

## మది దోచే మంచు సోయగం

మోతుగూడెం ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం తగ్గాక కొండలపై మంచు పరుచుకుని అద్భుత దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. డొంకరాయి ప్రధాన ఆనకట్ట దిగువ, సుకుమామిడి సమీపంలోని కొండల మీదుగా మంచు అందాలు మదిని దోచేస్తున్నాయి. – న్యూస్‌టుడే, మోతుగూడెం

## పర్యాటకుల రాక.. మన్యం అందాలు కేక

కొలంతో పనిలేకుండా మన్యం అందాలు పర్యాటకులను అలరిస్తున్నాయి. వారాంతాలు, సెలవు దినాల్లో దూరప్రాంతాల నుంచి ఇక్కడకు తరలివస్తున్నారు. శని, ఆదివారాలు వరుసగా సెలవులు కావడంతో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు చింతపల్లి మండలంలోని చెరువుల వెనం, తాజంగి, లంబసింగి తరలివచ్చారు. వాతావరణం మబ్బుగా ఉండటంతో మంచు తక్కువగా ఉంది. ఇక్కడ సహజసిద్ధ అందాలకు పర్యాటకులు ఫిదా అవుతూ వ్యూపాయింట్‌లవద్ద ఫొటోలు దిగి సందడి చేశారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

## సాగని విస్తరణ.. ఆగని ప్రమాదాలు

తమరాడ వద్ద రోడ్డు పక్కన వరద నీరు

ముంచంగిపుట్టు - పాడేరు రహదారిలో సంపంగిపుట్టు నుంచి పెదబయలు మండలం బంగారుమెట్ట వరకు రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా నీరు నిలిచి బురద పేరుకుపోయి అవస్థలకు గురవుతున్నారు. వాహన చోదకులు రోడ్డు అంచు దిగితే బురదలో పడే ప్రమాదముంది. బస్సులు, వ్యాన్లు, లారీలు, జీపులు ఎదురెదురుగా వచ్చినపుడు అంచు దిగలేక డ్రైవర్లు పరస్పరం గొడవ పడుతున్నారు. కుజభంగి, తమరాడ, అడుగులపుట్టు, సంపంగిపుట్టు గ్రామాలకు సమీపంలో కల్వర్టుల పనుల కోసం రోడ్డు విస్తరణను అసంపూర్తిగా వదిలేశారు. పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు

## మూత'బడి'.. చదువులకు సుడి

మూతపడిన రేవులకోట పాఠశాల

కొయ్యూరు మండలంలోని మారుమూల మందపల్లి, పలకజీడి, రేవులకోట, చీడికోట, పీఎల్ కొత్తూరు పాఠశాలలు కొత్త విద్యా సంవత్సరంలో నేటికీ తెరచుకోలేదు. విద్యార్థులు రోజూ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుల కోసం ఎదురుచూసి తిరిగి ఇంటికి వచ్చేస్తున్నారు. ఉపాధ్యాయుల్లేక తమ పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడులను తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై స్థానిక ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్‌ని 'న్యూస్‌టుడే' కోరగా.. సమీపంలోని ఆశ్రమ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను పంపి బడులను తెరిపిస్తామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కొయ్యూరు

## మూణ్నాళ్ల ముచ్చటే!



కుంగిన మట్టి

కొద్దిరోజులకే రక్షణ గోడ కింద ఇలా..

అరకులోయ - విశాఖపట్నం ఘాట్ రోడ్డులో ములియగుడ నుంచి శివలింగపురం వరకు ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయి. తూతూమంత్రంగా ఈ పనులు చేపడుతున్నారని విమర్శలున్నాయి. కొడమగుడ సమీపంలో రక్షణగోడను పునర్నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. నాల్గో నంబరు మలుపువద్ద కూడా వేసిన దారంలో ప్రమాదకరంగా పెద్ద గుంత ఏర్పడగా అక్కడ ఉన్న మట్టి పోసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుత వర్షాలకు మట్టి జారుతోంది. రహదారి కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి.. నాణ్యతగా పనులు జరిగేలా చూడాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అనంతగిరి

# తీరు మారకుంటే కటకటాలే!

## గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం

ఈనాడు డిజిటల్, పాడేరు

గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను వ్యాపారంగా చేసుకుని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. పదే పదే అరెస్టు చేస్తున్నా.. తీరు మార్చుకోని వారిని ఏడాదిపాటు జైల్లో పెట్టేలా పీడీ, ఎన్‌డీపీఎస్ చట్టాన్ని ప్రయోగిస్తోంది. ఇప్పటివరకు అల్లూరి జిల్లాకు చెందిన ఆరుగురు, అనకాపల్లి జిల్లాకు చెందిన ముగ్గురిని ఈ చట్టం కింద నిర్బంధించారు. రెండు జిల్లాల పరిధిలో ఇలాంటి వారు ఇంకా ఉన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. రానున్న రోజుల్లో అక్రమాలకు పాల్పడే వారందరిపై ఈ చట్టాన్ని ప్రయోగించి కటకటాల్లోకి పంపనున్నారు.

« అల్లూరి ఏజెన్సీలో గతంలో భారీగా గంజాయి సాగయ్యేది. పండించేది కొందరైతే.. రవాణా చేయడంలో ఎక్కువ మంది భాగస్వాములయ్యేవారు. కీలక సూత్రధారులు తెర వెనక ఉండి గిరిజన యువకులకు డబ్బు ఆశ చూపి గంజాయి రవాణాకు వాడుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపింది. డ్రోన్ కెమెరాల ద్వారా సాగును గుర్తించి ధ్వంసం చేయించింది. గతంలో సాగు చేసిన వారిని ప్రత్యామ్నాయ మార్గాలను చూపింది. వారిలో కొందరు గంజాయి సాగు, అందులోని మత్తును వీడటం లేదు. ఇలాంటి వారందరిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది.

« గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన ఆరుగురిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పాయకరావుపేట మండలానికి చెందిన దుంగ మాణిక్యం 2018లో మొదటిసారి ఆటోలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. ఇప్పటివరకు ఆయనపై ఆరు కేసులో నమోదయ్యాయి.

« మాడుగుల మండలానికి చెందిన బి.కొండలరావు ఆటోలో గంజాయి రవాణా చేస్తూ 2019లో మొదటిసారి పట్టుబడ్డాడు. ఈయనపై రెండు కేసులున్నాయి.

« జి.మాడుగుల మండలానికి చెందిన వి.కొండబాబు బైక్‌పై తరలిస్తూ 2024లో మొదటిసారి దొరికాడు. ఈయనపై మూడు కేసులున్నాయి.

« హుకుంపేట మండలానికి చెందిన సీతారాం 2024లో గంజాయి రవాణా చేస్తూ దొరికాడు. ఈయనపై రెండు కేసులున్నాయి.

« గూడెంకొత్తవీధి మండలానికి చెందిన వంతల బాలు బద్దర్ 2020లో మొదట గంజాయితో పట్టుబడ్డాడు. వేర్వేరు స్టేషన్ల పరిధిలో మూడు కేసులున్నాయి.

« చింతపల్లికి చెందిన గాలి సత్యనారాయణ గంజాయి రవాణా చేస్తూ 2017లో దొరికాడు. ఇప్పటివరకు రెండు కేసులు ఈయనపై నమోదయ్యాయి. వీరంతా గంజాయి స్మగ్లింగ్‌ను వీడకుండా తరచూ రవాణా చేస్తున్నారన్న అభియోగాలతో ఎన్‌డీపీఎస్ చట్టం కింద అదుపులోకి తీసుకోవాలని తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

### స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రభుత్వం గంజాయిని పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు అనేక చర్యలు చేపడుతోంది. అల్లూరి జిల్లాలో చాలావరకు డ్రోన్ల ద్వారా సాగును గుర్తించి ధ్వంసం చేశాం. గతంలో గంజాయి సాగు చేసిన వారికి అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ప్రభుత్వం చూపుతోంది. బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పీడీ ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్టు చేసి ఏడాదిపాటు జైలుకు పంపుతాం.

– అమిత్ బర్దార్, ఎస్పీ, అల్లూరి జిల్లా



అరవిరిసిన అంచంగిపూలు

అంచంగి పూలందాలు మనసును కట్టిపడేస్తున్నాయి. ఈ పూలు అందంలోనే కాదు.. ఔషధ గుణాల్లోనూ మెండే. గిరిజనులు పలు వ్యాధుల నివారణకు వీటిని వినియోగిస్తారు. అంచంగి పండ్లు రుచిగా ఉంటాయి. హుకుంపేట మండలం అండిభ గ్రామంలో ఈ చెట్లు అధికంగా ఉన్నాయి. – న్యూస్‌టుడే, హుకుంపేట

## కోట శ్రీనివాస్‌కు దేవీపట్నంతో అనుబంధం

దేవీపట్నం, న్యూస్‌టుడే: సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు అల్లూరి సీతారామరాజు జిల్లాతో అనుబంధం ఉంది. ఆయన నటించిన 'ముద్దుల ప్రియుడు' సినిమాలో కొన్ని సన్నివేశాలను దేవీపట్నం కొండపై ఉన్న చోడేశ్వరస్వామివారి ఆలయం వద్ద చిత్రీకరించారు. ఈ సినిమాలో దేవాలయంలో దేవుడు నగలు పోయిన సన్నివేశం ఇక్కడ చిత్రీకరించిందే.

# అన్నదాతపై ఎరువుల బరువు!

## నిలువుదోపిడీ చేస్తున్న డీలర్లు

అరకులోయ, న్యూస్‌టుడే

వ్యవసాయ పనుల్లో గిరిజన రైతు

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులు గుదిబండగా మారాయి. ఈ సీజన్‌లో అధికంగా వరి, చోడి పంటలకు యూరియా, డీఏపీ వినియోగిస్తుంటారు. అరకులోయ సబ్ డివిజన్ పరిధిలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో సుమారు 50 వేల ఎకరాల్లో వరి, చోడి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో డీఏపీ, యూరియాకు డిమాండ్ నెలకొంది.

★ అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో ఎరువుల డీలర్లు కొద్దిమందే ఉన్నారు. అరకులోయ మండలంలో ఒకరు, డుంబ్రిగుడ మండలంలో ఇద్దరున్నారు. రైతుల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు వారంతా ప్రయత్నాలు చేస్తున్నారు. డీఏపీ బస్తాకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,350, డీలర్లు ఒక్కో బస్తాకు రూ.1,650 వరకు వసూలు చేస్తున్నారు. ఒకరిద్దరు డీలర్లే ఉండటంతో వారి చెప్పిన ధరకే రైతులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. యూరియా బస్తాపై రూ.150 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఎరువుల విక్రయాలపై వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో డీలర్లు ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారని రైతులు వాపోతున్నారు.

★ ఏటా మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బందే విక్రయాలు చేసే వారు. ఈ ఏడాది మార్క్‌ఫెడ్ ఎరువులను సరఫరా చేయలేదు. రైతుసేవా కేంద్రాల్లో ఎరువుల విక్రయాలు చేపడితే రైతులకు డీలర్ల వద్దకు వెళ్లాల్సిన పని ఉండదు. గిరిజన ప్రాంతాన్ని రసాయన ఎరువుల రహిత పంటల జోన్‌గా మార్చాలన్న ఉద్దేశంతో కలెక్టర్ రైతు సేవా కేంద్రాలకు ఎరువుల సరఫరాను ఆపేశారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. సేంద్రియ వ్యవసాయం విస్తీర్ణం పెంచాలన్న ఉద్దేశం మంచిదైనా.. ఒక్కసారిగా ఎరువులు అందుబాటులో లేకుండా చేస్తే డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారు. సేంద్రియ వ్యవసాయం పెరగాలంటే డీలర్లకు సైతం ఎరువుల సరఫరా నిలిపివేయాలి. డీలర్ల వద్ద టన్నులకొద్దీ ఎరువుల నిల్వలు ఉన్నాయి. అధికారులు స్పందించి రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల విక్రయాలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### కేసులు నమోదు చేస్తాం

ఈ ఏడాది రైతు సేవా కేంద్రాలకు ఎరువుల నిల్వలు రాలేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే డీలర్లు విక్రయాలు చేయాలి. అధిక ధరకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులపై తనిఖీలు నిర్వహిస్తాం. బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం.

– మోహన్‌రావు, ఏడీఏ, అరకులోయ

# సుపరిపాలనతో స్వర్ణాంధ్రకు అడుగులు

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గంగవరం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలనతో అడుగులు వేస్తోందని పేదరిక నిర్మూలన, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పాత రామవరం, నెల్లిపూడి పంచాయతీల్లో ఆదివారం పర్యటించారు. ఎమ్మెల్యే శిరీషాదేవి, కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పాత రామవరం ఆంతర్లమ్మ గుడిలో పూజలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు అండగా నిలిచిన అందరికీ రుణపడి ఉంటామన్నారు. స్థానికులు ప్రస్తావించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే శిరీషాదేవి, గంగవరం సర్పంచి అక్కమ్మ, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, బాబూ రమేష్, వంతల రాజేశ్వరి, నాయకులు అర్జున్, రాంబాబు, తీగల ప్రభ, శ్రీనివాస్, విజయభాస్కర్, భానుప్రకాశ్, వెంకటరమణ, సిద్ధు, నీలాలమ్మ పాల్గొన్నారు.

నెల్లిపూడిలో కరపత్రాలు పంచుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే శిరీషాదేవి తదితరులు

## శ్రమదానంతో రహదారికి రూపు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తూరు పంచాయతీ తుమ్మనవలస నుంచి గుమ్మకోట వరకు రహదారి గోతులమయంగా మారింది. బీంపోలు, గుమ్మకోట ప్రాంతాలకు చెందిన ఆటోడ్రైవర్లు శ్రమదానంతో ఆదివారం రహదారిని బాగుచేసుకున్నారు. ఆ మార్గంలో వెళ్తున్న అరకులోయ నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి, ఆర్టీసీ విజయనగరం రీజియన్ ఛైర్మన్ సియ్యారి దొన్నుదొర ఆటోడ్రైవర్లతో చేయి కలిపారు. రహదారికి ఇరువైపులా తుప్పలను తొలగించారు.

తుప్పలు తొలగిస్తున్న ఆర్టీసీ విజయనగరం రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర

# అసంపూర్తి రహదారిపై అవస్థల ప్రయాణం

## 200 గిరిజన గ్రామాల ప్రజలకు తప్పని ఇక్కట్లు

పాడేరు పట్టణం/ జి.మాడుగుల, న్యూస్‌టుడే

ప్రమాదకరంగా మారిన మట్టి రోడ్డు

ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ గిరిజనులు కాళ్లరిగేలా తిరిగి సాధించుకున్న పాడేరు - వంతాల రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దశాబ్దాల పోరాటంతో రోడ్డు మంజూరు కావడం, వెంటనే నిర్మాణం ప్రారంభం కావడంతో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. పాడేరు - జి.మాడుగుల మండలాలకు సరిహద్దునున్న ఆరు పంచాయతీలను అనుసంధానం చేసే రహదారి కావడంతో జిల్లా కేంద్రానికి మరింత దగ్గరవుతామని సంబరపడ్డారు. వీరి సంతోషం ఎక్కువ రోజులు నిలవలేదు. మూడేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

★ పాడేరు నుంచి బంగారుమెట్ట, జీడిపగడ మీదుగా వంతాల వరకు 18 కి.మీ. దూరం రోడ్డు నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరయ్యాయి. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే వంతాల, లోచలి, గడుతూరు, సొలభం, గన్నెల, ఇంజరి పంచాయతీలోని రెండు వందలకు పైగా గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రం పాడేరుకు గంట సేపట్లో చేరుకోవచ్చు. పాడేరు - వంతాల రహదారి బంగారుమెట్ట, జీడిపగడ గ్రామాలను కలుపుతూ జి.మాడుగుల మండలం వంతాల పంచాయతీ కేంద్రాన్ని అనుసంధానం చేసేలా అంచనాలు రూపొందించారు.

★ వంతాల నుంచి లోచలి, గడుతూరు, సొలభం, గెమ్మెలి, వంజరి పంచాయతీల పరిధిలోని గ్రామాలకు మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరమే ఉంటుంది. పాడేరు నుంచి వంతాల చేరుకునేందుకు ఈ రహదారి అయితే 18 కి.మీ. దూరమే ఉంటుంది. జి.మాడుగుల మీదుగా వంతాల చేరుకోవాలంటే 38 కి.మీ. వెళ్లాలి. గంటన్నర సమయం పడుతుంది. వంతాల కాకుండా మిగతా పంచాయతీలు 40 కి.మీ. దూరంలో ఉన్నాయి.

★ జి.మాడుగుల పరిధిలోని ఈ ఆరు పంచాయతీలకు చెందిన వారంతా వంతాల నుంచి పాడేరు వెళ్లేందుకు అడ్డరోడ్డు మంజూరు చేసి రవాణా సదుపాయం కల్పించాలి కలెక్టర్, ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవోకు పలుమార్లు వినతులు అందజేశారు. మూడేళ్ల కిందట గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చారు. నిర్మాణం ప్రారంభించి మట్టి పనులు పూర్తి చేశారు. డ్రైనేజీలు నిర్మించాల్సి ఉండగా.. గుత్తేదారు పనులు నిలిపివేశారు.

**అందరికీ ఉపయుక్తం:** జి.మాడుగుల మీదుగా జిల్లా కేంద్రం పాడేరు వెళ్లాలంటే వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. వంతాల - పాడేరు రోడ్డు పూర్తయితే అందరికీ ఉపయుక్తంగా ఉంటుంది. గంట సేపట్లో పాడేరు చేరుకోగలం. రోడ్డు మంజూరైందన్న ఆనందం లేకుండా పోయింది. కంకర పరిచి వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాలని కోరుతున్నాం. – శోభన్, మధు, వంతాల వాసులు

**పది రోజుల్లో చదును చేస్తాం:** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సామగ్రి తరలింపునకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుత్తేదారు కంకర వేసి పనులు నిలిపేశారు. పది రోజుల్లో చదును చేస్తాం. భవిష్యత్తులో తారురోడ్డుగా అభివృద్ధి చేస్తాం. – డేవిడ్‌రాజు, ఈఈ, గిరిజనసంక్షేమశాఖ

# బాల్యానికి భరోసా

## 'నవ చేతన- ఆధార్ శిల' పుస్తకాల సరఫరా

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్యానికి భరోసా ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. బాలలు మానసికంగా, ఆరోగ్యంగా ఎదిగేలా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. 'నవ చేతన, ఆధార్ శిల' పుస్తకాలు రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసింది. వీటిలోని అంశాలను అంగన్‌వాడీ కార్యకర్తలు అమలు చేయడంతోపాటు తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంటుంది.

| జిల్లాలో.. | |
|---|---|
| అంగన్‌వాడీ కేంద్రాలు : | 3214 |
| చిన్నారులు : | 78,061 మంది |

**అంశాల వారీగా వివరిస్తూ.. :** పసిబిడ్డల పెంపకంలో తల్లి, కుటుంబసభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. వారితో ప్రవర్తించే విధానం, చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా కబుర్లు, కథలు చెప్పడం తదితర అంశాలను చిత్రాలతో సహా ఈ పుస్తకంలో పొందుపర్చారు. చిన్నారికి 36 నెలలు వచ్చే వరకు ఏంచేస్తే వారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా పెరుగుతారో వివరించారు. ఏ నెలలో ఏయే అంశాలు నేర్పాలో పొందుపర్చారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన పుస్తకాలు

### అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర కీలకం

చిన్నారుల మెదడులో అభివృద్ధి, సమగ్ర ఎదుగుదలలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర కీలకం. 85 శాతం మెదడు అభివృద్ధి ఆరేళ్ల ముందు పూర్తవుతుంది. ఈ సమయంలో సరైన సంరక్షణ, ప్రేరణ, అనుభవాత్మక కృత్యాల ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, ఆసక్తి, శ్రద్ధ పెంపొందించనున్నారు. తల్లిదండ్రులకు మార్గదర్శకంగా నిలుస్తూ పిల్లల ఆహారం, విద్యా అవసరాలను తీర్చడంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. 'బాల్యారంభ దశలో అన్నివిధాలుగా ఎదిగేందుకు పుస్తకాలు దోహదపడతాయి. ఇప్పటికే ఆయా పుస్తకాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చామ'ని చింతపల్లి ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి తెలిపారు.

(c) eenadu

## మా మధ్య భేదాభిప్రాయాలు లేవు

### జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర

ఈనాడు, విశాఖపట్నం: జిల్లా పరిషత్తుకు సంబంధించి నిధుల కేటాయింపు, ఇతర అంశాలపై జడ్పీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వడంలో కొంత అంతరం ఉందే తప్పా, తనకూ సభ్యులకు మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేవని విశాఖ జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర అన్నారు. ఆదివారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'ఛైర్‌పర్సన్'గా బాధ్యతలు చేపట్టిన ప్పటి నుంచి సభ్యులందరికీ సమాన ప్రాతిపదికన నిధులు కేటాయించానని, ఇటీవల కొందరు సభ్యులు కావాలనే తనపై ఆరోపణలు చేస్తూ అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ క్రమంలోనే పార్టీ నిర్ణయం మేరకు అసంతృప్త జడ్పీటీసీలు, మిగిలిన వారితో విశాఖలో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మండలాలకు నిధులు కేటాయించే సమాచారం జడ్పీటీసీ సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేయకపోవడం పొరపాటేనన్నారు. త్వరలో అధికారులు, సభ్యులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు.

## ఇద్దరు అటవీశాఖ అధికారుల సస్పెన్షన్

**అడ్డతీగల, న్యూస్‌టుడే:** అడ్డతీగల అటవీశాఖ రేంజ్‌లో పనిచేస్తున్న ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు పడినట్లు రేంజర్ సహాన్సా ఆదివారం తెలిపారు. అడ్డతీగల డీఆర్వో రాజారావు, ఎఫ్‌బీవో బసవయ్యపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణ చేపట్టామన్నారు. విచారణ అనంతరం ఆ ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు.

## రాయితీపై విత్తనాలు ఇవ్వాలని వినతి

**అచ్యుతాపురం, న్యూస్‌టుడే:** పామాయిల్ తోటల్లో అంతర పంటల సాగుకు రాయితీపై విత్తనాలు అందజేయాలని ఆయిల్‌పామ్ రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ సీతారామరాజు (రవిరాజు) కోరారు. జిల్లాలో మూడు వేల ఎకరాల్లో పామాయిల్ సాగవుతోందన్నారు. పామాయిల్, కొబ్బరి తోటల్లో అంతర పంటగా పోక, జాజి సాగుచేస్తే రైతులకు ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పోక మొక్క రూ.25, జాజి మొక్క రూ.500 వరకు ధర ఉందని, రాయితీపై అందజేయాలని కోరుతూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడికి ఇటీవల వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

## పింఛనుదారుల ధర్నా రేపు

**అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే:** సమస్యల పరిష్కారం కోరుతూ అనకాపల్లిలో మంగళవారం ధర్నా చేయనున్నట్లు పింఛనుదారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వడ్డాది జగన్నాథరావు, కార్యదర్శి బీఎస్ఎల్ శర్మ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎనిమిదో వేతన కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండు చేశారు. అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

## ఉపాధి మాయా పథకం

### చర్యలు నామమాత్రం.. అవినీతి యథాతథం

పాయకరావుపేట, న్యూస్‌టుడే

**ఇక్కడో కందకం ఉండాలి. మీరెవరైనా చూశారా? కాలువలో పనులు చేశారంట. మీకు తెలుసా? మీ పొలంలోనే పని చేయించారంట కదా..! నిజమేనా?**

ఉపాధి హామీ పథకంలో ఎక్కడెక్కడ ఏ పనులు చేశారో భూతద్దం పెట్టి వెతికినా ఇసుమంతైనా కనిపించడం లేదు. ఎక్కడా పనుల జాడే లేదు. తనిఖీకి వెళ్లిన సభ్యులకు ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఆర్పీలు కలిసి 'రాజావారి చేపల చెరువు' సినిమా చూపించారు. పనులు చేయకుండానే చేసినట్లు చెబుతూ తనిఖీ బృందానికి చుక్కలు చూపారు. పాయకరావుపేట మండల పరిధిలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలపై 'న్యూస్‌టుడే' పరిశోధనాత్మక కథనం.

ఈ కొండపైనే కందకాలు తవ్వారట..

✦ ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టకుండానే చేసినట్లు చూపి సొమ్ములు నొక్కేశారు. తనిఖీ సిబ్బందే అవాక్కయ్యే పరిస్థితి ఎదురైంది. మండలంలోని 24 గ్రామాల్లో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.9.43 కోట్లతో 1,303 పనులు చేపట్టారు. వేతనాలకు రూ.7.05 కోట్లు, మిగతా మొత్తం సామగ్రి చెల్లింపులకు వినియోగించారు. సామాజిక తనిఖీ బృందానికి పనుల్లో అడుగడుగునా అవినీతి ఆనవాళ్లే కనిపించాయి. కొలతలు, మస్తర్లలో తేడాలతో సొమ్మును పక్కదారి పట్టించినట్లు గుర్తించారు.

**మచ్చుకు కొన్ని..** ✦ గోపాలపట్నం కొండ ప్రాంతంలో 300 కందకాలు తవ్వినట్లు రికార్డుల్లో చూపారు. 110 కందకాలకు సంబంధించిన వివరాల్లేవు. మంగవరంలో రైతుల పొలాల్లో కందకాలు తవ్వామని రికార్డుల్లో పేర్కొన్నా.. సగానికిపైగా జాడ లేదు. ఉన్న వాటిలోనూ కొలతల్లో తేడాలున్నాయి.

✦ ఎస్.నర్సాపురంలో మస్తర్లలో గోల్‌మాల్ చేశారు. పంట కాలువల తవ్వకాల్లోనూ అవకతవకలే. మస్తర్లు వేయకుండానే సొమ్ములు మింగేశారు.

✦ 130 మంది కూలీలు పని చేయకుండానే చేసినట్లుగా మస్తర్లు వేసి నామవరం వీఆర్పీ నగదు విత్‌డ్రా చేశారు. నాలుగు నెలలపాటు పని చేసినట్లుగా రికార్డుల్లో చూపారు.

✦ పెంటకోటలో చేపట్టిన పనుల్లో కొలతలు, మస్తర్లలో తేడా జరిగినట్లు తేలింది.

**నిధుల రికవరీకి ఆదేశాలు..** సామాజిక తనిఖీ వేదికగా డీఆర్పీలు ఇచ్చిన నివేదికల ఆధారంగా రూ.3.18 లక్షలు రికవరీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. నామవరం వీఆర్పీపై క్రిమినల్ కేసు నమోదు సహా నగదు రికవరీకీ చర్యలు చేపడుతున్నాం. కందకాలు, పంట కాలువల తవ్వకాల్లో అవకతవలను గుర్తించేందుకు క్వాలిటీ కంట్రోల్ విభాగానికి ఫిర్యాదు చేశాం.
– నానిబాబు, ఏపీఓ

## 'ఆహార తయారీ'.. ఉపాధికి దగ్గర దారి..!

ప్రయోజన సమాచారం

యువత, మహిళలకు వంటల తయారీలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్. చినగదిలి తహసీల్దారు కార్యాలయం పక్కన ఈ సంస్థ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తోంది. –న్యూస్‌టుడే, విశాఖపట్నం

★ ప్రైవేటు కళాశాలల్లో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండగా ఇక్కడ కేవలం రూ.30వేలు, అది కూడా విడతల వారీగా చెల్లించే అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ప్రవేశాలు జరుగుతున్నాయి. దరఖాస్తుకు ఈనెల 17వతేదీ తుది గడువు.

చినగదిలి మండలంలోని ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న యువత

1 **అడ్వాన్స్‌డ్ ట్రేడ్ సర్టిఫికెట్ ఇన్ కలినరీ ఆర్ట్స్ కోర్సు:** పదో తరగతి విద్యార్హత. కోర్సు వ్యవధి ఆరు నెలలు. దక్షిణ, ఉత్తర భారత వంటలు, చైనీస్, పాశ్చాత్య వంటలు, కేకులు, బిస్కెట్లు, పాస్తా, సమోసా, మిఠాయిల తయారీలో శిక్షణ ఇస్తారు. ఆరునెలలు స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. శిక్షణ అనంతరం స్టార్ హోటళ్లలో చెఫ్‌గా ఉద్యోగావకాశం కల్పిస్తారు.

2 **టెక్నిక్స్ ఇన్ కుకింగ్:** ఈ విభాగంలో చేరేందుకు విద్యార్హత 8వ తరగతి. 25 వారాలపాటు శిక్షణ ఉంటుంది. శాఖాహార, మాంసాహార వంటల తయారీల్లో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తారు.

3 **కేటరింగ్ మేనేజర్:** రక్షణ రంగంలో ఆరునెలల్లో ఉద్యోగ విరమణ చేయబోయేవారు అర్హులు. రక్షణ రంగమే ఎంపిక చేసి శిక్షణ ఖర్చు భరిస్తుంది. ఆరునెలలపాటు శిక్షణ ఉంటుంది. వంటలతోపాటు, బేకరీ వస్తువులు, బిస్కెట్లు, పఫ్‌ల తయారీలో శిక్షణ ఇస్తారు. అనంతరం సొంతంగా క్యాటరింగ్ ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా స్టార్ హోటళ్లలో చెఫ్‌గా ఉద్యోగం చేయవచ్చు.

## ఆగని 'కోళ్ల వ్యర్థాల' దందా..!

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నిబంధనల మేరకు కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చేరాల్సిన కోళ్ల వ్యర్థాలు... నగరం నుంచి ఇతర జిల్లాలకు తరలిపోతున్నాయి. అలా వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల్ని అధికారులు ఆదివారం సాయంత్రం అనకాపల్లిలో స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఇంఛార్జి కమిషనర్‌గా పని చేసిన సమయంలో కోళ్లవ్యర్థాల టెండర్లు రద్దు చేశారు. దీంతో గుత్తేదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కోళ్ల వ్యర్థాల టెండర్ల రద్దుపై కోర్టు మూడు వారాల స్టే విధించింది. దీంతో ఈ వ్యాపారంలో అనుభవం ఉన్నవారంతా నాలుగైదు వార్డులకు ఓ వాహనం ఏర్పాటు చేసి... టెండర్‌తో సంబంధం లేకుండా ఎవరికి వారే కోళ్లవ్యర్థాలు సేకరించి, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ.. కాసులు సంపాదిస్తున్నారు. మరోవైపు ఒకరిపై మరొకరు అధికారులకు ఫిర్యాదులు చేస్తూ... వ్యాపారంలో పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు.

పట్టుబడ్డ వాహనం, చోదకుడు

### వాట్సప్‌లో వాగ్వాదం

అనకాపల్లిలో పట్టుబడిన వాహనాలు వైకాపా, తెదేపాకు చెందిన కార్పొరేటర్లవేనని ఆయా వాహనాల సిబ్బంది చెబుతున్న వీడియోలను 22వ వార్డు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ 'టీం జీవీఎంసీ వాట్సప్ గ్రూప్'లో పోస్ట్ చేశారు. దీంతో కూటమి, వైకాపా కార్పొరేటర్ల మధ్య వాయిస్ మెసేజ్‌లు, సాధారణ మెసేజ్‌లతో వాగ్వాదం జరిగింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కొందరు నాయకులు డిమాండ్ చేశారు.

## ఉత్సాహంగా నేవీ మారథాన్ సన్నాహక పరుగు

విశాఖపట్నం: బీచ్‌రోడ్డులో ఆదివారం ఉదయం తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో మారథాన్ సన్నాహక పరుగు నిర్వహించారు. ఆర్.కె.బీచ్ నుంచి పాండురంగాపురం వరకు ఈ పరుగు కొనసాగింది. 'వన్ రన్.. వన్ నేషన్' నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. డిసెంబరు 14న జరగబోయే మారథాన్ కోసం ఈ సన్నాహక పరుగు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేవీ ఉద్యోగులతోపాటు కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు ఫ్లాష్‌మాబ్ నిర్వహించి ఆకట్టుకున్నారు. విజేతలుగా నిలిచిన వారికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేతలుగా నిలిచిన నేవీ సిబ్బంది

## మెగా వైద్యశిబిరంతో సాంత్వన

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటైన ఉచిత మెగా వెరికోస్ వెయిన్, శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యశిబిరం రోగులకు సాంత్వన చేకూర్చింది. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో వెరికోస్ వ్యాధితో అనేకమంది బాధపడుతున్నారని, చాలామందికి దీనిపై అవగాహన లేదన్నారు. గోపిస్నేహిల్స్ యాజమాన్యం ఈ శిబిరం ఏర్పాటుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. అవసరమైన శస్త్ర చికిత్సలు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో బుధవారం చేస్తారని చెప్పారు. అయ్యన్నతోపాటు సతీమణి పద్మావతి, కుమారుడు రాజేష్ శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. వెరికోస్ వెయిన్స్ వైద్యనిపుణుడు సంపత్, నేత్ర వైద్య నిపుణులు ఎం.చంద్రశేఖర్, మధులిక తదితరులు రోగులకు సేవలందించారు.

ప్రసంగిస్తున్న శాసన సభాపతి అయ్యన్న

**బ్రాండిక్స్‌లో...** అచ్యుతాపురం: బ్రాండిక్స్ ఆవరణలో ఆదివారం 140వ కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. 700 మంది హాజరు కాగా.. 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మిగిలిన వారంతా వచ్చే వారం శిబిరానికి రావాలని సూచిస్తూ టోకెన్లు జారీ చేశారు. 290 మందికి కళ్లద్దాలు, 150 మందికి మందులు అందజేశారు. 56 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. శిబిరానికి హాజరైన వారికి మజ్జిగ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించినట్లు బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి పేర్కొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

## దాసుడి సంకల్పం.. అప్పన్నకు గరుడ వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: ఒడిశాకు చెందిన అప్పన్న స్వామి భక్తులు లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో గరుడ వాహన సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు నేతృత్వంలో అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శేషాచ మానంగా అలంకరించారు. మాడవీధుల్లోని దివ్యరథంపై గరుడ వాహనంపై స్వామిని కొలువుదీర్చారు. నాదస్వర మంగళవాయిద్యాలు, పండితుల వేద మంత్రాలు, ఒడిశా జానపద కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ మాడవీధుల్లో గరుడ వాహన సేవ వైభవోపేతంగా జరిగింది. లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు కుటుంబ సమేతంగా ఉత్సవంలో పాల్గొని స్వామికి వింజామర సేవలు చేశారు. ఒడిశా భక్త బృందం సంకీర్తనలతో స్వామిని కొలిచారు. పెద్ద సంఖ్యలో భక్తజనం పాల్గొని గోవింద నామస్మరణ చేశారు.

మాడవీధుల్లో గరుడ వాహన సేవలో పాల్గొన్న దాసుడు, భక్త బృందం

## బ్యాంకు వాటాదారులకు 14 శాతం డివిడెండ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: వినియోగదారుల అభిమానాన్ని చూరగొనడం ద్వారా ప్రస్తుతం రూ.290.39 కోట్ల బ్యాంక్ డిపాజిట్లు కలిగి ఉన్నామని ది మహారాణిపేట కో ఆపరేటివ్ బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణ రాజు అన్నారు. సీతమ్మధార క్షత్రియ కళ్యాణ మండపంలో బ్యాంకు 25వ మహాజన సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.202.16 కోట్లు రుణాలు అందించి రూ.492.55 కోట్ల వ్యాపారం కలిగి ఉన్నామన్నారు. రూ.4.36 కోట్ల స్థూల ఆదాయాన్ని ఆర్జించి రూ.1.13 కోట్లు ఆదాయ పన్ను చెల్లించామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు 14 శాతం డివిడెండ్ ప్రకటించినట్లు పేర్కొన్నారు. సిబ్బంది పిల్లలకు దాదాపు రూ.8 లక్షలు ఉపకార వేతనాలు, విద్యా సామగ్రి అందజేయడం జరిగిందన్నారు. త్వరలో విజయవాడ, రాజమహేంద్రవరం, రామచంద్రపురంలో బ్యాంకు శాఖలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటుగా నైపుణ్య... కార్యక్రమంలో సమావేశంలో... ఎగ్జిక్యూటివ్ అధికారి వనమాల శ్రీనివాస్, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.శ్యామ్‌కిశోర్, సంస్థ జీఎం ఎన్.ఎన్.సత్యనారాయణ, బ్యాంకు డైరెక్టర్లు, వాటాదారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణరాజు, చిత్రంలో అతిథులు

## షీలానగర్‌లో భారీ చోరీ

★ నిశ్చితార్థం నగలు, డబ్బు మాయం
★ రూ.కోటి నష్టపోయామని తల్లిదండ్రుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: కుమార్తె నిశ్చితార్థం కోసం సిద్ధం చేసిన నగలు, డబ్బు కలిపి దాదాపు రూ.కోటి సొత్తు చోరీ కావడంతో బాధిత తల్లిదండ్రులు లబోదిబో మంటున్నారు. షీలానగర్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఘటన వివరాలివి. జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్-8లోని లక్ష్మీ రెసిడెన్సీ మొదటి అంతస్తులో ఎస్.శ్రీనివాస్, భార్య నాగమణి, ఇద్దరు కుమార్తెలు నివాసం ఉంటున్నారు. ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తున్న ఆయన, ఆటోనగర్‌లో చిన్న పరిశ్రమ నిర్వహిస్తున్నారు. ఇటీవల పెద్ద కుమార్తెకు వివాహం నిశ్చయమైంది. వచ్చే నెల 10న నిశ్చితార్థ వేడుక నిర్వహించేందుకు ఫ్లాట్‌కు రంగులు వేయిస్తున్నారు. కుటుంబ సభ్యులంతా శనివారం రాత్రి 11 గంటలకు పనులు ముగించుకుని, కింద ఖాళీగా ఉన్న మరో ఫ్లాట్‌లోకి వెళ్లి నిద్రపోయారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు తమ ఫ్లాట్ నుంచి శబ్దాలు రావడాన్ని గమనించి వెంటనే పైకి వెళ్లి పరిశీలించారు. తలుపులు తీసి ఉండటంతో పాటు బీరువాలో సామగ్రి చెల్లాచెదురై ఉండటంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. వెంటనే ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాజువాక క్రైం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. నిశ్చితార్థం నిమిత్తం రూ.20 లక్షల నగదు, 700 గ్రాముల బరువైన బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి, కొత్త పట్టుచీరలు, 7 వాచీలు బీరువాలో భద్రపరిచామని, అవన్నీ మాయమైనట్టు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీమ్ సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. పోలీసు జాగిలం సమీపంలోని మెకానిక్ దుకాణం వైపు వెళ్లి, మళ్లీ వెనక్కి రావడంతో క్రైం సీఐ శ్రీనివాస్ మెకానిక్ దుకాణం నిర్వాహకుడిని, ఇరుగుపొరుగు వారిని ప్రశ్నించారు. లక్ష్మీ రెసిడెన్సీకి సీసీ కెమెరాలు లేకపోవడంతో పథకం ప్రకారమే ఇక్కడ చోరీ జరిగిందని సీఐ పేర్కొన్నారు. ఎస్సై మన్మథరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిందర వందరగా పడిన బీరువాలో వస్తువులు

## నిత్యం ప్రదక్షిణ.. అ'విశ్రాంత' నిరీక్షణ

★ 'ఆరోగ్య పథకం' అమలులో అంతులేని జాప్యం
★ సీజీహెచ్ఎస్ కేంద్రాల తీరుపై వృద్ధుల నిరసన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) లబ్ధిదారులు వైద్యం పొందాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ పథకంలో విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరికి ఆరోగ్యం బాగోలేకపోతే నగరంలో తమకు నచ్చిన ఆసుపత్రిలో చూపించడానికి ముందుగా పెదవాల్తేరు, డాబాగార్డెన్స్‌ల్లోని సంస్థ వెల్‌నెస్ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. ఇక్కడ సేవలు సరిగా అందక అర్ధరాత్రి నుంచి నిరీక్షించాల్సి వస్తోంది.

**ప్రహసనంగా టోకెన్ల జారీ:** పేర్ల నమోదుకు సీజీహెచ్ఎస్ సభ్యులు నిత్యం పెదవాల్తేరు కేంద్రానికి భారీగా తరలివస్తున్నారు. ఇక్కడ టోకెన్ జారీ చేసిన తర్వాత వైద్యులు పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తారు. తరువాత నగరంలోని సీజీహెచ్ఎస్‌తో అనుసంధానమైన కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చు. అయితే ఈ టోకెన్లు తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిత్యం వందలాది మంది వస్తుండగా కేవలం పదుల సంఖ్యలో టోకెన్లు ఇస్తున్నారు. దీంతో విశ్రాంత ఉద్యోగులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు రాత్రి ఇక్కడే ఉండిపోతున్నారు.

పెదవాల్తేరు సీజీహెచ్ఎస్ కేంద్రం వద్ద బారులు తీరిన విశ్రాంత ఉద్యోగులు

**త్వరలో సమస్య పరిష్కారం:** 'డాబాగార్డెన్స్ వెల్‌నెస్ కేంద్రం 100 గజాల స్థలంలో ఇరుగ్గా ఉంది. కూర్చోవడానికి స్థలం కూడా లేదు. ఈ కేంద్రాన్ని విమ్స్‌కు తరలించడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు వచ్చాయి. సాఫ్ట్‌వేర్ సమస్యను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది' అని సీజీహెచ్ఎస్ లబ్ధిదారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు.

**చిక్కులు తెచ్చిన సాఫ్ట్‌వేర్ మార్పు:** ఇటీవల సీజీహెచ్ఎస్ సాఫ్ట్‌వేర్‌ను నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) నుంచి సి-డాక్‌లోకి మార్చారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ఆరోగ్య చరిత్ర పూర్తిస్థాయిలో బదిలీ కాలేదని సమాచారం. ప్రతిసారి కొత్తగా వివరాలు నమోదు చేయాల్సి వస్తోంది. కొంత మంది కార్డులు సైతం గల్లంతయ్యాయని చెబుతున్నారు.

★ విశాఖలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు 13,500 మంది సీజీహెచ్ఎస్ కార్డులు కలిగి ఉన్నారు. కుటుంబసభ్యులతో కలిపి 35వేల మంది లబ్ధిదారులుగా ఉన్నారు. ఇందులో 5శాతం మాత్రమే ఉద్యోగులు కాగా, మిగతా 95 శాతం పదవీవిరమణ చేసిన వారే. వాస్తవంగా 2వేల మందికి ఒక వెల్‌నెస్ కేంద్రం ఉండాలి. విశాఖలో కేవలం రెండు మాత్రమే ఉన్నాయి. రెండింటిలో కలిపి కేవలం ఏడుగురు వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఫలితంగా సేవలు అందక ప్రతి రోజు 200 మంది తిరిగి వెళ్లిపోతున్నారు

## వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురికి గాయాలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు వేర్వేరుచోట్ల ఆదివారం జరిగిన ప్రమాదాల్లో అయిదుగురికి గాయాలయ్యాయి. బందబయలు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ తులసి, ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కొరకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ★ ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చింతపల్లి మండలం బలపం పంచాయతీ తడ్డపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు గిరిజనులు ఆటోలో కొయ్యూరు మండలం గోపవరం గ్రామంలో బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో రొబ్బసింగి గ్రామం వద్ద ఆటో బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆనందరావు, లక్ష్మీ, పుష్పలత తీవ్రంగా గాయపడ్డారు. వీరిని డౌనూరు పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

గాయపడిన లక్ష్మి

## వేతనాలు చెల్లించక ఇబ్బందులు

దేవీపట్నం, న్యూస్‌టుడే: సత్యసాయి రక్షిత తాగునీటి పథకం కార్మికులకు వేతన బకాయిలు చెల్లించి.. ప్రజలకు తాగునీరు అందించాలని నిర్వాసితులు కోరారు. దేవీపట్నం మండలంలోని సత్యసాయి కార్మికులకు 19 నెలలుగా బకాయిలు చెల్లించకపోవడంతో వారంతా మంగళవారం నుంచి చేపడుతున్న సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరింది. కార్మికులు గోకవరం నుంచి ఇందుకూరుపేట మీదుగా కోరుకొండ మండలం బొల్లెదుపాలెం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. వీరికి పెదభీంపల్లి ఆర్‌అండ్‌ఆర్ పునరావాస కాలనీ-1లో ఉన్న పరగసానిపాడు నిర్వాసితులు సంఘీభావం తెలిపారు. కార్మికులకు వేతన బకాయిలు చెల్లించకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, వీరబాబు, తాతాజీ, శేషారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

సత్యసాయి పథక కార్మికులకు ఖాళీ బిందెలతో సంఘీభావం తెలుపుతున్న నిర్వాసితులు

## బూత్‌కమిటీల బలోపేతంపై దృష్టి

కొయ్యూరు, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో బూత్ కమిటీల బలోపేతంపై దృష్టిసారించాలని భాజపా మండల అధ్యక్షుడు ఎస్.శివకుమార్, ప్రధాన కార్యదర్శి డి.పద్మరాజు అన్నారు. కారకరపాడు గ్రామంలో పద్మరాజు అధ్యక్షతన ఆదివారం పార్టీ మండల సమావేశం నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బూత్ కమిటీలను తక్షణమే నియమించాలన్నారు. గోపవరం బూత్‌కమిటీ అధ్యక్షుడు పాడి కిరణ్‌కుమార్ మృతికి సంతాపం తెలిపారు. పాడేరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ మంగతల్లి, భాజపా మండల సహాయ కార్యదర్శి సన్యాసిరావు, నేతలు దేముడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాజపా మండల ప్రధాన కార్యదర్శి పద్మరాజు

## క్వారీ అనుమతులు రద్దు చేయాలి

మాకవరపాలెం: జి.కోడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 332లో నల్లరాయి క్వారీల అనుమతులను ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని స్థానిక రైతులు ఆదివారం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. పెంటయ్య, అప్పారావు పాల్గొన్నారు.

## పొక్లెయిన్, మూడు ట్రాక్టర్ల సీజ్

కోటవురట్ల, న్యూస్‌టుడే: పాత గొట్టివాడ రెవెన్యూ పరిధిలో సాగు భూమిలో అనుమతి లేకుండా జరుగుతున్న మట్టి తవ్వకాలపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. పొక్లెయిన్, మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. గ్రామానికి చెందిన ఓ రైతు వరాహనది ఒడ్డునున్న సొంత భూమిలో పొక్లెయిన్‌తో తవ్వకాలు చేస్తున్నారు. గ్రామంలో ఇంటి పునాది కప్పేందుకు ఒప్పందం కుదుర్చుకుని ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రమేష్ సిబ్బందితో దాడి చేశారు. తహసీల్దార్ తిరుమలబాబు ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న పొక్లెయిన్

## రేషన్ బియ్యం పట్టివేత

కె.కోటపాడు, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని కార్డుదారుల నుంచి కొనుగోలుచేసి అక్రమంగా తరలిస్తున్న వ్యానును పోలీసులు పట్టుకున్నారు. గుల్లిపల్లికి చెందిన పలువురికి చెందిన బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ధనుంజయ చెప్పారు.

## జీవితంపై విరక్తితో ఆత్మహత్య

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకన్నపాలేనికి చెందిన తమ్మిన వరుణ్(45)కు 22ఏళ్ల కిందట భవానీతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వరుణ్ ప్రయివేటు పనులు చేస్తుంటాడు. 18ఏళ్ల కిందట భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. ఆదివారం ఉదయం 7గంటల సమయంలో తల్లి ఇంటికొచ్చి చూడగా వరుణ్ ఉరి వేసుకుని కనిపించాడు. గత కొద్దిరోజులుగా తీవ్ర మనస్తాపంతో బాధ పడుతున్న అతను అతిగా మద్యం తాగడం ప్రారంభించాడు. చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ గొలగాని అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ఢీకొని విశ్రాంత ఆచార్యుడి మృతి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కొత్తూరు పంచాయతీ ఎన్జీవో కాలనీకి చెందిన ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత ఆచార్యులు కొట్నాన రామారావు రైలు ఢీకొని దుర్మరణం చెందారు. ఇంటి నుంచి కళాశాలకు దగ్గరి దారిలో వెళ్లేందుకు శనివారం సాయంత్రం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. పరశురామ్‌పేటలోని శ్మశానంలో ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. డైట్ విద్యా సంస్థల అధినేత దాడి రత్నాకర్, ఏఎంఏఎల్ కళాశాల ప్రతినిధి వాసిరెడ్డి బాలకృష్ణ, విశ్రాంత అధ్యాపకులు బుద్ద అప్పారావు, రాజేశ్వరప్రసాద్, పీడీ నాయుడు, వెలమ సంక్షేమ సంఘ నాయకులు భీమ, తహసీల్దార్ వాసు అంతియయాత్రలో పాల్గొన్నారు. రామారావుకు భార్య, ఇద్దరు కుమారులు. కుమారులిద్దరూ విదేశాల్లో ఉన్నారు. అంత్యక్రియలకు పెద్ద కుమారుడు హాజరు కాగా, చిన్న కుమారుడు కెనడా నుంచి సకాలంలో రాలేకపోయారు.

కొట్నాన రామారావు (పాత చిత్రం)

## విశాఖ కలెక్టర్ పేరిట 'నకిలీ ఫేస్‌బుక్ ఖాతా'

విశాఖపట్నం: గుర్తు తెలియని వ్యక్తులు విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్ పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతా రూపొందించారు. కలెక్టర్ ఫొటో వాడారు. ఆ ఖాతా చూసి ఎవరూ మోసపోవద్దని, మెసేజ్‌లకు సమాధానాలు ఇవ్వొద్దని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 81 | 70 |
| లైవ్ | 103 | 90 |
| డ్రెస్డ్ | 149 | 150 |
| స్కిన్‌లెస్ | 170 | 160 |

(c) eenadu

**మేమున్నాం.. మీకు తోడుగా..**

పాడేరు : 89853 66570, అరకులోయ: 63034 86346
రంపచోడవరం: 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే: ?: భీరంపల్లి-గొట్లగూడెం రోడ్డు నిర్మాణం నాలుగేళ్లుగా నిలిచిపోయింది. కేవలం మెటల్‌పరచి వదిలేశారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – జె. శివకుమార్, భీరంపల్లి, ✔: నిధుల విడుదలలో జాప్యంతో పనులు నిలిచిపోయాయి. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలో రోడ్డు పనులు పూర్తి చేస్తాం. – ఉమాశంకర్, డీఈఈ, పీఆర్(ప్రాజెక్టు), రంపచోడవరం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ?: మారేడుమిల్లి నుంచి వేటుకూరు మీదుగా చింతలపూడి రహదారి నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపేశారు. రాళ్లు లేచిపోయి వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – రేవుల జానకి రెడ్డి, పీఎంకోట, ✔: పనులు పూర్తి చేస్తాం. – శ్రీనివాస విశ్వనాథ్, ఎంపీడీవో

చింతపల్లి, న్యూస్‌టుడే: ?: చింతపల్లి సంత ప్రదేశంలో గతంలో ఐటీడీఏ నిర్మించిన డిజిటల్ తూనిక యంత్రం భవనం నిరుపయోగంగా మారింది. – కరుణానిధి, చౌడుపల్లి, ✔: వారపు సంతల్లో నిరుపయోగంగా ఉన్న ఈ భవనాలు, తూనిక యంత్రాలను తమకు అప్పగించాలని ఐటీడీఏ అధికారులను కోరతాం.– వెంకటేష్, జీసీసీ డీఎం చింతపల్లి

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కాశీపట్నం పంచాయతీ సీతంపేట గ్రామంలో కుళాయిల ద్వారా తాగు నీరు రావడం లేదు. – ఐతయ్య, గ్రామస్థుడు, ✔: సమస్య పరిష్కరిస్తాం. –రామ్‌శంకర్, గ్రామ కార్యదర్శి

## పాడైన డిపోలు.. తప్పని పాట్లు

పెదబయలు, న్యూస్‌టుడే: మన్యంలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిపోల పరిస్థితి దారుణంగా ఉంది. దాదాపు అన్ని మండలాల్లో ఇవి మరమ్మతులకు గురయ్యాయి. శిథిల డిపోల్లోనే లబ్ధిదారులకు సరకులు పంపిణీ చేయాల్సిన పరిస్థితి. పెదబయలు మండలంలో 23 పంచాయతీల్లో 17 ప్రధాన, 15 మినీ డిపోలున్నాయి. వీటిలో పెదబయలు, సీకరి, అరడకోట, గంపరాయి, రూఢకోట, లక్ష్మీపేట, కిముడుపల్లి, అడుగులపుట్టు, పెదకోడాపల్లిలో సొంత భవనాలున్నాయి.

బంగారుమెట్టలో జీసీసీ డిపో దుస్థితి

సగానికి పైగా డిపోలకు సొంత భవనాలు లేవు. సొంత భవనాలన్నీ మరమ్మతులకు గురయ్యాయి. అరడకోట, సీకరి, పెదకోడాపల్లి, రూఢకోట, లక్ష్మీపేట తదితర చోట్ల డిపోలు నిరుపయోగంగా ఉన్నాయి. ముంచంగిపుట్టు మండలంలోనూ ఇదే పరిస్థితి. జీసీసీ డిపోల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఐటీడీఏ గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి విన్నవించుకున్నారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా ఉండడంతో డిపోలు కారుతుండటంతో సరకులు పాడై ప్రజానీకానికి నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి డిపోలకు మరమ్మతులు చేయాలని, మరికొన్ని చోట్ల కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల్లో నిత్యావసర సరకులు పంపిణీ చేసేందుకు జీసీసీ డీఆర్ డిపోలను గతంలో ఏర్పాటు చేసింది. ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార, పప్పులు అందజేస్తుంటారు. మారేడుమిల్లి జీసీసీ పరిధిలో మారేడుమిల్లి, వై.రామవరం మండలాల్లోని ఎగువ ప్రాంతంలోని గ్రామాలకు సరకులు అందజేస్తున్నారు. డీఆర్ డిపోల భవనాలు శిథిలస్థితికి చేరుకున్నా సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. వర్షానికి భవనాలు కారుతుండటంతో సరకులు తడుస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిపో సిబ్బంది కోరుతున్నారు.

సున్నంపాడులో ఇలా..

గడిబాపనమ్మతల్లి ఆలయం వద్ద నిలిచిన వాహనాలు

## ఆక్రమణలతో ట్రాఫిక్ ఇక్కట్లు

రంపచోడవరం, న్యూస్‌టుడే: సీతపల్లి గడిబాపనమ్మతల్లి ఆలయం వద్ద ఆక్రమణలతో నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం జిల్లా నాయకుడు కడబాల రాంబాబు తహసీల్దారును కోరారు. ఈ ఆలయానికి ఆది, మంగళ, బుధ, గురువారాల్లో అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని చెప్పారు. తక్షణమే రెవెన్యూ, ర.భ.శాఖ అధికారులు స్పందించి ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి, రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు.

## ఐక్యతతో సమస్యల పరిష్కారం

గంగవరం, న్యూస్‌టుడే: ఐక్యతతోనే ఆదివాసీ గౌడుల సమస్యల పరిష్కారం సాధ్యమని ఆ సంఘ అధ్యక్షుడు మద్దా రామ్మూర్తిగౌడ్, పండి అప్పలస్వామిగౌడ్ పిలుపునిచ్చారు. గంగవరంలో అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. జీవో నం.3 పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొన్ని మండలాల్లో కులధ్రువపత్రాలు జారీ చేయకపోవడంతో రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా మద్దా రామ్మూర్తి గౌడ్, ఉపాధ్యక్షులుగా కిల్లో త్రినాథ్‌గౌడ్, సందారి సూర్యనారాయణరావు, ట్రెజరర్‌గా పాంగి రామకృష్ణలను ఎన్నుకున్నారు. కొప్పుల దుర్గారావు, అప్పలస్వామి, పాంగి త్రినాథ్, వంతల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రామ్మూర్తిగౌడ్

## తాజంగికి జలకళ

చింతపల్లి, న్యూస్‌టుడే: తాజంగి జలాశయం నిండుగా నీటితో కళకళలాడుతోంది. ఇటీవల విడవకుండా వర్షాలు పడుతుండంతో ఈ జలాశయంలోకి నీరు పూర్తిగా చేరింది. దీని మరమ్మతులకు కలెక్టర్ ఇప్పటివరకూ సుమారు రూ.45 లక్షల వరకూ విడుదల చేశారు. వీటితో జలవనరులశాఖ అధికారులు పనులు చేపట్టారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌నకు పుష్కలంగా నీరు అందుతుంది.

## మురుగుతో రోగాల ముప్పు

ప్రస్తుత వర్షాలతో వీధులన్నీ బురదమయంగా మారాయి. ఎక్కడికక్కడే మురుగు నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధి కారకాలు పెరిగేందుకు అవకాశం ఇవ్వొద్దని వైద్యులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని గిరిజనులు కోరుతున్నారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

సంతవలసలో గిరిజనుల ఇళ్ల ముందు మురుగు

## విస్తారంగా పసుపు సాగు

స్వర్గయిగుడలో పసుపు తోట

నాణ్యతకు పేరుగాంచిన మన్యం పసుపునకు మైదాన ప్రాంతంలో గిరాకీ నెలకొంది. గిరిజన రైతులు దీన్ని వాణిజ్యపరంగా విస్తారంగా సాగు చేస్తున్నారు. పసుపు కొమ్ములను ఉడకబెట్టి రెండు వారాలపాటు ఎండలో ఆరబెట్టి నాణ్యతగా తయారు చేస్తారు. వారపు సంతల్లో విక్రయిస్తుంటారు. డుంబ్రిగుడ మండలవ్యాప్తంగా 26 హెక్టార్లలో పసుపు సాగవుతోందని వ్యవసాయ అధికారులు తెలిపారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

## చెట్టు.. పట్టించుకుంటే ఒట్టు!

మారేడుమిల్లి- దేవరపల్లి మధ్యలో అంతర్రాష్ట్ర రహదారిపై ఓ చెట్టు కూలిపోయి.. మరో చెట్టు ఆసరాతో ప్రమాదకరంగా ఉండిపోయింది. ఇది ఎప్పుడు పడిపోతుందో తెలియక వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిలో అధిక సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. అధికారులు స్పందించి దీన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు. – మారేడుమిల్లి, న్యూస్‌టుడే

మారేడుమిల్లి- దేవరపల్లి మధ్యలో ప్రమాదకరంగా చెట్టు

## డ్రైనేజీ పనులు ముమ్మరం

పనులు చేస్తున్న సిబ్బంది

స్పందనకు వందనం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగులలో నెల రోజులకుపైగా నిలిచిపోయిన డ్రైనేజీ పనులను పునఃప్రారంభించారు. ఈ సమస్యపై ఈనెల 12న ఈనాడులో 'కాలువ పనుల్లో జాప్యం' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. జాతీయ రహదారి అధికారులు స్పందించి పనులు ముమ్మరం చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అ వీ ఇ వీ

## విగ్రహం ధ్వంసం దారుణం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: కోతులగుట్టలో కుమురం భీమ్ విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని చిన్నమట్టపల్లి సర్పంచి పిట్టా రామారావు డిమాండ్ చేశారు. గుండుగూడెంలో ఆదివారం పెసా కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. భీమ్ విగ్రహం ధ్వంసం చేయడం దారుణమన్నారు. కమిటీ ఉపాధ్యక్షులు కోటం జయరాజు, బాలరాజు, శంకర్, రాముడు, రామారావు, టింకు, బాలరాజు పాల్గొన్నారు.

కూనవరం, న్యూస్‌టుడే: దుండగులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సరియం అనిల్‌కుమార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు ముత్తయ్య డిమాండ్ చేశారు. విగ్రహం వద్ద రెండు సంఘాల నాయకులు నిరసన తెలిపారు.

చింతరేవుపల్లిలో నినాదాలు చేస్తున్న సర్పంచి రామారావు తదితరులు

## ఆరు లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: బడదనాంపల్లి పంచాయతీ చినరేలంగిపాడు శివారు అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా బట్టీపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. సారా తయారు చేస్తున్న చినరేలంగిపాడుకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి నిందితుడిని అడ్డతీగల జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

## న్యాయబద్ధంగా బదిలీలు చేపట్టండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో సచివాలయాల్లో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ల బదిలీలను న్యాయబద్ధంగా చేపట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులకు ఉన్నతాధికారుల బెదిరింపులు తగవన్నారు.

## తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి నియామకం

ఎటపాక, న్యూస్‌టుడే: తెదేపా ఎటపాక మండల క్లస్టర్ ఇన్‌ఛార్జిగా వల్లభనేని చందు, కో క్లస్టర్ ఇన్‌ఛార్జిగా విజ్జగిరి రవితేజలను నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే శిరీషాదేవి ఆదివారం ఆదేశాలు జారీచేశారు. వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం పర్యాటక ప్రాంతాలకు శని, ఆదివారాల్లో సందర్శకులు పోటెత్తారు.

పొల్లూరు దిగువ జలపాతంలో పర్యాటకులు

## పర్యాటక ప్రాంతాలు కిటకిట

పొల్లూరు ధారాలమ్మ పిక్నిక్ స్పాట్, పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల వాహనాలతో రద్దీ నెలకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కుటుంబసమేతంగా వచ్చిన పర్యాటకులు అక్కడే వండుకుని సామూహిక భోజనాలు చేశారు. ధారాలమ్మ పిక్నిక్ స్పాట్, ఫోర్‌బే, పికప్, డొంకరాయి జలాశయాలు, విద్యుత్కేంద్రాలను సందర్శించారు. కొంతమంది జలపాతం, సీలేరు నదిలో జలకాలాడుతూ, కేరింతలు కొడుతూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

## శ్రీరాముని పాదుకలకు పల్లకీసేవ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అయోధ్యలోని శ్రీరాముల పవిత్ర పాదుకలు ఆదివారం బౌడ, బూసులకోట గ్రామాలకు చేరుకున్నాయి. వేదపండితుడు చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులు వీటికి భక్తిశ్రద్ధలతో పూజలు, పల్లకీసేవ నిర్వహించారు. శ్రీరామ నామ సంకీర్తన జరిగింది. 'జైశ్రీరాం' నినాదాలతో గ్రామం మార్మోగింది. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూకాలమ్మ అమ్మవారు

శ్రీరాముని పాదుకలను ఊరేగిస్తున్న బూసులకోట గ్రామస్థులు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి గ్రామ దేవత నూకాలమ్మకు ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

## రహదారులను వీడని వరద

చింతరేవుపల్లి-తుష్టివారిగూడెం మధ్య రహదారిపై వరద నీరు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వరద తగ్గినా ఆదివారం సాయంత్రం వరకు రహదారులపై నీరు తొలగలేదు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో నీరు నెమ్మదిగా తగ్గుతోంది. చింతరేవుపల్లి- కన్నాయిగూడెం, తుష్టివారిగూడెం-చింతరేవుపల్లి, ఇప్పూరు వద్ద నీరు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గంగపుత్రులు చేపల వేటలో నిమగ్నమయ్యారు.

కూనవరం, న్యూస్‌టుడే: గోదావరి శాంతించింది. ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టడంతో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. కూనవరం మండలంలో ముంపు గ్రామాల ప్రజలకు ఉపశమనం లభించింది. కోండ్రాజుపేట రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి.

దేవీపట్నం, న్యూస్‌టుడే: దేవీపట్నం మండలం గండిపోశమ్మ ఆలయం వద్ద గోదావరి శాంతించింది. ఆదివారం సాయంత్రానికి రెండు అడుగులకు పైగా నీటిమట్టం తగ్గడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆలయం ఇంకా ముంపులోనే ఉంది. పోశమ్మగండి నుంచి దండంగి వరకూ ఆర్‌అండ్‌బీ రహదారిపై వరద ఉద్ధృతి తగ్గకపోవడంతో రాకపోకలు నిలిచాయి. ఆదివారం మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని కొండపై నుంచే దర్శించుకుని మొక్కులు చెల్లించారు. పాపికొండల విహారయాత్రకు మరికొన్ని రోజులపాటు అనుమతులు లేవని జలవనరులశాఖ ఏఈ భాస్కర్ తెలిపారు. సీతపల్లి వాగుకు వరద ప్రవాహం కొనసాగుతోంది.

కోండ్రాజుపేట రోడ్డుపై..

గండిపోశమ్మ ఆలయానికి వస్తున్న భక్తులు

## ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వితరణ

కమిటీ సభ్యులకు వెండి నామాలు, తాడు అందిస్తున్న కుమార్, స్వాతి దంపతులు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు పాత బస్టాండు సమీపంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయానికి విశాఖపట్నంకు చెందిన సీహెచ్‌వీవీ కుమార్, స్వాతి (బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి) దంపతులు వెండి నామాలు, వెండి తాడు వితరణగా అందించారు. ఆదివారం ఉదయం దాత కుటుంబసభ్యులు ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, అర్చకులు రామంకు వీటిని అందజేశారు. ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు రామారావు, ప్రభాకర్, కరుణ, కొండలరావు, శ్రీనివాస్‌కుమార్, కారం దేముడు, కటారి శ్రీనివాస్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో మేలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని ఎంసీఆర్పీ కె.అప్పలరాజు అన్నారు. కొమరాపురంలో దస్సపర్ని కషాయం తయారీపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ కషాయాన్ని అన్నిరకాల పంటలకు వాడుకోవచ్చన్నారు. పూత, పిందె దశలో వినియోగించరాదని పేర్కొన్నారు. 100 లీటర్ల నీటికి మూడు లీటర్ల కషాయం కలిపి పిచికారీ చేయాలన్నారు. సాయంత్రం వేళ పిచికారీ చేస్తే రసం పీల్చే, కాయ, కాండం తొలిచే పురుగుల నివారణకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఐసీఆర్పీలు లోవరెడ్డి సత్యనారాయణ, పాపారావు పాల్గొన్నారు.

కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్పీ

## కోయను జాతీయ భాషగా గుర్తించాలి

చింతూరు, న్యూస్‌టుడే: కోయ భాషను జాతీయ భాషగా గుర్తించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు రాష్ట్ర ప్రచార కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏపీఆర్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ నెల 21న విశ్వ కోయ భాషా దినోత్సవాన్ని నిర్వహించడానికి ఆదివాసీలు సిద్ధం కావాలని చెప్పారు. సుమారు మూడు కోట్ల మంది గిరిజనులు ఈ భాష మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రాథమిక విద్యలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాతృభాషలోనే బోధించాలని పేర్కొన్నారు. కృష్ణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రాఘవయ్య పాల్గొన్నారు.

## గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు

పాడేరు, న్యూస్‌టుడే: విశాఖపట్నం కేజీహెచ్‌లో రిఫరల్ కేసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అల్లూరి జిల్లా ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ విశ్వేశ్వరరావునాయుడు ఆదేశించారు. ఆదివారం కేజీహెచ్‌లో ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన ఎస్టీసెల్ విభాగాన్ని సందర్శించారు. పాడేరు డివిజన్ నుంచి వస్తున్న గిరిజన రోగులకు సత్వరమే వైద్యసేవలు అందించాలని సూచించారు. 2005 జులై నెలలో ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ఇప్పటికి 20 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయినవారి మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు జిల్లా కలెక్టర్ మూడు అంబులెన్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతం నుంచి వచ్చిన రోగులతో మాట్లాడారు. గిరిజన రోగులు వైద్యసలహాల కోసం 63039 21375 నంబరులో సంప్రదించాలన్నారు. ఎస్టీసెల్ వైద్యాధికారి సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ విశ్వేశ్వరరావునాయుడు

## భీమవరం వైద్యాధికారిగా నాయుడు

అనంతగిరి, న్యూస్‌టుడే: అనంతగిరి మండలం భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా కేపీ నాయుడును వైద్యారోగ్య శాఖ నియమించింది. గతంలో ఇక్కడ పనిచేసిన సంతోష్ శ్రీకాకుళం వైద్యకళాశాలకు బదిలీ అయ్యారు. ఈయన బదిలీ అయిన 20 రోజులకు కొత్త వైద్యాధికారిని నియమించారు. ఈయన ఇంకా విధుల్లో చేరలేదు.

## పాలిటెక్నిక్ కళాశాల రద్దుపై ఉద్యమం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని పాలిటెక్నిక్ కళాశాలను కొనసాగించేలా దశలవారీగా ఉద్యమాలు చేపడతామని గిరిజన జాగృతి సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ తెలిపారు. స్థానిక గిరిజన ఉద్యోగ భవనంలో ఎంపీపీ అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, అఖిలపక్ష నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. గత 14 ఏళ్లుగా నడుస్తున్న కళాశాలను మూసివేయడం తగదని పేర్కొన్నారు. కళాశాల రద్దు ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్య ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నెలకొల్పిన కళాశాలను రద్దు చేయడం తగదన్నారు. గూడెంకొత్తవీధి ఎంపీపీ కుమారి, లోచలి రామకృష్ణ, రీమల ఆనంద్, బేతాళుడు, జల్లి సుధాకర్, చిరంజీవి, బూసరి కృష్ణారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

## ఎన్నికల హామీలన్నీ అమలు

ఎటపాక, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమంతోపాటు రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కూటమి నాయకులు, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి వల్లభనేని చందు అన్నారు. కుసుమనపల్లి, పిచుకలపాడు, విస్సాపురం, నల్లకుంట తదితర గ్రామాల్లో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తోందన్నారు. సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంచారు. సంపత్, శ్రీకాంత్, నగేష్, ఎన్ఎస్ఎన్ చౌదరి, సతీష్, రాఘవయ్య, రాంబాబు, నవీన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నల్లకుంటలో కూటమి నాయకుల ప్రచారం

అరకులో గ్రామ కమిటీలతో తెదేపా నేతలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గ్రామ కమిటీలతో తెదేపా బలోపేతమవుతుందని ఆ పార్టీ మండల పరిశీలకులు రాంబాబు అన్నారు. అరుకు, సాగర పంచాయతీల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు ఆధ్వర్యాన ఆదివారం గ్రామ కమిటీల ఎన్నిక జరిగింది. కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెదేపాలో కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. అరకు పార్లమెంటరీ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ సర్పంచులు ఆనంద్, లక్ష్మి, వెంకటరావు, నాయకులు గెన్ను, పొత్తి తదితరులు పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్లు అందిస్తున్న స్వప్నకుమారి

## బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యం

రంపచోడవరం, న్యూస్‌టుడే: బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని భాజపా జిల్లా కార్యదర్శి ఎస్.స్వప్నకుమారి పేర్కొన్నారు. ఆదివారం తామరపల్లి పంచాయతీ కన్నారం గ్రామంలో పార్టీ సమాశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. స్వప్నకుమారి మాట్లాడుతూ.. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. రైతులు, యూత్ పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలకు విశేష స్పందన

రంపచోడవరం, న్యూస్‌టుడే: రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 400 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్లు టి.వి సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, దాసరి ఉమామహేష్, సంపత్‌కుమార్ సేవలందించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో 72 మందికి కంటిపరీక్షలు చేసి 18 మందికి కళ్లద్దాలు అందజేశారు. 10 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం వేమగిరి తీసుకెళ్లారు. మూర్ఛ వ్యాధిపై డాక్టరు గోపాలం శివన్నారాయణ అవగాహన కల్పించారు. క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాసు, వాలంటీర్లు దాసరి పెద్దఅప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో..

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల పంచాయతీ గాంధీనగర్‌లో మలయంగర్ క్యాథలిక్ చర్చి, సెయింటాన్స్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. గాంధీనగర్, మధురమామిడి, ఉరుము, రచ్చపల్లి పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఫాదర్స్ స్టీఫెన్, మోబిన్, సిస్టర్స్ జూడిట్, జూలియన్ తదితరులు పాల్గొన్నారు.

సిరిగిందలపాడులో సేవలందిస్తున్న వైద్యుడు

(c) eenadu

## శాకంబరి.. నమోస్తుతే..

**మంగళగిరి, న్యూస్‌టుడే:** పాత మంగళగిరి గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఊట్ల పాల శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మంగళగిరిలోని పోలేరమ్మకు మహిళా భక్తులు ఆదివారం ఆషాఢ సారె, బోనాలు సమర్పించారు. 'మన అమ్మకు మన సారె.. మనసారా' పేరుతో 552 మంది మహిళలు ఊరేగింపుగా నృసింహుని ఆలయం నుంచి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. వాసవీ పరివార్, వాసవీ క్లబ్ అనిత, రాజ్యలక్ష్మి అమ్మవారి భక్తసమాజం ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మంగళగిరిలో బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

## పాడైతే చూడరు.. మరమ్మతులు చేయరు!

ఎక్స్‌రే విభాగానికి తాళం

జీజీహెచ్‌లోని అత్యవసర విభాగంలోని ఎక్స్‌రే పరికరాలు పాడైపోవడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. ఏడాదిగా ఎక్స్‌రే పనిచేయకుండా మూలనపడడంతో ప్రమాదాలు జరిగి అత్యవసర సేవలకు వచ్చే రోగులను స్ట్రెచర్‌పై పొరుగు సేవల విభాగంలోని ఎక్స్‌రే కేంద్రం వద్దకు తీసుకుంటూ తీసుకెళ్లాల్సి వస్తోంది. రాత్రివేళల్లో సిబ్బంది లేక గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని రోగుల బంధువులు వాపోతున్నారు.

- ఈనాడు గుంటూరు

## ఆదాయం చేదా.. అడిగే ఉద్దేశం లేదా?

జడ్పీ బకాయిలు రూ.1.15 కోట్లు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

**జి**ల్లా పరిషత్తుకు ఉన్న స్థలాలు, భూములు, వాణిజ్య దుకాణాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఇందులో సింహభాగం దుకాణాల అద్దె ద్వారా లభిస్తోంది. దుకాణాల లీజుదారులు అద్దెలు సక్రమంగా చెల్లించకపోవడంతో జడ్పీ నిధుల లేమితో ఇబ్బందులు పడుతోంది. ఉమ్మడి జిల్లాలో 10 వాణిజ్య దుకాణాల సముదాయాల్లో 116 దుకాణాలు ఉన్నాయి. వీటికి అద్దె రూ.1.45 కోట్లు వసూలు కావాల్సి ఉండగా రూ.67.53 లక్షలు మాత్రమే వసూలైంది. రూ.77.95 లక్షలు బకాయి పడ్డాయి. జిల్లాపరిషత్తు డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ దుకాణాల లీజుదారుల నుంచి అద్దెలు వసూలు చేసేందుకు రికవరీ డ్రైవ్ నిర్వహించి కొంతమేరకు వసూలు చేశారు. కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ జనవరి నెలాఖరులో అమలులోకి రావడంతో రికవరీ డ్రైవ్‌ని నిలిపివేశారు. దీంతో చాలావరకు బకాయిలు పెండింగ్ ఉన్నా మళ్లీ వాటి ఊసెత్తడంలేదు.

పిడుగురాళ్ల వాణిజ్య దుకాణాల సముదాయం

| దుకాణాల సముదాయం పేరు | దుకాణాల సంఖ్య | జూన్ వరకు అద్దెల డిమాండ్ | చెల్లించిన అద్దెలు | బకాయిలు (రూ.లక్షల్లో) |
|---|---|---|---|---|
| నరసరావుపేట | 14 | 26.52 | 19.48 | 7.04 |
| గురజాల | 16 | 26.55 | 16.00 | 10.55 |
| సత్తెనపల్లి | 5 | 3.29 | 2.04 | 1.25 |
| వినుకొండ | 10 | 5.83 | 2.98 | 2.85 |
| మాచర్ల | 4 | 1.47 | 0.3 | 1.17 |
| అచ్చంపేట | 18 | 9.7 | 4.34 | 5.36 |
| పిడుగురాళ్ల | 13 | 33.00 | 2.29 | 30.71 |
| చిలకలూరిపేట | 13 | 13.68 | 9.8 | 3.88 |
| పెదనందిపాడు | 16 | 20.52 | 8.00 | 12.52 |
| అడవులదీవి | 7 | 4.92 | 2.3 | 2.62 |
| మొత్తం | 116 | 145.48 | 67.53 | 77.95 |

★ పల్నాడు కలెక్టర్ అతిథి గృహానికి రూ.38 లక్షలు బకాయి

### ఇతరులకు అద్దెలకు ఇస్తూ..

పెదనందిపాడు, అచ్చంపేట, అడవులదీవి మినహా మిగిలిన 7 షాపింగ్ కాంప్లెక్స్‌లు పట్టణ ప్రాంతాల్లో ఉండడంతో దుకాణాలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. జడ్పీకి నామమాత్రపు అద్దెలు చెల్లిస్తున్నారనే విమర్శలున్నాయి. దుకాణాలను లీజుకు తీసుకున్న వారిలో పలువురు ఇతరులకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### మూడేళ్లుగా రూపాయి చెల్లించలేదు

2022, ఏప్రిల్‌లో జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఏర్పాటు చేశారు. కలెక్టరు అతిథి గృహంగా జడ్పీ అతిథి గృహాన్ని అద్దె ప్రాతిపదికన తీసుకున్నారు. అప్పటి నుంచి అద్దెలు చెల్లించకపోవడంతో రూ.38 లక్షలు బకాయిలు ఉన్నాయి. మూడేళ్లు పూర్తయినా ఒక్క రూపాయి చెల్లించకపోవడం గమనార్హం.

## అంతా మా ఇష్టం.. ప్రశ్నిస్తే అంతుచూస్తాం!

గుంటూరు బస్టాండు పరిసరాల్లో ప్రైవేటు ట్రావెల్స్ దౌర్జన్యం

ఈనాడు, అమరావతి

**అం**తా మా ఇష్టమంటూ బరితెగిస్తున్నారు. అడిగారంటే అంతుచూస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. మాజీ ఎంపీ అనుచరులమంటూ దౌర్జన్యానికి దిగడం, ఏళ్ల తరబడి స్థానికంగా వాహనాలు నడుపుకుంటున్న వారిపై దాడులకు పాల్పడుతూ, మిన్నకుండిపోవాలని ఒత్తిడి చేస్తుండడం.. వెరసి గుంటూరు ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో ఓ ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకుల దౌర్జన్యం వివాదాస్పదంగా మారింది. ఆర్టీసీ ఆదాయానికి అడ్డంగా గండికొడుతూ అడ్డగోలుగా వ్యవహరిస్తుండడం వారికే చెల్లింది.

గుంటూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండు సమీపంలో 50 ఏళ్లుగా కొందరు కార్ల యజమానులు ఓ కారు స్టాండ్ నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ నిబంధనలకు లోబడి ఇదే జీవనాధారంగా వీరు నిర్వహణ సాగిస్తున్నారు. కొంతకాలం కిందట విజయవాడ నుంచి 45 కార్లతో ఓ వ్యక్తి ఇక్కడ ప్రైవేటు రవాణా వ్యవస్థ ఏర్పాటు చేశారు. గుంటూరు నుంచి విజయవాడకు ఆ కార్లలో ప్రయాణికుల తరలింపు మొదలుపెట్టారు. కొందరు అధికారులను మచ్చిక చేసుకుని గుంటూరు-విజయవాడ మధ్య వాహనాలు దర్జాగా టోల్‌గేట్ దాటేలా వ్యవస్థ రూపొందించుకున్నారు. ఇందుకోసం కొన్ని కార్లకు 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' బోర్డులు ఏర్పాటు చేయడం గమనార్హం. నిబంధనల ప్రకారం పసుపురంగు నంబర్ ప్లేట్ కలిగిన వాహనాలు మాత్రమే ట్రాన్స్‌పోర్ట్ కింద వాడాల్సి ఉండగా.. ఇక్కడ తెల్ల నంబర్ ప్లేట్లు కలిగిన వాహనాలతోనే కథ నడిపిస్తున్నారు.

### ఆర్టీసీ ఆదాయానికి గండి

ఇక్కడ అడ్డగోలుగా కథ నడుస్తున్నా అధికారులు ఇదేమిటని ప్రశ్నించలేని దుస్థితి. వాస్తవానికి, ఆర్టీసీ అధికారులు 45 కార్లపైనా గతంలోనే రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. విజయవాడకు ప్రతి ఐదు నిమిషాలకు ఓ బస్సు తిరుగుతోందని, బస్టాండు ఎదుట ఛార్జీ తీసుకుని ప్రైవేటు వాహనాలు ప్రయాణికులను తరలించకూడదన్నది సదరు అధికారుల మాట. ఆ ఫిర్యాదుపై రవాణాశాఖ వర్గాలు మిన్నకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది.

### మాజీ ఎంపీ అనుచరులమని బెదిరింపులు

ప్రైవేటు వాహనదారులు ఆర్టీసీ బస్టాండుకు 2 కి.మీ దూరంలో ప్రయాణికులను ఎక్కించుకోవాలి. ఇక్కడా పరిస్థితి కరవైంది. బస్టాండు వద్ద ప్రైవేటు వాహనదారులు అద్దెకు మాత్రమే ప్రయాణికులను తీసుకెళ్లాల్సి ఉన్నా ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రతినెలా ఆర్టీసీ అధికారులు, రవాణాశాఖ వర్గాలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉండగా అదీ కరవైంది. ఈ ప్రాంతంలో రెండు నిముషాలు ఆర్టీసీ బస్సు ఆగినా తెగ హడావుడి చేసే ట్రాఫిక్ పోలీసులు సదరు ప్రైవేటు వ్యక్తుల కార్లు గంటల తరబడి వేచి ఉంటున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మాజీ ఎంపీ పేరు చెప్పి వారు చేస్తున్న దాడులు, దౌర్జన్యంతో పరిస్థితి అదుపు తప్పుతోంది. ఇక్కడ వివాదం మరింత ముదరకముందే ఆర్టీసీ, రవాణా, పోలీసుశాఖలు సంయుక్తంగా ప్రత్యేక చొరవ తీసుకుని నిబంధనలు అమలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు జరిగిన వ్యవహారంపై లోతైన విచారణ జరిపితే వాస్తవాలు వెల్లడవుతాయి.

గత నెల కొర్నెపాడు జగనన్న కాలనీలో విద్యుత్తు తీగలు ఇలా..

నేడు తీగలన్నీ మాయం చేసిన దుండగులు

## జనం లేని ఊరు.. ఇదీ చోరీల తీరు..

**వ**ట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులోని పీఎంఏవై ఎన్టీఆర్‌నగర్ (జగనన్నకాలనీ) ఇది. గత వైకాపా ప్రభుత్వం 2021లో జగనన్న అర్బన్ హౌసింగ్ కాలనీ పేరిట రూ.153.64 కోట్లతో 334 ఎకరాలకు పైగా పంట పొలాలు సేకరించింది. రూ.160కోట్లతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి విద్యుత్తు లైన్లు, రోడ్లు వేశారు. నగర పేదలు 15 వేల మందికి పైగా ఆర్భాటంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఇళ్లు మంజూరు చేయకుండా చేతులు దులిపేసుకున్నారు. ఏడాదికి రెండు పంటలతో కళకళలాడే భూములు ఇలా ముళ్ల పొదలతో నిండి దారుణంగా మారాయి. ఏళ్ల తరబడి నిరుపయోగంగా వదిలేయడంతో ఇదే అదనుగా దొంగలు తెగబడ్డారు. విద్యుత్తు తీగలన్నీ కట్‌చేసి పట్టపగలే ఆటోల్లో తరలిస్తున్నా పట్టించుకునేవారు కరవయ్యారని కొర్నెపాడు గ్రామస్థులు వాపోతున్నారు.

- ఈనాడు గుంటూరు, న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు

## ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌కు 746 మంది హాజరు

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి సంబంధించి విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌కు ఆదివారం 746 మంది అభ్యర్థులు హాజరై తమ ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేయించుకున్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగాల్లో 60,001 నుంచి లక్ష ర్యాంకు వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలిచారు. ఎన్‌సీసీ విభాగంలో 260 మంది, క్రీడా విభాగంలో 103 మంది హాజరయ్యారు. ఆర్మీ సంతతి విభాగంలో ఒకటి నుంచి 50,000 ర్యాంకుల వరకు పిలవగా.. 383 మంది వచ్చారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. 14వ తేదీన ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగంలో 1,00,001 - 1,50,000 ర్యాంక్ వరకు, ఆర్మీ విభాగంలో 50,001 - 1,00,000 ర్యాంకు వరకు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రావాలని ఆయన తెలిపారు.

## కాలువలకు 12,788 క్యూసెక్కుల సాగు నీరు

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 12,788 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు(కేఈ) ప్రధాన కాల్వకు 9,781, కృష్ణా పశ్చిమ(కేడబ్ల్యూ) ప్రధాన కాల్వకు 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 5,017, ఏలూరు కాల్వకు 1,404, బందరు కాల్వకు 1,853, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,507 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు.

## రాజధాని సిగలో.. మణిహారమై..

కూటమి పాలనలో అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా..

వైకాపా పాలనలో అస్తవ్యస్తంగా నిర్మించిన సీఆర్‌డీఏ భవనం

**అ**మరావతి అభివృద్ధిలో కీలక భూమిక పోషించే సీఆర్‌డీఏ భవనం అత్యాధునిక హంగులతో సిద్ధమవుతోంది. వైకాపా ప్రభుత్వం ఎన్నికల ముందు బ్యాంకు రుణాల కోసం ఎలాంటి హంగులు లేకుండా ఈ భవనాన్ని అస్తవ్యస్తంగా నిర్మించింది. అనంతరం కూటమి అధికారంలోకి రాగానే రాజధానికే తలమానికంగా ఉండాల్సిన ఈ భవనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో జనవరి నెలాఖరున పనులు మొదలుపెట్టి వందల మంది కార్మికులు రాత్రింబవళ్లు పనులు చేస్తున్నారు. జీప్లస్ 7 మోడల్‌లో నిర్మిస్తున్న ఈ భవనం విద్యుత్తు అవసరాల్లో 30 శాతానికి పైగా సోలార్‌ను ఉపయోగించుకునేలా తీర్చిదిద్దారు. చుట్టూ అద్దాలు, మధ్యలో ఏ సింబల్‌తో కార్యాలయ నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేశారు. అన్ని హంగులూ సమకూర్చి ఆగస్టు 15 నాటికి ప్రారంభించేలా సిద్ధం చేస్తున్నామని సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

– ఈనాడు–అమరావతి, న్యూస్‌టుడే– తుళ్లూరు

## ఖాళీ కుర్చీలు.. కళతప్పిన బోర్డులు!

ఉపాధ్యాయ బదిలీలతో కొత్త సమస్య

ఈనాడు, అమరావతి

**భా**వి పౌరుల భవిష్యత్తును నిర్దేశించేవి బడులే. అంతటి కీలకమైన చదువు కొన్నిచోట్ల విద్యార్థులకు అందడం లేదు. పల్నాడు జిల్లాలోని అనేక పాఠశాలల్లో అసలు ఉపాధ్యాయులే లేరు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు మరో సమస్యగా తయారయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 5వేల మంది ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయ్యారు. ఎక్కువ మంది గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పనిచేయడానికే మొగ్గు చూపి వచ్చేయడంతో పల్నాడు జిల్లాలో పరిస్థితులు ప్రహసనమయ్యాయి. అనేక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేని దుస్థితి ఏర్పడింది.

### మచ్చుకు కొన్ని చూస్తే..

మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలంలో 98 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి రాగా ప్రస్తుతం ఇక్కడ 27 మంది మాత్రమే ఉన్నారు. అంటే 71 మంది కొరత ఉంది. 8 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నా ఉపాధ్యాయులు లేక నల్లబోర్డు, ఖాళీ కుర్చీనే స్వాగతం పలుకుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటివి 122 మేర పాఠశాలలున్నట్లు సమాచారం. మారుమూల తండాలు, రవాణా సదుపాయాలు లేని అటవీ ప్రాంతం కావడంతో బదిలీపై వెళ్లినవారి స్థానంలో రావడానికి ఎవరూ మొగ్గుచూపడం లేదు.

వెల్దుర్తి: శివలింగాపురంలో మాస్టారు లేక ఖాళీగా విద్యార్థులు

### తాత్కాలికంగా ఏర్పాట్లు

బదిలీల వల్ల ఉపాధ్యాయులు లేని బడుల్లో అధికారులు తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో పనిచేసి బదిలీ అయిన వారినే తిరిగి వెనక్కి రప్పించి పాఠశాలలు నడిపిస్తున్నారు. కొన్నిచోట్ల ఆయాలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో నెట్టుకొస్తుండడం కనిపిస్తోంది. ఓ స్వచ్ఛంద సంస్థ నుంచి 32 మంది వాలంటీర్లను నెలకు రూ.8వేలు జీతం ఇచ్చేలా నియమించుకుని ఇక్కడ వినియోగిస్తున్నారు. అయినా సమస్య కొలిక్కి రావడం లేదు. అంతా డీఎస్సీ భర్తీ పైనే ఆశలు పెట్టుకున్నాయి.

### అక్కడ మరో అవస్థ

ఇక ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మరో రకం సమస్యలు నెలకొన్నాయి. ఆ రోజు ఉపాధ్యాయుడు సెలవు పెడితే బడికీ సెలవు ప్రకటించాల్సిందే. పొరుగు పాఠశాలల్లోని వారిని వినియోగించడానికీ వీల్లేకుండా ఖాళీలు దర్శనమిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల సంఖ్యలో ఇలాంటివి ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఒక్క వెల్దుర్తి మండలంలోనే మొత్తం 56 పాఠశాలలకు 30 ఏకోపాధ్యాయ పాఠశాలలే కావడం గమనార్హం. బాపట్ల జిల్లాలో 441 ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దీనికితోడు, గుంటూరు, బాపట్ల జిల్లా కేంద్రాల్లో ఉండే కొందరు ఉపాధ్యాయులు మారుమూల మండలాల్లో పనిచేయాల్సి రావడంతో వారు వెళ్లి రావడానికే సమయం సరిపోతూ బోధనపై ఆ ప్రభావం పడుతోంది. ఈ సమస్యలకు చెక్ పెట్టాలంటే ఎంటీఎస్ ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలి. ఉమ్మడి జిల్లాలో అధికంగా ఉన్నచోట్ల ఉపాధ్యాయులను డెప్యుటేషన్లపై ఖాళీ ఉన్న బడులకు పంపించడం.. తాత్కాలిక హెచ్ఎం బాధ్యతలు చూస్తున్న వారినీ బోధనకు వినియోగించడం ద్వారా విద్యార్థులకు సిలబస్ జరిగేలా చూడటానికి వీలుంటుంది.

## చెరువు భూమి ఆక్రమణపై చర్యలు

అరుగురిపై కేసు

ఈనాడు కథనానికి స్పందన

**తుళ్లూరు, న్యూస్‌టుడే:** 'చెరువు భూమిని చెరబట్టేశారు' శీర్షికన ఈ నెల 12న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి తుళ్లూరు పోలీసులు స్పందించారు. వడ్డమాను గ్రామంలో నకిలీ పత్రాలతో చెరువు భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొని మోసం చేశారని గ్రామానికి చెందిన బాధిత రైతు జంగా శివశంకర్‌రెడ్డి (46) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం తుళ్లూరు సి.ఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జంగా శివశంకర్‌రెడ్డి ముత్తాత జంగా వెంకట రామిరెడ్డికి సర్వే నం.159లో ఉన్న 4.65 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇంకా ఎవరికీ పంపకాలు చేయలేదు. ఈ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి గ్రామానికి చెందిన కంజుల పురుషోత్తమరెడ్డి, మరో నలుగురు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 20 జూన్ 2025న రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనికి కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం, చినఆవుటపల్లి గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సింహాద్రి సుబ్బారావు సహకరించారు. ఈ ఘటనలో మొత్తం ఆరుగురిపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండో విడత ప్రవేశాలకు 907 మంది ఎంపిక

**వేంపల్లె, న్యూస్‌టుడే :** రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు రెండో విడత ప్రవేశాల కోసం ఎంపికైన 907 మంది విద్యార్థుల జాబితాను ఆదివారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ విడుదల చేశారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థుల పేర్లను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొదటి విడతలో ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 628 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలలో చేరలేదు. దీంతో ఆ సీట్లు ఖాళీపడ్డాయి. వీటితో పాటు దివ్యాంగుల కోటా కింద 179, సైనికోద్యోగుల పిల్లల కోటా కింద 80, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 20 సీట్లతో కలిపి మొత్తం 907 సీట్లకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి వారి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇందులో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి 96 మంది, ఒంగోలుకు 460, నూజివీడుకు 85, శ్రీకాకుళానికి 265 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్‌సీసీ కోటా కింద 40 సీట్లు, క్రీడా కోటా కింద 20 సీట్లకు నిపుణులైన ఆయా శాఖల అధికారుల నుంచి విద్యార్థుల మెరిట్ జాబితా అందాల్సి ఉంది. ఈ సీట్ల భర్తీ కూడా మరో వారంలో పూర్తి కానుంది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 96 మంది విద్యార్థులు ఈ నెల 17న ఇడుపులపాయకు, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 810 మంది విద్యార్థులు అదే రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరిగే కౌన్సెలింగ్‌కు ధ్రువపత్రాలు, లగేజీలతో హాజరు కావాలని వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. కొత్తగా ఎంపికైన విద్యార్థులందరికీ సోమవారం నుంచి ఓరియెంటేషన్ తరగతులు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

## ఆంధ్రా ప్యారిస్‌కు పర్యాటక శోభ!

నిజాంపట్నం కాలువలో బోటు షికారుకు అడుగులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

**తె**నాలికి 'ఆంధ్రా ప్యారిస్' అన్న పేరు రావడం వెనుక కారణాల్లో ఒకటి పట్టణం మధ్య నుంచి పారిస్‌లో మాదిరిగా మూడు పంట కాలువలు పారుతుండటమే. ఇవి సుమారు 2 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్నాయి. వీటి బండ్లను సుందరీకరించడంతో పాటు కాలువల్లో బోటు షికారును అందుబాటులోకి తీసుకొస్తే తెనాలి మంచి పర్యాటక ప్రాంతం అవుతుందన్న ఆలోచనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో నాదెండ్ల మనోహర్ స్థానిక శాసనసభ్యుడిగా, ఉపసభాపతి, సభాపతిగా బాధ్యతలు నిర్వర్తించిన క్రమంలో ఈ అంశంపై దృష్టి సారించి అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. కాలువలపై నుంచి అటూ ఇటూ రాకపోకలకు 'ఆకాశ నడక వంతెన' నిర్మాణానికి సంబంధించి ప్రణాళిక, రూపు, అంచనాలు చేయించారు. కాని అప్పట్లో సాధ్యపడలేదు. తిరిగి ఇప్పుడు మంత్రి హోదాలో ఆ అంశంపై ఆయన దృష్టి సారించారు.

తెనాలి పట్టణం నుంచి సాగుతున్న మూడు పంట కాలువలు

పర్యాటక విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నిజాంపట్నం కాలువలో నమూనా డ్రైవ్

### నమూనా డ్రైవ్ విజయవంతం

తొలుత మధ్య కాలువ అయిన నిజాంపట్నం కాలువలో బోటు షికారుకు కసరత్తు మొదలైంది. మంత్రి మనోహర్ ఆదేశాలతో జలవనరుల విభాగం అధికారులు మూడు నెలలుగా ఈ అంశంపై ప్రణాళిక రూపొందించే పనిలో ఉన్నారు. పర్యాటక విభాగం వారు కూడా క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పలుమార్లు పరిశీలించారు. ఆదివారం నమూనా డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించారు. కాలువలో చిన్న బోటును పట్టణ పరిధిలో నడిపి వివిధ చోట్ల నీటి లోతును నమోదు చేశారు. బండ్ల సుందరీకరణ, ప్రజలు బోటు ఎక్కే, దిగే ప్రాంతాల గుర్తింపు, ఆయా చోట్ల వివిధ స్టాల్స్ ఏర్పాటు వంటి పనులకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

### ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా

తెనాలికి సహజంగా అందుబాటులో ఉన్న వనరులను అన్ని విధాలుగా సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచనలో భాగంగానే బోటు షికారుకు ప్రయత్నిస్తున్నాం. తర్వాత దశలవారీగా ఇతర కార్యక్రమాలను కొనసాగిస్తాం. వీలైనంత త్వరగా ప్రజలకు చక్కటి ఆహ్లాదం, అందమైన అనుభూతిని చేరువ చేయాలని ప్రయత్నిస్తున్నాం. బోటు షికారు మొదలైన తర్వాత ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తెనాలి భక్తులకు మరింత చేరువ అవుతుంది.

– మంత్రి నాదెండ్ల మనోహర్

## రైతుల ముంగిటకు ప్రభుత్వ సేవలు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** వివిధ పథకాల ద్వారా రైతులకు వీలైనంత మేలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి మార్కెట్ యార్డులో ఆదివారం రూ.12 లక్షల రాయితీతో డ్రోన్, ఇతర యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సేవలను వారి ముగింటకే తీసుకొస్తున్నామన్నారు. సాగులో ఆధునిక విధానాలపై అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. అనంతరం 33 మంది రైతులు, సంఘాలకు యంత్ర పరికరాలు అందజేశారు. ప్రకృతి సాగు విధానాలు, వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాసరావు, ఏడీఏ రాజకుమారి ఇతర అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తన శుద్ధిని చూస్తున్న మంత్రి మనోహర్

## తురకా కిశోర్‌పై మరో కేసు

**వెల్దుర్తి, మాచర్ల (కారంపూడి) :** వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడు పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ మాజీ ఛైర్మన్ తురకా కిశోర్‌పై వెల్దుర్తి పోలీసు స్టేషన్లో మరో హత్యాయత్నం కేసు నమోదైంది. ఎస్సై సమందర్‌వలీ తెలిపిన వివరాల ప్రకారం.. 2022 అక్టోబరు 7న లోయపల్లికి చెందిన తెదేపా నాయకుడు దారపనేని శ్రీనివాసరావు పార్టీ మారలేదన్న నెపంతో తురకా కిశోర్, బోదిలవీడుకు చెందిన మేదరమెట్ల శ్రీను, పంగులూరి బాబు మరికొందరు దాడి చేసి హత్యాయత్నం చేశారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంతో బాధితుడు ఆదివారం మళ్లీ ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వారిలో మేదరమెట్ల శ్రీను, పంగులూరి బాబులను అదుపులోకి తీసుకొని 306, 307, 448, మరో రెండు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


(c) eenadu

# సేవానిరతి.. విద్యాప్రగతి

## గుళ్లపల్లి సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలు, మహాప్రస్థానాల్లో సౌకర్యాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

కమ్మజన సేవా సమితిలో సుబ్బారావు కట్టించిన పై అంతస్తు

**వి**ద్యతోనే సమాజం ప్రగతి దిశగా సాగుతుందని బలంగా నమ్మారాయన. ఉన్నంతలో ఎంతో కొంత సమాజానికి తిరిగి ఇచ్చేయాలనుకున్నారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని, విద్యాభివృద్ధికి చేయూత అందిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు విద్యాప్రదాత **గుళ్లపల్లి సుబ్బారావు.**

గుంటూరుకు సమీపంలోని బ్రాహ్మణకోడూరుకు చెందిన గుళ్లపల్లి సుబ్బారావుది వ్యవసాయ కుటుంబం. తండ్రి ఉపాధ్యాయుడిగా పని చేసేవారు. సుబ్బారావు ఎమ్మెస్సీ ఫిజిక్స్ చదివారు. ఇండియన్ బ్యాంకులో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె.. అందరూ బాగా స్థిరపడ్డారు. ఈ జీవన ప్రయాణంలో తండ్రి నేర్పిన సంస్కారం, తల్లి ఇచ్చిన సంప్రదాయ చైతన్యం వెన్నంటి నడిచింది. ఈ నేపథ్యంలోనే పాతికేళ్లుగా తనకున్నంతలో తల్లిదండ్రులు గుళ్లపల్లి బసవయ్య, లీలావతి, మామ రాయపాటి వీరయ్య పేర్లపై దానధర్మాలు ప్రారంభించారు. అనంతరం గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ స్థాపించి దాదాపు రూ.1.5 కోట్లతో ఎన్నో కార్యక్రమాలు చేశారు. ఇప్పటికీ బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిరంతరం సాహిత్య, సేవ, నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం, ప్రతిభావంతులైన వృద్ధ మహిళలను సన్మానిస్తుంటారు. సోదరుడు గుళ్లపల్లి రాఘవేంద్రరావు సహకారంతో కార్యక్రమాలు చేస్తున్నారు.

### సాహిత్యంపై మక్కువ.. చదువుకు చేయూత

- తెలుగు సాహిత్యంపై అభిమానంతో పలు విలువైన తెలుగు సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం పుస్తకాలు 50 వరకు అచ్చు వేయించారు.
- గుంటూరులో కమ్మజన సేవా సమితి బాలికల వసతిగృహం, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్, అరండల్‌పేట బాలుర కమ్మ వసతిగృహం, దాక్షిణ్య మానసిక వికలాంగుల సంస్థ, బ్రాడీపేట శారదానికేతనాల్లో ఒక్కో బ్లాకు చొప్పున కట్టించారు.
- కొరిటెపాడు శాంతినగర్లో ప్రాథమిక పాఠశాల భవనం కట్టించారు. బ్రాహ్మణకోడూరు, గుంటూరుల్లో పైకా క్రీడా భవనాలు, జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో వంటశాలలు కట్టించారు.
- జిల్లా గ్రంథాలయం, అరండల్‌పేటలోని రీడింగ్ రూమ్ ఆధునికీకరణ. పట్టాభిపురంలోని వేదపాఠశాల కార్యాలయ భవనం, మోతడకలో కాకతీయ కన్వెన్షన్ సెంటర్ కార్యాలయం, గుంటూరు బార్ అసోసియేషన్‌లో ఏసీ క్యాంటీన్ నిర్మించారు.

**ఉద్యానాల వృద్ధి:** గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణాలకు విరాళం ఇచ్చారు. కృష్ణనగర్ పార్క్, అన్నమయ్య ట్రాక్, ఇన్నర్‌రింగ్ రోడ్ పార్క్, చినపలకలూరు, తురకపాలెంలలో వాకింగ్ ట్రాక్‌ల దగ్గర బెంచీలు ఏర్పాటు చేశారు. గుంటూరులోని అన్నమయ్య వాకింగ్ ట్రాక్ మధ్యలో 30 అడుగుల శ్రీమహావిష్ణువు విగ్రహం కట్టించారు.

### మహాప్రస్థానాల్లో సౌకర్యాలు

అంతిమ సంస్కారాలకు పలు శ్మశానాల్లో కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. స్తంభాలగరువు మహాప్రస్థానంలో షెడ్లు, వాటర్ ట్యాంక్, దహన కార్యక్రమాలకు గ్యాస్ ఛాంబర్, నల్లపాడురోడ్డులో అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మహాప్రస్థానం, బొంగరాలబీడులో సత్యహరిశ్చంద్ర విగ్రహం ఏర్పాటు చేశారు. గుంటూరు మహాప్రస్థానంలో సౌకర్యాలకు విరాళం ఇచ్చారు.

# తెనాలితో కోటకు ఆత్మీయ అనుబంధం

కోట శ్రీనివాసరావుకు అవార్డును అందజేస్తున్న సాయి లక్కరాజు

**తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే:** విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుకు ఆంధ్రా ప్యారిస్, కళల కాణాచి తెనాలితో ఆత్మీయ అనుబంధం ఉంది. ఆయన మృతి చెందారన్న విషయం తెలిసి కళాకారులు, కళాభిమానులు విచారం వ్యక్తం చేశారు. స్థానిక స్పందన సామాజిక సాంస్కృతిక సంస్థ కార్యదర్శి సాయి లక్కరాజు ఆధ్వర్యంలో తెనాలి వాసి పల్నాటి యుద్ధం (పాతది) సినిమాలో బ్రహ్మనాయుడు పాత్రధారి, సినీనటుడు డాక్టర్ గోవిందరాజుల సుబ్బారావు స్మారక అవార్డును 1998 అక్టోబరు 11న స్థానిక నన్నపనేని వెంకట్రావు కల్యాణ మండపంలో కోట శ్రీనివాసరావుకు అందజేశారు. ఆ కార్యక్రమ ఆహ్వానం అందుకున్న అవార్డు గ్రహీత అందుకు తన అంగీకారం తెలుపుతూ ప్రత్యుత్తరం రాశారు. దానిని సాయి లక్కరాజు ఎంతో అపురూపంగా దాచుకున్నారు. నటుడు కోట శ్రీనివాసరావు మృతికి పౌరాణిక రంగస్థల నటుడు, పద్యకవి పాతూరు సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా, స్వరలయ వేదిక అధ్యక్షుడు సాయిలక్కరాజు, సభ్యులు రమణయ్య, నటుడు హేమంత్ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

# సొలస అల్లుడే కోట

శ్రీనివాసరావుతో భార్య రుక్మిణి (పాత చిత్రం)

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** విలక్షణ నటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు మరణ వార్త విని.. జిల్లాలో ఆయన అభిమానులు, నాటకరంగ కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేటలతో ఆయనకున్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. కోట శ్రీనివాసరావు యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన కరణం రాజేశ్వరరావు కుమార్తె రుక్మిణిని 1968లో వివాహం చేసుకున్నారు. అప్పటికే ఆ కుటుంబం విజయవాడలో స్థిరపడటంతో అప్పుడప్పుడు సొలసలోని బంధువుల ఇంటికి వచ్చేవారు. గ్రామంలో సాంఘిక నాటకాలు నేర్చుకుంటున్న యువకులకు సూచనలు ఇచ్చేవారని ఆ తరం వారు గుర్తు చేసుకున్నారు.

# వాణిజ్య పన్నులశాఖ ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

ఎన్నికైన నూతన కార్యవర్గం

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** ఏపీ వాణిజ్య పన్నులశాఖ ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగుల సంఘం, ఉమ్మడి గుంటూరు జిల్లా బ్రాంచి ఎన్నికలు ఆదివారం జిన్నాటవర్ సెంటర్‌లోని ఆ శాఖ కార్యాలయంలో జరిగాయి. సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వి.రమేష్‌కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా వి.రమేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.విజయలక్ష్మీ, ఎం.షణ్ముఖ, ప్రధాన కార్యదర్శిగా ఎన్.కార్తీక్, కార్యాలయ కార్యదర్శిగా వి.కల్యాణ్, సంయుక్త కార్యదర్శిగా ఆర్.సరళబాబు, కోశాధికారిగా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఏపీ వాణిజ్యపన్నులశాఖ 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావులపాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు, ఏపీ 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాగమల్లేశ్వరరావు ముఖ్యఅతిథులు విచ్చేసి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

# వేద జ్ఞానాన్ని బోధించిన వ్యాస మహర్షి

మాట్లాడుతున్న శివస్వామి

**బాపట్ల, న్యూస్‌టుడే:** వేద జ్ఞానాన్ని అందరికీ అర్థమయ్యేలా బోధించిన వ్యాసమహర్షి స్ఫూర్తితో ఉపాధ్యాయులు పని చేయాలని తాళ్లాయపాలెం శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి అన్నారు. హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని విజయలక్ష్మీపురం రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు వ్యాస పురస్కారాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో విజ్ఞాన సౌరభాలు వెదజల్లుతూ భారతీయ సంస్కృతికి సింధువులుగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. అష్టాదశ పురాణాలు రచించిన వ్యాసమహర్షి సమాజానికి జ్ఞాన సంపద ఇచ్చారన్నారు. ఆధ్యాత్మిక, రక్షణ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం మహోన్నత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. భారతీయ సాంస్కృతిక వైభవాన్ని విస్తరింపజేయటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. హిందూ ధర్మం, జాతి గర్వించదగ్గ వారసత్వాన్ని యువతకు అందించే కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ శ్రీనివాసరావు, హిందూ ఉపాధ్యాయ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు సీతారామయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, ప్రధాన కార్యదర్శి స్వర్ణఫణి అజయ్‌శర్మ, నేతలు చారులత, నాగరాజు, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాల పెంపుపై స్పష్టత ఇవ్వండి

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ముత్యాలరావు, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం నుంచి నిరవధిక సమ్మెకు దిగినట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం తక్కెళ్లపాడు వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల సమ్మెలోకి వెళ్తున్నామని గత నెలలో నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడం హేయమైన చర్యని విమర్శించారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి నారాయణ ప్రకటించారన్నారు. వేతనాలు ఎంత పెంచుతారు, ఎప్పుడు పెంచుతారనే స్పష్టత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి దిగారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు వేతనాల పెంపు, సంక్షేమ పథకాలు అమలు చేసి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముత్యాలరావు, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, నాయకులు యాసిన్‌ఖాన్, బాలకృష్ణ, రవి, జానీ, నాగరాజు, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

# ఎన్నాళ్లీ జాప్యం?

## పదోన్నతులకు పరిపాలన అధికారుల నిరీక్షణ

**జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే:** ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు పరిధిలోని పరిపాలన అధికారుల (ఏవో) పోస్టుల ఖాళీలను సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయడంలో జాప్యం జరుగుతోంది. బొల్లాపల్లి, గురజాల, పిట్టలవానిపాలెం మండల పరిషత్తు కార్యాలయాల ఏవో పోస్టులు ఖాళీలు ఏర్పడి మూడు నెలలయ్యింది. జూన్ 30న ప్రత్తిపాడు, ఈపూరు మండల పరిషత్తు కార్యాలయాల ఏవోలు ఉద్యోగ విరమణ పొందడంతో మరో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. జులై 31న మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి. రొంపిచర్ల, రాజుపాలెం మండలాల ఏవోల పోస్టులు నకిరేకల్లు మండల పరిషత్తు ఏవో శ్రీనివాసరావు పేరు ఎంపీడీవో పదోన్నతి జాబితాలో ఉంది. ఈ నెలలోనే ఆయనకు ప్రభుత్వం పదోన్నతి ఇస్తుందని భావిస్తున్నారు. ఆయనకు పదోన్నతి లభిస్తే ఆ పోస్టు ఖాళీ ఏర్పడనుంది. మూడు నెలల కిందట నూజెండ్ల మండల పరిషత్తు కార్యాలయ ఏవోగా నియమించిన అధికారి విధుల్లో చేరకపోవడంతో ఆ పోస్టులో మరొకరిని నియమించే అవకాశముంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 9 మండల పరిషత్తు కార్యాలయాలకు ఏవోలు పదోన్నతుల కోసం జడ్పీ అధికారులు సిబ్బందితో పలుమార్లు చర్చించారు. ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఏవోల పోస్టుల ఖాళీలు ఏర్పడిన రోజుల వ్యవధిలోనే సీనియారిటీలో ముందున్న సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతి ఇస్తుండటంతో మూడో జోన్‌లో సీనియారిటీ పరంగా ముందుంటున్నారు. ఎంపీడీవో పదోన్నతులు ఇచ్చేసమయం గుంటూరు జిల్లాకు చెందిన వారు వెనుకబడి ఉంటున్నారని ఉద్యోగ సంఘ నాయకులు గుర్తు చేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల ఉద్యోగులకు పదోన్నతి కల్పించడంపై ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జీవోకి అనుగుణంగా ఎ, బి, సి కేటగిరి వారీగా రోస్టర్ పాయింట్లు రూపొందించాలి. సీనియర్ అసిస్టెంట్లు ఏవోలుగా పదోన్నతిపై వెళ్తే.. వారి కింది కేడర్‌లోని జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా, ఆఫీస్ సబార్డినేట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించే అవకాశముంది. దాంతో సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతులు ఎప్పుడు ఉత్తర్వులు జారీ చేస్తారని సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

# చిన్న రంధ్రాలతో ఆర్థ్రోస్కోపీ సర్జరీలు

జ్యోతి వెలిగిస్తున్న ఎన్ఎస్‌వీ రమణ, పక్కన ప్రశాంత్, అమర్‌నాథ్, సందీప్, శివకుమార్, చైతన్య, నారాయణరావు, సుబ్రమణియన్ తదితరులు

**గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే:** క్రీడల్లోనో, ప్రమాదాల్లోనో మోకీలులో లిగమెంట్లు, ఘుటులో ఉండే కండరాలు తెగితే.. చిన్న రంధ్రాల ద్వారా ఆర్థ్రోస్కోపీ విధానంలో సర్జరీ పూర్తి చేయడం వల్ల రోగులకు ఎంతో మేలు జరుగుతుందని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎన్ఎస్‌వీ రమణ తెలిపారు. గుంటూరులోని వెలెక్స్ హోటల్లో గుంటూరు ఆర్థోపెడిక్ అసోసియేషన్, గుంటూరు ఆర్థ్రోస్కోపీ అకాడమీ సంయుక్తంగా మొదటి ఆర్థ్రోస్కోపీ సదస్సు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ మోకీలులో ఉండే లిగమెంట్లు తెగిపోతే గతంలో మోకాలిని పూర్తిగా తెరిచి సర్జరీ చెయ్యాల్సి వచ్చేదన్నారు. అత్యాధునిక ఆర్థ్రోస్కోపీ విధానంలో రెండు చిన్న రంధ్రాల ద్వారానే సర్జరీ పూర్తి చేస్తున్నారన్నారు. 40-50 ఏళ్ల వయసులో కీళ్లలో వాపు, నొప్పి తలెత్తిన వారికి మోకీలు మార్పిడి సర్జరీ అవసరం లేకుండానే హెచ్‌టీవో విధానంలో చేయొచ్చన్నారు. గతంలో ఆర్థ్రోస్కోపీ శస్త్రచికిత్సల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌కు రోగులు వెళ్లాల్సి వచ్చేదన్నారు. కొంతకాలంగా గుంటూరులోనూ ఈ సర్జరీలు చేస్తున్నారన్నారు. వైద్యులకు దీనిపై శిక్షణ ఇచ్చి అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేసిన కార్యనిర్వాహక మండలిని అభినందించారు. చెన్నైకు చెందిన సుబ్రమణియన్ (మదురై), జైన్(అహ్మదాబాద్), బాలసుబ్రమణియన్(బెంగళూరు) తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. అంతేగాకుండా లైవ్ సర్జరీలు చేశారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహక అధ్యక్షుడు శివకుమార్ మామిళ్లపల్లి, కార్యదర్శి గంటా చైతన్య, రాష్ట్ర ఆర్థోపెడిక్ సర్జన్స్ సంఘం పూర్వ అధ్యక్షులు ప్రశాంత్, అమర్‌నాథ్, నారాయణరావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు పాల్గొన్నారు.

# 551.10 అడుగులకు సాగర్ నీటిమట్టం

క్రస్టుగేట్లకు చేరిన సాగర్ జలాలు

**విజయపురిసౌత్, న్యూస్‌టుడే:** నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటలకు 551.10 అడుగులకు పెరిగింది. 212.2078 టీఎంసీలకు సమానంగా ఉంది. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1,650 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం నీటిమట్టం 883.30 అడుగుల వద్ద కొనసాగుతోంది. ఇది 206.0996 టీఎంసీలకు సమానం. జూరాల, రోజాల నుంచి శ్రీశైలం జలాశయానికి 72,763 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 63,317 క్యూసెక్కుల నీరు వస్తోంది.

# అవాస్తవాల ప్రచారం తగదు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** తెనాలి ఐతానగర్ చెరువులో మునిగి మృతిచెందిన రౌడీ షీటర్ మాతంగి భరత్‌కుమార్ విషయంలో కొంత మంది అవాస్తవాలు ప్రచారాలు చేస్తున్నారని, దీనిని ఖండిస్తున్నట్లు తెనాలి పోలీసులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. భరత్‌కుమార్‌పై 2011 నుంచి ఇప్పటి వరకు 13 కేసులు నమోదయ్యాయన్నారు. 2015 నుంచి అతడిపై తెనాలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్లో రౌడీషీట్ ఉందని పేర్కొన్నారు. 2024 నవంబరులో బాలికను వేధించడంతో నమోదైన పోక్సో కేసులో విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో న్యాయమూర్తి వారెంట్ జారీ చేశారని, అతడి కోసం ఇంటికి పోలీసులు వెళ్లగా భరత్‌కుమార్ చెరువులో దూకాడని, ఆ తర్వాత పోలీసులు అక్కడి నుంచి వచ్చేశారని, ఇదంతా అతడి కుటుంబ సభ్యులు, స్థానికులు కూడా గమనించారని తెలిపారు. వాస్తవాలను వక్రీకరించడం తగదని స్పష్టం చేశారు.

# రుణాల విడుదల ఇంకెప్పుడు?

## బీసీ, ఈబీసీ నిరుద్యోగుల ఎదురుచూపులు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

**జి**ల్లాలో నిరుద్యోగ బీసీ, ఈబీసీలకు స్వయం ఉపాధి పథకంలో రుణాలు ఎప్పుడు విడుదల చేస్తారా? అని అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. గత ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలోని ఎంపిక కమిటీ సభ్యులు అర్హులను ఎంపిక చేశారు. మూడు నెలలైనప్పటికీ అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాలను జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యాలయానికి పంపలేదు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో అయిదేళ్లు స్వయం ఉపాధి రుణాలను నిలిపివేసింది. దాంతో పేదల స్వయం ఉపాధికి అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ కార్పొరేషన్లకు సంబంధించి స్వయం ఉపాధి రుణాలను పునరుద్ధరించింది.

### మూడు నెలలైనా ప్రకటించని అర్హుల జాబితా

జిల్లా బీసీ కార్పొరేషన్‌తో పాటు ఈబీసీ కార్పొరేషన్, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ల ద్వారా ఆయా సామాజిక వర్గాలకు చెందిన నిరుపేదలు 2,495 మందికి రూ.59.99 కోట్ల రుణాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ప్రభుత్వం రాయితీగా రూ.29.99 కోట్లు విడుదల చేయనుంది. బ్యాంకులు రూ.29.29 కోట్లు రుణం మంజూరు చేయనున్నాయి. లబ్ధిదారుల వాటాని ప్రభుత్వం రద్దు చేసింది. దాంతో పేదలపై భారం కూడా లేకుండా పోయింది. రుణాలు విడుదల చేస్తే అభ్యర్థులు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుని వస్తువులను ఉత్పత్తి చేయడం ద్వారా ఆదాయం గడించవచ్చు. 2014-19 కాలంలో తెదేపా ప్రభుత్వం ఆదరణ పథకంలో చేతివృత్తిదారులకు అవసరమైన వస్తువులను సరఫరా చేసింది. ప్రస్తుతం లబ్ధిదారుల ఇష్టానికి అనుగుణంగా యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దాంతో ఆధునిక పరికరాలను పలువురు ఎంపిక చేసుకుని దరఖాస్తుల్లో పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక ఏడాదిలో మొదటి త్రైమాసికం పూర్తయినందున రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం రుణం మంజూరు చేశాక బ్యాంకర్లు తమ వాటా రుణం విడుదల చేసిన తర్వాతే యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి. ప్రభుత్వం నుంచి రుణాల మంజూరుపై సమాచారం లేనందునే అర్హుల జాబితా విడుదల ఆలస్యమవుతోందని జిల్లా బీసీ కార్పొరేషన్ వర్గాలు తెలిపాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు.

# కారు బీభత్సం

## ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

**తాడికొండ:** నిద్ర మత్తులో నిర్లక్ష్యంగా కారు నడుపుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా.. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నుంచి అమరావతి వెళ్తున్న కారు శనివారం ఉదయం బీభత్సం సృష్టించింది. డ్రైవర్ నిద్ర మత్తులో కారును నడపడంతో లాం డిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మూడు ద్విచక్రవాహనాలను ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనాలపై ఉన్న తుళ్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన ఆరేపల్లి జోజి, ఎస్.సాంబయ్య(40), మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాంబయ్య మృతి చెందగా.. జోజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ పోలీసులు తెలిపారు.

# సీనియర్ అంతర్ జిల్లాల మల్టీ డే ఛాంప్ గుంటూరు

విజేతగా నిలిచిన గుంటూరు జట్టు

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** విజయవాడ సమీపంలోని మూలపాడు ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లో ఆదివారం ముగిసిన ఏసీఏ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల మల్టీ డే క్రికెట్ టోర్నీలో గుంటూరు జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ప్రకాశం జట్టు ద్వితీయ స్థానం సాధించింది. డీవీఆర్ మైదానంలో గుంటూరు, ప్రకాశం జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో 217 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ప్రకాశం జట్టు 54.2 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. ఎం.లేఖాజ్‌రెడ్డి (92)రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ పి.ఆదిత్యరెడ్డి (5/62)మెరిశాడు. రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు ఆట నిలిపే సమయానికి 51 ఓవర్లలో అయిదు వికెట్లను కోల్పోయి 263 పరుగులు చేసింది. ఎం.వంశీకృష్ణ (73) రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ వి.వేణు (2/94) మెరిశాడు. గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 468 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కనబరచడంతో మూడు పాయింట్లు, ప్రకాశం జట్టు ఒక పాయింటు సొంతం చేసుకున్నాయి. సీపీ మైదానంలో కృష్ణా, పశ్చిమ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్యాటర్లు శతకాల మోత మోగించారు. పశ్చిమ గోదావరి జట్టు 310 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను కొనసాగించి 120 ఓవర్లలో తొమ్మిది వికెట్లను కోల్పోయి 502 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జీఎస్ స్వామినాయుడు (104), కె.రేవంత్ నాగ్ (120) రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ ఎ.బ్రహ్మతేజ (4/130) మెరిశాడు. రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు ఆట నిలిపే సమయానికి 44 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. పశ్చిమ గోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం చూపడంతో మూడు పాయింట్లు, కృష్ణా జట్టు ఒక పాయింటు సాధించాయి.

# జిప్‌లైన్ దిగుతుండగా సందర్శకుడికి గాయాలు

చికిత్స పొందుతున్న రఘువరన్

**మేడికొండూరు, న్యూస్‌టుడే:** జిప్‌లైన్ దిగే సమయంలో సందర్శకుడికి గాయాలయ్యాయి. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన జి.రఘువరన్, మరికొంత మంది మిత్రులు సరదాగా ఆదివారం పేరేచర్లలోని నగరవనానికి వచ్చారు. వారంతా కలిసి జిప్‌లైన్ ఎక్కారు. దిగే క్రమంలో రఘువరన్ అప్రమత్తంగా లేకపోవడంతో పక్కనే ఉన్న ఇనుప రాడ్డు తగిలింది. దీంతో మూతికి రక్తపు గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని ఇద్దరు సహాయకులతో 108 వాహనంలో గుంటూరు ప్రయివేట్ ఆసుపత్రి తరలించామని, అక్కడ చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారని అధికారులు తెలిపారు.

### బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

**వెన్‌కాబ్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 102, రిటైల్ ధర - 124, చికెన్ విత్‌స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.

**కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ - 173, చికెన్ స్కిన్‌లెస్ - 196.

**అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 101, 109, 120 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

### నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

# భట్టిప్రోలు నుంచి తిరుమలకు కూరగాయలు

**భట్టిప్రోలు, న్యూస్‌టుడే:** తిరుమల తిరుపతి దేవస్థానానికి స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నుంచి ఆదివారం రాత్రి పదిన్నర టన్నుల కూరగాయల లారీ బయలుదేరి వెళ్లింది. కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా మాట్లాడుతూ తిరుమలలోని నిత్యాన్నదానానికి కళావతి కాలంగి వీర వెంకట పాండురంగారావు, ఆయన సోదరి సుగుణ సహకారంతో కూరగాయలను ఉచితంగా పంపామని తెలిపారు. తొలుత వాహనం వద్ద పూజ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు బొలిశెట్టి సునీల్ కుమార్, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


EENADU Classifieds

BUSINESS SERVICES | HEALTH & CARE | REAL ESTATE | LAND FOR SALE | GENERAL | PEOPLE CARE | OLD AGE HOME | JOBS | FINANCIAL SERVICES | SHARES

మంగళపాలెం NH-16 పెట్రోల్ బంకు నందు పనిచేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం 12,000/- నుండి 14,000/- వరకు. 8 గం|| డ్యూటీ. సంప్రదించగలరు. Cell: 98854 14786, 98854 97786.

మానసిక ఎదుగుదల లేని ఇద్దరు పిల్లలు (10 సం||లు) చూసుకొనుటకు "ఆయా" కావలెను. సంప్రదించండి. Ph: 99492 84105.

Wanted B-pharmacy or D-pharmacy candidates to work in a pharmacy in Guntur city. Pci Registration Mandatory. Contact - 63009 75241.

రాజధాని అమరావతికి 90 Km లో ... Ph: 9390060136.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గమనిక

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541



91.9FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం


| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |


/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589


(c) eenadu

# తెనాలి

• తెనాలి • పొన్నూరు

## ఉపకార వేతనాలు, పుస్తకాల పంపిణీ

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** పద్మశాలి వెల్‌ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సంఘ కల్యాణ మండపంలో ఆదివారం 142 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.2.84 లక్షల విలువైన ఉపకార వేతనాలు, 275 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేశారు. డాక్టర్ శ్రీహరి, మురళీకాంత్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు భరోసా

**పెదకాకాని, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు భరోసా అని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. పెదకాకాని తెదేపా కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పంపిణీ చేశారు. పెదకాకానిలో ప్రహరీ కూలి మృతి చెందిన చిన్నారులు బంగారు సిద్ధార్థ (12), కోలాటపు స్వాతిక్(12), నంబూరులో హోలీ రోజు ప్రమాదవశాత్తు గుంటూరు ఛానల్‌లో పడిన దాసరి జాషువా కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. దీంతో పాటు పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

### మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పట్టణ పరిధిలోని 10వ వార్డు శివారులో వీధి దీపం వెలగడం లేదు. ఆ మార్గంలో రాత్రి సమయంలో రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉంది. **- కె.నాగరాజు, 10వ వార్డు.**

✔ వీధి దీపం బాగుచేయించే విధంగా చర్యలు తీసుకుంటాం.**- జంగం అపర్ణ, సహాయ ఇంజినీరు**

? పొన్నూరు పట్టణ పరిధిలోని 14వ వార్డు ప్రధాన రహదారిలో రెండు రోజులు నుంచి చెత్తను తొలగించలేదు. **- ఎన్.భాస్కర్, 14వ వార్డు**

✔ చెత్త తొలగించే విధంగా చూస్తాం. **- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి -న్యూస్‌టుడే, పొన్నూరు**

స్పందనకు వందనం

పట్టణ పరిధిలోని నేతాజీనగర్‌లోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో పూడిక తొలగించారు.

## రాష్ట్ర మహాసభలకు తరలిరావాలని పిలుపు

**తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే:** వచ్చే నెల 23, 24 25 తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహా సభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో కళారూపాలతో కళాకారులు తరలి రావాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.రామకృష్ణ పిలుపునిచ్చారు. తెనాలిలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, కనపర్తి బెన్‌హర్, నీలాంబరం, మల్లికార్జునరావు, శ్రీనివాసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ

# తీరనున్న రుణ భారం..!

**తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేసిన ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్‌ల)పరిధిలోని బహుళ ప్రయోజన గోదాములను అద్దె ప్రాతిపదికన తీసుకునేందుకు వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రీజనల్ అథారిటీ(డబ్ల్యూడీఅండ్ఆర్ఏ) వారు ముందుకొచ్చారు. దీంతో ఏడాది నుంచి వాటికి సంబంధించిన నాబార్డు రుణం తీర్చడానికి పీఏసీఎస్‌ల నిర్వాహకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీరనున్నాయి.

### ఒక్కోదానికి రూ.40 లక్షల ఖర్చు

రైతుల పంట ఉత్పత్తులు నిల్వ చేసుకొని, వాటికి మద్దతు ధర వచ్చాక విక్రయించుకునేలా నాబార్డు రుణంతో పీఏసీఎస్‌ల పరిధిలో ప్రభుత్వ స్థలాలు, లేఔట్లలో గోదాములు నిర్మించారు. ఒక్కోదానికి రూ.40 లక్షలు ఖర్చు చేశారు. 500 టన్నుల చొప్పున నిల్వ చేసుకొనే సదుపాయం ఉంది. అయితే

వాటిని చేరుకోవడానికి రహదారులు నిర్మించకపోవడంతో వినియోగించుకోవడానికి రైతులు ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో ఏటా చెల్లించాల్సిన నాబార్డు రుణం భారం పెరిగిపోయింది. ఈ విషయాన్ని సహకార శాఖ కమిషనర్‌కు లేఖ ద్వారా తెలియజేసి, పరిష్కారం చూపాలని కోరారు. వారి సూచనల మేరకు పీఏసీఎస్‌ల నిర్వాహకులు డబ్ల్యూడీఅండ్ ఆర్ఏ వెబ్‌సైట్‌లో పీఏసీఎస్‌ల వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. తూములూరు, కొల్లిపర, అత్తోట, వల్లభాపురం పీఏసీఎస్‌ల నిర్వాహకులు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసిన గోదాములను అధికారులు పరిశీలించి సమగ్ర వివరాలతో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు.

పెదరావూరులో..

### బహుళ ప్రయోజన గోదాములను అద్దెకు తీసుకునేందుకు అంగీకారం

బుర్రిపాలెంలో నిర్మాణం

**మొత్తం 18..** తెనాలి డివిజనల్ సహకార శాఖ అధికారి కార్యాలయ పరిధిలో తెనాలి నియోజకవర్గంలో 6, పొన్నూరులో 6, ప్రత్తిపాడులో 3, మంగళగిరిలో 3 చొప్పున బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు నిర్మించారు. వీటిపై సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ కేవీ రామారావును సంప్రదించగా.. గోదాములను అద్దె ప్రాతిపదికన తీసుకోడానికి డబ్ల్యూడీ అండ్ఆర్ఏ ఉన్నతాధికారులు అంగీకరించారని చెప్పారు.

## ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**పెదకాకాని, న్యూస్‌టుడే:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. పెదకాకానిలోని బండ్లమూడివారిపేట వద్ద ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నట్లు తెలిపారు.

ప్రజలతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

### రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

**పొన్నూరు, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని వడ్డిముక్కలలో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. డీసీఎంఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత వైకాపా పాలనలో రైతులకు సంక్షేమాన్ని అందించడంలో అప్పటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత వైకాపా పాలనలో సాగునీటి, మురుగు నీటి కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగు, మురుగు నీటి కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేశారని చెప్పారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న హరిబాబు

## అమ్మవారికి బోనాల సమర్పణ

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** తెనాలి మండలం కఠెవరంలోని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం తరఫున అమ్మవారికి ఆదివారం ఆషాఢ బోనాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

**సారె సమర్పణ: తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** ఆషాఢ మాసం సందర్భంగా మహిళలు ఆదివారం బుర్రిపాలెం రోడ్డులోని పార్వతీదేవి సమేత ఓంకారేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పించారు. అర్చకులు వేదాశీర్వచనం అందించారు. భక్తులకు అన్నదానం చేశారు.

## పరీక్షా కేంద్రాల తనిఖీ

**ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షా కేంద్రాలను సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు, సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్ ఆదివారం తనిఖీ చేశారు. గుంటూరు పుట్టగుంటలోని ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కళాశాల, విజయవాడలోని ఎస్‌కేఎస్, జానెట్ డిగ్రీ కళాశాల, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను వారు పరిశీలించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు తాగునీరు, గదుల్లో వెలుతురు, ఫ్యాన్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించకపోతే పరీక్షా కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్ మాట్లాడుతూ.. అన్ని పరీక్షా కేంద్రాల నుంచి ఏక కాలంలో సమాచారం తీసుకునేందుకు గూగుల్ సహాయం తీసుకుంటున్నామని చెప్పారు. పరీక్షా పత్రాల బండిళ్లకు జీపీఎస్ అనుసంధానించినట్లు తెలిపారు. ఏయే సమయంలో ప్యాకింగ్ చేశారో, ప్రశ్నాపత్రం బయటకు తీశారో వెంటనే తెలుస్తోందన్నారు. దీంతో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మానవత్వ పరిమళాలతో ఆనంద జీవనం

డాక్టర్ సుబ్రహ్మణ్యంను పురస్కారం అందజేస్తున్న మానవత ప్రతినిధులు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** మానవత్వ పరిమళాలతో సంఘ జీవనం సంతోషంగా సాగుతుందని, అవసరంలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఉన్న సంతృప్తిని.. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ పొందాలని మానవత వ్యవస్థాపకుడు ఎన్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కుమార్ పంప్స్ సత్సంగ్ మందిరంలో ఆదివారం నిర్వహించిన మానవత తెనాలి శాఖ ద్వితీయ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొల్లిపర రాంచంద్ అధ్యక్షత వహించారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రముఖ సీనియర్ వైద్యుడు డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు జీవిత సాఫల్య పురస్కారం అందించి సత్కరించారు. తల్లిదండ్రులు లేని విద్యార్థిని చదువు బాధ్యత స్వీకరించారు. ప్రతిభావంతురాలైన మరో విద్యార్థినికి రూ.10 వేలు సాయం అందజేశారు. కొత్త సుబ్రహ్మణ్యం, కె.రామ్మోహన్‌రావు, ఓంకార్ ప్రసాద్, వెంకట్, మొవ్వా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శాకంబరిగా దుర్గమ్మ

**పొన్నూరు, న్యూస్‌టుడే:** పట్టణ పరిధి జీబీసీ రహదారిలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం కనక దుర్గమ్మను వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## నిర్వహణ లేక.. వినియోగానికి పనికిరాక!

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** గత తెదేపా ప్రభుత్వ హయాంలో పురపాలక బహిరంగ స్థలాల చుట్టూ గోడలు నిర్మించి వాటిలో వివిధ రకాల క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు. కాలక్రమంలో అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. గత వైకాపా ప్రభుత్వం మరమ్మతులు చేయించకుండా, కొత్తవి బిగించకుండా వదిలేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వినియోగంలోకి తేవాలని చెంచుపేట, అమరావతి, ఇందిరానగర్ కాలనీ వాసులు కోరుతున్నారు. చెంచుపేటలోని బహిరంగ స్థలంలో సుమారు రూ.50 లక్షలతో వివిధ రకాల పరికరాలు బిగించారు. దాదాపు రూ.50 లక్షలతో చుట్టూ గోడలు నిర్మించి గేట్లు అమర్చారు. సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రం, వార్డు సచివాలయాలు నిర్వహిస్తున్నారు. క్రీడా పరికరాల్లో చాలా వరకు విరిగిపోయి నిరుపయోగంగా మారాయి. వానకు తడుస్తూ తుప్పు పట్టి ప్రమాదకరంగా మారాయి.

చెంచుపేటలో పాడైన పరికరాలు

ఇందిరానగర్ కాలనీలో..

## సహజత్వానికి దగ్గరగా అడవి బాపిరాజు సాహిత్యం

డాక్టర్ సత్యనారాయణను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** సంప్రదాయాలకు కట్టుబడకుండా, వ్యతిరేకించకుండా మధ్యేమార్గంగా 'అడవి బాపిరాజు' సాహిత్యం సహజత్వానికి దగ్గరగా సాగిందని డాక్టర్ మన్నవ సత్యనారాయణ పేర్కొన్నారు. తెనాలి వాకర్స్ క్లబ్, చైతన్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అడవి బాపిరాజు జీవితం, సాహిత్యంపై ఆయన మాట్లాడారు. మన్నవ సత్యనారాయణ మేధావిగా గుర్తింపు పొందారని, జాతీయ స్థాయిలో పీహెచ్‌డీ సాధించారని లలితానందప్రసాద్ వివరించారు. అనంతరం సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. డాక్టర్ దక్షిణామూర్తి, గుత్తా వెంకటరత్నం, కడియాల రవిబాబు, ముత్తేవి రవీంద్రనాథ్, ఆనందయ్య, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## మురుగు కాలువ నిర్మాణం పూర్తి

**పొన్నూరు, న్యూస్‌టుడే:** పట్టణ పరిధి 23వ వార్డు ఇందిరానగర్‌లో మురుగు నీటి కాలువ లేకపోవడంతో, మురుగు నీరు, వర్షపు నీరు బయటకు వెళ్లక కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడ్డారు. గత వైకాపా పాలనలో ఆ వార్డుకు రూ.20 లక్షలు కేటాయించారు. ఆ నిధుల్లో నుంచి ఇందిరా నగర్‌లో సిమెంటు మురుగు కాలువ నిర్మాణ పనులకు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు వైకాపా నేతలు గొప్పగా చెప్పారు. ఆ పనులకు స్థానిక వైకాపా నేతలు, అధికారులు శంకుస్థాపన చేశారు. సిమెంటు మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించలేదు. మురుగు నీటి సమస్య, వర్షపు నీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని గతేడాది సెప్టెంబరు 22వ తేదీన వైకాపా హయాంలో 'మాటలతోనే కాలయాపన' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు పురపాలక సంఘ అధికారులు స్పందించారు. సిమెంటు మురుగు కాలువ నిర్మాణ పనులకు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఎట్టకేలకు సిమెంటు మురుగు కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

## బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

**కొల్లిపర, న్యూస్‌టుడే:** తూములూరు గ్రామానికి చెందిన పెరికలదుర్గాప్రసాద్.. అదే గ్రామానికి చెందిన గాయం శివారెడ్డి నుంచి అప్పుతీసుకుని వడ్డీ చెల్లించకపోవడంతో శివారెడ్డి దుర్భాషలాడారు. మనస్తాపానికి గురైన దుర్గాప్రసాద్ గడ్డి మందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే. పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినప్పటికీ నిందితుడిని అదుపులోకి తీసుకోలేదంటూ బాధిత కుటుంబ సభ్యులకు మద్దతుగా మహిళలు, దళిత సంఘాల నాయకులు కొల్లిపర మండలం దావులూరు అడ్డరోడ్డు కూడలిలో మృతదేహంతో ఆదివారం ధర్నా చేశారు. దుర్గాప్రసాద్ కుటుంబానికి ప్రభుత్వం సాయం అందించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి నాయకులు మోరంపూడి ప్రసాదు, యంద్రపాటి అశోక్, సుధీర్, మంద్రురాజు, పిల్లి గంగాధర్, బత్తుల రవి, బేతాళ భూషణం తదితరులు బాసటగా నిలిచారు. చివరకు నిందితుడిని తెనాలిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న విషయం తెలియడంతో ధర్నాను విరమించారని ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు.

ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, మహిళలు

## పారిశుద్ధ్య పనుల పరిశీలన

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** తగినంత మంది సిబ్బంది ఉన్నా.. పారిశుద్ధ్య పనుల్లో మార్పు కనిపించడం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆదివారం ఉదయం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. రోడ్లపై, కాలువల్లో వ్యర్థాలు ఎందుకు తీయడం లేదని అధికారులను ప్రశ్నించారు. వ్యాపార సంస్థలు, ఇళ్ల నుంచి వేర్వేరుగా చెత్త సేకరణ చేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో ఏసుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమను ప్రశ్నిస్తున్న మంత్రి మనోహర్

## నిత్యావసర సరకుల అందజేత

**నారాకోడూరు (చేబ్రోలు), న్యూస్‌టుడే:** అనాథ, పేద చిన్నారులను ఆదుకునేందుకు 'షేర్ ది విజన్' అనే సంస్థ ముందుకు రావడం హర్షణీయమని ఎంఈవో సుబ్బారావు అన్నారు. చేబ్రోలు మండల తెదేపా ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నారాకోడూరులోని సీఎమ్ఎస్ అనాథ వసతి గృహంలో 100 మంది బాల బాలికలకు హైదరాబాద్‌కు చెందిన 'షేర్ దీ విజన్ అనే సంస్థ' సహకారంతో రూ.4 లక్షలు విలువైన నిత్యావసరాలు, దుస్తులు, పుస్తకాలతో పాటు జనరేటర్‌ను అందజేశారు.

నిత్యావసరాలు అందుకున్న చిన్నారులతో సంస్థ ప్రతినిధులు, ఎంఈవో

## మల్లేశ్వరస్వామికి స్టీలు తులాభారం

**పెదకాకాని, న్యూస్‌టుడే:** పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానానికి గ్రామానికి చెందిన శివకోటి సాంబశివరావు, రోజా దంపతులు రూ.40 వేలు విలువైన స్టీల్ తులాభారం (ధర్మకాటా)ను ఈవో గోగినేని లీలాకుమార్ సమక్షంలో ఆదివారం అందజేశారు. దాతలకు వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ఈ తులాభారం ఉపయోగపడుతుందని ఈవో తెలిపారు.

## సామగ్రి స్వాహాపై విచారణకు ఆదేశం

**వెనిగండ్ల(పెదకాకాని), న్యూస్‌టుడే:** వెనిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు సంబంధించిన 13 రకాల సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన నగదును పూర్వపు వ్యాయామ ఉపాధ్యాయుడు స్వాహా చేసిన ఘటనపై ఆదివారం 'ఈనాడు'లో 'ఎన్‌సీసీ క్యాడెట్ల సామగ్రి, నిధుల స్వాహా'అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక స్పందించి విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా ఉప విద్యాశాఖ అధికారికి నియమించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

## ఆస్తి విషయంలో ఘర్షణ: నలుగురికి గాయాలు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని ఇస్లాంపేటలో ఆస్తి విషయంలో తండ్రి, ఇద్దరు కుమార్తెల కుటుంబాల నడుమ ఆదివారం రాత్రి ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు రాళ్లతో దాడి చేసుకోగా.. నలుగురికి గాయాలయ్యాయని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

## గంజాయి విక్రేతల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉమేష్, ఎస్సై ఆనంద్, వెనుక ముసుగుల్లో నిందితులు

**తెనాలి టౌన్:** గంజాయికి అలవాటు పడటంతో పాటు దాన్ని విక్రయిస్తున్న నలుగురిని తెనాలి గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి 1300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తెనాలి గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఉమేష్, ఎస్సై ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. తెనాలికి చెందిన ప్రకాశరావు, ప్రదీప్‌కుమార్, శివనాగరాజు, ప్రశాంత్‌కిరణ్‌లు గంజాయికి అలవాటు పడ్డారు. సులభంగా డబ్బు సంపాదనలో భాగంగా దాని విక్రేతలుగానూ మారారు. ప్రకాశరావుపై విశాఖ ప్రాంతంలో గంజాయి కేసు ఉంది. ఈ నేపథ్యంలో అక్కడికి వాయిదాలకు వెళ్లి వస్తూ గంజాయి తెచ్చేవాడు. అదే విధంగా విజయవాడకు చెందిన ఇమ్మానియేలు వద్ద కూడా కొనుగోలు చేసి, ఇక్కడ విక్రయించే వారు. గంజాయి విక్రయాలపై నిఘా ఉంచిన పోలీసులు వారిని జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహాల వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఒకడైన ప్రశాంత్‌కిరణ్‌పై రౌడీషీట్, గంజాయి కేసులు ఉన్నాయి. ఈ కేసులో ఇమ్మానియేలును అరెస్టు చేయాల్సి ఉంది. గంజాయి విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని సీఐ., ఎస్సై, స్పష్టం చేశారు.

# రోడ్లపైనే సామగ్రి.. రాకపోకలకు ఇబ్బంది

**పొన్నూరు, న్యూస్‌టుడే**

| | |
|---|---|
| పట్టణం | : పొన్నూరు |
| వార్డులు | : 31 |
| జనాభా | : 61,500 |
| కుటుంబాలు | : 19,075 |

గత వైకాపా పాలనలో భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరగలేదు. అప్పటి వైకాపా పాలకులు, అధికారులకు ముడుపులు చెల్లించలేక భవన నిర్మాణ పనులను అనేక మంది యజమానులు ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. గత నెల రోజుల వ్యవధిలోనే 150 మంది యజమానులు నూతన భవన నిర్మాణ పనులకు అనుమతులు తీసుకున్నారు.

నేతాజీనగర్ ప్రధాన రహదారిపై నిల్వచేసిన ఇసుక

### అదుపు తప్పుతున్న వాహనాలు

పట్టణ పరిధిలోని నిడుబ్రోలు, శాంతినగర్, ముబారక్ నగర్, వైష్ణవినగర్, విద్యానగర్, తెలగపాలెం, తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణ పనుల కోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేసి భవన నిర్మాణ సామగ్రిని యజమానులు కొనుగోలు చేస్తున్నారు. ఆ కొనుగోలు చేసిన ఇసుక, ఇటుక, గులకరాళ్ల తదితర వస్తువులను ప్రజల అవసరాల నిమిత్తం నిర్మించిన రహదారులపై నిల్వ చేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు అదుపుతప్పి బోల్తా పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

### ఇప్పటికైనా మేల్కోండి

కొన్ని ప్రాంతాల్లో సిమెంటు, ఇసుక, గులకరాళ్లను మిల్లర్‌లో పోసి మిక్స్ చేస్తున్నారు. ఆ మిల్లర్‌ను రహదారిపై ఉంచి పనులు చేస్తుండడంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యమైన కూడళ్లలో భవన నిర్మాణ సామగ్రిని నిల్వ చేయడంతో అటుగా వెళ్లిన అంబులెన్స్‌లు ఆ మార్గంలో వెళ్లడానికి అవకాశం లేకుండాపోతోంది. రోగి ఇంటికి వాహనం రావడానికి ఆలస్యం అవుతుండడంతో రోగి కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఎలాంటి భవన నిర్మాణ సామగ్రి నిల్వ లేకుండా తగు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

### క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాం

దీనిపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారి రఘురాంను న్యూస్‌టుడే వివరణ కోరగా.. రహదారులపై భవన నిర్మాణ సామగ్రిని నిల్వ చేయవద్దని యజమానులకు హెచ్చరిస్తున్నట్లు చెప్పారు. మరోసారి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వాటిని తొలగించే విధంగా తగు చర్యలు చేపడతామన్నారు.

శాంతినగర్‌లో రహదారికి అడ్డంగా కంకర రాళ్లు

www.kimssikhara.com

KIMS SIKHARA HOSPITALS

కిమ్స్ శిఖర హాస్పిటల్స్ గుంటూరుకు చెందిన ప్రముఖ సినియర్ కార్డియాలజిస్ట్ (గుండె వైద్యనిపుణులు) కన్సల్టేషన్ కొరకు తెనాలి లో అందుబాటులో ఉంటారు.

డా॥ నాగ శ్రీ హరిత పర్వతనేని
MD (Osm), DM (SVIMS), FESC, FSCAI, FACC
Ex. Associate Professor Guntur Medical College
Sr. Interventional Cardiologist
Director – Cardiac Sciences

ప్రతి మంగళవారం నాడు
సమయం: ఉ॥ 10 గం॥ నుండి సా॥ 6 గం॥ వరకు అందుబాటులో ఉంటారు.
ECG, 2D Echo, TMT సదుపాయం కలదు

స్థలం : ఆశ్రిత సూపర్ స్పెషాలిటి కేర్
7-5-31, లెక్చరర్స్ కాలని, ప్రకాశం రోడ్, బ్యాంక్ ఆఫ్ బరోడా దగ్గర, గంగానమ్మపేట, తెనాలి.
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి.
ఫోన్ నెం: 97057 53356 | 99661 90493

(c) eenadu

# మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

## సమ్మెకు దిగిన ఇంజినీరింగ్ కార్మికులు

నగరపాలక కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

**మంగళగిరి, న్యూస్‌టుడే:** మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలో పనిచేసే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం నగరపాలక కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ప్రారంభమైన నిరసన కార్యక్రమాన్ని సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, వీవీ జవహర్‌లాల్ ప్రారంభించారు. జీవో నంబరు 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మె కారణంగా ప్రజలకు అసౌకర్యం కలిగితే దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని నాయకులు డిమాండ్ చేశారు.

## కంకర లారీలను నియంత్రించాలని ఆందోళన

**మేడికొండూరు, న్యూస్‌టుడే:** కంకర లోడు లారీల రాకపోకలతో విపరీతమైన దుమ్ము వస్తోందని, దీని వల్ల ఇబ్బందులు పడుతున్నామని పేరేచర్ల తెల్లకాల్వ కాలనీ వాసులు ఆదివారం కొద్దిసేపు ఆందోళనకు దిగారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు కొమ్మ ఉంచి నిరసన తెలిపారు. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ సిబ్బందితో కలిసి కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించివేశారు. దీంతో విషయం సద్దు మణిగింది.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

★ పొన్నెకల్లు నుండి దామరపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో మట్టి కుప్పలు అడ్డుగా ఉన్నాయి. వాహనాలు అదుపు తప్పి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక జులై 9న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఈవోపీఆర్డీ సాయిలీల పంచాయతీ కార్మికులతో మట్టి కుప్పలు తొలగింపజేశారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేశారు. ★ దామరపల్లి గ్రామంలో రహదారిపై చెత్త వేయడంతో వీధి కుక్కలు తిరుగుతున్నాయి. ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక జులై 9న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారి సురేష్ పంచాయతీ కార్మికులతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. ★ తాడికొండ అడ్డరోడ్డు ప్రధాన కూడలి వద్ద కంకర, ఇసుక వేసి వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రహదారిపై ఉన్న కంకర, ఇసుకను వెంటనే తొలగించారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేశారు. **-తాడికొండ, న్యూస్‌టుడే**

? తాడికొండ గ్రామంలోని చెంచుకాలనీలో పారిశుద్ధ్యం లోపించింది. కాలనీలోని మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. **-ప్రభు, గ్రామస్థుడు**

✔ ఎప్పటికప్పుడు మురుగు కాలువల్లో పూడిక తీయిస్తాం. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లిస్తాం. **-రమణ, గ్రామ కార్యదర్శి**

? తాతికొండపాలెం రహదారిపై చెత్త వ్యర్థాలు మేటవేశాయి. ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. **-గ్రామస్థులు**

✔ పారిశుద్ధ్య కార్మికులతో రహదారిని శుభ్రం చేయిస్తాం. **-రమణ, గ్రామ కార్యదర్శి -తాడికొండ, న్యూస్‌టుడే**

? కుంచనపల్లిలో రెడ్డి రామాలయం వీధిలో వీధి దీపం వెలగడం లేదు. దీనివల్ల రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- శ్రీనివాసరెడ్డి**

✔ పరిశీలించి వీధి దీపం వెలిగించేందుకు చర్యలు తీసుకుంటాం **- అలీంబాషా, కమిషనర్, మంగళగిరి. - తాడేపల్లి, న్యూస్‌టుడే**

## రోడ్డుపైనే నీరు..పట్టించుకోరు

ముట్లూరులోని ప్రధాన రహదారి వానొస్తే తటాకాన్ని తలపిస్తోంది. ముట్లూరు మార్కెట్ కూడలి నుంచి లేమల్లెపాడు పంచాయతీరాజ్ రోడ్డు ప్రారంభం వరకు గుంతలతో నిండిపోయింది. ఇరువైపులా డ్రెయిన్లు లేకపోవడంతో వాన నీరు తిష్ఠ వేస్తోంది. దీనిపై ఏఈ అబ్బాస్‌కెనడి మాట్లాడుతూ మురుగు కాలువల నిర్మాణానికి రూ.2.40 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాయని చెప్పారు. **-న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు**

## 16 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

**మంగళగిరి:** మంగళగిరి మార్కండేయ పద్మశాలీయ కళ్యాణ మండపంలో ఈ నెల 16వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రధాన యోగాచార్యులు పంచమర్తి సత్యనారాయణ యోగ గురూజీ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 15 రోజులు జరిగే శిబిరంలో ఉదయం 5.30 గంటల నుంచి 7.00 గంటల వరకు జరుగుతుందన్నారు. ఐదేళ్ల వయస్సు బాలబాలికల నుండి 85 ఏళ్ల వయస్సు ఉన్నవారు వినియోగించుకోవాలని కోరారు.

## నేడు మంత్రి అనగాని రాక

**దుగ్గిరాల:** మండలంలోని మోరంపూడిలో సోమవారం సాయంత్రం జరుగనున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారని తెదేపా మండల అధ్యక్షులు కేసంనేని శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. రేవేంద్రపాడులో పలు రోడ్లను ఎంపీపీ షేక్ జబీన్ ప్రారంభోత్సవాలు చేస్తారు.

## షాదీఖానా అభివృద్ధి కమిటీ నియామకం

**ప్రత్తిపాడు, న్యూస్‌టుడే:** ప్రత్తిపాడులో ముస్లిం, మైనారిటీ కమ్యూనిటీ హాల్, షాదీఖానా అభివృద్ధి సేవా కమిటీని ఆదివారం నియమించారు. కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ప్రోత్సాహంతో ప్రకాశం జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐ సూదరగుంట రామచంద్ర ప్రసాద్, కళ్యాణి దంపతులు ఆర్థిక సాయం రూ.45 లక్షలతో షాదీఖానాను ప్రభుత్వం నిర్మించనుంది. కమిటీ అధ్యక్షుడిగా నూర్‌బాషా హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా పఠాన్ మస్తాన్‌వలి, కార్యదర్శి షేక్.రజాక్, కోశాధికారిగా షేక్.మీరాసా సాహెబ్, మరో 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. స్థల దాత నూతలపాటి పరమేశ్వరరావు (బేబి) కుమారుడు నూతలపాటి తిలోత్తమరావు గౌరవ సలహాదారుడిగా ఎన్నుకున్నట్లు మత పెద్దలు తెలిపారు.

## పరీక్ష కేంద్రాల తనిఖీ

**ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు, సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్ ఆదివారం తనిఖీ చేశారు. గుంటూరు పుల్లడిగుంటలోని ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కళాశాల, విజయవాడలోని ఎస్ఆర్కే, జానెట్ డిగ్రీ కళాశాల, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను వారు పరిశీలించారు.

# కళ్లెదుటే ప్లాంట్లు.. నీళ్లకు పాట్లు

### పాఠశాలల్లో పని చేయని తాగునీటి పథకాలు

**మేడికొండూరు, తాడికొండ, తుళ్లూరు, ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే**

ప్రభుత్వ పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలు (ఆర్వో ప్లాంట్లు) సరిగా పనిచేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వైకాపా ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో మౌలిక వసతుల్లో భాగంగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా అప్పట్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రెండు దశల్లో వివిధ వీటిని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను అప్పటి ప్రభుత్వం గాలికొదిలేయడంతో నేటికీ విద్యార్థులకు కష్టాలు వెంటాడుతున్నాయి. మంజూరైన వాటిల్లో కొన్నింటిని బిగించారు.. మరికొన్నింటిని అలాగే వదిలేశారు. కొన్ని మరమ్మతులకు గురై మూలకు చేరాయి. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో శుద్ధ జలం అందక ఇబ్బందులు పడుతున్నామని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నుంచి సీసాలతో నీటిని తెచ్చుకుంటున్నామని, అవి కొద్దిసేపటికే వేడిగా మారిపోతుండడంతో తాగలేకపోతున్నామని వారు చెబుతున్నారు.

మేడికొండూరు: ప్రభుత్వ పాఠశాలలో పాడైపోయిన నీటి శుద్ధి యంత్రం

### మరమ్మతులకు గురైతే అంతే..

సాంకేతిక కారణాలతో మొరాయించిన ప్లాంట్లను బాగు చేయాలంటే సంబంధిత కంపెనీ ప్రతినిధులు వచ్చి గాడిలో పెట్టేందుకు తీవ్ర జాప్యం జరుగుతోంది. మరో పక్క నీటిలో ఉప్పు శాతం అధికంగా ఉన్న చోట్ల ఈ యంత్రాలు తరచూ పాడైపోతున్నాయి. మరమ్మతులకు రూ.వేలల్లో ఖర్చు అవుతుండడంతో సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు సొంతంగా డబ్బులు పెట్టుకోలేక మిన్నకుండిపోతున్నట్లు సమాచారం. మేడికొండూరు, తాడికొండ, తుళ్లూరు, ఫిరంగిపురం మండలాల పరిధిలో రెండో దశలో మంజూరైన నీటి శుద్ధి యంత్రాల్లో చాలా శాతం ఇంకా బిగించలేదు. కొన్నిచోట్ల ప్రైవేటు ప్లాంట్ల నుంచి 20 లీటర్ల పరిమాణం ఉన్న నీటిని రూ.10 నుంచి రూ.20 చొప్పున కొనుగోలు చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటిని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పాడైపోయిన ప్లాంట్లను వినియోగంలోకి తీసుకువస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

బిగించకపోవడంతో నిరుపయోగంగా ఇలా

ప్లాంట్ల వివరాలివి..

| మండలం | పాఠశాలలు | విద్యార్థులు | పనిచేస్తున్నవి | బిగించనివి | పని చేయనివి |
|---|---|---|---|---|---|
| మేడికొండూరు | 53 | 4,302 | 21 | 13 | 11 |
| తుళ్లూరు | 45 | 3,041 | 29 | 07 | 22 |
| తాడికొండ | 48 | 4,212 | 45 | 40 | 05 |

## నైపుణ్యాలపై పట్టు సాధించాలి

**పెదనందిపాడు, న్యూస్‌టుడే:** విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలపై పట్టు సాధించాలని నల్లమడ రైతు సంఘ నాయకుడు, గ్రంథాలయ ట్రస్టు ఛైర్మన్ రాజమోహనరావు అన్నారు. స్థానిక కొల్లా వెంకయ్య స్మారక గ్రంథాలయంలో రెండు నెలలుగా కొనసాగుతున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ధ్రువీకరణపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ట్రస్టు సభ్యురాలు డాక్టర్ అనిత మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుతూ కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయురాలు జవహర్‌రాణి, ఎస్సీయూ రాష్ట్ర కౌన్సిలర్ మోహనరావు, నల్లమడ రైతు సంఘ సభ్యులు, శిక్షకుడు ఎస్. నాగేశ్వరరావు, సహాయకురాలు నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజమోహనరావు

## అవకతవకలపై విచారణ జరిపించండి

**పెదనందిపాడు, న్యూస్‌టుడే:** ఫోర్జరీ చేసి పొదుపు సంఘంలోని డబ్బును డ్రా చేసి అవకతవకలకు పాల్పడిన యానిమేటర్ ఈమని అంజలిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ పాలపర్రులో ఆదివారం లక్ష్మీ పరస్పర సహకార పొదుపు సొసైటీ సభ్యులు ఎమ్మెల్యే రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. మాకు తప్పక న్యాయం చేయాలని వారు పట్టుబట్టారు. దీంతో డీఆర్డీఏ పీడీకి ఎమ్మెల్యే ఫోన్ చేసి మాట్లాడారు. వారం రోజులలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని చెప్పారు.

## సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మంగళగిరి: పెదవడ్లపూడిలో జవ్వాది కిరణ్‌చంద్ ఆధ్వర్యంలో..

**తాడేపల్లి, న్యూస్‌టుడే:** పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెదేపా మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ అన్నారు. తాడేపల్లి మండలం గుండిమెడలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆదివారం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీలు ఏడాదిలో అమల్లోకి తెస్తున్నారని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలు ప్రజల చెంతకు చేరుతున్నాయన్నారు. ఇంట్లో ప్రతి ఒక్క పిల్లాడు చదువుకోవాలనే ఉద్దేశంతో మంత్రి లోకేశ్ 'తల్లికి వందనం' పథకాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి నామతోటి రాంబాబు, అనుమోలు వీరాంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడలో కరపత్రాలు అందజేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్ తదితరులు

### జనం మెచ్చేలా సుపరిపాలన

**మంగళగిరి:** మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని మంగళగిరి జవ్వాది కిరణ్‌చంద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జనం మెచ్చేలా కూటమి పాలన సాగుతోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేశ్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

# అలీనగర్ విలీనం ఎప్పుడు?

దుగ్గిరాల, న్యూస్‌టుడే

స్థానిక అలీనగర్ పూర్తిగా దుగ్గిరాల పంచాయతీ విలీనం అయ్యేదెన్నడు అని అక్కడి ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో దీనికి సంబంధించిన దస్త్రం కొంత ముందుకు కదిలింది. పూర్వాపరాలు పరిశీలిస్తే దుగ్గిరాల పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న అలీనగర్‌లో కొంత భాగం తెనాలి గ్రామీణ మండలం కొలకలూరు పంచాయతీలో ఉంది. వీధిలో ఒకవైపు దుగ్గిరాల, మరో వైపు కొలకలూరులో ఉంటుంది. ఇలా నాలుగు వీధులున్నాయి. కొలకలూరు పంచాయతీలో ఉన్న వీధులన్నీ తెనాలి శాసన సభ నియోజకవర్గంలోకి, మిగిలినవి మంగళగిరి నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. మొత్తాన్ని దుగ్గిరాలలో కలిపేయడానికి స్థానికుడైన నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఆయన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్నప్పుడే చర్య ప్రారంభించారు. దీన్ని అంగీకరిస్తూ రెండు పంచాయతీలు ఒప్పంద తీర్మానాలు చేశాయి. కొంత పని జరిగాక దస్త్రం ముందుకు సాగలేదు. మంత్రి లోకేశ్ ఆదేశాలతో ఇటీవల మండల పరిషత్తు అభిప్రాయాన్ని కోరుతూ పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఆ మేరకు వివరణ కూడా ప్రభుత్వానికి పంపామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థలకు ఎన్నికలు రానున్న నేపథ్యంలో తగిన నిర్ణయం తీసుకుంటే తమకు వెతలు తీరతాయని కొలకలూరు ప్రజలు కోరుతున్నారు.

ఒకవైపు కొలకలూరు-మరోవైపు దుగ్గిరాలలోని అలీనగర్

## సీఎం ప్రకటనతో ఆశావహుల్లో ఉత్సాహం

**దుగ్గిరాల, న్యూస్‌టుడే:** దేవాలయాల పాలకవర్గాలు త్వరలో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో ఆ పదవులు ఆశిస్తున్న వారిలో ఉత్సాహం ఏర్పడింది. మండలంలో ప్రధాన దేవాలయం కంఠంరాజుకొండూరు మహంకాళి ఆలయం ఒకటి. సాలీనా రూ. కోటికి పైగా ఆదాయం వస్తుంది. అటువంటి దేవాలయానికి పాలకవర్గ పదవుల కోసం పలువురు ఎదురు చూస్తున్నారు. మండలంలోని 18 గ్రామాల్లో మేజర్ పంచాయతీలైన దుగ్గిరాల, ఈమని, చిలువూరులలో మూడేసి దేవాలయాలు ఉన్నాయి. ఆధ్యాత్మికంగా ప్రసిద్ధి పొందిన పెదకొండూరులోనూ నాలుగు ఆలయాలు ఉన్నాయి. మిగిలిన 14 గ్రామాల్లోనూ ఆలయాలకు కమిటీలు వేయాల్సి ఉంది. మండలంలో దుగ్గిరాల, పెనుమూలి, ఈమని మూడు సొసైటీలున్నాయి. నూతన ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఇంత వరకు పాలకవర్గాలు ఏర్పడలేదు. తాజా నిర్ణయంతో ఇవి అన్నీ భర్తీకానున్నాయి.

దుగ్గిరాల శివాలయం

# మనసారా.. అమ్మకు సారె

కాకుమాను: కొమ్మూరులో అంకమ్మ తల్లి

వట్టిచెరుకూరులో ..

**వట్టిచెరుకూరు, కాకుమాను, దుగ్గిరాల, న్యూస్‌టుడే:** వట్టిచెరుకూరు గ్రామంలో మహిళలు స్థానికంగా ఉన్న దేవాలయాలలో అమ్మవార్లకు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా అద్దంకమ్మ, పోలేరమ్మ, భ్రమరంబికా దేవి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ★ కాకుమాను మండలం కొమ్మూరులో అంకమ్మ, పోలేరమ్మ అమ్మవార్లు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. మహిళలు సారె తీసుకు వచ్చారు. పెద్దివారిపాలెంలో పోలేరమ్మకు శాకంబరి అలంకరణ చేశారు. ★ దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరులోని మహంకాళి ఆలయంలో అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. దుగ్గిరాల గంగాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలోని(శివాలయం) అమ్మవారికి భక్తులు ఆదివారం సాయంత్రం ఆషాఢసారె సమర్పించారు.

దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులో మహంకాళి

### వర్షాలు కురిపించు తల్లీ..!

**మేడికొండూరు:** వర్షాలు కురవాలని మేడికొండూరులో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు అందరూ కలిసి మొక్కుకున్నారు. గ్రామంలోని పోలేరమ్మ, శ్రీలక్ష్మీ, బొడ్డురాయి విగ్రహాలకు బిందెలతో నీళ్లు పోశారు. మహిళలు పొంగళ్లు చేశారు. పోలేరమ్మ, శ్రీలక్ష్మీ అమ్మవారిని పూల దండలతో అలంకరించారు.

## పురస్కారాల ప్రదానం

**ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే:** ఫిరంగిపురం దీనాపూర్ ప్రాంగణంలో ఆదివారం కార్డ్సు సంస్థ ఆధ్వర్యంలో దళిత్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా తరుపున వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన జీవీహెచ్ విక్టర్‌జోసఫ్, డి.రమేష్, ఏ.వెంకటరత్నం, కెమని సింగ్, ఆర్. బేబిలకు అవార్డులు ప్రదానం చేశారు. ఆ సంస్థ వ్యవస్థాపకులు పుల్లగూర రంజన్‌బాబు జయంతి పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య జి.కృపాచారి, అధ్యక్షుడు, వెడ్స్ కళాశాల డైరెక్టర్ స్వర్ణలతాదేవి, కార్డ్సు సంస్థ డైరెక్టర్ మేరి, ప్రెసిడెంట్ డి. రజిని తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలతో వర్సిటీ ప్రతినిధులు

## నత్తనడకన పనులు.. రోగులకు అవస్థలు

వట్టిచెరుకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో పరీక్షల ల్యాబొరేటరీ భవనం(బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్) నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. గత ఫిబ్రవరిలో ఈ భవనం నిర్మాణ పనులు రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ప్రారంభం అయ్యాయి. పూర్తి చేయాల్సిన గడువు దగ్గర పడుతున్నా పనులు వేగం పుంజుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఇసుక, కంకర రాళ్లు తదితర నిర్మాణ సామగ్రి ఆవరణలో నెలల తరబడి ఉండడంతో రాకపోకలకు రోగులు, సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే వట్టిచెరుకూరు మండలంలోని ప్రజలతో పాటు ప్రత్తిపాడు వైద్య, ఆరోగ్యశాఖ బ్లాక్ పరిధిలోని వైద్యశాలలకు సంబంధించిన నామూనాలను కూడా ఇక్కడ పరీక్షించవచ్చు. ఆగస్టులోపు పనులను పూర్తి చేసి ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఆర్ అండ్‌బీ ఏఈ అబ్బాస్ కెనడి తెలిపారు. సందర్శకులకు ఇబ్బందుల్లేకుండా నిర్మాణ సామగ్రిని నిల్వ చేస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు**

## విద్యుత్తు సరఫరా నిలిపివేతపై ఆందోళన

**ప్రత్తిపాడు, న్యూస్‌టుడే:** ప్రత్తిపాడులోని 1వ వార్డులో శనివారం రాత్రంతా విద్యుత్తు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు కూడా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారంటూ స్థానిక మహిళలు ఆదివారం రాత్రి గుంటూరు-పర్చూరు రోడ్డుపై బైఠాయించారు. రాత్రంతా చిన్నపిల్లలతో ఉక్కపోతలతో దోమలతో అల్లాడమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని, అయినప్పటికీ తరచూ నిలిచిపోతుందని వాపోయారు. 20 నిమిషాల పాటు వాహనాల రాకపోకలు నిలిచాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్సై కె.నాగేంద్ర మహిళలతో మాట్లాడారు. ఈ క్రమంలో సరఫరా పునరుద్ధరించడంతో మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయంపై విద్యుత్ ఏఈని 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా.. 'శనివారం రాత్రి నియంత్రిక ఫెయిల్ కావడంతో సరఫరా నిలిచింది. ఆదివారం ఉదయం ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరాను అందించాం. లోడ్ అధికం కావడంతో సరఫరా నిలిచిపోయింది. సోమవారం పూర్తి స్థాయిలో సమస్య పరిష్కరిస్తాం' అని చెప్పారు.

రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న వాహనం.. పలువురికి గాయాలు

**ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే:** రోడ్డు పక్కన ఆపి ఉన్న లారీని ప్రమాదవశాత్తు మరో వాహనం ఢీ కొట్టింది. ప్రాణనష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఫిరంగిపురం శివారు ఒక పెట్రోల్ బంకు వద్ద రోడ్డు పక్కన ఓ లారీ నిలిపి ఉంది. నరసరావుపేట నుంచి గుంటూరు వైపు వెళ్లే ఓ మినీ ట్రావెలర్ వాహనం అదుపుతప్పి ఆ లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఆ వాహనంలో మొత్తం 11 మంది ప్రయాణికులు ఉండగా వారిలో పలువురుకి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా.. ఏఎస్ఐ మురళీకృష్ణ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు

క్రైమ్ కార్నర్

## వడ్డేశ్వరం వద్ద గుర్తు తెలియని మృతదేహం

**తాడేపల్లి:** తాడేపల్లి మండలం వడ్డేశ్వరం-ఇప్పటం మధ్య రహదారి వెంట గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతుడు గళ్ల చొక్కా, ఆకుపచ్చ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, సుమారు 50 ఏళ్లు ఉంటాయని చెప్పారు.

## వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

**తుళ్లూరు:** నెక్కల్లు గ్రామానికి చెందిన పూజల శేషమ్మ (70) ఈ నెల 12 నుంచి కనిపించడం లేదని ఆదివారం ఆమె మనవడు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం ఆమె గుంటూరు బస్సు ఎక్కి వెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు. తుళ్లూరు ఎస్ఐ కలగయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్వో ప్లాంట్ నిర్వాహకుల ఘర్షణ

**పెదనందిపాడు, న్యూస్‌టుడే:** పాలపర్రులో 2019లో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపీ లాడ్స్‌తో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను వైకాపా హయాం నుంచి ఆ గ్రామానికి చెందిన ఎం.మహేష్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న విషయాన్ని స్థానిక తెదేపా నాయకులు ఆదివారం 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమానికి వచ్చిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు దృష్టికి తీసుకువెళ్లారు. ప్లాంట్ నిర్వహణను ఎం.సతీష్‌కు అప్పగించేలా ఓ పత్రం రాయించి దానిపై సాక్షి సంతకాలు చేయించారు. ఆ మేరకు ఆర్వో ప్లాంట్ వద్దకు ఎమ్మెల్యేతోపాటు తెదేపా శ్రేణులు చేరుకుని తాళాలు ఇవ్వమని మహేష్‌ను అడిగారు. అతడు పంచాయతీ వారికి ప్లాంట్‌ను అప్పగిస్తానని అనడంతో.. వెంటనే తాళాలు తీసుకోమని పోలీసులకు ఎమ్మెల్యే సూచించారు. ఎట్టకేలకు తాళాన్ని తీసుకున్నారు. ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిన తర్వాత ప్లాంట్ షట్టర్‌కు ఒకవైపు మహేష్, మరోవైపు సతీష్ తాళాలు వేశారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఇద్దరూ ఒకరినొకరు కొట్టుకున్నారు. పెదనందిపాడు, కాకుమాను ఎస్సైలు మధూపవన్, ఏక్‌నాథ్‌లు సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బూర్ల, పక్కన నాయకులు

**పెదనందిపాడు, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం చంద్రబాబు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. పెదనందిపాడు మండలం నాగభైరువారిపాలెం, జరుగులవారిపాలెం, ఉప్పలపాడు, అన్నవరం, పాలపర్రు గ్రామాలలో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పొగాకును ఇంతవరకు విక్రయించలేకపోయామని రైతులు కొందరు ఆయన ఎదుట వాపోయారు. సీఎం యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్న ఇంత వరకు తమకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. బాపట్ల నుంచి హైదరాబాద్‌కు ఉప్పలపాడు గ్రామాలను కలుపుతూ బస్సు ఏర్పాటు చేయాలని, పాలపర్రు ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థులు కోరారు నాయకులు హనుమంతరావు, జి. శ్రీనివాసరావు, రాంబాబు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

**ప్రత్తిపాడు, న్యూస్‌టుడే:** రోటరీ క్లబ్ ఆఫ్ పెదనందిపాడు నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ప్రత్తిపాడులోని ఎస్ఆర్ఎస్ రెయిన్‌బో పాఠశాలలో ఆదివారం జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా చిన్నం శ్రీనివాసరావు, కార్యదర్శిగా పోపూరి నాగేశ్వరరావు, కోశాధికారిగా కొడూరి నాగేశ్వరరావు, సభ్యులతో ప్రమాణ స్వీకారాన్ని గవర్నర్ నామినీ హరిహరప్రసాద్, సెంటేనియల్ గవర్నర్ జాష్టి రంగారావు, అసిస్టెంటు గవర్నర్ పోలిశెట్టి రాఘవయ్య చేయించారు. ఏపీ ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహన్‌రావు, రోటరీ క్లబ్ సభ్యులు, తెనాలి, పొన్నూరు, చిలకలూరిపేట, పర్చూరు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కార్యవర్గంతో హరిహరప్రసాద్, జాష్టి రంగారావు తదితరులు

(c) eenadu

# గుంటూరు తూర్పు

**ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి...** (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 34, వంగ 28, బెండ 29, పచ్చిమిర్చి 57, కాకర 38, క్యారెట్ 46, క్యాబేజీ 23, బీర 24, దొండ 40, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 42, దోస 20, పొట్ల 23, చామదుంప 28, మునగ 10, గోంగూర 10, తోటకూర 10, చుక్కకూర 15, కొత్తిమీర 20, బీట్‌రూట్ 38, కీర 48, క్యాప్సికం 73, అల్లం 58, ఫ్రెంచి బీన్స్ 84, సొర 12, అరటి 7. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

మొక్కలు నాటుతున్న ప్రకృతి ప్రేమికుడు మంజునాథ, జనసేన నాయకులు

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** మానవవాళికి ఆధారం చెట్లు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి అన్నారు. ఆదివారం ప్రకృతి ప్రేమికుడు మంజునాథ ఆధ్వర్యంలో నగరంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రాగి, వేప, తులసి, ఉసిరి, నేరేడు తదితర దేవాతా వృక్షాలు నాటారు. కార్యక్రమంలో నాయకులు బాబు, రఫీ, సాంబశివరావు కేదార్, ప్రసాద్‌బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

★ **సంజీవయ్యనగర్** ప్రధాన రోడ్డు సైడుకాల్వల్లో పూడిక చేరి మురుగు నీటి పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో కాల్వల్లో పూడికలు తీయించారు.

★ **బాలాజీనగర్** మూడో లైన్‌లో చెత్త కుప్పలు పేరుకుపోయి వీధి అపరిశుభ్రంగా మారందని స్థానికులు సతీష్ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య అధికారుల దృష్టికి తేవడంతో చెత్తకుప్పలు తీయించి తరలించారు.

**- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ(గుంటూరు)**

## మున్సిపల్ కార్మికుల సమ్మెకు సీపీఎం మద్దతు

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే:** మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని డిమాండ్ చేశారు.

# కొండలా కుప్పలు.. తరగక తిప్పలు

చుట్టుపక్కల ప్రాంతాలకు దుర్గంధం

న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ(గుంటూరు)

| | |
|---|---|
| నగరంలోని డివిజన్లు | : 57 |
| నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్త (మెట్రిక్ టన్నులు) | : 460 |
| పారిశుద్ధ్య కార్మికులు | : 2200 |

**న**గరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం ఆధ్వరంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నా అనేక లోపాలు కనిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేమితో పాటు సిబ్బంది నిర్లక్ష్యంతో ఏటుకూరు రోడ్డులోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద చెత్తకుప్పలు భారీ ఎత్తున కొండలా పేరుకుపోతోంది. భారీగా వ్యర్థాలు పోగుపడడంతో దుర్గంధంతో స్థానిక పరిసరాలు కలుషితం కావడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు కొబ్బరితోట, సంపత్‌నగర్ వాసులు, కాల్వకట్ట పక్కన నివాసం ఉంటున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం, చెత్త ట్రాన్సిట్ పాయింట్ వద్ద నిర్వహణ పక్కాగా లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. తడి చెత్తను ఈ ప్రాంతంలో కుప్పలుగా పోసి కంపోస్ట్‌లా తయారు చేస్తారు. పొడి చెత్తను విభజించి జిందాల్ వ్యర్థాలతో విద్యుత్తు ప్లాంటుకు తరలిస్తారు. ఇక్కడ ఈ ప్రక్రియ ఓ క్రమపద్ధతి ప్రకారం జరుగుతున్న దాఖలా లేదు.

ఏటుకూరు రోడ్డులోని చెత్త ట్రాన్సిట్ పాయింట్ వద్ద వ్యర్థాల గుట్టలు

### అధికారుల పర్యవేక్షణ శూన్యం

నగరం నుంచి ఎంత చెత్త వస్తుందో వేబ్రిడ్జి వద్ద చూస్తారు. తర్వాత చెత్త విభజనకు తరలిస్తారు. కంపోస్ట్ తయారు చేసి పొడి చెత్త నాయుడుపేటకు తరలిస్తారు. ఇవన్నీ ఏఈ, డీఈఈ స్థాయి అధికారులు రోజుకోసారైనా పర్యవేక్షించి సిబ్బందికి పక్కాగా సూచనలు ఇవ్వాల్సి ఉంది. కానీ అధికారులు పర్యవేక్షిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆ ప్రాంతానికి వెళ్తేనే ముక్కుపుటాలు అదిరిపోయేలా దుర్గంధంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. నగరం నుంచి వస్తున్న చెత్తను ఎప్పటికప్పుడు వేబ్రిడ్జి వద్ద బరువు చూసి వెంటనే పంపాల్సి ఉంది. కానీ నిర్వహణ లోపంతో నిత్యం చెత్త ట్రాక్టర్లు బారులు తీరుతున్నాయి. నిర్వహణ లోపాలతోనే నగరంలో చెత్త కుప్పలు ఎక్కడివక్కడే ఉండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ట్రాన్సిట్ పాయింట్ వద్ద చెత్త నిర్వహణను పకడ్బందీగా చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిర్దేశిత సమయంలో చెత్త తరలింపు ప్రక్రియ పూర్తయితే నగరంలో పారిశుద్ధ్యం పక్కాగా ఉండేందుకు వీలు కలుగుతుందని పలువురు భావిస్తున్నారు.

చెత్త పడేసేందుకు వరుసలో ఉన్న ట్రాక్టర్లు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

## సుపరిపాలన ప్రతి ఇంటికీ చేరువకావాలి

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** ప్రతి ఇంటికి సుపరిపాలన చేరువ కావాలని, ఈ విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలే వారధులని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి గడపకు తీసుకెళ్లే బాధ్యత కేడర్‌దేనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టామని, విస్తృత చర్చ జరగాలని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను ఇప్పటికే 80 శాతం పూర్తి చేశామని పేర్కొన్నారు. రానున్న నాలుగేళ్లలో తూర్పు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## సమాజ సేవకు ఆర్యవైశ్యులు ముందంజలో ఉంటారు

పేదలకు బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్, పాదర్తి దుర్గారావు

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** సమాజ సేవకు ఆర్య వైశ్యులు ముందంజలో ఉంటారని వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ అన్నారు. ఏటుకూరు రోడ్డులోని గీతామందిరంలో ఆదివారం వాసవీక్లబ్ గుంటూరు, మహిళా క్లబ్ గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో 108 మంది పేదలకు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాదర్తి దుర్గారావు, కొల్లిపర దుర్గా నాగమణి, రాచకొండ ఏడుకొండలు, గుండా హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు హెచ్చుతగ్గులతో ఇబ్బందులు

పాడవుతున్న గృహోపకరణాలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

**బు**చ్చయ్యతోటలో ఇళ్లకు విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గులు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. 20 రోజుల కిందట 1వ వీధిలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్ద శబ్దం వచ్చింది. 2గంటలకు పైగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. అప్పటి నుంచి విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గులు వస్తోందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లోవోల్టేజీ కారణంగా ఇళ్లల్లోని లైట్లు దిమ్ముగా వెలుగుతున్నాయని, ఫ్యాన్లు సరిగ్గా పనిచేయడం లేదని, కొన్ని నివాసాల్లో ట్యూబ్‌లైట్లు అసలు వెలగడం లేదని వాపోతున్నారు. రాత్రి వేళల్లో ఏసీలు పనిచేయడం లేదు. ఇప్పటికే పలువురి ఏసీలు పాడయ్యాయి. సమస్యను ఆశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు గృహాల్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు తదితర పరికరాలు పాడైపోతాయని ఆందోళనగా ఉందని వాపోతున్నారు. ఆ ప్రాంతంలో విద్యుత్తు వాడకానికి ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోవడంలేదని, దాని కారణంగానే సమస్య తలెత్తుతున్నట్లు గతంలోనే ఆశాఖ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

శ్రీవారికి పంచామృతాభిషేకాలు

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే:** నెహ్రూనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా ఆదివారం పంచామృతాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీభాష్యం లక్ష్మణాచార్యులు బృందం శ్రీవారికి విశేష పూజలు, సహస్ర నామార్చన చేశారు. ఆలయ నిర్వాహకులు కొనగళ్ల సాయికృష్ణ, పసుపులేటి సాంబశివరావు, సభ్యులు భక్తులకు తీర్థప్రసాదం అందించారు.

సారె తీసుకొస్తున్న భక్తులు

అలంకరణలో మహాలక్ష్మమ్మ అమ్మవారు

## అమ్మవారికి ఆషాఢ సారె

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే:** శారదాకాలనీ 27వ వీధిలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఊరేగింపుగా సారెను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదం అందించారు. కార్యక్రమంలో పెద్దలు రావి వెంకటరత్తయ్య, దుగ్గినేని మహాలక్ష్మయ్య, గోదు గులూరు సుబ్బారావు, వెంకట నారాయణ పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** స్థానిక సమస్యలపై సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863- 2224202) కార్యక్రమం ఉంటుందన్నారు. తర్వాత 10.30 నుంచి ఒంటి గంట వరకు కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ ఉంటుందని తెలిపారు.

## వ్యాపార వర్గాలు కాటారాళ్లపై ముద్రలు వేయించుకోవాలి

మాట్లాడుతున్న వెంకట హరిప్రసాద్

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** వ్యాపార వర్గాలు విధిగా కాటారాళ్లపై ముద్రలు వేయించుకోవాలని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ బి.వెంకట హరిప్రసాద్ సూచించారు. సిద్ధార్థనగర్‌లోని లీగల్ మెట్రాలజీ కార్యాలయంలో ఆదివారం కాటారాళ్ల రిపేర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీల ప్రభుత్వ జీవో నంబరు 6 ప్రకారం స్టాంపింగ్ ఫీజు 500 గ్రాముల నుంచి 5000 కిలోల వరకు రూ.500గా నిర్ణయించినట్లు తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలని ఆయన పేర్కొన్నారు. రిపేర్ల అభ్యర్థన మేరకు స్టాంపింగ్ ఫీజులు 500 గ్రాముల నుంచి 20 కిలోల వరకు రూ.200, 25- నుంచి 200 కిలోల వరకు రూ.300, 250- 5వేల కిలోల వరకు రూ.500 వరకు వసూలు చేసేలా స్టాంపింగ్ ఫీజు మార్పుల అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ కంట్రోలర్ బి.వెంకట హరిప్రసాద్ వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కంట్రోలర్ [illegible], గుంటూరు ఇన్‌స్పెక్టర్ జె.ఎస్.సునీల్‌రాజు, నరసరావుపేట ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, తెనాలి ఇన్‌స్పెక్టర్ శేషసాయి పాల్గొన్నారు.

## వైద్యురాలి సేవాగుణం అభినందనీయం

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే:** తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థల మాజీ ఛైర్మన్ దాసరి రాజామాస్టర్ చిన్న కుమార్తె వైద్యురాలు దాసరి సాయి తేజస్విని తన తొలి వేతనంలో రూ.25 వేలు హెల్ప్ టూ నీడ్ సేవా కార్యక్రమాలకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆమెను అభినందించారు.

### తాగు నీటి వృథా...

**వ**ర్షం పడకపోయినా తమ ప్రాంతంలో రహదారులు చెరువులను తలపిస్తున్నాయని బుచ్చయ్యతోట, నెహ్రూనగర్ వాసులు వాపోతున్నారు. ఆదివారం రిజర్వాయర్ నుంచి తాగునీరు కాలువల ద్వారా బుచ్చయ్యతోట, నెహ్రూనగర్ రహదారులపై ప్రవహించింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. తాగునీరు తరచూ వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. **-నెహ్రూనగర్, న్యూస్‌టుడే**

### అడుగు తడబడితే అంతే

**నె**హ్రూనగర్ 6వ వీధి మొదటి అడ్డరోడ్డులో రహదారిపై ఉన్న పెద్ద గుంత ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కల్వర్టు నిర్మాణానికి తవ్వి చుట్టూ ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకుండా వదిలేశారు. ఆ గుంతలో మురుగునీరు చేరి బావిని తలపిస్తోంది. ఇటుగా ప్రభుత్వ పాఠశాలకు చిన్నపిల్లలు వెళ్తుంటారు. పిల్లలు ఆ గుంతను దాటుకుంటూ ఇంటికి వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. అటుగా వెళ్లే క్రమంలో అడుగు తడబడితే పిల్లలు గుంతలో పడిపోయే ప్రమాదం ఉందని భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. **- గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే**

### పాడవుతున్నా పట్టదా!

**నె**హ్రూనగర్ 6వ వీధిలో తాగునీటి పైపులకు లీకులు పడటంతో మంచినీరు వృథాగా పోతోంది. రోడ్డు మధ్యలో లీకులు పడి నెలల తరబడి నీరు ప్రవహించడంతో రహదారి గుంతలు పడి పాడైపోయింది. రాత్రి వేళల్లో ఆ గుంతల్లో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయని చోదకులు ఆందోళన చెందుతున్నారు. నెలలుగా తాగునీరు రోడ్డు పాలవుతున్నా సమీప సచివాలయ కార్యదర్శులు పట్టించుకోవడంలేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. **- న్యూస్‌టుడే, నెహ్రూనగర్**

## దాడి ఘటనపై కేసు

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** దాడి ఘటనపై ఆదివారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రామకృష్ణ వడ్డెరకాలనీలో సిమెంట్ వ్యాపారం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ సిమెంట్ దుకాణం పెట్టవద్దని స్థానికులు నిరసన తెలిపారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్న క్రమంలో అంకమ్మ అనే వ్యక్తి ఇనప రాడ్డుతో రామకృష్ణపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాంబాబు తెలిపారు.

## సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** పేద ప్రజలకు మరింతగా సేవలందించడానికి ప్రాధాన్యమిద్దామని రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అధ్యక్షుడు నంబూరు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యదర్శి శ్రీధర్ బాబు, కోశాధికారి హరనాథ్, సహాయ గవర్నర్ భాస్కర్, శిక్షకులు అనిల్ హరనాథక, డైరెక్టర్లు చదలవాడ రఘురామ్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. పూర్వ అధ్యక్షుడు సత్యనారాయణ, అప్పారావు పాల్గొని నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వీధి కుక్కల బెడద

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** బుచ్చయ్యతోట, చేనేతకాలనీ, మోతీలాల్‌నగర్, నెహ్రూనగర్‌లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఆయా రహదారులపై గుంపులుగా వీధి కుక్కలు చేరి అటుగా వెళ్తున్నవారి వెంటపడడంతో భయాందోళనలు చెందుతున్నారు. కొద్ది రోజుల కిందట నెహ్రూనగర్‌లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని వీధికుక్క వెంటపడి కరవడంతో స్థానికులు చెదరగొట్టి అతన్ని ఆసుపత్రికి పంపించారు. వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. ద్విచక్ర వాహనాల వెంటపడుతూ కరవడానికి యత్నించడంతో వాటిని తప్పించుకొని వెళ్లే క్రమంలో వాహనాలు అదుపుతప్పి పడిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో పాదచారులు సైతం వీధుల్లోకి వెళ్లలేని పరిస్థితి. ఆర్టీసీ బస్సులు, రైళ్లల్లో దూరప్రాంతాల నుంచి వచ్చినవాళ్లు ఇళ్లకు వెళ్లే క్రమంలో వీధుల్లోని కుక్కలు వెంటపడడంతో వాటిని తప్పించుకోవడం పెద్ద ప్రహసనంలా మారుతోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

శునకాలను చూసి ఆగిపోయిన వాహనచోదకుడు

## ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** అభివృద్ధి పనులు జరుగుతున్న పలుచోట్ల కొందరు సామాజిక స్పృహ లోపించి వ్యవహరిస్తున్నారు. స్థానిక కుగ్లర్ ఆస్పత్రి రోడ్డులో రహదారి విస్తరించి, ఫుట్‌పాత్ కోసం టైల్స్ వేసి నిర్మాణం పూర్తి చేశారు. రహదారి రద్దీ దృష్ట్యా ఫుట్‌పాత్‌లపై అనేక మంది రాకపోకలు చేస్తుంటారు. కానీ కొందరు ప్రైవేటు వ్యక్తులు, ఆస్పత్రులకు చెందిన వాహనాలను అక్కడ పార్కింగ్ చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నడిచి వెళ్లే వారు నేరుగా రహదార్లపై నుంచే రాకపోకలు చేయడం వల్ల పలు సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆక్రమణలు తొలగించేలా పట్టణ ప్రణాళిక అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పాదబాటపై వాహనాల పార్కింగ్ ఇలా..

# సాగుతున్న పనులు.. తప్పని అవస్థలు

న్యూస్‌టుడే, నెహ్రూనగర్

**నె**హ్రూనగర్‌లో రహదారులు, కాలువలు, కల్వర్టు నిర్మాణ పనులు రోజుల తరబడి సాగుతుండడంతో అవస్థలు తప్పడం లేదు. 7వ వీధి ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు, ఆరు, ఎనిమిది వీధుల్లో అడ్డరోడ్లు, సైడ్ కాలువల నిర్మాణాలు ప్రారంభించారు. నెల రోజుల కిందట పనులు మొదలుపెట్టినా నేటికీ కొలిక్కి రాకపోవడంతో సమస్యగా మారింది. ఈ వీధిలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉంది. రహదారులు పగులకొట్టి ఉండడం, కాలువల కోసం తవ్వకాలు చేయడంతో పాఠశాలలకు విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే క్రమంలో ఇబ్బందిగా ఉందని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ముందు రాళ్లకుప్పలు

కల్వర్టు దిగి ఇంటికి వెళ్లడానికి బాలిక అవస్థలు

### వేసవి సెలవుల్లో వదిలేసి..

వేసవి సెలవులకు ముందు అన్ని వీధుల్లో కాలువలు, రోడ్ల పనులు ప్రారంభించి పాఠశాలలు తెరిచే సమయానికి పూర్తి చేసి ఉంటే బాగుండేదని పేర్కొంటున్నారు. నిర్మాణ పనులు ప్రారంభ సమయంలో ఇళ్ల ముందు మెట్లు, పాత తాగునీటి పైపులు పగులకొట్టారు. మెట్లు తొలగించడంతో ఇళ్లల్లోకి వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని వీధుల్లో కల్వర్టులు నిర్మించారు. అవి ఎత్తుగా ఉండడంతో వాటిని దాటుకొని ఇళ్లల్లోకి వెళ్లడానికి చిన్నారుల అవస్థలు వర్ణనాతీతం. అడ్డ రోడ్లన్నీ పగలకొట్టడంతో అస్తవ్యస్తంగా మారాయి. కొన్ని వీధుల్లో బండరాళ్లు అడ్డుగా ఉండడం, పైకి వచ్చిన తాగునీటి పైపులు కాలుకు తగిలి పడిపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు పడితే పనులకు ఆటంకంగా మారి మరింత ఆలస్యమైతే ఇబ్బందులు తప్పవని, త్వరితగతిన పనులు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## 24న నగర మహాసభలు

మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి, శివనాగేశ్వరరావు, సూరి, రమణయ్య

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఈ నెల 24న నిర్వహిస్తున్న సీపీఐ నగర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఆదివారం పిచుకలగుంట వద్ద పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకులు శివనాగేశ్వరరావు, సూరి, రమణయ్య పాల్గొన్నారు.

## అత్యవసర సేవలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** ప్రజలకు అందించే అత్యవసర సేవలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం తాగునీటి సరఫరా విధులకు హాజరుకాకుండా సరఫరాకు ఆటంకం కలిగించిన 15 మంది ఆప్కాస్ కార్మికులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సోమవారం ఉదయం కల్లా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. కార్మికుల గైర్హాజరు వల్ల తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగిందన్నారు. వీరంతా సోమవారం విధులకు హాజరు కాకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

## జిల్లాకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి రాక నేడు

**జిల్లాపరిషత్తు(గుంటూరు) :** జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రరావు జిల్లాకు రానున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి గుంటూరు చేరుకుంటారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా ఉన్నతాధికారులు, ఆయా శాఖల అధికారులు, కేంద్ర ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి శాఖాపరమైన, ఇతర అంశాలపై సమీక్షిస్తారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య తెలిపారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై ఆదివారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ నృత్య కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. గురువు డాక్టర్ మద్దాలి ఉషాగాయత్రి శిష్య బృందం యశస్వినీశ్రీ, శ్రద్ధా వారణాసి, సహస్ర, చెరిష్య, కార్తీక, ప్రణీత, చాతుర్యశ్రీలు.. వినరో భాగ్యము విష్ణుకథతో నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం శ్రీమన్నారాయణ, నారాయణతే నమో నమో.. తదితర కీర్తనలకు అనుగుణంగా కూచిపూడి నృత్యాలను అభినయించి ఆకట్టుకున్నారు.

## ఉర్రూతలూగించిన సంగీత విభావరి

పాటలు పాడుతున్న అమ్మపండు, పూజ బృందం

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, గీతాంజలి ఆర్కెస్ట్రా సంయుక్త నిర్వహణలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి అన్ని వయసుల ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏ షామ్ మస్తానీ-16 పేరున జరిగిన ఈ కార్యక్రమంలో కేరింతలు కొట్టించే పాత హిందీ చలనచిత్రాల్లోని మధుర గీతాలను పలువురు గాయనీగాయకులు ఆలపించి అభినందనలు అందుకున్నారు. 1960 నుంచి వచ్చిన హిందీ చలనచిత్రాల గీతాలను అమ్మపండు, పూజ, హేమమాలిని, శరణ్య, నందిని, సింహ, కల్యాణ్, విజయసాయి, శ్రీనివాసరావు, ప్రొఫెసర్ వీరరాఘవరావు, పాడుతా తీయగా ఫేమ్ శ్రీలలిత గానం చేశారు. కొన్ని తెలుగు మధుర గీతాలు గానం చేశారు. టీఎంటీ ట్రస్ట్ కార్యదర్శి పీఆర్సీ రాజు, డాక్టర్ రాఘవరావు, షుకూర్ తదితరులు శ్రీలలిత తదితర గాయనీగాయకులను సత్కరించారు.

(c) eenadu

# గుంటూరు పశ్చిమ

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** స్థానిక సమస్యలపై సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863- 2224202) కార్యక్రమం ఉంటుందన్నారు. తర్వాత 10.30 నుంచి ఒంటి గంట వరకు కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ ఉంటుందని తెలిపారు.

**కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో):** టమాట 30, వంగ 28, బెండ 23, పచ్చిమిర్చి 64, కాకర 43, బీర 38, క్యాబేజి 23, క్యారెట్ 44, దొండ 28, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 38, దోస 19, సొర 19, పొట్లకాయ 22, అరటికాయ 7, చామదుంప 28, మునగ 10, బీట్‌రూట్ 37, కీరదోసకాయ 48, బీన్స్ 84, క్యాప్సికమ్ 94, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 26, అల్లం 55, వెల్లుల్లి 110. **-న్యూస్‌టుడే, పట్టాభిపురం**

## పేదల సంక్షేమం.. అభివృద్ధికి ప్రాధాన్యం

కరపత్రాలు అందజేసి పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు ఓవైపు పేదల సంక్షేమం, మరోవైపు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. నవభారత్ నగర్ రెండో లైనులో రూ.1,18,50,000తో చేపట్టనున్న డ్రెయిన్లు, రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మాధవితో పాటు మేయర్ కోవెలమూడి రవీంద్ర శంకుస్థాపన చేశారు. అనంతరం 'సుపరిపాలన-తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కేవలం ఏడాదిలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో అధిక శాతం నెరవేర్చారన్నారు. పింఛన్లు పెంపు మొదలుకొని అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, తల్లికి వందనం, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయడంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మంది పేదల్ని ఆదుకుంటున్నామన్నారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ నగరం నలువైపులా అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఆరు నెలల్లోగా నగరంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 25వ డివిజన్‌లో కూడా 'సుపరిపాలన-తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, తెదేపా నాయకులు సింహాద్రి కనకాచారి, లంకా ఉదయ్, గాలం వెంకటేశ్వర్లు, కనపర్తి శ్రీనివాసరావు, ముత్తినేని రాజేష్, సుఖవాసి శ్రీనివాసరావు, కూసం కిరణ్‌కుమార్ రెడ్డి, పొకాలపాటి శ్రీకాంత్, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్తు.. యువత చిత్తు!

### గంజాయి విక్రయాలకు స్థావరాలుగా శివారు ప్రాంతాలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

**గు**ంటూరు నగర శివారు ప్రాంతాల్లో గంజాయి గుప్పుమంటోంది. గత వైకాపా ప్రభుత్వంలో తేలికగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడ్డ కొందరు గంజాయి క్రయవిక్రయాలను ఉపాధిగా మలచుకున్నారు. దీంతో ఎంతో మంది యువకులు మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. శివారు ప్రాంతాలతో పాటు కొన్ని గ్రామాల్లో గంజాయి విక్రయ కేంద్రాలు ఇటీవల కాలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వైజాగ్, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా నుంచి పెద్ద మొత్తంలో తెప్పించి వెంగళాయపాలెంలోని టిడ్కో గృహాలు, రాజీవ్‌గాంధీ కాలనీ, పులేనగర్ ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని కొందరు మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారు. 50 గ్రాముల ప్యాకెట్‌ని రూ.500, వంద గ్రాముల ప్యాకెట్ రూ.1000 చొప్పున విక్రయిస్తున్నారు.

### పోలీసుల ఉదాసీనత వల్లే...

వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగాయి. దీంతో ఆకతాయిలతో పాటు ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులూ దీనికి బానిసయ్యారు. గతంలో ఎన్నడూ లేనంతగా లిక్విడ్ రూపంలో కూడా దొరకడం నాడే ఆరంభమైంది. గత ప్రభుత్వంలో లక్ష్మీపురంలోని ఓ అల్పాహారం సెంటర్ నిర్వాహకుడు గంజాయి, మత్తు పదార్థాల విక్రయాల్లో ఆరితేరాడు. అప్పట్లో డ్రగ్స్ కేసులో తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. పలువురు ప్రముఖుల పిల్లలతో పాటు కొందరు యువతులకు అలవాటు చేశాడంటున్నారు. బృందావన్ గార్డెన్స్ పెట్రోల్ బంకు రోడ్డులో కారులో గంజాయి తరలిస్తూ పట్టుబడితే.. అప్పట్లో పోలీసులు తూతూ మంత్రంగా కేసులు పెట్టి మమ అనిపించారు.

### గంజాయి బ్యాచ్‌కు వైకాపా అండదండలు

వెంగళాయపాలెంకు చెందిన వైకాపా నాయకుడు దేవరకొండ నాగేశ్వరరావుతో పాటు ఆయన బంధువు కొండపల్లి గోపిని ఇటీవల ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి కిలోన్నరకు పైగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి బ్యాచ్‌కు వైకాపా నాయకుల అండదండలు ఉన్నాయనడానికి ఇదే నిదర్శనం. నాగేశ్వరరావు గతంలో పలు కేసుల్లో జైలుకు వెళ్లొచ్చాడు. రాజీవ్‌గాంధీకాలనీ, పులే నగర్ ప్రాంతాల్లోనూ గంజాయి స్టాక్ పాయింట్లు ఉన్నట్లు చెబుతున్నారు. నల్లచెరువుకు చెందిన కొందరు వెంగళాయపాలెం బ్యాచ్‌తో కలిసి కార్యకలాపాలు సాగిస్తున్నట్లు సమాచారం.

గుంటూరు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో గంజాయి స్టాక్ పాయింట్లు వెలిశాయంటున్నారు. నగరంలో కొంత మేరకు పోలీసులు నిఘా పెట్టడంతో కేంద్రాలను ఇక్కడి నుంచి అక్కడకు మార్చి కార్యకలాపాలు చక్కబెడుతున్నారు. స్వర్ణభారతినగర్, ఇన్నర్‌రింగ్‌రోడ్డు, రెడ్డిపాలెంతో పాటు జనసంచారం అంతగా లేని ప్రాంతాలను ఎంచుకుని విక్రయిస్తున్నారు. నల్లచెరువు, శ్రీనివాసరావుపేట, కేవీపీ కాలనీ, మిర్చియార్డు ప్రాంతాలు, రత్నగిరినగర్, శారదాకాలనీ, శివనాగరాజుకాలనీ, కోబాల్టుపేట తదితర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయాలు సాగుతూనే ఉన్నాయి. పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరించి గంజాయి స్టాక్ పాయింట్ల నిర్వాహకుల ఆట కట్టించాల్సిన ఆవశ్యకత ఉంది.

## 'అలజడులు సృష్టించాలని వైకాపా నేతల కుట్ర'

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** . అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని అన్నివిధాలా నష్టపర్చి 'పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా శాంతిభద్రతల సమస్య సృష్టించాలని వైకాపా నేతలు కుట్రపన్నారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'ఎంత రెచ్చగొట్టినా పోలీసులు తనను అరెస్టు చేయడంలేదన్న మనోవేదనలో వైకాపా నేత అంబటి రాంబాబు ఉన్నారు. మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నానిలకు పట్టిన గతే అంబటికి పట్టనుంది. గుడివాడ నా అడ్డా.. చంద్రబాబు, లోకేశ్‌లకు దమ్ముంటే రమ్మనండని పిచ్చి కూతలు కూసిన కొడాలి నాని.. అదే గుడివాడలో బిక్కుబిక్కుమంటూ గుర్తుతెలియని వాహనంలో గుట్టుగా వచ్చి పోలీస్ స్టేషన్‌లో సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారు. మంత్రి లోకేశ్‌పై నోరు పారేసుకుంటున్న పేర్ని నాని గుడివాడలో అడుగుపెడితే.. దేహశుద్ధి తప్పదని తెలుసుకుని దొడ్డి దారిలో విజయవాడలో తలదాచుకున్న సంగతి అందరికీ తెలిసిందే. అధికారమదంతో గతంలో నోటికొచ్చినట్లు మాట్లాడిన అంబటి రాంబాబు లాంటి వారు ఇకనైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి'.. అని హెచ్చరించారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM
**97042 53525, 80085 74897**

? ఆకులవారితోట 1వ లైన్ నుంచి ఎస్పీ బంగ్లాకి వెళ్లే దారిలో మలుపు వద్ద చెత్త పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలతో ఇబ్బంది పడుతున్నాం. **-స్థానికులు**

✔ పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తీయించేలా చర్యలు తీసుకుంటాం. **- అంగడి రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్, జీఎంసీ**

**కాలువలో చెత్త తొలగింపు:** అంకమ్మనగర్‌లోని సైడ్ కాలువలో చెత్త పేరుకుపోయి మురుగు నీటి పారుదలకు ఆటంకంగా మారింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సిబ్బందిని పంపి కాలువలో చెత్త తీయించారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

స్పందనకు వందనం

## జిల్లాకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి రాక నేడు

**జిల్లాపరిషత్తు:** జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ జిల్లాకు రానున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి గుంటూరు చేరుకుంటారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా ఉన్నతాధికారులు, ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఎస్సీలకు సంబంధించి శాఖాపరమైన, ఇతర అంశాలపై సమీక్షిస్తారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య తెలిపారు.

## గుంతల దారి.. నరకంగా మారి..

**నియోజకవర్గంలోని** పలు ప్రధాన రహదారులల్లోనూ పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా బ్రాడీపేట 4/18వ లైన్‌లో దారి పొడవునా అధ్వానంగా తయారవడంతో ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాత్కాలికంగానైనా గుంతలను పూడ్చించి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

## ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..!

**చు**ట్టుగుంట నుంచి లాల్‌పురం వైపు ఉన్న వీవీపీ రోడ్డులో కల్వర్టు వద్ద రహదారి విస్తరించకుండా వదిలేశారు. దీంతో ఆ మార్గం ఇరుకుగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రాత్రిళ్లు కల్వర్టు వద్ద జాగ్రత్తగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. వాహనాలు పరస్పరం ఢీకొనడంతో పాటు గాయాలపాలవుతున్నారు. అక్కడ రోడ్డు విస్తరించి కల్వర్టును పూర్తి స్థాయిలో నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ**

## కాటారాళ్లపై ముద్రలు వేయించుకోవాలి

**పట్నంబజారు:** వ్యాపార వర్గాలు విధిగా కాటా రాళ్లపై ముద్రలు వేయించుకోవాలని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ బి.వెంకట హరిప్రసాద్ సూచించారు. సిద్ధార్థనగర్‌లోని లీగల్ మెట్రాలజీ కార్యాలయంలో ఆదివారం కాటా రాళ్ల రిపేర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం జీవో నంబరు 6 ప్రకారం స్టాంపింగ్ ఫీజు 500 గ్రాముల నుంచి 5000 కిలోల వరకు రూ.500గా నిర్ణయించినట్లు తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలన్నారు. రిపేర్లు మాట్లాడుతూ స్టాంపింగ్ ఫీజులు 500 గ్రాముల నుంచి 20 కిలోల వరకు రూ.200, 25- నుంచి 200 కిలోల వరకు రూ.300, 250- 5వేల కిలోలు రూ.500 వరకు పెంచేలా స్టాంపింగ్ ఫీజు మార్చాలని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ కంట్రోలర్ బి.వెంకట హరిప్రసాద్ వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కంట్రోలర్ అల్లురయ్య, గుంటూరు ఇన్‌స్పెక్టర్ జి.ఎస్.సునీల్‌రాజు, నరసరావుపేట ఇన్‌స్పెక్టర్ శ్రీకర్, తెనాలి ఇన్‌స్పెక్టర్ శేషసాయి పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మెకు సీపీఎం మద్దతు

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే:** మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని డిమాండ్ చేశారు.

## ఉర్రూతలూగించిన సంగీత విభావరి

పాటలు పాడుతున్న అమ్మపండు, పూజ బృందం

**గుంటూరు సాంస్కృతికం:** ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, గీతాంజలి ఆర్కెస్ట్రా సంయుక్త నిర్వహణలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి అన్ని వయసుల ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏ షామ్ మస్తానీ-16 పేరున జరిగిన ఈ కార్యక్రమంలో కేరింతలు కొట్టించే పాత హిందీ చలనచిత్రాల్లోని మధుర గీతాలను పలువురు గాయనీగాయకులు ఆలపించి అభినందనలు అందుకున్నారు. 1960 నుంచి వచ్చిన హిందీ చలనచిత్రాల గీతాలను అమ్మపండు, పూజ, హేమమాలిని, శరణ్య, నందిని, సింహ, కల్యాణ్, విజయసాయి, శ్రీనివాసరావు, ప్రొఫెసర్ వీరరాఘవరావు, పాడుతా తీయగా ఫేమ్ శ్రీలలిత గానం చేశారు. కొన్ని తెలుగు మధుర గీతాలు గానం చేశారు. టీఎంటీ ట్రస్ట్ కార్యదర్శి పీఆర్పీ రాజు, డాక్టర్ రాఘవరావు, షకూర్ తదితరులు శ్రీలలిత తదితర గాయనీగాయకులను సత్కరించారు.

## కొండలా కుప్పలు.. తరగక తిప్పలు

### చుట్టుపక్కల ప్రాంతాలకు దుర్గంధం

న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ(గుంటూరు)

| | |
|---|---|
| నగరంలోని డివిజన్లు | : 57 |
| నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్త (మెట్రిక్ టన్నులు) | : 460 |
| పారిశుద్ధ్య కార్మికులు | : 2200 |

**న**గరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నా అనేక లోపాలు కనిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేమితో పాటు సిబ్బంది నిర్లక్ష్యంతో ఏటుకూరు రోడ్డులోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద చెత్తకుప్పలు భారీ ఎత్తున కొండలా పేరుకుపోతోంది. భారీగా వ్యర్థాలు పోగుపడడంతో దుర్గంధంతో స్థానిక పరిసరాలు కలుషితం కావడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు కొబ్బరితోట, సంపత్‌నగర్ వాసులు, కాల్వకట్ట పక్కన నివాసం ఉంటున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం, చెత్త ట్రాన్సిట్ పాయింట్ వద్ద నిర్వహణ పక్కాగా లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. తడి చెత్తను ఈ ప్రాంతంలో కుప్పలుగా పోసి కంపోస్టులా తయారు చేస్తారు. పొడి చెత్తను విభజించి జిందాల్ వ్యర్థాలతో విద్యుత్తు ప్లాంటుకు తరలిస్తారు. ఇక్కడ ఈ ప్రక్రియ ఓ క్రమపద్ధతి ప్రకారం జరుగుతున్న దాఖలా లేదు.

ఏటుకూరు రోడ్డులోని చెత్త ట్రాన్సిట్ పాయింట్ వద్ద వ్యర్థాల గుట్టలు

### అధికారుల పర్యవేక్షణ శూన్యం

నగరం నుంచి ఎంత చెత్త వస్తుందో వేబ్రిడ్జి వద్ద చూస్తారు. తర్వాత చెత్త విభజనకు తరలిస్తారు. కంపోస్టు తయారు చేసి పొడి చెత్త నాయుడుపేటకు తరలిస్తారు. ఇవన్నీ ఏఈ, డీఈఈ స్థాయి అధికారులు రోజుకోసారైనా పర్యవేక్షించి సిబ్బందికి పక్కాగా సూచనలు ఇవ్వాల్సి ఉంది. కానీ అధికారులు పర్యవేక్షిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆ ప్రాంతానికి వెళ్తేనే ముక్కుపుటాలు అదిరిపోయేలా దుర్గంధంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. నగరం నుంచి వస్తున్న చెత్తను ఎప్పటికప్పుడు వేబ్రిడ్జి వద్ద బరువు చూసి వెంటనే పంపాల్సి ఉంది. కానీ నిర్వహణ లోపంతో నిత్యం చెత్త ట్రాక్టర్లు బారులు తీరుతున్నాయి. నిర్వహణ లోపాలతోనే నగరంలో చెత్త కుప్పలు ఎక్కడివక్కడే ఉండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ట్రాన్సిట్ పాయింట్ వద్ద చెత్త నిర్వహణను పకడ్బందీగా చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిర్దేశిత సమయంలో చెత్త తరలింపు ప్రక్రియ పూర్తయితే నగరంలో పారిశుద్ధ్యం పక్కాగా ఉండేందుకు వీలు కలుగుతుందని పలువురు భావిస్తున్నారు.

చెత్త పడేసేందుకు వచ్చి లైన్‌లో ఉన్న ట్రాక్టర్లు

## తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలి

ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరావు

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినులు తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసరావు.. ఎమ్మెల్యే మాధవి చేతుల మీదుగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ హాస్టల్‌లో ఏ సమస్య ఉన్నా.. తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రహరీ, వంట గదుల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. విద్యార్థినులకు ఏ సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణులు శైలజ, జగదీశ్వరిలకు ఆమె సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, ఎల్లావుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సేవలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** ప్రజలకు అందించే అత్యవసర సేవలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం తాగునీటి సరఫరా విధులకు హాజరుకాకుండా సరఫరాకు ఆటంకం కలిగించిన 15 మంది ఆప్కాస్ కార్మికులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సోమవారం ఉదయం కల్లా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. కార్మికుల గైర్హాజరు వల్ల తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగిందన్నారు. వీరంతా సోమవారం విధులకు హాజరుకాకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై ఆదివారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ నృత్య కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. గురువు డాక్టర్ మద్దాలి ఉషాగాయత్రి శిష్య బృందం యశస్వినీశ్రీ, శ్రద్ధా వారణాసి, సహస్ర, చెరిష్య, కార్తీక, ప్రణీత, చాతుర్యశ్రీలు.. వినరో భాగ్యము విష్ణుకథతో నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం శ్రీమన్నారాయణ, నారాయణతే నమో నమో.. తదితర కీర్తనలకు అనుగుణంగా కూచిపూడి నృత్యాలను అభినయించి ఆకట్టుకున్నారు.

## కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** నల్లపాడు ఠాణా పరిధిలో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. వివాహేతర సంబంధం వల్ల ఎవరైనా సత్తెనపల్లికి చెందిన పద్మావతిని హత్య చేసి ఉంటారా.. అని అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం పూర్తయిన నేపథ్యంలో నివేదిక వస్తే కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఎవరైనా గొంతు నులిమి హత్య చేసి ఉంటారా.. అనే సందేహాలు రావడంతో ఆ దిశగానూ దర్యాప్తు చేస్తున్నారు.

## బెదిరించి సెల్‌ఫోన్ గుంజుకెళ్లిన ముగ్గురిపై కేసు

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** బెదిరించి సెల్‌ఫోన్ గుంజుకెళ్లిన ముగ్గురిపై అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. వెంగళరావునగర్‌కు చెందిన రాజేష్ ఇంటికి వెళ్తుండగా.. ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు మద్యం మత్తులో హడావుడి చేసి డబ్బులివ్వమని అడిగారు. తన వద్ద డబ్బు లేదని చెప్పడంతో రెచ్చిపోయిన ఆ ముగ్గురు రాజేష్‌పై దాడి చేసి సెల్‌ఫోన్ గుంజుకుని వెళ్లిపోయారు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపుతామని బెదిరించారు. దీంతో రాజేష్ అరండల్‌ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మధుమేహాన్ని నియంత్రణలో పెట్టుకోవాల్సిందే

ప్రసంగిస్తున్న నేత్ర వైద్య నిపుణులు కల్పనారెడ్డి

**గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే:** మధుమేహాన్ని నియంత్రణలో పెట్టుకోకపోతే కంటిలోని కీలకమైన రెటీనా పొర దెబ్బతిని నడివయసులోనే చూపు పోగొట్టుకుని అంధత్వంలోకి వెళ్లిపోతున్నారని నేత్ర వైద్య నిపుణులు కల్పనారెడ్డి తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్‌టెన్షన్, డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత రెటినోపతి వైద్య శిబిరంలో కల్పనారెడ్డి మాట్లాడారు. మారుతున్న జీవనశైలి కారణంగా పట్టణాలనే కాదు, ఇప్పుడు గ్రామాలను కూడా చుట్టబెడ్తున్న పెద్ద సమస్య మధుమేహం అన్నారు. మధుమేహం కారణంగా కంటి చూపు దెబ్బతినడం(రెటినోపతి) చాలా తీవ్రమైన సమస్యన్నారు. అందువల్ల తరచూ కంటి పరీక్షలు చేయించుకుంటూ లోపల పరిస్థితి ఎలా ఉందో చూసుకోవాలన్నారు. మధుమేహాన్ని కచ్చితంగా నియంత్రణలో పెట్టుకోవాలన్నారు. అనంతరం బాధితులకు రెటినోపతి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో వ్యవస్థాపకుడు డాక్టర్ సేవకుమార్, దంత వైద్యులు చల్లా చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## దాడి ఘటనపై కేసు

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** దాడి ఘటనపై ఆదివారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రామకృష్ణ వడ్డెరకాలనీలో సిమెంట్ వ్యాపారం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ సిమెంట్ దుకాణం పెట్టవద్దని స్థానికులు నిరసన తెలిపారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్న క్రమంలో అంకమ్మ అనే వ్యక్తి ఇనప రాడ్డుతో రామకృష్ణపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాంబాబు తెలిపారు.

## భక్తి ప్రపత్తులతో లక్ష తులసీ దళార్చన

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** బ్రాడీపేట 2/7లోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయం శతాబ్ది ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణుడికి ఆదివారం భక్తి ప్రపత్తులతో లక్ష తులసీ దళార్చన, అష్టాక్షరీ, సుదర్శన హోమాలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ సోమవారం స్వామి కల్యాణం, కలశాభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

## నొప్పుల నుంచి ఉపశమనానికి ఫిజియోథెరపీ

మాట్లాడుతున్న ఫిజియోథెరపిస్టు లక్ష్మీలావణ్య

**గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే:** వివిధ నొప్పుల నుంచి సత్వర ఉపశమనానికి ఫిజియోథెరపీ ఉపయోగపడుతుందని ఫిజియోథెరపిస్టు లక్ష్మీలావణ్య తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో ఆమె మాట్లాడారు. దెబ్బతిన్న శరీర అవయవాల పనితీరును యథాస్థితికి తీసుకురావడానికి ఇది దోహదం చేస్తుందన్నారు. తగిన వైద్యం, శస్త్రచికిత్సలతో పాటు రోగి పూర్తి స్థాయిలో కోలుకోవడానికి ఇప్పుడు ఫిజియోథెరపీ కీలకంగా మారిందన్నారు. శరీరంలో ఏవైనా అవయవాలు ప్రమాదానికి గురైనా, చచ్చుబడినా నిర్దేశిత పద్ధతులు, వ్యాయామాల ద్వారా ఫిజియోథెరపిస్టులు వాటిని ప్రేరేపిస్తారన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## కర్మయోగంపై అవగాహన శిబిరం

**ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే:** జడ్పీ ప్రాంగణంలో శ్రీఅరబిందో సొసైటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సాధన శిబిరం ఆదివారం నిర్వహించారు. సొసైటీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఛైర్మన్ ములుగు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కర్మ అనే ఉపాయాన్ని పట్టుకొని ఆత్మజ్ఞానం సాధించడాన్ని కర్మయోగం అంటారన్నారు. అనంతరం సాధకులతో ధ్యానం సాధన చేయించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు డాక్టర్ పల్లా వెంకటేశ్వరరావు, గంటా రామకృష్ణ, వరిగొండ కాంతారావు, యర్రంశెట్టి గోపీనాథ్, లోక్‌నాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సాధకులతో శ్రీఅరబిందో సొసైటీ ప్రతినిధులు

## సమాజ సేవకు ఆర్యవైశ్యులు ముందంజ

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** సమాజ సేవకు ఆర్యవైశ్యులు ముందంజలో ఉంటారని వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ అన్నారు. ఏటుకూరు రోడ్డులోని గీతామందిరంలో ఆదివారం వాసవిక్లబ్ గుంటూరు, మహిళా క్లబ్ గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో 108 మంది పేదలకు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాదర్తి దుర్గారావు, కొల్లిపర దుర్గా నాగమణి, రాచకొండ ఏడుకొండలు, గుండా హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 24న నగర మహాసభలు

మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఈ నెల 24న నిర్వహిస్తున్న సీపీఐ నగర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఆదివారం పిచుకలగుంట వద్ద పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకులు శివనాగేశ్వరరావు, సూరి, రమణయ్య పాల్గొన్నారు.

(c) eenadu

## ఎక్కాలంటే గండం.. దిగాలంటే నరకం..

ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దుర్గాఘాట్ నుంచి కొండపైకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన దేవస్థానం బస్సులు చాలక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల్లో కిక్కిరిసి చంటిబిడ్డలతో తల్లడిల్లుతున్నారు. వారాంతం, సెలవు రోజుల్లో అదనపు బస్సులు వేయాలని కోరుతున్నా ఫలితం ఉండటం లేదు. బస్సులు చాలాలని వేళ.. ఇలా బస్సు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ కొండపైకి వెళ్లే మార్గంలో గాయాల పాలవుతున్నామని భక్తులు వాపోతున్నారు.

– ఈనాడు, అమరావతి

## కాలువలకు 12,788 క్యూసెక్కుల సాగునీరు

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 12,788 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు(కేఈ) ప్రధాన కాల్వకు 9,781, కృష్ణా పశ్చిమ(కేడబ్ల్యూ) ప్రధాన కాల్వకు 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 5,017, ఏలూరు కాల్వకు 1,404, బందరు కాల్వకు 1,853, కేఈబీ (బిడబ్ల్యూ) కాల్వకు 1,507 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

**కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే:** కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తారని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదిక ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమీపంలోని మండల, డివిజన్ కేంద్రాల్లో అర్జీలు సమర్పిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. కాల్ సెంటర్‌లోని 1100 నంబరుకు ఫోన్ చేసి అర్జీలు నమోదు చేసుకోవడంతో పాటు అర్జీ స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు.

## మోపిదేవి ఆలయ ఒక్క రోజు ఆదాయం రూ.10.41లక్షలు

స్వామి నిత్య కల్యాణం

**మోపిదేవి, న్యూస్‌టుడే:** మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఒక్కరోజు ఆదాయం రూ.10,40,737 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. అన్నదాన పథకానికి రూ.1.78 లక్షలు, కల్యాణ కట్టకు రూ.16 వేలు, ప్రసాదాలు రూ.1.62 లక్షలు, స్వామి సేవ రుసుములకు రూ.6.10 లక్షలు, ఇతర సేవల ద్వారా రూ.75 వేలు ఆదాయం సమకూరిందన్నారు. 15 వేలమంది భక్తులు మొక్కులు సమర్పించి ఆర్జిత సేవల్లో పాల్గొని నాగదేవతకు కొలిచి పుట్టలో పాలుపోశారు. అన్నప్రసాదం స్వీకరించారు. ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి.

## గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీ

**మచిలీపట్నం గ్రామీణం:** జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి ఏడాదిలో చేరదలచిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసి ఇంకా సీట్లు రాని వారికి మరో అవకాశం కల్పించేందుకు ఈ నెల 14న గన్నవరం మండలం వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. చల్లపల్లి, వీరపనేనిగూడెం(గన్నవరం), బల్లిపర్రు (పెడన), మోటూరు(గుడివాడ గ్రామీణ మండలం)లోని బాలికల గురుకులం, రుద్రవరం(మచిలీపట్నం), పామర్రులోని బాలుర పాఠశాలల్లో మిగులు సీట్లను భర్తీ చేస్తామన్నారు.

## జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి సమీక్ష నేడు

**ఎన్టీఆర్ కలెక్టరేట్:** జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని ఏపీ ఎస్.ఆర్.బీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలో షెడ్యూల్ కులాల జనాభా స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతుల స్థితి, ప్రభుత్వ పరంగా వారికి కల్పించిన సౌకర్యాలు, తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై ఆయన సమీక్షిస్తారు. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎన్సీఎస్సీ) డైరెక్టర్ జి.సునీల్‌కుమార్‌బాబు పాల్గొంటారు.

# విలక్షణ కోట.. విలువల పూదోట

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, కంకిపాడు, గవర్నర్‌పేట, భవానీపురం

'విలక్షణ నటుడు.. కోట శ్రీనివాసరావు. ఆయనకు కృష్ణా జిల్లాతోనూ.. విజయవాడ నగరంతోనూ విడదీయలేని అనుబంధం ఉంది. కంకిపాడులో పుట్టి పెరిగిన కోట.. నటనలో తొలి అడుగులు ఇక్కడే వేశారు. విజయవాడలో కొన్నాళ్లు నివాసం ఉన్నారు. నగరంలో కళ, నాటక ప్రదర్శనలను చూసే ఆయన స్ఫూర్తి పొందారు. నటుడిగానే కాక ప్రజాప్రతినిధిగా, నాయకుడిగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా.. సేవలందించిన వేళ కళలు, కళాకారులను ఎంతో ప్రోత్సహించారు.'

కోట శ్రీనివాసరావుకు కళారంగమంటే అమితమైన ఇష్టం. సినిమాల్లోకి వెళ్లక ముందు విజయవాడలో ఉన్నారు. కోటకు.. ఎస్టేట్ కొత్త గుళ్ల వద్ద మూడు సొంత ఇళ్లు ఉండేవి. ఒకదానిలో తానుండి, మిగతావి చాలా తక్కువకు కళాకారులకు అద్దెకు ఇచ్చేవారు. అప్పట్లో రూ.3 వేలు అద్దె వచ్చే ఇంటిని రూ.800కే కళాకారులకు ఇచ్చేవారని ఆయన సన్నిహితులు గుర్తుచేసుకున్నారు.

**కళాక్షేత్రానికి వెళ్లాల్సిందే...** కొత్త గుళ్ల సెంటర్ నుంచి రోజూ రిక్షాలోనే లోబ్రిడ్జి మీదుగా విజయవాడలో పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చేవారు. మధ్యలో కళాక్షేత్రంలో ఏవైనా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటే కచ్చితంగా ఆగి వీక్షించేవారు. కళలపై ఆసక్తితో నాటక రంగం వైపు ఆకర్షితులయ్యారు. సినిమా రంగానికి వెళ్లినా బెజవాడను మరవలేదు. తూర్పు ఎమ్మెల్యే అయ్యాక నగర కళా రంగంతో ఆయనకు అనుబంధం మరింత పెరిగింది.

### జంధ్యాల పురస్కారమిక్కడే...

2001లో సుమధుర కళానికేతన్ సంస్థ జంధ్యాల పురస్కారంతో విజయవాడలో కోటను ఘనంగా సత్కరించింది. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అనేక కళా ప్రదర్శనలు, సభలకు కోటా తరచూ ఎమ్మెల్యే హోదాలో హాజరయ్యేవారు.

1995లో పునాదిపాడులో కబడ్డీ విజేతలకు షీల్డ్ ప్రదానం సందర్భంగా విద్యార్థులతో...

### నేనేమైనా చిరంజీవినా.. బాలకృష్ణనా?

కోట పదేళ్ల కిందట కంకిపాడు వచ్చినప్పుడు.. నలుగురు విద్యార్థినులు ఆయన దగ్గరకు వచ్చి "మీతో ఫొటో దిగుతాం సార్.. మీరన్నా, మీ నటనన్నా ఇష్టమని" చెప్పారు. దీంతో ఆయన తన సహజశైలిలో నవ్వుతూ.. "నేను చిరంజీవో.. బాలకృష్ణో కాదు కదా.. నేను ఇష్టం అనడానికి.." అని చమత్కరించారు. "నాతో ఫొటో దిగాలనే కదా.. నాకు బిస్కెట్ వేస్తున్నారని" అనడంతో అక్కడున్న వాళ్లందరి ముఖంలోనూ నవ్వులు పూశాయి. ఆ తర్వాత విద్యార్థినులతో ఫొటో దిగి.. "చూశారా, ఈతరం పిల్లలు ఎంత తెలివితేటలతో పుడుతున్నారో.." అని చమత్కరించారు.

### మీ కార్యక్రమానికి నేను రావచ్చా..

సుందర హనుమాన్ ధార్మిక పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో 2003లో సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలను విజయవాడలోని రామకోటిలో ఏర్పాటు చేశారు. షణ్ముఖశర్మకు అదే మొదటి కార్యక్రమం. అప్పట్లో ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు ఉన్నారు. షణ్ముఖశర్మ కార్యక్రమం ఉందని తెలిసి నిర్వాహకులకు ఫోన్ చేసి మరీ... నేను రావచ్చా అని కోట అడిగారు. దీంతో నిర్వాహకులు ఆనందంతో ఆయనను ఆహ్వానించారు. కోట శ్రీనివాసరావు చేతుల మీదగానే కార్యక్రమాన్ని ఆరంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఆయనకు ఉన్న ఇష్టానికి ఇది నిదర్శనం.

విజయవాడలో భాజపా నాయకులతో కలిసి ప్రజాప్రదర్శన

### కంకిపాడులో చదువు.. విజయవాడలో వెలుగు

**స్వగ్రామంపై మమకారం...**

కంకిపాడులో మధ్యతరగతి కుటుంబంలో కోట శ్రీనివాసరావు పుట్టారు. సినీరంగాన మేటిగా ఎదిగినా.. కంకిపాడుపై తరగని మమకారం. గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. తర్వాత పునాదిపాడులో హైస్కూలు విద్య చదివారు. బాల్యం నుంచి హాస్యోక్తులతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆకట్టుకునే వారు. కోట తండ్రి.. సీతారామాంజనేయులు. ఆయన... డాక్టర్‌గా సుపరిచితులు. తండ్రి క్రమశిక్షణ, అంకితభావమే తనకు స్ఫూర్తి అనీ.. ఎంత ఎదిగినా ఒదగాలనేది తండ్రి నుంచే నేర్చుకున్నానని కోట గుర్తు చేసుకునే వారు. కంకిపాడు బ్రాహ్మణ సంఘానికి కోట శాశ్వత గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు.

2012లో కంకిపాడు వచ్చినప్పుడు స్థానికులతో..

### నా అన్నే... తొలి గురువు..

కోట శ్రీనివాసరావు అన్న నరసింహారావు.. మంచి రంగస్థల నటుడు. ఆయన దర్శకత్వంలో రాష్ట్రంలో వందలసార్లు ప్రదర్శించిన 'వీరమ్మతల్లి', 'పుణ్యవతి' నాటకాల్లో కోట ప్రధాన పాత్ర పోషించారు. నటనలో 'అన్నే... నా తొలి గురువని' పలు మార్లు కోట చెప్పేవారు.

తమ్ముడు శంకరరావు, అన్న నరసింహారావులతో..

### కల్యాణ మండపం కట్టాలనుకున్నా...

కోట.. తనకు వారసత్వంగా వచ్చిన కంకిపాడులోని స్థలంలో పేద, మధ్యతరగతి వారి కోసం కల్యాణ మండపం నిర్మించాలని భావించారు. కానీ.. ఆరోగ్య సమస్యలు ఎదురవడంతో ఆయన కోరిక నెరవేరలేదు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కంకిపాడులో నిర్మించిన గాయత్రీ ధ్యాన మందిరానికి కోట భారీ విరాళం అందజేశారు. సమయం దొరికిన ప్రతిసారీ కంకిపాడు వచ్చి బాల్యమిత్రులు, సంఘం సభ్యులు, గ్రామస్థులతో ఉల్లాసంగా గడిపేవారు.

గాయత్రీ ధ్యాన మందిరం

### విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా సేవలు..

ఎన్డీయే కూటమి పొత్తులో భాగంగా 1999లో విజయవాడ తూర్పు నుంచి భాజపా ఎమ్మెల్యే అభ్యర్థిగా కోట శ్రీనివాసరావు బరిలో దిగారు. కోట శ్రీనివాసరావుకు 57,047 ఓట్లు.. కాంగ్రెస్ అభ్యర్థి ఐలాపురం వెంకయ్యకు 50,971 ఓట్లు వచ్చాయి. 6,076 ఓట్ల ఆధిక్యంతో కోట ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత పునర్విభజనలో నాటి తూర్పు పరిధిలోని అధిక భాగం నేటి సెంట్రల్ నియోజకవర్గంగా మారింది. అప్పటి కంకిపాడు నియోజకవర్గంలోని కొంత భాగం వేరుచేసి ప్రస్తుత విజయవాడ తూర్పు నియోజకవర్గం ఏర్పాటు చేశారు. కోట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ప్రస్తుత సూర్యారావుపేట ఠాణా భవన సముదాయం ప్రారంభించారు. నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన హయాంలో రూపకల్పన చేశారు. డిస్నీల్యాండ్‌లో భాజపా రాష్ట్ర సమావేశాలను విజయవంతంగా నిర్వహించారు. భాజపా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతూనే.. ప్రజాప్రదర్శన నిర్వహించారు.

# పట్టణ వ్యర్థం.. పట్టక అనర్థం!

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

**స్వ**చ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఈ-వ్యర్థాల సేకరణ ఆరంభ శూరత్వానికే పరిమితమవుతుంది. ఎలక్ట్రానిక్ వస్తువులు వినియోగం విపరీతంగా పెరిగింది. వాటితో పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి ప్రభుత్వం వాటిని సేకరించి రీసైక్లింగ్ చేయాలని నిర్ణయించింది. అన్ని చోట్లా ఈ-వ్యర్థాలను సేకరించే ప్రక్రియ ప్రారంభించింది. కానీ ఆరంభంలో హడావుడి చేయడం తప్పా ప్రస్తుతం ఎక్కడా ప్రక్రియ సక్రమంగా సాగకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రెండో విడతగా..** జిల్లా వ్యాప్తంగా తొలుత ఆయా ప్రాంతాల నుంచి సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వాహనాల ద్వారా బందరు మండలంలోని పోతేపల్లికి తరలించి అక్కడ నిల్వ చేశారు. వీటన్నింటినీ రీసైక్లింగ్ చేసేందుకు గానూ ఓ సంస్థకు బాధ్యతలు కూడా అప్పగించారు. ప్రారంభంలోనే 11 టన్నులకు పైగా వ్యర్థాలను సేకరించారు. ప్రజల నుంచి స్పందన రావడంతో రెండో విడతగా పది మేజర్ పంచాయతీల్లో ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. పోతేపల్లి, అవనిగడ్డ, బాపులపాడు, చల్లపల్లి, మల్లాయిపాలెం, గుడ్లవల్లేరు, నాగాయలంక, పామర్రు, ఉంగుటూరు, పెదపారుపూడిలో వీటిని ఏర్పాటు చేశారు. దానికి సంబంధించిన వసతులు కల్పించారు. ఆ తర్వాత అన్ని పంచాయతీల్లోనూ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా ఆ దిశగా చర్యలు లేవు. ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కూడా ప్రస్తుతం ఈ- వ్యర్థాల సేకరణ సరిగా జరగడం లేదు.

పోతేపల్లిలో అలంకారంగా ఈ– వ్యర్థాల సేకరణ కేంద్రం

**పట్టణాల్లోనూ అంతే..** తొలుత బందరుతో పాటు పెడన, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప పురపాలక సంఘాల నుంచి రెండు టన్నులకుపైగా వ్యర్థాలు సేకరించి పోతేపల్లికి తరలించారు. ఆ తర్వాత ప్రతి పట్టణంలో కేంద్రం ఉండాలన్న ప్రభుత్వ ఆదేశాలతో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సేకరించే వ్యర్థాల్లోనే ఇవి ఉంటే విడిగా తీసుకొచ్చి అందించాలని సచివాలయ ఉద్యోగులు పారిశుద్ధ్య సిబ్బందికి చెప్పి మమ అనిపిస్తున్నారు. బందరు పరిధిలోని నగరపాలక సంస్థ వాహన డిపో పరిధిలో పరదాలు కట్టి ఈ-వ్యర్థాలు కేంద్రంగా ఏర్పాటు చేశారు.

### సమర్థంగా నిర్వహిస్తేనే ఫలితం

ప్రతి ఇంట్లోనూ పాడైన టీవీలు, చరవాణులు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, కుక్కర్లు, మిక్సీలు తదితరాలు ఉంటున్నాయి. వాటిని ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరిస్తున్నా కానీ వాటిలో ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండటంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. పాడైన వాటిని కొందరు కొనుగోలు చేస్తున్నారు కానీ ఎక్కడపడితే అక్కడ పగలగొట్టి అవసరమైన వాటిని తీసుకుని మిగిలిన వాటిని అక్కడ వదిలేస్తున్నారు. వాటి వల్ల తలెత్తే ప్రమాదాలను నివారించి, ఈ వ్యర్థాల్లో ఉండే క్యాడ్మియం, లెడ్ తదితరాలను సేకరించి సంపద సృష్టించాలన్నది ప్రభుత్వ ఆశయం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించాలి.

# డబ్బుల కోసమే హతమార్చారు?

శ్రీకాళహస్తి సెల్‌ఫోన్ దుకాణదారుడి చాకచక్యంతో చిక్కిన నిందితులు

**పటమట, న్యూస్‌టుడే:** విశ్రాంత ఇంజినీర్ రామారావుని డబ్బుల కోసమే హతమార్చినట్లు పోలీసుల విచారణలో ప్రాథమికంగా తేలింది. రామారావుని హతమార్చి పరారైన పల్లెపు మంగ, ఉపేంద్ర రెడ్డిని మాచవరం పోలీసులు శనివారం రాత్రి శ్రీకాళహస్తిలో అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం విజయవాడ తీసుకువచ్చారు. ★ మంగ మే 28న ఉపేంద్రరెడ్డిని శ్రీకాళహస్తిలో మూడో వివాహం చేసుకుంది. తరువాత నంది మొబైల్స్ దుకాణంలో ఇద్దరికీ కొత్త సిమ్‌లు తీసుకున్నారు. ఉపేంద్రరెడ్డి శివ భక్తుడు. ప్రతినెలా శ్రీకాళహస్తి వచ్చి దర్శనం చేసుకుంటాడు. ఆ కోణంలో పోలీసులు ఆలోచించి సెల్‌ఫోన్ దుకాణ యజమానికి ఫోన్ చేసి విషయం చెప్పారు. వారి ఫొటోలు, వివరాలు అందజేశారు. అనుకున్నట్లే ఆదివారం రాత్రి కొత్త సిమ్ కోసం దుకు ఆ దుకాణానికి వెళ్లారు. యజమాని వెంటనే మాచవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఉన్నతాధికారుల ఆదేశాలతో శ్రీకాళహస్తి పోలీసులు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తరువాత ఎస్ఐ శంకర్ బృందం వారిని విజయవాడ తెచ్చింది.

**పొంతన లేని సమాధానాలు:** విచారణలో మంగ పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రామారావు తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని, ఉపేంద్రకు ఫోన్ చేసి విషయం చెబితే అతను వచ్చి అడగడంతో వివాదం చోటు చేసుకుందని, రామారావే ముందుగా చేయి చేసుకోవడంతో కోపంలో ఘటన జరిగిందని చెప్పుకొచ్చింది. బీరువాలో నగదు ఎందుకు తీశావంటే సమాధానం చెప్పట్లేదు. నాలుగు రోజుల కిందట రామారావు కుమార్తె చందన వచ్చి కొంత నగదు రామారావుకు ఇచ్చింది. అది మంగ చూసింది. బీరువాలో పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని ఊహించి ఉపేంద్రతో కలిసి ప్రణాళిక వేసుకున్నట్లు తెలిసింది. ★ గురువారం రాత్రి రామారావు నిద్రపోయిన తర్వాత ఉపేంద్రకు ఫోన్ చేసి పిలిచింది. ఇంటి వెనుక తలుపు తీసి లోపలికి తీసుకెళ్లింది. రాత్రి 12 గంటలకు బెడ్ రూమ్‌లో పడుకున్న రామారావు ఛాతిపై ఉపేంద్ర కూర్చొని దిండుతో ముఖంపై అదమగా, రామారావు కాళ్లని మంగ పట్టుకుంది. చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత అతనిపై కారం చల్లారు. బీరువా తెరిచి చూస్తే అందులో రూ.50 వేలు మాత్రమే ఉన్నాయి. ఇల్లు అంతా వెతికినా బంగారం, నగదు దొరక్కపోవడంతో అవి తీసుకుని పరారయ్యారు.

# వెలితి తీర్చాలి.. వెలుగు తేవాలి..!

ఈనాడు, అమరావతి – కానూరు, న్యూస్‌టుడే

కూటమి సర్కారు చొరవతో కానూరు పైవంతెన పూర్తి

'**జ**గన్ ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోకుండా వదిలేసిన కానూరు సిద్ధార్థ కళాశాల పైవంతెనను కూటమి సర్కారు రాగానే.. యుద్ధప్రాతిపదికన అందుబాటులోకి తేవడం హర్షణీయం. కానీ.. ఆ వంతెన మీదుగా వెళ్లే రహదారిపై వేయాల్సిన వీధి దీపాలను నేటికీ వేయలేదు. నిత్యం వేల మంది రాత్రుళ్లు ఇటుగా రాకపోకలు సాగిస్తున్నారు. విద్యుద్దీపాలు లేక.. పెనమలూరు ఠాణా నుంచి తాడిగడప వందడుగుల రోడ్డు వరకూ చిమ్మచీకట్లు అలముకొని.. ప్రమాదాలు జరుగుతున్నాయి." విజయవాడ నగరాన్ని శివారు ప్రాంతాలను కలిపే కీలకమైన అనుసంధానం... కానూరు పైవంతెనే. వీధి దీపాల కోసం రూ.40 లక్షలు మంజూరయ్యాయని.. తాడిగడప మున్సిపాలిటీ అధికారులు ప్రకటించి ఎనిమిది నెలలైంది. వంతెన మీదుగా వందడుగుల రహదారి వరకూ సెంట్రల్ లైటింగ్ వేస్తామన్నారు. కానీ.. రహదారి పక్కన డ్రెయినేజీ పనులు పూర్తి కాక.. సెంట్రల్ లైటింగ్ పనులు అడుగు పడటంలేదు.

**కాలువల జాప్యంతో ఆగిన విస్తరణ..** పెనమలూరు ఠాణా నుంచి సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల మీదుగా వందడుగుల రోడ్డు వరకు రూ.కోటిన్నరతో ఇరువైపులా కాలువల పనులు చేపడుతున్నారు. ఒకవైపు పూర్తవగా.. మరోవైపు నిర్మాణాల తొలగింపుతో జాప్యమైంది. ఇక్కడ కొన్ని విద్యుత్తు స్తంభాలు, ఓ ఆలయం ఉన్నాయి. దీంతో అలైన్‌మెంట్ మార్చి.. పనులు చేసేలా అధికారులు ప్రతిపాదించారు. మరో 300 మీటర్ల పొడవైన కాలువనూ నిర్మించాలి. ఇవి పూర్తయ్యాకే దారిని విస్తరించి.. సెంట్రల్ లైటింగ్ పనులు చేపడతారు. అందుకే డ్రెయినేజీ పనులను త్వరగా చేయించాలి.

**బందరు రోడ్డుకు ప్రత్యామ్నాయం..** పంటకాలువ రహదారి పూర్తిగా అందుబాటులోకి వచ్చాక బందరు రోడ్డుకు ప్రత్యామ్నాయ మార్గంగా మారింది. నిత్యం వేల వాహనాలు బందరు రోడ్డుపై కాకుండా.. పైవంతెన మీదుగా తాడిగడప చేరుతున్నాయి. ఆపై నగర శివార్లలో జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. కానీ.. కిలోమీటరుకు పైగా పైవంతెన

### కానీ విద్యుద్దీపాలు లేక.. నిత్యం ప్రమాదాలు

వద్ద అంధకారం నెలకొని తరచూ వాహనదారులు ఎదురెదురుగా వచ్చి ఢీ కొని పడిపోతున్నారు. రాత్రి 7 గంటల నుంచిఅర్ధరాత్రి వరకూ వంతెన మీదుగా వాహనాలు భారీగానే వెళ్తున్నాయి.

### దత్తత తీసుకున్న ఎమ్మెల్యే ..

సిద్ధార్థ పైవంతెన నుంచి వందడుగుల రోడ్డు వరకు కిలోమీటరు రహదారిని ఎమ్మెల్యే సుజనాచౌదరి దత్తత తీసుకున్నారు. ఆయన నివాసం ఇక్కడే ఉండటంతో రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రణాళికలూ సిద్ధం చేయించారు. డ్రెయినేజీ పనులు పూర్తయితే రహదారిని విస్తరించి, మధ్యలో సెంట్రల్ లైటింగ్ వేస్తారు.

### నెలలో డ్రెయినేజీ పనుల పూర్తి

డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తున్నాం. కొలిక్కి రాగానే సెంట్రల్ లైటింగ్ పనులు చేపడతాం. ఈనెల ఆఖరులోగా పూర్తిచేయాలని గుత్తేదారు, అధికారులను ఆదేశించాం.

– నజీర్, కమిషనర్, తాడిగడప

# బందరులో.. ఉత్కంఠ!

పెడనలో మళ్లీ రెచ్చగొట్టేలా పేర్ని వ్యాఖ్యలు

**ఈనాడు డిజిటల్, మచిలీపట్నం - న్యూస్‌టుడే, కోనేరుసెంటరు, పెడన:** ఇటీవల పామర్రులో వైకాపా కార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షుడి హోదాలో హాజరైన పేర్ని నాని.. "చీకట్లో కనుసైగ చేస్తే రెండో కంటికి తెలియకుండా వేసేయాలి.. తెల్లారగానే వెళ్లి పరామర్శించాలని" కార్యకర్తలను రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. పేర్ని అనుచిత వ్యాఖ్యలపై శనివారం గుడివాడలో కూటమి నేతల ఆందోళన.. ఇరువర్గాల రాళ్ల దాడులతో ఉద్రిక్తత నేపథ్యంలో ఆదివారం పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఆదివారం నానిని పోలీసులు అదుపులోకి తీసుకుంటారని ప్రచారం జరగడం... వైకాపా నేతలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు.. ఆయన ఇంటికి చేరుకున్నారు. అల్లర్లు జరగకుండా పేర్ని ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించడంతో హైడ్రామా నెలకొంది. మరోవైపు ఉప్పాల రాము, హారిక అధ్యక్షతన పెడనలో నిర్వహించే సమావేశానికి అనుమతి ఇవ్వాలని ఎస్పీ గంగాధరరావును వైకాపా నేతలు కోరారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయమని.. వివాదాలు.. అల్లర్లు.. జరిగితే బాధ్యత తమదే అని పోలీసులు ఇచ్చిన నోటీసులను పేర్ని నాని, కిట్టు, ఉప్పాల రాము, హారిక తీసుకున్నారు.

పేర్ని కిట్టుతో మాట్లాడుతున్న పోలీసులు

**ప్రశాంతమని.. హద్దుమీరి మాట్లాడి..** పెడన కార్యకర్తల సమావేశంలో వివాదస్పద వ్యాఖ్యలు చేయనని హామీ ఇచ్చిన పేర్ని నాని.. మళ్లీ హద్దు మీరారు. పామర్రు సమావేశంలో తాను చేసిన వ్యాఖ్యలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తూనే... తాను చెప్పాలనుకుంటే పట్టపగలే వేసేయమంటానని మరోసారి కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్రలను కించపరిచేలా మాట్లాడారు. ఇప్పటికే హింస, వర్గ వైషమ్యాలను ప్రోత్సహిస్తున్నారనే కారణంతో కూటమి నేతల ఫిర్యాదుతో పేర్నిపై కేసు నమోదవడం గమనార్హం.

**పెడనలో భారీ బందోబస్తు...** పెడనలో వైకాపా సమావేశం వేళ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా భారీగా పోలీసు బందోబస్తు పెట్టారు. జిల్లాతోపాటు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అదనపు బలగాలను పెడనకు రప్పించారు. ఏఎస్పీ వి.వి. నాయుడు పర్యవేక్షణలో మచిలీపట్నం, అవనిగడ్డ డీఎస్పీలు చప్పిడి రాజా, శ్రీవిద్య పలువురు సీఐలు, ఎస్సైలు, వందల సంఖ్యలో సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. స్పెషల్ బ్రాంచి, ఇంటిలిజెన్స్ వర్గాలు పలు చోట్ల మోహరించి కొత్త వ్యక్తుల కదలికలను గమనించారు.

(c) eenadu

# తోటల్లో ఈగల మోత..

- ఉద్యానం ఉసురు తీస్తున్న పండు ఈగ
- నియంత్రించలేక తోటలు తొలగిస్తున్న కర్షకులు

మైలవరం, న్యూస్‌టుడే

☛ మైలవరానికి చెందిన ఓ పెద్ద రైతు జామ సాగు చేపట్టిన రెండేళ్లలోనే పదెకరాల తోటను నిర్మొహమాటంగా తొలగించారు. ఆ తర్వాత పామాయిల్ మొక్కలు పెంచారు. జామ సాగు సమయంలో రెండేళ్లలో సుమారు రూ.10 లక్షల వరకు నష్టపోయానని, తోట తొలగించాక ప్రశాంతంగా ఉందని చెబుతున్నారు. జామను పండు ఈగ పట్టిపీడించడంతో, తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని వాపోయారు.

☛ రెండ్రోజుల కిందట మార్కెట్‌లో బొప్పాయి కాయలు కొనుగోలు చేసిన వ్యక్తి, ఇంటికెళ్లాక కోసి చూస్తే పురుగులొచ్చాయి. కాయలు పైకి చూడడానికి బాగానే ఉన్నా, కోస్తేగానీ పురుగు బయటపడలేదు. ఈ రెండు ఉదాహరణలు చాలు, పండు ఈగ అనే కీటకం పండిస్తున్న రైతుల్ని, కొనుగోలు చేస్తున్న వినియోగదారులను ఎంతలా ఇబ్బంది పెడుతుందో తెలుసుకోవడానికి.

☛ పండు ఈగ.. చూపు ఉద్యానంపై పడింది. పచ్చి, పండు తేడాలేకుండా దొరికిన కాయనల్లా కాటేస్తుంటే కనీస దిగుబడులు రావడంలేదు. దీర్ఘకాల పంటగా ఉన్న మామిడి నుంచి స్వల్పకాలికంగా ఉన్న బొప్పాయి వరకు ఏ పండును పట్టుకున్నా, ఈగ కాటుతో చిల్లుపడుతోంది. లాభాల సంగతేమోగాని..విపత్తును తట్టుకోవడమెలా అంటూ తలలు పట్టుకుంటూ తోటల్ని తొలగించేస్తున్నారు.

చెట్టుకున్న జామ కాయపై ఇలా

బొప్పాయ కాయపై ముసిరి..

డోజర్‌తో జామ తోట నేలమట్టం

## పది సార్లు పరిశీలించుకోవాలి

జిల్లాలోనే అత్యధికంగా మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ఉద్యాన పంటల సాగు జరుగుతోంది. ఒకప్పుడు మామిడి తోటలు అధికంగా ఉండగా, గడిచిన ఏడెనిమిదేళ్లుగా జామ, బొప్పాయి తోటల సాగు పెరిగింది. జామ దిగుబడుల్లో మిశ్రమ ఫలితాలతో రైతులు ఇబ్బందుల్లో ఉండడంతో క్రమేపీ మూడేళ్లుగా తోటల నరికివేతలు మొదలయ్యాయి. లాభాలు బాగున్నాయన్న ఆశతో రైతులు బొప్పాయి సాగుదిశగా పయనిస్తే, రెండేళ్లుగా ఆ పంట పరిస్థితి అంతే. గతేడాది మామిడిని చీడపీడలు సర్వనాశనం చేయగా, తినే కాయని పదిసార్లు పరిశీలించుకోవాల్సి వస్తోంది. ఇన్ని అనర్థాలకు ప్రధాన కారణం పండు ఈగ అనే కీటకం. ప్రస్తుతం ఉద్యాన పంటలను సాగుచేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

## ఫలితం అంతంత మాత్రమే...

సహజంగా జామ, మామిడి, బొప్పాయి కాయలు చిన్న పరిమాణంలో ఉన్న దశలోనే ఈగ కాటేస్తోంది. దాంతో పక్వానికి రాకుండానే పండుగా మారి, లోపల కుళ్లిపోతోంది. గత కొన్నేళ్లుగా కీటకాలు, ఈగల నివారణకు ఉద్యానశాఖ ట్రాప్స్ (ఆకర్షిత బుట్టలు) ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. వాటి కోసం రూ.వేలల్లో ఖర్చు చేసినా, రసాయన మందుల పిచికారీ చేస్తున్నా ఫలితం పూర్తిస్థాయిలో దొరకడంలేదు. రెండు నియోజకవర్గాల పరిధిలో సుమారు 5 వేల ఎకరాల వరకు జామ, బొప్పాయి సాగవగా, నష్టాల బాటలో దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా జామ తోటల్ని తొలగించారు. ఈ ఏడాది బొప్పాయి ధర లేమితో పాటు, కీటకాల ప్రభావంతో దిక్కులు చూడాల్సి వస్తోందని చెబుతున్నారు.

## ట్రాపర్లతో కొంత మేర అదుపులోకి

ఈగలు, కీటకాల నివారణకు ట్రాపర్లతో కొంత వరకు అదుపులోకి వస్తోంది. గడిచిన కొన్నేళ్లుగా ఉద్యాన పంటలపై వాటి దాడి అధికంగానే ఉంది.

- బాలాజీకుమార్, జిల్లా ఉద్యానశాఖాధికారి

# తెలుగు భాష పరిరక్షణకు కోట తోడ్పాటు మరువలేనిది

**అవనిగడ్డ:** విలక్షణ నటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు అసెంబ్లీల్లో తెలుగు భాష పరిరక్షణకు అందించిన తోడ్పాటు ఎనలేనిదని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన కోట శ్రీనివాసరావు సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు భాషను విధిగా బోధించాలని తాను అసెంబ్లీలో అనధికార తీర్మానం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సాధారణంగా అనధికార తీర్మానాలు చర్చకు రావని, అయితే తాను ప్రవేశపెట్టిన ఈ తీర్మానం చర్చకు రావడంతో మరో ఎమ్మెల్యే మద్దతు కోసం తాను కోట శ్రీనివాసరావును కోరిన వెంటనే ఆయన అంగీకరించి చర్చలో పాల్గొన్నారన్నారు.

కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

### కంకిపాడులో విషాద ఛాయలు

**కంకిపాడు:** కోట శ్రీనివాసరావు మరణ వార్తతో కంకిపాడులో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన ఆరోగ్యం సహకరించినంత వరకూ సొంతూరికి వచ్చి వెళుతూనే ఉన్నారంటూ గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామంలో విభేదాలు వద్దని, అభివృద్ధికి ఆటంకంగా మారతాయంటూ కోట తరచూ తనను కలిసేందుకు వచ్చే గ్రామస్థులకు సూచించేవారు. 'ఊరికి ఒకరు మంచి చేస్తే మరొకరు అంతకు మించి చేయడంలో పోటీ పడాలి. అపుడే ఊరు బాగుపడుతుంది.' అంటూ ఆయన చెబుతుండేవారంటూ పలువురు గుర్తుచేసుకున్నారు. కంకిపాడులోని స్థానిక జడ్పీ, ఎంపీపీ పాఠశాలలను తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అభివృద్ధి చేసేందుకు ఆసక్తి చూపించారు. భూరి విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చినా.. కొన్ని ఇబ్బందుల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. * జైఆంధ్ర ఉద్యమంలో భాగంగా కంకిపాడు కూడలిలో ప్రదర్శించిన నాటకాలలో కోట కీలక పాత్ర పోషించారు.

# లక్ష్మణస్వామి సేవలు ఆదర్శనీయం

**మచిలీపట్నం(గొడుగుపేట):** పర్యావరణ పరిరక్షణకు తన వంతు సాయం అందించాలన్న లక్ష్యంతో ప్రతి ఏటా వేల సంఖ్యలో మొక్కలు పంపిణీ చేస్తున్న డా.రాళ్లపల్లి లక్ష్మణ స్వామి సేవలు ఆదర్శనీయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం మచిలీపట్నంలో లక్ష్మణ స్వామి సాయంతో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యంగా ఉంటేనే జీవి మనుగడ సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ కుంచే దుర్గాప్రసాద్(నాని)తదితరులు ప్రసంగించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, ప్రతినిధులు మామిడి ప్రసాద్, కోన వెంకటేశ్వరమ్మ, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి కొత్తగుండు రమేష్ పర్యవేక్షించారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న మంత్రి రవీంద్ర తదితరులు

## ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

### 907 మంది విద్యార్థుల ఎంపిక

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఇందులో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, వికలాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80.. మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

ఆర్కే వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తరగతులు 14 నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులు తమ లగేజీతో వచ్చి రిపోర్ట్ చేసి తరగతులకు హాజరయ్యేలా సిద్ధపడి రావాలన్నారు.

☛ మొదటి దశ తరువాత మిగిలిన ఖాళీలను దృష్టిలో ఉంచుకుని అంతర్గత బదిలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా 384 మందికి లబ్ధి కలిగినట్లు వివరించారు. ఇప్పటి వరకు 4,340 మంది విద్యార్థుల ఎంపిక పూర్తి అయిందని తెలిపారు. ఇంకా 60 సీట్లు మిగిలి ఉండగా ఇందులో ఎన్‌సీసీ కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఈ సీట్ల ఎంపిక ఫలితాలను వచ్చే వారం విడుదల చేస్తామని రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు.

## కమ్మ సేవా సమాఖ్య కార్యక్రమాలు విస్తృతం

**పటమట, న్యూస్‌టుడే:** కమ్మ వారి సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు విస్తృతం చేసేందుకు కమ్మ సామాజికవర్గ మేధావులు, పెద్దలు ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని పటమట ఫన్ టైమ్స్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ కమ్మ వారి సేవా సమాఖ్య రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సభ్యులు హాజరైయ్యారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఐక్యత లేకపోవడం వల్ల ఎక్కువ కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుపడడం లేదని అన్నారు. మండవ రమ్య సంధానకర్తగా వ్యవహరించగా.. సమాఖ్య గౌరవ అధ్యక్షుడు గన్ని భాస్కరరావు సభకు అధ్యక్షత వహించారు.

## ఈదుతూ.. సేద తీరుతూ!

కరకట్ట వద్ద కృష్ణానదిలో ఈత కొడుతున్న నగరవాసులు

రోజంతా చదువులు, ఉద్యోగాలు, వ్యాపార కార్యకలాపాలు, వివిధ పనులు నిమిత్తం బిజీ బిజీగా కాలం గడిపే విజయవాడ నగర వాసులు, విద్యార్థులు వారాంతం ఆదివారం వచ్చిందంటే చాలు కృష్ణమ్మ ఒడిలో వాలిపోతున్నారు. కుటుంబాలతో సహా తెల్లవారుజామున 5 గంటలకే ప్రకాశం బ్యారేజీ కరకట్ట వద్దకు చేరుకుని కృష్ణా నదిలో ఈత కొడుతూ సేద తీరుతున్నారు. నిత్యం వచ్చి సాధన చేసే వారితో పాటు వారాంతంలో వచ్చే వారు కూడా తోడవడంతో నదీ తీరమంతా సందడిగా మారుతోంది. - ఈనాడు, అమరావతి

## వయసు 78.. డిగ్రీలు 37

### జమీగొల్వేపల్లి వాసి ఘనత

**పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే:** కృష్ణా జిల్లా పామర్రు మండలం జమీగొల్వేపల్లికి చెందిన కొత్తిమిల్లి పుండరీకాక్షయ్య కుమారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రొఫెసర్ కేబీఆర్ శేషాద్రిరావు 37 డిగ్రీలు సాధించారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి, విజయవాడ పోరంకిలో గల విజ్ఞాన్ భారత్ హైస్కూలు అధినేతగా ఉన్న ఆయన.. ప్రస్తుతం దాదాపు తన 78 ఏళ్ల వయసులో ఇప్పటికే 36 డిగ్రీలు సాధించారు. తాజాగా అమెరికాలోని ఫ్లోరిడాలో కేడిజ్ యూనివర్సిటీ నుంచి 'హెల్త్ కేర్ ఎడ్యుకేషన్ అండ్ కౌన్సెలింగ్' అనే ప్రోగ్రామ్‌లో 37వ డిగ్రీని ఈ నెల 5న దిల్లీలో అందుకున్నారు. ఈ సందర్భంగా స్వగ్రామమైన జమీగొల్వేపల్లి వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆదివారం శేషాద్రిరావును అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గ్రామానికి పేరు తేవాలని ఆకాంక్షిస్తున్నారు.

అతిథి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న శేషాద్రిరావు

# 'రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే సహించం'

**పెడన, న్యూస్‌టుడే :** వైకాపా నేతలు ప్రజల్ని రెచ్చగొట్టే రీతిలో వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక 12వ వార్డులో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని విలేకరులతో మాట్లాడారు. పామర్రు వైకాపా కార్యకర్తల సమావేశంలో పేర్ని నాని కార్యకర్తల్ని రెచ్చగొట్టే రీతిలో చేసిన వ్యాఖ్యలు సమాజంలో హింసను ప్రేరేపించే రీతిలో ఉన్నాయన్నారు. దీనిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే ఆర్‌పేట పోలీసు స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైందని, త్వరలో విచారణ ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో వైకాపా ఘోర పరాజయం పొందినప్పటికీ పేర్నిలో పరివర్తన రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కౌన్సిలర్ మట్టా శివపావనీ, చందన నారాయణరావు, యక్కల శ్యామలయ్య, అబ్దుల్ ఖయ్యూం, మట్టా నాని, గుల్లంకి మాధవరావు, యర్రా రాజా, యర్రపోతు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్. పక్కన పార్టీ నేతలు

**చిన్నాపురం(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే :** చీకట్లో కన్ను కొట్టండి..వేసేయండి అని మాట్లాడుతున్న నేతలు పదవి పోయి, మతిస్థిమితం లేక మాట్లాడుతున్న మాటలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ బండి రామకృష్ణ ఎద్దేవా చేశారు. చిన్నాపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడారు. గొడవలతో సుఖపడిన వారు లేరని, ఒకరు ప్రాణం నాది కాదనుకుంటే ఎవరినైనా ఏమైనా చేసేయగలరని హెచ్చరించారు. రాజకీయ నాయకుని నోటి వెంట రాకూడని మాటలు మాట్లాడటం తగదని హితవు పలికారు.

## కొండలమ్మతల్లికి నీరాజనం

**వేమవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆదివారం బారులు తీరారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 20 వేల మంది దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు పాలపొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మొక్కులు తీర్చుకుని బంధుమిత్రులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో ఎ.కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాలపొంగళ్లు వండుతున్న మహిళలు

## రోడ్డు ప్రమాదంలో బస్సు క్లీనర్ మృతి

**మంటాడ (పమిడిముక్కల), న్యూస్‌టుడే:** విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో మంటాడ వద్ద ఫ్లైఓవర్‌పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మొవ్వ మండలం కారకంపాడుకు చెందిన అంగడాల ఓంకారేశ్వరరావు(45) మరణించారు. ప్రస్తుతం ఆయన కడవకొల్లులో ఉంటూ ఉయ్యూరులోని ఓ ప్రైవేటు స్కూలు బస్సు క్లీనరుగా పనిచేస్తున్నారు. కారకంపాడు నుంచి ఉయ్యూరుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో ఆతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని అంబులెన్సులో ఉయ్యూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మృతుడు ఓంకారేశ్వరరావు

## కుమార్తెను హాస్టల్‌లో చేర్పించి వస్తుండగా ప్రమాదం

### ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు

**గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే:** ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి గాయాలైన సంఘటన చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై గన్నవరం పట్టణ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా గుబ్బలపల్లెం గ్రామానికి చెందిన టి.అనురాధ జిబీఎల్ ఇంజినీరింగ్ పూర్తిచేసింది. ఆమెకు హెచ్‌సీఎల్ సంస్థలో ఉద్యోగం రావడంతో గన్నవరం పట్టణ శివారులోని ఓ హాస్టల్‌లో చేర్పించేందుకు తల్లిదండ్రులైన సాల్వాచారి, లక్ష్మీకళ ఆదివారం గన్నవరం చేరుకున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని ఓ హాస్టల్‌లో కుమార్తెను చేర్పించారు. అనంతరం తల్లిదండ్రులను బస్సు ఎక్కించే నిమిత్తం అనురాధ వారితో కలిసి స్థానిక హైవే దాటే క్రమంలో విజయవాడ నుంచి హనుమాన్ జంక్షన్ వైపునకు అతివేగంతో వచ్చిన ద్విచక్ర వాహనం వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. సాల్వాచారి, అనురాధకు తలకు.. లక్ష్మీకళ చేయి, కాలుకి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను చిన్నఆవుటపల్లి డా.పిన్నమనేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణమైన యువకులను అదుపులోకి తీసుకుని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## బాలుడి అదృశ్యం

**తోట్లవల్లూరు:** బాలుడు అదృశ్యమైన ఘటన మండలంలోని రొయ్యూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పామర్రు మండలం నిమ్మకూరుకు చెందిన పడమట దుర్గా శ్రీనివాసరావు, సరోజినీల కుమారుడు నిదీష్(10), కుమార్తె రూపనీరెహ(8)లను శనివారం మధ్యాహ్నం మేనమామ వీరంకి బాలకృష్ణ రొయ్యూరు తీసుకు వచ్చారు. ఇద్దరు చిన్నారులు ఆడుకుంటుండగా మేనమామ పానీపూరి తీసుకు వస్తానని చెప్పి బయటకు వెళ్లారు. ఈలోగా రూపనీరెహ ఇంటికెళ్లిపోయింది. తిరిగి మేనమామ సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా బాలుడు కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లల్లో ఆరా తీయగా బాలుడు ఆచూకీ దొరకలేదు. తండ్రి శ్రీనివాసరావు ఆదివారం ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిదీష్ కోసం రొయ్యూరు ప్రాంతంలో సీసీ ఫుటేజ్‌లు కూడా పరిశీలించారు. ఎవ్వరైనా అపహరించారా? లేక పొరపాటున ఎదురుగా ఉన్న కేఈబీ కెనాల్ వైపు వెళ్లి అదృశ్యమయ్యాడా? అన్న కోణంలో దర్యాప్తు చేపట్టామని ఎస్సై అవినాష్ తెలిపారు.



నిదీష్

**బ్రాయిలర్ ధరలు** (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ -173, చికెన్ స్కిన్‌లెస్ - 196.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 103, 111, 122 చికెన్ విత్ స్కిన్ - 196 చికెన్ స్కిన్‌లెస్ - 206.

**నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర**

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

# పట్టపగలు వృద్ధురాలి హత్య

మంతెనలో ఘటన

**కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే:** ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు పట్టపగలు హత్యకు గురైన సంఘటన కంకిపాడు మండలం మంతెన గ్రామంలో సంచలనం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తిరుమల స్వర్ణకుమారి(70) గతంలో విజయా డెయిరీ డైరెక్టర్‌గా ఏడేళ్లు పనిచేశారు. ప్రస్తుతం గ్రామంలోని పాల కేంద్రం అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా ఉన్నారు. ఈమెకు భర్త వెంకటకోటేశ్వరరావు, ముగ్గురు పిల్లలున్నారు. పిల్లలకు వివాహాలు కావడంతో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. భార్యాభర్తలిద్దరే మంతెన గ్రామంలో ఉంటున్నారు. గత 15 రోజులుగా ఇంటి మరమ్మతులు చేయిస్తున్నారు. శనివారం నుంచి పనివారు రాకపోతుండటంతో భర్త వెంకట కోటేశ్వరరావు పొలం పనులు చూసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో పొలానికి వెళ్లి మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో నేరుగా లోపలికి వెళ్లి చూడగా భార్య స్వర్ణకుమారి వంటగదిలో నెత్తుటి మడుగులో చలనం లేకుండా పడిఉంది. దీంతో ఆందోళన చెందిన అతడు స్థానికంగా ఉన్న బంధువులు, స్నేహితులకు సమాచారం ఇచ్చి, విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, కంకిపాడు సీఐ మురళీకృష్ణ, ఎస్సైలు సందీప్, తాతాచార్యులు, సురేష్ కుమార్‌లు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్, ఆధారాల సేకరణ బృందాలను రప్పించారు. చుట్టుపక్కల వారిని విచారించారు. అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేశారు. మరోవైపు స్వర్ణకుమారి అందరితో కలివిడిగా ఉంటారని గ్రామస్థులు చెబుతున్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా సలహాలు, సూచనలు చేయడంతో పాటు తన వంతు సాయం చేసి ఆదుకుంటారని తెలిపారు.

స్వర్ణకుమారి (పాతచిత్రం)

**తెలిసిన వారి పనేనా! :** స్వర్ణకుమారి కుటుంబంతో పరిచయమున్న వ్యక్తులే హత్యకు కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రధానంగా ఆమె ఒంటరిగా ఉందనే విషయం తెలిసే నిందితులు ఇంటికి వెళ్లి ఉంటారని భావిస్తున్నారు. కొన్నిరోజులుగా ఇంటి మరమ్మతులు చేయిస్తున్న నేపథ్యంలో ఎవరైనా అదును చూసి హత్యకు పాల్పడ్డారా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

**నగదు, బంగారం చోరీ కాలేదు:** హత్యకు గురైన స్వర్ణకుమారి ఇంట్లో ఎటువంటి నగదు, బంగారం చోరీ కాలేదని, ఆమె మెడలోని రెండున్నర కాసుల బంగారు గొలుసు మాత్రం కనిపించడం లేదని భర్త వెంకట కోటేశ్వరరావు పోలీసులకు తెలిపారు. స్వర్ణకుమారి హత్య సమాచారం తెలుసుకున్న పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసులకు సూచించారు.

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

# జైల్లో పరిచయం.. కలిసే దొంగతనం

**మైలవరం, న్యూస్‌టుడే:** దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారు...వేర్వేరు కేసుల్లో జైలుకెళ్లి ఒకరికొకరు పరిచయమయ్యారు. ఒంటరిగా ఎందుకనుకుని తోడు దొంగలుగా మారారు. పొలంలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాల (సీసీ కెమెరాలు) సహకారంతో ఇద్దరినీ పట్టుకుని మళ్లీ జైలుకు పంపించారు. రెడ్డిగూడెం మండలం కుదపలో చోటుచేసుకున్న దొంగతనం కేసు వివరాలను ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ దాడి చంద్రశేఖర్ వివరించారు. ఈ నెల 4వ తేదీన రెడ్డిగూడెం మండలం కుదపలో మరీదు జమలమ్మ ఒంటరిగా పొలంలో గేదెలు మేపుతోంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు ఆమె వద్దకు వచ్చి, మాటలతో ఏమార్చి ఠక్కున మెడలో బంగారు నానుతాడును లాక్కుని, అప్పటికే రహదారిపై ద్విచక్ర వాహనంతో సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా రెండు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించాయి. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సాయంతో నిందితులు, పాత నేరస్థులైన కొండపల్లి ముత్యాలచెరువు ప్రాంతానికి చెందిన నామాల నాగరాజు, కృష్ణాజిల్లా గుడివాడ చెంచుకాలనీకి చెందిన మోటపర్తి నాగరాజులుగా గుర్తించారు. శనివారం సాయంత్రం మండలంలోని గణపవరం సమీపంలో గల పెట్రోల్ బంకు వద్ద వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వివరించారు. వారిద్దరిపై ఇప్పటికే స్టేషన్ల పరిధిలో దొంగతనాల కేసులు నమోదవగా, నామాల నాగరాజుపై కేడీ షీటు ఉంది. రిమాండ్ ఖైదిగా ఉన్న అతను ఈ ఏడాది మే 8వ తేదీన విశాఖపట్నం కేజీహెచ్ నుంచి పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. మోటపర్తి నాగరాజుపై గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైంది. ఇద్దరికీ గతంలో రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఏర్పడిన పరిచయంతో కొన్నాళ్లుగా కలిసి దొంగతనాలు చేస్తున్నారని వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.2.45 లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేసి, కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు వివరించారు. కేసు దర్యాప్తులో సమర్థవంతంగా వ్యవహరించిన రెడ్డిగూడెం ఎస్సై మోహనరావు, సిబ్బందిని కమిషనర్, డీసీపీ, ఏసీపీలు అభినందించినట్లు తెలిపారు.

నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ చంద్రశేఖర్, రెడ్డిగూడెం ఎస్సై మోహనరావు


91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
| --- | --- |
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర: 81422 92071.

BUSINESS OFFER

Investors- Wanted 2-6Cr for Vijayawada's Approved Apartment Projects. Secured ROI, Equity Arranged. ✆ 9848419818

TENDER

ఇ-కోట్ టెండర్ సేల్: 1050 KVA, జెన్‌సెట్ 2 నెం.లు, తనిఖీ 16 & 17 ఉ. 9.00 గం. నుండి సా. 5.00 గం. వరకు. ITC లిమిటెడ్, ABD అనపర్తి- 533342, తూ.గో. జిల్లా. ఇ-కోట్ టెండరు తేది: 18.07.25, టెండరు ఫారం ధర రూ. 500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై- 14 ద్వారా మొబైల్: 9840731925, www.welcomeauctioneers.com.

Book your 5 lines Classified Colour Rs.1200/- 3Ads Package Rs.3250/- 5 lines Classified B/W Rs.1025/- 3Ads Package Rs.2575/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం PH: 98496 97616

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. విజయవాడః శ్రీశరణం లాడ్జి పాతబస్టాండ్ ఎదురుగా, బందర్ రోడ్, ప్రతీనెల 2, 16 తేదీల్లో మందులు.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA, వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 82474 49042, 96404 96677.

REAL ESTATE

FLAT FOR SALE

RAMAVARAPPADU

రామవరప్పాడు యాదవుల బజార్ లక్ష్మీ నిలయం అపార్ట్‌మెంట్ 2nd ఫ్లోర్‌లో 2 BHK ఫ్లాట్ 27 లక్షలకే అమ్మకమునకు కలదు. సంప్ర: 83746 57677.

GENERAL

2 B/R ఫ్లాట్ నెం: 202, 2వ ఫ్లోర్, కప్‌బోర్డ్స్, కారు పార్కింగ్‌లతో పోరంకి రాఘవ ఎస్టేట్స్ , ప్రకృతి విహార్, నీలగిరి బ్లాక్ నందు అమ్మకమునకు కలదు. ✆ 98493 29322.

LAND FOR SALE

రాజధాని అమరావతికి 90 Km లోపు వినుకొండలో 1 + 2 బెనిఫిట్స్‌తో రిసార్ట్స్ డెవలప్‌మెంట్స్‌తో చ॥గ॥ 800/- & ఎకరం 38 లక్షలు లోపు కొని లబ్ధి పొందండి. Ph: 9390060136.

PLOT FOR SALE

VJA, అమరావతి రాజధాని, కంచికచర్ల, ఔటర్ రింగ్‌రోడ్ దగ్గర DTCP & CRDA ఇళ్ళ మధ్య ప్లాట్స్ చ॥గ॥ 1,975/- నుండి 6,900/-. సంప్ర: 93985 76997.

1+1 బంపర్ ఆఫర్! 50 గజాలు కొంటే 50 గ॥లు ఉచితం. 50 గజాలు కేవలం 3 లక్షల 99 వేలు మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 91609 47999, 98666 47033.

TO LET

COMMERCIAL

విజయవాడ జమ్మిచెట్టు సెంటర్ మొగల్రాజపురం పెట్రోల్ బంక్ ప్రక్కన గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్స్ 2500 Sft (ఒక్కొక్క ఫ్లోర్) అద్దెకు ఇవ్వబడును. ✆ 98851 03855, 92466 61529.

JOBS

ప్రైవేటు బ్యాంకులలోకి 10th, ఇంటర్ all (డిగ్రీ, B.Tech, Dip. & ITI) కావలెను. Sal: 18K-45K Age: 35 లోపు. స్పాట్ జాయిన్ ✆ 9052593579.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

# మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

## 16న మెగా జాబ్ మేళా

**పెడన గ్రామీణం, న్యూస్‌టుడే :** మచిలీపట్నం ఏజే కళాశాలలో ఈ నెల 16న ఉదయం 9 గంటలకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా మేనేజర్ నరేష్ తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ చదువుకున్న అభ్యర్థులు ఇందులో పాల్గొన వచ్చని చెప్పారు. అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్, పాన్‌కార్డు నకలుతో దీనికి హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 96666 54641, 96767 08041 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

◆ నగరంలోని బస్టాండ్ కూడలి నుంచి జిల్లా కోర్టు సెంటర్‌కు వెళ్లే దారిలో చెత్తను తొలగించడం లేదని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. దీనిపై స్పందించిన అధికారులు సిబ్బందిని పంపి చెత్త తొలగింపజేశారు.

◆ బందరులోని ఖొజ్జిల్లిపేటలో రోడ్డు పక్కన వ్యర్థాలు మేట వేసుకుపోవడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను మేమున్నాం..మీకు తోడుగా ద్వారా అధికారులకు తెలుపగా సిబ్బందిని పంపి చెత్తను తీయించారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

? నందమూరు- గొడపాలెం ప్రధాన రహదారి నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. సగం వేసి మధ్యలో నిలిపేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు** ✔ రహదారి నిర్మాణం గురించి ఉన్నతాధికారులతో మాట్లాడతాం. త్వరలో పూర్తి అయ్యే విధంగా చూస్తాం. **- వై.ధర్మయ్య, పీఆర్ ఏఈ, పెడన మండలం** – న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

## ఉచిత కంటి వైద్య శిబిరం

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే :** నగరంలోని దేశాయిపేటలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గోల్డెన్ క్రాస్ చర్చి నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణుడు భానుమూర్తి పాల్గొని పలువురికి కంటి పరీక్షలు చేశారు. పలు ప్రాంతాలకు చెందిన 200 మందికి పరీక్షలు నిర్వహించగా 30 మందికి శస్త్రచికిత్సలు అవసరమవుతాయని గుర్తించారు. వారిని సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు డా. భానుమూర్తి తెలిపారు. శిబిరం నిర్వాహకుడు శ్యామ్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## ధర వరలు

టమాట 33, వంగ 28, బెండ 20, పచ్చిమిర్చి 65, కాకర 42, క్యాబేజీ 22, క్యారెట్ 44, దొండ 29, బంగాళదుంప 28, ఉల్లిపాయలు 26, గోరుచిక్కుడు 36, దోస 20, సొర 10/8, అరటికాయ 8/7, చిక్కుళ్లు 44, బీర 32, చామదుంప 30, మునగ 07/08, కంద 60, బీట్‌రూట్ 30, కీరదోస 50, బీన్స్ 90, క్యాప్సికం 85, అలసందలు 38, చిలకడదుంప 36, కొత్తిమీర 17/8, పుదీనా 15/5 సోమవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. **ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఎస్టేట్ అధికారి బలి చక్రవర్తిని 91823 61295లో సంప్రదించవచ్చు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)**

## సినిమాలు

**రేవతీ :** ఓ భామ అయ్యోరామ
**మినీ రేవతి :** కుబేర
**సిరికృష్ణ:** సూపర్ మ్యాన్
**సిరివెంకట్ :** ది 100
-మచిలీపట్నం (గొడుగుపేట)

## లస్కర్లు లేక.. సాగు నీరందక..

**మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే**

### ఇబ్బందులు పడుతున్న రైతులు

కాల్వల ద్వారా రైతుల అవసరాలకు సరిపడ సాగునీరు విడుదల చేస్తున్నా..శివారు ప్రాంతాలకు నీరు అందక పలువురు అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా కాల్వలపై పర్యవేక్షించే లస్కర్లు లేకపోవడంతో నీటి సరఫరా నిర్వహణ, నియంత్రణ సమస్యగా మారింది. ఎగువన నీరు విడుదలైన పలు చోట్ల వృథాగా పోవడం, గండ్లు పడటం తదితర సమస్యలు ఉన్నాయి. బందరు, పెడన నియోజకవర్గాల్లోని కాల్వలపై సరిపడ లస్కర్లు లేక రైతులు సమస్యలతో సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

### సమస్యల తిష్ఠ

బందరు, పెడన నియోజకవర్గాల్లో 88 వేల ఎకరాలకుపైగా సాగు విస్తీర్ణం ఉంది. వీటిలో ఎక్కువ బందరు కాలువ, రామరాజుపాలెం ఛానల్, బంటుమిల్లి కాల్వలపైనే ఆధార పడి ఉన్నాయి. గుడ్లవల్లేరు లాకుల వద్ద నుంచి పలు అనుబంధ కాలువల ద్వారా ఆయా మండలాలకు నీరు సరఫరా అవుతోంది. కానీ వీటి వద్ద గేట్లు, డ్రాప్‌లు చాలా చోట్ల తుప్పు పట్టి పాడైపోయాయి. ఆయా కాలువల పొడవునా మధ్యలో ఆకుమర్రు, కమలాపురం, బల్లిపర్రు, గురివింద పల్లి ఇలా పలు ప్రాంతాల్లో ఉన్న లాకుల వద్ద అనేక సమస్యలు తిష్ఠ వేశాయి. ఈ ప్రాంతాల్లో సూపర్ వైజర్లు ఉన్నా కలాసీలు మాత్రం ఒకరిద్దరే ఉన్నారు. దీంతో కొన్నేళ్లుగా కాలువలపై పర్యవేక్షణ లేకుండా పోయింది.

### ఇప్పటికైనా నియమించేనా..?

కాల్వల క్షేత్ర స్థాయి పర్యవేక్షణలో లస్కర్ల పాత్ర కీలకం. ఈ పోస్టులు దశాబ్దాలుగా ఖాళీగా ఉన్నాయి. దీంతో తెదేపా హయాంలో పొరుగు సేవల విధానంలో సిబ్బందిని తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఏడాదిలో తొమ్మిది నెలల పాటు కొనసాగించి, రోజుకు రూ.350 చొప్పున వేతనం అందించారు. వీరి నియామకానికి సంబంధించి ప్రతి ఏటా జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు చేసే వారు. కానీ వైకాపా ప్రభుత్వం వచ్చాక ఈ ప్రక్రియ నిలిపేశారు. దీంతో డ్రాప్‌ల వద్ద షట్టర్లకు గ్రీజు పెట్టేవారు లేక అవి తుప్పుపట్టి పోతున్నాయి. కాల్వలకు గండ్లు పడినా సకాలంలో గుర్తించక పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఇలా కాల్వలను పర్యవేక్షిస్తూ సాగుకు సాయంగా నిలిచే లస్కర్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి గతంలో మాదిరిగా తాత్కాలిక ప్రాతిపదికన లస్కర్‌లను నియమించేలా చర్యలు తీసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

గూడూరు మండలం ఆకుమర్రు లాకుల వద్ద తుప్పుపట్టిన షట్టర్లు

## నిధులు కేటాయించి.. పార్కును అభివృద్ధి చేసి

నగరంలోని బ్రహ్మపురం ఉద్యానవనాన్ని గతంలో అభివృద్ధి చేసినా తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దాన్ని పట్టించుకోక పోవడంతో అధ్వానంగా తయారైంది. ప్రస్తుత కూటమి సర్కారు పార్కుల అభివృద్ధిలో భాగంగా దీనికి రూ.20 లక్షలు కేటాయించగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొత్తగా గేట్లు ఏర్పాటు చేయడంతో పాటు వ్యాయామశాల, చిన్నారులకు ఆట వస్తువులు ఇలా అనేక వసతులు కల్పిస్తున్నారు. ఆయా పనులు త్వరితగతిన పూర్తి చేసి పార్కును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.
**- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

## రోటరీ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే :** రోటరీ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని డీఎంహెచ్‌వో డా. శర్మిష్ఠ అన్నారు. నగరంలోని రోటరీ క్లబ్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం క్లబ్ మచిలీపట్నం శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో క్లబ్ ముందుంటుందన్నారు. ప్రధానంగా వైద్య, విద్య రంగాల్లో అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. బందరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఆశాలత మాట్లాడుతూ క్లబ్ పోలియో రహిత సమాజమే లక్ష్యంగా పని చేస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నదన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా లింగం మోజెస్, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్ కిరణ్ ప్రమాణ స్వీకారం చేశారు. విస్తృత సేవలు అందిస్తున్న సభ్యులను సత్కరించారు. క్లబ్ వైద్య విభాగ డైరెక్టర్ అనుపమ ముఖర్జీ, ప్రతినిధులు డా.బి ధన్వంతరి ఆచార్య, డా.ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ

## 'పేదల బియ్యాన్ని మాయం చేసిన ఘనుడు పేర్ని'

**మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే :** మాజీ మంత్రి పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకోవాలని తెదేపా నాయకులు అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌ఖాజా, కుంచే నాని, కాశీ విశ్వనాథం మాట్లాడారు. పేర్ని కుటుంబానికి సంబంధించి మూడు తరాల రాజకీయ జీవితంలో ఎవరికీ పట్టెడన్నం పెట్టకపోగా అధికారాన్ని అడ్డు పెట్టుకొని పేదలకు చెందాల్సిన బియ్యాన్ని మాయం చేసిన నానికి రాజకీయాల్లో కొనసాగే నైతికత లేదన్నారు. గత ఎన్నికల్లో పేర్ని, ఆయన కుమారుడు కిట్టుకు నియోజకవర్గ ప్రజలు చెంపదెబ్బ కొట్టినట్టు తీర్పు ఇచ్చినా వారిలో ఏ మాత్రం పరివర్తన రాలేదన్నారు. వైకాపా హయాంలో తమపై చేసిన నిర్బంధాలు, కేసులు మర్చిపోలేదని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని కూటమి ప్రభుత్వం సహించదన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

## సేంద్రియ కూరగాయలతో ప్రయోజనాలు

**బంటుమిల్లి, న్యూస్‌టుడే :** సేంద్రియ పద్ధతిలో కూరగాయల పెంపకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి భాస్కర్‌రావు అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం మొక్కలు, విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని అబ్దుల్ కలాం హెల్త్ ఫౌండేషన్, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. చండిక గంగాజలరావు, జనార్దనరావు, యర్ల శ్యాంబాబు, పట్లం వీర వెంకటేశ్వరరావు, రాయుడు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి భాస్కర్‌రావు తదితరులు

## రాజాని పరామర్శించిన కొల్లు

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే :** తెదేపా క్షత్రియ సాధికార రాష్ట్ర చైర్మన్, ఏపీ క్షత్రియ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అక్కుమహంతి రాజా తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం మంత్రి కొల్లు రవీంద్ర రాజాతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపిచంద్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ కుంచే దుర్గాప్రసాద్ తదితరులు లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర తదితరులు

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే :** నగరంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజుపేట కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి సువాసినులు ఆషాఢ సారె సమర్పించి పూజా క్రతువులు జరిపించారు. నిజాంపేట నూతి వీరయ్య ఆది వనవలమ్మ తదితర ఆలయాల్లో ఆషాఢ మాసం సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.

**గూడూరు, న్యూస్‌టుడే :** మండల పరిధి కంకటావలోని గంగానమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి పూజ క్రతువులు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

**పెడన, న్యూస్‌టుడే :** పెడన మండలం దావోజీపాలెంలోని అమలేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యుడు అంకెం శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కనకదుర్గ అమ్మవారు

సారె తీసుకొస్తున్న సువాసినులు

శాకాంబరిగా గంగానమ్మ

అమలేశ్వరీ దేవి

## ఆరంభించారు.. ఎక్కడికక్కడ వదిలేశారు

**పెడన, న్యూస్‌టుడే**

పెడనలోని నాలుగు పంచాయతీల్లో 2022లో చేపట్టిన ప్రభుత్వ భవనాలు నేటికీ అసంపూర్తిగా మిగిలాయి. మడక, అచ్చయ్యవారిపాలెం, నందమూరు, చెన్నూరు పంచాయతీల్లో మాజీ మంత్రి జోగి రమేశ్ అట్టహాసంగా శంకుస్థాపనలు చేసి ఆయా పనులను ఆరంభించారు. వంద శాతం జాతీయ ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులు ఆ తర్వాత పలు దశల్లో నిలిచాయి. గుత్తేదారులు బిల్లులు చేయించుకొని ఎక్కడికక్కడ వదిలేసి వెళ్లారు. మడకలో రూ.85.04 లక్షలతో చేపట్టిన సచివాలయం, రైతు సేవా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లు స్లాబు దశలో ఆగాయి. అచ్చయ్యవారిపాలెంలోనూ ఈ మూడు భవనాల పరిస్థితి ఇలానే ఉంది. నందమూరులో చేపట్టిన సచివాలయం, ఆర్ఎస్‌కేలు నిలిచిపోయాయి. చెన్నూరులో రూ.43.60 లక్షలతో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు.

మడకలో అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

### జూద కేంద్రాలుగా మారి..

మడకలో 216 జాతీయ రహదారి పక్కగా చేపట్టిన భవన నిర్మాణాలు స్లాబు పూర్తయి నిలిచిపోయాయి. ఈ మూడింటిని కొంతమంది వ్యక్తులు జూద, మద్యం కేంద్రాలుగా మార్చేశారు. ఈ నేపథ్యంలో గతేడాది జూదంలో ఘర్షణలు చోటు చేసుకొని ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్ హత్యకు దారి తీసింది. ఇక మిగిలిన అసంపూర్తి భవనాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటిని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### పనులు పూర్తి చేయిస్తాం

మడకలోని భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. చెన్నూరులో దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. మిగిలిన రెండు పంచాయతీల్లో పూర్తి చేయించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాం. గత ప్రభుత్వంలో పనులు చేపట్టిన గుత్తేదారులకు బిల్లులు బకాయి లేకుండా చెల్లించాం. తాజాగా కొత్త కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నాం.
**- ధర్మయ్య, మండల పరిషత్తు ఏఈ**

## అధ్వానం.. అస్తవ్యస్తం

బందర్‌లోని వర్రేగూడెం పట్టణ ఆరోగ్య కేంద్రం సమీపంలోని అంతర్గత డ్రెయిన్ పూడిపోవడంతో పాటు దాని పొడవునా పిచ్చిమొక్కలు మొలిచాయి. డోజర్‌తో శుభ్రం చేయాలని సచివాలయ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందారు. రాత్రిపూట దోమలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

## మురుగు పారే దారేది?

నగరంలోని వివిధ డ్రెయిన్లలో ఎగువ నుంచి వస్తున్న వ్యర్థాలు కల్వర్టుల వద్ద మేట వేసుకుపోతున్నాయి. వాటిని తొలగించక పోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. రైతుబజారు ఎదురు ప్రాంతంలో గత కొన్ని రోజులుగా ఇలాగే ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

## ట్రిపుల్ ఐటీకి ఎంపిక

**పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే :** పట్టణ బీజీకే జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఎన్.సుబ్బలక్ష్మి ఒంగోలు, వరదా పూజిత నాగశ్రీ నూజివీడుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని లంకా ఇందిర తెలిపారు. ఈ మేరకు పాఠశాల గైడ్ టీచర్లు సుమయఖాతున్, ఎన్. వీరకుమారి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది బాలికల్ని అభినందించారు. మొదటి విడతలో ఈ బడి నుంచి బి.శరణ్య ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది.

ఎన్.సుబ్బలక్ష్మి

పూజిత నాగశ్రీ

## నిత్యాన్నదాన పథకానికి వితరణ

**మోపిదేవి, న్యూస్‌టుడే:** విజయవాడ వాస్తవ్యులు బి.రాశిహర్షణి.. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం రూ.50,116 వితరణగా అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావుకు ఈ మొత్తం అందించారు. ఆమెకు స్వామి దర్శనం, వేద పండితుల ఆశీర్వచనం, శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి చిత్రపటం అందించారు.

## ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధికి కృషి

**చిన్నాపురం(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే :** వాడపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా దారపురెడ్డి వీరాంజనేయ ప్రసాద్(చంటిబాబు) ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చిన్నాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో జనసేన మచిలీపట్నం ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కర్షకమిత్ర ద్వారా అన్నదాతలకు రుణాలను సులభతరంగా మంజూరు చేయాలని కోరారు. కూటమి నాయకులు కుంచె నాని, కాగిత వెంకటేశ్వరరావు, గడ్డం రాజు, లంకిశెట్టి బాలాజీ, కాటం మధుసూదనరావు, గళ్లా తిమోతి, మాదివాడ రాము, శాయన శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న వీరాంజనేయ ప్రసాద్

## నూతన కార్యవర్గం ఎన్నిక

**పెడన, న్యూస్‌టుడే :** మానవతా స్వచ్ఛంద సంస్థ పెడన శాఖ అధ్యక్షుడిగా పేరిశెట్టి నాగరవి ఎంపికయ్యారు. స్థానిక విశ్వభారతి హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా కాగిత సాంబశివరావు, కోశాధికారిగా కొట్టు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ బాబు తదితరులను ఎంపిక చేశారు. సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమన్వయ కమిటీ ఛైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, ముదిగొండ వీరభద్ర శాస్త్రి, అనుమకొండ గౌరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమితోనే సంక్షేమం సాధ్యం

**లక్ష్మీపురం (కృత్తివెన్ను), న్యూస్‌టుడే :** లక్ష్మీపురం పంచాయతీలోని కృష్ణానగర్, ఎస్సీవాడ, లక్ష్మీపురం గ్రామాల్లో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు, ఏఎంసీ ఛైర్మన్ ఒడుగు తులసీరావు, గ్రామ అధ్యక్షుడు నాగభూషణం, శీతాల తాతాజీ, రావూరి తాతాజీ, చింతారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతున్న నాయకులు

## విస్తృతంగా సేవలు అందించండి

**మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే :** స్థానిక గీతామందిరంలో మచిలీపట్నం ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో సంఘ జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. సంఘం ద్వారా విస్తృతంగా సామాజిక సేవలు నిర్వహించాలని సూచించారు. సంఘ అధ్యక్షుడు మామిడి దుష్యంత్ కుమార్, నాయకులు వెచ్చా మల్లికార్జున గుప్తా, వేముల కృష్ణ, శ్రీనివాస్, మానేపల్లి చిన్నా, పద్మనాభుని శేఖర్ పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తూ..

## జడ్పీ ఛైర్‌పర్సన్‌కు పరామర్శ

**పెడన, న్యూస్‌టుడే :** గుడివాడలో శనివారం కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త రాము వాహనంపై దాడి చేసిన నేపథ్యంలో వైకాపా స్పందించింది. ఈ మేరకు ఆ పార్టీ నేతలు పలువురు ఆదివారం పెడన మండలం కృష్ణాపురంలోని ఆమె నివాసానికి వచ్చి సంఘటనకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శాసన మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు, తలశిల రఘురాం, తానేటి వనిత, పేర్ని నాని, సింహాద్రి రమేశ్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న శాసన మండలి ఛైర్మన్ మోషేన్ రాజు

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే :** జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక గుడివాడలో నిర్వహించిన పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్నప్పుడు ఆమె కారుపై దాడికి పాల్పడటమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని వైకాపా జడ్పీటీసీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణ, వేముల సురేష్ రంగబాబు, మైలా రత్నకుమారి, బాకీబాబు, వెంకటరమణ తదితరులు కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్లకు గాయాలు

**పెడన, న్యూస్‌టుడే :** 216 జాతీయ రహదారిపై మండలంలోని బల్లిపర్రు వద్ద ఆదివారం ఎదురెదురుగా వస్తున్న లారీలు ఢీకొన్న సంఘటనలో ఇరువురు డ్రైవర్లకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో అమలాపురం మండలం నడుపూడి గ్రామానికి చెందిన ఐకర్ వ్యాన్ డ్రైవర్ భైరిశెట్టి నాగేశ్వరరావు(45), ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం [illegible] గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రామిశెట్టి రామకృష్ణ(44)కు తీవ్ర గాయాలు కాగా మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు చెప్పారు.

ప్రమాద స్థలంలో లారీలు

## వంతుల వారీగా సాగునీటి సరఫరా

**పెడన, న్యూస్‌టుడే :** బందరు, పెడన నియోజకవర్గాల్లో 20 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే రామరాజుపాలెం బ్రాంచి కాలువ పరిధిలోని రైతులకు వంతుల వారీగా నీరు అందించేందుకు ఇరిగేషన్ అధికారులు నిర్ణయించారు. బందరు మండలంలో కాలువ చివరి గ్రామం కానూరు రైతులతో కేసీ డివిజన్ ఇరిగేషన్ ఈఈ రావెళ్ల రవికుమార్, ఏఈ హరీష్, తెదేపా రైతు నాయకుడు గోపు సత్యనారాయణ తదితరులు ఆదివారం రాత్రి సమావేశమయ్యారు. కాలువపై బుద్దాలపాలెం వద్ద ఉన్న డ్రాపు నుంచి ప్రతి బుధవారం 6గం.లకు నీటిని విడుదల చేసి ఆదివారం ఉదయం 6గం.ల వరకు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఫలితంగా పెడన, బందరు మండలాల్లో దాదాపు 7 వేల ఎకరాల ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవని అధికారులు చెప్పారు.

రైతులతో చర్చిస్తున్న ఇరిగేషన్ అధికారులు

## వ్యర్థాలు తొలగించక..అవస్థలు

మండలంలోని పెదతుమ్మిడి, నాగేశ్వరరావుపేట, అర్తమూరు, మల్లపరాజుగూడెం తదితర గ్రామాల్లో వ్యర్థాలను ప్రధాన రోడ్ల వెంట వేస్తున్నారు. వాటిని సకాలంలో తొలగించక పోవడంతో పేరుకుపోతున్నాయి. దీంతో పలువురు పారిశుద్ధ్య కార్మికులు వాటికి నిప్పు పెడుతున్నారు. ఈ క్రమంలో ఆ మార్గం వెంబడి వెళ్లే వాహన చోదకులు పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టించాల్సిన కేంద్రాలను ఆయా గ్రామాల్లో వాడుకలోకి తీసుకు రాకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, బంటుమిల్లి**

## దారి..రాకపోకలకు ఇబ్బందిగా మారి

బందరు మండలం పోతేపల్లి పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. మచిలీపట్నం నగరాన్ని ఆనుకుని ఉన్న గ్రామం కావడం, జ్యూయలరీ పార్కుతో పాటు వివిధ పరిశ్రమలు ఇక్కడే ఉండడంతో జనావాసాలు గణనీయంగా పెరుగుతున్నాయి. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు పలు రోడ్లపై రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ప్రాంతంలో రహదారులు అభివృద్ధికి నోచుకోక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.వైకాపా హయాంలోనే వీటిని అభివృద్ధి చేయాలని స్థానికులు మొరపెట్టుకున్నా ఎవరు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బందరు నుంచి పోతేపల్లి వెళ్లే ప్రధాన రహదారిని అభివృద్ధి చేశారు. మిగిలిన రోడ్లను కూడా అభివృద్ధి చేస్తారన్న ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు.- **న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

## వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత

కేసరపల్లి(గన్నవరం గ్రామీణం): గన్నవరం మండలం కేసరపల్లిలోని అమ్మ వయోవృద్ధుల ఆశ్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ ప్రతినిధులు ఆదివారం నిత్యావసరాలు అందించారు. సుమారు పదివేల రూపాయల సరకులతో పాటు రూ.9వేల నగదు, అన్నదానం చేసినట్లు క్లబ్ కార్యదర్శి రావి సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పి.కిరణ్‌కుమార్, కోశాధికారి టీఎస్ఆర్‌కే ప్రసాద్, డా.లోయసురేంద్ర, డి.సువర్ణ పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.50,116 వితరణ

మోపిదేవి: విజయవాడ వాస్తవ్యులు బి.రాహిణి.. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం రూ.50,116 వితరణగా అందించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావుకు ఈ మొత్తం అందించారు.

# పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

## జ్ఞాపకాల కోటలో కంకిపాడు

కంకిపాడు, న్యూస్‌టుడే: విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి తమను తీరని లోటని, కూమా తల్లి తన ముద్దు బిడ్డను కోల్పోయిందని ఆయన స్వగ్రామం కంకిపాడు వాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్న నాటి నుంచి ఆయనతో గడిపిన క్షణాలు, అనుభవాలను నెమరు వేసుకున్నారు.

### నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారు

కోట శ్రీనివాసరావు నా కంటే రెండేళ్ల చిన్నవాడు. ఆయన తండ్రి దివంగత డాక్టర్ ఆంజనేయులు వద్ద మా కుటుంబ సభ్యులు పనులు చేస్తూ ఉండేవారు. దీంతో శ్రీనివాసరావు, నేను కలిసి కంకిపాడులోని ఎంపీపీ పాఠశాలకు వెళ్లే వారం. నాటకాలపై కోటకు మక్కువ. ఇది ఆయన తండ్రికి ఇష్టం ఉండేది కాదు. చాటుమాటున నాటకాల్లో వేషాలు వేసేవారు. ఉత్సాహంగా ఉంటూ అందరిని నవ్వుతూ నవ్విస్తూ ఉండే వారు. కంకిపాడు వచ్చిన ప్రతిసారి స్థానిక కబుర్లు చెప్పించుకునే వారు. ఆయన తెలుగు సినిమా విశేషాలు కూడా చెప్పే వారు. అంతస్థాయికి వెళ్లినా పేదవాడినైనా నన్ను ఆప్యాయంగా పలకరించే వారు. -పులిగేటి చెన్నరాయుడు, చిన్ననాటి మిత్రుడు

### 'కోట' బ్రదర్స్ నాటకానికి మంచి ఆదరణ

కోట శ్రీనివాసరావు, ఆయన సోదరుడు నరసింహారావు ఏ పాత్రనైనా అవలీలగా పోషించేవారు. వారి నాటకాలకు మంచి ఆదరణ ఉండేది. పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ప్రదర్శన చేసినా జనాలు అధిక సంఖ్యలో వచ్చేవారు. కంకిపాడుకు ఆయన మారుపేరు. - గుడిసేవ సుబ్బారావు, సహచరుడు

### విగ్రహం ఏర్పాటుకు కృషి

మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కె.ఎల్.రావు రాజకీయంగా, కోట శ్రీనివాసరావు నాటక, సినీ రంగాల్లో కంకిపాడు ప్రాంతానికి మంచి గుర్తింపు తెచ్చారు. అందరి సహకారంతో శ్రీనివాసరావు విగ్రహాన్ని కంకిపాడులో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం. - తుమ్మలపల్లి హరికృష్ణ, రాష్ట్ర బ్రాహ్మణ సంఘ ప్రతినిధి

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

★ కానూరు ఎస్సీ కాలనీలో కొన్ని రోజులుగా చెత్త తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం... మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. ఈ విషయమై స్పందించిన కమిషనర్ షేక్ నజీర్ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు.

★ పోరంకి మెయిన్ రోడ్డులో కొన్ని రోజులుగా చెత్త తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. ఈ విషయమై స్పందించిన శానిటరీ అధికారి సుధాకర్ సమస్య పరిష్కరించారు. - పోరంకి(కానూరు), న్యూస్‌టుడే

స్పందనకు వందనం

## భవనాల కథ.. ఎప్పటికి తీరేను వ్యథ..!

### అసంపూర్తి నిర్మాణాలతో అవస్థలు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే

గన్నవరం నియోజకవర్గంలో వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, ఆరోగ్య క్లినిక్‌ల భవనాల నిర్మాణాలు అరకొరగా, అసంపూర్తిగా మిగిలిపోయాయి. చాలా చోట్ల శంకుస్థాపనలు నిర్వహించి మూడేళ్లు దాటినా కూడా బిల్లుల చెల్లింపులో జాప్యంతో గుత్తేదార్లు మిన్నకుండిపోయారు. దీంతో అరకొర వసతులున్న భవనాల్లోనే విధులు నిర్వహించాల్సి రావడం సిబ్బందికి ఇబ్బందిగా మారింది. కూటమి ప్రభుత్వం ఈ భవనాల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది.

నిలిపివేత : గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ప్రభుత్వం నుంచి సక్రమంగా బిల్లులు పడలేదు. దీంతో ఎక్కడికక్కడ పనులు స్తంభించిపోయాయి. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 48 భవనాల పనులు అసలు మొదలే కాలేదు. 60కి పైగా భవనాలు బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిపోయాయి. సిమెంటు, ఇసుక వరకు ప్రభుత్వం సరఫరా చేసినా, మిగతా సామగ్రి, కూలీల వేతనాలు చెల్లింపులు కష్టతరంగా మారడంతో గుత్తేదారులు వైకాపా హయాంలో చేతులెత్తేశారు.

| మండలం | మంజూరు ఇలా.. సచివాలయాలు | రైతుసేవా కేంద్రాలు | ఆరోగ్య క్లినిక్‌లు |
|---|---|---|---|
| గన్నవరం | 23 | 21 | 21 |
| బాపులపాడు | 20 | 22 | 18 |
| ఉంగుటూరు | 13 | 16 | 12 |

★ బాపులపాడు మండలం బొమ్ములూరులో ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రం భవనాల నిర్మాణానికి 2020లోనే భూమిపూజ చేశారు. కానీ నేటికీ అవి పూర్తి కాలేదు. నాలుగేళ్ల వ్యవధిలో బేస్‌మెంట్ స్థాయి నుంచి శ్లాబు వరకు వచ్చి అసంపూర్తిగా మిగిలిపోయాయి. ★ రేమల్లెలో గ్రామ సచివాలయాన్ని మూడేళ్లుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అరకొర వసతులున్న ఇక్కడ విధులు నిర్వహించడం, ప్రజలకు సేవలందించడం కష్టతరంగా ఉన్నా, ప్రత్యామ్నాయం లేక అలాగే కాలం గడపాల్సి వస్తోంది. ★ గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో సైతం పలు గ్రామాల్లో కీలకమైన ప్రభుత్వ భవనాల నిర్మాణ పరిస్థితి నామమాత్రంగానే ఉంది.

బొమ్ములూరులో అసంపూర్తిగా..

మల్లవల్లిలో దాదాపుగా నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాలేదు

## 'అభివృద్ధిని చూడలేకే విమర్శలు'

సమావేశంలో కూటమి పార్టీల నాయకులు

పెనమలూరు, న్యూస్‌టుడే: వైకాపా పెనమలూరు నియోజకవర్గ బాధ్యుడు దేవభక్తుని చక్రవర్తి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌లను విమర్శించే స్థాయి లేదని కూటమి పార్టీల నాయకులు అన్నారు. పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంగెపు రంగారావు, తాతపూడి గణేష్‌లు మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పార్ట్‌టైం పొలిటీషియన్ అంటూ చక్రవర్తి చేసిన విమర్శలను వారు ఖండించారు. నిన్న గాక మొన్న రాజకీయాల్లోకి వచ్చిన వారికి విమర్శలు చేసేంత స్థాయి లేదన్నారు. కూటమి ఏడాది పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను చూడలేకే విమర్శలు చేస్తున్నారన్నారు. సమావేశంలో శొంఠినవరామప్రసాద్, కోయ ఆనంద్, యార్లగడ్డ సుధీర్, విజయేంద్ర, మల్లంపాటి విజయలక్ష్మి, బొప్పన లావణ్య పాల్గొన్నారు.

## అభివృద్ధి చేయరు.. గుంతలూ పూడ్చరు..!

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడులో ఓ వైపు పాత 16వ జాతీయ రహదారి, మరోవైపు పెదఅవుటపల్లి-లక్ష్మీపురం హైవేను అనుసంధానం చేసే మేడేపూడి సుబ్బారావు నగర్ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. వీఎంఎం పాఠశాల, సాయిబాబా గుడి, తారకరామనగర్, కృతావాటికలు, ఎంజీనగర్, మండల కార్యాలయాల ప్రాంతం వరకు వ్యాపించి ఉన్న ఈ మార్గం రాకపోకలకు అత్యంత కీలకమైంది. కానీ దీనిపై ఎక్కడికక్కడ గుంతలు పడి, పలు చోట్ల ఛిద్రమైంది. పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న ఈ రహదారిని విస్తరించి అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు ఏళ్ల తరబడి కార్యరూపం దాల్చకపోగా, కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## 300 మందికి వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కోడూరుపాడులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైస్ ఎంపీపీ చందు రమాదేవి చొరవతో తెలంగాణ శంకర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్సీఎం సంస్థ భవనంలో జరిగిన ఈ శిబిరంలో మొత్తం 300 మందికి నేత్ర పరీక్షలు చేశారు. 40 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా చేయించేలా ఏర్పాట్లు చేశారు. 'నాసా' మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ నగేష్, నాయకులు నక్కా గాంధీ, చందు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోకి ప్రవేశించిన ఇస్కాన్ యాత్ర

యాత్రకు స్వాగతం పలుకుతున్న చలసాని ఆంజనేయులు తదితరులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సనాతన ధర్మ ప్రచార పాదయాత్ర ఆదివారం సాయంత్రం హనుమాన్ జంక్షన్ వద్ద కృష్ణాజిల్లాలోకి ప్రవేశించింది. దేశ వ్యాప్త ప్రచారంలో భాగంగా 2021లో ఉత్తరప్రదేశ్‌లోని ద్వారక నుంచి ఎడ్లబండిపై దేవతామూర్తుల విగ్రహాలతో ఈ పాదయాత్ర ప్రారంభించారు. 2030 నాటికి తిరిగి ఈ యాత్ర ద్వారకకు చేరుకుంటుంది. ఆదిరుద్రదాస, రాధావల్లభాయ్ నేతృత్వంలో 20 మంది ప్రతినిధుల పాదయాత్ర బృందానికి విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, ఎనికేపల్లి రామచంద్రరావు, గుమ్మడి శేషగిరిరావు, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం నగర సంకీర్తన నిర్వహించారు.

## 'శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పేర్ని వ్యాఖ్యలు'

కంకిపాడు: మాట్లాడుతున్న నాయకులు

కంకిపాడు, న్యూస్‌టుడే: వైకాపా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని), ఆతడి కుమారుడు కిట్టు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని జనసేన నాయకుడు ముప్పా రాజా ఆరోపించారు. కంకిపాడులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై అనుచితంగా మాట్లాడాన్ని ఖండిస్తున్నామన్నారు. గంటకో మాట మార్చే పేర్ని నాని, తన స్థాయి మాట జనసేనానిని కించపరుస్తున్నారన్నారు. వైకాపా పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తులు నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. సమావేశంలో సీహెచ్‌సీ ఛైర్‌పర్సన్ బోయిన రోహిణీకుమారి, పీఏసీఎస్ ఛైర్మన్ సుంకర శివ, బోయిన నాగరాజు, రవి, శేఖర్ పాల్గొన్నారు.

## ఆత్మీయ వేడుక.. ఆనంద గీతిక



పూర్వ విద్యార్థుల బృందం

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు బీవీఎం జూనియర్ ఉన్నత పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 31 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో సకలాపురపు శ్రీను, కొల్లి హరికృష్ణ, మల్లిశెట్టి సుబ్రహ్మణ్యం, కోలవెంటి సునీల్, లింగినీడి ఉమారఘురామ్, కలపాల మోహన్ తదితరులు నేతృత్వం వహించారు.

## వాహనదారుల అవస్థలకు చెక్!

పునాదిపాడు (కంకిపాడు), న్యూస్‌టుడే: కంకిపాడు-పునాదిపాడు మధ్య పైవంతెనకు ఉత్తరం వైపున గత ఆరేళ్లుగా వాహనదారులను అవస్థలకు గురిచేస్తున్న ప్రదేశాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. గతేడాది అక్టోబరులో స్థానిక తెదేపా నాయకులు మద్దాలి సాయిబాబు, రామచంద్రరావు చొరవతో గోతులు పూడ్చారు. ప్రభుత్వ నిధులతో మరోసారి మెరక చేశారు. వర్షపునీరు, మురుగు చేరడంతో మరమ్మతులు చేసిన కొద్ది రోజులకే సమస్య మొదటికి వచ్చింది. శాశ్వత పరిష్కారంలో భాగంగా ప్రస్తుతం కొంత మేర రహదారికి ఇరువైపులా డ్రెయిన్ల ఏర్పాటు, అంచుల్లో మేట తొలగింపు పనులు చేపట్టారు. రహదారిని రెండున్నర అడుగుల ఎత్తుకు పెంచారు. దీంతో వాహనదారులకు ఇక్కట్లు ఉండవని ఆశిస్తున్నారు.

## కరకట్టపై ఢీకొన్న కార్లు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం వెలివోలు వద్ద కరకట్టపై ఆదివారం స్పీడ్ బ్రేకర్ వద్ద రెండు కార్లు ఢీకొన్నాయి. ఉయ్యూరుకు చెందిన వి.వీరభద్రరావు భార్యతో కలసి తన కారులో కరకట్ట మీదుగా మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వెళుతున్నారు. చల్లపల్లి మండలం వెలివోలు వద్ద కరకట్టపై స్పీడ్ బ్రేకర్ దగ్గర ముందు కారు స్లోగా వెళుతుండగా.. వీరభద్రరావు స్లోగా బ్రేక్ వేశారు. ఈ సమయంలో వెనుకగా వస్తున్న కారు అతివేగంగా ఢీకొనడంతో వెనుక భాగం దెబ్బతింది. ఈ వేగానికి ముందు కారు బానెట్, హెడ్‌లైట్ సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఢీకొట్టిన వాహనం ఎల్.బోర్డుతో తెలంగాణ రిజిస్ట్రేషన్ కలిగి ఉంది. బాధితుని ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఏఎస్ఐ ఉప్పాల వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గన్నవరంలో ఆర్టీసీ బస్సు.. కారు..

గన్నవరం గ్రామీణం : గన్నవరం పట్టణ శివారులోని చైతన్య కూడలి సమీపంలో ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. కంకిపాడు నుంచి గన్నవరం వస్తున్న ఆర్టీసీ బస్సు.. స్థానిక కూడలి వద్దకు చేరుకోగానే.. విజయవాడ నుంచి వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, బస్సు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

## 'సంక్షేమ ఫలాల ఘనత కూటమి ప్రభుత్వానిదే'

కానూరు, న్యూస్‌టుడే: సూపర్-6 పథకాల అమలు ద్వారా పేదలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఆదివారం తాడిగడప శ్రీనగర్‌కట్టపై నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనమలూరు: పెనమలూరు శివాలయం పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో తెదేపా పెనమలూరు క్లస్టర్ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు గూడవల్లి పూర్ణ, తోటకూర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు 12వ వార్డులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కౌన్సిలర్ రమణ, పూర్ణచంద్రరావు, ఖుద్దూస్ పాల్గొన్నారు.

ఉయ్యూరులో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో..

యనమలకుదురు (కానూరు): యనమలకుదురులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.



తాడిగడపలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బోడేప్రసాద్

పెనమలూరులో కరపత్రాలు అందజేస్తూ..

## చెత్త తరలింపునకు సమకూరిన వాహనాలు

పెనమలూరు, న్యూస్‌టుడే: తాడిగడప పురపాలక సంఘం పరిధిలో పోగయ్యే చెత్త, ఇతర వ్యర్థాల తరలింపు నిమిత్తం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.2.32 కోట్ల విలువైన రెండు కాంపాక్ట్ వాహనాలు సమకూరాయి. వాటిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌లు పోరంకిలోని కార్యాలయం వద్ద ఆదివారం పురపాలక అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ రెండు వాహనాలు రోజుకు 110 టన్నుల చెత్తను గుంటూరులోని వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తాయన్నారు. అవి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారయ్యాయన్నారు. రానున్న రోజుల్లో ఇంటింటా చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ వాహనాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ వాహనాలతో పురపాలక సంఘానికి చెత్త తరలింపు వ్యయం తగ్గుతుందన్నారు. కమిషనర్ నజీర్, కూటమి పార్టీల నాయకులు జువ్వాది రాంబాబు, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్, మారుపూడి ధనకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతలో రాజీవద్దు

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి ఇరువైపులా పచ్చదనం పరిడవిల్లేలా గన్నవరం నియోజకవర్గంలో రూ.8కోట్లతో చేపట్టే అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడొద్దని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. గన్నవరం, పొట్టిపాడులో ప్రైవేట్ కార్యక్రమాలకు వెళ్తూ ఆదివారం మధ్యాహ్నం విమానాశ్రయం ఎదుట జరుగుతున్న మొక్కల పెంపకం పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్మికులు, గుత్తేదారులకు పలు సూచనలు చేశారు. -గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

## చికిత్స పొందుతూ విశ్రాంత ఉపాధ్యాయిని మృతి

పెనమలూరు, న్యూస్‌టుడే: చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడిన విశ్రాంత ఉపాధ్యాయిని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పెనమలూరుకు చెందిన డి.కనకదుర్గ(70) విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయిని. నాలుగురోజుల కిందట ఇంట్లో పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తు దీపారాధన చీరకు అంటుకొంది. ఈ సంఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అనారోగ్యంతో మాజీ ఇన్‌ఛార్జి సర్పంచి..

వణుకూరు (పెనమలూరు), న్యూస్‌టుడే: వణుకూరు మాజీ ఇన్‌ఛార్జి సర్పంచి రావి వెంకటనారాయణ(93) మృతిచెందారు. వారం రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. పలువురు సంతాపం తెలిపారు.

## భయపెడుతున్న ఖాళీ స్థలాలు

నున్న(అంబాపురం), న్యూస్‌టుడే: అంబాపురం పంచాయతీ మొదటి వార్డులోని ఐకాన్ హైట్స్ రోడ్డులో ఖాళీ స్థలాలల్లో భారీగా పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటి కారణంగా తీవ్ర దుర్వాసన వస్తోందని, పాములు, విషకీటకాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగంతా వాటిలో పేరుకుపోయి వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

## మందుబాబులకు అడ్డాగా కట్ట ప్రాంతం

నున్న, న్యూస్‌టుడే: నున్న పోలవరం కుడి కాలువ పక్కన కట్ట ప్రాంతం మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. రోజూ రాత్రుళ్లు, పగలు పలువురు మద్యం తాగుతూ వారిలో వారే గొడవపడుతున్నారు. పైగా ఆ మార్గంలో వంతెన పైనుంచి వికాస్ కళాశాలకు దారి ఉంది. ఒంటరిగా ద్విచక్ర వాహనాలపై వచ్చే వారిని అడ్డగించి నగదు వసూలు చేస్తున్నారు. అసభ్యంగా కూడా ప్రవర్తిస్తున్నారు. పోలీసులు ఆ ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేసి, తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## దడ పుట్టిస్తున్న రహదారుల అంచులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు మండలం కె.సీతారాంపురంలో పలు సిమెంట్ రహదారులుదడ పుట్టిస్తున్నాయి. అంచులు(మార్జిన్లు) లేకుండా రోడ్లు నిర్మించడం, పక్కనే డ్రెయినేజీలు లోతుగా ఉండటం, వాటిపై ఎలాంటి పైకప్పు లేకుండా అగాధాల్లా తవ్వడంతో ప్రమాదకరంగా మారాయి. మరోవైపు రోడ్డు నిర్మాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కుంగుతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు సత్వరమే స్పందించి, ఎలాంటి అనర్థాలు జరగక ముందే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్సీ కాలనీ ప్రధాన రహదారి

కుంగిపోతున్న మరో రహదారి

## సామాజిక భవనం.. సేవలకు దూరం!

ఎస్సీ కమ్యూనిటీ హాలు

పెనమలూరు, న్యూస్‌టుడే: పదేళ్ల కిందట గంగూరులో ఊరికి దూరంగా ఎస్సీ, ఎస్టీల సౌకర్యార్థం రూ.12 లక్షలతో సామాజిక భవనం నిర్మించారు. ఇందులో రూ.10 లక్షలు ఎంపీ, రూ.2 లక్షలు మండల పరిషత్తు నిధులు ఉన్నాయి. అయితే అక్కడికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. వినియోగించుకోవడానికి విద్యుత్తు సౌకర్యం సైతం లేదు. నీటి సౌకర్యం కోసం చేతిపంపు ఏర్పాటు చేసినా అది పనిచేయడం లేదు. నిర్మానుష్య ప్రాంతంలో ఉండటంతో భవనం, పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు ఆలవాలంగా మారాయి. ప్రధాన ద్వారం తలుపులు విరిగిపోయాయి. ఫ్లోరింగ్ పగిలిపోయి బీటలు వారింది. పంచాయతీకి చెందిన సామగ్రి, పరికరాలను దాచుకోవడానికి గోదాముగా ఉపయోగిస్తున్నారు. అంతే తప్ప సౌకర్యాల కల్పనపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించడం లేదు. భవనాన్ని అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకొస్తే గంగూరు, ఈడుపుగల్లు ప్రాంతాల వారికి సౌకర్యంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఊడిపోయిన ప్రధాన ద్వారం తలుపులు

సౌకర్యాల కల్పనకు కృషి : ఎస్సీ, ఎస్టీ సామాజిక భవనాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలంటే రూ.25 లక్షల వ్యయం అవుతుంది. ప్రహరీ, ఫ్లోరింగ్, తాగునీటి బోరు, విద్యుత్తు, భవనంపైకి మెట్లు, మెరక వంటి పనులు చేయాల్సి ఉంది. ఇటీవల జరిగిన పంచాయతీ సర్వసభ్య సమావేశం తీర్మానాల్లో భవనం అభివృద్ధికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను కోరాం. రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలతో తాత్కాలిక వినియోగానికి భవనాన్ని అభివృద్ధి చేస్తాం. మిగతా నిధులను సమకూర్చాల్సిందిగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌ను కోరతాం. -తస్లీమున్నీసాబేగం, గంగూరు సర్పంచి

(c) eenadu

## గుర్రపుడెక్క నిర్మూలనకు చర్యలు

పుల్లేరులో డ్రోన్‌తో రసాయనాల పిచికారీ

**గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే:** స్థానిక నీలకంఠేశ్వరపురం రైల్వే వంతెన వద్ద పుల్లేరులో మేట వేసిన గుర్రపు డెక్క తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వారి ఆదేశాల మేరకు గుత్తేదారు రసాయనాలు పిచికారీ చేపట్టాడు. నిర్లక్ష్యం మేటలు వేసి.. శీర్షికన ఈనెల 12వ తేదీన 'ఈనాడు'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. రైల్వే వంతెన వద్ద భారీగా మేట వేసిన డెక్క ఎండిపోగా దానిపై ఇంగ్లిష్ గడ్డిగా పిలిచే పశుగ్రాసం కూడా పెరుగుతోందని కథనం ప్రచురితమైంది. దీంతో ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో నిర్మూలనకు చర్యలు చేపట్టారు. పుల్లేరు వెడల్పుగా ఉండడంతో మనుషులతో రసాయనాల పిచికారీ కుదరక డ్రోన్‌తో చేస్తున్నారు.

# గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

## రైతు కుటుంబానికి సాయం

**ఈపూరు:** మండలంలోని కొచ్చెర్లలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు బండి కొండయ్య కుటుంబ సభ్యులకు గుడివాడకు చెందిన దాత ఎన్.వెంకటేశ్వరరావు రూ.15వేలు ఆర్థికసాయం అందించారు. అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ కో-ఆపరేటివ్ సొసైటీ అధికారిగా పనిచేస్తున్న ఆయన సామాజిక స్ఫూర్తితో ప్రతి నెలా తన జీతం నుంచి ఎంతో కొంత సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.50,116 వితరణ

**మోపిదేవి, న్యూస్‌టుడే:** విజయవాడ వాస్తవ్యులు బి.రాజకుమార్.. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం రూ.50,116 వితరణగా అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావుకు ఈ మొత్తం అందించారు. ఆమెకు స్వామి దర్శనం, వేదమంత్రాలతో ఆశీర్వచనం, శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి చిత్రపటం అందించారు.

## భక్తితో సుదర్శన హోమం

**మంటాడ(వమిడిముక్కల), న్యూస్‌టుడే:** మంటాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఆగ్నిరాజు రామ్మోహనరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

## రెచ్చగొట్టి అవమానించారని కేసులా?: తెదేపా

సెల్ ఫోన్ చూపుతూ మాట్లాడుతున్న జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు పుష్పావతి

**గుడివాడ, న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వం మారినా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఇంకా అదే ఆలోచనలో ఉండి మొండిగా వ్యవహరిస్తూ తెదేపా వారిని రెచ్చగొట్టారని, పోలీసులు వారించినా వినకుండా రెండో వైపు రావడం వల్లనే వివాదం జరిగిందని తెలుగు మహిళా పట్టణ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు పుష్పావతి, నాయకులు కొల్లి రమ్య, రమాదేవిలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రజా వేదికలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అసలు హారిక పార్టీ సమావేశానికి ప్రభుత్వ వాహనం తీసుకుని దూసుకుని రావచ్చా? అని ప్రశ్నించారు. పోలీసులు చెప్పినా వినకుండా తీవ్ర దుర్భాషలు పలుకుతూ ఆమె భర్త రాము హడావుడి చేయడం సరికాదన్నారు. చేసిందంతా చేసి బీసీ మహిళను జిల్లా ప్రథమ మహిళను అని ఏడ్వడం దేనికన్నారు. జగన్‌ను ఆదర్శంగా తీసుకుని ఆమె రెచ్చిపోయి వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వీరంతా ఇక్కడ సమావేశం ఏర్పాటు చేశారని, తాము సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉండగా రెచ్చ గొట్టారని పేర్కొన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని పేదల బియ్యం బొక్కి ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. పేర్ని నాని గుడివాడ వస్తే తగిన గుణపాఠం చెబుతామన్నారు. కొడాలి నాని తన నియోజకవర్గంలో జరిగే సభకు హాజరు కాకుండాపోతే బయట వారంతా వచ్చి ఇక్కడ శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం ఎంతవరకు సమంజసమని సుధారాణి, పుష్పావతిలు ప్రశ్నించారు. తెలుగు మహిళలు మాదాల సునీత, సిరపురపు తులసీరాణి, మల్లికా బేగం తదితరులు పాల్గొన్నారు.

**రాజకీయ లబ్ధి కోసమే హారిక దంపతుల యత్నం..** ఉప్పాల హారిక, రాము దంపతులు రాజకీయ లబ్ధి కోసం గుడివాడ వచ్చి డ్రామాలు చేస్తున్నారని తెదేపా బీసీ సెల్ నేతలు మండి పడ్డారు. స్థానిక ప్రజావేదికలో వారు మాట్లాడుతూ హారిక దంపతులు బండ బూతులు తిట్టి.. తీరా తెదేపా వాళ్లు దూషించారనడం సరికాదన్నారు. గతంలో ఎప్పుడూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల సభలు వైకాపా అడ్డుకోలేదా? అని ప్రశ్నించారు. బీసీ సెల్ నేతలు వసంతవాడ దుర్గారావు, ఈడే మోహన్, పామర్తి సత్తిబాబు, దేవరపల్లి కోటి, ఆర్నేపల్లి పాండు తదితరులు పాల్గొన్నారు.

## 'జడ్పీ ఛైర్‌పర్సన్‌పై దాడి హేయం'

**గుడివాడ, న్యూస్‌టుడే:** గుడివాడలో రక్షణ కరవైందని ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని మాజీ మంత్రి కె.ఈశ్వర్ కుమార్ విమర్శించారు. గుడివాడలో తన నివాసంలో ఆయన మాట్లాడుతూ హారిక కారు పైదాడి చేసి ఆమెపై దుర్భాషలాడడం అప్రజాస్వామికమన్నారు. ఈ ఘటనకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పూర్తి బాధ్యత వహించాలన్నారు.

**కౌతవరం(గుడ్లవల్లేరు):** బీసీ మహిళ, జడ్పీ ఛైర్‌పర్సన్‌పై దాడి హేయమని కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్, వైకాపా నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పడమట సుజాత ఖండించారు. ఆదివారం మండలంలోని కౌతవరం తన నివాసంలో గౌడ సంఘీయులతో కలిసి ఆమె మాట్లాడారు.

**పామర్రు, న్యూస్‌టుడే:** ఉప్పాల హారికపై తెదేపా శ్రేణులు దాడి చేయడం అమానుషమని గౌడ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మాదు శివరామకృష్ణ అన్నారు. స్థానిక వైకాపా కార్యాలయంలో వివిధ మండలాల ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గుడివాడలో శనివారం హారిక, ఆమె భర్త రాములపై జరిగిన దాడిని అన్ని బీసీ సంఘాలు ఖండించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు రోడ్లపైకి వచ్చి ధర్నాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేస్తామని హెచ్చరించారు.

**అవనిగడ్డ:** రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగంతో కూటమి ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ చెప్పారు. తన కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, బీసీ వ్యతిరేకి చంద్రబాబు మార్గంలోనే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పయనిస్తున్నారన్నారు. హారికపై దాడి చేయడం హేయమైన చర్యని ఖండించారు.

**గుడివాడ:** బీసీ మహిళను కంటతడి పెట్టించడం దారుణమని వైకాపా పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సీనియర్ నేత మండలి హనుమంతరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, పెయ్యల ఆదాం తదితరులు పేర్కొన్నారు. స్థానిక వైకాపా కార్యాలయంలో వారు మాట్లాడారు.

## గౌరీశంకరపురంలో సమస్యల తిష్ఠ

గుడివాడ, న్యూస్‌టుడే

పట్టణ నడిబొడ్డున ఉన్న గౌరీశంకరపురంలో దీర్ఘకాలంగా పలు సమస్యలు తిష్ఠ వేశాయి. ముఖ్యంగా రహదారులు, డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయి. 4వ వార్డు పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో ఈ సమస్యల వల్ల సుమారు 1500 మంది జనాభా ఇబ్బందిపడుతున్నారు. గత వైకాపా పాలకులు ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి పూర్తిగా గాలికి వదిలేశారని కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించి వీటిని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డీఎస్పీ కార్యాలయం ఎదురుగా రాళ్లు తేలిన రహదారి

### వివిధ ప్రాంతాల్లో పరిస్థితి

కుసుమహరనాథ బాబా గుడి నుంచి చిన్న శివాలయానికి వెళ్లే ప్రధాన రహదారి దశాబ్దాల కాలంగా పెద్ద గుంతలతో నరకాన్ని తలపిస్తోంది. స్థానికులు వీటిని రాళ్లతో పూడ్చుకున్నా ఫలితం ఉండడం లేదు. ఈ మార్గంలో శ్రీగౌరీశంకరస్వామివారి దేవాలయానికి, శ్రీ సాయిబాబా మందిరానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చిపోతుంటారు. ఈ ప్రాంతంలో చాలా విద్యా సంస్థలు ఉండడంతో ఇక్కడకు చదువుకోవడానికి వేల సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రహదారి కావడం వల్ల వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది. భారీ గుంతల కారణంగా వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. చిన్న శివాలయ మలుపులో రోడ్డుపై ఉన్న కల్వర్టు దిమ్మెల మధ్య ఖాళీ ఉండడం వల్ల వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి.

★ ఈ ప్రాంతంలో పలు డ్రెయిన్లు పూర్తిగా పూడిపోవడం వల్ల మురుగు పారడం స్తంభించింది. వర్షం వస్తే వర్షపు నీరు, మురుగు అంతా రోడ్డుపై చేరుతోంది. దుర్గంధం వెదజల్లడమే కాకుండా రాత్రివేళ దోమలు విజృంభిస్తున్నాయి.

## సాగునీరు విడుదల

**మోపిదేవి, న్యూస్‌టుడే:** 12వ నంబరు పంట కాలువకు ఆదివారం సాగునీరు విడుదల చేశారు. జలవనరుల శాఖ ఈఈ రవికిరణ్, ఏఈ రవితేజలు నీటిని విడుదల చేశారు. 'సాగునీరెప్పుడొస్తుందో' శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జలవనరుల శాఖాధికారులు స్పందించి ఈ చర్యలు తీసుకున్నారు.

## అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

**అవనిగడ్డ (గ్రామీణం, న్యూస్‌టుడే:** సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని మండల తెదేపా అధ్యక్షుడు యాసం చిట్టిబాబు చెప్పారు. మండలంలోని తుంగలవారిపాలెంలో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. మండలంలో పాత ఎడ్లంకలో ఎంపీపీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరదలు వస్తే ఈసారి గ్రామమే కనుమరుగు అవుతుందని అవనిగడ్డలో తమకు నివేశన స్థలాలు ఇప్పించాలని స్థానికులు వెంకటేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు.

అవనిగడ్డ: తుంగలవారిపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

అవనిగడ్డ: పాత ఎడ్లంకలో ఎంపీపీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు

## వ్యాయామోపాధ్యాయుల కార్యవర్గం ఎన్నిక

**అవనిగడ్డ:** జిల్లా ప్రభుత్వ బదిలీలు చేపట్టిన కారణంగా వ్యాయామోపాధ్యాయుల సంఘం నాయకులు ఇతర ప్రాంతాలకు బదిలీ కావడంతో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సబ్ జోన్ పరిధిలోని 6 మండలాలకు సంబంధించిన సబ్ జోన్ వ్యాయామోపాధ్యాయుల సంఘం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా ఎదురుమొండి పి.డి. బి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా తలగడదీవి పి.డి. జీవన్ ప్రసాద్, కోశాధికారిగా పెదకళ్లేపల్లి పీడీ జి.నవీన్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని వ్యాయామోపాధ్యాయులు అభినందించారు. విశ్రాంత వ్యాయామోపాధ్యాయులు కోసూరు పూర్ణచంద్రరావు తదితరులు పర్యవేక్షించారు.

## పులిగడ్డ అక్విడక్ట్‌కు సొబగులు

**దివిసీమలోని** అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో 72 వేల ఎకరాలకు సాగు, మూడు మండలాల ప్రజలకు తాగునీరు అందించే దివి వరప్రదాయిని పులిగడ్డ అక్విడక్ట్ నూతన శోభ సంతరించుకుంది. ఐదేళ్ల వైకాపా పాలనలో ఇది తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.. దీని పరిరక్షణ, మరమ్మతులు, ఆధునికీకరణకు రూ.1.10 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఇందులో భాగంగా మరమ్మతు పనులు చేస్తూనే అక్విడక్టుకు రంగులు వేశారు. దీని నుంచి పంట కాలువలకు నీరు విడుదల చేయడంతో సరికొత్త అందాలతో దర్శనమిస్తోంది. **- న్యూస్‌టుడే, అవనిగడ్డ గ్రామీణం**

## ఇలా ఉంటే వ్యాధులు రావా?

**తోట్లవల్లూరు** మండలంలో దోమల బెడద ఎక్కువైంది. పగలు, రాత్రి అని తేడా లేకుండా కుడుతూ ప్రజలను కునుకులేకుండా చేస్తున్నాయి. యాకమూరు, గరికపర్రు, పెనమకూరు, ఐలూరు, దేవరపల్లి, గురివిందపల్లి, కళ్లంవారిపాలెం, చాగంటిపాడు, తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, చినపులిపాక, రొయ్యూరు తదితర గ్రామాల్లోని ఖాళీ స్థలాలు దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. వీధుల్లో ఫాగింగ్ నామమాత్రంగా సాగుతోంది. ప్రజారోగ్య విభాగం ఫాగింగ్ కోసం ప్రత్యేకంగా షెడ్యూల్ రూపొందించుకున్నా అది కాగితాలకే పరిమితమయ్యింది. ఫాగింగ్ యంత్రాలు కొన్ని మరమ్మతుకు గురయ్యాయి. ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తామన్నారు. **- న్యూస్‌టుడే, తోట్లవల్లూరు**

## విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

**గుడివాడ, న్యూస్‌టుడే:** గుడివాడలో నిర్మాణంలో ఉన్న పైవంతెన వల్ల చౌదరిపేట ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు

ఎదురుమొండి దీవుల్లో మండలి బుద్ధప్రసాద్‌తో పర్యటిస్తున్న కోట శ్రీనివాసరావు(పాత చిత్రం)

**నాగాయలంక, న్యూస్‌టుడే:** తెలుగు చిత్రసీమలో సితారలా మెరిసిన కోట శ్రీనివాసరావు విలక్షణ నటుడు, రాజకీయ ప్రముఖుడని అభ్యుదయ వేదిక అధ్యక్ష కార్యదర్శులు తలశిల నాగేశ్వరరావు, వర్రే రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. 2002లో మండలం ఎదురుమొండి దీవుల్లో గొల్లమంద రేవులో పడవ ప్రమాదం జరిగింది. ఆ సందర్భంగా అప్పటి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కోట శ్రీనివాసరావులు కలిసి పడవ ప్రమాద బాధితుల కుటుంబాలను పరామర్శించి సాయం అందించారని గ్రామ పెద్దలు గుర్తు చేసుకున్నారు. కోట శ్రీనివాసరావు మృతి సినీరంగానికి తీరని లోటని రంగస్థల కళాకారులు చన్నగిరి లతామోహన్, కన్నా రాజు, కైతేపల్లి అచ్చియ్య, పన్నాల ప్రభాకర శర్మ, మహేశ్వరపు గాంధీ, మండల భాజపా అధ్యక్షుడు గుడివాక శివాజీలు తమ సంతాపం ప్రకటించారు.

## కరకట్టపై ఢీకొన్న కార్లు

**చల్లపల్లి, న్యూస్‌టుడే:** చల్లపల్లి మండలం వెలివోలు వద్ద కరకట్టపై ఆదివారం స్పీడ్ బ్రేకర్ వద్ద రెండు కార్లు ఢీకొన్నాయి. ఉయ్యూరుకు చెందిన వి.వీరభద్రరావు భార్యతో కలసి తన కారులో కరకట్ట మీదుగా మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వెళుతున్నారు. చల్లపల్లి మండలం వెలివోలు వద్ద కరకట్టపై స్పీడ్ బ్రేకర్ దగ్గర ముందు కారు స్లోగా వెళుతుండగా.. వీరభద్రరావు స్లోగా బ్రేక్ వేశారు. ఈ సమయంలో వెనుకగా వస్తున్న కారు అతి వేగంగా ఢీకొనడంతో వెనుక భాగం దెబ్బతింది. ఈ వేగానికి ముందు కారు బానెట్, హెడ్‌లైట్ సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఢీకొట్టిన వాహనం ఎల్.బోర్డుతో తెలంగాణ రిజిస్ట్రేషన్ కలిగి ఉంది. బాధితుని ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఏఎస్ఐ ఉప్పాల వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శతాధిక వృద్ధురాలు జానకమ్మ మృతి

**కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని మందపాకల గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు మత్తి జానకమ్మ(102) శనివారం రాత్రి మృతి చెందారు. ఇన్నేళ్లూ ఆమె ఆరోగ్యంగా ఉంటూ తన పనులు తానే చేసుకుంటూ జీవించారని అల్లుడు గాదె పిచ్చయ్య తెలిపారు. జానకమ్మకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

## మాజీ సర్పంచి నాగేశ్వరరావు..



**కోడూరు(అవనిగడ్డ), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని పోటుమీద గ్రామ మాజీ సర్పంచి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కడవకొల్లు నాగేశ్వరరావు(80) ఆదివారం ఉదయం మరణించారు. ఆయన సుదీర్ఘ కాలం గ్రామ సర్పంచిగా, సహకార సంఘ అధ్యక్షుడిగా పనిచేశారు. గ్రామాభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి కృషి చేశారు. ఆయన భార్య, కుమారుడు మరణించారు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సంతాపం తెలిపారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

అవనిగడ్డ : కొత్తపేటలో రేణుకా మావూరమ్మవారి సన్నిధిలో భూపతి వంశీకులు

మోపిదేవి: పెదప్రోలులో..

నాగాయలంక: నంగేగడ్డలో విరుగులమ్మకు సారె తీసుకెళుతున్న భక్తులు

**నంగేగడ్డ(నాగాయలంక), న్యూస్‌టుడే:** మండలంలోని నంగేగడ్డలో కొలువై ఉన్న గ్రామ దేవత శ్రీవిరుగులమ్మకు భక్తులు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

**పులిగడ్డ (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే:** మండలంలోని పులిగడ్డలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న ఆలివేలు మంగాదేవి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు అవనిగడ్డకు చెందిన లలితాదేవి ఆర్య వైశ్య సంఘం మహిళలు 11 రకాల మిఠాయిలు అందజేశారు.

**పెదప్రోలు (మోపిదేవి), న్యూస్‌టుడే:** పెదప్రోలులో శ్రీశక్తి పీఠం నాంచారమ్మ అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. పాడి పంటలు నిండుగా ఉండాలని, అవసరమైన వర్షాలు కురవాలని కోరుతూ 500 కిలోల కూరగాయలు, ఫల, పుష్పాలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. కూరపాటి కోటేశ్వరరావు పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

పులిగడ్డ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

పెదప్రోలులో..

పామర్రులో..

**పామర్రు, న్యూస్‌టుడే:** స్థానిక సోమేశ్వర స్వామి ఆలయంలో(శివాలయం) పార్వతీదేవికి ప్రముఖ వ్యాపారవేత్త పువ్వాడ శ్రీనివాసరావు నేతృత్వంలో మహిళలు సారె సమర్పించారు. ఆలయ అర్చకుడు తోలేటి సోమేశ్వరశర్మ పూజలు నిర్వహించగా ఈవో జన్ను వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**కోడూరు(అవనిగడ్డ):** కోడూరు గ్రామ దేవత గంగానమ్మ తల్లికి ఇస్మాయిల్ బేగ్‌పేటకు చెందిన మహిళా భక్త బృందం సారె సమర్పించింది. మండల పరిధి విశ్వనాథపల్లిలో అద్దంకి నాంచారమ్మ వారు భక్తులకు శాకంబరీదేవిగా దర్శనం ఇచ్చారు.

**అవనిగడ్డ, న్యూస్‌టుడే:** స్థానిక గ్రామ దేవత లంకమ్మ అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక కొత్తపేటలో భూపతి వారి ఇలవేల్పు రేణుకా మావూరమ్మ తల్లికి భూపతి వంశీకులు సారె సమర్పించారు.

పామర్రు: సోమేశ్వరస్వామి ఆలయంలో..

## కనులపండువగా వేంకటేశ్వరుని కల్యాణం

పులిగడ్డ: క్రతువులో భక్తులు

**పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే:** పులిగడ్డలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం కనుల పండవగా జరిగింది. వైఖానస ఆగమ పండితులు దీవి సత్యకృష్ణమాచార్యులు, విఖరసాచార్యుల బ్రహ్మత్వంలో ధనంతరాచార్యులు, పార్థాచార్యుల వేదమంత్రాలతో ఈ క్రతువు నిర్వహించగా.. 10 మంది దంపతులు పాల్గొన్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండలి భావన్నారాయణ, ఆలయ ఈవో యార్లగడ్డ వాసుదేవరావు, సహాయకులు దావెర్ల ఏడుకొండలు పర్యవేక్షించారు. స్థానిక వికాస తరంగిణి భక్త బృందం సభ్యులు విష్ణు సహస్ర నామస్తోత్ర పారాయణ చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు.

## ఆదిత్య హృదయం స్తోత్ర పారాయణం

కల్యాణ మూర్తులు ఉషాపద్మినీ సమేత సూర్యదేవుడు

**వేకనూరు(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే:** మండలం వేకనూరు సూర్యదేవాలయంలో ఆదివారం సూర్యదేవుడి కల్యాణోత్సవం ఆగమ పండితులు దీవి నరసింహమూర్తి బ్రహ్మత్వంలో వైభవంగా జరిగింది. వికాస తరంగిణీ భక్త బృందం ఆదిత్య హృదయం స్తోత్ర పారాయణ చేశారు. ఆలయ ప్రాంగణంలో వ్యవస్థాపకులు తుంగల వీరవసంతరావు- ఇందిర దంపతులు అన్నసంతర్పణ చేశారు.

## ట్రిపుల్ ఐటీకి ఎంపిక

తులసీప్రియతో అధ్యాపకురాలు ఉమా సరస్వతి

**చల్లపల్లి, న్యూస్‌టుడే:** రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ రెండో విడత ఫలితాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీలో బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి హైస్కూల్ విద్యార్థిని బళ్లా తులసీప్రియ ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనట్లు పురిటిగడ్డ జడ్పీ హైస్కూల్ ప్లస్ తెలుగు అధ్యాపకురాలు ఓలేటి ఉమాసరస్వతి ఆదివారం తెలిపారు. తులసీప్రియను గైడ్ టీచర్ ఉమాసరస్వతి అభినందించారు.

## వైద్య శిబిరాలకు స్పందన

కూచిపూడి : శిబిరాన్ని ప్రారంభిస్తున్న విశ్వనాథ్

నాగాయలంక: కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు లిల్లిజాయ్

గుడ్లవల్లేరులో..

**కూచిపూడి,న్యూస్‌టుడే:** స్థానిక రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయం ఆవరణలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ, రోటరీ క్లబ్ కూచిపూడి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి చక్కని స్పందన లభించింది. ఉయ్యూరు సమతా శంకర నేత్ర చికిత్సాలయ నేత్ర వైద్య నిపుణుడు ఆదిత్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కూచిపూడి ఎస్ఐ కేవన్ విశ్వనాథ్ ప్రారంభించారు. 160 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా.. 48 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. రెడ్‌క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ ఛైర్మన్ బి.వెంకటేశ్వరరావు, రోటరీక్లబ్బు అధ్యక్ష కార్యదర్శులు జె.హనుమకుమార్, బీహెచ్‌వీ ఆర్ఎస్ సాయి, సర్పంచి కొండవీటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**నాగాయలంక, న్యూస్‌టుడే:** స్థానిక మారుతీ విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో బొబ్బా గోవర్ధన్ సహకారంతో సుదర్శి మానవతా సేవా సంస్థ, జిల్లా అంధత్వ నివారణసంస్థ, పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన శిబిరంలో 123 మందికి కంటి వ్యాధులకు వైద్య నిపుణురాలు లిల్లి జాయ్ వైద్య పరీక్షలు నిర్వహించి 85 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని శస్త్రచికిత్సల కోసం శంకర కంటి ఆసుపత్రి పెదకాకానికి ప్రత్యేక వాహనంలో పంపినట్లు నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణలు తెలిపారు. శిబిరం ఇన్‌ఛార్జి ప్రసన్న కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో..

**గుడివాడ, న్యూస్‌టుడే:** గుడివాడ మండలం బొమ్ములూరులో ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యుడు పి.శివప్రసాద్ నేతృత్వంలో గుణదల హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్, లయన్స్ కంటి ఆసుపత్రి వారిచే మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ(చంటి) ఇంటి వద్ద ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 2డీ ఎకో, ఈసీజీ, బీపీ, మధుమేహం తదితర పరీక్షలు నిర్వహించి 250 మందికి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. వాకర్స్ గవర్నర్ సనకా సుబ్బారావు, గుత్తా శివరామకృష్ణ(చంటి), దండమూడి సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

**గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే:** స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు జి.రజిని, వైద్యసిబ్బంది 164 మంది రోగులను పరీక్షించారు. దాతలు వి.రామకృష్ణ, ఎన్.గంగాధరరావు, కె.బాపయ్య చౌదరిల వితరణతో ఉచితంగా మందులు అందజేశారు. లయన్స్ ప్రతినిధులు మూల్పూరి సుధాకర్, చాపరాల రాజేశ్వరరావు, గుమ్మడి రామకృష్ణ, జంగం మోహన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

## చల్లపల్లిలో సెల్‌ఫోన్ దొంగలు

**చల్లపల్లి, న్యూస్‌టుడే:** మండలంలో సెల్‌ఫోన్ దొంగలు తిరుగుతున్నారు. శనివారం వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు నుంచి సెల్‌ఫోన్‌లు దొంగిలించినట్లు సమాచారం. శనివారం రాత్రి చల్లపల్లి సంతబజారులో దుకాణం వద్ద ముగ్గురు వ్యక్తులు ఒకరి వెన్నంటి ఒకరు ఉండి చోరీ చేసేందుకు ప్రయత్నించారు. ఈ పన్నాగం కుదరకపోవడంతో ద్విచక్ర వాహనం స్టార్ట్ చేసి పడిపోయినట్లు నటించడంతో అక్కడే ఉన్న చిట్టీల వ్యాపారి సాయం చేసేందుకు ప్రయత్నం చేయగా వారి వెనకే ఉన్న మరో వ్యక్తి అతని సెల్‌ఫోన్ దొంగిలించినట్లు స్థానికులు తెలిపారు. ఇదే తరహాలో విశ్రాంత వీఆర్వో సెల్‌ఫోన్ చోరీకి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం చల్లపల్లి రైతుబజారు వద్ద జరిగిన సెల్‌ఫోన్ చోరీ సీసీ కెమెరాలో నమోదైనట్లు తెలుస్తోంది. కొంతమంది యువకులు ఇతర ప్రాంతాల నుంచి చల్లపల్లి వచ్చి ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

(c) eenadu

మాక్ కౌన్సెలింగ్ 2025

ఐసెట్

నీట్




**కరెంట్ అఫైర్స్**

◆ నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) కొత్త మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (భారతీయ సినిమాను ప్రోత్సహించే లక్ష్యంతో 1975లో ఎన్ఎఫ్‌డీసీను ఏర్పాటు చేశారు?) జ: ప్రకాష్ మగ్దుమ్

◆ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (POK) ల్లో ఎన్ని

**మాదిరి ప్రశ్నలు**

ప్రధాన ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్ పేరిట రహస్య ఆపరేషన్‌ను నిర్వహించాయి? (26 మంది భారతీయ పౌరులు, భద్రతా సిబ్బంది ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన రెండు వారాల తర్వాత ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు.) జ: 9

◆ 2025, మే 6న భారత్‌తో ఏ దేశం చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) కుదుర్చుకుంది? జ: యునైటెడ్ కింగ్‌డమ్

◆ యెమెన్ నూతన ప్రధానిగా ఎవరు నియమితులయ్యారు? (దేశ ఆర్థిక మంత్రిగా కొనసాగుతున్న ఈయనను యెమెన్ ప్రెసిడెన్షియల్ లీడర్‌షిప్ కౌన్సెల్ కొత్త ప్రధాన మంత్రిగా నియమించింది.)

మరింత సమాచారం

జ: సలేం సలేహ్ బిన్ బ్రైక్



[ఏపీ ఎకానమీ]

# ఉప రంగాలే వృద్ధి చోదకాలు!

## ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలోని రంగాలు

దేశంలో రెండంకెల వృద్ధి రేటు నమోదు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ప్రధానంగా వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక, సేవా రంగాలకు వ్యవసాయ రంగంతో సమాన ప్రాధాన్యం ఉంది. ఈ మూడు ప్రధాన రంగాలు, వాటి అనుబంధ, ఉప రంగాలన్నీ కలిసి రాష్ట్ర వృద్ధి రేటు, తలసరి ఆదాయాలను నిర్ణయిస్తున్నాయి. ఏపీ ఆర్థిక వ్యవస్థ స్వరూపం, జీఎస్‌డీపీలో రంగాలవారీ వాటా, విలువ, వృద్ధి పరంగా ముందంజలో నిలుస్తున్న రంగాలు, ఇటీవలి గణాంకాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల వారీగా అధిక వాటా సమకూరుస్తున్న జిల్లాలు, నిర్దిష్ట వార్షిక వృద్ధి రేటే లక్ష్యంగా రూపొందిన స్వర్ణాంధ్ర ఆశయాలను తెలుసుకోవాలి.



**స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో రంగాలు:** జీఎస్‌డీపీని స్థూలంగా వ్యవసాయం - అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవా రంగం అనే మూడు విభాగాలుగా విభజించారు.

**వ్యవసాయం – అనుబంధ రంగాలు:** వ్యవసాయం, ఉద్యాన ఉత్పత్తులు, పశుసంపద, అటవీ ఉత్పత్తులు, మత్స్య సంపద.



**పారిశ్రామిక రంగంలోని ఉప రంగాలు:** తయారీ పరిశ్రమలు (రిజిస్టర్, రిజిస్టర్ కాని), విద్యుత్తు ఉత్పత్తి, గ్యాస్ ఉత్పత్తి, పరిశ్రమలకు నీటి సరఫరా, నిర్మాణ రంగం, గనులు, తవ్వకాలు.

**సేవా రంగం (తృతీయ రంగం)లోని ఉప రంగాలు:** వర్తకం, హోటల్, రెస్టారెంట్లు, రైల్వే, రోడ్డు, జల, వాయు రవాణా; గిడ్డంగులు, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, బీమా, ఇతర ఆర్థిక సేవలు, రియల్‌ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు, ప్రభుత్వ పరిపాలన, ఇతర సేవలు.

**నోట్:** రాష్ట్ర జీఎస్‌డీపీలో 17 ఉపరంగాలు ఉన్నాయి.

◆ ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర జీఎస్‌డీపీలో అత్యధిక వాటా ఉన్న రంగాలు వరుసగా సేవారంగం, వ్యవసాయం-అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం ఉన్నాయి. అదే స్థిర ధరల వద్ద చూస్తే సేవా రంగం, పారిశ్రామిక రంగం, వ్యవసాయం - అనుబంధ రంగాలు వరుసలో నిలుస్తున్నాయి. ◆ 2023-24లో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీకి వ్యవసాయ అనుబంధ రంగాల్లో అధిక విలువ నమోదు చేసిన ఉప రంగం 'వ్యవసాయం, ఉద్యాన ఉత్పత్తులు'. అధిక వృద్ధిరేటు నమోదైన ఉప రంగం 'పశు సంపద'.

◆ 2023-24లో పారిశ్రామిక రంగంలో అధిక విలువ నమోదు చేసిన ఉపరంగం 'తయారీ పరిశ్రమలు'. అధిక వృద్ధిరేటు నమోదు చేసిన ఉపరంగం 'నిర్మాణ రంగం'.

◆ 2023-24లో సేవారంగం నుంచి అధిక విలువ నమోదు చేసిన ఉప రంగం 'వర్తకం, హోటల్, రెస్టారెంట్'. అధికవృద్ధిరేటు నమోదు చేసిన ఉపరంగం రియల్ ఎస్టేట్.

**ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీలో రంగాల వారీ వాటా (2023 – 24)**

| రంగం | ప్రస్తుత ధరల వద్ద జీఎస్‌డీపీలో వాటా | స్థిరధరల వద్ద జీఎస్‌డీపీలో వాటా |
|---|---|---|
| 1) వ్యవసాయం, అనుబంధ రంగాలు | 34.15% | 29.7% |
| 2) పారిశ్రామిక రంగం | 25.69% | 30.4% |
| 3) సేవా రంగం | 40.16% | 39.9% |
| మొత్తం | 100% | 100% |

**స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ - గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్):** ఒక ఆర్థిక సంవత్సరంలో జిల్లా సరిహద్దులకు లోబడి ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవల విలువను 'స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ)' అంటారు. 2022 - 23 నూతన నివేదిక ప్రకారం 26 జిల్లాల ప్రాతిపదికగా మొత్తం స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ) విలువలో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా అధికంగా ఉన్న జిల్లా ఏలూరు. పారిశ్రామిక రంగం వాటా అధికంగా ఉన్న జిల్లా విశాఖపట్టణం. సేవారంగం వాటా అధికంగా ఉన్న జిల్లా ఎన్‌టీఆర్.

✦ 2022 - 23 గణాంకాల ప్రకారం ప్రస్తుత, స్థిర ధరల వద్ద జీడీడీపీ విలువ ఎక్కువగా ఉన్న మూడు జిల్లాలు వరుసగా విశాఖపట్టణం, ఎన్‌టీఆర్, కృష్ణా. ప్రస్తుత, స్థిర ధరల ప్రకారం జీడీడీపీ విలువ తక్కువ ఉన్న జిల్లా అల్లూరి సీతారామరాజు. ✦ ప్రస్తుత ధరల ప్రకారం తలసరి ఆదాయం ఎక్కువ ఉన్న జిల్లాలు విశాఖపట్టణం (4,83,892), కృష్ణా (3,35,324), ఏలూరు (2,87,481). ✦ స్థిర ధరల ప్రకారం తలసరి ఆదాయం ఎక్కువ ఉన్న జిల్లాలు విశాఖపట్టణం (3,10,968), కృష్ణా (2,11,739), ఎన్‌టీఆర్ (1,66,049). ✦ ప్రస్తుత, స్థిర ధరల ప్రకారం తలసరి ఆదాయం తక్కువ ఉన్న జిల్లా అల్లూరి.

**ప్రస్తుతం, స్థిర ధరల వద్ద జీడీడీపీ (రూ.కోట్లలో)**

| జిల్లా | ప్రస్తుత ధరల వద్ద జీడీడీపీ | స్థిర ధరల వద్ద జీడీడీపీ |
|---|---|---|
| 1) విశాఖపట్టణం | 1,19,268 | 77,498 |
| 2) ఎన్‌టీఆర్ | 73,632 | 44,729 |
| 3) కృష్ణా | 68,301 | 43,530 |

**స్వర్ణాంధ్ర @ 2047:** దేశానికి స్వాతంత్ర్యానంతరం 100 సంవత్సరాల కాలపరిమితిలో 2047 నాటికి కేంద్ర ప్రభుత్వం సాధించాల్సిన లక్ష్యాలను 'వికసిత్ భారత్ @ 2047' పేరుతో నిర్దేశించింది. ఈ లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర @ 2047' విధానపత్రం రూపంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించాల్సిన లక్ష్యాలను పేర్కొంది. 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ 2.4 ట్రిలియన్ డాలర్లుగా నమోదు కావాలి. అలాగే రాష్ట్ర తలసరి ఆదాయం 43,000 డాలర్లకు చేరాలి. రాష్ట్ర ప్రభుత్వ సగటు వార్షిక వృద్ధి రేటు 15%గా ఉండాలనే లక్ష్యాలను స్వర్ణాంధ్ర @ 2047 విధాన పత్రంలో పేర్కొన్నారు.

**ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం**

✸ 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల వద్ద ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ.2,42,479 కాగా, దేశ తలసరి ఆదాయం రూ.1,84,205. అంటే దేశ తలసరి ఆదాయం కంటే ఏపీ తలసరి ఆదాయం ఎక్కువ. 2021 - 22 నుంచి ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ వృద్ధి రేటు భారతదేశ జీడీపీ వృద్ధి రేటు కంటే వరుసగా రెండేళ్లు తక్కువగా ఉంది. కానీ 2023 - 24లో దేశ సగటు వృద్ధి రేటు 9.6% ఉంటే, రాష్ట్ర వృద్ధిరేటు 10.44%గా నమోదైంది. 2021 - 22 నుంచి స్థిరధరల వద్ద రాష్ట్ర వృద్ధి రేటు కంటే భారతదేశ వృద్ధి రేటు అధికంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

✸ 2023 - 24 ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాలు వరుసగా గోవా (రూ. 4,75,401), సిక్కిం (రూ. 4,63,509), దిల్లీ (రూ. 3,76,217). తలసరిఆదాయ పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో 16వ స్థానంలో ఉంది.

| సంవత్సరాలు | ప్రస్తుత ధరల వద్ద తలసరి ఆదాయం(రూ.ల్లో) | వృద్ధిరేటు | స్థిర ధరల వద్ద తలసరి ఆదాయం(రూ.ల్లో) | వృద్ధి రేటు |
|---|---|---|---|---|
| 2021 - 22 | 1,97,214 | 17.35% | 1,21,762 | 9.72% |
| 2022 - 23 | 2,19,881 | 11.49% | 1,26,690 | 4.05% |
| 2023 - 24 | 2,42,479 | 10.28% | 1,35,806 | 7.20% |

**మాదిరి ప్రశ్నలు**

1. కింది వాటిలో పారిశ్రామిక రంగంలోని ఉపరంగం కానిది?
   1) బ్యాంకింగ్, బీమా 2) ఉద్యాన ఉత్పత్తులు 3) రియల్ ఎస్టేట్ 4) పైవన్నీ
2. 2023 – 24 డేటా ప్రకారం ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర జీఎస్‌డీపీలో సేవారంగం వాటా ఎంత శాతం?
   1) 25.69% 2) 34.15% 3) 39.9% 4) 40.16%
3. స్వర్ణాంధ్ర @ 2047 డాక్యుమెంట్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్ర తలసరి ఆదాయం ఎన్ని డాలర్లుగా ఉండాలి?
   1) 42,000 2) 43,000 3) 44,000 4) 45,000
4. 2023 – 24 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీకి సేవారంగం నుంచి అధిక విలువ నమోదు చేసిన ఉపరంగం?
   1) వర్తకం, హోటల్, రెస్టారెంట్లు 2) కమ్యూనికేషన్ 3) రియల్ ఎస్టేట్ 4) బ్యాంకింగ్, బీమా
5. 2022 – 23 ప్రకారం ప్రస్తుతం, స్థిరధరల వద్ద స్థూల జిల్లా ఉత్పత్తి విలువ (జీడీడీపీ) ఎక్కువగా ఉన్న మూడు జిల్లాలు వరుసగా..
   1) విశాఖపట్టణం, కృష్ణా, ఎన్‌టీఆర్
   2) విశాఖపట్టణం, ఎన్‌టీఆర్, కృష్ణా
   3) విశాఖపట్టణం, కృష్ణా, ఏలూరు
   4) విశాఖపట్టణం, ఏలూరు, కృష్ణా
6. రాష్ట్ర జీఎస్‌డీపీలో ఎన్ని ఉపరంగాలున్నాయి?
   1) 9 2) 13 3) 15 4) 17
7. 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ ఎంత ఉండాలని స్వర్ణాంధ్ర @ 2047 విధాన పత్రంలో పేర్కొన్నారు?
   1) 2.1 ట్రిలియన్ డాలర్లు
   2) 2.2 ట్రిలియన్ డాలర్లు
   3) 2.3 ట్రిలియన్ డాలర్లు
   4) 2.4 ట్రిలియన్ డాలర్లు
8. 2022 – 23 డేటా ప్రకారం స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ) విలువలో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా అధికంగా ఉన్న జిల్లా?
   1) ఏలూరు 2) పశ్చిమ గోదావరి 3) తూర్పుగోదావరి 4) కృష్ణా

రచయిత: సుబ్బారెడ్డి


**సమాధానాలు**

1-4; 2-4; 3-2; 4-1; 5-2; 6-4; 7-4; 8-1.

# ముప్పై జిల్లాలను ఆదుకుంటున్న ఆపదమిత్ర!

అకస్మాత్తుగా సంభవించి అప్పటి వరకు ఉన్న సానుకూల వాతావరణాన్ని ధ్వంసం చేసే పెద్ద ప్రమాదమే విపత్తు. ప్రకృతిపరమైన కారణాలకు తోడు మానవకారక విపత్తులు కూడా ఏటేటా పెరిగిపోతున్నాయి. పర్యావరణాన్ని, సమాజ ప్రగతిని విచ్ఛిన్నం చేస్తున్న ఈ విపత్తుల నిర్వచనాలు, రకాలు, వాటిని ఎదుర్కొనే పద్ధతులు, ముందస్తు నివారణ చర్యలు, ఇందుకోసం దేశంలో, ప్రపంచవ్యాప్తంగా ఏర్పాటైన సంస్థలు, హెచ్చరిక వ్యవస్థలు, వాటి విధులు, పరిధితో పాటు దేశంలో విపత్తు నిర్వహణ వ్యవస్థ నిర్మాణం, అమలు చేస్తున్న కార్యక్రమాలు తదితరాలను పోటీ పరీక్షార్థులు విధిగా తెలుసుకోవాలి. దుర్బలతను పెంచుతున్న మానవకారక చర్యలు, దేశాల వారీగా పరిస్థితులు, ఇప్పటి వరకు నిర్వహించిన ముఖ్యమైన సదస్సులు, తీసుకున్న నిర్ణయాలు, సెండాయ్ ఫ్రేమ్‌వర్క్‌లోని కీలకాంశాలు, అమలు తీరుపై అవగాహన కలిగి ఉండాలి.

**విపత్తు నిర్వహణ - ప్రాథమిక భావనలు**

1. విపత్తు అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
   1) ఫ్రెంచ్ 2) గ్రీకు 3) జపనీస్ 4) తెలుగు
2. విపత్తు ఏయే పదాల కలయిక ద్వారా ఏర్పడింది?
   1) చెడు 2) నక్షత్రం 3) 1, 2 4) ఏదీకాదు
3. 'డిజాస్టర్' అనే పదాన్ని ఏ రెండు పదాల నుంచి సృష్టించారు?
   1) డిజాస్టరీ 2) డిజాస్ట్రో 3) 1, 2 4) ఏదీకాదు
4. మానవ కల్పిత విపత్తులు ఏవి?
   1) అగ్నిప్రమాదాలు 2) మహమ్మారి వ్యాధులు 3) రోడ్డు ప్రమాదాలు 4) పైవన్నీ
5. కృత్రిమ విపత్తులు ఏవి?
   1) రసాయన విస్ఫోటాలు 2) అణు ప్రమాదాలు 3) 1, 2 4) ఏదీకాదు
6. 'అకస్మాత్తుగా, పెద్ద దురదృష్టంగా సమాజ నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసే సంఘటనే విపత్తు' అని నిర్వచించింది ఎవరు?
   1) ప్రపంచ బ్యాంకు 2) యూఎన్‌ఓ 3) యునెస్కో 4) ఆసియా అభివృద్ధి బ్యాంకు
7. విపత్తు నిర్వహణపై జె.సి.పంత్ కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 2000 2) 1999 3) 2001 4) 2002
8. జె.సి.పంత్ నేతృత్వంలోని విపత్తు నిర్వహణపై ఏర్పాటు చేసిన కమిటీ గుర్తించిన వైపరీత్యాలు ఎన్ని?
   1) 31 2) 34 3) 35 4) 32
9. ప్రమాదాలకు సంబంధించిన విపత్తులకు ఉదాహరణలు?
   1) కార్చిచ్చు, చమురు ప్రమాదాలు
   2) పట్టణాల్లో అగ్నిప్రమాదాలు
   3) వరుస బాంబు పేలుళ్లు 4) పైవన్నీ
10. శీతోష్ణస్థితికి సంబంధిత సంఘటనలు?
    1) కరవు 2) కార్చిచ్చు 3) హిమానీనదాలు ఉప్పొంగడం 4) పైవన్నీ
11. హజార్డ్ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
    1) గ్రీకు 2) ఫ్రెంచ్ 3) లాటిన్ 4) జపనీస్
12. విపత్తు ముప్పు నిర్వహణలో భాగంగా చేపట్టే కార్యకలాపాల మూడు ముఖ్యమైన దశలు ఏవి?
    1) విపత్తుకు ముందు 2) విపత్తు సమయంలో 3) విపత్తు తర్వాత 4) పైవన్నీ
13. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఎండీఏ) 'ఆపదమిత్ర' అనే పథకాన్ని దేశవ్యాప్తంగా ఎన్ని జిల్లాల్లో అమలు చేస్తోంది?
    1) 30 2) 40 3) 50 4) 120
14. విపత్తు నిర్వహణలో వచ్చేవి?
    1) యథాస్థితికి తీసుకురావడం 2) పునర్ నిర్మాణం 3) మిటిగేషన్ 4) పైవన్నీ
15. ప్రకృతి విపత్తులకు సంబంధించిన రికార్డు నమోదు ఎప్పటి నుంచి జరుగుతుంది?
    1) క్రీ.పూ.310 2) క్రీ.పూ.430 3) క్రీ.పూ.540 4) క్రీ.పూ.1020

**విపత్తు నిర్వహణ**

16. 'ఇన్ ది లైన్ ఆఫ్ ఫైర్: ట్రామా ఇన్ ది ఎమర్జెన్సీ సర్వీసెస్' పుస్తక రచయిత(లు)?
    1) రేగర్ 2) బాబర్ 3) 1, 2 4) ఎవరూకాదు
17. దక్షిణాసియా విపత్తు పీడిత దేశాల్లో అధిక జనాభా కారణంగా, ఎక్కువగా విపత్తులకు గురవుతున్న దేశం/దేశాలు?
    1) భారత్ 2) బంగ్లాదేశ్ 3) 1, 2 4) పాకిస్థాన్
18. అంతర్జాతీయ విపత్తు కుదింపు దినం?
    1) అక్టోబరు 13 2) నవంబరు 13 3) జులై 13 4) ఆగస్టు 13
19. అంతర్జాతీయ విపత్తు కుదింపు దశాబ్దం?
    1) 1990 - 1999 2) 2000 - 2009 3) 1980 - 1987 4) 1970 - 1979
20. పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ ఎక్కడ ఉంది?
    1) స్విట్జర్లాండ్ 2) ఐర్లాండ్ 3) హవాయి 4) న్యూయార్క్
21. ఇంటర్నేషనల్ సునామీ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఎక్కడ ఉంది?
    1) బీజింగ్ 2) న్యూయార్క్ 3) హోనలులు 4) సవన్నా
22. పసిఫిక్ ప్రాంతంలో సునామీ హెచ్చరికల సమన్వయ గ్రూపును ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) న్యూదిల్లీ 2) ప్యారిస్ 3) బీజింగ్ 4) బాన్
23. సార్క్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెంటర్ (ఎస్‌డీఎంసీ) ఎప్పుడు, ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) న్యూదిల్లీ-2006 2) ముంబయి-2008 3) హైదరాబాద్-2009 4) చెన్నై-2010
24. ఎస్‌డీఎంసీ నిర్వహించే వెబ్ పోర్టల్?
    1) sdmc.nic.in 2) s-sdmc.nic.in 3) saarc-sdmc.org.in 4) sdmc-saarc.nic.in
25. ఇంటర్నేషనల్ స్ట్రాటజీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్ (యూఎన్ఐఎస్‌డీఆర్)ను ఎక్కడ, ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) జెనీవా, 1999 2) న్యూయార్క్, 2000 3) సిడ్నీ, 2001 4) సింగపూర్, 1998
26. ఇంటర్ – గవర్నమెంట్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (ఐపీసీసీ)ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1990 2) 1989 3) 1988 4) 1987
27. ఐపీసీసీని ఏర్పాటు చేసిన సంస్థ?
    1) డబ్ల్యూఎంఓ 2) యూఎన్ఈపీ 3) 1, 2 4) ఏదీకాదు




28. ఐపీసీసీ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) జెనీవా 2) హైదరాబాద్ 3) చెన్నై 4) సింగపూర్
29. ఎన్ఐడీఎం ఆధ్వర్యంలో భారత్‌లో మొదటి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కాంగ్రెస్ ఎక్కడ జరిగింది?
    1) న్యూదిల్లీ 2) చెన్నై 3) బెంగళూరు 4) హైదరాబాద్
30. ఇండియా మొదటి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కాంగ్రెస్‌ను ఎవరు ప్రారంభించారు?
    1) అటల్ బిహారీ వాజ్‌పేయీ 2) నరేంద్ర మోదీ 3) మన్మోహన్ సింగ్ 4) రాహుల్ గాంధీ

31. 'హ్యూగో ఫ్రేమ్‌వర్క్ ఫర్ యాక్షన్' గడువు ఎప్పటితో ముగిసిపోయింది?
    1) 2010 2) 2015 3) 2018 4) 2012
32. మూడో యూఎన్‌ఓ విపత్తు ముప్పు కుదింపు ప్రపంచ సదస్సు జపాన్‌లో ఎక్కడ జరిగింది?
    1) కోబె 2) సెండాయ్ 3) టోక్యో 4) నాగసాకి
33. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని లక్ష్యాలను నిర్దేశించారు?
    1) 8 2) 7 3) 6 4) 5
34. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశకత్వంలో భారత ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ ప్రణాళికను ఎప్పుడు విడుదల చేసింది?
    1) 2015, జూన్ 1 2) 2016, జూన్ 1 3) 2017, జూన్ 1 4) 2018, జూన్ 1
35. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అమలులో ఉండే కాలం?
    1) 2015-2030 2) 2010-2020 3) 2010-2025 4) 2015-2025
36. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్‌ను మొదట అమలు చేసిన భారత రాష్ట్రం?
    1) అస్సాం 2) కేరళ 3) ఒడిశా 4) బిహార్
37. బీఐఎస్ ప్రకారం భారత్‌లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విపత్తులకు గురయ్యే ప్రాంతం ఎంత శాతం?
    1) 85% 2) 99% 3) 52% 4) 73%
38. విపత్తు నిర్వహణ సమన్వయానికి నోడల్ డిపార్ట్‌మెంట్‌గా బాధ్యత వహించేది?
    1) కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ 2) పౌర విమానయాన శాఖ 3) కేంద్ర హోంమంత్రిత్వ శాఖ 4) రక్షణ శాఖ
39. 'మేనేజింగ్ డిజాస్టర్ రిస్క్ ఇన్ ఎమర్జింగ్ ఎకానమిస్' ఎవరి నివేదిక?
    1) ప్రపంచ బ్యాంకు 2) ఆసియా అభివృద్ధి బ్యాంకు 3) గృహ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 4) కేంద్ర హోంమంత్రిత్వ శాఖ

40. విపత్తుల వల్ల అత్యధికంగా పశువులను కోల్పోయే రాష్ట్రం?
    1) ఆంధ్రప్రదేశ్ 2) రాజస్థాన్ 3) పశ్చిమ బెంగాల్ 4) పైవన్నీ
41. విపత్తు నిర్వహణపై అంతర్జాతీయంగా ఆన్‌లైన్ కోర్సులను ఏ విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది?
    1) కాప్లన్ విశ్వవిద్యాలయం 2) వాల్డెన్ విశ్వవిద్యాలయం 3) గ్రాండ్ కాన్యాన్ విశ్వవిద్యాలయం 4) పైవన్నీ
42. 'డిజాస్టర్ మేనేజ్‌మెంట్: రీసెంట్ అప్రోచెస్' గ్రంథకర్త ఎవరు?
    1) బి.నారాయణ 2) అరవింద్ కుమార్ 3) జగ్బీర్ సింగ్ 4) బి.సి.బోస్
43. విపత్తులకు గురయ్యే స్వభావాన్ని బట్టి, భారత్‌లో ఉన్న ప్రత్యేక ప్రాంతాలు ఏవి?
    1) హిమాలయ ప్రాంతం, ఎడారి ప్రాంతం
    2) ఒండ్రు మైదానాలు, తీరప్రాంత మండలం
    3) ద్వీపకల్ప ప్రాంతంలో కొండల భాగం
    4) పైవన్నీ
44. విపత్తు నిర్వహణ ప్రణాళిక ప్రధాన లక్షణాలు ఏమిటి?
    1) సరళత 2) లక్ష్య సుద్ధి 3) ఆచరణ సాధ్యం 4) పైవన్నీ
45. కింది వాటిలో విపత్తును తగ్గించే వ్యూహం?
    1) పిల్లలకు స్కూల్ యూనిఫాం ఇవ్వడం.
    2) చౌకగా విద్యుత్తును అందించడం.
    3) బ్యాంకుల నుంచి అప్పులు ఇవ్వడం.
    4) తుపాను షెల్టర్లను నిర్మించడం.
46. ఇండియాలో ఏటా ఎంతమంది ప్రజలు వరదలకు గురవుతున్నారు (మిలియన్లలో)?
    1) 175 మి. 2) 150 మి. 3) 200 మి. 4) 325 మి.
47. మొత్తం దేశంలో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు ఎన్ని విపత్తు ముప్పును కలిగి ఉన్నాయి?
    1) 25 2) 30 3) 31 4) 28
48. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్ అమలు కోసం అస్సాం రాష్ట్రానికి సహాయపడే సంస్థలు ఏవి?
    1) యూనిసెఫ్ 2) యూఎన్ఐఎస్‌డీఆర్ 3) 1, 2 4) ఏదీకాదు
49. ఆసియన్ డిజాస్టర్ రిడక్షన్ సెంటర్ ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1998 2) 2002 3) 2004 4) 2006

**సమాధానాలు**

1-2; 2-3; 3-3; 4-4; 5-3; 6-2; 7-2; 8-1; 9-4; 10-4; 11-2; 12-4; 13-1; 14-4; 15-2; 16-3; 17-3; 18-1; 19-1; 20-3; 21-3; 22-2; 23-1; 24-3; 25-1; 26-3; 27-3; 28-1; 29-1; 30-3; 31-2; 32-2; 33-2; 34-2; 35-1; 36-1; 37-1; 38-1; 39-1; 40-4; 41-4; 42-2; 43-4; 44-4; 45-4; 46-3; 47-1; 48-3; 49-1.


(c) eenadu

## ఎక్కాలంటే గండం.. దిగాలంటే నరకం..

ఇంద్రకీలాద్రి: ఆదివారం భక్తులు పోటెత్తారు. దుర్గాఘాట్ నుంచి కొండపైకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన దేవస్థానం బస్సులు చాలక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల్లో కిక్కిరిసి చంటిబిడ్డలతో ఇబ్బందులు పడుతున్నారు. వారాంతం, సెలవు రోజుల్లో అదనపు బస్సులు వేయాలని కోరుతున్నా ఫలితం ఉండటం లేదు. బస్సులు చాలీచాలని వేళ... ఇలా బస్సు ఫుట్‌పాత్‌పై వేలాడుతూ కొండపైకి వెళ్లే మార్గంలో గాయాల పాలవుతున్నామని భక్తులు వాపోతున్నారు.

– ఈనాడు, అమరావతి

## కాలువలకు 12,788 క్యూసెక్కుల సాగునీరు

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 12,788 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు(కేఈబీ) ప్రధాన కాల్వకు 9,781, కృష్ణా పశ్చిమ(కేడబ్ల్యూ) ప్రధాన కాల్వకు 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 5,017, ఏలూరు కాల్వకు 1,404, బందరు కాల్వకు 1,853, కేఈబీ (బిసినెస్) కాల్వకు 1,507 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు.



## వినతుల స్వీకరణ నేడు

**ఎన్టీఆర్ కలెక్టరేట్:** జిల్లాలో ఈనెల 14వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని వెల్లడించారు. విజయవాడ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు వినతులు స్వీకరిస్తామని వివరించారు.

**మీకోసం వెబ్‌సైట్‌లోనూ దాఖలు:** ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని సూచించారు.

## ఘాటెక్కిన పచ్చి మిర్చి

**ఎన్టీఆర్ కలెక్టరేట్:** పచ్చి మిర్చి ధర పెరుగుతోంది. నగరంలోని రైతు బజార్లలో శని, ఆది వారాల్లో కిలో రూ.65 చొప్పున విక్రయించారు. ఈనెల ఒకటో తేదీన కిలో రూ.32 ఉన్న మిర్చి ధర క్రమేపీ పెరుగుతోంది. 5న రూ.38, 6న రూ.42 ఉండగా, ఏడో తేదీన ఏకంగా రూ.60 లకు పెరిగింది. 8న రూ.66 ధర ఉండగా, 9న రూ.54లకు తగ్గింది. 10న రూ.50లకు తగ్గగా, 11న రూ.52లకు, 12న రూ.65లకు పెరిగింది. బాపట్ల జిల్లాలో స్థానిక పంట అయిపోయింది. ఆ తర్వాత ఉమ్మడి కడప జిల్లా బాలాగారిపల్లె నుంచి రాగా అక్కడా సరుకు అయిపోవడంతో.. ప్రస్తుతం పులివెందుల నుంచి తక్కువగా, కర్నూలు జిల్లా నుంచి ఎక్కువగా వస్తోంది. తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి డిమాండ్ ఉండటంతో ధరలు పెరుగుతున్నాయి. కర్ణాటక నుంచి నల్ల మిర్చి అందుబాటులో ఉన్నా.. దీన్ని కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే నల్ల మిర్చి తెస్తారు.

**తగ్గిన విక్రయాలు:** ఇటీవల కాలంలో పచ్చి మిర్చి రూ.15లకు విక్రయించిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ధర లేక మిర్చి సాగుపై రైతులకు ఆసక్తి తగ్గినట్లు చెబుతున్నారు. స్థానిక పంట వస్తే గానీ ధరలు అదుపులోకి వచ్చే పరిస్థితి లేదు. ధర తక్కువగా ఉంటే నగరంలోని ఒక రైతుబజారులో రోజుకు 15 నుంచి 16 క్వింటాళ్ల సరకు విక్రయిస్తుంటారు. ధర పెరగడంతో కొనుగోళ్లు 8 క్వింటాళ్లకు పడిపోయాయి..

# విలక్షణ కోట.. విలువల పూదోట

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, కంకిపాడు, గవర్నర్‌పేట, భవానీపురం

*విలక్షణ నటుడు... కోట శ్రీనివాసరావు.* ఆయనకు కృష్ణా జిల్లాతోనూ.. విజయవాడ నగరంతోనూ విడదీయలేని అనుబంధం ఉంది. కంకిపాడులో పుట్టి పెరిగిన కోట.. నటనలో తొలి అడుగులు ఇక్కడే వేశారు. విజయవాడలో కొన్నాళ్లు నివాసం ఉన్నారు. నగరంలో కళా, నాటక ప్రదర్శనలను చూసే ఆయన స్ఫూర్తి పొందారు. నటుడిగానే కాక ప్రజాప్రతినిధిగా, నాయకుడిగా అనేక కార్యక్రమాలనూ నిర్వహించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా.. సేవలందించిన వేళ కళలు, కళాకారులను ఎంతో ప్రోత్సహించారు.

కోట శ్రీనివాసరావుకు కళారంగమంటే అమితమైన ఇష్టం. సినిమాల్లోకి వెళ్లక ముందు విజయవాడలో ఉన్నారు. కోటకు.. వన్‌టౌన్ కొత్త గుళ్ల వద్ద మూడు సొంత ఇళ్లు ఉండేవి. ఒకదానిలో తానుండి, మిగతావి చాలా తక్కువకు కళాకారులకు అద్దెకు ఇచ్చేవారు. అప్పట్లో రూ.3 వేలు అద్దె వచ్చే ఇంటిని రూ.800కే కళాకారులకు ఇచ్చేవారని ఆయన సన్నిహితులు గుర్తుచేసుకున్నారు.

**కళాక్షేత్రానికి వెళ్లాల్సిందే...** కొత్త గుళ్ల సెంటర్ నుంచి రోజూ రిక్షాలోనే లోబ్రిడ్జి మీదుగా విజయవాడలో పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చేవారు. మధ్యలో కళాక్షేత్రంలో ఏవైనా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటే కచ్చితంగా ఆగి వీక్షించేవారు. కళలపై ఆసక్తితో నాటక రంగం వైపు ఆకర్షితులయ్యారు. సినిమా రంగానికి వెళ్లినా బెజవాడను మరవలేదు. తూర్పు ఎమ్మెల్యే అయ్యాక నగర కళా రంగంతో ఆయనకు అనుబంధం మరింత పెరిగింది.

### జంధ్యాల పురస్కారమిక్కడే...

2001లో సుమధుర కళా నికేతన్ సంస్థ జంధ్యాల పురస్కారంతో విజయవాడలో కోటను ఘనంగా సత్కరించింది. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అనేక కళా ప్రదర్శనలు, సభలకు కోటా తరచూ ఎమ్మెల్యే హోదాలో హాజరయ్యేవారు.

1995లో పునాదిపాడులో కబడ్డీ విజేతలకు షీల్డ్ ప్రదానం సందర్భంగా విద్యార్థులతో...

### నేనేమైనా చిరంజీవినా.. బాలకృష్ణనా?

కోట పదేళ్ల కిందట కంకిపాడు వచ్చినప్పుడు.. నలుగురు విద్యార్థినులు ఆయన దగ్గరకు వచ్చి "మీతో ఫొటో దిగుతాం సార్.. మీరన్నా, మీ నటనన్నా ఇష్టమని" చెప్పారు. దీంతో ఆయన తన సహజశైలిలో నవ్వుతూ.. "నేను చిరంజీవో.. బాలకృష్ణో కాదు కదా.. నేను ఇష్టం అనడానికి.." అని చమత్కరించారు. "నాతో ఫొటో దిగాలనే కదా.. నాకు బిస్కెట్ వేస్తున్నారని" అనడంతో అక్కడున్న వాళ్లందరి ముఖంలోనూ నవ్వులు పూశాయి. ఆ తర్వాత విద్యార్థినులతో ఫొటో దిగి.. "చూశారా, ఈతరం పిల్లలు ఎంత తెలివితేటలతో పుడుతున్నారో.." అని చమత్కరించారు.

### మీ కార్యక్రమానికి నేను రావచ్చా..

సుందర హనుమాన్ ధార్మిక పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో 2003లో సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలను విజయవాడలోని రామకోటిలో ఏర్పాటు చేశారు. షణ్ముఖశర్మకు అదే మొదటి కార్యక్రమం. అప్పట్లో ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు ఉన్నారు. షణ్ముఖశర్మ కార్యక్రమం ఉందని తెలిసి నిర్వాహకులకు ఫోన్ చేసి మరీ... నేను రావచ్చా అని కోట అడిగారు. దీంతో నిర్వాహకులు ఆనందంతో ఆయనను ఆహ్వానించారు. కోట శ్రీనివాసరావు చేతుల మీదగానే కార్యక్రమాన్ని ఆరంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఆయనకు ఉన్న ఇష్టానికి ఇది నిదర్శనం.

విజయవాడలో భాజపా నాయకులతో కలిసి ప్రజాప్రదర్శన

### కంకిపాడులో చదువు.. విజయవాడలో వెలుగు

**స్వగ్రామంపై మమకారం...**

కంకిపాడులో మధ్యతరగతి కుటుంబంలో కోట శ్రీనివాసరావు పుట్టారు. సినీరంగాన మేటిగా ఎదిగినా.. కంకిపాడుపై తరగని మమకారం. గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. తర్వాత పునాదిపాడులో హైస్కూలు విద్య చదివారు. బాల్యం నుంచి హాస్యోక్తులతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆకట్టుకునేవారు. కోట తండ్రి.. సీతారామాంజనేయులు. ఆయన... డాక్టర్‌గా సుపరిచితులు. తండ్రి క్రమశిక్షణ, అంకితభావమే తనకు స్ఫూర్తి అనీ.. ఎంత ఎదిగినా ఒదగాలనేది తండ్రి నుంచే నేర్చుకున్నానని కోట గుర్తు చేసుకునేవారు. కంకిపాడు బ్రాహ్మణ సంఘానికి కోట శాశ్వత గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు.



2012లో కంకిపాడు వచ్చినప్పుడు స్థానికులతో..

### నా అన్నే... తొలి గురువు..

కోట శ్రీనివాసరావు అన్న నరసింహారావు.. మంచి రంగస్థల నటుడు. ఆయన దర్శకత్వంలో రాష్ట్రంలో వందలసార్లు ప్రదర్శించిన 'వీరమ్మతల్లి', 'పుణ్యవతి' నాటకాల్లో కోట ప్రధాన పాత్ర పోషించారు. నటనలో 'అన్నే... నా తొలి గురువని' పలు మార్లు కోట చెప్పేవారు.

తమ్ముడు శంకరరావు, అన్న నరసింహారావులతో..

### కల్యాణ మండపం కట్టాలనుకున్నా...

కోట.. తనకు వారసత్వంగా వచ్చిన కంకిపాడులోని స్థలంలో పేద, మధ్యతరగతి వారి కోసం కల్యాణ మండపం నిర్మించాలని భావించారు. కానీ.. ఆరోగ్య సమస్యలు ఎదురవడంతో ఆయన కోరిక నెరవేరలేదు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కంకిపాడులో నిర్మించిన గాయత్రీ ధ్యాన మందిరానికి కోట భారీ విరాళం అందజేశారు. సమయం దొరికిన ప్రతిసారీ కంకిపాడు వచ్చి బాల్యమిత్రులు, సంఘం సభ్యులు, గ్రామస్థులతో ఉల్లాసంగా గడిపేవారు.

గాయత్రీ ధ్యాన మందిరం

### విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా సేవలు..

ఎన్డీయే కూటమి పొత్తులో భాగంగా 1999లో విజయవాడ తూర్పు నుంచి భాజపా ఎమ్మెల్యే అభ్యర్థిగా కోట శ్రీనివాసరావు బరిలో దిగారు. కోట శ్రీనివాసరావుకు 57,047 ఓట్లు.. కాంగ్రెస్ అభ్యర్థి ఐలాపురం వెంకయ్యకు 50,971 ఓట్లు వచ్చాయి. 6,076 ఓట్ల ఆధిక్యంతో కోట ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత పునర్విభజనలో నాటి తూర్పు పరిధిలోని అధిక భాగం నేటి సెంట్రల్ నియోజకవర్గంగా మారింది. అప్పటి కంకిపాడు నియోజకవర్గంలోని కొంత భాగం వేరుచేసి ప్రస్తుత విజయవాడ తూర్పు నియోజకవర్గం ఏర్పాటు చేశారు. కోట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ప్రస్తుత సూర్యారావుపేట రాణా భవన సముదాయం ప్రారంభించారు. నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన హయాంలో రూపకల్పన చేశారు. డీస్నీల్యాండ్‌లో భాజపా రాష్ట్ర సమావేశాలను విజయవంతంగా నిర్వహించారు. భాజపా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతూనే.. ప్రజాప్రదర్శన నిర్వహించారు.

# డబ్బుల కోసమే హతమార్చారు?

## శ్రీకాళహస్తి సెల్‌ఫోన్ దుకాణదారుడి చాకచక్యంతో చిక్కిన నిందితులు

**పటమట, న్యూస్‌టుడే:** విశ్రాంత ఇంజినీర్ రామారావుని డబ్బుల కోసమే హత మార్చినట్లు పోలీసుల విచారణలో ప్రాథమికంగా తేలింది. రామారావుని హత మార్చి పరారైన పల్లెపు మంగ, ఉపేంద్ర రెడ్డిని మాచవరం పోలీసులు శనివారం రాత్రి 10 గంటల సమయంలో శ్రీకాళహస్తిలో అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం వాళ్లిద్దరినీ విజయవాడ నగరానికి తీసుకువచ్చారు.

★ మంగ ఈ ఏడాది మే 28న ఉపేంద్ర రెడ్డిని శ్రీకాళహస్తిలో మూడో వివాహం చేసుకుంది. తరువాత నందు మొబైల్స్ దుకాణంలో ఇద్దరికీ కొత్త సిమ్‌లు తీసుకున్నారు. ఉపేంద్రరెడ్డి శివ భక్తుడు. ప్రతినెలా శ్రీకాళహస్తి వచ్చి దర్శనం చేసుకుంటాడు. ఆ కోణంలో పోలీసులు ఆలోచించి సెల్‌ఫోన్ దుకాణ యజమానికి ఫోన్ చేసి విషయం చెప్పారు. వారి ఫొటోలు, వివరాలు అందజేశారు. అనుకున్నట్లే ఆదివారం రాత్రి కొత్త సిమ్ కొనేందుకు ఆ దుకాణానికి వెళ్లారు. దుకాణ యజమాని వెంటనే మాచవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు తమ పై అధికారులకు విషయం చెప్పారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పోలీసులు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ప్రక్రియ అంతా పది నిమిషాల్లో ముగిసింది. తరువాత ఎస్ఐ శంకర్ బృందం వారిని విజయవాడ తీసుకువచ్చింది.

**పొంతన లేని సమాధానాలు:** విచారణలో మంగ పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రామారావు తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని, ఉపేంద్రకు ఫోన్ చేసి విషయం చెబితే అతను వచ్చి అడగడంతో వివాదం చోటు చేసుకుందని, రామారావే ముందుగా చేయి చేసుకోవడంతో కోపంలో ఘటన జరిగిందని చెప్పుకొచ్చింది. బీరువాలో నగదు ఎందుకు తీశావంటే సమాధానం చెప్పట్లేదు. నాలుగు రోజుల కిందట రామారావు కుమార్తె చందన వచ్చి కొంత నగదు రామారావుకు ఇచ్చింది. అది మంగ చూసింది. బీరువాలో పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని ఊహించి ఉపేంద్రతో కలిసి ప్రణాళిక వేసుకున్నట్లు తెలిసింది.

★ గురువారం రాత్రి రామారావు నిద్రపోయిన తర్వాత ఉపేంద్రకు ఫోన్ చేసి పిలిచింది. ఇంటి వెనుక తలుపు తీసి లోపలికి తీసుకెళ్లింది. రాత్రి 12 గంటలకు బెడ్ రూమ్‌లో పడుకున్న రామారావు ఛాతిపై ఉపేంద్ర కూర్చొని దిండుతో ముఖంపై అదమగా, రామారావు కాళ్లని మంగ పట్టుకుంది. చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత అతనిపై కారం చల్లారు. బీరువా తెరిచి చూస్తే అందులో రూ.50 వేలు మాత్రమే ఉన్నాయి. ఇల్లు అంతా వెతికినా బంగారం, నగదు దొరక్కపోవడంతో అవి తీసుకుని పరారయ్యారు.

# వెలితి తీర్చాలి.. వెలుగు తేవాలి..!

## కూటమి సర్కారు చొరవతో కానూరు పైవంతెన పూర్తి

ఈనాడు, అమరావతి – కానూరు, న్యూస్‌టుడే

'జగన్ ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోకుండా వదిలేసిన కానూరు సిద్ధార్థ కళాశాల పైవంతెనను కూటమి సర్కారు రాగానే.. యుద్ధప్రాతిపదికన అందుబాటులోకి తేవడం హర్షణీయం. కానీ.. ఆ వంతెన మీదుగా వెళ్లే రహదారిపై వేయాల్సిన వీధి దీపాలను నేటికీ వేయలేదు. నిత్యం వేల మంది రాత్రుళ్లు ఇటుగా రాకపోకలు సాగిస్తున్నారు. విద్యుద్దీపాలు లేక.. పెనమలూరు రాణా నుంచి తాడిగడప వందడుగుల రోడ్డు వరకూ చిమ్మచీకట్లు అలముకొని.. ప్రమాదాలు జరుగుతున్నాయి."

విజయవాడ నగరాన్ని శివారు ప్రాంతాలను కలిపే కీలకమైన అనుసంధానం... కానూరు పైవంతెనే. వీధి దీపాల కోసం రూ.40 లక్షలు మంజూరయ్యాయని.. తాడిగడప మున్సిపాలిటీ అధికారులు ప్రకటించి ఎనిమిది నెలలైంది. వంతెన మీదుగా వందడుగుల రహదారి వరకూ సెంట్రల్ లైటింగ్ వేస్తామన్నారు. కానీ.. రహదారి పక్కన డ్రెయినేజీ పనులు పూర్తి కాక.. సెంట్రల్ లైటింగ్ పనులు అడుగు పడటంలేదు.

**కాలువల జాప్యంతో ఆగిన విస్తరణ..** పెనమలూరు రాణా నుంచి సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల మీదుగా వందడుగుల రోడ్డు వరకు రూ.కోటిన్నరతో ఇరువైపులా కాలువల పనులు చేపడుతున్నారు. ఒకవైపు పూర్తవగా.. మరోవైపు నిర్మాణాల తొలగింపుతో జాప్యమైంది. ఇక్కడ కొన్ని విద్యుత్తు స్తంభాలు, ఓ ఆలయం ఉన్నాయి. దీంతో అలైన్‌మెంట్ మార్చి.. పనులు చేసేలా అధికారులు ప్రతిపాదించారు. మరో 300 మీటర్ల పొడవైన కాలువనూ నిర్మించాలి. ఇవి పూర్తయ్యాకే దారిని విస్తరించి.. సెంట్రల్ లైటింగ్ పనులు చేపడతారు. అందుకే డ్రెయినేజీ పనులను త్వరగా చేయించాలి.

**బందరు రోడ్డుకు ప్రత్యామ్నాయం..** పంటకాలువ రహదారి పూర్తిగా అందుబాటులోకి వచ్చాక బందరు రోడ్డుకు ప్రత్యామ్నాయ మార్గంగా మారింది. నిత్యం వేల వాహనాలు బందరు రోడ్డుపై కాకుండా.. పైవంతెన మీదుగా తాడిగడప చేరుతున్నాయి. ఆపై నగర శివార్లలో జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. కానీ.. కిలోమీటరుకు పైగా పైవంతెన

### కానీ విద్యుద్దీపాలు లేక.. నిత్యం ప్రమాదాలు

వద్ద అంధకారం నెలకొని తరచూ వాహనదారులు ఎదురెదురుగా వచ్చి ఢీ కొని పడిపోతున్నారు. రాత్రి 7 గంటల నుంచిఅర్ధరాత్రి వరకూ వంతెన మీదుగా వాహనాలు భారీగానే వెళ్తున్నాయి.

### దత్తత తీసుకున్న ఎమ్మెల్యే ..

సిద్ధార్థ పైవంతెన నుంచి వందడుగుల రోడ్డు వరకు కిలోమీటరు రహదారిని ఎమ్మెల్యే సుజనాచౌదరి దత్తత తీసుకున్నారు. ఆయన నివాసం ఇక్కడే ఉండటంతో రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రణాళికలూ సిద్ధం చేయించారు. డ్రెయినేజీ పనులు పూర్తయితే రహదారిని విస్తరించి, మధ్యలో సెంట్రల్ లైటింగ్ వేస్తారు.

### నెలలో డ్రెయినేజీ పనుల పూర్తి

డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తున్నాం. కొలిక్కి రాగానే సెంట్రల్ లైటింగ్ పనులు చేపడతాం. ఈనెల ఆఖరులోగా పూర్తిచేయాలని గుత్తేదారు, అధికారులను ఆదేశించాం.

– నజీర్, కమిషనర్, తాడిగడప

# ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింటా అందాలు

**భవానీపురం, న్యూస్‌టుడే:** కృష్ణానదీ తీరంలో చిన్నారులు, యువత వేసిన ఫ్లోర్ పెయింటింగ్, బొమ్మలు ఆకట్టుకున్నాయి. జిల్లా అధికారులు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బరంపార్కు ఘాట్ వద్ద ఆదివారం పెయింటింగ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. యువత, చిన్నారులు సృజనకు పదును పెట్టారు. చిన్నారులు, యువతతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర ఫ్లోర్ పెయింట్ వేశారు. కుమారుడితో కలిసి కలెక్టర్ పీ4 బొమ్మకు రంగులు అద్దారు. అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో మిగిలిన వారిలోనూ ఉత్సాహం నెలకొంది.

చిన్నారులతో కలిసి పెయింటింగ్ వేస్తున్న కలెక్టర్

## ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌కు 746 మంది హాజరు

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి సంబంధించి విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌కు ఆదివారం 746 మంది అభ్యర్థులు హాజరై తమ ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేయించుకున్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగాల్లో 60,001 నుంచి లక్ష ర్యాంకు వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలిచారు. ఎన్‌సీసీ విభాగంలో 260 మంది, క్రీడా విభాగంలో 103 మంది హాజరయ్యారు. ఆర్మీ సంతతి విభాగంలో ఒకటి నుంచి 50,000 ర్యాంకుల వరకు పిలవగా.. 383 మంది వచ్చారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. 14వ తేదీన ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగంలో 1,00,001 - 1,50,000 ర్యాంక్ వరకు, ఆర్మీ విభాగంలో 50,001 - 1,00,000 ర్యాంకు వరకు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రావాలని ఆయన తెలిపారు.

# నవ్యతే నేస్తమై.. నడిపించే అస్త్రమై

★ టెక్ @ఎన్టీఆర్ కమిషనరేట్

★ నూతన ఆవిష్కరణలకు వేదిక..

న్యూస్‌టుడే, విజయవాడ నేరవార్తలు

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్.. రాష్ట్రంలో మార్మోగుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో మేటిగా నిలిచింది. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో తనదైన ప్రత్యేకత చాటుతూ.. నూతన ఆవిష్కరణలకు వేదిక అవుతోంది. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై పట్టున్న ఎస్.వి.రాజశేఖరబాబు.. సీపీగా కొలువుదీరాక అనేక మార్పులకు శ్రీకారం చుట్టడం.. సత్ఫలితాలను ఇస్తోంది.

**సకల జన... 'సురక్ష':** ప్రతి ఠాణాలో అన్ని వర్గాల ప్రజలతో 'సురక్ష' కమిటీలు వేశారు. తర్వాత 'సురక్ష 360' పేరుతో అపార్ట్‌మెంట్లు, కాలనీలు, గ్రామాల్లో పూర్తిగా సీసీ కెమెరాలు పెట్టారు. హోంమంత్రి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. తాజాగా 'సురక్ష డిజైన్' పేరుతో ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలకు శ్రీకారం చుట్టారు.

**యాప్‌తోడు.. సేవలు మెండు:** వీఐపీ పర్యటనలు, పండగల వేళ శరవేగ బందోబస్తుకు ప్రత్యేకంగా 'ఏపీ పోలీస్ ఈ డిప్లాయిమెంట్' యాప్‌ను తెచ్చారు. దీంతో నిమిషాల్లో బందోబస్తు వేసే వీలుండటంతో ప్రశంసలు అందుకుంది. డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా దీనిని రాష్ట్రవ్యాప్త అమలుకు నిర్ణయించారు. ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ టూల్‌తో 'అస్త్రం' యాప్ రూపొందించారు. నగర ట్రాఫిక్ సమస్యలను క్షణాల్లో గుర్తించి సరిచేసేలా తీర్చిదిద్దారు. 'ఇ-పహారా' యాప్‌తో బీట్ సిస్టమ్ తెచ్చి.. రాత్రుళ్లు అన్ని ప్రాంతాల్లో నిఘా సులభతరం చేశారు.

మహిళా కానిస్టేబుళ్లకు డ్రోన్ పైలట్లగా శిక్షణ

**సైబర్ నేరాలపై.. కమాండోస్ సైరన్:** 'డిజిటల్ అరెస్టు'.. ప్రజలను వణికించింది. రూ.కోట్లు దోచేస్తున్న సైబరాసురులను ఎదుర్కొనేలా సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయించారు. ప్రజలకు అవగాహన కలిగించి.. భరోసా కల్పించేలా 'సైబర్ కమాండోస్' రూపొందించారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే 3 లక్షల మందిని సిద్ధం చేశారు.

**డ్రోన్ విప్లవంతో భళా...:** కమిషనరేట్‌లో డ్రోన్ విప్లవం.. మరో మేలిమలుపు. ట్రాఫిక్ నియంత్రణేకాక.. పోలీసులు వెళ్లలేని మారుమూలలకూ డ్రోన్లను పంపి అసాంఘిక శక్తుల ఆట కట్టించారు. ఇందుకు ప్రతి ఠాణాకు ఒక డ్రోన్ కేటాయించారు. 70 మంది మహిళా పోలీసులకు డ్రోన్ నిర్వహణలో శిక్షణ ఇచ్చి డ్రోన్ పైలట్లుగా తీర్చి దిద్దారు.

**ప్రతీ క్షణం.. నిశిత నిఘా:** శాంతిభద్రతల రక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్ పరిశీలనకు సీసీ కెమెరాలను పూర్తిగా అమర్చారు. నేరాలను చాలా వరకు వీటి సాయంతో కట్టడి చేశారు. ప్రతి కూడలిలో ట్రాఫిక్‌పై నిఘా పెంచి ఉల్లంఘనులకు జరిమానాలు వేస్తున్నారు. ఏడాది వ్యవధిలో 428 చోరీ కేసులు నమోదవగా.. 280 కేసులు ఛేదించారు. రూ.7.16 కోట్ల సొత్తు చోరీకి గురవగా.. రూ.6.07 కోట్లు రికవరీ చేయగలిగారు.

సీసీ కెమెరాల ద్వారా బందోబస్తు పర్యవేక్షణ

### వినూత్న పథంలో ముందుకు..

★ ఏడాదిలో మూడుసార్లు చోరీకి గురైన... 1400 చరవాణులను పట్టేసి సొంతదారులకు అప్పగించారు. ★ హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితుల కుటుంబాలకు రూ.8.95 కోట్లు పరిహారం ఇప్పించారు. ★ కమాండ్ కంట్రోల్ కేంద్రం ఆధునికీకరణ ★ 350 మంది ట్రాఫిక్ అంబాసిడర్ల నియామకం. ★ గంజాయి నేరస్థులపై పిట్ ఎన్డీపీఎస్ యాక్ట్ ★ రౌడీషీటర్ల పూర్తి వివరాల కంప్యూటరీకరణ ప్రత్యేకతగా నిలిచాయి.

## ఈదుతూ.. సేద తీరుతూ!

కరకట్ట వద్ద కృష్ణానదిలో ఈత కొడుతున్న నగరవాసులు

రోజంతా చదువులు, ఉద్యోగాలు, వ్యాపార కార్యకలాపాలు, వివిధ పనులు నిమిత్తం బిజీబిజీగా కాలం గడిపే విజయవాడ నగర వాసులు, విద్యార్థులు వారాంతం ఆదివారం వచ్చిందంటే చాలు కృష్ణమ్మ ఒడిలో వాలిపోతున్నారు. కుటుంబాలతో సహా తెల్లవారుజామున 5 గంటలకే ప్రకాశం బ్యారేజి కరకట్ట వద్దకు చేరుకుని కృష్ణా నదిలో ఈత కొడుతూ సేద తీరుతున్నారు. నిత్యం వచ్చి సాధన చేసే వారితో పాటు వారాంతంలో వచ్చే వారు కూడా తోడవటంతో నదీ తీరమంతా సందడిగా మారుతోంది. - ఈనాడు అమరావతి

## రెండో విడత ప్రవేశాలకు 907 మంది ఎంపిక

**వేంపల్లె, న్యూస్‌టుడే :** రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు రెండో విడత ప్రవేశాల కోసం ఎంపికైన 907 మంది విద్యార్థుల జాబితాను ఆదివారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ విడుదల చేశారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థుల పేర్లను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొదటి విడతలో ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 628 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలలో చేరలేదు. దీంతో ఆ సీట్లు ఖాళీపడ్డాయి. వీటితో పాటు దివ్యాంగుల కోటా కింద 179, సైనికోద్యోగుల పిల్లల కోటా కింద 80, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 20 సీట్లతో కలిపి మొత్తం 907 సీట్లకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి వారి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇందులో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి 96 మంది, ఒంగోలుకు 460, నూజివీడుకు 85, శ్రీకాకుళానికి 265 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్‌సీసీ కోటా కింద 40 సీట్లు, క్రీడా కోటా కింద 20 సీట్లకు నిపుణులైన ఆయా శాఖల అధికారుల నుంచి విద్యార్థుల మెరిట్ జాబితా అందాల్సి ఉంది. ఈ సీట్ల భర్తీ కూడా మరో వారంలో పూర్తి కానుంది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 96 మంది విద్యార్థులు ఈ నెల 17న ఇడుపులపాయకు, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 810 మంది విద్యార్థులు అదే రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరిగే కౌన్సెలింగ్‌కు ధ్రువపత్రాలు, లగేజీలతో హాజరు కావాలని వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. కొత్తగా ఎంపికైన విద్యార్థులందరికీ సోమవారం నుంచి ఓరియెంటేషన్ తరగతులు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

## జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి సమీక్ష నేడు

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ ఈనెల సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని ఎ.వి.ఎస్.రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలో షెడ్యూలు కులాల జనాభా స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల లబ్ధి, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతుల స్థితి, ప్రభుత్వ పరంగా వారికి కల్పించిన సౌకర్యాలు, తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై ఆయన సమీక్షిస్తారు. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ (ఎన్సీఎస్సీ) డైరెక్టర్ జి.సునీల్‌కుమార్‌బాబు పాల్గొంటారు.

## నగదు అవకతవకలపై సీబీఐ అధికారుల దర్యాప్తు

**జి.కొండూరు, న్యూస్‌టుడే:** మండలంలోని సున్నంపాడు పోస్టాఫీస్‌లో నగదు గల్లంతైన విషయంపై ఆ గ్రామంలో ఆదివారం సీబీఐ అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు సర్పంచి దేశం సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ గ్రామంలో డిపాజిట్‌దారుల నగదు ఏ విధంగా దోపిడీకి గురైంది, ఎవరి ఖాతాలో ఎంత నగదు గల్లంతైందో బాధితుల నుంచి వివరాలు సేకరించినట్లు అధికారులు తెలిపారు. రూ.35 లక్షలు పైబడి డిపాజిటర్ల నగదు స్వాహా జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు సీబీఐ సీఐ నరేష్ తెలిపారు. ఆయనతో పాటు హెడ్‌కానిస్టేబుల్ కమ్రుద్దీన్, గ్రామస్థులు విచారణలో పాల్గొన్నారు.

## చిక్కడు.. దొరకడు

### బెంగళూరు డ్రగ్స్ సూత్రధారి దోబూచులాట

**విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే:** అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాదకద్రవ్యం 'మెత్' స్వాధీనం చేసుకున్న కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. ఈ కేసులో ముగ్గురు యువకులను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 5.2 గ్రాముల మెత్‌ను స్వాధీనం చేసుకున్నారు. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురానికి చెందిన గౌర శ్రీరాం వెంకట మణికంఠ బెంగళూరు నుంచి మెత్ తీసుకు వచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీనిపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టగా ఆసక్తికర విషయాలు వెలుగు చూసాయి..

మాదకద్రవ్యం విక్రయించే ముఠా పోలీసులకు దొరక్కుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు విచారణలో గుర్తించారు. బెంగళూరులోని పబ్‌లో ఆకాశ్ అనే యువకుడు మణికంఠకు పరిచయమయ్యాడు. డ్రగ్స్ సరఫరాలో అతనిదే కీలకపాత్ర అని గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సమాచారం ఇచ్చి పుచ్చుకుంటారు. డ్రగ్స్ కోసం వేర్వేరు వ్యక్తుల నెంబర్లకు యూపీఐ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తారు. ఆ తరువాత ఆకాశ్ రంగంలోకి వస్తాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో డ్రగ్స్ ఎక్కడ ఉంచాడో చెబుతాడు. దీని కోసం వీరు జాతీయ రహదారులను ఎంపిక చేసుకుంటారు. ఫలానా ప్రదేశంలో ఉంచి ఆ సమాచారాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేస్తారు. తరువాత ఆ వివరాలు తొలగిస్తారు. చరవాణిపై పోలీసులు నిఘా ఉంచడంతో..తద్వారా నిందితులు పోలీసులకు దొరికిపోతున్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు వీరు ఇన్‌స్టాగ్రామ్‌ను ఎంచుకున్నారు. పోలీసులకు దానిపై నిఘా లేకపోవడంతో సులువుగా వీరి లావాదేవీలు జరిగిపోతున్నాయి. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు దీనికి సంబంధించిన కీలకమైన సమాచారం సేకరించారు. బెంగళూరుకు చెందిన ఆకాశ్ దొరికితే తప్ప ఈ ముఠా గుట్టు రట్టు చేయలేమని విజయవాడ పోలీసులు అంటున్నారు.

### ఖాతాలు, లావాదేవీలపై దృష్టి

డ్రగ్స్ కొనుగోళ్లు, అమ్మకాల్లో భాగంగా నగదు లావాదేవీలు జరిపిన ఖాతాలపై పోలీసులు దృష్టి పెట్టారు. ప్రధానంగా మణికంఠ ఖాతా నుంచి ఏయే ఖాతాలకు డబ్బులు వెళ్లాయి? వాటి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. వీటి పూర్తి వివరాలు తెలిస్తేనే డ్రగ్స్ ముఠా ఎంత మందితో లావాదేవీలు నిర్వహిస్తుంది? తదితర విషయాలు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఇవన్నీ జరిగితే రాబోయే రోజుల్లో ఈ ముఠాను కట్టడి చేయవచ్చని పోలీసులు అంటున్నారు.

## సంగీతంలో ఉన్నత స్థానానికి సూరిబాబు

మాట్లాడుతున్న ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, పక్కన మల్లాది సూరిబాబు, ఎల్వీ సుబ్రహ్మణ్యం

**లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే :** గురువుల అనుగ్రహం, అభిమానుల ఆదరణతో సంగీత రంగంలో సూరిబాబు ఉన్నత స్థానానికి ఎదిగారని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సామగాన లహరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన సంగీతోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలతో పాటు కళలపై యువత ఆసక్తి కనబరచాలని కోరారు. మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. సూరిబాబు ఎన్నో కచేరీలు నిర్వహిస్తూ... తన సంగీతంతో ఎంతో మంది అభిమానులను పొందగలిగారని, ఎన్నో అవార్డులు సాధించి తన కంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు డి.రాఘవచారి, ఎన్.రవికుమార్, అన్నవరపు రామస్వామి, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, భగవాన్ రమణ మహర్షి ట్రస్ట్ నిర్వాహకుడు సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సూరిబాబు దంపతులను అతిథులు సత్కరించారు.

## కృష్ణా తీరం.. వర్ణ రంజితం

జనజాగృతి చిత్రాలకు రంగులు అద్దుతూ..

బంగారు కుటుంబం ఆవిష్కరిస్తూ...

మొదటి స్థానంలో నిలిచిన తనూజకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

**భవానీపురం, న్యూస్‌టుడే:** నగర ప్రజలు, యువత వేసిన బొమ్మలతో కృష్ణానదీ తీరం కొత్త రూపు సంతరించుకుంది. ఎన్టీఆర్ జిల్లా అధికారులు, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భవానీపురంలోని హరిత బరంపార్కు ఘాట్ వద్ద ఫ్లోర్ పెయింటింగ్, చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు ఆదివారం ఉదయం నిర్వహించారు. యువతీ, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను చాటారు. జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ...ప్రజలను జాగృతం చేసేలా వేసిన చిత్రాలతో నదీ తీరం కొత్త శోభను సంతరించుకుందన్నారు. వైబ్రెంట్ విజయవాడకు ఈ కార్యక్రమం తొలిఅడుగు అని పేర్కొన్నారు. నగర పరిధిలోని పవిత్ర సంగమం, కొండపల్లి ఖిల్లా, గాంధీకొండ తదితర పర్యాటక ప్రదేశాల్లో వివిధ థీమ్‌లతో కార్యక్రమాలను రూపకల్పన చేస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. నగర యువతలో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ విధమైన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.

ప్లాస్టిక్ భూతం నుంచి భూమాతను రక్షించుకుందామంటూ..



బొట్టుబొట్టునూ ఒడిసిపడదాం..




మేల్కోకుంటే ఎడారే

### విజేతలకు బహుమతులు

ఫ్లోర్ పెయింటింగ్, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఫ్లోర్ పెయింటింగ్ విభాగంలో స్వర్ణాంధ్ర విజన్-సేవ్ వాటర్ అంశంపై బొమ్మ వేసిన జి.తనూజ మొదటి స్థానంలో నిలవగా రూ.10వేలు బహుమతిగా అందజేశారు. ద్వితీయ బహుమతిగా యామిని విశాలకు రూ.7500లు, తృతీయ బహుమతి వి.జశ్వతి, నాలుగో బహుమతి ఎం.సురేష్ పొందారు. చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ స్థానంలో ఎం.ఎస్.వైష్ణవి, రాహుల్ జయాన్ ద్వితీయ, జి.భాష్యశ్రీ తృతీయ, లక్ష్య జైన్ నాలుగో స్థానంలో నిలిచారు. మిగిలిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

## సమాజ పరివర్తనకు ఉపయోగపడే సాహిత్యం అవసరం

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే:** మన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రతిబింబించే వాస్తవ జీవన చిత్రాన్ని ఎస్.ఆర్.పృథ్వి రచించిన 'పగిలిన జీవ కలలు' పుస్తకంలో చూస్తామని కృష్ణాజిల్లా పూర్వపు కలెక్టర్ ఎ.ఎం.డి.ఇంతియాజ్ చెప్పారు. ఆదివారం సాయంత్రం విజయవాడ పుస్తక మహోత్సవ గ్రంథాలయంలో ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, జి.ఆర్.కె. పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి ఎస్.ఆర్.పృథ్వి రచించిన పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇంతియాజ్ తొలుత 'పగిలిన జీవ కలలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ పరివర్తనకు ఉపయోగపడే సాహిత్యం రావాలని ఆకాంక్షించారు. 'నానో ప్రస్థానం' పుస్తకాన్ని ఆవిష్కరించిన డీఎస్పీ ఎన్.వి.రమణ మాట్లాడుతూ స్వల్ప అక్షరాలతో అనల్పమైన అర్థం నానో కవితా ప్రక్రియలో చూస్తామని తెలిపారు. అనేక మంది కవుల రచనా శైలిని కవి ఎస్.ఆర్.పృథ్వి చక్కగా వివరించారని ప్రశంసించారు. ఆకాశవాణి పూర్వపు సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, ప్రముఖ రచయిత్రి కావూరి సత్యవతి ఈ పుస్తకాలను సమీక్షించారు. సభకు ఎక్స్‌రే కొల్లూరి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జి.ఆర్.కె.పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, బి.ఆంజనేయరాజు, చామర్తి వెంకటసుబ్బయ్య, కొల్లూరి కనకవల్లి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్, గోళ్ల నారాయణరావు, ఎస్ఆర్ పృథ్వి, ఎన్.వి.రమణ, కొల్లూరి, వెంకటసుబ్బయ్య, కృష్ణకుమారి, సత్యవతి తదితరులు

## దుర్గమ్మకు పోలీసుల ఆషాఢ సారె



అమ్మవారికి సారె తీసుకువస్తున్న సీపీ రాజశేఖర బాబు దంపతులు, పక్కన ఈవో శీనానాయక్

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు నగర పోలీసుల తరఫున సీపీ రాజశేఖరబాబు దంపతులు ఆదివారం సారెను సమర్పించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషను ప్రాంగణంలోని రావి చెట్టుకు పూజ చేసిన అనంతరం పోలీసు కుటుంబాలతో కలిసి సీపీ దంపతులు ఊరేగింపుగా సారెను తీసుకువచ్చారు. ఈవో శీనానాయక్ వేద పండితులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సీపీ దంపతులకు ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. డీసీపీలు ఉదయరాణి, ప్రసాద్, ఏడీసీపీలు రామకృష్ణ, ప్రసన్నకుమార్, ఏసీపీలు దుర్గారావు, రామచంద్రరావు, దామోదరరావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.




## కమ్మ సేవా సమాఖ్య కార్యక్రమాలు విస్తృతం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

**పటమట, న్యూస్‌టుడే:** కమ్మ వారి సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు విస్తృతం చేసేందుకు కమ్మ సామాజికవర్గ మేధావులు, పెద్దలు ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని పటమట ఫన్ టైమ్స్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ కమ్మ వారి సేవా సమాఖ్య రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సభ్యులు హాజరైయ్యారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఐక్యత లేకపోవడం వల్ల ఎక్కువ కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుపడడం లేదని అన్నారు. కేవలం కమ్మ కులానికే కాకుండా ఇతర వర్గాల్లో కూడా పేదలను గుర్తించి వారికి విద్య, ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో అమరావతిలో రాష్ట్ర స్థాయి కమ్మ భవన్ నిర్మాణానికి, డిజిటల్, భౌతిక గ్రంథాలయాల ఏర్పాటుకు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. మండవ రమ్య సంధానకర్తగా వ్యవహరించగా.. సమాఖ్య గౌరవ అధ్యక్షుడు గన్ని భాస్కరరావు సభకు అధ్యక్షత వహించారు. సభ్యులు గూడూరు సత్యనారాయణ, సూరపనేని స్వరూపరాణి, మండలపు జగదీష్, గుమ్మడి రామకృష్ణ, కనకమేడల శ్రీనివాస చక్రవర్తి, బొర్రా గాంధీ, జీవీ రాయుడు, సామినేని కోటేశ్వరరావు, నల్లూరి చలపతిరావు, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపేయండి



ఐక్యత చాటుతున్న రామకృష్ణ, శ్రీనివాసరావు, శోభనాద్రీశ్వరరావు, దుర్గాభవాని, ప్రసాద్ తదితరులు

**విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే:** రాష్ట్రంలో అదానీ కంపెనీ స్మార్ట్‌మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆపకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం దాసరిభవన్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సంస్కరణల పేరుతో విద్యుత్తు సంస్థలను ప్రైవేటీకరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అదానీ కంపెనీతో జరిగిన సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత వైకాపా ప్రభుత్వం అదానీ నుంచి ముడుపులు తీసుకొని 20 సంవత్సరాల ఒప్పందంతో రూ.లక్ష కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని ఆరోపించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల బిగింపుతో అందరిపై పెనుభారాలు పడతాయని చెప్పారు. న్యూడెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ ఈనెల 15, 16 తేదీల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, 17, 22 తేదీల్లో పట్టణ, మండల స్థాయిలో సదస్సులు, 23 నుంచి 29 వరకు ఇంటింటికీ ప్రచారం, సంతకాల సేకరణ, 30వ తేదీ నుంచి ఆగస్టు 4 వరకు కాలనీల్లో నిరసన ప్రదర్శనలు, ఆగస్టు 5న విద్యుత్తు కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు హరినాథ్, ఎం.రామకృష్ణ, తూమాటి శివయ్య, ఖాదర్‌బాషా, గోవిందరాజులు, జానకిరాములు, మరీదు ప్రసాదబాబు, బి.శ్రీనివాసులు, రావుల వెంకయ్య, బి.నరసింగరావు, రవీంద్రనాథ్, దుర్గాభవాని, యు.వీరబాబు, కె.పోలారి తదితరులు పాల్గొన్నారు.

## చెరువు భూమి ఆక్రమణపై చర్యలు

### ఆరుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

**తుళ్లూరు, న్యూస్‌టుడే:** 'చెరువు భూమిని చెరబట్టేశారు' శీర్షికన ఈ నెల 12న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి తుళ్లూరు పోలీసులు స్పందించారు. వడ్డమాను గ్రామంలో నకిలీ పత్రాలతో చెరువు భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొని మోసం చేశారని గ్రామానికి చెందిన బాధిత రైతు జంగా శివశంకర్‌రెడ్డి (46) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం తుళ్లూరు సి.ఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జంగా శివశంకర్‌రెడ్డి ముత్తాత జంగా వెంకటరామిరెడ్డికి సర్వే నం.159లో ఉన్న 4.65 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇంకా ఎవరికీ పంపకాలు చేయలేదు. ఈ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి గ్రామానికి చెందిన కంజుల పురుషోత్తమరెడ్డి, మరో నలుగురు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 20 జూన్ 2025న రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనికి కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం, చినఆవుటపల్లి గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సింహాద్రి సుబ్బారావు సహకరించారు. ఈ ఘటనలో మొత్తం ఆరుగురిపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ - 173, చికెన్ స్కిన్‌లెస్ - 196.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 103, 111, 122 చికెన్ విత్ స్కిన్ - 196 చికెన్ స్కిన్‌లెస్ - 206.

### నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

## జైల్లో పరిచయం.. కలిసే దొంగతనం

నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ చంద్రశేఖర్, రెడ్డిగూడెం ఎస్సై మోహనరావు

**మైలవరం, న్యూస్‌టుడే:** దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారు...వేర్వేరు కేసుల్లో జైలుకెళ్లి ఒకరికొకరు పరిచయమయ్యారు. ఒంటరిగా ఎందుకనుకుని తోడు దొంగలుగా మారారు. పొలంలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాల (సీసీ కెమెరాలు) సహకారంతో ఇద్దరినీ పట్టుకుని మళ్లీ జైలుకు పంపించారు. రెడ్డిగూడెం మండలం కుదపలో చోటుచేసుకున్న దొంగతనం కేసు వివరాలను ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ దాడి చంద్రశేఖర్ వివరించారు. ఈ నెల 4వ తేదీన రెడ్డిగూడెం మండలం కుదపలో మరీదు జమలమ్మ ఒంటరిగా పొలంలో గేదెలు మేపుతోంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు ఆమె వద్దకు వచ్చి, మాటలతో ఏమార్చి పక్కన మెడలో బంగారు నానుతాడును లాక్కుని, అప్పటికే రహదారిపై ద్విచక్ర వాహనంతో సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా రెండు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించాయి. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సాయంతో నిందితులు, పాత నేరస్థులైన కొండపల్లి ముత్యాలచెరువు ప్రాంతానికి చెందిన నామాల నాగరాజు, కృష్ణాజిల్లా గుడివాడ చెంచుకాలనీకి చెందిన మోటపర్తి నాగరాజులుగా గుర్తించారు. శనివారం సాయంత్రం మండలంలోని గణపవరం సమీపంలో గల పెట్రోల్ బంకు వద్ద వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వివరించారు. వారిద్దరిపై ఇప్పటికే స్టేషన్ల పరిధిలో దొంగతనాల కేసులు నమోదవగా, నామాల నాగరాజుపై కేడీ షీటు ఉంది. రిమాండ్ ఖైదిగా ఉన్న అతను ఈ ఏడాది మే 8వ తేదీన విశాఖపట్నం కేజీహెచ్ నుంచి పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. మోటపర్తి నాగరాజుపై గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైంది. ఇద్దరికీ గతంలో రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఏర్పడిన పరిచయంతో కొన్నాళ్లుగా కలిసి దొంగతనాలు చేస్తున్నారని వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.2.45 లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేసి, కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు వివరించారు. కేసు దర్యాప్తులో సమర్థవంతంగా వ్యవహరించిన రెడ్డిగూడెం ఎస్సై మోహనరావు, సిబ్బందిని కమిషనర్, డీసీపీ, ఏసీపీలు అభినందించినట్లు తెలిపారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

## కోలుకుంటున్న శిశువు

**విజయవాడ పాతాసుపత్రి :** విజయవాడలోని కొత్తపేట కొండ ప్రాంతంలో ఈనెల 2న అమానవీయ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. పాతబస్తీ కొత్తపేట పోతిన సాయిప్రసాద్ వీధి చింతాడ రాము ఇంటి వద్ద ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే జన్మించిన మగ శిశువును రోడ్డుపై వదిలివెళ్లారు. ఆ శిశువు బొటనవేలును ఎలుకలు కొరుక్కుతిన్నాయి. 2వ పట్టణ పోలీసులు, ఐసీడీఎస్, అంగన్‌వాడీ అధికారులు విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి పాత ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువుకు పిల్లల వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం కోలుకుంటుందని వైద్యులు పేర్కొన్నారు. కాకపోతే శిశువు బొటనవేలుకు ప్లాస్టిక్ సర్జరీ అవసరమవుతుందని వైద్యులు భావిస్తున్నారు. ఆ సర్జరీని శిశువు తట్టుకోలేడని, ఇప్పుడు కాకపోయిన భవిష్యత్తులో ఇన్‌ఫెక్షన్ అయ్యే ప్రమాదం ఉన్నందున రెండేళ్లు వచ్చిన తరువాత సర్జరీ చేయాలని వైద్యులు భావిస్తున్నారు. శిశువు ఆరోగ్యం పూర్తిగా మెరుగయ్యాక శిశు సంరక్షణ కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర: 81422 92071.

BUSINESS OFFER

Investors- Wanted 2-6Cr for Vijayawada's Approved Apartment Projects. Secured ROI, Equity Arranged. ✆ 9848419818

TENDER

ఇ-కోట్ టెండర్ సేల్: 1050 KVA, జెన్‌సెట్ 2 నెం.లు, తనిఖీ 16 & 17 ఉ. 9.00 గం. నుండి సా. 5.00 గం. వరకు. ITC లిమిటెడ్, ABD అనపర్తి- 533342, తూ.గో. జిల్లా. ఇ-కోట్ టెండరు తేది: 18.07.25, టెండరు ఫారం ధర రూ. 500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై- 14 ద్వారా మొబైల్: 9840731925, www.welcomeauctioneers.com.

Book your 5 lines Classified Colour Rs.1200/- 3Ads Package Rs.3250/-
5 lines Classified B/W Rs.1025/- 3Ads Package Rs.2575/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం
PH: 98496 97616

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. విజయవాడ: శ్రీశరణు లాడ్జి పాతబస్టాండ్ ఎదురుగా, బందర్ రోడ్, ప్రతీనెల 2, 16 తేదీల్లో మందులు.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA, వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 82474 49042, 96404 96677.

REAL ESTATE

FLAT FOR SALE

RAMAVARAPPADU

రామవరప్పాడు యాదవుల బజార్ లక్ష్మీ నిలయం అపార్ట్‌మెంట్ 2nd ఫ్లోర్‌లో 2 BHK ఫ్లాట్ 27 లక్షలకే అమ్మకమునకు కలదు. సంప్ర: 83746 57677.

GENERAL

2 B/R ఫ్లాట్ నెం: 202, 2వ ఫ్లోర్, కప్‌బోర్డ్స్, కారు పార్కింగ్‌లతో పోరంకి రాఘవ ఎస్టేట్స్, ప్రకృతి విహార్, నీలగిరి బ్లాక్ నందు అమ్మకమునకు కలదు. ✆ 98493 29322.

LAND FOR SALE

రాజధాని అమరావతికి 90 Km లోపు వినుకొండలో 1 + 2 బెనిఫిట్స్‌తో రిసార్ట్స్ డెవలప్‌మెంట్స్‌తో చ॥గ॥ 800/- & ఎకరం 38 లక్షలు లోపు కొని లబ్ధి పొందండి. Ph: 9390060136.

PLOT FOR SALE

VJA, అమరావతి రాజధాని, కంచికచర్ల, ఔటర్ రింగ్‌రోడ్ దగ్గర DTCP & CRDA ఇళ్ళ మధ్య ప్లాట్స్ చ॥గ॥ 1,975/- నుండి 6,900/-. సంప్ర: 93985 76997.

1+1 బంపర్ ఆఫర్! 50 గజాలు కొంటే 50 గజాలు ఉచితం. 50 గజాలు కేవలం 3 లక్షల 99 వేలు మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 91609 47999, 98666 47033.

TO LET

COMMERCIAL

విజయవాడ జమ్మిచెట్టు సెంటర్ మొగల్రాజపురం పెట్రోల్ బంక్ ప్రక్కన గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్స్ 2500 Sft (ఒక్కొక్క ఫ్లోర్) అద్దెకు ఇవ్వబడును. ✆ 98851 03855, 92466 61529.

JOBS

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్ all (డిగ్రీ, B.Tech, Dip. & ITI) కావలెను. Sal: 18K-45K Age: 35 లోపు. స్పాట్ జాయిన్ ✆ 9052593579.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

# తిరువూరు

• తిరువూరు • మైలవరం

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? మండలంలోని దుగ్గిరాలపాడు గ్రామంలో కాలువల్లో పూడిక తీయక మురుగు పేరుకుపోయి దుర్వాసన దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. -కె.రాంబాబు, స్థానికుడు ✔ పారిశుద్ధ్య సిబ్బంది పంపి పూడిక తీయించి బ్లీచింగ్ చల్లిస్తాం.- హరికృష్ణ పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, జి.కొండూరు

? గుంటుపల్లి ఖాజీపేటలోని మురుగు కాలువల్లో పూడికలు పేరుకుపోయి మురుగునీరు పారుదల నిలిచిపోయింది. దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - రామనాయక్, స్థానికుడు ✔ ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - మురళి, గ్రామకార్యదర్శి, – న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

స్పందనకు వందనం

◆ పట్టణంలోని 6వ వార్డుల్లో డ్రైయినేజీలు పిచ్చి మొక్కలతో నిండిపోయి మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగింపజేశారు.

◆ పట్టణంలోని 5వ వార్డులో రెవెన్యూ కార్యాలయం సమీపంలో రహదారి పక్కన చెట్ల కొమ్మలు పెరిగి ప్రయాణికులకు అసౌకర్యంగా ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు వివరించగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో రహదారి పక్కన చెట్ల కొమ్మలు తొలగించి ట్రాక్టర్‌తో బయటకు తరలింపజేశారు.– న్యూస్‌టుడే, తిరువూరు

## 170 మందికి ఆరోగ్య పరీక్షలు

కోడూరులో ప్రజలకు వైద్యం చేస్తున్న డాక్టర్ శ్వేత

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కోడూరులో తెదేపా నాయకుడు యెలినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో విజయవాడ ఒమెగా అను ఆస్పత్రి వైద్యులు పాల్గొని కీళ్లు, ఎముకలు, గుండె జబ్బులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. యెలినేని నాగశిరోమణి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ శ్వేత, డాక్టర్ అన్వర్ పాల్గొని సుమారు 170 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం అక్కడకి వచ్చిన ప్రజలకు, రోగులకు ఆరోగ్యంపై నిత్యం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు గ్రామంలో ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహించే ఉచిత ధన్వంతరి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 95 మంది రోగులు హాజరు కాగా వైద్యులు ఈశ్వర్, పవన్, శ్రీవాణి తదితరులు మధుమేహం, రక్తపోటు వైద్య పరీక్షలు చేశారు. నెల రోజులకు సరిపడా మందులను ట్రస్టీ నిర్వాహకుడు జువ్వా వెంకటేశ్వరరావు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హనుమంతరావు, రామారావు, యేసు, బొర్రా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

తిరువూరు, న్యూస్‌టుడే: మండల, పట్టణంలోని రౌడీషీటర్లకు ఆదివారం తిరువూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కేవీజీవీ.సత్యనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## సౌర పలకలతో అధిక లాభం

కొండపల్లి, న్యూస్‌టుడే: ప్రతి గృహ విద్యుత్తు వినియోగదారుడు సౌరశక్తి పలకలను ఏర్పాటు చేసుకుని 25 ఏళ్ల పాటు లాభం పొందాలని ఏపీఎస్పీడీసీఎల్ సహాయక ఇంజినీర్ పవిత్రారాణి అన్నారు. సోలార్‌పై గృహ వినియోగదారులకు అవగాహన కలిగిస్తూ కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కొండపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణానికి హితమైన సౌర పలకల ద్వారా పొందే విద్యుత్తు వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. గృహ వినియోగదార్ల కోసం 2, 3 కేవీల సామర్థ్యం కలిగిన యూనిట్లను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రాయితీ ఇస్తుందన్నారు. బ్యాంకుల ద్వారా పొందిన రుణాలకు పదేళ్ల సులభ వాయిదాలు చెల్లించిన తర్వాత విద్యుత్తు బిల్లుల భారం ఉండదని చెప్పారు. వీటిపై అవగాహన లేని వారు అందుబాటులో ఉన్న లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్ల సలహాలతో ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# భద్రత మరవద్దు.. బాధ్యత మీ వంతు

## దమ్ము చక్రాలతో ఏమరుపాటుగా ఉంటే ప్రాణానికే ముప్పు

తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే

జిల్లాలో అన్నదాతలు ఖరీఫ్ వరినాట్లు ప్రారంభించారు. గత పది రోజులుగా కురిసిన వర్షాలు, ఎత్తిపోతల పథకాలు, బోర్లు, బావులు, వాగుల కింద వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో అన్నదాతలు మాగాణి భూముల్లో దమ్ము చేయడానికి ఇనుప చక్రాలతో ఉన్న ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా బురదలో చక్రాలు కూరుకుపోయి తిరగబడే ప్రమాదం ఉంది. జరగరానిది జరిగి ఆ సమయంలో మృత్యువాత చెందితే కుటుంబాలు ఒంటరిగా మిగులుతాయి. గతంలో తిరువూరు నియోజకవర్గంలో ఇలాంటి సంఘటనలు జరిగి ఆరుగురు వరకు దుర్మరణం చెంది..వారి బంధువులకు దూరమయ్యారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో 40 వేల ఎకరాల వరకు వరిసాగు చేస్తున్నారు. గతంలో వరినాట్లు ముందు ఎడ్ల నాగళ్ళ, అడ్డతో దమ్ము చేసేవారు. యాంత్రిక వ్యవసాయం ప్రారంభించాక తక్కువ సమయంలో ఎక్కువ పని చేసుకోవాలన్న తొందర్లో చోదకులు, రైతులు, కూలీలు ప్రమాదాల బారిన పడుతున్నారు.



ప్రమాద నివారణకు ఇనుప చక్రాలతో పాటు ఇలా పళ్లగొర్రు

### తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

మాగాణిలో ట్రాక్టర్‌తో దమ్ము చేసేటప్పుడు ఇనుప చక్రాలతో పాటు వెనుక గొర్రు(కల్టివేటర్) అమర్చాలి. దీంతో ఇంజిన్ పైకి లేవకుండా, పల్టీ కొట్టకుండా అడ్డుపడుతుంది. ఒక మడి నుంచి మరో మడికి వెళ్లేటప్పుడు రెండు చక్రాలు పొలం గట్టుపై ఒకేసారి ఎక్కించకుండా ఒక చక్రాన్ని ఎక్కించిన అనంతరం మరోదాన్ని ఎక్కించాలి. రెండు చక్రాలు ఒకేసారి ఎక్కిస్తే ట్రాక్టర్ హౌసింగ్ గట్టుకు తగిలి తిరిగి ఆగిపోయే అవకాశం ఉంది. అజాగ్రత్తగా ఉంటే ట్రాక్టర్ వెనక్కి పడే అవకాశం ఉంటుంది. ఎత్తు తక్కువున్న గట్టు వద్ద ట్రాక్టర్లను దాటించడం శ్రేయస్కరం. ట్రాక్టర్ ఫుట్‌బాల్ మట్టి లేకుండా చూసుకోవాలి. దమ్ము చేయాల్సిన పొలంలో నీళ్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. నీళ్లు తక్కువగా ఉంటే కేజ్‌వీల్స్ మట్టిలో నిండి ట్రాక్టర్ వెనక్కి పడుతుంది. నడిపేందుకు ఇద్దరు డ్రైవర్లు ఉండాలి. వర్షం కురుస్తున్నప్పుడు, మద్యం తాగి దమ్ము చేసే ట్రాక్టర్లను నడపవద్దు. కొత్తగా డ్రైవింగ్ నేర్చుకున్న వారు, నేర్చుకునే వారు వెళ్లకపోవడమే మంచిది.

### అనుభవం ఉండాలి

గ్రామాల్లో ఖరీఫ్ వరి నాట్లు ఆరంభమయ్యాయి. మాగాణిలో నాట్లు వేసేందుకు ఇనుప చక్రాలు ఉన్న ట్రాక్టర్లతోనే రైతులు దమ్ము చేస్తున్నారు. అలాంటి సమయాల్లో అనుభవం ఉన్న, నిష్ణాతులైన చోదకులు ట్రాక్టర్ నడిపితే ప్రమాదాలు జరగవు.

- సాయిశ్రీ, ఎ.కొండూరు మండల వ్యవసాయాధికారి

## శాకంబరిగా ముత్యాలమ్మ

ఆర్లపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఆర్లపాడులో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి మూలవిరాట్‌ను అర్చకులు, భక్తులు ఆదివారం వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

## రైతులకు ఇబ్బందులు రానివ్వం

మోటార్ల వద్ద తెదేపా నాయకులు, రైతులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: రైతులు పంటలు పండించుకునేందుకు, వివిధ గ్రామాల ప్రజలు తాగునీటి కోసం గొల్లపూడి పంపింగ్ స్కీం నుంచి నీటిని ఆదివారం విడుదల చేశారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ఎలాంటి సమస్యలు తలెత్తినా పరిష్కరిస్తామన్నారు. పంపింగ్ స్కీం కాలువలో పేరుకున్న గుర్రపు డెక్క, వ్యర్థాలను తొలగిస్తామని చెప్పారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ నర్రా వాసు, తెదేపా నాయకులు నారద, చలపతిరావు, రైతులు పాల్గొన్నారు.

## తెదేపా నాయకుడికి నివాళి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో ఆదివారం తెదేపా మండల నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నామా సత్యనారాయణ వర్ధంతి నిర్వహించారు. గ్రామ పార్టీ నాయకులు ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు శ్రమించాలి

మాట్లాడుతున్న శ్రీధర్

కొండపల్లి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా శ్రమించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ మానికొండ శ్రీధర్ అన్నారు. వినూత్న వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొండపల్లి బి.కాలనీ శ్మశాన వాటికలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జీవకోటి సమతుల్యతతోనే మానవుడు మనుగడ సాధిస్తున్నాడన్న సంగతి మరువకూడదన్నారు. ప్రస్తుతం అన్ని చోట్ల కాలుష్యం పెరిగిందని దాని నుంచి చెట్లు మాత్రమే కాపాడగలవన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్న ప్రతిచోటా మొక్కలు నాటి వాటి సంరక్షణకు అడుగు వేయాలన్నారు. అనంతరం పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, జనసేన నాయకులు అక్కల రామ్మోహనరావులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ శ్రీను, కౌన్సిలర్ దుర్గా భవానీ, తెదేపా నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలపై ప్రచారం



కరపత్రాలు ప్రదర్శిస్తున్న తెదేపా నాయకులు, గ్రామస్థులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని గోపాలపురం, జీళ్లకుంట, వల్లంపట్ల, మంత్రియ తండా, ఎ.కొండూరు తండాలో ఆదివారం కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేశారు. గ్రామాల్లో యువత, మహిళల స్వయం ఉపాధి కోసం కేశినేని ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతులపై అవగాహన కల్పించారు. పేదరిక నిర్మూలనకు చేపట్టిన పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు సంజయ్‌వర్మ, మునియ్య, రమేష్‌రెడ్డి, డేవిడ్‌రాజు, చైతన్య, ఏలియాబాబు తదితరులు పాల్గొన్నారు.

## గమనిస్తుంటా..సాయం చేస్తుంటా

నేర పరిశోధనలో క్రియాశీలకంగా ఉన్న సీసీ కెమెరాలు ఏర్పాటుపై పోలీస్‌శాఖ దృష్టి సారించింది. ఇప్పటికే, సర్కిల్ పరిధిలో ఎక్కడికక్కడే గ్రామాల్లో దాతల వితరణతో వందలాది కెమెరాలను ఏర్పాటు చేశారు. నివాస ప్రాంతాల్లోనే కాకుండా, రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాలపైనా దృష్టి పెట్టారు. అందులో భాగంగా స్థానిక పూర గుట్ట వద్ద, ఇతర పలు గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కన స్తంభాలకు సీసీ కెమెరాలను బిగించారు. –న్యూస్‌టుడే, మైలవరం

## కాంగ్రెస్ తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్తగా రాజీవ్‌రతన్

గవర్నర్‌పేట: అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ నూతన సమన్వయకర్తలను నియమిస్తూ ఆదివారం ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా ఇప్పుడు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న రాజీవ్‌రతన్‌ను తిరువూరుకు పంపించారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమై పార్టీని పటిష్ఠం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్తలకు షర్మిలారెడ్డి సూచించారు.

## తెదేపా గ్రామశాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరే

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని తెదేపా గ్రామ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం పూర్తయినట్లు నియోజకవర్గ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. వి.వెంకటేశ్వరరావు, పి.మారేశ్వరరావు (కలగర), పి.శ్రీనివాసరావు, ఎల్.పుల్లారావు (తాతకుంట్ల), ఎం.శ్రీధర్, ఇ.ఆంజనేయులు (కొండపర్వ), బి.బాలు, కె.ఆంజనేయులు (చంద్రుపట్ల తండ), వి.మాధవరావు, పి.వెంకటనారాయణ (చంద్రుపట్ల), పి.నాగరాజు, జి.శ్రీను (నరసాపురం), ఎ.వెంకటేశ్వరరావు, సీహెచ్.రంగారావు (కొర్లమండ), ఆర్.శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ (వేమిరెడ్డిపల్లి), ఎ.శ్రీనివాసరావు, కె.సర్వేశ్వరరావు (పుట్రేల), డి.రాంబాబు, జి.రామకృష్ణ (తెల్లదేవరపల్లి), సీహెచ్.బాబూరావు, వి.రాంబాబు (మారేమండ), కె.శ్రీనివాసరావు (విస్సన్నపేట) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు.

## స్థల సమస్య అధిగమించేందుకే సీటీజీ

కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న శ్రీధర్, శ్రీదేవి

కొండపల్లి, న్యూస్‌టుడే: నగర పరిధిలో మొక్కలు పెంచడానికి ప్రధానమైన స్థల సమస్యను అధిగమించేందుకు టెర్రస్ గార్డెనింగ్‌ను ఉపయోగించుకొనే ఆలోచన ప్రతి ఒక్కరూ చేయాలని మెప్మా సిటీ మేనేజర్ శ్రీధర్ అన్నారు. మెప్మా, సీటీజీ(సిటీ టెర్రస్ గార్డెనింగ్) ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని సచివాలయం-1 పరిధిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీటీజీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నగరాల్లో మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగా మొక్కలు, కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్నామని చెప్పి పొదుపు సంఘ మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో కోగంటి శ్రీదేవి, వంగూరు ప్రకాష్, హసీనా, శిరీష, పారదబీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలు ప్రమాదాలు ఆపుతాయా..?

కుంటముక్కల గురుకులం గోడ కూలిపోవడంతో పట్టాలు ఏర్పాటు చేశారిలా

గత సెప్టెంబర్‌లో వచ్చిన వరద ఉద్ధృతికి కుంటముక్కల బాలికల గురుకులం ప్రహరీ కూలి ఏడాదైనా అధికారులు పట్టించుకోవడం లేదు. కూలిపోయిన గోడ స్థానంలో తాత్కాలికంగా పట్టాలు ఏర్పాటు చేసి వదిలేశారు. చుట్టుపక్కల పొలాలు ఉండడంతో విష పురుగులు లోపలికి వచ్చే అవకాశం ఉందని, లోపల బాలికలకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. అంతేకాక గురుకులం జాతీయరహదారి-30 పక్కనే ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని బాలికల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు శ్రద్ధ వహించి గోడను పునర్నిర్మించాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, జి.కొండూరు

## ఎవరూ అడగట్లేదని ఎదురొస్తున్నారా..?

రహదారులపై ఒకరు చేసే తప్పులకు మరొకరు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. కొందరు వాహనచోదకులు రోడ్లపై నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా అపసవ్య దిశలో రావడంతో ఎదుటివారు ప్రమాదాలకు గురవుతున్నారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు కొందరు భారీ వాహనాలతో అపసవ్య దిశలో వస్తున్నారు. దీంతో ఏదొకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికితోడు ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారిపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– న్యూస్‌టుడే, గొల్లపూడి

గొల్లపూడి వద్ద వ్యతిరేక మార్గంలో లారీ రావడంతో నిలిచిన ట్రాఫిక్

## అన్నీ గుంతలు..అంతా అవస్థలు

మండలంలోని కందులపాడు గ్రామంలో ఆర్అండ్‌బీ రహదారి దుస్థితికి చేరి ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు. రహదారిపై తారు మొత్తం పోయి రాళ్లు తేలడం, గుంతలతో నరకయాతన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. రహదారి గత ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా వాహనదారుల అవస్థలపై దృష్టి సారించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, జి.కొండూరు

## ఇది డంపింగ్ యార్డు కాదు..!

మండల పరిధిలోని కూనపరాజుపర్వలో దక్షిణ బజారు వైపు నుంచి కుదప వెళ్లే తారురోడ్డును డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్డు మార్జిన్‌లో వేయడంతో అందులోకి కుక్కలు, పందులు చేరి మరింత అధ్వానంగా మారుస్తున్నాయి. దీనికి తోడు వాటిని రోడ్డుపైకి లాక్కొని రావడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని వ్యర్థాలను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

# కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు

కొండపల్లి: కరపత్రాలు అందజేస్తున్న సీతారామయ్య, ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు

దాములూరులో..

రంగాపురం ఎస్సీవాడలో..

విస్సన్నపేట: తాతకుంట్లలో..

రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, తాతకుంట్ల(విస్సన్నపేట), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పలువురు తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఆదివారం తిరువూరు, మైలవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో తెదేపా నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

# గ్రామాల్లో ఆషాఢ సారె సందడి

ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరు కోదండ రామాలయంలోని రాజ్యలక్ష్మి, గోదాదేవి, సీతమ్మ వారికి ఆదివారం గ్రామస్థులు ఆషాఢ సారె సమర్పించారు. అర్చకులు సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయస్వామి, రాజ్యలక్ష్మి, గోదాదేవి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి నూతనవస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. తదుపరి మహిళలు పసుపు, కుంకుమ, పూలు, ఫలాలు, గాజులు, చీర, జాకెట్లు, పిండి వంటలతో సారెను మంగళ వాయిద్యాలతో ప్రదర్శనగా తీసుకువచ్చి సమర్పించారు.



ఊటుకూరు కోదండ రామాలయానికి ప్రదర్శనగా వస్తూ..

పాత తిరువూరులో బోనాలు తీసుకొస్తున్న మహిళలు

తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరులోని గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. గుడి వద్ద భక్తులతో సందడి నెలకొంది.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడి శివారు కిలేశపురంలోని గ్రామ దేవత గంగానమ్మకు గ్రామానికి చెందిన భక్తులు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. తొలుత గ్రామంలోని బొడ్డురాయికి ప్రత్యేక పూజలు చేసి..అనంతరం డప్పు వాయిద్యాలతో గంగానమ్మ ఆలయానికి చేరుకుని సారె అందజేశారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మైలవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఆషాఢ సారెల సందడి నెలకొంది. మైలవరంతో పాటు పలు గ్రామాల్లో ఆయా గ్రామదేవతలకు మహిళలు సారెలు అందజేస్తున్నారు. ఆదివారం మైలవరంలో భక్తులు స్థానిక విజయవాడ రోడ్డులోని వాటర్‌ట్యాంకు వద్ద నుంచి సారెతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

సారె అందుకున్న గంగానమ్మ

చిలుకూరివారిగూడెంలో

## కోట శ్రీనివాసరావు మృతి బాధాకరం

ఇరవై ఏళ్ల కిందట కోట శ్రీనివాసరావును సత్కరించిన ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

తిరువూరు, న్యూస్‌టుడే: ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతి బాధాకరమని ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఇరవై ఏళ్ల కిందట తిరువూరులో జరిగిన ఘంటసాల జయంతి వేడుకలకు ఆహ్వానించగా ఆయన పాల్గొని సంతోషంగా గడిపారన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు.

## ట్రాక్టర్ ట్రక్కు కిందపడి ఒడిశా కార్మికుడి మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఇటుకలు ఉన్న ట్రాక్టర్ ట్రక్కు కిందపడి ఓ కార్మికుడి మృతి చెందిన ఘటన మండల పరిధి వెల్లటూరు గ్రామ శివారులో జరిగింది. సేకరించిన సమాచారం మేరకు నెల్లూరు జిల్లాకు చెందిన చల్లా తిరుపతిరావు విజయవాడలో ట్రాక్టర్‌తో ఇటుకలు తరలిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన కింద పనిచేసేందుకు ఐదు రోజుల కిందట దుష్మంత్ చిందా(22) అనే ఒడిశా కార్మికుడిని పనిలో పెట్టుకున్నాడు. ఆదివారం ఇటుకలు తీసుకెళ్లేందుకు వెల్లటూరు నుంచి కుంటముక్కల వైపు వస్తున్న ట్రాక్టర్ ఓ మలుపు వద్ద ఎదురుగా వచ్చే ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ పక్కనే కూర్చున్న దుష్మంత్ కిందపడగా ట్రక్కు అతడిపై నుంచి వెళ్లడంతో మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్సై కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రత్యామ్నాయం లేకనే సమ్మెబాట

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మె మొదలు పెట్టారు. ఆదివారం పట్టణంలో తాము నిర్వహించాల్సిన వివిధ రకాల విధులకు దూరంగా ఉన్నారు. శిబిరాన్ని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ..ఏడేళ్లుగా కార్మికులకు రూపాయి కూడా వేతనం పెంచలేదన్నారు. రెండు నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే..ప్రత్యామ్నాయం లేక సమ్మెబాట పట్టామని కార్మికులు తెలిపారు. సీఐటీయూ, సంఘం నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎస్.వీరభద్రం, రవి, బాజీ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికుల నినాదాలు

కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పురపాలిక ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం సమ్మెను చేసి..పుర కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అందులో భాగంగా వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్, ఇంజినీరింగ్ కార్మిక యూనియన్‌కు చెందిన శ్రీను, వాసు, అంజి తదితరులు పాల్గొన్నారు. దీంతో పురపాలికలో ఆదివారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అనేక చోట్ల వీధి దీపాలు వెలగలేదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు. 14:13
జ్ఞాపకార్థ కూడిక

అందరి శ్రేయస్సును ఆకాంక్షిస్తూ...
మా ఉన్నతికి శ్రమించిన మీరు భౌతికంగా లేరన్న నిజాన్ని నమ్మలేకున్నాము.
అశ్రునయనాలతో.. అంజలిఘటిస్తూ..
కుటుంబ సభ్యులు
కీ॥శే॥ వెంపాటి ప్రకాశరావు గారు
జననం: 19-12-1962 మరణం: 30-06-2025
జ్ఞాపకార్థకూడిక: ది. 14-07-2025 సోమవారం ఉ॥ 11 గం॥లకు మా స్వగృహము పాతకొండూరు గ్రామం, ఎ.కొండూరు (మం) నందు జరుగును. కావున తెలియపరచడమైనది. ఫోన్: 88861 23023

(c) eenadu

# విజయవాడ మధ్య

## నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం చేయూత

**అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే:** నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా నిలబడేందుకు కూటమి ప్రభుత్వం తోడ్పాటు ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం అజిత్‌సింగ్‌నగర్ తెదేపా కార్యాలయంలో పీ4 కార్యక్రమం ద్వారా సొంత నిధులతో పేద కుటుంబాలకు తోపుడుబండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు తదితర అనేక పథకాలతో ఆర్థిక చేయూత అందిస్తుందన్నారు. హాకర్స్‌తో సచివాలయాల ద్వారా దరఖాస్తు చేయించి.. వారికి గుర్తింపు కార్డులు అందజేస్తున్నామన్నారు. కండ్రిక, పాయకాపురం, రాజీవ్‌నగర్, వాంబే కాలనీ, అజిత్‌సింగ్‌నగర్, దేవినగర్, రామకృష్ణాపురం తదితర ప్రాంతాల్లోని హాకర్స్ అందరికీ తోపుడుబండ్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నవనీతం సాంబశివరావు, గంటా కృష్ణమోహన్, కాకొల్లు రవికుమార్, లబ్బా వైకుంఠం, మోత్కూరి కాసిం, పైడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

## ధర వరలు

వంకాయలు-28, టమాటా-32, బెండ-22, పచ్చిమిర్చి-65, కాకర-42, బీర-32/40, క్యాబేజీ-22, క్యారెట్-32/44, దొండ-28, బంగాళ దుంప-28, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుళ్లు-36, దోస-20, సొర-12/15, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-30, అల్లం-60, మునగ-7/8, ఆకు కూరలు (కట్ట)-3, కంద-60, బీట్ రూట్-30, కీరదోస-50, బీన్స్-90/105, క్యాప్సికమ్-85, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/15, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/10 (నిన్నటిది). నగరంలోని రైతు బజార్లలో ఈధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. -ఎస్టేట్ ఆఫీసర్, విజయవాడ.

## నడిరోడ్డుపై గండాలు

### ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

అజిత్‌సింగ్‌నగర్, మధురానగర్, న్యూస్‌టుడే

**న**గరంలోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ మూతలు సక్రమంగా లేక ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. కొన్ని చోట్ల లోతుగా ఉండగా.. కొన్ని శిథిలమయ్యాయి. కొన్ని చోట్ల రోడ్డు కంటే ఎత్తుగా ఉండి ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇటీవల నగర వ్యాప్తంగా మ్యాన్‌హోల్స్‌ను సరిచేస్తున్నారు. కారల్‌మార్క్స్ రోడ్డులో కొత్త మ్యాన్‌హోల్స్ నిర్మాణం చేపట్టారు. అయినప్పటికీ కొన్ని చోట్ల ఇంకా ప్రమాదకరంగానే ఉన్నాయి.

మధురానగర్ ఆర్‌యూబీ సర్వీస్‌రోడ్డులో..

**రోడ్డు కంటే ఎత్తులో ఉండి..**

☛ మధురానగర్ ఆర్‌యూబీ సర్వీస్‌రోడ్డులో మ్యాన్‌హోల్ మూత ఎత్తుగా ఉంది. పసుపుతోట నుంచి వచ్చే రోడ్డు మలుపులోనూ ఇదే పరిస్థితి. రాత్రి వేళ ఇది కనిపించకపోవడంతో కొత్తగా వచ్చిన వారు దీన్ని ఢీకొట్టి అదుపు తప్పి పడిపోతున్నారు. ఇక్కడ సర్వీసు మార్గాన్ని సీసీ రోడ్డుగా మార్చాల్సి ఉంది. దీని నిమిత్తం ముందుగానే మ్యాన్‌హోల్ నిర్మించేశారు. కొత్తగా వేసే సీసీ రోడ్డుకు సమాంతరంగా ఉండేలా మ్యాన్‌హోల్ మూత ఏర్పాటు చేశారు. అయితే ఇది ఎత్తుగా ఉండి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణం ఇంకా ప్రారంభమే కాలేదు.

సన్‌సిటీ కాలనీ ఎస్.ఆర్.కాంప్లెక్స్ దారిలో ఇలా..

☛ అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో.. ఇక్కడా సరిగా లేని మ్యాన్‌హోల్స్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. న్యూరాజరాజేశ్వరి పేట రైలు కట్ట సమీపంలోని దారిలో మ్యాన్‌హోల్స్ ఎత్తు పల్లాలతో ఉండడంతో అదుపుతప్పి పడిపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. మూతలు కూడా సరిగా లేవని చెబుతున్నారు. సన్‌సిటీ కాలనీలోని ఎస్.ఆర్.కాంప్లెక్స్ సమీప మార్గంలో రహదారి కంటే ఎత్తుగా మ్యాన్‌హోల్స్ ఉన్నాయి. రాత్రి సమయంలో వేగంగా వచ్చే వారు వాటిని గమనించక ప్రమాదానికి గురవుతున్నారు. పైపుల రోడ్డు, నందమూరి నగర్, వాంబే కాలనీల్లోని మ్యాన్‌హోల్స్ రోడ్డుకు సమాంతరంగా లేవు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సరిగా లేని మ్యాన్‌హోల్స్‌ను సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

**విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** నగర వాసుల సమస్యల పరిష్కారానికి ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం

**విద్యాధరపురం, న్యూస్‌టుడే:** శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రి శ్యామలానగర్‌కు చెందిన దాత బోగవరపు సత్యనారాయణ రూ.1,01,116 విరాళం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

## అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ

**పాయకాపురం, న్యూస్‌టుడే:** కండ్రిక ప్రజాశక్తినగర్‌లోని దుర్గాదేవి ఆలయంలోని అమ్మవారికి స్థానికులు ఆషాఢ సారె సమర్పించారు. డివిజన్ తెదేపా నేతలు పలగాని శివసాయి ఆధ్వర్యంలో ఐదువందల మందికిపైగా మహిళలు ప్రదర్శనగా ఆదివారం అమ్మవారి ఆలయానికి వెళ్లి సారె సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏటా ఆషాఢ మాసంలో దుర్గమ్మకు సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని, మన ప్రాంతంలోని అమ్మవారికి కూడా స్థానిక మహిళలంతా సారె సమర్పిస్తున్నారని, వారికి అమ్మవారి కృప, ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నేతలు సురవరపు నాగరాజు, దుర్గాదేవి ఆలయ కమిటీ సభ్యుడు గొర్లె కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారె తీసుకువెళ్తున్న మహిళలు, శివసాయి కుటుంబ సభ్యులు

## నేరాలకు పాల్పడితే నగర బహిష్కరణ

**విజయవాడ నేరవార్తలు, గాంధీనగర్, న్యూస్‌టుడే:** ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఆదివారం ఉదయం టాస్క్‌ఫోర్స్‌తో పాటు నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. నార్త్ ఏసీపీ స్రవంతి రాయ్ సత్యనారాయణపురం, నున్న పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లతో మాట్లాడారు. నేరాలకు పాల్పడితే నగర బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. మంచి మార్గంలో నడవాలని రౌడీషీటర్లకు సూచించారు. ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. బయోమెట్రిక్ ద్వారా హాజరును కొత్తగా అమల్లోకి తెచ్చినట్లు చెప్పారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఏసీపీ స్రవంతిరాయ్

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సత్యనారాయణపురం ఎస్సై గోళ్ల సౌజన్య హెచ్చరించారు. నగర సీపీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఆదివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే ఐనాక్స్ థియేటర్ వద్ద నోపార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలిపిన చోదకులకు జరిమానాలు విధించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ నేరమని, ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రస్ కోడ్ పాటించాలని ఎస్సై సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని చెప్పారు.

వాహన పత్రాలు పరిశీలిస్తున్న ఎస్సై సౌజన్య

## కోట మృతి చిత్రపరిశ్రమకు తీరని లోటు

**అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే:** తెలుగు సినిమాకు అపూర్వ సేవలందించిన కోట శ్రీనివాసరావు మృతి విచారకరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం అజిత్‌సింగ్‌నగర్ తెదేపా కార్యాలయంలో శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఉమా.. మాట్లాడుతూ కోట శ్రీనివాసరావు మృతి చిత్రపరిశ్రమకు తీరని లోటన్నారు. 1999లో విజయవాడ ఈస్ట్ నుంచి అంటే ప్రస్తుత విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి తెదేపా మిత్రపక్షంగా భాజపా నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా శ్రీనివాసరావు మంచి మెజారిటీతో గెలుపొందారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నవనీతం సాంబశివరావు, గొర్రపాటి విజయ్‌కుమార్, పైడి శ్రీను, దాసరి ఉదయశ్రీ, లబ్బా వైకుంఠం, బత్తుల కొండ, మోత్కూరి కాసిం, దాసరి జయరాజు, ఎస్.కె.ఫర్హాన్, సుల్తానా, గోసాయి పాల్గొన్నారు.

శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తదితరులు

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** వందల తెలుగు చిత్రాల్లో విభిన్న పాత్రల్లో నటించిన నటుడు కోట శ్రీనివాసరావు ప్రేక్షకుల హృదయాల్లో పదిలంగా నిలిచిపోతారని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 33వ డివిజన్ శివాజీ కేఫ్ సెంటర్‌లో ఆదివారం డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. తూర్పు ఎమ్మెల్యేగా శ్రీనివాసరావు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన మరణం చిత్ర పరిశ్రమకు తీరనిలోటని చెప్పారు.

మల్లాది విష్ణు, మూర్తి తదితరుల నివాళి

## కళాకారులను ప్రోత్సహించాలి

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని ఆశిష్ స్టూడియోలో రాగాల పల్లకి సరిగమప కలిసి పాడుదాం కార్యక్రమానికి వాసవీ క్లబ్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేమూరి హజరత్తయ్య గుప్తా ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కళాకారులు ఆశించే నిజమైన బహుమతి ప్రోత్సాహం మాత్రమేనని చెప్పారు. సంస్థ అధ్యక్షుడు కె.మురళీమోహనరావు మాట్లాడుతూ యువ కళాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గాంధీ సోషల్ ట్రస్టు అధ్యక్షుడు గాంధీ నాగరాజన్, కృష్ణవేణి, వివిధ జిల్లాల నుంచి గాయనీ, గాయకులు విచ్చేశారు.

కళాకారులతో గుప్తా, మురళీమోహనరావు తదితరులు

## అలరించిన సంగీత విభావరి

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** డ్రీమ్ ఆడియో అధినేత వావా నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కౌతా కళావేదికలో కల్యాణ వైభోగమే పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. గాయని, గాయకులు విష్ణుప్రియ, శిరీష, మల్లీశ్వరి, సత్యవర్ధన్, పురుషోత్తం, ప్రసాద్, రహూల్ తదితరులు తెలుగు చలన చిత్రాల్లోని పాటలను ఆలపించారు. పరుచూరి విజయలక్ష్మి, ప్రభాకరరావు, దేవిరెడ్డి, చింతకాయల చిట్టిబాబు అతిథులుగా హాజరయ్యారు. గుంటూరురమేష్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

పాటలు పాడుతున్న గాయనీగాయకులు

## నేత్రపర్వం.. నృత్య నీరాజనం

**విద్యాధరపురం, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా జగన్మాత దుర్గమ్మకు కోలాట నృత్య కళాకారులు ఆదివారం నేత్రపర్వంగా కళార్చన నిర్వహించారు. విజయవాడకు చెందిన కూచిపూడి కళాకారులు జగన్మాతను కీర్తిస్తు చేసిన నృత్యం భక్తులను ఆకట్టుకుంది. జానపద గీతాలకు నగరానికి చెందిన కోలాట మహిళా బృందం చేసిన ప్రదర్శన అలరించింది.

## అధిక వసూళ్లు.. అడిగితే దాడులు!

### నగరంలో పార్కింగ్ ఫీజు పేరిట దోపిడీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

**న**గరంలో వాహనాల పార్కింగ్ ఫీజుల పేరిట చోదకుల నుంచి నిబంధనలు ఉల్లంఘించి గుత్తేదార్లు వసూలు చేస్తున్నారు. అదేమని ప్రశ్నించిన వారిపై దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకుల బినామీలు పార్కింగ్ ప్రాంతాలను లీజుకు తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆమ్యామ్యాల మాటున నగరపాలక సంస్థ అధికారులు వారిని కట్టడి చేయడం లేదు.

☛ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 12 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌లు ఉన్నారు. వాటిల్లో కొన్ని కీలకమైన వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో ఉన్నాయి. వాహనాల పార్కింగ్‌పై నిర్దేశిత ఫీజు మాత్రమే వసూలు చేయాలి. అందుకు భిన్నంగా వాహనం పెట్టి తీస్తే కనిష్ఠంగా రూ.30 తీసుకుంటున్నారు. గంటకు మించితే దౌర్జన్యంగా రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. బోర్డుపై రాసిన ధరలకు మించి ఎందుకు వసూలు చేస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే, వారి వాహనాలకు అడ్డుగా నిలబడి తిట్ల దండకం అందుకుంటున్నారు. గుత్తేదార్ల అనుచరులు, వారివద్ద పనిచేసే కుర్రాళ్లు దౌర్జన్యానికి దిగుతున్నారు. అయినా బాధ్యులైన ఎస్టేట్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పార్కింగ్ అక్రమాలు, గుత్తేదార్ల ఆగడాలపై ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పార్కింగ్ ప్రాంతంలో నిలిపిన వాహనాలు

☛ పార్కింగ్ ఫీజు ఎక్కువ వసూలు చేయడం, యూపీఐ చెల్లింపులను నిరాకరించడం, కేటాయించిన ప్రాంతాన్ని కాకుండా వేరే చోట వసూలు చేయడం, నకిలీ రసీదు పుస్తకాలు వినియోగించడం వంటి వాటిపై ఫిర్యాదులు అందుతున్నా.. అధికారులు కనీసం స్పందించడం లేదనే విమర్శ వాహనదారుల నుంచి వినిపిస్తోంది.

**నకిలీ రసీదులు వినియోగిస్తూ..**

☛ ఎన్టీఆర్ వాణిజ్య సముదాయం, కాళేశ్వర రావు జనరల్ మార్కెట్, కేబీఎన్ వాణిజ్య సముదాయం వంటి ప్రాంతాల్లో సెల్లార్ పార్కింగ్‌లున్నాయి. మిగిలిన చోట్ల బహిరంగ పార్కింగ్‌లు ఉన్నాయి. కేటాయించిన ప్రాంతంలో కాకుండా వేరే ప్రాంతాల్లో నిలిపిన వాహనాలకూ అక్రమంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు.

☛ పార్కింగ్ ప్రాంతాల వేలం సమయంలో కొందరు అధికారులు అప్‌సెట్ ధరలను లీక్ చేస్తుండడంతో తక్కువ ధరకు వేలంలో లీజు దక్కించుకుని, ఎక్కువగా దండుకుంటున్నారు.

☛ నగర పాలక సంస్థ ముద్రించి ఇచ్చే రసీదులను గుత్తేదారులు పెద్దగా వాడడం లేదు. సొంతంగా ముద్రించినవి వినియోగిస్తున్నారు. కొందరైతే తెల్లకాగితాలు, అట్టముక్కలపై రాసి సొమ్ము తీసుకుంటున్నారు.

☛ పార్కింగ్ ప్రాంతాలను ఏడాది లీజు కాలానికి వేలం ద్వారా కేటాయించాలి. కొందరు రాజకీయ పలుకుబడి ఉపయోగించి కొద్దిపాటి లీజు సొమ్ము పెంపుదలతో పొడిగించుకుంటున్నారు. స్థాయీ సంఘం సభ్యులు కొందరు అమ్యామ్యాలు తీసుకొని ఆ ప్రతిపాదనను ఆమోదిస్తున్నారు.

## యమపాశంలా తీగలు

**అజిత్‌సింగ్‌నగర్:** 58వ డివిజన్ పీఅండ్‌టీ కాలనీలోని మసీదు సమీప వీధిలో విద్యుత్తు స్తంభానికి కేబుల్ తీగలు వేలాడుతున్నాయి. దీంతో అటుగా రాకపోకలు చేసే పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇవి కేబుల్ తీగలా లేక విద్యుత్తు తీగలా అన్నది అర్థం కాని పరిస్థితి నెలకొంది. అవి పట్టుకుని ఎక్కడ ప్రమాదం బారిన పడతామో అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళ మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి ఇప్పటికైనా అస్తవ్యస్త పరిస్థితిని చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

## పూడిక తీయరూ..!

**అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే:** అజిత్ సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్ సమీప వీధిలోని సైడు కాల్వలో గత వారం రోజులుగా వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగు పారక దుర్వాసన వస్తోందని, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పూడిక సక్రమంగా తీయడం లేదని ఆవేదన వ్యక్తం చేసున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు పారేలా పూడిక తీయించాలని కోరుతున్నారు.

వ్యర్థాలతో నిండిన మురుగు కాల్వ

## ఆర్‌యూబీ వద్ద నిలిచిన ట్రాఫిక్

**మధురానగర్, న్యూస్‌టుడే:** మధురానగర్ మెయిన్‌రోడ్డులో ఆర్‌యూబీ వద్ద ఆదివారం ఉదయం నిలిచిన ట్రాఫిక్‌తో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ బారికేడ్లు లేకపోవడంతో ఆర్‌యూబీలోకి వెళ్లేందుకు మూడు వైపుల నుంచి వాహనాలు వస్తున్నాయి. దీంతో వాహనాలు ఒక్కసారిగా నిలిచిపోతున్నాయి. ఆదివారం ఉదయం ఇలాగే ఆటో, కార్లు ఎదురెదురుగా వచ్చేశాయి. వీటి వెనుక ద్విచక్రవాహనాలు నిలిచిపోయాయి. దీంతో ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేకపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. గతంలో ఇక్కడ వాహనాలను నియంత్రించేందుకు బారికేడ్లు పెట్టారు. ఇవి లేకపోవడంతో తరచూ వాహనాలు ఆగిపోతున్నాయి.

## ఫొటో జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ఫొటో జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచల జయరాజు, మాజీ ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ సూచించారు. ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఫొటో జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా జి.వి.నారాయణరావు, అధ్యక్షుడిగా సి.హెచ్.వి.ఎన్.విజయభాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.రూబెన్, ప్రధాన కార్యదర్శిగా జి.మహేష్, కోశాధికారిగా సి.హెచ్.నారాయణరావు, ఉపాధ్యక్షులుగా కె.గిరిబాబు, సుధాకర్, కొమ్మూరి శ్రీనివాస్, ఎస్.సాంబశివరావు, ఎం.శివకుమార్, మస్తాన్, మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎస్.కె.బాబు, దారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'తీన్మార్ మల్లన్నపై దాడి చేసిన వారిని శిక్షించాలి'

**గవర్నర్‌పేట:** సామాజిక ఉద్యమకారుడు, బీసీల గళం వినిపిస్తున్న తీన్మార్ మల్లన్నపై తెలంగాణ జాగృతి గూండాలు దాడి చేయడాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు యాదవ్ ఖండించారు. ఆదివారం గవర్నర్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్లన్నపై దాడి చేసిన వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ ముదిరాజ్, యలమందరావు, మహిళా అధ్యక్షురాలు గీత తదితరులు మల్లన్నపై దాడిని ఖండించారు.

## హింస లేని సమాజాన్ని నిర్మిద్దాం

**అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే:** హింసలేని సమాజాన్ని నిర్మిద్దామని మహిత ఎన్‌జీవో స్టేట్ కోఆర్డినేటర్ గోడే ప్రసాద్ అన్నారు. ఆదివారం వాంబే కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పురుషులకు జెండర్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హింసలేని సమాజాన్ని నిర్మించడంలో పురుషుల పాత్ర ఎక్కువ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో పురుషులతో కలిసి పని చేయడం మొదలు పెట్టామన్నారు. కార్యక్రమంలో భూమిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాద్

## 'మాజీ మంత్రి పేర్ని నానిని అరెస్టు చేయాలి'

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** హింసను ప్రేరేపించే విధంగా వైకాపా నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నాని వ్యవహరించిన తీరుపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెదేపా రాష్ట్ర మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లా ఆదివారం తెలిపారు. కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా, వైకాపా కార్యకర్తలను రెచ్చగొట్టేలా ఓ సభలో ఆయన మాట్లాడిన తీరు పూర్తిగా ఆక్షేపణీయమన్నారు. రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా వ్యవహరించడమే కాకుండా రప్పా రప్పా అనడం సరికాదని, కన్ను కొడితే, ఒక సైగ చేస్తే తెదేపా కార్యకర్తల తలలు నరికే విధంగా అర్థం వచ్చేలా మాట్లాడారని పేర్కొన్నారు. ఈ క్రమంలో అతనిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. తెదేపా నాయకులు షేక్ ఆశా, సుకాశి సరిత, అన్సార్, జాహెద్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

**విజయవాడ వన్‌టౌన్:** పాతబస్తీ గణపతిరావు రోడ్డులోని ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంపు కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఫతావుల్లా మాట్లాడుతూ.. ప్రజలు వైకాపాను 11 సీట్లే ఇచ్చిన ఇలా అర్థరహిత వ్యాఖ్యలు చేస్తూ, సమాజంలో గొడవలు సృష్టించేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు షేక్.ఆశ మాట్లాడుతూ.. వైకాపా నేత, జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడమంటే నటిస్తున్నారని, తెదేపా నేతలు దాడి చేయకపోయినా చేసినట్టు ఊహల్లో ఉండి ఆరోపిస్తున్నారని విమర్శించారు. పేర్ని నాని సూచనలతోనే ఉప్పాల రాము, హారిక దంపతులు గుడివాడలో గొడవలు సృష్టించేందుకు యత్నించారని ఆమె ఆరోపించారు. అనంతరం 2వ పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి పేర్ని నానిపై ఫిర్యాదు చేశారు. తెదేపా నేతలు సుకాశి సరిత, ధనేకుల వెంకటసుబ్బారావు, హరికృష్ణ, తెలుగు మహిళా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్తల మార్పు

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే:** అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ నూతన సమన్వయకర్తలను నియమిస్తూ ఆదివారం ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నరహరిశెట్టి నరసింహారావును నియమించారు. ఆయన ఇప్పటివరకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉండగా.. ఇప్పుడు తూర్పు నియోజకవర్గానికి పంపించారు. ఇప్పుడు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న రాజీవ్‌రతన్‌ను తిరువూరుకు పంపించారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమై పార్టీని దిగువ స్థాయి నుంచి పటిష్ఠం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్తలకు షర్మిలారెడ్డి సూచించారు.

## కేవీఆర్ కైలాష్ అపార్టుమెంట్ల వద్ద మళ్లీ వివాదం

**విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే:** గుణదలలోని కేవీఆర్ కైలాష్ అపార్టుమెంట్ల వద్ద మళ్లీ గొడవ జరిగింది. అపార్టుమెంట్ బిల్డరు అయిన దేవినేని శ్రీహరిని అతని వద్ద, పనిచేసే వారిపై దాడి చేయడమే కాకుండా ఈనెల 7న నమోదు చేసిన కేసును వెనక్కి తీసుకోమంటూ బెదిరించిన వారిపై గుణదల పోలీసులు మరో కొత్త కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఫిర్యాది దేవినేని శ్రీహరి కథనం ప్రకారం.. గుణదలలో శ్రీహరి కేవీఆర్ కైలాష్ హైట్స్ ఎ, బి బ్లాకులు నిర్మించారు. ఈ అపార్టుమెంట్లకు పక్కనే ఉన్న స్థలాన్ని యజమాని అనుమతితో వీరు దారిగా వాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 12న ఉదయం 10.30 గంటల సమయంలో మల్లాది కాశీవిశ్వనాథ్, వీరమాచనేని శివప్రసాద్, మరికొంత మంది జేసీబీ తీసుకొచ్చి దారిగా వాడుకుంటున్న స్థలాన్ని తవ్వేశారు. దీన్ని ప్రశ్నించిన శ్రీహరిని, అతని వద్ద పనిచేసే ఎల్లారావును కొట్టారు. ఈనెల 7న ఇదే అపార్టుమెంటులోకి దౌర్జన్యంగా ప్రవేశించి సూపర్‌వైజర్ ప్రవీణ్‌ను కొట్టి సీసీ కెమెరాలు కట్ చేశారు. దీనిపై గుణదల పోలీసులు ఆ తరువాత రోజు కేసు నమోదు చేశారు. ఆ కేసును వెనక్కి తీసుకోవాలని.. లేకపోతే చంపుతామంటూ తాజాగా బెదిరిస్తున్నారని శ్రీహరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు నిందితులైన వీరమాచినేని శివప్రసాద్, మల్లాది కాశీ విశ్వనాథ్, మరికొంత మందిపై కేసు నమోదు చేశారు.

## జిప్‌లైన్ దిగుతుండగా సందర్శకుడికి గాయాలు

**మేడికొండూరు, న్యూస్‌టుడే:** జిప్‌లైన్ దిగే సమయంలో సందర్శకుడికి గాయాలయ్యాయి. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన జి.రఘువరన్, మరికొంత మంది మిత్రులు సరదాగా ఆదివారం పేరేచర్లలోని నగరవనానికి వచ్చారు. వారంతా కలిసి జిప్‌లైన్ ఎక్కారు. దిగే క్రమంలో రఘువరన్ అప్రమత్తంగా లేకపోవడంతో పక్కనే ఉన్న ఇనుప రాడ్డు తగిలింది. దీంతో మూతికి రక్తపు గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని ఇద్దరు సహాయకులతో 108 వాహనంలో గుంటూరు ప్రయివేట్ ఆసుపత్రి తరలించామని, అక్కడ చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారని అధికారులు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE XII ADDITIONAL DISTRICT JUDGE-CUM-JUDGE FAMILY COURT AT GUNTUR

A.S.NO. 207 OF 2004

Between:
Pasupuleti Govindamma (died) and 2 other ... Appellants
And
Pasupuleti Lakshmi Prasuna and others ...Respondents

**NOTICE**

To,
Respondent No. 3:

The Peerless General Finance and Investment Co., Ltd., represented by its Branch Manager, Sai Tavaneesh Towers, Ramamandiram Street, Eluru Road, Governerpet, Vijayawada.

**Take Notice that:** Above appeal was filed by the appellants, wherein you are the respondent No 3. The Hon'ble court ordered notices and they were not served on you. Hence as per the order of the Hon'ble court the appellants herein informed you that the above appeal is posted for your appearance on 24-07-2025 and you are hereby informed to attend before the above named court by 10.30 am. on 24-07-2025 personally or through Advocate. Failing which the matter will be decided against you.

**Date of adjournment: 24-07-2025**
(By order of the Court)

**K.SAI RAMA MURTHY, K. JAYASREE,** Advocates,
Flat No. 104, Krystal Castle Apartments, Hailand Road, Chinnakakani, Mangalagiri, Guntur District.
Guntur,12-07-2024

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

# విజయవాడ పశ్చిమ

## నేత్రపర్వం.. నృత్య నీరాజనం

కళాకారిణులు కూచిపూడి నృత్యం

**విద్యాధరపురం, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా జగన్మాత దుర్గమ్మకు కోలాట నృత్య కళాకారులు ఆదివారం నేత్రపర్వంగా కళార్చన నిర్వహించారు. విజయవాడకు చెందిన కూచిపూడి కళాకారులు జగన్మాతను కీర్తిస్తు చేసిన నృత్యం భక్తులను ఆకట్టుకుంది. జానపద గీతాలకు నగరానికి చెందిన కోలాట మహిళా బృందం చేసిన ప్రదర్శన అలరించింది. కళాకారులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారిని అభినందించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రి శ్యామలానగర్‌కు చెందిన దాత బోగవరపు సత్యనారాయణ రూ.1,01,116 విరాళం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

## సూర్య సత్య ఛారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ట్రస్టు ఛైర్మన్ సోమేశ్వరరావు తదితరులు

**చిట్టినగర్:** పేద విద్యార్థులను చదువుకు చేరువ చేయడంతో పాటు సమాజ సేవ స్ఫూర్తిదాయకమని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో వి.నారాయణరావు అన్నారు. కేవీఎల్‌రావునగర్, సిండికేటు బ్యాంకు కాలనీలోని రాజగిరి రెసిడెన్సీలో ఛైర్మన్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సూర్య సత్య ఛారిటబుల్ ట్రస్టు 10వ వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పది వసంతాలుగా సేవలో తరించడం, ఎందరికో విద్యను అందించడంలో ట్రస్టు నిర్వాహకులు తమ వంతు పాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్ మాట్లాడుతూ.. ఏటా ఉపకార వేతనాలే కాకుండా చలి వేంద్రాలు, అన్నదానాలు చేయడం శుభ పరిణామమని అన్నారు. అనంతరం 50 మంది కళాశాల విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున ఉపకార వేతనాలు, 50 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు, ముగ్గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం అధ్యక్షులు బాయన బాబ్జి, ఎన్.సూర్యారావు, ఎన్.వి.రావు, సాయి సత్సంగ మండలి వ్యవస్థాపకులు కృష్ణశేఖర్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డులా దుర్గగుడి డార్మిటరీలు..!

### అందుబాటులోకి తీసుకొస్తే ప్రయోజనం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

హాల్ కిటికీ మెష్‌లకు రంధ్రాలు

ఆవరణ ఇలా..

**రా**ష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయంగా పేరుగాంచిన దుర్గగుడిలో భక్తులకు మౌలిక వసతులు కరవయ్యాయి. సత్రాలు, డార్మిటరీలను భక్తులకు కేటాయించకుండా వాటిని ఇతర అవసరాలకు వినియోగిస్తుండడంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. పాతబస్తీ రైల్వే వెస్టు బుకింగ్ సెంటర్ సమీపంలో విశాలమైన సీవీ రెడ్డి చారిటీస్ స్థలంలో రూ.10 కోట్ల వ్యయంతో ఏడేళ్ల క్రితం నాలుగు డార్మిటరీలను దుర్గగుడి అధికారులు నిర్మించారు. గడిచిన వైకాపా పాలనలో ఈ డార్మిటరీలను అభివృద్ధి చేయకపోగా.. వీటి చుట్టూ ఆలయంలోని పాత సామగ్రిని తీసుకువచ్చి నింపారు. ఇది చాలదన్నట్లుగా అప్పటి దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలతో కనకదుర్గానగర్‌లో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన పెర్గోలా (రాతి స్తంభాల ద్వారం) స్తంభాలు తొలగించి వాటిని తీసుకువచ్చి డార్మిటరీస్ పక్కన పడేశారు. ఒకవైపు చెత్త మరొక వైపు రాతి స్తంభాలు వేయడంతో ఈ ప్రాంతంలో పాములు, విష కీటకాలు చేరాయి. వీటికి తోడు కిటికీలకు వేసిన మెష్ కూడా జీర్ణావస్థకు చేరింది.

### నిరుపయోగంగా..

ఒకవైపు భక్తులకు వసతి లేక అల్లాడుతుంటే దేవస్థానం అధికారులు డార్మిటరీలు ఉన్న విషయం గోప్యంగా ఉంచుతున్నారు. నిర్మాణం చేసి ఏడేళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో ఒక్క దానిని మాత్రమే వినియోగిస్తున్నారు. మిగతా మూడింట్లో దేవస్థానానికి సంబంధించిన పాత సామగ్రి వేసి గోదాముగా వాడుతున్నారు. చుట్టు పక్కల ఉన్న తుక్కు కారణంగా పాములు, విష కీటకాలు సంచరిస్తున్నాయని భక్తులు వాపోతున్నారు.

### పాత పరికరాలు తొలగించేందుకు చర్యలు..

భక్తుల సౌకర్యం కోసం ఇక్కడ ఉన్న పాత సామగ్రిని వేలం వేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నాం. భక్తులు పూర్తిస్థాయిలో నాలుగు డార్మిటరీలు వినియోగించేందుకు వీలుగా చర్యలు తీసుకుంటాం.

**- ఈఈ రాంబాబు, దుర్గగుడి**

## ప్రజాసంక్షేమమే కూటమి ధ్యేయం

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరావు, బుద్దా వెంకన్న, తదితరులు

**విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బుద్దా వెంకన్న ప్రజలను కోరారు. పాతబస్తీ 52వ డివిజన్ బ్రాహ్మణవీధి రావిచెట్టు సెంటర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం స్థానిక నేతలతో కలిసి నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. కార్యక్రమంలో తెదేపా నేతలు నందం భవానీప్రసాద్, గోలి శ్రీనివాసరావు, దూడే అప్పారావు, తాడిశెట్టి అశోక్, వెంకటేష్, దాసరి రమణ, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

**విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:** తెలుగు యువత నాయకుడు దాడి మురళీకృష్ణ, బ్లూ ఐ ఆప్టికల్స్ సంయుక్త ఆధ్వర్యంలో పాతబస్తీ పంజా సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. 300 మంది పాల్గొనగా, సుమారు 200 మందికి ఐ డ్రాప్స్ మందులను పంపిణీ చేశారు. అవసరమైన కళ్లజోళ్లను మాజీ ఎమ్మెల్యే బుద్దా వెంకన్న పంపిణీ చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు మైలపల్లి రాజు, తెదేపా నేతలు గడ్డిపాటి కిరణ్, పెంటపల్లి బాజీ, భాజపా నేత సయ్యద్ ఇంతియాజ్, శ్రీనివాసరావు, జనసేన నేత గౌరి శంకర్, ముద్రబోయిన దేవకి, తదితరులు పాల్గొన్నారు.

## ఫొటో జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ఫొటో జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచల జయరాజు, మాజీ ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ సూచించారు. ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఫొటో జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా జి.వి.నారాయణరావు, అధ్యక్షుడిగా సి.హెచ్.వి.ఎన్.విజయభాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.రూబెన్, ప్రధాన కార్యదర్శిగా జి.మహేష్, కోశాధికారిగా సి.హెచ్.నారాయణరావు, ఉపాధ్యక్షులుగా కె.గిరిబాబు, సుధాకర్, కొమ్మూరి శ్రీనివాస్, ఎస్.సాంబశివరావు, ఎం.శివకుమార్, మస్తాన్, మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎస్.కె.బాబు, దారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావు లేని లోటు పూడ్చలేనిది

విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**భవానీపురం:** సినీ నటుడు, భాజపా మాజీ శాసనసభ్యుడు కోట శ్రీనివాసరావు లేని లోటు తీరనిదని భాజపా రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో కోట శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మధుకర్ మాట్లాడుతూ.. కొందరు నటులు నవ్వించగలరని, మరికొందరు ఏడిపిస్తారని, నవ్వించి..ఏడిపించి.. భయపెట్టిన ఏకైక నటుడు కోట శ్రీనివాసరావు మరణించడం బాధాకరమన్నారు. భాజపా రాష్ట్ర నాయకులు ఉప్పలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. అవినీతికి తావు లేకుండా శాసనసభ్యుడిగా పనిచేశారని, ప్రజలు, కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉండేవారని చెప్పారు. భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, నాయకులు షేక్ బాజీ, కర్రి.నాగలక్ష్మీ, బాషా, తదితరులు పాల్గొన్నారు.

**భవానీపురం, న్యూస్‌టుడే:** తెలుగు ప్రజల హృదయాల్లో కోట శ్రీనివాసరావు చిరస్థాయిగా నిలిచిపోతారని పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

● కోట శ్రీనివాసరావుతో తనకు చక్కటి అనుబంధం ఉందని భాజపా రాష్ట్ర నాయకుడు ఉప్పలపాటి శ్రీనివాసరాజు తెలిపారు. ఆయన శాసనసభ్యుడిగా పని చేసిన సమయంలో తాను విజయవాడ నగర అధ్యక్షుడిగా పని చేశానని గుర్తుచేసుకున్నారు. అవినీతికి తావు లేకుండా పని చేశారని వెల్లడించారు.

**విజయవాడ వన్‌టౌన్:** ప్రముఖ సినీనటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు లేని లోటు పూడ్చలేనిదని ఏఐసీసీ సభ్యుడు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు అన్నారు. పాతబస్తీలోని ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. కోటా శ్రీనివాసరావు నటుడిగానే కాకుండా రాజకీయ నేతగానూ, ప్రజలకు సేవ చేసిన ఎమ్మెల్యేగానూ సుపరిచితులని, విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారని పేర్కొన్నారు. సినీ రంగానికి ఆయన లేని లోటు పూడ్చలేనిదని.. ఆయన ఆత్మ శాంతించాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** విలక్షణ నటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బి.శివకుమార్ పట్నాయక్ అన్నారు. ఆయన తూర్పు ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఆయన వెన్నంటే ఉండి ప్రచారం చేసి గెలిపించుకున్నామని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి బాధాకరమన్నారు.

**విద్యాధరపురం:** విజయవాడ డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన కొణిజేటి కన్నయ్య కుమార్తె వివాహానికి 30ఏళ్ల కిందట కోట శ్రీనివాసరావు హాజరయ్యారు. కన్నయ్య కుమారుడు, తెదేపా నాయకులు కొణిజేటి రమేష్ కోటాతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. విజయవాడ రోటరీ హాల్లో 20 ఏళ్ల క్రితం నిర్వహించిన ఎక్స్‌రే సంస్థ వార్షికోత్సవానికి హాజరైన కోటా నాడు చేసిన ప్రసంగాన్ని సంస్థ నిర్వాహకులు కొల్లూరి రాజు గుర్తు చేసుకున్నారు.

## దుర్గమ్మకు ఆషాఢ సారె

సారె తీసుకువస్తున్న ఏపీ బ్రాహ్మణ సమాఖ్య నాయకులు

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు సారె సమర్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మహిళా బృందాలు ఆదివారం తరలివచ్చాయి. సెలవు దినం కావడంతో ఒకవైపు దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు, మరొక వైపు సారె బృందాలతో దుర్గగుడిపై ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. 80 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు చెబుతున్నారు. కనకదుర్గానగర్ మెట్ల మార్గం, ఘాట్ రోడ్డు మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. క్యూలైన్లు కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనానికి వీఐపీ క్యూలైన్లో రెండు గంటల సమయం పట్టింది. సర్వ దర్శనానికి మూడు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు దేవస్థానం సిబ్బంది అందజేశారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో రావిచెట్టు సెంటరు నుంచి కుటుంబ సభ్యులతో కలిసి నాయకులు అమ్మవారికి సారెను సంప్రదాయబద్ధంగా సమర్పించారు. సమాఖ్య అధ్యక్షుడు కె.సతీష్ శర్మ, ప్రధాన కార్యదర్శి మనోహరరావు, మహిళా సంఘం అధ్యక్షురాలు కె.కుసుమకుమారి, ప్రధానకార్యదర్శి కె. సూర్యకుమారి పాల్గొన్నారు.

### ఉచిత ప్రసాద పంపిణీకి విరాళం

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** దుర్గగుడి ఉచిత ప్రసాద పంపిణీకి రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌కు చెందిన శాంభవ సోలంకీ రూ.1,52,000 విరాళం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాతకు విరాళం రసీదు అందజేస్తున్న ఈవో శీనానాయక్

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? చిట్టినగర్ లంబాడీపేట పక్క కాలువలో పూడిక పేరుకుపోయింది. **-పూర్ణిమ, స్థానికురాలు** ✔ పరిశీలించి పూడిక తీయిస్తాం. **- ఆనంద్‌కృపాల్, స్థానిక శానిటరీ అధికారి**

? కేఎల్‌రావు పార్కుకు వెళ్లే రహదారి మార్గంలో గుంతలు ఏర్పడ్డాయి. **- సతీష్, స్థానికుడు** ✔ పరిశీలించి గుంతలు పూడ్చివేయిస్తాం. **- సురేఖ, సర్కిల్-I ఈఈ**

? సొరంగమార్గం గంగానమ్మ ఆలయం నుంచి మస్తానయ్య వీధికి వెళ్లే మార్గంలో పక్క కాలువలో పూడిక పేరుకుపోయింది. **- రియాజ్, స్థానికుడు** ✔ పరిశీలించి పూడిక తీయిస్తాం. **- నరసింహారావు, స్థానిక శానిటరీ అధికారి**

? గొల్లపూడి డీమార్ట్ ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ల ఆవరణలో పూడిక పేరుకుపోయి రోడ్డుపై మురుగు పొంగిపొర్లుతోంది. **- రాజేష్, స్థానికుడు** ✔ పరిశీలించి పూడిక తీయిస్తాం. **- రమేష్‌బాబు, స్థానిక శానిటరీ అధికారి**

? చిట్టినగర్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న వీధిలో రామాలయం పక్క కాలువలో మురుగు పేరుకుపోయింది. **- సురేష్, స్థానికుడు** ✔ పరిశీలించి పూడిక తీయిస్తాం. **- కృష్ణ, స్థానిక శానిటరీ అధికారి**

స్పందనకు వందనం

● పాల ఫ్యాక్టరీ ఎస్ఏఎస్ కళాశాల వెనుక భాగంలో రంగుమారిన మంచినీరు సరఫరా అవుతోందని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మంచినీటి విభాగం అధికారులు స్పందించారు. తుప్పుబట్టిన పైపులైన్లను మార్పించారు. ● సాయిరామ్ థియేటర్ వద్ద ఉన్న పేరల్స్ అపార్టుమెంట్ పక్క కాలువలో పూడిక పేరుకుపోయిందని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో పూడిక తీయించారు. ● ప్రైజర్‌పేట సీఎస్ఐ చర్చి వద్ద రాత్రుళ్లు కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు వెటర్నరీ విభాగం అధికారులు స్పందించారు. కుక్కలను పట్టారు. ● పూర్ణానందంపేట నాడార్ వీధి ఆలయం పక్క కాలువలో పూడిక పేరుకుపోయిందని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో పూడిక తీయించారు. ● కేదారేశ్వరపేట ప్రభాస్ కళాశాల వెనుక వీధిలో పక్క కాలువలో రోడ్డుపై మురుగు పొంగిపొర్లుతోందని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

## ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

**విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** నగర వాసుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ పరిధిలోని సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

## మాజీ మంత్రి పేర్ని నానిని అరెస్టు చేయాలి

కొత్తపేట సీఐకి ఫిర్యాదు అందిస్తున్న తెదేపా మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, పార్టీ శ్రేణులు

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** హింసను ప్రేరేపించే విధంగా వైకాపా నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నాని వ్యవహరించిన తీరుపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెదేపా రాష్ట్ర మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లా ఆదివారం తెలిపారు. కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా, వైకాపా కార్యకర్తలను రెచ్చగొట్టేలా ఓ సభలో ఆయన మాట్లాడిన తీరు పూర్తిగా ఆక్షేపణీయమన్నారు. రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా వ్యవహరించడమే కాకుండా రప్పా రప్పా అనడం సరికాదని, కన్ను కొడితే, ఒక సైగ చేస్తే తెదేపా కార్యకర్తల తలలు నరికే విధంగా అర్థం వచ్చేలా మాట్లాడారని పేర్కొన్నారు. ఈ క్రమంలో అతనిపై చట్ట పరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. తెదేపా నాయకులు షేక్ ఆశా, సుకాశి సరిత, అన్సార్, జాహెద్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

**విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:** పాతబస్తీ గణపతిరావు రోడ్డులోని ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంపు కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఫతావుల్లా మాట్లాడుతూ.. ప్రజలు వైకాపాను 11 సీట్లే ఇచ్చిన ఇలా అర్థరహిత వ్యాఖ్యలు చేస్తూ, సమాజంలో గొడవలు సృష్టించేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు షేక్.ఆశ మాట్లాడుతూ.. వైకాపా నేత, జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడమంటే నటిస్తున్నారని, తెదేపా నేతలు దాడి చేయకపోయినా చేసినట్టు ఊహల్లో ఉండి ఆరోపిస్తున్నారని విమర్శించారు. పేర్ని నాని సూచనలతోనే ఉప్పాల రాము, హారిక దంపతులు గుడివాడలో గొడవలు సృష్టించేందుకు యత్నించారని ఆమె ఆరోపించారు. అనంతరం 2వ పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి పేర్ని నానిపై ఫిర్యాదు చేశారు. తెదేపా నేతలు సుకాశి సరిత, ధనేకుల వెంకటసుబ్బారావు, హరికృష్ణ, తెలుగు మహిళా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నాయకుల నిరసన

## స్మార్టు మీటర్లు ఉపసంహరించుకోవాలి

**విద్యాధరపురం:** పేద వర్గాలపై విద్యుత్తు భారాలు మోపే స్మార్టు మీటర్లు రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు డిమాండ్ చేశారు. కబేళా విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద స్మార్టు మీటర్లను సీపీఎం నాయకులు ఆదివారం దగ్ధం చేశారు. సత్యబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి ఒప్పందాల కారణంగా రానున్న 25 ఏళ్లలో రూ.1.25 లక్షల కోట్లు భారం ప్రజలపై పడుతుందన్నారు. సీపీఎం నాయకులు సూరిబాబు, వెంకట్రావ్, వెంకటరత్నం, మస్తాన్ పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు ప్రభుత్వం చేయూత

**అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే:** నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా నిలబడేందుకు కూటమి ప్రభుత్వం తోడ్పాటు ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం అజిత్‌సింగ్‌నగర్ తెదేపా కార్యాలయంలో పీ4 కార్యక్రమం ద్వారా సొంత నిధులతో పేద కుటుంబాలకు తోపుడుబండ్లను అందజేశారు.

## దారంతా గుంతలు.. దాటలేక తిప్పలు

**పా**ల ఫ్యాక్టరీ కొండమూల ప్రాంతంలో రోడ్డు అధ్వానంగా మారింది. గోతులు పడడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. చనమోలు వెంకట్రావు వంతెన దిగువన రోడ్డుపై కంకర తేలింది. కొన్ని చోట్ల గోతులు ఏర్పడ్డాయి. నగరంలో నుంచి గ్రామీణ ప్రాంతాలైన అంబాపురం, నైనవరం, కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, వైఎస్ఆర్ కాలనీలకు నిత్యం వేలమంది రాకపోకలు సాగిస్తారు. రాత్రి సమయంలో గోతులు తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రమాదాలకు తావులేకుండా చూడాలని కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, చిట్టినగర్**

## బీసీ మహిళపై దాడి హేయమైన చర్య

మాజీ మంత్రి వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి నిరసన

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** గుడివాడలో జిల్లా పరిషత్ ఛైర్మన్, బీసీ మహిళ హారికపై దాడిచేయడం హేయమైన చర్య అని మాజీ మంత్రి, వైకాపా నేత వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. దాడి ఘటనను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. 46వ డివిజన్, సాయిరాం థియేటర్ సమీపంలోని తమ్మిన కృష్ణ వీధిలో మేయర్ భాగ్యలక్ష్మి ఇంటి వద్ద హారికపై దాడికి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబూని ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళపై దాడి జరుగుతుంటే పోలీసు వ్యవస్థ ప్రేక్షక పాత్ర వహించడం సరికాదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. మేయర్ భాగ్యలక్ష్మితో పాటు వైకాపా కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సినిమాలు

**తమ్ముడు:** శైలజ, జీ-3(రాజ్-యువరాజ్), మీరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు).

**3బీహెచ్‌కే:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు)

**కన్నప్ప:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), సాయిరామ్, స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు)

**మార్గన్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), సాయిరామ్, స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు)

**కుబేరా:** అలంకార్, జీ-3(రాజ్-యువరాజ్), మీరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు)

**- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

## అధిక వసూళ్లు.. అడిగితే దాడులు!

### నగరంలో పార్కింగ్ ఫీజు పేరిట దోపిడీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

**న**గరంలో వాహనాల పార్కింగ్ ఫీజుల పేరిట చోదకుల నుంచి నిబంధనలు ఉల్లంఘించి గుత్తేదార్లు వసూలు చేస్తున్నారు. అదేమని ప్రశ్నించిన వారిపై దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకుల బినామీలు పార్కింగ్ ప్రాంతాలను లీజుకు తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆమ్యామ్యాల మాటున నగరపాలక సంస్థ అధికారులు వారిని కట్టడి చేయడం లేదు.

☛ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 12 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌లు ఉన్నారు. వాటిల్లో కొన్ని కీలకమైన వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో ఉన్నాయి. వాహనాల పార్కింగ్‌పై నిర్దేశిత ఫీజు మాత్రమే వసూలు చేయాలి. అందుకు భిన్నంగా వాహనం పెట్టి తీస్తే కనిష్ఠంగా రూ.30 తీసుకుంటున్నారు. గంటకు మించితే దౌర్జన్యంగా రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. బోర్డుపై రాసిన ధరలకు మించి ఎందుకు వసూలు చేస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే, వారి వాహనాలకు అడ్డుగా నిలబడి తిట్ల దండకం అందుకుంటున్నారు. గుత్తేదార్ల అనుచరులు, వారివద్ద పనిచేసే కుర్రాళ్లు దౌర్జన్యానికి దిగుతున్నారు. అయినా బాధ్యులైన ఎస్టేట్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పార్కింగ్ అక్రమాలు, గుత్తేదార్ల ఆగడాలపై ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వాహనాల పార్కింగ్

☛ పార్కింగ్ ఫీజు ఎక్కువ వసూలు చేయడం, యూపీఏ చెల్లింపులను నిరాకరించడం, కేటాయించిన ప్రాంతాన్ని కాకుండా వేరే చోట వసూలు చేయడం, నకిలీ రసీదు పుస్తకాలు వినియోగించడం వంటి వాటిపై ఫిర్యాదులు అందుతున్నా. అధికారులు కనీసం స్పందించడం లేదనే విమర్శ వాహనదారుల నుంచి వినిపిస్తోంది.

### నకిలీ రసీదులు వినియోగిస్తూ..

☛ ఎన్టీఆర్ వాణిజ్య సముదాయం, కాళేశ్వరరావు జనరల్ మార్కెట్, కేబీఎన్ వాణిజ్య సముదాయం వంటి ప్రాంతాల్లో సెల్లార్ పార్కింగ్‌లున్నాయి. మిగిలిన చోట్ల బహిరంగ పార్కింగ్‌లు ఉన్నాయి. కేటాయించిన ప్రాంతంలో కాకుండా వేరే ప్రాంతాల్లో నిలిపిన వాహనాలకూ అక్రమంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు.

☛ పార్కింగ్ ప్రాంతాల వేలం సమయంలో కొందరు అధికారులు అప్‌సెట్ ధరలను లీక్ చేస్తుండడంతో తక్కువ ధరకు వేలంలో లీజు దక్కించుకుని, ఎక్కువగా దండుకుంటున్నారు.

☛ నగర పాలక సంస్థ ముద్రించి ఇచ్చే రసీదులను గుత్తేదారులు పెద్దగా వాడడం లేదు. సొంతంగా ముద్రించినవి వినియోగిస్తున్నారు. కొందరైతే తెల్లకాగితాలు, అట్టముక్కలపై రాసి సొమ్ము తీసుకుంటున్నారు.

☛ పార్కింగ్ ప్రాంతాలను ఏడాది లీజు కాలానికి వేలం ద్వారా కేటాయించాలి. కొందరు రాజకీయ పలుకుబడి ఉపయోగించి కొద్దిపాటి లీజు సొమ్ము పెంపుదలతో పొడిగించుకుంటున్నారు. స్థాయీ సంఘం సభ్యులు కొందరు అమ్యామ్యాలు తీసుకొని ఆ ప్రతిపాదనను ఆమోదిస్తున్నారు.

(c) eenadu

# విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

స్పందనకు వందనం

● మూడో డివిజన్ శ్రీరామ చంద్రనగర్ హైటెన్షన్ రోడ్డు ఆయుష్ హాస్పిటల్ రోడ్డులో భూగర్భ డ్రెయినేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి భగవాన్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్రం సాయంతో పూడిక తీయించారు.

● 10వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో 10-47/35 విద్యుత్ స్తంభానికున్న దీపం గత కొంత కాలంగా వెలగడం లేదని స్థానిక నివాసి డి.హరికృష్ణ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

**విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** నగరవాసుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ పరిధిలోని సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

## కోట మృతికి ఎంపీ శివనాథ్ సంతాపం

**పటమట, న్యూస్‌టుడే:** తెలుగు సినీ రంగంలో విలక్షణ నటుడిగా తనదైన ముద్ర వేసుకున్న విజయవాడ ఈస్ట్ మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటు అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కోట శ్రీనివాసరావు ప్రత్యేక తరహా నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో ఎప్పటికీ గుర్తుండిపోతారని అన్నారు. కంకిపాడుకు చెందిన కోటకి విజయవాడతో ప్రత్యేక అనుబంధం ఉందని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## అధిక వసూళ్లు.. అడిగితే దాడులు!

### నగరంలో పార్కింగ్ ఫీజు పేరిట దోపిడీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

**న**గరంలో వాహనాల పార్కింగ్ ఫీజుల పేరిట చోదకుల నుంచి నిబంధనలు ఉల్లంఘించి గుత్తేదార్లు వసూలు చేస్తున్నారు. అదేమని ప్రశ్నించిన వారిపై దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకుల బినామీలు పార్కింగ్ ప్రాంతాలను లీజుకు తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. అమ్యామ్యాల మాటున నగరపాలక సంస్థ అధికారులు వారిని కట్టడి చేయడం లేదు.

☛ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 12 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌లు ఉన్నాయి. వాటిల్లో కొన్ని కీలకమైన వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో ఉన్నాయి. వాహనాల పార్కింగ్‌పై నిర్దేశిత ఫీజు మాత్రమే వసూలు చేయాలి. అందుకు భిన్నంగా వాహనం పెట్టి తీస్తే కనిష్ఠంగా రూ.30 తీసుకుంటున్నారు. గంటకు మించితే దౌర్జన్యంగా రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. బోర్డుపై రాసిన ధరలకు మించి ఎందుకు వసూలు చేస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే, వారి వాహనాలకు అడ్డంగా నిలబడి తిట్ల దండకం అందుకుంటున్నారు. గుత్తేదార్ల అనుచరులు, వారివద్ద పనిచేసే కుర్రాళ్లు దౌర్జన్యానికి దిగుతున్నారు. అయినా బాధ్యులైన ఎస్టేట్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పార్కింగ్ అక్రమాలు, గుత్తేదార్ల ఆగడాలపై ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పార్కింగ్ ప్రాంతంలో నిలిపిన ద్విచక్ర వాహనాలు

☛ పార్కింగ్ ఫీజు ఎక్కువ వసూలు చేయడం, యూపీఐ చెల్లింపులను నిరాకరించడం, కేటాయించిన ప్రాంతాన్ని కాకుండా వేరే చోట వసూలు చేయడం, నకిలీ రసీదు పుస్తకాలు వినియోగించడం వంటి వాటిపై ఫిర్యాదులు అందుతున్నా. అధికారులు కనీసం స్పందించడం లేదనే విమర్శ వాహనదారుల నుంచి వినిపిస్తోంది.

**నకిలీ రసీదులు వినియోగిస్తూ..**

☛ ఎన్టీఆర్ వాణిజ్య సముదాయం, కాళేశ్వరరావు జనరల్ మార్కెట్, కేబీఎన్ వాణిజ్య సముదాయం వంటి ప్రాంతాల్లో సెల్లార్ పార్కింగ్‌లున్నాయి. మిగిలిన చోట్ల బహిరంగ పార్కింగ్‌లు ఉన్నాయి. కేటాయించిన ప్రాంతంలో కాకుండా వేరే ప్రాంతాల్లో నిలిపిన వాహనాలకూ అక్రమంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు.

☛ పార్కింగ్ ప్రాంతాల వేలం సమయంలో కొందరు అధికారులు అప్‌సెట్ ధరలను లీక్ చేస్తుండడంతో తక్కువ ధరకు వేలంలో లీజు దక్కించుకుని, ఎక్కువగా దండుకుంటున్నారు.

☛ నగర పాలక సంస్థ ముద్రించి ఇచ్చే రసీదులను గుత్తేదారులు పెద్దగా వాడడం లేదు. సొంతంగా ముద్రించినవి వినియోగిస్తున్నారు. కొందరైతే తెల్లకాగితాలు, అట్టముక్కలపై రాసి సొమ్ము తీసుకుంటున్నారు.

☛ పార్కింగ్ ప్రాంతాలను ఏడాది లీజు కాలానికి వేలం ద్వారా కేటాయించాలి. కొందరు రాజకీయ పలుకుబడి ఉపయోగించి కొద్దిపాటి లీజు సొమ్ము పెంపుదలతో పొడిగించుకుంటున్నారు. స్థాయీ సంఘం సభ్యులు కొందరు అమ్యామ్యాలు తీసుకొని ఆ ప్రతిపాదనను ఆమోదిస్తున్నారు.

## కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నరహరిశెట్టి

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే:** అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ నూతన సమన్వయకర్తలను నియమిస్తూ ఆదివారం ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నరహరిశెట్టి నరసింహారావును నియమించారు. ఆయన ఇప్పటి వరకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉండగా.. ఇప్పుడు తూర్పు నియోజకవర్గానికి పంపించారు. ఇప్పుడు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న రాజీవ్‌రతన్‌ను తిరువూరుకు పంపించారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమై పార్టీని దిగువ స్థాయి నుంచి పటిష్ఠం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్తలకు షర్మిలారెడ్డి సూచించారు.

## ఆకట్టుకున్న నృత్య నీరాజనం

**విద్యాధరపురం:** ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా జగన్మాత దుర్గమ్మకు కోలాట నృత్య కళాకారులు ఆదివారం నేత్రపర్వంగా కళార్చన నిర్వహించారు. విజయవాడకు చెందిన కూచిపూడి కళాకారులు జగన్మాతను కీర్తిస్తు చేసిన నృత్యం భక్తులను ఆకట్టుకుంది. జానపద గీతాలకు నగరానికి చెందిన కోలాట మహిళా బృందం చేసిన ప్రదర్శన అలరించింది.

## కేవీఆర్ కైలాష్ అపార్టుమెంట్ల వద్ద మళ్లీ వివాదం

**విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే:** గుణదలలోని కేవీఆర్ కైలాష్ అపార్టుమెంట్ల వద్ద మళ్లీ గొడవ జరిగింది. అపార్టుమెంట్ బిల్డరు అయిన దేవినేని శ్రీహరిని అతని వద్ద, పని చేసే వారిపై దాడి చేయడమే కాకుండా ఈనెల 7న నమోదు చేసిన కేసును వెనక్కి తీసుకోమంటూ బెదిరించిన వారిపై గుణదల పోలీసులు మరో కొత్త కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఫిర్యాది దేవినేని శ్రీహరి కథనం ప్రకారం..గుణదలలో శ్రీహరి కేవీఆర్ కైలాష్ హైట్స్ ఎ, బి బ్లాక్‌లు నిర్మించారు. ఈ అపార్టుమెంట్లకు పక్కనే ఉన్న స్థలాన్ని యజమాని అనుమతితో వీరు దారిగా వాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 12న ఉదయం 10.30 గంటల సమయంలో మల్లాది కాశీవిశ్వనాథ్, వీరమాచనేని శివప్రసాద్, మరికొంత మంది జేసీబీ తీసుకొచ్చి దారిగా వాడుకుంటున్న స్థలాన్ని తవ్వేశారు. దీన్ని ప్రశ్నించిన శ్రీహరిని, అతని వద్ద పనిచేసే ఎల్లారావును కొట్టారు. ఈనెల 7న ఇదే అపార్టుమెంటులోకి దౌర్జన్యంగా ప్రవేశించి సూపర్‌వైజర్ ప్రవీణ్‌ను కొట్టి సీసీ కెమెరాలు కట్ చేశారు. దీనిపై గుణదల పోలీసులు ఆ తరువాత రోజు కేసు నమోదు చేశారు. ఆ కేసును వెనక్కి తీసుకోవాలని..లేకపోతే చంపుతామంటూ తాజాగా బెదిరిస్తున్నారని శ్రీహరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు నిందితులైన వీరమాచినేని శివప్రసాద్, మల్లాది కాశీ విశ్వనాథ్, మరికొంత మందిపై కేసు నమోదు చేశారు.

## సీనియర్ అంతర్ జిల్లాల మల్టీ డే క్రికెట్ విజేత గుంటూరు

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** విజయవాడ సమీపంలోని మూలపాడు ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లో ఆదివారం ముగిసిన ఏసీఏ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల మల్టీ డే క్రికెట్ టోర్నీలో గుంటూరు జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ప్రకాశం జట్టు ద్వితీయ స్థానం సాధించింది. సీపీ మైదానంలో కృష్ణా, పశ్చిమ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్యాటర్లు సత్తా చాటారు. పశ్చిమ గోదావరి జట్టు 310 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను కొనసాగించి 120 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 502 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జీఎస్ స్వామినాయుడు (104), కె. రేవంత్ నాగ్ (120) రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ ఎ.బ్రహ్మతేజ (4/130) మెరిశాడు. రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు ఆట నిలిపే సమయానికి 44 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. వై.సందీప్ (102) క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్ బి.మునీష్ వర్మ (2/39) మెరిశాడు. కృష్ణా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. పశ్చిమ గోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం చూపడంతో మూడు పాయింట్లు, కృష్ణా జట్టు ఒక పాయింటు సాధించాయి.

గెలుపొందిన గుంటూరు జట్టు క్రీడాకారులు

● డీఆర్ మైదానంలో గుంటూరు, ప్రకాశం జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో 217 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ప్రకాశం జట్టు 54.2 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. ఎం.లేఖాజ్‌రెడ్డి (92)రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ పి.ఆదిత్యరెడ్డి (5/62)మెరిశాడు. రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు ఆట నిలిపే సమయానికి 51 ఓవర్లలో అయిదు వికెట్లు కోల్పోయి 263 పరుగులు చేసింది. ఎం.వంశీకృష్ణ (73) రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ వి.వేణు (2/94) మెరిశాడు. గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 468 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కనబరచడంతో మూడు పాయింట్లు, ప్రకాశం జట్టు ఒక పాయింటు సొంతం చేసుకున్నాయి.

## ముగిసిన జూడో బ్రౌన్ బెల్ట్ శిక్షణ

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** నగరంలోని ఏఆర్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన జూడో బ్రౌన్ బెల్ట్ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 20 మంది జూడోకాలు పాల్గొనగా.. 15 మంది ఉత్తీర్ణులయ్యారని రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. పవన్ సందీప్ తెలిపారు. శిబిర నిర్వాహకులుగా [illegible] శిక్షకులు పీవీ తేజ (కాకినాడ), ఐ.శ్రీను (ఏలూరు), ఎం.నాగభద్ర (గుంటూరు) పాల్గొన్నారు. బ్రౌన్ బెల్ట్ ఉత్తీర్ణులైన క్రీడాకారులకు ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర జూడో సంఘం సీఈవో వెంకట్ నాయుడు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఉత్తీర్ణులైన జూడోకాలు జాతీయ జూడో సమాఖ్య నిర్వహించే బ్లాక్ బెల్ట్ పరీక్షకు అర్హత సాధించారని కార్యదర్శి పవన్ సందీప్ ప్రకటించారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గణేష్ సుబ్బారావు, కోశాధికారి టీవీవీ రమణ, సంయుక్త కార్యదర్శులు గమిడి శ్రీనివాసరావు, ఎంఎల్ ఉషారాణి పాల్గొన్నారు.

ఉత్తీర్ణులైన జూడోకాలతో అతిథులు

## రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపిక

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** కాకినాడలో ఈ నెల 19, 20వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎన్టీఆర్ జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా రోల్‌బాల్ సంఘం అడ్‌హక్ కమిటీ ఛైర్‌పర్సన్ టి.లలిత ప్రియ తెలిపారు. రామలింగేశ్వరనగర్‌లోని శ్రీహర్షి దన్ స్పోర్ట్స్ అండ్ ఫన్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీలో పాల్గొన్న క్రీడాకారుల నుంచి ప్రతిభగల వారిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. అండర్-11 కేటగిరీలో కౌషల్, సాయి విహాన్, హన్స్, 17+ కేటగిరీలో కె. రాజు జిల్లాకు ఆడుతారని ఆమె వివరించారు.

క్రీడాకారులతో సంఘం ప్రతినిధులు

## చెస్ ఛాంప్స్ మేరీ ఆమెన్, రోషన్

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** భవానీపురంలోని ఆధ్య ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా అండర్-13 చెస్ ఛాంపియన్‌షిప్‌లో బాలికల విభాగంలో ఎం.మేరీ ఆమెన్, బాలుర విభాగంలో వి.రోషన్ ఛాంపియన్లుగా నిలిచారు. టోర్నీలో వంద మంది చిన్నారులు తలపడగా.. బాలికలకు అయిదు రౌండ్లు, బాలురకు ఆరు రౌండ్ల పాటు పోటీ నిర్వహించామని ది విజయవాడ చెస్ సంఘం కార్యదర్శి ఎం.రాజీవ్ తెలిపారు. బాలికల విభాగంలో ఎ.హన్సిక, బాలుర విభాగంలో ఎ.శశాంక్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ఇన్‌స్టిట్యూట్ అధినేత రాజేష్ హాజరై విజేతలకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందించారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర అండర్-13 చెస్ పోటీలో పాల్గొంటారని ప్రకటించారు. సంఘం అధ్యక్షుడు ఎండీ అక్బర్ పాషా పాల్గొన్నారు.

విజేతలతో అతిథులు

## పారని వాడుక నీరు.. దోమలతో అవస్థ

**నా**లుగో డివిజన్ శ్రీనగర్ కాలనీ తిమ్మరుసు వీధి, రామ మందిరం సమీపంలో సైడు డ్రెయిన్‌లో మురుగు పారడం లేదు. కొంత కాలంగా పూడిక తీయకపోవడంతో మురుగు నీరంతా రంగు మారి దుర్వాసన వస్తోంది. డ్రెయిన్‌లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తిష్ఠ వేసింది. దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

-కరెన్సీనగర్, న్యూస్‌టుడే

## స్తంభానికి తుప్పు... పొంచి ఉన్న ముప్పు

11వ డివిజన్ పటమట నుంచి ఆటోనగర్‌కు వెళ్లే రెండో రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు భద్రతగా ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభం తుప్పు పట్టి ప్రమాదభరితంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయే దశలో ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఇనుప స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– కరెన్సీనగర్, న్యూస్‌టుడే

## రహదారిపై మురుగు.. రాకపోకలకు ఇబ్బంది

**కృ**ష్ణలంక 22వ డివిజన్ గంగానమ్మ గుడి వీధి సమీపంలోని మొదటి అడ్డరోడ్డులో మ్యాన్‌హోల్ దీర్ఘకాలంగా పొంగి పొర్లుతోంది. మురుగు రోడ్డుపై మడుగులా ఏర్పడుతోంది. దుర్వాసన వెదజల్లుతోందని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. –కృష్ణలంక, న్యూస్‌టుడే

## ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్

**ఎ**నిమిదో డివిజన్ గాయత్రినగర్‌లో అనుమోలు ఎన్‌క్లేవ్ వద్ద రహదారి పక్కన తక్కువ ఎత్తులో విద్యుత్తు ఫ్యూజ్ బాక్సు ఉంది. ఆ ప్రాంతం వాహనదారులు, పాదచారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఏ మాత్రం తాకినా విద్యుదాఘాతం జరిగే అవకాశం ఉందని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాన్ని ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అభ్యంతరం తెలపండి

**కృష్ణలంక, న్యూస్‌టుడే:** కృష్ణలంక 21వ డివిజన్ కల్పనా ప్రింట్ వీధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ.. విద్యుత్తు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల విషయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మీటర్ల ఏర్పాటు విషయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మధ్యాహ్నం ఇళ్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు యత్నిస్తే అభ్యంతరం తెలపాలన్నారు. సూచించారు. పార్టీ తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కోరాడ రమణ, కె.శివాజీ, తాడి రమణ, గోపి, లక్ష్మణ, భారతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

## విద్యార్థినికి ఆర్థిక సాయం

**మొగల్రాజపురం(విజయవాడ సిటీ):** బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థినికి ఎనిమిదో డివిజన్ అశోక్‌నగర్‌లోని కార్యాలయంలో వైఎస్ఆర్ ఛారిటీస్ ఛైర్మన్ యలమంచిలి జయప్రకాష్ రూ.10వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గోపిచంద్, విశ్రాంత ప్రిన్సిపల్ రాజగోపాల్, ఎ.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## జూదరుల అరెస్టు

**కృష్ణలంక:** ఫకీరుగూడెం జ్యోతి కన్వెన్షన్ వెనకాల ఉన్న చాపరాల భవన్ ప్రాంగణంలో జూదమాడుతున్నారన్న సమాచారంతో ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేపట్టారు. వేర్వేరు ప్రాంతాలకు చెందిన 10మంది గుర్తించి వారి నుంచి రూ.44వేలు, 11 చరవాణులను స్వాధీనం చేసుకుని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

## కాలువ సరిగా లేక.. మురుగు పారక

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

**తూ**ర్పు నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో డ్రెయిన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఎప్పుడో నిర్మించిన డ్రెయినేజీ గోడలు కుప్పకూలి మురుగు పారుదలకు ఆటంకంగా మారుతున్నాయి. పొక్లెయిన్‌తో పూడిక తీయడం వల్ల కూడా గోడలు కూలిపోతున్నాయి. మురుగు నీరంతా పారకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అవి దోమలకు కేంద్రాలుగా మారుతున్నాయి.

❖ నియోజకవర్గంలోని 3, 4, 10 డివిజన్లలో సైడు డ్రెయినేజీ వ్యవస్థ అంతంత మాత్రంగానే ఉంది. పూడికతో నిండిన, ధ్వంసమైన డ్రెయిన్లు దర్శనమిస్తున్నాయి. ❖ గురునానక్ రోడ్డు డాన్ బాస్కో స్కూల్ సమీపంలో సైడు కాలువలు లేకపోవడంతో మురుగు పారడం లేదు. పూడిక తీయాలని పలుమార్లు అధికారులను అడిగితే.. పొక్లెయిన్ సాయంతో చర్యలు చేపట్టారు. దాంతో అంతంత మాత్రంగా ఉన్న డ్రెయిన్ల గోడలు కుప్పకూలాయి. మురుగు నీరు ముందుకు సాగక ఎక్కడికక్కడే నిలిచి దుర్వాసన భరించలేకపోతున్నారు.

గురునానక్ రోడ్డులో ధ్వంసమై..

తొలగించిన గోడ

❖ భారతీనగర్, శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ, నాగార్జుననగర్, కరెన్సీనగర్ ప్రాంతాల్లో కొన్నిచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. మొక్కుబడి పూడికతీత పనులకే పారిశుద్ధ్య అధికారులు ప్రాధాన్యం ఇస్తుండడంతో పిచ్చిమొక్కలు డ్రెయిన్లలో మొలిచి మురుగు ముందుకు సాగనీయడం లేదు.

❖ మహానాడు రోడ్డులో బండరాళ్లు, చెట్లు డ్రెయిన్‌లో ఉన్నా.. తొలగించడానికి నగరపాలక సంస్థ చర్యలు తీసుకోవడం లేదు. రానున్న రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు స్పందించి పూడిక, ఇతర అడ్డంకులు తొలగించి మురుగు, వాన నీరు సజావుగా సాగేలా చర్యలు తొలగించాలని కాలనీల కమిటీలు కోరుతున్నాయి.

## భక్తిశ్రద్ధలతో చండీ హోమం

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** బెంజ్ సర్కిల్ సమీపంలోని శ్రీవిద్యా దత్తసాయి పీఠంలో 75 పౌర్ణిమలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం శ్రీలక్ష్మీ గణపతి చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి లక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హోమాన్ని చేపట్టి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం 300 భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసినట్లు పీఠం నిర్వాహకుడు యడవల్లి మురళీకృష్ణశర్మ తెలిపారు.

పూర్ణాహుతి సమర్పిస్తున్న పండితుడు

## 'ఫొటో జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి'

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ఫొటో జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచల జయరాజు, మాజీ ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ సూచించారు. ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఫొటో జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా జి.వి.నారాయణరావు, అధ్యక్షుడిగా సి.హెచ్.వి.ఎన్.విజయభాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.రూబెన్, ప్రధాన కార్యదర్శిగా జి.మహేష్, కోశాధికారిగా సి.హెచ్.నారాయణరావు, ఉపాధ్యక్షులుగా కె.గిరిబాబు, సుధాకర్, కొమ్మూరి శ్రీనివాస్, ఎస్.సాంబశివరావు, ఎం.శివకుమార్, మస్తాన్, మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎస్.కె.బాబు, దారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులకు ప్రోత్సాహం అవసరం

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని ఆశిష్ స్టూడియోలో రాగాల పల్లకి సరిగమప కలిసి పాడుదాం కార్యక్రమానికి వాసవీ క్లబ్‌ల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కళాకారులు ఆశించే నిజమైన బహుమతి ప్రోత్సాహం మాత్రమేనని చెప్పారు. సంస్థ అధ్యక్షుడు కె.మురళీమోహనరాజు మాట్లాడుతూ యువ కళాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గాంధీ సోషల్ ట్రస్టు అధ్యక్షుడు గాంధీ నటరాజన్, కృష్ణవేణి, వివిధ జిల్లాల నుంచి గాయనీ, గాయకులు విచ్చేశారు.

## అలరించిన సంగీత విభావరి

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కౌతా కళావేదికలో కల్యాణ వైభోగమే పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. గాయనీ, గాయకులు విష్ణుప్రియ, శిరీష, మల్లీశ్వరి, సత్యవర్ధన్, పురుషోత్తం, ప్రసాద్, రసూల్ తదితరులు తెలుగు చిత్రాల్లోని పాటలను ఆలపించారు. పరుచూరి విజయలక్ష్మి, ప్రసూనరామన్, డేవిడ్‌రాజు, చింతకాయల చిట్టిబాబు అతిథులుగా హాజరయ్యారు. గుంటూరురమేష్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

పాటలు పాడుతున్న గాయనీగాయకులు

## తొలి ఏడాదిలోనే అద్భుత ఫలితాలు

**పటమట, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే అన్ని రంగాల్లో అద్భుతమైన ఫలితాలను సాధించిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం 12వ డివిజన్‌లోని అయ్యప్పనగర్‌లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ పాల్గొని ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలు క్రమం తప్పకుండా అమలు చేస్తున్నామన్నారు. వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, నాయకులు శాయన సత్యనారాయణ, అబ్దుల్ కరీం, జక్కుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్, అనూరాధ

## కూటమి పాలనలో ప్రశాంత జీవనం

**కృష్ణలంక, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలు ప్రశాంత జీవనాన్ని సాగిస్తున్నట్లు తెదేపా 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం డివిజన్ పరిధిలోని 176, 197, 198, 203 బూత్‌లలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు ఇస్తున్న పథకాలు, వారి ఇబ్బందులను తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కరపత్రాలు పంపిణీ చేసి రానున్న రోజుల్లో ప్రభుత్వం అందించనున్న పథకాలను వివరించారు. దేవళ్ల శ్రీను, బలగాని శ్రీను, తలపాటి ప్రసాద్, పత్తి రామారావు, ఎల్లయ్య, వెంకటరమణ, వెంకటేశ్వరరెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

18వ డివిజన్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

## ఉచిత ప్రసాద పంపిణీకి విరాళం

**ఇంద్రకీలాద్రి:** దుర్గగుడి ఉచిత ప్రసాద పంపిణీకి రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌కు చెందిన శాంభవ సోలంకీ రూ.1,52,000 విరాళం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు.

(c) eenadu

మాక్ కౌన్సెలింగ్ 2025

ఐసెట్
నీట్

## కరెంట్ అఫైర్స్

◆ నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) కొత్త మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (భారతీయ సినిమాను ప్రోత్సహించే లక్ష్యంతో 1975లో ఎన్ఎఫ్‌డీసీను ఏర్పాటు చేశారు?) జ: ప్రకాష్ మగ్దుమ్

◆ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (POK) ల్లో ఎన్ని ప్రధాన ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్ పేరిట రహస్య ఆపరేషన్‌ను నిర్వహించాయి? (26 మంది భారతీయ పౌరులు, భద్రతా సిబ్బంది ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన రెండు వారాల తర్వాత ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు.) జ: 9

### మాదిరి ప్రశ్నలు

◆ 2025, మే 6న భారత్‌తో ఏ దేశం చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) కుదుర్చుకుంది? జ: యునైటెడ్ కింగ్‌డమ్

◆ యెమెన్ నూతన ప్రధానిగా ఎవరు నియమితులయ్యారు? (దేశ ఆర్థిక మంత్రిగా కొనసాగుతున్న ఈయనను యెమెన్ ప్రెసిడెన్షియల్ లీడర్‌షిప్ కౌన్సెల్ కొత్త ప్రధాన మంత్రిగా నియమించింది.) జ: సలేం సలేహ్ బిన్ బ్రైక్

మరింత సమాచారం

## ఏపీ ఎకానమీ

# ఉప రంగాలే వృద్ధి చోదకాలు!

## ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలోని రంగాలు

**దేశంలో రెండంకెల వృద్ధి రేటు నమోదు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ప్రధానంగా వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక, సేవా రంగాలకు వ్యవసాయ రంగంతో సమాన ప్రాధాన్యం ఉంది. ఈ మూడు ప్రధాన రంగాలు, వాటి అనుబంధ, ఉప రంగాలన్నీ కలిసి రాష్ట్ర వృద్ధి రేటు, తలసరి ఆదాయాలను నిర్ణయిస్తున్నాయి. ఏపీ ఆర్థిక వ్యవస్థ స్వరూపం, జీఎస్‌డీపీలో రంగాలవారీ వాటా, విలువ, వృద్ధి పరంగా ముందంజలో నిలుస్తున్న రంగాలు, ఇటీవలి గణాంకాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల వారీగా అధిక వాటా సమకూరుస్తున్న జిల్లాలు, నిర్దిష్ట వార్షిక వృద్ధి రేటే లక్ష్యంగా రూపొందిన స్వర్ణాంధ్ర ఆశయాలను తెలుసుకోవాలి.**



**స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో రంగాలు:** జీఎస్‌డీపీని స్థూలంగా వ్యవసాయం - అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవా రంగం అనే మూడు విభాగాలుగా విభజించారు.

**వ్యవసాయం – అనుబంధ రంగాలు:** వ్యవసాయం, ఉద్యాన ఉత్పత్తులు, పశుసంపద, అటవీ ఉత్పత్తులు, మత్స్య సంపద.



**పారిశ్రామిక రంగంలోని ఉప రంగాలు:** తయారీ పరిశ్రమలు (రిజిస్టర్, రిజిస్టర్ కాని), విద్యుత్తు ఉత్పత్తి, గ్యాస్ ఉత్పత్తి, పరిశ్రమలకు నీటి సరఫరా, నిర్మాణ రంగం, గనులు, తవ్వకాలు.

**సేవా రంగం (తృతీయ రంగం)లోని ఉప రంగాలు:** వర్తకం, హోటల్, రెస్టారెంట్లు, రైల్వే, రోడ్డు, జల, వాయు రవాణా; గిడ్డంగులు, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, బీమా, ఇతర ఆర్థిక సేవలు, రియల్‌ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు, ప్రభుత్వ పరిపాలన, ఇతర సేవలు.

**నోట్:** రాష్ట్ర జీఎస్‌డీపీలో 17 ఉపరంగాలు ఉన్నాయి.

◆ ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర జీఎస్‌డీపీలో అత్యధిక వాటా ఉన్న రంగాలు వరుసగా సేవారంగం, వ్యవసాయం-అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం ఉన్నాయి. అదే స్థిర ధరల వద్ద చూస్తే సేవా రంగం, పారిశ్రామిక రంగం, వ్యవసాయం - అనుబంధ రంగాలు వరుసలో నిలుస్తున్నాయి. ◆ 2023-24లో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీకి వ్యవసాయ అనుబంధ రంగాల్లో అధిక విలువ నమోదు చేసిన ఉప రంగం 'వ్యవసాయం, ఉద్యాన ఉత్పత్తులు'. అధిక వృద్ధిరేటు నమోదైన ఉప రంగం 'పశు సంపద'.

◆ 2023-24లో పారిశ్రామిక రంగంలో అధిక విలువ నమోదు చేసిన ఉపరంగం 'తయారీ పరిశ్రమలు'. అధిక వృద్ధిరేటు నమోదు చేసిన ఉపరంగం 'నిర్మాణ రంగం'.

◆ 2023-24లో సేవారంగం నుంచి అధిక విలువ నమోదు చేసిన ఉప రంగం 'వర్తకం, హోటల్, రెస్టారెంట్'. అధికవృద్ధిరేటు నమోదు చేసిన ఉపరంగం రియల్ ఎస్టేట్.

**ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీలో రంగాల వారీ వాటా (2023 – 24)**

| రంగం | ప్రస్తుత ధరల వద్ద జీఎస్‌డీపీలో వాటా | స్థిరధరల వద్ద జీఎస్‌డీపీలో వాటా |
|---|---|---|
| 1) వ్యవసాయం, అనుబంధ రంగాలు | 34.15% | 29.7% |
| 2) పారిశ్రామిక రంగం | 25.69% | 30.4% |
| 3) సేవా రంగం | 40.16% | 39.9% |
| మొత్తం | 100% | 100% |

**స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ - గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్):** ఒక ఆర్థిక సంవత్సరంలో జిల్లా సరిహద్దులకు లోబడి ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవల విలువను 'స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ)' అంటారు. 2022 - 23 నూతన నివేదిక ప్రకారం 26 జిల్లాల ప్రాతిపదికగా మొత్తం

✦ 2022 - 23 గణాంకాల ప్రకారం ప్రస్తుత, స్థిర ధరల వద్ద జీడీడీపీ విలువ ఎక్కువగా ఉన్న మూడు జిల్లాలు వరుసగా విశాఖపట్టణం, ఎన్‌టీఆర్, కృష్ణా. ప్రస్తుత, స్థిర ధరల ప్రకారం జీడీడీపీ విలువ తక్కువ ఉన్న జిల్లా అల్లూరి సీతారామరాజు. ✦ ప్రస్తుత ధరల ప్రకారం తలసరి ఆదాయం ఎక్కువ ఉన్న జిల్లాలు విశాఖపట్టణం (4,83,892), కృష్ణా (3,35,324), ఏలూరు (2,87,481). ✦ స్థిర ధరల ప్రకారం తలసరి ఆదాయం ఎక్కువ ఉన్న జిల్లాలు విశాఖపట్టణం (3,10,968), కృష్ణా (2,11,739), ఎన్‌టీఆర్ (1,66,049).

✦ ప్రస్తుత, స్థిర ధరల ప్రకారం తలసరి ఆదాయం తక్కువ ఉన్న జిల్లా అల్లూరి.

**ప్రస్తుతం, స్థిర ధరల వద్ద జీడీడీపీ (రూ.కోట్లలో)**

| జిల్లా | ప్రస్తుత ధరల వద్ద జీడీడీపీ | స్థిర ధరల వద్ద జీడీడీపీ |
|---|---|---|
| 1) విశాఖపట్టణం | 1,19,268 | 77,498 |
| 2) ఎన్‌టీఆర్ | 73,632 | 44,729 |
| 3) కృష్ణా | 68,301 | 43,530 |

స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ) విలువలో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా అధికంగా ఉన్న జిల్లా ఏలూరు. పారిశ్రామిక రంగం వాటా అధికంగా ఉన్న జిల్లా విశాఖపట్టణం. సేవారంగం వాటా అధికంగా ఉన్న జిల్లా ఎన్‌టీఆర్.

**స్వర్ణాంధ్ర @ 2047:** దేశానికి స్వాతంత్ర్యానంతరం 100 సంవత్సరాల కాలపరిమితిలో 2047 నాటికి కేంద్ర ప్రభుత్వం సాధించాల్సిన లక్ష్యాలను 'వికసిత్ భారత్ @ 2047' పేరుతో నిర్దేశించింది. ఈ లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర @ 2047' విధానపత్రం రూపంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించాల్సిన లక్ష్యాలను పేర్కొంది. 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ 2.4 ట్రిలియన్ డాలర్లుగా నమోదు కావాలి. అలాగే రాష్ట్ర తలసరి ఆదాయం 43,000 డాల్లర్లకు చేరాలి. రాష్ట్ర ప్రభుత్వ సగటు వార్షిక వృద్ధి రేటు 15%గా ఉండాలనే లక్ష్యాలను స్వర్ణాంధ్ర @ 2047 విధాన పత్రంలో పేర్కొన్నారు.

**ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం**

✸ 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల వద్ద ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ.2,42,479 కాగా, దేశ తలసరి ఆదాయం రూ.1,84,205. అంటే దేశ తలసరి ఆదాయం కంటే ఏపీ తలసరి ఆదాయం ఎక్కువ. 2021 - 22 నుంచి ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ వృద్ధి రేటు భారతదేశ జీడీపీ వృద్ధి రేటు కంటే వరుసగా రెండేళ్లు తక్కువగా ఉంది. కానీ 2023 - 24లో దేశ సగటు వృద్ధి రేటు 9.6% ఉంటే, రాష్ట్ర వృద్ధిరేటు 10.44%గా నమోదైంది. 2021 - 22 నుంచి స్థిరధరల వద్ద రాష్ట్ర వృద్ధి రేటు కంటే భారతదేశ వృద్ధి రేటు అధికంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

✸ 2023 - 24 ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాలు వరుసగా గోవా (రూ.4,75,401), సిక్కిం (రూ.4,63,509), దిల్లీ (రూ.3,76,217). తలసరిఆదాయ పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో 16వ స్థానంలో ఉంది.

| సంవత్సరాలు | ప్రస్తుత ధరల వద్ద తలసరి ఆదాయం(రూ.ల్లో) | వృద్ధిరేటు | స్థిర ధరల వద్ద తలసరి ఆదాయం(రూ.ల్లో) | వృద్ధి రేటు |
|---|---|---|---|---|
| 2021 - 22 | 1,97,214 | 17.35% | 1,21,762 | 9.72% |
| 2022 - 23 | 2,19,881 | 11.49% | 1,26,690 | 4.05% |
| 2023 - 24 | 2,42,479 | 10.28% | 1,35,806 | 7.20% |

### మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పారిశ్రామిక రంగంలోని ఉపరంగం కానిది?
   1) బ్యాంకింగ్, బీమా 2) ఉద్యాన ఉత్పత్తులు
   3) రియల్ ఎస్టేట్ 4) పైవన్నీ
2. 2023 – 24 డేటా ప్రకారం ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర జీఎస్‌డీపీలో సేవారంగం వాటా ఎంత శాతం?
   1) 25.69% 2) 34.15% 3) 39.9% 4) 40.16%
3. స్వర్ణాంధ్ర @ 2047 డాక్యుమెంట్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్ర తలసరి ఆదాయం ఎన్ని డాలర్లుగా ఉండాలి?
   1) 42,000 2) 43,000 3) 44,000 4) 45,000
4. 2023 – 24 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీకి సేవారంగం నుంచి అధిక విలువ నమోదు చేసిన ఉపరంగం?
   1) వర్తకం, హోటల్, రెస్టారెంట్లు
   2) కమ్యూనికేషన్ 3) రియల్ ఎస్టేట్
   4) బ్యాంకింగ్, బీమా
5. 2022 – 23 ప్రకారం ప్రస్తుతం, స్థిరధరల వద్ద స్థూల జిల్లా ఉత్పత్తి విలువ (జీడీడీపీ) ఎక్కువగా ఉన్న మూడు జిల్లాలు వరుసగా..
   1) విశాఖపట్టణం, కృష్ణా, ఎన్‌టీఆర్
   2) విశాఖపట్టణం, ఎన్‌టీఆర్, కృష్ణా
   3) విశాఖపట్టణం, కృష్ణా, ఏలూరు
   4) విశాఖపట్టణం, ఏలూరు, కృష్ణా
6. రాష్ట్ర జీఎస్‌డీపీలో ఎన్ని ఉపరంగాలున్నాయి?
   1) 9 2) 13 3) 15 4) 17
7. 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ ఎంత ఉండాలని స్వర్ణాంధ్ర @ 2047 విధాన పత్రంలో పేర్కొన్నారు?
   1) 2.1 ట్రిలియన్ డాలర్లు
   2) 2.2 ట్రిలియన్ డాలర్లు
   3) 2.3 ట్రిలియన్ డాలర్లు
   4) 2.4 ట్రిలియన్ డాలర్లు
8. 2022 – 23 డేటా ప్రకారం స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ) విలువలో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా అధికంగా ఉన్న జిల్లా?
   1) ఏలూరు 2) పశ్చిమ గోదవరి
   3) తూర్పుగోదావరి 4) కృష్ణా

రచయిత: సుబ్బారెడ్డి

**సమాధానాలు**

1-4; 2-4; 3-2; 4-1; 5-2; 6-4; 7-4; 8-1.

### విపత్తు నిర్వహణ - ప్రాథమిక భావనలు

1. విపత్తు అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
   1) ఫ్రెంచ్ 2) గ్రీకు 3) జపనీస్ 4) తెలుగు
2. విపత్తు ఏయే పదాల కలయిక ద్వారా ఏర్పడింది?
   1) చెడు 2) నక్షత్రం 3) 1, 2 4) ఏదీకాదు
3. 'డిజాస్టర్' అనే పదాన్ని ఏ రెండు పదాల నుంచి సృష్టించారు?
   1) డిజాస్టరీ 2) డిజాస్ట్రో
   3) 1, 2 4) ఏదీకాదు
4. మానవ కల్పిత విపత్తులు ఏవి?
   1) అగ్నిప్రమాదాలు 2) మహమ్మారి వ్యాధులు
   3) రోడ్డు ప్రమాదాలు 4) పైవన్నీ
5. కృత్రిమ విపత్తులు ఏవి?
   1) రసాయన విస్ఫోటాలు 2) అణు ప్రమాదాలు
   3) 1, 2 4) ఏదీకాదు
6. 'అకస్మాత్తుగా, పెద్ద దురదృష్టంగా సమాజ నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసే సంఘటనే విపత్తు' అని నిర్వచించింది ఎవరు?
   1) ప్రపంచ బ్యాంకు 2) యూఎన్‌ఓ
   3) యునెస్కో 4) ఆసియా అభివృద్ధి బ్యాంకు
7. విపత్తు నిర్వహణపై జె.సి.పంత్ కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 2000 2) 1999 3) 2001 4) 2002
8. జె.సి.పంత్ నేతృత్వంలోని విపత్తు నిర్వహణపై ఏర్పాటు చేసిన కమిటీ గుర్తించిన వైపరీత్యాలు ఎన్ని?
   1) 31 2) 34 3) 35 4) 32
9. ప్రమాదాలకు సంబంధించిన విపత్తులకు ఉదాహరణలు?
   1) కార్చిచ్చు, చమురు ప్రమాదాలు
   2) పట్టణాల్లో అగ్నిప్రమాదాలు
   3) వరుస బాంబుపేలుళ్లు 4) పైవన్నీ
10. శీతోష్ణస్థితికి సంబంధిత సంఘటనలు?
    1) కరవు 2) కార్చిచ్చు
    3) హిమానీనదాలు ఉప్పొంగడం 4) పైవన్నీ
11. హజార్డ్ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
    1) గ్రీకు 2) ఫ్రెంచ్ 3) లాటిన్ 4) జపనీస్
12. విపత్తు ముప్పు నిర్వహణలో భాగంగా చేపట్టే కార్యకలాపాల మూడు ముఖ్యమైన దశలు ఏవి?
    1) విపత్తుకు ముందు 2) విపత్తు సమయంలో
    3) విపత్తు తర్వాత 4) పైవన్నీ
13. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఎండీఏ) 'ఆపదమిత్ర' అనే పథకాన్ని దేశవ్యాప్తంగా ఎన్ని జిల్లాల్లో అమలు చేస్తోంది?
    1) 30 2) 40 3) 50 4) 120
14. విపత్తు నిర్వహణలో వచ్చేవి?
    1) యథాస్థితికి తీసుకురావడం 2) పునర్ నిర్మాణం
    3) మిటిగేషన్ 4) పైవన్నీ
15. ప్రకృతి విపత్తులకు సంబంధించిన రికార్డు నమోదు ఎప్పటి నుంచి జరుగుతుంది?
    1) క్రీ.పూ.310 2) క్రీ.పూ.430
    3) క్రీ.పూ.540 4) క్రీ.పూ.1020

# ముప్పై జిల్లాలను ఆదుకుంటున్న ఆపదమిత్ర!

**అకస్మాత్తుగా సంభవించి అప్పటి వరకు ఉన్న సానుకూల వాతావరణాన్ని ధ్వంసం చేసే పెద్ద ప్రమాదమే విపత్తు. ప్రకృతిపరమైన కారణాలకు తోడు మానవకారక విపత్తులు కూడా ఏటేటా పెరిగిపోతున్నాయి. పర్యావరణాన్ని, సమాజ ప్రగతిని విచ్ఛిన్నం చేస్తున్న ఈ విపత్తుల నిర్వచనాలు, రకాలు, వాటిని ఎదుర్కొనే పద్ధతులు, ముందస్తు నివారణ చర్యలు, ఇందుకోసం దేశంలో, ప్రపంచవ్యాప్తంగా ఏర్పాటైన సంస్థలు, హెచ్చరిక వ్యవస్థలు, వాటి విధులు, పరిధితో పాటు దేశంలో విపత్తు నిర్వహణ వ్యవస్థ నిర్మాణం, అమలు చేస్తున్న కార్యక్రమాలు తదితరాలను పోటీ పరీక్షార్థులు విధిగా తెలుసుకోవాలి. దుర్బలతను పెంచుతున్న మానవకారక చర్యలు, దేశాల వారీగా పరిస్థితులు, ఇప్పటి వరకు నిర్వహించిన ముఖ్యమైన సదస్సులు, తీసుకున్న నిర్ణయాలు, సెండాయ్ ఫ్రేమ్‌వర్క్‌లోని కీలకాంశాలు, అమలు తీరుపై అవగాహన కలిగి ఉండాలి.**

### విపత్తు నిర్వహణ

16. 'ఇన్ ది లైన్ ఆఫ్ ఫైర్: ట్రామా ఇన్ ది ఎమర్జెన్సీ సర్వీసెస్' పుస్తక రచయిత(లు)?
    1) రేగర్ 2) బాబర్
    3) 1, 2 4) ఎవరూకాదు
17. దక్షిణాసియా విపత్తు పీడిత దేశాల్లో అధిక జనాభా కారణంగా, ఎక్కువగా విపత్తులకు గురవుతున్న దేశం/దేశాలు?
    1) భారత్ 2) బంగ్లాదేశ్
    3) 1, 2 4) పాకిస్థాన్
18. అంతర్జాతీయ విపత్తు కుదింపు దినం?
    1) అక్టోబరు 13 2) నవంబరు 13
    3) జులై 13 4) ఆగస్టు 13
19. అంతర్జాతీయ విపత్తు కుదింపు దశాబ్దం?
    1) 1990 - 1999 2) 2000 - 2009
    3) 1980 - 1987 4) 1970 - 1979
20. పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ ఎక్కడ ఉంది?
    1) స్విట్జర్లాండ్ 2) ఐర్లాండ్
    3) హవాయి 4) న్యూయార్క్
21. ఇంటర్నేషనల్ సునామీ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఎక్కడ ఉంది?
    1) బీజింగ్ 2) న్యూయార్క్
    3) హోనలులు 4) సవన్నా
22. పసిఫిక్ ప్రాంతంలో సునామీ హెచ్చరికల సమన్వయ గ్రూపును ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) న్యూదిల్లీ 2) ప్యారిస్
    3) బీజింగ్ 4) బాన్
23. సార్క్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెంటర్ (ఎస్‌డీఎంసీ) ఎప్పుడు, ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) న్యూదిల్లీ-2006 2) ముంబయి-2008
    3) హైదరాబాద్-2009 4) చెన్నై-2010
24. ఎస్‌డీఎంసీ నిర్వహించే వెబ్ పోర్టల్?
    1) sdmc.nic.in 2) s-sdmc.nic.in
    3) saarc-sdmc.org.in 4) sdmc-saarc.nic.in
25. ఇంటర్నేషనల్ స్ట్రాటజీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్ (యూఎన్ఐఎస్‌డీఆర్)ను ఎక్కడ, ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) జెనీవా, 1999 2) న్యూయార్క్, 2000
    3) సిడ్నీ, 2001 4) సింగపూర్, 1998
26. ఇంటర్ – గవర్నమెంట్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (ఐపీసీసీ)ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1990 2) 1989 3) 1988 4) 1987
27. ఐపీసీసీని ఏర్పాటు చేసిన సంస్థ?
    1) డబ్ల్యూఎంఓ
    2) యూఎన్ఈపీ
    3) 1, 2
    4) ఏదీకాదు

28. ఐపీసీసీ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) జెనీవా 2) హైదరాబాద్
    3) చెన్నై 4) సింగపూర్
29. ఎన్ఐడీఎం ఆధ్వర్యంలో భారత్‌లో మొదటి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కాంగ్రెస్ ఎక్కడ జరిగింది?
    1) న్యూదిల్లీ 2) చెన్నై
    3) బెంగళూరు 4) హైదరాబాద్
30. ఇండియా మొదటి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కాంగ్రెస్‌ను ఎవరు ప్రారంభించారు?
    1) అటల్ బిహారీ వాజ్‌పేయీ
    2) నరేంద్ర మోదీ
    3) మన్మోహన్ సింగ్ 4) రాహుల్ గాంధీ

31. 'హ్యూగో ఫ్రేమ్‌వర్క్ ఫర్ యాక్షన్' గడువు ఎప్పటితో ముగిసిపోయింది?
    1) 2010 2) 2015 3) 2018 4) 2012
32. మూడో యూఎన్‌ఓ విపత్తు ముప్పు కుదింపు ప్రపంచ సదస్సు జపాన్‌లో ఎక్కడ జరిగింది?
    1) కోబె 2) సెండాయ్
    3) టోక్యో 4) నాగసాకి
33. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని లక్ష్యాలను నిర్దేశించారు?
    1) 8 2) 7 3) 6 4) 5
34. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశకత్వంలో భారత ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ ప్రణాళికను ఎప్పుడు విడుదల చేసింది?
    1) 2015, జూన్ 1 2) 2016, జూన్ 1
    3) 2017, జూన్ 1 4) 2018, జూన్ 1
35. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అమలులో ఉండే కాలం?
    1) 2015-2030 2) 2010-2020
    3) 2010-2025 4) 2015-2025
36. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్‌ను మొదట అమలు చేసిన భారత రాష్ట్రం?
    1) అస్సాం 2) కేరళ 3) ఒడిశా 4) బిహార్
37. బీఐఎస్ ప్రకారం భారత్‌లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విపత్తులకు గురయ్యే ప్రాంతం ఎంత శాతం?
    1) 85% 2) 99% 3) 52% 4) 73%
38. విపత్తు నిర్వహణ సమన్వయానికి నోడల్ డిపార్ట్‌మెంట్‌గా బాధ్యత వహించేది?
    1) కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ
    2) పౌర విమానయాన శాఖ
    3) కేంద్ర హోంమంత్రిత్వ శాఖ 4) రక్షణ శాఖ
39. 'మేనేజింగ్ డిజాస్టర్ రిస్క్ ఇన్ ఎమర్జింగ్ ఎకానమిస్' ఎవరి నివేదిక?
    1) ప్రపంచ బ్యాంకు
    2) ఆసియా అభివృద్ధి బ్యాంకు
    3) గృహ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
    4) కేంద్ర హోంమంత్రిత్వ శాఖ




40. విపత్తుల వల్ల అత్యధికంగా పశువులను కోల్పోయే రాష్ట్రం?
    1) ఆంధ్రప్రదేశ్ 2) రాజస్థాన్
    3) పశ్చిమ బెంగాల్ 4) పైవన్నీ
41. విపత్తు నిర్వహణపై అంతర్జాతీయంగా ఆన్‌లైన్ కోర్సులను ఏ విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది?
    1) కాప్లన్ విశ్వవిద్యాలయం
    2) వాల్డెన్ విశ్వవిద్యాలయం
    3) గ్రాండ్ కాన్యాన్ విశ్వవిద్యాలయం 4) పైవన్నీ
42. 'డిజాస్టర్ మేనేజ్‌మెంట్: రీసెంట్ అప్రోచెస్' గ్రంథకర్త ఎవరు?
    1) బి.నారాయణ 2) అరవింద్ కుమార్
    3) జగ్బీర్ సింగ్ 4) బి.సి.బోస్
43. విపత్తులకు గురయ్యే స్వభావాన్ని బట్టి, భారత్‌లో ఉన్న ప్రత్యేక ప్రాంతాలు ఏవి?
    1) హిమాలయ ప్రాంతం, ఎడారి ప్రాంతం
    2) ఒండ్రు మైదానాలు, తీరప్రాంత మండలం
    3) ద్వీపకల్ప ప్రాంతంలో కొండల భాగం
    4) పైవన్నీ
44. విపత్తు నిర్వహణ ప్రణాళిక ప్రధాన లక్షణాలు ఏమిటి?
    1) సరళత 2) లక్ష్య సుద్ధి
    3) ఆచరణ సాధ్యం 4) పైవన్నీ
45. కింది వాటిలో విపత్తును తగ్గించే వ్యూహం?
    1) పిల్లలకు స్కూల్ యూనిఫాం ఇవ్వడం.
    2) చౌకగా విద్యుత్తును అందించడం.
    3) బ్యాంకుల నుంచి అప్పులు ఇవ్వడం.
    4) తుపాను షెల్టర్లను నిర్మించడం.
46. ఇండియాలో ఏటా ఎంతమంది ప్రజలు వరదలకు గురవుతున్నారు (మిలియన్లలో)?
    1) 175 మి. 2) 150 మి.
    3) 200 మి. 4) 325 మి.
47. మొత్తం దేశంలో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు ఎన్ని విపత్తు ముప్పును కలిగి ఉన్నాయి?
    1) 25 2) 30 3) 31 4) 28
48. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్ అమలు కోసం అస్సాం రాష్ట్రానికి సహాయపడే సంస్థలు ఏవి?
    1) యూనిసెఫ్ 2) యూఎన్ఐఎస్‌డీఆర్
    3) 1, 2 4) ఏదీకాదు
49. ఆసియన్ డిజాస్టర్ రిడక్షన్ సెంటర్ ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1998 2) 2002 3) 2004 4) 2006

**సమాధానాలు**

1-2; 2-3; 3-3; 4-4; 5-3; 6-2; 7-2; 8-1; 9-4; 10-4; 11-2; 12-4; 13-1; 14-4; 15-2; 16-3; 17-3; 18-1; 19-1; 20-3; 21-3; 22-2; 23-1; 24-3; 25-1; 26-3; 27-3; 28-1; 29-1; 30-3; 31-2; 32-2; 33-2; 34-2; 35-1; 36-1; 37-1; 38-1; 39-1; 40-4; 41-4; 42-2; 43-4; 44-4; 45-4; 46-3; 47-1; 48-3; 49-1.

(c) eenadu

# నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

## కంటి వైద్య శిబిరానికి స్పందన

కంటి పరీక్షలకు హాజరైన స్థానికులు

**నందిగామ, న్యూస్‌టుడే:** స్థానిక భగవాన్ సత్య సాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి రోగుల నుంచి అనూహ్య స్పందన లభించింది. సత్య సాయిబాబా వందో జయంతిని పురస్కరించుకొని సత్య సాయి సేవా సమితి, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 354 మంది రోగులను ఉచితంగా పరీక్షించారు. వారిలో 136 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. అనంతరం 57 మందిని ఆపరేషన్లు చేయడానికి పెదకాకానిలోని శంకర కంటి వైద్యశాలకు ప్రత్యేక బస్సులో తీసుకెళ్లారు. మిగిలిన వారిని మంగళవారం తీసుకెళ్తామని సేవా సమితి కన్వీనర్ వాసుదేవ రావు తెలిపారు.

## నిత్యాన్నదానానికి విరాళం

**జగ్గయ్యపేట గ్రామీణం:** మండలంలోని తిరుమలగిరి గ్రామంలో వేంచేసియున్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి దాతలు ఆదివారం విరాళం అందించారు. కోదాడకు చెందిన నందూరి వేదమనోజ్ఞ రూ.25 వేలు, నిడమోలు గ్రామానికి చెందిన ఎండూరి లిఖిత రూ.14 వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పేదల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**చందర్లపాడు, న్యూస్‌టుడే:** గుడిమెట్లలో ఎన్ఎస్పీ ఎడమ కాల్వ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, తెదేపా మండలాధ్యక్షుడు మేకల సుధాకర్, తోటరావులపాడులో మండల ప్రధాన కార్యదర్శి జేవీ శ్రీనివాసరావు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి కూటమి ప్రభుత్వం ఏడాది వ్యవధిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. పీ4 కార్యక్రమం ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. మందడపు అప్పారావు, చింతకాయల నరసింహారావు, కమతం సైదారావు, బొందల రామకృష్ణ, మీసాల వెంకటేశ్వరరావు, వెంకయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గుడిమెట్లలో నిర్వహించిన కార్యక్రమంలో వీరబాబు తదితరులు

## కమ్మవారిపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు

**నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే:** తల్లికి వందనం పథకం అమలు పట్ల విద్యార్థుల తల్లులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి తెలిపారు. ఆదివారం రాత్రి మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సజ్జా అజయ్, యూనిట్ ఇన్‌ఛార్జి వేల్పుల భిక్షాలు, నాయకులు గర్మిడి సురేష్, చాపలమడుగు వెంకటరమణ, అమరనేని ఆశ, బుర్రా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు వీరాస్వామి, అజయ్ తదితరులు

## సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

**నందిగామ, న్యూస్‌టుడే:** తమ సమస్యలు పరిష్కరించాలని నందిగామలో మున్సిపల్ కార్మికులు ఆదివారం నుంచి సమ్మె చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఇంజినీరింగ్ విభాగంలోని తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరాతో పాటు పలు విధులు నిర్వహిస్తున్న కార్మికులంతా సమ్మె చేస్తుండడంతో ఆయా పనులు నిలిచిపోయాయి. మున్సిపల్ పరిధిలో ఆదివారం రాత్రి వీధి దీపాలు వేయలేదు. పట్టణంలో అంధకారం నెలకొంది. సమస్యలు పరిష్కరించాలని కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు కార్మికులు ఆందోళన చేస్తున్నారు. డిమాండ్లు పరిష్కరించకపోవడంతో సమ్మెకు దిగారు. కార్మికులతో కలిసి సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఉద్యోగ విరమణ తర్వాత ప్రయోజనాలు కల్పించాలని తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకు కార్మికులు సమ్మె కొనసాగిస్తారని చెప్పారు. కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల్, కార్మికులు

## సౌర పలకలతో అధిక లాభం

**కొండపల్లి, న్యూస్‌టుడే:** ప్రతి గృహ విద్యుత్తు వినియోగదారుడు సౌర శక్తి పలకలను ఏర్పాటు చేసుకుని 25 ఏళ్ల పాటు లాభం పొందాలని ఏపీ ఎస్పీడీసీఎల్ సహాయక ఇంజినీర్ పవిత్రారాణి అన్నారు. సోలార్‌పై గృహ వినియోగదారులకు అవగాహన కలిగిస్తూ కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కొండపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వంహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణానికి హితమైన సౌర పలకల ద్వారా పొందే విద్యుత్తు వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. గృహ వినియోగదార్ల కోసం 2, 3 కేవీల సామర్థ్యం కలిగిన యూనిట్లను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రాయితీ ఇస్తుందన్నారు.

## శ్రీరాం చిన్నబాబు జన్మదిన వేడుకలు

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సోదరుడు శ్రీరాం చిన్నబాబు జన్మదిన వేడుకలను పట్టణం, మండలంలోనూ ఆదివారం నిర్వహించారు. అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం కాంట్రాక్టర్లు గొల్ల గోపి, నవీన్‌ల ఆర్థిక సాయంతో శ్రీరాం తాతయ్య కుమారుడు శ్రీరాం కృష్ణపవన్ 10 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందించారు. బస్టాండ్ ఆవరణలో షేర్‌మహమ్మద్‌పేట తెదేపా నాయకులు మార్తి వీరకృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. చిల్లకల్లుకు చెందిన పల్లెపు రాము హైదరాబాద్‌లో 100 మంది అనాథలకు ఆహార పొట్లాలు అందించారు. ముక్త్యాలలో సర్పంచి షేక్ హస్మతున్ ఆధ్వర్యంలో కేకు కోసి వేడుకలు నిర్వహించారు. బలుసుపాడులో ఆయన అభిమానులు కేకు కోసి గ్రామస్థులకు అన్నదానం చేశారు.

బస్టాండ్ ఆవరణలో అన్నదానం

## క్వారీలో కార్మికుడికి గాయాలు

**పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే :** క్వారీలో కొండ మీద పని చేస్తున్న కార్మికుడు జారి పడి తీవ్ర గాయాలైన ఘటన పరిటాల సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... ఒడిశాకు చెందిన కార్మికుడు బుద్ధు పరిటాల సమీపంలోని క్వారీలో కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. కుటుంబంతో సహా క్వారీ సమీపంలోనే నివాసముంటున్నారు. ఆదివారం ఉదయం క్వారీలో కొండ మీద డ్రిల్లింగ్ పని చేస్తుండగా జారి కింద పడిపోయారు. అతనికి తీవ్ర గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు.

## జూద శిబిరంపై దాడి

**నందిగామ, న్యూస్‌టుడే:** స్థానిక రైతుపేటలో ఓ ప్రైవేట్ పాఠశాలకు దగ్గర్లోని ఇంట్లో జూదం ఆడుతుండగా సీఐ నాయుడు దాడులు చేశారు. సీఐకి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జూదం ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని స్టేషనుకు తరలించారు. వారి నుంచి రూ.30 వేలు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా ఆ ప్రాంతంలో జూదం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. స్పందించిన సీఐ దాడులు చేశారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## గంజాయి పట్టివేత

**నందిగామ, న్యూస్‌టుడే:** నందిగామలోని డీవీఆర్ కాలనీలో ఆదివారం పోలీసులు గంజాయి పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తూ, వినియోగిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సీఐ వైవీవీఎల్ నాయుడు తనిఖీలు నిర్వహించారు. 200 గ్రాముల గంజాయి పట్టుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.





(c) eenadu

## కరెంట్ అఫైర్స్

◆ నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) కొత్త మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (భారతీయ సినిమాను ప్రోత్సహించే లక్ష్యంతో 1975లో ఎన్ఎఫ్‌డీసీను ఏర్పాటు చేశారు?) జ: ప్రకాష్ మగ్దుమ్

◆ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (POK) ల్లో ఎన్ని

### మాదిరి ప్రశ్నలు

ప్రధాన ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్ పేరిట రహస్య ఆపరేషన్‌ను నిర్వహించాయి? (26 మంది భారతీయ పౌరులు, భద్రతా సిబ్బంది ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన రెండు వారాల తర్వాత ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు.) జ: 9

◆ 2025, మే 6న భారత్‌తో ఏ దేశం చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) కుదుర్చుకుంది? జ: యునైటెడ్ కింగ్‌డమ్

◆ యెమెన్ నూతన ప్రధానిగా ఎవరు నియమితులయ్యారు? (దేశ ఆర్థిక మంత్రిగా కొనసాగుతున్న ఈయనను యెమెన్ ప్రెసిడెన్షియల్ లీడర్‌షిప్ కౌన్సెల్ కొత్త ప్రధాన మంత్రిగా నియమించింది.) జ: సలేం సలేహ్ బిన్ బ్రైక్

మరింత సమాచారం

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

దేశంలో రెండంకెల వృద్ధి రేటు నమోదు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ప్రధానంగా వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక, సేవా రంగాలకు వ్యవసాయ రంగంతో సమాన ప్రాధాన్యం ఉంది. ఈ మూడు ప్రధాన రంగాలు, వాటి అనుబంధ, ఉప రంగాలన్నీ కలిసి రాష్ట్ర వృద్ధి రేటు, తలసరి ఆదాయాలను నిర్ణయిస్తున్నాయి. ఏపీ ఆర్థిక వ్యవస్థ స్వరూపం, జీఎస్‌డీపీలో రంగాలవారీ వాటా, విలువ, వృద్ధి వరుసగా ముందంజలో నిలుస్తున్న రంగాలు, ఇటీవలి గణాంకాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల వారీగా అధిక వాటా సమకూరుస్తున్న జిల్లాలు, నిర్దిష్ట వార్షిక వృద్ధి రేటే లక్ష్యంగా రూపొందించిన స్వర్ణాంధ్ర ఆశయాలను తెలుసుకోవాలి.

# ఏపీ ఎకానమీ

# ఉప రంగాలే వృద్ధి చోదకాలు!

## ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలోని రంగాలు

**స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో రంగాలు:** జీఎస్‌డీపీని స్థూలంగా వ్యవసాయం - అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవా రంగం అనే మూడు విభాగాలుగా విభజించారు.

**వ్యవసాయం – అనుబంధ రంగాలు:** వ్యవసాయం, ఉద్యాన ఉత్పత్తులు, పశుసంపద, అటవీ ఉత్పత్తులు, మత్స్య సంపద.

**పారిశ్రామిక రంగంలోని ఉప రంగాలు:** తయారీ పరిశ్రమలు (రిజిస్టర్, రిజిస్టర్ కాని), విద్యుత్తు ఉత్పత్తి, గ్యాస్ ఉత్పత్తి, పరిశ్రమలకు నీటి సరఫరా, నిర్మాణ రంగం, గనులు, తవ్వకాలు.



**సేవా రంగం (తృతీయ రంగం)లోని ఉప రంగాలు:** వర్తకం, హోటల్, రెస్టారెంట్లు, రైల్వే, రోడ్డు, జల, వాయు రవాణా; గిడ్డంగులు, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, బీమా, ఇతర ఆర్థిక సేవలు, రియల్ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు, ప్రభుత్వ పరిపాలన, ఇతర సేవలు.

**నోట్:** రాష్ట్ర జీఎస్‌డీపీలో 17 ఉపరంగాలు ఉన్నాయి.

◆ ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర జీఎస్‌డీపీలో అత్యధిక వాటా ఉన్న రంగాలు వరుసగా సేవారంగం, వ్యవసాయం-అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం ఉన్నాయి. అదే స్థిర ధరల వద్ద చూస్తే సేవా రంగం, పారిశ్రామిక రంగం, వ్యవసాయం - అనుబంధ రంగాలు వరుసలో నిలుస్తున్నాయి.

◆ 2023-24లో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీకి వ్యవసాయ అనుబంధ రంగాల్లో అధిక విలువ నమోదు చేసిన ఉప రంగం 'వ్యవసాయం, ఉద్యాన ఉత్పత్తులు'. అధిక వృద్ధిరేటు నమోదైన ఉప రంగం 'పశు సంపద'.

◆ 2023-24లో పారిశ్రామిక రంగంలో అధిక విలువ నమోదు చేసిన ఉపరంగం 'తయారీ పరిశ్రమలు'. అధిక వృద్ధిరేటు నమోదు చేసిన ఉపరంగం 'నిర్మాణ రంగం'.

◆ 2023-24లో సేవారంగం నుంచి అధిక విలువ నమోదు చేసిన ఉప రంగం 'వర్తకం, హోటల్, రెస్టారెంట్'. అధికవృద్ధిరేటు నమోదు చేసిన ఉపరంగం రియల్ ఎస్టేట్.

**ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీలో రంగాల వారీ వాటా (2023 – 24)**

| రంగం | ప్రస్తుత ధరల వద్ద జీఎస్‌డీపీలో వాటా | స్థిరధరల వద్ద జీఎస్‌డీపీలో వాటా |
|---|---|---|
| 1) వ్యవసాయం, అనుబంధ రంగాలు | 34.15% | 29.7% |
| 2) పారిశ్రామిక రంగం | 25.69% | 30.4% |
| 3) సేవా రంగం | 40.16% | 39.9% |
| మొత్తం | 100% | 100% |

**స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ - గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్):** ఒక ఆర్థిక సంవత్సరంలో జిల్లా సరిహద్దులకు లోబడి ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవల విలువను 'స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ)' అంటారు. 2022 - 23 నూతన నివేదిక ప్రకారం 26 జిల్లాల ప్రాతిపదికగా మొత్తం స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ) విలువలో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా అధికంగా ఉన్న జిల్లా ఏలూరు. పారిశ్రామిక రంగం వాటా అధికంగా ఉన్న జిల్లా విశాఖపట్టణం. సేవారంగం వాటా అధికంగా ఉన్న జిల్లా ఎన్‌టీఆర్.

✦ 2022 - 23 గణాంకాల ప్రకారం ప్రస్తుత, స్థిర ధరల వద్ద జీడీడీపీ విలువ ఎక్కువగా ఉన్న మూడు జిల్లాలు వరుసగా విశాఖపట్టణం, ఎన్‌టీఆర్, కృష్ణా. ప్రస్తుత, స్థిర ధరల ప్రకారం జీడీడీపీ విలువ తక్కువ ఉన్న జిల్లా అల్లూరి సీతారామరాజు. ✦ ప్రస్తుత ధరల ప్రకారం తలసరి ఆదాయం ఎక్కువ ఉన్న జిల్లాలు విశాఖపట్టణం (4,83,892), కృష్ణా (3,35,324), ఏలూరు (2,87,481). ✦ స్థిర ధరల ప్రకారం తలసరి ఆదాయం ఎక్కువ ఉన్న జిల్లాలు విశాఖపట్టణం (3,10,968), కృష్ణా (2,11,739), ఎన్‌టీఆర్ (1,66,049). ✦ ప్రస్తుత, స్థిర ధరల ప్రకారం తలసరి ఆదాయం తక్కువ ఉన్న జిల్లా అల్లూరి.

**ప్రస్తుతం, స్థిర ధరల వద్ద జీడీడీపీ (రూ.కోట్లలో)**

| జిల్లా | ప్రస్తుత ధరల వద్ద జీడీడీపీ | స్థిర ధరల వద్ద జీడీడీపీ |
|---|---|---|
| 1) విశాఖపట్టణం | 1,19,268 | 77,498 |
| 2) ఎన్‌టీఆర్ | 73,632 | 44,729 |
| 3) కృష్ణా | 68,301 | 43,530 |

**స్వర్ణాంధ్ర @ 2047:** దేశానికి స్వాతంత్ర్యానంతరం 100 సంవత్సరాల కాలపరిమితిలో 2047 నాటికి కేంద్ర ప్రభుత్వం సాధించాల్సిన లక్ష్యాలను 'వికసిత్ భారత్ @ 2047' పేరుతో నిర్దేశించింది. ఈ లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర @ 2047' విధానపత్రం రూపంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించాల్సిన లక్ష్యాలను పేర్కొంది. 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ 2.4 ట్రిలియన్ డాలర్లుగా నమోదు కావాలి. అలాగే రాష్ట్ర తలసరి ఆదాయం 43,000 డాలర్లకు చేరాలి. రాష్ట్ర ప్రభుత్వ సగటు వార్షిక వృద్ధి రేటు 15%గా ఉండాలనే లక్ష్యాలను స్వర్ణాంధ్ర @ 2047 విధాన పత్రంలో పేర్కొన్నారు.

### ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం

✸ 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల వద్ద ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ. 2,42,479 కాగా, దేశ తలసరి ఆదాయం రూ. 1,84,205. అంటే దేశ తలసరి ఆదాయం కంటే ఏపీ తలసరి ఆదాయం ఎక్కువ. 2021 - 22 నుంచి ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ వృద్ధి రేటు భారతదేశ జీడీపీ వృద్ధి రేటు కంటే వరుసగా రెండేళ్లు తక్కువగా ఉంది. కానీ 2023 - 24లో దేశ సగటు వృద్ధి రేటు 9.6% ఉంటే, రాష్ట్ర వృద్ధిరేటు 10.44%గా నమోదైంది. 2021 - 22 నుంచి స్థిరధరల వద్ద రాష్ట్ర వృద్ధి రేటు కంటే భారతదేశ వృద్ధి రేటు అధికంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

✸ 2023 - 24 ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాలు వరుసగా గోవా (రూ. 4,75,401), సిక్కిం (రూ. 4,63,509), దిల్లీ (రూ. 3,76,217). తలసరి ఆదాయ పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో 16వ స్థానంలో ఉంది.

| సంవత్సరాలు | ప్రస్తుత ధరల వద్ద తలసరి ఆదాయం(రూ.ల్లో) | వృద్ధిరేటు | స్థిర ధరల వద్ద తలసరి ఆదాయం(రూ.ల్లో) | వృద్ధి రేటు |
|---|---|---|---|---|
| 2021 - 22 | 1,97,214 | 17.35% | 1,21,762 | 9.72% |
| 2022 - 23 | 2,19,881 | 11.49% | 1,26,690 | 4.05% |
| 2023 - 24 | 2,42,479 | 10.28% | 1,35,806 | 7.20% |

### మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పారిశ్రామిక రంగంలోని ఉపరంగం కానిది?
1) బ్యాంకింగ్, బీమా 2) ఉద్యాన ఉత్పత్తులు 3) రియల్ ఎస్టేట్ 4) మైనింగ్

2. 2023 – 24 డేటా ప్రకారం ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర జీఎస్‌డీపీలో 'సేవారంగం' వాటా ఎంత శాతం?
1) 25.69% 2) 34.15% 3) 39.9% 4) 40.16%

3. స్వర్ణాంధ్ర @ 2047 డాక్యుమెంట్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్ర తలసరి ఆదాయం ఎన్ని డాలర్లు ఉండాలి?
1) 42,000 2) 43,000 3) 44,000 4) 45,000

4. 2023 – 24 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీకి 'సేవారంగం' నుంచి అధిక విలువ నమోదు చేసిన ఉపరంగం?
1) వర్తకం, హోటల్, రెస్టారెంట్లు 2) కమ్యూనికేషన్ 3) రియల్ ఎస్టేట్ 4) బ్యాంకింగ్, బీమా

5. 2022 – 23 ప్రకారం ప్రస్తుత, స్థిరధరల వద్ద స్థూల జిల్లా ఉత్పత్తి విలువ (జీడీడీపీ) ఎక్కువగా ఉన్న మూడు జిల్లాలు వరుసగా..
1) విశాఖపట్టణం, కృష్ణా, ఎన్‌టీఆర్ 2) విశాఖపట్టణం, ఎన్‌టీఆర్, కృష్ణా 3) విశాఖపట్టణం, కృష్ణా, ఏలూరు 4) విశాఖపట్టణం, ఏలూరు, కృష్ణా

6. రాష్ట్ర జీఎస్‌డీపీలో ఎన్ని ఉపరంగాలున్నాయి?
1) 9 2) 13 3) 15 4) 17

7. 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ ఎంత ఉండాలని స్వర్ణాంధ్ర @ 2047 విధాన పత్రంలో పేర్కొన్నారు?
1) 2.1 ట్రిలియన్ డాలర్లు 2) 2.2 ట్రిలియన్ డాలర్లు 3) 2.3 ట్రిలియన్ డాలర్లు 4) 2.4 ట్రిలియన్ డాలర్లు

8. 2022 – 23 డేటా ప్రకారం స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ) విలువలో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా అధికంగా ఉన్న జిల్లా?
1) ఏలూరు 2) పశ్చిమ గోదావరి 3) తూర్పుగోదావరి 4) కృష్ణా

రచయిత: సుబ్బిరెడ్డి

**సమాధానాలు**
1-4; 2-4; 3-2; 4-1; 5-2; 6-4; 7-4; 8-1.

# కౌలు పత్రం.. భవిత భద్రం

మంజూరు చేస్తున్న ప్రభుత్వం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

**కూ**టమి ప్రభుత్వం కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు మంజూరు చేస్తోంది. ఏటా గ్రామ రెవెన్యూ అధికారులు వాటిని మంజూరు చేస్తారు. సొంత భూమి లేని వారు కౌలుకు భూములు సాగు చేస్తుంటే.. ఆ పత్రాలు మంజూరు చేస్తారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో ఎక్కువమంది కౌలుకు భూములు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు. వారంతా ఆ పత్రం కోసం అధికారులకు దరఖాస్తులు అందిస్తున్నారు.

**వీఆర్వోలను సంప్రదిస్తే...**

నందిగామ రెవెన్యూ డివిజన్లో 34 వేల మంది కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు (సీసీఆర్సీ) ఇవ్వాలి. ఇప్పటివరకు 19,556 మందికి మంజూరు చేశారు. సొంత భూమి ఉన్న రైతుల నుంచి పంట సాగుదారులు 11 నెలల కాలానికి అగ్రిమెంట్ తీసుకోవాలి. కాల పరిమితి ముగిస్తే ఆ కార్డును రెన్యువల్ చేయించుకోవాలి.

నారు మడి పోస్తున్న రైతులు

కౌలు రైతులు తమ గ్రామాల్లోని వీఆర్వోలను సంప్రదిస్తే.. ఆన్‌లైన్లో వివరాలు నమోదు చేసి వెంటనే సీసీఆర్సీ కార్డులు మంజూరు చేస్తారు. నందిగామ మండలంలో 12,589 మందికి కార్డులు ఇవ్వాలి. ఇప్పటి వరకు 4200 మందికి మంజూరు చేశారు. తమను సంప్రదించిన వెంటనే సీసీఆర్సీ కార్డులు మంజూరు చేస్తామని వీఆర్వోలు భరోసా ఇస్తున్నారు. గతంలో కార్డులు పొందని కౌలు రైతులకు పంట నష్ట పరిహారం మంజూరు కాక ఇబ్బందులు పడ్డారు. నష్టపరిహారం భూమి యజమానుల బ్యాంకు ఖాతాలకు జమ అయింది.

**దరఖాస్తుతోపాటు ఇవ్వాల్సిన పత్రాలు**

- భూమి యజమాని నుంచి 11 మాసాల సాగు ఒప్పందం
- పట్టాదారు పాసు పుస్తకం జెరాక్స్
- కౌలు రైతు పాస్‌పోర్టు సైజ్ ఫొటో
- కౌలు రైతు ఆధార్ కార్డు జెరాక్స్

**ఉపయోగాలు ఇవీ..**

☛ సీసీ కార్డులున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులే. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం మంజూరవుతుంది. ☛ ప్రభుత్వం రాయితీపై ఇచ్చే విత్తనాలు, ఎరువులు పొందొచ్చు. ☛ పంటల బీమా ప్రీమియం చెల్లిస్తే.. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపరిహారం మంజూరు అవుతుంది. ☛ బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేస్తాయి.

## కిటకిటలాడిన తిరుపతమ్మ దేవాలయం

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆదివారం ఆలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి మొదలైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. మహిళలు పాలపొంగళ్లు చేసి అమ్మవారికి సమర్పించారు. ఆషాఢ మాసం కావడంతో ఎక్కువ మంది అమ్మవారికి సారె తీసుకొచ్చి సమర్పించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లు నిండిపోయి దర్శనానికి ఎక్కువ సమయం పట్టింది. సుమారు 25 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏఈవో జంగం శ్రీనివాస్ పర్యవేక్షణలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మునేరు పక్కనున్న గార్డెన్లు, ఫంక్షన్ హాళ్లు భక్తులతో నిండిపోయాయి.

## ఆషాఢ సారె సమర్పణ

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారికి పెనుగంచిప్రోలు పోలీసులు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు, వత్సవాయి ఎస్ఐలు అర్జున్, ఉమామహేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్ నుంచి సారెతో ఆలయం వరకు ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో పోలీసు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

లింగగూడెం నుంచి ఆలయానికి వస్తున్న భక్తులు

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** మండలంలోని లింగగూడెంకు చెందిన భక్తులు ఆదివారం తిరుపతమ్మ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. గ్రామానికి చెందిన మహిళలంతా కాలినడకన పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేసుకుంటూ వచ్చి సారె సమర్పించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

❖ నందిగామలోని కొని వార్డుల్లో దోమలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి నిద్రకు ఇబ్బందిగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో ఫాగింగ్ చేయించారు.

❖ స్థానిక విజయవాడ రోడ్డు, గాంధీ సెంటర్ అపరిశుభ్రంగా ఉందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఆయా రోడ్లను కార్మికులు శుభ్రం చేశారు.

❖ స్థానిక బీసీ కాలనీలో మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదని పురపాలక ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. వెంటనే ఆమె స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో మురుగు కాలువలను శుభ్రం చేయించారు.

❖ స్థానిక రైతు పేటలోని రెండు రహదారుల్లో కల్వర్టులు పాడైపోయాయని, రాకపోకలకు ఇబ్బందదిగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా పురపాలక ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాల మేరకు లోవరాజు కొత్తగా కల్వర్టులు నిర్మాణం చేయించారు. – నందిగామ, న్యూస్‌టుడే

❖ పేరకలపాడు - పొన్నవరం రహదారిలో చెత్త నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని గ్రామానికి చెందిన సంగమేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ జలీల్ సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

❖ కీసర - పెండ్యాల రహదారిలో పైపులైను పగలడంతో తాగు నీరు వృథాగా పోతోందని కీసరకు చెందిన రామారావు చేసిన ఫిర్యాదుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు స్పందించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – కంచికచర్ల, న్యూస్‌టుడే

❖ చందర్లపాడులోని బండ స్థావరాలు, ధర్మచెరువు, రెడ్డి బజారులో మురుగు కాల్వ పూడుకుపోయినట్లు పంచాయతీ కార్యదర్శి సాయిరాం దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా ఆయన పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించారు.

❖ చందర్లపాడు పంచాయతీ పాటెంపాడులో రెండు వీధి దీపాలు వెలగడం లేదని, అంధకారం నెలకొందని పంచాయతీ కార్యదర్శికి స్థానికులు చెప్పగా.. వెంటనే ఆయన స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

❖ స్థానిక జంగాల కాలనీ, పడమట బజారులో మూడేసి చొప్పున వీధి దీపాలు వెలగడం లేదని పంచాయతీ కార్యదర్శికి తెలియజేయగా.. ఆయన స్పందించి వాటిని ఏర్పాటు చేయించారు. –చందర్లపాడు, న్యూస్‌టుడే

## వైభవంగా దేవాలయ వార్షికోత్సవం

**పాతకంచల(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే:** మండలంలోని పాతకంచల గ్రామంలో ఆదివారం పల్నాటి వీరుల అంకమ్మతల్లి, చెన్నకేశవస్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రామిరెడ్డి వంశీయులు అమ్మవారికి మొక్కులు తీర్చారు. మహిళలు బోనాలు సమర్పించారు. అంక గుడారిని పుష్పాలతో అలంకరణ చేసి పూజలు చేశారు. పోతురాజు గావు, పోతురాజు బోనం, దీవెన బండారు సమర్పించారు. అన్నప్రసాదం వితరణ చేశారు. చెన్నకేశవస్వామి కొణతాలకు పూజలు చేశారు. నిర్వాహకులు రామిరెడ్డి సుబ్బారావు, రామిరెడ్డి వెంకటేశ్వరరావు (స్వామి), రామిరెడ్డి శ్రీధర్, వీరరాఘవయ్య, శ్రీనివాసరావు, మామిడాకుల కొండ, వీరబాబు, ఎంపీటీసీ సభ్యుడు సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో సారె తీసుకువచ్చిన మహిళలు

❖ నందిగామలో దత్త సమాజ మహిళా మండలి, లలితా విష్ణు జ్ఞాన వాహిని మహిళలు అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పించారు.

❖ అంబారుపేట సత్యమ్మతల్లికి ఐతవరం గ్రామ మహిళలు సారె సమర్పించారు. భక్తులతో దేవాలయం పోటెత్తింది. మొక్కులు తీర్చారు. రామిరెడ్డిపల్లి గ్రామదేవత ముత్యాలమ్మకు మహిళలు సామూహికంగా బోనాలు సమర్పించారు.

❖ అంబారుపేట సత్యమ్మతల్లికి ఆదివారం మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. గోళ్లమూడి గ్రామదేవత ముత్యాలమ్మకు గ్రామంలోని చావా కుటుంబీకులు తొలి బోనం అందించారు. శివాలయ ఛైర్మన్ చావా అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పాతకంచలలో బోనాలతో భక్తులు

## అంకమ్మ తల్లికి పంచామృత అభిషేకం

**గొట్టుముక్కల(కంచికచర్ల), న్యూస్‌టుడే :** గొట్టుముక్కలలో అంకమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం అనంతరం ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించారు. లలితా సహస్ర నామం, అర్చన నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

(c) eenadu

## బకాయిలు చెల్లిస్తాం.. గానుగాడుతాం

**'న్యూస్‌టుడే'తో ఎండీ వెంకటేశ్వరరావు**

చోడవరం, న్యూస్‌టుడే

చోడవరం సహకార చక్కెర కర్మాగారానికి చెరకు సరఫరా చేసే రైతులకు బకాయిలు చెల్లించడంతోపాటు 2025-26 సంవత్సరంలో గానుగాడేందుకు సన్నద్ధమవుతున్నట్లు ఎండీ డి.వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందిస్తే అడ్డంకులను అధిగమిస్తామని పేర్కొన్నారు. తక్షణ సాయంగా రూ.30 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు వెల్లడించారు. ఎండీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన కర్మాగారం ప్రస్తుత పరిస్థితి, గానుగాట అంశంపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. పాలనాపరమైన అంశాలను ప్రస్తావిస్తూ అందరి సహకారంతో ముందుకెళ్తామని చెప్పారు.

- 2023-24 గానుగాట కాలానికి సంబంధించి చెల్లించాల్సిన బకాయిలు టన్ను ఒక్కింటికి రూ.150 చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశాం. మొత్తం బకాయిలు రూ.2.5 కోట్లలో పూర్వ ఎండీ హయాంలో రూ.కోటి జమ చేయగా.. ప్రస్తుతం రూ.1.5 కోట్లు చెల్లింపులు చేశాం.
- ముగిసిన గానుగాట కాలంలో గానుగ చేసిన చెరకుకు రూ.6 కోట్ల చెల్లింపులు జరిగాయి. రూ.30 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉంది. ఈ మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందించాలని ప్రభుత్వానికి నివేదించాం. సకాలంలో ఆర్థిక సాయం అందుతుందన్న నమ్మకంతో ఉన్నాం.
- కర్మాగారం పరిధిలో చెరకు తోటల నుంచి లక్ష టన్నుల వరకు దిగుబడి వస్తుందని వ్యవసాయ విభాగం పరిశీలనలో తేలింది. కార్శి తోటలే అధికంగా ఉన్నాయి. ఊడ్చిన తోటలు పెద్దగా లేవు. బకాయిలు చెల్లిస్తే రైతులు ఉత్సాహంగా కర్మాగారానికి చెరకు తీసుకొస్తారు. ఈ ఏడాది చెరకు టన్ను ధర రూ.3,290.50గా నిర్ణయించాం.
- 2025-26 సంవత్సరానికి గానుగాట ప్రారంభించాలంటే ముందుగా యంత్రాలకు మరమ్మతు, గ్రీజ్ పెట్టడం తదితర ఓవర్ హాలింగ్ పనులు చేయాలి. ఇందుకు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు ఖర్చవుతుంది. కార్మికుల వేతనాలకు రూ.8.2 కోట్లు అవసరం. కర్మాగారంలో ఏడు వేల టన్నుల వరకు మొలాసిస్ నిల్వలున్నాయి. వీటి విక్రయం ద్వారా వచ్చే ఆదాయంతో ఈ పనులు చేపడతాం.

## మా మధ్య భేదాభిప్రాయాలు లేవు : జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర

**ఈనాడు, విశాఖపట్నం:** జిల్లా పరిషత్తు నిధుల కేటాయింపు, ఇతర అంశాలపై జడ్పీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వడంలో కొంత అంతరం ఉందే తప్పా, తనకూ సభ్యులకు మధ్య భేదాభిప్రాయాల్లేవని జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర అన్నారు. విశాఖపట్నంలో ఆదివారం మాట్లాడుతూ.. 'ఛైర్‌పర్సన్'గా బాధ్యతలు చేపట్టినప్పట్నుంచి సభ్యులందరికీ సమాన ప్రాతిపదికన నిధులు కేటాయించానన్నారు. ఇటీవల కావాలనే కొందరు ఆరోపణలు చేస్తూ అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ క్రమంలోనే అసంతృప్త సభ్యులతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. నిధుల కేటాయింపు సమాచారం సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేయకపోవడం పొరపాటేనన్నారు. త్వరలోనే అధికారులు, సభ్యులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**కడలి తీరం.. ఆరోగ్య హారం**

ఆర్‌కే బీచ్‌లో ఆదివారం ఉదయం సందడి వాతావరణం నెలకొంది. జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో 'ఒలింపిక్ డే' పరుగు నిర్వహించారు. గతంలో నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం వర్షాల వల్ల ఆదివారానికి వాయిదా పడింది. విశాఖ పశ్చిమ, ఎలమంచిలి ఎమ్మెల్యేలు గణబాబు, సుందరపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, విశాఖపట్నం

## ఉపాధి మాయా పథకం

**చర్యలు నామమాత్రం.. అవినీతి యథాతథం**

పాయకరావుపేట, న్యూస్‌టుడే

**ఇక్కడో కందకం ఉండాలి. మీరెవరైనా చూశారా? కాలువలో పనులు చేశారంట. మీకు తెలుసా? మీ పొలంలోనే పని చేయించారంట కదా..! నిజమేనా?**

ఉపాధి హామీ పథకంలో ఎక్కడెక్కడ ఏ పనులు చేశారో భూతద్దం పెట్టి వెతికినా ఇసుమంతైనా కనిపించడం లేదు. ఎక్కడా పనుల జాడే లేదు. తనిఖీకి వెళ్లిన సభ్యులకు ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఆర్పీలు కలిసి 'రాజావారి చేపల చెరువు' సినిమా చూపించారు. పనులు చేయకుండానే చేసినట్లు చెబుతూ తనిఖీ బృందానికి చుక్కలు చూపారు. పాయకరావుపేట మండల పరిధిలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలపై 'న్యూస్‌టుడే' పరిశోధనాత్మక కథనం.



ఈ కొండపైనే కందకాలు తవ్వారట..

- ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టకుండానే చేసినట్లు చూపి సొమ్ములు నొక్కేశారు. తనిఖీ సిబ్బందే అవాక్కయ్యే పరిస్థితి ఎదురైంది. మండలంలోని 24 గ్రామాల్లో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.9.43 కోట్లతో 1,303 పనులు చేపట్టారు. వేతనాలకు రూ.7.05 కోట్లు, మిగతా మొత్తం సామగ్రి చెల్లింపులకు వినియోగించారు. సామాజిక తనిఖీ బృందానికి పనుల్లో అడుగడుగునా అవినీతి ఆనవాళ్లే కనిపించాయి. కొలతలు, మస్తర్లలో తేడాలతో సొమ్మును పక్కదారి పట్టించినట్లు గుర్తించారు.

**మచ్చుకు కొన్ని..**
- గోపాలపట్నం కొండ ప్రాంతంలో 300 కందకాలు తవ్వినట్లు రికార్డుల్లో చూపారు. 110 కందకాలకు సంబంధించిన వివరాల్లేవు. మంగవరంలో రైతుల పొలాల్లో కందకాలు తవ్వామని రికార్డుల్లో పేర్కొన్నా.. సగానికిపైగా జాడ లేదు. ఉన్న వాటిలోనూ కొలతల్లో తేడాలున్నాయి.
- ఎస్.నర్సాపురంలో మస్తర్లలో గోల్‌మాల్ చేశారు. పంట కాలువల తవ్వకాల్లోనూ అవకతవకలే. మస్తర్లు వేయకుండానే సొమ్ములు మింగేశారు.
- 130 మంది కూలీలు పని చేయకుండానే చేసినట్లుగా మస్తర్లు వేసి నామవరం వీఆర్పీ నగదు విత్‌డ్రా చేశారు. నాలుగు నెలపాటు పని చేసినట్లుగా రికార్డుల్లో చూపారు.
- పెంటకోటలో చేపట్టిన పనుల్లో కొలతలు, మస్తర్లలో తేడా జరిగినట్లు తేలింది.

**నిధుల రికవరీకి ఆదేశాలు..** సామాజిక తనిఖీ వేదికగా డీఆర్పీలు ఇచ్చిన నివేదికల ఆధారంగా రూ.3.18 లక్షలు రికవరీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. నామవరం వీఆర్పీపై క్రిమినల్ కేసు నమోదు సహా నగదు రికవరీకి చర్యలు చేపడుతున్నాం. కందకాలు, పంట కాలువల తవ్వకాల్లో అవకతవలను గుర్తించేందుకు క్వాలిటీ కంట్రోల్ విభాగానికి ఫిర్యాదు చేశాం. – నానిబాబు, ఏపీఓ

## రెండో విడత ప్రవేశాలకు గడువు పొడిగింపు

**పాయకరావుపేట, న్యూస్‌టుడే:** ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు గడువు పొడిగించారని పేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 20 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. వివరాలకు 70137 37243, 99894 78278 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

**కలెక్టరేట్, న్యూస్‌టుడే:** కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్, జీవీఎంసీ, పురపాలక సంఘ కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇంటి నుంచే మీ కోసం వెబ్‌సైట్‌లో వినతులు పంపవచ్చన్నారు. 1100 నంబరుకు ఫోన్ చేసి అర్జీల స్థితి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలి: అనిత

**ఎస్.రాయవరం, నక్కపల్లి, న్యూస్‌టుడే:** రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని, ఇందుకు అందరూ సహకరించాలని హోంమంత్రి వంగలపూడి అనిత కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రామయ్యపట్నంలో ఆదివారం పర్యటించారు. తెదేపా కార్యాలయాన్ని ప్రారంభించి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. సర్పంచి తీర్మానాలు ఇవ్వకపోవడం వల్ల పంచాయతీలో అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బొమ్మల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిశ్రమ అందుబాటులోకి వస్తే 25 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కాలేయ సంబంధిత సమస్యతో బాధపడుతున్న నక్కపల్లి మండలం కాగిత గ్రామానికి చెందిన దేవరపు గోవిందరావుకు సీఎం సహాయ నిధి నుంచి రూ.12,43,188 మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కు రూపేణా హోం మంత్రి అనిత సారిపల్లిపాలెంలోని క్యాంపు కార్యాలయంలో బాధితుడికి అందజేశారు. నాయకులు వినోద్‌రాజు, కొప్పిశెట్టి వెంకటేష్, అబద్ధం, నరసింహమూర్తి, వెంకటరాజు, శ్రీనివాస్, పోలిశెట్టి నాయుడు పాల్గొన్నారు.

బాధితుడికి సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న మంత్రి అనిత

## కొత్తూరులో మెగా పార్క్

**వీఎంఆర్‌డీఏ పచ్చజెండా**

ఈనాడు డిజిటల్, అనకాపల్లి – న్యూస్‌టుడే, కొత్తూరు

గజిబిజి జీవనశైలిలో.. సాయంత్రం సేదతీరేందుకు జిల్లాలో ఆహ్లాదం కరవైంది. వారాంతాల్లో పిల్లలతో ఆటలాడేందుకు, సరదాగా గడిపేందుకు అనకాపల్లిలో సరైన పార్కు ఒక్కటీ లేదు. అనకాపల్లి పట్టణ పరిధిలో మెగా పార్క్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎప్పట్నుంచో ఉంది. గత ప్రభుత్వంలో పార్క్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు కనీస ప్రయత్నమూ చేయలేదు. కూటమి ప్రభుత్వంలో ఆ కల సాకారం కానుంది. జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొత్తూరులో మెగా పార్క్ ఏర్పాటుకానుంది. ఇందుకు సంబంధించి వీఎంఆర్‌డీఏ పరిపాలన అనుమతులు ఇచ్చింది.

పార్కు ఏర్పాటుకు గుర్తించిన భూములు

**5.68 ఎకరాలు.. రూ.5.35 కోట్లు**

... మెగా పార్క్ ఏర్పాటుకు కొత్తూరు పరిధిలో సర్వే నంబర్ 608లో ఏడు ఎకరాలకుపైగా జీవీఎంసీ స్థలం ఉంది. ఇదే అనువైనదిగా అధికారులు తాజాగా గుర్తించారు. 5.68 ఎకరాల్లో మెగా పార్క్ ఏర్పాటు చేయాలని విశాఖలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో ఇటీవల తీర్మానం చేశారు. రూ.5.35 కోట్ల వ్యయంతో రెండు విడతలుగా నిర్మించనున్నారు. పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలం, యోగా చేసేందుకు యోగా ముద్రలతో అనువైన ప్రదేశం, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్, బాస్కెట్ బాల్, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ కోర్టులు, స్కేటింగ్ రింక్ నిర్మించనున్నట్లు వీఎంఆర్‌డీఏ ఈఈ రాంబాబు చెప్పారు. జిల్లా అధికారుల సమక్షంలో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

## నేటి నుంచి 'బిమ్స్‌టెక్' పోర్టుల సదస్సు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే :** ప్రాంతీయ నౌకాశ్రయం, సముద్ర జలాల్లో సంబంధాల బలోపేతానికి సోమ, మంగళవారాల్లో 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కో-ఆపరేషన్-బిమ్స్‌టెక్' పోర్టుల సదస్సు నగరంలో నిర్వహించనున్నారు. సదస్సులో పాల్గొనేందుకు వివిధ దేశాల పోర్టులకు చెందిన అధికారులు, ఇతర ప్రతినిధులు విశాఖ చేరుకున్నారు. ఆదివారం రాత్రి నగరానికి చేరుకున్న కేంద్ర నౌకాశ్రయాలు, నౌకాయానం, జలరవాణా మంత్రి సర్బానంద సోనోవాల్‌కు విశాఖ పోర్టు అథారిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఘనస్వాగతం పలికారు. కేంద్ర సహాయ మంత్రి శాంతనూ ఠాకూర్‌తో పాటు ఇతరులు సదస్సులో పాల్గొంటారు. ఈ సందర్భంగా విశాఖ పోర్టులో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర మంత్రులు ప్రారంభించి, నూతన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. ఈ వివరాలను విశాఖ పోర్టు అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్ వెల్లడించారు.

## 15న 'సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ' విభాగాల ప్రారంభం

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో అభివృద్ధి చేసిన సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ విభాగాలను ఈనెల 15న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించనున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో మూడు సార్లు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మూడు సార్లు విభాగాల ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఈ ఆరుసార్లు భవనాలను ముస్తాబు చేయడంతో పాటు ఫెక్సీలు ఏర్పాటు చేయడం, తోరణాలు కట్టడం చేశారు. తర్వాత వాయిదా పడడంతో చేసిన ఖర్చంతా వృథా అయింది. ఈ సారైనా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభానికి నోచుకుంటుందా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విభాగాలు అందుబాటులోకి రాకపోవడంతో రోగులు ఆధునిక వైద్యం అందడం లేదని చెబుతున్నారు.

## 'పురమిత్ర'తో పరిష్కారం మీ చేతుల్లోనే..

**ఫొటో తీయండి.. వాట్సప్ చేయండి**

నర్సీపట్నం, న్యూస్‌టుడే

రోజులు మారాయి. ఎవరో వస్తారని ఎదురుచూడాల్సిన పని లేదు. సాంకేతికత ఎన్నో మార్పులు తీసువచ్చింది. సమస్యలపై అధికారులను అప్రమత్తం చేసి మనమే పరిష్కరించుకోవచ్చు. పట్టణాల్లో 'పురమిత్ర' యాప్ ఇందుకు దోహదపడుతోంది. ఈ ఏడాది మార్చి 15 నుంచి ఈ యాప్ అందుబాటులోకి వచ్చింది. స్మార్ట్ ఫోన్ యూజర్లు పురమిత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. స్థానికంగా నెలకొన్న సమస్యల తీవ్రత తెలిసేలా ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు. సంబంధిత అధికారులు స్పందించి మూడు రోజుల్లో పరిష్కారానికి చర్యలు చేపడతారు.

- నర్సీపట్నం మున్సిపాలిటీలో రిలయన్స్ పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న కాలువ చాలా కాలంగా పూడికతో నిండిపోయింది. మురుగు నీరంతా రోడ్డుపైకి చేరుతుండటంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణానికి చెందిన సత్యనారాయణ సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి పురమిత్ర యాప్‌లో అప్‌లోడ్ చేశారు. పారిశుద్ధ్య విభాగం అధికారులు పొక్లెయిన్‌తో కాలువలో పూడిక తొలగించి మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించారు.
- నిత్యం రద్దీగా ఉండే నర్సీపట్నం పెద్ద చెరువు రోడ్డు పరిసరాలు రెండేళ్లుగా చెత్త చెదారాలతో దుర్గంధభరితంగా మారింది. అటుగా వెళ్లే వారంతా ముక్కు మూసుకోవాల్సిందే. చెరువు ప్రాంతానికి చెందిన రామరాజు రెండు నెలల కిందట ఫొటో తీసి పురమిత్ర యాప్ ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పుడు ఆ దారంతా పరిశుభ్రంగా మారింది.

**కొరవడిన ప్రచారం...** ఎంతో ఉపయుక్తమైన ఈ యాప్‌పై అనకాపల్లి జీవీఎంసీ, నర్సీపట్నం, ఎలమంచిలి పురపాలక సంఘాల్లో ప్రచారం కొరవడింది. ఈ యాప్ సీఎం డాష్ బోర్డుకు అనుసంధానమై ఉంటుంది. ఉన్నతాధికారులంతా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. చిన్న సమస్యలు 24 గంటల్లో, పెద్దవైతే 3 నుంచి 15 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంది. సకాలంలో స్పందించి సమస్యలు పరిష్కరించని వారిపై చర్యలు ఉంటాయి. ఈ కారణంగా ఎందుకొచ్చిన తలనొప్పి అని భావిస్తున్న కొందరు అధికారులు పురమిత్ర యాప్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సుముఖత చూపడం లేదు.

**అనకాపల్లిలో ఒకటే..** జిల్లా కేంద్రం అనకాపల్లి జీవీఎంసీలో ఈ యాప్ నుంచి మూడున్నర నెలల్లో ఒక్క సమస్యే నమోదైంది. అదీ విశాఖపట్నంకు సంబంధించినది. ఈ సమస్య తమ పరిధిలోకి రాదని అధికారులు మిన్నకుండిపోయారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో 47 సమస్యలు రాగా.. 41 పరిష్కారానికి నోచుకున్నాయి. వీటిలో పారిశుద్ధ్యానికి సంబంధించినవి 23, ఇంజినీరింగ్ విభాగానివి 13, రెవెన్యూ 2, పాలనాపరమైనవి 3 ఉన్నాయి. ఎలమంచిలి మున్సిపాలిటీలో 72 సమస్యలు నమోదయ్యాయి. వీటిలో 62 పరిష్కరించారు. ఇప్పటివరకు 300 మంది యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రాజు చెప్పారు.

**ఒక్కరోజులో 1500 మందితో..** నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ సురేంద్ర పురమిత్ర యాప్‌పై సచివాలయ సిబ్బందితో ఈ నెల 11న ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వీరంతా ఇంటింటికి వెళ్లి ఒక్కరోజులో 1500 మందితో డౌన్‌లోడ్ చేయించారు. డౌన్‌లోడ్ చేసుకున్న వారిలో ఆరుగురు వెంటనే సమస్యలకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేశారు. నర్సీపట్నం పరిధిలో ఇప్పటివరకు 1,748 మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని కమిషనర్ సురేంద్ర పేర్కొన్నారు.

నర్సీపట్నంలో గృహిణికి యాప్‌పై అవగాహన కల్పించి డౌన్‌లోడ్ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

## జాతీయ స్థాయి చదరంగం పోటీలకు శ్రావ్యశ్రీ ఎంపిక

**ఎస్.రాయవరం, న్యూస్‌టుడే:** ఎస్.రాయవరానికి చెందిన భీమరశెట్టి శ్రావ్యశ్రీ జాతీయ స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైంది. విశాఖలోని బీవీకే కళాశాలలో రెండు రోజులపాటు రాష్ట్రస్థాయి అండర్-15 బాలికల చదరంగం పోటీలు జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి 99 మంది బాలికలు పాల్గొన్నారు. శ్రావ్యశ్రీ మొదటి స్థానంలో నిలిచి ఉత్తరప్రదేశ్‌లో నవంబర్‌లో జరిగే జాతీయ స్థాయి అండర్-15 పోటీలకు ఎంపికైంది. కుటుంబ సభ్యులు, పలువురు క్రీడాకారులు అభినందించారు.

## రక్తపోటు.. తీపికాటు

**నెలాఖరుతో ముగియనున్న సర్వే | ఎన్‌సీడీ 3.0లో పెరిగిన బాధితులు**

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

జిల్లాలో మధుమేహం, రక్తపోటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఎన్‌సీడీ - నాన్ కమ్యూనకబుల్ డిసీజెస్ (అసంక్రమిత వ్యాధులు) 3.0 సర్వేలో భాగంగా గతేడాది నవంబరు నుంచి వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్లు నిండిన అందరికీ పరీక్షలు చేస్తున్నారు. ఈ నెలఖారులోగా సర్వే పూర్తి కావాల్సి ఉంది. జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారు 13,84,526 మంది ఉన్నారు. ఇప్పటివరకు 11,83,478 మందిని సర్వే చేశారు. వీరిలో 1,09,210 మందికి రక్తపోటు (బీపీ) ఉన్నట్లు గుర్తించారు. 73,087 మందికి మధుమేహం ఉన్నట్లు తేలింది. 68 మందిలో క్యాన్సర్ లక్షణాలు కనిపించాయి. జిల్లా వ్యాప్తంగా ఇంకా రెండు లక్షల మందిని సర్వే చేయాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో వైద్య సిబ్బంది సర్వేను వేగవంతం చేశారు. పూర్తయ్యేలోగా బీపీ, మధుమేహం బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అస్కారముంది.

సర్వేలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

**వయసుతో సంబంధం లేకుండా..** ఒకప్పుడు బీపీ, మధుమేహంతో బాధపడుతున్న వారిలో 50 ఏళ్లు దాటిన వారే ఎక్కువ మంది ఉండే వారు. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా అన్ని వయసుల వారు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పిన్న వయసులోనే బాధితులుగా మారుతున్నారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థుల్లోనూ బీపీ, మధుమేహం ఉండటం గమనార్హం. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లే కారణమని వైద్యులు చెబుతున్నారు. శారీరక శ్రమ లేకపోవడం, జంక్‌ఫుడ్ తినడం వల్ల ఈ సమస్య ఎక్కువ మందిలో కనిపిస్తోంది.

**పరీక్షలు చేయించుకోవాలి...** వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ శారీరక శ్రమ అవసరం. రోజూ వ్యాయామం చేయాలి. బీపీ, మధుమేహం ఉన్న వారు వైద్యుల సూచన మేరకు మందులు వాడటంతోపాటు వ్యాయామంపై దృష్టిసారించాలి. నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. – డాక్టర్ ఎస్తేర్‌రాణి, ఎన్‌సీడీ పీవో, అనకాపల్లి.

(c) eenadu

## ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన దివ్యాంగ విద్యార్థిని

బేబీ భవిష్య అనుష్క

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), కశింకోట: అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామా కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసిన దివ్యాంగ విద్యార్థిని మడక అనుష్క ఆర్కే వ్యాలీలోని ట్రిపుల్ఐటీలో సీటు సాధించి సత్తాచాటింది. ఈమె పదోతరగతి పరీక్షల్లో పాఠశాలలో అత్యుత్తమ మార్కులు సాధించింది. లక్ష్యంతో ముందుకు వెళ్తే వైకల్యమూ తలవొంచాల్సిందేనని నిరూపించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ ఈమెను ప్రత్యేకంగా అభినందించారు. ★ కశింకోట మండలం తాళ్లపాలెం గాయత్రి ఉన్నత పాఠశాల విద్యార్థిని కోన బేబీ భవిష్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వై.నగేష్ తెలిపారు.

## బుచ్చెయ్యపేట తెదేపా అధ్యక్షుడిగా సత్యనారాయణ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: తెదేపా బుచ్చెయ్యపేట మండల అధ్యక్షుడిగా ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికయ్యారు. బుచ్చెయ్యపేటలో ఆదివారం సాయంత్రం ఏర్పాటైన సమావేశంలో నాయకులందరూ ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ నెల 9న గోకివాడ భారతిని అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఆమె ఎన్నికపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అధిష్ఠానం ఆదేశాల మేరకు మళ్లీ ఎన్నిక నిర్వహించారు. కొండపాలెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు సత్యనారాయణ పేరును ప్రతిపాదించారు. అందరూ బలపరచడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతకుముందు సర్పంచిగా, ఎంపీపీగా, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడిగా, రెండుసార్లు మండల కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు.

## రాయితీపై విత్తనాలు ఇవ్వాలని వినతి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పామాయిల్ తోటల్లో అంతర పంటల సాగుకు రాయితీపై విత్తనాలు అందజేయాలని ఆయిల్‌పామ్ రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ సీతారామరాజు (రవిరాజు) కోరారు. జిల్లాలో మూడు వేల ఎకరాల్లో పామాయిల్ సాగవుతోందన్నారు. పామాయిల్, కొబ్బరి తోటల్లో అంతర పంటగా పోక, జాజి సాగుచేస్తే రైతులకు ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పోక మొక్క రూ.25, జాజి మొక్క రూ.500 వరకు ధర ఉందని, రాయితీపై అందజేయాలని కోరుతూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడికి ఇటీవల వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

## పింఛనుదారుల ధర్నా రేపు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ అనకాపల్లిలో మంగళవారం ధర్నా చేయనున్నట్లు పింఛనుదారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వడ్డాది జగన్నాథరావు, కార్యదర్శి బీఎన్ఎల్ శర్మ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎనిమిదో వేతన కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండు చేశారు. అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

# తీరు మారకుంటే కటకటాలే!

### గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను వ్యాపారంగా చేసుకుని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కొరడా ఝళిపిస్తోంది. పదే పదే అరెస్టు చేస్తున్నా.. తీరు మార్చుకోని వారిని ఏడాదిపాటు జైల్లో పెట్టేలా పీడీ, ఎన్‌డీపీఎస్ చట్టాన్ని ప్రయోగిస్తోంది. ఇప్పటివరకు అల్లూరి జిల్లాకు చెందిన ఆరుగురు, అనకాపల్లి జిల్లాకు చెందిన ముగ్గురిని ఈ చట్టం కింద నిర్బంధించారు. రెండు జిల్లాల పరిధిలో ఇలాంటి వారు ఇంకా ఉన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. రానున్న రోజుల్లో అక్రమాలకు పాల్పడే వారందరిపై ఈ చట్టాన్ని ప్రయోగించి కటకటాల్లోకి పంపనున్నారు.

« అల్లూరి ఏజెన్సీలో గతంలో భారీగా గంజాయి సాగయ్యేది. పండించేది కొందరైతే.. రవాణా చేయడంలో ఎక్కువ మంది భాగస్వాములయ్యేవారు. కీలక సూత్రధారులు తెర వెనక ఉండి గిరిజన యువకులకు డబ్బు ఆశ చూపి గంజాయి రవాణాకు వాడుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపింది. డ్రోన్ కెమెరాల ద్వారా సాగును గుర్తించి ధ్వంసం చేయించింది. గతంలో సాగు చేసిన వారిని ప్రత్యామ్నాయ మార్గాలను చూపింది. వారిలో కొందరు గంజాయి సాగు, అందులోని మత్తును వీడటం లేదు. ఇలాంటి వారందరిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది.

« గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన ఆరుగురిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పాయకరావుపేట మండలానికి చెందిన దుంగ మాణిక్యం 2018లో మొదటిసారి ఆటోలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. ఇప్పటివరకు ఆయనపై ఆరు కేసులో నమోదయ్యాయి.

« మాడుగుల మండలానికి చెందిన బి.కొండలరావు ఆటోలో గంజాయి రవాణా చేస్తూ 2019లో మొదటిసారి పట్టుబడ్డాడు. ఈయనపై రెండు కేసులున్నాయి.

« జి.మాడుగుల మండలానికి చెందిన వి.కొండబాబు బైక్‌పై తరలిస్తూ 2024లో మొదటిసారి దొరికాడు. ఈయనపై మూడు కేసులున్నాయి.

« హుకుంపేట మండలానికి చెందిన సీతారాం 2024లో గంజాయి రవాణా చేస్తూ దొరికాడు. ఈయనపై రెండు కేసులున్నాయి.

« గూడెంకొత్తవీధి మండలానికి చెందిన వంతల బాలు బద్దర్ 2020లో మొదట గంజాయితో పట్టుబడ్డాడు. వేర్వేరు స్టేషన్ల పరిధిలో మూడు కేసులున్నాయి.

« చింతపల్లికి చెందిన గాలి సత్యనారాయణ గంజాయి రవాణా చేస్తూ 2017లో దొరికాడు. ఇప్పటివరకు రెండు కేసులు ఈయనపై నమోదయ్యాయి. వీరంతా గంజాయి స్మగ్లింగ్‌ను వీడకుండా తరచూ రవాణా చేస్తున్నారన్న అభియోగాలతో ఎన్‌డీపీఎస్ చట్టం కింద అదుపులోకి తీసుకోవాలని తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

### స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రభుత్వం గంజాయిని పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు అనేక చర్యలు చేపడుతోంది. అల్లూరి జిల్లాలో చాలావరకు డ్రోన్ల ద్వారా సాగును గుర్తించి ధ్వంసం చేశాం. గతంలో గంజాయి సాగు చేసిన వారికి అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ప్రభుత్వం చూపుతోంది. బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పీటీ ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్టు చేసి ఏడాదిపాటు జైలుకు పంపుతాం.

– అమిత్ బర్దార్, ఎస్పీ, అల్లూరి జిల్లా

## 'ఆహార తయారీ'.. ఉపాధికి దగ్గర దారి..!

ప్రయోజన సమాచారం

యువత, మహిళలకు వంటల తయారీలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్. చినగదిలి ఆతిథ్య కార్యాలయం పక్కన ఈ సంస్థ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తోంది. –న్యూస్‌టుడే, విశాఖపట్నం

★ ప్రైవేటు కళాశాలల్లో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండగా ఇక్కడ కేవలం రూ.30వేలు, అది కూడా విడతల వారీగా చెల్లించే అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ప్రవేశాలు జరుగుతున్నాయి. దరఖాస్తుకు ఈనెల 17వతేదీ తుది గడువు.

చినగదిలి మండలంలోని ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న యువత

1 అడ్వాన్స్‌డ్ ట్రేడ్ సర్టిఫికెట్ ఇన్ కలినరీ ఆర్ట్స్ కోర్సు: పదో తరగతి విద్యార్హత. కోర్సు వ్యవధి ఆరు నెలలు. దక్షిణ, ఉత్తర భారత వంటలు, చైనీస్, పాశ్చాత్య వంటలు, కేకులు, బిస్కెట్లు, పాస్తా, సమోసా, మిఠాయిల తయారీలో శిక్షణ ఇస్తారు. ఆరునెలలు స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. శిక్షణ అనంతరం స్టార్ హోటళ్లలో చెఫ్‌గా ఉద్యోగావకాశం కల్పిస్తారు.

2 టెక్నిక్స్ ఇన్ కుకింగ్: ఈ విభాగంలో చేరేందుకు విద్యార్హత 8వ తరగతి. 25 వారాలపాటు శిక్షణ ఉంటుంది. శాకాహార, మాంసాహార వంటల తయారీలో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తారు.

3 కేటరింగ్ మేనేజర్: రక్షణ రంగంలో ఉద్యోగ విరమణ చేయబోయేవారు అర్హులు. రక్షణ రంగమే ఎంపిక చేసి శిక్షణ ఖర్చు భరిస్తుంది. ఆరునెలలపాటు శిక్షణ ఉంటుంది. వంటలతోపాటు, బేకరీ వస్తువులు, బిస్కెట్లు, పఫ్‌ల తయారీలో శిక్షణ ఇస్తారు. అనంతరం సొంతంగా క్యాటరింగ్ ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా స్టార్ హోటళ్లలో చెఫ్‌గా ఉద్యోగం చేయవచ్చు.

# ఆగని 'కోళ్ల వ్యర్థాల' దందా..!

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నిబంధనల మేరకు కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చేరాల్సిన కోళ్ల వ్యర్థాలు... నగరం నుంచి ఇతర జిల్లాలకు తరలిపోతున్నాయి. అలా వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల్ని అధికారులు ఆదివారం సాయంత్రం అనకాపల్లిలో పట్టుకుని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఇంఛార్జి కమిషనర్‌గా పని చేసిన సమయంలో కోళ్లవ్యర్థాల టెండర్లు రద్దు చేశారు. దీంతో గుత్తేదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కోళ్ల వ్యర్థాల టెండర్ల రద్దుపై కోర్టు మూడు వారాల స్టే విధించింది. దీంతో ఈ వ్యాపారంలో అనుభవం ఉన్నవారంతా నాలుగైదు వార్డులకు ఓ వాహనం ఏర్పాటు చేసి... టెండర్లతో సంబంధం లేకుండా ఎవరికి వారే కోళ్లవ్యర్థాలు సేకరించి, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ.. కాసులు సంపాదిస్తున్నారు. మరోవైపు ఒకరిపై మరొకరు అధికారులకు ఫిర్యాదులు చేస్తూ... వ్యాపారంలో పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు.

పట్టుబడ్డ వాహనం, చోదకుడు

### వాట్సప్‌లో వాగ్వాదం

అనకాపల్లిలో పట్టుబడిన వాహనాలు వైకాపా, తెదేపాకు చెందిన కార్పొరేటర్లవేనని ఆయా వాహనాల సిబ్బంది చెబుతున్న వీడియోలను 22వ వార్డు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ 'టీం జీవీఎంసీ వాట్సప్ గ్రూప్'లో పోస్టు చేశారు. దీంతో కూటమి, వైకాపా కార్పొరేటర్ల మధ్య వాయిస్ మెసేజ్‌లు, సాధారణ మెసేజ్‌లతో వాగ్వాదం జరిగింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కొందరు నాయకులు డిమాండ్ చేశారు.

## ఉత్సాహంగా నేవీ మారథాన్ సన్నాహక పరుగు

విశాఖపట్నం: బీచ్‌రోడ్డులో ఆదివారం ఉదయం తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో మారథాన్ సన్నాహక పరుగు నిర్వహించారు. ఆర్.కె.బీచ్ నుంచి పాండురంగాపురం వరకు ఈ పరుగు కొనసాగింది. 'వన్ రన్.. వన్ నేషన్' నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. డిసెంబరు 14న జరగబోయే మారథాన్ కోసం ఈ సన్నాహక పరుగు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేవీ ఉద్యోగులతోపాటు కుటుంబ సభ్యులు ఉత్సాహంలో పాల్గొన్నారు. పలువురు ఫ్లాష్‌మాబ్ నిర్వహించి ఆకట్టుకున్నారు. విజేతలుగా నిలిచిన వారికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేతలుగా నిలిచిన నేవీ సిబ్బంది

## మెగా వైద్యశిబిరంతో సాంత్వన

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటైన ఉచిత మెగా వెరికోస్ వెయిన్, శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యశిబిరం రోగులకు సాంత్వన చేకూర్చింది. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో వెరికోస్ వ్యాధితో అనేకమంది బాధపడుతున్నారని, చాలామందికి దీనిపై అవగాహన లేదన్నారు. గో-హాస్పిటల్స్ యాజమాన్యం ఈ శిబిరం ఏర్పాటుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. అవసరమైన శస్త్ర చికిత్సలు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో బుధవారం చేస్తారని చెప్పారు. అయ్యన్నతోపాటు సతీమణి పద్మావతి, కుమారుడు రాజేష్ శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. వెరికోస్ వెయిన్స్ వైద్యనిపుణుడు సంపత్, నేత్ర వైద్య నిపుణుడు ఎం.చంద్రశేఖర్, మధులిక తదితరులు రోగులకు సేవలందించారు.

ప్రసంగిస్తున్న శాసన సభాపతి అయ్యన్న

### బ్రాండిక్స్‌లో...

అచ్యుతాపురం: బ్రాండిక్స్ ఆవరణలో ఆదివారం 140వ కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. 700 మంది హాజరు కాగా.. 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మిగిలిన వారంతా వచ్చే వారం శిబిరానికి రావాలని సూచిస్తూ టోకెన్లు జారీ చేశారు. 290 మందికి కళ్లద్దాలు, 150 మందికి మందులు అందజేశారు. 56 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. శిబిరానికి హాజరైన వారికి మజ్జిగ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించినట్లు బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి పేర్కొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

## దాసుడి సంకల్పం.. అప్పన్నకు గరుడ వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: ఒడిశాకు చెందిన అప్పన్న స్వామి భక్తులు లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో గరుడ వాహన సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు నేతృత్వంలో అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించారు. మాడవీధుల్లోని చిన్నరథంపై వెండి గరుడ వాహనంపై స్వామిని కొలువుదీర్చారు. నాదస్వర మంగళవాయిద్యాలు, పండితుల వేద మంత్రాలు, ఒడిశా జానపద కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ మాడవీధుల్లో గరుడ వాహన సేవ వైభవోపేతంగా జరిగింది. లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు కుటుంబ సమేతంగా ఉత్సవంలో పాల్గొని స్వామికి వింజామర సేవలు చేశారు. ఒడిశా భక్త బృందం సంకీర్తనలతో స్వామిని కొలిచారు. పెద్ద సంఖ్యలో భక్తజనం పాల్గొని గోవింద నామస్మరణ చేశారు.

మాడవీధుల్లో గరుడ వాహన సేవలో పాల్గొన్న దాసుడు, భక్త బృందం

## బ్యాంకు వాటాదారులకు 14 శాతం డివిడెండ్

మాట్లాడుతున్న రామకృష్ణంరాజు, చిత్రంలో అతిథులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: వినియోగదారుల అభిమానాన్ని చూరగొంటూ ప్రస్తుతం రూ.290.39 కోట్ల బ్యాంక్ డిపాజిట్లు కలిగి ఉన్నామని ది మహారాజా కో ఆపరేటివ్ బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణ రాజు అన్నారు. సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో బ్యాంకు 25వ మహాజన సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.202.16 కోట్లు రుణాలు అందించి రూ.492.55 కోట్లు వ్యాపారం కలిగి ఉన్నామన్నారు. రూ.4.36 కోట్లు స్థూల ఆదాయాన్ని ఆర్జించగా రూ.1.13 కోట్లు ఆదాయ పన్ను చెల్లించామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు 14 శాతం డివిడెండ్ ప్రకటించినట్లు పేర్కొన్నారు. సిబ్బంది పిల్లలకు దాదాపు రూ.8 లక్షలు ఉపకార వేతనాలు, విద్యా సామగ్రి అందజేయడం జరిగిందన్నారు. త్వరలో విజయవాడ, రాజమహేంద్రవరం, రామచంద్రపురంలో బ్యాంకు శాఖలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటుగా ఫైనాన్షియల్లీ సౌండ్ అండ్ వెల్ మేనేజ్డ్(ఎఫ్ఎస్‌డబ్ల్యూఎం) విభాగంలో ఒక శాఖను ప్రారంభిస్తామని తెలియజేశారు. సమావేశంలో పైడా ఎడ్యుకేషనల్ ఛైర్మన్ పైడా కృష్ణప్రసాద్, గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి వనమాల శ్రీనివాస్, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.శ్యామ్‌కిశోర్, సంస్థ జీఎం ఎన్.ఎన్.సత్యనారాయణ, బ్యాంకు డైరెక్టర్లు, వాటాదారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

# షీలానగర్‌లో భారీ చోరీ

★ నిశ్చితార్థం నగలు, డబ్బు మాయం
★ రూ.కోటి నష్టపోయామని తల్లిదండ్రుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: కుమార్తె నిశ్చితార్థం కోసం సిద్ధం చేసిన నగలు, డబ్బు కలిపి దాదాపు రూ.కోటి సొత్తు చోరీ కావడంతో బాధిత తల్లిదండ్రులు లబోదిబో మంటున్నారు. షీలానగర్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఘటన వివరాలివి. జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్-8లోని లక్ష్మీ రెసిడెన్సీ మొదటి అంతస్తులో ఎస్.శ్రీనివాస్, భార్య నాగమణి, ఇద్దరు కుమార్తెలు నివాసం ఉంటున్నారు. ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తున్న ఆయన, ఆటోనగర్‌లో చిన్న పరిశ్రమ నిర్వహిస్తున్నారు. ఇటీవల పెద్ద కుమార్తెకు వివాహం నిశ్చయమైంది. వచ్చే నెల 10న నిశ్చితార్థ వేడుక నిర్వహించేందుకు ఫ్లాట్‌కు రంగులు వేయిస్తున్నారు. కుటుంబ సభ్యులంతా శనివారం రాత్రి 11 గంటలకు పనులు ముగించుకుని, కింద ఖాళీగా ఉన్న మరో ఫ్లాట్‌లోకి వెళ్లి నిద్రపోయారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు తమ ఫ్లాట్ నుంచి శబ్దాలు రావడాన్ని గమనించి వెంటనే పైకి వెళ్లి పరిశీలించారు. తలుపులు తీసి ఉండటంతో పాటు బీరువాలో సామగ్రి చెల్లాచెదురై ఉండటంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. వెంటనే ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాజువాక క్రైం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. నిశ్చితార్థం నిమిత్తం రూ.20 లక్షల నగదు, 700 గ్రాముల బరువైన బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి, కొత్త పట్టుచీరలు, 7 వాచీలు బీరువాలో భద్రపరిచామని, అవన్నీ మాయమైనట్టు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీమ్ సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. పోలీసు జాగిలం సమీపంలోని మెకానిక్ దుకాణం వైపు వెళ్లి, మళ్లీ వెనక్కి రావడంతో క్రైం సీఐ శ్రీనివాస్ మెకానిక్ దుకాణం నిర్వాహకుడిని, ఇరుగుపొరుగు వారిని ప్రశ్నించారు. లక్ష్మీ రెసిడెన్సీకి సీసీ కెమెరాలు లేకపోవడడంతో పథకం ప్రకారమే ఇక్కడ చోరీ జరిగిందని సీఐ పేర్కొన్నారు. ఎస్సై మన్మథరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిందర వందరగా పడిన బీరువాలో వస్తువులు

# నిత్యం ప్రదక్షిణ.. అ'విశ్రాంత' నిరీక్షణ

★ 'ఆరోగ్య పథకం' అమలులో అంతులేని జాప్యం
★ సీజీహెచ్ఎస్ కేంద్రాల తీరుపై వృద్ధుల నిరసన

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) లబ్ధిదారులు వైద్యం పొందాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ పథకంలో విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరికి ఆరోగ్యం బాగోలేకపోతే నగరంలో తమకు నచ్చిన ఆసుపత్రిలో చూపించడానికి ముందుగా పెదవాల్తేరు, డాబాగార్డెన్స్‌ల్లోని సంస్థ వెల్‌నెస్ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. ఇక్కడ సేవలు సరిగా అందక అర్ధరాత్రి నుంచి నిరీక్షించాల్సి వస్తోంది.

ప్రహసనంగా టోకెన్ల జారీ: పేర్ల నమోదుకు సీజీహెచ్ఎస్ సభ్యులు నిత్యం పెదవాల్తేరు కేంద్రానికి భారీగా తరలివస్తున్నారు. ఇక్కడ టోకెన్ జారీ చేసిన తర్వాత వైద్యులు పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తారు. తరువాత నగరంలోని సీజీహెచ్ఎస్‌తో అనుసంధానమైన కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చు. అయితే ఈ టోకెన్లు తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిత్యం వందలాది మంది వస్తుండగా కేవలం పదుల సంఖ్యలో టోకెన్లు ఇస్తున్నారు. దీంతో విశ్రాంత ఉద్యోగులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు రాత్రి ఇక్కడే ఉండిపోతున్నారు.

పెదవాల్తేరు సీజీహెచ్ఎస్ కేంద్రం వద్ద బారులు తీరిన విశ్రాంత ఉద్యోగులు

త్వరలో సమస్య పరిష్కారం: 'డాబాగార్డెన్స్ వెల్‌నెస్ కేంద్రం 100 గజాల స్థలంలో ఇరుగ్గా ఉంది. కూర్చోవడానికి స్థలం కూడా లేదు. ఈ కేంద్రాన్ని విమ్స్‌కు తరలించడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు వచ్చాయి. సాఫ్ట్‌వేర్ సమస్యను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది' అని సీజీహెచ్ఎస్ లబ్ధిదారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు.

చిక్కులు తెచ్చిన సాఫ్ట్‌వేర్ మార్పు: ఇటీవల సీజీహెచ్ఎస్ సాఫ్ట్‌వేర్‌ను నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) నుంచి సి-డాక్‌లోకి మార్చారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ఆరోగ్య చరిత్ర పూర్తిస్థాయిలో బదిలీ కాలేదని సమాచారం. ప్రతిసారి కొత్తగా వివరాలు నమోదు చేయాల్సి వస్తోంది. కొంత మంది కార్డులు సైతం గల్లంతయ్యాయని చెబుతున్నారు.

★ విశాఖలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు 13,500 మంది సీజీహెచ్ఎస్ కార్డులు కలిగి ఉన్నారు. కుటుంబసభ్యులతో కలిపి 35వేల మంది లబ్ధిదారులుగా ఉన్నారు. ఇందులో 5శాతం మాత్రమే ఉద్యోగులు కాగా, మిగతా 95 శాతం పదవీవిరమణ చేసిన వారే. వాస్తవంగా 2వేల మందికి ఒక వెల్‌నెస్ కేంద్రం ఉండాలి. విశాఖలో కేవలం రెండు మాత్రమే ఉన్నాయి. రెండింటిలో కలిపి కేవలం ఏడుగురు వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఫలితంగా సేవలు అందక ప్రతి రోజు 200 మంది తిరిగి వెళ్లిపోతున్నారు


EENADU eClassifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును. అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

TENDER

ఇ-కోట్ టెండర్ సేల్: 1050 KVA, జెన్‌సెట్ 2 నెం.లు, తనిఖీ 16 & 17 ఉ. 9.00 గం. నుండి సా. 5.00 గం. వరకు. ITC లిమిటెడ్, ABD అనపర్తి- 533342, తూ.గో. జిల్లా. ఇ-కోట్ టెండరు తేది: 18.07.25, టెండరు ఫారం ధర రూ. 500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై- 14 ద్వారా మొబైల్: 9840731925, www.welcomeauctioneers.com.

FURNITURE & FURNISHING

REAL ESTATE

FLAT FOR SALE

SHEELANAGAR

Sheelanagar, Pawan Residency B-block 4F, East face, 2Bed, 2Bath, 980sft Next to Kim's icon hospital. Vizag. ✆ 9971845081

HOUSE FOR SALE

KURMANNAPALEM

Independent Two Storied Building in 167 Sq.Yd. S/F Phase-1, VUDA Nagar, Kurmannapalem. Cont: 9866192279, 0834910679.

PLOT FOR SALE

GENERAL

VUDA approved plots in PM Palam 346 sq.yds and 300 sq.yrds near Sabbavaram for sale. Contact: 8978326333

TO LET

COMMERCIAL

GENERAL

Commercial Warehouse (3500 Sq.Ft) for rent in Thalavalsa, Visakhapatnam all amenities. Ph: 9440878300/ 7981741475

JOBS

Receptionist and Waiters Required Age: below 35 yrs. with Computer & Hindi & English speaking skills Hotel Winsar Park, Opp. KGH, Vizag. 9849581868.

Required DRA Certified Executive, Team Leader, Telecaller & Backend for Bank Recovery in Visakhapatnam. Attractive Salary. Ph: 9885556922.

Wanted Fitter 5 years experience. Contact: 8142993317.

ఉద్యోగ అవకాశం వైజాగ్‌లో నెం1 ISO సర్టిఫైడ్ సంస్థ నూతన ప్రాజెక్టులయందు పనిచేయుటకు ఈ క్రింది సిబ్బంది కావలెను. 1. Chief Managers: 18 Nos. 2. Assistant Managers : 15 Nos అర్హత: Govt. & Private Org. రిటైర్ అయినవారు, గృహిణులు / VRS/ Ex - Servicemens / Insurance Sectorలో అనుభవం కలవారు. Note : No Field Work. Salary /Incentive ఇంటర్వ్యూ టైంలో నిర్ణయించబడును. ఇంటర్వ్యూలు: 14th, 15th, 16th July. Ph: 9440372402, 9440559401.

ఫీల్డ్ ఆఫీసర్లు, సెక్యూరిటీగార్డులు, టెలికాలర్స్, HR ఎగ్జిక్యూటివ్ కావలెను. Qlf: 10th, డిగ్రీ, MBA, జీతం: 14-24 వేలు. Ct: RSR, 7702959468, 0891-3570630.

బెంగుళూరు సిటీలో పెద్ద ఇంట్లో సహాయకురాలుగా పనిచేయుటకు ఎటువంటి బాదరబందీలేని 20 నుండి 25 సం॥ మధ్య వయస్సుగల ఆడ మనిషి కావలెను. జీతం: 20,000/-. ఫోన్: 7331167845.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


## పొక్లెయిన్, మూడు ట్రాక్టర్ల సీజ్

కోటవురట్ల, న్యూస్‌టుడే: పాత గొట్టివాడ రెవెన్యూ పరిధిలో సాగు భూమిలో అనుమతి లేకుండా జరుగుతున్న మట్టి తవ్వకాలపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. పొక్లెయిన్, మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. గ్రామానికి చెందిన ఓ రైతు వరాహనది ఒడ్డునున్న సొంత భూమిలో పొక్లెయిన్‌తో తవ్వకాలు చేస్తున్నారు. గ్రామంలో ఇంటి పునాది కప్పేందుకు ఒప్పందం కుదుర్చుకుని ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రమేష్ సిబ్బందితో దాడి చేశారు. తహసీల్దార్ తిరుమలబాబు ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న పొక్లెయిన్

## జీవితంపై విరక్తితో ఆత్మహత్య

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకన్నపాలేనికి చెందిన తమ్మిన వరుణ్(45)కు 22ఏళ్ల కిందట భవానీతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వరుణ్ ప్రయివేటు పనులు చేస్తుంటాడు. 18ఏళ్ల కిందట భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. ఆదివారం ఉదయం 7గంటల సమయంలో తల్లి ఇంటికొచ్చి చూడగా వరుణ్ ఉరి వేసుకుని కనిపించాడు. గత కొద్దిరోజులుగా తీవ్ర మనస్తాపంతో బాధ పడుతున్న అతను అతిగా మద్యం తాగడం ప్రారంభించాడు. చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ గొలగాని అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ఢీకొని విశ్రాంత ఆచార్యుడి మృతి

కొట్నాన రామారావు (పాత చిత్రం)

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కొత్తూరు పంచాయతీ ఎన్జీవో కాలనీకి చెందిన ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత ఆచార్యులు కొట్నాన రామారావు రైలు ఢీకొని దుర్మరణం చెందారు. ఇంటి నుంచి కళాశాలకు దగ్గరి దారిలో వెళ్లేందుకు శనివారం సాయంత్రం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. పరశురామ్‌పేటలోని శ్మశానంలో ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. డైట్ విద్యా సంస్థల అధినేత దాడి రత్నాకర్, ఏఎంఏఎల్ కళాశాల ప్రతినిధి వాసిరెడ్డి బాలకృష్ణ, విశ్రాంత అధ్యాపకులు బుద్ధ అప్పారావు, రాజేశ్వరప్రసాద్, పీడీ నాయుడు, వెలమ సంక్షేమ సంఘ నాయకులు భీమ, తహసీల్దార్ వాసు అంతియాత్రలో పాల్గొన్నారు. రామారావుకు భార్య, ఇద్దరు కుమారులు. కుమారులిద్దరూ విదేశాల్లో ఉన్నారు. అంత్యక్రియలకు పెద్ద కుమారుడు హాజరు కాగా, చిన్న కుమారుడు కెనడా నుంచి సకాలంలో రాలేకపోయారు.

## రేషన్ బియ్యం పట్టివేత

కె.కోటపాడు, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని కార్డుదారుల నుంచి కొనుగోలుచేసి అక్రమంగా తరలిస్తున్న వ్యానును పోలీసులు పట్టుకున్నారు. గుల్లిపల్లికి చెందిన పలువురికి చెందిన బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ధనుంజయ చెప్పారు.

## విశాఖ కలెక్టర్ పేరిట 'నకిలీ ఫేస్‌బుక్ ఖాతా'

విశాఖపట్నం: గుర్తు తెలియని వ్యక్తులు విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్ పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతా రూపొందించారు. కలెక్టర్ ఫొటో వాడారు. ఆ ఖాతా చూసి ఎవరూ మోసపోవద్దని, మెసేజ్‌లకు సమాధానాలు ఇవ్వొద్దని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

### చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | విత్‌స్కిన్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 81 | 70 |
| లైవ్ | 103 | 90 |
| డ్రెస్డ్ | 149 | 150 |
| స్కిన్‌లెస్ | 170 | 160 |

# అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

### తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **సూపర్‌మేన్**, రామచంద్ర: **3బీహెచ్‌కే** శ్రీసత్య: **డి100**, సత్యనారాయణ స్క్రీన్-1: **కన్నప్ప** స్క్రీన్-2: **జురాసిక్ వరల్డ్**, వెంకటేశ్వర: **వర్జిన్ బాయ్స్** పర్తిసాయి: **ఓ భామ అయ్యో రామ** షిర్డిసాయి: **తమ్ముడు**, అచ్యుతాపురం: స్క్రీన్-1: **ఓ భామ అయ్యో రామ, సూపర్‌మేన్**, స్క్రీన్-2: **3బీహెచ్‌కే, వర్జిన్ బాయ్స్**

### కాలువ అభివృద్ధిపై అభినందన

నక్కపల్లి, న్యూస్‌టుడే: పాయకరావుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి గెడ్డం బుజ్జిని ఆ పార్టీ నాయకులు ఆదివారం అభినందించారు. ఆయన తన సొంత నిధులు రూ.10 లక్షలకు పైగా వెచ్చించి 12 కిలోమీటర్ల పొడవున సాగునీటి కాలువ అభివృద్ధి చేయించారు. పార్టీ నేతలు ఆయన్ని తన నివాసంలో కలిసి అభినందనలు తెలియజేశారు. కాలువ అభివృద్ధితో వందల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. జనసేన నేతలు తుమ్మల శ్యామ్ కిశోర్, నల్లల రత్నాజీ, కసిరెడ్డి ఆదినారాయణ పాల్గొన్నారు.

### టోల్ ప్లాజా వద్ద వాహన రద్దీ

టోల్ ప్లాజా వద్ద వాహనాల బారులు, కౌంటర్లు మార్గంలో కార్ల రద్దీ

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి మండలం కాగిత టోల్ ప్లాజా ఆదివారం వాహనాలతో రద్దీగా మారింది. ఆషాఢ మాసం ఆదివారం కావడంతో ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి తుని తలుపులమ్మ లోవ ఆలయానికి వందల వాహనాల్లో భక్తులు తరలి వెళ్లారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కౌంటర్ల వద్ద భారీ ఎత్తున వాహన రద్దీ కనిపించింది. ముఖ్యంగా వందల కొద్ది కార్లు జాతీయ రహదారిపై పరుగులు తీశాయి. కౌంటర్ల లోనూ వాహనాలు రద్దీ కనిపించింది.

### విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా సోమవారం కుమారపురం, రాజగోపాలపురం, రత్నాయంపేట, కందిపూడి గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**అచ్యుతాపురం:** హరిపాలెం, అందలాపల్లి, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేట గ్రామాలకు సోమవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్, ఏఈ భానుప్రకాశ్ తెలిపారు.

### 31 మద్యం సీసాలు పట్టివేత

నక్కపల్లి, న్యూస్‌టుడే: బుచ్చిరాజుపేటలో అనధికారికంగా విక్రయిస్తున్న మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కె.సన్నిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధూళి అనంత బాబు పాన్‌షాప్‌లో మద్యం అమ్ముతుండగా, సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. 31 సీసాలు స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

### గొలుసు దుకాణాల నిర్వాహకులపై కేసు

**అచ్యుతాపురం:** ఉప్పవరం, ఎం.జగన్నాథపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న గొలుసు దుకాణాలపై ఆదివారం దాడిచేసినట్లు సీఐ నమ్మి గణేష్, ఎస్సై సుధాకరరావు తెలిపారు. ఉప్పవరంలో తొమ్మిది, ఎం.జగన్నాథపురంలో ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరు నిర్వాహకులను అరెస్టు చేసినట్లు చెప్పారు.

### తపాలా సిబ్బందికి క్రికెట్ పోటీలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని డైట్ కళాశాలలో విశాఖ రీజన్ పోస్టల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ ఆదివారం జరిగింది. క్రీడాకారులను డైట్ కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ పరిచయం చేసుకున్నారు. పోస్టల్ సిబ్బంది ప్రతీఏటా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విశాఖపట్నం - విజయనగరం జిల్లాల మధ్య క్రికెట్ పోటీ జరిగింది. రీజియన్ అధ్యక్షులు పలాసరావు, శంకరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రత్నాకర్

## నిధులున్నా.. అరకొర పనులే

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్లలోని కేంద్రప్రభుత్వ ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) ఉన్నత పాఠశాల సమస్యలతో అల్లాడుతోంది. ప్రభుత్వం నిధులిచ్చానా.. అరకొరగా చేసిన పనులతో విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా ఉన్న దీనిని, ఇటీవల పీఎంశ్రీ ఉన్నత పాఠశాలగా మార్చారు. మూడు నుంచి పదో తరగతి వరకు ఈ పాఠశాలలో విద్యను బోధిస్తారు. కోటవురట్ల, రాట్నాలపాలెం, కైలాసపట్నం, గొట్టివాడ, రాజుపేట, చౌడువాడ, లింగాపురం, జానకీరామపురం, గవరపేట, తంగేడు, తిమ్మాపురం, సన్యాసిరాజుపాలెం, జగ్గంపేటకు చెందిన 350 మందికిపైగా విద్యార్థులు ఈ పాఠశాలకు వస్తారు. మైదానం ఉన్నప్పటికీ.. పిచ్చి మొక్కలతో నిండి ఆటలు ఆడలేకపోతున్నారు. షెల్టర్ లేక సైకిళ్లు ఆరబయటే ఉంచడంతో మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరబయటే ఉంచిన విద్యార్థుల సైకిళ్లు

**అసంపూర్తిగా నిలిచిన పనులు..:** పీఎంశ్రీ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం దాదాపు రూ. 23 లక్షల నిధులు మంజూరు చేసింది. సాంకేతిక విద్య, ప్రయోగశాల గదుల నిర్మాణం, అందుకు సంబంధించిన పరికరాలు, మైదానంలో ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, షెటిల్ బ్యాడ్మింటన్ ఫుట్‌బాల్ క్రీడలకు సంబంధించిన కోర్టు నిర్మాణాలు, నీరు వృథా కాకుండా ఉండటానికి ఇంకుడు గుంతల ఏర్పాటు పనులను ఈ నిధులతో చేయాల్సి ఉంది. పాఠశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో సాంకేతిక విద్యకు సంబంధించిన గది ఒక్కటే పూర్తయ్యింది. పక్కన నిర్మించాల్సిన ప్రయోగశాల గది నిర్మాణ పనులు ఇంకా మొదలపెట్టలేదు. తాగునీరు కుళాయి, వంటశాల దగ్గర నీరు వృథా కాకుండా ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలు, ఇంకా పూర్తి కాకపోవడంతో, ఆదమరిస్తే విద్యార్థులు అందులో పడిపోయే పరిస్థితి కనిపిస్తోంది. సకాలంలో పనులు చేయకపోవడంతో, సుమారు రూ.5 లక్షలు వెనక్కి వెళ్లిపోయాయి.

అసంపూర్తిగా ఉన్న ఇంకుడు గుంత

**పనులు పూర్తి చేయిస్తా:** పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయమని గుత్తేదారితో చెబుతాను. ఇంకుడు గుంతలను పూర్తి చేయిస్తాను. సాంకేతిక, ప్రయోగశాల పరికరాలు, సైకిల్ షెల్టర్ ఏర్పాటుకు కృషి చేస్తాను. **– సుకుమార్, హెచ్ఎం**

### పాఠశాలల్లో పొంచి ఉన్న ప్రమాదం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: సరస్వతి నిలయాలు సమస్యల చెర నుంచి వీడటం లేదు. పాఠశాలల ఆవరణలో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. దీంతో చిన్నారులు బిక్కుబిక్కుమంటూ విద్యనభ్యసిస్తున్నారు.

▼ దుర్గానగర్‌లో ఏడాదిన్నర క్రితం మరుగుదొడ్డి నిర్మాణంలో భాగంగా ఉంచిన సిమెంట్ దిమ్మె పడి విద్యార్థి దుర్మరణం చెందిన విషయం తెల్సిందే. ఇదే పాఠశాల ఆవరణలో విద్యుత్తు స్తంభం ఉంది. దీనికి ఆనుకుని వేసిన స్టే తీగ వేలాడుతూ ఉంది. ▼ అరట్లకోట ఎస్సీ కాలనీ వద్ద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని తొలగించలేదు. విద్యార్థులు ఇక్కడే ఆడుకుంటారు. అజాగ్రత్తగా ఉంటే గాయాల పాలయ్యే ప్రమాదముంది. ▼ రత్నాయంపేట, రాజానగరం ఉన్నత పాఠశాల ఆవరణలోనూ శిథిలావస్థకు చేరిన భవనాలతో ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు, గాలులు వీచే సమయంలో ఆందోళన చెందుతున్నారు. వీటిపై గ్రామస్థులు, విద్యార్థుల నుంచి పలుమార్లు ఫిర్యాదులు వచ్చాయి.



అరట్లకోటలో శిథిలావస్థకు చేరిన భవనం

## తేలిన రాళ్లు.. వెక్కిరిస్తున్న బోర్డు

### రెండేళ్లగా పూర్తికాని కొల్లివానిపాలెం రోడ్డు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: గండివానిపాలెం - కొల్లివానిపాలెం రోడ్డు అభివృద్ధి పనులు ప్రజలకు శాపంగా మారాయి. గ్రావెల్ రోడ్డును తారురోడ్డుగా మారుస్తున్నట్లు అధికారులు, వైకాపా నాయకులు ప్రకటించడంతో ఆనందపడిన ప్రజలు ఇప్పుడు నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆర్భాటంగా రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి ఇప్పుడు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

రాళ్లు తేలిపోయిన రోడ్డుపై కొల్లివానిపాలెం గ్రామస్థులు

దోసూరు శివారు గండివానిపాలెం నుంచి కొల్లివానిపాలెం వరకు 2.4 కిలోమీటర్ల రోడ్డును రూ.1.72 కోట్లతో నిర్మించడానికి 2023 మార్చి నెల 31న పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభం కావడంతో ఇక్కడివారంతా ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. 40 ఎం.ఎం. రాళ్లను రోడ్డుమీద వేసిన గుత్తేదారు ఈ పనులను మధ్యలోనే నిలుపు చేశారు. రాళ్లు తేలిపోయి ఉండటంతో ద్విచక్ర వాహనాలతో రాకపోకలకు వీలుకావడంలేదని, ఆటోలు టైర్లుపోతాయని గ్రామానికి రావడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. రోడ్డు నిర్మించకపోయినా పర్వాలేదు గానీ తేలిపోయిన రాళ్లను తొలగించి గ్రావెల్ వేసినా పర్వాలేదంటున్నారు. రోడ్డును పూర్తిచేయాలని ప్రజా సమస్యలు పరిష్కారవేదిక ద్వారా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని చెబుతున్నారు.


**మహారాజశ్రీ అనకాపల్లి అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**

E.P. 24/2022 IN O.S.128/2017

**Between:**

యల్లపు సీతారామయ్య ...DHr

**And:**

సూరిశెట్టి నాగఅప్పల జగదీశ్వరరావు ...JDr

**వేలం ప్రకటన**

పై నెంబరు దావా డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఇందలి **JDr** తాలుకా అమలు షెడ్యూలు ఆస్తిని వేలం వేయించవలసిందిగా **DHr** కోరుతూ పై అమలు గ్రంథమును దాఖలు చేయగా సదరు అమలు గ్రంథము వేలం నిమిత్తం **తేది 18-08-2025**కి వాయిదా అయి ఉన్నందున వేలం పాట యందు పాడుకొనదలచినవారు సదరు తేదిని **ఉదయం గం.10-30ని.లకు** పై కోర్టువారి యదుట హాజరై, శ్రీ కోర్టువారు జరుపు బహిరంగ వేలం పాట యందు పాల్గొని వేలం షరతులుకు లోబడి పాడుకొనవచ్చును. ఇంకన్ను యితర వివరములు కావలసిన యెడల పైకోర్టులో Deputy Nazar వారి కార్యాలయములో గాని లేదా యాదిగువ తెలిపిన Decree Holders యొక్క అడ్వకేట్ గారి కార్యాలయములోగాని అడిగి తెలుసుకొనవచ్చును.

**షెడ్యూల్ ఆస్తి వివరం**

Anakapalli District, Anakapalle Sub-registry limits - G.V.M.C. Anakapalli Zone (hreviously Anakapalli Municipality Dimits) Anakapalli village, Nidanam Doddi - 17th ward, Neelakantarao street RCC House situated to the northern side of Neelakantarao street, bearing Asst.No. 11605/17, D.No. 14-24-16/B and bounded by: **East:** Joint lane. **West:** Joint wall of this property and property of Saragadam Suryanarayana. **North:** Joint lane of this property and property of Alakchand Ramakrishna. **South:** Another property of defendant. **Measurements: East to west:** 15 feet / 4.57 mts., **North to south:** 20 feet / 6.10 mts.,

And the total extent of site is **33.33 sq.yds., / 27.99 sq.mts.,** site and wherein RCC house building was constructed in an extent of **300 sft.,** about 24 years from now with electrical connections, meter, deposit along with all easement rights such as way, water etc.,

❖ **Decree Holder's value** is Rs.10,00,000/-
❖ **JDr Value:** not submitted
❖ **Amine Value** is Rs. 10,00,000/-
❖ **Market value as per market value certificate:** Rs.11,80,260/-

**LANKA JAGANNADHAM, LANKA PARVATEESWAR**
Advocates, Anakapalli.
అనకాపల్లి
తేదీ. 08-07-2025
**Cell: 9885161002**


## అర్హులందరికీ పక్కా ఇళ్లు: పీలా

అనకాపల్లి/పట్టణం, కొత్తూరు (అనకాపల్లి), కశింకోట, న్యూస్‌టుడే: అర్హులందరికి పక్కా ఇళ్లు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. స్థానిక మిరియాల కాలనీలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగం ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వార్డు ఇన్‌ఛార్జి బొద్దపు ప్రసాద్, పార్టీ నాయకులు పైల గోపి, శ్రీను, కొణతాల గణేష్ పాల్గొన్నారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలోని దళితవాడలో జిల్లా టీఎన్‌టీసీ ఉపాధ్యక్షులు పిట్ల రాజు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. తెదేపా నాయకులు భర్నికాన శ్రీనివాసరావు, పల్లా సత్య అప్పారావు పాల్గొన్నారు. బీఆర్టీకాలనీలో తెదేపా మండల నాయకుడు మళ్ల శ్రీను, గ్రామ అధ్యక్షుడు నూకరాజుల ఆధ్వర్యంలో నాయకులు, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు.

మిరియాల కాలనీలో మహిళలతో మాట్లాడుతున్న పీలా

అచ్యుతాపురం. మునగపాక: హరిపాలెంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఏపీ రహదార్ల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్ పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పలమరశెట్టి కిరణ్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.79లక్షల చెక్కును అందించారు. తెదేపా మండల అధ్యక్షులు పీలా తులసీరామ్ పాల్గొన్నారు. మునగపాక ఎస్సీకాలనీలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టరు డొక్కా నాగభూషణం సంక్షేమ పథకాలను అందరికీ వివరించారు.

సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ప్రగడ, రాజాన

**కోటవురట్ల:** మండల తెదేపా అధ్యక్షులు పెట్ల లింగన్ననాయుడు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ వేచలపు జనార్దన్, నాయకులు భాస్కరావు, రామచంద్ర పాములవాకలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు

## నిత్యం ఇక్కట్లే.. ఎవరికీ పట్టట్లే..

పాయకరావుపేట, న్యూస్‌టుడే: అక్షరాల 50 మీటర్ల దూరం.. ఎంత నెమ్మదిగా వెళ్లినా నిముషంలో దాటొచ్చు. కాని ఇదే దూరానికి అరగంట నుంచి గంట పడుతోందంటే నమ్ముతారా... పాయకరావుపేటలోని తాండవ వంతెనపై మాత్రం ఇది సాధ్యమే. వంతెన ఫుట్‌పాత్‌పై చేపల అమ్మకాల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. 15 మంది వరకు చేపల అమ్మకందారులు.. వీటి కొనుగోలుకు వచ్చే వారంతా ఇష్టారాజ్యంగా వాహనాలను రోడ్డుపై నిలిపే వారితో తరచూ ట్రాఫిక్ ఇక్కట్లు వస్తున్నాయి. నిత్యం వేలాది మంది ఇబ్బంది పడుతున్నారు. రెండు జిల్లాల వారధిపై అవస్థలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. వంతెనపై సగం భాగం కాకినాడ జిల్లా పరిధిలోనూ మిగతా సగం పేట పరిధిగానూ చూస్తారు. ఉదయం 8 గంటలకు తుని గొల్ల అప్పారావు కూడలికి వచ్చిన పోలీసులు వారిని ఇటువైపు పంపేస్తున్నారు. పేట పరిధిలో పోలీసులు ఎటువంటి నియంత్రణ చర్యలు చేపట్టడంలేదు. దీంతో ఉదయం ఏడు నుంచి సాయంత్రం వరకు వాహనచోదకులు, పాదచారులకు నరకయాతనే మిగులుతోంది. ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఉన్న చేపల మార్కెట్‌కు వీరిని తరలిస్తే ఇబ్బందే ఉండదు. సీఐ అప్పన్న మాట్లాడుతూ అమ్మకాలు చేపట్టకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

తాండవ వంతెనపై నిలిచిన వాహనాలు

### ముగిసిన శిక్షణ తరగతులు

పాయకరావుపేట: పట్టణంలోని స్పేసెస్ డిగ్రీ కళాశాలలో గో ఆధారిత ఉత్పత్తుల శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. రెండు రోజులపాటు అగరబత్తీల తయారీ, ప్రమిదలు, సబ్బులు, షాంపూలు, దోమల నివారణి తదితర 20 రకాల ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, జువాలజీ విభాగ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Atchutapuram Branch, Anakapalli District,** I issue the following notice to general public. My client intends to grant loan to **SMT. TAMARANA YERRAYYAMMA** W/o T Sanyasi Naidu by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

Anakapalli District, Yelamanchili Sub-District, Atchutapuram Mandalam, Janguluru Gram panchayast and village accounts zeriothy dry land covered by S. No.23 an extent of Ac.0.55 cents in which an extent of Ac.0.03 cents or 145.33 Sq. yards or 121.51 sq. meters of vacant site is measured and bounded by:
**East:** Site of K Atcham Naidu - 32.7 feet or 9.962 meters; **South:** Land of Hanumanthu Purnavathi - 40 feet or 12.186 meters; **West:** Panchayat CC road - 32.7 feet or 9.962 meters; **North:** 14 feet width road - 40 feet or 12.186 meters.

**KODURI SREENIVASA RAO**
**SMT. SIVA KUMARI JALADI**
**Advocates,**
S-2, Bharat Apartments, Behind Rythu bazar, Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam
Dt. 12.07.2025
Mobile No. **9885166648**
Mail: **sreenivaskoduri@gmail.com**


### ఉచిత వైద్య శిబిరం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి సీఐటీయూ దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. న్యూరాలజీ వైద్యుడు డాక్టర్ సాయి సందీప్, డాక్టర్ డి సాంబమూర్తి, డాక్టర్ బి. మీనేంద్ర కుమార్ తదితరులు శిబిరంలో సుమారు 150 మంది రోగులకు చికిత్సలు అందజేశారు. నిర్వాకులు మళ్ల చంద్రశేఖర్, జె. రమేష్‌బాబు, మళ్ల అప్పలనాయుడు, కొణతాల రాంబాబు పాల్గొన్నారు.

శిబిరానికి తరలివచ్చిన రోగులు

### పాడి రైతులకు దాణా గిన్నెల పంపిణీ

**మునగపాక:** మంగళరపుపేట పాల సొసైటీ సభ్య రైతులకు డెయిరీ సమకూర్చిన పశువుల దాణా గిన్నెలు, సొసైటీ అధ్యక్షుడు మొల్లేటి సత్యనారాయణ సొంతసొమ్ముతో కొనుగోలు చేసిన స్టీల్ పాలక్యాన్లను ఆదివారం ఆడారి త్రిమూర్తులు అందజేశారు. కాగా సొసైటీ అధ్యక్షుడిగా మళ్లీ సత్యనారాయణను నియమించడంపై కొంతమంది పాడిరైతులు అభ్యంతరం తెలిపారు. సర్వసభ్య సమావేశం నిర్వహించి రైతుల అభిప్రాయం తీసుకోకుండా నూతన పాలకవర్గాన్ని ఎలా ఎన్నుకొన్నారంటూ రాపేటి రామకృష్ణ, గనిరెడ్డి సూర్యనారాయణ, ఎల్లపు గోవింద, పద్మ తదితరులు నిలదీశారు. కొంతమంది రైతులు దాణా గిన్నెలు తీసుకోకుండానే వెనుదిరిగారు.

### స్మార్ట్‌మీటర్లు తొలగించకుంటే ఉద్యమం

మునగపాక, రాంబిల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయ మోటార్లకు ఏర్పాటుచేసిన స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం వెంటనే తొలగించాలని లేకుంటే ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు హెచ్చరించారు. వెంకటాపురం వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు ఏర్పాటుచేసిన స్మార్ట్ మీటర్లను ఆదివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వెంకటాపురం మాజీ సర్పంచి గనిశెట్టి సత్యనారాయణ, కడియం కృష్ణ సుందరపు అప్పలరాజు, కె. నీలకంఠరావు, చిన్ని అప్పారావు,పాల్గొన్నారు. స్మార్ట్ మీటర్లు ఇళ్లకు పెట్టొద్దని... ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఎం నాయకులు రాంబిల్లిలో గోడపత్రికలను ఆవిష్కరించారు. విద్యుత్తు ఛార్జీలను పెంచే అదాని స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శంకరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు, చందక రామకృష్ణ, ఎస్.నారాయణ రావు, రుత్తల రాంబాబు పాల్గొన్నారు.

వెంకటాపురంలో స్మార్టు మీటర్లు పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

యానాద్రమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

## వైభవంగా అమ్మవార్ల పండగ

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు కాలనీలో యానాద్రమ్మ, రామారాయుడుపాలెం రోడ్డులో ఉన్న పొలిమేరమ్మ తల్లి అమ్మవారల పండగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బాణసంచా కాల్చారు. భజనలు, చిడతలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

**అచ్యుతాపురం:** నునపర్తిలో పసలమారమ్మ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సతకంపట్టు నుంచి సంప్రదాయ వాయిద్యాదలతో ఊరేగింపుగా అమ్మవారి వద్దకు వెళ్లిన భక్తులు పూజలుచేసి అమ్మవారి పండ్లు, కుంకుమ సమర్పించారు. తెదేపా నాయకులు రెడ్డి నగేష్, గొంప నరసింహనాయుడు, గ్రామ పెద్దలు నర్సింగరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

**కోటవురట్ల:** తంగేడులో బోనాలు జాతరను ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో తలుపులమ్మ తల్లికి ప్రతి ఏటా బోనాలు సమర్పిస్తారు. దీనిలోభాగంగానే ఆదివారం గ్రామ పెద్దల సహకారంతో, మహిళలు అమ్మవారి బోనాలను, గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. తలుపులమ్మ దగ్గర ఉంచి మొక్కులు తీర్చుకున్నారు. అన్న సమారాధన నిర్వహించారు.

తలుపులమ్మతల్లికి భక్తులు తీసుకొచ్చిన బోనాలు

**అనకాపల్లి:** అనకాపల్లి నూకాలమ్మ నగర సంకీర్తన ఆదివారం నిర్వహించారు. పోతురాజు సిండికేట్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున నగర వీధులలో చేపట్టారు. ఆలయం నుంచి బయలుదేరి రజకుల కాలనీ, గంగిరేవి చెట్టు, అగ్గిమర్రిచెట్టు, దేమునిగుమ్మం, కోటవీధి మీదగా తిరిగి అమ్మవారి ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో వరలక్ష్మి, శిరీష, ఉమామహేష్, సూరిబాబు పాల్గొన్నారు.

**కశింకోట:** కశింకోటలో కొలువైన నూకాంబికకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివగణేష్ ఆధ్వర్యంలో విశేష అలంకరణ, కుంకుమార్చనలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### శాకంబరిగా నూకాంబిక అమ్మవారు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం గ్రామదేవత నూకాంబిక అమ్మవారు శాకంబరి అలంకరణలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తూరు నరసింగరావుపేటలో మోదకొండమ్మ శాకంబరిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. సమీప గ్రామాల నుంచి భారీగా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వివిధ రకాల కూరగాయాలతో అమ్మవారినికి అందంగా అలంకరించారు.

అనకాపల్లిలో..

### మేమున్నాం.. మీకు తోడుగా

| | |
|---|---|
| అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750 |
| ఎలమంచిలి- 80085 74726 | |

అనకాపల్లి, న్యూస్‌టుడే **?:** ప్రధాన రహదారిలో న్యాయస్థానాల సముదాయం ఎదురుగా మంచినీటి బోరు చుట్టు బురద ఉంది. – బుద్ధ భాస్కరరావు, అనకాపల్లి, **✓:** సిబ్బందిని పంపి పరిశీలించి బురద తొలగిస్తాం. – రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే **?:** పట్టణంలోని శారదానది వంతెన నడక మార్గం మరమ్మతులకు గురైంది. మరమ్మతు చేయించలరు. – రామ్మోహనరావు, అనకాపల్లి, **✓:** మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – ప్రభు, ఆర్ అండ్‌బీ జేఈ, అనకాపల్లి.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే **?:** విద్యుత్తు మరమ్మతుల పేరుతో ఎండలు మండుతున్న ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్తు కోతలు విధిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, రోగులు ఇబ్బంది పడుతున్నారు. – రాంబాబు, పెదపాడు., **✓:** రోజంతా నిరంతరాయంగా విద్యుత్తు అందివ్వాలనే లక్ష్యంతో ఆధునికీకరణ పనులు చేపట్టాం. వినియోగదారులు సహకరించాలి. –భానుప్రకాశ్, ఏఈ, ఈపీడీసీఎల్, కొండకర్ల.

పాయకరావుపేట, న్యూస్‌టుడే **?:** మండలంలోని సత్యవరంలో వీరబాబు గుడి సమీపాన సర్వే నంబరు 19లోని మోటారుకు 15 రోజుల నుంచి విద్యుత్తు సరఫరా రావడం లేదు. తమలపాకు తోట నీరు లేక ఎండిపోతుంది. సరఫరా పునరుద్ధరించాలి. – టి.కన్నారావు, సత్యవరం, **✓:** తక్షణమే సరఫరా అందిస్తాం. సమస్య పరిష్కరిస్తాం. – పరదేశి, ఏఈ, ఏపీఈపీడీసీఎల్

### ఉదయపు నడకతో ఆరోగ్యం పదిలం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉదయపు నడకతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ జిల్లా గవర్నర్ కె.ద్వారకానాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద ఫంక్షన్ హాల్‌లో క్లబ్ త్రైమాసిక సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉదయపు నడకను దినచర్యలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహాత్మగాంధీ ఫెలోషిప్ తీసుకున్న 40 మంది క్లబ్ సభ్యులను సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ పూర్వపు అధ్యక్షులు టీవీ హనుమంతరావు, ఏహెచ్ఎన్ వెంకటరావు, అనకాపల్లి క్లబ్ అధ్యక్షులు రాపేటి నారాయణరావు, కార్యదర్శి యల్లపు శివ, క్లబ్ ఏరియా అధ్యక్షులు డాక్టర్ డీడీ.నాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కొణతాల జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.





కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

### యాత కులస్థుల సమస్యలు పరిష్కరించండి

సమావేశమైన జిల్లా యాత కులస్థుల సంఘం నాయకులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: యాత కులస్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పెంకే మారేష్ పేర్కొన్నారు. పట్టణంలోని నాయుళ్లవీధిలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మారేష్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రలో యాత కులస్థులు ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో వెనుకబాటుతనంతో ఉన్నారని పేర్కొన్నారు. తమ పిల్లలందరినీ పాఠశాలలకు పంపించి నూరుశాతం అక్షరాస్యత ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు, ఉపాధ్యక్షులు పిల్లి శ్రీనివాసరావు, సంఘం నాయకులు కర్రి వెంకటరమణ, బత్తిని సత్యనారాయణ, ఒడిసెల సూరిబాబు, కట్ట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Atchutapuram Branch, Anakapalli District,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. GAGANAM TRINADHA RAO** S/o G Raja Lingam by keeping the below mentioned schedule property of **Mr. GAGANAM GOPALA SWAMY** S/o G Trinadha Rao as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

Anakapalli District, Yelamanchili Sub-District, Munagapaka Mandalam, Melupaka Gram panchayat and village accounts Gramkantam S.No.161-1 part an extent of 69.66 Sq. yards or 58.24 Sq . meters of site together with RCC building with plinth area of 150 SFT bearing D. No.1-57, assessment no.57 is measured and bounded by:

**Mesurements of site:**
**East:** 19 feet or 5.788 meters; **South:** 33 feet or 10.054 meters; **West:** 19 feet or 5.788 meters; **North:** 33 feet or 10.054 meters.

**Mesurements of Building**
**East:**10 feet or 3.046 meters; **South:** 15 feet or 4.570 meters; **West:** 10 feet or 3.046 meters; **North:** 15 feet or 4.570 meters.

**Boundaries of the property:**
**East:** House of Gaganam Someswara Rao; **South:** Compound wall of Sivalaya Temple and road; **West:** House of Gaganam Manikyala rao; **North:** Houses of Gaganam Malleswara Rao and G Nabhushanam.

**KODURI SREENIVASA RAO**
**SMT. SIVA KUMARI JALADI**
**Advocates,**
S-2, Bharat Apartments, Behind Rythu bazar, Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam
Dt. 12.07.2025
Mobile No. **9885166648**
Mail: **sreenivaskoduri@gmail.com**


(c) eenadu

# నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

## ప్రమాదకరంగా కూడళ్లు
సిగ్నల్ లైట్లు అత్యవసరం

కృష్ణాబజారులో ట్రాఫిక్

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నంలో ట్రాఫిక్ కష్టాలు తీవ్రమవుతున్నాయి. పలు కూడళ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఐదు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు ఏళ్ల తరబడి మోక్షం రావడం లేదు. ట్రాఫిక్ నియంత్రణకు ఒక ఎస్సైకి బాధ్యత అప్పగించినప్పటికీ తగిన సిబ్బంది లేరు. కూడళ్ల వద్ద హోంగార్డులతోనే నెట్టుకొస్తున్నారు. పట్టణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

★ కృష్ణాబజారులో వాహన చోదకులకు పగలే చుక్కలు కనిపిస్తుంటాయి. సాయంత్రం వేళల్లో ఇక్కడ ప్రధాన రహదారిలో వాహనాలు తప్పుకోవడానికి వీల్లేనంత రద్దీ ఉంటోంది. ప్రధాన రహదారికి ఇరువైపులా ఇటీవలి కాలంలో హోటళ్లు ఇక్కడ ఎక్కువగా ఉన్నాయి. ఉదయం వేళ వ్యాపార సంస్థలు ఎగుమతులు, దిగుమతుల కోసం వాహనాలను ఎక్కువ సమయం నిలిపి ఉంచడంతో సమస్య తీవ్రమవుతోంది.

★ పాతబస్టాండ్‌లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులే. గతంలో ఈ మార్గంలో వన్-వే విధానం అమలు చేసేవారు. కొన్నాళ్లుగా ఈ పద్ధతి పక్కన పెట్టేశారు. తుని వైపు నుంచి టిప్పర్లు, లారీలు ఇటువైపుగానే పట్టణంలో ప్రవేశిస్తున్నాయి. కోమటివీధి మలుపులో ఇరుకు రోడ్లో భారీ వాహనాలు మళ్లించేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

★ అబీద్‌కూడలి నుంచి పాత స్టేట్‌బ్యాంకు వరకు రోడ్డును విస్తరించినప్పటికీ ఫుట్‌పాత్‌ల నిర్మాణం సరిగాలేదు. దుకాణదారులంతా రోడ్డు పక్కనే వ్యాపారం చేసుకుంటున్నారు. కొందరైతే ఏకంగా రోడ్డుమీదనే దుకాణాలు ఏర్పాటుచేస్తున్నారు.

★ శ్రీకన్యకూడలి ప్రాంతంలో బస్టాండ్, విద్యాసంస్థలు, థియేటర్లు, షాపింగ్‌మాల్స్ ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఆటోలన్నీ ఎక్కువగా రోడ్డు మీద నిలుపుతుంటారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది.

### నిబంధనలు పాటించాలి..

వాహన చోదకులు కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. యూ-టర్న్ తీసుకునేటప్పుడు వేగం తగ్గించి సిగ్నల్ ఇవ్వాలి. శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలి. సిగ్నల్ లైటు అవసరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ట్రాఫిక్ నియంత్రణ కోసం సైరన్ కలిగిన ఓ ద్విచక్ర వాహనాన్ని వినియోగిస్తున్నాం. కీలకమైన శ్రీకన్యకూడలిలో సాయంత్రం వేళ సిబ్బంది ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారు. – కె.సత్యనారాయణ, ట్రాఫిక్ ఎస్సై

## పీఏసీఎస్ ఇన్‌ఛార్జిగా చినబాబు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మాకవరపాలెం సహకార సంఘం అధ్యక్షుడిగా గిడుతూరుకు చెందిన మాజీ సర్పంచి శీరంరెడ్డి నాగేశ్వరరావు చిన బాబును నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు డీసీసీబీ నుంచి ఉత్తర్వులొచ్చినట్లు చినబాబు తెలిపారు. డైరెక్టర్లుగా భాజపా నుంచి అడిగర్ల రాంబాబు, గనిశెట్టి శంకర్రావు, సీఈవో భూషణం తెలిపారు.

### తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకృష్ణ ఆడి: సూపర్ మ్యాన్, మిరాయి, వర్జిన్ బాయ్స్ ది 100, ఓ భామ అయ్యో రామ, ఆడి2: కుమారి 21 ఎఫ్, కుబేర, మార్గన్, ఆడి3: సూపర్ మ్యాన్, ఆడి4: జురాసిక్ వరల్డ్, ఎఫ్1 ది మూవీ, బంగార్రాజు: వర్జిన్ బాయ్స్, రాజు: 3బి హెచ్‌కె, చోడవరం: శ్రీసాయిలక్ష్మి: సూపర్ మేన్, సాయిలక్ష్మి: వర్కింగ్ బాయ్స్, పూర్ణ: 3బిహెచ్‌కె.

## ఆస్తులు బారెడు.. ఆదాయం మూరెడు

శిథిలస్థితిలో ఉన్న బుచ్చి సీతయ్యమ్మ సత్రం

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణంలో పూర్వీకులు అందించిన ఆస్తులు ఒక్కొక్కటి అన్యాక్రాంతమవుతున్నాయి. భవనాలు శిథిలావస్థకు చేరాయి. గతంలో కళకళలాడిన రాజా చింతల పాటి బుచ్చియ్యమ్మ సత్రం, భమిడిపాటి వారి సత్రాలు ప్రస్తుతం వాటి ఉనికిని కోల్పోయాయి. నిర్వహణకు కేటాయించిన భూముల నుంచి ఆదాయం అంతంతమాత్రంగా వస్తుంది.

### విద్యార్థుల నిలయంగా...

పట్టణంలో బి-ఎన్ రహదారిని ఆనుకుని కళాశాల రహదారిలో రాజా చింతల పాటి బుచ్చియ్యమ్మ సత్రం ఉంది. లక్కవరం జమిందారు 280 చదరపు గజాల స్థలంలో అప్పట్లో పెద్ద భవంతిని నిర్మించారు. క్షత్రియ కులానికి చెందిన విద్యార్థులకు ఇది ఉపయోగపడేది. ఈ భవంతి నిర్వహణకు 280 ఎకరాలను లక్కవరం జమిందారులు కేటాయించారు. కె.కోటపాడు మండలం చౌడువాడ, మల్లాం పేటలో సత్రం భూములున్నాయి. చోడవరం మండలం అడ్డూరులో ఆరు ఎకరాలు ఉంది. 1990 వరకు బుచ్చియ్యమ్మ సత్రం విద్యార్థులతో చక్కగా నడిచేది. క్రమేనా సత్రం నిర్వహణ, పర్యవేక్షణ చూసే దిక్కు లేక భవంతిని, భూములను 2001లో దేవాదాయ శాఖకు అప్పగించారు. ఇప్పుడు భవంతి ముందు ఆవరణలో చిరు దుకాణాలు వెలిశాయి. బడ్డీల స్థానంలోనే పక్కా నిర్మాణాలు చేపట్టడంతో పలువురు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### అభివృద్ధి పేరుతో కూల్చివేత..

పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో భమిడపాటి వారి సత్రం ఉండేది. 280 చదరపు గజాల విస్తీర్ణంలో పెంకుటిల్లు ఉండేది. పూర్వం బాటసారుల కోసం అంబలి పోసేవారు. దీంతో అంబలి సత్రంగా పేరు ప్రచారంలోకి వచ్చింది. పదేళ్ల కిందట అభివృద్ధి పేరిట భమిడి పాటివారి సత్రం పెంకుటిల్లును పడగొట్టేశారు. గాయత్రి బ్రాహ్మణ సంఘం ఈ స్థలాన్ని వేద పాఠశాల నిర్వహించడానికి కేటాయించాలంటూ గతంలో దేవదాయశాఖ అధికారులకు లేఖ రాసింది. దీనిపై అధికారుల స్పందన లేదు. అన్నవరం, జన్నవరం, చిట్టెయ్య పాలెం, చోడవరం, బుచ్చెయ్యపేట గ్రామాల్లో 52 ఎకరాలు భూమి ఉంది.

సత్రంలో అక్రమ నిర్మాణం

### సత్రాలపై శ్రద్ధ చూపండి

### ఆదాయం ఆరు వేలే..

బుచ్చియ్యమ్మ సత్రానికి 280 ఎకరాలుంటే ఏడాదికి రూ.6వేలు మాత్రమే ఆదాయం వస్తోంది. ఇది కూడా అడ్డూరు రైతులు చెల్లిస్తున్నారు. చౌడువాడ, మల్లంపేట రైతులు శిస్తు చెల్లించడం లేదని అధికారులు చెబుతున్నారు. 280 ఎకరాల్లో 80 ఎకరాల సత్రం భూములను కౌలు చేసే రైతులు తమ పేరున పట్టాలు పొందారు. ప్రస్తుతం సత్రం భూముల వివాదం అనకాపల్లి ఆర్డీవో కోర్టులో ఉంది.

### 12 ఎకరాలు కనిపించడం లేదు..

బుచ్చెయ్యపేటలో భమిడిపాటి వారి సత్రానికి సంబంధించిన భూముల్లో 12 ఎకరాల భూమి కనిపించడం లేదు. ఈ విషయమై గతంలో సత్రం ఛైర్మన్‌గా పనిచేసిన పినబోయిన అప్పారావు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి 12 ఎకరాల భూమిని కనుగొని కేటాయించాలని తిరిగినా ఫలితం లేకపోయింది.

### నోటీసులిస్తున్నాం..

దేవదాయ శాఖకు చెందిన ఆస్తులు కాపాడుతూ వస్తున్నాం. సాగులో ఉన్న రైతుల నుంచి శిస్తు సొమ్ము వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం. భూములన్నీ సత్రాల పేరిట దాఖలు పడేలా పనిచేస్తున్నాం. బుచ్చియ్యమ్మ సత్రానికి బోర్డు ఏర్పాటు చేసి కంచె వేయించే పనులు జరుగుతున్నాయి. క్షత్రియ సత్రం అభివృద్ధి విషయమై కమిషనర్‌కు రాశాం. – ఎస్.వి.వి.సత్యనారాయణ మూర్తి ఈవో, దేవాదాయ శాఖ, చోడవరం

## మార్కెట్ కమిటీలో ఇద్దరికి చోటు

దేవరాపల్లి, న్యూస్‌టుడే : మాడుగుల మార్కెట్ కమిటీలో దేవరాపల్లి మండలం వేచలంకి చెందిన జనసేన యువ నాయకుడు పైడా మధుసూదన రావుకి చోటు దక్కింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్వర్వులు వెలువడ్డాయి. మార్కెట్ కమిటీలో తనకు స్థానం కల్పించడానికి సహకరించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్. కృష్ణ మండల పార్టీ అధ్యక్షుడు జి.రామ్మూర్తినాయుడు తదితరులకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

### టోల్ ప్లాజా వద్ద వాహన రద్దీ

నక్కపల్లి మండలం కాగిత టోల్ ప్లాజా ఆదివారం వాహనాలతో రద్దీగా మారింది. ఆషాఢ మాసం ఆదివారం కావడంతో ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి తుని తలుపులమ్మ లోవ ఆలయానికి వందల వాహనాల్లో భక్తులు తరలి వెళ్లారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కౌంటర్ల వద్ద భారీ ఎత్తున వాహన రద్దీ కనిపించింది. ముఖ్యంగా వందల కొద్ది కార్లు జాతీయ రహదారిపై పరుగులు తీశాయి. కౌంటర్లలోనూ వాహనాలు రద్దీ కనిపించింది.

- న్యూస్‌టుడే, నక్కపల్లి

## లోపూడిలో దాహం కేకలు

నిరుపయోగంగా నీటిపథకం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని లోపూడి గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. వారం రోజులగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మంచినీటి పథకం నిరుపయోగంగా మారింది. కుళాయిల నుంచి చుక్క నీరు రాకపోవడంతో నీటికోసం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడ ఉన్న చేతిబోర్లు, ప్రైవేటు బోర్ల దగ్గరకు వెళ్లి నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. మోటారు కాలిపోవడంతో నీటి పథకం పనిచేయలేదు. పంచాయతీ సిబ్బంది బోరుబావిలో మోటారును బయటకి తీసి వదిలేశారు. చాలారోజులు కావడంతో పాత మోటారు తుప్పు పట్టి పూర్తిగా పాడైంది. మరమ్మతులు చేయించడానికి అవకాశం లేదని చెబుతున్నారు. కొత్తమోటారును ఏర్పాటు చేస్తేనే నీటిపథకం వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. తాగునీటి ఇబ్బందులు గురించి పంచాయతీ సర్పంచి, కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## అవీ ఇవీ

### నల్లరాయి క్వారీ అనుమతులు రద్దు చేయాలి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: జి.కోడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 332లో గల నల్లరాయి క్వారీల అనుమతులను ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని స్థానిక రైతులు ఆదివారం పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. అలాగే క్వారీ సమీపంలో అత్తుమూరి కల్యాణం భూమిలోని పాకను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చి వేశారని దీనిపై దర్యాప్తు చేపట్టి నిందితులను శిక్షించాలన్నారు.

### సందడిగా స్నాతకోత్సవం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పెదబొడ్డేపల్లిలోని డాన్‌బోస్కో డిగ్రీ కళాశాలలో 2022-25 మధ్య డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఆదివారం 'గ్రాడ్యుయేషన్ డే' నిర్వహించారు. కళాశాల అభివృద్ధి కమిటీ కన్వీనర్ వెంకట కృష్ణ మాట్లాడుతూ డిగ్రీతో సరిపెట్టుకోకుండా మరింత ఉన్నత చదువులకు వెళ్లాలని సూచించారు. నైతిక విలువలతో జీవించాలన్నారు.

### బెల్టు షాపుల రద్దుకు నేడు ధర్నా

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన గొలుసు దుకాణాలు తొలగించి గీత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించనున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం చీడికాడ, మాడుగుల మండలాల సొసైటీ అధ్యక్షుడు దొడ్డి నారాయణరావు తెలిపారు. ఈ నెల 14న అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

### వ్యాను ఢీకొని ఒకరికి గాయాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బొలెరో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బీఎన్ రోడ్డులో ఆదివారం వడ్డాది నుంచి కొండెంపూడి వెళ్తున్న వాహనం స్థానిక జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి రోడ్డుపక్కన దుకాణంలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో అక్కడున్న బైక్‌ను ఢీకొనడంతో సీహెచ్ లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం అనకాపల్లికి తరలించారు.

### ఉపాధ్యాయుడికి సత్కారం

చీడికాడ : అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న ఉపాధ్యాయుడు రామారావును ఘనంగా సత్కరించారు. గుంటూరులో జరిగిన పద్మశాలి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ (పీఈడబ్ల్యూఏ) నాల్గో వార్షికోత్సవ మహాజన కార్యక్రమంలో ఆయన్ను సన్మానించారు. చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రామారావు బుచ్చెయ్యపేట మండలంలోని ఓ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న ఈయన కొద్దిరోజుల క్రితం జరిగిన రాష్ట్ర మాస్టార్ అథ్లెటిక్స్ పోటీలో బహుమతులు సాధించడంతో ఈ గౌరవం దక్కింది.

## శాకంబరిగా దేవీతల్లి

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం నీలంపేటలో ఆదివారం దేవీతల్లి పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి విగ్రహాన్ని కూరగాయలతో అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. గురుభవానీ రామారావు ఆధ్వర్యంలో వేడుక జరిగింది.

చోడవరం, న్యూస్‌టుడే : చోడవరం పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు రకాల కూరగాయలతో అమ్మవారికి అలంకరణ చేశారు. ఆషాఢ బహుళ తదియ సందర్భంగా ఆలయ కమిటీ, వాసవీ మహిళా మండలి సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చోడవరంలో

## ఐదేళ్లనాటి సమస్యకు శాశ్వత పరిష్కారం

గొలుగొండ, న్యూస్‌టుడే: నర్సీపట్నం-కృష్ణదేవిపేట మధ్య గొలుగొండ ఎస్సీ కాలనీ వద్ద ప్రధానరహదారి కల్వర్టు అప్రోచ్ రోడ్డు ఇరువైపులా భారీగా గోతులు ఏర్పడ్డాయి. వాహనచోదకులు ఐదేళ్లుగా నరకం చూస్తున్నారు. దీని మీదుగా అల్లూరితోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఏలేశ్వరం, రాజమహేంద్రవరం, కాకినాడ, రంపచోడవరం తదితర ప్రాంతాలకు నిత్యం ఆర్టీసీ సర్వీసుల తోపాటు అధిక సంఖ్యలో ఇతర వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. సమస్యను శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు గుర్తించి గుంతలు పూడ్చాలంటూ ర.భ. శాఖ అధికారులను ఆదేశించారు.

గొలుగొండ ఎస్సీ కాలనీ వద్ద అద్దంలా అప్రోచ్

## పేదల సంక్షేమమే ధ్యేయం

చోడవరంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాజు, మల్లునాయుడు

చోడవరం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమం కోసం పనిచేసే ఏకైక ప్రభుత్వం తెదేపా నేతృత్వంలోని కూటమి ప్రభుత్వమేనని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. చోడవరం పట్టణంలోని తామరచెరువు నివాసిత ప్రాంతంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను అందజేశారు. పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, పెదబాబు, దేవరపల్లి వెంకట అప్పారావు, చిన్న, రొంగలి సోమునాయుడు, గూనూరు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: రావికమతంలో నూతనంగా ఏర్పాటు చేసిన సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆదివారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్‌రాజు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు

ప్రమాణ స్వీకారంలో ఆశీర్వచనాలు చేస్తున్న అర్చకులు

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు లయన్స్ క్లబ్ కృషి చేస్తోందని క్లబ్ నూతనశాఖ కార్యవర్గం పేర్కొంది. ఆదివారం ఓ పంక్షన్ హాల్లో లయన్స్ క్లబ్ చోడవరం శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకరణ వేడుకగా జరిగింది. ఇందులో మొదటి విడతగా నాలుగు కెమెరాల ఏర్పాటుకు కార్యవర్గం ముందుకొచ్చింది. లయన్స్ క్లబ్ చోడవరం శాఖ అధ్యక్షుడిగా పసుమర్తి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా బద్రి మహంతి ఫాల్గుణలు ప్రమాణం చేశారు. పూర్వపు అధ్యక్షుడు డా.నీలం నాగేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పూర్వపు జిల్లా గవర్నరు డా.అధికారి గోపాలరావు హాజరై ప్రమాణం చేయించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు హాజరయ్యారు.

## రాకపోకలకు చింత

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలోని కొవ్వూరు నుంచి శరభవరం వెళ్లే మార్గంలో తారురోడ్డు పక్కనే పాడైన బావి ప్రమాదకరంగా తయారైంది. రహదారికి కేవలం కొద్ది పాటి దూరంలోనే ఉంది. ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనాలు పొరపాటున రోడ్డు దిగితే ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. తక్షణమే ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

కొవ్వూరు సమీపంలో రోడ్డు పక్కనే పాడైన లోతైన బావి

## సగం శిథిలం.. పొంచిఉన్న ప్రమాదం

రోలుగుంట: మండలంలోని నిండుగొండ నుంచి ఎన్.కొత్తూరు వెళ్లే మార్గంలో పోతలవాని చెరువుగట్టుపై వేసిన విద్యుత్తు స్తంభం అడుగుభాగం శిథిలమై ఆందోళన కలిగిస్తోంది. కేవలం విద్యుత్తు సరఫరా చేసేందుకు పైన అమర్చిన తీగలపైనే ఆధారపడి ఉంది. దీన్ని ఇలాగే వదిలేస్తే ఏక్షణంలోనైనా ప్రమాదం జరిగే అవకాశముందని సమీపంలోని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

దెబ్బతిన్న స్తంభం అడుగుభాగం

### కథలతో వ్యక్తిత్వ వికాసం

నర్సీపట్నం అర్బన్: నీతి కథల ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని నాతవరం ఎంఈవో వరహాలబాబు అన్నారు. నర్సీపట్నం శాఖ గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యతో పాటు విలువలు అలవరుచుకోవాలంటే తప్పనిసరిగా పిల్లలను గ్రంథాలయాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు.

## వీరి పరిస్థితి ఏంటి ?

అయోమయ స్థితిలో చిన్నారులు

రోలుగుంట, న్యూస్‌టుడే: రాష్ట్రమంతటా ఉపాధ్యాయ, తల్లిదండ్రుల సమావేశ వేడుకల్లో సందడిగా ఉంటే రోలుగుంట మండలంలోని బుచ్చెంపేట శివారు గుర్రంపేట, కొంతలం పాపంపేట ప్రాథమిక పాఠశాలలకు విచిత్రమైన పరిస్థితి నెలకొంది. బుచ్చెంపేట శివారు గుర్రంపేటలో మాత్రం ఫౌండేషన్ స్థాయి పాఠశాల కావడంతో 1, 2తరగతులకు మాత్రమే అవకాశం ఉండటంతో గ్రామంలో ప్రస్తుతం 3, 4, 5తరగతులకు చెందిన పిల్లలు ఇక్కడ చదువుకునే అవకాశంలేక వారి పరిస్థితి ప్రశ్నార్థకమైంది. ఈ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన పలువురు ఇటీవలే తిరిగిరావడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. దీంతో వీరు ఇక్కడ చదవాలంటే ఈ పాఠశాలను బేసిక్ పాఠశాలగా మార్చు చేయాల్సిఉంది. ఇదిలా ఉండగా ఇటీవల బదిలీల్లో అనకాపల్లి నుంచి పాపంపేట పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడిని అక్కడ పాఠశాల మూతపడటంతో గుర్రంపేటకు కేటాయించి నెట్టుకొస్తున్నారు. పాఠశాలలు ప్రారంభించి చాలారోజులైనా 3, 4, 5తరగతుల పిల్లలకు ఇక్కడ అవకాశం కల్పించలేదు. అలాగని ప్రత్యామ్నాయం కూడా లేకపోవడంతో వారు కూడా ఇదే పాఠశాలకు వస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ జాన్‌ప్రసాద్ వివరణ ఇస్తూ ఇక్కడి పరిస్థితిని అధికారులకు తెలియజేశామన్నారు. గుర్రంపేటను ఫౌండేషన్ పాఠశాల నుంచి బేసిక్ పాఠశాలగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

## ఉదయపు నడకతో ఆరోగ్యం పదిలం

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉదయపు నడకతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ జిల్లా గవర్నర్ కె.ద్వారకానాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద ఫంక్షన్ హాల్లో క్లబ్ త్రైమాసిక సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉదయపు నడకను దినచర్యలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహాత్మగాంధీ ఫెలోషిప్ తీసుకున్న 40 మంది క్లబ్ సభ్యులను సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ పూర్వపు అధ్యక్షులు టీవీ హనుమంతరావు, ఏహెచ్ఎన్ వెంకటరావు, అనకాపల్లి క్లబ్ అధ్యక్షులు రాపేటి నారాయణరావు, కార్యదర్శి యల్లపు శివ, క్లబ్ ఏరియా అధ్యక్షులు డాక్టర్ డీడీ.నాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కొణతాల జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

### తాజంగికి జలకళ

చింతపల్లి: తాజంగి జలాశయం నిండుగా నీటితో కళకళలాడుతోంది. ఇటీవల విడవకుండా వర్షాలు పడుతుండంతో ఈ జలాశయంలోకి నీరు పూర్తిగా చేరింది. దీని మరమ్మతులకు కలెక్టర్ ఇప్పటివరకు సుమారు రూ.45 లక్షల వరకూ విడుదల చేశారు.

## వైద్య శిబిరానికి స్పందన

రోగుల వివరాలు నమోదుచేస్తున్న సత్యసాయి సేవకులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో మండలంలోని తామరబ్బలో సత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ వైద్య శిబిరానికి దేవరాపల్లి, అనంతగిరి, వేపాడ మండలాలకు చెందిన 636 మంది తరలి వచ్చారు. విశాఖ, తుని, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పనిచేసే 21 మందితో కూడిన ప్రముఖ వైద్య నిపుణుల బందం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎక్స్‌రే, ఈసీజీ, రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నిరుపేదలైన పిల్లలు, పెద్దలకు దుస్తులు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మాడుగుల గ్రామీణం: మండలంలోని ఒమ్మలి, గ్రామంలో అనిల్‌నీరుకొండ, డీడీఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారుగా 63 మందికి జనరల్ వ్యాధులపై చికిత్సలు, గర్భిణి సమస్యలు, క్యాన్సర్‌కు సంబంధించి సమస్యలపై చికిత్సలు చేసినట్లు డాక్టర్లు చాందిని, అనూష తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743, చోడవరం - 80085 74732, మాడుగుల - 80085 74740 చీడికాడ - 80085 74742

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేట శివారు గవిరంపేటలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉండే నివాస గృహాలకు తాగునీటి ఇక్కట్లు నెలకొన్నాయి. కొళాయి ఏర్పాటు చేయక పోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – పోతురాజు, స్థానికుడు, ✔: సమస్యను సచివాలయం దృష్టికి వచ్చింది. కొళాయి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – శివ, కార్యదర్శి

సమస్య: నాతవరంలోని ఎర్ర చెరువు నుంచి దిగువ భాగంలో వందలాది ఎకరాలకు నీటిని పంపిణీ చేసే కాలువ చాలా దుస్థితిలో ఉంది. దీన్ని తక్షణం బాగు చేస్తే వచ్చే ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు తొలగుతాయి.– శెట్టి బాపన్నాయుడు, నాతవరం, ✔: తాండవ పనుల్లో భాగంగా మైనరు కాలువల బాగుకు ప్రతిపాదిస్తాం. – పారుపల్లి దాసు తాండవ డిసి

### గోతులు పూడ్చారు
స్పందనకు వందనం

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేట-కృష్ణదేవిపేట మధ్య ప్రధానరహదారిలో బ్రిటీష్ కాలం నాటి వంతెన మధ్యలో గోతులు ఏర్పడ్డాయి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై ఈ నెల 3న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ర.భ.శా గోతులను కంకరతో పూడ్చివేశారు.

## బటన్ నొక్కేది కార్యకర్తలే: అమర్

ప్రసంగిస్తున్న గుడివాడ అమర్‌నాథ్

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: మళ్లీ జగనే అధికారానికి వస్తే కార్యకర్తలే బటన్ నొక్కుతారని మాజీమంత్రి, జిల్లా వైకాపా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం ఆయన నర్సీపట్నం నియోజకవర్గ వైకాపా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. 2029 ఎన్నికల దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులు ఏకం కావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గణేష్, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు తదితరులు ప్రసంగించారు.

## తహసీల్దారుకు చెప్పుకొందాం రండి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: సెజ్‌కు మా భూములను ఇవ్వబోమంటూ ఈ నెల 16న 'తహసీల్దారుకు చెప్పుకుందాం రండి' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఆర్లి, చింతపాలెం, గరుగుబిలి, చౌడువాడ తదితర గ్రామాలను పర్యటించి రైతులను కలిశారు. ఈ కార్యక్రమంలో ఈర్లె నాయుడు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడు తదితరులు పాల్గొన్నారు.

చింతపాలెం రైతులతో కార్మిక సంఘాల నాయకులు

## కంప్యూటర్ ల్యాబ్ సిద్ధం

నాతవరం జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్మించిన కంప్యూటర్ లాబ్

నాతవరం, న్యూస్‌టుడే: జడ్పీ పాఠశాల విద్యార్థుల కంప్యూటర్ విద్య కోసం ఏర్పాటు చేసిన లాబ్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. పీఎం.శ్రీ పథకం ద్వారా సుమారు రూ.12 లక్షల అంచనా నిధులతో ఈ భవనాన్ని ఇక్కడి జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్మించారు. ఇందులో కంప్యూటర్లు తదితర పరికరాలు ఉంచనున్నారు. మండలంలో తొలివిడతగా నాతవరం, యర్రవరంలో మాత్రమే వీటికి అనుమతి వచ్చిందని, దీంతోపాటు క్రీడా ప్రాంగణాన్ని నిర్మిస్తున్నామని తుది దశ పనులు జరుగుతున్నట్టు హెచ్.ఎం.సత్యనారాయణ తెలిపారు.

(c) eenadu

# పెందుర్తి

**తెరపై ఈనాడు**

పెందుర్తి, న్యూస్‌టుడే

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - **సూపర్ మ్యాన్ (2డీ తెలుగు)**

స్క్రీన్-2 - **ఓ భామ.. అయ్యో రామ**

## అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజియోథెరపీ ఒకేషనల్ గ్రూప్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పీవీఎన్ మూర్తి తెలిపారు. అభ్యర్థులు ఫిజియో థెరపీ బీపీటీలో 55 శాతం మార్కులతో పాటు అనుభవం కలిగిన వారు ఇందుకు అర్హులని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి బయోడేటాతో ఈనెల 15న మధ్యాహ్నం 3 గంటల లోపు కళాశాల సమయాల్లో సంప్రదించాలన్నారు.

## ఇంటర్ స్టేట్ ఛాంపియన్ షిప్ పోటీల ప్రారంభం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గుల్లేపల్లి అక్షర పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఫస్ట్ ఇంటర్ స్టేట్ ఓపెన్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలను స్థానిక వైకాపా నాయకుడు గండి రవికుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అన్ని రంగాల్లో రాణించే సామర్థ్యం ఉంటుందని, దాన్ని పదును పెట్టినప్పుడే ఉన్నత భవితకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో నేతలు బోకం అప్పారావు, బోదువలస గ్రామ సర్పంచి నేబర్తి శ్రీనివాసరావు, యడ్ల నాయుడు, సరపరపు వాసు, ఎస్.కనకరాజు, కరాటే మాస్టారు బీవీ అప్పారావు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

**80085 74978** సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురం మరిడిమాంబ కాలనీ సమీప జి.వి.కాలనీలో తుప్పలు బాగా పెరిగిపోయాయి. పాముల సంచారం ఎక్కువగా ఉంది. **- మోహన్‌రావు, జి.వి.కాలనీ, పురుషోత్తపురం.** ✓: తుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో, జోన్-8.**

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలోని హైమాస్టు దీపాలు కొంత కాలంగా వెలగడం లేదు. కూడలిలో గుంతలతో పాటు చీకటి అలముకోవడంతో ప్రమాదాలబారిన పడుతున్నాం. **- రమేశ్, పరవాడ**

✓: హైమాస్టు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- ధర్మారావు, ఈవోపీఆర్డీ.**

## అన్నదాతలకు అండగా.. వ్యవసాయం లాభసాటిగా..

### పొలం పిలుస్తోంది పేరుతో శిక్షణ

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

పరవాడ, న్యూస్‌టుడే: అన్నదాతలకు అండగా నిలిచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు.. రైతులు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపుతూ సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ఇటీవల శ్రీకారం చుట్టింది. విత్తనం నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకు అన్నదాతలకు వ్యవసాయాధికారులు సలహాలు ఇస్తారు. విత్తన ఎంపిక, శుద్ధి, ప్రకృతి సేద్యం, రసాయన ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తారు. ఈ శిక్షణను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచిస్తున్నారు.

**వారానికి రెండు రోజులు:** నియోజకవర్గంలోని పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయాధికారులు ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తారు. మండల వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, జలవనరులు, మార్కెటింగ్, విద్యుత్తు శాఖ అధికారులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు ఒకే రోజు ఉదయం, సాయంత్రం రెండు గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శిస్తారు. వారంలో నాలుగు గ్రామాల వంతున నెలకు 16 గ్రామాల్లో ఇలా నాలుగునెలల పాటు కార్యక్రమం నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు.

**ప్రకృతి సాగుపై దృష్టి పెట్టేలా:** రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం, సేంద్రియ పంటలను ప్రోత్సహించడంతో పాటు శాస్త్రీయ పరిజ్ఞానం, వ్యవసాయ పథకాలు, అనుబంధ పంటల్లో సాంకేతికతపై అవగాహన కల్పిస్తారు. రైతులను ప్రకృతి సాగువైపు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. జీవామృతం, బీజామృతం వంటి కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్నారు. పొలం గట్లుపై కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు.

**నియోజకవర్గంలో..**

| మండలం | రైతులు |
|---|---|
| పరవాడ | 4535 |
| సబ్బవరం | 10522 |
| పెందుర్తి | 2808 |
| మొత్తం | 17865 |

## సిగరెట్ల విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్

ఓ దుకాణం వద్ద సిగరెట్ ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యాలయాల సమీపంలో సిగరెట్ల విక్రయంపై నిషేధం ఉన్న నేపథ్యంలో అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ హెచ్చరించారు. 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో ఆదివారం రాత్రి పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు విద్యాలయాల పరిసరాల్లో కిల్లీ బడ్డీలు, కిరాణా దుకాణాలను తనిఖీ చేసినట్లు సీఐ వివరించారు. ఆయా దుకాణాల్లో సిగరెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు సిగరెట్లను ధ్వంసం చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. విద్యాలయాలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు సంబంధిత పదార్థాల విక్రయం, వినియోగం నిషేధమని సీఐ పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామన్నారు. ఇకపై తరచూ ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు.

## వర్షాలు కురవాలని వరుణ దేవుడికి పూజలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గొర్లెవానిపాలేనికి చెందిన యువకులు వరుణ దేవుడి కరుణ కోసం కప్పల పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో నుంచి ఆడ, మగ కప్పలను కావడికి కట్టి ఊరేగించారు. 'కప్పా కప్పా నీలా డాలి పాడీ పంటా బాగుండాలి' అంటూ పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద బావి నీళ్లతో కప్పలకు స్నానం చేయించారు. ఈ సందర్భంగా సేకరించిన జోగు బియ్యాన్ని స్థానిక సూరికొండ చివర వరకు ఎక్కి అక్కడ పరమాన్నం వండి వరుణ దేవుడికి ప్రసాదం సమర్పించారు. మిగిలిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. వరుణుడు కరుణించి వర్షిస్తాడనే నమ్మకంతోనే ఆరేడు దశాబ్దాలుగా ఈ ఉత్సవాన్ని ఏటా ఆదివారం రోజునే నిర్వహిస్తామన్నారు. ఆ విధంగానే ఆదివారం సబ్బవరంలో వర్షం పడటం విశేషం.

కప్పలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

## అ వీ ఇ వీ

### సీతమ్మధారలో భారీ వర్షం

ఈనాడు, విశాఖపట్నం: నగరంలో ఆదివారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల వరకు సీతమ్మధారలో 34 మి.మీ., పెదవాల్తేరు 26.75, ధారపాలెం 20.5, పెందుర్తి 18, కొత్తపాలెం 17, జోగువానిపాలెం 16, గాజువాక 13.25, ఆరిలోవ 12, విశాఖ గ్రామీణం 11.25, మహారాణిపేట 10.75, పెదగంట్యాడ 10.25, సింహాచలంలో 9.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

### నేడు వేపగుంటలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ముత్యమాంబ కాలనీలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండిబాబ్జీ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పరవాడ, న్యూస్‌టుడే: అనకాపల్లి - తాడి రైల్వేస్టేషన్ మధ్య రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్‌పీ పోలీసులు ఆదివారం తెలిపారు. రైలు బలంగా ఢీకొట్టడం వల్ల తలకు, శరీర భాగాలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉంటాయని, ఎత్తు 5.4 అడుగులు ఉన్నాడని, పర్పుల్ కలర్ షర్టు, బ్లాక్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం పక్కనే సిల్వర్ కలర్ వాచ్ ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్సై కేదార్ లక్ష్మి తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని కోరారు.

### మహాసభల విజయవంతానికి పిలుపు

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: విజయవాడలో ఈనెల 17న నిర్వహించనున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎన్ఏడీలోని జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మహాసభల గోడపత్రిక ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు నమ్మి అప్పలరాజు మాట్లాడుతూ బీసీ మహిళలకు సబ్ కోటా, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వశాఖ, చట్టసభలతో పాటు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు, మండల కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## శ్రీరామ్‌నగర్ కాలనీలో చోరీ

వివరాలు సేకరిస్తున్న సీఐ మల్లికార్జునరావు

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జాతీయ రహదారి లంకెలపాలెం శివారు శ్రీరామ్‌నగర్ కాలనీలోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. దీనికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరామ్‌నగర్ కాలనీలోని ఒక అద్దె ఇంట్లో దొండార విమలకుమారి నివాసం ఉంటోంది. ఆమె శనివారం సాయంత్రం తలుపులకు తాళాలు వేసుకుని అదే కాలనీలో నివాసముంటున్న పెద్దకుమారుడు ఇంటికి వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం మరలా తిరిగి ఇంటికొచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు లోపలున్న బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలోని 4 తులాల బంగారు ఆభరణాలతో పాటు 20 తులాల వెండి వస్తువులు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితురాలితో మాట్లాడి వివరాలు సేకరించారు. క్లూస్‌టీమ్ చేరుకుని వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పక్కనే మరో ఇంటికి చెందిన తాళాలు దుండగులు పగులగొట్టినా అందులో ఏమీ పోలేదని స్థానికులు తెలిపారు.

## బస్సెక్కాలంటే అర కిలోమీటరు నడవాల్సిందే..!

పాపయ్యరాజుపాలెం(పెందుర్తి), న్యూస్‌టుడే: బీఆర్‌టీఎస్ రహదారిలోని సుజాతనగర్ - పురుషోత్తపురం మధ్య బస్టాప్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పరిసర కాలనీవాసులు వాపోతున్నారు. పాపయ్యరాజుపాలెం, సుజాతనగర్ దరి గోపాలకృష్ణనగర్ తదితర కాలనీల్లో సుమారు పది వేల మంది జనాభా నివసిస్తున్నారు. వీరంతా నగరానికి, పెందుర్తి వైపు వెళ్లాలంటే బస్సుల కోసం సుమారు అర కిలోమీటరు దూరం నడిచి సుజాతనగర్ కూడలికి వెళ్లాల్సి వస్తోంది. వృద్ధులు, విద్యార్థులు అంత దూరం నడిచి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాపయ్యరాజుపాలెం పెట్రోల్ బంకు సమీపంలో రిక్వెస్టు బస్టాపు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ శరత్‌బాబు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ఆ రూటులో రిక్వెస్టు స్టాపు ఏర్పాటుకు పరిశీలన చేస్తామని వివరించారు.

పాపయ్యరాజుపాలెం వద్ద ఆటోల కోసం వేచివున్న విద్యార్థులు, స్థానికులు

## మట్టిదారులతో నిత్యం అవస్థలు

ఫోకస్

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ సీ-1 జోన్ దరి రెడ్డి సేవా సంఘం మార్గంలో రహదారి అధ్వానంగా మారింది. ఈ ప్రాంతంలో జీవీఎంసీ నిర్మాణాలు ఊపందుకున్నాయి. బహుళ అంతస్తుల భవనాలతో పాటు వ్యక్తిగత గృహాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో బహుళ అంతస్తుల భవనాలున్నాయి. ఏళ్లుగా ఈ ప్రాంతానికి పక్కా రహదారి సౌకర్యం లేకపోవడంతో నివాసితులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మట్టి రోడ్డులోనే రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు కురిస్తే రోడ్లంతా బురదమయంగా మారి నడవడానికి వీలుకాని పరిస్థితి నెలకొంటోందని నివాసితులు వాపోతున్నారు. అధికారులు ఈ ప్రాంతంపై దృష్టిసారించి పక్కా రహదారులను నిర్మించాలని కోరుతున్నారు.

సీ-1 జోన్ నివాసాలకు వెళ్లే మార్గంలోని కూడలిలో మట్టి..

రెడ్డి సేవా సంఘం భవనం వద్ద..

## కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

కెఎస్‌పాలెం(పరవాడ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సుపరిపాలన అందుతోందని మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండిబాబ్జీ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధి కె.ఎస్.పాలెంలో ఆదివారం తెదేపా అధ్యక్షుడు పాల అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ, వచ్చే నెలలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నారన్నారు. ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రేలంగి చినతల్లి, వైదిరాజు దంపతులకు నలుగురు సంతానం. వీరందరికి తల్లికి వందనం పథకం లబ్ధి చేకూరిందని బ్యాంకు ఖాతాలో రూ.52 వేలు నగదు జమ అయిందని ఆమె సంతోషం వ్యక్తం చేయడంతో వారితో ఫొటో దిగారు. ఈనాం భూముల్లో ఇల్లు నిర్మించుకుంటే పట్టాలు, విద్యుత్తు మీటర్లు, కొళాయిలు ఇవ్వడం లేదని, ఎన్టీపీసీ, హిందుజా పవర్‌ప్లాంట్లకు చెందిన యాష్‌పాండ్స్ నుంచి బూడిద ఎగిరి గ్రామాల్లోకి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు బాబ్జీకి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం కలపాక, రావాడ గ్రామాల్లో పర్యటించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైలా జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, తెదేపా నాయకులు వియ్యపు చిన్నా, కన్నూరు వెంకటరమణ, నగిరెడ్డి చిన్నారావు, మంత్రి రవి, ఈర్ల సోమునాయుడు పాల నగేశ్, సర్వరే ఆలం తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం లబ్ధిదారురాలు చినతల్లి, ఆమె నలుగురు పిల్లలతో గండి బాబ్జీ

## ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

చింతగట్ల(వేపగుంట), న్యూస్‌టుడే: చింతగట్లలో రూ.కోట్లు విలువ చేసే 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ సభ్యుడు నందవరపు అప్పలరాజు, గనిశెట్టి కనకరాజు ఆదివారం డిమాండ్ చేశారు. ఆదివారం తెదేపా నాయకులు భూమిని పరిశీలించి మాట్లాడారు. ఈ భూమిని ఫ్రీహోల్డ్‌లో పెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఇది ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగానే ఉందని సర్వేయర్ ఓ వ్యక్తికి చెందిన భూమిగా ఎలా రిపోర్టు ఇచ్చారో వెంటనే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ స్థలాన్ని పేదలకు ఉపయోగించాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండిబాబ్జీ నేతృత్వంలో తాము పోరాటం చేస్తామన్నారు.

## జిల్లా వీఆర్వోల సంఘం బాధ్యతల అప్పగింత

సబ్బవరం, న్యూస్‌టుడే: జిల్లా వీఆర్వోల సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం సబ్బవరంలో జరిగింది. సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాధ రామకాసు, కార్యదర్శి అనంతరామయ్య హాజరయ్యారు. 13 సంవత్సరాలుగా పదవీ బాధ్యతలు చేపట్టిన సంఘం అధ్యక్షుడు రామకాసు జిల్లా వీఆర్వోల సంఘం బాధ్యతలను అసోసియేట్ అధ్యక్షుడు కె.రాజునాయుడుకు అప్పగించారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, శంకర్, నర్సింహులు, అనకాపల్లి డివిజన్ల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజునాయుడుకు జిల్లా వీఆర్వోల సంఘం బాధ్యతలు అప్పగిస్తున్న మాజీ అధ్యక్షుడు రామకాసు

## రహదారి నిర్మాణ పనుల పరిశీలన

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు వేపగుంట దరి వరలక్ష్మీనగర్‌లో నిర్మిస్తున్న బీటీ రహదారి పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదివారం పరిశీలించారు. నాణ్యత లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుత్తేదారుడికి సూచించారు. రహదారి నిర్మాణంతో వీఎంఆర్‌డీఏ కన్వెన్షన్ కేంద్రానికి, కొండపైన ఉన్న నివాసితులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

## హద్దు దాటితే పీడీ చట్టం ప్రయోగం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు హద్దు దాటితే పీడీ చట్టం ప్రయోగిస్తామని సీఐ కె.వి.సతీశ్‌కుమార్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర చరిత్రను విడిచిపెట్టి మంచి మార్గంలో నడవాలని సీఐ సూచించారు. నేరస్థులకు సహకరించినా, ఆశ్రయం కల్పించినా, పరిచయాలు కొనసాగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

## ముగిసిన క్రికెట్ పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి చినపాలెంలో ఆశ్రయ్ క్రికెట్ క్లబ్, చినపాలెం యూత్ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఎల్‌పీఎల్-5 క్రికెట్ పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. పోటీల్లో బీపీఆర్ జట్టు ప్రథమ, జీపీ వారియర్స్ ద్వితీయ, బీఎస్ఆర్ లెవెన్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.1 లక్ష, రూ.75 వేలు, రూ.30 వేలు నగదుతో పాటు జ్ఞాపికలను అతిథుల చేతులమీదుగా అందజేశారు. చివరిరోజు ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చిన 500 మంది ప్రేక్షకులకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు.

అతిథుల నుంచి బహుమతి అందుకుంటున్న విజేత బీపీఆర్ జట్టు

## వైభవంగా శ్రవణ నక్షత్ర పూజలు

అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట రవినగర్ సమీప శేషాద్రినగర్ శిఖరం పైగల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి జన్మతార శ్రవణ నక్షత్ర పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు నందమూరినగర్ కాలనీవాసులు మోహన్‌రెడ్డి, నందిని, సన్యాసిరావు, అనిత దంపతుల ఆర్థిక సహాయంతో అన్నప్రసాద వితరణ చేశారు.

## ఈ.భోనంగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

పరవాడ, న్యూస్‌టుడే: ఈ.భోనంగి ఫార్మాసిటీ పునరావాసకాలనీ కొండపై కొలువైన శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీహరి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. పంచామృత అభిషేకాలు, గోత్రనామాలతో అర్చనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

దేవతామూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

## ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండుగ

వరలక్ష్మీనగర్(వేపగుంట), న్యూస్‌టుడే: వరలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్యదైవం మరిడిమాంబ(పశువులమ్మ) అమ్మవారి మారువారం పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారి అనుపోత్సవం చేశారు.

అన్నప్రసాద వితరణలో పాల్గొన్న మరిడిమాంబ ఆలయ కమిటీ సభ్యులు

## సిరుల స్వామికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారమై.. సింహగిరిపై కొలువైన అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులు చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

## అప్పన్న సన్నిధిలో గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో ఆదివారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై ఆశీనులు చేశారు. తులసిదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవిందరాజ స్వామికి ప్రదక్షిణలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ వేడుక

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం జెడ్పీ పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ వేడుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వారంతా పాఠశాలలోని సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు ప్రారంభించారు. తమ కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను ఒకరినొకరు తెలుసుకున్నారు. అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు కె.వి.అప్పారావు, జగన్నాథం, శ్రీనివాస్‌లను సత్కరించారు. అనంతరం ఆటపాటల్లో మునిగితేలారు.

1997-98 పదో తరగతి విద్యార్థులు

## పిచ్చి మొక్కలకు ఆవాసంగా లారీ

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి రైల్వేస్టేషన్ రహదారిలోని ఓ శిథిల వాహనం పిచ్చి మొక్కలు, పాములకు ఆవాసంగా మారింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే కీలక రహదారిలో ఈ వాహనం 15 ఏళ్లుగా అక్కడే ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని పలువురు వాపోతున్నారు. పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ నేరానికి సంబంధించి 2010లో ఈ లారీని స్వాధీనం చేసుకుని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద రహదారి పక్కన ఉంచారు. ఆ వాహనం ప్రస్తుతం పూర్తి తుక్కుగా మారింది. లారీలో పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు పెరిగిపోయి పాములు, విష కీటకాలకు ఆవాసంగా మారింది. ఇదే ప్రాంతంలో సీహెచ్‌సీ, వెలుగు కార్యాలయం, వ్యవసాయ, విద్యాశాఖ మండల కార్యాలయాలున్నాయి. ఈ దారి గుండా రైల్వేస్టేషన్‌కు, తహసీల్దార్, విద్యుత్తు శాఖ కార్యాలయానికి వెళ్లాలి. ఇంతటి కీలకమైన రహదారిలో ఈ వాహనం ఉండటం వల్ల తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఈ వాహనాన్ని మరోచోటకు తరలించే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

లారీ వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

## విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలోని విద్యా వికాస కేంద్రాల నిర్వాహకుల శిక్షణ కార్యక్రమం ఆదివారం పెందుర్తిలోని కైట్స్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆవరణలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులు విద్యార్థులకు ఎలాంటి అంశాలపై తర్ఫీదు ఇవ్వాలి, ఏ విధంగా బోధించాలి అనే అంశాలపై రిసోర్స్‌పర్సన్లు అవగాహన కల్పించారు. శిబిరంలో కైట్స్ సంస్థ అధినేత గొర్లె రామునాయుడు పాల్గొని శిక్షణ పొందిన వారికి ధ్రువ పత్రాలు అందజేశారు. రాష్ట్ర ఎడ్యుకేషన్ ప్రాజెక్టు మేనేజర్ ప్రశాంత్, జిల్లా కోఆర్డినేటర్లు వనజ, గౌరీనాయుడు, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న నిర్వాహకులు, శిక్షకులు

(c) eenadu

# ఎట్టకేలకు ఏఎన్ఎంల బదిలీలు పూర్తి!

**అనంతపురం(వైద్యం),న్యూస్‌టుడే :** ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీల ప్రక్రియను ఎట్టకేలకు అధికారులు పూర్తి చేశారు. గత నెల 30న అర్ధరాత్రి వరకూ సదరు ఏఎన్ఎంల బదిలీల ప్రక్రియను జూమ్ ప్రక్రియ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్వహించారు. అయితే బదిలీల ఉత్తర్వులను విడుదల చేయకపోవటంతో సర్వత్రా విమర్శలు వ్యక్తం అయ్యాయి. బదిలీల ప్రక్రియలో రీడిప్లాయిమెంట్ కింద పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఇటీవల కాలంలో పదోన్నతులు పొంది శాఖలో విలీనం చేసిన ఏఎన్ఎంలకు సంబంధించిన పోస్టులను ఖాళీలను చూపకుండా గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీ ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలో గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఇచ్చిన బదిలీల ఉత్తర్వులను నిలుపుదల చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కేటాయించిన 340 పోస్టులకు సంబంధించి ఖాళీలను తొలగించి మిగిలిన పోస్టులకు బదిలీలు చేయాలని ఆదేశించారు. ఆదివారం ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 736 మందికి గ్రేడ్-3 ఏఎన్ఎంలకు జూమ్ పద్ధతి ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి 727 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీలు చేశారు. ఈప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఆందోళన చేపట్టారు. పోలీసులకు సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వటంతో వారు ఏఎన్ఎంలకు సర్ది చెప్పి పంపారు. డీఎంహెచ్‌వో కార్యాలయానికి తాళాలు వేసి అధికారులు జూమ్ ద్వారా కౌన్సెలింగ్‌ను కొనసాగించారు. స్పౌజ్ కింద ఇచ్చిన ఉద్యోగుల విషయంలో అక్రమాలు జరిగాయని ఏఎన్ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న ఖాళీలను చూపకుండా వారికి అనుచిత లబ్ధి చేకూర్చిన వారికి కేటాయించారని ఏఎన్ఎంలు ఆరోపిస్తున్నారు. అయితే బదిలీలు పారదర్శకంగా చేశామని, అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయచ్చని డీఎంహెచ్‌వో ఈబీదేవి, డిప్యూటి కలెక్టర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

ఈనాడు
అనంతపురం
సోమవారం జులై 14, 2025



## ఆకట్టుకున్న అయాం సాయిబాబా నాటకం

**పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన 'అయాం సాయిబాబా' నాటకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మూడురోజు ఆదివారం అమెరికా గ్లోబల్ కౌన్సిల్-1 సత్యసాయి భక్తులు ప్రశాంతి నిలయంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేద పఠనానంతరం అమెరికా బాలవికాస్ విద్యార్థులు సత్యసాయిబాబా జీవితంలోని కొన్ని ఘట్టాలను తీసుకుని ప్రదర్శించిన 'అయాం సాయిబాబా' నాటకం ఆహుతులను ఆకట్టుకుంది. మంగళహారతి అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు.

నాటకంలో ఓ సన్నివేశం

# మారని సంక్షేమ రూపురేఖలు

### విద్యార్థులకు ఆటంకం

అనంతపురం సాయినగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో పలు రకాల మరమ్మతు పనులకు రూ.16.20 లక్షలు మంజూరు అయ్యాయి. గత సంవత్సరంలోనే నిధులు మంజూరు అయ్యాయి. ఇప్పటికే ఏడు నెలలు కావొస్తోంది. ఇంకా పనులు చేయాల్సి ఉంది. మరుగుదొడ్లకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. వసతి గృహాల్లో ఇంకా పనులు సాగుతూనే ఉన్నాయి. విద్యార్థులకు వసతికి ప్రతిబంధకంగా మారింది. స్లాబుకు మరమ్మతులు చేయగా ఇటీవల మళ్లీ పెచ్చులు ఊడాయి.

### నిధులున్నా.. మొదలు కాని పనులు

**అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే:** బడులు మొదలై నెల పూర్తయింది. పిల్లలందరూ బడి బాట పట్టారు. కానీ సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతు పనులు నెలలు గడుస్తున్నా మెరుగు పడట్లేదు. మామూలుగా అయితే.. వేసవి సెలవులు పూర్తి అయి విద్యార్థులు వసతి గృహాల్లో చేరే సమయానికే ఇవి పూర్తి కావాల్సి ఉంది. కొన్నింటిలో పనులు ప్రారంభం కాలేదు. ఐదేళ్ల వైకాపా హయాంలో వసతి గృహాల్లో కనీసం సున్నం కొట్టడానికి కూడా నిధులు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వసతి గృహాల్లో రూపురేఖలు మార్చాలనే ఉద్దేశంతో నిధులు భారీగా మంజూరు అయ్యాయి. కానీ ఇచ్చిన నిధులను కూడా సక్రమంగా వినియోగించడంలో వైఫల్యం చెందుతున్నారు. వెలిసి పోయిన రంగులు, ఊడుతున్న పెచ్చులు వంటి సమస్యలు అలానే పీడిస్తున్నాయి.

| జిల్లా | మరమ్మతులు సంఖ్య | నిధులు రూ.కోట్లు | పూర్తి | అసంపూర్తి |
|---|---|---|---|---|
| అనంతపురం | 62 | 9.25 | 29 | 33 |
| శ్రీసత్యసాయి | 60 | 9.85 | 25 | 35 |

### ఏదీ అప్పటి చొరవ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనంతపురం జిల్లాలో 10 సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు, 1 రెసిడెన్సియల్ పాఠశాలకు రూ.1.34 కోట్లు నిధులు మంజూరు చేయగా వసతి గృహాల్లో అత్యవసరం అయిన మరమ్మతు పనులు వేగంగా చేశారు. రెండో విడతలో సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతు పనులపై చొరవ చూపడం లేదు. గుత్తేదారులకు బిల్లులు కాలేదన్న ఉద్దేశంతో పనులపై శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులకు వసతులు దూరమయ్యాయి.

## ఏ తీగ తెగినా ప్రమాదమే..

అనంతపురం నగరంలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారుతున్నాయి. తక్కువ ఎత్తులోనే కేబుల్, విద్యుత్తు తీగలు ఏర్పాటు చేస్తుండటంతో అల్లికలు మాదిరిగా ఉంటున్నాయి. పాదచారులు, వాహనదారులు, స్థానికులు భయపడుతున్నారు. టవర్ క్లాక్, గుల్జార్‌పేట, పాతూరులలో ఇవి ప్రమాదకరంగా మారుతున్నాయి. పెద్ద అనర్థం జరగక ముందే.. వీటి నిర్వహణ ఒక రీతికి తీసుకురావాల్సిన అవసరం ఉంది. **- ఈనాడు, అనంతపురం**

## చర్లపల్లి నుంచి ధర్మవరానికి ప్రత్యేక రైలు

**పీలేరు, ములకలచెరువు, న్యూస్‌టుడే:** చర్లపల్లి నుంచి ధర్మవరానికి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రైలు చర్లపల్లి నుంచి నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, శ్రీకాళహస్తి, రేణుగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లె, కదిరి మీదుగా ధర్మవరం వరకు నడుస్తుంది. ఈ నెల 13, 20, 27, ఆగస్టు 3, 10, 17, 24 తేదీల్లో చర్లపల్లి నుంచి ధర్మవరం వరకు, అలాగే ఈ నెల 14, 21, 28, ఆగస్టు 4, 11, 18, 25 తేదీల్లో ధర్మవరం నుంచి చర్లపల్లికి నడుస్తుంది.

# సొమ్ము వసూలు.. చెల్లింపుల్లో తకరారు!

**➠ వేరుసెనగ విత్తన బకాయి రూ.5.99 కోట్లు ➠ సిబ్బందిని రిలీవ్ చేయకుండా నిలుపుదల**

**అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే:** ''వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో పని చేసే వీఏఏ, వీహెచ్ఏ, ఏహెచ్ఏ, వీహెచ్ఏ సిబ్బంది బదిలీలు చేశారు. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత నెల రోజులుగా రాయితీ వేరుసెనగ, ఇతర విత్తనాల పంపిణీ కొనసాగుతోంది. ఒక్కో కేంద్రంలో ఎవరో ఒకరు మాత్రమే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రైతులతో సొమ్ము వసూలు చేసి విత్తనకాయలు పంపిణీ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థకు ఉమ్మడి జిల్లాలో సుమారు 6 వేల క్వింటాళ్లకు రూ.5,99,58,119 సొమ్మును సిబ్బంది చెల్లించాల్సి ఉంది. ఆ సొమ్ము వసూళ్ల కోసం ఏపీ సీడ్స్ అధికారులు రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.''

### పంపిణీకి ఆటంకం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 867 రైతు సేవా కేంద్రాల్లో 820 మంది సిబ్బందిని బదిలీ చేసి ఉత్తర్వులు జారీ చేశారు. సిబ్బంది బదిలీలతో విత్తన పంపిణీకి తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,14,510 క్వింటాళ్ల విత్తన వేరుసెనగ కేటాయించారు. 869 రైతు సేవా కేంద్రాలకు రాయితీ వేరుసెనగ విత్తనం కేటాయించి, ఏపీ సీడ్స్ ద్వారా సరఫరా చేశారు. ప్రస్తుతం కేంద్రాల్లో విత్తన పంపిణీ కొనసాగుతోంది. అయితే సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని తెలుస్తోంది. ఇప్పటి వరకు 93,595 క్వింటాళ్ల విత్తనం కావాలని 1,09,750 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో 92,256 క్వింటాళ్లను లక్షకు పైగా రైతులకు పంపిణీ చేశారు. ఆర్ఎస్‌సీల్లో ఇంకా సుమారు 8 వేల క్వింటాళ్ల వరకు వేరుసెనగ కాయల నిల్వలు ఉన్నట్లు ఏపీసీడ్స్ అధికారులు తెలిపారు.

### రైతు సేవా కేంద్రాల్లో..

రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ వాటా సొమ్ము సిబ్బందికి చెల్లించి వేరుసెనగ కాయలు తీసుకెళుతున్నారు. లక్ష క్వింటాళ్ల విత్తనానికి మొత్తం సొమ్ము రూ.59.52 కోట్లు. కాగా నాన్‌సబ్సిడీ మొత్తం రూ.53.52 కోట్లను ఆర్ఎస్‌సీ సిబ్బంది ఏపీసీడ్స్‌కు చెల్లించారు. ఇంకా 293 రైతు సేవా కేంద్రాలకు సంబంధించి 6 వేల క్వింటాళ్లకు రూ.5.99 కోట్లు చెల్లించాల్సి ఉంది.

### బకాయిలు చెల్లిస్తేనే సిబ్బందిని రిలీవ్ చేస్తాం

**- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారి (అనంతపురం)**

ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏపీ సీడ్స్ ద్వారా రాయితీ వేరుసెనగ విత్తనం సరఫరా చేశాం. ఏపీసీడ్స్‌కు నాన్‌సబ్సిడీ సొమ్ము రూ.5 కోట్ల వరకు పెండింగ్‌లో ఉంది. రైతు సేవా కేంద్రాల సిబ్బంది బదిలీల కౌన్సెలింగ్ పూర్తి అయ్యింది. అయితే సిబ్బందిని రిలీవ్ చేయొద్దని అన్ని మండలాల వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేశాం. నోడ్యూస్ సర్టిఫికెట్ ఇస్తేనే రిలీవ్ చేస్తామని చెప్పాం.

## శాస్త్రీయ సంగీతమే భారతీయ సంస్కృతికి పునాది

నృత్య ప్రదర్శనలో చిన్నారులు

**అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే:** శాస్త్రాలు కూడా తెలుపలేని భారతీయ సంస్కృతి సత్యాలను శాస్త్రీయ సంగీతం తెలుపుతుందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శ్రీనృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో స్థానిక టి.టి.డి కల్యాణమండపంలో ఆదివారం 'సంధ్యారవళి' జాతీయస్థాయి నృత్యప్రదర్శన జరిగింది. ఎంపీతో పాటు మాజీ మేయర్ మదమంచి స్వరూప, ఆచార్య సుధాకర్, డా. బాలకుమారి, ఎస్ఎన్ కేవీ జేఏసీ (సనాతన భారతీయ నృత్య విభాగ్ సంయుక్త కార్యాచరణ కమిటీ) అధ్యక్షుడు హైదరాబాద్ వాసి డా. పోతిని శ్రీనివాసరావు నృత్య ప్రదర్శనలను ప్రారంభించారు. ఉదయం నుంచి రాత్రి పదివరకు జరిగిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్, హిందూపురం, గుంతకల్లు, ధర్మవరంల నుంచి ఒక్కో శిక్షణాలయం, బెంగళూరు నుంచి రెండు, నగరంలోని ఆరు శిక్షణాలయాల నుంచి మొత్తం 170 మంది నర్తకీమణులు పాల్గొన్నారు.

నృత్యకారిణులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించి సన్మానిస్తున్న ఎంపీ, మాజీ మేయర్ స్వరూప



హెచ్చెల్సీలో నిలిచిన జలాలు

# సరిహద్దులో ఆగిన తుంగభద్రమ్మ!

**బొమ్మనహాళ్, న్యూస్‌టుడే:** తుంగభద్ర జలాశయం నుంచి ఈనెల 10న హెచ్చెల్సీకి విడుదల చేసిన నీరు ఆంధ్రా సరిహద్దులోని బొమ్మనహాళ్ వద్ద ఆగాయి. హెచ్చెల్సీలో అత్యవసరంగా సాగుతున్న మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ఆంధ్రా వాటా నీరు తీసుకోవడంలో జాప్యం ఏర్పడుతోంది. 117వ కిలోమీటరు వద్ద జరగుతున్న వంతెన నిర్మాణ పనులు పూర్తికాలేదు. జలాశయంలో గతేడాది 19వ గేటు కొట్టుకుపోవడంతో ఈసారి నీటి నిల్వను 80 టీఎంసీలకే పరిమితం చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని వెంటనే మరమ్మతులు పూర్తిచేసి నీటి సరఫరాను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో డీఈఈ దివాకర్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయన్నారు.

# రూ.200 కోట్లు ఖర్చైనా.. దప్పికపాట్లేనా?

**➠ గుంతకల్లులో ఐదురోజులకోసారి నీరు**
**➠ ఎప్పుడు పడితే అప్పుడు సరఫరా**
**➠ ప్రజలకు తప్పని అగచాట్లు**

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** గుంతకల్లు వాసులకు గతంలో కుళాయిల నుంచి 15 నుంచి 20 రోజులకోసారి తాగునీరు సరఫరా అయ్యేది. నీటి కోసం ప్రజలు నానా తిప్పలు పడేవారు. ప్రజల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కరించడానికి రూ.200 కోట్లకు పైన ఖర్చు చేసి తాగునీటి వనరులను కల్పించింది. ప్రజలకు రోజూ తాగునీటిని అందించడానికి అవసరమైన సౌకర్యాలున్నా వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడటంలో అధికారులు విఫలమవుతున్నారు.

### కుళాయిల వద్ద పడిగాపులు

నాలుగు, ఐదు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని కూడా కచ్చితమైన వేళల్లో సరఫరా చేయడం లేదు. కుళాయిలకు ఎప్పుడు వస్తుందో తెలియక నిరుపేదలు పనులకు వెళ్లకుండా వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

### అవసరమైన నిర్ణయాలు తీసుకుంటాం

**- భవానీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్**

మున్సిపాలిటీలోని ప్రజలకు రోజూ ఒకే సమయంలో తాగునీటిని అందించే విషయంపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటాం. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. తాగునీటి పైపులకు అంతర్గత కనెక్షన్ల ఏర్పాటుపై చర్చిస్తాం. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తోడ్పాటు ఇవ్వాలని కోరుతాం.

నీటి అవసరాల నిమిత్తం నిర్మించిన ఉపరితల ట్యాంకులు

- ★ పురపాలిక : గుంతకల్లు
- ★ జనాభా : 1.80 లక్షలు
- ★ ఎస్ఎస్ ట్యాంకులు : 2
- ★ ఉపరితల ట్యాంకులు : 17
- ★ కుళాయిల సంఖ్య : 40 వేలు
- ★ తాగునీటి పైపుల పొడవు : 350 కి.మీ.లు

### అంతర్గత కనెక్షన్ల ఏర్పాటులో విఫలం

గుంతకల్లులో తాగునీటిని కుళాయిల ద్వారా అందించడానికి మున్సిపాలిటీ పరిధిలో 17 ఉపరితల ట్యాంకులు నిర్మించారు. ప్రస్తుతం అధికారులు రోజూ నీటిని సరఫరా చేయకుండా నాలుగైదు రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. నీటిని సరఫరా చేసే సిబ్బంది జీత భత్యాలకు ప్రతినెలా రూ.14 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. రోజూ తాగునీటిని అందించాలన్న ఉత్తర్వులను అటకెక్కించారు. ఉపరితల ట్యాంకులకు చెందిన పైప్‌లైన్లను అనుసంధానం చేసి ఎస్ఎస్ ట్యాంకుల నుంచి నీటిని ఒకేరోజు నింపడానికి అంతర్గత కనెక్షన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోవైపు తాగునీటి పన్ను రూపంలో మున్సిపాలిటీకి ఖజానాకు ఏటా రూ.2 కోట్లకు పైన చేరుతోంది.

## ఎస్కేయూలో కొత్త కోర్సులు

**ఎస్కేయూ, న్యూస్‌టుడే:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో 2 కొత్త కోర్సులకు ప్రభుత్వం అనుమతిచ్చింది. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్- డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సులు ఈ విద్యా సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాతిపదికన ఈ కోర్సులు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే అమలులో ఉన్న కోర్సుల్లో సీఎస్ఈ, ఈసీఈ కోర్సులకు 60 సీట్లు ఉండగా అదనంగా మరో 60 పెంచినట్లు చెప్పారు. ఆయా కోర్సుల్లో ఇక నుంచి 120 సీట్లు భర్తీ చేస్తారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి ఐచ్ఛికాలు ఎంచుకోవాలని ప్రిన్సిపల్ విజ్ఞప్తి చేశారు.




(c) eenadu

రామకృష్ణ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న కవులు, రచయితలు

## గుత్తి రామకృష్ణ సేవలు చిరస్మరణీయం

**అనంత సాంస్కృతికం:** తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ పాత్రికేయుడు గుత్తి రామకృష్ణ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక కృష్ణ కళా మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రచయితలు, కవులు హాజరై రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. రచయితలు డా.గిరిధర్‌రాయ్, దాసన్నగారి కృష్ణమూర్తి, షేక్ రియాజుద్దీన్, డా. జూటూరు షరీఫ్ మాట్లాడుతూ.. జిల్లా చరిత్రలో గుత్తి రామకృష్ణది ప్రత్యేక అధ్యాయమన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడుగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా సంఘ సంస్కర్తగా, తొలితరం కథకుడుగా, జర్నలిస్టుగా సేవలు అందించారు. ఈ సందర్భంగా గుత్తి రామకృష్ణ స్మృతిలో అవార్డ్ కమిటీ ఎంపిక చేశారు. కుమారుడు ఆనంద వర్ధన్‌ను గౌరవాధ్యక్షుడుగా, కన్వీనర్‌గా తాత నాగరాజును తాత్కాలిక కమిటీగా ఎన్నుకున్నారు.

## వేలం లేదు.. వాహనం పనికి రాదు!

శ్రీకేపల్లి మండల పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన, ప్రమాదాలకు గురైన వాహనాలు మండల కేంద్రంలోని ఠాణాలో ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. ప్రమాదాలు, కేసుల్లో వాహనాలు పట్టుబడిన తరువాత పోలీసులు కేసు నమోదు చేసి వాటిని స్టేషన్ ఆవరణలో ఉంచారు. ఐదారేళ్ల నుంచి వాహనాలకు వేలంపాట నిర్వహించకపోవడంతో వాహనాలు తుప్పు పడుతున్నాయి. అవకాశం ఉన్నవాటికి వేలం పాట నిర్వహించడం లేదా సంబంధిత వాహనదారులకు అప్పగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఎస్సై సత్యనారాయణ దృష్టికి తీసుకుపోగా 55 వాహనాలు వివిధ కేసులకు సంబంధించి స్టేషన్ ఆవరణలో ఉన్నాయన్నారు. 17 అబ్కారీ కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు కాగా, మిగతావి ప్రమాద కేసులకు సంబంధించినవి అన్నారు. అబ్కారీ కేసులలో పట్టుబడిన వాహనాలకు ఉన్నతాధికారులకు నివేదించి రెండు నెలల్లో వేలం పాట నిర్వహిస్తామన్నారు. - న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

## రాళ్ల దారిలో ప్రయాణం కష్టం

వజ్రకరూరు నుంచి గుత్తికి వెళ్లే రహదారి ఇది. మొత్తం 28 కిలోమీటర్లు ఉంది. అందులో చింతలాంపల్లి వరకు దాదాపు 8 కిలోమీటర్లు కంకర తేలి పూర్తిగా శిథిలమయ్యింది. కల్వర్టుల వద్ద ప్రమాదకరంగా మారింది. అత్యవసర వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్నా కష్టమే. గత ఐదేళ్ల నుంచి 10 గ్రామాల ప్రజలు ఈ మార్గంలో రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. రోడ్డును బాగు చేస్తే ఉరవకొండ వైపు నుంచి గుత్తి, కర్నూలు, హైదరాబాద్‌కు వెళ్లేవారికి సుమారు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీనిపై మండల ఇంజినీరింగ్ అధికారి మణిభూషణ్‌ను వివరణ కోరగా.. రహదారి నిర్మాణానికి సంబంధించి ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు వివరాలు సేకరించినట్లు చెప్పారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

## గాలీవాన బీభత్సం.. రైతుకు నష్టం

కళ్యాణదుర్గం మండలంలోని ఎర్రంపల్లి గ్రామంలో గాలీవానకు మారుతి అనే రైతు సాగు చేసిన బీర పంట నేలవాలి రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. రెండెకరాల్లో రూ.3 లక్షల పెట్టుబడి పెట్టి పంట సాగు చేశారు. ఇప్పటి వరకు నాలుగు కోతలు పూర్తి అయ్యాయి. ఆదివారం గాలివానకు పంట మొత్తం నేలవాలి, కాయలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సోమవారం ఐదో కోత కోయాల్సి ఉంది. సుమారు 10 టన్నుల వరకు దిగుబడి వచ్చేది. మార్కెట్లో విక్రయిస్తే దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చేదని రైతు కన్నీరు పెట్టారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

## లక్ష్మీనరసింహస్వామీ మన్నించు!

ఆత్మకూరు మండల పరిధిలోని వై.కొత్తపల్లి గ్రామ సమీపంలో వెలసిన మలహోబుల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇందుకు ఈ చిత్రమే నిదర్శనం. శని, ఆదివారాల్లో వెయ్యికిపైగా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. అయితే లక్ష్మీనరసింహస్వామి విగ్రహం చుట్టూ భక్తులు రాళ్లు పేర్చారు. ఇలా చేస్తే తమ సొంతింటి కల నెరవేరుతుందని నమ్మకం. అక్కడే చెత్త పేరుకుపోయింది. ఉత్సవాల్లో స్వామిని ఊరేగించే రథం ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ దెబ్బతింటోంది. ఈ విషయంపై ఆలయ ఈవో దేవదాసును వివరణ కోరగా వెంటనే ఆలయంలో సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. - న్యూస్‌టుడే, ఆత్మకూరు

# ఔషధ కోర్సులు.. ఉపాధి, ఉద్యోగాలకు బాటలు

### ఓటీపీఆర్ఐలో త్వరలో ప్రవేశాలు

**జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే:** ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసీ పాత్ర కీలకం. జేఎన్‌టీయూ అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ (ఓటీపీఆర్ఐ) ఫార్మసీ కోర్సులను అందిస్తోంది. ప్రతిష్ఠాత్మకమైన ఈ ఔషధ విద్యాసంస్థలో అభ్యసించిన విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షలైన నైపర్ జేఈఈ, జీప్యాట్‌లో మంచి ర్యాంకులు సాధించారు. ఇందులో నూతన ఔషధ తయారీ, ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. నూతన ఔషధాల ఉత్పత్తి చేసిన మందులు మొక్కలు, జంతువులు, జలచరాలపై ప్రయోగిస్తుంటారు. ప్రస్తుత జీవన పరిస్థితుల్లో మధుమేహం, అధికరక్తపోటు, క్యాన్సర్ వంటి రోగాలు బాధిస్తున్నాయి. వాటి నివారణలో ఫార్మసీ నిరంతరం కృషి చేస్తోంది. 1950కి ముందు మన దేశంలో ఔషధాల్లో 90 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు. ప్రస్తుతం 90 శాతం ఔషధాలు విదేశాలకు మనదేశం నుంచి ఎగుమతి చేస్తున్నారు. ఫార్మసీ రంగం ఏ స్థాయిలో వృద్ధి చెందిందో ఊహించవచ్చు.

ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

### ఫార్మసీతో భవిష్యత్తు అవకాశాలు

● ఫార్మాస్యూటికల్ రంగంలో పరిశోధనలు, అభివృద్ధి, మార్కెటింగ్, రెప్రజెంటేటివ్‌లో అవకాశాలున్నాయి. డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి అర్హులు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫార్మసిస్టులుగా ఉద్యోగాలు. అకడమిక్ పరంగా బోధన, పరిశోధన, పరిపాలన రంగాల్లో అవకాశాలు ఉంటాయి. విదేశాల్లో కూడా ఉద్యోగావకాశాలు ఉన్నాయి.

### త్వరలో వసతి గృహాలు అందుబాటులోకి

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఫార్మసీ విద్యార్థులకు వసతి గృహాలు అందుబాటులోకి తెస్తున్నాం. నైపర్ జేఈఈ, జీప్యాట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. వారికి సీట్లు కేటాయించిన తరువాత ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించిన వారికి ప్రవేశాలు కల్పిస్తాం. ఆగస్టులో ప్రవేశాలు నిర్వహించే అవకాశముంది.
- ఆచార్య సుబ్బారెడ్డి, సంచాలకులు, ఓటీపీఆర్ఐ

| ఔషధ కోర్సులు | కాలపరిమితి | అర్హత | అందుబాటులో సీట్లు |
|---|---|---|---|
| బీఫార్మసీ | 4 సం॥ | ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ. | ఈఏపీసెట్ 100, ఈడబ్ల్యూఎస్‌కి 10 |
| బీఫార్మ్ (లాటరల్ ఎంట్రీ) | 3 సం॥ | డిప్లొమా ఇన్ ఫార్మసీ, ఈఏపీసెట్ | 10 |
| ఫార్మా-డీ | 6 సం॥ | ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఈఏపీసెట్ | 30 |
| ఎం ఫార్మసీ, అనలిస్ట్ | 2 సం॥ | బీఫార్మ్, పీజీఈసెట్ | 15 |
| ఎం ఫార్మసీ- ఫార్మాసూటికల్ | 2 సం॥ | బీఫార్మ్, పీజీఈసెట్ | 15 |

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

### ఆర్యఈడిగ ప్రతిభా పురస్కారాల ప్రదానంలో మాజీమంత్రి కేఈ ప్రభాకర్

**హిందూపురం, న్యూస్‌టుడే:** ప్రతిభా పురస్కారాలు అందుకొని ఆర్యఈడిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. జిల్లాలో గత సంవత్సరం పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన 133 మంది ఆర్యఈడిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు రూ.11లక్షల ప్రోత్సాహ మొత్తం, జ్ఞాపికలను మాజీమంత్రి అందజేశారు. ఆర్యఈడిగ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు రామకృష్ణప్ప అధ్యక్షతన ఆదివారం ఈడిగ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేఈ మాట్లాడుతూ వెనకబాటులో ఉన్న ఈడిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు విద్యలో రాణించేలా ప్రోత్సాహక బహుమతులు సంఘం అందించటం అభినందనీయమన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ లక్ష్యాన్ని నిర్ణయించుకొని సాధనకు కృషి చేయాలన్నారు. ఆర్య ఈడిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ రూ.లక్ష అందించటం, వచ్చే సంవత్సరం రూ.10లక్షల మొత్తం అందిస్తామని హామీ ఇవ్వటం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి, మాజీ మంత్రి ఈడిగ సంఘం హిందూపురం వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. సమావేశంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శేఖరగౌడ్, విజయ్‌కుమార్ సీనియర్ నాయకులు ఆదిమూర్తి, విశ్రాంత డీఈవో మునెయ్య, వేణుగోపాల్, నాగభూషణం, సంఘం మాజీ అధ్యక్షుడు దేవకేతేపల్లి వెంకటనారాయణప్ప, పుల్లారెడ్డి, సర్పంచి తిరుమలేశ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిన్నప్పయ్య, మాజీ కౌన్సిలర్ హరినాథ్‌గౌడ్, కౌన్సిలర్ మల్లికార్జున, సురేశ్‌కుమార్, రవీంద్రనాథ్, లక్ష్మీపతి, భాగ్యమ్మ, లక్ష్మీపతి, జిల్లాకు చెందిన ఆర్య ఈడిగలు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో కేఈ, సంఘం ప్రతినిధులు

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

**మీ బంగారం,** వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

EDUCATION

**అడ్మిషన్స్:** APNCET (నర్సింగ్ సెట్)లో క్వాలిఫై కానీ స్టూడెంట్స్‌కి B.Sc (MLT), BPT (ఫిజియోథెరపి)కి గవర్నమెంట్ సీట్స్‌కు అడ్మిషన్స్ జరుగుచున్నవి. Cont: G.Murali, 9030661651. అనంతపురం.

REAL ESTATE

PLOT FOR SALE

**ATP నుండి** తాడిపత్రి - NH 544D South, North Corner 3, 4 AHUDA approval Layout 66x106= 16 Cents Main Road Plots అమ్మకానికి కలవు. సెల్: 6303444456/ 9866782818.

JOBS

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

Wanted APTITUDE Trainer: Recuired Aptitude Trainer to Train Engineering Graduates, Experienced Candidates Preferred. Salary Negotiable for Deserving Candidates. Contact: Corporate Training (&) Placement Officer. 7799797555.

**ప్రముఖ రియల్** ఎస్టేట్ కంపెనీ బెల్ ఇన్‌ఫ్రా ATP నందు పనిచేయుటకు అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టార్గెట్‌తో పనిలేకుండా ఫిక్స్ జీతం ఇవ్వబడును. ATP. Cell: 9989452444.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు

8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

# సుబ్బారావుపేటలో వైకాపా వర్గీయుల అరాచకం

### పీర్ల ఊరేగింపులో ఎస్సీలు పాల్గొనకుండా అడ్డగింత

**ధర్మవరం, న్యూస్‌టుడే:** ధర్మవరం మండలం సుబ్బారావుపేటలో ఆదివారం పీర్ల ఊరేగింపులో ఎస్సీ కాలనీ వాసులు పాల్గొనకుండా స్థానిక వైకాపా వర్గీయులు అడ్డుకున్నారు. ఎస్సీ కాలనీ నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారిపై ముళ్ల కంచెను అడ్డుగా వేశారు. శనివారం రాత్రి ఆటోడ్రైవర్ బాలు పీర్ల చావిడి వద్దనున్న అగ్ని గుండంలోకి మొద్దులు వేసేందుకు తీసుకెళ్తూ డప్పు వాయిస్తున్న చిన్న గంగన్నను ఢీకొట్టాడు. మొద్దులు చిన్నగంగన్నకు తగలడంతో గాయపడ్డాడు. వైకాపా వర్గీయులు కోనప్ప, నంద, విజయ్, శశాంక్‌లు అక్కడికి చేరుకొని చిన్నగంగప్పను మందలించి అక్కడి నుంచి పంపించారు. ఆటోతో ఢీకొట్టడమే కాకుండా చిన్నగంగప్పను బెదిరించి పంపారని పీర్ల జలధిలో డప్పు కొట్టేందుకు ఎస్సీ కాలనీవాసులు నిరాకరించారు. దీంతో వైకాపా వర్గీయులు ఇతర ప్రాంతాల నుంచి డప్పు కొట్టేవారిని గ్రామానికి రప్పించారు.

ఎస్సీ కాలనీవాసులు గ్రామంలోకి రాకుండా అడ్డుగా వేసిన ముళ్లకంప

ఆదివారం పీర్లను తిలకించేందుకు ఎస్సీ కాలనీవాసులు వెళుతుండగా రావద్దంటూ వైకాపా వర్గీయులు బాలుతోపాటు మరి కొందరు రహదారికి కంచె అడ్డుగా వేశారు. గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారు, బీసీలను అడ్డుపెట్టుకొని తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఎస్సీ కాలనీకి చెందిన పెద్దిరాజు ఆరోపించారు. పోలీసులు ఉండగానే ఈ ఘటన జరిగిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు వారు చెప్పారు.

# ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

### 907 మంది విద్యార్థుల ఎంపిక

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఇందులో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, వికలాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80.. మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్కే వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తరగతులు 14 నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులు తమ లగేజీతో వచ్చి రిపోర్ట్ చేసి తరగతులకు హాజరుకావాలన్నారు.

● మొదటి దశ తరువాత మిగిలిన ఖాళీలను దృష్టిలో ఉంచుకుని అంతర్గత బదిలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా 384 మందికి లబ్ధి కలిగినట్లు వివరించారు. ఇప్పటి వరకు 4,340 మంది విద్యార్థుల ఎంపిక పూర్తి అయిందని తెలిపారు. ఇంకా 60 సీట్లు మిగిలి ఉండగా ఇందులో ఎన్‌సీసీ కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఈ సీట్ల ఎంపిక ఫలితాలను వచ్చే వారం విడుదల చేస్తామని రిజిస్ట్రార్ తెలిపారు.

# ఎమ్మెల్యే చొరవ.. దాతల సహకారం

**కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే:** జిల్లాలోనే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న కళ్యాణదుర్గం కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మౌలిక అవసరాలపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టి సారించారు. పాఠశాలలో ప్రధానంగా బాలుర మరుగు దొడ్లు, బాస్కెట్ బాల్ కోర్టు, వంట చేయడానికి, విద్యార్థులు కూర్చుని భోజనం చేయడానికి షెడ్లు నిర్మించాలని పాఠశాల సిబ్బంది ఇటీవల ఎమ్మెల్యేను కోరగా ఆయన స్పందించారు. తనకు పరిచయం ఉన్న వ్యక్తుల నుంచి సుమారు రూ.35 లక్షల ఆర్థిక సహకారం తీసుకుని పనులు ప్రారంభించారు. ప్రస్తుతం మరుగుదొడ్లు, బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. పాఠశాలలో ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి పనులు కొనసాగుతుండటంతో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు భోజనాలు చేయడానికి షెడ్డు నిర్మిస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

నిర్మాణంలో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టు

# సంతల ఆదాయం రూ.3.37 లక్షలు

**అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే :** అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ. 3,37,790 ఆదాయం వచ్చింది. అందులో గొర్రెలు, మేకల సంతలో రూ. 1,93,390 ఆదాయం రాగా, పశువుల సంతలో రూ. 1,44,400 ఆదాయం వచ్చిందని, వచ్చిన ఆదాయ మొత్తాన్ని సోమవారం ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

# ఆటోను ఢీకొన్న కేఎస్ ఆర్టీసీ బస్సు.. ఒకరి దుర్మరణం

**గార్లదిన్నె, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని కల్లూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు మహిళలు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహమ్మద్ హుస్సేన్(42) ఆయనతోపాటు ఉమాదేవి, మరియమ్మ ముగ్గురు లగేజీ ఆటో వాహనంలో అనంతపురం నుంచి వెళ్తుండగా కేఎస్ ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొనడంతో మహమ్మద్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరు మహిళలు గాయపడటంతో చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లగేజీ ఆటో రోడ్డు పక్కన నిలిపి ఉంచడంతో బెంగుళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న బస్సు ఢీ కొనింది. ఘటనా స్థలాన్ని ఎస్సై గౌస్‌బాషా పోలీసు సిబ్బంది సందర్శించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## టిప్పర్ ఢీకొని రైతు ..

శ్రీనివాసులు నాయక్

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఓ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన ముదిగుబ్బ మండలంలోని రామస్వామితండా ఆర్చ్ దగ్గర ఆదివారం చోటు చేసుకుంది. పట్నం ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు... రామస్వామితండాకు చెందిన శ్రీనివాసులునాయక్ (60) పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ముదిగుబ్బకు వెళ్తున్నాడు. ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం వైపు వెళ్తున్న టిప్పర్ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య తులసిబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కు మృతి చెందడంతో కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పట్నం పోలీసులు తెలిపారు.

## పాముకాటుతో ఒకరి మృతి

**బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే:** మండలంలోని నాగిరెడ్డిపల్లిలో కురుబ రామాంజిని(50) పాము కాటుకు గురై మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... కర్ణాటకలోని నాగసముద్రం గ్రామానికి చెందిన రామాంజిని పదేళ్లుగా బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లిలోని ఓ తోటలో కూలీగా పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి రామాంజిని షెడ్డులో నిద్రిస్తుండగా విషపు పాము కాటేసింది. వెంటనే స్థానికులు కళ్యాణదుర్గం ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామాంజిని ఆదివారం ఉదయం మృతిచెందినట్లు ఎస్సై నరేంద్రకుమార్ తెలిపారు.

# గుత్తి పరిసరాల్లో మూడు చోరీలు

**గుత్తి, న్యూస్‌టుడే :** గుత్తి శివారులోని అనంతపురం రోడ్డులో ఓ రైతు పొలంలో మోటారు చోరీకి గురైంది. గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి తోటలోని మోటారుతోపాటు పైపులను ఎత్తుకెళ్లారు. రైతు ఆదివారం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుత్తిలోని మురళీ అనే వ్యక్తి బంధువుకు చెందిన ఐచర్ వాహనం బ్యాటరీలను చోరీ చేశారు. అన్నపూర్ణ హోటల్ వెనుక కాలనీలో ఓ వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేదని బాధితులు వాపోతున్నారు.

# రాష్ట్రస్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ

**కదిరి, న్యూస్‌టుడే:** తిరుపతిలోని గిరిజన భవనంలో శని, ఆదివారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మాస్టర్ షేక్షావలి తెలిపారు. కదిరి నుంచి పాల్గొన్న తొమ్మిది మంది అత్యుత్తమ ప్రతిభతో రాణించారు. సెయింట్ థామస్ పాఠశాల డింబుశ్రీ, యశ్వంత్, రాజేశ్‌లు మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. వర్షిత తృతీయ స్థానంలో కాంస్య పతకం, బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు మనోహర్, విష్ణు తృతీయ స్థానంలో కాంస్య పతకం, నికిత ద్వితీయ స్థానంలో రజత పతకాలు సాధించారు. వీరితో పాటు నారాయణ పాఠశాల నుంచి ప్రజెంష్ ప్రథమ స్థానంలో బంగారు పతకం, నల్లచెరువు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి జయవర్ధన్ మొదటి స్థానంలో బంగారు పతకం పొందినట్లు ఆయన వివరించారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పతకాలు పొందిన విద్యార్థులతో మాస్టర్లు

## కేరళ నుంచి కశ్మీర్‌కు సైకిల్‌యాత్ర

**నల్లచెరువు, న్యూస్‌టుడే:** కేరళ రాష్ట్రంలోని కొట్టాయంకు చెందిన జోసన్ తన స్వగ్రామం నుంచి కశ్మీర్‌కు సైకిల్ యాత్ర చేపట్టారు. యాత్రలో భాగంగా ఆదివారం ఆయన నల్లచెరువుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో ప్రజల సంప్రదాయాలు, సంస్కృతులు, వాతావరణ పరిస్థితులను తెలుసుకునేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. గ్రామం నుంచి బయలుదేరి 9 నెలలైందని, ఇప్పటి వరకు 14 రాష్ట్రాలు తిరిగినట్లు చెప్పారు. ఇక్కడి ప్రజలు చూపుతున్న ఆప్యాయత మరువలేనని తెలిపారు.

యాత్రికుడు జోసన్

## వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి మృతి

**ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులు, స్వాతంత్ర సమరయోధులు, గుత్తి మాజీ ఎమ్మెల్యే వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ (100) ఆదివారం నగరంలోని ఒకటో రోడ్డు తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నాయకులు పార్వతమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సోమవారం ఉదయం పది గంటలకు స్వగృహం నుంచి అంతిమ యాత్ర స్థానిక గుత్తిరోడ్డులో ఉన్న హరిశ్చంద్ర ఘాట్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వీకే కుటుంబ సభ్యులు తెలిపారు.

పార్వతమ్మ

# పురాతన అచ్యుతదేవరాయల శాసనం గుర్తింపు

బసవన్నబావిలో శాసనాలు పరిశీలిస్తున్న చరిత్రకారుడు మైనాస్వామి

**పెనుకొండ, న్యూస్‌టుడే:** పెనుకొండ పట్టణంలోని బసవన్నబావిలో 1532 సంవత్సరం నాటి అచ్యుత దేవరాయల శాసనాన్ని గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి పేర్కొన్నారు. ఆదివారం విజయనగర సామ్రాజ్య కట్టడాలు, శిల్ప సంపదపై చేస్తున్న పరిశోధనలో భాగంగా కాశీవిశ్వేరాలయం ఎదురుగా ఉన్న బసవన్నబావిని సందర్శించినట్లు తెలిపారు. కన్నడభాషలో రాసిన ఆ శాసనంలో అనేక ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయన్నారు. విజయనగర సామ్రాజ్యాన్ని అచ్యుతరాయలు పరిపాలిస్తున్న సమయంలో కాశీవిశ్వేశరాలయానికి అనుబంధంగా ఓ మెట్లబావిని, ఉత్సవ మండపాన్ని నిర్మించారు. శాలివాహన శకవర్షం 1454 వైశాఖ శుద్ధనాడు, అనగా సామాన్యశకం 1532 ఏప్రిల్‌లో మెట్లబావిని తవ్వించినట్లు శాసనం ద్వారా తెలిసిందన్నారు. బావిలోకి దిగే మెట్లకు ఎడమవైపున శ్రీత్రయంబక శరణు అనే ఏక వాఖ్య కన్నడ శాసనం ఉందన్నారు. శాసనం వద్ద విజయనగర చిహ్నం సూర్యచంద్రులు, కత్తి, శివలింగం చెక్కారు. ఒకప్పుడు ఎంతో సుందరంగా ఉన్న బావి నేడు చెత్తాచెదారంతో కళావిహీనంగా మారిందని, ఇక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, బావిని అందంగా తీర్చిదిద్దాలని మైనాస్వామి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పరిశోధకుడు గోపి, శ్రీధర్ ఉన్నారు.

(c) eenadu

రాయదుర్గం
• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

## పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఓబయ్య

ప్రభుత్వ విప్ కాలవతో హనుమంతు, ఓబయ్య

**రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని 74 ఉడేగోళం ప్రభుత్వ ప్రాథమిక సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా తెదేపా సీనియర్ నాయకుడు బోయ ఓబయ్య ఎన్నికైనట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ ఎంబీఎస్ హనుమంతు ఆదివారం ప్రకటించారు. తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి ఇచ్చిన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు ఓబయ్య కృతజ్ఞతలు తెలిపారు. తెదేపా నాయకులు కదరంపల్లి సోమశేఖర్, మాజీ ఎంపీటీసీ పురుషోత్తం, సరాయి, నాగప్ప, గొల్లలదొడ్డి బాగూరప్ప పాల్గొన్నారు.

## అపూర్వ సమ్మేళనం

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిసరాల్లో సమావేశమయ్యారు. పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకుని సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు.

## దారులు ఇలా.. ప్రమాదాలు జరగవంటే ఎలా?

కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని దొడగట్ట బైపాస్‌లో వ్యాపారులు రోడ్డుపై వ్యర్థ పదార్థాలు పడేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలుపు వద్దే పెద్దపెద్ద దిబ్బగా వేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. ఈ విషయమై కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, పట్టణ సీఐ యువరాజు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించి సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. రోడ్డు పక్కన వ్యర్థ పదార్థాలు వేయకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

### రాణా పక్కనే చెత్తాచెదారం!

పోలీస్ స్టేషన్ పక్క నుంచి జెట్టిరెడ్డి పల్లి, ఓబుగానిపల్లి గ్రామాలకు వెళ్లే దారిని ఆనుకుని చెత్తాచెదారం వేస్తున్నారు. పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఈ ప్రాంతం డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఈ దారి నుంచి వెళ్లే కళ్యాణదుర్గం, పావగడ ప్రాంతాల ప్రజలు నిత్యం దీనిని దాటేసుకుని వెళ్లాల్సిందే. కార్యదర్శి మహేష్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తామన్నారు.

మలుపు వద్దే దిబ్బగా వ్యర్థాలు

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం, కంబదూరు

## ఉచిత కందుల పంపిణీలో గోల్‌మాల్!

● సంతకాలు చేయించుకుని విత్తనాలు ఇవ్వని అధికారులు ● అయిన వారికి ఎక్కువ మొత్తంలో పంపిణీ

**న్యూస్‌టుడే, శెట్టూరు**

శెట్టూరు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఉచిత కందుల పంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. కొందరు వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)లు కందులను ఉచితంగా కాకుండా నగదు ఇచ్చిన వారికి మాత్రమే ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ములకలేడు, చింతర్లపల్లిలో ఒక్కో ప్యాకెట్‌కు వీఏఏలు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. అధికారులకు కావాల్సిన వారికి నిబంధనలకు విరుద్ధంగా రెండు నుంచి పది ప్యాకెట్లు ఇస్తున్నారని, ఇదేంటని ప్రశ్నించిన వారితో వీఏఏలు దురుసుగా మాట్లాడుతున్నారని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### డిమాండ్ ఎందుకంటే?

ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు వ్యాపారులు, రైతులు స్థానిక భూములను కౌలుకు తీసుకుని పెద్ద మొత్తంలో కంది సేద్యం చేస్తున్నారు. వారికి విత్తనాలు అవసరం కావడంతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కందులకు డిమాండ్ ఏర్పడింది. కొందరు వీఏఏలు ఆ రైతులతో కుమ్మక్కైనట్లు స్థానిక అన్నదాతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శెట్టూరు మండలంలోని 13 రైతు సేవా కేంద్రాలకు పంపిణీ జరిగిన 35 క్వింటాళ్ల కందుల్లో సగానికిపైగా అక్రమ బాట పట్టాయని పలువురు వాపోతున్నారు.

ఇటీవల పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేస్తున్న రైతు గోపాల్

### రాణాలో విత్తనాల పంచాయితీ!

శెట్టూరు మండలం ములకలేడు రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న వీఏఏ విజయ్‌కుమార్ తనతో వేలిముద్ర వేయించుకుని రాయితీ కందులు ఇవ్వలేదని రంగయపాళ్యంకు చెందిన రైతు ఆర్.గోపాల్ ఇటీవల పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఇదే తీరులో మరో నలుగురితో వేలిముద్రలు వేయించుకుని విత్తనాలు ఇవ్వలేదని ఆయన ఆరోపించాడు. ఈ విషయమై ఏవో వాసుకీరాణి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ విత్తనాల పంపిణీలో కొన్నిచోట్ల అవకతవకలు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

న్యూస్‌టుడే, ఉరవకొండ, డి.హీరేహాళ్

?: ఉరవకొండలో ఓ మోస్తరు వర్షం పడినా చౌడేశ్వరి కాలనీకి వెళ్లే దారి, బీసీ సంక్షేమ కార్యాలయ పరిసరాల్లో వరద నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. అధికారులు స్పందించి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి. **-మోహన్, ఉరవకొండ.**

✓: నీరు నిలవకుండా శాశ్వత చర్యలు చేపడతాం. **-గౌస్‌సాహెబ్, కార్యదర్శి, ఉరవకొండ.**

?: డి.హీరేహాళ్ మండలం ఎం.హనుమాపురం నుంచి జజ్జులవడికి వెళ్లే దారిలో గుంతలు ఏర్పడి, రాళ్లు తేలడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **- మంజునాథ, ఎం.హనుమాపురం.**

✓: బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవగానే రోడ్డు పనులు మొదలు పెడతాం. **-సుధాకర్, పీఆర్‌జేఈ డి.హీరేహాళ్.**

?: పోలీస్ స్టేషన్ సమీపంలో బీసీ కాలనీ రావిచెట్టు మధ్యలో ఓ ఇనుప స్తంభం ఉండడంతో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ ప్రమాదం జరిగే అవకాశం ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. వెంటనే సరిచేయాలి. **-కాలనీవాసులు, డి.హీరేహాళ్.**

✓: ఆ స్థలాన్ని పరిశీలించి చెట్టు నుంచి స్తంభం తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **-ఖలీల్, లైన్‌మెన్ డి.హీరేహాళ్.**

## చింతర్లపల్లిలో తాగునీటి ఇక్కట్లు

**శెట్టూరు, న్యూస్‌టుడే:** శెట్టూరు మండలం చింతర్లపల్లిలో తాగునీటి సమస్యతో బాధపడుతున్నట్లు గ్రామస్థులు ఆదివారం వాపోయారు. గ్రామ సమీపంలోని పొలాలు, వ్యవసాయ తోటలు, రాధా స్వామి ఆశ్రమం నుంచి నిత్యం నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో ఐదు బోర్లు ఉన్నప్పటికీ ఒక్కటి సరిగా పనిచేయడం లేదని, నీళ్లు సరిగా రావడంలేదన్నారు. దీంతో వీధులకు తాగునీటిని వంతులవారీగా వదులుతున్నారు. శ్రీరామిరెడ్డి పథకం నీరు ఇంకా రాకపోవడంతో ఈ సమస్య మరింత జఠిలంగా మారిందన్నారు. గ్రామ కార్యదర్శి ఫక్రుద్దీన్, సర్పంచి గౌరమ్మ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ నీటి సమస్య తీర్చడానికి కృషి చేస్తామన్నారు.

తోటలో నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

## చీనీ చెట్లు నరికివేతపై కేసు

**వజ్రకరూరు:** తోటలో 13 చీనీ చెట్లు నరికివేయడంతోపాటు తన పొలాన్ని కౌలుకు చేస్తున్న వ్యక్తిని బెదిరించిన భీమ్లానాయక్‌పై చర్యలు తీసుకోవాలని వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురం కొట్టాల తండాకు చెందిన శాంతి బాయి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగస్వామి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**గుమ్మఘట్ట, న్యూస్‌టుడే:** పూలకుంట బస్టాండులో నిలబడి ఉన్న గోవిందు(45)ను ఆటో వెనుకనుంచి ఢీకొట్టడంతో రెండు కాళ్లు విరిగిపోయిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్సకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఎస్సై ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మధ్యవర్తిత్వ వారోత్సవాలపై విస్తృత చైతన్యం

**అనంతపురం ఆర్టీసీ, న్యూస్‌టుడే:** మధ్యవర్తిత్వ వారోత్సవాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు దేశం కోసం-మధ్యవర్తిత్వం వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అనంతపురం ఆర్టీసీ బస్టాండులో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది ప్రయాణికులకు కరపత్రాలు అందజేశారు.

## లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** పేదలకు సేవలు అందించడమే లయన్స్ క్లబ్ ముఖ్య లక్ష్యమని ఆ క్లబ్ జిల్లా మొదటి ఉప గవర్నర్ విరుపాక్షిరెడ్డి పేర్కొన్నారు. ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వేదమూర్తి, కోశాధికారిగా డాక్టర్ హర్షవర్ధన్ ప్రమాణ స్వీకార సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిభ కలిగిన యువతీ యువకులు, వృద్ధులకు సేవ కార్యక్రమాలు సమర్థంగా అందించాలన్నారు. నూతన సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఛైర్మన్ గణేశ్‌బాబు, ప్రతినిధులు ప్రభాకరనాయుడు, సత్యన్న, ఎన్‌సీ నాగభూషణ, సద్గురు మల్లికార్జున, బాలచంద్ర, నూర్ మహమ్మద్, నజీర్, జయకృష్ణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ జిల్లా మొదటి ఉప గవర్నర్ విరుపాక్షిరెడ్డి తదితరులు

## చెట్లు నరకవద్దని ర్యాలీ

**కుందుర్పి, న్యూస్‌టుడే:** పీర్ల చావిడిలో ఏర్పాటు చేస్తున్న అగ్నిగుండంలోకి పచ్చని చెట్లు కొట్టి వేయడం మానుకుని ఎండిన కట్టెలను మాత్రమే వేసి మొహర్రం జరుపుకోవాలని దినసోక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ట్రస్టు ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేరూరు కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** జీడిపల్లి-పేరూరు కాలువ పనులను వెంటనే పూర్తి చేసి సాగునీటిని అందించాలని సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌డీటీ పాఠశాలలో ఆదివారం సీపీఐ మండల సమావేశాన్ని నిర్వహించారు. పేరూరు కాలువకు ఎంతోమంది రైతులు భూములు ఇచ్చారని వారి ఖాతాల్లో వెంటనే నగదు జమ చేయాలన్నారు. పేరూరు డ్యాంకి నీరందిస్తే ఎంతోమంది రైతులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ, మండల కార్యదర్శి రామకృష్ణ, శివ, రామంజనేయులు, గోపాల్, చౌడప్ప, సరస్వతి, ఓబుళేసు పాల్గొన్నారు.

## కేవీకేలో ఆముదం విత్తనాల పంపిణీ

**కుందుర్పి, న్యూస్‌టుడే:** వర్షాధారమైన ఆముదం పంట సాగుకు కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విత్తనాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఏవో విజయ్‌కుమార్ తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో కేవీకే శాస్త్రవేత్త బాలాజిని సంప్రదించాలని కోరారు.

## పీర్లమకానంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని ఫిర్యాదు

**శెట్టూరు, న్యూస్‌టుడే:** శెట్టూరు మండలంలోని మాకొడికిలో పీర్లమకానంలోకి రాకుండా తలారి వన్నూరుస్వామి, మరి కొందరు అడ్డుకోవడంతో పాటు దాడి చేశారని బాధితులు, దళిత సంఘాల నాయకుడు గంగాధర్ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య మాటలు పెరగడంతో గొడవ కూడా జరిగింది. ఈ ఘటనపై ఎస్‌హెచ్‌వో గంగన్న 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఫిర్యాదు అందిందని, ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## మురుగు మార్గం.. మళ్లించరూ!

రాయదుర్గం పట్టణం శాంతినగర్‌లో జమ్మిచెట్టు పైభాగాన రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది.! దీంతో పాదచారులు, వాహన చోదకులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలో శమీవృక్షం దర్శనానికి వచ్చే భక్తులకు కూడా ఇక్కట్లు తప్పడం లేదు. రోడ్డు కింది భాగంలోని కల్వర్టులో పూడిక చేరడంతో మురుగు మీది నుంచి పారుతోంది. సంబంధిత అధికారులు దీనిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ రవీంద్ర 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కల్వర్టు కింది నుంచి ఉన్న కాల్వకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

## ఏడాదిన్నరగా ఇదే తంతు!

మండలంలోని వడ్డేపాళ్యం శ్రీ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గ్రామస్థుల దాహార్తి తీర్చేందుకు గతంలో ఏర్పాటు చేసిన చేతి పంపు...ఏడాదిన్నరగా నిరుపయోగంగా మారింది. దీనిని పట్టించుకునే వారే కరవయ్యారు. ఇప్పటికైనా చేతి పంపు మరమ్మతునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కుందుర్పి

## నాడు కళకళ.. నేడు వెలవెల

పట్టణంలోని గార్మెంట్ రంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నైపుణ్యం కలిగిన కార్మికులను తయారు చేసేందుకు గతంలో ఏర్పాటు చేసిన కామన్ ఫెసిలిటీ సెంటర్(సీఎఫ్‌సీ) ప్రస్తుతం వెలవెలబోతోంది. అయిదేళ్ల వైకాపా పాలనలో దీనిని పట్టించుకోకపోవడంతో భవనాలు, కుట్టు యంత్రాలు మూలకుపడ్డాయి. రూ.కోటి వ్యయంతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. వెలుగు ప్రాంతీయ సమన్వయకర్త గోవిందప్పను వివరణ కోరగా కేంద్రాన్ని ప్రారంభించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

## కూలనున్న ప్రహరీ!

రాయదుర్గం పట్టణం శాంతినగర్‌లోని చంద్రబాబు నాయుడు పార్కు ప్రహరీ పునాది కూలడానికి సిద్ధంగా ఉంది. రాళ్లు కిందకు పడిపోవడంతో కాలువలో అడ్డుగా మారాయి. పార్కు లోపల సచివాలయం కూడా ఉండటంతో నిత్యం ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ముందు భాగంలో ప్రహరీ కూలడంతో లోపలికి పశువులు వచ్చి పచ్చికను పాడు చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రహరీ కూలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కమిషనర్ దివాకర్ రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కాలువల నిర్మాణంతోపాటు ప్రహరీ పటిష్ఠతకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం**

## ఇళ్లపై తీగలు... ఆందోళనలో ప్రజలు

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో చాలాచోట్ల విద్యుత్తు స్తంభాలు లేవు. దీంతో ప్రజలు తీగలను కర్రలు, చెట్ల కొమ్మల మీది నుంచి తీసుకెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో స్థానికులు ప్రమాదాల నివారణకు తీగలకు కర్రలు ఊతంగా పెట్టారు. ఈదురు గాలులు, వర్షం కురిసినప్పుడు తీగలు ఒకదానికొకటి రాసుకుని నిప్పు రవ్వలు ఎగిసి పడతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే వేలాడుతున్న తీగలు సరిచేయడంతోపాటు అవసరమైన చోట్ల స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటిపై నుంచి వెళ్లిన తీగలకు కర్రలే ఆధారం

### సమస్య పరిష్కారానికి కృషి: రఘు, ఏఈ

ఈ కాలనీల్లో సింగిల్ ఫేస్ విద్యుత్తు తీగలున్నాయి. వాటిని త్రీ ఫేస్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. అవసరమైతే స్తంభాలు ఏర్పాటు చేస్తాం.

## శ్రీరామిరెడ్డి నీటి పథకం పైపులకు మరమ్మతులు

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** మూడు నెలలుగా సమ్మెలో ఉన్న శ్రీరామిరెడ్డి పథకం సిబ్బంది రెండు రోజుల నుంచి నీటి పంపిణీ చేస్తుండటంతో ప్రధాన పైపులైన్ల లీకేజీలు బయట పడుతున్నాయి. ముఖ్యంగా ఉప్పొంక, కంబదూరు, చెర్లోపల్లి, జంబుగుంపల గ్రామాల సమీపంలో లీకేజీలను సిబ్బంది గుర్తించి తక్షణం మరమ్మతులు చేస్తున్నారు. ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్‌ఈ సురేశ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పైపులకు మరమ్మతులు చేయిస్తున్నామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

కంబదూరులో మరమ్మతు చేస్తున్న కార్మికులు

## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

**బొమ్మనహాళ్, న్యూస్‌టుడే:** తెదేపాతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు మురళి, లేపాక్షి, కెంచప్ప, కాశీం, ప్రేమకుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉంతకల్లులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో వారు ఇంటింటికీ తిరుగుతూ ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. పలు పత్రాలు పంపిణీ చేశారు. రైతులకు గిట్టు ధరలు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంతకల్లులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మహిళలు, తెదేపా నాయకులు


నివాళి అర్పిస్తున్న తెదేపా నాయకులు

## చిరస్మరణీయుడు లక్కా చిన్నపరెడ్డి

**కణేకల్లు, న్యూస్‌టుడే:** తుంగభద్ర హెచ్చెల్సీ జలాలు కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలకు తీసుకురావడంలో విశేష కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే లక్కా చిన్నపరెడ్డి సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఆదివారం నిర్వహించిన లక్కా చిన్నపరెడ్డి జయంతి వేడుకల్లో పలువురు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి నిర్మలసోమన్న, నిర్వాహకుడు కృష్ణారెడ్డి, తెదేపా నాయకులు ఆనందరాజు, చంద్రశేఖరగుప్తా, రమేశ్, నాగభూషణ, నాగప్ప, గోపాల్, వేణు, వెంకటేశులు పాల్గొన్నారు.

## ఇంటింటా సూర్యోదయం

■ ఇప్పటికే 553 రిజిస్ట్రేషన్లు పూర్తి
■ 50 ఇళ్లకు సౌర పలకల ఏర్పాటు

విద్యుత్తు వినియోగదారుల విద్యుత్తు బిల్లులను తగ్గించటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం 'సూర్యఘర్ పథకం' తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఇళ్ల పైకప్పులపై సౌర పలకలు ఏర్పాటు చేసుకునే వారికి రాయితీలు కల్పిస్తోంది. దీనిపై విద్యుత్తు శాఖాధికారులు పీఎం సూర్యఘర్ పథకంపై జోరుగా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఎక్కువ మంది సౌర పలకల ఏర్పాటుకు ముందుకొస్తున్నారు. బ్యాంకులు సైతం లక్ష్యాల మేరకు రుణాలు అందజేయనున్నాయి. సౌర పలకలు అమర్చేందుకు పలువురు నిరుద్యోగులు వెండర్లుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం

### డివిజన్‌లో 553 రిజిస్ట్రేషన్లు

నియోజకవర్గంలో ఇప్పటి వరకు 553 మంది సౌర పలకల ఏర్పాటుకు ముందుకొచ్చారు. బెంగళూరు, గుజరాత్, హైదరాబాద్‌ల నుంచి సౌర పలకలు రావాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి డిమాండ్ ఏర్పడటంతో కంపెనీలు పూర్తిస్థాయిలో అనుకున్న సమయానికి వీటిని సరఫరా చేయలేకపోతున్నాయి. ఇప్పటివరకు నియోజకవర్గంలో 50 ఇళ్లు, వ్యాపార దుకాణాలపై సౌర పలకల ఏర్పాటు పూర్తయింది.

| మండలం | రిజిస్ట్రేషన్లు | సౌర పలకాల ఏర్పాటు |
|---|---|---|
| రాయదుర్గం | 216 | 40 |
| బొమ్మనహాళ్ | 214 | 2 |
| డి.హీరేహాళ్ | 67 | 3 |
| గుమ్మఘట్ట | 56 | 5 |

నేమకల్లులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఈ శ్రీనివాసులు నాయుడు

### ఎస్సీ, ఎస్టీలకు ఉచితం

'సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' కింద ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఒక్కో ఇంటిపై రెండు కిలోవాట్ల సౌరవిద్యుత్తు పలకలు ఏర్పాటు చేస్తారు. ఇందుకయ్యే వ్యయంలో 65 శాతం కేంద్రం, 45 శాతం రాష్ట్రం భరిస్తుంది. రాష్ట్ర వాటాను డిస్కంలు రుణంగా తీసుకుని.. వాయిదాలను ప్రభుత్వమే చెల్లిస్తుంది. సౌర విద్యుత్తు ప్యానళ్ల ద్వారా నెలకు 200ల యూనిట్లు ఉత్పత్తి కాగా.. వంద యూనిట్లు సొంతానికి వాడుకుంటే మిగతా 100 యూనిట్లకు రూ.2.00 చొప్పున ప్రభుత్వం ఇచ్చి కొనుగోలు చేస్తుంది. దీని ద్వారా వినియోగదారుడికి ఉచిత విద్యుత్తుతోపాటు కొంత ఆదాయం రానుంది.

### గ్రామాల్లో ప్రచారం

**- శ్రీనివాసులు నాయుడు, డీఈ, రాయదుర్గం సబ్‌డివిజన్**

పీఎం సూర్యఘర్ పథకంపై గ్రామాల్లో ఇప్పటికే ప్రచారం చేస్తున్నాం. డివిజన్‌లో 553 మంది దరఖాస్తు చేసుకోగా.. 50 ఇళ్లకు పలకలు బిగించాం. పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించిన వారికి వెంటనే తగు ఏర్పాట్లు చేస్తున్నాం.

## రోడ్డు కోత.. ప్రజలకు వెత!

**బొమ్మనహాళ్, న్యూస్‌టుడే:** మండలంలోని కల్లుదేవనహళ్లి నుంచి సంగమేశ్వరాలయం మీదుగా శింగానహళ్లి గ్రామానికి వెళ్లే రోడ్డు మూడేళ్ల కిందట 'వేదవతి హగరి నది' వరదకు కోతకు గురైంది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారికి నేటికీ కనీస మరమ్మతులు కూడా చేయలేదు. గతేడాది అక్టోబర్, నవంబర్‌లో 'వేదవతి హగరికి నది' ఉద్ధృతికి కల్లు దేవనహళ్లి వద్ద ఒడ్డు, శింగానహళ్లి గ్రామానికి వెళ్లే రోడ్డు మరింత భారీగా కోతకు గురైంది. దీంతో శింగానహళ్లి, బెణకల్లు, గోనేహాళ్, శ్రీధరఘట్ట, బ్రహ్మసముద్రం గ్రామాలకు వెళ్లే ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం నదిగుండా ఇసులో రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శింగానహళ్లి ప్రజలు ఉరవకొండ, బొమ్మనహాళ్, బళ్లారి, అనంతపురం, గుంతకల్లు వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు.

కల్లుదేవనహళ్లి వద్ద కోతకు గురైన రోడ్డు

### మరమ్మతులకు ప్రతిపాదనలు

**- జగదీశ్, పీఆర్ ఇంజినీరు**

వేదవతి హగరికి నది ఉద్ధృతికి కల్లు దేవనహళ్లి వద్ద శింగానహళి గ్రామం రోడ్డు కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవగానే తగిన మరమ్మతులు చేయిస్తాం.

**మహారాజశ్రీ గా॥ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు: ఉరవకొండ**
**O.S. No. 128/2023**
బిట్‌వీన్:
K.చెన్నమ్మ ... వాది
మరియు
వడ్ల నాగమంజునాథ ఆచారి ... ప్రతివాది
**ప్రతివాదికి సమను**
To
**వడ్ల నాగమంజునాథ ఆచారి,** తండ్రి: విశ్వరూప ఆచారి, డోర్ నం: 10-6-129, రంగావీధి, ఉరవకొండ గ్రామం, పోస్టు & మండలం. అనంతపురం జిల్లా.
ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పై కేసులోని వాది గారు ప్రాంసరి నోటు బాకీ రాబట్టుకొనుటకు ప్రతివాది గారిపై దావా వేయటం జరిగింది. నీ హాజరు నిమిత్తం వాయిదా తేది: 24-7-2025న వున్నది. ఆదినం నీవు స్వయంగా కానీ లేదా లాయరు ద్వారా కానీ హాజరై ఏమైనా ఆక్షేపణలున్నయెడల తెలుపుకోవచ్చును. అట్లుకాని యెడల కేసు నీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.
**కోర్టు ఉత్తర్వుల మేరకు**
ఉరవకొండ,
వాయిదా తేది: 24-07-2025
Y.లక్ష్మీనారాయణరెడ్డి, వాదిపరం వకీలు, ఉరవకొండ

(c) eenadu

# గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

## 'పరామర్శల పేరుతో శాంతి భద్రతలకు విఘాతం'

**బుక్కరాయసముద్రం:** వైకాపా అధినేత జగన్ పరామర్శల పేరుతో రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్నారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ఆరోపించారు. ఆదివారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గత నెలలో గుంటూరు జిల్లాలో పరామర్శల పేరుతో కారు ప్రమాదంతో నిండు ప్రాణం బలిగొన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తాజాగా చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల పరామర్శ పేరుతో మామిడికాయలను ట్రాక్టర్లతో తొక్కించి ఆనందం పొందారన్నారు. దీనికితోడు బందోబస్తుగా వచ్చిన పోలీసు అధికారులపై బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. తెదేపా నాయకులు చెన్నమయ్య, నారాయణస్వామి, కుళ్లాయప్ప, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** గుంతకల్లు పట్టణం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పురపాలిక ఉన్నత పాఠశాలలో 25 ఏళ్ల కిందట పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. గురువులు చంద్రశేఖర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, నారాయణస్వామి, సూర్యం, మస్తానప్ప, వీరభద్రగౌడ్, రామాంజనేయులు, నాగరాజు తదితరులకు పాదపూజ చేశారు. కార్యక్రమం పూర్వ విద్యార్థులు తిమ్మప్ప, వన్నూరప్ప, అశోక్, రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

### మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

**సమస్య:** గుంతకల్లులో భాగ్యనగర్‌లో ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో పైపులైన్ లీకేజీ ఏర్పడి నీరు వృథా అవుతోంది.
- మోహన, భాగ్యనగర్

**సమాధానం:** పైపులైన్‌కు మరమ్మతుల చేయిస్తాం.- **సుదర్శన, ఏఈ, గుంతకల్లు**
- న్యూస్‌టుడే గుంతకల్లు పట్టణం

**సమస్య:** నార్పల మేజర్ పంచాయతీలోని కూత లేరు వాగులో మురుగునీరు భారీగా నిలిచింది.-**కుళ్లాయప్ప, నార్పల**

**సమాధానం:** పంచాయతీ సిబ్బంది సాయంతో కాలువలు వాగును శుభ్రం చేయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.
- **శైలజారాణి,ఈవోఆర్డీ**
- న్యూస్‌టుడే నార్పల

**సమస్య:** నాగులగుడ్డం నుంచి గంపమల్లయ్య స్వామి దేవాలయం వరకు రోడ్డు వేయాల్సి ఉంది. ప్రజాప్రతినిధులు అనేక సార్లు హామీలు ఇచ్చారు. అయినా పట్టించుకోవడం లేదు. - **నాగశేషయ్య, చిన్నజలాలపురం**

**సమస్య :** తరిమెల ప్రధాన కూడళ్లలో మురుగు నిల్వ ఉంటోంది. - **ప్రణీత్‌కుమార్**

**సమాధానం :** ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. - **భాస్కర్, ఎంపీడీవో**
- న్యూస్‌టుడే శింగనమల

**సమస్య :** యాడికిలోని ఓంశాంతి, సాయిబాబా ఆలయాల సమీపంలో వీధి దీపాలు వెలగడం లేదు. - **స్థానికులు**

**సమాధానం:** ఎలక్ట్రీషియన్‌ను పంపి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
- **శశికళ, డిప్యూటీ ఎంపీడీవో**
- న్యూస్‌టుడే యాడికి

## రైల్వే జంక్షన్ అందాలు ఆవిరి!

● రూ.కోటితో ఫౌంటెన్ ● ఏడాదిగా నిరుపయోగం

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** గుంతకల్లుకు చెందిన ప్రజలే కాకుండా వివిధ ప్రాంతాలకు వెళ్లే రైలు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే రైల్వే జంక్షన్ రోజూ బోసిపోయి ఉంటోంది. నాలుగేళ్ల కిందట అధికారులు రైల్వే జంక్షన్‌లో రూ.12 కోట్లతో భవనాలు నిర్మించారు. ఇందులో భాగంగా జంక్షన్‌కు అందాన్ని, ప్రజలకు ఆనందాన్ని పంచడానికి రూ.కోటితో ఫౌంటెన్ నిర్మించారు. ఇది రాత్రిళ్లు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని అందించేది. వీరితోపాటు ఇక్కడ సేదతీరడానికి పట్టణానికి చెందిన ప్రజలు వారి కుటుంబాలు, పిల్లలు వచ్చేవారు. అంతేకాకుండా వారు ఎంతో ఉత్సాహంతో ఛాయాచిత్రాలు తీసుకుని మురిసిపోయేవారు. ఇక్కడ ఉన్న అందాల కారణంగా కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల కిందట గుంతకల్లు రైల్వే జంక్షన్‌కు దేశస్థాయిలో ప్రథమ స్థానాన్ని అందించి ప్రశంసాపత్రాలు అందజేసింది. ఇలాంటి ఫౌంటెన్ ప్రస్తుతం మరుగునపడింది.

పని చేయని ఫౌంటెన్

### పని చేయని విద్యుత్తు మోటార్లు

ఫౌంటెన్‌కు చెందిన విద్యుత్తు మోటార్లు పని చేయడం లేదు. ఫలితంగా ఫౌంటెన్‌కు చెందిన పైపులు, ఇతర పరికరాలు తుప్పు పట్టి పాడైపోతున్నాయి. గతంలో లాగా పట్టణ ప్రజలకు స్టేషన్ వినోదాన్ని అందించలేక పోతోంది. సాయంత్రం పట్టణ ప్రజలతోనే కాకుండా ప్రయాణికులతో కళకళలాడే స్టేషన్ ప్రాంగణం బోసిపోతోంది.

● డివిజన్, జోనల్ అధికారులు తరచూ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్నా ఫౌంటెన్ పునరుద్ధరణ విషయం పట్టించుకోవడం లేదు. అధికారులు వెంటనే వినియోగంలోకి తెచ్చి ఆహ్లాదాన్ని అందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● ఫౌంటెన్ గురించి సంబంధిత ఇంజినీర్లను వివరణ కోరగా అవసరమైన నీటిని అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. విద్యుత్తు విభాగానికి చెందిన వారు మోటార్లకు మరమ్మతులు చేయాల్సి ఉందని, ఈవిషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

## దిమ్మగుడిలో మొహర్రం ప్రశాంతం

**పెద్దవడుగూరు, న్యూస్‌టుడే :** ఫ్యాక్షన్ గ్రామం దిమ్మగుడిలో 30 ఏళ్ల తర్వాత జరిగిన మొహర్రం కార్యక్రమం ఎట్టకేలకు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొదటికే మొహర్రం కార్యక్రమం వద్దని ఆంక్షలు పెట్టిన పోలీసు యంత్రాంగం గ్రామ పెద్దలకు షరతులతో కూడిన అనుమతులు ఇవ్వడంతో ఆర్వై మంది పోలీసు బలగాలతో కార్యక్రమాన్ని ప్రశాంతంగా కొనసాగించారు. ఆదివారం జలధి కార్యక్రమం ఉండగా సాయంత్రం అగ్నిప్రవేశం చేసే సమయంలో ఎద్దులపల్లి పీరు గుండంలో పడిపోగా వెంటనే అక్కడున్న భక్తులు అప్రమత్తమై పైకిలేపడంతో ప్రమాదం తప్పింది. ఎస్పీ ఆదేశాల మేరకు తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కు మార్‌చౌదరి ఆధ్వర్యంలో సీఐ రామసుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతోనే మొహర్రం కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

అగ్నిగుండంలో ప్రవేశం చేస్తున్న పీరు

గ్రామస్థులు సీఐ రామసుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుళ్లను ఘనంగా సత్కరించారు.

### జలధికి తరలిన పీర్లు

**గార్లదిన్నె గ్రామీణం :** కమలాపురం, గుడ్డాలపల్లి, రామదాసుపేట గ్రామాల్లో మొహర్రం సందర్భంగా ఆదివారం పీర్ల స్వాములు జలధికి తరలివెళ్లాయి. ఉదయం పీర్లను అగ్నిగుండం ప్రవేశం చేయించారు. అలాగే సాయంత్రం జలధికి తీసుకెళ్లారు.

## రక్షణ గోడ నిర్మాణం

**గుత్తి, న్యూస్‌టుడే:** పట్టణంలోని షాలోము నగర్‌లో మురుగు కాలువ వద్ద సిమెంట్‌రోడ్డు కోతకు గురై కూలిపోవడంతో పురపాలిక అధికారులు ఎట్టకేలకు రక్షణ గోడ నిర్మించారు. రోడ్డు కోతకు గురై రాకపోకలకు ఇబ్బందిగా నేపథ్యంలో రెండు నెలల కిందట 'ఈనాడు' ప్రచురించిన కథనానికి కమిషనర్ జబ్బార్‌మియా స్పందించారు. నిధులు కేటాయించి రక్షణ గోడను నిర్మించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చేశారు.

## 'రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోంది'

కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, న్యూస్‌టుడే :** రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి అనే రెండు లక్ష్యాలతో ప్రజా పాలన సాగుతోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శింగనమల మండలం నాయనవారిపల్లిలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనపై వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పనుల గురించి చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు అందించిన సంక్షేమం గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకాపా అరాచక పాలనను పారదోలి కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. మండల పార్టీ కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలుంటే చెప్పండి

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** తాడిపత్రి పుర ప్రజలకు ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని గాంధీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ఆప్యాయంగా పలకరించారు. ఈకార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాడిపత్రిలో.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

### కూటమి ప్రభుత్వాన్ని ఆదరించండి

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని తెదేపా పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, యాదవ కార్పొరేషన్ డైరెక్టరు మస్తాన్ యాదవ్, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. పార్టీ నాయకులు ఆదివారం పట్టణంలోని వివిధ కాలనీల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలు ముద్రించిన కరపత్రాలను పంచారు. తెదేపా నాయకులు హనుమంతు, లక్ష్మయ్య యాదవ్, మోహన్ యాదవ్, రుద్రముని తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లులో.. ఇంటింటి ప్రచారంలో తెదేపా నాయకులు

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడిపత్రి: నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** మున్సిపాలిటీల్లో పని చేసే ఇంజినీరింగ్ కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర అవస్థలు పడుతున్నారని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు సమ్మె చేస్తూ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పురపాలికల్లో పని చేస్తున్నా చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయలేదని, ఎలాంటి పదవీవిరమణ ఫలాలు అందించలేదన్నారు. వీటిని వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాల కింద ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి ఆధ్వర్యంలో వారికి మద్దతు ప్రకటించారు.

### ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**గుత్తి, న్యూస్‌టుడే :** తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఆదివారం గుత్తిలోని పురపాలిక కార్మికులు ఆందోళన చేశారు. ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు కార్యాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని ధర్నా చేశారు. తరువాత పట్టణంలో ర్యాలీగా సాగారు. నాయకులు రాము, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## కాలు కోల్పోయిన ప్రయాణికుడు

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** రైలు ప్రమాదంలో ఓ ప్రయాణికుడు కాలు కోల్పోయిన ఘటన గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. బెంగళూరులోని ఓ దాబాలో పనిచేసే నగేశ్ (25) ప్రమాదంలో గాయపడినట్లు రైల్వే ఎస్ఐ మహేంద్ర చెప్పారు. ఇతను కదిలే రైలును ఎక్కుతూ అదుపుతప్పి కింద పడడంతో ఎడమకాలు పూర్తిగా దెబ్బతినిందన్నారు. కర్ణాటకకు చెందిన ఇతను తన స్వగ్రామం చెప్పలేని పరిస్థితిలో ఉన్నాడన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించి తరువాత అనంతపురం ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ వివరించారు.

## బాధిత కుటుంబానికి సాయం

**నార్పల, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని బొందలవాడకు చెందిన వైకాపా కార్యకర్త నారాయణ కుటుంబానికి వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి రూ.20 వేల ఆర్థికసాయం చేశారు. నారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నారు. దీంతో ఆయన చికిత్స ఖర్చుల కోసం ఆర్థికసాయం అందించానన్నారు.

## తిలక్‌నగర్‌లో పెట్రోల్ చోరీ

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే :** గుంతకల్లులో తిలక్ నగర్‌లో మదీన్ మసీదు లైన్ లోపల వీధిలో ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం నుంచి ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం వేకువజామున సీసాలోకి పెట్రోల్ తీసుకుంటున్నట్లు స్థానిక సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. స్థానికులు గమనించి సీసీ ఫుటేజీలను పరిశీలించగా పెట్రోల్ దొంగతనం చేస్తుండేది రికార్డు అయింది. పట్టణంలో ఇళ్ల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల నుంచి రాత్రి సమయాల్లో పెట్రోల్‌ను చోరీ చేస్తున్నారని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల గస్తీతో నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

### జన ఔషధ దుకాణానికి మోక్షమెన్నడో?

గుంతకల్లు స్టేషన్‌తో పాటు అనంతపురం రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ కేంద్రాలను ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. వీటిని ఒకటిన్నర నెల రోజుల కిందట ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. రెండు దుకాణాలను అద్దెకు తీసుకున్న గుత్తేదారు వాటిని తెరవడంలో ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, గుంతకల్లు

### ఆరుబయటే వంటావార్పు

గుత్తిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ వారు వంటావార్పును ఆరుబయటే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వంట గదిని నిర్మించలేదు. కళాశాలలో మొత్తం 350 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేదు. ఈక్రమంలో ఆహార పదార్థాలపై దుమ్మూధూళి పడుతోందని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వంట గదిని నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గుత్తి

### ట్రాక్టరు ఇచ్చారు.. ట్రాలీ మరిచారు

మండలంలోని పెనకచెర్ల, ఇల్లూరు గ్రామాల్లో చెత్త సేకరణకు ప్రభుత్వం గతేడాది నవంబరులో రెండు ట్రాక్టర్లు మంజూరు చేసింది. ట్రాలీ లేకపోవడంతో నాటి నుంచి అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకొచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఇల్లూరు పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డిని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ట్రాలీ వచ్చిన వెంటనే వినియోగంలోకి తెస్తామన్నారు.

– న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం

## యాడికి ప్రధాన కాలువలో పూడికతీత

**పెద్దవడుగూరు, న్యూస్‌టుడే :** పెద్దవడుగూరు మండలం నుంచి యాడికి మండలానికి వెళ్లే ప్రధాన కాలువలో పూడిక పేరుకుపోవడంతో తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి చొరవతో పూడికతీతకు మోక్షం కలిగింది. ఆదివారం ఇక్కడి ప్రధాన కాలువ నుంచి యాడికి కాలువలో పొక్లెయిన్ల సాయంతో పెరిగిన కంపచెట్లతోపాటు పూడిక, జమ్ముగడ్డిని తొలగించి సాగునీరు నేరుగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు. ఈకార్యక్రమాన్ని యాడికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య ఆధ్వర్యంలో కొనసాగించారు. పలువురు నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

కాలువలో పొక్లెయిన్లతో సాగుతున్న పనులు

## భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల జాతర

పెద్దపప్పూరు : అశ్వర్థనారాయణస్వామి

**యాడికి:** రాయలచెరువులో రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారికి మేళతాళాల నడుమ బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

యాడికి : బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

### అశ్వర్థ ఆలయంలో విశేష పూజలు

**పెద్దపప్పూరు:** మండలంలో ప్రసిద్ధి గాంచిన అశ్వర్థ ఆలయంలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అశ్వర్థ నారాయణస్వామి, చక్రభీమలింగేశ్వరస్వామి వారికి వేద పండితులు అభిషేక పూజలు, అర్చనలు చేశారు.

### సుబ్రహ్మణ్యేశ్వరుడికి క్షీరాభిషేకం

**గార్లదిన్నె గ్రామీణం:** కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకొని ఉదయం అర్చనలు, క్షీరాభిషేకాలు, ఆకు పూజ చేసి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కోటంక: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఎగువపల్లి : గాలెమ్మ అమ్మవారు

### నేత్రపర్వంగా గాలెమ్మ ఉత్సవం

**గార్లదిన్నె గ్రామీణం:** పంటలు బాగా పండాలని, ప్రజలందరినీ చల్లగా చూడాలని భక్తులు గాలెమ్మ అమ్మవారిని వేడుకున్నారు. ఎగువపల్లి గ్రామంలో వెలసిన గాలెమ్మ అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఏటా ఆషాఢ మాసం మూడో ఆదివారం జాతరను ప్రజలంతా కలిసి మెలిసి జరుపుకొంటారు.

## 'పెద్దారెడ్డి తాడిపత్రికొస్తే అడ్డుకుంటాం'

**తాడిపత్రి, న్యూస్‌టుడే :** పెద్దారెడ్డి తాడిపత్రి వస్తే అరచకాలు జరుగుతాయని మున్సిపల్ కౌన్సిలర్ జింకా లక్ష్మీదేవి పేర్కొన్నారు. తాడిపత్రిలోని జేసీ నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత వైకాపా పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నో అరాచకాలు చేశారన్నారు. పలుమార్లు మీడియా ముందే తాను అధికారంలోకి రాకపోయినా వచ్చినా ఫ్యాక్షన్ చేస్తానని హెచ్చరించారన్నారు. ఆయన్ను తాడిపత్రికి రాకుండా పట్టణ ప్రజలతో వెళ్లి అడ్డుకుంటామన్నారు. వైస్‌ఛైర్మన్ తలారి అరుణ, కౌన్సిలర్లు రేష్మాపర్వీన్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## తల్లి చెంతకు కుమారుడు

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** మతిస్థిమితం సక్రమంగా లేక ఇంటి నుంచి బయటకు వచ్చి రైలులో వెళ్తున్న ఓ యువకుడిని గుంతకల్లు రైల్వే పోలీసులు పట్టుకుని ఆదివారం తల్లికి అప్పగించారు. అనంతపురానికి చెందిన మహేశ్ (19) ఇంటి నుంచి అనంతపురం రైల్వే స్టేషన్‌కు వచ్చి బెంగళూరు నుంచి దిల్లీ వెళ్లే కర్ణాటక ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కాడు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో గుర్తించారని ఎస్ఐ మహేంద్ర చెప్పారు. యువకుడి నుంచి వివరాలు సేకరించి విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. తల్లి రావడంతో కుమారుడిని అప్పగించామని ఆయన పేర్కొన్నారు.

## చెంద్రాయిని కుంట ఆయకట్టు రైతుల్లో ఆనందం

**గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే:** గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఆయకట్టు రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి చొరవతో వారి కష్టాలు తీరనున్నాయి. గుత్తి మండలంలోని చెర్లోపల్లి పరిధిలో ఉన్న చెంద్రాయిని కుంట వద్ద ప్రస్తుతం ముళ్లపొదల తొలగింపు, పూడికతీత పనులు, షెల్టర్ మరమ్మతులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దీనిపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురించడంతో కాలువను శుభ్రం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆయకట్టు రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని పనులు చేయిస్తోంది. చాలా మంది రైతులకు అవస్థలు తప్పనున్నాయి.

● ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రూ.7 లక్షలకు పైగా నిధులు వెచ్చించి దాదాపు నాలుగు కిలోమీటర్ల పొడవున కాలువ మరమ్మతులు చేస్తున్నారు. ఐదేళ్లగా సాగునీటిని విడుదల చేసే షెల్టర్ మరమ్మతులకు గురి కావడంతో నీరు వృథా అయింది. వాటి మరమ్మతులు చేయిస్తున్నారు.

ముళ్లపొదలు, పూడిక తీసిన తరువాత ఇలా..

చెంద్రాయిని కుంట మరమ్మతులు చేయడంతో ఆయకట్టులోని దాదాపు 2వేలకు పైగా రైతులకు సాగునీరు అందనుంది. దీంతో రైతుల ఐదేళ్ల కల సాకారం కానుంది. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కార్యాలయం ఒక చోట.. విధులు మరోచోట

**గుత్తి, న్యూస్‌టుడే :** గుత్తి మండల ఇంజినీర్‌కు కేటాయించిన గది ఎప్పుడూ మూతపడి ఉంటోంది. మండల ఇంజినీర్ తనకు కేటాయించిన గదిలో ఉండటం లేదు. ఇంజినీర్ పంచాయతీరాజ్ డీఈఈ కార్యాలయంలోనే ఉంటున్నారు. ఆయన అక్కడే ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మండల పరిషత్తు కార్యాలయంలో విధులు నిర్వహించక పోతుండటంతో సర్పంచులు, గుత్తేదారులు ఇబ్బందులు పడుతున్నారు. తమకు ఇంజినీరింగ్ అధికారి అందుబాటులో లేరని వాపోతున్నారు. ఇప్పటికైనా ఎంపీడీవో కార్యాలయంలో ఇంజినీరుకు కేటాయించిన గదిలోనే విధులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో మూతపడిన ఇంజినీర్ గది

## 'స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దు'

**బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండు చేశారు. ఆదివారం పార్టీ నాయకులతో కలసి కరపత్రాలు విడుదల చేశారు. ట్రూ అప్‌ఛార్జీలు, ఇతర ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్తు మీటర్లను కొనసాగించాలన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం వేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. సీపీఎం నాయకులు కుళ్లాయప్ప, నాగేంద్ర, నెట్టికంఠయ్య, చెన్నప్ప, సాలమ్మ, పెద్దన్న పాల్గొన్నారు.

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** ప్రజలపై విద్యుత్తు ఛార్జీల భారం వద్దని, స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గుంతకల్లులో ట్రావెల్స్ బంగ్లా సర్కిల్‌లో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు, పట్టణ కమిటీ నాయకులు క్యూఆర్ కోడ్ ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. సీపీఎం నాయకులు మారుతీప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకులు

(c) eenadu

# అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

## స్కూల్‌బ్యాగుల వితరణ

స్కూల్ బ్యాగ్ అందుకున్న చిన్నారులు

**అనంత సాంస్కృతికం:** నగరంలోని ఆజాద్‌నగర్ ఆదరణ సేవా సమాజ్ ట్రస్ట్ వారు ఆదరణ సేవా హోంలో ఆదివారం స్కూల్ బ్యాగ్‌ల వితరణ చేశారు. నగరంలో పలు స్వచ్ఛంద సేవలందించే చంద్రయాన్ సేవా సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ సారథ్యంలో హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, భారతి దంపతుల ఆర్థిక సహకారంతో వితరణ జరిగింది. ఆదరణ సేవా హోం నిర్వాహకులు లాల్‌బాషా, ముంతాజ్, హోం విద్యార్థులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామి వారికి అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారికి విశేష పల్లకీ సేవ, సర్ప కవచసేవ, రథోత్సవ సేవలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# బయట ఏం తినాలన్నా వణుకే!

**● హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల్లో శుచి, శుభ్రత లేని ఆహారం ● ఆకస్మిక తనిఖీలో వెల్లడి**

**అరవిందనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే:** నగరంలో పలు హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల్లో నిబంధన ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతోంది. కొందరు నిర్వాహకులు అనుమతి పత్రం తీసుకోకుండానే ఆహారం విక్రయిస్తున్నారు. ఆందోళన కలిగించే విషయం ఏమంటే.. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణం అది. కక్షిదారులు కోర్టుకు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ప్రాంగణంలో హోటల్ నిర్వహిస్తున్న గుత్తేదారుడు అనధికారికంగా ఆహార పదార్థాలు విక్రయిస్తున్న తీరును రెండ్రోజుల కింద ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలో గుర్తించారు.

✤ హోటల్లో వంటగదిలో శుచి, శుభ్రత లోపించిన వైనం, ఆహార పదార్థాలను పాత్రలో నిల్వచేయకుండా గాలికి వదిలేసిన నిర్వాహకుల నిర్లక్ష్యంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శీతల పెట్టెలో నిల్వ చేసిన, చెడిపోయిన వెజ్ బిర్యానీ విక్రయిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు లోపించిన వంటగదులు, ఆహార పదార్థాలను శుభ్రంగా ఉంచడంలో నిర్వాహకుల నిర్లక్ష్యం తనిఖీలో వెలుగు చూశాయి.

హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఆహార భద్రత అధికారిణి తస్లీమ్

✤ లైసెన్స్ తీసుకోవడంపై అవగాహన కలిగిస్తున్నాం. ఏడాదికి రూ.12 లక్షలు వ్యాపార లావాదేవీలు కలిగిన వారు ఆన్‌లైన్లో రూ.100లు రుసుము చెల్లించి అనుమతి తీసుకోవాలని నిబంధన ఉంది. అపరిశుభ్ర వాతావరణం ఉంటే హెచ్చరికలు జారీ చేస్తున్నాం. నిబంధనలు అతిక్రమించిన హోటళ్ల నిర్వాహకులకు తాఖీదులిస్తున్నాం. నాసిరకం, హానికర ఆహార పదార్థాలు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. నగరంలో నాలుగు హోటళ్లలో తనిఖీలు చేసి, ఆహార పదార్థాల నమూనా సేకరించి నాణ్యత పరీక్షకు పంపించాం. అని ఆహార భద్రతా అధికారిణి తెలిపారు.

### తాఖీదులిచ్చాం..

ఈరిబాబు బిర్యానీ సెంటర్లో, (శ్రీనగర్‌కాలనీ) చికెన్ దమ్ బిర్యానీ, పిస్తా హౌస్‌లో వెజ్ బిర్యానీ నమూనాలను నాణ్యత పరీక్షకు ప్రయోగశాలకు పంపించాం. అనుమతి పత్రం (లైసెన్స్) తీసుకోకుండానే ఆహార పదార్థాలు విక్రయిస్తున్న కోర్టు ప్రాంగణంలోని క్యాంటీన్ గుత్తేదారుడికి, సాయినగర్లోని కేవీఎస్‌సీ కేక్ హౌస్ నిర్వాహకుడికి తాఖీదులు జారీ చేశాం.

**- తస్లీమ్, ఫుడ్ సేఫ్టీ తనిఖీ అధికారిణి**

బోనాలతో చిన్నారులు, మహిళలు

## చౌడేశ్వరీదేవికి బోనాలు

**అనంత సాంస్కృతికం:** నగరంలో పలు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవానికి భక్త జనం తరలివచ్చారు. ఆషాఢ మాసం మూడో ఆదివారం జగజ్జననికి ప్రీతి పాత్రమైన రోజని భక్తుల విశ్వాసం. ఆర్టీసీ బస్టాండ్ ఎదురు సందులోని ఖాజానగర్‌లో ఊరేగింపుగా చౌడేశ్వరీమాత ఆలయం వద్దకు బోనాలు తీసుకువచ్చారు.

అలంకరణలో అమ్మవారు

## పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు డిమాండ్

**రుద్రంపేట, న్యూస్‌టుడే:** పార్లమెంటులో ప్రత్యేక రాయలసీమ కోసం ఆర్టికల్ 3 ప్రైవేట్ బిల్లు ప్రవేశ పెట్టాలని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎన్జీఓ హోమ్‌లో జరిగిన ప్రత్యేక రాయలసీమ రాష్ట్రమా.. లేదా కేంద్ర పాలిత ప్రాంతమా.? అనే నినాదంతో 2029 లోపు డిక్లేర్ చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ ప్లీనరీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. కుంచం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సీమ వాసులకు దళిత బంధు, రైతు బంధు పేరుతో ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కేటాయించాలన్నారు. సీమలో పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సీమ ప్రాంతాలకు పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటు చేసి వెనకబడిన ఇక్కడి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

మాట్లాడుతున్న రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి

## పేరూరు కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయండి

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** జీడిపల్లి-పేరూరు కాలువ పనులను వెంటనే పూర్తి చేసి సాగు నీటిని అందించాలని సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌డీటీ పాఠశాలలో ఆదివారం సీపీఐ మండల సమావేశాన్ని నిర్వహించారు. పేరూరు కాలువకు ఎంతోమంది రైతులు భూములు ఇచ్చారని వారి ఖాతాల్లో వెంటనే నగదు జమ చేయాలన్నారు. పేరూరు డ్యాంకి నీరందిస్తే ఎంతోమంది రైతులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ, మండల కార్యదర్శి రామకృష్ణ, శివ, రామాంజనేయులు, గోపాల్, చౌడప్ప, సరస్వతి, ఓబుళేసు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ హాస్టల్‌కు నూతన అధ్యక్షుడు

ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

**అనంత సాంస్కృతికం:** నగరంలోని బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహం నూతన అధ్యక్షుడిగా మొదటి రోడ్డు శివాలయం అనువంశికుడు హోమియో రామసుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో రామసుబ్రహ్మణ్యాన్ని అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారి సుందరేశం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రామచంద్ర జోషి, శరదిందు, ప్రధాన కార్యదర్శిగా సంధ్యావందనం బద్రీనాథ్, కోశాధికారిగా పాణ్యం శ్రీధర్, సహాయ కార్యదర్శులుగా కరణం సత్యనారాయణ, వెంకటనారాయణ, ఎక్స్ అఫిషియో సభ్యుడుగా సుంకేశుల సత్యనారాయణలతో పాటు పలువురు సలహాదారులు, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

## ముక్కు మూసుకోవాల్సిందే!

అనంతపురం గ్రామీణ మండలం ఎ.నారాయణపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో ప్రధాన రహదారిపై నదిలా ప్రవహిస్తున్న మురుగులోనే పాదచారులు నడవాల్సిన దుస్థితి నెలకొంది. రెండు నెలలుగా ఈ సమస్యతో ఆ కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. సమస్యను స్థానికుడు జె.లక్ష్మన్న 'ఈనాడు-మీతోడు' దృష్టికి తెచ్చారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. **- న్యూస్‌టుడే, తపోవనం**

## పశువుల సంత.. పద్మవ్యూహాన్ని మించి

నగరంలోని గుత్తిరోడ్డులో మార్కెట్ యార్డు పక్కన శని, ఆదివారాల్లో గొర్రెలు, మేకలు, పశువుల సంత జరుగుతుంది. ఈ రెండు రోజులు వందలాదిగా మూగజీవాల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. పశువులను తరలించేందుకు వాహనాలు పెద్ద ఎత్తున వస్తాయి. ఆదివారం ఆ ప్రాంతమంతా ట్రాఫిక్‌జాం అయింది. వందలాది వాహనాల రాకపోకలు జరిగే చోట కనీసం నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. **- ఈనాడు అనంతపురం**

## అపసవ్యంలోనూ వేగమేనా?

డ్రైవర్ల నిర్లక్ష్యమే రోడ్డు ప్రమాదాలకు కారణమని ఈ దృశ్యం చూస్తుంటే అర్థమవుతోంది. హైదరాబాద్ బెంగళూరు జాతీయరహదారిలో రాప్తాడు వద్ద ఓ లారీ వేగంగా దూసుకువస్తుండగా రాంగ్‌రూట్‌లో ఇంకో లారీ ప్రమాదకరంగా ఎదురుగా వెళ్తోంది. అటువైపు నుంచి ఏదైనా వాహనం ఓవర్‌టేక్ చేయబోతే మాత్రం పెద్ద ప్రమాదం జరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. **- ఈనాడు అనంతపురం.**

## చెత్త తొలగించరూ?

కొత్తూరు నగర్ క్రాస్‌లో నాలుగో రోడ్డులో మూడు వారాలుగా చెత్త అలాగే పడేశారు. దీంతో దోమలు వ్యాపించి సీజనల్ జబ్బుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

## నవోదయ కాలనీలో కొలువుదీరిన పీర్లు

**అనంత సాంస్కృతికం:** మొహర్రం సందర్భంగా మెరవణి అనంతరం చిన్నపీర్లు కొలువుదీరాయి. జిన్‌ఇమాం చోట కాసీం మకాన్‌లో చిన్నఖాసీం, దస్తగిరి, అంగార్‌వలి, ఇమాం ఖాసీంల పేరిట పీర్లను కొలువు దీర్చారు. 14న చిన్న సరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు, 17న జలధి కార్యక్రమం జరుగుతుందన్నారు.

## ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ మంజూరుకు విజ్ఞప్తి

**అనంతపురం విద్య, న్యూస్‌టుడే:** ఆర్డీటీ సంస్థకు ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) సమస్య వెంటనే పరిష్కరించాలని పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఉపాధ్యాయభవన్‌లో 'ఆర్డీటీ సేవలు-సామాజిక ఆవశ్యకత' అనే అంశంపై సదస్సు జరిగింది. ఉప్పరపాటి వెంకటేశులు, సంగీత వాణి రాయుడు నిర్వహించారు. రచయితలు శాంతి నారాయణ, రెడ్డప్పరెడ్డి, వహాబ్‌ఖాన్, తిప్పేస్వామి, హనుమంత రాయుడు, వంశీకృష్ణ వక్తలు పాల్గొన్నారు. ఆర్డీటీ సంస్థ అనేక దశాబ్దాలుగా జిల్లాలోని పేదల అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు.

## మధ్యవర్తిత్వ వారోత్సవాలపై విస్తృత చైతన్యం

**అనంతపురం ఆర్టీసీ, న్యూస్‌టుడే:** మధ్యవర్తిత్వ వారోత్సవాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు దేశం కోసం-మధ్యవర్తిత్వం వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అనంతపురం ఆర్టీసీ బస్టాండులో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది ప్రయాణికులకు కరపత్రాలు అందజేశారు.

## సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**రాప్తాడు,న్యూస్‌టుడే:** ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్తు బిల్లును తగ్గించుకునేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాప్తాడు విద్యుత్ శాఖ ఏఈ శివప్రకాష్‌నాయుడు తెలిపారు. ఈ సోలార్ ఫలకాలు ఇంటిపై ఏర్పరుచుకున్న వారికి ఈ పథకం కింద ఒక్కో కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు కేంద్రం రాయితీ అందిస్తుంది.

## చాలీచాలని వేతనంతో ఏమి తినాలి?

**అనంత నగరపాలక, న్యూస్‌టుడే:** నెలకు కేవలం రూ.13వేలు చాలీచాలని వేతనం ఇస్తే ఏమి తినాలి, ఎలా బతకాలి, అద్దెలు ఎలా కట్టాలని మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని సంవత్సరం అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు సంజీవరాయుడు, ఓబుళపతి, మురళి, పోతులయ్య, శివన్న, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

# 'స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వద్దు'

**బుక్కరాయసముద్రం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండు చేశారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ట్రూ అప్‌చార్జీలు, ఇతర ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్తు మీటర్లను కొనసాగించాలన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం వేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. సీపీఎం నాయకులు కుళ్లాయప్ప, నాగేంద్ర, నెట్టికంఠయ్య, చెన్నప్ప పాల్గొన్నారు.

**గుంతకల్లు పట్టణం:** ప్రజలపై విద్యుత్తు ఛార్జీల భారం వద్దని, స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గుంతకల్లులో ట్రావెల్స్ బంగ్లా సర్కిల్‌లో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు, పట్టణ కమిటీ నాయకులు క్యూఆర్ కోడ్ ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. సీపీఎం నాయకులు మారుతీప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తూ..

## 'కళ్లు కనపడలేదా? అనే వ్యాఖ్యలు తగవు'

**అనంత నగరపాలక, న్యూస్‌టుడే:** అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో రూ.118 కోట్లు అభివృద్ధికి సంబంధించిన జీఓలు చూపమంటే కళ్లు కనపడలేదా' అంటూ విమర్శలు చేయడం తగునా అని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ సామాజిక మాధ్యమాలకు సంబంధించిన నాయకులతో సమావేశం నిర్వహించారు. కొందరు నేతలు అధికారం తలకెక్కి మాట్లాడుతున్నారని ఎందుకు అంత ఓర్వలేనితనం వస్తోందని ప్రశ్నించారు.

## సేవాదృక్పథంతో వైద్యశిబిరం

**కమలానగర్, న్యూస్‌టుడే:** పేద ప్రజలకు ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అక్కినేని నాగార్జున అభిమానులు సేవాభావం చాటుకున్నారు. ఆదివారం బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లిలో అక్కినేని నాగార్జున అభిమాన సంఘం, విజయాస్ ఎస్వీ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు, ప్రజలకు వైద్య పరీక్షలు చేసి దగ్గు, జలుబు, నొప్పులకు ఉచితంగా మందులు అందించారు.

## వాహనం కిక్కిరిసి.. ప్రమాదానికి తెరతీసి

గుత్తి రోడ్డులో మేకలను తరలిస్తున్న వాహనం పైభాగంలో మనుషులు ప్రమాదకరంగా కిక్కిరిసి కూర్చున్నారు. మనకు అన్నీ తెలిసి వ్యాన్ పైభాగంలో ఇలా అంచులు పైన కూర్చోవడం చాలా ప్రమాదకరం. వాహనం హఠాత్తుగా బ్రేక్ వేస్తే కింద పడడం ఖాయం. రోజూ రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది మరణిస్తున్నా గుణపాఠాలు నేర్చుకోకపోవడం గమనార్హం. **- ఈనాడు అనంతపురం**

### తెరపై ఈనాడు

**కమలానగర్, న్యూస్‌టుడే :** గంగా : **మార్గన్,** గౌరి : **జురాసిక్ వరల్డ్,** గాయత్రి : **దీర్ఘాయుష్మాన్ భవ,** గౌతమి : **వర్జిన్ బాయ్స్,** త్రివేణి, నీలిమ : **సూపర్‌మ్యాన్,** తరంగిణి : **కన్నప్ప,** తేజశ్విని : **ది 100,** ఎస్వీ సినిమా : **ఓ భామ అయ్యో రామ,** శాంతి : **కుబేర,** సుధా : **తమ్ముడు.**

# దారి.. పొగచూరి!

నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో దారి పక్కనే చెత్తకు నిప్పు పెట్టారు. దారంతా పొగ కమ్మేయడంతో వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డు సమీపంలో పడేసిన చెత్తకు నిప్పు పెట్టడంతో పొగతో జాతీయ రహదారి కమ్ముకుంటోంది. డంపింగ్ యార్డు పొగకు ఈ పొగ తోడై వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. **- న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

కమ్మేసిన పొగలో దూసుకెళ్తున్న వాహనాలు

రోడ్డు పక్కన చెత్తకు నిప్పు

# డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం

**● రాజీవ్‌కాలనీ నుంచి గుత్తి రహదారి వరకు లింక్‌రోడ్డు**

దుకాణం వద్ద మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

**తపోవనం, న్యూస్‌టుడే:** మూడు దశబ్దాలుగా నగరంలోని రాజీవ్‌కాలనీ పంచాయతీ ప్రజలను పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్యను త్వరలో పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వెల్లడించారు. వారంలోగా డంపింగ్ యార్డు తరలించే పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వివరించారు. ఆదివారం రాజీవ్‌కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలైన సంక్షేమ పథకాలను వివరించారు. అక్టోబరు 2 నాటికి యార్డును తరలింపు పూర్తవుతుందన్నారు. అలాగే రాజీవ్‌కాలనీ నుంచి గుత్తిరోడ్డుకు లింకు రోడ్డు కూడా నిర్మిస్తామని, అక్కడ విద్యుత్తు సమస్యను పరిష్కరించామన్నారు. తెదేపా కార్పొరేటర్ సి.బాలాంజనేయులు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ పల్లవి, స్థానిక నాయకులు చౌడయ్య, సాదిక్, లింగమయ్య, శోభ పాల్గొన్నారు.


**IN THE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU**

**E.A. 382/2024 in E.P. 71/2016 in O.S. 650/2012**

Between:
K.Eswaramma ... Petitioner/Decreeholder
And
V.Venkataramanappa ... Respondent /Judgment debtor

**NOTICE TO RESPONDENT**

V.Venkataramanappa S/o V.Dasanna, Prakash Road, D.No. 7-27, Anantapuramu.

Please take noitce that the above E.A.382/2024 for delivery of E.P. Schedule Property. The above E.A. 382/2024 is stands posted to 28-7-2025 for your appearance. Please be attend before the above court at 10.30 A.M. on 28-7-2025 either in person or through court. Failing which the matter will proceed exparte.

Advocate for petitioner

**K.Sreenatha Reddy,** Advocate, Flat No: 203, Madhu Kalash Apartment, Opp: Church Line, Court Road, Ananthapuramu. Cell No: 94409 86932, 62812 49065


## అధిక వడ్డీ వ్యాపారులపై చర్యలకు డిమాండ్

**కమలానగర్ :** అవసరానికి అప్పు తీసుకున్న వారిని వడ్డీ కోసం జలగల్లా పీడిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అధిక వడ్డీ వ్యతిరేక పోరాట కమిటి అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడుతూ.. అధిక వడ్డీలతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు కమిటీ అండగా ఉంటుందన్నారు. అవసరాన్ని ఆసరాగా తీసుకుని ఇష్టానుసారంగా రూ.10 వడ్డీ వసూలు చేస్తూ బాధితులను బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

## అడ్డంగా ఆపేసి.. దారుల్ని మూసేసి!

గుత్తి రోడ్డుపై అడ్డంగా నిలిపిన వాహనాలు

తాడిపత్రి రోడ్డు వద్ద ఇలా..

అనంతనగరంలో నాలుగువైపులా రోడ్ల పక్కన లారీలు, భారీ వాహనాలు వరుసగా ఆపేస్తున్నారు. రోడ్ల మీద వేగంగా వచ్చే వాహనదారులు ఈ లారీలను ఢీకొనే అవకాశం ఉంది. ఇలాంటి ఘటనల్లో కొందరు వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. తాడిపత్రిరోడ్డు, నారాయణపురం రోడ్డు, గుత్తిరోడ్డు, రాప్తాడు వద్ద, బెంగళూరు- హైదరాబాద్ జాతీయ రహదారిపై రాత్రిళ్లు పరిస్థితి దారుణంగా ఉంటోంది. పోలీసులు రోడ్డు ప్రక్కన లారీలు, భారీ వాహనాలు ఆపకుండా చర్యలు చేపట్టాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. **- ఈనాడు, అనంతపురం**

# కొత్త ప్రణాళికలు.. కేజీబీవీలకు మెరుగులు

**● ఆగిన నిర్మాణాలు పూర్తి చేసేందుకు కసరత్తు**

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** ఉన్నత చదువులు చదివే విద్యార్థినులు ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ విద్య ప్రారంభించారు. మొదలు పెట్టారు గానీ విద్యార్థుల సంఖ్య అనుగుణంగా పలుచోట్ల భవనాలు నిర్మించలేదు. ఉన్న గదుల్లోనే సర్దుకుపోవాల్సి వస్తోంది. గత వైకాపా పాలనలో అనేక పాఠశాలల్లో నాడు-నేడు పథకంలో భాగంగా అదనపు గదుల నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయకుండానే మధ్యలో వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసంపూర్తి భవనాల వివరాలను సేకరించి కొత్త ప్రణాళికలను రూపొందించారు. ఆగిన నిర్మాణాలను పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించారు.

● ఆత్మకూరు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 270 మంది విద్యార్థులు ఉన్నారు. గతంలో భవన నిర్మాణాన్ని 6 నుంచి 10 తరగతులకు అనుగుణంగా 5 తరగతులు, 5 వసతి గదులు నిర్మించారు. ఇంటర్ విద్యను ప్రవేశపెట్టడంతో మరో 4 గదులు అదనంగా కావాల్సి వచ్చింది. ● విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యే దృష్టికి ఉపాధ్యాయులు తీసుకు వెళ్లిన వెంటనే రూ.1.36 కోట్లతో 12 గదుల నిర్మాణాలకు అనుమతులు అందించారు. వెంటనే పనులు ప్రారంభించారు. వీటితో పాటు రూ.40 లక్షలు వెచ్చించి ఒక తరగతి గదిని ఇప్పటికే అందుబాటులోకి తీసుకువచ్చారు. ● కూటమి ప్రభుత్వం 60 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దింది. ఆత్మకూరు మండల వ్యాప్తంగా 10 ప్రాథమిక పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా మార్చింది.

రూ.1.36 కోట్లతో నిర్మిస్తున్న అదనపు గదులు

### ఇబ్బందులు తీరుతాయి

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తి నిర్మాణాల గురించి ప్రభుత్వ నివేదికలు తీసుకున్నాం. విద్యార్థులు ఇబ్బంది పడుతున్న పాఠశాలల్లో తొలివిడతగా పనులు ప్రారంభమవుతున్నాయి. గదుల నిర్మాణాలు పూర్తి అయితే విద్యార్థులకు ఇబ్బందులు తొలగిపోతాయి.

**- నరసింహారెడ్డి, ఎంఈవో, ఆత్మకూరు**


**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా! అనంతపురము జిల్లా మరియు టౌన్, వెంకటరావునగర్, డోర్ నెం.6-5-105లో కాపురం ఉండు నా క్లయింట్ లేట్ **బి.సుబ్బరాయుడు** గారి కుమారుడైన **బి.శ్రీనివాసరావు** అనువారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని ఏదేనీ బ్యాంకులో ఆయకం ఉంచి ఋణం పొందవలెనని తలచినారు. అయితే సదరి **బి.శ్రీనివాసరావు** అనువారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన మూడు ఒరిజినల్ లింకు పత్రములు (అనగా 1) తేది 13-8-1990, డాక్యుమెంట్ నెం.6198/1990గా గల పి.బి.రామదాసు రెడ్డి గారి భార్య అయిన **శ్రీమతి పి.సుధామణి** గారి పేర ఉన్న రిజిష్టర్ విక్రయ పత్రము 2) తేది 30-11-2000, డాక్యుమెంటు నెం.9020/2000గా గల యం.భాస్కర్‌రెడ్డి గారి భార్య అయిన **శ్రీమతి వై.రాజేశ్వరి** గారి పేర ఉన్న రిజిష్టర్ విక్రయ పత్రము మరియు 3) తేది: 8-7-2010, డాక్యుమెంట్ నెం.4540/2010గా గల భగవాన రామ్‌మోలి గారి భార్య అయిన **శ్రీమతి లక్ష్మిదేవి** గారి పేర ఉన్న రిజిష్టర్ విక్రయ పత్రము) తాను అనంతపురం టౌన్‌లోని రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న జిరాక్స్ సెంటర్‌కు పోవుచున్నప్పుడు పోగొట్టుకొన్నానని సదరి విషయమై తాను అనంతపురం 3వ పట్టణ పోలీస్ స్టేషన్ వారికి 25-6-2025 తేదీన ఫిర్యాదు చేసి వారి నుండి 8-7-2025వ తేదీన సర్టిఫికెట్ కూడా పొంది ఉన్నానని కావున ప్రస్తుతం తన వద్ద సదరి మూడు ఒరిజినల్ లింకు పత్రముల యొక్క నకలు పత్రము మాత్రమే ఉన్నవని తెలిపి ఉన్నారు.

కావున ఎవరికైనా క్రింది షెడ్యూల్ దాఖల ఆస్తిని గురించి ఏలాంటి విక్రయాలు గానీ, ఆయకములు గానీ, లీజులు గానీ లేదా తకరార్లు గానీ ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 10 రోజుల లోపు నాకు గానీ లేదా నా క్లయింట్ అయిన బి.శ్రీనివాసరావు గారికి గానీ తెలియజేయవలెనని, లేనియెడల నా క్లయింట్ బి.శ్రీనివాసరావు గారు షెడ్యూల్ దాఖలా ఆస్తికి సంబంధించిన పై తెలిపిన మూడు లింకు పత్రము యొక్క నకలు పత్రములను మరియు ఇతర ఒరిజినల్ పత్రములను ఏదేనీ బ్యాంకులో డిపాజిట్ చేసి షెడ్యూల్ దాఖలా ఆస్తిని ఆయకం ఉంచి ఋణము తీసుకొందురని తెలపడమైనది.

**షెడ్యూలు:** అనంతపురం ఆర్.డి. మరియు సబ్.ఆర్.డి.కి చెందిన అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, సర్వే నెంబరులు 61/1A4, 62/1B & 138/1B పైకి ఎ.సి.30.51, యల్.పి. నెం.413/87 పైకి ఎ.సి.0.05.56 ప్లాట్ నెం.31 గల ఇంటి స్థలము

**కొలతలు: తూర్పు-పడమర:** 40 అడుగులు, **ఉత్తరం-దక్షిణం** (తూర్పు దిశన): 60 అడుగులు, **ఉత్తరం-దక్షిణం** (పడమర దిశన): 61 అడుగులు (269.15 చదరపు గజములు).

**చెక్కుబంది: తూర్పు:** ప్లాట్ నెం.32లో గల డోర్ నెం.6-5-107గా గల ఇల్లు, **పడమర:** ప్లాట్ నెం.30లో గల డోర్ నెం.6-5-105గా గల ఇల్లు, **ఉత్తరం:** ఇతరుల భూమి, **దక్షిణం:** రోడ్డు

**టి.విశ్వనాథ్,** అడ్వకేట్, అనంతపురం. మొబైల్ నెం.9440285641


(c) eenadu

## ఘనంగా ఎల్లమ్మ రథోత్సవం

ఎల్లమ్మ అమ్మవారి రథాన్ని లాగుతున్న భక్తులు

బ్రహ్మరథంపై ఊరేగుతున్న అమ్మవారు

**కలికిరి, న్యూస్‌టుడే:** కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ జాతర సందర్భంగా ఆదివారం జరిగిన రథోత్సవం కనుల విందుగా సాగింది. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంపై ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రథాన్ని లాగారు. మహిళా భక్తులు దీలు, బోనాలు సమర్పించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

## 964 టన్నుల టమాట రాక

రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన టమాట

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** మదనపల్లె మార్కెట్‌లో టమాట అత్యధికంగా రూ.32 పలికింది. వివిధ మండలాల నుంచి రైతులు మార్కెట్‌కు 964 టన్నుల టమాటాను తీసుకొచ్చారు. మొదటి రకం టమాట కిలో రూ.25 నుంచి రూ.32, రెండో రకం కిలో రూ.18 నుంచి రూ.24 వరకు పలికింది. వ్యాపారులు రైతుల నుంచి సగటున కిలో రూ.22 నుంచి రూ.30తో కొనుగోలు చేసి ఎగుమతి చేసినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి జగదీష్ చెప్పారు. గత నాలుగు రోజులుగా ధరలు నిలకడగా ఉన్నాయి. మదనపల్లె మార్కెట్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన సరకును దిల్లీ, కోల్‌కతా, తమిళనాడు, తెలంగాణ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

# నిశీధిలో మృత్యుకేక

- బోల్తా పడిన మామిడి కాయల లారీ
- ఉపాధికి వచ్చి విగతజీవులైన కూలీలు
- శెట్టిగుంట ఎస్టీ కాలనీలో విషాదం

ఘటనా స్థలంలో సహాయక చర్యలు

రాజంపేట ఆసుపత్రిలో క్షతగాత్రులు

**వారంతా కూలీలు.. రెక్కాడితేనే గానీ డొక్కాడని బడుగు జీవులు... మామిడి కాయలు తెంపడం కోసం ఊరుగాని ఊరొచ్చారు... తమను ఎక్కించుకుని వచ్చిన శకటమే మృత్యువు రూపంలో కాటేస్తుందని ఊహించలేకపోయారు.. దారి కాచిన మృత్యువు వారిని ప్రమాదం రూపంలో కబళించింది. కుటుంబంలో తల్లీ పిల్లలందరూ కూలి పనులకు రాగా ఒకరికొకరు దూరమయ్యారు. నిశీధిలో తొమ్మిది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. 11 మంది ఆసుపత్రి పాలయ్యారు. హృదయ విదారకమైన ఈ ఘటన ఆదివారం రాత్రి పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువు సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే...**

**రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** రాజంపేట మండలం ఇసుకపల్లె సమీపంలో మామిడి తోటలో కాయలు తెంపడానికి 20 మందికి పైగా కూలీలు వచ్చారు. వీరిలో రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన వారు దాదాపు 15 మందికి పైగా ఉండగా మిగతా వారంతా తిరుపతి జిల్లా వెంకటగిరి మండలానికి చెందిన యానాదులు. వీరంతా ఆదివారం తెల్లవారుజామునే మామిడి తోట వద్దకు చేరుకుని పనులు ప్రారంభించారు. లోడింగ్ పూర్తవగా రైల్వేకోడూరు మార్కెట్‌కు రాత్రి బయలుదేరారు. అరగంటలో గమ్యస్థానం చేరుకుంటామనగా రాత్రి 10 గంటల సమయంలో పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువుపై అదుపు తప్పి లారీ బోల్తా పడింది. టాపుపై కూర్చున్న కూలీలంతా మామిడి కాయల లోడు కింద పడ్డారు. కొందరు ఎగిరి దూరంగా పడడంతో గాయాలతో బయటపడ్డారు. లారీ కింద పడిన వారిలో తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మందిని రాజంపేట ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం వారిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదం నుంచి బయటపడిన చిన్నారులు

ఘటనా స్థలంలో మృతదేహాలు

### అంతా అయిపోయింది సార్!



'అంతా... అయిపోయింది సార్... కూలి పనులకు అని వచ్చి కుటుంబాన్నే కోల్పోయా.. మాది తిరుపతి జిల్లా వెంకటగిరి కాగా ఉపాధి కోసం కుటుంబంతో సహా పుల్లంపేట మండలం గొల్లపల్లికి వచ్చా. నా భార్య చెంచమ్మ, కుమార్తె రాధ, కోడలు ఘటనా స్థలంలోనే చనిపోయారు. నా కొడుకు, మనమళ్లు ఏమయ్యారో తెలియదు.. కుటుంబాన్నంతా కోల్పోయా' అని రాజంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీ **వెంకటేశ్వర్లు** కన్నీరుమున్నీరయ్యారు. ● మామిడి కాయలు తెంపడానికి కూలీలను తీసుకొచ్చిన మేస్త్రీ శివ చిన్న గాయాలతో బయటపడగా అతని భార్య చిట్టెమ్మ కళ్లముందే విగతజీవిగా మారగా ఆమె మృతదేహంతో ఆసుపత్రికి చేరుకుని తన భార్యను బతికించాలని వైద్యులను కోరడం చూపరులకు కంటతడి పెట్టించింది.

### రెడ్డిపల్లిచెరువు కట్ట ప్రమాదాల అడ్డా

**రాయచోటి, న్యూస్‌టుడే:** కడప-తిరుపతి మార్గంలోని వంద కిలో మీటర్లు భయం భయంగానే ప్రయాణించాల్సి వస్తోంది. ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయం అటుగా వెళ్లే వాహనదారులను వెంటాడుతోంది. అందులో పుల్లంపేట మండలం రెడ్డిపల్లి సమీపంలోని చెరువు కట్టపై మృత్యువు మాటేస్తోంది. రాజుల కాలంలో నిర్మించిన ఈ చెరువు కట్ట సుమారు అర కిలో మీటరు మేర ఉంటుంది. కట్టపైనే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కడప వైపు నుంచి వెళ్లే సమయంలో ప్రారంభ ప్రదేశంలో ప్రమాదకరమైన మలుపు ఉంది. తిరుపతి వైపు నుంచి వచ్చే వాహనాలు ఎత్తు నుంచి పల్లపు ప్రదేశానికి దిగుతూ మలుపు తిప్పాల్సిన పరిస్థితి అక్కడ నెలకొంది. ఏటా ఈ కట్టపై ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాదిలోనే మూడు ప్రమాదాలు చోటు చేసుకోగా ఆరుగురు మృత్యువాత పడ్డారు.

### ఆకాంక్షిత జిల్లాగా... అన్నమయ్య

- కార్యాచరణ రూపకల్పన
- త్వరలో ప్రకటన చేసే అవకాశం

**ఈనాడు, కడప**

వెనుకబడిన, మారుమూల ప్రాంతాల్లో వేగవంతమైన ప్రగతిని సాధించేందుకు ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి (ఏడీపీ) కింద అన్నమయ్య జిల్లా ఎంపిక దిశగా కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు త్వరలో ప్రకటన దిశగా సన్నాహాలు జరుగుతున్నాయి. 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ ఇటీవల సూత్రప్రాయంగా ప్రకటన చేశారు. జిల్లాతో పాటు శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాలను ఆకాంక్షిత జిల్లా జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వం 2018లో ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రధానంగా విద్య, వైద్యం, వ్యవసాయం-జలవనరులు, మౌలిక వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సమ్మిళితత్వం పరంగా వెనుకబడిన జిల్లాల కోసం నీతి ఆయోగ్ తలపెట్టిన కార్యక్రమాన్ని అన్నమయ్యలో ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడింది. నీతి ఆయోగ్ ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమంలో భాగంగా కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. ఇప్పటికే దేశంలో 117 జిల్లాల్లో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. సామాజిక, ఆర్థికాభివృద్ధిలో భాగంగా బాగా వెనుకబడిన ప్రాంతాలను ఆకాంక్షిత జిల్లాలుగా ఎంపిక చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులు అమలు చేస్తారు. కార్యక్రమం కింద జిల్లా ఎంపిక కానున్న నేపథ్యంలో రహదారుల అనుసంధానం, ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, వ్యవసాయం తదితరాలతో కలిపి మొత్తం 49 రంగాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయి. తద్వారా జిల్లాకు కాస్త ఉపశమనంగా ఉండనుంది. జిల్లా బాగా వెనుకబడింది. భూగర్భజల మట్టం పడిపోయి కరవు కాటకాలు తరచూ వెంటాడుతున్నాయి. ఇప్పటికే చాలా గ్రామాలు తాగునీటికి సైతం అల్లాడుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో పేదరికం సైతం జిల్లాలో అధికంగా ఉంది. ఏడీపీ కింద జిల్లా ఎంపికతో కొంత వరకు మహర్దశ పట్టనుంది.

## అన్నమయ్య పునర్నిర్మాణంపై తుది నివేదిక సిద్ధం

కేంద్రం అనుమతులు రాగానే పనులు ప్రారంభం

అన్నమయ్య జలాశయాన్ని పరిశీలిస్తున్న జలవనరులశాఖ అధికారులు, నిపుణులు, తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** అన్నమయ్య జలాశయ పునర్నిర్మాణంపై ఇంజినీరింగ్ అధికారులు తుది నివేదికలు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు అయిదు గురితో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో నిపుణుల కమిటీ బృందం కడప సీఈ శ్రీరామ చంద్రమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం జలాశయాన్ని సందర్శించింది. పునర్నిర్మాణ సమయంలో ఎలాంటి సమస్యలు ఎదురవుతాయనే కోణంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈ రమేష్ కుమార్, సీఈ సీడీవో విజయభాస్కర్, మెకానికల్ విభాగం నిపుణుడు విశ్రాంత సీఈ సత్యనారాయణ, జియాలజిష్టు డైరెక్టర్ రాజులతో చర్చించారు. పరిశీలనాంశాలతో తుది నివేదిక తయారు చేశారు. ప్రభుత్వానికి నివేదిస్తామని.. కేంద్ర జల బవనరుల శాఖ నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని వారు చెప్పారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం జలాశయ పునర్నిర్మాణ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కడప ఈఈ కిరణ్, అన్నమయ్య జలాశయం ఈఈ జయచంద్రరెడ్డి పాల్గొన్నారు.

## అరిటాకులో అన్న ప్రసాదం

**వేంపల్లె, న్యూస్‌టుడే :** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం గండి అంజన్న ఆలయంలో వెలసిన వీరాంజనేయ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ అధికారులు అరిటాకుల్లో నిత్యాన్నదానం చేస్తున్నారు. శుచికీ, శుభ్రతకు లోటు లేకుండా నిత్యం వందలాది మంది భక్తులు ఇక్కడ అన్న ప్రసాదం అందిస్తున్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెంచలకోన లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల తర్వాత గండిక్షేత్రంలోనే భక్తులకు అరిటాకుల్లో భోజనం వడ్డిస్తున్నారు. గండి క్షేత్రానికి రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు దర్శనానికి వస్తుంటారు. స్వామి వారిని నిత్యం 500 మందికి పైగా భక్తులు దర్శిస్తుండగా ప్రత్యేకించి మంగళ, శనివారాల్లో భక్తుల సంఖ్య రెండు వేలకు పైగా ఉంటోంది. నిత్యాన్నదాన కేంద్రంలో 8 నెలలుగా అరిటాకుల్లో భోజనం వడ్డిస్తున్నారు. సాధారణంగా ఇక్కడికి వచ్చే భక్తులకు కూర్చునే సదుపాయం లేకుండా నిలబడి తినేలా అన్న ప్రసాదం వడ్డించే వారు. పెంచలకోన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి గండిక్షేత్రానికి బదిలీపై వచ్చిన ఈవో వెంకటసుబ్బయ్య శనివారం మినహా మిగిలిన అన్ని రోజులు అరిటాకుల్లో బల్లలు, కుర్చీలు వేసి భక్తులకు భోజనం పెడుతున్నారు. రోజూ ప్రత్యేకంగా బెల్లంతో తయారు చేసిన తీపి అన్నం, అన్నం, పప్పు, వంకాయ మసాలా, రసం, మజ్జిగతో భోజనం అందిస్తున్నారు. భక్తుల సంఖ్య పెరిగినా భోజనం తయారు చేసి అందిస్తున్నారు.

గండిక్షేత్రంలో అరిటాకు భోజనం చేస్తున్న భక్తులు

### ఆలస్యంగా నడిచిన రైళ్లు

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే :** తమిళనాడులోని తిరువళ్లూరులో గూడ్స్ రైలు అగ్నికి ఆహుతవడంతో చెన్నై నుంచి కడప వైపునకు వస్తున్న రైళ్లు ఆదివారం ఆలస్యంగా నడిచాయి. చెన్నై-ముంబయి మధ్య నడిచే ముంబయి మెయిల్ (22158), చెన్నై-ముంబయి మధ్య నడిచే ముంబయి ఎక్స్‌ప్రెస్ (22160) సుమారు అయిదు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి.

## శాస్త్రీయ విజ్ఞానమే అభివృద్ధికి మూలం

**కడప విద్య, న్యూస్‌టుడే :** శాస్త్రీయ విజ్ఞానమే అభివృద్ధికి మూలమని వక్తలు పేర్కొన్నారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జన విజ్ఞాన వేదిక (జవివే) రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. అంతకుముందు యర్రముక్కపల్లి కూడలి నుంచి సంధ్యా కూడలి వరకు 'శరీరం వెనుక వైపు కొక్కీలు తగిలించుకుని కారు లాగే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద గాలిలో తేలుతూ కూర్చున్న బాల సన్యాసినులు విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం ఇంద్రజాల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతున్న నేటి కాలంలో చేతబడులు, మూఢాచారాలతో ప్రాణాలు తీయడం వంటి ఘటనలు జరుగుతుండటం బాధాకరమన్నారు. యువత ముందుకొచ్చి జవివే ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. సరైన ఆరోగ్యం, విద్యను పొందితే చాలు ధనవంతులేనన్నారు. ప్రధానంగా మహిళలు జవివేలో ప్రధాన పాత్ర పోషిస్తే సమాజ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు విశ్వనాథ, రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సురేష్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, రాష్ట్ర కోశాధికారి సనావుల్లా, నాయకులు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, రామారావు, మురళీధర్, సుదర్శన్, వరలక్ష్మి, మీన, సుజాత, స్వరాజ్యలక్ష్మి, సుబ్బరాజు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గాలిలో తేలుతున్న బాల సన్యాసినుల వేషధారణల్లో విద్యార్థులు

(c) eenadu

## రాయితీ రుణాల మంజూరుకు వినతి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే:** ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు పెండింగ్‌లో ఉన్న రాయితీ రుణాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని అఖిల భారత ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 నుంచి అనేక మంది ఎస్సీ ఎస్టీల పారిశ్రామికవేత్తలు ఎదిగేందుకు ఉత్సాహంగా ముందుకు వచ్చి అనేక రంగాల్లో వ్యాపారాలు కొనసాగిస్తున్నారన్నారు. వారికి ఇప్పటికీ రాయితీ మొత్తం అందకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పారిశ్రామికవేత్తలకు రాయితీ రుణాలు వచ్చేలా చూడాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఐఎఫ్‌బీ నాయకులు రాజేంద్రప్రసాద్, అఖిల్ పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామి అన్నదాన ట్రస్ట్‌కు భూ విరాళం

దాతను అభినందిస్తున్న ఆలయ ట్రస్టు సభ్యులు

**ములకలచెరువు, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి సేవా సమితి అన్నదాన ట్రస్ట్‌కు 3 ఎకరాల భూమిని దాత విరాళంగా అందజేశారు. తంబళ్లపల్లె మండల కేంద్రంలోని సాలె వీధికి చెందిన శ్రీనివాసులు తమ తల్లిదండ్రులు మునెమ్మ, సుబ్బరాయుడు జ్ఞాపకార్థం మల్లయ్యకొండ కింద గల అన్నదాన కేంద్ర సమీపంలో ఉన్న 3 ఎకరాల భూమిని ట్రస్ట్ అభివృద్ధికి ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి ట్రస్ట్ ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డికి భూమి పత్రాలను అందజేశారు. ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు శ్రీనివాసులు దాతృత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరీం, అన్నదాన ట్రస్టు సభ్యులు నారాయణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామ్మూర్తి, జయనారాయణరెడ్డి, తదితరులున్నారు.

## వృద్ధులకు రైల్వే పాసులివ్వాలని వినతి

తిరుపతిరావును సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే :** వృద్ధులకు రైల్వే పాసులు ఇవ్వాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ అన్నారు. మదనపల్లెలోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లకు కేంద్ర ప్రభుత్వం రైల్వే రాయితీ పాసులు ఇవ్వాలని కోరారు. అలాగే తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. దీనిపై ప్రధానమంత్రికి లేఖలు రాయనున్నట్లు తెలిపారు. మదనపల్లెకు చెందిన గొల్లపుడి తిరుపతిరావుకు హైదరాబాద్‌కు చెందిన తెలుగుబుక్ ఆఫ్ రికార్డు వారు ఐకాన్ అవార్డు ఇవ్వడంతో ఆయన్ను సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మునిరత్నమయ్య, కరుణాకర్, ఉస్మాన్‌సాహేబ్, జగన్‌మోహన్, టీఎస్‌పీ కృష్ణమూర్తి, ధనలక్ష్మీ, ప్రసన్నలక్ష్మీ, జయమ్మ, రాధికా, అబ్దుల్‌ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాలు.. భవితకు సోపానాలు

● ప్రవేశాలకు నెలాఖరు వరకు గడువు ● 'న్యూస్‌టుడే' ముఖాముఖితో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కృష్ణ

రాయచోటి-2 బాలికల వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కృష్ణ

**చిన్నమండెం, న్యూస్‌టుడే:** జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతి గృహాలు పేద విద్యార్థుల భవితకు సోపానాలుగా నిలుస్తున్నాయి. వార్డెన్ల పర్యవేక్షణలో ఉంటూ నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అభ్యసించడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఈ నెలాఖరు వరకు స్వీకరిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు.

**రిజర్వేషన్లు ఇలా.. :** జిల్లాలోని ఒక్కో వసతి గృహంలో వంద మందికి ప్రవేశం ఉంటుంది. జిల్లాలోని 55 వసతి గృహాల్లో 5,500 మందికి అవకాశం ఉన్నా నేటి వరకు 3,797 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇంకా 1,703 మంది విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉంది. రిజర్వేషన్ల విషయానికొస్తే ఒక్కో వసతి గృహంలో 70 శాతం సీట్లు ఎస్సీలకు, ఎస్టీలకు ఐదు శాతం, బీసీలకు తొమ్మిది శాతం, కన్వర్టెడ్ క్రిష్టియన్లకు 12 శాతం, ఓసీలకు నాలుగు శాతం కేటాయించారు.

**మూడో తరగతి నుంచి పీజీ వరకు:** జిల్లాలోని 55 వసతి గృహాల్లో పదో తరగతి వరకు 47 ఉండగా బాలురవి 32, బాలికల గృహాలు 15 ఉన్నాయి. వీటిల్లో బాలురు 2,296 మంది, బాలికలు 1028 మంది ఉన్నారు. 8 పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో ఇంటర్ నుంచిపీజీ వరకు 473 మంది విద్యార్థులున్నట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తంగా చూస్తే ఇంకా 1703 మంది విద్యార్థులను చేర్చుకునేందుకు అవకాశం ఉంది. ఇందులో నిబంధనల మేరకు ఈ నెలాఖరు వరకు చేర్చుకునేందుకు అవకాశం ఉంది.

**సౌకర్యాలు ఇవే :** వసతి గృహాల్లో విద్యార్థులకు ఉచిత వసతితో పాటు సన్నబియ్యంతో కూడిన నాణ్యతతో కూడిన మూడు పూటలా మంచి రుచికరమైన, పోషకాలతో కూడిన భోజనం, కాస్మోటిక్ ఛార్జీలు, దుప్పట్లు, ప్లేట్లు, ట్రంకు పెట్టెలు, ఉచిత పుస్తకాలతో పాటు తల్లికి వందనం పథకం కూడా వర్తిస్తుంది. ఇక్కడ చదువుకోవడంతో నిత్యం సంక్షేమ అధికారి పర్యవేక్షణతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక ఉపాధ్యాయులతో స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. వసతి గృహాల్లో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించగా ఇంటర్ విద్యార్థులు 67 శాతం సాధించారు.

**సద్వినియోగం చేసుకోవాలి :** జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలను అర్హులైన పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. రూ. వేలు ఖర్చులు పెట్టి ప్రైవేట్ వసతి గృహాల్లో ఉంటూ డబ్బులు ఖర్చు చేసుకోవడం కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ వసతి గృహాల్లో ఉంటే ఎలాంటి ఖర్చులు లేకుండా నాణ్యమైన విద్య, భోజనంతో కూడిన సౌకర్యాలు లభిస్తాయి. విద్యార్థులు త్వరపడి సమీపంలోని వసతి గృహాల్లో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలి.

చిన్నమండెంలోని సాఘిక సంక్షేమ వసతి గృహం

## కనుల పండువగా సౌమ్యనాథ స్వామికి చక్రస్నానం

ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు

**నందలూరు, న్యూస్‌టుడే:** కోరిన కోరికలు నెరవేర్చే భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న నందలూరు శ్రీసౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీసౌమ్యనాథ స్వామికి చక్రస్నానం ఆదివారం కనుల పండువగా జరిగింది. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామికి వసంతోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులకు సుగంధ పరిమళాలతో పాలు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫలాలతో అభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పండితులు రమసందన్, పవన్ కుమార్, మనోజ్ కుమార్, సునీల్ కుమార్, స్వాములు ఉత్సవమూర్తులకు చక్రస్నానం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రికి ధ్వజావరోహణం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఈవో ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీసౌమ్యనాథ స్వామి వారికి పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## కోట శ్రీనివాసరావుతో జిల్లాకు అనుబంధం

**ఐ.కొత్తకోట:** జిల్లాలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌తో నటుడు కోట శ్రీనివాసరావుకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన పోలీసు రిపోర్టు సినిమా చిత్రీకరణకు హార్సిలీహిల్స్‌కు తొలిసారిగా వచ్చారు. 1989 నవంబరు 1న విడుదలైన ఈ సినిమాలో నరేష్, తమిళనటుడు మోహన్‌లు హీరోలుగా నటించారు. ఈ సినిమాలో కోట శ్రీనివాసరావు గైడు పాత్రంలో హార్సిలీహిల్స్ చరిత్రను వివరించారు. అలాగే కృష్ణా హీరోగా శంకర్ దర్శకత్వంలో నిర్మించిన ఎన్‌కౌంటర్ సినిమా షూటింగ్ కోసం కోట శ్రీనివాసరావు ఇక్కడికి వచ్చారు. సినీ చిత్రీకరణ కోసం వచ్చినప్పుడు స్థానికులతో కబుర్లు చెబుతూ గడిపేవారని అప్పటి రోజులను హార్సిలీహిల్స్ వాసులు గుర్తుచేసుకున్నారు. కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు.

# చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్

మాట్లాడుతున్న ఏపీ దూదేకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీర్ మహ్మద్

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే :** ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన దూదేకుల సంక్షేమానికి ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఏపీ నూర్‌బాషా సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.పీర్ మహ్మద్ (అలియాస్ బుజ్జి) పేర్కొన్నారు. ఒంటిమిట్ట హరిత హోటల్‌లో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా తమ వర్గానికి చెందిన ఓటర్లు ఉన్నారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ పార్టీల నాయకులు తమ వర్గానికి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 100 కోట్లు ఇస్తామని ప్రకటించారు. ఈ వాగ్దానాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రతి జిల్లాలో నూర్ బాషా ప్రతినిధుల కార్యక్రమాల నిర్వహణకు అనువైన విశాల భవనాన్ని నిర్మించడానికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఇతర శాఖల కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవుల నియామకాల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ముస్లిం మైనార్టీలకు కల్పిస్తున్న రాయితీ, సంక్షేమ పథకాలను తమకు కూడా మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఒంటిమిట్ట శివారులోని మదరసా నిర్వాహకుడు సుభాన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఆయనను ఘనంగా సత్కరించారు. గౌరవాధ్యక్షుడు బాబన్, యువజన, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు పి.మస్తాన్, మస్తానమ్మ, జిల్లా అధ్యక్షుడు సుంకేసుల బాషా, గీతాంజలి విద్యాసంస్థల అధినేత నాగూర్, రాజన్న, కమాల్, సాలాబాదు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## హత్యకేసులో నిందితులకు రిమాండు

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే :** మదనపల్లెలో సంచలనం సృష్టించిన రియల్టర్ గంగాధర్ హత్య కేసులో ఎట్టకేలకు నిందితులను రిమాండుకు తరలించారు. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీలోని నక్కలకుంటకు చెందిన గంగాధర్ రియల్‌ఎస్టేట్ వ్యాపారంతో పాటు వడ్డీ వ్యాపారం చేసేవాడు. ఇతను గత నెల 15వ తేదీ రాత్రి తన ఇంట్లోనే దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అతడి భార్య నారప్పగారి వనిత, సదుం రెడ్డిరాము, గంజి మహేష్‌బాబులను నిందితులుగా గుర్తించి వారిని గత నెల 18న అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా వీరికి ఓ డిప్యూటీ డీఎంహెచ్‌వో వైద్యురాలు కూడా సహకరించిందని ఆసుపత్రిలో ఆమెకు వైద్య పరీక్షలు చేయించి ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత వైద్యురాలిని తప్పించి విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. ఇంత వరకు బాగానే ఉన్నా నిందితులను మదనపల్లెకు తీసుకొచ్చి వారిని సబ్‌జైలుకు తరలించకుండా నోటీసులిచ్చి పంపేశారు. దీనిపై పోలీసులపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ఆదివారం వనిత, రెడ్డిరాములను మాత్రమే అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో మరో ఇద్దరిని తప్పించారనే చర్చ జరుగుతోంది.

## కుటుంబ సభ్యులు మందలించారని వ్యక్తి ఆత్మహత్య

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే :** కుటుంబ సభ్యులు మందలించారని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మదనపల్లె మండలంలో ఆదివారం జరిగింది. సీటీఎంలోని పడమటి వీధికి చెందిన రాజయ్య (62) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. రాజయ్య తరచూ మద్యం తాగి ఇంటికి వస్తుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లోనే విషపు చెక్క తిన్నాడు. అతన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం ఆసుపత్రి శవాగారానికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## భార్యపై భర్త హత్యాయత్నం

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే :** భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన మదనపల్లె మండలంలో ఆదివారం సాయంత్రం జరిగింది. తురకపల్లెకు చెందిన శశికళకు పదేళ్ల కిందట కలికిరి మండలం నాయునిచెరువుపల్లెకు చెందిన రెడ్డిప్రకాష్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఆటో డ్రైవర్‌గా పనిచేసే ఇతను తరచూ భార్యను వేధింపులకు గురి చేస్తుండటంతో నెల రోజుల కిందట పుట్టింటికి వచ్చిన ఆమె తురకపల్లెలో ఉంటోంది. గతంలో కూడా ఇతను భార్యపై కత్తితో దాడి చేయడంతో మదనపల్లె రూరల్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆదివారం శశికళ తండ్రి మృతి చెంది 9 రోజులు కావడంతో ఇంట్లో ప్రార్థన చేసుకుంటుండగా అక్కడికి వచ్చిన రెడ్డిప్రకాష్ ఆమెపై కత్తితో దాడి చేశాడు. అక్కడే ఉన్న బంధువులు అడ్డుకోవడంతో అతను పరారయ్యాడు. దీంతో బాధితురాలు 112కు ఫోన్ చేయగా రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. రెడ్డిప్రకాష్ మద్యం దుకాణం వద్ద ఉండటంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ రేపు

**కడప విద్య :** వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని 24 అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్‌లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు పరీక్ష రాసి సీటు లభించని విద్యార్థులు జులై 15వ తేదీ ఉదయం 9 గంటలకు కడప నగరం చిన్నచౌక్ పాఠశాలలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని జిల్లా సమన్వయ కర్త ఉదయశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రహదారుల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయండి

మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

**రాయచోటి, న్యూస్‌టుడే:** జిల్లాలో నిధులు మంజూరై టెండరు దక్కించుకున్న గుత్తేదారులు త్వరగా పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి సూచించారు. తంబళ్లపల్లెలో సోమవారం పర్యటన నిమిత్తం ఆదివారం రాత్రి రాయచోటికి ఆయన చేరుకున్నారు. డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ సహదేవరెడ్డి, ఇతర అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో ఆయన మాట్లాడారు. ఎండీఆర్ ప్లాన్ కింద రూ. 20.80 కోట్లతో అయిదు పనులు మంజూరయ్యాయన్నారు. రూ. 4.5 కోట్లతో ఎస్‌హెచ్ కింద మరో వర్కు, రూ. 11.20 కోట్లు నాబార్డు నిధులతో చేపట్టబోయే పనులు టెండరు దశలో ఉన్నాయన్నారు. త్వరితగతిన ఏజెన్సీని నియమించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలోనే బిల్లులు విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే చాలా రహదారులపై గుంతలు పూడ్చించి ప్రజలకు సౌకర్యం కల్పించిన ఆర్అండ్‌బీ అధికారులను ఆయన అభినందించారు.

# రాజంపేట నుంచి తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా

● ఏడు టిప్పర్లు స్వాధీనం.. ఏడుగురి అరెస్టు ● సూత్రధారి కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు

సరిహద్దులో తడుకుపేట వద్ద స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

**నగరి, న్యూస్‌టుడే:** రాజంపేట నుంచి చిత్తూరు జిల్లా నగరి మీదుగా తమిళనాడుకు సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను నగరి పోలీసులు అడ్డుకున్నారు. ఏడు టిప్పర్లను సీజ్ చేసి ఏడుగురు డ్రైవర్లను అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన కీలక నిందితుడి కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సీఐ విక్రమ్ ఆదివారం నగరి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. తమిళనాడు సరిహద్దులోని తడుకుపేట వద్ద భారీగా ఇసుక టిప్పర్లు వెళ్తుండటంతో అనుమానంతో నిలిపి తనిఖీ చేయగా ఈ అక్రమ రవాణా గుట్టురట్టయింది. రాజంపేట సమీపంలోని రీచ్ నుంచి ఇసుకను టిప్పర్లలో నగరికి వరకు తరలిస్తారు. సరిహద్దులోని వేల్ అండ్ కో కంకర క్వారీలో నిలుపుతారు. అక్కడి పనికిరాని మట్టిని టిప్పర్ల పైభాగంలో ఓ లేయర్ పోస్తారు. అక్కడి నుంచి మట్టిగా చూపుతూ తమిళనాడుకి చేర్చి.. అక్కడ విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఈ అక్రమ రవాణాపై పక్కా సమాచారం రావడంతో నిఘా పెట్టి దాడులు చేపట్టినట్లు వివరించారు. ఏడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులోని చెందిన కనకమ్మ సత్రానికి చెందిన వి.జయకృష్ణ, కల్పాకంకు చెందిన ఎస్.పాండియన్, కల్లకుర్చికి చెందిన ఎ.అజిత్‌కుమార్, విళ్లుపురానికి చెందిన ఎం.ప్రవీణ్‌కుమార్, కన్యాకుమారికి చెందిన ఎ.ఎస్.శ్రీజిత్, తాంబరానికి చెందిన ఎన్.అశోక్, నగరి మండలం గుండ్రాజుకుప్పానికి చెందిన వి.దేవరాజులు అరెస్టయ్యారు. విచారణలో భరత్ అనే వ్యక్తి ఈ అక్రమాన్ని నడుపుతున్నట్లు వెల్లడైంది. అతని కోసం ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ వివరించారు. అతన్ని పట్టుకుంటే మరిన్ని వివరాలు వెల్లడవుతాయని ఆయన తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రవికుమార్, డీటీ మేఘవర్ణం, సిబ్బంది గోవిందరెడ్డి, వెంకటపతి, పోలీసులు గజేంద్ర, అశోక్, సత్య, పురుషోత్తం పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

**పెండ్లిమర్రి, న్యూస్‌టుడే :** నందిమండలం సమీపంలోని పొలంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి శనివారం రాత్రి వ్యవసాయ కూలీ ఓబులేసు (23) మృతి చెందారు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి వివరాల ప్రకారం.. చక్రాయపేట మండలం నడింపల్లెకు చెందిన ఓబులేసు శనివారం రాత్రి తన దగ్గరి బంధువుతో కలిసి నందిమండలంలోని వెంకటశివ అనే రైతు పొలంలో పక్షులను పట్టుకునేందుకు వచ్చారు. ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి ఓబులేసు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హైకోర్టులో అప్పీలుకు వెళ్లిన పోలీసులు

**వేంపల్లె, న్యూస్‌టుడే :** వేంపల్లె మండలంలోని ఓ గ్రామంలో అదృశ్యమైన బాలిక విషయంలో పోలీసులు, పోలీసుస్టేషన్‌పై దాడి కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకొనేందుకు పోలీసుశాఖ కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ వ్యవహారంలో ఆందోళనాకారులపై నమోదు చేసిన హత్యాయత్నం సెక్షన్ తగదని, కేవలం వారికి 41-ఏ కింద నోటీసులు జారీ చేయాలని ఈ నెల 11న హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై హైకోర్టులో అప్పీలు చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ విషయమై పులివెందుల డీఎస్పీ బుక్కే మురళీ, వేంపల్లె ఎస్ఐ తిరుపాల్‌నాయక్ ఆదివారం రాత్రి విజయవాడ బయలుదేరి వెళ్లారు.

***పోలీసుస్టేషన్‌కు 11 మంది నిందితులు***

వేంపల్లె పోలీసుస్టేషన్‌పై దాడి చేసిన కేసులో మొదటి విడతగా ఈ నెల 11న అరెస్టైన పక్కీరుపల్లె, రాజీవ్‌కాలనీకి చెందిన షేక్ హుస్సేన్, షేక్ మాలిక్‌బాషా, మరో 9 మందిని ఆదివారం స్థానిక పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. మరో విడత వారికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోలీసుస్టేషన్‌పై దాడి అంశం జిల్లా వ్యాప్తంగా సంచలనం కలిగించడంతో పోలీసు అధికారులు వేంపల్లెలో సాయుధ బలగాలను బందోబస్తు విధుల్లో నియమించారు. ఒక రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు 16 మంది స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు విధుల్లో ఉన్నారు.

## సమస్యలకు సత్వర పరిష్కారం

**ఎస్ఎన్‌కాలనీ(రాయచోటి), న్యూస్‌టుడే:** ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వస్తున్న వినతులపై అధికారులు సత్వరం పరిష్కారం చూపాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్ఎన్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను అక్కడి నుంచే అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడి త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు.

# ఇంటి వద్దకే ఓటరు కార్డు..!

**కలకడ, న్యూస్‌టుడే :** అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం సంస్కరణలు అమలు చేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఓటర్లను ప్రోత్సహించే పలు మార్గాలపై దృష్టి సారించింది. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల్లోగా ఓటరు కార్డు వారి చిరునామాలకు అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటివరకు ఎలక్టోరల్ ఫొటో గుర్తింపు కార్డు వచ్చేందుకు నెల రోజులకుపైగా సమయం పట్టేది. దీని కోసం ఈసీఐ కొత్తగా ప్రామాణిక నిర్వహణ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఎన్నికల నమోదు అధికారి ఆమోదం తెలిపిన తర్వాత తపాలా ద్వారా ఇంటికి చేరే వరకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుంది.

***దరఖాస్తు విధానం ఇలా...***

ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోకి వెళ్లి చరవాణి సంఖ్య, మెయిల్ ఐడీతో సైనప్ కావాలి. క్రియేట్ చేసిన అకౌంట్‌పై క్లిక్ చేసి పేరు, పాస్‌వర్డ్ నమోదు చేసి నిర్ధారించాలి. వెంటనే సైనప్ అయిన మెయిల్ ఐడీకి ఓటీపీ వస్తుంది. దీంతో పాటు ఓటరు వివరాలు నమోదు చేయాలి. తర్వాత వివరాలతో నమోదు చేయాలి. కొత్తగా ఓటరు నమోదు చేసుకునేవారు. ఫారం-6తో వ్యక్తిగత వివరాలు చిరునామా, ఇతర వివరాలు నమోదు చేయాలి. అడిగిన ధ్రువపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. వివరాలను సరిచూసుకుని సబ్మిట్ చేయాలి. ఫారం-8 ద్వారా మార్పులు, చేర్పులు, ఫారం-7 ద్వారా ఓటరు పేరు తొలగించుకోవడానికి వీలుంటుంది. ఎన్‌వీఎస్‌పీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి దరఖాస్తు స్థితి తెలుసుకోవచ్చు.

## అంతర్ జిల్లాల అండర్-16 క్రికెట్ పోటీలు ప్రారంభం

షారుక్ అక్తర్

తేజేష్

సుశాంత్

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే :** ఏసీఏ సౌత్‌జోన్ అండర్-16 పురుషుల మల్టీడే క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. కేఓఆర్ఎం మైదానంలో కడప-చిత్తూరు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 38.4 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌటైంది. లోకేశ్ 56, ఫర్హాఖాన్ లోడి 26 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లలో తేజేష్ 5, దినేష్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేసి తొలిరోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 299 పరుగులు సాధించింది. షారుక్ అక్తర్ అజేయంగా 202 పరుగులు చేశాడు. తనీశ్వర్ టెండూల్కర్ 46 పరుగులతో రాణించారు. కడప బౌలర్లలో కశ్యప్ రెడ్డి, గైబు చెరో వికెట్ తీసుకున్నారు.

★ వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూల్-నెల్లూరు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 177 పరుగులకు ఆలౌటైంది. వైవిక్ 58, రోహిత్ గౌడ్ 34 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లలో సుశాంత్ 4, రిత్విక్‌రెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. నెల్లూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది.

## జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలకు విశేష స్పందన

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రముఖులు

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే :** కడప ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి ఎంపికలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 150 మందికి పైగా క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాస్థాయి ఎంపికల్లో అండర్-15, 17 బాలికల సింగిల్స్ విభాగంలో కడప నగరానికి చెందిన పూర్వజరెడ్డి విజేతగా నిలిచింది. అండర్-15, 17 విభాగాల్లో జరిగిన ఎంపికల్లో బాల బాలికలకు విడివిడిగా సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం సభ్యులు జిలానీబాషా, గంగాధర్, నాగరాజు, డా.ప్రతాప్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి జ్ఞాపికలను అందించారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది వీరే:** జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్-15 రాష్ట్రస్థాయి పోటీలు ఆగస్టులో నెల్లూరులో, అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలు ఆగస్టులో అనంతపురంలో జరగనున్నాయి. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు..

**అండర్-15 బాలురు :** ఈశ్వర ప్రసాద్‌రెడ్డి, చంద్రకిశోర్, వర్షిత్ (ప్రొద్దుటూరు), **బాలికలు :** పూర్వజరెడ్డి, హరిణి, రితిక, కావ్య (కడప), **అండర్-17 బాలురు :** వేదవ్యాస్ వర్మ, సుప్రీత్‌రెడ్డి (కడప), విశ్వతేజ (ప్రొద్దుటూరు), **అండర్-17 బాలికలు :** రమ్యశ్రీ (ప్రొద్దుటూరు), పూర్వజ, కావ్య, రితిక (కడప)


EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

REAL ESTATE

HOUSE FOR SALE

ఇల్లు అమ్మకానికి- కలసపాడు H.No: 3-136-1, ఆర్యవైశ్య అమ్మవారిశాల వీధి 5.62 సెంట్లు (98X25), 2450 చ.అ. G+1 ఇంటి అమ్మకం, గ్రౌండ్ ఫ్లోర్: 2BHK (1200 చ.అ.), ఫస్ట్ ఫ్లోర్: 1BHK (650 చ.అ), 3 ఏళ్ల పాతది, ఫుల్ ఫర్నిష్డ్, రెడీ టు మూవ్ అన్ కి సిద్ధంగా ఉంది. ధర: రూ.1.20 కోట్లు (చర్చించవచ్చు) సంప్రదించండి: రమేష్ - 8247067863.

JOBS

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

ప్రొద్దుటూరు HGN ఏజెన్సీ నందు పనిచేయుటకు అవుట్‌డోర్ / షాపు సేల్స్‌మెన్స్, టూల్స్ మెకానిక్స్, ఆఫీస్ బాయ్, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Cell: 9100463787, 9515089758.

హాస్టల్ వార్డన్ కావలెను (లేడీ) ఆచార్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, D.అగ్రహారం, B. మఠం (మం). Cell: 8341847444, 90522 08001.

పల్లా హాస్పిటల్, 7 రోడ్స్ సర్కిల్ నందు పని చేయుటకు C-ARM టెక్నీషియన్స్ కావలెను Contact: 98490 40153.

FACULTY/ TEACHERS

Wanted Teachers Spoken English-1, Receptionist-1, Kadapa Contact No:91549 44970, 9154944955.

SECURITY GUARDS

కడప అరవింద నగర్ సమీపాన మా సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీగార్డులు కావలెను. 12 గంటలు డ్యూటీ, 13,000/- జీతం+ESI, PF, చదువు 10 పాస్, వయసు 22 నుండి 40 ఏళ్ల. సంప్ర॥ 72879 17477.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

# మదనపల్లె

• మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

## వైకాపా పాలనలో బీటీ కళాశాల అభివృద్ధి శూన్యం

మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేష్

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే :** గత వైకాపా ప్రభుత్వంలో బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను విశ్వవిద్యాలయంగా చేస్తున్నట్లు ప్రకటించి అభివృద్ధి లేకుండా చేశారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ దీంతో నిరుపేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. బీటీ కళాశాల సమస్యలను మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు ఉత్తన్న, ప్రసన్నకుమార్, అఖిల్, నాని, ఆనంద్, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

## బుద్ధుని కొండపై డీఎస్పీ పరిశీలన

బుద్ధునికొండపై డీఎస్పీ మహేంద్ర, సీఐ కళా వెంకటరమణ

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే :** మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని నల్లగుట్టపై ఉన్న బుద్ధుని కొండను మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, సీఐ కళా వెంకటరమణ ఆదివారం పరిశీలించారు. ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం సాంకేతిక బృందంతో మాట్లాడి టవర్‌లొకేషన్ ఆధారంగా ఎంతమంది లొకేషన్‌కు వచ్చారనే అంశంపై విచారించారు. సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తిస్తామని ఆయన పేర్కొన్నారు.

## వేడుకగా విరూపాక్షమ్మ జాతర

ప్రత్యేక అలంకరణలో చాందినిబండి

**కలకడ, న్యూస్‌టుడే :** మండలంలోని గంగాపురంలోని విరూపాక్షమ్మ జాతర ఆదివారం తెల్లవారుజామున వేడుకగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలకు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు చాందినిబండిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయించి ఊరేగించారు.

**గుర్రంకొండ:** మండలంలోని చెర్లోపల్లెలో వెలిసిన శ్రీరెడ్డెమ్మదేవతకు వరపడు పూజ ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారి పుష్కరణిలో స్నానమాచరించి పూజలు చేశారు. అనంతరం ఊయల కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## మంత్రుల పర్యటన నేడు

**ములకలచెరువు, న్యూస్‌టుడే:** తంబళ్లపల్లె నియోజకవర్గంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో పాటు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు పర్యటిస్తారని తెదేపా ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి తెలిపారు. కురబలకోట మండలం ముదివేడు క్రాస్, తూర్పుహరిజనవాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం బి.కొత్తకోట, ములకలచెరువు మండలాల్లో పర్యటించనున్నారు.

## లక్ష్యం ఘనం... సాగు నామమాత్రం

• వర్షాభావ పరిస్థితులతో వేరుసెనగ ఎండుముఖం • ఖరీఫ్‌పై రైతుల ఆశలు ఆవిరి

**మదనపల్లె పట్టణం, పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే:** వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. తొలకరి జల్లులు పలకరించినా తర్వాత వర్షం పడకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. జిల్లాలో మొత్తం 56 వేల హెక్టార్లు సాగు లక్ష్యం కాగా.. వేరుసెనగ ఒకటే 40 వేల హెక్టార్ల సాగు లక్ష్యం. ఇప్పటి వరకు 5,480 హెక్టార్లలో వేరుసెనగ సాగు నమోదైంది.

● వర్షాల జాడ లేకపోవడంతో సీజన్ ఆరంభంలో సాగు చేసిన వేరుసెనగ ప్రస్తుతం వాడుముఖం పట్టింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే పంట పూర్తిగా ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె వ్యవసాయశాఖ పరిధిలో ఖరీఫ్‌లో

కొండ్రెడ్డిగారిపల్లె వద్ద వాడుముఖం పట్టిన వేరుసెనగ

రైతులు 17,420 హెక్టార్లలో వేరుసెనగ సాగు చేస్తారు. మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలకడ, కలికిరి, పీలేరు తదితర మండలాల్లో సాగుచేస్తారు.

### 16,275 క్వింటాళ్ల పంపిణీ

ఖరీఫ్‌సాగులో రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రభుత్వం రాయితీపై విత్తన వేరుసెనగ పంపిణీ చేపట్టింది. మదనపల్లె సహాయ సంచాలకుల పరిధిలోని 8 మండలాల్లో 16,275 క్వింటాళ్ల విత్తన కాయలను రైతులకు అందజేశారు.

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి

ఈ నెలాఖరు వరకు వేరుసెనగ విత్తుకోవచ్చు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్‌లో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఏర్పాట్లు చేసుకోవాలి. దీనిపై జిల్లా స్థాయిలో కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకోవాలి. కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపుతాం. - శివనారాయణ, డీఏవో

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

?: చిప్పిలి పంచాయతీ బెంగళూరు రహదారిలోని పాల డెయిరీ ఎదుట కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. సమస్యను పరిష్కరించండి. - **మణికంఠ, స్థానికుడు**

✓: పారిశుద్ధ్య పనులు చేయించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - **తాజ్‌మస్రూర్, ఎంపీడీవో, మదనపల్లె**

?: బసినికొండ-2 పంచాయతీ నిమ్మనపల్లి రోడ్డు గంగన్నగారిపల్లె క్రాస్‌లోని ప్రాథమికోన్నతపాఠశాల చుట్టూ చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. - **బాబు, నిమ్మనపల్లె రోడ్డు**

✓: చెత్తదిబ్బలు లేకుండా కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - **అబ్దుల్‌షుకూర్, ఈవోపీఆర్డీ, మదనపల్లె**

?: మదనపల్లెలోని నిమ్మనపల్లెరోడ్డులో పేడ, చెత్తదిబ్బలతో అధ్వానంగా ఉంది. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. సమస్య పరిష్కరించండి. - **అబ్దుల్, స్థానికుడు**

✓: చెత్తదిబ్బలను డంపింగ్‌యార్డుకు తరలించేలా చర్యలు తీసుకుంటాం. - **ప్రమీల, పురపాలక కమిషనర్, మదనపల్లె**

?: ఈశ్వరమ్మకాలనీలో మురుగు రోడ్డుపైకి వస్తోంది. దీంతో కొత్తపల్లె తారురోడ్డు దెబ్బతింది. వాహనాల రాకపోకలతో దుర్వాసన వస్తోంది. - **సురేశ్, ఈశ్వరమ్మకాలనీ**

✓: మురుగు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకుంటాం. **- నాగరాజ, డీఎల్‌పీవో - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

?: ములకలచెరువులోని ఉమాశంకర్‌కాలనీకి వెళ్లే దారిలో మురుగు కాలువ పక్కనే పిచ్చిమొక్కలున్నాయి. దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉంది. రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించాలి. - **రాజేష్, స్థానికుడు**

✓: చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- రామ్లానాయక్, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, ములకలచెరువు**

## సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రచారం

మదనపల్లెలో మహిళలకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే :** ప్రజలు మెచ్చిన సుపరిపాలన అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలతో ప్రశంసలు అందుకుంటున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పురపాలక సంఘం పదో వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేస్తున్నామన్నారు. అనంతరం బసినికొండ, వడ్డిపల్లె, ఈశ్వరమ్మకాలనీ, బుగ్గకాలువ, దొంతివీధి, ప్యారానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లి రూ.27 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో రామ్మూర్తినాయుడు, బాబునాయుడు, బాలస్వామి, రాటకొండ మధు, సిమెంటు రమణ, ప్రభాకర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### హామీలు నెరవేర్చి, ఓటు అడుగుతాం

**గుర్రంకొండ, న్యూస్‌టుడే:** దేశానికే దిక్సూచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం గుర్రంకొండ, తరిగొండ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. వృద్ధులు, దివ్యాంగులకు దేశంలో ఎక్కడా లేనంతగా పింఛను పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తదితర పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ ఉచిత ప్రయాణం పథకాలను త్వరలో అమలు చేస్తామన్నారు. తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలకు తాగునీరు అందించేందుకు రూ.2 వేల కోట్లు మంజూరైందన్నారు. గుర్రంకొండ మండలం సంగసముద్రం పంచాయతీ మామిళ్లవారిపల్లె వద్ద నీటిశుద్ధి కోసం 33 ఎకరాలు సేకరించినట్లు చెప్పారు. గండికోట నుంచి తాగునీరు, హంద్రీ-నీవా సాగునీరు ఇచ్చి వచ్చే ఎన్నికల్లో ఓటు అడుగుతామన్నారు. కార్యక్రమంలో తెదేపా మండలపార్టీ అధ్యక్షుడు నాయిని జగదీష్, నాయకులు మూర్తిస్వామి, నౌషాద్, ఎల్లుట్ల మురళి, సుధాకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నల్లారి అమరనాథరెడ్డి సేవలు చిరస్మరణీయం

కలికిరి మార్కెట్‌యార్డు వద్ద నల్లారి అమరనాథరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ మార్కెట్ యార్డు వద్ద నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

**కలికిరి, కంభంవారిపల్లి, గుర్రంకొండ, వాల్మీకిపురం, న్యూస్‌టుడే:** మాజీ మంత్రి నల్లారి అమరనాథరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం నిర్వహించారు. కలికిరి మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న అమరనాథరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పూలమాలలు వేశారు. అంతకుముందు నగరిపల్లెలో అమరనాథరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. కంభంవారిపల్లి మండలం యంపీపల్లె పంచాయతీ గుండ్రేవారిపల్లె, గుర్రకొండ వ్యవసాయ మార్కెట్ యార్డు, వాల్మీకిపురంలో మార్కెట్ యార్డు వద్ద అమరనాథరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి అమరనాథ రెడ్డి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గ్రామీణులకు ఉచిత వైద్యసేవలు

**కంభంవారిపల్లి, న్యూస్‌టుడే :** గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్యసేవలందించడమే లక్ష్యమని శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి అన్నారు. కంభంవారిపల్లె మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీ కమ్మరపల్లెలోని వృద్ధాశ్రమంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బ్రహ్మారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వైద్యులు జిలానీ తదితరులు పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావుకు ఘన నివాళి

కోట శ్రీనివాసరావుకు నివాళులర్పిస్తున్న బాషా నాయకులు

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే :** సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరనిలోటని బాషా నాయకులు అన్నారు. ఆదివారం సొసైటీకాలనీలోని బాషా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పులి నరేంద్రకుమార్‌రెడ్డి, బండి ఆనంద్ మాట్లాడుతూ.. 40 ఏళ్ల నటజీవితంలో తెలుగు రాష్ట్ర ప్రజలను ఎంతగానో అలరింపజేశారని కొనియాడారు. ఇలాంటి విలక్షణ నటుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పిల్లిస్వామి నాయక్, నారదరెడ్డి, వెంకటరాజు, దామోదర్, భగవాన్, నాగరాజు, వెంకటేశ్, బాలకృష్ణ, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువల ఆక్రమణ... రహదారిపై మురుగు

మదనపల్లె-నిమ్మనపల్లె రహదారిలోని బసినికొండ పంచాయతీ కేంద్రంలో మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. ఇక్కడ కొండ కాలువను కొందరు ఆక్రమించుకున్నారు. దీంతో పాటు కాలువ పూడిపోవడంతో మురుగు ఇలా రోడ్డుపై ప్రవహిస్తోంది. దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగు సమీపంలోని పంట పొలాల్లోకి వస్తుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, బసినికొండ(మదనపల్లె గ్రామీణ)**

## ప్రహరీ నిర్మించరూ!

రామసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ సౌకర్యం లేదు. ఇక్కడ దాత సహకారంతో కళాశాల నిర్మించారు. అయితే ప్రహరీ లేకపోవడంతో అక్రమణకు గురయ్యే అవకాశం ఉంది. కళాశాల ఆవరణానికి ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపల్ చిట్టిబాబును వివరణ కోరగా ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదికను పంపినట్లు తెలిపారు. **- న్యూస్‌టుడే, రామసముద్రం**

## చెత్త.. తొలగించక అవస్థ

మదనపల్లె పట్టణంలోని ఎంఎల్ఎల్ ఆసుపత్రి రోడ్డులో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ఇక్కడ పురపాలకసంఘం కుండీలు పెట్టినా చెత్తను అందులో వేయకుండా నడిరోడ్డుపైనే వేస్తున్నారు. ఈ చెత్త గాలికి రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులపై పడుతుండటంతో వారు ఇక్కట్లు పడుతున్నారు. దీనికితోడు దుర్వాసనతో ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. స్థానికులు కుండీలోనే చెత్తను వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, మదనపల్లె పట్టణం**

## గుంతలు.... ప్రయాణికులకు అవస్థలు

జాతీయ రహదారి తిరుపతి-పులిచెర్ల రోడ్డు వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. ఏడు కిలోమీటర్ల దూరం తారు లేచి పోవడంతో వాహనాలను నడిపేందుకు చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల గుంతలకు తారు వేసి మరమ్మతులు చేసినా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, పీలేరు**

## గ్రామ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఇదే

**కురబలకోట (ములకలచెరువు), న్యూస్‌టుడే:** గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం కురబలకోట మండల అధ్యక్షుడిగా కె.శేషగిరి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కురబలకోటలో జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ, ప్రధాన కార్యదర్శిగా రామప్పనాయుడు, తదితర సభ్యులు ఎంపికయ్యారు.

## శాప్ డైరెక్టర్‌కు సన్మానం

జగదీశ్వరి దంపతులను సన్మానిస్తున్న తెదేపా నాయకులు

**పెద్దమండ్యం, న్యూస్‌టుడే :** శాప్ డైరెక్టర్ జగదీశ్వరి దంపతులను తెదేపా నాయకులు సన్మానించారు. ఈ మేరకు బండకింద తండాలో ఆదివారం తెదేపా మండల అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ఆమెకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ నాయక్, నాయకులు శ్రీనివాసులు, నటరాజనాయక్, ఓబులేశు, జిట్టా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మహల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు



పాపిరెడ్డిగారిపల్లెలో అప్పటి గురువులతో విద్యార్థులు

**కలికిరి, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని మహల్ తెలుగు ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువతో సత్కరించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బెంగళూరు రవిచంద్ర, శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, సీవీరెడ్డి, శీన, శ్రీనాథరెడ్డి, వేణుగోపాల్‌స్వామి, వెంకటేశ్వర్లు, షకీల్, అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**కలకడ, న్యూస్‌టుడే :** మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు భారతీదేవి, నాగభూషణశర్మ, రెడ్డెప్పరెడ్డి, రామచంద్రనాయుడులను ఘనంగా సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాలకు రూ.21 వేల విలువైన నాలుగు టేబుళ్లను వితరణగా అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు నిధులు సమకూరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సయ్యద్ బాషా, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ములకలచెరువు, న్యూస్‌టుడే:** అంగళ్లు చేనేత నగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిబా పులే గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ రామాంజినేయరెడ్డి తెలిపారు. పాఠశాలలో 5 నుంచి 9 తరగతి వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని అర్హులైన విద్యార్థులు ఈ నెల 18లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20న ఉదయం 10:30 నుంచి 12:30 గంటల వరకు ప్రవేశాలకు పరీక్ష ఉంటుందన్నారు.

## తెదేపా సర్వసభ్య సమావేశం 14న

**కలికిరి, న్యూస్‌టుడే:** పీలేరు నియోజకవర్గ తెదేపా సర్వసభ్య సమావేశం కలికిరిలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ పార్టీ సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు.

## శునకాలతో జనం బెంబేలు

నిమ్మనపల్లె మండలంలో శునకాల బెడద ఎక్కువైంది. రహదారులు, వీధుల్లో తిరగడానికి వీల్లేకుండా ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వీధికుక్కల బెడద ఎక్కువ కావడంతో పిల్లలను ఒంటరిగా పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇటీవల కుక్కకాటు కేసులు ఎక్కువ అవుతున్నాయని ఆరోగ్య సిబ్బంది చెబుతున్న నేపథ్యంలో నిమ్మనపల్లె-చింతపర్తి మార్గంలో శునకాలు ఇలా సంచరిస్తున్నాయి. **- న్యూస్‌టుడే, నిమ్మనపల్లె**

రాజశ్రీ గౌ॥ 2 వ అదనపు జిల్లా జడ్జి కోర్ట్, మదనపల్లె
(In the court of the Hon'ble 2nd Addl. District judge, Madanapalle)

IA No.104/2020 in AS No........./2020

శ్రీమతి బిసప్పగారి పార్వతమ్మ & వగైరా ..పిటీషనరులు /Appellants

శ్రీమతి సిద్దె గౌనివాళ్ళ చంద్రమ్మ & others ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

Notice to రెస్పాండెంట్స్/ప్రతివాది No. 4 : S. రాజశేఖర్‌రెడ్డి, S/o Late సిద్దె గౌనివాళ్ళ నారాయణ రెడ్డి, వయస్సు 31 సం॥, పూలపాడు village, రామసముద్రం మండలం,

పై నెంబరు గల IA No 104/2020 పై తెలిపిన Petitioners /Appellants తమకు పూలపాడు Rev. Village, పుంగనూరు మండలం నందు గల భూములలో హక్కు కలదని భాగపరిష్కారం కొరకు దాఖలు చేసిన OS No. 13/2009 Sr. Civil Judge Court (Civil Judge Sr. Division) పుంగనూరు dt. 29.6.2019 న dismiss, అయిన రీత్యా, అట్టి Decree & Judgement ను పై court కు 76 రోజుల ఆలస్యంగా వేసిన అప్పీల్ నందు అట్టి ఆలస్యమును మన్నించవలసినదిగా వేసిన IA No. 104/2020, పై కోర్ట్ నందు dt: 25/7/2025న వాయిదా ఉన్న రీత్యా సదరు తేదీన నీవు పై తెలిపిన court నందు హాజరై నీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను, లేనంతట IA No.104/2020 మీ పరోక్షంగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

// By order //

Dt :12.7.2025 సరస విద్యాసాగర్
9440539161 న్యాయవాది, మదనపల్లె

## విద్యుత్తు కోతలు... వినియోగదారుల వెతలు

**ములకలచెరువు, న్యూస్‌టుడే:** కొన్ని ప్రాంతాల్లో చినుకు పడితే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మరి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు కోతలతో గంటల తరబడి సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో ప్రజలు ఉక్కపోత, దోమల బెడదతో ఇబ్బందిపడుతున్నారు. ములకలచెరువులో కొద్ది రోజుల కిందట కురిసిన చిన్న వర్షానికే విద్యుత్తు సరఫరా నిలిపేశారని వినియోగదారులు వాపోతున్నారు. ప్రభుత్వం నెలనెలా బిల్లులు పెంచుతున్నా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయడంతో విఫలమవుతోందనే విమర్శలున్నాయి.

● ములకలచెరువు మండలంలో సుమారు 18 వేలకుపైగా వివిధ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెల రూ.40లక్షల వరకు ఆదాయం వస్తోంది. అధికారుల లెక్కల ప్రకారం మొత్తం 22 మంది సిబ్బంది పని చేస్తున్నారు. సాధారణ సమయాల్లోనూ సరఫరాలో అంతరాయం ఉంటోంది. రాత్రివేళ గాలివాన వస్తే కోతలు ఉంటున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ములకలచెరువు విద్యుత్తు ఉపకేంద్రం

### చర్యలు తీసుకుంటాం

గాలివానలు, భారీ మెరుపులు, ఉరుముల కారణంగా ప్రమాదం జరుగుతుందని ముందుగానే సరఫరా నిలిపివేస్తున్నాం. గంటల తరబడి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. **- రామలక్ష్మణ్, ట్రాన్స్‌కో ఏఈ, ములకలచెరువు**

## రైలులో నుంచి పడి వృద్ధుడికి తీవ్ర గాయాలు

**మదనపల్లె నేరవార్తలు:** రైలులో నుంచి పడి వృద్ధుడు తీవ్రంగా గాయపడిన ఘటన కురబలకోట మండలంలో ఆదివారం జరిగింది. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లెకు చెందిన కదిరప్ప రెండు రోజుల కిందట తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి ములకలచెరువుకు రైలులో వస్తుండగా కురబలకోట రైల్వేస్టేషన్ సమీపంలో రైలులో నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గాయపడిన ఆయన్ను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కదిరి రైల్వే పోలీసులు విచారణ చేస్తున్నారు.

## ఇంటి స్థలం విషయమై దాడి

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే :** ఇంటి విషయమై జరిగిన గొడవలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం కోటవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు ఈ నెల 11న తన సోదరి ఇంటి ముందు నిద్రిస్తుండగా అతని అన్న వెంకటరమణ కుమారుడు సురేంద్ర దాడి చేశాడు. దీనిని ప్రశ్నించిన సోదరి చంద్రమ్మను వెంకటరమణ రెండో కుమారుడు రాజేంద్ర ఆమెపై దాడి చేశారు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఆదివారం సురేంద్ర, రాజేంద్రలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

# రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కరపత్రం అందిస్తున్న చమర్తి జగన్‌మోహన్ రాజు

**నందలూరు, న్యూస్‌టుడే:** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా తెదేపా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని దుర్గాపురంలో ఇంటింటికీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

## పాలకొండ్రాయుడి ఆశయ సాధనే ధ్యేయం

మాట్లాడుతున్న తితిదే పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాదబాబు

**సుండుపల్లి, న్యూస్‌టుడే:** ఎంపీ, ఎమ్మెల్యేగా పాలకొండ్రాయుడు అందించిన సేవలపే మండల ప్రజలు మరిచిపోలేరని తితిదే పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాదబాబు అన్నారు. సుండుపల్లిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం తెదేపా రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్‌నాయుడు అధ్యక్షతన నిర్వహించిన పాలకొండ్రాయుడి సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి వారసత్వంగా తాము దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వారసులమని పార్టీకి విధేయులమన్నారు. మా తండ్రి నుంచి మాకు అందిన వారసత్వం ప్రజల అభిమానమేనని అన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

?: పట్టణంలోని లక్ష్మీప్యారడైజ్ సినిమా హాలు సమీపంలోని ఓ వీధిలో ఇటీవల సిమెంటు రోడ్డు నిర్మించారు. ఆ ప్రాంతంలో ప్రధాన రహదారి డ్రైనేజీకి ఉన్న బండలు పగిలిపోవడంతో మురుగు నీరు దుకాణాలు, ఇళ్ల ముందుకు వచ్చేసింది. దీంతో ఇబ్బందికరంగా మారింది. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. **- ఎస్. రాజేష్, వ్యాపారి, రైల్వేకోడూరు**

✓: రోడ్డు పనుల వల్ల తాత్కాలికంగా కొంత ఇబ్బంది ఏర్పడింది. వెంటనే సిబ్బందిని ఏర్పాటు చేసి కాలువను సరి చేయిస్తాం. **- బి.శివయ్య, సర్పంచి, రైల్వేకోడూరు**

**- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు**

?: రక్షిత నీటి పథకం మోటారు కాలిపోయింది. తాగునీటికి ఇబ్బందిగా మారింది. మోటారుకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య తీర్చాలి. **- స్థానికులు, తొట్టికాడ హరిజనవాడ, సుండుపల్లి పంచాయతీ**

✓: మోటారు మరమ్మతులు చేయించి నీటి సమస్య పరిష్కరిస్తాం. **- సురేష్‌బాబు, ప్రత్యేక అధికారి, సుండుపల్లి పంచాయతీ**

**- న్యూస్‌టుడే, సుండుపల్లి**

# జిల్లా కేంద్రం... ట్రాఫిక్‌తో సతమతం

✦ పట్టణంలో పెరిగిన వాహనాల రద్దీ ✦ పట్టించుకోని అధికార యంత్రాంగం

**రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే:** జిల్లా కేంద్రం రాయచోటిలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ పరిధిలోని ప్రధాన రహదారులే కాకుండా కూడళ్లు, వాణిజ్య సముదాయ వీధుల్లో నిత్యం వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. వాహనాల రాకపోకలు ఎక్కువయ్యాయి. దీనికి తగ్గట్టు పట్టణంలో రహదారులు విస్తరణ చేపట్టకపోవడం, పుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తుండటం, వాహనదారులు తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిర్లక్ష్యంగా పార్కింగ్ చేస్తుండటంతో నిత్యం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్‌ను నియంత్రించడం పోలీసులకు తలకు మించిన భారమవుతోంది.

పట్టణంలోని గాలివీడు రోడ్డులో ఘర్షణ పడుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవరు, ద్విచక్ర వాహనదారుడు

■ రాయచోటి పురపాలక పరిధిలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పట్టణంలో సుమారు 30 వేల నివాసాలున్నాయి. పట్టణంలో సంచరించే వాహనాలు సుమారు 35 వేల వరకు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి సుమారు రెండు వేల నుంచి మూడు వేల వరకు వాహనాలు పట్టణానికి వచ్చి వెళ్తుంటాయి. ఈ వాహనాల పార్కింగ్‌కు పట్టణంలో సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడం రహదారుల విస్తరణ చేయకపోవడతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రెవెన్యూ, పురపాలక, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా పార్కింగ్ స్థలాలపై అన్వేషణ చేసి ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదు.

■ ముఖ్యంగా గాంధీ బజార్, బస్టాండ్ సర్కిల్, బంగ్లా, ఠాణా, గాలివీడు రోడ్డు, నేతాజీ కూడలి, మదనపల్లె రోడ్డు తదితర ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తులోంది. ఈ ప్రాంతాల్లో చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల మీద వ్యాపారం చేసుకునే వారు రోడ్డపై అడ్డదిడ్డంగా తమ బండ్లను ఉంచి వ్యాపారం సాగిస్తున్నారు. ఆటో డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నేతాజీ కూడలి వద్ద పుట్‌పాత్‌లు ఆక్రమించుకుని వ్యాపారం సాగిస్తుండటతో ప్రజలు ప్రధాన రహదారిపై వెళ్లాల్సి వస్తోంది. దీంతో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

■ పట్టణంలోని గాలివీడు రోడ్డు చాలా ఇరుకుగా ఉంటుంది. ఈ మార్గంలో ఆసుపత్రులు ఎక్కువ. ఈ మార్గం ఎప్పుడు రద్దీగా ఉంటుంది. ఈ మార్గాన్ని పోలీసులు వన్‌వేగా మార్చి వాహనాలను నియంత్రిస్తుంటారు. అయితే ఈ మార్గం పేరుకే వన్ వే కాని నిత్యం వాహనాలు రెండు వైపులా ప్రయాణిస్తుంటాయి. దీంతో ట్రాఫిక్ నిలిచి పోతోంది. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు కూడా వెళ్లలేని పరిస్థితి తలెత్తుతోంది.

గాంధీ బజారులో ట్రాఫిక్ కారణంగా నిలిచిన వాహనాలు

■ పట్టణంలోని గాలివీడు రోడ్డు మార్గంలో ఆదివారం మధ్యాహ్నం ఓ ఆర్టీసీ బస్సు డ్రైవరు, ద్విచక్ర వాహనదారుడికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. రద్దీగా ఉండే ఈ ప్రాంతంతో బస్సు ప్రయాణిస్తున్న సమయంలో ద్విచక్ర వాహనానికి తగలడంతో ద్విచక్ర వాహనం దెబ్బతింది. దీంతో బస్సు డ్రైవరు, ద్విచక్రవాహనదారుడికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు ఈ వ్యవహారం పోలీసులకు ఫిర్యాదు చేసుకునేదాక వెళ్లింది. ఇలాంటి సంఘటనలు తరుచూ జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## భాజపా బలోపేతానికి కృషి చేద్దాం

**రాయచోటి, న్యూస్‌టుడే:** భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఎం.జకియాఖానం పేర్కొన్నారు. తన కార్యాలయంలో ఆదివారం భాజపా నాయకులతో ఆయన మాట్లాడారు. పార్టీ అప్పగించిన ఏ బాధ్యతను అయినా పూర్తిగా నిర్వహిస్తానని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని ఆమె కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమక్షంలో త్వరలో రాయచోటి నుంచి భారీగా మైనార్టీ కుటుంబాలను పార్టీలో చేరుస్తామన్నారు. నాయకులు సమన్వయంతో సమష్టిగా పని చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నేషనల్ బయోడైవర్సిటీ కమిటీ సభ్యుడు ఎం.శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు ఎ.శివగంగిరెడ్డి, నిర్మల్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, సుబ్బయ్యస్వామి, జయచంద్ర, బండి ఆనంద్, పులి నరేంద్ర కుమార్, పిల్లస్వామి నాయక్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.

భాజపా నాయకులతో చర్చిస్తున్న శాసన మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియాఖానం

## కార్మికుల నిరవధిక సమ్మె

**రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే:** పురపాలక శాఖలో పని చేస్తున్న ఇంజినీరింగ్ విభాగపు కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వారు ఆదివారం సమ్మెకు దిగారు. ఈ సమ్మెను సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు కార్మికులకు పూల మాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించబోమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్, శంకరయ్య, ఈశ్వర్‌రెడ్డి, మల్లికార్జున, దేవ, రమణ, దినేష్ పాల్గొన్నారు.

సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ విభాగపు కార్మికులు

## సుపరిపాలన దిశగా అడుగులు

**వీరబల్లి:** అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా మండల అధ్యక్షుడు ఎం.భానుగోపాల్‌రాజు అన్నారు. మండలంలోని తాటిగుంటపల్లె రెడ్డివారిపల్లె హరిజనవాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు హరినాథరెడ్డి, భాస్కర్‌రాజు, ఆంజనేయులు, వెంకట్రమణరాజు, నేతి రామ్మోహన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్థానికులతో తెదేపా మండలాధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, నాయకులు

## అడ్మిషన్లు ప్రారంభించాలని వినతి

**రాయచోటి, న్యూస్‌టుడే:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (పీఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆదివారం రాయచోటిలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందించినట్లు ఆయన చెప్పారు. ఇప్పటి వరకూ డిగ్రీ కళాశాలలో మాత్రం అడ్మిషన్లు ప్రారంభం కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి అడ్మిషన్లు ప్రారంభించాలన్నారు.

వినతి పత్రాన్ని చూపిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**రామాపురం:** రాష్ట్రంలో సుపరిపాలన సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని [illegible] పంచాయతీ [illegible] ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యకర్తలు స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తల్లికి వందనం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, వృద్ధులు, దివ్యాంగులకు పింఛను పెంపు తదితర పథకాలు ప్రవేశపెడుతోందన్నారు.

## తాగునీటి పథకం వద్ద పోలీసుల బందోబస్తు

**సిద్దవటం, న్యూస్‌టుడే :** మండలంలోని లింగంపల్లె తాగునీటి పథకం వద్ద ఆదివారం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. లింగంపల్లె పెన్నానది ఒడ్డున ఏర్పాటు చేసిన తాగునీటి పథకం నుంచి కడప నగరానికి నీరు సరఫరా అవుతున్న విషయం విదితమే. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ లింగంపల్లె తాగునీటి పథకం వద్ద పని చేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులు ఆదివారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నారాయణస్వామి మాట్లాడుతూ.. ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లడంతో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ముందు జాగ్రత్త చర్యగా లింగంపల్లె నీటి పథకం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

గౌరవ ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, మదనపల్లి
**H.M.O.P.No. 55 of 2018**
దున్నపోతుల గంగులప్ప - పిటీషనర్
**Vs**
దున్నపోతుల నాగమణి - రెస్పాండెంట్
To : దున్నపోతుల నాగమణి, భర్త దున్నపోతుల గంగులప్ప, తండ్రి సి.వెంకటరమణ, D.No. 73/101-50, పాత రాయచోటి, రాయచోటి టౌన్, అన్నమయ్య జిల్లా, PIN-516269.
**నోటీసు**
పై నెంబర్ గల పిటీషన్‌లో రెస్పాండెంట్ పైన (డివోర్స్) కావాలని, పిటీషనర్ కేసును వేసినారు. రెస్పాండెంట్‌కు నోటీసు అందనందున, పేపర్ ద్వారా తెలియజేయమని కోర్టు ఆదేశించిన మేర, తెలియజేయడం ఏమనగా, **30-07-2025**న ఉదయం 10.30 గంటలకు మీరు [illegible]
/-కోర్టు ఉత్తర్వుల మేరకు/-
వాయిదా తేదీ : 30-07-2025
**Sd/- C.V.RAMANA MURTHY,**
B.Com., LL.M., M.Sc., (Psy)
**ADVOCATE**
D.No. 2-419, Society Colony, Madanapalle - 517 325.
**Cell : 9652031772**

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**రాజంపేట, న్యూస్‌టుడే:** లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొత్తగా సభ్యుడిగా చేరిన జనసేన నేత అతికారి కృష్ణ అన్నారు. రాజంపేటలో ఆదివారం లయన్స్‌క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజంపేట పరిసర ప్రాంతాల్లో సేవలు విస్తరించడం ద్వారా పేదలకు మరింత మేలు జరుగుతుందన్నారు. సమాజానికి మేలు జరిగినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, డాక్టర్ సి. సుధాకర్, పారా సుబ్బానాయుడు, గీతాంజలి రమణ, డాక్టర్ నవీన్, వెంకటసుబ్బయ్య, నరసింహ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌లో చేరిన జనసేన నాయకుడు అతిగారి కృష్ణ, వినయ్ కుమార్‌లకు లయన్స్ బ్యాడ్జిని పెడుతున్న ఆ సంస్థ నాయకులు

## బుద్ధుడి విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలకు డిమాండు

నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

**రాయచోటి గ్రామీణ,న్యూస్‌టుడే:** మదనపల్లె లోని అంకిశెట్టిపల్లెలో గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాయచోటిలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ... ఈ నెల 28న మదనపల్లెలో దక్షిణాది రాష్ట్రాల ఇండియా కూటమి నాయకులతో జైల్‌భరో కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. బుద్ధుడి విగ్రహం తల తొలగించిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాసులు, రామాంజనేయులు, ఈశ్వర్, రవిశంకర్, నమణ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం... బాలికల పాఠశాలకు వరం

● ప్రహరీ, ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో తీరిన సమస్యలు

**చిన్నమండెం, న్యూస్‌టుడే:** చిన్నమండెం బాలికల పాఠశాలకు కూటమి ప్రభుత్వం వరం ఇచ్చింది. ఏళ్ల తరబడి ప్రహరీ, ఆర్వో ప్లాంట్ వంటి సమస్యలతో అల్లాడుతున్న విద్యార్థినులకు నేడు సమకూరాయి. పాఠశాలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టరు శ్రీధర్‌లే వేర్వేరుగా ఇటీవల సందర్శించారు. ఆ సమయంలో బాలికల సమస్యలను నేరుగా విన్నారు. పరిష్కారానికి తగు చర్యలు తీసుకున్నారు. ఉపాధి కింద రూ.42 లక్షలతో ప్రహరీ నిర్మించారు. పాఠశాల ఆవరణలో బోరు తవ్వించి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయించారు. సంత వీధిలో నుంచి పాఠశాలలోకి సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయించడంతో ఒక్క సారిగా బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ తీరిపోయాయి. ఇటీవల మంత్రి ప్రహరీని, ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల బాలికలు మాట్లాడుతూ.. గతంలో ప్రహరీ లేక పాఠశాల ఆవరణాన్ని ఆకతాయిలు పాడు చేసే వారని.. ఆవరణలో ఆటలపోటీలు, ఇతర కార్యక్రమాలు చేసుకోవాలన్నా ఇబ్బందిగా ఉండేదని, ప్రహరీ ఏర్పాటు కావడంతో మాకు సమస్యలు తీరిపోయాయని సంతోషంగా చెబుతున్నారు.

ప్రహరీ లేక ఆవరణలో సంచరిస్తున్న పందులు (నాడు)

కూటమి ప్రభుత్వం చొరవతో ఏర్పడిన ప్రహరీ (నేడు)

## రాములోరి సేవలో తెదేపా నాయకులు

రామయ్య క్షేత్రంలో బలిపీఠం వద్ద పూజలు నిర్వహిస్తున్న జనార్దన్‌రావు

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే :** ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు టి.డి.జనార్దన్‌రావు ఆదివారం సందర్శించారు. రాములోరి సన్నిధికి ఆయనతో పాటు తెదేపా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ్‌శేఖర్‌రెడ్డి, రైల్వేకోడూరు పరిశీలకుడు హేమాంబర్ విచ్చేశారు. అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణమూర్తులను దర్శించారు. అనంతరం వారికి శాలువా కప్పి సత్కరించారు. అర్చకులు వేదాశీర్వాదం చేశారు. రామయ్య క్షేత్రం చారిత్రక వైభవం, ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆలయంలో శిల్ప సంపద చాలా అద్భుతంగా ఉందని కొనియాడారు. జనార్దన్‌రావు ఒంటిమిట్టకు రాగానే జగన్‌మోహన్‌రాజు, విజయ్‌శేఖర్‌రెడ్డి వర్గీయులు వేర్వేరుగా ఆయనకు స్వాగతం పలికారు. నాయకులు గజ్జల నరసింహారెడ్డి, కొత్తపల్లి బొబ్బిలిరాయుడు, ఎస్వీ రమణ, నల్లగొండు వెంకటసుబ్బారెడ్డి, దున్నూతల రఘురామిరెడ్డి మామిళ్ల శ్రీహరి, చింతగింజల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రోశయ్య, ఆలూరి వెంకటసుబ్బయ్య, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, JUBEEDA BEE (Old Name), W/o Shaik Abdul Munaf, R/o 44/156, Bose Nagar, Rayachoty, Annamayya Dist. I changed my name to SHAIK JUBEDA BEGAM. Henceforth, I will be known as **SHAIK JUBEDA BEGAM** (New Name).

**In the Court of the Principal Civil Judge (Senior Division) : Rajampet**
**E.P.No : 9/2025 in O.S.No : 76/2017**
[illegible] - డిక్రీ హోల్డర్
Vs
[illegible] - జడ్జిమెంట్ డెటార్
[illegible] ఆక్షేపణలున్న యెడల పై రాజశ్రీ కోర్టు వారి ఎదుట **29-07-2025**న ఉ॥10.30 ని॥కు హాజరై తెలుపుకొనగలరు. లేకున్న పై రాజశ్రీ కోర్టు వారు పై పిటీషన్‌ను మీ పరోక్షమున తీర్మానించుదురని తెలియజేయడమైనది.
**By order of the Court**
**S.మధుసూధనరావు, అడ్వకేట్, రైల్వేకోడూరు.**

## బాధితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

**రాజంపేట, న్యూస్‌టుడే:** అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాషా డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర స్థాయిలో కమిటీలు వేయడం, ఆస్తులపై విచారణ జరపడం హర్షణీయమన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

### కార్మిక వేతనాలు పెంచాలని ఆందోళన

పురపాలకలో విద్యుత్తు, నీటి సరఫరా విభాగాల్లో పనిచేసే కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ స్థానిక పురపాలక కార్యాలయం ఎదుట ఆదివారం సీఐటీయూ, పుర పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పుర కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

### సంక్షేమ బోర్డు ఏర్పాటుకు వినతి

ఆరుగాలం కష్టపడి పని చేసే భవననిర్మాణ కార్మిక రంగం ప్రయోజనాలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.గంగాధర్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన కార్మిక వర్గానికి చెందిన 46 వేల పెండింగ్ క్లెయిమ్‌లకు నిధులు విడుదల చేయాలని కోరారు.

## ఘనంగా సిద్దేశ్వర, చెన్నకేశవ స్వాముల గ్రామోత్సవం

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** తాళ్లపాక గ్రామంలోని సిద్దేశ్వర, చెన్నకేశవ స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం తితిదే అధికారులు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి వార్లకు రోజులు ఉదయం, పల్లకీ సేవ, సాయంత్రం గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం సిద్దేశ్వర, చెన్నకేశవ స్వామి వార్లకు పల్లకీ సేవ నిర్వహించగా, తితిదే కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. అనంతరం కోలాటం, చెక్కభజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో అశ్వవాహనంపై శివకేశవులు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ పండితులు భక్తవత్సలం, వేదపారాయణం స్వామి కృష్ణతోపాటు ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

సిద్దేశ్వరస్వామికి పల్లకిసేవ

అశ్వవాహనంపై చెన్నకేశవస్వామి

### వానలు కురవాలని భైరవ స్వామికి బోనాలు

**చిన్నమండెం:** మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం కురవపల్లె వాసులు ఆదివారం వానలు కురవాలని భైరవ స్వామికి బోనాలు సమర్పించారు. శనివారం రాత్రి మాలెలోని పెద్దయ్యస్వామికి గ్రామస్థులు పూజలు చేశారు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని మల్లారమ్మకు, కొండమూల సమీపంలో ఉన్న భైరవ కొండలోని భైరవస్వామికి బోనాలు సమర్పించారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో యువత పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ చేస్తున్న యువకులు

### ఏటిగడ్డ గంగమ్మకు...

**గాలివీడు:** గాలివీడు పంచాయతీ కుషావతి నది ఒడ్డున వెలిసిన ఏటిగడ్డ గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలతో ఊరేగింపుగా మేళతాళాలతో ఆలయాని సందర్శించారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మకు బోనాలు పట్టడం సంప్రదాయంగా కొనసాగిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

బోనాలు సమర్పించేందుకు వస్తున్న మహిళలు

## జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు పీజీఆర్‌ఎస్ రద్దు

**రాయచోటి, న్యూస్‌టుడే:** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓర్చి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**చిట్వేలి(పుల్లంపేట), న్యూస్‌టుడే:** ఈ నెల 6వ తేదీ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నవీన్ తెలిపారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన పులి కొండారెడ్డి (35) బతుకుదెరువు కోసం రాయచోటికి వచ్చి నివాసం ఉంటున్నారు. బేల్దారి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 6న స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తిమ్మయ్యగారిపల్లె వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన ఆయన అప్పటి నుంచి తిరుపతి సిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారని పోలీసులు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

**బహిరంగ ప్రకటన**

అన్నమయ్య జిల్లా, రైల్వేకోడూరు తాలూకా, రైల్వేకోడూరు పట్టణం, సూర్యానగర్, డోర్ నెంబరు 7/633-1-16లో నివాసముండు కొండూరు నీలాపతి, భర్త విజయవర్మ అయిన నా కక్షిదారురాలు ఇచ్చిన సూచనల మేరకు యావన్మందికి తెలియజేయడమేమనగా మా కక్షిదారురాలు తండ్రి అడ్లూరు వెంకట్రాజు, తండ్రి సుబ్బరాజు, వెంకటరెడ్డిపల్లె గ్రామం, రైల్వేకోడూరు మండలం వారి పేరున వారసత్వరీత్యా కొనుగోలు రీత్యా మరియు ప్రభుత్వ డి.పట్టా రీత్యా క్రింది షెడ్యూలు ఆస్తిని తనపేరున కలిగియున్నారు. సదరు అడ్లూరు వెంకట్రాజు గారు ఖాతా నెంబరు 754గా ఉప్పరపల్లె గ్రామ పొలంలోను, ఖాతా నెంబరు 523గా చియ్యవరం గ్రామ పొలంలోను మరియు ఖాతా నెంబరు 1018గా శెట్టిగుంట గ్రామపొలంలోను వివిధ సర్వే నెంబర్లలో భూమిని కలిగి ఉన్నారు. సదరు అడ్లూరు వెంకట్రాజు గారు 26.10.2024న స్వర్గస్తులైనారు. ఈ షెడ్యూలు దాఖలా భూములపై స్వర్గీయ వెంకట్రాజు గారి సంతానమైన అడ్లూరు విజయకుమార్‌రాజు మరియు నా కక్షిదారురాలు సమాన హక్కులు కలిగియున్నారు. అయితే గత కొన్ని రోజులుగా నా కక్షిదారురాలుకు అన్న అయిన అడ్లూరు విజయకుమార్ రాజు గారు షెడ్యూలు దాఖలా ఆస్తులను అమ్ముకొనుటకు లేదా తనఖా పెట్టుటకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలియవచ్చినది. ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులపై నా కక్షిదారురాలు సమాన హక్కులు కలిగియున్నందున షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎవరైనా కొనుగోలు చేసినా లేదా తనఖా పెట్టుకున్నా చట్ట ప్రకారం చెల్లనేరవని ఖండితముగా తెలియజేయడమైనది.

**షెడ్యూలు :**

**అన్నమయ్య జిల్లా, కోడూరు మండలం ఉప్పరపల్లి గ్రామ పొలం:**
సర్వే నెం. 431/2B-0.94 సెంట్లు, 423-14-N3-0.13 సెంట్లు, 401-3-N1-0.75 సెంట్లు, 400-N1-0.90 సెంట్లు, 263-4-N2-0.18 సెంట్లు.

**అన్నమయ్య జిల్లా, కోడూరు మండలం, చియ్యవరం గ్రామ పొలం :**
సర్వే నెం. 95-7-0.28 సెంట్లు, 95-6-0.10 సెంట్లు, 95-5-0.10 సెంట్లు, 95-4-N2-0.18 సెంట్లు, 95-17-0.10 సెంట్లు, 95-13-N1-0.78 సెంట్లు, 95-11-N1-0.26 సెంట్లు, 95-10-N1-0.26 సెంట్లు, 95-8-N1-1.23 సెంట్లు, 107-3-0.75 సెంట్లు.

**అన్నమయ్య జిల్లా, కోడూరు మండలం, శెట్టిగుంట గ్రామ పొలం:**
సర్వే నెం. 2233 - య.3.92 సెంట్లు,
2232 - య.1.39 సెంట్లు.

**మద్దిన శంకరయ్య**, అడ్వకేట్, రైల్వేకోడూరు.

# ఖాళీ కుర్చీలు.. కళ తప్పిన బోర్డులు!

ఈనాడు, అమరావతి

వెల్దుర్తి: శివలింగాపురంలో మాస్టారు లేక ఖాళీగా విద్యార్థులు

బాల పౌరుల భవిష్యత్తును నిర్దేశించే బడులే. అంతటి కీలకమైన చదువు కొన్నిచోట్ల విద్యార్థులకు అందడం లేదు. పల్నాడు జిల్లాలోని అనేక పాఠశాలల్లో అసలు ఉపాధ్యాయులే లేరు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు మరో సమస్యగా తయారయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 5 వేల మంది ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయ్యారు. ఎక్కువ మంది గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పనిచేయడానికి మొగ్గు చూపి వచ్చేయడంతో పల్నాడు జిల్లాలోని అనేక ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేని దుస్థితి ఏర్పడింది.

**ఉపాధ్యాయ బదిలీలతో కొత్త సమస్య**

**ఇక్కడ మరో అవస్థ..** ఇక ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మరో రకం సమస్యలు నెలకొన్నాయి. ఆ రోజు ఉపాధ్యాయుడు సెలవు పెడితే బడికీ సెలవు ప్రకటించాల్సిందే. పొరుగు పాఠశాలల్లోని వారిని వినియోగించడానికి వీల్లేకుండా ఖాళీలు దర్శనమిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల సంఖ్యలో ఇలాంటివి ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఒక్క వెల్దుర్తి మండలంలోనే మొత్తం 56 పాఠశాలలకు 30 ఏకోపాధ్యాయ పాఠశాలలే కావడం గమనార్హం. బాపట్ల జిల్లాలో 441 ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

**మచ్చుకు కొన్ని..** మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలంలో 98 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 27 మంది మాత్రమే ఉన్నారు. ఎనిమిది మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక నల్లబోర్డులు, ఖాళీ కుర్చీలే స్వాగతం పలుకుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటివి 122 మేర పాఠశాలలున్నట్లు సమాచారం. మారుమూల తండాలు, రవాణా సదుపాయాలు లేని అటవీ ప్రాంతం కావడంతో బదిలీపై వెళ్లినవారి స్థానంలో రావడానికి ఎవరూ మొగ్గు చూపడం లేదు.

**తాత్కాలికంగా ఏర్పాట్లు**

బదిలీల కారణంగా ఉపాధ్యాయులు లేని బడుల్లో అధికారులు తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో పనిచేసి బదిలీ అయిన వారిని వెనక్కి రప్పించి పాఠశాలలు నడిపిస్తున్నారు. కొన్నిచోట్ల ఆయాలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో నెట్టుకొస్తుండటం కనిపిస్తోంది. ఓ స్వచ్ఛంద సంస్థ నుంచి 32 మంది వాలంటీర్లను నెలకు రూ.8 వేలు జీతం ఇచ్చేలా నియమించుకుని వినియోగిస్తున్నారు. అయినా సమస్య కొలిక్కి రావడం లేదు. అంతా డీఎస్సీ భర్తీపైనే ఆశలు పెట్టుకున్నారు.

## 551.10 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

**విజయపురిసౌత్, న్యూస్‌టుడే:** నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటలకు 551.10 అడుగులకు చేరింది. ఇది 212.2078 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1,650 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం నీటిమట్టం 883.30 అడుగుల వద్ద కొనసాగుతోంది. జూరాల, రోజాల నుంచి శ్రీశైలం జలాశయానికి 72,763 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 63,317 క్యూసెక్కుల నీరు వస్తోంది.

# కొత్త పింఛన్లు ఎప్పుడొస్తాయో!

న్యూస్‌టుడే, బాపట్ల

**సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యేలకు విజ్ఞప్తులు**

➡ జిల్లాలో మొత్తం పింఛన్లు
**2,25,075**
➡ ప్రతినెలా కేటాయిస్తున్న నగదు
**రూ.96.04 కోట్లు**

అద్దంకికి చెందిన 75 ఏళ్ల రైతు మీసాల వెంకటేశ్వర్లు 2021లో పాముకాటుకు గురయ్యారు. కాళ్లకు ఇన్ఫెక్షన్ సోకడంతో ఏడాది తర్వాత రెండు కాళ్లు తొలగించారు. ప్రస్తుతం అతనికి వృద్ధాప్య పింఛను కింద నెలకు రూ.4 వేలు అందుతోంది. 70 శాతం దూరం నుంచి కలెక్టరేట్‌కు వచ్చి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ వెంకటమురళిని కలిసి దివ్యాంగ పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సదరం శిబిరంలో దివ్యాంగ ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంది. 45 వేల మందికి పైగా సదరం శిబిరంలో స్లాట్ బుక్ చేసుకున్నారు. దివ్యాంగ వృద్ధుడి వంతు వచ్చేసరికి మూడు నెలలు పైగా పడుతుంది. ❖ బాపట్ల పట్టణం దేవుడి మాన్యానికి చెందిన మహిళ కర్నాంప్రు కుసుమకుమారి భర్త రాములు అనారోగ్యంతో రెండేళ్ల కిందట చనిపోయారు. వితంతు పింఛను కోసం 2023లోనే ఆమె దరఖాస్తు చేసినా వైకాపా ప్రభుత్వం మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ కాలనీలో పర్యటించారు. మహిళ ఎమ్మెల్యేను కలిసి తన కుటుంబ ఆర్థిక పరిస్థితి వివరించి, పింఛను మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేసింది. సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని త్వరలో ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ ఒక్క కాలనీలోనే పదుల సంఖ్యలో పేదలు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

❖ నగరం గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు పిన్నబోయిన తులశమ్మ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతోంది. భర్త మూడేళ్ల క్రితం మరణించారు. కుమారుడు ప్రమాదానికి గురై పని చేయలేకపోతున్నాడు. వృద్ధురాలు వితంతు పింఛను కోసం గతంలో దరఖాస్తు చేసుకుంది. వైకాపా ప్రభుత్వం మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఇస్తుందని ఆశగా ఎదురుచూస్తోంది.

❖ వైకాపా ప్రభుత్వ పాలనలో తెదేపా సానుభూతిపరులు, మద్దతుదారులకు వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు పింఛన్లు మంజూరు చేయకుండా అన్యాయం చేసింది. రకరకాల కారణాలు చెప్పి అనర్హులుగా తేల్చింది. వరుసగా మూడు నెలలు పింఛన్ల నగదు తీసుకోలేదని సాకు చూపుతూ రద్దు చేసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టణాలు, గ్రామాల్లో పర్యటించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ప్రజలను కలిసిన సందర్భంగా తమకు అన్ని అర్హతలు ఉన్నాయని పింఛన్లు మంజూరుచేయాలని వారికి పేదలు విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలోని 25 మండలాలు, నాలుగు పట్టణాల పరిధిలో 38 వేల మందికి పైగా పేదలు కూటమి ప్రభుత్వం నూతన పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

**స్పౌజ్ పింఛన్ల చెల్లింపులోనూ ఆలస్యం..**

ఎన్టీఆర్ భరోసా పథకం కింద వృద్ధాప్య పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే అదే నెలలో భార్యకు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 2717 స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసింది. అందుకు రూ.1.08 కోట్లు కేటాయించింది. జూన్ 12న కొత్త లబ్ధిదారులకు రూ.నాలుగు వేలు చొప్పున పింఛను నగదు పంపిణీ చేస్తామని డీఆర్డీఏ అధికారులు ప్రకటించారు. కానీ పంపిణీలో జాప్యం చోటుచేసుకుంటోంది. నెల గడిచినా ఇంకా నగదు చెల్లించలేదు.

శ్రీనివాసరావుతో భార్య రుక్మిణి (పాత చిత్రం)

## సొలస అల్లుడే కోట

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** విలక్షణ నటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు మరణ వార్త విని.. జిల్లాలో ఆయన అభిమానులు, నాటకరంగ కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేటలో ఆయనకున్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. కోట శ్రీనివాసరావు యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన కరణం రాజేశ్వరరావు కుమార్తె రుక్మిణిని 1968లో వివాహం చేసుకున్నారు. అప్పటికే ఆ కుటుంబం విజయవాడలో స్థిరపడటంతో అప్పుడప్పుడు సొలసలోని బంధువుల ఇంటికి వచ్చేవారు. గ్రామంలో సాంఘిక నాటకాలు నేర్చుకుంటున్న యువకులకు సూచనలు ఇచ్చేవారని ఆ తరం వారు గుర్తు చేసుకున్నారు.

శిథిలావస్థకు చేరిన రేకుల షెడ్డు, విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

# కూలేందుకు సిద్ధం.. అడుగడుగునా భయం

**చందోలు ఎస్టీ కాలనీ పాఠశాల దుస్థితి**

ఈ చిత్రంలో ఉన్నది జిల్లా కేంద్రం బాపట్లకు 20 కిలోమీటర్ల దూరంలోని పిట్లవానిపాలెం మండలం చందోలు ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల. కాలనీలో 70 కుటుంబాలున్నాయి. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పాఠశాలకు ఇంత వరకూ పక్కా భవనం నిర్మించలేదు. కూలేందుకు సిద్ధంగా ఉన్న రేకుల షెడ్డులో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. 25 మంది విద్యార్థులున్నారు. రేకుల షెడ్డులోనే ఒకవైపు అంగన్‌వాడీ కేంద్రం, వంటగది ఏర్పాటుచేసుకున్నారు. శిథిలావస్థకు చేరిన షెడ్డులోనే బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు కూర్చుంటున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయం వారిని వెంటాడుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలకు భవనం నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పిట్లవానిపాలెం

# మేజర్‌పై సందిగ్ధం.. ప్రవేశాల్లో జాప్యం

**డిగ్రీలో చేరే విద్యార్థుల్లో అయోమయం**

సత్తెనపల్లి, మాచర్ల – న్యూస్‌టుడే

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలొచ్చి మూడు నెలలు కావస్తోంది. సప్లిమెంటరీ ఫలితాలు వెలువడి కూడా చాలా రోజులైంది. ఇప్పటివరకూ డిగ్రీ మొదటి సంవత్సర ప్రవేశాల ప్రక్రియ మొదలవ్వకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. డిగ్రీలో ఈ ఏడాది పాత పద్ధతిలో సింగిల్ మేజర్ అమలు చేయాలా లేదా డబుల్ మేజర్ విధానమా అనే విషయమై సందిగ్ధత నెలకొంది. ఫలితంగా ప్రవేశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని కళాశాలల్లో డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ మొదలుకావడంతో గతేడాది జులై 20 నుంచి ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభించగా.. ఈ ఏడాది మరింత ఆలస్యంగా మొదలయ్యే అవకాశం ఉందని అధ్యాపకులు చెబుతున్నారు.

**ఎటువైపు మొగ్గు..**

2020-21 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయి. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తున్నారు. ఈ ఏడాది పూర్వ పద్ధతి(ఆఫ్‌లైన్)లో ప్రవేశాలకు అవకాశం కల్పించాలనే డిమాండ్ ఉంది. దీన్ని ఉన్నత విద్యా మండలి పరిశీలిస్తోంది. ఇంకా ఆన్‌లైన్.. ఆఫ్‌లైన్‌లో ఎటు వైపునకు మొగ్గు చూపిస్తారో మార్గదర్శకాలు రాలేదు.

మాచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల

**డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం కావాలని..**

వైకాపా ప్రభుత్వం డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు(ఒకేసారి రెండు సబ్జెక్టులు) విధానం అమలు చేసింది. దీనిపై ఎన్నో రకాల సమస్యలు తలెత్తాయి. దాని స్థానంలో ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలు చేయాలనే డిమాండ్ ఉంది. ఈ విధానంలో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ కూడా డబుల్ మేజర్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. అయితే ఏ విధానం అమలు చేయాలనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**వివిధ అంశాలపై ప్రభావం**

డిగ్రీ మొదటి సంవత్సర ప్రవేశాల జాప్యం తరగతులు, సిలబస్, పరీక్షలపై పెనుప్రభావం చూపిస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో సుమారు 60 డిగ్రీ కళాశాలలున్నాయి. మొదటి సంవత్సరంలో 4 నుంచి 5 వేల మంది విద్యార్థులు చేరవచ్చని అంచనా. ఇంకా.. జాప్యంతో ప్రవేశాలు తగ్గుతాయేమోనని చర్చ కూడా నడుస్తోంది.

# ఆదాయం చేదా.. అడిగే ఉద్దేశం లేదా?

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే

**జడ్పీ బకాయిలు రూ.1.15 కోట్లు**

జిల్లా పరిషత్తుకు ఉన్న స్థలాలు, భూములు, వాణిజ్య దుకాణాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఇందులో సింహభాగం దుకాణాల అద్దె ద్వారా లభిస్తోంది. దుకాణాల లీజుదారులు అద్దెలు క్రమంగా చెల్లించకపోవడంతో జడ్పీ నిధుల లేమితో ఇబ్బందులు పడుతోంది. ఉమ్మడి జిల్లాలో 10 వాణిజ్య దుకాణాల సముదాయాల్లో 116 దుకాణాలు ఉన్నాయి. వీటికి అద్దె రూ.1.45 కోట్లు వసూలు కావాల్సి ఉండగా రూ.67.53 లక్షలు మాత్రమే వసూలైంది. రూ.77.95 లక్షలు బకాయి పడ్డాయి. జిల్లాపరిషత్తు డిప్యూటీ సీఈవో సి.హెచ్.కృష్ణ దుకాణాల లీజుదారుల నుంచి అద్దెలు వసూలు చేసేందుకు రికవరీ డ్రైవ్ నిర్వహించి కొంతమేర వసూలు చేశారు. కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ జనవరి నెలాఖరులో అమలులోకి రావడంతో రికవరీ డ్రైవ్‌ను నిలిపివేశారు. దీంతో చాలావరకు బకాయిలు పెండింగ్ ఉన్నా మళ్లీ వాటి ఊసెత్తడంలేదు.

పిడుగురాళ్ల వాణిజ్య దుకాణాల సముదాయం

| దుకాణ సముదాయం పేరు | దుకాణాల సంఖ్య | జూన్ వరకు అద్దెల డిమాండ్ | చెల్లించిన అద్దెలు | బకాయిలు (రూ.లక్షల్లో) |
|---|---|---|---|---|
| నరసరావుపేట | 14 | 26.52 | 19.48 | 7.04 |
| గురజాల | 16 | 26.55 | 16.00 | 10.55 |
| సత్తెనపల్లి | 5 | 3.29 | 2.04 | 1.25 |
| వినుకొండ | 10 | 5.83 | 2.98 | 2.85 |
| మాచర్ల | 4 | 1.47 | 0.3 | 1.17 |
| అచ్చంపేట | 18 | 9.7 | 4.34 | 5.36 |
| పిడుగురాళ్ల | 13 | 33.00 | 2.29 | 30.71 |
| చిలకలూరిపేట | 13 | 13.68 | 9.8 | 3.88 |
| పెదనందిపాడు | 16 | 20.52 | 8.00 | 12.52 |
| అడవులదీవి (నిజాంపట్నం) | 7 | 4.92 | 2.3 | 2.62 |
| మొత్తం | 116 | 145.48 | 67.53 | 77.95 |

**ఇతరులకు అద్దెలకు ఇస్తూ..**

పెదనందిపాడు, అచ్చంపేట, అడవులదీవి మినహా మిగిలిన ఏడు షాపింగ్ కాంప్లెక్సులు పట్టణ ప్రాంతాల్లో ఉండటంతో దుకాణాలకు డిమాండ్ అధికంగా ఉంటోంది. జడ్పీకి నామమాత్రపు అద్దెలు చెల్లిస్తున్నారనే విమర్శలున్నాయి. దుకాణాలను లీజుకు తీసుకున్న వారిలో పలువురు వాటిని ఇతరులకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**మూడేళ్లుగా రూపాయి చెల్లించలేదు**

2022, ఏప్రిల్‌లో జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఏర్పాటు చేశారు. కలెక్టరు అతిథి గృహాన్ని జడ్పీ అతిథి గృహంగా ప్రతిపాదించి కొంత భాగాన్ని వాడుకుంటున్నారు. అప్పటి నుంచి అద్దెలు చెల్లించకపోవడంతో రూ.38 లక్షల బకాయిలు ఉన్నాయి. మూడేళ్లు పూర్తయినా ఒక్క రూపాయి చెల్లించకపోవడం గమనార్హం.

## సమస్యలపై ఆన్‌లైన్లో అర్జీల స్వీకరణ

**బాపట్ల, న్యూస్‌టుడే:** ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని మీ కోసం వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు నమోదు చేసిన అర్జీల స్థితి సంబంధించి సమాచారాన్ని తెలుసుకోవడానికి నేరుగా 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యలపై అర్జీలను కార్యాలయాల్లో నేరుగా అందజేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

చినగంజాం మండలం కడవకుదురులో గంగమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని పొంగళ్లను నెత్తిన పెట్టుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు ఊరేగింపుగా వెళుతున్న మహిళలు – న్యూస్‌టుడే, చినగంజాం

## ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

**907 మంది విద్యార్థుల ఎంపిక**

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఇందులో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, వికలాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80.. మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్కే వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తరగతులు 14 నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులు తమ లగేజీతో వచ్చి రిపోర్ట్ చేస్తే తరగతులకు హాజరయ్యేలా సిద్ధపడి రావాలని సూచించారు.

❖ మొదటి దశ తరువాత మిగిలిన ఖాళీలను దృష్టిలో ఉంచుకుని అంతర్గత బదిలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా 384 మందికి లబ్ధి కలిగినట్లు వివరించారు. ఇప్పటి వరకు 4,940 మంది విద్యార్థులను ఎంపిక పూర్తి అయిందని తెలిపారు. ఇంకా 60 సీట్లు మిగిలి ఉండగా ఇందులో ఎన్‌సీసీ కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఈ సీట్ల ఎంపిక ఫలితాలను వచ్చే వారం విడుదల చేస్తామని రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు.

# అంతా మా ఇష్టం.. అడిగితే అంతుచూస్తాం!

**గుంటూరు బస్టాండు పరిసరాల్లో ప్రైవేటు ట్రావెల్స్ దౌర్జన్యం**

ఈనాడు, అమరావతి

అంతా మా ఇష్టమంటూ బరితెగిస్తున్నారు. అడిగారంటే అంతుచూస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. మాజీ ఎంపీ అనుచరులమంటూ దౌర్జన్యానికి దిగడం, ఏళ్ల తరబడి స్థానికంగా వాహనాలు నడుపుకొంటున్న వారిపై దాడులకు పాల్పడుతూ, మిన్నకుండిపోవాలని ఒత్తిడి చేస్తుండడం.. వెరసి గుంటూరు ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో ఓ ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకుల దౌర్జన్యం వివాదాస్పదంగా మారింది. ఆర్టీసీ ఆదాయానికి అడ్డంగా గండికొడుతూ అడ్డగోలుగా వ్యవహరిస్తుండడం వారికే చెల్లింది.

గుంటూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండు సమీపంలో 50 ఏళ్లుగా కొందరు కార్ల యజమానులు ఓ కార్ స్టాండ్ నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ నిబంధనలకు లోబడి ఇదే జీవనాధారంగా వీరు నిర్వహణ సాగిస్తున్నారు. కొంత కాలం కిందట విజయవాడ నుంచి 45 ఖర్లతో ఓ వ్యక్తి ఇక్కడ ప్రైవేటు రవాణా వ్యవస్థ ఏర్పాటు చేశారు. గుంటూరు నుంచి విజయవాడకు ఆ కార్లలో ప్రయాణికుల తరలింపు మొదలుపెట్టారు. కొందరు అధికారులను మచ్చిక చేసుకుని గుంటూరు-విజయవాడ మధ్య వాహనాలు దర్జాగా టోల్‌గేట్ దాటేలా వ్యవస్థ రూపొందించుకున్నారు. ఇందుకోసం కొన్ని కార్లకు 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' బోర్డులు ఏర్పాటు చేయడం గమనార్హం. నిబంధనల ప్రకారం పసుపురంగు నంబర్ ప్లేట్ కలిగిన వాహనాలు మాత్రమే ట్రాన్స్‌పోర్ట్ కింద వాడాల్సి ఉండగా.. ఇక్కడి తెల్ల నంబర్ ప్లేట్లు కలిగిన వాహనాల్లోనే కథ నడిపిస్తున్నారు.

**ఆర్టీసీ ఆదాయానికి గండి**

ఇక్కడ అడ్డగోలుగా కథ నడుస్తున్నా అధికారులు ఐదేసిని ప్రశ్నించడం లేదు. వాస్తవానికి, ఆర్టీసీ అధికారులు 45 కార్లపైనా గతంలోనే రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. విజయవాడకు ప్రతి ఐదు నిమిషాలకు ఓ బస్సు తిరుగుతోంది, బస్టాండు ఎదుట ఛార్జీ తీసుకుని ప్రైవేటు వాహనాలు ప్రయాణికులను తరలించుకుపోవడాన్ని సదరు అధికారులు మాట. ఆ ఫిర్యాదుపై రవాణాశాఖ వర్గాలు మిన్నకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది.

**మాజీ ఎంపీ అనుచరులమంటూ బెదిరింపులు**

ప్రైవేటు వాహనదారులు ఆర్టీసీ బస్టాండుకు 2 కి.మీ. దూరంలోనే ప్రయాణికులను ఎక్కించుకోవాలి. ఇక్కడా పరిస్థితి కరువైంది. బస్టాండు వద్ద ప్రైవేటు వాహనదారులు ఇక్కడ మాత్రమే ప్రయాణికులను తీసుకెళ్లాల్సి ఉన్నా ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రతినెలా ఆర్టీసీ అధికారులు, రవాణాశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉండగా అదీ కరవైంది. ఈ ప్రాంతంలో రెండు నిముషాలు ఆర్టీసీ బస్సు ఆగినా తెగ హడావుడి చేసే ట్రాఫిక్ పోలీసులు ప్రైవేటు వ్యక్తుల కార్లు గంటల తరబడి వేచి ఉంటున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మాజీ ఎంపీ పేరు చెప్పి వారు చేస్తున్న దాడులు, దౌర్జన్యంతో పరిస్థితి అదుపు తప్పుతోంది. ఇక్కడ వివాదం మరింత ముదరకముందే ఆర్టీసీ, రవాణా, పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక చొరవ తీసుకుని నిబంధనలు అమలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు జరిగిన వ్యవహారాలపై లోతైన విచారణ జరిపితే వాస్తవాలు వెల్లడవుతాయి.

# తీరంలో మినీ డిశాలినైజేషన్ ప్లాంట్లు!

**సముద్రజలాల్ని మంచినీరుగా మార్చడానికి ప్రతిపాదనలు**

న్యూస్‌టుడే, బాపట్ల

జిల్లాలో పర్యాటక రంగం వేగంగా విస్తరిస్తోంది. బాపట్ల, చీరాల, వేటపాలెం మండలాలలోని తీర ప్రాంతాల్లో రూ.కోట్లు పెట్టి రిసార్ట్ల నిర్మాణం చేపడుతున్నారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి వారాంతాల్లో వేల సంఖ్యలో పర్యాటకులు జిల్లాలోని బీచ్‌లకు వస్తున్నారు. రిసార్ట్లు, హోటళ్లకు మంచినీటి అవసరం పెరిగింది. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా యజమానులు నీటిని తెప్పించుకుంటున్నారు. భూగర్భ జలాలు విపరీతంగా తోడేయకుండా ప్రత్యామ్నాయ వనరులపై ప్రభుత్వం దృష్టిసారించింది. సముద్రజలాలను మంచినీరుగా మార్చడానికి మినీ డిశాలినైజేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఇవి ఏర్పాటైతే నీరు సమృద్ధిగా లభిస్తుంది. జిల్లాలో 74 కి.మీ. పొడవున తీర ప్రాంతం ఉంది. సూర్యలంక, పాండురంగాపురం, రామచంద్రాపురం, కొత్త ఓడరేవు, వాడరేవు, రామాపురం, కఠారిపాలెం వంటి ప్రాంతాల్లో వందల సంఖ్యలో ప్రైవేటు రిసార్ట్లు, హోటళ్లు ఉన్నాయి. సంక్రాంతితో పాటు నాలుగు నక్షత్రాల హోటళ్లు ప్రారంభం కానున్నాయి. ఒబెరాయ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. సూర్యలంకలో పర్యాటక శాఖ బీచ్ రిసార్ట్ ఉంది. స్థానిక వాయుసేన కేంద్రం నుంచి ట్యాంకర్లో నీరు తెప్పించి రిసార్ట్‌లో వినియోగిస్తున్నారు. ప్రైవేటు రిసార్ట్ల నిర్వాహకులు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీరు కొనుగోలు చేసి తెప్పించుకుంటున్నారు. జిల్లాలో పర్యాటక రంగాభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి.



➡ ప్రైవేటు రిసార్ట్ల నిర్వాహకులతో బాపట్ల కలెక్టరేట్లో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ప్రత్యేకంగా సమావేశమై పర్యాటక రంగంలో మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. కొమ్మమూరు కాలువ నుంచి సూర్యలంక వరకు ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీరందించాలని హోటళ్ల యజమానులు కోరారు. కొమ్మమూరు కాలువ నీరు డెల్టా చివరి ఆయకట్టు అవసరాలకు సరిపోవడం లేదని, ఈ ప్రతిపాదనపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. సముద్ర జలాలను మంచినీరుగా మార్చే డిశాలినైజేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు అజయ్‌జైన్ సూచించారు. తొలుత అందరి అవసరాలు తీర్చేలా ఒకటే పెద్ద ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అయితే నిర్వహణలో ఇబ్బందులు వస్తాయని, తమ అవసరాలకు తగినట్లు విడివిడిగా ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటామని యజమానులు చెప్పగా కలెక్టర్ వెంకటమురళి సమ్మతించారు. తమిళనాడులోని నెమ్మెలి తరహాలో జిల్లా తీర ప్రాంతంలో ప్లాంట్లు నిర్మాణానికి కసరత్తు చేస్తున్నారు. బాపట్ల, చీరాల, వేటపాలెం మండలాల్లో మూడు నుంచి నాలుగు మినీ డిశాలినైజేషన్ ప్లాంట్లు నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో పారిశ్రామిక అవసరాలకు పెద్ద ప్లాంట్లు ఏర్పాటు చేసే అవసరం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

## చీకట్లోనే ప్రయాణం.. ఎప్పటికి వెలిగేను దీపం

చినగంజాం, న్యూస్‌టుడే

చినగంజాం టోల్‌ప్లాజా వద్ద తూర్పు, పడమర వైపు రోడ్డు వెంట 30 స్తంభాలు ఉండగా నాలుగింటికి మాత్రమే దీపాలు వెలుగుతున్నాయి. అయిదారు నెలల నుంచి 26 దీపాలు వెలగడం లేదు. టోల్ ప్లాజా గేట్లపై ఉన్న దీపాల్లోనూ సగం వెలగడం లేదు. ఈ కారణంగా ఏడాది కాలంలో టోల్‌ప్లాజా వద్ద ప్రమాదానికి గురై నలుగురు దుర్మరణం చెందారు. వాహన చోదకులు మృతిచెందారు. రాకపోకలు సాగించే సమయంలో రుసుం చెల్లిస్తున్న మేరకు దీపాలు వెలిగించడంలో నిర్లక్ష్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. టోల్‌ప్లాజాకు తూర్పుగా మూడు మరుగుదొడ్లు నిర్మించినా అవి ఉపయోగానికి పనికిరావడం లేదు. తూర్పున అంబులెన్స్, దాని నిర్వహణ గది ఉంది. అక్కడ మచ్చుకైనా సిబ్బంది కన్పించారు. గదికి తాళాలు వేసి ఉంటాయి. శని వారం రాత్రి 9 గంటల సమయంలో వీధి దీపాలు వెలగని పరిస్థితిపై ఫొటోలు తీస్తున్న 'న్యూస్‌టుడే' ప్రతినిధిని అక్కడ పనిచేసే సిబ్బంది అడ్డుకున్నారు. మంచి పని చేస్తున్నారు ఫొటోలు తీస్తున్నారని ప్రశ్నించారు. రెండు రోజుల్లో దీపాలు ఏర్పాటు చేస్తామని సిబ్బంది చెప్పడం గమనార్హం. సంబంధిత శాఖ అధికారులు టోల్‌ప్లాజా వద్ద రాత్రులు పరిశీలించి, వీధి దీపాలన్నీ వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

చినగంజాం టోల్‌ప్లాజా వద్ద పడమర వైపు వెలగని వీధి దీపాలు

(c) eenadu

# వేద జ్ఞానాన్ని బోధించిన వ్యాస మహర్షి

మాట్లాడుతున్న శివస్వామి

**బాపట్ల, న్యూస్‌టుడే:** వేద జ్ఞానాన్ని అందరికీ అర్థమయ్యేలా బోధించిన వ్యాసమహర్షి స్ఫూర్తితో ఉపాధ్యాయులు పని చేయాలని తాళ్లాయపాలెం శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి అన్నారు. హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని విజయలక్ష్మీపురం రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు వ్యాస పురస్కారాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో విజ్ఞాన సౌరభాలు వెదజల్లుతూ భారతీయ సంస్కృతికి సింధువులుగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. అష్టాదశ పురాణాలు రచించిన వ్యాసమహర్షి సమాజానికి జ్ఞాన సంపద ఇచ్చారన్నారు. ఆధ్యాత్మిక, రక్షణ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం మహోన్నత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. భారతీయ సాంస్కృతిక వైభవాన్ని విస్తరింపజేయటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. హిందూ ధర్మం, జాతి గర్వించదగ్గ వారసత్వాన్ని యువతకు అందించే కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ శ్రీనివాసరావు, హిందూ ఉపాధ్యాయ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు సీతారామయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, ప్రధాన కార్యదర్శి స్వర్ణఫణి అజయ్‌శర్మ, నేతలు చారులత, నాగరాజు, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# బాపట్లతో సినీనటుడు కోటకు అనుబంధం

బాపట్ల కవి కేవీఎస్ ఆచార్యతో కోట శ్రీనివాసరావు

**బాపట్ల, న్యూస్‌టుడే:** ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావుకు బాపట్లతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ ప్రాంత రంగస్థల కళాకారులతో కలిసి నాటకాలు వేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు కేఎస్‌టీ సాయితో మంచి సాన్నిహిత్యం ఉంది. ఆయన శిష్యరికంలో అనేక నాటకాల్లో కోట నటించారు. నాలుగు దశాబ్దాలుగా వీరిద్దరి మధ్య గురుశిష్యుల అనుబంధం ఉంది. బాపట్లకు మూడుసార్లు వచ్చారు. కోన ప్రభాకరరావు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీలకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కళాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రముఖ రచయిత కొర్రపాటి గంగాధరరావు జయంతి కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొన్నారు. ప్రముఖ కవి కేవీఎస్ ఆచార్యతో సన్నిహితంగా ఉండేవారు. పట్టణంలోని రైలుపేటలో కోట వారి వీధిలో బంధువులు ఉన్నారు. చందోలు బండ్లమ్మ ఆలయ ఈవో నరసింహమూర్తికి కోట శ్రీనివాసరావుతో అనుబంధం ఉంది. నరసింహమూర్తి స్వగ్రామం చావపాడులో నిర్మించిన ఆలయానికి కోట విరాళం అందజేశారు. ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు 67వ జన్మదినం సందర్భంగా కేఎస్‌టీ సాయిని ఉత్తమ నటుడిగా హైదరాబాద్‌లో సత్కరించారు. సత్కార సభలో కోట పాల్గొని బాపట్ల కళాకారులతో తనకున్న అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కోట మృతిపై బాపట్లకు చెందిన పలువురు కళాకారులు సంతాపం తెలిపారు.

కళాభారతి సభలో మాట్లాడుతున్న కోట


**జనరల్ నోటీసు**
మహారాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P. No. 3 / 2025
Between:-
1) వేముల సువర్ణ కుమారి, R/o చీరాల
2) తవ్వా లక్ష్మి మాధవి, R/o చీరాల
3) వేముల మాణిక్యరావు, R/o చీరాల
4) వలివేటి కనకవల్లి, R/o చిన్నగంజాం
....పిటీషనర్స్
- మరియు -
- Nil - ...రెస్పాండెంట్
ది.04-03-2021న బూర్లె రామ సుబ్బారావు గారు వేముల భరత్ కుమార్ అను వారి వద్ద మూడు లక్షల రూపాయలు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోట్ వ్రాయించి ఇచ్చుట ద్వారా సదరు వేముల భరత్ కుమార్ గారికి ఋణపడి బాకీ తీర్చనందున, ఆతరువాత, వేముల భరత్ కుమార్ గారు మరణించినందున, అతని వారసులైన పైన తెల్పిన పిటిషనర్లు ఆ బాకీ వసూలు నిమిత్తం చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో O.S.No.102/2024 దావాను రూ.4,91,865/- లకు బూర్లె రామ సుబ్బారావుపై దాఖలు చేసి, సదరు దావా బాకీని రాబట్టుకొను నిమిత్తం పై నెంబర్ పిటీషనర్స్, చనిపోయిన వేముల భరత్ కుమార్ యొక్క వారసులుగా "సక్సెషన్ సర్టిఫికెట్" మంజూరు చేయమని కోరుతూ S.O.P. పిటీషన్ ను కోర్టులో దాఖలు చేసినారు, సదరు పిటీషన్ లో ఎవరికైన ఏవిధమైన అభ్యంతరములు వున్న ఎడల తేది.29-07-2025 న ఉదయం 10-30 గంటలకు చీరాల సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో స్వయంగాకానీ, న్యాయవాది ద్వారా కానీ హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలయును, లేని ఎడల, కోర్టువారు తదుపరి ఉత్తరువులు జారీ చేయుదురని ఇందుమూలముగా యావన్మందికి తెలియపరచటమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది. 29-07-2025
స్థలం: చీరాల సం/. గాదంశెట్టి ప్రదీప్ కుమార్
తేది.11-07-2025 పిటీషనర్స్ తరపు న్యాయవాది


# నలుగురికి గాయాలు

రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

**మార్టూరు, న్యూస్‌టుడే:** చెన్నై- కోల్‌కతా పదహారో నంబరు జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి డివైడరును ఢీకొట్టిన సంఘటన ఆదివారం జరిగింది. మండలంలోని జొన్నతాళి- ఇసుకదర్శి గ్రామాల మధ్య ఆయిల్ బంకు సమీపంలో ఒంగోలు నుంచి గుంటూరు వైపు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి, రోడ్డు వెంటున్న డివైడర్, ఇనుప కంచెను ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న కె. వెంకట్రావు, జి. రామారావు, నాగిరెడ్డి, ఎన్వీ. ఆచారికి గాయాలయ్యాయని హైవే పోలీసులు వెల్లడించారు. క్షతగాత్రులను హైవే అంబులెన్సులో చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రోడ్డుపై ఉన్న కారును తొలగించి, రాకపోకలు క్రమబద్ధీకరించారు.

# లక్ష్యం మేర గృహ ప్రవేశాలు జరిగేనా?

అద్దంకి, న్యూస్‌టుడే

పేదలకు సొంతింటి నిర్మాణం పేరుతో గత వైకాపా ప్రభుత్వం నివేశన స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పట్టణాలకు దూరంగా, నిర్జీవ ప్రదేశాల్లో పట్టాలు ఇవ్వడంతో కొన్ని లేఔట్లలో పేదలు గృహ నిర్మాణాలు చేపట్టలేకపోయారు. కూటమి సర్కారు ఏర్పడిన తరువాత ఆ లబ్ధిదారులు ఆందోళన చెందకుండా అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు అవకాశం కల్పించింది. గృహనిర్మాణ పథకంలో భాగంగా ప్రభుత్వం పేదలకు ఒక్కొక్క ఇంటికి రూ. 1.80 లక్షలు మాత్రమే అందించింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఈ సాయాన్ని పెంచింది. ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ప్రకటించింది. ఈక్రమంలో జిల్లాలో గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు నిర్దేశించిన ఇళ్లలో 45.23 శాతం మాత్రమే పూర్తి చేశారు. ఇందులో అత్యధికంగా రేపల్లె నియోజకవర్గంలో 126 శాతం నిర్మాణాలు పూర్తి కాగా వేమూరులో అత్యల్పంగా 27 శాతం నిర్మాణాలు జరిగాయి.

బొమ్మనంపాడు సమీప కాలనీలో అసంపూర్తి గృహ నిర్మాణాలు

## యంత్రాంగం కసరత్తు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటికే పులుమార్లు సామూహిక గృహప్రవేశాలు జరపాలని నిర్ణయించారు. వివిధ కారణాలతో అవి వాయిదా పడుతూ వస్తున్నాయి. ఆగస్టు శ్రావణమాసం నాటికి శుభముహూర్తాలు ఉన్నందున నిర్దేశిత గృహనిర్మాణ లక్ష్యాలు పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పీడీ వై.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణాల్లో పర్యటిస్తూ లబ్ధిదారుల్ని ప్రోత్సహిస్తున్నారు. అయినప్పటికీ సాంకేతిక కారణాలతో గృహ నిర్మాణంలో లబ్ధిదారులు వెనుకంజలో ఉన్నారు.

| నియోజకవర్గం | మొత్తం ఇళ్లు | ఏడాది లక్ష్యం | పూర్తయినవి | శాతం |
|---|---|---|---|---|
| రేపల్లె | 8679 | 983 | 1237 | 125.84 |
| పర్చూరు | 7824 | 944 | 443 | 46.93 |
| అద్దంకి | 8666 | 1627 | 690 | 42.41 |
| బాపట్ల | 5953 | 1455 | 486 | 33.40 |
| చీరాల | 4025 | 511 | 165 | 32.29 |
| వేమూరు | 15268 | 2779 | 733 | 26.88 |
| మొత్తం | 50415 | 8299 | 3754 | 45.23 |

## వేమూరులో వెనకంజ

వేమూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఇళ్లు మంజూరయ్యాయి. మాగాణి ప్రాంతం అయినందున గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు అందులో ఎక్కువగా మెరకలు పోసుకోవాల్సి వచ్చింది. దీనివల్ల ఖర్చు పెరిగింది. శ్రావణమాసం నాటికి ఎక్కువ మందిచే గృహ నిర్మాణాలు జరిపించేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నాం.
- వై.వెంకటేశ్వరరావు, పీడీ, గృహ నిర్మాణ సంస్థ

# మార్పులకు అనుగుణంగా రిటర్నులు దాఖలు

కార్యక్రమంలో పాల్గొన్న ఆదాయపు పన్ను విభాగం ప్రతినిధులు

**చీరాల అర్బన్, న్యూస్‌టుడే:** ఆదాయ పన్ను, జీఎస్టీల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులకు అనుగుణంగా రిటర్నులు దాఖలు చేయాలని చీరాల ఆదాయ పన్ను అధికారి గ్రంధి మురళీకృష్ణ, జీఎస్టీ సహాయ కమిషనర్ రాయవరపు శ్రీనివాసరావు, సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ చింతపల్లి వెంకటసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. వీటిల్లో ఎటువంటి అనుమానాలున్నా నేరుగా సంప్రదించాలన్నారు. ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో ఆదివారం ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఒంగోలు బ్రాంచి, చీరాల ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా ఆదాయ పన్ను-2025, జీఎస్టీపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఒంగోలు బ్రాంచి ఛైర్మన్, సీఏ చక్కా తిరువాయు కుమార్ ఆదాయ పన్నులో వచ్చిన మార్పులు, ముఖ్యమైన నిబంధనలు, చార్టర్డ్ అకౌంటెంట్లు సుధీర్, మద్ది రాజేష్‌లు జీఎస్టీలో కొత్తగా తీసుకొచ్చిన అంశాలను వివరించారు. ప్రాజెక్ట్ డైరెక్టరుగా ఆడిటర్ వల్లంపట్ల వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి చిన్ని లీలాధరరావు, ఎంజీసీ అధ్యక్షుడు వేముల చంద్రశేఖర్, సీఏలు శ్రీమన్నారాయణ, రాజేంద్రప్రసాద్, జగన్ మోహనరావు పాల్గొన్నారు.

# చిన్న రంధ్రాలతో ఆర్థ్రోస్కోపీ సర్జరీలు

జ్యోతి వెలిగిస్తున్న ఎస్ఎస్వీ రమణ, పక్కన ప్రశాంత్, అమర్‌నాథ్, సందీప్, శివకుమార్ తదితరులు

**గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే:** క్రీడల్లోనో, ప్రమాదాల్లోనో మోకాలులో లిగమెంట్లు, భుజంలో ఉండే కండరాలు తెగితే.. చిన్న రంధ్రాల ద్వారా ఆర్థ్రోస్కోపీ విధానంలో సర్జరీ పూర్తిచేయడం వల్ల రోగులకు ఎంతో మేలు జరుగుతోందని సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ ఎస్ఎస్వీ రమణ తెలిపారు. గుంటూరులోని వెలకమ్ హోటల్‌లో గుంటూరు ఆర్థోపెడిక్ అసోసియేషన్, గుంటూరు ఆర్థ్రోస్కోపీ అకాడమీ సంయుక్తంగా మొదటి ఆర్థ్రోస్కోపీ సదస్సు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ మోకాలిలో లిగమెంట్లు తెగిపోతే గతంలో పెద్దకోసి పూర్తిగా తెరచి సర్జరీ చెయ్యాల్సి వచ్చేదన్నారు. అత్యాధునిక ఆర్థ్రోస్కోపీ విధానంలో రెండు చిన్న రంధ్రాల ద్వారానే సర్జరీ పూర్తి చేస్తున్నారన్నారు. 40-50 ఏళ్ల వయసులో కీళ్లలో వాపు, నొప్పి తలెత్తిన వారికి మోకీలు మార్పిడి సర్జరీ అవసరం లేకుండానే 'హెచ్‌టీవో' విధానంలో చేయొచ్చన్నారు. గతంలో ఆర్థ్రోస్కోపీ శస్త్రచికిత్సల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌కు రోగులు వెళ్లాల్సి వచ్చేదన్నారు. కొంతకాలంగా గుంటూరులోనూ ఈ సర్జరీలు చేస్తున్నారన్నారు. వైద్యులకు దీనిపై శిక్షణ ఇచ్చి అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేసిన కార్యనిర్వాహక మండలిని అభినందించారు. కీలు లోపల అడుగువైపున అర్ధ చంద్రాకారంలో రెండు రబ్బరు వాషర్ వంటి పొరలు(మినస్కై) లోపలి వైపు చినిగినా, భుజంలో ఉండే కండరాలు తెగినా ఈ విధానంలోనే సర్జరీలు చేసి సరిచేయొచ్చన్నారు. అనంతరం సుబ్రమణియన్ (మధురై), జైన్(అహ్మదాబాద్), భూపేష్‌కార్తీక్(బెంగళూరు) తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. అంతేగాకుండా లైవ్ సర్జరీలు చేశారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహక అధ్యక్షుడు శివకుమార్ మామిళ్లపల్లి, కార్యదర్శి గంటా చైతన్య, రాష్ట్ర ఆర్థోపెడిక్ సర్జన్స్ సంఘం పూర్వ అధ్యక్షులు ప్రశాంత్, అమర్‌నాథ్, నారాయణరావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు పాల్గొన్నారు.

# ఆంధ్రా ప్యారిస్‌కు పర్యాటక శోభ!

## నిజాంపట్నం కాలువలో బోటు షికారుకు చర్యలు

న్యూస్‌టుడే, తెనాలి

తెనాలికి 'ఆంధ్రా ప్యారిస్' అన్న పేరు రావడం వెనుక కారణాల్లో ఒకటి పట్టణం మధ్య నుంచి పారేటి మూడు కాలువలు పారుతుండటమే. ఇవి సుమారు 2 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్నాయి. వీటి బండ్‌లను సుందరీకరించడంతో పాటు కాలువల్లో బోటు షికారును అందుబాటులోకి తీసుకొస్తే తెనాలి మంచి పర్యాటక ప్రాంతం అవుతుందన్న ఆలోచనలు ఎప్పటి నుంచో ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో నాదెండ్ల మనోహర్ స్థానిక శాసన సభ్యుడిగా, ఉపసభాపతి, సభాపతిగా బాధ్యతలు నిర్వర్తించిన క్రమంలో ఈ అంశంపై దృష్టి సారించిన అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. కాలువలపై నుంచి అటూ ఇటూ రాకపోకలకు 'ఆకాశ నడక వంతెన' నిర్మాణానికి సంబంధించి ప్రణాళిక, రూపు, అంచనాలు చేయించారు. కాని అప్పట్లో సాధ్యపడలేదు. తిరిగి ఇప్పుడు మంత్రి హోదాలో ఈ అంశంపై ఆయన దృష్టి సారించారు.

తెనాలి పట్టణం నుంచి సాగుతున్న మూడు పంట కాలువలు

### ఆదివారం నమూనా డ్రైవ్

తొలుత మధ్య కాలువ అయిన నిజాంపట్నం కాలువలో బోటు షికారుకు కసరత్తు మొదలైంది. మంత్రి మనోహర్ ఆదేశాలతో జలవనరుల విభాగం అధికారులు మూడు నెలలుగా ఈ అంశంపై ప్రణాళిక రూపొందించే పనిలో ఉన్నారు. పర్యాటక విభాగం వారు కూడా క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పలుమార్లు పరిశీలించారు. ఆదివారం నమూనా డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించారు. కాలువలో చిన్న బోటును పట్టణ పరిధిలో నడిపి వివిధ చోట్ల నీటి లోతును నమోదు చేశారు. బండ్‌ల సుందరీకరణ, ప్రజలు బోటు ఎక్కే, దిగే ప్రాంతాల గుర్తింపు, ఆయా చోట్ల వివిధ స్టాల్స్ ఏర్పాటు వంటి పనులకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

కాలువలో వివిధ ప్రాంతాల్లో నీటి లోతును నమోదు చేస్తున్న సిబ్బంది

### ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా

తెనాలికి సహజంగా అందుబాటులో ఉన్న వనరులను అన్ని విధాలుగా సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచనలో భాగంగానే బోటు షికారుకు ప్రయత్నిస్తున్నాం. త్వరలో దశలవారీగా ఇతర కార్యక్రమాలను కొనసాగిస్తాం. వీటిద్వారా ప్రజలకు పట్టణ ఆహ్లాదం, అందమైన అనుభూతిని చేరువ చేయాలని ప్రయత్నిస్తున్నాం. బోటు షికారు మొదలైన తర్వాత ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తెనాలి భక్తులకు మరింత చేరువ అవుతుంది. -మంత్రి నాదెండ్ల మనోహర్

# రైలు కింద పడి వృద్ధురాలి ఆత్మహత్య

**చీరాల అర్బన్, న్యూస్‌టుడే:** చినగంజాం మండలం సోపిరాల తూర్పు బజారుకు చెందిన తుమ్మలపెంట వెంకట రమణమ్మ(65) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనేపథ్యంలో స్థానిక రామకోటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు కేసు నమోదు చేసిన మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే ఎస్సై సీహెచ్. కొండయ్య తెలిపారు.

# సేవానిరతి.. విద్యాప్రగతి

## గుళ్లపల్లి సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలు, మహాప్రస్థానాల్లో సౌకర్యాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

విద్యతోనే సమాజం ప్రగతి దిశగా సాగుతుందని బలంగా నమ్మారాయన. ఉన్నంతలో ఎంతో కొంత సమాజానికి తిరిగి ఇచ్చేయాలనుకున్నారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని, విద్యాభివృద్ధికి చేయూత అందిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు విద్యాప్రదాత **గుళ్లపల్లి సుబ్బారావు.**

గుంటూరుకు సమీపంలోని బ్రాహ్మణకోడూరుకు చెందిన గుళ్లపల్లి సుబ్బారావుది వ్యవసాయ కుటుంబం. తండ్రి ఉపాధ్యాయుడిగా పని చేసేవారు. సుబ్బారావు ఎమ్మెస్సీ ఫిజిక్స్ చదివారు. ఇండియన్ బ్యాంకులో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె.. అందరూ బాగా స్థిరపడ్డారు. ఈ జీవన ప్రయాణంలో తండ్రి నేర్పిన సంస్కారం, తల్లి ఇచ్చిన సంప్రదాయ చైతన్యం వెన్నంటి నడిచింది. ఈ నేపథ్యంలోనే పాతికేళ్లుగా తనకున్నంతలో తల్లిదండ్రులు గుళ్లపల్లి బసవయ్య, లీలావతి, మామ రాయపాటి వీరయ్య పేర్లపై దానధర్మాలు ప్రారంభించారు. అనంతరం గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ స్థాపించి దాదాపు రూ.1.5 కోట్లతో ఎన్నో కార్యక్రమాలు చేశారు. ఇప్పటికీ బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిరంతరం సాహిత్య, సేవ, నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం, ప్రతిభావంతులైన వృద్ధ మహిళలను సన్మానిస్తుంటారు. సోదరుడు గుళ్లపల్లి రాఘవేంద్రరావు సహకారంతో కార్యక్రమాలు చేస్తున్నారు.

కమ్మజన సేవా సమితిలో సుబ్బారావు కట్టించిన పై అంతస్తు

### సాహిత్యంపై మక్కువ.. చదువుకు చేయూత

- తెలుగు సాహిత్యంపై అభిమానంతో పలు విలువైన తెలుగు సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం పుస్తకాలు 50 వరకు అచ్చు వేయించారు.
- గుంటూరులో కమ్మజన సేవా సమితి బాలికల వసతిగృహం, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్, అరండల్‌పేట బాలుర కమ్మ వసతిగృహం, దాక్షిణ్య మానసిక వికలాంగుల సంస్థ, బ్రాడీపేట శారదానికేతనాల్లో ఒక్కో బ్లాకు చొప్పున కట్టించారు.
- కొరిటెపాడు శాంతినగర్లో ప్రాథమిక పాఠశాల భవనం కట్టించారు. బ్రాహ్మణకోడూరు, గుంటూరుల్లో పైకా క్రీడా భవనాలు, జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో వంటశాలలు కట్టించారు.
- జిల్లా గ్రంథాలయం, అరండల్‌పేటలోని రీడింగ్ రూమ్ ఆధునికీకరణ. పట్టాభిపురంలోని వేదపాఠశాల కార్యాలయ భవనం, మోతడకలో కాకతీయ కన్వెన్షన్ సెంటర్ కార్యాలయం, గుంటూరు బార్ అసోసియేషన్‌లో ఏసీ క్యాంటీన్ నిర్మించారు.

**ఉద్యానాల వృద్ధి:** గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణాలకు విరాళం ఇచ్చారు. కృష్ణనగర్ పార్క్, అన్నమయ్య ట్రాక్, ఇన్నర్‌రింగ్ రోడ్ పార్క్, చినపలకలూరు, తురకపాలెంలలో వాకింగ్ ట్రాక్‌ల దగ్గర బెంచీలు ఏర్పాటు చేశారు. గుంటూరులోని అన్నమయ్య వాకింగ్ ట్రాక్ మధ్యలో 30 అడుగుల శ్రీమహావిష్ణువు విగ్రహం కట్టించారు.

### మహాప్రస్థానాల్లో సౌకర్యాలు

అంతిమ సంస్కారాలకు పలు శ్మశానాల్లో కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. స్తంభాలగరువు మహాప్రస్థానంలో షెడ్డు, వాటర్ ట్యాంక్, దహన కార్యక్రమాలకు గ్యాస్ ఛాంబర్, నల్లపాడురోడ్డులో అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మహాప్రస్థానం, బొంగరాలబీడులో సత్యహరిశ్చంద్ర విగ్రహం ఏర్పాటు చేశారు. గుంటూరు మహాప్రస్థానంలో సౌకర్యాలకు విరాళం ఇచ్చారు.

# 15న విద్యుత్తు అదాలత్

**బాపట్ల, న్యూస్‌టుడే:** వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో విద్యుత్తు అదాలత్‌ను ఈ నెల 15న పట్టణంలోని ఎన్ఎన్‌పీ అగ్రహారం సాయి ఫంక్షన్ ప్యాలెస్‌లో నిర్వహిస్తున్నట్లు ఈఈ భాస్కరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్మన్ విక్టరీ ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో విద్యుత్తు అదాలత్ జరుగుతుందన్నారు. వినియోగదారులు కార్యక్రమానికి హాజరై సమస్యలపై అర్జీలు అందజేస్తే ఛైర్మన్ పరిష్కరిస్తారని చెప్పారు. ఈ సదవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

**బ్రాయిలర్ ధరలు** (కిలో 1కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 102, రిటైల్ ధర - 124, చికెన్ విత్‌స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ - 173, చికెన్ స్కిన్‌లెస్ - 196.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 101, 109, 120 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.
**నెక్ సూచించిన కోడిగుడ్డు ధర**
ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

# భట్టిప్రోలు నుంచి తిరుమలకు కూరగాయలు

**భట్టిప్రోలు, న్యూస్‌టుడే:** తిరుమల తిరుపతి దేవస్థానానికి స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నుంచి ఆదివారం రాత్రి పదిన్నర టన్నుల కూరగాయల లారీ బయలుదేరి వెళ్లింది. కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా మాట్లాడుతూ తిరుమలలోని నిత్యాన్నదానానికి కళావతి కాలంగి వీర వెంకట పాండురంగారావు, ఆయన సోదరి సుగుణ సహకారంతో కూరగాయలను ఉచితంగా పంపామని తెలిపారు. తొలుత వాహనం వద్ద పూజ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు బొలిశెట్టి సునీల్ కుమార్, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, సురేంద్ర పాల్గొన్నారు.

# ఇంజినీర్ మృతిపై కేసు నమోదు

**నవీపేట, న్యూస్‌టుడే:** యువ ఇంజినీర్ ఉమాగణేశ్ (28) మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా వేటపాలెనికి చెందిన సివిల్ ఇంజినీర్ గుత్తి ఉమాగణేశ్ తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం కోస్లీలోని కాశీరెడ్డి చెరువులో ప్రమాదవశాత్తు పడి శుక్రవారం చనిపోయాడు. తన తమ్ముడు ఉమాగణేశ్ జారి చెరువు కుంటలో పడి చనిపోయినట్లు అతని సోదరి గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించినట్లు చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**మేదరమెట్ల:** ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో యువకుడు మృతిచెందిన సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల జాతీయ రహదారి బైపాస్‌లో ఆదివారం చోటుచేసుకుంది. మేదరమెట్ల ఎస్సై మహమ్మదర్ రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. కొరిశపాడు గ్రామానికి చెందిన పాలేటి రాకేష్ (22) ద్విచక్ర వాహనంపై మేదరమెట్ల నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. ఈ క్రమంలోనే వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. రాకేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రాకేష్ శిరస్త్రాణం ధరించి ఉంటే చిన్నపాటి గాయాలతో బయటే పడేవాడని ఎస్సై తెలిపారు.


EENADU Classifieds

BUSINESS SERVICES
**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.
**బంగారం కొనబడును.** బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

FINANCIAL SERVICES
SHARES
**షేర్ మార్కెట్** & మ్యూచువల్ ఫండ్స్ (బేసిక్స్), ఫండమెంటల్స్ & టెక్నికల్స్) ట్రైనింగ్ కోర్సు (రెగ్యూలర్/సండే బ్యాచ్) ప్యాకల్టీ బై NSE సర్టిఫైడ్ మార్కెట్ ప్రొఫెషనల్. GNT, Cont: 98854 69566.

HEALTH & CARE
**మద్యపానం మానేయడం** ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. గుంటూరు: మాధవి గ్రాండ్ లాడ్జి ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతీ నెల 1, 15 తేదీల్లో లాడ్జిలో మందులు.

PEOPLE CARE
OLD AGE HOME
**స్వామి వివేకానంద** ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.
**రామకృష్ణ గ్రూప్** (AP No:1) VJA, వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 82474 49042, 96404 96677.

REAL ESTATE
LAND FOR SALE
GENERAL
**రాజధాని అమరావతికి** 90 Km లోపు వినుకొండలో 1 + 2 బెనిఫిట్స్‌తో రిసార్ట్స్ డెవలప్‌మెంట్స్‌తో చ॥గ॥ 800/- & ఎకరం 38 లక్షలు లోపు కొని లబ్ధి పొందండి. Ph: 9390060136.

JOBS
Wanted B-pharmacy or D-pharmacy candidates to work in a pharmacy in Guntur city. Pci Registration Mandatory. Contact - 63009 75241.
**ఏరిస్ ఆగ్రో** లిమిటెడ్, ముంబాయి (CMPL Area) లో పనిచేయుటకు మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జూనియర్ ఎక్స్‌టెన్షన్ ట్రైనీ కావలెను (experience / fresher). అర్హత: ఏదైనా డిగ్రీ మరియు వ్యవసాయ కుటుంబం నుండి వచ్చినవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును. Interview: గుంటూరు ఆఫీస్. Ph: 92487 24777, 99631 11817.
**బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్** కావలెను. డిగ్రీ, 3 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

**మంగళపాలెం** NH-16 పెట్రోల్ బంకు నందు పనిచేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం 12,000/- నుండి 14,000/- వరకు, 8 గం॥ డ్యూటి. సంప్రదించగలరు. Cell: 98854 14786, 98854 97786.
**మానసిక ఎదుగుదల** లేని ఇద్దరు పిల్లలకు (10 సం॥లు) సర్వీస్ చేయుటకు "ఆయా" కావలెను. వివరాలకు సంప్రదించండి. Ph: 99492 84105.
**ప్రముఖ సంస్థ** నందు పనిచేయుటకు మార్కెటింగ్‌లో అనుభవం కల్గిన "మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్" & అకౌంటెంట్స్ మరియు ఆఫీస్ అసిస్టెంట్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. వివరములకు సంప్ర॥ ✆ 87902 33667.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541



91.9 FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297



ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589


(c) eenadu

# బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

## తెదేపాతోనే రాష్ట్రాభివృద్ధి

రేపల్లెలో కరపత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

**రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** రేపల్లె 9, 11, 12 వార్డుల్లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తెదేపా నేతలు ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. తొలుత రైలుపేట కూడలిలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. నాయకులు పంతాని మురళీధరరావు, మేకా రామకృష్ణ, పట్టాభిరామారావు, గూడవల్లి బాబూరావు, వెనిగళ్ల శివ సుబ్రహ్మణ్యం, సజ్జా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? నిజాంపట్నంలో ఎస్‌బీఐ వెనుక ప్రాంతంలోని విద్యుత్తు నియంత్రిక వద్ద మొక్కలు పెరిగి గాలి వీచినప్పుడు సరఫరాలో అంతరాయం కలుగుతోంది. **-స్థానికుడు, నిజాంపట్నం**

✔ మొక్కలు తొలగించి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **-నాగరాజు విద్యుత్తు లైన్‌మెన్, నిజాంపట్నం** – న్యూస్‌టుడే, నిజాంపట్నం

## సర్వే చేయించి రహదారి వేయండి: ఎమ్మెల్యే

ఆక్రమణకు గురైన కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

**వేమూరు, న్యూస్‌టుడే:** సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఆదివారం పెరవలి పాలెం, పెరవలిలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఇంటింటికి తిరుగుతున్న ఎమ్మెల్యేకు స్థానికులు మురుగు కాలువ ఆక్రమణకు గురైన విషయం వివరించారు. ఆయన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి ఆక్రమణకు గురైన కాలువను సర్వే చేయించి, తరువాత కట్ట మార్గంపై రహదారి వేయాలని సూచించారు. పెరవలిలో పర్యటించిన ఆయన స్థానిక లూథరన్ చర్చి వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుందని చెప్పారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ జి.పూర్ణకుమారి, వైస్‌ఛైర్మన్ ఎ. కిశోర్, తెదేపా నాయకులు జె.విజయబాబు, డి. వెంకటేశ్వరరావు, దాది లక్ష్మణరావు, జి.వెంకట సుబ్బయ్య, వి.రవిప్రసాద్, సొసైటీ ఛైర్మన్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సిరులు పండించాలి

**నిజాంపట్నం, న్యూస్‌టుడే:** తీరం రైతులు సిరులు పండించాలని సాగునీటి సంఘాల అధ్యక్షులు రాగం కల్యాణ్, కొలాని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కూచినపూడి లాకు వద్ద అడవులదీవి, ప్రజ్ఞం గ్రామాలకు నీటిని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతన్నలకు పెద్దపీట వేసిందని, రేపల్లె నియోజకవర్గంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ రైతుల క్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ఈక్రమంలో రైతులు పాడి పంటలతో క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు.

నీరు విడుదల చేస్తున్న సాగునీటి సంఘాల అధ్యక్షుడు కల్యాణ్, శ్రీనివాసరావు

# వెద.. మొలకలు రాక వ్యధ

## వర్షాభావ పరిస్థితులతో నష్టపోతున్న రైతులు

న్యూస్‌టుడే, వేమూరు

**వే**మూరు మండలం బలిజేపల్లికి చెందిన **అప్పారావు** అనే రైతుకు ఎకరన్నర పొలం ఉంది. మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని మూడువారాల క్రితం వరి విత్తాడు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మొలకలు సరిగా రాలేదు. తర్వాత వ్యవసాయ బోరు ద్వారా నీరు పెట్టినా ఫలితం లేదు. మొలకలు రాని పొలంలో రోటోవేటర్ వేసి రెండోసారి వరి విత్తాలని పొలం సిద్ధం చేస్తున్నాడు. ఎకరాకు రూ.5 వేల చొప్పున పెట్టుబడి వృథా అయింది. ఇలాంటి పరిస్థితి ఆయన ఒక్కరిదే కాదు. నియోజకవర్గంలో వ్యవసాయ బోర్లు లేని రైతులు వర్షంపై ఆశ పెట్టుకుని వరి విత్తారు. అటు వర్షం కురవకపోగా, ఇటు కాలువల ద్వారా నీరందక విత్తిన విత్తనాలు దెబ్బతిన్నాయి.

**వ్య**వసాయ అధికారుల అంచనా ప్రకారం నియోజకవర్గంలో 94 వేల ఎకరాల సాగుభూమి ఉంది. 85 వేల ఎకరాల్లో వెద పద్ధతి ద్వారా వరిసాగు చేస్తున్నారు. ఇప్పటికి 75 వేల ఎకరాల్లో వెదపద్ధతి ద్వారా వరి విత్తారు. విత్తిన సాగు పొలాల్లో 25 వేల ఎకరాలకు వ్యవసాయ బోర్ల సౌకర్యం ఉంది. మిగతా 50వేల ఎకరాలకు సాగునీరే ఆధారం. లేదంటే వర్షం కురిస్తే మొలకలు వస్తాయి. ఇలాంటి పరిస్థితిలో అన్నదాతలు వర్షంపై ఆధారపడి వరి విత్తారు. జులైలోనూ వర్షం కురవకపోగా, ఎండలు వేసవిని తలపిస్తుండడంతో ప్రస్తుతం విత్తిన వరి విత్తనాలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేమూరు మండలం బలిజేపల్లిలో విత్తిన వరి దెబ్బతినడంతో పైరు చెడగొడుతున్న రైతు

### ఎనిమిది ఎకరాలు దెబ్బతినే అవకాశం

**వ్య**వసాయ బోరు లేకున్నా వర్షంపై ఆధారపడి ఎనిమిది ఎకరాల్లో వెదపద్ధతి ద్వారా వరి విత్తి 15 రోజులవుతోంది. మొలకలు కనిపించడం లేదు. కనీసం కాలువల ద్వారా నీరందితే తడుపుదామని చూస్తున్నా. నీటి జాడ కనిపించడం లేదు. పరిస్థితి చూస్తే ఎనిమిది ఎకరాల్లో విత్తిన గింజలు మొలకలు వచ్చేలా లేవు. కాలువల ద్వారా నీరు అందినప్పుడు రెండోసారి విత్తుకోవడం తప్ప మరోమార్గం కనిపించడం లేదు. **-బి.అంకమరావు, రైతు, జంపని**

## విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

**రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** రేపల్లె టౌన్ మూడో ఫీడర్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల దృష్ట్యా సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అరవపల్లి, పెనుమూడి రోడ్డు, ఓల్డ్‌టౌన్, గూనివారిపాలెం, చినఅరవపల్లిలో విద్యుత్తు సరఫరా ఉండదని డీఈ శ్యాంసుధాకరబాబు తెలిపారు. అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

**చెరుకుపల్లి మండలంలో..** **గూడవల్లి (చెరుకుపల్లి గ్రామీణ):** మండలంలోని గూడవల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా నేడు విద్యుత సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ డీఈ సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కనగాల, నడింపల్లి, పొన్నపల్లి, ఆరేపల్లి, తూర్పుపాలెం, చుట్టు పక్కల గ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత సరఫరా ఉండదన్నారు.

**నగరం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో..** **నగరం:** నగరం సబ్‌స్టేషన్ 33/11 కేవీ ఈదుపల్లి ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ నాగుల్‌మీరా తెలిపారు. మరమ్మతులు నిర్వహిస్తున్నందున పూడివాడ, ఈదుపల్లి, ముత్తుపల్లి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

## ఆరేపల్లి ఉపాధ్యాయుడికి పురస్కారం

శివస్వామి నుంచి పురస్కారం అందుకుంటున్న కోటేశ్వరరావు దంపతులు

**రాజోలు (చెరుకుపల్లి గ్రామీణ):** మండలంలోని రాజోలుకు చెందిన ఉపాధ్యాయుడు మరదాప కోటేశ్వరరావు విద్య, కళలు, ఆధ్యాత్మిక ప్రసంగాలకు చేసిన కృషికి రాష్ట్ర హిందూ ఉపాధ్యాయ సమితి విశిష్ట పురస్కారాన్ని అందించింది. ఆదివారం బాపట్ల రోటరీ క్లబ్‌లో వ్యాస మహర్షి విశిష్ట పురస్కారాన్ని తాళ్లాయపాలెం శివస్వామి చేతుల మీదుగా అందుకున్నారు. నిర్వాహకులు దేగల మహేష్, డోకుపర్తి సీతారామయ్య, స్వర్ణ ఫణి ఆజయ్‌శర్మ తదితరులు కోటేశ్వరరావు దంపతులను సత్కరించారు. పురస్కారం అందుకోవడంతో ఆరేపల్లి ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం కె. నాగేశ్వరరావు, ఎంఈవో లాజర్ తదితరులు అభినందనలు తెలిపారు.

## ఏపీపీగా శ్రీనివాసమూర్తి నియామకం

పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెదేపా నేత అనగాని శివప్రసాద్

**రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపీపీగా ఇటీవల అనగాని శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. రేపల్లె ఎమ్మెల్యే, రెవెన్యూశాఖ మంత్రి నివాసంలో తెదేపా నేత అనగాని శివప్రసాద్ ఆదివారం శ్రీనివాసమూర్తికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాది నాగరాజు పాల్గొన్నారు.

## పూడివాడ సహకార సంఘ అధ్యక్షుడిగా మోర్ల

శ్రీనివాస్

**నగరం, న్యూస్‌టుడే:** పూడివాడ సహకార సంఘ అధ్యక్షునిగా మోర్ల శ్రీనివాస్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ సహకార సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రైతులకు రుణాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, జడ్పీటీసీ సభ్యురాలు నాగమణి, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## యోగాసనాలు క్రీడగా గుర్తింపు

**బాపట్ల:** యోగాసనాలను ప్రభుత్వం క్రీడగా గుర్తించిందని యోగాసన క్రీడల సంఘం ప్రతినిధి మానం మల్లీశ్వరి అన్నారు. బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా యోగాసన క్రీడల సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆసనాలు ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా పోటీల్లో విజేతలను రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. సంఘం ప్రతినిధులు వెంకటేష్, సతీష్, కనకభూషణ్, శ్రీదేవి పాల్గొన్నారు.

## ఇద్దరికి గాయాలు

**బల్లికురవ, న్యూస్‌టుడే:** మండలంలోని అంబడిపూడి - కొమ్మినేనివారిపాలెం మధ్య రహదారిలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులైన కొమ్మినేనివారిపాలేనికి చెందిన కొమ్మినేని అరుణ్ కుమార్, సోమవరప్పాడు గ్రామానికి చెందిన పుసులూరి శ్రీనివాసరావును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అమ్మవారికి సారె సమర్పణ

**వేమూరు, న్యూస్‌టుడే:** ఆషాఢమాసం సందర్భంగా పెరవలిలోని అంకమ్మతల్లికి స్థానికులు ఆదివారం సారె సమర్పించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పెరవలి, చావలి గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

పెరవలి అంకమ్మతల్లి జాతరలో భక్తజనం

కురప్పాలెంలో ఊరేగింపుగా అమ్మవారికి సారె తీసుకెళుతున్న భక్తులు

**పిట్టలవానిపాలెం:** మండలంలోని సంగుపాలెం పంచాయతీ పరిధి కురప్పాలెంలో యద్దనపూడి వారి ఇలవేల్పు రేణుక అంకమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం అభిషేకం, కుంకుమార్చనలు చేశారు. అనంతరం మహిళలు గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సారె సమర్పించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## వేడిగాలులతో రైతుల్లో ఆందోళన

**చెరుకుపల్లి న్యూస్‌టుడే:** వేడి గాలులతో వరి నారుమళ్లు పోసిన రైతులను ఆందోళన చెందుతున్నారు. నారుమళ్లకు రోజు విడిచి రోజు నీటితడులు అందించాల్సి వస్తుందని, కాలువల్లో పూర్తిస్థాయిలో నీరు రావడం లేదని వాపోతున్నారు. విత్తనాలు చల్లి పదిరోజులు కూడా కాక ముందే ఇప్పటికి మూడుసార్లు నీటితడులు అందించాల్సి వచ్చిందని.. నీళ్ల ఇంజన్లతో తడులు ఇచ్చేందుకు ఖర్చు తడిసిమోపెడవుతుందని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి నారుమళ్లు ఎండిపోక ముందే కాలువలక పూర్తిస్థాయిలో సాగు నీరందించాలని కోరుతున్నారు.

## రహదారుల మధ్యలో గుంతలు

దిండి- అడవులదీవి మార్గంలో పడిన గుంత

కొత్తపాలెం- అడవులదీవి మార్గంలో పెట్రోలుబంకు ఎదురు గుంత ఇలా..

**నిజాంపట్నం** మండలంలో ప్రధాన ఆర్ అండ్‌బీ రహదారులపై అక్కడక్కడ గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపాలెం- రేపల్లె మార్గంలో పెట్రోలు బంకుఎదురు రహదారి మధ్యలో పెద్ద గుంత పడింది. అలాగే దిండి- అడవులదీవి మార్గంలో నర్రావారిపాలెం వద్ద రోడ్డుపై మరో గుంత పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సమస్యపై ఆర్‌అండ్‌బీ ఏఈ విద్యాసాగర్‌తో మాట్లాడగా గుంతలు పడిన విషయం తమ దృష్టిలో ఉందన్నారు. మరమ్మతులు చేయించి సమస్య తీరుస్తామన్నారు. – న్యూస్‌టుడే, నిజాంపట్నం

## మురుగు కదలదు.. దుర్వాసన ఆగదు

కాలువలో నిలిచిన మురుగు

**మం**డలంలోని సంగుపాలెం ఎన్టీఆర్ సెంటర్‌లో డ్రెనేజీలో మురుగు పేరుకుపోయింది. చెట్టు కింద సేదదీరే గ్రామస్థులు మురుగు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. కాలువలో తూటికాడ అల్లుకుపోయి, మట్టి మేటలు వేయడంతో మురుగు నిలుస్తోందని సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పరిశీలించి వెంటనే నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

## బండ్లమ్మ ఆలయాల్లో పూజలు

విజయేశ్వరిగా చందోలు బండ్లమ్మ

**చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే :** చందోలు శ్రీబండ్లమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసులహారం, రజత కవచంతో అలంకరించగా 'విజయేశ్వరి'గా దర్శనమిచ్చారు. భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారి పాలెంలోని శ్రీబండ్లమ్మ వార్లకు పూజలు చేశారు.

### అల్లూరమ్మ కొలుపు మహోత్సవం

ఆదిశక్తిగా..

**అల్లూరు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే:** గ్రామ దేవత శ్రీఅల్లూరమ్మ అమ్మవారికి ఆదివారం యాదవ సంఘం వారు కొలుపు మహోత్సవం నిర్వహించారు. ముందుగా కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణలో 'ఆదిశక్తి'గా భక్తులకు దర్శనమిచారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

### శాకంబరిగా ఆడెమ్మ

**భట్టిప్రోలు, న్యూస్‌టుడే:** ఆషాఢమాసం పురస్కరించుకుని అద్దేపల్లి గ్రామదేవత ఆడెమ్మ అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. వివిధరకాల కూరగాయలతో అమ్మవారికి అలంకరణ చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అర్చకుడు దివి శేషుబాబు ఆలయ విశిష్టత వివరించారు.

### మొగదారమ్మ

అలంకరణలో అమ్మవారు

**నిజాంపట్నం, న్యూస్‌టుడే:** మత్స్యకారుల ఇలవేల్పు, నిజాంపట్నం గ్రామ దేవత మొగదారమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మత్స్యకారులు, గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అలంకరణ ఆకట్టుకుంది.

### కట్లమ్మ తల్లికి అభిషేకం

**వేమూరు, న్యూస్‌టుడే:** రెండు వారాలకు పైగా వర్షం కురవకపోవడంతో వెదపద్ధతి ద్వారా వరి విత్తిన పొలాలు దెబ్బతింటున్నాయని వేమూరు రైతులు వాపోయారు. ఆదివారం గ్రామ దేవత కట్లమ్మతల్లికి వారు ప్రత్యేక పూజలు చేశారు. గుడి వద్ద అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. పుష్కలంగా వర్షం కురిపించాలని వేడుకున్నారు.

## వైద్య శిబిరం నిర్వహణ అభినందనీయం

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న శివప్రసాద్

**నగరం, న్యూస్‌టుడే:** గ్రామీణ ప్రాంతాల్లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని తెదేపా నేత అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఆస్టర్ రమేష్ హస్పిటల్స్ వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గుండె, ఊపిరితిత్తులు, నరాలు, మెదడు, జీర్ణకోశ వ్యాధులు, కీళ్లు, ప్రసూతి విభాగాలకు చెందిన నిపుణులు నగరంలోనే వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు గుంటూరు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు సుమారు 300 మంది రోగులను పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, స్థానిక అధికారులు, ఇతరులు పాల్గొన్నారు.

## సువాసిని పూజోత్సవం

పూజలో మహిళా భక్తులు

**బాపట్ల, న్యూస్‌టుడే:** పట్టణంలోని భావదేవనగర్‌లో జ్ఞానపీఠం ఆధ్వర్యంలో అష్టోత్తర శత ప్రత్యక్ష సువాసిని పూజోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 108 మహిళలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద సంతర్పణ చేశారు. గురువు శ్రీనివాసరావు, నిర్వాహకులు శిఖరం ఫణిరాజ శర్మ, అపర్ణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## 46 మందికి సీఎం సహాయనిధి చెక్కులు

**చీరాల:** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 46 మందికి మంజూరైన రూ.40,05,874 చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదివారం రాత్రి కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. బావుడా ఛైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, ఏఎంసీ ఛైర్మన్ కౌతరపు జనార్దనరావు, పీఏసీఎస్ ఛైర్మన్ కోటి మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నటుడు కోట మృతికి సంతాపం

**చెరుకుపల్లి, న్యూస్‌టుడే:** ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య నాయకులు సంతాపం తెలిపారు. సినీ, రాజకీయ రంగంలోనూ కోట విలక్షణమైన వ్యక్తిగా నిలిచారని, ఆయన మృతి తెలుగు చిత్రపరిశ్రమకు తీరని లోటని సంఘ సభ్యులు అన్నారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి రావూరి ఆంజనేయులు, పొన్నపల్లి సత్యనారాయణ, చావలి శ్రీధరశర్మ, మల్లెల కృష్ణమూర్తి తదితరులు నివాళి అర్పించారు.

**LOST**

I, **Atyala Salem Raju** S/o Atyala Israel, R/o H.No: 6-10, Vengalayapalle (V), Peda Irlapadu (M), Prakasam District, A.P. have lost my Original Regd. Link documents No's, **3665/2012, 3909/2015** & **13920/2017** all are registered at SRO, Uppal, while travelling from Nellore to Bapatla on 02.07.2025. If anyone found pls contact:

**9666915861**

## సమ్మెలో పురపాలక కార్మికులు

ధర్నా చేస్తున్న కార్మికులు

**బాపట్ల, న్యూస్‌టుడే:** పురపాలక ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మె బాట పట్టారు. పురపాలక సంఘంలో విద్యుత్తు, తాగునీరు, ఇతర ఇంజినీరింగ్ విభాగంలో సేవలు నిలిచిపోయాయి. కార్మికులు విధులు బహిష్కరించి పురపాలక కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో బైఠాయించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారమయ్యే వరకు విధుల్లోకి హాజరయ్యేది లేదని స్పష్టం చేశారు. నెల వేతనం రూ.24,500కు పెంచాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలతో కార్మికుల జీవనానికి ఇబ్బందిగా ఉందన్నారు. నాయకులు రత్నం, నాని, అశోక్, మురళీకృష్ణ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాపట్లలో స్తంభించిన సేవలు

**బాపట్ల, న్యూస్‌టుడే:** పురపాలక ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెతో బాపట్ల పట్టణంలో సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. రాత్రి ఎనిమిదిన్నర గంటల తర్వాత వీధి దీపాలు ఆపేశారు. పట్టణ వీధుల్లో అంధకారం నెలకొంది. తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తనుంది. నీటి సరఫరాను అడ్డుకోవటానికి కార్మికులు ప్రయత్నించగా అధికారులు ఆపారు. కార్మికుల సమ్మెతో తలెత్తిన అత్యవసర పరిస్థితులపై పురపాలక అధికారులు అప్రమత్తమయ్యారు. డీఈ కృష్ణారెడ్డి రంగంలోకి దిగి తాత్కాలిక సిబ్బంది ద్వారా సేవల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. తమకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కార్మికులు సమ్మె చేయటం సరికాదని పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి అన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని తెలిపారు. నీటి సరఫరాను అడ్డుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# కొరవడిన వ్యర్థాల నిర్వహణ

నగరం, న్యూస్‌టుడే

సీసీ రహదారిపై చెత్త

నగరం- అచ్యుతాపురం మార్గంలో..

**కూ**టమి ప్రభుత్వం పల్లెల్లో పరిశుభ్రత మెరుగు పరిచేందుకు ప్రయత్నిస్తున్నా చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. వ్యర్థాల తొలగింపులో సిబ్బంది నిర్లక్ష్యం వీడడం లేదు. దీంతో గ్రామాల్లోని అంతర్గత రహదారులు, ప్రభుత్వ స్థలాలు, పాఠశాలల పరిసరాలు చెత్తా చెదారంతో కంపుకొడుతున్నాయి. రహదారుల్లో చెత్త కనిపించరాదన్న లక్ష్యంతో రూ.లక్షల వ్యయంతో గతంలో తెదేపా ప్రభుత్వం ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాలు నిర్మించింది. గత వైకాపా ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేయడంతో నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రం నగరం శివారు ముత్తుపల్లి రహదారిలో నిర్మించిన సంపద సృష్టి కేంద్రం వృథాగా మారింది. చెత్తను వేరు చేసేందుకు నిర్మించిన కట్టడాలు ముళ్ల పొదలతో నిండిపోయాయి. లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్డు డంపింగ్ యార్డుగా తయారైంది. వర్షాకాలంలో విషజ్వరాలు వెంటాడుతుంటాయి. గత సంవత్సరం నగరం, చిలకాలవారిపాలెం, బెల్లంవారిపాలెం, బోరమాదిగపల్లి, సిరిపూడి తదితర గ్రామాల్లో టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వచ్చింది. గత ఐదేళ్లలో ఫాగింగ్ యంత్రాలను వాడకుండా నిరుపయోగంగా ఉంచారు. దీంతో అవి మూలకు చేరాయి. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో విషజ్వరాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని స్థానికులు కోరుతున్నారు.

### దుర్వాసన వస్తోంది

**వీ**ధుల్లో చెత్త పేరుకుపోతోంది. ఎప్పటికప్పుడు సిబ్బంది తొలగించడం లేదు. దోమల సమస్య పెరుగుతోంది. రోజుల పాటు తొలగించకపోవడంతో కంపుకొడుతోంది. వర్షాకాలం నేపథ్యంలో ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించి పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలి. చెత్త పేరుకుపోతే వ్యాధుల బారినపడతాం. **-వెంకటేశ్వర్లు, స్థానికుడు**

(c) eenadu

## 46 మందికి సీఎం సహాయనిధి చెక్కులు

చీరాల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 46 మందికి మంజూరైన రూ.40,05,874 చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదివారం రాత్రి కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. బావుడా ఛైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, ఏఎంసీ ఛైర్మన్ కౌతరపు జనార్దనరావు, పీఏసీఎస్ ఛైర్మన్ కోటి మోహనకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో ఎమ్మెల్యే కొండయ్య, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌బాబు

# చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

## వృథాగా జలం.. ఎన్నాళ్లీ నిర్లక్ష్యం

దేశాయిపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: మండలంలోని దేశాయిపేట నూలు మిల్లు సమీపంలో ఉన్న పెట్రోలు బంకు వెనుక వీధిలో పంచాయతీ తాగునీటి పైపునకు వేసిన కుళాయి మూత ఊడిపోయింది. దీంతో కొన్ని రోజులుగా నీరు వదిలినప్పుడు ఇలా వృథాగా పోతోంది. అధికారులు స్పందించి, దీనికి ట్యాప్ బిగించాలని, నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM**

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? అణుమల్లిపేట మహాలక్ష్మమ్మ చెట్టు నుంచి తూర్పువైపు గల్లీలో ఉన్న లైటు నెలరోజులుగా వెలగడంలేదు. **- నారాయణ, స్థానికుడు** ✔ వెంటనే సిబ్బందిని పంపి అక్కడ దీపం బాగుచేయిస్తా. **-టి.వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, దేశాయిపేట - న్యూస్‌టుడే, వేటపాలెం**

## ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం

పర్చూరు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూర్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఆదివారం జాగర్లమూడికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కె.పవన్‌కుమార్‌కు ఆర్థికసాయం అందజేశారు. దాత కొల్లా సాంబశివరావు రూ.40 వేలను అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్ చెప్పారు. కె.ఆంజనేయులు, పి.సదానందరెడ్డి, రావి సతీష్‌బాబు, కె.సుబ్రహ్మణ్యచారి, కె.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# యంత్రాంగం అప్రమత్తం.. పారిశుద్ధ్యంపై యుద్ధం

అద్దంకి, న్యూస్‌టుడే

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగిస్తున్నారు. పది రోజులుగా ఈ ప్రక్రియ ఊపందుకుంది. జిల్లా వ్యాప్తంగా ఇది చురుగ్గా సాగుతోంది. చీరాల డీఎల్‌డీవో పద్మావతి ఆధ్వర్యంలో శింగరకొండపాలెం చెత్త సంపద కేంద్రాన్ని ఇటీవల తనిఖీ చేశారు. అది అధ్వానంగా ఉండటంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే హరిత రాయబారుల్ని నియమించుకుని పకడ్బందీగా పనులు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ ఇటీవల జరిగిన పలు సమావేశాల్లో పారిశుద్ధ్యం లోపించిన మండలాల అధికారులపై తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది.

ఇటీవల చక్రాయపాలెం రహదారి వెంబడి పేడదిబ్బను ట్రాక్టర్‌లో తరలిస్తూ..

దీంతో మిగిలిన మండలాల్లో అధికారులు, యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రతిరోజూ మండల స్థాయిలో ఎంపీడీవో, ఉప ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తూ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

### కాలానుగుణ వ్యాధుల్ని దృష్టిలో ఉంచుకొని..

వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో రహదారుల వెంబడి పేడదిబ్బలు, వ్యర్థాలు వంటివి కొనసాగుతున్నాయి. అద్దంకి నియోజకవర్గంలోని 103 గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. వారం రోజుల క్రితం అద్దంకి మండలం వేలమూరిపాడు, కొంగపాడు, మణికేశ్వరం, చక్రాయపాలెం, శింగరకొండపాలెం, బొమ్మనంపాడు గ్రామాల్లో ఎంపీడీవో బి.సింగయ్య పర్యటించారు. స్థానికులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అందుబాటులోని హరిత రాయబారులను సద్వినియోగం చేసుకోవాలని, చెత్తను ప్రత్యేక డబ్బాలలో ఉంచి వారికి అందించాలని సూచించారు.

### ప్రజల్లో చైతన్యం ప్రారంభమైంది

పారిశుద్ధ్యం మెరుగుపై ప్రజల్లో చైతన్యం, కదలిక ఇపుడిపుడే వస్తోంది. తడి, పొడి చెత్తను వేరుచేయాలి. పొడిచెత్తను అమ్మేయగా వచ్చే సొమ్మును పంచాయతీకి జమ చేయాలి. మిగిలిన చెత్తను సంపద కేంద్రానికి తరలించాలి. అక్కడి నుంచి వేరు చేసిన చెత్త జిందాల్ కంపెనీకి చేరుతుంది. క్షేత్రస్థాయిలో ప్రజలకు చెత్తపై అవగాహన కల్పిస్తున్నాం. ఇదే సమయంలో సిబ్బందికి అవగాహన పెంచుతున్నాం. దీనివల్ల రాబోయే రోజుల్లో సత్ఫలితాలు రానున్నాయి. **-పద్మావతి, చీరాల డీఎల్‌డీవో**

## విద్యుత్తు సరఫరాలో అంతరాయం

అద్దంకి, న్యూస్‌టుడే: నూతన విద్యుత్తు టవర్ల నిర్మాణంలో భాగంగా పట్టణంలో సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ ఎం.దామోదరం తెలిపారు. ఎన్టీఆర్‌నగర్, ద్వారకానగర్, టైలర్స్ కాలనీ, ఆటోనగర్, భవానీ కూడలి నుంచి శింగరకొండ వరకు రోడ్డుకు ఇరువైపులా, కలవకూరు రోడ్డు వెంబడి ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

## ముక్తేశ్వరంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

బల్లికురవ: మండలంలోని ముక్తేశ్వరంలో సోమవారం రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. సాయంత్రం 5 గంటలకు సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి తెలుగుదేశంలో పాల్గొననున్నారు. **నేడు**

## నల్లబర్లీ కొనుగోలు కేంద్రం ప్రారంభం

మార్టూరు, యద్దనపూడి: మార్టూరు ఏఎంసీ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మార్క్‌ఫెడ్ అధికారులతో కలిసి ప్రారంభిస్తారని ఏలూరి క్యాంపు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

❖ యద్దనపూడి మండలంలోని నల్లబర్లీ పొగాకు నిల్వలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించేందుకు సోమవారం అడుసుమల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభిస్తారని తెదేపా మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి తెలిపారు.

## తుమ్మపొదల తొలగింపు

మార్టూరు: మార్టూరులోని గొట్టిపాటి హనుమంతరావు కాలనీలో తుమ్మపొదల తొలగింపు ఆదివారం ప్రారంభమైంది. పంచాయతీ నిధులతో పొక్లెయిన్‌తో ఇళ్ల మధ్య ఏపుగా పెరిగిన పొదలను తొలగిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. విషపురుగుల సంచారం తీవ్రమై కాలనీవాసులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు.

## కోట మృతికి ఏలూరి సంతాపం

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రముఖ వెండితెర నటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు మృతి తీరని లోటని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సానుభూతి వ్యక్తం చేశారు. కోట ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

## నిత్యావసరాలు అందజేత

దేశాయిపేట (వేటపాలెం), న్యూస్‌టుడే: నీలకంఠపురంలోని అనాథ వృద్ధ శరణాలయానికి రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో ఆదివారం బియ్యం, కంది పప్పు, కూరగాయలు, పండ్లు, బిస్కెట్లు నిత్యావసర వస్తువులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు జాలాది కృష్ణమూర్తి, తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్, పోలుదాసు రామకృష్ణ, హేమంత్ కుమార్, శ్రీనివాసరావు, వీరాంజనేయులు, శరణాలయ నిర్వాహకులు సత్రం మల్లేశ్వరరావు, గుత్తి విశ్వేశ్వరరావు ఉన్నారు.

# వైద్యశిబిరాలకు విశేష స్పందన

పర్చూరు: రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పర్చూరు, న్యూస్‌టుడే: స్థానిక వై.ఆర్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. నోవా అగ్రిగ్రూప్, ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్, గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటి వైద్యశాల సౌజన్యంతో ఇది నిర్వహించారు. తొలుత మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ప్రతిమకు, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేపట్టిన శిబిరంలో సుమారు 813 మందికి మధుమేహం, రక్తపోటు పరీక్షలతో పాటు కంటి పరీక్షలు చేశారు. 350 మందిని చికిత్సల నిమిత్తం ఎంపికచేశారు. శిబిరానికి విచ్చేసిన ప్రజలకు భోజన సదుపాయం కల్పించారు. తెదేపా నేతలు, కార్యకర్తలు పర్యవేక్షించారు.

గంగవరం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: నిత్యం ఉదయం సాయంత్రం నడిచే వారికి మధుమేహం అదుపులో ఉంటుందని మధుమేహ వ్యాధి నిపుణులు మంచాల రమేష్‌బాబు పేర్కొన్నారు. మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ, శంకరశెట్టి రామయ్య, కోటమ్మల పేరిట కుటుంబ సభ్యులు గంగవరంలో ఆదివారం ఉచిత రక్త పోటు, మధుమేహ వ్యాధుల వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం రమేష్‌బాబు, డాక్టర్ సాంబయ్య, డాక్టర్ విద్య 220 మందిని పరీక్షించి రెండు నెలలకు సరిపడా మందులు అందజేశారు. ఉదయం రోగులకు బీపీ, రక్త పరీక్షలు చేశారు.

ఇంకొల్లు, న్యూస్‌టుడే: శ్రీకృష్ణ ఫ్రీమెడికల్ క్యాంప్స్, రోటరీక్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్, ఎన్నారై నేస్తం ఆధ్వర్యంలో ఆదివారం ఇంకొల్లు రోటరీ గంగ కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డాక్టర్ ఆలా శ్రీకృష్ణమూర్తి ప్రారంభించారు. విజయవాడ సెంటినీ, గుంటూరు కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్, శిరీష స్కిన్ క్లినిక్‌లకు చెందిన వైద్య నిపుణులు మాధవన్, విష్ణుప్రియ, గోపిచంద్‌లు 300మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కోటేశ్వరరావు, సత్యనారాయణ, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, వాసు పాల్గొన్నారు.

బల్లికురవ, న్యూస్‌టుడే: బల్లికురవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నరసరావుపేటకు చెందిన తేజ నర్సింగ్ హోం ఆధ్వర్యంలో నిర్వహించారు. నాడి వైద్యుడిగా పేరొందిన బొట్ల రఘుప్రసాద్ 300 మందికి పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. వృద్ధులు, మహిళలు ఎక్కువగా హాజరయ్యారు.

# వేడుకగా ఏకాదశ రుద్ర పారాయణ

హాజరైన భక్తజనం... భక్తిగీతాలు ఆలపిస్తున్న గాయకులు

వేటపాలెం, న్యూస్‌టుడే: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని రామపురం తీరాన బాబాను ప్రార్థిస్తూ ఏకాదశ రుద్ర పారాయణ (రుద్రోపాసన) కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఏపీ సత్యసాయి సేవా సంస్థలు వేదధ్యాయన విభాగం ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు సురేంద్ర, జిల్లా అధ్యక్షుడు ముంగర రాంబాబు, రాష్ట్ర సమన్వయకర్తలు, ఇన్‌ఛార్జులు, పదాధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## అష్టదిగ్గజాల్లో విశిష్టమైన సాహితీవేత్త 'ధూర్జటి'

అద్దంకి, న్యూస్‌టుడే: శ్రీకృష్ణ దేవరాయలు ఆస్థానంలో పని చేసిన కవుల్లో ధూర్జటి సాహిత్యం విశిష్టమైనదని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. సృజన సాహిత్య సమావేశం ఆదివారం స్థానిక కమఠేశ్వరాలయం వద్ద నిర్వహించారు. వారణాశి రఘురామశర్మ, అద్దంకి లెవీప్రసాద్ పాల్గొన్నారు.

## నిరవధిక సమ్మెలో ఇంజినీరింగ్ సిబ్బంది

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి పురపాలక సంఘంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది ఆదివారం నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. మంచినీటి సరఫరా, వీధి దీపాల విభాగం సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 30 మంది అందుబాటులో లేరు. దీంతో ఉదయం 9.30 గంటల తరువాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో నీటి సరఫరాను అధికార యంత్రాంగం పునరుద్ధరించింది. సాయంత్రం వీధి దీపాల నిర్వహణ కష్టంగా మారింది. సమ్మెలో పాల్గొన్న కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచే పురపాలక కార్యాలయం ఎదుట నిరసనలో పాల్గొన్నారు. కార్మికులనుద్దేశించి ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ కావూరి రఘుచంద్ మాట్లాడారు. సీఐటీయూ నేతలు తంగిరాల వెంకటేశ్వర్లు, కేపీ.రాజు, డి.గంగాధర్, నాగేశ్వరరావు, పి.ఆదాం, వి.జాన్, జాషువా, మార్కు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయం ఎదుట..

## 'పొగాకు కొనుగోళ్లలో వివక్ష'

ఇంకొల్లు, న్యూస్‌టుడే: పొగాకు కొనుగోలు కేంద్రాల్లో వివక్ష చోటుచేసుకుంటోందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.రామకోటేశ్వరరావు ఆక్షేపించారు. ఆదివారం ఇంకొల్లులో యేషయ్య అధ్యక్షతన మండల రైతు సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత లేకుండా సిఫారసులతో ఒక వర్గంవారికి ప్రయోజనం కలిగేలా అధికారులు ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. కౌలు రైతు పత్రం కావాలంటే భూయజమాని అనుమతి తప్పనిసరి కావటంతో వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈసందర్భంగా జరిగిన నూతన కార్యవర్గ ఎంపికలో రైతు సంఘ మండల కన్వీనర్‌గా భానుప్రసాద్, సభ్యులుగా గంగయ్య, ప్రసాద్, యేషయ్య, రవీంద్రబాబు నియమితులయ్యారు.

## కాలువ పూడికతీతలో నాణ్యతలోపం


పూడికమట్టి కాలువ అంచుల్లో వేశారిలా..

ఇంకొల్లు, న్యూస్‌టుడే: పావులూరు మైనరు సాగరు కాలువ పూడికతీత పనుల్లో నాణ్యతలోపం కనిపిస్తోంది. పావులూరు మైనరులో వారం రోజులుగా పొక్లెయిన్‌తో పూడిక తీస్తున్నారు. ఆరు అంగుళాల లోతున పూడిక తీసి ఆ మట్టిని దక్షిణం వైపు కట్టపై పోసి, పటిష్ఠం చేయాలి. పొక్లెయిన్‌తో తీసిన మట్టిని అంచులపై వేస్తున్నారు. వర్షం కురిస్తే తిరిగి తీసిన మట్టి మళ్లీ కాలువలోకే వెళుతుంది. కాగా నీటి సంఘాల ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతుండగా 15 రోజుల క్రితం ఈ కాలువలోనే పది రోజుల పాటు ఉపాధి పనులు జరిగాయి. ఆ సమయంలోనూ తీసిన మట్టిని కట్టలపై కాకుండా అంచునే పోశారు. ఈ విషయమై ఎన్ఎస్పీ ఏఈ బాలకృష్ణనాయక్ వివరిస్తూ ఉపాధి పనులతో తమకు సంబంధం లేదన్నారు. వారిని తమ కాలువల్లో పనులు చేయవద్దని చెప్పినా వినకుండా చేశారన్నారు. పూడికతీతలో నాణ్యత లోపం ఉంటే పనులు పూర్తయ్యాక సరిచేయిస్తామన్నారు.

## రాళ్లతో నింపేసి.. వదిలేసి!

పర్చూరు మండలంలోని అడుసుమల్లి నుంచి చెరుకూరు వెళ్లే రహదారిని మరమ్మతుల పేరిట రాళ్లతో నింపేశారు. దీంతో వాహనదారులకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. పది కిలోమీటర్లకు పైగా గల ఈ మార్గంలో తిక్కరాజుపాలెం, భూషాయపాలెం గ్రామాలు ఉన్నాయి. ఐదు కిలోమీటర్ల మేర వైకాపా పాలనలో ఎక్కడికక్కడ గుంతలమయంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు, నిర్మాణాల కోసం రూ.1.50 కోట్ల



నిధులు విడుదల చేసింది. పనులు చేపట్టిన గుత్తేదారు గుంతల్లో గులకరాళ్లను నింపేసి వదిలేయటంతో వాటిపైనే వాహనదారులు ప్రయాణాలు సాగిస్తున్నారు. రాత్రి వేళ ప్రమాదవశాత్తూ వాహనాలు అదుపుతప్పితే ఏంటి పరిస్థితి అని వాహనచోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా గుత్తేదారుడు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని, ఇసుక కొరత ఏర్పడటంతోనే పనుల్లో జాప్యం జరిగిందని తెలిపారు. **- న్యూస్‌టుడే, పర్చూరు**

## చిల్లచెట్లు పెరిగి.. చిట్టడవిలా మారి!


పోలీస్ క్వార్టర్స్ స్థలం ఇలా..

అద్దంకి పరిధిలోని పోలీస్ క్వార్టర్స్ స్థలం చిట్టడవిని తలపిస్తోంది. ఎన్టీఆర్ నగర్‌కు అనుసంధానంగా ఉన్న ఇక్కడ దశాబ్దకాలం క్రితం సీఐ, ఎస్సై క్వార్టర్స్‌తో పాటు సిబ్బంది నివాస గృహసముదాయం ఉండేది. కాలక్రమంలో ఆ భవనాలన్నీ శిథిలావస్థకు చేరడంతో అటు అధికారులతో పాటు సిబ్బంది వాటిని ఖాళీ చేశారు. మొత్తం 2.17 ఎకరాల విస్తీర్ణం గల స్థలంలో పట్టణానికి చెందిన ఓ వ్యక్తి గతంలో ఏకంగా రెండంతస్తుల డాబా నిర్మించాడు. అప్పటి తెదేపా ప్రభుత్వం అతనిపై భూ దురాక్రమణ చట్టం కింద కేసు నమోదు చేసి, ఖాళీ చేయించింది. లోపల భాగంలో మొక్కలు వేసి పెంచారు. కొంత కాలం పోలీసు సిబ్బంది నిర్వహణ బాధ్యత చూశారు. అనంతరం వాటి గురించి పట్టించుకున్న నాథుడే లేడు. రహదారి వెంబడి పోలీస్ పెట్రోలు బంకు, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలున్నాయి. తక్షణం అధికారులు చర్యలు తీసుకుని, చిల్లచెట్లు తొలగించి క్వార్టర్స్ నిర్మిస్తే అందరికీ మేలు జరుగుతుందని సిబ్బంది వెల్లడిస్తున్నారు. **- న్యూస్‌టుడే, అద్దంకి**

## గ్రామీణ రోడ్లకు మహర్దశ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే రోడ్లకు మహర్దశ నెలకొంది. గత సర్కారు హయాంలో ఏ రహదారి చూసిన అడుగడుగున గుంతలమయంగా ఉండేవి. అద్దంకి శాసనసభ్యుడు, రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో రోడ్లు సుందరమయంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఇటీవల చెన్నుపల్లి - వైదన రోడ్డును రూ.3 కోట్లతో మరమ్మతులు చేయగా, బల్లికురవ - సంతమాగులూరు రోడ్డు కొంతమేర పూర్తికాగా, సంతమాగులూరు సమీపంలో కొంత అర్థాంతరంగా నిలిచిపోయింది. మంత్రి గొట్టిపాటి ప్రత్యేక చొరవతో రహదారి నిర్మాణం కోసం రూ.1.75 కోట్ల నిధులు మంజూరు చేశారు. మండలంలోని నక్కబొక్కలపాడు నుంచి కె.రాజుపాలెం వరకు రహదారి నిర్మాణానికి రూ.4 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేశారు. త్వరలో పనులు ప్రారంభించి ఈ రోడ్ల నిర్మించనున్నారు. **- న్యూస్‌టుడే, బల్లికురవ**


సుందరంగా చెన్నుపలి- వైదన రహదారి

## పశు వైద్యశాల భవనం.. శిథిలం



పంగులూరులో పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు పైకప్పు పెచ్చులూడి పడుతుందోననే భయంతో వైద్యాధికారి, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. దీని పరిధిలో పంగులూరు, ఆరికట్లవారిపాలెం, చినమల్లవరం, కల్లంవారిపాలెం, బూదవాడ ఉన్నాయి. ఈ గ్రామాలకు చెందిన రైతులు తమ పశువులు, గొర్రెలకు వైద్యం చేయించాలంటే ఇక్కడికి రావాల్సిందే. కొంతకాలంగా పశువైద్యశాలకు పూర్తి స్థాయిలో వైద్యులు లేరు. ఇన్‌ఛార్జి డాక్టర్ వారంలో మూడు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటారు. వైకాపా పాలనలో కొత్త భవనం కోసం నాలుగు సార్లు ప్రతిపాదనలు పంపినా అడుగు ముందుకు పడలేదని గ్రామస్థులు తెలిపారు. దీని పరిధిలోని పశువులకు పూర్తి స్థాయిలో వైద్యం అందాలంటే పాత భవనం తొలగించి, కొత్తది నిర్మించి, వైద్యులను నియమించాలని రైతులు కోరుతున్నారు. ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి మురళీకృష్ణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గతంలో నూతన భవనం కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. **- న్యూస్‌టుడే, జె.పంగులూరు**

## జనసేన పార్టీ బలోపేతానికి కృషి

కొత్తపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా కృషిచేయాలని, దీని కోసం కార్యాచరణను తన్నీరు ప్రసాద్ ఆధ్వర్యంలో రూపొందిస్తున్నట్లు పార్టీ నేతలు పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా పార్టీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు.


కొత్తపేటలో సమావేశమైన నాయకులు

ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్టీ కార్యదర్శి గుడూరు శివరామప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు ఉగ్గిరాల మార్కండేయులు, చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు, పట్టణ పార్టీ నాయకులు అనుమకొండ కిషోర్, పాలవలస శ్రీనివాస్, న్యాయవాది కస్తూరి, కనపర్తి రామారావు, తోట రాజ్ కుమార్, లక్కాకుల నాగేశ్వరరావు, ఎరిచర్ల అశోక్ కుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చేయూత

మార్టూరు: ద్రోణాదులకు చెందిన వైకాపా నేత పి.శామ్యేలు మృతి తెలుసుకున్న ఆ పార్టీ మండల కన్వీనర్ జె.వీరయ్య, సర్పంచి భాగ్యారావు, పట్టణ అధ్యక్షుడు ఎ.గంగయ్యలు కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.


బోనాలతో దేవాలయానికి ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

# దుర్గమ్మా... కాపాడమ్మా

కారంచేడు, న్యూస్‌టుడే: అమ్మా..ముగ్గురమ్మల మూలపుటమ్మా.. దుర్గమ్మా అంటూ కారంచేడులో బోనాల మహోత్సవం జరిగింది. ఆదివారం ఆషాఢ బహుళ త్రయోదశిని పురస్కరించుకుని మహిళలు బోనమెత్తి కారంచేడులోని శ్రీవైష్ణవి దుర్గాలయంలో సారెను సమర్పించారు. అమ్మవారి ప్రతిమను గ్రామంలో వాయిద్యాల నడుమ శోభాయాత్ర నిర్వహించగా మహిళలు ఉపవాస దీక్ష చేపట్టి మట్టికుండల్లో నిప్పులతో కూడిన బోనాలను తలపై పెట్టుకుని, ఊరేగింపుగా దేవాలయానికి చేరుకున్నారు. పసుపు, కుంకుమలతో పాటు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజలనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు.

### భద్రావతి అమ్మవారికి ఆషాఢం సారె

వేటపాలెం, న్యూస్‌టుడే: మార్కెట్ సమీపంలో ఉన్న పద్మశాలీయ రామమందిరంలో కొలువై ఉన్న భద్రావతి సమేత భావనారుషి ఆలయంలో భద్రావతి అమ్మవారికి భక్తులు ఆషాఢం సారెను ఆదివారం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముత్తయిదువులకు తాంబూలాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### గంగమ్మ, పోలేరమ్మకు పొంగళ్లు


గంగమ్మ

కడవకుదురు (చినగంజాం), న్యూస్‌టుడే: కడవకుదురులో గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద గొల్లలు నక్కల పెదముత్తయ్య, కొండేపి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వందలాది మంది మహిళలు పొంగళ్లను నెత్తిపై పెట్టుకొని, గ్రామం నుంచి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామానికి పడమర వైపున ఉన్న గుడి వద్దకు చేరి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు వెంపరాల హైమారావు నిర్వహించారు.

గొల్లపాలెం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: గొల్లపాలెంలో గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు పొంగళ్లు పొంగించి, ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

## ఇద్దరికి గాయాలు

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని అంబడిపూడి - కొమ్మినేనివారిపాలెం మధ్య రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బాధితులు కొమ్మినేనివారిపాలేనికి చెందిన కొమ్మినేని అరుణ్ కుమార్, సోమవరప్పాడు గ్రామానికి చెందిన పుసులూరి శ్రీనివాసరావును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

## పశు బీమా సద్వినియోగం చేసుకోండి

జె.పంగులూరు, న్యూస్‌టుడే: పశువులకు ప్రభుత్వం కల్పించిన పశు బీమా సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి మురళీకృష్ణ అన్నారు. పశు బీమా ప్రీమియంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీలకు రాయితీపై బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. నాటుజాతి పశువుకు రూ.816, మేలు జాతి పశువుకు రూ.1632 రాయితీ కల్పిస్తున్నట్లు వివరించారు. బీమా కాలపరిమితి మూడేళ్లు ఉంటుందని చెప్పారు. ఒక కుటుంబం నుంచి గరిష్ఠంగా 10 పశువులకు బీమా చేయించుకోవచ్చని వివరించారు. రామకూరు, ముప్పవరం, జె.పంగులూరు పశువైద్య కేంద్రాలకు 20 మెట్రిక్ టన్నుల పశు దాణా సరఫరా చేశారని, బస్తా రూ.1100 ఉండగా రాయితీపై రూ.555 అందిస్తున్నట్లు తెలిపారు.

## ఉచిత న్యాయ సాయం అందించాలి

అద్దంకి, న్యూస్‌టుడే: పేద ముస్లింలకు ఉచిత న్యాయ సహాయం అందించాలని ముస్లిం సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి మీర్‌సాబాబు అన్నారు. అద్దంకి బంగ్లారోడ్డులోని సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద అధ్యక్షుడు షేక్ అబ్దుల్ జబ్బార్‌ను కలిశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన నియామకానికి సంబంధించిన గుర్తింపు కార్డును ఆయనకు అందించారు. షేక్ అహ్మద్, అఫ్రిది, కరీముల్లా, హజ్రత్, రసూల్, ఆజాద్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా రంగంలో అవార్డు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన సిద్దా వెంకట సుబ్బారావు విశ్వకర్మ సేవా సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవకు పురస్కారం అందుకున్నారు. వరంగల్‌కు చెందిన తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయవాది స్వర్ణలత వడ్డేరాజు చేతుల మీదుగా వెంకట సుబ్బారావు అవార్డు అందుకున్నారు.

## నాగవరపమ్మ ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

వేటపాలెం, న్యూస్‌టుడే: నాగవరపమ్మ ఆలయంలో స్టీలు గేటు, గ్రానైట్ ఫ్లోరింగ్ నిర్మాణం నిమిత్తం గోలి మహేంద్రకుమార్, సుధారాణి దంపతులు రూ.లక్ష విరాళం ఇటీవల అందజేశారు. దీంతో పైవాటిని ఏర్పాటు చేయడంతో ఆదివారం దాతలు ప్రారంభించారు. అంతకు ముందు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. దంపతులను ఈవో పోతిని శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ అచ్చంశెట్టి భానుమూర్తి, బండ్ల వెంకటేశ్వరరావు(బాబు)లు సత్కరించారు.

స్టీలు రెయిలింగ్ ప్రారంభంలో దాతలు

## రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


మాట్లాడుతున్న క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్

అద్దంకి, న్యూస్‌టుడే: రొటేరియన్‌గా వచ్చిన అవకాశాన్ని సభ్యులు అందిపుచ్చుకోవాలని డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్వీ.రాంప్రసాద్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బాచిన శివధర పూర్ణచంద్రరావు, అళహరి హరిప్రసాద్, కోశాధికారిగా చామర్తి వెంకట గురుశేఖర్‌తో పాటు వివిధ స్థాయిల్లో నిలిచిన రొటేరియన్‌లు పాల్గొన్నారు. తొలుత జిల్లా గవర్నర్, సభ్యులు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో పూజలు చేశారు. గుడి ప్రాంగణం వద్ద మొక్కలు నాటారు. రొటేరియన్ కాకర్ల వెంకటేశ్వర్లు సౌజన్యంతో రూ.25 వేలు విలువైన కుట్టుమిషన్‌ను పేదవారికి అందించారు. వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య), డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు, రావి అంకమ్మచౌదరి, కొల్లా సింగారావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

## సర్వదర్శనానికి 16 గంటలు

**తిరుమల, న్యూస్‌టుడే:** వారాంతపు సెలవులు రావడంతో భక్తుల రద్దీ తిరుమలకు భారీగా పెరిగింది. సర్వదర్శనం భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-1, నారాయణగిరి షెడ్లు నిండిపోయి రింగురోడ్డు వరకు దాదాపు రెండు కిలోమీటర్లు క్యూలైన్‌లలో వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 16 గంటలు, రూ.300 టికెట్ల భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని అత్యధికంగా 92,221 మంది దర్శించుకున్నారు. రూ.3.51 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

## కొండంతా.. భక్తజనం

శక్తిక్షేత్రమైన బోయకొండ ఆదివారం భక్తజనంతో నిండింది. ఆషాఢ మాసం ఆఖరి వారం సమీపిస్తుండటంతో భక్తుల సంఖ్య పెరిగింది. ప్రధాన కూడలి నుంచి ఆలయానికి వెళ్లే మొదటి ఆర్చి వరకు రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. ఆలయంలో క్యూలైన్లు కిక్కిరిశాయి. గాలిగోపురం, ప్రధాన ప్రవేశ ద్వారం, టిక్కెట్ల కేంద్రాల వద్ద భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. ఉచిత దర్శనాలకు సుమారు మూడు గంటల సమయం, రూ.500 ప్రత్యేక దర్శన భక్తులు గంట నిరీక్షించారు. రద్దీ అదుపు కాకపోవడంతో వీఐపీ దర్శనాలను మధ్యాహ్నం మూడు గంటల వరకు రద్దు చేస్తూ ఈవో ఏకాంబరం అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. ఈ ఒక్క రోజే ప్రత్యేక దర్శన టికెట్ల ద్వారా 28.60 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

**- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

గాలిగోపురం వద్ద కిక్కిరిసిన భక్తులు ◆ బోయకొండ అమ్మవారు (అంతరచిత్రం)

---

నాలుగువేల ప్రతుల్లో..

తుడా అక్రమాలపై విచారణ పూర్తి

# చెవిరెడ్డి అవినీతి చిట్టా

**తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే:** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్‌ అధికారులు చేపట్టిన విచారణ కొలిక్కి వచ్చింది. 2024 డిసెంబరు 24న విచారణ ప్రారంభించి ఏడు నెలల అనంతరం ఇటీవలే పూర్తిచేశారు. నాలుగువేల ప్రతులతో కూడిన ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు.

### విచారణ జరిగిన అంశాలివే..

◆ తుడా ఛైర్మన్‌గా వ్యవహరించిన చెవిరెడ్డి జీవో 26 (08.02.2016), జీవో 161 (17.05.2018)లను ఉల్లంఘించడం. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు ప్రభుత్వ అభివృద్ధి పనులు చేయకూడదన్న నిబంధనలను ఉల్లంఘించి కుటుంబ సభ్యులకు చెందిన సీఎంఆర్‌ ఇన్‌ఫ్రా ద్వారా రూ. కోట్ల విలువైన పనులుచేయడం. మూడునెలల వ్యవధిలోనే ఆ సంస్థ క్లాస్‌-3 నుంచి క్లాస్‌-1 గుత్తేదారుగా ఎదగడం.

◆ తుడాకు నాలుగైదు వాహనాలు ఉండగా అదనంగా ప్రైవేటు వాహనాలు, వాటికి డీజిల్‌ వినియోగించడం. ఉద్దేశపూర్వకంగా చంద్రగిరి నియోజకవర్గంలో వ్యక్తిగతంగా ఇంటింటి సర్వే చేపట్టడం, దేశవిదేశాలకు విమాన ఛార్జీలను తుడా నుంచి వినియోగించడం

◆ 31 మంది విశ్రాంత ఉద్యోగులను, ఐదుగురు ప్రైవేటు వ్యక్తుల్ని మంజూరు లేని పోస్టుల్లో నియమించుకోవడం.

◆ జాతీయ హరిత ట్రైబునల్‌ నిబంధనలు ఉల్లంఘించి తుమ్మలగుంట చెరువును ధ్వంసం చేయడం. జలవనరుల శాఖ అనుమతి లేకుండా, కోచ్‌లు, నిర్వహణ సిబ్బంది లేకుండా పార్కులు, స్టేడియాలు నిర్మించడం, వాటిని గ్రామ పంచాయతీకి అప్పగించడం.

◆ కె.వి.బి.పురం మండలంలో కుటుంబ సభ్యులకు చెందిన ఆస్తులున్న ప్రాంతంలో తుడా నిధులతో రోడ్డు నిర్మించడం

◆ ప్రభుత్వ అనుమతి లేకుండా కేవలం పాలకమండలి తీర్మానం సాకుతో చంద్రగిరి నియోజకవర్గంలోని ఎంపీడీవోల ఖాతాలకు ప్రతిపాదనలే లేకుండా నిధులు మళ్లించడం.

◆ చంద్రగిరి నియోజకవర్గంలో అధికారులతో పదేపదే టెలికాన్ఫరెన్స్‌ నిర్వహణ. తుడా నిధులను అనధికారికంగా ఎంపీడీవోల చేత ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌లు చేయించడం, యూసీ(యుటలైజేషన్‌ సర్టిఫికెట్‌)లు లేకుండా బిల్లులు మంజూరు చేయడం, ఫిక్స్‌డ్‌ డిపాజిట్లపై వడ్డీలు వివరాలు తుడాకు సమాచారం లేకుండా వినియోగించడం.

| అంశాల వారీగా నిధుల ఖర్చు (రూ.కోట్లలో) | |
|---|---|
| ఎంపీడీవోల ఖాతాలకు మళ్లించిన నిధులు | 230.03 |
| తుమ్మలగుంట చెరువు కోసం చేసిన వ్యయం | 60 |
| 19 వేల బెంచీలకు అయిన ఖర్చు | 23 |
| వైద్య శిబిరాలకు చేసిన వ్యయం | 5.29 |
| విమాన ఛార్జీలు | 0.59 |
| వాహనాల కొనుగోలు | 1.85 |
| కొవిడ్‌ శిబిరాలకు | 2.18 |
| ఇంధన ఖర్చు | 2.50 |
| తుడా ఇంజినీరింగ్‌ అధికారుల వ్యయం | 105 |
| ఉద్యాన విభాగం ద్వారా మొక్కల పంపిణీ, పచ్చదనం పెంపు | 15 |

## పేదల ఇళ్లకు.. శ్రావణ శోభ

### లక్ష్యం దిశగా అధికారుల అడుగులు

**పుంగనూరు, న్యూస్‌టుడే:** పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రానున్న శ్రావణ మాసంలో పూర్తయిన ఇళ్లలో గృహ ప్రవేశాలు చేసే దిశగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికి ఇస్తున్న రూ.1.80 లక్షలతో పాటు ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా అందిస్తోంది. ఉన్నతాశయంతో అమలవుతున్న ఈ పథకంలో మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పుంగనూరు, చిత్తూరు, నగరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 71,058 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 50,874 ఇళ్లు పూర్తిచేశారు. 1,481 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు, 18,703 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. కూలీలు, స్టీలు, సిమెంటు ధరలు పెరిగిన నేపథ్యంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి పేదలందరికీ ఇంటి వసతి కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గడువు సమయం ముంచుకొస్తుండటంతో లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో అధికారులు ప్రయత్నిస్తున్నారు.

**పూర్తి చేసేలా సహకారం**

జిల్లా వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారుల్లో అవగాహన కల్పిస్తున్నాం. లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తూ నిర్మాణాలను వేగవంతం చేస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం.

**- గోపాల్‌నాయక్‌, గృహనిర్మాణ అధికారి**

| జిల్లా వివరాలిలా.. | |
|---|---|
| మంజూరైన ఇళ్లు | 71,058 |
| పూర్తయినవి | 50,874 |
| వివిధ దశల్లో ఉన్నవి | 18,703 |
| పూర్తిగా ప్రారంభించనవి | 1,481 |

## టన్ను రూ.7500కు పెరిగిన తోతాపురి

**బంగారుపాళ్యం, చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే:** స్థానిక మార్కెట్‌ యార్డు, ర్యాంపుల వద్ద తోతాపురి మామిడి కాయలు ఆదివారం టన్ను రూ. 7500 ధర పలికింది. వ్యాపారులు ఆశించిన మేర సరకు రాకపోవడంతో డిమాండు పెరిగి మంచి ధర వచ్చింది. నాలుగు రోజులుగా టన్ను కాయలు రూ. 6000 ధర పలికింది. అయితే రోజురోజుకు కాయలకు డిమాండు పెరగడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు తెలిపారు. ఆదివారం బంగారుపాళ్యం మార్కెట్‌యార్డు, ర్యాంపుల వద్దకు 200 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయని మండీవ్యాపారులు తెలిపారు. ధరలతో రైతులు ఊరట చెందుతున్నారు.

### 2.94 లక్షల టన్నుల కొనుగోలు

జిల్లాలోని గుజ్జు పరిశ్రమలకు వచ్చే తోతాపురి మామిడికాయల ట్రాక్టర్లు, లారీలు పూర్తిగా ఆగిపోయాయి. ప్రస్తుతం పరిశ్రమలకు వెళ్లే ట్రాక్టర్లు తక్షణమే అన్‌లోడింగ్‌ అవుతున్నాయి. ర్యాంపులకు నామమాత్రంగా ట్రాక్టర్లు, లారీలు వెళ్తున్నాయి. గుజ్జు పరిశ్రమలు జూన్‌ 8వ తేదీ నుంచి తోతాపురి కాయల కొనుగోలు ప్రారంభించాయి. ఇప్పటివరకు పరిశ్రమలు, ర్యాంపుల యజమానులు 64,784 మంది రైతుల నుంచి సుమారు 2,94,145 టన్నుల సరకు కొనుగోలు చేసినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదనరెడ్డి తెలిపారు. నాలుగైదు రోజుల్లో తోతాపురి మామిడి కోతలు సీజన్‌ పూర్తవుతుందని చెప్పారు. తోతాపురి మామిడి రైతులందరికీ ప్రభుత్వ ప్రోత్సాహక నగదు టన్నుకు రూ.4 వేలు ఖాతాల్లో వీలైనంత త్వరగా జమ చేస్తామన్నారు. రైతుల వివరాల నమోదు వేగంగా సాగుతుందన్నారు.

## శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం

**తిరుమల, న్యూస్‌టుడే:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం శ్రీపెద్దజీయర్‌ నేతృత్వంలో చాతుర్మాస దీక్ష సంకల్పం ప్రారంభమైంది. శ్రీపెద్దజీయర్‌ స్వామి మఠంలో కలశస్థాపన, కలశపూజ, విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సేకరించిన పుట్టమన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం శ్రీపెద్దజీయర్‌ స్వామి తిరుమల బేడి ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న జీయంగారి మఠం వద్ద నుంచి శ్రీచిన్నజీయంగారు, ఇతర శిష్య బృందంతో బయల్దేరారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి పుష్కరిణి, శ్రీవరాహస్వామి బాలాలయాన్ని సందర్శించారు. అక్కడి నుంచి మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు. శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద తితిదే ఛైర్మన్‌ బీఆర్‌ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, ఇతర ఆలయ అధికారులతో కలిసి స్వాగతం పలికారు. శ్రీవారిని దర్శించుకున్న తరువాత ఛాట్‌ వస్త్రాన్ని బహూకరించారు.

ఆలయంలో జీయంగార్లతో తితిదే ఛైర్మన్‌ బీఆర్‌ నాయుడు, ఈవో శ్యామల రావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

## అంతరాయం లేని.. సరఫరా లక్ష్యం

### ఉప-కేంద్రాల్లో అదనపు కెపాసిటర్ల ఏర్పాటుకు నిర్ణయం

**చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే :** ఐదేళ్ల వైకాపా పాలనతో విద్యుత్తు శాఖ అస్తవ్యస్తంగా తయారైంది. అనుబంధ పరికరాల కొనుగోలు నుంచి నూతన ఉప-కేంద్రాల ఏర్పాటువరకు అవినీతి, అక్రమాలకు నిలయమైంది. ఉప-కేంద్రాల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. తద్వారా సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజీ సమస్యలతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. విద్యుత్తుశాఖను ప్రక్షాళన చేస్తున్నారు. ఇప్పటికే పలు సంస్కరణలు మొదలయ్యాయి. వైకాపాతో అంటకాగిన అధికారుల

| జిల్లా విద్యుత్తు సర్వీసుల వివరాలిలా.. | |
|---|---|
| మొత్తం | 7.33 లక్షలు |
| వ్యవసాయ | 1.90 లక్షలు |
| గృహావసరాలు | 5.02 లక్షలు |

అనుప్పల్లి విద్యుత్తు ఉప-కేంద్రం

హవా కొనసాగుతుండటం ప్రతిబంధకంగా మారుతోంది.

### త్వరలో క్షేత్రస్థాయిలోకి

జిల్లాలో 33కేవీ ఉప-కేంద్రాలు 334, 220 కేవీ ఉప-కేంద్రాలు 19 ఉన్నాయి. కొన్నింటి పరిధిలో ఓల్టేజి, సరఫరాలో అంతరాయాలతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఉప-కేంద్రాల్లో అదనపు కెపాసిటర్లు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. తొలుత సమస్య ఎక్కువ ఉన్న చోట.. తర్వాత మిగిలిన కేంద్రాల్లో అమర్చనున్నారు. దీనిపై విద్యుత్తు ఎస్‌ఈ ఇస్మాయిల్‌ అహ్మద్‌ మాట్లాడుతూ త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సరిహద్దులో తడుకుపేట వద్ద స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

## రాజంపేట నుంచి తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా

### ఏడు టిప్పర్లు స్వాధీనం.. ఏడుగురి అరెస్టు
### సూత్రధారి కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు

**నగరి, న్యూస్‌టుడే:** అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి చిత్తూరు జిల్లా నగరి మీదుగా తమిళనాడుకు సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను నగరి పోలీసులు అడ్డుకున్నారు. ఏడు టిప్పర్లను సీజ్‌ చేసి ఏడుగురు డ్రైవర్లను అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన కీలక నిందితుడి కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సీఐ విక్రమ్‌ ఆదివారం నగరి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. తమిళనాడు సరిహద్దులోని తడుకుపేట వద్ద భారీగా ఇసుక టిప్పర్లు వెళ్తుండటంతో అనుమానంతో నిలిపి తనిఖీ చేయగా ఈ అక్రమ రవాణా గుట్టు రట్టు అయింది. రాజంపేట సమీపంలోని రీచ్‌ నుంచి ఇసుకను టిప్పర్లలో నగరికి వరకు తరలిస్తారు. సరిహద్దులోని వేల్‌ అండ్‌ కో కంకర క్వారీలో నిలుపుతారు. అక్కడి పనికిరాని మట్టిని టిప్పర్ల పైభాగంలో ఓ లేయర్‌ పోస్తారు. అక్కడి నుంచి మట్టిగా చూపుతూ తమిళనాడుకి చేర్చి.. అక్కడ విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఈ అక్రమ రవాణాపై పక్కా సమాచారం రావడంతో నిఘా పెట్టి దాడులు చేపట్టినట్లు వివరించారు. ఏడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులోని చెందిన కనకమ్మ సత్రంకు చెందిన వి.జయకృష్ణ, కల్పాకంకు చెందిన ఎస్‌.పాండియన్‌, కల్లకుర్చికి చెందిన ఎ.అజిత్‌కుమార్‌, విళ్లుపురంకు చెందిన ఎం.ప్రవీణ్‌కుమార్‌, కన్యాకుమారికి చెందిన ఎ.ఎస్‌.శ్రీజిత్‌, తాంబరంకు చెందిన ఎన్‌.అశోక్‌, నగరి మండలం గుండ్రాజుకుప్పం చెందిన వి.దేవరాజులు అరెస్టయ్యారు. విచారణలో భరత్‌ అనే వ్యక్తి ఈ దందా నడుపుతున్నట్లు వెల్లడైంది. అతని కోసం ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ వివరించారు. అతన్ని పట్టుకుంటే మరిన్ని వివరాలు వెల్లడవుతాయని ఆయన తెలిపారు. సమావేశంలో తహసీల్దార్‌ రవికుమార్‌, డీటీ మేఘవర్ణం, సిబ్బంది గోవిందరెడ్డి, వెంకటపతి, పోలీసులు గజేంద్ర, అశోక్‌, సత్య, పురుషోత్తం పాల్గొన్నారు.

## జిల్లాకు చేరిన ఎరువులు

**చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే:** ఖరీఫ్‌ సాగుకు అవసరమైన ఎరువులు వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళికలతో అందుబాటులో ఉంచుతోంది. ఆదివారం సాయంత్రం జిల్లాకు యూరియా 664 టన్నులు, డీఏపీ 450 టన్నులు, కాంప్లెక్స్‌ ఎరువులు 250 టన్నులు చేరినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎరువులు మార్క్‌ఫెడ్‌, ప్రైవేటు డీలర్లకు కేటాయించనున్నామని చెప్పారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీవారిని దర్శించుకుని వస్తున్న కోటా శ్రీనివాసరావు (పాతచిత్రం)

## ప్రేక్షకులకు.. నవరసాల కోటా

**తిరుపతి (బైరాగి పట్టెడ), చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే:** అనేక వైవిధ్య పాత్రలతో ప్రేక్షకులను మెప్పించి..నవ్వించి, చివరకు కన్నీరు మిగిల్చి అందనంత దూరానికి వెళ్లిన కోటా శ్రీనివాసరావుకు తిరుపతి జిల్లాతో విడదీయని బంధం ఉంది. శ్రీవారిని ఆయన పలుసార్లు దర్శించుకున్నారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో హీరో రాజేంద్రప్రసాద్‌తో కలిసి అనేక సినిమాల్లో నటించారు. సీతారత్నంగారి అబ్బాయి, దాసరి నారాయణరావుతో కలిసి నటించిన మామగారు, చిత్తూరు మాజీ ఎంపీ డా.శివప్రసాద్‌, మాజీమంత్రి ఆర్‌కే రోజాతో కలిసి అనేక చిత్రాల్లో పాల్గొన్నారు. తలకోన, భీమవరం, తిరుపతి ఎన్జీవోకాలనీ తదితర ప్రాంతాల్లో జరిగిన చిత్రీకరణల్లో పాల్గొన్నారు. బొబ్బిలిరాజా చిత్రం కోసం వారంరోజుల పాటు తలకోనలోనే ఉన్నారు.

**సినీ రంగానికి లోటు..** పద్మశ్రీ కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోట మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించి, తన విలక్షణ నటనతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్నారని, రాజకీయాల్లోనూ ఎమ్మెల్యేగా, మంచి నాయకుడిగా పేరు సంపాదించుకున్నట్లు అందులో వివరించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.


సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290


## 907 మందితో మలి విడత జాబితా

**వేంపల్లె, న్యూస్‌టుడే:** రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ ఐటీలకు రెండో విడత ప్రవేశాల కోసం ఎంపికైన 907 మంది విద్యార్థుల జాబితాను ఆదివారం విడుదల చేశారు. మొదటి విడతలో మిగిలిన 628 ఖాళీలతోపాటు దివ్యాంగుల కోటా 179, సైనికోద్యోగుల పిల్లల కోటా 80, స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ కోటా కింద 20 సీట్లకు అర్హులను ఎంపిక చేసి వెబ్‌సైట్‌లో ఉంచారు.

## నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌

**చిత్తూరు కలెక్టరేట్‌, న్యూస్‌టుడే:** కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ ఆదివారం తెలిపారు. అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చని, వాటి స్థితి గురించి తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు ఫోన్‌ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.


104FM Tirupati
ఈఎఫ్‌ఎమ్‌ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్‌ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్‌ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్‌ టు బ్యాక్‌ సాంగ్స్‌ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635



ఆకస్మిక మరణం

కీ॥శే॥ ఇరికి రమాబాయి గారు
భర్త లేట్ ఇరికి క్రిష్ణారెడ్డి గారు
రిటైర్డ్ పి.పి. అడ్వకేట్, కర్నాల వీధి, తిరుపతి

మీరు మాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలు, మా భవిష్యత్తుకు అహర్నిశలు శ్రమించిన మా ఇంటి దైవం, మా అమ్మగారైన కీ॥శే॥ ఇరికి రమాబాయి 13.07.2025వ తేది ఆదివారం ఉ॥ 7.45 గం॥లకు స్వర్గస్తులైనారు.

తదుపరి దహనక్రియలు 14.07.2025 సోమవారం ఉ॥ 9.30 గం॥లకు శ్రీనివాసపురం తిరుచానూరు రోడ్ నుండి అంతిమయాత్ర బయలుదేరి కరకంబాడి రోడ్డులోని గోవింద ధామం నందు జరుగునని తెలియజేయడమైనది.

శోకతప్త హృదయాలతో...

కుమారులు: డా॥ ఇ.వి.సుబ్బారెడ్డి, M.D, Dermatology, KADAPA
ఇ. చంద్రమౌళి, AUDITOR, CHENNAI
ఇ. ప్రతాప్, E.D-APIIC, MANGALAGIRI
మరియు కుటుంబ సభ్యులు


(c) eenadu

రూ.500 రాహు, కేతు సర్పదోష నివారణ కోసం క్యూలైన్లలో బారులు తీరిన జనం

## శ్రీకాళహస్తిలో 'కొండ'ంత జనం

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** పంచభూత క్షేత్రాల్లో వాయులింగ క్షేత్రమైన శ్రీకాళహస్తికి కొండంత జనం తరలివచ్చారు. తిరుమలేశుని దర్శనార్థం వచ్చిన భక్తులు చాలా వరకు ఈ ఆలయ దర్శనానికి రావడంతో ఆదివారం వాయులింగేశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. భక్తుల మధ్య తోపులాటల నియంత్రణకు క్యూలైన్లను తరచూ నిలుపుదల చేస్తూ దర్శనానికి అనుమతించారు. దర్శనం పూర్తయ్యాక చాలా వరకు భక్తులు ఆలయంలోనే ఉండిపోవడం, పరివార దేవతామూర్తుల వద్ద క్యూకట్టడంతో ఆలయంలో అవసరమైన ప్రాణవాయువు అందక వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ సమయంలో వీలైనంత మేర భక్తులను బయటకు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. అలాగే భక్తుల నియంత్రణ కూడా మహాద్వారం వద్దే జరిగేలా చర్యలు చేపట్టడంతో భక్తులకు అవసరమైన గాలి అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది. ఉదయం నుంచి రాత్రి వరకు దాదాపు 28 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. 5,801 రాహు, కేతు పూజలు జరగగా, ప్రత్యేక 3,552, శీఘ్ర 5,490, అంతరాలయ ప్రవేశ దర్శన 882 టికెట్లు అమ్ముడుపోయాయి.

## నేడు పాత డీపీవో కార్యాలయంలో గ్రీవెన్స్

**చిత్తూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** చిత్తూరులోని పాత డీపీవో కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పోలీసు శాఖ వర్గాలు ఆదివారం పేర్కొన్నాయి.

## నేడు, రేపు జిల్లాలో సత్యసాయి రథయాత్ర

**చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే:** భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా సోమ, మంగళవారాల్లో జిల్లాలో సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర సాగనుందని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు పెనుమూరులో ప్రారంభమై మురకంబట్టు, కట్టమంచి, సంతపేట, బంగారుపాళ్యం మీదుగా కుప్పం చేరుకుంటుందన్నారు. 15న కుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు, చౌడేపల్లె మీదుగా పుంగనూరు చేరుకుంటుందని పేర్కొన్నారు.

పతకం సాధించిన భార్గవ్

## రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

**చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే:** రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటథ్లాన్ లేజర్ రన్ పోటీల్లో స్థానిక బృందావన్ పాఠశాల విద్యార్థి సాయిభార్గవ్ కాంస్య పతకం సాధించాడని పాఠశాల నిర్వాహకురాలు శైలజకుమారి, డైరెక్టర్ ప్రియతేజ ఆదివారం తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లాలో జరిగిన అండర్-17 విభాగంలో పతకం సాధించినట్లు పేర్కొన్నారు.

# డైట్.. సమస్యలు వెయిట్

జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో సమస్యలు తిష్ఠ వేశాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి లక్షల సంఖ్యలో డైట్ సెట్‌కు పోటీపడే వారు. డైట్‌లో సీటు వస్తే ఉపాధ్యాయ వృత్తి స్వీకరించినట్లేనని అభ్యర్థులు భావించేవారు. ఆరేళ్లుగా డీఎస్సీ నిర్వహించకపోవడంతో విద్యార్థులు డైట్ సెట్‌పై అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన జిల్లా విద్యా శిక్షణా సంస్థ తన ప్రాభవాన్ని కోల్పోతోంది. తాజాగా కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించడంతో భావి ఉపాధ్యాయులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు.

**న్యూస్‌టుడే, కార్వేటినగరం**

కార్వేటినగరం డైట్

కార్వేటినగరానికి కిలోమీటరు దూరంలో ఆహ్లాదకర వాతావరణంలో 14 ఎకరాల సువిశాల ప్రాంతంలో 1975లో టీటీసీ ఏర్పాటు చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన వేలాదిమంది ఛాత్రోపాధ్యాయులు నేడు ఉపాధ్యాయ వృత్తిలో సేవలందిస్తున్నారు. 2000లో టీటీసీని డైట్‌గా మార్చారు. ఇక్కడి ఆహ్లాదకరమైన వాతావరణంలో శిక్షణ పొందడాన్ని వరంగా భావించే వారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనతో ఇక్కడ శిక్షణ పొందిన వారందరూ దాదాపు ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తుండటం గమనార్హం. గత ప్రభుత్వం ఏటా డీఎస్సీ నిర్వహించకపోవడం, డైట్‌పై యువత ఆసక్తి చూపకపోవడంతో ఆదరణ తగ్గుతోంది. దీనికితోడు ఇక్కడ నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది. గతేడాది డైట్‌లో 150 మంది విద్యార్థులకుగాను 48 మందే శిక్షణ పొందుతున్నారు.

### మౌలిక వసతులు లేక..

అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

డైట్‌లో మౌలిక వసతులు లేక ఛాత్రోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల(పురుషుల) వసతి గృహాలు పాడవడంతో వర్షాలకు ఉరుస్తున్నాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతోపాటు నీటి సౌకర్యం లేకపోవడంతో బహిర్భూమికి వెళ్లాలంటే దుర్వాసన వెదజల్లుతోంది. తాగునీరు వసతి గృహాల్లో లేకపోవడంతో ప్రధాన భవనం వద్దకు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి. వసతిగృహం పైకప్పు పాడై ఉండటంతో భారీ వర్షాలు కురిస్తే వర్షపునీరు గదుల్లోకి వస్తోంది.

### ఛాత్రోపాధ్యాయులకు తిప్పలు

**ప్రవేశాలు లేక వెలవెల..**

డైట్‌లో తెలుగు మాధ్యమంలో 50, ఆంగ్ల మాధ్యమంలో 50, తమిళ మాధ్యమంలో 50 సీట్లు ఉన్నాయి. ప్రథమ సంవత్సరంలో 150, ద్వితీయ సంవత్సరంలో 150 మంది ఇక్కడ శిక్షణ పొందేవారు. ప్రస్తుతం ప్రథమ సంవత్సరంలో 48 మంది, ద్వితీయ సంవత్సరంలో 18 మంది మాత్రమే శిక్షణ పొందుతున్నారు.

**రెగ్యులర్ అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి**

వివిధ సబ్జెక్టులకు సంబంధించి 19 మంది అధ్యాపకుల పోస్టులు అవసరం కాగా ఇద్దరు మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 17 మంది స్కూల్ అసిస్టెంట్లను ఎస్ఏసీటీ కింద అధ్యాపకులుగా నియమించింది. అనుభవజ్ఞులైన అధ్యాపకులు లేకపోవడంతో బోధన ప్రక్రియ కుంటుపడే ప్రమాదముంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలి.

**చర్యలు తీసుకుంటాం..**

మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నాం. మరుగుదొడ్లు బాగుచేయిస్తాం. వసతి గృహాల్లో పంకాలు, లైట్లు ఏర్పాటు చేశాం. డైట్‌కు వెళ్లే దారి విషయమై ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. సంస్థకు పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటాం.

- దామోదరం, వైస్ ప్రిన్సిపల్, డైట్

## వినాయకుడి సేవలో మెప్మా డైరెక్టర్

మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషసాయికి జ్ఞాపిక అందిస్తున్న డిప్యూటీ ఈవో సాగర్‌బాబు

**కాణిపాకం, న్యూస్‌టుడే:** శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ ఆదివారం దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు ఉన్నారు. ● శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి కుటుంబ సమేతంగా కలసి ఆదివారం దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో కే సాగర్‌బాబు, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. వారు స్వామి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ ప్రకారం స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి ఉన్నారు.

క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి తదితరులు

## సాధ్యం కాని హామీలతో అధికారం: పెద్దిరెడ్డి

**పుంగనూరు, న్యూస్‌టుడే:** సాధ్యం కాని హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుంగనూరు పురపాలక, మండల వైకాపా కార్యకర్తల సమావేశాలు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. నాడు ఎన్టీ రామారావు అమలు చేసిన పథకాలు తుంగలో తొక్కిన సీఎం చంద్రబాబు.. తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లో హామీలు గుప్పించడం అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం షరా మామూలుగా మారిందన్నారు. ఈ ఎన్నికల్లో సూపర్ సిక్స్‌తో పాటు మరో 143 హామీలు ఇచ్చారన్నారు. వాటిలో ఏవేవి అమలు చేశారు..ఏవి అమలు చేయలేదని తెలుసుకోవడానికే బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా క్యూఆర్ కోడ్‌తో తెలుసుకోవచ్చని వివరించారు. సమావేశంలో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి అనీషారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, పురపాలక ఛైర్మన్ అలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్ర గ్రాప్లింగ్ పోటీలు

**తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే:** ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని గిరిజన భవన్‌లో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. 13 జిల్లాలకు చెందిన 250 మంది పాల్గొనగా, విజేతగా నిలిచిన 60 మంది బాలబాలికలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఒలింపియన్ మాణిక్యాలు, విశ్వం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి, ఏపీ బాల్‌బాడ్మింటన్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటరావు తదితరుల చేతుల మీదుగా పతకాలు, జ్ఞాపకాలు ప్రదానం చేశారు.

విజేతలతో అతిథులు

## బాల్య వివాహం.. ఆలస్యంగా వెలుగులోకి

విచారణ చేస్తున్న ఐసీడీఎస్, పోలీసు సిబ్బంది

**యాదమరి, న్యూస్‌టుడే: మండల పరిధి లోని** పెరుమాళ్ల పెంట గ్రామంలో బాలికకు వివాహం జరిగిన ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఐసీడీఎస్, పోలీసులు గ్రామానికి చేరుకుని విచారించారు. బాలిక, అదే గ్రామానికి సమీపంలోని అనంతాపురానికి చెందిన యువకుడు ప్రేమించుకున్నారని, వారి ఒత్తిడి మేరకు ఆదివారం ఉదయం తిరుపతి నగరంలో బంధువుల సమక్షంలో వివాహం జరిపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి పేర్కొన్నారు. ప్రస్తుతం వారిద్దరూ పరారీలో ఉన్నారని, బాలిక తల్లికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. సోమవారం బాలికను సిబ్బంది ఎదుట హాజరు పరచాలని చెప్పామని, వారికి కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. సీడీపీఓ వినుతశ్రీ, సూపర్‌వైజర్ సరళ పాల్గొన్నారు.

## నిరాశ్రయుల సంరక్షణకు చర్యలు

నిరాశ్రయులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్

**చిత్తూరు నగరం, న్యూస్‌టుడే:** పట్టణ ప్రాంతాల్లోని నిరాశ్రయుల సంక్షేమానికి చర్యలు చేపట్టినట్లు మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ పేర్కొన్నారు. స్థానిక పట్టణ పేదల రాత్రి వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాలలో భోజనం తయారీ, నిత్యావసర వస్తువులు, వసతి పొందుతున్న వృద్ధుల వివరాలు పరిశీలించారు. పట్టణ పేదల రాత్రి వసతిగృహాల్లో పలు సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతామని చెప్పారు. మెప్మా అధికారులు శ్రీనివాసరావు, రవీంద్ర, వసతిగృహం ఇన్‌ఛార్జి జోసఫ్ రాజు పాల్గొన్నారు.

పరదాలకు తుది మెరుగులు దిద్దుతున్న మణి

## శ్రీవారికి పరదాలు సిద్ధం

**తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే:** తిరుపతికి చెందిన భక్తుడు పరదాల మణి 27 ఏళ్లుగా శ్రీవారిపై భక్తితో ఏటా ఏడాదికి నాలుగు సార్లు శ్రీవారికి విశేష పర్వదినాల్లో పరదాలు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీన మంగళవారం తిరుమలలో శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఈ సందర్భంగా పరదాల మణి సోమవారం కాలినడకన తిరుమల చేరుకొని దేవస్థానం అధికారులకు పరదాలు, కురాళాలు అందించనున్నారు. వీటిని మంగళవారం జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అనంతరం గర్భాలయం, రాములవారి మేడ, వెండి వాకిలి, ఏకాంత సేవ జరిగే తదితర ముఖ్య ప్రదేశాల్లో అలంకరించనున్నారు. మణి ఈ పర్యాయం శ్రీవారి నేత్ర దర్శనం పరదాలతో పాటు, సిరులు కురిపించే శ్రీమహాలక్ష్మి, గజ వాహనంపై తిరునామం శంకు, చక్రాలు, పూర్ణకుంభం, తామర పుష్పం తదితర డిజైన్లతో రూపొందించారు.

## మమ్మల్ని.. అనాథలను చేశావు కదరా

☛ కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు ☛ బొక్కసంపాళెంలో విషాద ఛాయలు

శ్రీనివాసులు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరై విలపిస్తున్న శ్రీనివాసులు అమ్మమ్మ రాజేశ్వరమ్మ, చెల్లెలు కీర్తి

**శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే:** భర్తను పోగొట్టుకున్నా.. కన్న కూతురు, అల్లుడు నన్ను వదలి వెళ్లారు. చివరకు అండగా ఉంటూ వచ్చిన నువ్వు కూడా దూరమయ్యావా మనవడా అంటూ శ్రీనివాసులు అమ్మమ్మ రాజేశ్వరమ్మ కన్నీటి పర్యంతం అయ్యారు. కానరాని లోకాలకు వెళ్లిన అమ్మానాన్నలను నీలో చూసుకుంటూ వస్తుండగా నన్ను వదలి వెళ్లిపోయావా అంటూ సోదరి కీర్తి రోదనలతో ఆదివారం బొక్కసంపాళెం గ్రామంలో విషాదం నెలకొంది. కోట వినుత దంపతుల చేతిలో హత్యకు గురైన శ్రీనివాసులు మృతదేహాన్ని ఆదివారం అతని స్వగ్రామం తీసుకురాగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు పెద్దఎత్తున కంటతడి పెట్టారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

**మమ్మల్ని ఆదుకోవాలి :** జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తమను ఆదుకోవాలంటూ శ్రీనివాసులు సోదరి కీర్తి ఆవేదనతో కోరారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో అందరితో ఎంతో స్నేహంగా ఉండే అన్నయ్య శ్రీనివాసులు తనకంటే జనసేన పార్టీ నేత కోట వినుత దంపతులకు ఎక్కువ గౌరవం ఇచ్చేవాడని తెలిపారు. రోజులతరబడి వారింట్లోనే ఉంటూ వారికి సేవలందించిన అతన్ని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసి హత్య చేయడం దారుణమన్నారు. హత్య జరిగాక తమను ప్రలోభపెట్టేందుకు వినుత దంపతులు యత్నించినట్లు ఆమె వివరించారు. అయినా తాము లొంగలేదన్నారు. ఏదైనా తప్పు జరిగి ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలే తప్ప చంపేయడం సరికాదని, ఈ అంశాన్ని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. పార్టీ తమకు న్యాయం చేయాలని కోరారు.

## తిరుమల సప్తగిరుల యాత్ర

**తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే:** గూడూరులోని ఆదిశంకర విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు ఆదివారం తిరుమల సప్తగిరుల పరిక్రమణ యాత్ర చేపట్టారు. ఈ యాత్రను కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి తిరుపతిలో ప్రారంభించారు. స్వామీజీ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు, భక్తిని పెంపొందించుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులు తిరుమల సప్తగిరుల యాత్రకు బయలుదేరారు.

## పోలీసుల అదుపులో దోపిడీ దొంగలు

**చిత్తూరు క్రైం, న్యూస్‌టుడే:** చిత్తూరు రూరల్ మండలంలోని సిద్ధంపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో జూన్ 26న చామ్‌రాజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు దోపిడీకి పాల్పడ్డ ముగ్గురు నిందితులని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైలు వస్తున్న క్రమంలో సిగ్నల్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేసి ఆగిన రైలులో దోపిడీకి పాల్పడ్డ విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఎస్7, ఎస్10 బోగీల్లో మొత్తం నలుగురి వద్ద సుమారు 70 గ్రాముల బంగారం ఆభరణాలు చోరీకి పాల్పడి పరారయ్యారు. ఈ కేసును సవాలుగా తీసుకున్న రైల్వే అధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతికంగా విచారణ జరిపారు. రైల్వే పోలీసులకు అందిన పక్కా సమాచారం ఆధారంగా ముఠాలో 10 మందికి పైగానే సభ్యులున్నట్లు ధ్రువీకరించారు. అందులో ప్రధానంగా కర్ణాటకకు చెందిన ఓ నిందితుడు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు నిందితుడి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారిస్తున్నట్లు తెలిసింది. సోమవారం రైల్వే ఎస్పీ రాహుల్ మీనా నిందితులను అరెస్టు చూపి కేసు వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

# ప్రతిపాదిస్తూ.. సుందరీకరిస్తూ..!

● ఆదర్శ కుప్పానికి సిద్ధమైన ప్రణాళికలు
● త్వరలో ప్రారంభంకానున్న మరిన్ని అభివృద్ధి పనులు

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:** 'ఆదర్శ పురపాలికగా కుప్పాన్ని మార్చడమే లక్ష్యం.. ప్రతిపాదనలు పంపండి. . ఎంత అడిగితే అంత ఇస్తాం' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనలో హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా పంపిన ప్రతిపాదనలకు నిధులను విడుదల చేస్తూ అనేక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆదర్శ కుప్పానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. పురపాలికలో ఇప్పటికే రోడ్లు, తాగునీటి బోర్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు, సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరికొన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేస్తున్నారు.

### లక్ష్యంతో ముందుకెళ్తూ..

కుప్పం శ్మశాన వాటికను అభివృద్ధి చేసి.. బర్నింగ్ కేంద్రం ఏర్పాటు, తితిదే ద్వారా పురపాలికలోని 25 ఆలయాల అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీల గృహాలకు సౌర విద్యుత్తును వచ్చే ఏడాది జూన్ లోపు పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. పుర పరిధిలోని మూడు ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి డిసెంబరు, ఎన్టీఆర్ సుజల పథకం ఆగస్టు, ఏరియా ఆస్పత్రి పనులు డిసెంబరు నాటికి పూర్తి చేసే దిశగా అడుగులేస్తున్నారు.

కుప్పం వీధులు, ఉద్యానాలు, ఇంటిపై సోలార్, ఈ-బస్సు ఉండేలా తయారు చేసిన ప్రతిపాదనలు..

### ఏళ్లుగా నిలిచిన పనులకు మోక్షం

ఏళ్లుగా నిలిచిన ప్రధాన రహదారి విస్తరణ, ఆర్టీసీ బస్టాండు అభివృద్ధి, షాపింగ్ కాంప్లెక్స్, జమిందారు పార్కు, 10 ప్రధాన కూడళ్ల అభివృద్ధి, ఈ-బస్సులు, భూగర్భ కాలువలు, భూగర్భ విద్యుత్తు లైన్లు, గ్యాస్ కనెక్షన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

### పూర్తైన లక్ష్యాలు ఇవీ..

పురపాలికలో రూ.2.59 కోట్లతో 3950 వీధి దీపాలు, రూ.66 లక్షలతో అన్న క్యాంటీన్, రూ.1.40 కోట్లతో ఆర్అండ్‌బీ భవనం, రూ.5 కోట్లతో సర్వే కేంద్రం, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, కాలువలు, అమృత్ 2.0 నీటి సరఫరా కార్యక్రమాలు చేపట్టి లక్ష్యాలు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ఎన్టీఆర్ క్రీడా మైదానం ప్రతిపాదించిన ప్రణాళికలు..

### క్రీడలకు ప్రాముఖ్యం..

కుప్పంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం అభివృద్ధికి రూ.22 కోట్లతో ప్రతిపాదనలు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ లోపు పూర్తి చేయనున్నట్లు అధికారుల అంచనా. అలాగే నాలుగు మండలాల పరిధిలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

### ప్రపంచస్థాయి సదుపాయాలు

ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో కుప్పం పురపాలికను ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు చేపడుతున్నాం. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని కడా ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో స్వర్ణ కుప్పం లక్ష్యంగా పని చేస్తున్నాం.

- వికాస్ మర్మత్, కడా పీడీ, కుప్పం

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**తవణంపల్లె, న్యూస్‌టుడే:** మండలంలోని తిరుపతి-బెంగళూరు ఆరు వరుసల జాతీయ రహదారిలో నత్తపుచేను వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. పాకాల మండలం దామలచెరువుకు చెందిన చిన్న మునెయ్య కుమారుడు చంద్రమౌళి (34) సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో తవణంపల్లెకు వచ్చి తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన గోవర్దన్ కారులో గోల్డెన్ టెంపుల్‌కు వెళుతుండగా రోడ్డు క్రాసింగ్ ఉండటంతో కారు వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. చంద్రమౌళి అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రహదారిపై కారు దగ్ధం.. ఐదుగురు సురక్షితం

**బంగారుపాళ్యం:** చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిలో పాలేరు సమీపంలో రహదారిపై కారు దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తమిళనాడులోని కాంచీపురానికి చెందిన తాండవమూర్తి, కార్తికేయన్, సంపత్‌కుమారి, అశ్విని, రక్షిత కారులో బైరెడ్డిపల్లె మండలం విరుపాక్షపురానికి వచ్చారు. అక్కడ పక్షవాతానికి ఔషధం తీసుకుని తిరిగి కాంచీపురానికి పయనమయ్యారు. మార్గమధ్యలో పాలేరు సమీపంలో కారు ముందు చక్రం ప్రమాదవశాత్తు పేలిపోయి అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే మంటలు వచ్చి వ్యాపించాయి. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అప్రమత్తమై కారు దిగడంతో స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**చికెన్ ధరలు**

| వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో) | |
|---|---|
| బ్రాయిలర్ (రైతు ధర) | 100 |
| రిటైల్ | 122 |
| లేయర్ | 112 |
| బ్రాయిలర్ | 177 |
| బ్రాయిలర్ స్కిన్ లెస్ | 201 |
| లేయర్ మాంసం | 190 |

EENADU e Classifieds

HEALTH & CARE

శ్రీ విష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: Dr. K. కీర్తన గారిచే పురిటి బిడ్డల & చిన్నపిల్లల వైద్యనిపుణులు 24x7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి. ✆ 63035 53359.

TO LET

తిరుపతి, అశోక్ నగర్, అశోక్ ఎన్‌క్లేవ్ A బ్లాక్ 2nd ఫ్లోర్ నందు North Facing 2 BHK, Flat బాడుగకు ఇవ్వబడును. లిఫ్ట్, జనరేటర్ సౌకర్యం కలదు ✆ 93939 29311, 93999 29311.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ దగ్గర TCL కంపెనీకి ఎదురుగా ఇంటి నిర్మాణానికి అనువైన అన్ని వసతులతో TUDA అప్రూవ్డ్ ప్లాట్స్ తక్కువ ధరకు కలవు. ✆ 82470 75857, 94943 92069.

అతి తక్కువ ధరల్లో, 46 సులభ వాయిదాల్లో, తుడా / డిటిసిపి అప్రూవ్డ్, స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు: 91145 61456.

వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో తిరుపతి రోడ్డుకి Tuda అప్రూవల్ లేఅవుట్‌లో Plots, 1 Sq.ft కమర్షియల్ Rs.1650, రెసిడెన్షియల్ Rs.1125. Contact: 99660 66111.

JOBS

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

WANTED GRADUATE Trained Teachers for primary Mathematics and EVS, Computer & PET Faculty also Sudhaha Little Citizen's High School, R.C. Road, Tirupati. ✆ 93925 13633.

తిరుపతి, MRపల్లి, ధనలక్ష్మీనగర్‌లో D.No: 23-1-102/16 నెంబర్‌లోని బాలాజీ హాస్పిటల్ నందు పనిచేయుటకు ఆయాలు కావలెను. జీతం: 16,000/-. ✆ 89776 07644.

తిరుపతి, చిత్తూరు మరియు కడప జిల్లాలో Medical Equipment సేల్స్ చేయుటకు సేల్స్ పర్సన్ (M) కావలెను. జీతం: 20-25K + TA, DA. సంప్ర: 83286 75684.

TOURS AND TRAVELS

వేదవిద్య పరిషత్ వారిచే కార్తీక పౌర్ణమి & ప్రతినెల కాశీయాత్ర. VIP దర్శన్ టిక్కెట్ ఉచితం. (గుడి నిబంధనలు లోబడి) వసతి, భోజనం, నగర దర్శనం + ప్రయాగ యాత్ర, వైదిక సేవలు. ✆ 9394142516.

EENADU THE WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

## 18 నుంచి ఆడినెల ఉత్సవాలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరం గుర్రప్పనాయుడు వీధిలో వెలసిన శ్రీ అంకాళ పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 18 నుంచి తమిళ ఆడినెల ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ నిర్వాహకులు కేఎంకుమార్, అర్చకులు కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18, 25వ తేదీల్లో పుష్పాలంకరణ, ఆగస్టు ఒకటిన కుంకుమ అలంకరణ, మహా కుంభం సమర్పణ ఉత్సవం, 8న వరలక్ష్మి వ్రతం, గాజుల అలంకరణ, 15న మహాభిషేకం సేవలు జరుగుతాయన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

పూతలపట్టు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో నాగరాజు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొంటారని చెప్పారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

# చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

## వజ్రోత్సవాలు విజయవంతం చేయండి

ఐరాల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న వజ్రోత్సవాలు విజయవంతం చేయాలని పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు సీతాపతినాయుడు కోరారు. పాఠశాలలో పూర్వ విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఆదివారం నిర్వహించి మాట్లాడారు. పాఠశాల ఏర్పడి 75 సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న సీతాపతినాయుడు

ముడిపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగులో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

## అందరికీ సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

నగరి,న్యూస్‌టుడే: అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. మండల పరిధి ముడిపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు వివరించారు. తెదేపా మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, వేణు, వెంకటరత్నం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కార్వేటినగరం: తెదేపా మండల అధ్యక్షుడు చెంగల్రాయులుయాదవ్ ఆధ్వర్యంలో తెల్లేరుపల్లి, ఆలత్తూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రాజేంద్రరెడ్డి, అన్నామలై పాల్గొన్నారు. నింద్ర: మండల పరిధిలోని అత్తూరు, నింద్ర, కెఆర్ పాళెం పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్‌నాయుడు, గిరి పాల్గొన్నారు. పాలసముద్రం: 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు ఆధ్వర్యంలో బాలకృష్ణాపురంలో నిర్వహించారు. వాసునాయుడు, కోదండనాయుడు, రజినీకాంత్ పాల్గొన్నారు.

పాలసముద్రం: కరపత్రాలు అందిస్తున్న తెదేపా నాయకులు

సత్కారం అందుకున్న విద్యార్థులతో డీవైఈవో ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు

## విద్యాదానం మహాదానం

పుత్తూరు,న్యూస్‌టుడే: విలువలతో కూడిన విద్య అందించడానికి గురువులకు తల్లిదండ్రులు సహకరించాలని పుత్తూరు ఉపవిద్యాశాఖాధికారి ఉమామహేశ్వరరావు కోరారు. పుత్తూరు ప్రధాన పాఠశాలలో ఆదివారం శ్రీసరస్వతి మాతా సాంఘిక సేవా సమాజం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. విశ్రాంత ఎంఈవోలు రవిశంకర్, యుగంధర్‌రాజు, బాలసుబ్రమణ్యంలు పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ విద్యా సంవత్సరం ఇద్దరు అనాథ పిల్లలను ఇంటర్మీడియేట్ చదివించేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ప్రకటించారు.

## సిబ్బంది పెరగరు.. చెత్త తరగదు

చెత్త పేరుకుపోతున్న దృశ్యం

● పురపాలికల్లో ఏళ్లుగా ఇదే దుస్థితి

● నానాటికీ పేరుకుపోతున్న వ్యర్థాలు

పుత్తూరు, నగరి, న్యూస్‌టుడే: పట్టణాభివృద్ధి వేగంగా సాగుతుంది. అందుకనుగుణంగా పాలకవర్గాలు ఆయా ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలి. అయితే ఎక్కడ చూసినా అవేవీ కనిపించవు. సౌకర్యాలు, వసతుల కల్పనకు నిధులతో పాటు సిబ్బంది అవసరం. ప్రభుత్వం నుంచి పలు రూపాల్లో నిధులు వస్తున్నాయి. అయితే శాశ్వత సిబ్బందిని నియమించుకుందుకు మాత్రం అనుమతి ఇవ్వడం లేదు. ముఖ్యంగా పారిశుద్ధ్య విభాగంలో ఈ పరిస్థితి అధికం. తద్వారా పట్టణాల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే కనిపిస్తుంది.

### సిబ్బంది ఇలా.. ఇబ్బంది తప్పేదెలా..?

పుత్తూరు మున్సిపాలిటీలో 27 వార్డులు, నగరిలో 29 వార్డులున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచి మంచి సేవలు అందించాల్సి ఉంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపడం లేదు. కొన్ని విభాగాల్లోని అధికారులు, సిబ్బంది డిప్యూటేషన్‌పై వేరొక చోటకు వెళ్లడంతో ఆ సీట్లలో పనులు ఆగిపోతున్నాయి. దీంతో ఇబ్బందులు అధికమవుతున్నాయి. ప్రస్తుతం పారిశుద్ధ్య విభాగంలో నగరిలో రెగ్యులర్‌గా నలుగురు, ఔట్‌సోర్సింగ్ కింద 88 మంది పని చేస్తున్నారు. పుత్తూరు పురపాలిక పరిధిలో రెగ్యులర్‌లో 8 మంది, ఔట్‌సోర్సింగ్ కింద 70 మంది పని చేస్తున్నారు. దీంతో నిత్యం చెత్త సేకరణ, వార్డుల్లో మురుగు కాలువలు సైతం శుభ్రం చేయాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత కారణంగా ఈ పనులు సక్రమంగా సాగడం లేదని అధికార పార్టీ కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశాల్లో గగ్గోలు పెడుతున్నారు. అయినా ఇప్పటి వరకు సిబ్బందిని నియమించలేదు.

● గతంలో ఆ జిల్లా కలెక్టర్ అనుమతి ఇస్తే.. తాత్కాలిక సిబ్బందిని నియమించుకునే వెలుసుబాటు ఆయా పాలకవర్గాలకు ఉండేది. ప్రస్తుతం ఆ అధికారం ప్రభుత్వం తీసేసుకుంది. నియామకాలు కావాలంటే కచ్చితంగా ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సిందే. ప్రతిపాదనలు పంపినా అవి బుట్టదాఖలు అవుతున్న దాఖలాలే అధికంగా కనిపిస్తున్నాయి.

### క్లాప్ అమలెక్కడా..?

నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, నగరి జంట పురపాలికలు. 2005లో మున్సిపాలిటీలుగా మారాయి. అప్పటి జనాభా ప్రకారం పారిశుద్ధ్య విభాగంలో సిబ్బందిని నియమించారు. నేటికీ 20 ఏళ్లు గడుస్తున్నా.. అదే సిబ్బందితో నెట్టుకు వస్తున్నారు. ఫలితంగా పారిశుద్ధ్యం నానాటికి తీసికట్టుగా మారింది. రెండు చోట్ల పారిశుద్ధ్య విభాగంలో తగినంత మంది కార్మికులు లేకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన క్లాప్ పథకం తూతూమంత్రంగా అమలు చేస్తున్నారు.

### సమస్య ప్రభుత్వం దృష్టికి

గతంలో జిల్లా కలెక్టర్ అనుమతితో పారిశుద్ధ్య సిబ్బందిని నియమించుకునే వెసులుబాటు ఉండేది. దీంతో ఎప్పకప్పుడు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించుకుంటూ ఉన్నాం. ప్రస్తుతం ప్రభుత్వం అనుమతితోనే నియమించుకోవాలి. జనాభా ప్రాతిపదికన సిబ్బందిని నియమించుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే నియామకాలు చేపడతాం. అప్పటి వరకు కొంత ఇబ్బంది తప్పదు.

- మంజునాథ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: సమస్య: మండల పరిధి పచ్చికాపల్లంలో వీధి కుక్కల బెడద పెరిగింది. తెల్లవారుజాము నుంచే వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి. పట్టపగలు చిన్నారులను వెంబడిస్తున్నాయి. వాహనాల వెంట పరుగులు తీస్తూ ద్విచక్రవాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. - కిరణ్‌కుమార్, స్థానికుడు

సమాధానం: వెంటనే పరిశీలించి వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.
- వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి, పచ్చికాపల్లం

పాలసముద్రం, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని సింహరాజుపురం పంచాయతీ కోసరపల్లి గ్రామానికి వెళ్లే రహదారి ముళ్లకంపలు పెరిగి రహదారి మూసుకుపోయింది. వాహనదారులకు దారి కనబడక ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు లేక నడవలేకపోతున్నాం.
- శర్మ, గ్రామస్థుడు

సమాధానం: వెంటనే పరిశీలించి వాటిని తొలగింపజేస్తాం. దీపాలు ఏర్పాటు చేయిస్తాం. - సతీష్, ఎంపీడీవో

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని మురుగు కాలువలో పూడిక పేరుకుపోయింది. డ్రైనేజీ కాలువలో చెత్త, వ్యర్థాలతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉంది. - స్థానికులు

సమాధానం: తక్షణమే కాలువల్లో పూడికతీత పనులు చేపడతాం. -లోకేష్, నగరపాలక ఆరోగ్యాధికారి

నింద్ర, న్యూస్‌టుడే: సమస్య: మిట్టకండ్రిగ ఎస్టీ కాలనీ వద్ద నుంచి గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యే పైపు లైను లీకేజీ అవుతోంది. ఆ ప్రాంతంలో నీరు నిల్వ చేరి కలుషితమయ్యే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు పరిశీలించి సరిచేయాలి. - స్థానికులు

సమాధానం: విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి

గుడిపాల, న్యూస్‌టుడే: సమస్య: గట్రాళ్లమిట్ట ఎస్టీ కాలనీలోని మురుగు కాల్వలు చెత్తా చెదారంతో నిండి ఉన్నాయి. శుభ్రపరచాలి. -శంకర్, స్థానికుడు

సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
-కృష్ణ ప్రసాద్, ఈవోపీఆర్డీ, గుడిపాల

పుత్తూరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని పైవంతెన పక్కన అప్రోచ్‌రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వర్షం పడితే పారే వీల్లేక రోడ్డుపై నీరు నిలుస్తుంది. - నిర్మల, పుత్తూరు

సమాధానం: వెంటనే మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం. - ప్రియాంక, శానిటరీ ఇన్‌స్పెక్టర్

యాదమరి, న్యూస్‌టుడే: సమస్య: వ్యవసాయ విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. పది నిమిషాలకోసారి అంతరాయం ఏర్పడుతోంది. పంటలకు నీరందించడం కష్టంగా ఉంది. - స్థానిక రైతులు

సమాధానం: 11 కేవీ విద్యుత్తు లైన్లలో సమస్య ఉంది. సమస్యను గుర్తించి పరిష్కరిస్తాం.
- గురప్ప, విద్యుత్తు ఏఈ, యాదమరి

## అశ్వవాహనంపై ఊరేగిన శ్రీరాముడు

అశ్వ వాహనంపై విహరిస్తున్న శ్రీరాముడు

తవణంపల్లె, న్యూస్‌టుడే: టి.పుత్తూరులోని శ్రీకోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీరాముడు గజ వాహనంపై పురవీధుల్లో విహరించారు. సీతా రామలక్ష్మణ విగ్రహాలకు ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పెనుమూరు, న్యూస్‌టుడే: కలిగిరి కొండపై వెలసిన తితిదే ఆధ్వర్యంలోని శ్రీవేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం ఆదివారం వేడుకగా జరిగింది. ఆలయ మండలాభిషేకం పూజల్లో భాగంగా చివరి రోజు శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి కల్యాణం జరిగింది. సాయంత్రం ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి ప్రాకారోత్సవం చేశారు. డిప్యూటీ ఈవో వరలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమూరు: కలిగిరికొండ శ్రీనివాసుని కల్యాణోత్సవం

ఆధ్యాత్మికం

వైభవంగా వార్షికోత్సవం.. గంగాధరనెల్లూరు: స్థానిక గుర్రప్పస్వామి ఆలయంలో ఆదివారం శాలివాహన వంశస్థులు వైభవంగా అక్కగార్ల, గుర్రప్పస్వామి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పొంగళ్లు పెట్టి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. వడమాలపేట: మాతమ్మ తిరునాళ్లు వడమాలపేట ఏఏడబ్ల్యూ నందు ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారిని దర్శించుకొన్నారు.

### హుండీ ఆదాయం రూ.1,36,000

కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన శ్రీబంగారమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు ద్వారా రూ.1,36,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. ఆలయంలో పరకామణి లెక్కింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆదాయాన్ని ఆలయాభివృద్ధికి ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. చంద్రశేఖర్‌పిళ్లై, రంగనాధంమొదలియార్ పాల్గొన్నారు.

పాలసముద్రం: అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న గ్రామస్థులు

### భక్తిశ్రద్ధలతో గంగమ్మ కుంభాభిషేకం

పాలసముద్రం : బాలకృష్ణాపురంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయ మహా కుంభాభిషేకం భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి పసుపు, కుంకుమతో అభిషేకం చేయించి వీధుల్లో ఊరేగించారు. అనంతరం మూలవిరాట్టును ప్రతిష్ఠించారు. ఆలయ గోపురంపై నదీ జలాలు చల్లి కుంభాభిషేకం నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు.

## కూలిన ప్రహరీ.. వెనుకనే బావి

పాఠశాల రక్షణ గోడ కూలిపోయి నెలలు గడుస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ వెనుకనే లోతైన బావి ఉంది. దీంతో ఏమాత్రం ఏమరపాటు జరిగినా భారీ ప్రమాదం తప్పదు. మండలంలోని వెంగళరాజుకుప్పం పోస్టాఫీసు వద్దనున్న ప్రాథమిక పాఠశాలలో ఈ దుస్థితి ఉంది. గతేడాది తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు ప్రహరీ పడిపోయింది. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అన్ని పనులు చేస్తామని చెప్పినా అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పాలసముద్రం

యాదమరి: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

జీడీనెల్లూరు: అప్పటి గురువులతో 1990-91 విద్యార్థులు

## పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

యాదమరి: మండల కేంద్రంలోని విష్ణుప్రియ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 1994-95 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలకు చేయూత అందించారు. ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. నాటి గురువులను సత్కరించారు. రూ.60 వేల విలువైన బోర్డులు, బీరువాను పాఠశాలకు వితరణగా ఇచ్చారు. గంగాధరనెల్లూరు: పూర్వవిద్యార్థుల సేవలు అభినందనీయంగా విశ్రాంత తెలుగుపండితులు యాగమూర్తిపిళ్లై పేర్కొన్నారు. స్థానిక హైస్కూలులో 1990-91లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అప్పటి గురువులతో కలసి ఆత్మీయసమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు తమవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు.

దేవళంపేటలో.. వెదురుకుప్పం: మండల పరిధి దేవళంపేట ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక కోలాహలంగా సాగింది. ఆదివారం స్థానిక పాఠశాలలో 2009-10లో పదో తరగతి చదివిన విద్యార్థులు సందడి చేశారు.

## బీఎస్ రావు వర్ధంతి.. అన్నదానం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: శ్రీచైతన్య పాఠశాలల వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్‌రావు వర్ధంతి సందర్భంగా ఆదివారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు, వృద్ధులకు ఆ పాఠశాల సిబ్బంది అన్నదానం చేశారు. బీఎస్ రావు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళి అర్పించారు. పాఠశాలల ఏజీఎం సురేష్ మాట్లాడుతూ విద్యారంగానికి ఆయప ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. రీజినల్ ఇన్‌ఛార్జి చక్రధర్, ప్రిన్సిపల్ సాగరిక పాల్గొన్నారు.

## చెరువుకట్ట శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

పెనుమూరు, న్యూస్‌టుడే: పెనుమూరు-దేవళంపేట మార్గంలో గుంటిపల్లె చెరువు కట్ట రహదారిపై పెరిగిన చెట్లు, ముళ్ల పొదలను ఎట్టకేలకు తొలగించారు. సమస్యపై జూన్ 5న 'కమ్ముకున్న ముళ్ల పొదలు' శీర్షికన 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. తాజాగా స్పందించిన ఆర్‌.భ. అధికారులు యంత్రాల సాయంతో వాటిని తొలగించి శుభ్రం చేయించారు. రోడ్డు బాగు పడడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**15న కలెక్టరేట్ ఎదుట ధర్నా.. చిత్తూరు కలెక్టరేట్:** తమ సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 15న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ తెలిపారు.

**రుయా మీదుగా నడపాలి.. పూతలపట్టు, న్యూస్‌టుడే:** చిత్తూరు నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ రుయా ఆసుపత్రి మీదుగా నడపాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

**కూటమి నిర్ణయంతో కదిలిన మామిడి.. పలమనేరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వం మామిడి ధరలు పెంచడంతో ర్యాంపుల వద్దకు లారీలు, ట్రాక్టర్లు క్యూ కడుతున్నాయి. రైతులు తోటలో మామిడిని కోసి వాహనాల్లో నింపి విక్రయానికి తరలిస్తున్నారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు మామిడిని కొనుగోలు చేయడానికి వస్తున్నారు. ఎప్పుడూ లేని విధంగా పలమనేరులో రెండు చోట్ల ర్యాంపులు దర్శనమిచ్చాయి. రైతుల నుంచి వ్యాపారులు మామిడి కాయలను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ.7.50 పైసలు ధర పలుకుతోంది

**కొత్తకాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించండి.. చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** గువ్వకల్లు పంచాయతీ కొత్తకాలనీకి రోడ్డు వసతి కల్పించి, కాలనీవాసులకు న్యాయం చేయాలని ప్రజలు ఆదివారం నిరసన చేపట్టారు. కొత్తకాలనీ సమీపంలో చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి ఉందన్నారు. ఇటీవల కాలనీ వెళ్లే మార్గంలో గుంత తవ్వడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు.

**పూర్వ వైభవమే లక్ష్యం.. పుత్తూరు:** కాంగ్రెస్ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆ పార్టీ నగరి కో-ఆర్డినేటర్ సీకే కార్తికేయన్ పేర్కొన్నారు. పుత్తూరు పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడానే. ప్రజల సమస్యలపై అవగాహన ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ హాజరయ్యారు.

**సంస్థాగత బలోపేతమే లక్ష్యం .. వెదురుకుప్పం:** సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లి.. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యమని భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధి పచ్చికాపల్లంలో భాజపా పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన చెంగారెడ్డిని సత్కరించారు. మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

**పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం.. పుత్తూరు:** పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం తథ్యమని ఎంపీపీ మునివేలు పేర్కొన్నారు. మండల పరిధిలోని వేపగుంటలో ఆదివారం పరమేశ్వరమంగళం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డెంగీ ప్రబలే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సర్పంచి గిరిజప్రసాద్, వైద్యాధికారి నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

**దుకాణం ఎదుట మూత్ర విసర్జన.. ప్రశ్నిస్తే దాడి.. తిరుపతి(నేరవిభాగం):** మత్తులో మద్యం దుకాణం ఎదుట మూత్ర విసర్జన చేస్తుంటే.. ప్రశ్నించిన సర్వర్‌పై బీరు సీసాతో దాడి చేసిన ఘటన తిరుపతిలో చోటు చేసుకుంది. 'పుత్తూరుకు చెందిన మురళి తిరుమలలో టీ మాస్టర్. శనివారం తిరుపతి జయశ్యామ్ థియేటర్ వద్ద ఓ వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి తాగాడు. ఆ మత్తులో మద్యం దుకాణం ఎదుటే మూత్ర విసర్జన చేస్తుండగా.. సర్వర్ వెంకటరమణ ప్రశ్నించారు. 'నేను ఎవరో తెలుసుకోకుండా అడుగుతావా.. పుత్తూరులో మురళి అంటే ఏందో ఎవరిని అడిగినా చెబుతారంటూ' గొడవకు దిగాడు. అక్కడితో ఆగక అక్కడున్న బీరు బాటిల్ చివర అంచును పగలగొట్టి సర్వర్ మెడపై దాడి చేశాడు. గాయపడ్డ వెంకటరమణను రుయా ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో ఉన్న మురళిని స్టేషన్‌కు తరలించారు.

## విలువలతో జీవించాలి



మాట్లాడుతున్న రాధా మనోహర్ దాస్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ నైతిక విలువలను అనుసరిస్తూ ఉన్నతంగా జీవించాలని ప్రవచనకర్త రాధా మనోహర్ దాస్ అన్నారు. చిత్తూరు నారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో కేవలామృతంపై స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన ప్రవచన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దురాశ లేకుండా ఉన్నవాటితో సంతృప్తిగా జీవించాలని.. జీవిత పరమార్థం తెలిస్తే చెడు ఆలోచనలు దరిచేరవని వివరించారు.

## ఉత్తమ విద్యార్థులకు సన్మానం

ఐరాల, న్యూస్‌టుడే: కాణిపాకం శ్రీశైల అన్నపూర్ణ సత్రంలో ఆర్యవైశ్య అఫిషియల్, ప్రొఫెషనల్ అసోషియేషన్ తరపున 133 ఆర్యవైశ్య ఉత్తమ విద్యార్థులకు మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ ఆదివారం సన్మానించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, జేఈఈ, ఎంసెట్ వివిధ విభాగాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు తమ తమ భవిష్యత్తు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. సంస్థ అధ్యక్షుడు తడవర్తి రాంబాబు, ఐఆర్ఎస్ అధికారి వంశీ, సంస్థ కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి శంకర్‌నారాయణ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య పోటీలు

బాలిక నృత్యాభినయం

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ప్రజాహిత సేవా సంస్థ, మాదిరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు రెవెన్యూ భవన్‌లో ఆదివారం జరిగిన ధారావాహిక శాస్త్రీయ నృత్య పోటీలు ఆహూతుల్ని ఆకట్టుకున్నాయి. బాలబాలికలకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారిని తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు రాజరత్నం తెలిపారు.

## ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుమూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని మాణిక్యరాయునిపల్లె వద్ద ఆదివారం జరిగింది. వెదురుకుప్పం మండలం మారేపల్లెకు చెందిన జయరాజ్, వేణుగోపాలపురం (వడ్డిండ్లు) గ్రామానికి చెందిన జయరాం బంధువులు. వీరు పనిమీద ద్విచక్ర వాహనంపై పూతలపట్టుకు వెళుతుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరు గాయపడ్డారు. వారిని స్థానికులు సీహెచ్‌సీకి తరలించారు.

### అన్నదమ్ముల ఘర్షణ.. కేసు నమోదు

పాలసముద్రం, న్యూస్‌టుడే: అన్న ఇంటి ఎదుట పూల మొక్కలు నాటగా.. బాధలో ఉండగా నాటమేంటని తమ్ముడు అభ్యంతరం వ్యక్తం చేయడంతో గొడవ జరిగింది. ఈ ఘటన ఎస్ఆర్ఆర్‌కండ్రిగ పంచాయతీ తొట్టికండ్రిగలో ఆదివారం జరిగింది. ఈ గొడవలో వ్యక్తులపై, ఇంటిపై దాడి చేయడంతో తీవ్రగాయాలు, ఆస్తి నష్టం కలగడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిన్నరెడ్డప్ప తెలిపారు.


43వ వర్ధంతి

పూజ్యులు A.RAMAN NAYAR
17th May, 1916 - 14th, July 1982
మంచితనానికి మారుపేరుగా నిలిచి మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి, మా నుండి దూరమై నేటికి 43 సం॥లు గడిచినను మీ జ్ఞాపకాలు మాలో పదిలంగా ఎప్పటికీ కదులుతూవుంటాయి.
To a great mind that guided and steered our lives, and helped us reach safe shores, a grand salute of honour, respect and profound gratitude.
Ponnore Family
• Star Tiles and Brick Industries • Royal Plastic
• Star Marketing • Sri Rama Lodge
• Sri Rama Shoping Complex
• Sri Rama Lunch Home • Five Star • Alpha Steels
• Aqua Star • Plantilart (India) Pvt. Ltd
• Thalam Theatre • New Ragam Theatre
HOUSE OF PLASTIC Kerala • Tamilnadu • Andhra Pradesh
Founder PONNORE enterprises LLP
SANY STAR PIPES & FITTINGS · STAR KITCHEN SINK · Aqua Star uPVC RAIN HARVEST SYSTEM
Contact No: 7799884610, 7799884611

పలమనేరు
•పలమనేరు •కుప్పం •పుంగనూరు

## కాలినడకన తిరుమలకు

**గంగవరం, న్యూస్‌టుడే:** మండలంలోని పత్తికొండకు చెందిన వేంకటేశ్వరస్వామి భక్తులు ఆదివారం కాలినడకన తిరుమలకు బయలుదేరారు. భక్తులు మాట్లాడుతూ.. ఏటా క్రమం తప్పక కాలినడకన వెళ్లి స్వామివారిని దర్శించుకుంటామన్నారు.

**దరఖాస్తుల ఆహ్వానం.. కుప్పం:** మహాత్మ జ్యోతిబా పూలే సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 5, 6, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 20న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.సరోజ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18లోపు దరఖాస్తులను పాఠశాలలో అందించాలన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

**పుంగనూరు, న్యూస్‌టుడే: సమస్య:** పట్టణ పరిధిలోని శాంతినగర్, రాగానిపల్లె రోడ్డు ప్రాంతాల్లో వీధిదీపాలు మరమ్మతుకు నోచుకోలేదు. కొన్ని చోట్ల కొత్తగా దీపాలు అమర్చాలి. **- రెడ్డెప్ప, రాగానిపల్లె రోడ్డు**

**సమాధానం:** వీధిదీపాల మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం. **- మహేష్, డీఈఈ, పుంగనూరు**

**పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య:** పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో మురుగు రోడ్లమీద ప్రవహిస్తోంది. కాలువలు శుభ్రం చేయించాలి. **- సుబ్బు, పలమనేరు**

**సమాధానం:** మురుగు రోడ్లమీదకు రాకుండా చర్యలు తీసుకుంటాం. **- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్**

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య:** పట్టణంలోని మర్రిమాను వీధిలో తాగునీటి పైపు గేటు వాల్వ్ గుంత ప్రమాదకరంగా ఉంది. **- రాజేష్, కుప్పం**

**సమాధానం:** గేటువాల్వ్ గుంతను మూసేలా సిబ్బందిని ఆదేశిస్తాం. **- శ్రీనివాసరావు, కమిషనర్**

**సమస్య:** పట్టణంలోని కుప్పం వారధి వద్ద ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన పైపులైను పగిలి పోవడంతో నీరు వృథాగా పోతోంది. **- హరీష్, కుప్పం**

**సమాధానం:** మరమ్మతులు చేయించి, నీటి వృథా అరికడతాం. **- శ్రీనివాసరావు, కమిషనర్**

## చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

**బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** కూటమి పాలనలోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని కంభంపల్లె తెదేపా యూనిట్ ఇన్‌ఛార్జి కోదండ రెడ్డి పేర్కొన్నారు. కంభంపల్లె పంచాయతీలోని జంబుగుండ్లపల్లెలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నాయకులు వెంకటప్పశెట్టి, సోమశంకరప్ప, ధనప్పశెట్టి. రెడ్డెప్ప పాల్గొన్నారు.

### ఇంటింటా సుపరిపాలనలో తొలి అడుగు

**శాంతిపురం, న్యూస్‌టుడే:** బడుగుమాకులపల్లె, శిద్ధావూరు, అడ్డవంక, గట్టూరు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ పుష్ప, నాయకులు ఎల్.జయరామిరెడ్డి, మురళి, భాస్కర్‌నాయుడు, దాయనందనాయుడు, సురేష్ పాల్గొన్నారు.

## కూటమి పాలనకు ప్రజాదరణ

మాట్లాడుతున్న మధుసూదనరాయల్

**పుంగనూరు:** ఏడాది పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ లభిస్తోందని తెదేపా నాయకుడు మధుసూదనరాయల్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వైకాపా చేపట్టిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం బూటకమన్నారు. ఈ ఏడాదిలో ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారంతో పాటు రాష్ట్రానికి తలమానికంలాంటి రాజధాని అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారన్నారు. నాయకులు మోహన్‌నాయుడు, నూరుల్లా, జగదీష్, పర్వేజ్, నూర్‌షా, ముజ్జు పాల్గొన్నారు.

**సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం.. పుంగనూరు:** సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ హరిణి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా జరిగిన 2025-26 ఏడాది నూతన కమిటీ ప్రమాణ స్వీకార సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

**లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం.. వి.కోట:** వి.కోట లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని సీఐ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం నూతన కమిటీ ఎంపిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా డా. తమీమ్‌ఖాన్, కార్యదర్శిగా ఇంద్రేష్‌యాదవ్, కోశాధికారిగా సయ్యద్‌సాదత్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

# బంగారు కుటుంబాల భవితకు భరోసా

✦ పేదరికం నుంచి విముక్తికి చేయూత

పుంగనూరులో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

**పుంగనూరు, న్యూస్‌టుడే:** బంగారు కుటుంబాలకు చేయూత అందించేందుకు ప్రభుత్వం పీ-4 కార్యక్రమం అమలు దిశగా యంత్రాంగం ముందుకు సాగుతోంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజలు భాగస్వామ్యం అనే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బంగారు కుటుంబాలు-మార్గదర్శకాల పేరుతో కార్యక్రమాలు మొదలు పెట్టారు. బంగారు కుటుంబాలను(పేదలు) గుర్తించేందుకు పుంగనూరు నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సర్వే నిర్వహించింది.

పుంగనూరు నియోజకవర్గంలో...

| మండలం | సచివాలయాలు | కుటుంబాలు | సభ్యులు |
|---|---|---|---|
| పుంగనూరు అర్బన్ | 16 | 1,476 | 4,888 |
| పుంగనూరు రూరల్ | 21 | 1,525 | 4,405 |
| చౌడేపల్లె | 15 | 1,615 | 4,885 |
| సోమల | 13 | 1,897 | 5,259 |
| సదుం | 11 | 959 | 2,615 |
| పులిచెర్ల | 14 | 1,091 | 2,865 |
| రొంపిచెర్ల | 8 | 978 | 2,615 |

పుంగనూరు పట్టణ, గ్రామీణ, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల పరిధిలోని 98 సచివాలయాల పరిధిలో 9,541 కుటుంబాలు అర్హత కలిగినట్లు గుర్తించారు. వారి భవితకు భరోసా కల్పించేందుకు దాతలను గుర్తించే ప్రక్రియ ముమ్మరమైంది.

### ఉపాధి కల్పనకు మార్గాలు..

వెనుకబడిన కుటుంబాలను దత్తత తీసుకుని పేదరికం నుంచి బయటకు తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. దీని కోసం ఆయా కుటుంబాలకు మార్గదర్శకత్వం, ఆర్థికసాయం, ఉద్యోగ అవకాశాలను కల్పించే మార్గాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం సమన్వయకర్తగా వ్యవహరించి సమాజంలోని కుటుంబాలు ఒకరికొకరు సాయం చేసుకునే విధంగా ఓ వ్యవస్థను నిర్మించనున్నారు.

### సోమల మండలంలోనే ఎక్కువ

నియోజకవర్గంలోని సోమల మండలంలోనే పేద కుటుంబాలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఇక్కడ 1,817 కుటుంబాల్లో 5,259 మంది పేదలు ఉన్నట్లు గుర్తించారు. అత్యల్పంగా సదుంలో 959 కుటుంబాల్లో 2,615 మంది పేదలను గుర్తించారు. నియోజకవర్గంలో ఇప్పటికే చౌడేపల్లె మండలంలో పేదలకు చేయూత ఇవ్వడానికి దాతలు ముందుకు వచ్చారు. కూటమి ప్రభుత్వం ఉన్నతాశయంతో చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలను సాధించాల్సి ఉంది.

## పల్లెవీధిలో చెత్త తొలగింపు

**పలమనేరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని పల్లెవీధిలో చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికతో వార్త ప్రచురితంకాగా అధికారులు స్పందించారు.

### పారిశుద్ధ్య చర్యలు

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:** పురపాలికలోని శాంతినగర్‌లో రోడ్డుపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. స్థానికులు ఈ సమస్యను 'ఈనాడు'కు తెలిపారు. 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికన వార్త ప్రచురించడంతో స్పందించిన పురపాలిక అధికారులు సిబ్బంది చేత పిచ్చి మొక్కలు తొలగించారు.

### కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:** ఆర్‌వీఎం వీధిలో మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు నిల్వ ఉంటోంది. సమస్యను స్థానికులు 'ఈనాడు'కు తెలిపారు. 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికన వార్త రావడంతో పురపాలిక అధికారులు స్పందించారు.

## నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం

**పుంగనూరు, న్యూస్‌టుడే:** స్థానిక కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీవారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం, శ్రవణ నక్షత్రం సందర్భంగా రాత్రి 7 నుంచి 9 వరకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటరమణ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టరు కృష్ణమూర్తి, ఉభయదారు బీసీవైపీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, ఆలయ అర్చకులు శ్రీనివాసస్వామి పాల్గొన్నారు.

### అలరించిన బకాసుర వధ ఘట్టం

**సదుం, కల్లూరు, న్యూస్‌టుడే:** భట్టువారిపల్లె వద్ద జరుగుతున్న మహాభారతయజ్ఞ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బకాసుర వధ ఘట్టం భక్తులకు ఎంతగానో అలరించింది. ఘట్టం గురించి భాగవతారిని జ్యోత్స్న భక్తులకు చక్కగా వివరించారు. భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:** కుప్పం వైసీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. 20 ఏళ్ల కిందట చదువుకున్న విద్యార్థులు తమ పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. జగన్నాథరావు, అధ్యాపకులు రమేష్, రామకృష్ణారావు, ప్రవీణ్, వెంకటరమణ, మహేష్ పాల్గొన్నారు.

### వానలు కురవాలని పూజలు

ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్థులు

**బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** తీవ్ర కరవు పరిస్థితుల నేపథ్యంలో వానలు కురవాలని బైరెడ్డిపల్లె గ్రామస్థులు ఆదివారం అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు డప్పు వాయిద్యాల మధ్య అక్కదేవతల ప్రతిమలను ఊరేగింపుగా పెద్ద చెరువు కట్ట వద్దకు చేరుకుని ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. చెరువు కట్టపై వెలసిన గంగమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు.

### ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

**చౌడేపల్లె, న్యూస్‌టుడే:** మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు ఆదివారం వాపోయారు. వివరాల మేరకు... మండలంలోని పలగార్లపల్లెకు చెందిన ఓ మహిళతో అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెండు రోజుల కిందట అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని భర్తకు తెలపగా.. శ్రీనివాసులను ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇప్పటికైనా పోలీసులు స్పందించాలని బాధితురాలు కోరుతున్నారు.

### నిత్యం ఇలా.. షరా మామూలే..!

ఈ చిత్రం పలమనేరు-చౌడేపల్లె ప్రధాన మార్గం రాయలపేట పంచాయతీ కేంద్రంలోనిది. ఇక్కడ అసలే ఇరుకైన రోడ్డు.. ఆపై వాహనాల రాకపోకలు అధికం కావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఎదురుగా వాహనాలు వస్తే వెనక్కి వెళ్లి ఆ వాహనానికి దారి ఇవ్వాల్సిన పరిస్థితి. రాయలపేట బజారువీధి, రాములగుడి వీధి, హైస్కూల్ వీధిలో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఉన్నాయి. ఇక్కడి వచ్చే వాహనాలు ఇరుకైన రోడ్డులోనే నిలిపి వేస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంటోంది.
**- న్యూస్‌టుడే, పెద్దపంజాణి**

### ఈ మొక్కలు తొలగించలేరా..?

పట్టణంలోని పెద్ద చెరువు కట్ట మీద నాలుగో నంబరు జాతీయ రహదారి పక్కన పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఫలితంగా మలుపు వద్ద అవతలి రోడ్డు కనిపించడం లేదు. ప్రమాదాలు సంభవించే అవకాశాలు లేకపోలేదు. మున్సిపల్ అధికారులు చెత్తను తొలగించి రోడ్డు కనిపించేలా చేయాల్సిన అవసరం ఉంది. రెండు చోట్ల ఇలా పిచ్చి మొక్కలు పెరగటంతో ద్విచక్రవాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. **- న్యూస్‌టుడే, పలమనేరు**

### అటెళ్లినా.. ఇటొచ్చినా ప్రమాదమే..!

గంగవరం మండలం దండపల్లె రోడ్డులో కౌండిన్య నది నుంచి మారేడుపల్లె క్రాస్ వరకు తారు రోడ్డు ఇరువైపులా కోతకు గురైంది. ఈ రహదారిలో సుమారు ఇరవై గ్రామాలకు పైగా ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు కోతకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే పక్కకు వెళ్లిన వాహనం ప్రమాదానికి గురవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
**- న్యూస్‌టుడే, గంగవరం**

### ఫౌంటేన్ కాదు.. పైపు లీకేజీ..!



ఇదేదో ఫౌంటేన్ అనుకుంటే పొరపడినట్లే.. బోయకొండ కింద ఉన్న యానాదికాలనీలో తాగునీరు సరఫరా అయ్యే పైపులైను దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఉంది. కుళాయిలు విరిగిపోవడం, పైపులు లీకేజీలు కావడంతో స్థానికులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆదివారం దెబ్బతిన్న పైపులైను నుంచి నీరు ఇలా పైకి ఎగసి పడింది.
**- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

### కూటమితో గుంతల దారికి మోక్షం..!

శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీలోని అటవీ గ్రామాలకు 20 ఏళ్ల కిందట నిర్మించిన బీటీ రహదారి దుస్థితిని వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. తిమ్మరాజుపల్లె, బీఎం గొల్లపల్లె, శ్యామరాజపురం తదితర గ్రామాల జనం రాకపోకలు సాగించేందుకు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం చొరవతో రోడ్డు దుస్థితికి మోక్షం లభించింది. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో కదిరిఓబనపల్లె నుంచి బీఎం గొల్లపల్లె కూడలి వరకు రూ.32 లక్షలతో బీటీ నిర్మాణం ఇటీవల పూర్తి చేశారు. **- న్యూస్‌టుడే, శాంతిపురం**

## కూటమి నిర్ణయంతో కదిలిన మామిడి

విక్రయానికి బారులు తీరిన వాహనాలు

**పలమనేరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వం మామిడి ధరలు పెంచడంతో ర్యాంపుల వద్దకు లారీలు, ట్రాక్టర్లు క్యూ కడుతున్నాయి. రైతులు తోటలో మామిడిని కోసి వాహనాల్లో నింపి విక్రయానికి తరలిస్తున్నారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు మామిడిని కొనుగోలు చేయడానికి వస్తున్నారు. ఎప్పుడూ లేని విధంగా పలమనేరులో రెండు చోట్ల ర్యాంపులు దర్శనమిచ్చాయి. రైతుల నుంచి వ్యాపారులు మామిడి కాయలను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ.7.50 పైసలు ధర పలుకుతోంది. తోతాపూరి కాయలను ర్యాంపుల వద్ద కొనుగోలు చేస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### గ్రామ కమిటీలతోనే అభివృద్ధి

**చౌడేపల్లె, న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామ కమిటీలతోనే అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక బైసాని కల్యాణ మండపంలో ఆదివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

**సోమల, న్యూస్‌టుడే:** ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నైజమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు గంగాధరం, ఎంపీపీ ఈశ్వరయ్యల అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## నేడు వైకాపా విస్తృతస్థాయి సమావేశం

**రొంపిచెర్ల, న్యూస్‌టుడే:** రొంపిచెర్ల మండలంలోని పెద్దగొట్టిగల్లు పంచాయతీలోని వీఎంఆర్ గార్డెన్స్‌లో వైకాపా రొంపిచెర్ల మండల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు ఆదివారం తెలిపాయి. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

### పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

**పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రకారం రాష్ట్రంలో డీఎస్సీ 2003లో ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి మోహన్ ఆదివారం గృహదీక్ష చేపట్టారు.

### గాయపడ్డ జింకకు చికిత్స

జింకకు వైద్యం చేస్తున్న సిబ్బంది

**పుంగనూరు, న్యూస్‌టుడే:** కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డ జింకను గ్రామస్థులు చేరదీసి అటవీశాఖ సిబ్బందితో కలిసి పశువైద్య సిబ్బందిచే వైద్యం చేయించారు. సోమల మండలం మేటిమందలో శనివారం చంద్ర అనే వ్యక్తి ఇంటి ఆవరణలో తీవ్రగాయంతో సేదతీరుతున్న జింకను గుర్తించి అటవీశాఖ అధికారులకు తెలిపారు. వారు స్థానిక పశువైద్యశాలకు తీసుకొచ్చి వైద్యసేవలు అందించారు. సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని అటవీశాఖ సిబ్బంది ఆదివారం తెలిపారు.

## పీఎంరోజ్‌గార్ మేళాలో రొంపిచెర్ల వాసి ఎంపిక

నియామకపత్రం అందుకుంటున్న దీపక్‌రాజా

**రొంపిచెర్ల, న్యూస్‌టుడే:** సికింద్రాబాద్‌లో సదరన రైల్వే ఆధ్వర్యంలో నిర్వహించిన పీఎం రోజ్‌గార్ యోజన పథకంలో భాగంగా నిర్వహించిన జాబ్‌మేళలో రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె నగిరిహరిజనవాడకు చెందిన దీపక్‌రాజా ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీపక్‌రాజా జియోలాజికల్ సర్వీస్‌లో బీటెక్ పూర్తి చేశారు. దీంతో ప్రస్తుతం ఆ విభాగంలోనే జూనియర్ ఇంజినీరుగా ఎంపికైనట్లు తెలిపారు.

### నేత్ర శిబిరానికి స్పందన

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

**సదుం, న్యూస్‌టుడే:** స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి, పీలేరు మానవతా స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. 40 మందికి పరీక్షలు చేసి 16 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్గనైజర్ గౌరీశంకర్, పీలేరు మానవతా సంస్థ ఛైర్మన్ శెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### జాగ్రత్తగా కాపాడుకోవాలి..

**బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** జ్ఞానేంద్రియాల్లో ప్రధానమైన నేత్రాలను ప్రజలు జాగ్రత్తగా కాపాడుకోవాలని చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి వైద్య నిపుణులు మురళీకృష్ణ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మిషన్ ఫర్ విజన్ ట్రస్టు సహకారంతో చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గత నెలలో శస్త్రచికిత్స చేసుకున్న వృద్ధులకు కళ్లజోడు అందజేశారు.

### త్యాగరాజ సంకీర్తనా విభావరి

కచేరిలో పాల్గొన్న కళాకారులు

**పలమనేరు:** పట్టణంలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో త్యాగరాజ సంకీర్తనా కచేరి నిర్వహించారు. జాయినింగ్ ద డాట్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం ఈ సంగీత విభావరి ఏర్పాటు చేశారు. కర్ణాటక సంగీత విద్వాంసులు సాయితేజస్ చంద్రశేఖర్ గానం, అర్జున్ దినకర్ వయోలిన్, బీఎస్ నాగరాజు మృదంగం అందరినీ ఆకట్టుకుంది. కళాకారులను సంస్థ కార్యదర్శి పుష్ప సత్కరించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు పాల్గొన్నారు.

## భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

**చౌడేపల్లె, న్యూస్‌టుడే:** భార్య మందలించడంతో మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. వివరాల మేరకు... స్థానిక పంచాయతీ పరిధిలోని చిన్నయల్లకుంట్లకు చెందిన గుర్రప్ప(57) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిస కావడంతో.. మద్యం తాగొద్దని భార్య ఈ నెల 3న గుర్రప్పను మందలించింది. దీంతో పురుగుల మందు తాగారు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేశ్వరరావు వివరించారు.

### వ్యక్తి అదృశ్యం

**బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** కర్ణాటకలోని ములబాగలుకు చెందిన నాగరాజు, దీప దంపతులు జీవనోపాధి కోసం మూడేళ్ల కిందట బైరెడ్డిపల్లెకు వచ్చారు. గుంతకురపల్లెలో నివాసముంటూ బైరెడ్డిపల్లెలోని ఓ వస్త్ర దుకాణంలో భార్యాభర్తలు పని చేస్తున్నారు. భర్త దుబారా ఖర్చులు చేస్తున్నారని భార్య ప్రశ్నించడంతో ఈ నెల 11న నాగరాజు ఇంటి నుంచి వెళ్లిపోయారు. రెండు రోజులుగా ఇంటికి తిరిగి రాకపోవడంతో దీప స్థానిక పోలీసులను ఆశ్రయించారు. దీప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరశురాముడు తెలిపారు.

### బాలిక..

**పలమనేరు:** మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(14) అదృశ్యమైంది. ఆదివారం ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జూదరుల అరెస్టు

**రామకుప్పం:** చెల్దిగానిపల్లి గ్రామ సమీపంలోని పొలాల్లో జూదం ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.16,300లు స్వాధీనం చేసుకున్నట్లు రామకుప్పం పోలీసులు ఆదివారం తెలిపారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

క్రైం కార్నర్

**రామకుప్పం, న్యూస్‌టుడే:** కర్ణాటక మద్యం అక్రమ రవాణాను అడ్డుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు రామకుప్పం పోలీసులు తెలిపారు. ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా మిట్టపల్లి వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న 90 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, తమిళనాడుకు చెందిన శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### వరకట్న వేధింపులు

**పలమనేరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని ముత్తాచ్చారి పాళ్యం వీధిలో నివాసముంటున్న అరుణ అనే వివాహిత అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహమై 20 సంవత్సరాలు అవుతుంటే ఇప్పుడు కట్నం ఇవ్వాలని వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త మార్కొండపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ప్లాంటు పనులు పట్టాలెక్కేనా..?

**పలమనేరు, న్యూస్‌టుడే:** మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన మురుగు శుద్ధి ప్లాంటు(ఎస్‌టీపీ) ఏర్పాటు జాప్యమవుతోంది. ఈ సంవత్సరం ప్రథమార్ధంలో ప్రారంభించాల్సిన పనులు వాయిదా పడ్డాయి. జిల్లా అధికారులు దీనికి సంబంధించిన దస్త్రాలను సైతం పెండింగ్‌లో ఉంచారు. ఇదిలా ఉంటే పట్టణంలోని పెద్ద చెరువులోకి చేరుతున్న మురుగు కారణంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని మొత్తం మురుగు ఈ చెరువులోకి రాకుండా ఇతర ప్రాంతానికి మళ్లించేందుకు గతంలో గుండుబావి వద్ద కాలువ పనులు చేపట్టారు. కొన్ని కారణాలతో పనులు ఆగిపోయాయి. ఒకవేళ ఈ కాలువ పనులు పూర్తి చేసినా దాని గుండా మురుగు కౌండిన్య నదిలోకి చేరుతుంది. తిరిగి అదే నీటిని ప్రాజెక్టు ద్వారా ప్రజలు తాగాల్సి వస్తోందని భావించిన కూటమి ప్రభుత్వం ఎస్‌టీపీ ప్లాంటు ప్రతిపాదనను తెరమీదకు తీసుకొచ్చింది. ఇందుకోసం పెద్ద చెరువు కట్టకు మరోవైపు ఉన్న 3.4 ఎకరాల వ్యవసాయ భూములను సర్వే చేసి ఎంపికకు గుర్తించారు.

ప్లాంటు కోసం ఎంపిక చేసిన ప్రదేశం

### మొత్తం భూమికే కాకుండా...

పెద్ద చెరువులో చేరుతున్న మురుగును శుద్ధి చేయడానికి రూ.9.5 కోట్లతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ మంజూరైంది. ప్రైవేటు భూమిలో ప్లాంటు నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంది. స్థల సేకరణకే భారీగా నిధులు ఖర్చు పెట్టే పని లేకుండా తక్కువ వ్యయంతో స్థల సేకరణ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. పట్టణంలో అధికారులు ఎంపిక చేసిన స్థలానికి ఇప్పటి ధరల ప్రకారం రూ.8 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. అంత మొత్తం భూమికే ఇవ్వకుండా.. ప్లాంటు పెట్టడానికి ప్రభుత్వ భూమి ఉంటే పరిశీలించాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. దీంతో ఈ ప్లాంటు నిర్మాణం ఎప్పటికప్పుడు జాప్యమవుతోంది.

(c) eenadu

# కడలి కాటు.. తీరానికి చేటు


ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్ యాజమాన్యం తాత్కాలికంగా రాళ్లతో నిర్మించిన రక్షణ గోడ

మోడువారుతున్న తాటిచెట్లు..

వాతావరణంలో అనూహ్య మార్పులు, రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యంతో సముద్ర తీరం పెద్దఎత్తున కోతకు గురవుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు వద్ద కనిపించిన ఈ దృశ్యాలే అందుకు నిదర్శనాలు. సముద్ర జలాలు ముందుకు చొచ్చుకు వస్తుండడంతో ఎన్నో ఏళ్లుగా తీరానికి రక్షణగా ఉన్న తాటి చెట్లు ఉప్పు సాంద్రతతో ఎండుముఖం పడుతున్నాయి. మరోవైపు తీరానికి ఆనుకొని ఉన్న ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్‌కు ప్రమాదం పొంచి వుంది. ఇప్పటికే దీనికి ఓ వైపు ఉన్న రహదారి అలల తాకిడికి ఛిద్రమైంది.. ప్రస్తుతం తాత్కాలిక రక్షణ కోసం రాళ్లగట్టును వేసినా ఫలితం ఉండడం లేదు. పరిస్థితి ఇలానే సాగితే సంబంధిత టెర్మినల్ కొద్ది రోజుల్లో సముద్రంలో కలిసిపోయే ప్రమాదముంది. ఇప్పటికైనా పాలకులు సముద్ర తీరం కోతకు అడ్డుకట్ట వేయడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, కోనసీమ

# వరదొస్తే వణుకే..

**ముమ్మిడివరం, న్యూస్‌టుడే:** ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే లంక గ్రామాల ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావు. పి.గన్నవరం, రాజోలు, మామిడికుదురు, కొత్తపేట, అయినవిల్లి, అల్లవరం, కె.గంగవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లోని లంక గ్రామాలపై వరద ప్రభావం పడుతుంది. ముమ్మిడివరం మండలంలోని లంక ఆఫ్ ఠాణేలంక, కూనాలంక, గురజాపులంక, లంక ఆఫ్ గేదెల్లంక, చింతపల్లిలంక, చింతావానిరేవు, కమిని, సలాదివారిపాలెం, ఐ.పోలవరం మండలంలోని పశువుల్లంక, కేశనకుర్రు, పొగాకులంక, కాట్రేనికోన మండలంలోని పల్లంకుర్రులో వరద ప్రభావిత లంక గ్రామాలు ఉన్నాయి. ధవళేశ్వరం ఆనకట్ట నుంచి 7 లక్షల క్యూసెక్కుల స్థాయిలో నీరు దిగువకు వదిలితే లంక గ్రామాలు వరదలో చిక్కుకుంటాయి. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి పడవలపై ప్రయాణించాల్సిన పరిస్థితి ఎదురౌతుంది.

### తాత్కాలిక పనులు..

బొబ్బర్లలంక- పల్లంకుర్రు గోదావరి కుడి గట్టుకు పల్లంకుర్రులోని బూలవారిమొండి వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉంది. ఏటా వరదల సమయంలో ఇక్కడ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. దీనికి ఇటీవల రూ.28 లక్షలతో తాత్కాలిక పనులు చేపట్టి గ్రావెల్‌తో గట్టును ఎత్తు చేయడంతో కొంత బలపడింది. పూర్తి స్థాయిలో గట్టును ఎత్తు చేసి రూ.45 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు హెడ్‌వర్క్సు ఏఈ ఈశ్వరమణ్యం తెలిపారు.

కాట్రేనికోన మండలం పల్లంకుర్రు బూలవారిమొండి వద్ద ఇటీవల తాత్కాలిక పనులు చేసిన ఏటిగట్టు

### ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం..

ధవళేశ్వరం ఆనకట్ట నుంచి 5 లక్షల క్యూసెక్కుల వరకు నీరు దిగువకు వచ్చినా.. పెద్ద సమస్య ఉండదు. ఆపై నీరు పెరిగితే లంకల్లోకి చేరి పంటలకు నష్టం వాటిల్లుతుంది. 2022లో వరదలకు జిల్లాలో 2012 హెక్టార్లలో కూరగాయలు, తమలపాకులు, అరటి తదితర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. 2023లో 1520 హెక్టార్లలో ఉద్యాన పంటలు కోల్పోయారు. గత ఏడాది 1926 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది.

### బొబ్బర్లంక వద్ద గోదారమ్మ పరవళ్లు

**ఆత్రేయపురం:** గోదావరి క్రమంగా పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎదుర్కొన్న అనుభవాలు తలచుకుని భీతిల్లుతున్నారు. పిచ్చుకలంక, వాడపల్లి లంక, బొబ్బర్లంక గ్రామాలు వరద తాకిడికి గురవుతుంటాయి.

బొబ్బర్లంక బ్యారేజీ వద్ద ప్రవాహం

కాటన్, డొక్కా సీతమ్మ అక్విడక్టుల మధ్య వైనతేయ ఉద్ధృతి

యానాం వీధుల్లోకి ప్రవేశించిన వరదలో రాకపోకలు

# ఎగువన తగ్గినా.. దిగువన పెరిగిన వరద

## ముంపులో కనకాయలంక కాజ్‌వే

కనకాయలంక వాసుల అవస్థలు

**పి.గన్నవరం, అయినవిల్లి, మలికిపురం:** ఎగువన గోదావరి వరద తగ్గుముఖం పట్టినా దిగువన కోనసీమలోని వివిధ నదీపాయల్లో మాత్రం పెరిగింది. పి.గన్నవరం మండలం చాకలిపాలెం సమీపంలోని పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ముంపులో చిక్కుకుంది. దీనికి సమీపంలోని వశిష్ఠ గోదావరికి సంబంధించిన అనుబంధ పాయలో పోటెత్తింది. కనకాయలంక వాసులు చాకలిపాలెం వైపు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. పి.గన్నవరంలో కాటన్, డొక్కా సీతమ్మ అక్విడక్టుల మధ్య వైనతేయ జోరుగా ప్రవహిస్తోంది. బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, పెదమల్లంక, అయోధ్యలంక, మర్రిమూల ఆవాస ప్రాంతాలకు చెందినవారు మర పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. తొగరపాయ వద్ద పాత వంతెనను తాకుతూ వరద ప్రవహిస్తోంది. ● దిండి రిసార్ట్స్‌కు సంబంధించిన గృహ పడవలు, పంటూన్, స్పీడ్ బోట్లను నది ఒడ్డున నిలిపివేశారు. * వరద రేవుల్లో లంకగ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా తగు రక్షణ ఏర్పాట్లు చేస్తామని నరసాపురం ఆర్డీవో దాసిరాజు తెలిపారు. ఆదివారం ఆయనతో పాటు యలమంచిలి తహసీల్దార్ జి.వెంకటపవన్‌కుమార్ కనకాయలంక రేవును పరిశీలించారు. ● యానాంలోని ఫ్రాన్సుతిప్ప, గురుకృష్ణాపురం, ఫెర్రీరోడ్డు వంటి ప్రాంతాలను ఆదివారం వరద ముంచెత్తింది. గోదావరి నీరు పట్టణంలోకి రాకుండా గురుకృష్ణాపురం వద్ద షట్టర్లు ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా వీటిని మూసివేయకపోవడంతో వరద పోటెత్తింది.

# మార్గదర్శకులకు అన్వేషణ

## పీ-4 కార్యక్రమంపై మొదలైన కసరత్తు

అల్లవరం: సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

**న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్**

పేదరికంలేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా పి-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదాయంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించారు. అలాంటి వారికి బంగారు కుటుంబాలుగా నామకరణం చేశారు. వీరిని ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వారు దత్తత తీసుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. పేదలకు సహాయ సహకారాలు అందించే వారికి మార్గదర్శకులుగా పేరు పెట్టారు. ఈ కార్యక్రమం ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పీ-4 లోగో

**ప్రత్యేక సర్వే..** పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వారి వివరాలు సేకరించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల వారీగా సిబ్బంది ప్రత్యేక సర్వే నిర్వహించారు. మొదట వారి వివరాలను సేకరించిన తర్వాత వారితో ఉన్నతాధికారుల స్థాయిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారు బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే విధంగా సమాయత్తం చేయనున్నారు.

### గ్రామ స్థాయిలో కమిటీలు..

ధనికులు, ప్రైవేటు సంస్థల నిర్వాహకులను చైతన్యవంతులను చేసి మార్గదర్శకులుగా ముందుకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలో దాన గుణం ఉన్న వారిని గుర్తించి మార్గదర్శకులుగా నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. గ్రామ స్థాయిలో సచివాలయ ఉద్యోగులతో కమిటీలు ఏర్పాటు చేసి మార్గదర్శకులను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు.

### గ్రామీణ ప్రాంతాల్లోనే ఔదార్యం

పట్టణ ప్రాంతాల్లో కన్నా గ్రామీణంలోనే బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు మార్గదర్శకులు ముందుకు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అమలాపురం నియోజకవర్గంలో బంగారు కుటుంబాలు ఎక్కువగా ఉంటే, రామచంద్రపురంలో తక్కువగా ఉన్నారు.

| నియోజకవర్గం | జనాభా(2011) | కుటుంబాలు | బంగారు కుటుంబాలు | మార్గదర్శకులు |
|---|---|---|---|---|
| అమలాపురం | 2,69,866 | 92,529 | 10,773 | 1,933 |
| పి.గన్నవరం | 2,55,708 | 88,001 | 9,548 | 1,844 |
| కొత్తపేట | 3,00,824 | 1,07,674 | 9,664 | 3,817 |
| మండపేట | 2,65,944 | 98,262 | 10,122 | 2,056 |
| ముమ్మిడివరం | 2,10,839 | 7,4276 | 8,262 | 1,930 |
| రామచంద్రపురం | 1,77540 | 64,889 | 6,861 | 1,201 |
| రాజోలు | 2,38,372 | 84,967 | 9,219 | 4,780 |

# పులసలకు పోటాపోటీ

## బయానాలు ఇస్తున్న భోజన ప్రియులు

**న్యూస్‌టుడే, అల్లవరం**

పుస్తెలమ్మైనా పులస కొని తినాల్సిందే అన్నది.. ఉభయ గోదావరి జిల్లాల్లో నానుడి. గోదావరికి వర్షాకాలం బురదనీరు వచ్చిందంటే పులసల సీజన్ మొదలైనట్లే. జులై నుంచి అక్టోబరు వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో సముద్రం నుంచి గోదావరి నదిలోకి పులసలు ఎదురీదుతూ వచ్చి ఇక్కడ పిల్లల్ని పెట్టి వాటితో తిరిగి వెళ్లే క్రమంలో జాలర్లకు చిక్కి, పులస ప్రియులకు కిక్కిస్తాయి. పల్లెల్లో ఎవరైనా పులస కొనుగోలు చేసి వండుకున్నారంటే ఊరంతా ఆ విషయాన్ని ఆ రోజు గొప్పగా చెబుతుంటారు.

### ముందు తమకే ఇవ్వాలని..

పులస వస్తే ముందుగా తనకే ఇవ్వాలని అమలాపురానికి చెందిన ప్రముఖ వ్యాపారి బోడసకుర్రు ప్రాంతంలో పులసలు అమ్మే మత్స్యకార మహిళలకు గోదావరికి వరద నీరు వచ్చిన వెంటనే రూ.5వేలు అడ్వాన్సు ఇచ్చారు.

● అల్లవరం మండలం రెబ్బనపల్లికి చెందిన చేపల వ్యాపారి సాయి ఏటా సీజన్‌లో పులసల వ్యాపారం చేస్తుంటారు. అతడికి రాజకీయనాయకులు, గుత్తేదారులు ముందస్తుగా నగదు ఇచ్చి అడ్వాన్స్‌గా బుకింగ్ చేసుకుంటారు. ప్రముఖులను ప్రసన్నం చేసుకునేందుకు కొందరు పులసను ఎరగా వేస్తారు. మరికొందరు ఏమీ ఆశించకుండా తమ ఆత్మీయులకు పంపిస్తుంటారు. జిల్లాలో బడా వ్యాపారులు, గుత్తేదారులు, శ్రీమంతులు పులస కోసం ఏటా ముందు వరుసలో ఉంటారు.

### తగ్గుతున్న లభ్యత..

కొన్నేళ్లనుంచి గోదావరి నదిలో పులస చేపల లభ్యత తగ్గుతూ వస్తోంది. పులసలు హిందూ మహాసముద్రం నుంచి తమ ప్రయాణాన్ని ప్రారంభించి బంగాళాఖాతంలోకి చేరి అక్కడి నుంచి గోదావరి నదిలోకి ప్రవేశిస్తాయి. కొన్నాళ్లుగా సముద్ర జలాలు కాలుష్య కారకాలుగా మారిపోతున్నాయి. దీంతో ఇవి తమ గమనాన్ని మార్చుకుని ఒడిశాలోని నదుల్లోకి వెళ్తున్నాయని సంబంధిత శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ వలల్లో వేట కారణంగా తల్లి చేపకు నష్టం వాటిల్లి, ఆ ప్రభావం పులస ఉత్పత్తిపై పడుతోందన్నారు. దీనిపై జాలర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# అన్నదాతకు ఆదరవు.. అతివలకు ఆదాయం

## రూ.2.5 కోట్లతో కోకో ఫెర్మెంటేషన్ యూనిట్ ఏర్పాటుకు కార్యాచరణ

**ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే, అల్లవరం:** కోకో రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు స్థానికంగా మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పెర్మెంటేషన్ (ఫెర్మెంటేషన్) యూనిట్ ఏర్పాటు దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనల మేరకు జిల్లా జీడీపీని పెంచేందుకు కొబ్బరిలో అంతరపంటగా కోకో విస్తీర్ణాన్ని మరో 1200 ఎకరాలకు పెంచేందుకు అవసరమైన నర్సరీ సిద్ధం చేశారు. ఉత్పత్తులను సాంకేతిక విధానంలో ప్రాసెస్ చేయడం ద్వారా మంచి ధర లభించడంతో పాటు మరింత మందికి ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉంది.

| | |
|---|---|
| మండలాలు | 22 |
| కొబ్బరి సాగు విస్తీర్ణం: | 90 వేల ఎకరాలు |
| అంతర పంటగా కోకో విస్తీర్ణం | 2500 ఎకరాలు |
| అదనపు లక్ష్యం | 1200 ఎకరాలు |

### అదనపు ఆదాయం

అంబాజీపేట, అయినవిల్లి, కొత్తపేట, రావులపాలెం, ముమ్మిడివరం తదితర మండలాల్లో అదనంగా మరో 1,200 ఎకరాల్లో కొత్త సాగు ప్రారంభించేందుకు రైతులు ముందుకు రావడంతో ఇప్పటికే అంబాజీపేట పరిశోధన కేంద్రంతోపాటు కొన్ని సంస్థలు నర్సరీలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఉపాధి హామీ అనుసంధానంతో రైతులకు ఎకరాకు రూ. 20 వేల వరకు ప్రయోజనం చేకూరనుంది.

### దళారులకు పెత్తనానికి అడ్డుకట్ట

కోకో గింజల మార్కెటింగ్ విషయంలో దళారుల పెత్తనం పెరిగింది. వాళ్లు నిర్ణయించిన ధరకే ఉత్పత్తులు విక్రయించాల్సి రావడంతో రైతులు నష్టపోతున్నారు. ఇటీవల కిలో పిక్కల ధర రూ.450కు కొనుగోలు చేయడంతో ప్రభుత్వం అదనంగా రూ.50 చెల్లించింది. ఈ పరిస్థితి అధిగమించేందుకు కోకో కాయల నుంచి గింజల తీసే ప్రక్రియను శాస్త్రీయంగా చేస్తే రైతులకు కిలోకు రూ.700 వరకు లభిస్తుందని భావిస్తున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు, పారిశ్రామికవేత్తలతో స్పెషల్ పర్పజ్ వెహికల్ ఏర్పాటుకు నిర్ణయించారు. ఇప్పటికే అధికారులతో ప్రాథమికంగా సమావేశాలు నిర్వహించి ఓ నిర్ణయానికి వచ్చారు.

### మహిళా సంఘాల ఆధ్వర్యంలో..

దాదాపు ఎకరా విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఫెర్మెంటేషన్ యూనిట్‌ను మహిళా సంఘాల సభ్యులచే నిర్వహించాలని నిర్ణయించారు. 10 మహిళా సంఘాలతో ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పాటు చేస్తారు. దీనికి రూ.2.50 కోట్ల రుణం మంజూరు చేస్తారు. దీనిపై శిక్షణ ఇవ్వడం ద్వారా దాదాపు 100 మంది మహిళలకు ఉపాధి కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. 'కోకో ఫెర్మెంటేషన్ యూనిట్ ద్వారా స్థానికంగా 100 మంది మహిళలకు ఉపాధితోపాటు, ఉత్పత్తులకు మంచి ధర వస్తుంది. సాగు విస్తీర్ణాన్ని ఈ ఏడాది మరో 1200 ఎకరాలకు పెంచుతున్నాం.' అని కలెక్టర్ మహేశ్‌కుమార్ అన్నారు.

# జలవనరుల శాఖలో లైంగిక వేధింపులు

## డీఈఈపై బదిలీ వేటు

**అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** అమలాపురం జలవనరుల శాఖ డివిజన్ కార్యాలయంలోని ఉద్యోగినిపై డీఈఈ లైంగికంగా వేధింపులకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఈఈ శ్రీనివాస్‌ను ఇటీవల రంపచోడవరం డివిజన్‌కు బదిలీ చేశారు. డీఈఈ తనను లైంగికంగా వేధించారని బాధిత ఉద్యోగిని ఆదివారం అమలాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. బాధితురాలి భర్త జలవనరుల శాఖలో విధులు నిర్వహిస్తూ కరోనా సమయంలో మృతి చెందడంతో ఆమెకు కార్యాలయ సబ్‌ఆర్డినేట్‌గా ఉద్యోగం కల్పించారు. వేధింపులపై గతంలో ఒకసారి గొడవ జరగడంతో జేఈ ఒకరు కలుగజేసుకుని వివాదం సర్దుమణిగేలా చేశారు. తన మాట వినడం లేదనే కారణంగా ఆమెను వేరే డివిజన్‌కు బదిలీ చేయడంతో వివాదం ముదిరింది. ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ నిర్వహించారు. ఆ నివేదిక ఆధారంగా ఆయనను రంపచోడవరం డివిజన్‌కు బదిలీ చేశారు.

# ఇళ్లపై సౌర కాంతులు..!

## ఎస్సీ, ఎస్టీల ఆవాసాలపై ఉచితంగా సోలార్ ఫలకాల ఏర్పాటు

**ఈనాడు, కాకినాడ**

ఓ వైపు పీఎం సూర్యఘర్ ద్వారా ఇళ్లపై సౌర విద్యుత్తు ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు. మరోవైపు పీఎం కుసుమ్‌లో వ్యవసాయ కనెక్షన్లు మొత్తం సోలార్ విద్యుత్తునే సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా ఎస్సీ, ఎస్టీ ఇళ్లకు ఉచితంగా సౌర కాంతులు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 72 వేల మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరి ఇళ్లపై రెండు కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ పలకలు ఏర్పాటు చేయనున్నారు. వీటిని గ్రిడ్‌తో అనుసంధానించి అయిదేళ్ల పాటు నిర్వహించనున్నారు.

ప్రభుత్వం ఇప్పటికే అర్హులైన ఎస్సీ, ఎస్టీ గృహాలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు ఇస్తోంది. దీనికోసం రూ.వేల కోట్ల ఖర్చుచేస్తోంది. వీరి ఇళ్లకు సోలార్ ద్వారా విద్యుత్తు అందించగలిగితే చాలావరకు సర్కారుపై ఆర్థిక భారం తొలగనుంది. ఒక ఇంటిపై రెండు కిలోవాట్లకు రూ.1.2 లక్షలు వరకు ఖర్చవుతుంది. కేంద్రం రూ.60 వేలు రాయితీ ఇస్తుంది. మిగతా మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది.

### పూర్తయిన సర్వే

దీని కోసం సోలార్ ఫలకలు ఏర్పాటుకు అనువుగా ఎన్ని ఇళ్లు ఉన్నాయి..? ఎంతమంది సౌర విద్యుత్తుకు అంగీకరించారన్న అంశాలపై సర్వే చేయించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా 30 వేలకు పైగా లబ్ధిదారులను గుర్తించారు. మిగిలిన రెండు జిల్లాలు కలిపి 35 వేల మంది ఎస్సీ ఎస్టీ వినియోగదారులున్నారు.

లబ్ధిదారుల వివరాలిలా..

| డివిజన్ | ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు | ఉత్పత్తి అయ్యే విద్యుత్తు (మెగావాట్లలో) |
|---|---|---|
| అమలాపురం | 24,113 | 48.23 |
| రామచంద్రపురం | 6,147 | 12.29 |

### సొంతిళ్లు లేకుంటే సామాజిక స్థలాల్లో..

ఎస్సీ, ఎస్టీల్లో సొంత ఇళ్లు లేనివారు.. రూఫ్‌టాప్ పలకలు అమర్చడానికి అనువుగా లేనివారికి ఉమ్మడిగా సోలార్ పలకలను సామాజిక స్థలాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు జిల్లాల్లో ఖాళీ స్థలాలు గుర్తిస్తున్నారు. అయితే భూములు విలువ పెరగడం, గ్రామ కంఠాలన్నీ చేతులు మారిపోవడంతో స్థలాలు దొరకడం లేదని అధికారులు చెబుతున్నారు. కొన్ని చోట్ల భూములను గుర్తించి సిద్ధంచేశారు. రూఫ్‌టాప్‌తో పాటు సామాజిక స్థలాల్లో సోలార్ పలకల ఏర్పాటుకు గుత్తేదారులను పిలుస్తున్నారు. పది మెగావాట్ల లోపు స్థానికంగా సోలార్ వెండార్లను ఎంపిక చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. ఇళ్లపై సోలార్ ఏర్పాటుకు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యనే ఇన్‌స్టాలేషన్ ఇతరత్రా పనులు చేయాలి. పరికరాలు పాడైనా, దెబ్బతిన్న వాటిని 24 గంటల్లోనే బాగు చేయాలి. లేకుంటే కిలోవాట్‌కు రూ.2 వేల చొప్పున రోజులు లెక్కన జరిమానాలు విధిస్తారు.

# వీడనున్న ఉత్కంఠ

## అధిష్ఠానానికి చేరిన నామినేటెడ్ పదవుల జాబితాలు

**న్యూస్‌టుడే, ముమ్మిడివరం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. తొలి 8 నెలల వరకు నామినేటెడ్ పదవుల జోలికి వెళ్లలేదు. తర్వాత పలు కార్పొరేషన్లకు ఛైర్మన్లు, డైరెక్టర్లను ఎంపిక చేశారు. ఈ క్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు(ఏఎంసీలు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్‌లు), ఆలయాలకు ధర్మకర్తల మండలి నియామకాల ప్రక్రియ పూర్తి చేస్తారని ఆశావాహులు ఎదురు చూశారు. ఇటీవల కొన్ని ఏఎంసీలు, పీఏసీఎస్‌లకు మాత్రమే నామినేటెడ్ పదవులు ప్రకటించారు. మిగిలిన వాటిపై ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 15లోగా జాబితాలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంతో త్వరలోనే ఉత్కంఠ వీడనుంది.

### జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో 9 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. రెండేళ్ల పదవీకాలానికి ప్రభుత్వం ఏఎంసీ పాలక వర్గాలను నామినేట్ చేస్తుంది. గత మార్చి, ఏప్రిల్ నెలల్లో మూడు విడతలుగా ఏఎంసీ పాలకవర్గాల నియామక జాబితాలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో 9 ఏఎంసీలకు నగరం, మండపేట, ఆలమూరు, అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలను ప్రకటించారు. ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, తాటిపాక, రామచంద్రపురం ఏఎంసీల పాలకవర్గాలను నియమించ లేదు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల విషయంలో జిల్లాలో 166 ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘాలు ఉండగా.. 53 చోట్ల మాత్రమే త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. ఇంకా 113 చోట్ల ఉత్కంఠ వీడలేదు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహణలోని ఆలయాలకు ఛైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను నియమించలేదు. దేవాదాయ శాఖ పరిధిలో 923 ఆలయాలు ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నియమించిన పాలకవర్గాలు ఏడాది క్రితమే రద్దయ్యాయి.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

### గతంలోనే పేర్లు ఎంపిక

జిల్లాలో నామినేటెడ్ పదవులకు సంబంధించి జాబితాలను గతంలోనే ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి పంపారు. వాటిని అధిష్ఠానం పరిశీలిస్తోంది. పార్టీకి చేసిన సేవలు, ప్రజల్లో ఆదరణ, నాయకత్వ లక్షణాలను బేరీజు వేసే క్రమంలో కొంత జాప్యం జరిగినట్లు తెలుస్తోంది.

అమృతమూర్తికి అశ్రుతాంజలి

మీరు మాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలు, మా భవిష్యత్తును నిర్మించిన మీ కృషి మా మనస్సులో ఎప్పటికీ నిలిచే ఉంటాయి. కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి మా భవితకు బంగారు బాటలు వేసి, అకాల మరణంతో అనంతలోకాలకు వెళ్ళిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
గుబ్బల వారి కుటుంబసభ్యులు, 96000 05578
నున్న వారి కుటుంబసభ్యులు, 92802 52510
నున్న సాహిరావు చౌదరి, మండపేట
కీ.శే. శ్రీమతి ఎన్.కనకదుర్గ గారు
జననం: 05-01-1985 మరణం: 04-07-2025
పెద్దకర్మ: ది.16/07/2025 బుధవారం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు

మా ఆత్మీయులు, శ్రేయోభిలాషి, నీతి, నిజాయతీ కలిగిన వ్యక్తి
శ్రీ మాదాల ఆనందరావు గారు
యనమదల PACS ఛైర్మన్‌గా (తాడిపల్లి, యనమదల, ఓదూరు PACS) ఎన్నికైన సందర్భంగా ప్రమాణ స్వీకారం చేయనున్న శుభసందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ..
శ్రీ మాదాల ఆనందరావు గారు
PACS ఛైర్మన్, యనమదల, రామచంద్రపురం మండలం
తాడిపల్లి, యనమదల, ఓదూరు
గ్రామ మిత్రులు & శ్రేయోభిలాషులు

(c) eenadu

## గాజుల సత్తెమ్మా.. కరుణించవమ్మా

ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుంకర వీరబాబు ఆర్థికసాయంతో అమ్మవారిని 10వేల గాజులతో అలంకరించారు. ఆషాఢమాసం ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

–న్యూస్‌టుడే, ముమ్మిడివరం

## మాణిక్యాంబకు సారె సమర్పణ

సారె తీసుకొస్తున్న భక్తులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అష్టాదశ శక్తిపీఠాల్లో 12వ పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామలోని శ్రీమాణిక్యాంబ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. అమ్మవారి ఆలయంతో పాటు ఆవరణ మొత్తాన్ని కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆషాఢ మాస ఆదివారాన్ని పురస్కరించుకొని అమ్మవారి పుట్టినిల్లుగా పిలిచే వేగాయమ్మపేట ఆస్థాన మండపం నుంచి వేదమంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాలతో మధ్య శోభాయాత్రగా సారెను తీసుకొచ్చి అమ్మవారి ఆలయంలో సమర్పించారు. ద్రాక్షారామకు చెందిన భక్తుడు కంచర్ల చక్రధరుడు 150 కిలోల మిఠాయిలను నైవేద్యంగా అందించారు. కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆయన తండ్రి సత్యం, ద్రాక్షారామ సర్పంచి కొత్తపల్లి అరుణ, ఆలయ ఈవో ఏవీ దుర్గాభవాని, వేగాయమ్మపేట జమిందారు వాడ్రేవు సుందర రత్నాకర్ శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం నుంచి బయలుదేరి వెలంపాలెం గోగులాంబ అమ్మవారి ఆలయానికి సారె తీసుకెళ్లి ఆలయం తరఫున సమర్పించారు.

## మహాలక్ష్మి, మరిడమ్మలకు..

అయినవిల్లి మండలం మాగం గ్రామంలోని మహాలక్ష్మి, మరిడమ్మ వార్లకు గ్రామస్థులు ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. 108 రకాలకు పైగా మిఠాయిలు, పండ్లు సమర్పించారు. చలిమిడి పానకాలు అందించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

– న్యూస్‌టుడే, అయినవిల్లి

## ఎత్తు.. చేతికందనంత..!

రైతుల చేలల్లో నాటిన కంద దుంపలకు వచ్చే పాదు మొక్కలు సాధారణంగా 3 నుంచి 4 అడుగుల ఎత్తు మాత్రమే పెరుగుతాయి. వాటికి భిన్నంగా రావులపాలెం మండలం రావులపాడులోని రైతు నెక్కంటి వెంకన్న పొలంలో ఒక కంద దుంపకు వచ్చిన మొక్క ఏకంగా 6 అడుగులు పైగా ఉండి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. చేనులో సారం, సేంద్రియ ఎరువుల కారణంగా ఇంత ఎత్తు పెరిగినట్టు రైతు తెలిపారు.

– న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

## శాకంబరి.. భక్తుల హితం కోరి..

తొత్తరమూడిలో..

మామిడికుదురు మండలం నగరంలోని దొడ్డి గంగాలమ్మను ఆషాఢ మాసం సందర్భంగా గ్రామస్థులు ఆదివారం శాకంబరిగా అలంకరించారు. 10 కిలోల చొప్పున 20 రకాల కూరగాయలతో నయన మనోహరంగా తీర్చిదిద్దారు. పలు రకాల పండ్లతో విశేషార్చన చేశారు. భక్తులు దర్శించుకున్నారు.

★ తొత్తరమూడి గ్రామంలో మురుగులమ్మను ఆదివారం వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, మామిడికుదురు అయినవిల్లి

## సిద్ధివినాయకా.. అభయ ప్రదాయకా

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకుడి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు చిన్నారులకు అన్నప్రాశన, తులాభారం నిర్వహించారు. నూతన వాహనాలకు పూజలు చేయించారు. వివిధ రుసుముల ద్వారా రూ. 2,51,704 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## చక్రకేళి గెల.. ఎనిమిది అత్తాలిలా..

అంబాజీపేటకు చెందిన కౌలురైతు విప్పర్తి రమణ సాగుచేస్తున్న అరటి తోటలో చక్రకేళి రకం చెట్టుకు కాసిన గెల ఏకంగా 8 అత్తాలు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఈ రకం అరటి గెలకు నాలుగు నుంచి అయిదు అత్తాలు మాత్రమే వస్తాయి. సకాలంలో పోషకాలు అందడంతో ఎక్కువ అత్తాలు వచ్చాయని అంబాజీపేట ఉద్యానశాఖాధికారి ఎం. దిలీప్‌కుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, అంబాజీపేట

**తమ్మీ ఎట్లున్నవ్.. మంచిగున్నావె.. అంటూ తెలంగాణ యాస పలికించినా.. ఇయ్‌తల్లీ.. నాకు ఇంకో బిడ్డుండాదనుకుంటా.. కడుపులోపెట్టి చూసుకుంటా.. అని రాయలసీమ రాజసం పలికించినా.. అరేయ్ ముళ్లపందీ అంటూ ఆంధ్రా వెటకారం పండించినా.. అది కోటకే చెల్లింది..**

# అభిమానకోట..

– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

విలక్షణ నటనతో తెలుగు ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ప్రఖ్యాత నటుడు కోట శ్రీనివాసరావుకు కోనసీమతో అనుబంధం ఉంది. నటుడు కాకముందే ఇక్కడికి వచ్చిన ఆయనకు ఈ ప్రాంతం ఎంతో గౌరవమిచ్చింది. ఆయన మృతితో అప్పటి అనుబంధాన్ని పలువురు గుర్తు చేసుకుంటున్నారు.

### సమనస అన్నపూర్ణ టాకీస్ సందర్శన

కోట శ్రీనివాసరావు సినిమాల్లోకి రాక ముందు బ్యాంకు ఉద్యోగిగా పనిచేసేవారు. 1987లో అమలాపురం మండలం సమనస స్టేట్ బ్యాంకు మేనేజర్‌ను కలిసేందుకొచ్చారు. అప్పటి సర్పంచి మామిళ్లపల్లి రాజారావు కోరిక మేరకు ఆయన నడుపుతున్న అన్నపూర్ణ టాకీస్‌ను సందర్శించారు. ఆ సమయంలో ప్రతిఘటన సినిమా ప్రదర్శిస్తున్నారు. కోట శ్రీనివాసరావు వచ్చారనే విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. ఆయన మృతికి రాజారావు సంతాపం తెలిపారు.

సమనసలో సత్కరిస్తున్న రాజారావు

### భలే ఖైదీలు సినిమాలో సవరప్పాలెం వ్యక్తి

రాంకీ, నిరోషా నటీనటులుగా వి.బి.ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కించిన భలే ఖైదీలు చిత్రీకరణ 1992 కాకినాడలో జరిగింది. ఈ చిత్రంలో కోట శ్రీనివాసరావు హెడ్ కానిస్టేబుల్‌గా నటించగా.. అమలాపురం మండలం సవరప్పాలేనికి చెందిన సత్తి శ్రీరామప్రసాద్ సిటీ బస్సులో కండక్టర్ పాత్ర పోషించారు. కోట శ్రీనివాసరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సత్తి శ్రీరామప్రసాద్ కన్నీటి పర్యాంతమయ్యారు.

### గోదావరితో అనుబంధం

గోదావరి జిల్లాలతో కోట శ్రీనివాసరావుకు ఎనలేని అనుబంధం పెనవేసుకున్నారని అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, సినీ పరిశోధకుడు దువ్వూరి సుబ్రహ్మణ్యశర్మ అన్నారు. వ్యక్తిగతంగా తనకు కోట శ్రీనివాసరావుతో అనుబంధముందన్నారు. తెలుగు సినిమా భావోద్వేగాలు పరిశోధనపై ఆయనతో మాట్లాడిన విషయాలను గుర్తు చేసుకున్నారు. ప్రతినాయక పాత్రల్లో కోట శ్రీనివాసరావు నటించిన తీరుపైనా తాను పరిశోధన చేశానని పేర్కొన్నారు.

అభిమాన నటుడితో దువ్వూరి సుబ్రహ్మణ్యశర్మ

మామగారు చిత్రీకరణ సమయంలో కోటతో బాబూమోహన్

### ఆయన చిరస్మరణీయుడు

రామచంద్రపురం: రామచంద్రపురం కోటలో 'కోట శ్రీనివాసరావు' సరదాగా గడిపేవారని మున్సిపల్ మాజీ ఛైర్మన్, రాజవంశీయులు, కోట వారసులు ఎస్.ఆర్.కె. రాజగోపాలనరసరాజు, ఆయన సోదరులు ఎస్.ఆర్.కె. కిషోర్‌బాబు ఆదివారం గుర్తు చేసుకున్నారు. రామచంద్రపురంతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. కోట భారతీయ స్టేట్‌బ్యాంకులో పనిచేసిన కాలంలో యూనియన్ లీడర్‌గా ఉండేవారని, అలా ఇక్కడి ఉద్యోగులతో పరిచయం నేపథ్యంలో రాజుగారి కోటకు వచ్చేవారని స్థానికులు చెబుతున్నారు. అబ్బాయిగారు, బొబ్బిలిసింహం, మామగారు తదితర సినిమాల చిత్రీకరణ నిమిత్తం ఇక్కడికి వచ్చారని, అలాంటి వ్యక్తి భౌతికంగా దూరమవడం సినీ పరిశ్రమకు తీరని లోటని చప్పిడి రమేష్‌బాబు పేర్కొన్నారు.

## మహిళలకు ఉపాధి మార్గం చూపించడమే లక్ష్యం

శిక్షణ పొందిన మహిళకు సామగ్రి అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: మహిళలందరికి ఉపాధి మార్గం చూపించి వారికి ఆర్థికపరమైన బలాన్ని సమకూర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలో మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం యూనియన్ బ్యాంకు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఆల్కట్ గార్డెన్స్ రాజమహేంద్రవరం, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి సుభాష్ మాట్లాడుతూ తాము ఏ కార్యక్రమం నిర్వహించినా రామచంద్రపురం మహిళలు ముందుంటారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 బంగారు కుటుంబలో భాగంగా ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారుచేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. శిక్షణకు హాజరైన మహిళలకు మంత్రి సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సత్యం ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంక్ ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కుమ్మర శాలివాహనులను ప్రభుత్వం ఆదుకోవాలి

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మం

అంబాజీపేట, న్యూస్‌టుడే: కుమ్మర శాలివాహనులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం కోరారు. మాచవరంలో ఆదివారం కార్యదర్శి దాలిపర్తి భీమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుమ్మర శాలివాహన ఫెడరేషన్‌కు ఎక్కువగా నిధులివ్వాలని డిమాండ్ చేశారు. తమకు ప్రత్యేకంగా ఎమ్మెల్సీ పదవి కేటాయించాలన్నారు. ఐలాపురం వెంకయ్యకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ ఇచ్చిందని గుర్తుచేశారు. మండల కమిటీలు ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. తొలుత ఇటీవల మృతిచెందిన సంఘీయులకు సంతాపం తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా వెల్ల త్రిమూర్తులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి, మంతెన శ్రీనివాసరావు, సలహాదారు దొడ్డిపట్ల శ్రీనివాస్, కొడమంచలి సూరిబాబు, పాలకొల్లు వెంకటరమణ, అంబటి వెంకటసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఒళ్లు దగ్గరపెట్టుకుని పనిచెయ్..

**పోలీస్ అధికారిని ఉద్దేశించి మాజీ మంత్రి విశ్వరూప్ హెచ్చరిక**

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: 'ఒళ్లు దగ్గర బెట్టుకుని పనిచేయాలని.. అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రీకృష్ణుడి జన్మస్థలానికి పంపిస్తామని.' ఓ పోలీసు అధికారిని ఉద్దేశించి మాజీ మంత్రి, వైకాపా నేత పినిపే విశ్వరూప్ హెచ్చరించారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో వైకాపా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమలాపురం రూరల్ సీఐను ఉద్దేశించి మాట్లాడారు. వైకాపా కార్యకర్తలే లక్ష్యంగా పనిచేస్తే వచ్చే అయిదేళ్లలో తొలుత వీఆర్‌కు.. అక్కడి నుంచి జైలుకు పంపిస్తామన్నారు. స్టేషన్ ఎదుట వైకాపా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేయకుండా ఉండాలంటే జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.

## అంతర్జాతీయ చెస్ మాస్టర్‌గా అజయ్

మసీదు సెంటర్ (కాకినాడ): ఈ నెల నుంచి 12వ తేదీ వరకు సెర్బియాలో జరిగిన అంతర్జాతీయ చెస్ పోరాసిన్ ఓపెన్ టోర్నమెంట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారుడు ముదిని అజయ్ ప్రతిభ కనబరిచాడు. ఆయన 2450 ఫిడే రేటింగ్ సాధించి అంతర్జాతీయ చెస్ మాస్టర్ హోదా సాధించాడు. కోనసీమ జిల్లా, అమలాపురానికి చెందిన అజయ్ గత నాలుగేళ్లుగా కాకినాడలో ఉంటూ స్థానిక డెవలప్ చెస్ అకాడమీలో కోచ్‌గా పని చేస్తూనే అనేక పోటీల్లో పాల్గొంటున్నాడు. అకాడమీ హెడ్‌కోచ్ దివ్యతేజ, ఇతర క్రీడాకారులు అజయ్‌ను అభినందించారు.

## ధరవరలు

**అంబాజీపేట కొబ్బరి మార్కెట్**

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | 24,000 |
| పాతకాయ: గండేరా | 27,000 |
| గటగట | 25,000 |
| కొత్తకాయ: గండేరా | 26,000 |
| గటగట | 24,000 |
| నీటి కాయ (వెయ్యింటికి): | |
| పాత (ముక్కుడు) కాయ | 19,000-22,000 |
| కొత్త (పచ్చి) కాయ | 19,000-20,000 |
| కొబ్బరినూనె మార్కెట్: | |
| 15 కిలోలు | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

**వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో**

| | |
|---|---|
| ఫారంరేటు | 97-00 |
| రిటైల్ లైవ్ | 119-00 |
| డ్రెస్డ్ | 173-00 |
| స్కిన్‌లెస్ | 196-00 |

# పెద్దోళ్లుగా వచ్చారు.. పసివాళ్లై మురిశారు

న్యూస్‌టుడే, మామిడికుదురు

**49 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు**

ఉత్సాహంతో వారంతా చిన్న పిల్లలయ్యారు. ఉద్యోగ విరమణ వయసు దాటిపోయినా బాల్యాన్ని మళ్లీ ఆస్వాదించారు. రాజోలు మండలం పొన్నమండ ఎస్.ఆర్.కె. పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-77లో పదోతరగతి చదివిన విద్యార్థులంతా 49 ఏళ్ల తర్వాత మామిడికుదురు మండలం గోగన్నమఠంలో ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు కుటుంబ నేపథ్యాలను వివరించుకొని ఆనందోత్సాహాల్లో పంచుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. సంతోషాలతో కేరింతలు కొట్టారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులు సాగి బాబు, అప్పారి వెంకటేశ్వరరావు, డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, బొలిశెట్టి జయప్రకాశ్, కొంబత్తుల గంగాభవాని, సాగి సత్యనారాయణరాజు, వడ్డి సుజాత, ప్రధానోపాధ్యాయుడు కె.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

గోగన్నమఠంలో కలిసిన పూర్వ విద్యార్థులు

### చెప్పలేనంత సంబరం

మేమంతా 49 ఏళ్ల తర్వాత కలుసుకోవడం చెప్పలేనంత సంబరంగా ఉంది. గురువులను సత్కరించుకోవడం అదృష్టం. స్నేహితులంతా కలిసిన తర్వాత మధురమైన బాల్యాన్ని మళ్లీ పొందగలిగాం.

- సాగి బాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు, గోగన్నమఠం

### పాఠశాలకు నిధులు వచ్చేలా..

నేను హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పాఠశాల నిర్వహిస్తున్నాను. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆరేళ్లు మా పాఠశాలలోనే చదివారు. పొన్నమండ హైస్కూల్ అభివృద్ధికి నిధులు కేటాయించే అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్తాను. ఇక్కడ పూర్వ విద్యార్థులంతా కలుసుకోవడం సంతోషంగా ఉంది.

- అప్పారి వెంకటేశ్వరరావు, హైదరాబాద్

### మరపురాని ఆనందమిది..

పదోతరగతిలో కలిసి చదువుకున్న స్నేహితులందర్నీ చూశాక భావోద్వేగానికి గురయ్యాను. నిజంగా నాకు మరపురాని ఆనందం. మళ్లీ బాల్యంలోకి వెళ్లిపోయాను. అందర్నీ కలుస్తానని అనుకోలేదు. మధురానుభూతి పొందగలిగాను.

- వడ్డి సుజాత, విశ్రాంత ఏపీవో, రాజమహేంద్రవరం

## రెండో విడత ప్రవేశాలకు 907 మంది ఎంపిక

వేంపల్లె, నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు రెండో విడత ప్రవేశాలకు ఎంపికైన 907 మంది విద్యార్థుల జాబితాను ఆదివారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ విడుదల చేశారు. మొదటి విడతలో ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 628 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలలో చేరలేదు. దీంతో ఆ సీట్లు ఖాళీపడ్డాయి. వీటితోపాటు దివ్యాంగుల కోటా కింద 179, సైనికోద్యోగుల పిల్లల కోటా కింద 80, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 20 సీట్లతో కలిపి మొత్తం 907 సీట్లకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి వారి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇందులో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి 96 మంది, ఒంగోలుకు 460, నూజివీడుకు 85, శ్రీకాకుళానికి 265 మంది ఎంపికయ్యారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 96 మంది ఈ నెల 17న ఇడుపులపాయకు, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 810 మంది విద్యార్థులు అదే రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సిఉంది. సోమవారం నుంచి ఓరియంటేషన్ తరగతులు జరుగుతాయన్నారు.

## ఆకాశ్ చిక్కితేనే.. డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

విజయవాడ నేరవార్తలు: మాదకద్రవ్యం 'మెత్' 5.2 గ్రాములు పట్టుబడిన కేసులో ముగ్గురు యువకులను విజయవాడ శివారు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కపిలేశ్వరపురానికి చెందిన గౌర శ్రీరాం వెంకటమణికంఠ బెంగళూరు నుంచి మెత్ తీసుకొచ్చినట్లు తేలింది. ఇతనికి బెంగళూరులోని పబ్‌లో ఆకాశ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. డ్రగ్స్ సరఫరాలో అతనిదే కీలకపాత్ర. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సమాచారం చేరవేస్తుంటారు. డ్రగ్స్‌కోసం వేర్వేరు వ్యక్తుల నంబర్లకు యూపీఐ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తారు. ఆ తరువాత ఆకాశ్ రంగంలోకి వస్తాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో డ్రగ్స్ ఎక్కడ ఉంచాడో చెబుతాడు. దీనికోసం వీరు జాతీయ రహదారులను ఎంపిక చేసుకుంటారు. ఫలానా ప్రదేశంలో ఉంచి ఆ సమాచారాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేస్తారు. తరువాత ఆ వివరాలు తొలగిస్తారు. ఆకాశ్ దొరికితేనే ముఠా గుట్టురట్టు చేయగలమని విజయవాడ పోలీసులు అంటున్నారు. డ్రగ్స్ కొనుగోళ్లు, అమ్మకాల్లో భాగంగా నగదు లావాదేవీలు జరిపిన ఖాతాలపై దృష్టి పెట్టారు. మణికంఠ ఖాతా నుంచి ఏయే ఖాతాలకు డబ్బులు వెళ్లాయనేది సేకరించే పనిలో పడ్డారు.

## కాలువలో రంగారెడ్డి జిల్లా వాసి మృతదేహం

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం ద్వారపూడి పైవంతెన కింద ధవళేశ్వరం-సామర్లకోట ప్రధాన కాలువలో ఆదివారం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు వీఆర్వోకు సమాచారం ఇవ్వడంతో ఆయన మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన పాన్‌కార్డు ఆధారంగా వివరాలు గుర్తించారు. రంగారెడ్డి జిల్లా కీసర మండలం దుమ్మయ్యగూడకు చెందిన గొట్టిముక్కల కుమార్‌రాజు(45)గా పోలీసులు గుర్తించారు. పాన్‌కార్డుపై ఉన్న నంబర్‌కు ఫోన్‌చేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారొస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని, అప్పటివరకు మృతదేహాన్ని ఆస్పత్రిలో భద్రపరుస్తామని ఎస్సై కిషోర్ చెప్పారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

## విన్యాసాలు చేసిన యువకుడి అరెస్ట్

రాజోలు, న్యూస్‌టుడే: శివకోటి బైపాస్ రోడ్డుపై ఈ నెల 12న ద్విచక్రవాహనంతో విన్యాసాలు చేసిన యువకుడిని అదుపులోకి తీసుకున్నామని రాజోలు ఎస్సై బి.రాజేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన మద్దూరి అనిల్‌కుమార్‌గా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. రోడ్లపై యువకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినా, విన్యాసాలు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు.

## విద్యార్థినులపై వేధింపుల ఘటన..

**నిందితులకు 14 రోజుల రిమాండ్**

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన కేసులో నలుగురు నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించారు. కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో ల్యాబ్‌టెక్నీషియన్ కోర్సు చదువుతున్న విద్యార్థినులను జీజీహెచ్‌లోని నలుగురు సిబ్బంది వేధింపులకు గురిచేసిన ఘటనకు సంబంధించి కాకినాడ ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు, రెండో పట్టణ స్టేషన్‌లో ఒక కేసు నమోదైన విషయం తెలిసిందే. రెండు రోజుల కిందట నిందితులు కల్యాణ చక్రవర్తి, జిమ్మి రాజు, గోపాలకృష్ణ, ప్రసాద్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం శనివారం రాత్రి నలుగురు నిందితులను రిమాండ్ నిమిత్తం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. సెక్షన్లన్నీ స్టేషన్ బెయిల్‌కి లోబడి ఉండడంతో రిమాండ్ విధించకుండా రిపోర్టును రిటర్న్ చేశారు. దీంతో పోలీసులు వెంటనే నిందితులకు 41(ఎ) నోటీసులు ఇచ్చారు. అనంతరం టుటౌన్ పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి ఆ నలుగురిని శనివారం రాత్రే అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి వారిని మళ్లీ న్యాయమూర్తి ముందు హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం వారిని కాకినాడ సబ్‌జైలుకు తరలించారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

TENDER

ఇ-కోట్ టెండర్ సేల్: 1050 KVA, జెన్‌సెట్ 2 నెం.లు, తనిఖీ 16 & 17 ఉ. 9.00 గం. నుండి సా. 5.00 గం. వరకు. ITC లిమిటెడ్, ABD అనపర్తి-533342, తూ.గో. జిల్లా. ఇ-కోట్ టెండరు తేది: 18-07-25, టెండరు ఫారం ధర రూ. 500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై- 14 ద్వారా మొబైల్: 98407 31925, www.welcomeauctioneers.com.

REAL ESTATE

PLOT FOR SALE

PITAPURAM

పిఠాపురం బైపాస్‌రోడ్‌ని ఆనుకొని తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో స్థలములు అమ్మకమునకు కలవు. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 89844 25999, 99495 51457.

GENERAL

కొండయ్యపాలెం ఫ్లైఓవర్ జంక్షన్‌లో సుమారుగా 440 గ॥లు మరియు ఉప్పాడలో స్థలములు అమ్మకమునకు కలదు. Cont: P.A.స్వామి, ✆ 98481 07949, 99856 46888.

TO LET

ఖమ్మం వైరా రోడ్ Opp. Rohit TestTube Centre, G+3 Floors Hospitals, Clinics, Gold Shopsకు అనువైనది అద్దెకు కలదు. సంప్ర: 93993 28709, 98661 85050.

COMMERCIAL

FOR OFFICES, Banks, Dental & Cosmetology convience place with parking in Danavaipeta, 1600 Sft., 1st Floor. Rjy, Cont: 94 90 811 769.

JOBS

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి / వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

ప్రముఖ సంస్థలో కాకినాడ, రాజమండ్రి, విశాఖపట్నం, హైదరాబాద్ నందు పని చేయుటకు నిరుద్యోగ యువతి, యువకులు మరియు రిటైర్డ్ ఉద్యోగులు కావలెను. ✆ 94940 42487, 98498 22088.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TC No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9010680011, 9989371122.

Dr.BRA కోనసీమ జిల్లా, కొత్తపేట, మారుతి సెంటర్ వద్ద గల ఇండియన్ ఆయిల్ బంకులో పెట్రోల్, డీజిల్ కొట్టుటకు యువతి, యువకులు కావలెను. ఆసక్తిగలవారు దుర్గా ఫైనాన్స్ కార్పొరేషన్, కొత్తపేట నందు సంప్ర: 90323 25441, 98485 44289.

మెకానిక్ హెల్పర్లు కావలెను. జీతం: 10,000/- నుండి 25,000/- వరకు. శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద, మెయిన్‌రోడ్, కాకినాడ, ✆ 94909 98888.

DRIVERS

కావలెను

ఆదిత్య యూనివర్శిటీ

సూరంపాలెంలో పనిచేయుటకు

బస్సు డ్రైవర్లు

హెవీ వెహికల్ లైసెన్స్‌తో పాటుగా 5 సం॥ల డ్రైవింగ్ అనుభవం కలిగి ఉండవలెను.

రాజమండ్రి సిటీ, రావులపాలెం ప్రాంతముల నుండి విద్యార్థులను తీసుకుని వచ్చుటకు

సూపర్‌వైజర్లు

ఏదైనా డిగ్రీ విద్యార్హత తతో పాటు, బస్సు నిర్వహణలో అనుభవం కలిగి ఉండి కాకినాడ, రాజమండ్రి, మండపేట మరియు ఇతరప్రాంతాల నుండి వచ్చే బస్సుల కొరకు

మరిన్ని వివరములకు సంప్రదించవలసిన నెంబర్లు

79976 86661, 80960 26667

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-93 పైII

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

9000180626, 9989993175

# రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

### నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద నిర్మితమవుతున్న పవిత్రమైన నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన ప్రోప్రై మధుసూదన్, కిరణ్ దంపతులు రూ.51,111 విరాళాన్ని ఆదివారం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధరరావు అభినందించారు.

### ఉచిత వైద్యశిబిరం

కొత్తపేట, న్యూస్‌టుడే: సండే ఐ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలో ఏర్పాటు చేసిన ఉచిత ఎముకల వైద్యశిబిరాన్ని స్పెషలిస్ట్ ఎస్సీ కొండ నరసింహారావు దంపతులు ప్రారంభించారు. వైద్యనిపుణులు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిల్పి ప్రసాద్, పెద్దింటి రామం, రాజమండ్రి యూనివర్సిల్ ఆసుపత్రి వైద్యుడు ఆరుమిల్లి రాజేంద్రబాబు పాల్గొన్నారు.

### రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

మలికిపురం: సామ్యవాదం, లౌకిక వాదం పదాలపై కొంతమంది మాటలతో గందరగోళం ఏర్పరుస్తున్నారని మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఉండి రాజేశ్ అన్నారు. మలికిపురం పూలే-అంబేడ్కర్ సామాజిక భవనంలో జనపల్లి సత్యానందం అధ్యక్షతన ఆదివారం జరిగిన చర్చావేదికలో ఆయన మాట్లాడారు. హేతువాద రాష్ట్ర పూర్వాధ్యక్షుడు పెన్మెత్స సుబ్బరాజు మాట్లాడుతూ రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన అంశాలను సమసిపోతే రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి బత్తుల లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు బూసి జాన్ మోషే, షారా సంస్థ డైరెక్టర్ పల్లి తానం, మానవహక్కుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల శ్రీనివాసరావు, ఆకుమర్తి భూషణం, నల్లి ప్రసాద్, మంద సత్యనారాయణ, బడుగు సాయిబాబా, పమ్మి రత్నరాజు, గొల్ల జేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

## ముంపులో వరి పొలాలు

లొల్ల వద్ద నీటిలో పంట పొలాలు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఏటా వాడపల్లి, లొల్ల, మెర్లపాలెం వరి ఆయకట్టు పొలాలకు ముంపు సమస్య వీడటం లేదు. బ్యాంక్ కెనాల్(ముక్తేశ్వరం కాలువ) నీటిమట్టం పెరగడంతో ఈ సమస్య తలెత్తుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేలల్లోని ముంపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**సైఫాన్లు నిర్మించినా..**

రూ.2.34 కోట్లతో లొల్ల, మెర్లపాలెం వద్ద ముంపు పరిష్కారం కోసం మెర్లపాలెం, లొల్ల వద్ద సైఫాన్లు నిర్మించారు. ఇవి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ముంపునీరు దిగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు వేసుకున్న సుమారు వంద ఎకరాలు పైబడి ప్రస్తుతం ముంపునకు గురయ్యాయి. బ్యాంక్ కెనాల్ మట్టం తగ్గిస్తే ముంపునీరు తగ్గుతుందని చెబుతున్నారు. నీటిమట్టం తగ్గిస్తే కాలువ పరిధిలోని ఊబలపల్లి, చింతల్లంక, అయినాపురం, కాట్రేనికోన తదితర ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని జల వనరులశాఖ అధికారులు చెబుతున్నారు. సైఫాన్లు వినియోగంలోకి తీసుకొస్తే పలివెల డ్రెయిన్ నుంచి ర్యాలి వియర్ కాలువ వద్ద ఉన్న గోదావరి డ్రెయిన్ ద్వారా నీరు బయటకు పోతుంది. దీనిపై జలవనరులశాఖ ఏఈ వెన్నా సాయి మాధవప్రసన్న మాట్లాడుతూ ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

రాజోలు నున్నవారిబాడవలో ఒడ్డుకు చేరిన బోట్లు

తొగరపాయ వద్ద మునిగిన శ్మశానవాటిక

అప్పనపల్లి పాటురేవులో ఇలా..

## పాటు రేవుల్లోకి వరదనీరు

మామిడికుదురు, రాజోలు, అయినవిల్లి, రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వైనతేయ నదిలో ప్రవహిస్తున్న వరద క్రమంగా పోటెత్తి ప్రవాహంతో పాటురేవుల్లోకి చేరుతోంది. పాశర్లపూడి ఏటిగట్టు దిగువలోని అప్పనపల్లి కాజ్‌వే వద్ద, పెదపట్నం లంక వద్ద మార్గంలో పాటురేవుల్లో నీరు పెరుగుతోంది. మామిడికుదురు మండలం పాశర్లపూడిలోని రిసార్ట్స్ వద్దకు చేరింది. అప్పనపల్లి స్నానఘట్టం వద్ద మెట్లను ముంచెత్తింది. వరద పెరుగుతున్నందున లంక గ్రామాల్లో అధికారులు అప్రమత్తం చేస్తున్నట్లు తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు.

రావులపాలెంలో గోదావరి ప్రవాహం

**గోదావరి పరవళ్లు**

రాజోలు మండలం మేకలపాలెం, నున్నవారి బాడవలో నివసిస్తున్న మత్స్యకారులు వేటను నిలిపివేసి బోట్లను ఒడ్డుకు చేర్చారు. మధ్యలంకలో ఉన్న కొబ్బరికాయలు, కాయగూరలను ఇవతలి దరికి చేర్చేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. మధ్యలంకలో పరిస్థితిని సమీక్షించిన తహసీల్దార్ సీహెచ్ భాస్కర్ అక్కడ నివసిస్తున్న నాలుగు కుటుంబాల వారు సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని కోరారు. • గోదావరికి వరద పెరిగితే రావులపాలెం మండలంలోని కొమరాజులంక, గోపాలపురం, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, ఊబలంక గ్రామాల్లోని లంక ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి నీరు చేరే అవకాశం ఉంది.

## త్రీమెన్ కమిటీల నియామకం

ఆలమూరు, న్యూస్‌టుడే: మండలంలోని 8 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు సంబంధించి త్రీమెన్ కమిటీల నియామకం జరిగిందని కూటమి నాయకులు తెలిపారు. ఆలమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షునిగా వంటిపల్లి సతీష్, చింతలూరు అధ్యక్షునిగా నల్లా వేంకటేశ్వర రావు, చొప్పెల్ల అధ్యక్షునిగా నాగిరెడ్డి వేంకటేశ్వర రావు, జొన్నాడ అధ్యక్షునిగా మేడపాటి రామారెడ్డి, మోదుకూరు అధ్యక్షునిగా ఈదల వీర్రాజు, నర్సిపూడి అధ్యక్షునిగా రాయుడు వెంకటస్వామి, పెదపళ్ల అధ్యక్షునిగా జాస్తి భాస్కర రావు, పెనికేరు అధ్యక్షునిగా మేకా రామన్నలను నియమించారు.

## పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

మామిడికుదురు: నగరం పరిధి తాడివారిమెరకలో ఇటీవల కొబ్బరి చెట్టుపై నుంచి జారిపడి మృతిచెందిన తాడి అశోక్‌కుమార్ కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. 2001-02లో అతనితో పదోతరగతి వరకు చదువుకున్న వారంతా కలిసి రూ.40 వేల ఆర్థిక సాయాన్ని మృతుని భార్య నాగమణికి ఆదివారం అందజేశారు. విశ్రాంత ఎంఈవో నీతిపూడి చంద్రరావు, తాడి రామకృష్ణ, దీపాటి సూర్యప్రకాశ్, జాలెం క్రాంతివర్ధన్, చింతా సుధీర్ పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై హర్షం

రాజోలు, న్యూస్‌టుడే: ఓడలరేవులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా హర్షం వ్యక్తంచేశారు. దీని ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్యాలయానికి జీఎంసీ బాలయోగి పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. రాజోలు దీవిలో సెంట్రల్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884
ఉ॥ 10 - మ॥ 1

స్పందనకు వందనం

**డ్రెయినేజీ శుభ్రం**

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం కొమరాజు లంకలో డ్రెయిన్ పూడిపోవడంతో మురుగు పారక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

**చెత్తాచెదారం తొలగింపు**

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని కొత్తకాలనీలో రోడ్డు చెంతన చెత్తాచెదారం పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు.

**వీధి దీపాలు వెలిగాయి**

ఆత్రేయపురం: లొల్ల గ్రామంలో వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నామంటూ స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి కాయల జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి కృష్ణమాచార్యులు స్పందించి వీధి దీపాలు వేయించారు.

అంబాజీపేట: మాచవరం పంచాయతీ పరిధిలోని పెద్దవీధి, రోజువారీ సంత, ప్రధాన రహదారి ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపాలు తలెత్తాయి. ఈ విషయాన్ని సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, గ్రామ కార్యదర్శి కె.వి.వి.సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా ఆయా ప్రాంతాలను ఆదివారం సిబ్బందితో శుభ్రం చేయించారు.

**పూడిక తీశారు**

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం కూడలిలో భూగర్భ డ్రెయినేజీలో పూడిక ఏర్పడి మురుగునీరు ప్రవహించక దుర్వాసన వెలువడుతోంది. ఈ సమస్యను సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, కార్యదర్శి తాడి ఏసు దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు.

## సరిహద్దు లంకగ్రామాల పరిశీలన

పి.గన్నవరం: పి.గన్నవరం మండలాన్ని చేర్చి ఉన్న పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దు లంకగ్రామాల గోదావరి వరద రేవులను పి.గన్నవరం తహసీల్దార్ పి.శ్రీపల్లవి ఆదివారం సందర్శించారు. 'వరద వేళ.. గోదావరిలో ప్రమాద ప్రయాణం' శీర్షికన ఈ నెల 13న వెలువడిన కథనంపై ఆమె స్పందించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు మర్రిమూల, అయోధ్యలంక, ఆనగార్లంక, పెదమల్లంక, కనకాయలంక వరద రేవులను పరిశీలించామని, లైఫ్‌జాకెట్లు ఏర్పాటు చేయాలని నరసాపురం ఆర్డీవో, ఆచంట తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.

స్థానికులతో మాట్లాడుతున్న పి.గన్నవరం తహసీల్దార్ శ్రీపల్లవి

అంబాజీపేట వాసవీమాత

అంతర్వేది గుర్రాలక్క

రాజోలు వనువులమ్మ ఆలయంలో భక్తులు

జగ్గన్నపేటలోని పళ్లాలమ్మ, సమర్పించిన సారె

## శాకంబరిగా అమ్మవార్లు

అంబాజీపేట, అంతర్వేది, న్యూస్‌టుడే: అంబాజీపేట వాసవీ కన్యకాపరమేశ్వరి శాకంబరీదేవి అలంకరణలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. వంద కిలోల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. ● అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి సోదరి గుర్రాలక్క అమ్మవారు శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు.

### ఆషాఢం సారె సమర్పణ

రాజోలు, మామిడికుదురు, కొత్తపేట, న్యూస్‌టుడే: రాజోలు గ్రామదేవత వనువులమ్మకు ఆర్య వైశ్య మహిళా సంఘ అధ్యక్షురాలు కాసు భవాని ఆధ్వర్యంలో సారె సమర్పించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి చీర, సారె, పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ● మామిడికుదురు మండలం మొగలికుదురు పరిధి జగ్గన్నపేట పళ్లాలమ్మకు గ్రామస్థులు 108 రకాలతో సారె సమర్పించారు. ● తొలకరి పంట రైతులకు అనుకూలంగా పండి చేతికి అందాలని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ వారికి ఎం.కె.నగర్ వాసులు ఆషాఢం సారె సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రకాల పిండి వంటలతో వంద కేజీల సారె అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించామని వెల్లడించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు.

## కూటమి ప్రభుత్వానికి ఆదరణ

అయినవిల్లి: కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటం చూసి ఓర్వలేక వైకాపా నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఏఎంసీ ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ఏ ఒక్క అభివృద్ధి పని పూర్తిచేయలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేసి ప్రజలకు మరింత చేరువ అవుతోందన్నారు.

## మురుగు పారక ఇక్కట్లు

రావులపాడు జాతీయ రహదారి సమీపంలోని పంట కాలువలో తాటి చెట్టు పడి పోయి నెలలు గడుస్తున్నా తొలగించకపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. దీంతో దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోయాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి దృష్టికి తీసుకుని వెళ్లగా తాడిచెట్టు మాను, ఇతర వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

## విద్యుత్తు స్తంభాలు సరిచేశారు

రామరాజులంక శివారు పెదతిప్ప వద్ద ఏటిగట్టు పక్కన విద్యుత్తు స్తంభాలను సరిచేశారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ సమీపంలో విద్యుత్తు స్తంభాలు ఒరిగి పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. దీనిపై 'ఒరిగిన విద్యుత్తు స్తంభాలు' శీర్షికతో ఈ నెల 13న ప్రచురితమైన కథనానికి స్పందించిన ఏఈ బి.ప్రసాద్ సిబ్బందితో పనులు చేయించారు. నాలుగు స్తంభాలను సరిచేసి తీగలు లాగారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

ఈనాడు కథనానికి స్పందన

## ఏడాది పాలనలో ఎన్నో విజయాలు: బండారు

ర్యాలి(ఆత్రేయపురం), సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం అంశాల్లో ఎన్నో విజయాలు సాధించామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం ర్యాలి గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. అమలాపురం వంతెన పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మద్దూరి సుబ్బారావు, పేరిచర్ల పుల్లంరాజు వర్మ, మెర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని తెదేపా రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు. సఖినేటిపల్లి మండలం వీవీమెరకలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేపట్టారు. తెదేపా మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు, తాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలి గ్రామంలో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

వీవీమెరకలో శ్రీనివాస్, ఇతర నాయకులు

## కోట మృతికి సంతాపం

రాజోలు: సినీ నటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు మృతికి భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. 1999లో తనతో సహచర ఎమ్మెల్యేగా భాజపా తరపున ప్రాతినిధ్యం వహించారన్నారు. అప్పట్లో సినిమాల్లో బిజీగా ఉన్నా ఎప్పుడూ నియోజకవర్గ అభివృద్ధి కోసం తపించేవారన్నారు.

**పాస్‌పోర్టు పోయినది**

డా॥ B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం, తూర్పుపాలెం, కేశనపల్లి గ్రామం, D.No. 4-276కి చెందిన అంద్రాజు విజయ, W/o దుర్గారావు అను నాయొక్క M9057810 నెంబరుగల ఒరిజినల్ పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం ఇంటి దగ్గర నుండి మలికిపురం సెంటర్‌కు వెళ్ళి వస్తుండగా మార్గంమధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.
అంద్రాజు విజయ, W/o దుర్గారావు
తూర్పుపాలెం, కేశనపల్లి, మలికిపురం మండలం, డా॥ B.R. అంబేద్కర్ కోనసీమ జిల్లా. సెల్: 88973 94527

**పాస్‌పోర్టు పడిపోయినది**

నల్లి మనోజ్‌లియ, S/o వెంకటరావు, డో.నెం. 4-82, మొక్కతోట సఖినేటిపల్లి గ్రామవాసి అయిన నేను ది. 10-07-2025న ఇంటి వద్ద నుంచి సఖినేటిపల్లి సెంటర్‌కు నా పాస్‌పోర్టు నెం. B8132151ను జిరాక్స్ తీయించుకొనుటకు వెళ్లినపుడు జారిపడిపోయినది. దొరికినవారు తెలియజేయగలరు.
నల్లి మనోజ్‌లియ, S/o వెంకటరావు
మొక్కతోట, సఖినేటిపల్లి,
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ నెం: 83330 12229

## ఎమ్మెల్యే వరప్రసాద్ పుట్టినరోజు వేడుకలు

ఎమ్మెల్యేకు గజమాల వేస్తున్న నాయకులు

మలికిపురం, రాజోలు, మామిడికుదురు, న్యూస్‌టుడే: రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పుట్టిన రోజు వేడుకలు విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. అభిమానుల మధ్య కేకును కోసి పంచారు. నాయకులు, నియోజకవర్గంలోని ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేని పుష్పగుచ్ఛాలతో అభినందించారు. వీర మహిళలు ఏర్పాటు చేసిన దేవ వరప్రసాద్ భారీ కటౌట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెదేపా, భాజపా నాయకులు, కార్యకర్తలు, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు. ● రాజోలులో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేకు కోసి పంచారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, దిరిశాల బాలాజీ, నల్లా పవన్‌కుమార్, పినిశెట్టి బుజ్జి, కాట్న రాజు, పామర్తి రమణ తదితరులు పాల్గొన్నారు. ● మామిడికుదురు శివాలయం సమీపంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కేకు కోసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కమనీయం.. స్వామివార్ల కల్యాణం

వాడపల్లి, ర్యాలి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుడు, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామివార్ల కల్యాణోత్సవాలు ఆదివారం కమనీయంగా జరిగాయి. ఈ సందర్భంగా కంకణదారణ, పాదోప్రక్షాళన, మధుపర్కప్రాశన, కన్యాదానం, సూత్ర, యజ్ఞోపవేతదారణ, తలంబ్రాలు, అష్టోత్తర శతనామావళి, గోపూజ తదితర కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా జరిపించారు. స్వామివార్లకు ఈవోలు నల్లం సూర్య చక్రధరరావు, బీవీ రమణ మూర్తి పట్టు వస్త్రాలు సమర్పించారు.

వేంకటేశ్వరుని కల్యాణ క్రతువులో భక్తులు

పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

## తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

అంబాజీపేట: అంబాజీపేట జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 130 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 120 మంది వివిధ గ్రేడింగ్ పొందారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తైక్వాండో కార్యదర్శి బి.అర్జునరావు, కోచ్‌లు పితాని త్రిమూర్తులు, పితాని భార్గవిశ్రీకళ, పి.నాగభూషణం, కె.వెంకటేశ్వరరావు, కె.మణికంఠ పాల్గొన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆలమూరు, న్యూస్‌టుడే: చొప్పెల్ల పీహెచ్‌సీలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై జి.నరేష్ వివరాల ప్రకారం.. ఈ నెల 12న 45 ఏళ్ల వ్యక్తి చొప్పెల్ల పీహెచ్‌సీలోకి వెళ్తూ కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వైద్యసిబ్బంది లోపలికి తీసుకువెళ్లేలోగా మృతి చెందాడు. దీనిపై వైద్యాధికారి ఎన్.లక్ష్మీ స్నేహలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆదివారం తెలిపారు. మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాసుపత్రి శవాగారంలో మూడు రోజుల పాటు ఉంచుతామన్నారు. స్థానికుల సహాయంతో వ్యక్తి వివరాలు తెలుసుకుని బంధువులకు మృతదేహం అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

# గట్లు బలహీనం.. భయం గుప్పెట జనం

న్యూస్‌టుడే, రాజోలు: రాజోలులోని వశిష్ట ఎడమ ఏటిగట్టును ఆనుకుని ఉన్న మేకలపాలెం, నున్నవారిబాడవలో నివసించే ప్రజలు ఏటా వచ్చే గోదావరి వరదలకు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. బలహీనంగా ఉన్న గట్టును పటిష్ఠ పరుస్తామంటూ హామీలిస్తున్నా ఇప్పటివరకు అవేమీ క్షేత్రస్థాయిలో అమలు కాలేదు.

● బొబ్బర్లంక నుంచి అంతర్వేది వరకు 90.600, గన్నవరం నుంచి అంతర్వేది వరకు ఎడమ ఏటిగట్టు 42, గన్నవరం నుంచి గోగన్నమఠం వరకు కుడి ఏటిగట్టు 28 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. చాలాచోట్ల బలహీనమవడంతో ఆయా ప్రదేశాల్లో వరదల సమయంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. దీంతో సంబంధిత అధికారులు ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

2021 వరదలకు ఇలా..

**గత సంఘటనలతో..**

2021లో మేకలపాలెం, నున్నవారిబాడవ, తాటిపాకమఠం వద్ద ఏటిగట్టు పైనుంచి వరదనీరు ప్రవహించింది. దీన్ని ఆనుకుని ఉన్న ఇళ్లన్నీ పూర్తిగా మునిగాయి. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు చేపట్టడంతో అప్పట్లో గండం గడిచింది.

**పట్టని ప్రతిపాదనలు**

గత వైకాపా పాలనలో ఏటిగట్టు రక్షణకు తూట్లు పొడిచింది. పలుమార్లు పరిశీలనకు వచ్చిన ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపినా నిధులు మంజూరు చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వశిష్ట కుడి, ఎడమ ఏటిగట్ల రక్షణకు రూ.52.50 కోట్లకు ప్రతిపాదనలు పంపినా కార్యాచరణకు నోచుకోలేదు.

నున్నవారిబాడవలో ఏటిగట్టు దుస్థితి

**పనులు చేపడతాం..**

వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇసుక బస్తాలు, సర్వేబాదులు, రక్షణ సామగ్రిని సిద్ధం చేశాం. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల మరమ్మతులు చేపట్టాం. ఏటిగట్టు పటిష్ఠ పరిచేందుకు అన్ని చర్యలు చేపట్టాం. 2 మీటర్ల ఎత్తు, 6.5 మీటర్ల వెడల్పు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పంపాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం.

– టీవీఎల్ఎన్ మూర్తి, ఏఈ, వశిష్ట సబ్‌డివిజన్, రాజోలు

**దేవదాయ ధర్మదాయశాఖ & శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము**
వాడపల్లి గ్రామం, ఆత్రేయపురం మండలం, Dr. BR. Ambedhkar కోనసీమ జిల్లా.
**ఇ-ప్రొక్యూర్‌మెంట్/ సీల్డు టెండర్/ బహిరంగ వేలం ప్రకటన -2**

Rc.No. V25/2025 తేది10/07/2025

షెడ్యూల్ - A (E-Procurement)

| వ సం | లైసెన్సు హక్కు వివరము | కాలపరిమితి | ధరావత్తు రూపాయిలు | బ్యాంకు గ్యారంటీ | బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ తేది | E- టెండరు దాఖలు చేయు చివరి తేది, సమయం | E- టెండరు తెరుచు తేది, సమయం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | శ్రీస్వామి వారి దర్శనంకు వచ్చే భక్తులు సెల్ ఫోను భద్రపరచు లైసెన్సు హక్కునకు దేవస్థానం వారు ఏర్పాట్లు చేసిన స్థలం నందు | (13/08/2025 నుండి 12/08/2026 వరకు 1 సంవత్సరం కాలపరిమితి) | 2,00,000/- | 25,00,000/- | 11/07/2025 ఉదయం 10.00 గం.లకు | 24/07/2025 ఉ.గం 10.30 వరకు PQ Stage Open Time 24/07/2025 మ.గం 12.30లకు | 24/07/2025 సా.గం 4.00 |

షెడ్యూల్ - B (సీల్డ్ టెండర్)

| వ సం | లైసెన్సు హక్కు వివరము | కాలపరిమితి | ధరావత్తు రూపాయిలు | బ్యాంకు గ్యారంటీ | సీల్డ్ టెండర్ షెడ్యూలు జారీ చేయు తేదీ | సీల్డ్ టెండర్ దాఖలు చేయు చివరి తేది, సమయం | సీల్డ్ టెండర్ తెరుచు తేది, సమయం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | శ్రీస్వామి వారి దర్శనంకు వచ్చే భక్తులు సెల్ ఫోను భద్రపరచు లైసెన్సు హక్కునకు దేవస్థానం వారు ఏర్పాట్లు చేసిన స్థలం నందు | (13/08/2025 నుండి 12/08/2026 వరకు 1 సంవత్సరం కాలపరిమితి) | 2,00,000/- | 25,00,000/- | 20/07/2025 ఉదయం 10.00 గం.ల నుండి | 24/07/2025 మ.గం 1.30లకు | 24/07/2025 మ.గం 3.30లకు |

షెడ్యూల్ - C (బహిరంగ వేలం పాట)

| వ సం | లైసెన్సు హక్కు వివరము | కాలపరిమితి | ధరావత్తు రూపాయిలు | బ్యాంకు గ్యారంటీ | బహిరంగ వేలం పాట జరుపు సమయం |
|---|---|---|---|---|---|
| 1 | శ్రీస్వామి వారి దర్శనంకు వచ్చే భక్తులు సెల్ ఫోను భద్రపరచు లైసెన్సు హక్కునకు దేవస్థానం వారు ఏర్పాట్లు చేసిన స్థలం నందు | (13/08/2025 నుండి 12/08/2026 వరకు 1 సంవత్సరం కాలపరిమితి) | 2,00,000/- | 25,00,000/- | 24/07/2025 మ.గం 2.30లకు |

షరతులు: ● సీల్డ్ టెండర్ / బహిరంగ వేలంలో పాల్గొనుటకు ఆసక్తి గలవారు దేవస్థాన కార్యాలయము నందు రూ.500/- చెల్లించి టెండర్ షెడ్యూల్ పొంది దేవస్థాన కార్యాలయము నందు సీల్డు టెండరు దాఖలు చేయవచ్చును ● సీల్డ్ టెండర్ ఐటమ్ లకు షరతులు మరియు ఇతర వివరముల కొరకు దేవస్థాన కార్యాలయములో సంప్రదించవలెను. ఫోన్ నెంబర్లు: 08855-271888, 9491000085 ● DD: The Executive Officer. Sri Venkateswara Swamy Devasthanam, Vadapalli పేరున తీసుకొనవలెను.
తేది. 10/07/2025, స్థలం: వాడపల్లి సం/- ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి

# అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

## టెంట్‌హౌస్ వ్యాపారుల కార్యవర్గం ఎన్నిక

యానాం, న్యూస్‌టుడే: యానాం ప్రాంత శ్రీలక్ష్మీ వినాయక టెంట్ సప్లయర్స్ యూనియన్ స్థానిక అంబేడ్కర్‌నగర్‌లోని కంచర్ల రామకృష్ణయ్య, పద్మావతి కల్యాణమండపంలో ఆదివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ద్రాక్షారామ భీమేశ్వర లైటింగ్ యూనియన్ ప్రతినిధి వాసంశెట్టి చినబాబు, తాళ్లరేవు కాలభైరవ లైటింగ్ యూనియన్ ప్రతినిధి యావారం సత్యనారాయణ, మల్లాడి సత్తిబాబు నేతృత్వంలో ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా శేరు మురళి, అధ్యక్షుడిగా మేడిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ర్యాలి సుధాకర్, కార్యదర్శిగా నిమ్మకాయల భావన్నారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె

ముమ్మిడివరం: ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ముమ్మిడివరంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. గత సమ్మెకాలపు ఒప్పందాల ప్రకారం.. జీఓ 36ను అనుసరించి జీతాలు పెంచాలని, తల్లికివందనం పథకంతో సహాఅన్ని సంక్షేమ పథకాలు షరతులు లేకుండా తమకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, ఎన్.అరుణ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.అజయ్‌కుమార్, జి.రమేష్, వై.రమణ, జి.వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, కె.శివ, ఎ.సత్తిబాబు, కె.గోవిందు, కె.శరత్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

## కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

శాకంబరిగా పైళ్లమ్మ

అమలాపురం పట్టణం, కాట్రేనికోన: ఆషాఢ మాసం సందర్భంగా అమలాపురం కల్వకొలను వీధిలోని వేపచెట్టు కనకదుర్గమ్మకు ఆదివారం భక్తులు సారె సమర్పించారు. మహిళలు పసుపు వీరలు ధరించి మేళతాళాల మధ్య గాజులు, బిందెలతో చలివిడి పానకం, పండ్లు, పిండి వంటలు తీసుకొని ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. చింతలమెరకలో కొలువైన శ్రీవిజయలక్ష్మి దుర్గాదేవి అమ్మవారికి పలువురు మహిళలు ఆదివారం ఆషాఢమాస సారె సమర్పించారు.

అల్లవరం: బోడసకుర్రు గ్రామ దేవత పైళ్లమ్మవారిని ఆషాఢమాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు.

చింతలమెరకలో అమ్మవారికి సారె సమర్పించి నమస్కరిస్తున్న భక్తులు

## అధ్వాన రహదారులు.. ట్రాఫిక్ ఇక్కట్లు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

కోనసీమ చుట్టు పక్కల ప్రాంత ప్రజలు వినోదం, షాపింగ్, ఆసుపత్రి, కార్యాలయ పనులు.. ఇలా ఏ అవసరం ఉన్నా జిల్లా కేంద్రం అమలాపురం పట్టణం రావాల్సిందే. పట్టణంలో పెరుగుతున్న జనాభా, ఆవాసాలు, ఇతర వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య, ఉపాధి అవసరాలకు తగ్గట్టుగా రహదారులు విస్తరించలేదు. ప్రథమ శ్రేణి పురపాలక సంఘంగా కొనసాగుతున్నా ఓటు బ్యాంకు రాజకీయాలతో పట్టణ రహదారులు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో స్థానికులతో పాటు దూరప్రాంత ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

● సమన్వయ లోపం.. పురపాలక సంస్థ, పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీశాఖల అధికారుల సమన్వయంతో సమష్టిగా ముందుకు వెళ్లకపోవడమే ప్రధాన సమస్యగా మారింది. ప్రధాన, అంతర్గత రహదారులు పక్కనున్న స్థలాలను కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ఫలితంగా రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. మూడు సంవత్సరాల క్రితం మురుగుకాలువలపై నిర్మాణాలు తొలగించి రోడ్డు నిర్మించారు. కాలక్రమేణా యథాతథంగా వ్యాపారులు ముందుకు వచ్చేశారు. అమలాపురంలో ట్రాఫిక్ సమస్యలు తిష్టవేయడంతో వాటిని అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అమలాపురం వడ్డిగూడెంలో..

చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించి మురుగుకాలువలు దాటకుండా నిర్మాణాలు ఉండేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### ఇలా చేస్తే పరిష్కారం

నివాస, వాణిజ్య ప్రాంతాలుగా విభజించి అందుకు అనుగుణంగా రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలి. విత్తనాలవారి కాలువగట్టురోడ్డు నుంచి కొంకాపల్లి వెళ్లే రోడ్డులను వెడల్పు చేసి నిర్మిస్తే ట్రాఫిక్ నియంత్రించవచ్చు. కిమ్స్ ఆసుపత్రి పక్క నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డు, ఎస్ఎస్‌నాయుడు మోడల్ కాలనీలో రోడ్డు నిర్మాణం చేస్తే ట్రాఫిక్ తగ్గుతుంది. కొంకాపల్లి జిల్లా కలెక్టరేట్ బంగ్లా నుంచి పేరూరు వై.జంక్షన్ వరకు రోడ్డు, నల్లవంతెన ఎర్రవంతెన మధ్య రహదారి నిర్మించాలని ప్రజలు కోరతున్నారు. కేంద్రప్రభుత్వం నిర్మించిన బోడసకుర్రు బైపాస్‌రోడ్డుకు కలిసే రహదారులను విస్తరించి త్వరగా నిర్మిస్తే ప్రయాణం సులభమవుతుంది.

అమలాపురం నల్లవంతెన ఎర్రవంతెన మధ్య రహదారి దుస్థితి

### ప్రణాళిక అమలుకు ప్రయత్నిస్తాం..

మాస్టర్ ప్లాన్‌లో 2041 వరకు పట్టణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ పొందుపరిచి ప్రభుత్వానికి నివేదించాం. ప్రధాన రహదారులు గరిష్ఠంగా 80 అడుగులు, కనిష్ఠంగా 60 అడుగులు, అంతర్గత రహదారులు 40 అడుగులు ఉండేలా ప్రతిపాదనలు రూపొందించాం. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. నిధులు మంజూరైతే పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. మురుగుకాలువలపై నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు అందజేశాం.

- వి.నిర్మల్‌కుమార్, అమలాపురం మున్సిపల్ కమిషనర్

## ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

యానాం: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ విశాఖపట్నం విభాగం తమ కోనసీమ, కాకినాడ జోన్ పరిధిలోని డీలర్లకు స్థానిక వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ నాకౌట్ డబుల్స్ పోటీలు నిర్వహించింది. 14 జట్లు పాల్గొనగా మల్లాడి రఘువంశీ, చైతన్య జట్టు ప్రథమ బహుమతి, రాజబాబు, మహేశ్వరరావు జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. విజేతలకు డివిజనల్ మేనేజర్ హెచ్.బుచ్చయ్య, చైతన్య వెంకటేష్ బహుమతులు అందజేశారు. కళ్యాణమండపంలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో విక్రయాల్లో నిర్దిష్ట లక్ష్యాలు సాధించిన డీలర్లకు బహుమతులు అందజేశారు.

బహుమతి అందుకుంటున్న రఘువంశీ, చైతన్య

## జాతీయస్థాయి పోటీలకు ఉషశ్రీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద యోగా ఆశ్రమం విద్యార్థిని అడ్డగళ్ల ఉషశ్రీ దిల్లీలో జరిగే జాతీయస్థాయి సీనియర్ యోగా పోటీలకు ఎంపికైనట్లు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. అమలాపురం రోటరీక్లబ్‌లో రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఆమె ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు.

యోగా సాధన చేస్తున్న అడ్డగళ్ల ఉషశ్రీ

## సారూ.. ఈ నీరు తాగేదెలా..?

అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో కొన్ని రోజులుగా కొళాయిల నుంచి మురుగు నీరు సరఫరా అవుతుందని స్థానికులు వాపోతున్నారు. నేరుగాను ఉన్న పీడబ్ల్యూఎస్ పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులోని ఫిల్టర్లు పాడవ్వడంతో నేరుగా కాలువ నీరు కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఆ నీరు మరుగుదొడ్డిలో వాడుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతుందున్నారు.

– న్యూస్‌టుడే, అల్లవరం

కొళాయిల నుంచి వస్తున్న రంగునీరు

## తవ్వేశారు.. మట్టితో వదిలేశారు

అమలాపురం ముమ్మిడివరంగేట్ దగ్గర మంచినీటి పైపులైన్ మరమ్మతులకు సిబ్బంది రహదారిని తవ్వి వదిలేశారు. అటువైపుగా వాహనదారులు, ప్రయాణికులు, పిల్లలు, వృద్ధులు ప్రయాణిస్తుంటారు. ఏ మాత్రం అదుపు తప్పినా అంతే. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

## రాకపోకలకు నిత్యకష్టాలు

కాట్రేనికోన మండలంలోని నడవపల్లి రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానిక గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు గుంతల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో మరింత ఇబ్బందిగా ఉందంటున్నారు. పల్లిపాలెం, నడవపల్లి తదితర గ్రామాలకు చెందిన వారంతా ఈ రోడ్డునే వినియోగిస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన

ఇటీవల వర్షాలకు నీటితో రోడ్డు

## వైద్యసేవలు అభినందనీయం

అమలాపురం పట్టణం: వాసవీ కన్యకాపరమేశ్వరి జిల్లా ఆర్యవైశ్య సంఘ సభ్యుల ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీకాకొళ్ళ శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. అమలాపురం వాసవీ వేదిక మందిరంలో ఆర్యవైశ్య సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆదివారం సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. వివిధ విభాగాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు, సంఘ ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబులు ప్రారంభించారు. వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. సంఘ వైద్య కమిటీ ఛైర్మన్ పచ్చిపులుసు కృష్ణారావు, నంబూరి సత్యనారాయణ మూర్తి, సింగంశెట్టి కుమార్, కాళ్లకూరి కుమార్, నంబూరి నరేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శివరామ సుబ్రహ్మణ్యం

## కోటా మృతి తీరనిలోటు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ప్రముఖ సినీనటుడు కోటా శ్రీనివాసరావు మృతి సినీ లోకానికి తీరనిలోటని కాట్రేనికోనకు చెందిన సినీ, టీవీ నటుడు సురేష్ శర్మ పేర్కొన్నారు. ఆయన ఆదివారం ఫిలింనగర్‌లోని కోటా నివాసానికి వెళ్లి నివాళి అర్పించారు. కోనసీమ అంటే ఆయనకు ఎంతో ఇష్టమని చాలా సందర్భాల్లో కోనసీమ ఆప్యాయత, అందాల గురించి సెట్లో చెబుతూ జ్ఞాపకాలు గుర్తు చేసుకునేవారన్నారు.

### చిత్రనివాళి

ప్రముఖ సినీనటుడు కోటా శ్రీనివాసరావు మృతి చెందడంతో కాట్రేనికోనకు చెందిన ప్రముఖ చిత్రకారుడు ఆకొండి అంజి ఆయన రేఖా చిత్రం గీసి నివాళి అర్పించారు. ఆయన నటనను ప్రజలెప్పటికీ మరిచిపోలేరన్నారు. తెలుగుజాతి గర్వించదగ్గ నటుడని కొనియాడారు.

## మొండిపోరలో బోర్‌బావి మూసివేత

కాట్రేనికోన: మొండిపోరలో ఓ ఆక్వా చెరువు వద్ద బోర్‌బావి నుంచి స్వల్ప గ్యాస్‌తో కూడిన నీరు ఎగసిపడటంతో ఓఎన్‌జీసీ బ్లోఅవుట్ కంట్రోల్ యూనిట్ సిబ్బంది మూసివేశారు. శుక్ర, శనివారాల్లో స్వల్ప గ్యాస్‌తో కూడిన నీరు ఎగసిపడటంతో రైతు, స్థానికులు ఓఎన్‌జీసీ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. వారు రాత్రికిరాత్రి దగ్గరుండి జేసీబీతో పనులు చేయించి బోర్‌బావికి ప్లగ్‌ను అమర్చి ఇసుకబస్తాలతో మూసివేశారు. ఆదివారం ఉదయం డీటీ జగదీష్, ఎస్సై అవినాష్ తదితరులు మూసివేసిన బోర్‌బావిని పరిశీలించారు.

మూసివేసిన బోర్ బావి

## శతాధిక వృద్ధురాలి మృతి

ఉప్పలగుప్తం: చల్లపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు నాగులాపల్లి సత్యవతి (మరియమ్మ)(105) ఆదివారం మృతి చెందారు. చివరి రోజు వరకు తనపని తాను చేసుకుంటూ ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని స్థానికులు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, 15 మంది మునిమనుమలు ఉన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డు చింతలమెరకలో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, గుద్దటి జమ్మి, దొమ్మేటి రమణకుమార్ పాల్గొన్నారు.

### సిమెంటు రహదార్లు ప్రారంభం

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో రూ.50 లక్షలు ఎంపీ నిధులతో నిర్మించిన సిమెంటు రహదార్లను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం ప్రారంభించారు. నగర పంచాయతీ మూడో వార్డు కాశివారితూము నుంచి చింతలమెరక, 19వ వార్డు రాజుపాలెం నుంచి మట్టాడిపాలెం వరకు రూ.25 లక్షలు చొప్పున రూ.50 లక్షలు ఎంపీ నిధులతో సిమెంటు రహదారులు నిర్మించారు

తాళ్ల రేవు: ప్రతి కుటుంబానికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా క్లస్టర్ సమన్వయకర్త మోపూరి వెంకటేశ్వరరావు అన్నారు. పిల్లంక, ఇంజరం, అరటికాయలంక గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో భూపతిరాజు బుచ్చిరాజు, వీరేశ్వరరావు, ఆకెళ్ల నాగేశ్వరరావు, వేగేశ్న భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలను అందించామని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాట్రేనికోనలో వేట్లపాలెం, చెయ్యేరు, పల్లంకుర్రు, బట్టు చెరువు మొక్కలతిప్ప తదితరచోట్ల ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

అమలాపురం పట్టణం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి అంశాల్లో ఎన్నో విజయాలు సాధించిందని జిల్లా తెలుగు మహిళా ధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి తెలిపారు. అమలాపురం పట్టణంలోని 11, 13, 14 వార్డుల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం తెదేపా నాయకులు ఆదివారం నిర్వహించారు. గెల్లా మీనాకుమారి, టి.నేతాజీ, వాసంశెట్టి చినబాబు, కట్టా నాని, వరదా సత్యనారాయణ, గుబ్బల నాగబాబు, కర్రి దత్తుడు పాల్గొన్నారు

అమలాపురం గ్రామీణం: సుపరిపాలనతో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి అన్నారు. పేరూరులోని రామాంజనేయనగర్, గౌతమ్‌నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.

చింతలమెరకలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బుచ్చిబాబు

## సావిత్రినగర్‌లో ఉచిత వైద్యశిబిరం

యానాం, న్యూస్‌టుడే: స్థానిక పడవలరేవు వీధిలోని గంగా మెడి క్లినిక్ వైద్యులు తీరగ్రామం సావిత్రినగర్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ ఎండీ కనకాల భైరవస్వామి. జనరల్ సర్జన్ పెనుమత్స దీపిక రోగులకు వైద్యపరీక్షలు చేశారు.

## ఉద్యోగ నియామకాలకు వయోపరిమితి పెంచాలి

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ప్రభుత్వం చాలా ఏళ్ల విరామం తర్వాత వివిధ ప్రభుత్వశాఖల్లో పలు రకాల ఖాళీల భర్తీకి ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టడంతో అభ్యర్థుల వయోపరిమితి పెంచడానికి కేంద్రం అనుమతించాలని ముఖ్యమంత్రి ఎన్.రంగసామి కోరారు. కేంద్ర హోంశాఖ సహాయ కార్యదర్శి నితీష్‌కుమార్ వ్యాస్ శనివారం పుదుచ్చేరి పర్యటనకు వచ్చిన సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఈ విషయాన్ని ప్రస్తావించారు.

## నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండాలి

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: వైకాపా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. అమలాపురం పట్టణం వేడుక మందిరంలో వైకాపా నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి, వైకాపా నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పత్రికలను ఆవిష్కరించారు. వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పిల్లి సూర్యప్రకాష్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం వేడుకమందిరంలో ప్రచార పత్రికలను ఆవిష్కరిస్తున్న వైకాపా నాయకులు

## ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉద్యోగులు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు అన్నారు. నడిపూడిలోని సామాజిక భవనంలో విద్యుత్తుశాఖ ఎస్ఈగా పనిచేసి ఉద్యోగోన్నతిపై విశాఖపట్టణం సీజీఎంగా బదిలీ జరిగిన ఎస్.రాజబాబు దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. విద్యుత్తు శాఖలో పనిచేసిన ఈఈ వై.విజయానంద్, కె.రాంబాబు, రామచంద్రపురం ఈఈ రత్నాలరావు, అమలాపురం తహసీల్దార్ పి.అశోక్‌ప్రసాద్, రాష్ట్ర దండోరా నాయకుడు బోయిలపల్లి కరుణాకర్, పెద్దాపురం ఏఈ కాప రామచంద్రరావు, విశ్రాంత సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సవరపు నాగేశ్వరరావు, కరాటేలో ప్రతిభ చాటిన మంద మౌనిక, యువ కవయిత్రి ఎస్.కావ్యలను సన్మానించారు.

రాజబాబు దంపతులను సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు

## ప్రజాపనులశాఖ నిర్లక్ష్యం.. ముంపులో ఫ్రాన్సుతిప్ప

యానాం, న్యూస్‌టుడే: భారీ వరద వస్తే తప్ప నీరు లోనికి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినా ఫ్రాన్సు తిప్పకు మళ్లీ ముంపు సమస్య తప్పలేదు. యానాం ప్రజాపనులశాఖ ఉదాసీనంగా ఉండటంతో లోతట్టు ప్రాంతాలైన గురుకృష్ణాపురం, ఫెర్రీరోడ్డు వంటి ప్రాంతాలకు వరద నీరు వచ్చిచేరింది. గౌతమి గోదావరిలో ఆదివారం వరద ఉద్ధృతి పెరిగింది. జీఎంసీ బాలయోగి వారధి నుంచి పాత రాజీవ్‌నగర్ టైడల్‌లాకు వరకు వరద రాకుండా గట్టు ఎత్తు చేసి గురుకృష్ణాపురం వద్ద నీరు లోనికి రాకుండా షట్టర్లను నిర్మించారు. ఆ షట్టర్లను ప్రజాపనులశాఖ అధికారులు సకాలంలో మూయకపోవడంతో వరద ప్రవేశించింది. గురుకృష్ణాపురం కాలనీలో పలు ఇళ్లు, ఫెర్రీరోడ్డు వరద నీటిలో ఉన్నాయి. పరిపాలనాధికారి మునిస్వామి శనివారం సాయంత్రం ఈ ప్రాంతాల్లో పర్యటించి ప్రజాపనులశాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, ఇసుక మూటలు వేయాలని ఆదేశించినా సకాలంలో స్పందించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఫెర్రీరోడ్డులోని రెండు ఫంక్షన్ హాళ్లలో కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్న వారు వరద నీటిలో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద ప్రాంతాల్లో మునిస్వామి పర్యటించి పరిశీలించారు.

అరటికాయలంకలో అంగన్‌వాడీ కేంద్రం వద్దకు చేరుకున్న వరద

తాళ్లరేవు: అరటికాయలంక గ్రామానికి వరద నీరు చేరుకుంది. నూతనంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద వరదనీరు తాకింది. అరటికాయలంక సమీపంలో గోదావరినీరు గ్రామాల్లోకి రాకుండా లాకులు ఏర్పాటు చేశారు. వరద ప్రవాహానికి లాకుల షెట్టర్ ఎత్తేశారు. ఆ నీరంతా లాకుల ద్వారా మురుగుకాలువలోకి చేరుకుంది.

### ఉద్ధృతంగా గోదావరి

ముమ్మిడివరం: గోదావరి వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ముమ్మిడివరం మండలంలో గోదావరి పరివాహక ప్రాంత లంక గ్రామాలైన లంక ఆఫ్ ఠాణేలంక, గురజాపులంక, కూనాలంక, కమిని, సలాదివారిపాలెం, లక్ష్మీదేవిలంక, లంక ఆఫ్ గేదెల్లంక, చింతపల్లిలంక, చింతావానిరేవు ప్రాంతాల్లోని ప్రజలు వరద పరిస్థితిని తెలుసుకుంటూ జాగ్రత్తలను తీసుకుంటున్నారు. వరదనీరు పెరుగుతుండటంతో ఆక్వాచెరువుల్లో రొయ్యలను పట్టుబడి పట్టి బయటకు తరలిస్తున్నారు.

పాతరాజీవ్‌నగర్ గట్టు వెలుపల ఇళ్ల వద్దకు చేరిన వరదనీటిని పరిశీలిస్తున్న పరిపాలనాధికారి మునిస్వామి

మండపేట
• మండపేట • రామచంద్రపురం

## రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

**మలికిపురం:** సామ్యవాదం, లౌకికవాదం పదాలను వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చినప్పటికీ ఆర్ఎస్ఎస్ నాయకులు పదేపదే మాట్లాడుతున్న తీరుతో ప్రజల్లో గందరగోళం ఏర్పడిందని మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి యేడిద రాజేష్ అన్నారు. మలికిపురం పులే-అంబేడ్కర్ సామాజిక భవనంలో 'రాజ్యాంగంపై మతతత్వ దాడి-ప్రతిఘటన ఆవశ్యకత' అనే అంశంపై జనపల్లి సత్యానందం అధ్యక్షతన ఆదివారం జరిగిన చర్చ వేదికలో ఆయన మాట్లాడారు. హేతువాద రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సుబ్బరాజు, బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఐతాబత్తుల లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు బూసి జాన్ మోషే, షారా సంస్థ డైరెక్టర్ పల్లి తానం, మానవహక్కుల వేదిక జిల్లా కార్యదర్శి సబ్బుల ముత్యాల శ్రీనివాసరావు, ఆకుమర్తి భూషణం, నల్లి ప్రసాద్, మండ సత్యనారాయణ, బదిరు సాయిబాబా, మద్ది రత్నరాజు, గొల్ల జేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

## కమనీయంగా స్వామివార్ల కల్యాణం

వాడపల్లి,ర్యాలి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుడు, ర్యాలి జగన్మోహిని కేశవ స్వామివార్ల కల్యాణోత్సవాలు ఆదివారం కమనీయంగా జరిగాయి. ఈ సందర్భంగా కంకణధారణ, పాదప్రక్షాళన, మధుపర్కప్రాశన, కన్యాదానం, సూత్ర, యజ్ఞోపవీతధారణ, తలంబ్రాలు, అక్షతలు శతనామావళి, గోపూజ తదితర కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా జరిపించారు. స్వామివార్లకు ఈవోలు నల్లం సూర్యచక్రధరరావు, బీవీ రమణమూర్తి పట్టువస్త్రాలు సమర్పించారు.

కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

## మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు ఉ. 10 - మ. 1
మండపేట: 80085 74183
రామచంద్రపురం: 80085 74191

స్పందనకు వందనం

### చెత్త తొలగించారు..

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండలం లొల్ల పంచాయతీ పరిధి ఎస్సీపేటలో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోందని 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సర్పంచి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై సర్పంచి స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగింపజేశారు.

**సమస్య:** పట్టణంలోని వార్డుల్లో నెలల తరబడి మురుగుకాలువలను శుభ్రం చేయడం లేదు. దుర్వాసనతో పాటు దోమలు పెరుగుతున్నాయి.
- ఎన్.రామారావు, సూర్యానగర్

**సమాధానం:** అన్ని వార్డుల్లోనూ మురుగు కాలువలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.
- దేవిరెడ్డి, శానిటరీ తనిఖీదారు
- న్యూస్‌టుడే, రామచంద్రపురం

## పేద పురోహితులకు గౌరవ వేతనం ఇచ్చేందుకు కృషి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పేద పురోహితులకు జీవనభృతిగా రూ.3 వేలు చొప్పున ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. ఈ అంశంపై ఇటీవల తితిదే పాలకమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు వివరించారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయ అర్చకుడు కావుటూరి సీతారాం కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ కుటుంబాన్ని పోషించుకోలేక వేదం నేర్చుకొంటున్న కుమారుడు అఖిల్‌ను మాన్పించి ఆలయంలో అర్చకత్వం చేయిస్తున్నట్లు మంత్రి దృష్టికి కూటమి నాయకులు తీసుకెళ్లారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి బాధితుడికి రూ.10 వేల చొప్పున ప్రతి నెలా ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చి ఆదివారం రూ.10 వేల విలువైన చెక్కు అందించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావు మృతి తీరని లోటు

మండపేట, న్యూస్‌టుడే: ప్రముఖ నటుడు, మాజీ ఎమ్మెల్యే, భాజపా సీనియర్ నేత పద్మశ్రీ కోట శ్రీనివాసరావు మృతికి పలువురు సంతాపం ప్రకటించారు. మండపేట నియోజకవర్గం భాజపా కన్వీనర్ కె.వి.వి. సాయిరాం మాట్లాడుతూ విలక్షణ నటుడిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికై పార్టీలో మార్గదర్శకుడిగా మెలిగారని చెప్పారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. సీనియర్ భాజపా నాయకుడు కడియాల ప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు.

**బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో:** పట్టణ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఆయన మరణం తీరనిలోటని సంఘం ప్రముఖులు కేసరి విద్యాసాగర్, శివకోటి శేషుబ్రహ్మణ్యం, ఏడిద సూర్యనారాయణ, కొండూరి భాస్కర కామరాజు తదితరులు సంతాపం తెలిపారు.

## ఉద్యోగ నియామకాలకు వయోపరిమితి పెంచాలి

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ప్రభుత్వం చాలా ఏళ్ల విరామం తర్వాత వివిధ ప్రభుత్వశాఖల్లో పలు రకాల ఖాళీల భర్తీకి ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టడంతో అభ్యర్థుల వయోపరిమితి పెంచడానికి కేంద్రం అనుమతించాలని ముఖ్యమంత్రి ఎన్.రంగసామి కోరారు. కేంద్ర హోంశాఖ సహాయ కార్యదర్శి నితీష్‌కుమార్ వ్యాస్ శనివారం పుదుచ్చేరి పర్యటనకు వచ్చిన సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

# రుణం అందుకో.. భవితను తీర్చిదిద్దుకో..

రాయవరం, న్యూస్‌టుడే: మహిళలకు స్త్రీనిధి అండగా నిలవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం గతంలో ఉన్న నిబంధనలను తొలగించి మరింత సరళం చేసింది. స్వయం సహాయ సంఘాల సభ్యుల పిల్లల చదువు నిమిత్తం స్త్రీనిధి ద్వారా విద్యా రుణం మంజూరు చేసేందుకు ప్రభుత్వం రూ. 1000 కోట్లను కేటాయించింది. మహిళా సంఘాల్లోని సభ్యుల పిల్లల చదువుకు రూ.లక్ష వరకు రుణం అందించేలా కార్యాచరణ రూపొందించింది. దీనివల్ల ఆర్థిక సమస్యల నుంచి ఉపశమనం పొందే అవకాశం కలుగుతోంది.

**మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో..**

| మండలం | సంఘాలు | సభ్యులు |
|---|---|---|
| రామచంద్రపురం | 1,826 | 18,174 |
| కె.గంగవరం | 1,582 | 15,819 |
| మండపేట | 1,900 | 18,945 |
| కపిలేశ్వరపురం | 1,768 | 17,680 |
| రాయవరం | 1,676 | 16,754 |
| మొత్తం | 8,752 | 87,372 |

### గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు..

ప్రతి సంఘానికి గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. రుణం తీసుకున్న సభ్యురాలికి బీమా సౌకర్యం కల్పిస్తారు. రుణం పొందిన సభ్యురాలు ప్రమాదవశాత్తు మృతిచెందితే రుణం మాఫీ అవుతుంది. గతంలో 12 శాతంగా ఉన్న వడ్డీని 6 శాతానికి తగ్గించారు. నిర్ణీత గడువులోగా రుణం చెల్లించినవారికి అదనపు రాయితీలు సైతం వర్తింపజేస్తామని అధికారులు చెబుతున్నారు.

● మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో 8,752 సంఘాలు ఉండగా వాటిలో మొత్తం 87,372 మంది సభ్యులు ఉన్నారు. వీరి ఆర్థిక అవసరాలు తీరేలా రుణం పొందడానికి అధికారులతో పాటు బ్యాంకర్లు మరింత చొరవ చూపాల్సి ఉంది. ఇప్పటికే స్వయం ఉపాధి, వ్యక్తిగత రుణాలు పొందిన సభ్యులకు విద్యా రుణాలు అదనంగా అందించాలని సభ్యులు కోరుతున్నారు.

వెదురుపాకలో రుణాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

### అవగాహన కల్పిస్తున్నాం..

విద్యా రుణ సదుపాయంపై స్వయం సహాయ సంఘాల సభ్యులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. వారి పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఈ రుణాన్ని అందిస్తాం. ప్రస్తుతం కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో అవసరమైన సభ్యులకి రూ.లక్ష వరకు రుణం అందించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. పొదుపు సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

- కోటిపల్లి నాగేశ్వరరావు, ఏపీఎం, రాయవరం

## త్రిసభ్య కమిటీల నియామకం

**ఆలమూరు:** మండలంలోని 8 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు సంబంధించి త్రిసభ్య కమిటీల నియామకం జరిగిందని కూటమి నాయకులు తెలిపారు. ఆలమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షునిగా వంటిపల్లి సతీష్, చింతలూరు అధ్యక్షునిగా నల్లా వేంకటేశ్వరరావు, చొప్పెల్ల అధ్యక్షునిగా నాగిరెడ్డి వేంకటేశ్వరరావు, జొన్నాడ అధ్యక్షునిగా మేడపాటి రామారెడ్డి, మోదుకూరు అధ్యక్షునిగా ఈదల వీర్రాజు, నర్సిపూడి అధ్యక్షునిగా రాయుడు వెంకటస్వామి, పెదపళ్ల అధ్యక్షునిగా జాస్తి భాస్కర రావు, పెనికేరు అధ్యక్షునిగా మేకా రామన్నలను నియమించారు.

## తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

**అంబాజీపేట:** అంబాజీపేట జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 130 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 120 మంది వివిధ గ్రేడింగ్ పొందారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తైక్వాండో కార్యదర్శి బి.అర్జునరావు, కోచ్‌లు పితాని త్రిమూర్తులు, పితాని భార్గవిశ్రీకళ, పి.నాగభూషణం, కె.వెంకటేశ్వరరావు, కె.మణికంఠ పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుపై హర్షం

రాజోలు, న్యూస్‌టుడే: ఓడలరేవులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా హర్షం వ్యక్తంచేశారు. దీని ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీ గంటి హరీష్ మాథుర్‌కు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్యాలయానికి జీఎంసీ బాలయోగి పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. రాజోలు దీవిలో సెంట్రల్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు.

## నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద నిర్మితమవుతున్న వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన మధుసూదన్, కిరణ్ దంపతులు రూ.51,111 విరాళాన్ని ఆదివారం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధరరావు అభినందించారు.

# కూటమి పాలనకు ప్రజల మన్నన

పామర్రు, న్యూస్‌టుడే: ఏడాది పాలనలో విజయవంతంగా పలు పథకాలు అమలుచేసి కూటమి ప్రభుత్వ ప్రజల మన్ననలు పొందిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని పామర్రు, యండగండి గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎంపీ గంటి హరీష్ మాథుర్‌తో కలిసి ఆయన పర్యటించారు. స్థానికుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అభిప్రాయాలను మై టీడీపీ యాప్‌లో అప్‌లోడ్ చేయించారు. అమలాపురం వాసుల చిరకాల స్వప్నమైన కోటిపల్లి-నర్సాపురం రైలు మార్గం పూర్తిచేసేలా ప్రయత్నిస్తానని ఎంపీ హరీష్ మాథుర్ వెల్లడించారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, నాయకులు మరివాడ సూరిబాబు, మేడిశెట్టి రవికుమార్, చుండ్రు వీవీఎస్ చౌదరి, దేవరపల్లి వెంకటేశ్వరరావు, రవ్వా భూషణం, చిట్టూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో వృద్ధుడికి కరపత్రం అందిస్తున్న ఎంపీ హరీష్ మాథుర్, మంత్రి సుభాష్

### ఇంటింటా సంక్షేమ పథకాలు

**మండపేట:** ఇంటింటా సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జోరందుకున్న అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ఎస్ఈసీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 19, 21 వార్డుల్లో ఆయన ఇంటింటా పర్యటించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ మాజీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, చుండ్రు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి కరపత్రం అందించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మహిళకు కరపత్రం అందిస్తున్న తెదేపా నాయకులు

### ప్రభుత్వ పాలనపై ప్రచారం

**రామచంద్రపురం:** రాష్ట్ర ప్రభుత్వ ప్రజారంజక పాలనపై ఇంటింటా ప్రచారం చేస్తున్నామని తెదేపా నాయకులు నారపరెడ్డి బలరాం, మాజీ కౌన్సిలర్ చప్పిడి రమేష్‌బాబు, అక్కల రాగూర్ తదితరులు చెప్పారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం వారు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. రామచంద్రపురం పట్టణంలోని అన్ని వార్డుల్లో మంత్రి సుభాష్ సూచనల మేరకు ఇంటింటికి కార్యకర్తలు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

## తామరపల్లిలో వైద్య పరీక్షలు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం తామరపల్లిలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. డా.గోలి మాణిక్య వెంకట కాశీరామ్, డా.బెల్లంకొండ రాజశేఖర్‌ల బృందం ఆధ్వర్యంలో పలువురిని పరీక్షించారు. వెన్నునొప్పి, ఆయాసం, గుండెదడ, ఆస్మా తదితర రుగ్మతలతో వచ్చినవారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు సరఫరా చేశారు. గోలివారి కుటుంబీకుల ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. తామరపల్లి, ఊడిమూడి, సత్యవాడ తదితర గ్రామాల నుంచి వచ్చినవారు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## భక్తుడు, ఆలయ ఉద్యోగి పరస్పర ఫిర్యాదు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆషాఢం సారె సమర్పించిన సమయంలో ఓ భక్తుడికి, ఆలయ ఉద్యోగికి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీనిపై ఇద్దరూ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సారెలో భాగంగా అమ్మవారికి సమర్పించిన మిఠాయిలను కంచర్ల చక్రి అనే భక్తుడు దూడల విజయలక్ష్మి అనే భక్తురాలికి కవర్లో వేసి ఇస్తుండగా ఆలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న వెంకన్నబాబు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనిపై ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడుతున్నారని వెంకన్నబాబుపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఇదే విషయంపై విధి నిర్వహణలో ఉన్న తనపై దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడారని ఆయన చక్రిపై ఫిర్యాదు చేశారు. ఇద్దరి నుంచి ఫిర్యాదులు అందాయని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

## కోట ఆలయంలో చోరీ

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం కోట గ్రామంలోని శ్రీధన, ధాన్య లక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. దాదాపు రూ.50 వేల విలువచేసే బంగారు ఆభరణాలను దోచుకున్నారు. ఆలయ పూజారి పెనుమత్స హరినాథరాజు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయడంతో ఎస్సై షేక్ జానీబాషా, అమలాపురం నుంచి వచ్చిన క్లూస్ బృందం సభ్యులు ఆధారాలు సేకరించారు. శనివారం రాత్రి తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయానని, ఆదివారం ఉదయం వచ్చేసరికి గ్రిల్స్‌కు రంధ్రం చేసి ఉండడం, నాలుగు సీసీ కెమెరాలు పగిలిపోయినట్లు గమనించామని పూజారి చెప్పారు. అమ్మవారి ముక్కుపుడకలు రెండు, శతమానాలు రెండు జతలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే రోల్డ్‌గోల్డ్ కంఠాభరణం, కాసులపేరు కూడా కనిపించడం లేవని చెప్పారు. చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

చోరీ జరిగిన తీరుని పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్ సభ్యులు

## శతాధిక వృద్ధురాలి మృతి

**ఉప్పలగుప్తం:** చల్లపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు నాగులాపల్లి సత్యవతి (మరియమ్మ) (105) ఆదివారం మృతి చెందారు. చివరి రోజు వరకు తనపని తాను చేసుకుంటూ ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని స్థానికులు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, 15 మంది మునిమనవళ్లు ఉన్నారు.

# అమ్మలగన్న అమ్మలకు అలంకరణ

పామర్రు, ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామదేవతలు, అమ్మవార్ల విగ్రహాలను శాకంబరిగా తీర్చిదిద్దారు. భక్తుల కనులపండువగా కూరగాయలు, పండ్లతో అలంకరించారు. ద్రాక్షారామలోని మాణిక్యాంబ అమ్మవారి పుట్టినిల్లుగా పిలిచే వేగాయమ్మపేట ఆస్థాన మండపం నుంచి వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలతో శోభాయాత్రగా సారెను తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పలువురు భక్తులతో కలిసి సారెను తెచ్చారు. పామర్రులోని గ్రామదేవత పుట్టాలమ్మ, శివాలయంలోని పార్వతీదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పలువురు భక్తులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని కానుకలు సమర్పించుకున్నారు. అర్చకులు ఉత్సవాల విశిష్టతలను వివరించారు.

ద్రాక్షారామ వేగాయమ్మపేట నుంచి సారె తీసుకొస్తున్న మంత్రి సుభాష్ తదితరులు

### చిన్న తలుపులమ్మ లోవలో భక్తుల సందడి

**రాయవరం:** రాయవరం మండలం పసలపూడి శివారు చిన్న తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు రాయవరం తదితర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

పామర్రు పుట్టాలమ్మకు ప్రత్యేక అలంకరణ

శాకంబరిగా పామర్రు పార్వతీదేవి



కూరగాయలు, పండ్లతో అమ్మవారు

### శాకంబరిగా వనువులమ్మ అమ్మవారు

**ద్వారపూడి:** మండపేట మండలం జడ్.మేడపాడు గ్రామంలో ప్రసిద్ధిచెందిన వనువులమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పళ్లు, ఆకుకూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వినయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తొలగని వ్యర్థాలు.. దోమల ఆవాసాలు

ద్వారపూడి, న్యూస్‌టుడే. స్వచ్ఛభారత్.. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామాల్లో పరిశుభ్రతపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నా పరిస్థితిలో మార్పు రావడంలేదు. ఎక్కడ వేసిన చెత్త అక్కడే కనిపిస్తోంది. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించి తడి, పొడిచెత్త పేరిట విభజించి సంపద కేంద్రాలకు తరలించి.. సేంద్రియ ఎరువు తయారీతో సంపద సృష్టించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మండపేట మండలం ద్వారపూడి, ఇప్పనపాడు, కేశవరం, తాపేశ్వరం తదితర గ్రామాల్లో రహదారి పక్కనే చెత్త, డ్రైనేజీల్లో వ్యర్థాలు నిత్యం దర్శనమిస్తున్నాయి. వీటి నుంచి వెలువడే దుర్వాసనతో వాహనదారులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరోవైపు ఆయా ప్రాంతాల నుంచి దోమలు, ఈగలు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. చెత్త తొలగించాలని పంచాయితీ పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు అంటున్నారు.

ఇప్పనపాడులో డ్రైనేజీల్లో వ్యర్థాలు

### మండపేటలో ఇలా..

మండపేటలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా 19,611 కుటుంబాలు ఉన్నాయి. రోజు అయిదు టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. వీటి పరిధిలో 93 క్లాప్‌మిత్రలు పనిచేస్తున్నాయి. ద్వారపూడి, కేశవరం, జడ్.మేడపాడు, ఇప్పనపాడు, అర్తమూరు, పాలతోడు, వెలగతోడు, మెర్నిపాడు, ఏడిద సీతానగరం గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలు ఉన్నప్పటికి రహదారి పక్కన వేసే వ్యర్థాలు అలానే ఉంటున్నాయి. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి. డ్రైనేజీల్లో, రహదారి పక్కన వ్యర్థాలు వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మార్పు రావడంలేదు.

### అవగాహన కల్పిస్తాం..

ప్రతి ఇంటికీ ప్లాస్టిక్ బుట్టలు ఇచ్చి తడి, పొడిచెత్త వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని, డ్రైనేజీల్లో వ్యర్థాలు వేయకూడదని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. అయినా కొంతమంది రహదారుల పక్కన చెత్త వేస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. మరోవైపు చెత్త వేయకూడదని బోర్డులు ఏర్పాటుచేస్తాం.

- దాసరి శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో, మండపేట

ద్రాక్షారామలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

## మధురానుభూతులు.. ఆప్యాయ పలకరింపులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: వారంతా దాదాపు 35 ఏళ్ల క్రితం ఒకే తరగతిలో కలిసి చదువుకున్నారు. ప్రస్తుతం ప్రయోజకులై డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపారులు, రాజకీయవేత్తలుగా స్థిరపడ్డారు. మిత్రులను కలుసుకోవాలనే బలమైన ఆకాంక్షతో అందరూ ఒక చోట చేరారు. సందడి చేశారు. ద్రాక్షారామ పీవీఆర్ ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన 260 మందిలో దాదాపు 200 మంది ఆదివారం మాధవానంద కల్యాణ మండపంలో సమ్మేళనంలో కలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో సమావేశానికి హాజరై పరిచయం చేసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించి జ్ఞాపికలు అందించారు. మధ్యాహ్నం సామూహిక విందు భోజనం చేసి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. ఈ బ్యాచ్‌లో చదివిన 15 మంది సహ విద్యార్థులు మృతిచెందినట్లు తెలుసుకుని వారికి నివాళి అర్పించారు. అమెరికాలో స్థిరపడిన రమేష్, భాగవతి గోపి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏర్పాట్లను తోట పుండరీకాక్ష, యండమూరి ఈశ్వరరావు, సంగీతం రామకృష్ణ, సత్యారామ్, పంపన గోవిందు, రఘు తదితరులు పర్యవేక్షించారు.

డిపో మేనేజర్‌ను సత్కరిస్తున్న కండక్టర్లు

## సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం ఆర్టీసీ డిపో పరిధిలో ఏపీపీటీడీ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ కండక్టర్ దినోత్సవాన్ని నిర్వహించారు. డిపో మేనేజర్ పి.భాస్కరరావు మాట్లాడుతూ సంస్థలో అమల్లోకి వచ్చిన ఆధునిక సాంకేతికతను ఆహ్వానించాలని, అందిపుచ్చుకోవాలని కోరారు. పి.సత్తిబాబు, ఎస్వీ రమణ తదితరులు మాట్లాడుతూ కండక్టర్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. సంస్థలో ఎవరైనా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఉంటే ఐకమత్యంగా స్పందించి సేవాభావంతో అండగా నిలవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. తొలుత డిపో మేనేజర్ భాస్కరరావును సత్కరించారు. కార్యక్రమంలో పి.గంగాధరరావు, ఆనంద్ కుమార్, జి.ఎ.కుమారి, గెడ్డం శ్రీను, ఎం.వి.ఎస్.మూర్తి, జడీపీ కుమార్, మండపేట మాస్టర్ డి.శ్రీనివాసరావు, ఎం.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## నామవానిపాలెం సర్పంచి చిట్టిరాజుకి మంత్రి నివాళి

కాజులూరు, న్యూస్‌టుడే: నామవానిపాలెం సర్పంచి భూపతిరాజు వెంకట సూర్యనారాయణరాజు (చిట్టిరాజు) (65) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం రోజూలానే ఉదయం చేపల చెరువుల వద్దకు వెళ్లిన ఆయన గుండెనొప్పిగా ఉందని ఇంటికి తిరిగి వచ్చేశారు. కుటుంబ సభ్యులు వెంటనే యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సూర్యనారాయణరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు సుపరిచితులైన ఆయన గత రెండు పర్యాయాలు సర్పంచిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. అధిక సంఖ్యలో గ్రామస్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులు అర్పించారు.

(c) eenadu

# భక్త వరదాయినీ.. మము బ్రోవమని..

శ్రీబాలా త్రిపురసుందరికి పుట్టింటి సారె సమర్పించిన భక్తులు

కలశాలు, సారెతో ఊరేగింపుతో భక్తులు

రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో కొలువైన శ్రీబాలా త్రిపురసుందరి అమ్మవారికి ఆషాఢ మాసం పుట్టింటి సారె భక్తితో సమర్పించారు. ఆలయ ఛైర్మన్‌ బత్తుల రాజరాజేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు తలపై సారె, బోనంతో శ్రీదేవి కల్యాణ మండపం నుంచి ఊరేగింపుగా దేవీచౌక్‌ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి ముంగింట వారు తెచ్చిన సారె ఉంచి పూజలు చేశారు. అమ్మకు సారె సమర్పించి హారతి అందించారు. శ్రీదేవి ఉత్సవ సమితి సభ్యులు, శ్రీదేవి వర్తక సంఘం సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం



# పిలిచినా రాలేను.. వచ్చినా మోయలేను

**సీతానగరం, న్యూస్‌టుడే:** అత్యవసర సమయాల్లో ప్రాణాలు నిలిపే 108 అంబులెన్సులు అనారోగ్యానికి గురవుతున్నాయి. గత ప్రభుత్వం కొత్తగా వాహనాలను కొనుగోలు చేసి, జిల్లాలకు కేటాయించారు. అప్పట్లో రహదారులు గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో పలు వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. వాటి నిర్వహణ బాధ్యతలు చూసే సంస్థకు బకాయిలు పేరుకుపోయి. మరమ్మతులు మరిచారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్‌ చేసిన 15 నుంచి 20 నిమిషాల్లోనే వాహనాలు రావాల్సి ఉండగా ఆలస్యంగా వస్తున్న వచ్చిన సందర్భాలు అనేకం. బండి మొదలు కాకపోవడం, బ్యాటరీలు సరిగా పనిచేయకపోవడం, అదనపు టైర్లు లేక నడిరోడ్డుపై వాహనాలు నిలిపేసిన ఘటనలు అనేకం ఉన్నాయి.

### ఇలా.. ఎలా..

సీతానగరం 108 వాహనం మూలకు చేరింది. ఆపద సమయంలో వాహనం కోసం వేచి చూస్తుంటే రాజమహేంద్రవరం, గోకవరం, కోరుకొండ ఇతర మండలాల నుంచి రావడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 27 గ్రామాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### సగానికి పైగా మరమ్మతుల్లోనే..

జిల్లాలో 108 వాహనాలు 21 ఉన్నాయి. అందులో సగానికి పైగా మరమ్మతుల్లో ఉన్నాయని అంటున్నారు. కాలం ముగిసిన వాహనాలను తీసేయాలని రవాణాశాఖ అధికారులు నివేదికలు ఇచ్చారు. ప్రతి మండల కేంద్రంలో ఒక వాహనం అందుబాటులో ఉండాలి. పలు వాహనాలు మరమ్మతుల్లో ఉండటంతో పక్క మండలాల నుంచి పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో గంటల తరబడి జాప్యం జరుగుతోంది. రంగంపేట, బిక్కవోలు, తాళ్లపూడి, సీతానగరం, ఉండ్రాజవరం, రాజమహేంద్రవరం గ్రామీణం తదితర చోట్ల వాహనాలు పాడైపోయినా వాటినే తిప్పుతున్నారు. 108 సిబ్బందికి ఈ ఏడాది ఏప్రిల్‌ నుంచి వేతనాలు రావట్లేదు.

వాహనం లోపల శీతలీకరణ లేక ఇలా..

### ఈ నెల 15 నాటికి కొత్తవి..

108 సర్వీసు ప్రొవైడర్‌గా ఉన్న సంస్థను తొలగించి మరో సంస్థకు అప్పగించారు. ఈనెల 15 నాటికి జిల్లాకు అయిదు వాహనాలు కొత్తవి చేరుతున్నాయి. సీతానగరం వాహనం మరమ్మతులు పూర్తి చేయించాం. సిబ్బంది వేతనాల బకాయిలపై నివేదికలు ఇచ్చాం.

- దాసరి రాజు, 108 పర్యవేక్షణ జిల్లా సమన్వయకర్త

# పుష్కర పనులకు ప్రత్యేక కార్యాచరణ

**రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో కార్యాచరణ అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. నేతలు, యంత్రాంగం కలిసి తొలి దశ సమావేశం నిర్వహించారు. అందులో ప్రతిపాదిత అంశాలకు ప్రాధాన్యం కల్పిస్తూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మొత్తం పనులను మూడు విధాలుగా విభజించారు. లాంగ్‌ టర్మ్‌, మిడ్‌ టర్మ్‌, షార్ట్‌ టర్మ్‌గా విడదీశారు. పుష్కరాల పేరుతో శాశ్వత ప్రాతిపదికన చేపట్టే పనులు ముందుగా ఆరంభించి, పుష్కర ఏర్పాట్లు వరకూ పనులను విభజించారు. మొత్తం 2,121 పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. టెండర్ల దశలో చేట్టాల్సినవి 1,596 ఉండగా, నామినేషన్‌ విధానంలో 242 ఉన్నాయి. మిగిలినవి ఆయా శాఖల పరిధిలోని నిధులతో చేపట్టాలని నిర్ణయించారు.

**త్వరలో ముఖ్యమంత్రితో సమావేశం**

### రూ.904 కోట్లతో ఘాట్‌ల విస్తరణ

ఘాట్‌ల విస్తరణకు రూ.904 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదించారు. ఏ, బీ, సీ, డీ, ఈ కేటగిరిల్లో ప్రాధాన్యం గుర్తించి, విస్తరిస్తారు. కొన్ని ఘాట్‌ల వద్ద ఆధ్యాత్మిక అలంకరణ, సుందరీకరణకు అదనంగా మరో రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నారు. పుష్కర, సరస్వతి, కోటిలింగాల ఘాట్‌లలో ఆర్చిలు ఏర్పాటు చేస్తారు.

### రూ.456 కోట్లతో రహదారుల అభివృద్ధి

రోడ్డు విస్తరణ, అనుసంధాన రోడ్ల నిర్మాణానికి నగరపాలక సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. రూ.456కోట్లతో చేపట్టనున్నారు. గత పుష్కరాలకు 3 కోట్ల నుంచి 4 కోట్ల మంది రాగా ఈసారి 8 కోట్ల మంది వస్తారని అంచనా. నగరాన్ని అనుసంధానం చేస్తూ 29.21 కి.మీ మేర రోడ్లను విస్తరించనున్నారు. 60 నుంచి 80 అడుగుల వరకూ వెడల్పు చేసి ట్రాఫిక్‌ రద్దీ నియంత్రిస్తారు.

### 151 బస్సుల్లో భక్తుల తరలింపు

ప్రజా రవాణా వ్యవస్థను మెరుగు పరుస్తూ అంతర్గత రహదారులపై 151 బస్సు ద్వారా ఘాట్‌ల వరకూ భక్తులను తీసుకెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. గంటకు పది వేలమంది భక్తులు నగరానికి వివిధ మార్గాల్లో పుష్కర స్నానాల కోసం వస్తారని అంచనా. వివిధ మార్గాల్లో వారందరినీ ఘాట్‌ల వరకూ చేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో జరిగే సమావేశంలో కీలక అంశాలపై కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

## కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌ అర్జీల స్వీకరణ నేడు

**కలెక్టరేట్‌(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే:** జిల్లాస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్‌) కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్‌ ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. ఇక్కడి సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్‌, మున్సిపల్‌, మండల కార్యాలయాలు, సచివాలయాల్లోనూ అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల వరకు రాలేనివారు మీకోసం పోర్టల్‌లో లేదా 1100 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వాట్సప్‌ గవర్నెన్స్‌ నంబరు 9552300009 ద్వారా ప్రజలు 500లకు పైగా పౌరసేవలు పొందవచ్చన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# లంక గ్రామాలకు వరద ముప్పు..

### త్రుటిలో తప్పిన పడవ ప్రమాదం

**సీతానగరం, న్యూస్‌టుడే:** సీతానగరం మండలంలోని బొబ్బిల్లంక-ములకల్లంక గ్రామాలకు గోదావరి వరద పోటు పెరగడంతో ప్రస్తుతం పడవలపైనే ఆ ప్రాంత వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. శనివారం రాత్రి ఎనిమిది మందితో బొబ్బిల్లంక నుంచి ములకల్లంకకు బయలుదేరిన పడవ నీటి ఉద్ధృతికి దిగువకు కొట్టుకుపోయింది. రాజమహేంద్రవరం గ్రామీణంలోని వెంకటనగరం వరకు సుమారు 6 కిలోమీటర్లు పడవ అదుపుతప్పి ముందుకు వెళ్లిపోయిందని లంక గ్రామాల ప్రజలు వాపోయారు. వెంకటనగరం వద్ద మత్స్యకారులు పడవను అదుపుచేసి వారిని కాపాడటంతో పెనుప్రమాదం తప్పిందంటున్నారు. ఆదివారం ఉదయం పడవలో ప్రయాణికులు ఉండగానే గాలిపంకలో వ్యర్థాలు వెళ్లి ఇంజిన్‌ ఆగిపోయింది. ఒడ్డుకు దగ్గరగానే ఈ ఘటన చోటుచేసుకోవడంతో పంకలో పేరుకుపోయిన వ్యర్థాలను బయటకు తీశారు. నీటి ప్రవాహానికి బొబ్బిల్లంక వద్ద ఒడ్డు కొట్టుకుపోవడంతో రోజుకో చోట ఒడ్డు వెదుక్కుని అవస్థలు పడుతున్నామన్నారు. ఆరేళ్ల క్రితం లంక గ్రామాల ప్రజల కోసం రూ.35 కోట్లతో చేపట్టిన వంతెన పనులు మధ్యలోనే ఆపేశారని కనీసం పట్టించుకునేవారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బొబ్బిల్లంక వద్ద గోదావరి ప్రవాహానికి కోతకు గురవుతున్న ఒడ్డు

గోష్పద క్షేత్రం ప్రధానరేవులో మునిగిన శివలింగం, నందీశ్వరుడు

### ఉద్ధృతంగా గోదావరి

**కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే:** పోటెత్తి ప్రవహిస్తున్న వరదతో గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. ఎగువన విస్తారంగా కురిసిన వర్షాలతో నీరు భారీగా చేరుతోంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గోష్పద క్షేత్రం ప్రధాన రేవులోని శివలింగం, నందీశ్వరుడిని తాకుతూ ఆదివారం వరద చేరింది. క్షేత్రం రేవులో ఎవరూ స్నానాలకు, ఇతర కార్యక్రమాలకు దిగవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## విద్యార్థినులపై వేధింపుల ఘటన.. నిందితులకు 14 రోజుల రిమాండ్‌

**మసీదు సెంటర్‌ (కాకినాడ), న్యూస్‌టుడే:** విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన కేసులో నలుగురు నిందితులకు 14 రోజులు రిమాండ్‌ విధించారు. కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో ల్యాబ్‌టెక్నీషియన్‌ కోర్సు చదువుతున్న విద్యార్థినులను జీజీహెచ్‌లోని నలుగురు సిబ్బంది వేధింపులకు గురిచేసిన ఘటనకు సంబంధించి కాకినాడ ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు, రెండో పట్టణ స్టేషన్‌లో ఒక కేసు నమోదైన విషయం తెలిసిందే. రెండు రోజుల కిందట నిందితులు కల్యాణ చక్రవర్తి, జిమ్మి రాజు, గోపాలకృష్ణ, ప్రసాద్‌లను పోలీసులు అరెస్ట్‌ చేశారు. విచారణ అనంతరం శనివారం రాత్రి నలుగురు నిందితులను రిమాండ్‌ నిమిత్తం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. సెక్షన్లు స్టేషన్‌ బెయిలుకి లోబడి ఉండడంతో రిమాండ్‌ విధించకుండా రిమాండ్‌ రిపోర్టును రిటర్న్‌ చేశారు. దీంతో పోలీసులు వెంటనే నిందితులకు 41(ఎ) నోటీసులు ఇచ్చారు. అనంతరం టుటౌన్‌ పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి ఆ నలుగురిని శనివారం రాత్రే అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి వారిని మళ్లీ న్యాయమూర్తి ముందు హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్‌ విధించారు. అనంతరం వారిని కాకినాడ సబ్‌జైలుకు తరలించారు.

# పులసలకు పోటాపోటీ

## బయానాలు ఇస్తున్న మాంస ప్రియులు

**న్యూస్‌టుడే, అల్లవరం**

పుస్తెలమ్మైనా పులస కొని తినాల్సిందే అన్నది.. ఉభయ గోదావరి జిల్లాల్లో నానుడి. గోదావరికి వర్షాకాలం బురదనీరు వచ్చిందంటే పులసల సీజన్‌ మొదలైనట్లే. జులై నుంచి అక్టోబరు వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో సముద్రం నుంచి గోదావరి నదిలోకి పులసలు ఎదురీదుతూ వచ్చి ఇక్కడ పిల్లలు పెట్టి వాటితో తిరిగి వెళ్లే క్రమంలో జాలర్లకు చిక్కి పులస ప్రియులకు కిక్కిస్తాయి. పల్లెల్లో ఎవరైనా పులస కొనుగోలు చేసి వండుకున్నారంటే ఊరంతా ఆ విషయాన్ని ఆ రోజు గొప్పగా చెబుతుంటారు.

### ముందు తమకే ఇవ్వాలని..

పులస వస్తే ముందుగా తనకే ఇవ్వాలని అమలాపురానికి చెందిన ప్రముఖ వ్యాపారి బోడసకుర్రు ప్రాంతంలో పులసలు అమ్మే మత్స్యకార మహిళలకు గోదావరికి వరద నీరు వచ్చిన వెంటనే రూ.5వేలు అడ్వాన్సు ఇచ్చారు. ● అల్లవరం మండలం రెబ్బనపల్లికి చెందిన చేపల వ్యాపారి సాయి ఏటా సీజన్‌లో పులసల వ్యాపారం చేస్తుంటారు. అతడికి రాజకీయనాయకులు, గుత్తేదారులు ముందస్తుగా నగదు ఇచ్చి అడ్వాన్స్‌గా బుకింగ్‌ చేసుకుంటారు. ప్రముఖులను ప్రసన్నం చేసుకునేందుకు కొందరు పులసను ఎరగా వేస్తారు. మరికొందరు ఏమీ ఆశించకుండా తమ ఆత్మీయులకు పంపిస్తుంటారు. జిల్లాలో బడా వ్యాపారులు, గుత్తేదారులు, శ్రీమంతులు పులస కోసం ఏటా ముందు వరుసలో ఉంటారు.

### తగ్గుతున్న లభ్యత..

కొన్నేళ్లనుంచి గోదావరి నదిలో పులస చేపల లభ్యత తగ్గుతూ వస్తోంది. పులసలు హిందూ మహాసముద్రం నుంచి తమ ప్రయాణాన్ని ప్రారంభించి బంగాళాఖాతంలోకి చేరి అక్కడి నుంచి గోదావరి నదిలోకి ప్రవేశిస్తాయి. కొన్నాళ్లుగా సముద్ర జలాలు కాలుష్య కారకాలుగా మారిపోతున్నాయి. దీంతో ఇవి తమ గమనాన్ని మార్చుకుని ఉంటాయని సంబంధిత శాఖ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. దీనిపై జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారీ వలలతో వేట కారణంగా తల్లి చేపకు నష్టం వాటిల్లి, ఆ ప్రభావం పులసల ఉత్పత్తిపై పడుతోందన్నారు. దీనిపై జాలర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్‌) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669


# ఇళ్లపై సౌర కాంతులు..

## ఎస్సీ, ఎస్టీల ఆవాసాలపై ఉచితంగా సోలార్‌ ఫలకాల ఏర్పాటు

**ఈనాడు, కాకినాడ:** ఓ వైపు పీఎం సూర్యఘర్‌ ద్వారా ఇళ్లపై సౌర విద్యుత్తు ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు. మరో వైపు పీఎం కుసుమ్‌లో వ్యవసాయ కనెక్షన్లు మొత్తం సోలార్‌ విద్యుత్తునే సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా ఎస్సీ, ఎస్టీ ఇళ్లకు ఉచితంగా సౌర కాంతులు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 72 వేల మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరి ఇళ్లపై రెండు కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్‌ పలకలు ఏర్పాటు చేయనున్నారు. వీటిని గ్రిడ్‌తో అనుసంధానించి అయిదేళ్ల పాటు నిర్వహించనున్నారు.

### పూర్తయిన సర్వే

ప్రభుత్వం ఇప్పటికే అర్హులైన ఎస్సీ, ఎస్టీ గృహాలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు ఇస్తోంది. దీనికోసం రూ.వేల కోట్లు ఖర్చుచేస్తోంది. వీరి ఇళ్లకు సోలార్‌ ద్వారా విద్యుత్తు అందించగలిగితే చాలావరకు సర్కారుపై ఆర్థిక భారం తొలగనుంది. ఒక ఇంటిపై రెండు కిలోవాట్లకు రూ.1.2 లక్షలు వరకు ఖర్చవుతుంది. కేంద్రం రూ.60 వేలు రాయితీ ఇస్తుంది. మిగతా మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. దీని కోసం సోలార్‌ పలకలు ఏర్పాటుకు అనువుగా ఎన్ని ఇళ్లు ఉన్నాయి..? ఎంతమంది సౌర విద్యుత్తుకు అంగీకరించారన్న అంశాలపై సర్వే చేయించారు. అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలో అత్యధికంగా 30 వేలకు పైగా లబ్ధిదారులను గుర్తించారు. మిగిలిన రెండు జిల్లాలు కలిపి 35 వేల మంది ఎస్సీ ఎస్టీ వినియోగదారులున్నారు.

**లబ్ధిదారుల వివరాలిలా..**

| డివిజన్‌ | ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు | ఉత్పత్తి అయ్యే విద్యుత్తు (మెగావాట్లలో) |
|---|---|---|
| జగ్గంపేట | 7,992 | 15.98 |
| కాకినాడ | 5,133 | 10.27 |
| పెద్దాపురం | 6,468 | 12.94 |

### సొంతిల్లు లేకుంటే సామాజిక స్థలాల్లో..

ఎస్సీ, ఎస్టీల్లో సొంత ఇళ్లు లేనివారు.. రూఫ్‌టాప్‌ పలకలు అమర్చడానికి అనువుగా లేనివారికి ఉమ్మడిగా సోలార్‌ పలకలను సామాజిక స్థలాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు జిల్లాల్లో ఖాళీ స్థలాలు గుర్తిస్తున్నారు. అయితే భూముల విలువ పెరగడం, గ్రామ కంఠాలన్నీ చేతులు మారిపోవడంతో స్థలాలు దొరకడం లేదని అధికారులు చెబుతున్నారు. కొన్ని చోట్ల భూములను గుర్తించి సిద్ధంచేశారు. రూఫ్‌టాప్‌తో పాటు సామాజిక స్థలాల్లో సోలార్‌ పలకల ఏర్పాటుకు గుత్తేదారులను పిలుస్తున్నారు. పది మెగావాట్ల లోపు స్థానికంగా సోలార్‌ వెండార్లను ఎంపిక చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. ఇళ్లపై సోలార్‌ ఏర్పాటుకు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యనే ఇన్‌స్టాలేషన్‌ ఇతరత్రా పనులు చేయాలి. పరికరాలు పాడైనా, దెబ్బతిన్న వాటిని 24 గంటల్లోనే బాగు చేయాలి. లేకుంటే కిలోవాట్‌కు రూ.2 వేల చొప్పున రోజులు లెక్కన జరిమానాలు విధిస్తారు.

## మదిదోచిన మువ్వల సవ్వడి

శ్రీలలిత కళా నృత్యనికేతన్‌ ఆధ్వర్యంలో భారతీయ నృత్యోత్సవం-18 'మువ్వల సవ్వడి- నాట్యరవళి' పేరుతో ఆదివారం ఆనం కళాకేంద్రంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 30 బృందాలు పాల్గొన్నాయి. గురువులు నర్తనమౌళి పేరుతో, విద్యార్థులు నర్తన మాధురి పేరుతో ఇచ్చిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ప్రముఖ నాట్యాచార్యులు వెంకటప్రసాద్‌ వ్యవహరించగా, పర్యవేక్షకులుగా అరవ ఆంజనేయులు వ్యవహరించారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

## ఎంసీసీ ప్రాంగణంలో ఉద్యోగ మేళా నేడు

**వి.ఎల్‌.పురం:** రాజమహేంద్రవరంలోని తాడితోట వద్ద జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్‌ కెరియర్‌ సెంటర్‌(ఎంసీసీ) ప్రాంగణంలో నేడు ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ మేళాలో పాటిల్‌ గ్రూప్‌, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌, కిమ్స్‌, నవతా కంపెనీ ప్రతినిధులు ఎంపికలు నిర్వహిస్తారని జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఐటీఐ, బీఎస్సీ నర్సింగ్‌, జీఎన్‌ఎం నర్సింగ్‌ విద్యార్హత కలిగి 19- 35 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ ఆధార్‌, విద్యార్హతల పత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9533221189 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## రైతులంతా పంటల బీమా చేయించుకోవాలి

**వి.ఎల్‌.పురం(రాజమహేంద్రవరం):** ప్రస్తుత ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి రైతులంతా ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), వాతావరణ ఆధారిత పంట బీమా పథకం(ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌) ద్వారా వరి, మినుము, అరటి పంటలకు బీమా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో) ఎస్‌.మాధవరావు సూచించారు. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించే కౌలు రైతులతో సహా అందరూ ఇందులో చేరడానికి అర్హులన్నారు. తుపాన్లు, కరవు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థికసాయం అందుతుందన్నారు. వరి, మినుము పంటలకు ఎస్‌బీఐ జనరల్‌ ఇన్సూరెన్స్‌, అరటి పంటకు ఇఫ్కో టోక్యో జనరల్‌ ఇన్సూరెన్స్‌ కంపెనీకి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ✦ వరికి ఎకరాకు ఆగస్టు 15లోగా రూ.576.92, మినుము పంటకు ఈనెల 31లోగా రూ.303.64, అరటికి ఈనెల 15లోగా రూ.3,036 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులు, సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

# పక్కదారి పడుతున్న పేదల బియ్యం

**దేవరపల్లి, నల్లజర్ల, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రేషన్‌ బియ్యాన్ని ప్రతి లబ్ధిదారుడికి అందజేస్తుంటే అక్రమార్కులు పేదలకు డబ్బు ఎర చూపి దోచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా గత 12 నెలల్లో 93 కేసుల్లో 413.46 టన్నుల రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.87 కోట్లు ఉంటుందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంటింకీ వెళ్లడం, కొన్ని ప్రాంతాల్లో రేషన్‌ దుకాణాదారులతో కలిసి అక్రమార్కులు బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

యర్నగూడెం గ్రామ శివారులో ఈనెల 4న విజిలెన్స్‌ అధికారులు స్వాధీనం చేసుకున్న లారీ

✦ ఏప్రిల్‌ 13న నల్లజర్లలోని రామచంద్ర రవ్వ, రైస్‌ మిల్లు వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 28,050 కేజీల రేషన్‌ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.12.90 లక్షలు ఉంటుంది. ఒకరిపై కేసు నమోదు చేశారు.

✦ నల్లజర్ల నుంచి బిక్కవోలు అక్రమంగా లారీలో ఈనెల 4న రేషన్‌ బియ్యాన్ని తరలిస్తుండగా దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామ శివారులో విజిలెన్స్‌, పౌరసరఫరాల శాఖ అధికారులు లారీను అదుపులోకి తీసుకున్నారు. సుమారు 400 బస్తాల్లో 18,000 కేజీల పీడీఎస్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.8.28 లక్షలు ఉంటుంది. ఏడుగురుపై కేసు నమోదు చేశారు.

### రైస్‌ మిల్లులే ప్రధానం..

పీడీఎస్‌ బియ్యం కొనుగోలులో రైస్‌మిల్లులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సైకిళ్లు, ద్విచక్రవాహనాలపై వస్తున్న చిరు వ్యాపారస్తులు పేదల ఇంటికి వెళ్లి కేజీ రూ.18 నుంచి 20 కొనుగోలు చేస్తున్నారు. వాళ్ల వద్ద నుంచి రైస్‌మిల్లు యజమానులు కేజీ రూ.23 కొనుగోలు చేస్తున్నారు. ఇలా ఒక లారీ సరిపడా లోడు అయ్యాక ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నల్లజర్లలోని ఓ రైస్‌ మిల్లు యజమాని సుమారు మూడు, నాలుగు మండలాల నుంచి రేషన్‌ బియ్యాన్ని కొనుగోలు చేసి భారీగా కాకినాడ, బిక్కవోలు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

### నిఘా పెడుతున్నాం..

జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు ప్రతి రోజూ చౌక దుకాణాలను తనిఖీ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో అప్లోడ్‌ చేస్తున్నారు. గతంలో కేసులు నమోదైన రైస్‌మిల్లులు, దళారులు, గోదాములపై ప్రత్యేక నిఘా పెడుతున్నాం. నిర్లక్ష్యంగా ఉన్న రేషన్‌ దుకాణాదారులపై ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- వి.పార్వతీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, రాజమహేంద్రవరం

(c) eenadu

## ఘనంగా సత్యదేవుని రథ సేవ

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం సత్యదేవుని రథసేవ ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చరణ, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాకారం చుట్టూ మూడుసార్లు ఊరేగింపు జరిపారు. ఈవో సుబ్బారావు, భక్తులు స్వామి సేవలో పాల్గొన్నారు. గోధుమ నూక ప్రసాదానికి డిమాండ్ ఏర్పడింది. ఆదివారం ఒక్కరోజే సుమారు లక్ష ప్యాకెట్లు విక్రయించారు.

## నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

చిత్రపటం అందజేస్తున్న ఈవో సూర్యచక్రధరరావు

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద నిర్మితమవుతున్న వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన ప్రోమ మధుసూదన్, కిరణ్ దంపతులు రూ. 51,111 విరాళాన్ని ఆదివారం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధరరావు అభినందించారు.

## చిన్నారులు కదిలివచ్చారు.. నృత్యంతో మురిపించారు

నిడదవోలు పట్టణంలోని బ్రమరి కూచిపూడి నాట్య నిలయం వార్షికోత్సవ ముగింపు కార్యక్రమాన్ని స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కూచిపూడి నాట్యంలో రాణిస్తున్న బాలికలను అభినందించారు. బాలికలు చేసిన వివిధ రకాల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పురపాలక సంఘ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జడ్పీటీసీ సభ్యుడు కె.సూరిబాబు, నాట్య నిలయం వ్యవస్థాపకురాలు పోతుల పావని, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల ప్రసాద్, కార్యదర్శి దారుపురెడ్డి ప్రతాప్, డాక్టర్ కల్యాణచక్రవర్తి, పి.చందు, గంగుల గోపీనాయుడు పాల్గొన్నారు.

జి.వేమవరం రక్షిత చెరువులో పెరిగిన భారీ చేపలతో స్థానికులు

## 36 నెలలు.. 30 కిలోల చేపలు

తాళ్లరేవు మండలం జి.వేమవరం రక్షిత చెరువులో మూడేళ్ల తర్వాత ఆదివారం చేపల పట్టుబడి చేపట్టారు. ఈ చెరువును ఓ వ్యక్తి రూ.36 వేలకు పాడుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి మోహన్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుకీర్తి తెలిపారు. ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రక్షిత చెరువులో 30 కేజీల వరకు బరువున్న చేపలు లభించాయి. వాటిని కొనుగోలు చేసేందుకు స్థానికులు, వ్యాపారులు భారీగా తరలి వెళ్లారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

## అందరూ దీక్ష చేయొచ్చు

పిఠాపురం: ప్రతిఒక్కరూ చాతుర్మాస దీక్ష చేయొచ్చని, ఒత్తిడితో జీవనం సాగిస్తున్న వారికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థ స్వామిజీ అన్నారు. పిఠాపురం అనఘా దత్త క్షేత్రంలో చాతుర్మాస దీక్ష నాలుగోరోజు ఆదివారం అనఘా దత్త స్వామికి తైలాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మచారులు, గృహస్థులు, పేదలు, పెద్దలు చేయొచ్చన్నారు. ఆహార నియమాలు పాటించాలన్నారు. ప్రయాణాల్లో ఇబ్బందులు లేని విముక్తికి, ఆరోగ్యానికి ఈ దీక్ష దోహదపడుతుందన్నారు. ఒకచోట ఉండి భగవన్నామస్మరణ చేసుకోవాలని తెలిపారు. వైద్య శిబిరం నిర్వహించారు.

> తమ్మీ ఎట్లున్నవ్.. మంచిగున్నావె.. అంటూ తెలంగాణ యాస పలికించినా.. ఇయ్‌తల్లా నాకు ఇంకో బిడ్డుండాదనుకుంటా.. కడుపులోపెట్టి చూసుకుంటా.. అని రాయలసీమ రాజసం పలికించినా.. అరేయ్ ముల్లపందీ అంటూ ఆంధ్రా వెటకారం పండించినా.. అది కోట శ్రీనివాసరావుకే చెల్లింది..

# అభిమానకోట..

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

తెలుగు సినిమాలో విలక్షణ నటుడిగా గుర్తింపుపొందిన కోట శ్రీనివాసరావు వయోభారంతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మృతిచెందారు. ఆయనకు గోదావరి తీరంతో ప్రత్యేక అనుబంధం ఉంది. 750కి పైగా చిత్రాల్లో నటించిన ఆయన రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకొన్న 50కి పైగా చిత్రాల్లో నటించారు. ఆయనతో కలిసి నటించిన నటుడు, గాయకుడు జిత్‌మోహన్‌మిత్రాకు మంచి మిత్రుడు.

### ఇక్కడ పలు చిత్రాల్లో..

నాటక రంగం నుంచి వచ్చిన కోట శ్రీనివాసరావుకు కళంటే ప్రాణం. ప్రాణం ఖరీదు, ఆలీబాబా అరడజను దొంగలు, ఏవండీ.. ఆవిడ వచ్చింది.., హై హై నాయకా.. చిన్నబ్బాయి, 420, కత్తి కాంతారావు తదితర చిత్రాలు ఈ ప్రాంతంలోనే చిత్రీకరించారు. గోదావరి తీరంలోని మిర్తిపాడు, తొర్రేడు తదితర గ్రామాల్లో ఏవండీ ఆవిడ వచ్చింది చిత్రం షూటింగ్ జరుపుకొంది. కత్తి కాంతారావు చిత్రం గూటాలలో తీశారు. హై హై నాయకా చిత్రం మోరంపూడిలో, చిన్నబ్బాయి చిత్రం రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోనే షూటింగ్ చేశారు.

### మంచి మిత్రుడిని కోల్పోయా..

కోట శ్రీనివాసరావుకు నటనపై అమితమైన ప్రేమ, భక్తి ఉన్నాయి. ఎలాంటి పాత్రలో అయినా ఒదిగిపోవడం ఆయన ప్రత్యేకత. ఆయనతో కలిసి గోదావరి తీరంలో అనేక చిత్రాల్లో నటించా. ప్రత్యేకించి కత్తి కాంతారావు, ఏవండీ ఆవిడ వచ్చింది చిత్రాల సమయంలో మంచి స్నేహితుడయ్యారు. రాజమహేంద్రవరంలో నేను నిర్వహించిన ఆర్కెస్ట్రా 25వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా వచ్చి మిమిక్రీ చేశారు. మంచి మిత్రుడిని కోల్పోయా.

- శ్రీపాద జిత్‌మోహన్‌మిత్రా, నటుడు, గాయకుడు, రాజమహేంద్రవరం

అల్లరి అల్లుడు చిత్రంలో పెద్దేవంలో తీసిన సన్నివేశం

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు ప్రాంతంలో తీసిన ఎన్నో చిత్రాల్లో కోట నటించారు. సీతారత్నంగారి అబ్బాయి, బొబ్బిలిరాజా సినిమాలు మలకపల్లిలో తీయగా వారంపాటు శ్రీనివాసరావు అక్కడే ఉన్నారు. అల్లరి అల్లుడు చిత్రంలో ఓ పాటను పెద్దేవం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద తీశారు. ఏవండి.. ఆవిడ వచ్చింది! చిత్రీకరణ నేపథ్యంలో చాలా రోజులు తోగుమ్మి, మలకపల్లి, ధర్మవరం, దొమ్మేరు ప్రాంతాల్లో ఆయన ఉన్నారు. చినరాయుడు సినిమాలో కొన్ని సన్నివేశాలను తోగుమ్మిలో చిత్రీకరించారు. ఏ షూటింగ్ జరిగినా ఆయన వద్దకు వచ్చే వారిని ఆప్యాయంగా పలకరించేవారని కొవ్వూరుకు చెందిన పరస జగన్నాథరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

### ఆయనే పిలిచి మాట్లాడారు..

ఏ పాత్రనైనా నటనా కౌశలంతో మెప్పించగల పరిపూర్ణ నటుడు కోట శ్రీనివాసరావు. శ్రీకాంత్ హీరోగా ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో 1999లో వచ్చిన మాణిక్యం సినిమా షూటింగ్ మునికూడలిలో జరుగుతోందని అక్కడికి వెళ్లా. పది రోజులపాటు చిత్రీకరణ జరగ్గా వారం రోజులు వెళ్లా. శ్రీనివాసరావును రోజూ చూసినా మాట్లాడే అవకాశం రాలేదు. ఒక రోజు ఆయనే గమనించి దగ్గరకు పిలిచి చాలాసేపు మాట్లాడారు. కలిసి భోజనం కూడా చేశా.

– కొండపల్లి రత్నసాయి, కొవ్వూరు

## రెండో విడత ప్రవేశాలకు 907 మంది ఎంపిక

వేంపల్లె, నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు రెండో విడత ప్రవేశాలకు ఎంపికైన 907 మంది విద్యార్థుల జాబితాను ఆదివారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్రకుమార్ విడుదల చేశారు. మొదటి విడతలో ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 628 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలలో చేరలేదు. దీంతో ఆ సీట్లు ఖాళీఅయ్యాయి. వీటితోపాటు దివ్యాంగుల కోటా కింద 179, సైనికోద్యోగుల పిల్లల కోటా కింద 80, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 20 సీట్లతో కలిపి మొత్తం 907 సీట్లకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి వారి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇందులో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి 96 మంది, ఒంగోలుకు 460, నూజివీడుకు 85, శ్రీకాకుళానికి 265 మంది ఎంపికయ్యారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 96 మంది ఈ నెల 17న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 810 మంది విద్యార్థులు అదే రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సివుంటుంది. సోమవారం నుంచి ఓరియంటేషన్ తరగతులు జరుగుతాయన్నారు.

## వరదలోనూ ఆగని జలవిద్యుత్తు కేంద్రం పనులు

పోలవరం వద్ద జరుగుతున్న పనులు

సీతానగరం, న్యూస్‌టుడే: గోదావరి వరద పోటు వల్ల అల్లూరిసీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం అంగుళూరు, తూర్పుగోదావరిజిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం పరిసరాల్లో పోలవరం డ్యాం జలవిద్యుత్తు కేంద్రం వద్ద ఎటువంటి ఆటంకం లేకుండా పనులు జరుగుతున్నాయి. ఎగువ ప్రాంతమైన భద్రాచలం నుంచి వరదనీరు స్పిల్‌వే వద్ద 31 మీటర్లకు చేరడం, 48 గేట్లు ఎత్తివేసి సుమారు 7 లక్షలకు పైబడి క్యూసెక్కుల నీటిని ధవళేశ్వరం బ్యారేజీ మీదుగా సముద్రంలోకి చేరుస్తున్నారు. స్పిల్‌వే వద్ద నుంచి ఎప్పటికప్పుడు వరదనీటిని దిగువకు వదిలేయడంతో 960 మెగావాట్ల విద్యుత్తు ఉపకేంద్రం పనులకు ఎటువంటి ఆటంకం లేదని ఏపీజెన్కో సీనియర్ మేనేజర్ కొగాని వీవీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. 35 మీటర్లకు పైబడి నీటి ప్రవాహం పెరిగితేనే జలవిద్యుత్తు కేంద్రం వద్ద టన్నెల్‌కు వరదనీరు చేరుతుందన్నారు. గోదావరి నదికి అంగుళూరుకు మధ్యలో 36 మీటర్ల ఎత్తున రక్షణ గోడ ఏర్పాటుచేయడంతో చుక్కనీరు కూడా విద్యుత్తు కేంద్రం వద్దకు రాదన్నారు. జల విద్యుత్తు కేంద్రానికి రావాల్సిన భారీ సామగ్రి అంతా సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి ఏటిగట్టు రోడ్డు నుంచి చేరుతోందని 2026 డిసెంబరు నాటికి కేంద్రం పనులు పూర్తవుతాయన్నారు.

## మహిళలకు ఉపాధి మార్గం చూపించడమే లక్ష్యం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: మహిళలందరికి ఉపాధి మార్గం చూపించి వారికి ఆర్థికపరమైన బలాన్ని సమకూర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలో మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం యూనియన్ బ్యాంకు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఆక్సిజ్ గార్మెంట్స్ రాజమహేంద్రవరం, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి సుభాష్ మాట్లాడుతూ తాము ఏ కార్యక్రమం నిర్వహించినా రామచంద్రపురం మహిళలు ముందుంటారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 బంగారు కుటుంబలో భాగంగా ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారుచేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. శిక్షణకు హాజరైన మహిళలకు మంత్రి సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సత్యం ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంక్ ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన మహిళకు సామగ్రి అందిస్తున్న మంత్రి సుభాష్

## ముగిసిన రాష్ట్ర స్థాయి గైనకాలజీ సదస్సు

మసీదుసెంటర్ (కాకినాడ): కాకినాడ నగర గైనకాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజీ(ఏపీసీవోజీ) రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారంతో ముగిసింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1400 మంది గైనకాలజీ వైద్యులు, పీజీలు హాజరయ్యారు. కాకినాడ ఆర్ఎంసీ ఆడిటోరియంలో సైంటిఫిక్ సెషన్స్ నిర్వహించారు. నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు, కొత్త చికిత్సా విధానాలపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వైద్యనిపుణులు కోలా శశికళ, కిరణ్మయి, మాల, మంజుల, భాస్కర్ షా, శాంతకుమారి, దీప్తి, కాదా వెంకటరమణ తదితరులు అవగాహన కల్పించారు. అసోసియేషన్ పాట్రన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, అసోసియేషన్ అధ్యక్షురాలు అనురాగమయి, ఆర్గనైజింగ్ కార్యదర్శి గీతశ్రీ, ఛైర్‌పర్సన్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కో ఛైర్‌పర్సన్ ఎ.సత్యవతి, కోఆర్డినేటర్ బి.సూర్యకుమారి, రవికుమార్, శ్రీధర్, లక్ష్మీకిరణ్, ఉషశ్రీ, కరుణకుమారి, పీఎస్ రాజు, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపికలు అందుకున్న వైద్యనిపుణులు

## అంతర్జాతీయ చెస్ మాస్టర్‌గా అజయ్

మసీదు సెంటర్ (కాకినాడ): ఈ నెల నుంచి 12వ తేదీ వరకూ సెర్బియాలో జరిగిన అంతర్జాతీయ చెస్ పారాసిన్ ఓపెన్ టోర్నమెంట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారుడు ముషిని అజయ్ ప్రతిభ కనబరిచాడు. ఆయన 2450 ఫిడే రేటింగ్ సాధించి అంతర్జాతీయ చెస్ మాస్టర్ హోదా సాధించాడు. కోనసీమ జిల్లా, అమలాపురానికి చెందిన అజయ్ గత నాలుగేళ్లుగా కాకినాడలో ఉంటూ స్థానిక డెవలప్ చెస్ అకాడమీలో కోచ్‌గా పనిచేస్తూనే అనేక పోటీల్లో పాల్గొంటున్నాడు. అకాడమీ హెడ్‌కోచ్ దివ్యతేజ, ఇతర క్రీడాకారులు అజయ్‌ను అభినందించారు.

## కాసులు గలగల.. సౌకర్యాలు వెలవెల

### ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కార్యాలయాలు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. వీటికి ఏటా రూ.లక్షల్లో అద్దె చెల్లించాల్సి వస్తున్నప్పటికీ కక్షిదారులకు మెరుగైన సౌకర్యాలు లేవు. ఇరుకైనా భవనాల్లో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇబ్బందులు తప్పట్లేదు. జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంతభవనాలు సమకూర్చే దిశగా అధికారులు ఆలోచిస్తున్నారు. రాజమహేంద్రవరంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు జిల్లాలో మొత్తం 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో రెండు మాత్రమే సొంత భవనాల్లో ఉండగా మిగిలినవి అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖకు సొంత స్థలం ఉన్న చోట కూడా నిర్మాణాలకు నోచుకోలేదు.

### సొంత భవనాలకు యోచన..

గత వైకాపా ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలు భారీగా పెంచి ప్రజలపై రిజిస్ట్రేషన్ ఛార్జీల భారాన్ని మోపింది. కానీ సొంత భవనాలు సమకూర్చలేదు. కొన్నిచోట్ల పైఅంతస్తుల్లో నిర్వహిస్తున్నారు. వయసు పైబడినవారు మెట్లు ఎక్కలేక నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని కార్యాలయ భవనాలు ఇరుకుగా ఉండటంతో అటు సిబ్బంది, ఇటు కక్షిదారులు ఇబ్బంది పడుతున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వరండాలో, చెట్ల కింద నిరీక్షిస్తున్నారు. సొంత భవనాల కోసం మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు పంపించాలని అధికారులు యోచిస్తున్నారు.

శిథిలమైన రిజిస్ట్రేషన్ కార్యాలయ భవనం

### ఏటా రూ.17.61 లక్షల అద్దె..

జిల్లాలోని బిక్కవోలు, కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు మాత్రమే సొంత భవనాల్లో నడుస్తున్నాయి. రాజమహేంద్రవరంలోని జిల్లా రిజిస్ట్రార్ పరిపాలన విభాగం, అర్బన్ రిజిస్ట్రేషన్ ఒరిజనల్ బ్రాంచి(ఓబీ), కడియం, కోరుకొండ, అనపర్తి, అనంతపల్లి, నిడదవోలు, పిడింగొయ్యి, రాజానగరం, సీతానగరం, వేగేశ్వరపురం సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటికి ఏటా రూ. 17,61,552 అద్దె చెల్లిస్తున్నారు.

### నిధులు వెనక్కి..

స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద సుమారు 700 గజాల స్థలంలో శిథిల భవనం స్థానంలో కొత్త నిర్మాణానికి గతంలో తెదేపా హయాంలో నిధులు మంజూరు అయ్యాయి. ప్రభుత్వం మారి వైకాపా రావడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. తర్వాత రెండుసార్లు అధికారులు ప్రతిపాదనలు పంపినా గత సర్కారు నిధులు మంజూరు చేయలేదు.

### ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..

సొంత భవనాలు సమకూర్చేందుకు యోచిస్తున్నాం. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. బిక్కవోలు కార్యాలయ భవన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించా. రాజమహేంద్రవరంలో సొంత స్థలంలో కొత్త భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. స్థలాలు లేనిచోట ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

– సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రార్

## విలేకరి కుమార్ మృతికి సంతాపం

కుమార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పాత్రికేయులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), ఏవీఏ రోడ్డు: రాజమహేంద్రవరంలో న్యూస్‌టుడే విలేకరిగా పనిచేస్తున్న మెట్ల కుమార్ మృతి తీరనిలోటని వక్తలు పేర్కొన్నారు. వృత్తిపట్ల నిబద్ధతతో వ్యవహరించిన కుమార్ పలువురికి ఆదర్శమన్నారు. నగరంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం కుమార్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు ఎం.శ్రీరామ్‌మూర్తి, అధ్యక్షుడు కుడిపూడి పార్థసారథి, పాత్రికేయులు శ్రీనివాస్, ఆనంద్, రాజు, ఫయాజ్, సారథి, నాగేంద్ర, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశ్ చిక్కితేనే.. డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

విజయవాడ నేరవార్తలు: మాదకద్రవ్యం 'మెత్' 5.2 గ్రాములు పట్టుబడిన కేసులో ముగ్గురు యువకులను విజయవాడ శివారు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కపిలేశ్వరపురానికి చెందిన గౌర శ్రీరాం వెంకటమణికంఠ బెంగళూరు నుంచి మెత్ తీసుకొచ్చినట్లు తేలింది. ఇతనికి బెంగళూరులోని పబ్‌లో ఆకాశ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. డ్రగ్స్ సరఫరాలో అతనిదే కీలకపాత్ర. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సమాచారం చేరవేస్తుంటారు. డ్రగ్స్‌కోసం వేర్వేరు వ్యక్తుల నంబర్లకు యూపీఐ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తారు. ఆ తరువాత ఆకాశ్ రంగంలోకి వస్తాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో డ్రగ్స్ ఎక్కడ ఉంచాడో చెబుతాడు. దీనికోసం వీరు జాతీయ రహదారులను ఎంపిక చేసుకుంటారు. ఫలానా ప్రదేశంలో ఉంచి ఆ సమాచారాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేస్తారు. తరువాత ఆ వివరాలు తొలగిస్తారు. ఆకాశ్ దొరికితేనే ముఠా గుట్టురట్టు చేయగలమని విజయవాడ పోలీసులు అంటున్నారు. డ్రగ్స్ కొనుగోళ్లు, అమ్మకాల్లో భాగంగా నగదు లావాదేవీలు జరిపిన ఖాతాలపై దృష్టి పెట్టారు. మణికంఠ ఖాతా నుంచి ఏయే ఖాతాలకు డబ్బులు వెళ్లాయనేది సేకరించే పనిలో పడ్డారు.

## 17 నుంచి నాటికల పోటీలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు స్మారక కళావేదిక రజతోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ నాలుగు రోజుల పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు పరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు తెలిపారు. ఆదివారం దంటు కళాక్షేత్రంలో కళాపరిషత్ రజతోత్సవాలపై సన్నాహక సమావేశం, నాటికల పోటీల కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దయానందబాబు మాట్లాడుతూ నాలుగు రోజులపాటు జరిగే పోటీల్లో పలు పరిషత్‌లు పాల్గొంటున్నాయన్నారు. ప్రతిరోజూ రెండు లక్కీడిప్‌లు నిర్వహించి విజేతలైన ప్రేక్షకులకు బహుమతులు అందజేస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు స్వరార్చన, ఏకపాత్రాభినయ ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కర్రి భామిరెడ్డికి అల్లూరి సీతారామరాజు విశిష్ట సాంస్కృతిక సేవా పురస్కారాన్ని అందజేస్తామని తెలిపారు. అనంతరం సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి రెండు నిమిషాల మౌనం పాటించి సంతాపం తెలిపారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్‌వీఎస్‌ఎన్.మూర్తి, బాపిరాజు, నూకరాజు, టీవీఎస్‌ఎన్.రెడ్డి, బుద్ధరాజు, సత్యనారాయణ, బుచ్చయ్య, బాలు, ఎస్వీ.రమణ, వర్మ, మురళి, జి.శ్రీనివాసు, ఏ.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## క్షణికావేశంలో వ్యక్తిపై కత్తితో దాడి

చికిత్సపొందుతున్న వీరరాఘవ

కరప, న్యూస్‌టుడే: ఆస్తి తగాదా నేపథ్యంలో ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన కరపలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరపలో ఒకే కుటుంబానికి చెందిన బి.రామకృష్ణ, బి.రాజరాజేశ్వరి ఒకే ఇంట్లో పైన, కింది పోర్షన్‌లలో నివాసం ఉంటున్నారు. వీరి మధ్య కొంతకాలం నుంచి ఆస్తి తగాదాలున్నాయి. ఆదివారం మధ్యాహ్నం రామకృష్ణ వియ్యంకుడైన బిక్కవోలుకు చెందిన అమజాల వీరరాఘవ భోజనం క్యారేజీ పట్టుకుని వచ్చాడు. ఆ సమయంలో రామకృష్ణ, వీరరాఘవలకు రాజరాజేశ్వరితో గొడవ జరిగింది. ఆమె కుమారుడు చంద్రశేఖర్ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న కత్తితో వీరరాఘవ ఎడమ చేతిపై రెండు చోట్ల నరికాడు. వీరరాఘవను స్థానికులు వెంటనే కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి ఘటనపై ఎస్సై తోట సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | 24,000 |
| పాతకాయ: గండేరా | 27,000 |
| గటగట | 25,000 |
| కొత్తకాయ: గండేరా | 26,000 |
| గటగట | 24,000 |
| నీటి కాయ (వెయ్యింటికి): | |
| పాత (ముక్కుడు) కాయ | 19,000-22,000 |
| కొత్త [illegible] కాయ | 19,000-20,000 |
| కొబ్బరినూనె 15 కిలో | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు [illegible] మారుతుంటాయి.

| వెంకాబ్ చికెన్ ధర | రూ॥లలో |
|---|---|
| ఫారంకోడి | 97-00 |
| లైవ్ [illegible] | 119-00 |
| డ్రెస్ | 173-00 |
| స్కిన్‌లెస్ | 196-00 |

EENADU Classifieds

BUSINESS SERVICES

COMMERCIAL
FOR OFFICES, Banks, Dental & Cosmetology convience place with parking in Danavaipeta, 1600 Sft., 1st Floor. Rjy, Cont: 94 90 811 769.

TENDER

JOBS
Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

REAL ESTATE

PLOT FOR SALE

PITAPURAM

GENERAL

TO LET

DRIVERS
కావలెను
ఆదిత్య యూనివర్శిటీ
బస్సు డ్రైవర్లు
సూపర్‌వైజర్లు
79976 86661, 80960 26667

EENADU
for Advertisement Contact:
8008597607

గమనిక

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

(c) eenadu

# రాజమహేంద్రవరం

## పైపైకి మిర్చి ధర

రైతుబజారులో పచ్చిమిర్చి కొనుగోళ్లు

దేవీచౌక్, న్యూస్‌టుడే: వర్షాలకు దిగుబడి తగ్గడంతో పచ్చిమిర్చి ధర ఒక్కసారిగా పెరిగింది. స్థానికంగా పచ్చిమిర్చి పంట లేకపోవడంతో కొంత కాలంగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. రాజమహేంద్రవరం మార్కెట్‌కు దిగుమతి తగ్గడంతో ప్రస్తుతం రైతుబజార్లలో కిలో ధర రూ.68కి చేరుకుంది. బహిరంగ మార్కెట్లో సుమారు రూ.100కు విక్రయిస్తున్నారు. నగరంలో ఏడు రైతుబజార్లు ఉండగా ఆల్కాట్‌తోట మినహా మిగిలిన వాటికి రోజుకు 5 క్వింటాళ్ల నుంచి 8 క్వింటాళ్ల వరకు అవసరం అవుతాయి. ధర పెరగడంతో వ్యాపారులు తక్కువ మొత్తంలో దిగుమతి చేసుకుంటున్నారు. గతనెల 29న కిలో రూ.28 ఉండగా ప్రస్తుతం దాదాపు రెండురెట్లు పెరిగింది. నెలక్రితం వరకు కడియం, కోరుకొండ మండలాల నుంచి తక్కువ మొత్తంలో మార్కెట్‌కు వచ్చేది. ప్రస్తుతం అదికూడా లేకపోవడంతో కడప జిల్లా మైదుకూరు, కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణా ఛార్జీల భారం, పంట దిగుబడి తగ్గడం వంటి కారణాలతో ఇక్కడికి వచ్చేసరికి ఖరీదు పెరుగుతోంది. ఎడతెరిపిలేని వర్షాలు, తుపాన్లు వంటివి రాకుండా ఉంటే ధర తగ్గుముఖం పడుతుందని రైతుబజారు ఎస్టేట్ అధికారులు చెబుతున్నారు.

**పెరుగుదల ఇలా (కిలో.. రూ.ల్లో)**

| తేదీ | ధర |
|---|---|
| 29-6 | 28 |
| 30-6 | 32 |
| 2-7 | 35 |
| 4-7 | 36 |
| 5-7 | 40 |
| 6-7 | 46 |
| 7-7 | 55 |
| 12-7 | 64 |
| 13-7 | 68 |

## నగరానికి మినిస్టీరియల్ అవార్డుపై హర్షం

దేవీచౌక్, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాల్లో భాగంగా రాజమహేంద్రవరం నగరాన్ని 2024 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం మినిస్టీరియల్ అవార్డుకు ఎంపిక చేయడంపై భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల రామకృష్ణారావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అవార్డు రావడానికి కారణమైన నగరపాలక సంస్థ అధికారులు, పారిశుద్ధ్యం సిబ్బంది, నగర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## చిరకాల కల.. సాకారమవుతున్న వేళ..

### తుది దశకు ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ భవనం

చురుగ్గా నిర్మాణ పనులు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

నగరంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే స్లాబ్ నిర్మాణాలు పూర్తయ్యి, పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఎలక్ట్రికల్ పనులు జరుగుతుండగా పెయింటింగ్, ఇతర పనులు చేసి త్వరలోనే సొంత భవనంలో సంఘ కార్యకలాపాలు కొనసాగిస్తామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోయేషన్ నగర యూనిట్ అధ్యక్షుడు సంజీవరావు తెలిపారు. ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ రాజమహేంద్రవరం యూనిట్ 1971లో ఏర్పడగా దీనికి 1976లో రిజిస్ట్రేషన్ జరిగింది. ఇప్పటివరకు సొంత భవనం లేదు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులంతా ఏళ్లుగా పరాయి పంచనే సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. తొలుత ప్రకాశ్‌నగర్ రౌండ్ పార్కులోని సమావేశ మందిరంలోనే 25 ఏళ్లపాటు అసోసియేషన్ కార్యకలాపాలు కొనసాగించారు. ప్రతినెలా ఇక్కడే సమావేశాలు నిర్వహించి తమ సమస్యలపై చర్చించుకునేవారు. తర్వాత స్థానిక ధర్మంచర కమ్యూనిటీ హాలులో కార్యాలయాన్ని మార్పు చేశారు. ప్రస్తుతం ఇందులో 4,500 మంది విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు సభ్యులుగా ఉన్నారు. తమ అసోసియేషన్‌కు సొంతభవనం సమకూర్చేందుకు ఏళ్లుగా ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసోసియేషన్‌కు ప్రభుత్వ స్థలం సమకూరింది.

**రూ.95 లక్షల అంచనాతో..**

ఆర్డీవో కార్యాలయం వెనుక వైపు జిల్లా ట్రెజరీ కార్యాలయం చెంతన 166.66 గజాల ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం కేటాయించడంతో ఈ ఏడాది జనవరిలో నిర్మాణ పనులు ప్రారంభించారు. జీప్లస్ 2 తరహాలో నిర్మాణానికి రూ.95 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. పింఛనుదారులు విరాళాలు వేసుకోవడంతో పాటు బయట దాతల సహకారంతో పనులు చేపట్టారు. అసోసియేషన్‌కు సొంత భవనం సమకూర్చాలనే వారి చిరకాల కల సాకారమవుతుంది.

**బయట ప్రాంతాల వారికి..**

మినీ సమావేశ మందిరం

గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకవైపు జిల్లా అసోసియేషన్ కార్యాలయ గది, రెండో వైపు అసోసియేషన్ రాజమహేంద్రవరం యూనిట్ కార్యాలయ గది, మధ్యలో మినీ హాలు నిర్మాణం చేపట్టారు. మొదటి అంతస్తులో పెన్షనర్ల సమావేశ మందిరాన్ని, రెండో అంతస్తులో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రభుత్వ పింఛనుదారులు విశ్రాంతి తీసుకునేందుకు మూడు గదులు నిర్మిస్తున్నట్లు సభ్యులు చెబుతున్నారు. కింద అంతస్తులో ఎలక్ట్రికల్, పెయింటింగ్ పనులు పూర్తి చేసి, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

## పారిశుద్ధ్య సమస్యలా.. ఫోన్ చేయండి

**డయల్ యువర్ ఎంహెచ్‌వో**

రేపు ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో నగరంలో పారిశుద్ధ్య సమస్యలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో రేపు (మంగళవారం) నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారిణి ఎ.వినూత్నతో ఫోన్-ఇన్ కార్యక్రమం జరగనుంది. నివాస ప్రాంతాల్లో అపరిశుభ్రత, కాలువల్లో పూడిక పేరుకుపోవడం, దోమలు, వీధి కుక్కల సమస్యలు, మురుగు రోడ్డుపైకి చేరడం తదితర పారిశుద్ధ్య సమస్యలపై ఫోన్ చేయొచ్చు. మీ సమస్యలకు పరిష్కారం పొందచ్చు. వ్యక్తిగత సమస్యలు ప్రస్తావించకూడదు.
- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

**ఆలకించారు.. పరిష్కరించారు..**

నగరంలోని వివిధ సమస్యలపై 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నగరపాలక సంస్థ ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ● స్థానిక మల్లికార్జుననగర్ బ్రహ్మంగారి గుడి వీధిలో లీకవుతున్న పైపులైనుకు సంబంధిత విభాగం సిబ్బంది మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టినట్లు ఫిర్యాదుదారుడు ఇస్మాయిల్ తెలిపారు. ● స్థానిక ఇన్నీసుపేట భావన ఆసుపత్రి ఏరియాలో వెలగని వీధి దీపాలకు సంబంధిత విభాగం సిబ్బంది మరమ్మతులు చేపట్టడంతో ప్రస్తుతం దీపాలు వెలుగుతున్నట్లు ఫిర్యాదుదారుడు సుధాకర్ తెలిపారు. ● స్థానిక నారాయణపురంలోని డ్రెయిన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికను సంబంధిత పారిశుద్ధ్య సిబ్బంది తొలగించినట్లు ఫిర్యాదుదారుడు రామకృష్ణ తెలిపారు. ● స్థానిక రామచంద్రరావుపేటలో వినాయకుడి గుడి వద్ద డ్రెయిన్‌లో పూడిక తొలగించి పనులను సంబంధిత పారిశుద్ధ్య సిబ్బంది చేపడుతున్నట్లు ఫిర్యాదుదారుడు వరప్రసాద్‌యాదవ్ తెలిపారు. - న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

స్పందనకు సందనం

**సమస్య:** స్థానిక పోలీసు క్వార్టర్స్ వద్ద కాలువల్లో పూడికను సిబ్బంది తొలగించట్లేదు. కాలువల్లో నీరు రోడ్డుపైకి చేరుతోంది. అధిక దుర్వాసన రావడంతో ఇబ్బందులు తప్పట్లేదు. - ప్రసాద్

**సమస్య:** కంబాలపేట వెనుక వీధుల్లో కాలువల్లో పూడిక పెరుగుతోంది. ఎప్పటికప్పుడు పూడిక తొలగించట్లేదు. - లక్ష్మి

**సమాధానం:** పారిశుద్ధ్య సిబ్బంది వచ్చి పూడిక తొలగిస్తారు. - వినూత్న, ఎంహెచ్‌వో

**సమస్య:** స్థానిక ఆర్యాపురం ప్రాంతంలో వీధి దీపాలు వెలగట్లేదు. - భావన

**సమస్య:** త్యాగరాజనగర్‌లో వీధి దీపాలు సక్రమంగా వెలగట్లేదు. - సురేష్

**సమాధానం:** సిబ్బంది వచ్చి పరిశీలించి, తక్షణ మరమ్మతు చేయిస్తాం - విమల, మున్సిపల్ ఎలక్ట్రికల్ ఏఈ

- న్యూస్‌టుడే, టి.నగర్

## కార్యకర్తలకు అండగా తెదేపా

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**టి.నగర్:** కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సీనియర్ కార్యకర్త మేడపాటి ప్రసాద్ ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా నగదును ఆదివారం ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు.

## యువోహం.. స్వచ్ఛ సందేశం

ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్‌లోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆదివారం ఉదయం జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ భవన ప్రాంగణంలో పేరుకున్న వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులు, పెరిగిన గడ్డి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు మహాలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ రాంబాబు, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ఎస్.నాగేశ్వరరావు, పోలుకొండ సాయి, కె.మహేశ్వరి, బి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

## రాజేశ్వరి సేవలు చిరస్మరణీయం

**వి.ఎల్.పురం:** మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దివంగత అల్లు రాజేశ్వరి సేవలు చిరస్మరణీయమని జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ కొనియాడింది. ఆదివారం స్థానిక జేఎన్‌రోడ్డులోని ఐశ్వర్య అపార్టుమెంట్స్‌లోని రాజేశ్వరి కుమారుడు అల్లు బాబీ స్వగృహంలో జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ జరిగింది. కోనే శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. రావ్‌అండ్‌రావ్ స్టూడియో అధినేత ఏపీ.నారాయణరావు, పలువురు అసోసియేషన్ సభ్యులు మాట్లాడారు. 1987లో మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికైన రాజేశ్వరి ఎన్నో సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఆమె కుమారుడు బాబీ 2003లో కార్పొరేటర్‌గా ఎన్నికై, అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆయా మండలాల అసోయేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

## గుండెల్లో కోనేటి రాయుడు

శ్రవణా నక్షత్రం సందర్భంగా రాజమహేంద్రవరం నల్లమందు సందులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఆదివారం అంతరాలయంలో స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. తులసి, పలురకాల పూలతో అలంకరించి హారతి సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.
- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

## వనువులమ్మకు ప్రత్యేక పూజలు

కంబాలచెరువు (తొర్రేడు), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని తొర్రేడులో కొలువై ఉన్న వనువులమ్మతల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం లలిత, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అన్నప్రసాద వితరణ జరిగింది.

## రాకపోకలు.. ప్రయాణికులకు సవాలు

లాలాచెరువు సమీపంలోని గ్లో గార్డెన్ వెనుక వీధిలో ఇటీవల కల్వర్టు నిర్మించారు. పనులు పూర్తయినా రాకపోకలకు మార్గం సుగమం కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపైకి చేరి, తీవ్రమైన దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్

## ఆదమరిస్తే అంతే సంగతులు

నగరంలోని నిత్యం రద్దీగా ఉండే జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులోని వాడ్రేవు ఫంక్షన్ హాలు వీధిలో ప్లే స్కూల్ వద్ద మ్యాన్‌హోల్ తెరిచి ఉంది. పాఠశాల ఉండటంతో చిన్నారులు రాకపోకలు సాగిస్తారు. కాలిబాటపై కొంతమేర పాడైన మూతతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

## రోడ్డుపైనే వ్యర్థాలు.. పట్టదేం అసలు

స్థానిక బస్టాండ్‌కు ఆనుకొని ఉన్న వీధుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడున్న ప్రైవేటు డిగ్రీ కళాశాల వీధిలో రోజూ చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. ఇక్కడ చెత్త పోసుకునేందుకు కుండీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రెండురోజులకు ఒకసారైన చెత్త తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్

## అడుగు తుప్పపట్టి.. అందర్నీ భయపెట్టి

నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు తుప్పపట్టి ప్రమాదకరంగా ఉన్నాయి. రక్షణ చర్యలు, నిర్వహణ లేక ఈ పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల స్తంభాలు ఒరిగిపోగా, మరికొన్ని చోట్ల ప్రమాదకరంగా మారాయి. అడుగు భాగం తుప్పపట్టి ప్రమాదకరంగా మారడంతో ఏం జరుగుతోందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

తుమ్మలావ చైతన్య పాఠశాల ఎదురుగా..

ఆల్కట్‌తోటలో..

## దేవాంగ సంక్షేమ సంఘ సమావేశం

**రాజమహేంద్రవరం సాంస్కృతికం:** జాంపేట శ్రీఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు రొబ్బి విజయ్ శేఖర్ నిర్వహణలో ఆదివారం సమావేశం జరిగింది. సంఘ నగర ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ దేవాంగ కులదేవత చౌడేశ్వరీ అమ్మవారి జయంతిని పురస్కరించుకుని ఈనెల 24న గురువారం ఆషాఢ అమావాస్య రోజున జాంపేట కల్యాణం మండపంలో వేడుక నిర్వహిస్తామన్నారు. ఉదయం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం అమ్మవారికి సారె సమర్పణ, భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. దేవాంగ సంఘీయులు పాల్గొనాలన్నారు. కేకే సంజీవరావు, బీరా శ్యామలరావు, చింతా వెంకట చలపతి, బళ్లా శ్రీనివాసరావు, పూర్ణిమ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'మహిళలపై దాడి దారుణం'

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: బీసీ మహిళ అయిన కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారుపై రాళ్లతో దాడి చేయడం దారుణమని ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు. దాడిని ఖండిస్తూ ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరగడం చూస్తే అసలు ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతుందన్నారు.

## రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని ఒక వ్యక్తి మృతిచెందారు. నగరంలోని గోదావరి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారుజాము 4.30 గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మృతుడి వయసు 55 ఏళ్లు ఉంటాయని రాజమహేంద్రవరం జీఆర్పీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఒంటిపై యజ్ఞోపవీతం, చెవికి పోగులు ధరించి తెల్లగా ఉన్నారన్నారు. పట్టాలపై మృతదేహం పడి ఉండటాన్ని బట్టి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. వివరాలు తెలిసినవారు 9406275551, 9491444022 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కోరుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జిత్‌మోహన్‌కు సత్కారం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ముత్యాలముగ్గు చిత్రం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో శ్రీపాద జిత్‌మోహన్‌మిత్రాను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మిత్రబృందం ఆయనను సత్కరించారు. గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్‌మోహన్‌మిత్రా కళావేదికపై ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాటూరి రంగారావు, ముద్రగడ ఏసుబాబు, పి.వి.ఎస్.కృష్ణారావు, గుంటూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాము చదువుకున్న తరగతి గదిలో పూర్వ విద్యార్థులు

## గుర్తుకొస్తున్నాయి..

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గవర్నమెంట్ హైస్కూల్ ఫర్ బాయ్స్ (ట్రైనింగ్ కళాశాల)లో 1984-85 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. మోరంపూడి గోల్డెన్ ఫంక్షన్ హాలులో కలుసుకున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో స్థిరపడిన వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో సంతోషంగా గడిపారు. తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి రెండేళ్లకు కలుసుకోవాలని తీర్మానం చేసుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారి స్నేహితులకు సహాయం కోసం ట్రస్టు ఏర్పాటు చేసుకుని సాయం చేయాలని అనుకున్నారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాలకు వెళ్లి, చిన్నప్పుడు కూర్చున్న తరగతి గదిలో కూర్చుని జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.

## వీనులవిందుగా సంగీత విభావరి

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని విక్రమ హాలులో శ్వేత ఆర్కెస్ట్రా, ఈవెంట్స్ 25 వసంతాల సందర్భంగా ఆదివారం సంగీత విభావరి నిర్వహించారు. పలువురు వీనులవిందుగా పాటలు పాడారు. సెలవుదినం కావడంతో సంగీతప్రియులు పెద్దఎత్తున హాజరై ఉల్లాసంగా గడిపారు.

## ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

రాజానగరం: ఫుట్‌బాల్‌లో నైపుణ్యం సాధించి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం కులపతి కె.వి.వి.సత్యనారాయణరాజు అన్నారు. జీజీయూ ప్రాంగణంలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో రోటరీక్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ఎపిక్ స్పోర్ట్స్ ఫుట్‌బాల్ అకాడమీ నిర్వహణలో రెండు రోజులుగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సబ్‌జూనియర్ బాలుర ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2025 ఆదివారంతో ముగిసింది. ఓఎన్‌జీసీ కేజీబీజీ బేసిన్ మేనేజర్ కె.కరువనన్నన్, ఛార్టర్ ప్రెసిడెంట్ తీగల రాజు మాట్లాడారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమస్థానాన్ని అనంతపురం జిల్లా దక్కించుకుందని, ద్వితీయ, తృతీయ స్థానాలను కృష్ణా, తిరుపతి జిల్లాలు సాధించాయి.

## విలక్షణ నటుడు 'కోట'

నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

**రాజమహేంద్రవరం సాంస్కృతికం:** ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మరణం పట్ల రాజమహేంద్రవరం నగరానికి చెందిన రాకా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఆదివారం సాయంత్రం గోకవరం బస్టాండ్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో కోట చిత్రపటానికి డాక్టర్ కంటే వీరన్న చౌదరి, జి.వి.రమణ, తోట సుబ్బారావు, సూరపురెడ్డి తాతారావు తదితరులు నివాళి అర్పించారు. విలక్షణ నటుడు కోట అని కొనియాడారు.

## సాహితీ సుగంధం

పుస్తకావిష్కరణలో ప్రముఖులు

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: హిందీ సాహిత్యంలో తులసీదాస్ రచించిన రామచరిత మానస్ లాంటి కావ్యం తర్వాత ఆధునిక హిందీ సాహిత్యంలో అంతటి గొప్ప కావ్య రచన 'కామాయని' అని వక్తలు పేర్కొన్నారు. అగ్రశ్రేణి కవి, నాటక రచయిత దివంగత జయశంకర్ ప్రసాద్ 1936లో దీన్ని రాశారన్నారు. దాన్ని నగరానికి చెందిన ప్రముఖ సాహిత్యకారులు, జాతీయ అవార్డు గ్రహీత విశ్రాంత ప్రిన్సిపల్ డా.సేతుమాధవ్ కామేశ్వరరావు తెలుగులోకి అనువాదం చేశారు. ఈ పుస్తకాన్ని నగరంలోని వాడ్రేవు ఫంక్షన్‌హాలులో ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా గెయిల్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ వీఎస్ రావు, విశిష్ట అతిథులుగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విశ్రాంత డీజీఎం రామ్‌నారాయణ, కెనరా బ్యాంకు విశ్రాంత రాజ్యభాషాధికారి జ్ఞానేశ్రమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రచయిత కామేశ్వరరావు సాహిత్య సేవను కొనియాడారు. భాషాభిమానులు, సాహితీవేత్తలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## కదలరు.. మెదలరు..

పుష్కరఘాట్ వద్ద ట్రాఫిక్ రద్దీ

టి.నగర్, న్యూస్‌టుడే: స్థానిక గోకవరం బస్టాండ్ నుంచి పుష్కరఘాట్ గోదావరి గట్టు మీదుగా ప్రయాణం సవాలుగా మారుతోంది. నిత్యం ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. ధవళేశ్వరం, కొవ్వూరు మీదుగా వెళ్లే వాహనాలు ఇటు వైపే వెళ్లడంతో రద్దీ పెరుగుతోంది. దీనికి తోడు గట్టు రోడ్డును ఆనుకొని ప్రధాన వాణిజ్య సముదాయాలు ఉండటం కూడా ట్రాఫిక్‌ను పెంచుతోంది. మెయిన్ రోడ్డు, కోటగుమ్మం ప్రాంతాల్లో వాణిజ్య కేంద్రాలుగా ఉన్నాయి. వస్త్ర, బంగారు, ఇతర వ్యాపార సముదాయాలు గట్టు ప్రాంతాన్ని ఆనుకొని దిగువన ఉన్నాయి. ఇక్కడకు ఉభయగోదావరి జిల్లాల నుంచి వస్తుంటారు. సెలవులు, ప్రత్యేక పండగ రోజుల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. అలాంటి సందర్భాల్లో రోజుకు లక్షమంది వస్తారని ఓ అంచనా. మార్కెట్‌కు వచ్చే వాహనాలు ఇక్కడ రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ కచ్చితమైన ట్రాఫిక్ ఆంక్షలు విధించాల్సి ఉంది. అలాగే రహదారులను విస్తరించాలి. ప్రస్తుతం గోదావరి వరద కారణంగా ఎక్కువమంది వస్తున్నారు. దీంతో సమస్యగా ఉంది. దీనిపై యంత్రాంగం స్పందించాలని నగరవాసులు కోరుతున్నారు.

(c) eenadu

# రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

## శిరస్త్రాణం.. జీవితానికి రక్షణ

అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనునాయక్

**అనపర్తి గ్రామీణం:** ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరించడం వల్ల వారి జీవితంతో పాటు కుటుంబానికి కూడా రక్షణ లభిస్తుందని అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ అన్నారు. ఆదివారం అనపర్తిలో వాహన చోదకులకు శిరస్త్రాణం వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

రాపాకలో సారె తీసుకువెళ్తున్న మహిళలు

**సీతానగరం, న్యూస్‌టుడే:** సీతానగరం మండలం ములకల్లంకలోని లంకాలమ్మను పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో ఆదివారం శాకంబరిగా అలకరించారు. గోదావరి నది వద్ద పూలు, కుంకుమలతో పూజలు చేశారు. రాపాకలో మారెమ్మ, గోగులమ్మలకు ప్రతి ఇంటి నుంచి సారె తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు. మిర్తిపాడులోని వేగులమ్మ అమ్మవారి సారె కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అ వీ ఇ వీ అ న్నీ

## వైద్య శిబిరానికి విశేష స్పందన

**రాజానగరం:** జీఎస్ఎల్ వైద్య కళాశాల ఛైర్మన్ డా.గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో రాష్ట్రీయ చర్మవ్యాధుల అసోసియేషన్ సహకారంతో రాజానగరం పీహెచ్‌సీలో ఆదివారం చర్మవ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. డా.సీతారాం, డా.వెంకటరమణ, డా.సుభాషిణి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**రాజానగరం:** మండలంలోని 11 కేవీ శ్రీరాంపురం ఫీడర్‌పై మరమ్మతుల నిమిత్తం శ్రీకృష్ణపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాంపురం గ్రామంలో వ్యవసాయబోర్లకు ఈ నెల 14వ తేదీన విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఇన్‌ఛార్జ్ జె.పి.బి.నటరాజన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

## 'హామీలు అమలు చేయకుండా సంబరాలా'

**రంగంపేట:** ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను పూర్తిగా అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం సంబరాలు జరుపుకోవడం హాస్యాస్పదమని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వీరంపాలెంలో మండల వైకాపా సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, లంక చంద్రన్న, పోతుల బులివీర్రాజు, అడబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆడుతూ.. పాడుతూ తల్లులకు శిక్షణ

### అంగన్‌వాడీలకు చేరిన నూతన పుస్తకాలు

**బొమ్మూరు, న్యూస్‌టుడే:** చిన్నారులు బాల్య దశలో ఎదగడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నవచేతన, ఆధార్ శిల పుస్తకాలు రూపొందించింది. మహిళా శిశు సంక్షేమ శాఖలోని ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలు పంపిణీ చేశారు. 0 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు శారీరకంగా, మానసికంగా ఎదగడానికి ప్రణాళికబద్ధంగా సిలబస్‌ను పుస్తకాల్లో రూపొందించారు. చిట్టి కథలు, హావభావాలతో వివరణ, ఆసక్తికరమైన బొమ్మలు ప్రచురితం చేశారు.

### నవచేతన పుస్తకంలో ఇలా..

ఇందులో పసిబిడ్డలు పుట్టినప్పటి నుంచి 3 సంవత్సరాల వరకూ ఎలా చూసుకోవాలో వివరించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి రెండేళ్ల లోపు 90 శాతం మెదడు ఎదుగుదల ఉంటుంది. కొత్తగా నవచేతన ద్వారా బిడ్డ తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచి తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నెలలు, ఏడాది పిల్లలతో కుటుంబీకులు ఎలా ప్రవర్తించాలో రూపొందించారు. సెల్‌ఫోన్ ఉపయోగించకుండా ఆటపాటలతో వారిని ఆడించడం, రంగులు, చిన్న కథలను తల్లులు ఎలా చెప్పాలో కేంద్రాలకు వచ్చే తల్లులు, బాలింతలకు అవగాహన కల్పిస్తారు. తల్లితో పాటు బిడ్డ ఎదుగుదల ఏ విధంగా జరుగుతుంది, రోజు వారి దినచర్య, తీసుకోవాల్సిన పోషకాహారాన్ని వివరిస్తారు.

బొమ్మూరు కేంద్రంలో చిన్నారులు

| మండలాలు | కేంద్రాలు |
|---|---|
| రాజమండ్రి గ్రామీణం | 131 |
| కడియం | 82 |
| కోరుకొండ | 85 |
| అనపర్తి | 66 |
| రాజానగరం | 100 |
| సీతానగరం | 69 |
| గోకవరం | 74 |
| బిక్కవోలు | 70 |
| రంగంపేట | 49 |

నవచేతన, ఆధార్ శిల పుస్తకాలతో పీడీ లక్ష్మి

### ఆధార్ శిలలో..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల పిల్లలు కొత్త విషయాలపై శ్రద్ధ చూపిస్తారు. వారు ఇంటి బాట పట్టకుండా ఉండేందుకు వినోదాత్మకంగా పాఠాలు బోధిస్తారు. కథలు, పద్యాలు, అంకెలు ఉంటాయి. వారంలో రెండు రోజులు కథలు, అంకెలు, మంచి అలవాట్లు గురించి వివరిస్తారు. ఆటపాటలతోనే విషయాలు గ్రహించే కృత్యాలు బోధిస్తారు. సంభాషణ చేస్తూ మధ్యలో ప్రశ్నలు వేస్తారు. భాషానైపుణ్యం, సృజనాత్మక పెంపొందించే కథలు ఉంటాయి.

### మేధస్సును పెంచుతాయి..

కొత్తగా ఇచ్చిన పుస్తకాలు పసి బిడ్డ నుంచి ఆరేళ్లలోపు పిల్లల్లో సృజనాత్మకత, ఏకాగ్రత పెంపొందించే విధంగా తయారు చేశారు. దీనిపై నిర్వాహకులు కేంద్రాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టడానికి కావాల్సిన విషయాలు తల్లి పూర్తిగా పాఠాల ద్వారా నేర్చుకుంటారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం ఆరోగ్యాన్ని, పోషకాహారం అందించే తల్లిలా ఉపయోగపడతాయి.

– లక్ష్మి, మహిళా, శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకురాలు

## శాకంబరిగా తొర్రేడు వనువులమ్మ

**బొమ్మూరు:** ఆషాఢ మాసం సందర్భంగా తొర్రేడు గ్రామ దేవత వనువులమ్మను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రకరకాల పండ్లు, కూరగాయలతో శాకంబరిగా ఆదివారం అలంకరించారు. అమ్మవారిని దర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేశామని, ప్రతి ఏటా ఇదే విధంగా చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

**పార్వతీదేవికి సారె సమర్పణ..** **బిక్కవోలు:** ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని బలభద్రపురంలో పార్వతీదేవి అమ్మవారికి గ్రామస్థులు సారె సమర్పించారు. ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి రథంలో ఆమె పుట్టిల్లు అయిన వేణుగోపాల స్వామి దేవాలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. గ్రామోత్సవం నిర్వహించారు. శివాలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలతో కూడిన సారె సమర్పించారు. కొత్తలంక సోమన్నస్వామి పాల్గొన్నారు. ● జువ్వలదొడ్డిలోని సత్తెమ్మ అమ్మవారికి ఆదివారం సారె సమర్పించారు. భక్తులంతా ఊరేగింపుగా వెళ్లి 558 కిలోల స్వీట్లు, పసుపు, కుంకుమతో కూడిన సారె సమర్పించారు.

## 'నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నా'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

**రాజానగరం, న్యూస్‌టుడే:** నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా అహర్నిశలు కృషి చేస్తున్నానని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరంలో నియోజకవర్గస్థాయి జనశ్రేణుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రణాళికా వ్యూహం మేరకు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ మరో 15 సంవత్సరాలు జనసేన జెండా రాజానగరం నియోజకవర్గంలో రెపరెపలాడేలా సమష్టిగా కృషి చేద్దామన్నారు. నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు హాజరయ్యారు.

## బిక్కవోలులో రూ.19.1 కోట్లతో అభివృద్ధి



గ్రామస్థులకు కరపత్రాలు అందజేస్తున్న మనోజ్‌రెడ్డి

**బిక్కవోలు, న్యూస్‌టుడే:** మండలంలో ఏడాదిగా రూ.19.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెదేపా నేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి తెలిపారు. ఆదివారం బిక్కవోలులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు ఇంటింటా అందించారు.

## వెదుళ్లపల్లి విద్యార్థికి ట్రిపుల్ ఐటీ సీటు

**సీతానగరం, న్యూస్‌టుడే:** సీతానగరం మండలం వెదుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆకుల బాల శివదత్త తులసి మనోహర్‌కు రెండో విడత విడుదల చేసిన జాబితాలో ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళంలో సీటు వచ్చినట్లు ప్రధానాచార్యుడు ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ఇనుగంటివారిపేటకు చెందిన మనోహర్ పదో తరగతి పరీక్షల్లో 569 మార్కులు సాధించిన ప్రతిభతో ప్రవేశం వచ్చిందన్నారు.

## పురుషోత్తపట్నం వద్ద 22 మీటర్లకు పెరిగిన నీటిమట్టం

మునికూడలి దేవాన్స్ పుష్కర ఘాట్‌ను ముంచెత్తిన వరద

**సీతానగరం, న్యూస్‌టుడే:** ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటి ప్రవాహంతో గోదావరి ఎడమగట్టున ఎత్తిపోతల పథకాల వద్దకు ముంపునీరు భారీగా చేరుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటిమట్టం 31 మీటర్లకు చేరుకుంది. దీంతో 48 గేట్లు ద్వారా సుమారు 7.43 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీతానగరం మండలంలో లంక గ్రామాలను ఆనుకుని వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల వద్ద ఆదివారం సాయంత్రం 5 గంటల సమయానికి 22 మీటర్లకు నీటిమట్టం పెరిగింది. దీంతో 350 క్యూసెక్కులు పుష్కరకాలువలకు మళ్లించినట్లు జలవనరులశాఖ డీఈ సీహెచ్.కోటేశ్వరరావు తెలిపారు. రెండు రోజుల్లో మరో 350 క్యూసెక్కుల నీటిని తుని వరకు పంపిస్తామన్నారు. మెట్ట మండలాల్లోని 1.50 లక్షల ఎకరాలకు అవసరమైన 1,400 క్యూసెక్కులు నీటిని అంచలంచెలుగా విడుదల చేస్తామన్నారు. కాగా మునికూడలి దేవాన్స్ పుష్కరఘాట్ వద్ద భారీగా ముంపునీరు చేరింది. సీతానగరం, రఘుదేవపురం, సింగవరం లంకల్లో వేసిన ఉద్యానపంటలను వరద నీరు తాకింది. పురుషోత్తపట్నం-పోలవరం ఫెర్రీ రేవులో లాంచీలను ఆదివారం ఉదయం నుంచి నిలిపివేయించారు.

## ఆకట్టుకున్న కోలాటం

కోలాటాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

**రాజానగరం, న్యూస్‌టుడే:** మండలంలోని తోకాడలో వెంకటరామా కోలాట భజన మండలి ఆధ్వర్యంలో కోలాటం నేర్చుకున్న చిన్నారులకు ఆదివారం గజ్జెలపూజ నిర్వహించారు. బత్తుల వెంకటలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై కొత్తగా కోలాటం నేర్చుకున్న చిన్నారులకు, మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని ఘనంగా చాటేందుకు ఇటువంటి కార్యక్రమాల ద్వారా అందరూ ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. కూటమి నాయకులు, తోకాడ గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు, మహిళలు కోలాటాన్ని ప్రదర్శించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

**సమస్య:** అనపర్తి రాముడమ్మపేట సమీపంలో రైల్వే అండర్‌పాస్‌కు వెళ్లేదారిలో చెత్తఎక్కువగా వేస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంటుంది. – స్థానికులు

**సమాధానం:** తక్షణమే పారిశుద్ధ్య కార్మికులను పంపి చెత్త తొలగిస్తాం. – ఫణికుమార్, ఇన్‌ఛార్జి కార్యదర్శి, అనపర్తి

- న్యూస్‌టుడే, అనపర్తి గ్రామీణం

## కాలువ సమస్య పూర్తి

హుకుంపేట కూడలి సమీపంలో మురుగుకాలువ వంతెన చిన్నగా ఉండి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. హుకుంపేట, రామకృష్ణనగర్, బాలాజీపేట నుంచి అధిక సంఖ్యలో నిత్యం ఈ మార్గంలో రాజమహేంద్రవరం, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. గోదావరి వరద వస్తే మురుగు రోడ్డుపై చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రణాళికలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కల్వర్టు పనులను ప్రారంభించారు. త్వరితగతిన పనులు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా 90 శాతం పూర్తి చేశారు. కల్వర్టు పెద్దగా నిర్మాణం చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. –న్యూస్‌టుడే, బొమ్మూరు

## రూ.2.68 కోట్లతో బొబ్బిల్లంక గట్టు పనులు

మండలంలోని బొబ్బిల్లంక వద్ద బలహీనపడిన అఖండ గోదావరి గట్టును పటిష్ఠ చేసేలా పనులు చేపట్టారు. సుమారు 115 మీటర్ల పొడవునా స్టోన్‌రివిట్‌మెంట్, పిచ్చింగ్ ప్లాట్‌ఫామ్‌లు రూ.2.68 కోట్లతో నిర్మాణం పూర్తిచేయాల్సి ఉందని ఏజీఎల్‌బీ ఏఈ అడ్డాల శివప్రసాద్ ఆదివారం తెలిపారు. ఏటా వరదల సమయంలో బొబ్బిల్లంక ఏటిగట్టుకు నీటిప్రవాహం వేగంగా వస్తోందని దీంతో అత్యవసరంగా ఈపనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రతిపాదనలతో నిధులు మంజూరయ్యాయన్నారు. నెలరోజుల వ్యవధిలో ఈ పనులు పూర్తిచేస్తామన్నారు. ఏటిగట్టు పరిరక్షణ పనులు ములకల్లంక, బొబ్బిల్లంక, జాలిమూడి, కాటవరం మునికూడలి వరకు 2.7 కి.మీ పరిధిలో పనులు చేపట్టేలా అవసరమైన నిధులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. – న్యూస్‌టుడే, సీతానగరం

## అంతా నీటిమయం

బొమ్మూరు ఏపీ ట్రాన్స్‌కో సమీపంలో పైపులైన్ నుంచి నీరు వృథాగా పోతుంది. నీరు వేగంగా వస్తుండటంతో ప్రధానరహదారి నుంచి మహిళా ప్రాంగణం వరకూ నీరు పారుతుంది. మలుపు వద్ద వేగంగా వస్తున్న వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దీంతో ప్రయాణికులు భయపడుతున్నారు. సమస్యపై గ్రామకార్యదర్శి కాశీని వివరణ కోరగా మరమ్మతులు చేయించి నీరు పారకుండా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

## అనపర్తితో 'కోటా'నుబంధం

జీబీఆర్ విశ్రాంత ప్రిన్సిపల్ బి.రత్నారెడ్డి కుటుంబ సభ్యులతో..

**అనపర్తి గ్రామీణం:** విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి బాధాకరమని భాజపా సీనియర్ నాయకుడు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోటాతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 1998 ఎన్నికల సందర్భంగా భాజపా తరపున ప్రచారం నిమిత్తం అనపర్తి వచ్చినప్పుడు ఆయనతో దిగిన ఫోటోను మీడియాతో పంచుకున్నారు.

### ఏలూరులో కోటాతో కలసి చదువుకున్నా..

కోటా శ్రీనివాసరావు మృతి తనను కలిచివేసిందని అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ బి.రత్నారెడ్డి అన్నారు. 1966 ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో కోటాతో కలసి బీఎస్సీ చదువుకున్నట్లు తెలిపారు. ఇద్దరం స్నేహపూర్వకంగా ఉండేవారమని, తూర్పుగోదావరి జిల్లా వచ్చినప్పుడల్లా అనపర్తికి వచ్చి తనను కలిసేవారని గుర్తు చేసుకున్నారు. 2003లో తన పదవీ విరమణ కార్యక్రమానికి కూడా కోటా హాజరైనట్లు తెలిపారు.

## వ్యవసాయ కూలీకి పాముకాటు

**బిక్కవోలు, న్యూస్‌టుడే:** అనపర్తిలో పొలం పని చేస్తున్న విశాఖజిల్లా మట్టంవారిపాలానికి చెందిన కోరుకొండ నాగరాజును పాము కాటేసింది. స్థానికులు వెంటనే ఆయన్ని ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ప్రమాదం లేదని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

**బిక్కవోలు, న్యూస్‌టుడే:** కొప్పవరం రోడ్డులో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన కర్రి లక్ష్మి, ఆమె కుమారుడితో కలసి ద్విచక్ర వాహనంపై కొప్పవరం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న దొడ్డి దేవీప్రసాద్ వీరిని ఢీకొట్టాడు. దీంతో లక్ష్మికి గాయాలవ్వగా అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆసుపత్రి వర్గాలు పోలీసులకు సమాచారమిచ్చారు.

## మృతదేహం గుర్తింపు

**బిక్కవోలు, న్యూస్‌టుడే:** బలభద్రపురం బస్టాండు వద్ద మృతి చెందిన వ్యక్తిని యు.కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి గ్రామానికి చెందిన గంపల రాముడు(79)గా గుర్తించినట్లు ఎస్సై రవిచంద్రకుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అనపర్తి మండలంలోని పులగుర్తలో కొవ్వూరి సూరారెడ్డి ఇటుక బట్టీలో రాముడు పని చేస్తున్నారు. ఆదివారం రాముడు సైకిలుపై స్వగ్రామం ఇసుకపల్లి వెళ్తుండగా బలభద్రపురం వచ్చేసరికి మృతి చెందారు. అతని కుమారుడు గంపల నానాజీ సామాజిక మాధ్యమాల్లో తండ్రి ఫొటో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దర్యాప్తు జరపాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

**రాజానగరం, న్యూస్‌టుడే:** కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం పాలచర్లలో చోటుచేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వేమగిరి ముసలయ్యతో లలితకు పది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. భర్తను పనిలోకి ఎందుకు వెళ్లలేదని భార్య ప్రశ్నించింది. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదాలు జరిగాయని, దీంతో మనస్థాపానికి గురైన లలిత ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించిన అనంతరం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో శవపరీక్ష నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

## 'దుప్పలపూడి ఘటనపై రాజకీయాలు మానుకోవాలి'

**అనపర్తి గ్రామీణం:** దుప్పలపూడిలో ఇటీవల జరిగిన ఘటనను మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి రాజకీయాలకు వాడుకుంటున్నారని, అన్యాయం జరిగిన కుటుంబానికి న్యాయం చేద్దామనే ఆలోచనే లేదని తెదేపా తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం దుప్పలపూడిలో జరిగిన విలేకరుల సమావేశంలో తెదేపా నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. దుప్పలపూడి గ్రామాన్ని అప్రతిష్ఠపాలు చేయాలనే ఆలోచనతో మాజీ ఎమ్మెల్యే ఉన్నారన్నారు. రోడ్డు ప్రమాదం విషయంలో వివాదం జరిగిందన్నారు. నల్లమిల్లి వీరవెంకటరామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ తాను వైకాపా సానుభూతిపరులకే అండగా నిలిచానన్నారు. వారికి అన్యాయం జరగకూడదని మాట్లాడుతుంటే రౌడీయిజం అంటారా..? అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే రాజకీయాల కోసం జనం మధ్య చిచ్చుపెట్టడం మానుకోవాలన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రపంచ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులుగా ఎదగాలి

బహుమతి అందుకుంటున్న అనంతపురం జట్టు

**రాజానగరం:** ఫుట్‌బాల్ క్రీడలో మంచి నైపుణ్యం సాధించి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం కులపతి కె.వి.వి.సత్యనారాయణరాజు అన్నారు. జీజీయూ ప్రాంగణంలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో రోటరీక్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ఎపిక్ స్పోర్ట్స్ ఫుట్‌బాల్ అకాడమీ నిర్వహణలో రెండు రోజులుగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సబ్‌జూనియర్ బాలుర ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2025 ఆదివారంతో ముగిసింది. ఎం.వెంకన్నబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఓఎన్‌జీసీ కేజీబీజీ బేసిన్ మేనేజర్ కె.కరువనన్నన్, చార్టర్ ప్రెసిడెంట్ తీగల రాజు మాట్లాడారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమస్థానాన్ని అనంతపురం జిల్లా దక్కించుకుందని, ద్వితీయ, తృతీయ స్థానాలను కృష్ణా, తిరుపతి జిల్లాలు సాధించాయని హెడ్ ఆఫ్ ది రిఫరీ పి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డి.ఎం.ఎం.శేషగిరి, జీజీయూ ఉపకులపతి డా.యు.చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి వి.విజయ్‌కుమార్, వి.రాజశేఖర్, ఎం.కిరణ్‌కుమార్ రెడ్డి, ఇమ్మనేని వెంకట్, మద్దూర్ శంకర్ పాల్గొన్నారు.

తలపడుతున్న క్రీడాకారులు

## పైపైకి పచ్చిమిర్చి

**దేవీచౌక్, న్యూస్‌టుడే:** వర్షాలకు దిగుబడి తగ్గడంతో పచ్చిమిర్చి ధర ఒక్కసారిగా పెరిగింది. స్థానికంగా పచ్చిమిర్చి పంట లేకపోవడంతో కొంతకాలంగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. రాజమహేంద్రవరం మార్కెట్‌కు దిగుమతి తగ్గడంతో ప్రస్తుతం రైతుబజార్లలో కిలో ధర రూ.68 చేరుకుంది. బహిరంగ మార్కెట్లో సుమారు రూ.100 విక్రయిస్తున్నారు. నగరంలో ఏడు రైతుబజార్లు ఉండగా ఆల్కాట్‌తోట మినహా మిగిలిన వాటికి రోజుకు 5 క్వింటాళ్ల నుంచి 8 క్వింటాళ్ల వరకు అవసరం అవుతాయి. ధర పెరగడంతో వ్యాపారులు తక్కువ మొత్తంలో దిగుమతి చేసుకుంటున్నారు. గతనెల 29న కిలో రూ.28 ఉండగా ప్రస్తుతం దాదాపు రెండురెట్లు పెరిగింది. నెలక్రితం వరకు కడియం, కోరుకొండ మండలాల నుంచి తక్కువ మొత్తంలో మార్కెట్‌కు వచ్చేది. ప్రస్తుతం అది కూడా లేకపోవడంతో కడప జిల్లా మైదుకూరు, కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణా ఛార్జీల భారం, పంట దిగుబడి తగ్గడం వంటి కారణాలతో ఇక్కడికి వచ్చేసరికి ఖరీదు పెరుగుతోంది.

పెరుగుదల ఇలా (కిలో.. రూ.ల్లో)

| తేదీ | ధర |
|---|---|
| 29-6 | 28 |
| 30-6 | 32 |
| 2-7 | 35 |
| 4-7 | 36 |
| 5-7 | 40 |
| 6-7 | 46 |
| 7-7 | 55 |
| 12-7 | 64 |
| 13-7 | 68 |

రైతుబజారులో వినియోగదారుల కొనుగోలు

## చెరువులు.. ప్రమాదభరితం

రక్షణ కల్పించాలని ప్రజల వినతి

**కోరుకొండ, రాజానగరం, న్యూస్‌టుడే:** ప్రమాదాలు ఏ రూపంలో వస్తున్నాయో అర్థం కావడం లేదు. రోడ్డు ప్రమాదాలు సర్వసాధారణం అయినా చెరువులు, గోతులూ ప్రమాదానికి సంకేతాలుగా మారాయి. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం మండలాల్లో ప్రధానంగా పలు చెరువులు రక్షణ లేకుండా ఉండటంతో ప్రమాదాన్ని సూచిస్తున్నాయి.

### మృత్యువుకు చిరునామా

కోరుకొండ మండలంలో పలు చెరువులు మృత్యువుకు చిరునామాగా మారాయి. కోరుకొండ గ్రామానికి ఆనుకుని అంకాలమ్మ చెరువు ప్రధాన కూడలిలో ఉంది. గతంలో చాలా వరకు రక్షణ గోడ ఉండేది. ఇప్పుడు కొన్ని చోట్ల రక్షణ గోడలు శిథిలస్థితికి చేరాయి. రహదారికి ఆనుకుని ఉంటుంది. చుట్టూ నివాసాలు ఉన్నా ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ఈ చెరువుకు ఆనుకుని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ ఎటువంటి రక్షణ ఏర్పాటు చేయకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

రక్షణ లేని అంకాలమ్మ చెరువు

● రాజమహేంద్రవరం - సీతానగరం ప్రధాన రహదారిలో రాజంపేట వద్ద చెరువు ప్రమాదకర పరిస్థితుల్లో ఉండటంతో పలువురు క్షతగాత్రులవుతున్నారు. నాలుగు వరుసల రహదారి విస్తరణలో భాగంగా రక్షణగోడ నిర్మాణం చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఆపనులు చేయకుండా వదిలేశారు. చెరువు పక్కనే ఇసుక రేవుకు వెళ్లే ర్యాంపు ఉంది. ఆఇసుక వాహనాలు తిరగబడిన ఘటనలూ ఉన్నాయి. గతంలో ఇదే ప్రదేశంలో ముగ్గురు మృతిచెందారు. అయినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు.

### నిత్యం రాకపోకలు..

కాపవరం - మునగాల వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని చెరువును మృత్యువు వెంటాడుతోంది. ఈమార్గంలో నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు మూడేళ్ల క్రితం ఇద్దరు చిన్నారులు సైకిల్ తొక్కుతూ వెళ్లి ప్రమాదవశాత్తు రోడ్డు నుంచి నేరుగా చెరువులో పడి చనిపోయారు. అయినా చెరువుకు రక్షణ గోడలు గాని, ఇనుప మెస్ గాని లేకపోవడంతో ప్రయాణికులు భయపడుతున్నారు. ఇదే మాదిరిగా స్థానిక కోనేరు పరిస్థితి కూడా ఉంది.



కాపవరం బ్రహ్మలింగం చెరువుకు ఆనుకుని రహదారి

### చర్యలు తీసుకుంటాం..

చెరువుల అభివృద్ధిలో భాగంగా ప్రమాదకరంగా ఉన్నవాటిని గుర్తించి వాటి చెంతన రక్షణ చర్యలు చేపడతాం. గ్రామాల్లో ఎక్కడైనా ప్రమాదకరంగా ఉన్న చెరువులు ఉంటే, వాటిని స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి కార్యకర్తల ద్వారా గుర్తించి రక్షణ తీసుకుంటాం. అధికారులు కూడా వీటిపై దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటాం.

- బత్తుల బలరామకృష్ణ, రాజానగరం ఎమ్మెల్యే

(c) eenadu

# కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం


## కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ రోజు అమ్మవారికి రూ.2,86,081 ఆదాయం వచ్చింది. దర్శనాల ద్వారా రూ.82,540, అన్నదాన ట్రస్టుకు రూ.25,667, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.63,700, టిక్కెట్ అమ్మకాల ద్వారా రూ.70,374, విరాళాల రూపంలో రూ.43,800 ఆదాయం వచ్చింది. ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవికాంత్, ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్వీకేవీ శర్మ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పదో తరగతి పూర్వ విద్యార్థులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1990 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. పాఠశాలను సందర్శించి అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మధ్యాహ్నం భోజనాలు చేసి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. ప్రసాద్, హరికృష్ణ, కొండలరావు, నాగరమేష్, శ్రీనివాస్, సూరిబాబు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

## ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పట్టణంలో దీర్ఘకాలిక సమస్యగా మారిన ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కోటసత్తెమ్మ మోటార్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రాన్ని అందించారు. సంఘ అధ్యక్షుడు సంగాని వెంకటనారాయణ మాట్లాడుతూ నిడదవోలు పట్టణంలో గత 40 ఏళ్లుగా సుమారు 200 మంది వరకు రోజువారీ మోటార్ వర్క్‌షాపు పనిపైనే జీవిస్తున్నారన్నారు. వీరెవ్వరికీ సొంత స్థలాలు లేక అద్దె స్థలాల్లో జీవనం గడుపుతున్నామన్నారు. అద్దె చెల్లించుకోలేక ఇబ్బంది పడుతుండగా, రహదారి మార్జిన్‌లో వాహనాలు నిలుపుదల వల్ల పోలీస్ వారి నుంచి కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో వైఎస్సార్ వారి ఆధ్వర్యంలో సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించి ఆటోనగర్ ఏర్పాటుకు స్థల సేకరణ ప్రక్రియ మొదలు పెడతామని చెప్పారన్నారు. తామంతా కొంత నిధిని ఏర్పాటు చేసుకుని బ్యాంకు ఖాతాల్లో భద్రపరచి ఉంచామన్నారు. అయితే స్థల సేకరణ ప్రక్రియ కాలయాపన జరుగుతుందన్నారు. ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ✦ లారీలకు గ్రీన్ టాక్స్ తగ్గింపునకు జీవో జారీ చేయాలని కోరుతూ మంత్రి దుర్గేష్‌కు నిడదవోలు సత్యనారాయణ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రాన్ని అందించారు.

మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సభ్యులు

## ట్యాంకులు.. శిథిలావస్థతో వెతలు

తాగునీటి పథకం ట్యాంకులు శిథిలావస్థకు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన ఇవి క్రమంగా కూలడానికి సిద్ధమవుతున్నాయి. వాటి పరిసరాలు సైతం అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకుల్లో చేపట్టాల్సిన శుభ్రత చర్యలు సరిగా జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పరిశీలన

### పరిసరాలు అధ్వానం

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని రక్షిత తాగునీటి ట్యాంకు వద్ద పరిసరాలు అధ్వానంగా మారాయి. చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. వాల్వ్‌గేట్ నుంచి నీరు బయటకు వెళ్లే ప్రదేశమంతా మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. అందులోనే పందులు సంచరిస్తున్నాయి. దీంతో పక్క కాలనీవాసులు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకునీటి శుభ్రత, పరిశీలన వివరాలను నమోదు చేయడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యన్ మాట్లాడుతూ సంబంధిత సచివాలయ కార్యదర్శితో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు.

### ఎంతో భయంగా..

గోపాలపురం: చిట్యాల పంచాయతీ కార్యాలయం పరిధిలోని దాదాపు 20 ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. అక్కడక్కడ నీరు లీకవుతోంది. మరొక ట్యాంక్ నిర్మించాలని ప్రజలు ఎప్పటినుంచో కోరుతున్నారు. సమస్య పరిష్కారం కావడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

### నాలుగు దశాబ్దాల కిందట..

దేవరపల్లి: త్యాజంపూడిలోని 1986 సంవత్సరంలో నిర్మించిన మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరి పడిపోవడానికి సిద్ధంగా ఉంది. ట్యాంక్ నిర్మించి సుమారు 40 సంవత్సరాలు పూర్తి అవ్వడంతో పెచ్చులూడుతూ అంచులంటా నీరు కారుతోంది. ట్యాంక్‌పై మొక్కలు మొలుస్తున్నాయి. ఈ ట్యాంక్ 60 వేల లీటర్ల సామర్థ్యం ఉండి 400 కుటుంబాలకు నీటిని అందిస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో ఏదైనా ప్రమాదం జరగక ముందే ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

### తరచూ మరమ్మతులు..

నల్లజర్ల: సింగరాజుపాలెం పంచాయతీ పరిధిలోని కొండాయిగుంట గ్రామంలో 30 ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంక్ పైభాగం రంధ్రాలు పడి తరచూ లీకేజీ అవుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. నీరంతా ధారలుగా కిందకు పడి, ఆ చోట మురుగులా మారి దోమలు విజృంభిస్తున్నాయి. మెట్లు విరిగి పడుతున్నాయి. మరమ్మతులు చేపట్టినా కొన్నాళ్లకే సమస్య మళ్లీ మొదలవుతోందని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

దేవరపల్లి, నల్లజర్ల: ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం రామన్నపాలెం విద్యుత్తు 11కేవీ ఫీడర్ పరిధిలో ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు.

### చోడవరంలో వ్యవసాయానికి..

అనంతపల్లి విద్యుత్తు ఉప కేంద్రంలోని చోడవరం గ్రామంలో ఆర్డీఎస్ఎస్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మంగళ, బుధ, గురు వారాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయ విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఈఈ తెలిపారు. త్రీఫేస్ సరఫరా ఉదయం 3 నుంచి 8 గంటల వరకు, మరలా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కొవ్వూరు పట్టణం: ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాకారమే కూటమి ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణ పరిధిలో ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య సేవలకు చెక్కులను అందించారు. కల్యాణి రాజ్యలక్ష్మికి రూ. 2.70 లక్షలు, పాకా ప్రశాంతికి రూ. 53 వేలు, చంద్రమౌళి లక్ష్మీగణేష్ కుమార్‌కు రూ. 53 వేలు అందించారు.

## వాహనదారులు శిరస్త్రాణం ధరించాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనదారులు కచ్చితంగా శిరస్త్రాణం ధరించాలని నిడదవోలు సీఐ వీవీజీ తిలక్ సూచించారు. నిడదవోలు గణపతికూడలిలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. రహదారి భద్రతా నియమాలు పాటించాలని అవగాహన కల్పించారు. పట్టణ ఎస్సైలు జగన్ మోహనరావు, జీఎస్ఆర్కే పరమహంస, సిబ్బంది ఉన్నారు.

## స్వాధీనం చేసుకున్న డ్రెడ్జింగ్ పడవ అదృశ్యం

### జలవనరుల శాఖ ఏఈ ఫిర్యాదు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: జల వనరుల శాఖ స్వాధీనం చేసుకున్న డ్రెడ్జింగ్ పడవ అదృశ్యమైనట్లు ఆ శాఖ ఏఈ జి.మణికంఠరాజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దండకుంట రేవులో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వుతున్న రెండు పడవలను ఇటీవల సీజ్ చేశారు. వాటిని ఆ రేవు వద్ద కట్టి ఉంచారు. ఈ నెల 11న వెళ్లి చూడగా ఒకటి మాత్రమే ఉంది. దీనిపై దర్యాప్తు చేయగా ఆ పడవ యజమానులే తీసుకెళ్లారని తెలిసింది. దీనిపై ఏఈ ఫిర్యాదు చేయగా సీఐ పి.విశ్వం కేసు నమోదు చేశారు.

## సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

కొవ్వూరు పట్టణం, ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కొవ్వూరు పట్టణ పరిధి 23వ వార్డులో ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందించారు. క్షేత్ర స్థాయి సమస్యలపై ఆరా తీశారు. సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మురుకొండ శ్రీను, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు, పెనుమాక జయరాజు, కొప్పాక జవహర్, అర్జెల్లి రామకృష్ణ పాల్గొన్నారు. ✦ ప్రజలు చెప్పిన సమస్యలు యాప్‌లో నమోదు చేసి సకాలంలో పరిష్కరిస్తామని ఏపీ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. మండలంలోని తాడిపర్రులో ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. తెదేపా మండల శాఖ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నాయకులు పెండ్యాల గోవిందరావు, నందిన వీరరాఘవులు, వాకలపూడి సత్యనారాయణ, కత్తుల మాణిక్యం, మారిశెట్టి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాడిపర్రులో మహిళకు పత్రాన్ని అందజేస్తున్న శేషారావు

## ఆలయాల్లో ఆషాఢమాస వేడుకలు

దేవరపల్లిలో అమ్మవారికి సారె

కొత్తపల్లిఅగ్రహారంలో నేరేళ్లమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు, చాగల్లు, తాళ్లపూడి, కొవ్వూరు, దేవరపల్లి, నల్లజర్ల: ఆషాఢమాసం పురస్కరించుకుని ఆదివారం అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. వడ్లూరులో కొలువైన కనకదుర్గమ్మను వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. అమ్మవారిని మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. మండలంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ✦ మునిపల్లిలో పోలేరమ్మను, ఆలయాన్ని గ్రామస్థులు 220 కేజీల 21 రకాల కూరగాయలతో అలంకరించారు. చీరలు, రవికెలు. గాజులు, గోరింటాకు, 20 రకాల పిండిపదార్థాలు సమర్పించారు. ✦ బ్రాహ్మణగూడెంలోని నాగారమ్మను, పెద్దేవంలో గార్లమ్మతల్లిని, కొవ్వూరులో కొవ్వూరమ్మను శాకంబరిగా అలంకరించి, సారెను సమర్పించారు. ✦ దేవరపల్లిలో కడియాలమ్మకు, ఆవపాడులో విజయదుర్గ, ముత్యాలమ్మకు గ్రామస్థులు ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించారు. కూరగాయలతో శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

వడ్లూరులో కనకదుర్గమ్మ

కొవ్వూరమ్మ..

ఆవపాడు ముత్యాలమ్మ

అలంకరణలో విజయదుర్గ

మునిపల్లి పోలేరమ్మ

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498 ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

### దుర్వాసన వెదజల్లుతుంది

**సమస్య:** ప్రకాశరావుపాలెం నుంచి ఆవపాడుకు వెళ్లే బీటీ రహదారి పక్కన స్థానికులు వ్యర్థాలను వేయడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది.

– శ్రీనివాసు, గ్రామస్థుడు

**సమాధానం:** సమస్యను పరిశీలించి వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

- కొత్తూరి జాన్ విక్టర్‌బాబు, సర్పంచి, ప్రకాశరావుపాలెం – న్యూస్‌టుడే, నల్లజర్ల

## రహదారి కోతతో ఇక్కట్లు

దమ్మెన్ను, నడిపల్లికోట నుంచి వేలివెన్ను వెళ్లే రహదారి పలుచోట్ల దిగబడి, కోతకు గురైంది. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాధాన్యత గల ఈ రహదారికి మరమ్మతు పనులు చేయించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి మరమ్మతు పనులు చేయిస్తామని జడ్పీ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

## ఆదమరిస్తే అపాయం

దేవరపల్లి మండలం త్యాజంపూడిలోని సచివాలయం వెనుక ఉన్న గేట్‌వాల్వ్‌పై రక్షణ దిమ్మలు లేకపోవడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. వీటి సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం, జడ్పీ పాఠశాల ఉండడంతో నిత్యం విద్యార్థులు, చిన్నారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎవరైనా ఆదమరిచి గుంతలో పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాజారావును సంప్రదించగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, దేవరపల్లి

## ట్రాఫిక్ సమస్యలు తొలగించరూ..?

నిడదవోలు పట్టణంలో ప్రస్తుతం ఆర్వోబీ నిర్మాణ పనుల కారణంగా వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా దారుల్లో దుకాణాల వద్దకు వచ్చే వాహనాలను రహదారిపైనే నిలుపుదల చేస్తుండంతో ట్రాఫిక్ ఏర్పడుతోంది. దీంతో పట్టణంలోని గణపతికూడలి నుంచి బస్టాండ్‌కు వెళ్లు రహదారిలో ట్రాఫిక్ గణనీయంగా పెరిగింది. గణపతికూడలి నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు రహదారి ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

## ద్విచక్రహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

**చాగల్లు, న్యూస్‌టుడే:** కొవ్వూరు మండలం కుమారదేవం ఏటిగట్టుపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కుమారదేవం గండిపోశమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రాగోలపల్లి గ్రామానికి చెందిన ఎన్.రవి, దివిలికి చెందిన బి.వెంకటేష్‌ల ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ సమయంలో అటుగా వెళ్తున్న తాళ్లపూడి మండల జనసేన అధ్యక్షుడు గంటా శివరామకృష్ణ క్షతగాత్రులను 108 వాహనంలో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## చోరీలకు పాల్పడిన ముగ్గురి అరెస్టు

### రూ.6 లక్షలు విలువైన వస్తువులు స్వాధీనం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పలు చోరీల్లో నిందితులైన ముగ్గురిని పట్టణ పోలీసులు అరెస్టు చేసి సెంట్రల్ జైలుకు పంపించారు. కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న అర్ధరాత్రి పట్టణ పరిధి సంస్కృత పాఠశాల సమీపంలో తొండ్రంకి కురిమిశెట్టికి చెందిన దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించి 12న మధ్యాహ్నం నందమూరు రోడ్డులోని బుద్ధుడి విగ్రహం వద్ద వేములూరుకు చెందిన గుడ్ల సతీష్, నామవరానికి చెందిన తమ్మిశెట్టి సాయి, కొంతమూరుకు చెందిన బొండపల్లి అచ్యుత్‌లను అరెస్టు చేశారు. దుకాణంలో రూ. 3వేలు నగదు, థమ్స్‌ప్ బాటిళ్ల కేసులు 9, హోమ్‌థియేటర్ చోరీ కాగా రూ.500 నగదు రికవరీ అయ్యింది. అయితే వేరే చోరీలకు సంబంధించి వారి నుంచి 5 ద్విచక్ర వాహనాలు, ఆండ్రాయిడ్ ఫోను, వెండి పట్టీలు, బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.6 లక్షలు వరకు ఉంటుంది. గుడ్ల సతీష్‌పై పట్టణ స్టేషన్లో గతంలో 5 కేసులు ఉన్నాయి. విశ్వం మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ జి.దేవకుమార్ పర్యవేక్షణలో సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పాటై దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించామన్నారు.

## జూద శిబిరంపై దాడి

**గోపాలపురం, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని చెరుకుమిల్లి గ్రామ శివారులోని ఆయిల్‌పామ్ తోటలో జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం దాడి నిర్వహించినట్లు ఎస్సై పి.మనోహర్ తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## కారు ఢీకొనడంపై కేసు

కొవ్వూరు పట్టణం: కారు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల ప్రకారం.. పట్టణ పరిధి ఇందిరమ్మ కాలనీకి చెందిన కటకంశెట్టి గణేష్ ఈ నెల 9న దొమ్మేరు రోడ్డులోని పెట్రోలు బంకునకు వెళ్లి రోడ్డు దాటుతుండగా కొవ్వూరు వైపు వస్తున్న కారు ఢీకొంది. కాలికి గాయమవ్వగా కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి పంపించారు. గణేష్ ఇచ్చిన ఫిర్యాదుపై హెడ్‌కానిస్టేబుల్ ఎంవీవీ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

## పైపైకి వర్జీనియా పొగాకు ధర

### రైతు కళ్లల్లో సంతోషం

గోపాలపురం, దేవరపల్లి, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు ధరలు పెరగడంతో మెట్ట ప్రాంత రైతుల్లో సంతోషం వెల్లువిరుస్తోంది. కొనుగోలు ప్రారంభమై రెండు నెలల తర్వాత ఈ ధర గరిష్ఠంగా రూ.339 చేరుకుంది. కొద్ది రోజుల నుంచి ఈ ధర నిలకడగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నాణ్యమైన పొగాకు గరిష్ఠ ధర రూ.339 వరకు పలకగా కనిష్ఠ ధర రూ.200 ఉంది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న ఐదు వేలం కేంద్రాల పరిధిలో ఈ ఏడాది మార్చి 27 కొనుగోలు ప్రారంభించగా సెలవు రోజులు మినహాయిస్తే ఒక్క రోజు కూడా పొగాకు అమ్మకాలు నిలుపుదల కాలేదు. గతంలో అయితే కొనుగోలు కంపెనీల వాళ్లు సరైన ధర ఇవ్వక పోవడంతో గిట్టుబాటు ధర రాకపోవడంతో పలుమార్లు రైతులు కొనుగోలు నిలుపుదల చేసేవారు. ఈ ఏడాది మొదట్లో అనుకున్న స్థాయిలో ధర పలకక పోయినా రైతులు అమ్మకాలకు ఇబ్బంది పెట్టలేదు. గత 15 రోజులు నుంచి కొంచెం ధర పెరగడంతో గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాలకు రోజూ 700 నుంచి 1,200 వరకు బేళ్లు అమ్మకానికి వెళ్తున్నాయి.

కేంద్రాల్లో ధర కిలోకు ఇలా..

| వేలం కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠ |
|---|---|---|
| గోపాలపురం(ఎన్ఎల్ఎస్) | 339 | 200 |
| దేవరపల్లి(ఎన్ఎల్ఎస్) | 338 | 200 |
| దేవరపల్లి(బీఎల్ఎస్) | 335 | 200 |

గోపాలపురం వేలం కేంద్రానికి వచ్చిన బేళ్లు

### 10.45 మిలియన్ల కిలోల అమ్మకాలు..

ఐదు వేలం కేంద్రాల పరిధిలో 24.11 మిలియన్ల కిలోలకు పైగానే సుమారు 26 కంపెనీలకు చెందిన వారు ఇప్పటి వరకు కొనుగోళ్లు చేశారు. తేలికపాటి నేలలో పండే ఎన్ఎల్ఎస్ 91,15,156.69 కిలోల పైగా, నల్లరేగడి నేలలో పండే బీఎల్ఎస్ 13,43,684 కిలోల పైగా కొనుగోలు జరిగింది.

### నిలకడగా పొగాకు ధర...

అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ధర ఆశాజనకంగా ఉండటంతో వేలం కేంద్రాల్లో పొగాకు ధర నిలకడగా ఉంది. రైతులు అధికారులు సూచించిన మేరకు బేళ్ల అమ్మకాలు చేసుకోవాలి. నాణ్యమైన పొగాకు మంచి ధర పలుకుతోంది.

– హేమస్మిత, వేలం నిర్వహణాధికారి, దేవరపల్లి

## శ్రీవారి విద్యా దాన ట్రస్ట్‌కు విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి విద్యా దాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం సమకూరింది. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం మల్లవరానికి చెందిన కె.వెంకటరాజు విరాళాన్ని ఆలయ కార్యాలయంలో ఆదివారం జమ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

ఈవో మూర్తికి చెక్కు ఇస్తున్న వెంకటరాజు

నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నాయకులు

## మేదరులను ఎస్టీల్లో చేర్చాలి: మస్తాన్‌రావు

గోపాలపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉన్న మేదరులను ఎస్టీల్లో చేర్చి వారి ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర మేదర సంఘ అధ్యక్షుడు జొరిగే మస్తాన్‌రావు అన్నారు. గోపాలపురంలోని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో తూర్పుగోదావరి జిల్లా మేదర సంఘ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు మస్తాన్‌రావు, నాగేంద్ర మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ఎక్కువైన తరుణంలో ఎదురు, ఇతర కలపతో వస్తువులు తయారు చేసే మేదరులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా నూతన కమిటీతో ప్రమాణం స్వీకారం చేయించారు. జిల్లా అధ్యక్షుడిగా శేనగవరపు ఓంనమఃశ్శివాయ, ప్రధాన కార్యదర్శిగా కాపల్లి నాగముత్యాలరావు, కోశాధికారిగా నోముల సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా పాతకోట సూర్య ప్రకాశ్‌లు ఎంపికయ్యారు.

## కోటకు నిడదవోలుతో అనుబంధం

నిడదవోలు, న్యూస్‌టుడే: సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు నిడదవోలుతో మంచి అనుబంధం ఉంది. 1996లో తాళి సినిమాను నిడదవోలు పరిసర ప్రాంతాల్లో నిర్మించారు. ఆ సమయంలో ఆయన నిడదవోలులో సుంకవల్లి గణేశ్వరరావు ఇంట్లో వారం రోజుల పాటు ఉన్నారు. ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో తెరకెక్కిన కత్తి కాంతారావు చిత్రం సందర్భంలో కూడా ఆయన నిడదవోలు పరిసరప్రాంతాల్లో నటించారు.

నిడదవోలులో గణేశ్వరరావు, వారి ఇంట్లో కోట శ్రీనివాసరావు తదితరులు

## ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

గోపాలపురం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల పంచాయతీ సర్పంచి ఎన్.సరోజిని పేర్కొన్నారు. మండలంలోని చిట్యాలలో తాళ్లపూడి గ్రామానికి చెందిన శ్రీసాయి స్ఫూర్తి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు డి.రామారావు, విటి.వర్మ, కె.మోనిక, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

## 'మానవత' ఆర్థిక సాయం

గోపాలపురం, తాళ్లపూడి, న్యూస్‌టుడే: గోపాలపురం మండలం వెళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన విద్యార్థి కొలూరి శ్రీజ కుటుంబం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. దీంతో ఆమె చదువు నిమిత్తం రూ. 16,000 నగదును ఆదివారం మండల మానవత సభ్యులు అందించారు. సంస్థ మండల ఛైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, సభ్యులు చంద్రశేఖర్, జోగేంద్రప్రసాద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. ● చిడిపి శివారులో నిలువ నీడ, చూసేవారు లేని కావూరి మాణిక్యానికి పోషణ నిమిత్తం మానవత సంస్థ తరఫున రూ. 6 వేలు సాయంతో పాటు మెడికల్‌కిట్‌ను అందించారు. ఆ సంస్థ అధ్యక్షుడు వి.శ్రీనివాసు, రీజనల్ ఛైర్మన్ చంద్రయ్య, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## రోటరీ మిడ్ టౌన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**నిడదవోలు, న్యూస్‌టుడే:** రోటరీ నిడదవోలు మిడ్ టౌన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఏబీఎస్ టౌన్‌హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా గుబ్బల సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఆరుగోల్లు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఆనందం మురళీకృష్ణ, కోశాధికారిగా దొంగ శివ నాగరాజు ఇతర కార్యవర్గ సభ్యులతో రోటరీ సీనియర్ సభ్యులు గాలి రాఘవయ్య ప్రమాణస్వీకారం చేయించారు.

(c) eenadu

**అమ్మను దర్శించి.. వృక్షాల కింద సేదతీరి**

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కులు తీర్చుకుని అడవిలోని వృక్షాల కింద సహపంక్తి భోజనాలు చేశారు.

## నేడు 'మీ కోసం'

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'మీ కోసం' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మండల, డివిజనల్, పురపాలక కార్యాలయాల్లోనూ కొనసాగుతుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో https://meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా వినతులు సమర్పించవచ్చన్నారు. వాటి పరిష్కార స్థితిని టోల్‌ఫ్రీ నంబరు 1100కు ఫోను చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

# వేసిన రోడ్డే వేయలేరు

**ప్రతిదీ నిధి యాప్‌లో నిక్షిప్తం** | **పీఆర్ విభాగంలో అమలు**

**ఈనాడు-ఏలూరు:** ఇకపై రోడ్డు మీద రోడ్డు వేయటం కుదరదు. బాగున్న రహదారులకు మరమ్మతులు చేయటం అంత కన్నా సాధ్యం కాదు. ఎక్కడైతే రోడ్డు అవసరం, దాని ప్రాధాన్యం ఉందో అక్కడే నిర్మించేలా పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రహదారులన్నీ వాటి భౌగోళిక వివరాలతో నిధి యాప్‌లోకి అప్‌లోడ్ చేస్తున్నారు.

గతంలో రోడ్డు మేనేజ్‌మెంట్ రిజిస్టర్ ఒకటి ఉండేది. అందులో మాత్రమే ఈ వివరాలు ఉండేవి. ఇవన్నీ ఈఈ, ఎస్ఈ పర్యవేక్షణలో ఉండేవి. ఈ క్రమంలో కొందరు నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి బాగున్న రహదారులనే తిరిగి నిర్మిస్తున్నారనే విమర్శల నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. అసలు ఏ రహదారి పరిస్థితి ఎలా ఉంది? దాన్ని ఎప్పుడు నిర్మించారు? తిరిగి దానికి మరమ్మతులు ఎప్పుడు చేశారు? ఎన్ని నిధులు వెచ్చించారు? పనులు చేసిన గుత్తేదారుతో సహా అన్ని వివరాలను నిధి యాప్‌లోకి అప్‌లోడ్ చేయాలని ఆదేశించటంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో ఈ ప్రక్రియ గతకొద్ది రోజుల నుంచి చేస్తున్నారు. రెండు, మూడురోజుల్లో నిధి యాప్‌లోకి అన్ని వివరాలు చిత్రాలతో సహా అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి.

**ధ్రువీకరించుకున్న తర్వాతే..** ఏదైనా రహదారి నిర్మించాలని అధికారులు ప్రతిపాదించినప్పుడు ఈఎన్‌సీ ఆమోదానికి ఇకపై దాని ద్వారా మాత్రమే దస్త్రం పంపాలి. ఇకమీదట ఏదైనా రహదారి నిర్మాణానికి ఈఎన్‌సీ కార్యాలయానికి వివరాలు తెలియజేస్తారు. వారు అక్కడ ఆ రోడ్డు పరిస్థితి ఏమిటి? గతంలో అది ఎప్పుడు నిర్మించారు? దానికి మరమ్మతులు ఏమైనా చేశారా అనే వివరాలను నిధి యాప్‌లో ఉన్న సమాచారంతో ధ్రువీకరించుకుంటారు. ఎక్కడైతే అవసరం ఉంటుందో అక్కడ మాత్రమే రోడ్డు వేసేలా ఈ యాప్ దోహదం చేస్తుందని అధికారవర్గాలు అంటున్నాయి.

## 'సాక్షం'లో అంగన్‌వాడీలకు టీవీల సరఫరా

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** పోషణ్ 2.0 కార్యక్రమంలో భాగంగా సాక్షం పథకం కింద ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం టీవీలను సరఫరా చేసింది. బాలలకు ఆటపాటలతో కూడిన విద్యను డిజిటల్ విధానంలో బోధన సాగించడానికి వీలుగా ఎల్‌ఈడీ టీవీలు అందించినట్లు ఐసీడీఎస్ కొయ్యలగూడెం ప్రాజెక్టు ఇన్‌ఛార్జి సీడీపీవో తులసి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని కొయ్యలగూడెం మండలంలో 13 కేంద్రాలకు, పోలవరం మండలంలోని 30 కేంద్రాలకు టీవీలు సరఫరా అయ్యాయని వివరించారు.

# కోళ్లు లేని మంచాలా?

**అధికారుల ఉదాసీనతతో రోగులకు తప్పని అవస్థలు**

జంగారెడ్డిగూడెంలో వృథాగా..

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** జిల్లాలోని అర్బన్ పీహెచ్‌సీల్లో కోళ్లు లేని మంచాలు వెక్కిరిస్తున్నాయి. జ్వరాలు, ఇతర సమస్యలతో వచ్చేవారికి వైద్యం అందించడానికి యూపీహెచ్‌సీలకు రూ.లక్షలు విలువ చేసే రోగుల మంచాలు(బెడ్స్)ను కొద్ది నెలల కిందట సరఫరా చేశారు. ఆసుపత్రులకు చేరి నెలలు గడుస్తున్నా.. కోళ్లు లేని కారణంగా వీటిని బిగించకపోవడంతో వృథాగా దర్శనమిస్తున్నాయి. దీంతో జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్‌తో పాటు జంగారెడ్డిగూడెం, చింతలపూడి పట్టణాల్లో 18 యూపీహెచ్‌సీల్లో కొత్త మంచాలు ఉపయోగం పడట్లేదు. ఒక్కో యూపీహెచ్‌సీకి 10 చొప్పున 180 మంచాలు వచ్చాయి. బిగించే దశ మానేసి మంచాలు తప్ప కోళ్లు రాలేదు. అప్పటి నుంచి వాటి కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఫలితంగా మంచాలు వృథా అయ్యాయి. సమస్య తలెత్తి నెలలు గడుస్తున్నా.. వీటిని సరఫరా చేసిన ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వీరి నిర్లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా యూపీహెచ్‌సీలకు వచ్చే వందలాది మంది రోగులకు ఇబ్బంది పడుతున్నారు.

**కొత్త భవనంలో..** జంగారెడ్డిగూడెం ఎస్సీ కాలనీ యూపీహెచ్‌సీ కోళ్లు లేని కారణంగా వీటిని బిగించకుండా వదిలేశారు. దీంతో రోగులకు సెలైన్ వంటివి బల్లలపైనే అందిస్తున్నారు. డాంగేనగర్‌లో కూడా ఈ కారణంగా బిగించలేదు. దీంతో వృథాగా ఉన్నాయి.

**అధికారుల దృష్టికి..** కోళ్లు లేని మంచాలు సరఫరా అయ్యాయన్న విషయం యూపీహెచ్‌సీల వైద్యాధికారులు మా దృష్టికి తీసుకువచ్చారు. మేము కూడా ఉన్నతాధికారులకు నివేదించాం. సత్వరమే పరిష్కారమయ్యేలా చూస్తాం' అని యూపీహెచ్‌సీ డీపీఎం బాబు తెలిపారు.

# వండిందే మెనూ.. వడ్డించిందే తిను

- సంక్షేమ వసతి గృహాల్లో అమలు కాని ఆహారపట్టిక
- సెలవు రోజుల్లో కానరాని వార్డెన్లు

**జంగారెడ్డిగూడెం** పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహంలో మెనూ ప్రకారం ఇవ్వాల్సిన ఉదయం అల్పాహారంగా పూరీ, బంగాళ దుంపతో చేసిన కుర్మా, ఒక కోడి గుడ్డు ఇవ్వాలి. కానీ బజ్జీలు మాత్రమే పెట్టారు. కోడి కూర పులుసును తలపించింది. బీసీ వసతి గృహంలో 15 మంది కోసం సిద్ధం చేసిన కోడి కూర పట్టుమని కేజీ కూడా లేదు. రెండిట్లోనూ వార్డెన్లు లేరు.

**ఆగిరిపల్లి** లోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆదివారం రాత్రి అన్నం, సాంబారు, క్యారెట్ పెసరపప్పు కూర, మజ్జిగ.. మెనూ ప్రకారం పెట్టాల్సి ఉండగా.. మధ్యాహ్నం మిగిలిన బిర్యానీనే వడ్డించారు.

**మండవల్లి** బీసీ బాలుర వసతి గృహంలో 13 మంది విద్యార్థులు ఉన్నారు. రాత్రి భోజనంలో క్యారెట్ పెసరపప్పు కలిపి కూర వండాల్సి ఉండగా క్యారెట్ ఫ్రై చేశారు. మజ్జిగ ఊసేలేదు.

పరిశీలన

**ఉంగుటూరు, ఏలూరు టూటౌన్, జంగారెడ్డిగూడెం, నూజివీడు, మండవల్లి, న్యూస్‌టుడే:** జిల్లాలో సంక్షేమ వసతి గృహాల్లో నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు కావట్లేదు. మెనూ.. పెట్టిందే తిను అన్న పరిస్థితి నెలకొంది. 'న్యూస్‌టుడే' బృందం జిల్లాలోని పలు సంక్షేమ వసతి గృహాలను పరిశీలించింది. కొన్ని చోట్ల పాడైపోయిన కూరగాయలను వినియోగిస్తున్నారు. నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. మధ్యాహ్నం వండిన వంటకాలనే రాత్రికి పెడుతున్నారు.

**కైకరం** లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో 37 మంది విద్యార్థులు ఉన్నారు. ఆదివారం చికెన్ బిర్యానీ, పెరుగు చట్నీ, గోంగూర పచ్చడి పెట్టాలి. కానీ అన్నం, కోడి మాంసం కూర, రసం పెట్టారు. గోంగూర చికెన్ కర్రీలో కలిపి వండేశారు.

**పర్యవేక్షణ కరవు..** సెలవు రోజుల్లో వసతి గృహ సంక్షేమాధికారులు(వార్డెన్లు) కానరావడం లేదు. జిల్లా అధికారుల తనిఖీలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. 'వార్డెన్లు అందుబాటులో ఉండి నిరంతరం పర్యవేక్షించాలి. విధిగా మెనూ ప్రకారం ఆహారాన్ని నాణ్యతతో అందించాలి. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం' అని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వ మోహన్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగరాణి తెలిపారు.

**వసతి గృహాల వారీగా**

| స్థాయి | ఎస్సీ | బీసీ |
|---|---|---|
| పాఠశాల | 43 | 19 |
| కళాశాల | 15 | 16 |
| విద్యార్థులు | 4,200 | 2,600 |


మాట కలుపుతారు.. మాయం చేస్తారు 14లో


# అభిమానుల గుండెల్లో కోట

**హేలాపురితో అనుబంధం**

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** కళామతల్లి ముద్దు బిడ్డ.. నటనకు కట్టని కోట.. వందలాది విభిన్న పాత్రలతో తెలుగు సినీ ప్రియులను అలరించిన నటవల్లభుడు. ఆయనే కోట శ్రీనివాసరావు. అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లో మృతి చెందిన కోటకు హేలాపురితో అనుబంధముంది. కొన్నేళ్ల క్రితం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించిన సన్మాన సభకు వచ్చారు. ఆయన్ను సినీ నిర్మాత అంబికా కృష్ణ, నాట్య గురువు కేవీ సత్యనారాయణ తదితరులు సత్కరించారు. వివిధ భాషల్లో 700 పైగా చిత్రాల్లో నటించిన కోట మరణం సినీ రంగానికి తీరని లోటని కేవీ సత్యనారాయణ అన్నారు.

**సీఆర్ఆర్ కళాశాలలో విద్యాభ్యాసం..** ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో 1966లో కోట శ్రీనివాసరావు విద్యాభ్యాసం చేశారు. ఎన్‌సీసీలో ఫస్ట్ కంపెనీకి అండర్ ఆఫీసర్‌గానూ పని చేశారు. ఆయనతో కలిసి తాను చదివి, ఆధునిక వస్త్రధారణ పోటీల్లో పాల్గొన్నట్లు నగరానికి చెందిన ఏఐటీయూసీ నాయకుడు కె.కృష్ణమాచార్యులు తెలిపారు. ఏలూరుకు చెందిన విద్యాప్రసాద్ అప్పట్లో సీఆర్ఆర్ కళాశాల వ్యాయామోపాధ్యాయుడిగా, ఎన్‌సీసీ అధికారిగా పని చేశారన్నారు. కోట మరణం ఎంతో కలచివేసిందని కృష్ణమాచార్యులు కంటతడి పెట్టారు.

ఏలూరు వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించిన సన్మాన సభలో కోట శ్రీనివాసరావు, అంబికా కృష్ణ, కేవీ సత్యనారాయణ

**మన్యంతో మంచి అనుబంధం.. బుట్టాయగూడెం :** సినీ నటుడు కోట శ్రీనివాసరావుతో మన్యం ప్రాంతానికి మంచి అనుబంధం ఉంది. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా పని చేసిన కాలంలో 2000 డిసెంబరు 3న బుట్టాయగూడెం మండలం నందాపురంలో జరిగిన శ్రీ ఏజెన్సీ సేవా సంఘం స్వర్ణోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ రోజు స్థానికులతో మమేకమై ముచ్చటించారు. సంఘ వ్యవస్థాపకుడు దివంగత ఎస్ఎస్ నందా అప్పట్లో నిర్వహించిన వృద్ధాశ్రమం, గ్రంథాలయం, వయోజన విద్యా కేంద్రాన్ని సందర్శించారు. గ్రామ శివారున బైనేరు వాగు అనుసంధానంతో నిర్మించిన బందకట్టు ఆనకట్ట వద్ద ఏర్పాటు చేసిన కాటన్ దొర విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ సభలో ప్రసంగించిన ఆయన విద్యతోనే మన్యం వాసుల ప్రగతి సాధ్యమని చైతన్య పరిచారు.

## వరద తగ్గుముఖం

పోలవరం వద్ద గోదారి ప్రవాహం

**పోలవరం, న్యూస్‌టుడే:** నది పరీవాహక ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టడంతో పోలవరం వద్ద ఆదివారం ఉదయానికి 31.53 మీటర్లకు పెరిగిన వరద సాయంత్రానికి 31.30 మీటర్లకు తగ్గింది. 48 గేట్ల నుంచి 7.20 లక్షల క్యూసెక్కులు స్పిల్ ఛానల్ ద్వారా గోదావరిలోకి వెళ్తోంది. వరద పెరగడంతో కడెమ్మ అవుట్‌ఫాల్ స్లూయిస్ తలుపులు మూడొంతులు మునిగి వెనుక భాగంలోని కాలువలో నీటి మట్టం పెరిగింది. వరద నేపథ్యంలో ప్రాజెక్టు సందర్శనకు కార్లపై పలు ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులతో పోలీస్ చెక్‌పోస్టు వద్ద సందడి నెలకొంది. ముందుగానే అనుమతి తీసుకున్నవారు చెక్‌పోస్టు వద్ద ఆగి వివరాలు చెప్పి వెళ్తున్నారు.

## ఆగని సహాయ చర్యలు

**బాధితులకు టార్పాలిన్ల పంపిణీ**

**కుక్కునూరు, న్యూస్‌టుడే:** గోదావరి వరద తగ్గుతున్నా.. ఆదివారం కూడా పునరావాస కేంద్రాల్లో సహాయక చర్యలు కొనసాగాయి. బాధితులకు ఆహారం అందించారు. బాధితులు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా టార్పాలిన్లను పంపిణీ చేస్తున్నారు. ఆదివారం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ముంపు గ్రామాలకు పెద్దఎత్తున టార్పాలిన్లు సరఫరా చేశారు. వరద తగ్గుతుండటంతో తీరప్రాంత గ్రామాలు ఊపిరి పీల్చుకున్నాయి. వరద అధికమైతే ఇళ్లు కోల్పోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ అందించే సహాయం జరిగే నష్టంలో 10 శాతం కూడా ఉండటం లేదు. ఈ పరిస్థితుల్లో ఆగ్రహంతో తమ గ్రామాలపైకి దండెత్త వద్దంటూ తీరప్రాంత ప్రజలు గోదారమ్మకు మొక్కుతుంటారు. ఈ ఏడాదికి ఒక ప్రమాదం తప్పిందని, మరో రెండు నెలలు భయంతో గడపాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదలు వచ్చినప్పుడు కొద్దిపాటి సామగ్రితో ప్రాణాలు కాపాడుకుంటున్నామని, కానీ ఇళ్లను కోల్పోక తప్పడం లేదంటున్నారు. ఏటా వరదలు తప్పనిసరి అయ్యాయని, ఎంతోకొంత నష్టం చవిచూడక తప్పడం లేదంటున్నారు. దీంతో వరదలంటే వణుకు పుడుతోందని, కానీ ఈ వరదలు చల్లగా దయ చూసి, నష్టం చేయకుండానే వెనుదిరగడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పిల్లలకు ట్రాఫిక్‌పై అవగాహన అవసరం: ఎంపీ

పార్కును పరిశీలిస్తున్న మహేశ్ కుమార్, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే చంటి

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** పిల్లలకు రోడ్డు నిబంధనలు, భద్రతపై అవగాహన కల్పించడం సమాజ భద్రతకు ఎంతో దోహదపడుతుందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ సమీపంలో ఏలూరు నగరాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన రూ.84 లక్షలతో నూతనంగా నిర్మించిన క్రాస్‌రోడ్స్ చిల్డ్రన్స్ ట్రాఫిక్ పార్కును ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ తదితరులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ.. దేశంలోనే ప్రథమంగా ట్రాఫిక్ పార్కు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు జేసీ, ఎస్పీ, ఎమ్మెల్యే ఎంతగానో సహకరించారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడంలో జిల్లా అధికారులూ భాగస్వాములు కావడం శుభపరిణామమన్నారు. విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించడానికి పార్కు ఉపయోగపడుతుందని ఎస్పీ, జేసీ తెలిపారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్, సీఐలు లక్ష్మణరావు, కోటేశ్వరరావు, నాయకులు దాసరి ఆంజనేయులు, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

# మీ పాట్లు మీవే

**భక్తుల అవస్థల్ని పట్టించుకోని దేవస్థాన యంత్రాంగం**

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల చిన వేంకన్న దేవస్థానానికి ఆదాయాన్ని సమకూర్చడంలో అధికారులకు ఉన్న శ్రద్ధ భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో చూపడంలేదు. ఈ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. రద్దీ సమయంలో సౌకర్యాలను పర్యవేక్షించి, వారికి ఇబ్బందులు ఎదురైతే చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఇక్కడ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. అనివేటి మండపం ప్రారంభంలో ఉన్న కుళాయిల వద్ద నీడ సౌకర్యం కల్పించలేదు. దీంతో భక్తులు ఎండలోనే నిలబడి నీటిని తాగాల్సి వస్తుంది.

**నీడ కరవు..** శ్రీహరి కళాతోరణం పక్కన భక్తులు ఎండలోనే నిలబడి కొబ్బరి కాయలు కొడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ గతంలో పందిరి ఏర్పాటు చేయగా...సుమారు నెల క్రితం గాలివానకు అది పడిపోవడంతో తొలగించారు. అప్పటి నుంచి మళ్లీ వేయలేదు.

**పర్యవేక్షణ లేదు..** కొబ్బరి కాయ కొట్టే ముందు రెండు నిమిషాలు కళ్లు మూసుకుని స్వామివారిని స్మరిద్దామంటే కాళ్లు కాలుతున్నాయని విజయవాడకు చెందిన భక్తుడు ప్రశాంత్ వాపోయారు.

**కాళ్లు కాలుతున్నాయి..** ఆలయం చుట్టూ, తూర్పు వైపున, శ్రీవారి దర్శన క్యాకాంప్లెక్స్ ముందు ఇంకా పలు చోట్ల కొబ్బరి నార చాపలు పరిచారు. ఎండ తీవ్రత ఉన్న సమయంలో వాటిని నీటితో తడిపి చల్లపరచాలి. కొద్ది రోజుల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నా వాటిని నీటితో తడపడంలేదు. 'కాళ్లు కాలకుండా నార చాపలు ఏర్పాటు చేశారు. కానీ వాటిని తడపడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. భక్తుల సౌకర్యాలపై అధికారుల పర్యవేక్షణ కనిపించడంలేదు' అని కొత్తపల్లివాసి సత్తిపండు తెలిపారు. భక్తులకు నీడ సదుపాయం కల్పిస్తాం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నార చాపలను ఎప్పటికప్పుడు తడిపిస్తాం' అని దేవస్థానం ఈఈ భాస్కర్ తెలిపారు.

## గ్రీన్ పాస్‌పోర్టు నీకు వచ్చిందా మిత్రమా!

ఇటీవల విద్యార్థికి గ్రీన్ పాస్‌పోర్టు అందిస్తున్న మంత్రి పార్థసారథి

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** కాలుష్యంగా మారుతున్న పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం నింపాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పాఠశాల స్థాయి నుంచి ఈ కార్యక్రమం అమలు చేస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గుర్తించారు. ఇందుకోసం ప్రతి విద్యార్థికి గ్రీన్ పాస్‌పోర్టు ఇచ్చి మొక్కల పెంపకంపై ఆసక్తి రేకెత్తిస్తున్నారు. పాస్‌పోర్టు అంటే దేశవిదేశాలకు వెళ్లే వారికే అవసరం అనే పరిస్థితి నుంచి పర్యావరణ పరిరక్షణకు ఎంతో అవసరమని గుర్తించేలా సిద్ధం చేసి పంపిణీ చేస్తున్నారు. ప్రతి విద్యార్థి అమ్మ పేరుతో ఒక మొక్క నాటేలా ప్రణాళికను రూపొందించారు. ఇటీవల జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో మంత్రి కొలుసు పార్థసారథి చేతులు మీదుగా విద్యార్థులకు పాస్‌పోర్టుతో పాటు మొక్కను అందించి పచ్చదనం పెంపొందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆకుపచ్చని రంగుతో తయారు చేసిన అట్టపై ఒక మొక్క బొమ్మను ఏర్పాటు చేశారు. లోపల నాటిన మొక్క పేరు, శాస్త్రీయ నామం, నాటిన సమయం, ఏటా ఆ మొక్క ఎదుగుదల, మొక్క ఉన్న ప్రదేశం తదితరాలను అందులో నమోదు చేస్తున్నారు. ఈ గ్రీన్ పాస్‌పోర్టుపై విద్యార్థి ఫొటో, వయస్సు, పాఠశాల పేరు, చిరునామా తదితర వివరాలను పొందుపరిచారు. నాటిన మొక్క సంరక్షణ ఏ విధంగా ఉంటుంది. గ్రీన్ పాయింట్లు(మొక్కలు) ఎన్ని వచ్చాయో తరగతి ఉపాధ్యాయుడు నమోదు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు విద్యాశాఖ కసరత్తులు ప్రారంభించింది. ఈ కార్యక్రమం విజయవంతమవ్వాలని ఆకాంక్షిద్దాం.

## ఆషాఢంలోనూ సెగలు!

**ఆచంట, న్యూస్‌టుడే:** ఆషాఢమాసంలోనూ నాలుగైదు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నడి వేసవి తరహాలో ఎండ చుర్రుమంటోంది. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రతకు రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. పడమర దిశగా పొడిగాలులు వీస్తుండటంతో వాతావరణం మరింత వేడిగా మారుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో పలు ప్రాంతాల్లో 20 రోజుల క్రితమే వరి నాట్లు వేసే పనులు మొదలు కాగా వాతావరణ పరిస్థితుల కారణంగా వేగం మందగించింది. రుతుపవనాలు ముందుగానే పలకరించినా జులైలో ఆశించిన వర్షాలు పడలేదు.

# ముహూర్తం కుదరక.. సొమ్ము పంచక!

- ★ స్పౌజ్ పింఛన్లకు ఎదురుచూపులు
- ★ మూణ్నెల్లుగా వాయిదా పడుతున్న వైనం

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్లను ప్రతి నెలా లబ్ధిదారులకు ఠంచనుగా అందజేస్తోంది. స్పౌజ్ పింఛన్ల పంపిణీ విషయంలో మాత్రం తాత్సారం చేస్తోంది. ఈ విభాగం సొమ్ము పొందేందుకు అర్హత పొందిన వారు నెలలుగా సొమ్ము అందక ఇబ్బంది పడుతున్నారు. ఇంట్లో పింఛను పొందే భర్త మరణిస్తే.. ఆయన భార్యకు మరుసటి నెల నుంచే నగదు పంపిణీ విధానాన్ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

**జిల్లాలో 3,163 మందికి..** తాజాగా భాగస్వామ్య పింఛన్ల(స్పౌజ్)కు 3,163 మంది అర్హత పొందారు. వీరికి ప్రతినెలా రూ.4 వేల చొప్పున అందించాల్సి ఉంది. స్పౌజ్ పింఛనర్లకు మే 12 నుంచి సొమ్ము అందజేస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. అనివార్య కారణాలతో కార్యక్రమం వాయిదా వేసింది. జులైలో పంపిణీకి సొమ్ము సైతం విడుదలైంది. ఈ దఫా లబ్ధిదారులకు సొమ్ము పంపిణీ చేయలేదు. ఆ నిధులు కాస్త వెనక్కు మళ్లాయి.

**జిల్లా వివరాలిలా..**
లబ్ధిదారులు: 2,58,098
వితంతువులు: 68,428
ప్రతినెలా అందజేసే సొమ్ము: రూ.112.73 కోట్లు

**అర్హుల జాబితాలో 12 వేల మంది..** జిల్లాలో వివిధ విభాగాల కింద సామాజిక పింఛన్లు పొందడానికి సుమారు 12 వేల మంది అర్హులున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారిని క్షేత్ర స్థాయిలో సర్వే చేసి అర్హులుగా గుర్తించారు. వీరికి ఇంకా పింఛను మంజూరు కాలేదు. 2019-24 మధ్య సుమారు 15 వేల మంది పింఛన్లను అప్పటి వైకాపా ప్రభుత్వం తొలగించింది. ఆరంచెల తనిఖీ అస్త్రంగా ప్రయోగించి ఆర్నెల్లకోసారి కోత విధించింది. వీరిలో అత్యధికులు తెదేపా సానుభూతిపరులు ఉన్నారు. వైకాపా అభిమానులకు అర్హత లేకున్నా పింఛన్లు అందజేసింది. వారంతా ఇప్పటికీ లబ్ధి పొందుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే స్పౌజ్ పింఛన్లు అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తెలిపారు.

## సంపదలిచ్చి.. అభయమిచ్చి..

ఏలూరు నగరం గానుగులపేటలోని గంగానమ్మ ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. పరివార దేవతామూర్తులు, పోతురాజును సుందరంగా తీర్చిదిద్దారు. మహిళలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవార్లకు ఏకాదశ హారతులిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

## నరసాపురం లేసుకు అరుదైన గుర్తింపు

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఇప్పటికే అంతర్జాతీయంగా ఖ్యాతి సాధించిన నరసాపురం లేసు మరో గుర్తింపు సాధించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఒక జిల్లా... ఒక ఉత్పత్తి పథకం కింద 2024-25 సంవత్సరానికి నరసాపురం లేసు అల్లిక ఎంపికైంది. 26 జిల్లాల నుంచి ఉత్పత్తులు పోటీపడగా ఈ ఘనత మన ప్రాంత లేసుకు దక్కినట్లు కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో వెల్లడించారు. దీనికి సంబంధించి అవార్డును సోమవారం దిల్లీలో కలెక్టర్ అందుకోనున్నారు.

## ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

**907 మంది విద్యార్థుల ఎంపిక**

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఇందులో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, వికలాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80.. మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

ఆర్కే వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తరగతులు 14 నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులు తమ లగేజీతో వచ్చి రిపోర్ట్ చేసి తరగతులకు హాజరయ్యేలా సిద్ధపడి రావాలన్నారు. ● మొదటి దశ తరువాత మిగిలిన ఖాళీలను దృష్టిలో ఉంచుకుని అంతర్గత బదిలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా 384 మందికి లబ్ధి కలిగినట్లు వివరించారు. ఇప్పటి వరకు 4,340 మంది విద్యార్థుల ఎంపిక పూర్తి అయిందని తెలిపారు. ఇంకా 60 సీట్లు మిగిలి ఉండగా ఇందులో ఎన్‌సీసీ కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఈ సీట్ల ఎంపిక ఫలితాలను వచ్చే వారం విడుదల చేస్తామని రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు.

(c) eenadu

## విలనిజానికి కొత్త భాష్యం చెప్పిన కోట: మంత్రి

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** తెలుగు సినీ పరిశ్రమలో వైవిధ్య పాత్రలను పోషించి కోట్ల మంది అభిమానులను సంపాదించిన పద్మశ్రీ గ్రహీత కోట శ్రీనివాసరావు లేని లోటు పూడ్చలేనిదని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. వైవిధ్య భరితమైన నటనతో ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హాస్య నటుడిగా తెలుగు తెరపై మరపురాని పాత్రలు పోషించిన వ్యక్తి అన్నారు. విలనిజానికి తెలుగు బాష, యాస, మాండలికాలతో వెండితెరపై విలనిజానికి కొత్త భాష్యం చెప్పిన వ్యక్తి అన్నారు. 1999లో భాజపా తరఫున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలందించిన నాయకుడన్నారు. సామాజిక బాధ్యతగా రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పద్మశ్రీకి కేకు తినిపిస్తున్న ఎంపీ మహేశ్‌కుమార్

## ఘనంగా జడ్పీ ఛైర్‌పర్సన్ జన్మదినం

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** స్థానిక జడ్పీ విడిది కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జన్మదినం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, అభిమానులు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు బడేటి చంటి(ఏలూరు), మద్దిపాటి వెంకటరాజు(గోపాలపురం), ముప్పిడి వెంకటేశ్వరరావు(కొవ్వూరు), పత్సమట్ల ధర్మరాజు(ఉంగుటూరు), రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత, మాజీ ఎంపీ మాగంటి బాబు, కరాటం రాంబాబు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొని అభినందనలు చెప్పారు.

## మాట కలుపుతారు.. మాయం చేస్తారు

పండుటాకులే లక్ష్యంగా దొంగతనాలు

☛ పాలకోడేరు మండలం విస్సాకోడేరులో ఓ వృద్ధురాలి దగ్గరకు భార్యాభర్తలు వెళ్లారు. ఇల్లు అద్దెకు కావాలన్నారు. గదులు చూస్తామంటూ లోపలికి వెళ్లాక ఆమెను బెదిరించి మెడలోని బంగారు ఆభరణం లాక్కొని పారిపోయారు.

☛ భీమవరం పట్టణంలో అద్దెకు ఇల్లు కావాలని వెళ్లాడో వ్యక్తి. వృద్ధురాలితో బంధుత్వం కలిపాడు. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక ఆమె మెడలోని బంగారు ఆభరణం లాక్కెళ్లబోయాడు. అడ్డుకున్న వృద్ధురాలిని గోడకు కొట్టి నగలు తీసుకుని పారిపోయాడు. గాయపడిన వృద్ధురాలిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు.

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** రెక్కలొచ్చాక పక్షులు గూడు వదిలి వెళ్లినట్లు అప్పటి వరకూ పిల్లాపాపలతో సందడిగా కనిపించిన లోగిళ్లు బోసిపోతున్నాయి. ఉన్నత చదువులంటూ, ఉపాధి అంటూ పిల్లలు ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడే స్థిరపడుతున్నారు. పుట్టి పెరిగిన ఊళ్లను విడిచి వెళ్లలేమంటూ వృద్ధులు మాత్రమే ఇంటికి పరిమితమవుతున్నారు. ఇలాంటి వారిని దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. దాచుకున్న పింఛన్ సొమ్ము, ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుంటున్నారు. వృద్ధాప్యంలోనూ ప్రతిఘటించే ప్రయత్నం చేస్తే చంపేందుకు దొంగలు వెనుకాడటం లేదు. కొందరు చావు బతుకుల మధ్య ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పెరుగుతున్నాయి. అధికారికంగా ఏటా 10కి పైగా కేసులు నమోదవుతున్నాయి.

**రెక్కీ నిర్వహించి..**

ఒంటరిగా ఉన్న వృద్ధుల వివరాలను దొంగలు ముందుగా తెలుసుకుంటున్నారు. ఒకటికి రెండుసార్లు రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇరుగు పొరుగు వ్యక్తులైతే ఆచూకీ తెలియకుండా ఉండేందుకు చీకట్లో వెళ్లి ముసుగు వేసి దోచుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందినోళ్లయితే మంచినీళ్లు కావాలనో, పెరట్లో మొక్కలు, పండ్లు బాగున్నాయంటూ మాట కలిపి లోపలికి చొరబడుతున్నారు. చుట్టుపక్కల ఎవరూ లేరని గమనించి వృద్ధులపై దాడులకు తెగబడుతున్నారు.

**బిడ్డలు బాధ్యత తీసుకోవాలి..**

వృద్ధులకు డే కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వయో వృద్ధులకు కాపలాగా పోలీసులు నిరంతరం ఉండలేరు. తల్లిదండ్రుల పట్ల బిడ్డలు బాధ్యతగా వ్యవహరించాలి. ఒంటరిగా ఉన్న వృద్ధులు వాళ్లే ఉంటారులే అని విడిచిపెట్టకుండా ఏం చేస్తున్నారో తెలుసుకుంటూ ఉండాలి.

**- మేళం దుర్గాప్రసాద్, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేట్ ట్రైబ్యునల్ కమిటీ సభ్యుడు**

**వివరాలు సేకరిస్తున్నాం**

వృద్ధులు ఎంతమంది ఉన్నారు, వాళ్లు ఏం చేస్తుందీ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది. ఎంతమంది ఒంటరిగా ఉంటున్నారో వారి వివరాలను సేకరిస్తున్నాం. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇబ్బందులు ఏమైనా ఉంటున్నాయా అని వృద్ధుల దగ్గరకు బీట్ పోలీసులు వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. దీనిపై ప్రతి మూడు నెలలకోసారి సమీక్షిస్తున్నాం. **- అద్నాన్ నయీం అస్మి, ఎస్పీ**

## పురాణపురుషా.. పుండరీకాక్ష

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రద్దీ రెండో రోజు కొనసాగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వీఐపీల తాకిడి కూడా ఎక్కువగా ఉంది. సామాన్య భక్తులు స్వామిని దర్శించుకోవడానికి ఎక్కువ సమయం క్యూలలో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దివ్యాంగులు, వృద్ధులు, చంటి బిడ్డ తల్లులు ప్రత్యేక క్యూలో వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.

## ఉచితానికి కసరత్తు!

వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ ప్రయాణం

**కలిదిండి, న్యూస్‌టుడే:** మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం త్వరలో ప్రారంభం కానుంది. ఆగస్టు 15 నుంచి దీనిని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో రోజుకు సుమారు 15 వేల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. పండగ సమయాల్లో 20 వేల నుంచి 25 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాలో 308 ఆర్టీసీ బస్సులు ఉండగా, వాటిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు కలిపి 168 ఉన్నాయి.

**జిల్లా పరిధిలో..** జిల్లా పరిధిలో మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేయవచ్చని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లా పరిధిలోనూ, ఉమ్మడి జిల్లాలోనూ మొత్తం ఎంత మంది ప్రయాణిస్తున్నారు? వాళ్లల్లో మహిళలు ఎంత మంది ఉన్నారు? పథకం అమల్లోకి వచ్చిన తరవాత అదనంగా ఎంత మంది మహిళలు ప్రయాణించే అవకాశం ఉందన్న విషయాలను లెక్కలు కడుతున్నారు.

**బస్సుల మరమ్మతులు** పథకం అమల్లోకి వచ్చిన తరవాత బస్సుల్లో రద్దీ ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున బస్సుల సామర్థ్యాలను అంచనా వేస్తున్నారు. అవసరమైన వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. ప్రతి బస్సు ఫిట్‌గా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

**వసతుల కల్పన** బస్టాండ్లలోనూ రద్దీ పెరగనున్న నేపథ్యంలో వసతులపై ఆరా తీస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్వయంగా పరిశీలిస్తున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి అంశాలపై దృష్టి సారించారు.

**అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం..**

పథకం ప్రారంభమయ్యాక ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. బస్సులన్నింటినీ సిద్ధం చేస్తున్నాం. ఏఏ బస్టాండ్లలో ఏఏ సమస్యలున్నాయో తెలుసుకుంటున్నాం. అన్నింటినీ పరిష్కరిస్తాం. పథకాన్ని విజయవంతం చేసే దిశగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

**- ఎస్.కె.షబ్నం, ప్రజా రవాణా జిల్లా అధికారి**

## కొనసాగుతున్న నీటి విడుదల

**పోలవరం, న్యూస్‌టుడే:** మండలంలోని పట్టిసీమ వద్ద గోదావరిపై నిర్మించిన ఎత్తిపోతల పథకంలోని 22 పంపుల ద్వారా 7,700 క్యూసెక్కుల ప్రాజెక్టు కుడి కాలువలోకి విడుదల చేస్తున్నారు. మొత్తం 24 పంపులకుగాను ఐదు రోజులుగా 22 పంపుల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నట్లు పర్యవేక్షణ డీఈ సురేశ్ తెలిపారు.

## జీతాలు ఎప్పుడిస్తారు?: ఏపీటీఎఫ్

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** జిల్లాలో ఇటీవల బదిలీలైన ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు ఎప్పుడిస్తారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ప్రశ్నించారు. ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంగ్త్ నిర్ధారించి పొజిషన్ ఐడీలు కేటాయించడంలో సీఎస్ఈ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. పీటీఎం సమావేశాలతో గిన్నిస్ రికార్డు సాధనపై అధికారులకున్న శ్రద్ధ ఉపాధ్యాయుల జీతాలపై లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సీఎస్ఈ అధికారులు స్పందించి ఉపాధ్యాయులకు జీతాలు అందేలా చూడాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## ఎం.ఆర్. రాజు ఆశయ సాధనకు కృషి : పాకా

**కాళ్ల, న్యూస్‌టుడే:** డాక్టర్ ఎం.ఆర్.ఆశయ సాధనకు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ, పలువురు ప్రతినిధులు ఆదివారం అన్నారు. పెదఅమిరం మహాత్మా గాంధీ స్మారక ట్రస్టు భవనంలో నిర్వహించిన పద్మశ్రీ డాక్టర్ ముదుండి రామకృష్ణం రాజు(ఎం.ఆర్.రాజు) స్మృత్యంజలి సభలో వారు మాట్లాడారు. సభకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణమూర్తి(బాబ్జీ) అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అమెరికాలో పరిశోధనలు చేసి, స్వగ్రామంలో మహాత్మాగాంధీ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు నాలుగు దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించి చిరస్మరణీయులయ్యారని అన్నారు. ముందుగా ఎంఆర్ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయసాధనకు అనుగుణంగా ఎంజీఎం ట్రస్టు ద్వారా వైద్య సేవలు అందించే సర్వోదయం మండలి, స్వచ్ఛంద సంస్థల తరఫున భీమవరంలో సైన్సు పార్కు ఏర్పాటు చేసి దానికి డాక్టర్ ఎం.ఆర్.రాజు పేరు పెట్టాలని విజ్ఞాపన పత్రం అందించారు. ఎంఆర్ రాజు కుమారులు మంతెన రామ్‌కుమార్‌రాజు, దంతులూరి రంగరాజు, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఎంవీఎస్ రాజు, ప్రొఫెసర్ ఎస్.ఆర్.పరిమి, పలువురు డాక్టర్, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సత్యనారాయణ

## భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పణ

**కైకలూరు, న్యూస్‌టుడే:** కైకలూరు ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం శ్యామలాంబ అమ్మవారి ఆలయ క్షేత్రంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి కైకలూరు బ్రహ్మంగారి గుడివీధి మహిళలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారెను అందజేశారు. వేకువ జామునుంచే మహిళలు భారీగా చేరి పంటకాలువల్లో స్నానాలు ఆచరించి సంప్రదాయ వస్త్రధారణలో పలు రకాల తీపి వంటకాలు, పసుపు, కుంకుమ, గాజులు, పట్టు వస్త్రాలు, సారె కావిడలతో ఆలయానికి తరలివచ్చారు. ఈవో వీఎన్‌కే శేఖర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారు, శ్యామలాంబ అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు.

**శ్యామలాంబ సేవలో..** సిక్కిం రాష్ట్ర మాజీ గవర్నరు దివంగత వెంట్రప్రగడ రామారావు కుటుంబ సభ్యులు ఆదివారం కైకలూరు శ్యామలాంబను దర్శించుకున్నారు. ఈవో వీఎన్‌కే శేఖర్ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలకగా, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. రామారావు కుమారుడు వెంట్రప్రగడ శ్రీనివాస్ దంపతులను ఈవో శేష వస్త్రాలతో సత్కరించి జ్ఞాపికను అందించారు. భాజపా నేతలు కట్టా వీరరాఘవులు, బండి దివాకర్, పంద్రంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దింట్లమ్మా పాహిమాం!

**కైకలూరు, న్యూస్‌టుడే:** కొల్లేటి కొంగు బంగారు తల్లి పెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థానం ఆదివారం కిటకిటలాడింది. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే వరదాయని శ్రీపెద్దింట్లమ్మా రక్షమాం.. అంటూ అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పండ్ల రసాభిషేకాలు, సహస్ర శతనామావళి, కుంకుమార్చన, ధూపసేవ తదితర పూజలను వైభవోపేతంగా నిర్వహించారు. కొల్లేరు గ్రామాలకు చెందిన పలువురు మహిళా భక్తులు అమ్మవారికి సంప్రదాయ సారె అందించి పూజలు జరిపారు.

## ఆట.. మానసిక ఉల్లాసానికి బాట

బాస్కెట్ బాల్‌లో రాణిస్తున్న విద్యార్థినులు

**నూజివీడు రూరల్ , న్యూస్‌టుడే:** ఆట ఏదైనా మానసిక ఉల్లాసం లభిస్తుంది. విజయం నమ్మకాన్ని పెంచుతోంది. టీమ్ వర్క్ వల్ల సహకార భావన పెరుగుతుంది. బృంద సమస్యలు పరిష్కారం అవుతాయి. బృందాన్ని నడిపించడం వల్ల నాయకత్వ లక్షణాలు అలవడతాయి. స్నేహ సంబంధాలు బలపడతాయి. విద్యాసంస్థల్లో ఉపకార వేతనాలు లభిస్తాయి. నూజివీడులో వీటీహెచ్ గ్రౌండ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొంటూ విజయాలు సాధిస్తున్నారు. పదో తరగతి పాసైన ముగ్గురు క్రీడాకారులు నేడో రేపో క్రీడా కోటాలో ట్రిపుల్ ఐటీ సీటు సాధించనున్నారు.

**పది జాతీయ పోటీల్లో పాల్గొన్నా..**

పంజాబ్, చత్తీస్‌గడ్, ఒడిశా, మధ్యప్రదేశ్, కోల్‌కతా, పుదుచ్చేరి, గుజరాత్, కేరళ రాష్ట్రాల్లో జరిగిన పది పోటీల్లో పాల్గొని సత్తా చాటాం. బాస్కెట్‌బాల్ ఆట మాత్రమే కాదు ఆరోగ్యకరమైన జీవన శైలికి దోహద పడే మార్గం. జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు పొందాను. తల్లిదండ్రులు కూలి పని చేస్తూ నన్ను ఆటలో ప్రోత్సహిస్తున్నారు. **- బేతాళ ప్రభు దీపిక**

**పోలీస్ అధికారి అవ్వాలని..**

పోలీస్ అధికారి అవ్వాలన్నదే లక్ష్యం. నిత్యం సాధన చేస్తున్నా. పుదుచ్చేరిలో జరిగిన సబ్‌జూనియర్ నేషనల్స్, కోల్‌కతాలో జరిగిన 39వ యూత్ నేషనల్స్, మధ్యప్రదేశ్‌లో జరిగిన 74వ జూనియర్ నేషనల్స్, రాజస్థాన్‌లో 67వ అండర్ 14 నేషనల్స్, పుదుచ్చేరిలో 40వ యూత్ నేషనల్స్, తమిళనాడులో 68వ అండర్ 17 నేషనల్స్‌లో పాల్గొన్నా. నాన్న ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. **- ఎస్‌కే ఆస్రా**

**పతకాలు సాధిస్తూ ముందుకు సాగుతూ..**

చత్తీస్‌ఘడ్, తమిళనాడులో 2వ ఎస్‌జీఎఫ్ అండర్ 17 నేషనల్స్, పుదుచ్చేరిలో యూత్ నేషనల్స్‌లో పాల్గొన్నా. ఇప్పుడిప్పుడే పతకాలను సాధిస్తూ ముందుకు సాగుతున్నాం. శిక్షకుల సహకారంతో మరింత రాణించేందుకు శ్రమిస్తున్నా. ట్రిపుల్ ఐటీలో సీట్ వస్తుందని నమ్మకంతో ఉన్నాం. నాన్న కాంట్రాక్ట్ పనులు చేస్తూ నన్ను ప్రోత్సహిస్తున్నారు. **- బుర్రి ప్రణవి**

> ‘ గత వైకాపా సర్కారు పాడి రైతులను పూర్తిగా విస్మరిస్తే.. కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మేలుజాతి పశు సంతతి వృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. గతంలో మేలు జాతి పాడి పశువుల వీర్యనాళిక రూ.1,250 ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం పశు పోషకులకు రూ.1,100 రాయితీనిచ్చి కేవలం రూ.150కే అందిస్తోంది. ఫలితంగా పాడి రైతులపై ఆర్థిక భారం తగ్గించడంతోపాటు పాల ఉత్పత్తి పెంచడానికి శ్రీకారం చుట్టింది.’

## మేలు జాతి దూడల సంతతి పెంచేలా..

**రూ.150కే వీర్యనాళికల సరఫరా**

**ఏలూరు వన్‌టౌన్, ఆచంట, న్యూస్‌టుడే:** పాడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో పెయ్య దూడల సంతతి పెంచాలని నిర్ణయించింది. మేలు జాతి దూడల జననమే ధ్యేయంగా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 5.20 లక్షల పాడి పశువులున్నాయి. వీటిని పరీక్షించి ఆరోగ్యకర పశు వీర్యం ఎక్కిస్తారు. దీనిని వినియోగిస్తే 90 శాతం పెయ్య దూడలు జన్మించే అవకాశముంది. ఒకవేళ మగ దూడలు పుడితే వీర్యానికి చెల్లించిన డబ్బులను రైతులకు వెనక్కి ఇచ్చేస్తారు. దీనిపై పశువైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 30 వేల ఇంజెక్షన్లు వేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

**15 శాతం పాల దిగుబడి పెంచేలా..** నూతన సాంకేతికతతో ఏటా 15 శాతం పాల దిగుబడి పెంచాలని పశుసంవర్ధక శాఖకు లక్ష్యం నిర్దేశించింది. ఈ నెల 1 నుంచి అన్ని పశు వైద్య కేంద్రాల్లో మేలు జాతి వీర్యం ఉంచింది. ‘అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి అపోహలకు పోకుండా మేలు జాతి వీర్యాన్ని పాడి పశువులకు వేయించాలి. దీనిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం’ అని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు టి.గోవిందరాజు తెలిపారు.

## చికిత్స పొందుతూ మృతి

**కైకలూరు, న్యూస్‌టుడే:** మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కైకలూరు గ్రామీణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఆలపాడు గ్రామానికి చెందిన బొర్రా వెంకట మధుబాబు(23) ఏడాదిన్నర కిందట అదే గ్రామానికి చెందిన మేరీ అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. గత పది రోజులుగా భార్యాభర్తలిద్దరూ గొడవ పడుతున్న తరుణంలో ఈనెల 7న భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అదే రోజు ద్విచక్ర వాహనం ఫైనాన్స్ చెల్లించలేదని ఫైనాన్స్ సంస్థ వారు బండి తీసుకు వెళ్లిపోయారు. తీవ్ర మనస్తాపానికి గురైన మధుబాబు ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం రాత్రి మృతి చెందాడు. దీనిపై ఆదివారం మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.రాంబాబు తెలిపారు.

## యువతిపై అత్యాచార యత్నం

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండిలోని ఓ ఇంట్లోకి చొరబడి 19 ఏళ్ల యువతిపై ఆదివారం ఒక వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. తనకు వంట మనిషి కావాలని పాములపర్రు గ్రామానికి చెందిన వర్రే రాజేష్ శనివారం ఉండిలోని యువతి వద్దకు వెళ్లి ఆమె తల్లి ఫోన్ నంబర్ తీసుకున్నాడని చెబుతున్నారు. అదే ఇంటికి మళ్లీ ఆదివారం వెళ్లేసరికి ఒంటరిగా ఉన్న యువతిపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో పరారయ్యాడని పోలీసులు తెలిపారు.

## చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

13 మందికి గాయాలు

**చింతలపూడి, న్యూస్‌టుడే:** ప్రమాదవశాత్తూ తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సు వెలగలపల్లి సమీపంలో ఓ చెట్టును ఆదివారం ఢీకొట్టడంతో 13 మందికి గాయాలయ్యాయి. వీరిలో నలుగుర్ని మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తొమ్మిది మందికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం ఇళ్లకు పంపించారు. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సత్తుపల్లి నుంచి ఏలూరు వెళ్తోంది. వెలగలపల్లి సమీపంలో భారీ గోతులు ఉన్న విషయాన్ని డ్రైవర్ గమనించకుండా వేగంగా వెళ్లడంతో స్టీరింగ్‌పై పట్టు కోల్పోయి పక్కనే ఉన్న పెద్ద చెట్టును ఢీకొట్టాడు. ప్రయాణికులు భయంతో కేకలు వేయడంతో వెంటనే స్థానికులు స్పందించి 108కి ఫోన్ చేశారు. ప్రమాదంలో గాయపడ్డ వారందరినీ 108లో చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో చింతలపూడికి చెందిన రెడ్డి చిన్ని, ధర్మాజీగూడేనికి చెందిన మిద్దే జగన్నాథం, మిద్దే వెంకటలక్ష్మి, లింగపాలేనికి చెందిన గొల్లపల్లి ఏసులను మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన తొమ్మిది మందికి స్వల్ప గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స చేసి ఇళ్లకు పంపించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ వివరించారు.

**స్పందించిన ఎమ్మెల్యే..** ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్థానిక తెదేపా నాయకులను ఘటన జరిగిన స్థలానికి పంపించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించే వరకు ఆసుపత్రిలోనే ఉండాలని తెదేపా నాయకులకు సూచించారు. ఆసుపత్రి కమిటీ సభ్యుడు కొండ్రు దేవా తదితరులు దగ్గరే ఉండి మెరుగైన సేవలందించేలా చూశారు.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)**
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ - 173, చికెన్ స్కిన్‌లెస్ - 196.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 103, 111, 122 చికెన్ విత్ స్కిన్ - 196 చికెన్ స్కిన్‌లెస్ - 206.

## పెళ్లాడిన యువకుడిపై యువతి బంధువుల దాడి

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడి ఇంటిపై యువతి కుటుంబసభ్యులు దాడి చేసి.. యువతిని తీసుకెళ్లిన ఘటనపై లక్కవరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎంవీ సుభాష్ కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లికి చెందిన బెజవాడ రమేశ్.. పెదవేగి మండలం వీరంపాలెం గ్రామానికి చెందిన గంగోత్రి కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ శుక్రవారం ఏలూరులో ప్రేమ వివాహం చేసుకుని.. రక్షణ కావాలని లక్కవరం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అయితే ఎస్సై శశాంక.. ప్రేమజంట ఇరు కుటుంబాలను రావాల్సిందిగా సమాచారం అందించారు. అనంతరం వారు రమేశ్ ఇంటికి వెళ్లిపోయారు. కాగా శనివారం అర్ధరాత్రి యువతి కుటుంబసభ్యులు, బంధువులు.. రమేశ్ ఇంటిపై దాడి చేసి గంగోత్రిని తీసుకు వెళ్లిపోయారు. దాడి చేసిన పలువురు యువకులను రమేశ్ బంధువులు పట్టుకుని లక్కవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దీనిపై డీఎస్పీ రవిచంద్ర ఆదేశాల మేరకు.. సీఐ సుభాశ్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి యువతి ఆచూకీ కనుగొని ఆదివారం జంగారెడ్డిగూడెం తీసుకువచ్చారు. దాడికి పాల్పడ్డ యువతి సోదరుడు శరత్‌చంద్రతో పాటు మరో 11 మందిపై ఆదివారం కేసులు నమోదు చేశామని, ఇరు వర్గాలను బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. అలాగే యువతిని ఆమె భర్త రమేశ్‌కు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## 50 ఎకరాల్లో మారుజాతి కలప వనాలు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** వనీకరణలో భాగంగా జంగారెడ్డిగూడెం అటవీ రేంజి పరిధిలోని ములగలంపల్లి బీట్‌లో 50 ఎకరాల్లో మారుజాతి కలప వనాలను పెంచనున్నట్లు రేంజి అధికారి వి.దుర్గాకుమార్ బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. 50 ఎకరాల్లో సుమారు కలప జాతికి చెందిన 22 వేల మొక్కలను పెంచుతామన్నారు. వీటిలో వేగిశ, మద్ది, తెల్లమద్ది, రోజ్‌వుడ్, బండారు, నారవేపి తదితర మొక్కలు ప్లాంటేషన్ చేస్తామన్నారు. ఇందుకు రూ.8 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ప్లాంటేషన్ ప్రక్రియ శరవేగంగా జరుగుతుందన్నారు. కంపా పథకంలో ఏలూరు డివిజన్ పరిధిలోని ఒక్క జంగారెడ్డిగూడెం రేంజిలోనే ప్లాంటేషన్ పనులు మంజూరైనట్లు దుర్గాకుమార్ బాబు తెలిపారు.

## కౌలు రైతుకు పంట రుణం ఇవ్వాలి

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** రిజర్వ్ బ్యాంక్ ఆదేశానుసారం కౌలు రైతుకు రూ.2 లక్షలు పంట రుణం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలాంటి హామీ లేకుండా కౌలు రైతుకు పంట రుణాలివ్వాలని కోరారు. భూ యజమాని పంట రుణం పొందారన్న పేరుతో కౌలు రైతుకు మొండి చేయి చూపడం తగదన్నారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో రుణాలకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించినా.. ఆచరణలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన కౌలు చట్టం తీసుకొచ్చి మేలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 6304901226

EENADU Classifieds

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS




చి॥ శౌమిక్ మహదేవ్ అగస్త్య

మా గారాల బాబు శౌమిక్ కు మొదటి పుట్టినరోజు శుభాకాంక్షలతో.. నిండు హృదయంతో శతమానంభవతి అని దీవిస్తూ..

అమ్మ : శ్రావ్య
నాన్న : సాయిరామ్
మేనత్త : రమ్య
మామయ్య : అనిల్‌బాబు
తాతయ్య : తోకల రామకృష్ణ
నానమ్మ : విజయలక్ష్మి
అమ్మమ్మ : కళ్యాణి
తాతయ్య : నిమ్మగడ్డ శేఖర్

TENDER

ఇ-కోట్ టెండర్ సేల్: 1050 KVA, జెన్‌సెట్ 2 నెం.లు, తనిఖీ 16 & 17 ఉ. 9.00 గం. నుండి సా. 5.00 గం. వరకు. ITC లిమిటెడ్, ABD అనపర్తి-533342, తూ.గో. జిల్లా. ఇ-కోట్ టెండరు తేది: 18.07.25, టెండరు ఫారం ధర రూ. 500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై- 14 ద్వారా మొబైల్: 9840731925, www.welcomeauctioneers.com.

JOBS

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

ఏలూరు జ్ఞాపిక TVS షోరూం నందు పనిచేయుటకు అనుభవం కలిగిన సిబ్బంది కావలెను. టెలీకాలర్స్ -2, సేల్స్ ఎగ్జిక్యూటివ్ -8, సర్వీస్ అడ్వైజర్ -2, ఫ్లోర్ ఇన్‌చార్జి -2, టెక్నీషియన్స్ - 4. ఇంటర్వ్యూ తేది. 15-7-2025. ప్రదేశం : జ్ఞాపిక TVS, సత్రంపాడు. ✆ 70957 06262, 70957 09292.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి / వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TG No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9010680011, 9989371122.

భీమవరంలో ఫైనాన్స్ కంపెనీ యందు పనిచేయుటకు రికవరీ స్టాఫ్ (Male) జీ॥ 14000 to 16000. Ph: 91339 87779, 96526 74226.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 4.93 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం


(c) eenadu

# ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

ఈనాడు కథనానికి స్పందన

## గుంత పూడ్చారు

**ఏలూరు నగరం, న్యూస్‌టుడే:** ఒకటో పట్టణంలోని పెద్ద వంతెనపై ఏర్పడిన గుంతను పూడ్చారు. 'గుంత పూడ్చరు.. చింత తీరదు' శీర్షికన ఈ నెల 12న 'ఈనాడు'లో ప్రచురించిన చిత్ర కథనానికి స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు ఆదివారం గుంతను పూడ్చించారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**తొలగిన మురుగు.. నిడమర్రు (గ్రామీణం):** మండలంలోని బువ్వనపల్లి కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగును పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. 'మురుగు.. రోడ్డుపై పరుగు' శీర్షికన ఈ నెల 12న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి పంచాయతీ కార్యదర్శి సంజీవరావు స్పందించారు. ఆదివారం సిబ్బందితో మురుగు తొలగింపజేసి బ్లీచింగ్ చల్లించారు.

## కూటమి సర్కారుతోనే సంక్షేమ పాలన

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా ఆదివారం ఆయన 10 డివిజన్‌లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. నాయకులు పార్థసారథి, పెదబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు కరపత్రం ఇస్తున్న రామకృష్ణంరాజు

## ప్రజల అభ్యున్నతే ధ్యేయం

**పిప్పర(గణపవరం), న్యూస్‌టుడే:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా పిప్పరలో ఆదివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానికులు నివేదించిన సమస్యలను తెదేపా యాప్‌లో నమోదు చేశారు. తెదేపా నాయకుడు మురళీకృష్ణంరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్లూరి విగ్రహాన్ని సంరక్షిస్తాం

**ఏలూరు నగరం, న్యూస్‌టుడే:** స్థానిక ఏఎస్‌ఆర్ క్రీడా మైదానంలో ఆదివారం వాకర్స్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పత్తిపాటి నాగ విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. జలీల్ నూతనంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహ సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. పరిసరాల శుభ్రత, విద్యార్థులకు సాయం, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. సంఘ గౌరవాధ్యక్షులు ఎస్.ఎం.అక్బర్, ఎస్.కె.సత్తార్, విశ్వనాథ్, మాధవరావు, కొమ్మ నాగరాజు, మహిళా అధ్యక్షురాలు మేరీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో 'ఈనాడు'

**ఉదయం 9.30 గంటలకు:** జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంపీ మహేశ్ కుమార్ సహకారంతో సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మెగా ఉద్యోగ మేళా. **ఉదయం 10 గంటలకు:** ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అప్రంటిస్‌షిప్ మేళా. **- న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్**

## చినుకు రాలక.. అరక సాగక!

### ఆందోళనలో అన్నదాతలు

**దెందులూరు, ఏలూరు గ్రామీణ- న్యూస్‌టుడే:** వరుణుడు కరుణించలేదు. పంట కాలువల్లో నీరు ప్రవహించలేదు. వేసవిని తలపించేలా భానుడు భగభగలాడుతున్నాడు. నాట్లు వేయాల్సిన పొలాలు.. పచ్చగడ్డితో దర్శనమిస్తున్నాయి. ఫలితంగా రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

**35 వేల ఎకరాల్లో..** దెందులూరు నియోజకవర్గంలో పెదపాడు, ఏలూరు గ్రామీణ, పెదవేగి, దెందులూరు మండలాలున్నాయి. పెదవేగి మినహా మిగిలిన మూడు మండలాల్లో సీతంపేట కాలువ దిగువన 35 వేల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. గత నెల కురిసిన మోస్తరు వర్షాలకు చాలా మంది రైతులు నారుమడులు పోశారు. అదే సమయంలో కృష్ణా- ఏలూరు కాలువకు సాగునీరు విడుదల చేశారు.

**ముఖం చాటేసిన వరుణుడు..** అంతా సవ్యంగా సాగుతున్న దశలో.. వరుణుడు ముఖం చాటేశాడు. కృష్ణా- ఏలూరు కాలువలో నీటి ప్రవాహం తగ్గింది. 600 క్యూసెక్కులకు గాను కేవలం 150 క్యూసెక్కుల జలాలు ప్రవహిస్తున్నాయి. దాంతో సాగు నీరు పొలాలకు చేరడం లేదు. భానుడి భగభగలు, పడమటి గాలులతో పొలాలు నెర్రెలు వారాయి వర్షాలు కురవక, పంట కాలువలకు పూర్తిగా జలాలు సరఫరా కాకపోవడంతో నారుమడులు ఎండిపోతున్నాయి. సాగుకు సమయం మించినందున ఖరీఫ్‌లో స్వల్పకాలిక వరి వంగడాలు [illegible], 1232, 1140 రకాలు సాగు చేసుకోవడం మంచిదని ఏడీఏ అనిల్‌కుమారి తెలిపారు.

మాదేపల్లి రోడ్డులోని పొలంలో మేస్తున్న గేదెలు

వసంత మహల్ వంతెన వద్ద కృష్ణా- ఏలూరు కాలువ దుస్థితి

**నారు చేతికందిన దశలో..** కాలువకు శివారునున్న ఏలూరు గ్రామీణ మండలంలోని గ్రామాలకు చుక్కనీరు చేరడం లేదు. నారు చేతికందొచ్చిన సమయంలో.. నీటి సరఫరా ఆటంకం ఏర్పడుతోంది. దీని ప్రభావం దిగుబడులపై పడే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. 'ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి మట్టం పెరిగింది. ఏలూరు కాలువకు నీటి విడుదలను పెంచే అవకాశాలున్నాయి. రెండ్రోజుల్లో శివారు పొలాలకూ పూర్తిస్థాయిలో నీరందుతుంది' అని కృష్ణా-ఏలూరు కాలువ సెక్షన్ ఏఈ దుర్గారావు తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

| | |
|---|---|
| ఏలూరు టౌన్: 80085 74487 | ఏలూరు గ్రామీణ: 80085 74535 |
| పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492 |

**ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే:** ? పడమరవారి గంగానమ్మ గుడి కూడలిలోని విద్యుత్తు నియంత్రిక వద్ద చెత్త కుండీని రోడ్డుపై ఏర్పాటు చేశారు. వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. **- గంగరాజు**

✔ క్షేత్రస్థాయిలో పరిశీలించి, చెత్త కుండీని మార్పు చేయిస్తాం. ఇబ్బందుల్లేకుండా చూస్తాం. **- చంద్రయ్య, అదనపు కమిషనర్**

? తంగెళ్లమూడి నుంచి బీడీ కాలనీకి వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. **- సర్వేశ్వరరావు, స్థానికుడు**

✔ సమస్య నా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- సాంబశివరావు, విద్యుత్తు ఏఈ**

## గుండుగొలను వంతెన పూర్తి చేయండి: ఎంపీ

గుత్తేదారుతో ఫోన్‌లో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్

**గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే:** ఏలూరు కాలువపై గుండుగొలను వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను త్వరితం పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఆదేశించారు. గుండుగొలను పర్యటనలో అసంపూర్తి వంతెన పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. పనులు ఆగిపోవడానికి గల కారణాలను ఎన్‌హెచ్ అధికారులతో ఫోన్‌లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆపై గుత్తేదారుతోనూ ఫోన్‌లో మాట్లాడారు. తుది దశకు చేరుకున్న పనులను గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అపరిష్కృత బిల్లుల మంజూరుకు తాను బాధ్యత తీసుకుంటానని భరోసానిచ్చారు. మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, నాయకులు కరణం పెద్దిరాజు, పుప్పాల హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీహరికోటికి మహాత్మా చరఖా అవార్డు

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** హైదరాబాద్ గాంధీభవన్‌లో గాంధీజ్ఞాన్ ప్రతిష్ఠాన్ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యాన ఆదివారం స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు నగరానికి చెందిన గాంధేయవాది శ్రీహరికోటి దంపతులను మహాత్మా చరఖా అవార్డుతో సత్కరించారు. సంస్థ ఛైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్ పేట ఉద్యానంలో పిల్లల సందడి

## ఆనంద ఆదివారం!

### హేలాపురిలో పిల్లల కోలాహలం

ఏఎస్‌ఆర్ మైదానంలో క్రికెట్ ఆడుతున్న బాలలు

ఏలూరు నగరవాసుల్లో ఆదివారం ఆనందం నింపింది. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు ప్రధాన ఉద్యానాల్లో ఆటలాడుతూ సందడి చేశారు. ఏఎస్‌ఆర్ క్రీడా మైదానంలో యువకులు క్రికెట్ ఆడుతూ సంతోషంగా గడిపారు. ఆర్‌ఆర్ పేట రహదారి వెంబడి దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

## పునాది దశ.. మారని దిశ!

నిడమర్రు మండలం బువ్వనపల్లి ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం పునాది దశలో నిలిచిపోయింది. దీని చుట్టూ తుప్పలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. సొంత భవనం లేకపోవడంతో.. పరాయి చెంతన కార్యకలాపాలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. నిధుల లభ్యత మేరకు భవన నిర్మాణ పూర్తికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. **- న్యూస్‌టుడే, బువ్వనపల్లి(నిడమర్రు గ్రామీణం)**

## రైతులకు మెరుగైన సేవలందిస్తాం

బాధ్యతలు స్వీకరిస్తున్న గోపాలకృష్ణ

**బొమ్మిడి(ఉంగుటూరు), న్యూస్‌టుడే:** రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని బొమ్మిడి విశాల సహకార సంఘం(సొసైటీ) ఛైర్మన్ మైలవరపు గోపాలకృష్ణ అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయ ఆవరణలో త్రిసభ్య కమిటీ సభ్యులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఛైర్మన్(జనసేన)గా గోపాలకృష్ణ, సభ్యులుగా నక్కా ఆనందరావు, కన్నూరి శ్రీనివాసరావు ప్రమాణం చేశారు. ఎమ్మెల్యే సోదరుడు భీమరాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, చేబ్రోలు సొసైటీ ఛైర్మన్ కడియాల రవిశంకర్, నాయకులు పాల్గొన్నారు.

## సీతంపేట సొసైటీ అధ్యక్షుడిగా యలమర్తి

**దెందులూరు:** సీతంపేట విశాల సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా యలమర్తి వీర వెంకట సత్యనారాయణ(శ్రీను), డైరెక్టర్లు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనకు తెదేపా నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీను మాట్లాడుతూ.. రైతు సేవే పరమావధిగా పని చేస్తానన్నారు. నాయకులు మోతుకూరి నాని, మిల్లు బాబు తదితరులు పాల్గొన్నారు.

## పీ4తో సామాజిక స్పృహ పెంపు: చింతమనేని

దివ్యాంగులకు మూడుచక్రాల సైకిళ్లు ఇస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

**ముండూరు(పెదవేగి), న్యూస్‌టుడే:** సమాజంలో మనిషికి మనిషికి సాయపడేలా, సామాజిక స్పృహ పెంపొందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 కార్యక్రమాన్ని రూపొందించారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ముండూరులో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి చింతమనేని హాజరయ్యారు. తమ కుమారుడు బలుసు దీపుశ్రీనివాస్ జన్మదినం సందర్భంగా తల్లిదండ్రులు బలుసు లక్ష్మణరమేశ్, దివ్యశ్రీ దంపతులు రూ.3 లక్షల విలువైన రీఛార్జిబుల్ మూడుచక్రాల సైకిళ్లను ఏడుగురు దివ్యాంగులకు అందజేయడంపై ఎమ్మెల్యే అభినందించారు. అంతకుముందు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 387 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. నాయకులు సుజన్, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

తనిఖీ చేస్తున్న పోలీసులు

**కలపర్రు(పెదపాడు), న్యూస్‌టుడే:** మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. స్థానిక కలపర్రు టోల్‌ప్లాజా వద్ద డాగ్ స్క్వాడ్, పోలీసు బృందాలు ఆదివారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టాయి. కార్లు, ప్రైవేటు, ఆర్టీసీ బస్సులను ఆపి క్షుణ్నంగా తనిఖీ చేశాయి. సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖ ముందుకెళుతోందన్నారు. రహదారి నిబంధనలు, ప్రమాదాల నివారణ తదితరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై కట్టా శారదాసతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## అటుఇటు.. అదుపు తప్పేట్టు!

నిడమర్రు మండలం మందలపర్రు అంగన్‌వాడీ కేంద్రానికెళ్లే మార్గం ప్రమాదకరంగా మారింది. గతంలో ఈ దారిని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేశారు. అంచులను మట్టితో సరిచేయకపోవడంతో సమస్య నెలకొంది. రహదారికి ఓవైపు మురుగు బోదె, మరో వైపు చెరువు ఉండటంతో.. రాకపోకలు సాగించేందుకు స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకర దారిలో పిల్లలను ఎలా అంగన్‌వాడీ కేంద్రానికి పంపుతామని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మందలపర్రు(నిడమర్రు గ్రామీణం)**

## బోదె చెంత.. ఆక్రమణల చింత

గణపవరం మండలం కేశవరంలో ఉండి ప్రధాన కాలువ గట్టును ఆనుకుని పంట బోదెను కొందరు ఆక్రమించేశారు. దాన్ని పూడ్చేసి పక్కా షెడ్డు నిర్మించారు. మరికొందరు పక్కా భవనాలు నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. ఫలితంగా గట్టు కుంచించుకుపోయి రైతులు పంట ఉత్పత్తులు తరలించేందుకు ఇబ్బంది పడుతున్నారు. విషయం తన దృష్టికి రాలేదని, గట్టును పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని చిలకంపాడు సెక్షన్ జలవనరులశాఖ ఏఈ అనిల్ తెలిపారు. **- న్యూస్‌టుడే, కేశవరం(గణపవరం)**

## రోడ్డు అంచులు.. నిండిన వ్యర్థాలు

గణపవరం మండలం జల్లికాకినాడలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలను కేశవరం కూడలికి వెళ్లే దారి వెంబడి పడేస్తున్నారు. గ్రామంలో ఎస్‌డబ్ల్యూఎం షెడ్డు ఉన్నా.. చెత్త తరలించడం లేదు. రోజుల తరబడి వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే విద్యార్థులు, పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై చెత్త వేయకుండా చర్యలు చేపడతామని ఈవోపీఆర్డీ సత్యనారాయణ తెలిపారు. **- న్యూస్‌టుడే, జల్లికాకినాడ(గణపవరం)**

## జిల్లాలు కలుపుతూ.. విషాదం నింపుతూ!

పెదపాడు- కుదరవల్లి మార్గంలో కానరాని సూచికలు

నాయుడుగూడెం వద్ద ప్రమాదకర మలుపు

**పెదపాడు, న్యూస్‌టుడే:** పెదపాడు నుంచి కృష్ణా జిల్లా నందివాడ మండలం కుదరవల్లికి వెళ్లే ప్రధాన ర.భ.శాఖ రహదారి ప్రమాదాలకు నెలవుగా మారింది. గత తెదేపా హయాంలో ఈ రోడ్డును అభివృద్ధి చేశారు. ఏలూరు నుంచి పెదపాడు మీదుగా కృష్ణా జిల్లా కుదరవల్లి, నందివాడ, గుడివాడ వెళ్లేందుకు ఇది దగ్గరి దారి. ఫలితంగా ఎక్కువ మంది ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రాధాన్యమున్న రహదారిపై అనేక చోట్ల మలుపులున్నాయి. రాత్రిళ్లు రాకపోకలు సాగించే వాహనదారులు మలుపులను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు.

కొనికిలో సూచికల్లేకుండా..

**ఎక్కడెక్కడ అంటే..** నాయుడుగూడెం, సత్యవోలు, కడిమికుంట, కొనికి గ్రామాల వద్ద ఎక్కువగా మలుపులున్నాయి. ఆయా మలుపుల వద్ద అధికారులు వేగ నిరోధకాలు, సూచికలు ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ఎదురొచ్చే వాహనాలు దగ్గరకొచ్చే వరకూ కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. 'ఆయా గ్రామాల వద్దనున్న మలుపులను పరిశీలిస్తాం. అక్కడ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం' అని ర.భ.శాఖ ఏఈ శేషుకుమార్ తెలిపారు.

## రహదారి ప్రమాదంపై కేసు

**పెదవేగి, న్యూస్‌టుడే:** ముండూరులో ఈ నెల 4న చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ముండూరుకు చెందిన యలమర్తి కేశవాచార్యులు(65) పొలం పనులకెళ్లి ఇంటికి వస్తున్నారు. రోడ్డు దాటుతున్న ఆయన్ను ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కేశవాచార్యులను విజయవాడ సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి కుమారుడు శరత్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రెండు లారీల స్వాధీనం

**పెదపాడు, న్యూస్‌టుడే:** పర్యావరణానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న రెండు లారీలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.ఎస్.శారదా సతీశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. విజయవాడ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను రెండు లారీల్లో మండలంలోని పలు చేపల చెరువులకు తరలిస్తున్నారు. గోగుంట, గుడిపాడు వద్ద వాటిని పట్టుకున్నారు. పలువురిని అదుపులోకి తీసుకొని, వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## రాట్నాలమ్మకు ప్రత్యేకాభిషేకం



**రాట్నాలకుంట (పెదవేగి), న్యూస్‌టుడే:** రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముసునూరు మండలం బలివే పంచాయతీ వెంకటాపురం మహిళలు, ఆడపడుచులు రాట్నాలమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.1,09,921 ఆదాయం లభించిందని ఈవో ఎన్.సతీశ్‌కుమార్ తెలిపారు.

**శాకంబరిగా కనకదుర్గమ్మ.. గణపవరం:** మొయ్యేరులో వెలసిన కనకదుర్గమ్మ ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో చండీయాగం నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయావరణలో అన్నసమారాధన చేపట్టారు.

**108 పిండి వంటకాలతో.. ఉంగుటూరు:** స్థానిక తూర్పుకాపు రామాలయం వద్దనున్న కనకదుర్గమ్మకు స్థానికులు సారె సమర్పించారు. రావులపర్రులోని మహాలక్ష్మికి గ్రామస్థులు 108 రకాల పిండి వంటలు నివేదించారు. అమ్మవారికి శాకంబరిగా అలంకరించారు.

**తిమ్మనగూడెంలో పాటిమ్మకు.. దెందులూరు:** తిమ్మనగూడెంలోని పాటిమ్మకు ఆదివారం మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. చీర, జాకెట్లు, పసుపు, కుంకుమ, గాజులు, మధుర పదార్థాలు సమర్పించారు. భక్తులు ఆలయ చుట్టూ ప్రదక్షిణ చేసి, అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

**వేంకటేశ్వరుడికి నక్షత్ర పూజలు.. భీమడోలు:** గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణం నక్షత్రం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గర్భ గుడిలోని స్వామివారి మూలమూర్తికి అభిషేకాలు, తులసీ దళార్చన నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించి తరించారు.

**సూర్యనారాయణ నమః.. ఏలూరు నగరం:** స్థానిక పవరుపేటలోని సూర్యనారాయణుడి ఆలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత సూర్యభగవానుడినికి పంచామృతాభిషేకాలు చేసి.. తులసీ, వివిధ పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పాముకాటుతో మహిళా కూలీ మృతి

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** పాముకాటుతో వ్యవసాయ మహిళా కూలీ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. చింతలపూడి మండలం వెంకటాద్రిగూడేనికి చెందిన బొడ్డు వెంకాయమ్మ(60) ఆదివారం పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఆమెను పాము కాటేసింది. బాధితురాలిని సహచరులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

## వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** వృద్ధురాలి మెడలో గొలుసు చోరీకి పాల్పడ్డారు ఇద్దరు ఆగంతకులు. పోలీసుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన వృద్ధురాలు వెంకటేశ్వరి కుమార్తె ఏలూరు నగరం సత్రంపాడు ఎమ్మార్సీ కాలనీలో ఉంటున్నారు. ఆమె వద్దకొచ్చేందుకు ఈ నెల 12 రాత్రి విజయవాడలో నాన్‌స్టాప్ బస్సెక్కి సత్రంపాడులో దిగారు. శాంతినగర్ పద్నాలుగో రోడ్డు మీదుగా నడిచి వెళ్తుండగా.. రోడ్డు మధ్యలో ఇద్దరు ఆగంతకులు ద్విచక్ర వాహనం నిలుపుకొని ఉన్నారు. వృద్ధురాలు వారి సమీపానికి రాగానే మెడలోని 3 కాసుల బంగారు గొలుసు తెంపుకొని పరారయ్యారు. బాధితురాలు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కోటేశ్వరరావు ఘటనా స్థలంలోని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఏలూరు సినిమా

| | |
|---|---|
| అంబిక డీలక్స్ | లోపలికి రా చెప్తా |
| అంబిక మినీ | తొలిప్రేమ |
| సాయిబాలాజీ | జురాసిక్ వరల్డ్ రీబర్త్ |
| బాలాజీ | ఓ భామ అయ్యో రామ |
| సత్యనారాయణ స్క్రీన్ 1 | సూపర్‌మ్యాన్ |
| సత్యనారాయణ స్క్రీన్ 2 | మార్గన్ |
| సత్యనారాయణ స్క్రీన్ 3 | తమ్ముడు |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 1 | వర్జిన్ బాయ్స్ |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 2 | ది 100 |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 3 | 3 బీహెచ్‌కే |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1 | కన్నప్ప |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2 | తమ్ముడు |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3 | 3 బీహెచ్‌కే |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4 | కన్నప్ప |

## సర్కారు మోసాలు ఎండగడదాం: వైకాపా

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** కూటమి సర్కారు మోసాలను ఎండగడదామని వైకాపా ఏలూరు పార్లమెంట్ పరిశీలకుడు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. సర్కారు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు చూపి అవగాహన కల్పించాలన్నారు. నాయకులు కారుమూరి సునీల్‌కుమార్, జయప్రకాశ్, విజయరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కల్లు నమూనాల సేకరణ

**టి.నరసాపురం, న్యూస్‌టుడే:** మండలంలో పరీక్షల నిమిత్తం కల్లు నమూనాలు సేకరించినట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ ఆదివారం తెలిపారు. రాజుపోతేపల్లి, బంధంచర్లలో కల్లు దుకాణాలను తనిఖీ చేసిన రసాయన పరీక్షల నిమిత్తం కల్లు సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

## మార్గదర్శి.. పేదల పెన్నిధి!

● బంగారు కుటుంబాలకు చేయూత

● పీ4 అమలుకు కార్యాచరణ

'మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు మార్గదర్శకులుగా పేర్లు నమోదు చేసుకోవాలి. మొదట ఎమ్మెల్యేలు దత్తత తీసుకుంటే, వారిని చూసి మరికొందరు దాతలు ముందుకు రావాడానికి ఆస్కారం ఉంటుంది.' **- ఇటీవల శాసనసభ్యుల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలివీ.**

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో పేదరికం నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పీ4 పేరిట ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. గ్రామాల్లోని పేద కుటుంబాలను గుర్తించి దాతల భాగస్వామ్యంతో.. వారి సంక్షేమం, సమగ్రాభివృద్ధికి బాటలు వేయనుంది. ఇందుకు 'బంగారు కుటుంబాలు- మార్గదర్శి'కి రూపకల్పన చేసింది. ఉంగుటూరు నియోజకవర్గంలో బంగారు కుటుంబాలను గుర్తించిన అధికార యంత్రాంగం, మార్గదర్శులను అనుసంధానించే పనిలో నిమగ్నమైంది.

**సమగ్ర నివేదికతో..** ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామ సచివాలయాల వారీగా బంగారు కుటుంబాలను అధికారులు ఎంపిక చేశారు. ఆయా కుటుంబాల్లో ఎందరు ఉన్నారు. వారి జీవన ప్రమాణాలేంటి.. ఎలా చేయూతనివ్వాలన్న అంశాలతో సమగ్ర నివేదిక రూపొందించారు. ఆసక్తి ఉండి, అందుబాటులోని మార్గదర్శులను అన్వేషిస్తున్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు అధికంగా ఉండటంతో. వాటి నిర్వాహకులను చైతన్యపరిస్తే సత్ఫలితాలు రాబట్టవచ్చు.

అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు(పాత చిత్రం)

**నియోజకవర్గంలో 10,137..** ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల్లో 10,137 బంగారు కుటుంబాలను గుర్తించారు. వీటిని ఆగస్టు 15 నాటికి దత్తత తీసుకునేలా మార్గదర్శులను చూడాల్సి ఉంది. నియోజవర్గ నోడల్ అధికారిగా ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్‌రావు, కన్వీనర్‌గా ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజ్, సహాయక సిబ్బందిగా అయిదుగురు సచివాలయ ఉద్యోగులు, విషయ, వృత్తి నిపుణులు ఇద్దరు మొత్తం తొమ్మిది మందితో బృందం ఏర్పాటు చేశారు. 'ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే ధర్మరాజు పర్యవేక్షణలో సమీక్షిస్తున్నాం. వచ్చే నెల 15 నాటికి అన్ని బంగారు కుటుంబాలను మార్గదర్శులను అనుసంధానిస్తాం' అని పీ4 నోడల్ అధికారి రామ్మోహన్‌రావు తెలిపారు.

**నియోజకవర్గ సమాచారం**

| మండలం | మొత్తం సచివాలయాలు | బంగారు కుటుంబాలు |
|---|---|---|
| ఉంగుటూరు | 25 | 2,973 |
| భీమడోలు | 17 | 2,388 |
| నిడమర్రు | 14 | 2,240 |
| గణపవరం | 20 | 2,536 |


## దస్తావేజులు పోయినవి

ఏలూరులో నివసిస్తున్న కొత్త సుబ్బారావు గారి కుమారుడు కొత్త రాజబాబు అను నేను, నా యొక్క దస్తావేజులు నెం. 3566/1995 తేది: 27-05-1995 మరియు 8109/1995 తేది: 26-12-1995 లను జిరాక్స్ చేయించటకు ది.12-03-2025న ఏలూరులో సత్రంపాడులో నా ఇంటి వద్ద నుండి సత్రంపాడు సెంటర్ వద్దకు తీసుకుని వెళ్ళుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడి పోయినవి. కావున ఎవరికైనా దొరికిన ఎడల నా అడ్రస్సుకు తెలియ పరచవలసినదిగా కోరుచున్నము.

**కొత్త రాజబాబు,**
డోర్ నెం. 10-30, విద్యా వికాస్ హాస్టల్ వద్ద, ఏలూరు - 534007.
సెల్ నెం: 93976-12345


(c) eenadu

# పోలవరం

•పోలవరం • చింతలపూడి

## జాతీయ రహదారి విస్తరణకు చెట్ల తొలగింపు

పట్టిసీమ కూడలిలో దుంగలు

**పోలవరం, న్యూస్‌టుడే:** జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకు 365బీబీ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పోలవరం మండలంలోనూ రోడ్డు వెంబడి ఉన్న చెట్లను తొలగించే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రగడపల్లి నుంచి పట్టిసీమ కూడలి వరకు రహదారికి ఇరువైపులా చెట్లను తొలగించి దుంగలు బయటకు తరలిస్తున్నారు. భూసేకరణ పూర్తికావడంతో వర్షాకాలం అనంతరం పనులు వేగవంతం చేసేందుకు చెట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టినట్లు పర్యవేక్షణ ఏఈ భాజాబాబు తెలిపారు. ఇప్పటికే జీలుగుమిల్లి నుంచి రహదారి పనులు ప్రారంభించినట్లు ఏఈ పేర్కొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** మండలంలోని రామారావుపేట సెంటర్ విద్యుత్తు ఉప కేంద్రం వద్ద పలు నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 10.30 నుంచి 2 గంటల పాటు చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ఏఈ శ్రీనివాసవర్మ తెలిపారు.

# నీళ్లతో కాదు.. ఆక్రమణలతో నిండాయి!

• కనుమరుగవుతున్న చెరువులు • సాగు నీరందక రైతులకు ఇబ్బందులు

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల ఆక్రమణలతో ఆయకట్టు దారులకు నీరందక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చెరువులు ఉన్న ప్రాంతాల్లో పంట పొలాలు దర్శనమిస్తున్నాయి. వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులు రోజురోజుకు కనుమరుగవుతుండటంతో చెరువులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీరందక నానా అవస్థలు పడుతున్నారు. ఒకపక్క ఆక్రమణలు, మరోపక్క తూడులు లోతు కంటే ఎక్కువగా కందకాలతో చెరువులు అధ్వానంగా చేరాయి. ఫలితంగా ఈ ఏడాది పంటలకు నీరు ఎలా అందుతుందో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

ఆక్రమణకు గురైన నందమూరి విజయసాగర్ ప్రాజెక్టు

**అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు**

చింతలపూడి, టి.నరసాపురం మండల సరిహద్దుల్లో 300 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల ఎకరాలకు పైగా సాగునీటిని అందించే లక్ష్యంతో నలభై ఏళ్ల కిందట నందమూరి విజయసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. అప్పటి నుంచి చెరువును అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని రైతులు చెబుతున్నారు. చెరువు గట్టు మొత్తం పెద్ద పెద్ద వృక్షాలు పెరిగి అభయారణ్యాన్ని తలపిస్తోంది. ఆయకట్టుకు నీటిని వదిలే మూడు తూములపైనా లీకులు తప్ప పట్టి నీరు వృథాగా పోతుంది. తూముల వద్ద చెట్లు పెరిగిపోవడంతో చెరువులో నీరున్నా.. బయటకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పంటల మధ్యలో ఆయకట్టు రైతుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. చెరువు పైభాగం కొమ్ముగూడెం శివారులో సుమారు వంద ఎకరాలకుపైనే ఆక్రమించి ఆయిల్ పామ్ మేర చెరువు మట్టితో మెరక చేసి ఇంజిన్లు, బోరు బావులు ఏర్పాటు చేసి వ్యవసాయం చేస్తున్నారు.. అధికారులు పట్టించుకోవడం లేదు. వారిలో కొంతమందికి పట్టాలు ఉండటం గమనార్హం. చెరువు మధ్యలో పట్టాలు ఎవరిచ్చారో తెలియదని సమీపంలోని రైతులు వాపోతున్నారు.

**చర్యలు తీసుకుంటాం..** 'ప్రభుత్వ చెరువుల ఆక్రమణదారులను సహించం. సమస్య మా దృష్టికి వచ్చింది. జలవనరుల ఉన్నతాధికారులు చెరువును పరిశీలించారు. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.' అని జలవనరుల శాఖ ఏఈఈ రాహుల్ భాస్కర్ తెలిపారు.

## కమనీయం.. శ్రీవారి కల్యాణం

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** గోకుల తిరుమల పారిజాతగిరిలో శ్రీవారి కల్యాణం ఆదివారం కమనీయంగా నిర్వహించారు. శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రవి కుమారాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాల నడుమ రమణీయంగా జరిపారు. హరే శ్రీనివాస భజన మండలి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఈవో శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## వైభవంగా బోనాల సమర్పణ

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని రామన్నగూడెంలో గంగానమ్మకు ఆదివారం వైభవంగా బోనాలు సమర్పించారు. గ్రామంలో మహిళలు బోనాలు ఊరేగించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి గుడి వద్ద అన్న సమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మెట్టగూడెంలో గంగానమ్మకు ఆషాఢ మాస మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు చేశారు. భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు వంకా కాంచన మాల, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మకు జలాభిషేకం

సామూహిక కుంకుమార్చన

**జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే:** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని జీలుగుమిల్లిలో గ్రామ దేవత ముత్యాలమ్మకు జలాభిషేకం చేసి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. లక్ష్మీపురంలో కనకదుర్గమ్మకు భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన, లలితా పారాయణం చేశారు.

## భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం

**కొయ్యలగూడెం (గ్రామీణ, న్యూస్‌టుడే:** కొయ్యలగూడెం గ్రామ దేవత చింతాలమ్మ అమ్మవారికి కుంభాభిషేకం కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు మహిళలు బిందెలతో నీరు తెచ్చి ఆలయంలోని మూల విరాట్ విగ్రహానికి స్వయంగా అభిషేకం చేశారు. ఆలయ శిఖరంపై జలాలతో అభిషేకించారు. ఆలయం వద్ద పాలతో పొంగళ్లు వండి నైవేద్యాలు సమర్పించారు. నూతనంగా ఆలయ నిర్మాణాన్ని చేపట్టనున్న సందర్భంలో 90 రోజుల పాటు కొనసాగనున్న కోటి లలిత సహస్రనామ పారాయణంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: బొరగం

పథకాలు వివరిస్తున్న శ్రీనివాసులు

**పోలవరం, న్యూస్‌టుడే:** ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా పోలవరం పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో ఆదివారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి పథకాలు ద్వారా ప్రజలకు అందుతున్న లబ్ధి గురించి వివరించారు. నల్లా రాంబాబు, పోతుల శ్రీను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** గడిచిన ఏడాదిలో కూటమి చేసిన సంక్షేమాన్ని ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరిద్దామని తెదేపా పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అన్నారు. స్థానిక పార్టీ పట్టణ కార్యాలయంలో వార్డు కమిటీలతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా చేస్తున్న ఇంటింటి పర్యటనలో ప్రతి ఇంటా మన స్వాగతం లభిస్తోందన్నారు. సూపర్ సిక్స్ అమలు గురించి మనం ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్ర రాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, నాయకులు బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపురంలో.. ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక తెదేపా నేత పోలిన శ్రీను ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఘంటా శ్రీనివాసరావు, మట్టపర్తి రూపేష్‌కుమార్, ఏపూరి కిశోర్, బోట్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా సమస్యల పరిష్కారం: ఎంపీ

అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంపీ మహేష్, ఎమ్మెల్యే రోషన్‌కుమార్ తదితరులు

**కామవరపుకోట, న్యూస్‌టుడే:** ఏడాది కాలంలో చాలా సమస్యలు పరిష్కరించుకున్నామని, దశలవారీగా పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించుకుందామని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం రాత్రి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉప్పలపాడు, కామవరపుకోట పంచాయతీ కొత్తూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న నాలుగేళ్లలో సీఎం చంద్రబాబు ఆశిస్తున్న సుపరిపాలన లక్ష్యాలు అందరికి అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలులో అందరి సహకారం కావాలన్నారు. అధికారులు బాధ్యతగా సేవలు అందించాలన్నారు. ఏలూరి హరిబాబు, గంటా సధీర్‌బాబు, కోనేరు వెంకట సుబ్బారావు, నాగేశ్వరరాంబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలి

మాట్లాడుతున్న ముస్తఫా

**జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే:** ముస్లిం సోదరులు అన్ని రంగాల్లోనూ అభ్యున్నతి సాధించాలని జంగారెడ్డిగూడెం డివిజన్ ముస్లిం ఐకాస కమిటీ సభ్యుడు షేక్ ముస్తఫా పిలుపునిచ్చారు. ములగలంపల్లి మసీదులో ఆదివారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముస్లింలు విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఐకాస సభ్యులు షేక్ బాజీ, యాకూబ్, ఆదిల్, ముస్తాక్ అహ్మద్, ఉపాధ్యాయుడు మహమ్మద్ నబీ, ములగలంపల్లి, కామయ్యపాలెం, మైసన్నగూడెం గ్రామాల ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

కార్యవర్గ సభ్యులు

**కామవరపుకోట, న్యూస్‌టుడే:** జీలకర్రగూడెం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక, ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం హైస్కూల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆర్. ఆర్. రంగరాజు, కార్యదర్శిగా మహేశ్వరి, ట్రెజరర్‌గా పూర్ణశ్రీ ఎంపికయ్యారు. వి. కె. పంకజాక్షన్, సత్యస్వరూప్‌ల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. యర్రం రాజు, రత్నకుమారి పలు గ్రామాల లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని ఇస్తున్న నాగు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల క్షేత్ర వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపం ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.1.01 లక్షల విరాళం సమకూరింది. వరంగల్‌కు చెందిన పులుమాటి రాధాకృష్ణ జ్ఞాపకార్థం అతని భార్య నాగలక్ష్మి, వారి కుమార్తెలు రత్నమాల, అనురాధ, నాగమణి, మాధవి కలిసి విరాళాన్ని అన్నదానం ట్రస్ట్ ఇన్‌ఛార్జి ఇమ్మడి నాగేశ్వరరావు(నాగు)కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నాగు దాతలను ప్రత్యేకంగా అభినందించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

**శ్రీవారి విద్యా దాన ట్రస్ట్‌కు.. ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి విద్యా దాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం సమకూరింది. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం మల్లవరానికి చెందిన కె.వెంకటరాజు విరాళాన్ని ఆలయ కార్యాలయంలో ఆదివారం జమ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

## డ్రెయిన్లు అధ్వానం!

తారకరామనగర్‌లో ఇలా..

పరింపూడి పంచాయతీ తారకరామనగర్‌కు చెందిన వెనుకబడిన ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. మురుగు నీరు ముందుకు సాగక నిల్వలు పేరుకుని దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. వినాయకుడి గుడి వీధి, ఎన్టీఆర్ విగ్రహం వీధి, ఎస్టీ బాలికల వసతిగృహం రోడ్డు తదితర ప్రాంతాల్లో సమస్య అధికంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. తేలిక పాటి వానలకే మురుగునీరు రహదారులపై చేరుతోందని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె. సురేశ్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం లేదన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ**

# బోరుమంటున్నా.. పట్టించుకోవడం లేదు!

• ఎద్దడి నివారణకు రూ.85 లక్షలతో తవ్వకాలు • వర్షాకాలం వచ్చినా అందుబాటులోకి రాని వైనం

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం నిర్మించిన అయిదు బోర్లు వర్షాకాలం వచ్చినా.. అందుబాటులోకి రాలేదు. సుమారు రూ.69 లక్షలు వెచ్చించి వివిధ ప్రాంతాల్లో బోర్లు తవ్వారు. ఈ బోర్లకు విద్యుత్తు సదుపాయం కోసం మరో రూ.16 లక్షలు విద్యుత్తు శాఖకు చెల్లించారు. అయిదు బోర్ల కోసం దాదాపు రూ.85 లక్షలు వ్యయమైనా.. కాలాతీతం అవుతోంది తప్ప ఇంత వరకు ఇవి అందుబాటులోకి రాలేదు. పట్టణ ప్రజలకు చుక్క నీరు అందలేదు. పట్టణ జనాభా రోజు రోజుకు పెరుగుతుండటంతో నీటి అవసరం ఎక్కువైంది. ప్రస్తుతం పలు ఎగువ ప్రాంతాలకు నీరు అందడం లేదు. అన్ని ప్రాంతాలకు నీరు అందించాలన్న ఉద్దేశంతో పాటు గడిచిన వేసవిలో ఎద్దడి తలెత్తకుండా సాధారణ నిధులు కేటాయించారు. వినియోగంలోకి తీసుకురాలేకపోవడంలో జరుగుతున్న జాప్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి. బోర్లకు మోటార్లు అమర్చలేదు. విద్యుత్తు సరఫరా జరగలేదు. దీంతో పప్పుల మిల్లు, అటవీశాఖ కార్యాలయం, యూపీహెచ్‌సీ, అశోక్‌నగర్, కె.కన్వెన్షన్ వద్ద మూతలు వేసిన బోర్లు వెక్కిరిస్తున్నాయి.

అశోక్ నగర్‌లో నిరుపయోగంగా ఇలా..

**మూడు చోట్ల నుంచి..** ఈ బోర్ల విద్యుత్తు సరఫరాకు పట్టణంలో మూడు చోట్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు షిఫ్ట్ చేయనున్నారు. ఈ షిఫ్టింగ్ కోసమే పురపాలక సంఘం రూ.5.17లక్షలు వ్యయం చేస్తోంది. సత్యసాయి మంచినీటి ప్లాంట్ వద్ద నుంచి పప్పుల మిల్లుకు, డిగ్రీ కళాశాల నుంచి కె.కన్వెన్షన్‌కు, బాట గంగానమ్మ లేఅవుట్ నుంచి యూపీహెచ్‌సీకి నియంత్రికలు మారుస్తారట. ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అశోక్‌నగర్, అటవీశాఖ కార్యాలయాల వద్ద వేసిన బోర్లకు కొత్త నియంత్రికలను ఏర్పాటు చేసేందుకు రూ.10.72లక్షలు వ్యయం చేస్తున్నారు. ఈ పనులు మొదలవలేదు. సత్వరమే పూర్తి చేయించి బోర్లు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఏఈ రాజేశ్ పేర్కొన్నారు.

## కల్లు నమూనాల సేకరణ

**టి.నరసాపురం, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** టి.నరసాపురం మండలంలో పరీక్షల నిమిత్తం కల్లు నమూనాలు సేకరించినట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ ఆదివారం తెలిపారు. మండలంలోని రాజుపోతేపల్లి, బంధంచర్లలో కల్లు దుకాణాలను తనిఖీ చేసిన రసాయన పరీక్షల నిమిత్తం కల్లు సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

## వృద్ధాశ్రమానికి వితరణ

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** కొయ్యలగూడెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి క్లబ్ అధ్యక్షుడు మాదేటి సత్యనారాయణ దంపతులు రూ.60వేల విలువైన ఆట వస్తువులను సమకూర్చారు. ఈ మేరకు సామగ్రిని క్లబ్ జిల్లా గవర్నర్ కల్యాణచక్రవర్తి వృద్ధాశ్రమం ప్రతినిధులకు అందజేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమం ఛైర్మన్ అప్పలరాజు, రోటరీ అసిస్టెంటు గవర్నర్ విశ్వనాథశర్మ, కార్యదర్శి రామచంద్రరావు, శ్రీనివాస్, సత్తిరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## మూడు చక్రాల సైకిల్ అందజేత

**కామవరపుకోట, న్యూస్‌టుడే:** ప్రమాదంలో కాలు దెబ్బతిన్న కరీమున్నీసాకు ఆదివారం శ్రీవీరభద్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిల్ అందజేశారు. సభ్యులు కె.నరసింహారావు, జనార్దనరావు, శివరామకృష్ణమూర్తి, అంజిబాబు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలి

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు విజయలక్ష్మి కోరారు. చింతలపూడిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ నూతన కమిటీ సభ్యులను ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 42 రోజుల సమ్మె అనంతరం ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ నూతన అధ్యక్షురాలిగా సరోజిని, కార్యదర్శి సరళదేవి, కోశాధికారిగా ఫణివర్ధిని ఎన్నుకున్నారు.

## శివారు ప్రాంతాలకు తాగునీరందించాలి

**కలిదిండి, న్యూస్‌టుడే:** ఉప్పుటేరు తీర ప్రాంతాలకు సకాలంలో తాగు, సాగు నీరు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు డిమాండ్ చేశారు. భాస్కరరావుపేటలో ఆదివారం సీపీఎం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

## ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్

సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

**కుక్కునూరు, న్యూస్‌టుడే:** కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉపాధ్యాయులను మూకుమ్మడిగా బదిలీ చేసి ఇక్కడ ప్రభుత్వ విద్యను మిథ్యగా మార్చారని, ఒకట్రెండు రోజుల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోతే ఈ నెల 16, 17 తేదీల్లో రెండు మండలాల్లో రిలే నిరాహార దీక్షలు చేపడతామని పలు రాజకీయ పార్టీలు హెచ్చరించాయి. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం కుక్కునూరు సీపీఎం కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ.. కేవలం ఎంఈవో నిర్లక్ష్యం కారణంగా ఈ మండలాల్లో ఉపాధ్యాయులంతా బదిలీలపై వెళ్లిపోయారన్నారు. 11 ఏళ్లుగా ఇన్‌ఛార్జిగా ఉంటున్న ఎంఈవో ఇన్నేళ్లలో ఒక్క పాఠశాలను కూడా సందర్శించలేదన్నారు. తక్షణమే ఉపాధ్యాయ పోస్టులను డిప్యుటేషన్ ద్వారానైనా భర్తీ చేయాలని, లేకుంటే రిలే నిరాహారదీక్షలకు కూర్చుంటామన్నారు. సమావేశంలో సీపీఎం నుంచి నాగేంద్రరావు, సాయికిరణ్, సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మయ్య, వైకాపా నుంచి చంటినాయుడు, కాంగ్రెస్ నుంచి రఘు, గిరిజన సంఘం తరఫున వీరయ్య హాజరయ్యారు.

## భార్యపై దాడి చేసిన భర్తపై కేసు

**లింగపాలెం, న్యూస్‌టుడే:** భార్యాభర్తల గొడవ నేపథ్యంలో భార్యను కొట్టిన భర్తపై ధర్మాజీగూడెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కె.గోకవరం గ్రామానికి చెందిన అబ్బదాసరి సుకన్య(33) కుటుంబ గొడవ నేపథ్యంలో గత కొంత కాలంగా విజయవాడలో ఉంటోంది. ఆదివారం గ్రామానికి రాగా భర్త పురుషోత్తం తనపై కర్రతో దాడి చేసి గాయపరిచాడు. దీనిపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పరస్పర ఫిర్యాదులపై..

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** టి.నరసాపురం మండలం బొర్రంపాలెంలో పొలం తగాదాలో ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై జయబాబు ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బొర్రంపాలేనికి చెందిన కలపర్తి రామకృష్ణ అదే గ్రామంలో కొంత భూమిని కౌలుకు తీసుకున్నాడు. దీనిపై మంతెన సాంబశివరావు, రామ్మూర్తి, నరసింహారావు అనే ముగ్గురు వ్యక్తులు ఈ భూమి మాదే అంటూ రామకృష్ణపై దాడి చేశారు. పై ముగ్గురు వ్యక్తులు తనను కులం పేరుతో దూషించినట్లు రామకృష్ణ ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. సాంబశివరావు, రామ్మూర్తి, నరసింహారావు కూడా ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## బెల్లపు ఊట ధ్వంసం

**కుక్కునూరు, న్యూస్‌టుడే:** సారా స్థావరాలపై ఆదివారం కుక్కునూరు పోలీసులు దాడులు చేశారు. స్థానిక సీఐ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో 1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. తయారీదారులు ఎవరో తెలుసుకుని వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ వివరించారు.

## ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆటోని కారు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కి తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని బుట్టాయిగూడేనికి చెందిన వంగలపూడి ప్రభాకరరావు ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతను ఆదివారం తన ఆటోలో మహదేవపురానికి చెందిన కట్టా సాయిని ఎక్కించుకుని కప్పలకుంట నుంచి అయ్యవరం వెళ్తున్నాడు. సంఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి ఆటోను కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో ఆటో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రభాకరరావుకు తీవ్ర గాయాలు కాగా, సాయికి స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు క్షతగాత్రులను పరామర్శించారు. వారిని 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశించారు.

## పాముకాటుతో మహిళా కూలీ మృతి

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** పాముకాటుతో వ్యవసాయ మహిళా కూలీ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. చింతలపూడి మండలం వెంకటాద్రిగూడేనికి చెందిన బొడ్డు వెంకాయమ్మ(60) ఆదివారం పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఆమెను పాము కాటేసింది. బాధితురాలిని సహచరులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

**లారీ ఢీకొని గేదెలు.. కుక్కునూరు, న్యూస్‌టుడే:** గ్యాస్ సిలిండర్‌లు తరలిస్తున్న ఓ లారీ అల్లిగూడెంలో రెండు పాడి గేదెలను ఢీకొంది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఆ రెండు పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. పశువులను ఢీకొట్టిన లారీ కూడా పడిపోయి, గ్యాస్ బండలు కింద పడిపోయాయి. ఖాళీ బండలు కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవరు నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు చెబుతున్నారు. పశువులను ఢీకొన్న లారీ పల్టీ కొట్టకపోతే, సమీపంలో ఉన్న ఓ ఇంటిలోకి దూసుకుపోయేదని, ఇంటి సమీపంలోకి వెళ్లి బోల్తా పడి ఆగిపోయిందని తెలిపారు. కుక్కునూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జూద శిబిరాలపై దాడి

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** చొప్పరామన్నగూడెం శివారులో నిర్వహిస్తున్న జూద శిబిరంపై జరిపిన దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.42,800, అయిదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు.

**పోలవరం, న్యూస్‌టుడే:** పోలవరంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో ఒక వ్యక్తిని అరెస్టు చేయడంతో పాటు రెండు కోడి పుంజులు, రూ.1,140 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ వివరించారు.

**లింగపాలెం, న్యూస్‌టుడే:** మండలంలోని యడవల్లి గ్రామ శివారు తోటల్లో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ధర్మాజీగూడెం పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ.5,500, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకన్న వివరించారు.

## గోతులు.. దాటితే దుమ్ము, ధూళి!

లారీ వెనక ఇబ్బంది పడుతున్న వాహనదారుడు

**చింతలపూడి, న్యూస్‌టుడే:** చింతలపూడి పట్టణంలో ప్రజలు కాలుష్యంతో పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇంట్లో నుంచి బయటకు వస్తే ముఖం, దుస్తులు దుమ్ము ధూళితో నిండిపోతున్నాయి. నిత్యం టిప్పర్లు, ట్రాక్టర్లు మట్టిని పట్టణంలోని ప్రధాన రహదారి నుంచే తరలిస్తుంటే రోడ్డు చుట్టు పక్కల దుమ్ము పెద్ద ఎత్తున పేరుకుపోతోంది. ఏదైనా వాహనం వస్తే చాలు దుమ్ము విపరీతంగా కళ్లలో పడి సక్రమంగా కనిపించని పరిస్థితి. మట్టి తరలించిన తర్వాత కనీసం నీటితో తడపడం కూడా చేయకపోవడంతో స్థానిక ఏఎంసీ నుంచి రేచర్ల వాటర్ ట్యాంక్ దాటే వరకు ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. దీనికి తోడు పట్టణ రహదారులన్నీ గోతులమయంగా మారాయి. అటు గోతులతో నడ్డి విరుగుతుంటే, దుమ్ము, ధూళితో అనారోగ్యం బారిన పడుతున్నామని పట్టణ వాసులు వాపోతున్నారు. ఈ విషయమై కమిషనర్ రాంబాబు మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఫైర్‌స్టేషన్ వద్ద గుంతలమయంగా రహదారి

## దుక్కులు ముమ్మరం



ఓ వైపు గోదావరి వరదలు పరుగులు పెట్టిస్తున్నా.. మరో వైపు గోదావరి పరీవాహక గ్రామాల్లో దుక్కులు ముమ్మరంగా మొదలయ్యాయి. గోదావరి వరద పొలాలను ముంచేయక ముందే దుక్కులు చేస్తే వరద వచ్చి బలమైన ఒండ్రు మట్టి తమ పొలాల్లో నిలుస్తుందని వేలేరుపాడు మండలంలోని రైతులు చెబుతున్నారు. దీంతో భూమికి సారం పెరిగి, పంట దిగుబడులు అధికంగా వస్తాయని ముంపు గ్రామాల రైతులు తెలిపారు. **- న్యూస్‌టుడే, వేలేరుపాడు గ్రామీణ**

(c) eenadu

# నూజివీడు
• నూజివీడు • కైకలూరు

## కొత్త మోటారు ఏర్పాటు

**ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు మండలం రమణక్కపేటలో 20 రోజుల క్రితం పంచాయతీకి సంబంధించిన మోటారు కాలిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. పలుమార్లు సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఈ నెల 9న మహిళలు స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో సత్యనారాయణ స్పందించి ఆదివారం రూ.80 వేలతో కొత్త మోటారు ఏర్పాటు చేయించారు.

## మేకలకు తగ్గుముఖం పట్టిన వ్యాధి లక్షణాలు

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామంలో మేకలకు వచ్చిన అంతు చిక్కని వ్యాధి లక్షణాలు తగ్గుముఖం పట్టినట్లు పశువైద్యాధికారి సీహెచ్ హనుమంతరావు తెలిపారు. గ్రామానికి చెందిన పాడి రైతు సాధం స్వామికి చెందిన 9 మేకలు గత మూడు రోజుల్లో మృతి చెందడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం వ్యాధికి గురైన మేకలతో పాటు, గ్రామంలోని పశువులకు ముందస్తుగా చికిత్స అందించారు. గ్రామంలో పశువులకు అందిస్తున్న వైద్య సేవలను ఏలూరులోని వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలకు చెందిన వైద్యుడు ప్రసాద్ పరిశీలించారు.

### మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

| | |
|---|---|
| నూజివీడు : 80085 74698 | కైకలూరు : 73060 88555 |
| ముసునూరు : 93983 81268 | కలిదిండి : 90594 84862 |

**నూజివీడు రూరల్ , న్యూస్‌టుడే:** ? దేవరగుంట గ్రామంలో మురుగు కాల్వలు పూడిక తీయక పోవడంతో కాల్వల్లో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దుర్గంధంతో పాటు దోమలు విపరీతంగా ఉన్నాయి. **– బాబు, దేవరగుంట**

✔ గ్రామ కార్యదర్శికి తగు సూచనలు ఇచ్చి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- సీహెచ్ రాఘవేంద్రనాథ్, ఎంపీడీవో**

**కైకలూరు, న్యూస్‌టుడే:** ? కైకలూరు వెలమపేట కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. దోమలు వృద్ధి చెంది స్థానికులు అవస్థలు పడుతున్నారు. **- గౌతమ్ , వెలంపేట కాలనీ**

**సమాధానం:** డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాం. **- వై.ప్రసాద్ పంచాయతీ ఈవో, కైకలూరు**

**శుద్ధజలం సరఫరాకు చర్యలు..**

స్పందనకు వందనం

**సానారుద్రవరం (కలిదిండి), న్యూస్‌టుడే :** సానారుద్రవరంలో రక్షిత మంచి నీటి పథకం నుంచి సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితంగా ఉందంటూ గ్రామస్థుడొకరు 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక ద్వారా సమస్యను ఈనెల 12న అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సర్పంచి నున్న రాజేశ్వరమ్మ స్పందించారు. కార్యదర్శి రాఘవేంద్రరావు నేతృత్వంలో సంపులో క్లోరినేషన్ పిచికారీ చేశారు. చెరువు గట్ల చుట్టూ బ్లీచింగ్ చల్లించాలి. శుద్ధ జలం సరఫరాకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.

● మెప్మా వద్ద బ్యాంకులకు అనుసంధానం అయిన లబ్ధిదారుల జాబితా ఉంది. 1176 మందికి రుణం అందించినట్లు చెబుతున్నారు. మిగిలిన లెక్కలు ఇక్కడ లేవు. దరఖాస్తు చేసిన వారిలో పలువురు మృతి చెందారు. కొందరు గృహాలు తీసుకునేందుకు నిరాకరించి నగదు వెనక్కి ఇవ్వాలని కోరారు. అధికారులు వారి పట్ల దయ లేకుండా వ్యవహరిస్తున్నారు.

● నూజివీడులో రూ.500 చొప్పున 796 మంది. రూ.50 వేల చొప్పున 277 మంది, రూ.లక్ష చొప్పున 404 మంది పురపాలక సంఘానికి చెల్లించారు.

● టిడ్కో గృహాల గురించి కమిషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డిని ప్రశ్నించగా.. అంతా టిడ్కో అధికారులే పర్యవేక్షిస్తున్నారన్నారు. పురపాలక సంఘానికి జమ అయిన నగదును టిడ్కోకు బదిలీ చేశామని తెలిపారు.

## టిడ్కో గృహాలకు మోక్షమెన్నడో!

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** పేద, మధ్య తరగతి ప్రజలు టిడ్కో గృహాల కోసం ఆరేళ్లుగా ఎదురు చూస్తున్నారు. లబ్ధిదారులు నూజివీడు పురపాలక సంఘానికి లక్షలాది రూపాయలను చెల్లించినా ఇక్కడ సమాధానం చెప్పేవారే లేరు. మీరు కట్టిన నగదును టిడ్కో ఖాతాకు జమ చేశాం.. ఏదైనా ఉంటే వారితో మాట్లాడుకోండని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. సంబంధిత అధికారులు ఇక్కడికి ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రాతినిథ్యం వహిస్తున్న ఇలాకాలోనే పరిస్థితి ఈ విధంగా ఉందంటే అధికారుల పనితీరును అర్థం చేసుకోవచ్చు. టిడ్కో గృహాల లెక్కలు మున్సిపల్ కమిషనర్ వద్ద, పట్టణ ప్రణాళిక విభాగంలో లేవు. మొత్తం ఎన్ని గృహాలు లబ్ధిదారులకు అందించేందుకు నిర్మించారో కూడా తెలియదు. ఇప్పటికి అయిన ఖర్చు ఎంత.. ఉచితంగా ఇచ్చేవి ఎన్ని.. నగదు చెల్లించిన వారి సంఖ్య.. అడిగితే లెక్కలు తమవద్ద లేవని పురపాలక సంఘం అధికారులు చెబుతున్నారు.

సగంలో నిర్మాణం నిలిచిపోవడంతో తుప్పు పడుతున్న ఇనుప చువ్వలు

వర్షాలకు ధ్వంసమైన రహదారి

పరీక్షలు చేస్తున్న సిబ్బంది

## మెగా వైద్య శిబిరం

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మండవ ఫౌండేషన్, నూజివీడు సీడ్స్ గ్రూప్, పీ4, రమేశ్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీడీవో బి.భార్గవి, మండవ ఫౌండేషన్ ఛైర్మన్ మండవ వెంకట రామయ్య, రమాదేవి దంపతులు, వైద్యాధికారి డా.జె.జగన్మోహనరావులు ప్రారంభించారు. గుండె, ఎముకలు, నరాలు, నేత్ర, దంత, స్త్రీ సమస్యలు, సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు పాల్గొని 250 మందికి పరీక్షలు నిర్వహించి, సలహాలు, ఔషధాలు ఉచితంగా అందజేశారు.

## దమ్ము చక్రాలతో రోడ్డు ఛిద్రం
### పట్టించుకోని అధికారులు..

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధి, మరమ్మతులు చేయకపోవడంతో తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వాటిని అభివృద్ధి చేస్తోంది. వాటిని సంరక్షించుకోవాల్సింది పోయి అవగాహన రాహిత్యంతో పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ప్రారంభం కావడంతో దుక్కులు దున్నడంలో రైతులు నిమగ్నమవుతున్నారు. వీటికి అవసరమైన దమ్ము ట్రాక్టర్ల చక్రాలతో రహదారులపై వెళ్తుండటంతో రాళ్లు లేచిపోయి మండలంలోని పలు రహదారులు రూపు కోల్పోతున్నాయి. పెయ్యేరు రహదారి ఈ చక్రాలతో పూర్తిగా ధ్వంసమైంది. పట్టించుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు కనీసం హెచ్చరికలు సైతం ఇవ్వకపోవడంతో వాటిని ఇష్టానుసారం నడుపుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ సత్య అరవింద్‌ను సంప్రదించగా.. అలా రహదారులు ధ్వంసం చేసేలా దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## కన్నీరు తుడిచి.. చేయూతనిచ్చారు

**మూలలంక (కలిదిండి), న్యూస్‌టుడే :** ఆ కుటుంబాలకు అనుకోని కష్టం వచ్చింది. చేతికందిన కొడుకులు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. మూలలంక గ్రామానికి చెందిన కేత సాయి, తుమ్మ నాగరాజు ఈ నెల 6న తేదీన రొయ్యల విక్రయానికి వెళ్లివస్తూ నెల్లూరు సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. దీంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయిన ఆ కుటుంబాన్ని మానవత్వం ఆదుకుంది. మాజీ ఎంపీపీ బండి లక్ష్మీతులసీరావు ఆ రెండు కుటుంబాలను ఆదుకోవాలంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. అదే గ్రామానికి చెందిన పిల్లి గణేశ్ దీనిని విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో నియోజకవర్గ స్థాయిలో దాతలు స్పందించారు. ఐదు రోజుల్లో రూ.6 లక్షలు కూడబెట్టారు. వీటిని ప్రమాదంలో మృతి చెందిన కేత సాయి, తుమ్మ నాగరాజు కుటుంబాలకు చెరో రూ.3 లక్షల చొప్పున గ్రామ పెద్దల సమక్షంలో ఆదివారం అందించారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దాతలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

## అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పాలన

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు తెలిపారు. తోటపల్లిలో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ఏడాదిగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. పిన్నమరెడ్డిపల్లి నాయకులు రాంబాబు, చిన్న బాలయ్య, చంటి, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**ముసునూరు, న్యూస్‌టుడే:** ఒక్క అవకాశం పేరుతో గత పాలకులు రాష్ట్రాన్ని నాశనం చేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో సుపరిపాలన సాగుతోందని తెదేపా మండలాధ్యక్షుడు గద్దె రఘుబాబు, గ్రామ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేశ్ అన్నారు. ఆదివారం ముసునూరు మండలం గోపవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని 90 శాతం పూర్తిచేసిన బూత్ కన్వీనర్లను సత్కరించారు.

తోటపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న శ్రీనివాసరావు

**కోరుకొల్లు(కలిదిండి), న్యూస్‌టుడే :** కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని మాజీ ఎంపీపీ వలవల రామారావు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు తెలిపారు. కోరుకొల్లు, కలిదిండి గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి నున్న సుబ్రమణ్యం, ఎండీ ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహంకాళిరావు

## శివారు ప్రాంతాలకు తాగునీరందించాలి

**భాస్కరరావుపేట(కలిదిండి), న్యూస్‌టుడే:** ఉప్పుటేరు తీర ప్రాంతాలకు సకాలంలో తాగు, సాగు నీరు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు డిమాండ్ చేశారు. భాస్కరరావుపేటలో ఆదివారం సీపీఎం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా.. శివారు ప్రాంతాల ప్రజలు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారన్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు, నాయకులు స్పందించి మంచినీటి చెరువులు పూర్తిగా నింపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీరవల్లి భాస్కరరావు, డీవీ సత్యనారాయణ, బి.రామనాగేంద్రరావు, వి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి వర్ధిల్లాలని హోమం

**మండవల్లి, న్యూస్‌టుడే:** గణపతి సచ్చిదానంద స్వామివారి ఆశీస్సులతో ప్రపంచ శాంతి వర్ధిల్లేందుకు లోకుమూడి దత్తాశ్రమంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కోటి దత్త హోమం ఆదివారం సాయంత్రం ముగిసింది. కార్యనిర్వహణాధికారి గురజాడ ఉదయ్‌శంకర్ దంపతులు పీటపై కూర్చుని యాజ్ఞకులు తరుణ్, రోహిత్ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి రుత్విక్కులతో హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు సరిహద్దు దేశాలతో వైరానికి కాలు దువ్వుతూ శాంతి లేకుండా పోయిందన్నారు. మరోపక్క పాకిస్థాన్‌తో మనదేశం యుద్ధం చేసే పరిస్థితి నెలకొందని, వీటన్నింటి నుంచి విముక్తి కలిగి శాంతిని నెలకొల్పేందుకే హోమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

లోకుమూడి దత్తాశ్రమంలో నిర్వహిస్తున్న క్రతువు

## వైభవంగా.. గంగానమ్మ, కనకదుర్గమ్మల సంబరం

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లి గ్రామ దేవతలైన గంగానమ్మ, కనకదుర్గమ్మల సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్షాలు కురిసి పాడి పంటలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా డప్పు మేళాలతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పాల పొంగళ్లు నివేదించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సినిమాలు

నూజివీడు పట్టణం

| | |
|---|---|
| సత్యనారాయణ | తమ్ముడు |
| సత్యనారాయణ మినీ | ఓ భామ అయ్యో రామ |
| ద్వారక సినిమాస్ స్క్రీన్ 1 | సూపర్ మ్యాన్ |
| ద్వారక సినిమాస్ స్క్రీన్ 2 | ది 100 |
| ద్వారక సినిమాస్ స్క్రీన్ 3 | జురాసిక్ వరల్డ్ రీబర్త్ |
| ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్ | తమ్ముడు |
| కైకలూరు: విజయలక్ష్మి జీ3 | తమ్ముడు |
| మాగంటి సినిమాస్ | మార్గన్ |
| శ్రీవెంకటరమణ సినిమాస్ | జురాసిక్ వరల్డ్ రీబర్త్ |
| ముదినేపల్లి: పూర్ణిమ | తమ్ముడు |

## వాడవాడలా అమ్మవార్లకు ఆషాఢ సారె

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల వ్యాప్తంగా వాడవాడలా గ్రామ దేవతలకు భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచాతో సందడిగా నృత్యాలు చేస్తూ సంప్రదాయబద్ధంగా సారెను అమ్మవార్లకు సమర్పించి విశేష పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించగా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. మండలంలోని వడాలి సుభద్రా బలరామ సహిత జగన్నాథస్వామి వారికి గ్రామస్థులు, మహిళలు భారీ సంఖ్యలో దేవస్థానానికి గ్రామోత్సవంగా చేరుకుని ఆషాఢం సారెను సమర్పించారు. ★ మండలంలోని వడాలిలో కొలువుదీరిన కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా నక్క అప్పారావు ఆధ్వర్యంలో గ్రామస్థులు సారెను అందించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**పెదలపాలపర్రులో..** మండలంలోని పెదపాలపర్రు గ్రామదేవత గంగానమ్మకు గ్రామస్థులు ఆదివారం అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. పాలు పొంగళ్లు, వస్త్రాలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి పులిహోరా కుంభం సమర్పించారు.

నంగళమ్మ వారికి.. **అమరావతి (కలిదిండి), న్యూస్‌టుడే :** అమరావతి పంచాయతీ శివారు కొత్తూరులోని నంగళమ్మవారికి ఆదివారం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. అమరావతి నుంచి కాలి నడకన ఆలయానికి చేరుకున్నారు. సర్పంచి పెరుమాళ్ల భోగేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో నంగళమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరిగా విజయదుర్గ.. **మండవల్లి, న్యూస్‌టుడే:** మండవల్లి నాగేంద్ర స్వామి ఆలయంలోని విజయ దుర్గ అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చాగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారిని బెండ, బీర, దోస, దొండ, క్యాబేజీ, టమోటా, నిమ్మ, సొరకాయలు, ఆకు కూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. దీపధూప నైవేద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు సహస్ర నామార్చనలు చేశారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మహిళలు సారె సమర్పించారు.

కనకదుర్గ అమ్మవారికి.. **చాట్రాయి, న్యూస్‌టుడే:** చాట్రాయిలోని కనకదుర్గ అమ్మవారికి ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆదివారం మహిళలు ఊరేగింపుగా సారె సమర్పించారు. అమ్మవారి ఆలయం ఎదుట పూజా కార్యక్రమాలను చేపట్టారు. చిన్నారుల కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

సుభద్రా బలరామ సహిత జగన్నాథస్వామికి నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు

చాట్రాయిలో అమ్మవారికి ఊరేగింపుగా సారె తీసుకు వెళ్తున్న మహిళలు

☛ 3 నెలల క్రితం నెక్కలం గొల్లగూడెంలోని కుశలవ పారిశ్రామిక కేంద్రం సమీపంలో ఓ కారు రహదారిపై ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. కారు ముందు భాగం దెబ్బతింది. కారులోని వారికి గాయాలు ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

☛ 20 రోజుల క్రితం అడవినెక్కలం సమీపంలో ఓ ద్విచక్రవాహనం విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. నడుపుతున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. వాహనం దెబ్బతింది. ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.

## రహదారిపై స్తంభాలు.. నిత్యం ప్రమాదాలు..

**అడవినెక్కలం (ఆగిరిపల్లి), న్యూస్‌టుడే:** నూజివీడు-విజయవాడ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నాలుగేళ్ల క్రితం రహదారిని విస్తరించారు. గత వైకాపా ప్రభుత్వంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో నెక్కలం గొల్లగూడెం- అడవినెక్కలం గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించలేదు. దాంతో ఆ రహదారిలో ప్రయాణిస్తున్న వారు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి గాయపడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారిలో ప్రయాణించడానికి ప్రజలు భయపడుతున్నారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన ద్విచక్రవాహనం

**రెండు సార్లు అంచనాలు ఇచ్చాం...**

అడ్డుగా ఉన్న విద్యుత్తు స్తంభాలు తొలగించాలి అంటే ఆర్అండ్‌బీ అధికారులు విద్యుత్తు శాఖకు నగదు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే రెండు సార్లు దానికి సంబంధించిన అంచనాలు ఆ శాఖకు ఇచ్చాం.
- ఎం.రామారావు, విద్యుత్తు ఏఈ

**ఆ స్తంభాలను తొలగిస్తాం...**

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. త్వరలోనే రహదారిపై అడ్డుగా ఉన్న స్తంభాలను విద్యుత్తు శాఖ సహకారంతో తొలగింపునకు చర్యలు చేపడతాం.
- బాబూరావు, ఆర్అండ్‌బీ డీఈ

## జూద స్థావరంపై దాడి

**చాట్రాయి, న్యూస్‌టుడే:** సి.గుడిపాడు గ్రామంలో శివారు ప్రాంతంలో జూదం నిర్వహిస్తున్న వారిపై ఆదివారం దాడి చేసినట్లు ఎస్.ఐ. డి.రామకృష్ణ తెలిపారు. నలుగురిని అదుపులో తీసుకొని, వారి నుంచి రూ.6,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## పరస్పర ఫిర్యాదులపై కేసు

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** టి.నరసాపురం మండలం బొర్రంపాలెంలో పొలం తగాదాలో ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై జయబాబు ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బొర్రంపాలేనికి చెందిన కలపర్తి రామకృష్ణ అదే గ్రామంలో కొంత భూమిని కౌలుకు తీసుకున్నాడు. దీనిపై మంతెన సాంబశివరావు, రామ్మూర్తి, నరసింహారావు అనే ముగ్గురు వ్యక్తులు ఈ భూమి మాదే అంటూ రామకృష్ణపై దాడి చేశారు. పై ముగ్గురు వ్యక్తులు తనను కులం పేరుతో దూషించినట్లు రామకృష్ణ ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. సాంబశివరావు, రామ్మూర్తి, నరసింహారావు కూడా ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## మురుగు పారక ఇక్కట్లు

**చాట్రాయి, న్యూస్‌టుడే:** నరసింహారావుపాలెంలో సహకార సంఘానికి ఎదురుగా యాదవ బజారు, బీసీ ఏరియాలకు వెళ్లే రహదారిలో మురుగు నీరు దోమలకు ఆవాసాలుగా మారింది. యాదవ బజారులో మురుగు నీరు ప్రవహించే అవకాశం లేక రోడ్డు మీదకు చేరుతోంది. కోనేరు రహదారిలో గోతుల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ రోడ్డులో విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వెళ్లాలి. పారిశుద్ధ్య చర్యలు సకాలంలో చేపట్టక ఇలా దుర్గంధం పెరుగుతోంది. గతేడాది ఇక్కడ జ్వరాల తీవ్రతతో పలువురు మృతి చెందారు. అప్పట్లో మంత్రి పార్థసారథి సమక్షంలో జిల్లా వైద్య శాఖ అధికారులు ప్రజల సమక్షంలో సమీక్ష చేశారు. ఎంపీడీవో విజయలక్ష్మిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

బీసీ ప్రాంతానికి వెళ్లే సిమెంటు రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

## పశు వైద్యం అందేదెలా?

**ముసునూరు, న్యూస్‌టుడే:** అసలే అవి మూగ జీవాలు. అడ్డం పడితే తప్ప వాటికి జబ్బు చేసిన విషయం వాటి యజమానులకు కూడా తెలియదు. అలాంటి మూగజీవాల వేదన నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరు, చాట్రాయి మండలాల్లో అరణ్య రోదన అవుతోంది. జబ్బు పడినప్పుడు పశువులకు కనీస వైద్యమూ అందని దయనీయ స్థితి ఏర్పడింది. ఎప్పుడో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తరువాత పశు పోషణకు అంతా ప్రాధాన్యం ఇస్తారు. పశువులు జబ్బు పడినప్పుడు సరైన సమయంలో వైద్యం అందించాల్సిన పశువైద్య శాలలకు వైద్యుల కొరత వేధిస్తోంది. ఆస్పత్రుల్లో సౌకర్యాలు కూడా నామమాత్రమే.

వేధిస్తున్న సిబ్బంది కొరత.. నూజివీడు నియోజకవర్గంలోని చాట్రాయిలో మూడు పశు వైద్యశాలలు ఉండగా ఒక్కరు కూడా వైద్యులు అందుబాటులో లేరు. ముసునూరులో మూడు పశు వైద్యశాలలు ఉండగా రెండు చోట్ల వైద్యులు లేరు. దీంతో పక్క గ్రామాలు, మండలాల ఇన్‌ఛార్జులతో కాలం నెట్టుకొస్తున్నారు. ముసునూరులో రెండేళ్ల నుంచి వైద్యుడి పోస్టు ఖాళీ ఉంటోంది. వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో సరైన వైద్యం అందక గేదె మృతిచెందింది. దీనిపై పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేశ్‌ను వివరణ కోరగా.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా నన్నారు. సమస్య త్వరలో పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మూతపడ్డ ముసునూరు పశువైద్యశాల

## సచివాలయం సాక్షిగా అపరిశుభ్రత!

**చాట్రాయి, న్యూస్‌టుడే:** పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రజలను చైతన్యం చేస్తూ వర్షాకాలంలో వ్యాధులను నివారించేలా కృషి చేయాల్సిన సచివాలయం ఎదుటే అపరిశుభ్రత రాజ్యమేలుతున్న పరిస్థితి తుమ్మగూడెంలో నెలకొంది. ఇక్కడ నీరు లీకేజీతో ఇలా రహదారి మీదకు చేరింది. నీరు నిలిచి దుర్గంధంతో రంగు మారింది. సచివాలయం ఎదుటే ఆరోగ్య ఉప కేంద్రముంది. సచివాలయం, ఆరోగ్య సిబ్బందికి ఇక్కడ అపరిశుభ్రత కనిపిస్తున్నా తీసుకున్న చర్యలు శూన్యం. ఇక్కడకు వచ్చే ప్రజలకు అపరిశుభ్రత అసౌకర్యంగా మారింది. ఇదే విషయాన్ని ఎంపీడీవో విజయలక్ష్మి దృష్టికి తీసుకురాగా వెంటనే పరిశీలన చేయించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

## అప్రమత్తతే.. రక్ష!
### వర్షాకాలంలో పాము కాటుకు గురయ్యే ప్రమాదం

**నూజివీడు, న్యూస్‌టుడే:** వర్షాకాలం వచ్చిందంటే అనారోగ్యాలే కాదు.. విష సర్పాల సంచారం అధికమే. వాతావరణంలో వస్తున్న మార్పులతో ఉక్క పోత ఒక వైపు. వర్షపు జల్లులతో వేసవి తాపం నుంచి సేద తీరేందుకు పాములు, ఇతర విష కీటకాలు బహిరంగ ప్రదేశాల్లో సంచరించడం సహజం. ఒక్కోసారి రహదారులు, ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉంది. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లోని గ్రామాల్లో పాముల సంచారం అధికంగా ఉంటుంది. తగిన జాగ్రత్తలు తప్పనిసరని వైద్యులు సూచిస్తున్నారు.

నూజివీడు నియోజకవర్గంలో..

| సంవత్సరం | పాము కాట్లు |
|---|---|
| 2022 | 14 |
| 2023 | 09 |
| 2024 | 11 |

**స్వీయ జాగ్రత్తలు అనివార్యం...**

★ ఇళ్లల్లో చెత్త, చెదారం, పాత వస్తువులు కుప్పలుగా లేకుండా చూసుకోవాలి ★ ఇంటి ఆవరణ, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెట్ల పొదలను శుభ్రం చేసుకోవాలి. ★ పూల కుండీల్లో పాములు చేరే ప్రమాదం ఉంటుంది. నీళ్లు పట్టేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించాలి. ★ ఇళ్లల్లో ఉండే బూట్లలో పాములు చేరే అవకాశం ఉంటుంది. వేసుకునే ముందు అప్రమత్తంగా ఉండాలి ★ ద్విచక్రవాహనాల బ్యాగ్‌లను సైతం పరిశీలించుకోవాలి ★ పొలాలకు వెళ్లే వారు తప్పనిసరిగా రాత్రి వేళలో టార్చ్‌లైటుతో దారిని పరిశీలించుకోవాలి ★ పాము కాటుకు గురైతే కంగారు పడకూడదు, మంచినీళ్లు తాగకూడదు

➤ ఇరవై రోజుల క్రితం వడ్లమానుకు చెందిన ఓ రైతును పొలంలో పాము కరిచింది. వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లడంతో వారు యాంటీ స్నేక్‌వీనం వ్యాక్సిన్ చేసి చికిత్స అందించడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

➤ గత ఏడాది ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వెళ్లే మెట్ల దగ్గర సుమారు 8 అడుగుల పొడవు ఉన్న కొండ చిలువను స్థానికులు గమనించి గొడ్డలి, కర్రలతో కొట్టి చంపేశారు. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**అందుబాటులో వ్యాక్సిన్**

పాము కాటుకు సంబంధించిన వ్యాక్సిన్ నిల్వలు పూర్తి స్థాయిలో అన్ని పీహెచ్‌సీలలో సిద్ధంగా ఉన్నాయి. ఎవరైనా పాము కాటుకు గురైతే వెంటనే సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాలి. నాటు వైద్యం, మంత్రాల పేరిట సమయం వృథా చేసి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు.
-డా.ఆర్.లక్ష్మీనారాయణరావు, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో

(c) eenadu

# పులసలకు పోటాపోటీ

## అడ్వాన్సులు ఇస్తున్న భోజన ప్రియులు

న్యూస్‌టుడే, అల్లవరం

పుస్తెలమ్మి అయినా పులస కొని తినాల్సిందే అన్నది.. ఉభయ గోదావరి జిల్లాల్లో నానుడి. గోదావరికి వరదలు వచ్చిందంటే పులసల సీజన్ మొదలైనట్లే. జులై నుంచి అక్టోబరు వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో సముద్రం నుంచి గోదావరి నదిలోకి పులసలు ఎదురీదుతూ వచ్చి ఇక్కడ పిల్లలు పెట్టి వాటితో తిరిగి వెళ్లే క్రమంలో జాలర్లకు చిక్కి, పులస ప్రియులకు కిక్కిస్తాయి. పల్లెల్లో ఎవరైనా పులస కొని, వండుకున్నారంటే ఊరంతా ఆ విషయాన్ని ఆ రోజు గొప్పగా చెబుతుంటారు.

### ముందు తమకే ఇవ్వాలని..

✦ పులస వస్తే ముందుగా తనకే ఇవ్వాలని అమలాపురానికి చెందిన ప్రముఖ వ్యాపారి బోడసకుర్రు ప్రాంతంలో పులసలు అమ్మే మత్స్యకార మహిళలతో ఒప్పందం చేసుకున్నారు. గోదావరికి వరద నీరు వచ్చిన వెంటనే 5వేల రూపాయలు అడ్వాన్సు కూడా ఇచ్చారు.

✦ అల్లవరం మండలం రెబ్బనపల్లికి చెందిన చేపల వ్యాపారి సాయి ఏటా సీజన్‌లో పులసల వ్యాపారం చేస్తుంటారు. అతడికి రాజకీయ నాయకులు, గుత్తేదారులు ముందస్తుగా నగదు ఇచ్చి అడ్వాన్స్‌గా బుకింగ్ చేసుకుంటారు. ప్రముఖులను ప్రసన్నం చేసుకునేందుకు కూడా కొందరు పులసను ఎరగా వేయడం గమనార్హం. మరికొందరు ఏమీ ఆశించకుండా తమ ఆత్మీయులకు పంపిస్తుంటారు. జిల్లాలో బడా వ్యాపారులు, గుత్తేదారులు, శ్రీమంతులు పులస కోసం ఏటా ముందు వరుసలో ఉంటారు.

### తగ్గుతున్న లభ్యత..

కొన్నేళ్లనుంచి గోదావరి నదిలో పులస చేపల లభ్యత తగ్గుతూ వస్తోంది. పులసలు హిందూ మహాసముద్రం నుంచి తమ ప్రయాణాన్ని ప్రారంభించి బంగాళాఖాతంలోకి చేరి అక్కడి నుంచి గోదావరి నదిలోకి ప్రవేశిస్తాయి. కొన్నేళ్లుగా సముద్ర జలాలు కలుష్య కారకాలుగా మారిపోతున్నాయి. దీంతో ఇవి తమ గమనాన్ని మార్చుకుని ఉంటాయని సంబంధిత శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో వాటి లభ్యత తగ్గుతోంది. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారీ వలలతో వేట కారణంగా తల్లి చేపకు నష్టం వాటిల్లి, ఆ ప్రభావం పులసల ఉత్పత్తిపై పడుతోందన్నారు. దీనిపై జాలర్లకు అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

# శాకంబరి అలంకరణలో లోవ తలుపులమ్మ

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తుని గ్రామీణ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లోవ తలుపులమ్మ ఆలయంలో ఆషాఢమాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు భక్తులకు శాకంబరి దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. అమ్మవారి ప్రధానాలయం, బాలాలయం, నమూనా ఆలయం, పంచలోహ విగ్రహాల వద్ద కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఈ ఒక్కరోజే రికార్డు స్థాయిలో 50 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో దేవస్థానానికి రూ.17.03 లక్షల ఆదాయం సమకూరిందని డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.

# నిర్వహణ నిధులు నొక్కేశారు!

✦ ఆర్‌బీకేల్లో అధికారుల చేతివాటం
✦ విచారణలోనూ బెదిరింపులు

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

గత వైకాపా ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) నిర్వహణకు విడుదల చేసిన నిధుల్లో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ఆర్బీకేల విద్యుత్తు, ఇంటర్నెట్ బిల్లులు, క్లీనింగ్ ఛార్జీలు, స్టేషనరీ, తాగునీరు వంటి సదుపాయాలకు ప్రతి కేంద్రానికి నెలకు రూ.2047 చొప్పున గత ఐదేళ్ల నిధులు విడుదల చేశారు. వీటితో విద్యుత్తు, ఇంటర్నెట్ ఛార్జీలు చెల్లించినా, మిగతా సొమ్ములు కొందరు అధికారులు నొక్కేశారు. దీనిపై వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు విచారణకు ఆదేశించారు. కాకినాడ జిల్లాలోని 414 ఆర్బీకే(ఆర్ఎస్‌కే)లకు విడుదల చేసిన నిధులు, ఖర్చుల వివరాలను ఓచర్ల రూపంలో సమర్పించాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. దీంతో క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభమైంది.

రైతు సేవా కేంద్రం

### హడావుడిగా వోచర్ల సేకరణ

ప్రస్తుతం ఆర్ఎస్‌కేల్లో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, మత్స్య సహాయకులు బదిలీలు జరిగాయి. దీనిని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు దొంగ వోచర్లు సృష్టిస్తున్నారు. సిబ్బంది నుంచి బలవంతంగా వీటిని సేకరిస్తున్నారు. నిధులు ఖర్చు చేసినట్లు, వీటిని ఇవ్వకపోతే రిలీవ్ చేయబోమని, కొత్త స్థానంలో చేర్చుకోబోమని భయపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం విద్యుత్తు, ఇంటర్నెట్ బిల్లులు చెల్లించి, మిగతా నిర్వహణ ఖర్చులు 50 శాతం ఆర్‌బీకేలకు ఇవ్వలేదని ఆ శాఖ సిబ్బంది చెబుతున్నారు. స్టేషనరీ, హార్డ్‌వేర్ పరికరాల మరమ్మతులు, క్లీనింగ్, వాటర్ ఛార్జీలు సిబ్బందే చాలాచోట్ల భరించారు. ఈ నిధుల గోల్‌మాల్‌పై ఇతర శాఖల అధికారులతో విచారణ చేయిస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

### రూ.3 కోట్ల వరకు పక్కదారి

జిల్లాలో 2020-21 నుంచి 2024-25 వరకు ఐదేళ్లు 414 ఆర్‌బీకేలకు ఒక్కోదానికి రూ.2027 చొప్పున మొత్తం రూ.5.08 కోట్లు విడుదల చేశారు. ప్రతినెలా వీటిని ఆయా సిబ్బందికి ఇవ్వాల్సి ఉంది. అలా చేయకుండా కొందరు అధికారులు వారి వద్దే పెట్టుకుని, కొంత కాలం దాటాక నొక్కేశారు. దీనిలో రూ.3 కోట్ల వరకు అక్రమాలు జరిగాయనే వాదన వినిపిస్తోంది. కొందరు వైకాపా నాయకుల సహకారంతోనూ దీనికి తెగబడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని డెల్టా ప్రాంతంలో ఈ అక్రమాలు ఎక్కువగా జరిగాయని సిబ్బంది చెబుతున్నారు.

### క్షేత్రస్థాయిలో పరిశీలన

ఆర్‌బీకేలకు ఇచ్చిన నిర్వహణ ఖర్చులకు సంబంధించి లెక్కలపై విచారణ జరుగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశంతో పరిశీలనకు అధికారులను నియమించాం. ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే చర్యలకు సిఫార్సు చేస్తాం. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- ఎన్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, కాకినాడ

# ఎగువన తగ్గినా.. దిగువన పెరిగిన వరద

**పి.గన్నవరం, అయినవిల్లి, మలికిపురం:** ఎగువన గోదావరి వరద తగ్గుముఖం పట్టినా దిగువన కోనసీమలోని వివిధ నదీపాయల్లో మాత్రం పెరిగింది. పి.గన్నవరం మండలం చాకలిపాలెం సమీపంలోని పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే ఆదివారం ముంపులో చిక్కుకుంది. పి.గన్నవరంలో కాటన్, డొక్కా సీతమ్మ అక్విడక్టుల మధ్య వైనతేయ జోరుగా ప్రవహిస్తోంది. బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, పెదమల్లంక, అయోధ్యలంక, మర్రిమూల ఆవాస ప్రాంతాలకు చెందినవారు మర పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. తొగరపాయ వద్ద పాత వంతెనను తాకుతూ వరద ప్రవహిస్తోంది. దిండి రిసార్ట్స్‌కు సంబంధించిన గృహ పడవలు, ఫంటూన్, స్పీడ్ బోట్లను నది ఒడ్డున నిలిపివేశారు.

# ఏఐ.. దోమను చంపేయ్!

✦ సెన్సార్లతో స్థావరాల గుర్తింపు
✦ డ్రోన్లతో ద్రావణం పిచికారీ

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

కాకినాడ నగరంలో దోమల సమస్య జఠిలంగా మారింది. రాత్రి పూటే కాదు.. పగలు సైతం దోమలు దాడిచేసి కాటేస్తున్నాయి. నిరంతరం ఫాగింగ్ చేస్తున్నా.. కాలువల్లో నివారణ మందు పిచికారీ చేస్తున్నా.. సమస్య మాత్రం పరిష్కారం కావటం లేదు. దీనికి కారణం నగరంలో వాటి ఆవాసాలు, ఉత్పత్తి కేంద్రాలు అధికంగా ఉండటమే. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించింది. 'స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ (ఎస్ఎంఓఎస్ఎస్) విధానం ద్వారా దోమల ఉనికిని గుర్తించి వాటిని నాశనం చేయనుంది. ఏఐ ఆధారంగా పనిచేసే దీని అమలుకు రాష్ట్రంలో 6 నగరాలు ఎంపికయ్యాయి. అందులో కాకినాడకూ స్థానం దక్కింది. ఈ విధానాన్ని ఓ ప్రైవేటు సంస్థ రూపొందించింది. త్వరలోనే దీని అమలుకు చర్యలు తీసుకోనున్నారు.

సురేష్‌నగర్‌లో దోమల వృద్ధికి నిలయంగా ఖాళీ స్థలం

**ఇవీ లెక్కలు..**

✦ మొత్తం వార్డులు: 50
✦ జనాభా: 4లక్షలు పైన
✦ మురికి వాడలు: 101
✦ దోమల ఆవాస స్థలాలు: 380 వరకు
✦ పారిశుద్ధ్య సర్కిళ్లు: 14

### ఎలాగంటే..

ఇప్పటి వరకు దోమల నివారణకు ఫాగింగ్ చేయడం, కాలువల్లో ద్రావణం పిచికారీ, వర్షాకాలంలో కాలువల్లో గంబూసియా చేపలను విడుదల చేయడం వంటివి చేస్తున్నారు. ఇవన్నీ పైపై చర్యలే కావడంతో దోమల నిర్మూలన పూర్తిస్థాయిలో సాధ్యం కావడం లేదు. కొత్త విధానంలో వాటి ఉత్పత్తి ప్రాంతాలను ఏఐ అధారిత సెన్సార్లతో గుర్తిస్తారు. అక్కడి దోమల సాంద్రత, వాటి లింగం, ఉష్ణోగ్రతల వివరాలు వెల్లడిస్తాయి. ఆయా సమాచారాన్ని సెంట్రల్ సర్వర్‌కు చేరవేస్తాయి. ఇలా గుర్తించిన ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో దోమల నివారణ రసాయనాలను పిచికారీ చేస్తారు. దీని వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుంది. మారుమూల ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు, మురికి గుంతల్లో ఇప్పటివరకు నియంత్రణ చర్యలు లేవు. ఇప్పుడు కొత్త విధానం అమల్లోకి వస్తే పూర్తి స్థాయిలో దోమల నివారణ సాధ్యపడుతుందని అధికారులు చెబుతున్నారు.

### విధానం మంచిదే..

ఏఐ అధారిత విధానం ద్వారా దోమల స్థావరాలను గుర్తించి డ్రోన్ల సాయంతో నిర్మూలనకు చర్యలు తీసుకునే విధానం మంచిదే. నగరానికి సంబంధించిన వివరాలు ప్రభుత్వానికి పంపాం. దీంతో చాలా వరకు సమస్య తొలుగుతుంది. ఖర్చు, సమయం ఆదా అవుతుంది. కార్మికులను వేరే పనులకు ఉపయోగించుకోవచ్చు.

- డాక్టర్ పృథ్వీచరణ్, ప్రజారోగ్య శాఖ అధికారి, నగరపాలక సంస్థ, కాకినాడ

# నాడు అధ్వానం.. నేడు ఆనందం

ప్రస్తుతం అద్దంలా మారిన రహదారి..

వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారి దుస్థితి ఇలా..

కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి పిఠాపురం వెళ్లే ఆర్ అండ్ బి రహదారిలో 10 కిలోమీటర్ల మేర గత వైకాపా పాలనలో పెద్ద గుంతలు, రాళ్లు తేలి నరకానికి ప్రతిరూపంగా ఉండేది. దీని అభివృద్ధికి 2020లో రూ.14 కోట్లతో శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి ఆదిలోనే వదిలేశారు. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీని పనులను ప్రారంభించారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయి రహదారి ప్రయాణానికి అనువుగా మారింది. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఈనాడు, కాకినాడ

# ఇళ్లపై సౌర కాంతులు..

## ఎస్సీ, ఎస్టీల ఆవాసాలపై ఉచితంగా సోలార్ ఫలకాల ఏర్పాటు

ఈనాడు, కాకినాడ:

ఓ వైపు పీఎం సూర్యఘర్ ద్వారా ఇళ్లపై సౌర విద్యుత్తు ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు. మరో వైపు పీఎం కుసుమ్‌లో వ్యవసాయ కనెక్షన్లు మొత్తం సోలార్ విద్యుత్తునే సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా ఎస్సీ, ఎస్టీ ఇళ్లకు ఉచితంగా సౌర కాంతులు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 72 వేల మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరి ఇళ్లపై రెండు కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ పలకలు ఏర్పాటు చేయనున్నారు. వీటిని గ్రిడ్‌తో అనుసంధానించి అయిదేళ్ల పాటు నిర్వహించనున్నారు.

### పూర్తయిన సర్వే

ప్రభుత్వం ఇప్పటికే అర్హులైన ఎస్సీ, ఎస్టీ గృహాలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు ఇస్తోంది. దీనికోసం రూ.వేల కోట్లు ఖర్చుచేస్తోంది. వీరి ఇళ్లకు సోలార్ ద్వారా విద్యుత్తు అందించగలిగితే చాలావరకు సర్కారుపై ఆర్థిక భారం తొలగనుంది. ఒక ఇంటిపై రెండు కిలోవాట్లకు రూ.1.2 లక్షలు వరకు ఖర్చవుతుంది. కేంద్రం రూ.60 వేలు రాయితీ ఇస్తుంది. మిగతా మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. దీని కోసం సోలార్ పలకలు ఏర్పాటుకు అనువుగా ఎన్ని ఇళ్లు ఉన్నాయి..? ఎంతమంది సౌర విద్యుత్తుకు అంగీకరించారన్న అంశాలపై సర్వే చేయించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా 30 వేలకు పైగా లబ్ధిదారులను గుర్తించారు. మిగిలిన రెండు జిల్లాలు కలిపి 35 వేల మంది ఎస్సీ ఎస్టీ వినియోగదారులున్నారు.

**లబ్ధిదారుల వివరాలిలా..**

| డివిజన్ | ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు | ఉత్పత్తి అయ్యే విద్యుత్తు (మెగావాట్లలో) |
|---|---|---|
| జగ్గంపేట | 7,992 | 15.98 |
| కాకినాడ | 5,133 | 10.27 |
| పెద్దాపురం | 6,468 | 12.94 |

### సొంతిళ్లు లేకుంటే సామాజిక స్థలాల్లో..

ఎస్సీ, ఎస్టీల్లో సొంత ఇళ్లు లేనివారు.. రూఫ్‌టాప్ పలకలు అమర్చడానికి అనువుగా లేనివారికి ఉమ్మడిగా సోలార్ పలకలను సామాజిక స్థలాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు జిల్లాల్లో ఖాళీ స్థలాలు గుర్తిస్తున్నారు. అయితే భూముల విలువ పెరగడం, గ్రామ కంఠాలన్నీ చేతులు మారిపోవడంతో స్థలాలు దొరకడం లేదని అధికారులు చెబుతున్నారు. కొన్ని చోట్ల భూములను గుర్తించి సిద్ధంచేశారు. రూఫ్‌టాప్‌తో పాటు సామాజిక స్థలాల్లో సోలార్ పలకల ఏర్పాటుకు గుత్తేదారులను పిలుస్తున్నారు. పది మెగావాట్ల లోపు స్థానికంగా సోలార్ వెండార్లను ఎంపిక చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. ఇళ్లపై సోలార్ ఏర్పాటుకు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యనే ఇన్‌స్టాలేషన్ ఇతరత్రా పనులు చేయాలి. పరికరాలు పాడైనా, దెబ్బ తిన్న వాటిని 24 గంటల్లోనే బాగు చేయాలి. లేకుంటే కిలోవాట్‌కు రూ.2 వేల చొప్పున రోజులు లెక్కన జరిమానాలు విధిస్తారు.

# కర్షకా.. ఖరీఫ్‌కు కదలాలిక..!

– న్యూస్‌టుడే, కాకినాడ నగరం

నారు మడులు పరిశీలిస్తున్న జేడీ విజయ్‌కుమార్

కాకినాడ జిల్లాలో ఖరీఫ్ వరి సాగు నత్తనడకన సాగుతోంది. జులై 15 నాటికి వరి నాట్లు పూర్తి చేయాలని భావించారు. కానీ ఇప్పటికీ జిల్లాలో 15 శాతం నాట్లు కూడా పడలేదు. కొన్ని చోట్ల ఇంకా నారుమడులు వేస్తుండగా, మరికొన్ని చోట్ల ముందుగా వేసిన మడులతో నాట్లు మొదలు పెట్టారు. జిల్లాలో కొందరు 30 శాతం వెద సాగు విధానం అవలంబిస్తుండడంతో కాస్త ప్రగతి కనిపిస్తోంది. ఖరీఫ్ పంటను ముందుకు తెచ్చేందుకు జూన్ 1 నే కాలువలకు నీరు విడుదల చేశారు. అయినప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం అందకపోవటం, ఇతర కారణాలతో సాగు ముందుకు రాలేదు.

✦ జిల్లాలో ఖరీఫ్ పంట సాగుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 1307 హెక్టార్లలో వెద సాగుకు రైతులు సన్నాహాలు చేసుకున్నారు. పనులు మందకొడిగా సాగడంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఎందుకంటే సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో తుపానులతో పంటకు ఇబ్బందే. కానీ ఆగస్టు మొదటి వారానికి కూడా నాట్లు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. ఖరీఫ్ సాగుకు ఎరువులు ముందస్తుగానే అందుబాటులో ఉంచారు. జిల్లాకు అన్నిరకాలు కలిపి 48,364 మెట్రిక్ టన్నులు అవసరమని గుర్తించారు.

**ఇవీ లెక్కలు..**

జిల్లాలో మండలాలు: 21
ఖరీఫ్ సాగు విస్తీర్ణం: 90,984 హెక్టార్లు
రైతులు: 1,94,823
కౌలు రైతులు: 90 వేలు

### నాట్లు పూర్తి చేయండి

జులై నెలాఖరులోపు ఖరీఫ్ వరి నాట్లు పూర్తి చేయాలి. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటల్ని కాపాడేందుకు ప్రభుత్వం ఖరీఫ్ సాగును ముందుకు తెచ్చింది. ఇందుకు రైతులు సహకరించాలి. ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించి వాడొద్దు. అధికారుల సూచనలు పాటించాలి.

- డా.ఎన్.విజయ్‌కుమార్, వ్యవసాయశాఖ జేడీ, కాకినాడ

## విద్యార్థినులపై వేధింపుల ఘటన..

# నిందితులకు 14 రోజుల రిమాండ్

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన కేసులో నలుగురు నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించారు. కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో ల్యాబ్‌టెక్నీషియన్ కోర్సు చదువుతున్న విద్యార్థినులను జీజీహెచ్‌లోని నలుగురు సిబ్బంది వేధింపులకు గురిచేసిన ఘటనకు సంబంధించి కాకినాడ ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు, రెండో పట్టణ స్టేషన్‌లో ఒక కేసు నమోదైన విషయం తెలిసిందే. రెండు రోజుల కిందట నిందితులు కల్యాణ చక్రవర్తి, జిమ్మి రాజు, గోపాలకృష్ణ, ప్రసాద్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం శనివారం రాత్రి నలుగురు నిందితులను రిమాండ్ నిమిత్తం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. సెక్షన్లన్నీ స్టేషన్ బెయిల్‌కి లోబడి ఉండడంతో రిమాండ్ విధించకుండా రిపోర్టును రిటర్న్ చేశారు. దీంతో పోలీసులు వెంటనే నిందితులకు 41(ఎ) నోటీసులు ఇచ్చారు. అనంతరం టుటౌన్ పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి ఆ నలుగురిని శనివారం రాత్రే అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి వారిని మళ్లీ న్యాయమూర్తి ముందు హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం వారిని కాకినాడ సబ్‌జైలుకు తరలించారు.

### నేడు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాక

**కాకినాడ కలెక్టరేట్:** రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ సోమవారం కాకినాడలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు రంగరాయ వైద్యకళాశాలకు చేరుకుని లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటారు. విచారణ నివేదికను పరిశీలించనున్నారు. అనంతరం జీజీహెచ్‌కు చేరుకుని, సఖి సెంటర్‌ను పరిశీలిస్తారు. రోగులతో మాట్లాడతారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

# ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయండి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. స్థానిక రామారావుపేట ఎస్టీయూ భవన్‌లో జరుగుతున్న సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో రెండోరోజు ఆదివారం నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం లీప్ యాప్ ఒకటే అని చెబుతున్నా అందులోనే అనేక యాప్‌లను కలిపిందని గుర్తుచేశారు. విద్యార్థుల ప్రవేశాలను ఆన్‌లైన్ చేయటంతో పాటు ప్రభుత్వం ఇచ్చే విద్యా కానుకలు, ఈపీ, జీపీ, ఎఫ్‌పీల ద్వారా ఆన్‌లైన్ చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. జూన్ 12 తరువాత ఎటువంటి శిక్షణలు, బోధనేతర పనులు అప్పగించబోమని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ మొబైల్ ఫ్రీ క్లాస్ రూమ్ విధానాన్ని తీసుకురావాలని సూచించారు. తిరోగమన విధానాలతో విద్యా ప్రమాణాలను దిగజార్చవద్దని హితవు పలికారు. పాఠశాల విద్యాశాఖను ప్రయోగశాలగా మార్చవద్దని చెప్పారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోర్త శ్రీనివాస్, కె.కాశీవిశ్వనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, శివప్రసాద్, సుభాని, కోటేశ్వరరావు, రామచంద్రయ్య పాల్గొన్నారు.

# స్త్రీనిధి రుణం.. అక్రమాలకు కళ్లెం

ప్రత్యేక యాప్ రూపకల్పన.. డిజిటల్ విధానంలో చెల్లింపు

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

కోటనందూరు మండలం కె.కొట్టాంలో రుణాల వసూలు డ్రైవ్ నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

గ్రామీణ మహిళల ఆర్థిక వికాసానికి ఏర్పాటు చేసిన స్త్రీనిధి బ్యాంకు రుణాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. డ్వాక్రా సంఘాల సభ్యులు రుణాలు తిరిగి చెల్లిస్తున్నా.. కొందరు యానిమేటర్లు, సిబ్బంది చేతివాటంతో లక్ష్యం నీరుగారుతోంది. ఈ నేపథ్యంలో అక్రమాల కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డ్వాక్రా సభ్యులే ఎవరి ప్రమేయం లేకుండా స్వయంగా డిజిటల్ చెల్లింపులు చేసేలా ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. త్వరలో దీనిని అందుబాటులోకి తేనున్నారు.

### ఇప్పటివరకు రెండు విధానాల్లో..

ఇప్పటి వరకు రెండు రకాలుగా స్త్రీనిధి రుణాల వాయిదాలు చెల్లిస్తున్నారు. గ్రామైక్య సంఘానికి సభ్యులు సొమ్ములు చెల్లిస్తే వీటిని యానిమేటర్లు ద్వారా చెక్కు రూపంలో స్త్రీనిధి బ్యాంకుకు జమ చేస్తున్నారు. రెండోది పేటీఎం విధానం. యానిమేటర్లకు లాగిన్ ఇచ్చారు. ఫోన్ పే, గూగుల్‌పే, ఏటీఎం కార్డు ద్వారా సభ్యులు చెల్లిస్తున్నారు. జిల్లాలో 3లక్షల మందికిపైగా సభ్యులు ఉండగా, కేవలం 40 పేటీఎం యంత్రాలు మాత్రమే ఉన్నాయి. దీంతో చాలామంది యానిమేటర్లకే నేరుగా డబ్బులు చెల్లిస్తున్నారు. ఇక్కడే ఈ సొమ్ములు పక్కదారి పడుతున్నాయి.

### ఎక్కడికక్కడ రూ.లక్షల్లో కొట్టేశారు

రుణ వసూళ్లలో కిర్లంపూడి మండలంలో ఒక యానిమేటర్ రూ.22 లక్షలు నొక్కేశారు. యు.కొత్తపల్లి మండలంలో మరొకరు రూ.15 లక్షలు, తాళ్లరేవులో రూ.9 లక్షలు, తొండంగిలో రూ.4.50 లక్షలు, ఏలేశ్వరంలో రూ.2.50 లక్షలు చొప్పున కొట్టేశారు. తాజాగా కోటనందూరు మండలంలోని కేఈ చిన్నాయిపాలెంలో రూ.21లక్షలు, కె.కొట్టాంలో రూ.17.23 లక్షలు చొప్పున చేతివాటం ప్రదర్శించినట్లు గుర్తించారు. ఇప్పటికి జిల్లాలో స్త్రీనిధి రుణ బకాయిలు రూ.5.82 కోట్లకు చేరాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామీణ మహిళలకు స్త్రీ నిధి ద్వారా పెద్ద ఎత్తున రుణాల కల్పనకు సంకల్పించింది. 2025-26లో రూ.253 కోట్ల మేర లక్ష్యం నిర్దేశించింది. గతేడాదితో పోల్చితే ఇది రెట్టింపు. ఈ నేపథ్యంలో రుణాలు ఇవ్వడంతో పాటు, బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

### వసూలుకు ప్రత్యేక చర్యలు

జిల్లాలో స్త్రీనిధి రుణాల రికవరీ డ్రైవ్ చేపట్టాం. డ్వాక్రా సభ్యులు అప్పులు చెల్లించినా, వాటిని కొంత మంది యానిమేటర్లు దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. వీటిపై విచారణ చేసి, చర్యలు తీసుకుంటాం. రుణాల చెల్లింపులు పారదర్శకంగా జరిగేలా త్వరలో యాప్‌ను ప్రారంభిస్తాం.

- జి.శ్రీనివాసరావు, పీడీ, డీఆర్‌డీఏ, కాకినాడ

ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
మా ఆత్మీయులు, శ్రేయోభిలాషి, నీతి, నిజాయితీ కలిగిన వ్యక్తి
శ్రీ మాదాల ఆనందరావు గారు
యనమదల PACS ఛైర్మన్‌గా (తాడిపల్లి, యనమదల, ఓదూరు, PACS) ఎన్నికై నేడు ప్రమాణ స్వీకారం చేయుచున్న శుభసందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ..
శ్రీ మాదాల ఆనందరావు గారు
PACS ఛైర్మన్, యనమదల, రామచంద్రపురం మండలం
తాడిపల్లి, యనమదల, ఓదూరు
గ్రామ మిత్రులు & శ్రేయోభిలాషులు

(c) eenadu

## ఘనంగా సత్యదేవుని రథ సేవ

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని రథసేవ ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చరణ, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాకారం చుట్టూ మూడుసార్లు ఊరేగింపు జరిపారు. ఈవో సుబ్బారావు, భక్తులు స్వామి సేవలో పాల్గొన్నారు. గోధుమ నూక ప్రసాదానికి డిమాండ్ ఏర్పడింది. ఆదివారం ఒక్కరోజే సుమారు లక్ష ప్యాకెట్లు విక్రయించారు.

## ట్రిపుల్‌ఐటీల రెండో విడత ప్రవేశాలకు 907 మంది ఎంపిక

వేంపల్లె, నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు రెండో విడత ప్రవేశాలకు ఎంపికైన 907 మంది విద్యార్థుల జాబితాను ఆదివారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ విడుదల చేశారు. మొదటి విడతలో ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 628 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలలో చేరలేదు. దీంతో ఆ సీట్లు ఖాళీపడ్డాయి. వీటితోపాటు దివ్యాంగుల కోటా కింద 179, సైనికోద్యోగుల పిల్లల కోటా కింద 80, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 20 సీట్లతో కలిపి మొత్తం 907 సీట్లకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి వారి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇందులో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి 96 మంది, ఒంగోలుకు 460, నూజివీడుకు 85, శ్రీకాకుళానికి 265 మంది ఎంపికయ్యారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 96 మంది ఈ నెల 17న ఇడుపులపాయకు, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 810 మంది విద్యార్థులు అదే రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సిఉంది. సోమవారం నుంచి ఓరియంటేషన్ తరగతులు జరుగుతాయన్నారు.


గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం
ఆర్.ఓ.సి.నెం.138/2025-ఇ1, తేది. 13-07-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

గొల్లప్రోలు నగర పంచాయతీకు సంబంధించి BPS-2019 and LRS-2020 నిధుల నుండి మొదటి పిలుపు రూ. 100.00 లక్షలు విలువ గల 27 పనులను చేపట్టుటకు అర్హత గల కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిన ఆన్‌లైన్ టెండరు పిలుపు ఈ క్రింద చూపబడిన షెడ్యూలు ప్రకారం ఇందుమూలముగా టెండరు ప్రకటన జారీ చేయడమైనది. పూర్తి వివరములు www.apeprocurement.gov.in నందు మరియు ఇతర వివరముల కొరకు సెల్ నెం. 99480 60265 ద్వారా తెలుసుకొనవలెను.
బిడ్ డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 14-07-2025 సమయం 11.00 A.M నుండి
బిడ్ డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ ఆఖరి తేది: 21-07-2025 సమయం 04.00 P.M వరకు
సం/- కమిషనర్, గొల్లప్రోలు నగర పంచాయతీ



నోటీసు ప్రకటన

[illegible]

| | |
|---|---|
| 1. ఆర్.ఎస్.నెం.4988 బ్లాక్ నెం 14-7-27 | 2. ఆర్.ఎస్.నెం 4670 బ్లాక్ నెం 14-6-21 |
| 3. ఆర్.ఎస్.నెం 4764 బ్లాక్ నెం 14-2-1 | 4. ఆర్.ఎస్.నెం 4765 బ్లాక్ నెం 14-7-1/a |
| 5. ఆర్.ఎస్.నెం 4967 బ్లాక్ నెం 14-7-26 | 6. [illegible] |

[illegible] కుల్లాదాని యాపస్యందికి, పల్లా పద్మావతి దేవి, జాస్తి శైలజా రాణి గార్లకునూ మరియు ఇతరులకునూ మా క్లయింటు ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఇందుకు విరుద్ధముగా ఎవ్వరు ప్రవర్తించిననూ, ప్రయత్నించిననూ మా క్లయింటు శ్రీ కోర్టు వారి ఎదుట తగు చట్టపరమైన చర్యలు జరిపి, తగు పరిహారములు ఖర్చులతో సహా మా క్లయింటు పొందగలరని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
తేది. 14-07-2025
Devulapalli V.S.S.RamaChandra Rao,
Devulapalli S.S.N.S.Vijay Venkata Sastry, Advocates
Balaji Paradise Apartment, Sivalayam Street, Peddapuram-533437
Kakinada Dt., Cell: 9985691536, 8074026929



SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
SME బ్రాంచి, మెయిన్ రోడ్డు, కాకినాడ, కాకినాడ జిల్లా-533001.

స్వాధీనత ప్రకటన

(స్థిరాస్తి కొరకు) [అనుబంధం IV యాక్ట్-రూల్ 9 క్రింద ]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (నెం.54 ఆఫ్ 2002) ప్రకారము స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME బ్రాంచి మెయిన్ రోడ్డు, కాకినాడ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్ మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 9 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు: M/s. కోనే వరల్డ్ రిసార్ట్స్ లిమిటెడ్ తరఫున మేనేజింగ్ డైరెక్టర్ ముత్తా వెంకటేశ్వరరావు శశిధర్, డి.నెం.67-15-32, నాగమల్లితోట జంక్షన్, కాకినాడ, కాకినాడ జిల్లా (ఏపి)-533001. శ్రీ ముత్తా వెంకటేశ్వరరావు శశిధర్, తండ్రి: ముత్తా గోపాల కృష్ణ, డి.నెం.8-24-4బి, సుబ్బారావు స్ట్రీట్, గాంధీనగర్, కాకినాడ, కాకినాడ జిల్లా (ఏపి)-533004. హామీదారులు: 1) శ్రీ ముత్తా గోపాల కృష్ణ, తండ్రి: ముత్తా వెంకటేశ్వర్లు (లేటు) డి.నెం. 8-24-4బి, సుబ్బారావు స్ట్రీట్, గాంధీనగర్, కాకినాడ, కాకినాడ జిల్లా (ఏపి)-533004. 2) శ్రీ ముత్తా గౌతమ్, తండ్రి: ముత్తా గోపాల కృష్ణ, డి.నెం. 8-2-293/82, ఫ్లాట్ నెం.211-M-111/A, రోడ్డు నెం.76, TV5 ఆఫీస్ వెనుక, ఫేజ్-3, షేక్‌పేట, జూబ్లీ హిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500033. 3) శ్రీ ముత్తా వెంకటేశ్వరరావు శశిధర్, తండ్రి: ముత్తా గోపాల కృష్ణ, డి.నెం.8-24-4బి, సుబ్బారావు స్ట్రీట్, గాంధీనగర్, కాకినాడ, కాకినాడ జిల్లా (ఏపి)-533004. 4) శ్రీ ముత్తా నవీన్ కృష్ణ, తండ్రి: ముత్తా గోపాల కృష్ణ, డి.నెం.68-9-51ఎ, రోడ్డు నెం.1, విద్యుత్ నగర్, కాకినాడ-533003 ని నోటీసులో ఉదహరించబడిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME బ్రాంచి మెయిన్ రోడ్డు, కాకినాడ వారికి ABL DROPLINE OD LOAN A/c. No. 37123716421 క్రింద బకాయి రూ.12,70,38,703/- (అక్షరాల పన్నెండు కోట్ల డెబ్బై లక్షల ముప్పై ఎనిమిది వేల ఏడు వందల మూడు రూపాయలు మాత్రమే) మరియు GECL TERM LOAN A/c. No. 39766830919 క్రింద బకాయి రూ.80,54,800/- (అక్షరాల ఎనభై లక్షల యాభై నాలుగు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే) వెరశి మొత్తము తేది.28.04.2025 తేదీనాటికి రూ.13,50,93,503/- (అక్షరాల పదమూడు కోట్ల యాభై లక్షల తొంభై మూడు వేల ఐదు వందల మూడు రూపాయలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేట్ ప్రకారము భవిష్య వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ది.29-04-2025న డిమాండ్ నోటీసు జారీచేయబడినది.

ఋణగ్రహీతలు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు నోటీసు ఇచ్చి, ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 9 ప్రకారము ది.08.07.2025న దిగువ పేర్కొన్న ఆస్తిని నిర్మాణాత్మక స్వాధీనత తీసుకోవడమైనదని ఇందుమూలముగాతెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయిసొమ్ము ABL DROPLINE OD LOAN A/c. No. 37123716421 క్రింద బకాయి రూ.12,70,38,703/- (అక్షరాల పన్నెండు కోట్ల డెబ్బై లక్షల ముప్పై ఎనిమిది వేల ఏడు వందల మూడు రూపాయలు మాత్రమే) మరియు GECL TERM LOAN A/c. No. 39766830919 క్రింద బకాయి రూ.80,54,800/- (అక్షరాల ఎనభై లక్షల యాభై నాలుగు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే) వెరశి మొత్తము తేది.28.04.2025 తేదీనాటికి రూ.13,50,93,503/- (అక్షరాల పదమూడు కోట్ల యాభై లక్షల తొంభై మూడు వేల ఐదు వందల మూడు రూపాయలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేట్ ప్రకారము భవిష్య వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు (డిమాండ్ నోటీసు తరువాత ఏవైనా జమలు ఉంటే అవి తగ్గించబడును) మొ॥నవి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME బ్రాంచి మెయిన్ రోడ్డు, కాకినాడ వారి ఛార్జీకి లోబడి ఉండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

షెడ్యూలు ఆస్తి

స్థిరాస్తి యొక్క వివరములు

ఐటమ్ నెం.1: 1825.44 చ॥గ॥: రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 2870, తేది.03.04.1997, దస్తావేజు నెం. 2916, తేది. 04.04.1997, దస్తావేజు నెం. 7101/2001, తేది.08.11.2011 ప్రకారము ఆస్తి. తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతము కాకినాడ జిల్లా, కాకినాడ సబ్ రిజిస్ట్రీ మరియు కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్, రమణయ్యపేట, మెయిన్‌రోడ్డు, నాగమల్లితోట జంక్షన్, బ్లాక్ నెం.34, ఆర్‌యస్ నెం.151, డోర్‌నెం.67-15-32/1 నందు 1825.44 చ॥గ॥ లేదా 1526.06 చ॥మీ॥ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు (దస్తావేజులు ప్రకారము): తూర్పు: ప్రతిపాదిత తనఖాదారు గన్నీ కృష్ణ, వీర వెంకట నాగేశ్వరరావు మరియు గన్నీ రామమోహన్ వెత అమ్మిన ఆస్తి; పడమర: ప్రతిపాదిత తనఖాదారు కంపెనీ ఆధీనంలో ఉన్న ఆస్తి; దక్షిణం: ప్రతిపాదిత తనఖాదారు కంపెనీ ఆధీనంలో ఉన్న ఆస్తి; ఉత్తరం: రోడ్డు. ఈ పై ఐటమ్‌లోని మొత్తం విస్తీర్ణము 1825.44 చ॥గ॥ల స్థలము (ఓపెన్ ప్లాట్).

ఐటమ్ నెం.2: 5324.01 చ॥గ॥: రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 753/1910, తేది.21.09.1910, దస్తావేజు నెం. 805/1910, తేది. 17.10.1910, దస్తావేజు నెం. 04/1990, తేది.23.12.1918 ప్రకారము ఆస్తి. తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతము కాకినాడ జిల్లా, కాకినాడ సబ్ రిజిస్ట్రీ మరియు కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్, రమణయ్యపేట, మెయిన్‌రోడ్డు, నాగమల్లితోట జంక్షన్, ఆర్‌యస్ నెం.150, 151, డోర్ నెం.67-15-32/1 నందు 5324.01 చ॥గ॥ లేదా 4451.51 చ॥మీ॥ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు (దస్తావేజులు ప్రకారము): తూర్పు: 59.09 మీ॥; పైడా సూర్యనారాయణమూర్తికి చెందిన స్థలము; పడమర: 55.14 మీ॥; పైడా వారి స్ట్రీట్ మరియు 30 అ॥ ప్రత్యేకంగా రోడ్డు పిఠాపురం రోడ్డు; దక్షిణం: 78.26 మీ॥; గేట్ మరియు రోడ్డు; ఉత్తరం: 78.56 మీ॥; స్విమ్మింగ్ పూల్ యొక్క స్థలము. ఈ పై ఐటమ్‌లోని మొత్తం విస్తీర్ణము 5324.01 చ॥గ॥ లేదా 4451.51 చ॥మీ॥ స్థలము మరియు అందులో ఆర్‌సిసి రూఫ్ నాలుగంతస్తుల (జి+4) భవనము.

తేది : 08-07-2025, ప్రదేశం : కాకినాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


## అచ్చంగా అలానే... మెచ్చంగా ఇలానే

కార్యక్రమంలో పాల్గొన్న కొందరు కవలలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జంటగా చేసిన నృత్యాలు... కథలు చెప్పే క్రమంలో తమ కంఠంలోని వైవిధ్యాన్ని చూపిస్తూ.. అందమైన గొంతుతో ఆకట్టుకునేలా గీతాలాలపిస్తూ కవలలు చేసిన సందడితో ఆప్రాంగణమంతా ఆనందమయంగా మారింది. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల కవలల సమ్మేళనాన్ని ఆదివారం సాయంత్రం సూర్యకళామందిరంలో నిర్వహించారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ నాళం ఆండాళ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎ.రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి 54 జంట కవలలు (108 మంది) ఒకే వేదికపై తీసుకొచ్చి 0 నుంచి 25 సంవత్సరాల వారికి నాలుగు విభాగాలుగా చేసి కథలు చెప్పడం, పాటలు పాడటం, డాన్స్, జంటగా డాన్స్ చేయడం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఒకే వేదికపై ఒకరిని పోలిన మరొకరు ఉండటం, వారి కట్టు, బొట్టు, మాటతీరు, నడవడిక ఒకేలా ఉండటంతో వీక్షకులు ఆశ్చర్యానికి గురయ్యారు.

## అక్కడే అమ్మకాలు.. చీరల నేతకు వీలు..

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ లోని చేనేత వస్త్ర దుకాణాల్లో మగ్గాలపై తయారైన చీరలు మాత్రమే ఉంటాయి. ఒకప్పుడు చేనేత వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడేవి. ప్రస్తుతం వీటికి ఆదరణ కరవై కొనుగోలుదారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కొత్తపల్లికి చెందిన వ్యాపారి కొండేటి మధు తన వస్త్ర దుకాణంలోనే మగ్గం ఏర్పాటు చేసుకున్నారు. కొనుగోలుదారులు వస్తే వ్యాపారం చేసుకుంటూ, ఖాళీ సమయంలో చీర నేసుకుంటున్నారు. దుకాణంలోనే మగ్గం ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారు తిలకించి చీర తయారీ విధానం గురించి తెలుసుకుంటున్నారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లి

జి.వేమవరం రక్షిత చెరువులో పెరిగిన భారీ చేపలతో స్థానికులు

## 36 నెలలు.. 30 కిలోల చేపలు

తాళ్లరేవు మండలం జి.వేమవరం రక్షిత చెరువులో మూడేళ్ల తర్వాత ఆదివారం చేపల పట్టుబడి చేపట్టారు. ఈ చెరువును ఓ వ్యక్తి రూ.36 వేలకు పాడుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి మోహన్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుకీర్తి తెలిపారు. ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రక్షిత చెరువులో 30 కేజీల వరకు బరువున్న చేపలు లభించాయి. వాటిని కొనుగోలు చేసేందుకు స్థానికులు, వ్యాపారులు భారీగా తరలి వెళ్లారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

## ముగిసిన రాష్ట్ర స్థాయి గైనకాలజీ సదస్సు

జ్ఞాపిక అందుకున్న వైద్యనిపుణులు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ నగర గైనకాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఛాప్టర్ ఆఫ్ ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ(ఏపీసీవోజీ) రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారంతో ముగిసింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1400 మంది గైనకాలజీ వైద్యులు, పీజీలు హాజరయ్యారు. కాకినాడ ఆర్ఎంసీ ఆడిటోరియంలో సైంటిఫిక్ సెషన్స్ నిర్వహించారు. నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు, కొత్త చికిత్సా విధానాలపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వైద్యనిపుణులు కోలా శశికళ, కిరణ్మయి, మాల, మంజుల, భాస్కర్ షా, శాంతకుమారి, దీప్తి, కాదా వెంకటరమణ తదితరులు అవగాహన కల్పించారు. అసోసియేషన్ పాటరన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, అసోసియేషన్ అధ్యక్షురాలు అనురాగమయి, ఆర్గనైజింగ్ కార్యదర్శి గీతశ్రీ, ఛైర్ పర్సన్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కో ఛైర్‌పర్సన్ ఎ.సత్యవతి, కోఆర్డినేటర్ బి.సూర్యకుమారి, రవికుమార్, శ్రీధర్, లక్ష్మీకిరణ్, ఉషశ్రీ, కరుణకుమారి, పీఎస్ రాజు, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ చెస్ మాస్టర్‌గా అజయ్

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఈ నెల నుంచి 12వ తేదీ వరకూ సెర్బియాలో జరిగిన అంతర్జాతీయ చెస్ పారాసిన్ ఓపెన్ టోర్నమెంట్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారుడు ముషిని అజయ్ ప్రతిభ కనబరిచాడు. ఆయన 2450 ఫిడే రేటింగ్ సాధించి అంతర్జాతీయ చెస్ మాస్టర్ హోదా సాధించాడు. కోనసీమ జిల్లా, అమలాపురానికి చెందిన అజయ్ గత నాలుగేళ్లుగా కాకినాడలో ఉంటూ స్థానిక డెవలప్ చెస్ అకాడమీలో కోచ్‌గా పనిచేస్తూనే అనేక పోటీల్లో పాల్గొంటున్నాడు. అకాడమీ హెడ్‌కోచ్ దివ్యతేజ, ఇతర క్రీడాకారులు అజయ్‌ను అభినందించారు.

## అభిమానకోట..

తమ్మీ ఎట్లున్నవ్.. మంచిగున్నావె.. అంటూ తెలంగాణ యాస పలికించినా.. ఇయ్‌తల్లీ.. నాకు ఇంకో బిడ్డుండాదనుకుంటా.. కడుపులోపెట్టి చూసుకుంటా.. అని రాయలసీమ రాజసం పలికించినా.. అరేయ్ ముఫ్పండీ అంటూ ఆంధ్రా వెటకారం పండించినా.. అది కోట శ్రీనివాసరావుకే చెల్లింది..

– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

విలక్షణ నటునిగా తెలుగు ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ప్రఖ్యాత నటుడు కోట శ్రీనివాసరావుకు కోనసీమతో అనుబంధం ఉంది. నటుడు కాకముందే ఇక్కడికి వచ్చిన ఆయనకు ఈ ప్రాంతం ఎంతో గౌరవమిచ్చింది. ఆయన మృతితో అప్పటి అనుబంధాన్ని పలువురు గుర్తు చేసుకున్నారు.

### సమనస అన్నపూర్ణ టాకీస్ సందర్శన

కోట శ్రీనివాసరావు సినిమాల్లోకి రాక ముందు బ్యాంకు ఉద్యోగిగా పనిచేసేవారు. 1987లో అమలాపురం మండలం సమనస స్టేట్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేశారు. అప్పటి సర్పంచి మామిళ్లపల్లి రాజారావు కోరిక మేరకు ఆయన సమనసలో ఉన్న అన్నపూర్ణ టాకీస్‌ను సందర్శించారు. ఆ సమయంలో ప్రతిఘటన సినిమా ప్రదర్శిస్తున్నారు. కోట శ్రీనివాసరావు వచ్చారని విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. ఆయన మృతికి రాజారావు సంతాపం తెలిపారు.



సమనసలో సత్కరిస్తున్న రాజారావు

### గోదావరితో అనుబంధం

గోదావరి జిల్లాలతో కోట శ్రీనివాసరావుకు ఎనలేని అనుబంధం పెనవేసుకున్నది అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, సినీ పరిశోధకుడు దువ్వూరి సుబ్రహ్మణ్యశర్మ అన్నారు. వ్యక్తిగతంగా తనకు కోట శ్రీనివాసరావుతో అనుబంధముందన్నారు. తెలుగు సినిమా భావోద్వేగాల పరిశోధనపై ఆయనతో మాట్లాడిన విషయాలను గుర్తు చేసుకున్నారు. ప్రతినాయక పాత్రల్లో కోట శ్రీనివాసరావు నటించిన తీరుపైనా తాను పరిశోధన చేశానని పేర్కొన్నారు.

### దత్తాత్రేయుడి భక్తుడు

పిఠాపురం: ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావుకు పిఠాపురంతో అనుబంధం ఉంది. ఇక్కడ స్వయంభూగా వెలసిన దత్తాత్రేయ స్వామి భక్తుడైన కోట.. మూడుసార్లు దత్తాత్రేయుడు, శ్రీపాద వల్లభుడి దర్శనం చేసుకున్నట్లు ప్రముఖ దత్తప్రచారకుడు లక్ష్మీనారాయణదత్త తెలిపారు. 1991లో దొంగలు సినిమా చిత్రీకరణలో భాగంగా ఆయన తొలిసారి ఇక్కడికి వచ్చారు. ఆ తర్వాత ఆలయాల సందర్శనకు వచ్చి దత్త ప్రచారకుడు లక్ష్మీనారాయణ ఇంటిని సందర్శించారు. ఇటీవల తన పుట్టిన రోజు సందర్భంగా లక్ష్మీనారాయణదత్తను ఆశీర్వాదాలు అందించారు. ఆరోగ్యం కుదుట పడిన తరువాత పిఠాపురం వస్తానని కోట చెప్పారు. పలుమార్లు ఆయన ఇంటికి వెళ్లి దత్త రక్ష కట్టానని దత్తప్రచారకుడు చెప్పారు. తెలుగు భాష అంటే ఆయనకు ఎనలేని అభిమానమని తెలిపారు.

శ్రీనివాసరావుకు దత్త రక్ష కడుతున్న లక్ష్మీనారాయణ (పాత చిత్రం)

## 17 నుంచి నాటికల పోటీలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు స్మారక కళావేదిక రజతోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ నాలుగు రోజులపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు పరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్షుడు కర్రి అబ్బాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు తెలిపారు. ఆదివారం దంటు కళాక్షేత్రంలో రజతోత్సవ సన్నాహక సమావేశం, నాటికల పోటీల కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దయానందబాబు మాట్లాడుతూ నాలుగు రోజులపాటు జరిగే పోటీల్లో పలు పరిషత్‌లు పాల్గొంటున్నాయన్నారు. విజేతలైన ప్రేక్షకులకు బహుమతులు అందజేస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు స్వరార్చన, ఏకపాత్రాభినయ ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కర్రి భామిరెడ్డికి అల్లూరి సీతారామరాజు విశిష్ట సాంస్కృతిక సేవా పురస్కారాన్ని అందజేస్తామని తెలిపారు. అనంతరం సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్‌వీఎస్‌ఎన్.మూర్తి, బాబిరాజు, సూరిబాబు, టీవీఎస్‌ఎన్.రెడ్డి, బాబూరావు, సత్యనారాయణ, బుచ్చయ్య, బాలు, ఎస్.వి.రమణ, వర్మ, మురళి, జి.శ్రీనివాసు, ఏ.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## ఇదే ధోరణి కొనసాగితే వైకాపాకు భవిష్యత్తు ఉండదు

### సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి కొండపల్లి

జి.మేడపాడులో తొలిఅడుగు కరపత్రాలను అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట (గ్రామీణం, సామర్లకోట), న్యూస్‌టుడే: రాష్ట్రంలో శాంతిభద్రతలతో సుపరిపాలన జరుగుతుండగా.. ప్రజలను రెచ్చగొట్టే విధంగా వైకాపా ప్రవర్తిస్తోందని, వారికి ప్రజలు మళ్లీ బుద్ధి చెబుతారని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇదే దోరణిని కొనసాగిస్తే మరో పదేళ్లు వైకాపాకు భవిష్యత్ లేకుండా చేస్తారన్నారు. ఆదివారం మండలంలోని జి.మేడపాడులో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తుండే.. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నామనే నమ్మకాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ప్రజలంతా తన కుటుంబంగా భావిస్తుంటానని, అందుకే మూడుసార్లు తనకు ఓట్లు వేసి గెలిపించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో అనేక అభివృద్ధి పథకాలు చేపట్టారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ, తోటకూర శ్రీనివాస్, గుమ్మళ్ల రామకృష్ణ, ముసిరెడ్డి శ్రీరాములు, చీకట్ల వెంకటేష్, అడ్డాల వెంకన్న బాబు, జెమ్మి పాల్గొన్నారు.

### రైలులో వచ్చిన మంత్రి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో సామర్లకోట చేరుకున్నారు. రైల్వే స్టేషన్‌లో ఆయనకు తెదేపా శ్రేణులు, అధికారులు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రైల్వే మేనేజర్ ఎం రమేష్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ కృష్ణ భగవాన్, తెదేపా నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీశ్‌మోహన్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, బలుసు శ్రీనివాసు, నూనె రామారావు, కుర్రా నారాయణరావు, గొల్లపల్లి సర్వేశ్వరరావు, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నాయకులు కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బకాయిల విడుదలకు వినతి

మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

కాకినాడ నగరం: ఉపాధ్యాయులకు బకాయిలను తక్షణం విడుదల చేయాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం కాకినాడ జిల్లా పీఆర్‌టీయూ కార్యవర్గ సమావేశం జరిగింది. సంఘ అధ్యక్షుడు చింతాడ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని, 2023 జులై నుంచి 12వ పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదో తరగతి మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌ను విడుదల చేయాలన్నారు. నాయకులు సీహెచ్ శ్రీనివాస్, వాకాడ వెంకటరెడ్డి, కృష్ణకుమార్, మనోహర్, మంగారావు, కామేశ్వరరావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## అందరూ దీక్ష చేయొచ్చు

పిఠాపురం: ప్రతిఒక్కరూ చాతుర్మాస దీక్ష చేయొచ్చని, ఒత్తిడితో జీవనం సాగిస్తున్న వారికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థ స్వామిజీ అన్నారు. పిఠాపురం అనఘా దత్త క్షేత్రంలో చాతుర్మాస దీక్ష నాలుగోరోజు ఆదివారం అనఘా దత్త స్వామికి తైలాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మచారులు, గృహస్థులు, పిల్లలు, పెద్దలు చేయొచ్చునన్నారు. ఆహార నియామాలు పాటించాలన్నారు. ప్రయాణాల్లో ఇబ్బందుల నుంచి విముక్తికి, ఆరోగ్యానికి ఈ దీక్ష చేపట్టాలన్నారు. ఒకచోట ఉండి భగవన్నామస్మరణ చేసుకోవాలని తెలిపారు. వైద్య శిబిరం నిర్వహించారు.

### ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | 24,000 |
| పాతకాయ: గండేరా | 27,000 |
| గటగట | 25,000 |
| కొత్తకాయ: గండేరా | 26,000 |
| గటగట | 24,000 |
| నీటి కాయ (వెయ్యింటికి): | |
| పాత (ముక్కుడు) కాయ | 19,000-22,000 |
| కొత్త (పచ్చి) కాయ | 19,000-20,000 |
| కొబ్బరినూనె మార్కెట్: | |
| 15 కిలోలు | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

| | |
|---|---|
| ఫారంరేటు | 97-00 |
| రిటైల్ లైవ్ | 119-00 |
| డ్రెస్డ్ | 173-00 |
| స్కిన్‌లెస్ | 196-00 |

## కాలాన్ని నెట్టేశారు.. కబుర్లు చెప్పేశారు..

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కిర్లంపూడిలో శ్రీకొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1977-78లో 'పది' చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అప్పటి వారు 60 మంది కుటుంబాలతో కలిసి సందడి చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదవీవిరమణచేసి మరదాన శ్రీనివాసరావు, సబ్‌రిజిస్ట్రారుగా ఉద్యోగ విరమణచేసిన జమ్ము ప్రసాద్‌ను మిత్రులు ఆలింగనం చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు శ్రీధరశాస్త్రి, బుర్రే రామారావు, గోపి, కోటి, సంపర రామ్‌కుమార్‌లను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. పూర్వ మిత్రులను ఒక్కచోటకు చేర్చేందుకు దేవులపల్లి వెంకటసూర్యనారాయణ మూర్తి, పేర్ల రమేష్, పాలాట్ల వాసు కృషిని మిత్రులు అభినందించారు.

కిర్లంపూడి పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు

## క్షణికావేశంలో వ్యక్తిపై కత్తితో దాడి

కరప, న్యూస్‌టుడే: ఆస్తి తగాదా నేపథ్యంలో ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన కరపలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరపలో ఒకే కుటుంబానికి చెందిన బి.రామకృష్ణ, బి.రాజరాజేశ్వరి ఒకే ఇంట్లో పైన, కింది పోర్షన్‌లలో నివాసం ఉంటున్నారు. వీరి మధ్య కొంతకాలం నుంచి ఆస్తి తగాదాలున్నాయి. ఆదివారం మధ్యాహ్నం రామకృష్ణ వియ్యంకుడైన బిక్కవోలుకు చెందిన అమజాల వీరరాఘవ భోజనం క్యారేజీ పట్టుకుని వచ్చాడు. ఆ సమయంలో రామకృష్ణ, వీరరాఘవలకు రాజరాజేశ్వరితో గొడవ జరిగింది. ఆమె కుమారుడు చంద్రశేఖర్ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న కత్తితో వీరరాఘవ ఎడమ చేతిపై రెండు చోట్ల నరికాడు. వీరరాఘవను స్థానికులు వెంటనే కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి ఘటనపై ఎస్సై తోట సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175



EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

TENDER
ఇ-కోట్ టెండర్ సేల్: 1050 KVA, జెన్‌సెట్ 2 నెం.లు, తనిఖీ 16 & 17 ఉ. 9.00 గం. నుండి సా. 5.00 గం. వరకు. ITC లిమిటెడ్, ABD అనపర్తి-533342, తూ.గో. జిల్లా. ఇ-కోట్ టెండరు తేది: 18-07-25, టెండరు ఫారం ధర రూ. 500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై- 14 ద్వారా మొబైల్: 98407 31925, www.welcomeauctioneers.com.

REAL ESTATE
PLOT FOR SALE
PITAPURAM
పిఠాపురం బైపాస్‌రోడ్‌ని ఆనుకొని తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో స్థలములు అమ్మకమునకు కలవు. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 89844 25999, 99495 51457.

GENERAL
కొండయ్యపాలెం ఫ్లైఓవర్ జంక్షన్‌లో సుమారుగా 440 గ॥లు మరియు ఉప్పాడలో స్థలములు అమ్మకమునకు కలదు. Cont: P.A.స్వామి, ✆ 98481 07949, 99856 46888.

TO LET
ఖమ్మం వైరా రోడ్ Opp. Rohit TestTube Centre, G+3 Floors Hospitals, Clinics, Gold Shopsకు అనువైనది అద్దెకు కలదు. సంప్ర: 93993 28709, 98661 85050.

COMMERCIAL
FOR OFFICES, Banks, Dental & Cosmetology convience place with parking in Danavaipeta, 1600 Sft., 1st Floor, Rjy, Cont: 94 90 811 769.

JOBS
Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి / వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

ప్రముఖ సంస్థలో కాకినాడ, రాజమండ్రి, విశాఖపట్నం, హైదరాబాద్ నందు పని చేయుటకు నిరుద్యోగ యువతి, యువకులు మరియు రిటైర్డ్ ఉద్యోగులు కావలెను. ✆ 94940 42487, 98498 22088.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TC No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9010680011, 9989371122.

Dr.BRA కోనసీమ జిల్లా కొత్తపేట, మూడవ సెంటర్ వద్ద గల ఇండియన్ ఆయిల్ బంకులో పెట్రోల్, డీజిల్ కొట్టుటకు యువతి, యువకులు కావలెను. ఆసక్తిగలవారు దుర్గా ఫైనాన్స్ కార్పొరేషన్, కొత్తపేట నందు సంప్ర: 90323 25441, 98485 44289.

మెకానిక్ హెల్పర్లు కావలెను. జీతం: 10,000/- నుండి 25,000/- వరకు. శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద, మెయిన్‌రోడ్, కాకినాడ, ✆ 94909 98888.

DRIVERS
కావలెను
ఆదిత్య యూనివర్శిటీ
సూరంపాలెంలో పనిచేయుటకు
బస్సు డ్రైవర్లు
హెవీ వెహికల్ లైసెన్స్‌తో పాటుగా 5 సం॥ల డ్రైవింగ్ అనుభవం కలిగి ఉండవలెను.
రాజమండ్రి సిటీ, రావులపాలెం ప్రాంతముల నుండి విద్యార్థులను తీసుకుని వచ్చుటకు
సూపర్‌వైజర్లు
ఏదైనా డిగ్రీ విద్యార్హత తో పాటు, బస్సు నిర్వహణలో అనుభవం కలిగి ఉండి కాకినాడ, రాజమండ్రి, మండపేట మరియు ఇతర ప్రాంతముల నుండి వచ్చే బస్సుల కొరకు
మరిన్ని వివరములకు సంప్రదించవలసిన నెంబర్లు
79976 86661, 80960 26667

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-93 పై
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

## రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట - 20, 22, వంకాయలు - 46, 50, 60, బెండకాయలు - 30, పచ్చిమిర్చి - 64, 74, 78, కాకరకాయ - 40, బీర - 40, 46, క్యాబేజీ - 30, క్యారెట్ - 36, దొండకాయలు - 32, బంగాళాదుంపలు - 20, 23, ఉల్లి - 23, 29, గోరుచిక్కుళ్లు - 40, దోసకాయలు - 18, చిక్కుళ్లు- 54, చేమదుంపలు - 40, బీట్‌రూట్ - 32, కీర దోస - 46, బీన్స్‌కాయలు - 90, అల్లం - 48, క్యాప్సికం - 100, బొబ్బర్లు - 20, చిలకడదుంపలు - 36, ఒకటి చొప్పున ఆనపకాయ - 20, 25, పొట్లకాయ - 25, 30, అరటికాయ - 7, 8, 9, మునగకాడ - 6, 7, మామిడి కాయ - 6, 8, నిమ్మకాయలు(డజన్) - 24, 36.

## నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- సూపర్‌మ్యాన్, జురాసిక్ వరల్డ్ రీ బర్త్, ఓ భామ అయ్యో రామ, కుబేర, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- ఓ భామ అయ్యో రామ, మార్గన్, ది 100, లక్ష్మి- సూపర్‌మ్యాన్, సత్యగౌరి- వర్జిన్ బాయ్స్, తిరుమల- తమ్ముడు, సీఅండ్‌సీ 1- సూపర్‌మ్యాన్, సీఅండ్‌సీ 2- కుబేర, శ్రీప్రియ- జురాసిక్ వరల్డ్ రీ బర్త్(ఉ, సా), 3 బీహెచ్‌కే(మ, రా), పద్మప్రియ- సూపర్‌మ్యాన్, సూర్య1(వాకలపూడి)- తమ్ముడు, సూర్య 2- సూపర్‌మ్యాన్.

# గుంతల దారిలో ప్రయాణం సాగేదెలా?

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ సాంబమూర్తినగర్ పైవంతెన దిగువన వెంకటేశ్వరనగర్ నుంచి సూర్యనారాయణపురం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. రహదారిపై గుంతలు ఏర్పడడంతో రాకపోకల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సూర్యనారాయణపురం, పెద్ద మార్కెట్‌కు వెళ్లాలంటే సాంబమూర్తినగర్, రెవెన్యూ కాలనీ, వెంకటేశ్వరనగర్, సంజయ్‌నగర్ వాసులు ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. సమీపంలోనే న్యూ పోర్టు రైల్వే స్టేషన్ ఉంది. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని నగరవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

అధ్వానంగా పైవంతెన దిగువ రోడ్డు

### ఎవరూ పట్టించుకోవడం లేదు

వర్షాల సమయంలో ఈ మార్గంలో ప్రయాణించాలంటే ఇక్కట్లు తప్పవు. వర్షం పడినప్పుడు నీరు నిలబడి బురదమయంగా మారుతోంది. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వృద్ధులు, మహిళలు జారి పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– ఎన్.రమేష్, రెవెన్యూకాలనీ

## డ్రోన్‌తో తీరంలో నిఘా

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు బీచ్ ప్రాంతాల్లో సందర్శకుల రద్దీ, భద్రతా పరంగా, ముందస్తుగా అవాంఛీనయ ఘటనలను గుర్తించడానికి డ్రోన్లతో భద్రతా, నిఘా ఏర్పాటు చేశారు. సందర్శకులు పోలీసుల సూచనలు, హెచ్చరికలను పాటించాలని పేర్కొన్నారు.

# ఆటల్లో అదుర్స్

## రాణిస్తున్న ఏఎస్‌డీ జూనియర్ కళాశాల విద్యార్థినులు

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)

చదువుతోపాటు క్రీడల్లోనూ, ఎన్‌సీసీలో రాణిస్తూ తమ భవితకు బంగారు బాటలు వేసుకుంటున్నారు ఈ విద్యార్థినులు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా తలొగ్గక ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న వీరు ప్రిన్సిపల్ సిహెచ్ఎన్ మూర్తిరాజు సహకారంతో నిత్యం సాధన చేస్తూ విజయపథంలో సాగుతున్నారు.

క్రీడాకారిణులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ మూర్తిరాజు, అధ్యాపకులు

### ఫుట్‌బాల్‌లో ప్రతిభ

ఏఎస్‌డీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. రాష్ట్రం తరఫున జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాను. నాన్న శ్రీను హైదరాబాదులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. గతంలో గుంటూరులో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-14, అండర్-19 విభాగంలో పాల్గొని పతకాలు సాధించాను. ప్రస్తుతం కాజులూరు జడ్పీ హైస్కూల్ కోచ్ కౌర్ సహకారంతో సాధన చేస్తున్నాను.

- కాదా లక్ష్మీదుర్గ

### ఆర్మీలో చేరతా

అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నాన్న అప్పన్న కూలీగా చేస్తారు. అమ్మ మంగ గృహిణి. ఎన్‌సీసీ అంటే ఇష్టం. అందుకే అందులో చేరాను. ఇటీవల పెద్దాపురంలో 10 రోజులపాటు జరిగిన ఎన్‌సీసీ క్యాంపులో పాల్గొని ప్రతిభను చాటాను. 'ఏ' సర్టిఫికెట్ పొందాను. ఆర్మీ అధికారిణి అవ్వాలనే లక్ష్యంతో శ్రమిస్తున్నాను.

- దుళ్ల మనీష

### పవర్ లిఫ్టింగ్‌లో సత్తా

నాకు క్రీడలంటే ఆసక్తి. నాన్న ప్రభాజీ పెయింటింగ్ పనులు చేస్తుంటారు. అమ్మ జీవనజ్యోతి గృహిణి. పవర్ లిఫ్టింగ్ కోచ్, వాకలపూడి జడ్పీ హైస్కూల్ పీడీ పి.శ్రీనివాస్ సహకారంతో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్, జూడో పోటీలకు ఎంపికయ్యాను. పదో తరగతిలో 566 మార్కులు సాధించాను. గతంలో విజయవాడ, జగ్గయ్యపేటలో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించాను. జాతీయస్థాయి పోటీలకు సాధన చేస్తున్నా. ఐపీఎస్ సాధించాలన్నది లక్ష్యం.

- పెదగాడి దీవెన

### బాక్సింగ్‌లో భళా

కళాశాల తరఫున జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాను. ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నాన్న పడాల జానకిరామ్ డ్రైవర్. అమ్మ హరిత గృహిణి. కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14, గోవాలో జరిగిన అండర్-17 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రిన్సిపల్ మూర్తిరాజు, అధ్యాపకుల సహకారంతో ముందుకు సాగుతున్నా. ప్రస్తుతం బాక్సింగ్ కోచ్ రామకృష్ణ, పీటీ మాలిని సహకారంతో జాతీయ స్థాయి పోటీలకు శిక్షణ పొందుతున్నాను.

- పడాల జ్యోత్స్నరాణి

# మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ నగరం : 80085 74157
సాంబమూర్తినగర్ : 91548 46719, మసీదుసెంటర్ : 91541 18210
గాంధీనగర్ : 80085 74159, బాలాజీచెరువు : 80085 74154
ఉ॥ 10 - మ॥ 1

### స్తంభాన్ని మార్చారు..

కాకినాడ రేచర్లపేటలోని ఓ వీధిలో రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభం ఉండడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుందని, ప్రమాదాలు జరుగుతున్నాయని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించారు. అదే వీధిలో కొంచెం ముందు రహదారి పక్కన కొత్త స్తంభం ఏర్పాటు చేశారు.

### మూత బిగించారు

స్పందనకు వందనం

నగరంలోని కొత్తకాకినాడ కూడలి తదితర ప్రాంతాల్లో కాలువలపై ఇనుపచక్రాలు లేక ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఇనుపచక్రాన్ని ఏర్పాటు చేశారు.

### డివైడర్ నిర్మించరూ..

కాకినాడ, గొడారిగుంట ప్రధాన రహదారి మధ్యలో డివైడర్ వేయకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు రోడ్డు అంచులకు వెళ్లే క్రమంలో అదుపుతప్పి పడిపోతున్నారు. మధ్యలో విద్యుత్తుస్తంభాలు ఉండటంతో మరింత ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి డివైడర్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

### నివాసాల మధ్య చెత్తకుండీ తొలగించండి

రేచర్లపేటలోని ఏడో వార్డు సచివాలయం వెనుక వైపు రహదారిలో నివాసాల చెంతన చెత్తకుండీ ఉండడతో తీవ్ర దుర్వాసన వస్తోంది. ఇక్కడ చెత్తను కుక్కలు, పశువులు లాగి చెల్లాచెదురు చేస్తున్నాయి. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం.

### వంతెనకు అడ్డుగా బస్సులు

సమస్య: కాకినాడ సామర్లకోట రహదారిలో ప్రతాప్‌నగర్ వంతెనకు అడ్డుగా బస్సులను ఆపుతున్నారు. దీంతో రాకపోకలు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – స్థానికులు

**సమాధానం:** రోడ్డుకు అడ్డుగా బస్సులు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకుంటాం – మనోహర్, అసిస్టెంట్ కమిషనర్, కాకినాడ డిపో

- న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

## చిన్నారుల చదువుకు చేయూత

గాంధీనగర్, న్యూస్‌టుడే: తండ్రిని కోల్పోయిన చిన్నారులను దత్తత తీసుకుని చదివిస్తున్న శ్రీయువసేన సహాయనిధికి కాజులూరు మండలం ఉప్పుమిల్లికి చెందిన యాళ్ల శేఖర్ రూ.54 వేల ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు చెక్కును సంఘం అధ్యక్షుడు బొల్లం సతీష్‌కు అందజేశారు. యాళ్ల విజయ్ నాయుడు, మురళీ, సంతోష్, వాసు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న యాళ్ల శేఖర్

## సామాజిక సేవలు అభినందనీయం

గాంధీనగర్: యువత వ్యాపార అభివృద్ధికి లోకల్ బిజినెస్ నెట్‌వర్క్(ఎల్‌బీఎన్)ను స్థాపించి, సామాజిక సేవా కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. ఆదివారం టౌన్‌హాల్లో ఎల్‌బీఎన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎల్‌బీఎన్ ప్రెసిడెంట్ రవితేజ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సిరాజ్, సెక్రటరీ సతీష్ కుమార్‌తోపాటు మరో యాభై మంది సభ్యులు రక్తదానం చేశారు. లయన్స్ వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాసు, డైరెక్టర్ అంకూర్ సూరానా, రాము, కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువ వ్యాపారవేత్తలు

### పూడిక తీయక.. మురుగు కదలక

లక్ష్మీనారాయణనగర్‌లోని ఓ వీధిలో రహదారి పక్కన ఉన్న కాలువ అధ్వానంగా దర్శనమిస్తోంది. పూడిక తీయకపోవడం, వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగు పారేందుకు వీలులేక నిల్వ ఉంది. చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి, దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

### అల్లుకున్న పొదలు

కాకినాడ, శాంతినగర్ పెద్దిరెడ్డివారివీధిలో ఓ విద్యుత్తుస్తంభానికి పిచ్చిమొక్కలు, పొదలు అల్లుకున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ప్రమాదం పొంచి ఉందని, గాలులు వీచినప్పుడు నిప్పురవ్వలు వస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మసీదుసెంటర్

### నిబంధనలు పట్టవా..!

రవాణా సరకులను తరలించాల్సిన వ్యాన్లపై కొందరు నిబంధనలకు విరుద్ధంగా జనాలు తీసుకెళ్తూ నిబంధనలకు బేఖాతర్ చేస్తున్నారు. ఓ పక్క ట్రాఫిక్ అధికారులు అవగాహన కల్పిస్తున్నా, హెచ్చరిస్తున్నా కొందరిలో మాత్రం మార్పు రావడం లేదు. నిత్యం రద్దీగా ఉండే గొడారిగుంట ప్రధాన రహదారిలో ఓ రవాణా వాహనంపై జనం కిక్కిరిసి వెళ్తున్న తీరు భయాందోళనకు గురిచేస్తోంది.

- న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

## కుట్టులో ఉచిత శిక్షణ

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్, కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ శాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు యనమదల దేవి ఒక ప్రకటనలో తెలిపారు. సాంబమూర్తినగర్ నాలుగో వీధిలో గల కార్యాలయంలో ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తి గల వారు 93467 94779 నంబరులో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

బిక్కిన విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న గోడి సత్యవతి, వెంకట్ తదితరులు

## కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

గాంధీనగర్, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీని మరింతగా బలోపేతం చేయాలని, ఈక్రమంలో కష్టపడే వారికి తగిన గుర్తింపు నిస్తూ పదవులు దక్కుతాయని భాజపా జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. కాకినాడ సెంట్రల్ మండల అధ్యక్షురాలిగా నియమితురాలైన మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఆధ్వర్యంలో ఆదివారం విశ్వేశ్వరరావును సత్కరించారు. ఈ సందర్భంగా బిక్కిన మాట్లాడుతూ కూటమి పెద్దల సహకారంతో ప్రజలకు మరిన్ని సేవలందించాలని సూచించారు. మాజీ కౌన్సిలర్ జీవీవీ.శర్మ, టి.నాగభూషణం, ఎస్.నాగేశ్వరరావు, మల్లికార్జునశర్మ, సుబ్బారావు శర్మ, బాబూరావు, కె.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం పెంపునకు సహకారం

**సర్పవరం జంక్షన్:** కాకినాడ నగరంలో పచ్చదనం పెంచేందుకు కార్పొరేషన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఇప్పటివరకు 20 వేల మొక్కలు నాటడం స్ఫూర్తిదాయకమని విశ్రాంత డీఎంఈ డాక్టర్ రాఘవేంద్రరావు తెలిపారు. కాకినాడ అర్బన్ 1వ డివిజన్ రమణయ్యపేట బోటుక్లబ్ ఉద్యానంలో వన్ స్టెప్ టువార్డ్స్ సొసైటీ సంస్థ అధ్యక్షుడు జోగా రామకృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని డా.రాఘవేంద్రరావు ఆదివారం ప్రారంభించారు.

## అమెజాన్‌లో ఉద్యోగాలకు ఎంపిక

గాంధీనగర్, న్యూస్‌టుడే: జిల్లాలోని సూరంపాలెంలోని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థినులు గ్లోబల్ టెక్ దిగ్గజం అమెజాన్ సంస్థలో రూ.30 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగ అవకాశం పొందారని కళాశాల ఛైర్మన్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025లో ఉత్తీర్ణులైన 11 మంది విద్యార్థులు అమెజాన్‌లో 6 నెలలు ఇంటర్న్‌షిప్‌కు రూ.50 వేల నుంచి రూ.70 వేల మధ్య శిక్షణ వేతనంతో ఎంపికై నైపుణ్యాలను ప్రదర్శించారన్నారు. వారిలో ఆర్.శ్రీజ స్వరూప, ఈ.కోమల, మేఘన, డి.అదితి, పి.మధు, వై.రేష్మాచౌదరి, సిహెచ్.సత్యశ్రీ, కె.శ్రావ్యలు ఫుల్‌టైమ్ ఉద్యోగులుగా మారారని చెప్పారు. వీరు కళాశాల కీర్తిని పెంచడంతోపాటు, భవిష్యత్తులో విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తారని కృష్ణారావు పేర్కొన్నారు.

## కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయండి

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ సెజ్‌లో వెంటనే పరిశ్రమలు స్థాపించాలని, లేకుంటే రైతులకు అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.మధు డిమాండ్ చేశారు. ఆదివారం సాంబమూర్తినగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సీపీఐ కాకినాడ నగర మహాసభ పి.ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. తొలుత పార్టీ పతాకాన్ని మధు ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ సీనియర్ నేత, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పొన్నమండ రామచంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇక్కడ పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయని అంతా ఎదురు చూశారని, ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. సెజ్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గత ఏడాది హామీ ఇచ్చినా ఒక్క అడుగూ ముందుకు పడలేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి టి.ప్రసాద్‌లు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి టి.అన్నవరం, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.భవానీ, వివిధ సంఘాల నాయకులు ఎమ్మెస్, రాంబాబు, జయకుమార్, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు

మహారాజశ్రీ 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కాకినాడ

I.A. 628/2022, O.S 1242/2022

Between:
Gundabathula Siva Srinu ...Petitioner/ Plaintiff
AND
Vanga Rajashekar ...Respondent/ Defendant

Vanga Rajashekar, S/o. Venkata Tirunadh, R/o. D.No. 37-2-22, Market Street, Kakinada, Kakinada District. ...Respondent/ Defendant

పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 01-08-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషన్‌లో మీ అక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

దాసరి సంజయ్ గుప్త
అడపా భాస్కర్
అడ్వకేట్స్, కాకినాడ

కాకినాడ
10-7-2025

## వైకాపా హయాంలోనే తిరుమలలో అపచారాలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలోనే తిరుమల కొండపై అపచారాలు సాగాయని తెదేపా బ్రాహ్మణ సాధికారిత సమితి కన్వీనర్ హోతా రవి ఆరోపించారు. స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఆదివారం రవి మాట్లాడుతూ తిరుమల దర్శనానికి వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. కొండపై అన్యమత ప్రచారం సాగుతోందంటూ చేసిన వ్యాఖ్యలను తితిదే మాజీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి ఖండించడం విడ్డూరంగా ఉందన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం తగదు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: జీజీహెచ్ ఆస్పత్రి నిర్వహణలో పర్యవేక్షణ స్థాయి అధికారులు అలసత్వం ప్రదర్శించడంతో సామాన్యులకు వైద్య సేవలు అందడంలేదని 36వ డివిజన్ తెదేపా ఇన్‌ఛార్జి నల్లూరి శ్రీనివాస్ ఆరోపించారు. ఆయన శనివారం మాట్లాడుతూ ఫిర్యాదులు చేయడానికి వెళ్లినా ఎవరూ అందుబాటులో ఉండడం లేదని, ఫోన్‌లో సంప్రదించినా పట్టించుకోవడం లేదన్నారు. ఐసీయూలో పడకలు ఖాళీగా ఉన్నప్పటికీ రోగులకు కేటాయించకుండా జనరల్ వార్డులోనే ఉంచుతున్నారని, దీంతో అత్యవసర వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## బాలిక ఆత్మహత్యాయత్నం

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం తూరంగికి చెందిన 17 ఏళ్ల బాలిక వ్యక్తిగత సమస్యలతో మనస్తాపం చెంది ఇంటి వద్ద చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను చికిత్సనిమిత్తం ఆదివారం కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు.

# వైద్యం.. విజ్ఞానం.. ఆధునికం

న్యూస్‌టుడే, మసీదుసెంటర్(కాకినాడ)

ప్రస్తుత కాలంలో కొత్త కొత్త వ్యాధులు ముంచుకొస్తున్నాయి. వీటిని చికిత్స అందించడం వైద్యులకు కత్తిమీదసాములా మారింది. ఈ నేపథ్యంలో వారు ఎప్పటికప్పుడు నూతన వైద్యవిధానాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముంది. నూతన ఆవిష్కరణలు, అత్యాధునిక పరికరాలు, చికిత్సా విధానాలు తెలుసుకోవాలి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఛాప్టర్ ఆఫ్ ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ(ఏపీసీవోజీ) రాష్ట్రస్థాయి సదస్సు కాకినాడలో మూడురోజుల పాటు నిర్వహించారు. పలువురు వైద్యులు దీనికి హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి వైద్యనిపుణులు స్త్రీ, ప్రసూతి వ్యాధులకు సంబంధించి ఆధునిక చికిత్సా విధానంపై అవగాహన కల్పించారు. ఇది తమకు ఎంతో ఉపయోగమని పలువురు పేర్కొన్నారు.

సదస్సుకు హాజరైన వైద్యులు

### రోబోటిక్ సర్జరీతో ఎంతో ప్రయోజనం

గైనిక్ సమస్యలతో బాధపడుతున్న మహిళలకు అడ్వాన్స్‌డ్ రోబోటిక్ సర్జరీతో ఎంతో ప్రయోజనం కలుగుతుంది. లాపరోస్కోపిక్ సర్జరీ అంటే చిన్నహోల్స్ పెట్టి శస్త్రచికిత్స చేస్తారు. రోబోటిక్‌లో అంతకంటే చిన్న రంధ్రాలు చేసి రోబోటిక్ పరికరాలు లోపలకు పంపి శస్త్రచికిత్స చేస్తారు. మన చేయి 360 డిగ్రీలు తిరగదు. రోబోటిక్ పరికరాలు 540 డిగ్రీలు వరకూ తిరుగుతాయి. దీంతో గైనకాలజీ క్యాన్సర్లు, కొన్ని రకాల కణతులు, ట్యూమర్స్ సర్జరీల సమయంలో మూలమూలలకు, ఇరుకు ప్రదేశాల్లోకి కూడా వెళ్లి శస్త్రచికిత్స చేసేందుకు వీలుంటుంది. ఇతర అవయవాలు పక్కకు వెళ్లి వాటికి ఇబ్బంది కలగకుండా చిన్నచిన్న టిష్యూస్ తీసుకేందుకు ఎంతగానో దోహదపడతాయి. 2005 నుంచి ఇటువంటి సర్జరీలు అందుబాటులోకి వచ్చాయి. రానున్న రోజుల్లో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కూడా ఈ సేవలు అందనున్నాయి.

– డా.కిరణ్మయి, సీనియర్ కన్సల్టెంట్, మెడికవర్ ఆసుపత్రి, విశాఖపట్నం

### కొత్త పద్ధతులు, చికిత్సా విధానాలపై చర్చించాం...

కొత్త చికిత్సా విధానాలు, ఏ విధంగా వ్యాధిని గుర్తించాలి తదితర అంశాలపై చర్చించాం. ఇప్పుడిప్పుడే వైద్యవృత్తిలోకి వస్తున్నవారికి, వైద్యవిద్యార్థులకు ఇటువంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయి. గర్భాశయం పక్కన నున్న అండాశయంలో ట్యూమర్స్‌లో ఇన్‌ఫెక్షన్లు, గడ్డలు ఏవిధంగా కనుగొనాలి, లక్షణాలను గుర్తించి, వారికి ఏవిధంగా చికిత్స అందించాలి, నొప్పి తగ్గించడానికి ఏవిధంగా చికిత్స చేయాలి వంటి వాటిపై వివరించాను.

– డా.శశికళ కోలా, సీనియర్ కన్సల్టెంట్, రెయిన్‌బో ఆసుపత్రి, హైదరాబాద్

అమృతమూర్తికి అశ్రునివాళి



జననం 11-07-1942
మరణం 03-07-2025

శ్రీ కోడిదాసు వీర రాఘవులు గారు, D.C.T.O., (Retd.), కాకినాడ

ప్రేమ, ఆప్యాయతలకు మారుపేరుగా, మా అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించిన శ్రీ కోడిదాసు వీర రాఘవులు గారి మరణానికి చింతిస్తూ, వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ....

మనుమరాలు: Dr. ఇందన హైమశ్రీ, MBBS., Civil Assistant Surgeon
అక్క: శ్రీమతి ఇందన రమామణి
బావ: శ్రీ ఇందన కొండలరావు, D.E.E., (Retd.)
కుమార్తె: ఇందన పద్మావతి
అల్లుడు: ఇందన అశోక్ బాబు

(c) eenadu

కాకినాడ గ్రామీణం
• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

## విద్యుత్తు సమస్యలా.. పరిష్కార మార్గమిదిగో

**పిఠాపురం:** పిఠాపురం నియోజకవర్గంలో విద్యుత్తు సమస్యలున్నాయా..? లోవోల్టేజీ, విద్యుత్తు స్తంభాల మార్పు, సోలార్ విద్యుత్తు కనెక్షన్లు, విద్యుత్తు బిల్లుల సమస్యలు.. ఇలా ఏ సమస్యలున్నా విద్యుత్తు శాఖ డీఈ దృష్టికి తీసుకురావచ్చు. ప్రభుత్వం అమలు చేసే పథకాలతోపాటు, విద్యుత్తు ఇబ్బందుల పరిష్కారానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో నేడు డీఈ శ్రీనివాస్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం జరగనుంది. ఐచ్ఛికంగా ఆసక్తి ఫోన్ చేయండి.

తేదీ: 14.07.2025
సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్లు: 94408 12599, 80085 65544

## 16న హామీలు అమలుచేయాలని ప్రజాప్రదర్శన

సామర్లకోట, న్యూస్‌టుడే: ఎన్నికల హామీలు అమలు చేయాలని 16న ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు తెలిపారు. ఆదివారం విశ్వకర్మల కమ్యూనిటీ హాలులో పట్టణ కార్యదర్శి పి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16, 17 తేదీల్లో సామర్లకోటలో నిర్వహించే మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరుకానున్నట్లు చెప్పారు. జిల్లా కార్యదర్శి కె.బేబీరాణి, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
ఉ. 10 - మ. 1 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

**సమస్య:** సర్పవరం పులుసు ప్లైట్ కాలనీలో వర్షాలు పేరుకుపోయాయి. దాంతో దుర్వాసన వస్తోంది. - **రామ్‌కుమార్**

**పరిష్కారం:** పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును తెలుసుకునే సిబ్బందితో శుభ్రం చేయించారు.

**సమస్య:** కరప కొత్తపేట వీధిలో విద్యుద్దీపాలు సరిగా వెలగక రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిపడుతున్నాం. - **స్వామి**

**పరిష్కారం:** పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవికి తెలుపగా వీధి దీపాలు వెలిగేలా చేయించారు.

**సమస్య:** పిఠాపురంలోని ఏలేరు చర్చి నుంచి ఆర్‌ఆర్‌బీపాలెం వెళ్లే మార్గంలో పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. - **రమేష్, సూరిబాబు**

**పరిష్కారం:** తాగునీటి సరఫరా పర్యవేక్షణాధికారి జనార్దన్‌తో చెప్పగా పైప్‌లైన్ మరమ్మతు పనులు మొదలుపెట్టారు.

**సమస్య:** వాకలపూడి గ్రామం సాలిపేటలో చెత్త పేరుకుపోయింది. - **శంకర్, వాకతిప్ప**

**పరిష్కారం:** డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డికి చెప్పగా, సిబ్బందిని పంపి చెత్త తొలగించారు.

**సమస్య:** స్థానిక పోతిరెడ్డివారి వీధిలో చెత్త పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. - **బి. గోవిందు, పెద్దాపురం**

**పరిష్కారం:** పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులను పంపి శుభ్రం చేయించారు.

**సమస్య:** గొల్లప్రోలు పాయదువారి వీధిలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - **సూరిబాబు**

**పరిష్కారం:** ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రమేష్‌ప్రసాద్ సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, పిఠాపురం, సర్పవరం జంక్షన్, కరప, కత్తిపూడి, పెద్దాపురం, గొల్లప్రోలు

# రూ.లక్షలు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు

న్యూస్‌టుడే, గొల్లప్రోలు, పిఠాపురం

## తుప్పు పడుతున్న వ్యాయామ పరికరాలు

ఉరుకుల, పరుగుల జీవితంలో మానసిక వికాసం, ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం అవసరం. వైద్యులు సైతం రోజూ యోగా, నడక తప్పనిసరని సలహా ఇస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో తెదేపా ప్రభుత్వం ప్రజా వ్యాయామశాలలు ఏర్పాటు చేసింది. వీటి కోసం రూ.లక్షలు వెచ్చించినా నిర్వహణ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

గొల్లప్రోలు ఎస్సీపేటలో నిరుపయోగంగా..

### పిఠాపురంలో..

పిఠాపురం పురపాలక సంఘం పరిధిలో చిన్న మాంబ ఉద్యానం, రాజారా మెమోరియల్ ఉద్యానాల్లో రెండు వ్యాయామశాలలను ఏర్పాటు చేశారు. పరికరాల కొనుగోలు, బిగింపు, ఫ్లాట్‌ఫాం నిర్మాణానికి సుమారు రూ.12 లక్షలు ఖర్చు చేశారు. చిన్నమాంబ పార్కులోని వ్యాయామశాలలో కొన్ని పరికరాలు పనిచేయడం లేదు. స్థానికంగా అధిక సంఖ్యలో యువత ఉన్నప్పటికీ వ్యాయామశాలలు ఉపయోగంలోకి రావడం లేదు.

పిఠాపురం చిన్నమాంబ పార్కులో మరమ్మతులో ఇలా..

### గొల్లప్రోలులో ఏడేళ్ల క్రితం ఏర్పాటు..

గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని ఎస్సీపేట సామాజిక స్థలంలో ఏడేళ్లక్రితం వ్యాయామశాల ఏర్పాటుచేశారు. సుమారు రూ.6 లక్షలు ఖర్చుతో వ్యాయామ పరికరాలు కొనుగోలు చేసి అమర్చారు. తరువాత మరికొన్ని పరికరాలు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పినా ఆదిశగా చర్యలు చేపట్టలేదు. కొన్ని పరికరాలు పూర్తిగా బిగించకపోవడంతో తుప్పుపట్టాయి. కొన్ని పనిచేయడం లేదు. అధికారుల పర్యవేక్షణ కరవై వ్యాయామశాల పూర్తిస్థాయిలో ఉపయోగపడటంలేదు.

### పనిచేసేలా చర్యలు..

వ్యాయామశాలలను పరిశీలించి పరికరాలన్నీ పనిచేసేలా చర్యలు చేపడతాం. అదనపు పరికరాల ఏర్పాటు, కొత్తగా వ్యాయామశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతాం. - ప్రభాకరరావు, ఏఈ

## నేడు పాడాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని పాడా పీడీ చైతన్యరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపుతారని, మళ్లీ ఇవ్వనవసరం లేదన్నారు. డివిజనల్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు అంతా హాజరుకావాలని కోరారు.

## ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం: ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. పోలేకుర్రు పంచాయతీ బీసీపేటలో తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్డి మూరి సతీష్, తెదేపా నాయకుడు నిమ్మకాయల మూర్తి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి పాల్గొని ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు.

తాళ్లరేవులో ముత్యాలమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పిఠాపురంలో మరిడమ్మవారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

వేషధారణలో కళాకారులు

# వైభవంగా అమ్మవార్ల జాతరలు

పెద్దాపురం, గొల్లప్రోలు, కరప, తాళ్లరేవు, పెదపూడి, న్యూస్‌టుడే: పెద్దాపురం, పిఠాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో అమ్మవార్ల జాతరలు వైభవంగా సాగుతున్నాయి. పెద్దాపురంలో మరిడమ్మ జాతరకు మూడో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి పాతబస్టాండ్ వరకు భక్తులు మండుటెండలో బారులుదీరారు. కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో గ్రామానికి చెందిన మహిళలు వివిధ రకాల వంటలతో సారె సమర్పించారు. ● గొల్లప్రోలు దేవీనగర్‌లో శ్రీదేవి అమ్మవారిని 220 కేజీల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ● కరప మండలం వేములవాడ గ్రామదేవత ముసలమ్మతల్లి శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. ● తాళ్లరేవు గ్రామ దేవత ముత్యాలమ్మ, పోలేకుర్రు గ్రామ దేవత పోలేరమ్మతల్లి జాతర, తీర్థమహోత్సవాలు ఘనంగా జరిగాయి. ● పెదపూడి గ్రామదేవత బళ్లమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్లారు.

తాళ్లరేవు గ్రామదేవత ముత్యాలమ్మ

గొల్లప్రోలులో శ్రీదేవిఅమ్మవారు

వేములవాడ ముసలమ్మ

## మహావతార్‌బాబాజీ గురుపూజోత్సవం

**సర్పవరం జంక్షన్:** పుణెలో నిర్వహిస్తున్న మహావతార్‌బాబాజీ గురుపూజోత్సవ దీక్ష వేడుకల్లో ఆదివారం కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. దత్త పాదానంద స్వామీజీని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

### విశ్వేశ్వరరావును కలిసిన ఎమ్మెల్యే నానాజీ

**సర్పవరం జంక్షన్:** గురుపౌర్ణమిని పురస్కరించుకుని మూడు రోజుల దీక్ష నిమిత్తం కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే నానాజీ పుణె వెళ్లారు. అక్కడ దీక్ష అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పరిచయస్తుడైన మేజర్ జనరల్, కార్గిల్ వీరుడు ఎస్వీ విశ్వేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

## బాలవికాస్ కేంద్రాల అభివృద్ధికి కృషి

**పెద్దాపురం:** ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దే శ్రీసత్యసాయి బాలవికాస్ కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలని సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర విద్యా విభాగ సమన్వయకర్త టి.మధుసూదనరావు, ఆర్.మాధవి పిలుపునిచ్చారు. ఆదివారం వడ్లమూరు శ్రీసత్యసాయి విహారలో బాల వికాస్ గురువుల శిక్షణ తరగతులకు వారు హాజరయ్యారు. జిల్లా విభాగ సమన్వయకర్తలు యర్రగుడ్డ గోవిందరాజు, పాలచర్ల సత్యనారాయణ, కస్తూరి రాజాజేశ్వర్, నాగేశ్వరరావు, డి.శ్యామల, తుమ్మలపల్లి చిట్టి కామేశ్వరి, పాలచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనుబాబు పుట్టినరోజు వేడుకలు

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనివాస చార్యులుచౌదరి (శ్రీనుబాబు) జన్మదిన వేడుకలు జి.మేడపాడులోని ఆయన నివాసంలో ఆదివారం జరిగాయి. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప హాజరయ్యారు. శ్రీనుబాబుతో కేక్ కోయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనుబాబుతో మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే చినరాజప్ప

## బాల పరిరక్షణ కమిటీ సభ్యులకు శిక్షణ నేడు

**సామర్లకోట:** సామర్లకోట బీమేశ్వర లయన్స్ క్లబ్ భవనంలో ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటల నుంచి బాలల పరిరక్షణ కమిటీ సభ్యులకు శిక్షణ నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలన, పోక్సో, మిషన్ వాత్సల్య పథకం కార్యక్రమాల్లో భాగంగా కమిటీ సభ్యులు అంగన్‌వాడీ, ఏఎన్ఎం, పీజీ ఎంఈకే, మహిళ ఎంఎస్‌కే, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, అధికారులకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. శిక్షణకు ఆయా శాఖల సిబ్బంది హాజరు కావాలని ఆమె కోరారు.

## ఇన్నర్‌వీల్ క్లబ్ అన్నదానం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మరిడమ్మ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తుల ఆకలి తీర్చేందుకు ఆదివారం స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్, చాచా విద్యానికేతన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పాలచర్ల సీతాదేవి, సానిపిన వెంకటేశ్వరరావు, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## అడ్డదిడ్డంగా ఆటోలు.. ట్రాఫిక్ ఇక్కట్లు

పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో ఆటోలను ఇష్టానుసారంగా నిలిపేస్తున్నారు. కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వెళ్లే ఆటోలు నిలిపేందుకు చోటు ఉండడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. ఆ సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకుండా ఉప్పాడ సెంటర్ నలువైపులా వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. దీనిపై సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో రోజూ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారని చెప్పారు. - **న్యూస్‌టుడే, పిఠాపురం**

## పొంచి ఉన్న ప్రమాదం

గొల్లప్రోలు ఎస్సీపేటలో విద్యుత్తులైను తీగలు కిందుగా వేలాడుతుండడంతో ప్రమాదకర పరిసితులు ఏర్పడ్డాయి. విద్యుత్తు తీగలు ఎత్తు చేసేందుకు సిమెంటు స్తంభాన్ని ఏర్పాటుచేసినా తీగలు పైకి బిగించకపోవడంతో కిందుగానే వేలాడుతున్నాయి. విద్యుత్తులైను తీగలు గృహాలకు తగిలేలా ఉండడంతో సమీప ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన స్తంభానికి తీగలు ఏర్పాటుచేసి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. విద్యుత్తులైను తీగలు స్తంభానికి బిగించి ఎత్తు చేసేందుకు చర్యలు చేపడతామని ఏఈ రామచంద్రరావు తెలిపారు. - **న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

## పేరుకున్న చెత్త.. దుర్వాసనతో అవస్థ

పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ఆదివారాల్లో ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు జరగడం లేదని స్థానిక భక్తుడు రమేష్ తెలిపారు. ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి ప్రభాకర్‌కు చెప్పగా, సోమవారం ఉదయం ఆ ప్రాంతంలో శుభ్రత పనులు చేపడతామన్నారు. - **న్యూస్‌టుడే, పిఠాపురం**

## సేవలు స్ఫూర్తిదాయకం

**రమణయ్యపేట (సర్పవరం జంక్షన్):** కాకినాడ నగరంలో పచ్చదనం పెంచేందుకు కార్పొరేషన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఇప్పటివరకు 20 వేల మొక్కలు నాటడం స్ఫూర్తిదాయకమని విశ్రాంత డీఎంఈ డాక్టర్ రాఘవేంద్రరావు తెలిపారు. కాకినాడ అర్బన్ 1వ డివిజన్ రమణయ్యపేట బోటుక్లబ్ ఉద్యానంలో వన్ స్టెప్ టువార్డ్స్ సొసైటీ సంస్థ అధ్యక్షుడు జోగా రామకృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని డా. రాఘవేంద్రరావు ఆదివారం ప్రారంభించారు. సొసైటీ ప్రతినిధులు సీతారామరాజు, ఆనంద్, వీరబ్రహ్మం, సుధాకర్, శేషగిరిరావు, చేయూత రవి, కామేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న విశ్రాంత డీఎంఈ రాఘవేంద్రరావు

## నామవానిపాలెం సర్పంచి చిట్టిరాజు మృతి

**కాజులూరు:** నామవానిపాలెం సర్పంచి భూపతిరాజు వెంకట సూర్యనారాయణరాజు (చిట్టిరాజు) (65) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత రెండు పర్యాయాలు సర్పంచిగా ఎన్నికయ్యారు. ఆయన మృతదేహానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నివాళి అర్పించారు.

మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి సుభాష్

### పెద్దాపురప్పాడు ఉప సర్పంచి..

**కరప:** పెద్దాపురప్పాడు ఉప సర్పంచి బిరుదా శ్రీనివాసఅప్పారావు అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందానేజ ఆయన భార్య సరస్వతి ప్రస్తుతం గ్రామ సర్పంచిగా ఉన్నారు. గతంలో నీటి సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. రెండేళ్ల క్రితం ఆయనకు భార్య సరస్వతి ఒక కిడ్నీ ఇచ్చారు. మాజీ సర్పంచి గొల్లపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొండా చంటిబాబు తదితరులు సంతాపం తెలిపారు.

### సామర్లకోట వార్డు కౌన్సిలర్ కృష్ణ..

**సామర్లకోట:** పట్టణ 22వ వార్డు కౌన్సిలర్ పితాని కృష్ణ (55) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందారు. 2019లో జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో వైకాపా కౌన్సిలర్‌గా నెగ్గి ఇటీవల తెదేపాలో చేరారు. ఈయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్ శ్రీవిద్య, కౌన్సిల్ సభ్యులు సంతాపం వెలిబుచ్చారు.

## కూటమి పాలనలో ప్రజల్లో సంతోషం

కొత్తపల్లి, సామర్లకోట, **సర్పవరం జంక్షన్, పెదపూడి, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోటలోని 12, 13, 14, 18 వార్డుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం పట్టణ పార్టీ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కొత్తపల్లి మండలం కొమరగిరిలో మాజీ ఎమ్మెల్యే వర్మ, కాకినాడ గ్రామీణం పండూరులో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, సూర్యారావుపేటలో నియోజకవర్గ కోకోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ , పెదపూడి మండలం రామేశ్వరంలో ఇంటింటా తిరిగి ప్రజలకు కరపత్రాలు అందించారు.

కొమరగిరిలో ప్రజలతో మాజీ ఎమ్మెల్యే వర్మ

జైభీమ్‌పేటలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బుచ్చిబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

## తల్లికి వందనంతో ప్రతి విద్యార్థికీ లబ్ధి

**తాళ్లరేవు:** తల్లికి వందనంలో ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూర్చామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. పోలేకుర్రు పంచాయతీ జైబీమ్‌పేటలో తల్లికి వందనం అభినందన సభ జక్కల ప్రసాదబాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బుచ్చిబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సుంకటరేవు బీసీ కాలనీ, జైభీమ్‌పేటలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

## రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

**పిఠాపురం:** రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్ వద్ద సర్కిల్ పరిధిలోని 25 మంది రౌడీషీటర్లు, 25 మంది సస్పెక్ట్ షీటర్లకు తీసుకొచ్చి అవగాహన కల్పించారు. గొడవలు, కొట్లాటలకు దూరంగా ఉండాలన్నారు. బాధ్యతగా నడుచుకోవాలని సూచించారు. ఎస్సైలు మణికుమార్, జానీ బాషా, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

**తాళ్లరేవు:** చొల్లంగిలో మోహార్ బాబా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నగేష్ ఆధ్వర్యంలో గోపీనాథ్, తిరువూరు వీరేష్‌ప్రసాద్ ప్రోత్సాహంతో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామ పరిధిలో భవిష్యత్తు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం

**సర్పవరం జంక్షన్:** కాకినాడ అర్బన్ బోటు క్లబ్ ఉద్యానంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు జరిపారు. డా. సతీష్‌కుమార్, అడబాల రత్నప్రసాదరావు, దాసరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహం గుర్తింపు

**బిక్కవోలు:** బలభద్రపురం బస్టాండు వద్ద మృతి చెందిన వ్యక్తిని యు.కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి గ్రామానికి చెందిన గంపల రాముడు (79)గా గుర్తించినట్లు ఎస్సై రవిచంద్ర కుమార్ తెలిపారు. అనపర్తి మండలంలోని పులగుర్తలో కొవ్వూరి సూరారెడ్డి ఇటుక బట్టీలో రాముడు పనిచేస్తున్నారు. ఆదివారం సైకిలుపై ఇసుకపల్లి వెళ్తుండగా బలభద్రపురం వచ్చేసరికి మృతి చెందారు. అతని కుమారుడు గంపల నానాజీ సామాజిక మాధ్యమాల్లో తండ్రి ఫొటో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# ప్లాస్టిక్... పర్యావరణానికి హానికరం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పర్యావరణంతోపాటు మానవాళికి ప్లాస్టిక్ తీవ్ర విఘాతం కలిగిస్తోంది. కాలువలు, చెరువులు, నదులు, సముద్ర జలాలు దీంతో కలుషితం అవుతున్నాయి. అధికారులు ఏదో తూతూమంత్రంగా దాడులు చేసినా ప్రయోజనం శూన్యం. కాకినాడ జిల్లాలోని పురపాలక సంఘాల్లో పరిశీలిస్తే పెద్దాపురంలో 28, తునిలో 56, పిఠాపురంలో 28, సామర్లకోటలో 28 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ ప్రతి రోజూ జరుగుతుంది. వీటిలో 7 నుంచి 10 శాతం మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్'పై చేసిన సామాజిక సర్వేలో తేలింది.

పెద్దాపురం పట్టణ ప్రధాన కాలువ దుస్థితి

### పరిశోధనలు చేస్తున్నారు..

ప్రపంచ పర్యావరణానికి ప్రధాన సవాల్‌గా మారిన ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేసేందుకు జపాన్ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఆర్ ఐకేఈఎస్ సెంటర్ ఫర్ ఎమర్జెంట్ మ్యాటర్ సైన్స్ (టోక్యో) విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు ఈ పర్యావరణ హిత ప్లాస్టిక్ తయారు చేయడానికి పరిశోధనలు నిర్వహిస్తున్నారు. సాధారణ ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి వందల సంవత్సరాలు పడితే.. కొత్తగా తయారు చేసే ప్లాస్టిక్ ఉప్పు నేలలో పాతిపెడితే 200 గంటల్లో భూమిలో కలిసిపోతోందని పరిశోధనల్లో పాల్గొన్న బృందం చెబుతోంది. ఆ వస్తువులను నీటిలో ఉన్న బ్యాక్టీరియా ప్రాసెస్ చేస్తుందన్నారు.

- ఆర్. ప్రభాకరరావు, విశ్రాంత జువాలజీ అధ్యాపకులు, పెద్దాపురం

### అవగాహన కల్పిస్తున్నాం..

ప్లాస్టిక్ వినియోగించవద్దంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దాడులు జరిపి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్నాం. ప్రజల్లో కూడా మార్పు రావాలి. బజార్లకు వెళ్లేటప్పుడు విధిగా వస్త్ర సంచులు తీసుకువెళ్లాలి.

- శ్రీకాంత్‌రెడ్డి, శ్రీవిద్య, కమిషనర్లు, పెద్దాపురం, సామర్లకోట

అమృతమూర్తికి అశ్రునివాళి

జననం 11-07-1942
శ్రీ కోడిదాసు వీర రాఘవులు గారు,
D.C.T.O., (Retd.), కాకినాడ
మరణం 03-07-2025

ప్రేమ, ఆప్యాయతలకు మారుపేరుగా, మా అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించిన శ్రీ కోడిదాసు వీర రాఘవులు గారి మరణానికి చింతిస్తూ, వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ....
మనుమరాలు: Dr. ఇందన హైమశ్రీ, MBBS., Civil Assistant Surgeon
అక్క: శ్రీమతి ఇందన రమామణి
బావ: శ్రీ ఇందన కొండలరావు, D.E.E., (Retd.)
కుమార్తె: ఇందన పద్మావతి
అల్లుడు: ఇందన అశోక్ బాబు

(c) eenadu

# తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

వెంకన్న అభిషేకానికి సిద్ధం చేసిన 108 కలశాలు

## వెంకన్నకు పంచామృతాభిషేకాలు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.అన్నవరం గ్రామంలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రం దృష్ట్యా ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు పంచామృతాలతో కూడిన 108 కళశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అభిషేకాలు చేశారు.

## ఐటీఐల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

తుని, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడత చేరికల కోసం గడువు పెంచామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 21 న ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలన్నారు. కౌన్సిలింగ్ వివరాలకు 70137 37243 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

## మరిడమ్మతల్లి పండుగ

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడిలో ఆదివారం మరిడమ్మతల్లి పండుగను గ్రామస్థులు నిర్వహించారు. గ్రామశివారున మరిడమ్మ విగ్రహానికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబసభ్యులు బంధుమిత్రులతో కలిసి విందు భోజనం స్వీకరించారు.

## ఏలేరు ప్రాజెక్టు నిర్వహణపై నిర్లక్ష్యం..!

● నియంత్రికకు మరమ్మతులు చేయించడంలో మీనమేషాలు

ఏలేరు నుంచి వెళుతున్న జలాలు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మెట్ట బాంధవి ఏలేరు ఇటు 53 వేల ఎకరాలకు సాగునీరు.. మరోవైపు విశాఖ పారిశ్రామిక, తాగునీటి అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర వహిస్తుంది. కానీ ప్రాజెక్టు నిర్వహణను అధికారులు గాలికి వదిలేస్తున్నారు. రిజర్వాయర్‌లో ప్రతి విభాగానికి విద్యుత్తు సరఫరా చేసే నియంత్రిక మరమ్మతులకు గురై మూడు రోజులైంది. వెంటనే దాన్ని పట్టించుకోకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారు. దీంతో కార్యాలయం, పరిసరాలు అంధకారంలో ఉంటున్నాయి. వర్షాకాలంలో అత్యవసరమైన వరద గేట్ల నిర్వహణకు విద్యుత్తు అత్యవసరం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సౌకర్యం పునరుద్ధరణపై జల వనరుల శాఖ నిర్లక్ష్యంతోనే వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి.

**గేట్లు పనిచేసేదెలా..:**

మన్యం నుంచి ఏటా సీజన్‌లో భారీగా వరద నీరు వస్తుంది. ఇలా వచ్చిన సమయాల్లో వరద నీటిని దిగువకు తరలించేందుకు పది క్రస్ట్ గేట్లు ఏర్పాటు చేశారు. ఊహించని రీతిలో వరద వస్తే ఆగేట్లు ఎత్తి అదనపు జలాలను దిగువకి తరలిస్తారు. ఈ గేట్లు బాగా పనిచేయాలంటే విద్యుత్తు సరఫరా ఉండాల్సిందే. అసలే వర్షాకాలం.. నియంత్రికను వెంటనే పునరుద్ధరణ చేయడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం. ముప్పు ఏర్పడక ముందే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరిస్తే మంచిది.

**ఇబ్బంది లేదు**

విద్యుత్తు నియంత్రిక మరమ్మతులు జరుగుతున్నాయి. సక్రమంగా పనిచేసే జనరేటర్ అందుబాటులో ఉంది. ఏలేరు పూర్తి సామర్థ్యం 24.11 టీఎంసీలు, ప్రస్తుతం 10.75 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఇది వరదలు వచ్చే సమయం కాదు, వచ్చినా ముందస్తు జాగ్రత్తలు జలవనరుల శాఖ తీసుకుంటుంది.

- శేషగిరి, ఏలేరు అధికారి, ఏలేశ్వరం

## బంటాలా.. గండాలా?

మెట్ట చెరువుల్లో పనుల తీరు

న్యూస్‌టుడే– ప్రత్తిపాడు, శంఖవరం

చెరువుల పూడికతీత లాంఛనంగా జరుగుతోంది. లోతు పెంచడం తప్ప.. నీరు వచ్చిపోయే ఏర్పాట్లు సవ్యంగా లేవు. కూలీలకు కొలతలిచ్చి బంటాలుగా చెరువులో తవ్వించి ఊరుకుంటున్నారు. వర్షానికి నీరు చేరితే లోతు తెలియని పరిస్థితి ఉంటోంది. తీసిన బంటాలకు కొలతలు తీయడం తప్ప ప్రమాణాలేవీ పాటించలేదు. తాగునీటి కోసం పశువులు దిగినా వెలపలకు రాలేని తీరుగా చెరువులు మారుతున్నాయి. ప్రత్తిపాడు, జగపతినగరం, మెరకచామవరం.. ఇలా పలుచోట్ల నీటి వనరులు జలగండాలుగా మారుతున్నాయి. మెట్టలోని మండలాల్లో 30కిపైగా చెరువుల్లో పనులు జరిగాయి.

**ఇలా చేయాలి..**

చెరువు పూడిక తీస్తే గట్టు పటిష్ఠం చేయాలి. ఆక్రమణల బారిన పడకుండా బాగుచేయాలి. తూము ల్లోంచి నీరు వెళ్లేలా వాలు చూపాలి. పశువులు దిగే చోట చప్టాలు ఉండాలి. అక్కడ ప్రమాదకరమైన లోతు ఉండకుండా పూడిక తీయాలి. శాస్త్రీయంగా చెరువు అభివృద్ధి జరిగేలా పర్యవేక్షణ ఉండాలి.

మెరచామవరంలోని గుర్రప్ప చెరువులో బంటాలు

**తటాకం మట్టితో దండిగా వ్యాపారం**

మెట్టలో గత వేసవిలో ప్రతి మండలంలోనూ పూడికతీత పనులు జరిగాయి. లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించిన కాసారాలు ఉన్నాయి. జగపతినగరం పరిధిలోని ఓ చెరువు నుంచి టిప్పర్లు వరుస కట్టి మట్టిని పట్టుకెళ్లాయి. పూడిక తీతకు అనుమతులు ఇచ్చి ఊరుకున్న యంత్రాంగం ఎంత తవ్వారు..? ఎంత తరలించారనే విషయాలు ఆరా తీయలేదు. దాదాపు ప్రతి నీటి వనరునూ వ్యాపార కోణంలోనే పూడిక తీశారు. రియల్ ఎస్టేటు భూముల చదునుకే ప్రాధాన్యమిచ్చారు. ఎర్రవరం నుంచి కాకినాడ వరకూ పలుచోట్ల భూములను ఎత్తు చేసిన మట్టి చెరువులదే. నీరు నిల్వ ఉండేలా చేశామని చెప్పడం తప్ప ప్రమాదకర పరిస్థితులను గమనించలేదు. శంఖవరం మండలం మెరక చామవరంలోని గుర్రప్ప చెరువులో బంటాలు ప్రమాదకరంగా మిగిలాయి. సాగు వనరులను రైతుల అవసరాలకు అనుగుణంగానే అభివృద్ధి చేశామని, ఎక్కడా ప్రమాదకర పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకుంటామని డ్వామా, జలవనరులు, పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు.

## గంగాలమ్మకు పూజలు

తొండంగి, న్యూస్‌టుడే: ఏవీనగరం గ్రామ దేవత గంగాలమ్మ తల్లి అమ్మవారికి ఆదివారం ఏటా నిర్వహించే పసర పండుగ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి అభిషేకాలు చేయడంతో పాటు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సూరిబాబు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది.

## అమ్మ దర్శనానికి భక్తుల తాకిడి

మూడు కి.మీ. మేర నిలిచిన ట్రాఫిక్

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ అమ్మవారి ఆషాఢమాస ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం అమ్మవారి దర్శనార్థం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దేవస్థానంలోని క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. మరో పక్క అమ్మవారి ఆలయం నుంచి లోవకొత్తూరు వరకు సుమారు మూడు కి.మీ. వరకు ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భక్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకునేందుకు సుమారు మూడు గంటల సమయం పట్టింది.

లోవకొత్తూరు సమీపంలో నిలిచిన వాహనాలు

## కూటమి పాలనలో ప్రతి కుటుంబానికి మేలు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చేలా పథకాలు అందించామని తితిదే పాలకవర్గ సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మల్లిసాల ఎస్సీకాలనీలో ఆదివారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రోడ్ల మరమ్మతులు చేపట్టి ఏడాదిలోనే అన్ని సౌకర్యాలు కల్పించుకున్నామన్నారు. మహిళలతో మాట్లాడుతూ.. పథకాల అమలులో ఏమైనా ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. నాయకులు మారిశెట్టి భద్రం, అప్పలరాజు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, ముత్తా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లిసాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

## తెదేపాతోనే అభివృద్ధి, సంక్షేమం: ఎమ్మెల్యే

రౌతులపూడి, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం తెదేపాతోనే సాధ్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. చాకిరేవుపాలెంలో ఆమె పర్యటిస్తూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి, జల జీవన్ మిషన్ (జేజేఎం) నిధులు రూ.13 లక్షలతో ఏర్పాటుచేసిన ఇంటింటికి కొళాయి కనెక్షన్లను ప్రారంభించారు. అనంతరం తెదేపా శ్రేణులతో కలిసి గ్రామంలో 'సుపరిపాలన- తొలి అడుగు'లో భాగంగా కరపత్రాలను గ్రామస్థులకు అందజేశారు. నాయకులు సోమరౌతు చంద్రమౌళి, గంటిమళ్ల లోవరాజు, గంటిమళ్ల రాజ్యలక్ష్మి, తమరాల సత్యనారాయణ, ఇటంశెట్టి భాస్కరబాబు, పైడి పైడిరాజు, బద్ది రామారావు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే సత్యప్రభ తదితరులు

## పెద్దాపురం వీధుల్లో జాతర రద్దీ

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మరిడమ్మ జాతర మహోత్సవాల్లో మూడో ఆదివారం అమ్మవారి దర్శనానికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాతబస్టాండ్ వరకూ భక్తులు ఎండుటెండలో బారులుదీరారు. పట్టణంలోని కుమ్మరవీధి, మరిడమ్మగుడి ప్రాంతం, పాతబస్టాండ్, పాశీలవారి వీధి, దర్గాసెంటర్, రాజుగారి వీధి, నాగేశ్వరరావు వీధి, మెయిన్ రోడ్డు, సారావారి వీధులు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారికి రవికలు, చీరలు, పండ్లు సమర్పించారు. పట్టణానికి చెందిన వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదానం ఏర్పాటు చేశాయి. పోలీసులు దర్గా సెంటర్ నుంచి సామర్లకోట ఏడీబీ రహదారి మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించి క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు.

## నేడు పాడాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పిఠాపురం: పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని పాడా పీడీ చైత్ర వర్షిణి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించి నిర్ణీత గడువుల్లోగా పరిష్కారం చూపుతారని, మళ్లీ ఇవ్వనవసరం లేదన్నారు. డివిజనల్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు అంతా హాజరుకావాలని కోరారు.

## త్రిసభ్య కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరణ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కిర్లంపూడి పీఏసీఎస్‌కి కొత్తగా ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు ఆదివారం సొసైటీలో బాధ్యతలు స్వీకరించారు. ఛైర్మన్‌గా కుర్ల వెంకటరమణమూర్తి(చిన్నబాబు), సభ్యులుగా గండే రాయుడు, పాటంశెట్టి వెంకటలక్ష్మీ సొసైటీ సీఈవో వెంకటరమణ వారితో పాలకవర్గ సభ్యులుగా రిజిస్టర్‌లో సంతకాలు చేయించారు. అనంతరం సొసైటీ అభివృద్ధికి కృషిచేస్తామని ప్రమాణం చేశారు. నాయకులు చదరం చంటిబాబు, తూము కుమార్, గుడాల రాంబాబు, కాళ్ల వెంకటేష్, పాటంశెట్టి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఛైర్మన్ చిన్నబాబు, ఇతర సభ్యులు

## లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రజల అవసరాలను అనుగుణంగా సేవా కార్యక్రమాలను చేపడతామని ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు ఏడిద రెడ్డినాయుడు అన్నారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఘనంగా జరిగింది. అధ్యక్షుడుగా రెడ్డినాయుడు, కార్యదర్శిగా గోళ్ల నాగేశ్వరరావు, కోశాధికారిగా గుడాల రాజబాబు, ఉపాధ్యక్షులుగా ఇంధన ఏసుబాబు, సోమకిరణ్ తదితరులు నియమితులయ్యారు. లయన్స్ పూర్వపు గవర్నర్లు డి.రాఘవేంద్రరావు, బీవీఎన్ రెడ్డి తదితరులు నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు.

లయన్స్ అధ్యక్షుడు ఏడిద రెడ్డినాయుడును సత్కరిస్తున్న పూర్వపు అధ్యక్షుడు మోహన్

## పూడికతో పంట కాలువ

పంపా ఆయకట్టుకు నీరు అందించే ప్రధాన డీ6 పంట కాలువను ఆనుకుని ఉన్న మరో పంట కాలువ శృంగవృక్షం నుంచి తొండంగి మీదుగా ఒంటిమామిడి వెళ్తుంది. ఈ కాలువ సుమారు ఆయిదు కి.మీ. ఉంటుంది. ఈ కాలువ పూర్తిగా పూడికతో నిండి ఉంది. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి ఈ కాలువ పూడిక తీయించి అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, తొండంగి

## వసతిగృహ విద్యార్థుల అవస్థలు

జగ్గంపేట గ్రామీణ మండలంలోని రాజపూడి బాలుర వసతిగృహంలో మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 150 మంది విద్యార్థులు ఉన్న ఈ వసతిగృహంలో ఎనిమిది మరుగుదొడ్లు ఉన్నాయి. అన్నిగదులకు తలుపులు లేకపోవడంతో

వార్డెన్ కృష్ణ సొంత నిధులు వెచ్చించి గతేడాది ఆరు గదులకు తలుపులు ఏర్పాటు చేశారు. మరో రెండింటికి డోర్లు లేవు. మరుగుదొడ్లు చాలకపోవడంతో కొందరు విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

## పట్టపగలే చెత్తకు నిప్పు..!

నీలాద్రిరావుపేట గ్రామంలోని చెత్తను తెచ్చి శివారు ప్రాంతాల్లో పోసి పట్టపగలే నిప్పు పెడుతున్నారు. దీంతో అటుగా వెళ్లే జడ్.రాగంపేట, నీలాద్రిరావుపేట, నాయకంపల్లి గ్రామస్థులకు, వాహనచోదకులకు ఇబ్బందిగా ఉంటోంది. రాత్రి సమయాల్లో నిప్పు పెడితే ఇబ్బందులు ఉండవని వాహనచోదకులు, బాటసారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గండేపల్లి

## ఏడాది దాటినా అలాగేనా..!

తొండంగి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా తొండంగి మండల (డ్వాక్రా సంఘాల) వెలుగు కార్యాలయ అధికారులు వైకాపాపై అభిమానం తగ్గలేదు. తొండంగిలో ఎంపీడీవో, ఎంఈవో, తహసీల్దారు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, గృహ నిర్మాణ శాఖ, వెలుగు కార్యాలయాలన్నీ ఒకేచోట ఉంటాయి. ఈ కార్యాలయాలకు మార్గం చూపుతూ ఏర్పాటు చేసిన బోర్డుపై వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం అని ఇప్పటికీ అలాగే ఉంది. వెలుగు కార్యాలయం అని ఉండాల్సిన చోట వైఎస్సార్ క్రాంతి పథం అని ఉంది. ఈ బోర్డు మండలంలోని అన్ని శాఖల అధికారులు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు మార్గంలో ఉండడం గమనార్హం.

## ట్రాఫిక్ నియమాలు పాటించాలి

తుని పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని పట్టణ సీఐ ఎం.గీతారామకృష్ణ, ఎస్సై జె.విజయబాబు సూచించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆటోవాలాలు ఓవర్ లోడింగ్ చేయవద్దని, ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. పలువురు వాహనదార్లకు కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు అపరాధ రుసుము విధించారు.

ఆటోచోదకులతో మాట్లాడుతున్న సీఐ

## రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా

గండేపల్లి,న్యూస్‌టుడే: గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన ప్రకారం విద్యుత్తు స్తంభాలకు గోతులు తీసేందుకు యాంత్రిక ట్రాక్టర్ ఉప్పలపాడుకి వెళ్లేందుకు తాళ్లూరు దాబాల వద్ద రోడ్డు దాటుతుండగా వెనుకనుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఆగి ఉన్న ఆటోని ఢీకొన్న లారీ

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడిలో ఆగి ఉన్న ఆటోను ఆదివారం తెల్లవారుజామున లారీ ఢీకొట్టింది. సినిమా హాలు సెంటరులో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోను లారీ ఢీకొట్టి వెళ్లింది. స్థానికులు లారీని వెంబడించి ఆపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. భారీ వాహనాలతో తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు తెలుపుతున్నారు.

## తల్లి చెంతకు తప్పిపోయిన వివాహిత..

గండేపల్లి,న్యూస్‌టుడే: గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన ప్రకారం తన భర్త దగ్గరకి వెళ్లడానికి ఇష్టం లేక ఎవరికీ తెలియకుండా అదృశ్యమైందన్నారు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు, తన సిబ్బందితో గాలించగా నెల్లూరు పట్టణంలో పట్టుకుని ఆమె తల్లికి అప్పగించినట్లు తెలిపారు.

## నిర్వహణ కొరవడిన ఆర్టీసీ కాంప్లెక్స్

తుని పట్టణం, న్యూస్‌టుడే : నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే తుని ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్వహణపై అధికారులు కనీస శ్రద్ధ చూపడం లేదు. మరుగుదొడ్లు, మూత్ర విసర్జన శాలలు దుస్థితిలో ఉన్నాయి. శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నా పట్టింపు లేదు. మరుగుదొడ్లలో నీటి కుళాయిలు లేవు. డబ్బాలతో నీటిని తీసుకువెళ్లాల్సిన పరిస్థితి. మూత్రవిసర్జన సింక్‌లకు నీటి సరఫరా లేదు. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిపో ఆవరణ కూడా పరిశుభ్రంగా లేదు. తుప్పలు, చెత్తతో అధ్వానంగా ఉంది.

మరుగుదొడ్లు ఇలా..

## కల్యాణమండపం అందుబాటులోకి తేవాలి

శంఖవరం, న్యూస్‌టుడే: మండల కేంద్రం శంఖవరంలోని సత్యదేవ కల్యాణ మండపాన్ని నెలరోజుల్లోగా అందుబాటులోకి తీసుకురావాలని అన్నవరం దేవస్థానం ఈఈ నూకరత్నం అన్నారు. చిన్న చిన్న మరమ్మతుల నేపథ్యంలో వాడకంలో లేని మండపాన్ని ఆదివారం దేవస్థానం అధికారులు, స్థానిక తెదేపా నేత పర్వత సురేష్ పరిశీలించారు. పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

## 400 మందికి వైద్య సేవలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మవరం గ్రామంలో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. పిఠాపురం కార్తికేయ ఆసుపత్రి వైద్యుడు మొగిలి కాశీ విశ్వనాథం తదితర వైద్యులు 400 మందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.. శ్రీమ్అపర్ణా సేవాట్రస్ట్ వ్యవస్థాపకులు ఆకొండి వెంకటేశ్వర శర్మ(బాబి) మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అనే సంకల్పంతో ఏటా ట్రస్ట్ ద్వారా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో సర్పంచి బెంతుకుర్తి సుశీల, ఎంపీటీసీ సభ్యుడు నానిపల్లి చంటి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణంరాజు

## తండాల వెతలు తీరుతున్నాయ్..!

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఎత్తైన కొండపై ఉన్న బురదకోట గిరిజన తండాల వెతలు తీరేలా అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. 2003లో తెదేపా హయాంలో బురదకోటకు ఘాట్ రోడ్డు వేయగా.. క్రమేపీ అభివృద్ధి వైపు అడుగులు వేసింది. కూటమి ప్రభుత్వంలో మళ్లీ ఆ గూడేలపై ప్రగతిపై దృష్టి మళ్లింది. ఉపప్రణాళిక మన్యంలోని దారుల బాగుజేతపై ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అసెంబ్లీలోనూ ప్రస్తావించారు. బాపన్నధార, కొండపల్లి, కె.మిర్తివాడ, బురదకోటలోని 600 మంది గిరిజనులు బాహ్యప్రపంచంలోకి రావడానికి కిత్తమూరిపేట నుంచి కొండపై ఉన్న బురదకోట వరకూ ఉన్న 12 కి.మీ. రోడ్డు బాగుండాలి. ఈ రోడ్డు నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత డిసెంబరులో జేసీ రాహుల్‌మీనా, తహసీల్దారు సూర్యప్రభలు గూడేలను సందర్శించేందుకు వెళ్లినప్పుడు జనం చెప్పిన సమస్యల్లో ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయి. వందేళ్లుగా సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు ఇవ్వాలని కోరడంతో ఈ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. గత ప్రభుత్వం వాహనాలతో ఇంటింటికీ రేషన్ సరఫరా చేసినా బురదకోట జనం మాత్రం కొండ దిగి సరకులు తీసుకొనేవారు. గ్రామంలోనే రేషన్ దుకాణం అందుబాటులోకి రావడంతో ప్రయాస తప్పింది. గ్రామంలో సమాచార వ్యవస్థ లేక ప్రపంచానికి దూరంగా ఉన్నామని చెప్పడంతో సెల్ టవర్‌కు స్థలం కేటాయించామని కొండపై జనం కోరారు. దీంతో 9 సెంట్ల స్థలాన్ని టవరు ఏర్పాటుకు కేటాయించామని తహసీల్దారు సూర్యప్రభ తెలిపారు. ఆరోగ్య ఉపకేంద్రంలో క్రమం తప్పకుండా ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చేశారు. బురదకోట 'స్వచ్ఛ' పంచాయతీగా గతంలోనే పేరు తెచ్చుకుంది. ఈ పంచాయతీలోని పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలను తరచూ సమీక్షిస్తామని ఎంపీడీవో కుమార్‌బాబు తెలిపారు.

సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ సూర్యప్రభ

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

**తాగునీరు అందించరూ..!**

**సమస్య:** గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. కొళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించాలి.

**- రామలక్ష్మి, స్థానికురాలు.**

**సమాధానం:** పైపులైను పనులు జరగాల్సి ఉంది. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

– వీరబాబు, పంచాయతీ కార్యదర్శి, జి.కొత్తపల్లి.

– న్యూస్‌టుడే, శంఖవరం.

## ప్రకటన

మా క్లయింట్లు అయిన కాకినాడ జిల్లా, ఏలేశ్వరం మండలం, లింగంపర్తి గ్రామ కాపురస్తులు ఆకుల వెంకటస్వామి గార్ల కుమార్లు 1. **ఆకుల గంగరాజు** మరియు 2. **ఆకుల అర్జునరావు** గార్లు మాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై మా క్లయింట్లు మహారాజశ్రీ ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టునందు ATC No.1/2005కు గల (1) **ఉడతల అనంత వెంకట సత్యమోహన్**, (2) **ఉడతల వెంకట రమణమ్మ**లపై వారి యొక్క కౌలు హక్కులు నిర్ధారించుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాను శ్రీ కోర్టు వారు ది.16-04-2009న మా క్లయింట్ల యొక్క హక్కులను నిర్ధారించుచు మరియు Sec 15 AP Tenancy Actకు లోబడి షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఏమైనా క్రయములు జరిపినచో ముందుగా మా క్లయింట్లకు షెడ్యూల్ దాఖలా ఆస్తి కొనుగోలుకు ప్రాధాన్యత ఇవ్వవలెనని మా క్లయింట్లకు అనుకూలంగా తీర్పు ఇచ్చియున్నారు. కానీ పైన పేర్కొనిన (1) **ఉడతల అనంత వెంకట సత్యమోహన్**, (2) **ఉడతల వెంకట రమణమ్మ**లు శ్రీ కోర్టువారు ఇచ్చిన తీర్పును ధిక్కరించి షెడ్యూలు దాఖలా ఆస్తిని మా క్లయింట్లకు ప్రాధాన్యత కొనుగోలు హక్కు ఇవ్వకుండా వేరొకరికి అమ్మజూపే ప్రయత్నములు చేయుచున్నట్లు తెలియవచ్చినది. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరైనను ఎట్టి లావాదేవీలు జరిపినను అవి మా క్లయింట్ల యొక్క హక్కులకు భంగము కలుగచేయజాలవని మరియు శ్రీ కోర్టువారు ఇచ్చిన తీర్పును ధిక్కరించిన వారు అగుదురని ఇందుమూలముగా అట్టి క్రయ విక్రయములు చట్టరీత్యా చెల్లుబాటు కావని, కొనుగోలుదార్లు నష్టపోవుదరని మరియు మా క్లయింట్లు తీసుకొనబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని యావన్మంది లోకులకు తెలియజేయడమైనది.

**షెడ్యూలు:** పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు సబ్‌రిజిస్ట్రీ, ఏలేశ్వరం మండలం, లింగంపర్తి గ్రామం, సర్వే నెం.52/2A, జిరాయితీ మెరక భూమికి సంబంధించిన ఎ.03-25 సెంట్ల భూమికి హద్దులు, కొలతలు.

**తూర్పు:** పలివెల సుబ్బలక్ష్మి గారి భూమి; **పడమర:** ఉడతల అనంత వెంకట సత్యమోహన్ మరియు ఉడతల వెంకట రమణమ్మ గార్ల భూమి; **దక్షిణం:** ఆకుల బ్రదర్స్ మరియు దేవి చంద్రమ్మ గార్ల భూమి; **ఉత్తరం:** ఆకుల బ్రదర్స్ మరియు దంతులూరి వెంకట సత్యనారాయణ కృష్ణవర్మ గార్ల భూమి, యావత్తు ఈజిమెంట్ హక్కులతో సర్వం సహా..

**B.రాధాకృష్ణ, A.అనిల్ కుమార్‌రాజు,** అడ్వకేట్స్

డో.నెం.6-1-9, జవహర్ వీధి, కాకినాడ, కాకినాడ జిల్లా, సెల్: 9440323951

(c) eenadu

# అంకుర సంస్థలు బలోపేతం

**బెంగళూరు(అడుగోడి),న్యూస్‌టుడే:** దేశంలో అంకుర సంస్థలకు బెంగళూరు నగరం కేంద్ర స్థానంగా మారిందని, డిజిటల్ వ్యవస్థతో పాటు ప్రపంచ సామర్థ్య కేంద్రాలకు (జీసీసీ)లకు గమ్యస్థానంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి భాస్కర్ కటిమ్మెని తెలిపారు. ఆదివారం ఇక్కడి జీసీసీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకుర సంస్థలను బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. విజన్ భారత్ మిషన్ ఆవరణలోకి తెచ్చేందుకు 1,700 జీసీసీలు కింద పరిశ్రమలు ఏర్పడుతున్నాయని, తద్వారా దేశవ్యాప్తంగా 1.9 మిలియన్ల మందికి ఉపాధి దొరికే అవకాశాలు ఉన్నట్లు తెలియజేశారు. అంకుర సంస్థలు కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగించుకుని మరింత అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో కేఎస్ఐడీసీ ఎండీ రామన్‌రెడ్డి, అనుజ్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

చిరుపుస్తకాన్ని విడుదల చేస్తున్న భాస్కర్ కటిమ్మెని, రామన్‌రెడ్డి, అనుజ్‌అగర్వాల్, తదితరులు

# ఔషధాలపై నిషేధం

**బెంగళూరు (మారతహళ్ళి), న్యూస్‌టుడే:** నిబంధనలు ఉల్లంఘించి, నాణ్యతా ప్రమాణాలు పాటించని 133 ఔషధ విక్రయాలకు ఇచ్చిన అనుమతులను ఆరోగ్య శాఖ రద్దు చేసింది. మరో 20 ఔషధాలపై నిషేధాన్ని విధించింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,544 ఔషధ దుకాణాల్లో సోదాలు నిర్వహించిన ఆరోగ్య శాఖ, డ్రగ్ కంట్రోలర్ అధికారులు బెంగళూరు, హుబ్బళ్లి, బళ్లారిలోని ఔషధ పరీక్ష ప్రయోగశాలల్లో ఔషధాలను పరీక్షించారు. జూన్‌లో 1,333 నమూనాలను పరీక్షించగా, 41 ఔషధాలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని గుర్తించారు. మార్కెట్ నుంచి రూ.40 లక్షల విలువైన ఔషధాలను వెనక్కు తెప్పించారు. రక్తదాన శిబిరాలు, బ్లడ్ బ్యాంకులు నిర్వహిస్తున్న 122 కేంద్రాల్లో 44 కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు.



## మంటలు రేపిన ప్రతాప్ సింహ వ్యాఖ్యలు

**మైసూరు, న్యూస్‌టుడే:** కర్ణాటకలో బంగ్లా వలసదారుల సంఖ్య నానాటికీ ఎక్కువ అవుతోందని మాజీ ఎంపీ ప్రతాప సింహ ఆరోపించారు. అలా వచ్చిన 22 ముస్లిం కుటుంబాలకు 91 మంది పిల్లలు ఉన్నారని, వారికి పిల్లలను పుట్టించడమే పనిగా ఉందని అనుచిత వ్యాఖ్యలు చేశారు. హిందువులు ఒక సంతానంతోనే సరిపెట్టుకుంటూ ఉంటే, వలస వచ్చిన వారు ఎక్కువ మందికి జన్మనిస్తున్నారని ఆరోపించారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం పొందినప్పుడు అక్కడ 24 శాతం ఉన్న హిందువుల సంఖ్య ఇప్పుడు 5 శాతానికి, పాక్‌లో 15 శాతం ఉన్న వారి సంఖ్య 2 శాతానికి చేరుకుందన్నారు. ఇక్కడ మాత్రం దానికి భిన్నంగా ఉందన్నారు. ప్రపంచంలోని 57 దేశాలు ఇలా వలస వచ్చిన ముస్లింలకు ఆశ్రయం ఇవ్వడం లేదని, భారత్ కూడా వలసవచ్చే ముస్లింలకు ఆశ్రయం ఇవ్వకూడదని డిమాండ్ చేశారు.

ప్రతాప్ సింహ

## ఎగుమతులను ఎందుకు అడ్డుకోలేదు

**దావణగెరె, న్యూస్‌టుడే:** తాము గోవంశ రక్షకులం అని చెప్పుకుంటున్న హిందూ సంఘాలు, భాజపా నాయకులు గోమాంసం ఎగుమతులను ఎందుకు అడ్డుకోవడం లేదని కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ ప్రశ్నించారు. దేశంలోని 20 రాష్ట్రాల్లో భాజపా అధికారంలో ఉందని, అక్కడి నుంచే విదేశాలకు ఎక్కువగా గోమాంసం ఎగుమతి అవుతోందన్నారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్‌లో యోగి నేతృత్వంలో ప్రభుత్వం ఉన్నప్పటికీ, ఆ రాష్ట్రాల కన్నా అక్కడి నుంచే ఎగుమతులు అవుతున్నాయని చెప్పారు. వీధి జాగిలాలకు మాంసం పెట్టడంపై వివాదాన్ని చేస్తున్న భాజపా, గోమాంసం ఎగుమతులపై మాట్లాడాలని సవాలు విసిరారు. ప్రపంచంలో గోమాంసం ఎగుమతుల్లో భారత్ రెండో స్థానంలో ఉందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం గత పదకొండేళ్లలో చేసిన సాధనలు ఏమీ లేవని, గ్యాస్, ఇంధనం, నిత్యావసర వస్తువుల ధరల పెంపు సామాన్యుడిపై అదనపు భారాన్ని మోపాయని తెలిపారు.

## స్వతంత్రంగా నిలిచి గెలుస్తా

**విజయపుర, న్యూస్‌టుడే:** భాజపా తనను శాశ్వతంగా బహిష్కరించినా స్వతంత్ర అభ్యర్థిగా అయినా పోటీ చేసి గెలుస్తానని ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ధీమా వ్యక్తం చేశారు. వాస్తవాలు ఆలకించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని పార్టీ నుంచి బహిష్కరించారన్నారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, భాజపాలో మంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నారని, కేవలం కొందరితోనే పార్టీకి ఈ దుస్థితి వచ్చిందన్నారు. విజయపుర పాలికెలోని భాజపా సభ్యులు అందరికీ తాను సహకారాన్ని అందిస్తానని తెలిపారు.

బసనగౌడ పాటిల్ యత్నాళ్

# ఆసనం.. అందరి అస్త్రం

- కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం
- దసరా నాటికి తేలేనా?

**బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి పీఠానికి సంబంధించి అధికార పార్టీల్లో నేతల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. ముందుగా చేసుకున్న మౌఖిక ఒప్పందానికి అనుగుణంగా ఈ ఏడాది దసరా నాటికి తనకు ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని డీకే శివకుమార్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. తనకు ఇవే చివరి ఎన్నికలని, ఇకపై ఎన్నికల రాజకీయాల్లో తాను కొనసాగనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. శివునికి బాధ్యతలు అప్పగిస్తే ఆయనపై ఉన్న కేసులను భాజపా తిరగదోడితే ప్రభుత్వం పతనం అవుతుందని సీఎం వర్గానికి చెందిన నేతలు వాదిస్తున్నారు. అందుకే పూర్తి సమయం తనను కొనసాగించాలని సిద్ధు పట్టుబడుతున్నారు. పార్టీలో రెండో ఉప ముఖ్యమంత్రి లేకుండా, మంత్రిగా, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ బాధ్యతలూ అప్పగించి, ఆయనను గౌరవిస్తున్నామని కొందరు నేతలు పరోక్ష వ్యాఖ్యలు చేశారు. తానే ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్న నేతలు ఎక్కువ మంది ఉన్నారని పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సింగ్ సుర్జేవాలా, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ వద్ద సీఎం తన వాదనను వినిపించినట్లు సమాచారం.

ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో....

ప్రజల్లో తన ఆదరణ, నేతలపై తన పట్టు ఇంకా తగ్గలేదని నిరూపించుకునే దిశలో మైసూరులో ఈ నెల 19న సాధన సమావేశాలను నిర్వహించేందుకు మంత్రి మహదేవప్ప చర్యలు చేపట్టారు. మైసూరు, చామరాజనగర, కొడగు, హాసన, మండ్య, కోలారు, బెంగళూరు, చిత్రదుర్గ, దావణగెరె జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తరలించేందుకు, జనసమీకరణకు నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. సమావేశాల్లోనే రూ.2,600 కోట్ల విలువైన పనులకు భూమి పూజ చేస్తామని మహదేవప్ప తెలిపారు.

### పీసీసీ బాధ్యతల్ని తప్పిస్తారా?

శివకుమార్‌ను కట్టడి చేసేందుకు కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ సమితి అధ్యక్షుడి బాధ్యతల నుంచి తప్పించేందుకు మరోవైపు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సమితి అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే తాము ఆ బాధ్యతలను నిర్వహిస్తామని మంత్రులు సతీశ్ జార్ఖిహొళి, రాజణ్ణ ఇప్పటికే స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణ ఉంటుందని భావిస్తూ వచ్చిన నేతలకు ఇప్పట్లో ఉండదని అగ్రనేతలు చెప్పడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. నవంబరు వరకు మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉండవని ప్రభుత్వ చీఫ్ విప్ సలీం అహ్మద్ స్పష్టం చేశారు. పార్టీలో నేతల మధ్య ఎలాంటి వివాదాలు లేవన్నారు. ముఖ్యమంత్రి స్థానాన్ని కాపాడుకునేందుకు సీఎం, డీసీఎం పలువురు నేతలను తమ వైపు తిప్పుకునేందుకు తాయిలాలు, నియోజకవర్గాలకు నిధుల కేటాయింపు చేస్తున్నారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చేసిన వ్యాఖ్య సంచలనానికి కారణమైంది.

### శివుడి మౌనం ఏం చేస్తుందో

తానే ముఖ్యమంత్రిగా ఐదేళ్లు ఉంటానని సిద్ధరామయ్య ప్రకటించిన అనంతరం డీకే శివకుమార్ విలేకరుల వద్ద మౌనాన్ని ఆశ్రయించారు. ఆలయాలను చుట్టి రావడం, పూజలు చేసుకోవడానికి, రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని ట్వీట్ చేశారు. ఇటీవల దిల్లీకి వెళితే రాహుల్ గాంధీని భేటీ కావడం సాధ్యం కాలేదని, మళ్లీ వెళుతున్నానంటూ జరుగుతున్న ప్రచారం వాస్తవానికి విరుద్ధమన్నారు. ఉప ముఖ్యమంత్రికి ముఖ్యమంత్రి అన్యాయం చేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, కేంద్ర మంత్రి కుమారస్వామితో పాటు పలువురు విపక్ష నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. పార్టీలో నేతల మధ్య చిచ్చుపెట్టి, తమ రాజకీయ ప్రయోజనాలను చూసుకునేందుకే వారు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ ఎంపీ డీకే సురేశ్ విమర్శించారు. దసరా నాటికి పీఠంపై మరొకరు సీఎంగా కూర్చుంటారా? లేదా సిద్ధరామయ్య పూర్తి కాలం పనిచేస్తారనేది రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఎవరేమనుకున్నా కన్నడనాట రాజకీయాలు మరోసారి సంచలనానికి కేంద్ర బిందువుగా మారాయి.

కుర్చీ కోసం ప్రయత్నిస్తే అది మరొకరి పాలవుతుందా?

ముఖ్యమంత్రి కావాలంటే చేతిలో రేఖలు ఉండాలా

ఇప్పుడు ఎవరూ మాట్లాడవద్దు

## యూట్యూబర్‌పై కేసు నమోదు

**మంగళూరు, న్యూస్‌టుడే:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థలలో గత రెండు దశాబ్దాల్లో పలు అసహజ మరణాలు సంభవించాయని జరుగుతున్న ప్రచారానికి సంబంధించి యూట్యూబర్ సమీర్ కృత్రిమ మేధస్సుతో కొన్ని వీడియోలు సృష్టించాడు. తప్పుడు ప్రచారాన్ని, ప్రజలను రెచ్చగొట్టేలా ఆయన వీడియోలు చేశారంటూ వచ్చిన ఫిర్యాదులతో ధర్మస్థల ఠాణాలో సమీర్‌పై కేసు నమోదు చేసుకున్నారు. ధర్మస్థలలో కొందరు పెద్దలు హత్యలు చేసి మృతదేహాలను పూడ్చేందుకు తనకు ఇచ్చేవారని ఒక వ్యక్తి ఇప్పటికే బెళ్తంగడి న్యాయస్థానంలో హాజరై వాంగ్మూలాన్ని ఇచ్చాడు. అతను గతంలో జిల్లాధికారికి రాసిన లేఖ, అందులోని సమాచారం ఆధారంగా సమీర్ యూట్యూబర్ వీడియోలను రూపొందించాడు.

## కీటక నాశినిని ప్రయోగించారు

**చామరాజనగర, న్యూస్‌టుడే:** మలె మహదేశ్వర బెట్ట సమీపంలో ఆడపులి, దాని నాలుగు పిల్లల హత్యకు సంబంధించి, వేర్వేరు ప్రయోగశాలల నుంచి నివేదిక అటవీశాఖ అధికారులకు అందింది. పులి, దాని పిల్లలు తిన్న మాంసం ముక్కలపై కార్బోఫురాన్ అనే కీటకనాశిని ఔషధాన్ని పోయడంతోనే అవి మరణించాయని నివేదికలో తేటతెల్లమైంది. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ముగ్గురు నిందితులను హనూరు ఠాణా పోలీసులు అరెస్టు చేయగా, ముగ్గురు అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

## లేఖ రాసిన ముఖ్యమంత్రి

**బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే:** సిగందూరు వంతెన ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య లేఖ రాశారు. చివరి క్షణంలో తనకు సమాచారం అందించడంతో తాను కార్యక్రమానికి హాజరుకాలేకపోతున్నానని చెప్పారు. కొత్తగా మరో తేదీని ప్రకటిస్తే తాను కూడా ప్రారంభోత్సవంలో పాల్గొంటానని గడ్కరీకి రాసిన బహిరంగలేఖలో పేర్కొన్నారు.

# నదిలో గల్లంతైన ముగ్గురూ మృతి

- గజ ఈతగాళ్లు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు
- మృతదేహాలు లభ్యం

సచిన్

ప్రమోద్

అజిత్

**హాసన, మంత్రాలయం, న్యూస్‌టుడే:** తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి గల్లంతైన ముగ్గురు కన్నడ యువకులు మృతదేహాలై తేలారు. ఎస్సై శివాంజల్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు నదిలో గాలించి ఆదివారం ఉదయం 11:30 గంటలకు మృతదేహాలను వెలికి తీశారు. కర్ణాటక రాష్ట్రం హాసన జిల్లా జావగల్లుకు చెందిన డిగ్రీ చదువుతున్న సచిన్ (20), ప్రమోద్ (20), సంగరాయపురానికి చెందిన డిగ్రీ విద్యార్థి అజిత్ (19) తమ స్నేహితులతో కలిసి శనివారం నదిలో స్నానాలు చేస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతైన విషయం తెలిసిందే. శనివారం రాత్రే నది వద్దకు చేరుకున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, ఆదివారం ఎస్సై ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు గ్రామ సర్పంచి తెల్లబండ్ల భీమయ్య సహకారంతో 10 మంది గజ ఈతగాళ్లు, 6 మంది బుడగజంగాల వారి సాయంతో తెప్పలతో నదిలో జల్లెడ పట్టారు. గల్లంతైన ప్రదేశంలో వెతకగా రెండు మృతదేహాలు పైకి తేలాయి. అక్కడి నుంచి 200 మీటర్ల దూరంలో మరో మృతదేహాన్ని కనుగొని తెప్పలపై ఒడ్డుకు చేర్చారు. అర్ధాంతరంగా ప్రాణాలొదిలిన తమ వారిని చూసి తల్లిదండ్రులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం శ్రీమఠం అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### సబ్ కలెక్టర్, డీఎస్పీ పరామర్శ

ఎమ్మిగనూరు వైద్యశాలలో మృతుల కుటుంబ సభ్యులను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు పరామర్శించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాలను ప్రత్యేక వాహనంలో వారి స్వస్థలాలకు పంపించినట్లు సబ్ కలెక్టర్ మౌర్య, ఎస్సై శివాంజల్ తెలిపారు. ఆదివారం ఉదయం తహసీల్దార్ రమాదేవితో కలిసి సబ్ కలెక్టర్, డీఎస్పీ వేర్వేరు సమయాల్లో గల్లంతైన నది ప్రాంతాలను పరిశీలించారు. స్నేహితులను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

### నేడు అంత్యక్రియలు

**హాసన, న్యూస్‌టుడే:** మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి దర్శనానికి వెళ్లి తుంగభద్ర నదిలో నీట మునిగి మరణించిన యువకులకు నేడు (సోమ) అంత్యక్రియలు నిర్వహించనున్నారు. శనివారం నీట మునిగి మరణించిన అజిత్ (20), సచిన్ (20), ప్రమోద్ (19) మృతదేహాలు మంత్రాలయం నుంచి తెస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. వీరు హాసన జిల్లా అరసికెరె తాలూకా జాగవళ్కు చెందిన వారు. స్నేహితులతో కలిసి మంత్రాలయానికి వెళ్లి, నీటిలో దిగిన సమయంలో ఉద్ధృతికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే.

మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, పక్కన డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ మంజునాథ్, ఎస్సై శివాంజల్

## 'మోదీని ఉద్దేశించే వ్యాఖ్యలు చేశారు'

**హుబ్బళ్లి:** భాజపాలో 75 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పదవులను వీడాలని ఆర్ఎస్ఎస్ నేత మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు ప్రధాని మోదీని ఉద్దేశించేనని ప్రభుత్వ చీఫ్ విప్ సలీం అహ్మద్ పేర్కొన్నారు. ఈ ఏడాదితో మోదీకి 75 ఏళ్లు నిండుతున్నాయని, ఇతర నేతల్లాగే ఆయన తన పదవికి రాజీనామా చేయవలసి ఉంటుందన్నారు. అధికారాన్ని వీడడం, అదే పదవిలో కొనసాగడం అనేది భాజపా అంతర్గత వ్యవహారం అన్నారు.

## రూ.3.5 లక్షల నగదుతో మహిళల ఉడాయింపు

**దావణగెరె, న్యూస్‌టుడే:** బంగారంపై తీసుకున్న రుణాన్ని పునరుద్ధరణ చేసుకునేందుకు వచ్చిన లత అనే గృహిణికి సాయం చేసే నెపంతో వచ్చిన ముగ్గురు మహిళలు రూ.3.5 లక్షల నగదుతో జారుకున్నారు. బాధితురాలు చెన్నగిరి తాలూకా తణిగెరె గ్రామానికి చెందిన ఆమె సంతెబెన్నూరు శాఖ కెనరాబ్యాంకు శాఖకు శనివారం వచ్చిన సమయంలో మహిళలు చేతి వాటం ప్రదర్శించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఇద్దరు మహిళలను సంతెబెన్నూరు ఠాణా పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో మహిళ కోసం గాలింపు చేపట్టారు.

వర్షంలో గొడుగు వేసుకుని పాదచారి మార్గంలో నిలబడిన వ్యక్తి

వర్షంలో వెళుతున్న కార్లు

# నగరవాసి.. వానకు జడిసి

**బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే:** ఆదివారం మధ్యాహ్నం నుంచి తెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు, అంతర్జాల సేవలకు అంతరాయం కలిగింది. కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగి కార్లు, బైకులపై పడ్డాయి. సెలవు ఉండడంతో షాపింగ్ వచ్చిన నగర వాసి వర్షంతో ఒకే చోట ఆగిపోవలసి వచ్చింది. బెంగళూరు, బెంగళూరు గ్రామీణంలో గురువారం వరకు ఎల్లో అలర్ట్, తీర ప్రాంత జిల్లాలు, మల్నాడులో ఆరంజ్ అలర్ట్ ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

**రామనగర, న్యూస్‌టుడే:** బెంగళూరు- మైసూరు ఎక్స్‌ప్రెస్ వేలో జయపుర వద్ద ఆదివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. కేఆర్ నగర సమీపంలోని చిక్కనాయనకహళ్లికి చెందిన తమ్మణ్ణ గౌడ (56), ఆయన కుమారుడు ముత్తురాజ్ (28), కారు డ్రైవరు సచిన్ (27)లను మృతులుగా గుర్తించారు. కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ఆసుపత్రిలో ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మైసూరు నుంచి బెంగళూరుకు వస్తున్న సమయంలో ఆదివారం వేకువ జామున 5 గంటల సమయంలో నిద్రమత్తులో డ్రైవరు కారును రహదారి పక్కన ఉన్న అడ్డుగోడను ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది.

## రూ.5 వేలు తిరిగివ్వలేదని హత్య

**బెళగావి, న్యూస్‌టుడే:** రాయబాగ సమీపంలో రూ.5 వేల కోసం యువ జానపద కళాకారుడు మారుతి లట్టి (22)ని దుండగులు హత్య చేశారు. హత్యను రోడ్డు ప్రమాదంగా చూపించేందుకు అతని పైనుంచి కారు నడిపి వికృతి ప్రదర్శించారు. 'బా హుడుగి పంచమిగె' పాటతో లక్షలాది మంది జానపద పాటల అభిమానులను సంపాదించుకున్నాడు. బూదిహాళ గ్రామం వద్ద శుక్రవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో మారుతి లట్టి బైకును ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతోనే మరణించారని భావించారు. కొద్ది రోజుల కిందట కచ్చేరీలో పాల్గొనేందుకు ఈరప్ప అక్కివాటె అనే వ్యక్తి వద్ద రూ.50 వేలు బయానా తీసుకున్నాడు. కచ్చేరీ ఇవ్వడం సాధ్యపడకపోతే రూ.45 వేలను వెనక్కు ఇచ్చాడు. మరో రూ.5 వేలు త్వరలో ఇస్తానని చెప్పాడు. ఇదే విషయమై తన పది మంది అనుచరులతో కలిసి దారి కాచి దాడి చేసి హత్య చేశారని రాయబాగ ఠాణా పోలీసులు గుర్తించారు. ఈ కేసులో సిద్ధరామ ఒడెయ, ఆకాశ పూజారి అనే నిందితులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు తీవ్రం చేశారు.

## 'తీరు మారడంతోనే పొడిచా'

**బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే:** బుల్లితెర నటి శ్రుతిని కత్తితో పొడిచి పరారైన ఆమె భర్త అమరేశ్ విచారణను హనుమంతనగర ఠాణా పోలీసులు కొనసాగించారు. కొన్ని ధారావాహికల్లో వరుసగా నటించడం మొదలైనప్పటి నుంచి తనను, ఇద్దరు పిల్లలను నిర్లక్ష్యం చేస్తూ వచ్చిందని తెలిపాడు. పార్టీలు, పబ్బులకు వెళ్తూ అర్ధరాత్రుళ్లు ఇంటికి రావడం, ఒక్కోసారి పదిహేను రోజుల పాటు ఇంటికి తిరిగి రాకపోవడం, అడిగితే, కేసులు పెడతానని బెదిరింపులకు దిగిందని ఆరోపించాడు. రూ.25 లక్షలతో లీజుకు తీసుకున్న ఫ్లాట్‌లో ఉండకుండా, ఆ నగదును తీసుకువెళ్లేందుకు ప్రయత్నించి గొడవ పెట్టుకోవడంతో ఉద్రేకంతో కత్తితో దాడి చేశానని తెలిపాడు.

## అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలం

**హుబ్బళ్లి, న్యూస్‌టుడే:** కాంగ్రెస్ అధికారంలో ఉన్న ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితులు స్థిరంగా లేవని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఇదే కారణంతో ఉపాధి అవకాశాలను కల్పించడంలో ఆ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. ఉపాధి రేటును పెంచేందుకు భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన సమర్థించారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తన సలహాదారులు చెప్పిన మాటల ఆధారంగా ప్రకటనలు చేయడం దురదృష్టకరమన్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకునేందుకు డీకే శివకుమార్, మంత్రి పదవులు దక్కించుకునేందుకు మరికొందరు భారీ మొత్తంలో పార్టీ పెద్దలకు నగదు మూటలను తరలిస్తున్నారని ఆరోపించారు. సీఎం తన పదవిని కాపాడుకునేందుకే పెద్దపీట వేస్తున్నారని విమర్శించారు.

# సిగంధూరు మెడలో తీగలహారం

సిగంధూరు వెళ్లేందుకు నిర్మించిన పొడవైన తీగల వంతెన

**చిత్రదుర్గం,న్యూస్‌టుడే:** శివమొగ్గ జిల్లా సాగర తాలూకాలో శరావతి నదికి అడ్డంగా నిర్మించిన లింగనమక్కి జలాశయం పోటు జలాల్లో అంబరగొడ్లు కలసవళ్లి గ్రామాల నడుమ రూ.473 కోట్లతో నిర్మించిన 2.24 కి.మీ పొడవైన సిగంధూరు తీగల వంతెన (కేబుల్ బ్రిడ్జి)ను ప్రజల సంచారానికి కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్ర, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర తదితరులు హాజరవుతారని అధికారులు తెలిపారు. వంతెన ప్రారంభం తర్వాత సాగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆటల మైదానంలో సభా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

- **అలక్షిత ప్రాంతాల అభివృద్ధికి రహదారి:** అభివృద్ధి పనులను పూర్తి చేసుకొని ప్రజా సంచారానికి సిద్ధమైన సిగంధూరు తీగల వంతెనతో జలాశయానికి ఆవలి వైపున ఉన్న 15 గ్రామాల అభివృద్ధికి మార్గం ఏర్పడనుంది. ఇప్పటి వరకు ఈ గ్రామీణ ప్రాంతాల వేలాది మంది ప్రజలు లింగనమక్కి జలాశయం పోటు జలాల్లో సంచరించే లాంచీ పైనే రాకపోకలకు ఆధార పడేవారు. ఈ వంతెన ప్రారంభంతో అలక్షిత ప్రాంతాల అభివృద్ధికి దోహద పడుతుందని ఈ ప్రాంతాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.
- **పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించే పరిసరాలు:** ఈ జలాశయం నీరు విస్తరించిన ప్రాంతంలో ఏర్పడిన చిన్న చిన్న ద్వీపాలు, వాటిలో పెరిగిన చెట్లు, చుట్టూ నీరు, ప్రకృతి రమణీయత అందాలకు పుట్టినిల్లులా ఉంటుంది. ఇక్కడ రోజూ వేలాది మంది పర్యాటకులు ఉల్లాసంగా కాలం గడపడానికి వస్తారని ఆశిస్తున్నారు. ఈ వంతెనతో జలాశయానికి ఆవలి వైపున ప్రసిద్ధి చెందిన సిగంధూరు చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తమ సొంత వాహనాల్లో నేరుగా దేవాలయాన్ని చేరుకోవచ్చు. జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ నిర్మించిన ఈ వంతెన రాష్ట్రంలో అత్యంత పొడవైన తీగల వంతెన కాగా దేశంలో రెండో స్థానంలో నిలిచింది.

### నెరవేరుతున్న దశాబ్దాల కల

**శివమొగ్గ:** మల్నాడుకు హృదయభాగంలోని శివమొగ్గ జిల్లాలో పలు పర్యాటక కేంద్రాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయి. సిగందూరు చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు శరావతి నది బ్యాక్ వాటర్‌లో జెట్టీలోనే వెళ్లవలసి ఉంటుంది. జెట్టీ తిరగనప్పుడు సిగందూరుకు వెళ్లాలంటే కనీసం 100 కి.మీ. అదనంగా ప్రయాణించవలసి వచ్చేది. ఇక్కడ వంతెన నిర్మించాలని గడిచిన మూడున్నర దశాబ్దాలుగా స్థానికులు చేసిన వినతులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ.473 కోట్ల ఖర్చుతో దేశంలో రెండో అతి పెద్ద కేబుల్ వంతెన నిర్మాణం పూర్తయింది. వంతెన 2.24 కి.మీ పొడవు, 16 మీటర్ల వెడల్పు ఉండగా, అందులో 740 మీటర్లు కేబుల్ ఆధారంగా నిలిచి ఉంటుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రారంభోత్సవానికి వెళ్లడం లేదని ప్రజా పనుల శాఖ మంత్రి సతీశ్ జార్ఖిహొళి స్పష్టం చేశారు. చివరి క్షణంలో సమాచారం అందించడంతో వారి బదులుగా తాను ప్రారంభోత్సవంలో పాల్గొంటున్నానని జార్ఖిహొళి మాధ్యమ ప్రతినిధులకు వెల్లడించారు.

### వంతెన ప్రారంభం నేడే


ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9121167525

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 9945050116



(c) eenadu

# ఘన చరితం.. మన వారసత్వం

## యునెస్కో జాబితాలో చేరనున్న ఐదు ప్రాచీన కట్టడాలు

చెదరని కళాకృతుల ఐహోళ్ పురాతన దుర్గ కోవెల

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** ప్రపంచ ప్రాచీన వారసత్వ సంపద (యునెస్కో) జాబితాలోకి కర్ణాటకలోని ఐదు ప్రాచీన కట్టడాలు చేర్పించేందుకు ప్రభుత్వం వంతు ప్రయత్నాలు మొదలు పెట్టింది. మహారాష్ట్రలోని తొమ్మిది ప్రాచీన కట్టడాలు యునెస్కో జాబితాలో చేరడంతో కర్ణాటక ప్రభుత్వం మేలుకొంది.

బాదామి భూతనాథ్ ఆలయం

ఈ మేరకు రాష్ట్రంలో ఖ్యాతి పొందిన ప్రాచీన కట్టడాలు వివరాలతో కూడిన నివేదికలను రాష్ట్ర పురావస్తు శాఖ, పర్యాటక శాఖలు సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వానికి పంపించాయి. కేంద్ర ప్రభుత్వం నివేదికలను యునెస్కో సంస్థకు పంపిస్తుందని, అనంతరం సంస్థ అధికార ప్రతినిధులు వచ్చి పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. కర్ణాటక ప్రాచీన కట్టడాలు, ఆలయాలు, ప్రదేశాలకు పుట్టినిల్లు. హోయసళ, చాళుక్య, జైన, ఇస్లామిక్ వాస్తు శైలిలో ప్రాచీన కాలంలో రాజులు నిర్మించారు. పురాతన ఆలయాలకు నిలయమైన బాగల్‌కోట్ జిల్లాలోని ఐహోళ్‌లో చాళుక్యులు దుర్గ ఆలయాన్ని నిర్మించారు. చాళుక్యుల్లో మొదటి రాజులు కేవలం రాతి స్తంభాలతో ఆలయాన్ని పూర్తిగా నిర్మించారు. అదే జిల్లాలో ఉన్న బాదామి ప్రాంతంలో కొండ పక్కన చాళుక్య రాజులు నీటి కొలను మధ్య భూతనాథ్ గుడిని కట్టారు. అక్కడే జైన ఆలయం ఉంది. దాన్ని ఐదో శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్రకారులు తెలిపారు. అతి ప్రాచీన ఆలయాల్లో అది ఒకటిగా గుర్తింపు పొందింది. పట్టదకల్లులో ఒకే ప్రాంతంలో ఎనిమిదో శతాబ్దంలో చాళుక్య రాజులు విరపాక్ష, సోమేశ్వర, సంగమేశ్వర ఆలయాలను రాళ్లతో నిర్మించారు. మండ్య జిల్లాలోని శ్రీరంగపట్టణలో తొమ్మిదో శతాబ్దంలో గంగా వంశ రాజులు నిర్మించిన శ్రీరంగనాథస్వామి ఆలయం చరిత్ర ప్రసిద్ధిగాంచింది. కృష్ణదేవరాయలు ఆలయాల అభివృద్ధికి ఎక్కువ ధనం వ్యయం చేశారు. టిప్పు సుల్తాన్‌తో పాటు మైసూరు మహారాజులు ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేశారు. నిత్యం భక్తులతో కోవెల కళకళలాడుతోంది. బిజాపుర జిల్లాలో బహమనీ రాజులు నిర్మించిన గోల్ గుంబజ్ అతి పురాతనమైంది. అది దక్కన్ సుల్తాన్ పేరుపై కట్టారు. బహమనీ రాజులు తమ విడిది కోసం దాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది. ప్రపంచంలో అతి పెద్ద డోమ్ ఆకారం కలిగిన కట్టడాల్లో గోల్ గుంబజ్ రెండో స్థానంలో ఉంది. ఈ ఐదు పురాతన కట్టడాలను యునెస్కో జాబితాలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టిందని రాష్ట్ర న్యాయ పర్యాటక శాఖ మంత్రి హెచ్.కె.పాటిల్ తెలిపారు. యునెస్కో జాబితాలో చేరాల్సిన అనేక ప్రదేశాలు, ప్రాచీన కట్టడాలు కర్ణాటకలో ఉన్నట్లు తెలియజేశారు.

పట్టదకల్లులో కొలువైన ప్రాచీన కట్టడం

శ్రీరంగపట్టణలోని శ్రీరంగనాథస్వామి దేవస్థానం


బిజపుర ప్రాచీన గోల్ గుంబజ్

## కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం

**బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే:** ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతికి నగరంలోని వివిధ తెలుగు సంఘాలు ఆదివారం ఇక్కడ విడుదల చేసిన వివిధ ప్రకటనల్లో తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. బహుభాషా నటుడు కోట శ్రీనివాసరావు మృతితో గొప్ప నటుడిని సమాజం కోల్పోయిందని కర్ణాటక తెలుగు ప్రజాసమితి అధ్యక్షుడు డాక్టర్ బొందురామస్వామి తెలిపారు. విలన్ పాత్రల్లో గత కాలం నటుడు ఎస్వీరంగారావును తలపించేలా వివిధ పాత్రల్లో జీవించారన్నారు. నవరసాల నటుడిగా కోట శ్రీనివాసరావు గుర్తింపు పొందారని రంగస్థల నటుడిగా జీవితాన్ని ప్రారంభించారని సమితి ప్రధాన కార్యదర్శి బాబు రాజేంద్రకుమార్ తెలిపారు. నటుడిగా రాజకీయనేతగా గుర్తింపు పొందారని తెలియజేశారు. తెలుగు సమాజం గొప్పనటుడిని కోల్పోయినట్లు బెంగళూరు నగర పీజీ సమాఖ్య అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. తెలుగు సినీరంగానికి తెలుగు సాహిత్యానికి కోటశ్రీనివాసరావు సేవలు అందించారని కేంద్ర ప్రభుత్వ రంగ తెలుగు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఎల్.నాగేశ్వరరావు తెలియజేశారు. ఆయన మృతి సినీరంగానికి తీరని లోటు అని అభివర్ణించారు.

## తెలుగు విజ్ఞాన సమితి సంతాపం

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే:** నటుడు కోటా శ్రీనివాసరావు మృతి పట్ల తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణ రాజు సంతాపాన్ని ప్రకటించారు. వైవిధ్యమైన పాత్రలు పోషించి పలువురు నటులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని పేర్కొన్నారు. తెలుగు విజ్ఞాన సమితి వార్షికోత్సవాల్లో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్, నటుడు తణికెళ్ల భరణి, నటి మీనాతో కలిసి కోట శ్రీనివాసరావుకు శ్రీకృష్ణదేవరాయల పురస్కారాన్ని ప్రదానం చేశామని గుర్తు చేసుకున్నారు.

సమితి ప్రతినిధులతో కలిసి కోటా శ్రీనివాసరావును సత్కరిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య (పాతచిత్రం)

## హంతకుల అరెస్టు

**ధార్వాడ, న్యూస్‌టుడే:** తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియునితో కలిసి భర్తను హత్య చేసిన కరెవ్వ (30) అనే మహిళను, హత్య చేసిన ఫకీరప్ప, అతనికి సహకారాన్ని అందించిన సాబణ్ణ లక్ష్మణలను రామదుర్గ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. కరెవ్వ భర్త ఈరప్ప యల్లప్పను మద్యం తాగుదామని అమ్మినబావి గ్రామం నుంచి పిలుచుకు వచ్చి గొంతు చుట్టూ తువ్వాలుతో బిగించి హత్య చేశారు. ముఖాన్ని గుర్తుపట్టకుండా రాయితో నుజ్జు చేశారు. తన భర్త కనిపించడం లేదని రామదుర్గ ఠాణాలో కరెవ్వ ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి ఆమె చరవాణికి ఫకీరప్ప నుంచి ఎక్కువ సార్లు ఫోన్లు వస్తున్నట్లు గుర్తించి, అదుపునకు తీసుకుని ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించారు.

# దార్శనిక మేధావి ఆచార్య సత్యనారాయణశాస్త్రి

యోగాభారతి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వక్తలు

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** యోగాభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆచార్య ఎ.సత్యనారాయణ శాస్త్రి శత జయంతి ఉత్సవాలను ఇక్కడ బెంగళూరు నగరంలో నిర్వహించారు. కార్యక్రమానికి అనేక మంది పూర్వవిద్యార్థులు, ప్రముఖ వేదాంతులు, విజ్ఞానులు తదితరులు ఆయన జ్ఞాపకాలను పంచుకున్నారు. పరివర్తన, అనుభవబోధలుగా సత్యనారాయణ శాస్త్రిని అణు శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు అన్వేషకులు వేదాంత జ్ఞాన మార్గాన్ని ప్రకాశవంతం చేసే దార్శనిక మేధావిగా కీర్తించారు. ఆచార్య ఎ.సత్యనారాయణ శాస్త్రి ప్రసిద్ధ భారతీయ పండితుడు, రచయిత, ఆధ్యాత్మిక గురువుగా ఖ్యాతి పొందారని వక్తలు కొనియాడారు. హిందూ గ్రంథాలపై గాఢమైన జ్ఞానానికి, ప్రాచీన జ్ఞానాన్ని ప్రస్తుత ఆచరణాత్మక జీవితానికి అన్వయించడంలో ప్రసిద్ధి చెందారని తెలియజేశారు. వేద సంప్రదాయాలు, తత్వశాస్త్రం, భక్తిసాహిత్యం ఆచరణాత్మక ఆగమాల ప్రచారానికి ఆయన గణనీయంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన ప్రసంగాలు, బోధనలు వేద గ్రంథాలు భక్తి ఉద్యమాలు, హిందూ ఆచారాలపై ఆసక్తి ఉన్న భక్తులను పండితులను ఇప్పటికీ ప్రేరేపిస్తున్నాయని వివరించారు. శాస్త్రి ప్రేమైన సాధకుడు, ఉపనిషత్తులు వేదాంతంపై విస్తృతమైన జ్ఞానం ఉన్న వారు ఆయన ఆదికి ప్రశ్నల విధానం, పరిష్కార విధానం ఆదునికమైనవిగా, శాస్త్రీయమైనవిగా ప్రస్తుత కాలానికి సందర్భోచితమైనవి తెలియజేశారు. సుఖ దుఃఖాలు పరీక్ష భోగ సుఖాలు, బ్రహ్మ సుఖం, మనసును నిశ్శబ్దంగా చేయడం, ఆనందం విశ్లేషణ, విస్తరణ, నైధన్యం సాగడం, పంచకోశవివేకం అవశాత్రయ, ఎనర్జీ మోడల్, కర్మయోగం, భక్తియోగం, శుభకర్మలు, కర్మకాండలు, జపాలు, గాయత్రి ఓం నిశ్శబ్దం వైపు నడిపిస్తాయని, స్వేచ్ఛ విసుగు సాధన మార్గం ఆయన బోధించారని వివరించారు. కార్యక్రమంలో వేదపండితుడు డాక్టర్ రామచంద్ర జి.భట్, చాన్సలర్ డాక్టర్ హెచ్.ఆర్.నాగేంద్ర, డాక్టర్ నాగరత్న, డాక్టర్ శమంతకమణి, డాక్టర్ లతాహేమచంద్, డాక్టర్ ఆర్.రంగన్, ఆచార్య సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్రీధర్ మెల్కోటి, డాక్టర్ బి.ఆర్. తదితరులు నివాళులు అర్పించారు. రామకృష్ణ, ఎస్.రాధాకృష్ణన్, డాక్టర్ అన్ డెబాల్టో, రఘునందన్ త్రికన్నాథ్, శాస్త్రి ప్రియశిష్యుడు రఘురామ్‌జీ తదితరులు హాజరై నివాళి అర్పించారు.

కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

## చెరుకు తోటలో చిరుత పిల్లలు

**మండ్య, న్యూస్‌టుడే:** మద్దూరు తాలూకా అణ్ణూరు గ్రామంలో చెన్నమాదే గౌడ అనే రైతు పొలంలో చెరకు తోట నరుకుతున్నప్పుడు మూడు చిరుత పిల్లలు కనిపించాయి. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఆ పిల్లలను పట్టుకుని వెళ్లారు. పిల్లల కోసం చిరుత వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంతో గ్రామ శివార్లలో పలు చోట్ల బోనులు ఏర్పాటు చేశారు.

## అప్పుల బాధ తాళలేక బలవన్మరణం

**హుబ్బళ్లి, న్యూస్‌టుడే:** అప్పుల బాధ తాళలేక కుందగోళ తాలూకా బరద్వాద గ్రామానికి చెందిన రవిరాజ్ జాదవ్ (42), బసవనగౌడ పాటిల్ (54) అనే రైతులు తమ పొలంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. గత నాలుగేళ్లలో అతివృష్టి, అనావృష్టి, పంట పండినా ఏడాది ధరలు లేకపోవడంతో బ్యాంకుల, బయట వ్యక్తుల వద్ద రుణాలు తీసుకున్నారు. రుణాన్ని తిరిగి చెల్లించలేక తమ ఇళ్లలో ఉరి వేసుకున్నారు. కుందగోళ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## పోలీసుల అదుపులో నిందితుడు

**మండ్య, న్యూస్‌టుడే:** నాలుగేళ్ల బాలికకు చాక్లెట్ ఇప్పిస్తానని నమ్మించి లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన నిందితుణ్ని (21) మండ్య ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. బీహారుకు చెందిన బాధితురాలి తల్లిదండ్రులు స్థానిక షుగర్ ఫ్యాక్టరీలో కార్మికులుగా పని చేసేవారు. పరిశ్రమల సమీపంలో వీరి షెడ్డుకు సమీపంలోనే నిందితుడు కూడా ఉండేవాడని పోలీసులు తెలిపారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కన్నడను కాపాడుకుందాం

పురస్కారాలు స్వీకరించిన సాధకులు

**రాయచూరు, న్యూస్‌టుడే :** స్థానిక కన్నడభవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో హొసమని ప్రకాశన సంస్థ హొసమని మహిళా కావ్య, రంగ పురస్కారాలను ప్రదానం చేసింది. కావ్య ప్రశస్తులను కవయిత్రులు బసమ్మ హీరేమఠ (సింధనూరు), అంబమ్మ (మాన్వి), రంగ పురస్కారాలను రామణ్ణ మర్చేడ్, అణివీరయ్య స్వామి, నాగప్ప బాళె, వెంకట నరసింహులు, రంగస్వామి, ప్రవీణ్‌రెడ్డి, సుందరేశ్, వాల్మీకి, బసవరాజ్, జలాల్‌సాబ్ అందుకున్నారు. ఈ సందర్భంగా కన్నడ పత్రిక సంపాదకుడు నాగతిహళ్లి నాగరాజ్ మాట్లాడుతూ తమిళనాడు, కేరళ వాసులు మాతృభాషను కాపాడుకుంటున్నారని, కన్నడిగులు భాష రక్షణ కోసం పోరాట చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆవేదన కల్గిస్తోందన్నారు. కన్నడ భాషాభివృద్ధికి హొసమని ప్రకాశన అధ్యక్షుడు బషీర్ అహ్మద్ నిస్వార్థంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. పర్వీన్ బేగం, షంషాద్ బేగం, రామణ్ణ మ్యాదర్ వేదికను అలంకరించారు.

# సామ్రాట్ అశోక్ నాటక ప్రదర్శన

డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలు వేసి నాటక ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రులు డాక్టర్ మహదేవప్ప, ఈశ్వర్ ఖండ్రె తదితరులు

సామ్రాట్ అశోక్ నాటకంలో ఓదృశ్యం

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే:** బౌద్ధధర్మాన్ని స్వీకరించడంతో పాటు ప్రచారం చేసిన సామ్రాట్ అశోక్ నాటకాన్ని ఆదివారం ఇక్కడ డాక్టర్ అంబేడ్కర్ భవన్‌లో నాగపుర బుద్ధిస్ట్ అకాడమీ ఆఫ్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించారు. ప్రదర్శన కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు డాక్టర్ హెచ్.సి.మహదేవప్ప, ఈశ్వర్ ఖండ్రె, మాజీ మంత్రి పీజీఆర్‌సింధ్యా, డీఎస్ఎస్ సంచాలకుడు డీజీసాగర్ తదితరులు డాక్టర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ హెచ్.సి.మహదేవప్ప మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు ప్రపంచానికి శాంతిమార్గం చూపించారని తెలిపారు. సామ్రాట్ అశోక్ బుద్ధుడి ఆలోచనలను ముందుకు తీసుకుపోయారని తెలియజేశారు.

## విధానసౌధ వీక్షణకు స్పందన

**బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే:** విధానసౌధ లోపల, వెలుపల సంచరించేందుకు, గైడ్ సాయంతో పర్యటించేందుకు చక్కని స్పందన లభిస్తోందని అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారిని బృందాలుగా విధానసౌధ లోపలకు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. దీనిపై ఇతర జిల్లా కేంద్రాలు, విద్యాసంస్థల్లో జాగృతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సమాచార శాఖ అధికారులు తెలిపారు.

విధానసౌధ వీక్షించేందుకు వచ్చిన సందర్శకులు

## సంగీత రంగానికి గవాయి సేవలు నిరుపమానం

**రాయచూరు, న్యూస్‌టుడే :** పండిత పంచాక్షరి గవాయి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గణదిన్ని కల్యాణ మంటపంలో గవాయి పుణ్యస్మరణ, 45వ సంగీత సమ్మేళనాన్ని నిర్వహించారు. స్వామీజీలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామీజీ రాయచోటి వీరశివాచార్య మాట్లాడుతూ సంగీత రంగానికి గవాయి అందించిన అద్వితీయమైన సేవలను మననం చేసుకునేందుకు ఏటా సమ్మేళనం నిర్వహించడం శ్లాఘనీయమని పేర్కొన్నారు. తద్వారా అనేక సంగీత కళాకారుల బృందాలను తయారు చేస్తున్నారని కితాబిచ్చారు. కిల్లే బృహన్మఠం స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు ప్రసంగిస్తూ గవాయి ఆశయాన్ని కొనసాగించేందుకు, జిల్లాలో సంగీత సమ్మేళనాలను తరచూ జరిగేందుకు దాతలు చేయూత ఇవ్వాలని కోరారు.

## ఒకశాతం పన్ను చెల్లించండి

**బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే:** డిజిటల్ పేమెంట్లు తీసుకుంటూ, వాణిజ్య, ఆదాయ పన్నులు చెల్లించని చిరు వ్యాపారులు ఒక శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుందని అధికారులు స్పష్టం చేశారు. బేకరీ, కాండిమెంట్స్, పానీపురి, జ్యూస్ దుకాణదారులు ఏడాదిలో రూ.40 లక్షల కన్నా ఎక్కువ, రూ.1.5 కోట్ల కన్నా తక్కువ లావాదేవీలు చేస్తే జరిగిన వ్యాపారంలో ఒక శాతం పన్ను చెల్లించాలని తాజాగా నోటీసులు జారీ చేశారు.

## ప్రభుత్వ నిర్ణయంతో భగ్గుమన్న భక్తులు

**బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే:** మైసూరు రోడ్డు గాలి ఆంజనేయ స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ తమ ఆధీనంలోకి తీసుకోవడంపై భక్తులు, ఆలయం ట్రస్టు సభ్యులు భగ్గుమన్నారు. హుండీల్లో నగదు, కానుకలను లెక్కపెట్టే సమయంలో కొందరు సభ్యులు, అర్చకులు చేతివాటం ప్రదర్శించడం సీసీ కెమెరాల్లో రికార్డయింది. దీంతో తాము ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నామని, ఐదేళ్ల అనంతరం మళ్లీ ట్రస్టుకు అప్పగిస్తామని దేవాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు.

## నంది బెట్ట ఎక్కుదాం రండి

టీషర్టులు ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

**బెంగళూరు, (మారతహళ్లి), న్యూస్‌టుడే:** ఐదు నదులకు జన్మస్థానం, విలక్షణమైన జీవవైవిధ్యం ఉన్న నంది బెట్టను కాపాడుకోవాలన్న నినాదంతో 'దివ్యశ్రీ నందిహిల్స్ మాన్సూన్ రన్'ను ఆగస్టు రెండో వారంలో నిర్వహించనున్నారు. యువజన సేవలు, కర్ణాటక రాష్ట్ర పర్యాటక అభివృద్ధి మండలి సహకారంతో నిర్వహిస్తున్న పరుగులో బెట్ట దిగువ నుంచి ఎగువ వరకు 21.1 కి.మీ. మేర హాఫ్ మ్యారథాన్‌ను, 10 కి.మీ. ఛాలెంజ్ నిర్వహిస్తున్నామని నిర్వాహక ప్రతినిధి రుచికా రాజు తెలిపారు. యువ జన సేవల విభాగం ప్రధాన కార్యదర్శి నవీన్ రాజ్ సింగ్, షెడ్యూల్డు తెగల విభాగం అధికారి డీ రందీప్, రేస్ డైరెక్టర్ ప్రమోద్ దేశ్‌పాండేలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. భారతదేశంలోని అతి పెద్ద రన్నింగ్ అకాడమీ సహకారంతో నంది బెట్టపై ఉన్న జీవ వైవిధ్యాన్ని కాపాడడం, కాలుష్యాన్ని నియంత్రించాలన్న నినాదంతో ఈ పరుగును నిర్వహిస్తున్నామని వివరించారు. www.nandirun.in అనే వెబ్‌సైటులో పేర్లు నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు.

## చెలువనారాయణ స్వామికి అభిషేకం

**మండ్య, న్యూస్‌టుడే:** ఆషాఢమాసంలో నిర్వహించే వైరముడి ఉత్సవాల్లో భాగంగా చెలువనారాయణ స్వామి ఆలయంలోని మూల విరాట్టుకు పాలు, పెరుగు, తేనె, గంధం, కొబ్బరినీటితో కుంభాభిషేకాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవహారాల బాధ్యుడు చెలువరాయ స్వామి భార్య ధనలక్ష్మి, రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ అధ్యక్షుడు కాడేనహళ్లి నాగణ్ణగౌడ, హుబ్బళ్లి ఎమ్మెల్యే మహేశ్ టెంగినకాయి, అధికారిణి శీల తదితరులు మహాభిషేకంలో పాల్గొన్నారు.

చందన అలంకరణలో మూలవిరాట్టు

## బాలికపై అత్యాచారం.. పారిశ్రామికవేత్తకు జైలు

**మంగళూరు, న్యూస్‌టుడే:** పుట్టిన రోజు వేడుకలను ఘనంగా చేస్తానని ఒక బాలిక (16)ను నమ్మించి కారులో తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడిన ఒక పారిశ్రామికవేత్త (68)ను ముల్కి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. రెండు నెలల నుంచి బాలికను పాఠశాలకు తీసుకువెళ్లి విడిచి పెట్టేవాడు. అదే పరిచయంతో నీ పుట్టిన రోజును ఘనంగా చేస్తానని తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద నిందితుడ్ని అరెస్టు చేశారు. అరెస్టు అనంతరం నిందితుడికి రక్తపోటు అధికం కావడంతో చికిత్స కోసం ముల్కి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

## నర్సింగ్‌హోం యజమాని ఆకస్మిక మృతి

**రామనగర, న్యూస్‌టుడే:** కనకపురలో గణేశ్ నర్సింగ్ హోం, గణేశ్ మెడికల్స్ యజమాని మంజునాథ (50) శనివారం గుండెపోటుతో మరణించారు. నడకకు వెళ్లిన ఆయన దారి మధ్యలో స్పృహతప్పి పడిపోయారు. చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకు వెళ్లేసరికే ఆయన తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతోనే మంజునాథ్ మరణించారని వైద్యులు ధ్రువీకరించారు.

## ప్రభుత్వానికి తాఖీదులు

**బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే:** సీబీఎస్ఈ, సీఐఎస్ఎస్ఐఈ బోధనకు అనుమతి పొందిన పాఠశాలల్లో తప్పనిసరిగా కన్నడను బోధించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ప్రశ్నిస్తూ కొందరు తల్లిదండ్రులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై మూడు వారాల్లోగా ఆక్షేపణలు దాఖలు చేయాలని జస్టిస్ వి.కామేశ్వరరావు నేతృత్వంలోని పీఠం ప్రభుత్వానికి తాఖీదులు జారీ చేసింది. దీనిపై రెండేళ్లుగా తాము ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రుల తరపున వాదనలు వినిపించిన న్యాయవాదులు తెలిపారు.

## '666 ఆపరేషన్ డ్రిమ్ థియేటర్'

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే:** హీరో శివరాజ్‌కుమార్ '666 ఆపరేషన్ డ్రిమ్ థియేటర్' చిత్రంలో కొత్తగెటప్ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. సూట్ ధరించి చేతిలో వింటేజ్ రివాల్వర్ పట్టుకుని ఓ వైపు చూస్తున్న కొత్తలుక్‌లో కనపడుతున్నారు. డాక్టర్ రాజ్‌కుమార్ నటించిన '666 బ్లాక్‌బస్టర్' చిత్రం తరహాలో శివరాజ్‌కుమార్ నటిస్తున్నారని దర్శకుడు హేమంత్ ఎం.రావు తెలిపారు. వైశాక్ జె ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రానికి చరణ్‌రాజ్ సంగీతం అందిస్తున్నారు. శివరాజ్‌కుమార్‌తో పాటు ధనంజయ్ నటిస్తున్నారు.

కొత్తగెటప్‌లో 666 ఆపరేషన్ డ్రిమ్ థియేటర్ చిత్రంలో శివరాజ్‌కుమార్

## 25న 'బందూక్' రాక

నూతన నటులతో నిర్మించిన 'బందూక్' చిత్రం ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. విభిన్నమైన కథ అందించడంతోపాటు రచయిత మహేశ్ రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. బాలాజీ మనోహర్, శ్వేతా ప్రసాద్, గోపాలకృష్ణదేశపాండే, శంకర్ అశ్వత్, హరీశ్‌రై తదితర నూతన నటులు చిత్రం ద్వారా తమ ప్రతిభ చూపించారని దర్శకుడు తెలిపారు. హొన్నావర, ఉడుపి, మల్పె, మంగళూరు తదితర ప్రాంతాల్లో చిత్రీకరించారు.

బందూక్ చిత్రంలో హీరో బాలాజి మనోహర్

## 'ఎల్లుముత్తా' పాటలు వచ్చేశాయ్

ఎల్లు ముత్తా చిత్రంలో శౌర్యప్రతాప్, రా.సూర్య, ప్రియాంక మళలి

హై 5 స్టుడియోస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'ఎల్లు ముత్తా' చిత్రం పాటలు ఇటీవల హుబ్బళ్లిలో విడుదల చేశారు. శౌర్యప్రతాప్, రా.సూర్య, ప్రియాంక మళలి తదితరులు నటిస్తున్న చిత్రానికి ప్రసన్న కేశవ సంగీతం అందిస్తున్నారు. ఈ సందర్భంగా 50 ఏళ్ల నుంచి పాటలు పాడుతున్న గాయకురాలు సంగీతాకట్టిని సత్కరించారు. కొడగులో జరిగిన సంఘటన ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు తెలిపారు.

జూనియర్ చిత్రంలో రవిచంద్రన్ తదితరులు

## 'జూనియర్' చిత్రంలో రవిచంద్రన్

కన్నడ, తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో ఈనెల 18న విడుదల కానున్న 'జూనియర్' చిత్రంలో కన్నడ నటుడు రవిచంద్రన్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. హీరోయిన్ శ్రీలీలతో పాటు జెనీలియా డిసౌజా, రావు రమేష్, అచ్యుత్‌కుమార్ నటిస్తున్నారు.

## దసరాకు 'డెవిల్' వస్తున్నాడు

దర్శన్

**బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే:** నటుడు దర్శన్ నటిస్తున్న డెవిల్ సినిమా చిత్రీకరణ 80 శాతం పూర్తయింది. విదేశాల్లో చిత్రీకరణకు వెళ్లేందుకు న్యాయస్థానం అనుమతించినా, స్విజర్ల్యాండ్, మరికొన్ని ఐరోపా దేశాలకు వెళ్లేందుకు వీసా లభించలేదు. దీంతో బ్యాంకాక్, దుబాయ్, హైదరాబాద్, ఉదయపూర్‌లతో పాటు మైసూరులో చిత్రీకరణ పూర్తి చేసి దసరాకు విడుదల చేయాలని నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. చిత్రదుర్గకు చెందిన రేణుకా స్వామి హత్య కేసులో శిక్షకు సంబంధించిన తీర్పు వచ్చేలోగా దర్శకులు ప్రేమ్, సూరప్ప బాబు తీసే సినిమాల్లో దర్శన్ నటించే అవకాశం ఉంది.

## ఆ వివాహానికి గుర్తింపు ఉంటుంది

**బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే:** భారతీయులు విదేశాల్లో వివాహం చేసుకుని, అక్కడి చట్టాల ప్రకారం పెళ్లిని రిజిస్ట్రరు చేసుకోకపోయినా, దానికి చట్టబద్ధత ఉంటుందని జస్టిస్ రామచంద్ర డి హుద్దార్ స్పష్టం చేశారు. వివాహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు, సాక్ష్యులు, ఆ జంట పేరిట ఉమ్మడిగా బ్యాంకు ఖాతా, ఇతర గుర్తింపు పత్రాలు ఉంటే ఆ వివాహం చెల్లుతుందన్నారు.

(c) eenadu

# బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

## పోలీసు రాణాలో మంగళముఖికి సన్మానం

కంప్లి తాలూకా సుగ్గేనహళ్లి గ్రామానికి చెందిన మంగళముఖి రాజమ్మ తన భిక్షాటన డబ్బును పొదుపుచేసి రెండు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.60 వేలతో దుస్తులు కొనుగోలు చేసి ఇవ్వడం అభినందనీయమని పోలీసు అధికారులు అన్నారు. ఆమె సేవలను గుర్తించి ఆదివారం కంప్లి పోలీసు రాణాలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఐ వాసుకుమార్, ఎస్సై అవినాశ్, పోలీసులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, కంప్లి

## లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

సింధనూరు: సింధనూరు లయన్స్ క్లబ్ 2025-26 ఏడాది నూతన ఆఫీసు బేరర్ల ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక గోస్వామి కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం వేడుకగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా తెలుగు యువకుడు గూడపాటి వెంకటేష్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ పదవిలో గోనుగుంట్ల రవీంద్ర సేవలందించారు. గూడపాటి వెంకటేష్ ఆఫీసు బేరర్లలో మొదటి ఉపాధ్యక్షుడిగా పి.శివరామకృష్ణ, ద్వితీయ ఉపాధ్యక్షుడిగా డీబీ రంగరాజు, కార్యదర్శిగా వీరేశ్, సహ కార్యదర్శిగా గణేశ్, కోశాధికారిగా జి.రఘుమార్, లయన్ టేమర్‌గా బాపూరావు కులకర్ణి, లయన్ టేల్‌ట్విస్టర్‌గా శివప్రసాద్, సమన్వయకర్త న్యాయవాది జి.నాగరాజ్, కార్యనిర్వాహకుడిగా గౌతం మెహతా, సభ్యత్వ కమిటీ అధ్యక్షుడిగా పద్మనాయుడు, మార్కెటింగ్ కమ్యూనికేషన్ అధికారిగా నాగరాజ్ మాడిసిరివార, సర్వీస్ ఛైర్మన్‌గా జగదీశ్ నియమితులైన వారిలో ఉన్నారు.

## ఆసుపత్రుల్లోనే ప్రసవాలు సురక్షితం

**బళ్లారి, న్యూస్‌టుడే:** ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉంటాయని, ఇక్కడ ప్రసవాలు చేయించుకుంటే తల్లీబిడ్డలు సురక్షితంగా ఉంటారని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమాధికారి డా.యల్లా రమేష్‌బాబు అన్నారు. ఆయన శ్రీరామరంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రసవాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వ ఆసుపత్రులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిందన్నారు. కాన్పులు చేయడానికి అన్నిరకాల వసతులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులు తరచూ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. చిన్నారులకు వ్యాక్సిన్లు, టీకాలు వేయించుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తపోటు, మధుమేహం, హెచ్‌ఐవీ, రక్తహీనత తదితర పరీక్షలను ఉచితంగా చేస్తారని, అవసరమైన ఔషధాలు ఇస్తారన్నారు. గుండె సంబంధిత వ్యాధుల పరీక్షల నిర్వహించడానికి ఈసీజీ తదితర యంత్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. హెచ్‌బీ, ఎఫ్‌బీఎస్, పీపీబీఎస్, సీబీసీ వంటి పరీక్షలూ చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట డా.భరత్, ఆరోగ్య సిబ్బంది ఈశ్వర్ దాసప్పనవర, చెన్నమ్మ, మంగళగౌరి తదితరులున్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ రమేష్‌బాబు, చిత్రంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

## లోక్ అదాలత్‌లో 2 వేల కేసుల పరిష్కారం

**మాన్వి, న్యూస్‌టుడే:** స్థానిక సివిల్ జేఎంఎఫ్‌సీ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో రెండు వేలకు పైగా కేసులను పరిష్కరించినట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రవికుమార్ పాటిల్ వెల్లడించారు. సీనియర్ న్యాయమూర్తులు శివరాజ్ వి సిద్దేశ్వర, ఆనంద్ హెచ్.కొణ్ణూర ఆధ్వర్యంలో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా వ్యాజ్యాలను పరిష్కరించినట్లు తెలిపారు. శివరాజ్ వి సిద్దేశ్వర 599, ఆనంద్ హెచ్.కొణ్ణూర 1525 కేసులను పరిష్కరించారని, విడిపోయి విడాకుల కోసం అర్జీలు పెట్టుకున్న దంపతుల మధ్య రాజీ చేసి వారిని కలిపారు. దంపతులు పరస్పరం పూలదండలు మార్చుకొన్నారు. లోక్‌అదాలత్‌లో న్యాయవాదులు చన్నబసవనాయక్, మనోహర్ విశ్వకర్మ, దత్తాత్రేయ, ఈశప్ప, మల్లేశ్‌మాచనూరు, గుమ్మాబసవరాజ్, బి.కె.అమరేశప్ప, రాజా శ్యాంసుందర్‌నాయక్, లక్ష్మీదేవినాయక్, స్టెల్లా సర్లేట్, హనుమంత, చంద్రశేఖర్, రాథోడ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విడిపోయిన దంపతులను కలుపుతున్న జడ్జీలు

## 25న సిరిగేరి సహకార సంఘం ఎన్నికలు

**సిరుగుప్ప, న్యూస్‌టుడే:** సిరుగుప్ప తాలూకా సిరిగేరి గ్రామంలోని ప్రాథమిక సహకార కృషి పత్తిన సహకార సంఘానికి ఈ నెల 25న ఎన్నికలు నిర్వహిస్తామని రిటర్నింగ్ అధికారి వెంకటేశ్ తెలిపారు. మొత్తం 12మంది నిర్దేశకుల ఎన్నికలకు ఇప్పటికే నామపత్రాల స్వీకరణ ప్రారంభించినట్లు చెప్పారు. 278మంది ఓటర్లు ఉన్నారన్నారు. నామినేషన్ల స్వీకరణకు 16వ తేదీ చివరి గడువని, 18న ఉపసంహరణ, 25న పోలింగ్ జరుగుతుందని, అదేరోజు ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ఆదివారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని, ఇప్పటివరకు పదిమంది నామపత్రాలు ఇచ్చారని ఆయన వివరించారు.

అధికారి వెంకటేశ్‌కు నామపత్రాలు అందిస్తున్న అభ్యర్థులు

## 939వ రోజుకు చేరిన భూపోరాటం

**బళ్లారి, న్యూస్‌టుడే:** కుడతిని భూపోరాట సమితి చేపట్టిన నిరవధిక సత్యాగ్రహం ఆదివారానికి 939వ రోజుకు చేరుకుంది. కుడతిని, వేణివీరాపురం, జానెకుంటె, సిద్దమ్మనహళ్లి, కొళగల్లు, యర్రంగలి, హరగినడోణి తదితర గ్రామాల రైతులు ఆందోళనలో పాల్గొని నిరసన తెలిపారు. 14 సంవత్సరాల ముందు వివిధ స్టీల్ పరిశ్రమల కోసం వ్యవసాయ భూములను తక్కువ ధరలకు స్వాధీనం చేసుకున్నారని అన్నదాతలు వాపోయారు. న్యాయస్థానం నూతన భూస్వాధీన చట్టం ప్రకారం తమవద్ద తీసుకున్న భూములకు అధిక ధర ఇవ్వాలని సూచించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బాధపడ్డారు. దీనిపై ముఖ్యమంత్రి, పరిశ్రమల మంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు భూపోరాటం సాగుతుందని హెచ్చరించారు. ఆందోళనలో తిప్పేస్వామి, జంగ్లిసాబ్ తదితర రైతులు పాల్గొన్నారు.

నిరవధిక సత్యాగ్రహంలో పాల్గొన్న రైతులు

## ఆనకట్టల్లో పెరుగుతున్న నీటి మట్టం

**రాయచూరు, న్యూస్‌టుడే :** ఉత్తర కర్ణాటకలోని ప్రధాన జలాశయాల్లో నీటి మట్టం పెరిగింది. గరిష్ఠ మట్టానికి చేరువ అవుతున్నందున సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఆదివారం ఉదయానికి ఆలమట్టిలో 91.928 టీఎంసీలు, సాయంత్రానికి నారాయణపురలో 28.533 టీఎంసీల నీటి నిల్వ దాఖలైంది. ఎగువ భాగంలో వానలు తగ్గుముఖం పట్టినందున వరద నీటి ప్రమాణం పడిపోయింది. ఆలమట్టిలోకి 78,497 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో, 42,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నిన్నటి కంటే అవుట్‌ఫ్లో తగ్గింది. ఇన్‌ఫ్లోలో మార్పు లేదు. నారాయణపురలోకి 20 వేల క్యూసెక్కులు నీరు వస్తుంటే, దిగువకు 3 వేల క్యూసెక్కులను విడుస్తున్నారు. 24 గంటల ముందు 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 22,320 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

# నీరొదిలినా... ఎదురుచూపేనా

- ఆధునికీకరణ పనులతో తిప్పలు
- ఉపకాలువలకు చేరని సాగునీరు

వరి నారు సిద్ధం చేసుకున్న రైతులు

**బళ్లారి, న్యూస్‌టుడే:** అంగట్లో అన్నీఉన్నా అల్లుడు నోట్లో శని చందంగా బళ్లారి జిల్లా రైతుల పరిస్థితి మారింది. తుంగభద్ర జలాశయంలో పూర్తిస్థాయిలో వరదనీరు ఉండటంతో 20 రోజులుగా నదికి విడుదల చేస్తున్నారు. కాలువల ఆధునికీకరణ పేరిట ఆంధ్రప్రదేశ్ వాటా ఇవ్వలేదు. కర్ణాటక వాటా మాత్రమే వదలడంతో బళ్లారి జిల్లాలోని ఉప కాలువల నాగునీరు చేరక కర్షకులు అవస్థలు పడుతున్నారు. తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) 105 కిలోమీటర్ వరకు తుంగభద్ర మండలి కిందికి వస్తుంది. ఈ నెల 10న వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం హెచ్చెల్సీ కాలువకు 700 క్యూసెక్కులు వదిలారు. ఎల్లెల్సీ కాలువలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కాలువ దిగువ 205 నుంచి 250 కిలోమీటర్ వరకు ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. వాటికి ఇబ్బంది కలగకుండా కేవలం 600 క్యూసెక్కులు విడుదల చేశారు. నీరు వదిలి రెండు రోజులైనా ఇప్పటివరకు 53వ కి.మీ. వరకే చేరాయి. ఈ నెల 15 లేదా 16న కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకు చేరుకుంటాయని తుంగభద్ర మండలి ఇంజినీర్లు చెబుతున్నారు.

**బీడుగా మారుతున్న పొలాలు:** హెచ్చెల్సీ కాలువకు ప్రతి ఏడాది ఒకే పంటకే నీటినిస్తారు. జులై నుంచి డిసెంబరు వరకు నీరొస్తుంది. ఈ ఏడాది తుంగభద్ర జలాశయం గేట్లు బలహీనపడటంతో కేవలం 80 టీఎంసీలు మాత్రమే నిల్వ చేయాలని నిపుణులు ఇప్పటికే తుంగభద్ర మండలి అధికారులకు నివేదిక అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నవంబరులోనే నీటిని నిలిపేసే అవకాశముంది. మరోవైపు అన్నదాతలు వరి నారు సిద్ధం చేసుకున్నా, ఉప కాలువలకు నీరు చేరకపోవడంతో పొలాలు బీడుపడ్డాయి. ఎల్లెల్సీకీ నీటిని విడుదల చేసి మూడు రోజులు గడిచినా 50వ కిలోమీటరుకు చేరలేదు.

ఉప కాలువలో కానరాని చుక్కనీరు

ముళ్లకంపలతో మూసుకుపోయిన ఉప కాలువ

**హెచ్చెల్సీ కింద 17 ఉపకాలువలు:** తుంగభద్ర జలాశయ హెచ్చెల్సీ కాలువలో మొత్తం 17 ఉప కాలువలు ఉన్నాయి. ఈ కాలువల్లో పూడిక, గట్లపై పెరిగిన ముళ్లకంపలను తొలగించకపోవడంతో దుస్థితికి చేరుకున్నాయి. కనీసం కాలువల్లో పేరుకున్న వ్యర్థాలను తీయకపోవడంతో శివారులోని నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణానగర్ క్యాంపు మీదుగా వెళుతున్న 11, కొళగల్లుపై 12, 13, బళ్లారి మీదుగా వెళ్లే 14వ ఉపకాలువలు దయనీయ స్థితిలో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని అన్నదాతలు కోరుతున్నారు.

### కాలువలకు నీరు రావడం లేదు

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్లుగా తయారైంది తుంగభద్ర ఆయకట్టు రైతుల పరిస్థితి. తుంగభద్ర జలాశయం పూర్తిగా నిండిపోయి 20 రోజులుగా నదికి నీటిని వదిలారు. పంటల సాగుకు కాలువలకు నీటిని విడుదల చేయడం లేదు. ఇప్పటికే వరి నారు పెరిగిపోతోంది. మిరప నాట్లు, ఇతర పంటలు సాగు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అధికారులు తక్షణమే ఉపకాలువలకు నీరందేలా చూడాలి. **-బలరాం, రైతు, కృష్ణానగర్ క్యాంపు**

### ప్రతి ఏడాది ఇదే పరిస్థితి

తుంగభద్ర జలాశయ ఉపకాలువలకు నీటిని నిలిపేసి ఎనిమిది నెలలు గడిచింది. కాలువల్లో పూడిక, గట్లపై పెరిగిన ముళ్లకంప చెట్లు, పిచ్చి మొక్కలను ఇప్పటివరకు తొలగించనే లేదు. చివరికి వ్యర్థాలనూ తీయలేదు. ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. వరి నారు సిద్ధమైంది. ఒకటి రెండు రోజుల్లో నాటాలి. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి నెలకొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలాగైతే పంటలు ఎలా పండుతాయి. **-శ్రీనివాసులు, రైతు, లక్ష్మీనగర్ క్యాంపు**

## అర్హులకే పంచ గ్యారంటీ పథకాలు

**శ్రీరామనగర్, న్యూస్‌టుడే:** ప్రభుత్వం అమలు చేస్తున్న పంచ గ్యారంటీ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కొప్పళ జడ్పీ సీఈఓ వర్ణిత్ నేగి సూచించారు. శ్రీరామనగర్‌లో ఆదివారం జరిగిన పంచ గ్యారంటీ పథకాల అమలు, గ్రామ పంచాయతీ ప్రగతి పరిశీలన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్యారంటీ పథకాల అమలుపై ప్రతి నెలా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నటుల చెప్పారు. గ్యారంటీ పథకాల అనుష్ఠాన సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డిశ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని 2,160 మంది మహిళలు గృహలక్ష్మి పథకం లబ్ధి పొందారన్నారు. సాంకేతిక కారణాలతో 59 మందికి అందలేదన్నారు. వారికి త్వరలో లబ్ధి చేకూరేలా చూస్తామన్నారు. జిల్లాలో గ్యారంటీ పథకాల అమలు ఎలా జరుగుతుందో వివరించారు. టీపీ అధికారి రామరెడ్డిపాటిల్, నాయకులు మహ్మద్ రఫీ, సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు మాట్లాడారు. పంచ గ్యారంటీలు తమ జీవితాలను ఎలా మార్చాయో లబ్ధిదారులు తెలిపారు. తల్లిదండ్రులు లేని తన మనవళ్ల చదువుకు గృహలక్ష్మి డబ్బు ఉపయోగపడుతోందని వృద్ధురాలు శంకరమ్మ చెప్పగా, తాళిబొట్టు కొనుక్కున్నట్లు ఓ ఇంతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు శాంతప్ప, నాయకులు రెడ్డివీర్రాజు, మన్నె కృష్ణమూర్తి, చిలుకూరి వెంకటరామకృష్ణ, పొట్లూరి వెంకటేశ్వరరావు, కరుటూరి శ్రీనివాస్, పి.రామకృష్ణ, సాంబమూర్తి, కె.లక్ష్మి, సుభాష్ చంద్రబోస్, వరదరాజు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న రెడ్డి శ్రీనివాస్, జడ్పీ సీఈఓ వర్ణిత్‌నేగి తదితరులు

## ఎట్టకేలకు బోనులో పడిన చిరుత

**రాయచూరు, న్యూస్‌టుడే :** రాయచూరు తాలూకాలోని దొంగరాంపూరు గ్రామస్థులకు నెల రోజులుగా కంటిమీద కునుకు లేకుండా చేసిన రెండేళ్ల వయసు ఉన్న చిరుతను ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు బంధించారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న చిరుత ఆహారం కోసం శివార్లకు వచ్చి మేకలు, కుక్కలు, ఇతర జంతువులపై దాడి చేసి చంపేది. దీంతో గ్రామస్థులు బయటికి రావాలంటే జంకే వారు. అటవీశాఖ అధికారులు రెండు బోనుల్లో ఆహారాన్ని ఉంచి ఎరవేశారు. చిరుత చలనాన్ని పర్యవేక్షించేందుకు ముగ్గురు సిబ్బందిని నియమించారు. సీసీ కెమెరాలను అమర్చారు. బోను దగ్గరికి వచ్చి వెనక్కి వెళ్లిపోయేది. ఆదివారం ఉదయం బోనులోకి వెళ్లి చిక్కుకుంది. చిరుతను మృగాలయానికి తరలించారు. దొంగరాంపూరు ప్రజలు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు.

గాండ్రిస్తున్న చిరుత

## 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు

మసీదు ప్రాంతంలో మొక్కలు నాటుతున్న మౌలాలీ ట్రస్టు సభ్యులు

**కంప్లి, న్యూస్‌టుడే:** కంప్లి రెండో వార్డులోని మసీదులో 20 ఏళ్లుగా కవడి పీర్ల (చోటా మొహర్రం)ను ప్రతిష్ఠించి సమాజ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని మౌలాలీ తాత యువకర సేవా ట్రస్టు గౌరవాధ్యక్షుడు ఎం.ముస్తఫా తెలిపారు. ఆయన ఆదివారం మసీదు పరిసరాల్లో 40 పైగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు నాటిన ఈ మొక్కలను సంరక్షించి పెద్ద వృక్షాలుగా చేస్తామన్నారు. చోటా మొహర్రం సందర్భంగా మసీదులో వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. ట్రస్టు అధ్యక్షుడు అంబాదాసు, వెంకటేశ్, ముక్కణ్ణ, మహబూబ్, రహమాన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తి మరుగుదొడ్లు ఎందుకు?

**చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే:** జిల్లా బాధ్య మంత్రి డి.సుధాకర్ సొంత నియోజకవర్గం హిరియూరు తాలూకా ఆదివాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. దీనివల్ల దాదాపు రూ.10లక్షల ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయని గ్రామస్థులు మండిపడుతున్నారు. గ్రామానికి చెందిన చమన్ షరీఫ్ విలేకరులతో మాట్లాడుతూ ఏడాది క్రితం రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన రెండు మరుగుదొడ్ల నిర్మాణం పనులను సగంలోనే వదిలేశారన్నారు. వాటిని గుత్తేదారు పూర్తిచేసి పాఠశాలకు అప్పగించకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో మరో రూ.5లక్షల వ్యయంతో వాటి పక్కనే కొత్త మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టారన్నారు. గోడలు కట్టి, జింక్ షీట్లు వేశారని, లోపల పనులను ఆపేశారన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు వ్యయం చేసినా అవి అందుబాటులోకి రాకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు

## ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత సాధ్యం

సత్కారం అందుకున్న మణ్ణూరు రైతు తళవార ఈరణ్ణ

**కంప్లి, న్యూస్‌టుడే:** ప్రతి రోజూ కొంత సమయన్ని ఆధ్యాత్మికతకు కేటాయిస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందని మణ్ణూరు గ్రామ రైతు తళవార ఈరణ్ణ అన్నారు. కంప్లి అక్కమహాదేవి మహిళా మండలి అనుభవ మంటపంలో ఆదివారం శరణ సాహిత్య పరిషత్ నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలకు చిన్ననాటి నుంచే శరణుల వచనలు బోధించాలన్నారు. అప్పుడే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. 'శరణర విచారధార' అంశంపై ఉపన్యసించారు. కన్నడ హిత రక్షక సంఘం గౌరవాధ్యక్షుడు హేమయ్యస్వామి, సాంగత్రయ సంస్కృత పాఠశాల ప్రధానాచార్యులు ఘనమఠయ్య హిరేమఠ తదితరులు పలు ఆధ్యాత్మిక అంశాలను వివరించారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు జి.ప్రకాశ్, ప్రతినిధులు బంగి దొడ్డ మంజునాథ, ఎస్.డి.బసవరాజ్, శశిధర శాస్త్రి, భత్తద సంధ్య, బి.ఎం.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలన దేశానికే ఆదర్శం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పురపాలక మంత్రి రహీంఖాన్

**సింధనూరు, న్యూస్‌టుడే:** అయిదు గ్యారంటీ పథకాలను విజయవంతంగా అమలుచేస్తూ, రాష్ట్రాన్ని చక్కగా పాలిస్తున్న సిద్ధరామయ్య ప్రభుత్వం దేశానికే ఆదర్శమని పురపాలక మంత్రి రహీంఖాన్ అన్నారు. ఆయన ఆదివారం సింధనూరులో జరిగిన నగరాభివృద్ధి ప్రాధికార నూతన పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్యారంటీ పథకాలకు ఏటా రూ.60వేల కోట్లు వెచ్చిస్తున్న తమ ప్రభుత్వం కల్యాణ కర్ణాటక అభివృద్ధికి అంతే ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సిద్ధరామయ్య పాలనలో కల్యాణ కర్ణాటక ఊహించని విధంగా ప్రగతి సాధించిందన్నారు. సింధనూరు సీనియర్ ఎమ్మెల్యే బాదర్లి సీఎంకు అత్యంత ఆప్తుడన్నారు. ప్రజల తాగునీటి అవసరాలకు చెరువు తవ్వాలని బాదర్లి కోరిన వెంటనే రూ.25కోట్లు మంజూరు చేశారన్నారు. ఇతరత్రా కలిపి రూ.31 కోట్లతో తుర్విహాళ వద్ద మంచినీటి చెరువు నిర్మాణానికి ఇప్పుడే శంకుస్థాపన చేశామన్నారు. ఎమ్మెల్యే బాదర్లి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాది రెండంటే రెండు పట్టణాలకు నగరాభివృద్ధి ప్రాధికార హోదా దక్కిందని, అందులో సింధనూరు ఒకటన్నారు. ఇకపై పట్టణ పరిధిలో కొత్త లేఅవుట్లను ప్రాధికార సొంతంగా వేస్తుందన్నారు. ప్రాధికార కొత్త అధ్యక్షుడు బాబూగౌడ బాదర్లి మాట్లాడుతూ మా కుటుంబం సింధనూరు ప్రజల ప్రేమను గెల్చుకుందని, అందుకే అయిదుసార్లు మా చిన్నాన్న (ఎమ్మెల్యే బాదర్లి) శాసనసభ్యులు అయ్యారన్నారు. తొలుత ప్రాధికార మండలి సభ్యులను బాజా భజంత్రీల నడుమ వేడుకగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీ రాజశేఖర్, ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ, ఎమ్మెల్సీలు శరణప్ప బయ్యాపూర, వసంత్‌కుమార్, ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే రుద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.

సింధనూరు నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన బాబూగౌడ బాదర్లి

### తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

| 13-07-2025 (ఉ॥ 8 గంటలకు) | ప్రస్తుతం | గత సంవత్సరం |
|---|---|---|
| నీటిమట్టం (అడుగుల్లో) | 1625.32 | 1606.21 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 42,844 | 18,060 |
| అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 35,300 | 210 |
| నీటి నిల్వ (టి.ఎం.సి) | 77.542 | 230.690 |

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

# సంఘటిత పోరాటమే శరణ్యం

**మాన్వి, న్యూస్‌టుడే :** కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటం ఒక్కటే శరణ్యమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు హెచ్.శర్ఫుద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని తాలూకా పంచాయతీ సభా ప్రాంగణంలో కట్టడ, నిర్మాణ కార్మికుల సంఘం రెండో సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చాలా ఏళ్లుగా పోరాడుతున్న కార్మికులకు కనీస సదుపాయాలు కల్పించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక దోరణ అవలంభిస్తోందన్నారు. కార్మికుల పిల్లలకు అందాల్సిన ప్రభుత్వ సదుపాయాలు అందలేదన్నారు. కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పనిచేస్తోందన్నారు. కార్యదర్శి షబ్బీర్ మాట్లాడుతూ కార్మిక సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సభ్యత్వం లేని వారికి గుర్తింపు ఉండదనే విషయాన్ని గుర్తుచేశారు. హట్టి పట్టణంలో నిర్వహించనున్న జిల్లా కార్మిక సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కట్టడ కార్మిక సంఘానికి నూతన సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఆంజినేయ కోటె, యూసూఫ్‌ఖాన్, సిద్ధలింగయ్య, మహ్మద్ నీర్ మాన్వి, రుద్రప్పనాయక్, భాషా, రామణ్ణ, వెంకటేశ్, వెంకణ్ణ, ఇమామ్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న శర్ఫుద్దీన్, తదితరులు

# ప్రగతికి సాంకేతికత దోహదం

మాట్లాడుతున్న ఉపకులపతి సురేష్ జంగమ్‌శెట్టి, చిత్రంలో ఆచార్యులు నారాయణ, హనుమంతరెడ్డి తదితరులు

**బళ్లారి, న్యూస్‌టుడే:** కఠినశ్రమ, కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని హావేరి విశ్వవిద్యాలయం ఉపకులపతి సురేశ్ హెచ్.జంగమ్ శెట్టి అన్నారు. బళ్లారి రావ్‌బహద్దూర్ వై.మహబలేశ్వరప్ప సాంకేతిక మహావిద్యాలయ స్నాతకోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంజినీరింగ్ కోర్సు పూర్తిచేసిన పట్టభద్రులు తమ పరిశోధనలు ఆపకూడదని, సమాజానికి అవసరమైన కొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతిక విద్యతోనే ప్రగతి పరుగులు తీస్తోందన్నారు. సాధన లేకపోతే ఇంజినీరింగ్ వృత్తిలో రాణించడం కష్టమవుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో ఏఐ, చాట్‌జీపీటీ తదితర సాంకేతిక పరిజ్ఞానం అద్భుతాలు సృష్టిస్తోందన్నారు. వాటిని మనం అందిపుచ్చుకోవాలని సూచించారు. జీవితంలో ఎంతెత్తు ఎదిగినా జన్మనిచ్చిన తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. నేడు ఇంజినీరింగ్ కోర్సు చేస్తున్న విద్యార్థులు నాలుగు గోడల మధ్య చదువుకే పరిమితం కాకుండా పరిశోధనలు చేపట్టాలన్నారు. ఏఐతో పాటు మెషీన్ లర్నింగ్ తదితర కోర్సులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆచార్యులు డా.నారాయణ మాట్లాడుతూ సాంకేతిక విద్యార్థులు ప్రతి అంశాన్ని సవాల్‌గా తీసుకొని ముందుకు సాగాలన్నారు. గత పదేళ్లలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో వృద్ధి చెందిందన్నారు. వచ్చే పదేళ్లలో అద్భుతాలు చేయాలన్నారు. ప్రధాన ఆచార్యులు డా.హనుమంతరెడ్డి విద్యార్థుల ప్రతిభ, ఉద్యోగావకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో పరీక్షా విభాగం డీన్ శ్రీపతి, కళాశాల అధ్యక్షుడు జానెకుంటె బసవరాజు, కార్యదర్శి డా.అరవింద్ పాటీల్, సభ్యులు యర్రిస్వామి, ప్రకాష్ ఆచార్యులు సవిత సూనూళి, డా.ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న పట్టాదారులు

(c) eenadu

# ఘన చరితం.. మన వారసత్వం

## యునెస్కో జాబితాలో చేరనున్న ఐదు ప్రాచీన కట్టడాలు

చెదరని కళాకృతుల ఐహోళ్ పురాతన దుర్గ కోవెల

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** ప్రపంచ ప్రాచీన వారసత్వ సంపద (యునెస్కో) జాబితాలోకి కర్ణాటకలోని ఐదు ప్రాచీన కట్టడాలు చేర్పించేందుకు ప్రభుత్వం వంతు ప్రయత్నాలు మొదలు పెట్టింది. మహారాష్ట్రలోని తొమ్మిది ప్రాచీన కట్టడాలు యునెస్కో జాబితాలో చేరడంతో కర్ణాటక ప్రభుత్వం మేలుకొంది. ఈ మేరకు రాష్ట్రంలో ఖ్యాతి పొందిన ప్రాచీన కట్టడాలు వివరాలతో కూడిన నివేదికలను రాష్ట్ర పురావస్తు శాఖ, పర్యాటక శాఖలు సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వానికి పంపించాయి. కేంద్ర ప్రభుత్వం నివేదికలను యునెస్కో సంస్థకు పంపిస్తుందని, అనంతరం సంస్థ అధికార ప్రతినిధులు వచ్చి పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. కర్ణాటక ప్రాచీన కట్టడాలు, ఆలయాలు, ప్రదేశాలకు పుట్టినిల్లు. హోయసళ, చాళుక్య, జైన, ఇస్లామిక్ వాస్తు శైలిలో ప్రాచీన కాలంలో రాజులు నిర్మించారు. పురాతన ఆలయాలకు నిలయమైన బాగల్‌కోట్ జిల్లాలోని ఐహోళ్‌లో చాళుక్యులు దుర్గ ఆలయాన్ని నిర్మించారు. చాళుక్యుల్లో మొదటి రాజులు కేవలం రాతి స్తంభాలతో ఆలయాన్ని పూర్తిగా నిర్మించారు. అదే జిల్లాలో ఉన్న బాదామి ప్రాంతంలో కొండ పక్కన చాళుక్య రాజులు నీటి కొలను మధ్య భూతనాథ్ గుడిని కట్టారు. అక్కడే జైన ఆలయం ఉంది. దాన్ని ఐదో శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్రకారులు తెలిపారు. అతి ప్రాచీన ఆలయాల్లో అది ఒకటిగా గుర్తింపు పొందింది. పట్టదకల్లులో ఒకే ప్రాంతంలో ఎనిమిదో శతాబ్దంలో చాళుక్య రాజులు విరపాక్ష, సోమేశ్వర, సంగమేశ్వర ఆలయాలను రాళ్లతో నిర్మించారు. మండ్య జిల్లాలోని శ్రీరంగపట్టణలో తొమ్మిదో శతాబ్దంలో గంగా వంశ రాజులు నిర్మించిన శ్రీరంగనాథస్వామి ఆలయం చరిత్ర ప్రసిద్ధిగాంచింది. కృష్ణదేవరాయలు ఆలయాల అభివృద్ధికి ఎక్కువ ధనం వ్యయం చేశారు. టిప్పు సుల్తాన్‌తో పాటు మైసూరు మహారాజులు ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేశారు. నిత్యం భక్తులతో కోవెల కళకళలాడుతోంది. బిజపుర జిల్లాలో బహమనీ రాజులు నిర్మించిన గోల్ గుంబజ్ అతి పురాతనమైంది. అది దక్కన్ సుల్తాన్ పేరుపై కట్టారు. బహమనీ రాజులు తమ విడిది కోసం దాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది. ప్రపంచంలో అతి పెద్ద డోమ్ ఆకారం కలిగిన కట్టడాల్లో గోల్ గుంబజ్ రెండో స్థానంలో ఉంది. ఈ ఐదు పురాతన కట్టడాలను యునెస్కో జాబితాలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టిందని రాష్ట్ర న్యాయ పర్యాటక శాఖ మంత్రి హెచ్.కె.పాటిల్ తెలిపారు. యునెస్కో జాబితాలో చేరాల్సిన అనేక ప్రదేశాలు, ప్రాచీన కట్టడాలు కర్ణాటకలో ఉన్నట్లు తెలియజేశారు.

బాదామి భూతనాథ్ ఆలయం

పట్టదకల్లులో కొలువైన ప్రాచీన కట్టడం

శ్రీరంగపట్టణలోని శ్రీరంగనాథస్వామి దేవస్థానం


బిజపుర ప్రాచీన గోల్ గుంబజ్

## కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం

**బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే:** ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతికి నగరంలోని వివిధ తెలుగు సంఘాలు ఆదివారం ఇక్కడ విడుదల చేసిన వివిధ ప్రకటనల్లో తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. బహు భాషా నటుడు కోట శ్రీనివాసరావు మృతితో గొప్ప నటుడిని సమాజం కోల్పోయిందని కర్ణాటక తెలుగు ప్రజాసమితి అధ్యక్షుడు డాక్టర్ బొందిగా మస్తాన్ తెలిపారు. విలన్ పాత్రల్లో నటించి ఆ కాలం నటుడు ఎస్వీరంగారావును తలపించేలా వివిధ పాత్రల్లో జీవించారన్నారు. నవరసాల నటుడిగా కోట శ్రీనివాసరావు గుర్తింపు పొందారని రంగస్థల నటుడిగా జీవితాన్ని ప్రారంభించారని సమితి ప్రధాన కార్యదర్శి బాబు రాజేంద్రకుమార్ తెలిపారు. నటుడిగా రాజకీయనేతగా గుర్తింపు పొందారని తెలియజేశారు. తెలుగు సమాజం గొప్పనటుడిని కోల్పోయిందన్నట్లు బెంగళూరు నగర పీజీ సమాఖ్య అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. తెలుగు సినీరంగానికి తెలుగు సాహిత్యానికి కోటశ్రీనివాసరావు సేవలు అందించారని కేంద్ర ప్రభుత్వ రంగ తెలుగు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఎల్.నాగేశ్వరరావు తెలియజేశారు. ఆయన మృతి సినీరంగానికి తీరని లోటు అని అభివర్ణించారు.

## తెలుగు విజ్ఞాన సమితి సంతాపం

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే:** నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణ రాజు సంతాపాన్ని ప్రకటించారు. వైవిధ్యమైన పాత్రలు పోషించి పలువురు నటులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని పేర్కొన్నారు. తెలుగు విజ్ఞాన సమితి వార్షికోత్సవాల్లో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్, నటుడు తనికెళ్ల భరణి, నటి మీనాతో కలిసి కోట శ్రీనివాసరావుకు శ్రీకృష్ణ దేవరాయల పురస్కారాన్ని ప్రదానం చేశామని గుర్తు చేసుకున్నారు.

సమితి ప్రతినిధులతో కలిసి కోట శ్రీనివాసరావును సత్కరిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య (పాతచిత్రం)

## హంతకుల అరెస్టు

**ధార్వాడ, న్యూస్‌టుడే:** తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియునితో కలిసి భర్తను హత్య చేసిన కరెవ్వ (30) అనే మహిళను, హత్య చేసిన ఫకీరప్ప, అతనికి సహకారాన్ని అందించిన సొబ్బు లక్ష్మణను రామదుర్గ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. కరెవ్వ భర్త ఈరప్ప యల్లప్ప మద్దుం తాగుడుకాని అమ్మినబావి గ్రామం నుంచి పిలుపుకు వచ్చి గొంతు పిసుకు తువ్వాలుతో బిగించి హత్య చేశారు. ముఖాన్ని గుర్తుపట్టకుండా రాయితో నుజ్జు చేశారు. తన భర్త కనిపించడం లేదని రామదుర్గ ఠాణాలో కరెవ్వ ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి ఆమె చరవాణికి ఫకీరప్ప నుంచి ఎక్కువ సార్లు ఫోన్లు వస్తున్నట్లు గుర్తించి, అదుపునకు తీసుకుని ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించారు.

# దార్శనిక మేధావి ఆచార్య సత్యనారాయణశాస్త్రి

యోగాభారతి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వక్తలు

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** యోగాభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆచార్య ఎ.సత్యనారాయణ శాస్త్రి శత జయంతి ఉత్సవాలను ఇక్కడ బెంగళూరు నగరంలో నిర్వహించారు. కార్యక్రమానికి అనేక మంది పూర్వవిద్యార్థులు, ప్రముఖ వేదాంతులు, విజ్ఞానులు తదితరులు ఆయన జ్ఞాపకాలను పంచుకున్నారు. పరివర్తన, అనుభవబోధలుగా సత్యనారాయణ శాస్త్రిని అణు శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు అన్వేషకులు వేదాంత జ్ఞాన మార్గాన్ని ప్రకాశవంతం చేసే దార్శనిక మేధావిగా కీర్తించారు. ఆచార్య ఎ.సత్యనారాయణ శాస్త్రి ప్రసిద్ధ భారతీయ పండితుడు, రచయిత, ఆధ్యాత్మిక గురువుగా ఖ్యాతి పొందారని వక్తలు కొనియాడారు. హిందూ గ్రంథాలపై గాఢమైన జ్ఞానానికి, ప్రాచీన జ్ఞానాన్ని ప్రస్తుత ఆచరణాత్మక జీవితానికి అన్వయం చేయడంలో ప్రసిద్ధి చెందారని తెలియజేశారు. వేద సంప్రదాయాలు, తత్వశాస్త్రం, భక్తిసాహిత్యం ఆచరణాత్మక అవగాహన ప్రచారానికి ఆయన గణనీయంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన ప్రసంగాలు, బోధనలు వేద గ్రంథాలు భక్తి ఉద్యమాలు, హిందూ ఆచారాలపై ఆసక్తి ఉన్న భక్తులను పండితులను ఇప్పటికీ ప్రేరేపిస్తున్నాయని వివరించారు. శాస్త్రి శ్రీమద్భాగవత సారకుడు, ఉపనిషత్తులు వేదాంతంపై విస్తృతమైన జ్ఞానం ఉన్న వారు ఆయన అడిగే ప్రశ్నల విధానం, పరిష్కారం కనుగొనే విధానం ఆధునికమైనదిగాను, శాస్త్రీయమైనదిగాను ప్రస్తుత కాలానికి సందర్భోచితమైనదని తెలియజేశారు. సుఖ దుఃఖాల పరిశ్ర భోగ సుఖాలు, బ్రహ్మ సుఖం, మనసును నిశ్చలంగా చేయడం, ఆనందం విశ్లేషణ, విద్యలు, చైతన్యం సాగడం, పంచకోశవివేకం అవతారత్రయం, ఎనర్జీ మోడల్, కర్మయోగం, భక్తియోగం, జ్ఞానయోగం, కర్మకాండలు, ఆచారాలు, జపాలు, గాయత్రి ఓం నిశ్శబ్దం వైపు నడిపిస్తాయని, స్వేచ్ఛ విషయ సాధన మార్గం ఆయన బోధించారని వివరించారు. కార్యక్రమంలో వేదపండితుడు డాక్టర్ రామచంద్ర జి.భట్, డాక్టర్ హెచ్.ఆర్.నాగేంద్ర, డాక్టర్ నాగరత్న, డాక్టర్ శమంతకమణి, డాక్టర్ లతాహేమచంద్, డాక్టర్ ఆర్.రంగన్, ఆచార్య సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్రీధర్ మెల్కోటి, డాక్టర్ బి.ఆర్. తదితరులు నివాళులు అర్పించారు. రామకృష్ణ ఎస్.రాధాకృష్ణన్, డాక్టర్ ఆన్ డెజాల్స్, రఘునందన్ త్రికన్నాల్, శాస్త్రి ప్రియశిష్యుడు రఘురామ్‌జీ తదితరులు హాజరై నివాళి అర్పించారు.

కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

## చెరుకు తోటలో చిరుత పిల్లలు

**మండ్య, న్యూస్‌టుడే:** మద్దూరు తాలూకా అణ్ణూరు గ్రామంలో చెన్నమాదే గౌడ అనే రైతు పొలంలో చెరకు తోట నరుకుతున్నప్పుడు మూడు చిరుత పిల్లలు కనిపించాయి. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఆ పిల్లలను పట్టుకుని వెళ్లారు. పిల్లల కోసం చిరుత వస్తుందని స్థానికుల ఆందోళన వ్యక్తం చేయడంతో గ్రామ శివార్లలో పలు చోట్ల బోనులు ఏర్పాటు చేశారు.

## అప్పుల బాధ తాళలేక బలవన్మరణం

**హుబ్బళ్లి, న్యూస్‌టుడే:** అప్పుల బాధ తాళలేక కుందగోళ తాలూకా బరద్వాడ గ్రామానికి చెందిన రవిరాజ్ జాదవ్ (42), బసవనగౌడ పాటిల్ (54) అనే రైతులు విషం తీసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. గత నాలుగేళ్లలో అతివృష్టి, అనావృష్టి, పంట పండిన ఏడాది ధరలు లేకపోవడంతో బ్యాంకులు, బయట వ్యక్తుల వద్ద రుణాలు తీసుకున్నారు. రుణాన్ని తిరిగి చెల్లించలేక తమ ఇళ్లలో విషం తీసుకున్నారు. కుందగోళ ఠాణా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసుల అదుపులో నిందితుడు

**మండ్య, న్యూస్‌టుడే:** నాలుగేళ్ల బాలికకు చాక్లెట్ ఇప్పిస్తానని నమ్మించి లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన నిందితుడ్ని (21) మండ్య ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. బిహారుకు చెందిన బాధితురాలి తల్లిదండ్రులు స్థానిక ప్లైవుడ్ పరిశ్రమలో కార్మికులుగా పని చేసేవారు. పరిశ్రమల సమీపంలో వీరి షెడ్డుకు సమీపంలోనే నిందితుడు కూడా ఉండేవాడని పోలీసులు తెలిపారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

| | |
|---|---|
| బీన్స్- | 75 |
| క్యారెట్- | 85 |
| బీరకాయలు- | 50 |
| క్యాబేజి- | 35 |
| క్యాలీఫ్లవర్(ఒక్కటి)- | 35 |
| సొరకాయ- | 45 |
| దొండకాయలు- | 45 |
| పొట్లకాయ- | 35 |
| టమాటా(నాటు)- | 25 |
| టమాటా(సాధారణ)- | 20 |
| గుమ్మడి- | 35 |
| ఆలుగడ్డ- | 30 |
| ఉల్లి(మేలురకం)- | 30 |
| ఉల్లి(సాధారణ)- | 25 |
| వెల్లుల్లి- | 190 |
| సాంబారు ఉల్లి- | 170 |
| బీట్‌రూట్- | 40 |
| వంకాయలు- | 60 |
| బెండకాయలు- | 65 |
| ముల్లంగి- | 45 |
| నిమ్మకాయ- | 280 |

### పండ్లు,ఫలాలు ధరలు

| | |
|---|---|
| వాషింగ్టన్ ఆపిల్- | 420 |
| సిమ్లా ఆపిల్- | 285 |
| గ్రీన్ ఆపిల్- | 395 |
| అరటి కాయలు- | 35 |
| సపోటా- | 65 |
| పైనాపిల్- | 45 |
| బొప్పాయి- | 35 |
| ఆరంజి- | 195 |
| బత్తాయి- | 95 |

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

## కడుపులో హల్‌సెల్

అదేంటి కడుపులోనా.. నమ్మమంటారా.. నిజమేమరి.. చరవాణి ఎలా కడుపులోకి వెళ్లిందబ్బా.. తెలుసుకోవాలనుందా.. అయితే చదవండి మరి.. శివమొగ్గ కేంద్ర కారాగారంలో దౌలత్ ఖాన్ అలియాస్ గుండ (30) ఖైదీ కడుపు నుంచి వైద్యులు చరవాణిని బయటకు తీశారు. కడుపులో నుంచి రింగ్ టోన్లు వినిపించడంతో సహ ఖైదీలు కొందరు కారాగారం అధికారులకు తెలిపారు. తాను పొరపాటున రాయిని మింగానని, కడుపులో నొప్పి వస్తోందని చెప్పడంతో అతనికి ఎక్స్‌రే తీయించారు. పొట్టలో చరవాణి ఉన్నట్లు గుర్తించి, మెగ్గాన్ ఆసుపత్రిలో చేర్పించారు. శస్త్రచికిత్స చేసి చరవాణిని శనివారం బయటకు తీశారు. ఒక అంగుళం వెడల్పు, మూడు అంగుళాల పొడవైన బేసిక్ ఫోన్‌గా గుర్తించారు. సోదాల సమయంలో ఫోన్‌ను మింగి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడ్ని ఆసుపత్రి నుంచి కారాగారంలోని ప్రత్యేక వార్డుకు ఆదివారం తరలించారు. జైలర్ రంగనాథ్ ఫిర్యాదుతో తుంగానగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కోలుకున్న అనంతరం విచారణ చేస్తామని వారు తెలిపారు. – న్యూస్‌టుడే, శివమొగ్గ

దౌలత్ ఖాన్

కడుపు నుంచి తీసిన చరవాణి

## సామ్రాట్ అశోక్ నాటక ప్రదర్శన

డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలు వేసి నాటక ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రులు డాక్టర్ మహదేవప్ప, ఈశ్వర్ ఖండ్రె తదితరులు

సామ్రాట్ అశోక్ నాటకంలో ఓదృశ్యం

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే:** బౌద్ధధర్మాన్ని స్వీకరించడంతో పాటు ప్రచారం చేసిన సామ్రాట్ అశోక్ నాటకాన్ని ఆదివారం ఇక్కడ డాక్టర్ అంబేడ్కర్ భవన్‌లో నాగపుర బుద్ధిస్ట్ అకాడమీ ఆఫ్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించారు. ప్రదర్శన కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు డాక్టర్ హెచ్.సి.మహదేవప్ప, ఈశ్వర్ ఖండ్రె, మాజీ మంత్రి పీజీఆర్‌సింధ్యా, డీఎస్ఎస్ సంచాలకుడు డీజీసాగర్ తదితరులు డాక్టర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ హెచ్.సి.మహదేవప్ప మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు ప్రపంచానికి శాంతిమార్గం చూపించారని తెలిపారు. సామ్రాట్ అశోక్ బుద్ధుడి ఆలోచనలను ముందుకు తీసుకుపోయారని తెలియజేశారు.

## విధానసౌధ వీక్షణకు స్పందన

**బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే:** విధానసౌధ లోపల, వెలుపల సంచరించేందుకు, గైడ్ సాయంతో పర్యటించేందుకు చక్కని స్పందన లభిస్తోందని అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారిని బృందాలుగా విధానసౌధ లోపలకు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. దీనిపై ఇతర జిల్లా కేంద్రాలు, విద్యాసంస్థల్లో జాగృతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సమాచార శాఖ అధికారులు తెలిపారు.

విధానసౌధ వీక్షించేందుకు వచ్చిన సందర్శకులు

## ఒకశాతం పన్ను చెల్లించండి

**బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే:** డిజిటల్ పేమెంట్లు తీసుకుంటూ, వాణిజ్య, ఆదాయ పన్నులు చెల్లించని చిరు వ్యాపారులు ఒక శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుందని అధికారులు స్పష్టం చేశారు. బేకరీ, కాండిమెంట్స్, పానీపురి, జ్యూస్ దుకాణదారులు ఏడాదిలో రూ.40 లక్షల కన్నా ఎక్కువ, రూ.1.5 కోట్ల కన్నా తక్కువ లావాదేవీలు చేస్తే జరిగిన వ్యాపారంలో ఒక శాతం పన్ను చెల్లించాలని తాజాగా నోటీసులు జారీ చేశారు.

## ప్రభుత్వ నిర్ణయంతో భగ్గుమన్న భక్తులు

**బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే:** మైసూరు రోడ్డు గాలి ఆంజనేయ స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ తమ ఆధీనంలోకి తీసుకోవడంపై భక్తులు, ఆలయం ట్రస్టు సభ్యులు భగ్గుమన్నారు. హుండీల్లో నగదు, కానుకలను లెక్కపెట్టే సమయంలో కొందరు సభ్యులు, అర్చకులు చేతివాటం ప్రదర్శించడం సీసీ కెమెరాల్లో రికార్డయింది. దీంతో తాము ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నామని, ఐదేళ్ల అనంతరం మళ్లీ ట్రస్టుకు అప్పగిస్తామని దేవాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు.

## నంది బెట్ట ఎక్కుదాం రండి

**బెంగళూరు, (మారతహళ్లి), న్యూస్‌టుడే:** ఐదు నదులకు జన్మస్థానం, విలక్షణమైన జీవవైవిధ్యం ఉన్న నంది బెట్టను కాపాడుకోవాలన్న నినాదంతో 'దివ్యశ్రీ నందిహిల్స్ మాన్సూన్ రన్'ను ఆగస్టు రెండో వారంలో నిర్వహించనున్నారు. యువజన సేవలు, కర్ణాటక రాష్ట్ర పర్యాటక అభివృద్ధి మండలి సహకారంతో నిర్వహిస్తున్న పరుగులో బెట్ట దిగువ నుంచి ఎగువ వరకు 21.1 కి.మీ. మేర హాఫ్ మ్యారథాన్‌ను, 10 కి.మీ. ఛాలెంజ్ నిర్వహిస్తున్నామని నిర్వాహక ప్రతినిధి రుచికా రాజు తెలిపారు. యువ జన సేవల విభాగం ప్రధాన కార్యదర్శి నవీన్ రాజ్ సింగ్, షెడ్యూల్డు తెగల విభాగం అధికారి డీ రందీప్, రేస్ డైరెక్టర్ ప్రమోద్ దేశ్‌పాండేలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. భారతదేశంలోని అతి పెద్ద రన్నింగ్ అకాడమీ సహకారంతో నంది బెట్టపై ఉన్న జీవ వైవిధ్యాన్ని కాపాడడం, కాలుష్యాన్ని నియంత్రించాలన్న నినాదంతో ఈ పరుగును నిర్వహిస్తున్నామని వివరించారు. www.nandirun.in అనే వెబ్‌సైటులో పేర్లు నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు.

టీషర్టులు ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

## చెలువనారాయణ స్వామికి అభిషేకం

**మండ్య, న్యూస్‌టుడే:** ఆషాఢమాసంలో నిర్వహించే వైరముడి ఉత్సవాల్లో భాగంగా చెలువనారాయణ స్వామి ఆలయంలోని మూల విరాట్టుకు పాలు, పెరుగు, తేనె, గంధం, కొబ్బరినీటితో కుంభాభిషేకాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవహారాల బాధ్యుడు చెలువరాయ స్వామి భార్య ధనలక్ష్మి, రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ అధ్యక్షుడు కాడేనహళ్లి నాగణ్ణగౌడ, హుబ్బళ్లి ఎమ్మెల్యే మహేశ్ టెంగినకాయి, అధికారిణి శీల తదితరులు మహాభిషేకంలో పాల్గొన్నారు.

చందన అలంకరణలో మూలవిరాట్టు

## నర్సింగ్‌హోం యజమాని ఆకస్మిక మృతి

**రామనగర, న్యూస్‌టుడే:** కనకపురలో గణేశ్ నర్సింగ్ హోం, గణేశ్ మెడికల్స్ యజమాని మంజునాథ (50) శనివారం గుండెపోటుతో మరణించారు. నడకకు వెళ్లిన ఆయన దారి మధ్యలో స్పృహతప్పి పడిపోయారు. చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకు వెళ్లేసరికే ఆయన తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతోనే మంజునాథ్ మరణించారని వైద్యులు ధ్రువీకరించారు.

## ప్రభుత్వానికి తాఖీదులు

**బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే:** సీబీఎస్ఈ, సీఐఎస్ఎస్ఐఈ బోధనకు అనుమతి పొందిన పాఠశాలల్లో తప్పనిసరిగా కన్నడను బోధించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ప్రశ్నిస్తూ కొందరు తల్లిదండ్రులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై మూడు వారాల్లోగా ఆక్షేపణలు దాఖలు చేయాలని జస్టిస్ వి.కామేశ్వరరావు నేతృత్వంలోని పీఠం ప్రభుత్వానికి తాఖీదులు జారీ చేసింది. దీనిపై రెండేళ్లుగా తాము ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రుల తరఫున వాదనలు వినిపించిన న్యాయవాదులు తెలిపారు.

## '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే:** హీరో శివరాజ్‌కుమార్ '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' చిత్రంలో కొత్తగెటప్ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. సూట్ ధరించి చేతిలో వింటేజ్ రివాల్వర్ పట్టుకుని ఓ వైపు చూస్తున్న కొత్తలుక్‌లో కనపడుతున్నారు. డాక్టర్ రాజ్‌కుమార్ నటించిన '666 బ్లాక్‌బస్టర్' చిత్రం తరహాలో శివరాజ్‌కుమార్ నటిస్తున్నారని దర్శకుడు హేమంత్ ఎం.రావు తెలిపారు. వైశాక్ జె ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రానికి చరణ్‌రాజ్ సంగీతం అందిస్తున్నారు. శివరాజ్‌కుమార్‌తో పాటు ధనంజయ్ నటిస్తున్నారు.

కొత్తగెటప్‌లో 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ చిత్రంలో శివరాజ్‌కుమార్

## 25న 'బందూక్' రాక

నూతన నటులతో నిర్మించిన 'బందూక్' చిత్రం ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. విభిన్నమైన కథ అందించడంతోపాటు రచయిత మహేశ్ రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. బాలాజీ మనోహర్, శ్వేతా ప్రసాద్, గోపాలకృష్ణదేశపాండె, శంకర్ అశ్వత్, హరీశ్‌రై తదితర నూతన నటులు చిత్రం ద్వారా తమ ప్రతిభ చూపించారని దర్శకుడు తెలిపారు. హొన్నావర, ఉడుపి, మల్పె, మంగళూరు తదితర ప్రాంతాల్లో చిత్రీకరించారు.


బందూక్ చిత్రంలో హీరో బాలాజి మనోహర్

## 'ఎల్టుముత్తా' పాటలు వచ్చేశాయ్

ఎల్టు ముత్తా చిత్రంలో శౌర్యప్రతాప్, రా.సూర్య, ప్రియాంక మళలి

హై5 స్టుడియోస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'ఎల్టు ముత్తా' చిత్రం పాటలు ఇటీవల హుబ్బళ్లిలో విడుదల చేశారు. శౌర్యప్రతాప్, రా.సూర్య, ప్రియాంక మళలి తదితరులు నటిస్తున్న చిత్రానికి ప్రసన్న కేశవ సంగీతం అందిస్తున్నారు. ఈ సందర్భంగా 50 ఏళ్ల నుంచి పాటలు పాడుతున్న గాయకురాలు సంగీతాకట్టిని సత్కరించారు. కొడగులో జరిగిన సంఘటన ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు తెలిపారు.

జూనియర్ చిత్రంలో రవిచంద్రన్ తదితరులు

## 'జూనియర్' చిత్రంలో రవిచంద్రన్

కన్నడ, తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో ఈనెల 18న విడుదల కానున్న 'జూనియర్' చిత్రంలో కన్నడ నటుడు రవిచంద్రన్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. హీరోయిన్ శ్రీలీలతో పాటు జెనీలియా డిసౌజా, రావు రమేష్, అచ్యుత్‌కుమార్ నటిస్తున్నారు.

## బాలికపై అత్యాచారం.. పారిశ్రామికవేత్తకు జైలు

**మంగళూరు, న్యూస్‌టుడే:** పుట్టిన రోజు వేడుకలను ఘనంగా చేస్తానని ఒక బాలిక (16)ను నమ్మించి కారులో తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడిన ఒక పారిశ్రామికవేత్త (68)ను ముల్కి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. రెండు నెలల నుంచి బాలికను పాఠశాలకు తీసుకువెళ్లి విడిచి పెట్టేవాడు. అదే పరిచయంతో నీ పుట్టిన రోజును ఘనంగా చేస్తానని తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద నిందితుడ్ని అరెస్టు చేశారు. అరెస్టు అనంతరం నిందితుడికి రక్తపోటు అధికం కావడంతో చికిత్స కోసం ముల్కి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

## దసరాకు 'డెవిల్' వస్తున్నాడు

**బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే:** నటుడు దర్శన్ నటిస్తున్న డెవిల్ సినిమా చిత్రీకరణ 80 శాతం పూర్తయింది. విదేశాల్లో చిత్రీకరణకు వెళ్లేందుకు న్యాయస్థానం అనుమతించినా, స్విజర్లాండ్, మరికొన్ని ఐరోపా దేశాలకు వెళ్లేందుకు వీసా లభించలేదు. దీంతో బ్యాంకాక్, దుబాయ్, హైదరాబాద్, ఉదయపూర్‌లతో పాటు మైసూరులో చిత్రీకరణ పూర్తి చేసి దసరాకు విడుదల చేయాలని నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. చిత్రదుర్గకు చెందిన రేణుకా స్వామి హత్య కేసులో శిక్షకు సంబంధించిన తీర్పు వచ్చేలోగా దర్శకులు ప్రేమ్, సూరప్ప బాబు తీసే సినిమాల్లో దర్శన్ నటించే అవకాశం ఉంది.

దర్శన్

## ఆ వివాహానికి గుర్తింపు ఉంటుంది

**బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే:** భారతీయులు విదేశాల్లో వివాహం చేసుకుని, అక్కడి చట్టాల ప్రకారం పెళ్లిని రిజిస్ట్రరు చేసుకోకపోయినా, దానికి చట్టబద్ధత ఉంటుందని జస్టిస్ రామచంద్ర డి హుద్దార్ స్పష్టం చేశారు. వివాహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు, సాక్ష్యులు, ఆ జంట పేరిట ఉమ్మడిగా బ్యాంకు ఖాతా, ఇతర గుర్తింపు పత్రాలు ఉంటే ఆ వివాహం చెల్లుతుందన్నారు.

(c) eenadu

పూజలు చేస్తున్న ట్రస్టీ పదాధికారులు, భక్తులు

## వైభవంగా శ్రీక్షేత్రం పోలేరమ్మ జాతర

**బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే :** ప్రవాసాంధ్రులు అధికంగా నివాసం ఉండే కమ్మగుండనహళ్లి రెండో క్రాస్‌లోని శ్రీక్షేత్రం పోలేరమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామటెంపుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తెల్లవారుజామున అమ్మవారి సేవల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పొంగళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ట్రస్టు అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి పెంచలరావు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. చుట్టుప్రక్కల నివసించే తెలుగు ప్రజలు పూజలు చేసి ఆశీస్సులు పొందారు.

# బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

## బెంగళూరులో పడిపోయిన వాయు నాణ్యత

**బెంగళూరు (మారతహళ్లి):** ఉద్యాననగరి, ఎయిర్ కండిషన్డ్ సిటీ, పింఛనుదారుల స్వర్గధామం అనే పిలుపు బెంగళూరు నుంచి దూరం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రహదారుల విస్తరణ, మెట్రో కోసం వంతెనల నిర్మాణానికి చెట్లను కొట్టేయడంతో ఇటీవలి కాలంలో నగరంలో వాయు నాణ్యత గణనీయంగా పడిపోయింది. ఎయిర్ నాణ్యత సూచీ మాపకాల నుంచి తీసుకున్న గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయని అధికారులు, పర్యావరణవేత్తలు పేర్కొన్నారు. సిల్కుబోర్డు వద్ద ఎయిర్ నాణ్యత సూచీ 125కు చేరుకుంది. సూచిక 63 ఉంటే గాలి నాణ్యత ఒక మోస్తరు పరవాలేదని అర్థం. మెజిస్టిక్, రైల్వేస్టేషన్, పీణ్య, కస్తూరి నగర, మైలసంద్ర తదితర ప్రాంతాల్లో సూచిక 63 కన్నా చాలా ఎక్కువగా ఉందని గుర్తించారు. వాహన రద్దీ, నగరం కాంక్రీటు వనంగా మారడమే దీనికి కారణమని పర్యావరణవేత్తలు పేర్కొన్నారు.

**హో సూ రు క బు ర్లు**

## 250 మందికి డీఎంకే పార్టీ సభ్యత్వం

ప్రకాష్, నాయకులతో పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తలు

**హోసూరు, న్యూస్‌టుడే :** శూలగిరి తాలూకాలోని బుక్కసాగరం గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 250 మంది కార్యకర్తలు డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే వై.ప్రకాష్ సమక్షంలో డీఎంకే పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. శూలగిరి యూనియన్ డీఎంకే నాయకుడు బి.వి.కృష్ణమూర్తి నేతృత్వంలో పార్టీలో చేరారు. వేపనహళ్లి మాజీ ఎమ్మెల్యే బేరికె కె.నాగేష్, పాతకోట వీరారెడ్డి, అణ్ణాదురై, గుడిసాదనపల్లి గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఆరు స్థానాలను డీఎంకే కైవశం చేసుకొని మళ్లీ స్టాలిన్ ముఖ్యమంత్రిని చేయడానికి ఇప్పటి నుంచీ ప్రచారం చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ పిలుపునిచ్చారు.

## హోసూరులో స్కౌట్స్, గైడ్స్ శిక్షణ శిబిరం

శిబిరంలో మాట్లాడుతున్న కమిషనర్ వై.వి.ఎస్.రెడ్డి

**హోసూరు, న్యూస్‌టుడే :** హోసూరు కార్పొరేషన్ జూజువాడి పారిశ్రామికవాడలోని నేతాజీ శుభాష్‌చంద్ర బోస్ శిక్షణ కేంద్రంలో భారత్ స్కౌట్స్, గైడ్స్ ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో సంస్థ కమిషనర్ డాక్టర్ వై.వి.ఎస్.రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ హోసూరు విభాగం వై.వి.ఎస్.రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. ఇతను 55 ఏళ్లుగా లయన్స్ సంఘంలో సేవలందిస్తూ.. డాక్టరేట్ అందుకున్నారు.

## వెంకటరమణప్పకు ఘన నివాళులు

శ్రద్ధాంజలి ఘటిస్తున్న తెలుగు భాషాభిమానులు

**హోసూరు, న్యూస్‌టుడే :** హోసూరు సమీపం చిన్నకూళ్ల గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు వెంకటరమణప్పకు తెలుగు భాషాభిమానులు ఘన నివాళులర్పించారు. ఆదివారం హోసూరు కామరాజ కాలనీలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి సభాప్రాంగణంలో శ్రద్ధాంజలి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి వెంకటరమణప్ప చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి విశ్వనాథాచారి, విశ్రాంత విద్యాధికారి దయానాథం, చంద్రశేఖర్, సత్యనారాయణ, పటేల్ నారాయణరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటస్వామి, తళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కనుమరుగవుతున్న చెరువులు

అసంపూర్తిగా పూడిక తొలగింపు

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :** అప్పుడు ఇప్పుడు నగర ప్రజల జీవనాధారం చెరువులు. భూగర్భజలాల మట్టాన్ని చెరువులు కాపాడుతున్నాయి. ఆధునికత పేరుతో ఒకప్పుడు విశాలంగా ఉండే చెరువులు ఇప్పుడు అందమైన గుంతలుగా మారుతున్నాయి. మరికొన్ని కలుషితమై మత్స్య సంపద మృత్యువాత పడుతున్నాయి. చెరువుల అభివృద్ధి పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ప్రధాన రాజకీయ పార్టీలు, సివిక్ సంస్థలు పరిసరవాదులు ఆరోపణలు చేయడంతో పాటు న్యాయస్థానాల్లో పిటిషన్ల దాఖలు చేశారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న చెరువులు బాగుపడటం లేదు. చెరువుల ఆక్రమణలు తొలగింపు, పునరుద్ధరణ, మురుగునీటి ప్రవాహం నియంత్రణ, మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలు ఏర్పాటు తదితర కార్యక్రమాలను చేపట్టాలని ఐఏఎస్ అధికారి డాక్టర్ విశాల్ అధ్యక్షతన ప్రత్యేక సమితి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. చెరువులు సంరక్షించుకోకపోతే నగరంలో జలక్షామం ఏర్పడుతుందని హెచ్చరించారు.

✦ బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలో ఒకప్పుడు రెండు వందలకుపైగా ఉన్న చెరువులు ప్రస్తుతం 68 మిగిలాయి. వాటిని సంరక్షించేందుకు పాలికెలో ప్రత్యేక విభాగం ఉంది. చెరువుల సంరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ పథకాలను సిద్ధం చేసి అమలు చేశారు. చెరువులో పూడిక తొలగింపు, కట్ట నిర్మాణం, వాననీరు ప్రవహించే కాలువలు, వాయువిహారాలు సంచరించేందుకు నడకదారులు, ఉద్యానవనం, బయలు వ్యాయామ కేంద్రాలను అభివృద్ధి చేశారు. చెరువులను బీడీఏ ఎక్కువగా ఆక్రమించి లేఅవుట్‌లుగా మార్చి విక్రయించారు. 57 చెరువులు లేఅవుట్‌గా మారిన విషయం తెల్సిందే. లేఅవుట్‌లను ఖాళీ చేయించలేని పరిస్థితి లేక ఉన్న చెరువులను సంరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది.

మట్టితో చెరువును ఆక్రమిస్తున్న కబ్జాదారులు

మురుగునీటితో నిండిన కెంపాబుద్ధి చెరువు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపాలయ్య, ప్రతినిధులు

## రోటరీక్లబ్ సేవలు అభినందనీయం

**బెంగళూరు (యుడియూరు):** సమాజంలో పేదలకు విద్య, వైద్యపరంగా ఉత్తమ సేవలందిస్తున్న బెంగళూరు విద్యారణ్యపుర రోటరీక్లబ్ సేవలు అభినందనీయమని మహాలక్ష్మి లేఅవుట్ ఎమ్మెల్యే గోపాలయ్య తెలిపారు. ఆదివారం ఇస్కాన్ దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సమాజాభివృద్ధికి సహకరిస్తూ, పేదలకు సేవలు అందించడంలో ఆనందం దాగి ఉంటుందన్నారు. సేవలు చేస్తున్న రోటరీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా రోటరీ గవర్నర్ శ్రీకాంత్ నారాయణ్, డాక్టర్ ఎలిజబెత్, రంగరాజు, శ్రీనివాసు హరీష్, శ్రీనివాసరెడ్డి, పదాధికారులు పాల్గొన్నారు.

## ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు

మాట్లాడుతున్న జిల్లాధికారి రవీంద్ర, బ్యాంక్ అధికారులు

**చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే :** పేరేసంద్ర గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి కెనరా బ్యాంకు రూ.10 లక్షల విరాళాన్ని అందజేసింది. బ్యాంకు 120వ వార్షికోత్సవంలో భాగంగా తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా బ్యాంకు జోనల్ అసిస్టెంట్ మేనేజరు అశోక్‌కుమార్ చెక్కును జిల్లాధికారి పీఎన్ రవీంద్రకు అందించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు నింగరాజప్ప, సుకన్య, లీడ్ బ్యాంక్ ప్రతినిధులు వెంకటకృష్ణప్ప, కవిత, గంగారత్నమ్మ పాల్గొన్నారు.

## చిక్కసంద్రవార్డు అభివృద్ధే లక్ష్యం

పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మునిరాజు, తదితరులు

**బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే :** చిక్కసంద్రవార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే పలు పనులు జరుగుతున్నాయని దాసరహళ్లి ఎమ్మెల్యే మునిరాజు తెలిపారు. ఆదివారం ఇక్కడ తారురోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వార్డులో ప్రతివీధికి తారురోడ్డు వేయిస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో బీబీఎంపీ అధికారులు, ఇంజినీర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలతో మంత్రి రాజణ్ణ తదితరులు

## ‘సాహిత్యం అంతరంగాలను తాకాలి’

**తుమకూరు, న్యూస్‌టుడే :** ఊహతో కూడిన సాహిత్యానికి ప్రజల ప్రోత్సాహం ఉండదని, అనుభవంతో కూడిన సాహిత్యం అంతరంగాలను తాకుతుందని సహకారశాఖ మంత్రి కె.ఎన్.రాజణ్ణ అభిప్రాయపడ్డారు. తుమకూరులోని రవీంద్ర చిత్రకళా విద్యాలయంలో ఆదివారం వీసీ సాహిత్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2024 వీసీ (వి.చిక్కవీరయ్య) సాహిత్య ప్రశస్తులను మంత్రి ప్రదానం చేసి మాట్లాడారు. ఇటీవల కాలంలో మానవీయ సంబంధాలు నశించిపోతున్నాయని, భావితరాలకు సాహిత్యం, సంస్కృతి, కళలపై అవగాహన పెంపొందాలన్నారు. మాతృభాషకు అవమానం జరిగితే సహించకూడదన్నారు. తాహీరా కుల్సుం, పి.చంద్రిక, యువకవి గోవిందరాజు, ఎం.కల్లూరు కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టగలవన్నారు. వీరిని సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు ఎస్.జి.సిద్ధరామయ్య, డాక్టర్ నాగణ్ణ, డాక్టర్ హనుమంతేగౌడ, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక యుగంలో ప్రతిభకే పట్టం

జ్యోతి వెలిగిస్తున్న ప్రభాకర్, నిరంజనానంద పురి

**దావణగెరె, న్యూస్‌టుడే :** అణగారిన వర్గాలకు చెందిన యువత తాము ఇతరుల కన్నా ఎక్కువ అనే భావనను విడనాడాలని ముఖ్యమంత్రికి మాధ్యమ సలహాదారుడు కేవీ ప్రభాకర్ పిలుపునిచ్చారు. పోటీ యుగంలో ప్రతిభకే ప్రపంచం పట్టం కడుతుందని అన్నారు. కురుబ సముదాయానికి చెందిన వారిలో ఎక్కువ మంది కులవృత్తికే పరిమితం కావడం దురదృష్టకరమని అన్నారు. కనకదాసు కూడా ప్రారంభంలో అవమానాలు ఎదుర్కొన్న అనంతరం భక్తితో, తన వచనాలతో విప్లవాన్ని సృష్టించారని తెలిపారు. కనక ఉద్యోగుల బళగ, జిల్లా కురుబర విద్యాసంఘం ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాగినెలె మఠాధిపతి నిరంజనానందపురితో కలిసి విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. చరిత్రను అర్థం చేసుకోకపోతే భవిష్యత్తును రూపొందించడం సాధ్యం కాదన్నారు. ప్రశ్నించే స్వభావాన్ని పెంచుకుంటే, అన్ని రంగాల్లో ముందంజలోకి రావచ్చని చెప్పారు. ఒకప్పుడు శూద్రులు, దళితులు విద్యాభ్యాసం చేసినా, మంత్ర పఠనం చేసినా సీసం కాల్చి చెవుల్లో పోసేవారని, ఇప్పటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ విద్యాభ్యాసం చేసేందుకు పలువురు మహనీయుల శ్రమ ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీ ప్రభా మల్లికార్జున్, కొప్పళ వర్సిటీ ఉప కులపతి డాక్టర్ బీకే రవి, బాలభవన అధ్యక్షుడు బీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బనశంకరి కూడలి ఆధునికీకరణ

ప్రస్తుత బనశంకరి కూడలి పరిస్థితి

**బెంగళూరు (కుమారస్వామిలేఔట్), న్యూస్‌టుడే :** నగరంలోని ప్రముఖ కూడళ్లలో బనశంకరి అన్నివిధాలుగా ఖ్యాతి పొందింది. సంచార రద్దీలో కూడా ఖ్యాతి పొందిన విషయం తెల్సిందే. కూడలి దాటేందుకు వాహనదారులు పెద్ద సాహసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మెట్రోస్టేషన్, బనశంకరి దేవస్థానం, బనశంకరి బస్టాండ్, మార్కెట్ కూడలి చుట్టూ ఉన్నాయి. దీంతో వాహనాలతో పాటు ప్రజల రద్దీ ఎక్కువ. ఆ కూడలిని సుందరీకరించే పథకాన్ని పాలికె, భూఉపరితల సచివాలయం సంయుక్తంగా సిద్ధం చేశాయి. కూడలి ఆధునికీరణ కోసం ప్రత్యేక కార్యాచరణ పథకాన్ని రూపొందించారు. ప్రజలు, వాహనాలు కూడలిలో సంచరించే విధంగా ఉపరితల వంతెనలను నిర్మిస్తారు. కూడలి చుట్టూ రింగ్ ఉపరితల వంతెన నిర్మించి వాహనాలు పాదచారులు ప్రత్యేక సంచరించే విధంగా మార్గాలను నిర్మిస్తారు. కింద వాహనాలు సంచరించే విధంగా రహదారులను అభివృద్ధి చేస్తారు. కూడలి గుండా కనకపుర, సాతనూరు, జేపీనగర, జయనగర, సిటీ మార్కెట్, కుమారస్వామి లేఅవుట్, పద్మనాభనగర తదితర ప్రాంతాలకు వాహనాలు సంచరిస్తున్నాయి. నిత్యం కూడలిలో సంచార రద్దీ నెలకొంటుంది. కూడలి అభివృద్ధి చేస్తే సంచార రద్దీ అదుపులోకి వచ్చి దేవస్థానానికి వచ్చే భక్తులకు అనుకూలమవుతుందని నిపుణుల అభిప్రాయం.

ఆధునికీకరిస్తే ఈవిధంగా ఉంటుంది (నమూనా చిత్రం)

## ఈద్గా మైదానంలో కపోతాల సందడి

**ఈ**ద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు, గొర్రెల వ్యాపారాలు, యువత క్రికెట్ ఆట లేకపోవడంతో కపోతాలు సందడి చేశాయి. వాతావరణ మేఘావృతంగా ఉండడం, చిరుజల్లులు కురవడంతో ధాన్యం గింజల కోసం పావురాలు ఇలా వచ్చి వాలాయి.

**- న్యూస్‌టుడే, బెంగళూరు (జయనగర)**

## చర్చి, మసీదులను స్వాధీనం చేసుకుంటారా

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే :** గాలి ఆంజనేయ స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ స్వాధీనపరుచుకోవడాన్ని ఎంపీ తేజస్వి సూర్య తప్పు పట్టారు. చర్చి, మసీదులను ఇలా స్వాధీనపరుచుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. ఆలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం తన పథకాలకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం తన నిర్ణయం నుంచి వెనక్కు తగ్గకపోతే భక్తులతో కలిసి పోరాటం చేస్తామని ఆదివారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో హెచ్చరించారు.

## గర్భిణికి అరుదైన శస్త్రచికిత్స

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే :** ప్లాసెంటా పర్‌క్రియేటాతో పాటు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్న 28 వారాల పిండం ఉన్న గర్భిణికి వాసవి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించారు. ఆమెకు రక్తహీనత, మధుమేహం, పిండంలో ఉన్న శిశువు తక్కువ ఎదుగుదలతో ఉన్నట్లు గుర్తించారు. సిజేరియన్ చేయకపోతే తల్లీశిశువు ప్రాణాలకు ప్రమాదం కావడంతో ఆసుపత్రిలో ఆమెకు చికిత్స చేశారు. శిశవు బరువు 2 కిలోలకు చేరుకోవడం, గర్భిణిలో హిమోగ్లోబిన్ ఉన్నత స్థాయికి చేరుకున్న అనంతరం సిజేరియన్ చేసి కాన్పు చేశామని వైద్యురాలు డాక్టర్ నిశా బుచాడె తెలిపారు. ఇలాంటి సమస్యలు ఎదుర్కొనే గర్భిణులకు చేసే శస్త్రచికిత్సల్లో మూత్రకోశం, ఇతర అవయవాలు దెబ్బతినే అవకాశం ఉండడంతో పలు జాగ్రత్తలు తీసుకున్నామని ఆమె వివరించారు.

## లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

**ముళబాగిలు, న్యూస్‌టుడే :** కోలారు జిల్లాలోని ఆరు తాలూకాల పరిధిలో వివిధ కోర్టుల్లో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 1,56,860 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.ఎ.మంజునాథ్ తెలిపారు. రాజీ మార్గం ద్వారా ఆరు జంటలు మళ్లీ ఒక్కటయ్యాయి. పెండింగ్‌లో ఉన్న 9598 చెక్కుల కేసులు, ట్రాఫిక్ కేసులు, భార్యాభర్తల విభేదాల కేసులు పరిష్కారమయ్యాయి.

రాజశ్రీ గౌII 2 వ అదనపు జిల్లా జడ్జి కోర్ట్, మదనపల్లె
(In the court of the Hon'ble 2nd Addl. District judge, Madanapalle)
IA No.104/2020 in AS No........./2020
శ్రీమతి బిసప్పగారి పార్వతమ్మ & వగైరా
..పిటీషనరులు /Appellants
శ్రీమతి సిద్దె గౌనివాళ్ళ చంద్రమ్మ & others
...రెస్పాండెంట్స్/ప్రతివాదులు
Notice to రెస్పాండెంట్స్/ప్రతివాది No. 5 : Smt. R. సౌజన్య, W/o రమేష్, వయస్సు 25 సంII (35 సంII అప్పీల్ తేదీకి), హిందూ, R/a D.No. 18, ఆర్మీ Road, కుమార్ పార్క్, వెస్ట్ బెంగుళూరు.
పై నెంబరు గల IA No 104/2020 పై తెలిపిన Petitioners /Appellants తమకు పూలపాడు Rev. Village, పుంగనూరు మండలం నందు గల భూములలో హక్కు కలదని భాగపరిష్కారం కొరకు దాఖలు చేసిన OS No. 13/2009 Sr. Civil Judge Court (Civil Judge Sr. Division) పుంగనూరు dt. 29.6.2019న dismiss అయిన రీత్యా, అట్టి Decree & Judgement ను పై courtకు 76 రోజుల ఆలస్యంగా వేసిన అప్పీల్ నందు అట్టి ఆలస్యమును మన్నించవలసినదిగా వేసిన IA No. 104/2020, పై కోర్ట్ నందు dt. 25/7/2025న వాయిదా ఉన్న రీత్యా సదరు తేదీన మీవు పై తెలిపిన court నందు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను, లేనంతట IA No.104/2020 మీ పరోక్షంగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.
// By order //
Dt :12.7.2025 సరస విద్యాసాగర్
9440539161 న్యాయవాది, మదనపల్లె

స్మరణిక అందుకుంటున్న సాహితీవేత్త సత్యమూర్తి

## సాహితీవేత్తకు సత్కారం

**బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే :** ఉత్తమ రచనలతో పలువురికి స్ఫూర్తిని అందిస్తున్న సాహితీవేత్త డాక్టర్ సత్యమూర్తి కర్ణాటక ఐకాన్ అవార్డు-2025ను అందుకున్నారు. స్ఫూర్తి సేవాశ్రమ నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ అంజనప్ప ఆయనకు స్మరణిక, ప్రశంస పత్రాన్ని ప్రదానం చేశారు.

## నడకదారిలో ఆక్రమణల తొలగింపు

జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

**బెంగళూరు (బ్యాట్రాయణపుర), న్యూస్‌టుడే :** బ్యాటరాయణపుర నియోజకవర్గంలో పాదచారి మార్గాలను ఆక్రమించి నిర్మించిన భవనాలను బీబీఎంపీ అధికారులు జేసీబీలతో తొలగించారు. ఆక్రమణలు ఎక్కడున్నా తక్షణమే తొలగించాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు. సుల్తాన్, కుందహళ్లి ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించారు. రహదారులు, పాదచారి మార్గాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

**క్రైమ్.. కార్నర్**

## రైలులో నుంచి పడి వృద్ధుడికి తీవ్రగాయాలు

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే:** రైలులో నుంచి పడి వృద్ధుడు తీవ్రంగా గాయపడిన ఘటన అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో ఆదివారం జరిగింది. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లెకు చెందిన కదిరప్ప రెండు రోజుల కిందట తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి ములకలచెరువుకు రైలులో వస్తుండగా కురబలకోట రైల్వేస్టేషన్ సమీపంలో రైలులో నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గాయపడిన ఆయన్ను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కదిరి రైల్వే పోలీసులు విచారణ చేస్తున్నారు.

## కన్నుమూసిన కేబీ గణపతి

**మైసూరు, న్యూస్‌టుడే :** సీనియర్ విలేకరి కేబీ గణపతి (85) ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. గత కొద్ది రోజులుగా వయోసహజ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న గణపతిని శాంతవేరి గోపాలగౌడ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. కొడగుకు చెందిన ఆయన ఐదు దశాబ్దాలుగా సేవలందిస్తున్నారు. ముంబయిలోని టైమ్స్ ఆఫ్ ఇండియాలో వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం మైసూరుకు వచ్చి ఆంగ్లంలో స్టార్ ఆఫ్ మైసూరు, కన్నడలో మైసూరుమిత్ర పత్రికను ప్రారంభించారు. ఆయన మృతికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తదితరులు సంతాపం ప్రకటించారు.

## వివాహిత అదృశ్యం

చైత్ర

**పావగడ, న్యూస్‌టుడే :** తాలూకాలోని కె.రాంపుర గ్రామానికి చెందిన చైత్ర (35)అనే వివాహిత అదృశ్యమైనట్లు వై.ఎన్.హొసకోట పోలీసులు తెలిపారు. అక్కులప్పతో 13 ఏళ్ల క్రితం చైత్రకు వివాహమైంది. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. కొద్ది రోజుల క్రితం చైత్ర ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇంటికి వెళ్లి ఉంటుందని ఎదురు చూశారు. ఎన్నాళ్లైనా ఆమె రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భాజపాలో చేరాలని బెదిరింపు

**బాగలకోటె, న్యూస్‌టుడే :** భాజపాలో చేరాలని తనను, మరికొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొందరు బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే విజయానంద కాశప్పనవర్ ఆరోపించారు. జిల్లాలోని హుణసుందలో విలేకరులతో మాట్లాడుతూ భాజపాలో చేరకపోతే సీబీఐ, ఈడీ అధికారులతో దాడులు చేయిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. బళ్లారి జిల్లాలో ఎమ్మెల్యేలు భరత్ రెడ్డి, నాగేంద్ర, ఎంపీ తుకారాం తదితరులపై దాడులు చేయించినట్లు తమ పార్టీ నాయకులను వేధిస్తున్నారని చెప్పారు. భాజపా నేరుగా ఎన్నికల్లో గెలిచేందుకు అవకాశం లేకపోవడంతో ఈ తరహా కుట్రలకు తెరతీసిందన్నారు. ఈసారి వచ్చే ఎన్నికల్లోనూ కాషాయ పార్టీ గట్టెక్కడం సాధ్యం కాదని జోస్యం చెప్పారు.

## గృహనిర్మాణ శాఖలో అవినీతి

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే :** కర్ణాటక గృహ నిర్మాణ శాఖలో భారీ మొత్తంలో అవినీతి చోటు చేసుకుందని లోకాయుక్త అధికారులు గుర్తించారు. నకిలీ దాఖలాలతో 178 నివేశనాలను వితరణ చేశారని గుర్తించి, హౌసింగ్ బోర్డు కమిషనర్‌కు లోకాయుక్త అధికారులు లేఖ రాశారు. భూముల స్వాధీనం, నివేశనాల కేటాయింపు, వేలం ప్రక్రియకు సంబంధించిన వివరాలు తమకు అప్పగించాలని సూచించారు. యలహంక, గాంధీనగర, చిక్కజాల, బ్యాటరాయనపుర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కూడా లేఖలు రాసి వివరాలు అందించాలని ఆదేశించారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు పుస్తకాల పంపిణీ

పుస్తకాలు అందజేస్తున్న మరిస్వామి, శంకర్, బాలకృష్ణ తదితరులు

**బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే :** నగరంలోని పులికేశినగర-ఎంఎస్ భవన్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు వివిధ సంస్థల ప్రతినిధులకు సంచులు, రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ మరిస్వామి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం బలోపేతం చేయడంతో పాటు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎక్కువ సంఖ్యలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు లయన్ బాలకృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు దాతలు చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బాలలు ఎక్కువగా ఉన్న మురికివాడల్లో కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించాలని కర్ణాటక బహుజనసమాఖ్య (కేబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీహెచ్ శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బాలలకు చదువు చెప్పే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీనర్సరీ తరగతులను ప్రారంభిస్తే అనుకూలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

## అంతర గ్రామీణ క్రీడాపోటీల ప్రారంభం

పోటీలను ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే జ్యోతిగణేష్, రోహిత్ గంగాధర్ తదితరులు

**తుమకూరు, న్యూస్‌టుడే :** యువ సబలీకరణ, క్రీడాశాఖల సంయుక్త ఆశ్రయంలో నవ సహయోగ్ ఫౌండేషన్ నేతృత్వంలో 10 నుంచి 14 సంవత్సరాల బాల బాలికలకు అంతర గ్రామీణ పోటీలకు ఆదివారం తుమకూరు నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్ ప్రారంభించారు. నగరంలోని మహాత్మాగాంధీ ఇండోర్ స్టేడియంలో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల బాలబాలికలకు ఇలాంటి క్రీడా పోటీలు ఉపకరిస్తాయన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఆదివారం ఖోఖో, 20న కబడ్డీ, 27న ఫైనల్ పోటీలు ఉంటాయి. తుమకూరు, తిపటూరు, హళియాళ తాలూకాల్లోని 121 గ్రామాల నుంచి ఎంపికైన 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువసబలీకరణ, క్రీడాశాఖల అధికారి రోహిత్ గంగాధర్, నవసహయోగ్ ఫౌండేషన్ ప్రతినిధులు, నమత క్రీడాకారులు పాల్గొన్నారు.

(c) eenadu

# బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

## బ్రాహ్మణ మహాసభ సంయుక్త కార్యదర్శి నియామకం

లక్ష్మీకాంత్

**రాయచూరు, న్యూస్‌టుడే :** దాస సాహిత్య విద్వాంసుడు, భారతీయ సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తున్న కలబురగి జిల్లా నివాసి డాక్టర్ లక్ష్మీకాంత్ విఠలరావ్ మోహరీర్‌ను అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్రాధ్యక్షుడు ఎస్.రఘునాథ్ నియామక ఆదేశాలు వెలువరించారు. లక్ష్మీకాంత్‌ను కలబురగి జిల్లా మహాసభ ప్రతినిధులు అభినందించారు. తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర స్థాయి పదవిని కట్టబెట్టిన రఘునాథ్‌కు రుణపడి ఉంటానని, జిల్లాలో బ్రాహ్మణ సామాజికవర్గాన్ని సంఘటితం చేసేందుకు శక్తికి మీరి శ్రమిస్తానని లక్ష్మీకాంత్ విఠలరావ్ పేర్కొన్నారు.

## ఆనకట్టల్లో పెరుగుతున్న నీటి మట్టం

**రాయచూరు, న్యూస్‌టుడే :** ఉత్తర కర్ణాటకలోని ప్రధాన జలాశయాల్లో నీటి మట్టం పెరిగింది. గరిష్ఠ మట్టానికి చేరువ అవుతున్నందున సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఆదివారం ఉదయానికి ఆలమట్టిలో 91.928 టీఎంసీలు, సాయంత్రానికి నారాయణపురలో 28.533 టీఎంసీల నీటి నిల్వ దాఖలైంది. ఎగువ భాగంలో వానలు తగ్గుముఖం పట్టినందున వరద నీటి ప్రమాణం పడిపోయింది. ఆలమట్టిలోకి 78,497 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో, 42,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నిన్నటి కంటే అవుట్‌ఫ్లో తగ్గింది. ఇన్‌ఫ్లోలో మార్పు లేదు. నారాయణపురలోకి 20 వేల క్యూసెక్కులు నీరు వస్తుంటే, దిగువకు 3 వేల క్యూసెక్కులను విడుస్తున్నారు. 24 గంటల ముందు 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 22,320 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

## 'యరగేరా' కోసం ఊపందుకున్న ఉద్యమం

**రాయచూరు :** రాయచూరు తాలూకా పరిధిలోని యరగేరా ఫిర్కాను తాలూకా కేంద్రంగా ప్రకటించాలన్న ఉద్యమం ఊపందుకుంటోంది. గత ఐదేళ్లుగా జిల్లా స్థాయిలో వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన తాలూకా సాధనా పోరాట సమితి పోరును బెంగళూరుకు విస్తరించనుంది. రాజధానిలోని స్వతంత్ర ఉద్యానవనంలో ఈ నెల 21 నుంచి నిరవధిక ఆందోళనకు శ్రీకారం చుట్టాలని యరగేరాలోని రంగనాథస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో తీర్మానించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పోరుబాటకు అండగా ఉంటామని ముక్తకంఠంతో ప్రకటించారు. జిల్లా బాధ్య మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, మంత్రి బోసురాజు, రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్, జిల్లాలోని శాసనసభ్యులు, మండలి సభ్యులను కలిసి మద్దతు ఇవ్వాలని మనవి చేస్తారు. గిల్లేసూగూరు, తలమారి, కల్మల జడ్పీల వ్యాప్తిలోని పల్లెలకు వెళ్లి బెంగళూరుకు తరలి రావాలని విజ్ఞప్తి చేయనున్నారు.

### తాలూకాకు అర్హ తలివే..

జిల్లా కేంద్రానికి 18 కిలోమీటర్ల దూరం, 167వ జాతీయ రహదారి మీద పోయే యరగేరా తాలూకా కేంద్రానికి వంద శాతం అర్హత కల్గిందని సాధనా సమితి విశ్లేషిస్తోంది. 19 గ్రామ పంచాయతీలు, 78 గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల స్థాపనకు అవసరమైన సర్కారు భూములు, ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం 31 కిలోమీటర్ల దూరం, పంచముఖి ఆంజనేయ దేవస్థానం, మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం సమీపంలోనే ఉన్నాయి.

మహర్షి విశ్వవిద్యాలయం పరిపాలన కార్యాలయం

గత నెలలో యరగేరా పర్యటనకు విచ్చేసిన సీఎం సిద్ధరామయ్యకు రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే దద్దల్ యరగేరాను తాలూకా కేంద్రంగా సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని సిరివార, మస్కి తాలూకాలు నూతనంగా ఏర్పడినవే. గిల్లేసూగూరు, శక్తినగర్, ఉమ్మడి మాన్విలోని కవితాళ, లింగసూగూరు తాలూకాలోని ముదగల్‌ను నూతన తాలూకాలుగా ప్రకటించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నాయి.

**అంతం కాదు ఆరంభం : నిజాముద్దీన్**
**(సమితి ప్రధాన సంచాలకుడు)**


నిజాముద్దీన్

న్యాయ సమ్మతమైన తమ డిమాండ్‌పై సర్కారు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు పోరు కొనసాగుతుంది. ఇది ఆరంభమే. స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. మంత్రులు, ప్రజా ప్రతినిధులు మద్దతు ఇస్తారని ఆశిస్తున్నాం.

## నదిలో గల్లంతైన ముగ్గురూ మృతి

● గజ ఈతగాళ్లు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు
● మృతదేహాలు లభ్యం ● కుటుంబ సభ్యులకు అప్పగింత

అజిత్

ప్రమోద్

సచిన్

**మంత్రాలయం, న్యూస్‌టుడే:** తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి గల్లంతైన ముగ్గురు కన్నడ యువకులు మృతదేహాలై తేలారు. ఎస్సై శివాంజల్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు నదిలో గాలించి ఆదివారం ఉదయం 11:30 గంటలకు మృతదేహాలను వెలికి తీశారు. కర్ణాటక రాష్ట్రం హాసన జిల్లా జావగల్లుకు చెందిన డిగ్రీ చదువుతున్న సచిన్ (20), ప్రమోద్ (20), సంగరాయపురానికి చెందిన డిగ్రీ విద్యార్థి అజిత్ (19) తమ స్నేహితులతో కలిసి శనివారం నదిలో స్నానాలు చేస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతైన విషయం తెలిసిందే. శనివారం రాత్రే నది వద్దకు చేరుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, ఆదివారం ఎస్సై ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు గ్రామ సర్పంచి తెల్లబండ్ల భీమయ్య సహకారంతో 10 మంది గజ ఈతగాళ్లు, 6 మంది బుడగజంగాల వారి సాయంతో తెప్పలతో నదిలో జల్లెడ పట్టారు. గల్లంతైన ప్రదేశంలో వెతకగా రెండు మృతదేహాలు పైకి తేలాయి. అక్కడి నుంచి 200 మీటర్ల దూరంలో మరో మృతదేహాన్ని కనుగొని తెప్పలపై ఒడ్డుకు చేర్చారు. అర్ధాంతరంగా ప్రాణాలొదిలిన తమ వారిని చూసి తల్లిదండ్రులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం శ్రీమఠం అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### సబ్ కలెక్టర్, డీఎస్పీ పరామర్శ

ఎమ్మిగనూరు వైద్యశాలలో మృతుల కుటుంబ సభ్యులను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు పరామర్శించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాలను ప్రత్యేక వాహనంలో వారి స్వస్థలాలకు పంపించినట్లు సబ్ కలెక్టర్ మౌర్య, ఎస్సై శివాంజల్ తెలిపారు. ఆదివారం ఉదయం తహసీల్దార్ రమాదేవితో కలిసి సబ్ కలెక్టర్, డీఎస్పీ వేర్వేరు సమయాల్లో గల్లంతైన నది ప్రాంతాలను పరిశీలించారు. స్నేహితులను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, పక్కన డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ మంజునాథ్, ఎస్సై శివాంజల్

### నేడు అంత్యక్రియలు

**హాసన:** తుంగభద్ర నదిలో నీట మునిగి మరణించిన యువకులకు నేడు (సోమ) అంత్యక్రియలు నిర్వహించనున్నారు. శనివారం నీట మునిగి మరణించిన అజిత్ (20), సచిన్ (20), ప్రమోద్ (19) మృతదేహాలు మంత్రాలయం నుంచి వస్తున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. వీరు హాసన జిల్లా అరసికెరె తాలూకా జాగవళ్‌కు చెందిన వారు. స్నేహితులతో కలిసి మంత్రాలయానికి వెళ్లి, నీటిలో దిగిన సమయంలో ఉద్ధృతికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే.

## 'స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి'

**రాయచూరు, న్యూస్‌టుడే :** వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేసేలా ప్రధాని మోదీపై ఒత్తిడి తేవాలని స్వామినాథన్ సూచనల అమలు పోరాట సమితి ప్రతినిధులు రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణకు మనవి చేశారు. శనివారం మస్కి పర్యటనకు విచ్చేసిన మంత్రికి సమితి జిల్లా అధ్యక్షుడు ఎం.శరణప్ప, ఉపాధ్యక్షుడు రామయ్య, సంచాలకుడు మానయ్య, మస్కి తాలూకా అధ్యక్షుడు వెంకటేష్ వినతి పత్రాన్ని అందజేశారు. 20 ఏళ్ల క్రితం ప్రతిపాదించిన సిఫార్సులను అమలు చేసే విషయంలో మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. అత్యధిక పంటలకు ఏటా ధర లేక ఆర్థికంగా నష్టపోతూ, వ్యవసాయం చేయడం ఎందుకనే భావన రైతుల్లో ఏర్పడిందని వివరించారు. సేద్య రంగంలో సంక్షోభం తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు.

మంత్రికి ప్రతినిధుల వినతి పత్రం సమర్పణ

## రాజకీయాల్లో మరింత రాణించాలి

**రాయచూరు, న్యూస్‌టుడే :** దేవదుర్గ తాలూకా భాజపా అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ శరణబసవ పాటిల్ జోళదడగిని నగరంలోని ఎంపీ ప్రకాష్ పీయూసీ కళాశాలలో విద్యా సంస్థలు, కళాశాలల సంఘ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం సంస్థ ప్రధాన కార్యదర్శి మారుతి బడిగేర మాట్లాడుతూ సాధారణ కార్యకర్త అయిన శరణబసవకు తాలూకా అధ్యక్ష పదవిని కట్టబెట్టడం ఆయన క్రియాశీలకంగా పనిచేయడమే కారణమని తెలిపారు. విద్యావేత్తగా జిల్లా విద్యాభివృద్ధికి, రోటరీ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడిగా సమాజానికి సేవచేస్తున్న ఇతడు రాజకీయాల్లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.జి.మారుతి, ప్రముఖులు విజయకుమార్ శావంతగేర, రేఖా బడిగేర, వెంకటేష్ బేవినబెంచి, బసవరాజ ఎలి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం స్వీకరిస్తున్న శరణబసవ

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

**రామనగర, న్యూస్‌టుడే :** బెంగళూరు- మైసూరు ఎక్స్‌ప్రెస్ వేలో జయపుర వద్ద ఆదివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. కేఆర్ నగర సమీపంలోని చిక్కనాయనకహళ్లికి చెందిన తమ్మణ్ణ గౌడ (56), ఆయన కుమారుడు ముత్తురాజ్ (28), కారు డ్రైవరు సచిన్ (27)లను మృతులుగా గుర్తించారు. కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ఆసుపత్రిలో ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మైసూరు నుంచి బెంగళూరుకు వస్తున్న సమయంలో ఆదివారం వేకువ జామున 5 గంటల సమయంలో నిద్రమత్తులో డ్రైవరు కారును రహదారి పక్కన ఉన్న అడ్డుగోడను ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది.

## యూట్యూబర్‌పై కేసు నమోదు

**మంగళూరు, న్యూస్‌టుడే :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థలలో గత రెండు దశాబ్దాల్లో పలు అసహజ మరణాలు సంభవించాయని జరుగుతున్న ప్రచారానికి సంబంధించి యూట్యూబర్ సమీర్ కృత్రిమ మేధస్సుతో కొన్ని వీడియోలు సృష్టించాడు. తప్పుడు ప్రచారాన్ని, ప్రజలను రెచ్చగొట్టేలా ఆయన వీడియోలు చేశారంటూ వచ్చిన ఫిర్యాదులతో ధర్మస్థల ఠాణాలో సమీర్‌పై కేసు నమోదు చేసుకున్నారు. ధర్మస్థలలో కొందరు పెద్దలు హత్యలు చేసి మృతదేహాలను పూడ్చేందుకు తనకు ఇచ్చేవారని ఒక వ్యక్తి ఇప్పటికే బెళ్తంగడి న్యాయస్థానంలో హాజరై వాంగ్మూలాన్ని ఇచ్చాడు. అతను గతంలో జిల్లాధికారికి రాసిన లేఖ, అందులోని సమాచారం ఆధారంగా సమీర్ యూట్యూబర్ వీడియోలను రూపొందించాడు.

## ప్రతాప్ సింహ అనుచిత వ్యాఖ్యలు

**మైసూరు, న్యూస్‌టుడే:** కర్ణాటకలో బంగ్లా వలసదారుల సంఖ్య నానాటికీ ఎక్కువ అవుతోందని మాజీ ఎంపీ ప్రతాప సింహ ఆరోపించారు. అలా వచ్చిన 22 ముస్లిం కుటుంబాలకు 91 మంది పిల్లలు ఉన్నారని, వారికి పిల్లలను పుట్టించడమే పనిగా ఉందని అనుచిత వ్యాఖ్యలు చేశారు. హిందువులు ఒక సంతానంతోనే సరిపెట్టుకుంటూ ఉంటే, వలస వచ్చిన వారు ఎక్కువ మందికి కంటున్నారని ఆరోపించారు. బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అక్కడ 24 శాతం ఉన్న హిందువుల సంఖ్య ఇప్పుడు 5 శాతానికి, పాక్‌లో 15 శాతం ఉన్న వారి సంఖ్య 2 శాతానికి చేరుకుందన్నారు. ఇక్కడ మాత్రం దానికి భిన్నంగా ఉందన్నారు. ప్రపంచంలోని 57 దేశాలు ఇలా వలస వస్తున్న ముస్లింలకు ఆశ్రయం ఇవ్వడం లేదని, భారత్ కూడా వలసవచ్చే ముస్లింలకు ఆశ్రయం ఇవ్వకూడదని డిమాండ్ చేశారు.

## ఎట్టకేలకు బోనులో పడిన చిరుత

**రాయచూరు, న్యూస్‌టుడే :** రాయచూరు తాలూకాలోని దొంగరాంపూరు గ్రామస్థులకు నెల రోజులుగా కంటిమీద కునుకు లేకుండా చేసిన రెండేళ్ల వయసు ఉన్న చిరుతను ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు బంధించారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న చిరుత ఆహారం కోసం శివార్లకు వచ్చి మేకలు, కుక్కలు, ఇతర జంతువులపై దాడి చేసి చంపేది. దీంతో గ్రామస్థులు బయటికి రావాలంటే జంకే వారు. అటవీశాఖ అధికారులు రెండు బోనుల్లో ఆహారాన్ని ఉంచి ఎరవేశారు. చిరుత చలనాన్ని పర్యవేక్షించేందుకు ముగ్గురు సిబ్బందిని నియమించారు. సీసీ కెమెరాలను అమర్చారు. బోను దగ్గరికి వచ్చి వెనక్కి వెళ్లిపోయేది. ఆదివారం ఉదయం బోనులోకి వెళ్లి చిక్కుకుంది. చిరుతను మృగాలయానికి తరలించారు. దొంగరాంపూరు ప్రజలు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు.

గాండ్రిస్తున్న చిరుత

## కన్నడను కాపాడుకుందాం

**రాయచూరు, న్యూస్‌టుడే :** స్థానిక కన్నడభవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో హొసమని ప్రకాశన సంస్థ హొసమని మహిళా కావ్య, రంగ పురస్కారాలను ప్రదానం చేసింది. కావ్య ప్రశస్తులను కవయిత్రులు బసమ్మ హిరేమఠ (సింధనూరు), అంబమ్మ (మాన్వి), రంగ పురస్కారాలను రామణ్ణ మర్చేడ్, అణివీరయ్య స్వామి, నాగప్ప బాళె, వెంకట నరసింహులు, రంగస్వామి, ప్రవీణ్ రెడ్డి, సుందరేశ్, వాల్మీకి, బసవరాజ్, జలాల్‌సాబ్ అందుకున్నారు. ఈ సందర్భంగా కన్నడ పత్రిక సంపాదకుడు నాగతిహళ్లి నాగరాజ్ మాట్లాడుతూ తమిళనాడు, కేరళ వాసులు మాతృభాషను కాపాడుకుంటున్నారని, కన్నడిగులు భాష రక్షణ కోసం పోరాట చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆవేదన కల్గిస్తోందన్నారు. కన్నడ భాషాభివృద్ధికి హొసమని ప్రకాశన అధ్యక్షుడు బషీర్ అహ్మద్ నిస్వార్థంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. పర్వీన్ బేగం, షంషాద్ బేగం, రామణ్ణ మ్యాదర్ వేదికను అలంకరించారు.

పురస్కారాలు స్వీకరించిన సాధకులు

## స్వతంత్ర అభ్యర్థి అయినా గెలుస్తాను

**విజయపుర :** భాజపా తనను శాశ్వతంగా బహిష్కరించినా స్వతంత్ర్య అభ్యర్థిగా అయినా పోటీ చేసి గెలుస్తానని ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ధీమా వ్యక్తం చేశారు. వాస్తవాలు ఆలకించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని పార్టీ నుంచి బహిష్కరించారన్న ఆవేదన ఉందన్నారు. భాజపాలో మంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నారని, కేవలం కొందరితోనే పార్టీకి ఈ దుస్థితి వచ్చిందన్నారు. విజయపుర పాలికెలోని భాజపా సభ్యులు అందరికీ తాను సహకారాన్ని అందిస్తానని తెలిపారు.

## లోక్ అదాలత్‌లో 2 వేల కేసుల పరిష్కారం

**మాన్వి, న్యూస్‌టుడే :** స్థానిక సివిల్ జేఎంఎఫ్‌సీ కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో రెండు వేలకు పైగా కేసులను పరిష్కరించినట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రవికుమార్ పాటిల్ వెల్లడించారు. సీనియర్ న్యాయమూర్తులు శివరాజ్ వి సిద్దేశ్వర, ఆనంద్ హెచ్.కొణ్ణూరు ఆధ్వర్యంలో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చటం ద్వారా వ్యాజ్యాలను పరిష్కరించినట్లు తెలిపారు. శివరాజ్ వి సిద్దేశ్వర 593, ఆనంద్ హెచ్ కొణ్ణూరు 1525 కేసులను పరిష్కరించారని, విడిపోయి విడాకుల కోసం అర్జీలు పెట్టుకున్న దంపతుల మధ్య రాజీచేసి వారిని కలిపారు. దంపతులు పరస్పరం పూలదండలు మార్చుకొన్నారు. లోక్‌అదాలత్‌లో న్యాయవాదులు చన్నబసవనాయక్, మనోహర్ విశ్వకర్మ, దత్తాత్రేయ, ఈశప్ప, మల్లేశ్‌మాచనూరు, గుమ్మాబసవరాజ్, బి.కె.అమరేశప్ప, రాజా శ్యాంసుందర్‌నాయక్, లక్ష్మీదేవినాయక్, స్టెల్లా సర్లేట్, హనుమంత, చంద్రశేఖర్, రాథోడ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విడిపోయిన దంపతులను కలుపుతున్న జడ్జిలు

## ఆ వివాహానికి గుర్తింపు ఉంటుంది

**బెంగళూరు (శివాజీనగర) :** భారతీయులు విదేశాల్లో వివాహం చేసుకుని, అక్కడి చట్టాల ప్రకారం పెళ్లిని రిజిస్ట్రరు చేసుకోకపోయినా, దానికి చట్టబద్ధత ఉంటుందని జస్టిస్ రామచంద్ర డి హుద్దార్ స్పష్టం చేశారు. వివాహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు, సాక్ష్యులు, ఆ జంట పేరిట ఉమ్మడిగా బ్యాంకు ఖాతా, ఇతర గుర్తింపు పత్రాలు ఉంటే ఆ వివాహం చెల్లుతుందన్నారు. విదేశంలో వివాహం చేసుకున్న జంట వేసుకున్న కేసు విచారణ సందర్భంలో న్యాయమూర్తి ఈ వివరణ ఇచ్చారు.

## రూ.5 వేలు ఇవ్వలేదని హత్య

**బెళగావి, న్యూస్‌టుడే :** రాయబాగ సమీపంలో రూ.5 వేల కోసం యువ జానపద కళాకారుడు మారుతి లట్టి (22)ని దుండగులు హత్య చేశారు. హత్యను రోడ్డు ప్రమాదంగా చూపించేందుకు అతని పైనుంచి కారు నడిపి వికృతి ప్రదర్శించారు. 'బా హుడుగి పంచమిగె' పాటతో లక్షలాది మంది జానపద పాటల అభిమానులను సంపాదించుకున్నాడు. బూదిహాళ గ్రామం వద్ద శుక్రవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో మారుతి లట్టె బైకును ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతోనే మరణించారని భావించారు. కొద్ది రోజుల కిందట కచ్చేరీలో పాల్గొనేందుకు ఈరప్ప అక్కివాటె అనే వ్యక్తి వద్ద రూ.50 వేలు బయానా తీసుకున్నాడు. కచ్చేరీ ఇవ్వడం సాధ్యపడకపోతే రూ.45 వేలను వెనక్కు ఇచ్చాడు. మరో రూ.5 వేలు త్వరలో ఇస్తానని చెప్పాడు. ఇదే విషయమై తన పది మంది అనుచరులతో కలిసి దారి కాచి దాడి చేసి హత్య చేశాడని రాయబాగ ఠాణా పోలీసులు గుర్తించారు. ఈ కేసులో సిద్ధరామ ఒడెయ, ఆకాశ పూజారి అనే నిందితులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఇతర హంతకుల కోసం గాలింపు తీవ్రం చేశారు.

## 'తీరుమారడంతోనే పొడిచా'

**బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే:** బుల్లితెర నటి శ్రుతిని కత్తితో పొడిచి పరారైన ఆమె భర్త అమరేశ్ విచారణను హనుమంతనగర ఠాణా పోలీసులు కొనసాగించారు. కొన్ని ధారావాహికల్లో వరుసగా నటించడం మొదలైనప్పటి నుంచి తనను, ఇద్దరు పిల్లలను నిర్లక్ష్యం చేస్తూ వచ్చిందని తెలిపాడు. పార్టీలు, పబ్బులకు వెళ్తూ అర్ధరాత్రుళ్లు ఇంటికి రావడం, ఒక్కోసారి పదిహేను రోజుల పాటు ఇంటికి తిరిగి రాకపోవడం, అడిగితే, కేసులు పెడతానని బెదిరింపులకు దిగిందని ఆరోపించాడు. రూ.25 లక్షలతో లీజుకు తీసుకున్న ఫ్లాట్‌లో ఉండకుండా, ఆ నగదును తీసుకువెళ్లేందుకు ప్రయత్నించి గొడవ పెట్టుకోవడంతో ఉద్రేకంతో కత్తితో దాడి చేశానని తెలిపాడు.

## సంగీత రంగానికి గవాయి సేవలు నిరుపమానం

**రాయచూరు, న్యూస్‌టుడే :** పండిత పంచాక్షరి గవాయి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గణదిన్ని కల్యాణ మంటపంలో గవాయి పుణ్యస్మరణ, 45వ సంగీత సమ్మేళనాన్ని నిర్వహించారు. స్వామీజీలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామీజీ రాయచోటి వీరశివాచార్య మాట్లాడుతూ సంగీత రంగానికి గవాయి అందించిన అద్వితీయమైన సేవలను మననం చేసుకునేందుకు ఏటా సమ్మేళనం నిర్వహించడం శ్లాఘనీయమని పేర్కొన్నారు. తద్వారా అనేక సంగీత కళాకారుల బృందాలను తయారు చేస్తున్నారని కితాబిచ్చారు. కిల్లే బృహన్మఠం స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు ప్రసంగిస్తూ గవాయి ఆశయాన్ని కొనసాగించేందుకు, జిల్లాలో సంగీత సమ్మేళనాలను తరచూ జరిగేందుకు దాతలు చేయూత ఇవ్వాలని కోరారు. ఒత్తిళ్ల మధ్య జీవిస్తున్న వారు సంగీతాన్ని ఆలకిస్తే మనసుకు ఆహ్లాదం, ఉత్సాహాన్ని కల్గిస్తుందన్నారు. వీరశైవ మహాసభ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పాటిల్, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలనలో స్వామీజీలు

## అంకుర సంస్థలు బలోపేతం

**బెంగళూరు(అడుగోడి),న్యూస్‌టుడే :** దేశంలో అంకుర సంస్థలకు బెంగళూరు నగరం కేంద్రస్థానంగా మారిందని, డిజిటల్ వ్యవస్థతో పాటు ప్రపంచ సామర్థ్య కేంద్రం (జేసీసీ)లకు కేంద్ర బిందువుగా మారిందని రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి భాస్కర్ కటిమ్మెని తెలిపారు. ఆదివారం ఇక్కడ జేసీసీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకుర సంస్థలను బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. వికసిత్ భారత్ మిషన్ ఆచరణలోకి తెచ్చేందుకు 1,700 జీసీసీలు కింద పరిశ్రమలు ఏర్పడుతున్నాయని, తద్వారా దేశవ్యాప్తంగా 1.9 మిలియన్ల మందికి ఉపాధి దొరికే అవకాశాలు ఉన్నట్లు తెలియజేశారు. అంకుర సంస్థలు కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగించుకుని మరింత అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో కేపీసీడీఏ ఎండీ రామన్‌రెడ్డి, అనుజ్ అగర్‌వాల్ తదితరులు పాల్గొన్నారు.

చిరుపుస్తకాన్ని విడుదల చేస్తున్న భాస్కర్ కటిమ్మెని, రామన్‌రెడ్డి, అనుజ్‌అగర్‌వాల్, తదితరులు

## ఔషధాలపై నిషేధం

**బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే:** నిబంధనలు ఉల్లంఘించి, నాణ్యతా ప్రమాణాలు పాటించని 133 ఔషధ విక్రయాలకు ఇచ్చిన అనుమతులను ఆరోగ్య శాఖ రద్దు చేసింది. మరో 20 ఔషధాలపై నిషేధాన్ని విధించింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,544 ఔషధ దుకాణాల్లో సోదాలు నిర్వహించిన ఆరోగ్య శాఖ, డ్రగ్ కంట్రోలర్ అధికారులు బెంగళూరు, హుబ్బళ్లి, బళ్లారిలలోని ఔషధ పరీక్ష ప్రయోగశాలల్లో ఔషధాలను పరీక్షించారు. జూన్‌లో 1,333 నమూనాలను పరీక్షించగా, 41 ఔషధాలు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేవని గుర్తించారు. మార్కెట్ నుంచి రూ.40 లక్షల విలువైన ఔషధాలను వెనక్కు తెప్పించారు. రక్తదాన శిబిరాలు, బ్లడ్ బ్యాంకులు నిర్వహిస్తున్న 122 కేంద్రాల్లో 44 కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు.

## సంఘటిత పోరాటమే శరణ్యం

**మాన్వి:** కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటం ఒక్కటే శరణ్యమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు హెచ్.శర్ఫుద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని తాలూకా పంచాయతీ సభాప్రాంగణంలో కట్టడ, నిర్మాణ కార్మికుల సంఘం రెండో సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చాలా ఏళ్లుగా పోరాడుతున్న కార్మికులకు కనీస సదుపాయాలు కల్పించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక దోరణ అవలంభిస్తోందన్నారు. కార్మికుల పిల్లలకు అందాల్సిన ప్రభుత్వ సదుపాయాలు అందలేదన్నారు. కేంద్రం కార్పొరేట్ కంపనీలకు అనుకూలంగా పనిచేస్తోందన్నారు. కార్యదర్శి షబ్బీర్ మాట్లాడుతూ కార్మిక సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సభ్యత్వం లేని వారికి గుర్తింపు ఉండదనే విషయాన్ని గుర్తుచేశారు. హట్టి పట్టణంలో నిర్వహించనున్న జిల్లా కార్మిక సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కట్టడ కార్మిక సంఘానికి నూతన సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఆంజినేయ కోటె, యూసూఫ్‌ఖాన్, సిద్ధలింగయ్య, మహ్మద్ నీర్‌మాన్వి, రుద్రప్పనాయక్, భాషా, రామణ్ణ, వెంకటేశ్, వెంకణ్ణ, ఇమామ్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న శర్ఫుద్దీన్, తదితరులు

## సిగంధూరు సిగలో తీగల హారం

*నేడే వంతెన ప్రారంభం*

**చిత్రదుర్గం, న్యూస్‌టుడే :** శివమొగ్గ జిల్లా సాగర తాలూకాలో శరావతి నదికి అడ్డంగా నిర్మించిన లింగనమక్కి జలాశయం పోటు జలాల్లో అంబరగొడ్లు కలసవల్లి గ్రామాల మధ్యన రూ.425 కోట్లతో నిర్మించిన 2.25 కి.మీ పొడవైన సిగంధూరు తీగల వంతెన (కేబుల్ బ్రిడ్జి)ను ప్రజల సంచారానికి కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్ర, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర తదితరులు హాజరవుతారని అధికారులు తెలిపారు. వంతెన ప్రారంభం తర్వాత సాగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆటల మైదానంలో సభా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

● **అలక్షిత ప్రాంతాల అభివృద్ధికి రహదారి:** అభివృద్ధి పనులను పూర్తి చేసుకొని ప్రజా సంచారానికి సిద్ధమైన సిగంధూరు తీగల వంతెనతో జలాశయానికి ఆవలి వైపున ఉన్న 15 గ్రామాల అభివృద్ధికి మార్గం ఏర్పడనుంది. ఇప్పటి వరకు ఈ గ్రామీణ ప్రాంతాల వేలాది మంది ప్రజలు లింగనమక్కి జలాశయం పోటు జలాల్లో సంచరించే లాంచీ పైనే రాకపోకలకు ఆధార పడేవారు. ఈ వంతెన ప్రారంభంతో అలక్షిత ప్రాంతాల అభివృద్ధికి దోహద పడుతుందని ఈ ప్రాంతాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

● **పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించే పరిసరాలు:** ఈ జలాశయం నీరు విస్తరించిన ప్రాంతంలో ఏర్పడిన చిన్న చిన్న ద్వీపాలు, వాటిలో పెరిగిన చెట్లు, చుట్టూ నీరు, ప్రకృతి రమణీయత అందాలకు పుట్టినిల్లులా ఉంటుంది. పర్యాటకులు ఉల్లాసంగా కాలం గడపడానికి వస్తారని ఆశిస్తున్నారు. ఈ వంతెనతో జలాశయానికి ఆవలి వైపున్న ప్రసిద్ధి చెందిన సిగంధూరు చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తమ సొంత వాహనాల్లో నేరుగా దేవాలయాన్ని చేరుకోవచ్చు. జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ నిర్మించిన ఈ వంతెన రాష్ట్రంలో అత్యంత పొడవైన తీగల వంతెన కాగా దేశంలో రెండో స్థానంలో నిలిచింది.

సిగంధూరు వెళ్లేందుకు నిర్మించిన పొడవైన తీగల వంతెన

## ఎగుమతులను ఎందుకు అడ్డుకోలేదు

**దావణగెరె, న్యూస్‌టుడే:** తాము గోవంశ రక్షకులం అని చెప్పుకుంటున్న హిందూ సంఘాలు, భాజపా నాయకులు గోమాంసం ఎగుమతులను ఎందుకు అడ్డుకోవడం లేదని కార్మిక శాఖ మంత్రి సంతోశ్ లాడ్ ప్రశ్నించారు. దేశంలోని 20 రాష్ట్రాల్లో భాజపా అధికారంలో ఉందని, అక్కడి నుంచే విదేశాలకు ఎక్కువగా గోమాంసం ఎగుమతి అవుతోందన్నారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్‌లో యోగి నేతృత్వంలో ప్రభుత్వం ఉన్నప్పటికీ, అన్ని రాష్ట్రాల కన్నా అక్కడి నుంచే ఎగుమతులు అవుతున్నాయని చెప్పారు.

## కీటకనాశినిని వినియోగించారు

**చామరాజనగర, న్యూస్‌టుడే:** మలెమహదేశ్వర బెట్ట సమీపంలో ఆడపులి, దాని నాలుగు పిల్లల హత్యకు సంబంధించి, వేర్వేరు ప్రయోగశాలల నుంచి నివేదిక అటవీశాఖ అధికారులకు అందింది. పులి, దాని పిల్లలు తిన్న మాంసం ముక్కలపై కార్బోఫ్యురాన్ అనే కీటకనాశిని ఔషధాన్ని పోయడంతోనే అవి మరణించాయని నివేదికలో తేటతెల్లమైంది.

(c) eenadu

# బస్టాండు ఎలా ఉంది

- మహిళల ఉచిత ప్రయాణానికి కసరత్తు
- పెరగనున్న ప్రయాణికుల రద్దీ
- సమస్యలు పరిష్కరించకుంటే కష్టమే

మహిళలకు ఆగస్టు-15 నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. రద్దీ పెరగనున్న నేపథ్యంలో బస్టాండ్లలో వసతులపై ఆర్టీసీ ఆరా తీస్తోంది. మంచినీరు, మరుగుదొడ్లు, బెంచీలు, ఫ్యాన్లు తదితర వసతులు మెరుగుపరిచే పనిలో పడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 డిపోల పరిధిలో రద్దీ ఎక్కువగా ఉంటే కర్నూలు, నంద్యాల, డోన్, బనగానపల్లి, ఎమ్మిగనూరు, ఆదోని, ఆత్మకూరు బస్టాండ్లలో వసతులపై 'న్యూస్‌బృందం' పరిశీలన చేసి అక్కడ ప్రయాణికులతో మాట్లాడగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. మరుగుదొడ్లు శుభ్రం ఉండటం లేదు.. మంచినీటి సౌకర్యం సరిగా లేదు.. సీసీ కెమెరాలు ఎక్కడా ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

## స్కాన్ చేసి చెప్పొచ్చు

ఎమ్మిగనూరు బస్టాండులో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న ప్రయాణికుడు

- బస్టాండు ప్రాంగణంలో పరిశుభ్రత, తాగునీరు, కుర్చీలు, మూత్రశాలలు, బస్సుల రాకపోకలు, సమాచార వ్యవస్థ వంటి ఐదు అంశాలపై ప్రత్యేక క్యూఆర్ కోడ్ విధానం అమలులోకి ఉంది. ప్రయాణికులు తమ చరవాణి ద్వారా స్కాన్ చేసి ఏపీ సర్వే సైట్‌లో నేరుగా సమస్యను తెలియజేసే అవకాశం కల్పించింది.
- క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాత ఏపీజీవోసర్వే.కామ్ అనే లింకు తెరుచుకుంటుంది. ఇందులో ఆర్టీసీ బస్టాండ్‌పై సర్వే అంటూ ఐదు అంశాలకు సంబంధించి ప్రశ్నలు కనిపిస్తాయి. అవును, కాదు, బాగుంది., బాగాలేదు. అని ఉంటాయి. వీటిని పూర్తి చేసి అప్‌లోడ్ చేస్తే నేరుగా ఏపీ సర్వే సైట్‌కు వివరాలు చేరుతాయి. ఎలాంటి సమస్యలపై ఎక్కువమంది అసంతృప్తి వ్యక్తం చేశారో దానిపై ఆర్టీసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. వీలైనంతో త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తారు.




మరిన్ని పరిశీలనాంశాలు 7లో

# ఎర్రమన్ను.. అక్రమార్కుల కన్ను

చేనేత టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించిన భూముల్లో దొంగలు పడ్డారు. విలువైన ఎర్రమట్టిని ఎత్తుకెళ్తున్నారు. ఎమ్మిగనూరు మండలం బనవాసిఫారం నవోదయ విద్యాలయం ఎదుట 77 ఎకరాలు పార్కుకు కేటాయించారు. ఇటీవల శంకుస్థాపన చేశారు. ఆ భూములు పశుసంవర్ధక శాఖ నుంచి చేనేత జౌళిశాఖ పరమయ్యాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విలువైన ఎర్రమట్టిని తవ్వేస్తున్నారు. ఒక ట్రిప్పు మట్టి రూ.2 వేలకుపైగా విక్రయిస్తున్నారు. నిత్యం 20 ట్రాక్టర్లలో తరలిస్తున్నారు.

–న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

# ఉచిత ఇసుక స్థిరాస్తికి ఊరట

రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం ● గత రెండు నెలల్లో 97.16 శాతానికి చేరిక

గత ఐదేళ్లు 'నేల' చూపులు చూసిన స్థిరాస్తి ఆదాయం 'కూటమి' ప్రభుత్వం చర్యలతో క్రమంగా పెరుగుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి జిల్లాకు రూ.601.40 కోట్ల ఆదాయం లక్ష్యంగా నిర్దేశించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉమ్మడి జిల్లాలోని 24 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రూ.138.32 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా రూ.134.39 కోట్లు ఆర్జించి 97.16 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు గాయత్రీ ఎస్టేట్

### గత ఐదేళ్లు తిరోగమనం

గత ఐదేళ్ల వైకాపా పాలనలో కొత్త పరిశ్రమలు రాక.. ప్రాజెక్టులు నిర్మించక స్థిరాస్తి వ్యాపారం పూర్తిగా కుదేలైంది. పొలాలు, స్థలాల క్రయవిక్రయాలు పడిపోయాయి. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. సేవల రుసుము, భూములు, స్థలాలు, భవనాల విలువను అమాంతం పెంచారు. దీంతో వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క ఆర్థిక సంవత్సరం కూడా నిర్దేశిత లక్ష్యంలో 50 శాతం ఆదాయాన్ని చేరుకోలేదు.

| ఆర్థిక సంవత్సరం | వచ్చిన ఆదాయం (రూ.కోట్లలో) | శాతం |
|---|---|---|
| 2023-24 | 341.43 | 48.8 |
| 2024-25 | 446.90 | 59.49 |
| 2025-26 (ఏప్రిల్ నుంచి జూన్) | 134.39 | 97.16 |

### కూటమి రాకతో పురోగమనం

- కుదేలైన స్థిరాస్తి వ్యాపారం 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుంజుకుంది. ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగం వేగం అందుకుంది. ఓర్వకల్లు పరిధిలో పలు భారీ పరిశ్రమలు మంజూరయ్యాయి. రహదారుల విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇవన్నీ జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం పెరిగేందుకు దోహదపడుతున్నాయి.
- సగటున ప్రతినెలా రూ.44.79 కోట్ల ఆదాయం సమకూరుతోంది. నెల ఆదాయం 2024- 25లో రూ.37.24 కోట్లు, 2023- 24 ఆర్థిక సంవత్సరంలో రూ.28.45 కోట్లు ఉండేది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి నెల ఆదాయం రూ.7.55 కోట్లు పెరిగింది.



పూజల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులు

## కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు, న్యూస్‌టుడే: వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు పూర్తిచేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలిసి ఆయన ఆదివారం సుంకేసుల జలాశయ గేటు వద్ద పూజలు నిర్వహించారు. 500 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వలకు విడుదల చేశారు. తుంగభద్ర జలాశయం గేట్లకు మరమ్మతులు చేస్తున్నారు.. ఈ నేపథ్యంలో రబీలో నీటి విడుదల ఉండదు.. దీన్ని రైతులు గమనించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలన్నారు. డీఈ ప్రసాద్, ఏఈ మహేంద్ర రెడ్డి, తదితరులు ఉన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలులోని కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలు, బాధితుల నుంచి సోమవారం వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

## నేడు వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవాలని.. రైతులకు సిరుల పంట పండాలని కోరుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ కమీషన్ ఏజెంట్ల సంఘం ప్రతినిధులు సోమవారం ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ రామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సహస్ర ఘటాభిషేకం చేయనున్నట్లు కమీషన్ ఏజెంట్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాసరెడ్డి, కట్టా శేఖర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు వారు వెల్లడించారు.

## భోరుమన్న బాలికలు

ఎస్సీ బాలికల వసతి గృహంలో నీటి సౌకర్యం లేక విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. నాలుగు రోజులకు ఒకసారి కుళాయి నీరు వస్తోంది. రోజువారి అవసరాల కోసం వంద మీటర్ల దూరంలోనున్న మసీదులో బోరు నీటిని తెచ్చుకుంటున్నారు. ఒక్కోసారి నాలుగు రోజులైనా నీళ్లు రావటం లేదని బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. –న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

## శ్రీగిరిలో భక్తజనం

శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులు ఆదివారం పెద్దఎత్తున తరలివచ్చారు. వేకువజామున 4 గంటల నుంచే స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.– న్యూస్‌టుడే, శ్రీశైల ఆలయం

# ముక్క.. కనిపించని ఆరోగ్య ముద్ర

అపరిశుభ్రత మధ్యే మాంసం విక్రయాలు ● కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఆదివారం మాంసాహారులకు ముక్కలేనిదే ముద్ద దిగదు. ఇదే అదనుగా వ్యాపారులు ఇష్టానుసారం దందా సాగిస్తున్నారు. నిబంధనలను లెక్క చేయడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలోనే జీవాలను వధించి.. మాంసం విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. శుభ్రత, నాణ్యత, ధరల విషయంలో అధికారుల నియంత్రణ కొరవడింది. దీంతో వ్యాపారులు తక్కువ ధరకు లభించే చిన్న వయసు పిల్లలు, అనారోగ్యంతో ఉన్న జీవాలు, గొర్రెలను వధించి వినియోగదారులకు అంటగడుతున్నారు.

–న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

పరిశీలన

### ఒక్కటి రూ.50

- మాంసం ధరల నియంత్రణపై జిల్లా పాలనాధికారులు ఒక్క సమావేశం కూడా నిర్వహించ లేదు. పైగా ఉమ్మడి జిల్లాలో ఎంతమంది మాంసం వ్యాపారులున్నారో కూడా అధికారుల వద్ద లెక్కలు లేకపోవడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో కిలో రూ.700- రూ.800 వరకు విక్రయిస్తున్నారు. కర్నూలు నగరంలో రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నారు.
- కిలో మటన్ కొంటే 50 గ్రాముల బరువున్న ముక్కలు 20 వరకు వస్తాయి. ఇందులో నాలుగు ఎముకలు ఉంటున్నాయి. ఈ లెక్కన ఒక్కో ముక్క రూ.40 నుంచి రూ.50 ధర పలుకుతోంది.

అపరిశుభ్రమైన ప్రాంతంలోనే..

### నిబంధనలు ఏం చెబుతున్నాయి

- పశు సంవర్ధక శాఖ వైద్యుడు, మున్సిపల్ శానిటరీ విభాగం సిబ్బంది పొట్టేళ్లు, మేకలను పరిశీలించి ఆరోగ్యంగా ఉన్నాయని ధ్రువీకరించిన తర్వాతే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జంతు వధశాలల్లో వాటిని వధించాలి. శుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రమాణాలు పాటించాలి. ఆ తదుపరి స్థానిక సంస్థల అధికారులు మాంసంపై ముద్ర వేసిన తర్వాత విక్రయించాలి.
- మాంసం ధరలు ప్రదర్శించాలి. ఎలక్ట్రానిక్ కాటాలు వాడాలి. తూకం పారదర్శకంగా ఉండాలి.
- పొట్టేళ్లు, మేకల మాంసాన్ని మాత్రమే వ్యాపారులు విక్రయించాలి. ఈ నిబంధనలు పాటించని వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

### ఇదీ పరిస్థితి..

కర్నూలు నగరంలోని వన్‌టౌన్ పరిధిలో జంతు వధశాల ఏర్పాటు చేశారు. అక్కడ పెద్ద పెద్ద జంతువులను వధిస్తున్నారు. గొర్రెలు, మేకలు, పొట్టేళ్లను దుకాణాల్లో, రోడ్ల పక్కన, మురుగు కాల్వల పక్కనే వధించి మాంసం వేరు చేసి విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మిగతా మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో అన్నిచోట్లా ఇదే పరిస్థితి. జంతువధశాలల్లోనే జీవాలను వధించేలా చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మామూళ్లు తీసుకొని చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు.

### వారానికి రూ.60 కోట్ల వ్యాపారం

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13.50 లక్షల కుటుంబాలున్నాయి. 46 లక్షలకు పైగా జనాభా ఉంది. ఒక వ్యక్తి రోజుకు 70 గ్రాముల చొప్పున.. వారానికి 500 గ్రాముల మాంసం తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మాంసం ధరలు ఆకాశాన్నంటుతుండటంతో 30 శాతం మంది మాత్రమే వారానికోసారి తింటున్నారు. అదీ 100 నుంచి 200 గ్రాముల్లోపే. ఇక 60- 70 శాతం మంది మాంసం బదులుగా చికెన్, చేపలు, గుడ్లను తింటున్నారు.
- ఉమ్మడి జిల్లాలో సుమారు 5 వేల మంది వరకు మాంసం వ్యాపారులున్నారు. వారానికి సగటున రూ.60 కోట్ల విలువ చేసే 7.50 లక్షల కిలోల మాంసం విక్రయాలు జరుగుతున్నాయి.

### 6 నెలల్లోపు జీవాలను వధించరాదు

– డా.జి.శ్రీనివాస్, జేడీ, పశు సంవర్ధకశాఖ

ఆరు నెలల వయసు దాటిన మేకలు, గొర్రెలు, పొట్టేళ్లను మాత్రమే వధించాలి. అంతకంటే చిన్న పిల్లలను వధిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ఆరోగ్యకరమైన వాటి మాంసాన్నే విక్రయించాలి. పరిశుభ్రమైన వాతావరణంలో మాంసం విక్రయాలు జరిగేలా పట్టణాల్లో నగర, పురపాలక సంఘాలు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది.

# రోజుకో పోలీసు పాఠం

- నేరాల నియంత్రణకు కొత్త ప్రణాళిక

కర్నూలు , ఆదోని నేరవిభాగం న్యూస్‌టుడే: ఖాకీ చొక్కాలోని కరుకుదనంతో పాటు సేవల్లోనూ జిల్లా పోలీసులు కొత్త పంథా ఎంచుకున్నారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ చొరవతో రోజువారి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పోలీసుల చర్యలు కనిపించకపోవడంతో ప్రజల్లో కలిగే అభద్రతా భావాన్ని తొలగించేలా 38 పోలీసుస్టేషన్ల పరిధిలో రోజువారీ కార్యక్రమాలు అమలు చేస్తూ పర్యవేక్షిస్తున్నారు. నేరగాళ్ల దూకుడుకు కళ్లెం వేస్తూ, నిబంధనలు పాటించని వారిని దారికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

### మంగళవారం – 'ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్'

విద్యా సంస్థల సమీపంలోని దుకాణాల్లో సిగరెట్లు, బీడీలు, గుట్కా, పొగాకు ఉత్పత్తులు విక్రయించటం సమస్యగా మారింది. పోకిరీలు, నేరగాళ్లు అక్కడ తిష్ఠ వేస్తున్నారు. విద్యార్థినులకు ఇబ్బందిగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి మంగళవారం 'ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్' పేరుతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. విద్యా సంస్థలకు 100 గజాల దూరం వరకు గుట్కా, పొగాకు ఉత్పత్తుల విక్రయంపై నిషేధం అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు.

ఆదోనిలోని పాఠశాలలో బాలికల అవగాహన కల్పిస్తున్న పోలీసులు

### శనివారం – రోడ్డు భద్రత

ప్రతి శనివారం పోలీసులు రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అతివేగం, ఓవర్‌లోడు, మద్యం మత్తులో డ్రైవింగ్, శిరస్త్రాణం ధరించకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, నంబరు ప్లేటు లేకపోవటం, రాంగ్‌రూట్, మితిమీరిన వేగం తదితర ట్రాఫిక్ ఉల్లంఘనల వల్ల జరిగే అనర్థాలు వివరిస్తున్నారు. నిబంధనలు పాటించని వాహన చోదకులకు మంత్రణం చేసి జరిమానాలు విధిస్తున్నారు.

### ఆదివారం – రౌడీషీటర్లకు మంత్రణం

జిల్లాలో దాదాపు 1300 మంది రౌడీ షీటర్లు ఉన్నారు. నేరగాళ్లకు కళ్లెం వేసేందుకు ప్రతి ఆదివారం స్టేషన్లకు పిలిపించి మంత్రణం చేయాలి. వారి కదలికలపై నిఘా ఉంచుతున్నారు.

### బుధవారం – అతివలకు తోడు

మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ.. ప్రతి బుధవారం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. విద్యా సంస్థలు, వాణిజ్య కేంద్రాలు, కార్యాలయాలు, పరిశ్రమల్లో పనిచేసే మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈవ్ టీజింగ్, వేధింపులు, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, ఇతర సమస్యలు ఎదురైతే శక్తియాప్, శక్తి వాట్సప్ నంబరు- 7993485111, డయల్ 100, 112, 1098 నంబర్లను సంప్రదించాలని సూచిస్తున్నారు. సామాజిక మాధ్యమ సమస్యలకు 1930 నంబరుకు ఫోన్ చేయాలని సూచిస్తున్నారు.




# అటు తొలగిన పూడిక.. ఇటు నిర్లక్ష్యం వీడక

దిగువ కాల్వకు నీరు విడుదల చేసి మూడు రోజులు గడిచింది. ఒకటి, రెండు రోజుల్లో ఆంధ్ర సరిహద్దుకు చేరుకొనే అవకాశం ఉంది. కాల్వలో మట్టి, ఇతర వ్యర్థాలు అలాగే ఉన్నాయి. నీటి ప్రవాహానికి అడ్డుపడే పరిస్థితి నెలకొంది. కర్ణాటకలోని యరగుడి వద్ద ప్రత్యేక యంత్రాలతో కాల్వలోని మట్టి, చెత్తాచెదారం తొలగిస్తున్నారు. మన వైపు ఎలాంటి పనులు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. బాపురం వద్ద దిగువ కాల్వలో మట్టి, వ్యర్థాలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. వీటిని అలాగే వదిలేస్తే నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతాయని స్థానికులు వాపోతున్నారు. దిగువ కాల్వ శుభ్రం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, హాలహర్వి

# కాల్వ విస్తరణ.. వంతెనల విస్మరణ

మద్దికెర- బొజ్జనాయునిపేట గ్రామాల మధ్య వంతెన నిర్మించారు. ఇరువైపులా గోడ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. కాలువలో పడి కొట్టుకుపోయే పరిస్థితి. ఇక్కడ కాలువ లోతు 40 అడుగులకు పైగా ఉంది.

–న్యూస్‌టుడే, పత్తికొండ, మద్దికెర

హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు వేగంగా సాగుతున్నా.. గత నిర్మాణాల నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 134 కి.మీ. మేర విస్తరించిన హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువను విస్తరించడం వల్ల ప్రస్తుతం 2,100 క్యూసెక్కుల నీటిని తరలించే సామర్థ్యం నుంచి 3,850 క్యూసెక్కులు తరలించేలా వేగంగా పనులు చేపట్టారు. రాకపోకల కోసం కాలువపై నిర్మించిన వంతెనల రక్షణ గోడలు పలుచోట్ల దెబ్బతిని కూలిపోయాయి. ఈ నిర్మాణాలు 20 ఏళ్ల కిందట చేసినవే. ఇప్పటి వరకు కనీస మరమ్మతుకు కూడా నోచుకోలేదని ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పర్యవేక్షించేదెవరు..

ఉమ్మడి జిల్లాలోని నందికొట్కూరు, బ్రాహ్మణకొట్కూరు, కృష్ణగిరి, దేవనకొండ, వెల్దుర్తి, పత్తికొండ, మద్దికెర తదితర మండలాల పరిధిలో హంద్రీనీవా కాలువ వెళ్తోంది. దీనిపై 54 చోట్ల వంతెనలు నిర్మించారు. దశాబ్దాలు గడవడంతో పలుచోట్ల రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నిత్యం వాహనాలు, పశువుల, వేలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారుల్లో సైతం హంద్రీనీవా వంతెనలు ప్రమాదకరంగానే ఉన్నాయి.

### ఉన్నతాధికారుల దృష్టికి – హరిప్రసాద్, ఏఈ, ఎచ్ఎన్ఎస్ఎస్

వంతెనలపై నిర్మించిన రక్షణ గోడలు పరిశీలిస్తాం. అవసరమైన చోట మరమ్మతుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వాటి వల్ల రైతులు, పశువులు ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు చేపడతాం.

## రూ.11 లక్షల ఎరువుల అమ్మకాల నిలిపివేత

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆదివారం మండల వ్యవసాయాధికారి శివశంకర్ తనిఖీ చేశారు. మల్లికార్జున ఓ దుకాణంలో దస్త్రాలు సరిగా లేనందున రూ.10 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపేశారు. మరో దుకాణంలో 42 బస్తాల యూరియా విక్రయాలను నిలిపేస్తూ ఆదేశాలిచ్చారు. ఆయన మాట్లాడుతూ... సోమవారం నుంచి గ్రామాల్లోనే రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎరువుల వ్యాపారులు యూరియాను నిర్ణీత ధర కంటే అధికంగా అమ్మితే దుకాణ అనుమతి రద్దు చేస్తామని హెచ్చరించారు.


ఎత్తుకు పైఎత్తు.. ప్రత్యర్థి చిత్తు 6లో

రిజ్వానా.. రెజ్లింగ్‌లో భళా

(c) eenadu

# ఎత్తుకు పైఎత్తు.. ప్రత్యర్థి చిత్తు

➤ చదరంగంలో విద్యార్థి ప్రతిభ

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే: చదరంగం మేధస్సుకు పదును పెట్టే క్రీడ. ఇందులో నిత్యం సాధన చేస్తే ఏకాగ్రత పెరుగుతుంది. జ్ఞాపకశక్తి, వ్యూహ రచనా సామర్థ్యాలు పెంపొందుతాయి. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థులు చదరంగంపై ఆసక్తి చూపుతున్నారు. నంద్యాలకు చెందిన మోక్షిత్ ఇదే కోవకు చెందినవాడు. పట్టణంలోని బాలాజీ కాంప్లెక్సుకు చెందిన ఇతను ప్రస్తుతం 7వ తరగతి చదువుతున్నాడు.

## నిత్యం సాధన చేస్తూ..

చదరంగంపై ఆసక్తి నేపథ్యంలో గత మూడేళ్లుగా రామసుబ్బారెడ్డి వద్ద మోక్షిత్ శిక్షణ తీసుకుంటున్నాడు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు ప్రతిరోజూ ఖాళీ సమయంలో రెండు గంటలపాటు చదరంగంపై శిక్షణ తీసుకుంటూ తనదైన శైలిలో రాణిస్తున్నాడు. నిత్యం సాధన చేస్తూ చదరంగంపై పట్టు సాధించాడు. ఎప్పటికప్పుడు మెలకువలు నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నాడు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పతకాలు అందుకుంటూ అందరి మన్ననలు అందుకుంటున్నాడు.

## జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తా - మోక్షిత్

నాకు చిన్నప్పటి నుంచి చదరంగం అంటే ఎనలేని ఆసక్తి. ఈ నేపథ్యంలో నిదానంగా పట్టు సాధించా. ఎక్కడ పోటీలు జరిగినా ఉత్సాహంగా పాల్గొంటూ విజయాలు అందుకుంటున్నా. జాతీయస్థాయి పోటీల్లో రాణించడమే నా లక్ష్యం. దీనికి గాను నిరంతరం సాధన చేస్తున్నా. అన్ని పోటీల్లో రాణించి మంచి పేరు తీసుకొస్తా.

## సాధించిన విజయాలివే..

గతేడాది కర్నూలులో నిర్వహించిన అండర్-12 జిల్లాస్థాయి పోటీల్లో మోక్షిత్ పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే ఏడాది నగరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తృతీయ బహుమతి గెలుచుకున్నాడు. గతేడాది చివర్లో నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాలలో నిర్వహించిన ర్యాంకింగ్ చదరంగం పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకున్నాడు. అదే ఏడాది భీమవరంలో ర్యాపిడ్, రేటింగ్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 1,063 ర్యాంకు సొంతం చేసుకున్నాడు.

● ఈ ఏడాది నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో 4వ స్థానంలో నిలిచాడు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ర్యాపిడ్ పోటీల్లో ప్రథమ బహుమతి అందుకున్నాడు.

# రిజ్వానా.. రెజ్లింగ్‌లో భళా

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గనుల్లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఓ కుటుంబంలో పుట్టిన ఆ విద్యార్థిని ఓ వైపు చదువులోనూ మరోవైపు ఆటల్లోనూ ప్రతిభ చూపుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల సహకారంతో రెజ్లింగ్ ఆటలో పతకాలు సొంతం చేసుకుంటూ క్రీడా విభాగంలో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది రిజ్వానా.

## పేదింటి క్రీడారత్నం

అవుకు మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన దూదేకుల రంగన్న, బాలహుస్సేన్‌బీ దంపతులది నిరుపేద కుటుంబం. భార్యాభర్తలు గ్రామంలోని గని పనులు, వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తూనే పిల్లలను చదివిస్తున్నారు. రెండో సంతానమైన రిజ్వానా చదువులోనూ, ఆటల్లోనూ దూసుకుపోతోంది. తిరుపతిలోని పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివి 960మార్కులు సాధించింది. ఇంటర్ చదివే సమయంలో ఫిజికల్ డైరెక్టర్ సాయిసుమలత బాలికను రెజ్లింగ్‌లోని గ్రాప్లింగ్ ఆటలో శిక్షణ ఇప్పించింది. జిల్లాస్థాయి ఎంపికల్లో ఈ విద్యార్థిని చోటు దక్కించుకొని గ్రాప్లింగ్‌లోని జీఏ, నోగి రెండురకాల ఆటల్లో 37, 40కేజీల విభాగాల్లో ఆడి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించింది. కరాటే, జిమ్నాస్టిక్స్‌లోనూ శిక్షణ పొంది రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపించింది.

### సాధించిన విజయాలు:

- 2023 సెప్టెంబరులో హరియాణా రాష్ట్రం రోహ్‌తక్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి స్వర్ణపతకం కైవసం చేసుకుంది.
- 2023 డిసెంబరులో వైజాగ్‌లో జరిగిన జాతీయ స్థాయి బీచ్ గ్రాప్లింగ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచింది.
- 2024 ఆగస్టులో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జీఏ, నోగి విభాగాల్లో పాల్గొని మొదటి బహుమతి సొంతం చేసుకుంది.
- 2025లో హర్యానాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం గెలిచింది.
- 2024, 2025లో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచింది.
- ఇదే ఏడాది చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో వెండి పతకం సాధించింది.

## దేవరగుండు

చిన్న రాయిపై పెద్ద గుండు నిలబెట్టినట్లుగా ప్రత్యేకంగా ఉన్న ఈ ప్రకృతి రూపమే ఆ గ్రామస్థుల దైవం. దేవనకొండ సమీపంలోని 4 కి.మీ. దూరంలో కరిడికొండ గ్రామం ఉంది. ఆ ఊరి జనాభా 500 కుటుంబాలు. ఇంకో ఆశ్చర్యమైన విషయమేమిటంటే.. వారంతా ఆ కొండపైనే నివాసం ఉంటున్నారు. అక్కడే బొమ్మదేవర గుండు వద్ద ప్రతి అమావాస్య రోజున పూజలు చేస్తుంటారు. ఓ చిన్నపాటి రాయిపై ఓ పెద్ద గుండు నిల్చుండటాన్ని భక్తులు ఆసక్తిగా చూస్తుంటారు. – దేవనకొండ, న్యూస్‌టుడే:

# తపాలా.. మళ్లీ కళకళ

◆ ప్రభుత్వ పథకాల అనుసంధానంతో పూర్వవైభవం
◆ ఖాతాలు తెరిచేందుకు బారులుతీరుతున్న లబ్ధిదారులు

కర్నూలు ప్రధాన పోస్టాఫీసు వద్ద ఖాతాదారుల బారులు (పాతచిత్రం)

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తపాలాశాఖకు పూర్వవైభవం తెస్తున్నాయి. తల్లికి వందనం, త్వరలో అమలుకానున్న అన్నదాత సుఖీభవ పథకాల నగదును ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తోంది. ఈ మొత్తం జమ కావాలంటే వారి ఖాతాలు తప్పనిసరిగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో అనుసంధానమై ఉండాలి. చాలామంది ఖాతాలు ఎన్‌పీసీఐతో అనుసంధానం కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన తపాలా శాఖ అధికారులు ఎన్‌పీసీఐతో అనుసంధానమైన పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ఖాతా (ఐపీపీబీ)లను తెరిపిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. దీంతో సంక్షేమ పథకాల లబ్ధిదారులు పెద్దసంఖ్యలో తపాలా ఖాతాలు తెరిచేందుకు ఆసక్తి చూపుతున్నారు.

### 6 నెలలు.. 25 వేల ఖాతాలు

ఉమ్మడి జిల్లాలో మూడు ప్రధాన తపాలా కార్యాలయాలు ఉన్నాయి. సబ్ పోస్టాఫీసులు కర్నూలు జిల్లాలో 463, నంద్యాల జిల్లాలో 43 ఉన్నాయి. వీటి పరిధిలో ఆరు నెలల కాలంలో 25 వేలకు పైగా ఖాతాలు తెరిచినట్లు అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారుల ఇళ్లవద్దకు, కళాశాలల వద్దకే వెళ్లి ఖాతాలు తెరిపిస్తున్నారు. ఖాతాదారులకు ఏటీఎం కార్డు, పాసు పుస్తకం ఇస్తున్నారు. కార్డును వినియోగించుకొని నగదు లావాదేవీలు నిర్వహించవచ్చు.

### కార్యాలయాల వద్ద బారులు

● తల్లికి వందనం పథకం కింద జిల్లాలోని 27,495 మంది ఖాతాల్లో రూ. 57.18 కోట్ల నగదు జమ చేశారు. అర్హత ఉండి పథకం వర్తించని వారికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. రెండో విడతలో 5,100 మంది ఖాతాల్లో రూ. 7.10 కోట్ల నగదు జమ చేశారు.

● చాలామంది బ్యాంకు ఖాతాలు ఎన్‌పీసీఐకి అనుసంధానం కాలేదు. ఎన్‌పీసీఐ వద్ద వాటి వివరాలు లేకపోవడంతో తల్లికి వందనం డబ్బులు జమ కాలేదు. వారంతా తపాలా ఖాతాలు తెరిచేందుకు ముందుకొస్తున్నారు. రోజూ వేలాదిమంది ఖాతాలు తెరిచేందుకు బారులుతీరుతున్నారు.

### కళాశాలల వద్దకే వెళ్తున్నాం

- జనార్దన్‌రెడ్డి, ప్రధాన పర్యవేక్షకులు, కర్నూలు తపాలా డివిజన్

ప్రభుత్వ పథకాల నగదు బ్యాంకు ఖాతాల్లో జమ కావాలంటే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో అనుసంధానం కావాల్సి ఉంది. ఈ విషయం తెలుసుకుని చాలామంది తపాలా శాఖలో ఖాతాలు తెరిచేందుకు కార్యాలయాలకు తరలివస్తున్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని ఉదయం 6 గంటల నుంచే తపాలా కార్యాలయాలు తెరుస్తున్నాం. కళాశాలల వద్దకే వెళ్లి విద్యార్థులతో ఖాతాలు తెరిపించాం. నెల రోజుల వ్యవధిలోనే భారీ సంఖ్యలో ఖాతాలు తెరిచాం.

## పర్యావరణ హిత విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 27 నుంచి జరిగే వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణ హితమైన విగ్రహాలు ఏర్పాటు చేయాలని కర్నూలు జిల్లా గణేశ్ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల రమణ, సంఘటనా కార్యదర్శి నాగఫణిశాస్త్రి, కార్యాధ్యక్షుడు డా. మోక్షేశ్వరుడు మండపాల నిర్వాహకులను కోరారు. నగరంలోని వినాయక ఘాట్‌లో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయంలో ఆదివారం జిల్లా గణేశ్ ఉత్సవ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయాల ప్రకారం దేవతా విగ్రహాలు మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. సినీ హీరోలు, ఇతర వేషాలతో విగ్రహాలను ఏర్పాటు చేసి హిందూ సమాజాన్ని అవమానించొద్దన్నారు. జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, గూడూరు ఇతర పట్టణాల్లో ఆగస్టు 27 నుంచి 31వ తేదీ వరకు (ఐదు రోజుల) పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. కర్నూలు నగరంలో ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ విజయాలను ప్రతిబింబించే విధంగా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి కోశాధికారి ఎ.వి.ప్రసాద్, నగర ఉత్సవ సమితి అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి గిరిరాజవర్మ, సహ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గణేశ్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

# వరుసకట్టు.. ఆకట్టుకునేట్టు

మద్దికెర- తుగ్గలి మండలాల మధ్య వరుసగా వందల సంఖ్యలో విద్యుత్తు నియంత్రికలు కనిపిస్తుంటాయి. ఈదుల వంకకు నీరందేలా రైతులు తూములు ఏర్పాటు చేసుకున్నారు. వీటి ద్వారా పలు గ్రామాలకు నీరు అందుతోంది. ఈ ప్రాంతానికి చెందిన అన్నదాతలు తమ పొలాలకు ఈ నీరు అందించాలని విద్యుత్తు మోటారు ఏర్పాటు చేసుకున్నారు. వీటికి అవసరమైన విద్యుత్తు నియంత్రికలను అడుగడుగునా స్తంభాలకు బిగించారు. ఇవి దారి వెంట వందల సంఖ్యలో వరుస కట్టడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. – న్యూస్‌టుడే, పత్తికొండ

## మార్కెట్ యార్డు డైరెక్టర్ల ఎంపిక

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి మార్కెట్‌యార్డు డైరెక్టర్లుగా 13 మందిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఎర్రబోలు పవన్‌కుమార్‌రెడ్డి, నడిపి భూషన్న, దేశావత్ నర్సిబాయి, దూదేకుల ప్రవీణ్, జి.మల్లికార్జునరెడ్డి, గంగిరెడ్డి సుజాత, కురం రాధిక, మారం పుల్లారెడ్డి, ముచ్చలపురి రామయ్య, దూదేకుల పెద్దదస్తగిరిమ్మ, తెలుగు ఎల్లేశ్వరి, నల్‌బంద్ మహబూబ్‌బాషా, తలారి లక్ష్మీదేవిని ఎంపిక చేశారు.

# మెరిసిన తెల్ల బంగారం

◆ ఎకరా పొలంలో 19.2 క్వింటాళ్ల దిగుబడి
◆ రైతుకు దక్కిన జాతీయ పురస్కారం

పెద్ద అంజినయ్యకు అందజేసిన ప్రశంసాపత్రం

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎకరం పొలం.. రూ. 35 వేల పెట్టుబడి.. 19.2 క్వింటాళ్ల పత్తి దిగుబడి సాధించి జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు పెద్ద అంజినయ్య. నాగ్‌పూర్ పత్తి పరిశోధన స్థానం అధిక సాంద్రత పద్ధతిని రైతుల్లోకి తీసుకెళ్లేందుకు పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుంది. పెద్దకడబూరు మండలంలోని తారాపురానికి చెందిన పెద్ద అంజనయ్య గతేడాది అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేశారు. ఎకరానికి సాధారణంగా మూడు ప్యాకెట్ల పత్తి విత్తనాలు నాటుతారు. అధిక సాంద్రత పద్ధతిలో ఐదున్నర ప్యాకెట్లు నాటారు. రూ. 35 వేల పెట్టుబడి పెట్టారు. పంట దిగుబడి విక్రయించగా రూ. 1.22 లక్షలు వచ్చాయి. పెట్టుబడి పోను నికరాదాయం రూ. 87 వేలు పొందారు. తమిళనాడులోని కోయంబత్తూరులో జులై 11న పత్తి జాతీయ సదస్సును పత్తి పరిశోధన స్థానం నాగ్‌పూర్ వారు నిర్వహించారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసిన పెద్ద అంజినయ్యకు రైతు అవార్డు, ప్రశంసాపత్రాన్ని కేంద్ర మంత్రులు అందజేశారు.

## తిరుమల కొండపై శ్మశానాన్ని తొలగించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమలలో శ్మశానం ఉందన్న విషయం కలకలం రేపుతోందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తితిదే ఛైర్మన్ హిందూ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని వీహెచ్‌పీ అధికారి ప్రతినిధి రావినూతల శశిధర్ డిమాండ్ చేశారు. నగరంలోని వినాయక మందిరంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల కొండపై శ్మశానం ఉంటే వెంటనే తొలగించాలని కోరారు. ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నా జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదని వాపోయారు. జొహరాపురంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి చెందిన ఆరెకరాల భూమి ఆక్రమణకు గురైందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరవైందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య, కార్యదర్శి పర్రె కోటేశ్వరరావు, మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీహెచ్‌పీ అధికార ప్రతినిధి రావినూతన శశిధర్

# తెలుగుభాష అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

- మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : తెలుగుభాష అభివృద్ధికి సమష్టి కృషి చేయాల్సిన అవసరముందని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తెలుగుభాషా పరిరక్షణ సదస్సుకు రెండోరోజు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా టీజీ మాట్లాడుతూ.. తెలుగుభాషకు ప్రాధాన్యం తగ్గకుండా నిరంతరం వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వచ్చే ఏడాది కర్నూలులో తెలుగు మహాసభలను భారీగా నిర్వహించాలని సూచించారు. కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు ఉచితంగా నిర్వహించుకునే అవకాశం కల్పిస్తూ కళాకారులకు చేయూత ఇస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు, సదస్సు అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర, ఉపాధ్యక్షుడు జేఎస్‌ఆర్‌కే శర్మ, కార్యదర్శి డా. పార్వతితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన సాహితీవేత్తలు ప్రసంగించారు. ఈసందర్భంగా టీజీ వెంకటేశ్ సాహితీవేత్తలను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

### సదస్సులో చేసిన తీర్మానాలు

● కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల్లో మాతృభాష సంరక్షణకు చేపట్టిన కార్యక్రమాలపై అధ్యయనం చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. మన రాష్ట్రంలో తెలుగుభాష ప్రాభవం కోల్పోకుండా చూడాలి.

● తెలుగుభాషా సంఘాన్ని ఏర్పాటు చేసి, అధికారాలివ్వాలి.

● ప్రభుత్వ విద్యా సంస్థల్లో తెలుగును తొలి భాషగా, బోధన భాషగా, అధ్యయన భాషగా అందరూ అనుసరించే విధంగా నిర్ణయం తీసుకోవాలి.

● ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కళాశాలల్లో తెలుగును తప్పనిసరిగా అధ్యయనం చేసేలా చట్టం చేయాలి.

● ప్రతి జిల్లాలో తెలుగు ఓరియంటల్ కళాశాలను ఏర్పాటు చేయాలి.

● ప్రతి పాఠమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయున్ని నియమించాలి.

● పోటీ పరీక్షలను తెలుగులో రాసే విధానం అమలు చేయాలి.

● తెలుగుభాష అభివృద్ధికి కృషిచేసే భాషాభిమానులు, సాహితీవేత్తలతో ప్రభుత్వం సమావేశాలు నిర్వహించి, వారి సలహాలు తీసుకోవాలి.

● న్యాయస్థానాల్లో సామాన్య ప్రజానీకం కోసం వాదనలు, తీర్పులు తెలుగులో ఉండేలా చూడాలి.

● ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, దుకాణాలు, ఇతర సంస్థల పేర్లు తెలుగులోనే ఉండాలి.

సాహితీవేత్తలను సత్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్.. చిత్రంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు, పత్తి ఓబులయ్య తదితరులు

## మృత్తికా బృందావనానికి బంగారు పల్లకి సేవ

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే: శ్రీమఠంలో బంగారు పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ఆదివారం శ్రీమఠంలో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. ఆదివారం ఉదయం మృత్తికా బృందావనానికి వెండి సింహాసనంలో ఉంచి అర్చకులు దివాన్ శ్రీనాథ్ ఆచార్ పాద పూజ నిర్వహించారు. అనంతరం బంగారు పల్లకిలో ఉంచి శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. సహాయ పీఆర్వో వ్యాజరాజాచార్, మఠం సిబ్బంది పల్లకి సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బంగారు పల్లకి సేవలో పాల్గొన్నారు.

బంగారు పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

# ఈవ్‌టీజింగ్ కట్టడికి 11 బృందాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు పరిధిలో ఈవ్‌టీజింగ్‌ను అరికట్టేందుకు 11 యాంటీ ఈవ్‌టీజింగ్ గస్తీ బృందాలను ఏర్పాటు చేసినట్లు కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోలీసు బృందాలు మఫ్టీలో పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేటు మహిళా హాస్టళ్లు, బాలికల వసతిగృహాలు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రదేశాల్లో నిఘా ఉంచుతాయని వెల్లడించారు. ఆకతాయిలు కనిపిస్తే స్టేషన్‌కు తీసుకెళ్లి వారి తల్లిదండ్రులను పిలిపించి మంత్రణం చేస్తారన్నారు. సీఐలు మహేశ్వరరెడ్డి, విజయలక్ష్మి ఈవ్‌టీజింగ్ బీట్లను పర్యవేక్షిస్తారన్నారు. పోలీసు గస్తీ బృందాల సభ్యులు ఆదివారం వసతి గృహాలను తనిఖీ చేశారు. మహిళలు, బాలికలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆపద సమయాల్లో డయల్ 112కు గాని శక్తి వాట్సప్ నంబరు 7993485111 నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. గస్తీ బృందం పోలీసులు నగర శివారులోని ఓ ఇంజినీరింగ్ కళాశాల వద్ద మఫ్టీలో నిఘా పెట్టి ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న యువకులను పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్సై సురేష్ వారికి మంత్రణం చేశారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఈవ్‌టీజింగ్ గస్తీ పోలీసులు

# ధార్మిక సంస్థలన్నీ ఏకతాటిపై నడవాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : విశ్వశాంతి కోసం ధార్మిక సంస్థలన్నీ ఏకతాటిపై నడవాలని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి శ్రీమాన్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని జమ్మిచెట్టు సమీపంలో ఉన్న లలితాపీఠంలో ఆదివారం లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పీఠాధిపతులు, స్వామీజీలు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీశారదా పీఠం పీఠాధిపతి యోగీంద్ర సరస్వతి స్వామి, జూటూరులోని గురు సిద్ధనాగసాయి బ్రహ్మ విద్యాశ్రమం పీఠాధిపతి రామానందస్వామి, కర్నూలు భగవాన్ ధన్వంతరి యోగాశ్రమం నిర్వాహకులు డా. పద్మానంద యోగి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, నల్లగుట్ట శ్రీకూర్మం క్షేత్ర నిర్వాహకుడు నరేష్, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరు ప్రతాప్‌రెడ్డి, స్వాత్మానంద స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి ధార్మిక సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీలు

# ఇద్దరు యువకుల దుర్మరణం

➤ బెంగళూరులో రహదారి ప్రమాదం

రవితేజ (పాతచిత్రం)

రవి (పాతచిత్రం)

చంచుఎర్రగుడి (కృష్ణగిరి), న్యూస్‌టుడే: బెంగళూరులో ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో కృష్ణగిరి మండలం చంచుఎర్రగుడి గ్రామానికి చెందిన రవితేజ(30), సమీప బంధువైన రవి(31) మృతిచెందినట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన సిరోళ్ల రమేష్‌బాబు, మల్లేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రవితేజ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. అక్కడే నివాసం ఉంటున్న తన సమీప బంధువు దేవనకొండ మండలం కుంకనూరు గ్రామానికి చెందిన రవితో కలిసి ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. వెనుక నుంచి కారు ఢీకొంది. తలకు బలమైన గాయాలు కావడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలియడంతో కుటుంబ సభ్యులు వెంటనే బెంగళూరుకు బయల్దేరి వెళ్లినట్లు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని కోట్ల రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి (30) ఆత్మహత్య చేసుకున్నారు. డెమో రైలు వెళ్తున్న సమయంలో ఆయన అకస్మాత్తుగా పట్టాలపైకి రావడంతో రైలు ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. డెమో రైలులోకో పైలట్ వెంటనే రైల్వేస్టేషన్ మేనేజరు ద్వారా కర్నూలు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు ఎవరన్న వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

## విద్యార్థిని బలవన్మరణం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని కడుపు నొప్పి తాళలేక ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 44 మోటారు సైకిళ్ల స్వాధీనం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన నాకాబందీలో భాగంగా 44 మోటారు సైకిళ్లు, 2 ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. కురుకుంద గ్రామంలో తనిఖీలు జరిపామని.. సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో 10 మోటారు సైకిళ్లు, 14 మందు సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

● ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పాములపాడు పోలీసుస్టేషన్ పరిధిలో 9 ద్విచక్ర వాహనాలు, 31 మందు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నందికొట్కూరు సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నందికొట్కూరులోని జగనన్న కాలనీలో 10 బైక్‌లు 2 ఆటోలు పట్టుకున్నారు. నందికొట్కూరు సీఐ సుబ్రహ్మణ్యం, జూపాడుబంగ్లా ఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండ్లెం, జూపాడుబంగ్లాలో జరిపిన తనిఖీల్లో 15 మోటారు సైకిళ్లు, 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

## సీసీ కెమెరాలతో వ్యక్తి ఆచూకీ లభ్యం

◆ కుటుంబ సభ్యులకు అప్పగింత

ఆత్మకూరు, న్యూస్‌టుడే: అప్పులు ఎక్కువవడంతో గతేడాది ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోగా సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రాము ఆదివారం తెలిపారు. ఆత్మకూరు పట్టణం వడ్లపేటకు చెందిన బొల్లు రాము అప్పుల బాధతో గతేడాది మేలో ఇంటి నుంచి వెళ్లిపోయారని చెప్పారు. సీసీ కెమెరాల ఆధారంగా హైదరాబాద్ పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలోని సనత్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఆధారంగా పెట్రోలు బంకులో పనిచేస్తున్నట్లు గుర్తించి అతడిని పట్టుకుని ఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

సోషల్ మీడియాలో అనుభవం ఉన్న వారికి ఒక అద్భుతమైన వ్యాపార అవకాశం. తక్కువ పెట్టుబడితో మంచి సంపాదనకి గొప్ప అవకాశం. మీరు పెట్టే పెట్టుబడిలో వెంటనే మీకు ఒక Samsung Tab మరియు మొబైల్ అప్లికేషన్స్ లోడ్ చేసి ఇవ్వడం జరుగుతుంది. Area wise గా ఒక్కొక్కరికి మాత్రమే అవకాశం ఇవ్వడం జరుగుతుంది. మరిన్ని వివరాలకు సంప్రదించండి M/s R. R. Creative Media Events Pvt Ltd. Contact: 83742 35356, 90006 97232.

WANTED Marketing Executives for Reputed Company. No Targets, Permanent Salary: 10,000/- to 15,000/- & Good Incentives. ✆ 93912 50272.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

JOBS

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

# ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

## విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ మండలం లోని కోతిరాళ్ల, పందికోన, దేవనబండ విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో సోమవారం మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తుశాఖ ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆయా ఉపకేంద్రాల పరిధిలో కొత్తలైన్లకు తీగలు ఏర్పాటు చేస్తుండటం వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన చెప్పారు. తీగల పనులు పూర్తయిన వెంటనే విద్యుత్తు సరఫరా యథావిధిగా సరఫరా కు చర్యలు తీసుకుంటామన్నారు.

## పుల్లగుమ్మి రైతులకు అండగా ఉంటాం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: పుల్లగుమ్మి గ్రామంలోని బాధిత రైతు కుటుంబాలకు అండగా ఉంటామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ అన్నారు. పుల్లగుమ్మి గ్రామంలోని రైతులతో కలిసి పంట పొలాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో పుల్లగుమ్మి రైతులు జనార్దన్, శంకర్, శ్రీనివాసులు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రాల్లో యూరియా విక్రయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని, రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి అక్బర్‌బాషా అన్నారు. మల్లెపల్లి, బింగిదొడ్డి, లక్ష్మీనగరం, గోవర్ధనగిరి, వెల్దుర్తి, కలుగొట్ల గ్రామాల్లోని కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచున్నాం. వెల్దుర్తి, బింగిదొడ్డి, మల్లెపల్లిలోని రైతులకు పత్తికొండ ఏడీఏ విజయకుమార్ యూరియా బస్తాలు పంపిణీ చేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ?: అరికెర గ్రామంలో రైతుసేవా కేంద్రం వద్ద పారిశుద్ధ్యం లోపించింది.
- రాముడు, రైతు, అరికెర

✔: సిబ్బందిని పంపి శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం. - నాగరాజు, సర్పంచి

ఆదోని పురపాలకం: ?: ఆదోని పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఆటో సర్కిల్ కాలువ ప్రాంతంలో తాగునీరు అపరిశుభ్రంగా వస్తోంది. ఒక్కో రోజులోనే పాచి పట్టి, దుర్వాసన వస్తోంది. - గౌతమ్, ఆదోని

✔: నీటి సరఫరా విభాగం సిబ్బందికి సూచించి సమస్య పరిష్కరిస్తాం. - కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

హొళగుంద, న్యూస్‌టుడే: ?:మార్లమడికి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద మురుగు కాల్వలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోయాయి.

✔: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం.
- ఎంకప్ప, సర్పంచి, మార్లమడికి

హాలహర్వి, న్యూస్‌టుడే: ?: చింతకుంట గ్రామం నుంచి ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి గుంతలు పడి విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోండి.
- నాగరాజు, చింతకుంట

✔:రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. ప్రస్తుతం తాత్కాలికంగా పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తాం.
- శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: బంటనహాల్‌లో విద్యుత్తు వినియోగదారులు లోవోల్టేజీ సమస్య ఎదుర్కొంటున్నారు.
- వెంకటేశ్వర్లు, బంటనహాల్

✔: లోవోల్టేజీ సమస్య పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రత్యేక విద్యుత్తు లైన్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ నెలాఖరులోగా సమస్య పరిష్కారం అవుతోంది.
- విరూపాక్షి, విద్యుత్తు శాఖ ఇన్‌స్పెక్టర్, చిప్పగిరి

## సంక్షిప్త సమాచారం

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం కల్లుబావిలో వెలసిన కంద నాలి మారెమ్మవ్వ గంప జాతర మహోత్సవం ఈ నెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పిస్తారన్నారు.

దేవనకొండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆలూరు వైకాపా ఇన్‌ఛార్జి విరూపాక్షి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మూగితార దర్గా కల్యాణ మండపంలో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేందర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: రైతులు పంటల బీమా పథకం వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి అక్బర్‌బాషా అన్నారు. వేరుసెనగ, పత్తి పంటలకు వాతావరణ ఆధారిత బీమా అందిస్తున్నారన్నారు. ఈ నెల 15లోగా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

అమకతాడు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: వాల్మీకులను ఎస్టీల్లో చేర్చేదాకా ఉమ్మడిగా పోరాడదామని కృష్ణగిరి, వెల్దుర్తి వాల్మీకి నాయకులు అమకతాడు వీరభద్రుడు, సూదేపల్లె జయరాముడు అన్నారు. ఆదివారం అమకతాడు బోలేష్వరా సమీపంలో రెండు మండలాల గ్రామాల వాల్మీకి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆలూరు జడ్పీటీసీ సభ్యుడు రాంభీం నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు నక్క నాగరాజు, శివరాముడు, సుధాకర్, నాయుడు, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రయాణ ప్రాంగణం.. భద్రత కనం

పనిచేయని సీసీ కెమెరాలు ☛ మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. బస్సుల్లో ఒక్కసారిగా రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో బస్టాండ్లలో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రజారవాణా సంస్థ దృష్టి సారించింది. ఆదోని, పత్తికొండ, ఆలూరు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో సౌకర్యాలను 'న్యూస్‌టుడే' పరిశీలించింది.

పరిశీలన

### అసౌకర్యాలతో సతమతం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని బస్టాండు నుంచి రోజూ 120 నుంచి 140 ఆర్టీసీ బస్సుల్లో సుమారు 6వేల నుంచి 7వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండులో శుద్ధజల యంత్రం ఏర్పాటు చేసి, చల్లనీరు అందిస్తున్నా.. వారంలో ఒక్కో రోజు శుద్ధజలం రావడంలేదని ప్రయాణికులు చెబుతున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదు. బస్టాండు పైకప్పు పెచ్చులూడుతోంది. గత ఏడాది మరమ్మతు పనులు చేపట్టి బాగు చేశారు. ప్రయాణికుల కోసం ఇటీవల నాలుగు కొత్త బెంచీలు ఏర్పాటు చేశారు. డివిజన్ కేంద్రమైన ఆదోని ఆర్టీసీ బస్టాండులో పోలీసు ఔట్‌పోస్టు లేకపోవడంతో ప్రయాణికులకు భద్రత కరవైందనే చెప్పాలి. చైన్‌స్నాచింగ్, బ్యాగుల చోరీ జరిగిన ఘటనటూ లేకపోలేదు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే మేలని కోరుతున్నారు.

ఆదోని ఆర్టీసీ బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు

### ప్రయాణికులు అధికం.. సౌకర్యాలు స్వల్పం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ డిపో పరిధిలో 26 బస్సులు ఉన్నాయి. కర్నూలు, గుంతకల్లు, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, కల్యాణదుర్గం, నంద్యాల డిపోలకు చెందిన బస్సులు 46కు పైగా రాకపోకలు సాగిస్తుంటాయి. రోజూ ఆయా బస్సుల్లో 2,500 నుంచి 3వేల మంది ప్రయాణిస్తుంటారు. ప్రాంగణంలో కనీసం వంద కుర్చీలు కూడా లేవు. ఉన్నవాటిలో కొన్ని బంగిపోయాయి. శుద్ధజల యంత్రం లేదు. సింటెక్స్ ట్యాంకు ద్వారా నీరు అందిస్తున్నారు. అవి కేవలం చేతులు శుభ్రం చేసుకొనేందుకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. నీరు తాగాలంటే బాటిళ్లు కొనుగోలు చేయాల్సిందే. ఆవరణలో కేవలం ఒకే ఒక్క సీసీ కెమెరా మాత్రమే ఉంది. అదనంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పోలీసు ఔట్‌పోస్టు లేదు. రాత్రి సమయాల్లో మహిళా ప్రయాణికులకు భద్రత ఆగమ్యగోచరంగా మారింది.

ప్రాంగణంలో ఒకే ఒక్క సీసీ కెమెరా →

### కుర్చీలు లేవు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలూరు బస్టాండ్ మీదుగా రోజూ 15 బస్సులు వచ్చిపోతుంటాయి. గుంతకల్లు- ఆదోని, ఎమ్మిగనూరు- బళ్లారి బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా పాత బస్టాండ్ వద్ద ఆంధ్ర, కర్ణాటక, ప్రైవేటు బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. కొత్త బస్టాండ్‌లో కూర్చునేందుకు ఎలాంటి కుర్చీలు, బెంచీలు లేవు. తాగునీటి కుళాయిలు ఉన్నా.. వాటిలో నీరు రావడం లేదు. బస్టాండ్‌ను అద్దె నిలకించారు. ఎలాంటి సీసీ కెమెరాలు, పోలీసు ఔట్ పోస్ట్ లేదు.

## వృథా నీరు.. రహదారిపై చేరు

దేవనకొండ మండలంలోని ఈదులదేవరబండ-గుండ్లకొండ రహదారిలో గాజులదిన్నె పైపులైన్ లీకేజీ కావడంతో రహదారిపై భారీ గొయ్యి ఏర్పడింది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే దారిలో బేతపల్లి, బండపల్లి, బంటుపల్లి, గుడిమిరాళ్ల, గుండ్లకొండ తదితర గ్రామాలకు వెళ్లే వాహనదారుల రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదు. తాగునీటి లీకేజీ అరికట్టాలని, రహదారిపై ఏర్పడిన గుంతలు పూడ్చేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పి.కోటకొండ (దేవనకొండ)

## తొలగని అడ్డుకట్ట

హొళగుంద మండల పరిధిలోని వందవాగిలి గ్రామ సమీపంలో తుంగభద్ర దిగువ కాల్వలో ఆధునికీకరణ పనులు చేపట్టారు. వాహనాల రాకపోకలను సాగించేందుకు మధ్యలో అడ్డుకట్ట వేయడంతో వంతెనలా మారింది. వాహనాలు చుట్టూ తిరగి వెళ్లకుండా కాల్వ మధ్యలో నుంచే రాకపోకలు సాగించేందుకు వీలుగా ఇలా ఏర్పాటు చేసుకున్నారు. ఇరు వైపులా రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉంది. నీటి విడుదలకు సమయం ఆసన్నమవుతుండటంతో పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు దీనిపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హొళగుంద

## జొన్నగిరి.. రోగాల బరి

జొన్నగిరి ఎస్సీ కాలనీ పాఠశాల సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్రధాన రహదారిపై సగం వరకు చెత్తతో అపరిశుభ్రంగా ఉంది. కాలనీవాసులు, చిన్నరులు ఆ దారిలోనే ప్రభుత్వ పాఠశాలకు వెళ్లివస్తుంటారు. జొన్నగిరి నుంచి పగిడిరాయి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారీ అదే. కొందరి నివాసాలు వారు ఇంట్లో ఉన్న చెత్తను అక్కడ పడేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దానికి తోడు గ్రామ పంచాయతీ చెత్త సేకరణ చేయకపోడంతో ఈ దుస్థితి నెలకొంది. చెత్త తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జొన్నగిరి (తుగ్గలి)

## కొండెక్కిన రక్షణ

ఆదోని పట్టణ శివారు కొండ ప్రాంతం నుంచి ఎల్లమ్మవ్వ కొండ, దొడ్డనగేరి, సుల్తానపురానికి వెళ్లేందుకు కొండ ప్రాంతం నుంచి వెళ్లే రహదారిపై రక్షణ గోడ లేకపోవడంతో వాహన చోదకులకు ప్రమాదం పొంచి ఉంది. నిత్యం ఈ రహదారి మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో కొండ ప్రాంతం నుంచే వెళ్లే రస్తాపై రక్షణగోడ లేకపోవడంతో వాహన చోదకులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. కింద పడే ప్రమాదం లేకపోలేదు. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మారెల్ల(తుగ్గలి), న్యూస్‌టుడే: మారెల్ల గ్రామానికి చెందిన తలారి రాముడు ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మరణించారు. కుటుంబ పెద్ద మరణంతో ఆ కుటుంబం ఇబ్బందులు పడింది. రాముడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అందరూ చిన్న పిల్లలే. పత్తికొండ ప్రభుత్వ బాలుర పాఠశాల 1998 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా కలసి రూ.64 వేలు ఆదివారం అందించారు. సహాధ్యాయులు సుల్తాన్, రమేష్, కౌలుట్ల, రామాంజి, సూర్యప్రకాష్ బాధితుడి స్వగ్రామం మారెల్ల గ్రామంకు వచ్చి రాముడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్నేహితుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

## బకాయిలు వెంటనే మంజూరు చేయాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు, ఐఆర్, డీఏలు మంజూరు చేయాలని పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదరిశ సురేశ్‌కుమార్ అన్నారు. ఆదోనిలో సమాఖ్య సమావేశం కోశాధికారి కోటన్న అధ్యక్షతన జరిగింది. కార్యక్రమలో నాయకులు జంగం బసవరాజు, ప్రతాప్‌రెడ్డి, బడుగు బసవరాజు, రమేశ్‌రావు, భాస్కర్‌ఆచారి, చంద్రశేఖర్, ఎల్లాగి, నాగేశ్వరనాయుడు, వెంకటేశు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ ఆయాలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు అందించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, రూరల్ ప్రాజెక్టు కార్యదర్శి వరలక్ష్మి అన్నారు. ఆదోనిలో అంగన్‌వాడీ గ్రామీణ ఆయాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.

## ఆదోని కల్లు డిపోలో ఘర్షణ

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం భరత్‌నగర్‌లోని కల్లు డిపోలో ఆదివారం భాజపా, తెదేపాకు చెందిన ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. కల్లుడిపోలో పనిచేస్తున్న భాజపా నాయకుడు వడ్డే రాముడును పనికి రావద్దని డిపో నిర్వాహకులు తెదేపా నాయకుడు లింగన్నగౌడు, మాంత్రికి రాము చెప్పారు. వారి మధ్య మాటామాట పెరిగి, ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## అదుపు తప్పి ఆటో బోల్తా

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలం అగ్రహారం సమీపంలోని జాతీయ రహదారిపై గుంతను తప్పించబోయి ఆటో బోల్తాపడిన ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు యువకులు గాయపడ్డారు. ఆటోలో ఉన్న దీషన్, మనీష్, కమల్ గాయపడ్డారు. 108లో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు.

## జూదరుల అరెస్టు

కృష్ణగిరి, న్యూస్‌టుడే: రామకృష్ణాపురం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న పది మంది వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై జి.కృష్ణమూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఆదివారం మధ్యాహ్నం తన సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడిచేసి, పేకాట ఆడుతున్న పది మందిని పట్టుకొని వారి నుంచి రూ.30,150, ఒక ఆటో ఆరు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

తుగ్గలి, న్యూస్‌టుడే: త్వరలో మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం సీఎం చంద్రబాబు కల్పిస్తున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. జి ఎర్రగుడి గ్రామంలో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర నాయకులు బత్తిన వెంకటరాముడు, తిమ్మయ్యచౌదరి, మనోహర్‌చౌదరి, వెంకటస్వామి, చంద్రశేఖర్, తిరుపాల్‌నాయుడు, శివరాముడు, మిద్దె రవి పాల్గొన్నారు.


తుగ్గలి: మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఆదోని తెదేపా బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదోని మండలం ఇస్వీ గ్రామంలో తెదేపా ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఉమాపతినాయుడు, గుడిసె కృష్ణమ్మ, కురవ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, భూపాల్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని: ఇస్వీ గ్రామంలో పథకాల గురించి వివరిస్తున్న మీనాక్షినాయుడు

● ఆదోని పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీలో ఆదివారం తెదేపా సీనియర్ నాయకులు మదిరె భాస్కర్‌రెడ్డి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ముత్తర్‌ఫరూక్, మన్సూర్, షేక్షా, రామచంద్ర, ఫకృద్దీన్, బుద్దారెడ్డి, మల్లికార్జున, సోమశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఇస్వీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని పట్టణం నిజాముద్దీన్ కాలనీలో భాస్కర్‌రెడ్డి, తదితరులు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలూరులోని కోయనగర్ కాలనీలో, మఠ్రిస్వామి ఆలయం కాలనీ, కొట్టాల గేరిలో తెదేపా ఆలూరు నియోజకవర్గ బాధ్యుడు వీరభద్రగౌడ్ ఇంటింటికీ తిరిగి పథకాల గురించి వివరిస్తూ.. కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నరసప్ప, కొమ్ము రామాంజి, నెట్టేప్ప, అశోక్, జనసేన నాయకుడు సన్న, తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం (మద్దికెర), న్యూస్‌టుడే: అగ్రహారంలో ఆదివారం సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తమచౌదరి, మాజీ సర్పంచి లక్ష్మన్న, మాజీ ఎంపీటీసీ సభ్యులు సుధాకరచౌదరి, గొర్రెల శంకర్, ఆ పార్టీ నాయకులు కవిత, రామాంజులు, చంద్ర తదితరులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు.

మద్దికెర: అగ్రహారంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

## పేరుకుపోయిన మట్టి తొలగింపు

చందోలి(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: చందోలి గ్రామంలోని పెద్దబజారులో పేరుకుపోయిన మట్టిని తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. కొద్ది నెలలుగా మట్టి పేరుకుపోయి మురుగు నీరు నిలుస్తోంది. ఆదివారం 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమన సమస్యపై అధికారులు, గ్రామ సర్పంచి సరోజమ్మ స్పందించారు. సమస్య తాత్కాలికంగా పరిష్కారం కావడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

దేవనకొండ, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ బొజ్జమ్మ అన్నారు. మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో ఆదివారం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. 30 రోజుల పాటు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ఉంటుందని, మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 50శాతంతో రాయితీతో మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తామని అక్షిత సంస్థ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రామంజనేయులు, తెదేపా నాయకులు రంగుడు, కౌలుట్ల తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న బొజ్జమ్మ

## పూర్వ విద్యార్థుల చేయూత

ఆదోని వైఎంకే ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని వైఎంకే ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి(సెక్షన్-సి) ఇంగ్లిష్ మీడియం చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్యక్రమం ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మల్లికార్జున, రత్నం, ఉమాశంకర్, యల్లప్ప, అశోక్, సుజాత, ఈరలింగప్పను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పూర్వ విద్యార్థులు శంభు, రోజా ప్రియా, స్వప్న, సంగప్ప, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ పెండేకల్లు(తుగ్గలి), న్యూస్‌టుడే: ఆర్ఎస్ పెండేకల్లు జడ్పీ ఉన్నత పాఠశాల 1986-87 పది బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు చేయూత అందించారు. విరాళాలతో పాఠశాల ఆవరణలో నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు గాను ఈషెడ్ ఉపయోగపడుతుందన్నారు.

తుగ్గలి: షెడ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాటి విద్యార్థులు

## సీపీఐ నూతన కమిటీ ఎన్నిక

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ మండల, పట్టణ సీపీఐ కార్యదర్శులుగా యు.కారుమంచి, రామాంజనేయులు, సహాయ కార్యదర్శులుగా పెద్దఈరన్న, జొహరాపురం కాశీ ఎన్నికైనట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిడ్డయ్య ఆదివారం ప్రకటించారు. పట్టణ సహాయ కార్యదర్శులుగా ఎంకే సుంకన్న, శ్రీనివాసులు, ఖాన్ ఎంపికయ్యారన్నారు.

ఆస్పరి, న్యూస్‌టుడే: సీపీఐ కన్వీనర్‌గా విరుపాక్షి నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడారు. మండల సహాయ కార్యదర్శులుగా రమేష్, కృష్ణమూర్తితో పాటు మరో 50 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నామన్నారు.

కృష్ణగిరి, న్యూస్‌టుడే: సీపీఐ కృష్ణగిరి మండల కార్యదర్శిగా బోయబొంతిరాళ్ల గ్రామ సర్పంచి జె.రవిమోహన్‌ను ఎన్నుకున్నట్లు మండల ఇన్‌ఛార్జి నబిరసూల్ తెలిపారు. మండల సహాయ కార్యదర్శులుగా ఆర్బీ చిన్న మాదులు, పరమేశ్వరరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

## వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా పని చేస్తూ.. ఇటీవల పదవీ విరమణ పొందిన నరసయ్యను ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదోని జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు భూపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, పెద్దకడబూరు మండల అధికారి రామమూర్తి, ఏపీ పీఈటీ, ఎస్ఏపీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జోసఫ్ లక్ష్మయ్య, నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్ పాల్గొని మాట్లాడారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఈరన్నగౌడు, హనుమంతు, నరసయ్య, ఖలీల్‌అహ్మద్, సుశీలమ్మ, అంజనమ్మ, నరసింహులు, రామన్న, రాము, ఓబన్న, నరసింహరాజు, సత్యనారాయణ, రమేశ్, సాబీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నరసయ్యను సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

# పల్లెలు.. ఎండుతున్న గొంతులు

రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ట్యాంకు వద్ద నీటి కోసం అవస్థలు పడుతున్న ప్రజలు

నలకదొడ్డి(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో కష్టాలు తప్పడం లేదు. మూడువేలకు పైగా జనాభా ఉన్న గ్రామంలోని ప్రజలు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. వాడుక నీటికి కొంత మేర ఇబ్బందులు లేకున్నా.. తాగునీటి కష్టాలు మాత్రం వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. స్థానిక పాఠశాల సమీపంలోని తాగునీటి ట్యాంకు వద్దకు తోపుడు బండ్లపై వెళ్తుంటారు. తాగునీరు కావాలంటే గ్రామానికి అర కి.మీ. దూరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న ట్యాంకుల వద్దకు తోపుడు బండ్లు, ద్విచక్రవాహనాలు, ఆటోల్లో వెళ్లాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు, చిన్నా పెద్ద తేడా లేకుండా ట్యాంకుల వద్దకు పరుగుల పెట్టాల్సిన దుస్థితి ఏర్పడుతోందని గ్రామస్థులు వాపోతున్నారు.

### ఇదీ పరిస్థితి..

విద్యుత్తు సరఫరా ఉన్నప్పుడే ట్యాంకుల వద్దకు వెళ్తుంటారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు సమృద్ధిగా వానలు లేకపోవటం, సమీపంలోని చెరువు ఎండిపోవటం, చుట్టుపక్కల ఉన్న తాగునీటి పథకం బోర్లలో నీరు అడుగంటడం, తదితర కారణాలవల్ల వర్షాకాలం వచ్చినా తాగునీటి ఇబ్బందులు తప్పడంలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏవైనా వేడుకలు జరిగినప్పుడు పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోందంటున్నారు. చిన్నారులు, వృద్ధులు ఒక్కో తోపుడు బండిపై ఏడెనిమిది బిందెలు వేసుకొని నీరు తీసుకొచ్చేందుకు ప్రయాస తప్పటంలేదంటున్నారు గ్రామస్థులు.

### బురుజుల.. దాహంతో విలవిల

బురుజుల (మద్దికెర), న్యూస్‌టుడే: మండలంలోని బురుజుల ప్రజలను ఏళ్ల తరబడి తాగునీటి ఎద్దడి వెంటాడుతోంది. ఈ వేసవి కాలంలో పంచాయతీ తరపున ట్యాంకరుతో నీరు సరఫరా చేశారు. నిధుల లేమి కారణంగా వారు కూడా చేతులెత్తేశారు. గ్రామస్థులకు అవస్థలు తప్పడం లేదు. ఉదయం లేవగానే ప్రతి కుటుంబం ఎడ్ల బండో, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై బిందెలు, డ్రమ్ములతో నీరు తెచ్చుకుంటున్నారు. వారికి నీరందే పరిస్థితి తప్పదు. ఇలాంటి పరిస్థితిలో ట్యాంకరు ద్వారా నీటి సరఫరా నిలిపివేయడంతో అవి రెట్టింపయ్యాయి. జిల్లా అధికారులైనా స్పందించి మా ఇబ్బందులు తీర్చాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు.

ఆటోలో బిందెలు, డ్రమ్ములతో వెళ్తున్న స్థానికులు

(c) eenadu

# ఎమ్మిగనూరు



## ఆర్‌ఎస్‌కేల్లో అందుబాటులో యూరియా

సి.బెళగల్, న్యూస్‌టుడే: గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో యూరియా బస్తాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు ఏవో మల్లేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆర్‌ఎస్‌కేలను ఆయన ఆదివారం పరిశీలించారు. కొత్తకోటలో 23, బురాన్‌దొడ్డిలో 10, పోలకల్‌లో 25, బ్రాహ్మణదొడ్డిలో 10, గుండ్రేవులలో 8, ఇనగండ్లలో 12 కంబదహాల్‌లో 16 టన్నుల యూరియా ఉందన్నారు. ఆయన మాట్లాడుతూ.. డీలర్లు ఎమ్మార్పీ ధరలకన్నా అధికంగా అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా కొనుగోలు చేయాలన్నారు. దుకాణాల్లో కొనుగోలు చేసేటపుడు కచ్చితంగా బిల్లులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఎంపీఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## కుంగిన కల్వర్టును నిర్మించారు

స్పందనకు స్పందన

కౌతాళం, న్యూస్‌టుడే: మండలంలోని హాల్వి గ్రామంలో గ్రామ నడిబొడ్డున కల్వర్టు కుంగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉండేది. దీనిపై గత నెల 'ఈనాడు'లో 'గ్రామ నడిబొడ్డున కుంగిన కల్వర్టు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన గ్రామ సర్పంచి క్రాంతి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ కరీం కుంగిన కల్వర్టును ఆదివారం నిర్మించారు. సమస్య తీరడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

| ఎమ్మిగనూరు గ్రామీణం | కోసిగి |
|---|---|
| 80085 73794 | 9550434095 |

సి.బెళగల్:?: గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిరుపయోగంగా ఉంది. వినియోగంలోకి తీసుకురావాలి. -చంద్ర, బురాన్‌దొడ్డి

✔: కోడుమూరు పంచాయతీరాజ్ శాఖ డీఈఈ కర్రెన్న దృష్టికి తీసుకెళ్లి ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని వినియోగంలోకి తెస్తాం. - రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్

కొండాపురం: ?: గ్రామంలో ఏడాది క్రితం పూర్తయిన సచివాలయం భవనం ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అల్లరిమూకలకు అడ్డాగా మారింది. చర్యలు తీసుకోండి. -రమణా రెడ్డి, కొండాపురం గ్రామం

✔: తక్షణమే కోడుమూరు పంచాయతీరాజ్ శాఖ డీఈఈ కర్రెన్న దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. -రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్

తిమ్మందొడ్డి: ?: గ్రామంలో జడ్పీ నిధులతో సీసీ రహదారి నిర్మించారు. ఇరువైపులా మట్టి వేయడం మరిచారు. -కర్రెన్న, తిమ్మందొడ్డి

✔: సీసీ రోడ్డుకు ఎర్రమట్టి పరిచే విషయాన్ని మండల ఏఈ వెంకట ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. - రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని నాగులాపురం గ్రామంలో రోజుల తరబడి మురుగు కాల్వలు శుభ్రం చేయక అంతర్గత రహదారులపై మురుగు నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. - గ్రామస్థులు, నాగులాపురం.

✔: సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీ నిధులు కేటాయించిన తర్వాత పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. -ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు.

## బాలికల గురుకులాన్ని తనిఖీ చేసిన ఎంపీ

ప్రిన్సిపల్ సామ్రాజ్యంతో మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బనవాసిఫారం బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను పరిశీలించి విద్యాబోధన, భోజన వసతి, మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. ప్రిన్సిపల్ సామ్రాజ్యంతో మౌలిక వసతుల గురించి చర్చించారు. పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆమె ఎంపీకి విన్నవించారు. 6, 7 తరగతులకు తెలుగు, బయోలజీ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే అంతర్గత రహదారుల నిర్మాణం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరగా... ఎంపీ సానుకూలంగా స్పందించారు.

## ఆర్థిక సాయం అందజేత

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: అన్నమయ్య సర్కిల్‌లో జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని సువర్ణకు వైద్యం కోసం ఉపాధ్యాయుడు ప్రసన్నరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రూ.55 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. ఆయన మాట్లాడుతూ... ఈ నెల 9న వెంకటాపురం నుంచి ఎమ్మిగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆటోలో వస్తుండగా కుక్క అడ్డురావడంతో ఆటో బోల్తా పడిందని.. అందులో ఉన్న బాలికకు తీవ్ర గాయమైనట్లు తెలిపారు. బాలిక వైద్య ఖర్చుల కోసం ఉపాధ్యాయుల నుంచి విరాళాలు సేకరించి సాయమందించినట్లు తెలిపారు. బాలిక వైద్యానికి ఇంకా అవసరమైతే సాయమందించేందుకు ముందుంటామని తెలిపారు.

విద్యార్థి తల్లిదండ్రులకు సాయం అందిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసన్నరాజు

## ఆదాయమున్నా వసతులు సున్నా

☛ ఆర్టీసీ బస్టాండ్‌లో కానరాని సౌకర్యాలు ☛ పట్టించుకోని అధికారులు.. ప్రయాణికులకు అవస్థలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాలకు ముఖద్వారం ఎమ్మిగనూరు ఆర్టీసీ బస్టాండు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే మౌలిక వసతులు లేమితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్షల్లో ఆదాయమొస్తున్నా సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

మూతపడిన మూత్రశాలలు

| | |
|---|---|
| ★ ఎన్ని బస్సులు వస్తాయి: 450 బస్సులు | ★ వినియోగంలో లేని మరుగుదొడ్లు: మూడు |
| ★ రోజుకు ఎంత మంది ప్రయాణికులు వస్తారు: 25 నుంచి 30 వేలు | |
| ★ ప్రధాన నగరాలు: హైదరాబాదు, మంత్రాలయం, విజయవాడ, బెంగళూరు, మైసూర్, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కాకినాడ, కోదాడ, వనపర్తి, హంపి, బళ్లారితో పాటు ప్రధాన ప్రాంతాలు | |
| ★ కుర్చీలు అవసరం: 180 (120 మాత్రమే ఉన్నాయి) | |
| ★ ప్రయాణికుల ద్వారా ఆదాయం: రోజూ రూ.12 లక్షలు | |

### భక్తులతో రద్దీ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన మంత్రాలయం, ఉరుకుంద ఈరన్న ఆలయాలకు ఈ డిపో నుంచి భక్తులు అధికంగా వెళ్తుంటారు. శని, ఆది, సోమ వారాల్లో దాదాపు 10 వేల నుంచి 12 వేల మంది ప్రయాణిస్తుంటారు. వీరికి బస్సు సౌకర్యం లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

### అన్నీ అసౌకర్యాలే..

తాగునీటి కోసం బస్టాండులో రెండు కొళాయిలు ఏర్పాటు చేశారు. అయితే ట్యాంకు వద్ద అపరిశుభ్రత నెలకొంది. దీంతో ప్రయాణికులు నీళ్ల సీసాలను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి. స్వచ్ఛ భారత్ కింద నాలుగు చోట్ల మరుగుదొడ్లు నిర్మించినా నీటి వసతి లేక అధ్వానంగా తయారయ్యాయి. పోలీసు నిఘా లేకపోవడంతో చోరీలు ఎక్కువయ్యాయి. గతంలో బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. నిఘా నేత్రాలు ఆరు ఉన్నా పని చేయడం లేదు. బస్టాండులో 40 ఫ్యాన్లకు గాను 10 మాత్రమే పనిచేస్తున్నాయి. రాత్రి 11:30 తర్వాత బస్సుల రద్దీ ఉన్నప్పటికీ ఆర్టీసీ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. దూరప్రాంతాలకు వెళ్లే బస్సు వేళలు తెలిపే నాథులే ఉండరు.

## ట్యాంకు వృథా.. ప్రజలకు వ్యధ

నగర పంచాయతీలోని పడమర బీసీ కాలనీ రెండో లైనులో ఏర్పాటు చేసిన మినీ ట్యాంకు వృథాగా మారింది. నీటి సరఫరా నిలిచిపోవడంతో ఏడాదిగా ఉపయోగించలేక పోతున్నామని స్థానికులు వాపోయారు. ట్యాంకులో నీళ్లు ఉంటే అవసరాలకు వినియోగించుకునే వారమని, ప్రస్తుతం కుళాయిలకు నీళ్లు వచ్చిన సమయంలోనే పట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియక పనులు వదులుకుని ఇంటి వద్ద ఒకరు ఉంటున్నామని, ట్యాంకుకు నీటి సరఫరా ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గూడూరు

## కుళాయిల వరుస.. తీరె తాగునీటి సమస్య

మేజరు పంచాయతీ గోనెగండ్లలో జల జీవన్‌మిషన్ పథకం కింద రూ.2.5 కోట్లతో తాగు నీటి పైపులైను పనులు చేపట్టారు. గ్రామంలో మొదటి విడత కింద బీసీ కాలనీలో సీసీ రోడ్లతో పాటు ఇంటింటికి తాగు నీటి సౌకర్యం కల్పించారు. పథకం ప్రారంభమై గ్రామంలో శివాలయం వీధి, పాత బస్టాండు, బీసీ కాలనీలకు రెండు రోజులకోసారి నీటి సరఫరా అవుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంటి ముందు తాగునీటి కుళాయిలు వరుసలో ఉండటం ఆకట్టుకుంటోంది. – న్యూస్‌టుడే, గోనెగండ్ల:

## లక్ష్యానికి తూట్లు.. చెత్తతో అగచాట్లు

గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు కొన్ని చోట్ల నిరుపయోగంగా మారాయి. సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేసి ఎరువుగా మార్చి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఈ లక్ష్యం నీరుగారిపోతోంది. మండల కేంద్రంలో ఊరి బయట నిర్మించిన సంపద కేంద్రం పని చేయడం లేదు. దీంతో గ్రామస్థులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. సంబంధిత అధికారులు కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దకడబూరు

## వెలగని దీపాలు.. చిమ్మచీకట్లో కాలనీలు

నగర పంచాయతీలోని పలు కాలనీల్లో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగక కారుచీకట్లు కమ్ముకున్నాయి. దీంతో వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని సంజీవయ్య కాలనీ నుంచి చింతలముని స్వామి దేవాలయం వరకు, కోడుమూరుకు వెళ్లే దారిలో, ఎస్సీ కాలనీ, ప్రధాన రహదారులలో విద్యుత్తు దీపాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. నగర పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.- గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే

## సంక్షిప్త సమాచారం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు మాదిగ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఎస్టీయూ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి తిమ్మన్న శాలువలు, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యలను పరిష్కారించాలని తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రాముడులు కోరారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గూడూరు న్యూస్‌టుడే: పట్టణంలోని సింగనగేరి కాలనీలో భువనేశ్వరి నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి సోమవారం పుష్పాలంకరణ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి నాగరాజు తెలిపారు

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే: మండలంలోని రైతులు పంటల బీమా పథకానికి నమోదు చేసుకోవాలని ఏవో జీరా గణేశ్ సూచించారు. ఈ నెల 15 నుంచి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పత్తి పంటకు ఎకరాకు రూ.2 వేలు, వేరుసెనగకు ఎకరాకు రూ.560 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గూడూరు గ్రామీణం: గూడూరు మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు వెంకటేష్ నాయక్ అధ్యక్షతన ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దారు ధనుంజయరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే పరిష్కారం చేసుకోవాలని సూచించారు.

సి.బెళగల్: సి.బెళగల్ తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు వెంకటలక్ష్మీ అధ్యక్షతన ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దారు పురుషోత్తమ్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే పరిష్కారం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు కచ్చితంగా హాజరుకావాలని కోరారు.

సి.బెళగల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయుష్షు వైద్యాధికారి ప్రసాదరెడ్డి తెలిపారు. గ్రామాల్లోని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోలకల్: గ్రామంలో సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పురోహితుడు ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయం ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు.

తిమ్మందొడ్డి, చింతమానుపల్లె: తిమ్మందొడ్డి, చింతమానుపల్లె గ్రామాల్లో సోమవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి హాజరు అవుతున్నట్లు మండల తెదేపా కన్వీనరు బి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గొల్లలదొడ్డి, కొండాపురం: గ్రామాల్లో సోమవారం ఉదయం గొల్లలదొడ్డి, సాయంత్రం కొండాపురంలో ఉపాధి పనుల్లో సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రామసభలను ఆయా సర్పంచిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఏపీవో రామన్న ఒక ప్రకటనలో తెలిపారు.

కోసిగి:ఈ నెల 9వ తేదీన కోసిగి మండలం జంపాపురానికి చెందిన కాపు ఉమాదేవి తన రెండేళ్ల కుమారుడుతో సహా అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ మంజునాథ్, ఎస్సై హనుమంతరెడ్డి దర్యాప్తు చేపట్టారు. మహిళ ఆచూకీ కనుగొని ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కోసిగి, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాల్లో బీడీలు, సిగరెట్లు తాగితే చర్యలు తప్పవని ఎస్సై హనుమంతరెడ్డి హెచ్చరించారు. కోసిగి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఎస్సై హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, రహదారి భద్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కొండాపురం, పల్దొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి పేర్కొన్నారు. మండలంలోని కొండాపురం, పల్దొడ్డి గ్రామాల్లో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ముఖ్య ఉద్దేశమని మంత్రాలయం తెదేపా బాధ్యుడు రాఘవేంద్రరెడ్డి, తెదేపా రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రామాకాంతరెడ్డి, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు శశిరేఖ, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న పేర్కొన్నారు. మండలంలోని హనుమాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నెరవేర్చిన హామీలు, చేసిన అభివృద్ధి పనులపై కరపత్రాలు అందజేశారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సాగునీటి సంఘం - 4 అధ్యక్షుడు రమాకాంతరెడ్డి తెలిపారు. మండలంలోని సూగూరు మేజరు కాల్వ మరమ్మతుల పనులకు ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. రూ.8 లక్షలతో సూగూరు మేజరు కాల్వ మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా పట్టణ కన్వీనర్ కె.రామాంజనేయులు పేర్కొన్నారు. పట్టణంలోని 9వార్డు పరిధిలోని 185వ బూత్‌లో కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, తెదేపా నాయకులు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

కొండాపురం: పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

పెద్దకడబూరు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి, రామాకాంతరెడ్డి

## అధికారుల నిర్లక్ష్యంతోనే యువకుల మృతి

సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ముగ్గురు కన్నడ యువకులు నదిలో పడి ప్రాణాలు కోల్పోయారని జైభీం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. నది వద్ద భద్రతా ఏర్పాట్లు చేయడంలో అటు మఠం అధికారులు, ఇటు రెవెన్యూ, పోలీసు అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు మృత్యువాత పడ్డారన్నారు. మృతుల కుటుంబాలకు శ్రీమఠం తరుపున రూ.50 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

☛ నదిలో మునిగి మృతి చెందిన కన్నడ యువకుల కుటుంబాలకు శ్రీమఠం, ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. మంత్రాలయంలోని ప్రైవేటు వసతి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## తెదేపా కార్యకర్త మృతికి నివాళి

బురాన్‌దొడ్డి (సి.బెళగల్) న్యూస్‌టుడే: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త లింగప్ప గారి బి.వెంకట్రాముడు (72) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కోడుమూరు భాజపా నాయకుడు మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణ, సి.బెళగల్ సింగిల్ విండో అధ్యక్షుడు బీఎస్. చిన్నతిమ్మప్పలు ఆయన భౌతిక కాయానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి వ్యక్తి అని తెదేపా నాయకులు గుర్తుచేసుకున్నారు. మృతునికి ఇద్దరు కుమారులు ఇద్దరు కూతుర్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ధర్నాను విజయవంతం చేయండి

కౌతాళం, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కోరారు. మండల కేంద్రంలో కార్యక్రమ కరపత్రాలను పంచుతూ ర్యాలీ చేపట్టారు. విద్యుత్ ఉప కేంద్రం ఎదుట చేపట్టే ధర్నాను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

## విద్యుత్తు బిల్లులు తగ్గించాలని ధర్నా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యుత్ బిల్లులు తగ్గిస్తామని చెప్పి ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందని సీపీఎం నాయకులు గోవిందు అన్నారు. పట్టణంలో ఆదివారం ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టడం సరి కాదన్నారు. విద్యుత్ బిల్లులను పెంచడం ద్వారా గత ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలనే కూటమి ప్రభుత్వం అవలంబిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లతో సామాన్యులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, దావీదు, రామన్న, వలి, హుసేన్, మోహన్, భీమన్న, దాదా, పీరా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ జాబితాలో చేర్చితేనే వాల్మీకి బోయలకు న్యాయం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని చెప్పి ప్రధాని మోదీ మాట తప్పారని బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అంజి ఆరోపించారు. 2019 ఎన్నికల్లో కర్నూలులో జరిగిన బహిరంగ సభలో ప్రధాని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పట్టణంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఇచ్చిన హామీలను మోదీ విస్మరించారన్నారు. ఐదేళ్లు గడిచినా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. దీనిపై దశలవారీగా ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీజీఆర్ కొండయ్య, విష్ణు, జట్టప్ప, నాగరాజు, బీఎల్ నారాయణ, యాపిలయ్య పాల్గొన్నారు.

బీవీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న వాల్మీకులు

## వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,934

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,934 మధ్యస్థ ధర రూ.5,999 కనిష్ట ధర రూ.3,809గా పలికింది. మార్కెట్‌కు 44 మంది రైతులు 1538 వేరుసెనగ బస్తాలు అమ్మకానికి తెచ్చారు. బోర్ల కింద వేసిన వేరుసెనగ పంట కోతలు అక్కడక్కడ సాగుతున్నాయి.

## పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి

ఎమ్మిగనూరు గ్రామీణం: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తోందని కౌన్సిలర్ దయాసాగర్, భాజపా నాయకుడు చిన్నఈరన్న అన్నారు. 11 ఏళ్ల ప్రధాని నరేంద్రమోదీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై 32వ వార్డులో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు బీఎల్ నారాయణ, ఈరన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న భాజపా నాయకులు

## మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అసోసియేషన్ అధ్యక్షుడు శివరాముడు, కార్యదర్శి వినయ్ కుమార్ మాట్లాడుతూ... మొక్కల పెంపకంతో పచ్చదనంతో పాటు పాఠశాల ఆవరణ ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పాఠశాల ఆవరణలో పండ్ల మొక్కలతో సహా 300 మొక్కలను విద్యార్థులతో కలిసి నాటినట్లు చెప్పారు. మొక్కల పెంపకంతో విద్యార్థుల్లో పర్యావరణంపై బాధ్యతను కల్పించేందుకు పూర్వ విద్యార్థులుగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, అలుమ్ని సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మొక్కలు అందజేసిన అసోసియేషన్ నాయకులు

## ఫారం భూముల సర్వేపై మీనమేషాలు

✦ రెవెన్యూ అధికారుల కాలయాపన

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బనవాసిఫారం భూముల ఆక్రమణకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు పశు సంవర్ధక శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. భూములను సర్వే చేసి సరిహద్దులో కంచె లేదా ట్రెంచింగ్ వేసుకుంటే ఆక్రమణలు ఆగిపోతాయి. అయితే రీ సర్వే ఉందంటూ రెవెన్యూ అధికారులు, సిబ్బంది మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ఆక్రమిత భూముల్లో సాగు చేసిన పంటల తొలగింపు ముందుకు సాగడం లేదు.

మండలంలోని బనవాసిఫారంలో దాదాపు 200 ఎకరాలను కొందరు ఆక్రమించి పంటలు సాగు చేశారు. దీనిపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమవడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించారు. ఇటీవల ట్రాక్టరుతో విత్తనం వేసిన దాదాపు 10 ఎకరాల మేర దున్ని ఆ భూముల్లో పశుగ్రాసం వేశారు. రెవెన్యూ అధికారులు సర్వే చేస్తే ఆక్రమించిన మిగిలిన భూములను స్వాధీనం చేసుకుందామని పశు సంవర్ధక శాఖ అధికారులు సిద్ధమవుతున్నా రెవెన్యూ అధికారులు, సిబ్బంది మాత్రం సర్వే చేయడంలో నిర్లిప్తత చూపుతున్నారు.

ఇతరులు సాగు చేసిన భూమిని దున్నిస్తున్న అధికారులు

### సబ్ కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

ఫారం భూములను సర్వే చేయించాలని ఆదోని సబ్ కలెక్టర్ ఆదేశించినా... కింది స్థాయి సిబ్బంది సర్వే చేయకుండా కాలయాపన చేస్తున్నారు. మండలంలోని రెండు గ్రామాల్లో రీ సర్వే చేస్తున్నామని చెప్పి సర్వేయర్లు సర్వే చేయకుండా జాప్యం చేస్తున్నారని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. నెలల తరబడి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదంటున్నారు. తహసీల్దారు సైతం సర్వే చేయాలని ఆదేశించినా రీ సర్వే పనుల్లో ఉన్నామని చెబుతూ వస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందిస్తే గానీ ఫారం భూములకు ఆక్రమణల నుంచి విముక్తి లభించేలా లేదు.

## విద్యార్థుల్ని భావి పౌరులుగా తీర్చిదిద్దాలి

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించి, పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల్ని భావి పౌరులుగా తీర్చిదిద్దాలని ఎస్టీయూ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎచ్.తిమ్మన్న తెలిపారు. ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవనంలో ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు సుధాకర్, జాన్, రజనీకాంతమ్మ, చిన్న ఎల్లప్ప, చిన్న హనుమంతు, జీ.శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాసులకు సన్మానం చేశారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో ఎస్టీయూ నాయకులు

(c) eenadu

# కర్నూలు

•కర్నూలు • పాణ్యం

## నగర పాలన.. గాడిన పడేనా

☛ కొత్త కమిషనర్‌కు సమస్యల సవాళ్లు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో ఏడాదిగా అభివృద్ధి పనుల్లో పురోగతి కరవైంది. పలు ప్రాంతాల్లో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గుత్తేదారులు తమకు బిల్లులు మంజూరు చేస్తేనే పనులు చేస్తామని, లేకపోతే చేయలేమని చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నగరపాలక సంస్థ కొత్త కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.విశ్వనాథ పాలనను గాడిలో పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది. కొత్త కమిషనర్ ముందు పలు సమస్యలు, సవాళ్లు ఉన్నాయి. వాటిని అధిగమిస్తూ నగరాభివృద్ధికి కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

### సమన్వయంతో ముందుకెళ్లాలి

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాలు ఉన్నాయి. కర్నూలు నగరంలో 33, కల్లూరు పరిధిలో 16, కోడుమూరు పరిధిలో 3 వార్డులున్నాయి. మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

బంగారుపేట మీదుగా ఆర్ఎస్‌రోడ్డుకు వెళ్లే దారిలో డివైడర్‌ను ధ్వంసం చేసి రోడ్డుపై వేసిన వ్యర్థాలు

### పారిశుద్ధ్యం అధ్వానం

నగరంలోని 52 వార్డుల్లోనూ పారిశుద్ధ్యం అధ్వాన స్థితిలో ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ గాడితప్పింది. తాగునీరు, వీధి దీపాల సమస్య, కుక్కల బెడద అధికంగా ఉన్నాయి.

### ప్రక్షాళన అవసరం

● రెవెన్యూ విభాగం పనితీరుపై పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. కొత్త ఇంటి పన్ను, వీఎల్‌టీలు, ఇంటి నంబరు ఇవ్వడం వంటి వాటిలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయి. ఈ విభాగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.
● నగరంలో యథేచ్ఛగా అక్రమ భవనాలు వెలుస్తున్నాయి. పట్టణ ప్రణాళిక అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. టీడీఆర్‌ల జారీలో రూ.కోట్లలో అక్రమాలు జరిగాయి. కిందిస్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు అవినీతి ఆరోపణలున్నాయి.
● నగరపాలక అధికారులు కమీషన్లు ఇస్తేనే బిల్లులు మంజూరు చేస్తున్నారని గుత్తేదారులు ఆరోపిస్తున్నారు. ● పైప్‌లైన్ల లీకేజీలు, మోటార్ల మరమ్మతుల పేరుతో సిబ్బంది రూ.లక్షల్లో బిల్లులు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

## సారా స్వాధీనం.. ముగ్గురిపై కేసు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కల్లూరు మండలం ఉలిందకొండకు చెందిన గొల్ల రమేశ్, కొల్లంపల్లి తండాకు చెందిన తెలుగు రామదాసు, కర్నూలు మండలం గార్గేయపురానికి చెందిన బైనేని సురేశ్‌లపై ఆబ్కారీ పోలీసులు కేసు నమోదు చేశారు. రమేశ్, రామదాసు ద్విచక్రవాహనంపై నాటుసారాను గార్గేయపురానికి తీసుకెళ్లి బైనేపి సురేశ్ ఇంటి ముందు దించుతుండగా ఆబ్కారీశాఖ అధికారులు దాడి చేశారు. రామదాసు తప్పించుకుని పారిపోగా గొల్ల రమేశ్, బైనేని సురేశ్‌లను పట్టుకున్నారు. వారి నుంచి 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. పారిపోయిన నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై నవీన్‌బాబు తెలిపారు.

## విద్యుత్తు భవన్ ఎదుట ధర్నా నేడు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలంటూ ఈనెల 14న కర్నూలు విద్యుత్తు భవన్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం పాతనగరం నాయకుడు షరీఫ్ పిలుపునిచ్చారు. పాతనగరంలోని పలు కాలనీల్లో ఆదివారం సీపీఎం నాయకులు పర్యటించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : ?: అశోక్‌నగర్‌కు వెళ్లే దారిలో రైల్వే వంతెన సమీపంలో వీధిదీపాలు వెలగడం లేదు. – ప్రవీణ్, స్థానికుడు

?: వీకర్‌సెక్షన్ కాలనీలోని వీధుల్లో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. – ఆదిత్య

✔: వీధిదీపాలకు మరమ్మతులు చేస్తాం. కాలువలు శుభ్రం చేయిస్తాం. – నగరపాలక అధికారులు

## సమస్యల హారన్.. ప్రయాణికుల పరేషాన్

☛ కర్నూలు బస్టాండు నిర్వహణ అధ్వానం ☛ వసతుల కల్పనలో అధికారుల విఫలం

14వ ప్లాట్‌ఫాం వద్ద పెచ్చులూడి పడుతున్న పైకప్పు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు నగరంలోని ఆర్టీసీ బస్టాండు నిర్వహణ గాడితప్పింది. అపరిశుభ్రత, అసౌకర్యాలు ప్రయాణికులను వేధిస్తున్నాయి. రోజూ భారీ ఆదాయం సమకూరుతున్నా.. ఆ స్థాయిలో వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. వేలాదిగా తరలివస్తున్న ప్రయాణికులకు సరిపడా కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. త్వరలో ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయనుంది. దీంతో బస్టాండుకొచ్చే మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగనుంది. ఇక్కడ తిష్టవేసిన సమస్యల వల్ల వారంతా అవస్థలు పడాల్సిందే. అధికారులు స్పందించి వసతులు మెరుగుపర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పరిశీలన

### రోజుకు రూ.25 లక్షల ఆదాయం

కర్నూలు బస్టాండుకు వివిధ ప్రాంతాల నుంచి రోజుకు 878 బస్సులు వచ్చి వెళ్తున్నాయి. సుమారు 10 వేల నుంచి 20 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.
● కర్నూలు-1, 2 డిపో పరిధిలో 200 బస్సులు తిరుపతి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒక్కో డిపో నుంచి 15 మండలాలకు బస్సులు నడుపుతున్నారు.
● రెండు డిపోల ద్వారా ఆర్టీసీకి రోజుకు రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. పండగల సీజన్, సెలవుల్లో రోజుకు రూ.60 లక్షల ఆదాయం వస్తుంది. ఇంత ఆదాయం ఉన్నా సౌకర్యాలు మెరుగుపర్చకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### భరించలేని దుర్గంధం

బస్సు ప్రాంగణంలో మూడు ప్రాంతాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ అధ్వానంగా ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. ప్రయాణికులు వాటి దరిదాపుల్లోకి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. బస్టాండు పరిసరాలు సైతం తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నాయి.

### భద్రత కరవు

● నంద్యాల, పాణ్యం బస్సులు ఆగే 14వ ప్లాట్‌ఫాం వద్ద బస్టాండు పైకప్పు శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడి పడుతున్నాయి. తెలంగాణ ప్లాట్‌ఫాంల వద్ద సైతం స్లాబు దెబ్బతింది. దీంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు.
● ఈ ప్రాంగణంలో నాలుగుచోట్ల మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి పనితీరు కూడా సరిగా లేదు. దీంతో దొంగలు తరచూ చోరీలకు పాల్పడుతున్నారని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### తాగునీరు.. తాగలేరు

తాగునీటితో చేతులు శుభ్రం చేసుకుంటున్న ప్రయాణికుడు

బస్టాండులో మొక్కుబడిగా తాగునీటి సౌకర్యం కల్పించారు. శుద్ధినీరు కాకుండా బోరు నీటినే సరఫరా చేస్తుండటంతో ప్రయాణికులు కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు మాత్రమే వినియోగిస్తున్నారు. తాగేందుకు దుకాణాల్లో శుద్ధినీరు కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారు.

## శిథిల మోరీ.. ప్రమాదాలకు దారి

వీఆర్ కాలనీ నుంచి పంప్‌హౌస్ మీదుగా కొత్త బస్టాండుకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి ఎల్ఐసీ కాలనీలోకి వెళ్లే రోడ్డును అనుసంధానిస్తూ కాంక్రీటు దిమ్మెలతో నిర్మించిన కల్వర్టు దెబ్బతింది. దీని అంచుల్లో గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహన చక్రాలు మురుగు కాల్వలో దిగబడిపోయే ప్రమాదం ఉంది. ద్విచక్ర వాహనదారులకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన కల్వర్టు నిర్మించి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

## అదుపుతప్పితే ముప్పే

కళ్లముందే నిత్యం రహదారి ప్రమాదాలు జరుగుతున్నా.. చాలామంది ద్విచక్ర వాహనదారుల్లో మార్పు రావడం లేదు. బరువైన, ప్రమాదకరమైన వస్తువులను రద్దీ మార్గాల్లో ద్విచక్ర వాహనాలపై పెట్టుకొని అతివేగంతో దూసుకెళ్తున్నారు. వీరు ఏమాత్రం అదుపుతప్పినా వీరితో పాటు ఆ మార్గంలో ప్రయాణించే ఇతర వాహనదారులు సైతం ప్రమాదాల బారినపడాల్సి వస్తోంది. ఆదివారం నగరంలోని జడ్పీ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ఇనుప స్టూల్‌తో పాటు ఇతర సామగ్రి తరలించడం చూసి ఆ దారిన వెళ్లే వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, కర్నూలు విద్య

## గుట్టపాడు.. నీరందక గోడు

ఓర్వకల్లు మండలంలోని గుట్టపాడు ప్రజలకు మంచినీరు అందించేందుకు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన ట్యాంకు నిరుపయోగంగా ఉంది. గ్రామంలోని ఎస్సీ, బీసీకాలనీలకు నీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో గతంలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో మూడేళ్ల కిందట 90 వేల లీటర్ల సామర్థ్యంతో కొత్త ట్యాంకు నిర్మించారు. ఇంతవరకు దానిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రజలకు నీటి కష్టాలు తీరడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ట్యాంకును ఉపయోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఓర్వకల్లు



దరఖాస్తుపత్రాన్ని అందజేస్తున్న నూరి మన్సూర్ అలీఖాన్

## హజ్‌యాత్రతో మనశ్శాంతి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : హజ్‌యాత్ర చేయడం వల్ల మనశ్శాంతి లభిస్తుందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు నూరి మన్సూర్ అలీఖాన్ పేర్కొన్నారు. నగరంలోని పాతబస్తీలో ఉన్న మస్జిద్ ఎ అబుబకర్‌లో జిల్లా హజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హజ్‌యాత్ర చేయదలచిన ముస్లింలు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నగరంలోని నమస్తే ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న మస్జిద్ ఎ అబుబకర్‌లో ఉచిత ఆన్‌లైన్ సేవ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సలీమ్‌అహ్మద్, సయ్యద్ ఆసిఫ్‌హుస్సైన్, సలాంమియా, నూర్ అహ్మద్, తాసీన్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడామణులు.. పోటీల్లో మెరుపులు

☛ రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న డిగ్రీ విద్యార్థినులు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : నేటితరం అమ్మాయిలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. తమకు ఇష్టమైన ఆటలు పట్టుదలతో నేర్చుకుంటున్నారు. ప్రత్యేక శిక్షణ పొందుతూ.. నిత్యం సాధన చేస్తూ నైపుణ్యం పెంపొందించుకుంటున్నారు. తల్లిదండ్రులు, శిక్షకుల ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొంటూ విజయాలు సాధిస్తున్నారు. కర్నూలు నగరంలో డిగ్రీ చదువుతున్న నవిత, జయంతి ఇదే కోవలో ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో ఆర్‌యూకు ట్రోఫీ అందించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు వీరు చెబుతున్నారు.

### నవిత.. ఖోఖోలో విజేత

నగర శివారులోని నందికొట్కూరు రహదారిలో ఉన్న ఓ మహిళా కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న నవిత ఖోఖో క్రీడలో సత్తా చాటుతున్నారు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు వీరి స్వగ్రామం. ఖోఖో క్రీడ పట్ల మక్కువతో నేర్చుకుని పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. ● 2023లో నగరంలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల ఖోఖో పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు. ● 2018లో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో స్వర్ణం సాధించారు. ● 2017లో అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జట్టును గెలిపించారు. ● 2024 ఆగస్టులో ఆర్‌యూ పరిధిలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో సత్తా చాటారు. ● ఆర్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని నవిత చెబుతున్నారు.

### జయంతి.. వాలీబాల్‌లో ఖ్యాతి

నగర శివారులోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న జయంతి వాలీబాల్ క్రీడలో రాణిస్తున్నారు. పగిడ్యాల మండలం నెహ్రూనగర్ వీరి స్వగ్రామం. గ్రామంలో ఎక్కువమంది వాలీబాల్ క్రీడ ఆడటం చూసి ఈమె కూడా సాధన చేశారు. ● 2018లో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పైకా పోటీల్లో జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి స్వర్ణ పతకం అందుకున్నారు. ● 2019లో విజయవాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 పోటీల్లో రాణించారు. ● 2022లో నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో నిర్వహించిన ఆర్‌యూ అనుబంధ వాలీబాల్ పోటీల్లో వీరి జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈమె వెండి పతకం అందుకున్నారు. ● 2023లో నగరంలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల వాలీబాల్ పోటీల్లో స్వర్ణం అందుకున్నారు. ● 2024 ఆగస్టులో నగరంలో నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీల్లో రాణించి కాంస్య పతకం అందుకున్నారు.

కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చెప్పారు. ఉలిందకొండ గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు, తితిదే బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, పాణ్యం నియోజకవర్గ పరిశీలకుడు ఆదెన్న, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, ఏపీ టూరిజం డైరెక్టర్ ముంతాజ్‌బేగం, ఈవీ రమణ, సుబ్బారాయుడు, కరీం, మురళి పాల్గొన్నారు.

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. రేమట గ్రామంలో తెదేపా నాయకులు రాఘవరెడ్డి, సుజాత ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తెదేపా నాయకులు క్రిస్టఫర్, సురేష్, వెంకటరాముడు, హుసేనప్ప, ఎర్రవల్లి రవి, సీతారామిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

## భవనాన్ని ఉర్దూ వర్సిటీకి ఇస్తే అంగీకరించం

మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల భవనాన్ని ఉర్దూ వర్సిటీకి అప్పగిస్తే అంగీకరించబోమని విశ్రాంత అధ్యాపకుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 1997- 2000 మధ్య డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అధ్యాపకులను సన్మానించారు.

## సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని శకునాల ఉన్నత పాఠశాలలో 2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులకు సైకిళ్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శకునాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

## సమస్యలపై సత్వరం స్పందించాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిబ్బంది సత్వరం స్పందించి పరిష్కరించాలని కర్నూలు జిల్లా ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. శివారు ప్రాంతాల సమస్యలు పరిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక విద్యుత్తు భవన్‌లో ఆదివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్ఈని సన్మానించారు. పీపీఎస్ఎస్ నాయకులు పుల్లారెడ్డి, వివిధ సంఘాల నాయకులు ఖాజాహుస్సేన్, నిరంజన్, డా.హనీఫ్, ప్రిన్సిపల్ రమణ, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈని సన్మానిస్తున్న పీపీఎస్ఎస్ ప్రతినిధులు

## సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఖాజాబాషా, రాముడు డిమాండ్ చేశారు. నగరంలోని కేకేభవన్‌లో ఆదివారం నిర్వహించిన మహాసభలో వారు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

## సంక్షిప్త సమాచారం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30కు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : పట్టణంలోని 31వ వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, తెదేపా నాయకులు కాలనీలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి తెదేపా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : పందిపాడు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వైకాపా కల్లూరు గ్రామీణ, కల్లూరు పట్టణ వార్డుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైకాపా యువ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, ఆయా వార్డులకు చెందిన కార్పొరేటర్లు, గ్రామాల ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నేటి కంప్యూటర్ యుగంలో కూడా కులవివక్ష, అంటరానితనం కొనసాగడం బాధాకరమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగర అధ్యక్షురాలు సుమలత పేర్కొన్నారు. రోజావీధిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాప్రతినిధులు సైతం కులవివక్షను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు మంత్రి లోకేశ్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కేవీపీఎస్ నగర ఉపాధ్యక్షుడు ఆనంద్ డిమాండ్ చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని కోరుతూ ఆదివారం 42వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో పోరుబాట కార్యక్రమం నిర్వహించినట్లు సీపీఎం నగర కార్యదర్శి రాముడు తెలిపారు. ఈనెల 14న విద్యుత్తు భవన్ ముందు నిర్వహించే ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : డీవైఎఫ్ఐ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర కోశాధికారి నగేష్ తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రాఘవేంద్ర, అబ్దుల్లాను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : బాలాజీనగర్‌లో పార్కింగ్ విషయమై జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు కర్నూలు తాలూకా పోలీసులు తెలిపారు. భాజపా నాయకుడు మధుసూదన్‌గౌడ్, కానిస్టేబుల్ రఫీక్ కుటుంబ సభ్యులు పార్కింగ్ స్థలం కోసం గొడవపడి పరస్పరం దాడులు చేసుకున్నారని వెల్లడించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.





## రైతుబేజారు.. వినియోగదారులు ఉసూరు

■ వ్యాపారులదే పెత్తనం.. ధరలు అధికం

■ బయటికంటే ఎక్కువ మొత్తం వసూలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : సి.క్యాంపు రైతుబజార్‌లో ధరల మోత మోగుతోంది. వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఇక్కడ రైతుల కంటే వ్యాపారులే ఎక్కువగా తిష్టవేశారు. ఇష్టానుసారం ధరలు చెబుతున్నారు. రైతుబజార్‌లో కిలో టమాటా రూ.30తో విక్రయిస్తున్నారు. దీని చెంతనే కూరగాయల వ్యాపారులు అంతే నాణ్యత కలిగిన టమాటాలను కిలో రూ.20- 25కే విక్రయిస్తున్నారు. బయట కంటే తక్కువకు విక్రయించాల్సిందిపోయి కిలోపై రూ.5 నుంచి రూ.10 అధికంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. దీంతో రైతుబజార్‌కు వచ్చిన చాలామంది బయటికొచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు.

### రాతలు గంధరగోళం

రైతుబజార్‌లో ఆరోజు కూరగాయల ధరలను స్పష్టంగా బోర్డుపై రాసి ప్రదర్శించాల్సి ఉంది. కానీ ఇక్కడ బోర్డుపై రాస్తున్న రాతలు అర్థం కావడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. అందులో రాసిన ధరలకు, వ్యాపారులు తీసుకునే మొత్తానికి పొంతన ఉండటం లేదు.

రైతు బజార్ బయట కిలో రూ.20తో టమాటాలు కొంటున్న వినియోగదారులు

● రైతుబజార్‌లో మూడు మునగకాయలు రూ.20- 30తో విక్రయిస్తున్నారు. బోర్డుపై మాత్రం 8/10 అని రాశారు. దీంతో ఎన్ని మునగకాయలు ఎంతకు ఇస్తారో అర్థం కావడం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు.

● నిమ్మకాయలు 4/5 అని బోర్డులో రాశారు. రైతుబజార్ పక్కనే రూ.10కి 6 నిమ్మకాయలు అమ్ముతున్నారు. గోంగూర ధరల బోర్డుపై 4 అని రాశారు. రూ.పదికి నాలుగు కట్టలా లేక రూ.20కి నాలుగా అన్నది అర్థం కావడం లేదు. వ్యాపారులు మాత్రం రూ.20కు మూడు కట్టల గోంగూర విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సరసమైన ధరలకు కూరగాయలు విక్రయించేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన గార్గేయపురం సహకార సంఘం సభ్యులు

## సహకార సంఘం అభివృద్ధికి కృషి

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : గార్గేయపురం వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని పాలక మండలి సభ్యులు డి.ఫక్రుద్దీన్, బి.జములయ్య, బి.లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో గార్గేయపురం పీఏసీఎస్ పాలక మండలి సభ్యులను ఆదివారం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సీతారాంరెడ్డి, నరేందర్‌రెడ్డి, కౌలుట్లయ్య, అజయ్‌కుమార్, రామోజీరావు, మోజేసు, అర్.సురేష్, సోఫీ బేగ్ పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో దొంగలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను కర్నూలు పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. వారిని విచారించి పదికిపైగా బైకులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరికొన్నింటిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

(c) eenadu

## రైతు పాలిట పగాకు

నందికొట్కూరు పట్టణ సమీపం.. పగిడ్యాల వెళ్లే మార్గంలో గంగాధర్ అనే రైతు రూ.లక్ష విలువ చేసే పొగాకు బేళ్లను పొలంలోనే వదిలేశారు. కొనేవారు లేకపోవడంతో అలానే వదిలేసినట్లు ఆయన చెప్పారు. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టామని.. చివరికి నష్టమే మిగిలిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం



## శ్రీగిరిలో భక్తజనం

శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఆదివారం పెద్దఎత్తున తరలివచ్చారు. వేకువజామున 4 గంటల నుంచే స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# ఈనాడు నంద్యాల



## నాణ్యతను మట్టితో కప్పేశారు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది.. కొన్ని కాల్వలకు నీటి విడుదల ప్రారంభమైంది.. హంద్రీనీవా ప్రధాన కాల్వకు ఈనెల 15 నుంచి నీటిని ఎత్తిపోసేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఎత్తిపోతల మోటార్లను సిద్ధం చేశారు. ఇటీవల చేపట్టిన విస్తరణ పనులు పూర్తికాకపోవడం.. చేసిన పనుల నాణ్యతపై 'మట్టి' వేయడం ఆందోళనకు గురి చేస్తోంది.

● హంద్రీనీవా సుజల ప్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వలో గతంలో 2 వేల క్యూసెక్కుల వరద ప్రవహించేది. దీన్ని 3,850 క్యూసెక్కులు వెళ్లేలా విస్తరించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. రూ.650 కోట్లు వెచ్చించి పనులు చకచకా చేస్తోంది. నందికొట్కూరు మండల పరిధిలోని మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి పత్తికొండ వరకు ప్రధాన కాల్వ విస్తరణ పనులు చేపడుతున్నారు. గతంలో మట్టి కట్ట కోతకు గురవగా.. కాలువలో పూడిక తీసి అదే మట్టితో గట్టును చదును చేస్తుండటం గమనార్హం.



కాలువలో అసంపూర్తిగా పనులు (కట్టపై వేసిన మట్టి.. ఇలా జారుతోంది..)

ఫలితంగా చిన్నపాటి వర్షానికే మట్టి కాలువలోకి జారిపోతోంది. నీరు వదిలితే ప్రవాహానికి మట్టి కొట్టుకుపోతుందని.. భారీగా కోతకు గురయ్యే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● మల్యాల పథకం నుంచి సుమారు రెండు కి.మీ దూరంలో ప్రధాన కాలువపై గతంలో మట్టి కట్ట భారీగా కోతకు గురైంది. వడ్డెమాను గ్రామం సమీపాన మూడుసార్లు మట్టి కట్టకు గండ్లు పడ్డాయి. బ్రాహ్మణకొట్కూరు-వడ్డెమాను గ్రామాల మధ్య కాలువ కోతకు గురై భారీగా దెబ్బతింది. భూమికి సమాంతరంగా ఉన్న ప్రధాన కాలువ వద్ద పరిస్థితులు బాగానే ఉన్నా.. ప్రధాన కాలువ ఎత్తుగా ఉండటం.. భూములు తగ్గులో ఉన్న ప్రాంతాల్లోని పరిస్థితిపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆయా ప్రాంతాల్లో నీటి విడుదల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

## బస్టాండు ఎలా ఉంది?

▸▸ మహిళల ఉచిత ప్రయాణానికి కసరత్తు
▸▸ బస్సుల్లో పెరగనున్న రద్దీ
▸▸ సమస్యలు పరిష్కరించకుంటే కష్టమే

నంద్యాల బస్టాండులో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న ప్రయాణికుడు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : మహిళలకు ఆగస్టు-15 నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. రద్దీ పెరగనున్న నేపథ్యంలో బస్టాండ్లలో వసతులపై ఆర్టీసీ ఆరా తీస్తోంది. మంచినీరు, మరుగుదొడ్లు, బెంచీలు, ఫ్యాన్లు తదితర వసతులు మెరుగుపరిచే పనిలో పడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 డిపోల పరిధిలో రద్దీ ఎక్కువగా ఉంటే కర్నూలు, నంద్యాల, డోన్, బనగానపల్లి, ఎమ్మిగనూరు, ఆదోని, ఆత్మకూరు బస్టాండ్లలో వసతులపై 'న్యూస్‌బృందం' పరిశీలన చేసి అక్కడ ప్రయాణికులతో మాట్లాడగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. మరుగుదొడ్లు శుభ్రం ఉండటం లేదు.. మంచినీటి సౌకర్యం సరిగా లేదు..సీసీ కెమెరాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.




### స్కాన్ చేసి చెప్పొచ్చు

● బస్టాండు ప్రాంగణంలో పరిశుభ్రత, తాగునీరు, కుర్చీలు, మూత్రశాలలు, బస్సుల రాకపోకలు, సమాచార వ్యవస్థ వంటి ఐదు అంశాలపై ప్రత్యేక క్యూఆర్ కోడ్ విధానం అమలులోకి ఉంది. ప్రయాణికులు తమ చరవాణి ద్వారా స్కాన్ చేసి ఏపీ సర్వే సైట్‌లో నేరుగా సమస్యను తెలియజేసే అవకాశం కల్పించింది. ● క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాత ఏపీజీవో సర్వే.కామ్ అనే లింకు తెరుచుకుంటుంది. బస్టాండ్‌పై సర్వే అంటూ ఐదు అంశాలకు సంబంధించి ప్రశ్నలు కనిపిస్తాయి. అవును, కాదు, బాగుంది., బాగాలేదు. అని ఉంటాయి. వీటిని పూర్తి చేసి అప్‌లోడ్ చేస్తే నేరుగా ఏపీ సర్వే సైట్‌కు వివరాలు చేరుతాయి. ఎలాంటి సమస్యలపై ఎక్కువమంది అసంతృప్తి వ్యక్తం చేశారో దానిపై ఆర్టీసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు.


మరిన్ని పరిశీలనాంశాలు 7లో


## నల్లమలకు పర్యాటక తోరణం

☛ ప్రత్యేక కారిడార్ ఏర్పాటుకు ప్రణాళిక

నల్లమల అందాలు.. ఆధ్యాత్మిక క్షేత్రాలు.. చారిత్రక నిర్మాణాలకు నెలవైన జిల్లా పర్యాటకులకు స్వర్గధామం. పర్యాటక రంగంలో 15 శాతం వృద్ధి రేటు సాధిస్తే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచడానికి వీలుందని అధికారులు ప్రగతి పత్రం రూపొందించారు. జిల్లాలో ఇప్పటికే ఏడు పర్యాటక సర్క్యూట్లను ఏర్పాటు చేశారు. టెంపుల్ టూరిజం కింద సిద్ధేశ్వరం నుంచి శ్రీశైలం వరకు వివిధ మార్గాలుగా విభజించారు. సిద్ధేశ్వరం వద్ద పదెకరాల్లో పంచ కర్మ కేంద్రాన్ని ఆయుష్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

### శివయ్య చెంత జలదృశ్యం

■ ద్వాదశ జ్యోతిర్లింగ మహా క్షేత్రమైన శ్రీశైలం.. దేశంలోనే అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటిగా పేరొందింది. ఈ ఆలయం సమీపంలోనే కృష్ణా నది పరవళ్లు తొక్కుతూ ఉంటుంది. మహా శివరాత్రి, ఉగాది ఉత్సవాలు, కార్తిక, శ్రావణ మాసాల్లో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. శ్రీశైలం-నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు జల రవాణా సౌకర్యం ఉంది.

■ సంగమేశ్వరం- శ్రీశైలం మధ్య ప్రత్యేక నడువాను ఏర్పాటు చేయనున్నారు. సంగమేశ్వరం వద్ద త్వరలో తీగల వంతెన నిర్మాణం ప్రారంభం కానుంది. దీన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు. ఇక్కడి నుంచి శ్రీశైలానికి జల మార్గంలో వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి నుంచే సరస్వతి నిలయమైన కొలనుభారతికి వెళ్లేలా ప్రతిపాదించారు.

■ శ్రీశైలం సమీపంలోని ఇష్టకామేశ్వరి ఆలయం, శివాజీ స్ఫూర్తి కేంద్రం, పాలధార, పంచధార ప్రదేశాల్లో ఒకచోట ట్రెక్కింగ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

■ నిత్యం జల సవ్వడులతో.. నల్లమల అడవుల చెంత ఉన్న మహానంది ఆలయం భక్తులకు నేత్రానందాన్ని కలిగిస్తూ ఉంటుంది. ఇక్కడి రుద్రగుండం కోనేరులో నీరు నిత్యం ప్రవహిస్తూనే ఉంటుంది. శ్రీశైలం-మహానంది టూరిజం ప్యాకేజీ ఏర్పాటుచేసి మధ్యలో ఓంకారం క్షేత్రంతో పాటు రుద్రకోడూరు ఆలయ దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

■ కృష్ణా నది పరివాహక ప్రాంతంలో చరిత్ర కలిగిన ప్రముఖ ఆలయాలు మరెన్నో ఉన్నాయి. పర్యాటక పరంగా ఎలాంటి సౌకర్యాలు లేవు. ఎక్కడికక్కడ పర్యాటక కారిడార్ ఏర్పాటుచేస్తే ప్రభుత్వానికి పెద్దఎత్తున ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఛాలెంజ్-2 పథకం కింద అహోబిలంలో రోప్‌వే ఏర్పాటుకు కేంద్రం గతంలోనే అంగీకరించింది. ఎగువ, దిగువ అహోబిలాల్లో రోప్‌వే ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయమై ప్రభుత్వం సర్వే చేయనున్నారు.

### నవనందులను చూసేలా

నంద్యాల చుట్టు పక్కల 15 కి.మీల పరిధిలో ఉన్న నవనంది క్షేత్రాలను దర్శించే విధంగా ప్రత్యేక పర్యాటక మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఆయా క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను తిప్పనున్నారు. ఒకేరోజు అన్ని ఆలయాలు సందర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

### వచ్చిన పర్యాటకులు

| ఏడాది | నంద్యాల |
|---|---|
| 2022-23 | 1,21,32,623 |
| 2023-24 | 1,29,26,768 |

### గుహలకు మార్గం

■ పచ్చని కొండల నడుమ కాకుల జాడ లేని యాగంటి ఆలయం ఎంతో విశిష్టమైంది. ఈ ఆలయంతో పాటు సమీపంలోని బెలుం గుహలు, మద్దిలేటిస్వామి క్షేత్రం, రాణిమహల్, వాల్మీకి గుహలు ఉన్నాయి.

■ ప్యాపిలి సమీపంలో వాల్మీకి గుహలు, బేతంచెర్లలో బిల్వ గుహలు చూసేందుకు వెళ్లే పర్యాటలకు సంఖ్య పెరిగింది. ఇప్పటికే ఈ గుహలతో పాటు మద్దిలేటి స్వామి క్షేత్రాన్ని సందర్శించే విధంగా ప్రత్యేకంగా రవాణా సౌకర్యాలను కల్పించారు.

■ ప్రకృతి రమణీయత ఉట్టిపడే క్షేత్రం.. నవ నారసింహులకు నిలయం అహోబిలం క్షేత్రం. ఇక్కడ ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాలు ఉన్నాయి. వీటితోపాటు తొమ్మిది నారసింహ క్షేత్రాలు నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడ జరిగే పార్వేట ఉత్సవాలకు యునెస్కో గుర్తింపు లభించింది.

## 15న తెలుగు గంగకు నీటి విడుదల

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు తెలుగుగంగ జలాశయం నుంచి 15వ తేదీన మద్రాసు కాలువకు సాగు నీటిని విడుదల చేస్తున్నట్లు గంగ ఏఈ శివనాయక్ ఆదివారం తెలిపారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తారన్నారు. బనకచర్ల నుంచి వీబీఆర్‌కు 15 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని పేర్కొన్నారు. జలాశయంలో ప్రస్తుతం 903 టీఎంసీల నీటి నిల్వ ఉందని చెప్పారు.

## ముక్కపై కనిపించని ఆరోగ్య ముద్ర

☛ అపరిశుభ్రత మధ్యే మాంసం విక్రయాలు
☛ కొరవడిన అధికారుల పర్యవేక్షణ

సచివాలయం, న్యూస్‌టుడే : ఆదివారం మాంసాహారులకు ముక్కలేనిదే ముద్ద దిగదు. ఆరోజు పొట్టేళ్లు, మేకల మాంసానికి డిమాండ్ ఎక్కువ. ఇదే అదనుగా వ్యాపారులు ఇష్టానుసారం దందా సాగిస్తున్నారు. నిబంధనలను లెక్క చేయడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలోనే జీవాలను వధించి.. మాంసం విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. శుభ్రత, నాణ్యత, ధరల విషయంలో అధికారుల నియంత్రణ కొరవడింది. దీంతో వ్యాపారులు తక్కువ ధరకు లభించే చిన్న వయసు పిల్లలు, అనారోగ్యంతో ఉన్న జీవాలు, గొర్రెలను వధించి వినియోగదారులకు అంటగడుతున్నారు.

### వారానికి రూ.60 కోట్ల వ్యాపారం

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13.50 లక్షల కుటుంబాలున్నాయి. 46 లక్షలకు పైగా జనాభా ఉంది. ఒక వ్యక్తి రోజుకు 70 గ్రాముల చొప్పున.. వారానికి 500 గ్రాముల మాంసం తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మాంసం ధరలు ఆకాశాన్నంటుతుండటంతో 30 శాతం మంది మాత్రమే వారానికోసారి తింటున్నారు. అదీ 100 నుంచి 200 గ్రాముల్లోపే. ఇక 60- 70 శాతం మంది మాంసం బదులుగా చికెన్, చేపలు, గుడ్లను తింటున్నారు.

● ఉమ్మడి జిల్లాలో సుమారు 5 వేల మంది వరకు మాంసం వ్యాపారులున్నారు. వారానికి సగటున రూ.60 కోట్ల విలువ చేసే 7.50 లక్షల కిలోల మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ఏడాదికి రూ.2880 కోట్ల వ్యాపారం జరుగుతోంది.

### ఒక్కటి రూ.50

● మాంసం ధరల నియంత్రణపై జిల్లా పాలనాధికారులు ఒక్క సమావేశం కూడా నిర్వహించ లేదు. పైగా ఉమ్మడి జిల్లాలో ఎంతమంది మాంసం వ్యాపారులున్నారో కూడా అధికారుల వద్ద

లెక్కలు లేకపోవడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో కిలో రూ.700- రూ.800 వరకు విక్రయిస్తున్నారు. కర్నూలు నగరంలో రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నారు.

● కిలో మటన్ కొంటే మధ్యస్థ స్థాయి ముక్కలైతే 20- 30 కూడా రావు. 50 గ్రాముల బరువున్న ముక్కలు 20 వరకు వస్తాయి. ఇందులో నాలుగు ఎముకలు ఉంటున్నాయి. ఈ లెక్కన ఒక్కో ముక్క రూ.40 నుంచి రూ.50 ధర పలుకుతోంది.

### నిబంధనలు ఏం చెబుతున్నాయి

● పశు సంవర్ధక శాఖ వైద్యుడు, మున్సిపల్ శానిటరీ విభాగం సిబ్బంది పొట్టేళ్లు, మేకలను పరిశీలించి ఆరోగ్యంగా ఉన్నాయని ధ్రువీకరించిన తర్వాతే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జంతు వధశాలల్లో వాటిని వధించాలి. శుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రమాణాలు పాటించాలి. ఆ తదుపరి స్థానిక సంస్థల అధికారులు మాంసంపై ముద్ర వేసిన తర్వాత విక్రయించాలి.

● పొట్టేళ్లు, మేకల మాంసాన్ని మాత్రమే వ్యాపారులు విక్రయించాలి. ఈ నిబంధనలు పాటించని వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

● మాంసం ధరలు ప్రదర్శించాలి. ఎలక్ట్రానిక్ కాటాలు వాడాలి. తూకం పారదర్శకంగా ఉండాలి. ప్లాస్టిక్ సంచులు వాడకూడదు. రోజుల తరబడి నిల్వ చేసిన మాంసం విక్రయించకూడదు.

## ఉచిత ఇసుక స్థిరాస్తికి ఊరట

■ రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం ■ గత రెండు నెలల్లో 97.16 శాతానికి చేరిక

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : గత ఐదేళ్లు 'నేల'చూపులు చూసిన స్థిరాస్తి ఆదాయం 'కూటమి' ప్రభుత్వం చర్యలతో క్రమంగా పెరుగుతోంది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి జిల్లాకు రూ.601.40 కోట్ల ఆదాయం లక్ష్యంగా నిర్దేశించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉమ్మడి జిల్లాలోని 24 సబ్‌రిజిస్ట్రారు కార్యాలయాల పరిధిలో రూ.138.32 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా రూ.134.39 కోట్లు ఆర్జించి 97.16 శాతం లక్ష్యాన్ని చేరుకొన్నారు.

| ఆర్థిక సం॥ | వచ్చిన ఆదాయం (రూ.కోట్లలో) | శాతం |
|---|---|---|
| 2023-24 | 341.43 | 48.8 |
| 2024-25 | 446.90 | 59.49 |
| 2025-26 | 134.39 | 97.16 |

(ఏప్రిల్ నుంచి జూన్)

### గత ఐదేళ్లు తిరోగమనం

గత ఐదేళ్ల వైకాపా పాలనలో కొత్త పరిశ్రమలు రాక.. ప్రాజెక్టులు నిర్మించక స్థిరాస్తి వ్యాపారం పూర్తిగా కుదేలైంది. పొలాలు, స్థలాల క్రయవిక్రయాలు పడిపోయాయి. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. సేవల రుసుము, భూములు, స్థలాలు, భవనాల విలువను అమాంతం పెంచారు. దీంతో వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క ఆర్థిక సంవత్సరం కూడా నిర్దేశిత లక్ష్యంలో 50 శాతం ఆదాయాన్ని చేరుకోలేదు.

### కూటమి రాకతో పురోగమనం

● కుదేలైన స్థిరాస్తి వ్యాపారం 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుంజుకుంది. ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగం వేగం అందుకొంది. ఓర్వకల్లు పరిధిలో పలు భారీ పరిశ్రమలు మంజూరయ్యాయి. రహదారుల విస్తరణ పనులు ప్రారంభయ్యాయి. ఇవన్నీ జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం తెచ్చిపెడుతున్నాయి.

● సగటున ప్రతినెలా రూ.44.79 కోట్ల ఆదాయం సమకూరుతోంది. నెల ఆదాయం 2024- 25లో రూ.37.24 కోట్లు, 2023- 24 ఆర్థిక సంవత్సరంలో రూ.28.45 కోట్లు ఉండేది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి నెల ఆదాయం రూ.7.55 కోట్లు పెరిగింది.

## పట్టించుకోకుంటే ప్రాణం ఒరిగిపోతుంది

నంద్యాల మండల పరిధిలో అయ్యలూరిమెట్ట నుంచి నంద్యాల వెళ్లేందుకు దగ్గరి దారి కావడంతో చాలామంది కేసీ కాలువ కట్టపై నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో పొన్నాపురం కాలనీ సమీపంలో విద్యుత్తు స్తంభం వాలిపోయి ప్రమాదకరంగా ఉంది. బలమైన గాలులు వీస్తే పడిపోయేలా ఉన్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా స్పందించి వెంటనే తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, నియోజకవర్గ, మండల స్థాయిలోనూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్జీదారులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారానూ అందజేయొచ్చని పేర్కొన్నారు. తమ దరఖాస్తులు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవాలన్నా టోల్‌ఫ్రీ నంబరు 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని చెప్పారు.

## ఘాటెక్కిన మిర్చి ధర

పచ్చిమిర్చి ధర ఘాటెక్కింది. కిలో రూ.70 పలుకుతుండటంతో కొనుగోలుకు సామాన్య, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. ఆదివారం ప్యాపిలి మార్కెట్‌కు వచ్చిన పచ్చి మిర్చి కిలో రూ.70 పలికింది. గత వారం కిలో మిర్చి ధర రూ.30 పలికింది. ప్యాపిలి మండలంలో రైతులు 70 ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేశారు.

– న్యూస్‌టుడే, ప్యాపిలి

(c) eenadu

# ఎత్తుకు పైఎత్తు.. ప్రత్యర్థి చిత్తు

➤ చదరంగంలో విద్యార్థి ప్రతిభ

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే: చదరంగం మేధస్సుకు పదును పెట్టే క్రీడ. ఇందులో నిత్యం సాధన చేస్తే ఏకాగ్రత పెరుగుతుంది. జ్ఞాపకశక్తి, వ్యూహ రచనా సామర్థ్యాలు పెంపొందుతాయి. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థులు చదరంగంపై ఆసక్తి చూపుతున్నారు. నంద్యాలకు చెందిన మోక్షిత్ ఇదే కోవకు చెందినవాడే. పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌కు చెందిన ఇతను ప్రస్తుతం 7వ తరగతి చదువుతున్నాడు.

### నిత్యం సాధన చేస్తూ..

చదరంగంపై ఆసక్తి నేపథ్యంలో గత మూడేళ్లుగా రామసుబ్బారెడ్డి వద్ద మోక్షిత్ శిక్షణ తీసుకుంటున్నాడు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు ప్రతిరోజూ ఖాళీ సమయంలో రెండు గంటలపాటు చదరంగంపై శిక్షణ తీసుకుంటూ తనదైన శైలిలో రాణిస్తున్నాడు. నిత్యం సాధన చేస్తూ చదరంగంపై పట్టు సాధించాడు. ఎప్పటికప్పుడు మెలకువలు నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నాడు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పతకాలు అందుకుంటూ అందరి మన్ననలు అందుకుంటున్నాడు.

### జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తా - మోక్షిత్

నాకు చిన్నప్పటి నుంచి చదరంగం అంటే ఎనలేని ఆసక్తి. ఈ నేపథ్యంలో నిదానంగా పట్టు సాధించా. ఎక్కడ పోటీలు జరిగినా ఉత్సాహంగా పాల్గొంటూ విజయాలు అందుకుంటున్నా. జాతీయస్థాయి పోటీల్లో రాణించడమే నా లక్ష్యం. దీనికిగాను నిరంతరం సాధన చేస్తున్నా. అన్ని పోటీల్లో రాణించి మంచి పేరు తీసుకొస్తా.

### సాధించిన విజయాలివే..

గతేడాది కర్నూలులో నిర్వహించిన అండర్-12 జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో మోక్షిత్ పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే ఏడాది నగరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తృతీయ బహుమతి గెలుచుకున్నాడు. గతేడాది చివర్లో నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాలలో నిర్వహించిన ర్యాంకింగ్ చదరంగం పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకున్నాడు. అదే ఏడాది భీమవరంలో ర్యాపిడ్, రేటింగ్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 1,063 ర్యాంకు సొంతం చేసుకున్నాడు.

- ఈ ఏడాది నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో 4వ స్థానంలో నిలిచాడు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ర్యాపిడ్ పోటీల్లో ప్రథమ బహుమతి అందుకున్నారు.

# రిజ్వానా.. రెజ్లింగ్‌లో భళా

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గనుల్లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఓ కుటుంబంలో పుట్టిన ఆ విద్యార్థిని ఓ వైపు చదువులోనూ మరోవైపు ఆటల్లోనూ ప్రతిభ చూపుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల సహకారంతో రెజ్లింగ్ ఆటలో పతకాలు సొంతం చేసుకుంటూ క్రీడా విభాగంలో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది రిజ్వానా.

### పేదింటి క్రీడారత్నం

అవుకు మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన దూదేకుల రంగప్ప, బాలహుస్సేన్‌బీ దంపతులది నిరుపేద కుటుంబం. భార్యాభర్తలు గ్రామంలోని గని పనులు, వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తూనే పిల్లలను చదివిస్తున్నారు. రెండో సంతానమైన రిజ్వానా చదువులోనూ, ఆటల్లోనూ దూసుకుపోతోంది. తిరుపతిలోని పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివి 960మార్కులు సాధించింది. ఇంటర్ చదివే సమయంలో ఫిజికల్ డైరెక్టర్ సాయిసుమలత బాలికను రెజ్లింగ్‌లోని గ్రాప్లింగ్ ఆటలో శిక్షణ ఇచ్చింది. జిల్లాస్థాయి ఎంపికల్లో ఈ విద్యార్థిని చోటు దక్కించుకొని గ్రాప్లింగ్‌లోని జీఐ, నోగి రెండురకాల ఆటల్లో 37, 40కిలోల విభాగాల్లో ఆడి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించింది. కరాటే, జిమ్నాస్టిక్స్‌లోనూ శిక్షణ పొంది రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపింది.

### సాధించిన విజయాలు:

- 2023 సెప్టెంబర్‌లో హరియాణా రాష్ట్రం రోహ్‌తక్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి స్వర్ణపతకం కైవసం చేసుకుంది.
- 2023 డిసెంబర్‌లో వైజాగ్‌లో జరిగిన జాతీయ స్థాయి బీచ్ గ్రాప్లింగ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలించింది.
- 2024 ఆగస్టులో రేణిగుంటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జీఐ, నోగి విభాగాల్లో పాల్గొని మొదటి బహుమతి సొంతం చేసుకుంది.
- 2025లో హరిద్వార్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం గెలిచింది.
- 2024, 2025లో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచింది.
- ఇదే ఏడాది చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో వెండి పతకం సాధించింది.

### అహోబిలంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డా.వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న వారిని ఆళ్లగడ్డ తహసీల్దారు జ్యోతి రత్నకుమారి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం వారు ఎగువ, దిగువ ఆలయాల్లోని స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారి రాక సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణన్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు.

న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న తహసీల్దారు జ్యోతిరత్నకుమారి

# తపాలా.. మళ్లీ కళకళ

- ప్రభుత్వ పథకాల అనుసంధానంతో పూర్వవైభవం
- ఖాతాలు తెరిచేందుకు బారులుతీరుతున్న లబ్ధిదారులు

కర్నూలు ప్రధాన పోస్టాఫీసు వద్ద ఖాతాదారుల బారులు (పాతచిత్రం)

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తపాలాశాఖకు పూర్వవైభవం తెస్తున్నాయి. తల్లికి వందనం, త్వరలో అమలుకానున్న అన్నదాత సుఖీభవ పథకాల నగదును ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తోంది. ఈ మొత్తం జమ కావాలంటే వారి ఖాతాలు తప్పనిసరిగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో అనుసంధానమై ఉండాలి. చాలామంది ఖాతాలు ఎన్‌పీసీఐతో అనుసంధానం కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన తపాలా శాఖ అధికారులు ఎన్‌పీసీఐతో అనుసంధానమైన పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ఖాతా (ఐపీపీబీ)లను తెరిపిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. దీంతో సంక్షేమ పథకాల లబ్ధిదారులు పెద్దసంఖ్యలో తపాలా ఖాతాలు తెరిచేందుకు ఆసక్తి చూపుతున్నారు.

### 6 నెలలు.. 25 వేల ఖాతాలు

ఉమ్మడి జిల్లాలో మూడు ప్రధాన తపాలా కార్యాలయాలు ఉన్నాయి. సబ్ పోస్టాఫీసులు కర్నూలు జిల్లాలో 463, నంద్యాల జిల్లాలో 43 ఉన్నాయి. వీటి పరిధిలో ఆరు నెలల కాలంలో 25 వేలకు పైగా ఖాతాలు తెరిచినట్లు అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారుల ఇళ్లవద్దకు, కళాశాలల వద్దకే వెళ్లి ఖాతాలు తెరిపిస్తున్నారు. ఖాతాదారులకు ఏటీఎం కార్డు, పాసు పుస్తకం ఇస్తున్నారు. కార్డును వినియోగించుకొని నగదు లావాదేవీలు నిర్వహించవచ్చు.

### కార్యాలయాల వద్ద బారులు

- తల్లికి వందనం పథకం కింద జిల్లాలోని 27,495 మంది ఖాతాల్లో రూ.57.18 కోట్ల నగదు జమ చేశారు. అర్హత ఉండీ పథకం వర్తించని వారికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. రెండో విడతలో 5,100 మంది ఖాతాల్లో రూ.7.10 కోట్ల నగదు జమ చేశారు.
- చాలామంది బ్యాంకు ఖాతాలు ఎన్‌పీసీఐకి అనుసంధానం కాలేదు. ఎన్‌పీసీఐ వద్ద వాటి వివరాలు లేకపోవడంతో తల్లికి వందనం డబ్బులు జమ కాలేదు. వారంతా తపాలా ఖాతాలు తెరిచేందుకు ముందుకొస్తున్నారు. రోజూ వేలాదిమంది ఖాతాలు తెరిచేందుకు బారులుతీరుతున్నారు.

### కళాశాలల వద్దకే వెళ్తున్నాం

- జనార్దన్‌రెడ్డి, ప్రధాన పర్యవేక్షకులు, కర్నూలు తపాలా డివిజన్

ప్రభుత్వ పథకాల నగదు బ్యాంకు ఖాతాలో జమ కావాలంటే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో అనుసంధానం కావాల్సి ఉంది. ఈ విషయం తెలుసుకుని చాలామంది తపాలా శాఖలో ఖాతాలు తెరిచేందుకు కార్యాలయాలకు తరలివస్తున్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని ఉదయం 6 గంటల నుంచే తపాలా కార్యాలయాలు తెరుస్తున్నాం. కళాశాలల వద్దకే వెళ్లి విద్యార్థులతో ఖాతాలు తెరిపించాం. నెల రోజుల వ్యవధిలోనే భారీ సంఖ్యలో ఖాతాలు తెరిచాం.

# ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

- 907 మంది విద్యార్థుల ఎంపిక

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు రెండో విడత ప్రవేశాల కోసం ఎంపికైన 907 మంది విద్యార్థుల జాబితాను ఆదివారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ విడుదల చేశారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థుల పేర్లను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొదటి విడతలో ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 628 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలలో చేరలేదు. దీంతో ఆ సీట్లు ఖాళీపడ్డాయి. వీటితో పాటు దివ్యాంగుల కోటా కింద 179, సైనికోద్యోగుల పిల్లల కోటా కింద 80, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 20 సీట్లతో కలిపి మొత్తం 907 సీట్లకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి వారి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇందులో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి 96 మంది, ఒంగోలుకు 460, నూజివీడుకు 85, శ్రీకాకుళానికి 265 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్‌సీసీ కోటా కింద 40 సీట్లు, క్రీడా కోటా కింద 20 సీట్లకు నిపుణులైన ఆయా శాఖల అధికారుల నుంచి విద్యార్థుల మెరిట్ జాబితా అందాల్సి ఉంది. ఈ సీట్ల భర్తీ కూడా మరో వారంలో పూర్తి కానుంది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 96 మంది విద్యార్థులు ఈ నెల 17న, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 810 మంది విద్యార్థులు అదే రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరిగే కౌన్సెలింగ్‌కు ధ్రువపత్రాలు, లగేజీలతో హాజరు కావాలని వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. కొత్తగా ఎంపికైన విద్యార్థులందరికీ సోమవారం నుంచి ఓరియంటేషన్ తరగతులు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

### అవుకు జలాశయం నీటి విడుదల

అవుకు, న్యూస్‌టుడే: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు అవుకు జలాశయం నుంచి ఎస్సార్బీసీ (మైలవరం కాల్వ) 13 ప్యాకేజీ కాల్వకు ఆదివారం నీటిని విడుదల చేశారు. ఈ మేరకు జలాశయం ఏఈ సుధాకర్ ఆధ్వర్యంలో తిమ్మరాజుకట్ట పరిధిలో గేట్లను తెరిచారు. అవుకు జలాశయంలో పూర్తి నిల్వ సామర్థ్యం 4.14 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.6 టీఎంసీలు ఉన్నాయని, ప్రస్తుతం మైలవరం కాల్వకు 150 క్యూసెక్కులు, అవుకు కాల్వకు 50 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు. అవసరాన్ని బట్టి రానున్న రోజుల్లో 300 క్యూసెక్కులకు పెంచనున్నట్లు ఏఈ తెలిపారు. గేట్లు తెరవడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

### కోట శ్రీనివాసరావు మృతి బాధాకరం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. గొప్ప నటనతో ఎన్నో పాత్రలు పోషించారని చెప్పారు. తాను, కోట శ్రీనివాసరావు 1999-2024 మధ్య ఎమ్మెల్యేలుగా కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. సామాజిక బాధ్యతగా రహదారి భద్రత వారోత్సవాల్లో పాల్గొంటూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేసిన గొప్ప వ్యక్తి కోట శ్రీనివాసరావు అన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## నదిలో గల్లంతైన ముగ్గురూ మృతి

- మృతదేహాలు లభ్యం
- కుటుంబ సభ్యులకు అప్పగింత

మంత్రాలయం, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి గల్లంతైన ముగ్గురు కన్నడ యువకులు మృతదేహాలై తేలారు. ఎస్సై శివాంజల్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు నదిలో గాలించి ఆదివారం ఉదయం 11:30 గంటలకు మృతదేహాలను వెలికి తీశారు. కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లా జావగల్లుకు చెందిన డిగ్రీ చదువుతున్న సచిన్ (20), ప్రమోద్ (20), సంగరాయపురానికి చెందిన డిగ్రీ విద్యార్థి అజిత్ (19) తమ స్నేహితులతో కలిసి శనివారం నదిలో స్నానాలు చేస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతైన విషయం తెలిసిందే. శనివారం రాత్రే నది వద్దకు చేరుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, ఆదివారం ఎస్సై ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు గ్రామ సర్పంచి తెల్లబండ్ల భీమయ్య సహకారంతో 10 మంది గజ ఈతగాళ్లు, 6 మంది బుడగజంగాల వారి సాయంతో తెప్పలతో నదిలో జల్లెడ పట్టారు. గల్లంతైన ప్రదేశంలో వెతకగా రెండు మృతదేహాలు పైకి తేలాయి. అక్కడి నుంచి 200 మీటర్ల దూరంలో మరో మృతదేహాన్ని కనుగొని తెప్పలపై ఒడ్డుకు చేర్చారు. అర్ధాంతరంగా ప్రాణాలొదిలిన తమ వారిని చూసి తల్లిదండ్రులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం శ్రీమఠం అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, పక్కన డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ మంజునాథ్, ఎస్సై శివాంజల్

### సబ్ కలెక్టర్, డీఎస్పీ పరామర్శ

ఎమ్మిగనూరు వైద్యశాలలో మృతుల కుటుంబ సభ్యులను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు పరామర్శించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాలను ప్రత్యేక వాహనంలో వారి స్వస్థలాలకు పంపించినట్లు సబ్ కలెక్టర్ మౌర్య, ఎస్సై శివాంజల్ తెలిపారు. ఆదివారం ఉదయం తహసీల్దార్ రమాదేవితో కలిసి సబ్ కలెక్టర్, డీఎస్పీ వేర్వేరు సమయాల్లో గల్లంతైన నది ప్రాంతాలను పరిశీలించారు. స్నేహితులను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తాం

డోన్, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని డోన్ ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రామాలయంలో ఆర్యవైశ్య సమాజం ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకుని జీవించేలా ప్రశాంత వాతావరణం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నామని, మాపై కొందరు అధికారులు వేధింపులు, బెదిరింపులకు గురిచేస్తున్నారని వాటిని అరికటేలా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మాకంపీదిలో సీసీ రహదారి, కాల్వలు అధ్వానంగా ఉన్నాయని, చర్యలు చేపట్టాలని కోరారు. పాతపేట ప్రాంతంలో అండర్‌పాస్ నిర్మాణం జరిగేలా చూడాలన్నారు. ఆర్యవైశ్యులకు స్థలం కేటాయిస్తే కల్యాణ మండపం నిర్మించుకునేందుకు వీలవుతుందని రాజవిజయకుమార్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కోట్రికె హరికిషన్, తెదేపా నాయకులు సీఎం శ్రీనివాసులు, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాశ్‌రెడ్డి

## హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, రామాంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ బేతంచెర్ల పట్టణ, మండల నాలుగో మహాసభల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పింఛన్ల పెంపు, తల్లికి వందనం పథకాలను ప్రవేశపెట్టి మిగతా పథకాలను గాలికి వదిలేశారన్నారు. రైతు సంక్షేమం కోసం పాటు పడతామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నట్టేట ముంచుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు వేల ఎకరాలను ధారాదత్తం చేస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సీపీఐ మండల కార్యదర్శి యన్నా భార్గవ్, సీపీఐ నాయకులు ఎర్రగుడి రాముడు, బాబా ఫక్రుద్దీన్, సోమన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు రామచంద్రయ్య

## పెరిగిన చెట్లు.. రక్షణ గోడ కూలేట్టు

ఉమ్మడి జిల్లాలో ప్రాధాన్యమున్న కేసీ కాలువపై బ్రిటిష్ కాలంలో అద్భుతంగా వంతెనలు నిర్మించారు. వాటిలో కొన్నింటిని పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుని, కూలే ప్రమాదంలో పడ్డాయి. వాగులమర్రి సమీపంలో వక్కిలేరుపై కేసీ కాలువ నీరు ప్రవహించేందుకు వంతెనను నిర్మించారు. వంతెన కింద వక్కిలేరు వాగు ప్రవహిస్తుంది. వంతెన పైన కేసీ కాలువ ప్రవహిస్తుంది. ప్రస్తుతం వంతెన రక్షణ గోడ దెబ్బతిన్నాయి, ఇరువైపులా గోడలపై చెట్లు పెరిగాయి. వాటి వేర్ల ప్రభావంతో వంతెన పగుళ్లిచ్చి కూలే ప్రమాదం పొంచి ఉంది. వంతెన నిర్వాహణపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - న్యూస్‌టుడే, వాగులమర్రి



## దేవరగుండు

చిన్న రాయిపై పెద్ద గుండు నిలబెట్టినట్లుగా ప్రత్యేకంగా ఉన్న ఈ ప్రకృతి రూపమే ఆ గ్రామస్తుల దైవం. దేవనకొండ సమీపంలోని 4 కి.మీ. దూరంలో కరిడికొండ గ్రామం ఉంది. ఆ ఊరి జనాభా 500 కుటుంబాలు. ఇంతో ఆశ్చర్యపరిచే విషయమేమిటంటే.. వారంతా ఆ కొండపైనే నివాసం ఉంటున్నారు. అక్కడే బొమ్మదేవర గుండు వద్ద ప్రతి అమావాస్య రోజున పూజలు చేస్తుంటారు. ఓ చిన్న పాటి రాయిపై ఓ పెద్ద గుండు నిల్చుండటాన్ని భక్తులు ఆసక్తిగా చూస్తుంటారు.

– దేవనకొండ, న్యూస్‌టుడే:

### తిమ్మప్పకొండలో ఏళ్ల నాటి సమాధులు

ఈనాడు, కర్నూలు: కోసిగిలో ఉన్న కొండ ప్రాంతంలో క్రీస్తు పూర్వం 1000 ఏళ్ల కిందటి సమాధులను పురావస్తుశాఖ అధికారులు ఆదివారం గుర్తించారు. కర్నూలుకు చెందిన ఆకుల రామచంద్ర చరిత్రలో పీహెచ్‌డీ చేస్తున్నారు. కోసిగి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నాగన్న, ఉపాధ్యాయుడు రాము, ఆర్కియాలజిస్టు పరిశోధకుడు వీరన్నలు మిత్రులు. కోసిగి కొండల్లో రాళ్లు ఒక క్రమ పద్ధతిలో పేర్చి ఉన్న వైనంపై వారి మధ్య చర్చ జరిగింది. ఈ అంశం అనంతపురం జిల్లా పురావస్తుశాఖ సహాయ సంచాలకులు స్వామినాయక్‌కు దృష్టికి తీసుకురాగా ఆయన ఆదివారం తిమ్మప్ప కొండల ప్రాంతాన్ని సందర్శించారు. ఇవి బృహత్ శిలాయుగం నాటివిగా గుర్తించారు. ఒక చదరపు కిలోమీటర్ విస్తీర్ణంలో గల ఈ సమాధులను డాల్మెన్, సిస్ట్ బరియల్స్‌గా తేల్చారు. అవి క్రీ.పూ. 1000 నుంచి క్రీ.పూ.600 ఏళ్ల నాటివిగా నిర్ధారించారు. ఆ ప్రాంతంలో 55 సమాధులున్నట్లు తేల్చారు. ఈ విషయం పురావస్తుశాఖ అధికారుల దృష్టికి వచ్చినందున చారిత్రక ఆనవాళ్లు చెరిగిపోకుండా తగిన నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనశాలలశాఖ అధికారి మహేంద్రనాయుడు తెలిపారు.

### శ్రీశైలం శివారులో చిరుత సంచారం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలోని శివారు ప్రాంతంలో ఆదివారం రాత్రి చిరుత సంచరించింది. సారంగధర మఠం బావి సమీపంలో స్థానికులకు చిరుత కనిపించింది. కుక్కలను వేటాడేందుకు చిరుతలు తరచూ శ్రీశైలం వలయ మార్గంలోని శివారు ప్రాంతంలోకి వస్తున్నాయి.

### మార్కెట్ యార్డు డైరెక్టర్ల ఎంపిక

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి మార్కెట్ యార్డు డైరెక్టర్లుగా 13 మందిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఎర్రబోలు పవన్‌కుమార్‌రెడ్డి, నడిపి భూషన్న, దేశావత్ నర్సిబాయి, దూదేకుల ప్రవీణ్, జి.మల్లికార్జునరెడ్డి, గంగిరెడ్డి సుజాత, కురం రాధిక, మారం పుల్లారెడ్డి, ముచ్చలపురి రామయ్య, దూదేకుల పెద్దదస్తగిరిమ్మ, తెలుగు ఎల్లేశ్వరి, నల్‌బంద్ మహబూబ్‌బాషా, తలారి లక్ష్మీదేవిని ఎంపిక చేశారు.

## తెలుగుగంగ కాలువలోకి దూసుకెళ్లిన ట్యాంకర్

గాజులపల్లె (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిపై గాజులపల్లె-ఆంజనేయపురం గ్రామాల మధ్య తెలుగుగంగ ప్రధాన కాలువలోకి శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆయిల్ ట్యాంకరు ప్రమాదవశాత్తు దూసుకెళ్లింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కాలువలో పడిపోయింది. అందులోని వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం ఉదయం ఆ దారిన వెళ్లేవారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మహానంది ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి, తెలుగుగంగ ఇన్‌ఛార్జి ఎస్ఈ రమేష్‌బాబు వేర్వేరుగా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నంద్యాల వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు లోడుతో వెళుతున్న లారీ కాలువలోకి దూసుకెళ్లి ట్యాంకరు వేరుపడింది. ద్రవం లీకు కాకపోవడంతో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు.

కాలువలో పడిపోయిన ఆయిల్ ట్యాంకరు

### 44 మోటారు సైకిళ్ల స్వాధీనం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన నాకాబందీలో భాగంగా 44 మోటారు సైకిళ్లు, 2 ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. కురుకుంద గ్రామంలో తనిఖీలు జరిపామని.. సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో 10 మోటారు సైకిళ్లు, 14 మందు సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రాము

- ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పాములపాడు పోలీసుస్టేషన్ పరిధిలో 9 ద్విచక్ర వాహనాలు, 31 మందు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నందికొట్కూరు సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నందికొట్కూరులోని జగనన్న కాలనీలో 10 బైక్‌లు 2 ఆటోలు పట్టుకున్నారు. నందికొట్కూరు సీఐ సుబ్రహ్మణ్యం, జూపాడుబంగ్లా ఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండ్లెం, జూపాడుబంగ్లాలో జరిపిన తనిఖీల్లో 15 మోటారు సైకిళ్లు, 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

### సీసీ కెమెరాలతో వ్యక్తి ఆచూకీ లభ్యం

- కుటుంబ సభ్యులకు అప్పగింత

ఆత్మకూరు, న్యూస్‌టుడే: అప్పులు ఎక్కువవడంతో గతేడాది ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోగా సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రాము ఆదివారం తెలిపారు. ఆత్మకూరు పట్టణం వడ్లపేటకు చెందిన బొల్లు రాము అప్పుల బాధతో గతేడాది మేలో ఇంటి నుంచి వెళ్లిపోయారని చెప్పారు. సీసీ కెమెరాల ఆధారంగా హైదరాబాద్ పంజాగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలోని సనత్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఆధారంగా పెట్రోలు బంకులో పనిచేస్తున్నట్లు గుర్తించి అతడిని పట్టుకుని ఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

### విద్యార్థిని ఆత్మహత్య

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని కడుపు నొప్పి తాళలేక ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రమాదంలో ఒకరి దుర్మరణం

గార్లదిన్నె, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు మహిళలు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఆదోనికి చెందిన మహమ్మద్ హుస్సేన్(42) ఆయనతోపాటు ఉమాదేవి, మరియమ్మ ముగ్గురు లగేజీ ఆటో వాహనంలో అనంతపురం నుంచి వెళ్తుండగా కేఎస్ ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొనడంతో మహమ్మద్ హుస్సేన్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇద్దరు మహిళలు గాయపడటంతో చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లగేజీ ఆటో రోడ్డు పక్కన నిలిపి ఉంచడంతో బెంగుళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న బస్సు ఢీకొంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

సోషల్ మీడియాలో అనుభవం ఉన్న వారికి ఒక అద్భుతమైన వ్యాపార అవకాశం. తక్కువ పెట్టుబడితో మంచి సంపాదనకి గొప్ప అవకాశం. మీరు పెట్టే పెట్టుబడిలో వెంటనే మీకు ఒక Samsung Tab మరియు మొబైల్ అప్లికేషన్స్ లోడ్ చేసి ఇవ్వడం జరుగుతుంది. Area wise గా ఒక్కొక్కరికి మాత్రమే అవకాశం ఇవ్వడం జరుగుతుంది. మరిన్ని వివరాలకు సంప్రదించండి M/s R. R. Creative Media Events Pvt Ltd. Contact: 83742 35356, 90006 97232.

WANTED Marketing Executives for Reputed Company, No Targets, Permanent Salary: 10,000/- to 15,000/- & Good Incentives. ✆ 93912 50272.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

JOBS

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

# నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

## నిబంధనలు పాటించకుంటే చర్యలు

గాజులపల్లె (మహానంది), న్యూస్‌టుడే : వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎన్. రామమోహన్‌రెడ్డి హెచ్చరించారు. మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు అతిక్రమించడం, తగిన గుర్తింపు పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

వాహనదారుడికి జరిమానా విధిస్తున్న పోలీసు అధికారులు

## 15న వైద్య పరీక్షలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో ఈనెల 15న పాణ్యంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వృద్ధులు, దివ్యాంగులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెదేపా నాయకులు తెలిపారు. వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి పరికరాలు అందజేస్తారని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

పగిడ్యాల:?: మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. **- మద్దిలేటి**

✔: బదిలీల కారణంగా గ్రామ కార్యదర్శిని నియమించలేదు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం. **- సుమిత్రమ్మ, ఎంపీడీవో**

జూపాడుబంగ్లా (నందికొట్కూరు) : ?: జూపాడు బంగ్లా మండలం తంగడంచ గ్రామం.. బీసీ కాలనీ రాజా వీధిలో కాలువల్లో మురుగు ప్రవహించడం లేదు. వ్యర్థాలు పేరుకుపోయాయి. **- రాజు, స్థానికుడు**

✔: కాలనీలో సీసీ రహదారి, కాలువలను సగం వరకు నిర్మించారు. మురుగు నీరు ముందుకు రాకుండా స్థానికులు అడ్డుకోవడంతో సీసీ రహదారిపై నిలుస్తోంది. పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. వెంటనే కాలువలు శుభ్రం చేయిస్తాం. **- లక్ష్మణస్వామి, పంచాయతీ అధికారి, తంగడంచ**

నందికొట్కూరు : ?: నందికొట్కూరు పట్టణంలోని సుబ్బరావుపేట సెయింట్ మెరీస్ పాఠశాల సమీపాన కాలువ పక్క గోడలు కూలిపోయాయి. ఏళ్లు గడిచినా సమస్య పరిష్కరించడం లేదు. మురుగు నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నాం. వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **- ఖాజా**

✔: పరిశీలించి పక్క గోడల నిర్మాణం చేపడతాం. నిధులు మంజూరు చేసి పనులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- బేబి, కమిషనర్**

వెలుగోడు : ?: వెలుగోడు పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఎదుట ప్రధాన రహదారిపై నీరు నిలిచి ఉంటోంది. ఫలితంగా పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. **- నాగేశ్వరరావు**

✔: రహదారిపై నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకుంటాం. వీలైనంత త్వరలో ఇబ్బందులు తొలగిస్తాం. **- నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి**

## మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కొత్తపల్లి, న్యూస్‌టుడే : మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం నందికుంట గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. సీసీ రహదారులు, మురుగు కాలువలు లేవని.. వీధి దీపాల సమస్యలను గ్రామ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ నారపురెడ్డి, నాయకులు లింగస్వామిగౌడ్, మల్లారెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు, న్యూస్‌టుడే: తెదేపాతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తెదేపా నాయకురాలు, వేంపెంట మాజీ సర్పంచి రామసుబ్బమ్మ అన్నారు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని వేంపెంట గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

## బస్సు ప్రాంగణం.. వసతులు అధ్వానం

☛ ప్రయాణికులకు తప్పని పాట్లు

ఆత్మకూరులో మూత్రశాలకు నీటి వసతి కరవు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు బస్టాండుకు ప్రతిరోజూ 340 బస్సులు వస్తుంటాయి. నిత్యం 10 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. బస్టాండులో వివిధ సమస్యలు నెలకొన్నాయి. శుద్ధజల ప్లాంటు లేకపోవడంతో సింటెక్స్ ట్యాంకు నీళ్లే దిక్కైంది. దీనిని ఎప్పుడు శుభ్రం చేస్తారో తెలియని పరిస్థితి. మరుగుదొడ్లు పది వరకు ఉండగా.. ఒకటి అందుబాటులో లేదు. ఉన్న వాటిల్లో శుభ్రత లోపించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

### కానరాని సీసీ కెమెరాలు

బస్టాండులో సీసీ కెమెరాలు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. కొంతమంది దుకాణదారులు ఏర్పాటుచేసుకున్నప్పటికీ అవి పనిచేస్తున్నాయో.. లేదో తెలియని పరిస్థితి నెలకొంది. పోలీసు ఔట్‌పోస్టు లేకపోవడంతో మహిళలకు భద్రత కరవైంది. సాయంత్రం వేళల్లో మాత్రం కొద్దిసేపు బందోబస్తు నిర్వహిస్తున్నారు. తరచూ చోరీలు జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలను పట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయకనే వెళ్లిపోతున్నారు.

● బస్టాండును నూతనంగా నిర్మించడంతో కుర్చీలు తదితరాలు అందుబాటులో ఉన్నాయి. బస్టాండు నిర్వహణ మరింత మెరుగుపరచాల్సి ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు విన్నవిస్తున్నారు.

పెచ్చులూడి.. ప్రమాదకరంగా

నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండుకు ప్రతిరోజూ 20 వేల మంది ప్రయాణికులు వస్తుంటారు. బస్టాండును చాలా ఏళ్ల కిందట నిర్మించారు. నిర్వహణ కరవవడంతో పైకప్పు పెచ్చులూడి పడుతోంది. బస్టాండు ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. నిర్వహణ అధ్వానంగా ఉండటంతో భరింపరాని దుర్గంధం వస్తోంది. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినా కొన్ని పనిచేయడం లేదు. ఫలితంగా దొంగల బెడదను అరికట్టలేకపోతున్నారు. బస్టాండు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు అవసరమైన పూర్తి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

## చూసి నడుపు.. చూడకుంటే ఆస్పత్రికే

పట్టణంలోని పురపాలక కార్యాలయం ఎదురుగా పద్మావతి నగర్‌లో మార్గబిలం ఉంది. దీనిపై రహదారికన్నా ఎత్తులో మూతలు వేశారు. ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. ఈ మార్గం నిత్యం వాహనదారులతో రద్దీగా ఉంటుంది. వాహనదారులు ఏమాత్రం చూడకుండా వాహనాలు నడిపితే ఆస్పత్రికి వెళ్లాల్సిందే. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

## శిథిల భవనం.. సిబ్బందికి భయం

బ్రాహ్మణకొట్కూరులోని పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. గోడలు, పైకప్పు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షానికే భవనం కారుతోంది. ఫలితంగా సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. – న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

## గుంత తవ్వారు.. పనులు మరిచారు

పట్టణంలోని ఇస్లాంపేటలో సిద్ధపల్లెకు వెళ్లే రహదారి పక్కన ఉన్న ఓ హోటల్ వెనుకవైపు పైపులైను మరమ్మతుల కోసం గుంత తవ్వారు. వారం రోజులవుతున్నా మరమ్మతులు చేయడం లేదు. రహదారిని ఆనుకుని గుంత తవ్వడంతో పిల్లలు, వృద్ధులు అందులో పడిపోయే ప్రమాదముంది. ముఖ్యంగా రాత్రివేళల్లో సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

## లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

నూతనంగా ఎన్నికైన సభ్యులు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలని క్లబ్ మాజీ ఛైర్మన్ ఏవీఆర్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బాలాజీ కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. లయన్స్ క్లబ్ సీనియర్ నాయకుడు డా.రవికృష్ణ నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. నూతన అధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా జనార్దన్ ప్రమాణ స్వీకారం చేశారు. డా. పెసల శ్రీకాంత్, డా. సునీత, డా. మహమ్మద్ రఫీ, డా.శైలజ, డా.జహంగీర్, డా. క్రాంతి చైతన్యలకు లయన్స్‌క్లబ్ సేవా పురస్కారాలు అందజేశారు. గురురాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : పట్టణంలోని నాగులకుంట రోడ్డులో ఉన్న నాగలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నాగలింగేశ్వర స్వామికి, సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : పట్టణంలోని పలు వార్డుల్లో శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ శర్మ ఆధ్వర్యంలో సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆత్మకూరు బస్టాండు ప్రాంతంలో ఉన్న జగజ్జననీ ఆలయంలో సాయంత్రం రాహుకాల పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు.

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పట్టణంలోని గాంధీచౌక్‌లో ఉన్న కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో ఆషాఢమాస ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు.

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పట్టణంలోని బైటిపేటలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సింధూర అభిషేకాలు, విశేష పూజలు చేశారు.

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పురపాలక కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం పురపాలక కార్యాలయం నుంచి సంజీవనగర్ గేట్ వరకు నిరసన ర్యాలీ జరిపారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పరీక్షల భయం, ఒత్తిడి వంటి సమస్యలను అధిగమించేందుకుగాను విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు జీసీడీవో నాగసువర్చల ఆదివారం తెలిపారు. జిల్లాలో దాదాపు 10 మంది మానసిక ఆరోగ్య కౌన్సిలర్లను నియమించామని చెప్పారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్తు నిర్మాణానికి వారు పునాదులు వేస్తారని చెప్పారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సైన్యంలో రెజిమెంట్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ ఇన్‌ఛార్జ్ శేషఫణి యాదవ్, రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు పట్టణంలో యాదవుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు.

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్టీ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

## విద్య, వైద్యానికి పెద్దపీట

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని 11 వార్డు చాంద్‌బాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మొయిన్ సాహెబ్, హనీఫ్, ఈపూరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఫిరోజ్

## డిప్యుటేషన్లు వెంటనే రద్దు చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.శివశంకర్, రాష్ట్ర కార్యదర్శి జేఎండీ ఇక్బాల్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అజాం బేగ్ డిమాండ్ చేశారు. ఒకపక్క ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంటే సమగ్ర శిక్షా, డీఈవో కార్యాలయాలకు పలువురిని డిప్యుటేషన్ల పేరుతో నియమించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. కాకినాడలో నిర్వహిస్తున్న ఎస్టీయూ రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

నందికొట్కూరు, న్యూస్‌టుడే : ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేయనున్నట్లు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేత వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని వాల్మీకినగర్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ 6 పథకాల్లో భాగంగా ఇంటి స్థలాలు, సామాజిక పింఛను హామీలు అమలు కావడంలేదన్నారు. దీనిపై ధర్నా చేపట్టామన్నారు.

## ప్రజలకు అండగా నిలవాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా పోరాడాలని.. ప్రజలకు అండగా ఉండాలని సీపీఐ జిల్లా నేత రమేష్‌బాబు అన్నారు. జూపాడుబంగ్లాలోని ఓ ఫంక్షన్ హాలులో మండల ప్రతినిధుల సమావేశం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు వద్ద రాయలసీమ ప్రాజెక్టు నిర్మాణం కారణంగా చాబోలు గ్రామంలో దెబ్బతిన్న ఇళ్లకు రూ.30 లక్షల వరకు పరిహారం ఇప్పించినట్లు చెప్పారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో కొండచిలువ

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : సున్నిపెంటలోని పాలిటెక్నిక్ కళాశాలలో కొండ చిలువను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. నీటి ట్యాంకులో కొండచిలువను గుర్తించిన విద్యార్థులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడి చేరుకుని దానిని పట్టుకున్నారు. 10 అడుగుల పొడవు, 30 కిలోల బరువు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం దీనిని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

కొండచిలువను పట్టుకున్న సిబ్బంది

## నిత్యం అప్రమత్తత అవసరం

మిడుతూరు, న్యూస్‌టుడే : తమను తాము సంరక్షించుకునే విషయంలో బాలికలు, మహిళలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఓబులేసు, షీ బృందం అధికారిణి నీతమ్మ సూచించారు. మిడుతూరులోని బాలికల వసతి గృహంలో శక్తి యాప్, మహిళల సంరక్షణపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఉపయోగించాల్సిన చరవాణి నంబర్లను తెలియజేశారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఓబులేసు తదితరులు

## పీఏసీఎస్ అధ్యక్షుల నియామకం

యాళ్లూరు (గోస్పాడు), న్యూస్‌టుడే: మండలంలోని యాళ్లూరు, గోస్పాడు, దీబగుంట్ల పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను ప్రభుత్వం నియమించినట్లు యాళ్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా నియమితులైన గంగుల వెంకటరెడ్డి ఆదివారం తెలిపారు. గోస్పాడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా వీరసింహారెడ్డి, దీబగుంట్ల పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఓబులరెడ్డిని ప్రభుత్వం నియమించినట్లు చెప్పారు.

## పల్లె కబుర్లు

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో నిర్మిస్తున్న సుంకులా పరమేశ్వరి ఆలయ పనులను ప్రారంభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. గోవిందు, మద్దిలేటిగౌడు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల, న్యూస్‌టుడే: పాలమర్రి, బీరవోలు గ్రామాల్లోని మినీ తాగునీటి ట్యాంకులను సిబ్బంది శుభ్రం చేశారు.

పగిడ్యాల, న్యూస్‌టుడే: తూర్పు పాతకోట గ్రామంలో తెదేపా మండల కన్వీనర్ మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థులకు వివరించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోరుకల్లు గ్రామంలో ఓబులేసు అనే వ్యక్తికి చెందిన గడ్డివామి ఆదివారం దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.కొత్తూరు గ్రామంలో ఆదివారం జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, శిరువెళ్ల మండలం వడిగందిన్నెకు చెందిన మహేశ్ మధ్య ఘర్షణ జరిగింది. బాధితులు పాణ్యం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

పాములపాడు, న్యూస్‌టుడే : అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఉంచామని ఆత్మకూరు గ్రామీణ సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పలు గ్రామాల్లో ఆదివారం తనిఖీలు జరిపారు. నేరచరితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు.

వెలుగోడు, న్యూస్‌టుడే : ఆత్మకూరు-నంద్యాల రహదారిపై ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని పలు వాహనదారులకు జరిమానా విధించారు.

వెలుగోడు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఇంద్రానగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సోమవారం పాల్గొననున్నట్లు తెదేపా నాయకులు అన్నారపు శేషిరెడ్డి తెలిపారు.

వెలుగోడు, న్యూస్‌టుడే : పట్టణంలోని షాదీఖానా సమీపంలో నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. నియంత్రిక చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

వెలుగోడు, న్యూస్‌టుడే: పట్టణంలోని బస్టాండ్ నుంచి రాజానగర్, అరుగులు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిపై పందుల బెడద అధికంగా ఉందని పట్టణ ప్రజలు పేర్కొన్నారు. నిత్యం రహదారులపై సంచరిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని గోరుకల్లు జలాశయం నుంచి ఎస్సార్బీసీ కాలువకు సోమవారం నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి నీటిని కాలువకు విడుదల చేస్తారన్నారు.

## రైతులను ఆదుకోండి

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే : కేసీ కాలువ వెంబడి వేసిన పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే అధికారులు స్పందించి కాల్వకు నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు కోరారు. ఆయన ఆదివారం వెలుగోడు జలాశయాన్ని సందర్శించారు. కేసీ కాలువ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నీరు విడుదల చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి కోసం 44 గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాల్లోనూ మంచినీటి కొరత ఉందని చెప్పారు. వెంటనే స్పందించాలని ఆయన కోరారు.

చరవాణిలో అధికారులతో మాటాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు మధు

## రచయితలకు సత్కారం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: కర్నూలులో ఆదివారం జరిగిన తెలుగు భాష రాష్ట్రస్థాయి సదస్సులో నంద్యాల పట్టణానికి చెందిన పలువురు సన్మానాలు అందుకున్నారు. నంద్యాలకు చెందిన తెలుగు పండితులు, రచయితలు అన్నెం శ్రీనివాస రెడ్డి, డా.నీలం వెంకటేశ్వర్లు, మహ్మద్ రఫీలు సత్కారం అందుకున్నారు. సాహితీవేత్తలు.. విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు, పత్తి ఓబులయ్య, చంద్రశేఖర కల్కూర, దండెబోయిన పార్వతి తదితరులు రచయితలను సన్మానించారు. ఈ సందర్భంగా వారిని నంద్యాల సాహితీ సంస్థల నిర్వాహకులు డా. హయగ్రీవాచారి, డా. గెల్వి సహదేవుడు, డా. రవీంద్రనాథ్, డా. రమణమూర్తి, శ్రీనివాసమూర్తి తదితరులు అభినందించారు.

జ్ఞాపికలు అందుకున్న రచయితలు

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెదేపా మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం బండిఆత్మకూరు, నారాయణపురం, చిన్నదేవళాపురం, పెద్దదేవళాపురం గ్రామాల్లో నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి పథకాల గురించి వివరించారు. సాగునీటి సంఘం ఛైర్మన్ పాలశంకర్, నాయకులు బైరెడ్డి మధు, జాకీర్ ఖాన్, శంకర్, నారాయణ పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

## నీరుంది.. కన్నీరే మిగిలింది

☛ ఎత్తిపోతల పథకమున్నా ప్రయోజనం శూన్యమే

పెద్దగుమ్మడాపురంలో మొక్కజొన్న పంటను ట్రాక్టరుతో దున్నేస్తున్న రైతు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కొత్తపల్లి మండల పరిధి.. ముసలిమడుగులోని సంగమేశ్వరం ఎత్తిపోతల పథకానికి కృష్ణా జలాలు చేరాయి. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855 అడుగులకు చేరితే ఎత్తిపోతల పథకం ద్వారా శివపురం, సింగరాజుపల్లి, పెద్దగుమ్మడాపురం, చిన్నగుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, కపిలేశ్వరం తదితర గ్రామాల పరిధిలో 3,500 ఎకరాలకు శ్రీశైల జలాశయం వెనుక జలాలను అందించాల్సి ఉంది. నుంచి పంటలకు నీరు విడుదల చేయొచ్చు. ప్రస్తుతం 882 అడుగులకు చేరినా నీరు వదలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఎత్తి

### చినుకుజాడ కరవై..

జూన్ మొదటి వారంలో వర్షాలు కురిశాయి. అదను అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ నీరు అందుతుందన్న ఆశతో ఎత్తిపోతల ఆయకట్టు రైతులు మొక్కజొన్న, కంది, మినుము, పత్తి సాగు చేపట్టారు. నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చాయన్న ఉద్దేశంతో చాలా మంది మొక్కజొన్నపై మొగ్గు చూపారు. నాటిన 15 రోజుల తర్వాత ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆ తర్వాత మళ్లీ గత రెండు వారాలుగా చినుకు జాడే కరవైంది. ఇప్పటికే చాలామంది పంటలు వేశారు. వర్షం పడకపోవడంతో చాలా ప్రాంతాల్లో మొక్కల ఎదుగుదల లేక ఎండుముఖం పడుతున్నాయి. చివరికి కొందరు పంటను దున్నేస్తుండటం గమనార్హం. మరో వారం రోజుల్లో వర్షం పడకపోతే తీవ్రంగా నష్టపోతామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేస్తే పంటలను కాపాడుకుంటామని వారు పేర్కొంటున్నారు.

### మొదటి పంటను దున్నేశా

**- చిన్నలింగస్వామి, పెద్దగుమ్మడాపురం**

నేను సుమారు రూ.50 వేలు ఖర్చు చేసి మూడెకరాల్లో మొక్కజొన్న విత్తనం వేశా. అరకొర అదను కింద నాటడంతో మొక్కలు పలచగా వచ్చాయి. చినుకు జాడ లేకపోవడంతో ఎదుగుదల లేక మొక్కలు ఎండిపోతుండటంతో పంటను దున్నేశా. 15 రోజుల కిందట కురిసిన వర్షానికి తిరిగి విత్తనాలు వేశా. వర్షాలు పడకపోవడంతో ఆందోళనగా ఉంది. ఎత్తిపోతల పథకం నుంచి నీరు విడుదల చేస్తే పంటలను కాపాడుకుంటాం.

(c) eenadu

## ప్యాపిలిలో మొహర్రం ప్రారంభం

భాజ బండేనవాజ్ చావిడిలో కొలువైన పీర్లు

ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణంలో అనివార్య కారణాల వల్ల నిలిచిపోయిన మొహర్రం ఆదివారం ప్రారంభమైంది. ఆయా పీర్ల చావిళ్ల వద్ద ముజావర్లు పీర్లు పెట్టెను పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. పీర్లను భక్తుల దర్శనం కోసం చావిడిలో కొలువు దీర్చారు. చావిడిలో కొలువైన పీర్లను ప్రజలు భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు. ఈ నెల 18న విస్సరగిత్తు, 20న పెద్దసరిగెత్తు, 21న ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

# ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

## బకాయిలు వెంటనే మంజూరు చేయాలి

పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పింఛనర్ల సంఘం సభ్యులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పింఛనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని పింఛనర్ల సంఘం సహాయ అధ్యక్షుడు కె.సుబ్బరాయుడు, యూటీఎఫ్ పూర్వ గౌరవాధ్యక్షుడు ఎస్.నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంఘం సమావేశ భవనంలో ఇటీవల పదవీ విరమణ పొందిన హెచ్ఎం, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పింఛనర్ల సంఘం కోశాధికారి జి. గోపాల్, ఆర్గనైజర్లు సుబ్రహ్మణ్యం, రామదాసురెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

చాగలమర్రి, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు, కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం 4 విడతల డీఏ, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. శివశంకర్ డిమాండ్ చేశారు. కాకినాడలో జరిగిన ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, వెంటనే పరిష్కరించాలన్నారు. లేకపోతే దశల వారీగా ఉద్యమిస్తామన్నారు.

## ఆర్టీసీ బస్టాండు.. అవస్థలు మెండు

ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండు ప్రాంగణాల్లో వసతులు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రూ. లక్షల్లో ఆదాయం ఉన్నా ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించలేకున్నారు. తాగునీరు లేకపోవడంతో బయటి నుంచి దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్వహణ సరిగా ఉండటం లేదు. శౌచాలయాల్లో నీటి సరఫరాలేక, దుర్వాసన భరించలేకున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### శుద్ధ జలం కరవు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి ఆర్టీసీ బస్టాండులో శుద్ధజల కేంద్రం లేకపోవడంతో ప్రయాణికులు కుళాయి నీరే తాగాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్టాండుకు సుమారు 90 బస్సుల వరకు వస్తుంటాయి. నిత్యం సుమారు 5 వేల మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో ఉన్న శుద్ధజల కేంద్రాన్ని మూసేయడంతో ప్రస్తుతం ప్రయాణికులు శుద్ధి లేని నీటినే తాగాల్సి వస్తోంది. నీటి ట్యాంకు ఎప్పుడు శుభ్రం చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేదు. బస్టాండు పైభాగంలో ఇటీవల పెచ్చులు ఊడి మరమ్మతులు చేశారు. సీసీ కెమెరా ఒకటి ఉంది. పోలీస్ అవుట్ పోస్టు లేక పోవడంతో మహిళలకు రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఆరుబయట వర్షం వస్తే నీరు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోంది.

### నిరుపయోగంగా మరుగుదొడ్లు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ బస్టాండుకు 150 దాకా బస్సు సర్వీసులు ఉన్నాయి. రోజుకు 12వేల మంది దాకా ప్రయాణిస్తుంటారు. కుళాయి నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. ట్యాంకును శుభ్రం చేయడం లేదు. బస్టాండులో ట్రాఫిక్ కంట్రోలర్ గది పక్కన ఏర్పాటు చేసిన కుళాయిలు కనీసం పని చేయడం లేదు. వేసవిలో ప్రయాణికులు స్టాల్లలో నీటి ప్యాకెట్లు, బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారు. బస్టాండులో నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు చేయలేదు. రెండు మరుగుదొడ్లు నిర్మించినా నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి. ఆర్టీసీ బస్టాండులో గానీ, ప్రాంగణంలో గానీ, బస్టాండు బయట ఎక్కడా సీసీ కెమెరాలు ఏర్పాటు లేదు. బస్టాండు వెనుక, మరుగుదొడ్ల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. మద్యం సీసాలు కన్పిస్తుండటం మందుబాబులకు అడ్డాగా మారినట్లు తెలుస్తోంది. బస్సుల సమాచారం బస్టాండులో ప్రదర్శించలేదు.

## దొరపల్లిలో పారిశుద్ధ్య పనులు

స్పందనకు వందనం

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మండలంలోని డోన్ నుంచి దొరపల్లి గ్రామానికి వెళ్లే దారి అపరిశుభ్రంగా ఉందని జులై 13న 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పంచాయతీ సిబ్బంది ఆదివారం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని వైపీపీఎం పాఠశాల వద్ద రహదారిపై వేగ నియంత్రికలు సక్రమంగా లేవు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. - మల్లికార్జున, నెహ్రూనగర్.
✔: ఆర్అండ్‌బీ శాఖ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - పి.కిశోర్, కమిషనర్.
కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: ?: కలిమిగుండ్లలోని ఎరుకలిపేటలో వీధి దీపాలు వెలగటంలేదు. రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. - గంగయ్య, కాలనీవాసి.
✔: వీటిని పరిశీలించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. - వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి.
డోన్, న్యూస్‌టుడే: ?: యు.కొత్తపల్లెలో ప్రధాన రహదారి వెంట మురుగు కాలువ లేదు. కాల్వ ఏర్పాటు చేయాలి. - వెంకటేష్, యు.కొత్తపల్లె.
✔: సిబ్బందితో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ఫక్రుద్దీన్, ఈవోఆర్డీ, డోన్.
?: ఉడుములపాడు గ్రామంలో కర్నూలుకు వెళ్లే మార్గంలో మురుగు ప్రవహిస్తోంది. - రమణ, ఉడుములపాడు.
✔: త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తాం. -ఫక్రుద్దీన్, ఈవోఆర్డీ.
రుద్రవరం, న్యూస్‌టుడే: ?: శ్రీరంగాపురం గ్రామంలోని బీసీ కాలనీలో ఇళ్లలోని మురుగు నీరంతా రహదారిపై ప్రవహిస్తోంది. - రాము, శ్రీరంగాపురం.
✔: మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -పాములేటి, పంచాయతీ కార్యదర్శి.
?: ఆర్.నాగులవరం గ్రామంలోని ప్రధాన రహదారిపై వ్యర్థాలు వేస్తున్నారు. - శ్రీనివాసులు, ఆర్.నాగులవరం.
✔: వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -హరిబాబు, పంచాయతీ కార్యదర్శి.

## నీరు పారేనా.. పంట తడిచేనా?

ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో ఆర్.లింగందిన్నె నుంచి పెద్ద బోదనం వరకు 3 కి.మీ. పొడవున్న కేసీ ప్రధాన కాల్వ కలుపు మొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయింది. వీటి పరిధిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో సాగు నీరు అందాల్సి ఉంది. కాల్వ నుంచి సాగు నీరు సజావుగా వెళ్లటానికి ముళ్లపొదలు అడ్డుగా నిలిచాయి. ఇప్పటికైనా ప్రధాన కాల్వకిరువైపులా ఉన్న ముళ్లపొదలు తొలగించటానికి చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు అధికారులను కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ

## రహదారి ఇలా.. రాకపోకలు ఎలా..

ప్యాపిలి మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలోని రామాలయానికి వెళ్లే దారిలో సీసీ రహదారి లేకపోవడంతో చినుకుపడితే రోడ్డు చిత్తడిగా మారుతోంది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారిలో నడవాలన్నా, ప్రయాణించాలన్నా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రామకృష్ణాపురం (ప్యాపిలి)

## నిర్లక్ష్య ప్రయాణం.. ప్రమాదం

బనగానపల్లి మండల పరిధిలోని పలుకూరు, రామకృష్ణాపురం గ్రామాలు నాపరాయికి ప్రసిద్ధి. నాపరాయిని తరలించే ట్రాక్టర్లపై కూలీలు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇటీవల పలువురు కూలీలు నాపరాయి ట్రాక్టర్లపై కూర్చొని ప్రమాదంలో మృతిచెందారు. కొందరు గాయాలపాలవుతున్నారు. అయిన ఇలా ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. సంబంధిత అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – న్యూస్‌టుడే, పలుకూరు(బనగానపల్లి గ్రామీణం)

## యథేచ్ఛగా పశువుల సంచారం

డోన్ పట్టణంలో రహదారులతో పాటు పాఠశాలల మైదానాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. రహదారులపై తిరుగుతూ వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. వాహనదారులు ప్రయాణ సమయాల్లో పశువులను చూడకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వీటి సంచారాన్ని నియంత్రించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆదివారం కొన్ని గేదెలు పోలీస్ స్టేషన్ ముందు ఉన్న గడ్డిని తింటూ, తిరుగుతూ కన్పించాయి.
– న్యూస్‌టుడే, డోన్ నేరవిభాగం

## రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

డోన్ పట్టణం, డోన్ నేర విభాగం, న్యూస్‌టుడే: రైళ్లు, రైల్వేస్టేషన్‌లలో మాదకద్రవ్యాలను తీసుకున్నా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని పట్టణ, గ్రామీణ సీఐలు ఇంతియాజ్‌బాషా, సీఎం రాకేష్, రైల్వే ఎస్సై బిందుమాధవి తెలిపారు. ఆదివారం రైల్వేస్టేషన్‌లో పట్టణ పోలీసులతో పాటు రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని చిగురుమానుపేటలోని వీధుల్లో సోదాలు చేశారు. గంజాయితో పట్టుబడితే చట్ట ప్రకారం కేసు నమోదవుతుందని హెచ్చరించారు. గంజాయి సరఫరా, విక్రయాలు చేయడం నిషేధమన్నారు.

స్టేషన్‌లో తనిఖీకి వెళ్తున్న పట్టణ, రైల్వే పోలీసులు

## నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో పాత నేరస్థులకు ఆదివారం మంత్రణం నిర్వహించారు. నేరప్రవృత్తిని మానుకోవాలని, ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. రౌడీషీటర్లపై నిఘా పెట్టామని, వివాదాల్లో ఉన్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్‌బాబు, హెడ్‌కానిస్టేబుల్ తిరుపాల్‌నాయక్, సూర్యనారాయణ, చంద్రశేఖరప్ప పాల్గొన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగేలా ఎవరైనా రౌడీషీటర్లు అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సురేష్ హెచ్చరించారు. చాగలమర్రి పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో ఆదివారం మండలంలోని దాదాపు 38 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామాలో ఏదైనా గొడవలకు కారణమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి

ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఉడుములపాడు(డోన్), న్యూస్‌టుడే: పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాల ప్రభావం నుంచి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, మండల కార్యదర్శి నారాయణ కోరారు. ఉడుములపాడు సీపీఐ గ్రామ శాఖ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఘనత పార్టీదే అన్నారు. జిల్లాస్థాయి సీపీఐ మహాసభలు డోన్‌లో ఈనెల 30, 31వ తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరాజు, సురేష్, తిరుమలేశ్, మహేష్, హనుమంతు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

రుద్రవరం, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థి సాయితేజయాదవ్ ట్రిపుల్‌ఐటీ ఒంగోలులో సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 570 మార్కులు సాధించాడన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉపాధి సామాజిక తనిఖీపై గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. మండలంలోని కేపీ తండా, నేలంపాడు, కలుగొట్ల గ్రామాల్లో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎంపిక చేసిన డీఆర్పీల ఆధ్వర్యంలో గ్రామ సభను ఏర్పాటు చేసి చర్చించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే దివ్యాంగ విద్యార్థులు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని స్ఫూర్తి దివ్యాంగుల సేవా సంస్థ అధ్యక్షులు పీట్ల మద్దిలేటి ఆదివారం తెలిపారు. అక్టోబర్ 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: భగవద్గీత ప్రపంచానికి ఆదర్శమని త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి సభ్యులు రామచంద్రుడు పేర్కొన్నారు. నందవరం గ్రామంలో భగవద్గీత దాని అనుబంధ గ్రంథాల ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని వైఎస్ నగర్ కాలనీకి చెందిన సుమలత ఫిర్యాదు మేరకు ఓ యూట్యూబ్ ఛానల్ పాత్రికేయునిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు.

డోన్, న్యూస్‌టుడే: డోన్‌లోని సీఎస్ఐ సెయింట్ ఫ్రాన్సిస్ చర్చిలో ఆదివారం కమిటీ ఎన్నికలు నిర్వహించారు. సభ్యులుగా షడ్రక్, శ్యాంసుందర్, లారెన్స్, విజయ్‌కుమార్, శిఖామణి, పృథ్వీరాజ్, సారమ్మలను ఎన్నుకున్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కనకాద్రిపల్లె గ్రామంలో ముస్లిం శ్మశానవాటికకు రహదారి సౌకర్యం కల్పిస్తామని తెదేపా నియోజకవర్గం కోకన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి చెప్పారు. శ్మశానవాటికను పరిశీలించి రెండు రోజుల్లో మట్టితో చదును చేయిస్తామన్నారు. తెదేపా నాయకులు వెంకటమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు సరఫరాలో అంతరాయం

డోన్, న్యూస్‌టుడే: మండలంలోని మల్యాల సబ్‌స్టేషన్ పరిధిలో యాపదిన్నె ఫీడర్ కింద ఆర్‌డీఎస్ కింద 11 కేవీలైన్ పనులు చేపడుతున్నందున సోమ, మంగళవారాల్లో విద్యుత్తు కోత ఉంటుందని డీఈఈ నాగేంద్ర తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని యాపదిన్నె, ఎద్దుపెంట, తాడూరు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేజ్ విద్యుత్తును తెల్లవారుజామున 3 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఇస్తామన్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: మండలంలోని రామకృష్ణాపురం పరిధిలోని కొత్త 11 కేవీ ఫీడర్ నిర్మాణం కారణంగా సోమవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గార్లదిన్నె, మాధవరం, రామకృష్ణాపురం గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులకు ఇచ్చే విద్యుత్తు ఉదయం 4 గంటల నుంచి 10 వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు ఉంటుందన్నారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆషాఢమాసం సందర్భంగా వాసవీమాతకు ఆర్యవైశ్య మహిళలు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వాసవీమాతకు మహిళలు వేరుసెనగ విత్తనాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజా కార్యక్రమాలు అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేరుసెనగ విత్తనాలతో అమ్మవారి అలంకరణ

ఆర్.కృష్ణాపురం(ఆళ్లగడ్డ గ్రామీణం),న్యూస్‌టుడే: మండలంలోని ఆర్.కృష్ణాపురం గ్రామంలోని రామతీర్థం పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టాలమ్మ, పరశురామేశ్వర, లక్ష్మీనృసింహస్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తలనీలాలు, చీరసారెలు, బియ్యం బేడలు వంటి చిరుకానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆధ్యాత్మికం

డబ్ల్యూగోవిందిన్నె (దొర్నిపాడు), న్యూస్‌టుడే: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో మూల పెద్దమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వాహనాల్లో భక్తులు తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణంలోని గోకుల కృష్ణ ఆలయంలో సోమవారం నుంచి 'శ్రీ కుసుమ హరనాథ నామ సప్తాహం' ప్రారంభమవుతుందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని కుసుమేశుని ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

నందవరం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రొద్దుటూరుకు చెందిన మల్లికార్జున, నాగేశ్వరి దంపతులు రూ.25వేలు విరాళాన్ని ఆలయ అర్చకులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు దాతలను సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

## ధర్మ పరిరక్షణ.. అందరి బాధ్యత

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ ఏకంగా కావాలని వీహెచ్‌పీ ఆళ్లగడ్డ ప్రఖండ అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి కార్యాలయంలో 70 గ్రామాల వీహెచ్‌పీ కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన ఆలయాల పునరుద్ధరణ ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి, కార్యదర్శి కిశోర్‌కుమార్, మూసాని విశ్వనాథరెడ్డి, మురళి, బజరంగ్‌దళ్ ప్రఖండ కన్వీనర్ ఈశ్వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వీహెచ్‌పీ కమిటీ సభ్యులు

## పేదల సంక్షేమానికి పెద్దపీట

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాతపేటలో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కూటమి నాయకులు ఇంటింటి పర్యటన చేపట్టారు. వార్డుల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, సిబ్బందిని ఆదేశించారు. నియోజకవర్గంలో పలు రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. పాతపేట కాలనీని సందర్శించిన సందర్భంలో స్థానిక బీసీ కళాశాల బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, నాణ్యత ఎలా ఉంది, సౌకర్యాలు ఎలా ఉన్నాయి వంటి విషయాలపై ఆయన విద్యార్థినులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొట్రికె హరికిషన్, మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడ్, భాజపా అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

బేతంచెర్ల,న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని తెదేపా పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేసి సమస్యలను తెలుసుకున్నారు. వైకాపా హయాంలో రైతులకు చేసిందేమీ లేదని విమర్శించారు. సీఎం చంద్రబాబునాయుడుతోనే సుపరిపాలన సాధ్యమని, అన్ని వర్గాల సంక్షేమం తెదేపాతోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఎన్ఎండీ జిక్రియా, అంజాద్‌బాషా, కాణాల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను అందజేసిన బుగ్గన ప్రసన్నలక్ష్మి

హరివరం(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెదేపా గ్రామ నాయకులు నారాయణరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, మద్దూరి పెద్దచంద్రుడు, చంద్రాయుడు, నరేష్ పేర్కొన్నారు. హరివరం గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందజేశారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు వెంటనే కరవు భత్యం ప్రకటించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ ఆదివారం డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో డీఏ ఇస్తామని, మెరుగైన పీఆర్సీ ప్రకటిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఏడాది దాటినా కనీసం ఒక్క డీఏ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేసి ప్రజలకు చేరవేసేది ఉద్యోగులేనని అన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే ఉపయుక్తం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మరక్షణకు, శారీరక దృఢత్వానికి కరాటే ఉపయోగపడుతుందని వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత దుర్గావాహిని సభ్యురాలు ఈపూరి లక్ష్మీ పేర్కొన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో మహిళలు, యువతులు, బాలికలకు మహిళ యువ విభాగం ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు, యువతులు తమను తాము రక్షించుకునేందుకు వీహెచ్‌పీ శిక్షణ నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, రామ రాజేష్, తిరుపాల్, గణేష్, రవీంద్ర, రూపక్‌రాజు పాల్గొన్నారు.

## వడ్డెర సమస్యలపై పోరాడదాం

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: వడ్డెర సమస్యలపై అందరం కలిసికట్టుగా ఉండి పోరాటం కొనసాగిద్దామని అఖిల భారత వడ్డెర సంఘం కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో వడ్డెర కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. వడ్డెర హక్కుల కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు.

## సహకార సంఘం అధ్యక్షుడి ఎంపిక

సంజామల, న్యూస్‌టుడే: సంజామల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా పెండేకంటి కిరణ్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసినట్లు సహకార సంఘం సీఈవో ప్రసాద్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ డైరెక్టర్లుగా గిద్దలూరుకు చెందిన బత్తుల బాలవెంకటరెడ్డి, అక్కంపల్లెకు చెందిన నేతుల నాగేశ్వరరెడ్డి ఎంపికయ్యారన్నారు.

## ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక

నాటి గురువులతో పూర్వ విద్యార్థుల బృందం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. మాజీ సైనికులు రామచంద్రుడు, మద్దిలేటి, నాగన్నలను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఫయాజ్, విజయ్, రామాంజనేయులు, నరసింహులు, ప్రసాద్, సునీత, వరలక్ష్మి, ఆశా, జరీనా, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మహాసభను విజయవంతం చేయండి

డోన్, న్యూస్‌టుడే: ఆర్ఎంపీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని డోన్ మండల ఆర్ఎంపీల సంఘం నాయకులు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని కోరారు. ఆదివారం ఎమ్మెల్యే కోట్లను కలిసి ఈనెల 16వ తేదీన కర్నూలులో నిర్వహించే ఆర్ఎంపీల మహాసభ ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు కొచ్చెర్వు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సభకు వేలాదిగా ఆర్ఎంపీలు, పీఎంపీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలసుబ్బయ్య, బాషా, ప్రవీణ్‌కుమార్, టీఆర్ అంజి, మౌలాలి, కేవీ ఆచారి, అనూప్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మలుపుల దారి.. అస్తవ్యస్తంగా మారి

బేతంచెర్ల, పాణ్యం గ్రామీణ, న్యూస్‌టుడే: నిత్యం వందల వాహనాలు తిరిగే రహదారి ప్రమాదకరంగా మారింది. ఘాట్ రహదారిలో అదుపు తప్పితే కొండపై నుంచి లోయలో పడే ప్రమాదం ఉంది. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె నుంచి బేతంచెర్ల వరకు 16 కి.మీ. ఉంది. 2020లో రూ.22 కోట్లతో రెండు వరుసల రహదారిగా నిర్మాణం చేపట్టి 2022లో పూర్తి చేశారు. రెండేళ్లు గడవక ముందే రహదారంతా గుంతలమయమైంది.

తమ్మరాజుపల్లి రహదారి మలుపులో ధ్వంసమైన క్రాష్ బారియర్స్

### నాణ్యతా లోపంతో..

★ తమ్మరాజుపల్లె నుంచి సిమెంట్‌నగర్ వరకు సుమారు 6.50 కి.మీ. రహదారిని రూ.10కోట్లతో, సిమెంట్‌నగర్ నుంచి బేతంచెర్లకు 8.50 కి.మీ. రహదారిని రూ.12 కోట్లతో నిర్మించారు. నాణ్యతా లోపంతో ఘాట్ రహదారిలో రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి.

★ తమ్మరాజుపల్లె నుంచి సిమెంట్‌నగర్ వరకు 7 కి.మీ. రహదారిలో ప్రయాణం భయందోళన కలిగిస్తోంది. ఘాట్ మార్గం కావడంతో అదుపు తప్పితే లోయలోకి పడే ప్రమాదముంది. సుమారు 2 కి.మీ. ఘాట్ రహదారి మలుపులతో ఉండటంతో వాహనదారులు జాగ్రత్తలు పాటించాల్సిందే. ఈ ఘాట్ రహదారిలో రక్షణ గోడలు, క్రాష్ బారియర్స్ ధ్వంసమయ్యాయి. మలుపుల వద్ద ప్రమాద సూచికలు లేకుండా పోయాయి.

### అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా..

★ తమ్మరాజుపల్లె నుంచి సిమెంట్‌నగర్ రహదారి ప్రమాదాలతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. రక్షణ గోడలు శిథిలమవ్వడంతో నిదానంగా వెళ్లే వాహన చోదకులే లక్ష్యంగా దుండగులు దాడికి పాల్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఏదైనా వాహనం రహదారిలో నిలిపితే దొంగలు చుట్టుముట్టి దోపిడీకి యత్నించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

★ తమ్మరాజుపల్లె నుంచి సిమెంట్‌నగర్ ఘాట్ రోడ్డులో జులై 4న సిమెంట్‌నగర్ నుంచి నంద్యాల వైపు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ లారీ అదుపు తప్పికొండపై నుంచి కింద పడింది.

★ ఇదే రహదారిలో రెండు నెలల కిందట బేతంచెర్లకు చెందిన ఓ యువకుడు నంద్యాల నుంచి బేతంచెర్లకు ద్విచక్రవాహనంపై వస్తుండగా కొందరు దుండగులు దాడి చేసి దారి దోపిడీకి పాల్పడ్డారు. రహదారిలో ద్విచక్రవాహనంపై మహిళలతో కలిసి వెళ్తుంటే దారిలో అడ్డగించి అఘాయిత్యాలకు పాల్పడటంతో పాటు దోపిడీ చేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

(c) eenadu

## పొంచి ఉన్న రెండు అల్పపీడనాలు

● 17 వరకు వర్షాలకు అవకాశం: ఐఎండీ

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో రెండు అల్పపీడనాలు పొంచి ఉన్నాయని, సోమవారం (14న) ఇవి ఏర్పడే సూచనలున్నాయని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన శాఖ(ఐఎండీ) అధికారి ఉమాశంకర్‌దాస్ ఆదివారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమబెంగాల్ సరిహద్దు తీరంలో ఒక పీడనం, విదర్భ, మధ్యప్రదేశ్ సరిహద్దులో మరో పీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఉత్తర, పశ్చిమ తీరంలోని అల్పపీడనం రాష్ట్రంపై ప్రభావం చూపుతుందని, 17 వరకు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న అంచనా ఉందన్నారు. తీర ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే సూచనలున్నాయని దాస్ తెలిపారు.

**ఆరెంజ్ హెచ్చరిక..**

మయూర్‌భంజ్, కేంఝర్, సుందర్‌గఢ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, బరగఢ్ జిల్లాలకు ఈ హెచ్చరిక చేశారు.

**ఎల్లో వార్నింగ్...**

అనుగుల్, ఢెంకనాల్, కటక్, నయాగఢ్, బౌద్ధ్, సోన్‌పూర్, దేవ్‌గఢ్, బొలంగీర్, కలహండి, బాలేశ్వర్, భద్రక్, పూరీ, ఖుర్ధా, గంజాం, గజపతి, జాజ్‌పూర్, కేంద్రపడ, జగత్సింగ్‌పూర్ జిల్లాలు.

బోల్తా పడిన బస్సు. ఘటనా స్థలంలో స్థానికులు

## ఒకరి మృతి, 30 మందికి గాయాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ జిల్లా 16వ నెంబరు రహదారి రాజ్‌ఘాట్ వద్ద ఆదివారం ఉదయం ఒక ప్రైవేటు బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. జలేశ్వర్ పోలీసులు చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో మధ్యాహ్నం ఒకరు మృతిచెందినట్లు వైద్యవర్గాలు ధ్రువీకరించాయి. మరో 30 మంది కోలుకున్నట్లు తెలిపారు. బస్సు డ్రైవర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంచిక ఆవిష్కరిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సీఎస్‌సీ ప్రతినిధులు

## సీఎస్‌సీ సేవలకు చిరునామా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) డిజిటల్ సేవల్లో అగ్రగామిగా నిలుస్తూ, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు ప్రయోజకారిగా మారిందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని సీఎస్ఆర్ కార్యాలయంలో 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ధర్మేంద్ర మాట్లాడుతూ డిజిటల్ రంగం విస్తరిస్తున్న తరుణంలో సంస్థ ఈ-జిల్లాల సేవలకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్రాభివృద్ధిలో సీఎస్‌సీ కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ, ఉన్నత విద్యా శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, సీఎస్‌సీ ప్రతినిధులు పాల్గొన్నారు. వేదికపై 16 వసంతాల సంచికను ఆవిష్కరించారు.

**పశు పరిశోధనా కేంద్రం ప్రారంభం..** అనంతరం కేంద్ర మంత్రి ధర్మేంద్ర భువనేశ్వర్‌లోని నైజర్ విద్యాసంస్థలో కొత్తగా నిర్మాణమైన పశు పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగప్రాణుల గురించి పరిశోధనలు అవసరమని, నైజర్‌లో ఇది ప్రారంభం కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నైజర్ సంచాలకుడు అనిల్ కుమార్ షా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొత్త నిర్మాణం ప్రారంభిస్తున్న ధర్మేంద్ర

# విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విపక్షాల ఆందోళన

● అధ్యాపకుని అరెస్టు, ప్రిన్సిపల్ సస్పెన్షన్
● సీఎం ఎయిమ్స్ సందర్శన, విపక్షాల ఆందోళన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నం చేసిన బాలేశ్వర్ ఎఫ్.ఎం. కళాశాల విద్యార్థిని భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో మత్యువుతో పోరాడుతోంది. శరీరం 95 శాతం కాలిపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఎయిమ్స్ సంచాలకుడు ఆచార్య అశుతోష్ బిశ్వాస్ ఆదివారం విలేకర్లకు చెప్పారు. బర్నింగ్ వార్డులోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోందని తెలిపారు. 8 మంది నిపుణులు ఆమెకు చికిత్స చేస్తున్నారని, 48 గంటల తర్వాత పరిస్థితి చెప్పగలమన్నారు. ఆ విద్యార్థిని శనివారం సాయంత్రం ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే.

### అధ్యాపకుని అరెస్ట్, ప్రిన్సిపల్ సస్పెన్షన్

కళాశాలలో ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన అధ్యాపకుడు సమీర్‌సాహు తనను వేధిస్తున్నట్లు విద్యార్థిని కొన్నాళ్ల కిందట ప్రిన్సిపల్ దిలీప్‌ఘోష్‌కు లిఖితపూర్వకంగా తెలిపింది. తక్షణ చర్యలు తీసుకోవడంలో ఆయన తాత్సారం చేశారు. దర్యాప్తు సంఘం ఏర్పాటు చేశామని, వేచి చూడాలని సూచించారు. దీంతో బాధితురాలు బాలేశ్వర్ ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగికి తెలియపరిచింది. సీఎం మోహన్‌చరణ్ మాఝి, ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్‌లకు లేఖలు రాసింది. విద్యార్థినికి సత్వర న్యాయం చేయాలని ఎంపీ షడంగి కళాశాల ప్రిన్సిపల్‌కు ఫోన్ చేసినా పట్టించుకోలేదు. దీంతో ఆవేదనకు గురైన విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన తర్వాత ప్రిన్సిపల్, అధ్యాపకున్ని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అధ్యాపకుడు సమీర్‌ను పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు జైలుకు తరలించారు.

### దర్యాప్తు సంఘం ఏర్పాటు

ఉన్నత విద్యాశాఖ, ఆరోగ్య శాఖ మంత్రులు సూర్యవంశీ సూరజ్, ముఖేష్ మహాలింగ ఆదివారం ఉదయం ఎయిమ్స్‌లో బాధితురాలి పరిస్థితి చూశారు. ఆమె తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ముగ్గురు అధికారులతో సంఘం ఏర్పాటు చేసినట్లు సూర్యవంశీ విలేకర్లకు చెప్పారు. నివేదిక అందిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రి సూర్యవంశీ నివాసం వద్ద యువ కాంగ్రెస్ నాయకులు

### బిజద, కాంగ్రెస్ ఆందోళన

ఈ ఘటనపై విపక్షాలు ప్రభుత్వాన్ని దుయ్యబట్టాయి. యువ, ఛాత్ర బిజద నాయకులు ఆదివారం మధ్యాహ్నం సీఎం మోహన్ నివాస భవనం ఘెరావ్‌కు యత్నించారు. ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముట్టడికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకొని పలువురిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు యువ, ఛాత్ర కాంగ్రెస్ నేతలు మంత్రి సూర్యవంశీ నివాసాన్ని ముట్టడించేందుకు ఉద్యమించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. తర్వాత వారిని అదుపులోకి తీసుకుని వాహనాల్లో తరలించారు. యువ బిజద అధ్యక్షుడు, ఎమ్మెల్యే వ్యోమకేష్‌రాయ్ విలేకర్లతో మాట్లాడుతూ శాంతిభద్రతలు క్షీణించిన రాష్ట్రంలో వర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థినులకు రక్షణ కరవైందని, దీనికి నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి సూర్యవంశీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై బిజద రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తుందన్నారు. ఛాత్ర కాంగ్రెస్ నేత యాసిర్ నవాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో అధ్యాపకులు అమ్మాయిలను లైంగికంగా వేధించే పరిస్థితి దాపురించిందన్నారు. కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని, అన్ని విద్యాసంస్థల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

బాధితురాలి తల్లిని ఓదారుస్తున్న సీఎం

### దిల్లీకి తరలించే పరిస్థితి లేదు

ఆదివారం మధ్యాహ్నం దిల్లీ నుంచి భువనేశ్వర్ వచ్చిన సీఎం మోహన్‌చరణ్‌మాఝి విమానాశ్రయంలో ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్, మంత్రులు సూర్యవంశీ, ముఖేష్‌లతో మాట్లాడారు. తర్వాత నేరుగా ఎయిమ్స్‌కు వచ్చారు. వైద్యులతో మాట్లాడారు. బాధితురాలి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, భయపడొద్దని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ దిల్లీ ఎయిమ్స్ స్థాయి చికిత్స భువనేశ్వర్‌లో బాధితురాలికి అందుతోందన్నారు. విమానంలో ఆమెకు దిల్లీకి తరలించే పరిస్థితి లేదని, కోలుకున్న తర్వాతే హస్తిన పంపించే విషయమై నిర్ణయం తీసుకుంటామన్నారు.

**గవర్నరు జోక్యం చేసుకోవాలి..** ఈ ఘటనపై విశ్వవిద్యాలయాల కులపతి(గవర్నరు) కంభంపాటి హరిబాబు తక్షణ జోక్యం చేసుకోవాలని, ఎఫ్.ఎం. కళాశాలలో జరిగిన ఘటన రాష్ట్రానికి అగౌరవమని, గవర్నరు చర్యలు తీసుకోవాలని విపక్షనేత నవీన్‌పట్నాయక్ ఒక ప్రకటనలో కోరారు.

**ఎన్‌సీడబ్ల్యూ సీరియస్..** ఈ ఘటనకు కేంద్ర మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) సుమోటోగా తీసుకుంది. సమగ్ర దర్యాప్తు చేసి 3 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియాను ఆదేశించింది. డీజీపీ స్వయంగా పరిశీలించాలని అందులో పేర్కొంది.

సీఎం నివాసం వద్ద బిజద నేతల నినాదాలు

## టోల్‌గేట్ వద్ద బాలికను వదిలి వెళ్లిన వ్యక్తి

గురాపల్లి టోల్‌గేట్ వద్ద బాలిక

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి తనను వదిలేసి వెళ్లిపోతుంటే ఆ చిన్నారి బిగ్గరగా ఏడవడం తప్ప ఏమీ చేయలేకపోయింది. తనను ఎందుకు వదిలేస్తున్నాడో తెలియక తీవ్ర భయంతో బిగ్గరగా ఏడ్చింది. ఇవేమీ పట్టని ఆ వ్యక్తి గబగబ అక్కడి నుంచి జారుకున్నాడు. ఈ అమానవీయ ఘటన గంజాం జిల్లా కళ్లికోట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత యువకుడు బాలికను ఎత్తుకుని తీసుకువచ్చి 16వ నెంబరు జాతీయ రహదారిపై గురాపల్లి టోల్‌గేట్ సమీపంలో వదిలి వెళ్లిపోయిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. గేటు వద్ద బేలగా చూస్తున్న బాలికను స్థానికులు ఆదుకొని తినేందుకు ఆహారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. బాలిక వివరాల కోసం చుట్టుపక్కల వారిని ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. వారి సమాచారంతో ఆదివారం జిల్లా శిశు భద్రతా విభాగం అధికారులు ఆ బాలికను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రయ కేంద్రానికి తరలించారు.

బాలికను తీసుకెళ్తున్న గుర్తు తెలియని యువకుడు (సీసీటీవీ కెమెరా ఫుటేజీ)

## కంజమజోడి ఘటనపై ఎన్‌హెచ్ఆర్‌సీ కేసు నమోదు

● నలుగురు అధికారుల బృందంతో విచారణ

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రేమించుకోవడమే నేరంగా గ్రామస్థులు ప్రేమ జంట మెడకు నాగలి కట్టి పొలం దున్నించిన ఘటనపై అన్నివర్గాల నుంచి విమర్శలు రావడంతో ప్రభుత్వం స్పందించింది. జిల్లా పాలనాధికారి ఫరుల్ పట్వారి ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ రమేష్ జెనా నేతృత్వంలో కల్యాణ సింగ్‌పూర్ సమితి అధికారి, తహసీల్దార్, సీడీపీవో, సమితి సంక్షేమ అధికారులు బాధిత గ్రామం కంజమజోడికి చేరుకొని విచారణ చేపట్టనున్నారు. మరోవైపు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్‌హెచ్ఆర్‌సీ (జాతీయ మానవ హక్కుల కమిషన్) ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. నలుగురు సభ్యులతో కూడిన బృందం గ్రామానికి చేరుకొని విచారణ చేపడుతుందని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 11న కంజమజోడి గ్రామంలో ప్రేమికులిద్దరినీ గ్రామ కట్టుబాట్ల పేరుతో వారి మెడకు నాగలి కట్టి పొలం దున్నించిన ఘటన తెలిసింది. గ్రామ బహిష్కరణకు గురైన ఈ ప్రేమ జంట లకో సరక, కలియసరకలు శనివారం సాయంత్రం కంజమజోడి గ్రామానికి తిరిగి వచ్చారు. ఎస్‌డీపీవో గౌరహరి సాహు నేతృత్వంలో కెసింగుపూర్ పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోలీసుల రాకను తెలుసుకొని ఈ కేసుతో సంబంధం ఉన్న వారంతా పరారయ్యారు. ప్రేమ జంట మెడకు కట్టిన నాగలి పోలీసులు స్వాధీనం చేసుకొని కోరుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రేమ జంటతో దున్నిస్తున్న గ్రామస్థులు

## విద్యుత్తు తీగలు తగిలి ఏనుగు మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సంబల్‌పూర్ జిల్లా నకొటిదెవుళా అటవీ రేంజ్ పరిధిలోని టికిలిపడ వద్ద ఆదివారం ఉదయం వేలాడుతున్న కేపలైను తీగ తగిలి ఒక ఏనుగు మృతిచెందింది. ఘటనాస్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు కళేబరాన్ని పోస్టుమార్టం కోసం తరలించి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల కాలంలో సంబల్‌పూర్, సుందర్‌గఢ్ అటవీ రేంజ్ ప్రాంతాల్లో వేలాడుతున్న విద్యుత్తు తీగలకు తగిలి 12 ఏనుగులు మృతిచెందాయి. దీనిని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి తీవ్రంగా పరిగణించారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. దీంతో భువనేశ్వర్ నుంచి ఒక బృందం నకొటిదెవుళా వెళ్లింది.

మృతిచెందిన ఏనుగు

చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న మంత్రులు మహాలింగ, సూర్యవంశీ

## రెవెన్షా విద్యార్థులకు అతిసారం

● ఎస్సీబీలో చికిత్స

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్‌లోని రెవెన్షా వర్సిటీ పశ్చిమ వసతి గృహానికి చెందిన 30 మంది విద్యార్థులకు శనివారం రాత్రి అతిసారం సోకింది. వారిని ఎస్సీబీ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. ఆదివారం మంత్రులు ముఖేష్ మహాలింగ (ఆరోగ్యం), సూర్యవంశీ సూరజ్ (ఉన్నత విద్య)లు వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహానికి ఆహారం సరఫరా చేస్తున్న సంస్థ కలుషిత పదార్థాలతో చేసిన వంటకాలు ఇచ్చిందని సూర్యవంశీ తెలిపారు. ఈ సంస్థ బ్లాక్ లిస్టులో పెట్టినట్లు తెలిపారు. విద్యార్థులంతా కోలుకుంటున్నారని చెప్పారు.

## ఆ అయిదుగురి మృతికి అతిసారం కారణం కాదు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి, సన్నొఖెముండి, పాత్రపురం తదితర సమితుల్లో అతిసారం బారిన పడి ఇంత వరకూ ఐదుగురు మృతి చెందారంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదని జిల్లా ముఖ్య వైద్యం, ప్రజారోగ్య అధికారి (సీడీఎం, పీహెచ్‌వో) కార్యాలయం అధికారులు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. వారు ఇతర అనారోగ్య సమస్యలతో మృతి చెందారని దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అతిసారం బారిన పడి స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రిలో 19 మంది చికిత్స పొందుతున్నారని, జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో మరో 10 మంది బాధితులకు చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. దిగపొహండి సమితిలోని ఉస్తపల్లి, సన్నొఖెముండి సమితిలోని తలపూర్, కొంసామారి గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజల్ని చైతన్యపరిచామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అతిసారం బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్థులకు తెలియజేశామని తెలిపారు.

## నివాస ప్లాట్ల పేరిట మోసం: ఒకరి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: నివాస ప్లాట్ల పేరిట ప్రజల నుంచి సొమ్ము వసూలు చేసి మోసాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై స్థానిక గుసానినువాగాం ఠాణా పోలీసులు చేతన్ కుమార్ చౌధురి (43) అనే వ్యక్తిని అరెస్టు చేసి ఆదివారం న్యాయస్థానానికి తరలించారు. నిందితుడు స్థానిక గుసానినువాగాంలోని ఓ అపార్టుమెంటులో నివాసముంటున్నాడని, ఆయన నుంచి నివాస ప్లాట్ల ప్రతిపాదిత లేఔట్ ప్లాన్, 190 పేజీల రోజువారీ సొమ్ము వసూళ్ల రశీదులు స్వాధీనం చేసుకున్నామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. మధ్యాహ్నం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడికి చెందిన సాధ్వి కన్‌స్ట్రక్షన్స్ అండ్ లాజిస్టిక్స్ సంస్థ పేరిట ఆయన వద్ద పనిచేస్తున్న సిబ్బంది నివాస ప్లాట్ల కోసం ప్రజల నుంచి రోజువారీ సొమ్ము వసూలు చేశారు. 2019లో ఈ పథకం ప్రారంభం కాగా, 2021 సెప్టెంబరులో సొమ్ము చెల్లించినవారికి ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. గడువు దాటినా సొమ్ము చెల్లించినవారికి ప్లాట్లు ఇవ్వలేదు. ఇదేమిటని అడిగేందుకు వెళ్లినవారితో చేతన్ కుమార్ మాట్లాడుతూ తనకు సొమ్ము వసూళ్లతో సంబంధం లేదని, ఆ రశీదులు కూడా నకిలీవని చెప్పాడు. దీనిపై ఆయన సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేసిన ఎ.సంతోష్ కుమార్ పాత్ర్ అనే వ్యక్తి గుసానినువాగాం ఠాణాలో చేతన్‌పై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా, నిందితుడు చేతన్ నివాస ప్లాట్ల పేరిట సుమారు 200 మంది నుంచి రూ.5 కోట్లకుపైగా సొమ్ము వసూలు చేసి మోసగించినట్లు తేలిందని ఎస్పీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనపై గుసానినువాగాం, పెద్ద బజారు ఠాణాల్లో క్రిమినల్ కేసు నమోదు చేశామని ఎస్పీ శరవణ వివేక్ ఎం. వివరించారు.

అరెస్టయిన చేతన్ కుమార్ చౌధురి

## ఈ వారంలో మంత్రివర్గ విస్తరణ

మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఈ వారంలో మంత్రివర్గాన్ని విస్తరించనున్నారని విశ్వసనీయంగా తెలిసింది. శనివారం దిల్లీలో ప్రధాని నరేంద్రమోదీని కలిసిన సీఎం ఈ విషయమై చర్చించినట్లు సమాచారం.

### ఆశావహుల లాబీయింగ్

మంత్రివర్గంలోకి మరో ఆరుగురిని మాత్రమే తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం మోహన్ కొలువులో 10 మంది కేబినెట్, అయిదుగురు స్వతంత్ర హోదా గల మంత్రులున్నారు. ఒక్కొక్కరి వద్ద నాలుగైదు కీలకశాఖలున్నాయి. వారికి కేటాయించని శాఖలతోపాటు హోం, సాధారణ పాలన (జీఏ), ఆర్థిక శాఖలు సీఎం వద్ద ఉన్నాయి. అందరికీ పనిభారం ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఏ శాఖపైనా దృష్టి సారించే అవకాశం లేక న్యాయం చేయలేని పరిస్థితి ఉందని పరిశీలకులంటున్నారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణలో భాగంగా కొంతమంది మంత్రుల శాఖలు మారనున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మంత్రి పదవులపై ఆశలు పెంచుకున్న ఆశావహులు సీఎం, భాజపా అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

### వీరికి అవకాశం?

సీఎంకు సన్నిహితంగా ఉన్న భువనేశ్వర్-ఏకామ్ర ఎమ్మెల్యే బాబూసింగ్‌కు పదవి తథ్యమని తెలుస్తోంది. గతేడాది జరిగిన ఎన్నికల్లో బొలంగీర్ జిల్లా కంటాబంజి నుంచి పోటీ చేసిన బిజద అధినేత నవీన్‌పట్నాయక్‌ను ఓడించిన లక్ష్మణబాగ్‌కు కూడా బెర్తు ఖరారు కావచ్చు. అస్కా ఎమ్మెల్యే సరోజ్‌పాఢి, బట్లీ సభ్యుడు ఇరాసిస్ ఆచార్య, టంకధర్ త్రిపాఠి, సంబల్‌పూర్ ఎమ్మెల్యే జయనారాయణ మిశ్ర, పిపిలి శాసన సభ్యుడు ఆశ్రిత్‌కుమార్ పట్నాయక్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. పార్టీ, ముఖ్యమంత్రి ఆశీస్సులు ఎవరికున్నాయో, ఎవరిని పదవులు వరించనున్నాయో మరికొద్ది రోజులు తేలిపోనుంది.

**ఇతర పదవులకూ కసరత్తు..** మరోవైపు మహిళా, శిశు సంక్షేమ కమిషన్, ప్రణాళికా బోర్డు, జిల్లాల బోర్డులు, సహకార, కార్పొరేషన్ అధ్యక్ష పదవుల భర్తీకి సంబంధించి కసరత్తు జరుగుతోంది. కొద్ది రోజుల్లో ఈ పదవులకు నేతలను ఎంపిక చేస్తారని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

బాబూసింగ్

లక్ష్మణబాగ్

సరోజ్‌పాఢి

ఇరాసిస్ ఆచార్య

టంకధర్ త్రిపాఠి

జయనారాయణ మిశ్ర

ఆశ్రిత్‌కుమార్ పట్నాయక్

## ఎమ్మెల్యేకు అగ్నిపరీక్ష

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా అంటేనే ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. గుణుపురం విధానసభ నియోజకవర్గం అంటేనే కాంగ్రెసు సొంతమనే భావన ఉండేది. అటువంటిది గత 15 సంవత్సరాలుగా బిజద ఖాతాలో చేరింది. గత విధానసభ ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి సత్యజిత్ గమాంగ్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గమాంగ్ గెలుపునకు భాజపా ఇక్కడ బలహీనంగా ఉండటం, బిజదలో అసంతృప్తి ఎంతగానో సహకరించాయి. ప్రస్తుతం గుడారి సమితి అధ్యక్షురాలిపై తీసుకువచ్చిన అవిశ్వాస తీర్మానం కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారింది.

● రాయగడ జిల్లా గుడారి సమితిలో 9 పంచాయతీలున్నాయి. అధ్యక్షురాలిగా లక్ష్మీ సబర ఉన్నారు. ఆమె గత బిజద ప్రభుత్వ హయాంలో బిజద మద్దతుతో అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆమె ఇటీవల బిజదను వదిలి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బిజద శ్రేణులు, భాజపా, స్వతంత్ర అభ్యర్థులు ముకుమ్మడిగా ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. గత నెల 18వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయం సర్పంచులు, సమితి సభ్యులు అందరూ సంతకాలు చేసి సబ్ కలెక్టర్‌కు అందజేశారు. యంత్రాంగం తరపున తీర్మానంలో ఉన్న అభ్యర్థుల సంతకాలు పరిశీలన జరుగుతోంది. తరువాత అవిశ్వాస తీర్మానంపై తేదీ ప్రకటించనున్నారు.

దుర్గా పండా సమక్షంలో పార్టీలో చేరుతున్న యువ నాయకుడు రామకృష్ణ

● గుణుపురం ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్ గుడారి సమితిపై దృష్టి పెట్టారు. దాంతో గతంలో కాంగ్రెస్ వీడిన వారంతా తిరిగి పార్టీ గూటికి చేరుకుంటున్నారు. అందులో భాగంగా సమితి అధ్యక్షురాలు లక్ష్మీ సబర కాంగ్రెసులో చేరిన తరువాత సమస్య మొదలయింది. ఈ పరీక్షను ఎమ్మెల్యే ఎలా పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది. ఇదో అగ్ని పరీక్షగా మారింది. గుడారి సమితికి చెందిన కె.రామకృష్ణ తన మద్దతుదారులతో ఇటీవల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్ పండా సమక్షంలో పార్టీలో చేరారు. నేతల చేరికతో పదవి కోసం పోటీ తీవ్రంగా ఉంది.

## భౌ..భౌ.. భయం

హాల్ టౌన్‌షిప్‌లో కుక్కల గుంపు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ హాల్ టౌన్‌షిప్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో గత 10 రోజులుగా కుక్కల బెడద అధికమైంది. వీధుల్లో కుక్కలు సంచరించడంతో మహిళలు, పిల్లలు భయాందోళన చెందుతున్నారు. కుక్కలు రోడ్లపై తిష్టవేయడంతో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయంతో వణుకుతున్నారు. హాల్ టౌన్‌షిప్‌లో ఆరుగురు కుక్క కాటుకు గురయ్యారు. ఆర్.జోన్‌లో ఆదివారం ఉదయం నాలుగేళ్ల శిశువు ఆడుకుంటుండగా కుక్కలు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడింది. అనేక సందర్భాల్లో మహిళలు సైతం గాయపడుతున్నారు. పురపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకొని కుక్కల బెడద నుంచి విముక్తి కలిగించాలని పలువురు కోరుతున్నారు.

(c) eenadu

## పాఠశాలలో మంత్రి ఆకస్మిక పర్యటన

తరగతి గదిని పరిశీలిస్తున్న మంత్రి

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ స్వామి వివేకానంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆదివారం విద్యాశాఖ మంత్రి నిత్యానంద్‌గండ్ ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదిలో చెత్తను చూసి ప్రధానోపాధ్యాయుడుపై ఆగ్రహించారు. పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు సుమన్‌జెన్నాను ఆదేశించారు. ఆయనతో పాటు జిల్లా భాజపా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు రమేష్‌దాస్, నేతలు రమేష్‌చంద్ర సాహు, మున్నా పాణిగ్రహి ఉన్నారు.

## కాంగ్రెస్ నిజ నిర్ధారణ సంఘం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ ఎఫ్.ఎం. కళాశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై వాస్తవాలు తెలుసుకునేందుకు కాంగ్రెస్ నిజనిర్ధారణ సంఘం ఏర్పాటు చేసింది. పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్‌దాస్ ఆదివారం సాయంత్రం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షివాహినిపతి అధ్యక్షతన 12 మందితో సంఘం ఏర్పాటు చేశామని, అధ్యయనం తర్వాత తదుపరి చర్యలకు శ్రీకారం చుడతామన్నారు.

## ఎయిమ్స్ సందర్శించిన ఉన్నతాధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాల స్నాతకోత్సవానికి సోమవారం(14న) రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేరుకోనుండగా, ఆదివారం ఉన్నతాధికారులు ఎయిమ్స్‌లో భద్రతా ఏర్పాట్లు సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ అహుజా, హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యవ్రత సాహు, డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియాలు ఎయిమ్స్ అధికారులతో మాట్లాడారు. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము రెండు రోజుల పర్యటన కోసం భువనేశ్వర్ వస్తున్న సంగతి తెలిసిందే.

భువనేశ్వర్ ఎయిమ్స్ ఆసుపత్రిలో సీఎస్, ఉన్నతాధికారులు, డీజీపీ తదితరులు

## రాష్ట్రపతి ద్రౌపదీముర్మును కలిసిన సీఎం

ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి శనివారం రాత్రి దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు జగన్నాథ, బలభద్ర, సుభద్రల ఫొటో అందజేసిన సీఎం రాష్ట్రంలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు.

–న్యూస్‌టుడే, భువనేశ్వర్

## పడవ బోల్తా

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జిల్లా కోణార్క్ చేరువలోని చంద్రభాగ తీరంలో ఆదివారం చేపలవేటకు వెళ్లిన ఆరుగురు మత్స్యకారుల పడవ సముద్రంలో బోల్తాపడింది. నేర్పుగా అందరూ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. ఒక్క మత్స్యకారునికి స్వల్పగాయాలయ్యాయి.

## గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో విలేకరి మృతి

ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న విలేకర్లు

నరేశ్ (పాతచిత్రం)

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు ఠాణా ప్రాంతంలో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు విలేకరిపై దాడి చేయడంతో విలేకరి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలకు వస్తే శనివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో మోటు గ్రామానికి చెందిన వెబ్‌ఛానెల్ విలేకరి సి. హెచ్ నరేశ్‌తో పాటు మరో ఇద్దరు విలేకరులు వార్త కోసం మోటు దగ్గర మురలిగుడ గ్రామానికి కారులో వెళ్లారు. అక్కడ వార్త చేస్తున్న సమయంలో రెండు ద్విచక్ర వాహనాలలో ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు చేతిలో కత్తి పట్టుకుని దాడి చేశారు. ఇద్దరు విలేకర్లు భయంతో అక్కడ నుంచి పరారైనప్పటికీ నరేశ్‌పై కత్తితో దాడి చేయడంతో అతని చేతి నరాలు కోసుకుపోవడంతో స్థానికులు ప్రాథమిక చికిత్స కోసం మోటు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తరువాత మల్కాన్‌గిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. దీనిపై జిల్లా విలేకరుల సంఘం తరపున ఆదివారం మల్కాన్‌గిరి ఎస్పీ వినోద్ పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, విలేకరులకు రక్షణ చట్టం ప్రకటించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సంఘం అధ్యక్షుడు దేవప్రసాద్ దాస్, మాజీ అధ్యక్షుడు దుర్యోధన్ పాత్ర్, అశోక్ మిశ్ర, అశిమ విశ్వాస్, ఎ. ఈశ్వర్, నిరంజన్ మల్ల, పాటు 50మందికి పైగా విలేకర్లు పాల్గొన్నారు.

## వైకుంఠ వాసునికి ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

పర్లాఖెముండి న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని కేవిటి వీధిలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వర మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం స్వామివారి దివ్య తిరు నక్షత్రం శ్రవణం సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పురోహితులు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సాయంత్రం వేళలో సహస్రదీపాలంకరణ, సహస్రనామార్చన నిర్వహించారు. భక్తులు మందిరం వద్దకు చేరుకొని స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## బోల్‌భం భక్తుల సందడి

గుప్తేశ్వర శైవక్షేత్రానికి బారులు తీరుతున్న బోల్‌భం భక్తులు

కొరాపుట్, న్యూస్‌టుడే: పవిత్ర శ్రావణ మాసం ప్రారంభం కావడంతో శైవక్షేత్రాలకు భక్తుల తాకిడి మొదలైంది. జిల్లాలో గల ప్రముఖ శైవ క్షేత్రం గుప్తేశ్వరానికి భక్తులు బొయిపరిగుడ నుంచి కాలినడకన చేరుకుంటున్నారు. నేడు పవిత్ర శ్రావణ మాస మొదటి సోమవారం కావడంతో గుప్తేశ్వరునికి పవిత్రజలాల అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు ఆదివారం సాయంత్రం నుంచి గుప్తేశ్వర యాత్ర ప్రారంభించారు. మరోపక్క బోల్‌భం భక్తులకు ఉచిత సేవలు అందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థల బృందాలు బొయిపరిగుడ నుంచి మొదలుకొని గుప్తేశ్వరం వరకు శిబిరాలు ఏర్పాట్లు చేస్తున్నారు.

## జగన్నాథ సంస్కృతి అనుసరణీయం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: జగన్నాథ సంస్కృతి అనుసరణీయమని, స్వామి సేవలు, ఉత్సవాలు నిబంధన ప్రకారం జరగాలని పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ పేర్కొన్నారు. శనివారం భువనేశ్వర్‌లో పీటీఐ వార్తా సంస్థతో గజపతి మాట్లాడుతూ ఇస్కాన్ భక్తులు నిబంధనలు అతిక్రమిస్తున్నారని, స్నాన, రథయాత్రలు ఏకపక్షంగా చేపడుతున్నారన్నారు. దీనిపై తాను పశ్చిమబెంగాల్‌లోని మాయాపూర్ ఇస్కాన్ కార్యాలయం ప్రతినిధులకు లిఖితపూర్వకంగా తెలియపరిచినా పట్టించుకోలేదన్నారు. బెంగాల్‌లోని దిఘా తీరంలో ప్రారంభమైన జగన్నాథుని ఆలయానికి అక్కడి ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ధామంగా పేర్కొనడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. దీనిపై ఒడిశా సీఎం మోహన్ చరణ్‌మాఝి మమతాకు లేఖ రాసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్నాథుని సంస్కృతిని పరిరక్షించాల్సినవసరం ఇస్కాన్ యంత్రాంగంపై ఉందని గజపతి పేర్కొన్నారు.

## అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అమ్మవారి దర్శనం కోసం రహదారిపై వరుసలో భక్తులు

రాయగడ, న్యూస్‌టుడే: ఉత్కళ ఆంధ్రుల ఇలవేల్పు మజ్జిగౌరి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన ఆదివారం ఉదయం 4 గంటలు నుంచే వరుస కట్టారు. ఒకేసారి వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూ కాంప్లెక్స్‌లు నిండిపోగా రహదారి పొడవునా భక్తులు ఎండను కూడా లెక్కచేయకుండా వరుసలో నిలుచున్నారు. అనేక మంది భక్తులు గుడి మెట్లు వద్ద పూజలు చేసి వెనుదిరిగారు. సాధారణ దర్శనానికి 6 నుంచి 8 గంటలు సమయం పట్టింది. ఆలయ కమిటీ తాగునీరు, ఉచిత భోజనం, రైల్వేస్టేషన్ నుంచి ఉచిత రవాణా ఏర్పాటు చేశారు.

## ముగిసిన హాకీ పోటీలు

బాలుర విభాగంలో ఛాంపియన్స్ ట్రోఫీతో కువర్‌ముండా కేంద్రం క్రీడాకారులు

బాలికల విభాగం: ఛాంపియన్ ట్రోఫీ అందుకున్న లతికత కేంద్రం క్రీడాకారిణులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాశాఖ సౌజన్యంతో భువనేశ్వర్‌లోని కళింగ మైదానంలో నిర్వహించిన అయిదో ఒడిశా నేవల్ టాటా క్షేత్ర స్థాయి బాలబాలికల హాకీ పోటీలు-2025 శనివారం రాత్రి ముగిశాయి. ఇందులో బాలుర విభాగం తుది పోరులో కువర్‌ముండా హెచ్‌టీసీ జట్టు నువాగాం హెచ్‌టీసీ జట్టుపై గెలుపొంది ఛాంపియన్‌గా నిలిచింది. బాలికల విభాగం తుదిపోరులో లతికత హెచ్‌టీసీ జట్టు గురుండియా హెచ్‌టీసీ జట్టుపై విజయం సాధించింది. పోటీల అనంతరం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర క్రీడాశాఖ సంచాలకుడు దీపాంకర్ మహాపాత్ర్ విన్నర్, రన్నర్ జట్ల బాలబాలికలకు బహుమతులందజేశారు.

## పారా అథ్లెటిక్స్ రాష్ట్రానికి 11 పతకాలు

పతకాలతో రాష్ట్ర పారా క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బెంగళూరులో ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగిన ఏడో భారత ఓపెన్ పారా అథ్లెటిక్స్ పోటీలు-2025లో రాష్ట్ర క్రీడాకారులు సత్తాచాటి 11 పతకాలు గెలుచుకున్నారు. పోటీల్లో పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్ తదితర అంశాల్లో రాష్ట్రానికి చెందిన ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళా క్రీడాకారులు నాలుగు పసిడి, అయిదు రజతం, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నట్లు రాష్ట్ర క్రీడాశాఖ ఆదివారం 'ఎక్స్'లో వెల్లడించింది.

## జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుల సత్తా

అమియకుమార్ మల్లిక్ అవినాష్ సాహు సరుణ్‌పయ సింగ్ స్వాధీన్‌కుమార్ మాఝి

రమణ్‌దీప్ కౌర్ లక్ష్మీప్రియ కిసన్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని పుణెలో గల సావిత్రి బాయిపులే వర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం జరిగిన భారత ఓపెన్ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారు. ఒడిశా రిలయన్స్ ఫౌండేషన్ అథ్లెటిక్స్ హెచ్‌పీసీ కేంద్రానికి చెందిన అథ్లెట్లు పసిడి, రజత పతకాలు గెలుచుకున్నట్లు క్రీడాశాఖ ఆదివారం 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. పోటీల్లో పురుషుల విభాగంలో నిర్వహించిన 100 మీటర్ల పరుగులో అవినాష్ సాహు రజత పతకం, లాంగ్ జంప్‌లో సరుణ్‌పయ సింగ్ రజతం, హైజంప్‌లో స్వాధీన్ కుమార్ మాఝి రజత పతకాలు కైవసం చేసుకోగా మహిళా విభాగంలో జరిగిన 400 మీటర్ల హర్డిల్స్‌లో రమణ్‌దీప్ కౌర్ ద్వితీయస్థానంతో రజతం, 800 మీటర్ల పరుగులో లక్ష్మీప్రియ కిసన్ మొదటిస్థానంలో నిలిచి పసిడి పతకం గెలుచుకున్నట్లు క్రీడాశాఖ అందులో వెల్లడిస్తూ విజేతలకు అభినందనలు తెలిపింది.

**అమియకుమార్‌కు పసిడి పతకం:** పుణెలో జరిగిన భారత ఓపెన్ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర స్ప్రింటర్ అమియ కుమార్ మల్లిక్ పసిడిపతకం సాధించాడు. రాష్ట్ర క్రీడాశాఖ ఆ వివరాలను 'ఎక్స్'లో వెల్లడిస్తూ మల్లిక్‌కు అభినందనలు తెలిపింది.

## భాజపాను మరింత బలోపేతం చేద్దాం: గణపతి

గణపతికి సత్కరిస్తున్న భాజపా నాయకులు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురానికి చెందిన భాజపా నాయకులు వై.గణపతి రెండు రోజుల కిందట భాజపా నేషనల్ కౌన్సిల్ సభ్యునిగా నియామకం అయిన సంగతి తెలిసిందే. ఆయన శనివారం గుణుపురం వచ్చారు. సాయంత్రం గుణుపురం బంగ్లాలో స్థానిక భాజపా నేతలు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ రానున్న రోజుల్లో గుణుపురం నియోజకవర్గంలో భాజపా మరింత బలోపేతం అయ్యేలా కృషి చేద్దామన్నారు. నాయకులు శ్రీనివాస స్వాయి, మాధవ పాడి, రామ పట్నాయక్, రాజేంద్ర నాయక్, ఈశ్వర గమాంగ్, గోపాల కృష్ణ దేవ పాడి తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆర్కే బాలిక ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ పట్టణంలో ఉన్న ఆర్కే బాలిక ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని కొరాపుట్ ఎమ్మెల్యే రఘురామ్ మచ్చో హామీ ఇచ్చారు. బాలిక ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే మచ్చో ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అతి పురాతన బాలిక ఉన్నత పాఠశాల [illegible] 200 మంది విద్యార్థులు చదివే ఈ పాఠశాలలో ఎటువంటి సదుపాయాలు లేవని, ప్రభుత్వ నిధులు అందడం లేదని, విద్యార్థులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ బాలిక ఉన్నత పాఠశాల సమస్యలు పరిష్కారం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే మచ్చో హామీ ఇచ్చారు. కమిటీ కోశాధికారి విజయచంద్ర [illegible] ఆధ్వర్యంలో భాజపా నేతలు సుమంత్ ప్రధాన్, కమిటీ సభ్యులు తిలక్ కిముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మచ్చో

## ఆందోళన విరమించాలి

నవరంగపూర్, న్యూస్‌టుడే: డ్రైవర్లు స్టీరింగ్‌లు వదిలి చేస్తున్న ఆందోళన విరమించుకోవాలని నవరంగపూర్ ఎమ్మెల్యే గౌరీశంకర్‌మాఝి ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో కోరారు. చోదకులు ఆందోళన చేయటంతో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, పాలు, ఇతరత్రా ఆహార పదార్థాలు, కాయగూరలు కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రవాణా శాఖ మంత్రి విభూతి భూషణ్‌తో ఎమ్మెల్యేలు చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కుంజ బిహారి దాస్, కార్యకర్తలు దేవదాస్ మహాకుడ్, అనంత్ పండా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరీశంకర్

## ఉత్తమ వైద్యుడిగా దిలీప్‌కు పురస్కారం

మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, చెక్కును అందుకుంటున్న డా.దిలీప్

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా పపదహండి సమితి ఆసుపత్రిలో స్త్రీ, ప్రసూతి నిపుణుడు డా.దిలీప్ దొళాయికి ఉత్తమ వైద్యుడిగా పురస్కారం దక్కింది. భువనేశ్వర్‌లో రాష్ట్ర ఆరోగ్యశాఖ తరపున జరిగిన కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహాలింగ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, చెక్కు అందుకున్నారు.

## చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఇనుప కంచె తీగల దొంగతనం కేసుకు సంబంధించి మునిగుడ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం వివరాలను వెల్లడించింది. పట్టుబడ్డ నిందితుల నుంచి 500 అడుగుల పొడవున్న 8 ఇనుప తీగల కంచె బండెళ్లు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న ఇనుప కంచె

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

## కొరాపుట్ జిల్లా పర్యాటక స్థలాల అభివృద్ధికి కృషి

సిమిలిగుడ, కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా పర్యాటక స్థలాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక విభాగం కమిషనర్ బల్వంత్ సింగ్ అన్నారు. ఒడిశా ఆంధ్ర రాష్ట్రాల వివాదాస్పద కొఠియా గ్రామంలో శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. కొఠియాలో పంచాయతీ కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, ఆశ్రమ పాఠశాల, ఒడిశా ఆదర్శ విద్యాలయాలను సందర్శించి వాటి పనితీరు చూశారు. అనంతరం దేవ్‌మాలి పర్వతం పైకి వెళ్లి అక్కడ పర్యాటకంగా జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. సింగ్‌తోపాటు జిల్లా పాలనాధికారి కీర్తి వాసన్, జిల్లా పరిషత్ కార్య నిర్వాహక అధికారి వేణుధర్ సబర్, జిల్లా అటవీశాఖాధికారి కె.వి.భాస్కరరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారిని తల్లినా ప్రధాన్, పొట్టంగి సమితి అభివృద్ధి అధికారి రామకృష్ణ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

కొఠియాలో సింగ్, కీర్తి, భాస్కర్, వేణుధర్‌లు

## సరదాగా పిల్లలతో కాసేపు

బాలుడికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ ఎమ్మెల్యే గౌరీశంకర్ మాఝి తన 40వ జన్మదిన వేడుకలు దివ్యాంగ పిల్లలతో శనివారం సాయంత్రం జరుపుకొన్నారు. ఆశ్రమంలో కేకును కోసి పిల్లలకు తినిపిస్తూ ఆనందంగా గడిపారు. వారందరికి టీ-షర్టు, మిఠాయిలు, పెన్నులు, తినుబండరాలు అందజేశారు. అనంతరం ఆశ్రమ అధ్యక్షుడు జగన్నాథ్ బెహరా ఆధ్వర్యంలో పిల్లలతో కలిసి మొక్కలు నాటారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టైలరింగ్‌పై శిక్షణ

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ అందిస్తున్నారు. క్లబ్ కార్యాలయంలో ఆదివారం శిక్షణ శిబిరం ప్రారంభమవ్వగా సంఘసేవకురాలు స్నిగ్ధరాణి మిశ్ర ప్రారంభించారు.

## పోలీసుస్టేషన్ ఎదుట నిరసన ప్రదర్శన

నిరసన ప్రదర్శనలో పలువురు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ పోలీసుస్టేషన్ ఎదుట శనివారం సాయంత్రం వామపక్ష ప్రజాసంఘాల ప్రతినిధులు నిరసన ప్రదర్శన జరిపారు. జులై 9న దేశవ్యాప్త సమ్మె పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలో నిర్వహించారు. పోలీసులు, తృణమూల్ కాంగ్రెస్ ఆందోళన భగ్నం చేయడానికి తమపై దాడులు చేశారని జిల్లాలో పలు పోలీసుస్టేషన్ల ఎదుట నిరసన చేస్తూ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఏజెన్సీ గ్రామంలో వైద్య శిబిరం

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా తడమ పంచాయతీ సింగిపుట్టు గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. జిల్లా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొబైల్ హెల్త్ యూనిట్ వారు సహకారంతో రైతుల కాలనీ సత్యసాయి సేవా సమితి వారు శిబిరం నిర్వహించారు. 87 మంది రోగులకు చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## విద్యుదాఘాతంతో మేస్త్రీ మృతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి ఠాణా పరిధిలోని మౌళాభంజ గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో జి.నారాయణ దొర (22) అనే మేస్త్రీ మృతి చెందాడు. గ్రామంలోని సాతాదేవుని మందిరం సమీపాన నిర్మాణంలో ఉన్న ఇంటిపై పనులు చేస్తున్న దొర ప్రమాదవశాత్తు ఇంటి పైనున్న 11 కేవీ విద్యుత్ తీగల్ని తాకి షాక్ గురయ్యాడు. ఆయనను చికిత్స కోసం దిగపొహండిలోని ఆరోగ్య కేంద్రంలో చేర్పించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



దేవాశిష్ (పాతచిత్రం)

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడలో కలహండి కాలనీకి చెందిన యువకుడు శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. దేవాశిష్ కోరా(24) ఇంట్లో నుంచి వెళ్లి సమీపంలో నిరుపయోగంగా ఉన్న బధిర పాఠశాల భవనంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాలనీకి చెందిన యువకులు భవనం వద్దకు వెళ్లగా మృతదేహం వేలాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి ఉలుకూ పలుకూ లేకుండా పడి ఉండటంతో వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

## ప్రమాదంలో బోల్‌భం భక్తుడి మృత్యువాత

జయపురం, న్యూస్‌టుడే: బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర ఆలయ సందర్శనకు కాలి నడకన వెళుతున్న బోల్‌భం భక్తుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. [illegible] మృతుడు హల్దాకుంటి గ్రామానికి చెందిన పదుకరామ్ దురువా(34)గా గుర్తించారు.

## గుంతాల్ సర్పంచి కన్నుమూత

భక్త కలాపి (పాతచిత్రం)

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్రా సమితి గుంతాల్ సర్పంచి భక్త కలాపి (40) ఆదివారం ఉదయం కన్నుమూశారు. రెండేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న భక్త చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయన మరణానికి కాంగ్రెస్ నేతలు సంతాపం తెలియజేశారు.

## పిడుగుపాటుకు మహిళ దుర్మరణం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలో ఆదివారం సాయంత్రం పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షాలతోపాటు పిడుగులు పడ్డాయి. ఈ నేపథ్యంలో పర్లాఖెముండి పట్టణ ఆదర్శ ఠాణా పరిధిలోని గుమ్మ సమితి జమ్మూరు గ్రామానికి చెందిన కె.బృందావతి(32) అనే మహిళ వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పిడుగు పడి అస్వస్థతకు గురైంది. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో

## ముగ్గురు బాలల అరెస్ట్

స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ పట్టణంలో జరిగిన ఒక చోరీకి సంబంధించి సునాబెడ పోలీసులు ముగ్గురు బాల నేరస్థులను అరెస్టు చేసి, జువైనల్ జస్టిస్ బోర్డు స్కూల్‌కు తరలించారు. ఠాణా అధికారిని సుష్మకుహర్ అందించిన వివరాల ప్రకారం... సిమిలిగుడ పట్టణంలో కుశల ఆశ్రమం కాలనీలో జూన్ 7వ తేదీన సమీర్ ప్రధాన్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో నగదు, బంగారం ఆభరణాలు చోరీ జరిగిన విషయం తెలిసిందే. దీనిపై బాధితులు సునాబెడ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొంతమంది బాలలను రెండు రోజుల కిందట అదుపులోకి తీసుకొని విచారించారు. అందులో ముగ్గురు బాలలు దొంగతనం చేసినట్టు తేలింది. పోలీసులు ముగ్గురి నుంచి రూ.8.40 లక్షల నగదు, బంగారం, వెండి ఆభరణాలు, ఇతర సామగ్రి, నిందితులు ఉపయోగించిన కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని ఆదివారం భవానిపట్నంలో జువైనల్ జస్టిస్ బోర్డు స్కూలుకు తరలించారు.

## ఉద్ధృత రూపం దాల్చిన నదులు... ఒకరి మృతి మరొకరి గల్లంతు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: శీలావతి, జూమీ నదులు పొంగిపొర్లడంతో లోతట్టు ప్రాంతంలో వరదనీరు చేరడంతో ఘటాల్‌కు చెందిన సుల్తాన్ ఖాతూన్(7) వరద నీటిలో మునిగిపోయి మృతిచెందిందని, ఘటాల్ బ్లాక్ ఆజాద్ నగర్‌కు చెందిన నితాయ్ డొగ్రా(56) వరద నీటిలో గల్లంతయ్యాడని ఘటాల్ ఎస్డీవో సుమన్ విశ్వాస్ ప్రకటించారు. ముంపు ప్రాంతాలు పెరిగే అవకాశముందని యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక చర్యలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

పొంగిపొర్లుతున్న నదులు

## మావోయిస్టుల పేరుతో బెదిరించిన ముగ్గురి అరెస్టు

పట్టుబడ్డ నిందితులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే; రాయగడ జిల్లా కాశీపూర్ సమితి దొరగూడ పోలీసులు మావోయిస్టు పేరుతో వ్యాపారులను బెదిరిస్తున్న కేసులో ముగ్గురు నకిలీ మావోయిస్టులను శనివారం సాయంత్రం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాశీపూర్‌కి చెందిన వ్యాపారి శేఖర్ బిసాయికి మావోయిస్టుల పేరుతో రెండు రోజుల కిందట బెదిరింపు లేఖ వచ్చింది. అనంతరం ఫోన్‌లో మాట్లాడి తమకు రూ.50 లక్షలు ఇవ్వాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భయపెట్టారు. దీంతో బిసాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొరగూడ పోలీసులు సెల్‌ఫోన్‌లో వాయిస్ రికార్డు ఆధారంగా దర్యాప్తు చేసి కుఫకోల్ గ్రామానికి చెందిన బినోద్‌నాగ్, మాలిగూడ గ్రామానికి చెందిన నరేంద్ర నాగ్‌లతోపాటు మరో మైనర్ ను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

## రైలు నుంచి జారిపడిన జవాను

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే; కొరాపుట్ రాయగడ రైలు మార్గంలో రైలులో ప్రయాణిస్తున్న సీఆర్పీఎఫ్ జవాను సరత్‌మాఝి లెలిగుమ్మ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం రాత్రి జారిపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవాను రవుర్కెలా-జగదల్‌పూర్ రైలులో జగదల్‌పూర్ వెళ్తున్నాడు. డోర్ వద్ద నిలబడి ప్రయాణిస్తూ జారిపడ్డాడు. జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లెలిగుమ్మ రైల్వేస్టేషన్ సమీపంలో గాయాలతో ఉన్న జవాన్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## రెవెన్యూ అధికారుల సంఘం వార్షికోత్సవం

వేదికపై ఉన్న సంఘం నిరంజన్ స్వైన్, కె.ప్రతాప్ తదితరులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం సమావేశ భవనంలో ఆదివారం రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘం గజపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో వార్షికోత్సవం, సాధారణ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు నిరంజన్ స్వైన్ మాట్లాడుతూ భూమి అమ్మే సమయంలో చట్టపరమైన వారసుడు(లీగల్ హెయిర్) లేకపోవడం, మ్యుటేషన్ సమయంలో సరైన కాగితాలు లేక భూమి పట్టాలు చేసేందుకు ఎదురవుతున్న పలు సమస్యలు, వాటిని పరిష్కరించే విధానాలపై చర్చించారు. ఉపాధ్యక్షులు కె.ప్రతాప్, కార్యదర్శి కృష్ణచంద్ర బిస్వాల్, ఉప కార్యదర్శి శశిపట్నాయక్, కోశాధికారి గాయత్రీ నాయక్, సలహాదారు దిరెన్ పండా తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ కెమెరాకు చిక్కిన ముగ్గురు వేటగాళ్లు

అటవీ అధికారుల అదుపులో వేటగాళ్లు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: సిమిలిపాల్‌లో వన్యప్రాణులను వేటాడుతున్న ముగ్గురు వేటగాళ్లు ఏఐ కెమెరాకు చిక్కారు. వాటి చిత్రాల ఆధారంగా అటవీ అధికారులు శనివారం సాయంత్రం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సిమిలిపాల్ దక్షిణ డివిజన్ ఉప సంచాలకుడు సామ్రాట్ గౌడ తెలిపిన వివరాల మేరకు.. నలుగురు నిందితులు వన్యప్రాణులను వేటాడుతూ కెమెరాకు చిక్కారు. వారిలో కొప్తిపొడ పోలీసుస్టేషన్ పరిధి మొనొభంగ గ్రామానికి చెందిన జగన్నాథ్ నాయక్, పగడదిహ గ్రామానికి చెందిన బుధికాంసింగ్, గొంధాధర్ గ్రామానికి చెందిన కునార్ ముర్ములను అరెస్టు చేశారు. పగడదిహ గ్రామానికి చెందిన బుధిరాం నాయక్ అనే మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. పట్టుబడ్డ నిందితుల నుంచి మూడు నాటు తుపాకులు, పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

(c) eenadu

# అందని సహకారం.. తీరని అవసరం

ఎరువుల విక్రయానికి ముఖం చాటేసిన సంఘాలు

న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు నారుమడులు సిద్ధం చేశారు. పంటకు వేయడానికి అవసరమైన ఎరువులు మాత్రం లభించడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఏటా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు యూరియా, డీఏపీ, ఫాస్ఫేట్, కాంప్లెక్సు ఎరువులు అందించేవారు. ఈ ఏడాది పీఏసీఎస్‌లకు సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నా తగినంత నిల్వలు లేవు. 'మన గ్రోమోర్' దుకాణాల్లో కొద్దిగొప్పో తెచ్చుకుంటున్నారు. రానున్న రోజుల్లో యూరియా, డీఏపీకి మరింత డిమాండు ఉంటుందని తెలిసి ముందుగా సిద్ధం చేసుకోవాలని భావిస్తున్నా లభించడం లేదు. నారుమడులకు, వెద సాగుకు, మొక్కజొన్న పంటలకు ప్రస్తుతం యూరియా, డీఏపీ అవసరం. అవి పూర్తిస్థాయిలో లభించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## ముందుకురాని సంఘాలు

బొబ్బిలి డివిజన్ పరిధిలోని బొబ్బిలి మండలంలోని చింతాడ, కారాడ, కలవరాయి, కోమటిపల్లి, బొబ్బిలి గ్రామాల్లో పీఏసీఎస్‌లున్నాయి. ఒక్క బొబ్బిలిలోనే 110 టన్నుల యూరియా, 70 టన్నుల డీఏపీ విక్రయించి వదిలేశారు. బాడంగి మండలంలో మూడు సంఘాలుండగా.. పాల్తేరు సొసైటీలో మాత్రమే విక్రయిస్తున్నారు. రామభద్రపురంలో ఆరు సంఘాలున్నా.. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లోనే ఇస్తున్నారు. తెర్లాంలో మూడు సంఘాలూ విక్రయానికి ముందుకు రాలేదు. ఎరువులు తెచ్చుకుని రైతులకు విక్రయించాలంటే ముందుగా వ్యవసాయ శాఖ నుంచి లైసెన్సు పొందాలి. ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ అధికారులు చెప్పినా సంఘాల కార్యదర్శులు ముందుకు రాలేదని చెబుతున్నారు. ధాన్యం కొనుగోలుపై ఉన్న శ్రద్ధ ఎరువుల విక్రయాలపై చూపకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చింతాడలోని పీఏసీఎస్ కార్యాలయం

## పెరిగిన సాగు విస్తీర్ణం

బొబ్బిలి డివిజన్‌లోని తెర్లాం, రామభద్రపురం, బాడంగి, బొబ్బిలి మండలాల్లో వరి విస్తీర్ణం గతేడాది కంటే పెరిగింది. గతేడాది 14 వేల హెక్టార్లు ఉండగా ఈసారి మరో వెయ్యి ఎకరాలు పెరిగింది. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 2500 హెక్టార్లకు గాను ప్రస్తుత ఖరీఫ్‌లో 3,500 హెక్టార్లకు చేరింది. దీంతో యూరియా, డీఏపీ అవసరం కూడా పెరిగింది. వరి పంటకు నారుమడి నుంచి పంట చేతికొచ్చే వరకు మూడు దఫాలుగా ఈ ఎరువులు వేస్తారు. మొక్కజొన్నకు కూడా అదే విధంగా వేయనున్నారు.

## ఎరువులు తేవాలని చెప్పాం

ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు తెచ్చి రైతులకు సరఫరా చేయాలని పీఏసీఎస్‌ల కార్యదర్శులకు తెలియజేశాం. సబ్ డివిజన్‌లో బొబ్బిలి, రామభద్రపురం, పాల్తేరు సంఘాల్లోనే విక్రయించారు. మిగిలిన సంఘాల ద్వారా ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఆయా సంఘాల కార్యదర్శులకు తెలియజేశాం. –జ్యోతి, సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి, బొబ్బిలి

## పచ్చిరొట్ట ఎరువుతో పంటలకు మేలు

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పచ్చిరొట్ట ఎరువు వినియోగంతో పంటలకు మేలు కలుగుతుందని జిల్లా ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం బర్లిలో పచ్చిరొట్ట పంటకోత ప్రయోగం చేపట్టారు. ఎకరా పొలంలో పంట వేస్తే 7 టన్నుల ఎరువు తయారవుతుందని చెప్పారు. భూసారం పెరిగి మంచి దిగుబడి వస్తుందన్నారు. అనంతరం సుభద్ర గ్రామంలో రైతులకు ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. సిబ్బంది లక్ష్మి, తిరుపతిరావు, గంగమ్మ, ఆదిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## నాగావళి పరివాహకంలో ఏనుగులు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని నాగావళి పరివాహక ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఆదివారం బాసంగి, బాసంగి గదబవలస తదితర గ్రామాల్లో తిరుగుతూ కనిపించాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అరటి, పామాయిల్ పంటలను ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు. వ్యవసాయ పనులు చేసేందుకు పొలాలకు వెళ్లలేకపోతున్నామని, వాటిని దూరంగా తరలించాలని కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు కవిటి విద్యార్థులు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల జిల్లాలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కవిటికి చెందిన సమన్విత, రేణుక సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీల్లో 11 సంవత్సరాల విభాగంలో సమన్విత ద్వితీయ స్థానం సాధించగా, డబుల్స్ విభాగంలో సమన్విత, రేణుక జోడీ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా స్థానిక ఉషోదయ యువజన సంఘం సభ్యులు విజేతలకు అభినందనలు తెలిపారు.

సమన్విత, రేణుక

## అందని నీరు.. ఆగని కన్నీరు.!

నీరు లేక నారుమడులు ఎండుతున్నాయి. రైతులు కన్నీరు పెడుతున్నారు. ఇటీవల అడపాదడపా వర్షాలు కురవడంతో సంతకవిటి మండలంలోని శ్రీహరినాయుడుపేట, కృష్ణంవలస, కొండగూడేం, గరికిపాడు, తాలాడ, జీఎస్ పురం, సిరిపురం, ఎంఆర్ అగ్రహారం తదితర గ్రామాల్లో నారుమడులు వేశారు. వారం రోజులుగా వర్షం జాడలేక ఎండుతున్నాయి. కాపాడుకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. కొంతమంది సుదూర ప్రాంతాల నుంచి పైపులు, ఇంజిన్ల సాయంతో నీరు పెట్టుకుంటున్నారు. రైతులు వరి నారుమడులకు తప్పనిసరిగా నీటి తడిని అందించి కాపాడుకోవాలని ఏవో యశ్వంత్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

కొండగూడేంలో నారుమడులకు నీరు అందించేందుకు పైపులు మోసుకెళ్తున్న రైతు

# చిన్నారుల జీవితాల్లో చిరునవ్వులు

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

గిరిజన ప్రాంతానికి చెందిన ఈ శిశువు జిల్లా ఆసుపత్రిలో ఇటీవల జన్మించింది. వైద్యులు పరీక్షించగా పాదాలు వంకర్లు తిరిగినట్లు గుర్తించారు. సత్వర చికిత్స కేంద్రంలో చేర్చి పాదాలు సరిచేసి పంపారు.

పుట్టబోయే బిడ్డపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. వారి భవిష్యత్తుపై కలలు కంటారు. కానీ గుండెలో రంధ్రాలు, గ్రహణ మొర్రి, పాదాలు వంకర తిరగడం, నేత్ర సమస్యలతో కొందరు శిశువులు జన్మిస్తుంటే చిన్న వయసులో బిడ్డకు ఈ కష్టమేంటని ఆందోళనకు గురవుతున్నారు. అలాంటి చిన్నారుల జీవితాల్లో వెలుగు నింపేందుకు బాలల సత్వర చికిత్స కేంద్రం తనవంతు ప్రయత్నం చేస్తోంది.

పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రి సమీపంలో బాలల సత్వర చికిత్స కేంద్రం ఉంది. అప్పుడే పుట్టిన బిడ్డలకు సత్వర సేవలు అందించేందుకు నిపుణులు అందుబాటులో ఉన్నారు. ఇక్కడ 44 రకాల వైద్య చికిత్సలు అందిస్తారు. కౌన్సెలింగ్, వ్యాయామాలు, ఆటలు మొదలైనవి అందుబాటులో ఉన్నాయి.

## కొండంత అండగా సత్వర చికిత్స కేంద్రం

పార్వతీపురంలోని చికిత్స కేంద్రం

★ న్యూరల్ ట్యూబ్ లోపాలు, జన్యుపరమైన రుగ్మత(డౌన్ సిండ్రోమ్), అంగుటి చీలిక, క్లబ్ ఫుట్ (వంకర పాదాలు), ఎనీమియా, విటమిన్-ఎ, డి లోపం, గుండె సంబంధ సమస్యలు, ఛైల్డ్ హుడ్ లెప్రసీ, బుద్ధిమాంద్యం, దంత, నేత్ర సమస్యలపై బాలలకు చికిత్సలు అందిస్తారు.

## ప్రత్యేక వాహనం

జిల్లాలో ఏటా 10-12 వేల మధ్య ప్రసవాలు జరుగుతున్నాయి. పుట్టుకతో వివిధ రుగ్మతుల బారిన పడుతున్న చిన్నారులు వందల సంఖ్యలో ఉంటున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు వారికి ఇక్కడ చికిత్సలు అందిస్తారు. జిల్లాలోని 15 మండలాల్లో ఉన్న పీహెచ్‌సీలు, ఆసుపత్రుల్లో ఎక్కడైనా బిడ్డలు సమస్యతో పుడితే ఆర్బీఎస్‌కే కేంద్రానికి సమాచారం ఇవ్వొచ్చు. వెంటనే ప్రత్యేక వాహనంలో వారిని కేంద్రానికి తీసుకొస్తారు.

అందించిన చికిత్సలు..

| రుగ్మత | 2024 | 2025 (ఇప్పటివరకు) |
|---|---|---|
| గుండె | 20 | 04 |
| అంగుటి చీలిక | 08 | 04 |
| క్లబ్‌ఫుట్ | 14 | 08 |
| వెన్నెముక | 02 | 00 |
| నేత్రాలు | 05 | 02 |

## నిత్య పర్యవేక్షణ..

బిడ్డ పుట్టిన వెంటనే ఆరోగ్య సమస్యలుంటే పరీక్షించి స్థాయిని బట్టి చికిత్స అందిస్తాం. గుండెలో రంధ్రాలు, గ్రహణ మొర్రి, వెన్నెముక సమస్యలుంటే విశాఖకు రిఫర్ చేస్తాం. అక్కడ పిల్లలు కోలుకునే వరకు పర్యవేక్షిస్తారని ఆర్బీఎస్‌కే వైద్య నిపుణుడు భరత్‌చంద్ర పేర్కొన్నారు. బుద్ధిమాంద్యం పిల్లలకు కౌన్సెలర్లు, సిబ్బంది సేవలు అందిస్తారు.

# చిన్నారుల కష్టాలకు చలించి.. పెద్దలంతా అండగా నిలిచి..

## రూ.50 వేలతో బడి నిర్మాణం

కొమరాడ మండలంలోని కొండ శిఖర గ్రామం గాజులగూడ. అక్కడున్న పాఠశాలను ప్రభుత్వం ఆదర్శంగా ఎంపిక చేసింది. 55 మంది విద్యార్థుల కోసం అయిదుగురు ఉపాధ్యాయులను నియమించింది. కానీ ఏం లాభం. 5 తరగతులకు ఉన్నది ఒకటే గది. గతంలో అదనపు భవనాల కోసం రూ.5.50 లక్షలు కేటాయించగా స్లాబ్ వరకు పనులు చేసి సగంలో వదిలేశారు. దీంతో ఆరుబయట, వరండాలో బోధనతో విద్యార్థులకు నిత్యం ఇబ్బందులు ఎదురయ్యేవి. వర్షం పడితే మరింత ఎక్కువయ్యేవి. వారి అవస్థలను గ్రామస్థులు గుర్తించారు. పిల్లల చదువు కోసం.. వారి భవిత కోసం 110 కుటుంబాల ప్రజలు ఏకమయ్యారు. మంచి బడి అవసరమని భావించారు. ఇంటికి రూ.400, రూ.500 చొప్పున చందాలు వేసుకొని రూ.50 వేలు పోగుచేశారు. సగంలో నిలిచిన భవనం పనులు పూర్తి చేసేందుకు రేకులు, ఇటుకలు తీసుకొచ్చారు. ఆదివారం నుంచి పనులు ప్రారంభించారు. పిల్లల కష్టాలు తీర్చేందుకు పనులు చేస్తున్నట్లు తెలిపారు. విషయం ఎంఈవో జామి నారాయణస్వామి వద్ద ప్రస్తావించగా.. విద్యార్థుల సంఖ్య పెరగడంతో పెద్ద ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నారు. దీని కోసం రూ.8 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. – న్యూస్‌టుడే, కొమరాడ

# వనం విరిసి.. మనసు మురిసి..

చుట్టూ పచ్చని మొక్కలు.. సూర్యోదయంతో పాటు వికసించే విరులు.. ఆరగింపునకు ఆహ్వానం పలికే ఫలాలు.. అబ్బురపరిచే కూరగాయలు.. హరితవనంలో అభిరుచులను ఆస్వాదిస్తున్నారు జిల్లావాసులు. మొక్కవోని దీక్షతో మిద్దె తోటల పెంపకం చేపడుతున్నారు. రసాయనాలకు దూరంగా ప్రకృతి సాగుకు ప్రణమిల్లుతున్నారు. పంట.. మా ఇంట.. అని ముచ్చటపడుతూ.. మురిసిపోతున్నారు.

## సాగులో అవిశ్రాంతంగా

సాలూరు: పట్టణంలోని కోటవీధికి చెందిన **ఆదిత్య ప్రతాప్ భంజ్ దేవ్** విశ్రాంత జిల్లా న్యాయమూర్తి. ఉద్యోగ విరమణ తర్వాత పచ్చదనంపై ప్రేమ పెంచుకున్నారు. మేడపై, ఇంటి చుట్టూ మొక్కలు నాటారు. అల్‌మసాలా, డ్రాగన్ ఫ్రూట్, అరటి, కొబ్బరి, లిచి, స్వీట్ లెమన్, ఉసిరి తదితర 32 రకాల పండ్ల జాతులు, 12 రకాల పూలు, ఔషధ మొక్కలు వేశారు. నీటి కోసం సౌర పలకలు ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలాలను వృథాగా వదిలేయకుండా మొక్కలు పెంచాలని ఆయన సూచిస్తున్నారు.

## అభిరుచి ఆస్వాదిస్తూ..

పాలకొండ, గ్రామీణం: పట్టణంలోని నక్కపేటకు చెందిన **నల్లాన ప్రేమాన్వితకు** మొక్కల పెంపకమంటే మక్కువ. ఇంటి డాబాపై డ్రాగన్ ఫ్రూట్, తెల్లనేరడి, అంజీర, మిరాకిల్ ఫ్రూట్, మల్బరీ, వాక్కాయ, నిమ్మగడ్డి, ఆల్‌స్పైసెస్, నల్లేరు తదితర అరుదైన జాతులను పెంచుతున్నారు. వీటితోపాటు మూడు రకాల బెండ, బీరకాయలు, ఇతర కూరగాయల సాగు చేపడుతున్నారు. ద్రాక్ష, స్టార్ ఫ్రూట్, రణపాల, కొండపిండాకు, తెల్లగన్నేరుతోపాటు మినీ కదంబం, సంపెంగి, పారిజాతం, అకేనియం, మధుకామిని తదితర రకాలకు చెందిన పూలమొక్కలను పెంచుతున్నారు. మిద్దెపై మొక్కల పెంపకానికి ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. 'రసాయనాలతో పండించిన కూరగాయలు వంట సమయంలో అదో రకమైన వాసన వచ్చేది. తినలేకపోయేవాళ్లం. దీంతో భర్త రామ్మోహన్ సహకారంతో ఇంటి మేడపైనే కూరగాయల సాగు ప్రారంభించాం.' అని చెబుతున్నారు ప్రేమాన్విత.

## సూచనలు.. సలహాలు అందిస్తూ..

సీతంపేట: సీతంపేటకు చెందిన **ఎం. విక్టోరియారాణి** పంచాయతీ కార్యదర్శి. భర్త మోహనరావు సహకారంతో ఇంట్లోనే పండ్లు, కూరగాయల మొక్కలు పెంచుతున్నారు. మేడపై ఎనిమిది డ్రాగన్ ఫ్రూట్, రెండు ప్యాషన్ ఫ్రూట్, 2 నిమ్మ, దానిమ్మ, రేగు మొక్కలతో పాటు వంకాయలు, బీర, మిరప తదితర మొక్కలు వేశారు. కూరగాయల వ్యర్థాలతో తయారైన ఎరువును వీటికి వినియోగిస్తున్నారు. మిద్దె తోటల పెంపకంపై బంధువులు, స్నేహితులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

## మేడపైనే ద్రాక్ష.. డ్రాగన్ ఫ్రూట్

పార్వతీపురం పట్టణం, గ్రామీణం: పార్వతీపురం మండలం పులిగుమ్మి సర్పంచి **బేతా బాలాకుమారికి** చిన్ననాటి నుంచి మొక్కలంటే ఇష్టం. భర్త సహకారంతో ఇంటి మేడపై ద్రాక్ష, నల్లేరు, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు వేశారు. పెరట్లోని 20 సెంట్లలో బీర, చిక్కుడు, దొండలాంటి తీగ జాతులు, ఆకు కూరలు, అరటి, సపోట, జామ, నాలుగు రకాల నిమ్మజాతి, పూల మొక్కలు పెంచుతున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు వినియోగించడం లేదని బాలాకుమారి చెబుతున్నారు.

# మోసగించి వ్యాపారి పరారీ

జయపురం, కొరాపుట్, న్యూస్‌టుడే: పలువురు వ్యాపారుల వద్ద సామగ్రి తీసుకుని మరో వ్యాపారి పరారైన ఘటన కొరాపుట్ పట్టణంలో చర్చనీయాంశమైంది. ఐఐసీ సత్యనంద్‌పాత్ర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో పూజారిపుట్ ప్రాంతంలో విశ్వాల్ కాలనీకి చెందిన పి.జగన్నాథ్ పాత్ర్ ఆరేళ్లుగా దుకాణం నడుపుతున్నాడు. ఏప్రిల్ నెలలో తనకి పెద్ద గిరాకీ వచ్చిందని 17 మంది హోల్‌సేలర్ల వద్ద రూ. 1.11 కోట్లు విలువైన సామగ్రిని తీసుకువెళ్లాడు. రెండు నెలల తరువాత డబ్బులిస్తానని నమ్మబలికాడు. 10వ తేదీన దుకాణం ఖాళీ చేసినట్లు తెలుసుకున్న వ్యాపారులు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు టి.కిరణ్‌కుమార్ నేతృత్వంలో ఆదివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ఐఐసీతో మాట్లాడుతున్న వ్యాపారులు

# గోరింటాకు సంబరాలు

ఆషాఢ మాసం సందర్భంగా జిల్లాలో ఆదివారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. పార్వతీపురం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని మహిళలు గోరింటాకు, పూలతో అలంకరించారు. లక్ష్మీనారాయణులను స్తుతించి, గోరింటాకు పెట్టుకున్నారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం

## అదుపు తప్పితే ఆసుపత్రికే..

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో 18వ వార్డు పరిధిలో కాలువపై ఏర్పాటు చేసిన పలకకు రంధ్రం పడటంతో ప్రమాదకరంగా ఉంది. రాత్రివేళ రాకపోకలు చేస్తున్నప్పుడు పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువపై పలకలు మార్చేందుకు చర్యలు చేపడతామని ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

## ప్రహరీ పూర్తి చేయరూ..

వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పశువులు, కుక్కలు లోపల రావడంతో పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు బకాయిలుండటంతో ఆలస్యమవుతున్నాయని, త్వరలో పనులు పూర్తి చేస్తామని సచివాలయం ఇంజినీరు సహాయకులు సూర్య తెలిపారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

## ఇక్కడో కాలువ ఉంది..

బలియాపుట్టుగ కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కంచిలి ప్రధాన రహదారికి వరకు సీసీ రోడ్డుకు ఇరువైపులా ఉండే కాలువలు చెత్త, మట్టి పేరుకుపోయి మూతపడ్డాయి. మురుగునీరు నిల్వ ఉండి దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాంబాబును వివరణ కోరగా పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు.
– న్యూస్‌టుడే, కంచిలి

## మట్టి సరిపోలేదు..

ఇచ్ఛాపురం పట్టణం ఎల్లమ్మ గుడివీధి, పాత జాతీయరహదారిని కలిపే మార్గంలో కాలువపై కల్వర్టు నిర్మించలేదు. అంతకు ముందు ఇక్కడ వేసిన పలకలు భారీ వాహనాల తాకిడికి విరిగిపోవడంతో కాలువను మట్టితో మూసేశారు. ఇప్పుడు ఆ ప్రాంతం లోతుగా మారిపోవడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని, అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదనలు పంపిస్తామని, నిధులు రాగానే పనులు చేపడతామని ర.భ.శాఖ ఏఈ విక్రాంత్ తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## ఎక్కడ వేచి ఉండాలో..!

వజ్రపుకొత్తూరు మండలం యాజీపురంలో 20 ఏళ్ల కిందట నిర్మించిన విశ్రాంతి భవనం శిథిలమైంది. ప్రయాణికులు ఎండలో వేచి ఉండటానికి అవస్థలు పడుతున్నారు. అమలపాడు కూడలి వద్ద, ఎస్‌జేపురం వద్ద విశ్రాంతి భవనాలు లేవు. ఈ విషయాన్ని ఎంపీడీవో రమేశ్‌నాయుడు వద్ద ప్రస్తావించగా విశ్రాంతి భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

# పదునైన ఆట.. పతకాల వేట

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: వారంతా నిరుపేద గిరిజన విద్యార్థులు. క్రీడలపై ఉన్న ఆసక్తితో చదువుతోపాటు ఆటలపై దృష్టి సారించి సత్తా చాటుతున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన పలువురు గిరిజన విద్యార్థులు ఫెన్సింగ్ ఆటలో రాణిస్తున్నారు. శిక్షకుడు మాధవరావు తర్ఫీదు ఇవ్వడంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో చక్కటి ప్రతిభ చూపుతూ ఆకట్టుకుంటున్నారు.

## నాశిక్‌లో..దేశిక్

గుమ్మలక్ష్మీపురం మండలం జొల్లగూడకు చెందిన **దేశిక్** కొత్తగూడ ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. క్రీడలపై ఉన్న మక్కువతో ఫెన్సింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాడు. ఇప్పటికే విజయవాడ, మహారాష్ట్ర రాష్ట్రంలోని నాశిక్‌లో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకున్నాడు.

## జాతీయ స్థాయిలో..

గుమ్మలక్ష్మీపురం మండలం కన్నయ్యగూడకు చెందిన **తోయక నరేంద్ర నరసింహ** భద్రగిరి ఏపీఆర్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ద్వితీయ బహుమతి గెలిచాడు. ప్రస్తుతం నాశిక్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడమే లక్ష్యమని చెబుతున్నాడు.

## రాష్ట్ర స్థాయిలో ప్రతిభ

ఇచ్ఛాపురానికి చెందిన **మండంగి శేఖర్‌కు** క్రీడలపై ఉన్న ఆసక్తిని గమనించిన శిక్షకుడు తర్ఫీదు ఇవ్వడంతో చక్కటి ప్రతిభ కనబరుస్తున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో నాలుగు సార్లు పాల్గొని పతకాలు సాధించాడు. ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లోనూ బహుమతి గెలిచాడు. ప్రోత్సహిస్తే.. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తానని చెబుతున్నాడు.

## 5 సార్లు బహుమతులు

కొరటిగూడకు చెందిన **తోయక పరమేశ్** ఆటల్లో మేటిగా నిలుస్తున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో 5 సార్లు పాల్గొని బహుమతులు సొంతం చేసుకున్నాడు. బిహార్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాడు. మరిన్ని విజయాలు సాధించి, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలవడమే లక్ష్యమని చెబుతున్నాడు.

## అమ్మవార్లకు చల్లదనోత్సవం

వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురం, చిన్నమురహరిపురం గ్రామాల పరిధిలో నూతనంగా నిర్మించిన మరిడమ్మ, ఉజ్జుడమ్మ అమ్మవార్ల ఆలయ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా అమ్మవార్ల విగ్రహాలను రథాలపై ఊరేగించి, వేప కొమ్మలతో చల్లదనం చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా విచ్చేసి పూజలు చేశారు. సర్పంచి వసంతరావు, ఎంపీటీసీ సభ్యుడు వసంతరావు, యువత, మహిళలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

## 12 గంటలపాటు వరుణయాగం

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట పట్టణంలో వర్షాలు కురవాలని కోరుతూ పట్టుశాలి వీధిలో ఆదివారం నిర్విరామంగా 12 గంటలపాటు వరుణయాగం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త సుధాకర్ ఆధ్వర్యంలో రుత్వికులు నిర్వహించిన హోమంలో స్థానికులు పాల్గొన్నారు. చుట్టుపక్కల వర్షాలు పడుతున్నప్పటికీ సోంపేట పట్టణంలో లేకపోవడంతో ఏర్పడుతున్న ఇబ్బందులు గమనించి తాము యాగం చేస్తున్నామని నిర్వాహక ప్రతినిధి గిరిబాబు పేర్కొన్నారు.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు
యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనలపై జీఎస్టీ 5% శాతం అదనం
ఈనాడు ప్రకటనల విభాగం
80085 97609

(c) eenadu

# ఖాళీ కుర్చీలు.. కళ తప్పిన బోర్డులు!

ఈనాడు, అమరావతి

వెల్దుర్తి: శివలింగాపురంలో మాస్టారు లేక ఖాళీగా విద్యార్థులు

భావి పౌరుల భవిష్యత్తును నిర్దేశించేవి బడులే. అంతటి కీలకమైన చదువు కొన్నిచోట్ల విద్యార్థులకు అందడం లేదు. పల్నాడు జిల్లాలోని అనేక పాఠశాలల్లో అసలు ఉపాధ్యాయులే లేరు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు మరో సమస్యగా తయారయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 5 వేల మంది ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయ్యారు. ఎక్కువ మంది గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పనిచేయడానికే మొగ్గు చూపి వచ్చేయడంతో పల్నాడు జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేని దుస్థితి ఏర్పడింది.

**ఉపాధ్యాయ బదిలీలతో కొత్త సమస్య**

**మచ్చుకు కొన్ని..** మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలంలో 98 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి రాగా ప్రస్తుతం ఇక్కడ 27 మంది మాత్రమే ఉన్నారు. అంటే 71 మంది కొరత ఉంది. 8 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నా ఉపాధ్యాయులు లేక నల్లబోర్డు, ఖాళీ కుర్చీనే స్వాగతం పలుకుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటివి 122 మేర పాఠశాలలున్నట్లు సమాచారం. మారుమూల తండాలు, రవాణా సదుపాయాలు లేని అటవీ ప్రాంతం కావడంతో బదిలీపై వెళ్లినవారి స్థానంలో రావడానికి ఎవరూ మొగ్గుచూపడం లేదు.

**ఇక్కడ మరో అవస్థ..** ఇక ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మరో రకం సమస్యలు నెలకొన్నాయి. ఆ రోజు ఉపాధ్యాయుడు సెలవు పెడితే బడికీ సెలవు ప్రకటించాల్సిందే. పొరుగు పాఠశాలల్లోని వారిని వినియోగించడానికీ వీల్లేకుండా ఖాళీలు దర్శనమిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల సంఖ్యలో ఇలాంటివి ఉన్నాయి. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలో మొత్తం 56 బడులకు 30 ఏకోపాధ్యాయ పాఠశాలలే కావడం గమనార్హం. బాపట్ల జిల్లాలో 441 ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దీనికితోడు, గుంటూరు, బాపట్ల జిల్లా కేంద్రాల్లో ఉండే కొందరు ఉపాధ్యాయులు మారుమూల మండలాల్లో పనిచేయాల్సి రావడంతో వారు వెళ్లి రావడానికే సమయం సరిపోతూ బోధనపై ఆ ప్రభావం పడుతోంది. ఈ సమస్యలకు చెక్ పెట్టాలంటే ఎంటీఎస్ ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

**తాత్కాలికంగా ఏర్పాట్లు..** బదిలీల కారణంగా ఉపాధ్యాయులు లేని బడుల్లో అధికారులు తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో పనిచేసి బదిలీ అయిన వారిని వెనక్కి రప్పించి పాఠశాలలు నడిపిస్తున్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ నుంచి 32 మంది వాలంటీర్లను నెలకు రూ.8 వేలు జీతం ఇచ్చేలా నియమించుకుని వినియోగిస్తున్నారు. అయినా సమస్య కొలిక్కి రావడం లేదు. అంతా డీఎస్సీ భర్తీ పైనే ఆశలు పెట్టుకున్నారు.

## గంగామహాలక్ష్మికి ఆషాఢ సారె

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని వల్లప్ప చెరువుగట్టుపై ఉన్న గంగా మహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. మహిళలు పాతూరు నుంచి సారెతో ప్రదర్శనగా ఆలయానికి వచ్చారు. సారె సమర్పించి పూజలు చేశారు. అమ్మవారిని కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు.


# ఈనాడు పల్నాడు

సోమవారం జులై 14, 2025




# ఆస్తులున్నా... పేదలే!

## నిషేధిత జాబితాలో చేరడంతో క్రయవిక్రయాల్లేక ఆవేదన

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

ఆస్తులున్నా పేదలుగా మిగిలిన యజమానుల దీనగాథ ఇది. వీరి భూములు, నివాస గృహాలు నిషేధిత జాబితాలో చేరడంతో క్రయవిక్రయాలకు వీలు లేకుండాపోయింది. నిషిద్ధ జాబితా నుంచి తొలగించాలని యజమానులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. ఇలాంటివారు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 6,700 మంది ఉండగా.. ఒక్క చిలకలూరిపేటలోని 165 సర్వే నంబర్లలో 782 మంది ఉన్నారు. వీరికి సంబంధించిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో అమ్ముకోలేక, రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం సమస్యను పరిష్కరిస్తుందని వీరు ఆశలు పెట్టుకున్నారు.

**సమస్య ఇదీ..** గతంలో జమీందారులు.. దేవాలయాలకు సేవలందించే వారి జీవనోపాధి నిమిత్తం సాగు భూములను ఈనాం(విరాళం)గా ఇచ్చేవారు. జమీందారీ వ్యవస్థ రద్దయ్యాక 1956లో నాటి ప్రభుత్వం ఈనాం చట్టాన్ని తీసుకొచ్చి రైతువారీ పట్టాలు అందజేసింది. 1956 నుంచి 2013 వరకు ఈనాం భూములపై క్రయవిక్రయాలు లావాదేవీలు జరిగాయి. 2013లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఈనాం ల్యాండ్ అబాలిషన్ చట్టం తెచ్చి ఆ భూములను 22ఎ, సిలో చేర్చి నిషేధిత జాబితాలో ఉంచారు. అప్పటికే ఆ భూములు, ఇళ్లు ఏడెనిమిదిసార్లు రిజిస్ట్రేషన్లు జరిగినా నిషేధిత జాబితాలో చేరినందున క్రయవిక్రయాలకు వీల్లేకుండా పోయింది. సొంత అవసరాలకు భూమిని అమ్ముకోలేక.. ఆసుపత్రి ఖర్చులు, ఇతర అవసరాలకు తాకట్టు పెడదామన్నా వీలులేని పరిస్థితి ఏర్పడింది. న్యాయబద్ధంగా కొనుక్కున్న భూ, గృహాల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి 2019లో తెదేపా ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చినా చివరిలో ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైకాపా నేత జగన్ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చినా నెరవేర్చలేదు.


నిషేధిత జాబితాలో చేరిన చిలకలూరిపేట సీఆర్‌కాలనీ

**ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుంది..** 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈనాం భూముల (రైతువారీ) సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. సీఎం చంద్రబాబు కూడా రెవెన్యూ సమస్యలన్నీ ఏడాదిలోపు పరిష్కరిస్తామని చెప్పారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది' అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.

'మా తాతల నుంచి నాకు సంక్రమించిన 1.16 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉంచారు. దానిని విక్రయించి పిల్లలకు వివాహం చేద్దామంటే వీలు పడటం లేదు. కనీసం బ్యాంకులో తనఖా పెట్టి రుణం పొందలేని పరిస్థితి' అని చిలకలూరిపేటకు చెందిన గోపిదేశి రాంప్రసాద్ తెలిపారు. 'పట్టణంలోని సీఆర్ కాలనీలో సర్వే నంబరు 8, 9లో 200 ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టారు. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన ఆస్తులు ప్రస్తుతం నిరర్థకంగా మారాయి. మానసికంగా కుంగిపోతున్నాం' అని అప్పారావు వివరించారు.

# బైపాస్ ప్రాంతాల్లో ఇబ్బందులకు బైబై!

## స్థానిక రహదారుల అభివృద్ధికి నిధులు

ఈనాడు - అమరావతి

దాచేపల్లి- మాచర్ల మార్గం

జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా పట్టణాలు, పల్లెల్లో బైపాస్‌లు నిర్మించే క్రమంలో పాత రోడ్ల అభివృద్ధికి కేంద్రం వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ కింద నిధులు మంజూరు చేస్తోంది. దాచేపల్లి- మాచర్ల, సాగర్ - దావుపల్లి జాతీయ రహదారుల్లో బైపాస్‌లు వెళ్లే ప్రాంతాల్లో స్థానిక మార్గాల అభివృద్ధితోపాటు ఇరువైపులా మురుగుకాలువలు నిర్మించడానికి నిధులు వినియోగిస్తారు. దాచేపల్లి నుంచి మాచర్ల వరకు 44 కిలోమీటర్ల దూరాన్ని రెండు వరుసలుగా విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో నడికుడి, పాల్వాయి ప్రాంతాల్లో బైపాస్‌లు నిర్మిస్తున్నందున స్థానిక రోడ్లపై ఒక లేయరు తారువేసి అభివృద్ధి చేస్తారు. సాగర్- దావుపల్లి మార్గంలోని ఉప్పలపాడు, వెల్దుర్తి, శిరిగిపాడు గ్రామాల నుంచి బైపాస్ వెళ్తున్నందున స్థానికంగా రహదారులు, మురుగు కాలువలు నిర్మించనున్నారు. ఇందుకు కేంద్రం రూ.10 కోట్లు కేటాయించింది. జాతీయ రహదారుల సంస్థ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి అంచనాలు తయారుచేస్తున్నారు. ఆయా పనులు ఎక్కువగా చేయాల్సి ఉండటంతో సుమారు రూ.20 కోట్ల వరకు అంచనా వ్యయం పెరగనుంది.

**ఇరువైపులా డ్రెయిన్ల నిర్మాణం..** నడికుడి, పాల్వాయి, ఉప్పలపాడు, వెల్దుర్తి, శిరిగిరిపాడులో బైపాస్‌లు నిర్మిస్తున్నందున ఆయా ప్రాంతాల్లోని పాత రహదారులు బాగుచేస్తారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్లు నిర్మించి వర్షపు, మురుగునీరు నిలవకుండా చర్యలు చేపడతారు. బైపాస్‌లు ఏర్పాటయ్యాక పాత రోడ్లను అభివృద్ధి చేయరు. అందుకే కేంద్రం నిధులు విడుదల చేస్తోంది. ప్రాథమికంగా రూ.10 కోట్లకు ప్లాన్‌లో ఆమోదం తెలిపినందున అదనంగా అయ్యే వ్యయాన్ని కూడా కేంద్రం విడుదల చేయనుంది. ఈ నిధులతో ఆయా ప్రాంతాల్లో పనులు చేపట్టి అభివృద్ధి చేస్తామని జాతీయ రహదారుల సంస్థ ఇంజినీరు ఒకరు తెలిపారు.

## ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

### 907 మంది విద్యార్థుల ఎంపిక

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఇందులో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, వికలాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80.. మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్కే వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తరగతులు 14 నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులు తమ లగేజీతో వచ్చి రిపోర్ట్ చేసి తరగతులకు హాజరయ్యేలా సిద్ధపడి రావాలని సూచించారు.

- మొదటి దశ తరువాత మిగిలిన ఖాళీలను దృష్టిలో ఉంచుకుని అంతర్గత బదిలీలు నిర్వహించినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా 384 మందికి లబ్ధి కలిగినట్లు వివరించారు. ఇప్పటి వరకు 4,340 మంది విద్యార్థుల ఎంపిక పూర్తి అయిందని తెలిపారు. ఇంకా 60 సీట్లు మిగిలి ఉండగా ఇందులో ఎన్‌సీసీ కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఈ సీట్ల ఎంపిక ఫలితాలను వచ్చే వారం విడుదల చేస్తామని రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు.

# మేజర్‌పై సందిగ్ధం.. ప్రవేశాల్లో జాప్యం

సత్తెనపల్లి, మాచర్ల - న్యూస్‌టుడే

మాచర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలొచ్చి మూడు నెలలు కావస్తోంది. సప్లిమెంటరీ ఫలితాలు వెలువడి కూడా చాలా రోజులైంది. ఇప్పటివరకూ డిగ్రీ మొదటి సంవత్సర ప్రవేశాల ప్రక్రియ మొదలవకపోవడంతో విద్యార్థుల్లో అయోమయం నెలకొంది. డిగ్రీలో ఈ ఏడాది పాత పద్ధతిలో సింగిల్ మేజర్ అమలు చేయాలా లేదా డబుల్ మేజర్ విధానమా అనే విషయమై సందిగ్ధత నెలకొంది. ఫలితంగా ప్రవేశాలపై ఇంకా స్పష్టత రాలేదు.

**డిగ్రీలో చేరే విద్యార్థుల్లో అయోమయం**

ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని కళాశాలల్లో డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ మొదలుకాబోతోంది. గతేడాది జులై 20 నుంచి ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభించగా.. ఈ ఏడాది మరింత ఆలస్యంగా మొదలయ్యే అవకాశం ఉందని అధ్యాపకులు చెబుతున్నారు.

**వివిధ అంశాలపై ప్రభావం..** డిగ్రీ మొదటి సంవత్సర ప్రవేశాల జాప్యం తరగతులు, సన్నద్ధత, పరీక్షలపై పెనుప్రభావం చూపిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో సుమారు 60 డిగ్రీ కళాశాలలున్నాయి. మొదటి సంవత్సరంలో 4 నుంచి 5 వేల మంది విద్యార్థులు చేరవచ్చనే అంచనా ఉంది. జాప్యంతో ప్రవేశాలు తగ్గుతాయనే చర్చ కూడా నడుస్తోంది.

**ఎటువైపు మొగ్గు..** 2020-21 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయి. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తున్నారు. ఈ ఏడాది పూర్వ పద్ధతి(ఆఫ్‌లైన్)లో ప్రవేశాలకు అవకాశం కల్పించాలనే డిమాండ్ ఉంది. దీన్ని ఉన్నత విద్యా మండలి పరిశీలిస్తోంది. ఇంకా ఆన్‌లైన్.. ఆఫ్‌లైన్‌లో ఎటు వైపునకు మొగ్గు చూపిస్తారో మార్గదర్శకాలు రాలేదు.

**డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం కావాలని..** వైకాపా ప్రభుత్వం డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు(ఒకేసారి రెండు సబ్జెక్టులు) విధానం అమలు చేసింది. దీని వల్ల ఎన్నో రకాల సమస్యలు తలెత్తాయి. దాని స్థానంలో ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలు చేయాలనే డిమాండ్ ఉంది. ఈ విధానంలో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ కూడా డబుల్ మేజర్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. అయితే ఏ విధానం అమలు చేయాలనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

భార్య రుక్మిణితో శ్రీనివాసరావు (పాత చిత్రం)

## సొలస అల్లుడే కోట

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** విలక్షణ నటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు మరణ వార్త విని.. జిల్లాలో ఆయన అభిమానులు, నాటకరంగ కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేటలతో ఆయనకున్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. కోట శ్రీనివాసరావు చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన కరణం రాజేశ్వరరావు కుమార్తె రుక్మిణిని 1968లో వివాహం చేసుకున్నారు. అప్పటికే ఆ కుటుంబం విజయవాడలో స్థిరపడటంతో అప్పుడప్పుడు సొలసలోని బంధువుల ఇంటికొచ్చేవారు. గ్రామంలో సాంఘిక నాటకాలు నేర్చుకుంటున్న యువకులకు సూచనలు ఇచ్చేవారని, మెలకువలు నేర్పేవారని ఆ తరం వారు గుర్తు చేసుకున్నారు.

# నిర్భయంగా ఆటోలో వెళ్లొచ్చిక!

ఆటోకు కేటాయించిన నంబరు, క్యూఆర్ కోడ్ స్టిక్కర్ డ్రైవర్‌కు అందజేస్తున్న పోలీసులు

**నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే:** ఆటోల్లో ఒంటరిగా ప్రయాణమంటే పలు అనుమానాలతో ప్రయాణికులు వెనకడుగు వేస్తున్న పరిస్థితులు తెలిసిందే. ఆటోల్లో ప్రయాణం సురక్షితమే.. అన్న భరోసా కల్పిస్తూ పోలీసు శాఖ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిలో ఆటో డ్రైవర్‌కు సంబంధించిన అన్ని వివరాలు పొందుపరిచారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో సుమారు 1500 ఆటోలు ఉండగా.. వీటన్నింటికి పోలీసుశాఖ కేటాయించిన ప్రత్యేక నంబర్లతో పాటు క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తెచ్చారు.

**చోదకుడి వివరాలతో క్యూఆర్ కోడ్**

**ఆగడాలకు చెక్..** కొందరు ఆటో చోదకులతో ప్రయాణికులకు ఎదురయ్యే సమస్యలకు చెక్ పెట్టేలా పోలీస్ శాఖ క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీనిలో భాగంగా ప్రతి ఆటో డ్రైవర్ సీటు వెనుక క్యూఆర్ కోడ్ అతికిస్తున్నారు. ఎవరైనా డ్రైవర్ దురుసుగా ప్రవర్తించినా, మద్యం తాగి వాహనం నడుపుతున్నా, విలువైన వస్తువులు ఆటోలో పోగొట్టుకున్నా ప్రయాణికులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పంపితే చాలు వెంటనే ఆ ఆటో వివరాలు, ఎక్కడుందనేది కమాండ్ కంట్రోల్ ద్వారా పోలీసులకు సమాచారం అందుతుంది. పోలీసులు అప్రమత్తమై వెంటనే చర్యలు తీసుకుంటారు. మహిళల రక్షణకు అందుబాటులో ఉన్న 100, 112, 181 నంబర్లను కూడా ప్రతి ఆటోలో పొందుపరిచారు.

**ప్రజల భద్రతే లక్ష్యం**

ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆటోలకు క్యూఆర్ కోడ్, నంబర్లు కేటాయించాం. ఆటోల్లో ఎక్కే ప్రయాణికులు ముందుగా క్యూఆర్ కోడ్, నంబర్ ఫొటో తీసి పెట్టుకోవాలి. దీనివల్ల ఏదైనా సమస్య ఎదురైతే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆటో డ్రైవర్ వివరాలు తెలుసుకొని ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉంది. నరసరావుపేటలో 800 ఆటోలకు నంబర్లు, క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అతికించాం. మిగిలిన వాటికి త్వరలోనే అంటించి ప్రయాణికులు నిర్భయంగా ఆటోల్లో ప్రయాణం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

- లోకనాథం, ట్రాఫిక్ సీఐ

## 551.10 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

క్రస్టుగేట్లకు చేరిన జలాలు

**విజయపురిసౌత్, న్యూస్‌టుడే:** నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటలకు 551.10 అడుగులకు చేరింది. ఇది 212.2078 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1,650 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం నీటిమట్టం 883.30 అడుగుల వద్ద కొనసాగుతోంది. జూరాల, రోజాల నుంచి శ్రీశైలం జలాశయానికి 72,763 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 63,317 క్యూసెక్కుల నీరు వస్తోంది.

# ఆదాయం చేదా.. అడిగే ఉద్దేశం లేదా?

## జడ్పీ బకాయిలు రూ.1.15 కోట్లు

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే

జిల్లా పరిషత్తుకు ఉన్న స్థలాలు, భూములు, వాణిజ్య దుకాణాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఇందులో సింహభాగం దుకాణాల అద్దె ద్వారా లభిస్తోంది. దుకాణాల లీజుదారులు అద్దెలు సక్రమంగా చెల్లించకపోవడంతో జడ్పీ నిధుల లేమితో ఇబ్బందులు పడుతోంది. ఉమ్మడి జిల్లాలో 10 వాణిజ్య దుకాణాల సముదాయాల్లో 116 దుకాణాలు ఉన్నాయి. వీటికి అద్దె రూ.1.45 కోట్లు వసూలు కావాల్సి ఉండగా రూ.67.53 లక్షలు మాత్రమే వసూలైంది. రూ.77.95 లక్షలు బకాయి పడ్డాయి. జిల్లాపరిషత్తు డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ దుకాణాల లీజుదారుల నుంచి అద్దెలు వసూలు చేసేందుకు రికవరీ డ్రైవ్ నిర్వహించి కొంతమేరకు వసూలు చేశారు. కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ జనవరి నెలాఖరులో అమలులోకి రావడంతో రికవరీ డ్రైవ్‌ని నిలిపివేశారు. దీంతో చాలావరకు బకాయిలు పెండింగ్ ఉన్నా మళ్లీ వాటి ఊసెత్తడంలేదు.

పిడుగురాళ్ల వాణిజ్య దుకాణ సముదాయం

| దుకాణ సముదాయం పేరు | దుకాణాల సంఖ్య | జూన్ వరకు అద్దెల డిమాండ్ | చెల్లించిన అద్దెలు | బకాయిలు (రూ.లక్షల్లో) |
|---|---|---|---|---|
| నరసరావుపేట | 14 | 26.52 | 19.48 | 7.04 |
| గురజాల | 16 | 26.55 | 16.00 | 10.55 |
| సత్తెనపల్లి | 5 | 3.29 | 2.04 | 1.25 |
| వినుకొండ | 10 | 5.83 | 2.98 | 2.85 |
| మాచర్ల | 4 | 1.47 | 0.3 | 1.17 |
| అచ్చంపేట | 18 | 9.7 | 4.34 | 5.36 |
| పిడుగురాళ్ల | 13 | 33.00 | 2.29 | 30.71 |
| చిలకలూరిపేట | 13 | 13.68 | 9.8 | 3.88 |
| పెదనందిపాడు | 16 | 20.52 | 8.00 | 12.52 |
| అడవులదీవి (నిజాంపట్నం) | 7 | 4.92 | 2.3 | 2.62 |
| మొత్తం | 116 | 145.48 | 67.53 | 77.95 |

**ఇతరులకు అద్దెలకు ఇస్తూ..**

పెదనందిపాడు, అచ్చంపేట, అడవులదీవి మినహా మిగిలిన ఏడు షాపింగ్ కాంప్లెక్స్‌లు పట్టణ ప్రాంతాల్లో ఉండడంతో దుకాణాలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. జడ్పీకి నామమాత్రపు అద్దెలు చెల్లిస్తున్నారనే విమర్శలున్నాయి. దుకాణాలను లీజుకు తీసుకున్న వారిలో పలువురు ఇతరులకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**మూడేళ్లుగా రూపాయి చెల్లించలేదు**

2022, ఏప్రిల్‌లో జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఏర్పాటు చేశారు. కలెక్టరు అతిథి గృహంగా జడ్పీ అతిథి గృహాన్ని అద్దె ప్రాతిపదికన తీసుకున్నారు. అప్పటి నుంచి అద్దెలు చెల్లించకపోవడంతో రూ.38 లక్షలు బకాయిలు ఉన్నాయి. మూడేళ్లు పూర్తయినా ఒక్క రూపాయి చెల్లించకపోవడం గమనార్హం.

## తురకా కిశోర్‌పై మరో కేసు నమోదు

**వెల్దుర్తి, మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే:** వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడు పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ మాజీ ఛైర్మన్ తురకా కిశోర్‌పై వెల్దుర్తి పోలీసు స్టేషన్లో మరో హత్యాయత్నం కేసు నమోదైంది. ఎస్సై సమందర్‌వలీ తెలిపిన వివరాల ప్రకారం.. 2022 అక్టోబరు 7న లోయపల్లికి చెందిన తెదేపా నాయకుడు దారపనేని శ్రీనివాసరావు పార్టీ మారలేదన్న నెపంతో తురకా కిశోర్, బోదిలవీడుకు చెందిన మేదరమెట్ల శ్రీను, పంగులూరి బాబు మరికొందరు దాడి చేసి హత్యాయత్నం చేశారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంతో బాధితుడు ఆదివారం మళ్లీ ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వారిలో మేదరమెట్ల శ్రీను, పంగులూరి బాబులను అదుపులోకి తీసుకొని 306, 307, 448, మరో రెండు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

(c) eenadu

# ఆరు గ్రామాల ప్రజల్లో ఆనందం

కొత్త రోడ్డు నిర్మాణంతో తొలగిన ఇబ్బందులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే

వినుకొండ నుంచి దొండపాడు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో పరిస్థితిని స్వయంగా గమనించిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అప్పుడే రోడ్డు మంజూరు చేయించారు. వెంటనే గుత్తేదారు రూ.70 లక్షలు ఖర్చుచేసి కంకర తోలి కొంత వరకు రోడ్డు పరిచాడు. ఇంతలో 2019లో వైకాపా ప్రభుత్వం ఏర్పడింది. దీంతో రహదారి అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గత ఆరేళ్లుగా కమ్మరిపాలెం, తిమ్మాయిపాలెం, శ్రీరాంనగర్, భారతాపురం, నడిగడ్డ, పానకాలపాలెం, దొండపాడు, రైతునగర్ గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు ఈ రహదారిపై ప్రయాణానికి నిత్యం నరకం అనుభవించారు. కంకర పరిచిన దారిలో వాహనాలు వెళ్లక విద్యార్థులను తీసుకెళ్లడానికి ఆటోలు రాక నానా అవస్థలు పడ్డారు. ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అయినా కనీసం మట్టి తోలి గుంతలైనా పూడ్చలేదు. ఈ రోడ్డు దుస్థితిపై 'ఈనాడు' పలుమార్లు కథనాలు ప్రచురించింది. మళ్లీ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారి మరమ్మతుల విషయాన్ని ఆ గ్రామాల ప్రజలు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఏకంగా కొత్త రోడ్డు నిర్మాణానికి రూ.6.15 కోట్లు మంజూరు చేయించారు. వెంటనే పనులు ప్రారంభించి రోడ్డు వేయడంతో ఆ గ్రామాల ప్రజల ఆనందానికి అవధులు లేవు. గతంలో వినుకొండ నుంచి దొండపాడు వరకు మాత్రమే రోడ్డు ఉండగా ప్రస్తుతం శ్రీరాంనగర్ నుంచి నడిగడ్డ వరకు అదనంగా మంజూరు చేయించి రోడ్డు పూర్తి చేశారు. రోడ్డు పూర్తి కావడంతో ఆ మార్గంలో ఆర్టీసీ అధికారులు బస్సు నడుపుతున్నారు. దీంతో విద్యార్థులు, ప్రజల కష్టాలు తీరాయి.

నాడు వైకాపా హయాంలో గుంతలతో..

నేడు కూటమి పాలనలో..

శివాపురం వద్ద ఆవుల మంద ఇలా..

## సొంతూళ్లకు గోమాత పయనం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వేసవిలో ప్రకాశం జిల్లాలో పశుగ్రాసం కొరత నెలకొంది. దీంతో యర్రగొండపాలెం ప్రాంతానికి చెందిన పలు గ్రామాల పశువుల కాపరులు తమ ఆవులను మేపేందుకు అవస్థలు ఎదుర్కొన్నారు. చేసేది లేక ఈ ఏడాది మార్చిలో 1200 ఆవులను గుంటూరు జిల్లా పొన్నూరు ప్రాంతానికి తోలుకెళ్లారు. ప్రస్తుతం అక్కడ రైతులు నారుమడులు సిద్ధం చేస్తుండటంతో పాటు దుక్కులు దున్నడంతో మేత తగ్గింది. దీంతో కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి మీదుగా ఆవులతో సొంతూళ్లకు పయనమయ్యారు. వర్షాలు కురవడంతో తమ ప్రాంతంలోనూ అడవులు, పొలాల్లో గడ్డి దొరుకుతుందని, అందుకే ఆవులను తరలిస్తున్నట్లు యజమానులు పేర్కొన్నారు.

# రక్తపోటు.. మధుమేహం బాధితులే అధికం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

సెలవులు లేకుండా.. రాత్రిపగలు తేడా లేకుండా ఉద్యోగం చేసే విభాగాల్లో పోలీసు శాఖ ఒకటి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు వారాంతపు సెలవులుంటాయి కానీ.. పోలీసు శాఖలో సెలవు అనే మాట ఉండదు. చివరకు పండగ రోజు కూడా బందోబస్తుకు వెళ్లాల్సిందే. అత్యవసరమైతేనే సెలవు.. కాబట్టి పని ఒత్తిడి పెరిగి, జీవనశైలి మారి ఆరోగ్యం దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో పోలీసుల సంక్షేమం కోరుతూ కూటమి ప్రభుత్వం

శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న పోలీసులు

### జిల్లాలో పోలీసులకు వైద్య పరీక్షలు

వైద్య పరీక్షలు ప్రారంభించింది. వైద్య పరీక్షల ఫలితాల ఆధారంగా ఎక్కువ మంది పోలీసులు కొలెస్ట్రాల్, రక్తపోటు, మధుమేహం సమస్యలతో బాధ పడుతున్నట్లు వెల్లడవుతోంది. ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయంలో రోజుకు 100 మంది చొప్పున అందరికీ అన్ని రకాల పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఏవైనా రుగ్మతలు బయటపడితే చికిత్స తీసుకోవాలని సూచిస్తూ సెలవులు మంజూరు చేస్తున్నారు.

**అయిదు రోజుల్లో ఇలా..** పరీక్షలు చేయించుకున్న వారు : 473 మంది బయటపడిన రుగ్మతలు: మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్

రక్తపోటు పరీక్షిస్తున్న వైద్యురాలు

**ఏమేం పరీక్షలు..** మహాత్మాగాంధీ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి జనరల్ బాడీ చెకప్‌లో భాగంగా పలు రకాల రక్త పరీక్షలు, మూత్రపిండాలు, గుండె, కాలేయం పనితీరు ఎలా ఉంది? శరీరంలో కొవ్వు శాతం ఎంత?, ప్రధాన అవయవాలు ఎలా పనిచేస్తున్నాయి? అనేది వైద్యులు గమనిస్తున్నారు. ఏమైనా తేడాలు ఉంటే వెంటనే సంబంధిత నిపుణులకు సిఫారసు చేస్తున్నారు.

**ఏం తేలింది...** వైద్య పరీక్షలు ఈ నెల 8న ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 2000 మందికి పరీక్షలు పూర్తయ్యే వరకు శిబిరం కొనసాగనుంది. ఎక్కువ మందిలో కొలెస్ట్రాల్ అధికంగా ఉందని, ఎక్కువ మంది రక్తపోటు సమస్యతో బాధపడుతున్నట్లు, మధుమేహం బారిన పడినట్లు పరీక్షల్లో తేలింది. కుర్చీల్లో ఎక్కువసేపు కూర్చొని ఉంటున్న వారిలో కొవ్వు శాతం ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

**అందరికీ నిర్వహిస్తాం..** 'జిల్లాలో హోంగార్డు మొదలు అందరికీ వైద్య పరీక్షలు పూర్తయ్యే వరకు శిబిరం కొనసాగుతుందని, అదృష్టవశాత్తు ఇప్పటివరకు పెద్దగా అనారోగ్య సమస్యలు బయటపడలేదు' అని వెల్ఫేర్ ఆర్‌ఐ గోపీనాథ్ తెలిపారు.


శాకంబరీదేవిగా నీలంపాటి శ్రీలక్ష్మి

బోనాలు చెల్లించేందుకు ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

## ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని వెంకటపతి కాలనీలోని నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మ ఆలయంలో ఆదివారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నీలంపాటి లక్ష్మి అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజు విన్యాసాలు, వివిధరకాల దేవతామూర్తుల వేషధారణలతో అమ్మవారి నగరోత్సవాన్ని నిర్వహించారు. శక్తి పీఠాధీశ్వరి శ్యామలమ్మ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

# కోటకు పేటతో అనుబంధం

చిలకలూరిపేట గ్రామీణ, నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే

నాటక రంగంతో పాటు, సినీరంగంలో కళాభిమానులు అభిప్రాయపడ్డారు. తనదైన నటనతో ప్రత్యేక బాణీని ... కోట మృతికి సంతాపం తెలిపారు. కోట శ్రీనివాసరావు మృతి ఆయన మృతి నేపథ్యంలో చిలకలూరి కళారంగానికి తీరని లోటని పలువురు పేట, నరసరావుపేటతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చిలకలూరిపేట చౌత్రా సెంటర్‌లో, గణపవరంలోనూ ఆయనకు బంధువులున్నారు. గణపవరం బంధువుల వివాహానికి చిలకలూరిపేట కూడా వచ్చారన్నారు.

### ఆత్మబంధం షూటింగ్‌కు నెల రోజులు ఇక్కడే

1991లో విడుదలైన ఆత్మబంధం సినిమా షూటింగ్ దాదాపుగా చిలకలూరిపేటలోనే జరిగింది. సుమన్, భిజ హీరో, హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో కోట శ్రీనివాసరావు ప్రతినాయకుడి పాత్ర పోషించారు. 1990 డిసెంబరు నుంచి 1991 జనవరి వరకు చిలకలూరిపేట, గణపవరం ప్రాంతాల్లోని మద్ది వెంకటరత్నం ఆతిథ్యగృహం, పెంట్యాల శివ గృహం, పట్టణ పోలీసుస్టేషన్ తదితర ప్రాంతాల్లో షూటింగ్ జరిగింది. ఆ చిత్రంలో కోటతో కలిసి స్థానిక నటులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, వీసీహెచ్‌కే ప్రసాద్ కోటతో కలిసి నటించారు.

చిలకలూరిపేట: ఆత్మబంధం సినిమాలో కోట శ్రీనివాసరావుతో నటించిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు

### టెర్రర్ చిత్రీకరణ చేస్తుండగా పద్మశ్రీ

చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామానికి చెందిన ఆరా పొలిటికల్ సంస్థ ఛైర్మన్ మస్తాన్ నిర్మాతగా 2015లో టెర్రర్ సినిమా తీశారు. అందులో కోట శ్రీనివాసరావు నటించారు. ఆ సినిమా చిత్రీకరణ చేస్తుండగానే కోటకు పద్మశ్రీ అవార్డు ప్రకటించారు. వెంటనే కేక్ కోయించి సెట్‌లో సంబరాలు చేసుకున్నారు.

నరసరావుపేట: వేదికపై కోట శ్రీనివాసరావు, కోడెల, రంగస్థలి ప్రముఖులు (పాతచిత్రం)

### రంగస్థలి ప్రతిభా పురస్కారం

విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 2002లో నరసరావుపేట రంగస్థలి వార్షికోత్సవాలకు కోట హాజరయ్యారు. ఆ సమయంలో మధుమేహం సమస్యతో అస్వస్థతకు గురి కాగా వైద్యుడు డాక్టర్ జి. పెద్దయ్య చికిత్స చేయడంతో కోలుకుని సాయంత్రం సభకు హాజరైనట్లు సీనియర్ పాత్రికేయుడు కేవీకే రామారావు గుర్తు చేశారు. అప్పటి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆహ్వానం మేరకే రంగస్థలికి వచ్చినట్లు తెలిపారు. ఈ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ కళాకారుల కోసం టౌన్‌హాల్ నిర్మాణం, నాటకరంగానికి నరసరావుపేట వాసులు అందిస్తున్న సహకారం, ప్రోత్సాహాన్ని మెచ్చుకున్నారు. ఈసందర్భంగా నరసరావుపేట రంగస్థలి ప్రతిభా పురస్కారాన్ని కోడెల కోటకు ప్రదానం చేశారు.

## ఆరు పదుల వయసులోనూ లక్ష్యం మరువలేదు

కోటి రామమూర్తి

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన చెరుకూరి కోటి రామమూర్తి 1979-82లో డిగ్రీ పూర్తి చేసి ఆర్థిక ఇబ్బందులతో పైచదువులు చదవలేకపోయారు. బతుకుదెరువు కోసం బీమా ఏజెంట్‌గా మారారు. అప్పట్లో న్యాయ విద్య(లా డిగ్రీ) పూర్తి చేయాలన్న ఆయన కోరిక మనసులోనే ఉండిపోయింది. డిగ్రీ పూర్తి చేసి 43 ఏళ్లయినా ఆయన తన లక్ష్యం మరువలేదు. ఆర్థిక స్థిరత్వం వచ్చిన తర్వాత ప్రవేశ పరీక్ష రాసి 64 సంవత్సరాల వయసులో మార్కాపురంలోని ఎన్ఎస్ లా కళాశాల నుంచి మూడేళ్ల రెగ్యులర్ కోర్సు పూర్తి చేశారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. త్వరలో జరగనున్న ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ పరీక్ష రాసి న్యాయవాద వృత్తి చేపడతానని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా కూడలిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం నగర పంచాయతీకి చెందిన గుండా వెంకటేశ్వర్లు బంగ్లా వద్ద దాచేపల్లి వైపు రావడానికి రోడ్డు దాటుతున్న క్రమంలో జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి వెంకటేశ్వర్లు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై పాపారావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## పరిమితికి మించిన ప్రయాణం.. ప్రాణాంతకం

ఆదివారం వచ్చిందంటే వాహనాల సామర్థ్యాన్ని మించి పిల్లలు, పెద్దలను ఇష్టానుసారం ఎక్కించుకుని అడిగొప్పల అమ్మవారి దేవాలయానికి ప్రయాణాలు సాగిస్తున్నారు. వాహనంపై భాగంలో పిల్లలను ఎక్కించి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నా పోలీసులు నివారణ చర్యలు తీసుకోవటం లేదు. ప్రమాదాలు సంభవించినప్పుడు స్పందించే అధికార గణం ముందస్తు చర్యలు చేపడితే కొంతమేర వాహన ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. –న్యూస్‌టుడే, మాచర్ల (కారంపూడి)

## వర్షం కోసం పూజలు

యడ్లపాడు, న్యూస్‌టుడే: మండలంలో ప్రధాన వాణిజ్య పంటగా సాగు చేసే పత్తి విత్తనాలు నాటే సమయం ఆసన్నమైంది. కానీ జులై రెండో వారం పూర్తయినా వరుణుడు ముఖం చాటేశాడు. కొందరు రైతులు పొడి దుక్కులో పత్తి విత్తనాలు నాటి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.. వర్షాభావం నేపథ్యంలో రైతులు యడ్లపాడులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ, బోయపాలెం పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనాదిగా వస్తున్న ఆనవాయితీ పాటిస్తూ గుడిలో అమ్మవారి విగ్రహం ముక్కు వరకు మునిగేలా నీటితో నింపి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని మొక్కుకున్నారు.

నీటిలో అద్దంకి నాంచారమ్మ విగ్రహం

పూజలు చేస్తున్న రైతులు

## కార్మికుల నిరవధిక సమ్మె ప్రారంభం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని, ఇది మంచి పద్ధతి కాదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడుతూ పది నెలలుగా సమస్యలు పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని, సమ్మెను నీరుగార్చాలని ప్రయత్నిస్తోందని, అవసరమైతే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులనూ సమ్మెలోకి దింపుతామని హెచ్చరించారు. ఏడేళ్లుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలను షరతులు లేకుండా కార్మికులకు అందజేయాలన్నారు. నిరవధిక సమ్మెపై ఉక్కుపాదం మోపాలని చూస్తే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు ఇవ్వాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని, పెరిగిన పట్టణానికి అనుగుణంగా కార్మికులను నియమించాలని నినాదాలు చేశారు. సమ్మెలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు షేక్ చిన్న అలాభక్ష్, సోమశేఖర్, బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు


EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

FINANCIAL SERVICES

SHARES

షేర్ మార్కెట్ & మ్యూచువల్ ఫండ్స్ (బేసిక్స్), ఫండమెంటల్స్ & టెక్నికల్స్) ట్రైనింగ్ కోర్సు (రెగ్యులర్/సండే బ్యాచ్) ఫ్యాకల్టీ బై NSE సర్టిఫైడ్ మార్కెట్ ప్రొఫెషనల్. GNT, Cont: 98854 69566.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. గుంటూరు: మాధవి గ్రాండ్ లాడ్జి, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతీ నెల 1, 15 తేదీల్లో లాడ్జిలో మందులు.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA, వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 82474 49042, 96404 96677.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

రాజధాని అమరావతికి 90 Km లోపు వినుకొండలో 1 + 2 బెనిఫిట్స్‌తో రిసార్ట్స్ డెవలప్‌మెంట్స్‌తో చ।గ। 800/- & ఎకరం 38 లక్షలు లోపు కొని లబ్ధి పొందండి. Ph: 9390060136.

JOBS

Wanted B-pharmacy or D-pharmacy candidates to work in a pharmacy in Guntur city. Pci Registration Mandatory. Contact - 63009 75241.

ఏరిస్ ఆగ్రో లిమిటెడ్, ముంబాయి (CMPL Area) లో పనిచేయుటకు మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జూనియర్ ఎక్స్‌టెన్షన్ ట్రైనీ కావలెను (experience / fresher). అర్హత: ఏదైనా డిగ్రీ మరియు వ్యవసాయ కుటుంబం నుండి వచ్చినవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును. Interview: గుంటూరు ఆఫీస్. Ph: 92487 24777, 99631 11817.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, 3 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

మంగళపాలెం NH-16 పెట్రోల్ బంకు నందు పనిచేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం 12,000/- నుండి 14,000/- వరకు. 8 గం॥ డ్యూటీ. సంప్రదించగలరు. Cell: 98854 14786, 98854 97786.

మానసిక ఎదుగుదల లేని ఇద్దరు పిల్లలకు (10 సం॥లు) సర్వీస్ చేయుటకు "ఆయా" కావలెను. వివరాలకు సంప్రదించండి. Ph: 99492 84105.

ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు మార్కెటింగ్‌లో అనుభవం కల్గిన "మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్" & అకౌంటెంట్స్ మరియు ఆఫీస్ అసిస్టెంట్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. వివరములకు సంప్ర॥ ✆ 87902 33667.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..

ఈనాడు లో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి:

8008510541


# మెట్ట రైతుకు లాభసాటి

## వంద శాతం రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

పత్తి, మిరప పంటలు సాగు చేసి నష్టపోతున్న రైతులు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌పై దృష్టిసారిస్తున్నారు. మంచి ఆదాయానికి ఆయిల్ పామ్ సాగు ఉత్తమమని రైతులను ఉద్యానశాఖ చైతన్యపరుస్తోంది. కూటమి సర్కారు వచ్చిన తరువాత వంద శాతం రాయితీతో ఉద్యాన శాఖ ద్వారా ఈ మొక్కలు పంపిణీ చేస్తోంది. నీటి వసతి ఉన్న మెట్ట రైతులు ఈ పంట సాగు చేసుకుంటే లాభాలు పొందొచ్చని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే పల్నాడు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూల అంశాలైన వాతావరణం, భూసారం, నీటి లభ్యతపై చేసిన పరిశీలనలో 8 మండలాలు అనువుగా ఉన్నట్లు గుర్తించారు.

### 3,300 ఎకరాల్లో సాగు లక్ష్యం

జిల్లాలో తొలి దశలో ఎనిమిది మండలాలను ఆయిల్‌పామ్ సాగుకు ఎంపిక చేశారు. నాదెండ్ల, మాచవరం, పిడుగురాళ్ల, అమరావతి, బెల్లంకొండ, రాజుపాలెం, సత్తెనపల్లి, ఈపూరు మండలాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలం. గత ఏడాది 1601 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 3,300 ఎకరాల్లో సాగు లక్ష్యంగా ఉద్యానశాఖ నిర్ణయించగా ఇప్పటికి 465 ఎకరాల్లో సాగైంది. ఇతర మండలాల్లోనూ ఆయిల్‌పామ్ సాగుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు.

ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో మొక్క నాటుతున్న జిల్లా అధికారులు, రైతులు

### పంట సాగు చేసుకోండి

నీటి వసతి ఉన్న మెట్ట రైతులకు ఈ సాగు లాభసాటిగా ఉంటుంది. ప్రభుత్వం రైతులకు ఉచితంగా మొక్కలు ఇస్తుంది. ఆయిల్ పామ్ సాగు చేసిన మండలాల్లో గాద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థ, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ సంస్థ సాగులో మెలకువలు నేర్పుతాయి. పొలంలోనే ప్రభుత్వ ధరకు కొనుగోలు చేస్తారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ పంట సాగు చేసుకోవాలి.

- ఇంటూరి వెంకట్రావు, జిల్లా ఉద్యాన అధికారి

### ఎకరాకు 57 మొక్కలు

ఆయిల్‌పామ్ సాగుకు ఉచితంగా మొక్కలు అందజేస్తారు. ఎకరాకు 57 మొక్కలు నాటాలి. మొక్కలు నాలుగేళ్లకు కాపునకు వస్తాయి. హెక్టార్‌కి 150 ఆయిల్ పామ్ మొక్కలను 100శాతం రాయితీపై అందిస్తారు. ఈ మొక్కలు విదేశీవి అయితే ఒకటి రూ.193, దేశీయ అయితే రూ.133 చొప్పున చెల్లిస్తారు. రూ.29వేల వరకు రాయితీ లభిస్తుంది. నాటే సమయంలో మొక్కకు మొక్కకు మధ్య తొమ్మిది మీటర్ల దూరం ఉండాలి. దీంతో అంతర పంటలు సాగు చేసుకోవటానికి వెసులుబాటు ఉంటుంది. అంతర పంటల సాగుకు కూడా హెక్టారుకు 50 శాతం రాయితీపై ఏడాదికి రూ.5,250 ఆర్థిక సాయాన్ని నాలుగేళ్ల పాటు అందిస్తారు.

### నీటి వసతి తప్పనిసరి

ఆయిల్‌పామ్ సాగు చేయదలచుకున్న రైతులు కచ్చితంగా నీటి వసతి కలిగి ఉండాలి. బోరు సదుపాయం ఉండి వేసవిలో కూడా నీటిపారుదల చూసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా బిందు సేద్యానికి 80 నుంచి 100 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తారు. నాలుగేళ్ల నుంచి ఆయిల్ పామ్ కాపు ప్రారంభమై ఏడేళ్లకు పూర్తిస్థాయిలో వస్తుంది. 30 ఏళ్ల పాటు నిరంతర దిగుబడితో నికర ఆదాయం పొందే అవకాశం ఉంది.

### బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 102, రిటైల్ ధర - 124, చికెన్ విత్‌స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ - 173, చికెన్ స్కిన్‌లెస్ - 196.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 101, 109, 120 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

### నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

## బాధిత రైతు కుటుంబానికి సాయం

### ప్రతి నెలా జీతంలో కొంత సేవకు వెచ్చిస్తున్న గుడివాడ వాసి

ఈపూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొచ్చెర్లలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు బండి కొండయ్య కుటుంబ సభ్యులకు గుడివాడకు చెందిన దాత ఎన్.వెంకటేశ్వరరావు రూ.15వేలు ఆర్థికసాయం అందించారు. అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ కో-ఆపరేటివ్ సొసైటీ అధికారిగా పనిచేస్తున్న ఆయన సామాజిక స్ఫూర్తితో ప్రతినెలా తన జీతం నుంచి ఎంతోకొంత సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తారు. కొచ్చెర్లకు చెందిన కౌలు రైతు ఆత్మహత్య సమాచారాన్ని పత్రికల ద్వారా తెలుసుకుని ఈ సాయం అందించారు. ఈపూరు సొసైటీ డైరెక్టరు అయినాల కోటేశ్వరరావు ఆయన వెంట ఉన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న దాత వెంకటేశ్వరరావు


ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589


(c) eenadu

# సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

## రచయిత్రి రమాదేవికి సత్కారం

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే :** ఎన్టీఆర్, పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాల్లో భాగంగా సాహిత్యరంగంలో చేసిన సేవలతో పాటు సామాజిక సేవకుగాను తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన రచయిత్రి సరికొండ రమాదేవికి నందమూరి తారక రామారావు జాతీయ గౌరవ అవార్డు, భారత స్ఫూర్తి కిరీట్ అవార్డుతో శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెను స్థానిక కళా సంస్థల బాధ్యులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

## కౌలు రైతు కుటుంబానికి అండగా ఉంటా : ఎమ్మెల్యే

**మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే :** కౌలు రైతు ఇంట జరిగిన విషాదం ఎవరూ పూడ్చలేనిది, ఆ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మాచర్ల మండల పరిధిలోని అనుపులో కౌలు రైతు భార్య సుబ్బమ్మ తన కుమార్తెలిద్దరిపై పెట్రోలు పోసి తాను పోసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తనను కలచి వేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఏడాది క్రితం అప్పుల బాధతో భర్త బ్రహ్మారెడ్డి ఆత్మహత్య చేసుకోగా ఏడాది తరువాత అదే రోజున అతని భార్య ఆత్మహత్య చేసుకోవటం, వారి పిల్లలు అనాథలు కావటం ఎంతగానో కలచి వేసిందన్నారు. ఈ క్రమంలో ఆ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? అమరేశ్వర ఘాట్ చెత్తతో నిండిపోవడంతో ఆ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. **-శివరావు, భక్తుడు**

✔ నీరు ఎక్కువగా ఉండటం వల్ల తొలగించడం కష్టంగా మారింది. చెత్త తొలగించేలా చర్యలు చేపడతాం **-రేఖ, ఈవో, అమరేశ్వరాలయం – న్యూస్‌టుడే, అమరావతి**

? దుర్గి ఇందిరమ్మ కాలనీలో నీటి సమస్య ఉంది. పంచాయతీ, గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు గుర్తించి ట్యాంకర్లతో నీటిని చేయాలి. **-కాలనీ వాసులు** ✔ సర్పంచి సహకారంతో కాలనీలో ట్యాంకర్ల ద్వారా నీటి అందించేందుకు కృషి చేస్తాం. **-టి.కృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

? మండల పరిధిలోని ఆడిగొప్పలలో బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **-కాలనీ వాసి** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైనచోట వీధి దీపాలు వెలిగించేందుకు కృషి చేస్తాం. **-వెంకటేశ్, ఇన్‌ఛార్జి కార్యదర్శి –న్యూస్‌టుడే, దుర్గి**

? నాగులేరు వాగులో వ్యర్థాలు పడేయడంతో దుర్వాసన వస్తోంది. **- రవి, కారంపూడి** ✔ వాగులో స్థానికులు, వ్యాపారులు వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. దుర్వాసన నియంత్రించేందుకు బ్లీచింగ్ చల్లిస్తాం. **- కిశ్యానాయక్, కార్యదర్శి –న్యూస్‌టుడే, మాచర్ల (కారంపూడి)**

? తక్కెలపాడు గ్రామంలోని ఓ వీధిలో వారం రోజులుగా తాగునీటి పైపు పగిలి రోడ్డు పై నీరు వృథాగా పోతోంది. **శ్రీనివాసరావు -స్థానికుడు** ✔ తాగునీటి పైపునకు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికడతాం. **-సైదల్ - పంచాయతీ కార్యదర్శి –న్యూస్‌టుడే, దాచేపల్లి**

# సమాజ హితం.. సేవే అభిమతం

### 23 ఏళ్ల నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్న రోటరీక్లబ్

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

సమాజ హితమే ధ్యేయంగా రెండున్నర దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రజల శ్రేయస్సు, సమాజాభివృద్ధి, సేవా దృక్పథాన్ని ప్రోత్సహిస్తూ ముందుకుగా సాగుతున్నారు పిడుగురాళ్ల లైమ్‌సిటీ రోటరీక్లబ్ సభ్యులు. 2002 మే 22న దీనిని స్థాపించారు. ఈ క్లబ్ ద్వారా పిడుగురాళ్ల పట్టణం, పిడుగురాళ్ల, మాచవరం, రాజుపాలెం మండలాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలకు బెంచీలు, తాగునీరు, వైద్య శిబిరాలు, మహిళలకు కుట్టు మిషన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, అందించి సేవల్లో మేటిగా నిలుస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే క్లబ్

వరద బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

చేసే సేవా కార్యక్రమాలకు పలుమార్లు అవార్డులు దక్కించుకున్నారు. ఈ ఏడాది లైమ్‌సిటీ రోటరీక్లబ్ ఉత్తమ క్లబ్‌గా నిలిచి, పన్నెండు అవార్డులను కైవసం చేసుకొని పలు క్లబ్‌లకు ఆదర్శంగా నిలిచింది.

### వైద్య శిబిరాలు

రోటరీక్లబ్ ద్వారా పాఠశాలల్లో, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. పన్నెండు ఏళ్ల నుంచి శంకర కంటి ఆసుపత్రి ద్వారా ప్రతి ఏడాది ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఏటా 300-400 మందికి శుక్ల శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. పదేళ్ల నుంచి రక్తదాన శిబిరాన్ని నిర్వహించి దాతల నుంచి రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకులకు అందజేస్తున్నారు.

### శుద్ధ జలం అందించేందుకు కృషి

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభివృద్ధికి రోటరీ క్లబ్ మొదటి నుంచి కృషి చేస్తోంది. పిడుగురాళ్ల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలకు, బ్రాహ్మణపల్లి, తుమ్మల చెరువు, పిన్నెల్లి, మోర్జంపాడు, పెదనెమలిపురి, జూలకల్లు, గుత్తికొండ, పందిటివారిపాలెం గ్రామాల్లో ఉన్నత పాఠశాలలకు 2వేల బెంచీలు అందజేశారు. పలు పాఠశాలలు, గ్రామాల్లో సుమారు రూ.20 లక్షలతో శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేశారు.

### అవార్డుల పంట

ఈ ఏడాది లైమ్‌సిటీ రోటరీక్లబ్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టింది. గత నెల 30న హైదరాబాద్‌లో రోటరీ క్లబ్‌ల అవార్డుల ప్రదానం చేశారు. అనేక సేవా కార్యక్రమాలు చేయటంతో లైమ్‌సిటీ రోటరీ క్లబ్ అమరావతి రీజియన్‌లో ఉత్తమ క్లబ్‌గా ఎంపికైంది. చేసిన సేవలకు గాను మొత్తం 12 అవార్డులు అందుకుంది.

### దివ్యాంగులు.. మహిళలకు చేయూత

వివిధ ప్రమాదాల్లో వైకల్యానికి గురైన వారికి పరికరాలు అందజేస్తున్నారు. దివ్యాంగుల కోసం శిబిరాలు ఏర్పాటు చేసి 500మందికి జైపూర్ కాళ్లు అందజేశారు. ఈ ఏడాది 60 మందికి ఎల్ఎన్-4 చేతులు అందజేశారు. ఈ ఏడాదిలోనే 438 మందికి ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. మహిళా సాధికారతకు కుట్టు శిక్షణ ఇప్పించి 100మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు రేపల్లె ప్రాంతంలో నిరాశ్రయులైన వారికి రూ. 25లక్షల నిత్యావసర సరకులు అందజేశారు.

## రాజధాని అభివృద్ధి ఓర్వలేక దుష్ప్రచారం

**క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే:** రాజధాని అమరావతి అభివృద్ధి చూసి ఓర్వలేక వైకాపా నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ప్రజలు వారి మాటలు నమ్మరని నియోజకవర్గ తెదేపా నేత కంచేటి సాయిబాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన క్రోసూరు మార్కెట్‌యార్డు ఆవరణలో మండల తెదేపా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తమ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని భావించి దానిని అడ్డుకోవాలన్న అక్కసుతో విమర్శలు చేస్తున్నారన్నారు. సమావేశంలో తెదేపా మండల అధ్యక్షుడు మొమినేజన్, యార్డు మాజీ ఛైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ దిగుమర్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు చేయూత

**కారంపూడి, న్యూస్‌టుడే:** మండలంలో ఆదివారం తెదేపాకు చెందిన కార్యకర్తలు ఇద్దరు మృతి చెందగా వారి కుటుంబాలకు ఆ పార్టీ నాయకులు ఆర్థిక చేయూతనందించారు. కారంపూడిలో కుంచవరపు ఈశ్వరమ్మ, ఒప్పిచర్లలో చీమలదిన్నె అంకాళ్లు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలకు రూ. 10 వేల చొప్పున మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు.

## కల్వర్టు చింత తీరింది

**అమరావతి, న్యూస్‌టుడే :** అమరావతి నుంచి సత్తెనపల్లి రహదారిలో లింగాపురం- బసులపాడు మధ్య ఉన్న లోలెవల్ చప్టా కారణంగా వర్షాల సమయంలో తరచూ రవాణా నిలిచిపోతుంది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టికి సమస్య తీసుకెళ్లడంతో ఆయన చొరవ తీసుకొని లోలెవల్ చప్టాపై కల్వర్టు నిర్మాణం చేపట్టాలని అధికారులు ఆదేశించారు. గత కొన్ని రోజులుగా కల్వర్టు నిర్మాణం చేపట్టిన అధికారులు ఎట్టకేలకు పూర్తి చేయడంతో కల్వర్టు మీద వాహనాలు రాకపోకలు సాగించాయి. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు వాహనదారులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని కూటమి నేతలు తెలిపారు. మండల పరిధిలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పల్లెగుంతలో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. షేక్ మస్తాన్‌వలి, కూటమి నేతలు పాల్గొన్నారు.

## కుట్ర రాజకీయాలకు కేంద్రంగా వైకాపా

వృద్ధురాలి యోగక్షేమాలు అడుగుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

**అమరావతి, న్యూస్‌టుడే :** ప్రశాంతమైన రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని చూస్తున్న కుట్ర రాజకీయాలకు వైకాపా కేంద్రంగా మారిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం యండ్రాయిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల తెదేపా అధ్యక్షుడు మంచినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవ అభినందనీయం



విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

**సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే:** మండల పరిధి వావిలాల నగర్‌లో రూ.1.32 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ కల్యాణమండపానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. 61 మంది ఒంటరి మహిళలకు స్వయం ఉపాధి కోసం రెప్కో బ్యాంకు సౌజన్యంతో కుట్టు మిషన్లు ఉచితంగా అందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించారు. రెప్కో బ్యాంకు చేపట్టిన ఈ సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. రెప్కో బ్యాంకు ప్రతినిధులను ప్రశంసించారు.

## వైద్య శిబిరానికి స్పందన

శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

**ముప్పాళ్ల, న్యూస్‌టుడే:** మండలంలోని దమ్మాలపాడులో సత్తెనపల్లికి చెందిన సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దమ్మాలపాడుతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 370 మంది రోగులు శిబిరంలో ఉచితంగా గుండె, ఎముకలు, కీళ్లు, శ్వాస, జీర్ణ సంబంధ పరీక్షలు ఉచితంగా చేయించుకుని మందులు అందుకున్నారు. శిబిరంలో వైద్య నిపుణులు సింగరాజు సాయికృష్ణ, విద్య, ఆకుల శివప్రసాద్, ఎంఎల్‌వీ సాయికృష్ణారెడ్డి సేవలందించారు.

## వివాదాలు పెంచేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రయత్నం

సమావేశంలో పాల్గొన్న తెదేపా నేతలు

**పిడుగురాళ్ల, న్యూస్‌టుడే :** మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి గ్రామాల్లో వివాదాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ ఎంపీపీ యడ్లపల్లి నారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోనంకి గ్రామానికి మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి వెళ్లి తెదేపా నాయకులపై ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన చేసిన ఆరోపణలను తెదేపా నాయకులు ఖండించారు. 2019- 24 వరకు కోనంకిలో తెదేపా కార్యకర్తలు నాయకుల మీద అక్రమకేసులు పెట్టి వేధించారని తెలిపారు. తెదేపా జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ మాట్లాడుతూ కోనంకిలో భూముల రికార్డులు మార్చి అక్రమాలకు పాల్పడింది వైకాపా నేతలే అని మండిపడ్డారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అభివృద్ధి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే గొడవలు పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు.

## పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

**పెదకూరపాడు, న్యూస్‌టుడే:** పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జమాతే ఇస్లామీ హింద్ పెదకూరపాడుశాఖ అధ్యక్షుడు ఖాసింఖాన్ అన్నారు. మట్టిలో చేతులు- మనస్సులో దేశం నినాదంతో పర్యావరణ విలువ ప్రజలకు తెలియజేసేలా ఆదివారం చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ నేతృత్వంలో పెదకూరపాడులో విద్యార్థులతో కలసి ప్రదర్శన చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం, ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

మొక్కలు నాటుతున్న చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

# గోకులం.. పాడి పోషణకు ఊతం

### తుది దశకు చేరిన నిర్మాణాలు

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే :** గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి జీవనోపాధి కల్పిస్తున్న పాడిపోషణకు వెన్నుదన్నుగా గోకులాల నిర్మాణాలు చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. తొలివిడత వీటి నిర్మాణాల్ని సంక్రాంతికి పూర్తి చేశారు. బిల్లులు అందడంలో జాప్యంతో నిర్మాణాలు నెమ్మదించాయి. ఇటీవలే లబ్ధి పాడి పోషకుల ఖాతాల్లో చేరింది. దీంతో తుదిదశలో ఉన్న నిర్మాణాలు పూర్తవుతున్నాయి. రెండో విడతలో భారీగా గోకులాల నిర్మాణాల్ని చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

- సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో తొలివిడతలో 236 గోకులాల షెడ్ల నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యంగా ఉంది. 180 నిర్మాణాలు పూర్తయ్యాయి. 23 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. రూ. 4.14 కోట్ల నిధులతో వీటి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా ఇప్పటికే రూ. 3.06 కోట్ల వ్యయం చేశారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల్ని కొన్ని రోజులుగా పూర్తి చేయిస్తున్నారు. ఈ వారంలోనే తొలిదశ నిర్మాణాలన్నింటిని పూర్తి చేయనున్నారు.
- జిల్లాకు రెండో విడతలో 912 గోకులాల షెడ్లు మంజూరయ్యాయి. మండలానికి సగటున 32 రాబోతున్నాయి. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో కలిపి 290 వరకు గోకులాల షెడ్లు నిర్మించే అవకాశం ఉంది.
- రెండు గేదెలతో షెడ్డు నిర్మాణానికి రూ. 1.15 లక్షలు మంజూరు చేస్తారు. వీటిలో 10 శాతం లబ్ధిదారు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన 90 శాతం నగదు రాయితీగా అందజేస్తారు. నాలుగు గేదెలతో గోకులానికి రూ. 1.85 లక్షలు, ఆరు గేదెల షెడ్డుకు రూ. 2.30 లక్షలు మంజూరు చేస్తారు. వీటికి కూడా 90 శాతం రాయితీ ఉంటుంది. గొర్రెలు, మేకలు 20తో గోకులం నిర్మిస్తే రూ. 1.30 లక్షలు మంజూరు చేస్తారు. 50 గొర్రెలు, మేకలతో నిర్మాణానికి రూ. 2.30 లక్షలు అందజేస్తారు. వీటికి 70 శాతం రాయితీ ఉంటుంది. 100 పక్షులతో షెడ్డు నిర్మాణానికి రూ. 60,900గా అందజేస్తే వాటికి 70 శాతం రాయితీ ఉంటుంది. 200 కోళ్లతో షెడ్డు నిర్మాణానికి రూ. 1.32 లక్షలు మంజూరు చేస్తే వాటికి కూడా 70 శాతం రాయితీ వర్తింపజేస్తారు.
- అర్హులను ఎంపికచేసి గోకులాల నిర్మాణాల్ని చేపడతామని డ్వామా ఏపీడీ నారాయణ చెప్పారు. రెండోవిడత నిర్మాణాల్ని త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

తుదిదశలో షెడ్డు నిర్మాణం

## ఆసుపత్రి చుట్టూ అపరిశుభ్రత

దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. వెనుక భాగంలో కంపచెట్లు పెరిగి, భవనం కిటికీలకు అల్లుకుంటున్నాయి. దోమలు పెరిగి రోగులపై దాడి చేస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పరిసరాలు శుభ్రం చేయాలని, కంప చెట్లను తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, దాచేపల్లి**

## విద్యుత్తు ఆదా ఇలాగేనా!



ప్రభుత్వ సొమ్ము ఆదా చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి పర్యవేక్షించకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని యండ్రాయిలో పట్టపగలు వీధి దీపాలు వెలుగుతున్నా చర్యలు తీసుకునే వారే కనిపించడం లేదు. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి. పంచాయతీకి విద్యుత్తు బిల్లుల భారం అధికంగా వస్తున్నా అధికారులు స్పందన లేకుండా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, అమరావతి**

## చెరువును కప్పేసిన గుర్రపు డెక్క

ఒకప్పుడు మాచవరం చెరువు చూడచక్కగా ఉండేది. ఒడ్డున నిల్చొని చూస్తే నీరంతా కనిపించేది. ప్రస్తుతం చెరువు నీటినంతా గుర్రపు డెక్క కప్పేసింది. చెరువును వేలం పాట ద్వారా చేపల పెంపకందారులకు లీజు ఇచ్చేవారు. పంచాయతీకి ఆదాయం సమకూరేది. అయితే రానురాను వేలం పాటలు నిర్వహించకపోవడంతో, చెరువు నిరుపయోగంగా మారింది. గుర్రపు డెక్క చేరి అస్తవ్యస్తంగా తయారైంది. **- న్యూస్‌టుడే, మాచవరం**

## దళితుల అభివృద్ధికి కృషి

**మాచవరం, న్యూస్‌టుడే :** దళితుల హక్కులు, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి రంజన్ బాబు అని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ అన్నారు. కార్డ్స్ వ్యవస్థాపకుడు రంజన్‌బాబు 78వ జయంతిని ఆదివారం పిన్నెల్లిలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

## ఒప్పందాలు నెరవేర్చాలి

నినాదాలు చేస్తున్న కార్మికులు

**పిడుగురాళ్ల, న్యూస్‌టుడే :** పురపాలక సంఘంలో పని చేసే కార్మికులు ఆదివారం పట్టణంలోని జానపాడురోడ్డులో దీక్ష చేపట్టారు. జీఓ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగితే కేసులే

**పిడుగురాళ్ల, న్యూస్‌టుడే :** పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగితే కేసులు నమోదు చేస్తామని పట్టణ ఎస్సై ఎస్. వెంకట్రావు చెప్పారు. ఆదివారం పట్టణంలోని బడ్డీ కొట్లు, పాన్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఎస్సైలు శివనాగరాజు, మోహన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదాత పథకంలో పేర్లు నమోదు చేసుకోండి

**కారంపూడి:** అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందేందుకు అర్హులైన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి నరసింహారావు అన్నారు. ఇప్పటికే రైతుల పేర్లను ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో ప్రచురించామని, నమోదు కాని వారు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం కింద రూ.20 వేలను పంటల పెట్టుబడి అవసరాల కోసం వినియోగించుకోవచ్చని ఆయన వివరించారు.

## సంక్షేమం.. అభివృద్ధే తొలి ప్రాధాన్యం

**పెదకూరపాడు:** ప్రజల సంక్షేమం, అభివృద్ధే మొదటి ప్రాధాన్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెదేపా మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం రామాపురం, బుచ్చయపాలెంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం చేశారు.

## శాకంబరీ నమోస్తుతే

శాకంబరీదేవిగా పార్వతీదేవి

**రాజుపాలెం :** ఆకులగణపవరంలో కొలువుదీరిన గంగాపార్వతీ రామలింగేశ్వరాలయంలో ఆదివారం ఆషాఢమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీదేవి శాకాంబరీ అలంకారంలో దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

**రామాపురం(పెదకూరపాడు):** రామాపురం గ్రామంలో కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం శ్రీ నిదానం పాటి శ్రీలక్ష్మి అమ్మవారిని ఆషాఢ మాసం ఆదివారం పురస్కరించుకుని శాకంబరీ దేవిగా బుధవారం భక్తులు అలంకరించారు. మహిళలు 108 కలశాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చి జలాభిషేకం చేశారు. గ్రామస్థులు సమర్పించిన వివిధ రకాల తీపి పదార్థాలు, పండ్లు అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు.

రామాపురం శ్రీలక్ష్మీ అమ్మ

## భక్తులతో కిటకిటలాడిన అమ్మసన్నిధి

**దుర్గి, న్యూస్‌టుడే :** పల్నాట ప్రసిద్ధిచెందిన అడిగొప్పల శ్రీనిదానంపాటి అమ్మవారి సన్నిధి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శనివారం రాత్రి నుంచే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అమ్మసన్నిధిలో భక్తులకు అన్నదానం చేశారు.

## అంకమ్మతల్లికి ఆషాఢం సారె

**పెదకూరపాడు, న్యూస్‌టుడే:** పెదకూరపాడులోని అంకమ్మతల్లికి భక్తులు ఆదివారం ఆషాఢ సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 బిందెలతో జలాభిషేకం చేశారు. గ్రామ వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు.

సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

# స్వచ్ఛ సంకల్పానికి గ్రహణం

### నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

దాచేపల్లి, న్యూస్‌టుడే

స్వచ్ఛ సంకల్పం పేరుతో రూ. లక్షలు ఖర్చు పెట్టి పంచాయతీల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చాలని గత తెదేపా ప్రభుత్వం నిర్మించిన ఇవి వైకాపా పాలనలో ఆశయానికి తూట్లు పడ్డాయి. వాటి నిర్వహణ గత ఐదేళ్లు పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. తెదేపా హయాంలో దాచేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రూ. 6 నుంచి రూ. 7 లక్షల అంచనా వ్యయంతో 15 చెత్త సేకరణ కేంద్రాలు నిర్మించింది. వైకాపా అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని అటకెక్కించింది. దీంతో గ్రామాల్లో ఎక్కడా చెత్త అక్కడే ఉంటోంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్న ఇంకా ఆచరణలో పెట్టకపోవడంతో గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పం నీరుగారుతోంది. చెత్త రిక్షాలు మూలనపడి తుప్పు పడుతున్నాయి. సంపద కేంద్రాల్లో ఎక్కడా వర్మీ కంపోస్టు ఎరువు తయారు కావడం లేదు. డంపింగ్ యార్డుల చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు మొలిచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన వీటిని గాలికొదిలేయడంతో ప్రజాధనం వృథా అవుతోంది. గ్రీన్ అంబాసిడర్లకు కూడా సరిగా వేతనాలు ఇవ్వలేక పోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

తక్కెళ్లపాడులో చెత్త కేంద్రం వద్ద అధ్వానంగా పడేసిన వ్యర్థాలు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందిలా..

### వినియోగంలోకి తీసుకొస్తాం

చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్నాం. చెత్త సేకరించే సిబ్బందికి వేతనాల్లో జాప్యం కలుగుతోంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చెత్త సేకరణ సజావుగా సాగేలా చూస్తాం.

**- వీరయ్య, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, దాచేపల్లి**

(c) eenadu

# ఆరు గ్రామాల ప్రజల్లో ఆనందం

**కొత్త రోడ్డు నిర్మాణంతో తొలగిన ఇబ్బందులు**

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే

వినుకొండ నుంచి దొండపాడు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో పరిస్థితిని స్వయంగా గమనించిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అప్పుడే రోడ్డు మంజూరు చేయించారు. వెంటనే గుత్తేదారు రూ.70 లక్షలు ఖర్చుచేసి కంకర తోలి కొంత వరకు రోడ్డు పరిచాడు. ఇంతలో 2019లో వైకాపా ప్రభుత్వం ఏర్పడింది. దీంతో రహదారి అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గత ఆరేళ్లుగా కుమ్మరిపాలెం, తిమ్మాయిపాలెం, శ్రీరాంనగర్, భారతాపురం, నడిగడ్డ, పానకాలపాలెం, దొండపాడు, రైతునగర్ గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు ఈ రహదారిపై ప్రయాణానికి నిత్యం నరకం అనుభవించారు. కంకర పరిచిన దారిలో వాహనాలు వెళ్లక విద్యార్థులను తీసుకెళ్లడానికి ఆటోలు రాక నానా అవస్థలు పడ్డారు. ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అయినా కనీసం మట్టి తోలి గుంతలైనా పూడ్చలేదు. ఈ రోడ్డు దుస్థితిపై 'ఈనాడు' పలుమార్లు కథనాలు ప్రచురించింది. మళ్లీ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారి మరమ్మతుల విషయాన్ని ఆ గ్రామాల ప్రజలు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఏకంగా కొత్త రోడ్డు నిర్మాణానికి రూ.6.15 కోట్లు మంజూరు చేయించారు. వెంటనే పనులు ప్రారంభించి రోడ్డు వేయడంతో ఆ గ్రామాల ప్రజల ఆనందానికి అవధులు లేవు. గతంలో వినుకొండ నుంచి దొండపాడు వరకు మాత్రమే రోడ్డు ఉండగా ప్రస్తుతం శ్రీరాంనగర్ నుంచి నడిగడ్డ వరకు అదనంగా మంజూరు చేయించి రోడ్డు పూర్తి చేశారు. రోడ్డు పూర్తి కావడంతో ఆ మార్గంలో ఆర్టీసీ అధికారులు బస్సు నడుపుతున్నారు. దీంతో విద్యార్థులు, ప్రజల కష్టాలు తీరాయి.

నాడు వైకాపా హయాంలో గుంతలతో..

నేడు కూటమి పాలనలో..

శివాపురం వద్ద ఆవుల మంద ఇలా..

## సొంతూళ్లకు గోమాత పయనం

**వినుకొండ రూరల్, న్యూస్‌టుడే:** వేసవిలో ప్రకాశం జిల్లాలో పశుగ్రాసం కొరత నెలకొంది. దీంతో యర్రగొండపాలెం ప్రాంతానికి చెందిన పలు గ్రామాల పశువుల కాపరులు తమ ఆవులను మేపేందుకు అవస్థలు ఎదుర్కొన్నారు. చేసేది లేక ఈ ఏడాది మార్చిలో 1200 ఆవులను గుంటూరు జిల్లా పొన్నూరు ప్రాంతానికి తోలుకెళ్లారు. ప్రస్తుతం అక్కడ రైతులు నారుమడులు సిద్ధం చేస్తుండటంతో పాటు దుక్కులు దున్నడంతో మేత తగ్గింది. దీంతో కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి మీదుగా ఆవులతో సొంతూళ్లకు పయనమయ్యారు. వర్షాలు కురవడంతో తమ ప్రాంతంలోనూ అడవులు, పొలాల్లో గడ్డి దొరుకుతుందని, అందుకే ఆవులను తరలిస్తున్నట్లు యజమానులు పేర్కొన్నారు.

# రక్తపోటు.. మధుమేహం బాధితులే అధికం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

సెలవులు లేకుండా.. రాత్రిపగలు తేడా లేకుండా ఉద్యోగం చేసే విభాగాల్లో పోలీసు శాఖ ఒకటి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు వారాంతపు సెలవులుంటాయి కానీ.. పోలీసు శాఖలో సెలవు అనే మాట ఉండదు. చివరకు పండగ రోజు కూడా బందోబస్తుకు వెళ్లాల్సిందే. అత్యవసరమైతేనే సెలవు.. కాబట్టి పని ఒత్తిడి పెరిగి, జీవనశైలి మారి ఆరోగ్యం దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో పోలీసుల సంక్షేమం కోరుతూ కూటమి ప్రభుత్వం

శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న పోలీసులు

### జిల్లాలో పోలీసులకు వైద్య పరీక్షలు

వైద్య పరీక్షలు ప్రారంభించింది. వైద్య పరీక్షల ఫలితాల ఆధారంగా ఎక్కువ మంది పోలీసులు కొలెస్ట్రాల్, రక్తపోటు, మధుమేహం సమస్యలతో బాధ పడుతున్నట్లు వెల్లడవుతోంది. ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయంలో రోజుకు 100 మంది చొప్పున అందరికీ అన్ని రకాల పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఏవైనా రుగ్మతలు బయటపడితే చికిత్స తీసుకోవాలని సూచిస్తూ సెలవులు మంజూరు చేస్తున్నారు.

**అయిదు రోజుల్లో ఇలా..** పరీక్షలు చేయించుకున్న వారు : 473 మంది బయటపడిన రుగ్మతలు: మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్

రక్తపోటు పరీక్షిస్తున్న వైద్యురాలు

**ఏమేం పరీక్షలు..** మహాత్మాగాంధీ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి జనరల్ బాడీ చెకప్‌లో భాగంగా పలు రకాల రక్త పరీక్షలు, మూత్రపిండాలు, గుండె, కాలేయం పనితీరు ఎలా ఉంది? శరీరంలో కొవ్వు శాతం ఎంత?, ప్రధాన అవయవాలు ఎలా పనిచేస్తున్నాయి? అనేది వైద్యులు గమనిస్తున్నారు. ఏమైనా తేడాలు ఉంటే వెంటనే సంబంధిత నిపుణులకు సిఫారసు చేస్తున్నారు.

**ఏం తేలింది...** వైద్య పరీక్షలు ఈ నెల 8న ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 2000 మందికి పరీక్షలు పూర్తయ్యే వరకు శిబిరం కొనసాగనుంది. ఎక్కువ మందిలో కొలెస్ట్రాల్ అధికంగా ఉందని, ఎక్కువ మంది రక్తపోటు సమస్యతో బాధపడుతున్నట్లు, మధుమేహం బారిన పడినట్లు పరీక్షల్లో తేలింది. కుర్చీల్లో ఎక్కువసేపు కూర్చొని ఉంటున్న వారిలో కొవ్వు శాతం ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

**అందరికీ నిర్వహిస్తాం..** 'జిల్లాలో హోంగార్డు మొదలు అందరికీ వైద్య పరీక్షలు పూర్తయ్యే వరకు శిబిరం కొనసాగుతుందని, అదృష్టవశాత్తు ఇప్పటివరకు పెద్దగా అనారోగ్య సమస్యలు బయటపడలేదు' అని వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్ తెలిపారు.

# కోటకు పేటతో అనుబంధం

చిలకలూరిపేట గ్రామీణ, నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే

నాటక రంగంతో పాటు, సినీరంగంలో తనదైన నటనతో ప్రత్యేకత చాటుకున్న కోట శ్రీనివాసరావు మృతి కళారంగానికి తీరని లోటని పలువురు కళాభిమానులు అభిప్రాయపడ్డారు. కోట మృతికి సంతాపం తెలిపారు. ఆయన మృతి నేపథ్యంలో చిలకలూరిపేట, నరసరావుపేటతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చిలకలూరిపేట చౌత్రా సెంటర్‌లో, గణపవరంలోనూ ఆయనకు బంధువులున్నారు. గతేడాది బంధువుల వివాహానికి చిలకలూరిపేట కూడా వచ్చారన్నారు.

### టెర్రర్ చిత్రీకరణ చేస్తుండగా పద్మశ్రీ

చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామానికి చెందిన ఆరా పొలిటికల్ సంస్థ ఛైర్మన్ మస్తాన్ నిర్మాతగా 2015లో టెర్రర్ సినిమా తీశారు. అందులో కోట శ్రీనివాసరావు నటించారు. ఆ సినిమా చిత్రీకరణ చేస్తుండగానే కోటకు పద్మశ్రీ అవార్డు ప్రకటించారు. వెంటనే కేక్ కోయించి సెట్‌లో సంబరాలు చేసుకున్నారు.

### ఆత్మబంధం షూటింగ్‌కు నెల రోజులు ఇక్కడే

1991లో విడుదలైన ఆత్మబంధం సినిమా షూటింగ్ చాలావరకు చిలకలూరిపేటలోనే జరిగింది. సుమన్, లిజి హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రంలో కోట శ్రీనివాసరావు ప్రతినాయకుడి పాత్ర పోషించారు. 1990 డిసెంబరు నుంచి 1991 జనవరి వరకు చిలకలూరిపేట, గణపవరం ప్రాంతాల్లోని మద్ది వెంకటరత్నం అతిథిగృహం, పెంట్యాల శివ గృహం, పట్టణ పోలీసుస్టేషన్ తదితర ప్రాంతాల్లో షూటింగ్ జరిగింది. ఆ చిత్రంలో కోటతో కలిసి స్థానిక నటులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, వీసీహెచ్‌కే ప్రసాద్ కోటతో కలిసి నటించారు.

చిలకలూరిపేట: ఆత్మబంధం సినిమాలో కోట శ్రీనివాసరావుతో నటించిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు

నరసరావుపేట: వేదికపై కోట శ్రీనివాసరావు, కోడెల, రంగస్థలి ప్రముఖులు (పాతచిత్రం)

### రంగస్థలి ప్రతిభా పురస్కారం

విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 2002లో నరసరావుపేట రంగస్థలి వార్షికోత్సవాలకు కోట హాజరయ్యారు. ఆ సమయంలో మధుమేహం సమస్యతో అస్వస్థతకు గురి కాగా వైద్యుడు డాక్టర్ మర్రి పెద్దయ్య చికిత్స చేయడంతో కోలుకుని సాయంత్రం సభకు హాజరైనట్లు సీనియర్ పాత్రికేయుడు కేవీకే రామారావు గుర్తు చేశారు. అప్పటి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆహ్వానం మేరకే రంగస్థలికి వచ్చినట్లు తెలిపారు. ఈ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ కళాకారుల కోసం టౌన్‌హాల్ నిర్మాణం, నాటకరంగానికి నరసరావుపేట వాసులు అందిస్తున్న సహకారం, ప్రోత్సాహాన్ని మెచ్చుకున్నారు. ఈసందర్భంగా నరసరావుపేట రంగస్థలి ప్రతిభా పురస్కారాన్ని కోడెల కోటకు ప్రదానం చేశారు.

# ఆరు పదుల వయసులోనూ లక్ష్యం మరువలేదు

కోటి రామమూర్తి

**వినుకొండ, న్యూస్‌టుడే:** పట్టణానికి చెందిన చెరుకూరి కోటి రామమూర్తి 1979-82లో డిగ్రీ పూర్తి చేసి ఆర్థిక ఇబ్బందులతో పైచదువులకు వెళ్లలేకపోయారు. బతుకుదెరువు కోసం బీమా ఏజెంట్‌గా మారారు. అప్పట్లో న్యాయ విద్య(లా డిగ్రీ) పూర్తి చేయాలన్న ఆయన కోరిక మనసులోనే ఉండిపోయింది. డిగ్రీ పూర్తి చేసి 43 ఏళ్లయినా ఆయన తన లక్ష్యం మరువలేదు. ఆర్థిక స్థిరత్వం వచ్చిన తర్వాత ప్రవేశ పరీక్ష రాసి 64 సంవత్సరాల వయసులో మార్కాపురంలోని ఎస్ఎస్ లా కళాశాల నుంచి మూడేళ్ల రెగ్యులర్ కోర్సు పూర్తి చేశారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. త్వరలో జరగనున్న ఆల్ఇండియా బార్ కౌన్సిల్ పరీక్ష రాసి న్యాయవాద వృత్తి చేపడతానని తెలిపారు.

# వర్షం కోసం పూజలు

**యడ్లపాడు, న్యూస్‌టుడే:** మండలంలో ప్రధాన వాణిజ్య పంటగా సాగు చేసే పత్తి విత్తనాలు నాటే సమయం ఆసన్నమైంది. కానీ జులై రెండో వారం పూర్తయినా వరుణుడు ముఖం చాటేశాడు. కొందరు రైతులు పొడి దుక్కులో పత్తి విత్తనాలు నాటి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.. వర్షాభావం నేపథ్యంలో రైతులు యడ్లపాడులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ, బోయపాలెం పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనాదిగా వస్తున్న ఆనవాయితీ పాటిస్తూ గుడిలో అమ్మవారి విగ్రహం ముక్కు వరకు మునిగేలా నీటితో నింపి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని మొక్కుకున్నారు.

నీటిలో అద్దంకి నాంచారమ్మ విగ్రహం

పూజలు చేస్తున్న రైతులు

# కార్మికుల నిరవధిక సమ్మె ప్రారంభం

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

**నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే:** మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని, ఇది మంచి పద్ధతి కాదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడుతూ పది నెలలుగా సమస్యలు పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని, సమ్మెను నీరుగార్చాలని ప్రయత్నిస్తోందని, అవసరమైతే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులనూ సమ్మెలోకి దింపుతామని హెచ్చరించారు. ఏడేళ్లుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలను షరతులు లేకుండా కార్మికులకు అందజేయాలన్నారు. నిరవధిక సమ్మెపై ఉక్కుపాదం మోపాలని చూస్తే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు ఇవ్వాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని, పెరిగిన పట్టణానికి అనుగుణంగా కార్మికులను నియమించాలని నినాదాలు చేశారు. సమ్మెలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు షేక్ చిన్న అలాభక్షు, సోమశేఖర్, బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 102, రిటైల్ ధర - 124, చికెన్ విత్‌స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ - 173, చికెన్ స్కిన్‌లెస్ - 196.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 101, 109, 120 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

**నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర**

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

EENADU Classifieds

**BUSINESS SERVICES**

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

**బంగారం కొనబడును.** బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

**FINANCIAL SERVICES**

**SHARES**

**షేర్ మార్కెట్** & మ్యూచువల్ ఫండ్స్ (బేసిక్స్), ఫండమెంటల్స్ & టెక్నికల్స్) ట్రైనింగ్ కోర్సు (రెగ్యులర్/సండే బ్యాచ్) ఫ్యాకల్టీ బై NSE సర్టిఫైడ్ మార్కెట్ ప్రొఫెషనల్. GNT, Cont: 98854 69566.

**HEALTH & CARE**

**మద్యపానం మానేయడం** ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. గుంటూరు: మాధవి గ్రాండ్ లాడ్జి ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతీ నెల 1, 15 తేదీల్లో లాడ్జిలో మందులు.

**PEOPLE CARE**

**OLD AGE HOME**

**స్వామి వివేకానంద** ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

**రామకృష్ణ గ్రూప్** (AP No:1) VJA, వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 82474 49042, 96404 96677.

**REAL ESTATE**

**LAND FOR SALE**

**GENERAL**

**రాజధాని అమరావతికి** 90 Km లోపు వినుకొండలో 1 + 2 బెనిఫిట్స్‌తో రిసార్ట్స్ డెవలప్‌మెంట్స్‌తో చ॥గ॥ 800/- & ఎకరం 38 లక్షలు లోపు కొని లబ్ధి పొందండి. Ph: 9390060136.

**JOBS**

Wanted B-pharmacy or D-pharmacy candidates to work in a pharmacy in Guntur city. Pci Registration Mandatory. Contact - 63009 75241.

**ఏరీస్ ఆగ్రో** లిమిటెడ్, ముంబాయి (CMPL Area) లో పనిచేయుటకు మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జూనియర్ ఎక్సటెన్షన్ ట్రైనీ కావలెను (experience / fresher). అర్హత: ఏదైనా డిగ్రీ మరియు వ్యవసాయ కుటుంబం నుండి వచ్చినవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును. Interview: గుంటూరు ఆఫీస్. Ph: 92487 24777, 99631 11817.

**బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్** కావలెను. డిగ్రీ, 3 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

**మంగళపాలెం** NH-16 పెట్రోల్ బంకు నందు పనిచేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం 12,000/- నుండి 14,000/- వరకు. 8 గం॥ డ్యూటీ. సంప్రదించగలరు. Cell: 98854 14786, 98854 97786.

**మానసిక ఎదుగుదల** లేని ఇద్దరు పిల్లలకు (10 సం॥లు) సర్వీస్ చేయుటకు "ఆయా" కావలెను. వివరాలకు సంప్రదించండి. Ph: 99492 84105.

**ప్రముఖ సంస్థ** నందు పనిచేయుటకు మార్కెటింగ్‌లో అనుభవం కల్గిన "మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్" & అకౌంటెంట్స్ మరియు ఆఫీస్ అసిస్టెంట్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. వివరములకు సంప్ర॥ ✆ 87902 33667.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

# మెట్ట రైతుకు లాభసాటి

**వంద శాతం రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ**

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

పత్తి, మిరప పంటలు సాగు చేసి నష్టపోతున్న రైతులు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌పై దృష్టిసారిస్తున్నారు. మంచి ఆదాయానికి ఆయిల్ పామ్ సాగు ఉత్తమమని రైతులను ఉద్యానశాఖ చైతన్యపరుస్తోంది. కూటమి సర్కారు వచ్చిన తరువాత వంద శాతం రాయితీతో ఉద్యాన శాఖ ద్వారా ఈ మొక్కలు పంపిణీ చేస్తోంది. నీటి వసతి ఉన్న మెట్ట రైతులు ఈ పంట సాగు చేసుకుంటే లాభాలు పొందొచ్చని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే పల్నాడు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూల అంశాలైన వాతావరణం, భూసారం, నీటి లభ్యతపై చేసిన పరిశీలనలో 8 మండలాలు అనువుగా ఉన్నట్లు గుర్తించారు.

### 3,300 ఎకరాల్లో సాగు లక్ష్యం

జిల్లాలో తొలి దశలో ఎనిమిది మండలాలను ఆయిల్‌పామ్ సాగుకు ఎంపిక చేశారు. నాదెండ్ల, మాచవరం, పిడుగురాళ్ల, అమరావతి, బెల్లంకొండ, రాజుపాలెం, సత్తెనపల్లి, ఈపూరు మండలాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలం. గత ఏడాది 1601 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 3,300 ఎకరాల్లో సాగు లక్ష్యంగా ఉద్యానశాఖ నిర్ణయించగా ఇప్పటికి 465 ఎకరాల్లో సాగైంది. ఇతర మండలాల్లోనూ ఆయిల్‌పామ్ సాగుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు.

ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో మొక్క నాటుతున్న జిల్లా అధికారులు, రైతులు

### పంట సాగు చేసుకోండి

నీటి వసతి ఉన్న మెట్ట రైతులకు ఈ సాగు లాభసాటిగా ఉంటుంది. ప్రభుత్వం రైతులకు ఉచితంగా మొక్కలు ఇస్తుంది. ఆయిల్ పామ్ సాగు చేసిన మండలాల్లో గాద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ సంస్థ సాగులో మెలకువలు నేర్పుతాయి. పొలంలోనే ప్రభుత్వ ధరకు కొనుగోలు చేస్తారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ పంట సాగు చేసుకోవాలి.

- ఇంటూరి వెంకట్రావు, జిల్లా ఉద్యాన అధికారి

### ఎకరాకు 57 మొక్కలు

ఆయిల్‌పామ్ సాగుకు ఉచితంగా మొక్కలు అందజేస్తారు. ఎకరాకు 57 మొక్కలు నాటాలి. మొక్కలు నాలుగేళ్లకు కాపునకు వస్తాయి. హెక్టార్‌కి 150 ఆయిల్ పామ్ మొక్కలను 100శాతం రాయితీపై అందిస్తారు. ఈ మొక్కలు విదేశీవి అయితే ఒకటి రూ.193, దేశీయ అయితే రూ.133 చొప్పున చెల్లిస్తారు. రూ.29వేల వరకు రాయితీ లభిస్తుంది. నాటే సమయంలో మొక్కకు మొక్కకు మధ్య తొమ్మిది మీటర్ల దూరం ఉండాలి. దీంతో అంతర పంటలు సాగు చేసుకోవటానికి వెసులుబాటు ఉంటుంది. అంతర పంటల సాగుకు కూడా హెక్టారుకు 50 శాతం రాయితీపై ఏడాదికి రూ.5,250 ఆర్థిక సాయాన్ని నాలుగేళ్ల పాటు అందిస్తారు.

### నీటి వసతి తప్పనిసరి

ఆయిల్‌పామ్ సాగు చేయదలచుకున్న రైతులు కచ్చితంగా నీటి వసతి కలిగి ఉండాలి. బోరు సదుపాయం ఉండి వేసవిలో కూడా నీటిపారుదల చూసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా బిందు సేద్యానికి 80 నుంచి 100 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తారు. నాలుగేళ్ల నుంచి ఆయిల్ పామ్ కాపు ప్రారంభమై ఏడేళ్లకు పూర్తిస్థాయిలో వస్తుంది. 30 ఏళ్ల పాటు నిరంతర దిగుబడితో నికర ఆదాయం పొందే అవకాశం ఉంది.

# బాధిత రైతు కుటుంబానికి సాయం

**ప్రతి నెలా జీతంలో కొంత సేవకు వెచ్చిస్తున్న గుడివాడ వాసి**

**ఈపూరు, న్యూస్‌టుడే:** మండలంలోని కొచ్చెర్లలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు బండి కొండయ్య కుటుంబ సభ్యులకు గుడివాడకు చెందిన దాత ఎన్.వెంకటేశ్వరరావు రూ.15వేలు ఆర్థికసాయం అందించారు. అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ కో-ఆపరేటివ్ సొసైటీ అధికారిగా పనిచేస్తున్న ఆయన సామాజిక స్ఫూర్తితో ప్రతినెలా తన జీతం నుంచి ఎంతోకొంత సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తారు. కొచ్చెర్లకు చెందిన కౌలు రైతు ఆత్మహత్య సమాచారాన్ని పత్రికల ద్వారా తెలుసుకుని ఈ సాయం అందించారు. ఈపూరు సొసైటీ డైరెక్టరు అయినాల కోటేశ్వరరావు ఆయన వెంట ఉన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న దాత వెంకటేశ్వరరావు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

# నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

ఆరోగ్య కేంద్రం ముందు జనరేటర్, ఇతర వస్తువులు

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం

## ఏడాదిన్నరగా ఎదురుచూపులే మిగిలాయ్

**వినుకొండ రూరల్, న్యూస్‌టుడే:** వినుకొండ మండలం దొండపాడులో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు ప్రారంభానికి ఎదురుచూస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రతి సచివాలయ పరిధిలో ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రం ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ నిధులతో నూతన భవనాలు నిర్మించారు. ఏడాదిన్నర క్రితం భవనాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ భవనాలు అందుబాటులోకి రాక రైతులకు సేవలు అందడం కష్టతరంగా మారింది. సకాలంలో మందులు తీసుకోవాలన్నా సమస్యగానే ఉంది. ఆరోగ్య కేంద్రం ముందు కొందరు శుభ కార్యాలకు వినియోగించే వస్తువులు పెట్టుకుంటున్నారు. ఈ భవనాల విషయమై ఏఎన్‌ఎం పాలెం వైద్యుడు నాగేశ్వరరావు, ఏవో వరలక్ష్మిని సంప్రదించగా ఆ భవనాలు ఇంకా తమకు స్వాధీనం చేయలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత సేవలు అందించే అవకాశముందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకు రావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## 26 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

విద్యార్థినికి నగదు బహుమతి ఇస్తున్న తహసీల్దార్ హుస్సేన్

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** చిలకలూరిపేట సీఆర్ కాలనీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతిలో ప్రతిభ చాటిన 26 మంది పేద విద్యార్థులకు రూ.1.35 లక్షల నగదును ఉపకార వేతనంగా తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పెద్ది శివరామప్రసాద్, సీహెచ్ సీతారామయ్య, పెరవలి రామచంద్రరావు, సంజీవి సుబ్బారెడ్డి, ఆరెకట్ల కోటి సుబ్బారావు, సీహెచ్ శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

## వేలూరు వెళ్లాలంటే హడల్

నాదెండ్ల మండలం గణపవరం ప్రధాన కూడలి నుంచి వేలూరు వైపు వెళ్లే రహదారి ప్రారంభంలో పెద్ద గుంత ఏర్పడటంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో ప్రయాణమంటే చోదకులు హడలెత్తిపోతున్నారు. సమస్యను ఆర్‌అండ్‌బీ ఏఈ సురేష్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి గుంత పూడ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

## రక్షిత నీటి సరఫరా పెంచరూ!

సుజల పథకం ట్యాంక్ వద్ద నీళ్ల డబ్బాలు

**మం**డలంలోని పసుమర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల సురక్షిత నీటి ట్యాంకు నుంచి సరఫరా అవుతున్న నీరు సరిపోక గ్రామస్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజు సుజల పథకం నుంచి ఒక ట్యాంకర్‌తో సురక్షిత నీరు తీసుకొచ్చి సరఫరా చేస్తున్నా జనాభా 8వేల పైగా ఉండటంతో సరిపోవడం లేదు. సాయంత్రం మరో ట్యాంకర్ సరఫరా చేస్తే ఇబ్బందులు తొలగుతాయని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ ఈవో శ్రీనివాసరెడ్డిని సంప్రదించగా సురక్షిత నీటి సరఫరా పెంపునకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

## ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

విరాళం అందిస్తున్న దాత సురేష్

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలో పులుపుల వారివీధిలోని శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనృసింహ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. విజయవాడకు చెందిన స్మార్ట్ కిడ్స్ ఇండియా ఇన్నోవేషన్స్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత జి. సురేష్ రూ.3 లక్షలు విరాళాన్ని ఆలయ కమిటీ నేతలకు ఆదివారం అందజేశారు. ఆలయ శిలామండం పదో స్తంభం నిర్మాణానికి ఈ మొత్తం వినియోగించాలని కమిటీ నేతలను కోరారు. కార్యక్రమంలో పులుపుల రాము, వనమా కృష్ణ, శ్రీనివాసరావు, కోవూరి శివశ్రీనుబాబు తదితరులు ఉన్నారు.

## సినీ నటుడు కోట మృతికి ప్రముఖుల నివాళి

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే :** సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సంతాపం తెలిపారు. ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటన్నారు. ఆయన తనను కలిసినప్పుడల్లా 'నేను మీ నియోజకవర్గం (యడ్లపాడు మండలం సొలస) అల్లుడిని అంటూ చెప్పేవారని' ప్రత్తిపాటి గుర్తు చేసుకున్నారు. ప్రముఖ రచయిత, నటులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు వీసీ హెచ్‌కే ప్రసాద్ కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు. ఆత్మబంధం సినిమాలో ఆయనతో పాటు నటించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అలాంటి నటులు అరుదుగా ఉంటారన్నారు. ఆయన మృతి కళారంగానికి తీరని లోటన్నారు. చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామానికి చెందిన ఆరా పొలిటికల్ సంస్థ ఛైర్మన్ మస్తాన్ కోట మృతికి సంతాపం తెలిపారు. తాను 2015లో నిర్మాతగా టెర్రర్ సినిమా తీశానని అందులో కోట ప్రధానపాత్ర పోషించారన్నారు. అలాంటి గొప్ప నటుడి మృతి తీరని వేదన మిగిల్చిందన్నారు. వారితో పాటు పలువురు కళారంగ ప్రముఖులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

## పీఏసీఎస్ పాలక వర్గాల నియామకం

**రొంపిచర్ల, న్యూస్‌టుడే:** మండలంలో ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలక వర్గాలుగా త్రిసభ్య కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించగా ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు చేతులమీదగా ఆయా సొసైటీ అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేశారు. రొంపిచర్ల సొసైటీ అధ్యక్షుడిగా పల్లెల వెంకటరత్నారెడ్డి, విప్పర్లకు జల్లిపల్లి శేషమ్మ, సంతగుడిపాడుకు పొనుగోటి శ్రీనివాసరావు, బుచ్చిపాపన్నపాలెంకు సూరాబత్తుల రామారావు, అన్నవరానికి కుందేటి రామబ్రహ్మం, సుబ్బయ్యపాలెం సొసైటీ అధ్యక్షుడిగా ఇంటూరి వెంకట ప్రసాద్ నియమితులయ్యారు.

## మనసున్న మనిషి యల్లమంద

**వినుకొండ, న్యూస్‌టుడే:** ఎందరో విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దిన మనసున్న ఉపాధ్యాయుడు పాపసాని యల్లమంద అని వ్యాయామోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరీముల్లా చౌదరి అన్నారు. లయోలా ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన యల్లమందను ఆయన భార్య పద్మావతితో కలిసి ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సన్మానించారు. తాను చదివిన పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా పనిచేయడం ఆయన అదృష్టమన్నారు. మూడు దశాబ్దాలుగా మచ్చలేని మనిషిగా పేరు తెచ్చుకున్నాడని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయుడు జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాసరావు, జిల్లా గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్, మండల విద్యాశాఖాధికారులు జఫ్రల్లా, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
చిలకలూరిపేట గ్రామీణ : 8008883217 వినుకొండ గ్రామీణ : 9440009293

? నూజండ్ల రోడ్డులో రైల్వే కింది వంతెన వద్ద ఓ వైపు విద్యుత్తు దీపాలు లేక రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. చీకటిగా ఉండటంతో ఆకతాయిలు మద్యం తాగుతున్నారు. **- మల్లికార్జునరావు, వినుకొండ** ✔ ఇటీవల ఓ వైపు దీపాలు ఏర్పాటు చేయించాం. మరో వైపు కూడా త్వరలో ఏర్పాటు చేయిస్తాం.- **సుభాష్‌చంద్రబోస్, పురపాలక కమిషనర్, వినుకొండ** – న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

? పట్టణంలోని సాంబశివనగర్ పార్కులో పిల్లల ఆట పరికరాలు పాడై ప్రమాదకరంగా మారాయి. - **శ్రీనివాసరావు** ✔ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. - **మణికుమార్, పురపాలకసంఘ ఏఈ** – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? నరసరావుపేట కాకతీయ నగర్ మొదటి లైనులో ఇళ్ల ముందు, రోడ్ల పక్కన పిచ్చిమొక్కలు మొలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.- **శ్రీనివాసరావు, స్థానికుడు** ✔ సిబ్బందిని పంపి పిచ్చి మొక్కలు తొలగిస్తాం.- **రామకోటయ్య, పారిశుద్ధ్య అధికారి** – న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

? ఐనవోలు నుంచి కంభంపాడు, గురపనాయుడుపాలెం వెళ్లే పంచాయతీరాజ్ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రెండు వైపులా పిచ్చి చెట్లు అల్లుకున్నాయి. ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు తప్పడం లేదు. నూజండ్ల రావాలంటే వినుకొండ తిరిగి రావాల్సి వస్తుంది. - **లక్ష్మీనారాయణ, ఐనవోలు** ✔ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదలైన వెంటనే పనులు చేయిస్తాం. కనీస మరమ్మతులకూ ప్రతిపాదనలు అందజేశాం. నిధులు వచ్చిన వెంటనే పనులు చేయిస్తాం.
**- అల్లాభక్షు, ఏఈ, పంచాయతీరాజ్**– న్యూస్‌టుడే, నూజండ్ల

స్పందనకు వందనం

**పూడిక తీశారు.. మల్లమ్మ సెంటర్(నరసరావుపేట):** నరసరావుపేట బరంపేట శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం ఎదుట డ్రెయినేజీ పూడిక తీయక దుర్వాసన వస్తోంది. దీనివల్ల స్థానికులకు కలుగుతున్న ఇబ్బందిని ఈ నెల 7న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు' పారిశుద్ధ్య అధికారి సురేష్ దృష్టికి తేగా ఆయన స్పందించారు. డ్రెయినేజీలో వ్యర్థాలు తీయించారు.

**యడ్లపాడు:** మండలంలో ఉన్నవ ఉదయపురి కాలనీలో కాలువల్లో మురుగు నీరు నిలవడంతో అధ్వానంగా మారిన పారిశుద్ధ్యంపై ఈనెల 9న అధికారుల దృష్టికి తేగా వారు స్పందించారు. కాలువల్లో పూడిక తీయటంతో పాటు వాటికి మరమ్మతులు నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి జయబాబు తెలిపారు.

## చిన్నికృష్ణుడికి కొత్త కోవెల సమకూరేనా?

**య**డ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటలో చారిత్రక నేపథ్యం కలిగిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత వెన్నముద్దల వేణుగోపాలస్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. శతాబ్దాల క్రితం కొండవీడులో శత్రు రాజుల దాడుల నుంచి రక్షించబడిన ముగ్ధ మనోహరమైన చిన్ని కృష్ణుడి విగ్రహాన్ని ఈ ఆలయంలో ప్రతిష్ఠించారు. కాలక్రమంలో ఆలయ ప్రాంగణం లోతట్టుగా మారటంతో వర్షపునీరు నిలబడుతోంది. ధ్వజస్తంభం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడి పడుతూ ప్రమాదకరంగా మారింది. పురాతన ఆలయాన్ని పునర్నిర్మించాలన్న స్థానికుల దీర్ఘకాల డిమాండ్‌ను అధికారులు పట్టించుకోవటం లేదు. కూటమి పాలనలో అయినా అధికారులు స్పందించి బాలకన్నయ్యకు కొత్త కోవెల నిర్మించాలని, కనీసం

ఆలయ ముఖద్వారం

పాడైన ధ్వజస్తంభం కొత్తది నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయమై దేవాదాయ శాఖ జేఈ నెమలిరెడ్డిని వివరణ కోరగా పురావస్తు శాఖ అనుమతి మేరకు ఆలయానికి మరమ్మతులు నిర్వహిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, యడ్లపాడు

## నేడు డయల్ యువర్ డీఎం

**మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే:** నరసరావుపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజల కోసం సోమవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు తెలియజేసేందుకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959225428 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వినుకొండలో భగవద్గీత ప్రచారం

**వినుకొండ, న్యూస్‌టుడే:** ఇస్కాన్ అత్తాపూర్ సభ్యులు హిందూ మత ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలో సంకీర్తనలు ఆలపించారు. వాయిద్యాలు మోగిస్తూ లయబద్ధంగా పాటలు పాడారు. భగవద్గీత, శ్రీకృష్ణ అవతారం తదితర గ్రంథాలను విక్రయించారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి 20 మందితో కూడి బృందం రెండు వాహనాల్లో బయలు దేరారు. ఈనెల 20కి అహోబిలం చేరతామని వారు తెలిపారు. భగవద్గీతను ప్రజలకు చేరువ చేసేందుకు మార్గంమధ్యలో అన్ని ప్రధాన నివాస ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు.

సంకీర్తనలు ఆలపిస్తున్న ఇస్కాన్ సభ్యులు



## ఈపూరు సొసైటీ సభ్యుల బాధ్యతల స్వీకరణ

ఈపూరు సొసైటీ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు

**ఈపూరు, న్యూస్‌టుడే:** కొత్తగా ఎంపికైన సొసైటీ కమిటీ సభ్యులు రైతులకు సేవలందించి వారి ఆదరణ చూరగొనాలని కేంద్ర సహకార బ్యాంకు మాజీ డైరెక్టరు, మాజీ ఎంపీపీ బొల్లా వెంకటకోటయ్య అన్నారు. ఈపూరు సహకార వ్యవసాయ పరపతి సంఘం నూతన కమిటీ సభ్యులు ఈపూరు బోటిమీద ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకుని ఆదివారం పూజలు నిర్వహించారు. అనంతరం ఈపూరు సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఛైర్‌పర్సన్‌గా విడపలపాటి హనుమయ్య, సభ్యులుగా అయినాల కోటేశ్వరరావు, చిందుకూరి నరసింహారావు బాధ్యతలు స్వీకరించారు. వారిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, తెదేపా మండల అధ్యక్షుడు రాపర్ల మురళి, సొసైటీ సీఈవో పోకా కోటేశ్వరరావు, మోదుగుల సత్యనారాయణ, న్యాయవాది రామకోటేశ్వరరావు, సర్పంచి గోనుగుంట్ల శ్రీనివాసరావు, మోదుగుల నరసింహారావు, అంగలూరు సొసైటీ ఛైర్‌పర్సన్ తిరుమలశెట్టి బాలయ్య, పాపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భైలడుగు రామయ్య పాల్గొన్నారు.

## పోలేరమ్మకు బోనాలు

**శావల్యాపురం, న్యూస్‌టుడే :** ఆషాఢ మాసం ఆదివారం పురస్కరించుకుని మండల కేంద్రమైన శావల్యాపురంలో పోలేరమ్మ, అద్దంకమ్మ, గంగమ్మ తల్లి ఆలయాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో పోలేరమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాలడుగు అయ్యన్న, పాలడుగు నాగాంజనేయులు, వీరాంజనేయులు, చెవల వెంకటకిష్ణయ్య పాల్గొన్నారు.

## కాలువలు శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

**నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే:** పట్టణంలోని ఒకటో వార్డు రాములవారి వీధితో పాటు పలు వీధుల్లో మురుగు కాలువలు శుభ్రం చేయక గడ్డి మొలచి విషసర్పాలు సంచరిస్తున్నాయి. దీని వల్ల స్థానికులకు కలిగే ఇబ్బందులు వివరిస్తూ 'కాలువలు ఇలా.. మురుగు పారేదెలా' శీర్షికన 'ఈనాడు'లో ఈనెల 13న ప్రచురితమైన కథనంపై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమాదేవి స్పందించారు. పారిశుద్య సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయించారు.

## 9 మంది జూదరుల అరెస్టు

**కారుమంచి(శావల్యాపురం), న్యూస్‌టుడే:** మండలంలోని కారుమంచి సమీపంలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై దాడి చేసి 9మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.1.54 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

(c) eenadu

# నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

## పీజీఆర్ఎస్‌లో అర్జీలు అందించండి

**నూజండ్ల, న్యూస్‌టుడే:** ప్రజలు తమ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రతి సోమవారం అర్జీలు అందించాలని తహసీల్దార్ రమేష్‌కుమార్ కోరారు. రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమస్యలు ఆలకించి అర్జీలు తీసుకుంటామన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని వివరించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక

**వినుకొండ, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయుడు, కవి కరీముల్లా తిరుపతి వేంకటకవుల జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 20న హిందూపురంలో భారతీయ తెలుగు సాహిత్య అకాడమి, సత్యసాయి జిల్లా రచయితల సంఘం నిర్వహించే కార్యక్రమానికి రావాలని ఈ మేరకు ఆహ్వానం అందిందన్నారు. తెలుగు సాహిత్యంలో విశేష ప్రతిభకు ఈ పురస్కారం ప్రకటించారన్నారు.

## కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు

**చిలకలూరిపేట పట్టణం, నాదెండ్ల (చిలకలూరిపేట (గ్రామీణ), ఈపూరు, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే ప్రతి కుటుంబానికీ ఏదో ఒక మేలు జరిగిందని, ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకుని జీవితాలను మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేట పట్టణంలో 8, 18, 20, 22 వార్డుల్లో ఆదివారం పర్యటించారు. వార్డుల్లో రూ.55 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలు పరిష్కరించి పుర ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను కోరారు. ఎమ్మెల్యేకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని, వైస్ ఛైర్మన్ శ్రీను, భాజపా నాయకుడు జయరామిరెడ్డి, తెదేపా నాయకులు నెల్లూరి సదాశివరావు, కరీముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి తదితరులు పాల్గొన్నారు. నాదెండ్ల మండలం, తూబాడు, జంగాపల్లి గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నల్లమోతు హరిబాబు, బండారుపల్లి సత్యనారాయణ, ఇనగంటి జగదీష్, కందుల రమణ తదితరులు పాల్గొన్నారు. ఈపూరు మండలం ఊడిజర్లలో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు అందించారు. తెదేపా మండల అధ్యక్షుడు రాపర్ల మురళి, తెదేపా సీనియర్ నాయకులు పాపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాటం కోటేశ్వరరావు, తెలుగు దేశం పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నంబూరి మోషే పాల్గొన్నారు.

నాదెండ్ల మండలంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు

## పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తాం

**నరసరావుపేట అర్బన్:** జిల్లాలో సంస్కృత భాషాభివృద్ధికి కృషి చేస్తున్న పాఠశాల నరసరావుపేటలో ఉండడం గర్వకారణమని, అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవం ఆదివారం నిర్వహించారు. వేడుకలకు మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పాఠశాల మొదటి బ్యాచ్‌కు చెందిన మాజీ విశ్వవిద్యాలయ పాలకవర్గ సభ్యుడు డీఏఆర్ సుబ్రహ్మణ్యం, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయ్‌కుమార్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గోపిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు ముందుకు రావాలన్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణసింగ్‌ను పూర్వవిద్యార్థులు సత్కరించారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

## ట్రిపుల్ ఐటీకి కాకాని విద్యార్థుల ఎంపిక

**నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే:** మండలంలోని కాకాని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు భారత్ స్కౌట్స్ విభాగంలో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందరాజులు ఆదివారం తెలిపారు. పాఠశాలకు చెందిన కొర్నెపాటి అనిల్‌కుమార్, ప్రభాస్, రావిళ్ల విఘ్నేష్ ఎంపికయ్యారన్నారు. తమ పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. స్కౌట్స్ విభాగంలో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

## ఆస్తి విషయమై వివాదం - కత్తితో దాడి

**మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే:** ఆస్తి విషయమై వాదంలో తలెత్తిన వివాదంలో కత్తితో దాడి చేసిన సంఘటన నరసరావుపేట పట్టణంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.. నరసరావుపేట షాలేంనగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా, అతని పెదనాన్న షేక్ రసూల్‌కు ఉమ్మడిగా ఇల్లు ఉంది. ఈ ఇంట్లో రెండు గదులుండగా ఒక గదిలో రసూల్ ఉంటున్నాడు. మరో గదిని బాషా మరొకరికి అద్దెకు ఇచ్చాడు. ఈ ఆస్తి విషయమై శనివారం రాత్రి చోటుచేసుకున్న వివాదంలో బాషా గొంతును రసూల్ కత్తితో కోశాడు. ఘటనలో గాయపడిన వ్యక్తిని స్థానికులు ఏరియా వైద్యశాలలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.

## రోటరీ కార్యవర్గం బాధ్యతల స్వీకారం

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:** రోటరీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినుకొండ రోడ్డులోని రోటరీ సర్వీస్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా షేక్ కరీమ్‌మొహిద్దీన్, కార్యదర్శిగా మునీధర్‌రెడ్డి, కోశాధికారిగా ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. వీరితో ఎలెక్ట్ గవర్నర్ ఎం.హరిహరప్రసాద్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కొత్త సభ్యులను క్లబ్‌లోకి ఆహ్వానించారు. క్లబ్ నిబంధనలు తదితర అంశాలను వివరించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులకు మొత్తం రూ.25వేలు ఉపకార వేతనం అందజేశారు. సహాయ గవర్నర్ రాఘవయ్య, క్లబ్ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులతో నూతన కార్యవర్గ సభ్యులు

## గోరింటాకు సంబరాలు

ఆషాఢ మాసం సందర్భంగా జిల్లాలో ఆదివారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. పార్వతీపురం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని మహిళలు గోరింటాకు, పూలతో అలంకరించారు. లక్ష్మీ నారాయణులను స్తుతించి, గోరింటాకు పెట్టుకున్నారు.

–న్యూస్‌టుడే, పార్వతీపురం

## నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్

పార్వతీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రజలు తమ అర్జీలను నేరుగా పరిష్కార వేదికకు తీసుకురావాలన్నారు. అన్ని మండల కార్యాలయాల్లోనూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే సమర్పించిన అర్జీల వివరాలు టోల్‌ఫ్రీ నంబరు 1100కు ఫోను చేసి తెలుసుకోవచ్చన్నారు.

## కూటమితోనే పురాభివృద్ధి

ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే గ్రామ, పట్టణాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి జరుగుతోందని గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం 2, 5 వార్డుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైకాపా పాలనలో వార్డులు, వీధుల్లో సమస్యలు పరిష్కారంకాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చాక అవి చాలా వరకు తొలగాయని ఆమె అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు చిట్టి, కౌన్సిలర్లు సత్యవతి, మోహన్, వైదేహి, అప్పయ్యమ్మ, దేవి, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మన్యం వణుకుతోంది

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సీతంపేట, పాలకొండ, సాలూరు, జియ్యమ్మవలస

### కాలానుగుణ వ్యాధుల విజృంభణ

వారం పాటు ఎడతెరిపి లేని వర్షం.. తర్వాత వరుసగా రెండు రోజుల పాటు ఎండలతో కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వర బాధితులు కనిపిస్తున్నారు.

### ఆసుపత్రులకు తాకిడి..

కేవలం జిల్లా ఆసుపత్రిలో మాత్రమే ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు 3,788 మంది ఓపీకి వచ్చారు. వీరిలో 250 మంది వరకు జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పాటు సీతంపేట ఆసుపత్రిలోనూ పరిస్థితి తీవ్రంగానే ఉంది. ఇక్కడ ఏకంగా 550 మందికి పైగా జ్వర బాధితులు చికిత్స పొందారు. జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి సామాజిక ఆసుపత్రిలో కేసులు తక్కువ నమోదు కాగా, సాలూరు, పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రుల పరిధిలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. మొత్తం 6 ఆసుపత్రుల్లో 12,696 ఓపీ రాగా 1,757 జ్వరాల కేసులు నమోదయ్యాయి.

పార్వతీపురం ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో జ్వరబాధితులు

ఈ నెల 5 నుంచి 10 మధ్య జిల్లాలోని ప్రధాన ఆసుపత్రుల్లో పరిస్థితి..

| ఆసుపత్రి | ఓపీ | జ్వరాలు |
|---|---|---|
| పార్వతీపురం | 3,788 | 250 |
| సీతంపేట | 1750 | 550 |
| సాలూరు | 1870 | 291 |
| పాలకొండ | 3,523 | 274 |
| భద్రగిరి | 1405 | 347 |
| చినమేరంగి | 360 | 45 |

ఆరు రోజుల్లో ఓపీ 12,696.. జ్వరాల నిర్ధారణ 1,757

### అదనపు పడకలు..

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జిల్లా ఆసుపత్రితో పాటు మిగిలిన చోట్ల ముందస్తుగా అదనపు పడకల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కొన్నాళ్లుగా ఖాళీగా ఉన్న గదుల్లో మంచాలు వేసి సర్దుబాటు చేస్తున్నారు. పార్వతీపురంలో 150 పడకల ఆసుపత్రిలో 250 బెడ్లు అందుబాటులో ఉంచారు. ★ సాలూరు ఆసుపత్రిలో 56 పడకలు ఉండగా 130 మంది వరకు రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురికి సేవలు అందిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం, సీతంపేటలోనూ ఇదే పరిస్థితి ఉంది.

### కొత్త భవనాల పూర్తి ఎప్పుడు..

పార్వతీపురం ఆసుపత్రిని నాలుగేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేస్తూ పడకలు 100 నుంచి 150కి పెంచారు. దీంతో కొత్తగా 50 పడకల భవనం నిర్మాణానికి మూడేళ్ల క్రితం నాబార్డు నిధులు రూ.21 కోట్లు మంజూరు చేశారు. వీటిలో రూ.18 కోట్లతో కొత్త భవనం, రూ.3 కోట్లతో పాత భవనం మరమ్మతులు చేయాలని నిర్ధారించారు. కానీ మూడేళ్లుగా మరమ్మతులే సాగుతున్నాయి. గత వైకాపా హయాంలో నిధుల విడుదలలో జాప్యంతో ఈ పరిస్థితి ఎదురైంది. గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, పాలకొండ, సాలూరులోనూ ఇదే పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు చెల్లింపులు చేయడంతో కొన్నిచోట్ల పనుల్లో వేగం పెరిగింది.

**ఇబ్బంది లేకుండా చూస్తున్నాం...:** ప్రస్తుతం కాలానుగుణ వ్యాధులతో వస్తున్న వారి సంఖ్య పెరిగింది. దీనికి తగిన విధంగా జిల్లా ఆసుపత్రిలో మంచాలు ఏర్పాటు చేస్తున్నాం. గదులు చాలని పరిస్థితి ఉంది. కొత్త భవనం పనులు పూర్తి చేసి అప్పగించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లాం.

- నాగశివజ్యోతి, సూపరింటెండెంటు, జిల్లా ఆసుపత్రి

## నాగావళి పరివాహకంలో గజగజ

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని నాగావళి పరివాహక ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఆదివారం బాసంగి, బాసంగి గదబవలస తదితర గ్రామాల్లో తిరుగుతూ కనిపించాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అరటి, పామాయిల్ పంటలను ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు. వ్యవసాయ పనులు చేసేందుకు పొలాలకు వెళ్లలేకపోతున్నామని, వాటిని దూరంగా తరలించాలని కోరుతున్నారు.

## స్పందించారు.. కాలువలు బాగుచేశారు

ఈనాడు కథనానికి స్పందన

ప్రధాన కాలువ ఒకటో కి.మీ. వద్ద తొలగించిన పూడిక

పాచిపెంట, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 12 వేల ఎకరాలకు సాగునీరు అందించే పాచిపెంట పెద్దగెడ్డ జలాశయంలో ప్రధాన, పిల్ల కాలువల్లో పూడిక, పనికిరాని మొక్కలు తొలగించారు. కాలువలు అధ్వానంగా మారడంతో సమస్యపై 'అందని సాగునీరు.. ఆయకట్టు రైతుల కన్నీళ్లు' శీర్షికతో గత నెల 25న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పెద్దగెడ్డ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ నిధులు రూ.52లక్షలు, ప్రాజెక్టు నిర్వహణ నిధులు రూ.5.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. పెద్దగెడ్డ, కర్రివలస వేగావతి ఆనకట్ట పరిధిలోని కాలువల్లో పూర్తిస్థాయిలో పూడిక, పనికిరాని మొక్కలు తొలగిస్తున్నట్లు చెప్పారు.

## బొబ్బిలి వీణ.. ప్రగతి రాగం

న్యూస్‌టుడే, బొబ్బిలి, ఈనాడు, విజయనగరం

మూడు శతాబ్దాల చరిత్ర కలిగిన బొబ్బిలి వీణ ప్రగతి రాగం ఆలపిస్తోంది. బొబ్బిలి కోటలో వీణ మీటితే దిల్లీ కోటలో ధ్వనించింది. దేశ విదేశాల్లో ఈ వాయిద్య పరికరం ప్రాచుర్యం పొందింది. ఈ వీణ విలక్షణ స్వరాలకు ప్రసిద్ధి చెందింది. ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) కింద కేంద్ర ప్రభుత్వ పురస్కారానికి ఎంపికైంది. రాష్ట్రంలో ఏడు జిల్లాల నుంచి ఎంపికైన వాటిలో ఇదొకటి. ఈ మేరకు దిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పురస్కారాన్ని కలెక్టర్ అంబేడ్కర్ సోమవారం అందుకోనున్నారు.

గిఫ్టు వీణల తయారీలో కళాకారుడు

'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' పురస్కారం

### హస్తకళ అదరహో

ఏడేళ్ల క్రితం బొబ్బిలి వీణకు భౌగోళిక గుర్తింపు వచ్చింది. బొబ్బిలి వీణ బొమ్మలతో తపాలా బిళ్లలు, నాణేలు ముద్రితమయ్యాయి. ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఈ వీణను చూసి ముచ్చటపడ్డారు. రెండేళ్ల క్రితం దిల్లీలో జరిగిన జీ-20 సదస్సు, విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్లో సైతం దీన్ని ప్రదర్శించారు. దీన్ని కేవలం పనస కలపతోనే తయారు చేస్తారు. దానివల్ల రాగం మృదువుగా ఉంటుంది. రెండు చెక్క ముక్కలను కలిపి రూపొందించే ఇతర వీణల మాదిరి కాకుండా ఒకే చెక్క నుంచి తయారు చేస్తారు. అందుకే దీన్ని ఏకంద వీణ అని పిలుస్తారు. గొల్లపల్లి ప్రాంతంలో సుమారు 300 కుటుంబాలు వందేళ్లకు పైగా వీణల తయారీతో జీవనోపాధి పొందుతున్నాయి. బాడంగి మండలం వాడాడలోనూ ప్రస్తుతం తయారవుతున్న వాటినీ బొబ్బిలి వీణలుగా పరిగణిస్తున్నారు.

### చెట్ల పెంపకానికి అడుగులు

ప్రస్తుతం పనస కలప స్థానికంగా లేక ఒడిశా నుంచి తెచ్చుకుంటున్నారు. దీనివల్ల ఖర్చు పెరుగుతోంది. కొనుగోలు చేసేవారికి కూడా భారంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉత్తరాంధ్రలో ఉపాధి పథకంలో పనస చెట్లను పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టారు. ఇది పెరిగి కలప చేతికొచ్చేందుకు సుమారు 20 ఏళ్లు పడుతుంది. అందుకే పొరుగు రాష్ట్రంలో కొనుగోలు చేసి రాయితీపై అందించాలని కళాకారులు కోరుతున్నారు. ప్రస్తుతం అడుగు రూ.800 నుంచి రూ.1,000 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక పెద్ద వీణకు 10, చిన్న వీణ తయారీకి రెండు అడుగుల కలప అవసరం. ఎమ్మెల్యే బేబీనాయన అసెంబ్లీలో కూడా ఈ వీణ ప్రాధాన్యత, కళాకారుల సమస్యలు ప్రస్తావించారు.

### సకాలంలో ఇవ్వలేకపోతున్నాం..

వీణల తయారీ సంఖ్య పెరుగుతోంది. ముడిసరకు కొరతతో ఆర్డర్లు వస్తున్నా సకాలంలో ఇవ్వలేకపోతున్నాం. ప్రభుత్వం కలప డిపో ఏర్పాటు చేసి, రాయితీపై అందించాలి. ఇటీవల హస్తకళల అభివృద్ధి సంస్థ సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

– సర్వసిద్ధి రామకృష్ణ, వీణల కేంద్రం ఇన్‌ఛార్జి, బొబ్బిలి

## చిన్నారుల కష్టాలకు చలించి.. పెద్దలంతా అండగా నిలిచి

రూ.50 వేలతో గది నిర్మాణం

కొమరాడ మండలంలోని కొండ శిఖర గ్రామం గాజులగూడ. అక్కడున్న పాఠశాలను ప్రభుత్వం ఆదర్శంగా ఎంపిక చేసింది. 55 మంది విద్యార్థుల కోసం అయిదుగురు ఉపాధ్యాయులను నియమించింది. ఏం లాభం.. అయిదు తరగతులకు ఉన్నది ఒకటే గది. గతంలో అదనపు భవనాల కోసం రూ.5.50 లక్షలు కేటాయించగా స్లాబ్ వరకు పనులు చేసి మధ్యలో వదిలేశారు. దీంతో ఆరుబయట, వరండాలో బోధనతో విద్యార్థులకు నిత్యం ఇబ్బందులే ఎదురయ్యేవి. వర్షం పడితే వీరి కష్టాలు దయనీయం. దీన్ని గ్రామస్థులు గుర్తించారు. పిల్లల చదువు కోసం.. వారి భవిత కోసం 110 కుటుంబాల ప్రజలు ఏకమయ్యారు. మంచి బడి అవసరమని భావించారు. ఇంటికి రూ.400, రూ.500 చొప్పున చందాలు వేసుకొని రూ.50 వేలు పోగుచేశారు. సగంలో నిలిచిన భవనం పనులు పూర్తి చేసేందుకు రేకులు, ఇటుకలు తీసుకొచ్చారు. ఆదివారం నుంచి పనులు ప్రారంభించారు. విషయం ఎంఈవో జామి నారాయణ స్వామి వద్ద ప్రస్తావించగా.. విద్యార్థుల సంఖ్య పెరగడంతో షెడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. దీని కోసం రూ.8 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

– న్యూస్‌టుడే, కొమరాడ

గోడ నిర్మిస్తున్న గ్రామస్థులు

## పంటల బీమా సద్వినియోగం చేసుకోండి

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పత్తి, అరటి పంటలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. మొక్కజొన్నకు ఎకరాకు రూ.330, వరికి రూ.800, పత్తికి రూ.98, అరటికి రూ.152 రైతు వాటా కింద ఈనెల 15లోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు. సచివాలయ డిజిటల్ సహాయకులు, పీఏసీఎస్‌లు, పోస్టాఫీసుల్లో నగదు చెల్లించే అవకాశం ఉందన్నారు. భూమి పత్రాలు, ఆధార్, పంట వేసినట్లు ధ్రువపత్రం జతచేయాలన్నారు.

## లస్కర్లను నియమిస్తాం.. శివారుకు నీరిస్తాం

'న్యూస్‌టుడే'తో ఎస్‌ఈ అప్పారావు

ముఖాముఖి

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో పంట కాలువల ద్వారా శివారు ఆయకట్టుకు సాగునీరు చేరేలా ప్రణాళికలు రూపొందించామని జలవనరులశాఖ బొబ్బిలి సర్కిల్ ఎస్‌ఈ అప్పారావు వెల్లడించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పాలకొండ మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలు, విజయనగరం జిల్లాలో బొబ్బిలి డివిజన్‌లోని జలవనరులు ఈ సర్కిల్ పరిధిలోకి వస్తాయి. ఆయా జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉందని, త్వరలో సాగునీటి విడుదల తేదీలను ప్రకటిస్తామని ఆయన 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

### దినసరి వేతనంపై..

జలాశయాల పరిధిలో లస్కర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. దినసరి వేతనంపై నియమించుకునేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. వెంగళరాయ, వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం, జంఝావతి పరిధిలో ఒక్కో జలాశయానికి 10 నుంచి 15 మంది లస్కర్లు అవసరం కావొచ్చు. దీనిపై పక్కాగా నివేదిక ఇవ్వాలని ఇంజినీర్లకు సూచించాం. త్వరలో నియమిస్తాం.

### జంఝావతి పనులకు ప్రతిపాదనలు

జంఝావతి జలాశయం పరిధిలో ప్యాకేజీ-2 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనివల్ల ప్రధాన కాలువల నుంచి సాగునీరు పూర్తిస్థాయిలో రావడం లేదు. పాత గుత్తేదారు మధ్యలో వదిలేశారు. వీటిని పూర్తి చేసేందుకు రూ.51 లక్షలతో ఉన్నతాధికారులకు నివేదించాం.

### ఆ నిధులతో పూడికతీత

నీటి తీరువా మొత్తాలతో కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నాం. వట్టిగెడ్డ, పెదంకలాం, జంఝావతి పరిధిలో నిధుల్లేక చేయలేదు. రైతుల నుంచి వసూలు చేసిన మొత్తాలు జలవనరులశాఖ ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. రాష్ట్ర విపత్తుల నిధితో అవసరమైన చోట పనులు చేపట్టాం.

### జనరేటర్ల ఏర్పాటు

అత్యవసర సమయాల్లో జలాశయాల్లోని అదనపు నీటిని నదుల్లోకి మళ్లించేందుకు వీలుగా వెంగళరాయ, వట్టిగెడ్డ, జంఝావతి వద్ద జనరేటర్లను ఏర్పాటు చేశాం. రెగ్యులేటర్లను పైకిలేపి నీరు విడిచి పెడతాం. విద్యుత్తు లేని సమయాల్లో ఇబ్బందుల నేపథ్యంలో ఇలా చేస్తున్నాం. షట్టర్లకు హాలింగ్ పూర్తి చేశాం. కాల్ సెంటర్లు ఏర్పాటు చేశాం.

### అంచనాల తయారీ

సర్కిల్ పరిధిలో అసంపూర్తిగా ఉండిపోయిన వెంగళరాయ అదనపు ఆయకట్టు, కంచరగెడ్డ తదితర పనులకు తాజాగా అంచనాలు తయారు చేస్తున్నాం. 100 ఎకరాలు దాటిన చెరువులను గుర్తించి ఉపాధి హామీలో తూములు, చప్టాల పనులు చేపట్టాలని ఉత్తర్వులు వచ్చాయి. వాటికి కూడా అంచనాలు తయారు చేశాం.

### నీటి చౌర్యానికి పాల్పడితే కేసులు

కొందరు రైతులు పంట కాలువల్లో సాగునీటిని మోటార్లతో తోడేస్తున్నారు. గండ్లు పెట్టి పైపులు అమర్చుతున్నారు. దీంతో దిగువ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచాం. అలాంటి రైతులపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తాం.

## ఐక్యతతో హక్కుల సాధన

సమావేశంలో మాట్లాడుతున్న యశస్వి

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: భావితరాలకు మంచి భవిష్యత్తు అందించేందుకు జిల్లాలోని కాపు కులస్థులు సంఘటితం కావాలని రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షురాలు పాలవలస యశస్వి పిలుపునిచ్చారు. ఆదివారం పార్వతీపురంలో ఆ సంఘ నాయకుడు సీతారాం అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆమె పాల్గొని మాటాడారు. తొలిసారిగా ఇక్కడి నుంచి ఐక్య సమావేశాలు ప్రారంభం కావడం మంచి పరిణామమన్నారు. మన హక్కులు సాధించుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ భవనం ఏర్పాటుకు ఛైర్‌పర్సన్ సహకరించాలని నాయకుడు ఎస్.శేఖర్‌పాత్రుడు కోరారు. నాయకులు విజయాంకుశం, బాబు, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

## పాలకొండకు నిలిచిన తాగునీటి సరఫరా

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విధులు బహిష్కరించి రక్షిత మంచినీటి పథకం కార్మికులు సమ్మె చేపట్టడంతో పాలకొండ పట్టణంలో ఆదివారం నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో 20 వార్డులకు చెందిన ప్రజలు అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా కార్మికులు విధులకు హాజరయ్యేలా కోరతామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు.

## బ్లీచింగ్ కొనేదెలా.. ఫినాయిల్ తెచ్చేదెలా?

- పంచాయతీల ఖాతాలు ఖాళీ
- పారిశుద్ధ్య పక్షోత్సవాలపై ప్రభావం

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రతి పల్లె శుభ్రంగా ఉండాలి.. కాలువలు శుభ్రం చేయాలి.. బ్లీచింగ్ చల్లాలి.. ట్యాంకుల క్లోరినేషన్ చేపట్టాలి.. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పక్షోత్సవాలకు పంచాయతీలు సిద్ధం కావాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. కానీ ఇప్పటికే పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. కనీసం బ్లీచింగు, ఫినాయిల్, సామగ్రి కొనుగోలు చేసేందుకు సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ఎలా చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

బలిజిపేట మెట్ట వీధిలో పేరుకుపోయిన వ్యర్థాలు

### రూ.10 కోట్లు రావాల్సి ఉంది..

గత ప్రభుత్వం సర్పంచులకు చెక్ పవర్ ఇవ్వకపోవడంతోపాటు పంచాయతీల ఖాతాలు బ్లాక్ చేసి నిధులను వివిధ పథకాలకు మళ్లించింది. ఇప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో ఈ కార్యక్రమాలు ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఆర్థిక సంఘం నిధులు రూ.10 కోట్ల వరకు సర్దుబాటు చేయాల్సి ఉంది. ఇవి వస్తేనే పారిశుద్ధ్యం, తాగునీటిపై ఖర్చు చేసే వీలు కలుగుతుంది. చిన్న, గిరిజన పంచాయతీలు కావడంతో ఆదాయ వనరులు అంతంతమాత్రమే.

### ఇవీ అవసరాలు..

◆ జిల్లాలో చాలా గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన జరుగుతోంది. 1.63 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండగా, మరో 25 వేలు అవసరమని అధికారులు చెబుతున్నారు. ఉన్నవారు సైతం అంతంతమాత్రంగానే వినియోగిస్తున్నారు. ◆ చెత్త సేకరణకు ఇంటింటికీ బుట్టలు ఇవ్వాలని గతంలో నిర్ణయించారు. 1.09 లక్షల మందికి అందజేయగా, మరో 2.95 లక్షల మందికి సమకూర్చాలి. ఇచ్చినవి సైతం ఎక్కడా వినియోగంలో లేవు. ◆ పలు గ్రామాలకు 1,024 ట్రై సైకిళ్లు ఇవ్వగా.. వినియోగంలో ఉన్నవి వందలోపే. స్వచ్ఛభారత్‌లో భాగంగా అందజేసిన చెత్త తరలింపు వాహనాలదీ ఇదే పరిస్థితి. ◆ గత ప్రభుత్వ పాలనలో పంచాయతీలకు అందజేసిన ట్రాక్టర్లకు తొట్టెలు లేక మూలన పడేశారు.

జిల్లాలో వివరాలు..
పంచాయతీలు: 451
గృహాలు: 2,13,755
జనాభా: 7,40,938

### పనులకు ప్రణాళిక..

జిల్లాలో ఈ నెల 16 నుంచి నిర్వహించే పారిశుద్ధ్య పక్షోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధులను ఉపయోగించి, పల్లెల్లో శుభ్రత పనులు చేపడతాం. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయాలు భాగస్వామ్యం కానున్నాయి.

- టి.కొండలరావు, డీపీవో, పార్వతీపురం మన్యం జిల్లా




(c) eenadu

# చదువుల చుట్టూ చీకటి మత్తు

▼ విజయనగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న పలు విద్యా సంస్థల సమీపంలో పెద్దఎత్తున దుకాణాలున్నాయి. ఇక్కడ ఖైనీ, గుట్కా, సిగరెట్లు అమ్ముతున్నారని, తమ పిల్లలు పక్కదారి పడుతున్నట్లు పలు సందర్భాల్లో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పోలీసులు దాడులు చేపట్టి, నిర్వాహకులపై చర్యలు తీసుకున్నారు.

▼ విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు, మహారాజా కోట, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని పాన్‌షాప్‌లలో తనిఖీలు చేపట్టి, నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం నేరవార్తా విభాగం

ఇటీవల దాడుల్లో పట్టుబడిన పొగాకు ఉత్పత్తులు

బాలలు, యువతను మత్తులోకి దించడమే లక్ష్యంగా గంజాయి ముఠాలు దుకాణాల ద్వారా అమ్మకాలు సాగిస్తున్నాయి. గంజాయితో తయారైన సిగరెట్లు, చాక్లెట్లను వారి దరిచేర్చుతున్నాయి. దీంతో బాల్యం మాదక ద్రవ్యాల మాయలో పడిపోతోంది. విద్యా సంస్థలకు 100 మీటర్ల దూరంలో అమ్మకూడదన్న నిబంధనలున్నా జిల్లాలో యథేచ్ఛగా కార్యకలాపాలు సాగుతున్నాయి. ఈనెల 8న పోలీసులు, ఈగల్ బృందం, స్పెషల్ బ్రాంచి సిబ్బంది ఉమ్మడిగా చేపట్టిన దాడుల్లో ఈ విషయం తేటతెల్లమైంది.

**భారీగా స్వాధీనం..** జిల్లాలోని పలు కళాశాలలతో పాటు పాఠశాలల ఆవరణల్లో, సమీపంలోని రోడ్ల వెంబడి పెద్దఎత్తున దుకాణాలున్నాయి. వీటిల్లో చాలా వరకు 100 మీటర్ల లోపే ఉన్నాయి. సిగరెట్లు, ఖైనీ, గుట్కా, పలు రకాల పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్నారు. ఇటీవల 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్' పేరిట చేపట్టిన దాడుల్లో 512 మంది దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు కేసులు నమోదు చేసి, రూ.1.13 లక్షల జరిమానా విధించారు.

**బానిసలవుతూ..** మత్తుకు బానిసవుతున్న వారిలో యువతతో పాటు బాలలు సైతం ఎక్కువగానే ఉంటున్నారు. వీరిలో చాలామంది క్యాన్సర్, ఇతర ప్రమాదకర వ్యాధుల బారిన పడుతున్నారు. మహారాజా ప్రభుత్వాసుపత్రికి నెలలో వచ్చే కేసుల్లో 150 నుంచి 200 మంది వరకు యువతే ఉంటున్నారు. దంత, గొంతు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతూ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. మత్తు వ్యసనపరుల కేంద్రాన్ని సైతం కొందరు ఆశ్రయిస్తున్నారు. 2017 నుంచి ఈ ఏడాది మే వరకు 13,131 మంది చికిత్స పొందగా.. వీరిలో 47 శాతం మంది 35 ఏళ్ల లోపు వారేనని ఆ విభాగం పేర్కొంది. విద్యార్థులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

# నీటిజాడ కరవు.. రైతు గుండె బరువు..!

ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతుకు చివరి ధాన్యం సేకరణ వరకు కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తొలుత కురిసిన వర్షాలకు మురిసిన అన్నదాత.. తర్వాత వానలు ముఖం చాటేయడంతో ఆశలు ఎండిపోయాయి. ఇటీవల కురిసిన అడపాదడపా వర్షాలకు ఆయా ప్రాంతాల్లో రైతులు వరినారు వేసుకున్నారు. ఆదిలోనే హంసపాదు అన్న చందంగా తయారైంది ప్రస్తుత రైతు పరిస్థితి. వరుణుడు కన్నెర్ర చేయడంతో ఎండలు మండిపోతున్నాయి. నీరులేక నారుమడి ఎండుతోంది.. రైతు గుండె బరువెక్కుతోంది. పంటను కాపాడుకునేందుకు సమీపంలోని వనరుల నుంచి నీటిని తోడి, మోసుకుని తెచ్చి మడులు తడిపేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు. విజయనగరం జిల్లాలోని గంట్యాడ మండలంలోని రామవరం గ్రామంలో, మెంటాడ మండలంలో ఆగూరు, గుర్ల, జి.టి.పేట, జక్కువ, మీసాలపేట, బడేవలస, పోరాం, కుంటినవలస, పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలో వరి, కూరగాయలు, పత్తి రైతుల కష్టాలు వర్ణనాతీతం.

– ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, మెంటాడ, భామిని

మెంటాడ మండలం గుర్లలోని పొలంలో వరినారు తడుపుతున్న మహిళా రైతు

సంతకవిటి మండలం వాసుదేవపట్నం గ్రామ సమీపంలో నారుమడులను కాపాడేందుకు అన్నదాతల పాట్లు

# భారీ వర్షం.. నగరం మునక

చెరువును తలపిస్తున్న విజయనగరంలోని సిటీస్టాండ్ దారి

విజయనగరం జిల్లా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కుండపోతగా పడింది. దీంతో పలు ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. డివైడర్ల మధ్యలోని చెట్లు నేలకొరిగాయి. నగర పాలక సంస్థ కార్యాలయం కూడలి, సిటీ స్టాండ్, ప్రకాశం పార్కు, దాసన్నపేట రైతు బజారు కూడలి, ధర్మపురి రోడ్డు, రింగురోడ్డు, ఎన్సీఎస్ రోడ్డు, రామారాయుడు దారి తదితర చోట్ల వర్షం నీరు నిలవడంతో ఆయా ప్రాంతాలు చెరువులను తలపించాయి. అధ్వాన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా ఈ పరిస్థితి నెలకొందని నగర వాసులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ముంపుబారిన నగరపాలక సంస్థ కార్యాలయం

వరద ప్రవాహానికి కొట్టుకుపోతున్న వాహనం →

## ప్రయాణికులకు అండగా ఆర్టీసీ

# మీరు మర్చిపోతే.. వారు తిరిగిస్తారు

న్యూస్‌టుడే- విజయనగరం అయ్యన్నపేట

ఆర్టీసీ బస్సుల్లో రోజూ వేలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. చాలా మంది దిగే సమయంలో హడావుడి, ఇతరత్రా కారణాలతో తమ విలువైన వస్తువులను బస్సుల్లో మర్చిపోతుంటారు. వాటిని ఎలా తిరిగి పొందాలో తెలియక చాలామంది ఇబ్బంది పడుతున్నారు. దీనికోసం ఆర్టీసీ 'లాస్ట్ ప్రాపర్టీ హ్యాండోవర్' విధానాన్ని తీసుకొచ్చింది. దీన్ని జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో అమలు చేస్తున్నారు.

★ రామభద్రపురం మండలం ఆరికతోట వెళ్లేందుకు విజయనగరంలో సాలూరు బస్సు ఎక్కిన ఎం.రాజేశ్వరి శీతలపానీయం కొనుగోలు చేసేందుకు బస్సు దిగారు. ఇంతలో బస్సు సముదాయం నుంచి వెళ్లిపోయింది. స్టేషన్ ప్రబంధకుడు సత్యనారాయణను సంప్రదించగా.. బస్సును తిరిగి రప్పించి అందులో ఉన్న బంగారం, ఇతర విలువైన వస్తువులను ఆమెకు అందజేశారు.

★ గరివిడికి చెందిన కె.శ్రీ విజయనగరం- వీరఘట్టం బస్సులో ఎక్కి, హడావుడిగా దిగేశారు. తమ వెంట తెచ్చుకున్న కుక్కర్ మర్చిపోయారు. టిక్కెట్‌పై ఉన్న వివరాలతో కండక్టర్‌ను సంప్రదించగా.. విజయనగరం సముదాయంలో కుక్కర్ అందజేశారు.

మర్చిపోయిన వస్తువులను మహిళకు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

**సిబ్బంది భద్రపరుస్తారు..**

బస్సుల్లో ఏదైనా తెలియని వస్తువులు కనిపిస్తే డ్రైవర్, కండక్టర్ వాటిని భద్రపరుస్తారు. బస్సు గమ్యస్థానం చేరేవరకు వారిదే బాధ్యత. ఆ తరవాత వివరాలు పూర్తిచేసి నగదు జమచేసే ఎర్నింగ్ విభాగంలో ఆ వస్తువులను అందిస్తారు. నెల రోజులు అక్కడే ఉంటాయి. ఇంతలో ఎవరైనా వస్తే పరిశీలించి అందజేస్తారు. లేకపోతే వాటిని వేలం వేస్తారు. వచ్చిన నగదును జిల్లా ట్రెజరీలో జమచేస్తారు. దాదాపు ప్రయాణికులకు వస్తువులను అప్పగిస్తున్నామని, వేలం ప్రక్రియ వరకు రాలేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

**ఇలా పొందొచ్చు..**

ప్రయాణికులు బస్సుల్లో సామగ్రి మర్చిపోతే బస్సులో ఏర్పాటు చేసిన డిపో ప్రబంధకులు, డీపీటీవోల నంబర్లకు ఫోన్ చేయవచ్చు. ● ఆర్టీసీ ప్రధాన కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్ 149ను సంప్రదించి.. టిక్కెట్‌పై ఉన్న గుర్తింపు సంఖ్య చెబితే కండక్టర్, డ్రైవర్ ఫోన్ నంబర్, వివరాలు చెబుతారు. బస్సు ఏ డిపో పరిధిలో ఉందో, వస్తువులు ఎక్కడ ఉన్నాయో పూర్తి సమాచారం అందిస్తారు.

# వీఆర్‌కు ఒకటో పట్టణ సీఐ

## రాత్రి వేళ ఆకస్మిక బదిలీ పోలీసు వర్గాల్లో చర్చనీయాంశం

సీఐ శ్రీనివాస్

ఈనాడు, విజయనగరం: విజయనగరం ఒకటో పట్టణ సీఐ ఎస్.శ్రీనివాసును ఉన్నతాధికారులు ఆకస్మికంగా వీఆర్‌కు పంపించారు. ఆయన స్థానంలో ఎస్‌బీ-2 సీఐ ఆర్‌వీ ఆర్‌కే.చౌదరిని నియమించారు. ఈ మేరకు శనివారం రాత్రి విశాఖ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అంశం పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మూడు రోజుల క్రితం పక్కా సమాచారంతో చేపట్టిన తనిఖీల్లో సుమారు 700 గ్రాముల బంగారు ఆభరణాలతో ఒక వ్యక్తి పట్టుబడ్డారు. ఆ సొత్తుకు ఎలాంటి ఆధార పత్రాలు చూపించలేకపోయారు. ఈ విషయం ఆ శాఖ యంత్రాంగానికి తెలియగా.. నగరానికి చేరుకున్న కేసును జీఎస్టీ లేదా ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించాలని కోరారు. సమాచారాన్ని సీఐ ఉన్నతాధికారులకు చెప్పగా.. నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఆదేశించారు. ఈక్రమంలో కేసు బదలాయించడంలో జాప్యం చేశారని, ఉద్దేశపూర్వకంగా ఇలా చేస్తున్నారని బంగారం వ్యాపారి అమరావతిలోని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. ఓ కీలక ప్రజాప్రతినిధి పీఏ ఫోన్ చేసినా మాట్లాడేందుకు సీఐ నిరాకరించారు. ఇలా రెండు, మూడు సార్లు జరగడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాము చెప్పింది వినకపోవడం కాకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారని ఫిర్యాదు చేశారు. దీని ఫలితంగా ఆఘమేఘాలపై సీఐని వీఆర్‌కు బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# నిమ్మ ధర పతనం.. రైతు కలవరం

సీతంపేట మన్యంలో విరివిగా పండే నిమ్మకాయల ధర పతనమవడంతో గిరి రైతులు కలవరం చెందుతున్నారు. అష్టకష్టాలు పడి ఆదివారం వారపు సంతకు తీసుకురాగా కిలో ధర రూ.10 లోపే పలకడంతో ఉసూరుమంటున్నారు. గతంలో 50 నుంచి 60 కిలోలున్న బస్తా రూ.2 వేల నుంచి రూ.2500 వరకు తీసుకునేవారు. నేడు రూ.500 నుంచి రూ.600లోపే అమ్ముడుపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి, మద్దతు ధర దక్కేలా చూడాలని, మార్కెటింగ్‌కు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

సీతంపేట సంతలో బస్తాల్లో నిమ్మకాయలు

# దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో అతిథి అధ్యాపకులుగా పని చేసే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎస్.తవిటినాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశ్రాంత, ఇప్పటికే పనిచేస్తున్న అధ్యాపకులు, పాఠశాల సహాయకులు అర్హులన్నారు. డిగ్రీలో కనీసం 50 శాతం ఉత్తీర్ణత ఉండాలని, ఈనెల 15వ తేదీలోగా ఒరిజినల్, జిరాక్స్ పత్రాలను సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందజేయాలని సూచించారు. 16న విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముఖాముఖి ఉంటుందని చెప్పారు.

| కళాశాల | సబ్జెక్టు | పోస్టులు |
|---|---|---|
| గంట్యాడ | జంతుశాస్త్రం | 1 |
| కొత్తవలస | జంతుశాస్త్రం | 1 |
| డెంకాడ | గణితం | 1 |
| ఎస్.కోట | గణితం | 1 |
| ఎస్.కోట | జనరల్ ఫౌండేషన్ | 1 |
| దత్తిరాజేరు | భౌతికశాస్త్రం | 1 |
| సంతకవిటి | ఆంగ్లం | 1 |

## చికెన్ ధరలు

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 90 | 150 | 160 |

# బుచ్చెంపేటలో ఇరువర్గాల కొట్లాట

## 10 మందికి గాయాలు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పురపాలిక పరిధిలోని బుచ్చెంపేటలో స్థలం విషయంలో తలెత్తిన వివాదం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో 10 మందికి గాయాలైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఒక వర్గానికి చెందిన ఎన్.సింహాచలం, ఎం.శ్రీను, కె.చంద్రశేఖర్, పి.రవీంద్ర, ఎం.గోవింద, ఎన్.సిమ్మన్నను రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మరో వర్గానికి చెందిన ఎం.సూరిబాబు, పి.సత్యం, పి.రాము, పి.కావ్య స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై వై.రవికిరణ్ ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు. గ్రామంలో ఒక స్థలం విషయంలో ఏళ్ల నుంచి వివాదం నడుస్తోంది. దారి కోసం స్థలం విడిచిపెట్టి అందులో ఇప్పుడు గోడ నిర్మించేందుకు ప్రయత్నిస్తుండడంతో పెద్దల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారి తీసినట్లు చెబుతున్నారు. సింహాచలం, చంద్రశేఖర్‌కు తలకు గాయాలవడంతో పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తీవ్రంగా గాయపడిన సింహాచలం

# వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృత్యువాత

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం ఉదయం సాలూరు మండలం జీగిరాం సమీపంలోని బైపాస్‌రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాలూరు పట్టణం గొర్లెవీధికి చెందిన జి.ధర్మారావు(43) తన కుమారుడు గుణశేఖర్‌తో కలిసి పొలం పనుల నిమిత్తం బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లారు. తిరిగి ఇంటికి స్కూటీపై వస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ధర్మారావు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. గాయాలపాలైన కుమారుడ్ని స్థానికులు ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ధర్మారావు భార్య అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ బంగార్రాజు తెలిపారు.

ధర్మారావు (పాతచిత్రం)

**చికిత్స పొందుతూ..**

నేరవార్తా విభాగం: నగరంలోని ధర్మపురి రోడ్డులో ఈనెల 10న జరిగిన రహదారి ప్రమాదంలో గాయపడిన ఇద్దరు క్షతగాత్రులూ మృతిచెందారు. గొంపవీధికి చెందిన సీహెచ్.దుర్గాప్రసాద్(19), పి.ప్రణీత్‌కుమార్, కార్తీక్ ఈనెల 9న ద్విచక్రవాహనంపై సింహాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లారు. 10న ఇంటికి వస్తుండగా ధర్మపురి రోడ్డులో కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దుర్గాప్రసాద్, ప్రణీత్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రణీత్‌కుమార్ శనివారం మృతి చెందగా.. ఆదివారం దుర్గాప్రసాద్ కన్నుమూశాడు. ఈ యువకుడికి తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దుర్గాప్రసాద్ (పాతచిత్రం)

**రైలు ఢీకొని వృద్ధుడు..**

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన దత్తిరాజేరు మండలంలో చోటుచేసుకుంది. బొబ్బిలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు వివరాల ప్రకారం.. పాచిపెంట గ్రామానికి చెందిన డి.తవిటయ్య(70)కు వివాహితులైన కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య మృతిచెందారు. ప్రస్తుతం గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్నాడు. పని నిమిత్తం ఆదివారం దత్తిరాజేరు మండలం మరడాం వచ్చారు. పట్టాలు దాటుతున్న క్రమంలో గూడ్సు రైలు ఢీకొని మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెచ్‌సీ తెలిపారు.

# గుర్తుతెలియని మహిళ మృతి

జామి, న్యూస్‌టుడే: జామి మండలంలోని కంటకాపల్లి-అలమండ రైల్వేస్టేషన్ల వద్దగల ప్రధాన లైను సమీపంలో ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని రైల్వే హెచ్‌సీ పి.రవికుమార్ తెలిపారు. ఆమె వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, 5.5 అడుగుల పొడవు, ఎరుపు, పచ్చ, పసుపు, కాషాయ రంగు గడులతో కూడిన నైటీ ధరించినట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు 94906 17089, 91820 73593, 0891-2883218 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

**వృద్ధుడి మృతదేహం గుర్తింపు..**

విజయనగరం నేరవార్తావిభాగం: నగరంలోని నెహ్రూ పార్కు సమీపంలో సుమారు 70 ఏళ్ల వయసు గల వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తెల్లటి దుస్తులు ధరించాడని, దుప్పటి, స్టీలు కంచం ఉన్నాయని రెండో పట్టణ సీఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


EENADU Classifieds

PROFESSIONAL SERVICES

ASTROLOGY

శ్రీగాయత్రీ జోతిష్యం, గతం 25 సంIలు విజయనగరంలో స్థిరపడిఉన్నారు. విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం, ఆరోగ్యం మీకు ఎటువంటి సమస్యలున్నా.. జోతిష్యం చెప్పబడును సెల్: 9701778711.

REAL ESTATE

FLAT FOR SALE

3 BHK 1450 Sft Flat for sale. 4th floor newly construction Haimavathi Sadhan, Kamma Veedhi, VZM. Car Parking, Lift with all facilities. C : 9177400008.

South India shoping mall backside 3 BHK, 1325 Sft 4th floor new flat for sale. Car parking, Lift with all facilities. C : 9177400008.

JOBS

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ టీం లీడర్స్ కావలెను. అర్హతలు 10th to Degree. జీతం : 21,000/- నుండి 45 వేలు వరకు. Contact : 9704107303, 8008574616.

Receptionist and Waiters Required Age: below 35 yrs. with Computer & Hindi & English speaking skills Hotel Winsar Park, Opp. KGH, Vizag. 9849581868.

Required ITI in Civil with 5 yrs + Experience in the field of Constructions. Call : 9959969354.

Male House Keeping Boy for House Food and Accomodation Available. Contact: 8897663366.

మణిరాజ్ ఎలక్ట్రో మొబైల్స్‌తో కలిసి మైస్టఫ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్, లైవ్ ప్రాజెక్ట్‌లతో EV ఇంజినీరింగ్ మైక్రో డిగ్రీ సర్టిఫికేషన్ (4 వారాలు) కోర్సును అందిస్తోంది. 100% ప్లేస్‌మెంట్ సహాయం. సంప్రదించండి: 7997638005, 7997226984

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైన స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315/- (GST 5% అదనం)
మాత్రమే సంప్రదించండి: 8008597609


# అనుబంధం పెట్టని 'కోట'

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. 1993లో బొబ్బిలి సింహం చిత్రీకరణలో భాగంగా విజయనగరంలో నాలుగు రోజుల పాటు ఉన్నారు. స్థానిక ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం సమీపంలోని ఓ లాడ్జిలో బస చేశారు. అప్పట్లో తాటిపూడి జలాశయం, కోరుకొండ సైనిక పాఠశాలను సందర్శించారు. జిల్లాకు చెందిన ఆయన బాల్యమిత్రుడు సుధాకర్‌తో పాటు విజయనగరానికి చెందిన సాంస్కృతిక విభాగం ప్రతినిధులు వెంట ఉండేవారు.

# 'కమిషన్లు అడుగుతున్నారు'

శృంగవరపుకోట: జిందాల్ సంస్థ తీసుకున్న భూమికి 18 ఏళ్ల తరువాత పరిహారం కింద వేసిన రూ.8 లక్షల్లో.. రూ.3 లక్షలు ఇవ్వాలని కొందరు స్థానిక నాయకులు అడుగుతున్నారని నిర్వాసితుడు చీడిపాలెం గ్రామానికి చెందిన అప్పలరాజు ఆరోపించారు. ఆదివారం బొడ్డవరలో నిర్వాసితుల శిబిరం వద్ద విలేకరులతో మాట్లాడారు. పరిహారం వస్తే కమిషన్లు అడగడం ఎంతవరకు సమంజసమన్నారు.


ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237


# సహకారం అందేలా.. సమస్యలు తీరేలా

గరివిడి, న్యూస్‌టుడే

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను(పీఏసీఎస్) కంప్యూటరీకరణ చేశారు. ప్రస్తుతం రుణాల చెల్లింపులు, ఇతర కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. త్వరలో ఆడిట్ ప్రక్రియను పూర్తిచేసి బ్యాంకుల మాదిరిగానే వీటిల్లో అన్నిరకాల లావాదేవీలను పూర్తిగా కంప్యూటర్ల ద్వారానే చేపట్టనున్నారు. దీంతో అవకతవకలకు అడ్డుకట్ట పడనుంది. సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందని, తద్వారా ఖాతాదారుల్లో నమ్మకం పెరుగుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

| | |
|---|---|
| జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆర్థిక లావాదేవీలు | : రూ.2,150 కోట్లు |
| రెండు జిల్లాల్లో పీఏసీఎస్‌లు | : 94 |
| సహకార బ్యాంకులు | : 24 |
| ఖాతాదారులు | : 5.23 లక్షలు |
| రుణాలు తీసుకున్న రైతులు | : 68 వేలు |
| ప్రస్తుత ఖరీఫ్‌లో రుణాల లక్ష్యం | : రూ.300 కోట్లు |

**■ గతంలో ఎన్నో అక్రమాలు**

ఇప్పటివరకు రసీదుల రూపంలో కార్యకలాపాలు సాగేవి. దీంతో పక్కా లెక్కలుండేవి కాదు. దీంతో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకునేవి. కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శించేవారు. దస్త్రాలను తారుమారు చేసేవారు. రుణ వాయిదాలు చెల్లించకుండానే సర్దుబాటు చేయడం, బినామీల పేరిట నగదు తీసుకోవడం, భూములు లేని వారిని సైతం సభ్యులుగా చేర్చడం, బోగస్ పత్రాలతో బొక్కేసేవారు. విజయనగరం జిల్లాలోని రాజాం, గంట్యాడ, పార్వతీపురం జిల్లాలోని మరో రెండు సంఘాల్లో ఈ తరహా లోపాలను గుర్తించారు. ఇప్పటికే రికవరీకి ఆదేశించారు.

గుర్ల మండలం జమ్ముపేటలోని పీఏసీఎస్ కార్యాలయం

**రెండేళ్లుగా సాగుతూ..** సంఘాల్లో కంప్యూటరీకరణ ప్రక్రియ 2023లోనే ప్రారంభమైనా ముందుకు సాగలేదు. వైకాపా హయాంలో మందకొడిగా సాగింది. కూటమి ప్రభుత్వం రాకతో కొన్ని అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ప్రత్యేకంగా దృష్టి పెట్టి, ఫిబ్రవరి నాటికి పూర్తి చేసింది. సొసైటీ ఏర్పడినప్పటి నుంచి గతేడాది మార్చి 31 వరకు జరిగిన లావాదేవీలన్నీ డేటా క్యాప్చర్ టూల్(డీసీటీ) సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేశారు. కొన్ని సంఘాల్లో పాత రికార్డులు అందుబాటులో లేకపోవడంతో కంప్యూటరీకరణ ఆలస్యమైంది. ఇటీవల రెండు జిల్లాల్లోని 94 సంఘాల్లోనూ ఆన్‌లైన్ పూర్తయింది.

**■ 1.21 లక్షల మందితో ఈకేవైసీ**

సొసైటీల్లో సభ్యులంతా ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశాలొచ్చాయి. ఇప్పటికే 1.21 లక్షల మంది ముందుకొచ్చారు. కొందరు దస్త్రాల్లో ఉన్నా క్షేత్రస్థాయిలో లేకపోవడం, చనిపోవడం తదితర కారణాలతో దూరమయ్యారు. స్థానికేతరులు, తీసుకున్న రుణాలు చెల్లించని వారు సైతం ఈకేవైసీని దూరం చేస్తున్నారు. ప్రస్తుతం బకాయిలన్నీ పెరిగి సహకార బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.90 కోట్లు ఉన్నట్లు గుర్తించామని డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇకనుంచి పారదర్శక సేవలు అందనున్నట్లు చెప్పారు.

# దరఖాస్తుల ఆహ్వానం

ఉడాకాలనీ, సీతంపేట, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లాలో ఉన్న మూడు ప్రభుత్వ ఐటీఐలు, 25 ప్రైవేటు ఐటీసీలలో రెండో విడత ప్రవేశాలకు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ టి.వి.గిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 20వ తేదీలోగా వివరాలను సమర్పించాలని, 22న సమీపంలోని విద్యాలయానికి వెళ్లి ఒరిజినల్ ధ్రువపత్రాలతో పరిశీలన చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో 23, 25వ తేదీల్లో, ప్రైవేటుకు సంబంధించి 26, 27వ తేదీల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 94415 18355, 98499 44654, 77806 58035 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ★ 23వ తేదీన సీతంపేట ఐటీఐలో కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపల్ గోపాలకృష్ణ తెలిపారు.

## మధ్యలో స్తంభం.. మురుగుకు అడ్డం

పార్వతీపురం మండలంలోని పుట్టూరులో కాలువ మధ్యలో స్తంభం ఉండటంతో మురుగు పేరుకుపోతోంది. కాలువ నిర్మాణ సమయంలో స్తంభాన్ని వదిలివేయడంతో ఈ పరిస్థితి ఎదురైంది. వర్షాలు పడుతున్నందున విద్యుత్తు షాక్ కొట్టే ప్రమాదముందని స్థానికులు వాపోతున్నారు. వేరే ప్రాంతానికి స్తంభం మార్చాలని కోరుతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో గ్రామీణం ఏఈ రామారావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

## అసంపూర్తి పనులతో అవస్థలు

సీతానగరం మండలంలోని గెడ్డలుప్పి పరిధిలో ఉన్న వెల్‌నెస్ కేంద్ర భవన నిర్మాణ పనులు ఏడాదిగా అసంపూర్తిగా వదిలేశారు. ఈ పనులు మూడేళ్ల క్రితం ప్రారంభించారు. బిల్లులు రాకపోవడంతో చివరి దశలో నిలిపేశారు. దీంతో స్థానికులు కొన్నాళ్ల పాటు ధాన్యం బస్తాలు భద్రపర్చేవారు. ఇంజినీరింగ్ సిబ్బంది వాటిని తొలగించి ద్వారం వద్ద కర్రలు అడ్డుపెట్టారు. విషయం ఏఈ చంద్రమౌళి వద్ద ప్రస్తావించగా.. పనులు పూర్తికి దృష్టి పెడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

## కొంచెం పట్టించుకోండి సారూ!

పాచిపెంట మండలం కర్రివలస ప్రాథమికోన్నత పాఠశాలలో శుద్ధ జల ప్లాంట్ మరమ్మతుకు గురైంది. ఇక్కడ 126 మంది చదువుతున్నారు. మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా బాగు చేయలేదు. దీంతో విద్యార్థులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. స్థానికంగా ఉన్న బోర్లను ఆశ్రయిస్తున్నారు. దీనిపై నిర్వాహక కంపెనీకి చరవాణి ద్వారా సమాచారం అందించామని, త్వరలో బాగు చేయిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

## పెచ్చులు పడుతున్నాయి.. జాగ్రత్త

సాలూరు మండలం బాగువలస గ్రామపంచాయతీలో ఉన్న పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. భవనంలో నాలుగు గదులున్నాయి. స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. వైద్యుని గదితోపాటు, మందులిచ్చే గది, సిబ్బంది కూర్చొనే గదిలోనూ ఇదే పరిస్థితి. తలుపులు చెదలు పట్టాయి. దీనిపై పశువైద్యాధికారి పోలిస్తదొర మాట్లాడుతూ వారం రోజుల క్రితమే తాను బదిలీపై ఇక్కడికి వచ్చానని, సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

## పట్టుతప్పితే ప్రమాదమే..!

వీరఘట్టం మండలం ఎం.రాజపురం కూడలి వద్ద ప్రయాణికుల విశ్రాంతి భవనం ప్రమాదకరంగా మారింది. పైకప్పునకు ఆనుకుంటూ వేసిన స్తంభం పెచ్చులూడి, ఇనుప చువ్వలు తుప్పు పట్టి బయటకు కనిపిస్తున్నాయి. ఏ మాత్రం పట్టు తప్పినా భవనం కూలిపోయే ప్రమాదముంది. దీంతో ఇక్కడ ఉండేందుకు ప్రయాణికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వీరఘట్టం

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

| | |
|---|---|
| పార్వతీపురం | 8008566244 |
| పాలకొండ | 8008574299 |
| సాలూరు | 8008786820 |
| కురుపాం | 9849044696 |

? కుజరవలస శ్మశానవాటిక రహదారి అధ్వానంగా మారింది. మృతదేహాలను తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్నాం. – వంశధార నాయుడు ★ రహదారి బాగు చేయిస్తాం. – బి. వెంకటరమణ, ఎంపీడీవో – వీరఘట్టం

? రావికోన పంచాయతీ అట్టివలస పాఠశాల ప్రహరీ దిగువన మట్టి కోతకు గురవుతోంది. – రామయ్య ★ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. – కృష్ణారావు, ఏఈ – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? బుడ్డిపేట ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మురుగు రోడ్డుపై పారుతోంది. – వెంకటరమణ ★ కాలువ నిర్మిస్తాం. – సురేష్, పంచాయతీ ఈవో – న్యూస్‌టుడే, సీతానగరం

? పాలకొండ పట్టణంలోని మురళీమోహన నగర్‌లో కల్వర్టు పాడై ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు ★ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – దేవీవరప్రసాద్, ఏఈ, నగర పంచాయతీ – న్యూస్‌టుడే, పాలకొండ

? పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిపై మురుగు పారుతోంది. – శంకరరావు, ఉపాధ్యాయుడు ? పాలకొండ ఏలాం కాలనీలో కాలువలు పూడికతో నిండి ఉన్నాయి. – ప్రసాద్ ★ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – రత్నరాజ్, కమిషనరు – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

# పిలుపులేనా.. పనులు జరిగేనా..?

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు పట్టణంలో అభివృద్ధి పనులు ముందుకు కదలడం లేదు. గత వైకాపా పాలనలో పూర్తిగా వదిలేయడంతో ఈ పరిస్థితి ఎదురైంది. సాధారణ నిధులు లేక చిన్నపాటి సమస్యలు సైతం పరిష్కారం కావడం లేదు. దీనికి తోడు పురాభివృద్ధికి కేంద్రం ఏటా ఆర్థిక సంఘం నిధులు రూ. కోట్లలో మంజూరు చేస్తున్నా ఏమవుతున్నాయో తెలియని పరిస్థితి స్థానికంగా నెలకొంది.

ప్రమాదకరంగా మారిన మక్కువ బైపాస్ దారి

### ప్రతిపాదనలకే పరిమితం..

కూటమి ప్రభుత్వం వచ్చాక సాలూరులో అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు, కాలువ పూడికతీతకు రూ.34 లక్షలు మంజూరు చేసింది. సంబంధిత పనులు ముందుకు సాగడం లేదు. సామాజిక మరుగుదొడ్ల, నీటి పథకాల మరమ్మతులు, రోడ్లు, కాలువలు, కల్వర్టుల పనులకు ప్రతిపాదించడం, నిధులు కేటాయించడం, టెండర్లు పిలవడం, పాలకవర్గ సభ్యులు తీర్మానించడం మినహా పనులు మాత్రం జరగలేదు.

### మంత్రి శంకుస్థాపన చేసినా..

పురాభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11.32 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 110 పనులు ప్రతిపాదించారు. 11 చోట్ల, 3 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.50 కోట్లు కేటాయించారు. టెండర్ల ప్రక్రియ రెండేళ్లుగా సాగుతున్నా పనులు ప్రారంభించకపోవడంతో రద్దు చేశారు. గత అయిదేళ్లలో ఒక్క రోడ్డూ వేయలేదు. ★ దళ్లపీటి నుంచి పెదకోమటిపేట, కోటవీధి, మెంటాడవీధి, మక్కువ బైపాస్ రోడ్డు, ఎన్టీఆర్ కూడలి నుంచి కోటవీధి, రామాకాలనీ రోడ్లు గుంతలమయంగా మారాయి. గతేడాది వనవే రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఆ పనులు ఇప్పటికీ పూర్తి చేయలేదు.

| ఇదీ పనుల పరిస్థితి.. | |
|---|---|
| ప్రతిపాదించినవి | : 110 |
| పూర్తయినవి | : 43 |
| ప్రారంభం కానివి | : 19 |
| టెండర్లు రద్దు | : 14 |
| చేయాల్సిన పనులు | : 12 |

### మళ్లీ టెండర్లు పిలుస్తాం..

ఎస్ఎస్ఆర్ ధరలు మారాయి. అందుకే పాత టెండర్లు రద్దు చేసి మళ్లీ కొత్త ధరలతో బీటీ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నాం. వీలైనంత వేగంగా పనులు చేపట్టేలా చూస్తాం. – బి.వి.ప్రసాద్, పుర కమిషనర్

# కలుషిత నీరే దిక్కా?

పాలకొండ గ్రామీణం, పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ ప్రజలు తరచూ తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వేసవిలో ఎద్దడి.. మిగిలిన సమయాల్లో కలుషిత నీరు వారిని కలవరపెడుతోంది. తాజాగా వడమ రక్షిత పథకం పరిధిలో మూడు రోజులుగా పురుగులు, వ్యర్థాలు, మురుగు రంగులో నీరు రావడంతో ఆందోళన చెందుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పైపులకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పట్టణ పరిధిలో సరఫరా అవుతున్న నీరు

### మూడు నెలల్లో ఆరు సార్లు..

పాలకొండ పట్టణంలో నాలుగు రక్షిత పథకాలు ఉన్నాయి. వీటి నుంచి 20 వార్డుల పరిధిలోని 245 వీధులకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. నగర పంచాయతీ ఎదురుగా, వెంకమ్మ పేటలోని ట్యాంకులు 30 ఏళ్ల క్రితం నిర్మించారు. పాత పైపులు కావడంతో ఎప్పటికప్పుడు పాడవుతున్నాయి. దీంతో నీరు కలుషితం అవుతోంది. ఎన్‌కేరాజపురం, వడమ రక్షిత పథకాలను 15 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్లాస్టిక్ పైపులు అనుసంధానం చేయడంతో ఎప్పటికప్పుడు పగిలి పోతున్నాయి. దీంతో 3 నెలల వ్యవధిలో 6 సార్లు సమస్య ఏర్పడింది.

### నిబంధనలు పాటించక..

పట్టణ పరిధిలో అభివృద్ధి పనులను నగర పంచాయతీ దృష్టికి తీసుకెళ్లకుండా కొందరు నిబంధనలు అతిక్రమించి చేస్తున్నారు. ఇటీవల వడమ పరిధిలోని షిర్డీసాయినగర్, నక్కలపేటలో సాగునీటి కాలువల్లో పూడికను పొక్లెయిన్‌తో తొలగిస్తుండగా పైపులు దెబ్బతిన్నాయి. ఈ నెల మొదటి వారంలో అన్నవరం వద్ద శ్మశానవాటిక పనుల సమయంలోనూ ఇదే సమస్య వచ్చింది. గత నెలలో ఎన్‌కేరాజపురంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పాలకొండలో తాగునీటి కష్టాలు తీర్చేందుకు 2018లో నాన్ అమృత్ పథకంలో రూ.57 కోట్లు మంజూరైనా పనులు జరగలేదు.

### ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

పైపులు పాడవుతున్న మాట నిజమే. సమస్యను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరిస్తున్నాం. రక్షిత పథకాలు ఏళ్ల నాటివి కావడంతో సమస్య వస్తోంది. నాన్ అమృత్ పథకం పునఃప్రారంభించేలా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు. – రత్నరాజ్, నగర పంచాయతీ కమిషనరు, పాలకొండ

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: రాజకీయాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. మండలంలోని చెముడుగూడ, అడ్డంగూడ, తాటిశీలలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏఎంసీ అధ్యక్షురాలు కళావతి, మండల కన్వీనర్ నరేష్, నాయకులు రామారావు, కొండలరావు, భాస్కరరావు, సదానంద్, రవి, శ్రీను, ఈశ్వర్, మంగయ్య, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం అందిస్తున్న విప్ జగదీశ్వరి

## సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం ప్రాంతీయ పశు వైద్యశాలలో సహాయ సంచాలకుడిగా విధులు నిర్వర్తిస్తూ పార్వతీపురం బదిలీపై వెళ్లిన సీహెచ్. దీనకుమార్‌ను గ్రామస్థులు ఆదివారం సత్కరించారు. సీతానగరం పశువైద్యశాల ఆవరణలో ఏడీ శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు హరిగోపాల్, ప్రసాదరావు, కన్నారావు, అరవింద్, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, వైద్యులు రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దీనకుమార్‌ను సత్కరిస్తున్న గ్రామస్థులు

## వేతనాలు పెంచాలని కార్మికుల సమ్మె

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తమకు వేతనాలు పెంచాలంటూ రక్షిత మంచినీటి పథకం కార్మికులు ఆదివారం సమ్మె బాట పట్టారు. ఆ సంఘ పాలకొండ గౌరవాధ్యక్షుడు డి.రమణారావు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమవుతోందని, ప్రభుత్వ పథకాలు వర్తించక పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించలేని పరిస్థితి నెలకొందన్నారు. పదవీ విరమణ ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. సంఘ అధ్యక్షుడు వై.హరిబాబు, నాయకులు పి.సాయి, బాబూరావు, వెంకటరావు, సతీష్, నర్సింగరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

## కురుపాం వైపు ఏనుగుల పయనం

సీతంపేట: గత కొన్ని రోజులుగా మండలంలో సంచరిస్తున్న నాలుగు ఏనుగుల గుంపు కురుపాం మండలం వైపునకు పయనమైనట్లు అటవీశాఖ బీట్ అధికారి కె.దాలినాయుడు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## పచ్చిరొట్ట ఎరువుతో పంటలకు మేలు

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పచ్చిరొట్ట ఎరువు వినియోగంతో పంటలకు మేలు కలుగుతుందని ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం బర్లిలో పచ్చిరొట్ట పంటకోత ప్రయోగం చేపట్టారు. ఎకరా పొలంలో పంట వేస్తే 7 టన్నుల ఎరువు వస్తుందని చెప్పారు. భూసారం పెరిగి మంచి దిగుబడి వస్తుందన్నారు. సుభద్ర గ్రామంలో రైతులకు ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. సిబ్బంది లక్ష్మి, తిరుపతిరావు, గంగమ్మ, ఆదిలక్ష్మి ఉన్నారు.

## పాలకొండలో సీపీఐ జిల్లా మహాసభలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండలో వచ్చే నెల 8, 9 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు పేర్కొన్నారు. సత్యసాయినగర్‌లో ఆదివారం గోడప్రతులు ఆవిష్కరించారు. జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి, పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. సభలకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వస్తారని చెప్పారు. సభ్యులు బి.అప్పలనాయుడు, మురళీమోహనరావు, సూర్యనారాయణ, గోపీనాయుడు పాల్గొన్నారు.

## శ్రమదానంతో కాలువల బాగు

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదంకలాం ప్రధాన కాలువ నుంచి అరసాడ వద్దనున్న 2ఎల్ ఉపకాలువ మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏటా సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పూడిక తొలగించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో రైతులే ముందుకు వచ్చారు. ఇసుక బస్తాలు వేసి గండ్లు పూడ్చారు. 2 కిలోమీటర్ల మేర కాలువ పొడవునా గడ్డి నివారణ మందు పిచికారీ చేశారు.

## నేడు సీతంపేటలో పీజీఆర్ఎస్

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. గిరిజన గ్రామాల ప్రజలు తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందజేయాలని సూచించారు.

## ఉపాధ్యాయులకు 3 రోజుల శిక్షణ

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని మరిపివలస షిర్డీసాయి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉపాధ్యాయులకు పాఠశాల నాయకత్వ అభివృద్ధిపై (ఎస్ఎల్‌డీపీ) శిక్షణ అందిస్తున్నట్లు ఎంఈవో-2, కోర్సు డైరెక్టరు వెంకటరమణ తెలిపారు. ఈ నెల 14 నుంచి 17 వరకు జరగనున్న శిక్షణలో జిల్లా నుంచి తొలి విడతగా 255 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. కేంద్రంలోనే వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు పట్టణ ప్రధాన రహదారిలో ఆటో బైక్ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న పాచిపెంట మండలం కోష్టువలస గ్రామానికి చెందిన యువకుడు కె.నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో సాలూరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు కుడికాలు విరిగి, పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కేంద్రాసుపత్రికి తీసుకెళ్లారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డుపై బురద తొలగింపు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: మండలంలోని రావుపల్లి శివారు నుంచి కొత్తూరు వెళ్లే మార్గం బురదగా మారింది. దీనిపై ఇటీవల ఈనాడులో వార్త ప్రచురితమవగా సర్పంచి బి.మహేష్, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు స్పందించారు. పొక్లెయిన్‌తో బురద తొలగించి, బ్లీచింగ్ చల్లించారు.

## కుళాయి పైపుల మార్పు

పార్వతీపురం పట్టణం: జిల్లా ఆసుపత్రి సమీపంలో కుళాయి నీరు వృథాగా పోతోందని ఇటీవల ఈనాడులో 'తాగునీరు వృథా' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. డీఈఈ శ్రీనివాసరాజు స్పందించి సిబ్బందితో పాడైన పైపులు మార్పించి, సమస్యను పరిష్కరించారు.

## కాలువలో పూడికతీత

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: కొత్తూరు నుంచి రావుపల్లి వెళ్లే మార్గంలో కాలువలో పనికిరాని మొక్కలు, పూడిక పెరిగిపోయాయి. దిగువ భూములకు సాగునీరు అందే పరిస్థితి లేదని జూన్ రెండో వారంలో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

## ఇక సాఫీగా వెళ్లొచ్చు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బంటువానివలస గ్రామం సూచిక వద్ద తుప్పలు పెరగడంతో ప్రయాణికులు దారి తప్పుతున్నారు. ఈనెల 7న ఈనాడులో వార్త ప్రచురితమవగా ర.భ.శాఖ డీఈఈ అప్పాజీ స్పందించి.. తుప్పలు తొలగించి సూచిక కనిపించేలా చూశారు.

## కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారులో ఆదివారం సాయంత్రానికి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. (కిలో..రూపాయిల్లో..) **టమాటా:** 35, **వంకాయలు:** 46, **బెండ:** 36, **బీర:** 40, **చిక్కుడు:** 36, **పచ్చిమిర్చి:** 80, **కాకర:** 30, **క్యారెట్:** 40, **బీట్‌రూట్:** 40, **ఉల్లి:** 23, **బంగాళదుంపలు:** 22, **అల్లం:** 60, **వెల్లుల్లి:** 86, **క్యాప్సికమ్:** 85, **అరటికాయ:** 5, **ఆనప కాయ:** 12. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

## తెరపై ఈనాడు

పార్వతీపురం: **శ్రీ వీరభద్ర సినిమా:** కన్నప్ప, సూపర్‌మ్యాన్ ★ **టీబీఆర్:** ఓ భామ.. అయ్యోరామ, కుబేర ● **పాలకొండ: రామకళామందిర్**- 3 బీహెచ్‌కే ★ **వెంకటగౌరి (స్క్రీన్1)** - తమ్ముడు, **(స్క్రీన్2)** - ఓ భామ.. అయ్యోరామ ● **సాలూరు: శ్రీరామ**- తమ్ముడు, **లక్ష్మి**- వర్జిన్‌బాయ్స్, **శ్రీలక్ష్మి**- కుబేర. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ, సాలూరు

# రూ.లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి..

గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం పురపాలిక, న్యూస్‌టుడే: తుపాన్ల సమయంలో విద్యుత్తు సరఫరాకు అవాంతరాలు ఏర్పడితే సమాచార వ్యవస్థ దెబ్బతినకుండా ఏడేళ్ల క్రితం అన్ని మండలాల్లోని ఉపాధి, తహసీల్దారు కార్యాలయాలకు జనరేటర్లు అందించారు. నిర్వహణ లేకపోవడంతో రూ.లక్షల విలువైన పరికరాలు నిరుపయోగంగా మారాయి. వాటి వినియోగానికి డీజిల్ కొనుగోలుకు నిధులు కేటాయించలేదు. ఆ ఖర్చు ఎవరు భరించాలన్న విషయంపై స్పష్టత లేదు. దీంతో జిల్లాలో 30 వరకు మూలకు చేరాయి.

తోటపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న జనరేటర్

**8 ఏళ్లుగా వృథాగానే..:** తోటపల్లి ప్రధాన రక్షిత మంచినీటి పథకం వద్ద 2012లో రూ.16 లక్షల వ్యయంతో 200 కిలోవాట్ల సామర్థ్యమున్న జనరేటర్ ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు పని చేశాక ఎలుకలు విద్యుత్తు తీగలు పాడు చేశాయని చాలా రోజులు వృథాగా వదిలేశారు. మళ్లీ అవసరం పడటంతో బాగు చేయగా మరోసారి పాడైంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎనిమిది ఏళ్లుగా వృథాగా వదిలేశారు. మరమ్మతుల కోసం ఏడాది క్రితం తీసుకెళ్లిన విడిభాగం నేటికీ అమర్చలేదు. అత్యవసర పరిస్థితుల్లో అద్దె చెల్లించి తీసుకువస్తున్నారు. విషయం పురపాలక డీఈ జి.శ్రీనివాసరాజు వద్ద ప్రస్తావించగా.. జనరేటర్ పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

# ఖాళీ స్థలాలు.. దోమలకు నిలయాలు

గణేష్‌నగర్‌లో ఖాళీ స్థలంలో పెరిగిన పనికిరాని మొక్కలు

న్యూస్‌టుడే– పార్వతీపురం పట్టణం

పార్వతీపురం పురపాలిక పరిధిలోని ఖాళీ స్థలాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ చేరింది. దీంతో దోమలు పెరిగి జ్వరాలు విజృంభిస్తున్నాయని పలువురు చెబుతున్నారు.

పదేళ్లుగా పట్టణం విస్తరిస్తోంది. ప్రస్తుతం 30 వార్డుల్లో సుమారు 62 వేల జనాభా ఉన్నారు. పలువురు ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థలాలను ఖాళీగా వదిలేశారు. అవి లోతట్టుగా మారడంతో వర్షాకాలంలో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఇలాంటివి పట్టణంలో సుమారు 80 ఉన్నాయి. కొత్తగా వెలసిన కాలనీల్లో వందల సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. కాలువలు సక్రమంగా లేక మురుగు సమస్యతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఖాళీ స్థలాలకు పన్ను కట్టాలనే నిబంధన ఉన్నా సక్రమంగా అమలు కావడం లేదు. యజమానులకు నోటీసులిచ్చి, పన్ను కట్టించుకోవాల్సిన అధికారులే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

### ఈ ప్రాంతాల్లో సమస్యలు..

సౌందర్య థియేటర్, రామానంద్‌నగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక, గణేష్‌నగర్, బైపాసు రోడ్డు పక్కన, కొత్తవలస, వివేకానంద కాలనీ, పురపాలక సంఘాన్ని ఆనుకుని ఉన్న పార్వతీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండటంతో రోజురోజుకీ మురుగు సమస్య పెరిగిపోతోంది.

**చర్యలు తీసుకుంటాం..** పురపాలిక పరిధిలో సౌందర్య థియేటర్ వెనుక ఎక్కువ ఖాళీ స్థలాలు ఉన్నట్లు గుర్తించాం. యజమానులను గుర్తించి నోటీసులు ఇస్తున్నాం. స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. – పకీరు రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు

# అంత్యక్రియలకూ అవస్థలే

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణాల్లో శ్మశాన వాటికలకు వెళ్లేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పార్వతీపురంలో 62 వేల వరకు జనాభా ఉండగా 14 శ్మశాన వాటికలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 8 మాత్రమే వినియోగిస్తున్నారు. పట్టణానికి ప్రధానమైన రెడ్డి వీధి శ్మశానం చుట్టూ తుప్పలు పెరిగాయి. రహదారి సైతం సక్రమంగా లేకపోవడంతో అటుగా వెళ్లేందుకు భయపడుతున్నారు.

బైపాస్ రహదారిలోని శ్మశానానికి చేరాలన్నా ఇదే పరిస్థితి. ఇక్కడకు రైల్వే అండర్ పాస్ మార్గం నుంచి వెళ్లాల్సి ఉంది. కానీ రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా మారింది. కొత్తవలస మరుభూమి ఆక్రమణలకు గురవుతోంది. పట్టణ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న శ్మశానాన్ని కొత్తవలస, పాలకొండ రోడ్డు ప్రజలు వినియోగిస్తారు. ఇరుకు దారి, రైల్వే పట్టాలు దాటి వెళ్లాల్సి రావడంతో అవస్థలు తప్పడం లేదు. గంగసాగరం వద్దనున్న రుద్రభూమి ఆక్రమణల బారిన పడుతోంది. వర్షాకాలంలో ఇక్కడ మోకాలు లోతులో నీరు చేరుతుంది. సమస్యలపై పుర కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు వద్ద ప్రస్తావించగా.. పట్టణ పరిధిలోని శ్మశానాల బాగుకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

రెడ్డివీధి శివారులో తుప్పల మధ్య శ్మశానవాటిక

## ప్రభుత్వ పథకాలపై ప్రచారం

సీతంపేట, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తోందని మండల తెదేపా అధ్యక్షుడు ఎస్.తోటముఖలింగం, టీఏసీ సభ్యుడు ఎస్.మాలయ్య అన్నారు. మండలంలోని పి.పి.ఈతమానుగూడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, ఎస్.టి.మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలని డిమాండు

మక్కువ, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని మాజీ డిప్యూటీ సీఎం పి.రాజన్నదొర డిమాండు చేశారు. ఆదివారం మక్కువ మండల కేంద్రంలో వైకాపా మండలాధ్యక్షుడు ఎం.రంగునాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చటంలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజన్నదొర

## ఘనంగా వారాల పండగలు

బలిజిపేట, న్యూస్‌టుడే: మండలంలోని తుమరాడలో ఆదివారం దేశతల్లి వారాల పండగ నిర్వహించారు. ప్రసాదం, చీరలు, కోళ్లు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. కోలాటం, డీజే నృత్యాలతో అమ్మవారిని ఊరేగించారు. ★ సీతానగరం: మండలంలోని దేశమ్మ తల్లి వారాల పండగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు ప్రారంభించే ముందు అమ్మవారికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో కుమ్మరివీధి, ఇప్పలవలస, కాశాపేట, లక్ష్మీపురం, ఆర్.వెంకంపేటలో పూజలు చేశారు.

తుమరాడలో ఘటాలతో వెళ్తున్న గ్రామస్థులు

## ఎన్నిక ఏకగ్రీవం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.రంజిత్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 12, 13 తేదీల్లో కడప జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈసందర్భంగా నూతన కమిటీ ఎన్నిక జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలో వేదిక కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు.

(c) eenadu

## శాకంబరిగా సత్యమాంబ

ఆషాఢమాసం సందర్భంగా కంభం పట్టణంలోని కోటా సత్యమాంబదేవి... శాకంబరిగా భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. వర్షాలు కురవాలని కోరుతూ అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరించారు. పలువురు కుంకుమబండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలు, చీరలు, గాజులు సమర్పించారు. – న్యూస్‌టుడే, కంభం

## భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

తర్లుపాడులో పీర్ల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం సందర్భంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం... మకానంలోని పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. పూజాదికాల అనంతరం బయటకు తెచ్చి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, తర్లుపాడు (మార్కాపురం)



# కప్పం కడితేనే ఇసుక ఉచితం

▶ కొందరు యార్డు నిర్వాహకుల దందా ▶ రవాణాదారుల తీరుతోనూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు

న్యూస్‌టుడే – ఒంగోలు నేరవిభాగం

ఇసుక ఉచితం.. రవాణా ఖర్చులు మాత్రం వినియోగదారుడు భరిస్తే చాలు. ఇదీ కూటమి ప్రభుత్వ విధానం. ఇంతవరకు బాగానే ఉన్నా... పలువురు యార్డు నిర్వాహకుల పెత్తనం కారణంగా సర్కారు లక్ష్యానికి తూట్లుపడుతున్నాయి. ఎవరు ఎక్కడి నుంచి తెప్పించుకున్నా తమకు కప్పం చెల్లించాల్సిందేనని... లేదంటే లారీలు కదలనివ్వబోమని దందా చేస్తున్నారు. పొదిలిలో చోటుచేసుకున్న తాజా ఉదంతం ఉచిత ఇసుక విధానంలోని డొల్లతనాన్నీ, అధికారుల పర్యవేక్షణ లోపాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

**ముక్కుపిండి వసూలు...** వైకాపా హయాంలో ఇసుక పెద్ద ఆదాయవనరుగా మారింది. కొందరు నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ధరను కొండెక్కించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అంశంపై దృష్టి సారించి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. ఆ మేరకు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో యార్డులు ఏర్పాటు చేశారు. స్థానికంగా రీచ్‌లు లేకపోవటంతో నెల్లూరు నుంచి జిల్లాకు రవాణా చేస్తున్నారు. అలా తెచ్చిన ఇసుకను యార్డుల్లో నిల్వచేసి... వినియోగదారులకు రవాణా ఛార్జీల మేరకు అమ్ముకునే అవకాశం కల్పించారు. ఇదే సమయంలో వినియోగదారుడు నేరుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని తమ నివాసాలకు రవాణా చేసుకునే వెసులుబాటూ కల్పించారు. ఇక్కడే యార్డు నిర్వాహకులు అడ్డుపడుతున్నారు. వినియోగదారులు నేరుగా రవాణా చేసుకోవడాన్ని అంగీకరించకుండా... తమ ద్వారానే తీసుకోవాలని పట్టుబడుతున్నారు.

కొందరు ప్రైవేటు రవాణాదారులు సైతం భారీ ఎత్తున ఇసుక అక్రమ దందాకు పాల్పడుతున్నారు. వినియోగదారుల పేరిట ఇసుక బుక్ చేసి... తమ సొంత స్టాక్ పాయింట్లలో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో యార్డు నిర్వాహకులకు, ట్రాన్స్‌పోర్టర్లకు మధ్య తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి.

రాత్రివేళ రహదారులపై నిఘా పెట్టి మరీ ఇసుక వాహనాలను అడ్డుకుంటున్నారు. టన్నుకు రూ.వంద నుంచి రూ.200 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కాదంటే దౌర్జన్యాలకు దిగుతున్నారు. స్థానికంగా అనుకూలురైన పోలీసు అధికారుల సహకారంతో కేసులు పెట్టించిన ఉదంతాలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ఇసుక దందాపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**సామాన్యులకు చుక్కలు...**

పొదిలికి చెందిన ఓ వ్యక్తి అయిదు రోజుల క్రితం నెల్లూరు నుంచి ఇసుక రవాణా చేసుకున్నారు. తమకు కప్పం కట్టాకే అన్‌లోడ్ చేసేందుకు అనుమతిస్తామని స్థానిక యార్డు నిర్వాహకులు అడ్డుకున్నారు. దీంతో బాధిత డ్రైవర్ విషయాన్ని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి గనులశాఖ అధికారులను విచారణకు ఆదేశించారు. అడ్డుకున్నది నిజమేనని నిర్ధారించి... దగ్గరుంచి ఇసుకను అన్‌లోడ్ చేయించారు. దీనిని బట్టి క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. యార్డులు మొదలైన తొలి రోజుల్లో ఒంగోలులోనూ పలు వివాదాలు తలెత్తాయి. దీంతో ఏకంగా ఇక్కడి యార్డునే మూసేశారు.

## ట్రిపుల్ ఐటీ రెండో దశ... 907 మంది విద్యార్థుల ఎంపిక

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. మొదటి దశలో మిగిలిన సీట్లతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20, దివ్యాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80... మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ తెలిపారు. ఆర్కే వ్యాలీకి ఎంపికైన వారు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ప్రాంగణాలకు ఎంపికైన వారు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. 14 నుంచి తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో... విద్యార్థులు వాటికి హాజరయ్యేందుకు సిద్ధపడి లగేజీతో రావాలని సూచించారు. ఇప్పటి వరకు 4,340 మంది ఎంపిక పూర్తయినట్లు తెలిపారు. ఎన్‌సీసీ కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు ఉన్నాయన్నారు. వీటి ఫలితాలను వచ్చే వారం విడుదల చేస్తామని వెల్లడించారు.

# పల్లెలకూ త్రీఫేజ్ వెలుగులు

▶ 24/7 సరఫరాకు అడుగులు ▶ జిల్లాలో చురుగ్గా ఆర్డీఎస్ఎస్ పనులు

పల్లెలకూ నిరంతరం త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా దిశగా అడుగులు పడ్డాయి. ఆర్డీఎస్ఎస్ (రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) కింద ఉమ్మడి ప్రకాశంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పట్టణాలకు మాత్రమే ఈ సౌకర్యం ఉంది. గ్రామాల్లో వ్యవసాయానికి ఇస్తున్న తొమ్మిది గంటలు మినహా మిగతా సమయమంతా సింగిల్ ఫేజ్ మాత్రమే ఇస్తున్నారు. దీంతో ఆ పరిధిలోని పరిశ్రమల నిర్వహణతో పాటు ఇతరత్రాల పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

సింగరాయకొండ మండలం పాకలలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు పరివర్తకం, స్తంభాలు

**వైకాపా నిర్లక్ష్యంతో జాప్యం...**

వాస్తవానికి ఆర్డీఎస్ఎస్ ఫేజ్-1 కింద 2022లోనే జిల్లాకు రూ.800 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో కేంద్రం వాటా 60 శాతం కాగా.. మిగతా 40 శాతం రాష్ట్ర ప్రభుత్వానిది. అప్పటి వైకాపా సర్కారు నిధులు కేటాయించక పది శాతం పనులూ పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై సమీక్ష నిర్వహించి... ఆరు నెలల్లోగా తొలిదశ పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు పనులు ప్రారంభించింది. ఇవి పూర్తయితే గ్రామాల్లోని గృహ, వ్యవసాయ, పరిశ్రమలు ఇలా అన్ని విభాగాలకూ నిత్యం త్రీఫేజ్ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.

**జిల్లాలో విద్యుత్తు సర్వీసుల వివరాలు...**

- గృహ: 11,93,599
- వాణిజ్య: 1,34,845
- పరిశ్రమలు: 32,090
- వ్యవసాయ : 2,37,151
- ఇతర: 4,967

**నాణ్యమైన సరఫరా లక్ష్యంగా...**

ప్రస్తుతం గ్రామాల్లోని గృహ వినియోగదారులు, వ్యవసాయ కనక్షన్లకు ఒకే లైన్‌పై సరఫరా జరుగుతోంది. ఆర్డీఎస్ఎస్‌లో భాగంగా వీటికి వేర్వేరు లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు ఇస్తున్న నేపథ్యంలో ఎంత మొత్తం వినియోగం అవుతున్నదీ లెక్క తెలుస్తుంది. అధిక లోడు ఉన్న లైన్లను సైతం రెండుగా విభజించనున్నారు. దీనివల్ల లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. సరఫరాలోనూ నాణ్యత పెరుగుతుంది. అన్నిటికీ మించి... పాతికేళ్లు దాటిన స్తంభాలు, కండక్టర్, పరివర్తకాలను పూర్తిగా తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ఫేజ్-2లో అవసరమైన చోట విద్యుత్తు లైన్, ఫీడర్లు, ఉప కేంద్రాలు నిర్మించనున్నారు.

# జిల్లాలో స్టాంపుల కొరత

▶ నోటరీ సేవలకు ప్రజల ఇక్కట్లు

పొదిలి, న్యూస్‌టుడే: జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జ్యుడీషియల్, నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు కుల, ఈబ్ల్యూఎస్ తదితర ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు నోటరీ అవసరమవుతుంది. ఇందుకోసం రూ.10 స్టాంప్ పేపర్ సరిపోతుంది. అవి లేక రూ.50ది కొనుగోలు చేయాల్సి వస్తోంది. బయట మార్కెట్‌లో ఈ-స్టాంప్ వెండర్లు దీనికి రూ.80 వరకు వసూలు చేస్తున్నారు. వివిధ రకాల అగ్రిమెంట్లు రాసుకునే వారు సైతం... చిన్న స్టాంపుల కొరతతో రూ.50, రూ.100 విలువ కలిగినవి వినియోగించాల్సి వస్తోంది. కోర్టు ఫీజులు, నోటరీ కోసం వినియోగించే జ్యుడీషియల్ స్టాంపులు సైతం లభ్యం కాక... ఇతర పట్టణాల నుంచి తెప్పించుకోవాల్సిన వస్తోందని ఓ న్యాయవాది ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై పొదిలి సబ్ రిజిస్ట్రార్ నీరజను సంప్రదించగా... స్టాంపుల కోసం ఇండెంట్ పెట్టామని, రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ-స్టాంపులు అధిక ధరకు విక్రయించడంపై విచారణ జరుపుతామని పేర్కొన్నారు.

## నేటి నుంచి ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సోమవారం నుంచి నాయకత్వ శిక్షణ తొలి విడత తరగతులు ప్రారంభమవుతాయని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. పొదిలిలోని జోసెఫ్ శ్రీహర్ష, మేరీ ఇంద్రజ ఎడ్యుకేషనల్ సొసైటీలో రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఉంటుందన్నారు. హాజరు కావాల్సిన 320 మంది ఉపాధ్యాయుల జాబితాను ఇప్పటికే ఎంఈవోలకు పంపినట్లు చెప్పారు. అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని... ఈ నెల 17 వరకు తరగతులు ఉంటాయని వివరించారు.

విద్యాశక్తి తరగతులు వింటున్న విద్యార్థులు

# ఉన్నత బడులకు విద్యా శక్తి

▶ 241 పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

ప్రాథమిక స్థాయి నుంచే పిల్లల్లో నైపుణ్యాలు పెంచి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు విద్యా శక్తి పేరిట రాష్ట్ర విద్యాశాఖ వినూత్న కార్యక్రమం చేపట్టింది. ఇందుకోసం చెన్నై ఐఐటీ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు రోజుకో గంట చొప్పున వివిధ సబ్జెక్టులు, అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. సందేహాల నివృత్తికీ అవకాశం కల్పిస్తున్నారు. –న్యూస్‌టుడే, ఒంగోలు విద్య

**సమగ్ర వికాసం దిశగా...:** సైన్స్, గణితం, ఆంగ్లం సబ్జెక్టులతో పాటు... ఐఐటీ, కెరియర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు, నైపుణ్యాభివృద్ధి, సామర్థ్యాల పెంపు, యోగాపై శిక్షణ ఇస్తారు. సోమ, మంగళ, బుధవారాల్లో 6, 7 తరగతుల వారికి; గురు, శుక్ర, శనివారాల్లో 8, 9 తరగతుల వారికి తరగతులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల దాదాపు యాభై వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది. ఉపాధ్యాయులకు సైతం వారంలో ఒక రోజు రెమిడియల్ క్లాసులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. పిల్లల భవిష్యత్తుకు దిక్సూచిలా నిలిచే ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు చక్కగా అమలు చేయాలని డీఈవో కిరణ్‌కుమార్ సూచించారు. ఇంటర్‌కు సంబంధించి ఆర్ఐవో పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, కేజీబీవీ, మోడల్, రెసిడెన్షియల్ పాఠశాలలు మొత్తం 320 ఉండగా తొలిదశలో 241 బడుల్లో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఎంపికైన వాటిలో 28 కేజీబీవీలు, మూడు ఏపీ రెసిడెన్షియల్, 13 మోడల్ స్కూల్స్ కాగా మిగతావి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు. 160 మందికి పైగా పిల్లలున్న విద్యాలయాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నెల మూడో తేదీన లాంఛనంగా తరగతులు ప్రారంభించారు.

# దేవుడి మాన్యంలో భూచోళ్లు!

● వారి పేరిటే ఆన్‌లైన్ ● ఫిర్యాదులున్నా చర్యలు శూన్యం

దేవాదాయ భూముల అన్యాక్రాంతంపై ఆ శాఖ అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు. వాటిని స్వాధీనం చేయాలని రెవెన్యూ అధికారులకు ఇటీవల అర్జీలు ఇచ్చారు. కలెక్టర్ సైతం ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మాత్రం కనీస కదలిక లేదు.

–న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం, కొమరోలు గ్రామీణం

**అర్జీలతో సరి...:** పశ్చిమ ప్రకాశంలో వివిధ ఆలయాలకు చెందిన మాన్యం భూములు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురయ్యాయి. కొందరు వాటిలో పంటలు సాగు చేస్తుండడంతో పాటు... ఆన్‌లైన్‌లోనూ తమ పేరిట నమోదు చేసుకున్నారు. కొందరు మరో అడుగు ముందుకేసి క్రయవిక్రయాలు చేపడుతున్నారు. పరిస్థితి ఇంతలా ఉన్నా ఆ శాఖ అధికారులు ఇన్నాళ్లూ తాత్సారం చేశారు. కూటమి ప్రభుత్వం ఈ విషయమై దృష్టి సారించడంతో కొంత కదలిక వచ్చింది. పలుచోట్ల ఆలయ భూములు గుర్తించాలని తహసీల్దారు కార్యాలయాల్లో వినతులు ఇచ్చారు. ఈ క్రమంలో కొన్ని వివరాలు సైతం సమర్పించారు. అయినప్పటికీ ఆయా భూముల గుర్తింపు దిశగా సర్వే చేపట్టింది లేదు.

నాగిరెడ్డిపల్లె గ్రామదేవత పేరుతో ఉన్న పొలంలో వేసిన డీప్‌బోరు

దేవాదాయ ఆస్తుల పరిరక్షణకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీతో గత నెలలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి దేవాదాయ భూములను వెబ్‌ల్యాండ్‌లో మ్యుటేషన్, పేరు మార్పులు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు.

**మచ్చుకు కొన్ని...**

▶ కొమరోలు మండలం నాగిరెడ్డిపల్లెలో గ్రామదేవత పేరుతో సర్వే నంబరు 64-1లో 0.68 ఎకరాలు, 64-2లో 3.36 ఎకరాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ భూములన్నీ ఓ మహిళ పేరిట ఆన్‌లైన్‌లో ఉండడంతో... బోర్లు వేసి పంటలు సాగు చేస్తున్నారు. ఇటీవల రెవెన్యూ, దేవాదయ శాఖ అధికారులు కొలతలు వేసి కందకం తవ్వినా... మీభూమి పోర్టల్‌లో మాత్రం ఇప్పటికీ సదరు మహిళ పేరే కనిపిస్తోంది.

▶ చిన్నకంభంలోని భృగు మల్లేశ్వరస్వామి ఆలయానికి ఒందుట్ల సర్వే నంబరు 28-3లో 3.86 ఎకరాలు ఉన్నా... ఆన్‌లైన్‌లో మాత్రం మరొకరి పేరుతో ఉంది.

▶ దద్దవాడ, రాచర్ల మండలం ఎడవల్లి, కొమరోలు మండలం తాటిచెర్ల, రెడ్డిచర్ల గ్రామాల్లో పదుల ఎకరాల్లోని భూమి నేటికీ ఆన్‌లైన్‌లో చూపడం లేదు.

తాటిచెర్ల రామేశ్వరస్వామి దేవస్థానానికి సర్వే నం:139-1లో ఉన్న 7.28 ఎకరాలు నలుగురి పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అది మార్చాలని దేవాదాయశాఖ వారు రెవెన్యూ అధికారులకు విన్నవించినా నేటికీ స్పందన లేదు. కంభం మండలం తురిమెళ్లలోని శ్రీలక్ష్మీ మాధవస్వామి ఆలయ భూములకు సంబంధించి రెండు సార్లు ఫిర్యాదు చేసినా నేటికీ పరిష్కారం లేదు.

# నాడు విధ్వంసం... నేడు పర్యాటక సుమం!

ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 2014లో అప్పటి తెదేపా ప్రభుత్వం నిర్ణయించింది. రూ.2.40 కోట్లతో కాటేజీలు, వ్యూపాయింట్, పార్కులు, పిల్లల ఆట పరికరాలు, ఈత కొలనులు ఏర్పాటు చేసింది. దాదాపుగా పనులు పూర్తయిన తరుణంలో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో పచ్చదనం హరించుకుపోయి పిచ్చి మొక్కలు పెరిగాయి. ఉన్న వసతులను ఆకతాయిలు ధ్వంసం చేశారు. చివరకు ఆ ప్రాంగణం పశువులు, జీవాల మేత భూమిగా మారింది. తాజాగా... కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించింది. కాటేజీలు, ఇతర సౌకర్యాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతం ఆ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

– ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, మద్దిపాడు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వ చొరవతో మారాయి ఇలా...

చీమకుర్తి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సిమెంట్ బస్తాలు నిల్వ చేసిన గదిలో పాఠాల బోధన

కనిగిరిలోని మాచవరం ఉన్నత పాఠశాలలో అసంపూర్తి గదుల్లో తరగతుల నిర్వహణ

## వైకాపా పాపం... వెన్నాడుతున్న శాపం!

గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు-నేడు రెండో దశ పనులు మధ్యలో ఆగిపోవడం... సాంకేతిక చిక్కులతో నేటికీ పూర్తికాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. పలు చోట్ల అసంపూర్తి గదులు, నిర్మాణ సామగ్రి మధ్యలో పాఠాలు బోధించాల్సిన దుస్థితి నెలకొంది. సిమెంట్ బస్తాలు, బండలు అడ్డంగా ఉండడంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వమైనా ప్రత్యేక చొరవ చూపి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– ఈనాడు, ఒంగోలు

# ఎదురొచ్చిన మృత్యువు

▶ కారు ఢీకొని ఇద్దరి దుర్మరణం ▶ శుభకార్యానికి వెళ్లొస్తుండగా మార్కాపురంలో ఘోరం

మార్కాపురం, న్యూస్‌టుడే: శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు రూపంలో మృత్యువు ఎదురై ఇద్దరిని బలిగొంది. అమరావతి- అనంతపురం రహదారిపై ఆదివారం రాత్రి పది గంటల సమయంలో మార్కాపురం మండలం తిప్పాయపాలెం సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అర్ధవీడు మండలం బొల్లుపల్లె గ్రామానికి చెందిన బెజవాడ దావీదు (45), రంగారపురానికి చెందిన ఆకవీటి విజయ్‌కుమార్ (25) వరుసకు బాబాయి అబ్బాయి అవుతారు. వీరి బంధువులకు సంబంధించిన ఓ వివాహ నిశ్చయతాంబూలానికి... యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల గ్రామానికి ఆదివారం ఉదయం వెళ్లారు. అక్కడి వేడుక ముగిశాక రాత్రి పది గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరూ తిరుగు పయనమయ్యారు. తిప్పాయపాలెం శివారులోకి రాగానే... కంభం నుంచి దేవరాజుగట్టువైపు వెళ్తున్న ఓ కారు వీరిని బలంగా ఢీకొట్టింది. ఆ ధాటికి ఇద్దరూ ఎగిరి రహదారిపై పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ ఎస్సై పి.అంకమ్మరావు సిబ్బందితో సహా సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విషయం తెలిసిన బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. అప్పటి వరకూ తమతో సరదాగా గడిపి అంతలోనే మృత్యు ఒడికి చేరారంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. దావీదుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయ్‌కుమార్ అవివాహితుడు.

ప్రమాద స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై అంకమ్మరావు, పోలీసులు


అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి

మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల / ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రచురణ కొరకు

వివరాలకు సంప్రదించండి

ఈనాడు ప్రకటనల విభాగం

ఈనాడు కార్యాలయము, పేర్నమిట్ట, ఒంగోలు

★ GST 5% అదనం

9701112824



(c) eenadu

# సుడిగుండాలు దాటిన మొగిలిగుండాల

• కూటమి రాకతో జలాశయం పనుల పరుగు

వైకాపా పాలనలో సమస్యల సుడి గుండాల్లో చిక్కిన మొగిలిగుండాల.. వాటి నుంచి బయట పడుతోంది. కూటమి ప్రభుత్వం ఈ జలాశయంపై దృష్టి సారించి పనులను పరుగులు పెట్టిస్తోంది. వచ్చే ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేయాలన్న లక్ష్యంతో గుత్తేదారు, అధికారులు శ్రమిస్తున్నారు.

జలాశయం వద్ద నిర్మిస్తున్న ఆనకట్ట

న్యూస్‌టుడే, తాళ్లూరు

శివరాంపురంలో మొగిలిగుండాల మినీ జలాశయ నిర్మాణానికి గత తెదేపా పాలనలో పునాదులు పడ్డాయి. 2018లో రూ.10.5 కోట్ల నిధులు మంజూరు కాగా, జలాశయ నిర్మాణానికి రూ.ఎనిమిది కోట్లు, భూ సేకరణకు రూ.రెండున్నర కోట్లు కేటాయించారు. టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించేలోపు రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితులు మారిపోయాయి. గుత్తేదారుడు ఆనకట్ట నిర్మాణ పనులు కొంతమేర పూర్తిచేసినా సుమారు రూ.కోటిమేర బిల్లులను అప్పటి ప్రభుత్వం అందజేయలేదు. దీంతో 2022 నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

### ఆగస్టు నాటికి పూర్తయ్యే లక్ష్యంతో..

2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. అదే సమయంలో 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమవడంతో యంత్రాంగంలో కదలిక వచ్చింది. స్థానిక తెదేపా నాయకులు సమస్య తీవ్రతను పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారి నుంచి భరోసా రావడంతో గుత్తేదారుడు పనులు పునఃప్రారంభించి శరవేగంగా చేయిస్తున్నారు. ప్రస్తుతం జలాశయ నిర్మాణం తుది దశకు చేరుకుంది. వచ్చే ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేయనున్నారు. నీటి నిల్వ ఆనకట్ట దాదాపు పూర్తయ్యింది. నీరు నిలిచే ప్రదేశంలో చిల్లకంప తొలగించి శుభ్రం చేయించాల్సి ఉంది. రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే ఉమ్మడి ప్రకాశంలోని తాళ్లూరు, చీమకుర్తి, మద్దిపాడు, అద్దంకి మండలాల్లోని దాదాపు పాతిక గ్రామాల్లో తాగు, సాగు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది.

## శ్రీవారి వనం పనులు ప్రారంభం

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మల్లవరం వెంకటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలోని శ్రీవారివనం విస్తరణ పనులు ఆదివారం ప్రారంభించారు. మల్లవరం జలాశయం, దేవాలయ పరిసరాల్లో పచ్చదనం పెంపులో భాగంగా వీటిని చేపట్టారు. ఆదివారం శ్రీవారివనం గౌరవ అధ్యక్షుడు కాళ్ల వాసు, అధ్యక్షుడు మార్నేని కృష్ణారావు ఆధ్వర్యంలో ఒంగోలు పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ నల్లూరి క్రాంతికుమార్ జేసీబీకి పూజలు చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తరణ పనులకు ఆర్థికంగా సహకారం అందిస్తానని తెలిపారు. కంప, పిచ్చి చెట్లు తొలగించారు. కార్యక్రమంలో మల్లవరం సర్పంచి సుబ్బారెడ్డి, శ్రీవారివనం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మల్లవరంలోని దేవస్థానం పరిసరాల్లో జేసీబీతో కంపచెట్ల తొలగింపు

బీసీ సంఘం నాయకులతో అభివాదం చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

## బీసీల హక్కుల సాధనకు పోరాటం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: తమ హక్కుల సాధనకు పోరాటం తప్పనిసరని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శంకరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 139 బీసీ కులాల అవసరాలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. వారి పిల్లలకు రాజ్యాంగ బద్ధంగా పోరు సాగుతుందన్నారు. అనంతరం మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎంపికైన బి.రాజేశ్వర నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మస్తానయ్య, మహేష్, శంకర్, శివకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికతతో రోగులకు మెరుగైన వైద్యం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: వైద్య రంగంలో వస్తున్న సాంకేతికతపై అవగాహన పెంచుకుని రోగులకు మెరుగైన చికిత్స అందించాలని అపోలో ఆసుపత్రి సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎమ్.శ్రావణిరెడ్డి పేర్కొన్నారు. పల్మనాలజీ విభాగంలో మారిన సాంకేతిక చికిత్స పద్ధతులపై అపోలో ఆసుపత్రి, జిల్లా పల్మనాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో ఆదివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌వో వి.సుజాతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకుని చికిత్స చేస్తే రోగికి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. పల్మనాలజీ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ పిట్టి మల్లికార్జున, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 280 మంది వైద్యులు, పీజీ విద్యార్థులు, క్రిటికల్ కేర్ సిబ్బంది పాల్గొన్నారు. బ్రాంకోస్కోపీ, ఈబీయూఎస్, ఎయిర్ వే మేనేజ్‌మెంట్ వంటి ఆధునిక శ్వాసకోశ చికిత్స విధానాలపై పలువురు వైద్యులు తమ అనుభవాలను వివరించారు.

జ్యోతి వెలిగిస్తున్న సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎమ్.శ్రావణిరెడ్డి. చిత్రంలో డీఎంహెచ్‌వో సుజాత తదితరులు

మాట్లాడుతున్న భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య, నాయకులు

## రాందేవ్‌బాబాకు ప్రభుత్వ భూములివ్వొద్దు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రాందేవ్ బాబాకు ప్రభుత్వ భూముల కేటాయింపు నిలిపివేయాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్తీమందులు, సరుకులు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న బాబాకు ప్రభుత్వ భూములు ఇవ్వడం సరికాదన్నారు. అదే విధంగా పుట్టపర్తి సాయిబాబా శత జయంతిని ప్రభుత్వ పండగగా జరిపే జీవో రద్దు చేయాలన్నారు. సమాజంలో ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని రూ.వేల కోట్లు సంపాదిస్తున్నారన్నారు. గుడ్లూరు మండలం చేవూరు వద్ద రామదూత ఆక్రమించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. సమావేశంలో గుమ్మళ్ల నరసింహారావు, రాజశేఖర్, రాఘవ, కె.ప్రభుదాస్, కాలేషా బేగ్, చంద్రశేఖర్, రంగారెడ్డి పాల్గొన్నారు.

## 'ప్రభుత్వం మారినా అందని టిడ్కో ఇళ్లు'

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ల పూర్తికి రూ.180 కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం సీపీఎం నగర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు, చింతల వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి నేటికీ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా టెండర్ పిలిచి కాలయాపన చేయడం వల్ల లబ్ధిదారులు కష్టనష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇళ్ల నిర్మాణానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు చీకటి శ్రీనివాసరావు, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, వీరాస్వామి, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 19న కేఎన్‌పీఎస్ రాష్ట్ర సదస్సు

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలు అంబేడ్కర్ భవనంలో ఈ నెల 19న కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం చీమకుర్తి అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు ఆవిష్కరించారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌ను విడుదల చేయాలని నిర్వహిస్తున్న ఈ సదస్సుకు జస్టిస్ కె.చంద్రకుమార్ హాజరు కానున్నారన్నారు. సంఘం నాయకులు ఎ.రాంబాబు, పి.కొండలు, జి.పోతురాజు, ఆర్.అంకారావు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు ఔషధాలు విక్రయిస్తే చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

పొదిలిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఔషధ నియంత్రణ అధికారి డాక్టర్ ఉషారాణి

మార్కాపురం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు, అనుమతి లేని నిషేధిత మందులు విక్రయించే దుకాణాలపై చర్యలు తీసుకుంటామని మార్కాపురం ఔషధ నియంత్రణ అధికారి డాక్టర్ ఉషారాణి హెచ్చరించారు. పశ్చిమ ప్రాంతంలోని కొన్ని దుకాణాల్లో గర్భవిచ్ఛిత్తి, వయాగ్రా, మత్తు మందులను విక్రయిస్తున్నారని 'ఈనాడు'లో ఈ నెల 13న 'ఔషధ దుకాణాల్లో మత్తు పదార్థాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం మార్కాపురం ఔషధ నియంత్రణ అధికారి డాక్టర్ ఉషారాణితో పాటు సిబ్బంది పొదిలి, దర్శి పట్టణాల్లోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మూడుచోట్ల ఫార్మాసిస్ట్ కాకుండా సాధారణ వ్యక్తులు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. దస్త్రాలను తనిఖీ చేశారు. వైద్యులు రాసిస్తేనే అలాంటి ఔషధాలివ్వాలని సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9701112824
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008535779

తిరుమలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ముత్తుముల, ఉగ్ర

## వెంకన్నను దర్శించుకున్న మంత్రి గొట్టిపాటి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి తిరుమలలోని వెంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. మంత్రి, ఎమ్మెల్యేలను శాలువాలతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన దొడ్డంపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దొడ్డంపల్లె గ్రామానికి చెందిన బాలు కోటేశ్వరమ్మ శనివారం మధ్యాహ్నం ఇంటికి తాళంవేసి బ్రాహ్మణపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బ్రహ్మారెడ్డి ఆ ఇంటి ముందు నుంచి వెళుతూ తలుపులు తెరచి ఉండటాన్ని చూసి ఆమెకు ఫోన్ చేసి సమాచారం తెలిపారు. దీంతో కోటేశ్వరమ్మ ఆదివారం ఇంటికి వచ్చి చూడగా..తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని రూ.65వేల నగదు, బంగారు నెక్లెస్, చెవికమ్మలు, ఉంగరాలు కలసి మొత్తం 3 తులాల బంగారు అపహరణకు గురైనట్లు గుర్తించి గిద్దలూరు పోలీసులకు తెలిపారు. వెంటనే గిద్దలూరు సీఐ సురేష్, ఎస్‌ఐ శివనాంచారయ్య దొడ్డంపల్లె వెళ్లి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వరకట్న వేధింపులపై కేసు

ముండ్లమూరు: భర్త అదనపు కట్నం కావాలని వేధిస్తున్నాడని భార్య చేసిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై కమలాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వేములబండ గ్రామానికి చెందిన సునీత, దొనకొండ మండలానికి చెందిన గోవిందులు ప్రేమ వివాహం చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. గత కొద్దిరోజుల నుంచి ఇంటికి రావడం లేదని, హైదరాబాద్‌లో ఫ్లాట్ కొనిపెట్టాలని వేధిస్తున్నాడని సునీత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నటరాజ పూజా దినోత్సవంలో ప్రసంగిస్తున్న నవీన్

## గురువులేని విద్య శూన్యం

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సంస్కార భారతి ఒంగోలు శాఖ నిర్వహించిన నటరాజ పూజా దినోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక దక్షిణం బజారు పాత వారి రామానుజ కూటమిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ ప్రచార ప్రముఖ్ నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువు లేని విద్యత్తు శూన్యమన్నారు, అది నిరైనది కాదని గురు ప్రాముఖ్యతను ప్రస్తావించారు. దేవసేన, చాందిని, మానసి వీణా వాదనతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం సీఎస్‌ఆర్ శర్మ కళాశాల విశ్రాంత అధ్యాపకులు వేమూరి చిరంజీవి, వీణ విద్వాన్ నాగలక్ష్మి, గీతాచార్య పుష్పవల్లి తాయారులను సన్మానించారు. పొన్నూరు శ్రీనివాసులు, రంగమన్నార్ తదితరులు పాల్గొన్నారు.

## 15న ఉద్యోగ మేళా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక పాత రిమ్స్‌లోని ఆవరణలో ఈ నెల 15న ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు వయసు కలిగి; 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ డిప్లమో, డిగ్రీ పూర్తయిన వారు అర్హులన్నారు.

## తానా వైద్యసేవల సమన్వయకర్తగా మాధురీదేవి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) వైద్య సేవల సమన్వయకర్తగా సి.ఎస్.పురం మండలం పెదగోగులపల్లి గ్రామానికి చెందిన సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఏలూరి మాధురీదేవి ఎన్నికయ్యారు. ఆమె అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలోని షార్లెట్ నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ 2002 నుంచి అక్కడే స్థిరపడ్డారు. తానా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మూడేళ్లుగా తానా కమిటీలో సభ్యురాలిగా సేవలు అందిస్తున్నారు. తానా నూతన కార్యవర్గంలో హెల్త్ సర్వీసెస్ కోఆర్డినేటర్‌గా ఇప్పుడు ఎన్నికయ్యారు. రెండేళ్లపాటు ఆమె ఈ పదవిలో ఉంటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తానా ఆధ్వర్యంలో అమెరికాలో ఉంటున్న తెలుగువారికి ఆరోగ్య శిబిరాలు, వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చూస్తానని చెప్పారు. తానా అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. మాధురీదేవి భర్త సుబ్బారావు మల్లెల కూడా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆమె తండ్రి విశ్రాంత డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ కాగా, తల్లి శ్రీలక్ష్మి గృహిణి. ఆమె సోదరుడు ఏలూరి తైలేంద్రకుమార్ చిన్నపిల్లల వైద్య నిపుణుడిగా విజయవాడలో స్థిరపడ్డారు. ఆమెకు పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## విద్యార్థికి గాయాలు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పెద్దదోర్నాల పీర్ల గుండంలో ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు పడి గాయపడ్డాడు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గోగుల వెంకట సాంబ ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం పీర్ల పండుగ సందర్భంగా అగ్నిగుండంలో భక్తులు నడుస్తున్నారు. ఆ సమయంలో వెంకట సాంబ కాలు జారి గుండంలో పడి వెంటనే లేచాడు. అతని చేతికి, కాలుకు గాయాలయ్యాయి.

**నెక్ సూచించిన కోడిగుడ్డు ధర**

[illegible]

**ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)**

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 105, రిటైల్ లైవ్ - 127, చికెన్ విత్ స్కిన్ - 184, చికెన్ స్కిన్‌లెస్- 210

# ఆరోగ్యానికి మంట

• గ్యాస్ వదిలి.. కట్టెల వంట

కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కట్టెల పొయ్యి మీదే వంట

చింతపాలెం ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో మూలకు చేరిన గ్యాస్ పొయ్యి

సన్న బియ్యంతో భోజనం.. మెనూలో మార్పులు.. ఇలా ప్రభుత్వం అన్నీ సమకూర్చుతున్నా.. విద్యార్థుల ఆరోగ్యానికి మంట తప్పడం లేదు. గ్యాస్ పొయ్యిలతో మధ్యాహ్న భోజనం సిద్ధం చేయాల్సి ఉన్నా ఆరుబయట కట్టెల పొయ్యిల మీదే వంట చేస్తూ భావి పౌరుల ఆరోగ్యానికి మంట పెడుతున్నారు. గ్యాస్ రేట్లు పెరిగాయన్న నెపంతో అపరిశుభ్ర వాతావరణంలో వండి పెడుతున్న పరిస్థితి జిల్లాలో కన్పిస్తోంది.

న్యూస్‌టుడే, కనిగిరి

విద్యార్థులు శ్వాసకోశ, నేత్ర సంబంధ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పాఠశాలల్లో గ్యాస్ స్టౌలతో వంట సమకూర్చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే వీటిని చాలాచోట్ల పాటించడం లేదు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలు 2,341 ఉన్నాయి. వీటిలో 3,64,420 మంది విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే చేస్తాడు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్యాస్ పొయ్యి, సిలిండర్లను కొనుగోలు చేయించి భోజనం వండించి విద్యార్థులకు అందించాలి. అయితే గ్యాస్ ధరలు పెరిగిపోయాయని, కొత్త మెనూ ప్రకారం వండాల్సి రావడంతో తాము కట్టెల పొయ్యిలను ఆశ్రయించాల్సి వస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు. ఎక్కువమంది విద్యార్థులున్న చోట తమకు గ్యాస్ స్టౌలపై చేయడం గిట్టుబాటు కావడం లేదని వారంటున్నారు.

### పొంచివున్న వ్యాధుల ముప్పు

గతంలో పాఠశాలల నిధులు వెచ్చించి గ్యాస్ పొయ్యి, సిలిండర్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొనుగోలు చేశారు. అందులో సగానికి పైగా మూలకు చేరాయి. గ్యాస్ ధర రూ.920లతో పాటు గ్యాస్ తెచ్చిన వ్యక్తికి రూ.20 కలిపి మొత్తం రూ.940 చెల్లించాల్సి వస్తోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్కువమంది విద్యార్థులున్న పాఠశాలలకు అయితే ఒక సిలిండర్ వారం రోజులు వస్తోందని, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు మూడు రోజులకు మించి రావడం లేదని వారంటున్నారు. దీంతో పాటు కోడిగుడ్లు ఉడకబెట్టడం, కొత్త మెనూ ప్రకారం ఇతర పదార్థాలు వండి పెట్టడం ఎలా సాధ్యమని వారు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల ఆవరణలోనే వంటలు చేస్తుండటంతో పొగ వ్యాపించి శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. దీనికితోడు ఆవరణంతా మసి బారి అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. పాలకులతో పాటు విద్యాశాఖాధికారులు స్పందించి దీనికో పరిష్కార మార్గం చూపాలని వారంటున్నారు.

### అవగాహన కల్పించి మార్పు తీసుకొస్తాం

కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో కట్టెల పొయ్యి మీద మధ్యాహ్న భోజనం వండుతున్నారు. ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం. విద్యార్థులకు సంబంధించి ఏం వండినా గ్యాస్ మీదే చేయాలి. నిర్వాహకులకు అవగాహన కల్పించి సమస్య లేకుండా చేస్తాం.

– ఎం.శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ డీఈవో

# కారును ఢీకొన్న లారీ

• విశ్రాంత సైనికోద్యోగి మృతి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ఎదురుగా దూసుకొచ్చిన లారీ ఢీకొట్టి కారులో ప్రయాణిస్తున్న ఓ విశ్రాంత సైనికోద్యోగి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చింతలపాలెం సమీపంలో చీతిరాల కతువ వద్ద అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపిన కథనం మేరకు..గిద్దలూరు మండలం ఆదిమూర్తిపల్లికి చెందిన శిరిగిరి చిన్న ఓబయ్య (52) విశ్రాంత సైనికోద్యోగి. ఆయన పదవీ విరమణ తర్వాత హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. ఆయన స్వగ్రామమైన ఆదిమూర్తిపల్లిలో ఆదివారం జరిగే పోలేరమ్మ తిరునాళ్లకు హాజరయ్యేందుకు శనివారం రాత్రి భార్య జ్యోతితో కలిసి బోడుప్పల్ నుంచి కారులో బయలుదేరారు. చింతలపాలెం సమీపంలోని రాగానే వారు ప్రయాణిస్తున్న కారును బత్తాయి లోడుతో వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో చిన్న ఓబయ్య అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్య జ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని ఒంగోలుకు తరలించారు. కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంఘటనా స్థలంలో చిన్న ఓబయ్య మృతదేహం

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సింగరాయకొండ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. ఒంగోలు జీఆర్పీ ఎస్సై మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. మొదటి ప్లాట్‌ఫాం సమీపంలో ఒంగోలు వెళ్ల మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందన్న సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు వెళ్లి పరిశీలించారు. తెలుపు రంగు చొక్కా, తెలుపు రంగు చడ్డీ ధరించి ఉన్నాడని, రైలు ఢీకొని ముఖం ఛిద్రమవ్వడంతో గుర్తించడం కష్టంగా మారిందన్నారు. అనంతరం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION
DISTANCE EDUCATION

నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం, ఒంగోలు. కోర్సులు: M.Sc ఫుడ్ & న్యూట్రిషన్, M.Sc మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, M.Sc బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్. డిగ్రీ: B.A, B.Com, B.Com కంప్యూటర్స్. సంప్ర॥ ప్రకాశం అకాడమి, ఒంగోలు. 70936 21555.

PEOPLE CARE
OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA, వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 82474 49042, 96404 96677.

REAL ESTATE
PLOT FOR SALE

ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో మంగమూరురోడ్డు, హైదరాబాద్ స్కూల్ దగ్గరలో 59 1/2 గదుల స్థలం అమ్మబడును. గది కేవలం 30వేలు మాత్రమే. సంప్ర॥ సెల్: 94940 96261.

JOBS

Royal Appలో పనిచేయుటకు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన స్త్రీ అభ్యర్థులు వెంటనే కావలెను. 10K శాలరీ, సంప్ర॥ 9866140489.

ఏరీస్ ఆగ్రో లిమిటెడ్, ముంబాయి (CMPL Area) లో పనిచేయుటకు మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జూనియర్ ఎక్స్‌టెన్షన్ ట్రైనీ కావలెను (experience / fresher). అర్హత: ఏదైనా డిగ్రీ మరియు వ్యవసాయ కుటుంబం నుండి వచ్చినవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును. Interview: గుంటూరు ఆఫీస్. Ph: 92487 24777, 99631 11817.

ఒంగోలు ఫర్నిచర్ షాపులో పనిచేయుటకు లేడీస్ స్టాఫ్ కావలెను. వయస్సు (18-35) సం॥లోపు. జీతం : 12,000. సెల్ : 90305 90855.

మంగలపాలెం NH-16 పెట్రోల్ బంకు నందు పనిచేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం 12,000/- నుండి 14,000/- వరకు, 8 గం॥ డ్యూటీ. సంప్రదించగలరు. Cell: 98854 14786, 98854 97786.

WWW.RXWALA.COM మా సంస్థ నందు పనిచేయుటకు ఫార్మాశిస్టులు, RMP నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు కావలెను. Cell: 6300923212.

ఒంగోలు పట్టణంలోని ప్రముఖ లిమిటెడ్ ఫరమ్‌కు GST, TALLY, Income Tax పనులలో అనుభవం కలిగిన అకౌంటెంట్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ఆఫీసు కొరకు అనుభవం గల కారు డ్రైవర్స్ కావలెను. Cont: 7095916669, 8897277442.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

# మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మార్కాపురం పట్టణం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షులు తబసుమ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని చిన్నమసీద్ నుంచి కోర్టు సెంటర్ వరకు చెట్ల సంరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తూ చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాషా, ఆయేషా, మాలిక్, సర్కాజ్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

## సమస్యలు పరిష్కరించాలని విధుల బహిష్కరణ

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలకలో పని చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం గిద్దలూరు పురపాలకలో ఇంజినీరింగ్ సిబ్బంది విధులను బహిష్కరించారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబరు 36 ప్రకారం వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. గత సమ్మె కాలంలో చేసిన ఒప్పందాలను అమలు చేయాలని కోరారు.

ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడాది పాలనలోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. త్వరలో ప్రత్యేక మార్కాపురం జిల్లా కల సాకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరుకు చెందిన షూటోఖాన్ కరాటే శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థులు ఈనెల 12న తెలంగాణ రాష్ట్రం షాద్‌నగర్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో తమ ప్రతిభ కనబరిచారు. రజిత, సంజీవ్, సనా, మనోజ్, చంద్, హీనా, అభినయశ్రీ, భార్గవి, ప్రణీత్, రామ్ చరణ్, హేమంత్, నోకియా, దర్శన్, నక్షత్ర, సంకీర్తన, మహిపాల్, మున్నా కరాటే పోటీల్లో తమ సత్తా చాటారు. హేమలత బంగారు పతకం దక్కించుకుంది. విజేతలను కరాటే మాస్టర్ భూతరాజు శ్రీనివాసులు అభినందించారు.

ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను అందుకున్న విద్యార్థులతో కరాటే మాస్టర్

## భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: దోర్నాల మండలంలోని పెద్దదోర్నాల, యడవల్లి, కటకానిపల్లి, చింతల అగ్రహారం, రామచంద్రకోట గ్రామాల్లో ఆదివారం పీర్లఊరేగింపును భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జామున పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండాల్లో భక్తులు నడిచారు. సాయంత్రం పీర్లను ఊరేగించి ఏటికి పంపారు.

పెద్దదోర్నాల వీధుల్లో పీర్లను ఊరేగిస్తూ..

# నారు లేక నీరుగారి

❖ బోసిపోయిన నర్సరీలు ❖ అదను దాటినా ఆర్డర్లు నిల్

ఖాళీగా ఉన్న నర్సరీ

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: మిరప నారుతో కళకళలాడాల్సిన నర్సరీలు బోసిపోతున్నాయి. ఏటా ఈ పాటికి రైతుల నుంచి ఆర్డర్లు వచ్చేవి. ట్రేలలో నాటిన విత్తనాలు మొలకెత్తి పెరుగుదల దశలో ఉండేవి. గత సీజన్‌లో మిర్చికి గిట్టుబాటు ధర లభించకపోవడంతో ఈ సారి చాలా మంది సాగుకు జంకుతున్నారు. నారుకు రైతుల నుంచి డిమాండ్ లేకుండా షేడ్ నెట్లు గడ్డి మొలిచి ఖాళీగా కనిపిస్తున్నాయి.

### 300 ఎకరాల్లో పెంపకం

త్రిపురాంతకం మండలంలో కొన్నేళ్ల క్రితం ఒకట్రెండుకు పరిమితమైన షేడ్ నెట్లు మార్కెట్లో మిర్చికి ఏటికేడు ధరలు పెరుగుతుండటంతో వాటి సంఖ్య అధికమైంది. ఎకరా రూ.80,000 నుంచి రూ.లక్ష వరకు వెచ్చించి రాజుపాలెం-వెల్లంపల్లి మధ్యలో జాతీయ రహదారిని ఆనుకుని దాదాపు 50 నర్సరీలు నెలకొల్పారు. జాతీయ రహదారిని ఆనుకుని రవాణా సౌకర్యం ఉండటంతో వీటితో పాటు మేడపి, డీవీఎన్ కాలనీ, జి.ఉమ్మడివరం తదితర చోట్ల షేడ్ నెట్లు వెలిశాయి.

### సగానికి పైగా మూత..

త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లోని పలు గ్రామాలతో పాటు పల్నాడు జిల్లాలోని పలు గ్రామాల రైతులు ఏటా ఈ ప్రాంతం నుంచి మిరప నారు కొనుగోలు చేస్తుంటారు. ఏటా ఈ పాటికి దాదాపు 300 ఎకరాల్లో నారుతో కళకళలాడాల్సిన షేడ్ నెట్లు మిర్చి ధర పతనంతో సగానికిపైగా మూతపడ్డాయి. దీంతో కౌలు కూడా వచ్చే పరిస్థితి లేదని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అడిగే వారే కరవయ్యారు**

ఏటా ఈ పాటికి సగం మంది రైతులు ఆర్డర్లు ఇచ్చేవారు. 30 శాతం మంది రైతులు సొంతంగా విత్తనాలు కొనుగోలు చేసి మా వద్ద నారు పెంచుకుంటారు. ఆగస్టులో మిర్చి ధరలు పెరుగుతాయనే ఆశతో రెండెకరాలకు గాను అరెకరాలో నారు పెంచేందుకు షేడ్ నెట్‌ను సిద్ధం చేస్తున్నాను.

– వేముల నర్సింహారావు, షేడ్‌నెట్ యజమాని, రాజుపాలెం,

**కౌలు కూడా దక్కే పరిస్థితి లేదు**

డిమాండ్‌ను బట్టి ఎకరాకు రూ.60,000 నుంచి రూ.లక్ష వరకు వెచ్చించాం. నాకున్న మూడెకరాల నర్సరీలో ఏటా ఇదే సమయానికి 20 లక్షల మిరప మొక్కలు బుక్ అయ్యేవి. ఈసారి అడిగిన పాపానపోలేదు. ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు. ఈక్రమంలో కౌలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– దూళ్ల గాలెయ్య, నర్సరీ యజమాని, సోమేపల్లి

## పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మార్కాపురం పట్టణం, మార్కాపురం గ్రామీణం, కంభం, న్యూస్‌టుడే: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో వెలసిన అల్లూరి పోలేరమ్మ గ్రామోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు, నైవేద్యాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ❖ మండలంలోని కోలభీమునిపాడులోని శ్రీ ముద్ద సానమ్మ దేవాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. **రాచర్ల:** ఆకవీడు గ్రామంలో ఆదివారం గంగమ్మ తిరునాళ్ల భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, కుంకుమబండి కట్టారు. అమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకొని కాయకర్పూరాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి పూజలు చేశారు.

రాచర్లలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

మరమ్మతులు పూర్తయిన తరువాత వసతిగృహం

## వసతులు మెరుగు

పొదిలి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రూ.34 లక్షలు మంజూరు చేయగా వసతిగృహంలో మరుగుదొడ్లను ఆధునీకరించి, 24 గంటలు నీటి సౌకర్యం కల్పించారు. అక్కడి గదుల్ని టైల్స్‌తో సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# ఒకే ఆవరణలో నాలుగు పాఠశాలలు

పొదిలి జడ్పీ ఉన్నతపాఠశాల, ప్రాథమికోన్నత, అంగన్‌వాడీ పాఠశాల సముదాయాల చిత్రం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరతతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఒకే ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల (ఉర్దూ), జడ్పీ ఉన్నత పాఠశాల నడుస్తుంది. ఉన్నత పాఠశాలలో పది తరగతులకు ఆరు తరగతి గదులే ఉన్నాయి. నాలుగు గదుల కొరత ఉంది. పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయులు కూర్చొనేందుకు గది, మధ్యాహ్నభోజనానికి సంబంధించిన బియ్యం, గుడ్లు ఇతరాత్ర సరకుల నిల్వ చేసేందుకు గదులు లేకపోవడంతో అంతా ప్రధానోపాధ్యాయుని గదిలోనే సర్దుకోవాల్సి వస్తుంది. ఆ గదిలోనే రికార్డ్ అసిస్టెంట్, ఉపాధ్యాయుల ఆన్‌లైన్ వివరాలు నమోదుచేసే కంప్యూటర్ తదితర వాటిని ఏర్పాటు చేసుకున్నారు. నాడు-నేడు రెండోదశ పనులు మధ్యలో ఆగిపోవడంతో అదనపు గదుల నిర్మాణం పూర్తికాలేదు. మూడు గదుల్లో కేవలం స్లాబు మాత్రమే వేసి చుట్టూ గోడలు కట్టారు. ప్లాస్టింగ్, కరెంటు ఇతరాత్ర పనులు చేయాల్సి ఉంది. అసంపూర్తిగా ఉన్న గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులు నిర్వహిస్తున్నారు. మరికొన్ని తరగతులు వరండాల్లో జరుగుతున్నాయి. పొదిలి నడిబొడ్డున ఉండే ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులను చేర్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. అధికారులు స్పందించి పాఠశాలలో సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పేదలందరికీ సంక్షేమ ఫలాలు

మార్కాపురం, పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని భాజపా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.వి.కృష్ణారావు, సీనియర్ నాయకురాలు శాసనాల సరోజిని పేర్కొన్నారు. భాజపా ప్రభుత్వం 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మార్కాపురంలో వికసిత భారత్ అమృతకాలం.. సేవ సుపరిపాలన పేదల సంక్షేమానికి తోడుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దెల లక్ష్మీ, రాజా శ్రీకాంత్, ప్రవీణ్, రామకృష్ణ, వలి, నాగరాజు, రాజుయాదవ్, పాదర్తి ఆంజనేయులు, సతీష్‌కుమార్, రామ్నాద్, వెంకట చక్రి పాల్గొన్నారు. ❖ పెద్దదోర్నాల మండల భాజపా అధ్యక్షురాలిగా సూరవరం మల్లేశ్వరి ఎంపికయ్యారు. స్థానిక శివసదనంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు సిగ్గెం శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమెను ఏకగ్రీవం ఎన్నుకున్నారు.

మార్కాపురంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న భాజపా నాయకులు

## మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658

?: అర్థవీడు మండలంలోని రంగాపురంలోని మసీదు వీధి నుంచి అంగన్‌వాడీ కేంద్రం వరకు మురుగు నిలిచి దుర్వాసన వస్తుంది. దోమల బెడదతో రాత్రుల్లో ఇబ్బందిగా ఉంది. కాలువలు ఏర్పాటు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలి.

– కాశింవలి, రంగాపురం.

✓: మురుగు సమస్య పరిష్కరించి..కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

–ఈవోపీఆర్డీ, వీరరాజు, అర్థవీడు.

?: రాచర్ల మండలంలోని అక్కపల్లి గ్రామంలో చోళ్లవీడు వెళ్లే రోడ్డుపై మురుగు మడుగు కట్టి ఉంది. సమీపంలోని మినీట్యాంకు నుంచి వచ్చే వృథా నీరు రహదారిపైకి రావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నిలిచి ఉండకుండా చర్యలు తీసుకోవాలి. – శ్రీనివాసులు, స్థానికుడు

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మురుగు నిలిచి ఉండకుండా చర్యలు తీసుకుంటాం.– వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో, రాచర్ల .

- అర్థవీడు, రాచర్ల, న్యూస్‌టుడే:

## ఎట్టకేలకు మరమ్మతులు

బేస్తవారపేట, న్యూస్‌టుడే; మండలంలోని జేసీ అగ్రహారంలోని జగనన్న కాలనీకి వెళ్లే దారిలో మంచినీటి బోరు విద్యుత్తు మోటార్ మరమ్మతులకు గురికావడంతో పంచాయతీ అధికారులు మోటార్‌ను బయటకు ఊడదీసి మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేశారు. గత 20 రోజులుగా అక్కడి ప్రాంత వాసులు మంచి నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యపై 'ఈనాడు'లో ఆదివారం 'మంచి నీటికి కటకట' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆదివారం ఎంపీడీవో రంగనాయకులు మెకానిక్‌ను వెంటబెట్టుకుని గ్రామంలోని బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు వందనం

### పూడిక తొలగింది

యర్రగొండపాలెం: పట్టణంలోని కొలుకులరోడ్డులో కాలువల్లో పూడిక పేరుకుపోయి అధ్వానంగా మారాయి. ఈ సమస్య 10వ తేదీన 'మేమున్నాం.. మీకు తోడుగా..' కింద ప్రచురించి ఎంపీడీవో శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. ఆదివారం కాలువలోని పూడికను తొలగించి శుభ్రం చేయించారు.

## నీరు లేని తొట్టెందుకు?

స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.33,000లతో పశువుల నీటి తొట్టి నిర్మించారు. గ్రామంలోని గేదెలు ఆ రహదారి వైపు మేతకు వెళుతుంటాయి. దానిలో నీరు పోస్తే అవి దాహార్తి తీర్చుకునేందుకు ఉపయోగకరంగా ఉండేది. అయితే దానిని నిర్మించారే తప్ప వాటిలో నీరు పోయడంలేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

## ఆదమరిస్తే.. అపాయమే

యర్రగొండపాలెం బీసీ కాలనీ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమి పాఠశాలకు 12 అడుగుల దూరంలో ఒక పాడుబడ్డ బావి ప్రమాదకరంగా మారింది. ఈ పాఠశాలలో సుమారు వంద మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పిల్లలు ఖాళీ సమయంలో ఇటూ అటూ తిరుగుతుంటారు. బావి దగ్గర వెళ్తుంటారు. ఆడుకుంటూ పొరపాటున బావిలో పడే అవకాశం ఉంది. ఉపాధ్యాయులు పిల్లలు అటు వెళ్లకుండా కాపలాకాయాల్సి వస్తోంది. ప్రమాదం జరగక ముందే బావిని పూడ్పించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

## నీళ్ల కోసం నిరీక్షణ...

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలో తాగునీటి కోసం మహిళలు కుళాయిల వద్ద నిరీక్షిస్తున్నారు. వారానికొక్కసారి అది కూడ గంట సేపు మాత్రమే తాగునీరు సరఫరా చేస్తారు. ఆ సమయంలో ఏమాత్రం ఎమరుపాటుగా ఉన్నా, ఇంట్లో లేకపోయినా తాగునీటి కోసం మరో వారం రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి పొదిలిలో నెలకొంది. దీంతో నీటికోసం వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్న మహిళలు బిందెలతో ఇలా కుళాయిల వద్ద నిరీక్షిస్తూ నీటిని పట్టుకోవాల్సి వస్తోంది. తరువాత తాగునీరు కావాలంటే డబ్బాలతో సంపు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిందే.

## ఇసుక మాఫియాను అరికట్టండి

యర్రగొండపాలెం పట్టణం : నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక మాఫియాతో కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా కొందరు పని చేస్తున్నారని దీనికి సంబంధించిన వారిపై త్వరలో సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయనున్నట్లు భాజపా రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు ఆరె. రమణయ్య ఆదివారం తెలిపారు. నియోజకవర్గానికి రోజుకు 30 లారీలు ఇసుక వస్తున్నాయని, వినుకొండ వైపు నుంచి వచ్చే లారీలను ఉమ్మడివరం వద్ద ఇసుక మాఫియా ఆపి లారీకి రూ.400లు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఉచితంగా లారీల ద్వారా ఇసుక తీసుకొస్తుంటే కొందరు అడ్డగించి తమ స్టాక్ పాయింట్ల వద్దకు తీసుకెళ్లి టన్నుకు రూ.800లు ఇచ్చి దానిని రూ.1200లకు విక్రయించుకుంటున్నారని, ఇసుక మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు.

**జూదశిబిరంపై దాడి... అరెస్టు** : కొనకనమిట్ల : చినమనగుండం పంచాయతీలోని బ్రాహ్మణపల్లె వ్యవసాయ భూముల్లో నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం దాడి చేసినట్లు ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రెండుకోళ్లు, రూ.11,200నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని, 12మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

మార్కాపురం పట్టణం : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

కంభం : పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

## అపూర్వ సమ్మేళనం

మార్కాపురం పట్టణం : మార్కాపురం పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో 1986-87వ సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి ఆదివారం స్థానిక కమలా పాఠశాల వేదికైంది. దిల్లీ, చెన్నై, బెంగుళూరులో ఉంటున్న పూర్వ విద్యార్థులు హాజరై తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ సుబ్బారావు హాజరయ్యారు.

రాచర్ల, న్యూస్‌టుడే : రాచర్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-2002 సంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులు రమణారెడ్డి, కృపాచంద్రుడు, తదితరులను సత్కరించారు.

రాచర్ల : అప్పటి గురువులతో పూర్వ విద్యార్థుల బృందం

కంభం, న్యూస్‌టుడే : మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1986- 87 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కనక సురభేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న మిత్రులు అప్పటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు గురువులను ఘనంగా సన్మానించారు.

## విలక్షణ నటుడు కోట

మార్కాపురం, న్యూస్‌టుడే : విలక్షణ నటుడు, పద్మశ్రీ కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటని మార్కాపురం బ్రాహ్మణ సంఘం నాయకులు కొనియాడారు. ఆదివారం స్థానిక బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో జగద్గురు ఆదిశంకరాచార్య బ్రాహ్మణ పురోహిత అర్చక రుత్వికుల సంఘం ఆధ్వర్యంలో కోట చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కొనకనమిట్ల, అర్థవీడు, న్యూస్‌టుడే : కొనకనమిట్ల మండలంలోని గార్లదిన్నె పంచాయతీలో వెలిగొండ గురుకుల పాఠశాలలో, అర్థవీడు బాలుర గురుకులంలో మిగిలిన సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్స్ ఇబ్రహీం, బలరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు ఆసక్తి కలిగిన విద్యార్థులు చేరాలని సూచించారు. సోమవారం, మంగళవారం లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# అంచులను అలా.. వదిలేశారు

❖ ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

జాతీయ రహదారి అంచుల్లో గ్రావెల్‌తో చదును చేయకుండా వదిలేసిన దృశ్యం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : అనంతపురం- అమరావతి జాతీయ రహదారిలో గిద్దలూరు నుంచి తాటిచెర్ల మోటు వరకు ఉన్న రహదారిలో ఇటీవల జాతీయ రహదారి అధికారులు రహదారి అభివృద్ధి పనులు చేపట్టారు. ఉన్న రహదారిపై మళ్లీ తారు మందంగా వేశారు. దీంతో ఎదురెదురుగా భారీ వాహనాలు వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనదారులు రహదారి నుంచి పక్కకు తొలిగేందుకు మార్జిన్‌లో గ్రావెల్ వేసి చదును చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ ఎదురుగా వస్తున్న వాహనాల దీపాల కాంతులకు రహదారి మార్జిన్ నుంచి ద్విచక్ర వాహనాలు పక్కకు వెళ్లే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు రహదారి మార్జిన్‌లో గ్రావెల్ తోలి వాహన చోదకులకు ఇబ్బందులు లేకుండా చదును చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.


**ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్**
(ఒక భారత ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో)
**గిద్దలూరు వైఎస్ఆర్ సర్కిల్ శాఖ**

అనుబంధం- జి
**స్వాధీన ప్రకటన**
(2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8(I)
(స్థిరాస్తి కొరకు)

క్రింది సంతకదారుడు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గిద్దలూరు వైఎస్ఆర్ సర్కిలు శాఖకు అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (2002 నాటి చట్టం 54) మరియు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 3లో చదువుకొనేల సెక్షన్ 13(12) క్రింద లభించిన అధికారులు ద్వారా దిగువ వివరించిన రుణగ్రస్తుడు/లు, సహహామీదారులు/ గ్యారంటీదారులు/ మార్టిగేజిదార్లకు నోటీసులో వివరించిన బకాయి మొత్తం రూ.10,20,442/- (రూపాయలు పదిలక్షల ఇరవై వేల నాల్గువందల నలభై రెండు మాత్రమే)లను సదరు నోటీసు చేరిన తేదీ నుంచి గల 60 రోజుల లోగా చెల్లించమని కోరుతూ తేది: 16-04-2025లో ఒక డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది.

| రుణ గ్రస్తుడు | సహ-హామీదారుడు/ గ్యారంటీదారుడు | మార్టిగేజుదారుడు |
|---|---|---|
| కుంభం నారాయణ<br>తండ్రి వెంకటస్వామి<br>డోర్ నెం.5-12-118/88/బి2<br>5వ వార్డు, 12వ బ్లాకు<br>కొంగలవీడు రోడ్,<br>ఈశ్వరమ్మ గుడి ఎదురు,<br>గిద్దలూరు, పిన్ కోడ్: 523357 | పల్లపు వెంకటేశ్వర్లు<br>తండ్రి నడిపన్న<br>కె.వెంకటాపురం గ్రామం,<br>కృష్ణంశెట్టిపల్లి పోస్ట్,<br>గిద్దలూరు మండలం,<br>ప్రకాశం జిల్లా,<br>పిన్ కోడ్: 523357 | - |

రుణ గ్రస్తుడు సదరు బకాయి మొత్తం చెల్లించనందున క్రింది సంతకదారుడు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన (8)తో చదువుకొనేలా సదరు చట్టంలోని సెక్షన్13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని దిగువ వివరించిన ఆస్థిని తేది 08-07-2025న స్వాధీన పర్చుకొన్నట్లు తెలుపుతూ రుణగ్రస్తులు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్థితో ఎవ్వరూ ఎలాంటి వ్యవహారం చేయరాదనీ, ఒక వేళ ఎవ్వరైనా చేసినచో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వారు బకాయి మొత్తం రూ.9,98,169/- (రూపాయలు తొమ్మిదిలక్షల తొంభై ఎనిమిదివేల నూట అరవై తొమ్మిది మాత్రమే)లతో పాటు ఇటీవలి వడ్డీ మరియు 07-07-2025 నుంచి దానిపై అయిన ఇతర ఖర్చుల మొత్తంపై తీసుకోనున్న చర్యలకు బాధ్యులగుదురని ముఖ్యంగా రుణగ్రస్తుడు మరియు సాదారణ ప్రజలకు ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులు విడిపించుటకు రుణగ్రస్తులకు లభించు సమయంపై చట్టంలోని సెక్షను 13లోని ఉప-సెక్షన్(8)లో గల అంశాలపై రుణగ్రస్తుడు శ్రద్ధవహించాలని కోరడమైనది.

**ఆస్తి షెడ్యూలు**

**ఆస్తి మొత్తంతో పాటు**

| | | |
|---|---|---|
| ఆస్తి వివరాలు | : | నివాస గృహం రిజిష్టరు సాధారణ మార్టిగేజి సైటు ఏరియా 800 చ.అ.లతో ఉన్నచోట : స.నెం.407, 5వ వార్డు, 12వ బ్లాకు, కొంగలవీడు రోడ్, గిద్దలూరు పట్టణం, గిద్దలూరు మండలం ఉపరిజిస్ట్రేషన్ జిల్లా, మార్కాపురం రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రకాశం జిల్లా. |
| ఉండేచోటు | : | డో.నెం.5-12-118/88/బి2, 5వ బ్లాకు, 12వ వార్డు, గిద్దలూరు |
| సర్వేనెం | : | 407 |
| విస్తీర్ణం | : | 800 చ.అ.లు |
| యజమాని పేరు | : | కుంభం నారాయణ |
| హద్దులు | : | **తూర్పు:** వడ్డెనకుంట లక్ష్మీకుమారి స్థలం, **దక్షిణం:** రోడ్, **పడమర:** కొత్తపులి శివకృష్ణారెడ్డి స్థలం, **ఉత్తరం:** కలూరి బీరయ్య అమ్మిన స్థలం |

తేది: 08-7-2025 (ఎం. సంతోష్ కుమార్), ఛీఫ్ మేనేజర్
స్థలం: మార్కాపురం మరియు అధీకృత అధికారి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్


(c) eenadu

# కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

## ఉపకేంద్రం నిర్మాణంతో విద్యుత్తు వెతలు దూరం

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలో విద్యుత్తు లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు నూతన ఉపకేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పుల్లగ్రామం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్తు సబ్ స్టేషన్ శంకుస్థాపన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల మున్సిపాలిటీతో పాటు, చుట్టుపక్కల గ్రామీణ పరిశ్రమలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీంతోపాటు పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ల మీద అధిక లోడ్ తగ్గుతుందని, విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఉంటుందన్నారు. సోమవారం మంత్రులు బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్‌తో శంకుస్థాపన చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గాయం తిరుపతిరెడ్డి, షేక్ జంషీర్, ఫిరోజ్, సుబ్బారావు, కరిముల్లా పాల్గొన్నారు.

విద్యుత్తు సబ్ స్టేషన్ శంకుస్థాపన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

దర్శిలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, ఇతర నాయకులు

పామూరు: వగ్గంపల్లిలో కరపత్రాలు పంపిణీచేస్తున్న తెదేపా నాయకులు

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

దర్శి(తాళ్లూరు), న్యూస్‌టుడే: అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు కల్పించడం జరుగుతుందని దర్శి మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగు లేకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు సాధ్యమవుతోందని వివరించారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పలువురు నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. పథకాలపై కరపత్రాలు పంపిణీ చేసి అభివృద్ధి పనులు గురించి అవగాహన కల్పించారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు పి.చిన్నా, నాయకులు శ్రీనాథ్, శ్రీను, విజయకృష్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

▸ పామూరు, సి.ఎస్.పురం: కూటమి పాలనతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బి.జయరామిరెడ్డి అన్నారు. పామూరు మండలంలోని వగ్గంపల్లి, సి.ఎస్.పురం మండలంలోని కొండబోయినపల్లి, ఆర్‌కేపల్లి గ్రామాల్లో తెదేపా నాయకులు ప్రభుత్వ పథకాలపై ఇంటింటా నిర్వహించారు. ఐ.లక్ష్మణ్ యాదవ్, సీహెచ్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

▸ హనుమంతునిపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, గొల్లపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో తెదేపా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు మురహరి నరసయ్య తదితరులు ప్రజల సమస్యలు తెలుసుకొని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

▸ ముండ్లమూరు: మండలంలోని ఉమామహేశ్వరపురంలో తెదేపా మండల అధ్యక్షుడు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. నాయకులు దేవినేని కోటేశ్వరరావు, వెంకట్రావు, సాంబయ్య, రామాంజనేయులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కేరింతలు కొడుతూ నృత్యం చేస్తున్న చిన్నారులు

## ఆటపాటలతో ఆనంద ఆదివారం

కనిగిరి: పట్టణంలోని కాకి, పిచ్చుక పాఠశాలలో ఆనంద ఆదివారాన్ని చిన్నారులు కేరింతల మధ్య జరుపుకొన్నారు. పాఠశాల డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ చిన్నారులతో గ్లాసు కొట్టుట, గోలీలాట, వైకుంఠపాళీ, చదరంగం తదితర ఆటలను ఆడించి ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఒక మంచి ఆలోచన, పేరును చూసి ఎగతాళి చేయరాదు అనే కథలను చెప్పి అందులో నీతిని బోధించారు. పేపర్‌తో కళాకృతులు, పొడుపు కథలు అడిగి వారిని అలరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ట్రిపుల్‌ఐటీకి విద్యార్థిని ఎంపిక

టంగుటూరు: మండలంలోని తూర్పు నాయుడుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కొట్టే తేజశ్రీ ఒంగోలు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌కు ఎంపికైంది. 2024-25 పదో తరగతి పరీక్షల్లో 567 మార్కులు సాధించింది. ఆదివారం విడుదలైన రెండో జాబితాలో ఆమెకు సీటు లభించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎన్.వి.సుధారాణి, ఇతర ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

## వాతావరణ మార్పులు.. ముసురుతున్న వ్యాధులు

న్యూస్‌టుడే, కనిగిరి

ఒకరోజు వర్షం. విపరీతమైన గాలులు, ఆ తర్వాత వరుసగా నాలుగు రోజులు ఎండ.. ఇలా వాతావరణంలో వచ్చిన మార్పులతో వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. జలుబు, ఒళ్లు నొప్పులతో ప్రారంభమై జ్వరాలుగా రూపాంతరం చెందుతున్నాయి. పిల్లలు, వృద్ధులపై ప్రభావం ఎక్కువగా చూపుతున్నాయి. వారం రోజులుగా కనిగిరి చుట్టు పక్కల ప్రైవేటు ఆసుపత్రులు, మీహోస్లతోపాటు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి జ్వర పీడితుల తాకిడి కనిపిస్తోంది.

### సామాజిక ఆరోగ్య కేంద్రంలో పెరిగిన ఓపీలు

కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలో సాధారణంగా 200 వరకు ఓపీలు ఉంటాయి. ప్రస్తుతం 300లకు పైనే నమోదవుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. అంటే వ్యాధుల వ్యాప్తి పెరుగుతోంది. నియోజకవర్గంలోని కనిగిరి, పామూరు, పీసీపల్లి, హనుమంతునిపాడు, వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం ఓపీల సంఖ్య పెరిగినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

కనిగిరి సీహెచ్‌సీలో వైద్యుల వద్దకు వెళ్లేందుకు వేచి ఉన్న రోగులు

కొన్నిచోట్ల ఆసుపత్రిలో నామమాత్రం వైద్యం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రాబోయే రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉండటంతో ప్రజల్లో వ్యాధుల నివారణ పట్ల మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో మురుగు, వ్యర్థాలు పేరుకుపోకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కనిగిరి కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా.. ఓపీలు పెరిగిన మాట వాస్తవమేనన్నారు. జ్వరంతో వచ్చిన వారికి అన్ని విధాలుగా చికిత్సలు చేసి మందులు ఇచ్చి పంపుతున్నామని తెలిపారు. ఎవరైనా జ్వర లక్షణాలతో బాధపడుతుంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

## నేడు కురిచేడు మండలంలో మంత్రుల పర్యటన

కురిచేడు, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం నిర్వహించనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇద్దరు రాష్ట్ర మంత్రులు రానున్నారు. కల్లూరులో 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణ పనులకు విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి శంకుస్థాపన చేయనున్నట్లు దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 33 లక్షలకు సంబంధించిన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. నియోజకవర్గ పరిధిలోని అయిదు మండలాలకు చెందిన కూటమి పార్టీల నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## జాషువా వర్ధంతికి రావాలని పిలుపు

దర్శి(తాళ్లూరు), న్యూస్‌టుడే: మహాకవి గుర్రం జాషువా వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం దర్శిలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 24వ తేదీన జరిగే కార్యక్రమాలకు దర్శి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న కవులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని రాష్ట్ర దళితసేన నియోజకవర్గ అధ్యక్షుడు జి.ప్రేమ్‌కుమార్ కోరారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు, ప్రకృతి వైద్య నిపుణుడు వై.వి.రెడ్డి, కొత్తపల్లి సర్పంచి బి.రామారావు, జీవీ.రత్నం పాల్గొన్నారు.

## నిత్యం యోగా సాధనతో ఆరోగ్యం

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పుగంగవరానికి చెందిన వ్యాపారులు, ఉద్యోగులు, ఇతరులు సుమారు యాభై మంది ఆదివారం నీటిలో యోగాసనాలపై సాధన చేశారు. గుంటూరు నుంచి వచ్చిన ధ్యాన నిపుణుడు డి.సుబ్బారావు, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో నాగంబొట్లపాలెం సమీపాన పొలాల్లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లారు. కొందరు నీటిపై తేలియాడుతూ జలస్తంభ యోగాసనాలు వేశారు. మహిళలు సైతం ఉత్సాహంగా తరలి వచ్చారు. అనంతరం గ్రామంలోని గుజ్జుల మణికంఠారెడ్డి యోగాలయంలో ధ్యాన, యోగాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. యోగా సాధనతో ఆరోగ్యం మెరుగుపడుతుందని శిక్షకులు వివరించారు.

ఈతకొలను వద్ద యోగా సాధకుల సందడి

## అపరిచితులపై సమాచారమివ్వండి

ముండ్లమూరు, న్యూస్‌టుడే: అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కె.కమలాకర్ సూచించారు. మండలంలోని ఈదర, మారెళ్ల, మక్కెనవారిపాలెం గ్రామాల్లో ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. వాహనాల తనిఖీ చేపట్టి ధ్రువపత్రాలు, శిరస్త్రాణం ధరించని చోదకులకు జరిమానా విధించారు. కానిస్టేబుల్ మహేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈదర గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

## తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడంతోపాటు, తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.మాధవరావు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని హెచ్ ఎంపాడు - కనిగిరి రహదారిలో వేములపాడు వద్ద వాహన తనిఖీలు చేపట్టి ప్రయాణికులకు రోడ్డు ప్రమాదాల నివారణపై సూచనలిచ్చారు.

## శివారు కాలనీలు.. వీడని సమస్యలు

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

సింగరాయకొండ మండల పరిధిలోని శివారు ప్రాంతాలు మురికి కూపంలా మారడంతో స్థానికులు సమస్యలతోనే సావాసం చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, ఖాళీ స్థలాల్లో చెట్లు పెరిగి అధ్వానంగా మారడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని టీపీనగర్, అప్పాపురం, ఆవులవానిపాలెం, పాతసింగరాయకొండ పరిధిలోని తాతయ్యకాలనీ, బాలిరెడ్డినగర్, మల్లికార్జుననగర్, బింగినపల్లిలోని గిరిజన కాలనీల్లో ప్రజలు సమస్యలతో నిత్యం సతమతమవుతున్నారు. అంతర్గత రహదారులు సరిగా లేవు. పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వర్షాలు కురిస్తే బురదమయమే...

కొన్ని వీధుల్లో కాలువలు, రహదారులు లేక చిన్నపాటి వర్షం కురిసినా నడవలేని పరిస్థితి నెలకొంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు అప్పాపురం గిరిజన కాలనీలో వర్షపునీరు నివాసాల్లోకి రావడంతో నిత్యావసరాలు తడిసి ముద్దయి కట్టుబట్టలతో వారం రోజుల పాటు కంటిమీద కునుకు లేకుండా స్థానికులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఇళ్ల మధ్యే మురుగు పేరుకు పోవడంతో దోమలు వ్యాప్తి చెంది జ్వరాల బారిన పడుతున్నారు. కొన్ని కాలనీల్లో నేటికీ రోడ్లు, తాగునీటి వసతి లేవు. గిరిజన కాలనీల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని మంత్రి స్వామి ఆదేశించినా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. కుళాయిల్లో వారం రోజులకు ఒకసారే నీళ్లు వస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో సమస్యలపై ఈవోపీఆర్డీ రమేష్‌ను వివరణ కోరగా...త్వరలో గిరిజన కాలనీలను పరిశీలిస్తామన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టి, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఆవులవానిపాలెంలోని కాలువలో పిచ్చి మొక్కలు

## మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: తాళ్లూరు మండలం లక్కవరం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మంచినీరు పట్టుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రహరీకి ముందువైపు ఏర్పాటు చేసిన కుళాయిల వద్ద బురదమయంగా ఉంది. -శ్రీను, గ్రామస్థుడు
✓: వెంటనే సమస్యను పరిశీలించి సత్వరం సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. -వలీ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

?: తాళ్లూరు-ముండ్లమూరు ప్రధాన రహదారిపై విఠలాపురం పాతూరువద్ద పెద్ద గుంత ఏర్పడింది. వాహనాలు అదుపు తప్పుతున్నాయి. -వెంకటేశ్వర్లు, విఠలాపురం
✓: త్వరలోనే గుంతను పూడ్చించి ప్రమాదాలకు తావులేకుండా చేస్తాం. - రఫీ, జేఈ, ర.భ.శాఖ

?: దొనకొండలో పందుల సంచారం ఎక్కువైంది. వ్యాధులు వ్యాపిస్తాయని ఆందోళనగా ఉంది. - దేవిలాల్, గ్రామస్థుడు
✓: వారం రోజుల్లో గ్రామంలోని పందులను వాటిని పట్టించి అడవుల్లో వదిలిపెడతాం. -కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి

?: హెచ్ఎంపాడులో సాగర్‌నీటిని రాత్రివేళల్లో విడుదల చేస్తుండటంతో ప్రజలు మేలుకొని పట్టుకోవాల్సి వస్తుంది. వారానికి రెండుసార్లు రావాల్సి ఉండగా ఒక్కసారే వస్తున్నాయి. -మురహరి నరసయ్య, మాజీ సర్పంచి
✓: వారానికి రెండుసార్లు నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం. పగటిపూట పంపింగ్ చేయించి సరఫరా చేస్తాం. -శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

?: కనిగిరి పట్టణంలో పందుల సంచారం అధికమైంది. గృహాల్లోకి, షాపుల్లోకి ప్రవేశించి అపరిశుభ్ర వాతావరణాన్ని కలిగిస్తున్నాయి. -రామాంజనేయులు, పట్టణవాసి
✓: పందుల యజమానులను పిలిపించి మాట్లాడుతాం. పట్టణానికి దూరంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం. - నాయబ్ రసూల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: మర్రిపూడి పంచాయతీ నడిగడ్డ వీధిలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు రోడ్డుపైకి వస్తుంది. -వెంకటేశ్వర్లు, స్థానికుడు
✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. -నాగూర్‌వలి, డిప్యూటీ ఎంపీడీవో

-న్యూస్‌టుడే, తాళ్లూరు, దొనకొండ, హనుమంతునిపాడు, కనిగిరి, మర్రిపూడి

## చిల్లకంప తొలగింపు

స్పందనకు వందనం

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని లక్కవరం శివారు నాగంబొట్లపాలెం, అయ్యలవారిపాలెంవైపు వెళ్లే రహదారి కూడలి వద్ద పొలాల్లో వ్యవసాయావసరాల కోసం విద్యుత్తు పరివర్తకాన్ని ఏర్పాటు చేశారు. దాని చుట్టూ పిచ్చి మొక్కలు, చిల్లకంప దట్టంగా పెరిగింది. వర్షాలు పడిన సందర్భంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న విషయమై 'ఈనాడు'లో ఆదివారం 'పరి వర్తకం... ఇలాగైతే ఇబ్బందికరం' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీంతో దర్శి ఈఈ పి.శ్రీనివాసులు, ఇతర అధికారులు స్పందించారు. తక్షణం పరివర్తకం వద్ద ప్రమాదాలకు తావులేకుండా శుభ్రం చేయించాలని ఏఈ ఎం.రామకృష్ణారెడ్డి, ఎల్ఐ కాంతారావులకు సూచించారు. దీంతో ఎల్ఐ ఆదివారం మధ్యాహ్నం సిబ్బంది సాయంతో పరివర్తకం వద్ద పెరిగిన చిల్లకంప తొలగింపజేసి శుభ్రం చేయించారు.

## పనిచేయని బోర్లు.. తప్పని వెతలు

కాలనీల్లో నీటి సమస్యను తీర్చాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన డీప్‌బోర్లు పనిచేయక పోవడంతో నీటి కష్టాలు తప్పడం లేదు. మండలంలోని గుండ్లసముద్రం పంచాయతీలోని రెండు ఎస్సీ కాలనీల్లో డీప్‌బోర్లు మరమ్మతులకు గురికావటంతో రెండేళ్లుగా నీటికి ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. మరమ్మతులు చేసే నాథుడే లేక పోవటంతో నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. గతంలో డీప్‌బోరు ఏర్పాటుచేసి, వీధుల్లో కుళాయిలు ద్వారా నీటి సరఫరా చేసేవారు. బోర్లు పనిచేయక నీటి ఇక్కట్లు ప్రారంభమయ్యాయి. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ఇటీవల కాలనీలో పర్యటించారు. డీప్‌బోర్లకు మరమ్మతులు చేయించాలని, నీటికి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెప్పారు. అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించటంతోపాటు మరో డీప్‌బోరు ఏర్పాటు చేయించేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా.. పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, మర్రిపూడి

## పరివర్తకం.. మంటలతో ప్రమాదకరం

సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి పరిధిలోని టీపీనగర్ ప్రధాన రహదారి వెంబడి విద్యుత్తు పరివర్తకం చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకుని విద్యుత్తు తీగలను తాకుతున్నాయి. రాత్రి సమయంలో నిత్యం మంటలు చెలరేగుతున్నాయని, సంబంధిత అధికారులకు తెలియజేస్తున్నా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా ఈ రహదారి నుంచే పాకల సముద్ర తీరానికి సందర్శకులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయక పోవడంతో రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పరివర్తకం ఉన్న సిమెంటు దిమ్మెను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయంపై విద్యుత్తు ఏఈ సాంబశివరావును వివరణ కోరగా వెంటనే పిచ్చి మొక్కలను తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

## జామాయిల్‌పై అక్రమార్కుల కన్ను

పీసీపల్లి, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధి పేరుతో అక్రమార్కులు కొత్తపంథాను ఎంచుకున్నారు. మండల పరిధిలో తమ వ్యాపారానికి అనుకూలంగా ఉందంటే చాలు అక్కడ వాలిపోతున్నారు. ఒకరిద్దరు నాయకులను ప్రసన్నం చేసుకుని గ్రామాభివృద్ధికి ఎంతో కొంత ఇస్తామని చెప్పి తాము అనుకున్న పని సులువుగా కానిచ్చేస్తున్నారు. ఇందుకు నిదర్శనమే పిల్లివారిపల్లిలో జామాయిల్ చెట్ల నరికివేత. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆ గ్రామంలోని చెరువు, కొండకు దగ్గర్లో ఉంది. చెరువుకు సంబంధించిన భూమిలో గతంలో సుమారు 15 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని నాబార్డు సంస్థ జామాయిల్ మొక్కలు నాటించింది. ఇవి ఏపుగా పెరగడంతో వీటిపై అక్రమార్కుల కన్ను పడింది. గ్రామానికి చెందిన ఒకరిద్దరు నాయకులను వారు సంప్రదించి.. ఊరికి కొంతమేర ఆర్థిక సాయం చేస్తామని చెప్పి చెట్లను నరకడం ప్రారంభించారు. అయితే దీనిపై వ్యతిరేకించిన కొంతమంది శనివారం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చెట్లు నరుకుతున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. అధికారుల అనుమతి లేకుండా చెట్లు నరకవద్దని హెచ్చరించారు. కలప తరలించేందుకు ఉంచిన రెండు ట్రాక్టర్లను పీసీపల్లి తరలించారు. వీటిపై ఎస్సై కోటయ్యను వివరణ కోరగా.. తమకు అందిన సమాచారం మేరకు చెట్లు కొట్టివేతను అడ్డుకున్నట్లు తెలిపారు. జలవనరుల శాఖ ఏఈ రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పిల్లివారిపల్లిలో నరికివేసిన జామాయిల్ చెట్లు

## చికిత్స పొందుతూ కనిగిరివాసి మృతి

చిట్వేలి(పుల్లంపేట), న్యూస్‌టుడే: ఈ నెల 6వ తేదీ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నవీన్ తెలిపారు. కనిగిరికి చెందిన పులి కొండారెడ్డి (35) బతుకుదెరువు కోసం అన్నమయ్య జిల్లా రాయచోటి వచ్చి నివాసం ఉంటున్నారు. బేల్దారి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 6న స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తిమ్మయ్యగారిపల్లె వద్ద అదుపు తప్పి వాహనం బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన ఆయన అప్పటి నుంచి తిరుపతి సిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కోడిపందేలు ఆడుతున్న 8 మందిని కొండపి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రం కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో కోడిపందేలు నిర్వహిస్తుండగా.. పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో ఆ శిబిరంపై దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5,600 నగదు, 2 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు.

## పంటకుంట.. తీర్చేను సాగునీటి చింత!

న్యూస్‌టుడే, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు

పొలాల్లో పంటకుంటలు ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు వృద్ధి చెంది రైతులకు అధిక ప్రయోజనాలు చేకూరుతాయి. వర్షాలు సమృద్ధిగా కురవకపోయినా బోరుబావుల ద్వారా సాగు నీటికి ఇబ్బందులు ఉండవు. ఇందుకోసం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రస్తుత ఏడాదిలో పంట కుంటలు ఏర్పాటుకు ప్రోత్సాహకాలు అందజేస్తుంది. రైతులు వ్యక్తిగతంగా వారి పొలాల్లో విస్తీర్ణాన్ని బట్టి నియమిత కొలతల ప్రకారం కుంటలను తవ్వించాల్సి ఉంటుంది. వాటిని బట్టి ప్రభుత్వం రాయితీలు అందజేస్తుంది. దర్శి నియోజకవర్గంలో వీటి నిర్మాణ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి.

### లక్ష్యం కంటే ఎక్కువగానే మంజూరు..

దర్శి నియోజకవర్గంలో కుంటల నిర్మాణాలు ఇలా..

| మండలం | మంజూరైనవి | పూర్తయినవి |
|---|---|---|
| దర్శి | 315 | 44 |
| దొనకొండ | 225 | 41 |
| కురిచేడు | 305 | 43 |
| ముండ్లమూరు | 366 | 91 |
| తాళ్లూరు | 226 | 24 |

వ్యవసాయ భూములతో పాటు ప్రభుత్వ పరిధిలోని భూముల్లో పంట కుంటల నిర్మాణాలు చేపట్టారు. నియోజకవర్గంలోని అయిదు మండలాల్లోని 95 గ్రామ పంచాయతీల పరిధిలో 1,425 పంట కుంటలు నిర్మించాలని లక్ష్యం కాగా.. 1,437 మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికి 243 నిర్మాణాలు పూర్తికాగా, మరో 154 పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే అన్నింటినీ పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నట్లు దర్శి క్లస్టర్ ఏపీడీ లలితకుమారి తెలిపారు. వీటిని రెండు మీటర్ల లోతు, 20:20 మీటర్ల పొడవు, వెడల్పుతో నిర్మించే కుంటలకు రూ.2.75 లక్షలు, 15:15 మీటర్ల, పొడవు, వెడల్పుతో నిర్మిస్తే రూ. 2.30 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయనున్నారు.

శివరాంపురంలో ఓ రైతు పొలంలో ఏర్పాటు చేసిన పంటకుంట

## మిట్టపాలెంలో భక్తుల సందడి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణస్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు గోపూజ చేశారు. ఆలయంలో స్వామికి అభిషేకం, మహానివేదన, హారతి పూజలు జరిగాయి. స్వామివారి పల్లకీసేవ, రథోత్సవం సందడిగా సాగాయి. భక్తులు ఉత్సాహంగా రథాన్ని లాగారు. ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. పూజలు, అన్నదానం వద్ద దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ కె.చిన్న ఆదినారాయణ, సిబ్బంది పర్యవేక్షించారు.

స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

## పోలేరమ్మకు పొంగళ్లు సమర్పణ

పీసీపల్లి: మండలంలోని చిరుకూరివారిపల్లిలో గ్రామ దేవత పోలేరమ్మకు ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రలతో పొంగళ్లు సమర్పించారు. తొలుత మహిళలంతా కలిసి ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారున ఉన్న అమ్మవారి ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు వండారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు పండాలని, గ్రామస్థులు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

## గోవిందరాజుల స్వామి కొలుపులు

కురిచేడు: మండలంలోని పొట్లపాడులో ఆదివారం గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన గోవిందరాజుల స్వామి కొలుపులకు నియోజకవర్గ నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో నలభై ఏళ్ల క్రితం గోవిందరాజుల స్వామి కొలుపులు నిర్వహించామని, మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తున్నామని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

## గంగమ్మకు విశేష పూజలు

తాళ్లూరు: మండలంలోని సోమవరప్పాడు పరిధి గుంటిగంగలో కొలువుదీరిన గంగాభవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. జిల్లాతోపాటు, పరిసర జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయాన్నే పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నిమ్మకాయలు, పూలమాలలతో అలంకరించారు. దేవాలయ ట్రస్టీ అధ్యక్షుడు కొసనా గురుబ్రహ్మం, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

### వల్లూరమ్మ ఆలయంలో రద్దీ..

టంగుటూరు: ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం, పొంగళ్ల వంటశాల, భోజన శాలలు భక్తులతో కిటకిటలాడాయి. మొక్కులు చెల్లించి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

## లక్ష్మీపద్మావతికి సత్కారం

దర్శి(తాళ్లూరు), న్యూస్‌టుడే: దర్శి పట్టణంలో ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు శిద్దా లక్ష్మీపద్మావతిని స్థానిక సంఘ ప్రతినిధులు సత్కరించారు. పీటీఎస్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగానికి చెందిన ప్రతినిధులు కలిసి ఆమెకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానం చేశారు.

(c) eenadu

# ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

## సంక్షేమ పథకాల అమలుకు చర్యలు

పేర్నమిట్ట (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పేర్నమిట్టలోని 40వ డివిజన్‌లో సుపరిపాలనపై తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరిగి ప్రచార పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ 6 పథకాలు అమలు చేసేలా ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంచర్ల బాబు, తెదేపా మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్

వెంకటేశ్వర కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కామేపల్లి శ్రీనివాసరావు తదితరులు

### పింఛన్లు, రేషన్‌కార్డులు కావాలి

ఒంగోలు గ్రామీణం: స్థానిక తెదేపా కమిటీ ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనీలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించడంతోపాటు; కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరుతోపాటు; టిడ్కో ఇళ్లు ఇవ్వాలని విన్నవించారు. దీపం-2 పథకం కింద నగదు జమ కాలేదని ఎక్కువ మంది ఫిర్యాదు చేశారు.

## కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సూచించారు. కవర్తపు అభిలక్ష్మి మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సంతపేటలోని షిర్డి సాయి కల్యాణ మండపంలో ఆదివారం 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభావంతులైన 50 మంది పద్మశాలీ విద్యార్థులకు నగదు పురస్కారాలతోపాటు; ప్రశంసా పత్రాల ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన సొసైటీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు కవర్తపు బాలకృష్ణారావు, జి.మోహనరావు, కవర్తపు వెంకట ప్రసాద్, జంజనం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

## ఇక కార్పొరేట్ హంగుల మున్సిపాలిటీ

◗ రూ.16 కోట్లతో నూతన కార్యాలయం ◗ పీపీపీ పద్ధతిలో నిర్మాణానికి ప్రతిపాదన

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం:

నగరపాలక సంస్థ కార్యాలయం త్వరలో కార్పొరేట్ హంగులు సంతరించుకోనుంది. కొత్త భవన నిర్మాణానికి మార్గం సుగుమమైంది. ఇటీవలే టైప్ డిజైన్ ఆమోదం పూర్తికావడంతో పరిపాలనా ఆమోదం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

నగరపాలక సంస్థ కార్యాలయం

### రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు

పురపాలక సంఘం ఏర్పడినప్పుడు కట్టిన గదులే ఇప్పటి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ భవనం కాలదోషం పట్టి కూలిపోయే దశకు రావడంతో 2008లో కార్యాలయాల కోసం ఒక భవనం నిర్మించారు. దానిలో ప్రస్తుతం కమిషనర్ ఛాంబర్, పట్టణ ప్రణాళిక, మరికొన్ని విభాగాలు దానిలో ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాలకు గదులు లేక రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు. అత్యంత భద్రతతో ఉండాల్సిన రికార్డు గది అధ్వానంగా ఉంది. వర్షం పడితే కొన్ని గదులు కారుతున్నాయి.

### గతంలో ప్రతిపాదనలే...

కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో 10117 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ త్రీ భవన నిర్మాణం చేపట్టడానికి ఆమోదం లభించింది. దీనికోసం రూ. 16.50 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. గత ప్రభుత్వంలో నిర్మాణానికి ప్రతిపాదించినా ఆచరణకు నోచుకోలేదు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవతో పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ పద్ధతిలో నిర్మాణం కానుంది. ప్రైవేటు వ్యక్తులు, లేదా సంస్థలు నిర్మాణ ఖర్చు భరించినందుకు ప్రత్యామ్నాయంగా అంత విలువ చేసే స్థలాన్ని సదరు గుత్తేదారుకు అప్పగించాల్సి ఉంటుంది. సాధారణంగా దుకాణ సముదాయాలైతే ఒక ఫ్లోర్ గుత్తేదారుకు దీర్ఘకాలిక లీజుకు అప్పగించి, మిగిలినది కార్పొరేషన్ తీసుకుంటుంది. ఇది కార్యాలయం కనుక ఇతర ప్రాంతాల్లో నిర్మాణం చేసిన వారికి స్థలం అప్పగించాల్సి వస్తోంది. ఈ ప్రతిపాదనపై సమాలోచనలు జరుగుతున్నాయి. వీలు కాని పక్షంలో ఎంపీ ల్యాడ్స్, జనరల్ ఫండ్స్‌తో నిర్మాణం చేయాలనే ఆలోచనలో ఉన్నారు. మూడంతస్తుల భవనంలో మొదటి ఫ్లోర్‌లో కౌన్సిల్ హాలు, మేయర్ ఛాంబర్, డిప్యూటీ మేయర్ల గదులు, గ్రీవెన్స్ సెల్ నిర్మిస్తారు. రెండో అంతస్తులో కమిషనర్, ఇతర విభాగాల అధికారుల గదులు నిర్మిస్తారు. మూడో అంతస్తులో కార్యాలయాలు ఉండేలా డిజైన్ రూపొందించారు. ఈఏడాది ఆఖరికి పనులు చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## చీమకుర్తిలో మంత్రి, ఎమ్మెల్యేల పర్యటన

చీమకుర్తి, న్యూస్‌టుడే: సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న సోమవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్‌లు చీమకుర్తిలో పర్యటించనున్నారని పట్టణ తెదేపా అధ్యక్ష కార్యదర్శులు ముప్పూరి చలమయ్య, అవనిగడ్డ శేషారావులు తెలిపారు. పట్టణంలోని 14, 15 వార్డుల్లో జరిగే కార్యక్రమాల్లో వారు పాల్గొంటారని చెప్పారు.

నేడు

## విద్యుత్తు సరఫరా నిలిపివేత

మద్దిపాడు, న్యూస్‌టుడే: మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్తు శాఖ ఏఈ చెన్నారెడ్డి ఆదివారం తెలిపారు. 33 కేవీ నూతన విద్యుత్ లైన్ నిర్మాణం, ఇండస్ట్రియల్ ఫీడర్‌లో మరమ్మతులు, విద్యుత్తు లైన్‌లకు అవరోధంగా ఉన్న చెట్లు తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 8-00 గంటల నుంచి సాయంత్రం 3-00 గంటల వరకు గుండ్లాపల్లి, గార్లపాడు, మేదరమెట్ల, బూరేపల్లిలతో పాటు 16వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కావున వినియోగదారులు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

## రేపు కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల ఫెడరేషన్ పిలుపు మేరకు ఈనెల 15వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.అంకిరెడ్డి, డాక్టర్ కంచర్ల సుబ్బారావు తెలిపారు. ఎప్పుడూ పరిష్కరించని సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని ధర్నా చేస్తున్నామన్నారు.

## జూద శిబిరంపై దాడి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: తిమ్మసముద్రంలో జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై రజియా సుల్తానా సిబ్బందితో శిబిరంపై ఆదివారం దాడి చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 46330 నగదు స్వాధీనం చేసుకొన్నారు.

## పైసలు రాలేదు.. పైకప్పు దాటలేదు

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం: చిన్న మొత్తాల పొదుపు సంస్థ విభాగానికి సంబంధించి కార్యకలాపాల నిమిత్తం 2006లో ఒంగోలు మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నూతన భవనానికి అప్పట్లో రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో శ్లాబు వేశారు. తదనంతరం పనులు ఆపేయడంతో నేటికీ మొండిగోడలతోనే దర్శనమిస్తోంది. అప్పటి నుంచి నిరుపయోగంగా ఉండటంతో 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో అప్పటి తహసీల్దార్ చిరంజీవి మండల తహసీల్దార్ కార్యాలయం కింద వినియోగించేందుకు వీలుగా మిగతా పనులు పూర్తికి నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపారు. దీంతో రూ. 90 లక్షలు మంజూరయ్యాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిధులను రద్దు చేయడంతో నేటికీ భవన నిర్మాణం పూర్తికాలేదు. ప్రస్తుతం నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయం బ్రిటిష్ హయాంలో నిర్మించిన అతిథి గృహం కావడంతో కాలం చెల్లింది. అది చారిత్రాత్మక కట్టడం కింద పడేయడానికి వీల్లేదు. దీంతో పక్కనే ఉన్న అసంపూర్తి భవనాన్ని పూర్తి చేస్తే రెవెన్యూ ఉద్యోగులకు నూతన కార్యాలయం కింద వినియోగంలోకి వచ్చినట్లయింది.

కొలిక్కిరాని చిన్నమొత్తాల పొదుపు సంస్థ భవనం

## లింకు రోడ్లు దారుణం.. మరమ్మతులు మృగ్యం

న్యూస్‌టుడే, మద్దిపాడు:

దూర ప్రాంతాలను దగ్గర చేసే గ్రామీణ ప్రాంతాల లింక్ రహదారులు అధ్వానంగా మారినా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. గత వైకాపా ప్రభుత్వ నిర్వహణ లోపంతో పల్లె దారులు అడుగడుగునా గుంతలు పడి వాటిపై వెళ్తే నడుములు విరిగి పోతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

◗ **పలు గ్రామాలను కలిపేవీ..:** మండల పరిధిలోని పలు గ్రామాలను కలిపే లింక్ రహదారులు గుంతల మయమవడంతో నిత్యం తిరుగుతుండే రైతు సోదరుల ఇబ్బందులు వర్ణనాతీతం. పెదకొత్తపల్లి నుంచి మారెళ్ల గుంట పాలెం మీదగా పేర్నమిట్ట వద్ద కర్నూల్ రోడ్‌కు సుమారు ఆరు కిలో మీటర్ల దూరం ఉంటుంది. జాతీయ రహదారి మీదుగా తిరిగి వెళ్లడానికి సుమారు 18 కి మీ పైగా ఉంటుంది. వ్యయప్రయాసలు భరించలేని నేలటూరు, గురవారెడ్డి పాలెం, పెదకొత్తపల్లి, నరసాయపాలెం, మారెళ్ల గుంట పాలెం, లింగంగుంట గ్రామాలకు చెందిన రైతులు తాము పండించిన పొగాకును పేర్నమిట్ట సమీపంలో ఉన్న పొగాకు వేలం కేంద్రానికి ఈ రహదారిలోనే తీసుకెళ్తుంటారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో రహదారి పూర్తిగా గుంతలతో కూడి రాకపోకలకు వీలుకాకుండా పోయింది. పల్లామల్లి నుంచి త్రోవగుంట వెళ్లే రహదారిలో తెల్లగుంట నుంచి పేర్నమిట్టలోని కర్నూల్ రహదారికి 3 కిమీ వస్తుంది. రోడ్డు బాగాలేక వర్షాకాలంలో ద్విచక్ర వాహనం కదలడానికి అవకాశం లేనట్లుగా ఉంటోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా లింక్ దారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మారెళ్ల గుంట పాలెం, పేర్నమిట్ట మధ్య మట్టిదారి ఇలా..

## వీధి దీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం

కర్నూలు రోడ్డు: నగరంలో సీతారామపురం వినాయక స్వామి గుడి వద్ద రెండో లైన్ రోడ్డులో విద్యుత్తు దీపాలు పనిచేయడం లేదు. రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎన్నిసార్లు అధికారులు దృష్టికి తీసుకొని వెళ్లినా పట్టించుకోవడం లేదంటూ 12 తేదీ శనివారం 'ఈనాడు' 'మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురించడంతో అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపించి దీపాలకు మరమ్మతులు చేశారు.

## ఉల్లాసంగా స్వరామృతం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: యస్.వి రంగారావు జయంతి వేడుకలు, ఘంటసాల, యస్.పి. బాలు స్వరామృతం కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఉల్లాసంగా జరిగింది. స్థానిక సివియన్ రీడింగ్ రూమ్ ఆవరణలో పద్మశ్రీ ఘంటసాల, యస్.వి రంగారావు గార్ల సాంస్కృతిక సేవా సంస్థ ఒంగోలు ఆధ్వర్యంలో ఈ సంగీత విభావరిని ఘనంగా నిర్వహించారు. అలనాటి సినీ గేయాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో గాయకులు రత్తయ్య, శ్రీనివాస్, శైలజ, సుబ్రహ్మణ్యం, వ్యాఖ్యాత పొన్నూరు వెంకట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాటలు పాడుతున్న గాయకులు

**పేదలకు అన్నదానం: సంతనూతలపాడు:** స్థానిక సేవా సంకల్ప ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పేద వర్గాలకు అన్నదానం చేపట్టారు. ఎన్నారై పాతూరి సంపత్ సహకారంతో ఉచిత అన్నదానం, ఉచిత వైద్య శిబిరాలు, పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం ఇలా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ శనగల వెంకటరమణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, నారాయణస్వామి చౌదరి, వేమా కవిత, ఎస్.ధనలక్ష్మిలు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఒంగోలు కర్నూల్ రోడ్డు : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మద్దిపాడు, న్యూస్‌టుడే

?: మద్దిపాడు మండల కేంద్రంలోని పడమర పాలెంలో గంగమ్మ గుడి రహదారి చివరన రెండు రహదారుల మధ్య నుంచి మురుగు పోవడానికి కాలువ ఉండేది. సిమెంట్ రహదారి నిర్మాణ సమయంలో కాలువ పూడిపోయింది. దీంతో మురుగు నీరు రోడ్డు మీదగా పారుతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. పూడిక తీసి మురుగు నీరు రహదారి పైకి రాకుండా చర్యలు తీసుకోగలరు. –పి సుబ్బారావు. మద్దిపాడు గ్రామ నివాసి

✓: మురుగు నీరు రహదారుల మీదకు రాకుండా రెండు రహదారుల మధ్య తూము నిర్మాణం చేపడతాం. – నూరుల్లా, మద్దిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి.

?: మద్దిపాడు గ్రామ పంచాయతీలోని 16వ జాతీయ రహదారి పై వంతెన కింద వాహనాలు ఎక్కువగా నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ నిలిచి పోయి ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంటోంది. వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోగలరు.
–ఎన్. శ్రీనివాసరావు, మద్దిపాడు.

✓: సిబ్బందిని పంపి పై వంతెన కింద వాహనాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకుంటాం. – బి.శివరామయ్య, ఎస్సై, మద్దిపాడు పోలీస్ స్టేషన్

కొత్తపట్నం, న్యూస్‌టుడే:

?: మండలం కొత్తపట్నంలోని తుమ్మూకూరి పాలెం వీధిలో చెత్త వ్యర్థాలు పేరుకున్నా తరలించడంలేదు. వారానికి ఒకసారి కూడా చెత్త వాహనాలు రావడం లేదు. దీంతో ఇళ్లలోని వ్యర్థాలను రోడ్ల పక్కన పారబోయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ప్రతి రోజు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.
– దుర్గా ప్రసాద్, స్థానికుడు.

✓: ఆ ప్రాంతంలో చెత్త తొలగించేందుకు పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.
– సంపత్, పంచాయితీ కార్యదర్శి

## 1600 మందికి ఉచిత వైద్య పరీక్షలు

మందులు పంపిణీ చేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి తదితరులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: సినీహీరో బూచేపల్లి కమలాకర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని బూచేపల్లి ట్రస్టు, శంకర్‌నేత్రాలయ, జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 1600 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శిబిరాన్ని ప్రారంభించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మున్సిపల్ ఛైర్మన్ జి.రాజ్యలక్ష్మి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, వైకాపా నాయకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మద్దిపాడు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా ఖాజావలీ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా తెదేపా సీనియర్ నాయకులు మద్దిరాలపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాజావలీ నియమితులయ్యారు. ఆదివారం మద్దిరాలపాడులో తెదేపా సీనియర్ నాయకులు గుమ్మడి సాయిబాబా ఆధ్వర్యంలో వైస్ ఛైర్మన్ ఎన్నిక అభినందన సభ నిర్వహించారు. అనంతరం కేకు కత్తిరించి పంచి పెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణ అనురాధ, తెదేపా నాయకులు పెనుబోతు సునీల్, తాళ్లూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కేకు కత్తిరిస్తున్న ఖాజావలీ

### మార్కెట్ అధ్యక్షురాలికి సీపీఐ నేతల అభినందనలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: మద్దిపాడు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఇటీవల నియమితులైన మన్నం రాజేశ్వరి ప్రసాదరావు దంపతులను ఆదివారం సీపీఐ నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. సీపీఐ నాయకులు యు.ప్రకాశరావు, పి.శ్రీనివాసమూర్తి, షేక్ ఖాదర్‌వలీ, జి.హనుమంతరావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రవణా నక్షత్ర వేడుకలు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్థానిక శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్ర వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం దాతలు, దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు పరాంకుశం ప్రసాదాచార్యులు, అజయ్‌బాబులు శ్రీదేవి, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లపోతు సుబ్బరాయుడు, శైలజ దంపతులు రాళ్ల కిరీటాన్ని దేవాలయానికి అందజేశారు. మురళీకృష్ణ, రాధాకుమారి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు.

అలంకరణలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

## రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని స్థానిక దక్షిణ బైపాస్‌లోని ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ అధ్యక్షుడిగా రావిపాటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కొల్లూరి శ్రీనివాస్ చౌదరి, కోశాధికారిగా ఆర్ల శ్రీరామమూర్తితోపాటు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశంలో క్లబ్ ప్రతినిధులు అన్నె రత్న ప్రభాకర్, పి.శివన్నారాయణ, అంకమ్మ చౌదరి, రావి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మహాసభ విజయవంతానికి పిలుపు

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ఈ నెల 17న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగబోయే జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. సభ విజయవంతానికి పిలుపునిచ్చారు. స్థానిక అంజయ్యరోడ్డులోని బీసీ సామాజిక భవనం, ఆరామ క్షేత్రాల దగ్గర నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహారావు, జాతీయ ప్రధాన కార్యదర్శి కానుగుల విక్కీ నాగేశ్వరావు, బీసీ సంక్షేమ సాధన సమితి ప్రధాన కార్యదర్శి మద్దులూరి శ్రీనివాసులు మరికొంత మంది బీసీ నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

## చర్మ వ్యాధులపై అవగాహన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్, వినెరియాలజిస్ట్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక బొమ్మరిల్లు కేంద్రంలో ఉచిత చర్మవ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించాలనే సంకల్పంతో అన్ని మండల కేంద్రాల్లో ఏక కాలంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించినట్లు జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు పరీక్షలు చేసి ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. ప్రతిరోజూ స్నానం చేయాలన్నారు. జననేంద్రియాలకు వచ్చే చర్మవ్యాధులు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ బాలాజీనాయక్, జయ, శ్యాంసుందరి, వినయ్, చెంచయ్య, బొమ్మరిల్లు నిర్వాహకులు, ఖాశిం, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ విజయ్ కుమార్ రాజు

## ప్రభుత్వ పథకాలపై ప్రచారం

కొత్తపట్నం, న్యూస్‌టుడే: ఇంటింటికీ తెదేపా సుపరిపాలనలో భాగంగా.. కొత్తపట్నం మండలం ఈతముక్కల, మోటుమాల, పాదర్తి కొత్తపట్నం పలు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీపం 2, రేషన్ కార్డుల మంజూరు, పింఛన్ పెంపు, తల్లికి వందనం తదితర పథకాల గురించి వివరిస్తూ ఆదివారం ఒక రోజే 2400 కుటుంబాల పేర్లు నమోదు చేశారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 4000 రిజిస్ట్రేషన్‌లు చేశారు. సందడి వాతావరణంగా తొలి అడుగు కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టీవీ శ్రీరామమూర్తి, శశికాంత్ భూషణ్, కాకర్ల ఈశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

## పట్టించుకునేదెవరు.. పరిష్కరించేదెవరు?

◗ ఇన్‌ఛార్జిల పాలనతో పెరుగుతున్న ఇక్కట్లు

న్యూస్‌టుడే, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు:

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు అన్ని విధాలా యత్నిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా నడవడం ఆందోళన కలిగిస్తోంది. నియోజకవర్గంలో పలు శాఖలకు పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో సమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచడంలేదు. ఇన్‌ఛార్జిల పాలనతోనే సాగాల్సి వస్తోంది. దీంతో అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

విద్యుత్తు కార్యాలయం

**అయిదేళ్లుగా అదనపు బాధ్యతలు:** నియోజక వర్గంలో నాగులుప్పలపాడు, సంతనూతలపాడు మండలాల్లో పలు శాఖలు ఇన్‌ఛార్జి పాలనలోనే సాగుతున్నాయి. నాగులుప్పలపాడు మండలంలో కీలకమైన మండల అభివృద్ధి అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు, పీఆర్ ఏఈలు ఇన్‌ఛార్జిలతో నడుస్తున్నాయి. చీమకుర్తి మండల ఎంపీడీవో నాగులుప్పలపాడుకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తుండగా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మద్దిపాడు, పీఆర్ ఏఈ సంతనూతలపాడులు మండలానికి ఇన్‌ఛార్జి అధికారులుగా వ్యవహరిస్తున్నారు. అయిదేళ్ల నుంచి విద్యుత్తు జేఈఈనే ఏఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో అన్ని శాఖాధికారులు ఇన్‌ఛార్జిలతోనే సరిపెట్టడంతో క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రతరమవుతున్నాయి. ఏ అధికారి ఎప్పుడు అందుబాటులో ఉంటాడో కూడా అర్థం కాని పరిస్థితి.

### సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు మండలంలో విద్యుత్తు ఏఈ ఏళ్లుగా ఇన్‌ఛార్జి పాలనలోనే సాగుతోంది. గత వైకాపా ప్రభుత్వంలో ఒంగోలు ఏఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారిని పూర్తి స్థాయిలో కేటాయించిన దాఖలాలు లేవు. మండలంలో ప్రస్తుతం చాలా వరకు విద్యుత్తు పెద్ద సమస్యగా మారింది. అసలు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో కూడా తెలియడంలేదు. సమస్యను ఎవరికి చెప్పాలో తెలియక మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు గృహ నిర్మాణ శాఖ ఏఈని సైతం ఎనికపాడు సచివాలయ డిజిటల్ సహాయకులను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆ శాఖ తరపున ప్రభుత్వం పెద్ద ఎత్తున పాత ఇళ్లకు మ్యాపింగ్, నిర్మాణాలు చేస్తుండగా సచివాలయ సిబ్బందే చూసుకోవాల్సి వస్తోంది. ఆయా శాఖలతో పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆకట్టుకున్న భక్తిరస గానం

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీ త్యాగరాజ సేవా సమితి, ఒంగోలు వారి ఆధ్వర్యంలో అష్టమ మాస (8వ) లలిత సంగీత విభావరి కార్యక్రమము ఆదివారం మనోహరంగా జరిగింది. స్థానిక మంగమూరు రోడ్డులోని గాయత్రి మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా నేలబొట్ల సౌమ్యలత శిష్య బృందం ఆలపించిన భక్తిరస గీతాలు ఆకట్టుకున్నాయి. తబలా సహకారం కొత్తపల్లి శ్రీనివాస్ అందించారు.

గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

### అలరించిన సినీ సంగీత విభావరి

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: గాయని పి.పద్మ జన్మదినం సందర్భంగా ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి అలరించింది. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ విభావరిలో గాయకులు ఆలపించిన సినీ గేయాలు శ్రోతలను అలరించాయి. గాయకులు సూర్యం, నున్నా శ్రీనివాసరావు, రాజేష్, ఉష, వ్యాఖ్యాత గుర్రం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాటలు పాడుతున్న గాయకులు

(c) eenadu

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం జులై 14, 2025


## భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం

నగరంలోని మూలాపేట ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం కనులపండువగా జరిగింది. ముందుగా అమ్మవారిని, ధర్మరాజులను అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి అభిముఖంగా ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు ప్రవేశించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది తరలి రావడంతో సందడి నెలకొంది. అనంతరం ఉత్సవం నిర్వహించారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

## కోటకు సింహపురితో అనుబంధం

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: విలక్షణ నటుడు, ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు నెల్లూరుతో అనుబంధం ఉంది. ఇక్కడి భాజపా నాయకులు, కళాకారులతో పరిచయాలు ఉన్నాయి. ఆయన నటించిన ప్రతిఘటన సినిమాను నెల్లూరులో అప్పటి మాధవ్ థియేటర్‌లో వందరోజులపాటు ప్రదర్శించారు. నెల్లూరుకు చెందిన ఆనాటి నెర్జా కళా సంస్థ నిర్వహించిన ఉత్సవాలకు, ప్రతిఘటన చిత్రం విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు నెల్లూరుకు వచ్చారు. 2004లో ఎన్నికల్లో తెదేపా, భాజపా పొత్తులో భాగంగా నెల్లూరు రూరల్ భాజపా అభ్యర్థిగా ఎస్.సురేష్‌రెడ్డి పోటీ చేశారు. ఎన్నికల్లో భాజపా తరపున ప్రచారం చేశారు. కోట శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నెల్లూరుకు చెందిన భాజపా నాయకులు శ్యామ్, సురేంద్రరెడ్డి తదితరులతో పరిచయాలు ఉన్నాయి. పార్టీ విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లేవారు. ఆయనతో ఉన్న కళానుబంధంతో హాస్య నటుడు దోర్నాల హరిబాబు ఆధ్వర్యంలో కొందరు హైదరాబాద్ చేరుకుని నివాళి అర్పించారు. నెల్లూరుకు చెందిన నాటకరంగ దర్శకుడు అనంతరావు మాట్లాడుతూ మంచి నటుడిని కోల్పోయామని అన్నారు. నెల్లూరుకు చెందిన 25 కళాసంఘాల ప్రతినిధులు, పలు సంగీత, నృత్య, నాటక ప్రతినిధులు సంతాపం తెలిపారు.

## అన్నీ తెలుసు.. అయినా అలుసు!

**అనుమతులు లేకుండానే లేఅవుట్లు**
**చర్యలు తీసుకోవడంలో జాప్యం**

నెల్లూరు నగర శివారులో అక్రమ లేఅవుట్లు తొలగిస్తున్న అధికారులు (పాత చిత్రం)

| జిల్లాలో అక్రమ లేఅవుట్లు: 309 | నుడాకు నష్టం: దాదాపు రూ.12కోట్లు | నగర, పురపాలక సంఘాలకు..: రూ.30కోట్లు |
|---|---|---|

న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్), కావలి

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. స్థానిక నాయకులు కొందరు అధికారుల సహకారంతో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ప్లాట్లు వేస్తున్నారు. కొనుగోలు చేసిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే మార్కెట్ విలువకు తగ్గట్టు ప్రభుత్వానికి రుసుములు చెల్లించాలి. ఇవేమీ లేకుండానే క్రయవిక్రయాలు చేస్తున్నారు. జిల్లాలో ప్రత్యేక బృందాల ద్వారా 309 అక్రమ లేవుట్లను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు అందించారు. అయినా చర్యలు శూన్యం.

### నిబంధనలు పాటించకుండానే..

వ్యవసాయ భూమిని కమర్షియల్(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్)గా మార్చాలంటే కన్వర్షన్ ప్రక్రియ తప్పనిసరి. లేఅవుట్‌ల నిబంధనల ప్రకారం సుమారు పది శాతం రిజర్వ్ స్థలాన్ని ఖాళీగా ఉంచాలి. రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్తు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. అన్నింటినీ పరిశీలించిన తర్వాత నుడా నుంచి అనుమతి వస్తే ప్లాట్లు వేసుకుని విక్రయించవచ్చు. ఇవేమి లేకుండానే గత అయిదేళ్ల ఇష్టారాజ్యంగా లేఅవుట్లు వేసి విక్రయించారు. నుడా పరిధిలో వెలిసిన 309 అనధికార లేఅవుట్ల విస్తీర్ణం 1600 ఎకరాలు ఉంటుందని అధికారులు లెక్కతేల్చారు.

### నోటీసులు జారీ చేయాలని కోరినా..

నుడా అధికారులు నగర, పురపాలకసంఘాలతోపాటు డీపీవోకు లేఖలు రాసి.. అక్రమ లేఅవుట్లదారులకు నోటీసులు జారీ చేయాలని కోరారు. ఒక్క అడుగు ముందుకు పడలేదు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో వెలిసిన అక్రమ లేఅవుట్ల యజమానుల్లో ఎక్కువమంది అధికార పార్టీలో చేరిపోయారు. దాంతోవారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు భయపడుతున్నారు.

### విలువైన భూమిగా మారుస్తూ..

అనధికార లేఅవుట్లపై నుడా ఎప్పటికప్పుడు పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులకు నివేదికలు పంపించాలి. దీంతో పాటు అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వివరాలు ఇవ్వాలి. నోటీసులకు స్పందించని వారి లేఅవుట్లను ధ్వంసం చేయాలి. ఈ నిబంధనలన్నీ తుంగలో తొక్కారు. రూ.లక్షలతో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి ఆ భూమిని రూ.కోట్ల విలువజేసే భూమిగా మారుస్తున్నారు.

### 13 నెలలుగా జాప్యం

గత వైకాపా ప్రభుత్వంలో కావలిలో ప్రభుత్వ, పోరంబోకు, నీటి వనరులు ఆక్రమించారు. విచారణ చేపట్టి స్వాధీనం చేసుకోవాలని కూటమి ప్రభుత్వం రాగానే తెదేపా ఆధ్వర్యంలో రైతులు ఎడ్లబండ్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ తరువాత ఆర్డీవో విచారణ చేపట్టారు. ప్రాథమికంగా 128 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు కబ్జా జరిగినట్లు నిర్ధారించారు. వాటిని స్వాధీనం చేసుకోవడంలో 13 నెలలుగా జాప్యం జరుగుతోంది. నాడు వైకాపాలో చలామణి అయిన స్థిరాస్తి వ్యాపారులు ఎక్కువమంది ఆ పార్టీకి దూరమై అధికార పార్టీకి చేరువవుతుండటంతోనే చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.

### చర్యలు తీసుకుంటాం

అక్రమ లేఅవుట్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలని డీపీవో, నగర, పురపాలక సంఘాలకు లేఖలు రాశాం. వారు నోటీసులు జారీ చేసిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటాం. – పెంచలరెడ్డి, నుడా కార్యదర్శి

విజేతలతో ప్రత్యేక రెవెన్యూ కార్యదర్శి జయలక్ష్మి, కలెక్టర్ ఆనంద్ తదితరులు

## ముగిసిన రెవెన్యూ క్రీడలు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రెవెన్యూ క్రీడల ముగింపు ఉత్సవం ఆదివారం జరిగింది. రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్, ప్రత్యేక రెవెన్యూ కార్యదర్శి జి.జయలక్ష్మి, కలెక్టర్ ఆనంద్ హాజరయ్యారు. చివరి రోజు షటిల్, వాలీబాల్ క్రీడలు జరగ్గా.. జయలక్ష్మి ప్రారంభించారు. 35 ఏళ్ల లోపు మహిళల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో సాహిత్య, అనూష, శాంతిప్రియ వరుస స్థానాల్లో నిలిచారు. 200 మీటర్లలో సాహిత్య, హావీ, శాంతిప్రియ, షాట్‌పుట్‌లో శ్యామలత, అనూష, కావ్యశ్రీ, డిస్కస్‌త్రోలో సాయిశరణ్య, సుస్మితావదన, జావెలిన్‌త్రోలో శాంతిప్రియ, సాయిశరణ్య, సుస్మితావదన, లాంగ్‌జంప్‌లో సాయిశరణ్య, సాహిత్య, ఝాన్సీ, హైజంప్‌లో సాయిశరణ్య, శాంతిప్రియ, హావీలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. 400 మీటర్ల రిలే పరుగులో నెల్లూరు, కందుకూరు జట్లకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్‌సాహెబ్, ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాంప్‌ఫైర్‌లో నృత్యం చేస్తున్న కలెక్టర్

## ఇంటింటా ఇంతే!

**మున్సిపాలిటీ పైపులకు అక్రమ మోటార్లు**

న్యూస్‌టుడే, కావలి

మున్సిపల్ పైపులైన్లకు, కుళాయి కనెక్షన్లకు మోటార్లు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధం. గ్రావిటీ ద్వారా వచ్చే నీటిని మాత్రమే వినియోగించాలి. జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు. ముందుండే ఇళ్ల వారు ఇలా అక్రమంగా మోటార్ల ద్వారా వినియోగిస్తే, పైపులైన్‌కు ఆ తరువాత నివాసాల్లోని వారికి సమస్యలు తప్పడం లేదు. అంతేకాదు ఎక్కువ పవర్ ఉన్న మోటార్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరే వ్యక్తిగతంగా కుళాయి కనెక్షన్లు తీసుకుంటూ పురపాలకానికి ఛార్జీలు చెల్లిస్తున్నారు. ఎక్కువమంది అనధికారికంగా పొందుతూ మోటార్లు సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక హోటళ్లు, ఇతర వ్యాపారపరమైన అవసరాలకు పురపాలక పైపులైన్లకు మోటార్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకోవడం యథేచ్ఛగా సాగుతోంది. కొందరైతే ఏకంగా ప్రధాన పైపులైన్ల నుంచే మోటార్ల ద్వారా నీటిని పొందుతున్నారు. మున్సిపాలిటీల్లో ఉండే ఇంజినీరింగ్ విభాగాలకు, వార్డు సచివాలయాల్లో ఉండే సిబ్బంది అక్రమాలన్నీ తెలిసినా మిన్నకుండిపోతున్నారు. అధికారులు స్పందించి అక్రమ నీటి వినియోగాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం

కావలి పురపాలక కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ స్పందిస్తూ అక్రమ కనెక్షన్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారిక కనెక్షన్లకు మోటార్ల ఏర్పాటు తగదన్నారు. పురపాలకమే సమృద్ధిగా నీటిని అందించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

● నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో సుమారుగా 65వేల ఇళ్ల కుళాయి కనెక్షన్లకు మోటార్లు ఏర్పాటు చేశారు. చాలా మంది నివాసాలకు వాడుక నీటికి బోర్లు వినియోగించకుండా కుళాయిల ద్వారా వచ్చే నీటినే సమకూర్చుకుంటున్నారు. ఇళ్లకు భూగర్భంలో గుంతలు తవ్వించకుండా, అక్రమంగా మోటార్లు ఏర్పాటు చేస్తూ మిద్దెలపై ట్యాంకుల్లో నింపుతున్నారు.

అల్లూరు నగర పంచాయతీ పరిధిలో సుమారుగా నాలుగు వేలకు పైగానే ఇళ్లలో మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామ పంచాయతీ నుంచి పురపాలకశాఖలోకి వచ్చి నాలుగేళ్లు నిండినా.. ఇప్పటికీ నీటి సరఫరా వ్యవస్థ గాడిలో పడలేదు. జనం కుళాయి ఛార్జీలు చెల్లిస్తున్న దాఖలాలు లేవు. నగర పంచాయతీలో ఉన్న నార్తు మోపూరు, సింగపేటలో వంటి ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి.

కావలి పట్టణంలో మున్సిపల్ పైపులైన్ కనెక్షన్‌కు ఏర్పాటు చేసిన మోటారు ఇది. చట్టవిరుద్ధమే అయినా వివిధ ప్రాంతాల్లో ఇలాగే ఏర్పాటు చేసి నీటిని వినియోగిస్తున్నారు. ఫలితంగా చివరి ఇళ్లకు నీరు అందని పరిస్థితి. పట్టణంలో ఏడు వేల మోటార్లు ఉపయోగించి నీటిని వాడుతున్నట్లు సమాచారం.

## విద్యార్థుల సామర్థ్యాలు బాగు

**ఫలితాల్లో వెలుగులోకి**

న్యూస్‌టుడే, అనంతసాగరం

అభ్యసన సామర్థ్యాల సాధనలో సగటున జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెరుగ్గా ఉన్నా. జాతీయ స్థాయిలో కొన్నింటిలో వెనుకబడి ఉంది. ప్రతి విద్యార్థి చదువుతున్న తరగతికి సంబంధించి కనీస సామర్థ్యాలు తప్పనిసరి. వారిలో అభ్యసన సామర్థ్యాలు పరిశీలించేందుకు గతేడాది డిసెంబర్‌లో జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్షలు నిర్వహించారు. ఫలితాలను జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ -2024 పేరుతో ఇటీవల విడుదల చేసింది. ఫలితాలపై కలెక్టర్, డీఈవో, ఉప, మండల విద్యాశాఖ అధికారులతో చర్చించారు. ప్రతి సబ్జెక్టులో జిల్లా సగటు రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉండటం విశేషం.

**తరగతుల వారీగా సగటు స్కోరు (శాతాల్లో..)**

| తరగతి | సబ్జెక్టు | జాతీయ | రాష్ట్రం | జిల్లా |
|---|---|---|---|---|
| 3 | భాష | 64 | 64 | 66 |
| | గణితం | 60 | 61 | 62 |
| 6 | భాష | 57 | 48 | 51 |
| | గణితం | 46 | 41 | 43 |
| | సైన్సు | 49 | 40 | 42 |
| 9 | భాష | 54 | 50 | 55 |
| | గణితం | 37 | 35 | 38 |
| | సైన్సు | 40 | 36 | 39 |
| | సోషల్ | 40 | 37 | 38 |

### సర్వే ముఖ్యాంశాలు

మూడో తరగతిలో భాష, గణితంలో బాలుర కంటే బాలికలు మెరుగైన అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉన్నారు. ఆరో తరగతిలో భాషలో బాలికలు, గణితం, పరిసరాల విజ్ఞానంలో బాలురు ముందంజలో ఉన్నట్లు తేలింది. తొమ్మిదో తరగతిలో భాష, సాంఘిక శాస్త్రంలో బాలికలు మెరుగ్గా ఉండగా.. గణితం, సైన్స్‌లో సమాన సామర్థ్యాలు కలిగి ఉన్నారు. 3, 6 తరగతుల్లో పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులు భాష, గణితంలో మెరుగైన సామర్థ్యాలు కలిగి ఉన్నట్లు తేలింది. తొమ్మిదో తరగతిలో మాత్రం అన్ని విషయాలలో గ్రామీణ ప్రాంత విద్యార్థుల కంటే పట్టణ ప్రాంతం వారు ముందు వరుసలో ఉన్నారు.

### వీటిపై మరింత దృష్టి పెట్టాలి..

తెలుగులో చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలపై పట్టు సాధించేలా చూడాలి. గణితంలో కృత్యాధార బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. మోడల్ ప్రైమరీ పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నందున అక్కడి విద్యార్థుల సామర్థ్యాలపై ఎంఈవోలు దృష్టి సారించాలి. వచ్చే ఏడాది ఈ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగేటట్లు చూడాల్సిన అవసరం ఉందని పలువురు విద్యావేత్తలు అంటున్నారు.

| జిల్లా సర్వే వివరాలు | పాఠశాలలు - 108 | ఉపాధ్యాయులు - 379 మంది | విద్యార్థులు - 2,927 మంది |
|---|---|---|---|

## కేసులతోనే సరి..!

**ఆగని చోరీలు**

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

ఒకవైపు చోరీలు, దోపిడీలు.. మరోవైపు పోలీస్ శాఖపై ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆ శాఖలో చర్చనీయాంశమైంది. నగరంలో యువకులు కత్తులతో స్వైర విహారం చేస్తున్నారు. మద్యానికి, చెడు వ్యసనాలకు అలవాటు పడి బెదిరించి దోపిడీ చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి సంస్కృతి పెరిగింది. పట్టపగలే రోడ్డుపై వెళ్తున్న వారిని అటకాయించి దోచుకుంటున్నారు. నగదు లేదని చెప్పినా ఫోన్ పేతో వేయించుకుంటున్నారు. వీరంతా పాత నేరస్థులు కావడం గమనార్హం. గతంలో వీరిపై కేసులు ఉన్నాయి. అయినా దోచుకునేందుకు వెనుకాడటం లేదు. నగరంలోని చిన్నబజారు, నవాబుపేట, సంతపేట, దర్గామిట్ట, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీసు స్టేషన్లలో ఇలాంటి కేసులు నమోదుకావడం ఆందోళన కలిగిస్తోంది.

### ఏదీ విచారణ?

సాధారణంగా పోలీసు శాఖలో ఆరోపణ వచ్చిన వెంటనే స్పెషల్ బ్రాంచ్ అధికారులు విచారణ నిర్వహించాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఏమి జరిగింది? ఎలా జరిగింది? వాస్తవమా కాదా? అనేది తేల్చాలి. అనంతరం సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలి. విచారించాల్సిన అధికారులే మౌనంగా ఉండటంపై పోలీసు శాఖలోని కిందిస్థాయి సిబ్బంది చర్చించుకుంటున్నారు.

### నిఘా పెంచాం

జిల్లా వ్యాప్తంగా రాత్రుల్లో నిఘా పెంచాం. దొంగతనాలు తగ్గుముఖం పట్టాయి. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులు రోడ్లపై ఉండాలని ఆదేశించాం. ఇటీవల నిందితులను పట్టుకున్నాం. చెడు వ్యసనాలకు బానిసై కత్తులతో స్వైర విహారానికి పాల్పడుతున్నారు. వారిపై కూడా నిఘా పెట్టాం. మిగిలిన విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ సౌజన్య, జిల్లా అదనపు ఎస్పీ

✦ తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు జరుగుతున్నాయి. జిల్లా, నగరంలోని పోలీసు స్టేషన్ల పరిధిలో ఇవి చోటుచేసుకుంటున్నాయి. పోలీస్ శాఖ వీటిని పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతోందనే విమర్శలున్నాయి.

✦ జిల్లాలో కొత్త తరహా దొంగతనాలు జరుగుతున్నాయి. దొంగలు కత్తులతో బెదిరించగా.. నగదు లేదని బాధితులు చెప్పినా ఫోన్ పే ద్వారా వేయించుకున్న సంఘటనలు ఇటీవల మూడుచోట్ల జరిగాయి.

✦ స్టేషన్ బెయిల్ కోసం నగదు డిమాండ్ చేసినా, సివిల్ పంచాయితీలు చేసినా ఎలాంటి చర్యలు లేకపోవడం పోలీసుశాఖలో చర్చనీయాంశమైంది.

## నియంత్రణ కొరవడి.. సాగునీరు వృథా

**పురాతన రెగ్యులేటర్లతో సరిపెడుతున్న అధికారులు**

కనిగిరి జలాశయం షట్టరు నుంచి వృథాగా పోతున్న నీరు

న్యూస్‌టుడే, సంగం : జలాశయాల్లో నీటి నియంత్రణకు రెగ్యులేటర్లు కీలకం. అవి పురాతనమైనవి కావడంతో అయిదు లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. 1862-63లో పెన్నానదిపై నెల్లూరు ఆనకట్టని నిర్మించారు. దానికి అనుబంధంగా జాఫర్ సాహెబ్, కృష్ణపట్నం కాలువలు, వాటికి పలు ఉప కాలువలున్నాయి. 1882-85లో నదిపై సంగం వద్ద ఉత్తరంవైపు ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు ఆనకట్ట నిర్మించారు. దానికి అనుబంధంగా ఆరు టీఎంసీల సామర్థ్యం కలిగిన కనిగిరి జలాశయం ఏర్పాటు చేశారు. సంగం ఆనకట్ట నుంచి కనిగిరి జలాశయం ప్రధానకాలువ, దువ్వూరు, నెల్లూరు చెరువు కాలువలు.. కనిగిరి జలాశయం నుంచి ఈస్ట్రన్, సదరన్, పైడేరు కాలువల నిర్మాణం జరిగింది. అనంతర కాలంలో 1960లో కనుపూరు, 1980లో బెజవాడపాపిరెడ్డి కాలువల నిర్మాణం చేపట్టారు.

### బ్యారేజీల నిర్మాణం జరిగినా..

సంగం, నెల్లూరు ఆనకట్టల స్థానంలో బ్యారేజీల నిర్మాణం జరిగింది. 2022 నుంచి అందుబాటులోకి రావడంతో అక్కడ నూతన రెగ్యులేటర్లు ఏర్పడ్డాయి. మిగిలిన కాలువలు, ఉప కాలువల స్థానంలో రెగ్యులేటర్లు పురాతనమైనవే ఉన్నాయి. దాంతో నీరు లీకేజీ అవుతోంది. సంగం బ్యారేజీ నుంచి అయిదువేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన కనిగిరి జలాశయం ప్రధానకాలువలో 1882-85 మధ్య గాంధీజనసంఘం వద్ద నిర్మించిన రెగ్యులేటర్ దెబ్బతినింది. రెండేళ్లక్రితం ఉనికిని కోల్పోయే పరిస్థితి రావడంతో 'ఈనాడు'లో వచ్చిన వరుస కథనాలతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. అక్కడ 14 షట్టర్లుండగా వాటిలో అయిదు నియంత్రణ కోల్పోవడంతో వాటి ద్వారా నీరు వెళుతోంది. 1980లో సంగం సమీపంలో బెజవాడపాపిరెడ్డి కాలువకు నీటిని తరలించేందుకు నిర్మించిన క్రాస్‌రెగ్యులేటరులోని అయిదు షట్టర్లలో మూడు నియంత్రణ కోల్పోవడంతో సాగునీటి సరఫరాకు ఆటంకం కలుగుతోంది.

### రేడియల్ గేట్ల నుంచి..

ఆరు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన కనిగిరి జలాశయంలో అయిదు రేడియల్ గేట్లున్నాయి. అందులో నీటి నిల్వ ఎక్కువైతే వాటిని తెరుస్తారు. 12వేల క్యూసెక్కులను వెలుపలకు తరలించే ఈ గేట్లతో ఎప్పుడో ఒకసారి అవసరం ఉంటుంది. నిరంతరం వాటి నుంచి నీరు వృథాగా పోతోంది. పెన్నాడెల్టాలో ప్రధాన కాలువలు, ఉపకాలువల పరిధిలో వందలాది రెగ్యులేటర్లున్నాయి. అవన్నీ 125 ఏళ్ల క్రితమే నిర్మించినందున శిథిలావస్థకు చేరాయి. వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా సాగునీటి సరఫరాలో నియంత్రణ సక్రమంగా లేదు. రెగ్యులేటర్ల పరిరక్షణకు జలవనరుల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

● సమస్యపై బుచ్చిరెడ్డిపాళెం డీఈ పెంచలయ్య మాట్లాడుతూ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

## నీటి వనరు.. ఆక్రమణలు కనరు

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం : ప్రభుత్వాలు.. ప్రజాప్రతినిధులు, అధికారులు మారుతున్నారు. పట్టణంలో ఆక్రమణలు తొలగించే సాహసం చేయడం లేదు. రూ.లక్షల విలువజేసే స్థలాలను కొంచెం కష్టపడి ఆక్రమించుకుంటే చాలు.. భవిష్యత్తులో వాటి జోలికెళ్లే వారు ఉండరు. ఇక మీదట ఆక్రమణలు జరగకుండా చూడాలని ప్రజా ప్రతినిధులు అధికారులను ఆదేశిస్తున్నారేగానీ.. అప్పటివరకు జరిగిన వాటిని తొలగించే ఆలోచన చేయడం లేదు.

ఆక్రమణలతో గుండంకట్ట

### కుచించుకుపోతున్న కుంటలు

పట్టణంలో భూగర్భ జలాల వృద్ధికి పూర్వీకులు ఏర్పాటుచేసిన కుంటలు ఆక్రమణలతో కుచించుకుపోతున్నాయి. కొందరు ఆక్రమించి కట్టడాలు చేపడుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారు. అంకుల్ కుంట కనుమరుగుకాగా.. ముత్యాలకుంట, గుండంకట్ట, కోమటికుంటలు ఆక్రమణలతో కుచించుకుపోయాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న గుండంకట్ట 25 ఎకరాలు ఉండాలి. ఇప్పటికే పది ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు తేలింది. మున్సిపల్ మంత్రిగా పనిచేసిన మహీధర్‌రెడ్డి ఆక్రమణల తొలగింపు విషయం పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కుంట మరింత ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇటీవల గుండంకట్టను పరిశీలించారు. ఇక మీదట ఆక్రమణలు జరగకుండా అడ్డుకట్ట వేయాలని, ఉన్న కుంట రక్షణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అంతవరకు బాగానే ఉన్నా.. గతంలో భారీగా ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల విషయాన్ని పక్కనపెట్టడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. అధికారులు స్పందించి నీటి వనరుల ఆక్రమణలు అడ్డుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● ఆక్రమణలు అడ్డుకుంటామని, కుంటల అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

## అంకమ్మ తల్లి గ్రామోత్సవం

స్థానిక తూర్పువీధిలో వెలసిన అంకమ్మ తల్లి తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి ప్రత్యేక పుష్పాలంకరణతో చేసిన ట్రాక్టర్‌లో అమ్మవారిని కొలువుదీర్చి గ్రామోత్సవం చేశారు. రజక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, మనుబోలు**

## కోడూరు తీరం.. పర్యాటకులకు ఆహ్లాదం

కొత్తకోడూరు సముద్ర తీరంలో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది.. నెల్లూరులోని బారా షహీద్ దర్గాకు వచ్చిన భక్తులు ప్రత్యేక వాహనాల్లో వచ్చి కుటుంబ సభ్యులతో గడిపారు. పర్యాటక శాఖ అధికారులు తగిన వసతులు సమకూర్చాలని పలువురు కోరుతున్నారు. తీరానికి వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు**

## పండు.. రక్షణ మెండు

మండలంలోని ఒగూరు రైతులు మామిడి కాయలకు పురుగు ఆశించకుండా రసాయనిక ఫ్రూట్ కవర్లను పిందెదశలోనే ఏర్పాటు చేశారు. దీని వల్ల కాయ బాగా వృద్ధి చెందుతుందని ఈ తరహా విధానంలో పండిన కాయలకు డిమాండ్ ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కిలో రూ.100 వరకు రహదారి పక్కనే పెట్టి అమ్మకాలు చేస్తున్నామని చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం**

## దర్గా ఆవరణలో భక్తుల సందడి

నెల్లూరు బారాషహీద్ రొట్టెల పండగ ముగిసినా.. ఆదివారం దర్గా ఆవరణ భక్తులతో కిటకిటలాడింది. మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తూనే ఉన్నారు. జిల్లా నలుమూలల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. దుకాణాలు, ఆట పరికరాల వద్ద పెద్దసంఖ్యలో చేరి సరదాగా గడుపుతున్నారు. **- న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)**

## ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

### 907 మంది విద్యార్థుల ఎంపిక

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఇందులో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, వికలాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80.. మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్కే వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తరగతులు 14 నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులు తమ లగేజీతో వచ్చి రిపోర్ట్ చేసి తరగతులకు హాజరయ్యేలా సిద్ధపడి రావాలన్నారు.

▼ మొదటి దశ తరువాత మిగిలిన ఖాళీలను దృష్టిలో ఉంచుకుని అంతర్గత బదిలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా 384 మందికి లబ్ధి కలిగినట్లు వివరించారు. ఇప్పటి వరకు 4,340 మంది విద్యార్థుల ఎంపిక పూర్తి అయిందని తెలిపారు. ఇంకా 60 సీట్లు మిగిలి ఉండగా ఇందులో ఎన్‌సీసీ కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఈ సీట్ల ఎంపిక ఫలితాలను వచ్చే వారం విడుదల చేస్తామని రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు.

## ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు

**ఆత్మకూరు :** ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చారని, అయిదు కోర్సుల్లో 300 మంది విద్యార్థులను మొదటి ఏడాది ప్రవేశాలు కల్పించనున్నారు. ఆత్మకూరులో భవనాలు నిర్మించేంత వరకు ఆత్మకూరులోని వీఆర్‌పీవీఎస్ కళాశాల భవనాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు

**బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే:** గంజాయి ఉందని స్థానికుల సమాచారంతో పోలీసులు ఒకరిని పట్టుకున్నారు. ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి వివరాల మేరకు..నెల్లూరు గ్రామీణ మండలానికి చెందిన మస్తాన్‌ను జొన్నవాడ పెన్నా వంతెన వద్ద అదుపులోకి తీసుకుని 1.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

# సమస్యలు తీరితే ఉద్యాన పంటలు వరమే

**న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)**

ఉద్యాన పంట

భారతదేశంలో విదేశీ మారక ద్రవ్యం రాబట్టడంలో మత్స్యశాఖ ప్రథమ స్థానంలో ఉండగా.. ఉద్యాన శాఖ స్థూల విలువ జోడింపు (జీవీఏ) రెండో స్థానంలో ఉంది. ఉద్యాన పంటలకు ఇంతటి ప్రాధాన్యం ఉండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారించి.. సాగు విస్తీర్ణం రెట్టింపునకు ప్రణాళికలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు. 50 వేల ఎకరాలున్నచోట లక్ష ఎకరాలు సాగు చేపట్టాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలు అందాయి. ప్రస్తుతం సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్న ఉద్యాన శాఖలో అధికారులు, ఉద్యోగుల కొరత వెంటాడుతోంది.

### 80 వేల ఎకరాల్లో..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మామిడి, నిమ్మ, బత్తాయి, సపోటా, కూరగాయల పంటల విస్తీర్ణం ఐదు సంవత్సరాల క్రితం 70 వేల ఎకరాల్లో ఉండగా.. ప్రస్తుతం 80 వేల ఎకరాలకు పెరిగింది. సాగు రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో 46 మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉద్యాన శాఖ అధికారులు 13 మందే ఉన్నారు. ఒక ఉద్యానాధికారి మూడు నుంచి నాలుగు మండలాల బాధ్యతలు నిర్వహించాలి. రైతులకు పంటలపై సూచనలు, సలహాలు, ప్రభుత్వం నుంచి వస్తున్న రాయితీ పథకాలు వివరాలు అన్నదాతలకు చేరవేయలేని స్థితిలో ఉన్నారు. దీనికి తోడు ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యాన పంటల సాగు రెట్టింపు చేయాలని లక్ష్యం పెట్టింది. అధికారులు ఏం చేయాలో తోచక మథన పడుతున్నారు. సాగు విస్తీర్ణం పెరిగి ప్రభుత్వానికి స్థూల విలువ జోడింపు అధికంగా రావాలంటే.. వ్యవసాయశాఖలో ప్రతి మండలానికి వ్యవసాయాధికారి ఉన్నట్లుగానే.. ప్రతి మండలానికి ఉద్యాన శాఖలో కూడా ఉద్యానాధికారిని నియమిస్తే ప్రభుత్వం నుంచి వస్తున్న రాయితీ పథకాలు ప్రతి రైతుకు చేరడమే కాదు.. పంటల పురోగతి కూడా పెరిగే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుందని వ్యవసాయ రంగ నిపుణులు, ఉద్యాన పంటలపై అనుభవం ఉన్న రైతులు అంటున్నారు.

### మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే..

సాగు విస్తీర్ణం పెంచినప్పుడు ఉద్యాన పంటలైన మామిడి, నిమ్మ, జామ, సపోటా తదితర పంటల ఉత్పత్తులు కూడా పెరుగుతాయి. ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. లేదంటే పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకోలేక ఇబ్బంది పడే పరిస్థితులు ఉన్నాయి. అలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం ముందుగానే మార్కెటింగ్ సదుపాయం, ఎగుమతుల కల్పన, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మరిన్ని నెలకొల్పేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రాష్ట్రానికి 5 స్వచ్ఛ అవార్డులు రావడం సంతోషం

**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం అయిదు స్వచ్ఛ అవార్డులను రాష్ట్రానికి ప్రకటించడం సంతోషంగా ఉందని రాష్ట్ర పట్టణ, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటై 25 సంవత్సరాలైన సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం పార్కులో జరిగాయి. ఇందుకు గుర్తుగా 25 మొక్కలు నాటారు. పార్కు ఏర్పాటుకు కృషి చేసిన జేఎస్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సంవత్సరం రాష్ట్రానికి మరిన్ని అవార్డులు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. శుభ్రతలో నెల్లూరును ఆదర్శంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ అనురాధ, తెదేపా నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, నగర తెదేపా అధ్యక్షుడు మధు, కార్పొరేటర్లు శ్రీకాంత్‌రెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, పెద పెంచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న మంత్రి నారాయణ

### గురువులకు సత్కారం

**నెల్లూరు (విద్య):** నగరంలోని వీఆర్ హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం జరగ్గా.. నాడు పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. నరసింహారెడ్డి, చంద్రశేఖర్ అనే ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులతో కలసి మంత్రి నారాయణ సత్కరించారు.

## పోలీసుల విచారణపై ఆందోళన

**ఉదయగిరి, న్యూస్‌టుడే:** పట్టణంలోని శ్రీనగర్ కాలనీ అల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన షేక్ మహమ్మద్ హమీద్ హత్య కేసుకు సంబంధించి పోలీసుల విచారణ తీరుపై బీసీ కాలనీ వాసులు ఆదివారం రాత్రి బస్టాండ్ కూడలిలో ఆందోళన చేశారు. ఫంక్షన్ హాల్‌లో జరిగిన హత్య ఘటనను కాలనీకి చెందిన ఓ యువకుడు చిత్రీకరించారు. అప్పటి నుంచి పోలీసులు అతను ఎక్కడున్నాడంటూ కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు. ఆదివారం యువకుడి తండ్రిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. హత్య చేసిన వారిని పట్టుకోకుండా చిత్రీకరించిన యువకుడి కుటుంబసభ్యులను విచారించడం ఏమిటని బంధువులు, కాలనీవాసులు ఆందోళనకు దిగారు. ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, శ్రీను సిబ్బందితో కలిసి బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమించారు.

మహిళలకు సర్దిచెబుతున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి

## నగదు దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

**నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే:** నగదు దోపిడీ కేసులో నిందితులను వేదాయపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం పోలీసు స్టేషన్‌లో స్థానిక ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఈ కేసు వివరాలను వెల్లడించారు. నెల్లూరు గ్రామీణ మండలంలోని చంద్రబాబునగర్‌కు చెందిన విజయ్ అలియాస్ పుండా, జి.సుధీర్, షేక్ సిరాజ్, పోలీసు కాలనీ ప్రాంతానికి చెందిన పి.అనిల్, ఓ ప్రైవేటు స్కూలు సమీపంలో నివాసం ఉంటున్న బి.సాయికుమార్ వ్యసనాలకు బానిసలయ్యారు. వీటికోసం దోపిడీలకు తెరలేపారు. వీరు ఈ నెల 11వ తేదీ సాయంత్రం తల్పగిరి కాలనీ సమీపంలో ఎస్.నాగేంద్రను కత్తులతో చంపుతామని బెదిరించి అతని ఫోన్‌పే నుంచి రూ.5 వేల నగదును తమ ఫోన్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఈ విషయాన్ని బయటకు చెబితే చంపేస్తామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం చంద్రబాబునగర్ సమీపంలోని ఖాళీ ప్లాట్లలో నిందితులను అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమావేశంలో ఎస్సై జి.నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కందిపప్పునకు ఎదురుచూపులే!

**జిల్లాలో ఇలా..**

| | |
|---|---|
| మండలాలు | 38 |
| చౌక ధరల దుకాణాలు | 1513 |
| రేషన్‌కార్డులు | 7,21,524 |

**నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే:** పేద ప్రజలకు చౌకదుకాణాల ద్వారా అందించే నిత్యావసర సరకులు పూర్తిస్థాయిలో అందకపోవడంతో వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినా కందిపప్పు ఇవ్వకపోవడంతో నిరాశ చెందుతున్నారు. జూన్ నెల నుంచి ఇస్తారని లబ్ధిదారులు ఆశించినా చౌకదుకాణాలకు సరఫరా కాలేదు.

❖ జిల్లాలో ప్రస్తుత నెలలో రేషన్ దుకాణాలకు 10,953 టన్నుల బియ్యం, 380 టన్నుల పంచదార సరఫరా చేస్తున్నారు. ప్రతినెలా 721 టన్నుల కందిపప్పు అవసరమవుతుంది. గత సర్కారు తీరుతో టెండర్లు వేసేందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో కందిపప్పు సరిగా అందలేదు. కందిపప్పు పంపిణీదారులకు భారీ మొత్తంలో సొమ్ము బకాయి పెట్టి ఇబ్బందులకు గురిచేసింది. అరకొరగా పంచదార, కందిపప్పు ఇచ్చినా దుకాణాల్లో మోసం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటిని గుర్తించి సరఫరా నిలిపేసింది. జూన్‌లో ఇంటింటికీ రేషన్ నిలిపివేసి పాత విధానాన్ని ప్రారంభించింది. అన్ని సరకులు ఇస్తారని ఆశించారు. కందిపప్పు ఇవ్వకపోవడంతో పేదల ఆశలు నెరవేరలేదు. బయట మార్కెట్‌లో కిలో రూ.120 నుంచి రూ.150 వరకు ఉంది. దీంతో నిరుపేదలపై ఆర్థిక భారం పడుతోంది.

## ప్రమాణాలు తప్పనిసరి

**నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే:** ఎట్టకేలకు నగరపాలకసంస్థ ఆరోగ్య విభాగం అధికారులు ఆదివారం తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకొన్నారు. ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ హోటల్‌ను తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్సు, ఎన్‌వోసీ సర్టిఫికెట్లను పరిశీలించారు. వంటశాలలో నిర్వహణ తీరును పరిశీలించి నిర్వాహకులను వివరణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో నిర్దేశించిన ప్రజారోగ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య

## జనావాసాల్లోకి కణితి

అడవిలో వదిలేందుకు కణితిని వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

**ఉదయగిరి, న్యూస్‌టుడే:** పట్టణంలోని దేవలాలగడ్డ వీధిలోని ఓ ఇంటి ఆవరణలో సమీప అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం ఆదివారం కణితి వచ్చి చిక్కుకుంది. స్థానికులు అటవీశాఖాధికారులకు సమాచారమందించారు. ఎఫ్‌బీవోలు వెంకటేశ్వర్లు, లక్ష్మీప్రసన్న, ప్రసాద్ అక్కడి చేరుకుని దాన్ని పట్టుకున్నారు. అనంతరం దుర్గంపల్లి రిజర్వు ఫారెస్టులో వదిలారు. తాగునీటి కోసం జనావాసాల్లోకి వచ్చి ఇటీవల చుక్కల దుప్పిలు చాలా మృతిచెందాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని అటవీప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించి వన్యప్రాణులు మృతిచెందకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

WWW.RXWALA.COM మా సంస్థ నందు పనిచేయుటకు ఫార్మాశిస్టులు, RMP నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు కావలెను. Cell: 6300923212.

FOR SALE

అమ్మకము - గానుగ చెక్క, వేరుశనగ, పొద్దుతిరుగుడు మరియు నువ్వుల చెక్క అలాగే పాత వస్తువులు, ఖాళీ అట్ట బాక్సులు, ప్లాస్టిక్ బాటిల్స్, ఆయిల్ డబ్బాలు, పాత అల్యూమినియం, ఇనుము అమ్మకానికి కలవు. Cont: నెల్లూరు Ph: 7997991863, 8019977269

FACULTY/ TEACHERS

Wanted Teachers P.V.E.M. హైస్కూల్, అల్లూరు. అర్హత: M.Sc., / M.A., / B.Ed., / H.P.T., / T.T.C., లలో శిక్షణ పొంది అనుభవజ్ఞులై ఉండాలి. Contact: 94415 24851

EDUCATION

LAST CHANCE: 10th, Inter, Direct Degree (Disc.) BA, B.Com., B.Sc., BBA, BCA, B.Tech, Diploma, MA, M.Com., MBA, MCA. Regular/ Lateral Entry. ✆ 93812 87629.

TOURS AND TRAVELS

వేదవిద్య పరిషత్ వారిచే కార్తీక పౌర్ణమి & ప్రతినెల కాశీయాత్ర. VIP దర్శన్ టిక్కెట్ ఉచితం. (గుడి నిబంధనలు లోబడి) వసతి, భోజనం, నగర దర్శనం + ప్రయాగ యాత్ర, వైదిక సేవలు. ✆ 9394142516.

REAL ESTATE

HOUSE FOR SALE

అల్లూరు మండలం, బట్రకాగొల్లు బస్టాండ్ పక్కన 20 అంకణముల ఇల్లు + షాపు, డబుల్ బెడ్ రూమ్ గల ఇల్లు అమ్మబడును. కేశవ ప్రొవిజన్స్, అల్లూరు. సంప్ర|| ✆ 98494 15760

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు.. నెల్లూరు 80080 01790

TO LET

COMMERCIAL

Commercial Showroom for rent 1st, 2nd & 3rd floors (4500 sft), Underground Parking, Lift Available, Opp: MGB Mall, Nellore. ✆ 98498 02947

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

JOBS

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

హోమ్‌కేర్ & పర్సనల్ కేర్ ప్రొడక్టును ఎగ్జిక్యూటివ్స్ / సేల్స్ టీమ్ ద్వారా మార్కెటింగ్ చేయుటకు స్త్రీ / పురుషులు, టీమ్ లీడర్లు కావలెను. భవిష్యత్ గొప్పగా ఉండాలనే కోరుకునే వారు మాత్రమే ✆ 79890 48868

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

## 108 సిబ్బంది చొరవ... సీపీఆర్‌తో నిలిచిన ప్రాణం

**ముత్తుకూరు, న్యూస్‌టుడే:** చలనం లేకుండా పుట్టిన శిశువుకు వాహన సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణం నిలిపిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... తోటపల్లిగూడూరు మండలం విలుకానిపల్లె గిరిజన కాలనీకి చెందిన మేకల జానకికి పురిటి నొప్పులు రావడంతో ఉదయం 5.30 గంటలకు 108కు సమాచారమిచ్చారు. ఈఎంటీ సురేశ్, పైలట్ గిరీశ్‌లు వాహనంలో ఎక్కించుకొని కొంతదూరం వెళ్లగానే నొప్పులు తీవ్రమయ్యాయి. సిబ్బంది కాన్పు చేశారు. 20 నిమిషాల వ్యవధిలో కవలలు(మగపిల్లలు) పుట్టారు. మొదట జన్మించిన శిశువు బాగున్నా... రెండో శిశువు చలనం లేకుండా ఉండిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈఎంటీ వెంటనే సీపీఆర్ చేశారు. కొంత సేపటికి సాధారణ స్థితికి వచ్చారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉండటంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం తల్లి, పిల్లలను నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సిబ్బందిని స్థానికులు అభినందించారు.

శిశువులతో కుటుంబ సభ్యులు

## కామాక్షితాయికి విశేషపూజలు

**బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పూజలో పాల్గొన్న భక్తులు

# బంగారు కుటుంబం.. పేదల ఆర్థికాభివృద్ధికి శ్రీకారం

**న్యూస్‌టుడే, సంగం, ముత్తుకూరు**

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా కూటమి సర్కారు తలపెట్టిన పీ4 పథకం ప్రగతి పథంలో పయనిస్తోంది.. సేవా మనస్తత్వం ఉన్న సంపన్న కుటుంబాలు సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలను దత్తత తీసుకొని వారికి అండగా నిలవడమే దీని ప్రధాన లక్ష్యం.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదరికమే ప్రధాన సమస్యగా ఉందని దాన్ని సమూలంగా రూపుమాపాలని నిర్ణయించారు.

సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

| జిల్లా పరిధిలో వివరాలు... | గుర్తించిన కుటుంబాలు | పరిశీలించినవి | ఆమోదం తెలిపినవి |
|---|---|---|---|
| | 6,32,509 | 6,25,899 | 5,19,047 |

### పేదరికమే అర్హతగా..

గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది జిల్లాలో ప్రతి ఇంటికి వెళ్లి వారి స్థితిగతులు పరిశీలించారు. కనీస సదుపాయాలైన విద్యుత్తు, తాగునీరు, వంట గ్యాస్, టీవీ, ఫ్రిజ్, ద్విచక్రవాహనాలు తదితరవివరాలు నమోదు చేశారు. రేషన్‌కార్డులు, ఆరంచెల అర్హత(సిక్స్‌స్టెప్ వ్యాలిడేషన్) వంటి నిబంధనలకు స్వస్తి పలికి వివరాలుసేకరించారు. పేదరికమే అర్హతగా ఎంపిక చేశారు. ఇప్పటికే పలు రకాల సంక్షేమ పథకాలు పొందుతున్నా, వాటికి సంబంధం లేదని స్పష్టం చేశారు.

### పలు రకాల ప్రయోజనాలు...

ఆమోదం తెలిపిన కుటుంబాలకు పలు రకాల ప్రయోజనాలు కలగనున్నాయి. వారికి ఇళ్ల నిర్మాణం, పరిశుభ్రమైన వనరులు, తాగునీరు, పారిశుద్ధ్యం, డిజిటల్ కనెక్టివిటీ, సౌరవిద్యుత్తు వంటి సదుపాయాలు కల్పిస్తారు. వారి పిల్లలకు చదివించడంతో పాటు, పలు రకాల నైపుణ్యాలు, ఉద్యోగ సదుపాయాల కల్పనకు మార్గదర్శులు అండగా నిలుస్తారు. ఫలితంగా ఆయా కుటుంబాల జీవనోపాధి మెరుగుపడటం, పేదరికంనుంచి గట్టెక్కడమే అంతిమ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతోంది.

### వారికి అండగా మార్గదర్శులు...

బంగారు కుటుంబాల జీవనోపాధి మెరుగుపరిచేందుకు సమాజంలో స్థిరపడిన వ్యక్తులు, కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులను ప్రభుత్వం భాగస్వాములుగా చేసి వారిని 'మార్గదర్శులు'గా ప్రకటించింది. వారు ఒక కుటుంబం నుంచి గ్రామం, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు దత్తత స్వీకరించేందుకు అవకాశముంది. అండగా ఉన్నవారికి ఆదాయపు పన్ను మినహాయింపు లభించనుంది.

### నియోజకవర్గానికి పది వేల కుటుంబాలు...

ఒక్కో నియోజకవర్గం నుంచి పది వేల బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించి వారి జీవనోపాధులు మెరుగుపరిచేందుకు ఆగస్టు 15 నుంచి అమలు చేయాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఈ క్రమంలో ముత్తుకూరు పంచాయతీని పోర్టు యాజమాన్యం దత్తత స్వీకరిస్తామని ప్రకటించింది. జిల్లా ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. మార్గదర్శులుగా ముందుకు వస్తున్న వారికి పలు సూచనలు చేస్తున్నారు.

# జాతీయ రహదారులపై మృత్యుఘోష

## రాత్రిళ్లు రోడ్డు పక్కన వాహనాల నిలిపివేతతో ప్రమాదాలు

❖ గత నెలలో దుత్తలూరు మండలంలోని తెడ్డుపాడు సమీపంలో సూచిక లేకుండానే రాత్రి వేళ లారీ జాతీయ రహదారి పక్కనే నిలిపారు. ఆ సమయంలో దుత్తలూరు నుంచి తెడ్డుపాడుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న చిన్నా అనే యువకుడు దీన్ని ఢీకొని పడి గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందారు.

❖ గత ఏడాది దుత్తలూరు- కావలి మార్గంలో కమ్మవారిపాలెం సమీపంలో బొగ్గుతో వెళుతున్న ఒక లారీ రహదారి పక్కనే ఆపి నీరు పట్టుకుంటున్నారు. ఆ సమయంలో బ్రహ్మేశ్వరం వైపు వెళుతున్న నరేంద్ర అనే వ్యక్తి దీన్ని ఢీకొని గాయపడగా.. నెలన్నరపాటు చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు.

**న్యూస్‌టుడే, దుత్తలూరు, ఉదయగిరి**

జాతీయ రహదారులపై రాత్రిళ్లు నిలిపే వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చీకట్లో వీటిని గమనించక వచ్చే వారు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకు నిదర్శనమే ఉదయగిరి ప్రాంతంలోని జాతీయరహదారులు. ఈప్రాంతంలో రెండు జాతీయ రహదారులు వెళుతున్నాయి. వరికుంటపాడు, దుత్తలూరు మీదుగా 565, సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, జలదంకి మండలాల మీదుగా 167 బీజీ రహదారి వెళుతోంది. ఇవి ఏర్పడిన తరువాత ప్రమాదాలు అధికమయ్యాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో ఆగి ఉన్న వాహనాలను ఢీకొని జరుగుతున్న ప్రమాదాలు ఇటీవల ఎక్కువయ్యాయి. గత ఏడాది కాలంలో దుత్తలూరు మండల పరిధిలో తొమ్మిది ప్రమాదాలు జరగ్గా.. నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే స్థాయిలో వరికుంటపాడు, సీతారామపురం, కలిగిరి, వింజమూరు, ఉదయగిరి, జలదంకిప్రాంతాల్లో జరుగుతున్నాయి.

దుత్తలూరులో జాతీయ రహదారి పక్కనే నిలిపిన టిప్పర్లు

### సూచికలు లేకుండా...

జాతీయ రహదారులపై పక్కన వాహనాలను నిలపకూడదు. లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు తదితర వాహనాల చోదకులు దీన్ని విస్మరిస్తున్నారు. రాత్రిళ్లు ఎక్కడంటే అక్కడ సూచిక బోర్డులు లేకుండా నిలిపివేస్తున్నారు. సిగ్నళ్లు కూడా పెట్టడం లేదు. దీంతో ఎదురుగా, వెనుక నుంచి వచ్చే వాహనదారులు ఆగి ఉన్న వాహనాలను దగ్గరకు వచ్చే వరకు గమనించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈవిషయమై దుత్తలూరు ఎస్సై ఆదిలక్ష్మి మాట్లాడుతూ జాతీయ రహదారుల పక్కన ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను నిలపకూడదని.. ఈ నిబంధన అమలయ్యేలా చూస్తామని వివరించారు.

## ముగిసిన కాకాణి కస్టడీ

**నెల్లూరు (నేర విభాగం):** మద్యం అక్రమ నిల్వల కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు కస్టడీ ఆదివారం ముగిసింది. శని, ఆదివారాలు నెల్లూరు పోలీసు శిక్షణ కేంద్రంలో ఇందుకూరుపేట పోలీసులు విచారించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన విచారణ మధ్యాహ్నం ముగిసింది. 24 ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఆసుపత్రిలో చికిత్సలు నిర్వహించి కేంద్ర కారాగారానికి తరలించారు.

## కేసు నమోదు

**నెల్లూరు (నేర విభాగం) :** మాజీ మంత్రి, వైకాపా నాయకులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన ఘటనపై శనివారం రాత్రి దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 7వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కొందరు సుజాతమ్మ కాలనీలోని ఆయన ఇంట్లోకి ప్రవేశించి వస్తువులు ధ్వంసం చేశారు. ఫర్నీచర్ నాశనం చేశారు. దీనిపై బాధితులు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజి ఆధారంగా నిందితులను గుర్తిస్తున్నారు.

### సమాచార స్రవంతి

**బంగారం ధరలు**

| | |
|---|---|
| గ్రాముధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర) | రూ. 9,414 |
| సవర ధర: | రూ. 75,312 |
| వెండి గ్రాము : | రూ. 118.60 |

**వెంకాబ్ కోళ్ల ధరలు**

| | |
|---|---|
| బ్రాయిలర్ (రైతుధర) | 105 |
| రిటైల్ | 127 |
| లేయర్ | 112 |
| బ్రాయిలర్స్ | 184 |
| బ్రాయిలర్స్ స్కిన్‌లెస్ | 210 |
| లేయర్ మాంసం | 190 |
| **నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్** | |
| బ్రాయిలర్ | 119 |
| లేయర్ | 112 |
| బ్రాయిలర్స్ | 216 |
| బ్రాయిలర్స్ స్కిన్‌లెస్ | 240 |
| లేయర్ మాంసం | 190 |

(c) eenadu

# కావలి

•కావలి •ఉదయగిరి •కందుకూరు

## సెలవొచ్చిందోయ్.. సొమ్ము చేసుకుందాం

న్యూస్‌టుడే, వరికుంటపాడు

ఆదివారం వచ్చిందోయ్ స్థానికంగా అధికారులుండరు, అడిగేవారూ.. ఉండరు. ఇదే మంచి తరుణం. చెరువులు గుల్ల చేద్దాం.. గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుందాం.. ఇది వరికుంటపాడు మండలంలో అక్రమార్కుల పంథా.

జి.కొత్తపల్లె చెరువు నుంచి ట్రాక్టరుకు గ్రావెల్ నింపుతున్న యంత్రం

### అక్రమ లేఅవుట్లకు సైతం

సెలవుదినాలే వేదికగా అక్రమార్కులు యథేచ్ఛగా ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వి తరలించేస్తున్నారు. ఇటీవల గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. వాటికి అవసరమైన గ్రావెల్‌ను తీసుకువెళుతున్నారు.

### యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తరలింపు

మండలంలోని జి.కొత్తపల్లె చెరువులో ఆదివారం జేసీబీ యంత్రం సాయంతో ఏడు ట్రాక్టర్ల ద్వారా మట్టిని సమీపంలో లేఅవుట్‌లకు తరలించారు. అడిగినవారికి అనుమతి ఉందని, పట్టా భూముల్లో మట్టిని తవ్వుతున్నామని బుకాయిస్తున్నారు. అధికారులు స్థానికంగా ఉండకపోవడం, రాజకీయ ఒత్తిడిలతో ఈ వ్యవహారం సాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. చెరువుల్లో భారీగా గోతులు ఏర్పడటంతో వర్షాల సమయంలో నీళ్లు ఎక్కువైనపుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### అనుమతి లేకుండా తరలిస్తే చర్యలు

రమేష్, జలవనరుల శాఖ ఏఈ

మండలంలో ఎక్కడ మట్టి తరలింపునకు అనుమతులు ఇవ్వలేదు. జి.కొత్తపల్లె చెరువులో తరలించే విషయం నా దృష్టికి రాలేదు. పరిశీలించి మట్టి తరలించనట్లు రుజువైతే సదరు వ్యక్తులకు జరిమానా విధిస్తాం. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

## అర్హులకు పథకాలు అందిస్తాం: ఎమ్మెల్యే

**గుడ్లూరు :** అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పొట్లూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. కాలనీలో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని మురుగుకాలువలు నిర్మించాలని, ఇంటి స్థలాలు మంజూరు చేయాలంటూ స్థానికులు కోరారు. పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు నాగరాజు, సుబ్బారావు,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యువతికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

**కందుకూరుపట్టణం:** పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని మహాకరుణ శాఖాహార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు.

## క్రమబద్ధీకరించి.. ఆదాయం సమకూర్చి

విద్యుత్తుశాఖకు రూ.72 లక్షల రాబడి

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

పరిమితికి మించి విద్యుత్తును అదనంగా వాడుతూ అపరాధ రుసులుకు గురవుతున్న వినియోగదారుల కోసం ఆ శాఖ క్రమబద్ధీకరణ పేరుతో పథకాన్ని తీసుకొచ్చింది. మార్చి ఒకటో తేదీ నుంచి జూన్ 30 వరకు రాయితీ సౌకర్యం కల్పించింది. పట్టణ ప్రజల నుంచి మంచి స్పందన లభించగా.. గ్రామాల్లో అంతంత మాత్రగానే ఉంది. మొత్తం మీద ఎక్కువ సంఖ్యలో ప్రస్తుతం ఇళ్లల్లో వాడుతున్న విద్యుత్తుకు అనుగుణంగా అదనపు లోడుకు నగదు చెల్లించి క్రమబద్ధీకరించుకున్నారు. దీంతో కందుకూరు నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో విద్యుత్తుశాఖకు రూ.72 లక్షలపైనే ఆదాయం సమకూరింది.

### పెరిగిన వినియోగానికి అనుగుణంగా

పదేళ్ల క్రితం ఇళ్లల్లో ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం అంతంత మాత్రంగానే ఉండేది. దానికి అనుగుణంగా అప్పట్లో విద్యుత్తు కనెక్షన్లు తీసుకునే వారికి 0.5కిలోవాట్ సామర్థ్యం గల మీటర్లు మంజూరు చేసేవారు. కొన్నేళ్లుగా ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీ తదితర ఎలక్ట్రికల్ పరికరాల వినియోగం పెరుగుతూ వస్తోంది. ఎవరి ఇంట్లో ఎంత వినియోగం జరుగుతుందో విద్యుత్తుశాఖకు నిర్దిష్ట సమాచారం లేక సరైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీంతో తరచూ లోవోల్టేజీ, హైవోల్టేజీ సమస్యతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క అదనపులోడుకు అపరాద రుసుం చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో దాన్ని క్రమబద్ధీకరించడంతోపాటు నాణ్యమైన విద్యుత్తు సరపరా అందించాలన్న లక్ష్యంతో ఆ శాఖ 50శాతం రాయితీ సౌకర్యం కల్పించింది. దీని ప్రకారం ఒక్కో కిలోవాట్‌కు రూ.1250 చొప్పున వసూలు చేశారు. కందుకూరు నియోజకవర్గంలో 2958 సర్వీసులకు 5,964 కిలోవాట్లు క్రమబద్ధీకరించుకునేందుకు రూ.72.23లక్షలు విద్యుత్తుశాఖకు చెల్లించారు.

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నియోజకవర్గంలో వివరాలు ఇలా..

| మండలం | సర్వీసులు | కిలోవాట్లు | ఆదాయం (రూ.లక్షల్లో) |
|---|---|---|---|
| గుడ్లూరు | 315 | 670 | 8.11 |
| ఉలవపాడు | 314 | 671 | 8.8 |
| లింగసముద్రం | 130 | 240 | 2.92 |
| వలేటివారిపాలెం | 108 | 258 | 3.13 |
| కందుకూరు మండలం | 493 | 965 | 11.58 |
| కందుకూరు పట్టణం | 1598 | 3160 | 38.43 |

దీంతో ప్రస్తుతం నగదు సమకూరడంతో అవసరమైన చోట్ల విద్యుత్తు పరివర్తకాల ఏర్పాటు వేగవంతం కానుంది.

### నాణ్యమైన విద్యుత్తుకు అవకాశం

టి.వి.నరసింహం, పట్టణ ఏఈ

అదనపులోడును క్రమబద్ధీకరించుకోవడం వల్ల వినియోగదారులకు అపరాధ రుసుం భారం తప్పడంతో పాటు నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు అవకాశం ఉంటుంది. వినియోగదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

## ముమ్మరంగా పూడికతీత

స్పందనకు వందనం

**కలిగిరి :** పరికోట పంచాయతీలో డ్రైనేజీ పూడికతీత పనులు ఆదివారం ముమ్మరంగా జరిగాయి. గ్రామంలో ఆనవాలు కోల్పోయిన మురుగు కాలువలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆదివారం ఈనాడులో ప్రచురితమైన 'కాలువలు మాయం.. పారని మురుగు' కథనానికి పంచాయతీ పాలకవర్గం స్పందించింది. సర్పంచి ఉమామహేశ్వరి సూచనలతో కార్యదర్శి బయ్యన్న పూడికతీత పనులను ముమ్మరం చేశారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698

కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

**సమస్య:** లింగసముద్రంలో కుక్కల బెడద అధికంగా ఉంది. **- శ్రీనివాస్, గ్రామస్థుడు**

**సమాధానం:** ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. **- మాధవరావు, పంచాయతీ కార్యదర్శి, లింగసముద్రం**

? కావలి పట్టణం వెంగళరావునగర్ ఉపాధ్యాయ కాలనీలో చాలామంది ఇళ్ల స్థలాలు ముళ్ల భూముల్లోనే ఉన్నాయి. సమస్య పరిష్కరించాలి. **- నారాయణ**

✓ విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ - కావలి**

? గుడ్లూరు మండలంలోని మొగుళ్లూరులో మురుగు కాలువలు పూడికతీయకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. **- నరసింహారాజు**

✓ పరిశీలించి వెంటనే పూడికతీయిస్తాను. **- నరేశ్, పంచాయతీ కార్యదర్శి, గుడ్లూరు**

? పట్టణంలోని సినిమాహాల్ వీధిలో ఏర్పాటు చేసిన సింథటిక్ ట్యాంకుకు కుళాయిలు సరిగా లేక నీరంతా వృథాగా పోతోంది. **- మస్తాన్‌బాషా**

✓ సమస్య మా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- కరీముల్లా, పంచాయతీ ఈవో, - న్యూస్‌టుడే, ఉదయగిరి**

? పట్టణంలోని శివాలయం వెనుక గుండకట్ట దిగువన మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. **- మాబాషా**

✓: పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. **- కె.అనూష, మున్సిపల్ కమిషనర్**

**- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**

## కోట మృతి బాధాకరం

**కావలి :** సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి చెందడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఏ పాత్రలో అయినా అలవోకగా ఒదిగిపోయే విలక్షణ నటుడన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఐదేళ్లుగా నిలిచిన నిర్మాణాలు

మండలంలోని విక్కిరాలపేటలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు అయిదేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కొందరు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది నిధులు వెచ్చిస్తే.. అందుబాటులోకి వచ్చే అవకాశముందని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

## రోడ్డుపై చెత్త.. రాకపోకలకు అవస్థ

పట్టణంలోని కూరగాయల మార్కెట్ వీధిలో రోడ్డుపైనే పలువురు వ్యర్థాలు వేస్తున్నారు. నివాసాల మధ్యలో చెత్త కుప్ప దర్శనమిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. వాటిని తొలగించకపోవడంతో అది కాస్త మురుగు కాలువలో చేరి దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉదయగిరి

## దగదర్తిలో బోనాల పండగ

దగదర్తిలోని దుర్గాభవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం బోనాల పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 20వ తేదీన పెద్ద బోనం నిర్వహించాలని నిర్ణయించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.- న్యూస్‌టుడే, దగదర్తి

## నియంత్రికను బాగు చేయరూ..!

తిమ్మసముద్రంలోని పడమర వీధిలో ఉన్న సింగిల్ ఫేజ్ విద్యుత్తు నియంత్రిక మరమ్మతులకు గురవుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. లోడ్ భారం పెరిగి తరచూ సరఫరా నిలిచిపోతోంది.. అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ సునీల్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు సమస్యను తెలిపామని.. చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, జలదంకి

## ప్రమాదకరంగా రోడ్డు అంచులు

గంగమిట్ట నుంచి లెక్కలవారిపాలెం, సాతానివారిపాలెం వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డు అంచులు, శిథిలమైన మురుగు కాలువ ప్రమాదకరంగా మారాయి. రాత్రిళ్లు రాకపోకలు చేసే సమయంలో గాయాలపాలవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, వింజమూరు

## చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

**కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే:** అనారోగ్య కారణాలతో ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మాచవరానికి చెందిన ఆర్.పిచ్చయ్య(70) అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబసభ్యులు గమనించి పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై బాలమహేంద్రనాయక్ తెలిపారు.

## వలేటివారిపాలెంలో యువకుడు..

**వలేటివారిపాలెం:** స్థానిక బస్టాండు సమీపంలో జమీన్ ఉప్పలపాడుకు చెందిన జీ నాగరాజు(30) మృతి చెందడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆ క్రమంలో మృతిచెంది ఉండటాన్ని బంధువులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్సై మరిది నాయుడు తెలిపారు.

## మద్యం మత్తులో ఘర్షణ.. ఇరువర్గాల ఫిర్యాదు

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** మద్యం మత్తులో యువకుల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఎస్సై శివనాగరాజు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన కొందరు ఆదివారం మధ్యాహ్నం శివారు ప్రాంతంలో మద్యం తాగుతూ ఘర్షణ పడ్డారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోకి వచ్చి మరికొందరితో వివాదానికి దిగారు. దీంతో ఇరువర్గాలకు గాయాలయ్యాయి. స్థానికులు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. వారిలో పట్టణంలోని ఓ వార్డుకు చెందిన తెదేపా నాయకుడు ఉన్నట్లు సమాచారం. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**గుడ్లూరు, న్యూస్‌టుడే:** పోట్లూరు, తెట్టు ఉపకేంద్రాల పరిధిలో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న కారణంగా సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మధుబాబు తెలిపారు. చేవూరు, రావూరు, ఏలూరుపాడు, మోచర్ల, పోట్లూరు, తెట్టు, ఆర్సీ అగ్రహారం, పాజర్ల, స్వర్ణాజీపురం, అడవిరాజుపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఇండోసోల్ పరిశ్రమకు భూములివ్వం

**ఉలవపాడు, న్యూస్‌టుడే:** ఇండోసోల్ పరిశ్రమకు భూములు ఇవ్వమని కరేడు పంచాయతీ గ్రామాల ప్రజలు ఎమ్మెల్సీ తూమాటి మాధవరావుకు తెలిపారు. ఆదివారం ఆయన టెంకాయచెట్లపాలెం, కొత్తపల్లిపాలెం, పాతపల్లిపాలెం, చైతన్యనగర్ ఎస్సీ కాలనీలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. మాజీముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఈ విషయాన్ని వివరిస్తానన్నారు.

## మరమ్మతులు ఎప్పుడో..?

న్యూస్‌టుడే, గుడ్లూరు

చేతి పంపులు మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి. తాగునీటి సరఫరా నిలిచిన సమయంలో ఇవి అక్కరకు వస్తాయి. ఇప్పటికి కొన్ని గ్రామాల్లో ఎక్కువమంది వీటినే ఉపయోగిస్తున్నారు. మండలంలోని 24 పంచాయతీల్లో 347 చేతి పంపులున్నాయి. వీటిలో 156 మరమ్మతులకు గురయ్యాయి. గుడ్లూరు ప్రధాన వీధిలో ఉన్న బోర్లు ఏడాది నుంచి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. పాజర్ల, మిట్టపాలెంలో ఉన్నవాటికి చిన్నపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తాయి. ● ఈ విషయమై ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. బోర్ల సామగ్రి అందుబాటులో ఉంది. మరమ్మతులకు గురైన చేతి పంపులను పరిశీలించి సరిచేయిస్తాం. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

పాజర్లలో పనిచేయని చేతి పంపు

## సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వినతి

**ఉదయగిరి, న్యూస్‌టుడే:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ ఆదివారం గంగిరెడ్డిపల్లికి విచ్చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఉదయగిరి అభివృద్ధి ఫోరం ప్రతినిధులు షేక్ ఎండీ ఖాజ, వి.రామచంద్రమూర్తి వినతిపత్రం అందజేశారు. చెరువులు, చెక్‌డ్యాంలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. గండిపాలెం, నక్కలగండి, మర్రివూట్ల రిజర్వాయర్లను, ప్రధాన కాలువలను ఆధునీకీకరించాలన్నారు. ఉదయగిరి, వింజమూరులోని వైద్యశాలలను 100 పడకలకు పెంచటంతోపాటు ఉదయగిరి వైద్యశాలలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నాయకులు పి.చెంచలబాబుయాదవ్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న యుడీఎఫ్ ప్రతినిధులు

## చేపల అక్రమ వేట

**వరికుంటపాడు, న్యూస్‌టుడే:** గువ్వాడి చెరువులో అక్రమంగా చేపల వేట కొనసాగిస్తున్నారు. నిరోధించాల్సిన అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తమ సొంత చెరువుల మాదిరిగా చేపల పెంపకం చేస్తున్నారు. చెరువులో పెంచిన మత్స్యసంపదకు పంచాయతీ అధికారులు వేలంపాట నిర్వహించాల్సి ఉంది. వారు మిన్నకుండిపోవడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

## కమిటీ వేస్తేనే.. శైవక్షేత్రానికి మహర్దశ

**బిట్రగుంట, న్యూస్‌టుడే:** బోగోలు మండలం జక్కేపల్లిగూడూరు పంచాయతీ సోమేశ్వరపురం ఆలయానికి కోట్ల రూపాయలు విలువ చేసే 116 ఎకరాలు మెట్ట, మాగాణి భూములు ఉన్నాయి. సోమశిల జలాలు అందుతుండడంతో రెండు కార్లు పండుతున్నాయి. ఆలయానికి కమిటీ లేకపోవడంతో అధికశాతం భూములన్నీ కౌలు వేలానికి కూడా నోచుకోలేదు. బ్రిటీష్ హయాం నాటి అభివృద్ధి కూడా చూడలేని పరిస్థితి నెలకొంది. అదే ఆలయ కమిటీని ఏర్పాటు చేస్తే.. భూములన్నీ దేవాలయ పరిధిలోకి వస్తాయి. కౌలు సొమ్ము ఏటా రూ.20లక్షల వరకు వస్తుంది. ఆలయానికి పూర్వవైభవం తీసుకురావచ్చు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఈవో రాధాకృష్ణను వివరణ కోరగా కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి కమిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

## కోలాహలం.. పూర్వవిద్యార్థుల సమ్మేళనం

బిట్రగుంట రైల్వే తెలుగు మీడియం ఉన్నత పాఠశాలలో 1980-81లో పదో తరగతి చదివిన 70 మంది విద్యార్థులు ఆదివారం ఒక్కచోట చేరారు. నాటి అల్లర్లు, ఆనందాలను నెమరేసుకున్నారు. గురువులను గుర్తుచేసుకుని స్మరించుకున్నారు. ఒకర్ని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు, పిల్లల చదువులు వివరాలు తెలుసుకున్నారు. విశ్వనాథరావుపేటలోని ఓ ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. **న్యూస్‌టుడే, బిట్రగుంట**

## రోడ్డు తొలగిస్తున్నారు

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కలిగిరి మెయిన్ రోడ్డును భారీ యంత్రాలతో తవ్వేస్తున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి కలిగిరి పట్టణంలో నుంచి వెళ్తుందో.. లేదో స్పష్టత లేదు. మరోవైపు పట్టణం వెలుపల బైపాస్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ తరుణంలో రోడ్డును తొలగించి విస్తరణ చేయాల్సిన అవసరం లేదని ప్రజలు అంటున్నారు. ఒక వేళ అదే చేసినట్లయితే బైపాస్ ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇలా బాగున్న రోడ్డును తొలగిస్తూ ప్రజాధనం వృథా చేస్తున్నారని చెబుతున్నారు. ● ఎన్‌హెచ్‌ఏ విభాగం ఈఈ సంజీవరాయుడు స్పందిస్తూ.. గతంలో రోడ్డు విస్తరణ పనులు కొద్దిమేర జరిగాయి. దానికి అనుసంధానం చేసే విధంగా సిమెంటు రోడ్డును కొంతమేర పగలగొట్టారు. తారు రోడ్డు వేసి సరిచేస్తాం. డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంది.

– న్యూస్‌టుడే, కలిగిరి

## అమ్మో ఎండలు

**గుడ్లూరు, న్యూస్‌టుడే:** జిల్లాల్లో గత వారం రోజులుగా ఎండ దంచి కొడుతోంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. సాధారణంగా మేలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం జులై నెల వచ్చినా వేడితీవ్రత అధికంగా ఉంటోంది. ఆదివారం కందుకూరు, గుడ్లూరులో 39డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. దీంతో ప్రధాన వీధులు నిర్మానుష్యంగా మారాయి.

## భక్తిశ్రద్ధలతో పొంగళ్లు

సీతారామపురం : అమ్మవారికి సారె

**ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, న్యూస్‌టుడే:** గంగిరెడ్డిపల్లిలోని అనంతపురి గంగాభవానీ అమ్మవారికి ఆదివారం నెల పొంగళ్ల కార్యక్రమాన్ని గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామపురం మండలం ఘటికసిద్ధేశ్వరంలో ఇష్టకామేశ్వరీదేవి, పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సారెను భక్తులు అమ్మవారికి సమర్పించారు. ● నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు అమ్మవారికి నెలపొంగళ్లు ఈనెల 17వ తేదీన జరగనున్నట్లు ఆలయ ఈవో ఉషశ్రీ తెలిపారు. మహిళలకు, భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**జలదంకి, న్యూస్‌టుడే:** బ్రాహ్మణక్రాకలో జరుగుతున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు చివరి రోజనైన ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి 108 కలశములతో అభిషేకం, చక్రస్నానం నిర్వహించి.. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి దంపతులు స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

## కూరగాయల ధరలకు రెక్కలు

న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

కూరగాయాల ధరలకు రెక్కలొచ్చాయి. స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో పట్టణంలోని రైతుబజారుకు మదనపల్లె నుంచి కూరగాయలు, ప్రకాశం జిల్లా కొత్తపట్నం నుంచి ఆకుకూరలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. రవాణా ఖర్చులు, దళారీల ప్రమేయంతో ధరలు పెరుగుతున్నాయి.

### వాతావరణం అనుకూలించక

కందుకూరు, వలేటివారిపాలెం మండలాల్లో రైతులు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించక దిగుబడి తగ్గింది. ఇక్కడే లభిస్తే సరాసరినా.. కిలో రూ.20లు అంతకంటే తక్కువగా వివిధ రకాలు కూరగాయాలు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చేవి. ప్రస్తుతం మండలంలోని ఓగూరు నుంచి దోస, బెండకాయలు అరకొరగా వస్తున్నాయి. శ్రావణమాసం వచ్చిందంటే ధరలు ఆకాశాన్ని తాకుతాయని మధ్యతరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత నెల వరకు ఓగూరు, మహదేవపురం నుంచి ఆకుకూరలు వచ్చేవి. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నారు. ఒక కట్ట రూ.5 నుంచి రూ.10 వరకు అమ్ముతున్నారు.

రైతు బజారులో కూరగాయలు

### కందుకూరు రైతు బజారులో ధరలు ఇలా..

వంకాయలు, పచ్చిమిర్చి, కాకరకాయలు.. రూ.55, గోరుచిక్కులు రూ.50, క్యారెట్ రూ.65, దొండకాయ రూ.40, క్యాలీఫ్లవర్, ముల్లంగి రూ.65, బీట్‌రూట్,చామగడ్డ, బీరకాయ రూ.45, టమాటా రూ.33, బెండ, దోసకాయలు రూ.20లకు కిలో చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. వినియోగదారుడు రెండు,మూడు రకాలు కొనుగోలు చేసినా రూ.100లు తక్కువ కావడం లేదు. ఒక మధ్యతరగతి కుటుంబం నెలకు రూ.1500లు కూరగాయలకే ఖర్చు చేయాల్సి వస్తుంది.


## ప్రకటన

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా **గౌ॥ జూనియర్ సివిల్ జడ్జి, ఉదయగిరి** వారు **O.S.No. 14/2017** దావాలో **తేది 28-6-2024న** డిక్రీ, జడ్జిమెంటు నా క్లయింటు అయిన **కట్టా షార్కె** గారికి అనుకూలముగా తీర్పు ఇచ్చియున్నారు. కాబట్టి ఎవరైనా కోర్టు తీర్పును అతిక్రమించి నా క్లయింట్ **కట్టా షార్కె** గారి స్థలమును అక్రమముగా ఆక్రమించాలని ప్రయత్నిస్తే వారి మీద సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకోబడును.

**ఆస్తి షెడ్యూలు**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్, ఉదయగిరి సబ్ రిజిస్ట్రేషన్ ఏరియా, సీతారామపురం మండలం, అయ్యవారిపల్లె గ్రామము, సర్వే నెం. 7, విస్తీర్ణం AC. 0.30 1/2 Cents ఖాళీ స్థలము లోనిది.

ఇట్లు : **కె.సుధాకర్ రావు, M.A., L.L.B.,**

Advocate, Udayagiri, Ph: 94416 85548


(c) eenadu

# కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

## మాజీ ఎమ్మెల్యే ప్రసన్నను అరెస్టు చేయాలని నిరసన

ఇందుకూరుపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

విడవలూరు, ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మురికి వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని మహిళలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఇందుకూరుపేటలో సాయిబాబా గుడి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రసన్న వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. తెదేపా నాయకులు పవన్‌రెడ్డి, వెంచుకిశోర్, చెన్నయ్య మహిళలు పాల్గొన్నారు.

● ఎన్నికల్లో ప్రజలు ప్రసన్నను చిత్తుగా ఓడించినా ఇంకా మారలేదని తెదేపా నాయకులు విమర్శించారు. విడవలూరు మండలం వావిళ్లలో తెదేపా మండలాధ్యక్షుడు ఏటూరు శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మి శ్రీధర్‌నాయుడు, పల్లం శేషమ్మ మాట్లాడుతూ ఆరు సార్లు ఎమ్మెల్యే పని చేస్తున్నారని, నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని చేయలేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో అడపాల శ్రీధర్‌రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకు లేదని బాజాపా గ్రామీణ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి తెలిపారు. బుచ్చి లోని బాజాపా కార్యాలయంలో కూటమి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## సంస్కృతి సంప్రదాయాలు పాటిద్దాం

ఆత్మకూరు: మన సంస్కృతి.. సంప్రదాయాలు గౌరవించి పాటిద్దామని ప్రముఖ వైద్యులు డాక్టర్ అరుణమ్మ అన్నారు. ఆదివారం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ హరిక, డాక్టర్ ప్రతీక్ సహకారంతో శ్రీ భారతి సంగీత నృత్య విద్యాలయం నిర్వాహకులు అవధా చక్రవర్తి ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణంలోని మహిళా వైద్యులు, న్యాయవాదులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## గ్రామ సింహాలతో హడల్

● వెంకటాచలం మండలం తిక్కవరప్పాడు పంచాయతీలో ఐదేళ్ల బాలుడు కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. గతవారం ఒకే రోజు పది మందికిపై కుక్కలు దాడి చేశాయి. దీంతో వీధుల్లోకి వెళ్లాలంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో కుక్కలు విస్తృతంగా ఉన్నాయని వాటిని నివారించాలని స్థానికులు పంచాయతీ పాలకులతో పాటు, అధికారులు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. స్థానికులు రాత్రి వేళల్లో బయటకు రావాలంటే బిక్కుబిక్కుమంటున్నారు.

● గూడూరుకు చెందిన ఒక యువకుడు పని నిమిత్తం నిడిగుంటపాళేనికి వచ్చాడు. రాత్రి తొమ్మిది గంటలకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా... ఇస్కపాళెం వద్దకు రాగానే కుక్కలు వెంబడించాయి. సదరు యువకుడు ఆందోళన చెందడంతో అదుపుతప్పి పడిపోవడంతో గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు వెంకటాచలం మండలంలో సాధారణంగా మారాయి.

న్యూస్‌టుడే, వెంకటాచలం

వెంకటాచలంలో రోడ్డుపై కుక్కల గుంపు

కోవూరు, బుచ్చి, పొదలకూరు, కోవూరు, నార్తురాజుపాళెం, కసుమూరు, ఆత్మకూరు, ఏఎస్‌పేట, మనుబోలు, నరుకూరు మేజర్ పంచాయతీల పరిధిలో కుక్కల బెడద అధికంగా ఉంది. ప్రధాన వీధుల్లో గుంపులుగా చేరి రహదారిపై వచ్చిపోయే వారిని వెంబడిస్తున్నాయి. రోడ్డుపై ద్విచక్రవాహనాల్లో వెళ్లేవారు హడలిపోతున్నారు. వెంబడించిన సమయంలో కొందరు ద్విచక్రవాహన దారులు ఆందోళన చెందడంతో వాహనాలు అదుపుతప్పి పడి పోతున్నాయి. మండల పరిధిలోని వెంకటాచలం, తిక్కవరప్పాడు, సర్వేపల్లి, కనుపూరు, ఇస్కపాళెం, నిడిగుంటపాళెం, కాకుటూరు, కసుమూరు, కంటేపల్లి, గుడ్లూరువారిపాళెం తదితర గ్రామాల్లో సమస్య ఎక్కువగా ఉంది. పంచాయతీ అధికారులు చొరవ చూపి కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

● వెంకటాచలం ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ... కుక్కల బెడద అధికంగా ఉందని, కొన్ని గ్రామాల నుంచి ప్రజలు ఫిర్యాదు చేశారని చెప్పారు. అధికంగా ఉన్న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులతో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## డ్రోన్ వినియోగం... సేద్యం లాభదాయకం

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, కోవూరు

నేడు ఎక్కడ చూసినా డ్రోన్ వినియోగం పెరుగుతోంది. ప్రస్తుతం సాగులోనూ ఓ భాగంగా మారింది. గతంలో రైతులు పంటలపై పురుగు మందు పిచికారీ కోసం కూలీలపై ఆధారపడేవారు. దీని వలన అధిక సమయంతో పాటు ఖర్చులు ఎక్కువయ్యేవి. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం గతేడాది డ్రోన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొంత మంది వీటిని సొంతంగా కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తున్నారు. ఎక్కువ మందిని ప్రోత్సహించేందుకు రైతు సంఘాలకు ప్రభుత్వం రాయితీపై డ్రోన్లు అందిస్తుంది. ● జిల్లాలో ప్రభుత్వం రాయితీపై 41 డ్రోన్లు మంజూరు చేసింది. పైలట్‌గా శిక్షణ పూర్తి చేసుకొని బ్యాంకు డిపాజిట్లు చెల్లించిన పదమూడు గ్రూపులకు పంపిణీ చేశారు. ఇది ఒక్కోటి రూ.9.80 లక్షలు కాగా ప్రభుత్వం 80 శాతం రాయితీ కింద 7.80 లక్షలు రైతు సంఘం ఖాతాకు జమచేస్తోంది.

**జిల్లా వ్యాప్తంగా మంజూరైన వివరాలు**

| | |
|---|---|
| మొత్తం డ్రోన్లు | 41 |
| పంపిణీ చేసినవి | 18 |
| చేయాల్సినవి | 23 |

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**ఎలా పొందాలంటే...**

ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడి ముందుగా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గ్రూపు పేరు నమోదు చేసుకోవాలి. సభ్యుల్లో ఒకరు కచ్చితంగా ఇంటర్ చదివి ఉండాలి. అతడినే పైలట్‌గా ఎంపిక చేసి శిక్షణ ఇస్తారు. రైతు వాటా కింద రూ.2 లక్షలు బ్యాంకులో ధరావతుగా జమ చేయాలి. తరువాత డ్రోన్ ధరలో దాదాపు 50 శాతం రైతు సంఘం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన 50 శాతం రాయితీ నగదు గ్రూపు ఖాతాలో జమవుతుందని, ఈ మొత్తంతో పరికరాన్ని కొనుగోలు చేసి రైతు సంఘానికి అందిస్తారు. రాయితీ నగదు 15 రోజుల్లో సంఘం ఖాతాకు జమచేస్తారు.

**ప్రయోజనాలు...**

● ఎకరా పొలానికి కేవలం ఐదు నుంచి పది నిమిషాల్లో పురుగు మందు పిచికారీ చేస్తుంది. ● కూలీల సాయం అవసరం లేకుండా ఎప్పుడైనా చేసుకోవచ్చు. ● మందు ప్రభావం మనుషులపై పడకుండా ఉంటుంది. ● దీని వినియోగంతో నీటి, వాయు కాలుష్యాన్ని నియంత్రించవచ్చు. ● ముఖ్యంగా రైతులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవు.

● పొదలకూరు వ్యవసాయ శాఖ ఏవో ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న డ్రోన్లను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం మండలానికి రెండు మంజూరు చేసిందని, రైతులు ఆయా సంఘాల వద్ద అద్దె చెల్లించి వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

## బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

విడవలూరు: విడవలూరు మండలం వరిణిలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన బాధితులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆర్థిక సాయం చేశారు. బాధితులు అంకయ్య, శీనయ్య కుటుంబాలకు ఎమ్మెల్యే ఇచ్చిన రూ.50 వేలు నగదు మండల తెదేపా ఇన్‌ఛార్జి శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. తెదేపా నాయకులు శ్రీహరిరెడ్డి, రాజన్న, కుడుముల మల్లికార్జున పాల్గొన్నారు.

## మేమున్నాం... మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

**సమస్య :** మనుబోలు మండలం పిడూరు గ్రామానికెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదకరంగా ఉంది. అటుగా రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. – ప్రసన్నకుమార్, స్థానికుడు

**సమాధానం:** పరిశీలించి రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. – చంద్రశేఖర్, పంచాయతీరాజ్ డీఈ.

? వెంకటాచలం మండలం కసుమూరు రోడ్డు వద్ద జాతీయ రహదారిపై చెత్త పోస్తున్నారు. రహదారిపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – నాగేశ్వరరావు, స్థానికుడు

✓ సమస్య సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతాం – కల్పన, ఎంపీడీవో

? వెంకటాచలం మండలం కాకుటూరులో రోడ్డుపైనే గేదెలు కట్టేస్తున్నారు. ఆ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఉంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. – స్థానికులు

✓ పంచాయతీ సిబ్బందికి చెప్పి సమస్య పరిష్కరిస్తాం. – కల్పన, ఎంపీడీవో

? సంగం మండలం చెన్నవరప్పాడులో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. – స్థానికులు

✓ పరిశీలించి సరిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. –మస్తానయ్య, డిస్కం ఏఈ

? బుచ్చి నగర పంచాయతీలోని 19వ వార్డు నాలుగో వీధిలో వీధి దీపం సక్రమంగా వెలగడం లేదు. – రంగయ్య, స్థానికుడు

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– బాలకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్

? పొదలకూరు రూరల్ పరిధిలోని రమణారెడ్డి కాలనీలో వీధిదీపాలు మరమ్మతులకు గురై వెలగడం లేదు. – మస్తాన్, స్థానికుడు

✓ సిబ్బందిని పంపి వెలిగిస్తాం.

– యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి

## ప్రజాసంక్షేమమే కూటమి లక్ష్యం

మనుబోలు, న్యూస్‌టుడే : ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు శివుడు రాజాగౌడ్, గ్రామాధ్యక్షుడు సాని వెంకటరమణయ్య పేర్కొన్నారు. స్థానిక కోదండరామపురంలోని చంద్రమౌళినగర్, బీసీకాలనీ, దేవాంగుల కాలనీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాయకులు చేరెడ్డి పద్మనాభరెడ్డి, మోపూరు ధనుంజయ్‌రెడ్డి, పెనుబాక మహేశ్, మస్తాన్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

## పోలీసు సంఘం కోఆప్షన్ సభ్యుడిగా వినోద్

విడవలూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర కోఆప్షన్ సభ్యుడిగా ఊటుకూరుకు చెందిన గండవరపు వినోద్ కుమార్ నియమితులయ్యారు. ఈయన ఇస్కపల్లి మెరైన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఏపీ పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు, వివిధ యూనిట్ల ప్రతినిధుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను అభినందలు తెలిపారు. పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకల శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీహరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## జనసేన బలోపేతానికి కృషి

పొదలకూరు, న్యూస్‌టుడే : గ్రామ స్థాయి నుంచే జనసేనను బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి రమేశ్‌నాయుడు అన్నారు. ఆదివారం ప్రభగిరిపట్నం గ్రామ హరిజనవాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులు, గ్రామాభివృద్ధికి తోడ్పడే పనులు చేపడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సేవలను గుర్తించాలన్నారు.

## పూడిక తీశారు..తొలగించడం మరిచారు

విడవలూరు మండలం గాంధీ గిరిజన కాలనీలో మురుగు కాలువల్లో పూడిక తీసి దారిలో వేశారు. పూడికతీసి వారం రోజులైనా వాటిని తొలగించలేదు. దారిలో అడ్డుగా వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూడికతీసిన మట్టి తొలగించాలని స్థానికులు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు

## ప్రహరీ నిర్మించరూ

పొదలకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల తూర్పువైపున ఉన్న ప్రహరీ పడిపోవడంతో పశువులు కళాశాల ప్రాంగణంలోకి వస్తున్నాయి. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో కళాశాల చుట్టూ గోడ నిర్మించారు. ఒకవైపు ముళ్లచెట్లు మొలిచి కూలిపోయింది. పశువులు, కుక్కలు లోపలికి వస్తున్నాయి. ప్రభుత్వం నిధులు సమకూర్చి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సూచిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

## నిర్మించారు... నిరుపయోగంగా ఉంచారు

వెంకటాచలం మండలం నిడిగుంటపాళెం పంచాయతీ దళితవాడలో రూ.లక్షలు వెచ్చించి అంగన్‌వాడీ భవనం నిర్మించారు. నిర్మాణం పూర్తయిన నేటికీ ప్రారంభం కాలేదు. నిరుపయోగంగా ఉండటంతో భవనం చుట్టూ ముళ్లచెట్లు పెరిగిపోయాయి. సమీపంలోని శిథిలమైన పాఠశాల భవనంలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి భవనాన్ని ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వెంకటాచలం

## గుంత ప్రమాదాలతో చింత

పొదలకూరు-గూడూరు మార్గంలో తలుపూరు కూడలి రోడ్డుపై ఏర్పడిన గుంత అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం సైదాపురం, గూడూరుకు రాకపోకలు సాగించే వాహనాలతో గుంత క్రమేపి పెద్దదవుతోంది. అధికారులు స్పందించి గుంతను తాత్కాలికంగా మట్టితోనైనా పూడ్చాలని విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

## బిల్లు రాక.. నిర్మాణం పూర్తి కాక!

మర్రిపాడు మండలం ఇర్లపాడులో పాలవెల్లువ పథకంలో భాగంగా రూ.16.70 లక్షల వ్యయంతో నిర్మించిన పాల శీతలీకరణ భవనమిది. పనులు చేసినా బిల్లులు సకాలంలో రాకపోవడంతో గుత్తేదారు పనులను అరకొరగా చేసి వదిలేశారు. చిన్నపాటి పనులు చేస్తే భవన నిర్మాణం పూర్తవుతుంది. పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)

## జలాశయానికి 2,148 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయానికి ఆదివారం ఎగువ ప్రాంతాల నుంచి 1,498 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 28.350 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 298.911 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 30, ఆరో క్రస్టు గేట్ ద్వారా 570, పవర్ టన్నెల్ ద్వారా 2,100 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన దక్షిణ కాలువకు 400, ఉత్తర కాలువకు 375 క్యూసెక్కులు వదులుతున్నారు. రోజుకు సగటున 143 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు సంబంధిత ప్రాజెక్టు అధికారులు వివరించారు.

## దాడికి యత్నించిన వారిపై కేసు నమోదు

అనంతసాగరం, న్యూస్‌టుడే: అప్పుగా ఇచ్చిన నగదును తిరిగి ఇవ్వమన్నందుకు ఓ వ్యక్తిపై దాడికి యత్నించిన ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై సూర్యప్రకాశ్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... లక్కరాజుపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్... అదే గ్రామంలో ప్రదీప్‌కు రెండేళ్ల క్రితం నగదు అప్పుగా ఇచ్చారు. ప్రస్తుతం శ్రీధర్ నెల్లూరులో ఆటో నడుపుతూ జీవిస్తున్నారు. ఇరవై రోజుల క్రితం గ్రామానికి వచ్చి నగదు ఇవ్వమని కోరగా వాగ్వాదానికి దిగారు. ప్రదీప్‌తో పాటు అతని తండ్రి, సోదరుడు కర్రలతో శ్రీధర్‌పై దాడికి యత్నించారు. బాధితుడు అనంతసాగరం పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్సై గ్రామంలో విచారించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు మండల పరిధిలోని అల్లూర్తి గ్రామ వాగులో విద్యుదాఘాతానికి గురైన నాలుగు గేదెలు మృతి చెందాయని నావూరుపల్లి గ్రామానికి చెందిన యజమాని చినపెంచలయ్య తెలిపారు. వనంతోపు ప్రాంతానికి చెందిన రైతు అనధికారంగా అక్రమంగా వ్యవసాయ విద్యుత్తు సర్వీసు తీసుకొని తన పొలానికి వినియోగిస్తున్నారు. విద్యుత్తు తీగ తెగి వాగులో పడింది. అటువైపు నీటి కోసం వెళ్లిన గేదెలు దిగి మృతి చెందాయని యజయాని తెలిపారు. చనిపోయిన గేదెల విలువ సుమారు రూ.2.50 లక్షల విలువ ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## గిద్దలూరులో సరుగుడు తోటలు దగ్ధం

సైదాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గిద్దలూరుకు చెందిన పలువురు రైతుల సరుగుడు తోటల్లో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని చెట్లు దగ్ధమయ్యాయని రైతులు తెలిపారు. విద్యుత్తు తీగల నుంచి మంటలు రావడంతో ప్రమాదం జరిగింది. వాటిని సరిచేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు అయిదు లక్షల రూపాయల విలువ చేసే సరుగుడు చెట్లు కాలిపోయాయని పేర్కొన్నారు.

## గంగమ్మ తల్లికి శాకంబరి అలంకారం


సంగంలో..

సంగం, సైదాపురం, అనంతసాగరం న్యూస్‌టుడే : సంగంలో పెన్నానది గట్టున కొలువైన పాలేటి గంగమ్మ తల్లి ఆలయంలో మూలమూర్తికి ఆదివారం శాకంబరి అలంకారం చేశారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శోభాయమానంగా మారిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ● సైదాపురం మండలంలోని కలిచేడు సమీపంలో వెలసిన కామాక్షిదేవి సమేత సిద్ధేశ్వరస్వామి పారువేట.. పల్లకీసేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడి ఆలయంలో అయిదురోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాల్ని నిర్వహిస్తున్నారు. ● అనంతసాగరంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో సీతా రాముల కల్యాణాన్ని ఆదివారం రాత్రి నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

## సంఘాల ఆధ్వర్యంలో సన్మానం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివప్రసాద్ కార్మిక కర్షక శ్రామిక యూనియన్లకు అందించిన సేవలు ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శివప్రసాద్ ఉద్యోగ విరమణ సన్మానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయన సేవలు గుర్తుచేశారు. సంఘం అధ్యక్షులు వాగాల శ్రీహరి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పుల్లయ్య, పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, గంటా లక్ష్మీపతి, సందాని, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగయ్య, ట్రేడ్ యూనియన్ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శిథిల భవనం.. విధులకు ఆటంకం


పెచ్చులూడుతున్న పైకప్పు

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, వెంకటాచలం

పొదలకూరు విష్ణుశ్వర కాలనీ వద్ద ఉన్న అగ్నిమాపక కార్యాలయం శిథిలావస్థకు చేరింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం చుట్టూ పగుళ్లు ఏర్పడి కూలేందుకు సిద్ధంగా ఉంది. విధుల నిర్వహణకు వచ్చే ఉద్యోగుల గదుల్లోని లోపలి భాగం పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో భవనంలో విశ్రాంతి తీసుకునేందుకు అధికారులెవ్వరూ సాహసించడం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

● గత తెదేపా పాలనలో 2018లో పాత భవనానికి సమీపంలో నూతన భవన పనులు ప్రారంభించారు. స్లాబ్‌వరకు పనులు పూర్తయ్యాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తరువాత పట్టించుకోలేదు. అప్పటి నుంచి భవనం అసంపూర్తిగా ఉంది. సుమారు 40 కిలోమీటర్ల పరిధిలో పొదలకూరు, చేజర్ల, కలువాయి గ్రామాలకు ఒకటే శకటం సేవలందిస్తోంది. వెంకటాచలం మండలంలోని కసుమూరు, మనుబోలు మండలంలోని వీరంపల్లి గ్రామాల వరకు దీని పరిధిలోనే ఉన్నాయి. ఏక కాలంలో వేర్వేరు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదం జరిగితే ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. 18 మంది సిబ్బందికి 13 మంది మాత్రమే ఉన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో 4 ఫైర్ మ్యాన్‌లు, ఒక డ్రైవర్ బదిలీ కావడంతో మిగిలిన వారితో మాత్రమే సేవలు కొనసాగుతున్నాయి.

● పొదలకూరు అగ్నిమాపక అధికారి విజయ వరకుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరడంతో విధులకు హాజరయ్యే ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనం గురించి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. సిబ్బంది కొరత ఉన్న చోట జిల్లా నుంచి పలువురిని సర్దుబాటు చేస్తూ సేవలందిస్తున్నామని పేర్కొన్నారు.

అసంపూర్తిగా నూతన భవనం

## క్రీడలతో మమేకం.. విజయాలు సొంతం

న్యూస్‌టుడే, మర్రిపాడు(ఆత్మకూరు, గ్రామీణం)

కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల చదువుతో పాటు క్రీడల్లో దూసుకుపోతున్నారు. బరిలో దిగితే చిచ్చర పిడుగుల్లా చెలరేగుతున్నారు. అవకాశాలు అందిపుచ్చుకుంటూ విజేతలుగా నిలుస్తున్నారు. సాధించాలన్న తపన, పట్టుదల ఉంటే చాలు లక్ష్యాన్ని అలవోకగా సాధించవచ్చని నిరూపిస్తున్నారు. క్లస్టర్ రీజనల్, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు.

### ఉత్తమ క్రీడాకారిణిగా ఎదగాలని : అలేఖ్య

నవోదయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్నా. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలియడంతో ఖోఖోలో రాణిస్తూ, మెలకువలు నేర్చుకొని పోటీల్లో పాల్గొంటున్నా. గతేడాది కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రీజనల్ స్థాయి ఖోఖో పోటీల్లో గెలుపొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. ఫిబ్రవరిలో ఉత్తరాఖండ్‌లో జరిగిన ఖోఖో జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపా. ఉత్తమ క్రీడాకారిణిగా ఎదగాలన్నదే లక్ష్యం.

### మరిన్ని పతకాలు సాధిస్తా : కల్పన

నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. మాది వ్యవసాయ కుటుంబం. 2023లో నవోదయ విద్యాలయం తరఫున గుంటూరులో జరిగిన రీజనల్ స్థాయి ఖోఖో పోటీల్లో సెమీఫైనల్ వరకు వెళ్లా. 2024లో గుంటూరులో జరిగిన రీజనల్ స్థాయి ఖోఖో పోటీల్లో మొదటి స్థానంలో నిలిచా. క్రీడల్లో మరిన్ని పతకాలు సాధించి, జాతీయ జట్టులో స్థానం పొందాలన్నదే నా ధ్యేయం.

### ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం : అక్షయ

నవోదయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్నా. క్రీడల్లో వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళుతున్నా. 2023లో నవోదయ విద్యాలయం తరఫున కర్ణాటక రాష్ట్రం శివమొగ్గలో జరిగిన రీజనల్ స్థాయి స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపా. ఫిబ్రవరిలో కర్నూలులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకం సాధించా. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నా.

## బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసశర్మ

విడవలూరు, న్యూస్‌టుడే: బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శులుగా విడవలూరుకు చెందిన పేరేపి శ్రీనివాసశర్మ, ప్రసాదాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరులో రాష్ట్ర బ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా కామేశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా హరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వాసుదేవరావు పాల్గొన్నారు.

## తెదేపా పాలనలోనే అభివృద్ధి

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఏఎస్‌పేటలో ఆదివారం తెదేపా నాయకులు ప్రజలకు పంపిణీ చేశారు. ఇంటింటా తిరుగుతూ కరపత్రాలను అందజేసి ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు వీరప్రతాప్, నజీర్, షఫి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత నివారించండి

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య అన్నారు. నరుకూరులో ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో రైతుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల డిమాండ్‌కు తగ్గట్టుగా ఎరువులు అందుబాటులో లేవని వివరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని సూచించారు. సోమవారం ఉదయం నెల్లూరు కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కందిపాటి రమణమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

(c) eenadu

# నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

## నెల్లూరు గ్రామదేవతకు శాకంబరి అలంకరణ

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నగరంలోని స్వర్ణాల చెరువు ఒడ్డున ఉన్న గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి శాకంబరి అలంకరణ ఆదివారం ఘనంగా చేశారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కూరగాయలు, పండ్లు, పుష్పాలతో అలంకరణ నిర్వహించారు.

## రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి: ఎమ్మెల్యే

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద ప్రధాన మార్గాన్ని త్వరలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి నుంచే మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా నగరపాలక సంస్థ కమిషనర్ నందనతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 48 గంటల్లో టెండర్లు పిలవాలని మంత్రి కార్పొరేషన్ కమిషనర్‌ని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు(మార్కెట్ సెంటర్): కూటమి పాలనలో వ్యవస్థలు గాడిలో పడుతున్నాయని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రాంతంలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. విఘ్నేశ్వరపురంలో బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్వారం సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## 'పూర్వ' కలయిక

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: నగరంలోని మూలాపేటలోని ఈఎస్‌ఆర్‌ఎం, రామయ్యబడి, వేద సంస్కృత తదితర పాఠశాలల్లో 1975-85 సంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం నగరంలోని సిటీ ఇన్ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆ రోజుల్లో విద్యార్థులకు ట్యూషన్ చెప్పిన ఉపాధ్యాయులు బండి వెంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి శ్రీనివాస్, అధ్యక్షులు రమేష్, పూర్వ విద్యార్థులు ప్రసాద్, జయసింహా, మోపూరు పెంచలయ్య, నాగేశ్వరరావు, సురేష్, పాల్గొన్నారు.

మూలాపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు

## యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేకుంటే రానున్న రోజుల్లో పోరాటాలు చేపడతామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎంసీ కల్యాణ మండపంలో డీవైఎఫ్ఐ గ్రామీణ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కట్టా సతీష్, కొండా ప్రసాద్, పెంచల నరసయ్య పాల్గొన్నారు.

# కుళ్లిపోతే మాకేం.. రోగాలు మీకేగా!

## నగరంలో ఇష్టారాజ్యంగా మాంసం విక్రయాలు

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

మాంసం విక్రయాల్లో నిబంధనలకు నీళ్లొదిలారు. మార్కెట్లపై పర్యవేక్షణ.. నియంత్రణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మృతి చెందిన మేకలు, గొర్రెలను కూడా వధించి విక్రయిస్తున్నారు. రోజుల తరబడి పచ్చి మాంసాన్ని ఫ్రిజ్‌లలో నిల్వ చేసి పురుగులు పట్టిన, వాసన వస్తున్నా అమ్ముతున్నారు. ఇందులో బ్యాక్టీరియా వృద్ధి చెంది తింటే వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఏడాది క్రితం నగరపాలకసంస్థ అధికారులు మటన్ మార్కెట్‌పై దాడులు చేయగా.. విక్రయానికి నిల్వ ఉంచిన కేజీల కొద్ది మాంసం, తలకాయలు, కాళ్లు బయటపడ్డాయి. కోడి మాంసం విక్రయ దుకాణాలపై దాడులు చేయగా.. ఫ్రిజ్‌లలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పురుగులు పట్టిన, కుళ్లిన మాంసం కనుగొన్నారు. హరనాథపురంలోని చికెన్ సెంటరులో తనిఖీ చేయగా 200 కేజీలు నిల్వ ఉంచిన మాంసం లభించింది. లెగ్ పీసులు, లివర్, కందనకాయలు, లాలీపాప్‌లు, బోన్‌లెస్ చికెన్ ఇలా.. వేరుచేసి ఫ్రీజర్లలో పెట్టి విక్రయిస్తున్నారు. దీంతో అప్పటి కమిషనర్ రూ.50 వేలు జరిమానా విధించి, మాంసం నిల్వ ఉంచేందుకు ఉపయోగించిన రెండు ఫ్రీజర్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. జీఎన్‌టీ రోడ్డులో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద ఉన్న రెస్టారెంట్‌లో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన వండిన మాంసాహారాన్ని గుర్తించి రూ.20 వేలు, నిప్పో సెంటరులోని రెస్టారెంటుకు రూ.20వేలు జరిమానా విధించారు. అయ్యప్పగుడి ప్రాంతంలోని బార్ అండ్ రెస్టారెంట్‌లో తనిఖీ చేయగా.. ఫ్రిజ్‌లలో బూజు పట్టిన, కుళ్లిన మాంసాహారాన్ని స్వాధీనం చేసుకుని రూ.50 వేలు జరిమానా విధించారు. ఏడాది నుంచి మళ్లీ కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ప్రతి నెలా మామూళ్లు అందుతుండడంతో వాటివైపు చూడడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ ముద్ర లేకుండానే విక్రయిస్తున్న మటన్

### అమలవుతోంది ఇలా..

- చాలా సందర్భాల్లో రోగాల బారిన పడిన గొర్రెలను, మేకలను వధిస్తున్నారు.
- జిల్లాలోని ఏ పురపాలికల్లో పశువైద్యుడు పరీక్షించి నిర్ధారించకుండానే వందల కొద్దీ గొర్రెలను, మేకలను విక్రయిస్తున్నారు.
- జంతు వధ చట్టానికి విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ కోస్తున్నారు. కొంతమంది ఇంటి దగ్గరే కోసుకొచ్చి నాలుగు చక్రాల బళ్లు, రహదారుల వెంట విక్రయిస్తున్నారు.
- అపరిశుభ్ర వాతావరణంలో కోసిన మాంసం తినడంతో వ్యాధులు సోకే ప్రమాదముందనివైద్యులుచెబుతున్నారు.

### నిబంధనలు ఇవీ..

- గొర్రెలు, మేకలను వధించే ముందు ఆరోగ్యంగా ఉన్నట్లు పశువైద్యాధికారి ధ్రువీకరించాలి.
- కోసిన ప్రతి భాగాన్ని పశువైద్యుడు పరిశీలించాలి. భుజించడానికి వీల్లేని భాగాలను ఆయన సమక్షంలో తొలగించాలి.
- ఆరు నెలల వయసు దాటిన వాటినే అమ్మకాలకు అనుమతించాలి.
- నగర, పురపాలిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జంతు వధశాలల్లోనే వధించి, శుభ్రం చేసిన మాంసాన్ని విక్రయించాలి.
- గొర్రెలను కోసిన తర్వాత మళ్లీ పశువైద్య శాఖ లేదా పురపాలక సిబ్బంది ఆ మాంసంపై ముద్ర వేసిన తర్వాతే విక్రయించాలి.
- జంతు వధ చట్ట ప్రకారం గొర్రె, మేక, కోళ్లను నేలపై వధించరాదు.

### పాటిస్తే ఒట్టు..

ప్రత్యేక జంతు వధశాలలు లేకపోవడం.. ఉన్నా సరైన నిర్వహణ లేకపోవడం, పశువైద్య అధికారుల పర్యవేక్షణ కొరవడడం తదితర కారణాలతో నెల్లూరు జిల్లాలో మాంసాహారులు నాణ్యమైన మాంసాన్ని పొందలేకపోతున్నారు. చాలా ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగుతున్నాయి. తగినంత సిబ్బంది లేకపోవడంతో మాంసం నాణ్యతను పట్టించుకునే వారు లేకుండా పోయారు. ప్రజారోగ్య, పశువైద్యాధికారులు జంతువులను పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరిస్తూ ముద్ర వేయాల్సి ఉండగా.. ఇదెక్కడా అమలు కావడం లేదు. నగర వ్యాప్తంగా రెస్టారెంట్లు, హోటళ్లు, మాంసం మార్కెట్లు, చికెన్ దుకాణాల్లో తనిఖీలు చేస్తామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య వివరించారు. నిబంధనల ప్రకారం విక్రయాలు జరిగేలా చూస్తామని తెలిపారు.

## సామూహిక గణేశ నిమజ్జనోత్సవం

ఉత్సవ సమితి కార్యాలయ సమావేశంలో మాట్లాడుతున్న మహేంద్రరెడ్డి

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: వినాయక చవితి సందర్భంగా సామూహిక గణేశ్ నిమజ్జనోత్సవాలు ఆగస్టు 31న తేదీ నిర్వహిస్తున్నట్లు విజయ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి తెలిపింది. నెల్లూరులోని టీవీఎస్ కల్యాణ్ సదన్‌లో ఆదివారం ఉత్సవ సమితి కార్యవర్గ సమావేశం జరిగింది. వచ్చే నెల 27వ తేదీ వినాయక చవితి జరగనుండడంతో గణపతి మండపాల నిర్వాహకులకు ఈ నెల 20న గణేశ్ మహల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, సురేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సమితి నాయకులు వేలూరు మహేష్, శ్రీకాంత్, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, వేలూరు శ్రీనివాసులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసశర్మ

వివేకానంద: బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శులుగా నెల్లూరుకు చెందిన పేరేప శ్రీనివాసశర్మ, ప్రసాదరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరులో రాష్ట్ర బ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా కామేశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా హరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వాసుదేవరావు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి ఆలయంలో ప్రభుత్వ కార్యదర్శికి ఘనస్వాగతం

నగరంలోని రాజరాజేశ్వరి ఆలయాన్ని రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్, ప్రత్యేక రెవెన్యూ కార్యదర్శి జి.జయలక్ష్మి సందర్శించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు చేశారు. దేవాదాయ శాఖ భూములను వెబ్‌ల్యాండ్‌లో అప్‌డేషన్ చేయాలని ఆ శాఖ సహాయ కమిషనర్ జనార్ధనరెడ్డి విన్నవించారు., - న్యూస్‌టుడే,నెల్లూరు (జడ్పీ)

## పొంచి ఉన్న ప్రమాదం

నగరంలోని శెట్టిగుంట రోడ్డు, పప్పుల వీధి, లక్ష్మీపురం ప్రాంతాల్లో భారీ వాహనాలు రోడ్డు వెంబడే నిలిపి వేస్తున్నారు. దీంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్ణీత సమయంలో భారీ వాహనాలు వచ్చేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)

## పూడిక తీశారు.. తొలగించడం మరిచారు

నగరంలోని ఏసీనగర్ నగర్ నుంచి పాత ఆంధ్రా బ్యాంక్ రోడ్డులో కాలువలో కొద్ది రోజులు క్రితం పూడిక తీశారు. ఈ మట్టి రోడ్డు వెంబడి పోశారు. వారం రోజులు గడుస్తున్నా అక్కడి నుంచి తొలగించలేదు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

## డంపింగ్ యార్డులా సర్వోదయ కళాశాల

ఎందరో విద్యావేత్తలను తీర్చిదిద్దిన నగరంలోని సర్వోదయ కళాశాల నేడు డంపింగ్ యార్డులా తయారైంది. గత ప్రభుత్వం ఈ కళాశాలను మూసివేసింది. దీంతో ఈ ప్రాంగణంలో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తున్నారు. మైదానం, ప్రహరీ అంచుల్లో ఇవి పేరుకుపోయాయి. - న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

## న్యూమిలటరీ కాలనీలో రోడ్డుపై చెత్త

నగరంలోని పొదలకూరు రోడ్డు న్యూమిలటరీ కాలనీలో నగర పాలక సంస్థ అధికారులు చెత్త కుండీ పెట్టకపోవడంతో రోడ్డుపైనే స్థానికులు చెత్త వేస్తున్నారు. కాలువలో పడి నీరు పోక ఇబ్బందులు పడుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతిసెంటర్)

## అవగాహన సదస్సు

నెల్లూరు (జీజీహెచ్), న్యూస్‌టుడే: నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్లకు కీళ్లు, కండరాలు, ఎముకలు, ఆటో ఇమ్యూనో వ్యాధుల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, బలరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పింఛనర్ల సమావేశం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా నిర్వహించనున్నామని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్‌ఎం.గౌస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

**సమస్య:** ధనలక్ష్మీపురం, సాయిబాలాజీ గార్డెన్స్ మూడో వీధిలో స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. లూజ్ కనెక్షన్‌తో లైటు వెలగడం లేదు. - గిరిధర్, స్థానికుడు

**సమాధానం:** పరిశీలించి విద్యుద్దీపం వెలిగేలా చర్యలు చేపడతాం. - నందన్, కమిషనర్

? వెంకటేశ్వరపురంలో కాలువలను శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. ఇళ్లలో ఉండలేకున్నాం. -కామాక్షి

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం.

- డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే

## తెరపై ఈనాడు

**ఎం.I సినిమాస్.:** స్క్రీన్. 1 సూపర్‌మ్యాన్.3డి తెలుగు, నాలుగు షోస్ స్క్రీన్ ..2. ఓ భామ. అయ్యో రామ తెలుగు, నాలుగు షోస్ స్క్రీన్..3.జురాసిక్ వరల్డ్ 3డి తెలుగు రెండు షోస్, 100 తెలుగు రెండు షోస్

**స్పైన్.సినిమాస్:** స్క్రీన్ 1. జురాసిక్ వరల్డ్ 3డి, మూడు షోస్, ఎఫ్.1, ఇంగ్లీషు ఒక షోస్ స్క్రీన్..2 మైబేబీ తెలుగు రెండుషోస్, కుబేర తెలుగు రెండుషోస్, స్క్రీన్..3.100 తెలుగు రెండు షోస్, ఎఫ్.1, ఇంగ్లీషు రెండు షోస్ స్క్రీన్.. 4 సూపర్‌మ్యాన్3డి, తెలుగు మూడు షోస్, సూపర్ మ్యాన్3డి, ఇంగ్లీషు ఒక షో స్క్రీన్..5 ఓ భామ అయ్యో రామ తెలుగు, నాలుగు షోస్ **రెయిన్ సినిమా :** స్క్రీన్ 1.. సూపర్ మ్యాన్3డి, తెలుగు, సూపర్ మ్యాన్3 డి ఇంగ్లీషు స్క్రీన్..2. ఓ భామ.. అయ్యో రామ తెలుగు, జురాసిక్ వరల్డ్ 3డీ, (తెలుగు), స్క్రీన్..3.. కుబేరా తెలుగు, ఓ భామ అయ్యో రామ తెలుగు, ఎఫ్1, ఇంగ్లీషు , స్క్రీన్..4.. ది100 తెలుగు, వర్జిన్ బాయ్స్ తెలుగు, దీర్ఘాయుష్మాన్‌భవ, తెలుగు, బకాసుర రెస్టారెంట్, తెలుగు

## సాంకేతికతతో రోగులకు మెరుగైన వైద్యం

జ్యోతి వెలిగిస్తున్న అపోలో ఆసుపత్రి సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ శ్రావణిరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: వైద్య రంగంలో వస్తున్న సాంకేతికతపై అవగాహన పెంచుకుని రోగులకు మెరుగైన చికిత్స అందించాలని అపోలో ఆసుపత్రి సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రావణిరెడ్డి పేర్కొన్నారు. పల్మనాలజీ విభాగంలో మారిన సాంకేతిక చికిత్స పద్ధతులపై అపోలో ఆసుపత్రి, జిల్లా పల్మనాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో ఆదివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. దీన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌వో వి.సుజాతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకుని చికిత్స చేస్తే రోగికి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. పల్మనాలజీ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ పిట్టి మల్లికార్జున, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 280 మంది వైద్యులు, పీజీ విద్యార్థులు, క్రిటికల్ కేర్ సిబ్బంది పాల్గొన్నారు. బ్రాంకోస్కోపి, ఈబీయూఎస్, ఎయిర్ వే మేనేజ్‌మెంట్ వంటి ఆధునిక శ్వాసకోశ చికిత్స విధానాలపై పలువురు వైద్యులు తమ అనుభవాలను వివరించారు.

# శాంతినగరం.. సమస్యల వలయం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని శాంతినగర్ సమస్యలమయంగా మారింది. పగుళ్లు ఇచ్చిన రోడ్లు, పూడిక నిండిన కాలువలతో దుర్గంధాన్ని భరించలేక స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతం నగరం నడిబొడ్డున ఉన్నా సరైన సౌకర్యాలు మాత్రం కరవయ్యాయి. కాలనీకి రెండు వైపులా పెద్ద కాలువలు ప్రవహిస్తున్నాయి. గతంలో సాగునీరు పారుదల అయ్యే వీటిలో ప్రస్తుతం మురుగునీరు ప్రవహిస్తోంది. కొన్ని నెలలుగా వీటిలో పూడిక తొలగించకపోవడంతో ప్రవాహం సాగడం లేదు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి కంపుకొడుతున్నాయి. ఈ ప్రాంతంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. కాలువ సమీపంలో నివసించే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దోమలు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నిత్యం వెదజల్లుతున్న దుర్వాసన, దోమల కారణంగా ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. వీధుల్లోని కాలువలు పూడికతో నిండిపోయాయి. బట్వాడిపాలెం నుంచి ఫత్తేఖాన్‌పేటకు వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది. ప్రధాన రహదారైనా కొంతభాగం కాలువలు కూడా నిర్మించలేదు. శాంతినగర్ పక్కనే ఉన్న సకిలంవారివీధిలో రోడ్డు దారుణంగా ఉంది. నాసిరకంగా నిర్మించడంతో ఎక్కడిక్కడ పగుళ్లు ఇచ్చి కుంగిపోయింది. కుంగిన చోట ఓ కరెంట్ స్తంభం కాలువలో పడిపోయింది. ఆరు నెలలుగా ఉన్నా దీన్ని తీసేందుకు విద్యుత్తు శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా కాలువలో పూడిక తీయడం కూడా కష్టంగా ఉంటోంది. మరోచోట రోడ్డు కుంగి ఏకంగా ఆ వ్యర్థాలతో కాలువ పూడిపోయింది. ఇక్కడ చాలా వరకు ఇరుకురోడ్లు కావడంతో స్థానికులు రాకపోకలకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సకిలంవారి వీధిలో కుంగిన రోడ్డు

## యూరియా అందక రైతుల ఇబ్బందులు

న్యూస్‌టుడే,నెల్లూరు (పద్మావతి సెంటర్): జిల్లాలో యూరియా సకాలంలో అందక రైతులు అల్లాడుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి గంగపట్నం రమణయ్య ఆరోపించారు. నగరంలోని రామకోటయ్యభవన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎడగారు సీజన్‌లో నీరు సమృద్ధిగా ఉండటంతో రెండు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారన్నారు. ప్రస్తుతం అంకుర దశలో ఉందన్నారు. ఇప్పుడు యూరియా అవసరం ఉందన్నారు. ఇది అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో పలువురు రైతు నాయకులు పాల్గొన్నారు.

## యోగా న్యాయ నిర్ణేతల శిక్షణలో జిల్లా ప్రతినిధులు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: చిత్తూరులో ఈ నెల 11 నుంచి జరిగిన అయిదో రాష్ట్ర స్థాయి యోగా న్యాయనిర్ణేతల శిక్షణ సదస్సుకు జిల్లా ప్రతినిధులుగా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచలయ్య, పద్మావతి, వెంకటసుబ్బయ్య, కావ్యశ్రీ, రమేష్ చౌదరి, ప్రసూన, రంగారెడ్డి, మానస, రాజేంద్ర, శ్రీనివాసులు, దినేష్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు శిక్షణలో పాల్గొన్నారు. వీరికి రాష్ట్ర అసోసియేషన్ సాంకేతిక కమిటీ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు.

## నిత్యావసర సరకుల పంపిణీ

నెల్లూరు (క్రీడా విభాగం) : ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.40 వేల విలువైన నిత్యావసర సరకులు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణ రెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్ నాయుడు, 203 ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, షేక్ నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

## డీకేడబ్ల్యూ కళాశాలకు 50 బెంచీలు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని నిర్మల సౌధలో ఆదివారం రెడ్డి ఐక్య వేదిక సమావేశం జరిగింది. మహిళా కార్యవర్గ సభ్యురాలు కవిత సహకారంతో డీకేడబ్ల్యూ కళాశాలలో ఇంటర్ టాపరైన విద్యార్థి అనితకు పది వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కళాశాలకు 50 బెంచీలు అందజేస్తామని వేదిక నాయకులు ప్రకటించారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి, డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి, నాయకులు హరినారాయణరెడ్డి, సతీష్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి సాయం చేస్తున్న రెడ్డి ఐక్య వేదిక నాయకులు

## వివాహిత మెడలో బంగారు గొలుసు అపహరణ

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: వివాహిత మెడలోని బంగారు గొలుసును దుండగుడు చోరీ చేసిన ఘటన జనార్ధన్‌రెడ్డి కాలనీ లక్ష్మీపార్వతి నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికంగా నివాసం ఉంటున్న సౌమ్య శనివారం రాత్రి తన కుమార్తెతో కలిసి ఇంట్లో నిద్రపోయారు. ఉక్కపోతగా ఉండడంతో తలుపులు ఓరగా వేశారు. ఆదివారం తెల్లవారు జామున దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి వివాహిత మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు తెంపుకెళ్లాడు. బాధితులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## కనిపించడం లేదని ఫిర్యాదు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: అయిదు రోజులుగా తన సోదరుడు కనిపించడం లేదని అతని అన్న నెల్లూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరుగ్రామీణ పరిధిలోని యలమవారిదిన్నె ప్రాంతానికి చెందిన కాలయ మోహన్ చందు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అయిదు రోజులుగా కనిపించడం లేదని సోదరుడు డేనియల్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సంబంధిత అధికారులను కలిసి విన్నవించినా పరిష్కరించలేదని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య, సీఐటీయూ నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా నెల్లూరు నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ కార్మికులు విధులు బహిష్కరించి గాంధీబొమ్మ సెంటరు నుంచి వీఆర్సీ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పి.సూర్యనారాయణ, శివాజీ, సురేష్, శ్రీనివాసులు, బాలు, కామాక్షమ్మ, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

## సాయిదర్బార్‌లో నేత్ర వైద్య శిబిరం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: గురుపౌర్ణిమ సందర్భంగా ఆదివారం నెల్లూరులోని బాలాజీనగర్ దగ్గరున్న పద్మావతినగర్‌లోని శ్రీసాయిదర్బార్‌లో నేత్ర వైద్య శిబిరం జరిగింది. మోడరన్ ఐ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ వైద్య బృందం పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని పర్యవేక్షించిన మందిర ఛైర్మన్ మధుసాయి మాట్లాడుతూ శిబిరంలో పాల్గొన్న 45 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చెయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హేమలత, రామసుబ్బారావు, సాయిదర్బార్ గౌరవ సలహాదారు రామసుబ్బయ్య, యువసేవా దళ్ సభ్యులు పాల్గొన్నారు.

# సింహపురి.. ఇక శుభ్రం

స్వీపింగ్ యంత్రాలు

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: అయిదేళ్ల తర్వాత నగరపాలకసంస్థకు కొత్త వాహనాలు, పరికరాలు అందుబాటులోకి రావడంతో పారిశుద్ధ్యం మెరుగుపడుతోంది. ఇటీవల 80 డంపర్‌బిన్లు, 10 స్వీపింగ్ మిషన్లు, 200 పుష్‌కార్టులు వచ్చాయి. వీటితో పాటు మరో పది వరకు చిన్న, పెద్దవి స్వీపింగ్ యంత్రాలు ఉన్నాయి. ఇవి కాకుండా కొత్త వాహనాలు, పరికరాలు కొనుగోలుకు ప్రతిపాదనలు చేశారు.

### ఖర్చవుతున్నా..

పారిశుద్ధ్య పనులకు ఏటా రూ.50 కోట్లకుపైగా ఖర్చవుతున్నా నగరంలో ఆ స్థాయిలో శుభ్రత లేదనే విమర్శలు ఉన్నాయి. పదేళ్ల నాటి నాటి టిప్పర్లు, ఆటోలు వినియోగిస్తుండగా.. తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిలో 80 వరకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చారు. వాహనాల కొరతను అధిగమించేందుకు 200 ఈ-ఆటోలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ అనుమతి కోసం పంపించారు. అప్పటి వరకు 105 అద్దె ట్రాక్టర్ల ద్వారా వ్యర్థాలను సేకరిస్తున్నారు.

### 40 టన్నుల కాంపాక్టర్లు

నగర వ్యాప్తంగా ప్రతి రోజూ 320 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీన్ని అల్లీపురం నుంచి దొంతాలి డంపింగ్ యార్డుకు తరలించేందుకు ప్రతి నెలా రూ.50 లక్షల వరకు గుత్తేదారులకు చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 40 టన్నుల సామర్థ్యం కలిగిన అయిదు కాంపాక్టర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి రోజూ వాటి ద్వారా దొంతాలి డంపింగ్‌యార్డుకు చెత్తను తరలిస్తుండటంతో నెలకు రూ.50 లక్షల వరకు అవుతోంది.

BEFORE THE V ADDL. MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL : NELLORE
M.V.O.P.No. 390/2024
1. Shaik Reena
2. Shaik Parveen ... Claimants
Vs.
1. Sarvani Jabiulla and 3 others ... Respondents
Notice to 4th Respondent
Shaik Rafi Ahamad S/o Late Shaik Usman, resident of No. 22/4/38, Yahali Street, Kotamitta, Nellore City.
పై నెంబరున క్లయిమెంట్స్ మీపై నష్ట పరిహారములు కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే. 17-07-2025దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
C.భాస్కర్, B.Com., B.L., క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the I Addl. Junior Civil Judge : Nellore
O.S.No. 610/2022
Shaik Habibunnissa ... Plaintiff
Vs.
1. Shaik Mahammadunisa and 3 Others ... Defendants
NOTICE
To,
D1. Shaik Mahammadunisa, W/o. Late Ali Hussain
D2. Shaik Humera Begum W/o. Late Mushtaq Hussain
D3. Shaik Burhan Hussain S/o. Late Mushtaq Hussain
D4. Shaik Kousar Jabeen D/o. Late Mushtaq Hussain
D1, D2, D3 & D4 are residing at D.No: 22/522, Dycus Road, Big Bazar, Nellore - 524001.
పై నెంబరున వాది దావా షెడ్యూలు ఆస్తిని భాగపంపకములు జరిపించమని కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తే 22-07-2025దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
వై. వెంకటసురేష్, B.Sc., B.L., వాది తరపు అడ్వకేట్, నెల్లూరు

(c) eenadu

# ఏటా ముంపు.. ఏదీ కనువిప్పు!

➡ ఆక్రమణల చెరలో కాలువలు, వాగులు ➡ దృష్టిసారించని అధికారులు, పాలకులు

**కదిరి, పుట్టపర్తి, కొత్తచెరువు, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే:** ఆకాశంలో మబ్బులు కమ్మినా.. చినుకు రాలినా పురప్రజలు వణుకుతున్నారు. ఎక్కడ వరద ముంచేస్తుందోనని భయపడుతున్నారు. కదిరి, కొత్తచెరువు, ధర్మవరం పట్టణాలకు ఎగువన పెద్ద చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు నిండి మరువలు పారితే వరద పట్టణాలను ముంచెత్తుతోంది. దీనికి వాగులు, ఇరిగేషన్ కాలువలు ఆక్రమణకు గురవటమే కారణం. పట్టణాలకు ఆనుకుని ఉన్న కాలువలు, వాగులను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో అవి కుంచించుకుపోయాయి. ఫలితంగా వరదతో లోతట్టు ప్రాంతాలు జలమయమై పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు. వరదలప్పుడు మాత్రమే అధికారులు సహాయక చర్యలు, పాలకులు పరామర్శలతో హడావుడి చేస్తున్నారు. తర్వాత పట్టించుకోవడం లేదు. అధికారులు సర్వే చేసి ఆక్రమణల చెర నుంచి వాగులు, కాలువలను సంరక్షించి, వరద ముప్పు నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రాయచోటి రోడ్డు రైల్వేవంతెన సమీపంలో ఆక్రమణకు గురైన కాలువ

★ కదిరికి తూర్పున విఠలరాయునిచెరువు, దక్షిణం వైపు దేవరచెరువు ప్రధానమైనవి. వర్షపు నీటితో నిండే చెరువుల మరువలు కదిరి మీదుగా ప్రవహిస్తాయి. నివాసాలకు చేరువలోని మద్దిలేరు వాగులో సున్నపుగుట్ట ప్రదేశంలో వరద కలుస్తుంది. రాయచోటి రోడ్డు నుంచి పట్టణ శివారు వరకు మద్దిలేరు వాగు ఆక్రమణకు గురైంది. సున్నపుగుట్టతండా వరకు 30 మీటర్లు, ఆ తర్వాత 40 మీటర్లు ఉండాల్సిన వాగు సగానికి మించి అన్యాక్రాంతమైంది. దీంతో అరవ గుడిసెలు, నానాదర్గా, శివాలయం, వాసవీనగర్, కోనేరు తదితర ప్రాంతాల జనం వరద ముప్పుతో భీతిల్లుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కాలువ సర్వే, ఆక్రమణ కాకుండా రాతి కట్టడానికి రూ.2.50 కోట్లతో చేపట్టిన ప్రణాళిక ప్రతిపాదనలతోనే ఆగింది

★ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తికి ఆనుకుని చిత్రావతి ప్రవహిస్తోంది. పట్టణం వైపున ప్రభుత్వ స్థలంతోపాటు నది లోతట్టు స్థలాన్ని ఆక్రమించారు. నది అంచుల్లోకి వ్యర్థాలను తరలించటం, స్థలం ఏర్పడ్డాక కబ్జా చేస్తున్నారు. దీంతో చిత్రావతి విస్తీర్ణం తగ్గిపోయి పట్టణానికి వరద ముప్పు పొంచి ఉంది.

★ బుక్కపట్నం చెరువు ప్రధాన మరువ కొత్తచెరువుకు ఆనుకుని వెళ్తుంది. గ్రామానికి ఆవలివైపు ఇరిగేషన్ స్థలం ఆక్రమణతో వాగు కుంచించుకుపోయింది. వరద ప్రవాహం నివాసాల వైపు దూసుకొస్తుండటంతో ఆందోళన రేకెత్తిస్తోంది.

★ ధర్మవరం చెరువు లోతట్టులో నిర్మాణాలు వెలుస్తున్నాయి. చెరువు విస్తీర్ణం తగ్గటంతో ఎగువ నుంచి వచ్చే వరదనీరు పట్టణంలోని లోనికోట సమీప నివాసాలను ముంచెత్తుతోంది.

**త్వరలోనే తొలగింపు చర్యలు..**

**- గురుమూర్తి, ఇరిగేషన్ ఈఈ**

త్వరలోనే వాగులు, కాలువల ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడతాం. పుట్టపర్తి సమీప చిత్రావతి, కదిరికి ఆనుకుని ఉన్న మద్దిలేరుతోపాటు ఇతర ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన కాలువలను గుర్తిస్తున్నాం. అందరి సహకారంతో ఆక్రమణలు తొలగిస్తాం.

## ఎస్కేయూలో కొత్త కోర్సులు

**ఎస్కేయూ, న్యూస్‌టుడే:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో 2 కొత్త కోర్సులకు ప్రభుత్వం అనుమతిచ్చింది. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్- డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సులు ఈ విద్యా సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాతిపదికన ఈ కోర్సులు నిర్వహిస్తారు. ఇప్పటికే అమలులో ఉన్న కోర్సుల్లో సీఎస్ఈ, ఈసీఈ కోర్సులకు 60 సీట్లు ఉండగా అదనంగా మరో 60 పెంచారు. ఆయా కోర్సుల్లో ఇక నుంచి 120 సీట్లు భర్తీ చేస్తారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి ఐచ్ఛికాలు ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రైతన్నలకు సూక్ష్మ సేద్యానికి చేయూత

■ రాయితీపై పరికరాలు ■ ఈ ఏడాది 14 వేల హెక్టార్లు లక్ష్యం

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** కరవు జిల్లాలో రైతులు ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకుని, అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసేలా కూటమి ప్రభుత్వం బిందు, సూక్ష్మ పరికరాలను రాయితీతో అందిస్తోంది. ఏపీ సూక్ష్మ నీటి సాగు పథకం (ఏపీఎంఐపీ)ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద రైతులకు రాయితీతో పరికరాలను రెండు దశాబ్దాలుగా అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్లపాటు ఈ పథకాన్ని మూలనపడేశారు. చివరి ఏడాదిన్నర హడావుడి చేసినా.. నామమాత్రంగా సరఫరా చేసి చేతులు దులుపుకొన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో కంపెనీలు పరికరాల సరఫరాను నిలిపివేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొంత బకాయిలు జమ చేయడంతో పరికరాలు అందించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

బిందు, సూక్ష్మ పరికరాలను పరిశీలిస్తున్న పీడీ సుదర్శన్, అధికారులు

**రాయితీ ఇలా..:** రైతులు బిందు, తుంపర సేద్య పరికరాలకు దరఖాస్తు చేయాలంటే.. నీటి వసతి, విద్యుత్తు సౌకర్యం ఉండాలి. ఆధార్‌కార్డు, వన్‌బీ, బ్యాంకు ఖాతా పుస్తకం, గ్రామ రెవెన్యూ భూమికి సంబంధించిన స్కెచ్‌తో రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చు. రైతు కోరుకున్న కంపెనీ నుంచి పరికరాలు తీసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలకు కాకుండా ఇతర రైతులకు ఐదెకరాల్లోపు పంటల సాగుకు 90 శాతం, ఐదు నుంచి పదెకరాల్లోపు ఉన్నవారికి 70 శాతం, పది నుంచి 12.5 ఎకరాలు కలిగిన రైతులకు 50 శాతం రాయితీతో పరికరాలు అందించనున్నారు.

**21,843 దరఖాస్తులు :** జిల్లాలో 2025-26 సంవత్సరానికి 14 వేల హెక్టార్లలో సూక్ష్మసేద్యం సాగు లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల ద్వారా 21,843 మంది రైతులు 16,703 హెక్టార్లలో సాగుకు అవసరమైన పరికరాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 342 మంది రైతులకు చెందిన 531 హెక్టార్ల పొలం పరిశీలన పూర్తయింది. సంబంధిత రైతులు తమ వాటా నగదు చెల్లించారు. త్వరలోనే వీరికి పరికరాలు పంపిణీ చేస్తామని పీడీ సుదర్శన్ చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన రైతులందరికి పరికరాలు అందిస్తామని తెలిపారు.

నాటకంలో ఓ సన్నివేశం

## ఆకట్టుకున్న అయాం సాయిబాబా నాటకం

**పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన 'అయాం సాయిబాబా' నాటకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మూడోరోజు ఆదివారం అమెరికా గ్లోబల్ కౌన్సిల్-1 సత్యసాయి భక్తులు ప్రశాంతి నిలయంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేద పఠనానంతరం అమెరికా బాలవికాస్ విద్యార్థులు సత్యసాయి బాబా జీవితంలోని కొన్ని ఘట్టాలను తీసుకుని ప్రదర్శించిన 'అయాం సాయిబాబా' నాటకం ఆహుతులను ఆకట్టుకుంది. మంగళహారతి అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

# సొమ్ము వసూలు.. చెల్లింపుల్లో తకరారు!

■ వేరుసెనగ విత్తన బకాయి రూ.5.99 కోట్లు ■ సిబ్బందిని రిలీవ్ చేయకుండా నిలుపుదల

**అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే:** వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో పని చేసే వీఏఏ, వీహెచ్ఏ, ఏహెచ్ఏ, వీహెచ్ఏ సిబ్బంది బదిలీలు చేశారు. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత నెల రోజులుగా రాయితీ వేరుసెనగ, ఇతర విత్తనాల పంపిణీ కొనసాగుతోంది. ఒక్కో కేంద్రంలో ఎవరో ఒకరు మాత్రమే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రైతులతో సొమ్ము వసూలు చేసి విత్తనకాయలు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థకు ఉమ్మడి జిల్లాలో సుమారు 6 వేల క్వింటాళ్లకు రూ.5,99,58,119 సొమ్మును సిబ్బంది చెల్లించాల్సి ఉంది. ఆ సొమ్ము వసూళ్ల కోసం ఏపీ సీడ్స్ అధికారులు రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.

**పంపిణీకి ఆటంకం**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 867 రైతు సేవా కేంద్రాల్లో 820 మంది సిబ్బందిని బదిలీ చేసి ఉత్తర్వులు జారీ చేశారు. సిబ్బంది బదిలీలతో విత్తన పంపిణీకి తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,14,510 క్వింటాళ్ల విత్తన వేరుసెనగ కేటాయించారు. 869 రైతు సేవా కేంద్రాలకు రాయితీ వేరుసెనగ విత్తనం కేటాయించి, ఏపీ సీడ్స్ ద్వారా సరఫరా చేశారు. ప్రస్తుతం కేంద్రాల్లో విత్తన పంపిణీ కొనసాగుతోంది. అయితే సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని తెలుస్తోంది. ఇప్పటివరకు 93,595 క్వింటాళ్ల విత్తనం కావాలని 1,09,750 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో 92,256 క్వింటాళ్లను లక్షకుపైగా రైతులకు పంపిణీ చేశారు. ఆర్ఎస్‌కేల్లో ఇంకా సుమారు 8 వేల క్వింటాళ్ల వరకు వేరుసెనగ కాయల నిల్వలు ఉన్నట్లు ఏపీ సీడ్స్ అధికారులు తెలిపారు.

**రైతు సేవా కేంద్రాల్లో..**

రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ వాటా సొమ్ము సిబ్బందికి చెల్లించి వేరుసెనగ కాయలు తీసుకెళుతున్నారు. లక్ష క్వింటాళ్ల విత్తనానికి మొత్తం సొమ్ము రూ.59.52 కోట్లు. కాగా నాన్‌సబ్సిడీ మొత్తం రూ.53.52 కోట్లను ఆర్ఎస్‌కే సిబ్బంది ఏపీసీడ్స్‌కు చెల్లించారు. ఇంకా 293 రైతు సేవా కేంద్రాలకు సంబంధించి 6 వేల క్వింటాళ్లకు రూ.5.99 కోట్లు చెల్లించాల్సి ఉంది.

**బకాయిలు చెల్లిస్తేనే సిబ్బందిని రిలీవ్ చేస్తాం**

**- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారి (అనంతపురం)**

ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏపీ సీడ్స్ ద్వారా రాయితీ వేరుసెనగ విత్తనం సరఫరా చేశాం. ఏపీసీడ్స్‌కు నాన్‌సబ్సిడీ సొమ్ము రూ.5 కోట్ల వరకు పెండింగ్‌లో ఉంది. రైతు సేవా కేంద్రాల సిబ్బంది బదిలీల కౌన్సెలింగ్ పూర్తి అయ్యింది. అయితే సిబ్బందిని రిలీవ్ చేయొద్దని అన్ని మండలాల వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేశాం. నోడ్యూస్ సర్టిఫికెట్ ఇస్తేనే రిలీవ్ చేస్తామని చెప్పాం.

## చర్లపల్లి నుంచి ధర్మవరానికి ప్రత్యేక రైలు

**పీలేరు, ములకలచెరువు, న్యూస్‌టుడే:** చర్లపల్లి నుంచి ధర్మవరానికి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రైలు చర్లపల్లి నుంచి నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, శ్రీకాళహస్తి, రేణుగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లె, కదిరి మీదుగా ధర్మవరం వరకు నడుస్తుంది. ఈ నెల 13, 20, 27, ఆగస్టు 3, 10, 17, 24 తేదీల్లో చర్లపల్లి నుంచి ధర్మవరం వరకు, అలాగే ఈ నెల 14, 21, 28, ఆగస్టు 4, 11, 18, 25 తేదీల్లో ధర్మవరం నుంచి చర్లపల్లికి నడుస్తుంది.




# మారని సంక్షేమ రూపురేఖలు

**అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే:** బడులు మొదలై నెల పూర్తయింది. పిల్లలందరూ బడి బాట పట్టారు. కానీ సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతు పనులు నెలలు గడుస్తున్నా మెరుగు పడట్లేదు. మామూలుగా అయితే.. వేసవి సెలవులు పూర్తి అయి విద్యార్థులు వసతి గృహాల్లో చేరే సమయానికే ఇవి పూర్తి కావాల్సి ఉంది. కొన్నింటిలో పనులు ప్రారంభం కాలేదు. ఐదేళ్ల వైకాపా హయాంలో వసతి గృహాల్లో కనీసం సున్నం కొట్టడానికి కూడా నిధులు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన అనంతరం వసతి గృహాల్లో రూపురేఖలు మార్చాలనే ఉద్దేశంతో నిధులు భారీగా మంజూరు అయ్యాయి. కానీ ఇచ్చిన నిధులను కూడా సక్రమంగా వినియోగించడంలో వైఫల్యం చెందుతున్నారు. వెలిసి పోయిన రంగులు, ఊడుతున్న పెచ్చులు వంటి సమస్యలు అలానే పీడిస్తున్నాయి.

**నిధులున్నా.. మొదలు కాని పనులు**

అసంపూర్తిగా ..

| జిల్లా | మరమ్మతులు సంఖ్య | నిధులు రూ.కోట్లు | పూర్తి | అసంపూర్తి |
|---|---|---|---|---|
| అనంతపురం | 62 | 9.25 | 29 | 33 |
| శ్రీసత్యసాయి | 60 | 9.85 | 25 | 35 |

**ఏదీ అప్పటి చొరవ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనంతపురం జిల్లాలో 10 సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు, 1 రెసిడెన్షియల్ పాఠశాలకు రూ.1.34 కోట్లు నిధులు మంజూరు చేయగా వసతి గృహాల్లో అత్యవసరం అయిన మరమ్మతు పనులు వేగంగా చేశారు. రెండో విడతలో సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతు పనులపై చొరవ చూపడం లేదు. గుత్తేదారులకు బిల్లులు కాలేదన్న ఉద్దేశంతో పనులపై శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులకు వసతులు దూరమయ్యాయి.

**విద్యార్థులకు ఆటంకం**

అనంతపురం సాయినగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో పలు రకాల మరమ్మతు పనులకు రూ.16.20 లక్షలు మంజూరు అయ్యాయి. గత సంవత్సరంలోనే నిధులు మంజూరు అయ్యాయి. ఇప్పటికే ఏడు నెలలు కావస్తోంది. ఇంకా పనులు చేయాల్సి ఉంది. మరుగుదొడ్లకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. వసతి గృహాల్లో ఇంకా పనులు సాగుతూనే ఉన్నాయి. విద్యార్థులకు వసతికి ప్రతిబంధకంగా మారింది. స్లాబుకు మరమ్మతులు చేయగా ఇటీవల మళ్లీ పెచ్చులు ఊడాయి.

అనంతపురంలోని బాలికల వసతి గృహంలో మరమ్మతుల అనంతరం ఊడిన పెచ్చులు

## ధర్మవరం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

**ధర్మవరం, న్యూస్‌టుడే:** ధర్మవరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం మూడోరోజు ధర్మవరం పట్టణంలోని సిద్దయ్యగుట్టకాలనీ, సాయినగర్‌లో పాదయాత్ర చేపట్టారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు మంజూరైనా స్థలం చూపలేదని సిద్దయ్యగుట్ట కాలనీవాసులు మంత్రి దృష్టికి తెచ్చారు. విచారించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

సిద్ధయ్యగుట్ట కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

## ఎట్టకేలకు ఏఎన్ఎంల బదిలీలు పూర్తి!

**అనంతపురం(వైద్యం),న్యూస్‌టుడే :** ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా సచివాలయాల పరిధిలో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీల ప్రక్రియను ఎట్టకేలకు అధికారులు పూర్తి చేశారు. గత నెల 30న ఏఎన్ఎంల బదిలీల ప్రక్రియను జూమ్ ప్రక్రియ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్వహించారు. బదిలీల ఉత్తర్వులను విడుదల చేయకపోవటంతో సర్వత్రా విమర్శలు వ్యక్తం అయ్యాయి. బదిలీల ప్రక్రియలో రీడిప్లాయిమెంట్ కింద పని చేస్తున్న ఏఎన్ఎంలు, ఇటీవల పదోన్నతులు పొంది శాఖలో విలీనం చేసిన ఏఎన్ఎంలకు సంబంధించిన పోస్టుల ఖాళీలను చూపకుండా గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీ ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలో గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఇచ్చిన బదిలీల ఉత్తర్వులను నిలుపుదల చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కేటాయించిన 340 పోస్టులకు సంబంధించి ఖాళీలను తొలగించి మిగిలిన పోస్టులకు బదిలీలు చేయాలని ఆదేశించారు. ఆదివారం ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న 736 మందికి గ్రేడ్-3 ఏఎన్ఎంలకు జూమ్ పద్ధతి ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి 727 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీలు చేశారు. ఈప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఆందోళన చేపట్టారు. పోలీసులకు సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వటంతో వారు ఏఎన్ఎంలకు సర్ది చెప్పి పంపారు. డీఎంహెచ్‌వో కార్యాలయానికి తాళాలు వేసి అధికారులు కౌన్సెలింగ్‌ను కొనసాగించారు. స్పౌజ్ కింద ఇచ్చిన ఉద్యోగుల విషయంలో అక్రమాలు జరిగాయని ఏఎన్ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు పారదర్శకంగా చేశామని, అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయచ్చని డీఎంహెచ్‌వో ఈబీదేవి, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

## సరిహద్దులో ఆగిన తుంగభద్రమ్మ

**బొమ్మనహాళ్, న్యూస్‌టుడే:** తుంగభద్ర జలాశయం నుంచి ఈనెల 10న హెచ్చెల్సీకి విడుదల చేసిన నీరు ఆంధ్రా సరిహద్దులోని బొమ్మనహాళ్ వద్ద ఆగాయి. హెచ్చెల్సీలో అత్యవసరంగా సాగుతున్న మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ఆంధ్రా వాటా నీరు తీసుకోవడంలో జాప్యం ఏర్పడుతోంది. 117వ కిలోమీటరు వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు పూర్తి కాలేదు. జలాశయంలో గతేడాది 19వ గేటు కొట్టుకుపోవడంతో ఈసారి నీటి నిల్వను 80 టీఎంసీలకే పరిమితం చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని వెంటనే మరమ్మతులు పూర్తిచేసి నీటి సరఫరాను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో డీఈఈ దివాకర్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (జీపీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ టీఎస్‌చేతన్ తెలిపారు. కదిరి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీవో కార్యాలయాలతో పాటు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని, వాటిని కూడా పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలుగానే పరిగణించి పరిష్కరిస్తామన్నారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు కాల్ సెంటర్ 1100 నంబరులో సంప్రదించవచ్చన్నారు. ఫిర్యాదుదారుడు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

**జిల్లా పోలీసు కార్యాలయంలో..:** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ రత్న తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.



రామకృష్ణ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న కవులు, రచయితలు

## గుత్తి రామకృష్ణ సేవలు చిరస్మరణీయం

**అనంత సాంస్కృతికం:** తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ పాత్రికేయుడు గుత్తి రామకృష్ణ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక కృష్ణ కళా మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రచయితలు, కవులు హాజరై రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. రచయితలు డా.గిరిధర్‌రాయ్, దాసన్నగారి కృష్ణమూర్తి, షేక్ రియాజుద్దీన్, డా. జూటూరు షరీఫ్ మాట్లాడుతూ.. జిల్లా చరిత్రలో గుత్తి రామకృష్ణది ప్రత్యేక అధ్యాయమన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడుగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా సంఘ సంస్కర్తగా, తొలితరం కథకుడుగా, జర్నలిస్టుగా సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా గుత్తి రామకృష్ణ స్మృతిలో అడ్‌హాక్ కమిటీ ఎంపిక చేశారు. కుమారుడు ఆనంద వర్ధన్‌ను గౌరవాధ్యక్షుడుగా, కన్వీనర్‌గా తోట నాగరాజును తాత్కాలిక కమిటీగా ఎన్నుకున్నారు.

## వేలం లేదు.. వాహనం పనికి రాదు!

శ్రీకేపల్లి మండల పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన, ప్రమాదాలకు గురైన వాహనాలు మండల కేంద్రంలోని ఠాణాలో ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. ప్రమాదాలు, కేసుల్లో వాహనాలు పట్టుబడిన తరువాత పోలీసులు కేసు నమోదు చేసి వాటిని స్టేషన్ ఆవరణలో ఉంచారు. ఐదారేళ్ల నుంచి వాహనాలకు వేలంపాట నిర్వహించకపోవడంతో వాహనాలు తుప్పు పడుతున్నాయి. అవకాశం ఉన్నవాటికి వేలం పాట నిర్వహించడం లేదా సంబంధిత వాహనదారులకు అప్పగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఎస్సై సత్యనారాయణ దృష్టికి తీసుకుపోగా 55 వాహనాలు వివిధ కేసులకు సంబంధించి స్టేషన్ ఆవరణలో ఉన్నాయన్నారు. 17 అబ్కారీ కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు కాగా, మిగతావి ప్రమాద కేసులకు సంబంధించినవి అన్నారు. అబ్కారీ కేసులలో పట్టుబడిన వాహనాలకు ఉన్నతాధికారులకు నివేదించి రెండు నెలల్లో వేలం పాట నిర్వహిస్తామన్నారు. - న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

## రాళ్ల దారిలో ప్రయాణం కష్టం

వజ్రకరూరు నుంచి గుత్తికి వెళ్లే రహదారి ఇది. మొత్తం 28 కిలోమీటర్లు ఉంది. అందులో చింతలాంపల్లి వరకు దాదాపు 8 కిలోమీటర్లు కంకర తేలి పూర్తిగా శిథిలమయ్యింది. కల్వర్టుల వద్ద ప్రమాదకరంగా మారింది. అత్యవసర వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్నా కష్టమే. గత ఐదేళ్ల నుంచి 10 గ్రామాల ప్రజలు ఈ మార్గంలో రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. రోడ్డును బాగు చేస్తే ఉరవకొండ వైపు నుంచి గుత్తి, కర్నూలు, హైదరాబాద్‌కు వెళ్లేవారికి సుమారు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీనిపై మండల ఇంజినీరింగ్ అధికారి మణిభూషణ్‌ను వివరణ కోరగా.. రహదారి నిర్మాణానికి సంబంధించి ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు వివరాలు సేకరించినట్లు చెప్పారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

## గాలివాన బీభత్సం.. రైతుకు నష్టం

కళ్యాణదుర్గం మండలంలోని ఎర్రంపల్లి గ్రామంలో గాలివానకు మారుతి అనే రైతు సాగు చేసిన బీర పంట నేలవాలి రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. రెండెకరాల్లో రూ.3 లక్షల పెట్టుబడి పెట్టి పంట సాగు చేశారు. ఇప్పటి వరకు నాలుగు కోతలు పూర్తి అయ్యాయి. ఆదివారం గాలివానకు పంట మొత్తం నేలవాలి, కాయలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సోమవారం ఐదో కోత కోయాల్సి ఉంది. సుమారు 10 టన్నుల వరకు దిగుబడి వచ్చేది. మార్కెట్లో విక్రయిస్తే దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చేదని రైతు కన్నీరు పెట్టారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

## లక్ష్మీనరసింహస్వామీ మన్నించు!

ఆత్మకూరు మండల పరిధిలోని వై.కొత్తపల్లి గ్రామ సమీపంలో వెలసిన మలహోబుల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇందుకు ఈ చిత్రమే నిదర్శనం. శని, ఆదివారాల్లో వెయ్యికిపైగా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. అయితే లక్ష్మీనరసింహస్వామి విగ్రహం చుట్టూ భక్తులు రాళ్లు పేర్చారు. ఇలా చేస్తే తమ సొంతింటి కల నెరవేరుతుందని నమ్మకం. అక్కడే చెత్త పేరుకుపోయింది. ఉత్సవాల్లో స్వామిని ఊరేగించే రథం ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ దెబ్బతింటోంది. ఈ విషయంపై ఆలయ ఈవో దేవదాసును వివరణ కోరగా వెంటనే ఆలయంలో సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. - న్యూస్‌టుడే, ఆత్మకూరు

# ఔషధ కోర్సులు.. ఉపాధి, ఉద్యోగాలకు బాటలు

### ఓటీపీఆర్ఐలో త్వరలో ప్రవేశాలు

**జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే:** ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసీ పాత్ర కీలకం. జేఎన్‌టీయూ అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ (ఓటీపీఆర్ఐ) ఫార్మసీ కోర్సులను అందిస్తోంది. ప్రతిష్ఠాత్మకమైన ఈ ఔషధ విద్యాసంస్థలో అభ్యసించిన విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షలైన నైపర్ జేఈఈ, జీపాట్‌లో మంచి ర్యాంకులు సాధించారు. ఇందులో నూతన ఔషధాల తయారీ, ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. నూతన ఔషధాల ఉత్పత్తి చేసిన మందులు మొక్కలు, జంతువులు, జలచరాలపై ప్రయోగిస్తుంటారు. ప్రస్తుత జీవన పరిస్థితుల్లో మధుమేహం, అధికరక్తపోటు, క్యాన్సర్ వంటి రోగాల బారినపడుతున్నారు. వాటి నివారణలో ఫార్మసీ నిరంతం కృషి చేస్తోంది. 1950కి ముందు ప్రజలకు అవసరమైన ఔషధాల్లో 90 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొనేవారు. ప్రస్తుతం 90 శాతం ఔషధాలు విదేశాలకు మనదేశం నుంచి ఎగుమతి చేస్తున్నారు. ఫార్మసీ రంగం ఏ స్థాయిలో వృద్ధి చెందిందో ఊహించవచ్చు.

ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

### ఫార్మసీతో భవిష్యత్తు అవకాశాలు

- పారిశ్రామిక రంగంలో పరిశోధనలు, అభివృద్ధి, మార్కెటింగ్, రెప్రజెంటివ్స్‌లో అవకాశాలున్నాయి. డ్రగ్ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి అర్హులు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలు. అకడమిక్ పరంగా బోధన, పరిశోధన, పరిపాలన రంగాల్లో అవకాశాలు ఉంటాయి. విదేశాల్లో కూడా ఉద్యోగావకాశాలు ఉన్నాయి.

### త్వరలో వసతి గృహాలు అందుబాటులోకి

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఫార్మసీ విద్యార్థులకు వసతి గృహాలు అందుబాటులోకి తెస్తున్నాం. నైపర్ జేఈఈ, జీప్యాట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. వారికి సీట్లు కేటాయించిన తరువాత ఈఏపీ సెట్‌లో ర్యాంకులు సాధించిన వారికి ప్రవేశాలు కల్పిస్తాం. ఆగస్టులో ప్రవేశాలు నిర్వహించే అవకాశముంది.
- ఆచార్య సుబ్బారెడ్డి, సంచాలకులు, ఓటీపీఆర్ఐ

| ఔషధ కోర్సులు | కాలపరిమితి | అర్హత | అందుబాటులో సీట్లు |
|---|---|---|---|
| బీఫార్మసీ | 4 సం॥ | ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, | ఈఏపీసెట్ 100, ఈడబ్ల్యూఎస్‌కి 10 |
| బీఫార్మ్ (లాటరల్ ఎంట్రీ) | 3 సం॥ | డిప్లొమా ఇన్ ఫార్మసీ, ఈసెట్ | 10 |
| ఫార్మా-డీ | 6 సం॥ | ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఈఏపీసెట్ | 30 |
| ఎం ఫార్మసీ, అనలిస్ట్ | 2 సం॥ | బీఫార్మ్, పీజీఈసెట్ | 15 |
| ఎం ఫార్మసీ- ఫార్మాస్యూటికల్ | 2 సం॥ | బీఫార్మ్, పీజీఈసెట్ | 15 |

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

### ఆర్యఈడిగ ప్రతిభా పురస్కారాల ప్రదానంలో మాజీమంత్రి కేఈ ప్రభాకర్

ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో కేఈ, సంఘం ప్రతినిధులు

**హిందూపురం, న్యూస్‌టుడే:** ప్రతిభా పురస్కారాలను ఆదర్శంగా తీసుకొని ఆర్యఈడిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. జిల్లాలో గత సంవత్సరం పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన 133 మంది ఆర్యఈడిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు రూ.11లక్షల ప్రోత్సాహ మొత్తం, జ్ఞాపికలను మాజీమంత్రి అందజేశారు. ఆర్యఈడిగ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు రామకృష్ణప్ప అధ్యక్షతన ఆదివారం ఈడిగ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేఈ మాట్లాడుతూ వెనకబాటులో ఉన్న ఈడిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు విద్యలో రాణించేలా ప్రోత్సాహక బహుమతులు సంఘం అందించటం అభినందనీయమన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ లక్ష్యాన్ని నిర్ణయించుకొని సాధనకు కృషి చేయాలన్నారు. ఆర్య ఈడిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ రూ.లక్ష అందించటం, వచ్చే సంవత్సరం రూ.10లక్షల మొత్తం అందిస్తామని హామీ ఇవ్వటం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి, మాజీ మంత్రి ఈడిగ సంఘం హిందూపురం వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. సమావేశంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్‌గౌడ్, వినయ్‌కుమార్ సీనియర్ నాయకులు ఆదిమూర్తి, విశ్రాంత డీఈవో మునయ్య, వేణుగోపాల్, నాగభూషణం, సంఘం మాజీ అధ్యక్షుడు దేవరకేతేపల్లి వెంకటనారాయణప్ప, పుల్లారెడ్డి, సర్పంచి తిరుమలేశ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిన్నప్పయ్య, మాజీ కౌన్సిలర్ హరినాథ్‌గౌడ్, కౌన్సిలర్ మల్లికార్జున, సురేశ్‌కుమార్, రవీంద్రనాథ్, లక్ష్మీపతి, భాగ్యమ్మ, లక్ష్మీపతి, జిల్లాకు చెందిన ఆర్య ఈడిగలు పాల్గొన్నారు.

## సుబ్బారావుపేటలో వైకాపా వర్గీయుల అరాచకం

### పీర్ల ఊరేగింపులో ఎస్సీలు పాల్గొనకుండా అడ్డగింత

**ధర్మవరం, న్యూస్‌టుడే:** ధర్మవరం మండలం సుబ్బారావుపేటలో ఆదివారం పీర్ల ఊరేగింపులో ఎస్సీ కాలనీ వాసులు పాల్గొనకుండా స్థానిక వైకాపా వర్గీయులు అడ్డుకున్నారు. ఎస్సీ కాలనీ నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారిపై ముళ్ల కంచెను అడ్డంగా వేశారు. శనివారం రాత్రి ఆటోడ్రైవర్ బాలు పీర్ల చావిడి వద్దకున్న అగ్ని గుండంలోకి మొద్దులు వేసేందుకు వెళుతుండగా డప్పు వాయిస్తున్న చిన్న గంగప్పను ఆటో ఢీకొట్టారు. మొద్దులు చిన్నగంగప్పకు తగలడంతో గాయపడ్డారు. వైకాపా వర్గీయులు కొనప్ప, నంద, విజయ్, శశాంక్‌లు అక్కడికి చేరుకొని చిన్నగంగప్పను మందలించి అక్కడి నుంచి పంపించారు. ఆటోతో ఢీకొట్టడమే కాకుండా చిన్నగంగప్పను బెదిరించి పంపారని పీర్ల జలధిలో డప్పు కొట్టేందుకు ఎస్సీ కాలనీవాసులు నిరాకరించారు. దీంతో వైకాపా వర్గీయులు ఇతర ప్రాంతాల నుంచి డప్పు కొట్టేవారిని గ్రామానికి రప్పించారు.

ఎస్సీ కాలనీవాసులు గ్రామంలోకి రాకుండా అడ్డం వేసిన ముళ్లకంప

ఆదివారం పీర్లను ఊరేగించేందుకు ఎస్సీ కాలనీవాసులు వెళుతుండగా రావద్దంటూ వైకాపా వర్గీయులు బాలుతోపాటు మరో కొందరు రహదారికి కంచె అడ్డంగా వేశారు. గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారు, బీసీలను అడ్డు పెట్టుకొని తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఎస్సీ కాలనీకి చెందిన పెద్దిరాజు ఆరోపించారు. పోలీసులు ఉండగానే ఈ ఘటన జరిగిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు వారు చెప్పారు.

## ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

### 907 మంది విద్యార్థుల ఎంపిక

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఇందులో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, వికలాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80.. మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్కే వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తరగతులు 14 నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులు తమ లేఖతో వచ్చి రిపోర్ట్ చేసి తరగతులకు హాజరుకావాలన్నారు.

- మొదటి దశ తరువాత మిగిలిన ఖాళీల భర్తీ దృష్టిలో ఉంచుకుని అంతర్గత బదిలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా 384 మందికి లబ్ధి కలిగినట్లు వివరించారు. ఇప్పటి వరకు 4,340 మంది విద్యార్థుల ఎంపిక పూర్తి అయిందని తెలిపారు. ఇంకా 60 సీట్లు మిగిలి ఉండగా ఇందులో ఎన్‌సీసీ కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఈ సీట్ల ఎంపిక ఫలితాలను వచ్చే వారం విడుదల చేస్తామని రిజిస్ట్రార్ తెలిపారు.

## ఎమ్మెల్యే చొరవ.. దాతల సహకారం

**కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే:** జిల్లాలోనే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న కళ్యాణదుర్గం కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతులపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టి సారించారు. పాఠశాలలో ప్రధానంగా బాలుర మరుగు దొడ్డి, బాస్కెట్ బాల్ కోర్టు, వంట చేయడానికి, విద్యార్థులు కూర్చుని భోజనం చేయడానికి షెడ్డు నిర్మించాలని పాఠశాల సిబ్బంది ఇటీవల ఎమ్మెల్యేను కోరగా ఆయన స్పందించారు. తనకు పరిచయం ఉన్న వ్యక్తుల నుంచి సుమారు రూ.35 లక్షల ఆర్థిక సహకారం తీసుకుని పనులు ప్రారంభించారు. ప్రస్తుతం మరుగుదొడ్లు, బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. పాఠశాలలో ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి పనులు కొనసాగుతుండటంతో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు భోజనాలు చేయడానికి షెడ్డు నిర్మిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

నిర్మాణంలో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టు

## సంతల ఆదాయం రూ.3.37 లక్షలు

**అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే :** అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ. 3,37,790 ఆదాయం వచ్చింది. అందులో గొర్రెలు, మేకల సంతలో రూ. 1,93,390 ఆదాయం రాగా, పశువుల సంతలో రూ. 1,44,400 ఆదాయం వచ్చిందని, వచ్చిన ఆదాయ మొత్తాన్ని సోమవారం ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

# ఆటోను ఢీకొన్న కేఎస్ ఆర్టీసీ బస్సు.. ఒకరి దుర్మరణం

**గార్లదిన్నె, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని కల్లూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు మహిళలు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహమ్మద్ హుస్సేన్(42) ఆయనతోపాటు ఉమాదేవి, మరియమ్మ ముగ్గురు లగేజీ ఆటో వాహనంలో అనంతపురం నుంచి వెళ్తుండగా కేఎస్ ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొనడంతో మహమ్మద్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరు మహిళలు గాయపడటంతో చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లగేజీ ఆటో రోడ్డు పక్కన నిలిపి ఉంచడంతో బెంగుళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న బస్సు ఢీ కొనింది. ఘటనా స్థలాన్ని ఎస్సై గౌస్‌బాషా పోలీసు సిబ్బంది సందర్శించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## రాష్ట్రస్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ

**కదిరి, న్యూస్‌టుడే:** తిరుపతిలోని గిరిజన భవనంలో శని, ఆదివారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మాస్టర్ షేక్షావలి తెలిపారు. కదిరి నుంచి పాల్గొన్న తొమ్మిది మంది అత్యుత్తమ ప్రతిభతో రాణించారు. సెయింట్ థామస్ పాఠశాల డింబుశ్రీ, యశ్వంత్, రాజేశ్‌లు మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. వర్షిత తృతీయ స్థానంలో కాంస్య పతకం, బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు మనోహర్, విష్ణు తృతీయ స్థానంలో కాంస్య పతకం, నికిత ద్వితీయ స్థానంలో రజత పతకాలు సాధించారు. వీరితో పాటు నారాయణ పాఠశాల నుంచి ప్రజెంష్ ప్రథమ స్థానంలో బంగారు పతకం, నల్లచెరువు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి జయవర్ధన్ మొదటి స్థానంలో బంగారు పతకం పొందినట్లు ఆయన వివరించారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పతకాలు పొందిన విద్యార్థులతో మాస్టర్లు

## కేరళ నుంచి కశ్మీర్‌కు సైకిల్‌యాత్ర

**నల్లచెరువు, న్యూస్‌టుడే:** కేరళ రాష్ట్రంలోని కొట్టాయంకు చెందిన జోసన్ తన స్వగ్రామం నుంచి కశ్మీర్‌కు సైకిల్ యాత్ర చేపట్టారు. యాత్రలో భాగంగా ఆదివారం ఆయన నల్లచెరువుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో ప్రజల సంప్రదాయాలు, సంస్కృతులు, వాతావరణ పరిస్థితులను తెలుసుకునేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. గ్రామం నుంచి బయలుదేరి 9 నెలలైందని, ఇప్పటి వరకు 14 రాష్ట్రాలు తిరిగినట్లు చెప్పారు. ఇక్కడి ప్రజలు చూపుతున్న ఆప్యాయత మరువలేనని తెలిపారు.

యాత్రికుడు జోసన్

## టిప్పర్ ఢీకొని రైతు ..

శ్రీనివాసులు నాయక్

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఓ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన ముదిగుబ్బ మండలంలోని రామస్వామితండా ఆర్చ్ దగ్గర ఆదివారం చోటు చేసుకుంది. పట్నం ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు... రామస్వామితండాకు చెందిన శ్రీనివాసులునాయక్ (60) పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ముదిగుబ్బకు వెళ్తున్నాడు. ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం వైపు వెళ్తున్న టిప్పర్ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య తులసిబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కు మృతి చెందడంతో కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పట్నం పోలీసులు తెలిపారు.

## పాముకాటుతో ఒకరి మృతి

**బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే:** మండలంలోని నాగిరెడ్డిపల్లిలో కురుబ రామాంజిని(50) పాము కాటుకు గురై మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... కర్ణాటకలోని నాగసముద్రం గ్రామానికి చెందిన రామాంజిని పదేళ్లుగా బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లిలోని ఓ తోటలో కూలీగా పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి రామాంజిని షెడ్డులో నిద్రిస్తుండగా విషపు పాము కాటేసింది. వెంటనే స్థానికులు కళ్యాణదుర్గం ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామాంజిని ఆదివారం ఉదయం మృతిచెందినట్లు ఎస్సై నరేంద్రకుమార్ తెలిపారు.

## గుత్తి పరిసరాల్లో మూడు చోరీలు

**గుత్తి, న్యూస్‌టుడే :** గుత్తి శివారులోని అనంతపురం రోడ్డులో ఓ రైతు పొలంలో మోటారు చోరీకి గురైంది. గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి తోటలోని మోటారుతోపాటు పైపులను ఎత్తుకెళ్లారు. రైతు ఆదివారం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుత్తిలోని మురళీ అనే వ్యక్తి బంధువుకు చెందిన ఐచర్ వాహనం బ్యాటరీలను చోరీ చేశారు. అన్నపూర్ణ హోటల్ వెనుక కాలనీలో ఓ వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేదని బాధితులు వాపోతున్నారు.

## వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి మృతి

పార్వతమ్మ

**ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులు, స్వాతంత్ర సమరయోధులు, గుత్తి మాజీ ఎమ్మెల్యే వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ (100) ఆదివారం నగరంలోని ఒకటో రోడ్డు తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నాయకులు పార్వతమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సోమవారం ఉదయం పది గంటలకు స్వగృహం నుంచి అంతిమ యాత్ర స్థానిక గుత్తిరోడ్డులో ఉన్న హరిశ్చంద్ర ఘాట్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వీకే కుటుంబ సభ్యులు తెలిపారు.

## పురాతన అచ్యుతదేవరాయల శాసనం గుర్తింపు

బసవన్నబావిలో శాసనాలు పరిశీలిస్తున్న చరిత్రకారుడు మైనాస్వామి

**పెనుకొండ, న్యూస్‌టుడే:** పెనుకొండ పట్టణంలోని బసవన్నబావిలో 1532 సంవత్సరం నాటి అచ్యుత దేవరాయల శాసనాన్ని గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి పేర్కొన్నారు. ఆదివారం విజయనగర సామ్రాజ్య కట్టడాలు, శిల్ప సంపదపై చేస్తున్న పరిశోధనలో భాగంగా కాశీవిశ్వేశ్వరాలయం ఎదురుగా ఉన్న బసవన్నబావిని సందర్శించినట్లు తెలిపారు. కన్నడభాషలో రాసిన ఆ శాసనంలో అనేక ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయన్నారు. విజయనగర సామ్రాజ్యాన్ని అచ్యుతరాయలు పరిపాలిస్తున్న సమయంలో కాశీవిశ్వేశ్వరాలయానికి అనుబంధంగా ఓ మెట్లబావిని, ఉత్సవ మండపాన్ని నిర్మించారు. శాలివాహన శకవర్షం 1454 వైశాఖ శుద్ధనాడు, అనగా సామాన్యశకం 1532 ఏప్రిల్‌లో మెట్లబావిని తవ్వించినట్లు శాసనం ద్వారా తెలిసిందన్నారు. బావిలోకి దిగే మెట్లకు ఎడమవైపున శ్రీత్రయంబక శరణు అనే ఏక వాఖ్య కన్నడ శాసనం ఉందన్నారు. శాసనం వద్ద విజయనగర చిహ్నం సూర్యచంద్రులు, కత్తి, శివలింగం చెక్కారు. ఒకప్పుడు ఎంతో సుందరంగా ఉన్న బావి నేడు చెత్తాచెదారంతో కళావిహీనంగా మారిందని, ఇక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, బావిని అందంగా తీర్చిదిద్దాలని మైనాస్వామి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పరిశోధకుడు గోపి, శ్రీధర్ ఉన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బులతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిజిస్టర్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం Cell: 7382114647.

EDUCATION

అడ్మిషన్స్: APNCET (నర్సింగ్ సెట్)లో క్వాలిఫై కాని స్టూడెంట్స్‌కి B.Sc (MLT), BPT (ఫిజియోథెరపి) గవర్నమెంట్ సీట్లకు అడ్మిషన్లు జరుగుతున్నవి. Cont: G.Murali, 9030661651. ఉరవకొండ.

REAL ESTATE

PLOT FOR SALE

ATP నందు NH 544D South, North Corner 3, 4 AHUDA approval Layout 66x106= 16 Cents Main Road Plots అమ్మబడును. సెల్: 6303444456/ 9866782618.

JOBS

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

Wanted APTITUDE Trainer: Recuired Aptitude Trainer to Train Engineering Graduates, Experienced Candidates Preferred. Salary Negotiable for Deserving Candidates. Contact: Corporate Training (&) Placement Officer. 7799797555.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ బెల్ ఇన్‌ఫ్రా ATP నందు పనిచేయుటకు అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టార్గెట్‌తో పనిలేకుండా ఫిక్స్ జీతం ఇవ్వబడును. ATP. Cell: 9989452444.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

# హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

## కార్యకర్తలకు పూర్తిస్థాయిలో న్యాయం : ఎంపీ

**రొద్దం :** తెదేపా కార్యకర్తలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే పార్టీ లక్ష్యమని ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం రొద్దం పంచాయతీలోని ఆర్.మరువపల్లికి ఎంపీ వచ్చిన సందర్భంగా పలు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కలిశారు. వచ్చినవారు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు చరవాణి ద్వారా ఎంపీ తెలియజేశారు. మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, మహిళా కార్యదర్శి లీలమ్మ, జిల్లా అధికారప్రతినిధి నరసింహులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీని సత్కరిస్తున్న మండలాల తెదేపా నాయకులు

## బూత్ కన్వీనర్లకు సత్కారం

సన్మానిస్తున్న మంత్రి సవిత

**పెనుకొండ, న్యూస్‌టుడే:** సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మండలంలోని 187వ బూత్ అమ్మవారిపల్లిలో 100శాతం నమోదు పూర్తి చేసిన బూత్ కన్వీనర్లు శంకర నారాయణ, నరేశ్‌లను ఆదివారం మంత్రి సవిత సత్కరించారు. మండల కన్వీనర్ ఈశ్వర్‌ప్రసాద్, ఎర్రమంచి సర్పంచి నాగమూర్తి, నాయకులు త్రివేంద్రనాయుడు, వాసుదేవరెడ్డి, కొండారెడ్డి పలువురు పార్టీశ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 80085 73018
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

**సమస్య:** కాచికుంట దళిత కాలనీలో చెత్తదిబ్బలతో దోమలు బెడద ఎక్కువగా ఉంది. **-నరసింహప్ప**
**సమాధానం:** రెండు రోజుల్లో తొలగిస్తాం.
**-హనుమక్క, సర్పంచి హలుకూరు.**

**సమస్య:** కనకనపల్లి కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు కదలడం లేదు. **-వీరనాగప్ప**
**సమాధానం:** కాలువలను రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తాం. **-ఈరన్న, సర్పంచి, హోలదపల్లి.**
**సమస్య:** గొల్లపల్లి బీసీ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం. **-మంజుళ**
**సమాధానం:** వెంటనే ఏర్పాటు చేయిస్తాం.
**-రంగస్వామి, సర్పంచి, తాళికెర**

**సమస్య:** ఎస్.రాయాపురం ఎస్సీ కాలనీలో రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. **-భాగ్యమ్మ**
**సమాధానం:** హరితరాయబారుల ద్వారా తొలగిస్తాం. **-రాధమ్మ, సర్పంచి, ఎస్.రాయాపురం.**
-న్యూస్‌టుడే, అమరాపురం, గుడిబండ

### సిమెంట్ స్తంభం ఏర్పాటు

'విద్యుత్తు స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన ఈనెల 8న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్రకథనానికి విద్యుత్తు శాఖ స్పందించారు. తుప్పుపట్టిన విద్యుత్తు స్తంభం స్థానంలో సిమెంట్ స్తంభం ఏర్పాటు చేశారు. **-న్యూస్‌టుడే, హిందూపురం**

### సమస్య పరిష్కారం

స్పందనకు వందనం

**హిందూపురం అర్బన్ :** పట్టణంలో వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో మేమున్నాం.. మీకుతోడుగా దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారి స్పందించారు. పట్టణంలోని చిన్నమార్కెట్ సర్కిల్ నుంచి వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లే రహదారిలోని గుంతలను ఆర్‌అండ్‌బీ అధికారి మోహన్ సిబ్బంది చేత పూడ్చించారు.

# పూర్తికాని భవన నిర్మాణాలు.. అరకొర సౌకర్యాలు

**హిందూపురం గ్రామీణం, చిలమత్తూరు, లేపాక్షి, న్యూస్‌టుడే:** హిందూపురం నియోజకవర్గంలో ఐదేళ్ల క్రితం వైకాపా ప్రభుత్వ పాలనలో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైద్య, పశువైద్యశాలల భవనాలు నిర్మించాలని రూ.కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 107 భవనాలు నిర్మించాల్సి ఉండగా కేవలం 38 మాత్రమే పూర్తయ్యాయి. అందులోనూ ఐదింటిలో కార్యకలాపాలు కొనసాగించే ప్రక్రియ ప్రారంభించ లేదు.

పిల్లర్ల వరకే కిరికెర-3 సచివాలయ నిర్మాణం

### తాత్కాలిక గదుల్లో సచివాలయాలు

| మండలం | మొత్తం భవనాలు | నిర్మించినవి |
|---|---|---|
| హిందూపురం | 40 | 6 |
| చిలమత్తూరు | 34 | 17 |
| లేపాక్షి | 32 | 13 |

తాత్కాలిక భవనాల్లోనే సచివాలయాల సిబ్బంది విధులకు హాజరవుతూ ఇబ్బందులకు గురవుతున్నారు.

### ప్రభుత్వ ఆదేశాలు రాలేదు

గతంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలను మళ్లీ కొనసాగించేందుకు ప్రభుత్వ ఆదేశాలు రాలేదు. కొత్తగా నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. ఉన్న వాటితో అరకొర సదుపాయలతోనే ప్రత్యామ్నాయంగా ప్రజలకు సేవలు అందిస్తున్నాం. **-సరస్వతి, రమణమూర్తి, నరసింహమూర్తి, ఎంపీడీవోలు**

### మండలాల్లో వివిధ దశల్లో..

● కంచిసముద్రం, చోళసముద్రం, కల్లూరు, మరో రెండు గ్రామాలతో పాటు 5 మాత్రమే సచివాలయ నిర్మాణాలు పూర్తికాగా, మిగతా 35 పంచాయతీల్లో నిర్మాణ దశలో ఉంటూ రెండేళ్లుగా స్తంభించిపోయాయి. సంతేబిదనూరు, కిరికెర, చలివెందల, లేపాక్షి కొండూరు, శిరివరం, కేదూరు, చాగలేరు, వీరాపురం, సోమఘట్ట తదితర గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే తాత్కాలికంగా కార్యకలాపాలు ఉన్నందున అధికారులు, ప్రజలకు ఇబ్బందిగా మారింది.

● లేపాక్షి, మానెంపల్లి, మైదుగోళం, నాయనపల్లి, పూలకుంట, చిలమత్తూరు, కోడూరులో మాత్రమే రైతు సేవా భవనాలు నిర్మితమయ్యాయి. కిరికెర, సంతేబిదనూరు, గోళ్లాపురం, కొటిపి, చలివెందల, చోళసముద్రం, శిరివరం, కొండూరు, పాతచామలపల్లి, కొడికొండలతో పాటు మొత్తం 38 చోట్ల వివిధ దశల్లోనే నిర్మాణాలు ఆగిపోయాయి. రైతులకు అసౌకర్యంగా ఉంది.

● విలేజ్ క్లీనిక్‌లు 26 నిర్మాణం కావాల్సి ఉండగా కేవలం కగ్గల్లు, కె.బసవనపల్లి, లేపాక్షి చిలమత్తూరులో మాత్రమే పూర్తయ్యాయి. అయితే వైద్యసేవలకు అనుకూలంగా లేదు. కిరికెర, చలివెందల, సోమఘట్ట, చోళసముద్రం గ్రామాలతో పాటు 22 చోట్ల నిర్మాణాలు జరుగుతూ మధ్యలో పనులు ఆగిపోయి మూడేళ్లు అవుతోంది. వైద్యానికి పెద్దపీట వేస్తామనే ప్రభుత్వ లక్ష్యం కుంటుపడింది.

## యూరియా వచ్చిందోచ్

గోదాం వద్ద యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

**రొద్దం, న్యూస్‌టుడే :** ఖరీఫ్ ప్రారంభం కావడంతో రైతులకు ఎరువులు అందించడంపై అధికారులు దృష్టి సారించారు. రొద్దం సింగిల్ విండో కార్యాలయానికి యూరియా రావడంతో ఆదివారం రైతులు ఎగబడ్డారు. కొందరు ఎక్కువ మోతాదులో తీసుకెళ్లడంతో చాలామంది వెనుదిరిగారు. ఈ విషయంపై సింగిల్ విండో కార్యదర్శి వెంకటేశులు మాట్లాడుతూ శనివారం రెండు లారీల్లో దాదాపు 560 బస్తాలు వచ్చిందన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది ద్వారా రైతుల ఆధార్ నంబరు నమోదు చేసుకుని అందరికీ పంపిణీ చేస్తామని ఆయన వివరించారు.

## గొడవలకు దూరంగా ఉండాలి: డీఎస్పీ

గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

**పెనుకొండ, న్యూస్‌టుడే:** క్షణికావేశంలో జరిగే సంఘటనల్లో గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని సమస్యాత్మక గ్రామం శెట్టిపల్లిని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్థులతో సమస్యలపై ఆరాతీశారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## చంద్రబాబుతోనే సుపరిపాలన :మంత్రి

**పెనుకొండ, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని మంత్రి సవిత పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఆదివారం పట్టణంలోని వజ్రాలపేటలో 15, 16వ వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

**రొద్దం :** చంద్రబాబునాయుడుతోనే సుపరిపాలన సాధ్యమని తెదేపా సీనియర్ నాయకులు పేర్కొన్నారు. రొద్దంలో పలు వార్డుల్లో పర్యటించారు. మండల కన్వీనర్ నరహరి, తెదేపా నాయకులు ఆంజనేయులు, పాతర్లపల్లి నరసింహులు, వీరాంజనేయులు, పవన్, సిద్దన్న, మాజీ సర్పంచి కుళాయప్ప, కల్లుకుంట హనుమంత తదితరులు పాల్గొన్నారు.

**గుడిబండ :** భైరేపల్లిలో తెదేపా నాయకులు ప్రచారం చేశారు. మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, బూత్ ఇన్‌ఛార్జి తిప్పేస్వామి, రంగనాథ్, ఈరన్న, శ్రీనివాస్, రామప్ప, నర్సేగౌడ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రం అందజేసి తెదేపా పాలనలో చేస్తున్న పథకాలు వివరించారు.

రొద్దంలో తెదేపా నాయకులు

భైరేపల్లిలో కరపత్రం అందుజేస్తున్న నాయకులు

డాక్టరేట్ అందుకుంటున్న శంకరనారాయణమూర్తి

## యోగా గురువుకు డాక్టరేట్ ప్రదానం

**హిందూపురం, న్యూస్‌టుడే:** హిందూపురం పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన శంకరనారాయణమూర్తికి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ డాక్టరేట్ అందజేసింది. 25 సంవత్సరాలుగా యోగా గురువుగా కర్ణాటకతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో హోమాలు నిర్వహించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. వైదిక పద్ధతిలో మూడు దశాబ్దాలుగా అనేక కార్యక్రమాలు చేపట్టడంతో గుర్తించి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తి, కార్యదర్శి శ్రీరామమూర్తి డాక్టరేట్ ప్రదానం చేశారని శంకరనారాయణమూర్తి పేర్కొన్నారు. ఆయనకు పలువురు యోగా సాధకులు అభినందనలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం

**రొళ్ల, న్యూస్‌టుడే:** మండలంలోని కె.బ్యాడిగెర గ్రామంలో వెలసిన కాటమ రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తిని రథంలో కొలువుదీర్చి గోవిందనామస్మరణతో లాగారు. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేయించారు.

రథాన్ని లాగుతున్న భక్తులు

**హిందూపురం అర్బన్ (గుడ్డం):** గుడ్డం రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీదేవిభూదేవి సమేతుడైన రంగనాథుని ఉత్సవమూర్తులను పూల రథంలో ఉంచి గిరిప్రదక్షిణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగేంద్రుడు, అర్చకులు గోవిందశర్మ, శ్రీమన్నారాయణ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### ఘనంగా మెహెందీ వేడుకలు

**హిందూపురం అర్బన్ :** పట్టణంలోని చెక్‌పోస్టు సమీపంలో ఉన్న వాల్మీకి ఆలయంలో ఆదివారం శ్రీకృష్ణభజన మహిళా మండలి ఆధ్వర్యంలో మెహెందీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌరీదేవి అమ్మవారి ప్రతిమ ఉంచి మహిళలు పూజలు చేశారు. అనంతరం కోలాటం, చెక్కభజనలు, భక్తిగీతాలను ఆలపించారు.

## నియోజకవర్గంలో నేడు..

### ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా

**హిందూపురం, న్యూస్‌టుడే:** పట్టణంలోని శ్రీకంఠపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ మురళీధర్ తెలిపారు. మేళాకు జిల్లాలోని ప్రముఖ కంపెనీల వారు హాజరవుతారన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### సోమందేపల్లి మండల సర్వసభ్య సమావేశం

**సోమందేపల్లి :** స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులతో పాటు అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు.

### ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశం..

**సోమందేపల్లి :** స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సోమందేపల్లి, గోరంట్ల, పరిగి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాన్ని సోమవారం ఉదయం శిర్డీ సాయిబాబా ఆలయం వద్ద నిర్వహిస్తున్నట్లు సీడీపీవో శాంతలక్ష్మి తెలిపారు. పర్యవేక్షకులు, కార్యకర్తలు అందరూ తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

### సౌరవిద్యుత్తు పార్కు ఏర్పాటుపై చర్చ

**మడకశిర గ్రామీణం :** బుళ్లసముద్రం, హరేసముద్రం, వైబీహళ్లి, కల్లుమర్రి, మణూరు ప్రాంతాల్లో 2 వేల మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు (సోలార్) పార్కు ఏర్పాటు విషయమై సోమవారం ఆ గ్రామాల రైతులతో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమావేశం నిర్వహించి చర్చించనున్నట్లు మండల కన్వీనర్ నాగరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు బుళ్లసముద్రం హైవేలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద సమావేశం ఉంటుందని రైతులందరూ హాజరు కావాలని కోరారు.

## బండి చక్రం ఎక్కడంతో రైతుకు తీవ్ర గాయాలు

**రొద్దం, న్యూస్‌టుడే :** మండలంలోని ఆర్.ఎల్.కొత్తూరు గ్రామానికి చెందిన రైతు ఎడ్ల బండి మీద మల్బరీ ఆకు తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో ఎద్దులు వేగంగా పరిగెత్తడంతో రైతు జారి పడగా తలపై బండి చక్రం ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు.

## ఎట్టకేలకు వంతెన పనులు పూర్తి

**రొద్దం, న్యూస్‌టుడే :** డీఆర్ కొట్టాల గ్రామానికి వంతెన లేక రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ట్యాంకు ద్వారా నీరు పోస్తున్న గ్రామస్థుడు

గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంతో రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి సవిత దృష్టికి స్థానిక తెదేపా నాయకులు తీసుకెళ్లడంతో స్పందించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.1.30 కోట్లు నిధులు మంజూరు చేశారు. మే నెల చివరిలో పనులు మొదలు పెట్టిన గుత్తేదారు జులై మొదటి వారంలోనే వంతెన నిర్మాణం పనులు పూర్తి చేశారు. త్వరలోనే ప్రారంభిస్తామని స్థానిక నాయకులు తెలిపారు.

## 25న చౌడేశ్వరిదేవికి బోనాలు

**సోమందేపల్లి, న్యూస్‌టుడే:** చౌడేశ్వరీ దేవికి కులాలకు అతీతంగా మహిళలు, యువతులు బోనాలు సమర్పించేందుకు ముందుకురావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు డీసీ ఈశ్వరయ్య, తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు సీసీ హరిదాస్ కోరారు. ఈనెల 25వ తేదీ చౌడేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా మహిళా భక్తులు తెలంగాణలో నిర్వహిస్తున్న విధంగా చేపట్టాలన్నారు. ఈసారి వెయ్యి మంది మహిళలు భారీ ప్రదర్శనగా అమ్మవారికి బోనాలు ఒకేసారి సమర్పించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. త్వరలోనే అందరికీ ఉచితంగా కుండలు పంపిణీ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

# విధుల్లో చేరారు.. చుట్టపు చూపుగా మారారు

● గ్రామీణ ప్రాంతాల్లో సక్రమంగా విధులకు హాజరుకాని ఎంటీఎస్ ఉపాధ్యాయులు
● ఎంఈవోలకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**హిందూపురం, గుడిబండ, న్యూస్‌టుడే:** జిల్లాలోని మారుమూల ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలోని గుడిబండ, అగళి, రొళ్ల, అమరాపురం మండలాలకు బదిలీపై నియమించిన ఎంటీఎస్ (మినిమమ్ టైమ్ స్కేల్) ఉపాధ్యాయులు విధుల్లో చేరినా సక్రమంగా పాఠశాలలకు హాజరుకావటం లేదు. దీనివలన విద్యార్థులకు సక్రమంగా విద్య అందటం లేదని ఆయాగ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టింది. ఈ బదిలీల్లో వెనకబాటు, మారుమూల ప్రాంతాల్లో అధిక పోస్టులు ఖాళీగా ఉండటం, పలు పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ రెగ్యులర్ ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు బదిలీ కావటంతో ఎక్కువ పోస్టులు ఖాళీ పడ్డాయి. వీటిని భర్తీ చేయటానికి ఎంటీఎస్ ఉపాధ్యాయులను ఆ శాఖ అధికారులు నియమించారు. వీరు విధుల్లో చేరిన వెంటనే అక్కడ ఉన్న రెగ్యులర్ ఉపాధ్యాయులను నిబంధనల మేరకు ఎంఈవోలు రిలీవ్ చేశారు. ఈ సమయంలో పాఠశాల నిర్వహణ ఇతర విషయాలు ఎంటీఎస్ ఉపాధ్యాయులు పర్యవేక్షించాలి వీరు విధులకు సక్రమంగా హాజరుకాక పాఠశాలల్లో సక్రమంగా విద్యార్థులకు విద్య అందటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత ఎంటీఎస్ ఉపాధ్యాయులను ఎంఈవోలు సంజాయిషీ కోరినా రాజకీయనాయకులమని, మాజీ ప్రజాప్రతినిధులమని, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నామని, మాకు వయసు సహకరించటం లేదనే కారణాలు చూపిస్తూ కాలయాపన చేస్తున్నారు. దీనివలన ఈ పాఠశాలల్లో విద్య కుంటుపడుతోంది. సక్రమంగా విధులకు హాజరుకాని వారిపై తగిన చర్యలు తీసుకొని విధులకు హాజరుకాకపోతే వారి స్థానంలో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారి కిష్టప్ప దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా విధుల్లో చేరి సక్రమంగా పాఠశాలలకు రాని ఉపాధ్యాయుల వివరాలు సేకరించి వారు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు తీసుకొంటామన్నారు.

గుడిబండ మండలం తాళ్లకెరలో ఉపాధ్యాయులు రాక మూతపడే స్థితిలో పాఠశాల

## జలధికి తరలిన పీర్లు

**గోరంట్ల, న్యూస్‌టుడే:** గోరంట్ల మండలంలోని కొండాపురంలో భక్తిశ్రద్ధలతో మొహర్రం నిర్వహించారు. ఆదివారం చివరిరోజు అగ్నిగుండ ప్రవేశం, ఊరేగింపు అనంతరం పీర్లను జలధికి తరలించారు. శివరాం ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ సుదర్శన్‌శర్మ, ఛైర్మన్ సోమశేఖర్, మహిళలు, పిల్లలు హాజరై తిలకించారు.

కొండాపురంలో పీర్ల ఊరేగింపు

పెద్దరెడ్డిపల్లిలో..

**కొడిగెనహళ్లి(పరిగి):** మండల పరిధిలోని పెద్దరెడ్డిపల్లిలో ఆదివారం సాయంత్రం పీర్లతో భక్తులు అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేశారు. తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మొహర్రం నిర్వాహకులు కొండారెడ్డి, నరసారెడ్డి, నారాయణ, జూలారెడ్డి, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

**లేపాక్షి:** మండలంలోని గలిబిపల్లి, మామిడిమాకులపల్లిలో ఆదివారం పీర్లను జలధికి తరలించారు. భక్తులు బెల్లం, చక్కెరతో చదివింపులు చేయించారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**పెనుకొండ, న్యూస్‌టుడే:** భర్తకు భోజనం ఇచ్చి వచ్చేలోపే ఓ ఇంట్లో దొంగతనం జరిగిన ఘటన ఆదివారం మండలంలోని అమ్మవారిపల్లిలో చోటుచేసుకుంది. కియా స్టేషన్ ఏఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాలిలా.. అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన రజని ఉదయాన్నే పిల్లలను ఇంటి వద్ద ఆడుకొమ్మని చెప్పి ఇంటికి తాళం వేసి, తాళం చెవిని ఇంటి బయట ఓ బకెట్లో దాచింది. అవసరమైతే తెరుచుకోమని పిల్లలకు చెప్పి పొలం పనులకు వెళ్లిన భర్త రాజశేఖర్‌రెడ్డికి భోజనం తీసుకెళ్లింది. విషయాన్ని గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.50వేల నగదు, రూ.38 వేల విలువచేసే వెండి సామగ్రిని అపహరించారు. ఇంటికి వచ్చి చూసుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

## ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

**కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే:** మండలంలోని పుట్టగూర్లపల్లిలో ఆదివారం వివాహిత ఆత్మహత్య చేసుకుందని పరిగి ఎస్సై రంగడుయాదవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన సమాచారం మేరకు.. మోదా పంచాయతీ పుట్టగూర్లపల్లి గ్రామానికి చెందిన మంజుళ(29)కు అదే గ్రామానికి చెందిన జయచంద్రతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఆమె తరచూ కడుపునొప్పితో బాధపడుతూ ఉండేదని, ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## కారు, ద్విచక్రవాహనం ఢీ.. ఒకరి పరిస్థితి విషమం

**గోరంట్ల, న్యూస్‌టుడే:** గోరంట్ల మండల పరిధిలోని బి.గొల్లపల్లి సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం సాయంత్రం కారు, ద్విచక్రవాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళ్తున్న గొల్లిపల్లికి చెందిన అశోక్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రునికి గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సలు అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో హిందూపురం పంపించారు.

# భరతనాట్యం భళా

**హిందూపురం, అర్బన్, న్యూస్‌టుడే:** నేటి సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చిన్నారులు విద్యతో పాటు సంగీతం, భరతనాట్యం, కూచిపూడి నృత్యం తదితర వాటిపై ఆసక్తి చూపుతున్నారు 'పురం' చిన్నారులు. స్థానిక సదాశివనగర్‌కు చెందిన శిక్షకురాలు చంద్రభానుచతుర్వేది వద్ద శిక్షణ తీసుకుని ఎన్నోచోట్ల ప్రదర్శనలు ఇచ్చి అందరి చేత భేష్ అనిపించుకుంటున్నారు.

### వివిధ ఆలయాల్లో ప్రదర్శనలు ఇచ్చా

నాకు చిన్నప్పటి నుంచే నృత్యం నేర్చుకోవాలని కోరిక. అభిజ్ఞ నృత్యాలయంలో చేరాను. అక్కడ నేర్చుకొని ఆలయాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. కాశీలో చేసిన నృత్య ప్రదర్శనకు వరల్డ్ రికార్డు, కర్ణాటకలోని ఉడిపిలో ప్రదర్శించిన నృత్యానికి కర్ణాటక బుక్‌ఆఫ్ రికార్డు వచ్చింది. **-రోహానిక**

### అమ్మే నన్ను ప్రోత్సహించింది

నేను ఐదో తరగతి చదువుతున్నా. మా అమ్మ ప్రోత్సాహంతోనే నృత్యాలయంలో చేరాను. కూచిపూడి నృత్యం చేయడం ప్రారంభించా. హైదరాబాదులో ప్రదర్శన ఇచ్చా. కర్ణాటక నంది అవార్డు, ఇండియన్, అమెరికన్ బుక్ ఆఫ్ రికార్డులు వచ్చాయి. భరత నాట్యం కోర్సు చేస్తున్నాను. **-శ్లోక**

### నృత్యంలో రాణిస్తా

నేను నాలుగో తరగతి చదువుతున్నాను. మూడేళ్లలోనే నాట్యం నేర్చుకోవాలన్న ఆశతో శిక్షణ తీసుకున్నాను. ఇప్పుడు నాట్య గంధర్వ, అమెరికన్ బుక్ ఆఫ్‌రికార్డు, కర్ణాటక అచివర్స్ బుక్ ఆఫ్ రికార్డు, కేరళ బుక్ ఆఫ్ రికార్డులో పాల్గొన్నాను. నాకు విద్య నేర్పిన మా గురువు చంద్రభానుకు ఎల్లప్పుడు రుణపడి ఉంటాను.
**-నిహాస్వి ఆదితి, హిందూపురం**

## వాహనాలు మూలకు.. రోడ్లపై చెత్త

కొడిగెనహళ్లిలో పారిశుద్ధ్య పనులను చేపట్టేందుకు ప్రభుత్వం సమకూర్చిన పొడిచెత్త, తడిచెత్త తరలించే వాహనంతో పాటు ట్రాక్టరు నిర్వహణ లోపంతో మూలనపడ్డాయి. దీంతో చెత్తను తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి అరుణ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయించి వాడుకలోకి తెస్తామని తెలిపారు. **-న్యూస్‌టుడే, కొడిగెనహళ్లి(పరిగి).**

## నిర్మించారు.. వదిలేశారు

శంకరగల్లు గ్రామంలో శ్రీరామిరెడ్డి ప్రాజెక్టు నీరు నింపి సరఫరా చేయడానికి ట్యాంకు నిర్మించి వదిలేశారు. గ్రామంలో 2 వేలకు పైగా జనాభా ఉంది. ట్యాంకు వృథాగా ఉండటంతో గ్రామ ప్రజలకు నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ఈ విషయమై ఈఓఆర్డీ నాగరాజు నాయక్ మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

**పెనుకొండ :** పట్టణంలోని డీఎస్పీ బంగ్లా సమీపంలో శనివారం ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ప్రమోద్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. ప్రమోద్ ద్విచక్రవాహనంపై కొత్తచెరువుకు వెళుతుండగా, పట్టణానికి చెందిన జిలాన్ ద్విక్రహనంపై వచ్చి ఢీకొన్నాడు. బాధితుడు ప్రమోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

(c) eenadu

# పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

## గొడవలకు దూరంగా ఉండండి: డీఎస్పీ

గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ శివ నారాయణస్వామి, పక్కన సీఐ, ఎస్ఐ

**తనకల్లు, న్యూస్‌టుడే:** చిన్నపాటి విషయాలకు గొడవలకు పాల్పడకుండా ప్రశాంత జీవనం సాగించాలని డీఎస్పీ శివ నారాయణస్వామి అన్నారు. శుక్రవారం రాత్రి మొహర్రం సందర్భంగా బాస్వర్‌పై ఇస్మాయిల్ కర్రతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం రాత్రి బసయం గ్రామంలో పోలీసులు పల్లెనిద్ర నిర్వహించారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ సీఐ నాగేంద్ర, ఎస్ఐ గోపీ, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'

**కదిరి, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెప్పిన వాగ్దానాలు నెరవేర్చాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కదిరి బాలికల ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ జోనల్ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఆదిబయన్న మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. పీఆర్సీ, రెండు పెండింగ్ డీఏలను ప్రకటించి, ఇటీవల బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలను ఇచ్చి, జీతాలు జమ చేయాలన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు నారాయణ, జనార్దన్, రమణారెడ్డి, రాజశేఖర్, శ్రీవాణి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

?: దేవరపల్లిలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రిళ్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. సమస్యను పరిష్కరించండి. - **గ్రామస్థులు**

✓: పరిశీలించి, మరమ్మతులు చేయిస్తాం. - **మధు కార్యదర్శి, పోలతలవాండ్లపల్లి**

?: పోలతలవాండ్లపల్లి పంచాయతీ కార్యాలయం ముందు గుంత ప్రమాదకరంగా ఉంది.మరమ్మతులు చేయండి. - **గ్రామస్థులు**

✓: గుంత తవ్వి వదిలేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **మధు, కార్యదర్శి**

?: ఉబ్బరవాండ్లపల్లిలో కాలువలు పూడ్చివేయడంతో రోడ్డుపై మురుగు ప్రవహిస్తుంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **గ్రామస్థులు**

✓: పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **రమణప్పనాయుడు, కార్యదర్శి, తలుపుల**

– న్యూస్‌టుడే, తలుపుల

?: చెన్నేకొత్తపల్లిలోని పోలీస్‌స్టేషన్ వెళ్లేదారిలో చిన్నపాటి వర్షానికే నీరు నిలవడంతో దారిన పోయేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. - **రామాంజనేయులు, వెంకటాంపల్లి**

✓: వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపడతాం. **చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి**

?: ముష్టికోవెల గ్రామంలో గ్రామ సచివాలయానికి ఎదురుగా ఉన్న వీధులకు పంచాయతీ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో స్థానికులు నీటి ఇబ్బందులు తప్పడంలేదు. నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలి. - **అంజనేయులు, స్థానికుడు**

✓: నీరు సక్రమంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం.. - **లక్ష్మీ ఆర్‌డబ్ల్యూఎస్ మండల అధికారిణి**

?: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి వెళ్లే మూడో దారి ముఖద్వారంలో విద్యుత్ చేసిన సింగిల్ ఫ్యూజ్ నియంత్రిక స్తంభానికి పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో ప్రమాదకరంగా మారింది. - **సునందమ్మ, స్థానికురాలు**

✓: పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు చేపడతాం- **సుధాకర్, విద్యుత్ లైన్‌మెన్**

– న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

## మాంసం విక్రయాలు.. ప్రజారోగ్యంపై ప్రభావం

- శుభ్రత పాటించని విక్రేతలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ధర్మవరం: ప్రధాన రహదారి పక్కన విక్రయాలు

కదిరి: అపరిశుభ్రత మధ్య సిద్ధం చేస్తున్న మాంసం

**ధర్మవరం, న్యూస్‌టుడే:** ధర్మవరం పట్టణంలో కాలువల పక్కనే అపరిశుభ్ర వాతావరణంలో మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. గ్రంథాలయం మార్గంలోని ప్రధాన రహదారి వెంట చిన్నపాటి దుకాణాలు ఏర్పాటు చేసుకొని బహిరంగ ప్రదేశంలో మాంసాన్ని విక్రయిస్తున్నారు. గ్రంథాలయం కూడలి నుంచి అంజుమన్ కూడలి వరకు రహదారికి ఇరువైపులా విక్రయాలు జరుగుతున్నాయి. రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో కొత్తపేట వద్ద ఆరుబయట మాంసం విక్రయాలు చేస్తుండటంతో దుమ్ము, ధూళి పడుతోంది. పట్టణంలో మాంసం విక్రయ కేంద్రాలు 50, చికెన్ సెంటర్లు 300 పైగా ఉన్నాయి. పరిశుభ్రమైన వాతావరణంలో మాంసం విక్రయాలు చేయాల్సి ఉండగా.. నిబంధనలు పట్టించుకోకుండా ఎక్కడ పడితే అక్కడ చేస్తున్నారు. మాంసం విక్రయించేచోట జంతు వధశాలలు ఏర్పాటు చేసుకొని పశువైద్యుడి ధ్రువీకరణ పొందాలి. అనంతరం విక్రయించాల్సి ఉంటుంది. పురపాలకశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదు. దీనిపై పురపాలక కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను వివరణ కోరగా.. ధర్మవరంలో మాంసం విక్రయాలు బహిరంగ ప్రదేశాల్లో చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఒక ప్రాంతాన్ని ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు చేస్తామని తెలిపారు.

**కదిరి:** పట్టణంలోని జంతు వధశాలలో శుభ్రత పాటించటం లేదు. దీంతో మాంసం నాణ్యతపై ప్రభావం చూపుతుంది. జీవాల వ్యర్థాలను గుట్టగా పడేస్తున్నారు. ఈ ప్రదేశాన్ని ఎప్పటికప్పుడు కడిగేందుకు తగిన నీటి వసతి కూడా కొరవడింది. పశువుల లేమి, అపరిశుభ్రత కారణంగా ప్రజారోగ్యంపై ప్రభావం చూపనుందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజ్‌ను వివరణ కోరగా.. జంతు వధశాలలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలిస్తున్నామన్నారు. ఆదివారం కావడంతో వ్యర్థాలు ఎక్కువ పడ్డాయని, శుభ్రత పాటించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

## ప్రజల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి

కుక్కల కు.ని శస్త్రచికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

**ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే:** వీధి, పిచ్చి కుక్కల కాటుకు గురికాకుండా ప్రజల భద్రతతో పాటు జంతు సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రాన్ని మంత్రి పురపాలక కమిషనర్ ప్రమోద్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. వీధికుక్కల నియంత్రణకు మానవీయ కోణాన్ని అనుసరించాలని, వాటికి వ్యాక్సినేషన్ ప్రక్రియను నిరంతరం చేపట్టాలని సూచించారు. మున్సిపల్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈ ప్రకాశ్, మెప్మా టీపీవో విజయ్‌భాస్కర్, శానిటేషన్ అధికారి శ్యామ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మహిళలు

## తాగునీటికి ఖాళీ బిందెలతో నిరసన

**నల్లమాడ (పుట్టపర్తి పట్టణం), న్యూస్‌టుడే:** మండలంలోని రాగానిపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదివారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గత మూడు నెలలుగా పంచాయతీ మోటారు మరమ్మతుకు గురై తీవ్ర నీటి ఎద్దడి నెలకొందన్నారు. కనీసం తాగడానికి నీరు లేక నానా అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోటారు మరమ్మతు చేయించాలని కోరారు. దీనిపై గోపేపల్లి సర్పంచి రమణారెడ్డిని వివరణ కోరగా.. పంచాయతీ మోటారు తరచూ కాలిపోతున్నట్లు చెప్పారు. గత వారంలో మూడుసార్లు మరమ్మతు చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం కాలిపోవడంతో త్వరలో మోటారు మరమ్మతు చేయిస్తామని వివరించారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రిజర్వేషన్ల పరిరక్షణ సమితి నాయకులు

## చట్టబద్ధమైన రిజర్వేషన్లకు కృషి చేద్దాం

**కదిరి పట్టణం, న్యూస్‌టుడే:** జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 46 శాతం రిజర్వేషన్ కల్పించేలా కృషి చేద్దామని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి నాయకుడు నాగరాజు పిలుపునిచ్చారు. ఆగస్టు 3న నిర్వహించనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాప్రతినిధుల ఆత్మీయసన్మాన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం కదిరిలో ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ, రాజ్యసభకు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు లేవని.. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. నారాయణనాయక్, బాలకృష్ణ, మోహన్‌గాంధీ, ఖుదాబక్షు, అస్రఫ్, గంగాద్రి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

## కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం

**ధర్మవరం, న్యూస్‌టుడే:** సినిమాల్లో విలన్‌లాగా వైకాపా నాయకులు వ్యాఖ్యలు చేస్తూ ప్రశాంతతకు బంగం కలిగిస్తున్నారని ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయినగర్‌లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ్‌తో పాటు తెదేపా నాయకులు ఇంటింటా వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ప్రజలు, ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టారని తెలిపారు. మాజీ మంత్రి పేర్ని నాని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారన్నారు. ఇప్పటికే ప్రజలు వారికి తగిన బుద్ధిచెప్పారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని వివరించారు. ధర్మవరం మండలం కత్తే కొట్టాల గ్రామానికి చెందిన కల్యాణ్‌కు మంజూరైన రూ.7 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. నియోజకవర్గ తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేశ్ చౌదరి, తెదేపా పట్టణ అధ్యక్షుడు సుధాకర్, మాజీ ఎంపీపీ మద్దిలేటి, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**తాడిమర్రి:** మండలంలోని పలు గ్రామాల్లో తెదేపా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై తెలియజేశారు. పూలఓబయ్యపల్లిలో జరిగిన కార్యక్రమంలో తెదేపా నాయకులు అశ్వర్థ, సదా, కిరణ్, రాజశేఖర్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: మహిళకు కరపత్రం అందజేస్తున్న పరిటాల శ్రీరామ్, నాయకులు

## ఘనంగా గ్రామదేవత సల్లాపురమ్మ ఊరేగింపు

**ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే:** మండలంలోని దిగువపల్లిలో ఆదివారం గ్రామదేవత సల్లాపురమ్మ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఏటా వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని, గ్రామస్థులు సుఖశాంతులతో ఉండాలని కోరుతూ ఊరేగింపు నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఓబుళరెడ్డి, తెదేపా మండల కన్వీనర్ జయచంద్ర, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంజినప్ప, రాజారెడ్డి, శివారెడ్డి, సుధాకర్, హరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

**పుట్టపర్తి:** మండలంలోని సుబ్బరాయునిపల్లిలో అక్కమ్మ దేవత జాతర సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఎడ్లబండ్ల పోటీలను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

**ధర్మవరం:** పట్టణంలోని రామ్‌నగర్ చౌడేశ్వరీదేవికి కాలనీవాసులు ఆదివారం బోనాలు సమర్పించారు. దుర్గానగర్, పార్థసారధినగర్ నుంచి మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆషాఢమాసం ఆదివారం పురస్కరించుకొని పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

## బస్సులో ప్రయాణిస్తూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**వేంపల్లె, న్యూస్‌టుడే :** వేంపల్లెలో ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న 48 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులో కదిరిలో ఆ వ్యక్తి బస్సు ఎక్కారు. ఈ మేరకు కండక్టర్ బాబ్‌జాన్ వద్ద వేంపల్లెకు వెళ్లేందుకు టిక్కెట్ తీసుకున్నారు. రాత్రి 8 గంటలకు బస్సు తలుపుల మీదుగా వేంపల్లె నాలుగురోడ్ల కూడలికి చేరింది. ఇంతలో కండక్టర్ అతని వద్దకు వెళ్లి వేంపల్లె స్టేజీ వచ్చింది అని చెప్పగా ఆయన పలకపోగా విగతజీవిగా కనిపించారు. ఈ మేరకు డ్రైవర్ కృష్ణయ్య, కండక్టర్ బస్సును స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లి సమాచారాన్ని పోలీసులకు అందించారు. వారి సూచన మేరకు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద చరవాణి, ఆధార్‌కార్డు లేకపోవడంతో వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## శ్రమదానంతో మట్టి తొలగింపు

**చెన్నేకొత్తపల్లి:** సీకేపల్లి మండలంలోని న్యామద్దలలో సీసీదారిపై పేరుకుపోయిన మట్టిని గ్రామ తెదేపా నాయకులు ఆదివారం శ్రమదానంతో తొలగించారు. గ్రామంలోని బస్టాండ్ కూడలిలో సీసీదారిపై మట్టి పేరుకుపోవడంతో వృథా నీరు నిలబడి మురుగుగా మారి గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. రెండేళ్ల నుంచి ఉన్న సమస్యను గమనించిన తెదేపా నాయకులు ముందుకు వచ్చి శ్రమదానంతో దారిపై ఉన్న మట్టిని తొలగించారు. ట్రాక్టర్‌లో గ్రామం బయటికి తరలించారు.

ధర్మవరం: చిగిచెర్లలో పీర్ల ఊరేగింపు

నంబులపూలకుంటలో..

## జలధికి తరలిన పీర్లు

**ధర్మవరం, ముదిగుబ్బ, బుక్కపట్నం, తాడిమర్రి, న్యూస్‌టుడే:** ధర్మవరం మండలంలోని చిగిచెర్ల, వసంతపురం, సుబ్బరావుపేట, తుమ్మల, రావులచెరువు, గరుడంపల్లి, ఆర్.యర్రగుంటపల్లి గ్రామాల్లో ఆదివారం పీర్లు జలధి నిర్వహించారు. ముదిగుబ్బలోని పాతూరు, బుక్కపట్నం మండలంలోని సిద్ధరాంపురంలో తాడిమర్రి, నంబులపూలకుంటలో పీర్లు జలధికి తరలివెళ్లాయి. భక్తులకు పీర్లకు చక్కెర చదివింపులు చేయించారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

**ధర్మవరం, న్యూస్‌టుడే:** ధర్మవరం రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించే విధంగా వ్యవహరించి గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రెడ్డప్ప హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై పోలీసు నిఘా ఉంటుందని, ప్రశాంతంగా జీవనం చేయాలని తెలిపారు.

## ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

**తలుపుల, న్యూస్‌టుడే:** నూతనకాలువకు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేసినట్లు కార్యదర్శి తహాసీన్, సర్పంచి షేక్షావలి తెలిపారు. 'పాతాళంలోకి గంగ..తాగునీటికి బెంగ' అనే శీర్షికన శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ట్యాంకర్లను ఏర్పాటు చేసి సరఫరా చేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## 15 ధర్నాను జయప్రదం చేయండి

**కొత్తచెరువు, న్యూస్‌టుడే:** విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 15న పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధర్నా నిర్వహించనున్నట్లు పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి నాగార్జునశెట్టి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వేలిడేషన్ అమెండ్‌మెంటు రద్దు, 12వ పే కమిషన్ నియామకం, పెండింగ్ డీఆర్ బకాయిలు తదితర సమస్యల పరిష్కారానికి ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్ల కార్యవర్గ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఉత్కంఠగా క్రికెట్ పోటీలు

**కదిరి, న్యూస్‌టుడే:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన క్రికెట్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. ఆర్డీటీ, ఏసీఏ కోచింగ్ క్యాంపు ఏ, బీ జట్ల మధ్య పోటీలు జరిగాయి. బీ జట్టు విజయం సాధించినట్లు కోచ్ నజీర్ తెలిపారు. మొదట బ్యాటింగ్ చేసిన కోచింగ్ క్యాంపు ఏ జట్టు 30 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన క్యాంపు బీ జట్టు 30వ ఓవర్ చివరి బంతికి విజయాన్ని కైవసం చేసుకుంది.

### క్రైం కార్నర్

## ఎనిమిది మంది బైండోవర్

**కదిరి పట్టణం, న్యూస్‌టుడే:** కదిరిలో లాడ్జిల తనిఖీల సందర్భంగా సరైన సమాచారం ఇవ్వకుండా అనుమానాస్పదంగా వ్యవహరించిన ఎనిమిది మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వేర్వేరు ప్రాంతాల నుంచి కదిరికి వచ్చి లాడ్జిలో ఉన్న వారిలో కదిరి మండలం కాళసముద్రంకు చెందిన ఇస్మాయిల్, కె.బ్రాహ్మణపల్లికి చెందిన రమేశ్, ముదిగుబ్బకు చెందిన ఫకృద్దీన్, చిత్తూరు జిల్లా పీలేరుకు చెందిన వెంకటేశ్వరప్రసాద్, విజయవాడకు చెందిన వీరభద్ర, కుటాగుళ్లకు చెందిన రామాంజనేయులు, షాన్‌వాజ్, ఎరుకవలవాండ్లపల్లికి చెందిన ఈశ్వరయ్య ఉన్నారు. సరైన సమాధానం చెప్పకపోవడం, ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటం, చరవాణిలో గుప్తనిధులకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ఉన్నందున బైండోవర్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**దాడిపై:** బుక్కపట్నం: మండలంలోని సిద్ధరాంపురంలో ఆదివారం జరిగిన మొహర్రంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన మేరకు వివరాలిలా.. సిద్ధరాంపురానికి చెందిన చందు, వెంకటరమణ నాయక్ చేతులు, కాళ్లు తగిలాయని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మాటలు పెరిగి ఘర్షణకు దారితీసింది. గ్రామ పెద్దలు, పోలీసులు కల్పించుకుని నచ్చజెప్పారు. విషయం తెలుసుకున్న చందు కుటుంబ సభ్యులు వెంకటరమణనాయక్ ఇంటి వద్దకు వెళ్లి గొడవపడ్డారు. వెంకటరమణనాయక్ భార్య సాలీబాయి, కుమారుడు తరుణ్ నాయక్ గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మద్యం తాగుతున్న వారిపై..

**ధర్మవరం, న్యూస్‌టుడే:** పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని సీఐ రెడ్డప్ప తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పాడిఆవుల చోరీ

**కొత్తచెరువు, న్యూస్‌టుడే:** కొత్తచెరువుకు చెందిన రైతు కిష్టప్పకు సంబంధించి రెండు ఆవులను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వంగపేరు ఒడ్డునున్న సొంత పొలంలో 20 ఏళ్లుగా పశువులను పోషిస్తున్నారు. నాలుగు ఆవులు, రెండు దూడలు ఉన్నాయి. శనివారం రాత్రి షెడ్డు తాళం పగలగొట్టి రెండు ఆవులు అపహరించారు. ఉదయాన్నే పొలానికి వెళ్లిన రైతు షెడ్డు తలుపులు తెరిచి ఉండడాన్ని చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. షెడ్డులోకి వెళ్లి చూడగా రెండు ఆవులు కనిపించలేదు. రైల్వే వంతెన వరకూ ఆవులను నడిపించుకుని వెళ్లి అక్కడి నుంచి వాహనంలో తరలించి ఉంటారని రైతు అనుమానం వ్యక్తం చేశాడు. చోరీపై సీఐ మారుతీశంకర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**కనగానపల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని ముక్తాపురం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు పేర్కొన్నారు. బెంగళూరు పట్టణానికి చెందిన శ్రీనివాస్ రెండు రోజుల క్రితం కారులో హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి సొంత ప్రాంతానికి వెళుతున్న సమయంలో ముక్తాపురం వద్దకు రాగానే వాహన వేగాన్ని అదుపు చేయలేక విభాగినిని ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు.

## తెదేపా నాయకుడి మృతికి సంతాపం

**బుక్కపట్నం:** కొత్తకోటకు చెందిన తెదేపా నాయకుడు నగరి కేశప్ప(50) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నినాదాలు చేస్తున్న కార్మికులు

## 'సమస్యల పరిష్కారంలో కాలయాపన తగదు'

**ధర్మవరం పట్టణం:** ప్రభుత్వాలు మారుతున్న ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదని.. అధికారులు కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్యలు పరిష్కరించడం లేదని ఆ సంఘం యూనియన్ అధ్యక్షుడు నాగరాజు ఆరోపించారు. సీఐటీయూ నేతృత్వంలో ఇంజినీరింగ్ కార్మికులు చేపడుతున్న దీక్ష ఆదివారానికి 18వ రోజుకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి నుంచి ఇంజినీరింగ్ సెక్షన్‌లోని పలువురు కార్మికులు మున్సిపాలిటీ విధులకు గైర్హాజరయ్యారు. గత ఏడేళ్లుగా సమ్మెలు, ధర్నాలు, నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు తీర్చే వరకు నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టం చేశారు.

## హత్యోదంతంపై ఆరా

**కదిరి పట్టణం, న్యూస్‌టుడే:** కదిరి మండలం బండావాండ్లపల్లిలో శుక్రవారం హత్య జరిగిన ప్రదేశాన్ని డీఎస్పీ శివన్నారాయణస్వామి ఆదివారం పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన నవీన్‌ను కత్తితో పొడిచి కిరాతకంగా హతమార్చిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా డీఎస్పీ కదిరి అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డితో పాటు గ్రామానికి వెళ్లి హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో వివరాలు ఆరా తీసినట్లు తెలిసింది.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ధర్మవరం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దాత మురళీధర్ సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగభూషణ శిబిరాన్ని ప్రారంభించారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేశారు. 114 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణ, విజయ్‌భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవనానికి మోక్షం ఎప్పుడో?

కనగానపల్లి మండలం మామిళ్లపల్లి మినీ అంగన్‌వాడీ భవన నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వం నిధులు కేటాయించింది. మొదట్లో పనులు వేగంగా సాగినా.. నిధుల కొరత కారణంగా పనులు నత్తనడకన సాగాయి. ఫలితంగా అర్ధ గోడలకే భవనం పరిమితం కావడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. మామిళ్లపల్లిలో మెయిన్ అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు రెండు ఉన్నాయి. మినీ అంగన్‌వాడీ భవనాన్ని అసంపూర్తిగా నిర్మించడంతో విధిలేని పరిస్థితుల్లో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలోనే విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. ఇంజినీర్ సహాయకుడు రమేశ్ దృష్టికి తీసుకెళ్లగా..నిధులు మంజూరైన వెంటనే పనులను చేపడతామన్నారు.
- **న్యూస్‌టుడే, కనగానపల్లి**

## గుంత ఉంది జాగ్రత్త

ధర్మవరం పట్టణంలోని కొత్తపేట నుంచి రామ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన కూడలిలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది. కాలువల్లో మురుగు దిగువకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారి మధ్యలో కుంగి గుంత ఏర్పడింది. ఈ దారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు వెళ్తుంటారు. గుంతను పూడ్చాలని పలుమార్లు మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని వాహన చోదకులు వాపోయారు. దీనిపై శానిటేషన్ అధికారి శ్యామ్‌సన్‌ను వివరణ కోరగా.. ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. - **న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం**

## అధ్వానంగా రహదారి.. రాకపోకలకు అవస్థలు

నూతనకాలువ పంచాయతీ నుంచి పోలతలవాండ్లపల్లికి వేసిన తారురోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది. కంకర తేలి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాహనచోదకులు, గ్రామస్థులు వాపోయారు. నూతనకాలువ పంచాయతీ జొన్నాకాలనీ సమీపంలో పలుచోట్ల గుంతలు పడి కంకర తేలింది. దేవరపల్లి - నూతనకాలువకు మధ్యలో ఉన్న అడవిలో పలుచోట్ల రోడ్డు గుంతలు పడినట్లు గ్రామస్థులు వాపోయారు. దీనిపై పీఆర్ (పీఐయూ) జేఈ రాజేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా.. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే పనులు చేపడతామని తెలిపారు. - **న్యూస్‌టుడే, తలుపుల**

## 'మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం'

**గాండ్లపెంట, న్యూస్‌టుడే:** ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైందని మాజీ మంత్రి ఉషాశ్రీచరణ్ అన్నారు. ఆదివారం మండల కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీల వైఫల్యాలను గుర్తించేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రతి కుటుంబం నష్టపోతున్న వివరాలు చూడవచ్చునని తెలిపారు. ప్రభుత్వం కేసులు పెట్టిస్తే భయపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. మగ్బూల్ అహ్మద్, శ్రీనివాసులరెడ్డి, వజ్రభాస్కరరెడ్డి, లోకేశ్వరరెడ్డి, రమేశ్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

**నల్లచెరువు:** మండల కేంద్రంలోని వైకాపా మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు 'షూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. కదిరి నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి మాగ్బుల్‌బాషా, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే బాధ్యత వైకాపా నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు.

(c) eenadu

★ హరిపురంలోని పెద్ద చెరువు సర్వే నంబరు 97, 99లో కలిపి మొత్తం 11.18 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఓ ప్రభుత్వ ఉద్యోగే అందులో కొంత భాగం కబ్జా చేసి భవనం నిర్మించుకున్నారు.

★ పొందూరు మండల కేంద్రం లోని పానుపుల గెడ్డలో సుమారు 20 సెంట్లు ఆక్రమించి.. దుకాణాలు నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ సెంటు రూ.15 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు పలుకుతోంది.

★ మెళియాపుట్టి మండలం ముకుంద పురం పంచాయతీ పరిధిలోని ముకుంద సాగరం చెరువు విస్తీర్ణం 47.5 ఎకరాలు. ఆక్రమణల కారణంగా ప్రస్తుతానికి 20 ఎకరాల వరకే మిగిలింది. చెరువు లోపల మట్టి వేసి పంటలు సాగు చేస్తున్నారు.

★ ఇచ్ఛాపురం పట్టణంలోని కోటేరు బంద చెరువు విస్తీర్ణం 35.22 ఎకరాలు. అందులో సుమారు 10.50 ఎకరాలు ఆక్రమ ణకు గురైనట్లుగా రెవెన్యూ అధి కారులే భూ సర్వేలో తేల్చారు.

★ ఎల్ఎన్‌పేట మండల కేంద్రంలో డోల చెరువును కబ్జా చేసి వ్యాపార కేంద్రంగా మార్చే శారు. మొత్తం విస్తీర్ణం 30 ఎక రాలు కాగా.. అందులో 27 ఎక రాల వరకు ఆక్రమించేశారు.

# చెరువే కదా.. చెరిపేద్దాం పదా..!

గ్రామాల్లో యథేచ్ఛగా తటాకాల ఆక్రమణలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని యంత్రాంగం

జలవనరులను ఆక్రమణదారులు చెరిపేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వందల ఎకరాల్లో చెరువులు అన్యాక్రాంతమవుతున్నాయి. కన్ను పడితే చాలు మట్టి వేసి చదును చేసేస్తున్నారు. కొన్ని చోట్ల పంట పొలాలుగా మార్చేస్తుంటే.. మరికొందరు ఏకంగా చెరువు గర్భంలో పక్కా భవనాలు, దుకాణాలు నిర్మించేస్తున్నారు. దీనిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, బృందం

జిల్లావ్యాప్తంగా వందల ఎకరాల్లో చెరువులు ఆక్రమణల చెరలో చిక్కుకున్నట్లు అధికారులే చెబుతున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం వంద ఎకరాల కంటే తక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు 5,262, వంద ఎకరాలకు పైబడినవి 690 ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల్లో సాగుకు ఇబ్బందులు వాటిల్లకుండా ఉండేందుకు గ్రామాల్లో వీటిని తవ్వించారు. దశాబ్దాల తరబడి వీటిపైనే ఆధారపడి జిల్లా రైతులు పంటలు పండించుకుంటున్నారు. కాలక్రమేణా అవి కనుమరుగవుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సాగు చేయలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది లావేరు మండలం చిన్నమురపాకలోని దాబాల చెరువు. దీని విస్తీర్ణం 112.70 ఎకరాలు. అందులో సుమారు 60 ఎకరాల వరకు కొందరు స్థానిక నేతలు ఆక్రమించారు. చెరువు గర్భంలో మట్టి వేసి పొలాలుగా మార్చేశారు. ప్రస్తుతం వరి, పత్తి, కొబ్బరి, నీలగిరి తోటలు సాగు చేస్తున్నారు. కొంత భాగం కల్లాలుగా వినియోగించుకుంటున్నారు.

### పర్యవేక్షణ ఉండదు.. చెప్పినా స్పందించరు..

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. హద్దులు గుర్తించడం, హెచ్చరిక బోర్డులు పెట్టడం, పరిరక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. చెరువుల సమీపంలోని స్థలాలను కొనుగోలు చేసి క్రమంగా కబ్జా చేసి రూ.కోట్లు విలువైన భూమిని మింగేస్తున్నారు. పొందూరు, లావేరు, మందస, ఇచ్ఛాపురంతో పాటు మరికొన్ని చెరువుల ఆక్రమణపై స్థానికులు రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నారు. తూతూమంత్రంగా పరిశీలన చేసి వెళ్తున్నారే తప్ప ఆగడాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

**జిల్లాలో వివరాలిలా...**
మొత్తం చెరువులు: 5,952
ఆయకట్టు విస్తీర్ణం: 1,89,269 ఎకరాలు

### పరిశీలన చేయిస్తాం..

చెరువుల్ని ఆక్రమించడం నేరం. జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయిస్తాం. ఆక్రమణలు జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. హెచ్చరిక బోర్డులు, హద్దులు గుర్తించి పరిరక్షించేందుకు కృషి చేస్తాం.

– ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జేసీ

## 15న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ రాక

కలెక్టరేట్(శ్రీకాకుళం), పాతబస్టాండ్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా.డి.వి.జి.శంకరరావు ఈ నెల 15న జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానంతరం శాంతినగర్ కాలనీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడతారని చెప్పారు. ఆ తర్వాత మందస తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ అధికారులు, ఆదివాసీ నాయకులతో సమీక్షా సమావేశంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్న భోజనం అయ్యాక ఎచ్చెర్ల బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 'గిరిజన విద్యార్థులకు రిజర్వేషన్ల అమలు, సమస్యలు' అంశంపై జరిగే సమావేశంలో ప్రసంగిస్తారన్నారు.



## చెదరని నిర్లక్ష్యం

ఇది మెళియాపుట్టి మండలంలోని శిరియాఖండిలో గ్రామీణ ఆరోగ్య ఉపకేంద్రం. వైకాపా హయాంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. కొంత మేర నిర్మాణం జరిగాక బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగడంతో గుత్తేదారు పూర్తి చేయలేదు. అధికారులు సైతం నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రస్తుతం భవనం అధ్వానంగా మారింది. తలుపులు చెదలు పట్టి పాడవుతున్నాయి. సిబ్బంది గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. సమస్యను పంచాయతీరాజ్‌శాఖ ఏఈ ఆనందరావు దృష్టికి తీసుకెళ్లగా.. చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, మెళియాపుట్టి

## కర్రలే ఆధారం.. కష్టాలతో సావాసం..!

హిరమండలంలోని పెద్దసంకిలి గ్రామానికి చెందిన వంశధార నిర్వాసితులు గులుమూరు పంచాయతీ జగన్నాథపురంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ కాలనీలో విద్యుత్తు స్తంభాలు లేకపోవడంతో కర్రలనే ఇలా ఆధారంగా పెట్టుకున్నారు.

ఏబీ రహదారి పక్కనున్న స్తంభం నుంచి తీగలు వేసుకుని విద్యుత్తు వినియోగించుకుంటున్నారు. ఈ గ్రామం గులుమూరు పంచాయతీలో కొత్తగా చేరడంతో వీరి సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో పాటు రోడ్లు, కాలువలు సైతం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతం కొండ సమీపంలో ఉండటంతో రాత్రి వేళ విషసర్పాలు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ ఇటీవల వంశధార నిర్వాసితులు వారి సమస్యలు తెలియజేశారని, పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. – న్యూస్‌టుడే, హిరమండలం

## ఆదిత్యుని ఆదాయం రూ.5.87 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రపుష్కరిణిలో స్నానాలు ఆచరించి రావి చెట్టు, గోశాలల్లో పూజలు చేశారు. క్యూలైనులో టెంట్లు ఉన్నప్పటికీ కుటుంబ సమేతంగా బొబ్బిలి నుంచి వచ్చిన ఓ బాలిక ఉదయం ఎండ, ఉక్కపోతకు సొమ్మసిల్లి అస్వస్థతకు గురైంది. దర్శన టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల రూపంలో రూ.5.87 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో కె.ఎన్.వి.డి.ప్రసాదరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, లావేరు, ఎచ్చెర్ల

# ఇంకెంత కాలం.. అవస్థల అభ్యాసం..?

అసంపూర్తిగా నాడు-నేడు రెండో విడత పనులు

సర్కారు బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామని వైకాపా హయాంలో 'నాడు-నేడు' పనులు చేపట్టారు. అవి నేటికీ కొలిక్కిరాలేదు. తొలి విడతలో మంజూరైన పాఠశాలల్లో అదనపు భవనాల నిర్మాణం, ఇతర పనులు దాదాపు పూర్తయ్యాయి. రెండో విడతలో ప్రారంభించిన పనుల పరిస్థితి అతీగతీ లేకుండా ఉంది. కొన్ని చోట్ల పనులు పునాది దశలోనే ఆగిపోయాయి. నిధుల గ్రహణంతో అదనపు గదుల నిర్మాణం జరగక విద్యార్థులకు అవస్థలు తప్పట్లేదు. చాలా చోట్ల ఉన్న తరగతి గదులు చాలక వరండాల్లోనే పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

### వాటినైనా పూర్తి చేయొచ్చుగా..

నాడు-నేడు రెండో విడతకు సంబంధించి జిల్లాలో రూ.25.95 కోట్ల నిధులు ఇప్పటికీ ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లోనే ఉన్నాయి. వాటిని ఖర్చు చేయొద్దని ఉన్నతాధికారులు చెప్పడంతో వినియోగించలేదు. పనులు మధ్యలో వదిలేయడంతో ఊచలకు తుప్పుపట్టగా.. సిమెంట్ గడ్డ కట్టి పోతోంది. కొన్ని బడుల్లో వంట గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్తు సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇవ్వాల్సిన నిధులు మంజూరు చేసి.. కనీసం 70 శాతం నిర్మించిన భవనాలైన పూర్తి చేస్తే విద్యార్థులకు తరగతి గదుల కొరత తీరుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట జడ్పీహెచ్ఎస్‌లో అదనపు గదుల నిర్మాణం ఇలా పునాదులకే పరిమితమైంది. పనుల్లో జాప్యం కారణంగా పునాది బీటలు వారడంతో పాటు ఇనుప గజాలు తుప్పు పట్టిపోయాయి. చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. మెళియాపుట్టి మండలం జాడుపల్లిలోనే ఇదే పరిస్థితి నెలకొంది.

★ కంచిలి జడ్పీ ఉన్నత పాఠశాలలో 600 మంది చదువుతున్నారు. అదనపు గదులు మంజూరైనా పూర్తికాక విద్యార్థులు వరండాలో చదువుకోవాల్సిన దుస్థితి. కనీసం బల్లలు కూడా లేకపోవడంతో నేలపైనే కూర్చుంటున్నారు. మరుగుదొడ్లు నిర్మించినా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో విద్యార్థినులకు అవస్థలు తప్పట్లేదు.

★ టెక్కలి మండలం సీతాపురం జడ్పీహెచ్ఎస్‌లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఆ మేరకు గదుల్లేక సీట్లు కేటాయించడం లేదు. అదనపు గదులు మంజూరైనా పూర్తి కాలేదు. ప్రస్తుతానికి ఉన్న తరగతులనే రెండు చొప్పున సెక్షన్లుగా విడదీసి పాఠాలు చెబుతున్నారు.

★ సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం ఉన్నత పాఠశాలలో 320 మంది విద్యార్థులు చదువుతున్నారు. 6 అదనపు గదులకు రూ.92 లక్షలు మంజూరు చేయగా.. రూ.70 లక్షలు ఖర్చు చేశారు. రూ.10 లక్షలు హెచ్‌ఎం ఖాతాలో ఉన్నాయి. మరో రూ.10 లక్షలిస్తే పనులు కొలిక్కివస్తాయి.

### నివేదిక పంపించాం..

జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన నాడు-నేడు రెండో విడత పనుల పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. చాలా చోట్ల సిమెంటు, ఇనుము ఉన్నాయి. అవి పాడవకుండా చూస్తున్నాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పనులు పునఃప్రారంభిస్తాం. – ఎస్.శశిభూషణ్, ఏపీసీ, సమగ్రశిక్ష

**జిల్లాలో వివరాలిలా..**

| పాఠశాలలు: | ప్రతిపాదిత నిధులు: | ఇప్పటి వరకు ఖర్చు చేసింది: | హెచ్‌ఎంల ఖాతాల్లో ఉన్నవి: | విడుదల కావాల్సింది: |
|---|---|---|---|---|
| 1,054 | రూ.417 కోట్లు | రూ.250 కోట్లు | రూ.25.95 కోట్లు | రూ.141.05 కోట్లు |

## ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు గడువు పెంపు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం బలగలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(డీఎల్‌టీసీ) వివిధ ట్రేడ్‌లలో ప్రవేశాల దరఖాస్తు గడువు పెంచినట్లు ఏడీ వై.రామ్మోహనరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండో విడతలో ప్రవేశాలకు ఈ నెల 20 వరకు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బాలికలు భవిష్యత్తులో క్రాఫ్ట్ ఉపాధ్యాయులుగా కొలువులు పొందేందుకు సూయింగ్ టెక్నాలజీ కోర్సులో ఇస్తున్నామని తెలిపారు. దరఖాస్తుల తనిఖీ అనంతరం అభ్యర్థులకు ఈ నెల 23న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 95051 61701, 99639 45259, 98859 60809 నంబర్లను సంప్రదించాలన్నారు.

– న్యూస్‌టుడే, పాతపట్నం, మెళియాపుట్టి

# చిన్న పల్లెలపై శీతకన్ను!

● 66 ఏకగ్రీవ పంచాయతీలకు అందని ప్రోత్సాహకాలు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఆర్థిక భారం తగ్గించడంతో పాటు పల్లెల్లో శాంతియుత వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో గత వైకాపా ప్రభుత్వం ప్రోత్సాహకాలను ప్రకటించింది. తద్వారా అభివృద్ధికి బాటలు వేయొచ్చని భావించి గ్రామస్థులంతా ఏకతాటిపైకి వచ్చారు. జిల్లాలోని పలు పంచాయతీల్లో ప్రజాస్వామ్యబద్ధంగా సాగే ఎన్నికలను కాదని ఏకగ్రీవ బాట పట్టారు. కానీ నేటికీ పలు గ్రామాలకు ఆ నిధులు అందలేదు. ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు.

మెళియాపుట్టి మండలం ముకుందాపురంలో అభివృద్ధికి నోచుకోని చెరువు గట్టు

జిల్లావ్యాప్తంగా 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం 137 పంచాయతీల సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాటిల్లో వెయ్యి జనాభా కలిగిన పంచాయతీకి రూ.5 లక్షలు, 2 వేల జనాభా ఉంటే రూ.10 లక్షలు, మేజర్ పంచాయతీలకు రూ.15 లక్షల చొప్పున ప్రోత్సాహకాలను అప్పట్లో ప్రకటించారు. ఆ మేరకు రూ.7.90 కోట్లు అవసరం కాగా.. తొలి విడతలో 67 పెద్ద పంచాయతీలకు రూ.4.40 కోట్లు విడుదల చేశారు. మిగిలిన 70 చిన్న పంచాయతీలకు రూ.5 లక్షల చొప్పున ఇవ్వాల్సి ఉంది. వాటికి గతేడాది కూటమి అధికారంలోకి వచ్చాక రూ.20 లక్షలు మంజూరు కావడంతో.. నాలుగు పంచాయతీలకు సర్దుబాటు చేశారు. మిగిలిన 66 పంచాయతీలు విడుదల కావాల్సిన రూ.3.30 కోట్ల కోసం ఎదురు చూస్తున్నాయి.

### నాలుగేళ్లయినా నిరీక్షణే..

అసలే చిన్న పంచాయతీలు.. వచ్చే ఆదాయమూ అరకొరే. ఈ క్రమంలో ప్రభుత్వం ఇవ్వాల్సిన ప్రోత్సాహక నిధులొస్తే కొన్ని అభివృద్ధి పనులైనా చేయొచ్చునని నిరీక్షిస్తున్న వారికి నిరాశ తప్పట్లేదు. తాగునీరు సరఫరాలో ఇబ్బందులు, విద్యుత్తు దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, రహదారులు, కాలువల నిర్మాణం తదితర పనులు చేపట్టాల్సి ఉన్నా జరగని పరిస్థితి నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి నాలుగేళ్లు పూర్తయ్యాయి. మరికొద్ది నెలల్లో మళ్లీ ఎన్నికలకు సిద్ధం కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఆ నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. 'నిధులు మంజూరు కావాల్సి ఉంది. రాగానే పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తాం' అని జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య తెలిపారు.

## ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు 907 మంది ఎంపిక

రెండో విడత జాబితా విడుదల

నూజివీడు రూరల్, వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలకు 907 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఆ జాబితాను ఆదివారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ ఆదివారం విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థుల పేర్లను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

**17న కౌన్సెలింగ్:** మొదటి విడతలో ఎంపికైన 628 మంది విద్యార్థులు చేరలేదు. దీంతో ఆ సీట్లు ఖాళీగా ఉన్నాయి. వాటితో పాటు దివ్యాంగుల కోటా కింద 179, సైనికోద్యోగుల పిల్లల కోటా కింద 80, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 20 సీట్లతో కలిపి మొత్తం 907 సీట్లకు అర్హులైనవారిని ఎంపిక చేశారు. అందులో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి 96 మంది, ఒంగోలుకు 460, నూజివీడుకు 85, శ్రీకాకుళానికి 265 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్‌సీసీ కోటా కింద 40 సీట్లు, క్రీడా కోటా కింద 20 సీట్లకు నిపుణులైన ఆయా శాఖల అధికారుల నుంచి విద్యార్థుల ప్రతిభ జాబితా అందాల్సి ఉంది. ఈ సీట్ల భర్తీ కూడా మరో వారంలో పూర్తి కానుంది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 96 మంది విద్యార్థులు ఈ నెల 17న ఇడుపులపాయకు, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 810 మంది విద్యార్థులు అదే రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరిగే కౌన్సెలింగ్‌కు ధ్రువపత్రాలు, లగేజీలతో హాజరు కావాలని వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. కొత్తగా ఎంపికైన విద్యార్థులందరికీ సోమవారం నుంచి ఓరియంటేషన్ తరగతులు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

## మంత్రి ఆదేశం.. గుంతలకు మోక్షం

రహదారికి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురంలో పర్యటించారు. ఆ సమయంలో సంతబొమ్మాళి- కోటబొమ్మాళి రహదారి గుంతలతో అధ్వానంగా ఉండటాన్ని గమనించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పోర్టు వాహనాల రాకపోకలతో రహదారి ఇలా మారిందని స్థానికులు ఆయనకు తెలియజేశారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో ఆదివారం శరవేగంగా రోడ్డు బాగు చేయించారు. ఎట్టకేలకు గుంతలు పూడ్చడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయంలోని సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యల వివరాలను meekosam.ap.gov.in లో నమోదు చేసుకోవచ్చన్నారు. సమస్యల స్థితిగతులు, పరిష్కార వివరాలు 1100కు డయల్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

– న్యూస్‌టుడే, టెక్కలి

తీరప్రాంత అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు(భావనపాడు) నుంచి విశాఖపట్నం వరకు 4 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. సుమారు 150 నుంచి 200 కిలోమీటర్ల మేర తీరం వెంబడి మరో జాతీయ రహదారి రానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు చొరవతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి సూచికగా నిలిచే ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. ఆ మేరకు డీపీఆర్ తయారీ, భూసేకరణ ప్రక్రియ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# తీరం వెంబడి ప్రగతికి బాటలు..!

● మూలపేట నుంచి విశాఖ వరకు సాగర నడవ
● 4 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి సన్నాహాలు

సిక్కోలు కొత్త శోభను సంతరించుకోనుంది. పోర్టు నిర్మాణంతో పాటు మూలపేట పారిశ్రామిక క్లస్టర్‌కు ఈ రహదారి మణిహారంగా మారనుంది. బారువ బీచ్ ఫెస్టివల్ జరిగిన తర్వాత తీరాన్ని గోవాకు దీటుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. దీంతో పాటు గ్రీన్‌ఫీల్డ్ రహదారి అందుబాటులోకి వస్తే ఇచ్ఛాపురం వరకు పర్యాటకాభివృద్ధికి అవకాశాలు మెరుగుపడతాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మూలపేట నుంచి భోగాపురం విమానాశ్రయం మీదుగా విశాఖపట్నం వరకు ఈ నడవ నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నారు.

### పెరగనున్న ఉపాధి అవకాశాలు..

నడవ నిర్మాణంతో ఉత్తరాంధ్రలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పరిశ్రమలు, పర్యాటక రంగాల అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. జిల్లాలోని మత్స్యకారులకు కొత్త అవకాశాలు రానున్నాయి. బుడగట్లపాలెంలో హార్బర్ నిర్మాణంతో పాటు మరో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కార్గో ఎగుమతులతో ఆర్థిక పురోభివృద్ధి జరుగుతుందని, స్థిరాస్తి వ్యాపారం మరింత పుంజుకుంటుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఈనాడు కథనానికి స్పందన

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: రౌడీ షీటర్లలో మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా పలు పోలీసు స్టేషన్ల పరిధిలో ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ చేపట్టారు. 'ఈనాడు'లో ఈ నెల 12న 'వీధికో దాదా.. రోజుకో దందా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు రౌడీ షీటర్లను స్టేషన్లకు పిలిపించారు. నేరప్రవృత్తిని మార్గంగా ఎంచుకుని దందాలు చేసున్నట్లు ఫిర్యాదులొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వారానికి ఓ రోజు తప్పనిసరిగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, రాలేని పరిస్థితి ఉంటే సంబంధిత స్టేషన్ ఎస్సై అనుమతి తీసుకోవాలని చెప్పారు. నగరంలోని రెండోపట్టణ స్టేషన్ పరిధిలో ఎక్కువ మంది ఉండటంతో ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు సీఐ ఈశ్వరరావు వెల్లడించారు.

# నింగి నుంచి అదే పనిఘా..!

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

● పోలీసుశాఖలో డ్రోన్ల వినియోగంతో సత్ఫలితాలు

● జిల్లా కేంద్రంలో నాగావళి నది పరివాహక ప్రాంతాల్లో పలు చోట్ల ఆకతాయిలు మకాం వేస్తున్నారు. అక్కడున్న ఇసుక తిన్నెలపై ముళ్లపొదల చాటున గంజాయి, మద్యం తాగుతున్నారు. కొన్ని చోట్ల జూద శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకుని పోలీసులు డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేశారు. ఫలితంగా వ్యసనపరులు ఆ ప్రాంతాలకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

● గార మండలం కళింగపట్నం, వత్సవలస, శ్రీకాకుళం గ్రామీణ ప్రాంతంలోని గణగళ్లవానిపేట, మత్స్యలేశం వంటి సముద్ర తీరాల్లో ఆకతాయిలు మద్యం తాగి అలజడులు సృష్టించేవారు. పలుమార్లు ప్రేమికులపైనా దాడులకు పాల్పడ్డారు. ఇటీవల ఆయా చోట్ల డ్రోన్లతో జల్లెడ పట్టి.. కౌన్సెలింగ్ ఇవ్వడంతో తాకిడి కొంత మేర తగ్గింది.

నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు సాంకేతిక బాట పట్టారు. జిల్లావ్యాప్తంగా నిర్మానుష్య ప్రదేశాలను గుర్తించి.. ఆయా చోట్ల డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుశాఖలో డ్రోన్ వినియోగాన్ని పెంచింది. జిల్లావ్యాప్తంగా సమస్యాత్మక పోలీసు స్టేషన్ల పరిధిలో వీటిని అందుబాటులో ఉంచారు. వినియోగానికి ఎస్‌టీఎఫ్(స్పెషల్ టాస్క్‌ఫోర్స్) సిబ్బందిని ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. డ్రోన్లు ఎగరేయడం, రద్దీ ప్రాంతాల్లో చిత్రాలు, వీడియోలు తీయడం వంటి మెలకువలు నేర్పుతున్నారు. రోజూ అనుమానిత ప్రదేశాల్లో సుమారు 2 గంటల పాటు డ్రోన్లతో సర్వైలెన్స్ చేపడుతున్నారు.

శ్రీకాకుళం నగరంలో నాగావళి తీరాన డ్రోన్‌తో పర్యవేక్షణ

### సాంకేతికతతో నేరాల అదుపు..

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి డ్రోన్ల పర్యవేక్షణ కొనసాగుతోంది. పాత నేరస్థులపై నిఘా పెంచాం. ఆలయాలు, పని ప్రదేశాలు, శివారు ప్రాంతాల్లో ప్రతిరోజూ డ్రోన్లు ఎగురవేస్తున్నాం. సాంకేతికత వినియోగంతో నేరాలను అదుపు చేయగలుగుతున్నాం. – కేవీ రమణ, అదనపు ఎస్పీ, అడ్మిన్

**జిల్లాలో వివరాలిలా..**

| | | | |
|---|---|---|---|
| మండలాలు: 30 | మెరైన్ స్టేషన్లు: 3 | డ్రోన్ల వినియోగంపై శిక్షణ పొందినవారు: 160 | జిల్లాలో గంజాయి తాగే ప్రదేశాలు: 65 |
| పోలీసు స్టేషన్లు: 43 | నేర ప్రదేశాలు: 80 | | ఖాళీ స్థలాలు, శిథిల భవనాలు: 56 |

### ఏం చేస్తున్నారంటే..

★ డ్రోన్ కెమెరాల ద్వారా ప్రతి స్టేషన్ పరిధిలో సమస్యాత్మక, శివారు ప్రాంతాలను గుర్తిస్తున్నారు.

★ శిథిల భవనాలు, నిర్జన ప్రదేశాలు, గంజాయి, మద్యం తాగే స్థావరాలపై నిఘా ఉంచుతున్నారు.

★ అసాంఘిక కార్యకలాపాల్లో నిమగ్నమయ్యే వారిని గుర్తించి పుటేజీకి చిక్కిన వారిని స్టేషన్లకు పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అదే ప్రాంతంలో మళ్లీ కనిపిస్తే కేసులు నమోదు చేస్తున్నారు.

★ పండగలు, తిరునాళ్లు, రాజకీయ పార్టీల సమావేశాలు, ధర్నా, బంద్‌లు, ట్రాఫిక్ నియంత్రణలోనూ డ్రోన్లను వాడుతున్నారు.




(c) eenadu

## బాగున్నావా.. దోస్తు..!


గురువులతో పూర్వ విద్యార్థులు

వారంతా 1973-1980 మధ్య పదో తరగతి చదువుకున్న విద్యార్థులు. ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో 50 ఏళ్లు దాటిన వయసులో కలుసుకున్నారు. ఐకమత్యంగా.. ఒకరినొకరు తెలియని అనుభూతి. సంతోషం ఎలా ఉన్నావ్ మిత్రమా అంటూ ఆలింగనం చేసుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆద్యంతం ఆనందంగా గడిపారు. చాన్నాళ్లయింది చూసి అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ అపూర్వ సమ్మేళనానికి లావేరు జడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. అక్కడ చదువుకున్న పదో తరగతి చదువుకున్న 7 బ్యాచ్‌ల్లో 100 మంది హాజరై చదువు చెప్పిన గురువులను సత్కరించి, పాదాభివందనం చేశారు. -న్యూస్‌టుడే, లావేరు

## విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు

కోట శ్రీనివాసరావుతో లోకనాథం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సినీ వినీలాకాశంలో నాలుగున్నర దశాబ్దాలపాటు విలక్షణ పాత్రలతో మెప్పించిన నటుడు కోట శ్రీనివాసరావు అని సామాజికవేత్త, జాతీయ అవార్డు గ్రహీత గురుగుబెల్లి లోకనాథం తెలిపారు. ఆయనతో పెళ్లి కోసం సినిమాలో తాను నటించే అవకాశం లభించిందని గుర్తు చేశారు. ఆయన మృతి సినిమా రంగానికి తీరని లోటన్నారు. రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధులు లోకనాథం రామలింగస్వామి, పన్నాల నరసింహమూర్తి, బంటుపల్లి రామచంద్రదేవ్‌లు ప్రగాఢ సానుభూతి తెలియజేయగా, సుమిత్ర కళాసమితి ప్రతినిధులు ఇప్పిలి శంకరశర్మ, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు సంతాపం వ్యక్తం చేశారు.

## అలరించిన నృత్య ప్రదర్శన

కోల్‌కతాలోని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ధ్యాన యజ్ఞం ఉత్సవాల్లో కళింగపల్లి సంప్రదాయ నాట్యగురుకులం కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. స్వాతి సోమనాథ్ శిష్య బృందం కూచిపూడి నాట్య శైలిలో ప్రదర్శనలిచ్చి ప్రశంసలు అందుకుంది. ★ తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా భద్రాచలంలో కోదండరామస్వామి దేవస్థానంలో భద్రాద్రి సాంస్కృతిక వారధి సంస్థ నిర్వహించిన పోతనామాత్యుల ఉత్సవాల్లో పొందూరు అచ్యుతాపేటకు చెందిన సన స్నేహాంజలి శాస్త్రీయ నృత్యప్రదర్శనతో అలరించింది. -న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం, పొందూరు గ్రామీణం

## వ్యక్తి అనుమానాస్పద మృతి

సలగ నారాయణరావు (పాత చిత్రం)

సారవకోట, న్యూస్‌టుడే: పెద్దలంబ పంచాయతీ కురమన్నపేట గ్రామానికి చెందిన సలగ నారాయణరావు (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న నారాయణరావు మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 11న పనులకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. భార్య హైమావతి, కుమార్తెలు ఉష, లలితలతో కలిసి స్వగ్రామమైన పాతపట్నం కొయ్యకొండలో ఉంటున్నారు. ఆదివారం గ్రామానికి సమీపంలోని తోటలో మేకలు కాస్తున్న కొంతమంది కుళ్లిన స్థితిలో ఉన్న వ్యక్తిని గుర్తించి తోట యజమాని వి.దేవప్రసాద్‌కు తెలియజేశారు. ఆయన తహసీల్దార్ విజయలక్ష్మికి వీఆర్వో ద్వారా సమాచారాన్ని అందించారు. ఎస్సై బి.అనిల్‌కుమార్, వీఆర్వో జె.బాలరాజు, గ్రామస్థులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి నారాయణరావుగా గుర్తించారు. అధికంగా మద్యం తాగి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి బాబూరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పాముకాటుతో మృత్యువాత

జగదీష్

ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే: శ్యామలాపురం గ్రామానికి చెందిన ఇప్పిలి జగదీష్(48) పాముకాటుతో మృతి చెందారు. గ్రామస్థులు, బంధువులు అందించిన వివరాల ప్రకారం.. జీవనోపాధి కోసం జగదీష్ కొంత కాలంగా మాంసం దుకాణం నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం దుకాణం నుంచి ఇంటికి వెళ్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ప్రైవేటు వాహనంలో సరుబుజ్జిలి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మధ్యలో మృతి చెందారు. కుమారుడు దుర్గాప్రసాద్ రెండేళ్ల కిందట విశాఖపట్నంలో ఓ ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. కుమార్తెకు వివాహమైంది. భార్య భానుమతి ఉన్నారు. భర్త, కుమారుడు దూరం కావడంతో ఆమె కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

స్పందనకు వందనం

నక్కలపేటలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న మండల విద్యాశాఖాధికారులు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ఎంఈవో-1,2 బాలరాజు, శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నక్కలపేట ప్రాథమిక పాఠశాల మూతపడంపై ఈ నెల 13న 'గురువు లేక పాఠశాల మూత' శీర్షికన 'ఈనాడులో' వచ్చిన వార్తకు మండల విద్యాశాఖాధికారులు స్పందించారు. నక్కలపేటలో ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఎంఐఎస్ పైడి మురళీకృష్ణ, సీఆర్ఎంటీ చిరంజీవి, పాల్గొన్నారు.

## యువజన సంఘాలకు ఊతమేది..?

పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ (పాతచిత్రం)

-న్యూస్‌టుడే, పొందూరు, జి.సిగడాం

దేశ ప్రగతిలో యువతను భాగస్వాములను చేసేందుకు కేంద్ర యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎన్‌వైకే (నెహ్రూ యువ కేంద్రం) పేరును ఇటీవల 'మేరా యువ భారత్‌'గా మార్చారు. ఇందులో ఉండే వాలంటీర్ల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపేందుకు క్షేత్రస్థాయిలో పనిచేయాల్సి ఉంటుంది. గత రెండేళ్లుగా నెహ్రూ యువ కేంద్రంలో వాలంటీర్ల వ్యవస్థ నియామకం నిలిచిపోవడంతో ఉన్న వారితో పని అనిపిస్తున్నారు. దీంతో ప్రజా చైతన్య కార్యక్రమాలు మందకొడిగా సాగుతున్నాయి.

### వాలంటీర్ల విధులివే

వాలంటీరుగా చేరేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 18 నుంచి 29 మధ్య వయసు ఉండాలి. ఉన్నత విద్య, కంప్యూటర్ పరిజ్ఞానం, స్మార్ట్‌ఫోన్ ఆపరేటింగ్ తెలిసి ఉండి, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌లో పనిచేసిన వారికి ప్రాధాన్యమిస్తారు. ఈ దిశలో హరితహారం, రక్తదాన శిబిరాలు, పల్స్‌పోలియో, స్వచ్ఛభారత్, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, క్రీడలు, మూఢనమ్మకాలపై అవగాహన, బాల్య వివాహాల అరికట్టడం, స్వచ్ఛత తదితర సామాజిక కార్యక్రమాలు యువజన సంఘాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వాలంటీర్లు ఎంతో కీలక పాత్ర పోషిస్తారు. వాలంటీర్ వ్యవస్థ ఉద్యోగం కాదు. స్వచ్ఛందంగా సేవా భావంతో పనిచేయాలి. గౌరవ వేతనంగా రూ.5వేలు చెల్లిస్తారు. కూటమి ప్రభుత్వంలోనైనా కొత్తగా వాలంటీర్లను నియమించి సంఘాలకు ఊతం కలిగిస్తారని పలువురు కోరుతున్నారు.

### రెండేళ్లుగా ఊసే లేని వాలంటీర్ల నియామకం

● జిల్లాలో నిర్వహణలోని సంఘాలు: 150
● యువకులు: సుమారు 12 లక్షలు

### సంయుక్తంగా సేవా కార్యక్రమాలు

జిల్లాలో నెహ్రూ యువజన సంఘం పరిధిలో 12 బ్లాక్‌లకు 24 మంది మాత్రమే వాలంటీర్లు పనిచేస్తున్నారు. దీంతో ఎన్ఎస్ఎస్, పలు సేవా సంస్థల సహకారంతో నెహ్రూ యువ కేంద్రం పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తోంది. దీనికితోడు రెండేళ్లుగా ఆటల పరికరాల కిట్లు యువజన సంఘాలకు కేంద్ర ప్రభుత్వం అందించకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాలంటీర్ల నియామకం చేపట్టేందుకు చర్యలు చేపడతాం. పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి నెహ్రూ యువజన సంఘం సంయుక్తంగా ప్రజా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయకర్త యు.వెంకట్ తెలిపారు.

## సాకారమవుతున్న వంతెన కల

బడ్డవానిపేట వద్ద నిర్మాణం జరుగుతున్న వంతెన

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం బడ్డవానిపేట వద్ద నూకాలమ్మ కాలువపై వంతెన లేక ఏళ్లుగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి రూ.2.6 కోట్లు మంజూరు చేయించారు. ఏప్రిల్‌లో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు భూమిపూజ చేయించి పనులు ప్రారంభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నారాయణవలస సంతకు పూర్వవైభవం

ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కూటమి నేతలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన నారాయణవలస వారపు సంతకు పూర్వవైభవం తీసుకొస్తామని రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. తక్షణమే సంతకు చెందిన స్థలంలో ఆక్రమణలు తొలగించాలని ఆర్డీవో కృష్ణమూర్తిని ఆదేశించారు. నారాయణవలసలో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వైకాపా నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా పంచాయతీలో ఎటువంటి పనులు జరగలేదని చెప్పారు. రూ.1.50 కోట్ల నిధులు పక్కదోవ పట్టినట్లు విజిలెన్సు అధికారులు గుర్తించారని పేర్కొన్నారు. నారాయణవలస కూడలిని అభివృద్ధి చేసి, నిమ్మాడ కూడలి వరకు రహదారిని పునర్నిర్మిస్తామని తెలిపారు. నారాయణవలస, తుంబయ్యపేట మహిళలు తాగునీటి సమస్యలను అచ్చెన్న వద్ద ఏకరువు పెట్టారు. నేతలు కింజరాపు ప్రసాదరావు, బోయిన రమేష్, విజయలక్ష్మి, రామకృష్ణ, లక్ష్మణరావు, కామేశ్వరరావు, సింహాచలం, ఎంపీడీవో ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

## 'పది' వరకు పర్లేదు.. ఆపై అవకాశం లేదు

ఉన్నత విద్యకు గిరిజన విద్యార్థులు దూరం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఐటీడీఏ పరిధిలోని గిరిజన బిడ్డలకు ఉన్నత విద్య కలగా మిగిలిపోతోంది. పది వరకు పూర్తి చేసినా.. తరువాత ఇంటర్, డిగ్రీ చదవాలంటేనే భారంగా మారుతోంది. సీతంపేట ఐటీడీఏ విభజనాంతరం సిక్కోలులో మిగిలిన 16 మండలాల పరిధిలో గిరిజన విద్యార్థులకు పెద్దమడి గురుకుల బాలురు, మెళియాపుట్టి ఏకలవ్య, మినహా ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఒక్కటీ లేకపోవడంతో విద్యకు దూరమైపోతున్నారు. మాజీ సీఎం జగన్ పాదయాత్ర చేసిన సమయంలో మెళియాపుట్టి మండలానికి ప్రత్యేకంగా మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటుతోపాటు మండలానికి ఒక డిగ్రీ కళాశాల పెడతామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని నెరవేర్చలేదు.

### మంచి ఉత్తీర్ణత

సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరం జరిగిన పదో తరగతి పరీక్షలు 800 మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా 600 మందికి పైగా ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో శ్రీకాకుళం, పాలకొండ వెళ్లి అద్దెగదుల్లో అవస్థలు పడుతూ చదువుకుంటున్నారు. 16 మండలాల్లో ఆశ్రమ ఉన్నత పాఠశాలల స్థాయి పెంచి ఇంటర్, డిగ్రీ వరకు పెంచితే విద్యార్థులకు వెసులుబాటు కలిగి చదువుకునేందుకు వీలుగా ఉంటుందని అంతా కోరుతున్నారు. 'ఐటీడీఏ పరిధిలో మహిళా జూనియర్ కళాశాలకు సంబంధించి ప్రతిపాదనలు గతంలో చేశాం. బాలిక ఆశ్రమ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదన పంపించాం అనుమతి వస్తే ఏర్పాటు చేస్తాం' అని సీతంపేట ఐటీడీఏ డీడీ అన్నాదొర అన్నారు.

## రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలకు పలువురి ఎంపిక

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బ్యాడ్మింటన్ క్రీడాకారులు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల సాధనతో ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్యుడు గూడేన సోమేశ్వరరావు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ మైదానంలో ఆదివారం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు, రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం జరగగా ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. వ్యాయామానికి దోహదపడే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. రెండు రోజులుగా బాల, బాలికలు, పురుషులు, మహిళల విభాగాలకు జరిగిన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.సాగర్, కార్యదర్శి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ★ బాలుర సింగిల్స్ విభాగంలో 11, డబుల్స్‌లో 10 మంది, బాలికల సింగిల్స్ 6, డబుల్స్ ఆరుగురు, మెన్ అండ్ ఉమెన్ సింగిల్స్, డబుల్స్‌లో అయిదుగురు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

### ఈత పోటీల్లో 14 మంది సత్తా

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతినగర్‌లోని డీఎస్ఏ ఈత కొలనులో జరిగిన ఈ పోటీలను జిల్లా క్రీడల అధికారి కె.శ్రీధర్‌రావు ప్రారంభించారు. 14 మంది ఎంపిక కాగా క్రీడాకారులు ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖపట్నం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

## పీఆర్ ఇంజినీర్లకు ఉద్యోగోన్నతి కల్పించండి..!

మాట్లాడుతున్న ఏపీ పీఆర్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పీఆర్ ఇంజినీర్లలో అర్హత కలిగిన వారిని ఏఈ, డీఈ, ఈఈలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని ఏపీ పీఆర్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. రవీంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతుల విషయంలో న్యాయం చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా రానున్న రోజుల్లో ధర్నా చేపడతామన్నారు. డిప్లొమా ఇంజినీర్ల సమస్యల పరిష్కారంలో పీఆర్ ఈఎన్‌సీ నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. తమశాఖలో సైట్ ఇంజనీర్లుగా 206 నుంచి ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న 75 మందిని, టైంస్కేల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఈ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతి, ఆ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## గోతుల మార్గం.. కష్టమే ప్రయాణం

లావేరు మండలం గుర్రాలపాలెం నుంచి పొందూరు, జి.సిగడాం మండలాలకు వెళ్లే రహదారి మడ్డువలస ప్రధాన కాలువ సమీపంలో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గత మూడు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారి జలయమం కావడంతో గోతుల్లోకి నీరు చేరి చెరువును తలపిస్తోంది. వాహనదారులు ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. రహదారులు, భవనాల శాఖ ఏఈఈ ఎం.ఆంజనేయరాజు వద్ద ప్రస్తావించగా మరమ్మతులు చేపడతామన్నారు. -న్యూస్‌టుడే, లావేరు

## కూర్మనాథుని సేవలో ప్రముఖులు

నల్లరాతి స్తంభాలపై లిపిని పరిశీలిస్తున్న తమిళనాడు ముఖ్య కార్యదర్శి వెంకటేశ్

గార (శ్రీకూర్మం), న్యూస్‌టుడే: గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రాన్ని తమిళనాడు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి టి.ఎన్.వెంకటేష్, పార్వతీపురం మన్యం జిల్లా అరకు ఎంపీ తనూజారాణిలు ఆదివారం సందర్శించారు. స్వామి దర్శనం అనంతరం బేడా మండపంలోని నల్లరాతి స్తంభాలపై ఉన్న నాటి చారిత్రక లిపిని, ఆలయ పరిసరాలును టి.ఎన్.వెంకటేష్ పరిశీలించారు. ఈవో నరసింహనాయుడు వీరికి స్వామివారి చిత్రపటం బహూకరించారు.

## గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయండి

మాట్లాడుతున్న వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

లావేరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వైకాపాకు త్వరలో పూర్వవైభవం రానుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం లావేరు మండలం బెజ్జిపురంలో ఎచ్చెర్ల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అధ్యక్షతన మండల స్థాయి విస్తృత సమావేశం, బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్క కార్యకర్త గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి.


మహారాజశ్రీ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి, శ్రీకాకుళం వారి కోర్టులో (EP 108/2024 in OS No.43/2018)

విట్నీన్.. వంబరవిల్లి అప్పలనాయుడు – డిక్రీ హోల్డర్
మరియు కిల్లారి మోహనరావు – జడ్జిమెంట్ డెటార్

ఇందుమూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తి శ్రీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, శ్రీకాకుళం వారి ఉత్తర్వుల ప్రాప్తికి తే.30-07-2025దీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గం॥ల వరకు బహిరంగ వేలం ద్వారా అమ్మకం జరపబడును. కావున ఆసక్తి గల వేలం ద్వారా కొనగలిగిన వ్యక్తులు/సంస్థలు పై తేదిన జిల్లా కోర్టు ఆవరణలో జరుగు బహిరంగ వేలంలో పాల్గొనవలసిందిగా కోరడమైనది.
బహిరంగ వేలం కొరకు సిద్ధంగా ఉన్న ఆస్తి వివరం : పార్వతీపురం మన్యం జిల్లా, భామిని మండలం, కొసలి రెవిన్యూ గ్రామం, సబ్ రిజిస్ట్రార్ హిరమండలం పరిధిలో గల ఈ క్రింది ప్రతుల వివరాలు.

| నెం. | ఖాతా నెం. | సర్వే నెం. | విస్తీర్ణం | స్వభావం | హద్దులు |
|---|---|---|---|---|---|
| 1వ ప్రతి | 1186 | 68-5 | 0.15 | మాగాణి | తూర్పు : ఎరుకు మజ్జి శ్రీరాములు మెట్టు భూమి, దక్షిణం : ఎరుకుమజ్జి సత్యం నాయుడు మెట్టు భూమి, పడమర: కేసు పద్మ గారి మెట్టు భూమి ఉత్తరం : మజ్జి వరలక్ష్మి గారి మెట్టు భూమి |
| 2వ ప్రతి | 1186 | 26-1 | 0.18 | మెట్టు | తూర్పు : కరణం అప్పన్న గారి మెట్టు భూమి దక్షిణం : కొవ్వాడ చిరంజీవులు మెట్టు భూమి పడమర: ఒమ్మి రమణయ్య గారి మెట్టు భూమి ఉత్తరం : కిల్లారి సత్యం గారి మెట్టు భూమి |
| 3వ ప్రతి | 1186 | 43-7 | 0.23 | మెట్టు | తూర్పు : ఎరుకుమజ్జి వరహాలు మెట్టు భూమి దక్షిణం : కిల్లారి నాగేశ్వరరావు మెట్టు భూమి పడమర: యరుకుమజ్జి జీవరత్నం మెట్టు భూమి ఉత్తరం : కొవ్వాడ సరోజని గారి మెట్టు భూమి |
| 4వ ప్రతి | 1186 | 2-35 | 0.30 | మాగాణి | తూర్పు : కొరికాన ఆనందరావు మెట్టు భూమి, దక్షిణం : కొవ్వాడ సుందర్ గారి మెట్టు భూమి పడమర: కిల్లారి సత్యం గారి మెట్టు భూమి ఉత్తరం : పోలాకి రాంబాబు గారి మెట్టు భూమి |
| 5వ ప్రతి | 1186 | 12-7 | 0.28 | మెట్టు | తూర్పు : ఎరుకుమజ్జి జీవరత్నం మెట్టు భూమి దక్షిణం : యరుకుమజ్జి ఆదినారాయణ మెట్టు భూమి పడమర: యరుకుమజ్జి మహేశ్వరరావు మెట్టు భూమి ఉత్తరం : కిల్లారి హనుమంతరావు మెట్టు భూమి |
| 6వ ప్రతి | 1186 | 125-2 | 0.36 | మాగాణి | తూర్పు : ఒమ్మి మోహనరావు గారి మెట్టు భూమి దక్షిణం : ఒమ్మి రమణమ్మ గారి మెట్టు భూమి పడమర: కొరికాన సూర్యనారాయణ మెట్టు భూమి, ఉత్తరం : ఒమ్మి భాస్కరరావు గారి మెట్టు భూమి |
| 7వ ప్రతి | 1186 | 37-11 | 0.37 | మాగాణి | తూర్పు : యరుకుమజ్జి సత్యంనాయుడు మెట్టు భూమి దక్షిణం : వెంగల చిన్నమ్మి గారి మెట్టు భూమి పడమర: యరుకుమజ్జి మహేశ్వరరావు మెట్టు భూమి ఉత్తరం : యరుకుమజ్జి మహేశ్వరరావు మెట్టు భూమి |
| 8వ ప్రతి | 1186 | 31-1 | 0.11 | మాగాణి | తూర్పు : ఒమ్మి మోహనరావు గారి పల్లం భూమి దక్షిణం : ఒమ్మి భాస్కరరావు గారి పల్లం భూమి పడమర: ఒమ్మి పార్వతి గారి పల్లం భూమి ఉత్తరం : పలుకోతు కృష్ణ గారి పల్లం భూమి |

గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి ఉత్తర్వులు ప్రకారం
యం. అప్పారావు, డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాది. ఫోన్ నెం. 9441868672


## వీఆర్‌కు ఇద్దరు ఎస్సైలు

శ్రీకాకుళం నేర వార్తా విభాగం, న్యూస్‌టుడే: రౌడీలతో సంబంధాలు కొనసాగిస్తున్న పోలీసు సిబ్బందిపై విచారణ మొదలైంది. ఆదివారం జి.సిగడాం ఎస్సై మధుసూదనరావు, ఇచ్ఛాపురం గ్రామీణ ఎస్సై శ్రీనివాసరావులను (వేకెన్సీ రిజర్వు)లో ఉంచుతూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాసరావుపై ఆర్థిక లావాదేవీలు, సివిల్ పంచాయతీల ఫిర్యాదులు ఉండగా పలువురు బాధితులు ఎస్పీని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. జి. సిగడాం మండలం డీఆర్‌వలస గ్రామంలో నవగ్రహ మండపాన్ని ధ్వంసం చేసిన ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సైను వీఆర్‌కు పంపించారు.

## అరుదైన నేల.. సంరక్షిద్దాం తల్లిలా..!

బీలలో ఎల్లప్పుడూ నీటి నిల్వలు

-న్యూస్‌టుడే, సోంపేట

ఏడాది పొడవునా నీటి నిల్వలతో అలరారే సోంపేట బీల ప్రాంతం ప్రపంచంలోనే అరుదైన చిత్తడి నేలల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇక్కడ థర్మల్ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టగా రైతులు, మత్స్యకారులు వ్యతిరేకించారు. 2010, జులై 14న థర్మల్ విద్యుత్తుకేంద్రం ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించగా ప్రజలు ప్రతిఘటించడంతో జరిగిన పోలీసు కాల్పులు చేశారు. లక్కవరం, పలాసపురం గ్రామాలకు చెందిన రైతులు గొనప కృష్ణమూర్తి, గున్న జోగారావు మృత్యువాత పడగా, గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పలాసపురం రైతు బెందాళం కృష్ణమూర్తి మరణించారు.

### మూడు జలాశయాలు

జలంతో కళకళలాడుతున్న బీలబట్టి

సోంపేట, కంచిలి, కవిటి మండలాల పరిధిలో ఆవరించిన బీలభూముల్లో ఏడాది పొడవునా నీటి నిల్వలుంటాయి. ఇద్దివాని పాలెం దరిలో తంపరగా పిలువబడే 4,500 ఎకరాల విస్తీర్ణంలో మూడు చోట్ల సహజ సిద్ధంగా ఏర్పడిన జలాశయాలున్నాయి.

### బొగ్గు కుంపటి వద్దని

థర్మల్ విద్యుత్తుకేంద్రం ఏర్పాటుకు సోంపేట బీలలో చిత్తడినేలల భూములను కేటాయిస్తూ 2007లో అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 33 గ్రామాల మధ్యలో 973 ఎకరాలు నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించగా రైతుల నుంచి మరో 6 వందల ఎకరాలకు పైబడి భూములను కంపెనీ కొనుగోలు చేసింది. ఇక్కడ బొగ్గుఆధారిత విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేస్తే గాలిలో 10 కి.మీ పరిధిలో ఫ్లైయాష్ (బూడిద) ఆవరించడంతో పాటు భూగర్భ జలాలు నాశనం కావడం, నీరు, గాలి భూమి కాలుష్యం అయి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్లాంట్ ఏర్పాటుకు నిరాకరించారు. ఈ క్రమంలో పోలీసుల కాల్పుల్లో జరిగి పలువురు మృతి చెందారు.

### పరిశ్రమలు ఏర్పాటు చేయొద్దు

కాల్పుల ఘటన తరువాత పరిశ్రమలు ఏర్పాటు చేయొద్దని రెండేళ్ల కిందటే జాతీయ పర్యావరణ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. చంద్రబాబునాయుడు 2015లో థర్మల్ ప్లాంట్ ఏర్పాటు జీవో(1107) రద్దు చేసి కాలుష్యరహిత ఆహారశుద్ధి పరిశ్రమలు ఏర్పాటుకు 329 జీవో జారీ చేశారు. ఇది చిత్తడిభూముల రక్షణకు ఆటంకం నెలకొంది. 'ఎట్టి పరిస్థితుల్లో ఈ నేలల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశం ఉండదు. ఆందోళనకారులపై ఉన్న పోలీసు కేసులు ఎత్తి వేయాలని ముఖ్యమంత్రిని కోరాను.' అని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు.

## బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న

పొందూరు, న్యూస్‌టుడే: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న ప్రభుత్వాన్ని కోరారు. పొందూరులో ఆదివారం అఫీషియల్ కాలనీలోని డీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి రాజశేఖర్‌తో కలిసి మాట్లాడారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని బడులకు కొత్తగా ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, క్లస్టర్ ఉపాధ్యాయుల పోస్టులను సృష్టించి ఆ పోస్టుల్లో ఉపాధ్యాయులను భర్తీ చేశారని, నూతనంగా సృష్టించిన ఉపాధ్యాయ పోస్టుల్లో నియమించిన వారికి ఐడీ నంబర్లు ఇంతవరకు కేటాయించకపోవడం, జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. మండల డీటీఎఫ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

### చికెన్ ధరలు

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 110 | 175 | 195 |


ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

EENADU Classifieds

JOBS

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ టీం లీడర్స్ కావలెను. అర్హతలు 10th to Degree. జీతం : 21,000/- నుండి 45 వేల వరకు. Contact : 9704107303, 8008574616.

Receptionist and Waiters Required Age: below 35 yrs with Computer & Hindi & English speaking skills Hotel Winsar Park, Opp. KGH, Vizag. 9849581868.

Experienced building supervisor required in Srikakulam town. Salary upto 14,000. Call: 9177278078

Required ITI in Civil with 5 yrs + Experience in the field of Constructions. Call : 9959969354.

Male House Keeping Boy for House Food and Accomodation Available. Contact: 8897663366.

మణిరాజ్ ఎలక్ట్రో మొబైల్స్‌తో కలిసి స్టెప్‌అప్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్, లైవ్ ప్రాజెక్టులతో EV ఇంజినీరింగ్ మైక్రో డిగ్రీ సర్టిఫికేషన్ (4 వారాలు) కోర్సును అందిస్తోంది. 100% ప్లేస్‌మెంట్ సహాయం. సంప్రదించండి: 7997638005, 7997226984.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

## ఆదిలోనే సాగునీటి కష్టాలు

రైతుకు ఆదిలోనే సాగునీటి కష్టాలు... వజ్రపుకొత్తూరు మండలం పూండి ప్రాంత మెట్టు రైతులు ఖరీఫ్ సాగు కోసం నానా పాట్లు. ఆశించిన స్థాయిలో వర్షాలు లేక నారుమడులు ఎండుతున్నాయి. ఈ ఏడాది ఎక్కువ మంది వెద పద్ధతిలో సాగు చేస్తుండగా.. వర్షాభావ పరిస్థితుల కారణంగా మొలకెత్తే సమయంలో వరుణుడు ముఖం చాటేయడంతో ఖర్చులంతా ఎండిపోతున్నాయి. ఏమీ చేయలేని దుస్థితి నెలకొంది. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

# పలాస

• పలాస • ఇచ్ఛాపురం

## అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట మండలం బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సివిక్స్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.సౌజన్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని కోరారు. సివిక్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 18న ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం బాలురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు అసలు ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

ఇచ్ఛాపురం ఎర్రన్నాయుడు కూడలిలో నిరసన తెలుపుతున్న తెదేపా శ్రేణులు

సోంపేటలో మాజీ మంత్రిపై ఫిర్యాదు చేస్తున్న తెదేపా నాయకులు

ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో హింసను ప్రోత్సహించేలా, తమ కార్యకర్తలను రెచ్చగొట్టేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నాయకుడు పేర్ని నానిని అరెస్టు చేయాలంటూ తెదేపా ఇచ్ఛాపురం నియోజకవర్గ నాయకులు కోరారు. ఇటీవల విజయవాడలో జరిగిన వైకాపా సమావేశంలో ప్రజలను రెచ్చగొట్టే విధంగా చేసే వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఇచ్ఛాపురంలో పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పత్రి తవిటయ్య, ఎన్.కోటి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండు సమీపంలోని ఎర్రన్నాయుడు కూడలిలో ఆందోళన చేపట్టి, పేర్నినాని, వైకాపా నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పట్టణ ఎస్సై ఎం.ముకుందరావుకు ఫిర్యాదు చేశారు. సోంపేటలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, కవిటిలో మండలాధ్యక్షుడు పొందల కృష్ణారావు ఆధ్వర్యంలో నాయకులు ఆయా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

## జలకళ కర్షకుల ఆనందహేల

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం/గ్రామీణం

ఖరీఫ్ కాలానికి ముందు రైతులందరూ చందాలు పోగు చేసుకుని శ్రమించి పంట కాలువలకు ఒక రూపు తెచ్చారు. ఇదంతా గత ప్రభుత్వ కాలంలో.. బాహుదానది ఆధారంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జరుగుతున్న పంటల సాగు, రైతులు దీనావస్థలు.. వీటిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డా.బెందాళం అశోక్ ద్వారా తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాహుదా గ్రోయిన్ల అభివృద్ధికి నిధులు కేటాయించారు. ఆ మేరకు జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరింగ్ అధికారి స్వయంగా పరిశీలించి ప్రతిపాదనలు చేశారు.

❖ ఈ లోగానే రైతుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వ విప్ ప్రత్యేక నిధులతో బెల్లుపడ ఛానల్‌కు రూ.4 లక్షలు, కేశుపురం కొత్త ఛానల్‌కు రూ.4 లక్షలు మంజూరు చేసి, ఆయా నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు జరిపించాలని సూచించారు. ఈమేరకు జలవనరుల శాఖ ఏఈ మధుసూదన పాణిగ్రాహి పర్యవేక్షణలో రెండు ఛానళ్ల పనులు జరిగాయి. వీటిని పటిష్ఠపరిచేందుకు ముఖ్యమంత్రి సమకూర్చిన నిధులతో రాతికట్టు నిర్మాణం చేపట్టేలా సన్నాహాలు చేస్తున్నారు. కేశుపురం కొత్త ఛానల్ పరిధిలో 4 కిలోమీటర్ల కాలువను సిద్ధం చేశారు. నీరు రావాల్సి ఉంది. నదిలో నీరు లేకపోవడంతో, పాత ఛానల్ వైపు నీటిని మళ్లిస్తున్నారు. వర్షాలు పడిన తరువాత ఈ ఛానల్‌కు కూడా నీరు విడుదల చేస్తామని నీటి సంఘ అధ్యక్షుడు దక్కత కామేశ్వరరావు తెలిపారు. ఈ కాలువపై సుమారు 600 ఎకరాల పంట భూమితోపాటు 50 ఎకరాల చేపల చెరువులు, మరో 30 ఎకరాల తోటలు ఆధారపడి ఉన్నాయి. బెల్లుపడ ఛానల్ పరిధిలో సుమారు 1,800 ఎకరాల వరిసాగు చేస్తున్నారు.

అభివృద్ధి చేసిన బెల్లుపడ ఛానల్‌లో నీరు

### ఆనందంగా ఉంది..

దీనావస్థలో ఉండే పంట కాలువకు రూపు వచ్చింది. ఇప్పుడు కళకళలాడుతోంది. పూర్తిస్థాయి కాలువను అభివృద్ధి చేయడం ఎంతో అవసరం.
- రంగాల జానకిరామ్‌రెడ్డి, రైతు, బెల్లుపడ

### రాతికట్టుకు ప్రతిపాదించాం..

మట్టి పనులు పూర్తయ్యాయి. వర్షం పడితే కాలువలోకి నీరు చేరుతుంది. ఈ లోగా ముఖ్యమైన ప్రాంతాల్లో రాతి కట్టు కట్టేందుకు ప్రతిపాదించాం. అందుబాటులో ఉన్న నిధులతో పనులు జరిపిస్తాం. ఈ లోగా ముఖ్యమంత్రి కేటాయించిన నిధులు మంజూరైతే ఏ ఇబ్బంది ఉండదు. ముంపు భయం కూడా ఉండదు.
- దక్కత కామేశ్వరరావు, అధ్యక్షుడు, కేశుపురం నీటిసంఘం

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

| | |
|---|---|
| ఇచ్ఛాపురం | 9440437129 |
| పలాస | 8008574279 |
| కవిటి గ్రామీణం | 9063144707 |
| పలాస గ్రామీణం | 7386408926 |
| కంచిలి గ్రామీణం | 9063144708 |

?: ఇచ్ఛాపురం పుర పరిధి గౌడవీధి కూడలిలో కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. **- చేతన్‌గౌడ్, ఇచ్ఛాపురం** ▌ పరిశీలించి కౌన్సిల్‌లో ప్రతిపాదన పెడతాం. **-పి.కామేశ్, ఏఈ, ఇచ్ఛాపురం** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: పలాస మండలం ఈదురాపల్లి ప్రధాన వీధిలో కాలువలు లేవు. **– స్థానికులు** ▌ ప్రతిపాదనలు పంపాం.. త్వరలోనే కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరిస్తాం. **- ఆశ, పంచాయతీ కార్యదర్శి, కేదారిపురం** – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

?: కంచిలి మండలం ఎస్ఆర్‌సీ పురం పంచాయతీ సిద్ధివినాయక కాలనీలో కాలువ లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉంటోంది. **- సుదర్శన్ బెహరా, ఉపాధ్యాయుడు** ▌ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **- విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి**
– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

## శిథిలావస్థలో భవనం

కొజ్జిరియాలో 15 ఏళ్ల కిందట నిర్మించిన విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి వేరే ప్రాంతానికి వెళ్తున్న ప్రజలు చెట్టునీడన బస్సు, ఆటోల కోసం వేచి ఉంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి హరిని వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

## చెత్త కుప్పలు తొలగించరూ..

ఇచ్ఛాపురం మండలం బెనుగానిపేటలో ఇళ్లకు సమీపంలో చెత్త వేస్తున్నారు. దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని, అనారోగ్యానికి గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ కృష్ణకు వివరణ కోరగా త్వరలోనే చెత్తను తొలగించి సమస్య పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

## అంచున ప్రమాదం

ఇచ్ఛాపురం పట్టణ పరిధి బెల్లుపడ అచ్చెమ్మపేట సమీప రహదారి అంచులు తెగిపోయాయి. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కన ఉన్న కాలువకు గోడలు నిర్మించి, రోడ్డును సరిచేయాలని కోరుతున్నారు. పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు చేస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## ప్రారంభానికి ఇంకెన్నాళ్లో..

ఇసకలపాలెం పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయినప్పటికీ ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. దీని నిర్మాణం తెదేపా హయాంలో ప్రారంభించగా వైకాపా పాలనలో సచివాలయంగా మార్చి పనులు పూర్తిచేశారు. బిల్లుల చెల్లింపులో నెలకొన్న ఇబ్బందులతో ఇది నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. చిన్నగదిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సమస్యను సర్పంచి అంకమ్మ వద్ద ప్రస్తావించగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

## తాగునీటికీ ఇబ్బందే...!

పలాస మండలం లొత్తూరులోని ప్రధాన వీధిలో తాగునీరు సరఫరా చేసే కుళాయిలు సుమారు పదిహేను రోజులుగా పని చేయట్లేదు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు గురైన కుళాయిలను బాగు చేసి, పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి రాజకుమార్ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

## అమ్మవార్లకు చల్లదనోత్సవం

వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురం, చిన్నమురహరిపురం గ్రామాల పరిధిలో నూతనంగా నిర్మించిన మరిడమ్మ, ఉజ్జుడమ్మ అమ్మవార్ల ఆలయ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా అమ్మవార్ల విగ్రహాలను రథాలపై ఊరేగించారు. అనంతరం వేప కొమ్మలతో చల్లదనోత్సవం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచి వసంతరావు, ఎంపీటీసీ సభ్యుడు వసంతరావు, గ్రామస్థులు, యువత, మహిళలు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

## 12 గంటలపాటు వరుణయాగం

సోంపేట పట్టణంలో వర్షాలు కురవాలని కోరుతూ పట్టుశాలి వీధిలో ఆదివారం నిర్విరామంగా 12 గంటలపాటు వరుణయాగం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త సుధాకర్ ఆధ్వర్యంలో రుత్వికులు నిర్వహించిన హోమంలో స్థానికులు పాల్గొన్నారు. చుట్టుపక్కల వర్షాలు పడుతున్నప్పటికీ సోంపేట పట్టణంలో లేకపోవడంతో ఏర్పడుతున్న ఇబ్బందులు గమనించి యాగం చేశామని నిర్వాహక ప్రతినిధి గిరిబాబు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

## సింహద్వారానికి రూ.1.50 లక్షల విరాళం

రాజపురానికి వెళ్లే రహదారిలో కాళీమాత ఆలయ సింహద్వారం నిర్మాణానికి దివంగత పొల్లాయి యశోద సింహాద్రి దంపతుల కుమారులు సీతారాం, ఉమామహేశ్వరరావు, యోగానంద దంపతులు రూ.1.50లక్షల నగదును అగ్నికుల క్షత్రియ పెద్దలకు ఆదివారం విరాళంగా అందజేశారు. పొల్లాయి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

## పూర్తికాని నిర్మాణాలు.. అందని వైద్య సేవలు

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ఆరోగ్య ఉపకేంద్రాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో గ్రామీణులకు వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందడంలేదు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 69 భవనాలు మంజూరుకాగా 19 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. మరో 50 భవనాలు వివిధ దశల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల (వెల్‌నెస్ సెంటర్లు) నిర్మాణానికి ఉపాధి పథకం, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఒక్కో భవనానికి రూ. 17.50 లక్షల చొప్పున మంజూరు చేసింది. నిర్మాణ వ్యయం పెరగడంతో మరో రూ. 3 లక్షలు కేటాయించారు. సకాలంలో నిధులు కేటాయించకపోవడంతో నాలుగేళ్లయినా నిర్మాణాలు పూర్తి కాలేదు.

కవిటి మండలం కుసుంపురంలో అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్ర భవనం

### అద్దె, సామాజిక భవనాలే దిక్కు..

నియోజకవర్గంలో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో పలు చోట్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో అద్దె, సామాజిక భవనాలు, సచివాలయాల్లో వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. మరికొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయినా చిన్న చిన్న పనులు చేయాల్సి ఉన్నా ఆ భవనాలను ఎలక్షన్ ముందు నాయకులు హడావుడిగా ప్రారంభించేశారు. వాటిలో ప్రస్తుతం విధులు నిర్వహించడం లేదు.

### నిధుల కొరత..

ఆరోగ్య కేంద్రాలకు నిధులు మంజూరు కాకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. భవనాలు పూర్తయిన చోట ఆరోగ్య సిబ్బందికి అప్పగించాం. మిగిలిన చోట్ల ప్రభుత్వ నిధులు మంజూరు చేసిన వెంటనే పనులు పూర్తి చేసి ప్రారంభిస్తాం. – ప్రవీణ్‌కుమార్, ఏఈ, పంచాయతీరాజ్, కవిటి

### నియోజకవర్గ వివరాలు

| మండలం | మంజూరైనవి | పూర్తయినవి | వివిధ దశల్లో ఉన్నవి |
|---|---|---|---|
| కవిటి | 17 | 5 | 12 |
| ఇచ్ఛాపురం | 14 | 1 | 13 |
| కంచిలి | 19 | 6 | 13 |
| సోంపేట | 19 | 7 | 12 |

## వేగంగా పనులు పూర్తిచేయాలి

పనులు పరిశీలిస్తున్న పురాధ్యక్షుడు గిరిబాబు

పలాస, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలని పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం అధ్యక్షుడు బళ్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ శివాజీనగర్‌లో రూ.16లక్షలతో చేపడుతున్న రహదారి, కాలువ పనులను ఆదివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని సూచించారు. కౌన్సిలర్లు ఎస్.సోమేశ్వరరావు, డి.శ్రీకాంత్, గుత్తేదారు ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం

క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని చింతామణి సొండి కుల సంక్షేమ సంఘం సభ్యులు అన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయి 20కిలోమీటర్ల నడక పోటీల్లో కవిటి మండలానికి చెందన మొగిలిపురి సతీష్ తృతీయ స్థానం కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు సతీష్‌ను సొండి కుల సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు.
– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

## నేడు బీల అమరుల సంస్మరణ సభ

సోంపేట, న్యూస్‌టుడే: థర్మల్ వ్యతిరేక ఉద్యమంలో మృతి చెందిన అమరుల సంస్మరణ సభ సోమవారం బారువలో నిర్వహించనున్నట్లు పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు వై.కృష్ణమూర్తి, బి.సత్యరాజు తెలిపారు. బారువ పూర్వ విద్యార్థి సంఘ భవన ప్రాంగణంలో జరగనున్న సభలో సినీనటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి, ప్రముఖ తెలంగాణ కవి జయరాజు, మానవహక్కుల వేదిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పర్యావరణ, సామాజికవేత్తలు పాల్గొంటారన్నారు. ముందుగా బీలలోని అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తామన్నారు. బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో అమరులకు నివాళులర్పించి పలాసపురం అన్నపూర్ణ రైస్ మిల్లు ఆవరణలో సమావేశం నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీన డిల్లీరావు తెలిపారు.

## శాశ్వత పరిష్కారం చూపిస్తాం

తహసీల్దార్ కల్యాణ చక్రవర్తికి సమస్యలు వివరిస్తున్న స్థానికులు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం రామకృష్ణాపురం ఆర్‌అండ్ఆర్ కాలనీ సమీపంలోని ఓ ఆశ్రమంలో మరణించిన మృతదేహాలను నిర్వాసితుల ఇళ్ల సమీపంలో దహనపరుస్తున్నారు. దీనిపై ఆదివారం 'ఇళ్ల సమీపంలో దహన సంస్కారాలు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పలాస మండల తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి స్పందించారు. దహన సంస్కారాలు చేస్తున్న ప్రదేశాన్ని ఆదివారం పరిశీలించారు. ఆర్‌అండ్ఆర్, జగనన్న కాలనీల్లో నివాసముంటున్న ప్రజలు తహసీల్దార్ ఎదుట తమ సమస్యలు ఏకరవు పెట్టారు. ఈ సందర్భంగా శ్మశానం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. సమస్యను ఆర్డీవో దృష్టిలో పెడదామని, సోమవారం ఆర్డీవో కార్యాలయానికి రావాలని తహసీల్దార్ నిర్వాసితులకు సూచించారు. ఆయనతో మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ రాకముందు ఆశ్రమానికి చెందిన వ్యక్తులే డ్రోన్‌తో ఫొటోలు, వీడియోలు తీసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్పందనకు వందనం

## కాలువలు శుభ్రం చేశారు

ఇచ్ఛాపురం పురపాలిక పరిధి ఏఎస్‌పేట పెద్ద వీధి, కొత్తవీధిలో మురుగునీటితో నిండి ఉన్న కాలువలను ఆదివారం శుభ్రం చేశారు. ఈ సమస్యపై ఇటీవల 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఇచ్ఛాపురం పురపాలక సంఘం కమిషనర్ నల్లి రమేష్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పారిశుద్ధ్య అధికారి పి.ఉపేంద్ర పర్యవేక్షణలో కార్మికులు ఆదివారం కాలువల్లో పూడిక తొలగించారు. అనంతరం బ్లీచింగ్, పొడి సున్నం వెదజల్లించారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## అభివృద్ధి.. సంక్షేమం కూటమితోనే సాధ్యం

ఇచ్ఛాపురంలో కరపత్రాలను అందిస్తున్న కౌన్సిలర్ లీలారాణి

సొండిపూడిలో ప్రచారం చేస్తున్న తెదేపా నాయకులు

మందస, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనపై తెదేపా శ్రేణులు మందస మండలం సొండిపూడిలో ఆదివారం ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వివరించి కరపత్రాలు పంచారు. తెదేపా కళింగ కార్పొరేషన్ డైరెక్టరు దుర్యోధనరావు, చౌదరి మురళీకృష్ణ, ఎం.సత్యం, గణపతి, కళ్యాణ్, సింహాద్రి పాల్గొన్నారు. ❖ ఇచ్ఛాపురం పుర పరిధిలోని 11, 16 వార్డుల్లో కూటమి నాయకులు 'సుపరిపాలనలో.. తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలు అందించి, అవగాహన కల్పించారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని జిల్లా తెలుగుమహిళ ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ ఆశి లీలారాణి, మాజీ కౌన్సిలర్ నాగరాజు పాత్ర్ తెలిపారు.

## నిధులు వృథా..

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో చెత్త సంపద కేంద్రం నిర్మాణానికి రెండేళ్ల కిందట అధికారులు చర్యలు తీసుకున్నారు. పలాస మండలం లొద్దభద్రకు వెళ్లే దారిలో ఈ కేంద్రం ఏర్పాటుకు షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. సగం వరకు చేసి వదిలేశారు. నిర్మాణానికి నిధులు వృథా తప్పా ప్రయోజనం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పుర డీఈ కనకరాజు మాట్లాడుతూ పరిశీలించి కేంద్రం పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు.– న్యూస్‌టుడే, కాశీబుగ్గ

## బాధితుడికి ఆర్థిక సాయం..

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కంచిలి మండల జాడుపూడి గ్రామానికి చెందిన కొయ్యి మన్మథరావు కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు బాధితుడి మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు.

## రోడ్లు వేయరు.. కాలువలు తీయరు..

– న్యూస్‌టుడే, కంచిలి

కంచిలి పంచాయతీలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఈ పంచాయతీ పరిధి కంచిలి, గొల్లకంచిలి, మఠంకంచిలి, బలియపుట్టుగకాలనీ, అబ్దుల్ కలాంకాలనీ, బలియాపుట్టుగ, పెద్దపాత్రపడ, చిన్నపాత్రపడ, దాకరాపల్లి గ్రామాలున్నాయి. మండల కేంద్రమైన కంచిలిలో ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు లేవు. వర్షాల సమయంలో ఇళ్లలోకి నీరు చేరడంతోపాటు సోంపేట రైలు నిలయం, స్టేట్ బ్యాంకు పరిసరాల్లో నిత్యం నీరు నిల్వ ఉండి రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. కంచిలి, గొల్లకంచిలి, బలియాపుట్టుగ, పాత్రపడ గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలతో పాటు కాలువల సమస్య వేధిస్తోంది. అబ్దుల్ కలాం కాలనీకి మౌలిక సదుపాయాలు లేవు.

నిర్మాణానికి నోచుకోని కంచిలి జాతీయ రహదారి నుంచి దాకరాపల్లికి వెళ్లే రోడ్డు

కంచిలి, బలియాపుట్టుగ కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. సచివాలయం, రైతు సేవా, ఆరోగ్య ఉపకేంద్రాలకు భవనాలు లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. వెలుగు, ఉపాధి హామీ శాఖల కోసం కడుతున్న భవనం రెండు దశాబ్దాలుగా నిర్మాణ దశను దాటడంలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు లేవు.

❖ స్థానిక సోంపేట రైలు నిలయానికి సోంపేట, కంచిలి, కవిటి మండలాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కంచిలి లోపలికి రాకుండా జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోతుండటంతో ఆటోలు ఇతర వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఒడియా విద్యార్థులకు ఇక్కడ అవకాశం లేకపోవడంతో సోంపేట వెళ్లి వ్యయప్రయాసలకు గురవుతున్నారు. మరి కొందరు తప్పక తెలుగు మాధ్యమంలో కొనసాగుతున్నారు. ఇక్కడి సమస్యలపై ఎంపీడీవో తిరుమలరావును వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

**పంచాయతీ: కంచిలి, జనాభా : సుమారు 10వేలు మంది, గృహాలు : 1,800పైగా**

## కొత్తది పూర్తి.. పాతది తొలగింపు

వజ్రపుకొత్తూరు మండలం పూండి రైల్వేస్టేషన్‌లో దశాబ్దాల కిందట నిర్మించిన ఫుట్‌పాత్ వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో పలుమార్లు వంతెన పైనుంచి రాకపోకలు మూసివేశారు. తర్వాత కొత్తది మంజూరై నిర్మాణం పూర్తవడంతోపాటు రాకపోకలు కొనసాగడంతో పాత వంతెన తొలగింపు పనులకు రైల్వే అధికారులు శ్రీకారం చుట్టారు. ఆదివారం క్రేన్ సహాయంతో బ్రిడ్జి తొలగింపు పనులు చేపడుతున్నారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

## పిడుగు పాటు.. మహిళకు అస్వస్థత

హిరమండలం, న్యూస్‌టుడే: పాతకొమనాపల్లిలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు ఓ మహిళ అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన దువ్వ చినబాబు ఇంటిపై పిడుగు పడగా పక్కనే ఉన్న బండి శిమ్మయ్య ఇల్లు దెబ్బతింది. ఈ సమయంలో ఆరుబైట పనులు చేస్తున్న శిమ్మయ్య భార్య పిడుగు ధాటికి అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయారు. స్థానిక గ్రామీణ వైద్యులు సకాలంలో వైద్య మందించడంతో ఆమె స్పృహలోకి వచ్చారు. పిడుగు పడటంతో పలువురి గృహాల్లో విద్యుత్తు సామగ్రి దెబ్బతింది.

## ఆక్రమణలపై లోకాయుక్త విచారణ

సోంపేట, న్యూస్‌టుడే: బిరుసువాడలో సర్వే నంబర్ 202లో చెరువు ఆక్రమణతోపాటు లేఅవుట్‌కు సంబంధించిన అవకతవకలపై అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఆధ్వర్యంలో సోమవారం లోకాయుక్త విచారణ జరగనుందని ఫిర్యాదుదారు పి.బాలరాజు తెలిపారు. రైతుల తరపున గతంలో ఫిర్యాదు చేయగా లోకాయుక్త అధికారులు పరిశీలించి విచారణకు చర్యలు తీసుకున్నారని సర్వే నంబర్ 193, 194ల్లో భూములు కలిగిన రైతులు హాజరుకావాలని కోరారు.

(c) eenadu

# టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

**మేమున్నాం.. మీకు తోడుగా** (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం దిమ్మిడిజోల పంచాయతీ గనియావూరు గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు పగిలిపోయింది. దీంతో నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

- సవర మోహనరావు, స్థానికుడు

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. కొత్త ట్యాంకు నిర్మించి, ఇబ్బందులు తీరుస్తాం. - సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, దిమ్మిడిజోల - న్యూస్‌టుడే, నందిగాం

?: సారవకోట మండలం గొర్రిబందలోని ప్రధాన వీధి, కాలనీలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో చీకట్లతో రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నాం. ఈ విషయాన్ని సంబంధిత సిబ్బందికి తెలియజేసినా ఫలితం లేకుండా పోయింది. - గ్రామస్థులు

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తాం

- విష్ణువర్ధన్, కార్యదర్శి, గొర్రిబంద - న్యూస్‌టుడే, సారవకోట

## సీఎం సహాయనిధి పేదలకు వరం

నిమ్మాడలో చెక్కులు అందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని ఆయన కార్యాలయంలో ఆదివారం టెక్కలి నియోజకవర్గంలోని 13 కుటుంబాలకు రూ.26.19 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం నందిగాం మండలం దిమ్మిడిజోలకు చెందిన సుమారు పదిహేను కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. నాయకులు బోయిన రమేష్, పినకాన అజయ్, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, మాజీ సర్పంచి గుండ లక్ష్మణరావు పాల్గొన్నారు.

### పక్కా ప్రణాళికతో కొత్తమ్మతల్లి ఉత్సవాలు

సెప్టెంబరులో నిర్వహించనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలు పక్కా ప్రణాళికతో చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ఈమేరకు నిధుల వ్యయానికి సంబంధించిన వివరాలను ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ మంత్రికి నివేదించారు. హడావుడి నిర్ణయాలు వద్దని, ప్రశాంతంగా కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అచ్చెన్న పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలపై దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ ప్రసాద్‌పట్నాయక్‌తో చరవాణిలో మాట్లాడారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తూరు, జలుమూరు, పోలాకి, న్యూస్‌టుడే: కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.ధనంజయరావు ఆదివారం తెలిపారు. చరిత్ర, పౌరశాస్త్రం, ఒకేషనల్ విభాగంలో ఖాళీలున్నాయని చెప్పారు. పీజీలో 50 శాతం మార్కులు దాటిన వారు ఈనెల 15 తేదీ లోగా దరఖాస్తులు అందించాలని కోరారు. ● జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్రంలో ఖాళీ ఉన్నట్లు ప్రిన్సిపల్ జామి సారిక చెప్పారు. ఈనెల 18న శ్రీకాకుళం బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ● ప్రియాగ్రహారంలో వృక్షశాస్త్ర అధ్యాపకుడి పోస్టు ఖాళీ ఉన్నట్లు ప్రిన్సిపల్ టి.జగదీశ్వరరావు చెప్పారు.

## పశువుల సంచారం.. ప్రాణ సంకటం

### ప్రధాన రహదారులే అడ్డా

డివిజన్ కేంద్రం టెక్కలిలో పశువుల బహిరంగ సంచారంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, ఇందిరా, చిన్నబజారు, అంబేడ్కర్ కూడళ్లు, పాతబస్టాండుతో పాటు పాతజాతీయ రహదారిలో పశువులు గుంపులుగా సంచరిస్తుండటంతో ట్రాఫిక్, పారిశుద్ధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పట్టణ వాసులు వాపోతున్నారు. ఉన్నట్టుండి రహదారిపైకి వచ్చిన సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. కూరగాయల దుకాణదారులు పశువుల్ని తరిమే సమయాల్లో జనంపైకి పరిగెత్తుకుంటూ దూసుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరా కూడలిలో సంచరిస్తున్న మూగజీవాలు

- న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

● టెక్కలి పట్టణంలోని కచేరి వీధిలో ఇటీవల పశువులు అడ్డు రావడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు కిందపడి గాయపడ్డారు. ఒకరికి పక్కటెముకలు విరిగిపోయి పరిస్థితి విషమంగా మారడంతో కొన్నిరోజులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని ఐసీయూ విభాగంలో చికిత్స అందించాల్సి వచ్చింది.

టెక్కలిలో ఏర్పాటు చేసిన గోసంరక్షణ శాల

● కొన్నాళ్ల కిందట టెక్కలిలో నివాసముంటున్న ఓ తపాలాశాఖ ఉద్యోగి భార్య, కుమార్తెతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో పశువులు ఒక్కసారిగా దూసుకురావడంతో కిందపడి ఆయన కాలు విరిగింది. కుటుంబసభ్యులు రహదారిపై సాయం కోసం భయంతో కేకలు వేశారు.

### అదే తీరు.. అవే అవస్థలు

టెక్కలిలో పశువుల బహిరంగ సంచారాన్ని అరికట్టేందుకు మంత్రి అచ్చెన్నాయుడు గతేడాది అక్టోబరు 24న జిల్లా ఆసుపత్రి వెనక భాగంలో గోసంరక్షణ శాలను ఏర్పాటు చేయించారు. ఆరుబయట తిరుగుతున్న పశువుల్ని పట్టుకుని అక్కడకు తరలించి పెంపకం దారులకు అపరాధ రుసుం విధిస్తే మార్పు వస్తుందని ఆశించారు. పశువుల కోసం ప్రస్తుతం ఓ షెడ్డును ఏర్పాటు చేశారు. తాగునీరు, గడ్డిని అందుబాటులో ఉంచారు. ఓ కాపలాదారుడ్ని సైతం నియమించారు. సరైన పర్యవేక్షణ లేక దీని నిర్వహణ తూతూమంత్రంగా మారింది. రహదారులపై తిరుగుతున్న పశువుల్ని పట్టుకుని గోసంరక్షణ శాలకు తరలించాల్సి ఉన్నా పంచాయతీ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. రాత్రివేళ కాపలాదారు లేని సమయాల్లో పెంపకం దారులు రక్షణ కంచెను ధ్వంసం చేసి మూగజీవాలను తోలుకెళ్తుండటం సమస్యగా మారింది.

### దూరప్రాంతాలకు తరలిస్తాం

రెండు వారాల కిందట ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 16 పశువుల్ని పట్టుకుంటే అందులో పదింటిని గోసంరక్షణ శాల స్తంభాలు ధ్వంసం చేసి గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళ తరలించారు. పశుసంవర్ధక శాఖాధికారులతో కలిసి సమస్య పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తున్నాం. పశువుల్ని పట్టుకున్న రోజునే వాటిని బయటి మండలాలకు తరలించే ఆలోచన చేస్తున్నాం.

- జి.వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి, టెక్కలి

## వ్యర్థాలకు నిప్పు.. కలగని కనువిప్పు

లక్ష్మీనర్సుపేట గ్రామానికి వెళ్లే రహదారి పక్కన వ్యర్థాలు కుప్పలుగా వేస్తున్నారు. వాటికి నిప్పు పెడుతుండటంతో పొగతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. చాలా వరకు గ్రామంలో సేకరించిన చెత్తను వంశధార నదిలో వేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. - న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, అధికారులు, నాయకులు

## శివారుకు సాగునీరందించడమే లక్ష్యం

జలుమూరు, న్యూస్‌టుడే: శివారు భూములకు సాగునీరందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. వంశధార ప్రధాన ఎడమకాలువపై ఉన్న నరసన్నపేట (24) బ్రాంచ్ కెనాల్‌కు ఆదివారం నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కాలువ ద్వారా జలుమూరు, నరసన్నపేట, పోలాకి మండలాల్లో 37,700 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. రూ.12.00 కోట్ల నిధులతో కాలువల ఆధునికీకరణకు ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. రైతులు పొదుపుగా నీటిని వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, గుండ మన్మథరావు, కింజరాపు సత్యనారాయణ, ఎం.వెంకటప్పలనాయుడు, తర్ర బలరాం, దుంగ స్వామిబాబు, వంశధార శాఖ ఈఈ ఎం.మురళీమోహనరావు, డీఈఈలు రామలక్ష్మి, శిమ్మ శ్రీనివాసరావు, జేఈలు హరీశ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## వంతెన.. గతి ఇంతేనా..!

నందిగాం మండలం కణితివూరు సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై 1989లో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. నిత్యం రద్దీగా ఉండే మార్గంలో పరిస్థితి ఇలా ఉండటంతో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వారధి కూలితే నందిగాం, నరేంద్రపురం, నారాయణపురం, కణితివూరు, వజ్రపుకొత్తూరు మండలం పూండి ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ప్రతిపాదనలు పంపించామని వంశధార శాఖ ఈఈ శేఖరరావు చెప్పారు.

- న్యూస్‌టుడే, నందిగాం

## తొలగించండి.. ఇబ్బందులు తీర్చండి

జలుమూరు మండల కేంద్రంలోని ఉపాధిహామీ పథకం, వెలుగు కార్యాలయాల వెనక పనికిరాని మొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. కిటికీలకు సైతం అల్లుకోవడంతో పాములు లోపలికి వచ్చే అవకాశముందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉపాధిహామీ పథకం ఏపీవో శేఖర్ వద్ద ప్రస్తావించగా.. తక్షణమే సిబ్బందికి తెలియజేసి, సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, జలుమూరు

## ముందే మేల్కొంటే మంచిది

కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ ప్రకాశ్‌నగర్ కాలనీ దుర్గమ్మ సన్నిధానం వీధిలో విద్యుత్తు స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. నివాసాల మధ్య పరిస్థితి ఇలా ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఈదురుగాలులకు స్తంభం కూలిపోయే అవకాశముందని చెబుతున్నారు. సరిచేయాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి ఏఈ కృష్ణ పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

## ప్రాణాలు పోతున్నా పట్టదా

నందిగాం మండలం సైలాడ పంచాయతీ రౌతుపురం గ్రామంలో రహదారి పక్కనే ఉన్న విద్యుత్తు నియంత్రికకు రక్షణ కంచె లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల రెండు దూడలు తీగలను తాకి మృతి చెందాయని చెబుతున్నారు. నౌగాం గ్రామం కొత్తవీధిలో రక్షణ కంచె లేని విద్యుత్తు నియంత్రికను తాకడంతో ఆవు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. రక్షణ కంచె ఏర్పాటు చేయిస్తామని విద్యుత్తు శాఖ ఏఈ నేతాజీ పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, నందిగాం

## నిబంధనలకు తూట్లు.. తప్పని పాట్లు

ఒడిశా నుంచి గ్రానైట్ తరలిస్తున్న భారీ వాహనాలు కొత్తూరు మీదుగా రాకపోకలు చేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి బరువుతో వెళ్తుండటంతో రహదారులు ఛిద్రమవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. కల్వర్టులు కూలిపోయే ప్రమాదముందని, తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ అమీర్ ఆలీ తెలిపారు. - న్యూస్‌టుడే, కొత్తూరు

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సూర్యనాయణపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, తెదేపా నాయకులు

పాతపట్నం, హిరమండలం, ఎల్ఎన్‌పేట, సారవకోట, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం పాతపట్నం మండలం సూర్యనారాయణపురం గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ❖ హిరమండలం పరిధి పెద్దగూడలో తెదేపా మండలాధ్యక్షుడు ఢిల్లేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు పర్యటించారు. ❖ ఎల్ఎన్‌పేట మండలం దబ్బపాడు, సుమంతాపురం గ్రామాల్లో పార్టీ మండలాధ్యక్షుడు మెండ మోహనరావు, వెలమల గోవిందరావు, జమ్మి మోహనరావు కార్యక్రమం నిర్వహించారు. ❖ సారవకోట మండలం బద్రి, లక్ష్మీపురం, అలుదు, కిన్నెరవాడ, కొత్తూరు గ్రామాల్లో పార్టీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

## చురుగ్గా సిరుసువాడ రహదారి నిర్మాణం

కొత్తూరు కూడలి నుంచి కొత్తకొత్తూరు, సిరుసువాడ, కుంటిభద్ర గ్రామాలను కలుపుతూ పీహెచ్ రహదారిని మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం రూ.1.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ పనులను ఇటీవల ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. వర్షాలకు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంపీటీసీ చెంగల దివ్య, సర్పంచి పోలినాయుడు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులకు ఆయన సూచనలు చేశారు. దీంతో పనులు పునఃప్రారంభమయ్యాయి - న్యూస్‌టుడే, కొత్తూరు

## పొలాలకు చేరని సాగునీరు

ఎన్బీసీ కాలువపై శిథిలమైన రెగ్యులేటర్ నిర్మాణం

నరసన్నపేట, న్యూస్‌టుడే: వంశధార ఎన్బీసీ కాలువపై జమ్ము సమీపంలో రెగ్యులేటర్ నిర్మాణం శిథిలమైంది. దీంతో కంబకాయ పరిధిలోని కోమటివాని చెరువుకు నీరు చేరడం లేదని మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి తెలిపారు. కాలువపై షట్టర్లు లేకపోగా, నిర్మాణాలు సైతం ధ్వంసమయ్యాయని, ఇప్పటి వరకు తాటిచెట్లు అడ్డుగా ఉంచి నీరు మళ్లించే వారిమని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంశధార అధికారులు సత్వరమే స్పందించాలని కోరుతున్నారు. దీనిపై వంశధార ఏఈ శ్యామ్ మాట్లాడుతూ. . చర్యలు తీసుకుంటామన్నారు.

## యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

ట్రాక్టరుతో తరలిస్తున్న దుంగలు

సారవకోట, న్యూస్‌టుడే: సెలవు రోజులు వచ్చాయంటే టేకు, ఇతర చెట్ల దుంగలు యథేచ్ఛగా కర్రల మిల్లులకు తరలిపోతున్నాయి. టేకు దుంగలను వ్యాన్‌లలో ఉంచి పరదాలు కప్పి తరలిస్తుండగా, మామిడి, నేరేడు వంటి దుంగలు ట్రాక్టర్లలో ఈ విధంగా తరలిస్తున్నారు. దుంగలు తరలించాలంటే రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి. ఎటువంటి పత్రాలు లేకుండానే దందా కొనసాగిస్తుండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. పచ్చదనం పెంచాలనే ఆలోచనతో ప్రభుత్వాలు ఒకవైపు విరివిగా మొక్కలు నాటిస్తుండగా, మరో వైపు అక్రమార్కులు చెట్లను నరికేస్తున్నారు. అధికారులు పట్టనట్లు వ్యవహరించడమే ఈ పరిస్థితికి కారణమని ఆరోపణలు వినవస్తున్నాయి. కొన్ని రకాల చెట్ల దుంగలు తరలించడానికి వీఆర్వో అనుమతి ఉంటే సరిపోతుందని, అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తే చర్యలు తీసుకుంటామని అటవీ అధికారి ఈశ్వరరావు తెలిపారు.

## పిడుగు పాటుతో అస్వస్థత

హిరమండలం: పాతకొమనాపల్లిలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు ఓ మహిళ అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన దువ్వ చినబాబు ఇంటిపై పిడుగు పడింది. పక్కనే ఉన్న బండి శిమ్మయ్య ఇల్లు సైతం దెబ్బ తింది. గృహోపకరణాలు మరమ్మతులకు గురయ్యాయి. అదే సమయంలో ఆరుబయట పనులు చేస్తున్న శిమ్మయ్య భార్య పిడుగు ధాటికి అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయారు. సకాలంలో వైద్యమందించడంతో తేరుకున్నారు.

## ఎదురు చూపులే మిగిలాయి

పోలాకి, న్యూస్‌టుడే: దీర్ఘాశిలో అంగన్వాడీ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయింది. సొంత భవనం వస్తుందని చిన్నారుల తల్లిదండ్రులు సంతోష పడ్డారు. కానీ ఇది ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు సైతం దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు. సమస్యపై సమగ్ర శిక్షా ఏఈ రమానంద్ మాట్లాడుతూ.. నిధులు మంజూరు కావాల్సి ఉందని, రాగానే నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు.

## రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

సారవకోట, న్యూస్‌టుడే: అంగూరు గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం సవరడ్డపనస గ్రామానికి చెందిన వెలమల రామారావు ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసన్నపేట నుంచి సారవకోట వైపు వస్తున్న లారీని చోదకుడు అంగూరు చెరువు వద్ద ఆపారు. అదే మార్గంలో వస్తున్న ఆటో లారీని వెనక వైపు నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో చోదకుడి పక్కన కూర్చున్న రామారావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని నరసన్నపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది రమేష్‌బాబు, గోవిందరావు తెలిపారు.

## మెమో 57 అమలు చేయాలి

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: కేంద్రం ఇచ్చిన మెమో 57ను ఏపీ ప్రభుత్వం అమలు చేయాలని డీఎస్సీ 2003 ఏపీ ఫాం శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయులు అంతా ఆదివారం గృహ దీక్ష చేసినట్లు తెలిపారు. 2003 ఉపాధ్యాయులకు న్యాయంగా రావాల్సిన పాత పింఛను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జులై 18న ఉమ్మడి జిల్లా కేంద్రాల వద్ద కుటుంబ సమేతంగా నిరసన దీక్షకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకుంటే విజయవాడలో దీక్షకు చేస్తామన్నారు.

## ఆలయ సమీపంలో కూల్చివేతలు

నరసన్నపేట, న్యూస్‌టుడే: పెద్దపేటలోని శక్తి ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో అర్చక నివాసాలను యంత్రాలతో కూల్చి వేయడంపై ఆర్ఎస్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. శతాబ్దన్నర కాలంగా అక్కడ ఉంటున్న అర్చకుడు ఇంటిని పునర్నిర్మిస్తుండగా, స్థానికంగా ఉంటున్న ఓ వ్యక్తి ఎవరూ లేని సమయంలో పొక్లెయిన్‌తో కూల్చి వేయడంపై ఆర్ఎస్ఎస్ ప్రతినిధి చింతు పాపారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు ఆధ్యాత్మిక వ్యవస్థకు మంచిది కాదని ఆయన మండిపడ్డారు. ఆలయ స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం తగదన్నారు. ఈ ఘటన నరసన్నపేట పట్టణంలో చర్చనీయాంశమైంది.

## రైతులకు ఉచితంగా మొక్కలు

సారవకోట, న్యూస్‌టుడే: వాతావరణ కాలుష్యాన్ని నివారించాలనే ఆలోచనతో ప్రేమతరు కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు పెంచాలని సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు పేర్కొన్నారు. సారవకోట సత్యసాయి మందిరంలో ఆదివారం జరిగిన కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది తమ సంస్థ ద్వారా 10 వేలు మొక్కలు నాటాలని నిర్ణయించామని, ఆసక్తి ఉన్న రైతులు జోనల్ కన్వీనర్లను సంప్రదిస్తే ఉచితంగా మొక్కలు అందిస్తామన్నారు. జిల్లా సేవాదల్ సమన్వయకర్త నాగేశ్వరరావు, ఆధ్యాత్మిక సమన్వయకర్త అనాథగుప్త, సీవోడీ బాధ్యుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దు

కొత్తూరు, న్యూస్‌టుడే: ఇళ్లకు విద్యుత్తు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు కోరారు. కొత్తూరులో ఆయన ఆదివారం మాట్లాడుతూ.. వీటి వల్ల వినియోగదారుడిపై భారం పడుతుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలని కోరారు. నాయకులు నిమ్మక అప్పన్న, మోహనరావు పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావు మృతి తీరని లోటు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: తెలుగు చలన చిత్ర పరిశ్రమకు కోట శ్రీనివాసరావు మృతి తీరని లోటని స్థానిక సుదర్శన్ థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ అన్నారు. విలక్షణ నటుడిగా విభిన్న పాత్రలు పోషించిన ఆయన ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోతారన్నారు. మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా నేతలు

## అభివృద్ధిపై చర్చకు సిద్ధం

టెక్కలి, న్యూస్‌టుడే: అభివృద్ధిపై నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వైకాపా నాయకులు ఎవరు చర్చకు వచ్చినా సిద్ధంగా ఉన్నామని తెదేపా టెక్కలి మండలాధ్యక్షుడు బగాది శేషగిరిరావు అన్నారు. ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం టెక్కలిలో నిర్వహించిన వైకాపా సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ కింజరాపు కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సమావేశంలో హనుమంతు రామకృష్ణ, రాము, లవకుమార్, జగదీశ్వరరావు, పురుషోత్తం, రామచంద్రుడు, ప్రీతిష్, కామేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

## యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ రమేష్ తెలిపారు. సదరు యువతి శనివారం మధ్యాహ్నం గ్రామంలోని ఓ దుకాణానికి శీతల పానీయం తెచ్చేందుకు వెళ్లి తిరిగి రాలేదని తండ్రి ఫిర్యాదు ఇచ్చినట్లు హెచ్‌సీ చెప్పారు.

## కదిలిన సిబ్బంది.. తీరిన ఇబ్బంది

స్పందనకు వందనం

నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడేవారు. వారి కష్టాలకు 'ఈనాడు' అక్షర రూపమిచ్చింది. పత్రికలో పలుమార్లు వీటి గురించి వార్తలు ప్రచురితమవడంతో యంత్రాంగం కదిలింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఎట్టకేలకు అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో ఆయా ప్రాంతాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### పాఠశాలకు బియ్యం సరఫరా

సారవకోట, న్యూస్‌టుడే: ధర్మలక్ష్మీపురం పాఠశాలకు అధికారులు మంచి బియ్యం సరఫరా చేశారు. విద్యాలయానికి అందించిన బియ్యంలో పురుగులు ఉండటంతో ఈనెల 6న 'పురుగుల బియ్యం.. తినేదెలా అన్నం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి, కొత్త బియ్యం అందించారు.

### ఎట్టకేలకు గొయ్యి పూడ్చారు

సారవకోట, న్యూస్‌టుడే: చీడిపూడి గ్రామ మార్కెట్ వీధి బీటీ రోడ్డుపై గొయ్యి ఏర్పడటంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడేవారు. ప్రమాదం జరగకుండా కొందరు గోతిలో రాళ్లు వేసి, పైన సంచి పెట్టారు. దీనిపై ఈనెల 12న 'ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా' శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో ర.భ.శాఖ ఏఈ సరోజ చర్యలు తీసుకున్నారు. గోతిలో రాళ్లు, కంకర వేయించి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు.

### తాగునీటి ఇక్కట్లు తీరాయి

నందిగాం, న్యూస్‌టుడే: పెద్దతామరాపల్లి రెల్లి వీధికి తాగునీరు అందజేసే చిన్న తరహా రక్షిత మంచినీటి పథకం మోటారు మరమ్మతులకు గురవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని స్థానికులు పేర్కొన్నారు. సమస్యపై ఇటీవల వార్త ప్రచురితమవడంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరేఖ మోటారు బాగుజేసి తాగునీరు అందజేశారు.

### పలక అమర్చారు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి-తెంబూరు రహదారిపై వంశధార అతిథిగృహం సమీపంలో మ్యాన్‌హోల్‌పై పాడైన పలకను సిబ్బంది తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. 'దారి కాచిన ప్రమాదం' శీర్షికతో గతనెల 21న వార్త ప్రచురితం కావడంతో గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏఈ మోహన్ స్పందించి, చర్యలు తీసుకున్నారు.

### చెత్తకుప్పల తొలగింపు

సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామంలో రహదారి పక్కన వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోవడంతో స్థానికులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. సమస్యను స్థానికులు 'ఈనాడు.. మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో పంచాయతీ కార్యదర్శి మధు స్పందించారు. పొక్లెయిన్‌తో చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ వేశారు. - న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

### విద్యుత్తు స్తంభాల ఏర్పాటు

హిరమండలం, న్యూస్‌టుడే: సుభలయ ఆర్ఆర్ కాలనీ రోడ్ నంబర్- 9లో అధికారులు అదనంగా విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేయించారు. స్తంభాలు దూరంగా ఉండటంతో తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉండేవి. ఇటీవల వచ్చిన కథనాలకు జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు స్పందించారు. ఏఈ వెంకటేశ్వరరావుకు సమస్యను తెలియజేయడంతో ఆదివారం స్తంభాలు వేయించారు.

## ట్రిపుల్ ఐటీకి ఎంపిక


రాజాన ఇంద్రజ


సవర పద్మశ్రీ

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: మెళియాపుట్టి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన రాజాన ఇంద్రజ, కేజీబీవీకి చెందిన సవర పద్మశ్రీ రెండో విడతలో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఇంద్రజ 569, పద్మశ్రీ 564 మార్కులు దక్కించుకున్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## బాలియాత్రను రాష్ట్ర పండగగా గుర్తించాలి

ఆలయ ప్రాంగణంలో బాలియాత్ర నిర్వాహణ కమిటీ సభ్యులు

జలుమూరు, న్యూస్‌టుడే: బాలియాత్రను రాష్ట్ర పండగగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరదామని బాలియాత్ర కార్యనిర్వాహక సభ్యుడు దువ్వాడ జీవితేశ్వరరావు అన్నారు. శ్రీముఖలింగేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కటక్‌లో కార్తిక పౌర్ణమి రోజు నుంచి వారం రోజుల పాటు ఈ యాత్ర జరుగుతుందని, అదే సమయంలో శ్రీముఖలింగంలో ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్క సభ్యుడు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు కరుకోల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు తర్ర బలరాం, న్యాయవాది చింతాడ వెంకటరావు పాల్గొన్నారు.

(c) eenadu

# శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

పొందూరు మండలం పిల్లలవలస ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా జరిగింది. ఏళ్ల తర్వాత కలుసుకున్న

## అపూర్వ కలయిక

వారంత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు బి.గొల్లవాడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

**మేమున్నాం.. మీకు తోడుగా** (10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? పట్టణానికి చేరుకునే ప్రధాన మలుపులు వద్ద ఎలాంటి బోర్డులు లేవు. -స్థానికులు

• తగు చర్యలు తీసుకుంటాం.

- బాలరాజు ఎస్సై, ఆమదాలవలస

? పాతినవీధిలోని మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయింది. – స్థానికులు.

• తొలగించేలా చూస్తాం. జాన్సన్, ఇన్‌ఛార్జి పుర కమిషనర్ –న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

## సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం

రణస్థలం, జి.సిగడాం, ఆమదాలవలస గ్రామీణం, గార (అంబటివానిపేట), న్యూస్‌టుడే : రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం రాత్రి రణస్థలం మండలం అర్జునవలస పంచాయతీ గిడిజాలపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ● తెదేపా జి.సిగడాం మండలాధ్యక్షుడిగా నియమితులైన కుమరాపు రవికుమార్, కుదిరిల్ల బుజ్జి, మండల నాయకులు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును వేర్వేరుగా కలిశారు. ●ఆమదాలవలస మండలం కలివరం పంచాయతీ పీర్‌సాహెబ్‌పేటలో తెదేపా నాయకుడు తిర్లంగి శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ● గార మండలం రామచంద్రాపురం పంచాయతీ గ్రామాల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యటించారు. ప్రభుత్వ పనితీరు, అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఇంటింటా గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సతివాడ పంచాయతీ యాళ్లపేట గ్రామాన్ని సందర్శించారు.

రణస్థలం: మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి

పీర్‌సాహెబ్‌పేటలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్, మహిళలు

రామచంద్రాపురంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

## జలాశయాలున్నా.. జలాలందవు

• నిరుపయోగంగా వెన్నెలవలస, గజిలగెడ్డ సాగునీటి వనరులు
• ఏటా అవస్థలు పడుతున్న రైతులు

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి

మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో జలాశయాలను నిర్మించారు. వాటిని నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారి పంటలకు చుక్క నీరైనా చేరడం లేదు. గత వైకాపా ప్రభుత్వంలో కనీసం వాటి నిర్వహణను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా జలాశయాల అభివృద్ధి చేపట్టి రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

అభివృద్ధికి దూరంగా సరుబుజ్జిలి మండలంలో వెన్నెలవలస జలాశయం

### గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో..

సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస జలాశయం వల్ల రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. సాగునీరు అందక ఏటా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ జలాశయాన్ని రూ.64 లక్షల ఐరోపా ఆర్థిక సహాయంతో 1987లో అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి కేతు కృష్ణమూర్తి శంకుస్థాపన చేశారు. 7 కి.మీ పొడవునా ఉన్న అటవీశాఖ ప్రాంతంలో కురిసిన వర్షాలకు వచ్చే నీటిని జలాశయానికి మళ్లించి 10 నుంచి 12 గ్రామాల రైతులకు సాగునీరు అందించాలన్నది ఈ పథకం ముఖ్య ఉద్దేశం. వెన్నెలవలస, శ్రీరామవలస కొండల మధ్య నాలుగు వందల మీటర్ల గట్టును నిర్మించి జలాశయానికి రెండువైపులా కాలువలు నిర్మించారు. 1991లో అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి దీనిని ప్రారంభించారు. అనంతరం వచ్చిన పాలకులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో జలాశయం మరుగునపడింది.

### షట్టర్లు తుప్పుపడుతున్నాయ్..

బూర్జ మండలం పెద్దపేట పంచాయతీ పరిధి బొమ్మిక వద్ద గజిలీగెడ్డ జలాశయ నిర్మాణం చేపట్టారు. దీని ద్వారా వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం. నాగులు పంచాయతీలో 12 గ్రామాలకు చెందిన రైతులకు ఈ జలాశయం ద్వారా సాగునీరు అందుతుంది. ప్రధాన ద్వారం వద్ద షట్టరు పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో నీరు దిగువకు వెళ్లిపోతోంది. దీంతో ఈ జలాశయం ఉన్నప్పటికీ రైతులు సాగునీరు అందించలేకపోతున్నారు. గత పాలకులు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ఉన్న షట్టర్లు తుప్పుపట్టిపోయాయి.

### ప్రతిపాదనలు పంపించాం..

సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఉన్న జలాశయాల అభివృద్ధి చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదిక అందించాం. నిధులు మంజూరైనా మరుక్షణమే పనులు చేపట్టి రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తాం.

--దాలయ్య, ఏఈ, నీటిపారుదల శాఖ

### తెరపై ఈనాడు

● కిన్నెర : ఓ భామా... అయ్యో రామా..! ● కీర్తన : జురాసిక్ వరల్డ్ రీబర్త్ ● కీర్తిక : 3బీహెచ్‌కే ● మారుతి : ది 100 ● సూర్యమహల్: కన్నప్ప ● ఎస్వీసీ (రామలక్ష్మణ): కుబేరా ● సన్‌మాక్స్: తమ్ముడు ● సరస్వతి : సూపర్‌మ్యాన్

–న్యూస్‌టుడే, పాతబస్టాండ్,

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత అధ్యాపక అతిథి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జె.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 50 శాతం మార్కులను దాటి ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. విశ్రాంత ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. * పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విభాగంలో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.ఇందిర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బి.టెక్ (ఈఈఈ) పూర్తిచేసి వారు అర్హులు. ఈ నెల 15వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు స్వీకరిస్తారు.

## తాకితే.. అంతే..!

శ్రీకాకుళం నగరం ఏడురోడ్ల కూడలి వద్ద పాత వంతెన, కలెక్టరేట్ సమీపంలో పొన్నాడ బ్రిడ్జిపై నగరపాలక సంస్థ ఇరువైపులా వీధి దీపాలు ఏర్పాటు చేసింది. వీటి కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు స్తంభం నుంచి బయటకు వచ్చి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. దీంతో పొరపాటున ఎవరైనా తాకితే షాక్‌కు కొట్టే ప్రమాదం ఉంది. నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు వివరణ కోరగా సమస్య పరిష్కరిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

## కూలేందుకు సిద్ధం!

జి.సిగడాం మండలం ఆనందపురం గ్రామంలో తాగునీటి పథకం కూలేందుకు సిద్ధంగా ఉంది. నీటి పథకం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దాన్ని తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదని చెబుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుసుమ వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

## అవస్థల దారి..

ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ ఈసర్లపేట గ్రామ రహదారి రాళ్లు తేలడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే రహదారి నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించారని, చిప్స్ వేసి వదిలేశారని, తారురోడ్డు నిర్మాణం చేపట్టలేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే గుత్తేదారుకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదేశించామని, పనులు వేగవంతం చేస్తున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ డీఈ చంద్రశేఖర్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

## ప్రజాధనం దుర్వినియోగం..!

ఆమదాలవలస ప్రజల సౌకర్యం కోసం స్వచ్ఛభారత్‌లో భాగంగా పట్టణంలో పలుచోట్ల సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. అందులో చాలావరకు వినియోగం లేక అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అవి పూర్తిగా నిరుపయోగంగా మారాయి. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని ప్రజా సంఘాల నాయకులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఈ సమస్యను ఇన్‌ఛార్జి పుర కమిషనర్ జాన్సన్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

## నిర్లక్ష్యం అల్లుకుంది..

పొందూరు మండలం తండ్యాం గ్రామ పంచాయతీ పరిధిలోని తండ్యాం నుంచి శ్రీరాంనగర్ కాలనీకు వెళ్లే దారిలో విద్యుత్తు స్తంభంపైకి పనికిరాని తీగలు అల్లుకుపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. దీంతో అటువైపు రాకపోకలు సాగించేవారు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పనికిరాని తీగలను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్తుశాఖ ఏఈ సుధీర్ వద్ద ప్రస్తావించగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

## 15న విశ్రాంత ఉద్యోగుల నిరసన

సర్వసభ్య సమావేశంలో చర్చిస్తున్న సంఘం సభ్యులు

పాతబస్టాండ్, పొందూరు గ్రామీణం న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.వి.ఎస్.కేశవరావు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో మాట్లాడారు. అఖిల భారత కేంద్ర, రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య సూచనలతో ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. పే కమిషన్, డీఆర్ బకాయిలు, ప్రభుత్వ రాయితీలు వంటి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు నిరసన చేపట్టనున్నామన్నారు. జిల్లా కేంద్రంలో 15న ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

## గుంతలతో చింత

శ్రీకాకుళం గ్రామీణ మండలం శిలగాం సింగువలస నుంచి లంకాం గ్రామానికి చేరుకునే రహదారిలో గుంతలతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వాహనదారులకు పలు ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీఐయూ ఏఈ మహంతిని వివరణ కోరగా మరమ్మతులు చేస్తామన్నారు.

–న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

## స్పందనకు వందనం

### ప్రమాదం తొలగింది..

గార మండలం వమరవల్లి, హుకుంపేట గ్రామాల మధ్య పంట పొలాల వద్ద విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దీనిపై 'ఈనాడు'లో ఈ నెల 1న 'చేతికి అందే ఎత్తులో ప్రమాదం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దానిపై ఏఈ కమల్‌హాసన్ స్పందించారు తీగల మధ్యలో స్తంభాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

– న్యూస్‌టుడే, గార

### విద్యుత్తు స్తంభాన్ని సరిచేశారు..

శ్రీకాకుళంరోడ్డు రైల్వేస్టేషన్ ఆవరణలో కొన్ని రోజులుగా విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉండటంపై ఈనాడులో ఈనెల 11న 'ఒరిగింది..ఎప్పుడైనా కూలొచ్చు' శీర్షిక వచ్చిన వార్తకు రైల్వే అధికారులు స్పందించారు. శనివారం స్తంభాన్ని సరిచేశారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

### సందడిగా ఆవేటి వారాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని కొయ్యాం, జాలరకొయ్యాం గ్రామాల్లో ఆదివారం అమ్మవార్ల ఆవేటి వారాలు ఘనంగా నిర్వహించారు. ఏటా ఖరీఫ్ పంటకాలం ప్రారంభ సమయంలో వరి నాట్లు వేసే ముందు వారం రోజులపాటు గ్రామంలో ఈ వేడుకలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నూకాలమ్మ, నీలమ్మ, పాతపట్నం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు.

### సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం

గార (శ్రీకూర్మం), న్యూస్‌టుడే: శిష్టకరణం సేవా సంఘం తరపున గ్రామ స్థాయిలో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని జిల్లా శిష్ట కరణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు అన్నారు. గార మండలం శ్రీకూర్మం వద్ద మండల శిష్టకరణ సేవా సంఘం కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం కార్యవర్గ సభ్యులతో పాటు విశ్రాంత జిల్లా విద్యాధికారి బలివాడ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పాత పింఛను విధానం అమలు చేయాలి

రణస్థలం, న్యూస్‌టుడే: పాత పింఛను విధానం అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు తమ ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలుపుతున్నారు. 2003 డీఎస్సీ ఫోరం పిలుపు మేరకు అప్పటి అభ్యర్థులు ఇంట్లోనే దీక్ష చేస్తున్నారు. ఈ నెల 18న ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసన తెలపడానికి కుటుంబాలతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

### పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం

పొందూరు గ్రామీణం: పొందూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా వండాన మురళి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సభ్యులుగా దుంపల సత్యం, కింజరాపు వెంకటరమణ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జనసేన అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ హాజరయ్యారు. తెదేపా మండలాధ్యక్షుడు సీహెచ్.రామ్మోహన్, పట్టణాధ్యక్షులు ఎ.శ్రీరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

### దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో ఫాజుల్‌బేగ్‌పేటలో ఛిందత్తనాథక్షేత్రంలో ఆదివారం అనఘా దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం, హోమం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. మాతృమండలి సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### వానలు కురవాలని శివుడికి అభిషేకం

బూర్జ, న్యూస్‌టుడే: మండలంలోని అన్నంపేటలో కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివలింగానికి భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయం పక్కనే చెరువులో నీటిని తెచ్చి ప్రత్యేక పూజల నంతరం అభిషేకం చేశారు. వానలు బాగా కురిసి పంటలు పండాలని ఏటా ఇలా పూజలు చేస్తామని పేర్కొన్నారు.

### రైతు సమస్యలను పరిష్కరిస్తాం

ఆమదాలవలస గ్రామీణం: ఆమదాలవలస మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న రైతుల సమస్యను పరిష్కరిస్తామని నూతనంగా ఎంపికైన ఛైర్మన్ మజ్జి శ్రీరాములునాయుడు అన్నారు. ఆదివారం ఆమదాలవలసలో ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తెదేపా నాయకులు నూక రాజు, తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని సుజాత, అన్నెపు భాస్కరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మంచి నటుడిని కోల్పోయాం

ఆమదాలవలస గ్రామీణం: విలక్షణ, విభిన్న పాత్రలు పోషించి మెప్పించిన నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికే తీరని లోటని ఆమదాలవలస అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి కె.వి.రాజారావు, మందలపల్లి రామకృష్ణ అన్నారు. ఆయన మృతికి ఆదివారం వారు సంతాపాన్ని తెలిపారు. తన నటన ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్రవేశారని పేర్కొన్నారు.

## కాలే వరకు కాంతులే

ఎచ్చెర్ల మండలం ఎచ్చెర్ల పంచాయతీ ఎస్సీ కాలనీ వీధిలో నెల రోజుల నుంచి దీపాలు నిరంతరం వెలుగుతునే ఉన్నాయి. దీంతో విద్యుత్తు వృథా అవుతుందని, సమస్యను మండల, పంచాయతీ అధికారులకు తెలియజేసినా పరిష్కారం కాలేదని కాలనీ వాసులు తెలియజేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రుప్ప విజయసాగర్ దృష్టికి న్యూస్‌టుడే తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

### పేద విద్యార్థికి ఆర్థిక సాయం

శ్రీకాకుళం సాంస్కృతికం: నగరానికి చెందిన పేద విద్యార్థిని పి.పూజిత చదువు నిమిత్తం అలియన్స్‌క్లబ్ అధ్యక్షుడు సూర్యప్రకాష్, కార్యవర్గం సభ్యులు రూ.16వేలు ఆర్థిక సాయం అందించారు.

### ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని విశ్రాంత ఇంజినీర్ల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పీఆర్ విశ్రాంత ఇంజినీర్లు, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. విశ్రాంత ఇంజినీర్ల ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించాలని కోరారు. 12వ పే కమిషన్‌ను నియమించాలని కోరారు.

## ఆగిన పనులు.. అవస్థల్లో ప్రజలు

పెద్దపాడు రోడ్డు విస్తరణ జరగక ఇక్కట్లు పడుతున్న వాహన చోదకులు

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

శ్రీకాకుళం నగరం నుంచి నరసన్నపేట వైపు వెళ్లే జాతీయ రహదారికి అనుసంధానంగా పెద్దపాడు రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. రామలక్ష్మణ కూడలి నుంచి పెద్దపాడు వరకు ఉన్న ఈ మార్గం ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలతో రద్దీతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. వాటిని దృష్టిలో పెట్టుకుని రథసప్తమి సందర్భంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ జనవరిలో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను ప్రారంభించింది. అందులో భాగంగా ఈ రహదారి విస్తరణ పనులు చేపట్టింది. పెద్దపాడులో ఇరువైపులా ఉన్న ఇళ్లు, దుకాణాలను మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా అధికారులు తొలగించారు. ర.భ.శాఖ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు రూ.60 లక్షలతో ఇరువైపులా సీసీ కాలువలను నిర్మించారు. రహదారి మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను నెల రోజుల కిందట రూ.30 లక్షలతో మార్పుచేశారు.

అసంపూర్తిగా పెద్దపాడు రహదారి

### ఆచరణకు నోచుకోని ప్రతిపాదనలు

రామలక్ష్మణ కూడలి నుంచి పెద్దపాడు వద్ద జాతీయ రహదారి వరకు ఈ మార్గాన్ని సుందరీకరించేందుకు నగరపాలక సంస్థ రూ.3.60 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రహదారి మధ్యలో విభాగిని నిర్మాణం, వాటి మధ్యలో విద్యుత్తు దీపాల ఏర్పాటు, మొక్కలు నాటేందుకు ప్రతిపాదనలు తయారు చేసింది. మూడు ప్యాకేజీలుగా చేపట్టే ఈ పనులకు సంబంధించి విభాగిని ఏర్పాటుకు ఇటీవల టెండర్లు పిలవగా గుత్తేదారులు ముందుకు రాలేదు. మరోసారి టెండర్లు పిలిచేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ పనులు చేపట్టిన అనంతరం ర.భ.శాఖ ఈ నిధులను సైతం సుడాకు చెల్లించాల్సి ఉంటుంది.

★ రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 15 ఏళ్ల కిందట రామలక్ష్మణ కూడలి నుంచి పెద్దపాడు జాతీయ రహదారి వరకు విస్తరణ పనులను అధికారులు చేపట్టారు. అప్పట్లో పెద్దపాడు వరకు కాలువలు, రహదారిని నిర్మించారు. పెద్దపాడు గ్రామస్థులు ఆ పనులను అడ్డుకున్నారు. రోజులు గడిచినా నగరపాలక అధికారులు ఆక్రమణల తొలగింపు చేపట్టకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఈ రహదారిలో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

**చర్యలు తీసుకుంటున్నాం..** ర.భ శాఖ నుంచి తిరిగి నిధులు నగరపాలక సంస్థకు రాబట్టే ప్రాతిపదికన ఇప్పటికే రూ.90 లక్షలతో ఇరువైపులా సీసీ కాలువల నిర్మాణం, విద్యుత్తు స్తంభాల మార్పిడి పనులు పూర్తి చేశాం. మరో రూ.3.60 కోట్లతో సుందరీకరణ పనులు సైతం పూర్తి చేసేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. సాధ్యమైనంత వేగంగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– పి.వి.వి.డి.ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్

### అలరించిన హరికథా గానం

శ్రీకాకుళం సాంస్కృతికం: నగరంలో బాపూజీ కళామందిరంలో సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి హరికథా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అనకాపల్లికి చెందిన తోట తులసి భాగవతారిణి హరికథా గానం జరిగింది. ఆమె శివపర్యటన కథాంశాన్ని కమనీయంగా గానం చేశారు. సుమిత్ర కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, మండవిల్లి రవి, కె.వేణుగోపాలరావు, యు.పూజలు భాగవతారిణిని సత్కరించారు.

భాగవతారిణిని సత్కరిస్తున్న సుమిత్ర కళాసమితి సభ్యులు

### 3 గ్రాముల బంగారం బహూకరణ

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో పాతశ్రీకాకుళంలో కాకివీధిలోని ఆలయంలో ముత్యాలమ్మ స్వర్ణకిరీటానికి నగరానికి చెందిన ఎస్ఎస్ఆర్ స్టోర్స్ యాజమాన్యం మూడు గ్రాముల బంగారం బహూకరించినట్లు ముత్యాలమ్మ ఆలయం నిర్వాహక ప్రతినిధులు ప్రకటలతో తెలిపారు. చింతపల్లి మురళీకృష్ణ కుటుంబీకులు రూ.1016లు అందజేశారు.

### విద్యార్థులకు ఆధ్యాత్మికతపై అవగాహన

ఆమదాలవలస గ్రామీణం: విద్యార్థి దశ నుంచి ఆధ్యాత్మికతపై అవగాహన ఉండాలని సత్యసాయి సేవా సమితుల విద్యాజ్యోతి ఇన్‌ఛార్జి ఎం.జనార్దనరావు అన్నారు. మండలంలోని అక్కులపేట పంచాయతీలో బాల వికాస్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

### బీసీ సంక్షేమశాఖ ఉద్యోగి హఠాన్మరణం

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న పొరుగు సేవల ఉద్యోగి ఎల్.రాంబాబు ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందారు. శ్రీకాకుళం బీసీ వసతి గృహం-2లో పనిచేస్తున్న ఈయనకు కొద్దిరోజుల కిందట జి.సిగాడంకు బదిలీ అయినట్లు సమాచారం.

### జూదరుల అరెస్టు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం: శ్రీకాకుళం నగరం పాలకొండ రోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం జూదం ఆడుతూ నలుగురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. వారి నుంచి రూ.9 వేల నగదు, చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు తెలిపారు.

## ఘనంగా చౌదరి సత్యనారాయణ జయంతి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని షేర్‌మహ్మద్‌పురం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, దివంగత మాజీ శాసనసభ్యుడు చౌదరి సత్యనారాయణ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కుశాలపురం సమీపంలోని సింహద్వారం వద్ద ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెదేపా పూర్వ జిల్లా పార్టీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్, జడ్పీ మాజీ అధ్యక్షురాలు చౌదరి ధనలక్ష్మి పాల్గొన్నారు.

(c) eenadu

దిల్లీలో లోక్‌సభ స్పీకర్ నేతృత్వంలోని రాజ్యాంగ క్లబ్‌కు జరిగిన నిర్వాహకుల ఎన్నికల్లో కార్యదర్శిగా (సాంస్కృతికం) ఎన్నికైన ఎంపీ తిరుచ్చి శివ ఆదివారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.
- న్యూస్‌టుడే, చెన్నై

## పర్యాటక కేంద్రంగా సెంజి వర్ధిల్లాలి

**కమల్‌హాసన్**

**చెన్నై, న్యూస్‌టుడే:** దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలు, విదేశీయులు వచ్చి చూసే పర్యాటక కేంద్రంగా సెంజి కోట వర్ధిల్లాలంటూ ఎంఎన్ఎం అధ్యక్షుడు, నటుడు కమల్‌హాసన్ ఆకాంక్షించారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... మనకు గర్వకారణమైన సెంజి కోటను 1921లో జాతీయ స్మృతి చిహ్నంగా ప్రకటించారని తెలిపారు. శతాబ్దకాలం తర్వాత ఇప్పుడు ప్రపంచ వారసత్వ చిహ్నంగా యునెస్కో గుర్తింపు పొందడం హర్షణీయమైన వార్తగా పేర్కొన్నారు. భారతదేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలు, విదేశీయులు వచ్చి చూసే పర్యాటక కేంద్రంగా సెంజి వర్ధిల్లాలంటూ ఆకాంక్షించారు.

**సైదాపేట:** సెంజి కోటను ప్రపంచ వారసత్వ ప్రదేశంగా యునెస్కో ప్రకటించటం సంతోషంగా ఉందని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ముమ్ముందు పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆకాంక్షించారు. ఆ ప్రకారం మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆగని పేలుళ్లు..
# పోతున్న ప్రాణాలు

- రాష్ట్రంలో ఆగని బాణసంచా ప్రమాదాలు
- ఇప్పటికే వందలాదిగా బాధిత కుటుంబాలు
- సరైన నిఘా, నియంత్రణ లేక తప్పిదాలు

విరుదునగర్ జిల్లా అరుప్పుకోట్టై సమీపంలో జరిగిన పేలుడు ధాటికి నేలమట్టమైన బాణసంచా పరిశ్రమ

**పొట్టకూటి కోసం బాణసంచా తయారీకి వెళితే.. అక్కడే ప్రాణాలు పోతున్నాయి. ప్రమాదమని తెలిసినా.. నాలుగు రూపాయలు వస్తాయన్న ఆశతో మృత్యు కుహరంలోకి పోయి బలవుతున్నారు. పేలుళ్ల ధాటికి కుటుంబ సభ్యులే గుర్తుపట్టలేనంతగా తునాతునకలవుతున్నారు. ప్రమాదాల తర్వాత చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో అంధకారం తప్ప మరేదీ మిగలడం లేదు. అయినా రాష్ట్రంలో అక్రమ బాణసంచా పరిశ్రమల విధ్వంసానికి అంతమే లేకుండా పోయింది. ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.**
**- ఈనాడు-చెన్నై**

బాణసంచా పేలుళ్లతో పెద్దఎత్తున వార్తల్లో నిలిచే జిల్లా విరుదునగర్. ఈ జిల్లాలోని శివకాశితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోనే పెద్దఎత్తున పరిశ్రమలు నడుస్తున్నాయి. గత కొన్నేళ్లలో భారీ పేలుళ్లు ఇక్కడ సంభవించాయి. ఒక్కో ప్రమాదంలో 5 నుంచి 15మంది లోపు చనిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకిచ్చిన గణాంకాల ప్రకారం.. 2019 నుంచి 2023 మధ్య 131 మంది చనిపోగా, 146 మంది గాయపడ్డారు. మరోపక్క 2023-2025 ఏప్రిల్ మధ్య 4 ప్రమాదాలు చోటుచేసుకోగా.. 44మంది మరణించగా, 10మంది గాయపడ్డారు. ఇవన్నీ విరుదునగర్ జిల్లాలోవే. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జరిగిన 5 పేలుడు ఘటనల్లో 19 మంది ప్రాణాలు కోల్పోగా, 18మంది గాయపడ్డారు. విరుదునగర్, తంజావూరు జిల్లాల్లో జరిగిన ఘటనలివి.

### పసిబిడ్డలను వదిలేసి..

జులై 1వ తేదీ ఉదయం 8.30గంటలు. విరుదునగర్ జిల్లా సాత్తూరు సమీపం చిన్న కమన్‌పట్టి బాణసంచా పరిశ్రమలో పెద్ద పేలుడు. 10మంది కార్మికులు మృత్యువాతపడ్డారు. మరికొందరు గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో ప్రాణాలొదిలిన కార్మికురాలు కె.లక్ష్మి (27)కి కె.కరుప్పన్ (4), కె.ఇనియశ్రీ (1) అనే ఇద్దరు పిల్లలున్నారు. పాలు తాగే వయసున్న బిడ్డను వదిలి మరీ పనికి వెళ్లేది. ప్రమాదం జరిగినరోజు అలా వెళ్లిన లక్ష్మి తిరిగి రాలేదు. పేలుడులో ప్రాణాలు పోయాయనే సమాచారమే ఇంటికొచ్చింది. భర్త ఎ.కుప్పుసామి (27) పిల్లలకు అన్నీ తానై చూసుకుంటున్నారు.

### శివకాశి సమీపంలోనే అధికం

బాణసంచా తయారీలో దేశంలోనే పేరుగాంచింది.. శివకాశి. విరుదునగర్ జిల్లాలోని ఈ ప్రాంతం దేశానికే బాణసంచా రాజధానిగా మారింది. ఇక్కడ ఏకంగా 1085 పరిశ్రమలున్నాయి. ఏటా రూ.6 వేలకోట్లకు తగ్గకుండా వ్యాపారం జరుగుతోంది. అయితే ఇక్కడ ప్రమాదాలూ ఎక్కువే. 2014 నుంచి 2025 ఏప్రిల్ మధ్య ఈ ఒక్క ప్రాంతంలోనే 236 ప్రమాదాలు చోటుచేసుకున్నట్లు సామాజిక కార్యకర్తలు సేకరించిన సమాచారం వెల్లడిస్తోంది. వీటిలో ఏకంగా 291 మంది చనిపోయినట్లు ఆధారాలు చూపుతున్నారు.

### పెద్దగా పట్టింపు లేదు

ప్రమాదంలో ప్రాణాలు పోతాయని తెలిసినా పొట్టకూటికోసం అక్కడి కార్మికులు పనికెళ్తున్నారు. ఏటా రూ.3 నుంచి రూ.4లక్షలు సంపాదిస్తారనే అంచనాలున్నాయి. వీరి ప్రాణాల్ని కాపాడాల్సిన బాణసంచా తయారీ సంస్థలు.. అది మరచి పేలుళ్లకు బలిస్తున్నాయి. సరైన అనుమతులు తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమలు పెట్టడం, భద్రత గాల్లోకి వదిలేయడం ఓ కారణమైతే.. పరిమితికి మించి సిబ్బందిని గదుల్లో ఉంచడం మరో అతిక్రమణ. పేలుడు జరిగినప్పుడు ఎక్కువమంది ప్రాణాలు కోల్పోయేందుకు ఇదే కారణం. 2024 అక్టోబరులో శివకాశి సమీపంలోని మంగులం గ్రామంలోని పరిశ్రమలో జరిగిన పేలుడులో 14మంది ప్రాణాలు విడిచారు. పోలీసుల దర్యాప్తులో అనుమతులులేకుండా రహస్యంగా పనులు చేయించారని తేలింది. ఇలా అతిక్రమణలు కొనసాగుతున్నా ప్రభుత్వం నుంచిగాని, నియంత్రణ సంస్థల నుంచి పెద్దగా స్పందనలేదు.

### న్యాయస్థానాలు ఆగ్రహం

బాణసంచా పరిశ్రమల్లో బయటపడుతున్న లోపాలపై మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం సైతం తీవ్రంగా స్పందించింది. పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రత సంస్థ (పెసో), రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని వ్యాఖ్యానించింది. నియంత్రణ సంస్థలు సరిగా పనిచేయడంలేదని చెప్పింది. లైసెన్సులపై పూర్తిస్థాయిలో జాగ్రత్త వహించాలని ఆదేశిస్తూ ప్రమాదాలకు మూలకారణాల్ని తెలుసుకుని, వాటిని నివారించాలని చెప్పింది. బాధితులకు పునరావాసం కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఎన్జీటీ సైతం ఆగ్రహించింది. ఇకమీదట ప్రమాదాలే ఉండకూడదని, నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమల్ని పూర్తిగా మూసేయాలని ఆదేశించింది. దీంతోపాటు క్షేత్రస్థాయి పరిశీలనకోసం న్యాయవ్యవస్థలోని నిపుణులతో రెండు బృందాల్ని నియమించింది.

విరుదునగర్ జిల్లా సాత్తూరు సమీపంలోని పరిశ్రమలో పేలుడు తర్వాత సహాయక చర్యలు చేపడుతున్న దృశ్యం

## రద్దయిన పథకాలను పునఃప్రారంభిస్తాం

ప్రసంగిస్తున్న పళనిసామి

**వేళచ్చేరి, న్యూస్‌టుడే:** అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలను డీఎంకే ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిని అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పడగానే తిరిగి అమలు చేస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎళప్పాడి పళనిసామి పేర్కొన్నారు. కడలూర్ జిల్లాలో శనివారం రాత్రి జరిగిన ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కడలూర్ ఉత్తర నియోజకవర్గంలోని పలుప్రాంతాల్లో రోడ్ షో నిర్వహించారు. అనంతరం సీమాట్టి సిల్క్స్ సిగ్నల్ వద్ద ప్రసంగిస్తూ.. వచ్చే ఎన్నికల్లో ఓట్లు పొందడానికి స్టాలిన్ ఇప్పటినుంచే జనరంజక పథకాలను ప్రకటిస్తున్నారని, మహిళా హక్కు పథకాన్ని అమలు చేయడానికి నిధుల్లేక రూ.4.38 వేల కోట్లు అప్పు తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.లక్ష కోట్ల అప్పు చేయాలనుకుంటున్నారని ఆరోపించారు.

### జులై 24 నుంచి రెండో విడత పర్యటన

**సైదాపేట:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోమ్' పేరుతో ఎన్నికల ప్రచార పర్యటనకు శ్రీకారం చుట్టారు. మొదటి విడత పర్యటన ఈ నెల 7న కోయంబత్తూరు మేట్టుపాళయంలో ప్రారంభించారు. 21వ తేదీ ఈ పర్యటన ముగియనుంది. ఈ నేపథ్యంలో జులై 24 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు రెండో విడత పర్యటన చేపట్టనున్నట్లు అన్నాడీఎంకే అధిష్ఠానం తెలిపింది. పుదుకోట్టై జిల్లా గంధర్వకోటలో పర్యటన ప్రారంభమై విరుదునగర్‌లో ముగియనున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది.

## మూడేళ్లలో 155 ఉపగ్రహాల ప్రయోగం

**ఇస్రో ఛైర్మన్ నారాయణన్**

**ప్యారిస్, న్యూస్‌టుడే:** మూడేళ్లలో 155 ఉపగ్రహాలను ప్రయోగించనున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. కన్నియాకుమరి జిల్లా కులశేఖరంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... 1984లో భారతీయుడైన రాకేష్ శర్మ రష్యా నుంచి అంతరిక్షానికి వెళ్లడంతో మనకు ఎన్నో ప్రయోజనాలు చేకూరినట్లు తెలిపారు. ప్రస్తుతం శుభాంశు శుక్లాను అమెరికా నుంచి స్పేస్ సెంటర్‌కి పంపామని, ఆయన తిరిగివచ్చిన తర్వాత అనుభవాలు మనకు ఎంతగానో సహాయపడతాయని చెప్పారు. 2024 నాటికి చంద్రునిపైకి భారతీయులను పంపేందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయన్నారు. ముందుగా ఆయన కళాశాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. 2035 నాటికి అంతరిక్షంలో మనకు సొంతంగా స్పేస్ సెంటర్‌ని ఏర్పాటు చేస్తారని తెలిపారు. అదేవిధంగా 2040 నాటికి భారతీయులను మన రాకెట్ ద్వారా చంద్రునిపైకి పంపి, తిరిగి తీసుకురావాలని ప్రధాని చెప్పారని, అందుకుగాను 40 అడుగుల ఎత్తైన రాకెట్ తయారీ పనులు జరుగుతున్నాయన్నారు. 2600 టన్నుల బరువున్న ఆ రాకెట్ 75వేల కిలోల బరువుని మోసుకెళ్తుందని చెప్పారు. రాబోయే మూడేళ్లలో 155 ఉపగ్రహాలను ప్రయోగించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

## పుదుచ్చేరి ప్రపంచ సుందరి ఆత్మహత్య

శాన్ రేచల్ (పాతచిత్రం)

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** పుదుచ్చేరికి చెందిన ప్రపంచ సుందరి శాన్ రేచల్ అధిక మోతాదులో మాత్రలు వేసుకొని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు... పుదుచ్చేరి కారామణికుప్పంకు చెందిన శంకరప్రియ అలియాస్ శాన్ రేచల్ (25) చిన్నతనంలోనే క్యాన్సర్ కారణంగా తల్లిని కోల్పోయింది. నల్లగా ఉండటంతో చాలామంది ఆమెను దూరం పెట్టారు. చర్మం రంగుతో సంబంధం లేకుండా తన ప్రతిభతో మోడలింగ్ రంగంలో రాణించారు. 2020-21లో మిస్ పాండిచ్చేరి, 2019లో మిస్ డార్క్ క్వీన్ తమిళనాడు, అదే ఏడాదిలో మిస్ బెస్ట్ యాటిట్యూడ్ తదితర పలు టైటిల్స్‌ని గెలుపొందారు. బ్లాక్ బ్యూటీ విభాగంలో మిస్ వరల్డ్ టైటిల్‌ని కూడా గెలుచుకున్నారు. గత కొన్ని రోజులుగా కిడ్నీ సమస్యతో జిప్మర్‌లో చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం తన నివాసంలో అధిక మోతాదులో రక్తపోటు మాత్రలు తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఫ్యాషన్ షో సహా పలు కార్యక్రమాలు నిర్వహించడం వల్ల కలిగిన నష్టాల కారణంగా ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. పుదుచ్చేరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## రాష్ట్రంలో కమలం వికసించాలి : నయినార్ నాగేంద్రన్

**సైదాపేట, న్యూస్‌టుడే:** తమిళనాడులో కమలం వికసించేందుకు అవసరమైన పనులు చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ నిర్వాహకులకు సూచించారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఆయన తన 'ఎక్స్' పేజీలో.. బూత్ కమిటీలను బలోపేతం చేసే పనుల్లో ఉన్న నిర్వాహకులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అంకితభావంతో ధార్మిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న అందరికీ తన నమస్కారాలు తెలుపుకుంటున్నాని పేర్కొన్నారు. తమిళనాడు అభివృద్ధిని అడ్డుకుంటున్న కలుపుమొక్క అయిన డీఎంకేను గద్దె దించడమే మన లక్ష్యమన్నారు. అలాగే రాష్ట్ర నలుమూలలా భాజపా వేర్లను బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

## అన్నాడీఎంకే కూటమికి డిపాజిట్లు దక్కవు : ఉదయనిధి

మహిళా బృందాలతో ఉదయనిధి స్టాలిన్

**తిరువణ్ణామలై, న్యూస్‌టుడే:** రానున్న శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమికి డిపాజిట్లు కూడా దక్కవని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఎద్దేవా చేశారు. తిరువణ్ణామలైలో ఆదివారం జరిగిన పోలింగ్ కేంద్రాల ఏజెంట్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ.. కొన్ని పార్టీల్లో ఇంకా బూత్ ఏజెంట్లు లేరన్నారు. అయితే బూత్ ఏజెంట్ల శిక్షణ సభను డీఎంకే మహానాడులా నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ఇంటింటికీ చేరవేయాలన్నారు. మహిళా హక్కు పథకాన్ని దేశమంతా తిరిగి చూస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి ఈవీ వేలు, డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి తదితరులు పాల్గొన్నారు. తర్వాత ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ స్థానిక మహిళా బృందాలతో సమావేశమయ్యారు.

# ఎగిసిపడిన మంటలు..
# అదిరిపడిన స్థానికులు

- ముడిచమురు తీసుకెళ్తున్న గూడ్సు రైలులో అగ్నిప్రమాదం
- తిరువళ్లూరు స్టేషన్ సమీపంలో ఘటన
- ఆ మార్గంగా నిలిచిన రైళ్ల రాకపోకలు
- ప్రమాదంపై దక్షిణ రైల్వే ప్రకటన

మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది

**వడపళని, న్యూస్‌టుడే:** చెన్నై హార్బరు నుంచి వాలాజా రోడ్ సైడింగ్‌కు డీజిల్ లోడుతో ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు వెళ్తున్న గూడ్సు రైలులోని కొన్ని వ్యాగన్లు తిరువళ్లూరు రైల్వే స్టేషను దాటి వెళ్తుండగా మంటల్లో చిక్కుకున్నాయి. దీనిపై దక్షిణ రైల్వే ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తీసుకుంటున్న చర్యలను వివరించింది. కొన్ని వ్యాగన్లు (ఇంజిన్ నుంచి మూడోది) పట్టాలు తప్పాయని, మూడో వ్యాగనులో మంటలు రావడాన్ని గమనించిన లోకోపైలట్ అత్యవసర బ్రేకులు ప్రయోగించారని, సంఘటన గురించి తెలుసుకున్న తిరువళ్లూరు స్టేషను మాస్టరు ముందు జాగ్రత్త చర్యగా ఓవర్‌హెడ్ నుంచి వచ్చే విద్యుత్తు సరఫరాను నిలిపేశారని పేర్కొంది. రైలును ఆపే సమయానికి మంటలు 19వ వ్యాగను వరకు వ్యాపించాయని, ఈ కారణంగా చెన్నై నుంచి బెంగళూరు, కేరళ, రేణిగుంట, తిరుపతితో పాటు ఆ మార్గంగా పయనించే పలు రైళ్లను రద్దు చేశామని, మరికొన్నింటిని దారి మళ్లించినట్లు వివరించింది.

ఇళ్లలోని వస్తువులు బయటకు తీసుకెళ్తున్న స్థానికులకు సాయపడుతున్న మంత్రి నాజర్

### పునరుద్ధరణ చర్యల పర్యవేక్షణ

జిల్లా యంత్రాంగం, ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక విభాగం చేపడుతున్న పునరుద్ధరణ కార్యకలాపాలను దక్షిణ రైల్వే సీనియర్ అధికారులతో పాటు జనరల్ మేనేజరు, డివిజనల్ రైల్వే మేనేజర్ తదితరులు పర్యవేక్షిస్తున్నారని తెలిపింది. ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదని, చెన్నై, దాని సమీపంలోని స్టేషన్లకు చేరుకోవాల్సిన ప్రయాణికులకు ఎంటీసీ బస్సులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. గూడ్సు రైలు నుంచి 30 వ్యాగన్లు, లోకోమోటివ్‌ను ప్రమాద స్థలం నుంచి సురక్షితంగా వేరు చేశామని, ప్రమాదంలో 18 వ్యాగన్లు పూర్తిగా కాలిపోయాయని చెప్పింది. చెన్నై నుంచి బెంగళూరు, జోలార్‌పేట్టై మీదుగా మంగుళూరుకు వెళ్లే డౌన్ లైన్ ఆదివారం మధ్యాహ్నం 3.15 గంటలకు తాత్కాలికంగా ట్రాఫిక్ కోసం పునరుద్ధరించనున్నట్లు పేర్కొంది. వీలైనంత త్వరగా రైళ్ల సేవలను పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించింది.

### లోకోపైలట్ వద్ద దర్యాప్తు

దక్షిణ రైల్వే చెన్నై జోన్ మేనేజర్ విశ్వనాథ్ బి.ఈర్య, ఆర్పీఎఫ్ ఐజీలు రామకృష్ణన్, బాబు, ఎస్పీలు ఈశ్వరన్ ప్రమాద స్థలానికి చేరుకుని లోకోపైలట్లు ఇద్దరి వద్ద దర్యాప్తు చేపట్టారు. కుట్ర కోణం ఏదైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగింది. ప్రమాదంలో ధ్వంసమైన విద్యుత్తు స్తంభాలు, తీగలు, ఇతర పరికరాలను బాగుచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

### క్షీణించిన గాలి నాణ్యత

ప్రమాదం కారణంగా తిరువళ్లూరు పట్టణ ప్రాంతంలో గాలి నాణ్యత క్షీణించింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు పట్టణాన్ని వీడి సమీపంలోని బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. మంటలు తమ ప్రాంతానికి వ్యాపిస్తాయేమోనన్న భయంతో రైల్వేస్టేషన్ సమీపంలోని మనవాళనగర్ వాసులు ఆందోళన చెందారు.

### ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులు

**అరక్కోణం:** చెన్నై నుంచి తిరువళ్లూరు, అరక్కోణం రైల్వేస్టేషన్ల మీదుగా వెళ్లాల్సిన పలు రైళ్లను రద్దు చేశారు. కేరళ, బెంగళూరు నుంచి తిరువళ్లూరు మార్గంగా చెన్నై చేరుకోవాల్సిన రైళ్లు కాట్పాడి, అరక్కోణం స్టేషన్లలో నిలిచిపోయాయి. అరక్కోణం నుంచి తిరువళ్లూరు, పెరంబూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఆదివారం తెల్లవారుజామున అరక్కోణం స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో చెన్నై మార్గంగా వెళ్లే ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు కిక్కిరిశాయి.

**సైదాపేట:** ప్రమాదం గురించి ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి రైల్వే శాఖ మంత్రిని డిమాండ్ చేశారు.

మంటలు అంటుకోని వ్యాగన్లను వెనక్కు నెడుతున్న స్థానికులు

## ముఖ్యమంత్రిగా మీరెందుకు?

**స్టాలిన్‌కు విజయ్ సూటిప్రశ్న ◆ బాధిత కుటుంబాలను క్షమాపణ కోరాలని డిమాండ్**

**చెన్నై, న్యూస్‌టుడే:** అన్ని నేరఘటనలు కోర్టు జోక్యంతో పరిష్కారమైతే ఇక ముఖ్యమంత్రిగా మీరెందుకంటూ స్టాలిన్‌కు టీవీకే అధ్యక్షుడు విజయ్ సూటిప్రశ్న వేశారు. లాకప్ మరణాల బాధితుల కుటుంబాలను క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. శివగంగై జిల్లా తిరుభువనం ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్ లాకప్ మరణానికి న్యాయం కోరుతూ శివానంద రోడ్డులో టీవీకే ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఆందోళన జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన పార్టీ అధ్యక్షుడు విజయ్ నల్లని దుస్తులు ధరించి ఆందోళనకు వచ్చారు. రాజకీయ పార్టీ ప్రారంభించిన తర్వాత తొలిసారిగా ఆయన ఆందోళనలో పాల్గొనడం గమనార్హం. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వంలో పోలీసుశాఖ కారణంగా 24 మంది మరణించారన్నారు. అజిత్‌కుమార్ కుటుంబాన్ని మినహాయించి మిగతా లాకప్ మరణాల బాధితుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ఎందుకు క్షమాపణ కోరలేదని, ఎందుకు నష్టపరిహారం చెల్లించలేదని ప్రశ్నించారు. వారందరినీ ఆయన క్షమాపణ కోరుతారా? అని ప్రశ్నించారు. డీఎంకే ప్రభుత్వం మోడల్ సర్కార్ నుంచి ఇప్పుడు 'సారీ-మా మోడల్ సర్కార్'గా మారిందని విమర్శించారు. అన్నాడీఎంకే హయాంలో లాకప్ మరణాల కేసును సీబీఐకి మార్చడం గౌరవ సమస్యగా పేర్కొన్న నాటి ప్రతిపక్షనేత స్టాలిన్ నేడు మాత్రం ఎందుకు సీబీఐకి మార్చారో సమాధానం ఇవ్వగలరా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరిగే అన్ని నేర ఘటనలకు కోర్టు జోక్యంతోనే పరిష్కారం లభించేలా ఉంటే ఇక ముఖ్యమంత్రిగా స్టాలిన్ ఎందుకని, ఆయన ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. డీఎంకే ప్రభుత్వ హయాం ముగిసేలోపు రాష్ట్రంలో శాంతిభద్రతలను చక్కదిద్దాలని, లేకుంటే ప్రజలతో కలిసి చక్కదిద్దేలా చేస్తామని హెచ్చరించారు. ఆర్.ఎస్.ఎస్, భాజపాలకు పావుగా సీబీఐ ఉందని ఆరోపించారు. ఆందోళనలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సి ఆనంద్, ఎన్నికల వ్యవహారాల విభాగం ప్రధానకార్యదర్శి ఆదవ్ అర్జున తదితరులు పాల్గొన్నారు. ఆందోళన సందర్భంగా ముందు జాగ్రత్త చర్యలుగా సుమారు 100 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.

వేదికపై ప్లకార్డులతో విజయ్ తదితరులు ◆ ఆందోళనలో పాల్గొన్న కార్యకర్తలు

స్పృహకోల్పోయిన కార్యకర్తలను అంబులెన్స్ వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం

### కార్యకర్తల అరెస్టు

టీవీకే ఆందోళనలో చెన్నైకు చెందిన ఆ పార్టీ కార్యకర్తలు మాత్రమే పాల్గొనాలని తదితర 16 ఆంక్షలను పోలీసుశాఖ ఆంక్షలు విధించింది. ఆ మేరకు ఇతర జిల్లాల నుంచి నగరానికి వచ్చిన టీవీకే కార్యకర్తలను అరెస్టు చేసింది. దీనికి నిరసనగా సిమ్సన్ వద్ద టీవీకే కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు.

## ఏడుగురు రాష్ట్ర జాలర్ల అరెస్టు

**చెన్నై, న్యూస్‌టుడే:** సముద్రంలో సరిహద్దులు దాటారన్న అభియోగంపై రాష్ట్రానికి చెందిన ఏడుగురు జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి చేపలు పట్టేందుకు 456 మరబోట్లలో జాలర్లు శనివారం సముద్రంలోకి వెళ్లారు. నెడుతీవు సమీపాన వలలు వేసి ఉండగా ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు శ్రీలంక నావికాదళానికి చెందిన గస్తీ నౌక అక్కడకు చేరుకుంది. దీంతో జాలర్లు అక్కడి నుంచి బయలుదేరారు. తంగచ్చిమడానికి చెందిన ఐజక్ పాల్ అనే వ్యక్తికి చెందిన మరబోటును నావికాదళం బోటు అడ్డుకుంది. సముద్రంలో సరిహద్దులు దాటారన్న అభియోగంపై ఫిషింగ్ బోటులోని షణ్ముగం, డుతర్, ఎడిషన్, శక్తివేల్, జగదీశ్, డల్విన్‌రాజ్, అన్బళగన్‌లను అరెస్టు చేసి వెంట తీసుకెళ్లింది.

### బోటు ధ్వంసం

కచ్చతీవు వద్ద శీరోన్ అనే వ్యక్తికి చెందిన బోటులో జాలర్లు సముద్రంలో చేపలు పడుతూ అటుగా శ్రీలంక నావికాదళం గస్తీ నౌక రావడాన్ని చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. వారిని గస్తీ నౌక అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అది ఢీకొట్టి జాలర్ల బోటు ధ్వంసమైంది. సముద్రపు నీరు బోటులోకి వస్తుండటంతో అతికష్టంపై బోటు సహా అందులోని స్టాలిన్, మునీశ్వరన్, లియాకులం, కొలంబస్, నాగేశ్, స్టీఫెన్, శరత్‌కుమార్ రామేశ్వరం ఫిషింగ్ హార్బరుకు చేరుకున్నారు.

## సముద్రంలో బోటు బోల్తా : 14 మంది సురక్షితం

**చెన్నై, న్యూస్‌టుడే:** దక్షిణ శ్రీలంకకు చెందిన 12 మంది పర్యాటకులు సహా 14 మంది ప్రైవేటు బోటులో నెడుతీవుకు బయలుదేరారు. బోటులో ఏర్పడిన సాంకేతిక లోపంతో అది సముద్రంలో మునగడం ప్రారంభించింది. దీంతో ఆందోళన చెందిన పర్యాటకులు, బోటు సిబ్బంది సహాయం కోసం ఎదురుచూశారు. అదే సమయంలో అటుగా నెడుతీవుకు చెందిన శబరీశ్ అనే వ్యక్తి ప్రైవేటు బోటు రావడాన్ని గమనించి తెల్ల జెండా ఊపారు. దీంతో అప్రమత్తమైన ఆ బోటులోని సిబ్బంది అక్కడకు చేరుకుని మునుగుతున్న బోటులోని 14 మందిని సురక్షితంగా తమ బోటులోకి తీసుకొచ్చారు. తర్వాత కొద్దిసేపటికి పర్యాటకులు వచ్చిన బోటు పూర్తిగా సముద్రంలో మునిగిపోయింది.

(c) eenadu

చెన్నైలోని ఐటీసీ గ్రాండ్ చోళ హోటల్‌లో శనివారం రాత్రి జరిగిన 'గుడ్ డీడ్స్ కప్ 2.0' ప్రారంభోత్సవ కార్యక్రమంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి, ఆయన సతీమణి లక్ష్మి పాల్గొని వల్లమై ట్రస్ట్, ట్రాన్స్‌జెండర్ మయూర గణేశన్‌కు స్కాలర్‌షిప్ గ్రాంట్స్‌ను అందజేశారు. - న్యూస్‌టుడే, చెన్నై

# ప్రభావం చూపని నాన్ ముదల్వన్ పథకం

- పేలవంగా నియామకాలు
- శిక్షణ కోర్సులకు తగ్గిన అభ్యర్థులు

- న్యూస్‌టుడే, వడపళని

తమిళనాడు ప్రభుత్వం స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి అందరికీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 'నాన్ ముదల్వన్' పథకాన్ని ప్రారంభించింది. అయితే దీనికి మిశ్రమ ఫలితాలు కనిపిస్తున్నాయి. శిక్షణానంతరం నియామకాలు కూడా పేలవంగా ఉంటున్నాయి. లాజిస్టిక్స్, హెల్త్‌కేర్, టెలికం రంగాలు మినహా ఇతర శిక్షణ కోర్సులకు దరఖాస్తుల సంఖ్య తక్కువగానే ఉంది. ప్రభుత్వం అందిస్తున్న పలు రకాల కోర్సుల్లో శిక్షణ అందుకున్న వారి సంఖ్య 2023లో 1.35 లక్షలు, 2024లో 36వేలు, 2025లో ఇప్పటివరకు 11వేల మందిగానే ఉంది.

లబ్ధిదారులతో ముఖ్యమంత్రి స్టాలిన్ (పాతచిత్రం)

## బ్లూ కాలర్ ఉద్యోగాలు

పరిశ్రమల్లో బ్లూ కాలర్ వంటి ఉద్యోగాల్లో చేరడానికి ఒకటి నుంచి ఆరు నెలల వరకు శిక్షణ అందిస్తారు. అయితే 2025లో శిక్షణ కోసం చేరిన వారిలో 60 శాతం మంది యూజీ, పీజీ చదివిన వారే. బ్యూటీ, వెల్‌నెస్, టైలరింగ్, రబ్బరు పనులలో శిక్షణ పొందిన వారికి అవకాశాలు తక్కువగా ఉంటున్నందున లాజిస్టిక్స్ అంశాన్ని ఎంచుకుని శిక్షణ పొందిన వారిలో 90 శాతం మందికి ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్లు, డ్రైవర్లు, గిగ్ వర్కర్లుగా అవకాశాలు లభించాయి. జెరియాట్రిక్ కేర్‌లో మంచి శిక్షణే పొందిన వారున్నారు. 2023లో ఏరోస్పేస్, ఏవియేషన్, టెక్స్‌టైల్స్ వంటి రంగాలలో వెయ్యిమంది వరకు శిక్షణ పొందినప్పటికీ అవకాశాలు మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో రాలేదు. బ్యూటీ, వెల్‌నెస్‌లో 1,776 మంది శిక్షణ పొందితే కేవలం 67 మంది మాత్రమే ఉపాధిని పొందగలిగారు.

## పలు కోర్సుల తొలగింపు

పేర్ల నమోదు, నియామకాలు తక్కువగా ఉండటంతో ప్రభుత్వం 2024 బ్యాచ్‌లో రత్నాలు, ఆభరణాల తయారీ, పెయింట్, పూత, బ్యాంకింగ్ ఆర్థిక సేవలకు సంబంధించిన కోర్సులను తొలగించింది. విద్యుత్తు, హస్తకళలు, కార్పెట్ తయారీ వంటి రంగాల్లో 30శాతం కన్నా తక్కువ నియామకాలున్నాయి. మేనేజ్‌మెంట్ విభాగంలో 1,948 మంది శిక్షణ పొందగా కేవలం ముగ్గురు మాత్రమే నియామకాలు అందుకోగలిగారు. ఈ క్రమంలో జులై 9వ తేదీ నాటికి 5వేల మంది యాక్టివ్ విద్యార్థులలో వెయ్యిమంది మాత్రమే కోర్సులకు హాజరయ్యారు. పేర్లు నమోదు చేసుకున్న వారు సరిగా శిక్షణకు రాలేదని తెలుస్తోంది.

## మొదటి ఏడాది బాగానే..

2022 మార్చి 1వ తేదీన ప్రారంభించిన 'నాన్ ముదల్వన్' పథకానికి మొదటి సంవత్సరం మంచి స్పందన కనిపించిందని నాన్ ముదల్వన్ విభాగ సీఈఓ ఎం.జయప్రకాశం పేర్కొన్నారు. వారికి ప్రభుత్వం నుంచి శిక్షణ కోసం నిధులు కూడా అందాయని, కానీ మౌలిక సదుపాయాలు లేవన్నారు.

## వివిధ రంగాల్లో లభించిన ఉద్యోగాల వివరాలు

- 2023... లాజిస్టిక్స్‌లో 60,429 మంది శిక్షణ పొందగా 53,233 మందికి, హెల్త్‌కేర్‌లో 15,602కిగాను 8,386, బ్యూటీ అండ్ వెల్‌నెస్‌లో 1,776కి 67, ఏరోస్పేస్ అండ్ ఏవియేషన్‌లో 38 మందికి సున్నా, టెక్స్‌టైల్ అండ్ హ్యాండ్‌లూమ్‌లో 524కి సున్నా ఉద్యోగాలు లభించాయి.
- 2024... లాజిస్టిక్స్‌లో 1575కి 882, టెలికాం 1,109కి 682, కేపిటల్ గూడ్స్, మాన్యుఫ్యాక్చరింగ్ 4,484కి 357, మేనేజ్‌మెంట్ 1,948కి 3, పవర్ 66కి ఏమీ లేదు.

**2025 జూన్ 9 వరకు దరఖాస్తులు ఇలా..**

మొత్తం దరఖాస్తులు 1,02,775. మొత్తం బ్యాచ్‌లు 857. మొత్తం శిక్షణలో భాగస్వాములు 505మంది. అందులో పురుషులు 41,991, మహిళలు 60,251, ఇతరులు 513 మంది.

- ఐటీ, ఐటీఈఎస్ 27,307, అప్పారెల్ 13,539, కేపిటల్ గూడ్స్ 8,777 మంది.
- అర్హతలు.. 12వ తరగతి 17,917 మంది, డిగ్రీ చదివినవారు 51,431 మంది, పీజీ చదివినవారు 11,755 మంది దరఖాస్తులు చేసుకున్నారు.
- జిల్లాల వారీగా... చెన్నై 30వేలు, మదురై 7 వేలు, కృష్ణగిరి 5 వేలు, తిరుచ్చి 5 వేలు, సేలం 4 వేల మంది.

## తక్కువ వేతనాలు

తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ... సంస్థలు సరైన నియామకాలు చేపట్టకుంటే అలాంటి సంస్థలకు చెల్లించే 40 శాతం చెల్లింపులను నిలిపేస్తామన్నారు. కొన్ని సందర్భాలలో వేతనాలు తక్కువగా ఉండటం లేదా దూరంగా ఉండటం వలన అభ్యర్థులకు అవకాశాలు రాకుండా పోతున్నాయని తెలిపారు.

కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

## వైభవంగా కుంభాభిషేకం

**షోళింగర్, న్యూస్‌టుడే:** రాణిపేట జిల్లా షోళింగర్ కోనేరు వద్ద ఉన్న పురాతన కమల వినాయకర్ ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా యాగశాల పూజలు జరిపారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, దీపారాధనలు చేశారు. చివరగా పవిత్ర జలాలున్న కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ గోపుర కలశాలపై అభిషేకించారు. మూలవర్లకు వెండి, బంగారు కవచాలు తొడిగారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బంగారు కవచంలో కమల వినాయకుడు

## చిరుతల సంచారంతో భయాందోళన

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** నీలగిరి జిల్లా కున్నూర్ కంబిచ్చోలై పరిసర ప్రాంతాల్లో ఇటీవలి కాలంగా రాత్రి సమయాల్లో చిరుతలు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురై అటవీ శాఖ వారికి తెలియజేశారు. తరచూ పర్యవేక్షిస్తున్న అటవీ శాఖవారు జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ నేపథ్యంలో శనివారం కంబిచ్చోలై-పందుమై రోడ్డు పక్కన ఉన్న మోటారు పంపుసెట్ గదిపై రెండు చిరుతలు విశ్రాంతి తీసుకుంటూ కనిపించాయి. అటుగా వెళ్తున్న వారు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశారు. ప్రస్తుతం అవి సామాజిక మాధ్యమాలలో వైరలవుతున్నాయి.

పంపుసెట్ గదిపై చిరుతలు

## విమానాశ్రయంలో ప్రతి గురువారం ఫుడ్ ఫెస్టివల్

**వడపళని, న్యూస్‌టుడే:** చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో గత గురువారం సాయంత్రం విమానాశ్రయ డైరెక్టర్ సీవీ దీపక్ 'ఫుడ్ ఫెస్టివల్'ను ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్(టీఎఫ్ఎస్) లాంజ్‌లో ప్రారంభించారు. ప్రయివేటు కేటరింగ్ సంస్థ(ట్రావెల్స్ ఫుడ్ సర్వీసెస్)తో కలిసి ప్రతి గురువారం దక్షిణ భారత వంటకాలను అందరికీ పరిచయం చేయాలనే ఆలోచనతో ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు టీఎఫ్ఎస్ లాంజ్‌లో జరిగే ఫెస్టివల్‌లో పేరున్న షెఫ్‌లు పాల్గొంటారు. దక్షిణ భారత సంప్రదాయ ఆహార పదార్థాల తయారీ గురించి షెఫ్‌లు వివరిస్తారు. విదేశీయులు, ఉత్తరాది రాష్ట్రాల ప్రయాణికులను ఫుడ్ ఫెస్టివల్ బాగా ఆకర్షిస్తోంది. గురువారం జరిగిన ఫెస్టివల్‌లో పేరున్న షెఫ్, విమానాశ్రయ సిబ్బంది, ప్రయాణికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అధికారులు తెలిపారు.

## అజిత్‌కుమార్ మృతి వ్యవహారం
## సీబీఐ దర్యాప్తు అధికారి నియామకం

**ప్యారిస్, న్యూస్‌టుడే:** నగల చోరీ కేసుకు సంబంధించి పోలీసుల దర్యాప్తు సమయంలో ఆలయ కావలదారుడు అజిత్‌కుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఐదుగురు పోలీసులను అరెస్టు చేశారు. మానామదురై డీఎస్పీ షణ్ముగసుందరం సస్పెండ్ అయ్యారు. అదేవిధంగా ఈ కేసుని సీబీఐ దర్యాప్తు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అనంతరం కేసు దర్యాప్తుని సీబీఐకి బదిలీ చేస్తూ మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అదేవిధంగా ఆగస్టు 20న అభియోగపత్రం దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించింది. అనంతరం కేసు నమోదు చేసిన సీబీఐ.. రాష్ట్ర పోలీసుల నుంచి కేసుకి సంబంధించిన పత్రాలను తీసుకుంది. ఈ నేపథ్యంలో సీబీఐ దర్యాప్తు అధికారిగా డీఎస్పీ మోహిత్‌కుమార్ శనివారం నియమితులయ్యారు. దర్యాప్తుని 14న ప్రారంభించనున్నారు.

## 'రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రాలేదు'

ప్రసంగిస్తున్న ఎంపీ కనిమొళి

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రజల్లో సామాజిక స్పృహ కారణంగా భాజపా అధికారంలోకి రాలేకపోయిందని ఎంపీ కనిమొళి పేర్కొన్నారు. చెన్నై టీనగర్‌లో తమిళనాడు ముర్పోక్కు ఎళుత్తాళర్ కలైజ్ఞర్ సంఘం స్వర్ణోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. పురుషులకు సమానంగా రచయిత్రులు ఉన్నారన్నారు. కేంద్రం పలు పథకాలకు హిందీలో పేర్లు పెడుతోందని, ఎందుకు అర్థం కావడం లేదన్నారు. అన్ని విధాలా భాషను బలవంతంగా రాష్ట్రాలపై రుద్దుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి కీళడి గొప్పతనాన్ని అంగీకరించడానికి మనసు రావడం లేదన్నారు. ఆదిచ్చనల్లూర్‌లో ఇనుపయుగ నాగరికత ప్రారంభమైందని తమిళనాడు ప్రభుత్వం శాస్త్రీయంగా నిరూపించిందని, అయినా దానిని అంగీకరించడం లేదన్నారు.

బస్సులకు జెండా ఊపుతున్న ఉదయనిధి స్టాలిన్

## కొత్త బస్సులు ప్రారంభించిన ఉదయనిధి

**తిరువణ్ణామలై, న్యూస్‌టుడే:** ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆదివారం తిరువణ్ణామలైలో పర్యటించారు. ఆయనకు జిల్లా కలెక్టరు తర్పగరాజ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తర్వాత కొత్తగా కొనుగోలు చేసిన ప్రభుత్వ బస్సులను ఉదయనిధి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి ఈవీ వేలు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.పిచ్చాండి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి పోలీసుల ఆర్థికసాయం

**రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే:** తిరువళ్లూరు జిల్లా తిరువాలంగాడు సరస్వతీనగర్‌కు చెందిన వెంకటస్వామి నిరుపేద. ఈయన కుమార్తె హెప్సిబా ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. పేదరికం కారణంగా కళాశాల ఫీజు రూ.50 వేలు చెల్లించలేకపోయింది. దీంతో ఆమె కొద్దిరోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను కుటుంబీకులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రెండు రోజుల క్రితం ఆమె డిశ్చార్జ్ అయ్యింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు విద్యార్థినికి సాయపడేందుకు ముందుకొచ్చారు. ఆ మేరకు సీఐ మిల్లర్, ఎస్సైలు భామ, అముల్ కలిసి రూ.50 వేలను ఆదివారం అందజేశారు.

## 3,500 ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ఈ ఏడాదిలోగా 3,500 ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఈరోడ్ జిల్లా కొండపై ఉన్న వేలాయుధస్వామి ఆలయంలో ప్రస్తుతం రాజగోపురం, ఆలయం ముందు 186 అడుగుల ఎత్తైన మురుగన్ విగ్రహం ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. ఈ పనులను మంత్రి శేఖర్‌బాబు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ద్రావిడ మోడల్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది లోపల 3,500 ఆలయాలలో పనులు పూర్తి చేసి కుంభాభిషేకం జరుపుతామని చెప్పారు. ఇందుకుగాను ఇప్పటివరకు రూ.1.120 కోట్లు ప్రభుత్వం రాయితీగా అందజేసిందని, 124 ఆలయాలలో కుంభాభిషేకం జరిపినట్టు పేర్కొన్నారు.

వేలాయుధస్వామి ఆలయంలో మంత్రి శేఖర్‌బాబు

# అభివృద్ధి పనులు ప్రారంభం

**చెన్నై, న్యూస్‌టుడే:** తిరు.వి.క జోన్‌లో పూర్తయిన పలు అభివృద్ధి పనులను మంత్రి, సీఎండీఏ ఛైర్మన్ పి.కె.శేఖర్‌బాబు, జీసీసీ మేయర్ ప్రియ అందుబాటులోకి తీసుకొచ్చారు. తిరు.వి.క నగర్ జోన్ 74వ డివిజన్‌లోని చంద్రయోగి సమాధి రోడ్డులో రూ.42 లక్షల వ్యయంతో నిర్మించిన బాలల కేంద్రం, రూ.32.90 లక్షల వ్యయంతో నిర్మించిన బహుళార్థ సాధక భవనం, రూ.9.87 లక్షల వ్యయంతో నిర్మించిన జిమ్‌ను మంత్రి పి.కె.శేఖర్‌బాబు, మేయర్ ప్రియ సంయుక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మధ్య ప్రాంతీయ డిప్యూటీ కమిషనరు కౌశిక్, జోన్ కమిటీ ఛైర్మన్ సరితా మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**చెన్నై:** చెన్నై కార్పొరేషన్ 170వ డివిజన్‌లోని కలికుండ్రం మెయిన్ రోడ్డులో బాలల కేంద్రం, ప్రహరీ, 172వ డివిజన్‌లోని కన్నికాపురం, వేళచ్చేరి మెయిన్ రోడ్డులో బహుళార్థ సాధక భవనం నిర్మించారు. వాటిని మంత్రి సుబ్రమణియన్ శనివారం సాయంత్రం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐదు పర్లాంగ్ రోడ్డులోని చెన్నై మహోన్నత పాఠశాలలో నిర్మించనున్న రెండంతస్తుల పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. 175వ డివిజన్‌లోని తమిళనాడు హౌసింగ్ బోర్డు కాలనీ 3వ అవెన్యూ, వేళచ్చేరి మెయిన్ రోడ్డులోని చెన్నై ప్రాథమిక పాఠశాలలో సింగార చెన్నై పథకం కింద నిర్మించిన అదనపు పాఠశాల భవనం, ఏ.ఎస్.కె.నగర్ మెయిన్ రోడ్డులో నిర్మించిన బహుళార్థ సాధక భవనం, ఏ.ఎస్.కె.నగర్ మెయిన్ రోడ్డులో పలుచోట్ల నిర్మించిన హైమాస్ట్ విద్యుత్తు స్తంభాలు, నమక్కు నామే పథకం కింద 172వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన 120 నిఘా కెమెరాలను ఆయన అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మేయర్ ప్రియ, వేళచ్చేరి ఎమ్మెల్యే అసన్ మౌలానా, డిప్యూటీ కమిషనరు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ ప్రియ. చిత్రంలో మంత్రి శేఖర్‌బాబు తదితరులు

నిఘా కెమెరాలను ప్రారంభిస్తున్న మంత్రి సుబ్రమణియన్

## రెండేళ్లలో అదనపు ట్రాక్‌ల నిర్మాణం

**గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే:** చెన్నై సెంట్రల్, గుమ్మిడిపూండి మధ్య ప్రస్తుతం రెండు రైల్వే లైన్లు మాత్రమే ఉన్నాయి. దీంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్లే సమయంలో సబర్బన్ రైళ్లు సిగ్నళ్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా సబర్బన్ రైళ్లు సుమారు 45 నిమిషాల పాటు ఆలస్యంగా నడుస్తున్నాయి. సమస్య పరిష్కారానికి అదనపు ట్రాక్ నిర్మించాలని ప్రయాణికులు ఏళ్ల తరబడి కోరుతున్నారు. ఎట్టకేలకు గుమ్మిడిపూండి, అత్తిపట్టు మధ్య 22.52 కి.మీ దూరానికి రూ.374 కోట్ల వ్యయంతో 2 కొత్త ట్రాక్‌లు నిర్మించేందుకు రైల్వేశాఖ అనుమతి ఇచ్చింది. 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు వెళ్లే విధంగా ట్రాక్‌లు నిర్మించనున్నట్లు సదరుశాఖ అధికారులు వెల్లడించారు. మార్గంలో 6 భారీ, 48 చిన్న వంతెనలు నిర్మిస్తామని పేర్కొన్నారు. పనులు రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించారు.

## శ్రీలంక విమానంలో సాంకేతిక లోపం

**టీనగర్, న్యూస్‌టుడే:** చెన్నై నుంచి శ్రీలంకకు బయలుదేరిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం చెన్నై విమానాశ్రయం నుంచి 126 మంది ప్రయాణికులతో శ్రీలంక ఎయిర్‌లైన్స్ విమానం శ్రీలంకకు బయలుదేరింది. విమానం రన్‌వేపై ఉండగా యంత్రంలో సమస్యను గుర్తించిన పైలట్ వెంటనే ఆపేశారు. అధికారులకు సమాచారం అందించగా వారు సిబ్బంది సాయంతో సమస్యను పరిష్కరించారు. సుమారు గంటన్నర తర్వాత విమానం బయలుదేరి వెళ్లింది.

## రాష్ట్రంలోకి భాజపా ప్రవేశిస్తే నాశనమే
### కేంద్ర మాజీ మంత్రి చిదంబరం

ప్రసంగిస్తున్న చిదంబరం

**వేలూర్, న్యూస్‌టుడే:** భాజపా ఏ రాష్ట్రంలోకి ప్రవేశించినా ఆ రాష్ట్రం నాశనం అవుతుందని కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ఆరోపించారు. వేలూర్ జిల్లా గుడియాత్తం బస్టాండు వద్ద జిల్లా కాంగ్రెస్ తరఫున బహిరంగ సభ శనివారం రాత్రి జరిగింది. ఇందులో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం, సీనియర్ నేత పీటర్ అల్ఫోన్స్ తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిదంబరం ప్రసంగిస్తూ.. భాజపా తమిళనాడులో కాలుమోపేందుకు పథకాలు వేస్తోందని, అందులో కొంత విజయం కూడా సాధించిందనే చెప్పాలని తెలిపారు. అన్నాడీఎంకే.. భాజపాతో కూటమి ఏర్పాటు చేయడం దురదృష్టకరమన్నారు. తమిళనాడులో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తే కూటమి పాలన ఉంటుందని అమిత్‌షా చెబుతున్నారని, అదే సమయంలో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఈపీఎస్ అంటున్నారని, కావున అన్నాడీఎంకే కూటమిని ఓడిస్తే ప్రజలకు ఈ సందేహాలు ఉండవన్నారు.

## నాయకుడికి ప్రతికార ధోరణి ఉండకూడదు: అన్నామలై

**సైదాపేట, న్యూస్‌టుడే:** నాయకుడికి ప్రతికార ధోరణి ఉండకూడదని భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. చెన్నై సమీపం ఉత్తండిలోని సుధానంద ఆశ్రమంలో రాజకీయాలు, పాలన, నాయకత్వంపై కార్యశాల శనివారం సాయంత్రం జరిగింది. ఇందులో అన్నామలై పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో ఏ పదవయినా ఏదో ఒకరోజు పోతుందన్నారు. మనం నోరు మెదపకుండా ఉన్నా మనకు మారు పేర్లు పెట్టి పోస్టర్లు అంటిస్తున్నారని చెప్పారు. నేడు తెల్లచొక్కా ధరించి నాలుగు రీల్స్ చేస్తే నాయకుడు అవుతున్నారని పేర్కొన్నారు. ఆవులకు ఓటు హక్కు కావాలని ఓ రాజకీయ నేత చెప్పడాన్ని తాను విమర్శించడం లేదన్నారు. ప్రతికారం తీర్చుకునే ధోరణి ఒక రాజకీయవేత్తకు ఉండొచ్చుగాని ఒక నాయకుడికి ఉండకూదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఫోన్ ట్యాపింగ్ చేయటం, ప్రతీకారం తీర్చుకోవటం ఉండకూదని అన్నారు. 40 శాతం ఓటర్లు ఎన్నికలకు వారం ముందే ఎవరికి ఓటేయాలనేది నిర్ణయించుకుంటారని తెలిపారు.

## యువతకు చదరంగ శిక్షణ

**వడపళని, న్యూస్‌టుడే:** చెన్నై నగరానికి చెందిన 'చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ' 'చోళ చెస్' పేరిట యువతకు చదరంగ శిక్షణ అందించనుంది. మురుగప్ప గ్రూపునకు చెందిన చోళమండలం సంస్థ ఆర్థిక స్థోమత లేని యువ క్రీడాకారులను ప్రోత్సహించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ప్రాతినిధ్యం వహిస్తున్న చెస్ గ్రాండ్‌మాస్టర్ ఆర్బీ రమేష్ మాట్లాడుతూ.. యువతలో ప్రతిభను వెతికితీసి ఉత్తమ వనరులతో తీర్చిదిద్దాలన్నదే సంస్థ ఆలోచనగా పేర్కొన్నారు. చెస్ గురుకుల్‌తో కలిసి ప్రారంభించిన ఈ కార్యక్రమం 5 నుంచి 7 రోజుల శిబిరాల ద్వారా శిక్షణ అందిస్తుందని, ప్రారంభ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ వెల్లయన్ సుబ్బయ్య మాట్లాడుతూ.. భారతదేశం ప్రస్తుతం అపూర్వమైన చెస్ ఉత్సాహాన్ని చూస్తోందని, యువ క్రీడాకారులు ప్రపంచ గుర్తింపును సాధిస్తున్నారని పేర్కొన్నారు.

## ఘనంగా అన్నకూట ఉత్సవం

స్వామివారికి సమర్పించిన నైవేద్యం

**సైదాపేట, న్యూస్‌టుడే:** మహామంత్ర భజన మండలి గురువారం నుంచి నిర్వహిస్తున్న షోడశనామ 92వ వార్షిక అఖండ సంకీర్తన సప్తాహంలో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నకూట ఉత్సవం వైభవంగా జరిగింది. పరబ్రహ్మ స్వరూపమైన అన్నాన్ని భగవంతుని ముందు రాశిగా పోసి పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ముందుగా భక్తులు అనేకులు శ్రీ విష్ణు సహస్రనామాన్ని భక్తిశ్రద్ధలతో బృంద పారాయణం చేశారు. సాంస్కృతిక కార్యక్రమంగా జోస్యుల ఉమ, శైలేశ్ జోస్యుల నిర్వహణలోని స్వరార్ణవ బృంద సభ్యుల భక్తి గేయాలాపన వీనులవిందు కలిగించింది. మండలి అధ్యక్షులు వీరబొమ్మల జనార్ధనరావు ఉత్సవ ఉభయదారులను, కళాకారులను సత్కరించారు. కార్యదర్శి కొత్తబాల నరసింహులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

# శిక్షల గురించి బహిరంగ ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటు చేయాలి

### మద్రాసు హైకోర్టు సీజే జస్టిస్ కేఆర్ శ్రీరామ్

**ప్యారిస్, న్యూస్‌టుడే:** మహిళలకు సంబంధించిన నేరాలకు విధించే శిక్షల గురించి బహిరంగ ప్రాంతాల్లో అవగాహన బ్యానర్లను ఏర్పాటు చేయాలని మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ ప్రభుత్వానికి సూచించారు. తేని జిల్లా పెరియకుళం లోని ఉద్యానవన కళాశాల, పరిశోధన కేంద్రంలో మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణపై ఒకరోజు సదస్సు శనివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ మాట్లాడుతూ... మహిళలు, పిల్లలపై జరిగే లైంగిక సంబంధమైన నేరాలను అడ్డుకోవడంతో పాటు లింగవివక్షను పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను లింగవివక్ష లేకుండా పెంచాలన్నారు. అదేవిధంగా మహిళలపై జరిగే నేరాలను అడ్డుకోవడానికి, లింగ వివక్షను తొలగించడానికి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సినిమా థియేటర్లు, వాణిజ్య ప్రాంగణాలు, బహిరంగ ప్రాంతాల్లో శిక్షల వివరాలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనితా సంపత్, ఆర్ఎన్ మంజుల, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

చెన్నై నగరంలో శనివారం రాత్రి జరిగిన సత్యభామ విశ్వవిద్యాలయం కులపతి మరియజీనా జాన్సన్-ప్రెసిడెంట్ మరియ జాన్సన్ దంపతుల కుమార్తె మరియ కేథరిన్ జయప్రియ-ఆకాశ్ వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సతీమణి దుర్గ పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. - న్యూస్‌టుడే, చెన్నై

## కరుణానిధి సమాధి వద్ద వైరముత్తు నివాళి

**చెన్నై, న్యూస్‌టుడే:** దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధి వద్ద ప్రముఖ సినీ గేయరచయిత, కవి వైరముత్తు నివాళులర్పించారు. తిరుకురళ్‌కు 'వళ్లువర్ మరై వైరముత్తు ఉరై' పేరిట వైరముత్తు రాసిన వ్యాఖ్యాన పుస్తకావిష్కరణ కార్యక్రమం సందర్భంగా ఆదివారం మెరినా తీరంలోని కరుణానిధి సమాధి వద్ద పుస్తకంతో పాటు వైరముత్తు వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తన 'ఎక్స్' పేజీలో.. కరుణానిధి వ్యాఖ్యానం రాసిన తిరుకురళ్‌కు తానూ వ్యాఖ్యానం రాశానన్నారు. వ్యాఖ్యాన రచయిత జాబితాలో చేరడం కన్నా కరుణానిధి సరసన చేరడంలో సంతోషిస్తున్నానని తెలిపారు.

కరుణానిధి సమాధి వద్ద పుస్తకంతో వైరముత్తు

## ఇద్దరు పోలీసు అధికారిణులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఫిర్యాదు

### పరిశీలించాలన్న మద్రాసు హైకోర్టు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** హైకోర్టు పేరుని దుర్వినియోగం చేసిన మహిళా ఇన్‌స్పెక్టరు, ఎస్సైలపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలన్న ఫిర్యాదుని పరిశీలించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. చెన్నై జీకేఎం కాలనీకి చెందిన బాలసెంథిల్ మురుగన్ దాఖలు చేసిన పిటిషన్‌లో... తాను, తన కుటుంబ సభ్యులు వరకట్న వేధింపులకి గురిచేస్తున్నట్లు తన భార్య పుళియంతోప్పు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఆ మేరకు తమపై హైకోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్వరి, కమిషనరు కార్యాలయ కంట్రోల్‌రూమ్ ఇన్‌స్పెక్టరు అంబికా కలిసి ఉన్నతాధికారులు, జాతీయ మహిళా కమిషన్‌కి తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని హోంశాఖ, డీజీపీ, చెన్నై పోలీసు కమిషనరుకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వరకట్న వేధింపుల కేసులో కేసు నమోదు చేయాలని హైకోర్టు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. కావున హైకోర్టు పేరుని దుర్వినియోగం చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ కుమరప్పన్ శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో.. హైకోర్టు పేరుని దుర్వినియోగం చేసిన ఇద్దరు పోలీసు అధికారిణులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఇచ్చిన ఫిర్యాదుని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ, కమిషనరు 8 వారాల్లోగా పరిశీలించాలని ఆదేశించారు.

## ఆచార్యులు.. పూజ్యనీయులు



ఉపన్యాసకులతో పాలక మండలి సభ్యులు

**సైదాపేట, న్యూస్‌టుడే:** మానవాళికి అజ్ఞానం అనే చీకటిని తొలగించి జ్ఞానం అనే వెలుగును ప్రసాదించే మార్గదర్శకులైన ఆచార్యులు పూజ్యనీయులని ప్రముఖ ఉపన్యాసకులు ఉభయ వేదాంత కిడాంబి నారాయణస్వామి అభివర్ణించారు. 100 ఏళ్లకు పైగా సమాజ సంక్షేమం కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పప్పిశెట్టి రాఘవయ్య శెట్టి ధర్మ సంస్థ 114వ ఆవిర్భావ దినోత్సవం (జులై 24) సందర్భంగా 'ఆచార్య వైభవం' అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం ఆదివారం ఏర్పాటైంది. చెన్నై త్యాగరాయనగర్ లోని పీఆర్‌సీసీ సెంటినరీ హాలు దీనికి వేదికగా నిలిచింది. ముందుగా పాలక మండలి సభ్యులు కోటా సుధాకర్, ఏఎస్ హరి ప్రసాద్, కేకే బాలు, పొత్తూరు సత్యనారాయణ ఉపన్యాసకులను సత్కరించారు. నగరంలోని సోదర ధర్మ సంస్థల నిర్వాహకులతో పాటు పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

(c) eenadu

## బరువు తగ్గిన శింబు

**చెన్నై, న్యూస్‌టుడే:** వెట్రిమారన్ దర్శకత్వంలో శింబు నటించనున్న చిత్రం గురించి ప్రకటన ఇప్పటికే వెలువడగా కథ, టైటిల్, ఇతర నటీనటులు తదితర వివరాలను ఇంకా వెల్లడించలేదు. ఇది 'వడ చెన్నై' తరహా చిత్రంగా ఉంటుందనే ప్రచారం మాత్రం జరుగుతోంది. ఈ చిత్రం కోసం శింబు 10 కిలోల వరకు శరీర బరువు తగ్గించినట్లు సమాచారం. వెట్రిమారన్ దర్శకత్వం కావడంపై చిత్రంపై శింబు అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



## పుదుపేట్టై 26న రీరిలీజ్

**చెన్నై:** సెల్వరాఘవన్ దర్శకత్వంలో ధనుష్, సోనియా అగర్వాల్, స్నేహ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించి 2006లో విడుదలైన చిత్రం 'పుదుపేట్టై'. యువన్ శంకర్ రాజా సంగీతంలోని ఈ చిత్రం పాటలన్నీ హిట్టయ్యాయి. ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రాన్ని 4కేలో 26న రీరిలీజ్ చేయనున్నారు.

## 'తలైవన్ తలైవి' రెండో పాట విడుదల

పాటలోని ఓ సన్నివేశ దృశ్యం

**చెన్నై:** పాండిరాజ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ జంటగా నటించిన చిత్రం 'తలైవన్ తలైవి'. ఇందులో యోగిబాబు తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. సత్యజ్యోతి ఫిలిమ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానున్న నేపథ్యంలో రెండో పాట 'ఆకాశ వీరన్'ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటకు సంతోశ్ నారాయణన్ సంగీతం అందించారు.

## సినిమా షూటింగ్‌లో స్టంట్ మాస్టర్ మోహన్‌రాజ్ హఠాన్మరణం

మోహన్‌రాజ్ (పాతచిత్రం)

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** దర్శకుడు పా. రంజిత్ సినిమా షూటింగ్‌లో పోరాట సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా స్టంట్ మాస్టర్ మోహన్‌రాజ్ గుండెపోటుతో మృతి చెందారు. పా. రంజిత్ దర్శకత్వంలో 'వేట్టువం' అనే సినిమా చిత్రీకరణ నాగపట్టిణం జిల్లా కీళైయూర్ సమీపంలోని విలుందమావడి గ్రామంలో గత 10వ తేదీ నుంచి జరుగుతోంది. ఈ చిత్రంలో కాంచిపురానికి చెందిన మోహన్‌రాజ్ (52) స్టంట్‌మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం పోరాట సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా ఓ సన్నివేశంలో కారు పైనుంచి మోహన్‌రాజ్ దూకాల్సి ఉంది. ఆయన కారు పైనుంచి దూకినప్పుడు అదుపుతప్పి కిందపడ్డారు. వెంటనే గుండెపోటుకు గురవడంతో నాగపట్టిణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో సినిమా చిత్రీకరణ తాత్కాలికంగా నిలిపివేశారు.

సభ్యత్వ కార్డులు అందజేస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ

## 16న తిరుచ్చి పంజపూర్ బస్టాండ్ ప్రారంభం

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** తిరుచ్చి పంజపూర్ బస్టాండ్‌ని 16వ తేదీ అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. తిరుచ్చి ఎలమలైపట్టిపుదూర్‌లో 'ఓరణియిల్ తమిళనాడు' పేరిట సభ్యత్వ నమోదు శిబిరాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించి కొత్తగా చేరినవారికి కార్డులు అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తిరుచ్చి పంజపూర్‌లో నిర్మించిన బస్టాండ్‌లో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. డీఎంకే ప్రభుత్వంలోనే గృహిణులకు రూ.వెయ్యి అందించే పథకాన్ని ప్రారంభమైందని, కానీ ఇప్పుడు ఎడప్పాడి రూ.1,500 ఇస్తామంటున్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్థలను రద్దు చేయాలని సిఫారసు చేసినట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు.

ప్రసంగిస్తున్న రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ వలీ

## తౌహీత్ జమాత్ కార్యశాల

**శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే:** తమిళనాడు తౌహీద్ జమాత్ తరఫున ఆదివారం శ్రీపెరుంబుదూర్ సమీప పడపైలోని ఓ కల్యాణ మండపంలో యువకులు సన్మార్గంలో నడవడంపై అవగాహన కార్యశాలను నిర్వహించారు. జమాత్ జిల్లా అధ్యక్షుడు అక్రమ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ వలీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని, ముస్లింలకు 7శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తదితర తీర్మానాలను ఆమోదించారు. జిల్లా కార్యదర్శి అష్రఫ్ అలీ, కోశాధికారి అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# పలు రైళ్ల రద్దు

**వడపళని, న్యూస్‌టుడే:** తిరువళ్లూరు సమీపంలో ముడిచమురుతో వెళ్తున్న గూడ్సు రైలులో సంభవించిన అగ్నిప్రమాదం కారణంగా ఆదివారం పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది.

● **20607** డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - మైసూరు వందేభారత్ 05.50, **12007** చెన్నై సెంట్రల్ - మైసూరు శతాబ్ది 06.00, **12675** చెన్నై సెంట్రల్-కోయంబత్తూరు కోవై 06.10, **12243** చెన్నై సెంట్రల్-కోయంబత్తూరు శతాబ్ది 07.15, **16057** చెన్నై సెంట్రల్-తిరుపతి సప్తగిరి 06.25, **22625** చెన్నై సెంట్రల్-కేఎస్సార్ బెంగళూరు డబుల్ డెక్కర్, 07.25, **12639** చెన్నై సెంట్రల్-కేఎస్సార్ బెంగళూరు బృందావన్ 07.40, **16003** చెన్నై సెంట్రల్-నాగర్‌సోల్ 09.15, **12676** కోయంబత్తూరు-చెన్నై సెంట్రల్ కోవై 15.15, **12244** కోయంబత్తూరు-చెన్నై సెంట్రల్ శతాబ్ది 15.05, 12679 చెన్నై సెంట్రల్-కోయంబత్తూరు ఇంటర్ సిటీ 14.35, **20643** చెన్నై సెంట్రల్-కోయంబత్తూరు వందేభారత్ 14.15, **16089** చెన్నై సెంట్రల్-జోలార్‌పేట్టై 17.55, **12607** చెన్నై సెంట్రల్-కేఎస్సార్ బెంగళూరు లాల్‌బాగ్ 15.30, **66038** నెల్లూరు-సూళ్లూరుపేట మెము 18.45 రైళ్లు ఆదివారం రద్దయ్యాయి.

● **తాత్కాలికంగా...** **20644** కోయంబత్తూరు-చెన్నై సెంట్రల్ వందేభారత్ 06.00 రైలు సేలం వరకు, **12680** కోయంబత్తూరు-చెన్నై సెంట్రల్ ఇంటర్ సిటీ 06.20 సేలం వరకు నడిచాయి. ● **12028** కేఎస్సార్ బెంగళూరు-చెన్నై సెంట్రల్ 06.00 రైలు అరక్కోణం వరకు నడిపారు. **12608** కేఎస్సార్ బెంగళూరు-చెన్నై సెంట్రల్ 06.25 రైలు అరక్కోణం వరకు నడిచింది. **12680** కోయంబత్తూరు-చెన్నై సెంట్రల్ 06.20 సేలం వరకు తాత్కాలికంగా నడిపారు. ● **టెర్మినల్ మార్పు...** **22637** చెన్నై సెంట్రల్-మంగళూరు సెంట్రల్ వెస్ట్ కోస్ట్ 13.25కు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరాల్సిన రైలు అరక్కోణంలో 14.35కు బయలుదేరింది. **16551** చెన్నై సెంట్రల్-అశోకపురం 13.35కు చెన్నై నుంచి నడవాల్సిన రైలు 15.45 గంటలకు కాట్పాడి నుంచి బయలుదేరింది. ● **దారి మళ్లింపు...** **20678** విజయవాడ-చెన్నై సెంట్రల్ వందేభారత్ 15.20 రైలు గూడూరు మార్గంగా మళ్లించారు. ● **09420** తిరుచ్చిరాపల్లి-అహ్మదాబాద్ స్పెషల్ 13న 05.45 బయలుదేరిన రైలును అరక్కోణం, రేణిగుంట మీదుగా దారి మళ్లించారు. ● **సేవల్లో మార్పు...** **16053** చెన్నై సెంట్రల్-తిరుపతి 14.25 రద్దయింది. ● **టెర్మినల్...** **16203** చెన్నై సెంట్రల్-తిరుపతి 16.35 రైలు తిరుత్తణి వరకు నడుస్తుంది. ● **22698** చెన్నై సెంట్రల్-హుబ్బళి 15.00 రైలు జోలార్‌పేట్టై నుంచి, **16551** చెన్నై సెంట్రల్-అశోకపురం 13.35 రైలు అరక్కోణం నుంచి బయలుదేరుతుంది. ● **12697** చెన్నై సెంట్రల్ - తిరువనంతపురం సెంట్రల్ 15.10 రైలు కాట్పాడినుంచి నడిచింది. ● **ఆలస్యంగా...** 12695 చెన్నై సెంట్రల్-తిరువనంతపురం 15.20 రైలు 18.00కు బయలుదేరుతుంది. ● 2210 చెన్నై సెంట్రల్-ముంబయి సీఎస్టీ 13.15 రైలు 16.00 గంటలకు నడుస్తుంది. ● **17651** చెంగల్పట్టు-కాచిగూడ 15.35 రైలు 17.00కు ఆలస్యంగా బయలుదేరింది. ● **12027** చెన్నై సెంట్రల్-కేఎస్సార్ బెంగళూరు శతాబ్ది 17.30 రైలు అరక్కోణం నుంచి నడుస్తుందన్నారు.

# హొగినేకల్‌లో దోనెల సారథుల సమ్మె

● నిరాశతో వెనుదిరిగిన పర్యాటకులు

పర్యాటకులు లేక బోసిపోయిన దోనెల రేవు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** హొగినేకల్ వద్ద కావేరి నదిలో నీటిరాక పెరిగిన సమయంలో స్థాయి మేరకు దోనెల రేవులలో దోనెలు నడపడానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం దోనెల సారథులు సమ్మెకు దిగారు. దీంతో షికారుకు వచ్చిన పర్యాటకులు నిరాశతో వెనుదిరిగారు. హొగినేకల్ జలపాతాల్లో ప్రస్తుతం నీటి రాక తగ్గింది. దీంతో 22 రోజుల తర్వాత దోనెలు నడపడానికి జిల్లా కలెక్టర్ సతీష్ అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో కావేరి నదిలో వరదలు చోటుచేసుకున్న సమయంలో గరిష్ఠంగా మూడు నెలల వరకు దోనెలను నిషేధిస్తున్నట్టు వాటి సారథులు వాపోయారు. తద్వారా ఈ వృత్తిని నమ్ముకున్న 2 వేల మందికి పైగా జీవనాధారం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఆ సమయంలో సాయం అందజేయాలని కోరారు. నీరు అధికస్థాయిలో వస్తున్నపుడు పర్యాటకులకు నిషేధం విధించకుండా కావేరి నదిలో నీటి ప్రవాహాన్ని తిలకించడానికి నిర్మించిన నడకబాట, మసాజ్ సెంటర్ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ 416 మంది దోనెల సారథులు సమ్మెకు దిగారు.

## పాఠశాలల్లో 'యూ' ఆకారంలో బెంచీలు

● వ్యతిరేకించిన పలువురు నేతలు

**సైదాపేట, న్యూస్‌టుడే:** పాఠశాలల్లోని తరగతి గదుల్లో 'యూ' ఆకారంలో బెంచీలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని కొందరు రాజకీయ నేతలు వ్యతిరేకిస్తున్నారు. భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ... యూ ఆకారంలో బెంచీలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిన ప్రభుత్వం మొదట గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా విద్యార్థులను యూ ఆకారంలో కూర్చోబెడితే వారికి ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సీటింగ్‌తో విద్యార్థులకు మెడ నొప్పి, కంటిచూపు సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని తాను ఓ వైద్యురాలిగా చెబుతున్నానని తెలిపారు. ఏదో సినిమాల్లో చూపించారు కదా అని అలా చేయడం సరికాదన్నారు. అన్బుమణి రామదాస్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర ప్రభుత్వం కామెడీ చేయడం మానుకుని విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎద్దేవా చేశారు. సీటింగ్ మార్చాలనుకోవడం వెనుక సదుద్దేశం ఉన్నా ఇందులో పలు సమస్యలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు బోర్డు చూసేందుకు తమ మెడను తిప్పాల్సి ఉంటుందని, దీంతో వారికి మెడనొప్పి తదితర సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, సరిపడా ఉపాధ్యాయుల నియామకం ద్వారానే నిజమైన విద్యాభివృద్ధి సాధ్యమన్నారు.

## ఎంబీబీఎస్ చదివేందుకు దరఖాస్తు చేసుకున్న ముగ్గురు సీనియర్ సిటిజన్లు

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** ఈ ఏడాది నిర్వహించిన నీట్‌లో ఉత్తీర్ణత పొందిన 60 ఏళ్లుదాటిన సీనియర్ సిటిజన్లు ముగ్గురు రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది నీట్ రాసి ఉత్తీర్ణత పొందిన 60ఏళ్లు దాటిన ఇద్దరు న్యాయవాదులు సహా ముగ్గురు సీనియర్ సిటిజన్లు రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివేందుకు దరఖాస్తు చేసుకున్నారు. దీని గురించి అధికారులు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎక్కువమంది గ్రాడ్యుయేట్లు, నిపుణులు మెడికల్ లేదా డెంటల్ డిగ్రీలలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని, 2017 తర్వాత ఇదే అధిక సంఖ్యగా ఉందన్నారు. అధికంగా సీనియర్ సిటిజన్లు వైద్యవిద్యలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వారికి యువ అభ్యర్థులతో పోటీ పడటానికి తగినంత మార్కులు లేకపోవచ్చునని, కానీ కొందరు 69శాతం రిజర్వేషన్ కేటగిరి కింద సీటు పొందేంతగా స్కోర్ సాధించారని తెలిపారు. వారు ప్రభుత్వ కళాశాలల్లో చదివేందుకు ప్రభుత్వం అన్ని సహాయాలు చేస్తోందన్నారు. ముగ్గురు సీనియర్ సిటిజన్లు ప్రత్యేక కేటగిరీ కింద ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

## వాహనాలను అడ్డుకున్న ఏనుగు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల అభయారణ్యం ఆసనూర్ అటవీ సర్కిల్‌లో ఏనుగులు ఆహారం, తాగునీటి కోసం రోడ్డు దాటి వెళ్లడం మామూలు. ఈ నేపథ్యంలో ఆసనూర్ నుంచి తింబం వెళ్లే మార్గంలో శనివారం పడి ఉన్న చెరకు గెడలను అడవి నుంచి బయటకు వచ్చిన ఓ ఏనుగు తింటుండగా వాహనాలు నిలిచిపోయాయి. అప్పుడు వరుసగా ఉన్న వాహనాలలో చెరకు గెడలు ఉన్నాయనకుని ఏనుగు వాటికి అడ్డుగా నిలిచింది. కాసేపు అటు ఇటు తిరిగి అడవిలోకి వెళ్లింది. కొన్ని రోజులుగా వాహనాలను తరుముకుంటున్న ఏనుగును దట్టమైన అడవిలోకి తరమాలని వాహన చోదకులు అటవీశాఖ అధికారులను కోరుతున్నారు.

## బస్సు డ్రైవరుకి గుండెపోటు

● అదుపుతప్పి ఢీకొనడంతో వ్యక్తి మృతి

**ప్యారిస్, న్యూస్‌టుడే:** బస్సు నడుపుతుండగా డ్రైవరుకు గుండెపోటు రావడంతో వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తిని ఢీకొనడంతో అతను మృతిచెందాడు. చెన్నై కిళాంబాక్కం నుంచి కోయంబేడుకి ఆదివారం ప్రభుత్వ బస్సు బయలుదేరింది. అరుంబాక్కం వద్ద వెళ్తుండగా డ్రైవరుకి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. దీంతో అదుపుతప్పిన బస్సు ఆగి ఉన్న కారు, పాదచారులను ఢీకొట్టింది. ప్రమాదంలో నాలుగు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అదేవిధంగా 50 ఏళ్ల వ్యక్తి మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. సమాచారం మేరకు అన్నానగర్ ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. గుండెపోటుకి గురైన డ్రైవరు ప్రాణాపాయస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

భువనేశ్వరన్, సుజన్, మోనిప్రసాద్ (పాతచిత్రాలు)

### నీటిగుంతలో పడి ముగ్గురు బాలుర మృతి

**శోళింగర్, న్యూస్‌టుడే:** రాణిపేట జిల్లా శోళింగర్ యూనియన్ మేట్టుకున్నత్తూర్ గ్రామానికి చెందిన రైతు శరవణన్ కుమారుడు భువనేశ్వరన్ (8) ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన గోపి కుమారులు మోనిప్రసాద్ (10), సుజన్ (8) ఐదు, మూడు తరగతులు చదువుతున్నారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఈ ముగ్గురు చిన్నారులు స్థానికంగా ఉన్న నీటిగుంత వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. స్థానికులు కాపాడి బాణావరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ముగ్గురు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బాలుడు నడిపిన వ్యాను ఢీకొని ఇద్దరు...

ప్రభు (పాతచిత్రం)

**రెడ్‌హిల్స్:** తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్ సమీపం సెన్నికుళం గ్రామానికి చెందిన కరుప్పుస్వామి (23) వ్యాను డ్రైవర్. ఈయన 18 ఏళ్ల బాలుడు (క్లీనర్)తో వ్యానులో తిరువళ్లూరు జిల్లా చోళవరం సమీప ఓరక్కాడుకు చేరుకున్నాడు. అల్లినగర్‌కు చెందిన ప్రభు (50) అనే వ్యక్తితో మాట్లాడుతుండగా బాలుడు వ్యాను స్టార్ట్ చేయగా అది ముందుకు కదలడంతో కరుప్పుస్వామి, ప్రభు తీవ్రంగా గాయపడి మృతి చెందారు. చోళవరం పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుదాఘాతంతో యువకుడు...

**ప్యారిస్:** తూత్తుకుడి జిల్లా చిదంబరం నగర్ ప్రాంతానికి చెందిన పెరుమాల్‌సామికి మీళవిట్టాన్ సమీపంలో గోదాము ఉంది. గోదాము పైకప్పుకి కూలింగ్ షీట్లు అమర్చే పనులు జరుగుతున్నాయి. కార్తిక్, ముత్తుశివ, కరుప్పసామి, చందన్‌కుమార్ తదితరులు పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం వారు నిచ్చెన సాయంతో పైకి ఎక్కేందుకు యత్నించారు. అప్పుడు పైనున్న విద్యుత్తు తీగలకు నిచ్చెన తగలడంతో నలుగురు విద్యుదాఘాతానికి గురయ్యారు. ముత్తుశివ ఘటనాస్థలిలో మృతిచెందాడు. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు గాయపడినవారిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కారు ఢీకొని కార్మికుడు...

**రెడ్‌హిల్స్:** తిరువళ్లూరు సమీపం వరదరాజపురానికి చెందిన బలరామన్ (46) రైతు కూలీ. ఈయన తన కుమారుడు మోహనకృష్ణన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి తిరువళ్లూరుకు బయలుదేరాడు. కుప్పమ్మ సత్రం వద్ద కారు ఢీకొనడంతో బలరామన్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ మోహన్‌కృష్ణన్‌ను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తిరువళ్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పాముకాటుకు బాలుడు...

**రెడ్‌హిల్స్:** తిరువళ్లూరు జిల్లా పెరుమాల్‌పట్టు ముల్లైనగర్‌కు చెందిన సుజయ్‌కుమార్ కుమారుడు శరణ్‌కుమార్ (8) ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఇతను స్నేహితులతో కలిసి శనివారం సాయంత్రం క్రికెట్ ఆడుతుండగా బంతి ముళ్ల పొదల్లో పడింది. శరణ్‌కుమార్ బంతిని తీస్తుండగా విషపూర్తి పాము కాటు వేసింది. వెంటనే అతన్ని తోటివారు తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందాడు. చెవ్వాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కుక్కర్ పేలి మహిళ...

**ప్యారిస్:** చెన్నై తిరువొత్తియూర్‌కి చెందిన రాజ్యలక్ష్మి (55) శనివారం మధ్యాహ్నం తన ఇంట్లో కుక్కర్‌లో ఆహారం వండుతుండగా అకస్మాత్తుగా కుక్కర్ పేలి మూత బలంగా తలకు తాకింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

### తుపాకీ కాల్పుల్లో గాయపడిన యువకుడు...

కార్తి (పాతచిత్రం)

**వేళచ్చేరి:** విళుపురం సమీప వాక్కూర్‌కు చెందిన తెన్నరసు తన భార్య లావణ్యతో శనివారం గొడవపడ్డాడు. మద్యం మత్తులో భార్య, తల్లి పచ్చయమ్మాళ్, చిన్నాన్న కుమారుడు కార్తిక్‌పై ఎయిర్ గన్‌తో కాల్పులు జరిపాడు. ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వారిని స్థానికులు ముండియంబాక్కం వైద్య కళాశాల ఆసుపత్రి తరలించారు. ఈ నేపథ్యంలో కార్తిక్‌ను మెరుగైన చికిత్సకోసం చెన్నై ఆసుపత్రికి తరలించగా ఆదివారం ఉదయం మృతి చెందాడు.

### కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు...

**అరక్కోణం:** రాణిపేట జిల్లా అరక్కోణం సమీపం గూడలూరు గ్రామానికి చెందిన కార్తిక్, సంతోష్ అన్నదమ్ములు. వీరిద్దరూ ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై అరక్కోణం పట్టణానికి బయలుదేరారు. మార్గమధ్యలో ఎస్సార్ కండ్రిగ వద్ద వెళుతుండగా అరక్కోణం నుంచి శోళింగర్ వెళుతున్న కారు వీరి వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో కార్తిక్ ఘటనాస్థలిలో మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన సంతోష్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నాటు మందు తిన్న కవల పిల్లలు...

మృతులు (పాతచిత్రాలు)

**వేళచ్చేరి:** పెరంబలూర్ జిల్లా వాలి గండేశ్వరపురం గ్రామానికి చెందిన కందసామి, ధనలక్ష్మి దంపతులు. వీరికి ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నాడు. 11 నెలల క్రితం ఇద్దరు కవల ఆడపిల్లలు రేష్మ, తనుశ్రీ పుట్టారు. కొద్ది రోజులుగా కవలలు అనారోగ్యంగా ఉన్నారు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా తగ్గలేదు. ఇదిలా ఉండగా ఈనెల 11వ తేదీ ఇద్దరినీ గ్రామంలోని నాటు వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడు ఇచ్చిన మందు పిల్లలకు ఇవ్వడంతో శుక్రవారం మధ్యాహ్నం రేష్మ మృతి చెందింది. తనుశ్రీకి ఆరోగ్యం క్షీణించడంతో తిరుచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

క్రైం కార్నర్

### వృద్ధురాలి ఆత్మహత్య

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ఈరోడ్ జిల్లా పున్‌సెయ్‌పులియంపట్టికి చెందిన కమలం (70) కుమారుడితో జీవిస్తోంది. వయోధిక ఆరోగ్య సమస్యలతో మనోవేదనకు గురైంది. ఈ నేపథ్యంలో శనివారం గ్రామంలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

### ఇంట్లో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

● తల్లి, కుమార్తెకు గాయాలు

**కాంచీపురం, న్యూస్‌టుడే:** కాంచీపురం నగరంలోని పిళ్లయార్‌పాళ్యం లింగప్పన్ ఒత్తవాడ వీధికి చెందిన మోహనసుందరం చేనేత కార్మికుడు. ఇతనికి భార్య మణిమేఘలై(26), కుమార్తె కృబాషిణి(7) ఉన్నారు. ఆదివారం ఉదయం మణిమేఘలై కుమార్తెకు స్నానం చేయించడానికి గ్యాస్ స్టౌపై నీళ్లు పెట్టింది. నీళ్లు కాగిన తరువాత కుమార్తెను తీసుకొని స్నానాల గదికి వెళ్లింది. అప్పుడు వంట గదిలో గ్యాస్ లీక్ కావడంతో ఉన్నట్టుండి మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో తల్లీకుమార్తెలు స్నానాల గదిలో నుంచి బయటకు రాలేకపోయారు. వారి కేకలు విన్న ఇరుగుపొరుగు వారు వచ్చి ఇద్దరిని కాపాడి మంటలను ఆర్పారు. గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు.

### ఇంటిపై పెట్రోల్ బాంబు దాడి

**టీనగర్, న్యూస్‌టుడే:** సేలం జిల్లా అంబాసముద్రం మున్సిపాలిటీ ముడప్పుళం గ్రామంలో శనివారం రాత్రి కొందరు యువకులు బహిరంగ ప్రదేశంలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఆ సమయంలో రవిచంద్రన్ అనే వ్యక్తి ఇంటి వద్ద టపాసులు పేల్చి స్థానికులకు నిద్ర లేకుండా చేశారు. దీనిపై రవిచంద్రన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు యువకులను మందలించారు. కాసేపటికి గుర్తు తెలియని వ్యక్తులు రవిచంద్రన్ ఇంటిపై పెట్రోబాంబు విసిరి పారిపోయారు. రవిచంద్రన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### తిరువణ్ణామలై ఆలయ హుండీలో చోరీ

**తిరువణ్ణామలై, న్యూస్‌టుడే:** తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి బంగారు ధ్వజస్తంభం వద్ద ఉన్న హుండీలో చెయ్యి పెట్టి కానుకలు కాజేశాడు. గమనించిన ఆలయ సిబ్బంది అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దర్యాప్తులో అతను తిరువారూర్ జిల్లా మేళతిరుపతికున్నం గ్రామానికి చెందిన శబరినాథన్ (40)గా తెలిపింది. అతను దొంగిలించిన రూ.5వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

### హత్యాయత్నం కేసులో ఐదుగురికి 14ఏళ్ల జైలుశిక్ష

**వేళచ్చేరి, న్యూస్‌టుడే:** మైలాడుదురై జిల్లా పెరంబూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అగరకీరంగుడి గ్రామానికి చెందిన అరసు(71) 2019 జులై 28వ తేదీ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అడ్డగించిన కొందరు వ్యక్తులు మద్యం తాగాలని అరసును బలవంతం చేశారు. అతను నిరాకరించడంతో గొడవపడి మద్యం సీసా పగులగొట్టి హత్యాయత్నం చేశారు. గాయపడిన అరసు పెరంబూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి కనివణ్ణన్, ఆనంద్ కుమార్, శరవణకుమార్, కార్తి, జగదీష్‌లను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ మైలాడుదురై జిల్లా కోర్టులో ఉంది. పోలీసులు అభియోగపత్రాలను దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం విచారణ ముగిసింది. నేరం రుజువు కావడంతో ఐదుగురికి 14ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

### పుళల్ జైల్లో గంజాయి స్వాధీనం

**రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే:** తిరువళ్లూరు జిల్లా పుళల్ కేంద్ర కారాగారంలో పోలీసులు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మత్తుపదార్థాలు తరలిస్తూ చెన్నై ట్రిప్లికేన్ పోలీసులకు పట్టుబడి జైల్లో ఉంటున్న కార్తిక్ అనే ఖైదీ సెల్ నుంచి 60 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పుళల్ పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గంజాయి విక్రేతలు ఇద్దరిపై గూండా చట్టం నమోదు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** కరూర్ వెంగంబేడు శ్మశానం ప్రాంతంలో గత నెల 20వ తేదీ గంజాయి విక్రయించిన తిరుప్పూర్‌కి చెందిన మనోజ్ అలియాస్ మాండో మనోజ్(25), జోగిందర్(24)ను అరెస్టు చేసిన పోలీసులు జైలుకు పంపారు. ఈ ఇద్దరిపై కరూర్, నామక్కల్ జిల్లాలలోని పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులు పెండింగ్‌లో ఉన్నందున గూండా చట్టం కింద చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఫెరోజ్‌ఖాన్ అబ్దుల్లా కలెక్టర్ తంగవేల్‌కి సిఫారసు చేశారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఇద్దరిపై శనివారం గూండా చట్టం నమోదు చేసి తిరుచ్చి జైలుకు తరలించారు.

### మహిళా పోలీసుపై ఖైదీ దాడి

**సైదాపేట, న్యూస్‌టుడే:** చెన్నై పుళల్ మహిళా జైలులో మహిళా పోలీసు సరస్వతి ముఖంపై నార్కొటిక్స్ కేసులో అరెస్టయిన నైజీరియాకు చెందిన మోనికా అనే మహిళా ఖైదీ శనివారం దాడి చేసింది. ఆమెపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. జైలు గది నుంచి బయటకు వచ్చేందుకు యత్నించి మహిళా పోలీసులతో గొడవపడి దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.

## హత్య కేసులో యువకుడి అరెస్టు

**మహాబలిపురం, న్యూస్‌టుడే:** చెంగల్పట్టు జిల్లా చెయ్యూర్ సమీపం అమ్మనూర్ గ్రామానికి చెందిన సుభాష్ (25) ఇంటికి సమీప బంధువైన అదే ప్రాంతానికి చెందిన సురేందర్(27) శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత వెళ్లాడు. సుభాష్‌ను నిద్ర లేపి ద్విచక్ర వాహనం తీసుకొని చెయ్యూర్ బయలుదేరారు. వాహనాన్ని సుభాష్ నడిపాడు. అమ్మనూర్ వద్ద వెళుతుండగా సురేందర్ తన వద్ద ఉన్న కత్తితో సుభాష్ మెడపై పొడిచాడు. అదుపుతప్పిన వాహనం కిందపడింది. సుభాష్ రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. తరువాత సురేందర్ తన ఇంటికి వెళ్లి పోయాడు. సుభాష్ తిరిగి రాకపోవడంతో అతని తల్లిదండ్రులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఆత్తికుట్టై రోడ్డులో సుభాష్ హత్యకు గురై పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరువాత సురేందర్‌ను అరెస్టుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

### వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడు...

అరెస్టయిన ముత్తుకృష్ణన్

**సైదాపేట:** కోయంబత్తూరు జిల్లా పుదూరు ప్రాంతానికి చెందిన సామువేల్‌రాజ్ (75) ఇంట్లో 10 సవర్ల బంగారు నగలు, రూ.5 వేల నగదు చోరీకి గురయ్యాయి. అలాగే సుండా ముత్తూరు ప్రాంతానికి చెందిన సతీష్ (30) కిరాణా దుకాణంలో ఈనెల 10న రూ.34 వేల నగదు చోరీ జరిగింది. అదేవిధంగా కునియముత్తూరు ప్రాంతంలోని పలు దుకాణాలు, ఇళ్లలో ఇలాగే చోరీలు జరిగాయి. మంకీ క్యాప్ ధరించిన దొంగ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం చెన్నైకి చెందిన ముత్తుకృష్ణన్ (36)ని అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను కోయంబత్తూరు గణపతి చతుర్వేది ప్రాంతంలో ఉంటూ చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. అతని నుంచి 30 గ్రాముల బంగారం, రూ.14 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

### పోక్సో కేసులో ఉపాధ్యాయుడు...

**టీనగర్:** సేలం జిల్లా ఓమలూరు సమీపం కాడయాంబట్టికి చెందిన పంచాయతీ యూనియన్ మాధ్యమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థినులతో ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ప్రధానోపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుడు తంగవేల్ (45)ను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

### కన్నబిడ్డలను చిత్రహింసలు పెడుతున్న తల్లి...

**పొన్నేరి:** తిరువళ్లూరు జిల్లా పొన్నేరికి చెందిన సంధ్య రెండ్రోజుల క్రితం తన ఇద్దరు పిల్లలకు వాతలు పెట్టింది. చుట్టుపక్కల వారు పిల్లలను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇందుకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంధ్య ఇదివరకు ఇద్దరు వ్యక్తులను పెళ్లి చేసుకుందని, మొదటి భర్తకు ఇద్దరు పిల్లలు పుట్టారని తెలిసింది. తాజాగా ఆమె మూడో భర్తతో కాపురం చేస్తోందని, కుటుంబ కలహాలతో మొదటి భర్తకు పుట్టిన ఇద్దరు పిల్లలకు వాతలు పెట్టి చిత్రహింసలు పెట్టినట్లు తేలింది. దీంతో ఆమెను ఆదివారం అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మూడో భర్త కోసం గాలిస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

## సర్వదర్శనానికి 16 గంటలు

**తిరుమల, న్యూస్‌టుడే:** వారాంతపు సెలవులు రావడంతో భక్తుల రద్దీ తిరుమలకు భారీగా పెరిగింది. సర్వదర్శనం భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-1, నారాయణగిరి షెడ్లు నిండిపోయి రింగురోడ్డు వరకు దాదాపు రెండు కిలోమీటర్లు క్యూలైన్‌లలో వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 16 గంటలు, రూ.300 టికెట్ల భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని అత్యధికంగా 92,221 మంది దర్శించుకున్నారు. రూ.3.51 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

## శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం

ఆలయంలో జీయంగార్లతో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు

**తిరుమల, న్యూస్‌టుడే:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం శ్రీపెద్దజీయర్ నేతృత్వంలో చాతుర్మాస దీక్షా సంకల్పం ప్రారంభమైంది. పెద్దజీయర్ స్వామి మఠంలో కలశస్థాపన, కలశపూజ, విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సేకరించిన పుట్టమన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం పెద్దజీయర్ స్వామి తిరుమల బేడి ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న జీయంగారి మఠం వద్ద నుంచి చిన్నజీయంగారు, ఇతర శిష్యబృందంతో బయల్దేరారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి పుష్కరిణి, శ్రీవరాహస్వామి బాలాలయాన్ని సందర్శించారు. అక్కడి నుంచి మంగళ వాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు. శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత మేల్‌ఛాట్, నూలు ఛాట్ వస్త్రాన్ని బహూకరించారు. అనంతరం పెద్దజీయర్ మఠంలో ఛైర్మన్, ఈవో, అదనపు ఈవోలను వారు సన్మానించారు.

# నాలుగువేల ప్రతుల్లో.. చెవిరెడ్డి అవినీతి చిట్టా

- తుడా అక్రమాలపై విచారణ పూర్తి
- సిట్ నివేదిక ప్రభుత్వానికి అందజేత

**తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే:** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణ కొలిక్కి వచ్చింది. 2024 డిసెంబరు 24న విచారణ ప్రారంభించి ఏడు నెలల అనంతరం ఇటీవలే పూర్తిచేశారు. నాలుగువేల ప్రతులతో కూడిన ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు.

### విచారణ జరిగిన అంశాలివే..

- తుడా ఛైర్మన్‌గా వ్యవహరించిన చెవిరెడ్డి జీవో 26 (08.02.2016), జీవో 161 (17.05.2018)లను ఉల్లంఘించడం. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు ప్రభుత్వ అభివృద్ధి పనులు చేయకూడదన్న నిబంధనలను ఉల్లంఘించి కుటుంబ సభ్యులకు చెందిన సీఎంఆర్ ఇన్‌ఫ్రా ద్వారా రూ.కోట్ల విలువైన పనులుచేయడం. మూడునెలల వ్యవధిలోనే ఆ సంస్థ క్లాస్‌-3 నుంచి క్లాస్‌-1 గుత్తేదారుగా ఎదగడం.
- తుడాకు నాలుగైదు వాహనాలు ఉండగా అదనంగా ప్రైవేటు వాహనాలు, వాటికి డీజిల్ వినియోగించడం. ఉద్దేశపూర్వకంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఇంటింటి సర్వే చేపట్టడం, విమాన ఛార్జీలకు తుడాను వినియోగించడం
- 31 మంది విశ్రాంత ఉద్యోగులను, ఐదుగురు ప్రైవేటు వ్యక్తుల్ని నియమించుకోవడం.
- జాతీయ హరిత ట్రైబ్యునల్ నిబంధనలు ఉల్లంఘించి తుమ్మలగుంట చెరువును ధ్వంసం చేయడం. జలవనరుల శాఖ అనుమతి లేకుండా, కోచ్‌లు, సిబ్బంది లేకుండా పార్కులు, స్టేడియాలు నిర్మించడం, వాటిని గ్రామ పంచాయతీకి అప్పగించడం.
- కె.వి.బి.పురం మండలంలో కుటుంబ సభ్యులకు చెందిన ఆస్తులున్న ప్రాంతంలో రోడ్డు నిర్మించడం.
- ప్రభుత్వ అనుమతి లేకుండా కేవలం పాలక మండలి తీర్మానం సాకుతో చంద్రగిరి నియోజకవర్గంలోని ఎంపీడీవోల ఖాతాలకు ప్రతిపాదనలే లేకుండా నిధులు మళ్లించడం.
- చంద్రగిరి నియోజకవర్గంలో అనధికారికంగా ఎంపీడీవోలతో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించడం, యూసీలు లేకుండా బిల్లులు మంజూరు చేయడం, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీల వివరాలు తుడాకు సమాచారం లేకుండా వినియోగించడం.

### అంశాల వారీగా నిధుల ఖర్చు (రూ.కోట్లలో)

- ఎంపీడీవోల ఖాతాలకు మళ్లించిన నిధులు: 230.03
- తుమ్మలగుంట చెరువు కోసం చేసిన వ్యయం: 60
- 19 వేల బెంచీల కొనుగోలుకు : 23
- వైద్య శిబిరాల నిర్వహణకు: 5.29
- విమాన ఛార్జీలు: 0.59 వాహనాల కొనుగోలు: 1.85
- కొవిడ్ శిబిరాలకు: 2.18 ఇంధనం: 2.50
- తుడా ఇంజినీరింగ్ అధికారుల వ్యయం: 105
- మొక్కల పంపిణీ, పచ్చదనం పెంపు: 15కోట్లు

# మన్నవరం.. వెన్ను విరిగింది

- ఎన్బీపీపీఎల్ పరిశ్రమకు తాళాలు
- ఏపీఐఐసీకి అప్పగింతకు సన్నాహాలు

మన్నవరంలోని విద్యుత్తు ఉపకరణాల పరిశ్రమ ప్రవేశ ద్వారం

**శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే :** 'ఐదువేల మందికి ప్రత్యక్ష ఉపాధి.. పాతిక వేల మందికి పరోక్షంగా ఉపాధి.. వందలాది కుటీర పరిశ్రమల' ఏర్పాటు లక్ష్యంగా మన్నవరం విద్యుత్తు ఉపకరణాల పరిశ్రమ ఏర్పాటుకు ప్రారంభంలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. పరిశ్రమ ప్రారంభ సమయంలో ఎన్బీపీపీఎల్ ప్రతినిధులు, జాతీయ స్థాయి అధికారులతో కళకళలాడగా ఇప్పుడు బోసిపోయింది. చివరకు భద్రతా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను తొలగించి భారీ పరిశ్రమకు తాళాలు వేసి వదిలి పెట్టేశారు. పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన భూములను ప్రభుత్వం ప్రస్తుతం ఏపీఐఐసీకి అప్పగించేందుకు సన్నాహాలు చేస్తోంది.

### భూములు వెనక్కి ఎప్పుడో..?

ఇక్కడి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం 750 ఎకరాల భూములను ఎకరా రూ.100 వంతున ఎన్బీపీపీఎల్ సంస్థకు అప్పగించింది. పరిశ్రమ ఏర్పాటుకు నిర్మించుకున్న భవనాలు వంద ఎకరాలు మినహాయించి 650 ఎకరాలు వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వం సంసిద్ధమైంది. కలెక్టర్ వెంకటేశ్వర్ నివేదిక మేరకు ఇక్కడ వెనక్కి తీసుకునే 650 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయి కొత్త పరిశ్రమలు వస్తే ఈ ప్రాంతం బాగుపడుతుందని సమీప గ్రామస్థులు ఆశలు పెంచుకున్నారు.

### కలగానే.. ఎన్బీపీపీఎల్ ఏర్పాటు

విద్యుత్తు ఉత్పాదకంలో దిగ్గజ సంస్థలైన ఎన్టీపీసీ-భెల్ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిందే ఎన్బీపీపీఎల్ విద్యుత్తు ఉపకరణాల పరిశ్రమ. 2010 సెప్టెంబరు ఒకటో తేదీన అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ దీనికి భూమి పూజ చేశారు. రూ.6 వేల కోట్లు అంచనాలో రూ.1200 కోట్ల ఖర్చుతో మౌలిక వసతులు, యంత్రాలు ఏర్పాటు చేసి 2015లో ఉత్పత్తులు ప్రారంభించారు. ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ విధానంలో విద్యుత్తు ఉత్పాదనకు అవసరమైన బొగ్గు-బూడిద నిర్వహణ పరికరాల తయారీ, టర్బైన్లు, జనరేటర్లు, బాయిలర్లు తయారీ ఈ పరిశ్రమ లక్ష్యం. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం నేపథ్యంలో దిగ్గజ సంస్థల అంచనాలన్నీ తలకిందులయ్యాయి. చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ లేకపోవడంతో ఈ సంస్థ ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. ఇన్నాళ్లూ కొంత మేర అధికారులు వచ్చి వెళ్లేవారు. ప్రస్తుతం భారీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు తాళాలు వేసేశారు. కనీసం భద్రతా సిబ్బంది ఉండటం లేదు.

# మత్తులో బండెక్కితే మృత్యువును ఆహ్వానించినట్లే..!

- 20% ప్రమాదాల్లో వారే..

● **ప్రమాద ఘటనలు ఇలా..** రెండునెలల కిందట ఇరవై ఏళ్ల యువకుడు ద్విచక్ర వాహనంతో గరుడ వారధిపై ప్రయాణిస్తూ పక్కగోడను ఢీకొట్టి గోడపై ఎగిరిపడి అటూఇటూ వేలాడుతూ మృత్యువాత పడ్డారు. నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారిలోని వకుళమాత సమీప కూడలి వద్ద ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ముందున్న లారీని వేగంగా ఢీకొన్నారు. స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో అతిగా మద్యం తాగి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ఇద్దరూ తనువు చాలించారు.

**కేసుల నమోదు ఇలా..**

| ఏడాది | 2024 | 2025 |
|---|---|---|
| డ్రంకన్ డ్రైవ్ | 1080 | 1896 |
| బహిరంగ మద్యపానం | 21,883 | 11,289 |

**తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే:** ప్రమాదాల్లో మద్యం, గంజాయి మత్తులో వాహనాలు నడిపేవారే ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ముందెళ్తున్న వాహనాలను ఢీకొట్టడం.. వేగాన్ని అదుపు చేయలేక డివైడర్‌ను తాకడం.. చెట్లను ఢీకొట్టడం, డ్రైనేజీ కాలువల్లో పడిపోవడంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

### జైలుకు పంపుతున్నా..

ప్రమాద మృతుల్లో సరాసరి 20 శాతం మంది మత్తుపదార్థాలు తీసుకుని వాహనాలు నడపడంతోనే జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. జాతీయ రహదారులతో పాటు ఇతర రోడ్లలో మద్యం, గంజాయి మత్తులో శిరస్త్రాణం ధరించకుండా ప్రమాదాలబారిన పడుతున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. తాగి బండెక్కితే వాహనాన్ని స్వాధీనం చేసుకుని మరుసటి రోజు కోర్టులో ప్రవేశపెడుతున్నారు. రూ.10,000 జరిమానా విధించి మరోసారి పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. నగరంలో గతేడాది డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 82 మందికి జైలు శిక్ష విధించగా ప్రస్తుతం 11 మందికి శిక్ష వేశారు.

# స్వర్ణముఖికి.. పొర్లు గండం

చిగురుపాడు వద్ద ఇసుక కోసం తీసిన గాడి

**నాయుడుపేట, న్యూస్‌టుడే:** స్వర్ణముఖి పొర్లుకట్టలను ఎక్కడికక్కడ ధ్వంసం చేస్తున్నారు. ఇసుక తరలింపు కోసం తీసిన గండ్లు యథావిధిగా ఉండటం, వర్షాకాలం సమీపిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో స్వర్ణముఖినది పాకాల నుంచి వాకాడు వరకు ప్రవహిస్తోంది. భారీ వరదల సమయంలో పొలాలు, గ్రామాల మీదకు వరద ప్రవహించడంతో రైతులు, స్థానికులు తీవ్రంగా నష్టపోయేవారు. దీనికి పరిష్కారంగా 2016-18 మధ్య కోట నుంచి పెళ్లకూరు మండలం కలవకూరు వరకు ఇరువైపులా పొర్లుకట్టలు రూ.220 కోట్లతో నిర్మించారు. నదిలోకి వాహనాలు దిగకుండా, వరద నీరు వెలుపలకు రాకుండా ఏడడుగుల ఎత్తులో వాటిని నిర్మించారు.

### నేతల అండదండలు

నేతలకు పెట్టుబడిలేని ఆదాయ మార్గం కావడంతో రేవులు దగ్గర ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ఇసుక తరలింపునకు తెరతీశారు. అధికారులు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారు.

అన్నమేడు రోడ్డు సమీపంలో కట్ట తొలగించి రోడ్డు ఏర్పాటు

### దెబ్బతిన్న ప్రాంతాలు

కోట మండలంలో గూడలి, చిట్టమూరు మండలం మెట్టు, గునపాటిపాళెం, నాయుడుపేట మండలం అన్నమేడు, మర్లపల్లి, అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం, తుమ్మూరు, తిమ్మాజీకండ్రిగ, చిగురుపాడు, చిగురుపాడు అగ్రహారం, భీమవరం ఓజిలి మండలం జోష్యులవారికండ్రిగ, పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు, దిగువచావాలి, కప్పగుంట కండ్రిగ, పెళ్లకూరు రాణితోట, కలవకూరు, పుల్లూరు, చింతపూడి గ్రామాల దగ్గర కట్టలకు భారీగా గాడులు తీశారు.

● ఈ విషయమై డీఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా నదికి తీసిన గాడులు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రేక్షకులకు.. నవరసాల కోటా

శ్రీవారిని దర్శించుకుని బయటకు వస్తున్న కోటా (పాత చిత్రం)

**తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే:** అనేక వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించి.. నవరసాలు పలికించి చివరకు అందనంత లోకాలకు తరలివెళ్లిన కోటా శ్రీనివాసరావుకు జిల్లాతో విడదీయని బంధం ఉంది. శ్రీవారిని ఆయన పలుసార్లు దర్శించుకున్నారు. తలకోన, భీమవరం, తిరుపతి ఎన్జీవోకాలనీ తదితర ప్రాంతాల్లో జరిగిన చిత్రీకరణల్లో విలక్షణ నటుడు రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. బొబ్బిలి రాజా చిత్రం కోసం వారంరోజుల పాటు తలకోనలోనే ఉన్నారు. చిత్తూరు మాజీ ఎంపీ డా.శివప్రసాద్, మాజీమంత్రి ఆర్కే రోజాతో కలిసి అనేక చిత్రాల్లో నటించి మెప్పించారు.

# లక్ష్యాలు దాటి.. లక్షణమైన ఉపాధులు

**తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే:** ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్న మహిళలకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. స్వశక్తితో ఎదిగి ప్రగతి పథంలో పయనించే మహిళలను వెన్నుతట్టి ప్రోత్సహించేలా విరివిగా రుణాలు అందిస్తోంది. 2025-26లో 32,100 మందికి రూ.320 కోట్ల స్త్రీనిధి రుణాలు ఇవ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది 65% ఎక్కువ. గత ప్రభుత్వం కేవలం ఎన్నికల ఏడాదిలోనే అధిక రుణాలు ఇవ్వగా ప్రస్తుత పాలనలో మొదటి ఏడాది నుంచే లక్ష్యానికి మించి రుణాలు మంజూరు చేస్తున్నారు. సభ్యురాలు మరణిస్తే రుణ మొత్తాన్ని మాఫీ చేస్తారు. రుణాలతో పాడి పశువులు, కోళ్ల పెంపకం, వ్యాపారం, ఇతర కుటీర పరిశ్రమలు నిర్వహించుకునేలా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను నిర్దేశించింది. మరికొందరు పిల్లల ఉన్నత చదువులకు రుణాలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

సభ్యులతో సమావేశమైన డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

**రుణాల సద్వినియోగం ఇలా.. (రూ.కోట్లలో)**

| ఏడాది | సభ్యులు | రుణాలు |
|---|---|---|
| 2024-25 | 32,859 | 206.15 |
| 2023-24 | 28,937 | 167.29 |
| 2022-23 | 25,652 | 129.34 |
| 2021-22 | 25,908 | 129.95 |
| 2020-21 | 21,107 | 106.66 |
| 2019-20 | 17,834 | 86.06 |

● **సాధికారత సాధించాలనే..** మహిళల సాధికారత సాధించాలనే సంకల్పంతో ఈ ఏడాది రూ.320 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 5,418 మంది సభ్యులకు రూ.38.5 కోట్లు అందించాం.

\- శోభన్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ

## రోగాలకు.. పచ్చ తివాచీ

తిరుపతి నుంచి తిరుచానూరుకు వెళ్లే మార్గంలో వృథానీటితో వ్యాధుల ముప్పు పొంచి ఉంది. జాతీయ రహదారి పరిధిలోని ఓవర్ బ్రిడ్జి వద్ద ఖాళీ స్థలంలోకి పెద్దఎత్తున నీరుచేరి పచ్చగా మారి చివరకు దోమల ఉత్పత్తి కేంద్రంగా తయారైంది. స్థానికులు ఇది చూసి.. ఇలాగైతే రోగాలు రమ్మంటే రావా అంటూ వాపోతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. - ఈనాడు, తిరుపతి

## టన్ను రూ.7500కు పెరిగిన తోతాపురి

బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వచ్చిన తోతాపురి కాయలు

**బంగారుపాళ్యం, న్యూస్‌టుడే:** స్థానిక మార్కెట్ యార్డు, ర్యాంపుల వద్ద తోతాపురి మామిడి కాయలు ఆదివారం టన్ను రూ. 7500 ధర పలికాయి. వ్యాపారులు ఆశించిన మేర సరకు రాకపోవడంతో డిమాండు పెరిగి మంచి ధర వచ్చింది. నాలుగు రోజులుగా టన్ను రూ. 6000 ధర పలికింది. అయితే రోజురోజుకు కాయలకు డిమాండు పెరగడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు తెలిపారు. ఆదివారం బంగారుపాళ్యం మార్కెట్‌యార్డు, ర్యాంపుల వద్దకు సుమారు 200 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయని మండీవ్యాపారులు తెలిపారు. పెరిగిన ధరలతో రైతులు ఊరట చెందుతున్నారు.

## పోలీసుల అదుపులో దోపిడీ దొంగలు

**చిత్తూరు క్రైం, న్యూస్‌టుడే:** సిద్ధంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో జూన్ 26న చామ్‌రాజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు దోపిడీకి పాల్పడ్డ ముగ్గురు నిందితులని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిగ్నల్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేసి ఆగిన రైలులో దోపిడీకి పాల్పడ్డ విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఎస్7, ఎస్10 బోగీల్లో మొత్తం నలుగురి వద్ద సుమారు 70 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడి పరారయ్యారు. రైల్వే పోలీసులకు అందిన పక్కా సమాచారం ఆధారంగా ముఠాలో 10 మందికి పైగానే సభ్యులున్నట్లు ధ్రువీకరించారు. అందులో ప్రధానంగా కర్ణాటకకు చెందిన ఓ నిందితుడు, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

## 907 మందితో జాబితా

**వేంపల్లె, న్యూస్‌టుడే:** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు రెండో విడత ప్రవేశాల కోసం ఎంపికైన 907 మంది విద్యార్థుల జాబితాను ఆదివారం విడుదల చేశారు. మొదటి విడతలో మిగిలిన 628 ఖాళీలతోపాటు దివ్యాంగుల కోటా 179, సైనికోద్యోగుల పిల్లల కోటా 80, స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 20 సీట్లకు అర్హులను ఎంపిక చేసి వెబ్‌సైట్‌లో ఉంచారు.


సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635



ఆకస్మిక మరణం

కీ॥శే॥ ఇరికి రమాబాయి గారు
భర్త లేట్ ఇరికి క్రిష్ణారెడ్డి గారు
రిటైర్డ్ పి.పి. అడ్వకేట్, కర్నాల వీధి, తిరుపతి

మీరు మాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలు, మా భవిష్యత్తుకు అహర్నిశలు శ్రమించిన మా ఇంటి దైవం, మా అమ్మగారైన కీ॥శే॥ ఇరికి రమాబాయి 13.07.2025వ తేది ఆదివారం ఉ॥ 7.45 గం॥లకు స్వర్గస్తులైనారు.
తదుపరి దహనక్రియలు 14.07.2025 సోమవారం ఉ॥ 9.30 గం॥లకు శ్రీనివాసపురం తిరుచానూరు రోడ్ నుండి అంతిమయాత్ర బయలుదేరి కరకంబాడి రోడ్డులోని గోవింద ధామం నందు జరుగునని తెలియజేయడమైనది.
శోకతప్త హృదయాలతో...

కుమారులు: డా॥ ఇ.వి.సుబ్బారెడ్డి, M.D, Dermatology, KADAPA
ఇ. చంద్రమౌళి, AUDITOR, CHENNAI
ఇ. ప్రతాప్, E.D-APIIC, MANGALAGIRI
మరియు కుటుంబ సభ్యులు


(c) eenadu

## అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం ఎదుట జస్టిస్ కృష్ణమోహన్ దంపతులు తదితరులు

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** శ్రీపద్మావతీ అమ్మవారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఆయన సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి

## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల, న్యూస్‌టుడే:** శ్రీవారిని హైకోర్టు రిజిస్ట్రార్ కమలాకర్‌రెడ్డి, మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌ఎస్ సంజయ్‌గౌడ, మంత్రి గొట్టి రవికుమార్ ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రముఖ జ్యోతిష్యశాస్త్ర నిపుణులు మాచిరాజు వేణుగోపాల్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

▸ హైకోర్టు రిజిస్ట్రార్ కమలాకర్‌రెడ్డి కుటుంబం ▸ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు

## తిరుమల సప్తగిరుల యాత్ర

జెండా ఊపి యాత్ర ప్రారంభిస్తున్న శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి తదితరులు

**తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే:** గూడూరులోని ఆదిశంకర విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు ఆదివారం తిరుమల సప్తగిరుల పరిక్రమణ యాత్ర చేపట్టారు. ఈ యాత్రను కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి తిరుపతిలో ప్రారంభించారు. స్వామీజీ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు, భక్తిని పెంపొందించుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులు తిరుమల సప్తగిరుల యాత్రకు బయలుదేరారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే:** కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు.

## డైట్.. సమస్యలు వెయిట్

కార్వేటినగరం కళాశాల

జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో సమస్యలు తిష్ఠ వేశాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి లక్షల సంఖ్యలో డైట్ సెట్‌కు పోటీపడే వారు. డైట్‌లో సీటు వస్తే ఉపాధ్యాయ వృత్తి స్వీకరించినట్లేనని అభ్యర్థులు భావించేవారు. ఆరేళ్లుగా డీఎస్సీ నిర్వహించకపోవడంతో విద్యార్థులు డైట్ సెట్‌పై అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన జిల్లా విద్యా శిక్షణా సంస్థ తన ప్రాభవాన్ని కోల్పోతోంది. తాజాగా కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించడంతో భావి ఉపాధ్యాయులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు.

**న్యూస్‌టుడే, కార్వేటినగరం**

కార్వేటినగరానికి కిలోమీటరు దూరంలో ఆహ్లాదకర వాతావరణంలో 14 ఎకరాల సువిశాల ప్రాంతంలో 1975లో టీటీసీ ఏర్పాటు చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన వేలాదిమంది ఛాత్రోపాధ్యాయులు నేడు ఉపాధ్యాయ వృత్తిలో సేవలందిస్తున్నారు. 2000లో టీటీసీని డైట్‌గా మార్చారు. ఇక్కడి ఆహ్లాదకరమైన వాతావరణంలో శిక్షణ పొందడాన్ని వరంగా భావించేవారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనతో ఇక్కడ శిక్షణ పొందిన వారందరూ దాదాపు ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తుండటం గమనార్హం. గత ప్రభుత్వం ఏటా డీఎస్సీ నిర్వహించకపోవడం, డైట్‌పై యువత ఆసక్తి చూపకపోవడంతో ఆదరణ తగ్గుతోంది. దీనికితోడు ఇక్కడ నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది. గతేడాది డైట్‌లో 150 మంది విద్యార్థులకుగాను 48 మందే శిక్షణ పొందుతున్నారు.

### మౌలిక వసతులు లేక..

అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

డైట్‌లో మౌలిక వసతులు లేక ఛాత్రోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల(పురుషుల) వసతి గృహాలు పాడవడంతో వర్షాలకు ఉరుస్తున్నాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతోపాటు నీటి సౌకర్యం లేకపోవడంతో బహిర్భూమికి వెళ్లాలంటే దుర్వాసన వెదజల్లుతోంది. తాగునీరు వసతి గృహాల్లో లేకపోవడంతో ప్రధాన భవనం వద్దకు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి. వసతిగృహం పైకప్పు పాడై ఉండటంతో భారీ వర్షాలు కురిస్తే వర్షపునీరు గదుల్లోకి వస్తోంది.

### ఛాత్రోపాధ్యాయులకు తిప్పలు

### ప్రవేశాలు లేక వెలవెల..

డైట్‌లో తెలుగు మాధ్యమంలో 50, ఆంగ్ల మాధ్యమంలో 50, తమిళ మాధ్యమంలో 50 సీట్లు ఉన్నాయి. ప్రథమ సంవత్సరంలో 150, ద్వితీయ సంవత్సరంలో 150 మంది ఇక్కడ శిక్షణ పొందేవారు. ప్రస్తుతం ప్రథమ సంవత్సరంలో 48 మంది, ద్వితీయ సంవత్సరంలో 18 మంది మాత్రమే శిక్షణ పొందుతున్నారు.

### రెగ్యులర్ అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి

వివిధ సబ్జెక్టులకు సంబంధించి 19 మంది అధ్యాపకుల పోస్టులు అవసరం కాగా ఇద్దరు మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 17 మంది స్కూల్ అసిస్టెంట్‌లను ఎఫ్‌ఎస్‌టీసీ కింద అధ్యాపకులుగా నియమించింది. అనుభవజ్ఞులైన అధ్యాపకులు లేకపోవడంతో బోధన ప్రక్రియ కుంటుపడే ప్రమాదముంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలి.

### పూర్వ వైభవం తెస్తాం..

మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నాం. మరుగుదొడ్లు బాగుచేయిస్తాం. వసతి గృహాల్లో పంకాలు, లైట్లు ఏర్పాటు చేశాం. డైట్‌కు వెళ్లే దారి విషయమై ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. సంస్థకు పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటాం.

- దామోదరం, వైస్ ప్రిన్సిపల్, డైట్

## శ్రీవారికి పరదాలు సిద్ధం

పరదాలకు తుది మెరుగులు దిద్దుతున్న మణి

**తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే:** తిరుపతికి చెందిన భక్తుడు పరదాల మణి 27 ఏళ్లుగా శ్రీవారిపై భక్తితో ఏటా ఏడాదికి నాలుగు సార్లు శ్రీవారికి విశేష పర్వదినాల్లో పరదాలు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీన మంగళవారం తిరుమలలో శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఈ సందర్భంగా పరదాల మణి సోమవారం కాలినడకన తిరుమల చేరుకొని దేవస్థానం అధికారులకు పరదాలు, కురాళాలు అందించనున్నారు. వీటిని మంగళవారం జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అనంతరం గర్భాలయం, రాములవారి మేడ, వెండి వాకిలి, ఏకాంత సేవ జరిగే తదితర ముఖ్య ప్రదేశాల్లో అలంకరించనున్నారు. మణి ఈ పర్యాయం శ్రీవారి నేత్ర దర్శనం పరదాలతో పాటు, సిరులు కురిపించే శ్రీమహాలక్ష్మి, గజ వాహనంపై తిరునామం శంకు, చక్రాలు, పూర్ణ కుంభం, తామర పుష్పం తదితర డిజైన్లతో రూపొందించారు.

## సాధ్యం కాని హామీలతో అధికారం: పెద్దిరెడ్డి

క్యూఆర్ కోడ్ ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి తదితరులు

**పుంగనూరు, న్యూస్‌టుడే:** సాధ్యం కాని హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుంగనూరు పురపాలక, మండల వైకాపా కార్యకర్తల సమావేశాలు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. నాడు ఎన్టీ రామారావు అమలు చేసిన పథకాలు తుంగలో తొక్కిన సీఎం చంద్రబాబు.. తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లో హామీలు గుప్పించడం అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం షరా మామూలుగా మారిందన్నారు. ఈ ఎన్నికల్లో సూపర్ సిక్స్‌తో పాటు మరో 143 హామీలు ఇచ్చారన్నారు. వాటిలో ఏవేవి అమలు చేశారు..ఏవి అమలు చేయలేదని తెలుసుకోవాలని బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా క్యూఆర్ కోడ్ తెలుసుకోవచ్చని వివరించారు. సమావేశంలో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి అనీషారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, పురపాలక ఛైర్మన్ అలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్ర గ్రాప్లింగ్ పోటీలు

విజేతలతో అతిథులు

**తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే:** ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని గిరిజన భవన్‌లో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. 13 జిల్లాలకు చెందిన 250 మంది పాల్గొనగా, విజేతగా నిలిచిన 60 మంది బాలబాలికలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఒలింపియన్ మాణిక్యాలు, విశ్వం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి, ఏపీ బాల్‌బ్యాడ్మింటన్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటరావు తదితరుల చేతుల మీదుగా పతకాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు.

### 3న సీపీఐ మహాసభలు విజయవంతం చేయండి

**తిరుపతి (నగరం):** ప్రజా సమస్యలపై నిరంతరం కమ్యూనిస్టులు పోరాటాలు చేస్తున్నారని.. వచ్చేనెల 3న జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఈఎస్‌ఐ శాఖ మహాసభ నరసింహులు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ సీపీఐ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు విశ్వనాథ్, నాగభూషణం, మణి, మునికేశవులు, రాజగోపాల్, ధనలక్ష్మీ, మునెమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం



పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి, డాక్టర్ రమేష్‌నాథ్, ఇతర అతిథులు

**తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే:** పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని, పీ4 కార్యక్రమాన్ని అందరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో రిచ్ గ్లోబల్ ఫౌండేషన్ పదో వార్షికోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరు ఒకటికంటే ఎక్కువ కుటుంబాలను, సంపన్నులు గ్రామాలను దత్తత తీసుకోవాలని సూచించారు. తాను ఐదు కుటుంబాలను దత్తత తీసుకున్నానని చెప్పారు. శ్రీవాసవి ట్రస్టు వారు టీటీడీ తరఫున జిల్లాలో దాదాపు 60 గ్రామాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 131 మెగా పరిశ్రమలున్నాయని, ఇవన్నీ సమీప గ్రామాలను దత్తత తీసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.. రిచ్ గ్లోబల్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ రమేష్‌నాథ్‌ను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకుని పేదలకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రమేష్‌నాథ్ ఇటీవల శ్రీకాకుళం, విశాఖపట్నంలో తుపాను బాధితులను ఆదుకున్నారని తెలిపారు. దీంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. కళాకారుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, సినీ గేయ రచయిత అశోక్‌తేజ, రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ శ్రీహరి, ఆశాలత, ఆర్వీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రశంసా పత్రాలు

ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో భాజపా మండలాధ్యక్షుడు బాలాజీ, కరాటే మాస్టర్ విల్సన్ తదితరులు

**సత్యవేడు, న్యూస్‌టుడే:** తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ చెన్నైలో ఇటీవల జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్ అటెంప్ట్ లార్జెస్ట్ కరాటే లెసన్ (సింగిల్ వెన్యూ)లో సత్యవేడు కరాటే అకాడమీకి చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్ ఆడిటోరియంలో కరాటే మాస్టర్ కోశి, విల్సన్ చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ గోపి, సతీష్, తిరుపతి, సూర్య, జగదీష్ పాల్గొన్నారు.

**చికెన్ ధరలు**

| వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో) | |
|---|---|
| బ్రాయిలర్ (రైతు ధర) | 100 |
| రిటైల్ | 122 |
| లేయర్ | 112 |
| బ్రాయిలర్ | 177 |
| బ్రాయిలర్ స్కిన్ లెస్ | 201 |
| లేయర్ మాంసం | 190 |

## నిశీధిలో మృత్యుకేక

- బోల్తా పడిన మామిడి కాయల లారీ
- ఉపాధికి వచ్చి విగతజీవులైన కూలీలు

వారంతా కూలీలు.. రెక్కాడితేనేగానీ డొక్కాడని బడుగు జీవులు... మామిడి కాయలు తెంపడం కోసం ఊరుగాని ఊరొచ్చారు... తమను ఎక్కించుకుని వచ్చిన శకటమే మృత్యువు రూపంలో కాటేస్తుందని ఊహించలేకపోయారు.. అంతలోనే మృత్యువు వారిని ప్రమాదం రూపంలో కబళించింది. ఒక్కో కుటుంబం నుంచి తల్లీ పిల్లలందరూ కూలి పనులకు రాగా ఒకరికి ఒకరు దూరమయ్యారు. ఎవరు ఏమయ్యారో తెలియని పరిస్థితి.. హృదయ విదారకమైన ఈ ఘటన ఆదివారం రాత్రి పుల్లంపేట మండలం రెడ్డిచెరువు సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బోల్తాపడిన లారీ.. సహాయ చర్యల్లో పోలీసులు, స్థానికులు

**రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఇసుకపల్లె సమీపంలో మామిడి తోటలో కాయలు తెంపడానికి 20 మందికి పైగా కూలీలు వచ్చారు. వీరిలో రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన వారు దాదాపు 15 మందికి పైగా ఉండగా మిగతా వారంతా తిరుపతి జిల్లా వెంకటగిరి మండలానికి చెందిన యానాదులు. వీరంతా ఆదివారం తెల్లవారుజామునే మామిడి తోట వద్దకు చేరుకుని పనులు ప్రారంభించారు. లోడింగ్ పూర్తవగా రైల్వేకోడూరు మార్కెట్‌కు రాత్రి బయలుదేరారు. అరగంటలో గమ్యస్థానం చేరుకుంటామనగా రాత్రి 10 గంటల సమయంలో పుల్లంపేట మండలం రెడ్డిచెరువుపై అదుపు తప్పి లారీ బోల్తా పడింది. టాపుపై కూర్చున్న కూలీలంతా మామిడి కాయల లోడు కింద పడ్డారు. కొందరు ఎగిరి దూరంగా పడడంతో గాయాలతో బయటపడ్డారు. లారీ కింద పడిన వారిలో తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మందిని రాజంపేట ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం వారిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

### 'అంతా... అయిపోయింది సార్...

కూలి పనులకు అని వచ్చి కుటుంబాన్నే కోల్పోయా.. మాది తిరుపతి జిల్లా వెంకటగిరి కాగా కూలీగా కుటుంబంతో సహా పుల్లంపేట మండలం గొల్లపల్లికి వచ్చా. నా భార్య తులశమ్మ, కుమార్తె రాధ, కోడలు ఘటనా స్థలంలోనే చనిపోయారు. నా కొడుకు, మనమళ్లు ఏమయ్యారో తెలియదు. కుటుంబాన్నంతా కోల్పోయా' అని రాజంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీ వెంకటేశ్వర్లు కన్నీరుమున్నీరయ్యారు.

## శ్రీకాళహస్తిలో 'కొండ'ంత జనం

**శ్రీకాళహస్తి:** పంచభూత క్షేత్రాల్లో వాయులింగ క్షేత్రమైన శ్రీకాళహస్తికి కొండంత జనం తరలివచ్చారు. తిరుమలేశుని దర్శనార్థం వచ్చిన భక్తులు చాలా వరకు ఈ ఆలయ దర్శనానికి రావడంతో ఆదివారం వాయులింగేశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. భక్తుల మధ్య తోపులాటల నియంత్రణకు క్యూలైన్లను తరచూ నిలుపుదల చేస్తూ దర్శనానికి అనుమతించారు. ఆలయంలో అవసరమైన ప్రాణవాయువు అందక వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ సమయంలో వీలైనంత మేర భక్తులను బయటకు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. అలాగే భక్తుల నియంత్రణ కూడా మహాద్వారం వద్దే జరిగేలా చర్యలు చేపట్టడంతో భక్తులకు అవసరమైన గాలి అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది. ఉదయం నుంచి రాత్రి వరకు దాదాపు 28 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. 5,801 రాహు, కేతు పూజలు జరగగా, ప్రత్యేక 3,552, శీఘ్ర 5,490, అంతరాలయ ప్రవేశ దర్శన 882 టికెట్లు అమ్ముడుపోయాయి.

## జువ్వలపాళెం.. చెరువు ఆక్రమణ

చెరువులో చదును చేసిన దృశ్యం

**నాయుడుపేట, న్యూస్‌టుడే:** పట్టణంలోని జువ్వలపాళెం పెద్ద చెరువులో వారం రోజులుగా కబ్జాదారులు మకాం వేసి డోజర్లతో చెరువంతా చదును చేస్తున్నారు. ఇటీవల అన్నాచెరువును ఇదే తరహాలో ఆక్రమించి మట్టితోలి చదును చేయడం తెలిసిందే. దీనికి కొంత దూరంలోని జువ్వలపాళెం చెరువు విస్తీర్ణంపైనా కన్నేసి చదును చేస్తుండటంతో రైతులు గుర్తించి వీఆర్వోకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణదారులు తాత్కాలికంగా వెనక్కుతగ్గారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో మళ్లీ డోజర్లు ఏర్పాటు చేసి పదెకరాల్లో పొదలు తొలగించి గట్లు నిర్మించారు. జువ్వలపాళెం రెవెన్యూ పరిధి సర్వేనంబరు 95లో 245 ఎకరాలు విస్తీర్ణం కలిగిన ఈ చెరువు ద్వారా జువ్వలపాళెం, బిరదవాడ గ్రామాల పరిధిలో 800 ఎకరాలకు సాగునీటి సరఫరా జరుగుతుంది. నాయుడుపేట పట్టణానికి దగ్గరగా, 71, 16 జాతీయ రహదారుల సమీపంలో ఉండటంతో ఇక్కడి భూములకున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కబ్జాదారులు మూకుమ్మడిగా చెరువులు, పంట కాలువలు ఆక్రమించేస్తున్నారు. ఇప్పటికే జువ్వలపాళెం చెరువులో వంద ఎకరాల వరకు ఆక్రమించేశారు. మిగిలిన 145 ఎకరాలు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. దీనిపై తహసీల్దారు రాజేంద్రతో ప్రస్తావించగా ఇతరులు ప్రవేశించకుండా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**తవణంపల్లె, న్యూస్‌టుడే:** మండలంలోని తిరుపతి-బెంగళూరు ఆరు వరుసల జాతీయ రహదారిలో నత్తపుచేను వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. పాకాల మండలం దామలచెరువుకు చెందిన చిన్నమునెయ్య కుమారుడు చంద్రమౌలి (34) సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో తవణంపల్లెకు వచ్చి తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన గోవర్ధన్ కారులో గోల్డెన్ టెంపుల్‌కు వెళుతుండగా రోడ్డు క్రాసింగ్ ఉండటంతో కారు వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. చంద్రమౌలి అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుదాఘతంతో బాలుడి మృతి

**రేణిగుంట, న్యూస్‌టుడే:** విద్యుత్ షాక్‌తో బాలుడు మృతిచెందిన ఘటన గాజులమండ్యం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తూకివాకం పంచాయతీ వినాయకపురం గ్రామ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌లో అసోం రాష్ట్రానికి చెందిన కొందరు పని చేస్తున్నారు. వీరు ఈ యార్డ్‌కు సమీపంలోని తాత్కాలిక షెడ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఆదివారం కావడంతో బాలుడు ఆడుకుంటుండగా సమీపంలో ఉన్న తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. గాజులమండ్యం ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## స్నేహితుడి.. విషాదాంతం

మనోజ్‌కృష్ణ (పాతచిత్రం)

**తొట్టంబేడు, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తి పట్టణ సమీపంలో రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ముందు వెళ్తున్న లారీని కారు అధిగమించే క్రమంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు. . తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామానికి చెందిన మనోజ్‌కృష్ణ మరో నలుగురు స్నేహితులతో కలిసి శనివారం రాత్రి కారులో తిరుమల దర్శనార్థం బయలుదేరారు. శ్రీకాళహస్తి స్వర్ణముఖి నది వంతెనపై ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు ఎడమవైపు ముందు భాగంలో కూర్చున్న మనోజ్‌కృష్ణ(24) ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. స్నేహితులు బాలసాయి, అభిలాష్, పవన్, అజయ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. మృతుడు మనోజ్‌కృష్ణ తూర్పు కనుపూరుకు చెందిన రాజేంద్ర, రామసుబ్బమ్మల చిన్న కుమారుడు. అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తిచేసి ఇంటి వద్ద తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడుగా ఉంటున్నారు. స్నేహితులతో కలిసి కోటకు వెళ్లి వస్తానంటూ ఇంట్లో చెప్పిన మనోజ్‌కృష్ణ తిరుమల వెళ్తుండగా మార్గమధ్యంలో ఈ ఘటన జరిగింది. మృతదేహాన్ని ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

## మమ్మల్ని.. అనాథలను చేశావు కదరా

- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు
- బొక్కసంపాళెంలో విషాద ఛాయలు

**న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి, ఏర్పేడు:** భర్తను పోగొట్టుకున్నా.. కన్న కూతురు, అల్లుడు నన్ను వదలి వెళ్లారు. చివరకు అండగా ఉంటూ వచ్చిన నువ్వు కూడా దూరమయ్యావా మనవడా అంటూ శ్రీనివాసులు అమ్మమ్మ రాజేశ్వరమ్మ కన్నీటి పర్యంతం అయ్యారు. కానరాని లోకాలకు వెళ్లిన అమ్మానాన్నలను నీలో చూసుకుంటూ వస్తుండగా నన్ను వదలి వెళ్లిపోయావా అంటూ సోదరి కీర్తి రోదనలతో ఆదివారం బొక్కసంపాళెం గ్రామంలో విషాదం నెలకొంది. కోట వినుత దంపతుల చేతిలో హత్యకు గురైన శ్రీనివాసులు మృతదేహాన్ని ఆదివారం అతని స్వగ్రామం బొక్కసంపాళెం తీసుకురాగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు పెద్దఎత్తున కంటతడి పెట్టారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

**మమ్మల్ని ఆదుకోవాలి :** జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తమను ఆదుకోవాలంటూ శ్రీనివాసులు సోదరి కీర్తి ఆవేదనతో కోరారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో అందరితో ఎంతో అన్యోన్యంగా ఉండే అన్నయ్య శ్రీనివాసులు తనకంటే జనసేన పార్టీ నేత కోట వినుత దంపతులకు ఎక్కువ గౌరవం ఇచ్చేవాడని తెలిపారు. రోజులతరబడి వారింట్లోనే ఉంటూ వారికి సేవలందించిన అతన్ని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసి హత్య చేయడం సరికాదన్నారు. హత్య జరిగాక తమను ప్రలోభపెట్టేందుకు వినుత దంపతులు యత్నించినట్లు ఆమె వివరించారు. అయినా తాము లొంగలేదన్నారు. ఏదైనా తప్పు జరిగి ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలే తప్ప చంపేయడం సరికాదని, ఈ అంశాన్ని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. పార్టీ తమకు న్యాయం చేయాలని కోరారు.

శ్రీనివాసులు మృతదేహం వద్ద విలపిస్తున్న అమ్మమ్మ రాజేశ్వరమ్మ, చెల్లెలు కీర్తి

EENADU Classifieds
HEALTH & CARE
TO LET
REAL ESTATE
JOBS
PLOT FOR SALE
GENERAL
TOURS AND TRAVELS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వృత్తిపరాలు
80085 13290
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

# తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

## ఎస్వీయూలో ఎంపీ బైరెడ్డి శబరి

**తిరుపతి(ఎస్వీయూ), న్యూస్‌టుడే:** నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తిరుమల పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఆదివారం ఎస్వీ యూనివర్సిటీ ఆవరణలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె వర్సిటీ ఆవరణలో ఒక మొక్క నాటారు. వర్సిటీ టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కర్ణుని జనన ఘట్టం

**రామచంద్రాపురం, న్యూస్‌టుడే:** సి.రామాపురంలో జరుగుతున్న శ్రీద్రౌపది సమేత శ్రీధర్మరాజుల వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రేక్షకులకు భాగవతారిని అనసూయ వివరించిన కర్ణుని జనన ఘట్టం ఆకట్టుకుంది. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నియామకం: తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే:** భాజపా కాలూరు మండల కన్వీనర్‌గా జయప్రకాశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం గ్రామీణ మండలంలోని శ్రీనాథ్ దామలంలో భాజపా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా నాయకుడు నవీన్ మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాలూరు మండల కన్వీనర్‌గా జయప్రకాశ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు పురుషోత్తం నాయుడు, మురళి, కేవీఎల్ నాయుడు, హేమాద్రినాయుడు, వేణుగోపాల్, చంగల్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి: 80085 74561
పాకాల : 80085 74563

**తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య:** బస్టాండు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో నగరపాలిక ఏర్పాటు చేసిన స్టెయిన్‌లెస్ స్టీల్ చెత్తకుండీలు నిండిపోయాయి. ఫుట్‌పాత్‌లు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ఈ కుండీల పరిసరాల్లో వ్యర్థాలు ఎక్కువగా పడుతున్నాయి. **- జగదీష్, ప్రయాణికుడు**

**సమస్య:** రేణిగుంట రోడ్డులోని గరుడ వారధి కింది ప్రాంతాల్లో అపరిశుభ్రత ఎక్కువగా ఉంటోంది. డివైడర్ మధ్యలో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరి అందవిహీనంగా మారింది. **- దయాకర్, తెలుగునగర్**

**సమాధానం:** సంబంధిత ప్రాంత శానిటరీ ఇన్‌స్పెక్టరును ఆదేశించి సమస్య పరిష్కరిస్తాం. చెత్త కుండీలను శుభ్రం చేయిస్తాం. **- యువ అన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక**

**తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: సమస్య:** తుమ్మలగుంట నెలండా నగర్‌లో రోడ్డు పక్కన స్థానికులు వ్యర్థాలు వేస్తున్నారు. **- సోమశేఖర్, స్థానికుడు**

**సమాధానం:** సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కార చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి**

### మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు

**తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే:** గాందీపురం పంచాయతీ దనలక్ష్మీనగర్‌లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక ఉన్న వీధిలో మ్యాన్‌హోల్ మూత పగిలిపోయింది. దీనిపై ఈనాడులో మేమున్నాం మీకు తోడుగా శీర్షికన వార్త వెలువడింది. స్పందించిన పంచాయతీ సర్పంచి లక్ష్మి మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు చేశారు.

## కనులపండువగా శ్రీపద్మావతీదేవి కల్యాణం

**తిరుచానూరు:** తిరుచానూరులోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో ఆదివారం శ్రీపద్మావతీదేవి కల్యాణం కనులపండువగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన కేసీ దాస్ సేవా సంస్థ, సనాతన ధర్మవారధి సంయుక్త ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం శ్రీనివాసుడు, శ్రీపద్మావతీ అమ్మవారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. నిర్వాహకులు శ్రీరామచంద్ర ప్రమూర్తి, రాధాకృష్ణయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## బంగారు తిరుచ్చిపై శ్రీహరి

**చంద్రగిరి, న్యూస్‌టుడే:** శ్రీకల్యాణవెంకటేశ్వరస్వామి ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా బంగారు తిరుచ్చిపై మాడవీధుల్లో సంచరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణానక్షత్రం పురస్కరించుకుని మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అర్జిత కల్యాణ మహోత్సవం చేపట్టారు.

## హోమ్‌స్టేలుగా నివాస గృహాలు

- నేరాలకు నిలయాలుగా మారిన వైనం
- పట్టించుకోని ప్రభుత్వ శాఖలు

నగర శివారు ప్రాంతాల్లోని భవనాలు, గృహాలు హోమ్‌స్టేలుగా మారుతున్నాయి. ఆదరణ, ఆదాయం ఉండటంతో భవనాన్ని అద్దెకు తీసుకుని హోమ్‌స్టే బోర్డులు పెట్టేస్తున్నారు. ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల వేదికగా యాత్రికులను ఆకర్షిస్తు గదులు అద్దెకు ఇస్తున్నారు. నివాస గృహాలు హోమ్‌స్టేలుగా మారుతుంటే వ్యాపారపరమైన పన్నులు వసూలు చేయాల్సిన నగరపాలక సంస్థ.. జీఎస్టీ పన్నులు చెల్లింపు సక్రమంగా జరుగుతుందా చూడాల్సిన వాణిజ్య పన్నుల విభాగం.. హోమ్‌స్టేలు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా నిత్యం పర్యవేక్షించాల్సిన పోలీసు శాఖల నిర్లక్ష్యం వల్ల పుట్టగొడుగుల్లా హోమ్‌స్టేలు వెలుస్తున్నాయి. నేరాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

హోమ్‌స్టేలోని సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు

**●ఇరుకు వీధుల్లోనూ:** నగరంలోని చిన్నచిన్న వీధుల్లోని నివాస గృహాలను హోమ్‌స్టేలుగా మార్చుతున్నారు. వాటికి ఎలా అనుమతులు ఇస్తున్నారోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారి వల్ల ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. పక్కనే నివాసం ఉండే ప్రజలు ఈ సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాణిజ్య పన్నుల విభాగం నుంచి జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకోవడం లేదు. జీవీఎంసీ సంబంధిత అధికారులు అనుమతులు ఇవ్వకున్నా కూడా జీఎస్టీ అనుమతులు తీసుకోలేదు. కొద్దిపాటి లోసుగులతో అందరూ జీఎస్టీని ఎగ్గొడుతున్నారు.

**●పరిశీలన తప్ప నిఘా ఏదీ..:** జిల్లాలో సుమారు 400 హోమ్‌స్టేలు అధికార, అనధికారంగా వెలిశాయి. పోలీసులు అప్పుడప్పుడు హోమ్‌స్టేలను తనిఖీ చేస్తున్నారు గానీ.. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా జరిగితే పోలీసులు వెళ్లి పరిశీలించడం తప్ప పూర్తిస్థాయిలో నిఘా పెట్టడం లేదు. ప్రతి హోమ్‌స్టేలో సీసీ కెమెరాలు తప్పక అమర్చుకోవాలి. వాటిని సక్రమంగా నిర్వహించాలి. గదులు కావాల్సిన వారి ఫొటో గుర్తింపు ఆధారాలు సేకరించి.. ఎందు నిమిత్తం వచ్చారో వివరాలతో రికార్డు కొనసాగించాలి.

**●యాప్ నిర్వహణ ఎప్పుడో:** నగరంలోని హోమ్‌స్టేల నిర్వహణ.. నిఘా నిమిత్తం ఓ యాప్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన పోలీసుశాఖ ఇంకా జాప్యం చేస్తోంది. మొదట ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసి ఆ తర్వాత నగర, శివారు ప్రాంతాల్లోని హోమ్‌స్టేలకు యాప్ సేవలను విస్తరించాలని భావించింది. రెండు నెలలు అవుతున్నా అమలులో ఆలస్యం అవుతోంది.

**న్యూస్‌టుడే, తిరుపతి(నేరవిభాగం)**

## అలరించిన భరతనాట్య ప్రదర్శన

**తిరుపతి (నగరం), న్యూస్‌టుడే:** తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఆదివారం తిరుపతికి చెందిన శ్రీనాట్యాలయ బృందం నాట్య ప్రదర్శన జరిగింది. పలు కీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఏవో సూర్యతేజ, నృత్య గురువు ఉమాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

**తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే:** మహతి కళాక్షేత్రంలో ఆదివారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవం స్వామి వారసుల్లో ఏడో తరానికి చెందిన వీరంభట్ల స్వామి, ఆయన సతీమణి చేతుల మీదుగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు నాగరత్నంరెడ్డి, ఉమాపతి, గిరిబాబు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి తదితరులు

## సీపీఎం నేతకు పరామర్శ

**తిరుపతి (నగరం), న్యూస్‌టుడే:** సీపీఎం నేత కందారపు మురళిని ఆదివారం ప్రముఖ సినీ గేయ రచయిత డా. సుద్దాల అశోక్‌తేజ దంపతులు పరామర్శించారు. రెండు రోజుల క్రితం కందారపు మురళి తల్లి రాజమ్మ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఆయన తిరుపతి చేరుకుని కందారపు మురళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సుద్దాల నిర్మల, ధర్మయ్య, మల్లారపు నాగార్జున, వేణుగోపాల్ తదితరులున్నారు.

మురళి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సుద్దాల అశోక్‌తేజ

## ఆధ్యాత్మికత పెంపే లక్ష్యం

**చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే:** ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించడమే తమ లక్ష్యమని తిరుపతి శ్రీమంత్రరాజపీఠం పీఠాధిపతి సింహయాజిస్వామి అన్నారు. ఆదివారం తిరుమల సప్తగిరుల యాత్రలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డలోని శ్రీకొల్లాపురమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పీఠాధిపతి సింహయాజిస్వామి తదితరులు

## సత్యసాయి ప్రేమ ప్రవాహిని యాత్ర

**ముత్యాలరెడ్డిపల్లి, న్యూస్‌టుడే:** సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రేమ వాహిని యాత్రను ముత్యాలరెడ్డిపల్లిలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైకుంఠపురం నుంచి యాత్ర ప్రారంభించారు. సత్యసాయి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు అమరనాథ్ మాట్లాడుతూ పుట్టపర్తి నుంచి పంపిన ఐదు రథాలతో భారతదేశం అంతటా ప్రేమ వాహిని యాత్ర సాగుతోందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 19 జిల్లాల్లో యాత్ర పూర్తయిందని తెలిపారు. ప్రస్తుతం తిరుపతిలో యాత్ర జరుగుతోందన్నారు. తిరుపతి సత్యసాయి సేవా సంఘం కన్వీనర్ లోకాద్రినాయుడు, శ్రీధర్, మురళి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పల్లిలో సాగుతున్న యాత్ర

## ఫుట్‌బాల్ టోర్నీలో సత్తా

**తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే:** ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర విభాగంలో జిల్లా జట్టు మూడో స్థానం సాధించింది. రాజమహేంద్రవరం వేదికగా జరిగిన పోటీల్లో విశాఖపట్నం, కాకినాడ జిల్లాలను ఓడించి సెమీఫైనల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా కోచ్‌లు వినోద్, రమేష్‌లను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డప్ప అభినందించారు.

మూడో స్థానంలో నిలిచిన జిల్లా క్రీడాకారులు

స్వామి మూలవిరాట్‌పై క్లాప్ కొడుతున్న భీమాస్ అశోక్ తదితరులు

## వెబ్ సిరీస్ షూటింగ్ ప్రారంభం

**తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే:** కేఎమ్ఆర్ ప్రొడక్షన్ పతాకంపై జేనిక్ ఫిల్మ్ ఫ్యాక్టరీ సహకారంతో నిర్మిస్తున్న 'రాజా..!' ఆట మొదలైంది వెబ్ సిరీస్ షూటింగ్ తిరుపతిలో ప్రారంభమైంది. తెల్లిపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భీమాస్ హోటల్స్ అధినేత భీమాస్ అశోక్ దేవుడి మూలవిరాట్టుపై క్లాప్ కొట్టి ప్రారంభించారు. మన దేశంలో పురాతన శిల్ప సంపదని విదేశీయులు తరలించకుండా జాగ్రత్తగా కాపాడాలనే కథాంశంతో రూపొందిస్తున్న సస్పెన్స్ కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో తిరుపతి పరిసర ప్రాంతంలో చిత్రీకరణ జరుగుతుందని దర్శకుడు క్రిస్టోఫర్ కిరణ్ తెలిపారు. హీరోగా సాయి మోక్షిత్‌రెడ్డి, హీరోయిన్‌గా యశస్విని తదితరులు నటిస్తున్నట్లు తెలిపారు. నిర్మాత కె.హరిబాబురెడ్డి, ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## గుంతలమయమై.. రాళ్లు తేలి

చంద్రగిరి మండలం శివగిరి కాలనీ వద్ద దుర్గసముద్రం వైపు రహదారి రాళ్లు తేలి.. గుంతలమయమై అధ్వానంగా ఉంది. వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. నిత్యం లోడుతో వెళ్తున్న భారీ వాహనాల రాకపోకలతో ఈ దుస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. **-ఈనాడు, తిరుపతి**

## ప్రమాదకరంగా వాలిన బ్యానర్

తిరుపతి ఎంఆర్‌పల్లి పోలీసుస్టేషన్ వద్ద అవిలాల కూడలిలో స్తంభానికి ఏర్పాటు చేసిన ప్రచార బ్యానర్ రహదారిలోకి వాలిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. కూడలిలో ద్విచక్ర వాహనచోదకులు, వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఏదైనా అనుకోని సంఘటన జరగకముందే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **-ఈనాడు, తిరుపతి**

## వ్యర్థాలిలా.. మురుగు పారేదెలా?

తిరుపతి-రేణిగుంట మార్గం పూలవానిగుంట వద్ద పరమాచార్య శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఉన్న మురుగు నీటి కాలువలో మురుగునీరు పారకుండా వ్యర్థాలు పేరుకుపోయాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షించి కాలువలో వ్యర్థాలు తొలగించే ఏర్పాటు చేసి మురుగునీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-ఈనాడు, తిరుపతి**

## పగలూ హైమాస్ట్ వెలుగులు

వకుళమాత ఆలయం ఆర్చి వద్ద జాతీయ రహదారి కూడలిలో పగటి పూట హైమాస్ట్ దీపాలు వెలుగుతున్నాయి. పగలూరాత్రి వెలగడం వల్ల విద్యుత్తు బిల్లులు ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. ఎండకు లైట్లు మరమ్మతుకు గురయ్యే అవకాశం ఉంది. ఆర్చి నుంచి ఆలయానికి వచ్చే ప్రధాన రహదారిలోనూ విద్యుత్తు దీపాలు పగటి పూట వెలుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పగటి పూట లైట్లు ఆఫ్ చేయాల్సి ఉంది.

**-న్యూస్‌టుడే, తిరుపతి(గ్రామీణ)**

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

**చంద్రగిరి, న్యూస్‌టుడే:** గ్రామ స్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జనసైనికులు ఇప్పట్నించే శ్రమించాలని నియోజకవర్గ జనసేన బాధ్యుడు దేవర మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నేతలు, ముఖ్యనాయకులు, మండల నాయకులతో రౌండ్‌టేబుల్, మండలాల వారిగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు.

సమావేశంలో నియోజకవర్గ బాధ్యుడు దేవర మనోహర్, నాయకులు

## తుప్పు పట్టిన వాహనాల తరలింపు

**తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే:** ముత్యాలరెడ్డిపల్లిలోని జడ్పీ అతిథి గృహం వద్ద ఉన్న డీఎల్‌పీవో కార్యాలయం వద్ద కొన్ని సంవత్సరాలుగా పంచాయతీరాజ్ శాఖకు చెందిన మరమ్మతుకు గురైన వాహనాలున్నాయి. వీటిని మరమ్మతు చేయకుండా అలాగే వదిలేశారు. ఇవి సంవత్సరాలుగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ శిథిలావస్థకు చేరాయి. ఈ వాహనాలు పాములకు ఆవాసాలుగా మారాయి. కార్యాలయంలోకి పాములు వచ్చే ప్రమాదం ఉందని సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో డీఎల్‌పీవో సురేష్‌నాయుడు తుప్పు పట్టిన వాహనాలను అక్కడ నుంచి వేరే చోటకు క్రేన్ సాయంతో తరలించారు. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తుప్పు పట్టిన వాహనాలను వేలం వేసినా ఎంతో కొంత ఆదాయం వస్తుంది.

## మహాప్రస్థానం నిర్మాణానికి ముందుకొచ్చిన సైనికోద్యోగులు

**చంద్రగిరి, న్యూస్‌టుడే:** స్వర్ణముఖినది ఒడ్డున శరవేగంగా నిర్మిస్తున్న మహాప్రస్థానం నిర్మాణానికి మేము సైతం అంటూ మండలంలోని విశ్రాంత సైనికోద్యోగులు ముందుకొచ్చారు. పట్టణంలోని విశ్రాంత సైనిక ఉద్యోగుల ఆహ్వానం మేరకు మహాప్రస్థానం కమిటీ సభ్యులు హాజరయ్యారు. విశ్రాంత సైనిక ఉద్యోగుల భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సైనిక ఉద్యోగుల సలహాలను మహాప్రస్థానం కమిటీ స్వీకరించింది. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ వీరంగారి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెదేపాతోనే అమరావతి నిర్మాణం సాధ్యం

**రామచంద్రాపురం, న్యూస్‌టుడే:** తెదేపాతోనే అమరావతి నిర్మాణం సాధ్యమని తెదేపా మండల ఉపాధ్యక్షుడు తానికొండ మోహన మురళి నాయుడు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలమనాయుడు కండ్రిగ పంచాయతీలో తెదేపా నాయకులు పర్యటించారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ పంచారు.

## ఉచిత వైద్య పరీక్షలు

**పాకాల, న్యూస్‌టుడే:** పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ సహకారంతో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. తిరుపతికి చెందిన మాధురి రెమిడీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 206 మంది ఎముకలు, కీళ్లు, నరాలు, దంతాలు, యూరాలజీ సమస్యల బాధితులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. 30 మందిని చికిత్సకు ఎంపిక చేశారు. వాసన్ ఐకేర్ ఆసుపత్రి వారితో 148 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి 20 మందిని కాటరాక్ట్ శస్త్రచికిత్సకు ఎంపికచేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కేవీన్ తులసీరామన్, ప్రతినిధులు కుప్పస్వామినాయుడు, రామయ్య, జయరామనాయుడు, ఆర్వీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నరకప్రాయంగా రహదారులు

- రోడ్డు పక్కనే చెత్త కుప్పలు
- ఇబ్బందుల్లో స్థానికులు

**తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే:** మండలంలోని సి. మల్లవరం గ్రామంలో వీధులు అధ్వానంగా ఉన్నాయి. గ్రామంలో సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. దశాబ్దమున్నరకు ముందు నిర్మించిన సిమెంట్ రోడ్లు శిథిలావస్థకు చేరాయి. జాతీయ రహదారికి పక్కనే ఈ గ్రామం ఉంది. ఈ నేపథ్యంలో పలమనేరు నుంచి, చంద్రగిరి నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు గ్రామంలో నుంచి వచ్చి జాతీయ రహదారిలోకి వెళుతున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు మరమ్మతుకు గురైంది.

వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో గ్రామంలో సుమారు పది అంతర్గత రోడ్లు ఉండగా నాలుగు వీధులకు మాత్రమే కొత్తగా సిమెంట్ రోడ్లు వేశారు. గ్రామంలో లోపల అంతర్గతంగా ఉన్న రోడ్లు కంకరతేలి, గుంతల మయంగా మారాయి. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు వీధుల్లో రాకపోకలు సాగించాలంటే ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి వెలుపల సిమెంట్ రోడ్లు వేశారు. ప్రధానంగా ప్రజలు రాకపోకలు సాగించే చోట సిమెంట్ రోడ్లు వేయలేదని స్థానికులు వాపోతున్నారు. కొందరు ఇళ్లలోని వృథా నీటిని వీధిలోకి వదిలేస్తున్నారు. ఈ కారణంగా రోడ్లలో నీళ్లు నిలిచి గుంతలు పడిపోయాయి. చిన్న పాటి వర్షం వచ్చినా వీధుల్లో నీళ్లు నిలిచి వీధులు బురదమయంగా మారుతున్నాయి. సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కంకర తేలిన రహదారి

### వ్యర్థాల కాల్చివేతతో అవస్థలు..

గ్రామంలో నుంచి జాతీయ రహదారికి వచ్చే ప్రధాన రహదారి పక్కనే స్థానికులు వ్యర్థాలు వేస్తున్నారు. వీటిని పారిశుద్ధ్య సిబ్బంది తొలగించడం లేదు. ఇవి కుప్పలుగా పేరుకుపోతున్నాయి. గత నెలలో 'ఈనాడు'లో వార్త వెలువడగా సిబ్బంది తొలగించారు. మళ్లీ స్థానికులు వ్యర్థాలు వేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు చేసి వీటిని తొలగించాల్సి ఉన్నా, ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో రోడ్డుపక్కన వేస్తున్న వ్యర్థాలను కాల్చేస్తున్నారు. గాలి వచ్చినప్పుడు కాలిన వ్యర్థాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సిబ్బందికి సూచనలు చేసి వ్యర్థాలు కాల్చకుండా తొలగించాల్సి ఉంది.

## దుకాణం ముందు మూత్ర విసర్జన..
## అడిగినందుకు దాడి

**తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:** మత్తులో మద్యం దుకాణం ముందు మూత్ర విసర్జన చేస్తుంటే.. అడిగిన సర్వర్‌పై బీరు సీసాతో దాడి చేసిన ఘటన తిరుపతిలో చోటు చేసుకుంది. తిరుపతి తూర్పు ఎస్‌ఐ గిరిబాబు వివరాల మేరకు.. 'పుత్తూరుకు చెందిన మురళి తిరుమలలో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తిరుమల నుంచి శనివారం తిరుపతి జయశ్యామ్ థియేటర్ వద్ద ఉన్న ఓ మందు దుకాణం వద్దకు వచ్చి మద్యం కొనుగోలు చేశాడు. స్నేహితులతో కలిసి సమీపంలో మద్యం తాగాడు. ఆ మత్తులో మద్యం దుకాణం ముందుకొచ్చి మూత్ర విసర్జన చేస్తుండగా.. అక్కడ సర్వర్‌గా పనిచేస్తున్న వెంకటరమణ ప్రశ్నించారు. 'నేను ఎవరో తెలుసుకోకుండా అడుగుతావా.. పుత్తూరులో మురళి అంటే ఏందో ఎవరిని అడిగినా చెబుతారంటూ' గొడవకు దిగాడు. అక్కడితో ఆగక అక్కడున్న బీరు బాటిల్ చివర అంచును పగలగొట్టి సర్వర్ మెడపై దాడి చేశాడు. గాయపడ్డ వెంకటరమణను రుయా ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో ఉన్న మురళిని స్టేషన్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న'ట్లు ఎస్‌ఐ తెలిపారు.

## మామిడి కాయల లారీ బోల్తా

**తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే:** మండలంలోని పేరూరు చెరువు కాలువలో మామిడి కాయల లోడుతో వెళుతున్న లారీ బోల్తాపడిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. చిత్తూరు నుంచి మినీ లారీలో మామిడికాయలను గుంటూరుకు తరలిస్తున్నారు. లారీ డ్రైవర్ కునుకు తీయడంతో జాతీయ రహదారి నుంచి దూసుకెళ్లి పేరూరు చెరువుకు స్వర్ణముఖి నుంచి నీళ్లు వచ్చే కాలువలో బోల్తాపడింది. వాహనంలో ఉన్న ముగ్గురికి గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు.

## సింగిల్‌విండో ఛైర్మన్‌కు సన్మానం

**రామచంద్రాపురం, న్యూస్‌టుడే:** మండల సింగిల్ విండో ఛైర్మన్ చేకూరి జనార్దన్ చౌదరితో పాటు 1982-1983 బ్యాచ్ పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయ ఆవరణలో ఆయన్ని ఘనంగా సన్మానించారు.

## దివ్యాంగుల కేంద్రానికి
## నిత్యావసరాల పంపిణీ

**తిరుపతి (నగరం), న్యూస్‌టుడే:** స్థానిక పద్మావతిపురంలోని పాస్ మానసిక ప్రతిభావంతుల కేంద్రానికి ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి నెలా రెండో ఆదివారం అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు సురేంద్రరెడ్డి, సభ్యులు లీలాప్రకాష్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న ఈతకొలను

లీలామహల్- కరకంబాడి మార్గంలో వినాయకసాగర్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఈత కొలను ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈతకు సంబంధించిన క్రీడా చిత్రాలను ఇటీవల కళాకారులు ఆకట్టుకునేలా చిత్రీకరించారు. పిల్లలకు, పెద్దలకు వేరువేరుగా ఈత కొలనులు ఏర్పాటు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నీటిశుద్ధి యంత్రాల సాయంతో 17.50 లక్షల లీటర్ల నీటిని నింపి పరీక్షలు చేసి సిద్ధంగా ఉంచారు. డైవింగ్‌బోర్డు, స్టేషన్ గ్యాలరీ ఆకట్టుకుంటున్నాయి. **-ఈనాడు, తిరుపతి**

(c) eenadu

# శ్రీకాళహస్తి
• శ్రీకాళహస్తి • సత్యవేడు

## వేడుకగా ఉదయ కస్తూరమ్మ జాతర

విశేషాలంకరణలో ఉదయ కస్తూరమ్మ

**నాగలాపురం, న్యూస్‌టుడే:** నాగలాపురం గ్రామదేవత ఉదయ కస్తూరమ్మ జాతరను ఆదివారం వేడుకగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం విశేషాభిషేకాలు చేసి సుందరంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారిని మద్రాసు కూడలి వద్ద పీఠంపై ఆసీనులను చేసి విశేషాలంకరణతో గ్రామ వీధుల్లో వేడుకగా ఊరేగించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన విద్యుద్దీపాలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## ఘనంగా ఆడి పొంగళ్ల మహోత్సవం

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** పట్టణంలోని పిట్టల వారి వీధిలో కొలువైన గంగమ్మ ఆలయంలో ఆడి పొంగళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి నివేదనలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు.

## ప్రహరీ నిర్మించాలి

**తొట్టంబేడు, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహ సముదాయానికి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆదివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు.

## ఎమ్మెల్యేపై ఆరోపణలు తగదు

**రేణిగుంట, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై జనసేన నియోజకవర్గ మాజీ ఇంఛార్జి కోట వినుత, ఆమె భర్త కోట చంద్రబాబు నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు మునిచంద్రశేఖర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు మహబుబ్‌బాషా ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. కోట వినుత, ఆమె భర్త చంద్రబాబుతో పాటు మరో ముగ్గురిపై ఆమె డ్రైవర్ రాయుడును హత్య చేశారన్న ఆరోపణలతో చెన్నై పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తీసుకెళ్లే సమయంలో తమ తప్పేమీ లేదని, ఇదంతా కావాలనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేశారని ఆరోపించడం పద్ధతి కాదన్నారు. వారిపై నేరారోపణ వచ్చినప్పుడు దాన్ని నిరూపించుకోవాలే తప్ప ఇతరులపై నిందలు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలా చేస్తే ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని తెలిపారు.

## సమగ్ర దర్యాప్తు జరపాలి

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** జనసేన కార్యకర్త శ్రీనివాసులు హత్య కేసుకు సంబంధించి కూటమి ప్రభుత్వం సమగ్రమైన దర్యాప్తు జరపాలంటూ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు కోరారు. ఆదివారం బొక్కసంపాళెం గ్రామంలో శ్రీనివాసులు మృతదేహానికి నివాళులు అర్పించి శ్రీనివాసులు చెల్లెలు కీర్తి, అమ్మమ్మ రాజేశ్వరిలను పరామర్శించారు. కాగా శ్రీనివాసులు హత్యకు సంబంధించి న్యాయ విచారణ జరిపించాలంటూ సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి జనసేన పార్టీ అండగా నిలవాలని కోరారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం

ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** అనాథలు, దివ్యాంగులకు ఆసరాగా సేవలందిస్తున్న హెల్పింగ్ సంస్థ సేవలు ప్రశంసనీయమని ముస్లిం మతగురువు జనాబ్ ముఫ్తీ సహీం సాహెబ్ అన్నారు. స్థానిక చిల్డ్రన్స్ ప్యాన్సీ స్టోర్ వద్ద ఆదివారం నిత్యావసర సరకుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన ముస్లిం మతగురువు సంస్థ చేస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మునీర్‌బాషా, సభ్యులు రమేష్‌బాబు, రాజేశ్వరరావు, ఉదయ్, బాబా ఫరీద్, షరీఫ్, కలాం తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు కల్పించాలి

పాదయాత్రలో పాల్గొన్న వారిని సత్కరిస్తున్న బలిజ సంఘం ప్రతినిధులు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** బలిజ కులస్థులకు గతంలో ఉన్న రిజర్వేషన్లను తిరిగి పునరుద్ధరించాలంటూ స్థానిక బలిజ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆదివారం స్థానిక శ్రీహరి కల్యాణ మండపంలో చిత్తూరు నుంచి అమరావతికి పాదయాత్రగా వెళ్తున్న రాఘవయ్య, వెంకట్రామయ్య, ప్రసాద్‌లను సంఘం సభ్యులు సత్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిద్దులుగారి ప్రసాద్, అంజూరు శ్రీనివాసులు, ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణయ్య, నవీన్‌కుమార్‌లు ప్రసంగించారు.

# పేదోళ్లకు పెళ్లిళ్ల కష్టాలు

● రూ.లక్షలు అద్దెలు.. ● కల్యాణ మండపాల్లేక తప్పని ఇక్కట్లు

ఊరందూరు గ్రామానికి వెళ్లే మార్గంలో తితిదే నిర్మించిన కల్యాణ మండపం

**న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి:** ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నట్లు.. పేదలు, మధ్యతరగతి ఇళ్లల్లో వివాహాల నిర్వహణ కష్టతరంగా మారుతోంది. ప్రత్యేకించి తక్కువ అద్దెలతో కల్యాణ మండపాలు అందుబాటులో లేకపోవడం, రూ.లక్షలు వ్యయం చేసి ప్రైవేటు మండపాల్లో చేసే ఆర్థిక స్థోమతలేక సామాన్యులు చిన్నపాటి ఆలయాలు, మందిరాల్లో వివాహాలు జరిపించుకోవాల్సి వస్తోంది.

### ముక్కంటి.. కష్టాలు కనవేంటీ

ముక్కంటి ఆలయానికి సమీపంలో ఉంటూ వచ్చిన తితిదే కల్యాణ మండపం పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఆసరాగా ఉండేది. అభివృద్ధి పనుల నేపథ్యంలో దానిని తొలగించాల్సి వచ్చింది. ఇక ముక్కంటి ఆలయానికి అనుబంధంగా శ్రీ ప్రసన్న వరదరాజస్వామి ఆలయం, ముత్యాలమ్మ ఆలయాల్లో కల్యాణ మండపాలు ఏర్పాటు చేశారు. జీర్ణోద్ధరణ పనులతో వరదరాజస్వామి ఆలయ ఆవరణలో ఉన్నదాన్ని కూలదోశారు. ఇక ముత్యాలమ్మ ఆలయంలో తరచూ ట్రాఫిక్ సమస్య. కల్యాణం మండపం సమావేశాలకు తప్ప వివాహాది శుభ కార్యాల నిర్వహణకు కష్టతరంగా మారడంతో నిరుపయోగమవుతోంది. ఉన్న మండపాలు అన్నింటినీ తొలగించడం, నిరుపయోగం కావడంతో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. శ్రీకాళహస్తి పట్టణం నుంచి ఊరందూరుకు వెళ్లే మార్గంలో తితిదే రూ.3.50 కోట్లతో కల్యాణ మండపాన్ని నిర్మించారు. పనులు పూర్తయినా ఏళ్లుగా ప్రారంభించేందుకు ముహూర్తం కుదరకపోవడం గమనార్హం. ఇలా ప్రారంభం కాని ఇక్కడి కల్యాణ మండపం అసాంఘిక కార్యక్రమాలతో పాటు చుట్టుపక్కల ఉన్న భవన నిర్మాణ యజమానులు యంత్రాలు భద్రపరుచుకుంటున్నారు. దీంతో ప్రారంభం కాకనే ఈ భవనాలు శిథిలమైపోయే పరిస్థితి ఏర్పడుతోంది.

అనధికారికంగా భవన నిర్మాణ యంత్రాలు దాచుకుంటున్న వైనం

### నిద్దరోతున్న తితిదే

ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్నవి తొలగించుకుంటూ వెళ్తుంటే.. తితిదే మాత్రం నిర్మాణం పూర్తైనా అందుబాటులోకి తీసుకురావడంలో ఏళ్లు గడిచి పోతున్నాయి. పనులు పూర్తయి కూడా ప్రారంభించేందుకు మీనమేషాలు వేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడి అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారడమే కాకుండా భవన నిర్మాణ యజమానులు యంత్రాలను భద్రపరుచుకుంటున్నారు.

### ప్రత్యామ్నాయంపై శ్రద్ధ అవసరం

గ్రామీణ ప్రాంత వాసులే కాకుండా ఇక్కడున్న సామాన్య, మధ్య తరగతి కుటుంబీకులు ఏదైనా ఆలయాలకు అనుబంధంగా ఉన్న కల్యాణ మండపాల్లో వేడుకలు నిర్వహించాలని ఆశ పడుతారు. అలాంటి వసతులు ఇక్కడి క్షేత్రంలో లేకపోయాయి. ఉన్న కల్యాణ మండపాలను తొలగించిన అధికారులు ప్రత్యామ్నాయంగా కైలాసస దన్, గంగాసదన్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు చేపడితే పేదలకు అందుబాటులో ఉంటుంది. అధికారులు, పాలకులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

**సత్యవేడు, న్యూస్‌టుడే:** సమస్య: ఆరూరు గ్రామంలో వీధి దీపాలు వెలగడంలేదు. రాత్రుల్లో వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. రాత్రిల్లో కుక్కల సైర్వవిహారం చేస్తున్నాయి. **- గణేష్, స్థానికుడు**

సమాధానం: రెండు, మూడు రోజుల్లో వీధి లైట్లు అమర్చుతాం. కుక్కల బెడద లేకుండా చర్యలు చేపడుతాం.
**- హరీష్, పంచాయతీ కార్యదర్శి**

**నారాయణవనం, న్యూస్‌టుడే:** సమస్య: చిత్తూరు కండ్రిగ ఏఏడబ్ల్యూలో నిత్యం వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. త్వరగా వీధి దీపాలు మరమ్మతుకు గురవుతున్నాయి. **- నాగరాజు, స్థానికుడు**

సమాధానం: వీధి దీపాలకు నియంత్రికలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **- మురళి, సర్పంచి**

## వరవ కాలువలకు మోక్షం

**ఏర్పేడు:** ఏర్పేడు మండల కేంద్రంగా ఉన్న వరవ కాలువలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఏర్పేడు నడిబొడ్డున బజారు కూడలి కాలువతో పాటు ఇక్కడ పలు వరవ కాలువలను ఏళ్ల తరబడిగా అభివృద్ధి పట్టించుకోక పూడిక చేరింది. దానికి తోడు స్థానికులు కాలువను ఆక్రమించుకోవడంతో కనుమరుగై వర్షాకాలంలో వరదనీరు గ్రామాన్ని ముంచెత్తుతోంది. దీనిపై 'ఈనాడు'లో ఆదివారం 'మురుగు పారక.. సమస్య తీరక' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రూ.18 లక్షలతో మండల కేంద్రంగా ఉన్న వరవ కాలువల అభివృద్ధికి పనులు ప్రారంభించారు. అలాగే ఇక్కడ మిగిలిన కాలువల అభివృద్ధి పనులను త్వరలోనే చేపట్టనున్నట్లు వివరించారు.

కొట్టకాడులో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

## ప్రజాసేవకే జీవితం అంకితం

**నాగలాపురం, న్యూస్‌టుడే:** తాను జీవించి ఉన్నంతకాలం తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండలంలోని కొట్టకాడులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కుట్రలు, కుతంత్రాలకు దూరంగా ఉండే తనపై కోవర్టు నేతలు పన్నిన పన్నాగానికి భగవంతుడే వారిని శిక్షిస్తాడన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో కుల, మత, వర్గ, పార్టీల కతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ప్రేమ సెల్వకుమార్, మాజీ ఎంపీపీ మురళి, మాజీ వైస్‌ఎంపీపీ అన్బయగన్‌అన్బు, నేతలు ప్రభాకర్, ఏలుమల్లై, జ్యోతి, లక్ష్మణ్, నారాయణ, మణి పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్

కమలాకర్‌రెడ్డితో స్థానిక న్యాయమూర్తులు, ఆలయ అధికారులు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడిషియల్) కమలాకర్‌రెడ్డి వాయులింగేశ్వరుని దర్శనార్థం ఆదివారం వచ్చారు. కుటుంబ సభ్యులతో వచ్చిన వీరికి స్థానిక 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసనాయక్ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆలయం ఏఈవో మోహన్ స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## దోషపూజలు చేయించిన బైరెడ్డి శబరి దంపతులు

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దంపతులతో ఆలయ అధికారులు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దంపతులు శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహు, కేతు సర్పదోష నివారణ పూజలను చేయించారు. కుటుంబ సభ్యులతో వచ్చిన వీరికి ఆదివారం ఆలయ అధికారులు, కూటమి పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శనం పూర్తయ్యాక తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న యువశ్రీ మురళి

## యువశ్రీ మురళికి సత్కారం

**బిఎన్ కండ్రిగ, న్యూస్‌టుడే:** తెలుగు భాషా అభివృద్ధికి కృషి చేసిన యువశ్రీ మురళికి సత్కారం లభించింది. కర్నూలు వేదికగా శని, ఆదివారం రెండు రోజుల పాటు జరిగిన తెలుగు భాషా పరిరక్షణ సదస్సులో తిరుపతి జిల్లా ప్రతినిధిగా యువశ్రీ మురళి పాల్గొన్నారు. మాజీ మంత్రి టి.జి.వెంకటేష్ తెలుగు తల్లి జ్ఞాపికను అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చంద్రశేఖర్ కల్కూర, శర్మ, పార్వతిదేవి, ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా మురుగు కాలువ

**రేణిగుంట, న్యూస్‌టుడే:** రేణిగుంట పంచాయతీలోని బస్టాండ్ నుంచి చెక్‌పోస్టుకు వెళ్లే ప్రధాన మార్గంలో వేణుగోపాలపురం వద్ద కాలువ అస్తవ్యస్తంగా ఉంది. ఇక్కడ కాలువలకు రూపురేఖలు లేకపోవడంతో మురుగునీరు ఎలా పడితే అలా పారుతోంది. దీంతో ఈ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతుంది. పంచాయతీ వారికి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన పంచాయతీ వారు పట్టించుకోని పరిష్కరించాలని కోరారు. ఈ అంశంపై ఈవోపీఆర్‌డీ ప్రభురావు మాట్లాడుతూ వెంటనే శుభ్రత చర్యలు చేయిస్తామని తెలిపారు.

## పూజలు అడ్డుకున్న భద్రతా సిబ్బంది

నదీ తీరంలో అనధికారికంగా పూజలకు చేపట్టిన ఏర్పాట్లు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** సువర్ణముఖి నదీ తీరంలో అనధికారికంగా పూజలు నిర్వహిస్తున్న వారిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. సన్నిధివీధిలోని జలవినాయకుని ఆలయం సమీపంలో సువర్ణముఖి నదిలో స్థానికేతర భక్తులు ఆదివారం అనధికారికంగా పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. పూజలు ప్రారంభించే సమయంలో ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందింది. వెంటనే వారు అక్కడకు వెళ్లి వాటిని నిలుపుదల చేయించారు. పూజలు చేయించేందుకు వచ్చిన అతనికి రూ.300, భక్తులకు రూ.వెయ్యి వంతున జరిమానా వేసి ఆ మొత్తాన్ని నిత్యాన్నదాన పథకానికి కట్టించారు. ఇకపై నదీ తీర ప్రాంతంలో ఎలాంటి పూజలు చేయరాదని హెచ్చరించి పంపారు.

**పేదల అభ్యున్నతి లక్ష్యం.. శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** పేదల సంక్షేమం ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పలు పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని మిన్నల రవి, బాలాజీరెడ్డిలు సంయుక్తంగా అన్నారు. పట్టణంలోని 5వ వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. ● కూటమి ప్రభుత్వం పేదల అభ్యున్నతికి లక్ష్యంగా చేసుకుందని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ అన్నారు. పట్టణంలోని మంచినీళ్ల గుంట పరిసర ప్రాంతాల్లో తెదేపా ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ● పట్టణంలోని 20వ వార్డులో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన దేవరాజు కుటుంబానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచనల మేరకు రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సుమతమ్మ, రఫీ, దనయుడు, సునీత, శివకుమార్, మీర్జా, సంపత్‌లు పాల్గొన్నారు.

**ప్రతి వారం హాజరుకావాలి.. రేణిగుంట, న్యూస్‌టుడే:** రౌడీ షీటర్లు, సస్పెక్ట్ వ్యక్తులు ప్రతి వారం హాజరు కావాలని పట్టణ సీఐ జయచంద్ర తెలిపారు. ఆదివారం పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సక్రమమైన పద్ధతిలో జీవనం సాగించాలని, బెదిరింపులకు, రౌడీయిజానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రగతికి కూటమి పాలనే శరణ్యం

సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ర్యాలీలో పాల్గొన్న శంకర్‌రెడ్డి

**వరదయ్యపాళెం, న్యూస్‌టుడే:** గత వైకాపా అవినీతి, అరాచక పాలనతో సర్వనాశనమైన రాష్ట్రాన్ని ప్రగతిపథంలో పెట్టాలంటే చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి పాలనే శరణ్యమని నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కారిపాకంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీఎమ్మెల్యే హేమలత, మండల పార్టీ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ భారతి, నాయకులు అయ్యప్పరెడ్డి, నందకిషోర్‌రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, రామలింగారెడ్డి, ధరణియాదవ్, నవీన్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**పిచ్చాటూరు, న్యూస్‌టుడే:** పూర్వ విద్యార్థుల సమ్మేళనాల్లో అరుదైన కలయిక పిచ్చాటూరు మండలంలోని వెంగళత్తూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం చోటుచేసుకుంది. 1981-82లో పదో తరగతి చదువుకున్న 45 మంది విద్యార్థుల్లో 37 మంది పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలిశారు. అలనాటి గుర్తులను స్మరించుకుని సరదాగా ఆడుతూ పాడుతూ గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు రామ్మూర్తి, కృష్ణమాచారిలను గౌరవించి ఆశీర్వాదాలు అందుకున్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు వివరాలు సేకరించారు. అందరినీ ఒక్కచోటకు చేర్చడంతో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, కడప నీటిపారుదల శాఖ ఈఈ ఉమామహేశ్వర్లు, జనార్దన్, రవి, సోమశేఖర్ కీలకంగా వ్యవహరించారు.

## పథకాలే కూటమికి శ్రీరామరక్ష

**సత్యవేడు, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన పథకాలను చూసి వైకాపా ఓర్వలేక కుట్ర పన్నుతోందని తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన నాయకులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, సత్యవేడు, కేవీబీపురం, నారాయణవనం మండలాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రామాంజులనాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నేత్ర శిబిరానికి స్పందన

**వరదయ్యపాళెం:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్వీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నై శంకర నేత్రాలయ వారిచే నిర్వహించిన శిబిరంలో 64 మందికి పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. వీరిలో శస్త్రచికిత్స కోసం 27 మంది ఎంపికయ్యారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుతో ఆకతాయిల ఆటకట్టు..

**కేవీబీపురం, న్యూస్‌టుడే:** సీసీ కెమెరాల ఏర్పాటుతో ఆకతాయిల వికృతి చేష్టలకు అడ్డుకట్ట వేసినట్లేనని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఎస్వో సుకన్య తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ఏపీ ఆదర్శ పాఠశాలకు ఇటీవల సత్యవేడు తెదేపా సమన్వయకర్త శంకర్‌రెడ్డి విచ్చేసిన సమయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సిబ్బందితో కలిసి ఎస్వో ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే కేజీబీవీ, ఏపీ ఆదర్శ పాఠశాలలకు రూ.లక్ష వెచ్చించి 15 సీసీ కెమెరాలను అమర్చడంతో పాటు కేజీబీవీకి రెండు కంప్యూటర్లను తన సొంత నిధులతో వెచ్చించారని ఎస్వో వివరించారు.

## శివానందం సేవలు చిరస్మరణీయం

భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంఘ ప్రతినిధులు

**వరదయ్యపాళెం:** ఉపాధ్యాయుడుగా విశేష సేవలందించిన వార్త శివానందం సేవలు చిరస్మరణీయమని నియోజకవర్గ పింఛను దారుల సంఘం అధ్యక్షుడు నాగేశులు అన్నారు. వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. భగవద్గీత సారాంశ పుస్తకాలను పంపిణీ చేశారు. సంఘం ప్రతినిధులు హరిగోపాల్‌రెడ్డి, రామసుబ్బయ్య, డీవీఎంసీ సభ్యులు గుత్తిత్యాగరాజు, సర్పంచి సల్లావీరభద్రం పాల్గొన్నారు

## పోగొట్టుకున్న చరవాణి అప్పగింత

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** ముక్కంటి దర్శనార్థం విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులతో ఆదివారం శ్రీకాళహస్తికి వచ్చారు. దర్శనం కోసం వెళ్లే సమయంలో చరవాణిని పోగొట్టుకున్నారు. ఆలయంలోని నాలుగో గేటు జలప్రసాద కేంద్రం సమీపంలో చరవాణి ఉన్నట్లు సమాచారం అందుకున్న భద్రతా ఉద్యోగి శ్రీనివాసులు అక్కడకు వెళ్లి చరవాణి తీసుకుని పోగొట్టుకున్న సుబ్రహ్మణ్యంకు అప్పగించారు. ఆలయ భద్రతా సిబ్బందికి భక్తుని కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

## జేసీబీ, ట్రాక్టర్ల స్వాధీనం

స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్లు

**రేణిగుంట, న్యూస్‌టుడే:** రేణిగుంట మండలంలోని పలు చెరువుల్లో మట్టి తరలింపు విషయంలో వెంకటాపురం చెరువు నిత్యం వార్తల్లో ఉంటుంది. నెల రోజులుగా ఇక్కడ మట్టిని తరలిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం కొందరు ఇక్కడ మునేశ్వరుడికి పొంగళ్లు పెట్టే విషయమై చెరువులో షామియానాలు వేసి పూజలు చేపట్టారు. ఆ సమయంలో వారు జేసీబీతో రోడ్డు చదును చేసే పనులు చేపట్టడం వివాదాస్పదమైంది. ఈ విషయాన్ని కొందరు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందిని పంపి జేసీబీ, ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్లు తెదేపా నాయకుడివి కావడంతో రెవెన్యూ వారిపై ఒత్తిడి వచ్చింది. ఇక్కడ వైకాపా, గతంలో తెదేపాలో పనిచేసిన వారు రోడ్డు పనులు చేయడం మరో కొసమెరుపు. కేవలం దేవుడికి పొంగళ్లు పెట్టుకునే విషయమై చాలా ఏళ్లుగా పూజలు చేస్తున్నామని, ఇప్పుడు ఇదే క్రమంలో చేశామని పూజలు చేసిన వారు తెలిపారు. రోజు ఇక్కడ మట్టి తరలిస్తున్న అధికారులకు అది కనిపించలేదా అని వారు ప్రశ్నించారు.

## మృతుడు ఒడిశా వాసి

**తొట్టంబేడు, న్యూస్‌టుడే:** గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో మృతిచెందిన వ్యక్తిని ఒడిశాలోని కొరాపుట్ జిల్లాకు చెందిన లచన ప్రక్ష(44)గా ఆదివారం పోలీసులు గుర్తించారు. ఈ నెల 10 తేదీన రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారిపై తొట్టంబేడు మండలం మల్లిగుంట సమీపంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సెల్‌ఫోన్ ద్వారా మృతుడి వివరాలు సేకరించి బంధువులకు సమాచారమిచ్చారు. వారిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పంచనామా అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

# సర్కారు బడుల్లో మరుగు కష్టాలు

వరదయ్యపాళెంలో విసర్జన కోసం బడి బయట ప్రాంతానికి వెళ్తున్న పిల్లలు

**బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, న్యూస్‌టుడే:** సర్కారు పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనకు గత ప్రభుత్వం 'నాడు-నేడు' పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించినా పిల్లలకు కష్టాలు తప్పడం లేదు. కనీసం పాఠశాలల్లో మరుగుదొడ్ల వసతి కూడా లేకపోవడం పిల్లల పాలిట శాపంగా మారింది. మలమూత్ర విసర్జనకు అత్యవసర పరిస్థితుల్లో పసిపిల్లల కష్టాలు అన్నీఇన్నీ కావు. పాలకుల ఆర్భాటపు ప్రకటనలకు సర్కారు బడుల్లో మరుగుదొడ్ల కొరత వెక్కిరిస్తోంది.

### అత్యవసరంలో నరకయాతనే..

వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో దాదాపు 500 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్య

### పిల్లలకు తప్పని అవస్థలు

సిస్తున్నారు. ఎనిమిది మంది మహిళా ఉపాధ్యాయులున్నారు. ఇక్కడ పిల్లలకు కేవలం రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. వీటిని ఉపాధ్యాయులు, బాలికలు వినియోగిస్తున్నారు. 300 మంది బాలికలు చాలీచాలని మరుగుదొడ్లతో అవస్థలు పడుతుండగా, బాలురు మాత్రం పాఠశాలకు ఎదురుగా గల చెరువు, నిరుపయోగంగా గల పోలీస్ క్వార్టర్స్ వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి. గోవర్ధనపురం, బత్తులవల్లం ఉన్నత పాఠశాలలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

● సత్యవేడు బాలికల ఉన్నత పాఠశాల, పుదుకుప్పం, వానెల్లూరు ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల కొరత ఉంది.

● బీఎన్‌కండ్రిగ మండలంలో నెలవాయి, పల్లమాలలో మరుగుదొడ్ల కొరత ఉండగా, మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల బాలురు మరుగుదొడ్లు లేక బయటకు వెళ్లాల్సి వస్తోంది.

ఈ చిత్రం బీఎన్‌కండ్రిగ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని మరుగుదొడ్డి. పాఠశాలలో దాదాపు 500 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. అంతమందికి ఒకే మరుగుదొడ్డి ఉంది. వీటిలో మూడు విభాగాలుగా మరుగుదొడ్లు ఉండగా, ఒకటి ఉపాధ్యాయులు, మిగిలిన రెండు బాలికలకు కేటాయించారు. బాలురు మాత్రం ఆరు బయటకు వెళ్లాల్సిందే. నియోజకవర్గంలో పలు ఉన్నతపాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

● కేవీబీపురం మండలంలోని అంజూరు, రాగిగుంట, సదాశివపురం, కేవీబీపురం ఉన్నత పాఠశాలల్లో చాలీచాలని మరుగుదొడ్లతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

## పరిశ్రమ ఉద్యోగుల రక్తదానం

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** మండలంలోని రాజులపాళెం సమీపంలోని సీఎంఆర్ ఎకో అల్యూమినియం పరిశ్రమలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంస్థ ఎండీ మోహన్ అగర్వాల్ జన్మదినం సందర్భంగా ఆదివారం పరిశ్రమ పరిపాలన భవనంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పరిశ్రమలోని ఉద్యోగులు, కార్మికులు రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

## యువతి అదృశ్యం

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని దాసుకుప్పానికి చెందిన ఓ యువతికి ఇదే గ్రామానికి ఒక వ్యక్తితో సోమవారం నిశ్చితార్థం ఖరారు చేశారు. ఈనేపథ్యంలో యువతి అదృశ్యమైనట్లు సమాచారం.

## ఇరువర్గాల ఘర్షణ

**సత్యవేడు, న్యూస్‌టుడే:** మండలంలోని కాలమనాయుడుపేటకు చెందిన మునస్వామి కుమారుడు నాగరాజు అదే గ్రామానికి చెందిన శేఖర్‌కు గతంలో నగదు వడ్డీకి ఇచ్చాడు. ఈ విషయంలో నాగరాజు. . శేఖరును డబ్బులు అడగ్గా.. శేఖరు, పురుషోత్తం మరో ముగ్గురు కలిసి నాగరాజు, ఆయన కుటుంబ సభ్యులపై ఘర్షణకు దిగారు. ఇది తీవ్రమవడంతో ఇరువర్గాలు దాడి చేసుకున్నాయి. నాగరాజు అమ్మకి, అవ్వకు రక్త గాయాలయ్యాయి. దీంతో స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామస్వామి తెలిపారు.

(c) eenadu

గూడూరు
•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

## మద్దిలేటమ్మకు ప్రత్యేక అభిషేకాలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** మండలంలోని మన్నేముత్తేరిలో గ్రామదేవత మద్దిలేటమ్మ వారికి ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. పలువురు దాతలు రూ.లక్షకు పైగా వ్యయం చేసి, అమ్మవారికి ఇత్తడిపై బంగారు పూతతో కూడిన కవచాలను తయారు చేసి ఇచ్చారు. 108 కలశాలతో పాలాభిషేకం చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఎంపీపీ అనిల్‌రెడ్డి, గ్రామస్థులు రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, చెంచుకృష్ణారెడ్డి, సర్పంచి చిన్నిరాజా పాల్గొన్నారు.

### కోటమ్మకు విశేష పూజలు

**కోట, న్యూస్‌టుడే:** స్థానిక కోటమ్మదేవత ఆలయంలో ఆదివారం పలు గ్రామాల భక్తులు సామూహికంగా విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు చేశారు. పొంగళ్లు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని సపరివార దేవతలకు పూజలు చేశారు. ప్రసాదాలు పంచి పెట్టారు.

### గంగమ్మకు సామూహిక పొంగళ్లు

**చిల్లకూరు, న్యూస్‌టుడే:** గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్ద స్థానికులు ఆదివారం సామూహిక పొంగళ్లు పెట్టారు. అమ్మవారి జాతరను నిర్వహించి నెల రోజులు కావడంతో మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు దర్శనమిచ్చారు.

### 18న చెంగాళమ్మకు శాకంబరి అలంకరణ

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** ఆంధ్ర, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ అమ్మవారు ఈనెల 18న శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఈవో ప్రసన్నలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో అందర్నీ భాగస్వామ్యం చేయాలన్న తలంపుతో శాకాంబరి అలంకారానికి కావల్సిన మూడు రకాల కూరగాయలను, రెండు రకాల పండ్లను భక్తుల నుంచి స్వీకరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈనెల 16వ తేదీ సాయంత్రంలోగా కార్యాలయంలో పండ్లు, కూరగాయలు సమర్పించాలని కోరారు.

### గూడూరులో నిమ్మ ధరలు

**మొదటి రకం:** కేజీ రూ. 21 నుంచి రూ. 30 వరకు
**రెండో రకం:** కిలో రూ. 15 నుంచి రూ. 20 వరకు

### కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ (రైతు ధర) | 119 |
| లేయర్ | 112 |
| బ్రాయిలర్స్ | 216 |
| బ్రాయిలర్స్ స్కిన్‌లెస్ | 240 |
| లేయర్ మాంసం | 190 |

# కన్నేసి.. కాజేసి

✦ రూ.కోట్ల విలువ చేసే కాలువల ఆక్రమణ
✦ పట్టించుకోని పురపాలక, నీటి పారుదల అధికారులు

సనత్‌నగర్‌లో ఆక్రమణలకు గురైన పంట కాలువ

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** జాగా కనిపిస్తే అక్రమార్కులు పాగా వేసేస్తున్నారు. కాలువలను సైతం వదలడం లేదు. చెరువుల నుంచి పంట కాలువలు మీదుగా పొలాలకు సాగునీరు అందించే కాలువలు నేడు కనుమరుగయ్యాయి. జనావాసాల మధ్య పంట కాలువలు ఉండడంతో ఆక్రమణదారులు చొచ్చుకొచ్చి, కాలువలపై నిర్మాణాలు చేపట్టారు. వర్షపునీరు ప్రవహించే వీలేలేదు. ఇరిగేషన్ శాఖాధికారులు, పురపాలక సంఘాల్లో కాలువలు ఉన్నాయనే ఆలోచనే లేదు. పాలకులు, పురపాలక శాఖాధికారులు కుమ్మక్కు కావడంతో ఆక్రమణదారుల ఆటలు జోరుగా సాగుతున్నాయి.

**ఎక్కడెక్కడంటే..**

గూడూరు పురపాలక సంఘంలో సుమారు ఐదు కి.మీ విస్తీర్ణంలో నాలుగు పంట కాలువలున్నాయి. రెండో పట్టణం రావిచెరువు నుంచి ఒకటో పట్టణం సనత్‌నగర్ వరకు ఒకటి, చెరువు కలుజు కింద రెండు కాలువలు ఉన్నాయి. అలాగే నాయుడు కాలువ కూడా ఉంది. ప్రస్తుతం దాదాపు కాలువకు ఇరువైపులా ఆక్రమణలకు గురికావడంతో కుంచించుకుపోయాయి. నరసింగరావుపేట, పూలతోట, తూర్పు వీధి, సత్రపు వీధి, సనత్‌నగర్, ఆర్టీసీ, కలుజు ప్రాంతం తదితర ప్రాంతాల్లో కాలువల వెడల్పు 20 అడుగులకు కేవలం 5 నుంచి 10 అడుగులు మాత్రమే ఉన్నాయి. ఒక్క గూడూరులోనే రూ.50 కోట్లు ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని అంచనా.

**సొమ్ము చేసుకుంటూ**

2015లో కురిసిన అతిభారీ వర్షానికి కొన్ని పురపాలక సంఘాలు నీట మునిగినా అప్పటి అధికారులు, పాలకులు పరిశీలించి ఆక్రమణలను తొలగిస్తున్నట్లు కబుర్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో అమలు చేయలేదు. నీటిపారుదల శాఖాధికారులు కాలువలను చూసిన దాఖలాలే లేవు. మురుగు కాలువలుగా మార్చుకోవడం, యథేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేసి, గుత్తేదారులు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ఇకనైనా ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

గూడూరులో నాయుడుకాలువ దుస్థితి

**చర్యలు తీసుకుంటాం**

ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వరదల సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తాం. స్థలాలు సర్వే చేసి నోటీసులు అందజేస్తాం.
- వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్

### మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య:** పట్టణంలోని చర్చి రోడ్డు ప్రాంతంలో చెత్తాచెదారాలు అధ్వానంగా ఉండడంతో దుర్వాసన భరితంగా ఉన్నాయి. **- వీరకుమార్**
**సమాధానం:** సిబ్బందితో తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, కమిషనర్**

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సమస్య:** పురపాలక సంఘంలోని బజారు వీధులు, గాండ్లవీధి ప్రాంతాల్లో కుళాయిల్లో తాగునీరు రావడం లేదు. **- రామాంజనేయులు, గాండ్లవీధి**
**సమాధానం:** మోటార్లు కాలిపోవడంతో తాగునీరు అందించలేకపోతున్నాం.. త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. **- చిన్నయ్య, పుర కమిషనర్**

**వాకాడు, న్యూస్‌టుడే: సమస్య:** వాకాడులో బీసీ కాలనీ వద్ద ర.భ. రోడ్డుకు పెద్ద గుంత ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- రమేష్**
**సమాధానం:** గుంతను పూడ్చేందుకు చర్యలు చేపడతాం. **- రామాంజనేయులు, ర.భ.శాఖ ఈఈ**

**సమస్య:** స్వర్ణముఖి నది వద్ద ఏర్పాటు చేసిన మెట్లపై చెత్తాచెదారాలను శుభ్రం చేయించాలి. **- అహ్మద్‌బాషా**
**సమాధానం:** చెత్తా చెదారాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- ప్రవళిక, పంచాయతీ ఈవో**

### వెలిగిన వీధి దీపాలు

స్పందనకు వందనం

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** పురపాలక పరిధిలోని గోగినేనిపురంలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఈనాడులో సమస్య ప్రచురితమైంది. స్పందించిన పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బంది ద్వారా వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

**పేదల అభ్యున్నతి లక్ష్యం.. శ్రీకాళహస్తి:** కూటమి ప్రభుత్వం పలు పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని రవి, బాలాజీరెడ్డిలు అన్నారు. పట్టణంలోని 5వ వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచిపెట్టారు.

## సంక్షేమ పథకాలు అందుతున్నాయా..?

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన తెదేపా నేతలు

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** కూటమి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మీకు అందుతున్నాయా.. మీ ప్రాంతంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అంటూ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రజల ఇళ్లకు వెళ్లి తెలుసుకున్నారు. పురపాలక సంఘంలోని సాయినగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆమె ఇంటింటికెళ్లి స్థానికులకు కరపత్రాలు అందజేసి జరిగిన అభివృద్ధి తెలియజేశారు. పలువురు ఆమెకు వినతిపత్రాలు అందించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ, ప్రజలకు అండగా ఉంటామన్నారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, శ్రీనివాసులు, రాజశేఖర్, జోగీశ్వరరావు, శ్రీహరిరెడ్డి, గిరి రాయల్, సుధాకర్, శరవణ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**గూడూరు పట్టణం, వెంకటగిరి, న్యూస్‌టుడే:** పురపాలక సంఘంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు, వెంకటగిరి పట్టణాల్లోని పురపాలక కార్యాలయం వద్ద ఆదివారం సమ్మె నిర్వహించి, ధర్నా చేశారు. జీవో నెంబర్ 36కి సంబంధించిన జీతాలు వర్తింప చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు పెంచలయ్య, సుబ్రమణ్యం, రమణయ్య, సుబ్బరత్నమ్మ, జోగి శివకుమార్, రమణయ్య, కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, మణి, ప్రసాద్ పాల్గొన్నారు.

గూడూరులో ధర్నా చేస్తున్న నాయకులు

నూతన కమిటీతో భాజపా నాయకులు

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దయాకర్ తెలిపారు. పట్టణంలోని భాజపా కార్యాలయంలో నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. పార్టీ ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, గుమ్మడి శ్రీనివాస్‌యాదవ్, సురేష్‌బాబు, ప్రభాకర్‌రావు, జీవి నాయుడు, ధనుంజయ్‌లు, ప్రధాన కార్యదర్శులు పర్చూరు బాలకృష్ణ గౌడ్, రవీంద్రబాబు, కోశాధికారిగా నిరంజన్ కార్యదర్శులుగా భార్గవ్, వినీల, సభ్యులను ఎన్నుకున్నారు.

### పలుచోట్ల నిర్బంధ తనిఖీ

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** పట్టణంలోని మహాదేవయ్యనగర్, క్రిస్టియన్‌పేటలలో ఆదివారం ఉదయం సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యాన పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎలాంటి పత్రాలు లేని పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సూళ్లూరుపేట, తడ ఎస్సైలు బ్రహ్మనాయుడు, కొండపనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు. **కోట, న్యూస్‌టుడే:** ప్రకాశం కాలనీలో వాకాడు సీఐ హుసేన్‌బాషా ఆధ్వర్యాన కార్డన్ సెర్చ్ చేశారు. సరైన పత్రాలు లేని 8 వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### 13వ వార్డులో తొలి అడుగు నేడు

**వెంకటగిరి, న్యూస్‌టుడే :** పట్టణంలోని 13వ వార్డు శివాలయం వీధిలో తెదేపా ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే రామకృష్ణ పాల్గొని ఇంటింటా ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ వివరాలు వివరిస్తారన్నారు.

## నడిరోడ్డే చెత్తకుండీ

తడకండ్రిగ పంచాయతీలో ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు వెనకబడ్డారు. ఫలితంగా నడిరోడ్డును స్థానికులు చెత్తకుండీగా మార్చేస్తున్నారు. స్థానిక కెనరా బ్యాంకు మార్గంలో సర్వీసు రోడ్డుపైనే చుట్టుపక్కల ఉండే దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులు రాత్రిళ్లు నడిరోడ్డుపైనే చెత్త పోగు పోసి చేతులు దులుపుకొంటున్నారు. స్వచ్ఛభారత్ పేరుతో ప్రజలకు అవగాహన కల్పించినా ఇక్కడ అమలు కష్టంగా మారింది. ఆదివారం సిబ్బంది రాకపోవడంతో ప్రాంతం దుర్గంధంగా మారుతోంది. **- న్యూస్‌టుడే, తడ**

## ప్రయాణం.. ప్రమాదం

ద్విచక్ర వాహనంపై ఇద్దరు.. ముగ్గురు కాదండీ ఏకంగా ఏడుగురు ప్రయాణం సాగించారు. అది కూడా అత్యంత వేగంగా రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆ ద్విచక్ర వాహనాన్ని చూసి అందరూ నోరెళ్ల బెట్టారు. ఇద్దరు పిల్లలను ముందు కూర్చోబెట్టుకున్నారు. వెనుక కూర్చున్న మహిళలు చెరొకరు పిల్లల్ని చంకలో.. ఇలా మొత్తం ఏడుగురు ప్రమాదకరంగా ప్రయాణించారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా మార్పు రావడం లేదని పలువురు నిట్టూర్చారు. **- న్యూస్‌టుడే, తడ**

## పారుదలకు ఇవే అడ్డంకి

వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీ నుంచి హెడ్ రెగ్యులేటర్ ద్వారా తూపిలి చెరువుకు వెళ్లే నీటి పారుదలకు గేట్ల వద్ద మొక్కలు అడ్డంకిగా మారాయి. వరదల సమయంలో నదికొచ్చే నీటితోపాటు చెత్తాచెదారాలు, మొక్కలు కొట్టుకొచ్చి గేట్ల వద్ద నిలిచిపోతున్నాయి. గేట్లు ఎత్తి, దించే సమయంలో ఈ మొక్కలు అడ్డంకిగా మారి పారుదల కష్టమవుతోంది. **- న్యూస్‌టుడే, వాకాడు**

## తాగునీరు వృథా

సూళ్లూరుపేట పురపాలక సంఘంలోని చిన్నసత్రం వద్ద ఉన్న పథకాల ద్వారా పట్టణంలోని వివిధ ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేస్తున్నారు. చిన్నసత్రం వద్ద రెండు రోజుల కిందట పైపులైన్ పగిలి, నీరంతా వృథాగా పోతోంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం పట్టణంతో తాగునీటి కొరత ఎక్కువగా ఉంది. పొదుపుగా వాడుకోవాల్సింది పోయి, వృథా చేస్తున్నారు.
**- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

## ఎడారిని తలపిస్తున్న చల్లకాలువ ఆనకట్ట

కోట చల్లకాలువ ఆనకట్ట ద్వారా 11 చెరువులకు, 6 వేలు హెక్టార్ల వరకు వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుంది. ఈ ఏడాది ఎడగారు సాగు చేశారు. తీవ్ర వర్షాభావంతో చల్లకాలువ పూర్తిగా ఎండిపోయి ఎడారిని తలపిస్తుంది. దీంతో అన్నదాతలు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలుగుగంగ నీరు చల్లకాలువ ఆనకట్టకు విడుదల చేస్తే భూములకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాగునీరు అందేలా చూస్తామని తెలుగుగంగ ఏఈ సుధాకర్ తెలిపారు. **- న్యూస్‌టుడే, కోట**

భాజపా రాష్ట్ర అధ్యక్షుడికి మొక్క అందజేస్తున్న కోటేశ్వరరావు

### భాజపా రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

**కోట, న్యూస్‌టుడే:** కోటకు చెందిన భాజపా సీనియర్ నాయకుడు కొమారి కోటేశ్వరరావు హైదరాబాద్‌లో ఆదివారం భాజపా ఏపీ నూతన అధ్యక్షుడు మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈవోకు చెక్కు అందజేస్తున్న చెంచురామయ్య కుటుంబీకులు

### నిత్యాన్నదానానికి రూ.1,01,116 వితరణ

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గూడూరుకు చెందిన సోమిశెట్టి చెంచురామయ్యతోపాటు కుటుంబీకులు రూ. 1,01,116 వితరణ చేశారు. సంబంధిత నగదు చెక్కును ఆదివారం ఆలయ ఈవో ప్రసన్నలక్ష్మికి అందజేశారు.

### ఘనంగా ఆడి పొంగళ్ల మహోత్సవం

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** పట్టణంలోని పిట్టలవారి వీధిలో కొలువైన గంగమ్మ ఆలయంలో ఆడి పొంగళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అనంతరం మహిళలు భక్తి శ్రద్ధలతో పొంగళ్లు పెట్టి నివేదనలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు.

### ప్రతి వారం హాజరుకావాలి

**రేణిగుంట, న్యూస్‌టుడే:** రౌడీ షీటర్లు, సస్పెక్ట్ వ్యక్తులు పోలీసుస్టేషనకు ప్రతి వారం హాజరు కావాలని పట్టణ సీఐ జయచంద్ర తెలిపారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సక్రమమైన పద్ధతిలో జీవనం సాగించాలని, బెదిరింపులకు, రౌడీయిజానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రసాదాల్లో నాణ్యత.. పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

✦ 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఈవో ప్రసన్నలక్ష్మి

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** భక్తులకు నాణ్యతతో కూడిన ప్రసాదాలు అందేలా చూడటం.. ఆలయం, ఆవరణ, పరిసరాల్లో మెరుగైన పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిస్తున్నాం. సామాన్య భక్తులకు ఇబ్బందుల్లేకుండా అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తున్నాం.. అన్నదానంలో రుచి, శుభ్రత పాటిస్తున్నట్లు చెంగాళమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి(సహాయ కమిషనర్) బి.ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. ఆలయంలో సేవలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆమె మాట్లాడారు.

**న్యూస్‌టుడే:** అంతరాలయంలో టికెట్ లేకుండా, అధికారుల అనుమతుల్లేకుండా దొడ్డిదారి దర్శనాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

**ఈవో:** అలాంటివి ఏమీ లేదు. టికెట్ కొనుగోలు చేసిన, ప్రోటోకాల్ ఉన్నవారిని మాత్రమే అనుమతి ఇస్తున్నాం.

**న్యూ:** గతంలో లడ్డూ, ప్రసాదాలు, అన్నదానంలో నాణ్యత, రుచి లేదని భక్తుల నుంచి విమర్శలొచ్చాయి?

**ఈవో:** నేను గతేడాది బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి లడ్డూ తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టాం. 80 గ్రాములు ఉండేలా చేశాం. అన్నదానం రుచి ఉండేలా, శుభ్రతతో భక్తులకు వడ్డిస్తున్నాం. కొన్నాళ్ల నుంచి వడను కూడా విక్రయిస్తున్నాం.

**న్యూ:** అన్నదానం సరకులు దాతల వివరాలు నమోదు చేయడంలో అక్రమాలు చోటు చేసుకున్నాయి.. ప్రస్తుత పరిస్థితి ఏమిటీ?

**ఈవో:** ఇప్పుడు దాతలిచ్చినా ప్రతి ఒక్కటి నమోదు చేసి రసీదులూ ఇస్తున్నాం.

**న్యూ:** తరచూ భక్తుల మధ్య గొడవలు, వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. చోరీలు జరుగుతున్నాయి.

**ఈవో:** మా దృష్టికి వచ్చింది. త్వరలోనే ఆలయ ఆవరణలో పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేయిస్తాం.

**న్యూ:** భక్తులకు సరిపడా కాటేజీలు ఉన్నాయా?

**ఈవో:** లేవు. శుక్ర, ఆదివారాల్లో కాటేజీలకు డిమాండ్ ఉంది. దాతల సాయంతో కొత్తవి నిర్మిస్తాం.

**న్యూ:** సెల్‌ఫోన్లలో అంతరాలయంలోని అమ్మవారిని చిత్రీకరించడం జరుగుతోంది?

**ఈవో:** గతంలో ఉండేది. ప్రస్తుతం ఆలయంలోకి సెల్‌ఫోన్లు అనుమతించడం లేదు. నిఘా ఉంచాం.

# ముచ్చటగా మూడోసారి టెండర్లు..!

అత్యవసరంగా డ్రెయిన్ నిర్మించాల్సిన ప్రాంతం

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** పురపాలక సంఘంలో సీసీ డ్రెయిన్లు, రోడ్లు, తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి కొన్నేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పనులకు పురపాలక సాధారణతోపాటు, వివిధ పద్దుల కింద నిధులను కేటాయించారు. ఇప్పటికే రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినా.. పెద్ద పనులను పలు కారణాలతో రద్దు చేస్తూ వస్తున్నారు. తాజాగా మూడోసారి మళ్లీ పిలిచారు. ఈ సారైనా గుత్తేదారులకు పనులు కేటాయిస్తారా.. లేదా.. అనే సందేహం అందరిలోనూ నెలకొంది.

**రెండోసారి ఎందుకు రద్దు చేశారో..!**

సూళ్లూరుపేట పురపాలక సంఘంలో పలు రకాల పనులకు రూ.3 కోట్ల మేర నిధులు కేటాయించారు. రూ.1.12 కోట్ల పనులకు సంబంధించి టెండర్లను వివిధ కారణాలతో రద్దు చేశారు. ఇందులో చిన్నసత్రం నుంచి సాయినగర్‌లో వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూ.40 లక్షలు, అంబేడ్కర్ భవన్ పక్కన డ్రెయిన్(ఆర్డీవో కార్యాలయం వద్ద) చిన్నసత్రం వరకు నిర్మాణం రూ.40 లక్షలు, పందుల గుంట నుంచి కసారెడ్డి పాళెం వరకు పురపాలక సంఘంలో వివిధ ప్రాంతాలకు తాగునీటిని అందించేందు ప్రధాన పైపులైన్‌కు రూ.40 లక్షల పనులు చేయాల్సి ఉంది. ఈ మూడు పనులు చేసేందుకు రెండో దఫా టెండర్లు పిలిచారు. కానీ పురపాలక అధికారులు వివిధ కారణాలతో టెండర్లు తెరవకనే రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎందుకు రద్దు చేశారో తెలియరాలేదు.

**ఈసారైనా..**

రూ.1.12 కోట్ల విలువైన పనులకు మళ్లీ టెండర్లు పిలిచారు. ఆన్‌లైన్ టెండర్లు కావడంతో గుత్తేదారులు పోటీ పడి కోట్ చేస్తున్నారు. అయితే ఈ దఫా అయినా పనులు అప్పగిస్తారా. . లేదా.. అనే మీమాంస నెలకొంది. ఈ పనులు వర్షాకాలం వచ్చేసరికి పూర్తి చేయాల్సి ఉంది. లేదంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

**టెండర్లు పిలిచాం**

ప్రధానమైన మూడు పనులతోపాటు, మరో రెండు చిన్న పనులు చేసేందుకు టెండర్లు పిలిచాం. 15వ తేదీ వరకు దాఖలకు సమయం ఉంది. ఆ వెంటనే తెరిచి, పనులు కేటాయిస్తాం.
- చిన్నయ్య, పుర కమిషనర్

## భాజపా మండల కార్యవర్గం ఏర్పాటు

**పెళ్లకూరు, న్యూస్‌టుడే:** మండలంలో తాళ్వాయిపాడులో ఆదివారం భాజపా తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీ మండలాధ్యక్షుడుగా నరసింహులు, ఉపాధ్యాక్షులుగా రామకృష్ణారెడ్డి, వీరయ్య, సుబ్బులయ్య, కవిత, నసయ్య, బుజ్జమ్మలు, ప్రధాన కార్యదర్శులుగా వల్లి భరత్‌కుమార్, ఇర్ల రమణయ్య కార్యదర్శులుగా సుష్మిత, సుబ్రహ్మణ్యంనాయుడు, వెంకటరమణ్య, జ్యోతి, కె.సుబ్రహ్మణ్యం, వెంకటమ్మ, సతీష్, కోశాధికారిగా సతీష్, పృథ్వీ నియమితులయ్యారు.



### 200 మందికి నేత్ర పరీక్షలు

**కోట:** స్థానిక ప్రగతి విద్యానికేతన్ స్కూల్‌లో ఆదివారం తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రవైద్యశాల సహకారంతో కోగిలి జయరామిరెడ్డి సేవాసంస్థ ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యనిపుణులు 200 మందికి పరీక్షలు చేశారు. 51 మందికి శస్త్రచికిత్సలు చేసేందుకు ఎంపిక చేశామని సేవా సంస్థ నిర్వహకులు సురేష్‌రెడ్డి తెలిపారు.

### 'బాబా మందిరంలో అవినీతి'

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని షిర్డీ సాయి నగర్‌లోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వ్రతం టికెట్లలో అవినీతి జరిగిందని సాయి భక్తులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టికెట్లను కొంత మంది అక్రమంగా అమ్ముకున్నారని ఆరోపించారు. భక్తులు మనోభావాలు దెబ్బతినేలా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### జూద స్థావరంపై దాడులు

**కోట, న్యూస్‌టుడే:** వీరారెడ్డిసత్రం సమీపంలో ఆదివారం రాత్రి జూదస్థావరంపై ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది దాడులు చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,500లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

### పోగొట్టుకున్న చరవాణి అప్పగింత

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** ముక్కంటి దర్శనార్థం విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులతో ఆదివారం శ్రీకాళహస్తికి వచ్చారు. దర్శనం కోసం వెళ్లే సమయంలో చరవాణిని పోగొట్టుకున్నారు. ఆలయంలోని నాలుగో గేటు జలప్రసాద కేంద్రం సమీపంలో చరవాణి ఉన్నట్లు సమాచారం అందుకున్న భద్రతా ఉద్యోగి శ్రీనివాసులు అక్కడకు వెళ్లి చరవాణి తీసుకుని పోగొట్టుకున్న సుబ్రహ్మణ్యంకు అప్పగించారు. ఆలయ భద్రతా సిబ్బందికి భక్తుని కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

### నేత్రదానం

రత్నమ్మ(పాత చిత్రం)

**సూళ్లూరుపేట:** పురపాలక సంఘం పరిధిలోని మన్నారుపోలూరుకు చెందిన కామిరెడ్డి రత్నమ్మ(85) మరణానంతరం ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియాలను ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధులు సేకరించి, చెన్నై శంకర నేత్రాలయానికి అందజేశారు. ఆమె 471వ నేత్రదాతగా నిలిచారు.

**PASSPORT LOST**
I, Ravilla Sireesha W/o. Ravilla Munikrishnama Naidu, Residing at Kammavaripalem, Kadivedu, Chillakur Mandal, Tirupati District, AP - 524410. I lost My Original Passport bearing No. M1514228, while I was proceeding from my House to Chillakuru Cross Road for taking xerox on 02-03-2022. If anyone found please inform up to the above address

(c) eenadu

# ఈనాడు విశాఖపట్నం

సోమవారం 14 జులై 2025 | సిటీ 5


## ఫోన్‌లోనే సీపీకి చెప్పొచ్చు!

విశాఖలో శాంతి భద్రతల పరిరక్షణకు, అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టకు, చోరీల నియంత్రణకు, మహిళలు, యువతులపై వేధింపుల నిరోధానికి, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచేందుకు, ఆకతాయిల ఆట కట్టించేందుకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని నగర సీపీ శంఖబ్రత బాగ్చీ సూచిస్తున్నారు. ఒక్క ఫోన్ కాల్ చేస్తే ఎలాంటి ఆపదలో ఉన్నా రక్షిస్తామని, ఏదైనా సమస్య ఉంటే పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. **79950 95799** నంబర్‌ను తమ ఫోన్లలో సేవ్ చేసుకుని, ఏదైనా సమస్యపై నేరుగా సీపీకే ఫోన్ చేసే సౌలభ్యం కల్పించారు.

★ ఇటీవల కుమార్తెకు తెలియకుండానే, ఆమె బిడ్డను తండ్రి మరొకరికి దత్తత ఇచ్చిన ఘటనపై ఫోన్‌లో ఫిర్యాదు అందుకున్న సీపీ... వెనువెంటనే స్పందించి బాధిత తల్లి చెంతకు బిడ్డను చేర్చి న్యాయం చేశారు. –న్యూస్‌టుడే, జగదాంబకూడలి

## ఆగని 'కోళ్ల వ్యర్థాల' దందా..!

పట్టుకున్న ఓ వాహనం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నిబంధనల మేరకు కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చేరాల్సిన కోళ్ల వ్యర్థాలు... నగరం నుంచి ఇతర జిల్లాలకు తరలిపోతున్నాయి. అలా వ్యర్థాలు తరలిస్తున్న కొన్ని వాహనాల్ని అధికారులు ఆదివారం సాయంత్రం అనకాపల్లిలో పట్టుకొని కేసులు నమోదు చేశారు. ఇటీవల కోళ్లవ్యర్థాల టెండర్లు రద్దు చేయగా గుత్తేదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు మూడు వారాల స్టే విధించింది. దీంతో ఈ వ్యాపారంలో అనుభవం ఉన్నవారంతా నాలుగైదు వార్డులకు ఓ వాహనం ఏర్పాటు చేసి... టెండర్‌తో సంబంధం లేకుండా ఎవరికి వారే కోళ్లవ్యర్థాలు సేకరించి, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ.. కాసులు సంపాదిస్తున్నారు. మరోవైపు ఒకరిపై మరొకరు అధికారులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. తాజా అంశంపై 'టీం జీవీఎంసీ వాట్సప్ గ్రూప్'లో అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్ల మధ్య మెసేజ్‌ల యుద్ధం సాగింది.

## జపాన్ తీరగస్తీ దళానికి శిక్షణ

భారత్‌లో జపాన్ తీరగస్తీ దళానికి చెందిన నౌక 'ఇత్సుకుషిమా' సిబ్బందికి శిక్షణ విజయవంతంగా ముగిసినట్టు ఐసీజీ వర్గాలు ఆదివారం తెలిపాయి. అయిదు రోజుల సందర్శన, శిక్షణ నిమిత్తం జపాన్ కోస్టుగార్డు అధికారుల బృందం ఇటీవల చెన్నై పోర్టుకు చేరుకుంది. జపాన్, భారత్ నుంచి కోస్టుగార్డు అధికారులు వైస్ అడ్మిరల్ కనోష్యూ హిరోకి, డైరెక్టర్ జనరల్ పరమేశ్ శివమణి పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, సింధియా

శిక్షణలో పాల్గొన్న జపాన్ కోస్టుగార్డు వెసల్ ఇత్సుకుషిమా

## కడలి తీరం.. ఆరోగ్య హారం

ఆర్కే బీచ్‌లో ఆదివారం ఉదయం ప్రత్యేక కార్యక్రమాలతో సందడి వాతావరణం నెలకొంది. జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో 'ఒలింపిక్ డే' పరుగు నిర్వహించారు. గతంలో నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం వర్షాల వల్ల ఆదివారానికి వాయిదా పడింది. ఎమ్మెల్యేలు గణబాబు, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

★ డిసెంబర్‌లో జరిగే నేవీ మారథాన్‌పై అవగాహన నిమిత్తం పరుగు నిర్వహించారు. ముందస్తు సన్నాహకాన్ని చిత్రంలో చూడొచ్చు. –న్యూస్‌టుడే, పెదవాల్తేరు

## 'బిమ్స్‌టెక్' పోర్టుల సదస్సుకు సర్వం సిద్ధం

కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌కు స్వాగతం పలుకుతున్న పోర్టు ఛైర్‌పర్సన్ అంగముత్తు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రాంతీయ నౌకాశ్రయాలు, సముద్ర జలాల్లో సంబంధాల బలోపేతానికి సోమ, మంగళవారాల్లో 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కో ఆపరేషన్- బిమ్స్‌టెక్' పోర్టుల సదస్సు నగరంలో నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు వివిధ దేశాల పోర్టులకు చెందిన అధికారులు, ఇతర ప్రతినిధులు విశాఖ చేరుకున్నారు. ఆదివారం రాత్రి నగరానికి చేరుకున్న కేంద్ర నౌకాశ్రయాలు, నౌకాయానం, జలరవాణా మంత్రి సర్బానంద సోనోవాల్‌కు విశాఖ పోర్టు అథారిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఘనస్వాగతం పలికారు. కేంద్ర సహాయ మంత్రి శాంతనూ ఠాకూర్‌తో పాటు ఇతరులు సదస్సులో పాల్గొంటారు. ఈ సందర్భంగా విశాఖ పోర్టులో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర మంత్రులు ప్రారంభించి, నూతన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. ఈ వివరాలను విశాఖ పోర్టు అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

## నిత్యం ప్రదక్షిణ.. అ'విశ్రాంత' నిరీక్షణ

★ 'ఆరోగ్య పథకం' అమలులో అంతులేని జాప్యం
★ సీజీహెచ్‌ఎస్ కేంద్రాల తీరుపై నిరసన

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్) లబ్ధిదారులు వైద్యం పొందాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ పథకంలో విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరికి ఆరోగ్యం బాగోలేకపోతే నగరంలో తమకు నచ్చిన ఆసుపత్రిలో చూపించడానికి ముందుగా పెదవాల్తేరు, డాబాగార్డెన్స్‌ల్లోని సంస్థ వెల్‌నెస్ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. ఇక్కడ సేవలు సరిగా అందక అర్ధరాత్రి నుంచి నిరీక్షించాల్సి వస్తోంది.

**ప్రహసనంగా టోకెన్ల జారీ:** పేర్ల నమోదుకు సీజీహెచ్‌ఎస్ సభ్యులు నిత్యం పెదవాల్తేరు కేంద్రానికి భారీగా తరలివస్తున్నారు. ఇక్కడ టోకెన్ జారీ చేసిన తర్వాత వైద్యులు పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తారు. తరువాత నగరంలోని సీజీహెచ్‌ఎస్‌తో అనుసంధానమైన కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చు. అయితే ఈ టోకెన్లు తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిత్యం వందలాది మంది వస్తుండగా కేవలం పదుల సంఖ్యలో టోకెన్లు ఇస్తున్నారు. దీంతో విశ్రాంత ఉద్యోగులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు రాత్రి ఇక్కడే ఉండిపోతున్నారు.

పెదవాల్తేరు సీజీహెచ్‌ఎస్ కేంద్రం వద్ద బారులు తీరిన విశ్రాంత ఉద్యోగులు

**త్వరలో సమస్య పరిష్కారం:** 'డాబాగార్డెన్స్ వెల్‌నెస్ కేంద్రం 100 గజాల స్థలంలో ఇరుగ్గా ఉంది. కూర్చోవడానికి స్థలం కూడా లేదు. ఈ కేంద్రాన్ని విమ్స్‌కు తరలించడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు వచ్చాయి. సాఫ్ట్‌వేర్ సమస్యను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది' అని సీజీహెచ్‌ఎస్ లబ్ధిదారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు.

**చిక్కులు తెచ్చిన సాఫ్ట్‌వేర్ మార్పు:** ఇటీవల సీజీహెచ్‌ఎస్ సాఫ్ట్‌వేర్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్‌ఐసీ) నుంచి సి-డాక్‌లోకి మార్చారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ఆరోగ్య చరిత్ర పూర్తిస్థాయిలో బదిలీ కాలేదని సమాచారం. ప్రతిసారి కొత్తగా వివరాలు నమోదు చేయాల్సి వస్తోంది. కొంత మంది కార్డులు సైతం గల్లంతయ్యాయని చెబుతున్నారు.

★ విశాఖలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు 13,500 మంది సీజీహెచ్‌ఎస్ కార్డులు కలిగి ఉన్నారు. కుటుంబసభ్యులతో కలిపి 35వేల మంది లబ్ధిదారులుగా ఉన్నారు. ఇందులో 5శాతం మాత్రమే ఉద్యోగులు కాగా, మిగతా 95 శాతం పదవీవిరమణ చేసిన వారే. వాస్తవంగా 2వేల మందికి ఒక వెల్‌నెస్ కేంద్రం ఉండాలి. విశాఖలో కేవలం రెండు మాత్రమే ఉన్నాయి. రెండింటిలో కలిపి కేవలం ఏడుగురు వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఫలితంగా సేవలు అందక ప్రతి రోజు 200 మంది తిరిగి వెళ్లిపోతున్నారు

## 'ఆహార తయారీ'.. ఉపాధికి దగ్గర దారి..!

ప్రయోజన సమాచారం

యువత, మహిళలకు వంటల తయారీలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్. చినగదిలి తహసీల్దారు కార్యాలయం పక్కన ఈ సంస్థ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తోంది. –న్యూస్‌టుడే, విశాలాక్షినగర్

★ ప్రైవేటు కళాశాలల్లో రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండగా ఇక్కడ కేవలం రూ.30వేలు, అది కూడా విడతల వారీగా చెల్లించే అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ప్రవేశాలు జరుగుతున్నాయి. దరఖాస్తుకు ఈనెల 17వతేదీ తుది గడువు.

చినగదిలి మండలంలోని ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న యువత

1 **అడ్వాన్స్‌డ్ ట్రేడ్ సర్టిఫికెట్ ఇన్ కలినరీ ఆర్ట్స్ కోర్సు:** పదో తరగతి విద్యార్హత. కోర్సు వ్యవధి ఆరు నెలలు. దక్షిణ, ఉత్తర భారత వంటలు, చైనీస్, పాశ్చాత్య వంటలు, కేకులు, బిస్కెట్లు, పాస్తా, సమోసా, మిఠాయిల తయారీలో శిక్షణ ఇస్తారు. ఆరునెలలు స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. శిక్షణ అనంతరం స్టార్ హోటళ్లలో చెఫ్‌గా ఉద్యోగావకాశం కల్పిస్తారు.

2 **టెక్నిక్స్ ఇన్ కుకింగ్:** ఈ విభాగంలో చేరేందుకు విద్యార్హత 8వ తరగతి. 25 వారాలపాటు శిక్షణ ఉంటుంది. శాఖాహార, మాంసాహార వంటల తయారీల్లో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తారు.

3 **కేటరింగ్ మేనేజర్:** రక్షణ రంగంలో ఆరునెలల్లో ఉద్యోగ విరమణ చేయబోయేవారు అర్హులు. రక్షణ రంగమే ఎంపిక చేసి శిక్షణ ఖర్చు భరిస్తుంది. ఆరునెలలపాటు శిక్షణ ఉంటుంది. వంటలతోపాటు, బేకరీ వస్తువులు, బిస్కెట్లు, పఫ్‌ల తయారీలో శిక్షణ ఇస్తారు. అనంతరం సొంతంగా క్యాటరింగ్ ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా స్టార్ హోటళ్లలో చెఫ్‌గా ఉద్యోగం చేయవచ్చు.

## ఉదయం ఉక్కపోత.. మధ్యాహ్నం కుండపోత

అక్కయ్యపాలెం వద్ద జాతీయ రహదారిపై..

గత కొన్ని రోజులుగా తీవ్ర వేడి... ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. ఆదివారం మధ్యాహ్నం నగరంలో భారీ వర్షం కురిసింది. –ఈనాడు, విశాఖపట్నం

## అదనపు బాధ్యతలు ఎన్నాళ్లు?!

'సింహాచలం' ఆలయానికి శాశ్వత ఈవో కలేనా?!



ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ప్రముఖ ఆలయంగా వెలుగొందుతున్న సింహాచలం క్షేత్రానికి పూర్తి స్థాయి 'ఈవో'ను నియమించడంలో అంతులేని తాత్సారం జరుగుతోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో త్రినాథరావుకు ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారే తప్ప శాశ్వత అధికారిని నియమించలేదు. దీంతో ఆలయ పాలన గాడి తప్పుతోందనే విమర్శలొస్తున్నాయి. 2019 నుంచి ఇప్పటివరకు 14 మందికి ఈవోలుగా బాధ్యతలప్పగించారంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**వరుస ఘటనలతోనైనా:** సింహగిరిపై ఏప్రిల్ 30న చందనోత్సవ సందడి నెలకొన్న తరుణంలో... భక్తులు నిల్చున్న చోట ఒక్కసారిగా గోడ కూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల గిరి ప్రదక్షిణ నేపథ్యంలో తొలిపావంచా వద్ద ఇనుప రాడ్లతో నిర్మించిన భారీ షెడ్డు కప్పు కూలింది. ఆ సమయంలో భక్తులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో శాశ్వత అధికారి నియామకం మరోసారి తెరపైకి వచ్చింది. మరో వైపు కొండపైనా, దిగువన ప్రసాద్ పథకంలో రూ.50 కోట్లతో పనులు జరుగుతున్నాయి. పంచగ్రామాల్లో ఆలయానికి విలువైన భూములున్నాయి. వేపగుంటలో వీఎంఆర్‌డీఏతో కలిసి పరిష్కరించాల్సిన 140 ఎకరాల భూసమస్య ఉంది. వీటన్నింటి పర్యవేక్షణకు కీలక అధికారి ముఖ్యం.

**ఎందుకు కొనసాగిస్తున్నారు?:** ఇటీవలి బదిలీల్లో ఈవోగా కొత్తగా ఎవర్నీ నియమించలేదు. గతంలో పనిచేసిన వి.త్రినాథరావును రాజమహేంద్రవరం ఆర్జేసీగా నియమించారు. అలాగే.. సింహాచలం ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలప్పగించారు. పలు ఉత్సవాల నిర్వహణలో ఆయన విమర్శలు మూటకట్టుకున్నా కొనసాగించడం గమనార్హం. 2023లో చందనోత్సవ సమయంలోనూ త్రినాథరావే ఈవోగా ఉన్నారు. ఆ సమయంలో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. దీనిపై అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు సంయుక్త కలెక్టర్ విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. అందులో ఈవో త్రినాథరావు పర్యవేక్షణ లోపాన్ని కూడా ప్రస్తావించారు. ప్రభుత్వం మారినా ఆయనే ఈవోగా కొనసాగారు. ఈ ఏడాది చందనోత్సవం నిర్వహణ సమయానికి సెలవుపై అమెరికాకు వెళ్లారు. ఉత్సవ తేదీ ప్రకటించాక అన్ని రోజులు సెలవు మంజూరు చేయడం దేవాదాయశాఖలో చర్చనీయాంశమైంది.

## నగరానికో నందనవనం!

★ కనువిందైన మొక్కలతో కళకళ
★ ఏపీజీబీసీ ఆధ్వర్యంలో నిర్వహణ

నర్సరీలో పెంచుతున్న మొక్కలు

ఈనాడు, విశాఖపట్నం: నగరంలోని ఆరిలోవలో లక్షల మొక్కలతో భారీ నర్సరీ ఆకట్టుకుంటోంది. విశాఖకే వన్నె తెస్తోంది. అక్కడి పరిసరాలు నందనవనాన్ని తలపిస్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కడ ఏ పెద్ద కార్యక్రమం జరిగినా అరుదైన జాతులను ఇక్కడి నుంచి అధికారులు తీసుకువెళ్తున్నారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇక్కడి మొక్కలతో పచ్చదనాన్ని పెంచుతున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) ఆధ్వర్యంలో ఈ నర్సరీని నిర్వహిస్తున్నారు.

**మోదీ సభలకు..:** అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునఃప్రారంభ సభకు హాజరైన ప్రధాని మోదీ పర్యటనలో కనువిందుగా కనిపించిన మొక్కల్ని విశాఖ నుంచే తరలించారు.

★ ఇటీవల జరిగిన యోగాంధ్ర-25 ఏర్పాట్లకూ ఈ నర్సరీ నుంచే మొక్కలు పంపించారు. ★ కొన్నాళ్ల క్రితం విశాఖలో జరిగిన జి-20 సన్నాహక సమావేశాల వేళ నగర సుందరీకరణలో లక్ష మొక్కలు వినియోగించారు. అవీ ఇక్కడి నుంచే సరఫరా చేశారు. ★ విశాఖ పోర్టులో, జీవీఎంసీ పార్కుల్లో, అమృత్‌సరోవర్ ప్రాజెక్టు కింద చెరువుల గట్లపైనా వేలాది మొక్కలు నాటారు.

**ఆ రెండు ఎకరాల్లో:** నేరుగా ఎండ తగలకుండా, మొక్కలు పెరిగేందుకు అనువైన వాతావరణం కల్పించేందుకు రెండు ఎకరాల్లో నాలుగు షేడ్‌నెట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ తుంపర్ల రూపంలో నీరందుతుంది. మిగిలిన వాటికి బిందు సేద్యం విధానంలో అందిస్తున్నారు.

**అందుబాటులో 1.76 లక్షలు:** ఈ నర్సరీ దాదాపు 30 ఎకరాల్లో ఉంది. అలంకరణకు అనువైనవి 25 రకాలు, ఉద్యానవనాల్లో నాటేవి 20 రకాల వరకు ఉన్నాయి. ప్రస్తుతం 1.76 లక్షల మొక్కలు సిద్ధం చేశారు. ఏటా 50 వేల వరకు విక్రయిస్తారు. ఎప్పటికప్పుడు అంటుకట్టే విధానంలో సరికొత్తగా అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మిగిలిన నర్సరీలతో పోల్చితే ఇక్కడ తక్కువ ధరకు ఎవరైనా కొనుగోలు చేసుకోవచ్చు. ఎన్ని కావాలో దరఖాస్తు చేస్తే వాటికి ధర నిర్ణయించి అందజేస్తారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థలు, మున్సిపాల్టీలు, దేవాలయాలకు ప్రాధాన్యం ఇస్తారు.

**పోర్టుతో ఒప్పందం:** 'పచ్చదనం పెంచే కార్యక్రమాలకు విశాఖ పోర్టు పెద్ద పీట వేస్తోంది. వారికి అవసరమైన మొక్కల సరఫరా, నిర్వహణకు పోర్టుతో ఏపీజీబీసీ ఒప్పందం చేసుకుంది. అరుదైన రకాలతో 'ఫైకటోరియం' నిర్వహిస్తున్నాం. మొక్కలు కావాలంటే ముడసర్లోవ జలాశయం ఎదురుగా ఉన్న నర్సరీలో సంప్రదించొచ్చు' అని ఏపీజీబీసీ ఉద్యానవనాధికారి భాస్కరరావు పేర్కొన్నారు.

## '1100' సేవలు వినియోగించుకోండి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: 'మీ కోసం' పేరిట ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నంబర్ '1100' సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

★ ప్రజా సమస్యలపై అర్జీలు అందించిన వారు ఫిర్యాదు సమాచారం తెలుసుకోవడానికి '1100'కు కాల్ చేయొచ్చన్నారు. 14వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

## షీలానగర్‌లో భారీ చోరీ

★ రూ.కోటి విలువైన నిశ్చితార్థ నగలు, డబ్బు మాయం
★ విచారణకు రంగంలోకి దిగిన పోలీసులు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : కుమార్తె నిశ్చితార్థం కోసం సిద్ధం చేసిన నగలు, డబ్బు కలిపి దాదాపు రూ. కోటి సొత్తు చోరీ కావడంతో బాధిత తల్లిదండ్రులు లబోదిబో మంటున్నారు. షీలానగర్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఘటన వివరాలివి. జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్-8లోని లక్ష్మీ రెసిడెన్సీ మొదటి అంతస్తులో ఎస్. శ్రీనివాస్, భార్య నాగమణి, ఇద్దరు కుమార్తెలు నివాసం ఉంటున్నారు. ఎల్‌ఐసీలో ఉద్యోగం చేస్తున్న ఆయన, ఆటోనగర్‌లో చిన్న పరిశ్రమ నిర్వహిస్తున్నారు. ఇటీవల పెద్ద కుమార్తెకు వివాహం నిశ్చయమైంది. వచ్చే నెల 10న నిశ్చితార్థ వేడుక నిర్వహించేందుకు ఫ్లాట్‌కు రంగులు వేయిస్తున్నారు. కుటుంబ సభ్యులంతా శనివారం రాత్రి 11 గంటలకు పనులు ముగించుకుని, కింద ఖాళీగా ఉన్న మరో ఫ్లాట్‌లోకి వెళ్లి నిద్రపోయారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు తమ ఫ్లాట్ నుంచి శబ్దాలు రావడాన్ని గమనించి వెంటనే పైకి వెళ్లి పరిశీలించారు. తలుపులు తీసి ఉండటంతో పాటు బీరువాలో సామగ్రి చెల్లాచెదురై ఉండటంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. వెంటనే ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాజువాక క్రైం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. నిశ్చితార్థం నిమిత్తం రూ. 20 లక్షల నగదు, 700 గ్రాముల బరువైన బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి, కొత్త పట్టుచీరలు, 7 వాచీలు బీరువాలో భద్రపరిచామని, అవన్నీ మాయమైనట్టు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీమ్ సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. పోలీసు జాగిలం సమీపంలోని మెకానిక్ దుకాణం వైపు వెళ్లి, మళ్లీ వెనక్కి రావడంతో క్రైం సీఐ శ్రీనివాస్ మెకానిక్ దుకాణం నిర్వాహకుడిని, ఇరుగుపొరుగు వారిని ప్రశ్నించారు. లక్ష్మీ రెసిడెన్సీకి సీసీ కెమెరాలు లేకపోవడడంతో పథకం ప్రకారమే ఇక్కడ చోరీ జరిగిందని సీఐ పేర్కొన్నారు. ఎస్సై మన్మథరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిందర వందరగా పడి ఉన్న బీరువాలో వస్తువులు

(c) eenadu

## త్వరలోనే ఇళ్ల నిర్మాణం ప్రారంభం

### బీహెచ్‌పీవీ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఫేజ్-3కి అనుమతులు

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే: సుమారు 25 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న సొంతింటి కల త్వరలో నెరవేరనుందని బీహెచ్‌పీవీ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎ.వెంకట్రావు అన్నారు. బెల్ కాలనీలోని ఆడిటోరియంలో ఆదివారం సొసైటీ ఫేజ్-3 సభ్యుల సమావేశం జరిగింది. హాజరైన వెంకట్రావు మాట్లాడుతూ... సొంతఇళ్ల నిర్మాణంలో 25 ఏళ్ల కిందట 352 మంది సభ్యులకు ఇళ్ల నిర్మాణ లక్ష్య ఉద్దేశంతో కొనుగోలు చేసిన స్థలానికి సంబంధించి చిక్కుముడులన్నీ వీడాయన్నారు. ఇళ్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు సభ్యులంతా అవసరమైన సొమ్ము సిద్ధం చేసుకోవాలన్నారు. నిర్మాణ పనులకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎస్.సాహు, భాస్కరరావు, పీవీ ఎల్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

హాజరైన సొసైటీ సభ్యులు

మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు వెంకట్రావు. చిత్రంలో డైరెక్టర్లు

## పరీక్ష పెట్టారు.. ఫలితాలు మరిచారు..!

### 24వేల మంది ఎదురుచూపులు ❑ ఏయూ దూరవిద్యా కేంద్రం తీరుపై మండిపాటు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: సాధారణంగా వార్షిక పరీక్షలు పూర్తయిన వారం, పది రోజుల నుంచే విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) ప్రారంభమవుతుంది. రెండు నెలల్లో ఫలితాలు వెల్లడిస్తారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఇప్పటి పరీక్షలు జరిగి మూడు నెలలైనా ఫలితాలు వెల్లడి కాలేదు. దీంతో అసలు మూల్యాంకనం ప్రారంభమైందా.. జవాబు పత్రాలు భద్రంగా ఉన్నాయా అనే సందేహాలు విద్యార్థుల్లో నెలకొన్నాయి.

★ మూల్యాంకనం పూర్తయ్యేదెప్పుడో..? ఏయూ దూర విద్యా కేంద్రం ఈ ఏడాది ఏప్రిల్ 25న యూజీ, పీజీ పరీక్షలు నిర్వహించింది. యూజీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ బీకాం 4707, బీఏ 4208, బీఎస్సీ 8739 మొత్తం 17,654 మంది పరీక్షలు రాశారు. పీజీలో మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ ఎమ్మెస్సీ 3100, ఎంఏ 1958, ఎంబీఏ 1104, ఎంకామ్ 219 మంది మొత్తం 6381 మంది పరీక్షలు రాశారు. యూజీ, పీజీ కలిపి మొత్తం 24,035 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరికి సంబంధించి 1,94,688 జవాబుపత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంది. ఇన్ని పత్రాలను మూల్యాంకనం చేయాలంటే కనీసం రెండు నెలల సమయం పడుతుందని చెబుతున్నారు. ఇప్పుడు ప్రారంభించినా ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెల్లడించడానికి నవంబరు, డిసెంబరు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. ఈలోగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల నోటిఫికేషన్ పడితే తాము నష్టపోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు.

ఏయూ దూర విద్యా కేంద్రం

★ లాభదాయక విభాగాలపై శీతకన్ను..: ఆంధ్రవిశ్వవిద్యాలయానికి లాభాన్ని చేకూర్చే విభాగాల్లో దూర విద్యా కేంద్రం ముందుంటుంది. దీని ద్వారా ఏటా రూ.40కోట్ల నుంచి రూ.50కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ మొత్తంలో 70శాతం విద్యార్థుల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. గతంలో దూర విద్య కేంద్రం బ్యాంకు ఖాతా కేంద్రం సంచాలకుల ఆధీనంలో ఉండేది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వీసీ ప్రసాదరెడ్డి ఆ ఖాతాను మెయిన్ క్యాంపస్ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో దూరవిద్య విద్యార్థులకు కనీసం సకాలంలో పుస్తకాలు కూడా సమకూర్చలేకపోతున్నారు. స్టేషనరీ కొనుగోలు సైతం వీసీ దయాదాక్షిణ్యాలపై ఆధార పడాల్సి వస్తోందని ఓ ఉద్యోగి వాపోయారు.

★ త్వరితగతిన పూర్తి చేస్తాం..: ఈ విషయమై ఏయూ దూర విద్యా కేంద్రం సంచాలకుడు ఆచార్య వీవీ నాయుడి వివరణ కోరగా శుక్రవారం నుంచి పీజీ విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభించామన్నారు. క్రమపద్ధతిలో మిగతా కోర్సుల జవాబుపత్రాలు కూడా పూర్తి చేస్తామన్నారు. ఫలితాలు వెల్లడించాలని విద్యార్థుల నుంచి ఒత్తిడి ఉందని, ఉద్యోగుల బదిలీలు, చేరిక నేపథ్యంలో కొంత జాప్యం జరిగిందని పేర్కొన్నారు.

## బ్యాంకు వాటాదారులకు 14 శాతం డివిడెండ్

గురుద్వారా, న్యూస్‌టుడే: వినియోగదారుల అభిమానాన్ని చూరగొంటూ ప్రస్తుతం రూ.290.39 కోట్ల బ్యాంక్ డిపాజిట్లు కలిగి ఉన్నామని ది మహారాజా కో ఆపరేటివ్ బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.రామకృష్ణ రాజు అన్నారు. సీతమ్మధార క్షత్రియ కళ్యాణ మండపంలో బ్యాంకు 25వ మహాజన సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.202.16 కోట్ల రుణాలు అందించి రూ.492.55 కోట్ల వ్యాపారం కలిగి ఉన్నామన్నారు. రూ.4.36 కోట్ల స్థూల ఆదాయన్ని ఆర్జించగా రూ.1.13 కోట్ల ఆదాయ పన్ను చెల్లించామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు 14 శాతం డివిడెండ్ ప్రకటించినట్లు పేర్కొన్నారు. సిబ్బంది పిల్లలకు దాదాపు రూ.8 లక్షల ఉపకార వేతనాలు, విద్యా సామగ్రి అందజేయడం జరుగుతుందన్నారు. త్వరలో విజయవాడ, రామచంద్రపురంలో బ్యాంకు శాఖలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటుగా ఫైనాన్షియల్ సౌండ్ అండ్ వెల్ మేనేజ్డ్(ఎఫ్ఎస్‌డబ్ల్యూఎం) విభాగంలో ఒక శాఖను ప్రారంభిస్తామని తెలియజేశారు. సమావేశంలో పైడా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి వనమాల శ్రీనివాస్, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.శ్యామ్‌కిశోర్, సంస్థ జీఎం ఎన్.ఎస్.సత్యనారాయణ, బ్యాంకు డైరెక్టర్లు, వాటాదారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణంరాజు...చిత్రంలో అతిథులు

## ఉత్సాహంగా 'ఒలింపిక్ డే పరుగు'

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా 'ఓ' ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో ఒలింపిక్ డే పరుగు నిర్వహించారు. జిల్లాలోని 32 క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కేటర్లు విన్యాసాలు, కత్తిసాము, కర్రసాముతో ఆకట్టుకున్నారు. బీచ్‌రోడ్డులోని ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి నోవాటెల్ ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ పార్కు వరకు సాగిన పరుగును ఎమ్మెల్యేలు పి.గణబాబు, సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. ... మాట్లాడుతూ.. ఒలింపిక్ డే సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రీడా సంఘాలు ఐక్యంగా ఉంటూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించడం శుభపరిణామమన్నారు. విశాఖను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు, పలు క్రీడా సంఘాల ప్రతినిధులను సత్కరించారు. జిల్లా 'ఓ' ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, అర్జున అవార్డు గ్రహీత శీరపు జయరాం, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు మోహన్ వెంకట్రామ్, యూ.శ్రీనివాసరావు, జి.వి.రవిరాజు, ఎ.నారాయణ, కిషోర్, పీడీలు, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకంగా సిద్ధం చేసిన చక్రాలతో విన్యాసాలు చేస్తున్న బాలలు

కత్తిసాము చేస్తున్న యువకుడు

## సందడిగా నేవీ మారథాన్ సన్నాహకం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో ఆదివారం ఉదయం తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో మారథాన్ సన్నాహక పరుగు నిర్వహించారు. ఆర్.కె.బీచ్ నుంచి పాండురంగాపురం వరకు ఈ పరుగు కొనసాగింది. 'వన్ రన్.. వన్ నేషన్' నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. డిసెంబరు 14న జరగబోయే మారథాన్ కోసం ఈ సన్నాహక పరుగు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేవీ ఉద్యోగులతోపాటు కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు ఫ్లాష్‌మాబ్ నిర్వహించి ఆకట్టుకున్నారు. విజేతలుగా నిలిచిన వారికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

జెండా ఊపి మారథాన్ సన్నాహక పరుగును ప్రారంభిస్తున్న దృశ్యం

విజేతలుగా నిలిచిన నేవీ సిబ్బంది, విద్యార్థులు

## 'చర్మ ఆరోగ్యం'పై అవగాహన తప్పనిసరి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : చర్మ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని వైద్యులు సూచించారు. ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కేజీహెచ్ చర్మవ్యాధుల వైద్య విభాగం, చర్మవ్యాధుల వైద్యుల సంఘం జాతీయ కమిటీ (ఎన్ఏఏడీవీఎల్) సంయుక్త ఆధ్వర్యంలో ఏయూ విద్యార్థులకు చర్మ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి, చర్మ ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. కేజీహెచ్ చర్మవ్యాధుల వైద్య విభాగాధిపతి డాక్టర్ కె.శాంతి, ఎన్ఏఏడీవీఎల్ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకటాచలం, ఏయూ ప్రొఫెసర్లు నర్సింహారావు, కేఎస్ఎన్.మూర్తి, ఇ.ధనుంజయ రావు, డాక్టర్ ఏడు కొండలరావు, డాక్టర్ కేఎస్.దివ్య, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ ప్రేమ్‌సాగర్ పలువురు పీజీలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

## గిరిజనులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్ జార్జ్ ఆసుపత్రిలోని గిరిజన సంక్షేమ శాఖ విభాగాన్ని ఆదివారం అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు సందర్శించి, వివిధ దస్త్రాలు తనిఖీ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల గిరిజన ప్రాంతాల నుంచి రోగులను కేజీహెచ్‌కు తరలించి, వైద్య సేవలు అందించేందుకు వీలుగా 20 ఏళ్ల కిందట ఈ విభాగం ఏర్పాటు చేశారు. గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవలు, రవాణా సదుపాయాలు, తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. రోగుల వివరాల నమోదుకు కంప్యూటర్, ఫర్నీచర్ సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యమని, వైద్య సలహాల కోసం 63039 21375 నంబరులో సంప్రదించాలన్నారు. కేజీహెచ్ గిరిజన విభాగం వైద్యాధికారి డాక్టర్ సంపత్ ఆధ్వర్యంలో ఇక్కడ వైద్యసేవలు అందుతున్నాయి.

దస్త్రాలు పరిశీలిస్తున్న పాడేరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు

## కలెక్టర్ పేరిట 'నకిలీ ఫేస్‌బుక్ ఖాతా'

వన్‌టౌన్, న్యూస్‌టుడే : గుర్తుతెలియని వ్యక్తులు విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతా రూపొందించారు. అందులో కలెక్టర్ ఫొటో వాడారు. అయితే ఆ ఖాతా చూసి ఎవరూ మోసపోవద్దని, మెసేజ్‌లకు సమాధానాలు ఇవ్వొద్దని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

## ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నైపుణ్యాలు అవసరం

ఆనందపురం, న్యూస్‌టుడే: భారత ఆర్థిక వ్యవస్థ స్వర్ణయగంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో వ్యాపార పరిశోధనలు మరింత అవసరమని ఐఐఎం రాంచీ డైరెక్టర్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఆదివారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం(ఐఐఎంవీ)లో ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్ రెండో బ్యాచ్ స్వాగత వేడుక ఉత్సాహంగా జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ... వాస్తవ ప్రపంచ అభ్యాసంతో లోతైన మెరుగైన విద్యా పునాదిని పీహెచ్‌డీ ద్వారా సాధించి అంతర్జాతీయ గుర్తింపును పొందాలన్నారు. ఐఐఎంవీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. డాక్టోరల్ పొందడానికి అభిరుచి, సహనం, పట్టుదల, అభ్యాసంతో పాటు మార్కెటింగ్ వంటి వృత్తిపరమైన నైపుణ్యాలపై పరిశోధన చేయాలన్నారు. ఐఐఎంవీ డీన్ కావేరి కృష్ణన్ మాట్లాడుతూ.. ఆటోమొబైల్ ఏవియేషన్, బ్రాడ్‌కాస్టింగ్, కన్సల్టింగ్, విద్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ వంటి విభిన్న రంగాలకు సంబంధించిన విభాగాల నుంచి 17 మంది స్కాలర్లు చేరారన్నారు. కార్యక్రమంలో ఐఐఎంవీ ఛైర్ పర్సన్ ప్రశాంత్ ప్రేమ్‌కుమార్ నాయర్, పీహెచ్‌డీ ప్రోగ్రాం ఛైర్‌పర్సన్ అమిత్ శంకర్, విజయభాస్కర్ మారిసెట్టి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఐఐఎం రాంచీ డైరెక్టర్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ, తదితరులు

## ముస్సోరీ పర్యటనకు జేసీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఈనెల 16 నుంచి 18 వరకు ముస్సోరీలోని నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆధ్వర్యంలో జరిగే శిక్షణకు విశాఖ జాయింట్ కలెక్టర్ (జేసీ) మయూర్‌అశోక్ హాజరుకానున్నారు. ఆయన తిరిగి వచ్చే వరకు జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఇంచార్జి జేసీగా వ్యవహరించనున్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే : జీవీఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ప్రధాన కార్యాలయంతో పాటు, జోనల్ కార్యాలయాల్లో వినతుల స్వీకరణ ఉంటుందని మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆ సత్తా 'ప్రైవేటు'కు ఉంటుందా..?

### ఉక్కులో ముగియనున్న 'సీఐఎస్ఎఫ్' సేవలు ❑ ప్రత్యామ్నాయంగా టెండర్ ఆహ్వానించిన యాజమాన్యం

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారంలో ఫైర్ ఫైటింగ్ సేవలు అందిస్తున్న సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక విభాగం స్థానంలో ప్రైవేటు సంస్థలు సేవలు అందించేలా టెండర్లు ఆహ్వానిస్తూ ఈనెల 7న ప్రకటన విడుదలైంది. ఆ టెండర్ గడువు సోమవారంతో ముగుస్తుంది. 15న టెండర్లు తెరవనున్నారు. నిత్యం అగ్నితో పని చేయాల్సిన కర్మాగారంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంటుందని, అలాంటి కీలక సమయంలో సహాయక చర్యలు అందించాల్సిన విభాగాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటివరకు కర్మాగారంలో జరిగిన అనేక ప్రమాదాలకు సంబంధించి సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక సిబ్బంది మెరుగైన సేవలు అందించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. కర్మాగారం ఆస్తుల్ని పరిరక్షించడంలోనూ ప్రత్యేక చొరవ చూపారు.

● కర్మాగారం నిర్వహణ ఖర్చులు తగ్గించుకునే చర్యల్లో భాగంగానే యాజమాన్యం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొస్తుంది. తొలుత ఉక్కులోని ఉద్యోగులతోనే అగ్నిమాపక విభాగాన్ని నిర్వహించేందుకు అన్ని విభాగాలను సంప్రదించగా... ఎవరూ ముందుకు రాలేదు. దీంతో రెండేళ్ల పాటు సేవలు అందించేందుకు రూ.18.24 కోట్లతో ప్రైవేటు సంస్థల నుంచి బహిరంగ టెండర్‌కు ఆహ్వానం పలికింది. ప్రస్తుతం కర్మాగారంలోని అగ్నిమాపక యంత్రాలను, భవనాలు, ఇతర సౌకర్యాలను గుత్తేదారుకు అప్పగించనున్నారు.

● 'పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక విభాగం సేవలు అందించాల్సి ఉంటుంది. ఎంతో ప్రాధాన్యం ఉన్న విభాగాన్ని ప్రైవేటుకు అప్పగించడం సరైంది కాదు. ఇప్పటికైనా యాజమాన్యం పునరాలోచించి 'సీఐఎస్ఎఫ్'నే కొనసాగిస్తే బాగుంటుంది' అని స్టీల్ సిటూ గౌరవ అధ్యక్షులు జె.అయోధ్యరామ్ పేర్కొన్నారు.

## దాసుడి సంకల్పం.. అప్పన్నకు గరుడ వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: ఒడిశాకు చెందిన అప్పన్న స్వామి భక్తులు లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో గరుడ వాహన సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు నేతృత్వంలో అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించారు. మాడవీధుల్లోని చిన్నరథంపై వెండి గరుడ వాహనంపై స్వామిని కొలువుదీర్చారు. లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు కుటుంబ సమేతంగా ఉత్సవంలో పాల్గొని స్వామికి వింజామర సేవలు చేశారు. ఒడిశా భక్త బృందం సంకీర్తనలతో స్వామిని కొలిచారు.

మాడవీధుల్లో గరుడ వాహన సేవలో పాల్గొన్న దాసుడు, భక్త బృందం

తిరువీధిలో నృత్యాలతో అలరించిన కళాకారులు

## ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఇందులో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, వికలాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80.. మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్కే వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తరగతులు 14 నుంచి ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

## విశాఖ సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం

పెదగంట్యాడ(బీసీరోడ్డు), న్యూస్‌టుడే : విశాఖ సమగ్రాభివృద్ధికి కూటమి ప్రాధాన్యం ఇస్తుందని తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు ప్రియదర్శిని కాలనీలోలో రూ.5 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు వారు ఆదివారం శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే గాజువాకలో సుమారు రూ.100 కోట్లతో వివిధ పనులు ప్రారంభించామన్నారు. వార్డు కార్పొరేటర్ బీఎస్.పాత్రుడు, కూటమి నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, రట్టి వాసు, కృష్ణ, రత్నం, సుజాత తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణలో తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు

## 15న 'సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ' విభాగాల ప్రారంభం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో అభివృద్ధి చేసిన సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ విభాగాలను ఈనెల 15న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించనున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో మూడు సార్లు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మూడు సార్లు విభాగాల ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఈ ఆరుసార్లు భవనాలను ముస్తాబు చేయడంతోపాటు ఫెక్సీలు ఏర్పాటు చేయడం, తోరణాలు కట్టడం చేశారు. తర్వాత వాయిదా పడడంతో చేసిన ఖర్చంతా వృథా అయింది. ఈ సారైనా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభానికి నోచుకుంటుందా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విభాగాలు అందుబాటులోకి రాకపోవడంతో రోగులకు ఆధునిక వైద్యం అందడం లేదని చెబుతున్నారు.

మానసిక ఆసుపత్రిలో కట్టిన నూతన భవనం


EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అదిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

TENDER

ఇ-కోట్ టెండర్ సేల్: 1050 KVA, జెన్‌సెట్ 2 నెం.లు, తనిఖీ 16 & 17 ఉ. 9.00 గం. నుండి సా. 5.00 గం. వరకు. ITC లిమిటెడ్, ABD అనపర్తి- 533342, తూ.గో. జిల్లా. ఇ-కోట్ టెండరు తేది: 18.07.25, టెండరు ఫారం ధర రూ. 500/-. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై- 14 ద్వారా మొబైల్: 9840731925, www.welcomeauctioneers.com.

FURNITURE & FURNISHING

GRAND LIVING PREMIUM FURNITURE MALL custom furniture, the ultimate luxury 5 FLOORS BIGGEST FURNITURE MALL SOFA EXCHANGE MELA MVS JEWEL PARK BUILDING, OPP ASILMETTA BUSSTOP, VIZAG ✆84532 89999 / 90527 51666

REAL ESTATE

FLAT FOR SALE

SHEELANAGAR

Sheelanagar, Pawan Residency B-block 4F, East face, 2Bed, 2Bath, 980sft Next to Kim's icon hospital. Vizag. ✆ 9971845081

HOUSE FOR SALE

KURMANNAPALEM

Independent Two Storied Building in 167 Sq.Yd. S/F Phase-1, VUDA Nagar, Kurmannapalem. Cont: 9866192279, 0834910679.

PLOT FOR SALE

GENERAL

VUDA approved plots in PM Palam 346 sq.yds and 300 sq.yrds near Sabbavaram for sale. Contact: 8978326333

TO LET

COMMERCIAL

GENERAL

Commercial Warehouse (3500 Sq.Ft) for rent in Thalavalsa, Visakhapatnam all amenities. Ph: 9440878300/ 7981741475

JOBS

Receptionist and Waiters Required Age: below 35 yrs. with Computer & Hindi & English speaking skills Hotel Winsar Park, Opp. KGH, Vizag. 9849581868.

Required DRA Certified Executive, Team Leader, Telecaller & Backend for Bank Recovery in Visakhapatnam. Attractive Salary. Ph: 9885556922.

Wanted Fitter 5 years experience. Contact: 8142993317.

ఉద్యోగ అవకాశం వైజాగ్‌లో నెం1 ISO సర్టిఫైడ్ సంస్థ నూతన ప్రాజెక్టులయందు పనిచేయుటకు ఈ క్రింది సిబ్బంది కావలెను. 1. Chief Managers: 18 Nos. 2. Assistant Managers : 15 Nos అర్హత: Govt. & Private Org. రిటైర్ అయినవారు, గృహిణులు / VRS/ Ex - Servicemens / Insurance Sectorలో అనుభవం కలవారు. Note : No Field Work. Salary /Incentive ఇంటర్వ్యూ టైంలో నిర్ణయించబడును. ఇంటర్వ్యూలు: 14th, 15th, 16th July. Ph: 9440372402, 9440559401.

ఫీల్డ్ ఆఫీసర్లు, సెక్యూరిటీగార్డులు, టెలికాలర్స్, HR ఎగ్జిక్యూటివ్ కావలెను. Qlf: 10th, డిగ్రీ, MBA, జీతం: 14-24 వేలు. Ct: RSR, 7702959468, 0891-3570630.

బెంగుళూరు సిటీలో పెద్ద ఇంట్లో సహాయకురాలుగా పనిచేయుటకు ఎటువంటి బాదరబందీలేని 20 నుండి 25 సం॥ మధ్య వయస్సుగల ఆడ మనిషి కావలెను. జీతం: 20,000/-. ఫోన్: 7331167845.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


## మా మధ్య భేదాభిప్రాయాలు లేవు

### జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర

ఈనాడు, విశాఖపట్నం: జిల్లా పరిషత్తుకు సంబంధించి నిధుల కేటాయింపు, ఇతర అంశాలపై జడ్పీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వడంలో కొంత అంతరం ఉండే తప్పా, తనకూ సభ్యులకు మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేవని విశాఖ జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర అన్నారు. ఆదివారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'ఛైర్‌పర్సన్'గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సభ్యులందరికీ సమాన ప్రాతిపదికన నిధులు కేటాయించానని, ఇటీవల కొందరు సభ్యులు కావాలనే తనపై ఆరోపణలు చేస్తూ అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ క్రమంలోనే పార్టీ నిర్ణయం మేరకు అసంతృప్త జడ్పీటీసీలు, మిగిలిన వారితో విశాఖలో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మండలాలకు నిధులు కేటాయించే సమాచారం జడ్పీటీసీ సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేయకపోవడం పొరపాటేనన్నారు. త్వరలో అధికారులు, సభ్యులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు.

## కిడ్నీ అమ్మేందుకు ప్రయత్నం.. పోలీసుల విచారణ

గురుద్వారా, న్యూస్‌టుడే: కిడ్నీ అమ్మేందుకు నగరానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులను నాలుగో పట్టణ పోలీసులు పట్టుకుని విచారించారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లాకు చెందిన కట్టా రంగబాబు(36), సీహెచ్ ఏసురాజు(30) స్నేహితులు. వ్యాన్ కొనుగోలు చేసేందుకు అని చెప్పి వీరిద్దరూ కొద్దిరోజుల క్రితం అక్కయ్యపాలెంలోని ఓ హోటల్‌లో దిగారు. ఇక్కడికి వచ్చిన తర్వాత కిడ్నీ అమ్మేందుకు వచ్చానని రంగబాబు ఏసురాజుతో చెప్పడాన్ని హోటల్ సిబ్బంది విని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అక్కడకు చేరుకుని వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా అమ్మేందుకు రావడం వాస్తవమని ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిసి నిరాకరించడంతో నిర్ణయం మార్చుకున్నట్లు రంగబాబు పోలీసులకు తెలిపారు. వీరి వెనుక ఎవరెవరు ఉన్నారు అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## వ్యాను చక్రాల కింద నలిగి మహిళ దుర్మరణం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రోడ్డుప్రమాదంలో మహిళ దుర్మరణం చెందారు. ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెదగదిలి ప్రాంతానికి చెందిన కుంచు మల్లీశ్వరి (56) కాలినొప్పికి చికిత్స కోసం శనివారం ద్వారకానగర్‌లోని ఓ వైద్యుడి వద్దకు వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున అల్లుడు మధుబాబు ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. వెంకోజీపాలెం మెడికవర్ ఆసుపత్రి వద్ద వెనుక వస్తున్న మరో ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని తగిలింది. మల్లీశ్వరి తుళ్లి రోడ్డుపై పడిపోగా వెనుక నుంచి వేగంగా వచ్చిన వ్యాను ఆమెను తొక్కుకుంటూ వెళ్లడంతో దుర్మరణం చెందారు. శరీరం నుజ్జునుజ్జుగా మారింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న మధుబాబు రోడ్డుకు అవతలి వైపు పడిపోవడంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. సీఐ మురళీ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. వ్యాను డ్రైవర్ పరారయ్యాడని, వ్యానును సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

## జీవితంపై విరక్తితో ఆత్మహత్య

సింధియా, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకన్నపాలేనికి చెందిన తమ్మిన వరుణ్(45)కు 22ఏళ్ల కిందట భవానీతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వరుణ్ ప్రయివేటు పనులు చేస్తుంటాడు. 18ఏళ్ల కిందట భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. ఆదివారం ఉదయం 7గంటల సమయంలో తల్లి ఇంటికొచ్చి చూడగా వరుణ్ ఉరి వేసుకుని కనిపించాడు. గత కొద్దిరోజులుగా తీవ్ర మనస్తాపంతో బాధ పడుతున్న అతను అతిగా మద్యం తాగడం ప్రారంభించాడు. చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ గొలగాని అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 81 | 70 |
| లైవ్ | 103 | 90 |
| డ్రెస్డ్ | 149 | 150 |
| స్కిన్‌లెస్ | 170 | 160 |

(c) eenadu

**తెరపై ఈనాడు**
పెందుర్తి, న్యూస్‌టుడే
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - **సూపర్ మ్యాన్ (2డీ తెలుగు)**
స్క్రీన్-2 - **ఓ భామ.. అయ్యో రామ**

## అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం, న్యూస్‌టుడే:సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజియోథెరపీ ఒకేషనల్ గ్రూప్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పీవీఎన్ మూర్తి తెలిపారు. అభ్యర్థులు ఫిజియో థెరపీ బీపీటీలో 55 శాతం మార్కులతో పాటు అనుభవం కలిగిన వారు ఇందుకు అర్హులని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి బయోడేటాతో ఈనెల 15న మధ్యాహ్నం 3 గంటల లోపు కళాశాల సమయాల్లో సంప్రదించాలన్నారు.

# పెందుర్తి

## ఇంటర్ స్టేట్ ఛాంపియన్ షిప్ పోటీల ప్రారంభం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గుల్లేపల్లి అక్షర పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఫస్ట్ ఇంటర్ స్టేట్ ఓపెన్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలను స్థానిక వైకాపా నాయకుడు గండి రవికుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అన్ని రంగాల్లో రాణించే సామర్థ్యం ఉంటుందని, దాన్ని పదును పెట్టినప్పుడే ఉన్నత భవితకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో నేతలు బోకం అప్పారావు, బోదువలస గ్రామ సర్పంచి నేబర్తి శ్రీనివాసరావు, యడ్ల నాయుడు, సరపరపు వాసు, ఎస్.కనకరాజు, కరాటే మాస్టారు బీవీ అప్పారావు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

**80085 74978** సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురం మరిడిమాంబ కాలనీ సమీప జి.వి.కాలనీలో తుప్పలు బాగా పెరిగిపోయాయి. పాముల సంచారం ఎక్కువగా ఉంది. – **మోహన్‌రావు, జి.వి.కాలనీ, పురుషోత్తపురం.** ✓: తుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – **అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో, జోన్–8.**

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలోని హైమాస్టు దీపాలు కొంతకాలంగా వెలగడం లేదు. కూడలిలో గుంతలతో పాటు చీకటి అలముకోవడంతో ప్రమాదాలబారిన పడుతున్నాం. – **రమేశ్, పరవాడ** ✓: హైమాస్టు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – **ధర్మారావు, ఈవోపీఆర్డీ.**

## అన్నదాతలకు అండగా.. వ్యవసాయం లాభసాటిగా..

### పొలం పిలుస్తోంది పేరుతో శిక్షణ

పరవాడ, న్యూస్‌టుడే: అన్నదాతలకు అండగా నిలిచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు.. రైతులు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపుతూ సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ఇటీవల శ్రీకారం చుట్టింది. విత్తనం నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకు అన్నదాతలకు వ్యవసాయాధికారులు సలహాలు ఇస్తారు. విత్తన ఎంపిక, శుద్ధి, ప్రకృతి సేద్యం, రసాయన ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తారు. ఈ శిక్షణను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచిస్తున్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

**వారానికి రెండు రోజులు:** నియోజకవర్గంలోని పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయాధికారులు ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తారు. మండల వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, జలవనరులు, మార్కెటింగ్, విద్యుత్తు శాఖ అధికారులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు ఒకే రోజు ఉదయం, సాయంత్రం రెండు గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శిస్తారు. వారంలో నాలుగు గ్రామాల వంతున నెలకు 16 గ్రామాల్లో ఇలా నాలుగునెలల పాటు కార్యక్రమం నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు.

**ప్రకృతి సాగుపై దృష్టి పెట్టేలా:** రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం, సేంద్రియ పంటలను ప్రోత్సహించడంతో పాటు శాస్త్రీయ పరిజ్ఞానం, వ్యవసాయ పథకాలు, అనుబంధ పంటల్లో సాంకేతికతపై అవగాహన కల్పిస్తారు. రైతులను ప్రకృతి సాగువైపు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. జీవామృతం, బీజామృతం వంటి కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్నారు. పొలం గట్లపై కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు.

**నియోజకవర్గంలో..**

| మండలం | రైతులు |
|---|---|
| పరవాడ | 4535 |
| సబ్బవరం | 10522 |
| పెందుర్తి | 2808 |
| మొత్తం | 17865 |

## సిగరెట్ల విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యాలయాల సమీపంలో సిగరెట్ల విక్రయంపై నిషేధం ఉన్న నేపథ్యంలో అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ హెచ్చరించారు. 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో ఆదివారం రాత్రి పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు విద్యాలయాల పరిసరాల్లో కిల్లీ బడ్డీలు, కిరాణా దుకాణాలను తనిఖీ చేసినట్లు సీఐ వివరించారు. ఆయా దుకాణాల్లో సిగరెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు సిగరెట్లను ధ్వంసం చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. విద్యాలయాలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు సంబంధిత పదార్థాల విక్రయం, వినియోగం నిషేధమని సీఐ పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామన్నారు. ఇకపై తరచూ ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు.

ఓ దుకాణం వద్ద సిగరెట్ ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

## వర్షాలు కురవాలని వరుణ దేవుడికి పూజలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గొర్లెవానిపాలేనికి చెందిన యువకులు వరుణ దేవుడి కరుణ కోసం కప్పల పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో నుంచి ఆడ, మగ కప్పలను కావడికి కట్టి ఊరేగించారు. 'కప్పా కప్పా నీలాడాలి పాడీ పంటా బాగుండాలి' అంటూ పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద బావి నీళ్లతో కప్పలకు స్నానం చేయించారు. ఈ సందర్భంగా సేకరించిన జోగు బియ్యాన్ని స్థానిక సూదికొండ చివర వరకు ఎక్కి అక్కడ పరమాన్నం వండి వరుణ దేవుడికి ప్రసాదం సమర్పించారు. మిగిలిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. వరుణుడు కరుణించి వర్షిస్తాడనే నమ్మకంతోనే ఆరేడు దశాబ్దాలుగా ఈ ఉత్సవాన్ని ఏటా ఆదివారం రోజునే నిర్వహిస్తామన్నారు. ఆ విధంగానే ఆదివారం సబ్బవరంలో వర్షం పడటం విశేషం.

కప్పలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

## అవీ ఇవీ

### సీతమ్మధారలో భారీ వర్షం

ఈనాడు, విశాఖపట్నం: నగరంలో ఆదివారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల వరకు సీతమ్మధారలో 34 మి.మీ., పెదవాల్తేరు 26.75, ధారపాలెం 20.5, పెందుర్తి 18, కొత్తపాలెం 17, జోగువానిపాలెం 16, గాజువాక 13.25, ఆరిలోవ 12, విశాఖ గ్రామీణం 11.25, మహారాణిపేట 10.75, పెదగంట్యాడ 10.25, సింహాచలంలో 9.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

### నేడు వేపగుంటలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ముత్యమాంబ కాలనీలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, తెదేపా నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండిబాబ్జీ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పరవాడ, న్యూస్‌టుడే: అనకాపల్లి - తాడి రైల్వేస్టేషన్ మధ్య రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ పోలీసులు ఆదివారం తెలిపారు. రైలు బలంగా ఢీకొట్టడం వల్ల తలకు, శరీర భాగాలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉంటాయని, ఎత్తు 5.4 అడుగులు ఉన్నాడని, పర్పుల్ కలర్ షర్టు, బ్లూజీన్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం పక్కనే సిల్వర్ కలర్ వాచ్ ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్సై కేటీఆర్ లక్ష్మి తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని కోరారు.

### మహాసభల విజయవంతానికి పిలుపు

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: విజయవాడలో ఈనెల 17న నిర్వహించనున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎన్ఏడీలోని జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మహాసభల గోడపత్రిక ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు నమ్మి అప్పలరాజు మాట్లాడుతూ బీసీ మహిళలకు సబ్ కోటా, కేంద్రంలో ఓబీసీకి మంత్రిత్వశాఖ, చట్టసభలతో పాటు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు, మండల కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## శ్రీరామ్‌నగర్ కాలనీలో చోరీ

వివరాలు సేకరిస్తున్న సీఐ మల్లికార్జునరావు

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జాతీయ రహదారి లంకెలపాలెం శివారు శ్రీరామ్‌నగర్ కాలనీలోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. దీనికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరామ్‌నగర్ కాలనీలోని ఒక అద్దె ఇంట్లో దొండాడ విమలకుమారి నివాసం ఉంటోంది. ఈమె శనివారం సాయంత్రం తలుపులకు తాళాలు వేసుకుని అదే కాలనీలో నివాసముంటున్న పెద్దకుమారుడు ఇంటికి వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం మరళా తిరిగి ఇంటికొచ్చి చూసేసరికి తాళాలు పగలుగొట్టి ఉండటంతో పాటు లోపలున్న బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలోని 4 తులాల బంగారు ఆభరణాలతో పాటు 20 తులాల వెండి వస్తువులు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితురాలితో మాట్లాడి వివరాలు సేకరించారు. క్లూస్‌టీం చేరుకుని వేలిముద్రలు సేకరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పక్కనే మరో ఇంటికి చెందిన తాళాలను దుండగులు పగలుగొట్టినా అందులో ఏమీ పోలేదని స్థానికులు తెలిపారు.

## బస్సెక్కాలంటే అర కిలోమీటరు నడవాల్సిందే..!

పాపయ్యరాజుపాలెం(పెందుర్తి), న్యూస్‌టుడే: బీఆర్టీఎస్ రహదారిలోని సుజాతనగర్ - పురుషోత్తపురం మధ్య బస్టాప్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పరిసర కాలనీవాసులు వాపోతున్నారు. పాపయ్యరాజుపాలెం, సుజాతనగర్ దరి గోపాలకృష్ణనగర్ తదితర కాలనీల్లో సుమారు పదివేల మంది జనాభా నివాసముంటున్నారు. వీరంతా నగరానికి, పెందుర్తి వైపు వెళ్లాలంటే బస్సుల కోసం సుమారు అర కిలోమీటరు దూరం నడిచి సుజాతనగర్ కూడలికి వెళ్లాల్సి వస్తోంది. వృద్ధులు, విద్యార్థులు అంత దూరం నడిచి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాపయ్యరాజుపాలెం పెట్రోల్ బంకు సమీపంలో రిక్వెస్టు బస్టాపు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ శరత్‌బాబు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ఆ రూటులో రిక్వెస్టు స్టాపు ఏర్పాటుకు పరిశీలన చేస్తామని వివరించారు.

పాపయ్యరాజుపాలెం వద్ద ఆటోల కోసం వేచివున్న విద్యార్థులు, స్థానికులు

## మట్టిదారులతో నిత్యం అవస్థలు

**ఫోకస్**

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ సీ-1 జోన్ దరి రెడ్డి సేవా సంఘం మార్గంలో రహదారి అధ్వానంగా మారింది. ఈ ప్రాంతంలో ఇటీవల నిర్మాణాలు ఊపందుకున్నాయి. బహుళ అంతస్తుల భవనాలతో పాటు వ్యక్తిగత గృహాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో బహుళ అంతస్తుల భవనాలున్నాయి. ఏళ్లుగా ఈ ప్రాంతానికి పక్కా రహదారి సౌకర్యం లేకపోవడంతో నివాసితులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మట్టి రోడ్డులోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వర్షాలు కురిస్తే రోడ్డంతా బురదగా మారి నడవడానికి వీలుకాని పరిస్థితి నెలకొంటోందని నివాసితులు వాపోతున్నారు. అధికారులు ఈ ప్రాంతంపై దృష్టిసారించి పక్కా రహదారులు నిర్మించాలని కోరుతున్నారు.

సీ-1 జోన్ నివాసాలకు వెళ్లే మార్గంలోని కూడలిలో మట్టి..

రెడ్డి సేవా సంఘం భవనం వద్ద..

## కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

కె.ఎన్.పాలెం(పరవాడ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సుపరిపాలన అందుతోందని మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి గండిబాబ్జీ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధి కె.ఎన్.పాలెంలో ఆదివారం వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ, వచ్చే నెలలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తారన్నారు. ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రేలంగి చినతల్లి, పైడిరాజు దంపతులకు నలుగురు సంతానం. వీరందరికీ తల్లికి వందనం పథకం లబ్ధి చేకూరిందని బ్యాంకు ఖాతాలో రూ.52 వేలు నగదు జమ అయిందని ఆమె సంతోషం వ్యక్తం చేయడంతో వారితో ఫొటో దిగారు. ఈనాం భూముల్లో ఇల్లు నిర్మించుకుంటే పట్టాలు, విద్యుత్తు మీటర్లు, కొళాయిలు ఇవ్వడం లేదని, ఎన్టీపీసీ, హిందుజా పవర్‌ప్లాంట్లకు చెందిన యాష్‌పాండ్స్ నుంచి బూడిద ఎగిరి గ్రామాల్లోకి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు బాబ్జీకి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం కలపాక, రావాడ గ్రామాల్లో పర్యటించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైలా జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, తెదేపా నాయకులు వియ్యపు చిన్నా, కన్నూరు వెంకటరమణ, నగిరెడ్డి చిన్నారావు, మంత్రి రవి, ఈర్ల సోమునాయుడు పాల నగేశ్, సర్వరే ఆలం తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం లబ్ధిదారురాలి చినతల్లి, ఆమె నలుగురు పిల్లలతో గండి బాబ్జీ

## ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

చింతగట్ల(వేపగుంట), న్యూస్‌టుడే: చింతగట్లలో రూ.కోట్లు విలువ చేసే 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, గొర్లె కనకరాజు ఆదివారం డిమాండ్ చేశారు. ఆదివారం తెదేపా నాయకులు భూమిని పరిశీలించి మాట్లాడారు. ఈ భూమిని ప్రహరీతో పెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఇది ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమి గానే ఉందని సర్వేయర్ ఓ వ్యక్తికి చెందిన భూమిగా ఎలా రిపోర్టు ఇచ్చారో వెంటనే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ స్థలాన్ని పేదలకు ఉపయోగించేలా తెదేపా నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండిబాబ్జీ నేతృత్వంలో తాము పోరాటం చేస్తామన్నారు.

## జిల్లా వీఆర్వోల సంఘం బాధ్యతల అప్పగింత

సబ్బవరం, న్యూస్‌టుడే: జిల్లా వీఆర్వోల సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం సబ్బవరంలో జరిగింది. సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, కార్యదర్శి అనంతరామయ్య హాజరయ్యారు. 13 సంవత్సరాలుగా పదవీ బాధ్యతలు చేపట్టిన సంఘం అధ్యక్షుడు రామకాసు జిల్లా వీఆర్వోల సంఘం బాధ్యతలను అసోసియేటెడ్ అధ్యక్షుడు కె.రాజునాయుడుకు అప్పగించారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, శంకర్, నర్సింహులు, అనకాపల్లి డివిజన్ల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజునాయుడుకు జిల్లా వీఆర్వోల సంఘం బాధ్యతలు అప్పగిస్తున్న మాజీ అధ్యక్షుడు రామకాసు

## రహదారి నిర్మాణ పనుల పరిశీలన

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు వేపగుంట దరి వరలక్ష్మీనగర్‌లో నిర్మిస్తున్న బీటీ రహదారి పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదివారం పరిశీలించారు. నాణ్యత లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుత్తేదారుడికి సూచించారు. రహదారి నిర్మాణంతో వీఎంఆర్‌డీఏ కన్వెన్షన్ కేంద్రానికి, కొండపైన ఉన్న నివాసితులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

## ముగిసిన క్రికెట్ పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి చినపాలెంలో ఆశ్రయ్ క్రికెట్ క్లబ్, చినపాలెం యూత్ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఎల్‌పీఎల్-5 క్రికెట్ పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. పోటీల్లో బీపీఆర్ జట్టు ప్రథమ, జీపీ వారియర్స్ ద్వితీయ, బీఎస్ఆర్ లెవెన్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.1 లక్ష, రూ.75 వేలు, రూ.30 వేలు నగదుతో పాటు జ్ఞాపికలను అతిథుల చేతులమీదుగా అందజేశారు. చివరిరోజు ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చిన 500 మంది ప్రేక్షకులకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు.

అతిథుల నుంచి బహుమతి అందుకుంటున్న విజేత బీపీఆర్ జట్టు

## వైభవంగా శ్రవణ నక్షత్ర పూజలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట రవినగర్ సమీప శేషాద్రినగర్ శిఖరం పైగల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి జన్మతార శ్రవణ నక్షత్ర పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు నందమూరినగర్ కాలనీవాసులు మోహన్‌రెడ్డి, నందిని, సన్యాసిరావు, అనిత దంపతుల ఆర్థిక సహాయంతో అన్నప్రసాద వితరణ చేశారు.

అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు

## ఈ.భోనంగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

పరవాడ, న్యూస్‌టుడే: ఈ.భోనంగి ఫార్మాసిటీ పునరావాసకాలనీ కొండపై కొలువైన శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీహరి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. పంచామృత అభిషేకాలు, గోత్రనామాలతో అర్చనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

దేవతామూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

## ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండుగ

వరలక్ష్మీనగర్(వేపగుంట), న్యూస్‌టుడే: వరలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్యదైవం మరిడిమాంబ(పశువులమ్మ) అమ్మవారి మారువారం పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారి అనుపోత్సవం చేశారు.

అన్నప్రసాద వితరణలో పాల్గొన్న మరిడిమాంబ ఆలయ కమిటీ సభ్యులు

## సిరుల స్వామికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారమై.. సింహగిరిపై కొలువైన అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులు చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

## అప్పన్న సన్నిధిలో గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో ఆదివారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై ఆశీనులు చేశారు. తులసిదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవిందరాజ స్వామికి ప్రదక్షిణలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## హద్దు దాటితే పీడీ చట్టం ప్రయోగం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు హద్దు దాటితే పీడీ చట్టం ప్రయోగిస్తామని సీఐ కె.వి.సతీశ్ కుమార్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర చరిత్రను విడిచిపెట్టి మంచి మార్గంలో నడవాలని సీఐ సూచించారు. నేరస్థులకు సహకరించినా, ఆశ్రయం కల్పించినా, పరిచయాలు కొనసాగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ వేడుక

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం జెడ్పీ పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ వేడుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వారంతా పాఠశాలలోని సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు ప్రారంభించారు. తమ కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను ఒకరినొకరు తెలుసుకున్నారు. అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు కె.వి.అప్పారావు, జగన్నాథం, శ్రీనివాస్‌లను సత్కరించారు. అనంతరం ఆటపాటల్లో మునిగితేలారు.

1997-98 పదో తరగతి విద్యార్థులు

## పిచ్చి మొక్కలకు ఆవాసంగా లారీ

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి రైల్వేస్టేషన్ రహదారిలోని ఓ శిథిల వాహనం పిచ్చి మొక్కలు, పాములకు ఆవాసంగా మారింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే కీలక రహదారిలో ఈ వాహనం 15 ఏళ్లుగా అక్కడే ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని పలువురు వాపోతున్నారు. పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ నేరానికి సంబంధించి 2010లో ఈ లారీని స్వాధీనం చేసుకుని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద రహదారి పక్కన ఉంచారు. ఆ వాహనం ప్రస్తుతం పూర్తి తుక్కుగా మారింది. లారీలో పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు పెరిగిపోయి పాములు, విష కీటకాలకు ఆవాసంగా మారింది. ఇదే ప్రాంతంలో సీహెచ్‌సీ, వెలుగు కార్యాలయం, వ్యవసాయ, విద్యాశాఖ మండల కార్యాలయాలున్నాయి. ఈ దారి గుండా రైల్వేస్టేషన్‌కు, తహసీల్దార్, విద్యుత్తు శాఖ కార్యాలయానికి వెళ్లాలి. ఇంతటి కీలకమైన రహదారిలో ఈ వాహనం ఉండటం వల్ల తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఈ వాహనాన్ని మరోచోటకు తరలించే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

లారీ వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

## విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలోని విద్యా వికాస కేంద్రాల నిర్వాహకుల శిక్షణ కార్యక్రమం ఆదివారం పెందుర్తిలోని క్రైట్స్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆవరణలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులు విద్యార్థులకు ఎలాంటి అంశాలపై తర్ఫీదు ఇవ్వాలి, ఏ విధంగా బోధించాలి అనే అంశాలపై రిసోర్స్‌పర్సన్లు అవగాహన కల్పించారు. శిబిరంలో క్రైట్స్ సంస్థ అధినేత గొర్లె రామునాయుడు పాల్గొని శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. రాష్ట్ర ఎడ్యుకేషన్ ప్రాజెక్టు మేనేజర్ ప్రశాంత్, జిల్లా కోఆర్డినేటర్లు వనజ, గౌరీనాయుడు, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న నిర్వాహకులు, శిక్షకులు

(c) eenadu

# భీమిలి

## సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ : ఓ భామ అయ్యో రామ
రాములమ్మ : వర్జిన్ బోయ్స్
తాతా : కుబేర
సప్తగిరి: 3బీహెచ్‌కే

## విధిగా శిరస్త్రాణం ధరించాలి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనదారులు విధిగా శిరస్త్రాణం ధరించాలని, తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని పీఎంపాలెం ట్రాఫిక్ ఎస్సై జి.ప్రసాద్ వాహనదారులకు సూచించారు. సీపీ శంఖబ్రతబాగ్చీ ఆదేశాల మేరకు ఆదివారం పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి శిరస్త్రాణం ధరించక పోవడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అలాగే వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి వాహనదారులతో చెల్లింపులు చేయించారు.

## ఎముకల సమస్యలపై ఉచిత సేవలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: ఎముకలకు సంబంధించిన సమస్యలపై భీమిలిలో పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కృషి ఆర్థోపెడిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు బి.ఎన్.సుబ్బారావు పేర్కొన్నారు. నగరంలో గత కొంత కాలంగా పని చేస్తున్న సొసైటీ బ్రాంచిను భీమిలిలో ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమిలి కేంద్రంలో వైద్య సిబ్బంది రోగులకు ప్రాథమిక వైద్యం చేసి శస్త్రచికిత్సలకు విశాఖలో గుర్తించిన ఆసుపత్రులకు పంపిస్తారు. ఈ సందర్భంగా సొసైటీ బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డా.ఎన్.కిరణ్, కళా సాహితీ అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్ వర్మ, ఫోరం బెటర్ భీమిలి అధ్యక్షుడు ఆర్.బి.కృష్ణమూర్తి, ఓఎస్డీ ఫౌండేషన్ అధ్యక్షుడు డి.శివ పాల్గొన్నారు.

బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

## మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: ఎండాడ రామాలయానికి వెళ్లే దారిలో ఇరువైపులా దుకాణాలు పెట్టి రోడ్డు ఆక్రమణకు పాల్పడుతున్నారు. – స్కైలైన్ అపార్ట్‌మెంట్ వాసులు ✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. – కనకమహాలక్ష్మి, జెడ్సీ

?: గణేష్‌నగర్ (ఎండాడ) నుంచి దసపల్లా లేఅవుట్ దారిలో పలుచోట్ల మంచినీటి పైప్‌లైన్ మరమ్మతులకు గురై గోతులు పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. – రవివర్మ, దసపల్లా లేఅవుట్ ✓: తవ్విన గోతులు పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, ఏఈ

?: రామాలయం వీధి (పీఎంపాలెం)లో ఎంఐజీ గృహ సముదాయాల్లో రోడ్డు గతుకులు పడి అధ్వానంగా ఉంది. – పీఎంపాలెం వాసులు ✓: త్వరలో రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – కనకమహాలక్ష్మి, జెడ్సీ

?: ఎండాడ పెట్రోల్ బంక్ సమీపంలో భారీ వాహనాల పార్కింగ్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయి. – చక్రి, ప్రయాణికుడు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – కె.వి.ఎస్.ఎన్ ప్రసాద్, ఆరిలోవ ట్రాఫిక్ సీఐ

## ప్రతి రూపాయి తెలిసేలా..

### మెప్మాలో పారదర్శకతకు కూటమి జై

పీఎం పాలెం, న్యూస్‌టుడే: మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలను పెంచడంతో పాటు అనేక రాయితీలను కల్పించింది. ప్రస్తుతం డ్వాక్రా మహిళలకు రుణాల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో పూర్తి పారదర్శకత, సత్వర సేవలు అందేలా తాజాగా 'డిజిటల్' విధానాన్ని తీసుకొచ్చింది.

ఆర్పీలకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసేలా...:** స్వయం సహాయక సంఘాలకు అందించే సేవల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు జోన్-2 పరిధిలోని వార్డుల వారీగా సంఘాలను పర్యవేక్షించే రిసోర్సుపర్సన్ (ఆర్పీ)లకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. గతంలో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించిన కూటమి ప్రభుత్వం వాటికి చెక్ పెడుతూ ఈ చర్యలు తీసుకోవడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

★ **నగదు పక్కదారి పట్టకుండా:** గతంలో సంఘాల్లోని సభ్యులు, ఇతర వివరాలు సరిగ్గా నమోదయ్యేవి కావు. దీంతో పొదుపు సొమ్ము, బ్యాంకు లింకేజీ రుణాల నగదు పక్కదారి పట్టిన సంఘటనలు అనేకం. ఇకపై మొబైల్ కీపింగ్ విధానంలో సంఘాల్లోని మహిళల వ్యక్తిగత, బృంద రుణాలు, ఎంత ఆర్థిక లబ్ధి చేకూరింది, ఎంత చెల్లించారనే వివరాలు సభ్యులంతా తెలుసుకోవచ్చు. నెలవారీ సమావేశాల వివరాలు, కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటు ఇలా అన్నీ ఆన్‌లైన్‌లో ఉంటాయి. ట్యాబ్‌ల ద్వారా యాప్‌ల్లో సంఘాలకు సంబంధించిన లావాదేవీలు అనుసంధానం చేయడంతో ప్రతి రూపాయి గురించి సభ్యులకు తెలుసుకునే అవకాశం కల్పించారు.

★ జోన్-2 పరిధిలోని 5 నుంచి 13 వార్డుల్లో మొత్తం 4,560 స్వయం సహాయక సంఘాల్లో 45,600 మంది సభ్యులుగా ఉన్నారు. ఇందులో 125 మంది రిసోర్స్‌పర్సన్‌లకు ట్యాబ్‌లు అందజేశారు.

**ఎంతో ప్రయోజనకరం:** మెప్మా ఆధ్వర్యంలో పని చేసే రిసోర్స్ పర్సన్‌లకు ట్యాబ్‌లు పంపిణీ చేశాం. వీటి వినియోగం, వివరాల నమోదు తదితరాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రుణాల పంపిణీ, రికవరీ అంతా పారదర్శకంగా ఉంటుంది. దీంతో డ్వాక్రా మహిళలకు ఎంతో మేలు జరుగుతుంది.
– వై.వై.శ్రీరామ్ (జోన్-2, ఏపీడీ)

## నృత్య ప్రదర్శనలు అదరహో

నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర) కళావేదికపై ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులకు అదరహో అనిపించాయి. నగరానికి చెందిన సిద్ధేంద్ర యోగి నాట్యాలయం చిన్నారులు ఆకాంక్ష, మౌనిక, ప్రజ్ఞ, చిన్నారి, రాజీ, సంజన, మన్విత, నవ్యలు వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. వీటికి మోహనలక్ష్మి దర్శకత్వం వహించగా స్థానిక పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి పర్యవేక్షించారు.

## పాత నేరస్థులపై నిఘా

పీఎంపాలెం, న్యూస్‌టుడే: వివిధ చోరీ ఘటనల్లో సంబంధాలున్న పాత నేరస్థుల కదలికలపై నిరంతరం దృష్టి సారిస్తున్నామని పీఎంపాలెం నేర విభాగం ఎస్సై ఆర్.శ్రీనివాసరావు అన్నారు. సీఐ బి.ఎస్.ఎస్.ప్రకాష్ ఆదేశాలతో ఆదివారం స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాత నేరస్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏదైనా నేర ఘటనలో మారోమారు హస్తం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అంతా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై ఆర్.శ్రీనివాసరావు

## స్పందనకు వందనం

### విద్యుత్తు చౌర్యం కట్టడి

ఆనందపురం, న్యూస్‌టుడే: పెద్దిపాలెం పంచాయతీ పరిధి యర్రకందివారి కళ్లాలు గ్రామంలో విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్నట్లు శనివారం 'ఈనాడు'లో 'పెద్దిపాలెంలో విద్యుత్తు చౌర్యం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్తు చౌర్యం చేస్తున్నవారిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఏఈ మండల అప్పలనాయుడు తెలిపారు.

## నీటి బొట్టు ప్రాధాన్యం.. పట్టని వైనం

నీరు ప్రవహించడంతో ఏర్పడిన గొయ్యి

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం - నీళ్లకుండీలు (సింహాచలం) మార్గంలో ప్రాధాన్య పాఠశాల వద్ద ఎంవీఎస్ పథకం (మల్టీ విలేజ్ వాటర్ స్కీం) ప్రధాన పైపులైన్ మరమ్మతులకు గురై నీరు వృథాగా పోతోంది. నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. నిత్యం వేలాది లీటర్ల మంచి నీరు వృథాగా పోతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో అక్కడే గుంత సైతం ఏర్పడటంతో వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టి రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

## కూర్చొన్న చోట.. దుర్వాసనకు చోటు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలస ఫుట్‌బాల్ మైదానం, లేబర్ వెల్ఫేర్ సెంటర్, చింతచెట్టు ప్రాంతాల్లోని చెత్త డబ్బాలను బహిరంగ ప్రదేశాల్లో వదిలేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం వేళ పలువురు సీనియర్ సిటిజన్లు, వెటరన్ క్రీడాకారులు ఇక్కడ ఏర్పాటు చేసిన బల్లలపై విశ్రాంతి తీసుకునేందుకు నిత్యం వస్తుంటారు. చెత్తను ఎత్తే డబ్బాలను ఆ బెంచీల వద్ద ఉంచడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వాటిని వినియోగించాక ఇబ్బంది లేకుండా దూరంగా శానిటేషన్ కార్యాలయంలో భద్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

బల్లల వద్ద పడేసిన చెత్త డబ్బాలు

## అల్లుకున్న నిర్లక్ష్యం

భీమిలి ఆర్డీవో కార్యాలయం బోర్డు చుట్టూ తీగలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ఆర్డీవో కార్యాలయం నామదేయ బోర్డుపై అక్షరాలు కనిపించకుండా తీగలు అల్లుకున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం, విశాఖ రూరల్, విశాఖ అర్బన్ తహసీల్దారు కార్యాలయాల పరిధిలోని వారు రెవెన్యూ సేవల కోసం ఇక్కడికి వస్తుంటారు. ఇంత ప్రాధాన్యమున్న కార్యాలయాన్ని తెలియజేసే బోర్డు మీదకు పాదులు వ్యాపించి అధ్వానంగా దర్శనమిస్తున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి

మధురవాడ, న్యూస్‌టుడే: ప్రకృతి వనరులు, సమస్త జీవరాశులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాలల హక్కుల పరిరక్షణ సమితి (సీఆర్‌పీఎఫ్) రాష్ట్ర కో-కన్వీనర్ విశాలాక్షి అన్నారు. మధురవాడ పరిధి మల్లయ్యపాలెంలో 'ధాత్రి ఫౌండేషన్' కార్యాలయం వద్ద గ్రీన్ క్లైమెట్ బృందం ఎన్జీవో ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. విరివిగా మొక్కలు నాటి పర్యవేక్షించాలని, పక్షులకు ఆహారం, నీరు అందించాలన్నారు. ప్లాస్టిక్ అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులు వినూత్న పద్ధతిలో ప్రదర్శన ఇచ్చారు. ధాత్రి ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ దీనబంధు, గ్రీన్ క్లైమెట్ బృందం ఎన్జీవో వ్యవస్థాపకుడు జె.వి.రత్నం, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం తెలియజేస్తూ విద్యార్థుల ప్రదర్శన

## వైకాపా విస్తృత స్థాయి సమావేశం

మధురవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైకాపా భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఎండాడ పనోరమహిల్స్ సమీప వైకాపా కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి అంతా సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ, అనకాపల్లి వైకాపా జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు, గుడివాడ అమర్‌నాథ్, కదిరి బాబూరావు, కరణం ధర్మశ్రీ, పి.హనుమంతు, గుడ్ల పోలిరెడ్డి, పోతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ట్రిపుల్‌ఐటీకి ఎంపిక

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని **నాయన కావ్య** దివ్యాంగుల కేటగిరీలో శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీకి ఎంపికైంది. ఆమెది మధురవాడలోని స్వతంత్రనగర్. తల్లి కనకమహాలక్ష్మి రోజూ పాఠశాలకు తీసుకెళ్లి సాయంత్రం తిరిగి తీసుకొచ్చేవారు. పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ జి.అచ్యుతరావు, ఉపాధ్యాయులు సీహెచ్.రవికృష్ణ బాలికను అభినందించారు.

## అస్పష్టత బోర్డు.. తొలగించని మొక్కలు

### అక్రమార్కులకు అడ్డుకట్ట పడేదెలా?

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం మండలం శొంఠ్యాం రెవెన్యూ గ్రామంలో అక్రమార్కులు పాగా వేశారు. ప్రభుత్వ భూమిలోకి దర్జాగా చొరబడినా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. రెండు నెలల క్రితం కొండ చెరువులో నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వి ప్రైవేటు లేఅవుట్‌కు తరలించినా ఇంత వరకు చర్యలు లేవు. సర్వేనెంబరు 1లోని ప్రభుత్వ భూమిలో నేలగిరి మొక్కలు నాటినా తొలగించే ప్రక్రియ చేపట్టలేదు. ఈ నెల 10న 'ఈనాడు'లో 'నాడు కాలనీ స్థలం.. నేడు సాగు భూమి' శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో మొక్కుబడిగా చిన్నపాటి హెచ్చరిక బోర్డు పెట్టి మమా అనిపించేశారు. రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతం నుంచి వెళ్లగానే మొక్కలకు నీళ్లు పోయడం కొసమెరుపు. ఇక్కడికి పశువులు రాకుండా ఓ కాపరిని పెట్టి మరీ వచ్చినవారికి తమ భూమిగా చెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని అమ్మకానికి సైతం మంతనాలు జరుపుతున్నట్లు చర్చ నడుస్తోంది.

స్పష్టత లేకుండా ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

★ మరోవైపు ప్రభుత్వ వెబ్‌ల్యాండ్‌లో ఆ సర్వేనెంబరులో ఎటువంటి మార్పులు చేయలేదు. ఇప్పటి వరకు ఎవరైనా ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటినా, నిర్మాణాలు చేసినా వాటిని తొలగించిన తర్వాత ఆక్రమించిన ప్రాంతాన్ని బట్టి ఒకటి నుంచి రెండు హెచ్చరిక బోర్డులు పెట్టేవారు. ఇప్పుడు ప్రభుత్వ హెచ్చరిక బోర్డు అన్న విషయం మినహా అందులో వివరాలు లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. గ్రామ అవసరాలకు వినియోగించాల్సిన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆనందపురం తహసీల్దార్ శ్రీనుబాబు వద్ద ప్రస్తావించగా పరిశీలించి మొక్కలను పూర్తిగా తొలగించడంతో పాటు వివరాలతో కూడిన ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

## ప్రాధాన్యత క్రమంలో హామీలన్నీ అమలు చేస్తాం

మధురవాడ, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రాధాన్యత క్రమంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ ఏడోవార్డు డాక్‌యార్డు కాలనీలో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ తదితరులతో కలిసి ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు 'తల్లికి వందనం' పథకంలో భాగంగా ఇంట్లో ఉన్న పిల్లలందరికీ నగదు వచ్చిందని చెప్పి ప్రభుత్వ పాలనపై సంతోషం వ్యక్తం చేశారు. కాలనీలో ఓ నిరుపేద ఇంటి స్లాబ్ దెబ్బతిని వర్షానికి నీరు లీకవుతోందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరడంతో సమస్య పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. కూటమి నాయకులు పిళ్లా వెంకట్రావు, మొల్లి లక్ష్మణరావు, కానూరి అచ్యుతరావు, నాగోతి సూర్యప్రకాష్, పిళ్లా రాము, మామిడి దుర్గారావు, వాండ్రాసి అప్పలరాజు, గరే గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

## కుబేర చిత్ర పైరసీ అడ్డగింత

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలసలోని తిరుమల కళాశాల హాస్టల్ ఆవరణలో భారీ తెరపై ప్రదర్శించిన కుబేర చిత్ర పైరసీని తగరపువలస తాతా థియేటరు యాజమాన్యం ఆదివారం రాత్రి అడ్డుకుంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రొజెక్టరు ద్వారా తెరపై చిత్రాన్ని ప్రదర్శిస్తున్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ ప్రతినిధులు హాస్టల్‌కు చేరుకుని కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఆ సమయంలో దాదాపు 1000 మందికి పైగా విద్యార్థులు తెరపై సినిమాను వీక్షిస్తున్నారు. థియేటర్ యజమాని గోపీకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని ప్రొజెక్టరును, తెరను స్వాధీనం చేసుకున్నారు. ఓ దశలో థియేటర్, కళాశాల ప్రతినిధులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సుమారు రెండు గంటల పాటు అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

## 'విద్యుత్తు స్మార్ట్ మీటర్లతో ఆర్థిక భారం'

కొమ్మాది, న్యూస్‌టుడే: స్మార్ట్‌మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. 5వ వార్డులో వివేకానందకాలనీ, ముత్యాలమ్మకాలనీ తదితర కొండవాలు ప్రాంతాల్లో నాయకులు డి.అప్పలరాజు నేతృత్వంలో కరపత్రాలు పంచుతూ నినాదాలు చేశారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్తు ప్రైవేటీకరణను వ్యతిరేకించిన తెదేపా, జనసేన పార్టీలు అధికారంలోకి వచ్చాక వాటి అమలుకే ప్రయత్నిస్తున్నాయన్నారు. దీంతో ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జి.కుమారి, ఎన్.పూజిత, టి.అప్పలనరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: దబ్బంద టిడ్కో గృహాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం దబ్బంద టిడ్కో వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. దబ్బంద టిడ్కోకు మౌలిక సదుపాయాలు, వీధి దీపాలు, మంచినీటి వసతి, రాకపోకలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈశ్వరరావు, ఎస్.గోవింద్, నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకాలనీలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

## బోటింగ్ సిబ్బందికి కౌన్సెలింగ్

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏపీటీడీసీ స్పీడు బోటు డ్రైవర్లు, తదితర సిబ్బందికి మెరైన్ పోలీసు స్టేషన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సముద్రంలో బోట్లు విన్యసించే సందర్భాల్లో పాటించాల్సిన భద్రతా విధానాలు, పర్యాటకుల పట్ల వ్యవహరించాల్సిన తీరు వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.

డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న సీఐ శ్రీనివాసరావు

## అప్పన్న సన్నిధిలో ఘనంగా గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవాలయంలో ఆదివారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై ఆశీనులు చేశారు. తులసిదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు.

## ఫుట్‌బాల్ క్రీడాకారులకు శిక్షణ ప్రారంభం

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: ఆంధ్ర రాష్ట్ర అండర్-16 ఫుట్‌బాల్ జట్టుకు శిక్షణ తరగతులను చిట్టివలస బంతాట క్రీడా మైదానంలో ఆదివారం ప్రారంభించారు. ఫుట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి అక్కరమాని చినబాబు, ఉపాధ్యక్షులు రాజారావు, సలహాదారు కోలా చంద్రశేఖర్ మాట్లాడారు. ఈనెల 22వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈనెల 26న మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో జరిగే జాతీయస్థాయి అండర్-16 పోటీల్లో ఇక్కడ శిక్షణ పొందిన జట్టు పాల్గొంటుందన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు, తదితరులు

## బంగారు స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారమై.. సింహగిరిపై కొలువైన అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులు చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతా మూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

అలంకరణలో స్వామి, అమ్మవార్లు.. నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

## జీవీపీలో ముగిసిన 'టెక్‌ఫెస్ట్'

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాలలోని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ), స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో సాంకేతిక నైపుణ్య సంబంధిత అంశాలపై రెండు రోజుల పాటు నిర్వహించిన 'టెక్‌ఫెస్ట్' ఆదివారంతో ముగిసింది. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.ఎస్.బోస్, డైరెక్టర్ ప్రొఫెసర్ పి.వి.వినయ్, చాప్టర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రవతి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. నైపుణ్యాల పెంపు, బృందాలకు నాయకత్వం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా రంగ నిపుణులు వీఎల్‌పీ లాల్, హరికృష్ణప్రసాద్, ఉదయ్‌కుమార్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో 'సుపరిపాలన - తొలి అడుగు' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 8వ వార్డు తెదేపా ప్రధాన కార్యదర్శి బి.దొరబాబు, సీహెచ్.సన్యాసిరావు, కె.ఎల్లయ్యరెడ్డి తదితర నాయకులు ఇంటింటికెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కె.ముత్యాలరెడ్డి, పోలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసుడి సన్నిధిలో సుదర్శన హోమం

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఉప దేవాలయం శ్రీవేంకటేశ్వర స్వామి కోవెలలో ఆదివారం సుదర్శన హోమం సంప్రదాయబద్ధంగా జరిపారు. అర్చకులు సుదర్శన మూర్తిని ఆలయ ప్రాంగణంలోని వేదికపై ఆశీనులను చేసి హోమగుండంలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. వేద మంత్రాల నడుమ హవనం, పూర్ణాహుతి నిర్వహించారు. పుణ్యాహవాచనం జలాలతో ఆలయ ప్రదక్షిణ చేసి అంతరాలయంలో స్వామికి సమర్పణ చేశారు. భక్తులు పాల్గొని యజ్ఞ ప్రసాదం స్వీకరించారు.

## నృత్య కళా.. ప్రతిభ భళా

నృత్య ప్రదర్శన

మధురవాడ, న్యూస్‌టుడే: నేటి పోటీ ప్రపంచంలో పిల్లలు, యువత ఆధునిక పద్ధతులు, విధానాల వైపు వడివడిగా అడుగులు వేస్తున్నారు. కొంత మంది పాశ్చాత్య సంస్కృతిపై మక్కువ చూపుతూ మన సంస్కృతి సంప్రదాయాలకు జీవం పోస్తున్నారు. మధురవాడకు చెందిన బాలిక కొప్పాక శ్రీశ్రేష్ఠ చిన్ననాటి నుంచి మక్కువతో చదువుతో పాటు నాట్యంలో చక్కగా రాణిస్తోంది. కాలికి గజ్జె కట్టి అద్భుతమనిపించేలా పతకాల వేట సాగిస్తోంది. ఇటీవల చెన్నైలో కూచిపూడి నృత్య ప్రదర్శన విభాగానికి సంబంధించి ఏపీ నుంచి సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు అందుకుంది.

★ కె.జి.ఎన్.మూర్తి, లక్ష్మీదీపిక దంపతుల కుమార్తె శ్రీశ్రేష్ఠ విశాఖ వ్యాలీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఆరేళ్ల వయసులో నగరంలోని చందన డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు గురువు కూచిపూడి నాగ చందన వద్ద నృత్యంలో అరంగేట్రం చేసింది. ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 400కి పైగా ప్రదర్శనలతో ఎన్నో అవార్డులు సొంతం చేసుకుంది. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో భరత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కూచిపూడి కళా వైభవం మహా బృంద నృత్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు దక్కించుకుంది. హైదరాబాద్ స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుమల, శిర్డీ వంటి అనేక ఆలయాల వేదికలపై అద్వితీయ ప్రతిభతో ఆకట్టుకుంది. తెలంగాణ, ఒడిశా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లోనూ ప్రదర్శనలిచ్చింది.

★ **దక్కించుకున్న అవార్డులు:** 2022 నవంబర్‌లో మలేషియాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో బహుమతి అందుకుంది. కల్చరల్ కాన్‌క్లేవ్-2024 పేరుతో బ్యాంకాక్‌లోనూ అంతర్జాతీయ ప్రదర్శనతో ఆకట్టుకుంది. సత్యభామ బాల పురస్కార్ (2024), నర్తన బాల (2024), ఉత్తమ నృత్య కళాకారిణిగా మ్యాజిక్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు (2024), లాస్య మయూరి, కళాశ్రేయ్ మంచ్, నృత్య ప్రవాహం, శ్రీగరుడ, అభినయ నృత్య భారతి, కళా సౌరభ, నాట్య కళానంది తదితర వందలాది అవార్డులను కైవసం చేసుకుని అందరి మన్ననలు అందుకుంది.



## పోటీ పరీక్షల్లో చురుగ్గా పాల్గొనాలి

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్ననాటి నుంచే అన్ని పోటీ పరీక్షల్లో చురుగ్గా పాల్గొనాలని భీమిలి ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టరు చిరంజీవి అన్నారు. ఫ్రెండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న జాతీయ ఉపకారవేతన పరీక్షల ఉచిత శిక్షణ కార్యక్రమానికి ఆదివారం హాజరై మాట్లాడారు. ఉచితంగా శిక్షణ ఇస్తూ ఎనిమిదో తరగతి విద్యార్థులు ఉపకారవేతనాలను సాధించేందుకు సహకరిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సొసైటీ అధ్యక్షులు మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి, నిర్వాహకులు

## సీతమ్మధారలో భారీ వర్షం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ నగరంలో ఆదివారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల వరకు సీతమ్మధారలో 34 మి.మీ., వర్షపాతం నమోదైంది.

## కరాటే పోటీల్లో సత్తా

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా సబ్బవరంలో శనివారం జరిగిన అంతర్రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్‌లో భీమిలి ప్రాంతానికి చెందిన బాలలు సత్తా చాటారు. కోచ్ సాయి పర్యవేక్షణలో ఆయా కేటగిరీల్లో పోటీపడిన కె.దేవాన్ష్, దివ్యాంకుశ్, పి.దివ్య దీక్ష్, ఎం.లోకేశ్‌లకు స్వర్ణ పతకాలు. రాగూర్, సన్మిత్, చరణ్‌లకు రజత పతకాలు వచ్చాయి.

గెలుపొందిన పతకాలతో బాలలు

## ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనులపై కొరడా

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఆరిలోవ పోలీసులు ఆదివారం సాయంత్రం కొరడా ఝుళిపించారు. హెల్మెట్‌లు, సీటు బెల్టులు ధరించని, అధిక లోడుతో వెళ్తున్న చోదకులకు జరిమానాలు విధించారు. చలానాలు పెండింగ్ ఉన్న చోదకులను గుర్తించి చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో జరిమానా చెల్లించి వాహనాలను తీసుకెళ్లాలని చోదకులను ఆదేశించారు. ట్రాఫిక్ ఎస్సై మురళీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ డ్రైవ్ చేపట్టారు.

# విశాఖ తూర్పు

## 9వ వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్, సంజీవ్‌నగర్ కాలనీ, హనుమంతవాక ప్రాంతాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. వార్డు తెదేపా ఇన్‌ఛార్జి బుద్ధూరి గోవింద్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని, తల్లికి వందనం పథకం రాలేదని, తదితర ఫిర్యాదులు వచ్చాయని నాయకులు తెలిపారు. నల్ల ఈశ్వరరావు, బాదరు బాలరాజు, బుద్ధూరి బాలకృష్ణ, ఒమ్మి రాజు, సిర అనంత్, శ్రీకాంత్, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎంవీపీ కాలనీ: 8008574768

మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురంకాలనీలో రహదారిపై పూడిక కుప్పలు వేసి తొలగించలేదు. రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నాం. – నాగూర్, మంగాపురంకాలనీ. ✓: సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: పెదవాల్తేరు ఆర్చి వద్ద చెత్త పేరుకుపోయింది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. – రమ, స్థానికులు, ✓: వెంటనే పారిశుద్ధ సిబ్బందిని పంపించి చెత్తను తొలగిస్తాం. – ప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు దారపాలెంలో నెల రోజులుగా 2ఎ/9, 10, 11 నెంబరు స్తంభాలకున్న వీధి దీపాలు వెలగడం లేదు. – గాయత్రి, దారపాలెం, ✓: తక్షణమే సిబ్బందిని పంపించి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. – ఎం.రామకృష్ణ, సూపర్‌వైజర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ?: పదోవార్డు రవీంద్రనగర్ చివరి బస్‌స్టాపు నుంచి గాంధీనగర్‌కు తిరిగే మలుపులో రహదారి మధ్యలో గుంతలు ఉన్నాయి. వాహనచోదకులు పడిపోతున్నారు. – పేపర్ నాయుడు, రవీంద్రనగర్, ✓: యూజీడీ మ్యాన్‌హోల్స్ కారణంగా గుంతలు పడ్డాయి. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశిస్తాం. – వెంకటరావు, ఏఈ

ఇందిరానగర్(విశాలాక్షినగర్): ?: పాతడెయిరీఫారం కూడలి నుంచి ఇందిరానగర్ వరకు ప్రధాన కాలువకు రక్షణగోడ లేదు. – పర్రి వరదరాజు, ఇందిరానగర్. ✓: ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. – శ్రీనివాస్, జీవీఎంసీ వర్క్స్ విభాగ పర్యవేక్షకుడు.

## అడుగుల సవ్వడి.. పరిమళించిన నృత్య రవళి

■ కూచిపూడి, భరతనాట్యాల్లో నగర విద్యార్థినుల ప్రతిభ

■ రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు.. అవార్డులు కైవసం



మద్దిలపాలెం, న్యూస్‌టుడే

సంప్రదాయ నృత్యాల్లో నగర విద్యార్థినులు ప్రతిభ చూపుతున్నారు. బాల్యం నుంచే ఒక పక్క చదువు..మరో పక్క నృత్యంలో రాణిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ వేదికలపై కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు ఇస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. చిన్న వయసులోనే అవార్డులు కైవసం చేసుకుంటూ శభాష్ అనిపించుకుంటున్నారు. ఇటీవల పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో జరిగిన నృత్యోత్సవాల్లో వీరి ప్రదర్శన ఆహూతులను అబ్బురపరిచింది.

### రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు

ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాకు కూచిపూడి నృత్యం అంటే ప్రాణం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలిస్తున్నా. మూడు సంవత్సరాల్లో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశా. తిరుపతిలో అవార్డు పొందా. భవిష్యత్తులో కూచిపూడి కళాకారిణిగా స్థిరపడతా. – ఎస్.హర్షిక, తగరపువలస

### భవిష్యత్తు తరాలకు తెలియజేస్తా..

బాల్యంలోనే కూచిపూడి నృత్యం నేర్చుకున్నా. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నా. నృత్యంతో చదువుకు ఎటువంటి ఆటంకం కలగడం లేదు. కూచిపూడిలో మూషిక వాహనం, శ్రీకృష్ణుడు భగవానుడు, సూర్యనారాయణ స్వామి వంటి అంశాలపై ప్రత్యేకత సాధించా. ఇప్పటికి రెండు అవార్డులు సాధించా. మరిన్ని మెలకువలు నేర్చుకుని భవిష్యత్తులో ఉత్తమ కళాకారిణిగా గుర్తింపు పొందుతా. భారతీయ కళలు చాలా గొప్పవని భావితరాలకు తెలియజేస్తా. – జి.లాస్యశ్రీ, జగదాంబ

### 35 అవార్డులు సాధించా

రెండో తరగతి చదువుతున్నప్పటి నుంచి కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నా. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చి 35 అవార్డులు సొంతం చేసుకున్నా. కూచిపూడిలో సత్యభామ పాత్ర ఎంతో గొప్పది. ఆ పాత్ర నుంచి ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకోవచ్చు. భవిష్యత్తులో విదేశాల్లో కూచిపూడి ప్రదర్శనలు ఇస్తా. నృత్య సాధనతో ఏకాగ్రత పెరిగి చదువుకు మరింత ఉపయోగపడుతుంది. – ఎం.శ్రీహిమని, లాసన్స్‌బే కాలనీ

### సత్యభామ నృత్యరూపకం ఇష్టం

ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నా. నాలుగు సంవత్సరాల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తున్నా. భవిష్యత్తులోనూ ఈ కళను కొనసాగిస్తా. సత్యభామ నృత్య రూపకం ఎంతో ఇష్టం. ఆ రూపకాన్ని పలు వేదికలపై ప్రదర్శించా. ఆహూతుల నుంచి ప్రశంసలు లభించాయి. భవిష్యత్తులో ఫ్యాషన్ డిజైనర్‌గా స్థిరపడతా. – లీలా వర్షిని.

### నృత్య సాధనతో ఎన్నో ప్రయోజనాలు

చిన్నతనం నుంచి నాకు నృత్యం అంటే ఇష్టం. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నా. రాష్ట్ర వ్యాప్తంగా కూచిపూడి నృత్యప్రదర్శనలు ప్రదర్శించి అవార్డులు కైవసం చేసుకున్నా. నృత్యంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మనసు, శరీరాన్ని అనుసంధానం చేస్తుంది. ఒక్క రోజు సాధన చేయకపోతే ఏదో కోల్పోయినట్లు అనిపిస్తుంటుంది. విద్యార్థులు చదువుతోపాటు సంప్రదాయ నృత్యాలు నేర్చుకోవాలి. – పి.సుష్మిత, గోపాలపట్నం

## కైలాసగిరి.. పర్యాటకుల సిరి

శివపార్వతుల విగ్రహాల వద్ద సెల్ఫీల సందడి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : పర్యాటక ప్రాంతమైన కైలాసగిరి ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. శివపార్వతుల విగ్రహం వద్ద, ఇతర వ్యూపాయింట్ల వద్ద పర్యాటకులు సెల్ఫీలు దిగారు. పలువురు గుర్రపు స్వారీ, సైకిల్ స్కేటింగ్, జిప్‌లైన్‌పై ఉత్సాహంగా దూసుకెళ్లారు. రోప్‌వే వద్ద రద్దీ నెలకొంది. అయితే టాయ్ ట్రైన్ మరమ్మతుల కారణంగా నిలిపివేయడంతో నిరాశ చెందారు. లోపలి వరకు వాహనాలను అనుమతించకపోవడంతో నడిచి వెళ్లలేక పలువురు ఇబ్బందులు పడ్డారు. బ్యాటరీ కార్లు తక్కువగా ఉన్నాయని, వాటి సంఖ్య పెంచాలని సందర్శకులు కోరుతున్నారు.

## నేడు ఉచిత హోమియో వైద్యశిబిరం

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : పదోవార్డు ఇందిరానగర్ ఆనందమార్గ ఆశ్రమంలో సోమవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు స్వామి సౌమ్యానంద అవధూత ఒక ప్రకటనలో తెలిపారు. మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, కీళ్లవాతం, పక్షవాతం వంటి వ్యాధులకు చికిత్స అందిస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

## ఇసుకలో క్రికెట్..భలే మజా

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వైఎంసీఏ ఎదురుగా ఉన్న తీరంలో బాలలు ఆదివారం క్రికెట్ సాధన చేస్తూ కనిపించారు. 'ఇసుకలో క్రికెట్ ఆడటం కష్టం. తరగని ఉత్సాహం ఉంటుంది. ఇటీవల స్థానికంగా క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. అందులో గెలవాలని ఇసుకలో సాధన చేస్తున్నామ'ని బాలలు తెలిపారు. దేహదారుఢ్యం పెరుగుతుందని, కాళ్లు గట్టిపడతాయని చెబుతున్నారు. చెమట కారుతున్నా ఉదయం 6 గంటల నుంచి 7.30గంటల వరకు వీరు సాధన చేశారు.

## ఫోకస్: రోడ్డు తవ్వి.. వదిలేశారు..!

ఎంవీపీకాలనీ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే

ఆళ్వార్‌దాస్ స్కూల్ ఎదురువీధిలో గుంతలు

శాటిలైట్ సిటీగా పేరున్న ఎంవీపీకాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. ముఖ్యంగా మత్స్యకారులు నివాసం ఉండే సెక్టార్-9లో భూగర్భ డ్రైనేజీకోసం గుంతలు తవ్వి వదిలేయడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. రెండు నెలల క్రితం ఆయా పనులు ప్రారంభించారు. పనులు పూర్తయిన తర్వాత గోతులను మట్టితో కప్పారు. అనంతరం రోడ్డు వేయడానికి 20 రోజుల క్రితం మళ్లీ తవ్వి వదిలేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వాహనాల పార్కింగ్‌కు అవకాశం లేకుండా పోయిందన్నారు. తక్షణం మట్టిని తొలగించి రహదారులను నిర్మించాలని కోరుతున్నారు.

## దర్పణం: నడకదారి ఛిద్రం..జర భద్రం

ఆరిలోవ, న్యూస్‌టుడే

చినగదిలి నేతాజీనగర్ సర్వీసు రోడ్డులో నడకదారి ఛిద్రమైంది. విద్యార్థులు ఈ మార్గంలో ఇబ్బందులు పడుతూ పాఠశాలలకు వెళ్తున్నారు. రోడ్డుమార్గం రద్దీగా ఉండటంతో ఇటీవల సర్వీసు రోడ్డులో నడుస్తున్న విద్యార్థిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉందని, అధికారులు వెంటనే నడకదారిని పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎటు చూసినా చెత్త కుప్పలే..!

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 17, 18 వార్డుల పరిధిలోని ఎంవీపీకాలనీ, ఆదర్శనగర్, అప్పుఘర్, టి.టి.డి. కల్యాణమండపం రహదారి మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఆదివారం వచ్చిందంటే పారిశుద్ధ్య కార్మికులు వీధుల్లో కనిపించడం లేదు. దీంతో నగరంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. అవి కుళ్లి దుర్వాసన వ్యాపించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రోజు ఒక్కపూట అయినా కార్మికులు విధులు నిర్వహిస్తే ఈ సమస్య ఉండదని చెబుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆదర్శనగర్ రహదారిలో వ్యర్థాలు

## డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

మాధవధార, న్యూస్‌టుడే: జాతీయ రహదారి బిర్లా కూడలి వద్ద ఓ కారు అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. వాహనం నడుపుతున్న వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బిర్లా కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద పలు వాహనాలు ఆగి ఉన్నాయి. అదే సమయంలో ఊర్వశి కూడలి నుంచి మురళీనగర్ వెళ్తున్న కారు చోదకుడు వాటిని గమనించకపోవడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయగా, వాహనం అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. వాహనం ముందు ప్రభుత్వ దంత వైద్యశాల సూపరింటెండెంట్ అని బోర్డు ఉంది. వాహనం నడిపిన వ్యక్తి ఎవరనేది తెలియలేదు. వాహనం ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కంచరపాలెం పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రమాదానికి గల కారణాలను నమోదు చేశారు.

## స్పందనకు వందనం

### పైపులైనుకు మరమ్మతులు

ఆరిలోవ, న్యూస్‌టుడే: 12వ వార్డు చినగదిలి కూడలి సాయిబాబా ఆలయం వద్ద ప్రధాన పైపులైను లీకవడంతో నెలలుగా తాగునీరు వృథా అవుతోందని ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి నీటి సరఫరా విభాగ ఏఈ శ్రీనివాస్ స్పందించారు. పైపులైను వాల్వు లీకవుతున్నట్లు గుర్తించారు. సిబ్బందిని పంపించి కొత్త వాల్వు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టారు.

### కాలువల్లో పూడికల తొలగింపు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 15వ వార్డు పాతవెంకోజీపాలెం, ఉమానగర్ ప్రాంతాల్లో సమస్యలు తిష్టవేశాయని ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్ స్పందించారు. ప్రధానంగా సిబ్బందితో కాలువల్లో పూడికలను తొలగించి ప్రక్షాళన చేయించారు.

### రోడ్లపై తిరిగే పశువుల స్వాధీనం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు పాతడెయిరీఫారం కూడలి నుంచి రవీంద్రనగర్ వరకు ప్రధాన రహదారిలో పశుసంచారం అధికంగా ఉండటంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆదివారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి జీవీఎంసీ పశు వైద్యాధికారి డాక్టర్ ఎన్. కిషోర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది ఆదివారం సాయంత్రం పశువులను పట్టుకుని తరలించారు.

## ముంచెత్తిన భారీ వర్షం

పెదగదిలి బీఆర్‌టీఎస్ రోడ్డులో నిలిచిన నీరు

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో నీటమునిగాయి. పెదగదిలి కూడలి వద్ద బీఆర్టీఎస్ రోడ్డు జలమయమైంది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి కొండ ప్రాంతం నుంచి వరదనీరు వచ్చి రోడ్డుపై నిలిచిపోయింది. పక్కన ఉన్న కాలువ వ్యర్థాలతో పూడిపోవడంతో నీరు వెళ్లే మార్గం లేక రోడ్డును ముంచెత్తింది.

కేఆర్ఎంకాలనీలో కొట్టుకు పోతున్న వాహనాలను పట్టుకుంటున్న స్థానికులు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ నగరంలో ఆదివారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల వరకు సీతమ్మధారలో 34 మి.మీ., పెదవాల్తేరు 26.75, ధారపాలెం 20.5, పెందుర్తి 18, కొత్తపాలెం 17, జోగువానిపాలెం 16, గాజువాక 13.25, ఆరిలోవ 12, విశాఖ గ్రామీణం 11.25, మహారాణిపేట 10.75, పెదగంట్యాడ 10.25, సింహాచలంలో 9.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

కేఆర్ఎంకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చని 23వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం 23వ వార్డులో స్వచ్ఛ ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. తడి-పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. డెంగీ, మలేరియా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మద్దిలపాలెం, రామాలయం, కేఆర్ఎంకాలనీల్లో ప్రచారం నిర్వహించారు.

రథాన్ని ప్రారంభిస్తున్న వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

## వసతిగృహంలో సౌకర్యాల పరిశీలన

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్.సత్యనారాయణ

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: వసతిగృహాల నిర్వహణను మరింత మెరుగుపర్చాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఇసుకతోటలోని బీసీ వసతిగృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భోజనాలు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమ అధికారి ఆర్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నిషేధిత గుట్కాతో పాటు, ఇతర పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఒకటో పట్టణ సీఐ జీడీ.బాబు హెచ్చరించారు. ఆదివారం ఆయన పాతనగరంలో 'సేఫ్ క్యాంపస్ జోన్' పేరిట ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఈగల్' సిబ్బందితో కలిసి స్థానిక దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకుని, వ్యాపారులను హెచ్చరించారు. ఈగల్ సిబ్బంది వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ కేసుల్లో అరెస్టయి షీట్లు ఓపెన్ చేసిన వారిని స్టేషన్‌కు రప్పించారు. సీఐ పైడయ్య మాట్లాడుతూ దందాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిత్యం నిఘా ఉంటుందని అసాంఘిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నట్లు తేలితే ఉపేక్షించమన్నారు. ప్రతి ఒక్కరు ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. నేరనియంత్రణకు సహకరించాలని, మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తు న్న సీఐ పైడయ్య

## అపూర్వ చిత్రాల్లో విలక్షణ పాత్రల 'కోట'..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుకు విశాఖతో అనుబంధం ఉంది. ఆయన నటించిన ప్రతిఘటన, కర్తవ్యం సినిమా షూటింగ్‌లు ఇక్కడే జరిగాయి. ప్రస్తుతం రామ్‌నగర్ కేర్ ఆసుపత్రి ఉన్న ప్రాంతంలో ప్రతిఘటన సినిమాను చిత్రీకరించారు. 2008లో సాగరతీరంలో రామానాయుడు సినీ స్టూడియో ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. శ్రీకాంత్ హీరోగా నటించిన గిల్లికజ్జాలు షూటింగ్‌లో పాల్గొన్నారు. సుబ్బరామిరెడ్డి సేవా పీఠం అవార్డుల వేడుక, 'తారలు దిగివచ్చిన వేళ' పేరుతో 20ఏళ్ల కిందట కళాభారతిలో నిర్వహించిన వేడుకల్లో కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

★ కోట శ్రీనివాసరావు మృతికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన సినీపరిశ్రమలో అందరి మన్నలు పొందారన్నారు. నటుడిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. సినీ రంగానికి ఆయన లేనిలోటు తీరనిదని ఫిల్మ్‌సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు.

## అలరించిన నృత్యోత్సవాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో నాట్య రవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నృత్యోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. చివరి రోజున వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 100మంది కళాకారులు ప్రతిభను ప్రదర్శించారు. జూనియర్స్, సబ్‌జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కార్యక్రమంలో వెంకటరమణ, ఉమ్మడి మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆపాత' కెమెరాలు అదరహో..!

పెదవాల్తేరు, న్యూస్‌టుడే

బీచ్‌రోడ్డు వుడాపార్కులో ఆదివారం ఉదయం వాల్తేరు ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ కెమెరా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశవిదేశాలకు చెందిన కెమెరాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. 1940 నుంచి ఇప్పటి వరకు కెమెరాల్లో వచ్చిన మార్పులపై నిర్వాహకులు అవగాహన కల్పించారు. 20 రకాలకు చెందిన 100 కెమెరాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. 1950 నాటి ట్విన్ లాండ్స్, 1960 నాటి పోల్‌రైడ్ కెమెరాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పలువురు ఆయా కెమెరాలు ఎలా పనిచేస్తాయో ఆసక్తిగా తెలుసుకున్నారు. సొసైటీ అధ్యక్షులు సేతు, కార్యదర్శి ఎం.వి.శ్రీనివాసరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు



ట్విన్‌లాండ్స్ కెమెరా

★ పోల్‌రైడ్: 1960నాటి ఈ కెమెరాతో తీసిన వెంటనే ఫొటో బయటకు వస్తుంది. అప్పట్లో వీటికి మంచి ఆదరణ ఉండేది. పర్యాటకులు ఎక్కువగా ఇలాంటి కెమెరాలు వాడేవారు.

★ ట్విన్‌లాండ్స్: 1950 నాటి కెమెరా ఇది. ఈ కెమెరా ప్రత్యేకమైనది. ఇందులో రెండు లెన్స్‌లు ఉంటాయి. ఒక లెన్స్‌లో వ్యక్తిని చూస్తూ.. మరో దాని ద్వారా ఫొటో తీస్తారు. తద్వారా ఫొటోలు స్పష్టంగా ఉండేలా చూసుకోవచ్చు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఆంధ్ర వైద్య కళాశాల, కేజీహెచ్ వైద్యులు చర్మ సంరక్షణపై అవగాహన, చర్మవ్యాధులపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఏయూ కామర్స్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు చర్మ ఆరోగ్యం ప్రాముఖ్యత, చర్మ సంబంధ వ్యాధులను ముందుగా గుర్తించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రోగ నిర్ధారణ, చికిత్స కోసం నిపుణులను సంప్రదించాలన్నారు. స్టెరాయిడ్స్ అతిగా వినియోగిస్తే కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. అశాస్త్రీయమైన చికిత్సలతో చర్మానికి హాని జరుగుతుందని వివరించారు. వైద్యులు డాక్టర్ డి.ఏడుకొండలరావు, డాక్టర్ కె.ఎస్.దివ్య, డాక్టర్ ఎస్.జాహ్నవి, డాక్టర్ జి.ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న వైద్య నిపుణులు

## బంగారు స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారమై.. సింహగిరిపై కొలువైన అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులు చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని ఏయూ ఆచార్యులు సువర్ణకుమార్ తెలిపారు. బీచ్‌రోడ్డు వుడాపార్కులో ఆదివారం ఉదయం సీషోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య సువర్ణకుమార్ మాట్లాడుతూ అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాల పాస్‌వర్డులను ఎప్పటికప్పుడు మార్చుకోవాలని సూచించారు. సీ షోర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తిరుపతిరావు, కోశాధికారి భీమారావు, సీనియర్ సిటిజన్స్ సోమేశ్వరరావు, పెద సోములు, స్వామినాయుడు తదితరులు ఆచార్య సువర్ణకుమార్‌ను సత్కరించారు.

ఆచార్య సువర్ణకుమార్‌ను సత్కరిస్తున్న సీషోర్ వాకర్స్ క్లబ్ సభ్యులు

# విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

## సినీనటుడు కోటా శ్రీనివాసరావుకు విశాఖతో అనుబంధం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుకు విశాఖతో అనుబంధం ఉంది. ఆయన నటించిన ప్రతిఘటన, కర్తవ్యం సినిమా షూటింగ్‌లు ఇక్కడే జరిగాయి. ప్రస్తుతం రామ్‌నగర్ కేర్ ఆసుపత్రి ఉన్న ప్రాంతంలో ప్రతిఘటన సినిమాను చిత్రీకరించారు. 2008లో సాగరతీరంలో రామానాయుడు సినీ స్టూడియో ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. శ్రీకాంత్ హీరోగా నటించిన గిల్లికజ్జాలు షూటింగ్‌లో పాల్గొన్నారు. సుబ్బరామిరెడ్డి సేవా పీఠం అవార్డుల వేడుక, 'తారలు దిగివచ్చిన వేళ' పేరుతో 20ఏళ్ల కిందట కళాభారతిలో నిర్వహించిన వేడుకల్లో కోటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 'ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి'

ఆందోళనలో పాల్గొన్న భీమ్‌సేన సంక్షేమ సంఘం సభ్యులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలని భీమ్ సేన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యు. రవి సిద్ధార్థ అన్నారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా... ఎస్సీ, ఎస్టీలపై మాత్రం వివక్షత కొనసాగుతూనే ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రత్యేక రుణమేళాలు నిర్వహించి.. దళితులకు ఉపాధి కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796
విశాఖ దక్షిణం: 8008574977

న్యూస్‌టుడే, జగదాంబకూడలి: ?: జీవీఎంసీ 39వ వార్డు కోటవీధి మసీదు రహదారిలోని కాలువలో వ్యర్థాలు తొలగించడం లేదు. తీవ్ర దుర్వాసన వస్తుంది. –అహ్మద్, స్థానికుడు ✓: తక్షణమే సిబ్బందితో శుభ్రత పనులు చేయిస్తాం. –వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: బాలయ్య శాస్త్రిలేఅవుట్ రాఘవేంద్ర ఆసుపత్రి రహదారి మరమ్మతులకు గురైంది. రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. – రమేశ్, స్థానికుడు ✓: మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, 14వ వార్డు, ఏఈ

మాధవధార, న్యూస్‌టుడే: ?:జీవీఎంసీ 51వ వార్డు పంజాబు హోటల్ ప్రధాన రహదారిలో గత రెండు రోజులగా వ్యర్థాలను తరలించడం లేదు. తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. – ఆర్.శ్యామలరావు, స్థానికుడు ✓: తక్షణమే సిబ్బందిని పంపించి వ్యర్థాలు తరలించేలా చూస్తాం. – హేమసుందర్, శానిటేషన్ కార్యదర్శి

## స్పందనకు వందనం

న్యూస్‌టుడే, జగదాంబకూడలి

జీవీఎంసీ 37వ వార్డు విశాఖ చేపలరేవు సమీప రహదారిపై గోతులు ఏర్పడిన సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు.

న్యూస్‌టుడే, అల్లిపురం

జీవీఎంసీ 34వ వార్డు పరిధిలో ఎక్కడికక్కడ అపరిశుభ్రత పరిసరాలతో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు స్పందించారు. తమ సిబ్బందితో శుభ్రత పనులు చేయించి, కాలువల్లో పూడికలు తీయించారు.

## కొత్తరేషన్ కార్డులు.. చిగురించిన ఆశలు

### ఆగస్టులో జారీ చేస్తామన్న ప్రభుత్వం

మాధవధార, న్యూస్‌టుడే: కొత్తగా రేషన్ కార్డులు జారీ చేస్తామన్న ప్రకటన ప్రభుత్వం నుంచి వెలువడగానే ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వచ్చాయి. గత మూడేళ్ల నుంచి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారితో సచివాలయాలు కిటకిటలాడాయి. కుటుంబ సభ్యుల విభజన, చిరునామా మార్పులు, మృతుల పేర్లు తొలగించడం, కొత్త సభ్యులను చేర్చేందుకు మే 7న తేదీ నుంచి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

సచివాలయంలో దరఖాస్తుల వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

దీంతో వార్డు సచివాలయాల్లో పలువురు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. కొత్త రేషన్ కార్డులు ఆగస్టులో ఇస్తామన్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తాజా ప్రకటనతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి.

★ **ఉత్తరం నియోజకవర్గంలో 7 వేలకు పైగా దరఖాస్తులు:** నియోజకవర్గంలోని 17 వార్డుల్లో 84 సచివాలయాలకు కొత్తగా నమోదు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు నిమిత్తం 7 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. సచివాలయాల వారీగా ఈ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైయింది. కార్డు మంజూరు, విభజన సభ్యులను చేర్చేందుకు, మృతుల పేర్లను తొలగించడానికి, సరెండర్ చేసేందుకు 21 రోజులు వ్యవధిని నిర్ణయించారు. రేషన్ కార్డు ఇస్తున్న వారి వివరాలు ఆన్‌లైన్ నుంచి సిబ్బంది లాగిన్‌కు వచ్చిన వెంటనే ఈకేవైసీ పూర్తి చేస్తున్నారు. ఆగస్టులో కార్డులు ఇస్తామని ప్రకటించడంతో ఈ పనిని త్వరత గతిన పూర్తి చేస్తున్నారు.

★ **నిరంతర ప్రక్రియ:** మన మిత్ర(వాట్సప్ గవర్నెన్స్)లోనూ రేషన్ కార్డులకు దరఖాస్తు సేవలందించనున్నట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రకటించారు. వాట్సాప్ నంబర్ 9552300009లో బియ్యం కార్డు సరెండర్, చేర్పులు, తొలగింపులు, తప్పులు సరిచేయడం, నూతన కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రక్రియకు చివరి తేదీ అనేది లేదు. దీంతో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. వివాహ ధ్రువీకరణ పత్రం, పెళ్లి ఫొటో కూడా అవసరం లేదు. అర్హులైతే 21 రోజుల్లో రేషన్ కార్డు మంజూరు చేయనున్నారు.

## పలకలు ఇలా.. అడుగు పడేదెలా..?

మూడో ప్లాట్‌ఫామ్‌పై అధ్వానంగా..., లిఫ్ట్ సమీపంలో..

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విశాఖ రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫామ్స్‌పై ఉన్న టైల్స్ పలకలు ఎక్కడికక్కడ పగిలిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హడావుడిగా రైలెక్కే వారు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. రైళ్లలో ఏసీ బోగీలకు దుప్పట్లు అందించే వాహనాలతో పాటు, పార్శిల్స్ తీసుకెళ్లే ఇనుప ట్రాలీలు, ఇతర బ్యాటరీ వాహనాలు ప్లాట్‌ఫామ్స్‌పై తిరగడంతోనే ఇలా జరుగుతోందని, పైగా అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో సమస్య తలెత్తుతోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

## సమస్యల పరిష్కారానికే 'సుపరిపాలనలో తొలి అడుగు'

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: కూటమి పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జీవీఎంసీ 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి పేర్కొన్నారు. 26వ వార్డు తెదేపా అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో 122 పోలింగ్ కేంద్రం పరిధిలో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ శ్రావణి ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. అదే విధంగా ప్రభుత్వ పనితీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెదేపా వార్డు ఉపాధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాస్, బూత్ కన్వీనర్ వరలక్ష్మి, దేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ ముక్కా శ్రావణి, నేతలు

## ఈ పార్కు.. ఆకతాయిలకు అడ్డా..!

అధ్వానంగా ఉద్యానవనం పరిసరాలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: గతంలో వార్డుల విభజన జరగక ముందు నరసింహనగర్‌లోని పార్కు 34వ వార్డులో ఉండేది. పార్కు నిర్వహణ, పరిశుభ్రం పనులన్నింటినీ పార్కులో ఉన్న వార్డు శానిటరీ కార్యాలయం విభాగం సిబ్బంది చూసుకునేవారు. నాలుగేళ్ల క్రితం వార్డుల విభజన చేపట్టిన తర్వాత నరసింహనగర్‌లోని పార్కు ప్రాంతం 14వ వార్డులోకి మిగతా ప్రాంతాలన్నీ 45వ వార్డుకి కేటాయించారు. దీంతో ఆ పార్కులో ఉన్న శానిటరీ విభాగం వారికి ఆ పార్కుకి సంబంధం లేకుండా పోయింది. 14వ వార్డు శానిటరీ కార్యాలయం సీతమ్మధారలోని తహసీల్దారు కార్యాలయం వెనకాల టి.పి.టి.కాలనీలో ఉంది. అక్కడ నుంచి ఇక్కడికి సిబ్బంది, ఇన్‌స్పెక్టర్ వచ్చేందుకు ససేమిరా అనడంతో ఉద్యానవనం నిర్వహణ కొరవడింది.

పార్కులో మద్యం సీసాలు, వ్యర్థాలు

**నిత్యం మద్యం తాగుతూ:** కొంతమంది ఆకతాయిలు సాయంత్రమైతే చాలు ఆ పార్కు వద్దకు గుంపులుగా చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పార్కు లోపల, బయట, ప్రహరీ వద్ద మద్యం, గంజాయి తాగుతుండటంతో నివాసితులు భయాందోళన చెందుతున్నారు. పిల్లలు, మహిళలు బయటకు రాలేని పరిస్థితి. రాత్రుళ్లు ఆకతాయిలు గొడవలు పడుతూ పెద్దగా కేకలు వేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని చుట్టుపక్కల వారు వాపోతున్నారు. రాత్రంతా ఇక్కడే కాలం గడుపుతున్నారని అంటున్నారు.

### కొరవడిన పర్యవేక్షణ

పోలీసులు పర్యవేక్షణ ఈ ప్రాంతంలో లేకుండా పోయింది. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించి ఈ పార్కు పరిసరాల్లో తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. వాచ్‌మెన్‌ను నియమించి పార్కును శుభ్రం చేసి మొక్కలు పెంచితే బాగుంటుంది. చిన్నవిగా ఉన్న ఇనుప గేట్లు మార్చి పెద్దవి ఏర్పాటు చేస్తే ఆకతాయిల ఆగడాలు తగ్గుతాయని చెబుతున్నారు.

## సీతమ్మధారలో భారీ వర్షం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ నగరంలో ఆదివారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల వరకు సీతమ్మధారలో 34 మి.మీ., పెదవాల్తేరు 26.75, దారపాలెం 20.5, పెందుర్తి 18, కొత్తపాలెం 17, జోగునాపాలెం 16, గాజువాక 13.25, ఆరిలోవ 12, విశాఖ గ్రామీణం 11.25, మహారాణిపేట 10.75, పెదగంట్యాడ 10.25, సింహాచలంలో 9.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వితరణ

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు పాత బస్టాండు సమీపంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయానికి విశాఖపట్నానికి చెందిన సీహెచ్.వివి కుమార్, స్వాతి (బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి) దంపతులు వెండి నామాలు, వెండి తాడు వితరణగా అందించారు. ఆదివారం ఉదయం దాత కుటుంబసభ్యులు ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, అర్చకులు రామంకు వీటిని అందజేశారు

## నేడు లలితాపీఠంలో ప్రత్యేక పూజలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లోని లలితాపీఠంలో సంకటహర చతుర్థి సందర్భంగా సోమవారం సాయంత్రం 5.30 గంటలకు గణపతికి అభిషేకం, లక్ష్మీగణపతి హోమం నిర్వహించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. విజయ గణపతికి అభిషేకం, లక్ష్మీగణపతి హోమం జరుగుతాయన్నారు. మంగళవారం ఆషాఢ మాసం బహుళ పంచమి సందర్భంగా లలితా కామేశ్వరి అమ్మవారిని శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో ఈ నెల 17న మధ్యాహ్నం అన్న ప్రసాదంగా భక్తులు స్వీకరించవచ్చునన్నారు.

## రేపు వనితా వాకర్స్ క్లబ్ వార్షిక వేడుకలు

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో మంగళవారం వనితా వాకర్స్ క్లబ్ 23వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. మహిళలకు ఇటీవల నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. సమాజ సేవలో భాగంగా వినూత్న కార్యక్రమాలు చేపడతామన్నారు.

## సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారమై.. సింహగిరిపై కొలువైన అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి ఉత్సవ వేదికపై ఆశీనులు చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

## అప్పన్న సన్నిధిలో ఘనంగా గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామివారి దేవాలయంలో ఆదివారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై ఆశీనులు చేశారు. తులసిదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవిందరాజ స్వామికి ప్రదక్షిణలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్వామికి గరుడ వాహన సేవ చేస్తున్న అర్చకులు

## వసతిగృహంలో సౌకర్యాల పరిశీలన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: వసతిగృహాల నిర్వహణను మరింత మెరుగుపర్చాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఇసుకతోటలోని బీసీ వసతిగృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భోజనాలు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమ అధికారి కె.శ్రీధరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్.సత్యనారాయణ

## దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నిషేధిత గుట్కాతో పాటు, ఇతర పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఒకటో పట్టణ సీఐ జీడీ.బాబు హెచ్చరించారు. ఆదివారం ఆయన పాతనగరంలో 'సేఫ్ క్యాంపస్ జోన్' పేరిట ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఈగల్' సిబ్బందితో కలిసి స్థానిక దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకుని, వ్యాపారులను హెచ్చరించారు. ఈగల్ సిబ్బంది వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఏర్పాటు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : 'రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్' నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం హోటల్ డాల్ఫిన్‌లో నిర్వహించారు. 2025-26 ఏడాదికి నూతన అధ్యక్షునిగా ఎస్.కామేశ్వరరావు, కార్యదర్శిగా కె.మారుతీ, కోశాధికారిగా ఎమ్.గోపాల్ ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో సభ్యులంతా ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సభ్యులు పి.శోభన్‌ప్రకాశ్, ఎన్.గాయత్రి, ఎంవీ.రాజశేఖర్, ఆర్.నీరజ తదితరులు పాల్గొన్నారు.

సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న అతిథులు

## 'రాజ్యాధికారంతోనే దళితులకు విముక్తి'

సీతంపేట, న్యూస్‌టుడే: కారంచేడు నరమేధానికి 40 ఏళ్లు అయిన సందర్భంగా విశాఖ పౌర గ్రంథాలయంలో భీమ్‌సేన్ వార్ ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కారంచేడు ఉద్యమ నేత సిర్రా నేతాజీ భగత్‌సింగ్ హాజరై మాట్లాడారు. రాజ్యాధికారంతోనే దళితులకు విముక్తి కలుగుతుందన్నారు. దళితులపై దాడులు కారంచేడుతోనే ఆగలేదని ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. దళిత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకతోటి బాబూరావు, వసంత రాజేంద్రప్రసాద్, బూసి వెంకటరావు, బొడ్డు కల్యాణ్‌రావు, ఆచార్య కోటి జాన్, టి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న భగత్‌సింగ్

## మహాసభల విజయవంతానికి పిలుపు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

ఎన్ఏడీకూడలి (బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: విజయవాడలో ఈనెల 17న నిర్వహించనున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎన్ఏడీలోని జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మహాసభల గోడపత్రిక ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు నమ్మి అప్పలరాజు మాట్లాడుతూ బీసీ మహిళలకు సబ్ కోటా, కేంద్రంలో ఓబీసీకి మంత్రిత్వశాఖ, చట్టసభలతోపాటు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు, మండల కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు, వి.ప్రసాద్, కె.ఆనందరావు, ఆర్.శ్రీనివాసరావు, ఎస్.శ్రీదేవి, యు.అప్పారావు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో భారీ వర్షం

సంగం శరత్ థియేటర్ సమీపంలో..

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖ నగరంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు కురిసిన వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. దీంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీప సంగం శరత్ థియేటర్ ఎదురుగా ఉన్న రహదారిపైకి అడుగులోతు నీరు చేరింది.

### ఎర్రిగెడ్డ పొంగింది..!

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : భారీ వర్షానికి 41వ వార్డు జ్ఞానాపురం పరిసర వీధులన్నీ జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతాలైన ద్వారకానగర్, దొండపర్తి, రైల్వే న్యూకాలనీ, ఊర్వశికూడలి, కంచరపాలెం నుంచి భారీగా చేరిన వదర నీటితో ఎర్రిగెడ్డ పొంగింది. ఆ మురుగు నీరంతా జ్ఞానాపురం పరిసరాల్లోకి చేరడంతో తీవ్ర దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

జ్ఞానాపురంలోని ఓ వీధిలో...

★ ఈ సమస్యపై స్థానికుల ఫిర్యాదుతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్పందించారు. గెడ్డ పూడికతీత పనులకు సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయని, జోన్-5 ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో పూడికతీత పనులు జరుగుతున్నాయన్నారు.

## అలరించిన హాస్యవల్లరి

నాటికలో ఓ సన్నివేశం

సీతంపేట, న్యూస్‌టుడే: విశాఖ హ్యూమర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన హాస్య లఘునాటికల కార్యక్రమం హాస్యవల్లరి అలరించింది. రావి గోపీ కృష్ణ ఆధ్వర్యంలో నటీనటులు వేసిన పలు లఘునాటికలు చూపరులను నవ్వులతో ముంచెత్తాయి. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఒకటో పట్టణ సీఐ జీడీ.బాబు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని ఒకటో పట్టణ సీఐ జీడీ.బాబు సూచించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా ఉంటుందని, నేర సంబంధిత గొడవలకు దూరంగా ఉండాలన్నారు. మరోసారి తప్పు చేసి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## తగాదాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

గురుద్వారా, న్యూస్‌టుడే: తగాదాలను ప్రోత్సహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ రౌడీషీటర్లను హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పాత పద్ధతి విడనాడాలని సూచించారు. సమాజంలో అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వీధుల్లో గ్యాంగులు నడుపుతూ సెటిల్‌మెంట్లు చేస్తే జైలుకెళ్లడం ఖాయమన్నారు. ఎస్సై చిన్నమనాయుడు పాల్గొన్నారు.

రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న సీఐ సత్యనారాయణ

## కైలాసగిరి.. పర్యాటకుల సిరి

న్యూస్‌టుడే : పర్యాటక ప్రాంతమైన కైలాసగిరి ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. శివపార్వతుల విగ్రహం వద్ద, ఇతర వ్యూపాయింట్ల వద్ద పర్యాటకులు సెల్ఫీలు దిగారు. పలువురు గుర్రపు స్వారీ, సైకి సైక్లింగ్, జిప్‌లైనర్‌పై ఉత్సాహంగా దూసుకెళ్లారు. రోప్‌వే వద్ద రద్దీ నెలకొంది. అయితే టాయ్ ట్రైన్ మరమ్మతుకు గురి కావడంపై నిరాశ చెందారు. లోపలి వరకు వాహనాలను అనుమతించకపోవడంతో నడిచి వెళ్లలేక పలువురు ఇబ్బందులు పడ్డారు. బ్యాటరీ కార్లు తక్కువగా ఉన్నాయని, వాటి సంఖ్య పెంచాలని సందర్శకులు కోరుతున్నారు.

కైలాసగిరి ముఖద్వారం వద్ద సందర్శకుల తాకిడి

## డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

మాధవధార, న్యూస్‌టుడే: జాతీయ రహదారి బిర్లా కూడలి వద్ద ఓ కారు అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. వాహనం నడుపుతున్న వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బిర్లా కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద పలు వాహనాలు ఆగి ఉన్నాయి. అదే సమయంలో ఊర్వశి కూడలి నుంచి మురళీనగర్ వెళ్తున్న కారు చోదకుడు వాటిని గమనించకపోవడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. వాహనం ముందు ప్రభుత్వ దంత వైద్యశాల సూపరింటెండెంట్ అని బోర్డు ఉంది. వాహనం నడిపిన వ్యక్తి ఎవరనేది తెలియలేదు. వాహనం ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కంచరపాలెం పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రమాదానికి గల కారణాలను నమోదు చేశారు.

## విద్యుత్తు సరఫరా అంతరాయంతో అగచాట్లు

మురళీనగర్, న్యూస్‌టుడే: బిర్లా కూడలి సమీపంలో విద్యుత్తు స్తంభం వద్ద సమస్య తలెత్తడంతో మురళీనగర్‌లోని పలు సెక్టార్లలో ఆదివారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్తు అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టడంతో 11 గంటలకు సరఫరాను పునరుద్ధరించారు. ఎప్పటికప్పుడు అంతరాయాల ఏర్పడుతున్నాయని సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

మరమ్మతులు చేస్తున్న విద్యుత్తు సిబ్బంది

(c) eenadu

**చోరీపై ముమ్మర దర్యాప్తు**

శ్రీనగర్ సమీప వెంకటేశ్వర కాలనీలో జరిగిన చోరీ ఘటనపై జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు, స్థానికులను ప్రశ్నిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు చిత్రంలో చూడొచ్చు. - న్యూస్‌టుడే, అక్కిరెడ్డిపాలెం

# గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

## బంగారు స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై కొలువైన అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవింద రాజ స్వామిని సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులు చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు.

★ శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో ఆదివారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై ఆశీనులు చేశారు. తులసీదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హాయిగా.. సాగిపోయేలా..!

### కాలనీల్లో చకచకా కల్వర్టుల నిర్మాణ పనులు

వుడాకాలనీలో ఇటీవల పూర్తయిన నిర్మాణం

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక, పెదగంట్యాడ పరిధిలోని రహదారుల మధ్యలో ఎక్కడికక్కడ శిథిలమైన కల్వర్టులు, అధ్వానంగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై నాటి వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో జనం కష్టాలు తీరలేదు.

★ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులపై దృష్టి సారించడంతో... గాజువాక జోన్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆయా పనులకు నిధులు మంజూరు కావడంతో నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి.

**క్షేత్రస్థాయి పరిశీలన:** ఇరవై వార్డుల్లో విస్తరించి ఉన్న గాజువాక నియోజకవర్గంలో కల్వర్టులు, మినీ వంతెనలు సుమారు 300పైగా శిథిలావస్థలో మగ్గుతున్నట్లు ఇంజినీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించారు.

★ కూటమి ప్రభుత్వం స్పందించి రూ.1.50కోట్ల నిధులు మంజూరు చేయడంతో జోన్ పరిధిలో శ్లాబ్ కల్వర్టులు, మినీ వంతెనలు, డ్రైనేజీ అవుట్‌లెట్ మార్గాలను పునరుద్ధరిస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..:** జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు, సీతానగరంలో మినీవంతెనలు, 73వ వార్డు వినాయకనగర్ వుడాకాలనీ, 75వ వార్డులో మరో నాలుగు చోట్ల కల్వర్టుల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇవి పూర్తయితే ముఖ్యంగా వాహనదారులకు ప్రయాణం సుగమం అవుతుందని, ఇతర సమస్యలు పరిష్కారం అవుతాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రతి వార్డులో కనీసం 5 నుంచి 8 వరకు కల్వర్టుల పునర్నిర్మాణం, మరమ్మతు పనులు జరుగుతున్నాయి.

★ పనులు జరిగే ప్రాంతంలో ప్రస్తుత రహదారి కన్నా నూతన నిర్మాణాలు ఎత్తుగా ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. వాహనదారులను హెచ్చరించేలా కల్వర్టుల వద్ద రేడియం స్టిక్కర్లు, బ్లింకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

★ ఆయా నిర్మాణాలు ఇటీవల గాజువాక జోనల్ కమిషనర్ శ్రీనివాస్ శేషాద్రి, కార్యనిర్వాహక ఇంజినీర్ అప్పారావు, ఇతర సహాయ ఇంజినీర్లు పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై గుత్తేదారులకు పలు సూచనలు ఇచ్చారు.

నడుపూరులో పనులు చేస్తున్న సిబ్బంది

## ప్లాస్టిక్ వ్యర్థం.. పర్యావరణానికి అనర్థం

జీవీఎంసీ విద్యుత్తు ఏడీఈ కార్యాలయం ఎదుట...

దర్పణం

అక్కిరెడ్డిపాలెం (నాతయ్యపాలెం), న్యూస్‌టుడే: బీహెచ్‌పీవీ నుంచి నాతయ్యపాలెం వెళ్లే సేవ మార్గంలోని విద్యుత్తు ఏడీఈ కార్యాలయం సమీప కాలువలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి... మురుగు నీరు ముందుకెళ్లడం లేదు. తీవ్ర దుర్వాసనతో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. తరచూ ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి, పలుమార్లు జేసీబీతో తొలగించినా... మళ్లీ కొద్దిరోజులకే సమస్య పునరావృతం అవుతుందని జీవీఎంసీ సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... ప్లాస్టిక్ నియంత్రణ చర్యలు పక్కాగా అమలు చేస్తే పర్యావరణానికి మేలు జరుగుతుందని పలువురు సూచిస్తున్నారు.

## నిర్వహణ లేక నిరుపయోగం..!

గాజువాకలో ఓపెన్ ఆడిటోరియం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ప్రజాధనం వెచ్చించి గాజువాక పురపాలకసంఘ సమతానగర్‌లో ఆర్భాటంగా నిర్మించిన ఓపెన్ ఆడిటోరియం నిర్వహణ చూసే వారు లేక అధ్వానంగా తయారైంది. వీఎంఆర్‌డీఏ నిధుల నుంచి సుమారు రూ.2.50 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు. ఆ తర్వాత జీవీఎంసీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అయినా... సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో గేటుకు తాళాలు వేసి వదిలేశారు. సంప్రదాయ, వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించడానికి ఎవరిని సంప్రదించాలో తెలియక స్థానికులు, సేవా సంస్థల సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఆవరణ మొత్తం చిత్తడిగా తయారైంది. ఆకతాయిలు సంచరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... ఆడిటోరియాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా సహకారంతో స్వచ్ఛత సాధ్యం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో విశాఖ నగరం మెరుగైన ర్యాంకు సాధించిందంటే.. ప్రజా సహకారం అవసరమని తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధి విశ్వేశ్వరరావు కోరారు. ఆదివారం తిరుమలనగర్‌లో స్వచ్ఛత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలంతా ప్లాస్టిక్ నియంత్రణ చర్యలు అమలు చేయడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పరమానందం, సన్యాసిరావు, రాజు, అప్పలనాయుడు, మహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

## వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యం

శంకుస్థాపనలో మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ కోటేశ్వరరావు తదితరులు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధిలో అన్ని వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం 86వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్‌తో పాటు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డు పరిధి కోళ్లఫారం రహదారిలో ప్రధాన కాలువ నిర్మాణానికి రూ.94 లక్షలు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. కూటమి పాలనలో అభివృద్ధితో పాటు, అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, నాయకులు సూర్యనారాయణ, వెంకట్రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యంగా కదిలే.. వ్యర్థాలు తరలించే..!

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ఆదివారం గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి శ్రమదానంతో శ్మశానాన్ని శుభ్రం చేశారు. ఎక్కడికక్కడ పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, తుప్పలు తొలగించారు. పేరుకుపోయిన వ్యర్థాలు తరలించారు. ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటారు. వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 40 మంది రెండు గంటల పాటు శ్రమదానం చేశారు.

శ్రమదానంలో పాల్గొన్న కార్పొరేటర్, గ్రామస్థులు

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: **సమస్య:** జీసీ రోడ్డు ప్రియదర్శినీకాలనీ సమీప రహదారుల్లో భవన నిర్మాణ వ్యర్థాలు పారబోస్తున్నారు. -శ్యామలరావు, బీసీరోడ్డు, పీపీ.నాగేశ్వరరావు, సంజీవపాలెం. **సమాధానం:** సిబ్బందిని పంపి, శుభ్రత పనులు చేయిస్తాం. -డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్య ఆరోగ్య అధికారి

?: అగనంపూడి కొత్త పెదమడక, పూడివానిపాలెంలో వీధి దీపాలు వెలగడం లేదు. -నర్సింగరావు, అగనంపూడి. ✓: పరిశీలించి, దీపాలు సరిచేయిస్తాం. -శివ, వీధి దీపాల నిర్వాహకుడు

మల్కాపురం, న్యూస్‌టుడే: ?: 62వ వార్డు దుర్గానగర్ ప్రధాన గెడ్డ పూడికతో నిండిపోయింది. మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. - తిలక్, స్థానికుడు ✓: వెంటనే సిబ్బందిని పంపించి గెడ్డలో పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - నవరత్నం, వార్డు శానిటరీ అధికారి

## కాలనీల్లో క్రిమిసంహారక చర్యలు

స్పందనకు వందనం

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక పరిధి కాలనీల్లో అపరిశుభ్రతపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. ఆదివారం సీతారాంనగర్, శివాజీపాలెం, తదితర కాలనీల్లో మురుగు కాలువలను శుభ్రం చేసి, క్రిమిసంహారక మందు చల్లారు.

## క్రీడలపై యువత ఆసక్తి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నేటి యువత ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విశాఖ నగర తెదేపా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం పెదగంట్యాడ ఉక్కు క్రీడా మైదానంలో పెంటమాంబ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-4 పేరిట ఏర్పాటు చేసిన పోటీలను ఆయన ప్రారంభించారు. నెల్లిముక్కు శెట్టిబలిజ యూత్ ఆధ్వర్యంలో సురేశ్, కుమార్, శివకుమార్ జ్ఞాపకార్థం వారి స్నేహితులు ఏర్పాటు చేసిన పోటీలు నాలుగు రోజుల పాటు జరుగుతాయన్నారు. నిర్వాసిత కాలనీల్లో యువ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని, పోటీల్లో ప్రతిభ చూపాలన్నారు.

మాట్లాడుతున్న తెదేపా ఉపాధ్యక్షుడు వెంకట రమణారెడ్డి

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఎల్లో డే వేడుకలో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

పంతులుగారిమేడ(గాజువాక), న్యూస్‌టుడే: జీవీఎంసీ 67వ వార్డు అప్పన్నకాలనీలోని ఆర్ఎస్ ప్లే స్కూల్లో ఆదివారం ఎల్లో డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పసుపు రంగు దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పక్షుల ఆకృతులు తయారు చేసి ప్రదర్శించారు. డైరెక్టర్ పాలవలస భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో స్వామి కల్యాణం

ఉక్కునగరం (స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే: శ్రవణా నక్షత్రం సందర్భంగా ఉక్కునగరం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం పంచామృత అభిషేకం, సాయంత్రం స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

ఉక్కునగరం ఆలయంలో..

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడ వాంబేకాలనీలో, 76వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

## వసతిగృహంలో సౌకర్యాల పరిశీలన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: వసతిగృహాల నిర్వహణను మరింత మెరుగుపర్చాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని ఇసుకతోటలో ఉన్న బీసీ వసతిగృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భోజనాలు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహంలో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమ అధికారి ఆర్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి.. దూసుకెళ్లి..

మధురవాడ, న్యూస్‌టుడే: జాతీయ రహదారి బిర్లా కూడలి వద్ద ఓ కారు అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఆదివారం బిర్లా కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద పలు వాహనాలు ఆగి ఉన్నాయి. అదే సమయంలో కారు ఆర్టీసీకాంప్లెక్స్ నుంచి మురళీనగర్ వెళ్తున్న వాహనాలను గమనించకపోవడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. వాహనం ముందు ప్రభుత్వ ఛాతి వైద్యశాల సూపరింటెండెంట్ అని బోర్డు ఉంది. వాహనం నడిపిన వ్యక్తి ఎవరనేది తెలియలేదు. ఈ ఘటనలో వాహనం ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కంచరపాలెం పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, వివరాలు నమోదు చేశారు.

## అప్రమత్తతతో నేత్ర వ్యాధులు దూరం

గాజువాక, న్యూస్‌టుడే : నేత్ర సంబంధిత వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం వుడాకాలనీ వేద్ నేత్రాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వైద్యులు పంకజ్, కీర్తి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

వుడాకాలనీ శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

## 'ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి'

కార్పొరేషన్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలపై దాడులు అరికట్టాలని భీమ్‌సేన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యు.రవి సిద్ధార్థ అన్నారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా... ఎస్సీ, ఎస్టీలపై మాత్రం వివక్షత కొనసాగుతూనే ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రత్యేక రుణమేళాలు నిర్వహించి.. దళితులకు ఉపాధి కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలన్నారు

## శ్రీరామ్‌నగర్ కాలనీలో చోరీ

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జాతీయ రహదారి లంకెలపాలెం శివారు శ్రీరామ్‌నగర్ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. దీనికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరామ్‌నగర్ కాలనీలోని ఒక అద్దె ఇంట్లో డి.విమలకుమారి నివాసం ఉంటోంది. ఆమె శనివారం సాయంత్రం తలుపులకు తాళాలు వేసుకుని అదే కాలనీలో నివాసముంటున్న పెద్దకుమారుడు ఇంటికి వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం తిరిగి ఇంటికొచ్చి చూసేసరికి తాళాలు పగలుగొట్టి ఉండటంతో పాటు లోపలు ఉన్న బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని 4 తులాల బంగారు ఆభరణాలతో పాటు 20 తులాల వెండి వస్తువులు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలితో మాట్లాడి వివరాలు సేకరించారు. క్లూస్‌టీం చేరుకుని వేలిముద్రలు సేకరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పక్కనే మరో ఇంటికి చెందిన తాళాలను దుండగలు పగలుగొట్టినా.. అక్కడ ఎలాంటి చోరీ జరగలేదని స్థానికులు తెలిపారు.

## 'రాజ్యాధికారంతోనే దళితులకు విముక్తి'

సీతంపేట, న్యూస్‌టుడే: కారంచేడు ఘటనకు 40 ఏళ్లు అయిన సందర్భంగా విశాఖ పౌర గ్రంథాలయంలో భీమ్‌సేన్ వార్ ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కారంచేడు ఉద్యమ నేత సిర్రా నేతాజీ భగత్‌సింగ్ హాజరై మాట్లాడారు. రాజ్యాధికారంతోనే దళితులకు విముక్తి కలుగుతుందన్నారు. దళితులపై దాడులు కారంచేడుతోనే ఆగలేదని ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. దళిత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకతోటి బాబూరావు, వసంత రాజేంద్రప్రసాద్, బూసి వెంకటరావు, బొడ్డు కల్యాణ్‌రావు, ఆచార్య కోటి జాన్, టి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యాలయంలో వినతుల స్వీకరణ

గాజువాక, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల సత్వర పరిష్కారంలో భాగంగా ఆదివారం గాజువాక తెదేపా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా పాల్గొని... వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి సమస్యల్ని పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

## రైతుబజార్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రైతుబజార్ల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా గోపాలపట్నం రైతుబజార్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ, స్టాల్స్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. నేలపై కూరగాయలు విక్రయించే రైతులకు కొత్త షెడ్ల నిర్మాణం చేపట్టారు.

షెడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

## మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

ఎన్ఏడీకూడలి (బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: విజయవాడలో ఈనెల 17న నిర్వహించనున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎన్ఏడీలోని జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మహాసభల గోడపత్రిక ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు నమ్మి అప్పలరాజు మాట్లాడుతూ బీసీ మహిళలకు సబ్ కోటా, కేంద్రంలో ఓబీసీకి మంత్రిత్వశాఖ, చట్టసభలతోపాటు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు, మండల కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు, వి.ప్రసాద్, కె.ఆనందరావు, ఆర్.శ్రీనివాసరావు, ఎస్.శ్రీదేవి, యు.అప్పారావు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కూలిన పాఠశాల ప్రహరీ..

# పట్టించుకోరా..!

మల్కాపురం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ కూలిపోయి నెల లైనా ఇప్పటికీ శిథిలాలను తొలగించ లేదని స్థానికులు వాపోతున్నారు. గోడ కూలి పక్కనే ఉన్న మురుగు కాలువపై పడినా వార్డు శానిటరీ అధికారి పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోడ శిథిలాలను తొలగించి ప్రహరీని పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పరవాడ, న్యూస్‌టుడే: అనకాపల్లి - తాడి రైల్వేస్టేషన్ మధ్య రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ పోలీసులు ఆదివారం తెలిపారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉంటాయని, ఎత్తు 5.4 అడుగులు ఉన్నాడని, పర్పుల్ కలర్ షర్టు, బ్లూజీన్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం పక్కనే సిల్వర్ కలర్ వాచ్ ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్సై కేటీఆర్ లక్ష్మి తెలిపారు.

## ధ్యానం, శాకాహారంతో ఆరోగ్యం

మాట్లాడుతున్న మేనేజింగ్ ట్రస్టీ రేవతీదేవి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : సమాజంలో ప్రతి ఒక్కరూ ధ్యాన జగత్తు, శాకాహార జగత్తు లక్ష్యం దిశగా అడుగులు వేయాలని పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రేవతీదేవి అన్నారు. ఆదివారం పెదగంట్యాడ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పత్రీజీ ఆశయాలను కొనసాగించాల్సి బాధ్యత ధ్యాన కేంద్రాల సభ్యులపై ఉందని చెప్పారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ వంశీకిరణ్, ట్రస్ట్ కార్యదర్శి ఎం.శివగణేశ్వరరావు, భాజపా మహిళా మోర్చా నాయకురాలు పద్మ, బ్రహ్మకుమారీస్ సభ్యురాలులు ప్రమీల, సీఈఓ వర్మరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా సామూహిక ధ్యానం, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

హాజరైన ధ్యాన కేంద్రాల సభ్యులు

## సీతమ్మధారలో భారీ వర్షం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ నగరంలో ఆదివారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల వరకు సీతమ్మధారలో 34 మి.మీ., పెదవాల్తేరు 26.75, ధారపాలెం 20.5, పెందుర్తి 18, కొత్తపాలెం 17, జోగువానిపాలెం 16, గాజువాక 13.25, ఆరిలోవ 12, విశాఖ గ్రామీణం 11.25, మహారాణిపేట 10.75, పెదగంట్యాడ 10.25, సింహాచలంలో 9.5 మి.మి. వర్షపాతం నమోదైంది.

## వీధి కుక్కలు బాబోయ్..

గోపాలపట్నం(ఎన్ఏడీకూడలి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 5, 8వ జోన్ల పరిధిలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా.. సైకిల్ వెళ్లినా. ద్విచక్రవాహనంపై ప్రయాణించినా.. వెంటపడి పిక్కలు పీకేస్తున్నాయి. దీంతో ప్రభుత్వాసుపత్రుల్లో కుక్కకాటు కేసుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. అయినా కుక్కల నియంత్రణకు జీవీఎంసీ చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. 91వ వార్డు నాయుడు క్వార్టర్స్, 52వ వార్డు శాంతినగర్‌లో శునకాలు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రుళ్లు అటుగా రాకపోకలు సాగించే వారిపై దాడులు చేస్తున్నాయని బాధితులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాయుడు క్వార్టర్స్‌లో కుక్కల గుంపు

## మురుగు... ముంచెత్తే...!

70వ వార్డు శ్రామికనగర్‌లో...

గాజువాక, న్యూస్‌టుడే: జీవీఎంసీ 70వ వార్డు శ్రామికనగర్‌లో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. ఎగువ నుంచి వచ్చే మురుగునీరు ముందుకెళ్లే మార్గం లేక పోవడంతో... ఆదివారం రహదారిపైకి చేరింది. తీవ్ర దుర్వాసనతో పాదచారులు, వాహనచోదలకు అవస్థలు పడ్డారు. శ్రామికనగర్‌తో పాటు, ఎర్రగడ్డకాలనీ, తాబేలుకాలనీ, శ్రీనివాసనగర్‌లో ఇదే పరిస్థితి ఉందని, అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 90వ వార్డు బాజీకూడలి నుంచి సుసర్లకాలనీ వెళ్లే రోడ్డులో బీఆర్టీఎస్ డక్(కాలువ) వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో పై ప్రాంతాల నుంచి వచ్చే మురుగు బీఆర్టీఎస్ రోడ్డుపై ప్రవహిస్తోంది. తీవ్ర దుర్వాసన వ్యాపించడంతో అటుగా రాకపోకలు సాగించే స్థానికులు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డక్‌లో పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

ఫోకస్

బాజీకూడలిలో పూడికతో నిండిన కాలువ

## నూతన కార్యవర్గం ఏర్పాటు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : 'రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్' నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం హోటల్ డాల్ఫిన్‌లో నిర్వహించారు. 2025-26 ఏడాదికి నూతన అధ్యక్షునిగా ఎస్.కామేశ్వరావు, కార్యదర్శిగా కె.మారుతీ, కోశాధికారిగా ఏఎన్.గోపాల్ ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో సభ్యులంతా ప్రమాణం చేశారు. సభ్యులు పాల్గొన్నారు.

**LOST PASSPORT**

I, SIRSAPALLI SHLAGHYA PRAHAASANA, D/o S.Srinivas resident of D.No: 24-16-2/1, Chinagantyada, Gajuwaka, lost my Passport (No.K2292929) while Travelling from my home to Chinagantyada junction. If found to anyone may Please Contact.

9849841947

**PASSPORT LOST**

I GONDESI LAKSHMANA REDDY S/o KUNCHAYYA, D.No.21-57-9 Siddeswaram RH Colony, Pedagantyada, Vizag AP-530044. I have lost my Original Passport bearing No.F7770592 while Travelling from Pedagantyada to Vizag RTC Complex by Bike on December 2024 if found anyone may Please.

Contact: 9985686525

(c) eenadu

# బొబ్బిలి వీణ.. ప్రగతి రాగం

'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' పురస్కారం

న్యూస్‌టుడే, బొబ్బిలి, ఈనాడు, విజయనగరం

గిప్పు వీణల తయారీలో కళాకారుడు

**మూ**డు శతాబ్దాల చరిత్ర కలిగిన బొబ్బిలి వీణ ప్రగతి రాగం ఆలపిస్తోంది. బొబ్బిలి కోటలో వీణ మీటితే దిల్లీ కోటలో ధ్వనించింది. దేశ విదేశాల్లో ఈ వాయిద్య పరికరం ప్రాచుర్యం పొందింది. ఈ వీణ విలక్షణ స్వరాలకు ప్రసిద్ధి చెందింది. ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) కింద కేంద్ర ప్రభుత్వ పురస్కారానికి ఎంపికైంది. రాష్ట్రంలో ఏడు జిల్లాల నుంచి ఎంపికైన వాటిలో ఇదొకటి. ఈ మేరకు దిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పురస్కారాన్ని కలెక్టర్ అంబేడ్కర్ సోమవారం అందుకోనున్నారు.

## హస్తకళ అదరహో

ఏడేళ్ల క్రితం బొబ్బిలి వీణకు భౌగోళిక గుర్తింపు వచ్చింది. బొబ్బిలి వీణ బొమ్మలతో తపాలా బిళ్లలు, నాణేలు ముద్రితమయ్యాయి. ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఈ వీణను చూసి ముచ్చటపడ్డారు. రెండేళ్ల క్రితం దిల్లీలో జరిగిన జీ-20 సదస్సు, విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్లో సైతం దీన్ని ప్రదర్శించారు. దీన్ని కేవలం పనస కలపతోనే తయారు చేస్తారు. దానివల్ల రాగం మృదువుగా ఉంటుంది. రెండు చెక్క ముక్కలను కలిపి రూపొందించే ఇతర వీణల మాదిరి కాకుండా ఒకే చెక్క నుంచి తయారు చేస్తారు. అందుకే దీన్ని ఏకంద వీణ అని పిలుస్తారు. గొల్లపల్లి ప్రాంతంలో సుమారు 300 కుటుంబాలు వందేళ్లకు పైగా వీణల తయారీతో జీవనోపాధి పొందుతున్నాయి. బాడంగి మండలం వాడాడలోనూ ప్రస్తుతం తయారవుతున్న వాటినీ బొబ్బిలి వీణలుగా పరిగణిస్తున్నారు.

## చెట్ల పెంపకానికి అడుగులు

ప్రస్తుతం పనస కలప స్థానికంగా లేక ఒడిశా నుంచి తెచ్చుకుంటున్నారు. దీనివల్ల ఖర్చు పెరుగుతోంది. కొనుగోలు చేసేవారికి కూడా భారంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉత్తరాంధ్రలో ఉపాధి పథకంలో పనస చెట్లను పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టారు. ఇది పెరిగి కలప చేతికొచ్చేందుకు సుమారు 20 ఏళ్లు పడుతుంది. అందుకే పొరుగు రాష్ట్రంలో కొనుగోలు చేసి రాయితీపై అందించాలని కళాకారులు కోరుతున్నారు. ప్రస్తుతం అడుగు రూ.800 నుంచి రూ.1,000 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక పెద్ద వీణకు 10, చిన్న వీణ తయారీకి రెండు అడుగుల కలప అవసరం. ఎమ్మెల్యే బేబినాయన అసెంబ్లీలో కూడా ఈ వీణ ప్రాధాన్యత, కళాకారుల సమస్యలు ప్రస్తావించారు.

## సకాలంలో ఇవ్వలేకపోతున్నాం..

వీణల తయారీ సంఖ్య పెరుగుతోంది. ముడిసరకు కొరతతో ఆర్డర్లు వస్తున్నా సకాలంలో ఇవ్వలేకపోతున్నాం. ప్రభుత్వం కలప డిపో ఏర్పాటు చేసి, రాయితీపై అందించాలి. ఇటీవల హస్తకళల అభివృద్ధి సంస్థ సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.
– సర్వసిద్ధి రామకృష్ణ, వీణల కేంద్రం ఇన్‌ఛార్జి, బొబ్బిలి

## శాకంబరీ అలంకారంలో కనకమహాలక్ష్మి



**ఆ**షాఢమాసం సందర్భంగా చీపురుపల్లిలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు శాకంబరీ దేవి అలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. భక్తులు సమర్పించిన 15 రకాల 350 కిలోల కూరగాయలతో అమ్మవారిని, మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తల్లిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.
– న్యూస్‌టుడే, చీపురుపల్లి

# అయిదేళ్ల నిర్లక్ష్యం.. అనుక్షణం గండం!

కారాడ వద్ద గోతులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి నియోజకవర్గంలో కీలకమైన రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. ఓ పక్క లోతైన గోతులు, మరోపక్క వర్షంతో బురద, నీరు చేరి ప్రయాణానికి పాట్లు పడుతున్నారు. అరచేతిలో ప్రాణం పెట్టుకుని వాహనాల్లో కూర్చోవాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.

## కూటమిలో నిధులు విడుదలైనా..

బాడంగి మండలం పినపెంకి-అకులకట్ట మార్గంలో..

'ఈనాడు' వరుస కథనాలు, ఎమ్మెల్యే బేబినాయన చొరవతో నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సి ఉంది. బొబ్బిలి-తెర్లాం రహదారికి రూ.4.50 కోట్లు, చిలకపల్లి-రామభద్రపురం-రాయగడ (సీఆర్ఆర్) రాష్ట్రీయ రహదారి పరిధిలోని ఉత్తరావల్లి నుంచి రామభద్రపురం మీదుగా బొబ్బిలి వరకు మరమ్మతులకు రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. బాడంగి మండలం పినపెంకి-అకులకట్ట రహదారికి రూ.1.80 కోట్లతో టెండర్లు పిలిచారు. పనులు ప్రారంభించాల్సి ఉంది. అంతవరకు తాత్కాలిక మరమ్మతులకు కలెక్టర్ అంబేడ్కర్ ప్రత్యేక నిధులు రూ.20 లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే బేబినాయన [illegible] ముహూర్తం పూర్తయ్యాక పనులు ప్రారంభిస్తామని ర.భ. శాఖ ఏఈ అప్పలరాజు తెలిపారు.

## మరమ్మతులు లేక ఇలా..

గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతోనే రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వేగావతి నదిపై పారాది వంతెన కుంగడంతో ట్రాఫిక్‌ను ఈ మార్గాల్లో మళ్లించారు. నిధులున్నా వంతెన నిర్మాణాన్ని విస్మరించారు. ఫలితంగా భారీ వాహనాలు తిరిగే రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. అయినా ఏనాడూ మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఇప్పుడవి మోకాలు లోతులో గోతులు ఏర్పడ్డాయి.

## అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడి ఏడాది కాలంలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం విజయనగరంలోని తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకెళుతున్నారన్నారు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో విధ్వంసం తప్ప ఏమీ లేదన్నారు. అధికారం కోల్పోయినా ఆ పార్టీ నాయకులు అదే ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జగన్ పర్యటనల్లో జరుగుతున్నవన్నీ నాటకాలే అని విమర్శించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమిదే విజయమని పేర్కొన్నారు. బొబ్బిలి పారిశ్రామిక వాడలో మాజీ మంత్రి బొత్స కుటుంబీకులకు గతంలో భూములిచ్చారని, పరిశ్రమ ఏర్పాటు చేయలేదని ఓ విలేకరి ప్రశ్నించగా.. నిబంధనల మేరకు ఆ భూములను వెనక్కి తీసుకుంటామని చెప్పారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, గంటా పోలినాయుడు, పైడిరాజు, సంతోష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లె సీమలకు సామాజిక వరం

- అభివృద్ధికి కార్పొరేట్ సంస్థల ఆర్థిక సాయం

ఈనాడు, విజయనగరం

**గ్రా**మీణ ప్రాంతాల్లో సామాజిక సమస్యలను కార్పొరేట్ సంస్థలు పరిష్కరిస్తున్నాయి. ఇందుకు ఆర్థిక భరోసా అందిస్తూ కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ వెనకబడిన విజయనగరం జిల్లాకు వరంలా మారాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఈ కంపెనీలు గతేడాదిలో విడుదల చేసిన నిధులతో జిల్లా అధికారులు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు.


సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన ఆధునిక వైద్య పరికరాలు

## నైపుణ్య శిక్షణకు ప్రయోగశాలలు

విజయనగరం ప్రభుత్వ ఐటీఐలో నైపుణ్య శిక్షణకు అనువుగా ప్రయోగశాలల నిర్మాణానికి రూ.45 లక్షలు కేటాయించారు. జిల్లా పోలీసు యంత్రాంగానికి శాంతిభద్రతల పరిరక్షణకు డ్రోన్లు సమకూర్చేందుకు రూ.44.25 లక్షలు ఇచ్చేందుకు ఆమోదం లభించింది. రెండు ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల జోక్యం వల్ల అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరిన గజపతినగరం మండలం కెంగువ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల భవన నిర్మాణాలకు విశాఖ రౌండ్ టేబుల్ సంస్థ సమకూర్చిన రూ.55 లక్షలను కలెక్టర్ మంజూరు చేయడంతో నిర్మించారు. ప్రస్తుతం తరగతులు అందులోనే జరుగుతున్నాయి. మరిన్ని సీఎస్ఆర్ నిధులు సేకరించి వివిధ రంగాల్లో సమస్యల పరిష్కారానికి, పలు కార్యక్రమాలతో ప్రగతికి వినియోగిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పేర్కొన్నారు.

## వంద పాఠశాలలకు రూ.కోటి

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా రంగంలో మార్పునకు సీఎస్ఆర్ కార్యకలాపాల ద్వారా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. భారత డైనమిక్ లిమిటెడ్ కంపెనీ, ఎన్‌పీసీఐఎల్ వంటి కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో నిధుల సేకరణకు కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చొరవ చూపారు. వంద ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యకు అవసరమైన పరికరాలకు రూ.కోటి సమకూర్చారు. ఇప్పటికే ప్రభుత్వం పాఠశాలల్లో బోధన, డిజిటల్ అభ్యాసానికి స్మార్ట్ గదుల నిర్మాణానికి పాఠశాలలను ఎంపిక చేస్తోంది. ఇందుకు కార్పొరేట్ సంస్థల సాయాన్ని సద్వినియోగం చేసుకుంటోంది.

## విద్యా, వైద్య రంగాలకు ఊతం

ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను నిర్వహిస్తోంది. ఇప్పటికే ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరడం, వసతిలేని చోట్ల విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా వీటిని నిర్మిస్తున్నారు. ప్రాధాన్యత క్రమంలో విజయనగరంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు రూ.14.50 లక్షలతో అదనపు గదులు నిర్మించారు. రూ.54.50 లక్షలతో పూసపాటిరేగ మండలంలో పాఠశాల అదనపు భవనాలు నిర్మించారు. దివ్యాంగుల రెసిడెన్షియల్ పాఠశాలలకు పడకలు, ఇతర వసతులు, బీసీ వసతి గృహాల్లో నాలుగు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఘన చరిత్ర కలిగిన మహారాజా ఆసుపత్రిలో కార్పొరేట్‌కు దీటుగా రోగులకు సేవలందించే లక్ష్యంతో ఎన్‌పీసీఐఎల్ సీఎస్ఆర్ నిధులు రూ.99.46 లక్షలతో ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చారు. రూ.7.16 లక్షలతో గజపతినగరం ప్రాంతీయాసుపత్రికి వైద్య పరికరాలు అందించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న రక్తనిధికి రూ.11.34 లక్షలతో విద్యుత్తు జనరేటర్ సమకూర్చారు.

## దంచేసింది.. ముంచేసింది

**వి**జయనగరంలో ఆదివారం మధ్యాహ్నం ఏకధాటిగా కురిసిన వర్షానికి పలు రహదారులు, వీధులు, మార్కెట్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. పలుచోట్ల చెట్లు, స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్తుకు అంతరాయం ఏర్పడడంతో నగర ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని సిటీ స్టాండు వద్ద నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. – న్యూస్‌టుడే, విజయనగరం

# రాయితీ మంత్రం.. ఆర్థిక ఉపశమనం

- విద్యుత్తు వినియోగ క్రమబద్ధీకరణకు స్పందన

న్యూస్‌టుడే, కొత్తవలస

**న**ష్ట నివారణ, ఆదాయం పెంపు లక్ష్యంగా.. విద్యుత్తు అదనపు వినియోగం క్రమబద్ధీకరణకు రాయితీ ఇస్తూ.. ఈపీడీసీఎల్ చేసిన ప్రకటనకు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. కొత్తగా ఇల్లు కట్టుకుని విద్యుత్తు మీటరు పొందాక, ఇంటి అవసరాల కోసం విద్యుత్తు ఉపకరణాలు, ఏసీ, వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్ వంటి పరికరాలు అదనంగా వినియోగిస్తుండటంతో విద్యుత్తు వినియోగం బాగా పెరుగుతోంది. కనెక్షన్ కోసం దరఖాస్తులో పొందుపర్చిన లోడ్ కంటే ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీనివల్ల విద్యుత్తు నియంత్రికలపై భారం పడుతోంది. ఫలితంగా తరచూ లోఓల్టేజీ, సరఫరాలో అంతరాయం సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి లోడ్ క్రమబద్ధీకరణకు ఈపీడీసీఎల్ శ్రీకారం చుట్టింది.

## లోడ్ ఇలా లెక్కిస్తారు..

ఇంట్లో ఉన్న విద్యుత్తు పరికరాల వినియోగాన్ని బట్టి లోడు అంచనా వేసి దాన్ని కిలోవాట్లలో లెక్కిస్తారు. ఒక కిలో వాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200, డెవలప్‌మెంట్ రుసుము కింద రూ.2 వేలు, దరఖాస్తుకు రూ.50, అదనపు ఖర్చులు రూ.250 చెల్లించాలి. అంటే అదనంగా కిలోవాట్‌కు రూ.2,500 చెల్లించాలి. 50 శాతం రాయితీతో రూ.1,250 వసూలు చేశారు.

## రూ. 42.88 లక్షల ఆదాయం..

అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ప్రకటిస్తూ.. ఇందుకోసం మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకూ దరఖాస్తులు చేసుకోవాలంటూ ఈపీడీసీఎల్ వినియోగదారులను ఆహ్వానించింది. దీంతో జిల్లాలోని 13 గ్రామీణ మండలాల్లోని వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. విజయనగరం డివిజన్ పరిధిలో 2,087 సర్వీసులకు 3880.47 కిలోవాట్ల అదనపు లోడు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. దీనివల్ల రూ.42.88 లక్షల ఆదాయం ఈపీడీసీఎల్‌కి సమకూరింది.

మూడు సబ్‌డివిజన్లలో వసూలైన ఛార్జీలు, డిపాజిట్ల వివరాలిలా...

| సబ్‌డివిజన్ | సర్వీసులు | అదనపు లోడు (కిలోవాట్లు) | డెవలప్‌మెంటు ఛార్జీలు(రూ.లక్షల్లో) | సెక్యూరిటీ డిపాజిట్ (రూ.లక్షల్లో) |
|---|---|---|---|---|
| ఎస్.కోట | 1251 | 2342.95 | 20.81 | 5.04 |
| భోగాపురం | 578 | 1085.51 | 9.65 | 2.34 |
| రాజాం | 258 | 443.90 | 4.09 | 0.95 |
| మొత్తం | 2087 | 3872.36 | 34.55 | 8.33 |

## అధిక దరఖాస్తులు ఇక్కడే..

13 మండలాల్లోకి కొత్తవలస సెక్షన్ నుంచి అధికంగా దరఖాస్తులు అందాయి. ఈ ప్రాంతం నుంచి అదనపు లోడు క్రమబద్ధీకరణకు 520 మంది విద్యుత్తు వినియోగదారులు 986.14 కి.వా.కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు రూ.8.77 లక్షలు డెవలప్‌మెంట్ ఛార్జీల కింద, రూ.2.11 లక్షలు సెక్యూరిటీ డిపాజిట్‌గా జమచేశారు. అతి తక్కువగా వంగర సెక్షన్ నుంచి నలుగురే దరఖాస్తు చేసుకుని రూ.10 వేలు డిపాజిట్ చెల్లించారు.

**స్పందన బాగుంది..** అదనపు లోడు క్రమబద్ధీకరణకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. రూ.42.88 లక్షల ఆదాయం వచ్చింది. లోడు ఎంత భారమో తెలిస్తే, అనుగుణంగా చర్యలు చేపట్టి లోఓల్టేజీ సమస్య పరిష్కరించొచ్చు. అవసరమైన చోట నియంత్రికలు ఏర్పాటు చేస్తాం. – **జిజి.సురేష్‌బాబు,** కార్యనిర్వాహక ఇంజినీరు, విజయనగరం గ్రామీణం

# ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

907 మంది విద్యార్థుల ఎంపిక

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఇందులో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, దివ్యాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80.. మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్కే వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. తరగతులు 14 నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులు తమ లగేజీతో వచ్చి రిపోర్ట్ చేసి తరగతులకు హాజరయ్యేలా సిద్ధపడాలన్నారు.

## అంతర్గత బదిలీలు ఇలా..

మొదటి దశ తర్వాత మిగిలిన ఖాళీలను దృష్టిలో ఉంచుకుని అంతర్గత బదిలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా 384 మందికి లబ్ధి కలిగినట్లు వివరించారు. ఇప్పటి వరకు 4,340 మంది విద్యార్థుల ఎంపిక పూర్తయిందన్నారు. ఇంకా 60 సీట్లు మిగిలి ఉండగా ఇందులో ఎన్‌సీసీ కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. వీటి ఎంపిక ఫలితాలను వచ్చే వారం విడుదల చేస్తామని రిజిస్ట్రార్ తెలిపారు.

# ప్రాజెక్టులు పూర్తి చేస్తాం.. పొలాలకు నీరందిస్తాం

'న్యూస్‌టుడే'తో ఎస్ఈ అప్పారావు

ముఖాముఖి

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో పంట కాలువల ద్వారా శివారు ఆయకట్టుకు సాగునీరు చేరేలా ప్రణాళికలు రూపొందించామని జలవనరులశాఖ బొబ్బిలి సర్కిల్ ఎస్ఈ అప్పారావు వెల్లడించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పాలకొండ మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలు, విజయనగరం జిల్లాలో బొబ్బిలి డివిజన్‌లోని జలవనరులు ఈ సర్కిల్ పరిధిలోకి వస్తాయి. ఆయా జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉందని, త్వరలో సాగునీటి విడుదల తేదీలను ప్రకటిస్తామని ఆయన 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

## దినసరి వేతనంపై..

జలాశయాల పరిధిలో లస్కర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. దినసరి వేతనంపై నియమించుకునేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. వెంగళరాయ, వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం, జంఝావతి పరిధిలో ఒక్కో జలాశయానికి 10 నుంచి 15 మంది లస్కర్లు అవసరం కావొచ్చు. దీనిపై పక్కాగా నివేదిక ఇవ్వాలని ఇంజినీర్లకు సూచించాం. త్వరలో నియమిస్తాం.

## జంఝావతి పనులకు ప్రతిపాదనలు

జంఝావతి జలాశయం పరిధిలో ప్యాకేజీ-2 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనివల్ల ప్రధాన కాలువల నుంచి సాగునీరు పూర్తిస్థాయిలో రావడం లేదు. పాత గుత్తేదారు మధ్యలో వదిలేశారు. వీటిని పూర్తి చేసేందుకు రూ.51 లక్షలతో ఉన్నతాధికారులకు నివేదించాం.

## ఆ నిధులతో పూడికతీత

నీటి తీరువా మొత్తాలతో కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నాం. వట్టిగెడ్డ, పెదంకలాం, జంఝావతి పరిధిలో నిధుల్లేక చేయలేదు. రైతుల నుంచి వసూలు చేసిన మొత్తాలు జలవనరులశాఖ ఖాతాల్లో జమకావాల్సి ఉంది. రాష్ట్ర విపత్తుల నిధితో అవసరమైన చోట పనులు చేపట్టాం.

## జనరేటర్ల ఏర్పాటు

అత్యవసర సమయాల్లో జలాశయాల్లోని అదనపు నీటిని నదుల్లోకి మళ్లించేందుకు వీలుగా వెంగళరాయ, వట్టిగెడ్డ, జంఝావతి వద్ద జనరేటర్లను ఏర్పాటు చేశాం. రెగ్యులేటర్లను పైకిలేపి నీరు విడిచి పెడతాం. విద్యుత్తు లేని సమయాల్లో ఇబ్బందుల నేపథ్యంలో ఇలా చేస్తున్నాం. షట్టర్లకు హాలింగ్ పూర్తి చేశాం. కాల్‌సెంటర్లు ఏర్పాటు చేశాం.

## అంచనాల తయారీ

సర్కిల్ పరిధిలో అసంపూర్తిగా ఉండిపోయిన వెంగళరాయ అదనపు ఆయకట్టు, కంచరగెడ్డ తదితర పనులకు తాజాగా అంచనాలు తయారు చేస్తున్నాం. 100 ఎకరాలు దాటిన చెరువులను గుర్తించి ఉపాధి హామీలో తూములు, చప్టాల పనులు చేపట్టాలని ఉత్తర్వులు వచ్చాయి. వాటికి కూడా అంచనాలు తయారు చేశాం.

## నీటి చౌర్యానికి పాల్పడితే కేసులు

కొందరు రైతులు పంట కాలువల్లో సాగునీటిని మోటార్లతో తోడేస్తున్నారు. గండ్లు పెట్టి పైపులు అమర్చుతున్నారు. దీంతో దిగువ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచాం. అలాంటి రైతులపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తాం.

## సిద్ధు సైకిల్‌పై బేబినాయన షికారు

బొబ్బిలి, న్యూస్‌టుడే: వినూత్న ఆలోచనతో బ్యాటరీ సైకిల్ తయారు చేసిన తెర్లాం మండలం జాడవారి కొత్తవలస గ్రామానికి చెందిన రాజాపు సిద్ధును ఆదివారం ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు. తనవంతు ప్రోత్సాహకంగా రూ.20 వేలు అందించారు. సైకిల్‌పై కాసేపు కోటలో చక్కర్లు కొట్టారు. ఈ సందర్భంగా సిద్ధు గ్రామ చెరువు కింద 40 ఎకరాల ఆయకట్టు ఉందని, రెండు సోలార్ బోర్లు తవ్వించాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

## తాటిపూడి సాగునీటి కాలువ పనులు

**తా**టిపూడి ఆయకట్టు సాగునీరు విడుదల చేసిన తర్వాత కాలువ పనులు చేపట్టారు. ఈనెల 2న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జలాశయం నుంచి నీరు విడుదల చేశారు. కాలువలో తుప్పలు నిండడంతో సాగునీరు వెళ్లలేని పరిస్థితిపై 'ఈనాడు'లో 'ఇక్కడ వదిలేసి.. అక్కడ నీరిస్తారా?' శీర్షికతో వచ్చిన కథనానికి మంత్రి స్పందించారు. అధికారులు, సాగునీటి సంఘం అధ్యక్షుడికి పనులు చేయించాలని సూచించారు. వారం రోజులుగా తాటిపూడి నుంచి రామభద్రపురం డివిజన్ డ్యామ్ వరకు 4 కి.మీ. పనులు చేపట్టామని కాలువ అధ్యక్షుడు రమేష్ అన్నారు.
– న్యూస్‌టుడే, గంట్యాడ, గంట్యాడ గ్రామీణం

(c) eenadu

# చదువుల చుట్టూ చీకటి మత్తు

▼ విజయనగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న పలు విద్యా సంస్థల సమీపంలో పెద్దఎత్తున దుకాణాలున్నాయి. ఇక్కడ ఖైనీ, గుట్కా, సిగరెట్లు అమ్ముతున్నారని, తమ పిల్లలు పక్కదారి పడుతున్నట్లు పలు సందర్భాల్లో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పోలీసులు దాడులు చేపట్టి, నిర్వాహకులపై చర్యలు తీసుకున్నారు.

▼ విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు, మహారాజా కోట, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని పాన్‌షాప్‌లలో తనిఖీలు చేపట్టి, నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం నేరవార్తా విభాగం

ఇటీవల దాడుల్లో పట్టుబడిన పొగాకు ఉత్పత్తులు

బాలలు, యువతను మత్తులోకి దించడమే లక్ష్యంగా గంజాయి ముఠాలు దుకాణాల ద్వారా అమ్మకాలు సాగిస్తున్నాయి. గంజాయితో తయారైన సిగరెట్లు, చాక్లెట్లను వారి దరిచేర్చుతున్నాయి. దీంతో బాల్యం మాదక ద్రవ్యాల మాయలో పడిపోతోంది. విద్యా సంస్థలకు 100 మీటర్ల దూరంలో అమ్మకూడదన్న నిబంధన లున్నా జిల్లాలో యథేచ్ఛగా కార్యకలాపాలు సాగుతున్నాయి. ఈనెల 8న పోలీసులు, ఈగల్ బృందం, స్పెషల్ బ్రాంచి సిబ్బంది ఉమ్మడిగా చేపట్టిన దాడుల్లో ఈ విషయం తేటతెల్లమైంది.

**భారీగా స్వాధీనం..** జిల్లాలోని పలు కళాశాలలతో పాటు పాఠశాలల ఆవరణల్లో, సమీపంలోని రోడ్ల వెంబడి పెద్దఎత్తున దుకాణాలున్నాయి. వీటిల్లో చాలా వరకు 100 మీటర్ల లోపే ఉన్నాయి. సిగరెట్లు, ఖైనీ, గుట్కా, పలు రకాల పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్నారు. ఇటీవల 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్' పేరిట చేపట్టిన దాడుల్లో 512 మంది దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు కేసులు నమోదు చేసి, రూ.1.13 లక్షల జరిమానా విధించారు.

**బానిసలవుతూ..** మత్తుకు బానిసవుతున్న వారిలో యువతతో పాటు బాలలు సైతం ఎక్కువగానే ఉంటున్నారు. వీరిలో చాలామంది క్యాన్సర్, ఇతర ప్రమాదకర వ్యాధుల బారిన పడుతున్నారు. మహారాజా ప్రభుత్వాసుపత్రికి నెలలో వచ్చే కేసుల్లో 150 నుంచి 200 మంది వరకు యువతే ఉంటున్నారు. దంత, గొంతు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతూ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. మత్తు వ్యసనపరుల కేంద్రాన్ని సైతం కొందరు ఆశ్రయిస్తున్నారు. 2017 నుంచి ఈ ఏడాది మే వరకు 13,131 మంది చికిత్స పొందగా.. వీరిలో 47 శాతం మంది 35 ఏళ్ల లోపు వారేనని ఆ విభాగం పేర్కొంది. విద్యార్థులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

# భారీ వర్షం.. నగరం మునక

చెరువును తలపిస్తున్న విజయనగరంలోని సిటీస్టాండ్ దారి

విజయనగరం జిల్లా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కుండపోతగా పడింది. దీంతో పలు ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. డివైడర్ల మధ్యలోని చెట్లు నేలకొరిగాయి. నగర పాలక సంస్థ కార్యాలయం కూడలి, సిటీ స్టాండ్, ప్రకాశం పార్కు, దాసన్నపేట రైతు బజారు కూడలి, ధర్మపురి రోడ్డు, రింగురోడ్డు, ఎన్సీఎస్ రోడ్డు, రామారాయుడు దారి తదితర చోట్ల వర్షం నీరు నిలవడంతో ఆయా ప్రాంతాలు చెరువులను తలపించాయి. అధ్వాన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా ఈ పరిస్థితి నెలకొందని నగర వాసులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ముంపుబారిన నగరపాలక సంస్థ కార్యాలయం

వరద ప్రవాహానికి కొట్టుకుపోతున్న వాహనం →

# మీరు మర్చిపోతే.. వారు తిరిగిస్తారు

## ప్రయాణికులకు అండగా ఆర్టీసీ

★ రామభద్రపురం మండలం ఆరికతోట వెళ్లేందుకు విజయనగరంలో సాలూరు బస్సు ఎక్కిన ఎం.రాజేశ్వరి శీతలపానీయం కొనుగోలు చేసేందుకు బస్సు దిగారు. ఇంతలో బస్సు సముదాయం నుంచి వెళ్లిపోయింది. స్టేషన్ ప్రబంధకుడు సత్యనారాయణను సంప్రదించగా.. బస్సును తిరిగి రప్పించి అయిదు తులాల బంగారం, ఇతర విలువైన వస్తువులను ఆమెకు అందజేశారు.

★ గరివిడికి చెందిన కె.లక్ష్మి విజయనగరం- చీపురుపల్లి బస్సులో ఎక్కి హడావుడిగా దిగేశారు. తమ వెంట తెచ్చుకున్న కుక్కర్‌ను మర్చిపోయారు. టిక్కెట్‌పై ఉన్న వివరాలతో కండక్టర్‌ను సంప్రదించగా.. విజయనగరం సముదాయంలో కుక్కర్ అందజేశారు.

న్యూస్‌టుడే- విజయనగరం అయ్యన్నపేట

ఆర్టీసీ బస్సుల్లో రోజూ వేలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. చాలా మంది దిగే సమయంలో హడావుడి, ఇతరత్రా కారణాలతో తమ విలువైన వస్తువులను బస్సుల్లో మర్చిపోతుంటారు. వాటిని ఎలా తిరిగి పొందాలో తెలియక చాలామంది ఇబ్బంది పడుతున్నారు. దీనికోసం ఆర్టీసీ 'లాస్ట్ ప్రోపర్టీ హ్యాండోవర్' విధానాన్ని తీసుకొచ్చింది. దీన్ని జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో అమలు చేస్తున్నారు.

మర్చిపోయిన వస్తువులను మహిళకు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

**సిబ్బంది భద్రపరుస్తారు..**

బస్సుల్లో ఏవైనా తెలియని వస్తువులు కనిపిస్తే డ్రైవర్, కండక్టర్ వాటిని భద్రపరుస్తారు. బస్సు గమ్యస్థానం చేరేవరకు వారిదే బాధ్యత. ఆ తరవాత విధులు పూర్తికాగానే నగదు జమచేసే ఎర్నింగ్ విభాగంలో ఆ వస్తువులను అందిస్తారు. నెల రోజులు అక్కడే ఉంటాయి. ఇంతలో ఎవరైనా వస్తే పరిశీలించి అందజేస్తారు. లేకపోతే వాటిని వేలం వేస్తారు. వచ్చిన నగదును జిల్లా ట్రెజరీలో జమచేస్తారు. దాదాపు ప్రయాణికులకు వస్తువులను అప్పగిస్తున్నామని, వేలం ప్రక్రియ వరకు రాలేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

**ఇలా పొందొచ్చు..**

ప్రయాణికులు బస్సుల్లో సామగ్రి మర్చిపోతే బస్సులో ఏర్పాటు చేసిన డిపో ప్రబంధకులు, డీపీటీవోల నంబర్లకు ఫోన్ చేయవచ్చు. ● ఆర్టీసీ ప్రధాన కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్ 149ను సంప్రదించి.. టిక్కెట్‌పై ఉన్న గుర్తింపు సంఖ్య చెబితే కండక్టర్, డ్రైవర్ ఫోన్ నంబర్, వివరాలు చెబుతారు. బస్సు ఏ డిపో పరిధిలో ఉందో, వస్తువులు ఎక్కడ ఉన్నాయో పూర్తి సమాచారం అందిస్తారు.

# వీఆర్‌కు ఒకటో పట్టణ సీఐ

## రాత్రి వేళ ఆకస్మిక బదిలీ పోలీసు వర్గాల్లో చర్చనీయాంశం

సీఐ శ్రీనివాస్

ఈనాడు, విజయనగరం: విజయనగరంలోని ఒకటో పట్టణ సీఐ ఎస్.శ్రీనివాస్‌ను ఉన్నతాధికారులు ఆకస్మికంగా వీఆర్‌కు పంపించారు. ఆయన స్థానంలో ఎస్బీ-2 సీఐ ఆర్వీ ఆర్‌కే.చౌదరిని నియమించారు. ఈ మేరకు శనివారం రాత్రి విశాఖ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అంశం పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మూడు రోజుల క్రితం పక్కా సమాచారంతో చేపట్టిన తనిఖీల్లో సుమారు 700 గ్రాముల బంగారు ఆభరణాలతో ఒక వ్యక్తి పట్టుబడ్డారు. ఆ సొత్తుకు ఎలాంటి ఆధార పత్రాలు చూపించలేకపోయారు. ఈ విషయం అతడి యజమానికి తెలియగా.. నగరానికి చేరుకుని కేసును జీఎస్టీ లేదా ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించాలని కోరారు. సమాచారాన్ని సీఐ ఉన్నతాధికారులకు చెప్పగా.. నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఆదేశించారు. ఈక్రమంలో కేసు బదలాయింపులో జాప్యం చేశారని, ఉద్దేశపూర్వకంగా ఇలా చేస్తున్నారని బంగారం వ్యాపారి అమరావతిలోని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. ఓ కీలక ప్రజాప్రతినిధి పీఏ ఫోన్ చేసినా మాట్లాడేందుకు సీఐ నిరాకరించారు. ఇలా రెండు, మూడు సార్లు జరగడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాము చెప్పింది వినకపోవడమే కాకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారని ఫిర్యాదు చేశారు. దీని ఫలితంగా ఆఘమేఘాలపై సీఐని వీఆర్‌కి బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# నీటిజాడ కరవు.. రైతు గుండె బరువు..!

ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతుకు చివరి ధాన్యం సేకరణ వరకు కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తొలుత కురిసిన వర్షాలకు మురిసిన అన్నదాత.. తర్వాత వానలు ముఖం చాటేయడంతో ఆశలు ఎండిపోయాయి. ఇటీవల కురిసిన అడపాదడపా వర్షాలకు ఆయా ప్రాంతాల్లో రైతులు వరినారు వేసుకున్నారు. ఆదిలోనే హంసపాదు అన్న చందంగా తయారైంది ప్రస్తుత రైతు పరిస్థితి. వరుణుడు కన్నెర్ర చేయడంతో ఎండలు మండిపోతున్నాయి. నీరులేక నారు మడి ఎండుతోంది. రైతు గుండె బరువెక్కుతోంది. పంటను కాపాడుకునేందుకు సమీపంలోని వనరుల నుంచి నీటిని తోడి, మోసుకుని తెచ్చి మడులు తడిపేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. విజయనగరం జిల్లాలోని గంట్యాడ మండలంలోని రామవరం గ్రామంలో, మెంటాడ మండలంలోని ఆగూరు, గుర్ల, జి.జి. పేట, జక్కువ, మీసాలపేట, బడెవలస, పోరాం, కుంటినవలస, పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలో వరి, కూరగాయలు, పత్తి రైతుల కష్టాలు వర్ణనాతీతం. – ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, మెంటాడ, భామిని

మెంటాడ మండలం గుర్లలోని పొలంలో వరినారు తడుపుతున్న మహిళా రైతు

సంతకవిటి మండలం వాసుదేవపట్నం గ్రామ సమీపంలో నారుమడులను కాపాడేందుకు అన్నదాతల పాట్లు

# నిమ్మ ధర పతనం.. రైతు కలవరం

సీతంపేట మన్యంలో విరివిగా పండే నిమ్మకాయల ధర పతనమవడంతో గిరి రైతులు కలవరం చెందుతున్నారు. అష్టకష్టాలు పడి ఆదివారం వారపు సంతకు తీసుకురాగా కిలో ధర రూ.10 లోపే పలకడంతో ఉసూరుమంటున్నారు. గతంలో 50 నుంచి 60 కిలోలున్న బస్తా రూ.2 వేల నుంచి రూ.2500 వరకు తీసుకునే వారు. నేడు రూ.500 నుంచి రూ.600లోపే అమ్ముడుపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి, మద్దతు ధర దక్కేలా చూడాలని, మార్కెటింగ్‌కు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

సీతంపేట సంతలో బస్తాల్లో నిమ్మకాయలు

# దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో అతిథి అధ్యాపకులుగా పని చేసే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎస్.తవిటినాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశ్రాంత, ఇప్పటికే పనిచేస్తున్న అధ్యాపకులు, పాఠశాల సహాయకులు అర్హులన్నారు. డిగ్రీలో కనీసం 50 శాతం ఉత్తీర్ణత ఉండాలని, ఈనెల 15వ తేదీలోగా ఒరిజినల్, జిరాక్స్ పత్రాలను సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందజేయాలని సూచించారు. 16న విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముఖాముఖి ఉంటుందని చెప్పారు.

| కళాశాల | సబ్జెక్టు | పోస్టులు |
|---|---|---|
| గంట్యాడ | జంతుశాస్త్రం | 1 |
| కొత్తవలస | జంతుశాస్త్రం | 1 |
| డెంకాడ | గణితం | 1 |
| ఎస్.కోట | గణితం | 1 |
| ఎస్.కోట | జనరల్ ఫౌండేషన్ | 1 |
| దత్తిరాజేరు | భౌతికశాస్త్రం | 1 |
| సంతకవిటి | ఆంగ్లం | 1 |

## చికెన్ ధరలు

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 90 | 150 | 160 |

# బుచ్చెంపేటలో ఇరువర్గాల కొట్లాట

## 10 మందికి గాయాలు

తీవ్రంగా గాయపడిన సింహాచలం

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పురపాలిక పరిధిలోని బుచ్చెంపేటలో స్థలం విషయంలో తలెత్తిన వివాదం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో 10 మందికి గాయాలైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఒక వర్గానికి చెందిన ఎన్.సింహాచలం, ఎం.శ్రీను, కె.చంద్రశేఖర్, పి.రవీంద్ర, ఎం.గోవింద, ఎన్.సిమ్మన్నను రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మరో వర్గానికి చెందిన ఎం.సూరిబాబు, పి.సత్యం, పి.రాము, పి.కావ్య స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై వై.రవికిరణ్ ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు. గ్రామంలో ఒక స్థలం విషయంలో ఏళ్ల నుంచి వివాదం నడుస్తోంది. దారి కోసం స్థలం విడిచిపెట్టి అందులో ఇప్పుడు గోడ నిర్మించేందుకు ప్రయత్నిస్తుండడంతో పెద్దల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారి తీసినట్లు చెబుతున్నారు. సింహాచలం, చంద్రశేఖర్‌కు తలకు గాయాలవడంతో పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృత్యువాత

ధర్మారావు (పాతచిత్రం)

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం ఉదయం సాలూరు మండలం జీగిరాం సమీపంలోని బైపాస్‌రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాలూరు పట్టణం గొర్లెవీధికి చెందిన జి.ధర్మారావు(43) తన కుమారుడు గుణశేఖర్‌తో కలిసి పొలం పనుల నిమిత్తం బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లారు. తిరిగి ఇంటికి స్కూటీపై వస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ధర్మారావు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. గాయాలపాలైన కుమారుడ్ని స్థానికులు ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ధర్మారావు భార్య అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ బంగార్రాజు తెలిపారు.

**చికిత్స పొందుతూ..**

దుర్గాప్రసాద్ (పాతచిత్రం)

నేరవార్తా విభాగం: నగరంలోని ధర్మపురి రోడ్డులో ఈనెల 10న జరిగిన రహదారి ప్రమాదంలో గాయపడిన ఇద్దరు క్షతగాత్రులూ మృతిచెందారు. గొంపవీధికి చెందిన సీహెచ్.దుర్గాప్రసాద్(19), పి.ప్రణీత్‌కుమార్, కార్తీక్ ఈనెల 9న ద్విచక్రవాహనంపై సింహాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లారు. 10న ఇంటికి వస్తుండగా ధర్మపురి రోడ్డులో కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దుర్గాప్రసాద్, ప్రణీత్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రణీత్‌కుమార్ శనివారం మృతి చెందగా.. ఆదివారం దుర్గాప్రసాద్ కన్నుమూశాడు. ఈ యువకుడికి తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**రైలు ఢీకొని వృద్ధుడు..**

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన దత్తిరాజేరు మండలంలో చోటుచేసుకుంది. బొబ్బిలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు వివరాల ప్రకారం.. పాచిపెంట గ్రామానికి చెందిన డి.తవిటయ్య(70)కు వివాహితులైన కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య మృతిచెందారు. ప్రస్తుతం గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్నాడు. పని నిమిత్తం ఆదివారం దత్తిరాజేరు మండలం మరడాం వచ్చారు. పట్టాలు దాటుతున్న క్రమంలో గూడ్సు రైలు ఢీకొని మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెచ్‌సీ తెలిపారు.

# గుర్తుతెలియని మహిళ మృతి

జామి, న్యూస్‌టుడే: జామి మండలంలోని కంటకాపల్లి-అలమండ రైల్వేస్టేషన్ల వద్దగల ప్రధాన లైను సమీపంలో ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని రైల్వే హెచ్‌సీ పి.రవికుమార్ తెలిపారు. ఆమె వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, 5.5 అడుగుల పొడవు, ఎరుపు, పచ్చ, పసుపు, కాషాయ రంగు గడులతో కూడిన నైటీ ధరించినట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు 94906 17089, 91820 73593, 0891-2883218 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

**వృద్ధుడి మృతదేహం గుర్తింపు..**

విజయనగరం నేరవార్తావిభాగం: నగరంలోని నెహ్రూ పార్కు సమీపంలో సుమారు 70 ఏళ్ల వయసు గల వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తెల్లటి దుస్తులు ధరించాడని, దుప్పటి, స్టీలు కంచం ఉన్నాయని రెండో పట్టణ సీఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


EENADU Classifieds

PROFESSIONAL SERVICES

ASTROLOGY

శ్రీగాయత్రీ జోతిష్యం, గత 25 సం॥లు విజయనగరంలో స్థిరపడిఉన్నారు. విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం, ఆరోగ్యం మీకు ఎటువంటి సమస్యలున్నా.. జోతిష్యం చెప్పబడును సెల్: 9701778711.

REAL ESTATE

FLAT FOR SALE

3 BHK 1450 Sft Flat for sale. 4th floor newly construction Haimavathi Sadhan, Kamma Veedhi, VZM. Car Parking, Lift with all facilities. C : 9177400008.

South India shoping mall backside 3 BHK, 1325 Sft 4th floor new flat for sale. Car parking, Lift with all facilities. C : 9177400008.

JOBS

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ టీం లీడర్స్ కావలెను. అర్హతలు 10th to Degree. జీతం : 21,000/- నుండి 45 వేలు వరకు. Contact : 9704107303, 8008574616.

Receptionist and Waiters Required Age: below 35 yrs. with Computer & Hindi & English speaking skills Hotel Winsar Park, Opp. KGH, Vizag. 9849581868.

Required ITI in Civil with 5 yrs + Experience in the field of Constructions. Call : 9959969354.

Male House Keeping Boy for House Food and Accomodation Available. Contact: 8897663366.

మణిరాజ్ ఎల్కో మొబైల్స్‌తో కలిసి మైస్టఫ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్, లైవ్ ప్రాజెక్టులతో EV ఇంజినీరింగ్ మైక్రో డిగ్రీ సర్టిఫికేషన్ (4 వారాలు) కోర్సును అందిస్తోంది. 100% ప్లేస్‌మెంట్ సహాయం. సంప్రదించండి: 7997638005, 7997226984

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైన స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315/- (GST 5% అదనం)
మాత్రమే సంప్రదించండి: 8008597609


# అనుబంధం పెట్టని 'కోట'

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. 1993లో బొబ్బిలి సింహం చిత్రీకరణలో భాగంగా విజయనగరంలో నాలుగు రోజుల పాటు ఉన్నారు. స్థానిక ఎస్బీఐ ప్రధాన కార్యాలయం సమీపంలోని ఓ లాడ్జిలో బస చేశారు. అప్పట్లో తాటిపూడి జలాశయం, కోరుకొండ సైనిక పాఠశాలను సందర్శించారు. జిల్లాకు చెందిన ఆయన బాల్యమిత్రుడు సుధాకర్‌తో పాటు విజయనగరానికి చెందిన సాంస్కృతిక విభాగం ప్రతినిధులు వెంట ఉండేవారు.

# 'కమిషన్లు అడుగుతున్నారు'

శృంగవరపుకోట: జిందాల్ సంస్థ తీసుకున్న భూమికి 18 ఏళ్ల తరువాత పరిహారం కింద వేసిన రూ.8 లక్షల్లో.. రూ.3 లక్షలు ఇవ్వాలని కొందరు స్థానిక నాయకులు అడుగుతున్నారని నిర్వాసితుడు చీడిపాలెం గ్రామానికి చెందిన అప్పలరాజు ఆరోపించారు. ఆదివారం బొడ్డవరలో నిర్వాసితుల శిబిరం వద్ద విలేకరులతో మాట్లాడారు. పరిహారం వస్తే కమిషన్లు అడగడం ఎంతవరకు సమంజసమన్నారు.


ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237


# సహకారం అందేలా.. సమస్యలు తీరేలా

గరివిడి, న్యూస్‌టుడే

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను(పీఏసీఎస్) కంప్యూటరీకరణ చేశారు. ప్రస్తుతం రుణాల చెల్లింపులు, ఇతర కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. త్వరలో ఆడిట్ ప్రక్రియను పూర్తిచేసి బ్యాంకుల మాదిరిగానే వీటిల్లో అన్నిరకాల లావాదేవీలను పూర్తిగా కంప్యూటర్ల ద్వారానే చేపట్టనున్నారు. దీంతో అవకతవకలకు అడ్డుకట్ట పడనుంది. సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందని, తద్వారా ఖాతాదారుల్లో నమ్మకం పెరుగుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

| జిల్లా కేంద్ర సహకార బ్యాంకు | |
|---|---|
| ఆర్థిక లావాదేవీలు | : రూ.2,150 కోట్లు |
| రెండు జిల్లాల్లో పీఏసీఎస్‌లు | : 94 |
| సహకార బ్యాంకులు | : 24 |
| ఖాతాదారులు | : 5.23 లక్షలు |
| రుణాలు తీసుకున్న రైతులు | : 68 వేలు |
| ప్రస్తుత ఖరీఫ్‌లో రుణాల లక్ష్యం | : రూ.300 కోట్లు |

**■ గతంలో ఎన్నో అక్రమాలు**

ఇప్పటివరకు రసీదుల రూపంలో కార్యకలాపాలు సాగేవి. దీంతో పక్కా లెక్కలుండేవి కాదు. దీంతో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకునేవి. కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శించేవారు. దస్త్రాలను తారుమారు చేసేవారు. రుణ వాయిదాలు చెల్లించకుండానే సర్దుబాటు చేయడం, బినామీల పేరిట నగదు తీసుకోవడం, భూములు లేని వారిని సైతం సభ్యులుగా చేర్చడం, బోగస్ పత్రాలతో బొక్కేసేవారు. విజయనగరం జిల్లాలోని రాజాం, గంట్యాడ, పార్వతీపురం జిల్లాలోని మరో రెండు సంఘాల్లో ఈ తరహా లోపాలను గుర్తించారు. ఇప్పటికే రికవరీకి ఆదేశించారు.

**రెండేళ్లుగా సాగుతూ..** సంఘాల్లో కంప్యూటరీకరణ ప్రక్రియ 2023లోనే ప్రారంభమైనా ముందుకు సాగలేదు. వైకాపా హయాంలో మందకొడిగా సాగింది. కూటమి ప్రభుత్వం రాకతో కొన్ని అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ప్రత్యేకంగా దృష్టి పెట్టి, ఫిబ్రవరి నాటికి పూర్తి చేసింది. సొసైటీ ఏర్పడినప్పటి నుంచి గతేడాది మార్చి 31 వరకు జరిగిన లావాదేవీలన్నీ డేటా క్యాప్చర్ టూల్(డీసీటీ) సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేశారు. కొన్ని సంఘాల్లో పాత రికార్డులు అందుబాటులో లేకపోవడంతో కంప్యూటరీకరణ ఆలస్యమైంది. ఇటీవల రెండు జిల్లాల్లోని 94 సంఘాల్లోనూ ఆన్‌లైన్ పూర్తయింది.

గుర్ల మండలం జమ్ముపేటలోని పీఏసీఎస్ కార్యాలయం

**■1.21 లక్షల మందితో ఈకేవైసీ**

సొసైటీల్లో సభ్యులంతా ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశాలొచ్చాయి. ఇప్పటికే 1.21 లక్షల మంది ముందుకొచ్చారు. కొందరు దస్త్రాల్లో ఉన్నా క్షేత్రస్థాయిలో లేకపోవడం, చనిపోవడం తదితర కారణాలతో దూరమయ్యారు. స్థానికేతరులు, తీసుకున్న రుణాలు చెల్లించని వారు సైతం ఈకేవైసీని దూరం చేస్తున్నారు. ప్రస్తుతం బకాయిలన్నీ పెరిగి సహకార బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.90 కోట్లు ఉన్నట్లు గుర్తించామని డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇకనుంచి పారదర్శక సేవలు అందనున్నట్లు చెప్పారు.

# దరఖాస్తుల ఆహ్వానం

ఉడాకాలనీ, సీతంపేట, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లాలో ఉన్న మూడు ప్రభుత్వ ఐటీఐలు, 25 ప్రైవేటు ఐటీసీలలో రెండో విడత ప్రవేశాలకు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ టి.వి.గిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 20వ తేదీలోగా వివరాలను సమర్పించాలని, 22న సమీపంలోని విద్యాలయానికి వెళ్లి ఒరిజినల్ ధ్రువపత్రాలతో పరిశీలన చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో 23, 25వ తేదీల్లో, ప్రైవేటుకు సంబంధించి 26, 27వ తేదీల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 94415 18355, 98499 44654, 77806 58035 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ★ 23వ తేదీన సీతంపేట ఐటీఐలో కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపల్ గోపాలకృష్ణ తెలిపారు.

# బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

## కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కిలో రూ.లో) ★ టమాటా: 35.00, వంకాయలు: 32.00 దొండ: 35.00, బీర: 40.00 ★ బెండ: 30.00 ★ కాకర: 32.00 ★ చిక్కుడు: 30.00 ★ అనపకాయ (ఒకటి): 12.00 ★ అరటి (జత): 15.00 ★ మునగ: 55.00 ★ ఉల్లి: 25.00 ★ బంగాళాదుంపలు: 20.00 ★ అల్లం: 50.00 ★ వెల్లుల్లి: 80.00 ★ పచ్చిమిర్చి: 85.00 – న్యూస్‌టుడే, రాజాం

## తెరపై ఈనాడు

రాజాంలో..: ★ సీతారామా: ఓ భామ అయ్యో రామ ★ సీతారామ(మినీ): తమ్ముడు అప్సర ఎస్‌వీసీ: 3 బీహెచ్‌కే –న్యూస్‌టుడే, రాజాం

బొబ్బిలిలో..: ★ లక్ష్మీ థియేటర్: కన్నప్ప ★ వాసవి: మార్గన్ ★ టీవీఆర్ స్క్రీన్-1: కుబేర – న్యూస్‌టుడే, బొబ్బిలి

## పొంచి ఉన్న ప్రమాదం

గంట్యాడ గ్రామీణం: బోనంగి ఉన్నత పాఠశాల భవనంపైకి భారీ వృక్షం వాలింది. ఇటీవల పాఠశాల మూసి ఉన్న సమయంలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ఆవరణంలోని చెట్టు భవనంపైకి ఒరిగింది. నిర్మాణం దెబ్బతినకముందే చెట్టును తొలగించాలని స్థానికులు అంటున్నారు. తక్షణమే సమస్యను పరిష్కరిస్తామని ఎంఈవో-2 వెంకటరావు అన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

| | |
|---|---|
| బొబ్బిలి | 80085 74367 |
| గజపతినగరం | 80085 74332 |
| రాజాం | 80085 74308 |
| గరివిడి | 80085 74348 |

?: శేషాద్రిపురం సమీపంలోని రహదారి పక్కన ఉన్న వెదురు తుప్ప విద్యుత్తు తీగలపై పడి ప్రమాదకరంగా ఉంది. -గ్రామస్థులు ❖ తక్షణమే పరిశీలించి పొదను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - కె.వినయ్‌కుమార్, ఏఈ – న్యూస్‌టుడే, సంతకవిటి

?: చినమానాపురం గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి. - యువత ❖ తక్షణమే పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - విజయ్, డిప్యూటీ ఎంపీడీవో – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

?: రాజాం కేర్ ఆసుపత్రి రహదారిలో వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంటోంది. -స్థానికులు ❖ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -వెంకటరామరాజు, ఏఈ, రాజాం పురపాలిక –న్యూస్‌టుడే, రాజాం

?: కొట్టిశలో పైపులైన్ పాడైపోవడంతో తాగునీరు అందక గ్రామ శివారు నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. - స్థానిక మహిళలు ❖ పరిశీలించి పైపులైన్ మరమ్మతులు చేపడతాం. - చిన్నయ్య, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, వంగర – న్యూస్‌టుడే, వంగర

?: మధుపాడ గ్రామ కాలువలు వ్యర్థాలు, పూడికతో నిండిపోయాయి. - స్థానికులు ❖ పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తాం. - విజయ్, ఈవోపీఆర్డీ – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

?: సంతకవిటిలో పందుల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. - స్థానికులు ❖ పందుల పెంపకందార్లకు నోటీసులు ఇచ్చి.. వారిపై చర్యలు తీసుకుంటాం. - ఎస్.సుభాను, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, సంతకవిటి

?: పాలవలస రహదారి మలుపు అతి ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ సూచికలు ఏర్పాటు చేయాలి. అలాగే రోడ్డుపైకి వచ్చిన పిచ్చి మొక్కలు తొలగించాలి. - స్థానికులు ❖ తగిన చర్యలు తీసుకుంటాం. - ప్రసాదరావు, ఎస్ఐ – న్యూస్‌టుడే, రామభద్రపురం

?: వసాది గ్రామ మురుగు కాలువలు పూడికతో అధ్వానంగా ఉన్నాయి. - స్థానికులు ❖ పనులు చేయిస్తాం. - విజయ్, ఈవోపీఆర్డీ – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

## ఆత్మీయ కలయిక

బొబ్బిలి పట్టణంలోని పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం ఒక్కచోట కలిశారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

## బాలికలకు చేయూత

సైకిళ్లు అందజేస్తున్న జేసీ రాజు తదితరులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: నాయుడువలస పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అయిదుగురు బాలికలకు కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జేసీ రాజు చేయూతగా నిలిచారు. సొంత నిధులు రూ.30 వేలతో సైకిళ్లు కొనుగోలు చేసి సర్పంచి లక్ష్మి, విశ్రాంత ఏఈ సత్యం చేతుల మీదుగా ఆదివారం అందించారు. ఫౌండేషన్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర శిబిరానికి స్పందన

నేత్ర పరీక్షలు చేపడుతున్న దృశ్యం

వంగర, న్యూస్‌టుడే: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. నవ జీవన్ సేవా సంస్థ ఆర్థిక సాయంతో శంకర్ ఫౌండేషన్ దీన్ని నిర్వహించింది. శిబిరంలో 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 68 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి విశాఖ ఆసుపత్రికి తరలించారు. సేవా సంస్థ అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ, బి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కానిచ్చేశాం.. కాసులివ్వండి

ఇంకుడు గుంతల బిల్లులకు ఎదురుచూపులు

లింగమ్మవలసలో నిర్మించిన ఇంకుడు గుంత

బొబ్బిలి గ్రామీణం, బొండపల్లి, న్యూస్‌టుడే: భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వేసవిలో నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి నీటి బొట్టు ఒడిసి పట్టాలనే ఉద్దేశంతో ఉపాధి నిధులతో ఇంకుడు గుంతలు తవ్వాలని ప్రభుత్వం భావించింది. ఇళ్ల వాడుక, వర్షం నీరు వృథాగా పోకుండా ఆవరణలోనే ఇంకిపోయేలా ఉండాలని వీటిని మంజూరు చేశారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ పథకంలో భాగంగా డ్వామా అధికారులు పనులు చేయించారు. ఆసక్తి ఉన్నవారంతా మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్మించుకున్నారు. కానీ ఇంకా బిల్లులు చెల్లించలేదు. లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

### ఒక్కోదానికి రూ.6 వేలు

గత తెదేపా హయాంలో ఇంకుడు గుంతలను పెద్ద ఎత్తున నిర్మించారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి దృష్టి సారించింది. ప్రతి మండలానికి కనీసం 500కు తక్కువ లేకుండా నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఒక్కో గుంతకు రూ.6 వేలు చొప్పున మంజూరు చేశారు. నాలుగు అడుగుల లోతు, వెడల్పుతో వీటిని నిర్మించారు. అందులో సిమెంటు కప్పులు దించారు. మొదట కొంత లోతులో రాళ్లు వేసిన తర్వాత మిగిలిన భాగంలో చిన్న రాళ్ల పిక్కలు, ఇసుక వేసి గొయ్యి పూడ్చారు. దానికి పైపు బిగించి నీరంతా వెళ్లేలా ఏర్పాటు చేశారు. మట్టి పని వరకు వేతనాలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కానీ మిగిలిన మెటీరియల్ డబ్బులు మాత్రం ఇంకా చెల్లించలేదు.

### డివిజన్‌లో 4,925 మంజూరు

బొబ్బిలి డివిజన్‌లోని రాజాం, గజపతినగరం, బొబ్బిలి నియోజకవర్గాల్లో 4,925 ఇంకుడు గుంతలు మంజూరు చేయగా.. 2,938 పూర్తి చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. బొబ్బిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 1,325 మంజూరు కాగా 586 నిర్మించారు. గజపతినగరంలో 2,193కు 1,426, రాజాంలో 1,507 కేటాయించగా 926 నిర్మించారు. వీటికి సంబంధించి రూ.1.76 కోట్లు బిల్లులు లబ్ధిదారులకు రావాల్సి ఉంది.

### త్వరలో బిల్లులు జమవుతాయి

మంజూరు చేసిన ఇంకుడు గుంతల నిర్మాణాలు చాలా వరకు పూర్తయ్యాయి. మిగిలినవి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేశాం. త్వరలో నిధులు విడుదల అవుతాయి. ఆపై లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతాయి. – రమామణి, ఏపీడీ, డ్వామా

## సౌకర్యాలు కరవు

దిబ్బగుడివలస జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. సిమెంటు రహదారులు లేక వర్షం పడితే అంతా బురదమయంగా మారుతోంది. ఇక్కడ ముందు నీరు నిలిచిపోతోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఒక్క బోరు ఉందని, దూర ప్రాంతం నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామని చెప్పారు. సిమెంటు రహదారులు నిర్మించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో సదుపాయాలు కల్పిస్తామని హామీలు ఇచ్చినా నెరవేరలేదన్నారు. రహదారులు, తాగునీటి సౌకర్యం కల్పించడానికి ప్రతిపాదనలు పంపించామని ఏఈ సూర్యనారాయణ తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

## శివార్లు.. చెత్తకు ఆనవాళ్లు

గంట్యాడ మండలంలోని బోనంగి, మదనాపురం శివారు ప్రాంతాలు చెత్తకు ఆనవాళ్లుగా మారాయి. మదనాపురం ఉన్నత పాఠశాల పరిసరాల్లో చెత్త పోయడంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. బోనంగి రహదారి పక్కన కూడా గుట్టలుగా వ్యర్థాలు పడి ఉన్నాయి. వర్షం పడితే దుర్వాసన వెదజల్లుతోందని, రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు. తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని డిప్యూటీ ఎంపీడీవో విజయ్ చెప్పారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

## సమస్యల్లో వసతి గృహం

బోనంగి బీసీ వసతి గృహంలో విద్యార్థులు సమస్యలతో సావాసం చేస్తున్నారు. ఇక్కడ 31 మంది చదువులు సాగిస్తున్నారు. వీరికి ఏర్పాటు చేసిన మూడు గదుల్లో ఒకటి శిథిలావస్థకు చేరగా, మరొకటి వర్షం పడితే తడిసి ముద్దవుతోంది. విద్యార్థులు నిద్రించే మంచాలు తడిసి తుప్పు పట్టిపోతున్నాయి. మరుగుదొడ్లు చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. వసతి గృహం చుట్టూ తుప్పలతో విషసర్పాల బెడద వేధిస్తోంది. సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని వసతి గృహం అధికారి బూడి చంద్రునాయుడు అన్నారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

## అడుగు వేస్తే గోతిలోకే..

రామభద్రపురం-ఇట్లా మామిడిపల్లి రహదారి గోతులమయమైంది. గత వైకాపా హయాంలో రహదారిని బాగు చేయాలని ప్రజలు అనేకసార్లు అధికారులకు వినతులు ఇచ్చినా ఫలితం లేదు. ఆరేళ్ల నుంచి పరిస్థితి ఇలానే ఉందని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వాహనాలు బోల్తా పడుతున్నాయని చెప్పారు. పీఆర్ డీఈ అప్పారావు వద్ద సమస్యలను 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. త్వరలోనే రహదారి బాగు చేయడానికి నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం

## ప్రమాదకరం.. పట్టించుకోరూ

గుర్లలో రహదారి పక్కనే కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. విజయనగరం- పాలకొండ రహదారిపై నిత్యం రద్దీ ఎక్కువగా ఉన్నందున ఎప్పుడు, ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రైతుబజారు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై గుర్ల ఎస్సై నారాయణరావు వద్ద ప్రస్తావించగా రహదారి పక్కన విక్రయాలతో వచ్చే ప్రమాదాల గురించి వీరికి అవగాహన కల్పించామన్నారు. –న్యూస్‌టుడే, గుర్ల

## కళ్లెదుటే నీరు.. సాగక కన్నీరు

చీకటిపేట వైపు వెళ్లే తోటపల్లి ప్రధాన కాలువలో పూడిక

తెర్లాం, న్యూస్‌టుడే: పొలాలకు సాగునీరు సక్రమంగా అందితే పొలాలు పచ్చగా ఉంటాయి. రైతులకు చేతినిండా పనిదొరికి తిండి గింజలకు లోటుండదు. కానీ క్షేత్రస్థాయిలో కాలువల పరిస్థితి భిన్నంగా ఉంది. పూడిక తీత పనులు కాకపోవడంతో ఖరీఫ్‌లో సాగుకు ఇబ్బందులు తప్పేలా లేవని రైతులు వాపోతున్నారు. తోటపల్లి జలాశయం సాగునీరు త్వరలో విడుదల చేయబోతున్నారు. తెర్లాం మండలానికి ఇవే ఆధారం. నీరు పారేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

### గండ్లు పడే అవకాశం

తోటపల్లి ప్రధాన కాలువ, పిల్ల కాలువల ద్వారా తెర్లాం, ఆమిటి, నెమలాం, ఉద్దవోలు, కొరటాం, కాగాం, అరసబలగ, చీకటిపేట తదితర 16 గ్రామాలకు చెందిన 4 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కానీ కాలువలు పూడిక, పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి. నీరు విడిచి పెడితే ఇబ్బందులు వస్తాయని, నీరు పారలేక ఒకేచోట చేరి గండ్లు ఏర్పడుతాయని రైతులు అంటున్నారు. తెర్లాం సమీపంలోని ఆసుపత్రి దగ్గర, కొరటాం, ఆమిటి, నెమలాం, నీలయ్యవలస గ్రామాలకు వెళ్లే కాలువలు అధ్వానంగా ఉన్నాయి. నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందని, శుభ్రం చేయాలని అంటున్నారు. నెమలాం నుంచి నీలయ్యవలసకు పిల్ల కాలువ ఏర్పాటు చేశారు. దీని మొదటి భాగంలో దట్టమైన పొదలతో నీరు పారే పరిస్థితి లేదు. మిగిలిన భాగంలో కొన్ని చోట్ల ఇటీవల పూడిక తీశారు. పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

### సమస్య లేకుండా చర్యలు

పూడికతీత పనులకు రూ.40 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే నెమలాం కాలువ పనులు చేపట్టాం. ఇంకా కొంతమేర చేయాల్సి ఉంది. నెమలాం ప్రధాన కాలువ లోతుగా ఉండడం వల్ల యంత్రాలు దించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. డిసెంబరు నెలాఖరు దాటితే కానీ పనులు పూర్తి కావని గుత్తేదారులు చెబుతున్నారు. రైతులకు సక్రమంగా సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నాం – రఘు, ఏఈ, తోటపల్లి

## కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. ఆదివారం చీపురుపల్లిలో గవిడివీధిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఉపాధి నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రహదారిని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, రౌతు కామునాయుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ❖ గుర్ల: తెట్టంగి, గూడెం, కెల్ల సొసైటీల నూతన అధ్యక్షులు టి.కిరణ్‌కుమార్, పిల్ల అప్పలనాయుడు, విమలారాణి ఎమ్మెల్యే కళాను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## తెదేపాతోనే సుపరిపాలన సాధ్యం

మహిళకు కరపత్రం అందిస్తున్న బేబినాయన

బొబ్బిలి గ్రామీణం, గజపతినగరం, తెర్లాం, రామభద్రపురం, వంగర: తెదేపాతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. బొబ్బిలి మండలం కింతలవానిపేటలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. భాస్కరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. గజపతినగరంలోని కెంగువ, తెర్లాం మండలం పణుకువలసలో ఏఎంసీ అధ్యక్షులు పీవీవీ గోపాలరాజు, ఎన్.వెంకటినాయుడు, నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. రామభద్రపురంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సి.రామకృష్ణ, వంగరలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బి.వాసుదేవరావునాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

## సీఐ 'పల్లె నిద్ర'

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఇట్లా మామిడిపల్లిలో సీఐ నారాయణరావు 'పల్లె నిద్ర' చేశారు. ముందుగా గ్రామస్థులతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణా, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సమ్మె విరమణ

గరివిడి, న్యూస్‌టుడే: కొండపాలెం (గరివిడి) పంచాయతీలో గత మూడు రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మెను ఆదివారం సాయంత్రంతో విరమించారు. 28 మంది ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో సిటు ఆధ్వర్యంలో సమ్మెకు దిగారు. బకాయిలు చెల్లించేందుకు అంగీకారం కుదరడంతో సమ్మె విరమించారు. సోమవారం నుంచి కార్మికులంతా విధుల్లో పాల్గొంటారని ఈవో నాగమణి చెప్పారు.

## బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శుల నియామకం

తెర్లాం, న్యూస్‌టుడే: వైకాపా బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తెర్లాం మండలం కూనాయవలస ఎంపీటీసీ సభ్యుడు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన చెప్పారు. ❖ దత్తిరాజేరు: వైకాపా రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా ఇంగిలాపల్లికి చెందిన ఉప ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు అప్పలనాయుడు ఓ ప్రకటన విడుదల చేశారు.

## అదుపు తప్పిన లారీ

ప్రమాదానికి గురైన వాహనం

రేగిడి, న్యూస్‌టుడే: వంగర నుంచి రాజాం వైపు ఊకతో వెళ్తున్న లారీ శనివారం రాత్రి పొలాల్లోకి దూసుకుపోయింది. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో జోడుబందర, కొడిశ గ్రామాల సమీపంలోని మలుపు వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో లారీ చోదకుడికి ఫిట్స్ వచ్చినట్లు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## మానసాదేవి.. సారె సమర్పయామి

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం రామలింగాపురంలో స్వయంభూగా వెలసిన మానసాదేవికి పలువురు భక్తులు పిండి వంటలతో సారె సమర్పించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ఆదివారం సాయంత్రం వందలాదిగా తరలివచ్చిన భక్తులు తీపి పదార్థాలను నైవేద్యంగా అందించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన చేశారు.

## ఘనంగా వారాల పండగ

బొబ్బిలి గ్రామీణం: అలజంగి, పక్కి, ఎం.బూర్జివలస గ్రామాల్లో ఆదివారం వారాల పండగలు ఘనంగా జరిగాయి. ప్రజలంతా ఆలయాల వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి చీరలు, పండ్లు, ప్రసాదాలు సమర్పించారు. నాట్లు వేసే ముందు ఆయా గ్రామాల్లో పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని దేవతలను వేడుకుంటామని స్థానికులు తెలిపారు. ❖ చీపురుపల్లి గ్రామీణం: వంగపల్లిపేటలో మరిడమ్మ పండగ జరిగింది. పలువురు రైతులు తమ పశువులతో అమ్మవారిని పూజించారు. రెండేళ్లకోసారి నిర్వహించే పండగతో సందడి నెలకొంది.

## కాలువ నిర్మాణంతో తప్పిన ముప్పు

ఈనాడు కథనానికి స్పందన

గుర్ల, న్యూస్‌టుడే: గూడెంలోని జగనన్న కాలనీలో మండల పరిషత్తు నిధులతో కాలువ నిర్మాణం చేపట్టారు. ఇక్కడ వాడుక నీరు రహదారి మీదకు వెళ్లడంతో గుంతలమయంగా తయారై ఆరు గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు. దీనిపై గతంలో 'ఈనాడు'లో పలుసార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీన్ని గుర్తించిన ఎంపీపీ ప్రమీల రూ.4 లక్షలు మంజూరు చేశారు.

## గ్రామాలకు తాగునీటి సరఫరా

సంతకవిటి, న్యూస్‌టుడే: సంతకవిటి, రేగిడి మండలాల పరిధిలోని 93 గ్రామాలకు అధికారులు ఆదివారం తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. సిబ్బంది సమ్మె వల్ల నిలిచిపోయిన సరఫరాపై 13న 'ఈనాడు'లో '93 గ్రామాలకు నీటి కష్టాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించేందుకు గుత్తేదారు అంగీకరించడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి తాగునీటి సరఫరా పునరుద్ధరించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు.

## సేవలకు సత్కారం

బాడంగిలో ఏఎస్ఐకి సన్మానం

బాడంగి, బొబ్బిలి, న్యూస్‌టుడే: బాడంగి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి బదిలీపై బొబ్బిలి పట్టణానికి వెళ్తున్న డి.కొండలరావును ఎస్ఐ తారకేశ్వరరావు, సిబ్బంది ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా కేసుల నమోదు, ఛేదన గురించి ఏఎస్ఐ తన అనుభవాలు పంచుకున్నారు. ❖ బొబ్బిలి పట్టణానికి చెందిన కోరుకొండ అప్పారావు బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధుల నిర్వహిస్తున్నారు. ఇటీవల 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొని దేశ రక్షణలో తనవంతు సేవలందించినందుకు సాహితీ నగర్‌లో శశి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు.

బీఎస్ఎఫ్ హెచ్‌సీని గౌరవిస్తున్న దృశ్యం

మహిళల కోలాటం

## ఆకట్టుకున్న ఆనందో బ్రహ్మ

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఆనందో బ్రహ్మ కార్యక్రమం ఆకట్టుకుంది. యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు విజయమోహన్ ఆధ్వర్యంలో కోలాటం, నాటకాలు, నృత్యం ప్రదర్శించారు. పట్టణ వాసులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ బలోపేతానికి కార్యక్రమాలు

సమావేశమైన నాయకులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో గ్రామస్థాయిలో జనసేన పార్టీ బలోపేతానికి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నియోజకవర్గ నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీ నుంచి క్రియాశీలకంగా ఉన్న ముగ్గురు జనసైనికులు, ఒక వీరమహిళ వివరాలను చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు. గుర్ల మండల పార్టీ అధ్యక్షుడు వై.సంతోష్, నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## ఉద్యోగ సంఘం ఎన్నిక

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక ఆదివారం రామభద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. అధ్యక్షుడిగా చొక్కాపు శ్రీరాములునాయుడు(ఎస్ఏ, ఎంపీడీవో కార్యాలయం, రామభద్రపురం), సెక్రటరీగా రవణమ్మ(జేఏ, ఆర్‌డబ్ల్యూఎస్, సాలూరు), జిల్లా కౌన్సిల్ సభ్యులుగా సంతోష్ కుమార్ (టైపిస్టు, ఎంపీడీవో కార్యాలయం, రామభద్రపురం), జిల్లా కౌన్సిల్ సభ్యుడు-2గా గౌరునాయుడు(ఆర్ఏ, వేదసమాజం, సాలూరు), వైస్ ప్రెసిడెంట్‌గా బీఆర్‌కేవీకే నాయుడు(జేఏ, ఎంపీడీవో కార్యాలయం మక్కువ), ట్రెజరర్‌గా హరికృష్ణ(జేఏ, ఎంపీడీవో కార్యాలయం, సాలూరు), ఆర్గనైజింగ్ సెక్రటరీగా టైపిస్ట్ నాగేశ్వరరావు(ఎంపీడీవో కార్యాలయం, పాచిపెంట) ఎన్నికైనట్లు తెలిపారు.


## SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

RASMECC శాఖ (61056), డి.నెం.5-16-6/1ఎ, ఎన్‌సిఎస్ రోడ్, విజయనగరం, విజయనగరం (జిల్లా)-535001.
ఫోన్: 08922-293816/ఫ్యాక్స్-233224, ఇ-మెయిల్: sbi.61056@sbi.co.in

### స్వాధీనత ప్రకటన

(అనుబంధం IV చట్టంలోని రూల్ 9 క్రింద) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చీపురుపల్లి శాఖ, విజయనగరం జిల్లా, ప్రస్తుతం RASMECC శాఖ, ఎన్‌సిఎస్ రోడ్, విజయనగరం, విజయనగరం జిల్లా వారిచే నిర్వహించబడుచున్న యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (నెం.54 ఆఫ్ 2002) ప్రకారము మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 9తో చదివే సదరు సెక్షన్ 13(2) ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు: మెస్సర్స్ ఎస్‌కెఎమ్‌ఎల్ కీర్తి శ్రీ పార్వతి ఫిల్లింగ్ స్టేషన్, GST.No.37BKAPG5748Q1ZK, ప్రొప్రైటర్: శ్రీ గేదల శ్రీను, తండ్రి: జి.సత్యం, డి.నెం. 61-13-ఎ1, పుర్రెయ్యవలస, రామలింగాపురం, చీపురుపల్లి, విజయనగరం జిల్లా-535128. మరియు: లావేరు రోడ్, చీపురుపల్లి గ్రామం, విజయనగరం జిల్లా-535128. హామీదారు: శ్రీ కింథాలి గౌతమ్, తండ్రి: నరసింహ స్వామి గుప్తా, చిరునామా: డి.నెం.12-116/బి, గొల్లవీధి, లావేరు రోడ్, చీపురుపల్లి గ్రామం, విజయనగరం జిల్లా-535128. వారి బకాయి క్యాష్ క్రెడిట్ లోన్ ఖాతా నెం.40789432348కి తేదీ.03.05.2025 నాటికి చెల్లించవలసిన మొత్తం రూ.25,98,031/- (ఇరవై ఐదు లక్షల తొంభై ఎనిమిది వేల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే) మరియు ఖర్చులు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది.02.05.2025 న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

ఋణగ్రహీత/హామీదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని రూల్సు నందలి రూల్స్ 9 తో చదివే సదరు సెక్షన్ 13(4) ప్రకారము ది.08.07.2025న దిగువ పేర్కొన్న ఆస్తిని నిర్మాణాత్మక స్వాధీనత తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకామునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం క్యాష్ క్రెడిట్ లోన్ ఖాతా నెం.40789432348కి 08.07.2025 నాటికి రూ.18,59,285/- (పద్దెనిమిది లక్షల యాభై తొమ్మిది వేల రెండు వందల ఎనభై ఐదు రూపాయలు మాత్రమే) మరియు తేది.09.07.2025 నుండి భవిష్యవడ్డీ మరియు ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు SBI RASMECC బ్రాంచ్, విజయనగరం వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత/హామీదారు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత మీ తదుపరి చెల్లింపులు ఏమైనా ఉంటే తగ్గించబడును.

స్థిరాస్తుల వివరములు:

చీపురుపల్లి ఎస్.ఆర్.ఓ ద్వారా 31.07.2015న నమోదు చేయబడిన సేల్ డీడ్ నంబర్ 1264/2015 పరిధిలోని శ్రీ కింథాలి గౌతమ్, తండ్రి: నరసింహ స్వామి గుప్తా గారి ఆస్తి.

విజయనగరం జిల్లా, చీపురుపల్లి సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, చీపురుపల్లి గ్రామ పంచాయతీ, 14వ బ్లాక్, ఆంజనేయ థియేటర్ సమీపంలో, ఆంజనేయపురం గ్రామం, సర్వే నం. 8/28 మరియు 8/30, డోర్ నెం.14-44, అసెస్‌మెంట్ నెం.3758 (పాత) 3495 (కొత్త) వద్ద 484 చదరపు గజాల విస్తీర్ణంలో గల ఖాళీ స్థలంతో కలిపి ఆర్.సి.సి. స్లాబ్ బిల్డింగ్ ఈ క్రింది కొలతలు మరియు సరిహద్దులు కలిగిఉన్నది.

కొలతలు: తూర్పు నుండి పడమర: 21 అడుగులు (6.40 మీటర్లు), ఉత్తరం నుండి దక్షిణం: 24 అడుగులు (7.31 మీటర్లు), మొత్తం విస్తీర్ణం: 504 చదరపు అడుగులు (47.04 చదరపు మీటర్లు) హద్దులు: తూర్పు: రాంభట్ల గోపాలరావు గారి ఖాళీ స్థలం, దక్షిణం: రాస్తా (మార్గం), పడమర: ముద్దు వరలక్ష్మి గారి స్లాబ్ ఇల్లు మరియు ఖాళీ స్థలం, ఉత్తరం: ముద్దు వరలక్ష్మి మరియు బోగిరి సీతారాం గారి ఖాళీ స్థలాలు.

తేది : 08.07.2025 సం/-అధీకృత అధికారి
ప్రదేశం : విజయనగరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


(c) eenadu

# విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

**కూరగాయల ధరలు**

విజయనగరం రైతుబజార్లలో ఆదివారం ధరలు (కిలో రూ.లలో) ★ వంకాయలు: తెల్లవి- 46, రవి- 36, నల్లవి- 30 ★ టమాటా: 30 ★ బెండ: 33 ★ కాకర: 30 ★ బీర: 35 ★ క్యాబేజీ: 28 ★ పొడవుచిక్కుడు: 25 ★ బరబాటీ: 30 ★ క్యారెట్: 36 ★ దొండ: 36 ★ బీట్‌రూట్: 38 ★ ఉల్లి: 23 ★ బంగాళదుంపలు: 20 ★ గోరుచిక్కుడు: 45 ★ క్యాప్సికమ్: 98 ★ పొటల్స్: 45 ★ బీన్స్: 90 ★ ఆగాకర: 90 – న్యూస్‌టుడే, విజయనగరం వ్యవసాయ విభాగం

**తెరపై ఈనాడు**

★ ఎన్సీఎస్: 3 బీహెచ్‌కే ★ శ్రీకృష్ణ: జురాసిక్ వరల్డ్ రీబర్త్ (తెలుగు డబ్బింగ్) ★ లీలామహల్: కుబేర ★ రంజనీ స్క్రీన్-1: ఓ భామా.. అయ్యో రామ ★ శివరంజనీ స్క్రీన్-2: కుబేర, తమ్ముడు ★ హిమగిరి: సూపర్‌మెన్ (తెలుగు) ★ సప్తగిరి: ఓ భామా.. అయ్యో రామ – కంటోన్మెంట్

## కనకదుర్గమ్మకు సారె

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: అఖిల ఆంధ్ర భవానీ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులు విజయవాడలో కనకదుర్గమ్మకు ఆషాఢం సారెను సమర్పించారు. పూసపాటిరేగ, భోగాపురం మండలాల నుంచి సుమారు 10 బస్సుల్లో శనివారం బయలుదేరి విజయవాడ వెళ్లారు. ఆదివారం అమ్మవారికి ఫలాలు, పిండి వంటలు, వస్త్రాలు, విగ్రహాలు సమర్పించారు. ఎం.నారాయణరావు, విజయ్‌కుమార్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే వికాసం

మాట్లాడుతున్న వెంకటరావు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విద్యతోనే వికాసం సాధ్యమని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(గోవా) ఉప కులపతి ఆర్.వెంకటరావు పేర్కొన్నారు. విజయనగరంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గాయత్రి భవన్- 2025 పేరిట ఆదివారం ప్రతిభ పురస్కారాలను అందించింది. వారు పాల్గొని సమాఖ్య తరపున 400 మంది విద్యార్థులకు రూ.28 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఛైర్మన్ ధవళ వెంకటరావు, రాంజీ, డా.డి.వి.శ్రీకాంత్, రమణమూర్తి, భరద్వాజ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అవకతవకలపై విచారించాలి

నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిందాల్ యాజమాన్యం చేస్తున్న అవకతవకలపై ఎందుకు విచారించడంలేదని సీపీఎం నాయకుడు చల్ల జగన్ ప్రశ్నించారు. ఆదివారం బొడ్డవరలో భూనిర్వాసితుల శిబిరం వద్ద నిరసన తెలిపారు. యాజమాన్య ప్రతినిధులు నిర్వాసితుల వద్దకు వచ్చి భూమికి, షేర్లకు, ఇళ్లకు డబ్బులు ఇప్పిస్తామని చెప్పి, కమీషన్లు దండుకుంటున్నారన్నారు. నలుగురు బాధితుల ఖాతాల్లో రూ.8.25 లక్షలు చొప్పున వేసి తిరిగి రూ.4 లక్షల చొప్పున నొక్కేశారన్నారు. దీనికి సంబంధించిన ఫోన్ రికార్డింగ్ స్థానికంగా హల్‌చల్ చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అమాయక గిరిజనుల భూమిని తిరిగి అప్పగించాలని డిమాండు చేశారు.

**నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం..** నెల్లిమర్ల: సతివాడ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ పి.త్రినాథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, బొడ్డపేట, మధుపాడ, వల్లూరు గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## హుద్‌హుద్ బాధితులకేదీ భరోసా?

న్యూస్‌టుడే– జామి

ఇళ్ల ముందు పేరుకుపోయిన వ్యర్థాలు

జామి మండలం అలమండలో హుద్‌హుద్ లబ్ధిదారుల కష్టాలు నేటికీ తీరడంలేదు. రక్షిత నీరు అందక.. మరుగుదొడ్లు సక్రమంగా లేక నానా అవస్థలు పడుతున్నారు. హుద్‌హుద్ సమయంలో తీవ్రంగా నష్టపోయినవారి కోసం 2015లో అలమండ గ్రామానికి చెందిన జడ్పీ మాజీ అధ్యక్షుడు లగుడు సింహాద్రి, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పట్టుబట్టి కాలనీ మంజూరు చేయించారు. లబ్ధిదారుల ఎంపికలో పలు ఆరోపణలతో విషయం కోర్టుకు వెళ్లినా.. ఏడేళ్ల తర్వాత అన్నీ కొలిక్కి వచ్చాయి. 2022లో 160 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. సుమారు అయిదేళ్ల పాటు ఖాళీగా ఉండడంతో ఆకతాయిలు భవనాలను పాడుచేశారు. దాంతో లబ్ధిదారులే సొంత ఖర్చులతో మరమ్మతులు చేసుకుని ఇళ్లలోకి వెళ్లారు. కానీ ప్రధాన సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదు.

**రెండు నెలల్లో కొలిక్కి..**

హుద్‌హుద్ లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. గుత్తేదారునితో మాట్లాడి, అసంపూర్తి పనులు మొదలు పెట్టాం. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తయింది. ఇళ్ల ట్యాంక్‌లకు కనెక్షన్లు ఏర్పాటు చేసి, మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకొస్తాం. రెండు నెలల్లో అన్నీ కొలిక్కి వస్తాయి. – శ్రీనివాసరావు, ఏఈ, గృహనిర్మాణ శాఖ

అసంపూర్తిగా రక్షిత నీటి పథకం

**ప్రధాన సమస్యలివీ..**

రక్షిత మంచినీటి పథకం నిర్మాణం పూర్తయినా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు కనెక్షన్లు ఇవ్వలేదు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు నిర్మించినా నీటి సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులు వర్ణనాతీతం. బహిరంగ ప్రదేశాన్ని మరుగుదొడ్లుగా వాడుతుండడంతో అపరిశుభ్రత నెలకొంటోంది. దీనికితోడు కాలనీ ముందే చెత్త వేస్తుండడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిందనే నెపంతో వైకాపా నాయకులు దీన్ని పూర్తిగా పట్టించుకోలేదు. ప్రస్తుత పాలకులైనా పట్టించుకుని అసంపూర్తి పనులు పూర్తి చేయించాలని, ఇబ్బందులు తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## మూడో నేత్రానికి కొమ్మలు అడ్డు

నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకం. అవి చక్కగా పనిచేసి మంచి ఫలితాలు ఇవ్వాలంటే ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహణ సాగాలి. విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తపేట బజాజ్ షోరూమ్ వద్దగల రోడ్డుపై ఏర్పాటు చేసిన అత్యాధునిక కెమెరాలకు చెట్టు కొమ్మలు అడ్డంకిగా మారాయి. ఓవైపు బాగానే ఉన్నా.. మరోవైపు ఫుటేజీ కానరావడం లేదు. పోలీసులు పరిశీలించి, కొమ్మలను తొలగించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, నేరవార్తా విభాగం

కెమెరాలకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు

## సమాజంపై అవగాహన అవసరం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, సాహితీవేత్తలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సమాజాన్ని మార్చే శక్తి రచయితలకే ఉంటుందని, వారికి సమాజంపై పూర్తిస్థాయిలో అవగాహన అవసరమని సాహితీవేత్త, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. రచయిత్రి కొరప్రోలు కళావతి రచించిన విశాఖ తరంగిణి బాల సాహిత్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం నగరంలో జరిగింది. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ప్రస్తుత పోకడలతో చిన్నారులు, యువతీయువకులు పక్కదారి పడుతున్నారని, వారిని సన్మార్గంలో నడిపించేలా కొత్త రచనలు రావాలన్నారు. రామచంద్రరావు, చలం, సింహాచలం, దివాకర్, ప్రకాశరావు, బాలకృష్ణ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాలువల శుభ్రం

కొత్తవలస: పట్టణంలోని శివాజీనగర్ ప్రాంతంలో కాలువలు పూడికతో అధ్వానంగా ఉన్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలియజేశారు. దీనిపై ఆదివారం వార్త ప్రచురితమవగా.. పంచాయతీ కార్యదర్శి బి.శైలజ స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

## నగర దారులు.. ప్రమాదాలకు నిలయాలు

నగరంలో పలుచోట్ల రహదారులు, కల్వర్టు పలకలు ప్రమాదకరంగా మారాయి. బొబ్బాదిపేట దారిలో రహదారి, కాలువ, కల్వర్టుపై పలక పాడైంది. రహదారి విరిగి కాలువపై పడడంతో మురుగునీరు పారడంలేదు. కల్వర్టు సగం వరకు పోయింది. దానిని సొంత నిధులతో నిర్మించుకున్నామని, భారీ వాహనాలు రావడంతో మళ్లీ విరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. విషయం కమిషనరు పి.నల్లనయ్య వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

## రహదారిపై బళ్లు.. రాకపోకలకు అవస్థలు

కొత్తవలస కూడలిలో ప్రధాన రహదారికి ఆనుకుని స్థలాల్లో చిరువ్యాపారులు పాగా వేస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. విశాఖపట్నం-అరకు జాతీయ రహదారిని ఆనుకుని ఆర్‌యూబీ అప్రోచ్ రోడ్డుపైనే తోపుడు బళ్లు పెట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ద్విచక్రవాహనాలను రోడ్డు పక్కన నిలిపేస్తున్నారు. విషయం సీఐ సీహెచ్.షణ్ముఖరావు వద్ద ప్రస్తావించగా.. రైల్వే రక్షణ దళంతో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపడతామని, ఆక్రమణలు లేకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తవలస

## నిర్వహణ ఇలా.. మంచినీరు ఎలా..?

జరజాపుపేట ప్రాంతంలో తాగునీటి ట్యాంకు మెట్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో 15 రోజులకొకసారి చేయాల్సిన ట్యాంకు క్లోరినేషన్ పనులు సుమారు రెండేళ్లుగా చేయడం లేదు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో చంపావతి నదిలో కొత్తనీరు వస్తోంది. దీనికితోడు నీరు విడుదల చేసే వాల్వుల చుట్టూ నాచుతో నిండింది. వ్యాధులు ప్రబలే అవకాశముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం ఏఈ రాజా వద్ద ప్రస్తావించగా.. శిథిలావస్థలో ఉన్న మెట్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచామన్నారు. నిర్మాణం పూర్తిచేస్తే నిర్వహణకు ఆటంకాలు ఉండవని చెప్పారు. – న్యూస్‌టుడే, జరజాపుపేట (నెల్లిమర్ల)


**PUBLIC NOTICE**

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Vizianagaram Branch-I, Vizianagaram,** I issue the following notice to general public. My client intends to grant loan to **SMT. PATNANA GEETA** W/o Venkata Ramana D/o Pydithalli Chintapalli by keeping the below mentioned schedule property of **SMT. GUDAPUVALASA KUMARI** W/o G Srinu, **Mr. THOTAPALLI RAMANA RAO** S/o T Ramanayya @ Ramana as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

Vizianagaram District, Bhogapuram Sub-District, Denkada Mandalam, Pedatadiwada Gram panchayat and village accounts covered by S. Nos. 93-P, 94-P, 95-P & 97-P part, approved by VUDA vide LP No.52/2018 dated 04.06.2018 in the name of SENOR VALLEY in which **Plot No.34** measuring East to West 30 feet or 9.15 meters and North to South 60 feet or 18.30 meters totaling 200 sq. yards or 167.2 sq. meters of vacant site is bounded by: **East** : Plot No.35 site; **South** : 40 feet wide layout road; **West** : Plot no.33 site; **North:** Plot no.49 site.

**KODURI SREENIVASA RAO**
**SMT. SIVA KUMARI JALADI**
**Advocates,**
S-2, Bharat Apartments, Behind Rythu bazar, Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt.13-07-2025 Mobile No.9885166648
Mail: sreenivaskoduri@gmail.com


## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న పావని

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోవడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్.పావని అన్నారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యను కార్పొరేటీకరణ చేస్తున్న జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండు చేశారు. రాజాం, గజపతినగరం, విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి కోరారు. నాయకులు డి.రాము, వెంకటేష్, చిన్నిబాబు, రవి కుమార్, సమీరా, వెంకీ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారమూ ఎస్‌బీఐ సేవలు

సాధారణంగా జాతీయ, ప్రైవేటు బ్యాంకులు ఆదివారం సెలవు రోజు పాటిస్తాయి. విజయనగరం జిల్లా కేంద్రంలోని రింగురోడ్డు రైతుబజారు సమీపంలో ఉన్న ఎస్‌బీఐ దాసన్నపేట శాఖ మాత్రం సేవలు అందిస్తోంది. మంగళవారం సెలవు పాటిస్తోంది. మిగిలిన బ్రాంచిలు రెండు, నాలుగో శనివారాల్లో కార్యకలాపాలు ఆపేస్తే.. ఇక్కడ మాత్రం రెండు, నాలుగో సోమవారాల్లో ఉద్యోగులు రారు. అత్యవసర సేవలు, రుణాలు, రూ.లక్షల్లో నగదు కావాల్సిన వారు ఈ శాఖను సంప్రదిస్తున్నారు. సద్వినియోగం చేసుకోవాలని, ఖాతాదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ప్రబంధకుడు ఎం.సింహాచలం కోరారు. – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

## శాకంబరి అలంకరణలో కోటమ్మ

ఎస్.కోట, న్యూస్‌టుడే: ఆషాఢమాసం ఆదివారం సందర్భంగా ఎస్.కోట మండలం కొట్టాం గ్రామంలోని కోటమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు.

## ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు

శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వీవీజే సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ ప్రకటించారు. ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో వీరి పేర్లను ప్రకటించారు.


**PUBLIC NOTICE**

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Vizianagaram Branch-I, Vizianagaram,** I issue the following notice to general public. My client intends to grant loan to **SMT. KOTTALA DHANA LAKSHMI** W/o Pasupureddy Raja Sekhar D/o K Arjuna by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

Vizianagaram District, Nellimarla Sub-District, Nellimasrla Mandalam, Jarajapupeta Nagar panchayat, and village accounts Near Kondalaveehi, Santhi nagar, Ward No.2, Block No.2, Khata No.138, S. No.13-12 part an extent of Ac.0.05¼ cents totaling 249.33 Sq. yards site measuring East to West 68 feet or 20.73 meters and North to South 33 feet or 10.06 meters is bounded by: **East:** Vacant site of Matha Lakshmi; **South:** Vacant site of Kottala Radha; **West:** CC road; **North:** 8 feet width road

**KODURI SREENIVASA RAO**
**SMT. SIVA KUMARI JALADI**
**Advocates**
S-2, Bharat Apartments, Behind Rythu bazar, Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt.13.07.2025 Mobile No.9885166648
Mail: sreenivaskoduri@gmail.com


## పేదలకు అండగా ఉండాలి

మొక్క నాటుతున్న ప్రభావతి తదితరులు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ పేదలకు అండగా ఉండాలని వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అన్నారు. ఆదివారం అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు ఆధ్వర్యంలో తోష్నివాల్ జయంతి కార్యక్రమం జరిగింది. ముందుగా తోష్నివాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడు నెలల పాటు మజ్జిగ చలివేంద్రానికి సహకారం అందించిన చందక ప్రసాద్‌ను సత్కరించారు.

## మొక్కల పంపిణీ

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణానికి చెందిన జియో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. స్థానిక జియో నర్సరీ నుంచి అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 60 జంబో నేరేడు, పూల మొక్కలు పంపించారు. సంస్థ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## వ్యక్తికి తీవ్రగాయాలు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట ర.భ అతిథి గృహం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్.కోట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన తూర్పాటి లోకేష్ (30) తీవ్ర గాయాలపాలయ్యాడు. కొత్తవలస 108 వాహన సిబ్బంది వివరాల ప్రకారం.. ఎస్.కోట నుంచి విశాఖపట్నం వైపు వస్తున్న కారు కొత్తవలస నుంచి సీతారాంపురం వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి జమ్మాదేవిపేట సమీపంలో ఢీకొన్నాయి. సీతారాంపురం గ్రామానికి చెందిన లోకేష్‌కు తీవ్ర గాయాలవగా.. ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు.

## బాధితులకు ఆర్థిక సాయం

జామి: జన్నివలసలో భార్యాభర్తలు మైలపల్లి పైడిరాజు, దేవి ఇటీవల కొద్ది రోజుల వ్యవధిలోనే ఇద్దరూ చనిపోయారు. వీరి పిల్లలు విజయ్, గౌతమ్‌లను పెద్దమ్మ కొండమ్మ చూస్తున్నారు. ఆ గ్రామంలోని తెలుగు యువత రూ.30,500 నగదును పిల్లలకు అందజేశారు. చదువుకునేందుకు సహకారం అందిస్తామని తెలిపారు.

## నిర్వాసిత ప్రాంతాల్లో పర్యటన

శృంగవరపుకోట: జిందాల్ భూ నిర్వాసితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లేందుకు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ సోమవారం నిర్వాసిత గ్రామాల్లో పర్యటిస్తారని నియోజకవర్గ అధ్యక్షుడు కాండ్రేగుల ప్రసాద్ తెలిపారు. కిల్తంపాలెం, ముషిడిపల్లి, మూలబొడ్డవర, చీడిపాలెం, అడ్డతీగ గ్రామాల్లో పర్యటిస్తారన్నారు.

## సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

లక్కవరపుకోట: అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. కిత్తన్నపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కొత్తవలస ఏఎంసీ ఛైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

## వైకుంఠనారాయణుడికి పూజలు

విజయనగరం గ్రామీణం: రామనారాయణంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనారాయణస్వామికి అర్చకులు చాణక్య, శ్రీహర్ష, కృష్ణతేజ పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.

## కల్యాణ వైభోగం

విజయనగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో కొలువుదీరిన వేంకటేశ్వరునికి శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం కల్యాణం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు పి.వి.నర్సింహాచార్యుల వేదమంత్రాల నడుమ ఈ క్రతువు సాగింది. దర్శనాలకు భక్తులు బారులుదీరారు. అయ్యన్నపేట శ్రీక్షేత్రంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

## రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడిగా నియామకం

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస మేజరు పంచాయతీలోని ఎర్రవానిపాలేనికి చెందిన కంట్రెడ్డి రామన్న పాత్రుడిని వైకాపా రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నియమించారని ఆయన తెలిపారు.

## బల్లంకిలో పశలమ్మ పండగ

పశువులకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో ఆదివారం పశలమ్మ పండగ నిర్వహించారు. పశువులన్నింటినీ ఒకచోటకు చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఖరీఫ్‌నకు ముందు ఇలా చేస్తే పాడి, పంటలు వృద్ధి చెందుతాయనే నమ్మకమని గ్రామ పెద్దలు చెప్పారు.

## ప్రశ్నిస్తే కేసులు పెడతారా: బొత్స

మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం కక్షపూరిత పాలన సాగిస్తోందని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రశ్నిస్తే దేశద్రోహం కేసులు పెడతామని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. నగరంలో ఆదివారం రాత్రి జరిగిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోందన్నారు. చంద్రబాబు వంద అబద్ధాలు ఆడితే ఆయన కుమారుడు లోకేశ్ 200 అబద్ధాలు ఆడుతారని విమర్శించారు. రూ.కోట్లు అప్పు చేస్తున్నా.. మామిడి రైతులకు రూ.200 కోట్లు ఇవ్వలేరా అని ప్రశ్నించారు. బెల్లాన చంద్రశేఖర్, కోలగట్ల వీరభద్రస్వామి, మజ్జి శ్రీనివాసరావు, సత్యనారాయణ, వెంపడాపు విజయలక్ష్మి, కోలగట్ల శ్రావణి, మామిడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో ఆవు మృతి

జామి, న్యూస్‌టుడే: జామి మండలం తానవరంలో ఆదివారం సాయంత్రం పిడుగుపడి పశువుల శాలలో ఉన్న రైతు వెన్నెల చిట్టి వెంకటరావుకు చెందిన ఆవు మృతి చెందిందని వీఆర్వో వేంద్రపు బంగారునాయుడు తెలిపారు. ఆవు విలువ రూ.50 వేలు ఉంటుందని, సమాచారం తహసీల్దారు, పశువైద్యాధికారికి తెలియజేశామన్నారు. రోజుకు 15 లీటర్ల పాలిచ్చే ఆవు మృతి చెందిందని రైతు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆ సమయంలో శాలలో ఉన్న మహిళకు ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## జీఆర్‌టీ జ్యువెలర్స్ షోరూం ప్రారంభం

విజయనగరం పట్టణం: డాబాతోట వద్ద జీఆర్‌టీ జ్యువెలర్స్ 66వ శాఖ ఆదివారం ప్రారంభమైంది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్.అనంత పద్మనాభన్, ఛైర్మన్ జి.రాజేంద్రన్ పాల్గొన్నారు. అన్నిరకాల వజ్రాభరణాలు ఉన్నాయని, ప్రారంభోత్సవ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పార్టీ బలోపేతానికి కృషి

ఎమ్మెల్యేతో పార్టీలో చేరినవారు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: జనసేనలోకి చేరిన ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఆదివారం మండలంలోని చోడమ్మ అగ్రహారానికి చెందిన పది కుటుంబాలు వైకాపాను వీడి జనసేనలో చేరాయి. ముంజేరులో వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలు నచ్చి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. మండల నాయకులు కోట్ల రఘు, పతివాడ శ్రీను, జమరాజు, శ్రీను పాల్గొన్నారు.

## సమస్యలు గుర్తించాలి

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: జనసేన కార్యకర్తలంతా గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి మండలాధ్యక్షుల సమక్షంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు చేరవేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్యనారాయణ అన్నారు. ఎల్.కోట పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పులి బంటి సంతోష్, శివాజీ, నాయుడు, నాగేష్, రాజు పాల్గొన్నారు.

## ఈదురుగాలుల వర్షం.. రోడ్లు జలమయం

డెంకాడ, న్యూస్‌టుడే: డెంకాడ మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పెదతాడివాడ, ఊడికలపేట, బేతనాపల్లి, గుణుపూరుపేట వద్ద ఉన్న కొండవాగు గెడ్డలు పొంగి ప్రవహించాయి. ఖరీఫ్ సాగుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'పథకాల పేరుతో మోసం'

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు

జరజాపుపేట (నెల్లిమర్ల), న్యూస్‌టుడే: సంక్షేమ పథకాల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం జరజాపుపేటలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో 100 పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఎక్కడా కనిపించడంలేదన్నారు. వైకాపా నాయకులు సముద్రపు రామారావు, చిక్కాల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులకు సత్కారం

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు బులుసు భాస్కరరావు, ఎల్ఐసీ ఉద్యోగి సీహెచ్ శ్రీనివాసరావులను పట్టణానికి చెందిన స్నేహ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక పీఆర్ కోర్టులో సంస్థ అధ్యక్షుడు ఏఎస్ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇద్దరినీ కుటుంబ సమేతంగా సత్కరించి జ్ఞాపిక అందించారు. ఉపాధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఈనాడు
పశ్చిమగోదావరి
సోమవారం జులై 14, 2025


# అభిమానుల గుండెల్లో కోట!

## శ్రీనివాసరావుకు జిల్లాతో ప్రత్యేక అనుబంధం

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** సినీరంగంలో తన కంటూ ప్రత్యేకమైన బాణీ ఉన్న విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు. ఆయనకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో లక్షలాదిమంది అభిమానులు న్నారు. షూటింగ్‌ల నిమిత్తం పలుమార్లు ఆయన జిల్లాకు వచ్చి ఇక్కడ గడిపారు. భౌతి కంగా దూరమైనా జిల్లాలో పలు ప్రాంతాలతో ఆయనకున్న అనుబంధం శాశ్వ తంగా నిలిచిపోతుందని అభిమానులు అభిప్రా యపడుతున్నారు. 1992లో వినోద్‌కుమార్, వాణిశ్రీ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సీతార త్నంగారి అబ్బాయి సినిమా చిత్రీకరణ సమ యంలో కోట శ్రీనివాసరావు యలమంచిలి మండలం మేడపాడు, యలమంచిలి గ్రామాలకు విచ్చేశారు. తర్వాత 1996 మే 15న పాలకొల్లు లలిత కళాంజలి నాటక అకాడమీ ఆధ్వర్యంలో అఖిల భారత స్థాయి నాటకోత్సవాలు నిర్వహించిన సందర్భంగా సినీ దర్శకుడు కోడి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. తర్వాత పాలకొల్లుకు చెందిన నానికృష్ణ దర్శకత్వంలో శ్రీకాంత్ హీరోగా 2012లో తెరకెక్కిన 'నాటుకోడి' చిత్రీకరణ సమ యంలో కోట పాలకొల్లు ప్రాంతానికి వచ్చారు. అప్పట్లో నాల్గురోజులు పాలకొల్లులోనే గడి పారని స్థానిక కళాకారులు చెబుతున్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న కోనసీమ ప్రాంతం తోనూ కోటకు విడదీయరాని అనుబంధం ఉంది. ఉభయ జిల్లాల సరిహద్దుల్లో పలు సినిమాల షూటింగ్‌లకు ఆయన తరచూ వచ్చేవారని స్థాని కులు గుర్తు చేసుకుంటున్నారు.

**భీమవరం ఆధ్యాత్మికం:** 2010లో చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరి షత్ వార్షికోత్సవం సందర్భంగా కోట శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆర్టీయ చైతన్య పురస్కారం అందుకుని మాట్లాడారు. ఆయన మృతి నాటక, సినీ రంగాలకు తీరనిలోటని నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, ప్రధాన కార్యదర్శి మంతెన రామ్‌కుమార్‌రాజు, సహాయ కార్యదర్శి బళ్ళప్రోలు శ్రీనివాస రావు తదితరులు ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

● భీమవరం పరి సర ప్రాంతాలకు పలు మార్లు వచ్చిన కోట మావుళ్లమ్మ ఆలయాన్ని, పంచారామక్షేత్రం గును పూడి సోమేశ్వర జనార్ద నస్వామి ఆలయాన్ని తప్పనిసరిగా దర్శించు కొని ఆశీస్సులు పొందడం ఎంతో తృప్తిగా ఉంటుందని చెప్పేవారని ఆలయాధి కారులు తెలిపారు.

## గుబ్బల మంగమ్మ గుడి కిటకిట

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయ గూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు.

## నేడు యథావిధిగా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** కలెక్ట రేట్లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ నాగరాణి ఒక ప్రకట నలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డివిజన్, మండల, మున్సి పల్ కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం ఉంటుం దన్నారు. పీజీఆర్‌ఎస్ కోసం ప్రభుత్వం ప్రారం భించిన 1100 నంబరు సేవలను వినియోగించు కోవాలని సూచించారు. meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోను అర్జీలు నమోదు చేసు కోవచ్చని తెలిపారు.

# ఈ వంతెనలు దాటాలంటే దడే

## ఈ నిర్మాణాలకు ఎప్పటికో మోక్షం

**దశాబ్దాలుగా దారుణం..** కాళ్ల మండలం కోపల్లె వద్ద జొరింద డ్రెయిన్‌పై గల వంతెన కూడా శిథిలమైంది. రెండు దశాబ్దాల నుంచి దారుణంగా ఉన్నా పాలకులు పట్టిం చుకోవడం లేదు. భీమవరం నుంచి గుడివాడ మీదుగా విజయవాడ వెళ్లేందుకు ఇది ప్రధాన దారి. రోజుకి 24 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారని అంచనా.

**న్యూస్‌టుడే, భీమవరం అర్బన్, కాళ్ల, పాలకోడేరు, ఉండి**

భీమవరం-ఉండి నియోజకవర్గాల పరిధి లోని ప్రధాన మార్గాల్లో దశాబ్దాల కిందట నిర్మించిన పలు వంతెనలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. శిథిలస్థితికి చేరి దశాబ్దం దాటినా వాటిని పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. రూ. వందల కోట్లు ఖర్చు చేసి రహదారులు నిర్మిస్తున్న పాలకులు.. వారధుల విషయంలో పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. గతం కంటే ట్రాఫిక్ రద్దీ పది రెట్లు పెరిగింది. అయినా వాటి స్థానంలో కొత్తవి నిర్మించకపోవడం వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఉదాహరణకు ఉండి-చేబ్రోలు రాష్ట్ర రహదారిలో పాములపర్రు వద్ద దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనపై నుంచి రోజుకి రెండు వేలకు పైగా వాహ నాలు, పది వేల మంది వరకు ప్రజలు ప్రయాణిస్తుంటారు. దీని గురించి పట్టిం చుకున్న నాథుడు లేరు.

**శిథిలమైన పుష్కరం** ఇది భీమవరం పట్టణం నుంచి కాళ్ల పట్నం వెళ్లే ప్రధాన రహదారి. రెండు మండలాల్లో సుమారు 14 గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన మార్గం. ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తులతో కూడిన భారీ కంటైన ర్లతో పాటు నిత్యం 11వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలోని వంతెన పుష్కర కాలం కిందటే శిథిలస్థితికి చేరింది. రెయిలింగ్‌లు పడిపోకుండా సర్వీబాదులు కట్టారు.

**గంటలకొద్దీ నరకం**

ఇది పాలకోడేరు మండలం గరగపర్రు వద్ద ఉండి కెనాల్‌పై దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన. భీమవరం-తాడేప ల్లిగూడెం ప్రధాన మార్గంలో ఉంది. ఈ మార్గంలో నిత్యం 16 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ కంటైనర్లు వచ్చిన ప్పుడు మలుపు వద్ద ఇరుక్కుపోయి కొన్ని గంటలపాటు వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. కొత్త వంతెన నిర్మించా లనే డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది.

**ప్రతిపాదనలు పంపించాం :** కోపెల్ల వద్ద వంతెన నిర్మాణానికి నిధులున్నాయి. గతంలో టెండరు పిలిచినా స్పందన రాలేదు. మళ్లీ పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మిగిలిన చోట్ల కొత్త వంతెనల కోసం ప్రతిపాదనలు పంపించాం.

**- శ్రీనివాసరావు, ర.భ.శాఖ ఈఈ**

# ఇక సేవలన్నీ ఒకే చోట

- త్వరలో అందుబాటులోకి అధునాతన వైద్యం
- చురుగ్గా కొనసాగుతున్న అభివృద్ధి పనులు

**న్యూస్‌టుడే, భీమవరం పట్టణం**

కూటమి ప్రభుత్వం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అధునాతన వైద్య సేవల్ని అందుబాటులోకి తీసు కొస్తోంది. ఇందులో భాగంగా క్రిటికల్ కేర్ బ్లాకు, కిడ్నీ సంబంధిత డయాల సిస్ వైద్యం, నాబార్డు నిధులతో ప్రాంతీయ ఆసుపత్రుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయనున్నారు. పనులు నిర్దేశిత సమయానికి పూర్తి చేస్తామని ఏపీఎంఎస్ఐడీసీ డీఈ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

**క్రిటికల్ కేర్ బ్లాకులు..** భీమవరంలోని ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటు చేయాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ప్రాణాపాయ స్థితిలో వైద్య సేవల కోసం విజయవాడ, గుంటూరుకు వెళ్లే సందర్భాల్లో బాధితులు మధ్యలో చనిపోతున్నారని ఇలాంటి ఇబ్బం దులు తొలగించేందుకు భీమవరంలోనే సేవలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఆకివీడులో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ ఇదే విష యాన్ని ప్రస్తావించి నిధులు మంజూరు చేశారు. దీంతోపాటు ఏలూరులో కూడా క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మించను న్నారు. రెండుచోట్లా కలిపి మొత్తం రూ.32 కోట్లు విడుదలయ్యాయి.

భీమవరం గొల్లవానితిప్పరోడ్డులో నిర్మాణంలో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి

**డయాలసిస్ సేవలు..** పశ్చిమ గోదావరి జిల్లాలో కొత్తగా మూడు డయాలసిస్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. భీమవరంలోని ఆసుపత్రి క్వార్టర్స్ ప్రాంగణం, తాడేపల్లిగూడెంలోని ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణాల్లో 10 చొప్పున పడకలతో పనులు పూర్తికి రూ.2 కోట్లు, ఆచంటలోని సామాజిక ఆసుపత్రిలో 6 పడకలతో మరో కేంద్రం నిర్మాణా నికి రూ.1 కోటి విడుదలవ్వగా గుత్తేదారులకు పనులు అప్పగించారు.

**ప్రాంతీయ ఆసుపత్రి నిర్మాణం వేగవంతం**

భీమవరం గొల్లవానితిప్ప రోడ్డులో 100 పడ కల ప్రాంతీయ ఆసుపత్రి పనులు రూ.38.15 కోట్ల నాబార్డు నిధులతో వేగవంతమయ్యాయి. భీమవరంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రస్తుతం సేవలు కొనసాగుతుండగా నిత్యం 400కు పైగా ఓపీ ఉంటోంది. 110 మంది రోగులు ఆసుపత్రిలోనే ఉంటూ సేవలందుకుం టున్నారు. గర్భిణులు, శిశువులు, సాధారణ రోగులతో నిత్యం కిటకిటలాడుతోంది. క్రిటికల్ కేర్ బ్లాక్‌తో వంద పడకల ఆసుపత్రి అందుబా టులోకి వస్తే సేవలన్నీ ఒకేచోట అందుతాయి.

## కుంభమేళాకు దీటుగా పుష్కరాలు: మంత్రి

**పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** మహా కుంభమేళాకు దీటుగా రాబోయే గోదావరి పుష్క రాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు సంక ల్పించారని.. ఈ క్రతు వులో అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొ న్నారు. పాలకొల్లు బ్రాడీపేట బైపాస్‌లో రామచంద్ర కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి అధికా రులు, కూటమి నాయకులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. గోదావరి పుష్కరాలకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శాఖల వారీగా ప్రతి పాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజలకు అవ సరమైన శాశ్వత అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వా లన్నారు. గోదావరి నదికి 2027 జులై 23 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు పుష్కరాలు జరుగుతాయ న్నారు. ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ శ్రీవేద, శిక్షణ డీఎస్పీ మానస, పురపాలక కమిషనర్ బి. విజయసా రథి, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

# ఎగువన తగ్గినా.. దిగువన పెరిగి

## ముంపులో కనకాయలంక కాజ్‌వే

కనకాయలంక వాసుల అవస్థలు

**యలమంచిలి, ఆచంట, పి.గన్నవరం, న్యూస్‌టుడే:** ఎగువన గోదావరి వరద ఉద్ధృతి తగ్గుముఖం పట్టినా దిగువన వివిధ నదీపా యల్లో మాత్రం పెరిగింది. యలమంచిలి మండలం కనకాయలంకలో కాజ్‌వే ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ముంపులో చిక్కు కుంది. సమీపాన వశిష్ఠ గోదావరి అనుబంధ పాయలో వరద పోటెత్తడంతో సాయంత్రానికి కాజ్‌వేపై సుమారు రెండు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తోంది. దీంతో కనకాయలంక వాసులు చాకలిపాలెం వైపు రాక పోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. లోతట్టు లంక భూముల్లోకి నీరు చేరింది. పెదమల్లం లంక, అయోధ్యలంక, మర్రిమూల ఆవాస ప్రాంతాలకు చెందినవారు మర పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. లంకగ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా రక్షణ ఏర్పాట్లు చేస్తామని నర సాపురం ఆర్డీవో దాసిరాజు తెలిపారు. ఆదివారం ఆయనతో పాటు యల మంచిలి తహసీల్దారు జి.వెంకటపవన్‌కుమార్ కనకాయలంక రేవును పరిశీ లించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఇక్కడ నాలుగు పడవలను అధికా రులు ఏర్పాటు చేశారు. ఎగువ ప్రాంతంలో వరద నెమ్మదించడంతో పరి స్థితి ప్రమాదకరం కాదని తహసీల్దారు పవన్‌కుమార్ తెలిపారు. పర్యవేక్షణ నిమిత్తం రెవెన్యూ అధికారులను కాజ్‌వే వద్ద నియమించారు.

**దిండిలో బోట్ల నిలిపివేత**

దిండి రిసార్ట్స్‌కు సంబంధించిన గృహ పడవలు, ఫంటూన్, స్పీడ్ బోట్లను నది ఒడ్డున నిలిపివేశారు. వరద ఉద్ధృతి తగ్గిన తర్వాత మళ్లీ వీటిని పునరుద్ధరించనున్నట్లు రిసార్ట్స్ మేనేజరు మురళీధర్ చెప్పారు.

# సుజలం.. నిర్వహణలో విఫలం!

## పల్లెల్లో అధ్వానంగా పైపులైన్ల వ్యవస్థ

అత్తిలి మండలం గుమ్మంపాడులో తాగునీటి పైపులైను వాల్వు ఇది. దీని చెంతనే డ్రెయిన్ మధ్యలో కుళాయి ఉండటం విస్మయం కలిగిస్తోంది. పెనుగొండ మండలం ములపర్రు పంచాయతీ పరిధి సీతా రామునిచెరువులో డ్రెయిన్‌లో కుళాయిలు దర్శనమిచ్చాయి. చెరుకువాడ పరిధి యర్రా నారాయణస్వామి కాలనీలో పైపు లైను దెబ్బతిని కొద్దిరోజులుగా నీరు వృథా అవుతోంది.

పెనుమంట్రలో తాగునీటి పైపులైన్లు మురుగునీటిలో దర్శన మిస్తున్నాయి. హైస్కూల్ ఎదుటి వీధిలో వాల్వును డ్రెయిన్ చెంత ఏర్పాటు చేశారు. పక్కనే పైపు లైను దెబ్బతిని నీరు లీక వుతూ ఆ ప్రాంతం అపరి శుభ్రంగా మారింది.

**పరిశీలన**

**మార్టేరు, అత్తిలి గ్రామీణ, పెనుగొండ, పెనుగొండ గ్రామీణ, పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే:** పల్లెల్లో తాగునీటి పైపులైన్ల వ్యవస్థ నిర్వహణ అధ్వానంగా మారింది. పైపులైన్లు, కుళాయిలు, వాల్వులు పలు చోట్ల మురుగు కాలువల్లో, వ్యర్థాల మధ్య ఉన్నాయి. నీటి పరీక్షలు సక్రమంగా జరగడం లేదు. లీకే జీల కారణంగా నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ప్రజలు ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల నుంచి నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు.

ములపర్రు పంచాయతీ సీతారామునిచెరువులో కుళాయి దుస్థితి

**జిల్లాలో ఇలా..**

| | |
|---|---|
| గ్రామాల సంఖ్య | 368 |
| జనాభా | 18.44 లక్షలు |
| తాగునీటి పథకాలు | 408 |

**నీటి పరీక్షలు అంతంతే..** ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాల్సిన యంత్రాంగం నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేసింది. నాణ్యత ప్రమా ణాల ప్రకారం నీటిని విడుదల చేసే ప్రాంతంలో 2 పీపీఎం, వీధుల్లో కుళాయిల 5 పీపీఎం లోపు ఉండాలి. ఫిల్టరేషన్ ప్లాంట్ వద్ద గతంలో ఆలం క్లోరిన్ ఉపయోగించేవారు. ప్రస్తుతం లిక్విడ్ క్లోరిన్‌తో మమ అని పిస్తున్నారు. నీటి పరీక్షలు చేసినట్లు రికార్డుల్లో తప్పుడు వివరాలు నమోదు చేస్తున్నారు. ట్యాంకులు శుభ్రం చేసిన తేదీలను కచ్చితంగా నమోదు చేయాల్సి ఉన్నా వాటి ఊసే లేకుండా పోయింది.

# మీ పాట్లు మీవే

## భక్తుల అవస్థల్ని పట్టించుకోని దేవస్థాన యంత్రాంగం

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతి రుమల చిన వేంకన్న దేవస్థానానికి ఆదా యాన్ని సమకూర్చడంలో అధికారులకు ఉన్న శ్రద్ధ భక్తులకు సౌకర్యాలు కల్పించ డంలో చూపడంలేదు. ఈ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. రద్దీ సమ యంలో సౌకర్యాలను పర్యవేక్షించి, వారికి ఇబ్బందులు ఎదురైతే చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఇక్కడ యంత్రాంగం పట్టించుకో వడం లేదు. అనివేటి మండపం ప్రారం భంలో ఉన్న కుళాయిల వద్ద నీడ సౌకర్యం కల్పించలేదు. దీంతో భక్తులు ఎండలోనే నిలబడి నీటిని తాగాల్సి వస్తుంది.

**నీడ కరవు..** శ్రీహరి కళాతోరణం పక్కన భక్తులు ఎండ లోనే నిలబడి కొబ్బరి కాయలు కొడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ గతంలో పందిరి ఏర్పాటు చేయగా... సుమారు నెల క్రితం గాలివానకు అది పడిపోవడంతో తొలగిం చారు. అప్పటి నుంచి మళ్లీ వేయలేదు.

**పర్యవేక్షణ లేదు..** కొబ్బరి కాయ కొట్టే ముందు రెండు నిమి షాలు కళ్లు మూసు కుని స్వామివారిని స్మరిద్దామంటే కాళ్లు కాలుతున్నాయని విజ యవాడకు చెందిన భక్తుడు ప్రశాంత్ వాపోయారు.

**కాళ్లు కాలుతున్నాయి..** ఆలయం చుట్టూ, తూర్పు వైపున, శ్రీవారి దర్శన క్యూకాంప్లెక్స్ ముందు ఇంకా పలు చోట్ల కొబ్బరి నార చాపలు పరిచారు. ఎండ తీవ్రత ఉన్న సమయంలో వాటిని నీటితో తడిపి చల్లపరచాలి. కొద్ది రోజుల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నా వాటిని నీటితో తడపడంలేదు.

'కాళ్లు కాలకుండా నార చాపలు ఏర్పాటు చేశారు. కానీ వాటిని తడపడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. భక్తుల సౌకర్యాలపై అధికారుల పర్యవేక్షణ కనిపించడంలేదు' అని కొత్తపల్లివాసి సత్తిపండు తెలిపారు. భక్తులకు నీడ సదుపాయం కల్పిస్తాం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నార చాపలను ఎప్పటికప్పుడు తడిపిస్తాం' అని దేవస్థానం ఈఈ భాస్కర్ తెలిపారు.

# లేసు.. బాగుంది బాసూ!

## ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి అవార్డుకు ఎంపిక

**నరసాపురం, గ్రామీణ, న్యూస్‌టుడే:** నరసాపురం మండలం సీతారామపురం లోని లేసు పార్కులో అల్లిక లకు ఇప్పటికే ప్రపంచ స్థాయి భౌగోళిక గుర్తింపు లభించగా ఇప్పుడు మరో ఘనతను సొంతం చేస్తుంది. కేంద్రం అమలు చేస్తున్న ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి అవార్డుకు లేసు పార్కును ఎంపిక చేశారు. దిల్లీలోని ప్రగతి మైదానంలో సోమవారం నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి నుంచి కలెక్టర్ నాగరాణి ఈ అవార్డు అందుకోనున్నారు.

**పోటీలో గెలిచి..** రాష్ట్రంలో 26 జిల్లా లకు చెందిన హస్తకళా ఉత్పత్తులు ఈ పోటీలో నిలిచాయి. కేంద్ర బృందం ఆయా ఉత్పత్తులను పరిశీలించి వాటిలో ఏడు జిల్లాలకు చెందిన ఉత్పత్తులను ఎంపిక చేశారు. ఈ జాబితాలో సీతారామ పురం లేసుపార్కు కూడా ఉంది.

**ఉభయగోదావరి జిల్లాల్లో..** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో లేసు ఉత్పత్తిదారులు ఉన్నారు. ఇక్కడి మహిళలు రూపొందించే లేసు అల్లికలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. సన్నటి దారంతో అంద మైన ఆకృతులను అల్లే నిష్ణా తులు ఎంతోమంది ఇక్కడ ఉన్నారు. గతంలో 250 గ్రామాల్లో సుమారు 95 వేల మంది మహిళలు లేసు అల్లి కలు చేసేవారు.

**కూటమి ప్రభుత్వం చొరవతో..** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా సాధి కారతకు ప్రాధాన్యం ఇస్తోంది. దీనిలో భాగంగా మహిళాభ్యున్నతే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సీతారామపురం లేసు పార్కు ద్వారా ఆధునిక దుస్తుల రూప కల్పనలో శిక్షణ ఇచ్చేందుకు, ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేం దుకు చర్యలు చేపట్టారు. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రమోషన్ విభాగం (డీపీఐఐటీ) ఈ ఏడాది మార్చిలో భౌగోళిక సూచికల రిజిస్ట్రీలో లేసు అల్లికల వృత్తిని నమోదు చేసింది.

# ఆషాఢంలోనూ సెగలు!

ఆచంట ప్రాంతంలో దమ్ము చేయని పొలాలు

**ఆచంట, న్యూస్‌టుడే:** మహారాష్ట్రలో కురిసిన వర్షాలతో గోదావరికి వరద పోటెత్తి నిండుకుండలా మారింది. ఇక్కడ మాత్రం తగిన వర్షాలు లేవు. ఆషాఢమాసంలోనూ జిల్లాలో నాలుగైదు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నడి వేసవి తరహాలో ఎండ చుర్రుమంటోంది. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రతకు రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. పడమర దిశగా పొడి గాలులు వీస్తుండటంతో వాతావరణం మరింత వేడిగా మారు తోంది. మధ్యమధ్యలో ఈదురు గాలులతో జల్లులు పడు తున్నా ఎండ తీవ్రత తగ్గడం లేదు.

**మందగించిన వరినాట్లు..** జిల్లాలో పలు ప్రాంతాల్లో 20 రోజుల క్రితమే వరి నాట్లు వేసే పనులు మొదలు కాగా వాతావరణ పరిస్థి తుల కారణంగా వేగం మందగించింది. ప్రస్తుత సీజన్లో జిల్లాలో 2.08 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగవుతుందని అంచనా. రుతుపవనాలు ముందుగానే పలకరించినా జులైలో ఆశించిన వర్షాలు పడలేదు. నరసాపురం డివిజన్ పరిధిలోని ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో కొన్ని చోట్ల వరి చేలు వేసవి తరహాలో నెర్రెలుతీసి కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం కాలువ నీరు పారించి దమ్ములు చేయడం సాధ్యని రైతులు చెబుతున్నారు. దీంతో జులై నెలాఖరుకు కూడా నాట్లు పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

● ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల
● వేసిన రోడ్డే వేయలేరు

14లో

# చేయి తడపాలి.. దస్త్రం కదపాలి

## రిజిస్ట్రేషన్ శాఖలో ఆగని అవినీతి పర్వం

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** కీలకమైన డెల్టాలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రధాన కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ లేకుండా పోయారు. ఆయాచోట్ల సీనియర్ సహా యకులతో బండి నడిపిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు కిందిస్థాయి ఉద్యోగులు అడిగినంత చేతిలో పెట్టనిదే ఏ పని చేయడం లేదు.

రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా అధికారి (డీఆర్) ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఏలూరు రిజిస్ట్రార్‌కి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వార్షికాదాయం రూ. 400 కోట్లకు పైగా వస్తుంది. పాలకొల్లు, నరసా పురం, మొగల్తూరు కార్యాలయాల్లో ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్‌లు లేరు. అక్కడ ఇన్‌ఛార్జులే దిక్కు. తణుకులో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లు ఉండగా ఒకరికి డిప్యుటేషన్‌పై తాడేపల్లిగూడెం కార్యాలయం బాధ్యతలు అప్పగించారు. గతంలో నరసాపురంలో పనిచేసి పాలకొల్లు వెళ్లిన ఒక ఉద్యోగి చేతివాటంలో ముందు ఉంటారని ప్రచారం. అదే ఉద్యోగి మళ్లీ ఒక రాజకీయ నాయకుడితో సిఫార్సు చేయిం చుకుని తాజాగా నరసాపురం వెళ్లారు. దస్త్రాలు రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక వాటిని స్కానింగ్ చేసేందుకు రూ.500, పూర్వా ర్జితం ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు రూ.1000 చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇదే పరిస్థితి చాలా కార్యాలయాల్లో ఉన్నట్లు తెలిసింది. వారు

● నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో ఇటీవల ఒక వ్యక్తి స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దస్త్రం స్కాన్ చేయాలంటే రూ.500 ఇవ్వాల్సిందేనని ఒక ఉద్యోగి పట్టుబట్ట డంతో ఎందుకొచ్చిన గొడవని ఇచ్చేశారు. అన్నిరకాల ఫీజులు చెల్లించినా అదనంగా ఇచ్చుకో వాల్సి వచ్చిందని వాపోయారు.



● పాలకొల్లు కార్యాలయం పరిధిలో ఒక ఆస్తిని ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్ అనే పద్ధతిలో వేరే కార్యా లయంలో చేయించుకునేందుకు వెళ్లగా క్రయవిక్రయదా రులకు చేదు అనుభవం ఎదురైంది. సంబంధిత అధి కారి 48గంటల తర్వాత అప్రూవల్ ఇస్తేనే వేరే చోట రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అది అప్రూ వల్ చేయాలంటే సొమ్ము డిమాండ్ చేశారని రిజిస్ట్రేషన్ ఆగిపోతుందనే ఉద్దేశంతో వారు అడిగినంత ఇచ్చుకోవాల్సి వచ్చిందని సదరు వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. అడిగిన సొమ్ము ఇవ్వకపోతే రోజుల తర బడి దస్త్రం చేతికి అందడం లేదని క్రయవి క్రయదారులు వాపోతున్నారు.

● ఎవరైనా నిబంధనల మేరకు పనిచేయాల్సిందే. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా నేరుగా నా దృష్టికి తేవొచ్చు. వారిపై శాఖాపరంగా చర్యలు తీసు కుంటాం. **- శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి జిల్లా రిజిస్ట్రార్**

పార్కును పరిశీలిస్తున్న మహేశ్ కుమార్, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే చంటి

## పిల్లలకు ట్రాఫిక్‌పై అవగాహన అవసరం: ఎంపీ

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** పిల్లలకు రోడ్డు నిబంధనలు, భద్రతపై అవగాహన కల్పించడం సమాజ భద్రతకు ఎంతో దోహద పడుతుందని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ సమీపంలో ఏలూరు నగరాభివృద్ధి సంస్థ ఆధ్వ ర్యాన రూ.84 లక్షలతో నూతనంగా నిర్మించిన క్రాస్‌రోడ్స్ చిల్డ్రన్స్ ట్రాఫిక్ పార్కును ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ తదితరులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ. . దేశంలోనే ప్రథమంగా ట్రాఫిక్ పార్కు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించడానికి పార్కు ఉపయోగపడుతుందని ఎస్పీ, జేసీ తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జీఎస్టీ 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

## పెద్దింట్లమ్మా పాహిమాం!

**కైకలూరు, న్యూస్‌టుడే:** కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం ఆదివారం కిటకిటలాడింది. పలు జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో పండ్ల రసాభిషేకాలు, సహస్ర శతనామావళి, కుంకుమార్చన, ధూపసేవ తదితర పూజలను వైభవోపేతంగా నిర్వహించారు. కొల్లేరు గ్రామాలకు చెందిన పలువురు మహిళా భక్తులు అమ్మవారికి సంప్రదాయ సారె అందించి పూజలు జరిపారు.

## జీతాలు ఎప్పుడిస్తారు?: ఏపీటీఎఫ్

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** జిల్లాలో ఇటీవల బదిలీలైన ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు ఎప్పుడిస్తారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ప్రశ్నించారు. ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంగ్త్ నిర్ధారించి పొజిషన్ ఐడీలు కేటాయించడంలో సీఎస్ఈ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. పీటీఎం సమావేశాలతో గిన్నిస్ రికార్డు సాధనపై అధికారులకున్న శ్రద్ధ ఉపాధ్యాయుల జీతాలపై లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సీఎస్ఈ అధికారులు స్పందించి ఉపాధ్యాయులకు జీతాలు అందేలా చూడాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## నూతన కార్యవర్గం నియామకం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** న్యూ ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని భీమవరంలోని వీరమ్మ పార్కు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా డి.ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శిగా షేక్ జాసిం, గౌరవాధ్యక్షుడిగా డి.జానీ, జిల్లా అధ్యక్షుడిగా బంగారు వినోద్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా టి.మూర్తి, కోరాడ శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా కట్టా శ్రీను, రామకృష్ణ, లీగల్ సెల్ ఛైర్మన్‌గా ఇంజేటి వెంకటేశ్వర్లు, కస్సే నర్సుగా బి.శ్రీను, విజయ నియమితులయ్యారు.

న్యూ ఆంధ్రా బాడీ బిల్డర్స్ కార్యవర్గాన్ని అభినందిస్తున్న రాష్ట్ర కమిటీ ప్రతినిధులు

## మాట కలుపుతారు.. మాయం చేస్తారు

### పండుటాకులే లక్ష్యంగా దొంగతనాలు

☛ పాలకోడేరు మండలం విస్సాకోడేరులో ఓ వృద్ధురాలి దగ్గరకు భార్యాభర్తలు వెళ్లారు. ఇల్లు అద్దెకు కావాలన్నారు. గదులు చూస్తామంటూ లోపలికి వెళ్లాక ఆమెను బెదిరించి మెడలోని బంగారు ఆభరణం లాక్కొని పారిపోయారు.

☛ భీమవరం పట్టణంలో అద్దెకు ఇల్లు కావాలని వెళ్లాడో వ్యక్తి. వృద్ధురాలితో బంధుత్వం కలిపాడు. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక ఆమె మెడలోని బంగారు ఆభరణం లాక్కెళ్లబోయాడు. అడ్డుకున్న వృద్ధురాలిని గోడకు కొట్టి నగలు తీసుకుని పారిపోయాడు. గాయపడిన వృద్ధురాలిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు.

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** రెక్కలొచ్చాక పక్షులు గూడు వదిలి వెళ్లినట్లు అప్పటి వరకూ పిల్లాపాపలతో సందడిగా కనిపించిన లోగిళ్లు బోసిపోతున్నాయి. పుట్టి పెరిగిన ఊళ్లను విడిచి వెళ్లలేమంటూ వృద్ధులు మాత్రమే ఇంటికి పరిమితమవుతున్నారు. ఇలాంటి వారిని దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. దాచుకున్న పింఛన్ సొమ్ము, ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుంటున్నారు. ప్రతిఘటించే ప్రయత్నం చేస్తే చంపేందుకు దొంగలు వెనుకాడటం లేదు. కొందరు చావు బతుకుల మధ్య ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పెరుగుతున్నాయి. అధికారికంగా ఏటా 10కి పైగా కేసులు నమోదవుతున్నాయి.

**రెక్కీ నిర్వహించి..** ఒంటరిగా ఉన్న వృద్ధుల వివరాలను దొంగలు ముందుగా తెలుసుకుంటున్నారు. ఒకటికి రెండుసార్లు రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇరుగు పొరుగు వ్యక్తులైతే ఆచూకీ తెలియకుండా ఉండేందుకు చీకట్లో వెళ్లి ముసుగు వేసి దోచుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందినోళ్లయితే మంచినీళ్లు కావాలనో, పెరట్లో మొక్కలు, పండ్లు బాగున్నాయంటూ మాట కలిపి లోపలికి చొరబడుతున్నారు.

**చట్టాలు ఉన్నా..** వయోవృద్ధుల సంక్షేమ నియమావళి-2011 ప్రకారం స్థానికంగానే వయో వృద్ధులకు రక్షణ చర్యలు తీసుకోవాలి. నోడల్ అధికారిగా ఎస్సైను నియమించాలి. స్థానికంగా ఎంతమంది వృద్ధులు ఉన్నారు, ఒంటరిగా ఉన్నది ఎంతమంది అనే వివరాలను స్థానిక వీఆర్వో, సచివాలయ సిబ్బంది నుంచి తెలుసుకోవాలి. వాళ్లకు కల్పిస్తున్న రక్షణ చర్యలు పర్యవేక్షించాలి. వృద్ధుల సంక్షేమం, వారి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం 14567 టోల్‌ఫ్రీ నంబరు ప్రవేశపెట్టింది.

### బిడ్డలు బాధ్యత తీసుకోవాలి..

వృద్ధులకు డే కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వయో వృద్ధులకు కాపలాగా పోలీసులు నిరంతరం ఉండరు. తల్లిదండ్రుల పట్ల బిడ్డలు బాధ్యతగా వ్యవహరించాలి. ఒంటరిగా ఉన్న వృద్ధులు వాళ్లే ఉంటారులే అని విడిచిపెట్టకుండా ఏం చేస్తున్నారో తెలుసుకుంటూ ఉండాలి.

**- మేళం దుర్గాప్రసాద్, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేట్ ట్రిబ్యునల్ కమిటీ సభ్యుడు**

### వివరాలు సేకరిస్తున్నాం..

వృద్ధులు ఎంతమంది ఉన్నారు, వాళ్లు ఏం చేస్తుందీ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది. ఎంతమంది ఒంటరిగా ఉంటున్నారో వారి వివరాలను సేకరిస్తున్నాం. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇబ్బందులు ఏమైనా ఉంటున్నాయా అని వృద్ధుల దగ్గరకు బీట్ పోలీసులు వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. దీనిపై ప్రతి మూడు నెలలకోసారి సమీక్షిస్తున్నాం. **- అద్నాన్ నయీం అస్మి, ఎస్పీ**

## పురాణపురుషా.. పుండరీకాక్ష

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రద్దీ రెండో రోజు కొనసాగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వీఐపీల తాకిడి కూడా ఎక్కువగా ఉంది. సామాన్య భక్తులు స్వామిని దర్శించుకోవడానికి ఎక్కువ సమయం క్యూలలో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దివ్యాంగులు, వృద్ధులు, చంటి బిడ్డ తల్లులు ప్రత్యేక క్యూలో వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.

## వేసిన రోడ్డే వేయలేరు

### ప్రతీదీ నిధి యాప్‌లో నిక్షిప్తం

### పీఆర్ విభాగంలో అమలు

**ఈనాడు-ఏలూరు:** ఇకపై రోడ్డు మీద రోడ్డు వేయటం కుదరదు. బాగున్న రహదారులకు మరమ్మతులు చేయటం అంతకన్నా సాధ్యం కాదు. ఎక్కడైతే అవసరం, దాని ప్రాధాన్యం ఉందో అక్కడే నిర్మించేలా పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రహదారులన్నీ వాటి భౌగోళిక వివరాలతో నిధి యాప్‌లోకి అప్లోడ్ చేస్తున్నారు.

గతంలో రోడ్డు మేనేజ్‌మెంట్ రిజిస్టర్ ఒకటి ఉండేది. అందులో మాత్రమే ఈ వివరాలు ఉండేవి. ఇవన్నీ ఈఈ, ఎస్ఈ పర్యవేక్షణలో ఉండేవి. ఈ క్రమంలో కొందరు నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి బాగున్న రహదారులనే తిరిగి నిర్మిస్తున్నారనే విమర్శల నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. అసలు ఏ రహదారి పరిస్థితి ఎలా ఉంది? దాన్ని ఎప్పుడు నిర్మించారు? తిరిగి దానికి మరమ్మతులు ఎప్పుడు చేశారు? ఎన్ని నిధులు వెచ్చించారు? ఎవరు చేసిన గుత్తేదారుతో సహా అన్ని వివరాలను నిధి యాప్‌లోకి అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో ఈ ప్రక్రియ గత కొన్ని రోజుల నుంచి చేస్తున్నారు. రెండు, మూడురోజుల్లో నిధి యాప్‌లోకి అన్ని వివరాలు చిత్రాలతో సహా అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌వర్గాలు తెలిపాయి.

**ధ్రువీకరించుకున్న తర్వాతే..** ఏదైనా రహదారి నిర్మించాలని అధికారులు ప్రతిపాదించినప్పుడు ఈఎన్‌సీ ఆమోదానికి ఇప్పటి దాకా దస్త్రం మాత్రమే పంపేవారు. ఇకమీదట ఏదైనా రోడ్డు వేయాలంటే తొలుత ఈఎన్‌సీ కార్యాలయానికి వివరాలు తెలియజేస్తారు. వారు అక్కడ ఆ రోడ్డు పరిస్థితి ఏమిటి? గతంలో ఎప్పుడు నిర్మించారు? దానికి మరమ్మతులు ఏమైనా చేశారా అనే వివరాలను నిధి యాప్‌లో ఉన్న సమాచారంతో ధ్రువీకరించుకుంటారు. ఎక్కడైతే అవసరం ఉంటుందో అక్కడ మాత్రమే రోడ్డు వేసేలా ఈ యాప్ దోహదం చేస్తుందని అధికారవర్గాలు అంటున్నాయి.

## ఆర్జీయూకేటీ రెండో దశ జాబితా విడుదల

### 907 మంది విద్యార్థుల ఎంపిక

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్జీయూకేటీలో రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఇందులో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, వికలాంగులకు 179, సాయుధ దళాల కోటాలో 80.. మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

ఆర్కే వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆ క్యాంపస్‌లో ఈ నెల 17న రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు 17న నూజివీడులో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తరగతులు 14 నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులు తమ లగేజీతో వచ్చి రిపోర్ట్ చేసి తరగతులకు హాజరయ్యేలా సిద్ధపడి రావాలన్నారు. ● మొదటి దశ తరువాత మిగిలిన ఖాళీలను దృష్టిలో ఉంచుకుని అంతర్గత బదిలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా 384 మందికి లబ్ధి కలిగినట్లు వివరించారు. ఇప్పటి వరకు 4,340 మంది విద్యార్థుల ఎంపిక పూర్తి అయిందని తెలిపారు. ఇంకా 60 సీట్లు మిగిలి ఉండగా ఇందులో ఎన్‌సీసీ కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఈ సీట్ల ఎంపిక ఫలితాలను వచ్చే వారం విడుదల చేస్తామని రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు.

## కౌలు రైతుకు పంట రుణం ఇవ్వాలి

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** రిజర్వ్ బ్యాంక్ ఆదేశానుసారం కౌలు రైతుకు రూ.2 లక్షలు పంట రుణం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలాంటి హామీ లేకుండా కౌలు రైతుకు పంట రుణాలివ్వాలని కోరారు. భూ యజమాని పంట రుణం పొందారన్న పేరుతో కౌలు రైతుకు మొండిచేయి చూపడం తగదన్నారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో రుణాలకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించినా.. ఆచరణలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన కౌలు చట్టం తీసుకొచ్చి మేలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కిడ్నీ అమ్మేందుకు ప్రయత్నం.. పోలీసుల విచారణ

**విశాఖపట్నం (గురుద్వారా), న్యూస్‌టుడే:** కిడ్నీ అమ్మేందుకు విశాఖ నగరానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులను నాలుగో పట్టణ పోలీసులు పట్టుకుని విచారించారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లాకు చెందిన కట్టా రంగబాబు(36), సీహెచ్ ఏసురాజు(30) స్నేహితులు. వ్యాన్ కొనుగోలు చేసేందుకు అని చెప్పి వీరిద్దరూ కొద్దిరోజుల క్రితం విశాఖ నగరం అక్కయ్యపాలెంలోని ఓ హోటల్‌లో దిగారు. ఇక్కడికి వచ్చిన తర్వాత కిడ్నీ అమ్మేందుకు వచ్చానని రంగబాబు ఏసురాజుతో చెప్పడాన్ని హోటల్ సిబ్బంది విని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అక్కడకు చేరుకుని వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా అమ్మేందుకు రావడం వాస్తవమని ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిసి నిరాకరించడంతో నిర్ణయం మార్చుకున్నట్లు రంగబాబు పోలీసులకు తెలిపారు. వీరి వెనుక ఎవరెవరు ఉన్నారు అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకుల సేవా సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా విస్సాకోడేరుకు చెందిన బండి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఆ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు నుంచి నియామక పత్రం అందుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని ఆదివాసీ ఎరుకుల సంక్షేమం, హక్కుల కోసం పోరాడతానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## ఐఐపీఈ కార్యదర్శిగా ఎంపిక

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొడక్షన్ ఇంజినీర్స్(ఐఐపీఈ) జాతీయ గౌరవ కార్యదర్శిగా భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆచార్యుడు కలిదిండి బ్రహ్మరాజు నియమితులయ్యారు. బెంగళూరులో ఈ నెల 9న జరిగిన ఐఐపీఈ జాతీయ కౌన్సిల్ సమావేశంలో కలిదిండిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంతవర్మ, డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కె.వి. మురళీకృష్ణంరాజు తదితరులు అభినందించారు.

## ఎం.ఆర్.రాజు ఆశయ సాధనకు కృషి : పాకా

**కాళ్ల, న్యూస్‌టుడే:** డాక్టర్ ఎం.ఆర్.రాజు ఆశయ సాధనకు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ, పలువురు ప్రతినిధులు ఆదివారం అన్నారు. పెదఅమిరం మహాత్మాగాంధీ స్మారక ట్రస్టు భవనంలో నిర్వహించిన పద్మశ్రీ డాక్టర్ ముదుండి రామకృష్ణం రాజు(ఎం.ఆర్.రాజు) స్మృత్యంజలి సభలో వారు మాట్లాడారు. సభకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణమూర్తి(బాబ్జీ) అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అమెరికాలో పరిశోధనలు చేసి, స్వగ్రామంలో మహాత్మాగాంధీ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు నాలుగు దశాబ్దిల పాటు వైద్య సేవలు అందించి చిరస్మరణీయులయ్యారని అన్నారు. ముందుగా ఎంఆర్ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయసాధనకు అనుగుణంగా ఎంజీఎం ట్రస్టు ద్వారా వైద్య సేవలు అందించే సర్వోదయం మండలి, స్వచ్ఛంద సంస్థల తరపున భీమవరంలో సైన్సు పార్కు ఏర్పాటు చేసి దానికి డాక్టర్ ఎం.ఆర్.రాజు పేరు పెట్టాలని విజ్ఞాపన పత్రం అందించారు. ఎంఆర్ రాజు కుమారులు మంతెన రామ్‌కుమార్‌రాజు, దంతులూరి రంగరాజు, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఎంవీఎస్ రాజు, ప్రొఫెసర్ ఎస్.ఆర్.పరిమి, పలువురు డాక్టర్, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సత్యనారాయణ

## ఆట.. మానసిక ఉల్లాసానికి బాట

### బాస్కెట్ బాల్‌లో రాణిస్తున్న విద్యార్థినులు

**నూజివీడు రూరల్ , న్యూస్‌టుడే:** ఆట ఏదైనా మానసిక ఉల్లాసం లభిస్తుంది. విజయం నమ్మకాన్ని పెంచుతోంది. టీమ్ వర్క్ వల్ల సహకార భావన పెరుగుతుంది. బృంద సమస్యలు పరిష్కారం అవుతాయి. బృందాన్ని నడిపించడం వల్ల నాయకత్వ లక్షణాలు అలవడతాయి. స్నేహ సంబంధాలు బలపడతాయి. విద్యాసంస్థల్లో ఉపకార వేతనాలు లభిస్తాయి. నూజివీడులో వీటీహెచ్ గ్రౌండ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొంటూ విజయాలు సాధిస్తున్నారు. పదో తరగతి పాసైన ముగ్గురు క్రీడాకారులు నేడో రేపో క్రీడా కోటాలో ట్రిపుల్ ఐటీ సీటు సాధించనున్నారు.

### పది జాతీయ పోటీల్లో పాల్గొన్నా..

పంజాబ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, కోల్‌కతా, పుదుచ్చేరి, గుజరాత్, కేరళ రాష్ట్రాల్లో జరిగిన పది పోటీల్లో పాల్గొని సత్తా చాటాం. బాస్కెట్‌బాల్ ఆట మాత్రమే కాదు ఆరోగ్యకరమైన జీవన శైలికి దోహద పడే మార్గం. జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు పొందాను. తల్లిదండ్రులు కూలి పని చేస్తూ నన్ను ఆటలో ప్రోత్సహిస్తున్నారు. **- బేతాళ ప్రభు దీపిక**

### పోలీస్ అధికారి అవ్వాలని..

పోలీస్ అధికారి అవ్వాలన్నదే లక్ష్యం. నిత్యం సాధన చేస్తున్నా. పుదుచ్చేరిలో జరిగిన సబ్‌జూనియర్ నేషనల్స్, కోల్‌కతాలో జరిగిన 39వ యూత్ నేషనల్స్, మధ్యప్రదేశ్‌లో జరిగిన 74వ జూనియర్ నేషనల్స్, రాజస్థాన్‌లో 67వ అండర్ 14 నేషనల్స్, పుదుచ్చేరిలో 40వ యూత్ నేషనల్స్, తమిళనాడులో 68వ అండర్ 17 నేషనల్స్‌లో పాల్గొన్నా. నాన్న ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. **- ఎస్‌కే ఆస్రా**

### పతకాలు సాధిస్తూ ముందుకు సాగుతూ..

చత్తీస్‌ఘడ్, తమిళనాడులో 2వ ఎస్‌జీఎఫ్ అండర్ 17 నేషనల్స్, పుదుచ్చేరిలో యూత్ నేషనల్స్‌లో పాల్గొన్నా. ఇప్పుడిప్పుడే పతకాలను సాధిస్తూ మందుకు సాగుతున్నాం. శిక్షకుల సహకారంతో మరింత రాణించేందుకు శ్రమిస్తున్నా. ట్రిపుల్ ఐటీలో సీట్ వస్తుందని నమ్మకంతో ఉన్నాం. నాన్న కాంట్రాక్ట్ పనులు చేస్తూ నన్ను ప్రోత్సహిస్తున్నారు. **- బుర్రి ప్రణవి**

‘గత వైకాపా సర్కారు పాడి రైతులను పూర్తిగా విస్మరిస్తే.. కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మేలుజాతి పశు సంతతి వృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. గతంలో మేలు జాతి పాడి పశువుల వీర్యనాళిక రూ.1,250 ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం పశు పోషకులకు రూ.1,100 రాయితీనిచ్చి కేవలం రూ.150కే అందిస్తోంది. ఫలితంగా పాడి రైతులపై ఆర్థిక భారం తగ్గించడంతోపాటు పాల ఉత్పత్తి పెంచడానికి శ్రీకారం చుట్టింది.’

## మేలు జాతి దూడల సంతతి పెంచేలా..

### రూ.150కే వీర్యనాళికల సరఫరా

**ఏలూరు వన్‌టౌన్, ఆచంట, న్యూస్‌టుడే:** పాడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో పెయ్య దూడల సంతతి పెంచాలని నిర్ణయించింది. మేలు జాతి దూడల జననమే ధ్యేయంగా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 5.20 లక్షల పాడి పశువులున్నాయి. వీటిని పరీక్షించి ఆరోగ్యకర పశు వీర్యం ఎక్కిస్తారు. దీనిని వినియోగిస్తే 90 శాతం పెయ్య దూడలు జన్మించే అవకాశముంది. ఒకవేళ మగ దూడలు పుడితే వీర్యానికి చెల్లించిన డబ్బులను రైతులకు వెనక్కి ఇచ్చేస్తారు. దీనిపై పశువైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 30 వేల ఇంజెక్షన్లు వేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

**నూతన సాంకేతికతతో..** నూతన సాంకేతికతతో ఏటా 15 శాతం పాల దిగుబడి పెంచాలని పశుసంవర్ధక శాఖకు లక్ష్యం నిర్దేశించింది. ఈ నెల 1 నుంచి అన్ని పశు వైద్య కేంద్రాల్లో మేలు జాతి వీర్యం ఉంచింది. ‘అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి అపోహలకు పోకుండా మేలు జాతి వీర్యాన్ని పాడి పశువులకు వేయించాలి. దీనిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం’ అని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు టి.గోవిందరాజు తెలిపారు.

## చికిత్స పొందుతూ మృతి

**కైకలూరు, న్యూస్‌టుడే:** మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కైకలూరు గ్రామీణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఆలపాడు గ్రామానికి చెందిన బొర్రా వెంకట మధుబాబు(23) ఏడాదిన్నర కిందట అదే గ్రామానికి చెందిన మేరీ అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. గత పది రోజులుగా భార్యాభర్తలిద్దరూ గొడవ పడుతున్న తరుణంలో ఈనెల 7న భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అదే రోజు ద్విచక్ర వాహనం ఫైనాన్స్ చెల్లించలేదని ఫైనాన్స్ సంస్థ వారు బండి తీసుకు వెళ్లిపోయారు. తీవ్ర మనస్తాపానికి గురైన మధుబాబు ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం రాత్రి మృతి చెందాడు. దీనిపై ఆదివారం మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.రాంబాబు తెలిపారు.

## యువతిపై అత్యాచార యత్నం

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండిలోని ఓ ఇంట్లోకి చొరబడి 19 ఏళ్ల యువతిపై ఆదివారం ఒక వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. తనకు వంట మనిషి కావాలని పాముల పర్రు గ్రామానికి చెందిన వర్రే రాజేష్ శనివారం ఉండిలోని యువతి వద్దకు వెళ్లి ఆమె తల్లి ఫోన్ నంబర్ తీసుకున్నాడని చెబుతున్నారు. అదే ఇంటికి మళ్లీ ఆదివారం వెళ్లేసరికి ఒంటరిగా ఉన్న యువతిపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో పరారయ్యాడని పోలీసులు తెలిపారు.

## చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

### 13 మందికి గాయాలు

**చింతలపూడి, న్యూస్‌టుడే:** ప్రమాదవశాత్తూ తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సు వెలగలపల్లి సమీపంలో ఓ చెట్టును ఆదివారం ఢీకొట్టడంతో 13 మందికి గాయాలయ్యాయి. వీరిలో నలుగుర్ని మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తొమ్మిది మందికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం ఇళ్లకు పంపించారు. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సత్తుపల్లి నుంచి ఏలూరు వెళ్తోంది. వెలగలపల్లి సమీపంలో భారీ గోతులు ఉన్న విషయాన్ని డ్రైవర్ గమనించకుండా వేగంగా వెళ్లడంతో స్టీరింగ్‌పై పట్టు కోల్పోయి పక్కనే ఉన్న పెద్ద చెట్టును ఢీకొట్టాడు. ప్రయాణికులు భయంతో కేకలు వేయడంతో వెంటనే స్థానికులు స్పందించి 108కి ఫోన్ చేశారు. ప్రమాదంలో గాయపడ్డ వారందరినీ 108లో చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో చింతలపూడికి చెందిన రెడ్డి చిన్ని, ధర్మాజీగూడేనికి చెందిన మిద్దే జగన్నాథం, మిద్దే వెంకటలక్ష్మి, లింగపాలేనికి చెందిన గొల్లపల్లి ఏసులను మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన తొమ్మిది మందికి స్వల్ప గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స చేసి ఇళ్లకు పంపించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ వివరించారు.

**స్పందించిన ఎమ్మెల్యే..** ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్థానిక తెదేపా నాయకులను ఘటన జరిగిన స్థలానికి పంపించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించే వరకు ఆసుపత్రిలోనే ఉండాలని తెదేపా నాయకులకు సూచించారు. ఆసుపత్రి కమిటీ సభ్యుడు కొండ్రు దేవా తదితరులు దగ్గరే ఉండి మెరుగైన సేవలందించేలా చూశారు.

### బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ - 173, చికెన్ స్కిన్‌లెస్ - 196.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 103, 111, 122 చికెన్ విత్ స్కిన్ - 196 చికెన్ స్కిన్‌లెస్ - 206.

## పెళ్లాడిన యువకుడిపై యువతి బంధువుల దాడి

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడి ఇంటిపై యువతి కుటుంబసభ్యులు దాడి చేసి.. యువతిని తీసుకెళ్లిన ఘటనపై లక్కవరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎంవీ సుభాశ్ కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లికి చెందిన బెజవాడ రమేశ్.. పెదవేగి మండలం వీరంపాలెం గ్రామానికి చెందిన గంగోత్రి కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ శుక్రవారం ఏలూరులో ప్రేమ వివాహం చేసుకుని.. రక్షణ కావాలని లక్కవరం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అయితే ఎస్సై శశాంక.. ప్రేమజంట ఇరు కుటుంబాలను రావాల్సిందిగా సమాచారం అందించారు. అనంతరం వారు రమేశ్ ఇంటికి వెళ్లిపోయారు. కాగా శనివారం అర్ధరాత్రి యువతి కుటుంబసభ్యులు, బంధువులు.. రమేశ్ ఇంటిపై దాడి చేసి గంగోత్రిని తీసుకు వెళ్లిపోయారు. దాడి చేసిన పలువురు యువకులను రమేశ్ బంధువులు పట్టుకుని లక్కవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దీనిపై డీఎస్పీ రవిచంద్ర ఆదేశాల మేరకు.. సీఐ సుభాశ్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి యువతి ఆచూకీ కనుగొని ఆదివారం జంగారెడ్డిగూడెం తీసుకువచ్చారు. దాడికి పాల్పడ్డ యువతి సోదరుడు శరత్‌చంద్రతో పాటు మరో 11 మందిపై ఆదివారం కేసులు నమోదు చేశామని, ఇరు వర్గాలను బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. అలాగే యువతిని ఆమె భర్త రమేశ్‌కు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా జడ్పీ ఛైర్‌పర్సన్ జన్మదినం

పద్మశ్రీకి కేకు తినిపిస్తున్న ఎంపీ మహేశ్‌కుమార్

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** స్థానిక జడ్పీ విడిది కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జన్మదినం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, అభిమానులు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు బడేటి చంటి(ఏలూరు), మద్దిపాటి వెంకటరాజు(గోపాలపురం), ముప్పిడి వెంకటేశ్వరరావు(కొవ్వూరు), పత్సమట్ల ధర్మరాజు(ఉంగుటూరు), రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత, మాజీ ఎంపీ మాగంటి బాబు, కరాటం రాంబాబు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొని అభినందనలు చెప్పారు.

## కొనసాగుతున్న నీటి విడుదల

**పోలవరం, న్యూస్‌టుడే:** మండలంలోని పట్టిసీమ వద్ద గోదావరిపై నిర్మించిన ఎత్తిపోతల పథకంలోని 22 పంపుల ద్వారా 7,700 క్యూసెక్కులు ప్రాజెక్టు కుడి కాలువలోకి విడుదల చేస్తున్నారు. మొత్తం 24 పంపులకు గాను ఐదు రోజులుగా 22 పంపుల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నట్లు పర్యవేక్షణ డీఈ సురేశ్ తెలిపారు.


92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

**ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు**

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
| --- | --- |
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 6304901226



EENADU Classifieds

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS



1st HAPPY BIRTHDAY to TOKALA MAHADEV

చి. శౌమిక్ మహదేవ్ అగస్త్య

మా గారాల బాబు శౌమిక్ కు మొదటి పుట్టినరోజు శుభాకాంక్షలతో.. నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని ఆశీర్వదిస్తూ శతమానంభవతి అని దీవిస్తూ..

అమ్మ: శ్రావ్య, నాన్న: సాయిరామ్, మేనత్త: రమ్య, మామయ్య: అనిల్‌బాబు, తాతయ్య: తోకల రామకృష్ణ, నానమ్మ: విజయలక్ష్మి, అమ్మమ్మ: కళ్యాణి, తాతయ్య: నిమ్మగడ్డ శేఖర్



TENDER

ఇ-టెండర్ నోటీస్: 1050 KVA, డెస్కెల్ 2 సెం.లు, తేదీ 16 & 17 ఉ. 9.00 గం. నుండి సా. 5.00 గం. వరకు. ITC లిమిటెడ్, ABD అనపర్తి-533342, తూ.గో. జిల్లా, ఇ-టెండర్ తెరుచు తేది: 18.07.25, టెండర్ ఫారం ధర రూ. 500/-, వెల్‌కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14 ద్వారా మొబైల్: 9840731925, www.wel-comeauctioneers.com.

JOBS

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

ఏలూరు జిల్లాలో TVS షోరూంలలో ... [illegible] ... ఫోన్: 70957 06262, 70957 09292.

స్వామి వివేకానంద ... [illegible] ... 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఒక్కేషనల్ ... [illegible] ... 92814 52277, 92814 52290.

రామకృష్ణ ఒక్కేషనల్ (TG No.1) Hyd. ... [illegible] ... 9010680011, 9989371122.

భీమవరంలోని ఫైనాన్స్ కంపెనీ ... [illegible] ... జీతం (Male) రూ॥ 14000 to 16000. Ph: 91339 87779, 96526 74226.

గమనిక

[illegible]

నెక్ నూలింగ్ కొబ్బరి ధర

[illegible] ఫోన్: 08819-224254

BUSINESS SERVICES

బంగారు బ్యాంగిల్స్‌లో ఏ ఇతర ... [illegible] ... Ph: 81422 92071.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

# భీమవరం

• భీమవరం • ఉండి

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

| | | | |
|---|---|---|---|
| భీమవరం పట్టణం | :80085 74471 | వీరవాసరం | :80085 74475 |
| భీమవరం మండలం | :80085 74533 | ఉండి | :80085 74526 |
| ఆకివీడు | :80085 74525 | పాలకోడేరు | :80085 74467 |
| కాళ్ల | : 80085 74474 | | |

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ? రెండో పట్టణంలో శ్రీరామపురం రోడ్డుమీద చెత్త తొలగించాలి. బలుసుమూడి వరకు అక్కడక్కడా గుట్టలు వేస్తున్నారు. **- సత్యనారాయణ, స్థానికుడు**

✔ చెత్త వేయొద్దని స్థానికులకు, పారిశుద్ధ్య సిబ్బందికి చెప్పాం. ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా వేస్తే గుర్తించి చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? సూర్యనారాయణపురం, అడ్డవంతెన ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు ఇబ్బందిగా ఉంటోంది **- రమేష్, ప్రైవేటు ఉద్యోగి**

✔ వెంటనే మరమ్మతులు చేయిస్తాం **- వై.శ్రీను, డీఈ**

**ఉండి, న్యూస్‌టుడే:** ? ఉండి మార్కెట్ యార్డు గోదాములకు సమీపంలో చెత్త పేరుకుపోతోంది. విష సర్పాల బెడద పొంచి ఉన్నందున శుభ్రం చేయాలని కోరుతున్నాం. **- కేవీ సత్యనారాయణ**

✔ చెత్త ప్రక్షాళన పనులు ఎప్పటికప్పుడు చేయిస్తున్నాం. మరో సారి ఆ పనులు చేపడతాం. **- మావుళ్లు, కార్యదర్శి, ఏఎంసీ, ఉండి.**

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** ? శృంగవృక్షం చినపేట నుంచి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం వరకు రహదారి గోతులమయంగా తయారైంది. వర్షం వస్తే గుంతల్లో వారాల తరబడి నీరు నిలిచిపోయి దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- పి.నాగేశ్వరరావు, శృంగవృక్షం**

✔ చర్యలు తీసుకుంటాం **- కోదండరామయ్య, కార్యదర్శి, శృంగవృక్షం**

**భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే:** ? అనాకోడేరు గ్రామ ప్రవేశంలో మలుపు ప్రమాదకరంగా ఉంది. హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలి **- రాజేష్, స్థానికుడు**

✔ చర్యలు చేపడతాం **- రాజశేఖర్, జేఈ, ర.భ.శాఖ, భీమవరం**

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ? ఆకివీడు గుమ్ములూరు కూడలి ప్రాంతంలో రహదారి వెంబడి వర్షం, మురుగు నీరు నిలిచిపోయి స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికుడు**

✔ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. **- సాకేత్‌బాబు, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్**

## నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

**కొణితివాడ (వీరవాసరం), న్యూస్‌టుడే:** కొణితివాడ విద్యుత్తు ఉప కేంద్రంలో అభివృద్ధి పనుల కారణంగా కొణితివాడ, మడుగుపోలవరం, నేలపోగుల, పెనుమంట్ర మండలం పొలమూరు ఇండస్ట్రియల్ ఫీడర్లకు సోమవారం సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్తు పంపిణీ సంస్థ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు.

## కాలువలో చెత్త వేయొద్దు

**ఉండి, న్యూస్‌టుడే:** పంట కాలువలో చెత్త పడేసి సాగునీటిని కాలుష్యానికి గురి చేయొద్దని ఉండి గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృత స్థాయిలో మైక్ ప్రచారం చేయించారు. 'వ్యర్థాలు వేస్తాం.. ఈ నీరే తాగేస్తాం' శీర్షికన 'ఈనాడు'లో ఈనెల 12న ప్రచురితమైన కథనంపై పంచాయతీ కార్యదర్శి స్పందించారు. చెత్త వాహనాల ద్వారా మైక్ ప్రచారంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. నివాసాల్లోని వ్యర్థాలన్నింటినీ చెత్త సేకరించే వాహనాల్లోనే వేయాలని సూచించారు.

## భీమవరం సుందరీకరణకు శ్రీకారం

- ఆక్రమణల తొలగింపు అందులో భాగమే
- 'న్యూస్‌టుడే'తో కమిషనర్ రామచంద్రారెడ్డి

**న్యూస్‌టుడే, భీమవరం పట్టణం:** భీమవరంలో ఆధునికీకరణ పనులు చేపట్టామని పురపాలక కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్నాం. దుకాణాల ఎదుట గుట్టలుగా చెత్త వేస్తే జరిమానా విధిస్తున్నాం. ప్లాస్టిక్ విక్రయాలు చేయకుండా ఇటీవల ఆకస్మిక తనిఖీలు చేసి వ్యాపారులకు జరిమానా విధించాం. జిల్లా కేంద్రమైన ఈ పట్టణానికి వివిధ పనులపై ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ప్రయాణ ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకున్నామని.. చిన్నారుల కోసం ప్రత్యేక క్రీడా పార్కులు, బోటు షికారు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పట్టణ సుందరీకరణతోపాటు చేపట్టబోయే ఇతర అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

### పారిశుద్ధ్య నిర్వహణ

పురపాలికలోని 39 వార్డుల్లో చెత్త సేకరణ కోసం ఉన్న 25 క్లాప్ వాహనాలకు అదనంగా 13 ఏర్పాటు చేస్తున్నాం. ముఖ్య కూడళ్ల నుంచి చెత్త తరలించేందుకు 5 కొత్త ట్రాక్టర్లు, ట్రక్కులు కొనుగోలు చేశాం. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉన్నందున ప్రజలు కూడా నిర్దేశిత ప్రాంతాల్లోనే చెత్త వేయాలి. ఇంటింటా చెత్త సేకరణ కొనసాగిస్తాం.

### అమృత్ పైపుల నుంచి నీటి సరఫరా

కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న అమృత్ పైపులను వినియోగంలోకి తీసుకొస్తున్నాం. హౌసింగ్‌బోర్డు కాలనీ, గునుపూడి ప్రాంతాల్లో గతంలో ట్రయల్ రన్ నిర్వహించాం. ఇక పాత పైపులు నుంచి కాకుండా అమృత్ పైపుల నుంచే ఇకపై నీటి సరఫరా అందిస్తాం. పట్టణంలో పైపులైన్ల లీకేజీ పనులు వెంటనే చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించాం.

### ఇతర అభివృద్ధి పనులు

శ్రీరామపురం, నర్సయ్య అగ్రహారాల్లో రహదారుల పనులు కొనసాగుతున్నాయి. రైల్వే జంక్షన్ దారిలోని శ్మశాన వాటికను ఆధునికీకరిస్తున్నాం. విద్యుత్తు ఆధారిత దహన వాటిక అందుబాటులోకి తీసుకొస్తాం. అక్కడ శివుడి విగ్రహం, స్నానాల గదులు నిర్మిస్తున్నాం. దాతల సౌజన్యంతో పార్కులు అభివృద్ధి చేస్తున్నాం. మారుతీనగర్ పార్కును 150 ట్రక్కుల మట్టితో మెరక చేయిస్తాం.

## ఏపీఆర్‌జేసీ ర్యాంకర్లకు సత్కారం

**బాలేపల్లి (వీరవాసరం), న్యూస్‌టుడే:** బాలేపల్లి గ్రామానికి చెందిన పాలా శ్రీనివాసరావు కుమారులు రోహిత్, రోహన్ 2025 ఏపీఆర్‌జేసీలో ర్యాంకులు సాధించడంతో శ్రీనివాసరావు 10వ తరగతి మిత్ర బృందం అతని కుమారులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఏపీఆర్‌జేసీలో రోహిత్ ప్రథమ ర్యాంకు, రోహన్ 227 ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్యకు త్వరలో తెర

**గొల్లలకోడేరు(పాలకోడేరు), న్యూస్‌టుడే:** ఎమ్మెల్యే, ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు చొరవతో గొల్లలకోడేరు సంజన ఎస్టేట్‌లో తాగునీటి సమస్య త్వరలోనే తీరబోతుందని తెదేపా సీనియర్ నాయకులు కామన రాంబాబు, కమ్మిల రాంబాబు తెలిపారు. ఆదివారం తెదేపా ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది కాలంలో గ్రామంలో జరిగిన అభివృద్ధిని స్థానికులకు వివరించారు. నాయకులు కమ్మిల మహేశ్ వర్మ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం.. **పాందువ్వ (ఉండి), న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యపడుతుందని తెదేపా మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు తెలిపారు. పాందువ్వ, అర్తమూరు, మహదేవపట్నం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాల్లో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. పాందువ్వ ఉప సర్పంచి దార్లంక మధు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పొత్తూరి ప్రసాదరాజు, మాజీ వైస్ ఎంపీపీ వర్రే సముద్రుడు, తెదేపా గ్రామ అధ్యక్షులు దండు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** మనిషికి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. బొండా సుబ్బారావు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో ఆయన కుమారుడు వెంకటేశ్వరరావు 5 రోజులపాటు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం సభలో ఆయన మాట్లాడారు. శ్రీనివాస రామానుజదాస్ మహాభారతంలో ముఖ్య ఘట్టాలతో ప్రవచనం ప్రారంభించారు. రోజూ సాయంత్రం 6 గంటలకు ప్రారంభం అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

## బస్టాండు పునఃప్రారంభం

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** మొగల్తూరు లాకు ప్రాంతంలో బస్టాండును సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ ఆదివారం పునఃప్రారంభించారు. గ్రామానికి చెందిన పొన్నపల్లి నాగేశ్వరరావు గతంలో దీనిని నిర్మించారు. జాతీయ రహదారికి పెద్దపల్లవ ప్రాంతంలో అనుసంధాన మార్గం నిర్మించలేదు. దీంతో ఏడేళ్లుగా లాకు ప్రాంతం మీదుగా బస్సులు ప్రయాణించడం లేదు. ఇటీవల అనుసంధాన మార్గం నిర్మాణం పూర్తికావడంతో బస్సుల రాకపోకలు పునరుద్ధరించారు.

## కాలువలో వ్యర్థాల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** పాలకోడేరు కోడిగట్టు పంట కాలువ పొడవునా ఉన్న నివాసాల నుంచి వస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో దాదాపు పూడుకుపోయింది. దీంతో దిగువ ఆయకట్టు రైతులు నీరు అందక పడుతున్న ఇబ్బందులపై గత నెల 27న 'కాలువలో వ్యర్థాల గుట్టలు' శీర్షికన వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. నీటి సంఘం ఆధ్వర్యంలో కాలువలో చెత్త, వ్యర్థాలతో పాటు పూడికతీత పనులు చేపట్టారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పశ్చిమతో విడదీయరాని అనుబంధం

శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాటి ఉత్సవ, వర్తక సంఘాల అధ్యక్షులు రంగారావు, పేరయ్య (పాత చిత్రం)

**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** ప్రముఖ సినీ నటుడు కోటా శ్రీనివాసరావుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ 37వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా 2001లో నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి కళా వేదికపై స్వర్ణ కంకణంతో సత్కరించినట్లు ప్రస్తుత కమిటీ ఉపాధ్యక్షుడు కొప్పల సత్తిబాబు తెలిపారు. వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు అడ్డాల రంగారావు మాట్లాడుతూ శ్రీనివాసరావు మృతి కళా రంగానికి తీరని లోటన్నారు. ● భీమవరం మాజీ ఎమ్మెల్యే, పురపాలక సంఘం మాజీ ఛైర్మన్ నాచు వెంకట్రామయ్య శత వార్షికోత్సవంలో భాగంగా 2015లో నాచు వారి కూడలిలో ఏర్పాటు చేసిన వెంకట్రామయ్య విగ్రహావిష్కరణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆ కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని కోటా వివరించారని.. ఆయన మృతి మంచి మిత్రుడిని కోల్పోయినట్లుగా ఉందని.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నట్లు వెంకట్రామయ్య కుమారుడు శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## భగవద్గీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

**ఆకివీడు, న్యూస్‌టుడే:** హైందవి పరిషత్, హైందవ శంఖారావం సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం ఆకివీడు మాదివాడలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మందికిపైగా ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ గుర్తింపు పత్రాలు అందజేశారు. లంక జలదుర్గ ప్రసాద్, ఎల్.ఎన్.శశికళ, దాసరి సత్యనారాయణ, సి.సూర్యనారాయణమూర్తి, తెన్నేటి మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

## పగలు ఎండ.. రాత్రి ఉక్కపోత

**ఆకివీడు, న్యూస్‌టుడే:** జులై నెలలో కూడా వేసవి తాపంతో జనం అల్లాడుతున్నారు. మూడు రోజులుగా పగలు ఎండ వేడి, రాత్రి ఉక్కపోత కొనసాగుతోంది. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు భానుడి ప్రతాపం కనిపించింది. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఆకివీడులోని జాతీయ రహదారి, పలు ప్రధాన కూడళ్లు మధ్యాహ్నం సమయంలో నిర్మానుష్యంగా కనిపించాయి. వర్షం కురవాలని రైతులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## అల్లుకుపోతా.. చీకట్లు మిగులుస్తా

ఇది భీమవరం మండలం నర్సింహపురం గ్రామ పరిధిలోని విద్యుత్తు స్తంభం. నిర్వహణ లేక ఇలా తీగజాతి మొక్కలు గుబురుగా పెరిగి తీగల వరకు అల్లుకున్నాయి. వర్షాకాలంలో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ సంభవించే ప్రమాదం ఉంది. చెట్లకొమ్మల తొలగింపు పేరుతో, ఉపకేంద్రం పరిధిలో మరమ్మతులంటూ తరచూ విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్న అధికారులకు ఈ స్తంభం మాత్రం కనిపించకపోవడం దారుణమని విమర్శిస్తున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ వర్మను సంప్రదించగా తమ దృష్టికొచ్చిందని, వెంటనే పొదలు తొలగిస్తామని తెలిపారు.

**- న్యూస్‌టుడే, నర్సింహపురం (భీమవరం గ్రామీణ)**

## వృక్ష విలాపం

### విద్యుత్తు లైన్ల కోసం భారీ చెట్ల తొలగింపు

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** వేండ్ర, కొండేపూడి పరిధిలో ఇటీవల కొత్తగా ఏర్పాటు చేస్తున్న హెచ్‌టీ విద్యుత్తు లైన్ కోసం భారీ వృక్షాలను తొలగిస్తుండడంతో పర్యావరణ ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల మీదుగా కొణితవాడకు 33 కేవీ లైన్ పనులు నెల రోజులుగా కొనసాగుతున్నాయి. తీగలకు అడ్డుగా ఉన్నాయనే కారణంతో వేండ్ర నుంచి కొండేపూడి వరకు పలుచోట్ల పదుల సంఖ్యలో చెట్లను తొలగించారు. రామచంద్రపురం పరిధిలో ఏళ్ల తరబడి నుంచి ఉంటున్న భారీ వృక్షాల కొమ్మలను సైతం నరికేశారు. పలుచోట్ల స్తంభాలు, తీగలకు అడ్డులేకపోయినా తొలగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏళ్ల తరబడి రహదారి పక్కన నీడనిస్తున్న చెట్లను తొలగించడం పట్ల ఆయా గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీడనిచ్చే మొక్కలు నాటాలని ఒక పక్క పాలకులు చెబుతుంటే భారీ వృక్షాలను ఇష్టానుసారంగా తొలగించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. తుపాన్లు, భారీ ఈదురు గాలులు వీసే సమయంలో కూలిపోయే ఆస్కారం ఉన్న చెట్లను, తీగలకు అడ్డుగా ఉన్న వాటిని మాత్రమే తొలగిస్తున్నామని మండల ఎలక్ట్రికల్ ఏఈ మాధవరాజు తెలిపారు.

రామచంద్రపురం వద్ద తొలగించిన భారీ వృక్షం

## భీమవరం సినిమాలు

**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే**

| | |
|---|---|
| శ్రీపద్మాలయ స్క్రీన్ 1 | తమ్ముడు |
| శ్రీపద్మాలయ స్క్రీన్ 2 | ది 100 |
| కిషోర్ స్క్రీన్ 1 | తమ్ముడు |
| కిషోర్ స్క్రీన్ 2 | మార్గన్ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1 | ఓ భామ అయ్యో రామ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2 | సూపర్ మ్యాన్ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3 | జురాసిక్ వరల్డ్ 3డీ (తెలుగు) |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4 | 3 బీహెచ్‌కే, ది 100 |
| విజయలక్ష్మి స్క్రీన్ | మార్గన్ |

## దారులు దారుణం.. ప్రయాణం నరకప్రాయం

**న్యూస్‌టుడే, కొణితివాడ (వీరవాసరం)** ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలు, పైకి తేలిన రాళ్ల కారణంగా ద్విచక్ర వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు ప్రతిపాదనలు చేస్తున్నా నిధులు విడుదల చేయడంలో పాలకులు చొరవ చూపకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని పాలకులు ప్రకటిస్తున్నా అవి కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రామేశ్వరం- కవిటం, వీరవాసరం - పెనుమంట్ర, వడ్డిగూడెం, రహదారులు అత్యంత దారుణంగా తయారయ్యాయి.

రామేశ్వరం - కవిటం రహదారిని దశాబ్దం నుంచి అభివృద్ధి చేయకపోవడంతో కొణితివాడ, మడుగుపోలవరం గ్రామాల్లో రహదారి ధ్వంసమైంది. పలు చోట్ల పెద్ద గుంతలు ఏర్పడాయి. రహదారి అంచులు ప్రమాదరకంగా ఉన్నాయి. ఈ రహదారిలో మడుగుపోలవరం గొంతేరు డ్రెయిన్‌పై ఉన్న వంతెన అప్రోచ్ రహదారి కుంగిపోయింది. వీరవాసరం - పెనుమంట్ర ఆర్‌అండ్‌బీ రహదారి అభివృద్ధికి రూ. 3 కోట్లు మంజూరై ఏడాది పూర్తి కావస్తున్నా పనులు ప్రారంభించలేదు. ఈ రహదారి వెంబడి తోకలపూడి, పంజావేమవరం గ్రామాల్లో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వడ్డిగూడెం రహదారి పరిస్థితి కూడా దానికి తీసికట్టుగానే ఉంది. ఆర్‌అండ్‌బీ ఏఈ డీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపామన్నారు. నిధులు విడుదల కాగానే మరమ్మతులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. వడ్డిగూడెం పంచాయతీరాజ్ రహదారికి ఉపాధి నిధులు మంజూరు కావాల్సి ఉందని ఆ శాఖ ఏఈ రమేష్ తెలిపారు.

ఇది రామేశ్వరం - కవిటం ఆర్‌అండ్‌బీ రహదారి. దశాబ్దం కిందట దీన్ని అభివృద్ధి చేశారు. నవుదూరు నుంచి మడుగుపోలవరం వరకూ సుమారు 6 కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డు చాలాచోట్ల అంచులు దెబ్బతినడం, రాళ్లుపైకి తేలి ఉండడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు.

వడ్డిగూడెం పంచాయతీరాజ్ రహదారికి ఏడాది కిందట పనులు చేశారు. సుమారు 300 మీటర్ల పొడవున ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. నిధులు లేక పనులు నిలిపివేశారు. ఈ రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా నిత్యం నరకం చూస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వివాహిత ఆత్మహత్య

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం ఒకటో పట్టణ పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో వివాహిత ఆదివారం ఆత్మహత్య చేసుకున్నారు. యు.శశిపూర్ణిమ(31) ఇంట్లోని గాలిపంకాకు ఉరేసుకున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై ఎస్.వి.వి.ఎస్ కృష్ణాజీ, సిబ్బంది వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఆమెకు ఆరేళ్ల కిందట వివాహం కాగా ఓ పాప ఉందన్నారు. మృతికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నామన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం రెండో పట్టణంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని సీఐ జి.కాళీచరణ్ హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

## మద్యం సీసాల స్వాధీనం

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** మోగల్లులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎ.లక్ష్మిగణేష్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఇతని నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## గడ్డివాము దగ్ధం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** విస్సాకోడేరు పరిధిలోని కె.పవన్‌కుమార్‌కు చెందిన రెండు ఎకరాల్లోని ఎండుగడ్డికి ఆదివారం నిప్పు అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. ఎన్‌ఛార్జి ఏడీఎఫ్‌వో డి.సూర్యబ్రహ్మం ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు.

## దుకాణాలు తనిఖీ

**కాళ్ల (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే:** కాళ్ల మండలంలోని విద్యాసంస్థలకు దగ్గరలో ఉన్న కిరాణా, కిళ్లీ దుకాణాలను పోలీసులు ఆదివారం తనిఖీ చేశారు. సిగరెట్లు, గంజాయి, మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులను విద్యాసంస్థలకు సమీపంలో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎన్. శ్రీనివాసరావు హెచ్చరించారు.

## నేత్రపర్వంగా వేంకన్న శాంతి కల్యాణం

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢమాసం శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆదివారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాంతి కల్యాణం ప్రధానార్చకుడు ఆదినారాయణాచార్యులు నిర్వహించినట్లు ఆలయ ఈవో ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

వీర పేరంటాలమ్మకు ప్రత్యేక నైవేద్యాలు.. **వెలివర్రు (ఉండి), న్యూస్‌టుడే:** వెలివర్రులోని వీర పేరంటాలమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. ఆకివీడు, కాళ్ల, కలిదిండి, కైకలూరు, భీమవరం, గణపవరం, ఉండి, వీరవాసరం తదితర మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. అమ్మ వారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు సేద తీరేందుకు వేసిన భారీ షెడ్లలో బంధుమిత్రులతో కలిసి అక్కడే వంట చేసుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి తోట శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు.

బాలాత్రిపురసుందరికి వెండి.. **భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** మెంటేవారితోటలో బాలాత్రిపుసుందరి ఆలయానికి పట్టణానికి చెందిన తవ్వా గురునాథం దంపతులు 100 గ్రాముల వెండి ఆదివారం సమర్పించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** ఆషాఢ మాసం సందర్భంగా పట్టణంలో వాడవాడలా మావుళ్లమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1, 2, 3 వార్డులతోపాటు 13 వార్డు టిడ్కో కాలనీలో అమ్మవారి జాతరను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. కళా భవన్ వీధి, కోయ వారి వీధి, టిడ్కో కాలనీలో శక్తి వేషాలు, ఆసాదుల నృత్యాలు, డప్పు వాయిద్యాలతో నిర్వహించిన జాతరను ఎమ్మెల్యే ప్రారంభించారు. మెంటేవారితోటలో రామాలయం కూడలిలో జాతరను మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజ ప్రారంభించారు.

**కలిసిపూడి (ఉండి), న్యూస్‌టుడే:** గ్రామ దేవత మాలేళ్లమ్మకు ఆడపడచులు ఆషాఢ మాస సారె సమర్పించారు. ఆదివారం ఉదయాన్నే అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీర, గాజులు, సారె బిందెలు, పానకం కావిళ్లతో మహిళలు ఊరేగింపుగా తరలొచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్య నాయకులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన అన్నసమారాధనకు వేలాదిమంది భక్తులు తరలొచ్చి ప్రసాదం స్వీకరించారు.

13వ వార్డులో మావుళ్లమ్మ జాతర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు



ఆకివీడు: పెద్దింట్లమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ఆకివీడు గ్రామదేవత పెద్దింట్లమ్మను ఆదివారం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. స్థానిక శ్రీరాంపురం ప్రాంతానికి చెందిన భక్తులు డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా వివిధ రకాల పిండి వంటలు, చలివిడి, పానకాలు, పువ్వులు, పండ్లతో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. పెదకాపవరం గ్రామ దేవత పల్లాలమ్మకు గ్రామస్థులు సారె సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**చెరుకువాడ (ఉండి), న్యూస్‌టుడే:** చెరుకువాడలో సారె కావిళ్లతో అలుగులమ్మ గ్రామోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు అమ్మవారికి మిఠాయిలు, పండ్లు, పుష్పాలు, చీర, జాకెట్, గాజులతో కూడిన సారెతో మహిళలు మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తరలొచ్చారు.

## పోలీసు స్టేషన్ వద్ద ఘర్షణ

**వీరవాసరం, న్యూస్‌టుడే:** వీరవాసరం పోలీసు స్టేషన్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఆదివారం ఘర్షణ పడ్డారు. అత్తిలి మండలం ఉనికిలికి చెందిన వి.రామరెడ్డి, వట్టికూటి సుబ్రహ్మణ్యంలకు వీరవాసరం మండలం అండలూరులో వ్యవసాయ భూమి ఉంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో సుబ్రహ్మణ్యం భూవిస్తీర్ణం తగ్గింది. అప్పటి నుంచి వారి మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణతో గత ఏడాది రామరెడ్డి వీరవాసరం పోలీసు స్టేషన్‌లో సుబ్రహ్మణ్యంపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఆదివారం పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఇద్దరు ఘర్షణకు పాల్పడ్డారు. సివిల్ కేసు కావడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

పూడిక తీస్తున్న పొక్లెయిన్

## ఎట్టకేలకు దొరగారి చెరువుకు మోక్షం

**ఆకివీడు, న్యూస్‌టుడే:** పూర్వం ఎందరో దాహం తీర్చిన ఆకివీడు నడిబొడ్డున గాంధీ విగ్రహం కూడలి పక్కన ఉన్న దొరగారి చెరువు సుమారు 25 ఏళ్లకు పైగా నిరుపయోగంగా ఉంది. నిర్వహణ లేక ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం వేసవిలో ఆకివీడులో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. చెరువు దుస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే, ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు వెంటనే చెరువును వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. శనివారం మట్టి పూడికతీత పనులను ప్రారంభించారు. చెరువుకు నీరు వచ్చేలా వెంకయ్యవయ్యేరు కాలువ నుంచి అయిభీమవరం రోడ్డు వెంబడి దొరగారి చెరువు వరకు పైప్‌లైన్, విద్యుత్తు మోటార్ తదితర అభివృద్ధి పనులను రూ.19 లక్షలతో చేపట్టనున్నామని ఏఈ సురేష్ తెలిపారు. చెరువు వినియోగంలోకి వస్తే వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించవచ్చని పేర్కొన్నారు.

## పత్రికా ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటును పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం భీమవరం మున్సిపల్ ఏరియా కాపురస్తులు దాసరి గురవయ్య గారి కుమారుడు 1. అంజిబాబు పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం పాలూరి గ్రామ కాపురస్తులు పేరిచర్ల వెంకటరామరాజుగారి కుమారుడు 2. వెంకట శ్రీను నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం ఈ పత్రికా ప్రకటన ఇవ్వడమైనది. నా క్లయింట్లకు పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ మండలం బొండాడ గ్రామ కాపురస్తులు గొర్ల జనార్దన గారి కుమారులు 1. సత్యనారాయణ 2. శ్రీరామమూర్తి, తోట సుబ్బారావు గారి కుమారుడు 3. పేరయ్య, గుండుల సత్యనారాయణ గారి భార్య 4. సీతామహాలక్ష్మి, గంగుల నాగేశ్వరరావు గారి భార్య 5. పేరంటాలు అను వార్లు భీమవరం జిల్లా రిజిస్ట్రారు వారి పరిధిలో చేరిన ఉండి సబ్ డివిజన్‌లోని బొండాడ గ్రామ పంచాయతీ ఏరియాలోని బొండాడ గ్రామం తాలూక ఆస్తిని పై ఆసాములు వారి సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో గల రిజిష్టరు సర్వే నెం. 74/3రు య.0.16ట్లు, రిజిష్టరు సర్వే నెం. 74/4రు య. 0.18ట్లు, రిజిష్టరు సర్వే నెం. 74/5రు య. 0.44ట్లు వెరశి మూడు నెంబర్లు తాలూక య. 0.79ట్లు భూమిని 1 సెంటుకు రూ.90,000/-లు ధర చొప్పున య. 0.79ట్లుకు అయిన మొత్తం రూ.71,10,000/-లు అక్షరాల డబ్బై ఒక్క లక్ష పదివేలు రూపాయలకు స్థిరాస్తిని ది. 10-01-2024 సం॥రం॥ తేదీన రూ.10,00,000/-లు అడ్వాన్సు తీసుకొని అన్ రిజిష్టర్డ్ క్రయ అగ్రిమెంట్ వ్రాయించి ఇచ్చియున్నారు. ఇట్లుండగా నా క్లయింట్ అనేక సార్లు రిజిష్టరు చేయమని అడుగగా గంగుల సత్యనారాయణ గారి భార్య సీతామహాలక్ష్మి గొర్ల జనార్దనగారి కుమారుడు శ్రీరామమూర్తి అను వార్లు నా క్లయింట్ పేరన రిజిష్టరు చేయకుండా కాలయాపన చేయుచూ సదరు ఆస్తిని వేరొకరి పేరున రిజిష్టరు చేయటానికి ప్రయత్నం చేయుచున్నారని నా క్లయింట్‌కు తెలియవచ్చినది. కాబట్టి సదరు ఆస్తిపై క్రయ అగ్రిమెంట్ ప్రకారము నా క్లయింట్‌కు చెందవలసి ఉన్నది. ఎవ్వరైనా క్రయ విక్రయాదులు జరిపించిన యెడల వారిపై చట్ట ప్రకారము చర్యలు తీసుకొన బడునని తెలియజేయుచున్నాము.

సం/- యేలేటి యోహాను (న్యూటన్)
కండెల్లి భీమారావు, న్యాయవాదులు,
భీమవరం, 98488 58195
స్థలం: భీమవరం
తేదీ: 13-07-2025

## రహదారి ఇలా.. నడిచేది ఎలా?

కొవ్వాడపుంత రోడ్డుగా పిలిచే ఈ మార్గం భీమవరం బైపాస్ రోడ్డులో కలుస్తుంది. ప్రస్తుతం పలు చోట్ల గుంతలమయమైంది. చిన్నపాటి వర్షం వచ్చినా దారి అధ్వానంగా తయారవుతుంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్యాంను సంప్రదించగా సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించామని తెలిపారు.

**- న్యూస్‌టుడే, కొవ్వాడ (భీమవరం గ్రామీణ)**

## నిధులు నిరుపయోగం..

వీరవాసరంలోని రెస్ట్‌హౌస్ చెరువు ప్రాంతంలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో రైతు బజార్ నిర్మాణం ప్రారంభించారు. తరువాత అధికారంలోకి వచ్చిన గత వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పనులు నిలిచిపోయాయి. ఐదేళ్లుగా రైతు బజార్ నిర్మాణం నిలిచిపోవడంతో ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరిగి భారీ వృక్షాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం రైతు బజార్ నిర్మాణ పనులు పూర్తి చేస్తే ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్ ఏఈ రమేష్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానన్నారు. **- న్యూస్‌టుడే, వీరవాసరం**

(c) eenadu

# నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

## బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెం సౌత్, కేపీపాలెం సౌత్‌లలోని బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు తీరంలో ఇసుక తిన్నెలు, కొబ్బరితోటల్లో ఆట పాటలతో అహ్లాదంగా గడిపారు. పలువురు సముద్ర అలల్లో స్నానాలు చేసి సేదతీరారు.

## బస్టాండు పునఃప్రారంభం

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు లాకు ప్రాంతంలో బస్టాండును సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ ఆదివారం పునఃప్రారంభించారు. గ్రామానికి చెందిన పొన్నపల్లి నాగేశ్వరరావు గతంలో దీనిని నిర్మించారు. జాతీయ రహదారికి పెద్దపల్లవ ప్రాంతంలో అనుసంధాన మార్గం నిర్మించలేదు. దీంతో ఏడేళ్లుగా లాకు ప్రాంతం మీదుగా బస్సులు ప్రయాణించడం లేదు. ఇటీవల అనుసంధాన మార్గం నిర్మాణం పూర్తికావడంతో బస్సుల రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో బస్టాండును శుభ్రం చేసి వినియోగంలోకి తెచ్చారు. నాయకులు పొన్నపల్లి త్రినాథ్ వుడయార్, కడలి త్రిమూర్తులు, పొన్నపల్లి శ్రీలక్ష్మి, మోహనరావు, మద్దూరి పెద్దిరాజు, కొప్పాడ నాగమల్లేశ్వరరావు, వాటాల బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు : 80085 74510
ఆచంట : 91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? రాయపేటలో చెత్త పేరుకుపోయి పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. - కేవీ సత్యనారాయణ, నరసాపురం

✔ చెత్త తొలగింపునకు చర్యలు చేపడతాం. - ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? మద్దిపట్ల వారి వీధిలో డ్రెయిన్లో పూడిక సక్రమంగా తొలగించలేదు. మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. - శ్రీధర్, నరసాపురం

✔ కాలువను శుభ్రం చేయిస్తాం. - ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్

సీడీ ఆవిష్కరిస్తున్న అతిథులు, సభ్యులు

## ఇళ్ల మధ్యే నిలిచి.. వానొస్తే ముంచి!

### వేధిస్తున్న మురుగు సమస్య

నరసాపురం పట్టణం న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో మురుగుపారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. జాతీయ రహదారిని అనుకుని రెండుగులు పల్లంగా డ్రెయిన్లను నిర్మించారు. పలు వీధుల్లో డ్రెయిన్లు వీటి కంటే పల్లంగా ఉండటంతో మురుగు ప్రధాన డ్రెయిన్లలోకి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో కొన్ని ప్రాంతాల్లో మురుగు ఇళ్ల మధ్యే నిలిచిపోతోంది. వర్షాలు కురిసినప్పుడు వీధులన్నీ జలమయమవుతున్నాయి.

**నిత్యం ఇబ్బందులే..**

కచ్చా డ్రెయిన్లో పెరిగిన పొదలు

పట్టణంలో చాలా ప్రాంతాల్లో ప్రజలు నిత్యం మురుగు సమస్యతో సతమతమవుతున్నారు. వీధుల్లో డ్రెయిన్లు నిర్మించినా అవుట్‌లెట్లు ఏర్పాటు చేయలేదు. కొన్నిచోట్ల మురుగును నేరుగా పంట కాలువల్లోకి వదిలేస్తుండంతో జలాలు కలుషితమవుతున్నాయి. సుమారు 10 వార్డులకు చెందిన మురుగు కలిసే నందమూరి కాలనీలో ప్రధాన డ్రెయిన్లో పూర్తిస్థాయిలో పూడిక తీసి ఏడాది దాటిందని స్థానికులు చెబుతున్నారు. రాయపేట, రుస్తుంబాద, వైఎస్ఆర్ కాలనీ, కృష్ణబాబు కాలనీ, వీవర్స్ కాలనీ, కొత్తకాలనీ, మునుసబు వారి వీధిల్లోనూ మురుగు పారుదలలో ఇబ్బందులు ఉన్నాయి.

అవుట్‌లెట్ లేని కాలువ దుస్థితి

**పరిష్కారానికి చర్యలు**

పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నాం. పరిశీలించి అన్ని ప్రాంతాల్లో నిర్వహణ పనులు సక్రమంగా జరిగేలా చర్యలు చేపడతాం. - ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్

**నిర్వహణలోపాలే కారణం**

పట్టణంలో డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా లేదు. పూడిక తీయకపోవడంతో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోవడంతో భరించలేని దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. పేరుకు పట్టణమే అయినా పలు చోట్ల ఇప్పటికీ కచ్చా డ్రెయిన్లు మాత్రమే ఉన్నాయి. వాటి స్థానంలో పక్కా డ్రెయిన్లు నిర్మించాలి. - రెడ్డెం శ్రీనివాస్, నరసాపురం

## శాకంబరి రూపంలో వనువులమ్మ

మార్టేరు, న్యూస్‌టుడే: ఆషాఢమాస ఆదివారం సందర్భంగా నెగ్గిపూడి పరిధి వనంపల్లి గ్రామ దేవత శ్రీ వనువులమ్మను శాకంబరి రూపంలో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పలువురు దంపతులు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు.

### సోమేశ్వరునికి రుద్రాభిషేకం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: జుత్తిగలో శ్రీ ఉమావాసుకీ రవి సోమేశ్వరస్వామి ఆలయం ఆదివారం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతీమాతకు సహస్రనామార్చనలు, సూర్యనారాయణ మూర్తి, శ్రీకాలభైరవ స్వామికి సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.

## రోటరీక్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

నరసాపురం, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ నరసాపురం శాఖ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం సాయంత్రం పట్టణంలోని వైఎన్నీ సమావేశ మందిరంలో జరిగింది. అధ్యక్షురాలిగా ఆత్మూరి రమ, కార్యదర్శిగా కేజేఎస్ఎల్ కుమారి, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అతిథులుగా డిస్ట్రిక్ట్ గవర్నర్ గుత్తికొండ శ్రీరామ్, బొమ్మిడి సునీత నాయకర్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

## భగవద్గీత పోటీల్లో ప్రతిభ

ఆకివీడు, న్యూస్‌టుడే: హైందవి పరిషత్, హైందవ శంఖారావం సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం ఆకివీడు మాదావాడలోని బ్రహ్మరాంబ సమేత మల్లేశ్వరస్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మందికిపైగా ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ గుర్తింపు పత్రాలు అందజేశారు. లంక జలదుర్గా ప్రసాద్, ఎల్.ఎన్.శశికళ, దాసరి సత్యనారాయణ, సి.సూర్యనారాయణమూర్తి, తెన్నేటి మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

నరసాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అర్హులందరికీ కూటమి ప్రభుత్వం సంక్షేమపథకాలు అందజేస్తోందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అధ్యక్షతన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని ఆదివారం రుస్తుంబాదలో నిర్వహించారు. ఆయన నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మత్స్యసహకార సంఘాల ఫెడరేషన్ డైరెక్టర్ కొల్లు పెద్దిరాజు, నాయకులు కంటే ఈశ్వరరావు, డొంగ పద్మారావు, నాగిడి రాంబాబు, నెల్లూరి వీరాస్వామి, భారత గోగులు, పొగాకు బుజ్జి, చెన్ను అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పరిశీలనలో రామరాజు, నాయకులు

### కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: వేములదీవి పడమర- చినమైనవానిలంక పరిధిలో ఉన్న నల్లికట్టపై వంతెన శిథిల స్థితికి చేరి ప్రమాదకరంగా తయారైంది. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కూటమి నాయకులు ఆదివారం ఈ వంతెనను పరిశీలించారు. చేపల వేటకు వెళ్లేందుకు, మత్స్య ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు ఈ వంతెనే ఆధారమని.. దీని స్థానే కొత్తది నిర్మించాలని వారిని స్థానికులు కోరారు. దీనిపై రామరాజు స్పందిస్తూ పంచాయతీ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సర్పంచి తిరుమాని ఏసుబాబును సూచించారు. ఇక్కడ నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు. వాతాడి ఉమామహేశ్వరరావు, స్థానిక నాయకులు ఆయన వెంట ఉన్నారు.

## నేతలకు ఆత్మీయ సత్కారం

కమిటీ సభ్యులతో నాయకులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంనార్తులో ఏటిపార కృష్ణాలయం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పలుపురు నేతలకు ఆత్మీయ సత్కారం చేశారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్న), మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడులను సన్మానించారు. ఆలయ కమిటీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీకి ఎంపిక

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని రేవు లక్ష్మీగాయత్రి ట్రిపుల్ ఐటీ ఒంగోలు కళాశాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పెన్మత్స రామరాజు తెలిపారు. ఈ విద్యార్థిని రెండో జాబితాలో ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీగాయత్రిని సర్పంచి అడ్డాల సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు తిరుమాని స్వామి, పీఎంసీ ఛైర్పర్సన్ చామంతి అభినందించారు.

## అధిక పన్నులపై ఫిర్యాదు చేయండి

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం మార్కెట్లో వ్యాపారుల నుంచి అధిక పన్నులు వసూలు చేస్తే పురపాలక కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని వైస్ ఛైర్పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నాటికలో ఓ సన్నివేశం

## ఆకట్టుకున్న 'జయహో శివాజీ'

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని వైఎన్నీ ఆడిటోరియంలో ఆదివారం ప్రదర్శించిన 'జయహో శివాజీ' ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటిక ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్, శ్రీసాయిబాబా నాట్యమండలి సభ్యులు శివాజీ మహారాజ్ జీవిత విశేషాలను తెలియజేసేందుకు ఈ నాటికను ప్రదర్శించగా తిలకించేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు.

## బండిముత్యాలమ్మ సేవలో సబ్ కలెక్టర్

పూజలు చేస్తున్న శ్రీపూజ

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలో కొలువైన బండి ముత్యాలమ్మను ఆదివారం ప్రకాశం జిల్లా కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెకు తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అభినందనలు తెలిపారు.

### గంగాలమ్మకు విశేష పూజలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎల్విన్‌పేటలో కొలువైన గంగాలమ్మ ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎల్విన్‌పేట, పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

### వారాహి మాత ఆలయంలో..

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మల్లిపూడిలో శ్రీవారాహి మాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.

### దేవర వెంకమ్మకు మహా నివేదన

మొగల్తూరు, న్యూస్‌టుడే: కొత్తోటలో దేవర వెంకమ్మవారికి ఆదివారం బొలిశెట్టి వారి కుటుంబ సభ్యులు వివిధ రకాల పిండి వంటలతో మహా నివేదన చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## శిథిల భవనంలోనే విధులు

పోడూరు, న్యూస్‌టుడే: మినిమించిలిపాడు పంచాయతీ భవనం ఇది. 1975లో నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరింది. హాలులో శ్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం కురిస్తే నీరు లీకై దస్త్రాలు, సామగ్రి తడిసిపోతున్నాయి. ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈ భవనం పల్లంగా ఉండటంతో వర్షం నీరు నేరుగా లోపలికి చేరుతోందని సిబ్బంది వాపోతున్నారు. రికార్డులు తడవకుండా భద్రపరచడానికి ఇబ్బందులు తప్పడం లేదని పంచాయతీ కార్యదర్శి బండి నాగశ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. గత వైకాపా పాలనలో సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో మినిమించిలిపాడును తూర్పుపాలెం సచివాలయంలో కలిపారు. దీంతో తూర్పుపాలెంలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, ఉపకేంద్రం భవనాలు నిర్మించారు. ఇక్కడ పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి సర్పంచి నామన వీర్రాజు ప్రతిపాదనలు చేసినా నిధులు మంజూరు కాలేదు. దీంతో పాలకవర్గ సమావేశాలు, గ్రామ సభలు నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై పంచాయతీ రాజ్ ఏఈ ప్రవీణ్ స్పందిస్తూ ప్రత్యేక గ్రాంటు ద్వారా నిధులు మంజూరు చేయించుకుని పంచాయతీ భవనం నిర్మించుకోవాల్సి ఉందన్నారు.

## అసంపూర్తి పనులు.. నాణ్యత లేమి

పోడూరు, న్యూస్‌టుడే: కవిటం జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీలో గతేడాది రూ.3.25 లక్షలతో చేపట్టిన అసంపూర్తిగా మిగిలాయి. మొత్తం నిధులు ఖర్చయినా పనులు పూర్తి కాలేదు. చేసిన వాటిలోనూ నాణ్యత లోపించింది. వాలీబాల్, షటిల్ కోర్టుల నిర్మాణం చేపట్టగా అసంపూర్తిగా మిగిలాయి. వాలీబాల్ కోర్టుకోసం బేస్‌మెంట్ వేసి పూడ్చకుండా వదిలేశారు. విద్యార్థులు ఆటలాడుతున్నప్పుడు బేస్‌మెంట్ దిమ్మలు తగిలి పడిపోతున్నారు. ఆటస్థలం చుట్టూ వాకింగ్ ట్రాక్ అసంపూర్తిగా నిలిచిపోయింది. రోలింగ్ చేయకపోవడంతో రాళ్లు పైకి తేలాయి. ఉత్తరం వైపు పల్లంగా ఉండటంతో నీరు నిలిచిపోతోంది. వాలీబాల్, షటిల్ కోర్టుల్లో నెట్‌ల ఏర్పాటుకు కప్పీలు వేయలేదు. ఈ అంశంపై ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ స్పందిస్తూ పనులు పూర్తిచేయడానికి మరో రూ.1.50 లక్షలు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు తేల్చారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు ఆడిటింగ్ పూర్తయిందని వివరించారు.

వాలీబాల్ కోర్టు ఇలా..

రాళ్లు తేలిన నడక బాట

## ప్రమాదకరంగా వారధి!

పొలమూరు పంచాయతీ పరిధిలో నాగళ్ల మెరక వెళ్లే మార్గంలో తూర్పుకాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. గతంలో దీనిపై రాకపోకలు తక్కువగా ఉండేవి. రాను రాను నివాసాలు పెరగడంతో ఈ మార్గంలో వచ్చిపోయే వాహనాల సంఖ్య పెరిగింది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు సైతం దెబ్బతిన్నాయి. ఏ మాత్రం ఆదమర్చినా వాహనాలు కాలువలోకి దూసుకెళ్లే పరిస్థితి ఉంది. ఈ సమస్యను ఆర్ అండ్‌బీ ఏఈ యశ్వంత్ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. - పెనుమంట్ర, న్యూస్‌టుడే

పెనుగొండ వద్ద ట్రాక్టర్‌తో దమ్ములు

## సాగు వ్యయం.. అదనపు భారం

పెనుగొండ, న్యూస్‌టుడే: వరి సాగు వ్యయం నానాటికీ పెరగడంతో రైతులు ఆర్థికంగా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల పరిధిలో సుమారు 35,722 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఎకరా నారుమడికి రూ.4 వేలు, నాట్లు వేసేందుకు కూలీలకు రూ.4 వేలు, ట్రాక్టర్‌తో దుక్కి చేయడానికి, తొలి దఫా ఎరువులకు రూ.16 వేలు అవుతుందని, కలుపుతీత, క్రిమి సంహారక మందులు పిచికారీ, సస్యరక్షణ చర్యలకు మరో రూ.14 వేలతో కలిసి సుమారు రూ. 8 వేలు పెట్టుబడి అవుతుందని రైతులు వాపోతున్నారు. కూలీల కొరత, ట్రాక్టర్లు, వరికోత యంత్రాల అద్దెలను పెంచడంతో ఏటేటా పెట్టుబడులు పెరుగుతున్నాయని.. వాతావరణం అనుకూలించక దిగుబడులు తగ్గితే అప్పులే మిగులుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## చెరువు.. నిర్వహణ కరవు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం, భీమవరం నియోజకవర్గాల పరిధిలో కె.బేతపూడి, జొన్నలగరువ్వు గ్రామాలకు చెందిన ఉమ్మడి మంచినీటి చెరువులో నీరు రంగుమారి కలుషితమైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం చెరువు నిండా తామరాకు కమ్మేసింది. కుళాయి ద్వారా సరఫరా అవుతున్న నీరు ఇంటి అవసరాలకు కూడా ఉపయోగపడటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువులో తామరాకుల తొలగింపు పనులను ఉపాధి హామీ పథకంలో చేపట్టేలా చర్యలు చేపడతామని కె.బేతపూడి సర్పంచి బెల్లపు రోజారాణి తెలిపారు.

## పశ్చిమతో విడదీయరాని అనుబంధం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నటుడు కోటా శ్రీనివాసరావుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ 37వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా 2001లో నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి కళా వేదికపై స్వర్ణ కంకణంతో సత్కరించినట్లు ప్రస్తుత కమిటీ ఉపాధ్యక్షుడు కొప్పల సత్తిబాబు తెలిపారు. వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు అడ్డాల రంగారావు మాట్లాడుతూ శ్రీనివాసరావు మృతి కళా రంగానికి తీరని లోటన్నారు.

శ్రీనివాసరావును సత్కరిస్తున్న రంగారావు, పేరయ్య (పాత చిత్రం)

**కోట మృతి తీరనిలోటు..** నరసాపురం: నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీరంగానికి తీరని లోటని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. ఆయన మృతికి సుబ్బారాయుడు సంతాపం తెలిపారు. కోట శ్రీనివాసరావు తనతో పాటు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రజాసమస్యలపై గళమెత్తారని పేర్కొన్నారు.

**పెనుమంట్ర:** వైవిధ్య పాత్రలతో సినీ ప్రేక్షకులను అభిమానాన్ని చూరగొన్న కోట శ్రీనివాసరావు మరణం విచారకరమని మానవ హక్కులు, సామాజిక న్యాయ విభాగం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్, జిల్లా కార్యదర్శి రెడ్డి ఇంద్రయ్య అన్నారు.

## ఆత్మీయం.. ఆనందం!

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట వేమవరంలోని జేఎన్‌బీఎం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-1987 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడి వాతావరణంలో జరిగింది. దాదాపు 38 ఏళ్ల తరువాత కలిసిన బాల్య స్నేహితులంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమ భవిష్యత్తుకు బాటలు వేసిన నాటి గురువులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు కె.లింగరాజు, వి.వేదవతి, బి.సుందరమ్మ, కేఆర్‌వీ ప్రసాద్ పాల్గొని పూర్వ విద్యార్థులకు ఆశీస్సులు అందించారు.

వేడుకలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## భార్యపై కొడవలితో దాడి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త భార్యపై కొడవలితో దాడికి పాల్పడిన ఘటన పాలకొల్లు మండలం అరట్లకట్ట గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానికుడు యాళ్లబండి వెంకటేశ్వర్లు, అతడి భార్య వెంకటరమణ కుటుంబ సమస్యలతో కొద్దికాలం నుంచి తరచూ గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్య నిద్రస్తున్న సమయంలో వెంకటేశ్వర్లు కొవడలితో మెడపై దాడి చేసి పరారయ్యాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ఓ ప్రైవేట్ తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని నరసాపురం డీఎస్పీ శ్రీవేద, సీఐ జి.శ్రీనివాస్ ఆదివారం పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పాలకొల్లు గ్రామీణ ఎస్సై బి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

## కల్లు కల్తీ చేస్తే క్రిమినల్ కేసు

తణుకు, న్యూస్‌టుడే: కల్లును కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవని తణుకు ఎక్సైజ్ ఎస్సై లక్ష్మి హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో కల్లు గీత కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల తెలంగాణలో కల్తీ కల్లు తాగి అనేక మంది ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లారన్నారు. తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 29 కల్లుగీత సహకార సంఘాలతో పాటు 3 వ్యక్తిగత లైసెన్స్ దారులు ఉన్నారన్నారు. కల్లులో ఆల్ప్రాజోలాం, డైయాజిపామ్, క్లోరల్ హైడ్రేట్ వంటి రసాయనాలు కలపడంతో మానవుడి కళ్ళు, నాడీవ్యవస్థ, మూత్రపిండాలు, కాలేయం, జీర్ణ వ్యవస్థ తదితర అవయవాలు మీద ప్రభావం చూపి క్రమంగా రోగనిరోధక శక్తిని బలహీన పరుస్తోందన్నారు. ప్రతి నెలా అకస్మిక తనిఖీలు చేస్తామని కల్తీ జరిగినట్లు రుజువైతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా కల్తీ జరిగినట్లు అనుమానం ఉంటే తణుకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 94409 02436 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

## సేవల విస్తరణకు కృషి

నరసాపురం, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాలను విస్తృతం చేసేలా కృషి చేయాలని వాసవీ క్లబ్ జోన్ ఛైర్మన్ అప్పన బదరి, రీజనల్ ఛైర్‌పర్సన్ వి.శ్యామల సభ్యులకు సూచించారు. పట్టణంలో ఆదివారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా నరసాపురం శాఖ ఆధ్వర్యంలో గోశాలకు కూరగాయలు, గ్రాసం, ఆలయాలకు డస్ట్‌బిన్‌లు అందించారు. క్లబ్ నరసాపురం శాఖ ప్రతినిధులు నూలి శ్రీనివాస్, కె.బాబ్జి, కోట్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

## డీలర్ల సంఘం అధ్యక్షుడిగా వీర్రాజు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని ఎరువులు, పురుగుల మందుల డీలర్ల సంఘం సమావేశం ఆదివారం జరిగింది. సభ్యులు సంఘం నూతన అధ్యక్షుడిగా సిద్ధ వీర్రాజు, ఉపాధ్యక్షుడిగా జనార్దన్ గంగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఏళ్ల తరబడి మరమ్మతులూ కరవే!

### అధ్వానంగా పశు వైద్యశాలలు

పాలకొల్లు మార్కెట్, ఆచంట, మొగల్తూరు, పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పశు సంపదను వృద్ధి చేసే కార్యక్రమాల్లో భాగంగా గతంలో నిర్మించిన పశు వైద్యశాలల భవనాలు క్రమంగా శిథిలావస్థకు చేరుతున్నాయి. వీటికి ఏళ్ల తరబడి మరమ్మతులు, నిర్వహణ పనులు కరవయ్యాయి. పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజవకర్గాల్లో 15 ఆసుపత్రులు ఉండగా అందులో ఐదు భవనాలు మరమ్మతులకు గురయ్యాయి. శ్లాబులు దెబ్బతిని పెచ్చులూడుతుండటంతో వీటిలో పని చేసే సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

| నియోజకవర్గం | ఆసుపత్రులు |
| --- | --- |
| పాలకొల్లు | 5 |
| నరసాపురం | 4 |
| ఆచంట | 6 |



ఆచంటలో తాగునీటి తొట్టె ఇలా...

● మొగల్తూరు మండలంలో పశువైద్యశాల భవనం మరమ్మతులకు గురైంది. కనీసం మందులు భద్రపరిచే చోటు లేక సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో పశువైద్యశాల భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి.

పాలకొల్లులో ప్రాంతీయ పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబు పెచ్చులూడుతున్న భవనంలోనే అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

● ఆచంటలో పూర్వం నిర్మించిన పశువైద్యశాల శిథిలావస్థకు చేరుతోంది. ఇక్కడ నిర్మించిన తాగు నీటి తొట్టెలు పగిలిపోయి నీరు నిలబడడం లేదు. చుట్టూ ప్రహరీ కూలిపోయే స్థితిలో ఉంది. ఇటీవల మండల పరిషత్తు నిధులతో రేకుల షెడ్డు నిర్మించడంతో పాడి రైతులకు కొంత ఊరట లభించింది.

**ప్రతిపాదనలు పంపాం:** పశువైద్యశాలలకు మరమ్మతులు చేయించే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. వాటి కోసం ప్రతిపాదనలు కూడా పంపాం. - జి.సత్యనారాయణ, సహాయ సంచాలకుడు, ప్రాంతీయ పశువైద్యశాల

## శుద్ధి జలాలు అందించాలి: సీపీఎం

పోడూరు, న్యూస్‌టుడే: జిన్నూరు గ్రామ ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందించాలని సీపీఎం మండల నాయకుడు పిల్లి ప్రసాద్ కోరారు. జిన్నూరులోని సీపీఎం కార్యాలయంలో పార్టీ గ్రామశాఖ సమావేశం ఆదివారం జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలకొల్లు పట్టణం నుంచి డబ్బాలతో మంచినీళ్లు తెచ్చుకొనేందుకు అనేక వ్యయప్రయాసలు పడుతున్నారన్నారు.

## పగలు ఎండ.. రాత్రి ఉక్కపోత

ఆకివీడు, న్యూస్‌టుడే: జులై నెలలో కూడా వేసవి తాపంతో జనం అల్లాడుతున్నారు. మూడు రోజులుగా పగలు ఎండ వేడి, రాత్రి ఉక్కపోత కొనసాగుతోంది. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు భానుడి ప్రతాపం కనిపించింది. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఆకివీడులోని జాతీయ రహదారి, పలు ప్రధాన కూడళ్లు మధ్యాహ్నం నిర్మానుష్యంగా కనిపించాయి.

(c) eenadu

# తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

## గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

మాట్లాడుతున్న వర్మ

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించాలని యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ఏఆర్‌కే వర్మ పేర్కొన్నారు. గూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆగస్టు 1 నుంచి 25వ తేదీ లోపు యోగా పోటీలను పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. 50వ రాష్ట్ర స్థాయి యోగా స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా వేదిక కాబోతుందని వెల్లడించారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో ఆదివారం సాయంత్రం నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమావేశం వ్యవస్థాపకుడు బుద్ధాల రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వేదికపై కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ఆత్మబంధువులం సేవా సంఘం అధ్యక్షుడు వెజ్జు దుర్గాప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి, నాదస్వర విద్వాంసులు గరగపర్తి శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. దేవిశెట్టి కృష్ణారావు కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో సిరిమావిళ్ల పెద్దిరాజు, ఎన్‌వీ రమణరావు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..**

| | |
|---|---|
| తాడేపల్లిగూడెం | :79950 67078 |
| పెంటపాడు | :79939 36123 |
| తణుకు | :85558 50851 |
| తణుకు గ్రామీణం | :63005 79402 |

10 AM to 1 PM

**తణుకు, న్యూస్‌టుడే:** ? రామయ్యకుంట కలువ రోడ్డులోని గోతులతో రైతులు, బోడకులు ఇబ్బంది పడుతున్నారు. - శ్రావణ్

✔ ప్రస్తుతం ఎటువంటి ప్రతిపాదన లేదు. - సత్యరుషి, ఏఈ

? వేల్పూరులో జీఎన్ కెనాల్ గట్టున వ్యర్థాలను నిప్పు పెట్టడంతో పొగ వ్యాప్తి చెంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - భాస్కర్

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - రామ్‌ప్రసాద్, ఈవోపీఆర్‌డీ

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** ? స్థానిక కడకట్ల కాలువ గట్టు వద్ద మురుగు బోదె వ్యర్థాలతో పూడిపోయింది. ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. -నీరజ్, స్థానికుడు

✔ బోదెలో వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - ఏసుబాబు, కమిషనర్

? పట్టణంలోని యాగర్లపల్లిలో పందుల బెడద ఎక్కువగా ఉంది. రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. -రవికుమార్, స్థానికుడు

✔ పందుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. -ఏసుబాబు, కమిషనర్

**పెంటపాడు, న్యూస్‌టుడే:** ? ప్రత్తిపాడులోని రామాలయం వీధిలో డ్రెయిన్లు వ్యర్థాలతో పూడిపోవడంతో మురుగు ముందుకెళ్లడం లేదు. - రాజేశ్, స్థానికుడు

✔ డ్రెయిన్లలో పూడిక తొలగిస్తాం. - నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి

? జట్లపాలెంలోని ఎస్సీ కాలనీ సమీపంలో రహదారి వెంబడి చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. పంచాయతీవారికి చెప్పినా పట్టించుకోవడంలేదు. - పండు, స్థానికుడు

✔ చెత్తకుప్పలను తొలగిస్తాం. -అప్పారావు, పంచాయతీ కార్యదర్శి

# ఉంటుందా.. ముంచుతుందా..?

## శిథిల నీడలో దువ్వ రెగ్యులేటర్

**తణుకు, న్యూస్‌టుడే:** ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు, మురుగు యనమదుర్రు డ్రెయిన్ ద్వారా దువ్వ నుంచి ఉప్పుటేరులోకి మళ్లించేందుకు ఏర్పాటు చేసిన రెగ్యులేటర్ కొన్నేళ్లుగా శిథిలావస్థలో మగ్గుతోంది. వరద సమయంలో సక్రమంగా పని చేయక పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. స్థానికులు ఎప్పుడు కూలిపోతుందోనని భయాందోళన చెందుతున్నారు.

తుప్పు పట్టి విరిగి పడిన ఇనుప గడ్డర్లు

1931లో 16 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో ఈ రెగ్యులేటర్ నిర్మించారు. ఏటా జులై, ఆగస్టు నెలల్లో కురిసే వర్షాలకు ఎగువ ప్రాంతాల్లోని వాగులు పొంగి ఎర్ర కాలువ ద్వారా యనమదుర్రు డ్రెయిన్‌లో చేరి భీమవరం సమీపంలోని ఉప్పుటేరులో అక్కడి నుంచి సముద్రంలో కలుస్తోంది. తాడేపల్లిగూడెం మండలం నందమూరు వరకు ఎర్రకాలువ, దువ్వ పరిసర ప్రాంతాలకు వర్షాలు పెరిగితే ఇబ్బంది తప్పదు. సుమారు 1.45 లక్షల ఎకరాలకు నీరు అందిస్తోంది.

**సామర్థ్యం మించి..** ఏటా జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసే వర్షాలకు సుమారు 20 వేల క్యూసెక్కులకు పైగా వరద ప్రవహిస్తోంది. 2018లో 29 వేల క్యూసెక్కుల వరదకు రెగ్యులేటర్ రోడ్డు అంచు కోతకు గురైంది. వర్షాల సమయంలో వరద దిగువకు లాగక పోవడంతో తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ, ఉండ్రాజవరం మండలంలోని సూర్యారావుపాలెం వద్ద గండిపడి గ్రామాలను వరద ముంచెత్తుతోంది.

కోతకు గురైన అంచు భాగం

**మంట కలిసిన మంత్రి హామీ..** గతంలో వరదలకు గేట్లు తెరుచుకోక పోవడంతో పొలాల, గేటు వైర్లు తెగిపోయాయి. నూతన రెగ్యులేటర్ నిర్మించాలని ప్రతిపాదనలు పంపిస్తామని వైకాపా ప్రభుత్వ హయాంలో హామీ ఇచ్చారు. అనేక సార్లు బహిరంగ సభల్లో కూడా తెలిపారు. కొత్త పుల్ల ముక్క కూడా కదపకపోవడంతో మంత్రి మాట మంటలో కలిసిపోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాకతో ప్రజల్లో ఆశలు చిగురించాయి. దువ్వ గ్రామం ముంపుకు పడకుండా ఇన్‌లెట్, అవుట్‌లెట్ నిర్మాణాలు చేపట్టడంతో గ్రామస్థులకు ఆత్మవిశ్వాసం బలపడింది. రెగ్యులేటర్ నిర్మాణం కూడా త్వరితగతిన చేపట్టాలని కోరుతున్నారు.

అమ్మవారికి సారె తీసుకొస్తున్న మహిళలు

## మహంకాళమ్మకు పూజలు

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** ఆషాఢ మాసం పురస్కరించుకుని స్థానిక ఏలూరు రోడ్డులో కొలువుదీరిన దేవీ మహంకాళమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు.

## చింతాలమ్మకు సారె సమర్పణ

**పెంటపాడు, న్యూస్‌టుడే:** చింతపల్లి గ్రామదేవత చింతాలమ్మ ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అమ్మవారికి సారె సమర్పించగా.. ఆలయ అభివృద్ధికమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు.

**శాకంబరిగా కనకదుర్గమ్మ.. గణపవరం:** మొయ్యేరులో వెలసిన కనకదుర్గమ్మను ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో చండీ యాగం నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయావరణలో అన్నసమారాధన చేపట్టారు.

## సోమేశ్వరునికి రుద్రాభిషేకం

**పెనుమంట్ర, న్యూస్‌టుడే:** జుత్తిగలో శ్రీ ఉమావాసుకీ రవి సోమేశ్వరస్వామి ఆలయం ఆదివారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతీమాతకు సహస్రనామార్చనలు, సూర్యనారాయణ మూర్తి, శ్రీకాలభైరవ స్వామికి సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.

# కూటమి పాలనతో ప్రశాంతత

రావిపాడు: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బాబ్జీ తదితరులు

**పెంటపాడు, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని భవన ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ అన్నారు. శనివారం ఆయన పెంటపాడు మండలం రావిపాడులో తెదేపా మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు ఆధ్వర్యంలో 'సుపరిపాలనతో తొలి అడుగు' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో భయానక వాతావరణం నుంచి ప్రశాంత వాతావరణం నెలకొల్పామన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి అప్పన్న, గంధం సతీశ్, పెదప్రోలు వెంకటేశ్వర్లు, ములగాల సుబ్రహ్మణ్యం, మాదాసు సత్యనారాయణ, రామాంజనేయులు, సూర్యకుమార్, నల్లగంటి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● రావిపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైకాపా నాయకుడు ములగాల రామసత్యనారాయణ(బాబ్జీ) మరో 50 మంది కార్యకర్తలతో కలిసి తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ సమక్షంలో తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా వలవల బాబ్జీ ఆయనకు తెదేపా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ● తాడేపల్లిగూడెం మండలం నందమూరులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మండల క్లస్టర్ కో ఇన్‌ఛార్జి సెనగన శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు సాదుల శ్రీనివాసరావు, కొప్పునీడి వెంకటేశ్వరరావు, ములపర్తి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సహాయ నిధి చెక్కు అందజేస్తున్న బొలిశెట్టి తదితరులు

## హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 మందికి రూ. 33.43 లక్షల విలువైన చెక్కులు అందించినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడు ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చిన వేంకన్న సేవలో.. ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం: ఆరిమిల్లి

### ఉద్యోగాలకు 900 మంది ఎంపిక

నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

**తణుకు, న్యూస్‌టుడే:** యువతకు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని, ఇందుకు ముందుగానే 3,500 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. రాజకీయ అవసరాల కోసం కాకుండా నియోజకవర్గంలోని యువత భవిష్యత్తు కోసం ఈ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 900 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. రెండో విడతలో మరొక 700 మందికి ఉద్యోగ అవకాశాలు అందిస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను అభినందించి వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటికీ వైద్యం

**తణుకు, న్యూస్‌టుడే:** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం ఇంటింటికి ఉచిత వైద్య కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని న్యూరోసైకియాట్రిస్ట్ డా. రమేశ్ తణుకు, పాలంగి ప్రాంతాల్లో మంచానికి పరిమితమైన వృద్ధులకు వైద్యం చేశారు. సభ్యులు అతికాల ప్రసాద్‌రావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. ఉచిత వైద్య సేవలు కావాల్సిన వారు స్వయంగా లేదా 99853 43530 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సంఘం అధ్యక్షులు కరుణాకర్ చౌదరి, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జోరందుకున్న నాట్లు..

### నియోజకవర్గంలో 60శాతం పూర్తి

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలో వరి నాట్లు ముమ్మరమయ్యాయి. పొలాలు దమ్ము చేసి నాట్లు వేసే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో బోర్లతో నీటిని తోడి దమ్ము చేస్తున్నారు. సొంత బోర్లు లేని చిన్న, సన్నకారు రైతులకు దమ్ము చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు.

**వెదజల్లే పైనే మొగ్గు..** గతేడాది ఈ సమయానికి వరదలు రావడంతో వేసిన వరినాట్లు కొట్టుకుపోయాయి. రెండోసారి వెదజల్లే విధానంలో పంటలు వేశారు. దీంతో కొంత నష్టం వచ్చినా రైతులు గట్టెక్కారు. ఈ సీజన్లో కూడా వెదజల్లే విధానంలో నాట్లు వేయడానికి మొగ్గు చూపుతున్నారు.

**వాతావరణాన్ని తట్టుకునేలా..** సాధారణంగా ఖరీఫ్‌లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉండటంతో కంకులు మీద ఉండే వరి గాలికి పడిపోయి నష్టపోతున్నారు. ఈ మేరకు వర్షాలకు, గాలికి పడిపోని 1318 రకం విత్తనాలు వేస్తున్నారు. పంట కాలం కొంత ఆలస్యమైనా రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉండదు.

**మండలాల వారీగా ఖరీఫ్ సాగు ఎకరాల్లో**

| | |
|---|---|
| అత్తిలి | 13,411 |
| ఇరగవరం | 14,614 |
| తణుకు | 11,568 |

**నెలాఖరులోగా..** నియోజకవర్గంలో 60 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. జులై నెలాఖరుకి మొత్తం పూర్తి చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అత్తిలి మండల వ్యవసాయాధికారి టి.రాజేశ్ తెలిపారు.

## కళారంగానికి విశేష సేవలు

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం రంగస్థల సంక్షేమ సంఘం పూర్వ అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ సంతాప సభ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్తు పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు సూరంపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ విద్య, కళా రంగానికి ఆయన విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో చింతకాయల వంశీకృష్ణ, కూచిపూడి నాగేశ్వరరావు, జేకే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కల్లు కల్తీ చేస్తే క్రిమినల్ కేసు

గీత కార్మికులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్సై లక్ష్మి

**తణుకు, న్యూస్‌టుడే:** కల్లును కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవని తణుకు ఎక్సైజ్ ఎస్సై లక్ష్మి హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో కల్లు గీత కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల తెలంగాణలో కల్తీ కల్లు తాగి అనేక మంది ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లారన్నారు. తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 29 కల్లుగీత సహకార సంఘాలతో పాటు 3 వ్యక్తిగత లైసెన్స్‌దారులు ఉన్నారన్నారు. కల్లులో ఆల్ప్రాజోలాం, డైయాజిపామ్, క్లోరల్ హైడ్రేట్ వంటి రసాయనాలు కలపడంతో మానవుడి కళ్ళు, నాడీవ్యవస్థ, మూత్రపిండాలు, కాలేయం, జీర్ణ వ్యవస్థ తదితర అవయవాలు మీద ప్రభావం చూపి క్రమంగా రోగనిరోధక శక్తిని బలహీన పరుస్తోందన్నారు. ప్రతి నెలా ఆకస్మిక తనిఖీలు చేస్తామని కల్తీ జరిగినట్లు రుజువైతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా కల్తీ జరిగినట్లు అనుమానం ఉంటే తణుకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 94409 02436 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

## యువత చూపు.. జిమ్ వైపు

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** ప్రస్తుతం చాలా మందికి శారీరక శ్రమ లేకపోవడంతో బరువు పెరగడం సమస్యగా మారింది. యువత మాత్రం యువత శరీర సౌష్ఠవంపై ఆసక్తి పెంచుకుంటున్నారు. ఉద్యోగ నియామకాల్లో విజయం సాధించడానికి, ఫిట్‌నెస్ సాధించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ తరుణంలో పల్లెల్లో కూడా వ్యాయామశాలలు రద్దీగానే కనిపిస్తున్నాయి. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఫిట్‌నెస్ సాధనతో పాటు యోగా వైపు అడుగులు వేస్తున్నారు.

**ప్రత్యేక శ్రద్ధ..** ఒకప్పుడు ఫిట్‌నెస్‌పై సాధన చేయాలంటే నగరాలు లేదా పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో జిమ్ సెంటర్లను ఏర్పాటు చేసి సాధన చేస్తున్నారు. అత్తిలిలో వ్యాయామం, యోగా విద్యల్లో శిక్షణనిచ్చి ఆరోగ్యవంతమైన జీవితాలకు నాంది పలుకుతున్నారు. ఆధునిక సదుపాయాలతో వ్యాయామశాలను నడుపుతున్నారు.

'డిగ్రీ పూర్తిచేశా. ఉద్యోగాన్వేషణలో ఉన్నా. రెండేళ్లుగా క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నా. రక్షణ రంగం, పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా.' అని అత్తిలికి చెందిన మాణిక్యాలరావు తెలిపారు.

'అయిదు నెలలుగా ఉదయం, సాయంత్రం సాధన చేసి మంచి ఫిట్‌నెస్ సంపాదించా. ఉద్యోగాల సాధనలోనూ ప్రయత్నాలు ముమ్మరం చేశా.' అని పాలూరుకు చెందిన మణికంఠ తెలిపారు.

**యోగాతో మానసిక ప్రశాంతత..** 'ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్ పెంపొందించుకోవడం తప్పనిసరి. చాలా మంది ఇంట్లోనే ఉంటున్న కారణంగా బరువు పెరిగి తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. యోగా సాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది.' అని యోగా గురువు బండి శ్రీనివాస ప్రసాద్ తెలిపారు.

## విలక్షణ నటుడికి సంతాపం

తాడేపల్లిగూడెం: మౌనం పాటిస్తున్న భాజపా నాయకులు

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** కోట శ్రీనివాసరావు తన విలక్షణ నటనతో తెలుగు రాష్ట్రాల ప్రజలను ఎంతగానో అలరించారని భాజపా నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కోట చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కంచుమర్తి నాగేశ్వరరావు, గట్టిం మాణిక్యాలరావు, ఐనం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**తణుకు, న్యూస్‌టుడే:** తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే అమరుడు నటుడు కోట శ్రీనివాసరావు అని భాజపా రాష్ట్ర నాయకురాలు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముళ్లపూడి రేణుక అన్నారు. కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం ప్రకటించారు. 1999-2004వ వరకు భాజపా నుంచి విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా పని చేశారన్నారు. నేటికీ భాజపాలోనే కొనసాగారని ఆమె అన్నారు. తన నటనా ప్రస్థానంతో ప్రజా సేవాభావాన్ని ప్రదర్శించారన్నారు. ఏ పాత్రైనా సహజ సిద్ధమైన నటనతో తెలుగు సినీ పరిశ్రమలో గుర్తింపు పొందిన ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మరణం తీరని లోటన్నారు.

## డీలర్ల సంఘం అధ్యక్షుడిగా వీర్రాజు

వీర్రాజును సత్కరిస్తున్న సభ్యులు

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం పట్టణం కేఎన్ రోడ్డులోని ఓ హోటల్లో ఎరువులు, పురుగుల మందుల డీలర్ల సంఘం నెలవారీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు సంఘం నూతన అధ్యక్షుడిగా సిద్ధ వీర్రాజు, ఉపాధ్యక్షుడిగా జనార్దన్ గంగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మద్దుకూరు ధనరాజు, చిక్కాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బీచ్‌లో పర్యాటకుల సందడి

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** పేరుపాలెం సౌత్, కేపీపాలెం సౌత్‌లలోని బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు తీరంలో ఇసుక తిన్నెలు, కొబ్బరితోటల్లో ఆటపాటలతో అహ్లాదంగా గడిపారు.

# ఎక్కడ చూసినా సమస్యలే

ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు

**తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే :** తాడేపల్లిగూడెం పట్టణంలోని 23వ వార్డులో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పలువీధుల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. వార్డులో చాలావరకు ఖాళీస్థలాలు ఉండటంతో వాటిలో పిచ్చిమొక్కలు మొలవడంతో వర్షపునీరు, మురుగు చేరి దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. రాత్రి పగలూ తేడా లేకుండా దోమలు తమపై దాడిచేస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. శివారు వీధులు మట్టిరోడ్లు కావడంతో వర్షం కురిసినప్పుడు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని శివారు ప్రాంతవాసులు చెబుతున్నారు.

భవానీనగర్‌కి సమీపంలోని ప్రధాన మురుగుకాలువ వ్యర్థాలతో పూడిపోవడంతో భరించలేని దుర్గాసన వస్తోందని, ఆ ప్రాంతంలో పందులు, శునకాల బెడద ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

**దోమల మందు కొట్టాలి..** ఖాళీ స్థలాల్లో మురుగు, వర్షపునీరు చేరడంతో దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. వార్డులో దోమల మందుని పిచికారీ చేసి చాలాకాలమైంది. నిత్యం దోమలతో సావాసం చేయాల్సి వస్తోంది.
- లక్ష్మి, స్థానికురాలు.

**వార్డు : 23 జనాభా : 3199**
**ప్రాంతాలు : బోదిగట్టు-2, భవానీ నగర్**

**పరిష్కరిస్తాం..** వార్డులోని కచ్చా డ్రెయిన్లలో పూడిక తొలగిస్తున్నాం. ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకోవాలని వాటి యజమానులకు నోటీసులు అందజేస్తాం. పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.
- ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్, తాడేపల్లిగూడెం.

పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

## బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ

**పెంటపాడు, న్యూస్‌టుడే:** ప్రత్తిపాడులోని సరస్వతి విద్యాలయ పాఠశాలలో శని, ఆదివారాల్లో సీఐఎస్‌సీఈ-2025-26 ఏపీ, తెలంగాణ జోనల్ లెవల్-ఎ బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. విజయవాడ, అమలాపురం, రావులపాలెం, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్-14, 17, 19 విభాగాల్లో సరస్వతి విద్యాలయానికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారని పాఠశాల ఛైర్మన్ కొలనువాడ వెంకట హనుమ సత్యనారాయణ రాజు తెలిపారు. అండర్-14లో బాల, బాలికలు, అండర్-17లో బాలికలు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. అండర్-17లో బాలురు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఛైర్మన్, ప్రిన్సిపల్ కొలనువాడ స్వాతి అన్నపూర్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

## పేద మహిళకు అంత్యక్రియలు

**తణుకు, న్యూస్‌టుడే:** తణుకు శివారు డంపింగ్ యార్డ్ వద్ద నివసిస్తున్న లక్ష్మమ్మ (50) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆర్థిక స్తోమత లేని ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఉందుర్తిపాల్ ఫౌండేషన్, పైడిపర్రు-తేతలి లయన్స్ క్లబ్ సంయుక్తంగా ముందుకొచ్చారు. ఉందుర్తిపాల్ ఫౌండేషన్ అధ్యక్షులు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. డబ్బు కంటే మంచి మనస్సు ముఖ్యమన్నారు. ఈ మేరకు ఆర్థికంగా సహకరించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులకు మెరుగైన సేవలందిస్తాం

**బొమ్మిడి(ఉంగుటూరు), న్యూస్‌టుడే:** రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని బొమ్మిడి విశాల సహకార సంఘం(సొసైటీ) ఛైర్మన్ మైలవరపు గోపాలకృష్ణ అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయ ఆవరణలో త్రిసభ్య కమిటీ సభ్యులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఛైర్మన్(జనసేన)గా గోపాలకృష్ణ, సభ్యులుగా నక్కా ఆనందరావు, కన్నూరి శ్రీనివాసరావు ప్రమాణం చేశారు.

**డాక్యుమెంట్స్ పోయినవి**

ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం టౌన్ రామచంద్రరావుపేట D.No. 13-1-30/2 నివాసి, దోనేపల్లి హారిక W/o ప్రభురత్నకుమార్ కి చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ No: 7629/2012 ఏలూరు నుండి బస్సులో వస్తుండగా పడిపోయినది. కావున దొరికిన వారు క్రింది అడ్రస్‌కు తెలియపరచగలరు.

**దోనేపల్లి ప్రభురత్నకుమార్**
**సెల్: 97055 56999**

**మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**
**I.P. No. 22/2025**

మధ్య
నీలపోలు ఎన్.ఎస్.ఎస్.ఎల్.పి. వెంకటేష్ నాయుడు, S/o రామానాయుడు, తాడేపల్లిగూడెం ... పిటీషనర్
మరియు
1. సైపురెడ్డి వెంకటేశ్వరరావు, S/o వెంకట కృష్ణారావు, తాడేపల్లిగూడెం
2. సైపురెడ్డి ఆనంద్ జే, S/o వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం
3. సైపురెడ్డి మౌనిక నిస్సీ, D/o వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం
4. సైపురెడ్డి మురళీ, S/o వెంకటకృష్ణారావు, తాడేపల్లిగూడెం
5. సైపురెడ్డి అభితేజ్, S/o మురళీ, తాడేపల్లిగూడెం
6. సైపురెడ్డి జెస్సీప్రియ, D/o మురళీ, తాడేపల్లిగూడెం
7. సమయం సాయి దుర్గ, W/o శ్రీనివాస్, తాడేపల్లిగూడెం
8. ది అఫిషియల్ రిసీవర్, ఏలూరు, ప.గో.జిల్లా

... రెస్పాండెంట్లు

పై నెంబరు ఐపీలో పిటీషనరు అయిన నీలపోలు ఎన్.ఎస్.ఎస్.ఎల్.పి. వెంకటేష్ వారికి ఉన్న బాకీలు తీర్చే స్తోమత వారికి లేదని, వారిని ఇన్‌సాల్వెంటుగా డిక్లేరు చేయించమని కోరి పై నెంబరు దివాలా పిటీషను పై కోర్టులో దాఖలు చేసియున్నారు. కావున వారు ఇంకా ఎవరికైనా బాకీలు ఉన్న యెడల ది. 5-08-2025 తేదీన ఉదయం 10.30 ని.లకు పై కోర్టుకు వచ్చి తెలియజేయవలెను.

సం/- శనివారపు వెంకట రామకృష్ణ
Advocate for Petitioner
Tadepalligudem, Cell: 9866772026

తాడేపల్లిగూడెం
13-7-2025

(c) eenadu

## డెక్క నిండిన కాలువ.. డొక్కలెండినా కానవా!

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి విడుదల చేసిన కృష్ణాజలాలు కుందూనదిలో ఉరకలేస్తున్నాయి. జిల్లా సరిహద్దు రాజోలి ఆనకట్ట వద్ద 4,400 క్యూసెక్కులు ప్రవహిస్తుండగా నదిలో పరుగులు తీస్తున్న నీటి ప్రవాహం వెంట గుర్రపుడెక్క తరలివస్తోంది. ఆనకట్ట వద్ద కేసీ కాలువకు నీటిని మళ్లించే తూముల వద్ద పెద్దఎత్తున పేరుకుపోయింది. రెండ్రోజుల కిందట గుర్రపు డెక్కను కేసీ కాలువ సిబ్బంది తొలగించగా తిరిగి యథాతథ స్థితికి చేరింది. సోమవారం సాయంత్రం నీటి విడుదలకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో నీటి ప్రవాహంపై ప్రభావం చూపనుంది. ఈ విషయమై కేసీ కాలువ డీఈఈ చిన్నపుల్లయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కాలువలో సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, మైదుకూరు

రాజోలి ఆనకట్ట వద్ద కేసీ కాలువకు నీటిని మళ్లించే తూములకు పెద్దఎత్తున చేరిన గుర్రపు డెక్క

## 964 టన్నుల టమాట రాక

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** మదనపల్లె మార్కెట్‌లో టమాట అత్యధికంగా రూ.32 పలికింది. వివిధ మండలాల నుంచి రైతులు మార్కెట్‌కు 964 టన్నుల టమాటాను తీసుకొచ్చారు. మొదటి రకం టమాట కిలో రూ.25 నుంచి రూ.32, రెండో రకం కిలో రూ.18 నుంచి రూ.24 వరకు పలికింది. వ్యాపారులు రైతుల నుంచి సగటున కిలో రూ.22 నుంచి రూ.30తో కొనుగోలు చేసి ఎగుమతి చేసినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి జగదీష్ చెప్పారు. గత నాలుగు రోజులుగా ధరలు నిలకడగా ఉన్నాయి. మదనపల్లె మార్కెట్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన సరకును దిల్లీ, కోల్‌కతా, తమిళనాడు, తెలంగాణ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన టమాట

# నిశీధిలో మృత్యుకేక

- బోల్తా పడిన మామిడి కాయల లారీ
- ఉపాధికి వచ్చి విగతజీవులైన కూలీలు
- శెట్టిగుంట ఎస్టీ కాలనీలో విషాదం

వారంతా కూలీలు.. రెక్కాడితేనే గానీ డొక్కాడని బడుగు జీవులు... మామిడి కాయలు తెంపడం కోసం ఊరుగాని ఊరొచ్చారు... తమను ఎక్కించుకుని వచ్చిన శకటమే మృత్యువు రూపంలో కాటేస్తుందని ఊహించలేకపోయారు.. దారి కాచిన మృత్యువు వారిని ప్రమాదం రూపంలో కబళించింది. కుటుంబంలో తల్లీ పిల్లలందరూ కూలి పనులకు రాగా ఒకరికొకరు దూరమయ్యారు. నిశీధిలో తొమ్మిది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. 11 మంది ఆసుపత్రి పాలయ్యారు. హృదయ విదారకమైన ఈ ఘటన ఆదివారం రాత్రి పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువు సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే...

**రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** రాజంపేట మండలం ఇసుకపల్లె సమీపంలో మామిడి తోటలో కాయలు తెంపడానికి 20 మందికి పైగా కూలీలు వచ్చారు. వీరిలో రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన వారు దాదాపు 15 మందికి పైగా ఉండగా మిగతా వారంతా తిరుపతి జిల్లా వెంకటగిరి మండలానికి చెందిన యానాదులు. వీరంతా ఆదివారం తెల్లవారుజామునే మామిడి తోట వద్దకు చేరుకుని పనులు ప్రారంభించారు. లోడింగ్ పూర్తవగా రైల్వేకోడూరు మార్కెట్‌కు రాత్రి బయలుదేరారు. అరగంటలో గమ్యస్థానం చేరుకుంటామనగా రాత్రి 10 గంటల సమయంలో పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువుపై అదుపు తప్పి లారీ బోల్తా పడింది. టాపుపై కూర్చున్న కూలీలంతా మామిడి కాయల లోడు కింద పడ్డారు. కొందరు ఎగిరి దూరంగా పడడంతో గాయాలతో బయటపడ్డారు. లారీ కింద పడిన వారిలో తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మందిని రాజంపేట ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం వారిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ఘటనా స్థలంలో సహాయక చర్యలు

రాజంపేట ఆసుపత్రిలో క్షతగాత్రులు

ప్రమాదం నుంచి బయటపడిన చిన్నారులు

ఘటనా స్థలంలో మృతదేహాలు

### అంతా అయిపోయింది సార్!

'అంతా... అయిపోయింది సార్... కూలి పనులకు అని వచ్చి కుటుంబాన్నే కోల్పోయా.. మాది తిరుపతి జిల్లా వెంకటగిరి కాగా ఉపాధి కోసం కుటుంబంతో సహా పుల్లంపేట మండలం గొల్లపల్లికి వచ్చా. నా భార్య చెంచమ్మ, కుమార్తె రాధ, కోడలు ఘటనా స్థలంలోనే చనిపోయారు. నా కొడుకు, మనమళ్లు ఏమయ్యారో తెలియదు.. కుటుంబాన్నంతా కోల్పోయా' అని రాజంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీ **వెంకటేశ్వర్లు** కన్నీరుమున్నీరయ్యారు. ● మామిడి కాయలు తెంపడానికి కూలీలను తీసుకొచ్చిన మేస్త్రీ శివ చిన్న గాయాలతో బయటపడగా అతని భార్య చిట్టెమ్మ కళ్లముందే విగతజీవిగా మారగా ఆమె మృతదేహంతో ఆసుపత్రికి చేరుకుని తన భార్యను బతికించాలని వైద్యులను కోరడం చూపరులకు కంటతడి పెట్టించింది.

### రెడ్డిపల్లిచెరువు కట్ట ప్రమాదాల అడ్డా

**రాయచోటి, న్యూస్‌టుడే:** కడప-తిరుపతి మార్గంలోని వంద కిలో మీటర్లు భయం భయంగానే ప్రయాణించాల్సి వస్తోంది. ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయం అటుగా వెళ్లే వాహనదారులను వెంటాడుతోంది. అందులో పుల్లంపేట మండలం రెడ్డిపల్లి సమీపంలోని చెరువు కట్టపై మృత్యువు మాటేస్తోంది. రాజుల కాలంలో నిర్మించిన ఈ చెరువు కట్ట సుమారు అర కిలో మీటరు మేర ఉంటుంది. కట్టపైనే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కడప వైపు నుంచి వెళ్లే సమయంలో ప్రారంభ ప్రదేశంలో ప్రమాదకరమైన మలుపు ఉంది. తిరుపతి వైపు నుంచి వచ్చే వాహనాలు ఎత్తు నుంచి పల్లపు ప్రదేశానికి దిగుతూ మలుపు తిప్పాల్సిన పరిస్థితి అక్కడ నెలకొంది. ఏటా ఈ కట్టపై ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాదిలోనే మూడు ప్రమాదాలు చోటు చేసుకోగా ఆరుగురు మృత్యువాత పడ్డారు.

## ట్రిపుల్ ఐటీకి రెండో విడతలో 907 మంది ఎంపిక

**వేంపల్లె, న్యూస్‌టుడే :** రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు రెండో విడత ప్రవేశాల కోసం ఎంపికైన 907 మంది విద్యార్థుల జాబితాను ఆదివారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ విడుదల చేశారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థుల పేర్లను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొదటి విడతలో ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 628 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో చేరలేదు. దీంతో ఆ సీట్లు ఖాళీ అయ్యాయి. వీటితో పాటు దివ్యాంగుల కోటా కింద 179, సైనికోద్యోగుల పిల్లల కోటా కింద 80, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 20 సీట్లతో కలిపి మొత్తం 907 సీట్లకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి వారి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇందులో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి 96 మంది, ఒంగోలుకు 460, నూజివీడుకు 85, శ్రీకాకుళానికి 265 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్‌సీసీ కోటా కింద 40 సీట్లు, క్రీడా కోటా కింద 20 సీట్లకు నిపుణులైన ఆయా శాఖల అధికారుల నుంచి విద్యార్థుల మెరిట్ జాబితా అందాల్సి ఉంది. ఈ సీట్ల భర్తీ కూడా మరో వారంలో పూర్తి కానుంది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 96 మంది విద్యార్థులు ఈ నెల 17న ఇడుపులపాయకు, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 810 మంది విద్యార్థులు అదే రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరిగే కౌన్సెలింగ్‌కు ధ్రువపత్రాలు, లగేజీలతో హాజరు కావాలని వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. కొత్తగా ఎంపికైన విద్యార్థులందరికీ సోమవారం నుంచి ఓరియెంటేషన్ తరగతులు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

ఇడుపులపాయలోని భవనాలు






## ఆలస్యంగా నడిచిన రైళ్లు

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే :** తమిళనాడులోని తిరువళ్లూరులో గూడ్స్ రైలు అగ్నికి ఆహుతవడంతో చెన్నై నుంచి కడప వైపునకు వస్తున్న రైళ్లు ఆదివారం ఆలస్యంగా నడిచాయి. చెన్నై-ముంబయి మధ్య నడిచే ముంబయి మెయిల్ (22158), చెన్నై-ముంబయి మధ్య నడిచే ముంబయి ఎక్స్‌ప్రెస్ (22160) సుమారు అయిదు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి.

## పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

**కడప విద్య, న్యూస్‌టుడే :** కడప నగరం సాయిపేట 8వ వార్డు నగరపాలక ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ నెల 10న నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు సంబంధించిన ఫొటోఫ్రేమ్ రూపకల్పనలో పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన చిత్రానికి రాష్ట్రస్థాయిలో అగ్రస్థానం లభించింది. దీన్ని సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర పోర్టల్‌లో ముఖచిత్రంగా ఏర్పాటు చేశారు. మంత్రి నారా లోకేశ్ పాఠశాల ఫొటో చిత్రాన్ని తన స్టేటస్‌తో పాటు సామాజిక మాధ్యమాల్లో ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు. జిల్లాలోని ఓ పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు రావడంపై జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. కడప కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా అధికారులు అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి కలెక్టర్ కార్యాలయానికి రాలేని వారి కోసం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల వరకు 08562 244437 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలవచ్చని పేర్కొన్నారు.

## అరిటాకులో అన్న ప్రసాదం

**వేంపల్లె, న్యూస్‌టుడే :** జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం గండి అంజన్న ఆలయంలో వెలసిన వీరాంజనేయ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ అధికారులు శ్రేష్టమైన అరటాకుల్లో నిత్యాన్నదానం చేస్తున్నారు. శుచికీ, శుభ్రతకు లోటు లేకుండా నిత్యం వందలాది మంది భక్తులు ఇక్కడ అన్న ప్రసాదం అందిస్తున్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెంచలకోన లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల తర్వాత గండిక్షేత్రంలోనే భక్తులకు అరటాకుల్లో భోజనం వడ్డిస్తున్నారు. గండి క్షేత్రానికి రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు దర్శనానికి వస్తుంటారు. స్వామి వారికి నిత్యం 500 మందికి పైగా భక్తులు దర్శిస్తుండగా ప్రత్యేకించి మంగళ, శనివారాల్లో భక్తుల సంఖ్య రెండు వేలకు పైగా ఉంటోంది. నిత్యాన్నదాన కేంద్రంలో 8 నెలలుగా అరిటాకుల్లో భోజనం వడ్డిస్తున్నారు. సాధారణంగా ఇక్కడికి వచ్చే భక్తులకు కూర్చునే సదుపాయం లేకుండా నిలబడి తినేలా అన్న ప్రసాదం వడ్డించే వారు. పెంచలకోన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి గండిక్షేత్రానికి బదిలీపై వచ్చిన ఈవో వెంకట సుబ్బయ్య శనివారం మినహా మిగిలిన అన్ని రోజులు అరిటాకుల్లో బల్లలు, కుర్చీలు వేసి భక్తులకు భోజనం పెడుతున్నారు. రోజూ ప్రత్యేకంగా బెల్లంతో తయారు చేసిన తీపి అన్నం, అన్నం, పప్పు, వంకాయ మసాలా, రసం, మజ్జిగతో భోజనం అందిస్తున్నారు. భక్తుల సంఖ్య పెరిగినా భోజనం తయారు చేసి అందిస్తున్నారు.

గండిక్షేత్రంలో అరిటాకు భోజనం చేస్తున్న భక్తులు

## శాస్త్రీయ విజ్ఞానమే అభివృద్ధికి మూలం

**కడప విద్య, న్యూస్‌టుడే :** శాస్త్రీయ విజ్ఞానమే అభివృద్ధికి మూలమని వక్తలు పేర్కొన్నారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జన విజ్ఞాన వేదిక (జవివే) రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. అంతకు ముందు యర్రముక్కపల్లి కూడలి నుంచి సంధ్యా కూడలి వరకు 'శరీరం వెనుక వైపు కొక్కీలు తగిలించుకుని కారు లాగే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద గాలిలో తేలుతూ కూర్చున్న బాల సన్యాసినులు విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం ఇంద్రజాల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతున్న నేటి కాలంలో చేతబడులు, మూఢాచారాలతో ప్రాణాలు తీయడం వంటి ఘటనలు జరుగుతుండటం బాధాకరమన్నారు. యువత ముందుకొచ్చి జవివే ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. సరైన ఆరోగ్యం, విద్యను పొందితే చాలు ధనవంతులేనన్నారు. ప్రధానంగా మహిళలు జవివేలో ప్రధాన పాత్ర పోషిస్తే సమాజ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు విశ్వనాథ, రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సురేష్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, రాష్ట్ర కోశాధికారి సనావుల్లా, నాయకులు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, రామారావు, మురళీధర్, సుదర్శన్, వరలక్ష్మి, మీన, సుజాత, స్వరాజ్యలక్ష్మి, సుబ్బరాజు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గాలిలో తేలుతున్న బాల సన్యాసినుల వేషధారణల్లో విద్యార్థులు






(c) eenadu

# సాగులో సందేహాలా?

**ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో ఈనాడు ఆధ్వర్యంలో ఫోన్‌ఇన్ రేపు**

ఖరీఫ్‌లో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, పంటల సాగులో సందేహాలు, విత్తనశుద్ధి, తెగుళ్ల నివారణ, వర్షాధార నేపథ్యంలో సాగు చేయాల్సిన పంటలు తదితర అంశాలపై సందేహాలు నివృత్తి చేసుకునేందుకు ఈనాడు మీతోపు చక్కని అవకాశం కల్పిస్తోంది. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్యతో పాటు ఉద్యాన, సేద్య విభాగాల పశుసంవర్ధక శాఖ శాస్త్రవేత్తలు ఫోన్ చేసి మీ సందేహాలను పరిష్కరించుకోవచ్చు. మీరు చేయాల్సిందల్లా ఈ కింది నంబరుకు ఫోన్ చేయడమే. - న్యూస్‌టుడే, చింతకొమ్మదిన్నె

**తేదీ : 15.07.2025 (మంగళవారం) సమయం: ఉదయం 10 నుంచి 11 వరకు**

**ఫోన్ నెంబరు: 99896 23826**

## రాయితీ రుణాల మంజూరుకు వినతి

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే :** ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు పెండింగ్‌లో ఉన్న రాయితీ రుణాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని అఖిల భారత ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 నుంచి అనేక మంది ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఉత్సాహంగా ముందుకు వచ్చి అనేక రంగాల్లో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వారికి ఇప్పటికీ రాయితీ మొత్తం అందకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పారిశ్రామికవేత్తలకు రాయితీ రుణాలు వచ్చేలా చూడాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఐఎఫ్‌బీ నాయకులు రాజేంద్రప్రసాద్, అఖిల్ పాల్గొన్నారు.

## శిక్షణకు వెళ్లనున్న జేసీ

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే :** వైఎస్సార్ కడప జిల్లా జేసీ అదితి సింగ్ ఈ నెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు శిక్షణకు వెళ్లనున్నారు. ఉత్తరాఖండ్ ముస్సోరిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో ల్యాండ్ అక్విజిషన్ పర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు అనే అంశంపై శిక్షణ ఉన్నందున ముగ్గురు జాయింట్ కలెక్టర్లు వెళ్లనుండగా అందులో వైఎస్సార్ జిల్లా జేసీ అదితిసింగ్ ఒకరు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) ముకేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.

## అంతర్ జిల్లాల అండర్-16 క్రికెట్ పోటీలు ప్రారంభం

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే :** ఏసీఏ సౌత్‌జోన్ అండర్-16 పురుషుల మల్టీడే క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. కేఓఆర్ఎం మైదానంలో కడప-చిత్తూరు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 38.4 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌటైంది. లోకేశ్ 56, ఫర్హాన్ 26 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లలో తేజేష్ 5, దినేష్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేసి తొలిరోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 299 పరుగులు సాధించింది. షారుక్ అక్తర్ అజేయంగా 202 పరుగులు చేశారు. తనీష్ టెండూల్కర్ 46 పరుగులతో రాణించారు. కడప బౌలర్లలో కళ్యాణ్‌రెడ్డి, గైబు చెరో వికెట్ తీసుకున్నారు.

షారుక్ అక్తర్, తేజేష్, సుశాంత్

✶ వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు-నెల్లూరు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 177 పరుగులకు ఆలౌటైంది. దైవిక్ 58, రోహిత్ గౌడ్ 34 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లలో సుశాంత్ 4, రిత్విక్‌రెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. నెల్లూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది.

## బ్యాడ్మింటన్ ఎంపికలకు విశేష స్పందన

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే :** కడప ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి ఎంపికలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 150 మందికి పైగా క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాస్థాయి ఎంపికల్లో అండర్-15, 17 బాలికల సింగిల్స్ విభాగంలో కడప నగరానికి చెందిన పూర్వజరెడ్డి విజేతగా నిలిచింది. అండర్-15, 17 విభాగాల్లో జరిగిన ఎంపికల్లో బాల బాలికలకు విడివిడిగా సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం సభ్యులు జిలానీబాషా, గంగాధర్, నాగరాజు, డా. ప్రతాప్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి జ్ఞాపికలను అందించారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది వీరే

జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్-15 రాష్ట్రస్థాయి పోటీలు ఆగస్టులో నెల్లూరులో, అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలు ఆగస్టులో అనంతపురంలో జరగనున్నాయి. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు.

**అండర్-15 బాలురు :** ఈశ్వర ప్రసాద్‌రెడ్డి, చంద్రకిశోర్, వర్షిత్ (ప్రొద్దుటూరు)
**బాలికలు :** పూర్వజరెడ్డి, హారిణి, రితిక, కావ్య (కడప)
**అండర్-17 బాలురు :** వేదవ్యాస్, సుధీర్‌రెడ్డి (కడప), వర్షిత్ (ప్రొద్దుటూరు)
**అండర్-17 బాలికలు :** రమ్యశ్రీ (ప్రొద్దుటూరు), పూర్వజ, కావ్య, రితిక (కడప)

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రముఖులు

## ఇంటి వివాదం.. మహిళ ఆత్మహత్యాయత్నం

**ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఇంటి వివాదం కారణంగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ప్రమీళ అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. మిట్టమడివీధికి చెందిన ఎద్దుల మల్లికార్జున.. పట్టణానికి చెందిన మరో వ్యక్తితో కొన్ని ఏళ్లుగా ఇంటి వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మల్లికార్జున కుటుంబ సభ్యులతో ఇంట్లో ఉండగా సింహాద్రిపురానికి చెందిన కొందరు వ్యక్తులు వచ్చి ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని దౌర్జన్యం చేసి దాడి చేశారు. పురపాలిక పార్కు వద్ద మరోసారి దాడి చేసేందుకు ప్రయత్నం చేశారని మల్లికార్జున ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన భార్య ప్రమీళ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.


**డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ వారి కార్యాలయం/ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలు, వై.యస్.ఆర్ కడప జిల్లా**

**టెండర్ ప్రకటన**

**RC.No: DCO-KDP/13/TENDERS/2025-26** **Dated 11.07.2025**

కడప జిల్లాలో ఉన్న 13 డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకులాలలో 2025-26 విద్య సంవత్సరానికి కూరగాయలు, పాలు, అరటిపండ్లు, కాలానుగుణంగా లభించే పండ్లు, స్కిన్‌లెస్ చికెన్, కోడిగుడ్లు మరియు స్నాక్స్ ఐటమ్స్ (ఎండు ఖర్జూరాలు, బిస్కెట్లు, నువ్వుల లడ్డు అన్ని స్పెసిఫికేషన్స్‌కు, సరఫరా చేయుటకొరకు సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్ అప్లికేషన్ కొరకు District Co-ordinator, APSWREIS, Kadapa వారి పేరు మీద 1500/- రూపాయలు డీడీ రూపంలో SBI, Treasury Branch, Kadapa బ్రాంచిలో చెల్లుబాటు అగునట్లుగా తీసుకొని తేదీ 14.07.2025 నుండి 29.07.2025 టెండర్ దరఖాస్తులు అన్ని పనిదినాలలో మాత్రమే పొందవచ్చును. పూర్తి చేసిన టెండర్ అప్లికేషన్స్ సీల్డ్ కవర్ తేదీ 29.07.2025 మధ్యాహ్నం 02.00 గంటల లోపు డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ వారి కార్యాలయం, కడప నందు ఉంచబడిన టెండర్ బాక్స్ నందు వెయ్యవలెను. టెండర్ నియమ నిబంధనలు టెండర్ ఫారం నందు తెలియచేయబడును. నిర్ణీత సమయం దాటిన తరువాత వచ్చిన టెండర్ అప్లికేషన్స్ అనుమతించబడవు. సీల్డ్ టెండర్లను శ్రీయుత జిల్లా జాయింట్ కలెక్టర్ వారి కార్యాలయం, వై.యస్.ఆర్. కడప జిల్లా నందు కొనుగోలు కమిటీ సభ్యులు, సంబంధిత పాఠశాలల ప్రిన్సిపల్స్ మరియు టెండరుదారుల సమక్షంలో తేదీ 29.07.2025 మధ్యాహ్నం 03.00 గంటలకు తెరవబడి ఖరారు చేయబడును. ఇందుకు సంబంధించిన టెండర్లను మార్పుచేయుటకు గాని, రద్దుచేయుటకు గాని పూర్తి అధికారం శ్రీయుత జిల్లా జాయింట్ కలెక్టర్, వై.యస్.ఆర్. కడప జిల్లా గారు కలిగి వుందురని తెలియజేయడమైనది. టెండర్ దరఖాస్తు రుసుము తిరిగి చెల్లించబడదు. ఇతర వివరముల కొరకు జిల్లా కో-ఆర్డినేటర్, G-5/2, డి-బ్లాక్, న్యూ కలెక్టరేట్ ఆఫీస్, కడప జిల్లా కార్యాలయం, కడప నందు సంప్రదించగలరు.

**సంయుక్త కలెక్టర్ వై.యస్.ఆర్. కడప జిల్లా వారి తరపున**
**జిల్లా సమన్వయ అధికారి.**
**APSWREIS, వై.యస్.ఆర్. కడప జిల్లా.**


# పేద విద్యార్థులు... భావి ఇంజినీర్లు

-న్యూస్‌టుడే, కొండాపురం, ముద్దనూరు

వారంతా నిరుపేద విద్యార్థులు. తమ జీవితంలో కీలక మలుపైన పదో తరగతిలో మంచి మార్కులు సాధించడం ద్వారా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేశారు. ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. ఉన్నతోద్యోగాలు సాధించి కుటుంబాలకు ఆసరాగా ఉంటామని చెబుతున్నారు.

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ

### సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తా..

నా పేరు క్షేమేంద్రనాథ్‌రెడ్డి. మాది కొండాపురం మండలం దత్తాపురం గ్రామం. మా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివాను. పరీక్ష ఫలితాల్లో 574 మార్కులు సాధించాను. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. తండ్రి నాగార్జునరెడ్డి వ్యవసాయం, తల్లి త్రివేణి గృహిణి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కావడమే నా లక్ష్యం.

### ఏఐలో ప్రభుత్వోద్యోగం సాధిస్తా..

నా పేరు వైష్ణవి. ముద్దనూరు పట్టణం. నేను స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాను. 586 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచాను. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. తండ్రి నరసింహులు పెయింటింగ్ వర్క్ చేస్తారు. తల్లి భారతి గృహిణి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇంజినీరింగ్ చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యం.

### ప్రణాళికతో చదివితే విజయం

నా పేరు అస్మాబేగం. ముద్దనూరు మండలం ఉప్పలూరు గ్రామం. స్థానిక జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదివాను. 572 మార్కులు సాధించాను. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అయితే డాక్టర్ కావాలనే లక్ష్యంలో బైపీసీలో చేరాను. వైద్యవృత్తిలో రాణించి, పేద ప్రజలకు సేవ చేస్తాను. తండ్రి ఇబ్రహీం వెలుగు కార్యాలయంలో కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. తల్లి షబానా ఆశా కార్యకర్త.. నేను వైద్యురాలుగా స్థిరపడాలన్నదే ధ్యేయం.

### ఐపీఎస్ సాధిస్తాను

నా పేరు వరుణ్. కొండాపురం మండలం టి.కోడూరు గ్రామం. స్థానిక జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదివాను. 573 మార్కులు సాధించాను. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించాను. తండ్రి నాగన్న ట్రాక్టర్ డ్రైవర్. తల్లి చిన్న ఓబుళమ్మ వ్యవసాయ కూలీ. ఐపీఎస్ సాధించాలనేది నా లక్ష్యం.

## విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

**పెండ్లిమర్రి, న్యూస్‌టుడే :** నందిమండలం సమీపంలోని పొలంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి శనివారం రాత్రి వ్యవసాయ కూలీ ఓబులేసు (23) మృతి చెందారు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి వివరాల ప్రకారం.. చక్రాయపేట మండలం నడింపల్లెకు చెందిన ఓబులేసు శనివారం రాత్రి తన దగ్గరి బంధువుతో కలిసి నందిమండలంలోని వెంకటశివ అనే రైతు పొలంలో పక్షులను పట్టుకునేందుకు వచ్చారు. ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి ఓబులేసు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బస్సులో ప్రయాణిస్తూ గుర్తు తెలియని వ్యక్తి ....

**వేంపల్లె, న్యూస్‌టుడే :** వేంపల్లెలో ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న 48 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులో కదిరిలో ఆ వ్యక్తి బస్సు ఎక్కారు. ఈ మేరకు కండక్టర్ బాబ్‌జాన్ వద్ద వేంపల్లెకు వెళ్లేందుకు టిక్కెట్ తీసుకున్నారు. రాత్రి 8 గంటలకు బస్సు తలుపుల మీదుగా వేంపల్లె నాలుగురోడ్ల కూడలికి చేరింది. ఇంతలో కండక్టర్ అతని వద్దకు వెళ్లి వేంపల్లె స్టేజీ వచ్చింది అని చెప్పగా ఆయన పలకపోగా విగతజీవిగా కనిపించారు. ఈ మేరకు డ్రైవర్ కృష్ణయ్య, కండక్టర్ బస్సును స్థానిక పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లి సమాచారాన్ని పోలీసులకు అందించారు. వారి సూచన మేరకు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద చరవాణి, ఆధార్‌కార్డు లేకపోవడంతో వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

## దంపతులపై దాడి.. బంగారు నగలతో పరారీ

**ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** దౌర్జన్యంగా ఇంట్లోకి వెళ్లి దంపతులపై దాడి చేసి బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఘటనలో తల్లీ కుమారుడు సహా మరో ఇద్దరు హిజ్రాలను ఆదివారం ప్రొద్దుటూరు ఒకటో పట్టణ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఎస్.ఐ సంజీవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన గైబూసా బంగారం దుకాణం నిర్వహిస్తున్నారు. అతని భార్య హబీబున్నీసా డబ్బులు బాకీ ఉన్నారని ఆమె వదిన గౌసియా కొన్నిరోజులుగా గొడవపడుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 11న గౌసియా తన కుమారుడు, కుమార్తె, ఇద్దరు హిజ్రాలు, మరికొందరితో కలిసి హబీబున్నీసా ఇంటికి వెళ్లారు. డబ్బులిస్తారా..? ఇవ్వరా అంటూ గట్టిగా అరుస్తూ ఇంట్లోని వస్తువులు, కబోర్డును ధ్వంసం చేశారు. కబోర్డులోని 150 గ్రాములకు పైగా ఉన్న బంగారం నగలను తీసుకెళ్లారు. అడ్డు వెళ్లిన గౌబూసా, హబీబున్నీసా దంపతులపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. సెల్‌ఫోన్లు, బయట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలనూ వదల్లేదు. బాధితుల ఫిర్యాదుతో గౌసియా, ఆమె కుమారుడు కరీం, ఇద్దరు హిజ్రాలు రాజారెడ్డి (పోరుమామిళ్ల), శ్యామల (ప్రొద్దుటూరు)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ సంజీవరెడ్డి తెలిపారు

## చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే :** ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన దూదేకుల సంక్షేమానికి ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఏపీ నూర్‌బాషా సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.పీర్ మహ్మద్ (ఆలియాస్ బుజ్జి) పేర్కొన్నారు. ఒంటిమిట్ట హరిత హోటల్‌లో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా తమ వర్గానికి చెందిన ఓటర్లు ఉన్నారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ పార్టీల నాయకులు తమ వర్గానికి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.100 కోట్లు ఇస్తామని ప్రకటించారు. ఈ వాగ్దానాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రతి జిల్లాలో నూర్ బాషా ప్రతినిధుల కార్యక్రమాల నిర్వహణకు అనువైన విశాల భవనాన్ని నిర్మించడానికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఇతర శాఖల కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవుల నియామకాల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ముస్లిం మైనార్టీలకు కల్పిస్తున్న రాయితీ, సంక్షేమ పథకాలను తమకు కూడా మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఒంటిమిట్ట శివారులోని మదరసా నిర్వాహకుడు సుభాన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఆయనను ఘనంగా సత్కరించారు. గౌరవాధ్యక్షుడు బాబన్, యువజన, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు పి.మస్తాన్, మస్తానమ్మ, జిల్లా అధ్యక్షుడు సుంకేసుల బాషా, గీతాంజలి విద్యాసంస్థల అధినేత నాగూర్, రాజన్న, కమాల్, సాలాబాదు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీ దూదేకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీర్ మహ్మద్

## రెండు వరుసల రహదారికి మోక్షం

### టెండర్ల ప్రక్రియ పూర్తి

**వేముల, న్యూస్‌టుడే :** మండల పరిధి మబ్బుచింతలపల్లె యురేనియం భవన సముదాయం సమీపంలోని నాలుగురోడ్ల కూడలి నుంచి పరిశ్రమ వరకు కొత్తగా రూ.30.86 కోట్ల వ్యయంతో నిర్మించే రెండు వరుసల రహదారికి మార్గం సుగమమైంది. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయింది. టెండర్లలో నాలుగు సంస్థలు పాల్గొనగా ఎన్ఎస్‌పీఆర్ సంస్థ పనులు దక్కించుకుంది. ఈ పనులను రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఎం.తుమ్మలపల్లె సమీపంలోని యురేనియం పరిశ్రమకు ప్రస్తుతం మబ్బుచింతలపల్లె, తుమ్మలపల్లె మీదుగా వాహనాలు వెళుతున్నాయి. ఇప్పుడు ఉన్న ఒక వరుస రహదారి ఇరుగ్గా ఉండడంతో భారీ వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఎక్కువగా మలుపులు ఉండడంతో ప్రయాణికులు, పరిశ్రమ అధికారులు, కార్మికులు ఇబ్బందులుపడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సంస్థ అధికారులు ప్రత్యామ్నాయంగా కొత్త రహదారి నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. యురేనియం భవన సముదాయం సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి మబ్బుచింతలపల్లె, తుమ్మలపల్లెకు సంబంధం లేకుండా పరిశ్రమ వరకు నేరుగా కొండల మధ్య 6.72 కిలోమీటర్ల రహదారిని నిర్మించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందులో 5.04 కిలోమీటర్లు కొండప్రాంతంలో నిర్మించాల్సి ఉంది. కొత్తగా నిర్మించే రహదారిలో ఆరు వంతెనలు, 14 కల్వర్టులతో పాటు స్లాబ్ కల్వర్టులను నిర్మించనున్నారు. ఈ రహదారిలో భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె గ్రామాలకు వెళ్లేందుకు నిర్మించిన పీఆర్‌రోడ్డుకు ఇబ్బందులు కలుగకుండా వెక్యులర్ అండర్‌పాస్ రోడ్డును నిర్మించనున్నారు. నిర్మాణం కోసం సంస్థ రూ. 49 కోట్లు వ్యయం చేయనుంది. ఇందులో రూ.30.86 కోట్లు రహదారి నిర్మాణానికి వ్యయం చేయనుండగా మిగిలిన రూ.18.14 కోట్లను భూసేకరణతోపాటు ఇతరత్రా వాటికి వినియోగించనున్నారు. పనులను తర్వలో ప్రారంభించనుంది.

రహదారి నిర్మించే ప్రాంతం

## విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య

**ముద్దనూరు, న్యూస్‌టుడే:** చింతకుంట గ్రామానికి చెందిన పెద్దఓబయ్య (50) అనే వ్యక్తి వ్యక్తిగత కారణాలతో విషద్రావణం తాగి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. పెద్దఓబయ్య వ్యక్తిగత కారణాలతో వారం రోజుల కిందట విషద్రావణం తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతనిని కడపలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు.

## ప్రజా సంక్షేమ సాహిత్యానికే జీవనం

సినీ రచయిత మోనశ్రీ మల్లిక్‌ను సన్మానిస్తున్న సభ నిర్వాహకుడు పల్లా కృష్ణ తదితరులు

**ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే:** ప్రజా సంక్షేమానికి ఉపయోగపడే సాహిత్యమే ఎల్లవేళల ప్రజాజీవనంలో ఉంటుందని గేయ రచయిత, సినీ, టీవీ సీరియల్ గేయ రచయిత మోనశ్రీ మల్లిక్ అన్నారు. ఆదివారం స్థానిక శివాలయంలో పల్లా జాతీయ కవితా పురస్కారం ప్రదానోత్సవ సభను నిర్వహించారు. ఈ సభకు డాక్టర్ కొమ్మిశెట్టి మోహన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన గేయ రచయిత మోనశ్రీ మల్లిక్‌కు కవితా పురస్కారం కింద రూ.7500 నగదు బహుమతితో గజమాల, జ్ఞాపికతో ప్రశంసాపత్రాన్ని అందచేశారు. అనంతరం మరో రచయిత ఏసీ దస్తగిరి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఇంత గొప్ప సాహిత్య సేవ తన తండ్రి పేరుపై చేయడం అభినందనీయమన్నారు. అతిథులను పల్లా కృష్ణ సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత చదువులబాబు, సర్పంచి శివ చంద్రారెడ్డి, సమీక్షకులు సీవీ.సురేష్, కవులు రామ్మోహన్, తోట రామ్మోహన్, మహమూద్ ఖలందర్, కాశీవరపు సుబ్బయ్య, రామారావు, గొరిగే వెంకటేశ్వర్లు, బికారి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటపాటలతో అభ్యసనం

## అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన విధానం

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

**కమలాపురం, చెన్నూరు న్యూస్‌టుడే :** బాల్యానికి భరోసా ఇవ్వడంతో పాటు చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఎదిగేలా కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 'నవచేతన, ఆధార్ శిల' అనే పుస్తకాలను (హ్యాండ్ బుక్స్) రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి అందజేసింది. వీటిలోని అంశాలను వారు అమలు చేయడంతో పాటు తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంది.

### కబుర్లు, కథలతో నవచేతన

'నవ చేతన' పుస్తకంలో చిన్నారుల పెంపకంలో తల్లి, కుటుంబ సభ్యులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వారితో ఎలా ప్రవర్తించాలి, చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా ఎలా కబుర్లు, కథలు చెప్పాలి అనే విషయాలను చిత్రాలతో సహా వివరించారు. చిన్నారికి మూడేళ్లు వచ్చే వరకు ఏం చేస్తే వారు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యకరంగా పెరుగుతారో వివరించారు. పిల్లలకు ఏ నెలలో ఎలాంటి అంశాలు నేర్పించాలో కూడా ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఇందులోని అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్త తమ వద్దకు వచ్చే బాలింతలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. జిల్లాలో 2,389 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి.

**జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు**

| | | |
|---|---|---|
| ఐసీడీఎస్ ప్రాజెక్టులు | : | 13 |
| అంగన్‌వాడీ కేంద్రాలు | : | 2,389 |
| మూడేళ్లలోపు చిన్నారులు | : | 65,423 |
| ఐదేళ్లలోపువారు | : | 59,262 |

'ఆధార్ శిల' పుస్తకంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు వినోదాత్మకంగా పాఠాలు ఎలా బోధించాలో వివరించారు. అభ్యసన మొత్తం ఆటలు ఆడించే ప్రక్రియగానే ఉంటుంది.

### శిక్షణ ఇచ్చాం

అంగన్‌వాడీ సిబ్బందికి పుస్తకాలు అందించాం. వీటిలోని అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు శిక్షణ ఇచ్చాం. అమలు తీరును పర్యవేక్షిస్తాం. **- శ్రీలత, సీడీపీవో, కమలాపురం**

## గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ రేపు

**కడప విద్య, న్యూస్‌టుడే :** వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని 24 అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్‌లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు పరీక్ష రాసి సీటు లభించని విద్యార్థులు జులై 15వ తేదీ ఉదయం 9 గంటలకు కడప నగరం చిన్నచౌక్ పాఠశాలలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని జిల్లా సమన్వయకర్త ఉదయశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## హైకోర్టులో అప్పీలుకు వెళ్లిన పోలీసులు

**వేంపల్లె, న్యూస్‌టుడే :** వేంపల్లె మండలంలోని ఓ గ్రామంలో అదృశ్యమైన బాలిక విషయంలో పోలీసులు, పోలీసుస్టేషన్‌పై దాడి కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకొనేందుకు పోలీసుశాఖ కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ వ్యవహారంలో ఆందోళనాకారులపై నమోదు చేసిన హత్యాయత్నం సెక్షన్ తగదని, కేవలం వారికి 41-ఏ కింద నోటీసులు జారీ చేయాలని ఈ నెల 11న హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై హైకోర్టులో అప్పీలు చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ విషయమై పులివెందుల డీఎస్పీ బుక్కే మురళీ, వేంపల్లె ఎస్ఐ తిరుపాల్‌నాయక్ ఆదివారం రాత్రి విజయవాడ బయలుదేరి వెళ్లారు.

### పోలీసుస్టేషన్‌కు 11 మంది నిందితులు

వేంపల్లె పోలీసుస్టేషన్‌పై దాడి చేసిన కేసులో మొదటి విడతగా ఈ నెల 11న అరెస్టైన పక్కీరుపల్లె, రాజీవ్‌కాలనీకి చెందిన షేక్ హుస్సేన్, షేక్ మాలిక్‌బాషా, మరో 9 మందిని ఆదివారం స్థానిక పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. మరో విడత వారికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోలీసుస్టేషన్‌పై దాడి అంశం జిల్లా వ్యాప్తంగా సంచలనం కలిగించడంతో పోలీసు అధికారులు వేంపల్లెలో సాయుధ బలగాలను బందోబస్తు విధుల్లో నియమించారు. ఒక రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు 16 మంది స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు విధుల్లో ఉన్నారు.

## సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సీమ అనువైన ప్రదేశం

**✦ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, పక్కన తెదేపా ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి

**బద్వేలు, న్యూస్‌టుడే:** రాయలసీమలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుకు అనువైన ప్రదేశమని రాష్ట్ర విద్యుత్తు శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బద్వేలు తెదేపా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రాష్ట్రంలో 20 లక్షల పీఎం సూర్యాఘర్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. ఇక్కడ పోరుమామిళ్ల ప్రాంతం సోలార్ ప్లాంటు అనువైన ప్రదేశమని, అక్కడ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో సోలార్ ప్లాంట్లను పెట్టి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందిస్తామన్నారు. మంత్రి నారా లోకేశ్ 20 లక్షలు ఉద్యోగాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. గత ప్రభుత్వం లక్షా ముప్పై నాలుగు వేల కోట్ల రూపాయలు అప్పు చేసి విద్యుత్తు వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. దిద్దుబాటు చర్యలు చేపట్టి సరిచేశామన్నారు. వినియోగదారులపై కరెంటు ఛార్జీలను పెంచకూడదన్నది సీఎం ముఖ్యోద్దేశమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నారని తల్లికివందనం కింద ఏడాదిలో రూ.10 వేల కోట్లు తల్లుల ఖాతాలకు ఒకే రోజు జమ చేశామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. దేశంలో ఎక్కడ ఇవ్వని పెన్షన్ ఈ రాష్ట్రంలో 64 లక్షలమందికి రూ.33 వేలకోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. తెదేపా ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆరు విద్యుత్తు సబ్‌స్టేషన్లు కావాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పోరుమామిళ్ల సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు తుగ్గలి నాగేంద్ర, ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ, ఏడీఈలు భరణీకృష్ణ, రవిచంద్రశేఖర్‌రావు, కుళాయప్ప పాల్గొన్నారు.


**EENADU Classifieds**

**BUSINESS SERVICES**

**BUSINESS OFFER**

**మీ బంగారం,** వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

**REAL ESTATE**

**HOUSE FOR SALE**

**ఇల్లు అమ్మకానికి-** కలసపాడు H.No: 3-136-1, ఆర్యవైశ్య అమ్మవారిశాల వీధి 5.62 సెంట్లు (98X25), 2450 చ.అ. G+1 ఇంటి అమ్మకం, గ్రౌండ్ ఫ్లోర్: 2BHK (1200 చ.అ.), ఫస్ట్ ఫ్లోర్: 1BHK (650 చ.అ), 3 ఏళ్ల పాతది, ఫుల్ ఫర్నిష్డ్, రెడీ టు మూవ్ ఆన్ కి సిద్ధంగా ఉంది. ధర: రూ.1.20 కోట్లు (చర్చించవచ్చు) సంప్రదించండి: రమేష్ - 8247067863.

**JOBS**

Wanted Electronic goods procurement executives from all Electronic stores for the locations. Ph: 91333 99257, 97033 33378.

**ప్రొద్దుటూరు** HGN ఏజెన్సీ నందు పనిచేయుటకు అవుట్‌డోర్ / షాపు సేల్స్‌మెన్స్, టూల్స్ మెకానిక్స్, ఆఫీస్ బాయ్, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Cell: 9100463787, 9515089758.

**హాస్టల్ వార్డన్** కావలెను (లేడీ) ఆచార్య కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, D.అగ్రహారం, B. మఠం (మం). Cell: 8341847444, 90522 08001.

**పల్లా హాస్పిటల్,** 7 రోడ్స్ సర్కిల్ నందు పని చేయుటకు C-ARM టెక్నీషియన్స్ కావలెను Contact: 98490 40153.

**FACULTY/ TEACHERS**

Wanted Teachers Spoken English-1, Receptionist-1, Kadapa Contact No:91549 44970, 9154944955.

**SECURITY GUARDS**

**కడప అరవింద** నగర్ సమీపాన మా సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీగార్డులు కావలెను. 12 గంటలు డ్యూటీ, 13,000/- జీతం+ESI, PF, చదువు 10 పాస్, వయసు 22 నుండి 40 ఏళ్ళు. సంప్ర॥ 72879 17477.

**ఈనాడు క్లాసిఫైడ్స్**
**5 లైన్ల ప్రకటన**
**రూ॥ 350/- మాత్రమే**
**Contact:**
**KDP: 9989997626 8008514248**
**PDTR: 8008597620**
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

## చెత్తకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు

జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. పర్యాటకులు దుర్వాసన, చెత్తచెదారంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. శని, ఆదివారం సెలవురోజులు కావడంతో బెంగళూరు, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. జుమ్మామసీదు ప్రాంగణంలో మొక్కలను పెంచాల్సిన కుండీల్లో చెత్తచెదారం, వ్యర్థాలు పేరుకుపోయాయి. వీటిని తొలగించకుండా అలాగే నిప్పు పెట్టడంతో దుర్వాసనతో పాటు చుట్టూ పొగ అలుముకుంది. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు దృష్టి పెట్టాలని సందర్శకులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ


# ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు


## సూచిక.. దారి చూపక.!

రాష్ట్ర రహదారులపై ప్రయాణం చేసే వారు తాము ఉన్న ప్రాంతం నుంచి ఏయే గ్రామాలు ఎంత దూరం ఉన్నాయి, ఎటువైపు వెళ్లాలో తెలిసేలా ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా లావనూరు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు చుట్టూ ముళ్లపొదలు అలుముకున్నా అధికారులెవరూ పట్టించుకోలేదు. పులివెందుల ప్రధాన మార్గం కావడంతో నిత్యం పదుల సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. ఈ సమస్యను అధికారులు పరిశీలించి ముళ్లపొదలు తొలగించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కొండాపురం

## శాకంబరీ అలంకరణలో చౌడేశ్వరి

ప్రత్యేకాలంకారంలో అమ్మవారు

**ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** స్థానిక వసంతపేటలోని చౌడేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేశారు. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో మనోహరంగా ఆదిపరాశక్తిని ముస్తాబు చేశారు. శక్తిస్వరూపిణి అనుగ్రహ ప్రదాయినిగా కొలువుదీరిన అమ్మవారిని భక్తులు దర్శించి పూజలు నిర్వహించారు.

### పోలేరమ్మకు బోనాల సమర్పణ

**బద్వేలు గ్రామీణ:** శివానగర్‌లో ఆషాఢమాసం సందర్భంగా పోలేరమ్మ అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా శివానగర్ నుంచి అమ్మవారి ఆలయం వరకు మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా వెళ్లారు. మొక్కులు తీర్చుకున్నారు.

## జలధికి తరలిన పీర్లు.. భక్తుల మొక్కులు

కె.సుగుమంచిపల్లెలో పీర్ల ఊరేగింపు

**కొండాపురం, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని కె.సుగుమంచిపల్లె గ్రామంలో కొలువుదీరిన పీర్లు ఆదివారం జలధికి తరలివెళ్లాయి. పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్ల స్వాములను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని చదివింపులు, ప్రార్థనలు చేశారు. తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం జనసందోహం నడుమ సంప్రదాయబద్ధంగా డప్పు, వాయిద్యాల నడుమ పీర్లను జలధికి తరలించారు.

## వ్యక్తిత్వ వికాసంపై ఉచిత శిక్షణ ప్రారంభం నేడు

**మైదుకూరు :** మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రిడ్జి టు బ్రిలియన్స్ సర్టిఫికేట్ కోర్సును అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.నారాయణరెడ్డి తెలిపారు. రెండు వారాల ఉచిత కోర్సు సోమవారం నుంచి 28వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, అనలిటికల్ స్కిల్స్, కంప్యూటర్ ప్రాథమికాలతోపాటు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సీపీఐ నియోజకవర్గ కార్యవర్గం ఎన్నిక

పోతిరెడ్డి భాస్కర్ షావలి

**మైదుకూరు, న్యూస్‌టుడే :** సీపీఐ మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శిగా పోతిరెడ్డి భాస్కర్ నియమితులయ్యారు. సహాయ కార్యదర్శిగా ఎస్.షావలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నిర్వహించిన నియోజకవర్గ మహాసభ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, పి.సుబ్బరాయుడు, పి.చంద్రశేఖర్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శ్రీరాములు ఆదివారం తెలిపారు.

## ఎన్జీవో సంఘం మైదుకూరు అధ్యక్షుడిగా చంద్రమౌళి

చంద్రమౌళి, రాఘవయ్య

**మైదుకూరు, న్యూస్‌టుడే :** ఏపీ ఎన్జీవో సంఘం మైదుకూరు తాలూకా అధ్యక్షుడిగా గజ్జల చంద్రమౌళి, కార్యదర్శిగా మాచనూరు రాఘవయ్య నియమితులయ్యారు. ఆదివారం మైదుకూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికకు అధికారిగా శ్రీనివాసులు, సహాయ ఎన్నికల అధికారిగా రాజశేఖర్, పరిశీలకుడిగా డి.రవికుమార్ పాల్గొన్న సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పెంచల్‌రెడ్డి, రాజన్న, గురుప్రసాద్, మేరీ సువర్ణ, సహాయ కార్యదర్శులుగా వి.సుధ, పద్మావతి, మునెయ్య, పీవీ.రామగుప్త, తులశమ్మ, కోశాధికారిగా లక్కినేని బాబులను ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులతోపాటు ప్రతినిధులు వై.ప్రసాద్ యాదవ్, తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, పద్మనాభం, సదాశివయ్య పాల్గొన్నారు.

## చెక్క భజనల్లో ప్రతిభ

**కలసపాడు, న్యూస్‌టుడే:** మండలంలోని పుల్లారెడ్డిపల్లెకు చెందిన చెక్కభజన కళాకారుడు గుడిమె సుదర్శన్ తన బృందంతో పలుచోట్ల చెక్కభజన పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపుతున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా నియోజకవర్గంలోని గోపవరంలో జరిగిన రాయలసీమ చెక్కభజన పోటీల్లో 10 బృందాలు పాల్గొనగా గుడిమె సుదర్శన్ బృందం ప్రథమస్థానంలో నిలిచింది. నిర్వాహకులచే రూ.50 వేలు బహుమతిగా పొందారు.

## 15 మంది చిన్నారులకు గాయాలు

**కాశినాయన:** మండలంలోని ఉప్పలూరులో నిర్వహించిన మొహర్రం పూజల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. చివరి రోజైన అగ్నిగుండ ప్రవేశ అనంతరం పొక్లెయిన్‌తో గుండం పూడ్చుతుండగా అగ్నితో ఉన్న బూడిద గుండం చుట్టూ ఉన్నవారిపై పడింది. దీంతో 10 మందికిపైగా చిన్నారులకు కాళ్లు కాలాయి. వీరందరిని చికిత్స నిమిత్తం పోరుమామిళ్లకు తరలించారు.

**ఇద్దరికి : పోరుమామిళ్ల, న్యూస్‌టుడే:** గానుగపెంట సబ్‌స్టేషన్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గోపవరం మండలం కాలవపల్లికి చెందిన మస్తాన్, గొల్లపల్లి హరిజనవాడకు చెందిన గురయ్య వేర్వేరు ద్విచక్రవాహనాల్లో బద్వేలుకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. తీవ్రగాయాలైన వీరిని స్థానికులు బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# దోమల దండయాత్ర.. పాలకుల మొద్దునిద్ర

• మురుగుపారుదల అస్తవ్యస్తం • నతమతమవుతున్న పసిడిపురి జనం

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ఆర్ట్స్ థియేటర్ వద్ద మురుగు కాలువలో ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాలు

బంగారు, వస్త్ర వ్యాపారంలో రెండో ముంబయిగా, దసరా ఉత్సవాల నిర్వహణలో రెండో మైసూరుగా ప్రొద్దుటూరు బాసిల్లుతోంది. ఇంతటి ఘన చరిత్ర కలిగి 3 లక్షల జనాభా ఉన్న ఈ పట్టణంలో మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఎగువ, దిగువనూ ఉన్న కాలువల్లో ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాల వల్ల వాన, మురుగు నీరు సాఫీగా ప్రవహించకుండా ఉంది. నిల్వ ఉన్న మురుగు దోమలు, దుర్వాసన, విష పురుగులకు ఆవాసమైంది. కొన్ని చోట్ల మురుగు, వాననీరు దాటికి ఇళ్ల పునాదులకు బీటలు పడుతున్నాయి. వ్యాధులు ప్రబలి ప్రాణాలు పోవడం వంటి స్థితి లేకపోలేదు.. పన్నుల రూపంలో కోట్ల రూపాయలు చెల్లిస్తున్నా... పాలకులు, అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నందుకే ప్రజారోగ్యానికి రక్షణ లేకుండా పోతుందని విమర్శలొస్తున్నాయి. గత వైకాపా సర్కారు నిర్లక్ష్యానికి రూ.163 కోట్లతో కాలువల ఆధునికీకరణ పనులకు నోచుకోలేదు. ఏడాది పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దోమల రహిత ప్రొద్దుటూరుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీనివాసనగర్‌లో మురుగు ప్రవాహానికి కోతకు గురవుతున్న ఇళ్ల పునాదులు

### కంటిపై కునుకులేదు

మా ఇల్లు కోనేటి కాల్వ వీధి మురుగు కాలువ పక్కనే ఉంది. సాయంత్రమవ్వగానే దోమలు చేటలతో పోసినట్లు దాడి చేస్తాయి. వీటి నివారణకు ఎన్ని ప్రయత్నాలు చేసినా సాధ్యంకావడం లేదు. రాత్రింబవళ్లు కంటికి కునుకు లేకుండా ఉంది. ఈ బాధ భరించలేక సొంతింటిని అమ్ముకొని పల్లెకు పోదామనుకుంటున్నాం. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడం మా దురదృష్టం.

-గౌరమ్మ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, కోనేటి కాల్వవీధి

### విజృంభిస్తున్న జ్వరాలు

మా ఇల్లు ఆర్ట్స్ థియేటర్ వద్ద కాలువ పక్కనే ఉంది. దోమలు, దుర్వాసన విజృంభిస్తోంది. పగలే కుడుతున్న దోమలతో విష జ్వరాలు సోకుతున్నాయి. మనమరాలు, మనమడికి నాలుగు రోజులుగా కాస్తున్న జ్వరం ఆసుపత్రి కెళ్లినా నయమవ్వలేదు. దోమల బెడదకు అద్దెకున్న పక్కింటి వాళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. గత ముప్పై ఏళ్లుగా ఓట్ల కోసం వచ్చిన ప్రతి అభ్యర్థికి దోమలు లేకుండా చేయాలని అభ్యర్థిస్తున్నప్పటికీ ఏ ఒక్క నాయకుడూ పట్టించుకున్న పాపాన పోలేదు.

-ఈశ్వరమ్మ, శ్రీరాములపేట

## అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం

**కాశినాయన:** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బాలాయపల్లె గ్రామంలో ప్రతి కుటుంబాన్ని మంత్రి పలకరించారు. మీకు తల్లికి వందనం, పింఛన్లు అందాయా అని ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. తమకు పథకాలు ప్రధానం కాదు సాగు, తాగు నీరు ఇప్పించండని మంత్రిని మహిళలు కోరారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ తాగు నీటి సమస్య పరిష్కారానికి బోరు వేపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, బద్వేల్ తెదేపా ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి, క్లస్టర్ నాయకులు బి.రవీంద్రారెడ్డి, బంగారు గురివిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ఫ్రీహోల్డ్ భూములపై నిషేధం తగదు

**ప్రొద్దుటూరు గ్రామీణ:** ఫ్రీ హోల్డ్ భూములపై విధించిన నిషేధాన్ని మరో రెండు నెలలపాటు పొడిగించడంతో అర్హులైన రైతులకు తీరని అన్యాయం జరుగుతున్నట్లు జిల్లా రైతు సేవా సమితి అధ్యక్షుడు రమణ ఆదివారం విమర్శించారు. అన్నదాతల ముసుగులో అధికారపార్టీలోని నాయకులు, కార్యకర్తల ప్రయోజనాలకు కొమ్ముకాస్తున్నట్లు మండిపడ్డారు.

## సీఎస్ఐ చర్చి ఎన్నికలు

**బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే:** పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో శనివారం జరిగిన పాస్టరేట్ కమిటీ ఎన్నికల్లో ఇగ్నైట్ ప్యానెల్ విజయాన్ని సాధించింది. ఆదివారం ఫలితాలను ప్రకటించారు. జనరల్ విభాగం నుంచి ఇమ్మరాజు విలియం, బెనహర్, నాగదాసరి చెన్నరాయుడు, పి.రవి, సుధాకర్‌బాబు, అల్లూరి సుధాకర్ ఎన్నికయ్యారు. స్త్రీల విభాగం నుంచి మేరి జయశీల, యూత్ విభాగం నుంచి టి.రాజు లారెన్సు గెలుపొందారు. ఎన్నికల అధికారిగా బద్వేలు సీఎస్ఐ చర్చి డీసరీ ఛైర్మన్ ప్రసాద్‌బాబు వ్యవహరించారు.

ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులు

## వైకాపావి కుట్ర రాజకీయాలు

మాట్లాడుతున్న వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగరాజు, పక్కన నాయకులు

**ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే:** వైకాపా కుట్ర రాజకీయాలకు తెరలేపుతోందని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు ఆరోపించారు. ఆదివారం ప్రొద్దుటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా నాయకులు ఎక్కడికెళ్లినా ఘర్షణ వాతావరణం నెలకొల్పేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఇందులో భాగంగానే కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పల హారిక రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి ఇరువర్గాల మధ్య ఘర్షణ ప్రేరేపించినట్లు ఆరోపించారు. ఈ ఘటనకు మాజీ మంత్రి పేర్ని నాని సామాజిక రంగు పులిమే కుట్రపన్నారని ఆరోపించారు. వైకాపా హయాంలో బీసీలను అణచివేసి దాడులు, హత్యలు చేసిన ఘటనలు గుర్తు చేసుకోవాలన్నారు. బీసీ నాయకులు రామచంద్రయ్య, నందం సుబ్బయ్య హత్య ఘటనలను గుర్తు చేశారు. బీసీలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. తెదేపా నాయకులు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికుల సమ్మె

పురపాలక ఇంజినీరు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

**ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే:** పురపాలక ఇంజినీర్ విభాగ ఒప్పంద కార్మికులు ఆదివారం సమ్మెలోకి వెళ్లారు. ప్రొద్దుటూరు పురపాలక సంఘ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని ఏర్పాటుచేశారు. నీటి సరఫరా, వీధిదీపాల నిర్వాహకులు ఇంజినీరు విభాగ సిబ్బంది శాశ్వత సమ్మెలోకి వెళ్లినట్లు ఆ సంఘ పట్టణ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈ సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా, పట్టణ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి మద్దతు తెలిపారు. ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయమని, కార్మికుల వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పురపాలక ఇంజినీరు ఎం.శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకులు విజయ్‌కుమార్, రాఘవ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు అధ్యక్షుడిగా వినయ్‌కుమార్

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆవుల వినయ్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్ తెలిపారు. ఆదివారం ఆయన జమ్మలమడుగులో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఆయన ప్రకటించారు. కార్యదర్శిగా ఉదయ్‌కిరణ్, సంయుక్త కార్యదర్శిగా చెన్నయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి రాజు, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు బిర్రు విక్రమ్ కుమార్ పాల్గొన్నారు.

కమిటీని ప్రకటిస్తున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు తిరుపాల్

## మట్టి తరలింపు అడ్డగింత

వరుసగా నిలిచిపోయిన టిప్పర్లు

**మైదుకూరు, చాపాడు, న్యూస్‌టుడే:** చాపాడు మండలంలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులతో దువ్వూరు మండలం చింతకుంట చెరువు నుంచి పెద్దఎత్తున టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. రాకపోకల సందర్భంగా మార్గమధ్య విశ్వనాథపురం వద్ద జాతీయ రహదారిపై రెండురోజుల కిందట మట్టి పడిపోయింది. వాహన రాకపోకలతో దుమ్ము ఎగసిపడుతోంది. వెనుక వాహనాలు కనిపించని విధంగా దుమ్ము రేగుతోంది. కొందరు ద్విచక్ర వాహనదారులు కిందపడ్డారు. దీనిని గుత్తేదారులు పట్టించుకోకపోవడంతో విశ్వనాథపురం గ్రామస్థుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆదివారం మట్టితో వచ్చిన టిప్పర్‌ను వచ్చినట్లు నిలిపివేసి నిరసన తెలిపారు. బారులుతీరి టిప్పర్లు నిలిచిపోయాయి. దీంతో గుత్తేదారు ప్రతినిధులు నీరు తెచ్చి రహదారిని శుభ్రం చేయడంతో టిప్పర్లను పంపివేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

స్పందనకు వందనం

**కొండాపురం:** లావనూరు గ్రామంలో కొన్ని దీపాలు వెలగడం లేదని ఈనెల 7న 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఎంపీడీవో నాగప్రసాద్ స్పందించి మరమ్మతులు చేయించారు.

?: రాజుపాళెం మండలం కొర్రపాడులోని బీసీ కాలనీ చివరి వీధిలో మురుగు కాలువలో అనేక నెలలుగా పూడిక నిండింది. దీంతో వర్షం పడితే రోడ్డుపైకి మురుగు ప్రవహిస్తోంది. మురుగు కాలువలో పూడిక తొలగించాలి. **-బాషా, కొర్రపాడు**

?: రాజుపాళెంలో ఉపాధి హామీ, వెలుగు కార్యాలయలున్నాయి. వీటి వెనుక వైపు దిబ్బలుగా చెత్తాచెదారం పేరుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతినెలా మూడో వారం విధిగా పరిశుభ్రత పనులుచేపట్టాలని ఆదేశిస్తున్నా ఇక్కడెందుకు చేయడంలేదు. పట్టణ సమస్యలు పరిష్కరించడంలేదు. **-ఉదయభాస్కర్, రాజుపాళెం**

?: రాజుపాళెంలో ప్రాథమిక పాఠశాల వద్ద మురుగు కాలువ పూడికతో నిండింది. రోడ్డుపైకి పారుతోంది. దీంతో వాహనదారులకు పాదచారులకు ఇబ్బందిగా ఉంది. ఇక్కడ పూడిక తొలగించాలి. **-రాముడు, రాజుపాళెం**

✓: క్షేత్రస్థాయిలో అన్ని ప్రాంతాలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం. **(పై సమస్యలను రాజుపాళెం ఈవోపీఆర్డీ షాకీర్ అలీఖాన్ పరిష్కరిస్తామని చెప్పారు.)** -న్యూస్‌టుడే, రాజుపాళెం

?: కొండాపురం మండలం సీఎంఆర్ కాలనీలో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. **-మహేష్, స్థానికుడు**

✓: కాలనీలో పర్యటించి రోడ్డుపై మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయిస్తాం. **-శర్వాణి, పంచాయతీ కార్యదర్శి, కొండాపురం**

?: కొండాపురం మండలం సీతాపురంలో అక్కడక్కడ విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. బాగు చేయించాలి. **-రమణ, స్థానికుడు**

✓: సీతాపురంలో పని చేయని విద్యుత్తు దీపాలను పరిశీలించి బాగు చేయిస్తాం. **-నాగప్రసాద్, ఎంపీడీవో, కొండాపురం**

?: కొండాపురం మండలం తిమ్మాపురంలో మురుగు రోడ్డుపై పారడంతో దుర్వాసన వస్తోంది. **-నాగేష్, స్థానికుడు**

✓: తిమ్మాపురంలో మురుగు నీరు నిల్వ లేకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. తగు చర్యలు చేపడతాం. **-సుజాత, వైద్యురాలు, కొండాపురం** -న్యూస్‌టుడే, కొండాపురం

?: బద్వేలు పురపాలికలోని బోవిళ్లవారిపల్లెలో మురుగు కాలువలో పూడిక పేరుకు పోయింది. నీళ్లు పారడం లేదు. దోమలు ఎక్కువై దుర్వాసన వస్తూ చాలా ఇబ్బంది పడుతున్నాం. పూడిక సమస్యను పరిష్కరించండి. **-నరసింహారెడ్డి, బోవిళ్లవారిపల్లె**

✓: బోవిళ్లవారిపల్లెకు పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి మురుగు కాలువలో పూడిక తీయించి సమస్యను పరిష్కరిస్తాం.

?: బద్వేలు పురపాలికలోని చింతబుత్తాయిపల్లెలో కొన్ని విద్యుత్తు స్తంభాలకు ఎల్ఈడీ దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో అంధకారం నెలకొంది. విషపురుగులు సంచరిస్తున్నాయి. రాత్రి సమయంలో చిన్నపిల్లలు బయట తిరగాలంటే భయంగా ఉంది.

✓: వెలగని ఎల్ఈడీ దీపాలను గుర్తించి రిపేరు చేయించి వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటాం. **(పై సమస్యలకు బద్వేలు పురపాలిక కమిషనరు నరసింహారెడ్డి సమాధానం చెప్పారు.)** -న్యూస్‌టుడే, బద్వేలు గ్రామీణ

## ఎమ్మెల్యే వరద కోలుకోవాలని పూజలు

**రాజుపాళెం:** ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి అనారోగ్యం నుంచి కోలుకోవాలని కోరుతూ తెదేపా నాయకులు సానా శ్రీనివాసులురెడ్డి, సంజీవరెడ్డి శనివారం హైదరాబాద్‌లో జుబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేశారు. ఆయన త్వరగా కోలుకుని ప్రజాసేవలో నిమగ్నం కావాలని కోరుకున్నారు.

## బాధితులపై గ్రామీణ పోలీసుల నిర్లక్ష్య వైఖరి తగదు

**ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే:** ప్రజాసమస్యలను గ్రామీణ పోలీసు అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యం ఆరోపించారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సమస్యలను పోలీసులు పరిష్కరిస్తారని బాధితులు ఠాణాకు వస్తే కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రొద్దుటూరులోని లింగాపురంలో ఎస్టీ కులానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త వెంకటమ్మ, ఆమె భర్తపై చౌకదుకాణ డీలర్ దాడి చేస్తే ఇప్పటి వరకూ ఎస్ఐ అరుణ్‌రెడ్డి కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. కాకిరేనిపల్లెలో అంగన్‌వాడీ టీచర్‌పై పట్టపగలు దాడిచేసి ఆమె మెడలో ఉన్న బంగారం గొలుసును ఎత్తుకుపోతే ఎస్ఐ రాజు న్యాయం చేయకపోగా బాధితులపైనే కేసు నమోదు చేశారన్నారు. ఈ సంఘటనపై బాధితులు పోలీసులపై కోర్టుకు వెళ్లారన్నారు. పొట్టిపాడురోడ్డు ఎన్టీఆర్ సర్కిల్ గంగమ్మ గుడి వద్ద లారీ మోటార్ సైకిల్‌ను తొక్కిస్తే పోలీస్‌స్టేషన్‌కు బాధితుడు వెళితే నెల రోజుల నుంచి తిప్పుతూ మీరే పంచాయితీ చేసుకోండంటూ ఎస్ఐ కాలయాపన చేస్తున్నారన్నారు. పెద్దశెట్టిపల్లెలో మేరీ రోడ్డు విషయంలోనూ సీఐ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

# రక్తదాతలు.. స్ఫూర్తి ప్రదాతలు

• అత్యవసరాల్లో ఆదుకుంటూ అందరితో మన్ననలు • సేవాతత్పరులు ప్రొద్దుటూరు యువకులు

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం

దేవుడు జన్మనిస్తే ఆ యువకులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మనిస్తున్నారు. అన్ని దానాల్లో రక్తదానం ప్రత్యేకమైనదని నమ్మి ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తున్నారు. సాధారణంగా అందరూ రక్త దానం చేస్తుంటారు. అయితే ప్రొద్దుటూరుకు చెందిన కొందరు యువకులు ఎక్కువ సార్లు రక్తదానం చేసి అనేక మంది ప్రాణాలు నిలుపుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. చిన్న వయస్సులో ఎక్కువ సార్లు రక్త దానం చేసిఆదర్శంగా నిలుస్తున్నారు.

### రక్తం అందక ఇబ్బంది పడకూడదు

మనం రక్తం ఇవ్వడం ద్వారా ఒకరి ప్రాణాలు నిలుప వచ్చన్న విషయం నాకు చాలా నచ్చింది. ప్రాణం పోతే తిరిగి రాదు. అందుకే నిర్ణయించుకున్నా ప్రత్యక్షంగానైనా పరోక్షంగానైనా నాకు తెలిసి రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం పోకూడదనుకున్న. అప్పటి నుంచి రక్తం అవసరమని సమాచారం తెలిస్తే వారికి ఖచ్చితంగా రక్తం అదేలా చూస్తా. నా వయస్సు 41 ఏళ్లు, ఇప్పటి వరకు 40 సార్లు రక్త దానం చేశా. **-కొప్పరపు ధీరేంద్ర ప్రసాద్, 'ఎ' పాజిటివ్**

### యువకులు ముందుకు రావాలి

రక్త దానంలో యువకులు ముందుండాలి. వారికి త్వరగా రక్తం తయారయ్యే అవకాశం ఉంటుంది. వైద్యుల సూచన ప్రకారం వారు ఎక్కువ సార్లు ఇచ్చే అవకాశం ఉంటుంది. అందుకే మేమంతా కలిసి యువకులకు రక్తదానంపై అవగాహన కల్పిస్తుంటాం. రక్త దానం ఎంతో ప్రత్యేకమైనది. నా వయస్సు 27 ఏళ్లు, ఇప్పటి వరకు 26 సార్లు రక్త దానం చేశా. **-సలీం, 'ఒ' పాజిటివ్**

### ఎంతదూరమైనా వెళ్తాం

రక్తం అవసరమని మాకు సమాచారం అందితే వారు ఎక్కడున్నా అక్కడి మా స్నేహితుల ద్వారా వారికి రక్తం అందేలా చూస్తాం. లేకుంటే ఇక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్తాం. స్నేహితులంతా కలిసి ఓ వాట్సప్ గ్రూపు తయారు చేసుకున్నాం. వారంతా దాతలను అందులో చేర్చారు. రక్త దానం చేయడం ద్వారా ఆరోగ్యానికి మంచిదని అవగాహన కల్పిస్తుంటాం. నా వయస్సు 27 ఏళ్లు, ఇప్పటికి 25 సార్లు రక్త దానం చేశా. **-ఎస్‌కే.సిరాజుద్దీన్, 'ఎ' పాజిటివ్**

### డబ్బుతో కొనలేనిది.. ప్రతిఫలం ఆశించనిది



అవసరమైన గ్రూపు అందుబాటులో లేకుంటే ఎంత డబ్బున్నా రక్తం కొనలేం. తోటి వారు సహాయం చేస్తేనే రక్తం అంది వారు ఆపద నుంచి బయటపడగలం. ఈ విషయాన్ని అందరూ గమనించి రక్త దానం చేసి అనారోగ్యంతో ఉన్న వారిని ఆదుకోవాలి. ఇది ప్రతిఫలం ఆశించనిది దానం. ఒకరి ప్రాణాలను కాపాడామన్న సంతృప్తి మనకు లభిస్తుంది. నా వయస్సు 29 ఏళ్లు, ఇప్పటి వరకు 20 సార్లు రక్తదానం చేశా. **-తులసిరెడ్డి, 'ఒ' పాజిటివ్**

## తొలగిన డెక్క... గ్రామస్థుల హర్షం

స్పందనకు వందనం

**కొండాపురం, న్యూస్‌టుడే:** పైడిపాళెం జలాశయం లీకేజీ నీరు లావనూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ముందు సీసీ రోడ్డుపై నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. నీరు వెళ్లే కాలువలో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో నీరు సక్రమంగా పారడం లేదని ఈనెల 10వ తేదీ 'ఈనాడు'లో 'లావనూరు.. సమస్యలతో బేజారు' శీర్షిక కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన కూటమి నాయకుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ నారాయణరెడ్డి జేసీబీతో కాలువ శుభ్రం చేయించారు. నీరు రోడ్డుపైకి రాకుండా కాలువలో వెళ్లేలా ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుర్రపుడెక్క తొలగింపుతో కాలువలో పారుతున్న నీరు

## రవికల్యాణ్‌కు ఘన సత్కారం

సత్కారం అందుకుంటున్న భూమిరెడ్డి రవికల్యాణ్

**మైదుకూరు:** గొల్లపల్లెకు చెందిన భూమిరెడ్డి రవికల్యాణ్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ కళా దీక్షితులు హాలులో మనం ఫౌండేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పుట్టినరోజు అంశంపై నా కానుక శీర్షికతో కవితను, అంటరానితనాన్ని నిర్మూలిస్తూ సమాజంలో సమానత్వాన్ని ప్రతిబింబించేలా పాటలు పాడినందుకు ఫౌండేషన్ ఛైర్మన్ కె.చక్రవర్తి, హిమాయత్‌నగర్ సీఐ పురుషోత్తం, హైకోర్టు న్యాయవాది రామమూర్తి, తమిళ హీరో కిరణ్‌కుమార్ చేతుల మీదుగా పద్మ ప్రతిభ జాతీయ అవార్డుతో సత్కరించారు


ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు, వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు. ప్రకటన - 14:13

ప్రార్థన కూటమి
14.07.2025
సమయం : సా॥ 5.30 ని॥లకు
గ్రామం : రామాపురం, ప్రొద్దుటూరు మం॥.

అమ్మా... నువ్వు మా నుంచి దూరమైనా కూడా, నీవు పంచిన ప్రేమ ఇంకా పది మందికి పంచుతూ ముందుకు సాగుతాను అలాగే నీ జ్ఞాపకాలు ఎప్పటికీ నాతో ఉంటాయి. ప్రేమతో నీ కుమారుడు
బోనం గురివిరెడ్డి
మాజీ కో-ఆప్షన్ సభ్యులు

కీ॥శే॥ బోనం సుందరమ్మ
మరణం : 24.06.2025
భర్త : కీ॥శే॥ బోనం పెద్ద చంద్రన్న

కుటుంబ సభ్యులు : కోడలు : బోనం రాజమ్మ
మనుమరాలు : బోనం నయోమి, బోనం అజూబా
మనుమడు : బోనం చిన్నబాబు మరియు బోనంవారి రక్త సంబంధికులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468


(c) eenadu

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురువులతో పూర్వ విద్యార్థులు

**కమలాపురం, న్యూస్‌టుడే :** మండల పరిధి పెద్దచెప్పలిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-2001లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

# కడప

• కడప • పులివెందుల • కమలాపురం

## ఆనకట్ట వద్ద రక్షణ చర్యలు

స్పందనకు వందనం

**వల్లూరు :** ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంపై ఈ నెల 13న ఈనాడులో 'పర్యాటక ప్రాంతం... అప్రమత్తతతోనే సురక్షితం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎస్‌ఐ పెద్దఓబన్న ఆదివారం తన సిబ్బందితో కలిసి ఆనకట్ట పరిసర ప్రాంతాలను పరిశీలించారు. నదిలో నీటి ప్రవాహం ప్రమాదకరంగా ఉన్నందున హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. పర్యాటకులు వచ్చే అవకాశం ఉన్న రోజుల్లో ఆనకట్ట వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466, 8008573474
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

**వేంపల్లె, న్యూస్‌టుడే :** వేంపల్లెలోని బొడ్డుచావిడివీధి సర్కిల్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడంపై ఈ నెల 7న మేమున్నాం...మీకుతోడుగా'లో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గ్రామ పంచాయతీ ఈవో మాధవరెడ్డి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.

?: వేంపల్లె గాండ్లవీధిలోని వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- సుబ్బరాయుడు, వేంపల్లె**

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్తాచెదారాన్ని శుభ్రం చేయిస్తాం. **- మాధవరెడ్డి, గ్రామపంచాయతీ ఈవో - న్యూస్‌టుడే, వేంపల్లె**

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**పులివెందుల, న్యూస్‌టుడే :** మండల పరిధి నల్లపురెడ్డిపల్లెకు చెందిన సరితాల రహమత్ (24) అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నల్లపురెడ్డిపల్లెకు చెందిన సరితాల రహమత్ కడుపు నొప్పి తాళలేక ఈ నెల 7న పురుగుల మందు తాగారు. విషయం తెలుసుకున్న బంధువులు చికిత్స కోసం పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఈ నెల 11న రాత్రి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శనివారం మృతి చెందినట్లు తెలిపారు.

## భాకరాపురంలో చోరీ.. నగలు, నగదు అపహరణ

**పులివెందుల, న్యూస్‌టుడే :** పులివెందులలోని భాకరాపురానికి చెందిన లక్ష్మీనరసమ్మ అనే నర్సు ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని మూడున్నర తులాల బంగారు నగలు, రూ.25 వేల నగదుతో పరారయ్యారు. బాధితురాలు విధులు ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మాధవరం-1లో ఇరువర్గాల ఘర్షణ

**సిద్దవటం, న్యూస్‌టుడే :** మండలంలోని మాధవరం-1 పరిధి ఎస్‌కేఆర్ ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపారు. మద్యం మత్తులో ఉన్న యువకులు దుర్భాషలాడుతూ ఘర్షణకు దిగారన్నారు. ఉభయ వర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉండటంతో ఘటనా స్థలానికి వెళ్లి ఇరువర్గాలను అదుపు చేశామన్నారు. ఈ ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సిమెంటు ట్యాంకరు బోల్తా.. తప్పిన ప్రమాదం

లారీ పడిపోవడంతో స్తంభించిన రాకపోకలు

**వల్లూరు, న్యూస్‌టుడే :** కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై అచ్చిరెడ్డిపల్లె వద్ద ఆదివారం సాయంత్రం సిమెంటు లోడుతో వెళుతున్న ట్యాంకర్ బోల్తా కొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ట్యాంకరు డ్రైవరు మద్యం మత్తులో ఉండటంతో వాహనం అదుపుతప్పి కిందపడిందన్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## కడప రైతుబజారు ఎస్టేట్ అధికారిణిగా రుచిత

**కడప వ్యవసాయం, న్యూస్‌టుడే :** కడప రైతుబజారు ఎస్టేట్ అధికారిగా రుచిత నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పులివెందుల రైతుబజారు ఎస్టేట్ అధికారిగా పని చేస్తున్న ఆమెకు కడప రైతుబజారు అధికారిణిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## సమస్యల పరిష్కారానికి వినతి

**కమలాపురం, న్యూస్‌టుడే :** కమలాపురం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కమలాపురంలో రైల్వే పైవంతెన నిర్మాణం చేపట్టాలని, మురుగుకాలువ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. వీఎన్‌పల్లె మండలంలోని సర్వరాయసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి పంట కాలువలను తవ్వి పొలాలకు నీరివ్వాలని కోరారు.

**నూతన కమిటీ ఎన్నిక.. :** స్థానిక షాదీఖానాలో ఆదివారం కమలాపురం ఏరియా మహాసభలు నిర్వహించారు. సభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమలాపురం ఏరియా కార్యదర్శిగా నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా రామ్మోహన్‌రెడ్డి, వరప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అలాగే 11 మంది కార్యవర్గ సభ్యులు, 30 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

## నటుడు కోట శ్రీనివాసరావు మృతి బాధాకరం

**కడప గ్రామీణ, న్యూస్‌టుడే :** నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినిమా రంగానికి తీరని లోటని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నటుడిగా విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించారన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## రైతుబజారులో కూరగాయల ధరలు

**కడప వ్యవసాయం, న్యూస్‌టుడే :** రైతు బజారులో కూరగాయలు కిలో ధరలు **(నిన్నటివి)** ఇలా.. బంగాళదుంప- 35, క్యాబేజి- 25, క్యారెట్- 60, బీన్స్- 80, బీట్‌రూట్- 40, కీర- 50, దోస - 35, బీర- 40, కాకర- 40, దొండకాయలు - 50, ముల్లంగి- 35, అల్లం- 70, కాలీఫ్లవర్- 40, క్యాప్సికం- 70, టమాట- 25, మిరపకాయలు- 58, వంకాయలు- 30, బెండకాయలు- 20, మట్టిక్కాయ- 40, చిక్కుడు- 55, ఉల్లిపాయలు- 25, మునగకాయలు- 20, చికెన్ - 185, గుడ్లు డజను - 67

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

# పాఠాలు నేర్చుకుంటూ... పతకాలు సాధిస్తూ

### క్రీడా, సాంస్కృతిక పోటీల్లో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థుల సత్తా

**చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే :** సీకేదిన్నె మండల పరిధిలోని ఊటుకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పొలాల్లో వ్యవసాయ పాఠాలు నేర్చుకుంటూనే క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో ప్రతిభ చాటుతున్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు నాలుగేళ్లుగా రాష్ట్ర స్థాయిలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోటీలను ఇప్పటి వరకు అనంతపురంలోని మడకశిర, తిరుపతి, శ్రీకాకుళంలోని నైరా, నంద్యాలలోని మహానంది వ్యవసాయ కళాశాలల్లో నిర్వహించారు. వీటిలో ఊటుకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బాడ్మింటన్, టెన్నికాయిట్, చదరంగం, క్రికెట్ తదితర పోటీల్లో ప్రతిభ చాటి బహుమతులు అందుకున్నారు. సాంస్కృతిక విభాగంలో తమ కళను ప్రదర్శించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఇదే కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు అగ్రిసెట్‌లో సీట్లు సాధించి ఏజీబీఎస్సీ చదువులకు వెళ్లారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థుల మనోగతం వారి మాటల్లోనే...

సాధించిన పతకాలతో క్రీడాకారులు

### వ్యవసాయంలో పీహెచ్‌డీ



మా కళాశాలలో చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో శిక్షణ ఇస్తారు. దీంతో అటు చదువులోనూ, ఇటు క్రీడల్లోనూ రాణిస్తున్నాం. నేను క్యారమ్స్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి బహుమతి గెలుపొందాను. భవిష్యత్తులో వ్యవసాయంలో పీహెచ్‌డీ పూర్తి చేసి రైతుల శ్రేయస్సుకు పాటుపడతాను. **- భవిత, ఊటుకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ క్రీడాకారిణి**

### అన్నదాతలకు సహాయం చేస్తాను

వ్యవసాయంలో రైతులు పడుతున్న ఇబ్బందులు గమనించాను. ఉన్నత చదువులు చదివి రైతన్నలకు సహాయం చేయడమే నా లక్ష్యం. శ్రీకాకుళంలోని నైరాలో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్‌లో మొదటి బహుమతి సాధించాను. **- శ్రీలత**

### క్రీడలంటే ఇష్టం

చిన్నతనం నుంచే నాకు క్రీడలంటే ఎంతో ఇష్టం. రాష్ట్రస్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో పాల్గొన్న మా జట్టు రెండో స్థానంలో నిలిచింది. వ్యవసాయంలో ఉన్నత చదువులు చదివి క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తాను. **- ఆదిత్య**

## తెదేపాతోనే రాష్ట్రాభివృద్ధి

స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బీటెక్ రవి

**పులివెందుల, న్యూస్‌టుడే :** రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు బీటెక్ రవి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పులివెందులలోని ఇస్లాంపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. తమ పిల్లలు విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నారని ఉద్యోగావకాశాలు కల్పించాలని పలువురు ఆయనను కోరారు. నీటి సమస్య, మురుగు కాలువల దుస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇస్లాంపురం, భాకరాపురం బాధ్యుడు రహంతుల్లా, హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్‌బాషా, తెదేపా నాయకులు భాస్కర్‌రెడ్డి, సిద్ధయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**సిద్దవటం :** మండల పరిధి టక్కోలులోని ఎస్సీ కాలనీలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం కార్యదర్శి నాగమునిరెడ్డి, నాయకుడు చిన్నపరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బమ్మ తదితరులు తెదేపా సంక్షేమ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. నాయకులు వీరారెడ్డి, రాముడు, శంకర్, సుబ్బయ్య, నిత్యపూజయ్య, విజయ్‌కుమార్, కొండయ్య పాల్గొన్నారు.

## తాగునీటి పథకం వద్ద పోలీసుల బందోబస్తు

**సిద్దవటం, న్యూస్‌టుడే :** మండలంలోని లింగంపల్లె తాగునీటి పథకం వద్ద ఆదివారం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. లింగంపల్లె పెన్నానది ఒడ్డున ఏర్పాటు చేసిన తాగునీటి పథకం నుంచి కడప నగరానికి నీరు సరఫరా అవుతున్న విషయం విదితమే. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ లింగంపల్లె తాగునీటి పథకం వద్ద పని చేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులు ఆదివారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. దీంతో నీటి సరఫరాకు అవాంతరాలు రాకుండా సంబంధిత అధికారులు గ్రామ సచివాలయాల ఉద్యోగులను పథకం వద్ద విధులకు నియమించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నారాయణస్వామి మాట్లాడుతూ.. ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లడంతో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సమ్మెలో ఉన్న ఉద్యోగులు నీటి సరఫరాను అడ్డుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా లింగంపల్లె నీటి పథకం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఏఈ అంజనీకుమార్, పోలీసులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయాల పని తీరు అధ్వానం


మాట్లాడుతున్న తులసిరెడ్డి, పక్కన నాయకులు

**వేంపల్లె, న్యూస్‌టుడే :** కూటమి పాలనలో రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల పనితీరు అధ్వానంగా మారిందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిధుల కొరత, సిబ్బంది లేక ఉన్నత విద్య నిర్వీర్యమైందన్నారు. రాష్ట్రంలో 17 విశ్వవిద్యాలయాలు ఉండగా ఇందులో తొమ్మిదింటికి వైస్ ఛాన్సులర్లు లేరన్నారు. వీటిలో 474 ప్రొఫెసర్ పోస్టులు, 859 అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టులు, 2146 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలు క్షీణించాయన్నారు. నటుడు కోటా శ్రీనివాసరావు మృతి బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ బాధ్యుడు ధ్రువకుమార్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షులు రామకృష్ణ, వెంకటేష్, ఉత్తన్న, వేమయ్య పాల్గొన్నారు.

### బహుజన ప్రజాప్రతినిధుల సమావేశం విజయవంతానికి పిలుపు

**పులివెందుల :** బహుజన ప్రజాప్రతినిధుల సమావేశాన్ని జయప్రదం చేయాలని రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. పులివెందులలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఆయన గోడపత్రాలు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అనంతపురంలోని లలిత కళాపరిషత్ భవనంలో ఆగస్టు 3న నిర్వహించే బహుజన ప్రజాప్రతినిధుల సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

పేదలకు అన్నదానం చేస్తున్న సంస్థ సభ్యులు

**కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే :** పేదల ఆకలి తీర్చడమే హిమవర్షిణి ఫౌండేషన్ లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకురాలు విజయలక్ష్మీ పేర్కొన్నారు. హిమవర్షిణి ఫౌండేషన్ ఏర్పాటు చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం కడపలోని ప్రేమాలయ నిరాశ్రయుల నివాస వసతి గృహంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండేళ్లలో దాతల సహకారంతో ఇప్పటి వరకు 330 అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అన్నదానంతో పాటు మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆర్టీసీ కానిస్టేబుల్ రవి, పుట్టా పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, వెంకట దామోదర్, రవి, మధు తదితరులున్నారు.

## అన్నదాతలపై ఎరువుల భారం మోపొద్దు

**వేంపల్లె, న్యూస్‌టుడే :** రైతన్నలపై ఎరువుల భారం మోపొద్దని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ముతుకూరు మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక్కో ఎరువుల బస్తాపై కేంద్ర ప్రభుత్వం రూ.50 నుంచి రూ.265 వరకు పెంచిందన్నారు. కేంద్రం ఎరువుల ధరలు పెంచుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఖరీఫ్ మొదలై వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతుంటే కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలు పెంచడం దారుణమన్నారు.

## నేటి నుంచి భూ రీసర్వే

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే :** భూ సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇటీవల క్షేత్ర స్థాయిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పలు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ స్పందించి మరో మారు రీసర్వేకు ఆదేశాలిచ్చారు. జిల్లాలోని 735 రెవెన్యూ గ్రామాల్లో 22,36,545 ఎకరాల భూమి ఉండగా ఇప్పటికే పలు గ్రామాల్లో రీ సర్వే పూర్తవ్వగా కొన్ని గ్రామాలు సాంకేతికపరంగా అడ్డురావడంతో సర్వే చేయడం లేదు. దీంతో మిగిలిన 300 గ్రామాల్లో భూములకు రీసర్వే చేయనున్నారు. ఇందుకు సంబంధించి సుమారు 480 మంది సర్వేయర్లు సర్వేకి సిద్ధంగా ఉన్నారు. వీళ్లంతా ముందుగా ప్రభుత్వ భూములు, గ్రామ సరిహద్దు రాళ్లను గుర్తించనున్నారు. సర్వే పూర్తయిన తర్వాత కొత్తగా రైతులకు పాసుపుస్తకాలు ఇవ్వనున్నారు.

## మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

సమావేశంలో పాల్గొన్న మాజీ సైనికులు

**కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే :** ఉమ్మడి కడప జిల్లాలోని మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమణయ్య పేర్కొన్నారు. కడప సీఎస్‌ఐ పాఠశాలలో ఆదివారం ఉమ్మడి కడప జిల్లాల మాజీ సైనికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కోర్టు విషయాలు, వ్యక్తిగత సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షులుగా అజ్మల్ అలీఖాన్, గుర్రప్ప, కోశాధికారిగా కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా సుధాకర్‌రెడ్డి, నాగరాజు, దుర్గాప్రసాద్, బషీర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రాయుడు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, జయరామిరెడ్డి, శ్రీనివాసరాజు, లక్ష్మీరెడ్డి, బాలాజీ, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీకి వేంపల్లె విద్యార్థి ఎంపిక

**వేంపల్లె, న్యూస్‌టుడే :** ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాల్లో వేంపల్లె ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలకు చెందిన తేజేష్ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. 10వ తరగతిలో ఈ విద్యార్థి 593 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్న ఆయనను పాఠశాల కరస్పాండెంట్ బీ.ఎస్. రమణారెడ్డి అభినందించి పుష్పగుచ్ఛం అందించారు.

## రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు తప్పవు

**వేంపల్లె, న్యూస్‌టుడే :** సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా ఇష్టానుసారంగా పోస్టింగులు పెడితే క్రిమినల్ కేసులు తప్పవని పట్టణ సీఐ నరసింహులు హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఇంటర్‌నెట్ కేంద్రాల నిర్వాహకులు, జిరాక్స్, ఫ్లెక్సీ, ప్రింటర్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక వర్గాలు, రాజకీయ విషయాలపై ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే న్యాయపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు

**చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే :** మండల పరిధి తాడిగొట్లలోని యల్లమ్మ, గంగమ్మ అమ్మవారికి ఆదివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని బోనాలు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సరిహద్దు వరకు శాంతి పూజలు చేశారు. బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పూజలందుకుంటున్న మల్లమ్మ

## శాకంబరీ అలంకరణలో అంకాలమ్మ

**కడప చిన్నచౌకు న్యూస్‌టుడే :** కడప నగరం వైఎస్సార్ కాలనీలోని అంకాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు శాకంబరిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.

## రాములోరి సేవలో తెదేపా నాయకులు

రామయ్య క్షేత్రంలో బలిపీఠం వద్ద పూజలు నిర్వహిస్తున్న జనార్దన్‌రావు

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే :** ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టి.డి.జనార్దన్‌రావు ఆదివారం సందర్శించారు. రాములోరి సన్నిధికి ఆయనతో పాటు తెదేపా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ్‌శేఖర్‌రెడ్డి, రైల్వేకోడూరు పరిశీలకుడు హేమాంబర్ విచ్చేశారు. అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణమూర్తులను దర్శించారు. అనంతరం వారికి శాలువా కప్పి సత్కరించారు. అర్చకులు వేదాశీర్వాదం చేశారు. రామయ్య క్షేత్రం చారిత్రక వైభవం, ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆలయంలో శిల్ప సంపద చాలా అద్భుతంగా ఉందని కొనియాడారు. జనార్దన్‌రావు ఒంటిమిట్టకు రాగానే జగన్‌మోహన్‌రాజు, విజయ్‌శేఖర్‌రెడ్డి వర్గీయులు వేర్వేరుగా ఆయనకు స్వాగతం పలికారు. నాయకులు గజ్జల నరసింహారెడ్డి, కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, ఎస్వీ రమణ, నల్లగొండు వెంకటసుబ్బారెడ్డి, దున్నూతల రఘురామిరెడ్డి మామిళ్ల శ్రీహరి, చింతగింజల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రోశయ్య, ఆలూరి వెంకటసుబ్బయ్య, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

## విభజన హామీలు అమలు చేయండి

**కమలాపురం, న్యూస్‌టుడే :** కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 18న చేపట్టిన చలో దిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ఆదివారం కమలాపురంలో గోడపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కును నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఎందుకు నిధులు కేటాయించలేదన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు ఎల్లయ్య, నాయకులు నరసింహ, మహేష్, సన్నీ పాల్గొన్నారు.

## కేసీ కాలువకు నీరు విడుదల చేయాలి

**అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే :** శ్రీశైలం జలాశయం నుంచి కేసీ కాలువ, ఎస్ఆర్‌బీసీ, వెలుగోడుకు తక్షణమే నీరు విడుదల చేసి రైతులను కాపాడాలని వైకాపా నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కోరారు. ఆదివారం కడపలోని వైకాపా జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం జలాశయంలో 841 అడుగులకంటే ఎక్కువగా నీరుంటే పోతిరెడ్డిపాడుకు నీరు ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పటికీ 867 అడుగుల నీరున్నా రాయలసీమలోని రైతులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. తక్షణమే ప్రజాప్రతినిధులు స్పందించి నీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఒప్పంద కార్మికుల సమ్మె బాట

**కడప నగరపాలక, న్యూస్‌టుడే :** నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, హార్టికల్చర్, వీధి దీపాల నిర్వహణ విభాగాలకు చెందిన ఒప్పంద కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరంలోని అప్సరా కూడలి - అన్నమయ్య కూడలి, క్రిష్ణాకూడలి - గోకుల్‌లాడ్జి కూడలి, ఏడురోడ్లు తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగలేదు. నగరపాలక పరిధిలో 24 వేల వీధి దీపాలున్నాయి. వీటిలో కొన్ని ఆటోమేటిక్ విధానంలో పని చేస్తాయి. మరికొన్ని మాన్యువల్ పద్ధతిలో వెలుగుతాయి. వీధి దీపాల విభాగంలోని దాదాపు 42 మంది కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఆయా ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణ గందరగోళంగా మారింది. ఇంజినీరింగ్ విభాగానికి చెందిన కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో నీటి సరఫరా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని నగరపాలక అధికారులు పోలీసులను కోరారు. కార్మికుల సమ్మెతో వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు.

## నగరంలో ఫ్లెక్సీ కలకలం

**కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే :** కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కలకలం సృష్టించింది. మాజీ సీఎం జగన్‌ను పొగుడుతూ.. కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి సమయంలో వచ్చి అక్కడ ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. జగన్ బాటలోనే కూటమి ప్రభుత్వం నడుస్తోందని అందులోని సారాంశం. ఆదివారం వేకువన అటుగా వెళ్లిన వారు ఫ్లెక్సీలను గమనించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఫ్లెక్సీని తొలగించారు. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వ్యక్తి ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఫ్లెక్సీ ఏర్పాటు చేసింది ఓ వైద్యుడని తెలుస్తోంది. అతను నిజంగా వైద్యుడా.. లేదా పార్టీ నాయకుడా.. వైకాపా కార్యకర్త అనే వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసు ఉన్నతాధికారులు, తెదేపా నాయకులు ఈ ఫ్లెక్సీపై లోతుగా విచారిస్తున్నారు.

### ఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ప్రశాంత్

**పులివెందుల, న్యూస్‌టుడే :** రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా దేరంగుల ప్రశాంత్‌ను నియమిస్తూ ఆర్పీఎస్ వ్యవస్థాపకుడు పోతుల నాగరాజు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రశాంత్‌కుమార్‌కు పులివెందుల పురపాలక ఛైర్మన్ వరప్రసాద్ నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లాలో సామాజిక న్యాయం కోసం బహుజనుల ఐక్యతకు కృషి చేస్తానని నాగరాజు తెలిపారు.

## సంపుతున్నా పట్టించుకోరా!

కడప పాతబస్టాండు అనునిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రాంతంలో గత 15 రోజులుగా మ్యాన్‌హోల్స్‌పై మైకప్పు ఏర్పాటు చేయలేదు. అక్కడున్న రెండు మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారాయి. రాత్రి వేళల్లో వాహనదారులు, పాదచారులు వీటిల్లో పడే అవకాశముంది. నగరపాలక అధికారులు స్పందించి మ్యాన్‌హోల్స్‌పై మైకప్పులు ఏర్పాటు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.
**- న్యూస్‌టుడే, కడప (చిన్నచౌకు)**

SRI GURU RAGHAVENDRA E.M. HIGH SCHOOL
Near Chennur Busstand, Kadapa,
Cell No. 9154091952, E-mail : sgrhs1985@gmail.com
నూతన యాజమాన్యం వారి ఆధ్వర్యంలో నడుపబడుతున్న విద్యా సంస్థ
WANTED TEACHERS : Nursery to X Class
Office - Clerk cum Data Entry Operator, PET, AO, PRO's, Aayas and Drivers
NOTE : Preferred Experienced and Qualified faculty with Good Communication Skills- Salary negotiable. Interested Candidates may Contact us by phone (or) Send Your resume to mail.

(c) eenadu